శ్రీవ్యాసమహర్షి ప్రణీతం

బ్రహ్మమహాపురాణం

ప్రథమభాగం

(తెలుగు అనువాదంతో)

అనువాదకులు

డా॥ అంబడిపూడి నాగభూషణం

సంపాదకులు


'మహామహోపాధ్యాయ'

డా॥ సముద్రాల లక్ష్మణయ్య

ప్రత్యేకాధికారి

పురాణేతిహాస ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2020

BRAHMAMAHAPURANAM

FIRST PART
(with Telugu Translation)

Translated by:
Dr. Ambadipudi Nagabhushanam

Chief Editor:
Dr. Samudrala Lakshmanaiah

T.T.D. Religious Publications Series No.1379


First Print : 2020

Copies: 1000


Published by:
Sri Anilkumar Singhal, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

Cover Design & D.T.P. Type Setting:
Office of the Special Officer, Purana Itihasa Project,
TTD,Tirupati.

Printed at:
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.



శ్రీపద్మావతి అమ్మవారు   శ్రీవేంకటేశ్వరస్వామివారు



వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

తిరుమల తిరుపతి దేవస్థానములు
పురాణేతిహాస ప్రాజెక్టు

పరిష్కరణ పరిషత్తు

డా॥ కందాడై రామానుజాచార్యులుగారు
విశ్రాంత ప్రాచ్యకళాశాలాధ్యక్షులు
శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధినీ సంస్కృతకళాశాల
హైదరాబాద్

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

డా॥ ఈ.ఏ.శింగరాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకులు
శ్రీవేంకటేశ్వర ప్రాచ్యకళాశాల, తిరుపతి

డా॥ వేదాల వేంకటసీతారామాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఎస్.వి.ఎస్. సంస్కృతకళాశాల, పొన్నూరు

డా॥ ధూళిపాళ మహదేవమణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల
రాజమండ్రి

డా॥ ధూళిపాళ అన్నపూర్ణగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకురాలు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల
రాజమండ్రి

డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు
విశ్రాంత సంచాలకులు,
ఓరియంటల్ మాన్‌స్క్రిప్ట్స లైబ్రరీ,
హైదరాబాద్

కన్వీనర్
డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు
ప్రత్యేకాధికారి
పురాణేతిహాస ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు

విషయానుక్రమణిక



తొలిపలుకు

భారతీయవాఙ్మయంలో వేదాల తరువాత అంతటి ప్రాధాన్యం కలిగినవి పురాణాలు.

విస్తారాయ చ వేదానాం స్వయం నారాయణః ప్రభుః ।
వ్యాసరూపేణ కృతవాన్ పురాణాని మహీతలే ॥

వేదార్థాలను విస్తరింప జేయడానికై శ్రీమన్నారాయణుడు వ్యాసుడుగా అవతరించి పదునెనిమిది పురాణాలు రచించాడని పై శ్లోకంనుండి తెలుస్తున్నది. వేదోక్తమైన ధర్మాలను సరళసుందరమైన సంస్కృతభాషలో పురాణాలు వివరిస్తున్నవి. కథాకథనపద్ధతి నాశ్రయించి పురాణరచన జరిగింది. కాబట్టి పాఠకులకు ధర్మం పట్ల ఆసక్తి కల్గించడంలో పురాణాలు విజయం సాధించాయి.

ప్రాచీన ఋషులు, పురాతనకాలానికి చెందిన రాజుల చరిత్రలు పురాణాలలో వర్ణించబడివున్నాయి. అంతేకాక పవిత్రమైన తీర్థాలు, క్షేత్రాలు, ఆచరణయోగ్యమైన వ్రతాలు–మొదలగు విషయాల వివరణ కూడా పురాణాలలో లభిస్తుంది.

తిరుమల తిరుపతి దేవస్థానం ఒక మహాధార్మికసంస్థ. అందువల్ల ధర్మబోధకమైన గ్రంథాలను విరివిగా ప్రచురించి ప్రచారంలోకి తేవడం దేవస్థానం కర్తవ్యం.

ఈ ఉద్దేశంతోనే మొదట వ్యాసభాగవతాన్ని మూడు సుప్రసిద్ధవ్యాఖ్యానాలతో 14 సంపుటాలుగా పరిష్కరించి ప్రచురించడమయింది. తరువాత వాల్మీకిరామాయణాన్ని గూడా రెండు వ్యాఖ్యానాలతో 8 సంపుటాలుగా ముద్రించడం జరిగింది.

ప్రస్తుతం పురాణేతిహాస ప్రాజెక్టు ద్వారా పదునెనిమిది పురాణాలను తెలుగు అనువాదంతో సహా ప్రచురించే కృషి జరుగుతున్నది. విష్ణు–కూర్మ పురాణాలు ముద్రణలో ఉన్నాయి. ఇప్పుడు బ్రహ్మపురాణం మొదటి సంపుటాన్ని ముద్రణార్హంగా సిద్ధం చేయడమైనది.

ఈ పురాణాన్ని అనువదించిన విద్వద్వర్యులు డా॥ అంబడిపూడి నాగభూషణంగారినీ, దీనికి సంపాదకత్వం వహించిన ప్రాజెక్టు పూర్వ ప్రత్యేకాధికారి డా॥ సముద్రాల లక్ష్మణయ్యనూ అభినందిస్తున్నాము. ఈ గ్రంథాన్ని పరిష్కరించడంలో తమవంతు సహకారమందించిన పండితులకు, పండితపరిషత్ సభ్యులకు మా అభివందనాలు.

సహృదయుల సహకారంతో అష్టాదశ పురాణాలనూ క్రమంగా ప్రచురించాలన్న దేవస్థానప్రయత్నం శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో త్వరలో సఫలమగుగాక!

ఈ జ్ఞానయజ్ఞంలో తోడ్పడిన వారినందరినీ ఏడుకొండల దేవుడు అనుగ్రహించుగాక!

కె.యస్.జవహర్ రెడ్డి ఐ.ఏ.యస్
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

నివేదన

పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్ ।
అనన్తరం చ వక్త్రేభ్యో వేదాస్తస్య వినిర్గతాః ॥

బ్రహ్మ శాస్త్రాలన్నింటికంటె ముందు పురాణాన్ని స్మరించాడు. ఆ తరువాతనే ఆ దేవుని చతుర్ముఖాల నుండి వేదాలు వెలువడ్డాయి.

పై ప్రమాణవచనాన్ని బట్టి పురాణం ఎంత ప్రాచీనమైనదో గ్రహించవచ్చు. వేదమైనా, పురాణమైనా ధర్మస్వరూప నిరూపణకే అవతరించాయి. వేదాలకంటే గూడా పురాణాలు నిరూపించిన ధర్మస్వరూపం పాఠకులకు ఎక్కువ ఆసక్తిదాయకంగా ఉంటుంది. అందుకు కారణం పురాణాలలోని కథాకథనవిధానమే.

జ్ఞానవిజ్ఞానాలను సర్వతోముఖంగా అష్టాదశపురాణాలు మనకందించాయి. అతిప్రాచీనమైన ఈ వాఙ్మయాన్ని పరిశీలించిన నేటి పలువురు వైజ్ఞానికులు, ఆధునికులు గ్రహించవలసిన అనేక విషయాలు అందులో ఉన్నాయని ముక్తకంఠంతో అంగీకరించారు.

'పురాऽపి నవం' అన్న వ్యుత్పత్తి ననుసరించి పురాణ వాఙ్మయం ఎంతో ప్రాచీనమైనప్పటికీ నిత్యనూతనంగా భాసించే విషయాల కది నిలయంగా ఉన్నదని పెద్దల అభిప్రాయం.

పురాణాలను గురించి కొంత విస్తృతమైన పరిచయాన్ని ఈ సంపుటంలోని 'పురాణప్రశస్తి' అన్న శీర్షిక క్రింద చూడవచ్చు.

పదునెనిమిది పురాణాలలో నాలుగులక్షల శ్లోకాలు ఉన్నాయని ప్రాచీన గ్రంథాలు పేర్కొంటున్నాయి. కాని మాకు లభించిన పురాణగ్రంథాలలో ఇంచుమించు మూడులక్షలా డెబ్బైఒక్కవేల శ్లోకాలు మాత్రమే ఉన్నాయి.

తిరుమల తిరుపతి దేవస్థానం భాగవతం ప్రాజెక్టు అన్నపేరుతో ఒక ప్రాజెక్టును స్థాపించి తద్వారా మొదట వ్యాసభాగవతాన్ని అద్వైత విశిష్టాద్వైత ద్వైత మతతత్త్వాలను వివరించే శ్రీధరీయం, వీరరాఘవీయం, విజయధ్వజీయం అన్న మూడు సుప్రసిద్ధవ్యాఖ్యలతో పరిష్కరించి 14 బృహత్సంపుటాలుగా ప్రచురించింది.

తరువాత వాల్మీకి రామాయణాన్ని గోవిందరాజీయం,మహేశ్వరతీర్థీయం అన్న రెండు వ్యాఖ్యలతో పరిష్కరించి 8 సంపుటాలుగా ప్రచురించడమయింది. పై రెండు గ్రంథాలకూ చివర శ్లోకపాదానుక్రమణిక గూడ చేర్చడం జరిగింది.

పిదప వ్యాసవిరచితమైన అష్టాదశపురాణాలను సరళమైన తెనుగు అనువాదంతో ప్రచురించాలని దేవస్థానం సంకల్పించింది. అనువాదరచనలో ఇంచుమించు 50మంది ప్రఖ్యాతసంస్కృతవిద్వాంసులు పాలుపంచుకొన్నారు. 3 లక్షలకుపైగా శ్లోకాల అనువాదం ఇప్పటికి పూర్తి చేశారు. మూలగ్రంథంతో సహా అనువదింపబడిన పురాణాలను డి.టి.పి చేసి పరిష్కరించి ప్రచురించే కార్యక్రమం కొనసాగుతున్నది.

ప్రస్తుతం విష్ణుపురాణం, కూర్మపురాణం ముద్రణలో ఉన్నాయి. అతిత్వరలో వాటిని ప్రజలకు అందించనున్నాము.

ఇప్పుడు 14వేల శ్లోకాలు గల బ్రహ్మపురాణం రెండు సంపుటాలుగా ప్రచురణకు సిద్ధం చేయబడుతున్నది. ఇందు మొదటిసంపుటాన్ని ప్రఖ్యాత సంస్కృతవిద్వాంసులు డా॥ అంబడిపూడి నాగభూషణం గారు అనువదించారు. వీరికి కృతజ్ఞతాభివందనాలు.

ఈ సంపుటాన్ని శ్రద్ధతో సరిచూచి అవసరమైన సవరణలు గావించి ప్రచురణార్హంగా రూపొందించిన పరిష్కరణ పరిషత్సభ్యులకు నమోవాకాలు.

ప్రాజెక్టులో సహాయపరిశోధకులైన శ్రీ యస్.బి.యస్.భట్టాచార్యులను, డా॥ యస్. దశరథను, డా॥ పూర్ణవల్లిని అభినందిస్తున్నాం. దీన్ని ముద్రణ యోగ్యంగా తీర్చిన డి.టి.పి ఆపరేటర్ శ్రీ బి.వెంకట్రాయులకు అభినందనలు.


ప్రాజెక్టు నిర్వహణకు తగిన ప్రోత్సాహాన్ని ఇస్తూ పురాణాలు ఇలా వెలుగులోకి రావడానికి తోడ్పడిన తి.తి.దే. ధర్మకర్తలమండలివారికీ, ధర్మనిష్ఠులు, కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్ కుమార్ సింఘాల్, ఐ.ఏ.యస్, గారికీ, సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ బి.లక్ష్మీకాంతం, ఐ.ఏ.యస్, గారికీ, ప్రాజెక్టు పండిత పరిషత్తు సభ్యులకూ కృతజ్ఞతా పూర్వకవందనాలు.

జ్ఞానయజ్ఞ మనదగిన అష్టాదశపురాణాల అనువాదకార్యక్రమం నిరాటంకంగా కొనసాగునట్లు శ్రీవేంకటేశ్వరుడు దయతో అనుగ్రహించుగాక!

తిరుపతి
18-5-2019

సముద్రాల లక్ష్మణయ్య
ప్రత్యేకాధికారి
పురాణేతిహాస ప్రాజెక్టు, తి.తి.దే.,

పురాణ పురుషుడు శ్రీమన్నారాయణుడు



బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ । వైష్ణవం దక్షిణో బాహు: వాయుర్వామో మహేశితు: ॥
ఊరూ భాగవతం ప్రోక్తం నాభి: స్యాన్నారదీయకమ్ । మార్కండేయం చ దక్షాంఘ్రి: వామో హ్యాగ్నేయముచ్యతే ॥
భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మన: । బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృత: ॥
లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ । స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥
కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేధ: ప్రకీర్త్యతే । మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణు: పురాణావయవో హరి: ।

పురాణప్రశస్తి

(అష్టాదశపురాణాలు)

మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥
నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

అతి ప్రాచీనకాలంలో గురుకులాలలో విద్యనభ్యసించే విద్యార్థులు పదునాలుగు విధాలైన విద్యల నభ్యసించేవారు. ఆ విద్యల నిలా పేర్కొనడం జరిగింది.

అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః ।
పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతాశ్చతుర్దశ ॥

శిక్ష,వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం–అనే ఆరు వేదాంగాలు, ఋగ్యజుస్సామా థర్వణము లనే నాలుగు వేదాలు, మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం–అనేవే పదునాల్గు విద్యలు.

'వేదోఽఖిలో ధర్మమూలం' అన్నట్లు వేదమంతా ధర్మమూల మైనది. వేదోక్తమైన ధర్మాలను గ్రహించడం అందరికీ సాధ్యం కాని పని. అందుచేత వేదాలను విభజించిన వేదవ్యాసుడే వేదార్థాలను సామాన్యులు గూడా గ్రహించడాని కనువుగా పురాణాలను రచించాడు. **అష్టాదశపురాణానాం కర్తా సత్యవతీ సుతః** –అను ప్రమాణవచనం కూడా పదునెన్మిది పురాణాల రచయిత సత్యవతీ సుతుడైన వ్యాసుడే అని నిరూపిస్తున్నది.

ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।
బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రహరిష్యతి ॥

అల్పజ్ఞుడు తనకు హాని కల్గిస్తాడేమో అని వేదం భయపడుతుంది. అందువల్ల ఇతిహాసాలతోనూ, పురాణాలతోనూ వేదార్థాలను విస్తరింపజేయాలి. ఈ దృష్టితోనే, అనగా అల్పజ్ఞులను దృష్టిలో పెట్టుకొనే వ్యాసుడు వేదార్థాలను పురాణాలద్వారా విస్తరింపజేశాడు. అట్లని పురాణాలు అల్పజ్ఞులకు మాత్రమే పరిమితమైనవి కావు. అధికజ్ఞులు కూడా గ్రహించవలసిన విషయాలు పురాణాలలో ఎన్నో ఉన్నాయి.

వేదం ప్రభువుతో సమానమైనది. శబ్దప్రధానమైన వేదవాణి కర్తవ్యవిషయంలో రాజాజ్ఞను పోలివుంటుంది. పురాణవచనం మిత్రతుల్యంగా వుంటుంది. అది అర్థప్రధానమై శ్రోతను కర్తవ్యానికి పురికొల్పుతుంది. కావ్యం కాంతాసమ్మితమై సరసంగా బోధించి పాఠకుణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేస్తుంది అని ఆలంకారికులు వేదార్థాలను వివరించే పురాణాలకు మిత్రసాదృశ్యాన్ని ప్రతిపాదించారు.

యద్వేదాత్ప్రభుసమ్మితాదధిగతం శబ్దప్రధానా చ్చిరం
యచ్చార్థ ప్రవణాత్పురాణవచనాదిష్టం సుహృత్సమ్మితాత్ ।

కాన్తాసమ్మితయా యయా సరసతామాపాద్య కావ్యశ్రియా
కర్తవ్యే కుతుకీ బుధో విరచితస్తస్యై స్పృహాం కుర్మహే ॥ (ప్రతాపరుద్రీయం)

పురాణాలలో గూడా కావ్యశైలిని పాటించి రసవత్తరంగా కర్తవ్యబోధ కావించిన ఘట్టాలెన్నో ఎడనెడా కానవస్తాయి.

పురాణాలలో పూర్వకాలానికి చెందిన అనేక కథలున్నాయి. కథా కథనం ద్వారా ధర్మ స్వరూపం అందులో నిరూపింపబడింది. పురాణ కథలు వాగ్వైభవాన్ని ప్రదర్శించడానికి చెప్పినవి కావనీ, విజ్ఞానవైరాగ్యాలను విస్తరించి చెప్పడానికే ఆ కథలను వివరించడమయిందనీ భాగవతపురాణంలో వ్యాసభగవానుడే చెప్పాడు.

కథా ఇమాస్తే కథితా మహీయసాం
వితాయ లోకేషు యశః పరేయుషామ్ ।
విజ్ఞానవైరాగ్య వివక్షయా విభో!
వచోవిభూతిర్న చ పారమార్థ్యమ్ ॥ (భాగవతం-12-3-14)

ఇక్కడ 'విజ్ఞాన' మంటే వేదవిజ్ఞానమనే గ్రహించాలి.

'వేదాః ప్రతిష్ఠితా స్సర్వే పురాణే నాత్ర సంశయః'

పురాణాలలో వేదాలు ప్రతిష్ఠితాలై ఉన్నాయి. ఇందులో సందేహం లేదు. కథల ద్వారా అవి ఆవిష్కృతాలవుతాయి.

పురాణ ప్రాముఖ్యం

యన్న దృష్టం హి వేదేషు తత్సర్వం లక్ష్యతే స్మృతౌ ।
ఉభయోర్యన్న దృష్టం హి తత్పురాణే ప్రతీయతే ॥

వేదాలలో గోచరం కానిదంతా స్మృతులలో కనిపిస్తుంది. శ్రుతి స్మృతులు రెండింటిలో కనిపించనిది పురాణం ద్వారా అవగతం అవుతుంది అన్న ప్రమాణాన్ని బట్టి శ్రుతులలోనూ, స్మృతులలోనూ లేని విషయాలను సైతం విస్తృతరచనావిధానం కల పురాణాలద్వారా గ్రహించవచ్చునని తెలుస్తున్నది. **'పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్'** అన్నట్లు శాస్త్రాలన్నింటిలోను మొదటిదిగా పురాణాన్ని విధాత స్మరించాడని విదితమవుతున్నది. యాగానుష్ఠానసమయంలో పురాణాలు పఠించే సంప్రదాయం కద్దు. ఇంకా పురాణాలలో భగవన్మహిమ, భగవదవతారాలు, భక్తిప్రబోధం, నానా విధాలైన ఆచారాలు, ధర్మాధర్మాలు, సాంఘిక -చారిత్రకాంశాలు, కళలు, వేదాంతతత్త్వాలు, నీతి ఇత్యాదిగా ఎన్నో విషయాలు నిరూపితాలయ్యాయి.

పురాణం ఐహికాముష్మిక సుఖసాధనం. మన సంస్కృతి సంప్రదాయాలను గ్రహించడానికి పురాణజ్ఞానం అవసరం.

పురాణ శబ్దనిర్వచనం

పురాణం అంటే – పురా భవం ప్రాచీన కాలంలో రచించబడినది అని అర్థం.

పురాఽపి నవం – ప్రాచీనమైనా విషయ విశిష్టతను బట్టి క్రొత్తది అని మరొక అర్థం.

పురా–అణతి–అగతానాగతే కథయతీతి పురాణం–అంటే జరిగిన, జరుగనున్న కాలానికి చెందిన విషయాలను వివరించునది అని వేరొక అర్థం.

పురా–పూర్వస్మిన్ జాతమితి పురాణమ్–పూర్వం ఎప్పుడో జరిగిన వృత్తాంతం పురాణం అని భావం.

పురా–అంటే పరంపరను వ్యక్తం చేసేది పురాణం అని మరొక వివరణ.

పురా–ప్రాచీన కాలోదంతం అనక్తీతి పురాణం – పురాతన కాలానికి చెందిన చరిత్రను చెప్పునది పురాణం.

ఇలా పురాణ శబ్దానికి పలు విధాల నిర్వచనం పెద్దలు చెప్పారు.

పురాణోత్పత్తి

అథర్వవేదంలో పురాణ శబ్దం ప్రయుక్తమైంది. యజ్ఞోచ్ఛిష్టంనుండి పురాణం పుట్టినదని అందులో చెప్పబడింది.

ఋచఃసామాని ఛందాంసి పురాణం యజుషా సహ ।
ఉచ్ఛిష్టాజ్జజ్ఞిరే సర్వే దివి దేవా దివి శ్రితాః ॥ అథర్వ సంహిత (11–7–24)

నాల్గువేదాల తరువాత ఇక్కడ పురాణోత్పత్తి నిర్దేశించబడింది. పురాణాల ఉనికి వేద సమకాలికమని తెలుస్తున్నది.

అందుచేత వేదసంహితల కాలంలోనే పురాణాలకు చెందిన మూలస్వరూపం రూపొందిందని భావించవచ్చు. బృహదారణ్యకోపనిషత్తులోని ఈ క్రింది వాక్యం గమనార్హం

"అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతత్ యదృగ్వేదో, యజుర్వేద స్సామవేదోఽథర్వాఙ్గిరసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణి".(2–4–10)

ఈ ఉపనిషద్ వాక్యం వేదాదులతోపాటు పురాణం కూడా పరమాత్మయొక్క నిఃశ్వాసరూపమైనదని వ్యక్తం చేస్తున్నది. దీనివల్ల వేదం ఎంత ప్రాచీనమో పురాణం కూడా అంతే ప్రాచీనమని గ్రహించవచ్చు. ఇక్కడ పురాణ శబ్దం ఏకవచనంలో ప్రయుక్తమైనది. అందుచేత పూర్వం సంక్షిప్తంగా ఉండిన పురాణం కాలక్రమంలో విస్తృతరూపం సంతరించుకొని వివిధ పురాణాలుగా విస్తరించిందని భావించవచ్చు.

భారతీయసంస్కృతిని ప్రతిబింబించే దర్పణాలు పురాణాలు. సామాన్య జనానీకంలో సనాతన ధర్మతత్త్వాన్ని ప్రచారం చేయడంలో అవి ప్రముఖపాత్ర వహించాయి. ఆధునికకాలంలో ప్రాచ్య పండితులేకాక పాశ్చాత్య పండితులు కూడా పురాణాల విశిష్టతను గుర్తించారు. పురాణం అన్న వ్యవహారమే ఇది అతిప్రాచీన సాహిత్యమని తెలియజేస్తుంది.

పురాణాలకంటే భిన్నంగా ఇతిహాసాలను గూడా మన పెద్దలు పేర్కొన్నారు. గతకాలంలో జరిగిన సంఘటనలను తెలిపేవి ఇతిహాసాలు. ఇతి హ+ఆస = ఇతిహాసం అనగా ఇలా పూర్వం జరిగినది–అని అర్థం. పురాణంలోని విషయాలు ఇతిహాసంలోని అంశాలకంటె వ్యాపకంగానూ, విస్తృతంగానూ వుంటాయి.

సాధారణ పురాణాల నుద్దేశించి నిర్దేశించిన సర్గం, ప్రతిసర్గం మొదలైన లక్షణాల కంటె భిన్నమైన వివిధ విషయాలు పురాణాలలో గోచరిస్తాయి. ఉదా: అగ్నిపురాణాన్ని పరిశీలిస్తే వివిధ విద్యలు, పదార్థలక్షణాలు, స్వప్నాలు,

శకున ఫలితాలు, కావ్యనాటక లక్షణాలు, ప్రళయస్వరూపం, నరకం తీరుతెన్నులు, అద్వైత బ్రహ్మతత్త్వం మున్నగు అంశాలు అందులో ఉండడం గమనార్హం. అందుకే అగ్నిపురాణాన్ని 'జ్ఞానకోశం' అన్నారు.

సృష్ట్యారంభంనుండి నేటివరకు సమాజంలోని స్థితిగతులను చెప్పే పురాణాలను శ్రద్ధతో పఠించి పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అంతేకాని అవేవో కల్పనాత్మకమైన కథలని ఉపేక్షించడం తగదు. పురాణాలను ఏ దృష్టితో వ్యాసభగవానుడు రచించాడు? అన్న ప్రశ్నకు ఈ క్రింది శ్లోకం సమాధానమిస్తున్నది.

విష్ణోరంశో మునిర్జాతః సత్యవత్యాం పరాశరాత్ ।
పురాణసంహితాం దధ్యౌ తేషాం ధర్మవిధిత్సయా ॥

విష్ణ్వంశంతో జనించిన సత్యవతీ పరాశరుల పుత్రుడగు వ్యాసుడు ధర్మస్వరూప నిరూపణకై పురాణసంహితను రూపొందించాడని భావం.

అంతేకాక శ్రీమన్నారాయణుడు స్వయంగా వ్యాసరూపుడై వేదార్థాల విస్తృతి నపేక్షించి భూతలములో పురాణాలు రచించాడని ఈ క్రింది శ్లోకం నిరూపిస్తున్నది.

విస్తారాయ చ వేదానాం స్వయం నారాయణః ప్రభుః ।
వ్యాసరూపేణ కృతవాన్ పురాణాని మహీతలే ॥

సూతుని ద్వారా ఈ పురాణవాఙ్మయం ప్రచారంలోకి వచ్చింది. నైమిశారణ్యనివాసులైన శౌనకాది మునులు సూతునినుండి ఈ పురాణాలను విన్నారు.

విష్ణువుయొక్క అవయవాలే పురాణాలు

త్రిమూర్తులలో ఒక్కడుగా, స్థితికారకుడుగా, దుష్టశిక్షకుడుగా, శిష్టరక్షకుడుగా, ధర్మసంస్థాపకుడుగా ప్రసిద్ధుడైన శ్రీమహావిష్ణుదేవుని యొక్క అవయవాలుగా పదునెన్మిది పురాణాలను పేర్కొనడం కద్దు. దీన్నిబట్టి ధర్మప్రభువైన అచ్యుతునికీ, ధర్మస్వరూపనిరూపకాలైన పురాణాలకూ కల సామ్యాన్ని గ్రహించవచ్చు. పురాణాలు ఈ క్రిందివిధంగా విష్ణుదేవుని అవయవాలుగా పేర్కొనబడ్డాయి.

బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ ।
వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥

ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ ।
మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥

భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః ।
బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥

లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ ।
స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥

కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేదః ప్రకీర్త్యతే ।
మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।

దీని తాత్పర్యం ఇది–శ్రీమహావిష్ణువునకు బ్రహ్మపురాణం–శిరస్సు, పద్మపురాణం–హృదయం, విష్ణుపురాణం–దక్షిణహస్తం, వాయుపురాణం–వామహస్తం, భాగవతపురాణం–తొడలు, నారదపురాణం–నాభి, మార్కేండయ పురాణం–దక్షిణపాదం, అగ్నిపురాణం–వామపాదం, భవిష్యపురాణం–కుడిమోకాలు, బ్రహ్మవైవర్త పురాణం–ఎడమ మోకాలు, లింగపురాణం–కుడి చీలమండ, వరాహపురాణం–ఎడమ చీలమండ, స్కాంద పురాణం–కేశాలు, వామనపురాణం–చర్మం, కూర్మపురాణం–వీపు, మత్స్యపురాణం–మెదడు, గరుడపురాణం–మజ్జ, బ్రహ్మాండపురాణం–ఎముకలు. ఇలా శ్రీహరి పురాణాలే అవయవాలుగా కల్గి వున్నాడు.

పురాణ సంఖ్య

పురాణాలు మొత్తం పదునెనిమిది. వీటిని ఆయా పురాణాల పేర్లలో మొదటి అక్షరాన్ని మాత్రం పేర్కొనే ఒక శ్లోకంలో ఇలా చెప్పడమయింది.

మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వచతుష్టయమ్ ।
అనాపలింగ కూస్కాని పురాణాని విదుర్బుధాః ॥

'మ' అనే అక్షరంతో ప్రారంభమయ్యే పురాణాలు రెండు–(1) మత్స్య పురాణం (2) మార్కండేయ పురాణం. 'భ' అను అక్షరంతో ప్రారంభమయ్యేవి, రెండు –(1) భాగవతం (2) భవిష్యపురాణం –'బ్ర'తో ప్రారంభమయ్యేవి –మూడు (1) బ్రహ్మ పురాణం (2) బ్రహ్మాండ పురాణం (3) బ్రహ్మవైవర్త పురాణం –'వ' కారంతో ప్రారంభమయ్యేవి నాల్గు (1) విష్ణు పురాణం (2) వాయు పురాణం (3) వామన పురాణం (4) వరాహ పురాణం –అ=అగ్నిపురాణం నా=నారదపురాణం–ప=పద్మపురాణం, లిం=లింగపురాణం, గ=గరుడ పురాణం, కూ=కూర్మపురాణం, స్కా=స్కాందపురాణం ఇలా మొత్తం పురాణాల సంఖ్య పదునెన్మిది.

పురాణ విభాగం

పురాణాలను మహాపురాణాలనీ, ఉప పురాణాలనీ రెండు విధాలుగా విభజించడం కద్దు. పైన ప్రథమాక్షర నిర్దేశంతో పేర్కొన్నవన్నీ మహాపురాణాలే. ఈ క్రింది విధంగా కూడా ఈ పురాణాలను పెద్దలు నిర్దేశించారు.

బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ వాయవీయం తథైవ చ ।
భాగవతం నారదీయం మార్కండేయం చ కీర్తితమ్ ॥
ఆగ్నేయం చ భవిష్యం చ బ్రహ్మవైవర్త లింగకే ।
వారాహం చ తథా స్కాందం వామనం కూర్మ సంజ్ఞకమ్ ।
మాత్స్యం చ గారుడం తద్వద్బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ ॥

ఈ పదునెన్మిది పురాణాలనూ పద్మపురాణం సాత్త్వికాలు, రాజసాలు, తామసాలు అని మూడు వర్గాలుగా విభజించింది.

సాత్త్వికాలు–

వైష్ణవం నారదీయం చ తథా భాగవతం శుభమ్ ।
గారుడం చ తథా పాద్మం వారాహం శుభదర్శనే ॥

రాజసాలు–

బ్రహ్మాండం బ్రహ్మవైవర్తం మార్కండేయం తథైవ చ ।
భవిష్యం వామనం బ్రాహ్మం రాజసాని నిబోధత ॥

తామసాలు–

మాత్స్యం కౌర్మం తథా లైంగం శైవం స్కాందం తథైవ చ ।
ఆగ్నేయం చ షడేతాని తామసాని నిబోధత ॥

ఇందులో (1) వైష్ణవం (2) నారదీయం (3) భాగవతం (4) గారుడం (5) వారాహం (6) పాద్మం –అనునవి సాత్త్వికపురాణాలు. (1) బ్రహ్మాండం (2) బ్రహ్మవైవర్తం (3) మార్కండేయం, (4) భవిష్యం (5) వామనం (6) బ్రాహ్మం–అనేవి రాజసాలు. (1) మాత్స్యం (2) కౌర్మం (3) లైంగం (4) వాయవీయం (శైవం) (5) స్కాందం (6) అగ్నేయం అనేవి తామసాలు.

ఇలా ఒక్కొక్క వర్గంలో ఆరేసి పురాణాలు లెక్కకు వస్తాయి.

సాత్త్వికపురాణాలు శ్రీమహావిష్ణువు యొక్క ప్రాధాన్యాన్నీ, రాజస పురాణాలు చతుర్ముఖ బ్రహ్మ ప్రాముఖ్యాన్నీ, తామస పురాణాలు శివునియొక్క ఆధిక్యాన్నీ వర్ణిస్తున్నాయి. ఈ ముగ్గురు దేవతలు త్రిమూర్తులుగా ప్రసిద్ధులు.

అన్ని పురాణాలూ ఈ దేవత లందరికీ సమప్రాధాన్యాన్ని ప్రతిపాదించక కొన్ని పురాణాలు ఒక దేవతను ఇతరదేవతల కంటే అధికుడని చెప్పడం యుక్తమా? అనే సంశయం కలుగవచ్చు.

వేదం **'ఏకం సత్ విప్రా బహుధా వదంతి'** అని చెప్పింది. అంటే సద్రూపుడైన పరమాత్మ ఒక్కడే, తత్త్వజ్ఞులు ఆయనను నానానామరూపాలతో వర్ణిస్తారని భావం. పరబ్రహ్మానికి మూర్తమని, అమూర్తమని రెండు రూపాలు కలవనీ; అందులో మూర్తం క్షరం–అంటే నశించే స్వభావం కలిగినదనీ, అమూర్తం నాశం లేనిదనీ గ్రహించాలి. క్షరాక్షరాలు సకలభూతాలలోనూ సమంగా ఉన్నాయి. అక్షరం పరబ్రహ్మం కాగా, ఈ చరాచరజగత్తు క్షరం అవుతున్నది. ఈ విషయాన్ని విష్ణుపురాణం ఇలా వివరించింది.–

ద్వే రూపే బ్రహ్మణస్తస్య మూర్తం చామూర్తమేవ చ ।
క్షరాక్షరస్వరూపే తే సర్వభూతేష్వవస్థితే ।
అక్షరం తత్ పరం బ్రహ్మ క్షరం సర్వమిదం జగత్ ॥

దీనినిబట్టి పురాణాలలో వర్ణింపబడిన త్రిమూర్తులలో ఒకరు పెద్ద, మరొకరు చిన్న అనే తేడాలు లేవు. ఒకే తత్త్వం మూడు రూపాలతో విరాజిల్లుతున్నది. ఆ దేవతలు నిర్వహించే క్రియలలోని భేదమే వారిని మూడురూపాలతో నిర్దేశించడానికి హేతువైనది. ఈ సంగతినే విష్ణుపురాణం ఈ విధంగా వివరించింది.

సృష్టిస్థిత్యంతకరణాత్ బ్రహ్మవిష్ణుశివాత్మికామ్ ।
స సంజ్ఞాం యాతి భగవాన్ ఏక ఏవ జనార్దనః ॥

ఒక జనార్దనుడే సృష్టి, స్థితి, లయం - అనే మూడు కార్యాలు నిర్వహించడంవల్ల బ్రహ్మ, విష్ణువు, శివుడు అన్న మూడు సంజ్ఞలు పొందాడని భావం.

ఈ సత్యాన్ని గ్రహిస్తే ఆయా దేవతల పట్ల వైషమ్యం తొలగి సమత్వం నెలకొంటుంది. అందువల్ల త్రిమూర్తుల ప్రభావాలను సమయానుగుణంగా వర్ణించే పురాణాల పట్ల సమన్వయదృష్టినే కలిగివుండాలి.

మహాపురాణాల లాగానే ఉపపురాణాలు గూడా పదునెన్మిది ఉన్నాయని కూర్మ పురాణం పేర్కొంటున్నది.

ఆద్యం సనత్కుమారోక్తం నారసింహం తథాఽపరమ్ ।
తృతీయం స్కంద ముద్దిష్టం కుమారేణ తు భాషితమ్ ॥

చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నందీశ భాషితమ్ ।
దుర్వాససోక్తమాశ్చర్యం నారదోక్తమతఃపరమ్ ॥

కపిలం వామనం చైవ తథోశనససేవితమ్ ।
బ్రహ్మాండం వారుణం చాథ కాలికాహ్వయమేవ చ ॥

మాహేశ్వరం తథా సాంబం సౌరం సర్వార్థ సంచయమ్ ।
పరాశరోక్త మపరే మారీచం భాస్కరాహ్వయమ్ ॥

ఉపపురాణాలు-(1) సనత్కుమారోక్తం (2) నారసింహం (3) స్కాందం (4) శివధర్మం (5) దౌర్వాసం (6) నారదోక్తం (7) కాపిలం (8) వామనం (మానవం) (9) ఉశనసఃప్రోక్తం (10) బ్రహ్మాండం (11) వారుణం (12) కాలికా పురాణం (13) మాహేశ్వరం (14) సాంబం (15) సౌరం (16) పరాశరోక్తం (17) మారీచం (18) భాస్కరం (భార్గవం).

కొందరి మతంప్రకారం ఉపపురాణాల సంఖ్య ముప్పదినాల్గుగా నిర్దిష్టమయింది. వీటికి తోడుగా ఔపపురాణాలు అన్న పేరుతో మరొక పదునెన్మిది పురాణాలను గూడ నిర్దేశించడం కద్దు.

పురాణ లక్షణం

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ ।
వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్ ॥

సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరాలు, వంశానుచరితం-అని పురాణం ఐదు లక్షణాలు గల్గి యుంటుంది. వీటి సంగ్రహవివరణ ఇది.

1. సర్గం - అవ్యాకృతతత్త్వం నుండి మహత్తత్త్వం, దానినుండి అహంకారతత్త్వం, దానినుండి సూక్ష్మభూతాల సృష్టి.
2. ప్రతిసర్గం - మరీచ్యాదులవల్ల జరిగిన చరాచరసృష్టి.
3. వంశం-ఆయా ఋషుల, రాజుల వంశాలు.

4. మన్వంతరాలు– మనువుల పరిపాలనకాలంలో జరిగిన విషయాలు మరియు ఆయా మన్వంతరాలలో సప్తఋషులు, మునులు మొదలగువారి వివరణ.

5. వంశానుచరితం–ఆ యా రాజవంశీయులైన రాజుల పరిపాలన మున్నగువాటికి చెందిన కథలను వివరించడం.

పక్షాంతరంలో పురాణాలకు పది లక్షణాలు గూడా నిర్దేశించడం కద్దు. పైన చెప్పిన ఐదు లక్షణాలు సాధారణపురాణాల లక్షణం కాగా, క్రింద చెప్పబోయే పదిలక్షణాలు మహాపురాణాలకు చెందినవని పెద్దల అభిప్రాయం.

అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణమూతయః ।
మన్వంతరేశానకథా నిరోధో ముక్తిరాశ్రయః ॥

సర్గం, విసర్గం, స్థానం, పోషణం, ఊతులు, మన్వంతరాలు, ఈశాన కథలు, నిరోధం, ముక్తి, ఆశ్రయం–అనేవే ఈ పది లక్షణాలు.

వీటి సంగ్రహ వివరణ ఇది–

(1) సర్గం –భగవత్ప్రేరణతో సత్త్వరజస్తమోగుణాలలో క్షోభ ఏర్పడి పంచభూతాలు, పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, అహంకారం, మహత్తత్త్వం జనించడాన్ని సర్గమంటారు.

2) విసర్గం:–విరాట్పురుషునినుండి ఉదయించిన బ్రహ్మ వివిధ చరాచరాలను సృష్టిస్తాడు. ఈ సృష్టినే విసర్గమంటారు.

3) స్థానం:–వినాశోన్ముఖమైన సృష్టిని ఒక మర్యాదలో నిల్పడమే స్థానం.

4) పోషణం:–భగవానుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావిస్తాడు. జగత్తుకు మేలు గల్గించే సందేశాన్ని అందిస్తాడు. నామరూపాలతో పుష్టిని కల్గిస్తాడు. దీనిని పోషణమంటారు.

5) ఊతులు:–కర్మవాసనలను ఊతులంటారు.

6) మన్వంతరాలు:–మనువులు మారినప్పుడు మన్వంతరకాలంలో తత్కాలానికి చెందిన అధిపతులు భక్తినీ,ధర్మాన్నీ ప్రబోధించే సంఘటనను మన్వంతరమంటారు.

7) ఈశానకథలు:– భగవదవతారాలు, భక్తులు–వీరికి సంబంధించిన చరిత్రలు.

8) నిరోధం:–జీవోపాధులను తనలో లీనం చేసుకొని భగవానుడు యోగనిద్రాముద్రితుడు కావడమే నిరోధం.

9) ముక్తి:–వేరే రూపాలు వదలి స్వస్వరూపంతో వుండడమే ముక్తి. ప్రకృతినుండి విముక్తి లభించే స్థితి ఇది.

10) ఆశ్రయం:– అధిష్ఠానమే ఆశ్రయం. దీని విశుద్ధికొరకే పై తొమ్మిది లక్షణాలనూ వివరించడం జరిగింది.

పై పది లక్షణాలూ మహాపురాణమైన శ్రీమద్భాగవతానికి చక్కగా అన్వయిస్తాయి. పెద్దలు వ్రాసిన గ్రంథాలలో వాటి సమన్వయాన్ని చూడవచ్చు.

పురాణశ్లోక సంఖ్య

భాగవతంలోని ద్వాదశస్కంధమందలి పదమూడవ అధ్యాయంలో ఆయా పురాణాలలోని శ్లోకాల సంఖ్య ఈ క్రిందివిధంగా నిర్దేశించడమయింది.

బ్రాహ్మం దశ సహస్రాణి పాద్మం పఞ్చోనషష్టి చ ।
శ్రీవైష్ణవం త్రయోవింశచ్చతుర్వింశతి శైవకమ్ ॥

దశాష్టౌ శ్రీభాగవతం నారదం పఞ్చవింశతిః ।
మార్కండేయం నవాగ్నేయం దశపఞ్చ చతుశ్శతమ్ ॥

చతుర్దశ భవిష్యం స్యాత్తథా పఞ్చశతాని చ ।
దశాష్టౌ బ్రహ్మవైవర్తం లైఙ్గమేకాదశైవ తు ॥

చతుర్వింశతి వారాహమేకాశీతిసహస్రకమ్ ।
స్కాందం శతం తథా చైకం వామనం దశ కీర్తితమ్ ॥

కౌర్మం సప్తదశాఽఽఖ్యాతం మాత్స్యం తత్తు చతుర్దశ ।
ఏకోనవింశత్సౌపర్ణం బ్రహ్మాండం ద్వాదశైవ తు ॥

త్రయోదశే పురాణానాం సంఖ్యామాహ యథాక్రమమ్ । **(భాగవతం-12-13-2--9)**

1. బ్రహ్మపురాణం	-	10,000	శ్లోకాలు
2. పద్మపురాణం	-	55,000	,,
3. విష్ణుపురాణం	-	23,000	,,
4. వాయుపురాణం	-	24,000	,,
5. భాగవతపురాణం	-	18,000	,,
6. నారదపురాణం	-	25,000	,,
7. మార్కండేయపురాణం	-	9,000	,,
8. అగ్నిపురాణం	-	15,400	,,
9. భవిష్యపురాణం	-	14,500	,,
10. బ్రహ్మవైవర్తపురాణం	-	18,000	,,
11. లింగపురాణం	-	11,000	,,
12. వరాహపురాణం	-	24,000	,,
13. స్కందపురాణం	-	81,100	,,
14. వామనపురాణం	-	10,000	,,
15. కూర్మపురాణం	-	17,000	,,
16. మత్స్యపురాణం	-	14,000	,,
17. గరుడపురాణం	-	19,000	,,
18. బ్రహ్మాండపురాణం	-	12,000	,,
మొత్తం శ్లోకాలు	-	**4,00,0000**	

పురాణాలలో ముఖ్యాంశాలు

పురాణాలు మానవకర్తవ్యాలను నిర్దేశిస్తూ కొన్ని ముఖ్యమైన సందేశాత్మక ప్రబోధాలు కావించాయి. ధర్మాన్ని రక్షించవలసిన ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనాలను వివిధ కథల ద్వారా అవి విశదీకరించాయి.

విశ్వమంతా భగవన్మయమనీ, మోక్షప్రాప్తికి భక్తి ముఖ్యసాధనమనీ, వివిధ వ్రతాలను వాటికి తగిన కాలాలలో అనుష్ఠించి పవిత్రులు కావాలనీ, పుణ్యక్షేత్రాలను సందర్శించాలనీ, ఆయా క్షేత్రాలలో ప్రతిష్ఠితులైన దేవతలను ఆరాధిస్తే శుభాలు సిద్ధిస్తాయనీ, పితృదేవతలకు శ్రాద్ధవిధిని తప్పక అనుష్ఠించాలనీ, కర్మఫలం అనుభవించక తప్పదనీ ఇత్యాదిగా పురాణాలు ప్రబోధించే అంశాలు అందరికీ గమనింపదగినవై యున్నాయి.

వర్ణనాశైలి

కవితా రూపంలో గల రచనలను కవులు ఆలంకారిక ప్రక్రియలో కొనసాగిస్తారు. ఈ ప్రక్రియ పాఠకులను ఆకర్షిస్తుంది. యథాతథంగా సాగే కథాకథనంతోపాటు అవసరమైనచోట అలంకార ప్రక్రియనాశ్రయించి కవులు వర్ణన నిర్వహిస్తారు. అతిశయోక్తులను గూడా మేళవిస్తారు. ఉన్నదున్నట్లు చెప్పడం యథాతథకథనం కాగా కథనంలో ఉపమారూపకాదులను ఆశ్రయించడం ఒక విశిష్టమైన పద్ధతి. వేదాలలో గూడ ఈ పద్ధతి కనిపిస్తుంది. ఉదాహరణకు కఠోపనిషత్తులో

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥

ఇత్యాదిగా శరీరానికి రథరూపకల్పన చేసి ఆత్మను రథికునిగా పేర్కొనడం జరిగింది. సూర్యుని కిరణాలలోని ఏడు రంగులను ఏడు గుర్రాలుగా వర్ణించడం గూడా ఈ ప్రక్రియకు చెందిన విషయమే.

పురాణాలు గూడా ఈ శైలిని విస్తృతంగా అనుకరించాయి. అతిశయోక్తిని గూడా విపులంగా వినియోగించాయి. ఈ పద్ధతి పురాణ వాఙ్మయానికి శోభావహ మైందనడంలో ఏ మాత్రం సందేహంలేదు.

పురాణ ప్రయోజనం

యథా పాపాని పూయన్తే గంగావారివిగాహనాత్ ।
తథా పురాణ శ్రవణాద్దురితానాం వినాశనమ్ ॥

గంగాజలంలో స్నానం చేయడంవల్ల పాపాలు నశించినట్లే పురాణశ్రవణంవల్ల దురితాలు నశిస్తాయి.

సదాచారప్రబోధం

యజ్ఞాలు, దానాలు, తపస్సులు ఇత్యాదిగా ఎన్ని చేసినా – సదాచారం లేనివాడు ఆత్మోన్నతి పొందలేడు.

దురాచారో హి పురుషో నేహ నాముత్ర నందతి ।

అన్నట్లు దురాచారుడైన మనుజుడు ఇహపరలోకాలు రెండింటా సుఖానికి దూరమౌతాడు.

ఆచారహీనం న పునన్తి వేదా యద్యప్యధీతాః సహ షడ్భిరంగైః ।

సదాచారం లేనివాడిని వేదాలుగూడా పవిత్రుణ్ణి చేయజాలవు. దురాచారాలు, సదాచారాల స్వరూపాన్ని వివిధ కథల ద్వారా పురాణాలు చక్కగా నిరూపించాయి. రామాయణంలో రామాదివద్వర్తితవ్యం, న రావణాదివత్, –రామాదులవలె ప్రవర్తించాలి కాని, రావణాదులవలె ప్రవర్తించరాదు అన్న విధంగా నీతిప్రబోధం పురాణాలలో రమణీయంగా చేయబడింది.

అందువల్ల పురాణ పఠన శ్రవణాలు సమాజాభ్యున్నతి కల్గిస్తాయి. పూర్వం గ్రామసీమలలో గూడ రాత్రివేళల పౌరాణికులు పురాణ పఠనం కావించి అందలి విశేషాలను సామాన్య జనులకు బోధించేవారు. ఈ బోధ ప్రజానీకానికి సముచిత సంస్కారం కల్గించేది. తద్వారా వారు ఆత్మోన్నతి కల్గించే మార్గంలో నడిచేవారు.

కాలనిర్ణయం

పురాణాల కాలనిర్ణయం అంత సుకరం కాదు. శ్రీ శంకరభగవత్పాదులు మున్నగువారు తమ రచనల్లో పురాణాల నుదాహరించియున్నారు. బాణకవి (క్రీ.శ.625) తన హర్షచరిత్రలో **పురాణేషు వాయుప్రలపితం** అని చెప్పి వాయుపురాణాన్ని ప్రస్తావించాడు.

కలియుగరాజులను నిర్దేశించిన పురాణాలు గూడా ఉన్నాయి. విష్ణు పురాణంలో మౌర్యవంశం పేర్కొనబడింది. మాత్స్యపురాణం–దాక్షిణాత్యులైన ఆంధ్రరాజులను (క్రీ.శ 225) ప్రస్తావించింది. గుప్తరాజుల ప్రస్తావన వాయుపురాణంలో కనిపిస్తున్నది.

లక్ష శ్లోకాలుగల ఇప్పటి మహాభారతం రూపొందకముందే పురాణాల ఉనికిని పరిశోధకులు గుర్తించారు. మహాభారతవక్త అయిన రౌమహర్షణి పురాణాలలో పారంగతుడు. అతని తండ్రిగూడ పౌరాణికుడుగా ప్రసిద్ధుడే. మహాభారతంలో పెక్కు శ్లోకాలు పురాణాంతర్గత శ్లోకాలతో సామ్యం కల్గి వున్నాయి. మహాభారతంలోని కొన్ని ఆఖ్యానాల ప్రాచీన స్వరూపం పురాణాలలో గోచరిస్తున్నది. దీన్ని బట్టి మహాభారతం కంటె పురాణాలు ప్రాచీనమైనవని విశ్వసించవచ్చు.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో పురాణ ప్రస్తావన ఉన్నది. అపమార్గగాములైన రాజకుమారులను పురాణోపదేశం ద్వారా సన్మార్గగాములను చేయాలని కౌటిల్యుడు వచించాడు. రాజుకు సంబంధించిన అధికారులలో పౌరాణికుడు గూడా ఒకడని కౌటిల్యుడు పేర్కొన్నాడు. అంచేత కౌటిల్యుని కంటె పురాణాలు ప్రాచీనాలని భావించడం సముచితం. కౌటిల్యుడు క్రీ.పూర్వం తృతీయ శతకం వాడని అనేకుల భావన. అందువల్ల ఆ కాలానికంటె ముందే పురాణాలుండేవని భావించాలి.

గౌతమ–అపస్తంబ సూత్రగ్రంథాలలో గూడ పురాణప్రస్తావన వస్తుంది. రాజు శాసనవ్యవస్థలో వేదంతోపాటు పురాణాన్ని గూడా ప్రముఖంగా గ్రహించాలని గౌతముడు చెప్పాడు. అతిప్రాచీన పురాణభాగాలనుండి మూడు శ్లోకాలను ఆపస్తంబ ధర్మసూత్రాలలో ఉదాహరించడం జరిగింది. ఆ శ్లోకాలతో సామ్యం కల శ్లోకాలు నేటి పురాణాలలో లభిస్తున్నాయి. కాబట్టి సూత్రకాలంలో గూడా పురాణ గ్రంథాలుండేవని బోధపడుతున్నది.

మరొక ముఖ్యాంశ మేమంటే అతిప్రాచీనములైన ఉపనిషత్తులలో గూడా పురాణ ప్రస్తావన కలదు, ఛాందోగ్యంలో నారద సనత్కుమారుల సంవాదంలో ఇతర శాస్త్రాలతోపాటు పురాణాలను పేర్కొన్నారు.

"ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేదమాథర్వణం చతుర్థమితిహాస పురాణం పంచమం వేదానాం వేదం" (ఛాందో 7-1-2).

అందుచేత క్రీ.పూ 600 సం॥ పూర్వం పురాణాల నిర్మాణం జరిగిందని పెద్దల భావన. వాటికి మూల భూతమైన పురాణా లిప్పుడు లభించవు.

పురాణాలు ఏ ఒక్క శతాబ్దానికో చెందిన రచనలు కావు. కాలక్రమములో వాటిలో క్రొత్తక్రొత్త అధ్యాయాలు చేర్చడం జరిగింది. గుప్తకాలానికి పురాణాలు నేటిరూపం సంతరించుకొన్నాయని చెప్పవచ్చు.

పురాణ వైశిష్ట్యం

పురాణాలు సామాన్యులకు దుర్బోధమైన వేదార్థాలను వారికవగతమయ్యే రీతిలో కథలు జోడించి చెప్పాయి. ప్రాచీనకాలానికి చెందిన భారతీయసమాజస్వరూపస్వభావాలను అర్థం చేసుకోవడానికి పురాణాలే ప్రామాణికమైన ఆధారాలు. ఆనాటి ఋషుల చరిత్రలను మనం పురాణాలనుండే సమగ్రంగా గ్రహించడానికి వీలవుతుంది.

భారతభౌగోళికస్థితి, నదీనదపర్వతాల ఉనికి, వివిధ తీర్థాల స్థితిగతులు, పలువృక్షాలు, జంతువులు– వీటిని గూర్చిన విజ్ఞానం కూడా పురాణాలలో లభిస్తుంది.

పురాణాలను, శిలాశాసనాదులగు ఇతర ప్రామాణికాధారాలతో తులనాత్మకంగా పరిశీలిస్తే గత చరిత్రకు చెందిన అనేక విషయాలు తేటతెల్లమవుతాయి.

కాబట్టి భారతీయులే కాక పాశ్చాత్యులు గూడా పురాణాలను శ్రద్ధతో పరిశోధించి మానవజాతి గతచరిత్రను సమగ్రంగా అవగతం చేసుకోవచ్చు.

ధార్మికంగానూ, ఆధ్యాత్మికంగానూ సామాన్యప్రజలను చైతన్యవంతులను చేయడంలో పురాణాలు నిర్వహించిన పాత్ర ఎంతో గణనీయమైనది. మొత్తం పదునెనిమిది పురాణాలలోని శ్లోకాల సంఖ్య నాల్గు లక్షలని ముందే చెప్పుకొన్నాం. ఇంత విస్తృతమైన గ్రంథరాశి సంస్కృతభాషానిబద్ధమై లభిస్తున్నది.

వేదాలలోని నిగూఢమైన వేదాంతతత్త్వాన్ని సామాన్య జనులకు గూడా అర్థం కావాలనే దృష్టితో ఆఖ్యానాలతోనూ, ఉపాఖ్యానాలతోనూ పురాణాలు వివరించాయి.

ప్రాచీనకాలంలో యజ్ఞాలు నిర్వహించే ప్రదేశాలలో పురాణపఠనం విధిగా నిర్వహింపబడేది. పురాణపఠనం పాపనివారకమనీ, పుణ్యప్రదమనీ ప్రశంసింపబడింది. పౌరాణికులు పురాణాలను పఠిస్తూ ప్రవృత్తినివృత్తిరూపాలైన రెండు విధాల ధర్మాలనూ ప్రజలకు వివరించేవారు.

పురాణాలను ఆధారంగా చేసుకొని కవులు కావ్యనాటకాదులు విస్తృతంగా రచించారు. భారతీయుల జీవితాలకూ, విశ్వాసాలకూ పురాణాలు శతాబ్దాల తరబడి మార్గనిర్దేశకా లయ్యాయి. వేదార్థాలను అతివిస్తృతస్థాయిలో జనానీకానికి అందజేయడానికి పురాణాలు ముఖ్యసాధనా లయ్యాయి.

వేదాంతతత్త్వాన్ని బోధించడాని కవతరించిన శ్రీశంకరరామానుజాద్యాచార్యులు గూడా అవసరమైన చోట పురాణవచనాలను ప్రమాణాలుగా పేర్కొనియున్నారు.

కర్మ-భక్తి-ధ్యాన-జ్ఞాన యోగాలు మోక్షసౌధాన్ని అధిష్ఠించడానికి సోపానాలు. ఇందులో కలియుగంలో భక్తియొక్కటే సులభమైన తరణోపాయమని పెద్దలు పేర్కొన్నారు.

"కలౌ భక్తిః కలౌ భక్తిః భక్త్యా కృష్ణః పురః స్థితః" అన్నట్లు కలియుగంలో అనన్యభక్తిచేతనే భగవదనుగ్రహం కలుగుతుందన్న సత్యాన్ని భాగవతాది పురాణాలు ప్రహ్లాదచరిత్రాదికథల ద్వారా మనోజ్ఞంగా నిరూపించాయి.

అట్లే గృహస్థులు పాటించవలసిన పలురకాలైన కర్మవిధానాలూ, వ్రతాలూ, వాటివల్ల కలిగే ఫలితాలూ పురాణాలలో ఎడనెడా విశదంగా నిరూపించబడ్డాయి. ఈ విధంగా కర్మయోగ నిరూపణం గూడా పురాణాలలో కనిపిస్తుంది. వివిధ విషయాలతో కూడిన పురాణాలను విజ్ఞానసర్వస్వాలుగా, జ్ఞాననిలయాలుగా భావించవచ్చు.

పురాణాలలో వివిధ ప్రదేశాలలో గల నానాతీర్థాలు, ఆ తీర్థాల ప్రాముఖ్యం, తీర్థయాత్రలవల్ల కలిగే ప్రయోజనాలు మొదలైన విషయాలు పలుచోట్ల వివరింపబడివున్నాయి. తీర్థయాత్రలవల్ల ప్రజలలో ఏకజాతీయతాభావం పెంపొందుతుంది. గతచరిత్రకు సంబంధించిన విజ్ఞానం భావిపురోగతికి దోహదం చేస్తుంది. పురాణాలను క్షణ్ణంగా పరిశీలిస్తే భారతదేశ గతచరిత్రకు చెందిన ఎన్నో విషయాలు గోచరిస్తాయి. "పురోఽభివృద్ధి గోరువారు పూర్వవృత్తాంతమును మరువరాదు" అని శ్రీమలయాళస్వామి సూక్తి. అందుచేత చారిత్రక పరిశోధకులు పురాణాలను పరిశీలనాత్మకమైన దృష్టితో అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. తమ పాలనలో ఎదురయ్యే సమస్యలను ఆనాటి పాలకులు పురాణవృత్తాంతాలను ప్రమాణంగా పరిగ్రహించి పరిష్కరించేవారు. అందుచేత రాజధర్మ పరిజ్ఞానానికి గూడా పురాణసారస్వతం ఉపకరిస్తుంది.

పురాణాలలో బోధింపబడిన నీతులను కేవలం హిందూజాతికి మాత్రమే పరిమితా లని భావించరాదు. ప్రపంచజను లందరికీ ఉపయోగపడే శాశ్వతనైతికబోధ లందులో ఉన్నాయి.

ఆధునిక విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పలు అంశాలు పురాణాలలో నిర్దిష్టములై యున్నాయని ఇప్పటి శాస్త్రజ్ఞులలో కొందరి భావన. అందుచేత వైజ్ఞానిక పరిశోధకులకు గూడా పురాణజ్ఞానం అవసరమే.

అతిప్రాచీనకాలంనుండీ నేటివరకూ అమూల్య సారస్వతరూపంలో మనకు ఉపలబ్ధమవుతున్న వాఙ్మయంలో పూర్వోక్తపద్ధతిలో పురాణాలకు గల ప్రాముఖ్యాన్ని గుర్తించి మానవజాతిపురోగతికి వాటిని వినియోగించుకొని సర్వతోముఖమైన శ్రేయస్సును పొందుదుము గాక!

తిరుపతి
తేది. 10-01-2019

సముద్రాల లక్ష్మణయ్య
ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు - తి.తి.దే.



అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం

1. బ్రహ్మపురాణం

పురాణాలలో మొదటిది బ్రహ్మపురాణం. ఇది విష్ణుదేవుని మాహాత్మ్యాన్ని విశదీకరిస్తుంది. ఆ దేవుని శిరస్సుగా వర్ణింపబడిన ఈ పురాణం ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధపురుషార్థాల ప్రాప్తికి తగిన ఉపాయాలను వివరిస్తుంది.

10,000 శ్లోకాలు గల ఈ పురాణంలో పలు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు ఉన్నాయి. నైమిశారణ్య వర్ణనం, ప్రళయస్వరూపం, హరిశ్చంద్రసగరాదుల చరిత్రలు, సప్తద్వీపాలు, పార్వతీ స్వయంవరం, సాగరస్నానవిధి, గోదావరీ పవిత్రత, క్షీరసాగరమథనం, దధీచి వృత్తాంతం, వరాహాద్యవతారాలు–ఇత్యాదిగా అనేక విషయాలు ఇందులో నిబంధింపబడి వున్నాయి.

భారతావని, దండకారణ్యం, గంగాదినదుల ప్రాశస్త్యం విస్తృతంగా ఈ పురాణంలో వివరించడమయింది.

ప్రతిపురాణంలోనూ తత్త్వాన్నీ, నీతినీ, ధర్మాన్నీ బోధించే కథలు ఉంటాయి. ఈ పురాణంలోని కథలలో 'కందు' మహర్షి కథ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది. అతని తపస్సుకు భంగం కల్గించడానికి దేవతలు పంపిన అప్సరస ప్రమ్లోచ దాదాపు 900 సంవత్సరాలు అతనితో విహరించి అతని నియమానికి భంగం కల్గిస్తుంది.

చివరికి తన పొరబాటు గుర్తించిన మహర్షి పురుషోత్తమక్షేత్రమనే పూరీజగన్నాథక్షేత్రానికి వెళ్ళి శ్రీ జగన్నాథుని సేవించి ముక్తుడవుతాడు.

తరువాతి కథలలో కార్తవీర్యార్జునుని వృత్తాంతం ప్రముఖమైనది. ఇది మిక్కిలి విస్తృతమైన చరిత్ర. దత్తాత్రేయుని అనుగ్రహంతో సహస్రబాహువులు కల్గి శిష్టరక్షణ కావిస్తూ రావణాదులను జయించి ధర్మబద్ధంగా రాజ్యపాలన గావించిన ఈ రాజు చివరికి తనకంటే బలవంతుడైన పరశురామునిచే వీరమరణం పొందుతాడు. ఏడువందల యాగాలు నిర్వహించినవాడుగా ఈతడు ప్రసిద్ధుడయ్యాడు. విష్ణుతత్త్వం బోధించే పలు విషయాలు ఇంకా ఎన్నో ఈ పురాణంలో గోచరిస్తాయి.

ఇదం యః శ్రద్ధయా నిత్యం పురాణం వేదసమ్మితమ్ ।
యః పఠేచ్ఛృణుయాన్మర్త్యః స యాతి భువనం హరేః ॥

వేదతుల్యమైన ఈ పురాణాన్ని శ్రద్ధతో చదివినవాడు, లేక విన్నవాడు హరినిలయమైన వైకుంఠం చేరుకుంటాడని ఫలశ్రుతి.

2. పద్మపురాణం

మహావిష్ణువుయొక్క హృదయస్థానంతో పోల్చబడిన పురాణమిది. సృష్టి ప్రక్రియ ఆ దేవుని నాభికమలంనుండి జన్మించిన బ్రహ్మద్వారా మొదలయింది. ఆ ప్రక్రియయే ఈ పురాణాని కాధారం. కాన ఇది 'పద్మపురాణ' మనబడింది. ఇందులో 55,000 శ్లోకాలున్నాయి.

సృష్టిఖండం, భూఖండం, స్వర్గఖండం, పాతాళఖండం, ఉత్తరఖండం – అని ఐదు ఖండాలుగా విభజింప బడిన ఇందులో మొత్తం 641 అధ్యాయాలున్నాయి.

కాలపరిమాణం, క్షీరసాగరమథనం, దక్షయాగధ్వంసం, చంద్రవంశం, వామనావతారం, తారకాసుర వృత్తాంతం, నృసింహావతారం, సదాచారం – ఇత్యాదిగా పలువిషయాలను ఈ పురాణం వివరిస్తున్నది.

శరీరవర్ణనం, ఆత్మస్వరూపం, విష్ణుభక్తి మహిమ, కార్తికమాస ప్రాశస్త్యం, దీపావళీమాహాత్మ్యం పూజావిధానాలు, యుగధర్మాలు మున్నగు విషయాలను విపులంగా ఇందులో చూడవచ్చు.

ప్రపంచమంతా శ్రీహరిమయమే అని ఈ పురాణం ఘోషిస్తున్నది. ఇందులో పేర్కొన్న సదాచారాలు అవశ్యం ఆచరింపదగివున్నాయి.

తల్లిదండ్రుల విశిష్టతను ప్రశంసించి **"మాతరం పితరం తస్మాత్సర్వయత్నేన పూజయేత్"** –సకల ప్రయత్నాలతోనూ తల్లిదండ్రుల నర్చించాలి అని ఈ పురాణం బోధించింది. ఇది **'మాతృదేవో భవ, పితృదేవో భవ'** అన్న శ్రుతివచనానికి వివరణగా ఉన్నది.

ఇంకా ఉసిరికాయకు గల పవిత్రత, దాన్ని సేవించే విధానం విపులంగా ఇందులో పేర్కొనబడింది. అట్లే తులసికి గల ప్రాశస్త్యం కీర్తించబడింది.

పురాణపఠనావశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనం, కలియుగధర్మాలు, ఆ యుగంలో స్త్రీపురుషుల స్వభావాలు, జనుల విపరీతప్రవృత్తులు విశదంగా ఇందులో నిరూపింపబడియుండడం గమనార్హం.

కలియుగంలో ధర్మాత్మకమైన కర్మను మనుజుడు భక్తితో భగవదర్పితంగా ఆచరిస్తే సర్వపాపనిర్ముక్తుడవుతాడని ఈ పురాణం ప్రతిపాదించింది. ఇలా ఏ పురాణాన్ని పరిశీలించినా నానావిధములైన, ఆత్మోన్నతిహేతువులైన, మానవజీవితాని కవసరములైన పెక్కు విషయాలు విశదీకరింపబడివున్నాయి.

ఈ పద్మపురాణాన్ని చదివేవారికి, వినేవారికి కోరిన కోర్కెలన్నీ శ్రియఃపతి అనుగ్రహం వల్ల సిద్ధిస్తాయని ఫలశ్రుతి.

యద్యదిష్టం పఠంత్యేతత్ శృణ్వంతి చ ముముక్షవః ।
లభన్తే తత్తదేవాశు ప్రసాదాత్కమలాపతేః ॥

3. విష్ణుపురాణం

శ్రీ మహావిష్ణువు యొక్క దక్షిణబాహువుగా విష్ణుపురాణం వర్ణించబడింది. ఆరు అంశాలుగా విభజింపబడిన ఈ పురాణంలో 126 అధ్యాయాలున్నాయి. విష్ణు ధర్మోత్తరంతోగూడ కలుపుకొంటే ఇందలి మొత్తం శ్లోకాలు 23,000. పరాశరమహర్షి మైత్రేయునకు జెప్పిన పురాణ మిది.

ఇరవైనాలుగు తత్త్వాలు, జగదావిర్భావం, కాలస్వరూపం, వరాహావతారం, భూవిభజన, సనకాదుల జననం, స్వాయంభువమనువు పుట్టుక, దక్షపుత్రికల వివాహం, ధ్రువచరిత్ర, నృసింహావతారం, భరతవంశవర్ణన, జడభరతోపాఖ్యానం–ఇత్యాదిగా అనేకాంశాలు ఈ పురాణంలో విశదీకరింపబడ్డాయి.

మరియు బ్రహ్మజ్ఞాన ప్రాశస్త్యం, వేదవిభాగం, బ్రహ్మచర్యాద్యాశ్రమాలు, దేవాసురుల యుద్ధం, సగరవంశవర్ణన, శ్రీకృష్ణావతారం, కలి లక్షణాలు, నామసంకీర్తనప్రభావం మొదలైన విషయాలు గూడ విపులంగా ఇందులో నిరూపించడమైనది.

వైష్ణవులకు మిక్కిలిగా ఆరాధనీయమైన పురాణమిది. వైష్ణవసిద్ధాంతాలకు మూలభూతమైన గ్రంథం గాన శ్రీభగవద్రామానుజాచార్యులు ఆ సిద్ధాంతప్రచారాన్ని ఈ పురాణాన్ని ఆధారంగా స్వీకరించి నిర్వర్తించారు.

శరణాగతి, భగవద్గుణకర్మనామాల గానం, విష్ణ్వర్పణంగా కర్మల ననుష్ఠించడం మొదలగు అంశాలకు ఈ పురాణంలో ప్రాముఖ్యం ఇవ్వడమయింది.

మరియు శ్రవణం, కీర్తనం మున్నగు నవవిధభక్తి మార్గాలు ఇందులో విస్తృతంగా ప్రతిపాదింపబడి వున్నాయి. భాగవతపురాణం లాగా ఈ పురాణం గూడా భక్తియోగానికి ప్రాధాన్యాన్ని ప్రతిపాదించింది.

దేవతలను ఆరాధించేవారిలో అనేకులు శివకేశవులలో భేదాన్ని చూస్తారు. అయితే ఈ పురాణంలో–

"అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః ।
వదంతి భేదం పశ్యన్తి చావయోరన్తరం హర!" ॥

'అవిద్యామోహితులే నీకూ, నాకు భేదం పాటిస్తారు' అని కేశవుడు శివునితో చెప్పాడు. ఈ శివకేశవాభేద సిద్ధాంతం ఇక్కడ గమనార్హం.

ఈ పురాణంలో జడభరతుని వృత్తాంతం మిక్కిలి ఆసక్తిని రేకెత్తించేదిగా వర్ణితమై వున్నది. ఆతని మూడు జన్మలకు సంబంధించిన విశేషాలు గ్రహిస్తే మనలో జ్ఞానవిజ్ఞానాలు వికసిస్తాయి.

యో నరః పఠతే భక్త్యా యః శృణోతి చ సాదరమ్ ।
తావుభౌ విష్ణులోకం హి వ్రజేతాం భుక్తభోగకౌ ॥

అన్నట్లు – భక్తితో దీన్ని పఠించేవాడు, ఆదరంతో వినేవాడూ ఈ లోకంలో భోగాలనుభవించి తుదకు విష్ణుసాన్నిధ్యం చేరగలరని ఫలశ్రుతి.

4. వాయుపురాణం

వాయుదేవుడు శివలీలలను వివరించిన పురాణమిది. అందుచేత దీన్ని 'శివపురాణ' మని కూడా పేర్కొంటారు. **'చతుర్వింశతి సాహస్రం పురాణం'** –అనుటవల్ల ఇందులో 24,000 శ్లోకాలున్నాయని గ్రహించాలి. కాని ఇపుడు మనకు లభించేవి 11,000 శ్లోకాలు మాత్రమే. శ్లోకసంఖ్యలలో ఇట్టి వ్యత్యాసాలు కొన్ని పురాణాలలో కనిపిస్తున్నాయి. ఈ పురాణం మహావిష్ణువుయొక్క వామభుజంగా పేర్కొనబడింది.

ఇందులో (1) ప్రక్రియాపాదం (2) అనుషంగ పాదం (3) ఉపోద్ఘాత పాదం (4) ఉపసంహార పాదం–అని నాలుగు పాదాలున్నాయి.

భూగోళ–ఖగోళాలు, బ్రహ్మాండసృష్టి, యుగధర్మాలు మున్నగు విషయాలతోపాటు కైలాసవర్ణన, గంగావతరణవర్ణన మొదలగు వర్ణనలు గూడా ఇందు గోచరిస్తాయి.

ఇది శైవపురాణం. అయినా సందర్భానుగుణంగా మహావిష్ణువు గూడా ఇందు వర్ణింపబడినాడు.

వివేకవిజ్ఞానాలు కావాలంటే తప్పకుండా పురాణాల అధ్యయనం చేయాలని ఈ పురాణం చెబుతున్నది.

యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో నరః ।
న చేత్పురాణం సంవిద్యాన్నైవ స స్యాద్విచక్షణః ॥

నాల్గువేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు చదివినా పురాణం చదువనివాడు విచక్షణుడు కాలేదని భావం. కాబట్టి పురాణాధ్యయనం ఎంత ముఖ్యమైనదో గ్రహించాలి.

ఈనాడు మనం యోగాభ్యాసాని కెంతో ప్రాముఖ్యం ఇస్తున్నాము. వాయుపురాణంలో యోగాని కవసరమైన ప్రాణాయామాన్ని గూర్చి విపులమైన వివరణ ఉన్నది. బ్రహ్మప్రాప్తికది అవసరం. శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదం–అనే నాల్గు ప్రయోజనాలు దానివల్ల కల్గుతాయని ఈ పురాణం చెబుతున్నది.

ఓంకారోపాసన గూడా ఇందులో చెప్పడమయింది. ఓంకారధ్యానపరులకు శివసాయుజ్యం కల్గుతుందని ఇందులో నిరూపించబడివున్నది.

'రమణకం' అనే దేశంలోని ప్రజలు పదివేల సంవత్సరాలు, 'హిరణ్యకం' లోనివారు పదకొండు వేల సంవత్సరాలు జీవిస్తారంటూ అక్కడి ప్రకృతివిశిష్టతను ఇక్కడ చెప్పడమయింది.

అక్కడి చెట్లు ఫలాలతోపాటు వస్త్రాలనూ, ఆభరణాలను గూడా ప్రసాదిస్తాయని చెప్పడం ఆశ్చర్యావహంగా ఉన్నది. కథాకథనంకంటే ఇట్టి వర్ణనలే ఈ గ్రంథంలో ఎక్కువగా గోచరిస్తాయి.

గయాక్షేత్రప్రాముఖ్యం గూడా ఇందు చెప్పడమయింది. గయను సందర్శించిన పుత్రుడు పితరులకు రక్షకుడనీ, అతణ్ణి చూచి పితరులు హర్షిస్తారనీ ఇక్కడ పేర్కొనబడింది.

ఈ పురాణకీర్తనం శ్రవణం,ధారణ–కీర్తినీ, పూర్ణాయువునూ, పాపనాశాన్నీ కల్గిస్తాయని ఫలశ్రుతి.

ధన్యం యశస్యమాయుష్యం పుణ్యం పాపప్రణాశనమ్ ।
కీర్తనం శ్రవణం చాస్య ధారణం చ విశేషతః ॥

5. శ్రీమద్భాగవతం

శ్రీమహావిష్ణుని ఊరువుగా వర్ణించబడిన శ్రీమద్భాగవతంలో పంద్రెండు స్కంధాలు, 18,000 శ్లోకాలున్నాయి. ఇది భక్తియోగ ప్రాముఖ్యాన్ని కథలతో, ఉపకథలతో వివరించే పురాణం.

'నిగమకల్పతరోర్గళితం ఫలం'-అన్నట్లు వేదమనే కల్పవృక్షంనుండి జారిపడిన పండుగా దీన్ని కీర్తించడమయింది. భక్తితోపాటు జ్ఞానవైరాగ్యాలు గూడా ఇందు నిర్దేశించబడి వున్నాయి.

వేదాలను విభజించిన వ్యాసుడు ధర్మనిరూపకమైన ఒక లక్షశ్లోకాలతో గూడిన మహాభారతం రచించాడు. అయినా మనశ్శాంతి లేక, చింతాక్రాంతు డయ్యాడు. నారదుడాయన చెంతకు వచ్చి 'నీచింతకు కారణ మేమి?' అని ప్రశ్నించాడు! 'అదేదో నీవే చెప్పు' అని వ్యాసుడన్నాడు.

అపుడు నారదమహర్షి ఊరక ధర్మాలు చెప్పితే చాలదు, విష్ణుకథాప్రధానమైన గ్రంథం రచిస్తే కానీ నీకు మనశ్శాంతి లభించదంటాడు. ఆయన చెప్పినట్లు వ్యాసభగవానుడు భగవంతుని గుణకర్మనామాలను కీర్తించే విష్ణుకథలను వర్ణిస్తూ భాగవతం రచించాడు, మనశ్శాంతి పొందాడు. భాగవత రచనకు చెందిన వృత్తాంతమిది.

దీని కథాప్రారంభమిది-పాండవవంశంలో జన్మించిన పరీక్షిత్తు వేటకు వెళ్ళి అలసిపోయి తపోనిమగ్నుడైన శమీక మహర్షిని నీళ్ళిమ్మంటాడు. నిర్వికల్పధ్యానంలో ఉన్న ఆ ముని కతనిమాట వినిపించదు. కోపించిన రాజు అతని మెడలో సర్పశవాన్ని వేసి శృంగిశాపానికి గురి అవుతాడు. వారం దినాలలో మరణించవలసిన దుఃస్థితి పాలవుతాడు.

అంతట రాజకార్యాలు త్యజించి ప్రాయోపవిష్టుడై ఏడు దినాలలో ముక్తి పొందే ఉపాయమేమి? అని విచారిస్తాడు. అపుడు శుకుడు వచ్చి అందుకు ఉపాయం భాగవతశ్రవణమే అని చెప్పి భాగవతప్రవచనం కావిస్తాడు.

ఇందులో ధ్రువుడు, జడభరతుడు, అజామిళుడు, దధీచి, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, అంబరీషుడు, రంతిదేవుడు మున్నగు భాగవతుల కథలు మనోజ్ఞంగా వివరింపబడివున్నాయి. ఆ కథల ద్వారా విజ్ఞానవైరాగ్యభక్తివిశేషాలు నిరూపితాలయ్యాయి.

దశమస్కంధం ఇందులో అతిముఖ్యమైనది. శ్రీకృష్ణావతారప్రతిపాదకమైన ఇందులో శ్రీకృష్ణుని లీలలు, ఆయన కావించిన కంసాదుల సంహారం, రుక్మిణీ కల్యాణం, కుచేలాదుల ఉద్ధరణ-ఇత్యాదిగా పలు అంశాలు రసవత్తరంగా చిత్రించబడినాయి.

ముఖ్యంగా గోపికలు కృష్ణుణ్ణి ప్రేమించిన ఘట్టం మనోహరంగా ఉన్నది. మధురభక్తితత్త్వం ఇందులో ప్రతిపాదితమయింది.

పదకొండవ స్కంధంలోని ఉద్ధవగీత ప్రశస్తం. శ్రీకృష్ణుడు అవసానదశలో గావించిన ఆధ్యాత్మిక ప్రబోధమిది. చివరి స్కంధంలో కలిస్వరూపం నిరూపించబడింది. మార్కండేయ చరిత్రను గూడా ఇందులో చూడవచ్చు.

'విద్యావతాం భాగవతే పరీక్షా' అన్నట్లు విద్యావంతుల జ్ఞానవిజ్ఞానాలను భాగవతం ద్వారా పరీక్షించవచ్చు. భగవన్నామసంకీర్తనం సర్వపాపప్రణాశకమని భాగవతం చెప్పింది. భారతావనిలో జన్మించి గూడా భాగవతం విననివారు ఆత్మఘాతకులని పేర్కొనబడ్డారు.

భారతే మానవం జన్మ ప్రాప్య భాగవతం న యైః ।
శ్రుతం పాపపరాధీనైరాత్మఘాతస్తు తైః కృతః ॥

భాగవత శ్రవణ ఫలం ఈ క్రిందిశ్లోకంలో ఇలా పేర్కొనబడింది.

మత్కథావాచనే నిత్యం మత్కథాశ్రవణే రతమ్ ।
మత్కథాప్రీతమనసం నాహం త్యక్ష్యామి తం నరమ్ ॥

'నాకథలు పఠించేవాడు, వినేవాడు, నాకథలచే సంతోషించేవాడు అయిన జనుణ్ణి నేను వదలను' అని శ్రీకృష్ణుడు చెప్పాడు.

6. నారదపురాణం

మహావిష్ణువుయొక్క నాభిస్థానంగా కీర్తింపబడిన పురాణమిది. నారదుడు ఉపదేశించినది కావడం వల్ల 'నారద పురాణం' అనే పేరు దీనికి స్థిరపడింది. ఇందులో ఇరువదియైదువేల శ్లోకాలున్నాయి.

పూర్వఖండం, ఉత్తరఖండం అని ఈ పురాణం రెండు ఖండాలుగా విభక్తమై యున్నది. పూర్వఖండంలో 125, ఉత్తరఖండంలో 82 అధ్యాయాలు ఉన్నాయి.

పురాణాల ప్రశస్తి. శివకేశవుల అభేదం, భక్తికి గల ప్రాముఖ్యం, సదాచార ప్రాశస్త్యం, పౌరాణికుల గురుత్వం-ఇత్యాదులు ఇందులో చక్కగా కీర్తితాలయ్యాయి.

సత్యహరిశ్చంద్రుని గాథ ఇందులో ఉన్నది. అట్లే శ్రీకృష్ణుని ప్రభావం చక్కగా పేర్కొనబడివున్నది. బ్రహ్మాండోత్పత్తి ఎలా జరిగిందో ఇందులో చూడవచ్చు.

విష్ణుభక్తికి గల ప్రాముఖ్యాన్ని వర్ణించే ఈ పురాణంలోని క్రిందిశ్లోకం గమనార్హమై యున్నది-

లోకే స ధన్యః స శుచి స్స విద్వాన్ స ఏవ వక్తా స చ ధర్మశీలః ।
జ్ఞాతా స దాతా స చ సత్యవక్తా యస్యాస్తి భక్తిః పురుషోత్తమాఖ్యే ॥

పురుషోత్తమునిపై భక్తి గలవాడే లోకంలో ధన్యుడు, శుచి, విద్వాంసుడు, ధర్మశీలుడు, జ్ఞాత, దాత, సత్యవక్త అని భావం. భక్తిలేనివాని గుణాలు విలువలేనివని తాత్పర్యం.

ఒక్క భక్తినే కాక తీర్థయాత్రలో సేవించవలసిన తీర్థాల ప్రాశస్త్యాన్ని గూడా ఈ పురాణం విశదీకరించింది. అయోధ్య, మధుర, మాయ, కాశి, కంచి, అవంతిక, ద్వారక-ఈ ఏడు నగరాలు మోక్షప్రదాలని ఈ పురాణం ఉద్ఘాటించింది.

రాజధర్మాలను గూడా ఈ పురాణం వివరించింది. ప్రజారక్షణ, శత్రుసంహారం, న్యాయబద్ధంగా పన్నులు వసూలు చేయడం, గోరక్షణ, అన్న-వస్త్ర గృహాలు అనే కనీసపు సౌకర్యాలను ప్రజలకు కల్గించడం, మద్యనిషేధం-మున్నగు రాజుల కర్తవ్యాలు గూడా ఇందులో నిర్దేశింపబడివున్నాయి.

పరులపై దౌర్జన్యం, వారిని హింసించడం మున్నగు పది పాపాలు పరిహరణీయాలు. వాటి వినాశానికే, 'దశహరా' అని పేరు. దానికి ప్రతీకగానే నేటికీ 'దశరా' పండుగ జరుపుకొంటున్నాము.

భర్తృహరిసుభాషితంవంటి గ్రంథాలలో మనం ఎన్నో సుభాషితాలు చదువుతుంటాం. వాటిని పోలిన పలు సుభాషితాలను మనం ఈ నారదపురాణంలో గూడా చూడవచ్చు.

యః శృణోతి నరో భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।
స యాతి బ్రహ్మణో ధామ నాత్ర కార్యా విచారణా ॥

అని ఫలశ్రుతి. ఎవడు భక్తితో ఈ పురాణాన్ని వింటాడో, లేదా వినిపిస్తాడో, అతడు బ్రహ్మలోకం చేరుతాడు. ఇందుకు సందేహం లేదు.

7. మార్కండేయ పురాణం

మునులు తమ సందేహాలను మార్కండేయ మహర్షికి తెల్పగా ఆయన వారి సంశయాలు తొలగిస్తూ చెప్పిన పురాణమిది. విష్ణు భగవానుని దక్షిణపాదంగా ఇది కీర్తింపబడింది. ఇందులో 134 అధ్యాయాలు, తొమ్మిదివేల శ్లోకాలు ఉన్నాయి.

బలరాముని తీర్థయాత్రలు, హరిశ్చంద్రుని వృత్తాంతం, పతివ్రతాస్త్రీల ప్రభావం, కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుని అనుగ్రహం పొందడం, రాజధర్మాలు, యోగశాస్త్రవిషయాలు, ఓంకారనిరూపణ, బ్రహ్మాండోత్పత్తి, దేవీమాహాత్మ్యం, సూర్యవంశవర్ణన ఇత్యాదిగా గల వివిధ విషయాలు ఈ పురాణంలో నిరూపించడమయింది.

దుర్గాదేవి జనుల ననుగ్రహించి వారి కోర్కెలు తీర్చే దేవత. ఆ దేవిని ఆరాధించడంలో సప్తశతీపారాయణం ముఖ్యకర్తవ్యం. ఆ సప్తశతి ఈ పురాణంలోని భాగమే. దేవీనవరాత్ర్యుత్సవాలలో సప్తశతిని పారాయణం చేస్తారు.

మహిళామణులలో కొందరు మహాయోగిను లున్నారు. వారిలో మదాలసాదేవి ఒకరు. ఈమెకు సంబంధించిన అద్భుతమైన చరిత్ర ఈ పురాణంలో అతి విపులంగానూ, రమణీయంగానూ నిరూపింపబడివున్నది.

ఋతధ్వజుడనే రాజుయొక్క ధర్మపత్ని మదాలస. ఈమెకు విక్రాంతుడు, సుబాహుడు, అరిమర్దనుడు, అలర్కుడు–అని నల్గురు కుమారులు. ఆమె ఉగ్గుబాలతోపాటు మొదటి ముగ్గురికీ బ్రహ్మవిద్యను గూడా బోధించింది. వారు అధ్యాత్మవిద్యలో ఆరితేరి సంసారవిరక్తులవుతారు. ఋతధ్వజుడు నాల్గవ కుమారుణ్ణి తల్లి వద్ద అధ్యాత్మవిద్యనభ్యసింపనీకుండా లౌకికవిద్యలు బోధించే ఏర్పాటు చేస్తాడు. అవసానదశలో ఆమె అతణ్ణి కూడా సత్సంగప్రభావముతో తత్త్వవేత్తగా రూపొందేటట్లు చేస్తుంది. ఇది ఆ కథా సంగ్రహ సారాంశం.

విష్ణువుయొక్క నాల్గు రూపాలు వాసుదేవ–శేష–ప్రద్యుమ్న–అనిరుద్ధములని ప్రసిద్ధాలు. వీటికి సంబంధించిన వివరణ కూడా ఈ పురాణంలో వస్తుంది.

ఇక ధర్మపక్షులుగా ప్రసిద్ధి వహించిన పక్షుల వృత్తాంతం గూడా మార్కండేయపురాణంలో పేర్కొనబడివున్నది. జైమినిమహర్షి తనకు గల్గిన సంశయాల నన్నింటినీ ఈ పక్షులద్వారానే తొలగించుకొంటాడు.

ఈ పురాణం పుత్రులను మూడురకాలుగా విభజించింది. తండ్రినుండి సంక్రమించిన కీర్తినీ, ధనాన్నీ పెంపొందించేవాడు ఉత్తముడు, పెంపొందించకున్నా పోగొట్టకుండా ఉండేవాడు మధ్యముడు, పోగొట్టుకొనేవాడు అధముడు. ఎంతో చక్కని ప్రబోధమిది.

తండ్రిపేరు చెప్పుకొని కాలం గడపువాడు వ్యర్థజన్ముడు. తండ్రికి కీర్తి తెచ్చేవాడు ఉత్తముడు ఇలాంటి విషయాలు యుక్తియుక్తంగా ఆసక్తిజనకంగా ఇందులో వివరించబడివున్నాయి.

శ్రుత్వా తత్పూజయేద్యస్తు పురాణం సప్తమం పునః ।
సర్వపాపవినిర్ముక్తః పునాత్యేవ నిజం కులమ్ ॥

అని ఫలశ్రుతి. ఇది విని దీనిని పూజించేవాడు సకలపాపవిముక్తుడై తన కులాన్ని పావనం చేస్తాడు.

8. అగ్నిపురాణం

అగ్నిదేవుడు వసిష్ఠమహర్షికి ఉపదేశించినదే అగ్నిపురాణం. ఇది విష్ణుదేవుని ఎడమపాదంగా వర్ణింపబడింది. ఇందులో 383 అధ్యాయాలు, 15,400 శ్లోకాలు ఉన్నాయి.

దశావతారాలు ఇందులో వర్ణింపబడ్డాయి. మరియు రామాయణ మహాభారతాలలోని కొన్ని ఘట్టాలు ఇందులో కనిపిస్తాయి.

దేవాలయ నిర్మాణం, సాలగ్రామలక్షణాలు, సూర్యపూజ, శివపూజ, వాస్తుపూజ, చతురాశ్రమధర్మాలు ఈ పురాణంలో పేర్కొనబడివున్నాయి. పలురకాల వ్రతాలు, రాజధర్మాలు, స్వప్న ఫలితాలు, స్త్రీ పురుష లక్షణాలు, ఆయుర్వేద విషయాలు, అద్వైతవేదాంతతత్త్వం ఇత్యాదిగా గల పలువిషయాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

కూర్మావతారవర్ణన సందర్భంలో విష్ణువు దేవతలకు ఎలా ఉపకరించాడో ఇక్కడ మనోజ్ఞంగా చెప్పడమయింది.

ఇక రామాయణ ఘట్టాలలో సుగ్రీవుడు సీతాన్వేషణ విషయంలో అశ్రద్ధ చూపినప్పుడు రాముడతనికి పంపిన తీక్ష్ణపదజాలంతో కూడిన సందేశం పాఠకులలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. రామాయణంలో సీతాపహరణకు రావణుడు మారీచుణ్ణి ప్రేరేపించినప్పుడు మారీచుడు చెప్పిన ఈ క్రిందిశ్లోకం గమనార్హం.

రావణాదపి మర్తవ్యం మర్తవ్యం రాఘవాదపి ।
అవశ్యం యది మర్తవ్యం వరం రామాన్న రావణాత్ ॥

"రావణుని ఆజ్ఞ పాటించకుంటే అతనినుండి చావు తప్పదు. పాటిస్తే రామునిచేత మరణం తప్పదు. రావణునికన్న రామునిచేత మరణించడమే మేలు" అని భావం. ఇలా రామాయణభారతాదులలోని కొన్ని ఘట్టాలు ఈ పురాణాల్లో కనిపిస్తాయి.

భగవంతు డనే పదానికి ఈ క్రింది శ్లోకంలో ఇచ్చిన నిర్వచనం అర్థవంతంగా ఉంది.

ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానామాగతిం గతిమ్ ।
వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి ॥

సృష్టిస్థితిలయాలు, జీవుల జననమరణాలు, విద్యా విద్యల స్వరూపం సమగ్రంగా ఎరిగినవాడే భగవంతుడు.

ఇక దేవాలయ నిర్మాణానికి చెందిన విశేషాలు కూడా ఈ పురాణంలో లభిస్తున్నాయి. ఆలయనిర్మాణం వల్ల బ్రహ్మహత్యాది దోషాలు కూడా తొలగిపోతాయని చెప్పడం విశేషం.

ఈ పురాణంలో కథలకు అంతగా ప్రాముఖ్యం లేదు కాని విద్యలు, పదార్థ లక్షణాలు, శుభాశుభస్వప్నాలు, శకునాలు, ఇవి మొదలుగాగల అనేక విషయాలు నిరూపింపబడి వున్నాయి. వివిధ శాస్త్రాలకు చెందిన విషయాలు ఇందులో ఉండడం వల్ల ఇదొక విశిష్టమైన పురాణంగా ప్రశంసింపబడుతున్నది. దీని ఫలశ్రుతి యిది–

'ఆగ్నేయం పఠితం ధ్యాతం శుభం స్యాద్భుక్తిముక్తిదమ్'

ఈ ఆగ్నేయ పురాణాన్ని చదివినా, ధ్యానించినా భుక్తిముక్తులు చేకూరుతాయని, శుభం కలుగుతుందని చెప్పడమయినది.

9. భవిష్యపురాణం

విష్ణుదేవుని కుడిమోకాలితో పోల్చబడిన ఈ పురాణంలో 14,500 శ్లోకాలున్నాయి. ఇందలి అధ్యాయాల సంఖ్య 585.

సృష్టివివరణ, పురాణాల ఉత్పత్తి, షోడశసంస్కారాలు. సావిత్రీమాహాత్మ్యం, స్త్రీలక్షణాలు, వివిధ వ్రతాలు ఇందులో వివరించడమయినది. రథసప్తమీ మాహాత్మ్యం, సూర్యుని ప్రభావం, ప్రతిమాలక్షణాలు, ధర్మస్వరూపం, జీమూతవాహనాదుల చరిత్రలు, అన్నదానప్రశస్తి మున్నగు విషయాలు అతివిస్తృతంగా ఇందులో వర్ణించడం జరిగింది.

భర్తపట్ల భార్య, భార్యపట్ల భర్త ప్రవర్తించవలసిన తీరుతెన్నులు చక్కగా ప్రతిపాదింపబడినాయి. సూర్యప్రభావవర్ణనా సందర్భంలో రాజు, దొంగలు, గ్రహాలు, పాములు, పేదరికం, దుఃఖాలు–ఇవేవీ సూర్యానుగ్రహం పొందిన వారిని బాధించవు అని చెప్పడం విశేషం.

ఇక జీవితంలో అతిముఖ్యమైన వివాహాన్ని గురించి వివరిస్తూ సమస్థాయిగలవారిలో జరిగే వివాహాలు శుభకరాలని, తదితరవివాహాలు దుఃఖదాయకాలని ఈ పురాణం చెప్పింది. స్మృతులలో పేర్కొనబడిన వివిధ వివాహభేదాలు ఇందులో ప్రతిపాదింపబడివున్నాయి. సామాజిక జీవితంలో అత్యావశ్యకాలైన వివాహాది విషయాలను ఈ పురాణంలో ప్రతిపాదించడంవల్ల సంఘశ్రేయస్సుపట్ల పురాణకర్తకు కల అభినివేశమెట్టిదో వ్యక్తమవుతున్నది.

అన్నదాన ప్రాశస్త్యాన్ని పేర్కొంటూ–

"అన్నం వై ప్రాణినాం ప్రాణా అన్నమోజో బలం సుఖమ్ ।
ఏతస్మాత్కారణాత్సద్భిరన్నదః ప్రాణదః స్మృతః ॥

ప్రాణులకు అన్నమే ప్రాణం. అన్నమే ఓజస్సు, బలం, సుఖం. అందుచేత అన్నదాత ప్రాణదాతగా పేర్కొనబడినాడు. ఈ పురాణంలో మరొక విశేషం విక్రమాదిత్యుడికీ, బేతాళునికీ సంబంధించిన కథలు. ఈ కథలు మిక్కిలి లోకప్రసిద్ధి వహించాయి. కథలలో జీవితంలో ఎదురయ్యే గడ్డు సమస్యలను పరిష్కరించే నైతికసూత్రాలు మనోజ్ఞంగా నిరూపింపబడివున్నాయి.

ఈ పురాణానికి ఫలశ్రుతిని వివరిస్తూ గ్రంథకర్త ఇలా అన్నాడు–

యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే మానవో నృప! ।
అశ్వమేధఫలం ప్రాప్య గచ్ఛేద్భానుం న సంశయః ॥

ఈ పురాణం వింటే సకలపాపవిముక్తి చేకూరుతుంది. అశ్వమేధయాగ ఫలం లభిస్తుంది. చివరికి సూర్య సాయుజ్యప్రాప్తి కలుగుతుంది.

10. బ్రహ్మవైవర్తపురాణం

సావర్ణిమనువు నారదమునీంద్రునికి చెప్పిన పురాణమిది. ఇందులో వరాహమూర్తికి, శ్రీకృష్ణునికి సంబంధించిన విషయాలు ప్రధానంగా ప్రతిపాదించబడివున్నాయి. ఈ పురాణం శ్రీమహావిష్ణువుయొక్క ఎడమ మోకాలుగా కీర్తింపబడింది.

బ్రహ్మఖండం, ప్రకృతిఖండం, గణేశఖండం, శ్రీకృష్ణఖండమని నాలుగు ఖండాలుగా ఇది విభజింపబడివున్నది. అన్ని ఖండాలలోను కలిపి మొత్తం 18,000వేల శ్లోకాలున్నాయి. **'సారభూతం పురాణేషు బ్రహ్మవైవర్తముచ్యతే'** అన్నట్లు ఈ పురాణం పురాణా లన్నింటికీ సారభూతమైనదిగా ప్రశస్తి పొందింది.

బ్రహ్మఖండంలో పరబ్రహ్మవర్ణన చేయబడింది. ప్రకృతిఖండంలో దుర్గాదేవి మున్నగు స్వరూపాలతో ప్రకృతి ఆవిర్భవించడం నిర్దేశించబడింది. గణేశఖండంలో వినాయక చరిత్ర నిబద్ధమైనది. శ్రీకృష్ణఖండంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపన మొదలగు అంశాలు పేర్కొనబడ్డాయి.

అతిథిని పూజించవలసిన అవశ్యకతను వివరిస్తూ ఈ పురాణం చెప్పిన విషయమిది–

అపూజితోఽతిథిర్యస్య భవనాద్వినివర్తతే ।
పితృదేవాగ్నయః పశ్చాద్గురవో యాన్త్యపూజితాః ॥

ఏ గృహస్థుని యింట అతిథి ఆదరింపబడడో ఆ యింటినుండి పితరులు, దేవతలు, అగ్నిదేవుడు, గురువులు పూజలను తిరస్కరించి వెళ్ళిపోతారని భావం.

ఇక జన్మకారణమైన తండ్రితోపాటు విద్యాదాత, అన్నదాత, భయమునుంచి కాపాడినవాడు, కన్యాదాత– ఈ నలుగురు కూడ తండ్రులుగానే పేర్కొనబడ్డారు. అట్లే సేవకుడు, శిష్యుడు, పోషితుడు, ఔరసుడు, శరణాగతుడు– ఈ ఐదుగురు పుత్రులుగానే పరిగణింపదగి ఉన్నారు.

ఈ గ్రంథంలో మొదటి పురుషార్థమైన ధర్మముయొక్క ప్రాశస్త్యం ఈ క్రిందివిధంగా ఉగ్గడింపబడింది–

నాస్తి ధర్మాత్పరో బన్ధుర్నాస్తి ధర్మాత్పరం ధనమ్ ।
ధర్మాత్ప్రియతరః కో వా స్వధర్మం రక్ష యత్నతః ॥

"ధర్మంకంటే శ్రేష్ఠమైన బంధువు లేదు. మేలైన ధనం లేదు. ధర్మంకంటే ప్రియతరమైన దేదీ లేదు. కాన ప్రయత్నంతో ధర్మాన్ని రక్షించాలి." అని భావం. అట్లే మరొక చోట గురువులో సకలదేవతలూ ఉన్నారని గురుమహిమ ప్రశంసింప బడినది.

పై విషయాలతోపాటు భగవంతుని స్వరూపం, సరస్వతీపూజ, భూదానప్రాశస్త్యం, గంగావతరణం, సంక్షిప్త రామాయణం, తులసీమాహాత్మ్యం, దుర్గోపాఖ్యానం మొదలైన విషయాలు కూడా ఈ పురాణంలో వివరింపబడి వున్నాయి.

ఈ గ్రంథంలో పేర్కొన్న కథలలో ముఖ్యంగా పేర్కొనదగినది వేదవతీ చరిత్ర. కృతయుగంలో వేదవతిగా, త్రేతాయుగంలో సీతగా, ద్వాపరయుగంలో ద్రౌపదిగా వేదవతిని పురాణం వర్ణించింది. తదుపరి పురాణాల కథలలో ఈ వేదవతియే పద్మావతిగా అవతరించి విష్ణుని రూపాంతరమైన వేంకటేశ్వరుణ్ణి చేపట్టినట్లు చెప్పడమయినది.

కశ్యపమహర్షిమానసపుత్రిక జరత్కారువుయొక్క స్తుతి కూడా ఈ పురాణంలోనే లభిస్తున్నది.

శుభదం పుణ్యదం చైవ విఘ్ననిఘ్నకరం పరమ్ ।
హరిదాస్యప్రదం చైవ పరలోకే ప్రహర్షదమ్ ॥

ఇత్యాదిగా ఈ పురాణ పఠనం శుభాన్నీ, పుణ్యాన్నీ, విఘ్నవినాశాన్నీ, హరిదాస్యాన్నీ, పరలోకంలో సంతోషాన్నీ ప్రసాదిస్తుంది అని చెప్పడమైనది.

11. లింగపురాణం

అగ్నిలింగంలో అంతర్గతుడైవున్న శివుడు ఉపదేశించినదే లింగపురాణం. ఇది విష్ణుదేవుని కుడిచీల మండతో పోల్చబడింది. శివుని ప్రభావాన్ని వర్ణించే ఈ పురాణంలో 11,000వేల శ్లోకాలున్నాయి. ఇది పూర్వార్ధమనీ, ఉత్తరార్ధమనీ రెండు భాగాలుగా ఉన్నది. పూర్వార్ధంలో 108, ఉత్తరార్ధంలో 55 కలిపి మొత్తం 163 అధ్యాయాలున్నాయి.

శివుని అవతారాలను ఈ పురాణం విరివిగా వర్ణిస్తున్నది. అందుచేత శైవులు ఈ పురాణాన్ని ప్రముఖంగా ఆదరిస్తారు. అష్టాంగయోగ సహితమైన శివారాధన, విష్ణువు కావించిన శివస్తోత్రం, బ్రహ్మజననం, లింగార్చనావిధానం, శివునికి చెందిన మానసపూజ, యుగ ధర్మాలు, సప్తద్వీపాలు, సప్తసాగరాలు, దిక్పాలకుల నగర వర్ణన, చంద్రవంశరాజుల వృత్తాంతం, త్రిపురాసురసంహారం, కైలాసగిరివర్ణన, సదాచారం ఇత్యాదిగా పలు విషయాలు ఈ పురాణంలో అతివిస్తృతంగా ప్రతిపాదింపబడివున్నాయి.

ఇందలి ఉత్తరార్ధంలో పృథివి, జలం, అగ్ని, వాయువు మొదలగు అష్టవిధాలైన శివుని మూర్తుల వివరణ వున్నది. శివభక్తిని ప్రతిపాదించే కథలు కూడా ఈ పురాణంలో చోటు చేసుకొనివున్నాయి.

మృత్యువు సమీపించిన శ్వేతుడు అనే శివభక్తుడు శివుని అనుగ్రహంచేత మరణంనుంచి తప్పించుకొనిన కథ శివారాధనవల్ల కలిగే ఫలితాన్ని వివరిస్తున్నది.

ఇక కాశీక్షేత్రమహిమ ఇందులో విస్తారంగా ప్రతిపాదితమయింది.

కామం భుంజన్ స్వపన్ క్రీడన్ కుర్వన్వి వివిధాః క్రియాః ।
అవిముక్తే త్యజేత్ ప్రాణాన్ జంతుర్మోక్షాయ కల్పతే ॥

భుజిస్తూ, నిద్రిస్తూ, క్రీడిస్తూ, యథేచ్ఛగా వివిధక్రియలాచరిస్తూ కూడ ఈ క్షేత్రంలో మరణిస్తే మోక్షం సిద్ధిస్తుందని ఇందులో చెప్పడమయినది.

అష్టదిక్పాలకులుగా ఇంద్రాదులు ప్రసిద్ధులు. వారు నివసించే నగరాలు క్రమంగా 1. అమరావతి 2.తేజస్విని 3.వైవస్వతి 4.కృష్ణవర్ణ 5. శుద్ధవతి, 6.గన్ధవతి 7.అలక 8.యశోవతి – అనేవి ఈ పురాణంలో పేర్కొనబడ్డాయి.

ఇది శైవపురాణం కాన శివపూజామాహాత్మ్యాన్ని ఘనంగా కీర్తిస్తున్నది. శివానుగ్రహంతోనే పరాశరుడు ఎన్నడో మరణించిన తన తండ్రిని, పినతండ్రులను చూస్తాడు. ఇట్టి విశిష్టమైన కథలతోను, వర్ణనలతోనూ సాగిపోయే లింగపురాణం చాలా ప్రభావోపేతమైనది.

మంచినీతులు చెప్పిన సందర్భాలు కూడా ఈ పురాణంలో లేకపోలేదు. భోగాశను నిరోధించాలనీ, విషయ విచారణచేత అది సాధ్యమనీ, మనోవాక్కాయాలతో వైరాగ్యాన్ని పాటించాలనీ చెప్పే ఈక్రింది శ్లోకం గమనార్హం–

భోగేన తృప్తిర్నైవాస్తి విషయాణాం విచారతః ।
తస్మాద్విరాగః కర్తవ్యః మనసా కర్మణా గిరా ॥

ఈ పురాణపఠన ప్రయోజనాన్ని ఈ క్రిందిశ్లోకం ఇలా చెప్పింది–

యః పఠేచ్ఛృణుయాద్వాఽపి లైంగం పాపహరం నరః ।
స భుక్తభోగో లోకేఽస్మిన్నన్తే శివపురం వ్రజేత్ ॥

పాపహరమైన ఈ పురాణాన్ని చదివేవారు, వినేవారు ఈ లోకంలో ఉన్నంతకాలం సకల భోగాల ననుభవించి కడపట కైలాసం చేరుకోగలరు.

12. వరాహపురాణం

వరాహావతారధారియైన విష్ణుదేవుడు భూదేవికి చెప్పిన పురాణమే వరాహపురాణం. ఇందులో 24వేల శ్లోకాలున్నాయి. విష్ణువుయొక్క ఎడమ చీలమండతో ఈ పురాణాన్ని పోల్చడమయింది. ఇందలి అధ్యాయాల సంఖ్య 215.

నానావిధ సృష్టులు, నారదమునీంద్రుని పూర్వజన్మచరిత్ర, విష్ణుభగవానుని అష్టమూర్తులు, ధర్మవ్యాధుని చరిత్ర, దక్షయాగధ్వంసం, పార్వతీజననం, వినాయకుని పుట్టుక, వివిధవ్రతాలు, వాటి ఫలితాలు, నాలుగు యుగాలు, అన్నదానప్రాశస్త్యం, వరాహస్వామి భూదేవిని ఉద్ధరించడం, నాచికేతుని వృత్తాంతం ఇత్యాదిగా పలువిషయాలు ఈ పురాణంలోని అంశాలుగా ఉన్నాయి.

అష్టాదశపురాణాల క్రమమూ, వివరణ గూడా ఇందులో నిర్దేశింపబడివున్నది. మహావిష్ణువు తన భక్తులకు అంగరక్షకుడై ఉంటాడన్న విషయం ఈ గ్రంథంలో చెప్పడమయింది.

శ్రీకృష్ణుడు గీతలో **'మమ మాయా దురత్యయా'** అని అంటాడు. 'నామాయ దాటరానిది' అని దీని అర్థం. భూదేవి 'మాయ' అంటే ఏమిటి? దాని స్వరూపం వివరించుమని విష్ణువును అడుగుతుంది. అందు కాదేవుడు తన మాయాస్వరూపాన్ని ఈ పురాణంలో అతి విస్తృతంగా వివరిస్తాడు.

లోకంలో తరచు సంభవించే అతివృష్టి, అనావృష్టి మున్నగు విపరీత సంఘటనలు, మాయవల్లనే కల్గుతున్నాయనీ, సృష్టిలో క్రమబద్ధంగా జరిగే సూర్యోదయాదులు, పంచభూతాల ప్రవర్తన, మాయాప్రభావం వల్లనే ఏర్పడుతున్నాయనీ ఇక్కడ చెప్పడమయింది.

దానాలన్నింటిలో అన్నదానం ప్రశస్తమయింది. అట్లే మనం వాడే వివిధములైన లోహాలతో నిర్మించబడిన పాత్రలలో రాగిపాత్రలు మేలైనవి అని ఈ పురాణం నిరూపించింది.

ఇంకా ఈ పురాణంలో వివిధతీర్థాల ప్రభావం గూడా వర్ణింపబడివున్నది. ఏ తీర్థాన్ని ఎప్పుడు సేవిస్తే మంచిదో ఇక్కడ వివరించబడివున్నది.

విష్ణుమందిరాలలో సేవలు చేసే వారికి గలిగే ఫలమేమి? అన్న భూదేవి ప్రశ్నకు విష్ణువు అట్టి వివిధ సేవాఫలాలను వివరంగా పేర్కొంటాడు. సకల జగత్తుకు సత్యమే ఆధారం కాన, సత్యాన్ని తప్పక పాటించాలన్న సంగతి ఇందులో చెప్పడమయింది.

ఇక కఠోపనిషత్తులో నాచికేతుని వృత్తాంతం ఇందులో రమ్యంగా ప్రతిపాదితమయింది. ఇంకా ఎన్నో కథాంశాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

శ్రుత్వా తు పూజయేద్యస్తు శాస్త్రం వారాహ సంజ్ఞితమ్ ।

సర్వపాపవినిర్ముక్తో విష్ణుసాయుజ్యమాప్రజేత్ ॥

అన్నట్లు దీన్ని ఎవరు శ్రవణం చేసి భక్తితో పూజిస్తారో, వారు సర్వపాపనిర్ముక్తులై విష్ణుసాయుజ్యం పొందుతారని ఫలశ్రుతి.

13. స్కాందపురాణం

స్కందుడనగా శివుని కుమారుడైన కుమారస్వామి. ఆ దేవుని పేరుతో ఈ పురాణం ప్రసిద్ధమయింది. శివుడు స్కందుణ్ణి ఉద్దేశించి చెప్పిన విషయమే ఈ స్కాందపురాణం. తండ్రినుండి విన్న ఈ పురాణాన్ని తరువాత స్కందుడు మునుల కుపదేశిస్తాడు.

'ఏకాశీతిసహస్రం తు స్కాందం సర్వాఘకృంతనం' – అన్నట్లు సకల పాపవిచ్ఛేదకమైన ఈ పురాణంలో 81,000 శ్లోకాలున్నాయి. దీన్ని బట్టి ఇతరపురాణాలకంటె ఇది ఆకృతిలో చాలా పెద్ద పురాణమని తెలుస్తున్నది.

మహావిష్ణుని వెండ్రుకలతో పోల్చబడిన ఈగ్రంథంలో మహేశ్వరఖండం, వైష్ణవఖండం, బ్రహ్మఖండం, కాశీఖండం, అవంతీఖండం, నాగరఖండం, ప్రభాసఖండం అని ఏడు ఖండాలున్నాయి.

మహేశ్వరఖండంలో కేదారఖండం, కౌమారీ ఖండం, అరుణాచలమాహాత్మ్యం మొదలైన అంశాలున్నాయి. వైష్ణవఖండంలో వేంకటాచల–జగన్నాథక్షేత్రాల మాహాత్మ్యం, బ్రహ్మఖండంలో సేతు మాహాత్మ్యం, ధర్మారణ్య, బ్రహ్మోత్తరఖండాలున్నాయి. కాశీఖండంలో కాశీక్షేత్రప్రభావం విస్తృతంగా వర్ణింపబడి వున్నది. నాగరఖండంలో వివిధ తీర్థాల వర్ణన ఉన్నది. విశ్వకర్మోపాఖ్యానాదికథలు గూడా ఉన్నాయి.

ప్రభాసఖండంలో ద్వారకానగరపరిసరాల ప్రభావం వివరించబడివున్నది. సంహితారూపంలో గూడా ఈ స్కాందపురాణం ప్రసిద్ధమైవున్నది.

సనత్కుమారసంహిత, సూతసంహిత, శంకరసంహిత, వైష్ణవసంహిత, బ్రహ్మసంహిత, సౌరసంహిత, అనేవే ఈ సంహితలు.

సూతసంహితలో శివోపాసనాప్రాముఖ్యం కీర్తింపబడివున్నది. కాశీక్షేత్రప్రభావాన్ని వర్ణించే కాశీఖండంలో అయోధ్యాదిక్షేత్రాలలో మరణించినవారు స్వర్లోకసుఖం అనుభవించి తరువాత కాశిలో జన్మించి అక్కడ ముక్తులవుతారని చెప్పడం విశేషం. **'కాశ్యాం తు మరణాన్ముక్తిః'** అన్న మాట గూడా ప్రసిద్ధం.

జీర్ణదేవాలయోద్ధరణ చేసేవారికి కలిగే ఫలాన్ని గూడా ఈ పురాణం వివరించింది. సత్యనారాయణ వ్రతస్వరూపం ఇందలి రేవాఖండంలో నిరూపితమయింది.

ఇంకను రామావతారం, క్షీరసాగరమథనం, గిరిజా కల్యాణం, కుమారోత్పత్తి, ఓంకారప్రభావం, 14 మంది మనువుల వర్ణన ఇత్యాద్యంశాలు ఇందులో గోచరిస్తాయి. అంతే కాక వనభోజనం, కార్తికవైభవం, ఉసిరిక విశిష్టత, ఇత్యాదివిషయాలు గూడా గమనింపదగివున్నాయి.

సర్వేషామేవ ధర్మాణాం గురుపూజా పరా మతా ।
గురుశుశ్రూషయా సర్వం ప్రాప్నోతి హి న సంశయః ॥

అన్ని ధర్మాలలోనూ గురుపూజ మేలైన ధర్మం. గురుసేవచేత అన్ని ఫలితాలూ పొందవచ్చు అని గురుసేవా ప్రాశస్త్యం పేర్కొనబడింది. రుద్రాక్ష మహిమ కథాకథన పూర్వాంకంగా ఇందులో వివరించబడింది.

పురాణ శ్రవణ ఫలాన్ని ఈ పురాణం 136 శ్లోకాలతో వివరించింది. జ్ఞానదీపాలుగా, భవరోగౌషధాలుగా పురాణాలిందులో కీర్తింపబడివున్నాయి.

14. వామనపురాణం

బ్రహ్మదేవుడు వామనావతార ప్రభావాన్ని కీర్తిస్తూ చెప్పినదే వామనపురాణం. మహావిష్ణుని చర్మంతో దీన్ని పోల్చారు. ఇందలి శ్లోకాలు పదివేలు, అధ్యాయాలు 95.

వైష్ణవధర్మ ప్రతిపాదకమైన ఈ పురాణంలో విష్ణుమందిరాలు, విష్ణుభక్తుల వృత్తాంతాలు అధికంగా కనిపిస్తాయి. ఉత్పత్తి ప్రళయాలు, కామదహనం, ప్రహ్లాదవరదానం, దేవీమాహాత్మ్యం, నానావిధ తీర్థాలు, వినాయక విజయం ఇత్యాద్యంశాలు ఈ పురాణంలో వర్ణించబడివున్నాయి.

వివిధ దేవతలకు చెందిన 25 స్తోత్రాలు ఈ పురాణంలో లభిస్తాయి. దేవతలలో మహావిష్ణువు, ఆయుధాలలో సుదర్శనం, పక్షులలో గరుడుడు, సర్పాలలో వాసుకి, ఈ రీతిగా ఆయా వర్గాలలో మేలైనవారినీ, వస్తువులను కీర్తించే ఇందలి ఘట్టం ఆసక్తి జనకంగా ఉంటుంది.

లోకంలో ఎన్నో పాపాలున్నాయి, కాని అన్నింటినీ మించిన పాపం కృతఘ్నుత్వమని ఈ పురాణం చెబుతున్నది.

నిత్యమూ ఉదయం లేవగానే త్రిమూర్తులు, గ్రహాలూ, సప్తర్షులూ, సప్తలోకాలూ తనకు శుభావహాలు కావాలని ప్రార్థించాలని ఈ గ్రంథం బోధిస్తున్నది.

జీవితంలో ఎన్ని విపత్తు లెదురైనా, షండుడు, మార్జారుడు, ఆఖువు, కుక్కుటుడు, పతితుడు, అపవిద్ధుడు, నగ్నుడు, చండాలుడు, అధముడు-ఇట్టివారిని ఆశ్రయించరాదని ఇందులో చెప్పడమయింది.

మనుజుడు అవశ్యం ఆచరించవలసిన సదాచారాలను 122 శ్లోకాలలో ఈ పురాణం వివరించింది.

పుత్రుడు - శిష్యుడు-వీరిరువురిలో శ్రేష్ఠు డెవరు? అన్న ప్రశ్నకు ఇందులో బ్రహ్మ పుత్రునికంటె శిష్యుడే శ్రేష్ఠుడని సమాధానం చెబుతాడు.

పున్నామ్నో నరకాత్త్రాతి పుత్రస్తేనేహ గీయతే ।
శిష్టపాపహరశ్శిష్య ఇతీయం వైదికీ శ్రుతిః ॥

'పుత్' అనే నరకం నుండి మాత్రమే రక్షించువాడు పుత్రుడు కాగా తక్కిన సకలపాపాలనుండీ కాపాడేవాడు శిష్యుడని భావం.

పాపాలను దూరం చేసుకొనే విధానాన్ని ప్రతిపాదిస్తూ దానికి ఉదాహరణంగా ఇందులో కోశకారుని వృత్తాంతం చక్కగా వర్ణించబడింది. పూర్వజన్మకృతపాపాలు తరువాతి జన్మలో స్మరణకు వస్తాయని ఈ కథ ద్వారా తెలుస్తున్నది.

యే పఠంతి చ శృణ్వంతి తేఽపి యాన్తి పరాం గతిమ్ ।

అన్నట్లు ఈ వామనపురాణం చదివేవారు, వినేవారు ఉత్తమగతిని పొందుతారని ఫలశ్రుతి.

15. కూర్మపురాణం

17000 శ్లోకాలు గల కూర్మపురాణం విష్ణువు యొక్క పృష్ఠంగా వర్ణించబడింది. పూర్వార్ధం, ఉత్తరార్ధం అని రెండు విభాగాలుగా ఉన్న ఈ పురాణంలో 53+46=99 అధ్యాయాలున్నాయి.

కూర్మరూపంలో ఉన్న విష్ణుదేవుడు మహర్షుల నుద్దేశించి చెప్పిన పురాణమిది. లక్ష్మి ఇంద్రద్యుమ్నుల సంవాదం, విష్ణువు-మహర్షులకు జరిగిన సంవాదం, సృష్టివిధానం, వర్ణాశ్రమాలు, భృగువంశవర్ణన, యుగధర్మాలు, కాశీప్రయాగక్షేత్రాల మాహాత్మ్యం, సదాచారాలు, ద్వాదశాదిత్యుల వర్ణన-ఇత్యాదిగా గల అనేకాంశాలు ఈ పురాణంలో ఉన్నాయి.

మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు. పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు–అనే తొమ్మిదిమంది బ్రహ్మపుత్రులుగా ఇందు పేర్కొనబడినారు. మొదటికాలంలో ప్రజలు సుఖసంతోషాలతో వుండేవారనీ, క్రమంగా రాగద్వేషాలు కారణంగా ప్రజలకు దుఃస్థితి ఏర్పడిందనీ ఈ పురాణం చెబుతున్నది.

ధర్మం ఆచరణీయమనీ, ధర్మంవల్లనే తక్కిన పురుషార్థాలు సిద్ధిస్తాయనీ ఈ పురాణం పేర్కొంటున్నది.

ధర్మాత్సంజాయతే హ్యర్థో ధర్మాత్కామోఽభిజాయతే ।
ధర్మ ఏవాపవర్గాయ తస్మాద్ధర్మం సమాశ్రయేత్ ॥

అనగా ధర్మంనుంచే అర్థ,కామ,మోక్షాలు సిద్ధిస్తాయి. కాన ధర్మాన్ని ఆశ్రయించాలి అని భావం.

శివకేశవులకు భేదం లేదని భక్తులు ఏఏరూపాలను ఆరాధిస్తారో భగవంతుడు ఆయా రూపాలతోనే వారిని అనుగ్రహిస్తాడని ఈ పురాణంలో చెప్పిన విషయం భగవద్గీతలోని

'యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహం' అనే వచనానికి అనుగుణంగా ఉన్నది.

స్వధర్మాన్ని త్యజించి చేసే తీర్థయాత్రలవల్ల ప్రయోజనం శూన్యమనీ, దేవాలయాదులను మిక్కిలి పరిశుభ్రంగా ఉంచాలనీ, మూత్రవిసర్జనాదులతో అపరిశుద్ధం చేయరాదనీ, అలాచేయడం పాపహేతువనీ ఈ పురాణం హెచ్చరిస్తున్నది. పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యం ఇందులో చక్కగా వివరించబడింది.

వేదాన్ని విభజించేవారు వేదవ్యాసు లనబడతారు. అట్టివారు 26మంది ఉన్నారనీ పరాశరపుత్రుడైన కృష్ణద్వైపాయనుడు చివరివాడనీ ఈ పురాణం చెప్పిన విషయం గమనార్హమై ఉన్నది.

ఇంకను సమాజంలో వున్నవారి కర్తవ్యాలు, గురువులవద్ద ఉండవలసిన తీరుతెన్నులు, పాపాత్ములతో చేసే సాంగత్యంవల్ల కలిగే దోషాలు–ఇత్యాది విషయాలు మిక్కిలి ఆసక్తిదాయకంగా ఈ పురాణంలో చెప్పడమయినది.

ఇందులో వామనావతారానికి సంబంధించిన చరిత్ర చాలా చక్కగా నిరూపించబడివున్నది. భక్తిప్రధానమైన దుర్జయు డనేవాని కథవంటి కొన్ని కథలు పాఠకులకు చక్కని చైతన్యం కలిగిస్తాయి. అట్టివి ఇందులో పలుకథలు వున్నాయి.

ఏతత్కూర్మపురాణం తు చతుర్వర్గఫలప్రదమ్ ।
పఠతాం శృణ్వతాం నృణాం సర్వోత్కృష్టగతిప్రదమ్ ॥

ఈ పురాణం చదివేవారికి, వినేవారికి చతుర్వర్గ ఫలాలు సిద్ధిస్తాయి. సర్వోత్కృష్టగతి కూడా కలుగుతుంది.

16. మత్స్యపురాణం

మహావిష్ణువు మత్స్యరూపుడై వైవస్వతమనువు నుద్దేశించి చెప్పిన పురాణమిది. విష్ణువుయొక్క మెదడుతో దీన్ని పోల్చడమైనది. ఇందులో 14.000 వేల శ్లోకాలున్నాయి. మొత్తం అధ్యాయాల సంఖ్య 283.

ఇందలి ముఖ్య విషయాలివి–మత్స్యావతారవర్ణన, అజాండసృష్టి, సూర్యచంద్రవంశాలు, గయాక్షేత్రవర్ణన, పురూరవుని చరిత్ర, కచదేవయానుల కథ, కార్తవీర్యార్జునుని వృత్తాంతం, కలిధర్మాలు మరియు కృష్ణాష్టమి, అక్షయ

తృతీయ, కల్యాణసప్తమి మున్నగు పలువ్రతాల వర్ణన, సప్తద్వీపాల వివరణ, త్రిపురాసురవృత్తాంతం, తారక వృత్తాంతం మున్నగు విషయాలే కాక రాజధర్మాలు, చతుర్విధ దండోపాయాలు, స్వప్నఫలాలు, వామన వరాహావతారాల వర్ణన ఇత్యాదిగా గల విషయాలు ప్రతిపాదితాంశాలై వున్నాయి.

పుట్టిన ప్రతివాడూ పురుషార్థసాధనకై ప్రయత్నించాలి. అలా చేయనివాని జన్మ వ్యర్థమని ఈ పురాణం నొక్కి వక్కాణిస్తున్నది.

లబ్ధ్వా జన్మ న యః కశ్చిద్ఘటయే త్పౌరుషం నరః ।
జన్మ తస్య వృథా భూతమజన్మా తు విశిష్యతే ॥

శ్రాద్ధకాలంలో పితృదేవతలకు అన్నపానాదులు సమర్పించడాన్ని గూర్చిన విశేషవివరణ యిందులో కనిపిస్తున్నది. శ్రాద్ధ కర్మలు అవశ్యాచరణీయాలని ఇక్కడ పేర్కొనడమైనది.

ఇక కాలమానం గురించి ప్రస్తావిస్తూ బ్రహ్మ, శివుడు, విష్ణువు అను త్రిమూర్తులకు చెందిన వివిధ కాలమానాల విశ్లేషణ ఇందులో చేయబడింది.

1.భృగువు 2.అత్రి 3. వసిష్ఠుడు 4. విశ్వకర్మ 5.మయుడు 6. నారదుడు 7. నగ్నజిత్తు 8. విశాలాక్షుడు 9. పురందరుడు 10. బ్రహ్మ 11. కుమారుడు 12.నందీశుడు 13.శౌనకుడు 14. గర్గుడు 15. వాసుదేవుడు 16. అనిరుద్ధుడు 17. శుకుడు 18. బృహస్పతి అనే ఈ పదునెనిమిది మంది వాస్తుశాస్త్రోపదేశకులుగా ఇందులో పేర్కొనబడినారు.

తల,లలాటం మున్నగు అవయవాల కదలికవల్ల కలిగే ఫలాన్ని కూడా భగవంతుడు ఈ పురాణంలో చెప్పియున్నాడు.

ఇక పితృశ్రాద్ధంవల్ల కలిగే ఫలాన్ని వివరించే కౌశికుడనే విద్యావంతుడు, అతని ఏడుగురు కుమారులకు చెందిన విస్తృతమైన కథ ఇందులో కనిపిస్తున్నది. భక్తిశ్రద్ధలతో ఆచరించిన పితృశ్రాద్ధం గోహత్యను కూడా పోగొడుతుందని ఈ కథలో నిరూపితమయినది. బ్రహ్మదత్తుని కథలో ఆడు చీమ, మగ చీమలమధ్య జరిగే సంభాషణ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది.

పతివ్రతల ప్రభావం గురించి చెప్పే ఈ క్రింది శ్లోకం వారిపట్ల గౌరవంతో వుండాలని హెచ్చరిస్తున్నది.

పతివ్రతానాం వచనం ప్రకృష్టం తాసాం తు వాక్యం భవతీహ మిథ్యా ।
న జాతు లోకేషు చరాచరేషు తస్మాత్సదా తాః పరిపూజనీయాః ॥

పతివ్రతల మాట శ్రేష్ఠమైనది. ఎప్పుడును వారి మాట మిథ్య కాదు. అందువల్ల వారు సదా పూజింపదగినవారు.

ఇక ఫలశ్రుతి –
అస్మాత్పురాణాదపి పాదమేకం పఠేత్తు యస్సోఽపి విముక్తపాపః ।
నారాయణాఖ్యం పదమేతి నూనమనంగవద్దివ్యసుఖాని భుంక్తే ॥

ఈ పురాణంలో ఒక్క పాదం చదివినా పాపనివృత్తుడై వైకుంఠం పొందగలడని, సకల దివ్యసుఖాలు అనుభవింపగలడని ఫలశ్రుతి చెబుతున్నది.

17. గరుడపురాణం

విష్ణువాహనమైన గరుడుడు అడిగిన ప్రశ్నలకు విష్ణుదేవుడు చెప్పిన సమాధానాలే గరుడపురాణం, ఇందులో 19వేల శ్లోకాలు గల పూర్వఖండం, ఉత్తరఖండం అనే రెండు ఖండాలున్నాయి.

పూర్వఖండంలో 229, ఉత్తరఖండంలో 35 కలిపి 264 అధ్యాయాలు గల పురాణమిది. విష్ణుదేవుని "మజ్జ" గా ఇది వర్ణించబడింది.

ఈ పురాణంలోని ఉత్తరఖండంలో ప్రేతకల్పం మిక్కిలి ప్రశస్తమైనది. మరణానంతరం జీవుని స్థితిగతులను విస్తృతంగా వివరించే ఘట్టమిది. అందువల్లనే మరణించిన వానియింట పదవ దినంలోగా ఈ పురాణాన్ని పఠించే సంప్రదాయమేర్పడింది.

గరుడపురాణం కేవలం యమలోకవృత్తాంతాన్ని మాత్రమే చెబుతుందని కొందరు భావించడం కద్దు. ఈ భావన తగదు. ఇందలి పూర్వఖండంలో ఈ క్రింద నిర్దేశించబడిన నానావిషయాలున్నాయి.

భగవదవతారాలు, సరస్వత్యుపాసన, విష్ణుదీక్ష, శివార్చనావిధి, సుదర్శనచక్ర పూజావిధానం, సూర్యార్చన, దేవతాప్రతిష్ఠ, నిత్యనైమిత్తిక కామ్యకర్మల వివరణ, పాపప్రాయశ్చిత్తవిధి, నవరత్నాల పరీక్ష, వివిధములైన వ్రతాలు, ఆయుర్వేద వైద్యవిధానాలు మున్నగు అనేక విషయాలు ఈ పురాణంలో గోచరిస్తాయి. పశువుల చికిత్సా విధానం కూడా ఇందులో నిర్దిష్టమైయున్నది.

మానవజీవితానికి అత్యవసరమైన పలు నీతులు గూడా ఈ గ్రంథంలో పేర్కొనబడివున్నాయి. యజమానులు నిష్కారణంగా సేవకులను నిందించరాదన్న ఉపదేశం ఇందులో ఉన్నది. ధనం, జ్ఞానం, రూపం, మిత్రులు–వీరి స్వభావా లెలా ఉండాలో ఇందులో సూచించబడింది.

అర్థేన కిం కృపణహస్తగతేన పుంసాం జ్ఞానేన కిం బహుశఠాకుల సంకులేన ।
రూపేణ కిం గుణ పరాక్రమవర్జితేన మిత్రేణ కిం వ్యసనకాలపరాఙ్ముఖేన ॥

కృపణుని చేతి ధనం, మొండి మనిషికి గలజ్ఞానం, గుణపరాక్రమాలులేని రూపం, వ్యసనకాలంలో కనిపించని మిత్రుడు ఉండీ ప్రయోజనం లేదని భావం. కష్టకాలంలో పరిచితవ్యక్తులు సైతం ఎలా తప్పించుకొంటారో సోదాహరణంగా ఈ పురాణం వివరించింది. గృహంలో వుంటూనే ముక్తిని సాధించే విధానం గూడా చెప్పడమయింది.

గరుడ పురాణంలో ఎన్నో కథలున్నాయి. కథలకంటె ఇందలి నీతివచనాలు మనోజ్ఞాలు. ఉదాహరణకు వేలకొలది గోవులలో దూడ తన తల్లిని గుర్తించి అనుసరించినట్లు మనమెంత దూరంగా ఉన్నా మనకర్మ మనల్ని విడువక వెంటాడుతూ వుంటుందని నీతిబోధ.

హయగ్రీవ పూజావిధి, పంచమహాయజ్ఞాలు, రాజలక్షణాలు, సేవకలక్షణాలు, రోగనివారణోపాయాలు మున్నగునవి కూడా ఈ పురాణంలో చూడవచ్చు.

'కీర్తితం పాపశమనం పఠతాం శృణ్వతాం నృణామ్' అనగా ఈ పురాణం చదివేవారు, వినేవారు సకల పాపాల నుండి విడుదల పొందుతారని దీనికి ఫలశ్రుతి చెప్పబడింది. 0

18. బ్రహ్మాండ పురాణం

బ్రహ్మదేవుని సృష్టిని వివరించే పురాణమిది. "బ్రహ్మాండం చాస్థి గీయతే" అన్నట్లు విష్ణువుయొక్క ఎముకలుగా ఇది పేర్కొనబడింది. ఇందులో 12,000 శ్లోకాలున్నాయి. బ్రహ్మాండపురాణం పూర్వభాగం, మధ్యభాగం, ఉత్తరభాగమని మూడు భాగాలుగా వున్నది. పూర్వభాగంలో 38, మధ్యభాగంలో 74, ఉత్తర భాగంలో 44, మొత్తం కలిపి 156 అధ్యాయాల గ్రంథమిది. రోమహర్షణుడనే ముని కురుక్షేత్రంలో ఋషులకు చెప్పిన పురాణమిది.

ప్రక్రియాపాదం, అనుషజ్గపాదం, ఉపోద్ఘాతపాదం, ఉపసంహారపాదమని నాలుగు భాగాలుగా ఈ పురాణం విభజింపబడింది. నైమిశారణ్యవర్ణన, చతుర్ముఖబ్రహ్మ వర్ణనం, వరాహావతారం మున్నగు విషయాలు ప్రక్రియాపాదంలో కనిపిస్తాయి.

తరువాతి పాదంలో చతురాశ్రమ ధర్మాలు, మునుల జన్మవృత్తాంతం, దక్షుడు గావించిన శివనింద, సతీదేవి అగ్నిప్రవేశం, దక్షుడు, శంకరుడు పరస్పరం శపించుకొనడం, ప్రియవ్రతవర్ణన మున్నగు విషయాలతోపాటు సప్తద్వీపాల వర్ణన, సూర్యుని మహిమ, సూర్యుని అధీనంలో ఉండి ఇతర గ్రహాలు సంచరించడం, రాత్రింబవళు ్ళ, మాసాలు, ఋతువులు, సంవత్సరాలు, యుగాలు అనబడే కాలానికి సూర్యుడే మూలకారణమని నిరూపించడం, లింగజననం, యుగధర్మాలు, మొదలగు విషయాలు ఇందులో కనిపిస్తాయి.

మూడవదైన ఉపోద్ఘాతపాదంలో సప్తర్షులజననం, నృసింహావతార వర్ణన, కుమారసంభవం, పుణ్యప్రదేశవర్ణన, శ్రాద్ధాలకు ప్రశస్తమైన నదులు, తీర్థాలు, అన్నదానం, గయలో శ్రాద్ధం, మొదలగు విషయాలు నిరూపింపబడి వున్నాయి. పరశురాముని తపస్సు, జమదగ్నిని కార్తవీర్యార్జునుడు హతమార్చడం, జమదగ్నిపునర్జననం, సగర యయాతుల చరిత్ర మున్నగు విషయాలు కనిపిస్తాయి.

చివరిపాదంలో లలితాదేవి వర్ణన, కామాక్షీ మాహాత్మ్యం, దేవీదీక్ష, మొదలైన విషయాలు ఉన్నాయి. ఈ పురాణపఠనఫలం క్రింది విధంగా పేర్కొనబడింది.

య ఇదం కీర్తయేద్వత్స! శృణోతి చ సమాహితః ।
స విధూయేహ పాపాని యాతి లోకమనామయమ్ ॥

బ్రహ్మాండపురాణం పఠించేవాడు, ఏకాగ్రతతో వినేవాడు పాపరహితుడై సర్వోత్తమలోకాలను చేరుకుంటాడు అని భావం.

సముద్రాల లక్ష్మణయ్య
ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.

బ్రహ్మమహాపురాణం

(ప్రథమభాగ కథాసంగ్రహం)

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం చైవ తతో జయముదీరయేత్ ॥

అది నైమిశారణ్యం. అక్కడ మహర్షులు సత్రయాగం చేస్తున్నారు. ఆ సమయంలో అక్కడికి సూతమహర్షి వచ్చాడు. మహర్షులు సూతుడిని పూజించారు. స్థావర జంగమాత్మకమైన ఈ సృష్టి ఎలా ఏర్పడిందో చెప్పమని అడిగారు. సూతుడు చెప్పసాగాడు.

సృష్టి చేయాలని సంకల్పించి, పరమాత్మ ముందుగా జలాన్ని సృష్టించాడు. నీటినుండి – బ్రహ్మ, స్వర్గం, భూమి, వాటి నడుమ ఆకాశం, పదిదిక్కులు, కాలం ఏర్పడ్డాయి. ఆ పిదప ప్రజాపతులు, రుద్రుడు, సనక సనంద నాదులు, క్రమంగా భువి, దివి, ఆకాశమూ, దేవతలూ, రాక్షసులూ, వృక్షాలూ, మొదలుగా స్థావర జంగమ స్వరూపమైన సృష్టి సమస్తం ఏర్పడింది. స్వాయంభువు మొదలుగా పదునాలుగుమంది మనువులూ కలిగారు. మన్వంతరాలూ విస్తరించాయి.

సూర్యవంశం

కశ్యపప్రజాపతికి అదితియందు సూర్యుడు పుట్టాడు. ఇతడికి త్వష్టకూతురు అయిన సంజ్ఞయందు వైవస్వతుడు, యముడు, యమున జనించారు. సంజ్ఞకుమారుడైన వైవస్వతుడు ఏడవమనువు. ప్రస్తుతం నడుస్తున్న కాలం వైవస్వత మన్వంతరమే. సూర్యుడి తేజస్సు భరించలేక సంజ్ఞ తనకు మారుగా తన ఛాయను సూర్యుడివద్ద ఉంచి వెళ్ళింది. సూర్యుడికి ఆ ఛాయవలన సావర్ణి అనే మనువు, శనైశ్చరుడు కలిగారు. వైవస్వత మనువుకు ఇక్ష్వాకువు కలిగాడు. ఇలా క్రమంగా సూర్యవంశం విస్తరించింది. ఈ వంశంలో అంబరీషుడు, కకుత్స్థుడు, మాంధాత, హరిశ్చంద్రుడు, భగీరథుడు, దశరథుడు, రాముడు, నలుడు మొదలైన మహాత్ములు జన్మించి, తమ తమ గుణవిశేషాలతో సుప్రసిద్ధులైనారు.

చంద్రవంశం

బ్రహ్మకుమారుడైన అత్రిమహర్షికి చంద్రుడు జన్మించాడు. చంద్రుడికి బుధుడు, అతడికి పురూరవుడు మొదలుగా చంద్రవంశం విస్తరించింది. గాధి, జహ్నువు, పరశురాముడు, నహుషుడు, వసుదేవుడు మొదలైనవారు ఈ వంశంలో ప్రసిద్ధులు. యయాతి కుమారుడైన యదువు సంతానంతో యదువంశం ప్రసిద్ధమైంది. ఆ పరంపరలోని సాత్వతుని సంతానమైన దేవావృధుడి కుమారుడైన బభ్రుదేవావృధుడు మొదలగు వారితో భోజవంశం ఏర్పడింది. అలాగే సాత్వతుని కుమారులైన వృష్ణి, అంధకుడు అనేవారిపేర్లతో వారివంశాలు ప్రసిద్ధమైనాయి. సాత్వతుడిపేరుమీదుగా వీరంతా సాత్వతులు అయినారు. శ్రీకృష్ణుడు ఈ యదుపరంపరలోనే జన్మించాడు.

స్యమంతకోపాఖ్యానం

సత్రాజిత్తు తపస్సు చేసి, సూర్యుడివలన స్యమంతకమణిని పొందాడు. దాన్ని ప్రేమతో తన సోదరుడు ప్రసేనజిత్తుకు ఇచ్చాడు. అతడు వేటకు వెళ్లగా ఒక సింహం ప్రసేనజిత్తును చంపి మణిని తీసుకుపోయింది. ఆ సింహాన్ని చంపి, మణిని తీసుకువెళ్లి, జాంబవంతుడు తన కూతురి కిచ్చాడు. దాన్ని తాను కాజేసినట్లు వచ్చిన అపవాదును తొలగించుకోవడానికి శ్రీకృష్ణుడు జాంబవంతుడితో యుద్ధం చేసి, మణిని తీసుకువచ్చి సత్రాజిత్తుకు ఇచ్చాడు. ఓడిపోయిన జాంబవంతుడు మణితోపాటు తన కూతురు జాంబవతిని కూడ కృష్ణుడికి ఇచ్చాడు. మణి ఇచ్చినందుకు కృతజ్ఞతతో సత్రాజిత్తు తన కూతుళ్లు సత్యభామ, వ్రతిని, ప్రస్వాపిని అనే ముగ్గురిని కృష్ణుడికి ఇచ్చి వివాహం చేశాడు. శతధన్వుడు సత్రాజిత్తును చంపి, ఆ మణిని హరించి, దానిని ఎప్పటినుంచో కోరుతున్న అక్రూరుడికి ఇచ్చాడు. కృష్ణుడు మణికోసం శతధన్వుడిని సంహరించాడు. మణి అతడివద్ద లేదు. బలరాముడు ఆ మణిని కృష్ణుడు అపహరించాడేమో అనుకున్నాడు. కోపంతో ద్వారక వదిలి, మిథిలానగరానికి వెళ్లిపోయాడు. కృష్ణుడు యోగశక్తితో మణి అక్రూరుడివద్ద ఉందని తెలుసుకున్నాడు. అక్రూరుడు మణి కృష్ణుడికి ఇచ్చాడు. కాని కృష్ణుడు దానిని అక్రూరుడికే తిరిగి ఇచ్చివేశాడు. అక్రూరుడు తన చెల్లెలిని కృష్ణుడికి ఇచ్చాడు.

ద్వీపతీర్థవర్ణనం

తరువాత సూతుడు మహర్షులకు 1. జంబూ, 2. ప్లక్ష, 3. శాల్మల, 4. కుశ, 5. క్రౌంచ, 6. శాక, 7. పుష్కరాలు అనే సప్తద్వీపాలనూ, వాటిప్రమాణంతో సహా ఆ ద్వీపాలలో ఉండే నగరాలూ, జీవులూ, నదులూ, మొదలయిన అంశాలను వివరించాడు. తరువాత రౌరవం, శౌకరం, తప్తకుంభం మొదలైన నరకాలను గూర్చి పేర్కొన్నాడు. ఆ పిదప భూలోకం, భువర్లోకం, సువర్లోకాలను గురించి, ధ్రువస్థానం గురించి వివరించాడు. భూలోకంలోని పుణ్యతీర్థాలను పేర్కొన్నాడు. పిదప సూతుడు పూర్వం బ్రహ్మదేవుడు మహర్షులకు చెప్పిన విషయాలను వ్యాసుడు తనకు చెప్పిన ప్రకారంగా వివరించాడు. బ్రహ్మ మహర్షులకు భూలోకంలో భరతవర్షం ప్రశస్తిని వివరించాడు.

కోణాదిత్యక్షేత్రం (కోణార్కం)

భరతవర్షంలో దక్షిణసముద్రానికి ఉత్తరదిక్కులో ఉత్కలదేశంలో సూర్యభగవానుడు స్వయంగా నెలకొన్నాడు. ఆయన కోణాదిత్యుడు అని ప్రసిద్ధుడు. ఆ దేవుడిని ప్రతిరోజూ ఆదిత్యమంత్రాలతో ఉపాసించాలి. రాగిపాత్రలలో, జిల్లేడు ఆకులలో, రక్తచందనంతో, రక్తపుష్పాలతో, అర్ఘ్యప్రదానాలతో ధూప, దీప, నైవేద్యాదులతో విధివిధానంగా అర్చనలు చేయాలి. ముఖ్యంగా మాఘమాసంలో అందులోనూ సప్తమినాడు విశేషంగా సూర్యుడిని అర్చించాలి. చైత్రమాసంలో శుక్లపక్షం ఏకాదశి మొదలైన తిథులలో దమనభంజిక అనే యాత్రను చేయాలి. అలా చేసినవాడికి కోరికలన్నీ తీరతాయి. చివరికి సూర్యలోకం చేరుకుంటాడు అని చెప్పి సూర్యోపాసనా నియమాలనూ, సూర్య మాహాత్మ్యాన్నీ, ద్వాదశాదిత్యులనూ, సూర్యుడి ఏకవింశతి నామాలనూ, అష్టోత్తర శతనామాలనూ వివరించాడుబ్రహ్మ.

సూర్యజన్మ వృత్తాంతం

మునులు కోరగా బ్రహ్మ సూర్యుడి జన్మవృత్తాంతాన్ని ఇలా చెప్తున్నాడు.

దక్షప్రజాపతికి అరవైమంది కుమార్తెలు. వారిని కశ్యపప్రజాపతికి ఇచ్చి వివాహం చేశాడు. వారిలో అదితికి కలిగిన కుమారులు ఆదిత్యులు. అంటే దేవతలు. దితికి పుట్టినవారు దైత్యులు. దనువు సంతానం దానవులు. వీళ్లు రాక్షసులు. అన్నదమ్ముల యుద్ధంలో రాక్షసులు దేవతలను జయించి, వారి యజ్ఞభాగాలను కూడా తీసుకున్నారు. దేవతలు ఆకలికి అలమటించారు. కుమారుల కష్టం పోగొట్టడానికి అదితి సూర్యుడిని గురించి తపస్సు చేసింది. సూర్యుడు ప్రత్యక్షమైనాడు. అదితి రాక్షసులనుండి కుమారులను కాపాడడానికి తనకు కొడుకుగా పుట్టమని వరం అడిగింది. సూర్యుడు ఒక సంవత్సరం చివరలో అదితిగర్భంలో ప్రవేశించాడు. గర్భాన్ని శుచిగా ఉంచుకోవడానికి అదితి నిత్యం వ్రతాలతో ఉపవాసం చేయసాగింది. ఉపవాసాలతో బిడ్డను చంపుతావా అన్నాడు కశ్యపుడు. చావలేదు అని చెప్పడానికి అదితి గర్భం జారవిడిచింది. అందులోనుండి సూర్యుడు వెలువడ్డాడు. మృత అండం అనే కశ్యపవచనం కారణంగా అతడు మార్తండుడు అయ్యాడు. పిదప మార్తండుడి తేజస్సువలన రాక్షసులు దగ్ధ మయ్యారు. దేవతలకు వారి అధికారాన్ని ఇచ్చి, సూర్యుడు దేవతలనూ, లోకాలనూ పాలించసాగాడు.

ఉమామహేశ్వర కల్యాణం

రుద్రుడు సర్వగతుడు. త్రిలోచనుడు. చంద్రశేఖరుడు. సమస్తభూతాలకు మేలు చేస్తాడు. మరి దక్షుడి యజ్ఞాన్ని ఎందుకు ధ్వంసం చేశాడని అడిగారు మునులు. బ్రహ్మ ఇలా చెప్పాడు.

దక్షప్రజాపతికి ఎనిమిదిమంది కూతుళ్లు. వారిలో సతి శివుడిభార్య. అయితే శివుడు దక్షుడిని గౌరవించడు. అల్లుడిమీద కోపంతో దక్షుడు యజ్ఞం తలపెట్టి, కూతురును గూడ ఆహ్వానించలేదు. అయినా సతి యజ్ఞానికి వెళ్లింది. దక్షుడు వసిష్ఠుడు, అత్రి, పులస్త్యుడు, అంగిరుడు, పులహుడు, క్రతువు, భృగువు, మరీచి అనే సప్తర్షులైన మిగిలిన అల్లుళ్లతో పోల్చి, శివుడినీ, సతినీ అవమానించాడు. తండ్రి భర్తను నిందించడంవలన సతి శరీర మంతటా అగ్నిని నిలుపుకుని భస్మమైంది. ఆ వృత్తాంతం విన్న శివుడు కోపించాడు. అందర్నీ శపించాడు. సతీదేవి తరువాత వైవస్వత మన్వంతరంలో హిమవంతుడికి ఉమగా జన్మించింది. ఆమె తీవ్రంగా తపస్సు చేసింది. శివపార్వతుల వివాహం మహావైభవంగా జరిగింది. దేవతలూ, మహర్షులూ అందరూ పరమేశ్వరుడిని మహత్వాన్ని స్తుతించారు. శివపార్వతులు కొన్నాళ్లు హిమవత్పర్వతంపైనే ఉన్నారు. తరువాత పార్వతి కోరికపై శివుడు మామగారిల్లు హిమాలయాన్ని విడిచిపెట్టి, మేరుపర్వతంపై నివసించసాగాడు.

దక్షాధ్వర ధ్వంసనం

పార్వతి నిరంతరం శివుడి ప్రక్కనే ఉండేది. యక్షగంధర్వాదులందరూ శివుడిని సేవిస్తూ ఉండేవారు. శివుడిశాపంవలన దక్షుడు చాక్షుష మన్వంతరంలో ప్రచేతసులకు పుత్రుడుగా, దక్షుడు అనే పేరుతోనే మహారాజుగా

జన్మించాడు. అతడు వైవస్వత మన్వంతరంలో అశ్వమేధయాగం తలపెట్టాడు. పరమేశ్వరుడి అనుమతితో ఇంద్రాదిదేవతలు ఆ యజ్ఞప్రదేశానికి వచ్చారు. ఆదిత్యులు, వసువులు, విష్ణువు, మొదలుగా అందరూ యజ్ఞానికి వచ్చారు. శంకరుడు మాత్రం రాలేదు. అపుడు దధీచిమహర్షి '**అపూజ్యపూజనే చైవ పూజ్యానాం చాప్యపూజనే, నరః పాప మవాప్నోతి మహద్ వై నాత్ర సంశయః**' అన్నట్లు శంకరుడు లేకుండా యజ్ఞం శోభించదు అన్నాడు. దక్షుడు శంకరుడిని నిందించాడు. అక్కడ పార్వతి ఈ దేవతలు అందరూ ఎక్కడికి వెళ్తున్నారు అని అడిగింది. శంకరుడు దక్షప్రజాపతి అశ్వమేధయాగం చేస్తున్నాడు. అక్కడికి వెళ్తున్నారు అన్నాడు. మరి నువ్వెందుకు వెళ్లడం లేదు? అన్నది పార్వతి. దేవతలు నాకు యజ్ఞంలో భాగం ఇవ్వడం లేదు. అందుకని వెళ్లడం లేదు అన్నాడు శివుడు. దేవతలలో నువ్వు శ్రేష్ఠుడివి కదా! నీకు యజ్ఞభాగం ఇవ్వకపోవడ మేమిటి? అది నీకు లభించాలంటే నేను ఏమి తపస్సు, వ్రతం చేయాలి? అని ఆమె అడిగింది. 'పార్వతీ! అంత కోపం వద్దు. నన్ను యజ్ఞేశ్వరుడుగా బ్రహ్మవేత్తలు గౌరవిస్తారు. యజ్ఞంలో నా భాగాన్ని నేనే సృష్టించుకుంటాను' అని శివుడు తన ముఖంనుండి కోపం అనే అగ్నిద్వారా ఒక భూతాన్ని సృష్టించాడు. అది సింహం ఆకారంలో ఉంది. దక్షుడి యజ్ఞాన్ని ధ్వంసం చేయమని దానికి అజ్ఞాపించాడు శివుడు. పరమేశ్వరికి కోపం రావడంవల్ల ఇలా జురుతున్నదని గ్రహించింది ఆ భూతం. దానికి వీరభద్రుడు అని పేరు. పరమేశ్వరి కూడ భద్రకాళిగా వీరభద్రుడికి తోడయింది. వీరభద్రుడు వెంటనే యజ్ఞస్థలానికి వెళ్లాడు. భయంకరమైన రూపంతో దక్షయజ్ఞాన్ని సర్వనాశనం చేశాడు. అపుడు నేను(బ్రహ్మ) దేవతలు యజ్ఞంలో శివుడికి భాగం ఇస్తారని చెప్పాను. దక్షుడు శరణు కోరాడు. పరమేశ్వరుడి అనుగ్రహంతో యజ్ఞం పూర్తి అయింది. దక్షుడు అష్టోత్తర సహస్రనామాలతో శివుడిని స్తుతించాడు.

క్షేత్రవైభవం

తరువాత బ్రహ్మ మహర్షుల కోరికమీద వివిధ క్షేత్రాల మహాత్మ్యాన్ని వివరించాడు.

ఏకామ్రక్షేత్రం (కంచి): వెయ్యిలింగాలు కలిగినదీ, వారాణసితో సమానమైనది ఏకామ్రక్షేత్రం. పూర్వకల్పంలో అక్కడ ఏడాదికి ఒకే మామిడిపండు ఇచ్చే మామిడిచెట్టు ఉండేది. ఆ పేరుమీద ఆ క్షేత్రం ఏకామ్రక్షేత్రం అయింది. అక్కడి శివుడిని సేవించినవారికి సమస్తమైన కోరికలు సిద్ధిస్తాయి. మోక్షం కలుగుతుంది.

విరజాక్షేత్రంలో విరజ అనే పేరుతో సరస్వతీదేవి ప్రతిష్ఠింపబడింది. అక్కడ వైతరణీనది ఉంది. అది సర్వపాప హరం. శ్రీమహావిష్ణువు కపిలుడు అనే పేరుతో ఉంటాడు. అక్కడ వారాహీదేవిని దర్శించాలి.

పురుషోత్తమక్షేత్రం (పూరీ)

విష్ణువు లక్ష్మీదేవితో ఈ క్షేత్రంగురించి చెప్పాడు. దక్షిణసముద్రం ఒడ్డున, పెద్దమట్టిచెట్టు ఉన్నది. అది 80 మైళ్లదూరం విస్తరించి ఉంటుంది. దానికి ఉత్తరంగా పురుషోత్తమ ఆలయం ఉంది. అందులోని దైవప్రతిమను భగవంతుడు నిర్మించాడు. దానిని దర్శించిన వారందరూ స్వర్గమోక్షాలకు వెళ్తారు. అందువల్ల తనకు పని లేకుండా

పోతున్నదని యమధర్మరాజు స్వామిని ఆ మూర్తిని తొలగించమని ప్రార్థించాడు. దానితో విష్ణువు ఆ ప్రతిమను ఇసుకతో కప్పి కనబడకుండా చేశాడు.

మాలవదేశంలో అవంతి అనే నగరం ఉంది. ఆ మహానగరంలో శివుడు మహాకాలుడు అనేపేరుతో ఉన్నాడు. అక్కడ క్షిప్ర అనే పుణ్యనది ఉంది. ఆ రాజ్యాన్ని ఇంద్రద్యుమ్నుడు పాలించేవాడు. అతడికి కలలో సముద్రతీరంలో ఒకానొకకొయ్య, తరువాత వాసుదేవుడు, విశ్వకర్మ, శిల్పం నిర్మించడం, ఆ శిల్పాన్ని ఆలయంలో ప్రతిష్ఠించడం కనిపించాయి.

ఇంద్రద్యుమ్నుడు సమస్త పరివారంతో దక్షిణ సముద్రతీరానికి వెళ్లాడు. అక్కడ వింధ్య పాదాన్నుంచి ప్రవహిస్తూ వచ్చిన ఒక నది ఉన్నది. దానిని మహానది అంటారు. ఆ నదీతీరంలో గొప్ప నగరం ఉంది. తనకు కలలో కనిపించిన పురుషోత్తముడి పుణ్యక్షేత్రం అదే అని గ్రహించాడు రాజు. అక్కడ స్వామికి పెద్ద ఆలయాన్ని నిర్మించాలను కున్నాడు. ముందుగా సలక్షణంగా ఘనంగా అశ్వమేధయాగం చేశాడు. ఏకాంతంగా జగన్నాథుడిని ఉపాసించాడు. తదేకధ్యానంతో ఉన్న ఇంద్రద్యుమ్నుడికి నిద్రలో కల వచ్చింది. ఆ కలలో గరుడారూఢుడైన శ్రీమహావిష్ణువు కనిపించి ఇలా అన్నాడు. 'ఈ సముద్రానికి ఆవల మహావృక్షాల మధ్యలో ఒక రావిచెట్టు ఉంటుంది. గొడ్డలితో దానిని నరికి, ఆ చెక్కతో నా విగ్రహాన్ని నిర్మించు'. ఇంద్రద్యుమ్నుడు అలాగే చేశాడు. చెట్టును నరికిన తరువాత విష్ణువు, విశ్వకర్మ బ్రాహ్మణవేషంలో అక్కడికి వచ్చారు. విప్రరూప విష్ణువు చెప్పిన ప్రకారం విశ్వకర్మ ఆ చెట్టుకాండంనుండి కృష్ణ, బలరామ, సుభద్రల మూర్తులు నిర్మించాడు. ఆషాఢమాసం శుక్లపంచమినాడు ఆ మూర్తులను తెచ్చి, మందిరంలో ఉంచి, వారంరోజులపాటు పూజలు చేశారు. పిదప మంచి ముహూర్తంలో ఆలయభవనంలో ప్రతిష్ఠ చేశారు. జ్యేష్ఠమాసంలో ముఖ్యంగా ద్వాదశినాడు స్వామిని దర్శించాలి.

ఈ పురుషోత్తమక్షేత్రాన్ని ఉత్కలక్షేత్రం అని కూడ అంటారు. ఇక్కడ యజ్ఞం చేసే సమయంలో ఏర్పరచిన సరస్సు ఇంద్రద్యుమ్నుడిపేరుతో ప్రసిద్ధమైంది. అందులో స్నానం చేసి, మార్కండేయుడినీ, వటవృక్షాన్నీ, బలరామాదులను దర్శించినవాడు మోక్షం పొందుతాడు.

శ్రీకృష్ణస్వామి, బలరాముడు, దక్షిణ సముద్రం, మార్కండేయ వటం, ఇంద్రద్యుమ్న సరస్సు ఈ అయిదింటిని సేవించడాన్ని పంచతీర్థవిధి అంటారు.

భువనేశ్వరలింగం – మార్కండేయహ్రదం – మహావటం – నరసింహమహత్త్వం

పూర్వం కల్పాంతంలో మహాప్రళయం జరిగి సమస్తం ఏకార్ణవం అయింది. ప్రళయజలంలో ఇరుక్కున్న మార్కండేయుడు బయటపడడానికి పురుషోత్తముడిని ఆశ్రయించాడు. ఆ జలంలో ఒక పెద్ద మఱ్ఱిచెట్టుంది. దానికొమ్మ మీద ఉత్తమమైన శయనంపై విష్ణువు చిన్నపిల్లవాడుగా ఉన్నాడు. మార్కండేయుడు పురుషోత్తముడి అనుగ్రహంతో ఆ బాలుడి ఉదరంలోకి చేరాడు. అక్కడే సమస్తలోకాలు దర్శించాడు. స్వామి తనముఖంనుండి మార్కండేయుడిని వెలువరించాడు. ముని స్వామిని దర్శించి, స్తుతించాడు. ప్రసన్నుడైన విష్ణువుతో పురుషోత్తమ

క్షేత్రంలో తాను పరమేశ్వరుడిని ప్రతిష్ఠిస్తాననీ, శివకేశవులిద్దరూ ఒక్కటే అని భక్తులు గ్రహిస్తారని చెప్పాడు. **'యో రుద్ర స్స స్వయం విష్ణు ర్యో విష్ణు స్స మహేశ్వరః'** అని, విష్ణువు 'పరమేశ్వరుడిని లింగరూపంలో భువనేశ్వరుడుగా ప్రతిష్ఠించు. నీ పేరుమీదుగా శివాలయం నిర్మించు. దానికి ఉత్తరదిక్కులో ఒక సరస్సు ఏర్పాటు చేయి. అది మార్కండేయ హ్రదం అనే పేరుతో ప్రసిద్ధం అవుతుంది' అని వరమిచ్చి అదృశ్యమయ్యాడు. మార్కండేయ హ్రదంలో స్నానం చేసి, భువనేశ్వరుడిని దర్శనం చేసుకుని అక్కడ ఉన్న మఱ్ఱిచెట్టుకు మూడుసార్లు ప్రదక్షిణం చేయాలి. ఆ తరువాత గరుత్మంతుణ్ణీ, కృష్ణ, బలరామ, సుభద్రలను సేవించాలి. అక్కడ ఇంద్రనీలమణుల రూపంలో ఇసుకలో రహస్యంగా ఉన్న నరసింహస్వామికి నమస్కరించాలి అని చెప్పి, బ్రహ్మ మహర్షులకు పిదప నరసింహోపాసనా విధానాన్ని వివరించాడు.

జ్యేష్ఠమాసంలో జ్యేష్ఠనక్షత్రం ఉన్న పూర్ణిమనాడు కృష్ణ, బలరామ, సుభద్రలకు అభిషేకం విశేషంగా జరుగుతుంది. నాడు దేవతలు మహర్షులు మొదలుగా అందరూ స్వామిని సేవించుకుంటారు. ఆ రోజు స్వామిని దర్శించడం విశేషఫలదాయకం.

శ్వేతమాధవుడు – శ్వేతగంగ

పూర్వం కృతయుగంలో శ్వేతుడు అనే రాజు ఉన్నాడు. అతడి రాజ్యంలో కపాలగౌతముడు అనే మహర్షి కుమారుడు పసివాడుగా ఉన్నప్పుడే మరణించాడు. రాజు మహాదేవుడిని సేవించి, శివానుగ్రహంతో యముడినుండి ఆ పిల్లవాడిని తెప్పించి బ్రతికించాడు. ఆ రాజు తరువాత విష్ణుదేవుడిని కూడ ఇలాగే సేవించాడు. దక్షిణసముద్ర తీరంలో కృష్ణస్వామిని దర్శించాడు. ఆ ఆలయానికి సమీపంలో దక్షిణంగా పెద్దఆలయం కట్టించాడు. అందులో చలువరాళ్లతో కూర్చిన మాధవస్వామి మూర్తిని విధివిధానంగా ప్రతిష్ఠించాడు. 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే ద్వాదశాక్షర మంత్రాన్ని నెలరోజులు జపించాడు. స్వామిని స్తుతించాడు. శ్రీహరి ప్రత్యక్షమై, సంపూర్ణంగా భోగాలనుభవించిన తరువాత, వైకుంఠం చేరుకుని, తనతో కలిసి ఉంటాడనీ, అక్కడి మాధవుడు శ్వేతమహారాజు పేరుమీదుగా శ్వేతమాధవుడు అనీ, అక్కడి గంగ శ్వేతగంగ అని ప్రసిద్ధమవుతాయనీ వరం ఇచ్చాడు.

ఆ ప్రక్కనే మాధవుడు రోహితం అనే జాతికి చెందిన చేపరూపం ధరించి, మత్స్యమాధవస్వామిగా ఉన్నాడు. శ్వేతమాధవమూర్తిని దర్శించినా, అక్కడి శ్వేతగంగను తాకినా స్వర్గం కలుగుతుంది.

తరువాత బ్రహ్మ సముద్రస్నానం, నారాయణపూజ, పంచతీర్థవిధానాలను విపులంగా మహర్షులకు వివరించాడు.

గుండికాయాత్ర

ఇంద్రద్యుమ్నుడు శ్రీహరిని ఇంద్రద్యుమ్నసరస్సు తీరంలో వారం రోజులు ఉండి, సేవలు అందుకోమని కోరాడు. ఆ సరస్సు తీరంలో వేదికమీద తనను దర్శించినవారు, అర్చించినవారు, అక్కడ దానాలు చేసినవారు

ఉత్తమగతులు పొందుతారని శ్రీహరి వరమిచ్చాడు. గుండికా ప్రదేశంలో ఉన్న మండపానికి రథంమీద వెళ్తూ ఉన్న స్వామిని చూడడం ఎంతో విశేషం. అందుచేత ఎంత కష్టపడి అయినా ఆ క్షేత్రానికి వెళ్ళి, రథయాత్రనూ, గుండికా మండపంలో వేంచేసిఉన్న స్వామినీ దర్శించుకోవాలి. అవకాశం ఉంటే, పన్నెండు నెలలలో పన్నెండుసార్లు ఈ యాత్ర చేయడం ఉత్తమం అని బ్రహ్మ పురుషోత్తమ అర్చనాది విధానాలను, దానివలన కలిగే ఫలితాలను, ఆ సందర్భంగా విష్ణులోక స్వరూపాన్ని, పురుషోత్తమక్షేత్రమాహాత్మ్యాన్ని మహర్షులకు వివరించాడు.

వాసుదేవమాహాత్మ్యం

ప్రథమకల్పంలో విష్ణువు విశ్వకర్మను పిలిచి, వాసుదేవమూర్తిని శిలామయంగా నిర్మించమని చెప్పాడు. శంఖచక్రగదాదులతో సమగ్రమైన స్వరూపంతో వాసుదేవమూర్తిని విశ్వకర్మ అందంగా తయారుచేశాడు. దానిని బ్రహ్మదేవుడే మంచి ముహూర్తంలో వేదమంత్రాలతో ప్రతిష్ఠించాడు. ఆ మూర్తిని మొదట ఇంద్రుడు పూజించాడు. త్రేతాయుగంలో రావణుడు ఇంద్రభవనం నుండి ఆ వాసుదేవమూర్తిని తీసుకువెళ్లాడు. విభీషణుడు దానిని 108 సంవత్సరాలు అర్చించాడు. రావణవధానంతరం రాముడు ఆ ప్రతిమను అయోధ్యకు తీసుకువెళ్లాడు. అనంతరం సముద్రుడికి ఇచ్చాడు. ద్వాపరయుగంలో శ్రీకృష్ణస్వామి ఆ ప్రతిమను సముద్రంనుంచి తీసి, పురుషోత్తమక్షేత్రంలో నిలిపాడు. అక్కడ వాసుదేవుడిని దర్శించినవారు వైకుంఠానికి వెళ్లి చివరకు మోక్షం పొందుతారు.

కండూపాఖ్యానం

కండుమహర్షి ఆశ్రమం గౌతమీతీరంలో ఉంది. అతడి తపస్సును భగ్నం చేయడానికి ఇంద్రుడు పంపిన ప్రమ్లోచ అనే అప్సరసతో మహర్షి తొమ్మిది వందల సంవత్సరాలకు పైగా కాపురం చేశాడు. తపస్సు అంతా నాశనం కావడంతో కండువు ఆ చోటు వదిలి పురుషోత్తమ క్షేత్రానికి వెళ్లి స్వామిని సేవించాడు. కృష్ణుడు ప్రత్యక్షమై, ఆ క్షేత్రంలో తనను సేవిస్తే పరమపదం కలుగుతుందన్నాడు. కండువు అలాగే పురుషోత్తమ సేవతో మోక్షం పొందాడు.

పురుషోత్తమ క్షేత్రమాహాత్మ్యం విస్తరంగా విన్న మహర్షులు బ్రహ్మదేవుడిని కృష్ణజన్మవృత్తాంతం చెప్పమని అడిగారు. బ్రహ్మ ముందుగా వాసుదేవ మొదలైన నాలుగు వ్యూహాలనూ, వరాహ, నారసింహాది అవతారాలనూ వివరించాడు.

శ్రీకృష్ణచరితం

భూదేవి జీవులభారం తగ్గించమని దేవతలను వేడుకుంది. బ్రహ్మదేవుడితో కలిసి వారు శ్రీహరివద్దకు వెళ్లారు. శ్రీహరి నలుపు, తెలుపు రంగుగల వెంట్రుకలు రెండు పెరికి, ఇవి మీ బాధలు తొలగిస్తాయన్నాడు. 'ఈ నల్లని వెంట్రుకల వసుదేవుడి పత్ని అయిన దేవకికి ఎనిమిదవ సంతానంగా జన్మించి, (తెల్లవెంట్రుక బలరాముడుగా జన్మిస్తుందని గ్రహించాలి) కాలనేమి అంశతో పుట్టిన కంసుడిని సంహరిస్తుంది. మీరు కూడ మీ మీ అంశలతో భూమిపై పుట్టండి. దుష్టసంహారంతో భూభారం తగ్గుతుంది' అన్నాడు. నారదుడీ మాటలు కంసుడికి చెప్పాడు.

విష్ణువు యోగనిద్రతో 'నీవు హిరణ్యకశిపుడి ఆరుగురు కుమారులను దేవకిగర్భంలో ప్రవేశపెట్టు. ఆదిశేషుడి అంశతో దేవకి ఏడవగర్భం ఏర్పడుతుంది. దానిని వసుదేవుడి ఇంకొకభార్య అయిన రోహిణిగర్భంలో ఉంచు. గర్భసంకర్షణంచేత అతడు సంకర్షణుడు అవుతాడు. దేవకికి ఏడవసారి గర్భస్రావం అయిందని వదంతి కలుగుతుంది. దేవకి ఎనిమిదవగర్భంలో నేను ప్రవేశిస్తాను. వెంటనే నువ్వు యశోదగర్భంలో ప్రవేశించు. శ్రావణబహుళఅష్టమినాడు నేనుదయిస్తాను. నవమినాడు నీవు పుడతావు. వసుదేవుడు నన్ను యశోదవద్దకు, నిన్ను దేవకివద్దకు చేరుస్తాడు. నువ్వు దుర్గ మొదలైన పేర్లతో శుంభ నిశుంభాది రాక్షసులను సంహరిస్తావు'. అన్నాడు.

దేవకి మొదటి ఆరుగురు కుమారులను పుట్టగానే కంసుడు సంహరించాడు. ఏడవదానిని బండరాతిమీద కొట్టగా అది ఆకాశంలో నిలిచి, కంసుడి మరణంగూర్చి చెప్పి వెళ్లిపోతుంది.

వ్రేపల్లెలో కృష్ణుడు కంసుడు పంపిన పూతనను, శకటుడిని సంహరించాడు. తనను బంధించిన రోటితో అర్జున వృక్షాలను కూల్చాడు. తరువాత కృష్ణుడిని రక్షించుకోవడానికి నందాదులు బృందావనం చేరారు. అక్కడ కృష్ణుడు గోపకులను పీడిస్తున్న కాళియసర్పాన్ని అణచి, కాళిందీనదిని ఉపయోగంలోకి తెచ్చాడు. తమను చంపడానికి గాడిదరూపంలో తిరుగుతున్న ధేనుకుడిని, గోపబాలకులలో కలిసి ఆటల నెపంతో వచ్చిన ప్రలంబుడిని బలరాముడు సంహరించాడు. గోవర్ధనపర్వతాన్ని ఎత్తి ఇంద్రుడు పెట్టిన ఇబ్బందులనుండి కృష్ణుడు గోవులను, గోపకులను కాపాడాడు. గోవులను కాపాడినందుకు ఇంద్రుడు కృష్ణుడిని గోవులకు ఇంద్రుడుగా అభిషేకించి, గోవిందుడు అని సత్కరించాడు. భయంకరమైన ఎద్దురూపంలో వచ్చిన అరిష్టుడు అనే రాక్షసుడిని కృష్ణుడు కొమ్ములు పట్టి, కడుపులో కుమ్మి సంహరించాడు. గుఱ్ఱంరూపంలో వచ్చిన కేశి అనే రాక్షసుడిని కృష్ణుడు ఆ గుఱ్ఱంనోట్లో చేయి దూర్చి, పెద్దది చేసి చంపివేశాడు. కేశి అనే రాక్షసుడిని చంపినందువల్ల స్వామి కేశవుడు అయ్యాడు.

పిదప కంసుడి ఆహ్వానంమీద ధనుర్యాగానికి బలరాముడితో కలిసి, కృష్ణుడు మధురకు వెళ్లాడు. అక్కడ కంసుడి రజకుడిని, మాలాకారుడిని సుగంధద్రవ్యాలు సమకూర్చే కుబ్జను అనుగ్రహించాడు. యాగధనుస్సును విరిచాడు. రామకృష్ణులు కువలయాపీడం అనే ఏనుగును చంపి, దాని దంతాలను ఆయుధాలుగా ధరించారు. కంసుడు నియోగించిన చాణూరుడు అనే మల్లుడిని కృష్ణుడు, ముష్టికుడు అనేవాడిని బలరాముడు మల్లయుద్ధంలో సంహరించారు. కృష్ణుడు కంసుడు కూర్చున్న సింహాసనంమీదికి దూకి, అతడిని కిందికి లాగి, మీదపడి చంపివేశాడు. సింహాసనంపై ఉగ్రసేనుడిని నిలిపారు. దేవకీవసుదేవులు వారిని ఆనందంతో ఆశీర్వదించారు.

పిదప బలరామకృష్ణులు సాందీపనివద్ద సమస్త విద్యలు అభ్యసించారు. మరణించిన గురుకుమారుణ్ణి తెచ్చియిచ్చారు. జరాసంధుడు మధురానగరంపై 18 సార్లు దండెత్తి కృష్ణుడిచేతిలో ఓడిపోయి వెనుదిరిగిపోయాడు. అదే సమయంలో మరొకవైపు నుంచి కాలయవనుడు దండెత్తేవాడు. యాదవుల రక్షణకోసం కృష్ణుడు సముద్రుడు ఇచ్చిన స్థలంలో సముద్రమధ్యంలో ద్వారకా నగరాన్ని నిర్మించి, మధురవాసులను ద్వారకకు చేర్చాడు. కాలయవనుడిని ముచుకుందుడి కంటిమంటలకు ఆహుతి చేశాడు. ముచుకుందుడికి ఉత్తమగతులు అనుగ్రహించాడు.

కృష్ణుడు రుక్మిణిని తీసుకువెళ్ళి వివాహం చేసుకున్నాడు. కృష్ణుడికి కాళింది, మిత్రవింద, సత్య, నాగ్నజితి, జాంబవతి, రోహిణి, సుశీల అనే మరొక ఏడుగురు పత్నులు అయ్యారు. రుక్మిణీకృష్ణుల కుమారుడు ప్రద్యుమ్నుడు. అతడు శంబరుడు అనే రాక్షసుడిని సంహరించాడు. రుక్మిణి సోదరుడైన రుక్మి మనుమరాలి వివాహంలో జూదంలో తగవులై రుక్మినీ, అతడి వైపున్న రాజులను బలరాముడు సంహరించాడు. దేవమాత అదితి కుండలాలు నరకుడు అపహరించాడనీ ఇప్పించమనీ ఇంద్రుడు కృష్ణుడిని కోరాడు. కృష్ణుడు సత్యభామను తీసుకుని గరుత్మంతుడిపై వెళ్ళి, నరకాసురుడిని చక్రాయుధంతో సంహరించాడు. అడ్డం వచ్చిన మురాసురుణ్ణి చంపాడు. అదితి కుండలాలు ఆమెకు ఇవ్వడానికి స్వర్గానికి వెళ్ళాడు. అక్కడ నందనవనంలోని పారిజాతంవృక్షం కావాలన్నది సత్య. ఇంద్రుడు ఇవ్వలేదు. యుద్ధంలో దిక్పాలకులను, దేవతలను జయించి, పారిజాతం ఇంటికి తెచ్చుకున్నాడు కృష్ణుడు. నరకుడి చెరసాలనుండి విడిపించి తెచ్చిన పదహారువేలమంది కన్యలను వివాహం చేసుకున్నాడు. వీరివలన కృష్ణుడికి ఒకలక్ష ఎనభైవేలమంది కుమారులు కలిగారు.

ప్రద్యుమ్నుడి కుమారుడు అనిరుద్ధుడు. బాణాసురుడి కుమార్తె ఉష, కలలో కలిసిన అనిరుద్ధుడిని గూర్చి చెప్పగా ఆమెసఖి చిత్రలేఖ అతడిని అంతఃపురానికి చేర్చింది. ఆ విషయంలో జరిగినయుద్ధంలో కృష్ణుడు బాణుడినీ, అతని పక్షాన వచ్చిన పరమేశ్వరాదులనూ జయించి, అనిరుద్ధుడినీ, ఉషనూ ద్వారకకు తీసుకొనివెళ్ళాడు. ఇంకా కృష్ణుడు తనవేషం ధరించి, తానే వాసుదేవుడినని చెప్పుకుంటున్న పౌండ్రకుడినీ, అతడికి సాయంగా వచ్చిన కాశిరాజునూ యుద్ధంలో సంహరించాడు. ప్రతీకారం తలపెట్టిన కాశిరాజు కుమారుడినీ, అతడికి తోడైవచ్చిన మహాకృత్యనూ కూల్చి, సుదర్శనచక్రం కాశీరాజ్యాన్ని దహించింది.

బలరామ మహత్త్వం

బలరాముడు తన ఆయుధమైన నాగలితో యమునాప్రవాహం దారి మళ్ళించాడు. జాంబవతికొడుకైన సాంబుడు దుర్యోధనుడి కూతురిని అపహరించాడు. వారు సాంబుడిని ఓడించి బంధించారు. కోపించిన యాదవులు కౌరవులను చంపాలనుకున్నారు. బలరాముడు వారించి, సాంబుడిని తీసుకురావడానికి హస్తినకు వెళ్ళాడు. సాంబుడిని విడిచిపెట్టమన్నాడు. కౌరవులు తిరస్కరించారు. బలరాముడు కోపంతో హస్తినసగరం కోటను నాగలి గుచ్చి లాగాడు. నగరం ఊగిసలాడింది. కౌరవులు కాళ్ళబేరానికి వచ్చి, సాంబుడిని భార్యతోసహా అప్పగించారు.

నరకాసురుడి స్నేహితుడైన ద్వివిదుడు అనే వానరుడు నరకవధకు ప్రతీకారంగా రకరకాలుగా లోకాలను హింసించసాగాడు. బలరాముడు తన స్త్రీలతో ఉన్నచోటికి వచ్చి వారిని అపహాస్యం చేశాడు. బలరాముడు ముసలాయుధం(రోకలి)తో ద్వివిదుడిని మోది సంహరించాడు.

వైకుంఠ గమనం

కృష్ణసంకల్పంతో మహర్షులశాపం కారణంగా సాంబుడి కడుపున ముసలం పుట్టింది. దానితో యాదవవంశం నాశనమైంది. తాను భూమిపై అవతరించిన ప్రయోజనం నెరవేరడంతో శ్రీకృష్ణుడు అవతారం ముగించి వైకుంఠధామానికి వెళ్ళిపోయాడు.

విష్ణువు అవతారాలు

తరువాత మునులకోరికపై వ్యాసుడు విష్ణువు అవతారాలనుగూర్చి చెప్పాడు. మహాప్రళయం తరువాత అంతా జలమై ఉండగా ఆ జలం మధ్యలో శ్రీమహావిష్ణువు ఒక్కడే ఉన్నాడు. ఆ సమయంలో మధువు, కైటభుడు అనే రాక్షసులు కోరగా యుద్ధం చేసి, వారిని సంహరించాడు. తరువాత అక్కడే పౌష్కరం అనే పేరుతో స్వామి అవతరించాడు. లోకశ్రేయస్సుకోసం యజ్ఞవరాహం రూపం ధరించి, సముద్రంలో మునిగిపోయిన భూమిని కోరలతో ఉద్ధరించాడు. కృతయుగంలో హిరణ్యకశిపుడు అనే రాక్షసుడు బ్రహ్మవరాలతో లోకాలను పీడిస్తుండగా, నరసింహరూపం ధరించి, అతడిని చీల్చి చెండాడాడు. తరువాత వామనుడుగా అవతరించాడు. బలి యజ్ఞం చేస్తుండగా విజృంభించిన రాక్షసులను సంహరించి, త్రివిక్రముడై లోకాలను ఆక్రమించాడు. లోకాలను ఇంద్రుడికి అధీనం చేశాడు. ఆ తరువాత దత్తాత్రేయుడుగా అవతరించి వేదధర్మాలను పునరుద్ధరించాడు. పరశురాముడుగా అవతరించి, క్షత్రియసంహారం చేశాడు. ఇరవైనాలుగవ త్రేతాయుగంలో శ్రీరాముడుగా అవతరించి, రావణాసురుడిని సంహరించాడు. కృష్ణుడుగా అవతరించి భూభారం తగ్గించాడు. ఇలా స్వామి అవతారాలు వేలసంఖ్యలో ఉన్నాయి.

మరణానంతర స్థితిగతులు

ఆ తరువాత మునులడుగగా జీవులు యమలోకానికి వెళ్లే మార్గంలోని బాధలనూ, వివిధ నరకాలలోని యాతనలనూ విస్తారంగా వివరించి చెప్పాడు వ్యాసుడు. ఆ బాధలు లేకుండా ఉత్తమగతులను పొందడానికి ఏం చేయాలో ఆ ధార్మికమార్గాలను కూడా వివరించాడు. పిదప శరీరం నశించే విధానమూ, తిరిగి జీవుడు జన్మించే విధానమూ, ఏయే కర్మలవలన ఏయే జన్మలు కలుగుతాయనే అంశాలనూ వివరించి చెప్పాడు. మరణించిన తరువాత కొడుకులు చేయవలసిన శ్రాద్ధవిధిని, పితరులను వరాహమూర్తి ఉద్ధరించిన విధానాన్ని ప్రవచించాడు వ్యాసమహర్షి

డా॥ అంబడిపూడి నాగభూషణం

శ్రీవ్యాసమహర్షి ప్రణీతం

బ్రహ్మమహాపురాణం

ప్రథమభాగం

(తెలుగు అనువాదంతో)

అనువాదకులు

డా॥ అంబడిపూడి నాగభూషణం

సంపాదకులు


'మహామహోపాధ్యాయ'

డా॥ సముద్రాల లక్ష్మణయ్య

ప్రత్యేకాధికారి

పురాణేతిహాస ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2020

BRAHMAMAHAPURANAM
FIRST PART
(with Telugu Translation)

Translated by:
Dr. Ambadipudi Nagabhushanam

Chief Editor:
Dr. Samudrala Lakshmanaiah

T.T.D. Religious Publications Series No.1379


First Print : 2020

Copies: 1000


Published by:
Sri Anilkumar Singhal, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

Cover Design & D.T.P. Type Setting:
Office of the Special Officer, Purana Itihasa Project,
TTD,Tirupati.

Printed at:
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.



శ్రీపద్మావతి అమ్మవారు　　శ్రీవేంకటేశ్వరస్వామివారు



వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

తిరుమల తిరుపతి దేవస్థానములు
పురాణ ఇతిహాస ప్రాజెక్టు
పండితపరిషత్తు
(సలహామండలి)

అధ్యక్షులు

శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.యస్.గారు

కార్యనిర్వహణాధికారి, తిరుమల తిరుపతి దేవస్థానములు.

సభ్యులు

శ్రీ బి. లక్ష్మీకాంతం, ఐ.ఏ.యస్.గారు

సంయుక్తకార్యనిర్వహణాధికారి,తి.తి.దే.,తిరుపతి.

డా॥ కందాడై రామానుజాచార్యులుగారు
విశ్రాంత ప్రాచ్యకళాశాలాధ్యక్షులు
శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధినీ సంస్కృతకళాశాల
హైదరాబాద్

డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు
విశ్రాంత సంచాలకులు
ఓరియంటల్ మాన్‌స్క్రిప్ట్స్ లైబ్రరీ - హైదరాబాద్

డా॥ ధూళిపాళ మహదేవమణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల
రాజమండ్రి

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రియ సంస్కృత విద్యాపీఠం
తిరుపతి

డా॥ ఈ.ఏ.శింగరాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకులు
శ్రీవేంకటేశ్వర ప్రాచ్యకళాశాల - తిరుపతి

డా॥ కె.ప్రతాప్గారు
విశ్రాంత ఆచార్యులు
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి

కన్వీనర్

డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు
ప్రత్యేకాధికారి, పురాణేతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

తిరుమల తిరుపతి దేవస్థానములు

పురాణేతిహాస ప్రాజెక్టు

పరిష్కరణ పరిషత్తు

డా॥ కందాడై రామానుజాచార్యులుగారు
విశ్రాంత ప్రాచ్యకళాశాలాధ్యక్షులు
శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధినీ సంస్కృతకళాశాల
హైదరాబాద్

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

డా॥ ఈ.ఏ.శింగరాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకులు
శ్రీవేంకటేశ్వర ప్రాచ్యకళాశాల, తిరుపతి

డా॥ వేదాల వేంకటసీతారామాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఎస్.బి.ఎస్. సంస్కృతకళాశాల, పొన్నూరు

డా॥ ధూళిపాళ మహదేవమణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల
రాజమండ్రి

డా॥ ధూళిపాళ అన్నపూర్ణగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకురాలు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల
రాజమండ్రి

డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు
విశ్రాంత సంచాలకులు,
ఓరియంటల్ మాన్స్క్రిప్ట్స లైబ్రరీ,
హైదరాబాద్

కన్వీనర్
డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు
ప్రత్యేకాధికారి
పురాణేతిహాస ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు

విషయానుక్రమణిక



తొలిపలుకు

భారతీయవాఙ్మయంలో వేదాల తరువాత అంతటి ప్రాధాన్యం కలిగినవి పురాణాలు.

విస్తారాయ చ వేదానాం స్వయం నారాయణః ప్రభుః ।
వ్యాసరూపేణ కృతవాన్ పురాణాని మహీతలే ॥

వేదార్థాలను విస్తరింప జేయడానికై శ్రీమన్నారాయణుడు వ్యాసుడుగా అవతరించి పదునెనిమిది పురాణాలు రచించాడని పై శ్లోకంనుండి తెలుస్తున్నది. వేదోక్తమైన ధర్మాలను సరళసుందరమైన సంస్కృతభాషలో పురాణాలు వివరిస్తున్నవి. కథాకథనపద్ధతి నాశ్రయించి పురాణరచన జరిగింది. కాబట్టి పాఠకులకు ధర్మం పట్ల ఆసక్తి కల్గించడంలో పురాణాలు విజయం సాధించాయి.

ప్రాచీన ఋషులు, పురాతనకాలానికి చెందిన రాజుల చరిత్రలు పురాణాలలో వర్ణించబడివున్నాయి. అంతేకాక పవిత్రమైన తీర్థాలు, క్షేత్రాలు, ఆచరణయోగ్యమైన వ్రతాలు–మొదలగు విషయాల వివరణ కూడా పురాణాలలో లభిస్తుంది.

తిరుమల తిరుపతి దేవస్థానం ఒక మహాధార్మికసంస్థ. అందువల్ల ధర్మబోధకమైన గ్రంథాలను విరివిగా ప్రచురించి ప్రచారంలోకి తేవడం దేవస్థానం కర్తవ్యం.

ఈ ఉద్దేశంతోనే మొదట వ్యాసభాగవతాన్ని మూడు సుప్రసిద్ధవ్యాఖ్యానాలతో 14 సంపుటాలుగా పరిష్కరించి ప్రచురించడమయింది. తరువాత వాల్మీకిరామాయణాన్ని గూడా రెండు వ్యాఖ్యానాలతో 8 సంపుటాలుగా ముద్రించడం జరిగింది.

ప్రస్తుతం పురాణేతిహాస ప్రాజెక్టు ద్వారా పదునెనిమిది పురాణాలను తెలుగు అనువాదంతో సహా ప్రచురించే కృషి జరుగుతున్నది. విష్ణు–కూర్మ పురాణాలు ముద్రణలో ఉన్నాయి. ఇప్పుడు బ్రహ్మపురాణం మొదటి సంపుటాన్ని ముద్రణార్హంగా సిద్ధం చేయడమైనది.

ఈ పురాణాన్ని అనువదించిన విద్వద్వర్యులు డా॥ అంబడిపూడి నాగభూషణంగారినీ, దీనికి సంపాదకత్వం వహించిన ప్రాజెక్టు పూర్వ ప్రత్యేకాధికారి డా॥ సముద్రాల లక్ష్మణయ్యనూ అభినందిస్తున్నాము. ఈ గ్రంథాన్ని పరిష్కరించడంలో తమవంతు సహకారమందించిన పండితులకు, పండితపరిషత్ సభ్యులకు మా అభివందనాలు.

సహృదయుల సహకారంతో అష్టాదశ పురాణాలనూ క్రమంగా ప్రచురించాలన్న దేవస్థానప్రయత్నం శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో త్వరలో సఫలమగుగాక!

ఈ జ్ఞానయజ్ఞంలో తోడ్పడిన వారినందరినీ ఏడుకొండల దేవుడు అనుగ్రహించుగాక!

కె.యస్.జవహర్ రెడ్డి ఐ.ఏ.యస్
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

నివేదన

పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్ ।
అనన్తరం చ వక్త్రేభ్యో వేదాస్తస్య వినిర్గతాః ॥

బ్రహ్మ శాస్త్రాలన్నింటికంటె ముందు పురాణాన్ని స్మరించాడు. ఆ తరువాతనే ఆ దేవుని చతుర్ముఖాల నుండి వేదాలు వెలువడ్డాయి.

పై ప్రమాణవచనాన్ని బట్టి పురాణం ఎంత ప్రాచీనమైనదో గ్రహించవచ్చు. వేదమైనా, పురాణమైనా ధర్మస్వరూప నిరూపణకే అవతరించాయి. వేదాలకంటే గూడా పురాణాలు నిరూపించిన ధర్మస్వరూపం పాఠకులకు ఎక్కువ ఆసక్తిదాయకంగా ఉంటుంది. అందుకు కారణం పురాణాలలోని కథాకథనవిధానమే.

జ్ఞానవిజ్ఞానాలను సర్వతోముఖంగా అష్టాదశపురాణాలు మనకందించాయి. అతిప్రాచీనమైన ఈ వాఙ్మయాన్ని పరిశీలించిన నేటి పలువురు వైజ్ఞానికులు, ఆధునికులు గ్రహించవలసిన అనేక విషయాలు అందులో ఉన్నాయని ముక్తకంఠంతో అంగీకరించారు.

'పురాఽపి నవం' అన్న వ్యుత్పత్తి ననుసరించి పురాణ వాఙ్మయం ఎంతో ప్రాచీనమైనప్పటికీ నిత్యనూతనంగా భాసించే విషయాల కది నిలయంగా ఉన్నదని పెద్దల అభిప్రాయం.

పురాణాలను గురించి కొంత విస్తృతమైన పరిచయాన్ని ఈ సంపుటంలోని 'పురాణప్రశస్తి' అన్న శీర్షిక క్రింద చూడవచ్చు.

పదునెనిమిది పురాణాలలో నాలుగులక్షల శ్లోకాలు ఉన్నాయని ప్రాచీన గ్రంథాలు పేర్కొంటున్నాయి. కాని మాకు లభించిన పురాణగ్రంథాలలో ఇంచుమించు మూడులక్షలా డెబ్బైఒక్కవేల శ్లోకాలు మాత్రమే ఉన్నాయి.

తిరుమల తిరుపతి దేవస్థానం భాగవతం ప్రాజెక్టు అన్నపేరుతో ఒక ప్రాజెక్టును స్థాపించి తద్వారా మొదట వ్యాసభాగవతాన్ని అద్వైత విశిష్టాద్వైత ద్వైత మతతత్త్వాలను వివరించే శ్రీధరీయం, వీరరాఘవీయం, విజయధ్వజీయం అన్న మూడు సుప్రసిద్ధవ్యాఖ్యలతో పరిష్కరించి 14 బృహత్సంపుటాలుగా ప్రచురించింది.

తరువాత వాల్మీకి రామాయణాన్ని గోవిందరాజీయం,మహేశ్వరతీర్థీయం అన్న రెండు వ్యాఖ్యలతో పరిష్కరించి 8 సంపుటాలుగా ప్రచురించడమయింది. పై రెండు గ్రంథాలకూ చివర శ్లోకపాదానుక్రమణిక గూడ చేర్చడం జరిగింది.

పిదప వ్యాసవిరచితమైన అష్టాదశపురాణాలను సరళమైన తెనుగు అనువాదంతో ప్రచురించాలని దేవస్థానం సంకల్పించింది. అనువాదరచనలో ఇంచుమించు 50మంది ప్రఖ్యాతసంస్కృతవిద్వాంసులు పాలుపంచుకొన్నారు. 3 లక్షలకుపైగా శ్లోకాల అనువాదం ఇప్పటికి పూర్తి చేశారు. మూలగ్రంథంతో సహా అనువదింపబడిన పురాణాలను డి.టి.పి చేసి పరిష్కరించి ప్రచురించే కార్యక్రమం కొనసాగుతున్నది.

ప్రస్తుతం విష్ణుపురాణం, కూర్మపురాణం ముద్రణలో ఉన్నాయి. అతిత్వరలో వాటిని ప్రజలకు అందించనున్నాము.

ఇప్పుడు 14వేల శ్లోకాలు గల బ్రహ్మపురాణం రెండు సంపుటాలుగా ప్రచురణకు సిద్ధం చేయబడుతున్నది. ఇందు మొదటిసంపుటాన్ని ప్రఖ్యాత సంస్కృతవిద్వాంసులు డా॥ అంబడిపూడి నాగభూషణం గారు అనువదించారు. వీరికి కృతజ్ఞతాభివందనాలు.

ఈ సంపుటాన్ని శ్రద్ధతో సరిచూచి అవసరమైన సవరణలు గావించి ప్రచురణార్హంగా రూపొందించిన పరిష్కరణ పరిషత్సభ్యులకు నమోవాకాలు.

ప్రాజెక్టులో సహాయపరిశోధకులైన శ్రీ యస్.బి.యస్.భట్టాచార్యులను, డా॥ యస్. దశరథను, డా॥ పూర్ణవల్లిని అభినందిస్తున్నాం. దీన్ని ముద్రణ యోగ్యంగా తీర్చిన డి.టి.పి ఆపరేటర్ శ్రీ బి.వెంకట్రాయులకు అభినందనలు.


ప్రాజెక్టు నిర్వహణకు తగిన ప్రోత్సాహాన్ని ఇస్తూ పురాణాలు ఇలా వెలుగులోకి రావడానికి తోడ్పడిన తి.తి.దే. ధర్మకర్తలమండలివారికీ, ధర్మనిష్ఠులు, కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్ కుమార్ సింఘాల్, ఐ.ఏ.యస్, గారికీ, సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ బి.లక్ష్మీకాంతం, ఐ.ఏ.యస్, గారికీ, ప్రాజెక్టు పండిత పరిషత్తు సభ్యులకూ కృతజ్ఞతా పూర్వకవందనాలు.

జ్ఞానయజ్ఞ మనదగిన అష్టాదశపురాణాల అనువాదకార్యక్రమం నిరాటంకంగా కొనసాగునట్లు శ్రీవేంకటేశ్వరుడు దయతో అనుగ్రహించుగాక!

తిరుపతి
18-5-2019

సముద్రాల లక్ష్మణయ్య
ప్రత్యేకాధికారి
పురాణేతిహాస ప్రాజెక్టు, తి.తి.దే.,

పురాణ పురుషుడు శ్రీమన్నారాయణుడు



బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ । వైష్ణవం దక్షిణో బాహు: వాయుర్వామో మహేశితు: ॥
ఊరూ భాగవతం ప్రోక్తం నాభి: స్యాన్నారదీయకమ్ । మార్కండేయం చ దక్షాంఘ్రి: వామో హ్యాగ్నేయముచ్యతే ॥
భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మన: । బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృత: ॥
లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ । స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥
కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేధ: ప్రకీర్త్యతే । మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణు: పురాణావయవో హరి: ।

పురాణప్రశస్తి

(అష్టాదశపురాణాలు)

మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥
నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

అతి ప్రాచీనకాలంలో గురుకులాలలో విద్యనభ్యసించే విద్యార్థులు పదునాలుగు విధాలైన విద్యల నభ్యసించేవారు. ఆ విద్యల నిలా పేర్కొనడం జరిగింది.

అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః ।
పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతాశ్చతుర్దశ ॥

శిక్ష,వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం-అనే ఆరు వేదాంగాలు, ఋగ్యజుస్సామా థర్వణము లనే నాలుగు వేదాలు, మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం-అనేవే పదునాల్గు విద్యలు.

'వేదోఽఖిలో ధర్మమూలం' అన్నట్లు వేదమంతా ధర్మమూల మైనది. వేదోక్తమైన ధర్మాలను గ్రహించడం అందరికీ సాధ్యం కాని పని. అందుచేత వేదాలను విభజించిన వేదవ్యాసుడే వేదార్థాలను సామాన్యులు గూడా గ్రహించడాని కనువుగా పురాణాలను రచించాడు. **అష్టాదశపురాణానాం కర్తా సత్యవతీ సుతః** -అను ప్రమాణవచనం కూడా పదునెన్మిది పురాణాల రచయిత సత్యవతీ సుతుడైన వ్యాసుడే అని నిరూపిస్తున్నది.

ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।
బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రహరిష్యతి ॥

అల్పజ్ఞుడు తనకు హాని కల్గిస్తాడేమో అని వేదం భయపడుతుంది. అందువల్ల ఇతిహాసాలతోనూ, పురాణాలతోనూ వేదార్థాలను విస్తరింపజేయాలి. ఈ దృష్టితోనే, అనగా అల్పజ్ఞులను దృష్టిలో పెట్టుకొనే వ్యాసుడు వేదార్థాలను పురాణాలద్వారా విస్తరింపజేశాడు. అట్లని పురాణాలు అల్పజ్ఞులకు మాత్రమే పరిమితమైనవి కావు. అధికజ్ఞులు కూడా గ్రహించవలసిన విషయాలు పురాణాలలో ఎన్నో ఉన్నాయి.

వేదం ప్రభువుతో సమానమైనది. శబ్దప్రధానమైన వేదవాణి కర్తవ్యవిషయంలో రాజాజ్ఞను పోలివుంటుంది. పురాణవచనం మిత్రతుల్యంగా వుంటుంది. అది అర్థప్రధానమై శ్రోతను కర్తవ్యానికి పురికొల్పుతుంది. కావ్యం కాంతాసమ్మితమై సరసంగా బోధించి పాఠకుణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేస్తుంది అని ఆలంకారికులు వేదార్థాలను వివరించే పురాణాలకు మిత్రసాదృశ్యాన్ని ప్రతిపాదించారు.

యద్వేదాత్ప్రభుసమ్మితాదధిగతం శబ్దప్రధానా చ్చిరం
యచ్చార్థ ప్రవణాత్పురాణవచనాదిష్టం సుహృత్సమ్మితాత్ ।

కాన్తాసమ్మితయా యయా సరసతామాపాద్య కావ్యశ్రియా
కర్తవ్యే కుతుకీ బుధో విరచితస్తస్మై స్పృహాం కుర్మహే ॥ (ప్రతాపరుద్రీయం)

పురాణాలలో గూడా కావ్యశైలిని పాటించి రసవత్తరంగా కర్తవ్యబోధ కావించిన ఘట్టాలెన్నో ఎడనెడా కానవస్తాయి.

పురాణాలలో పూర్వకాలానికి చెందిన అనేక కథలున్నాయి. కథా కథనం ద్వారా ధర్మ స్వరూపం అందులో నిరూపింపబడింది. పురాణ కథలు వాగ్వైభవాన్ని ప్రదర్శించడానికి చెప్పినవి కావనీ, విజ్ఞానవైరాగ్యాలను విస్తరించి చెప్పడానికే ఆ కథలను వివరించడమయిందనీ భాగవతపురాణంలో వ్యాసభగవానుడే చెప్పాడు.

కథా ఇమాస్తే కథితా మహీయసాం
వితాయ లోకేషు యశః పరేయుషామ్ ।
విజ్ఞానవైరాగ్య వివక్షయా విభో!
వచోవిభూతిర్న చ పారమార్థ్యమ్ ॥ (భాగవతం-12-3-14)

ఇక్కడ 'విజ్ఞాన' మంటే వేదవిజ్ఞానమనే గ్రహించాలి.

'వేదాః ప్రతిష్ఠితా స్సర్వే పురాణే నాత్ర సంశయః'

పురాణాలలో వేదాలు ప్రతిష్ఠితాలై ఉన్నాయి. ఇందులో సందేహం లేదు. కథల ద్వారా అవి ఆవిష్కృతాలవుతాయి.

పురాణ ప్రాముఖ్యం

యన్న దృష్టం హి వేదేషు తత్సర్వం లక్ష్యతే స్మృతౌ ।
ఉభయోర్యన్న దృష్టం హి తత్పురాణే ప్రతీయతే ॥

వేదాలలో గోచరం కానిదంతా స్మృతులలో కనిపిస్తుంది. శ్రుతి స్మృతులు రెండింటిలో కనిపించనిది పురాణం ద్వారా అవగతం అవుతుంది అన్న ప్రమాణాన్ని బట్టి శ్రుతులలోనూ, స్మృతులలోనూ లేని విషయాలను సైతం విస్తృతరచనావిధానం కల పురాణాలద్వారా గ్రహించవచ్చునని తెలుస్తున్నది. **'పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్'** అన్నట్లు శాస్త్రాలన్నింటిలోను మొదటిదిగా పురాణాన్ని విధాత స్మరించాడని విదితమవుతున్నది. యాగానుష్ఠానసమయంలో పురాణాలు పఠించే సంప్రదాయం కద్దు. ఇంకా పురాణాలలో భగవన్మహిమ, భగవదవతారాలు, భక్తిప్రబోధం, నానా విధాలైన ఆచారాలు, ధర్మాధర్మాలు, సాంఘిక -చారిత్రకాంశాలు, కళలు, వేదాంతతత్త్వాలు, నీతి ఇత్యాదిగా ఎన్నో విషయాలు నిరూపితాలయ్యాయి.

పురాణం ఐహికాముష్మిక సుఖసాధనం. మన సంస్కృతి సంప్రదాయాలను గ్రహించడానికి పురాణజ్ఞానం అవసరం.

పురాణ శబ్దనిర్వచనం

పురాణం అంటే - పురా భవం ప్రాచీన కాలంలో రచించబడినది అని అర్థం.

పురాఽపి నవం - ప్రాచీనమైనా విషయ విశిష్టతను బట్టి క్రొత్తది అని మరొక అర్థం.

పురా-అణతి-ఆగతానాగతే కథయతీతి పురాణం-అంటే జరిగిన, జరుగనున్న కాలానికి చెందిన విషయాలను వివరించునది అని వేరొక అర్థం.

పురా-పూర్వస్మిన్ జాతమితి పురాణమ్-పూర్వం ఎప్పుడో జరిగిన వృత్తాంతం పురాణం అని భావం.

పురా-అంటే పరంపరను వ్యక్తం చేసేది పురాణం అని మరొక వివరణ.

పురా-ప్రాచీన కాలోదంతం అనక్తీతి పురాణం - పురాతన కాలానికి చెందిన చరిత్రను చెప్పునది పురాణం.

ఇలా పురాణ శబ్దానికి పలు విధాల నిర్వచనం పెద్దలు చెప్పారు.

పురాణోత్పత్తి

అథర్వవేదంలో పురాణ శబ్దం ప్రయుక్తమైంది. యజ్ఞోచ్ఛిష్టంనుండి పురాణం పుట్టినదని అందులో చెప్పబడింది.

ఋచఃసామాని ఛందాంసి పురాణం యజుషా సహ ।
ఉచ్ఛిష్టాజ్జజ్ఞిరే సర్వే దివి దేవా దివి శ్రితాః ॥ అథర్వ సంహిత (11-7-24)

నాల్గువేదాల తరువాత ఇక్కడ పురాణోత్పత్తి నిర్దేశించబడింది. పురాణాల ఉనికి వేద సమకాలికమని తెలుస్తున్నది.

అందుచేత వేదసంహితల కాలంలోనే పురాణాలకు చెందిన మూలస్వరూపం రూపొందిందని భావించవచ్చు. బృహదారణ్యకోపనిషత్తులోని ఈ క్రింది వాక్యం గమనార్హం

"అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతత్ యదృగ్వేదో, యజుర్వేద స్సామవేదోఽథర్వాఙ్గిరసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణి".(2-4-10)

ఈ ఉపనిషద్ వాక్యం వేదాదులతోపాటు పురాణం కూడా పరమాత్మయొక్క నిఃశ్వాసరూపమైనదని వ్యక్తం చేస్తున్నది. దీనివల్ల వేదం ఎంత ప్రాచీనమో పురాణం కూడా అంతే ప్రాచీనమని గ్రహించవచ్చు. ఇక్కడ పురాణ శబ్దం ఏకవచనంలో ప్రయుక్తమైనది. అందుచేత పూర్వం సంక్షిప్తంగా ఉండిన పురాణం కాలక్రమంలో విస్తృతరూపం సంతరించుకొని వివిధ పురాణాలుగా విస్తరించిందని భావించవచ్చు.

భారతీయసంస్కృతిని ప్రతిబింబించే దర్పణాలు పురాణాలు. సామాన్య జనానీకంలో సనాతన ధర్మతత్త్వాన్ని ప్రచారం చేయడంలో అవి ప్రముఖపాత్ర వహించాయి. ఆధునికకాలంలో ప్రాచ్య పండితులేకాక పాశ్చాత్య పండితులు కూడా పురాణాల విశిష్టతను గుర్తించారు. పురాణం అన్న వ్యవహారమే ఇది అతిప్రాచీన సాహిత్యమని తెలియజేస్తుంది.

పురాణాలకంటే భిన్నంగా ఇతిహాసాలను గూడా మన పెద్దలు పేర్కొన్నారు. గతకాలంలో జరిగిన సంఘటనలను తెలిపేవి ఇతిహాసాలు. ఇతి హ+ఆస = ఇతిహాసం అనగా ఇలా పూర్వం జరిగినది-అని అర్థం. పురాణంలోని విషయాలు ఇతిహాసంలోని అంశాలకంటె వ్యాపకంగానూ, విస్తృతంగానూ వుంటాయి.

సాధారణ పురాణాల నుద్దేశించి నిర్దేశించిన సర్గం, ప్రతిసర్గం మొదలైన లక్షణాల కంటె భిన్నమైన వివిధ విషయాలు పురాణాలలో గోచరిస్తాయి. ఉదా: అగ్నిపురాణాన్ని పరిశీలిస్తే వివిధ విద్యలు, పదార్థలక్షణాలు, స్వప్నాలు,

శకున ఫలితాలు, కావ్యనాటక లక్షణాలు, ప్రళయస్వరూపం, నరకం తీరుతెన్నులు, అద్వైత బ్రహ్మతత్త్వం మున్నగు అంశాలు అందులో ఉండడం గమనార్హం. అందుకే అగ్నిపురాణాన్ని 'జ్ఞానకోశం' అన్నారు.

సృష్ట్యారంభంనుండి నేటివరకు సమాజంలోని స్థితిగతులను చెప్పే పురాణాలను శ్రద్ధతో పఠించి పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అంతేకాని అవేవో కల్పనాత్మకమైన కథలని ఉపేక్షించడం తగదు. పురాణాలను ఏ దృష్టితో వ్యాసభగవానుడు రచించాడు? అన్న ప్రశ్నకు ఈ క్రింది శ్లోకం సమాధానమిస్తున్నది.

విష్ణోరంశో మునిర్జాతః సత్యవత్యాం పరాశరాత్ ।
పురాణసంహితాం దధ్యౌ తేషాం ధర్మవిధిత్సయా ॥

విష్ణ్వంశంతో జనించిన సత్యవతీ పరాశరుల పుత్రుడగు వ్యాసుడు ధర్మస్వరూప నిరూపణకై పురాణసంహితను రూపొందించాడని భావం.

అంతేకాక శ్రీమన్నారాయణుడు స్వయంగా వ్యాసరూపుడై వేదార్థాల విస్తృతి నపేక్షించి భూతలములో పురాణాలు రచించాడని ఈ క్రింది శ్లోకం నిరూపిస్తున్నది.

విస్తారాయ చ వేదానాం స్వయం నారాయణః ప్రభుః ।
వ్యాసరూపేణ కృతవాన్ పురాణాని మహీతలే ॥

సూతుని ద్వారా ఈ పురాణవాఙ్మయం ప్రచారంలోకి వచ్చింది. నైమిశారణ్యనివాసులైన శౌనకాది మునులు సూతునినుండి ఈ పురాణాలను విన్నారు.

విష్ణువుయొక్క అవయవాలే పురాణాలు

త్రిమూర్తులలో ఒక్కడుగా, స్థితికారకుడుగా, దుష్టశిక్షకుడుగా, శిష్టరక్షకుడుగా, ధర్మసంస్థాపకుడుగా ప్రసిద్ధుడైన శ్రీమహావిష్ణుదేవుని యొక్క అవయవాలుగా పదునెన్మిది పురాణాలను పేర్కొనడం కద్దు. దీన్నిబట్టి ధర్మప్రభువైన అచ్యుతునికీ, ధర్మస్వరూపనిరూపకాలైన పురాణాలకూ కల సామ్యాన్ని గ్రహించవచ్చు. పురాణాలు ఈ క్రిందివిధంగా విష్ణుదేవుని అవయవాలుగా పేర్కొనబడ్డాయి.

బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ ।
వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥

ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ ।
మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥

భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః ।
బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥

లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ ।
స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥

కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేదః ప్రకీర్త్యతే ।
మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥

ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।

దీని తాత్పర్యం ఇది-శ్రీమహావిష్ణువునకు బ్రహ్మపురాణం-శిరస్సు, పద్మపురాణం-హృదయం, విష్ణుపురాణం-దక్షిణహస్తం, వాయుపురాణం-వామహస్తం, భాగవతపురాణం-తొడలు, నారదపురాణం-నాభి, మార్కేండయ పురాణం-దక్షిణపాదం, అగ్నిపురాణం-వామపాదం, భవిష్యపురాణం-కుడిమోకాలు, బ్రహ్మవైవర్త పురాణం-ఎడమ మోకాలు, లింగపురాణం-కుడి చీలమండ, వరాహపురాణం-ఎడమ చీలమండ, స్కాంద పురాణం-కేశాలు, వామనపురాణం-చర్మం, కూర్మపురాణం-వీపు, మత్స్యపురాణం-మెదడు, గరుడపురాణం-మజ్జ, బ్రహ్మాండపురాణం-ఎముకలు. ఇలా శ్రీహరి పురాణాలే అవయవాలుగా కల్గి వున్నాడు.

పురాణ సంఖ్య

పురాణాలు మొత్తం పదునెనిమిది. వీటిని ఆయా పురాణాల పేర్లలో మొదటి అక్షరాన్ని మాత్రం పేర్కొనే ఒక శ్లోకంలో ఇలా చెప్పడమయింది.

మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వచతుష్టయమ్ ।
అనాపలింగ కూస్కాని పురాణాని విదుర్బుధాః ॥

'మ' అనే అక్షరంతో ప్రారంభమయ్యే పురాణాలు రెండు-(1) మత్స్య పురాణం (2) మార్కండేయ పురాణం. 'భ' అను అక్షరంతో ప్రారంభమయ్యేవి, రెండు -(1) భాగవతం (2) భవిష్యపురాణం -'బ్ర'తో ప్రారంభమయ్యేవి -మూడు (1) బ్రహ్మ పురాణం (2) బ్రహ్మాండ పురాణం (3) బ్రహ్మవైవర్త పురాణం -'వ' కారంతో ప్రారంభమయ్యేవి నాల్గు (1) విష్ణు పురాణం (2) వాయు పురాణం (3) వామన పురాణం (4) వరాహ పురాణం -అ=అగ్నిపురాణం నా=నారదపురాణం-ప=పద్మపురాణం, లిం=లింగపురాణం, గ=గరుడ పురాణం, కూ=కూర్మపురాణం, స్కా=స్కాందపురాణం ఇలా మొత్తం పురాణాల సంఖ్య పదునెన్మిది.

పురాణ విభాగం

పురాణాలను మహాపురాణాలనీ, ఉప పురాణాలనీ రెండు విధాలుగా విభజించడం కద్దు. పైన ప్రథమాక్షర నిర్దేశంతో పేర్కొన్నవన్నీ మహాపురాణాలే. ఈ క్రింది విధంగా కూడా ఈ పురాణాలను పెద్దలు నిర్దేశించారు.

బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ వాయవీయం తథైవ చ ।
భాగవతం నారదీయం మార్కండేయం చ కీర్తితమ్ ॥
ఆగ్నేయం చ భవిష్యం చ బ్రహ్మవైవర్త లింగకే ।
వారాహం చ తథా స్కాందం వామనం కూర్మ సంజ్ఞకమ్ ।
మాత్స్యం చ గారుడం తద్వద్బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ ॥

ఈ పదునెన్మిది పురాణాలనూ పద్మపురాణం సాత్త్వికాలు, రాజసాలు, తామసాలు అని మూడు వర్గాలుగా విభజించింది.

సాత్త్వికాలు–

వైష్ణవం నారదీయం చ తథా భాగవతం శుభమ్ ।
గారుడం చ తథా పాద్మం వారాహం శుభదర్శనే ॥

రాజసాలు–

బ్రహ్మాండం బ్రహ్మవైవర్తం మార్కండేయం తథైవ చ ।
భవిష్యం వామనం బ్రాహ్మం రాజసాని నిబోధత ॥

తామసాలు–

మాత్స్యం కౌర్మం తథా లైంగం శైవం స్కాందం తథైవ చ ।
ఆగ్నేయం చ షడేతాని తామసాని నిబోధత ॥

ఇందులో (1) వైష్ణవం (2) నారదీయం (3) భాగవతం (4) గారుడం (5) వారాహం (6) పాద్మం –అనునవి సాత్త్వికపురాణాలు. (1) బ్రహ్మాండం (2) బ్రహ్మవైవర్తం (3) మార్కండేయం, (4) భవిష్యం (5) వామనం (6) బ్రాహ్మం–అనేవి రాజసాలు. (1) మాత్స్యం (2) కౌర్మం (3) లైంగం (4) వాయవీయం (శైవం) (5) స్కాందం (6) అగ్నేయం అనేవి తామసాలు.

ఇలా ఒక్కొక్క వర్గంలో ఆరేసి పురాణాలు లెక్కకు వస్తాయి.

సాత్త్వికపురాణాలు శ్రీమహావిష్ణువు యొక్క ప్రాధాన్యాన్నీ, రాజస పురాణాలు చతుర్ముఖ బ్రహ్మ ప్రాముఖ్యాన్నీ, తామస పురాణాలు శివునియొక్క ఆధిక్యాన్నీ వర్ణిస్తున్నాయి. ఈ ముగ్గురు దేవతలు త్రిమూర్తులుగా ప్రసిద్ధులు.

అన్ని పురాణాలూ ఈ దేవత లందరికీ సమప్రాధాన్యాన్ని ప్రతిపాదించక కొన్ని పురాణాలు ఒక దేవతను ఇతరదేవతల కంటే అధికుడని చెప్పడం యుక్తమా? అనే సంశయం కలుగవచ్చు.

వేదం **'ఏకం సత్ విప్రా బహుధా వదంతి'** అని చెప్పింది. అంటే సద్రూపుడైన పరమాత్మ ఒక్కడే, తత్త్వజ్ఞులు ఆయనను నానానామరూపాలతో వర్ణిస్తారని భావం. పరబ్రహ్మానికి మూర్తమని, అమూర్తమని రెండు రూపాలు కలవనీ; అందులో మూర్తం క్షరం–అంటే నశించే స్వభావం కలిగినదనీ, అమూర్తం నాశం లేనిదనీ గ్రహించాలి. క్షరాక్షరాలు సకలభూతాలలోనూ సమంగా ఉన్నాయి. అక్షరం పరబ్రహ్మం కాగా, ఈ చరాచరజగత్తు క్షరం అవుతున్నది. ఈ విషయాన్ని విష్ణుపురాణం ఇలా వివరించింది.–

ద్వే రూపే బ్రహ్మణస్తస్య మూర్తం చామూర్తమేవ చ ।
క్షరాక్షరస్వరూపే తే సర్వభూతేష్వవస్థితే ।
అక్షరం తత్ పరం బ్రహ్మ క్షరం సర్వమిదం జగత్ ॥

దీనినిబట్టి పురాణాలలో వర్ణింపబడిన త్రిమూర్తులలో ఒకరు పెద్ద, మరొకరు చిన్న అనే తేడాలు లేవు. ఒకే తత్త్వం మూడు రూపాలతో విరాజిల్లుతున్నది. ఆ దేవతలు నిర్వహించే క్రియలలోని భేదమే వారిని మూడురూపాలతో నిర్దేశించడానికి హేతువైనది. ఈ సంగతినే విష్ణుపురాణం ఈ విధంగా వివరించింది.

సృష్టిస్థిత్యంతకరణాత్ బ్రహ్మవిష్ణుశివాత్మికామ్ ।
స సంజ్ఞాం యాతి భగవాన్ ఏక ఏవ జనార్దనః ॥

ఒక జనార్దనుడే సృష్టి, స్థితి, లయం - అనే మూడు కార్యాలు నిర్వహించడంవల్ల బ్రహ్మ, విష్ణువు, శివుడు అన్న మూడు సంజ్ఞలు పొందాడని భావం.

ఈ సత్యాన్ని గ్రహిస్తే ఆయా దేవతల పట్ల వైషమ్యం తొలగి సమత్వం నెలకొంటుంది. అందువల్ల త్రిమూర్తుల ప్రభావాలను సమయానుగుణంగా వర్ణించే పురాణాల పట్ల సమన్వయదృష్టినే కలిగివుండాలి.

మహాపురాణాల లాగానే ఉపపురాణాలు గూడా పదునెన్మిది ఉన్నాయని కూర్మ పురాణం పేర్కొంటున్నది.

ఆద్యం సనత్కుమారోక్తం నారసింహం తథాఽపరమ్ ।
తృతీయం స్కంద ముద్దిష్టం కుమారేణ తు భాషితమ్ ॥

చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నందీశ భాషితమ్ ।
దుర్వాససోక్తమాశ్చర్యం నారదోక్తమతఃపరమ్ ॥

కపిలం వామనం చైవ తథోశనససేవితమ్ ।
బ్రహ్మాండం వారుణం చాథ కాలికాహ్వయమేవ చ ॥

మాహేశ్వరం తథా సాంబం సౌరం సర్వార్థ సంచయమ్ ।
పరాశరోక్త మపరే మారీచం భాస్కరాహ్వయమ్ ॥

ఉపపురాణాలు-(1) సనత్కుమారోక్తం (2) నారసింహం (3) స్కాందం (4) శివధర్మం (5) దౌర్వాసం (6) నారదోక్తం (7) కాపిలం (8) వామనం (మానవం) (9) ఉశనసఃప్రోక్తం (10) బ్రహ్మాండం (11) వారుణం (12) కాలికా పురాణం (13) మాహేశ్వరం (14) సాంబం (15) సౌరం (16) పరాశరోక్తం (17) మారీచం (18) భాస్కరం (భార్గవం).

కొందరి మతంప్రకారం ఉపపురాణాల సంఖ్య ముప్పదినాల్గుగా నిర్దిష్టమయింది. వీటికి తోడుగా ఔపపురాణాలు అన్న పేరుతో మరొక పదునెన్మిది పురాణాలను గూడ నిర్దేశించడం కద్దు.

పురాణ లక్షణం

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ ।
వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్ ॥

సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరాలు, వంశానుచరితం-అని పురాణం ఐదు లక్షణాలు గల్గి యుంటుంది. వీటి సంగ్రహవివరణ ఇది.

1. సర్గం - అవ్యాకృతతత్త్వం నుండి మహత్తత్త్వం, దానినుండి అహంకారతత్త్వం, దానినుండి సూక్ష్మభూతాల సృష్టి.
2. ప్రతిసర్గం - మరీచ్యాదులవల్ల జరిగిన చరాచరసృష్టి.
3. వంశం-ఆయా ఋషుల, రాజుల వంశాలు.

4. మన్వంతరాలు– మనువుల పరిపాలనకాలంలో జరిగిన విషయాలు మరియు ఆయా మన్వంతరాలలో సప్తఋషులు, మునులు మొదలగువారి వివరణ.

5. వంశానుచరితం–ఆ యా రాజవంశీయులైన రాజుల పరిపాలన మున్నగువాటికి చెందిన కథలను వివరించడం.

పక్షాంతరంలో పురాణాలకు పది లక్షణాలు గూడా నిర్దేశించడం కద్దు. పైన చెప్పిన ఐదు లక్షణాలు సాధారణపురాణాల లక్షణం కాగా, క్రింద చెప్పబోయే పదిలక్షణాలు మహాపురాణాలకు చెందినవని పెద్దల అభిప్రాయం.

అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణమూతయః ।
మన్వంతరేశానకథా నిరోధో ముక్తిరాశ్రయః ॥

సర్గం, విసర్గం, స్థానం, పోషణం, ఊతులు, మన్వంతరాలు, ఈశాన కథలు, నిరోధం, ముక్తి, ఆశ్రయం–అనేవే ఈ పది లక్షణాలు.

వీటి సంగ్రహ వివరణ ఇది–

(1) సర్గం –భగవత్ప్రేరణతో సత్త్వరజస్తమోగుణాలలో క్షోభ ఏర్పడి పంచభూతాలు, పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, అహంకారం, మహత్తత్త్వం జనించడాన్ని సర్గమంటారు.

2) విసర్గం:–విరాట్పురుషునినుండి ఉదయించిన బ్రహ్మ వివిధ చరాచరాలను సృష్టిస్తాడు. ఈ సృష్టినే విసర్గమంటారు.

3) స్థానం:–వినాశోన్ముఖమైన సృష్టిని ఒక మర్యాదలో నిల్పడమే స్థానం.

4) పోషణం:–భగవానుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావిస్తాడు. జగత్తుకు మేలు గల్గించే సందేశాన్ని అందిస్తాడు. నామరూపాలతో పుష్టిని కల్గిస్తాడు. దీనిని పోషణమంటారు.

5) ఊతులు:–కర్మవాసనలను ఊతులంటారు.

6) మన్వంతరాలు:–మనువులు మారినప్పుడు మన్వంతరకాలంలో తత్కాలానికి చెందిన అధిపతులు భక్తినీ,ధర్మాన్నీ ప్రబోధించే సంఘటనను మన్వంతరమంటారు.

7) ఈశానకథలు:– భగవదవతారాలు, భక్తులు–వీరికి సంబంధించిన చరిత్రలు.

8) నిరోధం:–జీవోపాధులను తనలో లీనం చేసుకొని భగవానుడు యోగనిద్రాముద్రితుడు కావడమే నిరోధం.

9) ముక్తి:–వేరే రూపాలు వదలి స్వస్వరూపంతో వుండడమే ముక్తి. ప్రకృతినుండి విముక్తి లభించే స్థితి ఇది.

10) ఆశ్రయం:– అధిష్ఠానమే ఆశ్రయం. దీని విశుద్ధికొరకే పై తొమ్మిది లక్షణాలనూ వివరించడం జరిగింది.

పై పది లక్షణాలూ మహాపురాణమైన శ్రీమద్భాగవతానికి చక్కగా అన్వయిస్తాయి. పెద్దలు వ్రాసిన గ్రంథాలలో వాటి సమన్వయాన్ని చూడవచ్చు.

పురాణశ్లోక సంఖ్య

భాగవతంలోని ద్వాదశస్కంధమందలి పదమూడవ అధ్యాయంలో ఆయా పురాణాలలోని శ్లోకాల సంఖ్య ఈ క్రిందివిధంగా నిర్దేశించడమయింది.

బ్రాహ్మం దశ సహస్రాణి పాద్మం పఞ్చోనషష్టి చ ।
శ్రీవైష్ణవం త్రయోవింశచ్చతుర్వింశతి శైవకమ్ ॥

దశాష్టౌ శ్రీభాగవతం నారదం పఞ్చవింశతిః ।
మార్కండేయం నవాగ్నేయం దశపఞ్చ చతుశ్శతమ్ ॥

చతుర్దశ భవిష్యం స్యాత్తథా పఞ్చశతాని చ ।
దశాష్టౌ బ్రహ్మవైవర్తం లైఙ్గమేకాదశైవ తు ॥

చతుర్వింశతి వారాహమేకాశీతిసహస్రకమ్ ।
స్కాందం శతం తథా చైకం వామనం దశ కీర్తితమ్ ॥

కౌర్మం సప్తదశాఽఽఖ్యాతం మాత్స్యం తత్తు చతుర్దశ ।
ఏకోనవింశత్సౌపర్ణం బ్రహ్మాండం ద్వాదశైవ తు ॥

త్రయోదశే పురాణానాం సంఖ్యామాహ యథాక్రమమ్ । **(భాగవతం-12-13-2--9)**

1.	బ్రహ్మపురాణం	-	10,000	శ్లోకాలు
2.	పద్మపురాణం	-	55,000	,,
3.	విష్ణుపురాణం	-	23,000	,,
4.	వాయుపురాణం	-	24,000	,,
5.	భాగవతపురాణం	-	18,000	,,
6.	నారదపురాణం	-	25,000	,,
7.	మార్కండేయపురాణం	-	9,000	,,
8.	అగ్నిపురాణం	-	15,400	,,
9.	భవిష్యపురాణం	-	14,500	,,
10.	బ్రహ్మవైవర్తపురాణం	-	18,000	,,
11.	లింగపురాణం	-	11,000	,,
12.	వరాహపురాణం	-	24,000	,,
13.	స్కందపురాణం	-	81,100	,,
14.	వామనపురాణం	-	10,000	,,
15.	కూర్మపురాణం	-	17,000	,,
16.	మత్స్యపురాణం	-	14,000	,,
17.	గరుడపురాణం	-	19,000	,,
18.	బ్రహ్మాండపురాణం	-	12,000	,,
	మొత్తం శ్లోకాలు	-	**4,00,0000**	

పురాణాలలో ముఖ్యాంశాలు

పురాణాలు మానవకర్తవ్యాలను నిర్దేశిస్తూ కొన్ని ముఖ్యమైన సందేశాత్మక ప్రబోధాలు కావించాయి. ధర్మాన్ని రక్షించవలసిన ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనాలను వివిధ కథల ద్వారా అవి విశదీకరించాయి.

విశ్వమంతా భగవన్మయమనీ, మోక్షప్రాప్తికి భక్తి ముఖ్యసాధనమనీ, వివిధ వ్రతాలను వాటికి తగిన కాలాలలో అనుష్ఠించి పవిత్రులు కావాలనీ, పుణ్యక్షేత్రాలను సందర్శించాలనీ, ఆయా క్షేత్రాలలో ప్రతిష్ఠితులైన దేవతలను ఆరాధిస్తే శుభాలు సిద్ధిస్తాయనీ, పితృదేవతలకు శ్రాద్ధవిధిని తప్పక అనుష్ఠించాలనీ, కర్మఫలం అనుభవించక తప్పదనీ ఇత్యాదిగా పురాణాలు ప్రబోధించే అంశాలు అందరికీ గమనింపదగినవై యున్నాయి.

వర్ణనాశైలి

కవితా రూపంలో గల రచనలను కవులు ఆలంకారిక ప్రక్రియలో కొనసాగిస్తారు. ఈ ప్రక్రియ పాఠకులను ఆకర్షిస్తుంది. యథాతథంగా సాగే కథాకథనంతోపాటు అవసరమైనచోట అలంకార ప్రక్రియనాశ్రయించి కవులు వర్ణన నిర్వహిస్తారు. అతిశయోక్తులను గూడా మేళవిస్తారు. ఉన్నదున్నట్లు చెప్పడం యథాతథకథనం కాగా కథనంలో ఉపమారూపకాదులను ఆశ్రయించడం ఒక విశిష్టమైన పద్ధతి. వేదాలలో గూడ ఈ పద్ధతి కనిపిస్తుంది. ఉదాహరణకు కఠోపనిషత్తులో

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥

ఇత్యాదిగా శరీరానికి రథరూపకల్పన చేసి ఆత్మను రథికునిగా పేర్కొనడం జరిగింది. సూర్యుని కిరణాలలోని ఏడు రంగులను ఏడు గుర్రాలుగా వర్ణించడం గూడా ఈ ప్రక్రియకు చెందిన విషయమే.

పురాణాలు గూడా ఈ శైలిని విస్తృతంగా అనుకరించాయి. అతిశయోక్తిని గూడా విపులంగా వినియోగించాయి. ఈ పద్ధతి పురాణ వాఙ్మయానికి శోభావహ మైందనడంలో ఏ మాత్రం సందేహంలేదు.

పురాణ ప్రయోజనం

యథా పాపాని పూయన్తే గంగావారివిగాహనాత్ ।
తథా పురాణ శ్రవణాద్దురితానాం వినాశనమ్ ॥

గంగాజలంలో స్నానం చేయడంవల్ల పాపాలు నశించినట్లే పురాణశ్రవణంవల్ల దురితాలు నశిస్తాయి.

సదాచారప్రబోధం

యజ్ఞాలు, దానాలు, తపస్సులు ఇత్యాదిగా ఎన్ని చేసినా – సదాచారం లేనివాడు ఆత్మోన్నతి పొందలేడు.

దురాచారో హి పురుషో నేహ నాముత్ర నందతి ।

అన్నట్లు దురాచారుడైన మనుజుడు ఇహపరలోకాలు రెండింటా సుఖానికి దూరమౌతాడు.

ఆచారహీనం న పునన్తి వేదా యద్యప్యధీతాః సహ షడ్భిరంగైః ।

సదాచారం లేనివాడిని వేదాలుగూడా పవిత్రుణ్ణి చేయజాలవు. దురాచారాలు, సదాచారాల స్వరూపాన్ని వివిధ కథల ద్వారా పురాణాలు చక్కగా నిరూపించాయి. రామాయణంలో రామాదివద్వర్తితవ్యం, న రావణాదివత్, -రామాదులవలె ప్రవర్తించాలి కాని, రావణాదులవలె ప్రవర్తించరాదు అన్న విధంగా నీతిప్రబోధం పురాణాలలో రమణీయంగా చేయబడింది.

అందువల్ల పురాణ పఠన శ్రవణాలు సమాజాభ్యున్నతి కల్గిస్తాయి. పూర్వం గ్రామసీమలలో గూడ రాత్రివేళల పౌరాణికులు పురాణ పఠనం కావించి అందలి విశేషాలను సామాన్య జనులకు బోధించేవారు. ఈ బోధ ప్రజానీకానికి సముచిత సంస్కారం కల్గించేది. తద్వారా వారు ఆత్మోన్నతి కల్గించే మార్గంలో నడిచేవారు.

కాలనిర్ణయం

పురాణాల కాలనిర్ణయం అంత సుకరం కాదు. శ్రీ శంకరభగవత్పాదులు మున్నగువారు తమ రచనల్లో పురాణాల నుదాహరించియున్నారు. బాణకవి (క్రీ.శ.625) తన హర్షచరిత్రలో **పురాణేషు వాయుప్రలపితం** అని చెప్పి వాయుపురాణాన్ని ప్రస్తావించాడు.

కలియుగరాజులను నిర్దేశించిన పురాణాలు గూడా ఉన్నాయి. విష్ణు పురాణంలో మౌర్యవంశం పేర్కొనబడింది. మాత్స్యపురాణం-దాక్షిణాత్యులైన ఆంధ్రరాజులను (క్రీ.శ 225) ప్రస్తావించింది. గుప్తరాజుల ప్రస్తావన వాయుపురాణంలో కనిపిస్తున్నది.

లక్ష శ్లోకాలుగల ఇప్పటి మహాభారతం రూపొందకముందే పురాణాల ఉనికిని పరిశోధకులు గుర్తించారు. మహాభారతవక్త అయిన రౌమహర్షణి పురాణాలలో పారంగతుడు. అతని తండ్రిగూడ పౌరాణికుడుగా ప్రసిద్ధుడే. మహాభారతంలో పెక్కు శ్లోకాలు పురాణాంతర్గత శ్లోకాలతో సామ్యం కల్గి వున్నాయి. మహాభారతంలోని కొన్ని ఆఖ్యానాల ప్రాచీన స్వరూపం పురాణాలలో గోచరిస్తున్నది. దీన్ని బట్టి మహాభారతం కంటె పురాణాలు ప్రాచీనమైనవని విశ్వసించవచ్చు.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో పురాణ ప్రస్తావన ఉన్నది. అపమార్గగాములైన రాజకుమారులను పురాణోపదేశం ద్వారా సన్మార్గగాములను చేయాలని కౌటిల్యుడు వచించాడు. రాజుకు సంబంధించిన అధికారులలో పౌరాణికుడు గూడా ఒకడని కౌటిల్యుడు పేర్కొన్నాడు. అంచేత కౌటిల్యుని కంటె పురాణాలు ప్రాచీనాలని భావించడం సముచితం. కౌటిల్యుడు క్రీ.పూర్వం తృతీయ శతకం వాడని అనేకుల భావన. అందువల్ల ఆ కాలానికంటె ముందే పురాణాలుండేవని భావించాలి.

గౌతమ-ఆపస్తంబ సూత్రగ్రంథాలలో గూడ పురాణప్రస్తావన వస్తుంది. రాజు శాసనవ్యవస్థలో వేదంతోపాటు పురాణాన్ని గూడా ప్రముఖంగా గ్రహించాలని గౌతముడు చెప్పాడు. అతిప్రాచీన పురాణభాగాలనుండి మూడు శ్లోకాలను ఆపస్తంబ ధర్మసూత్రాలలో ఉదాహరించడం జరిగింది. ఆ శ్లోకాలతో సామ్యం కల శ్లోకాలు నేటి పురాణాలలో లభిస్తున్నాయి. కాబట్టి సూత్రకాలంలో గూడా పురాణ గ్రంథాలుండేవని బోధపడుతున్నది.

మరొక ముఖ్యాంశ మేమంటే అతిప్రాచీనములైన ఉపనిషత్తులలో గూడా పురాణ ప్రస్తావన కలదు, ఛాందోగ్యంలో నారద సనత్కుమారుల సంవాదంలో ఇతర శాస్త్రాలతోపాటు పురాణాలను పేర్కొన్నారు.

"**ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేదమాథర్వణం చతుర్థమితిహాస పురాణం పంచమం వేదానాం వేదం**" (ఛాందో 7-1-2).

అందుచేత క్రీ.పూ 600 సం।। పూర్వం పురాణాల నిర్మాణం జరిగిందని పెద్దల భావన. వాటికి మూల భూతమైన పురాణా లిప్పుడు లభించవు.

పురాణాలు ఏ ఒక్క శతాబ్దానికో చెందిన రచనలు కావు. కాలక్రమములో వాటిలో క్రొత్తక్రొత్త అధ్యాయాలు చేర్చడం జరిగింది. గుప్తకాలానికి పురాణాలు నేటిరూపం సంతరించుకొన్నాయని చెప్పవచ్చు.

పురాణ వైశిష్ట్యం

పురాణాలు సామాన్యులకు దుర్బోధమైన వేదార్థాలను వారికవగతమయ్యే రీతిలో కథలు జోడించి చెప్పాయి. ప్రాచీనకాలానికి చెందిన భారతీయసమాజస్వరూపస్వభావాలను అర్థం చేసుకోవడానికి పురాణాలే ప్రామాణికమైన ఆధారాలు. ఆనాటి ఋషుల చరిత్రలను మనం పురాణాలనుండే సమగ్రంగా గ్రహించడానికి వీలవుతుంది.

భారతభౌగోళికస్థితి, నదీనదపర్వతాల ఉనికి, వివిధ తీర్థాల స్థితిగతులు, పలువృక్షాలు, జంతువులు- వీటిని గూర్చిన విజ్ఞానం కూడా పురాణాలలో లభిస్తుంది.

పురాణాలను, శిలాశాసనాదులగు ఇతర ప్రామాణికాధారాలతో తులనాత్మకంగా పరిశీలిస్తే గత చరిత్రకు చెందిన అనేక విషయాలు తేటతెల్లమవుతాయి.

కాబట్టి భారతీయులే కాక పాశ్చాత్యులు గూడా పురాణాలను శ్రద్ధతో పరిశోధించి మానవజాతి గతచరిత్రను సమగ్రంగా అవగతం చేసుకోవచ్చు.

ధార్మికంగానూ, ఆధ్యాత్మికంగానూ సామాన్యప్రజలను చైతన్యవంతులను చేయడంలో పురాణాలు నిర్వహించిన పాత్ర ఎంతో గణనీయమైనది. మొత్తం పదునెనిమిది పురాణాలలోని శ్లోకాల సంఖ్య నాల్గు లక్షలని ముందే చెప్పుకొన్నాం. ఇంత విస్తృతమైన గ్రంథరాశి సంస్కృతభాషానిబద్ధమై లభిస్తున్నది.

వేదాలలోని నిగూఢమైన వేదాంతతత్త్వాన్ని సామాన్య జనులకు గూడా అర్థం కావాలనే దృష్టితో ఆఖ్యానాలతోనూ, ఉపాఖ్యానాలతోనూ పురాణాలు వివరించాయి.

ప్రాచీనకాలంలో యజ్ఞాలు నిర్వహించే ప్రదేశాలలో పురాణపఠనం విధిగా నిర్వహింపబడేది. పురాణపఠనం పాపనివారకమనీ, పుణ్యప్రదమనీ ప్రశంసింపబడింది. పౌరాణికులు పురాణాలను పఠిస్తూ ప్రవృత్తినివృత్తిరూపాలైన రెండు విధాల ధర్మాలనూ ప్రజలకు వివరించేవారు.

పురాణాలను ఆధారంగా చేసుకొని కవులు కావ్యనాటకాదులు విస్తృతంగా రచించారు. భారతీయుల జీవితాలకూ, విశ్వాసాలకూ పురాణాలు శతాబ్దాల తరబడి మార్గనిర్దేశకా లయ్యాయి. వేదార్థాలను అతివిస్తృతస్థాయిలో జనానీకానికి అందజేయడానికి పురాణాలు ముఖ్యసాధనా లయ్యాయి.

వేదాంతతత్త్వాన్ని బోధించడాని కవతరించిన శ్రీశంకరరామానుజాద్యాచార్యులు గూడా అవసరమైన చోట పురాణవచనాలను ప్రమాణాలుగా పేర్కొనియున్నారు.

కర్మ–భక్తి–ధ్యాన–జ్ఞాన యోగాలు మోక్షసౌధాన్ని అధిష్ఠించడానికి సోపానాలు. ఇందులో కలియుగంలో భక్తియొక్కటే సులభమైన తరణోపాయమని పెద్దలు పేర్కొన్నారు.

"కలౌ భక్తిః కలౌ భక్తిః భక్త్యా కృష్ణః పురః స్థితః" అన్నట్లు కలియుగంలో అనన్యభక్తిచేతనే భగవదనుగ్రహం కలుగుతుందన్న సత్యాన్ని భాగవతాది పురాణాలు ప్రహ్లాదచరిత్రాదికథల ద్వారా మనోజ్ఞంగా నిరూపించాయి.

అట్లే గృహస్థులు పాటించవలసిన పలురకాలైన కర్మవిధానాలూ, వ్రతాలూ, వాటివల్ల కలిగే ఫలితాలూ పురాణాలలో ఎడనెడా విశదంగా నిరూపించబడ్డాయి. ఈ విధంగా కర్మయోగ నిరూపణం గూడా పురాణాలలో కనిపిస్తుంది. వివిధ విషయాలతో కూడిన పురాణాలను విజ్ఞానసర్వస్వాలుగా, జ్ఞాననిలయాలుగా భావించవచ్చు.

పురాణాలలో వివిధ ప్రదేశాలలో గల నానాతీర్థాలు, ఆ తీర్థాల ప్రాముఖ్యం, తీర్థయాత్రలవల్ల కలిగే ప్రయోజనాలు మొదలైన విషయాలు పలుచోట్ల వివరింపబడివున్నాయి. తీర్థయాత్రలవల్ల ప్రజలలో ఏకజాతీయతాభావం పెంపొందుతుంది. గతచరిత్రకు సంబంధించిన విజ్ఞానం భావిపురోగతికి దోహదం చేస్తుంది. పురాణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే భారతదేశ గతచరిత్రకు చెందిన ఎన్నో విషయాలు గోచరిస్తాయి. "పురోఽభివృద్ధి గోరువారు పూర్వవృత్తాంతమును మరువరాదు" అని శ్రీమలయాళస్వామి సూక్తి. అందుచేత చారిత్రక పరిశోధకులు పురాణాలను పరిశీలనాత్మకమైన దృష్టితో అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. తమ పాలనలో ఎదురయ్యే సమస్యలను ఆనాటి పాలకులు పురాణవృత్తాంతాలను ప్రమాణంగా పరిగ్రహించి పరిష్కరించేవారు. అందుచేత రాజధర్మ పరిజ్ఞానానికి గూడా పురాణసారస్వతం ఉపకరిస్తుంది.

పురాణాలలో బోధింపబడిన నీతులను కేవలం హిందూజాతికి మాత్రమే పరిమితా లని భావించరాదు. ప్రపంచజను లందరికీ ఉపయోగపడే శాశ్వతనైతికబోధ లందులో ఉన్నాయి.

ఆధునిక విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పలు అంశాలు పురాణాలలో నిర్దిష్టములై యున్నాయని ఇప్పటి శాస్త్రజ్ఞులలో కొందరి భావన. అందుచేత వైజ్ఞానిక పరిశోధకులకు గూడా పురాణజ్ఞానం అవసరమే.

అతిప్రాచీనకాలంనుండీ నేటివరకూ అమూల్య సారస్వతరూపంలో మనకు ఉపలబ్ధమవుతున్న వాఙ్మయంలో పూర్వోక్తపద్ధతిలో పురాణాలకు గల ప్రాముఖ్యాన్ని గుర్తించి మానవజాతిపురోగతికి వాటిని వినియోగించుకొని సర్వతోముఖమైన శ్రేయస్సును పొందుదుము గాక!

తిరుపతి
తేది. 10-01-2019

సముద్రాల లక్ష్మణయ్య
ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.



అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం

1. బ్రహ్మపురాణం

పురాణాలలో మొదటిది బ్రహ్మపురాణం. ఇది విష్ణుదేవుని మాహాత్మ్యాన్ని విశదీకరిస్తుంది. ఆ దేవుని శిరస్సుగా వర్ణింపబడిన ఈ పురాణం ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధపురుషార్థాల ప్రాప్తికి తగిన ఉపాయాలను వివరిస్తుంది.

10,000 శ్లోకాలు గల ఈ పురాణంలో పలు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు ఉన్నాయి. నైమిశారణ్య వర్ణనం, ప్రళయస్వరూపం, హరిశ్చంద్రసగరాదుల చరిత్రలు, సప్తద్వీపాలు, పార్వతీ స్వయంవరం, సాగరస్నానవిధి, గోదావరీ పవిత్రత, క్షీరసాగరమథనం, దధీచి వృత్తాంతం, వరాహాద్యవతారాలు–ఇత్యాదిగా అనేక విషయాలు ఇందులో నిబంధింపబడి వున్నాయి.

భారతావని, దండకారణ్యం, గంగాదినదుల ప్రాశస్త్యం విస్తృతంగా ఈ పురాణంలో వివరించడమయింది.

ప్రతిపురాణంలోనూ తత్త్వాన్నీ, నీతినీ, ధర్మాన్నీ బోధించే కథలు ఉంటాయి. ఈ పురాణంలోని కథలలో 'కండు' మహర్షి కథ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది. అతని తపస్సుకు భంగం కల్గించడానికి దేవతలు పంపిన అప్సరస ప్రమ్లోచ దాదాపు 900 సంవత్సరాలు అతనితో విహరించి అతని నియమానికి భంగం కల్గిస్తుంది.

చివరికి తన పొరబాటు గుర్తించిన మహర్షి పురుషోత్తమక్షేత్రమనే పూరీజగన్నాథక్షేత్రానికి వెళ్ళి శ్రీ జగన్నాథుని సేవించి ముక్తుడవుతాడు.

తరువాతి కథలలో కార్తవీర్యార్జునుని వృత్తాంతం ప్రముఖమైనది. ఇది మిక్కిలి విస్తృతమైన చరిత్ర. దత్తాత్రేయుని అనుగ్రహంతో సహస్రబాహువులు కల్గి శిష్టరక్షణ కావిస్తూ రావణాదులను జయించి ధర్మబద్ధంగా రాజ్యపాలన గావించిన ఈ రాజు చివరికి తనకంటే బలవంతుడైన పరశురామునిచే వీరమరణం పొందుతాడు. ఏడువందల యాగాలు నిర్వహించినవాడుగా ఈతడు ప్రసిద్ధుడయ్యాడు. విష్ణుతత్త్వం బోధించే పలు విషయాలు ఇంకా ఎన్నో ఈ పురాణంలో గోచరిస్తాయి.

ఇదం యః శ్రద్ధయా నిత్యం పురాణం వేదసమ్మితమ్ ।
యః పఠేచ్ఛృణుయాన్మర్త్యః స యాతి భువనం హరేః ॥

వేదతుల్యమైన ఈ పురాణాన్ని శ్రద్ధతో చదివినవాడు, లేక విన్నవాడు హరినిలయమైన వైకుంఠం చేరుకుంటాడని ఫలశ్రుతి.

2. పద్మపురాణం

మహావిష్ణువుయొక్క హృదయస్థానంతో పోల్చబడిన పురాణమిది. సృష్టి ప్రక్రియ ఆ దేవుని నాభికమలంనుండి జన్మించిన బ్రహ్మద్వారా మొదలయింది. ఆ ప్రక్రియయే ఈ పురాణాని కాధారం. కాన ఇది 'పద్మపురాణ' మనబడింది. ఇందులో 55,000 శ్లోకాలున్నాయి.

సృష్టిఖండం, భూఖండం, స్వర్గఖండం, పాతాళఖండం, ఉత్తరఖండం – అని ఐదు ఖండాలుగా విభజింప బడిన ఇందులో మొత్తం 641 అధ్యాయాలున్నాయి.

కాలపరిమాణం, క్షీరసాగరమథనం, దక్షయాగధ్వంసం, చంద్రవంశం, వామనావతారం, తారకాసుర వృత్తాంతం, నృసింహావతారం, సదాచారం – ఇత్యాదిగా పలువిషయాలను ఈ పురాణం వివరిస్తున్నది.

శరీరవర్ణనం, ఆత్మస్వరూపం, విష్ణుభక్తి మహిమ, కార్తికమాస ప్రాశస్త్యం, దీపావళీమాహాత్మ్యం పూజావిధానాలు, యుగధర్మాలు మున్నగు విషయాలను విపులంగా ఇందులో చూడవచ్చు.

ప్రపంచమంతా శ్రీహరిమయమే అని ఈ పురాణం ఘోషిస్తున్నది. ఇందులో పేర్కొన్న సదాచారాలు అవశ్యం ఆచరింపదగివున్నాయి.

తల్లిదండ్రుల విశిష్టతను ప్రశంసించి **"మాతరం పితరం తస్మాత్సర్వయత్నేన పూజయేత్" –**సకల ప్రయత్నాలతోనూ తల్లిదండ్రుల నర్చించాలి అని ఈ పురాణం బోధించింది. ఇది **'మాతృదేవో భవ, పితృదేవో భవ'** అన్న శ్రుతివచనానికి వివరణగా ఉన్నది.

ఇంకా ఉసిరికాయకు గల పవిత్రత, దాన్ని సేవించే విధానం విపులంగా ఇందులో పేర్కొనబడింది. అట్లే తులసికి గల ప్రాశస్త్యం కీర్తించబడింది.

పురాణపఠనావశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనం, కలియుగధర్మాలు, ఆ యుగంలో స్త్రీపురుషుల స్వభావాలు, జనుల విపరీతప్రవృత్తులు విశదంగా ఇందులో నిరూపింపబడియుండడం గమనార్హం.

కలియుగంలో ధర్మాత్మకమైన కర్మను మనుజుడు భక్తితో భగవదర్పితంగా ఆచరిస్తే సర్వపాపనిర్ముక్తుడవుతాడని ఈ పురాణం ప్రతిపాదించింది. ఇలా ఏ పురాణాన్ని పరిశీలించినా నానావిధములైన, ఆత్మోన్నతిహేతువులైన, మానవజీవితాని కవసరములైన పెక్కు విషయాలు విశదీకరింపబడివున్నాయి.

ఈ పద్మపురాణాన్ని చదివేవారికి, వినేవారికి కోరిన కోర్కెలన్నీ శ్రియఃపతి అనుగ్రహం వల్ల సిద్ధిస్తాయని ఫలశ్రుతి.

యద్యదిష్టం పఠంత్యేతత్ శృణ్వంతి చ ముముక్షవః ।
లభన్తే తత్తదేవాశు ప్రసాదాత్కమలాపతేః ॥

3. విష్ణుపురాణం

శ్రీ మహావిష్ణువు యొక్క దక్షిణబాహువుగా విష్ణుపురాణం వర్ణించబడింది. ఆరు అంశాలుగా విభజింపబడిన ఈ పురాణంలో 126 అధ్యాయాలున్నాయి. విష్ణు ధర్మోత్తరంతోగూడ కలుపుకొంటే ఇందలి మొత్తం శ్లోకాలు 23,000. పరాశరమహార్షి మైత్రేయునకు జెప్పిన పురాణ మిది.

ఇరవైనాలుగు తత్త్వాలు, జగదావిర్భావం, కాలస్వరూపం, వరాహావతారం, భూవిభజన, సనకాదుల జననం, స్వాయంభువమనువు పుట్టుక, దక్షపుత్రికల వివాహం, ధ్రువచరిత్ర, నృసింహావతారం, భరతవంశవర్ణన, జడభరతోపాఖ్యానం–ఇత్యాదిగా అనేకాంశాలు ఈ పురాణంలో విశదీకరింపబడ్డాయి.

మరియు బ్రహ్మజ్ఞాన ప్రాశస్త్యం, వేదవిభాగం, బ్రహ్మచర్యాద్యాశ్రమాలు, దేవాసురుల యుద్ధం, సగరవంశవర్ణన, శ్రీకృష్ణావతారం, కలి లక్షణాలు, నామసంకీర్తనప్రభావం మొదలైన విషయాలు గూడ విపులంగా ఇందులో నిరూపించడమైనది.

వైష్ణవులకు మిక్కిలిగా ఆరాధనీయమైన పురాణమిది. వైష్ణవసిద్ధాంతాలకు మూలభూతమైన గ్రంథం గాన శ్రీభగవద్రామానుజాచార్యులు ఆ సిద్ధాంతప్రచారాన్ని ఈ పురాణాన్ని ఆధారంగా స్వీకరించి నిర్వర్తించారు.

శరణాగతి, భగవద్గుణకర్మనామాల గానం, విష్ణ్వర్పణంగా కర్మల ననుష్ఠించడం మొదలగు అంశాలకు ఈ పురాణంలో ప్రాముఖ్యం ఇవ్వడమయింది.

మరియు శ్రవణం, కీర్తనం మున్నగు నవవిధభక్తి మార్గాలు ఇందులో విస్తృతంగా ప్రతిపాదింపబడి వున్నాయి. భాగవతపురాణం లాగా ఈ పురాణం గూడా భక్తియోగానికి ప్రాధాన్యాన్ని ప్రతిపాదించింది.

దేవతలను ఆరాధించేవారిలో అనేకులు శివకేశవులలో భేదాన్ని చూస్తారు. అయితే ఈ పురాణంలో–

"అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః ।
వదంతి భేదం పశ్యన్తి చావయోరన్తరం హర!" ॥

'అవిద్యామోహితులే నీకూ, నాకు భేదం పాటిస్తారు' అని కేశవుడు శివునితో చెప్పాడు. ఈ శివకేశవాభేద సిద్ధాంతం ఇక్కడ గమనార్హం.

ఈ పురాణంలో జడభరతుని వృత్తాంతం మిక్కిలి ఆసక్తిని రేకెత్తించేదిగా వర్ణితమై వున్నది. ఆతని మూడు జన్మలకు సంబంధించిన విశేషాలు గ్రహిస్తే మనలో జ్ఞానవిజ్ఞానాలు వికసిస్తాయి.

యో నరః పఠతే భక్త్యా యః శృణోతి చ సాదరమ్ ।
తావుభౌ విష్ణులోకం హి వ్రజేతాం భుక్తభోగకౌ ॥

అన్నట్లు – భక్తితో దీన్ని పఠించేవాడు, ఆదరంతో వినేవాడూ ఈ లోకంలో భోగాలనుభవించి తుదకు విష్ణుసాన్నిధ్యం చేరగలరని ఫలశ్రుతి.

4. వాయుపురాణం

వాయుదేవుడు శివలీలలను వివరించిన పురాణమిది. అందుచేత దీన్ని 'శివపురాణ' మని కూడా పేర్కొంటారు. **'చతుర్వింశతి సాహస్రం పురాణం'** –అనుటవల్ల ఇందులో 24,000 శ్లోకాలున్నాయని గ్రహించాలి. కాని ఇపుడు మనకు లభించేవి 11,000 శ్లోకాలు మాత్రమే. శ్లోకసంఖ్యలలో ఇట్టి వ్యత్యాసాలు కొన్ని పురాణాలలో కనిపిస్తున్నాయి. ఈ పురాణం మహావిష్ణువుయొక్క వామభుజంగా పేర్కొనబడింది.

ఇందులో (1) ప్రక్రియాపాదం (2) అనుషంగ పాదం (3) ఉపోద్ఘాత పాదం (4) ఉపసంహార పాదం–అని నాలుగు పాదాలున్నాయి.

భూగోళ–ఖగోళాలు, బ్రహ్మాండసృష్టి, యుగధర్మాలు మున్నగు విషయాలతోపాటు కైలాసవర్ణన, గంగావతరణవర్ణన మొదలగు వర్ణనలు గూడా ఇందు గోచరిస్తాయి.

ఇది శైవపురాణం. అయినా సందర్భానుగుణంగా మహావిష్ణువు గూడా ఇందు వర్ణింపబడినాడు.

వివేకవిజ్ఞానాలు కావాలంటే తప్పకుండా పురాణాల అధ్యయనం చేయాలని ఈ పురాణం చెబుతున్నది.

యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో నరః ।
న చేత్పురాణం సంవిద్యాన్నైవ స స్యాద్విచక్షణః ॥

నాల్గువేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు చదివినా పురాణం చదువనివాడు విచక్షణుడు కాలేడని భావం. కాబట్టి పురాణాధ్యయనం ఎంత ముఖ్యమైనదో గ్రహించాలి.

ఈనాడు మనం యోగాభ్యాసాని కెంతో ప్రాముఖ్యం ఇస్తున్నాము. వాయుపురాణంలో యోగాని కవసరమైన ప్రాణాయామాన్ని గూర్చి విపులమైన వివరణ ఉన్నది. బ్రహ్మప్రాప్తికది అవసరం. శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదం–అనే నాల్గు ప్రయోజనాలు దానివల్ల కల్గుతాయని ఈ పురాణం చెబుతున్నది.

ఓంకారోపాసన గూడా ఇందులో చెప్పడమయింది. ఓంకారధ్యానపరులకు శివసాయుజ్యం కల్గుతుందని ఇందులో నిరూపించబడివున్నది.

'రమణకం' అనే దేశంలోని ప్రజలు పదివేల సంవత్సరాలు, 'హిరణ్యకం' లోనివారు పదకొండు వేల సంవత్సరాలు జీవిస్తారంటూ అక్కడి ప్రకృతివిశిష్టతను ఇక్కడ చెప్పడమయింది.

అక్కడి చెట్లు ఫలాలతోపాటు వస్త్రాలనూ, ఆభరణాలను గూడా ప్రసాదిస్తాయని చెప్పడం ఆశ్చర్యావహంగా ఉన్నది. కథాకథనంకంటే ఇట్టి వర్ణనలే ఈ గ్రంథంలో ఎక్కువగా గోచరిస్తాయి.

గయాక్షేత్రప్రాముఖ్యం గూడా ఇందు చెప్పడమయింది. గయను సందర్శించిన పుత్రుడు పితరులకు రక్షకుడనీ, అతణ్ణి చూచి పితరులు హర్షిస్తారనీ ఇక్కడ పేర్కొనబడింది.

ఈ పురాణకీర్తనం శ్రవణం,ధారణ–కీర్తినీ, పూర్ణాయువునూ, పాపనాశాన్నీ కల్గిస్తాయని ఫలశ్రుతి.

ధన్యం యశస్యమాయుష్యం పుణ్యం పాపప్రణాశనమ్ ।
కీర్తనం శ్రవణం చాస్య ధారణం చ విశేషతః ॥

5. శ్రీమద్భాగవతం

శ్రీమహావిష్ణుని ఊరువుగా వర్ణించబడిన శ్రీమద్భాగవతంలో పంద్రెండు స్కంధాలు, 18,000 శ్లోకాలున్నాయి. ఇది భక్తియోగ ప్రాముఖ్యాన్ని కథలతో, ఉపకథలతో వివరించే పురాణం.

'నిగమకల్పతరోర్గళితం ఫలం'-అన్నట్లు వేదమనే కల్పవృక్షంనుండి జారిపడిన పండుగా దీన్ని కీర్తించడమయింది. భక్తితోపాటు జ్ఞానవైరాగ్యాలు గూడా ఇందు నిర్దేశించబడి వున్నాయి.

వేదాలను విభజించిన వ్యాసుడు ధర్మనిరూపకమైన ఒక లక్షశ్లోకాలతో గూడిన మహాభారతం రచించాడు. అయినా మనశ్శాంతి లేక, చింతాక్రాంతు డయ్యాడు. నారదుడాయన చెంతకు వచ్చి 'నీచింతకు కారణ మేమి?' అని ప్రశ్నించాడు! 'అదేదో నీవే చెప్పు' అని వ్యాసుడన్నాడు.

అపుడు నారదమహర్షి ఊరక ధర్మాలు చెప్పితే చాలదు, విష్ణుకథాప్రధానమైన గ్రంథం రచిస్తే కానీ నీకు మనశ్శాంతి లభించదంటాడు. ఆయన చెప్పినట్లు వ్యాసభగవానుడు భగవంతుని గుణకర్మనామాలను కీర్తించే విష్ణుకథలను వర్ణిస్తూ భాగవతం రచించాడు, మనశ్శాంతి పొందాడు. భాగవత రచనకు చెందిన వృత్తాంతమిది.

దీని కథాప్రారంభమిది-పాండవవంశంలో జన్మించిన పరీక్షిత్తు వేటకు వెళ్ళి అలసిపోయి తపోనిమగ్నుడైన శమీక మహర్షిని నీళ్ళిమ్మంటాడు. నిర్వికల్పధ్యానంలో ఉన్న ఆ ముని కతనిమాట వినిపించదు. కోపించిన రాజు అతని మెడలో సర్పశవాన్ని వేసి శృంగిశాపానికి గురి అవుతాడు. వారం దినాలలో మరణించవలసిన దుఃస్థితి పాలవుతాడు.

అంతట రాజకార్యాలు త్యజించి ప్రాయోపవిష్టుడై ఏడు దినాలలో ముక్తి పొందే ఉపాయమేమి? అని విచారిస్తాడు. అపుడు శుకుడు వచ్చి అందుకు ఉపాయం భాగవతశ్రవణమే అని చెప్పి భాగవతప్రవచనం కావిస్తాడు.

ఇందులో ధ్రువుడు, జడభరతుడు, అజామిళుడు, దధీచి, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, అంబరీషుడు, రంతిదేవుడు మున్నగు భాగవతుల కథలు మనోజ్ఞంగా వివరింపబడివున్నాయి. ఆ కథల ద్వారా విజ్ఞానవైరాగ్యభక్తివిశేషాలు నిరూపితాలయ్యాయి.

దశమస్కంధం ఇందులో అతిముఖ్యమైనది. శ్రీకృష్ణావతారప్రతిపాదకమైన ఇందులో శ్రీకృష్ణుని లీలలు, ఆయన కావించిన కంసాదుల సంహారం, రుక్మిణీ కల్యాణం, కుచేలాదుల ఉద్ధరణ-ఇత్యాదిగా పలు అంశాలు రసవత్తరంగా చిత్రించబడినాయి.

ముఖ్యంగా గోపికలు కృష్ణుణ్ణి ప్రేమించిన ఘట్టం మనోహరంగా ఉన్నది. మధురభక్తితత్త్వం ఇందులో ప్రతిపాదితమయింది.

పదకొండవ స్కంధంలోని ఉద్ధవగీత ప్రశస్తం. శ్రీకృష్ణుడు అవసానదశలో గావించిన ఆధ్యాత్మిక ప్రబోధమిది. చివరి స్కంధంలో కలిస్వరూపం నిరూపించబడింది. మార్కండేయ చరిత్రను గూడా ఇందులో చూడవచ్చు.

'విద్యావతాం భాగవతే పరీక్షా' అన్నట్లు విద్యావంతుల జ్ఞానవిజ్ఞానాలను భాగవతం ద్వారా పరీక్షించవచ్చు. భగవన్నామసంకీర్తనం సర్వపాపప్రణాశకమని భాగవతం చెప్పింది. భారతావనిలో జన్మించి గూడా భాగవతం విననివారు ఆత్మఘాతకులని పేర్కొనబడ్డారు.

భారతే మానవం జన్మ ప్రాప్య భాగవతం న యైః ।
శ్రుతం పాపపరాధీనైరాత్మఘాతస్తు తైః కృతః ॥

భాగవత శ్రవణ ఫలం ఈ క్రిందిశ్లోకంలో ఇలా పేర్కొనబడింది.

మత్కథావాచనే నిత్యం మత్కథాశ్రవణే రతమ్ ।
మత్కథాప్రీతమనసం నాహం త్యక్ష్యామి తం నరమ్ ॥

'నాకథలు పఠించేవాడు, వినేవాడు, నాకథలచే సంతోషించేవాడు అయిన జనుణ్ణి నేను వదలను' అని శ్రీకృష్ణుడు చెప్పాడు.

6. నారదపురాణం

మహావిష్ణువుయొక్క నాభిస్థానంగా కీర్తింపబడిన పురాణమిది. నారదుడు ఉపదేశించినది కావడం వల్ల 'నారద పురాణం' అనే పేరు దీనికి స్థిరపడింది. ఇందులో ఇరువదియైదువేల శ్లోకాలున్నాయి.

పూర్వఖండం, ఉత్తరఖండం అని ఈ పురాణం రెండు ఖండాలుగా విభక్తమై యున్నది. పూర్వఖండంలో 125, ఉత్తరఖండంలో 82 అధ్యాయాలు ఉన్నాయి.

పురాణాల ప్రశస్తి. శివకేశవుల అభేదం, భక్తికి గల ప్రాముఖ్యం, సదాచార ప్రాశస్త్యం, పౌరాణికుల గురుత్వం-ఇత్యాదులు ఇందులో చక్కగా కీర్తితాలయ్యాయి.

సత్యహరిశ్చంద్రుని గాథ ఇందులో ఉన్నది. అట్లే శ్రీకృష్ణుని ప్రభావం చక్కగా పేర్కొనబడివున్నది. బ్రహ్మాండోత్పత్తి ఎలా జరిగిందో ఇందులో చూడవచ్చు.

విష్ణుభక్తికి గల ప్రాముఖ్యాన్ని వర్ణించే ఈ పురాణంలోని క్రిందిశ్లోకం గమనార్హమై యున్నది-

లోకే స ధన్యః స శుచి స్స విద్వాన్ స ఏవ వక్తా స చ ధర్మశీలః ।
జ్ఞాతా స దాతా స చ సత్యవక్తా యస్యాస్తి భక్తిః పురుషోత్తమాఖ్యే ॥

పురుషోత్తమునిపై భక్తి గలవాడే లోకంలో ధన్యుడు, శుచి, విద్వాంసుడు, ధర్మశీలుడు, జ్ఞాత, దాత, సత్యవక్త అని భావం. భక్తిలేనివాని గుణాలు విలువలేనివని తాత్పర్యం.

ఒక్క భక్తినే కాక తీర్థయాత్రలో సేవించవలసిన తీర్థాల ప్రాశస్త్యాన్ని గూడా ఈ పురాణం విశదీకరించింది. అయోధ్య, మథుర, మాయ, కాశి, కంచి, అవంతిక, ద్వారక-ఈ ఏడు నగరాలు మోక్షప్రదాలని ఈ పురాణం ఉద్ఘాటించింది.

రాజధర్మాలను గూడా ఈ పురాణం వివరించింది. ప్రజారక్షణ, శత్రుసంహారం, న్యాయబద్ధంగా పన్నులు వసూలు చేయడం, గోరక్షణ, అన్న-వస్త్ర గృహాలు అనే కనీసపు సౌకర్యాలను ప్రజలకు కల్గించడం, మద్యనిషేధం-మున్నగు రాజుల కర్తవ్యాలు గూడా ఇందులో నిర్దేశింపబడివున్నాయి.

పరులపై దౌర్జన్యం, వారిని హింసించడం మున్నగు పది పాపాలు పరిహరణీయాలు. వాటి వినాశానికే, 'దశహరా' అని పేరు. దానికి ప్రతీకగానే నేటికీ 'దశరా' పండుగ జరుపుకొంటున్నాము.

భర్తృహరిసుభాషితంవంటి గ్రంథాలలో మనం ఎన్నో సుభాషితాలు చదువుతుంటాం. వాటిని పోలిన పలు సుభాషితాలను మనం ఈ నారదపురాణంలో గూడా చూడవచ్చు.

యః శృణోతి నరో భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।
స యాతి బ్రహ్మణో ధామ నాత్ర కార్యా విచారణా ॥

అని ఫలశ్రుతి. ఎవడు భక్తితో ఈ పురాణాన్ని వింటాడో, లేదా వినిపిస్తాడో, అతడు బ్రహ్మలోకం చేరుతాడు. ఇందుకు సందేహం లేదు.

7. మార్కండేయ పురాణం

మునులు తమ సందేహాలను మార్కండేయ మహర్షికి తెల్పగా ఆయన వారి సంశయాలు తొలగిస్తూ చెప్పిన పురాణమిది. విష్ణు భగవానుని దక్షిణపాదంగా ఇది కీర్తింపబడింది. ఇందులో 134 అధ్యాయాలు, తొమ్మిదివేల శ్లోకాలు ఉన్నాయి.

బలరాముని తీర్థయాత్రలు, హరిశ్చంద్రుని వృత్తాంతం, పతివ్రతాస్త్రీల ప్రభావం, కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుని అనుగ్రహం పొందడం, రాజధర్మాలు, యోగశాస్త్రవిషయాలు, ఓంకారనిరూపణ, బ్రహ్మాండోత్పత్తి, దేవీమాహాత్మ్యం, సూర్యవంశవర్ణన ఇత్యాదిగా గల వివిధ విషయాలు ఈ పురాణంలో నిరూపించడమయింది.

దుర్గాదేవి జనుల ననుగ్రహించి వారి కోర్కెలు తీర్చే దేవత. ఆ దేవిని ఆరాధించడంలో సప్తశతీపారాయణం ముఖ్యకర్తవ్యం. ఆ సప్తశతి ఈ పురాణంలోని భాగమే. దేవీనవరాత్ర్యుత్సవాలలో సప్తశతిని పారాయణం చేస్తారు.

మహిళామణులలో కొందరు మహాయోగిను లున్నారు. వారిలో మదాలసాదేవి ఒకరు. ఈమెకు సంబంధించిన అద్భుతమైన చరిత్ర ఈ పురాణంలో అతి విపులంగానూ, రమణీయంగానూ నిరూపింపబడివున్నది.

ఋతధ్వజుడనే రాజుయొక్క ధర్మపత్ని మదాలస. ఈమెకు విక్రాంతుడు, సుబాహుడు, అరిమర్దనుడు, అలర్కుడు–అని నల్గురు కుమారులు. ఆమె ఉగ్గుబాలతోపాటు మొదటి ముగ్గురికీ బ్రహ్మవిద్యను గూడా బోధించింది. వారు అధ్యాత్మవిద్యలో ఆరితేరి సంసారవిరక్తులవుతారు. ఋతధ్వజుడు నాల్గవ కుమారుణ్ణి తల్లి వద్ద అధ్యాత్మవిద్యనభ్యసింపనీకుండా లౌకికవిద్యలు బోధించే ఏర్పాటు చేస్తాడు. అవసానదశలో ఆమె అతణ్ణి కూడా సత్సంగప్రభావముతో తత్త్వవేత్తగా రూపొందేటట్లు చేస్తుంది. ఇది ఆ కథా సంగ్రహ సారాంశం.

విష్ణువుయొక్క నాల్గు రూపాలు వాసుదేవ–శేష–ప్రద్యుమ్న–అనిరుద్ధములని ప్రసిద్ధాలు. వీటికి సంబంధించిన వివరణ కూడా ఈ పురాణంలో వస్తుంది.

ఇక ధర్మపక్షులుగా ప్రసిద్ధి వహించిన పక్షుల వృత్తాంతం గూడా మార్కండేయపురాణంలో పేర్కొనబడివున్నది. జైమినిమహర్షి తనకు గల్గిన సంశయాల నన్నింటినీ ఈ పక్షులద్వారానే తొలగించుకొంటాడు.

ఈ పురాణం పుత్రులను మూడురకాలుగా విభజించింది. తండ్రినుండి సంక్రమించిన కీర్తినీ, ధనాన్నీ పెంపొందించేవాడు ఉత్తముడు, పెంపొందించకున్నా పోగొట్టకుండా ఉండేవాడు మధ్యముడు, పోగొట్టుకొనేవాడు అధముడు. ఎంతో చక్కని ప్రబోధమిది.

తండ్రిపేరు చెప్పుకొని కాలం గడపువాడు వ్యర్థజన్ముడు. తండ్రికి కీర్తి తెచ్చేవాడు ఉత్తముడు ఇలాంటి విషయాలు యుక్తియుక్తంగా ఆసక్తిజనకంగా ఇందులో వివరించబడివున్నాయి.

శ్రుత్వా తత్పూజయేద్యస్తు పురాణం సప్తమం పునః ।
సర్వపాపవినిర్ముక్తః పునాత్యేవ నిజం కులమ్ ॥

అని ఫలశ్రుతి. ఇది విని దీనిని పూజించేవాడు సకలపాపవిముక్తుడై తన కులాన్ని పావనం చేస్తాడు.

8. అగ్నిపురాణం

అగ్నిదేవుడు వసిష్ఠమహర్షికి ఉపదేశించినదే అగ్నిపురాణం. ఇది విష్ణుదేవుని ఎడమపాదంగా వర్ణింపబడింది. ఇందులో 383 అధ్యాయాలు, 15,400 శ్లోకాలు ఉన్నాయి.

దశావతారాలు ఇందులో వర్ణింపబడ్డాయి. మరియు రామాయణ మహాభారతాలలోని కొన్ని ఘట్టాలు ఇందులో కనిపిస్తాయి.

దేవాలయ నిర్మాణం, సాలగ్రామలక్షణాలు, సూర్యపూజ, శివపూజ, వాస్తుపూజ, చతురాశ్రమధర్మాలు ఈ పురాణంలో పేర్కొనబడివున్నాయి. పలురకాల వ్రతాలు, రాజధర్మాలు, స్వప్న ఫలితాలు, స్త్రీ పురుష లక్షణాలు, ఆయుర్వేద విషయాలు, అద్వైతవేదాంతతత్త్వం ఇత్యాదిగా గల పలువిషయాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

కూర్మావతారవర్ణన సందర్భంలో విష్ణువు దేవతలకు ఎలా ఉపకరించాడో ఇక్కడ మనోజ్ఞంగా చెప్పడమయింది.

ఇక రామాయణ ఘట్టాలలో సుగ్రీవుడు సీతాన్వేషణ విషయంలో అశ్రద్ధ చూపినప్పుడు రాముడతనికి పంపిన తీక్ష్ణపదజాలంతో కూడిన సందేశం పాఠకులలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. రామాయణంలో సీతాపహరణకు రావణుడు మారీచుణ్ణి ప్రేరేపించినప్పుడు మారీచుడు చెప్పిన ఈ క్రిందిశ్లోకం గమనార్హం.

రావణాదపి మర్తవ్యం మర్తవ్యం రాఘవాదపి ।
అవశ్యం యది మర్తవ్యం వరం రామాన్న రావణాత్ ॥

"రావణుని ఆజ్ఞ పాటించకుంటే అతనినుండి చావు తప్పదు. పాటిస్తే రామునిచేత మరణం తప్పదు. రావణునికన్న రామునిచేత మరణించడమే మేలు" అని భావం. ఇలా రామాయణభారతాదులలోని కొన్ని ఘట్టాలు ఈ పురాణాల్లో కనిపిస్తాయి.

భగవంతు డనే పదానికి ఈ క్రింది శ్లోకంలో ఇచ్చిన నిర్వచనం అర్థవంతంగా ఉంది.

ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానామాగతిం గతిమ్ ।
వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి ॥

సృష్టిస్థితిలయాలు, జీవుల జననమరణాలు, విద్యా విద్యల స్వరూపం సమగ్రంగా ఎరిగినవాడే భగవంతుడు.

ఇక దేవాలయ నిర్మాణానికి చెందిన విశేషాలు కూడా ఈ పురాణంలో లభిస్తున్నాయి. ఆలయనిర్మాణం వల్ల బ్రహ్మహత్యాది దోషాలు కూడా తొలగిపోతాయని చెప్పడం విశేషం.

ఈ పురాణంలో కథలకు అంతగా ప్రాముఖ్యం లేదు కాని విద్యలు, పదార్థ లక్షణాలు, శుభాశుభస్వప్నాలు, శకునాలు, ఇవి మొదలుగాగల అనేక విషయాలు నిరూపింపబడి వున్నాయి. వివిధ శాస్త్రాలకు చెందిన విషయాలు ఇందులో ఉండడం వల్ల ఇదొక విశిష్టమైన పురాణంగా ప్రశంసింపబడుతున్నది. దీని ఫలశ్రుతి యిది–

'ఆగ్నేయం పఠితం ధ్యాతం శుభం స్యాద్భుక్తిముక్తిదమ్'

ఈ ఆగ్నేయ పురాణాన్ని చదివినా, ధ్యానించినా భుక్తిముక్తులు చేకూరుతాయని, శుభం కలుగుతుందని చెప్పడమయినది.

9. భవిష్యపురాణం

విష్ణుదేవుని కుడిమోకాలితో పోల్చబడిన ఈ పురాణంలో 14,500 శ్లోకాలున్నాయి. ఇందలి అధ్యాయాల సంఖ్య 585.

సృష్టివివరణ, పురాణాల ఉత్పత్తి, షోడశసంస్కారాలు. సావిత్రీమాహాత్మ్యం, స్త్రీలక్షణాలు, వివిధ వ్రతాలు ఇందులో వివరించడమయినది. రథసప్తమీ మాహాత్మ్యం, సూర్యుని ప్రభావం, ప్రతిమాలక్షణాలు, ధర్మస్వరూపం, జీమూతవాహనాదుల చరిత్రలు, అన్నదానప్రశస్తి మున్నగు విషయాలు అతివిస్తృతంగా ఇందులో వర్ణించడం జరిగింది.

భర్తపట్ల భార్య, భార్యపట్ల భర్త ప్రవర్తించవలసిన తీరుతెన్నులు చక్కగా ప్రతిపాదింపబడినాయి. సూర్యప్రభావవర్ణనా సందర్భంలో రాజు, దొంగలు, గ్రహాలు, పాములు, పేదరికం, దుఃఖాలు–ఇవేవీ సూర్యానుగ్రహం పొందిన వారిని బాధించవు అని చెప్పడం విశేషం.

ఇక జీవితంలో అతిముఖ్యమైన వివాహాన్ని గురించి వివరిస్తూ సమస్థాయిగలవారిలో జరిగే వివాహాలు శుభకరాలని, తదితరవివాహాలు దుఃఖదాయకాలని ఈ పురాణం చెప్పింది. స్మృతులలో పేర్కొనబడిన వివిధ వివాహభేదాలు ఇందులో ప్రతిపాదింపబడివున్నాయి. సామాజిక జీవితంలో అత్యావశ్యకాలైన వివాహాది విషయాలను ఈ పురాణంలో ప్రతిపాదించడంవల్ల సంఘశ్రేయస్సుపట్ల పురాణకర్తకు కల అభినివేశమెట్టిదో వ్యక్తమవుతున్నది.

అన్నదాన ప్రాశస్త్యాన్ని పేర్కొంటూ–

"అన్నం వై ప్రాణినాం ప్రాణా అన్నమోజో బలం సుఖమ్ ।
ఏతస్మాత్కారణాత్సద్భిరన్నదః ప్రాణదః స్మృతః ॥

ప్రాణులకు అన్నమే ప్రాణం. అన్నమే ఓజస్సు, బలం, సుఖం. అందుచేత అన్నదాత ప్రాణదాతగా పేర్కొనబడినాడు. ఈ పురాణంలో మరొక విశేషం విక్రమాదిత్యుడికీ, బేతాళునికీ సంబంధించిన కథలు. ఈ కథలు మిక్కిలి లోకప్రసిద్ధి వహించాయి. కథలలో జీవితంలో ఎదురయ్యే గడ్డు సమస్యలను పరిష్కరించే నైతికసూత్రాలు మనోజ్ఞంగా నిరూపింపబడివున్నాయి.

ఈ పురాణానికి ఫలశ్రుతిని వివరిస్తూ గ్రంథకర్త ఇలా అన్నాడు-

యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే మానవో నృప! ।
అశ్వమేధఫలం ప్రాప్య గచ్ఛేద్భానుం న సంశయః ॥

ఈ పురాణం వింటే సకలపాపవిముక్తి చేకూరుతుంది. అశ్వమేధయాగ ఫలం లభిస్తుంది. చివరికి సూర్య సాయుజ్యప్రాప్తి కలుగుతుంది.

10. బ్రహ్మవైవర్తపురాణం

సావర్ణిమనువు నారదమునీంద్రునికి చెప్పిన పురాణమిది. ఇందులో వరాహమూర్తికి, శ్రీకృష్ణునికి సంబంధించిన విషయాలు ప్రధానంగా ప్రతిపాదించబడివున్నాయి. ఈ పురాణం శ్రీమహావిష్ణువుయొక్క ఎడమ మోకాలుగా కీర్తింపబడింది.

బ్రహ్మఖండం, ప్రకృతిఖండం, గణేశఖండం, శ్రీకృష్ణఖండమని నాలుగు ఖండాలుగా ఇది విభజింపబడివున్నది. అన్ని ఖండాలలోను కలిపి మొత్తం 18,000వేల శ్లోకాలున్నాయి. **'సారభూతం పురాణేషు బ్రహ్మవైవర్తముచ్యతే'** అన్నట్లు ఈ పురాణం పురాణా లన్నింటికీ సారభూతమైనదిగా ప్రశస్తి పొందింది.

బ్రహ్మఖండంలో పరబ్రహ్మవర్ణన చేయబడింది. ప్రకృతిఖండంలో దుర్గాదేవి మున్నగు స్వరూపాలతో ప్రకృతి ఆవిర్భవించడం నిర్దేశించబడింది. గణేశఖండంలో వినాయక చరిత్ర నిబద్ధమైనది. శ్రీకృష్ణఖండంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపన మొదలగు అంశాలు పేర్కొనబడ్డాయి.

అతిథిని పూజించవలసిన అవశ్యకతను వివరిస్తూ ఈ పురాణం చెప్పిన విషయమిది-

అపూజితోఽతిథిర్యస్య భవనాద్వినివర్తతే ।
పితృదేవాగ్నయః పశ్చాద్గురవో యాన్త్యపూజితాః ॥

ఏ గృహస్థుని యింట అతిథి ఆదరింపబడడో ఆ యింటినుండి పితరులు, దేవతలు, అగ్నిదేవుడు, గురువులు పూజలను తిరస్కరించి వెళ్ళిపోతారని భావం.

ఇక జన్మకారణమైన తండ్రితోపాటు విద్యాదాత, అన్నదాత, భయమునుంచి కాపాడినవాడు, కన్యాదాత- ఈ నలుగురు కూడ తండ్రులుగానే పేర్కొనబడ్డారు. అట్లే సేవకుడు, శిష్యుడు, పోషితుడు, ఔరసుడు, శరణాగతుడు- ఈ ఐదుగురు పుత్రులుగానే పరిగణింపదగి ఉన్నారు.

ఈ గ్రంథంలో మొదటి పురుషార్థమైన ధర్మముయొక్క ప్రాశస్త్యం ఈ క్రిందివిధంగా ఉగ్గడింపబడింది-

నాస్తి ధర్మాత్పరో బన్ధుర్నాస్తి ధర్మాత్పరం ధనమ్ ।
ధర్మాత్ప్రియతరః కో వా స్వధర్మం రక్ష యత్నతః ॥

"ధర్మంకంటే శ్రేష్ఠుడైన బంధువు లేడు. మేలైన ధనం లేదు. ధర్మంకంటే ప్రియతరమైన దేదీ లేదు. కాన ప్రయత్నంతో ధర్మాన్ని రక్షించాలి." అని భావం. అట్లే మరొక చోట గురువులో సకలదేవతలూ ఉన్నారని గురుమహిమ ప్రశంసింప బడినది.

పై విషయాలతోపాటు భగవంతుని స్వరూపం, సరస్వతీపూజ, భూదానప్రాశస్త్యం, గంగావతరణం, సంక్షిప్త రామాయణం, తులసీమాహాత్మ్యం, దుర్గోపాఖ్యానం మొదలైన విషయాలు కూడా ఈ పురాణంలో వివరింపబడి వున్నాయి.

ఈ గ్రంథంలో పేర్కొన్న కథలలో ముఖ్యంగా పేర్కొనదగినది వేదవతీ చరిత్ర. కృతయుగంలో వేదవతిగా, త్రేతాయుగంలో సీతగా, ద్వాపరయుగంలో ద్రౌపదిగా వేదవతిని పురాణం వర్ణించింది. తదుపరి పురాణాల కథలలో ఈ వేదవతియే పద్మావతిగా అవతరించి విష్ణుని రూపాంతరమైన వేంకటేశ్వరుణ్ణి చేపట్టినట్లు చెప్పడమయినది.

కశ్యపమహర్షిమానసపుత్రిక జరత్కారువుయొక్క స్తుతి కూడా ఈ పురాణంలోనే లభిస్తున్నది.

శుభదం పుణ్యదం చైవ విఘ్ననిఘ్నకరం పరమ్ ।
హరిదాస్యప్రదం చైవ పరలోకే ప్రహర్షదమ్ ॥

ఇత్యాదిగా ఈ పురాణ పఠనం శుభాన్నీ, పుణ్యాన్నీ, విఘ్నవినాశాన్నీ, హరిదాస్యాన్నీ, పరలోకంలో సంతోషాన్నీ ప్రసాదిస్తుంది అని చెప్పడమైనది.

11. లింగపురాణం

అగ్నిలింగంలో అంతర్గతుడైవున్న శివుడు ఉపదేశించినదే లింగపురాణం. ఇది విష్ణుదేవుని కుడిచీల మండతో పోల్చబడింది. శివుని ప్రభావాన్ని వర్ణించే ఈ పురాణంలో 11,000వేల శ్లోకాలున్నాయి. ఇది పూర్వార్ధమనీ, ఉత్తరార్ధమనీ రెండు భాగాలుగా ఉన్నది. పూర్వార్ధంలో 108, ఉత్తరార్ధంలో 55 కలిపి మొత్తం 163 అధ్యాయాలున్నాయి.

శివుని అవతారాలను ఈ పురాణం విరివిగా వర్ణిస్తున్నది. అందుచేత శైవులు ఈ పురాణాన్ని ప్రముఖంగా ఆదరిస్తారు. అష్టాంగయోగ సహితమైన శివారాధన, విష్ణువు కావించిన శివస్తోత్రం, బ్రహ్మజననం, లింగార్చనావిధానం, శివునికి చెందిన మానసపూజ, యుగ ధర్మాలు, సప్తద్వీపాలు, సప్తసాగరాలు, దిక్పాలకుల నగర వర్ణన, చంద్రవంశరాజుల వృత్తాంతం, త్రిపురాసురసంహారం, కైలాసగిరివర్ణన, సదాచారం ఇత్యాదిగా పలు విషయాలు ఈ పురాణంలో అతివిస్తృతంగా ప్రతిపాదింపబడివున్నాయి.

ఇందలి ఉత్తరార్ధంలో పృథివి, జలం, అగ్ని, వాయువు మొదలగు అష్టవిధాలైన శివుని మూర్తుల వివరణ వున్నది. శివభక్తిని ప్రతిపాదించే కథలు కూడా ఈ పురాణంలో చోటు చేసుకొనివున్నాయి.

మృత్యువు సమీపించిన శ్వేతుడు అనే శివభక్తుడు శివుని అనుగ్రహంచేత మరణంనుంచి తప్పించుకొనిన కథ శివారాధనవల్ల కలిగే ఫలితాన్ని వివరిస్తున్నది.

ఇక కాశీక్షేత్రమహిమ ఇందులో విస్తారంగా ప్రతిపాదితమయింది.

కామం భుంజన్ స్వపన్ క్రీడన్ కుర్వన్ని వివిధాః క్రియాః ।
అవిముక్తే త్యజేత్ ప్రాణాన్ జంతుర్మోక్షాయ కల్పతే ॥

భుజిస్తూ, నిద్రిస్తూ, క్రీడిస్తూ, యథేచ్ఛగా వివిధక్రియలాచరిస్తూ కూడ ఈ క్షేత్రంలో మరణిస్తే మోక్షం సిద్ధిస్తుందని ఇందులో చెప్పడమయినది.

అష్టదిక్పాలకులుగా ఇంద్రాదులు ప్రసిద్ధులు. వారు నివసించే నగరాలు క్రమంగా 1. అమరావతి 2.తేజస్విని 3.వైవస్వతి 4.కృష్ణవర్ణ 5. శుద్ధవతి, 6.గన్ధవతి 7.అలక 8.యశోవతి – అనేవి ఈ పురాణంలో పేర్కొనబడ్డాయి.

ఇది శైవపురాణం కాన శివపూజామాహాత్మ్యాన్ని ఘనంగా కీర్తిస్తున్నది. శివానుగ్రహంతోనే పరాశరుడు ఎన్నడో మరణించిన తన తండ్రిని, పినతండ్రులను చూస్తాడు. ఇట్టి విశిష్టమైన కథలతోను, వర్ణనలతోనూ సాగిపోయే లింగపురాణం చాలా ప్రభావోపేతమైనది.

మంచినీతులు చెప్పిన సందర్భాలు కూడా ఈ పురాణంలో లేకపోలేదు. భోగాశను నిరోధించాలనీ, విషయ విచారణచేత అది సాధ్యమనీ, మనోవాక్కాయాలతో వైరాగ్యాన్ని పాటించాలనీ చెప్పే ఈక్రింది శ్లోకం గమనార్హం–

భోగేన తృప్తిర్నైవాస్తి విషయాణాం విచారతః ।
తస్మాద్విరాగః కర్తవ్యః మనసా కర్మణా గిరా ॥

ఈ పురాణపఠన ప్రయోజనాన్ని ఈ క్రిందిశ్లోకం ఇలా చెప్పింది–

యః పఠేచ్ఛృణుయాద్వాఽపి లైంగం పాపహరం నరః ।
స భుక్తభోగో లోకేఽస్మిన్నన్తే శివపురం వ్రజేత్ ॥

పాపహరమైన ఈ పురాణాన్ని చదివేవారు, వినేవారు ఈ లోకంలో ఉన్నంతకాలం సకల భోగాల ననుభవించి కడపట కైలాసం చేరుకోగలరు.

12. వరాహపురాణం

వరాహావతారధారియైన విష్ణుదేవుడు భూదేవికి చెప్పిన పురాణమే వరాహపురాణం. ఇందులో 24వేల శ్లోకాలున్నాయి. విష్ణువుయొక్క ఎడమ చీలమండతో ఈ పురాణాన్ని పోల్చడమయింది. ఇందలి అధ్యాయాల సంఖ్య 215.

నానావిధ సృష్టులు, నారదమునీంద్రుని పూర్వజన్మచరిత్ర, విష్ణుభగవానుని అష్టమూర్తులు, ధర్మవ్యాధుని చరిత్ర, దక్షయాగధ్వంసం, పార్వతీజననం, వినాయకుని పుట్టుక, వివిధవ్రతాలు, వాటి ఫలితాలు, నాలుగు యుగాలు, అన్నదానప్రాశస్త్యం, వరాహస్వామి భూదేవిని ఉద్ధరించడం, నాచికేతుని వృత్తాంతం ఇత్యాదిగా పలువిషయాలు ఈ పురాణంలోని అంశాలుగా ఉన్నాయి.

అష్టాదశపురాణాల క్రమమూ, వివరణ గూడా ఇందులో నిర్దేశింపబడివున్నది. మహావిష్ణువు తన భక్తులకు అంగరక్షకుడై ఉంటాడన్న విషయం ఈ గ్రంథంలో చెప్పడమయింది.

శ్రీకృష్ణుడు గీతలో **'మమ మాయా దురత్యయా'** అని అంటాడు. 'నామాయ దాటరానిది' అని దీని అర్థం. భూదేవి 'మాయ' అంటే ఏమిటి? దాని స్వరూపం వివరించుమని విష్ణువును అడుగుతుంది. అందు కాదేవుడు తన మాయాస్వరూపాన్ని ఈ పురాణంలో అతి విస్తృతంగా వివరిస్తాడు.

లోకంలో తరచు సంభవించే అతివృష్టి, అనావృష్టి మున్నగు విపరీత సంఘటనలు, మాయవల్లనే కల్గుతున్నాయనీ, సృష్టిలో క్రమబద్ధంగా జరిగే సూర్యోదయాదులు, పంచభూతాల ప్రవర్తన, మాయాప్రభావం వల్లనే ఏర్పడుతున్నాయనీ ఇక్కడ చెప్పడమయింది.

దానాలన్నింటిలో అన్నదానం ప్రశస్తమయింది. అట్లే మనం వాడే వివిధములైన లోహాలతో నిర్మించబడిన పాత్రలలో రాగిపాత్రలు మేలైనవి అని ఈ పురాణం నిరూపించింది.

ఇంకా ఈ పురాణంలో వివిధతీర్థాల ప్రభావం గూడా వర్ణింపబడివున్నది. ఏ తీర్థాన్ని ఎప్పుడు సేవిస్తే మంచిదో ఇక్కడ వివరించబడివున్నది.

విష్ణుమందిరాలలో సేవలు చేసే వారికి గలిగే ఫలమేమి? అన్న భూదేవి ప్రశ్నకు విష్ణువు అట్టి వివిధ సేవాఫలాలను వివరంగా పేర్కొంటాడు. సకల జగత్తుకు సత్యమే ఆధారం కాన, సత్యాన్ని తప్పక పాటించాలన్న సంగతి ఇందులో చెప్పడమయింది.

ఇక కఠోపనిషత్తులో నాచికేతుని వృత్తాంతం ఇందులో రమ్యంగా ప్రతిపాదితమయింది. ఇంకా ఎన్నో కథాంశాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

శ్రుత్వా తు పూజయేద్యస్తు శాస్త్రం వారాహ సంజ్ఞితమ్ ।

సర్వపాపవినిర్ముక్తో విష్ణుసాయుజ్యమాప్రజేత్ ॥

అన్నట్లు దీన్ని ఎవరు శ్రవణం చేసి భక్తితో పూజిస్తారో, వారు సర్వపాపనిర్ముక్తులై విష్ణుసాయుజ్యం పొందుతారని ఫలశ్రుతి.

13. స్కాందపురాణం

స్కందుడనగా శివుని కుమారుడైన కుమారస్వామి. ఆ దేవుని పేరుతో ఈ పురాణం ప్రసిద్ధమయింది. శివుడు స్కందుణ్ణి ఉద్దేశించి చెప్పిన విషయమే ఈ స్కాందపురాణం. తండ్రినుండి విన్న ఈ పురాణాన్ని తరువాత స్కందుడు మునుల కుపదేశిస్తాడు.

'ఏకాశీతిసహస్రం తు స్కాందం సర్వాఘకృంతనం' – అన్నట్లు సకల పాపవిచ్ఛేదకమైన ఈ పురాణంలో 81,000 శ్లోకాలున్నాయి. దీన్ని బట్టి ఇతరపురాణాలకంటె ఇది ఆకృతిలో చాలా పెద్ద పురాణమని తెలుస్తున్నది.

మహావిష్ణుని వెంద్రుకలతో పోల్చబడిన ఈగ్రంథంలో మహేశ్వరఖండం, వైష్ణవఖండం, బ్రహ్మాఖండం, కాశీఖండం, అవంతీఖండం, నాగరఖండం, ప్రభాసఖండం అని ఏడు ఖండాలున్నాయి.

మహేశ్వరఖండంలో కేదారఖండం, కౌమారీ ఖండం, అరుణాచలమాహాత్మ్యం మొదలైన అంశాలున్నాయి. వైష్ణవఖండంలో వేంకటాచల-జగన్నాథక్షేత్రాల మాహాత్మ్యం, బ్రహ్మఖండంలో సేతు మాహాత్మ్యం, ధర్మారణ్య, బ్రహ్మోత్తరఖండాలున్నాయి. కాశీఖండంలో కాశీక్షేత్రప్రభావం విస్తృతంగా వర్ణింపబడి వున్నది. నాగరఖండంలో వివిధ తీర్థాల వర్ణన ఉన్నది. విశ్వకర్మోపాఖ్యానాదికథలు గూడా ఉన్నాయి.

ప్రభాసఖండంలో ద్వారకానగరపరిసరాల ప్రభావం వివరించబడివున్నది. సంహితారూపంలో గూడా ఈ స్కాందపురాణం ప్రసిద్ధమైవున్నది.

సనత్కుమారసంహిత, సూతసంహిత, శంకరసంహిత, వైష్ణవసంహిత, బ్రహ్మసంహిత, సౌరసంహిత, అనేవే ఈ సంహితలు.

సూతసంహితలో శివోపాసనాప్రాముఖ్యం కీర్తింపబడివున్నది. కాశీక్షేత్రప్రభావాన్ని వర్ణించే కాశీఖండంలో అయోధ్యాదిక్షేత్రాలలో మరణించినవారు స్వర్లోకసుఖం అనుభవించి తరువాత కాశిలో జన్మించి అక్కడ ముక్తులవుతారని చెప్పడం విశేషం. **'కాశ్యాం తు మరణాన్ముక్తిః'** అన్న మాట గూడా ప్రసిద్ధం.

జీర్ణదేవాలయోద్ధరణ చేసేవారికి కలిగే ఫలాన్ని గూడా ఈ పురాణం వివరించింది. సత్యనారాయణ వ్రతస్వరూపం ఇందలి రేవాఖండంలో నిరూపితమయింది.

ఇంకను రామావతారం, క్షీరసాగరమథనం, గిరిజా కల్యాణం, కుమారోత్పత్తి, ఓంకారప్రభావం, 14 మంది మనువుల వర్ణన ఇత్యాద్యంశాలు ఇందులో గోచరిస్తాయి. అంతే కాక వనభోజనం, కార్తికవైభవం, ఉసిరిక విశిష్టత, ఇత్యాదివిషయాలు గూడా గమనింపదగివున్నాయి.

సర్వేషామేవ ధర్మాణాం గురుపూజా పరా మతా ।
గురుశుశ్రూషయా సర్వం ప్రాప్నోతి హి న సంశయః ॥

అన్ని ధర్మాలలోనూ గురుపూజ మేలైన ధర్మం. గురుసేవచేత అన్ని ఫలితాలూ పొందవచ్చు అని గురుసేవా ప్రాశస్త్యం పేర్కొనబడింది. రుద్రాక్ష మహిమ కథాకథన పూర్వాంకంగా ఇందులో వివరించబడింది.

పురాణ శ్రవణ ఫలాన్ని ఈ పురాణం 136 శ్లోకాలతో వివరించింది. జ్ఞానదీపాలుగా, భవరోగౌషధాలుగా పురాణాలిందులో కీర్తింపబడివున్నాయి.

14. వామనపురాణం

బ్రహ్మదేవుడు వామనావతార ప్రభావాన్ని కీర్తిస్తూ చెప్పినదే వామనపురాణం. మహావిష్ణుని చర్మంతో దీన్ని పోల్చారు. ఇందలి శ్లోకాలు పదివేలు, అధ్యాయాలు 95.

వైష్ణవధర్మ ప్రతిపాదకమైన ఈ పురాణంలో విష్ణుమందిరాలు, విష్ణుభక్తుల వృత్తాంతాలు అధికంగా కనిపిస్తాయి. ఉత్పత్తి ప్రళయాలు, కామదహనం, ప్రహ్లాదవరదానం, దేవీమాహాత్మ్యం, నానావిధ తీర్థాలు, వినాయక విజయం ఇత్యాద్యంశాలు ఈ పురాణంలో వర్ణించబడివున్నాయి.

వివిధ దేవతలకు చెందిన 25 స్తోత్రాలు ఈ పురాణంలో లభిస్తాయి. దేవతలలో మహావిష్ణువు, ఆయుధాలలో సుదర్శనం, పక్షులలో గరుడుడు, సర్పాలలో వాసుకి, ఈ రీతిగా ఆయా వర్గాలలో మేలైనవారినీ, వస్తువులను కీర్తించే ఇందలి ఘట్టం ఆసక్తి జనకంగా ఉంటుంది.

లోకంలో ఎన్నో పాపాలున్నాయి, కాని అన్నింటినీ మించిన పాపం కృతఘ్నుత్వమని ఈ పురాణం చెబుతున్నది.

నిత్యమూ ఉదయం లేవగానే త్రిమూర్తులు, గ్రహాలూ, సప్తర్షులూ, సప్తలోకాలూ తనకు శుభావహాలు కావాలని ప్రార్థించాలని ఈ గ్రంథం బోధిస్తున్నది.

జీవితంలో ఎన్ని విపత్తు లెదురైనా, షండుడు, మార్జారుడు, ఆఖువు, కుక్కుటుడు, పతితుడు, అపవిద్ధుడు, నగ్నుడు, చండాలుడు, అధముడు-ఇట్టివారిని ఆశ్రయించరాదని ఇందులో చెప్పడమయింది.

మనుజుడు అవశ్యం ఆచరించవలసిన సదాచారాలను 122 శ్లోకాలలో ఈ పురాణం వివరించింది.

పుత్రుడు - శిష్యుడు-వీరిరువురిలో శ్రేష్ఠు డెవరు? అన్న ప్రశ్నకు ఇందులో బ్రహ్మ పుత్రునికంటె శిష్యుడే శ్రేష్ఠుడని సమాధానం చెబుతాడు.

పున్నామ్నో నరకాత్త్రాతి పుత్రస్తేనేహ గీయతే ।
శిష్టపాపహరశ్శిష్య ఇతీయం వైదికీ శ్రుతిః ॥

'పుత్' అనే నరకం నుండి మాత్రమే రక్షించువాడు పుత్రుడు కాగా తక్కిన సకలపాపాలనుండీ కాపాడేవాడు శిష్యుడని భావం.

పాపాలను దూరం చేసుకొనే విధానాన్ని ప్రతిపాదిస్తూ దానికి ఉదాహరణంగా ఇందులో కోశకారుని వృత్తాంతం చక్కగా వర్ణించబడింది. పూర్వజన్మకృతపాపాలు తరువాతి జన్మలో స్మరణకు వస్తాయని ఈ కథ ద్వారా తెలుస్తున్నది.

యే పఠంతి చ శృణ్వంతి తేఽపి యాన్తి పరాం గతిమ్ ।

అన్నట్లు ఈ వామనపురాణం చదివేవారు, వినేవారు ఉత్తమగతిని పొందుతారని ఫలశ్రుతి.

15. కూర్మపురాణం

17000 శ్లోకాలు గల కూర్మపురాణం విష్ణువు యొక్క పృష్ఠంగా వర్ణించబడింది. పూర్వార్ధం, ఉత్తరార్ధం అని రెండు విభాగాలుగా ఉన్న ఈ పురాణంలో 53+46=99 అధ్యాయాలున్నాయి.

కూర్మరూపంలో ఉన్న విష్ణుదేవుడు మహర్షుల నుద్దేశించి చెప్పిన పురాణమిది. లక్ష్మి ఇంద్రద్యుమ్నుల సంవాదం, విష్ణువు-మహర్షులకు జరిగిన సంవాదం, సృష్టివిధానం, వర్ణాశ్రమాలు, భృగువంశవర్ణన, యుగధర్మాలు, కాశీప్రయాగక్షేత్రాల మాహాత్మ్యం, సదాచారాలు, ద్వాదశాదిత్యుల వర్ణన-ఇత్యాదిగా గల అనేకాంశాలు ఈ పురాణంలో ఉన్నాయి.

మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు. పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు–అనే తొమ్మిదిమంది బ్రహ్మపుత్రులుగా ఇందు పేర్కొనబడినారు. మొదటికాలంలో ప్రజలు సుఖసంతోషాలతో వుండేవారనీ, క్రమంగా రాగద్వేషాలు కారణంగా ప్రజలకు దుఃస్థితి ఏర్పడిందనీ ఈ పురాణం చెబుతున్నది.

ధర్మం ఆచరణీయమనీ, ధర్మంవల్లనే తక్కిన పురుషార్థాలు సిద్ధిస్తాయనీ ఈ పురాణం పేర్కొంటున్నది.

ధర్మాత్సంజాయతే హ్యర్థో ధర్మాత్కామోఽభిజాయతే ।
ధర్మ ఏవాపవర్గాయ తస్మాద్ధర్మం సమాశ్రయేత్ ॥

అనగా ధర్మంనుంచే అర్థ,కామ,మోక్షాలు సిద్ధిస్తాయి. కాన ధర్మాన్ని ఆశ్రయించాలి అని భావం.

శివకేశవులకు భేదం లేదని భక్తులు ఏఏరూపాలను ఆరాధిస్తారో భగవంతుడు ఆయా రూపాలతోనే వారిని అనుగ్రహిస్తాడని ఈ పురాణంలో చెప్పిన విషయం భగవద్గీతలోని

'యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహం' అనే వచనానికి అనుగుణంగా ఉన్నది.

స్వధర్మాన్ని త్యజించి చేసే తీర్థయాత్రలవల్ల ప్రయోజనం శూన్యమనీ, దేవాలయాదులను మిక్కిలి పరిశుభ్రంగా ఉంచాలనీ, మూత్రవిసర్జనాదులతో అపరిశుద్ధం చేయరాదనీ, అలాచేయడం పాపహేతువనీ ఈ పురాణం హెచ్చరిస్తున్నది. పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యం ఇందులో చక్కగా వివరించబడింది.

వేదాన్ని విభజించేవారు వేదవ్యాసు లనబడతారు. అట్టివారు 26మంది ఉన్నారనీ పరాశరపుత్రుడైన కృష్ణద్వైపాయనుడు చివరివాడనీ ఈ పురాణం చెప్పిన విషయం గమనార్హమై ఉన్నది.

ఇంకను సమాజంలో వున్నవారి కర్తవ్యాలు, గురువులవద్ద ఉండవలసిన తీరుతెన్నులు, పాపాత్ములతో చేసే సాంగత్యంవల్ల కలిగే దోషాలు–ఇత్యాది విషయాలు మిక్కిలి ఆసక్తిదాయకంగా ఈ పురాణంలో చెప్పడమయినది.

ఇందులో వామనావతారానికి సంబంధించిన చరిత్ర చాలా చక్కగా నిరూపించబడివున్నది. భక్తిప్రధానమైన దుర్జయు డనేవాని కథవంటి కొన్ని కథలు పాఠకులకు చక్కని చైతన్యం కలిగిస్తాయి. అట్టివి ఇందులో పలుకథలు వున్నాయి.

ఏతత్కూర్మపురాణం తు చతుర్వర్గఫలప్రదమ్ ।
పఠతాం శృణ్వతాం నృణాం సర్వోత్కృష్టగతిప్రదమ్ ॥

ఈ పురాణం చదివేవారికి, వినేవారికి చతుర్వర్గ ఫలాలు సిద్ధిస్తాయి. సర్వోత్కృష్టగతి కూడా కలుగుతుంది.

16. మత్స్యపురాణం

మహావిష్ణువు మత్స్యరూపుడై వైవస్వతమనువు నుద్దేశించి చెప్పిన పురాణమిది. విష్ణువుయొక్క మెదడుతో దీన్ని పోల్చడమైనది. ఇందులో 14.000 వేల శ్లోకాలున్నాయి. మొత్తం అధ్యాయాల సంఖ్య 283.

ఇందలి ముఖ్య విషయాలివి–మత్స్యావతారవర్ణన, అజాండసృష్టి, సూర్యచంద్రవంశాలు, గయాక్షేత్రవర్ణన, పురూరవుని చరిత్ర, కచదేవయానుల కథ, కార్తవీర్యార్జునుని వృత్తాంతం, కలిధర్మాలు మరియు కృష్ణాష్టమి, అక్షయ

తృతీయ, కల్యాణసప్తమి మున్నగు పలువ్రతాల వర్ణన, సప్తద్వీపాల వివరణ, త్రిపురాసురవృత్తాంతం, తారక వృత్తాంతం మున్నగు విషయాలే కాక రాజధర్మాలు, చతుర్విధ దండోపాయాలు, స్వప్నఫలాలు, వామన వరాహావతారాల వర్ణన ఇత్యాదిగా గల విషయాలు ప్రతిపాదితాంశాలై వున్నాయి.

పుట్టిన ప్రతివాడూ పురుషార్థసాధనకై ప్రయత్నించాలి. అలా చేయనివాని జన్మ వ్యర్థమని ఈ పురాణం నొక్కి వక్కాణిస్తున్నది.

లబ్ధ్వా జన్మ న యః కశ్చిద్ఘటయే త్పౌరుషం నరః ।
జన్మ తస్య వృథా భూతమజన్మా తు విశిష్యతే ॥

శ్రాద్ధకాలంలో పితృదేవతలకు అన్నపానాదులు సమర్పించడాన్ని గూర్చిన విశేషవివరణ యిందులో కనిపిస్తున్నది. శ్రాద్ధ కర్మలు అవశ్యాచరణీయాలని ఇక్కడ పేర్కొనడమైనది.

ఇక కాలమానం గురించి ప్రస్తావిస్తూ బ్రహ్మ, శివుడు, విష్ణువు అను త్రిమూర్తులకు చెందిన వివిధ కాలమానాల విశ్లేషణ ఇందులో చేయబడింది.

1.భృగువు 2.అత్రి 3. వసిష్ఠుడు 4. విశ్వకర్మ 5.మయుడు 6. నారదుడు 7. నగ్నజిత్తు 8. విశాలాక్షుడు 9. పురందరుడు 10. బ్రహ్మ 11. కుమారుడు 12.నందీశుడు 13.శౌనకుడు 14. గర్గుడు 15. వాసుదేవుడు 16. అనిరుద్ధుడు 17. శుకుడు 18. బృహస్పతి అనే ఈ పదునెనిమిది మంది వాస్తుశాస్త్రోపదేశకులుగా ఇందులో పేర్కొనబడినారు.

తల,లలాటం మున్నగు అవయవాల కదలికవల్ల కలిగే ఫలాన్ని కూడా భగవంతుడు ఈ పురాణంలో చెప్పియున్నాడు.

ఇక పితృశ్రాద్ధంవల్ల కలిగే ఫలాన్ని వివరించే కౌశికుడనే విద్యావంతుడు, అతని ఏడుగురు కుమారులకు చెందిన విస్తృతమైన కథ ఇందులో కనిపిస్తున్నది. భక్తిశ్రద్ధలతో ఆచరించిన పితృశ్రాద్ధం గోహత్యను కూడా పోగొడుతుందని ఈ కథలో నిరూపితమయినది. బ్రహ్మదత్తుని కథలో ఆడు చీమ, మగ చీమలమధ్య జరిగే సంభాషణ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది.

పతివ్రతల ప్రభావం గురించి చెప్పే ఈ క్రింది శ్లోకం వారిపట్ల గౌరవంతో వుండాలని హెచ్చరిస్తున్నది.

పతివ్రతానాం వచనం ప్రకృష్టం తాసాం తు వాక్యం భవతీహ మిథ్యా ।
న జాతు లోకేషు చరాచరేషు తస్మాత్సదా తాః పరిపూజనీయాః ॥

పతివ్రతల మాట శ్రేష్ఠమైనది. ఎప్పుడును వారి మాట మిథ్య కాదు. అందువల్ల వారు సదా పూజింపదగినవారు.

ఇక ఫలశ్రుతి –
అస్మాత్పురాణాదపి పాదమేకం పఠేత్తు యస్సోఽపి విముక్తపాపః ।
నారాయణాఖ్యం పదమేతి నూనమనంగవద్దివ్యసుఖాని భుంక్తే ॥

ఈ పురాణంలో ఒక్క పాదం చదివినా పాపనివృత్తుడై వైకుంఠం పొందగలడని, సకల దివ్యసుఖాలు అనుభవింపగలడని ఫలశ్రుతి చెబుతున్నది.

17. గరుడపురాణం

విష్ణువాహనమైన గరుడుడు అడిగిన ప్రశ్నలకు విష్ణుదేవుడు చెప్పిన సమాధానాలే గరుడపురాణం, ఇందులో 19వేల శ్లోకాలు గల పూర్వఖండం, ఉత్తరఖండం అనే రెండు ఖండాలున్నాయి.

పూర్వఖండంలో 229, ఉత్తరఖండంలో 35 కలిపి 264 అధ్యాయాలు గల పురాణమిది. విష్ణుదేవుని "మజ్జ" గా ఇది వర్ణించబడింది.

ఈ పురాణంలోని ఉత్తరఖండంలో ప్రేతకల్పం మిక్కిలి ప్రశస్తమైనది. మరణానంతరం జీవుని స్థితిగతులను విస్తృతంగా వివరించే ఘట్టమిది. అందువల్లనే మరణించిన వానియింట పదవ దినంలోగా ఈ పురాణాన్ని పఠించే సంప్రదాయమేర్పడింది.

గరుడపురాణం కేవలం యమలోకవృత్తాంతాన్ని మాత్రమే చెబుతుందని కొందరు భావించడం కద్దు. ఈ భావన తగదు. ఇందలి పూర్వఖండంలో ఈ క్రింద నిర్దేశించబడిన నానావిషయాలున్నాయి.

భగవదవతారాలు, సరస్వత్యుపాసన, విష్ణుదీక్ష, శివార్చనావిధి, సుదర్శనచక్ర పూజావిధానం, సూర్యార్చన, దేవతాప్రతిష్ఠ, నిత్యనైమిత్తిక కామ్యకర్మల వివరణ, పాపప్రాయశ్చిత్తవిధి, నవరత్నాల పరీక్ష, వివిధములైన వ్రతాలు, ఆయుర్వేద వైద్యవిధానాలు మున్నగు అనేక విషయాలు ఈ పురాణంలో గోచరిస్తాయి. పశువుల చికిత్సా విధానం కూడా ఇందులో నిర్దిష్టమైయున్నది.

మానవజీవితానికి అత్యవసరమైన పలు నీతులు గూడా ఈ గ్రంథంలో పేర్కొనబడివున్నాయి. యజమానులు నిష్కారణంగా సేవకులను నిందించరాదన్న ఉపదేశం ఇందులో ఉన్నది. ధనం, జ్ఞానం, రూపం, మిత్రులు-వీరి స్వభావా లెలా ఉండాలో ఇందులో సూచించబడింది.

అర్థేన కిం కృపణహస్తగతేన పుంసాం జ్ఞానేన కిం బహుశఠాకుల సంకులేన ।
రూపేణ కిం గుణ పరాక్రమవర్జితేన మిత్రేణ కిం వ్యసనకాలపరాఙ్ముఖేన ॥

కృపణుని చేతి ధనం, మొండి మనిషికి గలజ్ఞానం, గుణపరాక్రమాలులేని రూపం, వ్యసనకాలంలో కనిపించని మిత్రుడు ఉండీ ప్రయోజనం లేదని భావం. కష్టకాలంలో పరిచితవ్యక్తులు సైతం ఎలా తప్పించుకొంటారో సోదాహరణంగా ఈ పురాణం వివరించింది. గృహంలో వుంటూనే ముక్తిని సాధించే విధానం గూడా చెప్పడమయింది.

గరుడ పురాణంలో ఎన్నో కథలున్నాయి. కథలకంటె ఇందలి నీతివచనాలు మనోజ్ఞాలు. ఉదాహరణకు వేలకొలది గోవులలో దూడ తన తల్లిని గుర్తించి అనుసరించినట్లు మనమెంత దూరంగా ఉన్నా మనకర్మ మనల్ని విడువక వెంటాడుతూ వుంటుందని నీతిబోధ.

హయగ్రీవ పూజావిధి, పంచమహాయజ్ఞాలు, రాజలక్షణాలు, సేవకలక్షణాలు, రోగనివారణోపాయాలు మున్నగునవి కూడా ఈ పురాణంలో చూడవచ్చు.

'కీర్తితం పాపశమనం పఠతాం శృణ్వతాం నృణామ్' అనగా ఈ పురాణం చదివేవారు, వినేవారు సకల పాపాల నుండి విడుదల పొందుతారని దీనికి ఫలశ్రుతి చెప్పబడింది.0

18. బ్రహ్మాండ పురాణం

బ్రహ్మదేవుని సృష్టిని వివరించే పురాణమిది. "బ్రహ్మాండం చాస్థి గీయతే" అన్నట్లు విష్ణువుయొక్క ఎముకలుగా ఇది పేర్కొనబడింది. ఇందులో 12,000 శ్లోకాలున్నాయి. బ్రహ్మాండపురాణం పూర్వభాగం, మధ్యభాగం, ఉత్తరభాగమని మూడు భాగాలుగా వున్నది. పూర్వభాగంలో 38, మధ్యభాగంలో 74, ఉత్తర భాగంలో 44, మొత్తం కలిపి 156 అధ్యాయాల గ్రంథమిది. రోమహర్షణుడనే ముని కురుక్షేత్రంలో ఋషులకు చెప్పిన పురాణమిది.

ప్రక్రియాపాదం, అనుషఙ్గపాదం, ఉపోద్ఘాతపాదం, ఉపసంహారపాదమని నాలుగు భాగాలుగా ఈ పురాణం విభజింపబడింది. నైమిశారణ్యవర్ణన, చతుర్ముఖబ్రహ్మ వర్ణనం, వరాహావతారం మున్నగు విషయాలు ప్రక్రియాపాదంలో కనిపిస్తాయి.

తరువాతి పాదంలో చతురాశ్రమ ధర్మాలు, మునుల జన్మవృత్తాంతం, దక్షుడు గావించిన శివనింద, సతీదేవి అగ్నిప్రవేశం, దక్షుడు, శంకరుడు పరస్పరం శపించుకొనడం, ప్రియవ్రతవర్ణన మున్నగు విషయాలతోపాటు సప్తద్వీపాల వర్ణన, సూర్యుని మహిమ, సూర్యుని అధీనంలో ఉండి ఇతర గ్రహాలు సంచరించడం, రాత్రింబవళు ్ళ, మాసాలు, ఋతువులు, సంవత్సరాలు, యుగాలు అనబడే కాలానికి సూర్యుడే మూలకారణమని నిరూపించడం, లింగజననం, యుగధర్మాలు, మొదలగు విషయాలు ఇందులో కనిపిస్తాయి.

మూడవదైన ఉపోద్ఘాతపాదంలో సప్తర్షులజననం, నృసింహావతార వర్ణన, కుమారసంభవం, పుణ్యప్రదేశవర్ణన, శ్రాద్ధాలకు ప్రశస్తమైన నదులు, తీర్థాలు, అన్నదానం, గయలో శ్రాద్ధం, మొదలగు విషయాలు నిరూపింపబడి వున్నాయి. పరశురాముని తపస్సు, జమదగ్నిని కార్తవీర్యార్జునుడు హతమార్చడం, జమదగ్నిపునర్జననం, సగర యయాతుల చరిత్ర మున్నగు విషయాలు కనిపిస్తాయి.

చివరిపాదంలో లలితాదేవి వర్ణన, కామాక్షీ మాహాత్మ్యం, దేవీదీక్ష, మొదలైన విషయాలు ఉన్నాయి. ఈ పురాణపఠనఫలం క్రింది విధంగా పేర్కొనబడింది.

య ఇదం కీర్తయేద్వత్స! శృణోతి చ సమాహితః ।
స విధూయేహ పాపాని యాతి లోకమనామయమ్ ॥

బ్రహ్మాండపురాణం పఠించేవాడు, ఏకాగ్రతతో వినేవాడు పాపరహితుడై సర్వోత్తమలోకాలను చేరుకుంటాడు అని భావం.

సముద్రాల లక్ష్మణయ్య
ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.

బ్రహ్మమహాపురాణం

(ప్రథమభాగ కథాసంగ్రహం)

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం చైవ తతో జయముదీరయేత్ ॥

అది నైమిశారణ్యం. అక్కడ మహర్షులు సత్రయాగం చేస్తున్నారు. ఆ సమయంలో అక్కడికి సూతమహర్షి వచ్చాడు. మహర్షులు సూతుడిని పూజించారు. స్థావర జంగమాత్మకమైన ఈ సృష్టి ఎలా ఏర్పడిందో చెప్పమని అడిగారు. సూతుడు చెప్పసాగాడు.

సృష్టి చేయాలని సంకల్పించి, పరమాత్మ ముందుగా జలాన్ని సృష్టించాడు. నీటినుండి – బ్రహ్మ, స్వర్గం, భూమి, వాటి నడుమ ఆకాశం, పదిదిక్కులు, కాలం ఏర్పడ్డాయి. ఆ పిదప ప్రజాపతులు, రుద్రుడు, సనక సనంద నాదులు, క్రమంగా భువి, దివి, ఆకాశమూ, దేవతలూ, రాక్షసులూ, వృక్షాలూ, మొదలుగా స్థావర జంగమ స్వరూపమైన సృష్టి సమస్తం ఏర్పడింది. స్వాయంభువు మొదలుగా పదునాలుగుమంది మనువులూ కలిగారు. మన్వంతరాలూ విస్తరించాయి.

సూర్యవంశం

కశ్యపప్రజాపతికి అదితియందు సూర్యుడు పుట్టాడు. ఇతడికి త్వష్టకూతురు అయిన సంజ్ఞయందు వైవస్వతుడు, యముడు, యమున జనించారు. సంజ్ఞకుమారుడైన వైవస్వతుడు ఏడవమనువు. ప్రస్తుతం నడుస్తున్న కాలం వైవస్వత మన్వంతరమే. సూర్యుడి తేజస్సు భరించలేక సంజ్ఞ తనకు మారుగా తన ఛాయను సూర్యుడివద్ద ఉంచి వెళ్ళింది. సూర్యుడికి ఆ ఛాయవలన సావర్ణి అనే మనువు, శనైశ్చరుడు కలిగారు. వైవస్వత మనువుకు ఇక్ష్వాకువు కలిగాడు. ఇలా క్రమంగా సూర్యవంశం విస్తరించింది. ఈ వంశంలో అంబరీషుడు, కకుత్స్థుడు, మాంధాత, హరిశ్చంద్రుడు, భగీరథుడు, దశరథుడు, రాముడు, నలుడు మొదలైన మహాత్ములు జన్మించి, తమ తమ గుణవిశేషాలతో సుప్రసిద్ధులైనారు.

చంద్రవంశం

బ్రహ్మకుమారుడైన అత్రిమహర్షికి చంద్రుడు జన్మించాడు. చంద్రుడికి బుధుడు, అతడికి పురూరవుడు మొదలుగా చంద్రవంశం విస్తరించింది. గాధి, జహ్నువు, పరశురాముడు, నహుషుడు, వసుదేవుడు మొదలైనవారు ఈ వంశంలో ప్రసిద్ధులు. యయాతి కుమారుడైన యదువు సంతానంతో యదువంశం ప్రసిద్ధమైంది. ఆ పరంపరలోని సాత్వతుని సంతానమైన దేవావృధుడి కుమారుడైన బభ్రుదేవావృధుడు మొదలగు వారితో భోజవంశం ఏర్పడింది. అలాగే సాత్వతుని కుమారులైన వృష్ణి, అంధకుడు అనేవారిపేర్లతో వారివంశాలు ప్రసిద్ధమైనాయి. సాత్వతుడిపేరుమీదుగా వీరంతా సాత్వతులు అయినారు. శ్రీకృష్ణుడు ఈ యదుపరంపరలోనే జన్మించాడు.

స్యమంతకోపాఖ్యానం

సత్రాజిత్తు తపస్సు చేసి, సూర్యుడివలన స్యమంతకమణిని పొందాడు. దాన్ని ప్రేమతో తన సోదరుడు ప్రసేనజిత్తుకు ఇచ్చాడు. అతడు వేటకు వెళ్లగా ఒక సింహం ప్రసేనజిత్తును చంపి మణిని తీసుకుపోయింది. ఆ సింహాన్ని చంపి, మణిని తీసుకువెళ్లి, జాంబవంతుడు తన కూతురి కిచ్చాడు. దాన్ని తాను కాజేసినట్లు వచ్చిన అపవాదును తొలగించుకోవడానికి శ్రీకృష్ణుడు జాంబవంతుడితో యుద్ధం చేసి, మణిని తీసుకువచ్చి సత్రాజిత్తుకు ఇచ్చాడు. ఓడిపోయిన జాంబవంతుడు మణితోపాటు తన కూతురు జాంబవతిని కూడ కృష్ణుడికి ఇచ్చాడు. మణి ఇచ్చినందుకు కృతజ్ఞతతో సత్రాజిత్తు తన కూతుళ్లు సత్యభామ, వ్రతిని, ప్రస్వాపిని అనే ముగ్గురిని కృష్ణుడికి ఇచ్చి వివాహం చేశాడు. శతధన్వుడు సత్రాజిత్తును చంపి, ఆ మణిని హరించి, దానిని ఎప్పటినుంచో కోరుతున్న అక్రూరుడికి ఇచ్చాడు. కృష్ణుడు మణికోసం శతధన్వుడిని సంహరించాడు. మణి అతడివద్ద లేదు. బలరాముడు ఆ మణిని కృష్ణుడు అపహరించాడేమో అనుకున్నాడు. కోపంతో ద్వారక వదిలి, మిథిలానగరానికి వెళ్లిపోయాడు. కృష్ణుడు యోగశక్తితో మణి అక్రూరుడివద్ద ఉందని తెలుసుకున్నాడు. అక్రూరుడు మణి కృష్ణుడికి ఇచ్చాడు. కాని కృష్ణుడు దానిని అక్రూరుడికే తిరిగి ఇచ్చివేశాడు. అక్రూరుడు తన చెల్లెలిని కృష్ణుడికి ఇచ్చాడు.

ద్వీపతీర్థవర్ణనం

తరువాత సూతుడు మహర్షులకు 1. జంబూ, 2. ప్లక్ష, 3. శాల్మల, 4. కుశ, 5. క్రౌంచ, 6. శాక, 7. పుష్కరాలు అనే సప్తద్వీపాలనూ, వాటిప్రమాణంతో సహా ఆ ద్వీపాలలో ఉండే నగరాలూ, జీవులూ, నదులూ, మొదలయిన అంశాలను వివరించాడు. తరువాత రౌరవం, శౌకరం, తప్తకుంభం మొదలైన నరకాలను గూర్చి పేర్కొన్నాడు. ఆ పిదప భూలోకం, భువర్లోకం, సువర్లోకాలను గురించి, ధ్రువస్థానం గురించి వివరించాడు. భూలోకంలోని పుణ్యతీర్థాలను పేర్కొన్నాడు. పిదప సూతుడు పూర్వం బ్రహ్మదేవుడు మహర్షులకు చెప్పిన విషయాలను వ్యాసుడు తనకు చెప్పిన ప్రకారంగా వివరించాడు. బ్రహ్మ మహర్షులకు భూలోకంలో భరతవర్షం ప్రశస్తిని వివరించాడు.

కోణాదిత్యక్షేత్రం (కోణార్కం)

భరతవర్షంలో దక్షిణసముద్రానికి ఉత్తరదిక్కులో ఉత్కలదేశంలో సూర్యభగవానుడు స్వయంగా నెలకొన్నాడు. ఆయన కోణాదిత్యుడు అని ప్రసిద్ధుడు. ఆ దేవుడిని ప్రతిరోజూ ఆదిత్యమంత్రాలతో ఉపాసించాలి. రాగిపాత్రలలో, జిల్లేడు ఆకులలో, రక్తచందనంతో, రక్తపుష్పాలతో, అర్ఘ్యప్రదానాలతో ధూప, దీప, నైవేద్యాదులతో విధివిధానంగా అర్చనలు చేయాలి. ముఖ్యంగా మాఘమాసంలో అందులోనూ సప్తమినాడు విశేషంగా సూర్యుడిని అర్చించాలి. చైత్రమాసంలో శుక్లపక్షం ఏకాదశి మొదలైన తిథులలో దమనభంజిక అనే యాత్రను చేయాలి. అలా చేసినవాడికి కోరికలన్నీ తీరతాయి. చివరికి సూర్యలోకం చేరుకుంటాడు అని చెప్పి సూర్యోపాసనా నియమాలనూ, సూర్య మాహాత్మ్యాన్నీ, ద్వాదశాదిత్యులనూ, సూర్యుడి ఏకవింశతి నామాలనూ, అష్టోత్తర శతనామాలనూ వివరించాడుబ్రహ్మ.

సూర్యజన్మ వృత్తాంతం

మునులు కోరగా బ్రహ్మ సూర్యుడి జన్మవృత్తాంతాన్ని ఇలా చెప్తున్నాడు.

దక్షప్రజాపతికి అరవైమంది కుమార్తెలు. వారిని కశ్యపప్రజాపతికి ఇచ్చి వివాహం చేశాడు. వారిలో అదితికి కలిగిన కుమారులు ఆదిత్యులు. అంటే దేవతలు. దితికి పుట్టినవారు దైత్యులు. దనువు సంతానం దానవులు. వీళ్లు రాక్షసులు. అన్నదమ్ముల యుద్ధంలో రాక్షసులు దేవతలను జయించి, వారి యజ్ఞభాగాలను కూడా తీసుకున్నారు. దేవతలు ఆకలికి అలమటించారు. కుమారుల కష్టం పోగొట్టడానికి అదితి సూర్యుడిని గురించి తపస్సు చేసింది. సూర్యుడు ప్రత్యక్షమైనాడు. అదితి రాక్షసులనుండి కుమారులను కాపాడడానికి తనకు కొడుకుగా పుట్టమని వరం అడిగింది. సూర్యుడు ఒక సంవత్సరం చివరలో అదితిగర్భంలో ప్రవేశించాడు. గర్భాన్ని శుచిగా ఉంచుకోవడానికి అదితి నిత్యం వ్రతాలతో ఉపవాసం చేయసాగింది. ఉపవాసాలతో బిడ్డను చంపుతావా అన్నాడు కశ్యపుడు. చావలేదు అని చెప్పడానికి అదితి గర్భం జారవిడిచింది. అందులోనుండి సూర్యుడు వెలువడ్డాడు. మృత అండం అనే కశ్యపవచనం కారణంగా అతడు మార్తండుడు అయ్యాడు. పిదప మార్తండుడి తేజస్సువలన రాక్షసులు దగ్ధ మయ్యారు. దేవతలకు వారి అధికారాన్ని ఇచ్చి, సూర్యుడు దేవతలనూ, లోకాలనూ పాలించసాగాడు.

ఉమామహేశ్వర కల్యాణం

రుద్రుడు సర్వగతుడు. త్రిలోచనుడు. చంద్రశేఖరుడు. సమస్తభూతాలకు మేలు చేస్తాడు. మరి దక్షుడి యజ్ఞాన్ని ఎందుకు ధ్వంసం చేశాడని అడిగారు మునులు. బ్రహ్మ ఇలా చెప్పాడు.

దక్షప్రజాపతికి ఎనిమిదిమంది కూతుళ్లు. వారిలో సతి శివుడిభార్య. అయితే శివుడు దక్షుడిని గౌరవించడు. అల్లుడిమీద కోపంతో దక్షుడు యజ్ఞం తలపెట్టి, కూతురును గూడ ఆహ్వానించలేదు. అయినా సతి యజ్ఞానికి వెళ్లింది. దక్షుడు వసిష్ఠుడు, అత్రి, పులస్త్యుడు, అంగిరుడు, పులహుడు, క్రతువు, భృగువు, మరీచి అనే సప్తర్షులైన మిగిలిన అల్లుళ్లతో పోల్చి, శివుడినీ, సతినీ అవమానించాడు. తండ్రి భర్తను నిందించడంవలన సతి శరీర మంతటా అగ్నిని నిలుపుకుని భస్మమైంది. ఆ వృత్తాంతం విన్న శివుడు కోపించాడు. అందర్నీ శపించాడు. సతీదేవి తరువాత వైవస్వత మన్వంతరంలో హిమవంతుడికి ఉమగా జన్మించింది. ఆమె తీవ్రంగా తపస్సు చేసింది. శివపార్వతుల వివాహం మహావైభవంగా జరిగింది. దేవతలూ, మహర్షులూ అందరూ పరమేశ్వరుడిని మహత్త్వాన్ని స్తుతించారు. శివపార్వతులు కొన్నాళ్లు హిమవత్పర్వతంపైనే ఉన్నారు. తరువాత పార్వతి కోరికపై శివుడు మామగారిల్లు హిమాలయాన్ని విడిచిపెట్టి, మేరుపర్వతంపై నివసించసాగాడు.

దక్షాధ్వర ధ్వంసనం

పార్వతి నిరంతరం శివుడి ప్రక్కనే ఉండేది. యక్షగంధర్వాదులందరూ శివుడిని సేవిస్తూ ఉండేవారు. శివుడిశాపంవలన దక్షుడు చాక్షుష మన్వంతరంలో ప్రచేతసులకు పుత్రుడుగా, దక్షుడు అనే పేరుతోనే మహారాజుగా

జన్మించాడు. అతడు వైవస్వత మన్వంతరంలో అశ్వమేధయాగం తలపెట్టాడు. పరమేశ్వరుడి అనుమతితో ఇంద్రాదిదేవతలు ఆ యజ్ఞప్రదేశానికి వచ్చారు. ఆదిత్యులు, వసువులు, విష్ణువు, మొదలుగా అందరూ యజ్ఞానికి వచ్చారు. శంకరుడు మాత్రం రాలేదు. అపుడు దధీచిమహర్షి '**అపూజ్యపూజనే చైవ పూజ్యానాం చాప్యపూజనే, నరః పాప మవాప్నోతి మహద్ వై నాత్ర సంశయః**' అన్నట్లు శంకరుడు లేకుండా యజ్ఞం శోభించదు అన్నాడు. దక్షుడు శంకరుడిని నిందించాడు. అక్కడ పార్వతి ఈ దేవతలు అందరూ ఎక్కడికి వెళ్తున్నారు అని అడిగింది. శంకరుడు దక్షప్రజాపతి అశ్వమేధయాగం చేస్తున్నాడు. అక్కడికి వెళ్తున్నారు అన్నాడు. మరి నువ్వెందుకు వెళ్లడం లేదు? అన్నది పార్వతి. దేవతలు నాకు యజ్ఞంలో భాగం ఇవ్వడం లేదు. అందుకని వెళ్లడం లేదు అన్నాడు శివుడు. దేవతలలో నువ్వు శ్రేష్ఠుడివి కదా! నీకు యజ్ఞభాగం ఇవ్వకపోవడ మేమిటి? అది నీకు లభించాలంటే నేను ఏమి తపస్సు, వ్రతం చేయాలి? అని ఆమె అడిగింది. 'పార్వతీ! అంత కోపం వద్దు. నన్ను యజ్ఞేశ్వరుడుగా బ్రహ్మవేత్తలు గౌరవిస్తారు. యజ్ఞంలో నా భాగాన్ని నేనే సృష్టించుకుంటాను' అని శివుడు తన ముఖంనుండి కోపం అనే అగ్నిద్వారా ఒక భూతాన్ని సృష్టించాడు. అది సింహం ఆకారంలో ఉంది. దక్షుడి యజ్ఞాన్ని ధ్వంసం చేయమని దానికి అజ్ఞాపించాడు శివుడు. పరమేశ్వరికి కోపం రావడంవల్ల ఇలా జరుగుతున్నదని గ్రహించింది ఆ భూతం. దానికి వీరభద్రుడు అని పేరు. పరమేశ్వరి కూడ భద్రకాళిగా వీరభద్రుడికి తోడయింది. వీరభద్రుడు వెంటనే యజ్ఞస్థలానికి వెళ్లాడు. భయంకరమైన రూపంతో దక్షయజ్ఞాన్ని సర్వనాశనం చేశాడు. అపుడు నేను(బ్రహ్మ) దేవతలు యజ్ఞంలో శివుడికి భాగం ఇస్తారని చెప్పాను. దక్షుడు శరణు కోరాడు. పరమేశ్వరుడి అనుగ్రహంతో యజ్ఞం పూర్తి అయింది. దక్షుడు అష్టోత్తర సహస్రనామాలతో శివుడిని స్తుతించాడు.

క్షేత్రవైభవం

తరువాత బ్రహ్మ మహర్షుల కోరికమీద వివిధ క్షేత్రాల మహాత్మ్యాన్ని వివరించాడు.

ఏకామ్రక్షేత్రం (కంచి): వెయ్యిలింగాలు కలిగినదీ, వారాణసితో సమానమైనది ఏకామ్రక్షేత్రం. పూర్వకల్పంలో అక్కడ ఏడాదికి ఒకే మామిడిపండు ఇచ్చే మామిడిచెట్టు ఉండేది. ఆ పేరుమీద ఆ క్షేత్రం ఏకామ్రక్షేత్రం అయింది. అక్కడి శివుడిని సేవించినవారికి సమస్తమైన కోరికలు సిద్ధిస్తాయి. మోక్షం కలుగుతుంది.

విరజాక్షేత్రంలో విరజ అనే పేరుతో సరస్వతీదేవి ప్రతిష్ఠింపబడింది. అక్కడ వైతరణీనది ఉంది. అది సర్వపాప హరం. శ్రీమహావిష్ణువు కపిలుడు అనే పేరుతో ఉంటాడు. అక్కడ వారాహీదేవిని దర్శించాలి.

పురుషోత్తమక్షేత్రం (పూరీ)

విష్ణువు లక్ష్మీదేవితో ఈ క్షేత్రంగురించి చెప్పాడు. దక్షిణసముద్రం ఒడ్డున, పెద్దమట్టిచెట్టు ఉన్నది. అది 80 మైళ్లదూరం విస్తరించి ఉంటుంది. దానికి ఉత్తరంగా పురుషోత్తమ ఆలయం ఉంది. అందులోని దైవప్రతిమను భగవంతుడు నిర్మించాడు. దానిని దర్శించిన వారందరూ స్వర్గమోక్షాలకు వెళ్తారు. అందువల్ల తనకు పని లేకుండా

పోతున్నదని యమధర్మరాజు స్వామిని ఆ మూర్తిని తొలగించమని ప్రార్థించాడు. దానితో విష్ణువు ఆ ప్రతిమను ఇసుకతో కప్పి కనబడకుండా చేశాడు.

మాలవదేశంలో అవంతి అనే నగరం ఉంది. ఆ మహానగరంలో శివుడు మహాకాలుడు అనేపేరుతో ఉన్నాడు. అక్కడ క్షిప్ర అనే పుణ్యనది ఉంది. ఆ రాజ్యాన్ని ఇంద్రద్యుమ్నుడు పాలించేవాడు. అతడికి కలలో సముద్రతీరంలో ఒకానొకకొయ్య, తరువాత వాసుదేవుడు, విశ్వకర్మ, శిల్పం నిర్మించడం, ఆ శిల్పాన్ని ఆలయంలో ప్రతిష్ఠించడం కనిపించాయి.

ఇంద్రద్యుమ్నుడు సమస్త పరివారంతో దక్షిణ సముద్రతీరానికి వెళ్లాడు. అక్కడ వింధ్య పాదాన్నుంచి ప్రవహిస్తూ వచ్చిన ఒక నది ఉన్నది. దానిని మహానది అంటారు. ఆ నదీతీరంలో గొప్ప నగరం ఉంది. తనకు కలలో కనిపించిన పురుషోత్తముడి పుణ్యక్షేత్రం అదే అని గ్రహించాడు రాజు. అక్కడ స్వామికి పెద్ద ఆలయాన్ని నిర్మించాలను కున్నాడు. ముందుగా సలక్షణంగా ఘనంగా అశ్వమేధయాగం చేశాడు. ఏకాంతంగా జగన్నాథుడిని ఉపాసించాడు. తదేకధ్యానంతో ఉన్న ఇంద్రద్యుమ్నుడికి నిద్రలో కల వచ్చింది. ఆ కలలో గరుడారూఢుడైన శ్రీమహావిష్ణువు కనిపించి ఇలా అన్నాడు. 'ఈ సముద్రానికి ఆవల మహావృక్షాల మధ్యలో ఒక రావిచెట్టు ఉంటుంది. గొడ్డలితో దానిని నరికి, ఆ చెక్కతో నా విగ్రహాన్ని నిర్మించు'. ఇంద్రద్యుమ్నుడు అలాగే చేశాడు. చెట్టును నరికిన తరువాత విష్ణువు, విశ్వకర్మ బ్రాహ్మణవేషంలో అక్కడికి వచ్చారు. విప్రరూప విష్ణువు చెప్పిన ప్రకారం విశ్వకర్మ ఆ చెట్టుకాండంనుండి కృష్ణ, బలరామ, సుభద్రల మూర్తులు నిర్మించాడు. ఆషాఢమాసం శుక్లపంచమినాడు ఆ మూర్తులను తెచ్చి, మందిరంలో ఉంచి, వారంరోజులపాటు పూజలు చేశారు. పిదప మంచి ముహూర్తంలో ఆలయభవనంలో ప్రతిష్ఠ చేశారు. జ్యేష్ఠమాసంలో ముఖ్యంగా ద్వాదశినాడు స్వామిని దర్శించాలి.

ఈ పురుషోత్తమక్షేత్రాన్ని ఉత్కలక్షేత్రం అని కూడ అంటారు. ఇక్కడ యజ్ఞం చేసే సమయంలో ఏర్పరచిన సరస్సు ఇంద్రద్యుమ్నుడిపేరుతో ప్రసిద్ధమైంది. అందులో స్నానం చేసి, మార్కండేయుడినీ, వటవృక్షాన్నీ, బలరామాదులను దర్శించినవాడు మోక్షం పొందుతాడు.

శ్రీకృష్ణస్వామి, బలరాముడు, దక్షిణ సముద్రం, మార్కండేయ వటం, ఇంద్రద్యుమ్న సరస్సు ఈ అయిందింటిని సేవించడాన్ని పంచతీర్థవిధి అంటారు.

భువనేశ్వరలింగం – మార్కండేయహ్రదం – మహావటం – నరసింహమహత్త్వం

పూర్వం కల్పాంతంలో మహాప్రళయం జరిగి సమస్తం ఏకార్ణవం అయింది. ప్రళయజలంలో ఇరుక్కున్న మార్కండేయుడు బయటపడడానికి పురుషోత్తముడిని ఆశ్రయించాడు. ఆ జలంలో ఒక పెద్ద మఱ్ఱిచెట్టుంది. దానికొమ్మ మీద ఉత్తమమైన శయనంపై విష్ణువు చిన్నపిల్లవాడుగా ఉన్నాడు. మార్కండేయుడు పురుషోత్తముడి అనుగ్రహంతో ఆ బాలుడి ఉదరంలోకి చేరాడు. అక్కడే సమస్తలోకాలు దర్శించాడు. స్వామి తనముఖంనుండి మార్కండేయుడిని వెలువరించాడు. ముని స్వామిని దర్శించి, స్తుతించాడు. ప్రసన్నుడైన విష్ణువుతో పురుషోత్తమ

క్షేత్రంలో తాను పరమేశ్వరుడిని ప్రతిష్ఠిస్తాననీ, శివకేశవులిద్దరూ ఒక్కటే అని భక్తులు గ్రహిస్తారని చెప్పాడు. **'యో రుద్ర స్స స్వయం విష్ణు ర్యో విష్ణు స్స మహేశ్వరః'** అని, విష్ణువు 'పరమేశ్వరుడిని లింగరూపంలో భువనేశ్వరుడుగా ప్రతిష్ఠించు. నీ పేరుమీదుగా శివాలయం నిర్మించు. దానికి ఉత్తరదిక్కులో ఒక సరస్సు ఏర్పాటు చేయి. అది మార్కండేయ హ్రదం అనే పేరుతో ప్రసిద్ధం అవుతుంది' అని వరమిచ్చి అదృశ్యమయ్యాడు. మార్కండేయ హ్రదంలో స్నానం చేసి, భువనేశ్వరుడిని దర్శనం చేసుకుని అక్కడ ఉన్న మఱ్ఱిచెట్టుకు మూడుసార్లు ప్రదక్షిణం చేయాలి. ఆ తరువాత గరుత్మంతుణ్ణీ, కృష్ణ, బలరామ, సుభద్రలను సేవించాలి. అక్కడ ఇంద్రనీలమణుల రూపంలో ఇసుకలో రహస్యంగా ఉన్న నరసింహస్వామికి నమస్కరించాలి అని చెప్పి, బ్రహ్మ మహర్షులకు పిదప నరసింహోపాసనా విధానాన్ని వివరించాడు.

జ్యేష్ఠమాసంలో జ్యేష్ఠనక్షత్రం ఉన్న పూర్ణిమనాడు కృష్ణ, బలరామ, సుభద్రలకు అభిషేకం విశేషంగా జరుగుతుంది. నాడు దేవతలు మహర్షులు మొదలుగా అందరూ స్వామిని సేవించుకుంటారు. ఆ రోజు స్వామిని దర్శించడం విశేషఫలదాయకం.

శ్వేతమాధవుడు – శ్వేతగంగ

పూర్వం కృతయుగంలో శ్వేతుడు అనే రాజు ఉన్నాడు. అతడి రాజ్యంలో కపాలగౌతముడు అనే మహర్షి కుమారుడు పసివాడుగా ఉన్నప్పుడే మరణించాడు. రాజు మహాదేవుడిని సేవించి, శివానుగ్రహంతో యముడినుండి ఆ పిల్లవాడిని తెప్పించి బ్రతికించాడు. ఆ రాజు తరువాత విష్ణుదేవుడిని కూడ ఇలాగే సేవించాడు. దక్షిణసముద్ర తీరంలో కృష్ణస్వామిని దర్శించాడు. ఆ ఆలయానికి సమీపంలో దక్షిణంగా పెద్దఆలయం కట్టించాడు. అందులో చలువరాళ్లతో కూర్చిన మాధవస్వామి మూర్తిని విధివిధానంగా ప్రతిష్ఠించాడు. 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే ద్వాదశాక్షర మంత్రాన్ని నెలరోజులు జపించాడు. స్వామిని స్తుతించాడు. శ్రీహరి ప్రత్యక్షమై, సంపూర్ణంగా భోగాలనుభవించిన తరువాత, వైకుంఠం చేరుకుని, తనతో కలిసి ఉంటాడనీ, అక్కడి మాధవుడు శ్వేతమహారాజు పేరుమీదుగా శ్వేతమాధవుడు అనీ, అక్కడి గంగ శ్వేతగంగ అని ప్రసిద్ధమవుతాయనీ వరం ఇచ్చాడు.

ఆ ప్రక్కనే మాధవుడు రోహితం అనే జాతికి చెందిన చేపరూపం ధరించి, మత్స్యమాధవస్వామిగా ఉన్నాడు. శ్వేతమాధవమూర్తిని దర్శించినా, అక్కడి శ్వేతగంగను తాకినా స్వర్గం కలుగుతుంది.

తరువాత బ్రహ్మ సముద్రస్నానం, నారాయణపూజ, పంచతీర్థవిధానాలను విపులంగా మహర్షులకు వివరించాడు.

గుండికాయాత్ర

ఇంద్రద్యుమ్నుడు శ్రీహరిని ఇంద్రద్యుమ్నసరస్సు తీరంలో వారం రోజులు ఉండి, సేవలు అందుకోమని కోరాడు. ఆ సరస్సు తీరంలో వేదికమీద తనను దర్శించినవారు, అర్చించినవారు, అక్కడ దానాలు చేసినవారు

ఉత్తమగతులు పొందుతారని శ్రీహరి వరమిచ్చాడు. గుండికా ప్రదేశంలో ఉన్న మండపానికి రథంమీద వెళ్తూ ఉన్న స్వామిని చూడడం ఎంతో విశేషం. అందుచేత ఎంత కష్టపడి అయినా ఆ క్షేత్రానికి వెళ్ళి, రథయాత్రనూ, గుండికా మండపంలో వేంచేసిఉన్న స్వామినీ దర్శించుకోవాలి. అవకాశం ఉంటే, పన్నెండు నెలలలో పన్నెండుసార్లు ఈ యాత్ర చేయడం ఉత్తమం అని బ్రహ్మ పురుషోత్తమ అర్చనాది విధానాలను, దానివలన కలిగే ఫలితాలను, ఆ సందర్భంగా విష్ణులోక స్వరూపాన్ని, పురుషోత్తమక్షేత్రమాహాత్మ్యాన్ని మహర్షులకు వివరించాడు.

వాసుదేవమాహాత్మ్యం

ప్రథమకల్పంలో విష్ణువు విశ్వకర్మను పిలిచి, వాసుదేవమూర్తిని శిలామయంగా నిర్మించమని చెప్పాడు. శంఖచక్రగదాదులతో సమగ్రమైన స్వరూపంతో వాసుదేవమూర్తిని విశ్వకర్మ అందంగా తయారుచేశాడు. దానిని బ్రహ్మదేవుడే మంచి ముహూర్తంలో వేదమంత్రాలతో ప్రతిష్ఠించాడు. ఆ మూర్తిని మొదట ఇంద్రుడు పూజించాడు. త్రేతాయుగంలో రావణుడు ఇంద్రభవనం నుండి ఆ వాసుదేవమూర్తిని తీసుకువెళ్లాడు. విభీషణుడు దానిని 108 సంవత్సరాలు అర్చించాడు. రావణవధానంతరం రాముడు ఆ ప్రతిమను అయోధ్యకు తీసుకువెళ్లాడు. అనంతరం సముద్రుడికి ఇచ్చాడు. ద్వాపరయుగంలో శ్రీకృష్ణస్వామి ఆ ప్రతిమను సముద్రంనుంచి తీసి, పురుషోత్తమక్షేత్రంలో నిలిపాడు. అక్కడ వాసుదేవుడిని దర్శించినవారు వైకుంఠానికి వెళ్లి చివరకు మోక్షం పొందుతారు.

కండూపాఖ్యానం

కండుమహర్షి ఆశ్రమం గౌతమీతీరంలో ఉంది. అతడి తపస్సును భగ్నం చేయడానికి ఇంద్రుడు పంపిన ప్రమ్లోచ అనే అప్సరసతో మహర్షి తొమ్మిది వందల సంవత్సరాలకు పైగా కాపురం చేశాడు. తపస్సు అంతా నాశనం కావడంతో కండువు ఆ చోటు వదిలి పురుషోత్తమ క్షేత్రానికి వెళ్లి స్వామిని సేవించాడు. కృష్ణుడు ప్రత్యక్షమై, ఆ క్షేత్రంలో తనను సేవిస్తే పరమపదం కలుగుతుందన్నాడు. కండువు అలాగే పురుషోత్తమ సేవతో మోక్షం పొందాడు.

పురుషోత్తమ క్షేత్రమాహాత్మ్యం విస్తరంగా విన్న మహర్షులు బ్రహ్మదేవుడిని కృష్ణజన్మవృత్తాంతం చెప్పమని అడిగారు. బ్రహ్మ ముందుగా వాసుదేవ మొదలైన నాలుగు వ్యూహాలనూ, వరాహ, నారసింహాది అవతారాలనూ వివరించాడు.

శ్రీకృష్ణచరితం

భూదేవి జీవులభారం తగ్గించమని దేవతలను వేడుకుంది. బ్రహ్మదేవుడితో కలిసి వారు శ్రీహరివద్దకు వెళ్లారు. శ్రీహరి నలుపు, తెలుపు రంగుగల వెంట్రుకలు రెండు పెరికి, ఇవి మీ బాధలు తొలగిస్తాయన్నాడు. ‘ఈ నల్లని వెంట్రుకల వసుదేవుడి పత్ని అయిన దేవకికి ఎనిమిదవ సంతానంగా జన్మించి, (తెల్లవెంట్రుక బలరాముడుగా జన్మిస్తుందని గ్రహించాలి) కాలనేమి అంశతో పుట్టిన కంసుడిని సంహరిస్తుంది. మీరు కూడ మీ మీ అంశలతో భూమిపై పుట్టండి. దుష్టసంహారంతో భూభారం తగ్గుతుంది’ అన్నాడు. నారదుడీ మాటలు కంసుడికి చెప్పాడు.

విష్ణువు యోగనిద్రతో 'నీవు హిరణ్యాకశిపుడి ఆరుగురు కుమారులను దేవకిగర్భంలో ప్రవేశపెట్టు. ఆదిశేషుడి అంశతో దేవకి ఏడవగర్భం ఏర్పడుతుంది. దానిని వసుదేవుడి ఇంకొకభార్య అయిన రోహిణిగర్భంలో ఉంచు. గర్భసంకర్షణంచేత అతడు సంకర్షణుడు అవుతాడు. దేవకికి ఏడవసారి గర్భస్రావం అయిందని వదంతి కలుగుతుంది. దేవకి ఎనిమిదవగర్భంలో నేను ప్రవేశిస్తాను. వెంటనే నువ్వు యశోదగర్భంలో ప్రవేశించు. శ్రావణబహుళఅష్టమినాడు నేనుదయిస్తాను. నవమినాడు నీవు పుడతావు. వసుదేవుడు నన్ను యశోదవద్దకు, నిన్ను దేవకివద్దకు చేరుస్తాడు. నువ్వు దుర్గ మొదలైన పేర్లతో శుంభ నిశుంభాది రాక్షసులను సంహరిస్తావు'. అన్నాడు.

దేవకి మొదటి ఆరుగురు కుమారులను పుట్టగానే కంసుడు సంహరించాడు. ఏడవదానిని బండరాతిమీద కొట్టగా అది ఆకాశంలో నిలిచి, కంసుడి మరణంగూర్చి చెప్పి వెళ్లిపోతుంది.

వ్రేపల్లెలో కృష్ణుడు కంసుడు పంపిన పూతనను, శకటుడిని సంహరించాడు. తనను బంధించిన రోటితో అర్జున వృక్షాలను కూల్చాడు. తరువాత కృష్ణుడిని రక్షించుకోవడానికి నందాదులు బృందావనం చేరారు. అక్కడ కృష్ణుడు గోపకులను పీడిస్తున్న కాళియసర్పాన్ని అణచి, కాళిందీనదిని ఉపయోగంలోకి తెచ్చాడు. తమను చంపడానికి గాడిదరూపంలో తిరుగుతున్న ధేనుకుడిని, గోపబాలకులలో కలిసి ఆటల నెపంతో వచ్చిన ప్రలంబుడిని బలరాముడు సంహరించాడు. గోవర్ధనపర్వతాన్ని ఎత్తి ఇంద్రుడు పెట్టిన ఇబ్బందులనుండి కృష్ణుడు గోవులను, గోపకులను కాపాడాడు. గోవులను కాపాడినందుకు ఇంద్రుడు కృష్ణుడిని గోవులకు ఇంద్రుడుగా అభిషేకించి, గోవిందుడు అని సత్కరించాడు. భయంకరమైన ఎద్దురూపంలో వచ్చిన అరిష్టుడు అనే రాక్షసుడిని కృష్ణుడు కొమ్ములు పట్టి, కడుపులో కుమ్మి సంహరించాడు. గుఱ్ఱంరూపంలో వచ్చిన కేశి అనే రాక్షసుడిని కృష్ణుడు ఆ గుఱ్ఱంనోట్లో చేయి దూర్చి, పెద్దది చేసి చంపివేశాడు. కేశి అనే రాక్షసుడిని చంపినందువల్ల స్వామి కేశవుడు అయ్యాడు.

పిదప కంసుడి ఆహ్వానంమీద ధనుర్యాగానికి బలరాముడితో కలిసి, కృష్ణుడు మధురకు వెళ్లాడు. అక్కడ కంసుడి రజకుడిని, మాలాకారుడిని సుగంధద్రవ్యాలు సమకూర్చే కుబ్జను అనుగ్రహించాడు. యాగధనుస్సును విరిచాడు. రామకృష్ణులు కువలయాపీడం అనే ఏనుగును చంపి, దాని దంతాలను ఆయుధాలుగా ధరించారు. కంసుడు నియోగించిన చాణూరుడు అనే మల్లుడిని కృష్ణుడు, ముష్టికుడు అనేవాడిని బలరాముడు మల్లయుద్ధంలో సంహరించారు. కృష్ణుడు కంసుడు కూర్చున్న సింహాసనంమీదికి దూకి, అతడిని కిందికి లాగి, మీదపడి చంపివేశాడు. సింహాసనంపై ఉగ్రసేనుడిని నిలిపారు. దేవకీవసుదేవులు వారిని ఆనందంతో ఆశీర్వదించారు.

పిదప బలరామకృష్ణులు సాందీపనివద్ద సమస్త విద్యలు అభ్యసించారు. మరణించిన గురుకుమారుణ్ణి తెచ్చియిచ్చారు. జరాసంధుడు మధురానగరంపై 18 సార్లు దండెత్తి కృష్ణుడిచేతిలో ఓడిపోయి వెనుదిరిగిపోయాడు. అదే సమయంలో మరొకవైపు నుంచి కాలయవనుడు దండెత్తేవాడు. యాదవుల రక్షణకోసం కృష్ణుడు సముద్రుడు ఇచ్చిన స్థలంలో సముద్రమధ్యంలో ద్వారకా నగరాన్ని నిర్మించి, మధురవాసులను ద్వారకకు చేర్చాడు. కాలయవనుడిని ముచుకుందుడి కంటిమంటలకు ఆహుతి చేశాడు. ముచుకుందుడికి ఉత్తమగతులు అనుగ్రహించాడు.

కృష్ణుడు రుక్మిణిని తీసుకువెళ్లి వివాహం చేసుకున్నాడు. కృష్ణుడికి కాళింది, మిత్రవింద, సత్య, నాగ్నజితి, జాంబవతి, రోహిణి, సుశీల అనే మరొక ఏడుగురు పత్నులు అయ్యారు. రుక్మిణీకృష్ణుల కుమారుడు ప్రద్యుమ్నుడు. అతడు శంబరుడు అనే రాక్షసుడిని సంహరించాడు. రుక్మిణి సోదరుడైన రుక్మి మనుమరాలి వివాహంలో జూదంలో తగవులై రుక్మినీ, అతడి వైపున్న రాజులను బలరాముడు సంహరించాడు. దేవమాత అదితి కుండలాలు నరకుడు అపహరించాడనీ ఇప్పించమనీ ఇంద్రుడు కృష్ణుడిని కోరాడు. కృష్ణుడు సత్యభామను తీసుకుని గరుత్మంతుడిపై వెళ్లి, నరకాసురుడిని చక్రాయుధంతో సంహరించాడు. అడ్డం వచ్చిన మురాసురుణ్ణి చంపాడు. అదితి కుండలాలు ఆమెకు ఇవ్వడానికి స్వర్గానికి వెళ్లాడు. అక్కడ నందనవనంలోని పారిజాతంవృక్షం కావాలన్నది సత్య. ఇంద్రుడు ఇవ్వలేదు. యుద్ధంలో దిక్పాలకులను, దేవతలను జయించి, పారిజాతం ఇంటికి తెచ్చుకున్నాడు కృష్ణుడు. నరకుడి చెరసాలనుండి విడిపించి తెచ్చిన పదహారువేలమంది కన్యలను వివాహం చేసుకున్నాడు. వీరివలన కృష్ణుడికి ఒకలక్ష ఎనభైవేలమంది కుమారులు కలిగారు.

ప్రద్యుమ్నుడి కుమారుడు అనిరుద్ధుడు. బాణాసురుడి కుమార్తె ఉష, కలలో కలిసిన అనిరుద్ధుడిని గూర్చి చెప్పగా ఆమెసఖి చిత్రలేఖ అతడిని అంతఃపురానికి చేర్చింది. ఆ విషయంలో జరిగినయుద్ధంలో కృష్ణుడు బాణుడినీ, అతని పక్షాన వచ్చిన పరమేశ్వరాదులనూ జయించి, అనిరుద్ధుడినీ, ఉషనూ ద్వారకకు తీసుకొనివెళ్లాడు. ఇంకా కృష్ణుడు తనవేషం ధరించి, తానే వాసుదేవుడినని చెప్పుకుంటున్న పౌండ్రకుడినీ, అతడికి సాయంగా వచ్చిన కాశిరాజునూ యుద్ధంలో సంహరించాడు. ప్రతీకారం తలపెట్టిన కాశిరాజు కుమారుడినీ, అతడికి తోడైవచ్చిన మహాకృత్యనూ కూల్చి, సుదర్శనచక్రం కాశీరాజ్యాన్ని దహించింది.

బలరామ మహత్త్వం

బలరాముడు తన ఆయుధమైన నాగలితో యమునాప్రవాహం దారి మళ్లించాడు. జాంబవతికొడుకైన సాంబుడు దుర్యోధనుడి కూతురిని అపహరించాడు. వారు సాంబుడిని ఓడించి బంధించారు. కోపించిన యాదవులు కౌరవులను చంపాలనుకున్నారు. బలరాముడు వారించి, సాంబుడిని తీసుకురావడానికి హస్తినకు వెళ్లాడు. సాంబుడిని విడిచిపెట్టమన్నాడు. కౌరవులు తిరస్కరించారు. బలరాముడు కోపంతో హస్తిననగరం కోటను నాగలి గుచ్చి లాగాడు. నగరం ఊగిసలాడింది. కౌరవులు కాళ్లబేరానికి వచ్చి, సాంబుడిని భార్యతోసహా అప్పగించారు.

నరకాసురుడి స్నేహితుడైన ద్వివిదుడు అనే వానరుడు నరకవధకు ప్రతీకారంగా రకరకాలుగా లోకాలను హింసించసాగాడు. బలరాముడు తన స్త్రీలతో ఉన్నచోటికి వచ్చి వారిని అపహాస్యం చేశాడు. బలరాముడు ముసలాయుధం(రోకలి)తో ద్వివిదుడిని మోది సంహరించాడు.

వైకుంఠ గమనం

కృష్ణసంకల్పంతో మహర్షులశాపం కారణంగా సాంబుడి కడుపున ముసలం పుట్టింది. దానితో యాదవవంశం నాశనమైంది. తాను భూమిపై అవతరించిన ప్రయోజనం నెరవేరడంతో శ్రీకృష్ణుడు అవతారం ముగించి వైకుంఠధామానికి వెళ్లిపోయాడు.

విష్ణువు అవతారాలు

తరువాత మునులకోరికపై వ్యాసుడు విష్ణువు అవతారాలనుగూర్చి చెప్పాడు. మహాప్రళయం తరువాత అంతా జలమై ఉండగా ఆ జలం మధ్యలో శ్రీమహావిష్ణువు ఒక్కడే ఉన్నాడు. ఆ సమయంలో మధువు, కైటభుడు అనే రాక్షసులు కోరగా యుద్ధం చేసి, వారిని సంహరించాడు. తరువాత అక్కడే పౌష్కరం అనే పేరుతో స్వామి అవతరించాడు. లోకశ్రేయస్సుకోసం యజ్ఞవరాహం రూపం ధరించి, సముద్రంలో మునిగిపోయిన భూమిని కోరలతో ఉద్ధరించాడు. కృతయుగంలో హిరణ్యకశిపుడు అనే రాక్షసుడు బ్రహ్మవరాలతో లోకాలను పీడిస్తుండగా, నరసింహరూపం ధరించి, అతడిని చీల్చి చెండాడాడు. తరువాత వామనుడుగా అవతరించాడు. బలి యజ్ఞం చేస్తుండగా విజృంభించిన రాక్షసులను సంహరించి, త్రివిక్రముడై లోకాలను ఆక్రమించాడు. లోకాలను ఇంద్రుడికి అధీనం చేశాడు. ఆ తరువాత దత్తాత్రేయుడుగా అవతరించి వేదధర్మాలను పునరుద్ధరించాడు. పరశురాముడుగా అవతరించి, క్షత్రియసంహారం చేశాడు. ఇరవైనాలుగవ త్రేతాయుగంలో శ్రీరాముడుగా అవతరించి, రావణాసురుడిని సంహరించాడు. కృష్ణుడుగా అవతరించి భూభారం తగ్గించాడు. ఇలా స్వామి అవతారాలు వేలసంఖ్యలో ఉన్నాయి.

మరణానంతర స్థితిగతులు

ఆ తరువాత మునులడుగగా జీవులు యమలోకానికి వెళ్లే మార్గంలోని బాధలనూ, వివిధ నరకాలలోని యాతనలనూ విస్తారంగా వివరించి చెప్పాడు వ్యాసుడు. ఆ బాధలు లేకుండా ఉత్తమగతులను పొందడానికి ఏం చేయాలో ఆ ధార్మికమార్గాలను కూడా వివరించాడు. పిదప శరీరం నశించే విధానమూ, తిరిగి జీవుడు జన్మించే విధానమూ, ఏయే కర్మలవలన ఏయే జన్మలు కలుగుతాయనే అంశాలనూ వివరించి చెప్పాడు. మరణించిన తరువాత కొడుకులు చేయవలసిన శ్రాద్ధవిధిని, పితరులను వరాహమూర్తి ఉద్ధరించిన విధానాన్ని ప్రవచించాడు వ్యాసమహర్షి

డా॥ అంబడిపూడి నాగభూషణం

బ్రహ్మమహాపురాణం

శ్రీగణేశాయ నమః.

శ్రీమహాగణాధిపతికి నమస్కారం.

అథ మహర్షివేదవ్యాసప్రణీతం బ్రహ్మపురాణమారభ్యతే.

వేదవ్యాసమహర్షి వెలువరించిన బ్రహ్మపురాణం ప్రారంభింపబడుతున్నది.

మొదటి సంపుటం

ప్రథమోఽధ్యాయః - మొదటి అధ్యాయం

దేవాసురోత్పత్తికథనమ్ - దేవాసురోత్పత్తికథనం

ఓం నమో భగవతే వాసుదేవాయ.

ప్రణవస్వరూపుడైన భగవంతుడు వాసుదేవునకు నమస్కారం.

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం చైవ తతో జయముదీరయేత్ ॥ 1 ॥

నారాయణమహర్షికీ, నరమహామునికీ, పురుషోత్తముడైన శ్రీమహావిష్ణువునకూ, వాగ్దేవి సరస్వతికీ ముందుగా నమస్కారం చేసి, ఆతర్వాత అష్టాదశ (జ= 8 య=1. అంకానాం వామతో గతిః. 18)పురాణాలను చెప్పాలి(వినాలి).

యస్మాత్ సర్వమిదం ప్రపఞ్చరచితం మాయాజగజ్జాయతే
యస్మింస్తిష్ఠతి లీయతే తు సమయే కల్పానుకల్పే పునః ।
యం ధ్యాత్వా మునయః ప్రపఞ్చరహితం విన్దన్తి మోక్షం ధ్రువం
తం వన్దే పురుషోత్తమాఖ్యమమలం నిత్యం విభుం నిశ్చలమ్ ॥ 2 ॥

దీనిని పరమాత్మ సృష్టించాడు. ఈజగత్తు ఆపరమాత్మలోనే నిలిచిఉన్నది. ప్రళయసమయంలో తిరిగి ఆపరమాత్మలోనే కలిసిపోతున్నది. ప్రతికల్పంలోనూ ఇలా పరమాత్మ జగత్తు సృష్టిస్థితిలయాలు చేస్తున్నాడు. నిరంతరం మననంచేసేవారు ఆపరమాత్మనే ధ్యానించి ఈకనబడే మాయాప్రపంచానికి అతీతమూ, శాశ్వతమూ ఐన మోక్షాన్ని పొందుతున్నారు. ఆపరమాత్మ, ప్రకృతికి సంబంధించినవికారాలు లేనివాడు. అన్నికాలాలలోనూ ఉంటాడు. సర్వత్ర నిండిఉంటాడు. స్థిరంగా ఉంటాడు. పురుషోత్తముడు అనిచెప్పబడతాడు. అటువంటిపరమాత్మకు నమస్కరిస్తున్నాను.

యం ధ్యాయన్తి బుధాస్సమాధిసమయే శుద్ధం వియత్సన్నిభం
నిత్యానన్దమయం ప్రసన్నమమలం సర్వేశ్వరం నిర్గుణమ్ ।
వ్యక్తావ్యక్తపరం ప్రపఞ్చరహితం ధ్యానైకగమ్యం విభుం
తం సంసారవినాశహేతుమజరం వన్దే హరిం ముక్తిదమ్ ॥ 3 ॥

ఆ పరమాత్మ అద్వితీయుడు. ఆకాశంలాగా అంతటా వ్యాపించి ఉన్నాడు. ఎల్లపుడు ఆనందంతో నిండి ఉంటాడు. దయామయుడు. ప్రకృతిమాలిన్యాలు లేనివాడు. సకలలోకాలకు అధిపతి. సత్త్వరజస్తమోగుణాలు మూడూ లేనివాడు. తెలిసీ, తెలియనిస్థితికి అతీతమైన స్థితిలో ఉన్నవాడు. దృశ్యమైన ప్రపంచానికి భిన్నమైనవాడు.

ధ్యానంచేత మాత్రమే పొందదగినవాడు. హిరణ్యగర్భుడు మొదలైనవివిధరూపాలతో ఉంటాడు. మనస్సును ఏకాగ్రంగా నిలిపినసమయంలో జ్ఞానులు అటువంటి పరమాత్మను ధ్యానం చేస్తుంటారు. అతడు చావుపుట్టుకలరూప మైనసంసారం లేకుండా పోవడానికి కారణమైనవాడు. మార్పు లేనివాడు. మోక్షాన్ని ఇస్తాడు. ఆ శ్రీహరికి నమస్కరిస్తున్నాను.

సుపుణ్యే నైమిషారణ్యే పవిత్రేఽథ మనోహరే ।
నానామునిజనాకీర్ణే నానాపుష్పోపశోభితే ॥ 4 ॥

నైమిషారణ్యం పుణ్యప్రదేశం. అది పవిత్రం. మనోహరం, అనేకమహర్షులతో నిండినది. రకరకాలపుష్పాలతో అందంగా కనబడుతున్నది.

శాలైశ్చ కర్ణికారైశ్చ పనసై ర్ధవఖాదిరైః ।
ఆమ్రజమ్బూకపిత్థైశ్చ న్యగ్రోధై ర్దేవదారుభిః ॥ 5 ॥

అశ్వత్థైః పారిజాతైశ్చ చన్దనాగురుపాటలైః ।
వకులై స్సప్తపర్ణైశ్చ పుంనాగై ర్నాగకేసరైః ॥ 6 ॥

శాలై స్తాలై స్తమాలై శ్చ నారికేలై స్త థార్జునైః ।
అన్యై శ్చ బహుభిర్ వృక్షై శ్చమ్పకాద్యైశ్చ శోభితే ॥ 7 ॥

మద్ది, కొండగోగు, పనస, ఉమ్మెత్త, చంద్ర, మామిడి, నేరేడు, వెలగ, మఱ్ఱి, దేవదారు వృక్షాలతోనూ, రావి, పారిజాతం, చందనం, అగురు, పాటలం, పొగడ, ఏడాకులఅరటి, పున్నాగం, నాగకేసరం (పూలు అధికంగా పూసే ఒకానొకవృక్షం) వృక్షాలతోనూ, కలపకు పనికివచ్చే ప్రత్యేకమైనచెట్లు, తాటిచెట్లు, చీకటిచెట్లు, కొబ్బరిచెట్లు, జువ్విచెట్లు, ఇంకా సంపంగి మొదలుగా అనేకమైన ఇతరవృక్షాలతోనూ, ఆ నైమిశారణ్యం ప్రకాశిస్తున్నది.

నానాపక్షిగణాకీర్ణే నానామృగగణై ర్యుతే ।
నానాజలాశయైః పుణ్యై ర్దీర్ఘికాద్యై రలఙ్కృతే ॥ 8 ॥

ఆ నైమిషారణ్యం రకరకాలపక్షులగుంపులతో నిండిఉన్నది. రకరకాల జంతువులగుంపులతో కూడిఉన్నది. పుణ్యప్రదాలైన వివిధసరస్సులు, దిగుడుబావులు మొదలైన వానితో అలంకరింపబడి ఉన్నది.

బ్రాహ్మణైః క్షత్రియై ర్వైశ్యై శ్శూద్రై శ్చాన్యైశ్చ జాతిభిః ।
వానప్రస్థై ర్గృహస్థైశ్చ యతిభి ర్బ్రహ్మచారిభిః ।
సమ్పన్నై ర్గోకులై శ్చైవ సర్వత్ర సమలఙ్కృతే ॥ 9 ॥

ఆ నైమిషారణ్యం బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు ఇంకా అనేకమైన జాతులమానవులతోనూ, బ్రహ్మచారులు, వానప్రస్థులు, గృహస్థులు, సన్న్యాసులు అనేనాలుగుఆశ్రమాలలోనివారితోనూ,సంపదలకు మూల మైన ఆవులజాతులతోనూ నిండి, అంతటా అందంగా ఉన్నది.

యవగోధూమచణకై ర్మాషముద్గతిలేక్షుభిః ।
శాలిభిశ్చ తథా మేధ్యై స్సస్యై శ్చాన్యైశ్చ శోభితే ॥ 10 ॥

యవలు, గోధుమలు, సెనగలు, మినుములు, పెసలు, నువ్వులు, చెఱకు, పైరులతోనూ, అదే విధంగా యజ్ఞానికి ఉపయోగించే ఇతరమైన మొక్కలతోనూ ప్రకాశించుచున్నది.

తత్ర దీప్తే హుతవహే హూయమానే మహామఖే ।
యజతాం నైమిషేయాణాం సత్రే ద్వాదశవార్షికే ॥ 11 ॥
ఆజగ్ము స్తత్ర మునయ స్తథాన్యేఽ పి ద్విజాతయః ॥12 ॥

నైమిషారణ్యంలో నివసించే మునులు 12 సంవత్సరాల అవధి కలిగిన గొప్ప సత్రయాగం చేస్తున్నారు. అక్కడ ప్రజ్వరిల్లుతున్న అగ్ని(గుండం)లో హోమం చేస్తుండగా, ఆయాగస్థలానికి మహర్షులు, ఇంకా, ఇతరులైన బ్రాహ్మణులు, (క్షత్రియులు, వైశ్యులు) కూడ వచ్చారు.

తా నాగతాన్ ద్విజాం స్తే తు పూజాం చక్రు ర్యథోచితమ్ ।
తేషు తత్రోపవిష్టేషు ఋత్విగ్భి స్సహితేషు చ ॥13 ॥

తత్రాజగామ సూతస్తు మతిమాన్ లోమహర్షణః ।
తం దృష్ట్వా తే మునివరాః పూజాం చక్రు ర్ముదాన్వితాః ॥ 14 ॥

యజ్ఞం చేస్తున్న నైమిషారణ్య వాసులు యాగానికి వచ్చిన ఆమహర్షులనూ, ఇతరులనూ సముచితంగా పూజించారు. యజ్ఞం చేసే బ్రాహ్మణులతో సహా వాళ్లు అందరూ అక్కడ సుఖంగా ఆసీనులైనారు. ఆసమయంలో వివేకవంతుడైన లోమహర్షణుడు (మంచిమాటలు చెప్పి, వినేవాళ్లకు ఆనందంతో పులకలు గలుగజేసేవాడు) అనేపేరు గలిగినసూతుడు అక్కడికి వచ్చాడు. అక్కడి మునిశ్రేష్ఠులు సూతుణ్ణి చూచి, ఆనందంతో అతడినిపూజించారు.

సోఽ పి తాన్ ప్రతిపూజ్యైవ సంవివేశ వరాసనే ।
కథాం చక్రు స్తదాఽ న్యోన్యం సూతేన సహితా ద్విజాః ॥ 15 ॥

లోమహర్షణుడు కూడ ఆమునులకు ప్రతిపూజలు చేసి, శ్రేష్ఠమైన ఆసనంలో కూర్చున్నాడు. అపుడు సూతుడితో సహా అక్కడివారు అందరూ పరస్పరం మాట్లాడుకున్నారు.

కథాన్తే వై వ్యాసశిష్యం పప్రచ్ఛు స్సంశయం ముదా ।
ఋత్విగ్భి స్సహితా స్సర్వే సదస్యై స్సహ దీక్షితాః ॥ 16 ॥

మాటలు అయినతరువాత యజ్ఞదీక్షలో ఉన్నవారు అందరూ ఋత్విక్కులు, సభలోనివారితో కలిసి, సంతోషంతో తమ సందేహాన్ని గురించి వ్యాసమహర్షిశిష్యుడైన లోమహర్షణుడిని ఇలా అడిగారు.

మునయ ఊచుః:-మునులు ఇలా అన్నారు.

పురాణాగమశాస్త్రాణి సేతిహాసాని సత్తమ ।
జానాసి దేవదైత్యానాం చరితం జన్మ కర్మ చ ॥17 ॥

సాధువులలో శ్రేష్ఠుడా! బ్రాహ్మం మొదలైన పురాణాలు, వేదాలు, ధర్మశాస్త్రాలు, భారతం మొదలైన ఇతిహాసాలు, దేవతలచరిత్రలు, దైత్యులచరిత్రలు, వారిపుట్టుకలు, నడవడులు అన్నీ నీకు చక్కగా తెలుసు.

న తేఽ స్త్యవిదితం కిఞ్చిద్ వేదే శాస్త్రే చ భారతే ।
పురాణే మోక్షశాస్త్రే చ సర్వజ్ఞోఽసి మహామతే ॥ 18 ॥

గొప్పవివేకం కలవాడా! వేదాలలో గానీ, శాస్త్రాలలో గానీ, భారతంలో గానీ, పురాణాలలో గానీ, ఉపనిషత్తులలో గానీ, నీకు తెలియనిది కొంచెం కూడా లేదు. నీవు సమస్తమూ తెలిసినవాడివి.

యథా పూర్వమిదం సర్వ ముత్పన్నం సచరాచరమ్ ।
ససురాసురగంధర్వం సయక్షోరగరాక్షసమ్ ॥ 19 ॥

శ్రోతు మిచ్ఛామహే సూత బ్రూహి సర్వం యథా జగత్ ।
బభూవ భూయశ్చ యథా మహాభాగ భవిష్యతి ॥ 20 ॥

దేవతలు, అసురులు, గంధర్వులు, యక్షులు, నాగులు, రాక్షసులతో సహా, స్థావరజంగమాత్మక మైన సమస్తమైన సృష్టి పూర్వం ఎలా ఏర్పడిందో, (జగత్ సృష్టిని గురించి) వినగోరుతున్నాము. మహాత్మా, సూతమహర్షీ, ఈ జగత్తు సమస్తమూ ఎలా ఉన్నదో (జగత్ స్థితీ), భవిష్యత్కాలంలో ఏమి కాబోతున్నదో (లయమూ), చెప్పవలసినది.

యత శ్చైవ జగత్ సూతం యత శ్చైవ చరాచరమ్ ।
లీన మాసీ త్తథా యత్ర లయ మేష్యతి యత్ర చ ॥ 21 ॥

చరాచరమైనఈజగత్తు దేనినుంచి పుట్టింది, ఎక్కడ దేనిని ఆశ్రయించుకుని ఉన్నది, అలాగే, ఎక్కడ లయం పొందబోతున్నది, తెలుపవలసింది.

లోమహర్షణ ఉవాచ :–లోమహర్షణుడు ఇలా చెప్తున్నాడు.

అవికారాయ గుహ్యాయ నిత్యాయ పరమాత్మనే ।
సదైకరూపరూపాయ విష్ణవే సర్వజిష్ణవే ॥ 22 ॥

నమో హిరణ్యగర్భాయ హరయే శఙ్కరాయ చ ।
వాసుదేవాయ తారాయ సర్గస్థిత్యన్తకర్మణే ॥ 23 ॥

పరమాత్మ ఉండటం, పుట్టటం, పెరగటం, తగ్గటం, మార్పుచెందటం, నశించటం అనే ఆరువిధాలైన ప్రకృతి వికారాలు లేనివాడు. తెలియరానివాడు. భూతభవిష్యద్వర్తమానకాలాలు మూడింట నిలిచి ఉండేవాడు. నిత్యమూ ఒకేరూపంచేత తెలియబడేవాడు. అన్నింటా ప్రవేశించి ఉన్నవాడు. సమస్తాన్ని జయించేవాడు. ఆయనే బ్రహ్మ, విష్ణువు, శంకరుడు, వాసుదేవుడు. తరింపజేసేవాడు. సృష్టి, స్థితి, లయాలు చేసేవాడు. అటువంటిపరమాత్మకు నమస్కారం.

ఏకానేకస్వరూపాయ స్థూలసూక్ష్మాత్మనే నమః ।
అవ్యక్తవ్యక్తభూతాయ విష్ణవే ముక్తిహేతవే ॥ 24 ॥

ఆపరమాత్మ ఒక్కడే. అనేకంగా సమస్తమూ తానే అయినవాడు. ఆకారం గలిగినవాడూ, నిరాకారమైనవాడూ ఆయనే. తెలియబడేవాడూ, తెలియరానివాడూ ఆయనే. అంతటా నిండిఉన్నవాడు. మోక్షానికి కారణమైన (మోక్షాన్ని ప్రసాదించే) వాడు. అటువంటి పరమాత్మకు నమస్కారం.

సర్గస్థితివినాశానాం జగతో యో జగన్మయః ।
మూలభూతో నమస్తస్మై విష్ణవే పరమాత్మనే ॥ 25 ॥

లోకాల సృష్టి, స్థితి, లయాలకు ఆధారం ఆపరమాత్మే. జగత్తు అంతా ఆపరమాత్మలో నిండిఉన్నది. జగత్తు అంతటా ఆపరమాత్మ తానయి నిండిఉన్నాడు. అటువంటి పరమాత్మకు నమస్కారం.

ఆధారభూతం విశ్వస్య మహతశ్చాప్యణీయసః ।
ప్రణమ్య సర్వభూతస్థమచ్యుతం పురుషోత్తమమ్ ॥ 26 ॥

ఆపరమాత్మ అన్నింటికంటె పెద్దదీ, అన్నింటికంటె చిన్నదీ అయిన సమస్త ప్రపంచానికి ఆధారమైనవాడు. అన్ని పదార్థాలలోనూ నిలిచిఉన్నవాడు. తనరూపసామర్థ్యాలనుండి ఎప్పటికీ జారిపోనివాడు. నారాయణుడు.

జ్ఞానస్వరూప మత్యన్తం నిర్మలం పరమార్థతః ।
త మే వార్థస్వరూపేణ భ్రాన్తిదర్శనతః స్థితమ్ ॥ 27 ॥

యథార్థం తెలియగలిగిన వివేకులు జ్ఞానమే ఆకారమైనవాడుగా, ఎంతమాత్రమూ త్రిగుణసంబంధం లేనివాడుగా పరమాత్మగా దర్శిస్తారు. కనబడే దానిని సత్యంగా చూచే ఇతరులు జగత్తును కేవలం జగత్తుగాచూస్తారు.

విష్ణుం గ్రసిష్ణుం విశ్వస్య స్థితౌ సర్గే తథా ప్రభుమ్ ।
సర్వజ్ఞం జగతామీశమజమక్షయమవ్యయమ్ ॥ 28 ॥

అన్నింటిలోనూ నిండి ఉన్నవాడు. సమస్తమైన సృష్టినీ మింగేవాడు. జగత్తును సృష్టించడానికీ, రక్షించడానికీ, సమర్థుడు. సర్వమూ తానే అయినవాడు. లోకాలకు అధిపతి. పుట్టుక లేనివాడు. తరగనివాడు. నశించనివాడు.

ఆద్యం సూక్ష్మం చ విశ్వేశం బ్రహ్మాదీన్ ప్రణిపత్య వై ।
ఇతిహాసపురాణజ్ఞం వేదవేదాఙ్గపారగమ్ ॥ 29 ॥

సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞం పరాశరసుతం ప్రభుమ్ ।
గురుం ప్రణమ్య వక్ష్యామి పురాణం వేదసమ్మితమ్ ॥ 30 ॥

పరమాత్మ సమస్తానికీ మొదటివాడు. అగోచరమైనవాడు. అటువంటి జగన్నాథుడికి ప్రణామం చేసి, బ్రహ్మ మొదలుగా కలిగినఇతరదేవతలకూ, సాష్టాంగనమస్కారం చేసి, ఆతర్వాత ఇతిహాసాలు, పురాణాలు, తెలిసినవాడూ, నాలుగు వేదాలనూ, ఆరు వేదాంగాలనూ, సంపూర్ణంగా గ్రహించినవాడూ, సమస్తశాస్త్రాల అర్థాలనూ, పరమార్థాలనూ చక్కగా తెలిసినవాడూ, పరాశరమహర్షి తనయుడూ, అందరికీ గురువూ అయిన వ్యాసమహర్షికి నమస్కరించి, వేదంతో సమానమైన పురాణాన్ని చెపుతాను.

కథయామి యథా పూర్వం దక్షాద్యైర్మునిసత్తమైః ।
పృష్టః ప్రోవాచ భగవానబ్జయోనిః పితామహః ॥ 31 ॥

పూర్వం ఒకానొకప్పుడు దక్షుడు మొదలైన మహర్షులు అడిగినపుడు, జ్ఞాని, పద్మగర్భుడు, అయిన బ్రహ్మదేవుడు చెప్పిన ప్రకారంగా చెప్తాను.

శృణుధ్వం సంప్రవక్ష్యామి కథాం పాపప్రమోచనీమ్ ।
కథ్యమానాం మయా చిత్రాం బహ్వర్థీం శ్రుతివిస్తరామ్ ॥ 32 ॥

ఈ కథ పాపాలను పూర్తిగా తొలగిస్తుంది. ఆశ్చర్యం కలిగిస్తుంది. అనేకమైన ప్రయోజనాలను చేకూరుస్తుంది. వేదార్థాలను చక్కగా వివరిస్తుంది. అటువంటికథను వివరంగా చెప్తాను, వినండి.

య శ్చేమాం ధారయే న్నిత్యం శృణుయాద్వాప్యభీక్ష్ణశః ।
స్వవంశధారణం కృత్వా స్వర్గలోకే మహీయతే ॥ 33 ॥

ఈపురాణకథను నిత్యమూ స్మరించేవాడూ, విన్నవాడూ, తనవంశాన్ని వృద్ధిచేసి, మరణానంతరం స్వర్గ లోకంలో వెలుగొందుతాడు.

అవ్యక్తం కారణం యత్తన్నిత్యం సదసదాత్మకమ్ ।
ప్రధానం పురుష స్తస్మాన్నిర్మమే విశ్వమీశ్వరః ॥ 34 ॥

బయటకు వెలువడకున్నదీ, జగత్తుకు కారణమైనదీ, శాశ్వతమైనదీ, ఉన్నదీ, లేనిదీ అయినది ప్రధానం (ప్రకృతి) అనబడుతుంది. పరమాత్మ చైతన్యస్వరూపుడై ఆ ప్రకృతినుండి ఈవిశ్వాన్ని నిర్మించాడు. (హరివంశం. హరివంశపర్వం 1-29 నుండి శ్లోకాలు వరసగా దాదాపుగా ఇలాగే ఉన్నాయి)

తం బుధ్యధ్వం మునిశ్రేష్ఠా బ్రహ్మాణమమితౌజసమ్ ।
స్రష్టారం సర్వభూతానామజం నారాయణం పరమ్ ॥ 35 ॥

మునివరులారా, అది మిక్కిలి ప్రకాశవంత మైన బ్రహ్మ. చరాచరాత్మక మైన సమస్తజగత్తును సృష్టిస్తుంది. దానికి పుట్టుకలేదు. అదే సర్వోత్తముడైన నారాయణుడు అని గ్రహించండి.

అహఙ్కారస్తు మహతస్తస్మాద్భూతాని జజ్ఞిరే ।
భూతభేదాశ్చ భూతేభ్య ఇతి సర్గ స్సనాతనః ॥ 36 ॥

మహత్తత్త్వంనుండి అహంకారం పుట్టింది. ఆ అహంకారంనుండి పంచమహాభూతాలు పుట్టాయి. పంచభూతాలనుండి సమస్తమైన ఇతర చరాచరకోటి ఆవిర్భవించింది. ఇది పురాతనమైన సృష్టిక్రమం.

విస్తారావయవం చైవ యథాప్రజ్ఞం యథాశ్రుతమ్ ।
కీర్త్యమానం శృణుధ్వం వ స్సర్వేషాం కీర్తివర్ధనమ్ ॥ 37 ॥
కీర్తితం స్థిరకీర్తీనాం సర్వేషాం పుణ్యకర్మణామ్ ।

గురువులవలన విన్నదానినీ, నాబుద్ధి గ్రహించినదానినీ అనుసరించి, ఆసృష్టిక్రమాన్ని గురించి అన్ని విషయాలనూ విస్తారంగా చెప్తాను. దీనిని వినడంచేత మీఅందరికీ కీర్తి పెంపొందుతుంది. వినండి. ధర్మకార్యాలను చేసి లోకంలో సుస్థిరమైన కీర్తిని సంపాదించుకున్న పుణ్యాత్ములను గురించి చెప్పటం అందరికీ కీర్తిని (చిత్తశుద్ధిని) గలిగిస్తుంది.

తత స్స్వయంభూ ర్భగవాన్ సిసృక్షు ర్వివిధాః ప్రజాః ॥ 38 ॥

తనకు తానుగా పుట్టినపరమాత్మకు ఆతరువాత అనేకవిధాలైన ప్రజలను సృష్టించాలనే కోరిక కలిగింది.

అప ఏవ ససర్జాదౌ తాసు వీర్య మథాసృజత్ ।
ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూనవః ॥ 39 ॥

పరమాత్మ మొట్టమొదట నీళ్లను సృష్టించాడు. ఆనీళ్లలో తనవీర్యాన్ని (సృష్టి చేసేశక్తిని) ఉంచాడు. నీళ్లనే నారములు అంటారు. నీళ్ళే మానవకోటిని సృష్టిస్తాయి.

అయనం తస్య తాః పూర్వం తేన నారాయణ స్స్మృతః ।
హిరణ్యగర్భ(వర్ణ) మభవ త్తదణ్డ ముదకేశయమ్ ॥ 40 ॥

మొదట్లో నీళ్ళే ఆపరమాత్మకు నివాసస్థానం. అందుకే పరమాత్మను నారాయణుడు అంటారు. నీళ్లపై(నీళ్లనే శయనంగా చేసుకుని దానిపై) తేలుతున్న వీర్యమే గ్రుడ్డు అయింది. ఆగ్రుడ్డు లోపల బంగారం కలిగి ఉంది.

తత్ర జజ్ఞే స్వయం బ్రహ్మా స్వయంభూరితి న శ్రుతమ్ ।

హిరణ్యవర్ణో(గర్భో) భగవానుషిత్వా పరివత్సరమ్ ॥ 41 ॥

తదణ్డ మకరోద్ ద్వైధం దివం భువ మథాపి చ ।
తయో శ్శకలయో ర్మధ్య ఆకాశ మకరోత్ ప్రభుః ॥ 42 ॥

అక్కడే (ఆగ్రుడ్డులోపల ఉన్నబంగారంనుండి) తనకు తానుగా బ్రహ్మ జన్మించాడు. స్వయంభువు అని మనం విన్నవాడు ఆతడే. ఆమహాత్ముడు బంగారంరంగులో ఉంటాడు. అతడు ఒక పరివత్సరం (భాగ. 3.11.14) ఆనీళ్ళలోనే ఉండి, ఆబంగారుగ్రుడ్డును రెండు ముక్కలు చేశాడు. ఒకటి స్వర్గం, మరొకటి భూమి. ఆరెండు ముక్కలనడిమిభాగంలో సర్వసమర్థుడైన ఆబ్రహ్మ ఆకాశాన్ని నిర్మించాడు.

అప్సు పారిప్లవాం పృథ్వీం దిశశ్చ దశధా దధే ।
తత్ర కాలం మనో వాచం కామం క్రోధమథో రతిమ్ ॥ 43 ॥

ససర్జ సృష్టిం తద్రూపాం స్రష్టు మిచ్ఛన్ ప్రజాపతీన్ ।
మరీచి మ త్ర్యఙ్గిరసౌ పులస్త్యం పులహం క్రతుమ్ ॥ 44 ॥

వసిష్ఠం చ మహాతేజా స్సోఽసృజత్ సప్త మానసాన్ ।
సప్త బ్రహ్మాణ ఇత్యేతే పురాణే నిశ్చయం గతాః ॥ 45 ॥

నీళ్ళమీద కదులుతున్న భూమినీ, పది దిక్కులనూ నిర్మించాడు. అందులోనే కాలాన్ని, మనస్సునూ,వాక్కునూ, కామాన్నీ, క్రోధాన్నీ, సుఖాన్నీ, సృష్టించాడు. స్వయంభువు ఆరూప మైనదానిని ఇంకా సృష్టింపదలచుకుని, అందుకోసం ప్రజాపతులను సృష్టించాడు. 1.మరీచి, 2.అత్రి, 3.అంగిరసుడు, 4.పులస్త్యుడు, 5.పులహుడు, 6.క్రతువు, గొప్పతేజోవంతు డయిన 7.వసిష్ఠుడు, అనే ఏడుగురిని మనసులోనే సృష్టించాడు. వీరే సప్తబ్రహ్మలు అనేపేరుతో పూర్వమే నిర్ణయింపబడ్డారు.

నారాయణాత్మకానాం తు సప్తానాం బ్రహ్మజన్మనామ్ ।
తతోఽసృజత్ పురా బ్రహ్మ రుద్రం రోషాత్మసంభవమ్ ॥ 46 ॥

నారాయణుడి అంశతో జన్మించిన ఈఏడుగురు బ్రహ్మతనయులకంటె పూర్వం బ్రహ్మ తనకోపం నుండి రుద్రుడిని సృష్టించాడు.

సనత్కుమారం చ విభుం పూర్వేషామపి పూర్వజమ్ ।
సప్తస్వేతా అజాయన్త ప్రజా రుద్రాశ్చ భో ద్విజాః ॥ 47 ॥

పూర్వులకంటె ఇంకా పూర్వుడు అయిన సనత్కుమారుడిని గూడ సృష్టించాడు. ఓ ద్విజులారా!, ఆ సప్తబ్రహ్మలు కూడా, ప్రజలనూ, రుద్రులనూ, సృష్టించారు.

స్కన్ద స్సనత్కుమారశ్చ తేజ స్సంక్షిప్య తిష్ఠతః ।
తేషాం సప్త మహావంశా దివ్యా దేవగణాన్వితాః ॥ 48 ॥

క్రియావన్తః ప్రజావన్తో మహర్షిభి రలఙ్కృతాః ।
విద్యుతో ఽశనిమేఘాంశ్చ రోహితేన్ద్రధనూంషి చ ॥ 49 ॥

వయాంసి చ ససర్జాదౌ పర్జన్యం చ ససర్జ హ ।
ఋచో యజూంషి సామాని నిర్మమే యజ్ఞసిద్ధయే ॥ 50 ॥

స్కందుడు, సనత్కుమారుడు మాత్రం తమతేజస్సును తమలోనే నిక్షేపించుకుని (సృష్టి చేయకుండా) ఉన్నారు. ఇంక సప్తబ్రహ్మలవలన సప్తమహావంశాలు ఏర్పడ్డాయి. దేవగణాలతో కూడ ఆకాశంలో పుట్టిన ఆసప్తవంశాలూ– కార్యశీలం గలిగినవి. ఉత్తమసంతానం గలిగినవి. మహర్షులతో వెలుగొందాయి. బ్రహ్మ ఆతరువాత మెరుపులనూ, పిడుగులనూ, మేఘాలనూ, ఇంద్రధనుస్సులనూ, పక్షులనూ మొదట సృష్టించాడు. వర్షాన్ని సృష్టించాడు. యజ్ఞకర్మలను నిర్వహించటంకోసం ఋక్కులను, యజుస్సులనూ, సామాలనూ (వేదాలను) నిర్మించాడు.

సాధ్యా నన్యాం స్తథా దేవా నిత్యేవమనుశుశ్రుమ ।
ఉచ్చావచాని భూతాని గాత్రేభ్యస్తస్య జజ్ఞిరే ॥ 51 ॥

సాధ్యులనూ, అలాగే ఇంకా ఇతరదేవతలనూ, సృష్టించినట్లుగా వింటాము. బ్రహ్మ తనశరీరావయవాలనుండి పెద్దవీ, చిన్నవీ అయిన వివిధచరాచరవస్తువులనూ సృష్టించాడు.

ఆయతం చ ప్రజాసర్గం సృజతోఽపి ప్రజాపతేః ।
సృజ్యమానాః ప్రజా నైవ వివర్ధన్తే యదా తదా ॥ 52 ॥

ద్విధా కృత్వాత్మనో దేహ మర్ధేన పురుషోఽభవత్ ।
అర్ధేన నారీ తస్యాం తు సోఽసృజద్ వివిధాః ప్రజాః ॥ 53 ॥

బ్రహ్మ విస్తారంగా సృష్టి చేస్తున్నప్పటికీ, తాను సృష్టించినవారు ప్రజలు వృద్ధిచెందకపోవుటతో అపుడు బ్రహ్మ–తనను తాను రెండుగా చేసుకున్నాడు. అందులో సగం దేహం పురుషుడు అయ్యాడు. రెండవసగం శరీరం స్త్రీ అయ్యాడు. ఆస్త్రీయందు బ్రహ్మ అనేకులైన ప్రజలను సృష్టించాడు.

దివం చ పృథివీం చైవ మహిమా వ్యాప్య తిష్ఠతి ।
విరాజ మసృజద్ విష్ణు స్సోఽసృజత్ పురుషం విరాట్ ॥ 54 ॥

తన మహిమతో బ్రహ్మ స్వర్గలోకాన్నీ, భూలోకాన్నీ (సృష్టిలోని అన్నింటా) నిండిపోయాడు. విష్ణువు (అంతటా వ్యాపించివున్న బ్రహ్మ) విరాట్పురుషుడిని సృష్టించాడు. ఆ విరాట్టు పురుషుడిని సృష్టించాడు.

పురుషం తం మనుం విద్యా త్తస్య మన్వన్తరం స్మృతమ్ ।
ద్వితీయం మానస స్యైత న్మనో రన్తర ముచ్యతే ॥ 55 ॥

ఆ పురుషుడే మనువు అని తెలుసుకోవాలి. ఆ మనువు తరమే మన్వంతరం. ఈ మన్వంతరం అనేది బ్రహ్మ మనసుతో సృష్టించినదానిలో రెండవదిగా చెప్పబడుతున్నది.

స వైరాజః ప్రజాసర్గే ససర్జ పురుషః ప్రభుః ।
నారాయణవిసర్గస్య ప్రజాస్తస్యాప్యయోనిజాః ॥ 56 ॥

ఆవిరాట్పురుషుడినుండి పుట్టినపురుషుడు (మనువు) సమర్థంగా ప్రజలను సృష్టి చేశాడు. నారాయణుని సృష్టిలోని ప్రజలవలెనే ఆమనువు సృష్టించినప్రజలు కూడ అయోనిజులు.

ఆయుష్మాన్ కీర్తిమాన్ ధన్యః ప్రజావాం శ్చ భవే న్నరః ।
ఆదిసర్గం విది త్వేమం యథేష్టాం చాప్నుయాద్ గతిమ్ ॥ 57 ॥

ఈ మొట్టమొదటి సృష్టిక్రమాన్ని గురించి తెలుసుకున్న మానవుడు ఆయుష్మంతుడు, కీర్తిమంతుడు అవుతాడు. తాను కోరుకున్న ఉత్తమస్థానాన్ని పొందుతాడు.

సిసృక్షుస్తు ప్రజాస్త్వేవ మాపవో వై ప్రజాపతిః ।
లేభే స పురుషః పత్నీం శతరూపా మయోనిజామ్ ॥ 58 ॥

ఈవిధంగా ప్రజలను సృష్టించగోరిన ఆపవుడు (నీళ్లలో ఉన్నవాడు, స్వాయంభువుడు) అనే ప్రజాపతి పురుషుడు (విరాట్టుచేత సృష్టింపబడినవాడు) అయోనిజ అయిన శతరూప అనే స్త్రీని భార్యగా పొందాడు. (వరుణుడికుమారుడు కావడంచేత వసిష్ఠుడికి కూడ ఆపవుడు అనేపేరు ఉంది. 11.193శ్లో.)

ఆపవస్య మహిమ్నా తు దివమావృత్య తిష్ఠతః ।
ధర్మేణైవ మునిశ్రేష్ఠా శ్శతరూపా వ్యజాయత ॥ 59 ॥

మునిశ్రేష్ఠులారా, తనమహిమతో ఆపవుడు స్వర్గలోకాన్ని ఆవరించి ఉండగా పుణ్యవశంతో శతరూప జన్మించింది.

సా తు వర్షాయుతం తప్త్వా తపః పరమదుశ్చరమ్ ।
భర్తారం దీప్తతపసం పురుషం ప్రత్యపద్యత ॥ 60 ॥

ఆమె (శతరూప) పదివేలసంవత్సరాలు మిక్కిలి తీవ్రమైన తపస్సు చేసి, గొప్పతపస్వి అయిన పురుషుడిని భర్తగా పొందింది.

స వై స్వాయంభువో విప్రాః పురుషో మనురుచ్యతే ।
తస్యైకసప్తతియుగం మన్వన్తర మిహోచ్యతే ॥ 61 ॥

బ్రాహ్మణులారా, ఆ పురుషుడే (విరాట్టు తనయుడైన ఆపవుడు) స్వాయంభువుడు అనే మనువుగా ప్రసిద్ధుడైనాడు. ఆతని (స్వాయంభువ) మన్వంతరం డెబ్బై ఒక్క మహాయుగాలుగా చెప్పబడుతున్నది.

వైరాజాత్ పురుషాద్ వీరం శతరూపా వ్యజాయత ।
ప్రియవ్రతోత్తానపాదౌ వీరాత్ కామ్యా వ్యజాయత ॥ 62 ॥

శతరూప విరాట్టు కొడుకైన స్వాయంభువమనువువలన – వీరుడు, ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనేవారిని ప్రసవించింది. వీరుడికి కామ్య పుట్టింది.

కామ్యా నామ మునిశ్రేష్ఠాః కర్దమస్య ప్రజాపతేః ।
కామ్యా పుత్రాస్తు చత్వార స్సమ్రాట్ కుక్షి ర్విరాట్ ప్రభుః ॥ 63 ॥

మునివరులారా, కామ్య కర్దమప్రజాపతికి భార్య అయింది. కామ్యకు సమ్రాట్టు, కుక్షి, విరాట్టు, ప్రభువు అనేవారు నలుగురు కొడుకులు.

ఉత్తానపాదం జగ్రాహ పుత్రమత్రిః ప్రజాపతిః ।
ఉత్తానపాదా చ్చతుర స్సూనృతా సుషువే సుతాన్ ॥ 64 ॥

అత్రి ప్రజాపతి ఉత్తానపాదుణ్ణి తనకొడుకుగా స్వీకరించాడు. ఆ ఉత్తానపాదుడివలన సూనృత నలుగురు కొడుకులను ప్రసవించింది.

ధర్మస్య కన్యా సుశ్రోణీ సూనృతా నామ విశ్రుతా ।
ఉత్పన్నా వాజిమేధేన ధ్రువస్య జననీ శుభా ॥ 65 ॥

సూనృత అని ప్రసిద్ధురాలైన ఆ సుందరి ధర్ముడికూతురు. అశ్వమేధయాగంవల్ల జన్మించింది. ఈ కల్యాణి ధ్రువుడికి తల్లి.

ధ్రువం చ కీర్తిమన్తం చ ఆయుష్మన్తం వసుం తథా ।
ఉత్తానపాదోఽజనయత్ సూనృతాయాం ప్రజాపతిః ॥ 66 ॥

ఉత్తానపాదుడు సూనృతయందు ధ్రువుడు, కీర్తిమంతుడు, ఆయుష్మంతుడు, వసువు అనే కొడుకులను కన్నాడు.

ధ్రువో వర్షసహస్రాణి త్రీణి దివ్యాని భో ద్విజాః ।
తపస్తేపే మహాభాగః ప్రార్థయన్ సుమహద్యశః ॥ 67 ॥

ఓ బ్రాహ్మణులారా! మహాత్ము డైనధ్రువుడు గొప్పకీర్తిని పొందాలని మూడువేలదివ్యసంవత్సరాలు తపస్సు చేశాడు.

తస్మై బ్రహ్మా దదౌ ప్రీతః స్థాన మాత్మసమం ప్రభుః ।
అచలం చైవ పురత స్సప్తర్షీణాం ప్రజాపతిః ॥ 68 ॥

ఆ తపస్సుకు బ్రహ్మదేవుడు సంతోషించి, సప్తర్షులకు అగ్రభాగంలో, తనతో సమానంగా, ధ్రువుడికి సుస్థిర మైనస్థానాన్ని ఇచ్చాడు.

తస్యాభిమానం వృద్ధిం చ మహిమానం నిరీక్ష్య వై ।
దేవాసురాణా మాచార్యః శ్లోకం ప్రాగుశనా జగౌ ॥69 ॥

దేవతలకు, రాక్షసులకు గురువైన శుక్రుడు ఆధ్రువుడి గౌరవాన్ని, మహిమనూ, గమనించి కీర్తించాడు.

అహోఽస్య తపసో వీర్య మహోశ్రుత మహోఽద్భుతమ్ ।
యమద్య పురతః కృత్వా ధ్రువం సప్తర్షయః స్థితాః ॥ 70 ॥

ఆహా, ఈధ్రువుడి తపశ్శక్తి ఆశ్చర్యకరం. ఆహాహా, ఈతని పాండిత్యం అద్భుతం. నేడు సప్తర్షులు కూడా తమకు అగ్రభాగంలో ఈతడిని నిలుపుకున్నారు. ఎంత వింత!

తస్మా చ్ఛ్లిష్టిం చ భవ్యం చ ధ్రువా చ్ఛమ్భు ర్వ్యజాయత ।
శ్లిష్టే రాధత్త సుచ్ఛాయా పఞ్చ పుత్రా నకల్మషాన్ ॥ 71 ॥

రిపుం పురం జయం పుత్రం వృకలం వృకతేజసమ్ ।
రిపో రాధత్త బృహతీ చాక్షుషం సర్వతేజసమ్ ॥ 72 ॥

శంభువు అనే ఆమె ధ్రువుడివలన శ్లిష్టి, భవ్యుడు అనే కొడుకులను కన్నది. శ్లిష్టివలన సుచ్ఛాయ అనే ఆమె పుణ్యవంతులైన రిపువు, పురుడు, జయుడు, (పుత్రుడైన)వృకలుడు, వృకతేజుడు, అనే కొడుకులు ఐదుగురిని గన్నది. రిపువువలన బృహతి అనే ఆవిడ సమగ్రమైనతేజస్సు గలిగిన చాక్షుషుడు అనేవాడిని కన్నది.

అజీజనత్ పుష్కరిణ్యాం వైరిణ్యాం చాక్షుషం మనుమ్ ।
ప్రజాపతే రాత్మజాయా మరణ్యస్య మహాత్మనః ॥ 73 ॥

మహాత్ముడైన అరణ్యప్రజాపతి కూతురు పుష్కరిణి. చక్షుషుడు ఆపుష్కరిణియందు చాక్షుషమనువును కన్నాడు.

**మనో రజాయన్త దశ నడ్వలాయాం మహౌజసః ।
కన్యాయాం మునిశార్దూలా వైరాజస్య ప్రజాపతేః ॥ 74 ॥**

మహర్షిశ్రేష్ఠులారా, వైరాజుడు అనే ప్రజాపతి కూతురు నడ్వల. ఆమెయందు చాక్షుషమనువుకు బలవంతులైన కొడుకులు పదిమంది కలిగారు.

**కుత్సః పురు శ్శతద్యుమ్న స్తపస్వీ సత్యవాక్కవిః ।
అగ్నిష్టుహో౽తిరాత్రశ్చ సుద్యుమ్నశ్చేతి తే నవ ॥ 75 ॥**

నడ్వలకు కుత్సుడు, పురువు, శతద్యుమ్నుడు, తపస్వి, సత్యవాక్కు, కవి, అగ్నిష్టువుడు, అతిరాత్రుడు, సుద్యుమ్నుడు అనేవాళ్లు తొమ్మిదిమందికొడుకులు. వీరు గొప్పపరాక్రమవంతులు.

**అభిమన్యుశ్చ దశమో నడ్వలాయాం మహౌజసః ।
పురో రజనయత్ పుత్రాన్ షడాగ్నేయీ మహాప్రభాన్ ॥ 76 ॥**

(నడ్వలకు చాక్షుషమనువువలన కలిగిన) అభిమన్యుడు పదవవాడు. వారిలో పురువువల్ల ఆగ్నేయి తేజస్వులయినకొడుకులను ఆరుగురిని కన్నది.

**అఙ్గం సుమనసం ఖ్యాతిం క్రతు మఙ్గిరసం గయమ్ ।
అఙ్గాత్ సునీథాపత్యం వై వేన మేకం వ్యజాయత ॥ 77 ॥**

వారు అంగుడు, సుమనసుడు, ఖ్యాతి, క్రతువు, అంగిరసుడు, గయుడు అనేవారు. సునీథ అంగునివలన వేనుడు అనేకొడుకును ఒకడిని గన్నది.

**అపచారేణ వేనస్య ప్రకోప స్సుమహా నభూత్ ।
ప్రజార్థ మృషయో యస్య మమన్థు ర్దక్షిణం కరమ్ ॥ 78 ॥**

వేనుడు చేసిన అపరాధంచేత ఋషులకు చాలా కోపం కలిగింది. (అతడు రాజుగా పనికి రాడని) వేనుడి సంతానంకోసం ఋషులు ఆతడి కుడిచేతిని మథించారు.

**వేనస్య మథితే పాణౌ సమ్బభూవ మహాన్నృపః ।
తం దృష్ట్వా మునయః ప్రాహు రేష వై ముదితాః ప్రజాః ॥ 79 ॥**

**కరిష్యతి మహాతేజా యశశ్చ ప్రాప్స్యతే మహత్ ।
స ధన్వీ కవచీ జాతో జ్వలజ్జ్వలనసుప్రభః ॥ 80 ॥**

చిలికిన ఆ వేనుడి కుడిచేతి నుండి మహారాజు జన్మించాడు. వాడిని చూచి మునులు ఈతడు ప్రజలను సంతోషపెట్టాడు. గొప్పకీర్తిని పొందుతాడు అన్నారు. అతడు ధనుస్సుతోనూ, కవచంతోనూ, జ్వలించుచున్న అగ్నివంటి గొప్పతేజస్సుతో పుట్టాడు.

పృథు ర్వైన్య స్తథా చైమాం రరక్ష క్షత్రపూర్వజః ।
రాజసూయాభిషిక్తానా మాద్య స్స వసుధాధిపః ॥ 81 ॥

వేనుడికొడుకు పేరు పృథువు. రాజ్యాన్ని చక్కగా రక్షించాడు. క్షత్రియులలో శ్రేష్ఠుడు. రాజసూయయాగం చేసినవారందరిలోనూ పృథుమహారాజు మొట్టమొదటివాడు.

తస్మా చ్చైవ సముత్పన్నౌ నిపుణౌ సూతమాగధౌ ।
తే నేయం గౌ ర్మునిశ్రేష్ఠా దుగ్ధా సస్యాని భూభృతా ॥ 82 ॥

ప్రజానాం వృత్తికామేన దేవై స్సర్షిగణై స్సహ ।
పితృభి ర్దానవై శ్చైవ గన్ధర్వై రప్సరోగణైః ॥ 83 ॥

సర్పైః పుణ్యజనై శ్చైవ వీరుద్భిః పర్వతై స్తథా ।
తేషు తేషు చ పాత్రేషు దుహ్యమానా వసున్ధరా ॥ 84 ॥

ప్రాదా ద్యథేప్సితం క్షీరం తేన ప్రాణా నధారయన్ ।
పృథోస్తు పుత్రౌ ధర్మజ్ఞౌ యజ్ఞాన్తేఽ న్తర్ధిపాతినౌ ॥ 85 ॥

మునివరులారా! పృథువుకు నేర్పరులైన సూతుడు, మాగధుడు అనేవారు ఇద్దరు జన్మించారు. ప్రజలకు జీవనాధారం కల్పించాలనే కోరికతో ఆపృథుమహారాజు ఈభూమిని ఆవుగా చేసి, పంటలు అనే పాలను పితికాడు. దేవతలు, ఋషిగణాలు, పితరులు, దానవులు, గంధర్వులు, అప్సరసలు, నాగులు, యక్షులు, ఓషధీలతలు, పర్వతాలు అలాగే అర్హులైనవారికి అందరికీ వారిపాత్రలలో సరిగ పితుకబడిన ఆభూమి (గోవు) కావలసినకోరికలను పాలను ఇచ్చింది. వాటితో జీవులు ప్రాణాలు నిలుపుకున్నారు (సుఖంగా బ్రతికారు). యజ్ఞం చివరలో పృథువుకు ధర్మజ్ఞులైన అంతర్ధి, పాతి అనేకొడుకులు జన్మించారు.

శిఖణ్డినీ హవిర్ధాన మన్తర్ధానాద్ వ్యజాయత ।
హవిర్ధానాత్ షడాగ్నేయీ ధిషణాఽ జనయత్ సుతాన్ ॥ 86 ॥

శిఖండిని అంతర్ధానుడివలన హవిర్ధానుడు అనే కొడుకును గన్నది. హవిర్ధానుడివలన అగ్నికుమార్తె అయిన ధిషణ ఆరుగురు కొడుకులను గన్నది.

ప్రాచీనబర్హిషం శుక్రం గయం కృష్ణం వ్రజాజినౌ ।
ప్రాచీనబర్హి ర్భగవాన్ మహానాసీత్ ప్రజాపతిః ॥ 87 ॥

హవిర్ధానా న్మునిశ్రేష్ఠా యేన సంవర్ధితాః ప్రజాః ।
ప్రాచీనబర్హి ర్భగవాన్ పృథివీతలచారిణః ॥ 88 ॥

వారు ప్రాచీనబర్హి, శుక్రుడు, గయుడు, కృష్ణుడు, వ్రజుడు, అజినుడు (ఆరుగురు). వారిలో ప్రాచీనబర్హి అనేవాడు హవిర్ధానుడి కంటె గొప్పప్రజాపతి అయ్యాడు. మునివరులారా! జ్ఞాని అయిన హవిర్ధానుడివలన ఈ నేలమీద సంచరించే మానవులు అందరూ వృద్ధిచెందారు.

సముద్రతనయాయాం తు కృతదారోఽభవత్ ప్రభుః ।
మహత స్తపసః పారే సవర్ణాయాం మహీపతిః ॥ 89 ॥

చాలా కాలం తపస్సు చేసినతర్వాత ప్రాచీనబర్హి మహారాజు సముద్రుడి కూతురైన సవర్ణను భార్యగా చేసుకున్నాడు.

సవర్ణాధత్త సాముద్రీ దశ ప్రాచీనబర్హిషః ।
సర్వాన్ ప్రచేతసో నామ ధనుర్వేదస్య పారగాన్ ॥ 90 ॥

సవర్ణ ప్రాచీనబర్హికి పదిమంది తనయులను గన్నది. వారందరూ ప్రచేతసులు అనేపేరు గలవారు. ధనుర్విద్యలో నేర్పరులు.

అపృథగ్ధర్మాచరణా స్తేపు స్తేఽపి మహత్తపః ।
దశవర్షసహస్రాణి సముద్రసలిలేశయాః ॥ 91 ॥

ఆ ప్రచేతసులు అందరూ సమానంగా స్వధర్మాన్ని ఆచరిస్తూ, సముద్రజలంలోనే ఉండి, పదివేలసంవత్సరాలు తీవ్రమైన తపస్సు చేశారు.

తపశ్చరత్సు పృథివీం ప్రచేతస్సు మహీరుహాః ।
అరక్షమాణా మావవ్రు ర్బభూవాథ ప్రజాక్షయః ॥ 92 ॥

అలా ప్రచేతసులు ఘోర మైనతపస్సు చేస్తుండగా, భూమిని రక్షించేవాళ్లు లేకపోవటంచేత, చెట్లు దట్టంగా పెరిగి, భూమిని కప్పివేశాయి. క్రమంగా ప్రజలు నశించసాగారు.

నాశకన్ మారుతో వాతుం వృతం సమభవద్ ద్రుమైః ।
దశవర్షసహస్రాణి న శేకు శ్చేష్టితుం ప్రజాః ॥ 93 ॥

వారు తపస్సు చేస్తున్న పదివేలసంవత్సరాలలోనూ ఆకాశం అంతా చెట్ల(కొమ్మల)తో నిండిపోయింది. దానిచేత గాలికే సంచరించడం సాధ్యం కాలేదు. ప్రజలు కూడా ఏమీ చేయలేక నిశ్చేష్టులయ్యారు.

తదుపశ్రుత్య తపసా యుక్తా స్సర్వే ప్రచేతసః ।
ముఖేభ్యో వాయు మగ్నిం చ ససృజు ర్జాతమన్యవః ॥ 94 ॥

ఆసంగతి విని, కోపం గలిగి, తపోదీక్షలో ఉన్న ప్రచేతసులు అందరూ, ముఖాలనుండి వాయువునూ, అగ్నినీ సృష్టించారు.

ఉన్మూలా నథ వృక్షాంస్తు కృత్వా వాయు రశోషయత్ ।
తా నగ్ని రదహద్ ఘోర ఏవ మాసీద్ ద్రుమక్షయః ॥ 95 ॥

వారు సృష్టించిన గాలి చెట్లను వేళ్లతో సహా పెకలించి ఎండగొట్టింది. వారు సృష్టించిన అగ్ని ఆచెట్లను దహించింది. ఈవిధంగా చెట్లన్నీ నాశన మయ్యాయి.

ద్రుమక్షయ మథో బుధ్వా కిఞ్చి చ్ఛిష్టేషు శాఖిషు ।
ఉపగమ్యాబ్రవీ దేతా నథ సోమః ప్రజాపతీన్ ॥ 96 ॥

చెట్లు కొద్దిగా మాత్రమే మిగిలిఉండగా, అవి నాశన మైపోవడాన్ని తెలుసుకుని, చంద్రుడు అక్కడికి వచ్చాడు. ఆ ప్రచేతసులతో ఇలా అన్నాడు.

కోపం యచ్ఛత రాజాన స్సర్వే ప్రాచీనబర్హిషః ।
వృక్షశూన్యా కృతా పృథ్వీ శామ్యేతా మగ్నిమారుతౌ ॥ 97 ॥

ప్రాచీనబర్హితనయులారా! మహారాజులారా! మీరు అందరూ కోపాన్ని విడిచిపెట్టండి. ఈభూమి వృక్షశూన్యం అయిపోతున్నది. మీరు సృష్టించిన అగ్నినీ, వాయువునూ అణచివేయండి.

రత్నభూతా చ కన్యేయం వృక్షాణాం వరవర్ణినీ ।
భవిష్యం జానతా తాత ధృతా గర్భేణ వై మయా ॥ 98 ॥

నాయనలారా! ఈమె ఈవృక్షాల కన్నకూతురు, సుందరి. కన్యలలో ఉత్తమురాలు. ఇలా జరగబోయేదానిని ముందుగా తెలిసిన నేను ఈమెను నాకడుపులో పెట్టుకుని కాపాడాను.

మారిషా నామ కన్యైషా వృక్షాణామితి నిర్మితా ।
భార్యా వోఽస్తు మహాభాగా స్సోమవంశ వివర్ధినీ ॥ 99 ॥

వృక్షాలు కన్న ఈ కన్యపేరు మారిష. మహాత్ములారా! మీకు ఈమె భార్య అగు గాక. ఈమె చంద్రవంశాన్ని వృద్ధిచేస్తుంది.

యుష్మాకం తేజసోఽర్ధేన మమ చార్ధేన తేజసా ।
అస్యా ముత్పత్స్యతే విద్వాన్ దక్షో నామ ప్రజాపతిః ॥ 100 ॥

మీ తేజస్సులో సగమూ, నాతేజస్సులో సగమూ కలిసి ఈమెయందు విద్వాంసుడైన దక్షుడు అనే ప్రజాపతి ఉద్భవిస్తాడు.

స ఇమాం దగ్ధభూయిష్ఠాం యుష్మత్తేజోమయేన వై ।
అగ్నినాగ్నిసమో భూయః ప్రజా స్సంవర్ధయిష్యతి ॥101 ॥

మీ తేజోరూపమైన అగ్నిచేత కాలిపోయిన ఈభూమిని అగ్నితో సమానుడైన ఆ దక్షుడు తిరిగి సృష్టించి, ప్రజలను వృద్ధిచేస్తాడు.

తత స్సోమస్య వచనా జ్జగృహు స్తే తపోధనాః ।
సంహృత్య కోపం వృక్షేభ్యః పత్నీం ధర్మేణ మారిషామ్ ॥102 ॥

అపుడు ఆ తపస్వులైన ప్రచేతసులు చంద్రుడి మాటలవలన చెట్లపై కోపాన్ని ఉపసంహరించుకున్నారు. మారిషను ధర్మమార్గంలో పత్నిగా స్వీకరించారు.

దశభ్య స్తు ప్రచేతేభ్యో మారిషాయాం ప్రజాపతిః ।
దక్షో జజ్ఞే మహాతేజా స్సోమస్యాంశేన భో ద్విజాః ॥ 103 ॥

ఓ బ్రాహ్మణులారా! పదిమంది ప్రచేతసులవలన సోముడి అంశతో మారిషకు గొప్పతేజస్సు కలిగిన దక్షప్రజాపతి జన్మించాడు.

అచరాంశ్చ చరాంశ్చైవ ద్విపదోఽథ చతుష్పదః ।
స సృష్ట్వా మనసా దక్షః పశ్చాదసృజత స్త్రియః ॥ 104 ॥

ఆ దక్షుడు మనసు(సంకల్పమాత్రం)చేతనే స్థావరాలను, జంగమాలనూ, రెండుపాదాల జీవులను, నాలుగుపాదాలజీవులనూ సృష్టించాడు. ఆతరువాత స్త్రీలను సృష్టి చేశాడు.

దదౌ దశ సధర్మాయ కశ్యపాయ త్రయోదశ ।
శిష్టా స్సోమాయ రాజ్ఞే చ నక్షత్రాఖ్యా దదౌ ప్రభుః ॥ 105 ॥

సమర్థు డైన దక్షప్రజాపతి తన స్త్రీసంతానంలో పదిమందిని ధర్ముడికి ఇచ్చాడు. పదముగ్గురిని కశ్యపుడికి ఇచ్చాడు. నక్షత్రంపేర్లు గలిగిన మిగిలిన ప్రకాశించే ఇరవైఏడుగురిని చంద్రుడికి ఇచ్చాడు.

తాసు దేవాః ఖగా గావో నాగా దితిజదానవాః ।
గన్ధర్వాప్సరస శ్చైవ జజ్ఞిరేఽన్యాశ్చ జాతయః ॥ 106 ॥

ఆ దక్షుని కుమార్తెలయందు దేవతలు, పక్షులు, ఆవులు, నాగులు, దైత్యులు, దానవులు, ఇంకా ఇతరమైన అనేకజాతులు ఉద్భవించాయి.

తతః ప్రభృతి విప్రేన్ద్రాః ప్రజా మైథునసమ్భవాః ।
సఙ్కల్పా ద్దర్శనాత్ స్పర్శాత్ పూర్వేషాం ప్రోచ్యతే ప్రజాః ॥ 107 ॥

బ్రాహ్మణోత్తములారా, అప్పటినుండి సంతానం మైథునం వలననే ఏర్పడుతున్నది. అంతకు పూర్వం వారికి తలచుకోవటంచేతనే చూచినంతనే తాకిననంతనే సంతానం కలిగేది.

మునయ ఊచుః :–లోమహర్షణుడితో మునులు ఇలా అన్నారు.

దేవానాం దానవానాం చ గన్ధర్వోరగరక్షసామ్ ।
సమ్భవస్తు శ్రుతోఽస్మాభి ర్దక్షస్య చ మహాత్మనః ॥ 108 ॥

సూతమహర్షీ! దేవతలు, దానవులు, గంధర్వులు, నాగులు, రాక్షసులు వీళ్ల పుట్టుక గురించి, అలాగే మహాత్ముడైన దక్షప్రజాపతి పుట్టుక గురించి కూడా మేం విన్నాం.

అఙ్గుష్ఠాద్ బ్రహ్మణో జజ్ఞే దక్షః కిల శుభవ్రతః ।
వామాఙ్గుష్ఠా త్తథా చైవ తస్య పత్నీ వ్యజాయత ॥ 109 ॥

మంచి నియమదీక్ష గలిగిన దక్షప్రజాపతి బ్రహ్మగారి కుడిబొట్టనవ్రేలినుండి జన్మించాడని విన్నాం కదా. అలాగే ఆ దక్షప్రజాపతి భార్య బ్రహ్మగారి ఎడమ బొట్టనవ్రేలి నుండి జనించింది. అని కూడా విన్నాము.

కథం ప్రాచేతసత్వం స పున ర్లేభే మహాతపాః ।
ఏతం న స్సంశయం సూత వ్యాఖ్యాతుం త్వ మిహార్హసి ।
దౌహిత్ర శ్చైవ సోమస్య కథం శ్వశురతాం గతః ॥ 110 ॥

అటువంటపుడు దక్షుడు ప్రచేతసులకు (పదిమందికి) జన్మించటం ఎలా? మహాతపస్వీ! మా ఈసందేహాన్ని తీర్చడానికి నీవే తగినవాడివి. అలాగే చంద్రుడి మనుమడు (కూతురు కొడుకు) మామ ఎలా అయినాడు?

లోమహర్షణ ఉవాచ :-లోమహర్షణుడు మునులతో ఇలా చెప్తున్నాడు.

ఉత్పత్తిశ్చ నిరోధశ్చ నిత్యం భూతేషు భో ద్విజాః ।
ఋషయోఽత్ర న ముహ్యన్తి విద్యావన్త శ్చ యే జనాః ॥ 111 ॥

బ్రాహ్మణులారా! జీవకోటి పుట్టడం, నశించడం నిత్యమూ జరిగేది. ఈవిషయంలో మహర్షులు, విద్యావంతులు అయిన జనాలు భ్రమపడరు. అజ్ఞానులైన సామాన్య జనులు సృష్టి, స్థితి, లయాలను గురించి అర్థం కాక భ్రమ పడుతుంటారు.

యుగే యుగే భవ న్త్యేతే పున ర్దక్షాదయో నృపాః ।
పునశ్చైవ నిరుధ్యన్తే విద్వాంస్తత్ర న ముహ్యతి ॥ 112 ॥

ప్రతియుగంలోనూ దక్షుడు మొదలైన రాజులు అందరూ పుడుతూనే ఉంటారు. తిరిగి మళ్లీ నశిస్తుంటారు. పండితుడు ఆవిషయంలో భ్రమపడడు.

జ్యైష్ఠ్యం చ కానిష్ఠ్యమప్యేషాం పూర్వం నాసీ ద్ద్విజోత్తమాః ।
తప ఏవ గరీయోఽభూత్ ప్రభావశ్చైవ కారణమ్ ॥ 113 ॥

బ్రాహ్మణశ్రేష్ఠులారా! ప్రాచీనకాలంలో వీరిలో పెద్ద(ముందు పుట్టిన)వాడూ, చిన్న(చివర పుట్టిన)వాడూ అనేభేదం లేదు. వారు చేసిన తపస్సే ప్రధానం. పెద్దతనానికీ, చిన్నతనానికీ తపస్సుయొక్క ప్రభావమే కారణం.

ఇమాం విసృష్టిం దక్షస్య యో విద్యాత్ సచరాచరమ్ ।
ప్రజావానాయుషా పూర్ణ స్స్వర్గలోకే మహీయతే ॥ 114 ॥

దక్షప్రజాపతి చేసిన ఈవిశేషమైన స్థావరజంగమసృష్టిని గురించి తెలుసుకున్నవాడు సంతానవంతుడు అవుతాడు. పరిపూర్ణమైన ఆయువు సిద్ధిస్తుంది. మరణానంతరం స్వర్గలోకంలో పూజింపబడతాడు.

మునయ ఊచుః :-మునులు పలికారు.

దేవానాం దానవానాం చ గన్ధర్వోరగరక్షసామ్ ।
ఉత్పత్తిం విస్తరేణైవ లోమహర్షణ కీర్తయ ॥ 115 ॥

లోమహర్షణమహర్షీ! దేవతలు, దానవులు, గంధర్వులు, నాగులు, రాక్షసులు వీళ్లయొక్క జన్మప్రకారం గురించి వివరించి చెప్పవలసినది.

లోమహర్షణ ఉవాచ :-లోమహర్షణుడు చెప్తున్నాడు.

ప్రజా స్సృజేతి వ్యాదిష్టః పూర్వం దక్ష స్స్వయంభువా ।
యథా ససర్జ భూతాని తథా శృణుత భో ద్విజాః ॥116 ॥

ఓ బ్రాహ్మణులారా! వినండి. పూర్వం స్వయంభువుడు ప్రజలను సృష్టించమని దక్షుడిని ఆజ్ఞాపించాడు. అపుడు దక్షప్రజాపతి ప్రజలను ఎలా సృష్టించాడో వినండి.

మానసాన్యేవ భూతాని ప్రజాపతి రవాసృజత్ ।
ఋషీన్ దేవాన్ సగన్ధర్వానసురాన్ యక్షరాక్షసాన్ ॥ 117 ॥

దక్షప్రజాపతి మనసుద్వారా (సంకల్పంచేత) దేవతలు, గంధర్వులు, అసురులు, యక్షులు, రాక్షసులు అయిన ప్రాణులను సృష్టించాడు.

యదాస్య మానసీ విప్రా న వ్యవర్ధత వై ప్రజాః ।
తదా సంచిన్త్య ధర్మాత్మా ప్రజాహేతోః ప్రజాపతిః ॥ 118 ॥

బ్రాహ్మణులారా! దక్షుడు మనస్సుతో సృష్టించిన ప్రజలు అధికంగా వృద్ధి చెందలేదు. అపుడు ధర్మాత్ముడైన దక్షప్రజాపతి ప్రజలను అధికంగా ఎలా సృష్టించాలా అని ఆలోచించాడు.

స మైథునేన ధర్మేణ సిసృక్షు ర్వివిధాః ప్రజాః ।
అసిక్నీ మావహత్పత్నీం వీరణస్య ప్రజాపతేః ॥ 119 ॥

మైధునధర్మంతో ప్రజలను వృద్ధి చేయాలనుకున్నాడు. అందుకోసం వీరణుడు అనే ప్రజాపతి కూతురైన అసిక్ని అనేకన్యను వివాహం చేసుకున్నాడు.

సుతాం సుతపసా యుక్తాం మహతీం లోకధారిణీమ్ ।
అథ పుత్రసహస్రాణి వైరణ్యాం పఞ్చ వీర్యవాన్ । 120 ॥

అసిక్న్యాం జనయామాస దక్ష ఏవ ప్రజాపతిః ।

ఆమె గొప్ప తపస్విని. ప్రజలను ధరింప గలిగినది. శక్తిమంతుడైన దక్షప్రజాపతి ఆ అసిక్నియందు ఐదు వేలమంది సంతానాన్ని కన్నాడు.

తాంస్తు దృష్ట్వా మహాభాగాన్ సంవివర్ధయిషూన్ ప్రజాః ॥ 121 ॥

దేవర్షిః ప్రియసంవాదో నారదః ప్రాబ్రవీదిదమ్ ।
నాశాయ వచనం తేషాం శాపాయైవాత్మన స్తథా ॥ 122 ॥

మహాత్ములైన ఆ దక్షుని సంతానం కూడ ప్రజలను అభివృద్ధి చేద్దామనుకున్నారు. వారిని చూచి, ఇష్ట మైనమాటలు చెప్పే నారదుడు ఆ దక్షసంతానం నశించిపోవడానికీ, అలాగే తనకు శాపం కలగడానికీ కారణ మయ్యేవిధంగా వారితో అలా అన్నాడు. (నారదుడు సంతానం కనవద్దని చెప్పి, వారికి వైరాగ్యాన్ని బోధించాడు. దానివల్ల వారు సంతానం కనలేదు. భూతసృష్టిని వృద్ధి చేయలేదని బ్రహ్మ దక్షపుత్రులను నాశనం చేశాడు. వాళ్లను సంతానం కనకుండా చేశాడని నారదుడికి దక్షుడు శాపం ఇచ్చాడు.)

యం కశ్యప స్సుతవరం పారమేష్ఠ్యం వ్యజీజనత్ ।
దక్షస్య వై దుహితరి దక్షశాపభయాన్మునిః ॥ 123 ॥

పూర్వం స హి సముత్పన్నో నారదః పరమేష్ఠినః ।
అసిక్న్యా మథ వైరణ్యాం భూయో దేవర్షిసత్తమః ॥ 124 ॥

తం భూయో జనయామాస పితేవ మునిపుఙ్గవమ్ ।
తేన దక్షస్య పుత్రా వై హర్యశ్వా ఇతి విశ్రుతాః ॥ 125 ॥

కశ్యపుడు పరమేష్ఠిపుత్రుడైన నారదమహర్షిని కన్నాడు. అంతకు పూర్వం దక్షుడు శపిస్తాడనేభయంతో నారదుడు దక్షునికూతురియందు కొడుకుగా జన్మించాడు. దేవర్షులలో శ్రేష్ఠుడైన నారదుడు తర్వాత వైరణి(వీరణప్రజాపతి కూతురు) ఐన అసిక్నియందు తిరిగి దక్షప్రజాపతికి జన్మించాడు. మునులలో శ్రేష్ఠుడైన దక్షుడు ఆ నారదమహర్షిని మళ్లీ తండ్రిలాగా కన్నాడు. అందువల్లనే ముగ్గురివలన కొడుకుగా పుట్టినవారి తమ్ములను హర్యశ్వు లంటారు దక్షుడికుమారులు (ఐదువేలమంది) హర్యశ్వులు అని ప్రసిద్ధులైనారు. (నారదుడు కశ్యపప్రజాపతి కొడుకు. దక్షుడికి వైరణికీ కొడుకు అయినాడు. బ్రహ్మకూ దక్షునికూతురు ప్రియకూ, కొడుకుగా పుట్టాడు.)

నిర్మథ్య నాశితా స్సర్వే విధినా చ న సంశయః ।
తస్యోద్యత స్తదా దక్షో నాశా యామితవిక్రమః ॥ 126 ॥

బ్రహ్మర్షీన్ పురతః కృత్వా యాచితః పరమేష్ఠినా ।
తతోఽభిసన్ధి శ్చక్రే వై దక్షస్య పరమేష్ఠినా ॥ 127 ॥

అపుడు విధివశాన (నారదుడిబోధనలను అనుసరించి) ఆ హర్యశ్వులు కష్టాలపాలయి, నశించిపోయారు. ఇందులో సందేహం లేదు. మిక్కిలి పరాక్రమవంతుడైన దక్షప్రజాపతి తనకొడుకులు నశించడానికి కారణమైన నారదుడిని నాశనం చేయడానికి (శపించడానికి) పూనుకున్నాడు. అపుడు పరమేష్ఠి బ్రహ్మర్షులను ముందుపెట్టుకుని నారదుడిని రక్షింపమని దక్షుడిని వేడుకున్నాడు. అపుడు బ్రహ్మ (నారదుడిని కాపాడడానికి) దక్షుడితో ఒక ఒప్పందం చేసుకున్నాడు.

కన్యాయాం నారదో మహ్యం తవ పుత్రో భవే దితి ।
తతో దక్ష స్సుతాం ప్రాదాత్ ప్రియాం వై పరమేష్ఠినే ।
స తస్యాం నారదో జజ్ఞే భూయ శ్శాపభయాద్ ఋషిః ॥ 128 ॥

నారదుడు నీకూతురియందు నాకు కొడుకుగా పుట్టాలి అని(సంధి చేసుకున్నాడు). అపుడు దక్షుడు పరమేష్ఠికి తనకూతురైన ప్రియను భార్యగా ఇచ్చాడు.(3–50) దక్షుడు శపిస్తాడనేభయంతో ఆకన్యయందు నారదమహర్షి మళ్లీ బ్రహ్మకు కొడుకుగా పుట్టాడు.

మునయ ఊచుః :– మునులు లోమహర్షణుడితో ఈవిధంగా అన్నారు.

కథం ప్రణాశితాః పుత్రా నారదేన మహర్షిణా ।
ప్రజాపతే స్తు భగవన్ శ్రోతు మిచ్ఛామ తత్త్వతః ॥ 129 ॥

మహాత్మా! దక్షప్రజాపతి పుత్రులైన హర్యశ్వులను నారదమహర్షి ఎలా నాశనం చేశాడు. సమగ్రంగా తెలుసుకోవాలనుకుంటున్నాము.

లోమహర్షణ ఉవాచ :–లోమహర్షణుడు మునులతో చెప్పాడు.

దక్షస్య పుత్రా హర్యశ్వా వివర్ధయిషవః ప్రజాః ।
సమాయాతా మహావీర్యా నారద స్తా నువాచ హ ॥ 130 ॥

దక్షుడి కొడుకులు గొప్పశక్తిమంతులు. వారే హర్యశ్వులు. వారు ప్రజలను వృద్ధిచేయటం కోసం సిద్ధపడ్డారు. అపుడు నారదుడు వారితో ఇలా అన్నాడు.

బాలిశా బత యూయం నాస్యా జానీత వై భువః ।
ప్రమాణం స్రష్టుకామా వై ప్రజాః ప్రాచేతసాత్మజాః ॥ 131 ॥

మూర్ఖులారా! ఈభూమి పరిమాణం ఎంతో మీకు తెలియదు. దక్షుడి (ప్రచేతసుని కుమారుడు)పుత్రులైనమీరు (ఏమీ తెలియకుండా) ప్రజలను సృష్టించా లనుకుంటున్నారు.

అన్త రూర్ధ్వ మథ శ్చైవ కథం సృజథ వై ప్రజాః ।
తే తు తద్వచనం శ్రుత్వా ప్రయాతా స్సర్వతోదిశమ్ ॥ 132 ॥

పైన, క్రింద, నడుమ మీరు ప్రజలను ఎలా సృష్టించగలరు? (భూమి పరిమాణమే తెలియనివారు భూర్, (అథస్) భువ (అన్తర్), స్సువర్ (ఊర్ధ్వ) లోకాలలో సృష్టి చేయటం సాధ్యం కాదు. కాబట్టి ఆప్రయత్నం మానుకోమని అభిప్రాయం.) ఆహర్యశ్వులు నారదుడిమాటలు విని (భూపరిమాణం తెలుసుకుందామని) అన్ని దిక్కులవైపువెళ్లారు.

అద్యాపి న నివర్తన్తే సముద్రేభ్య ఇవాపగాః ।
హర్యశ్వేష్వథ నష్టేషు దక్షః ప్రాచేతసః పునః ॥ 133 ॥

వైరణ్యామథ పుత్రాణాం సహస్ర మసృజత్ ప్రభుః ।
వివర్ధయిషవ స్తే తు శబలాశ్వా స్తథా ప్రజాః ॥ 134 ॥

పూర్వోక్తం వచనం తేఽపి నారదేన ప్రచోదితాః ।
అన్యోన్య మూచు స్తే సర్వే సమ్య గాహ మహాన్ ఋషిః ॥ 135 ॥

అలా వెళ్లినవారు సముద్రంలో కలిసిన నదులలాగా ఇప్పటికీ వెనకకు ఇంకా తిరిగి రాలేదు. హర్యశ్వులు నశించిపోగా, సమర్థుడైన దక్షుడు (ప్రచేతసునికొడుకు) మళ్లీ వైరణియందు ఒకవేయిమంది కొడుకులను కన్నాడు. వారిని శబలాశ్వులు అంటారు. వారు కూడా, ప్రజలను వృద్ధిచేయటంకోసం సిద్ధపడ్డారు. ఇంతకు ముందు తమ అన్నలకు చెప్పిన నారదుడి మాటలచేత ప్రేరేపింపబడి పరస్పరం ఇలా అనుకున్నారు. మహర్షి నారదుడు చాలా చక్కగా చెప్పారు.

భ్రాతౄణాం పదవీం జ్ఞాతుం గన్తవ్యం నాత్ర సంశయః ।
జ్ఞాత్వా ప్రమాణం పృథివ్యాశ్చ సుఖం స్రక్ష్యామహే ప్రజాః ॥ 136 ॥

మనం మన అన్నలైన హర్యశ్వుల ఉనికిని తెలుసుకోవటం కోసం తప్పకుండా వెళ్లాలి. సందేహం లేదు. అలాగే ఈ భూమియొక్క పరిమాణం కూడా తెలుసుకుని, ఆతర్వాత ప్రజలను సృష్టిద్దాం.

తేఽపి తేనైవ మార్గేణ ప్రయాతా స్సర్వతో దిశమ్ ।
అద్యాపి న నివర్తన్తే సముద్రేభ్య ఇవాపగాః ॥ 137 ॥

ఇలా అనుకుని శబలాశ్వులు కూడ అన్నల మార్గంలోనే నేలమీద అన్ని దిక్కులకూ వెళ్లారు. వారు కూడ నేటివరకూ సముద్రంలో కలిసిన నదులలాగా, వెనకకు తిరిగి రాలేదు.

తదా ప్రభృతి వై భ్రాతా భ్రాతు రన్వేషణే ద్విజాః ।
ప్రయాతో నశ్యతి క్షిప్రం త న్న కార్యం విపశ్చితా ॥138 ॥

ఓ బ్రాహ్మణులారా, అప్పటినుండి సోదరులను గూర్చి వెదకటానికి వెళ్లిన సోదరుడు వెంటనే నశిస్తాడు. అందుచేత తెలిసినవాళ్లు ఆపని చేయగూడదు. (సోదరులను అన్వేషించటానికి వెళ్లగూడదు.)

తాంశ్చైవ నష్టాన్ విజ్ఞాయ పుత్రాన్ దక్షః ప్రజాపతిః ।
షష్టిం తతోఽసృజన్ కన్యా వైరణ్యా మితి న శ్శ్రుతమ్ ॥ 139 ॥

దక్షప్రజాపతి ఆపుత్రులు (శబలాశ్వులు) కూడ నశించిపోయారని గ్రహించాడు. తర్వాత వైరణియందు అరవైమంది కన్యలను కన్నాడని విన్నాం.

తా స్తదా ప్రతిజగ్రాహ భార్యార్థం వైకశ్యపః ప్రభుః ।
సోమో ధర్మశ్చ భో విప్రా స్త థైవాన్యే మహర్షయః ॥140 ॥

ఓ విప్రులారా, సమర్థుడైన కశ్యపుడు, సోముడు, ధర్ముడు, అలాగే ఇతరమహర్షులు ఆ అరవైమంది దక్షపుత్రికలను భార్యలుగా స్వీకరించారు.

దదౌ స దశ ధర్మాయ కశ్యపాయ త్రయోదశ ।
సప్తవింశతి సోమాయ చతస్రోఽరిష్టనేమినే ॥ 141 ॥

దక్షుడు తనపుత్రికలలో పదిమందిని ధర్మునికి, భార్యలుగా ఇచ్చాడు. పదముగ్గురిని కశ్యపమహర్షికి ఇచ్చాడు. సోముడికి ఇరవైఏడుగురు కన్యలను ఇచ్చాడు. అరిష్టనేమికి నలుగురుకన్యలను ఇచ్చాడు.

ద్వే చైవ బహుపుత్రాయ ద్వే చైవాఙ్గిరసే తథా ।
ద్వే కృశాశ్వాయ విదుషే తాసాం నామాని మే శృణు ॥ 142 ॥

బహుపుత్రుడికి ఇద్దరినీ, అంగిరసుడికి ఇద్దరినీ, కృశాశ్వుడికి ఇద్దరినీ, భార్యలుగా ఇచ్చాడు. వారిపేర్లను చెప్తాను, వినండి.

అరున్ధతీ వసు ర్యామీ లమ్బా భానుర్ మరుత్వతీ ।
సఙ్కల్పా చ ముహూర్తా చ సాధ్యా విశ్వా చ భో ద్విజాః ॥ 143 ॥

ధర్మపత్న్యో దశ త్వేతా స్తా స్వపత్యాని బోధత ।
విశ్వేదేవాస్తు విశ్వాయాః సాధ్యా సాధ్యాన్ వ్యజాయత ॥ 144 ॥

ఓ బ్రాహ్మణులారా! అరుంధతి, వసువు, యామి, లంబ, భానువు (145 శ్లోకాన్ని బట్టి ఇది భాను. బాల అనేపాఠం సరి కాదు.), మరుత్వతి, సంకల్ప, ముహూర్త, సాధ్య, విశ్వ అనేపేర్లు గలిగినవారు పదిమంది కశ్యపుడికి భార్యలు. వాళ్లకు కలిగిన సంతానం గురించి తెలుసుకోండి. విశ్వకు విశ్వేదేవతలు కలిగారు. సాధ్యకు సాధ్యులు పుట్టారు.

మరుత్వత్యాం మరుత్వన్తో వసో స్తు వసవ స్సుతాః ।
భానోస్తు భానవః పుత్రా ముహూర్తాస్తు ముహూర్తజాః ॥ 145 ॥

మరుత్వతికి గలిగినపుత్రులు మరుత్వంతులు. వసువు పుత్రులు వసువులు. భానువుకు కలిగినపుత్రులు భానువులు. ముహూర్తకు పుట్టినబిడ్డలు ముహూర్తులు.

లమ్బాయా శ్చైవ ఘోషో ఽథ నాగవీథీ చ యామిజా ।
పృథివ్యా విషయం సర్వ మరున్ధత్యాం వ్యజాయత ॥ 146 ॥

లంబకు కలిగినపుత్రుడు ఘోషుడు. యామికి పుట్టినకూతురు నాగవీథి. అరుంధతికి ఈభూమికి సంబంధించినసంతానం అంతా కలిగింది.

సఙ్కల్పాయా స్తు విశ్వాత్మా జజ్ఞే సఙ్కల్ప ఏవ హి ।
నాగవీథ్యాం చ యామిన్యాం వృషలశ్చ వ్యజాయత ॥ 147 ॥

సంకల్పకు ప్రపంచ స్వరూపుడైన సంకల్పుడు జన్మించాడు. యామికి కూతురైన నాగవీథికి వృషలుడు పుట్టాడు.

స రాజా సోమపత్నీశ్చ దక్షః ప్రాచేతసో దదౌ ।
సర్వా నక్షత్రనామ్న్య స్తా జ్యోతిషే పరికీర్తితాః ॥ 148 ॥

ఆ వృషలుడు రాజు అయినాడు. ప్రచేతసుల పుత్రుడైన దక్షప్రజాపతి చంద్రుడికి భార్యలుగా ఇచ్చిన కన్యలు అందరూ నక్షత్రాలపేర్లతో జ్యోతిశ్శాస్త్రంలో ప్రసిద్ధులైనారు.

యే త్వన్యే ఖ్యాతిమన్తో వై దేవాః జ్యోతిఃపురోగమాః ।
వసవో ऽష్టౌ సమాఖ్యాతా స్తేషాం వక్ష్యామి విస్తరమ్ ॥ 149 ॥

ఇంకా కీర్తిమంతులై, జ్యోతిర్మండలంలో పురోగమించే ఇతరదేవతలు ఎనిమిదిమంది వసువులు అనే పేరుతో ప్రసిద్ధులై ఉన్నారు. వారిని గురించి వివరంగా చెప్తాను.

అయో ధ్రువశ్చ సోమశ్చ ధవశ్చైవానిలోऽనలః ।
ప్రత్యూషశ్చ ప్రభాసశ్చ వసవో నామభి స్స్మృతాః ॥ 150 ॥

ఆ వసువులు అయుడు, ధ్రువుడు, సోముడు, ధవుడు, అనిలుడు, అనలుడు, ప్రత్యూషుడు, ప్రభాసుడు అనేపేర్లతో గ్రహింపబడుతున్నారు.

అయస్య పుత్రో వైతణ్డ్యః శ్రమ శ్శ్రాన్తో ముని స్తథా ।
ధ్రువస్య పుత్రో భగవాన్ కాలో లోకప్రకాలనః ॥ 151 ॥

వారిలో అయుడి కొడుకు వైతండ్యుడు. అలాగే శ్రముడు, శ్రాంతుడు, ముని అనేవారు కూడ అయుడి తనయులు. ధ్రువుడి కొడుకు కాలుడు మహాత్ముడు. లోకాలను సంహరించేవాడు.

సోమస్య భగవాన్ వర్చా వర్చస్వీ యేన జాయతే ।
ధవస్య పుత్రో ద్రవిణో హుతహవ్యవహ స్తథా ।
మనోహరాయా శ్శిశిరః ప్రాణోऽథ రమణ స్తథా ॥ 152 ॥

సోముడికి తేజోవంతుడైన వర్చస్సు అనేవాడు జన్మించాడు. ధవుడికొడుకు ద్రవిణుడు. అలాగే హుతహవ్యవహుడు అనేవాడు కూడ సోముడికొడుకు. ధవుడికి మనోహర అనే స్త్రీవలన శిశిరుడు, ప్రాణుడు, రమణుడు అనే తనయులు కలిగారు.

అనిలస్య శివా భార్యా తస్యాః పుత్రో మనోజవః ।
అవిజ్ఞాతగతి శ్చైవ ద్వౌ పుత్రావనిలస్య చ ॥ 153 ॥

అనిలుడి భార్య శివ. ఆమెకు, అనిలుడివలన మనోజవుడు, అవిజ్ఞాతగతి అనే ఇరువురు పుత్రులు కలిగారు.

అగ్నిపుత్రః కుమారస్తు శరస్తమ్బే శ్రియా వృతః ।
తస్య శాఖో విశాఖశ్చ నైగమేయశ్చ పృష్ఠజః ॥ 154 ॥

అగ్ని(అనలుడు)కొడుకు కుమారుడు. ఇతడు రెల్లుపొదలో శోభిస్తాడు. కుమారుడికి శాఖుడు, విశాఖుడు, నైగమేయుడు అనేవారు ముగ్గురు తమ్ముళ్లు (అగ్ని కుమారులు).

అపత్యం కృత్తికానాం తు కార్తికేయ ఇతి స్మృతః ।
ప్రత్యూషస్య విదుః పుత్ర మృషిం నామ్నాఽ థ దేవలమ్ ॥155 ॥
ద్వౌ పుత్రౌ దేవలస్యాపి క్షమావన్తౌ మనీషిణౌ ।

కృత్తికలకు (అనలుడివలన) కలిగిన కుమారుడు కార్తికేయుడు. ప్రత్యూషుడి కొడుకు మహర్షి అయినాడు. అతడి పేరు దేవలుడు. దేవలుడికి ఇద్దరు కొడుకులు. వారు సహనశీలురు. విద్యావంతులు.

బృహస్పతే స్తు భగినీ వరస్త్రీ బ్రహ్మవాదినీ ॥156 ॥
యోగసిద్ధా జగత్ కృత్స్న మసక్తా విచచార హ ।
ప్రభాసస్య తు సా భార్యా వసూనా మష్టమస్య తు ॥157 ॥

బృహస్పతికి సోదరి శ్రేష్ఠురాలు. ఆత్మజ్ఞాని. యోగంలో సిద్ధి పొందినది. లోకవ్యవహారాలలో దేనిలోనూ ఆసక్తి లేకుండా సంచరించింది. ఆమె వసువులలో ఎనిమిదవ వాడైన ప్రభాసుడికి భార్య అయింది.

విశ్వకర్మా మహాభాగో యస్యాం జజ్ఞే ప్రజాపతిః ।
కర్తా శిల్పసహస్రాణాం త్రిదశానాం చ వార్ధకిః ॥ 158 ॥

మహాత్ము డైన విశ్వకర్మ అనే ప్రజాపతి ఆమెకు జన్మించాడు. అతడు వేల (శిల్పి) శిల్పాలను నిర్మించాడు. దేవతలకు వడ్రంగి.

భూషణానాం చ సర్వేషాం కర్తా శిల్పవతాం వరః ।
య స్సర్వేషాం విమానాని దైవతానాం చకార హ ॥159 ॥

అన్నిరకాలైన ఆభరణాలనూ కల్పించినవాడు. శిల్పులలో శ్రేష్ఠుడు. దేవతలకు అందరికీ విమానాలు తయారుచేసి యిచ్చాడు.

మానుషా శ్చోపజీవన్తి యస్య శిల్పం మహాత్మనః ।
సురభీ కశ్యపాద్ రుద్రా నేకాదశ వినిర్మమే ।
మహాదేవప్రసాదేన తపసా భావితా సతీ ॥ 160 ॥

మహాత్ముడైన ఆ విశ్వకర్మయొక్క శిల్పవిద్య కొందరు మానవులకు వృత్తి అయి, బ్రతికిస్తున్నది. తపస్సు చేసి, పరమేశ్వరుడి అనుగ్రహంతో సురభి అనే ఆమె కశ్యపప్రజాపతివలన పదకొండుమంది రుద్రులను కన్నది.

అజైకపా దహిర్బుధ్న్య స్త్వష్టా రుద్ర శ్చ వీర్యవాన్ ।
హరశ్చ బహురూపశ్చ త్ర్యమ్బక శ్చాపరాజితః ॥ 161 ॥

వృషాకపిశ్చ శమ్భుశ్చ కపర్దీ రైవత స్తథా ।
మృగవ్యాధశ్చ శర్వశ్చ కపాలీ చ ద్విజోత్తమాః ॥ 162 ॥

ఏకాదశైతే విఖ్యాతా రుద్రా స్త్రిభువనేశ్వరాః ॥ 163 ॥

1.అజైకపాత్, 2.అహిర్బుధ్న్యుడు, 3.వీర్యవంతుడైన రుద్రుడు 4. బహురూపుడైన హరుడు 5. అపరాజితుడైన త్ర్యంబకుడు, 6.వృషాకపి,7. శమ్భు 8. కపర్దీ 9. రైవతుడు 10. మృగవ్యాధుడు, 11. కపాలి అయిన శర్వుడు,

శతం త్వేవం సమాఖ్యాతం రుద్రాణా మమితౌజసామ్ ।
పురాణే మునిశార్దూలా యైర్వ్యాప్తం సచరాచరమ్ ॥164 ॥

మిక్కిలితేజస్వంతులైన ఈ రుద్రులు శతసంఖ్యలో పురాణాలలో వివరింపబడ్డారు. (వారిని స్తుతించేదే శతరుద్రీయం) మునిశ్రేష్ఠులారా! ఈ రుద్రులు స్థావరజంగమాత్మకమైన ఈ సృష్టి అంతటా నిండిఉన్నారు.

దారాన్ శృణుధ్వం విప్రేన్ద్రాః కశ్యపస్య ప్రజాపతేః ।
అదితి ర్దితి ర్దను శ్చైవ అరిష్టా సురసా ఖసా ॥ 165 ॥

సురభి ర్వినతా చైవ తామ్రా క్రోధవశా ఇరా ।
కద్రుర్మునిశ్చ భో విప్రా స్తా స్వపత్యాని బోధత ॥ 166 ॥

బ్రాహ్మణోత్తములారా! ఇక కశ్యపప్రజాపతి భార్యలను గురించి వినండి. అదితి, దితి, దనువు, అరిష్ట,సురస, ఖస, సురభి, వినత, తామ్ర, క్రోధవశ, ఇర, కద్రువ, ముని అనేవారు కశ్యపుడి భార్యలు. ఓ విప్రులారా, వారియందు కశ్యపుడికి కలిగిన సంతానం గురించి తెలుసుకోండి.(165 నుండి 219 శ్లోకాలు – శివ.ఉమా.32 అధ్యాయం)

పూర్వమన్వన్తరే శ్రేష్ఠా ద్వాదశాసన్ సురోత్తమాః ।
తుషితా నామ తేఽన్యోన్య మూచు ర్వైవస్వతే ఽన్తరే ॥167 ॥

ఉపస్థితే ఽతియశస శ్చాక్షుష స్యాన్తరే మనోః ।
హితార్థం సర్వలోకానాం సమాగమ్య పరస్పరమ్ ॥168 ॥

పూర్వమన్వంతరంలో తుషితులు అనేపేరు గలిగిన దేవతాశ్రేష్ఠులు పండ్రెండుమంది ఉన్నారు. వైవస్వత మన్వంతరం సమీపిస్తుండగా, కీర్తిమంతుడైన చాక్షుషుని మన్వంతరం చివరిదశలో, సమస్తలోకాలకు మేలు చేయడంకోసం తుషితులు అందరూ ఒకచోటికి చేరుకుని, పరస్పరం ఇలా అనుకున్నారు.

ఆగచ్ఛత ద్రుతం దేవా అదితిం సంప్రవిశ్య వై ।
మన్వన్తరే ప్రసూయామ స్త న్న శ్శ్రేయో భవిష్యతి ॥169 ॥

దేవతలారా! త్వరగా రండి. మనం ఈ చాక్షుషమన్వంతరంలో అదితిగర్భంలో ప్రవేశించి, భూమిపై జన్మిద్దాం. దానివలన మనకు మేలు కలుగుతుంది.

ఏవ ముక్త్వా తు తే సర్వే చాక్షుష స్యాన్తరే మనోః ।
మారీచాత్ కశ్యపా జ్జాతా స్త్వదిత్యాం భూరితేజసః ॥170 ॥

ఇలా అనుకుని వారందరూ చాక్షుషమన్వంతరంలో మిక్కిలి తేజోవంతుడూ, మరీచిప్రజాపతి తనయుడూ అయిన కశ్యపుడికి, అదితియందు జన్మించారు.

తత్ర విష్ణుశ్చ శక్రశ్చ జజ్ఞాతే పున రేవ హి ।
అర్యమా చైవ ధాతా చ త్వష్టా పూషా త థైవ చ ॥171 ॥

వివస్వాన్ సవితా చైవ మిత్రో వరుణ ఏవ చ ।
అంశో భగ శ్చాతితేజా ఆదిత్యా ద్వాదశ స్మృతాః ॥172 ॥

ఆ అదితిగర్భంలోనే విష్ణువు, ఇంద్రుడు కూడ తిరిగి జన్మించారు. అర్యముడు, ధాత, త్వష్ట, పూష, వివస్వంతుడు, సవితృడు, మిత్రుడు, వరుణుడు, అంశువు, మిక్కిలితేజస్వంతుడైన భగుడు అనేవారు ఆదిత్యులు. వీరు పండ్రెండు మంది.

చాక్షుష స్యాన్తరే పూర్వ మాసం స్తే తుషితా స్సురాః ।
వైవస్వతే కన్తరే తే వా ఆదిత్యా ద్వాదశ స్మృతాః ॥173 ॥

పూర్వం చాక్షుషమన్వంతరంలో దేవతలు తుషితులు అనబడేవారు. వారే తరువాత వైవస్వతమన్వంతరంలో ద్వాదశ ఆదిత్యులు అయినారు.

సప్తవింశతి యాః ప్రోక్తా స్సోమపత్న్యో మహావ్రతాః ।
తాసా మపత్యా న్యభవన్ దీప్తా న్యమితతేజసః ॥174 ॥

చంద్రుడి భార్యలుగా చెప్పబడిన ఇరవైఏడుమంది దక్షపుత్రికలు ఉత్తమనియమవతులు. వారి తనయులు గొప్ప బలవంతులు. కాంతిమంతులు.

అరిష్టనేమిపత్నీనా మపత్యా నీహ షోడశ ।
బహుపుత్రస్య విదుష శ్చతస్రో విద్యుత స్సుతాః ॥ 175 ॥

అరిష్టనేమి భార్యలకు పదహారుమంది కుమారులు. పండితుడైన బహుపుత్రుడికి విద్యుత్తులు అనేవారు నలుగురు కుమారులు.

చాక్షుష స్యాన్తరే పూర్వే ఋచో బ్రహ్మర్షిసత్కృతాః ।
కృశాశ్వస్య చ దేవర్షే ర్దేవప్రహరణా స్స్మృతాః ॥ 176 ॥

పూర్వమైన చాక్షుషమన్వంతరంలో ఋగ్వేదానికి సంబంధించిన బ్రాహ్మణులను బ్రహ్మర్షులు సమ్మానించారు. దేవఋషి అయిన కృశాశ్వుడికి దేవప్రహరణులు అనే తనయులు ఉద్భవించారు.

ఏతే యుగసహస్రాన్తే జాయన్తే పునరేవ హి ।
సర్వే దేవగణాశ్చాత్ర త్రయస్త్రింశత్తు కామజాః ॥ 177 ॥

వీళ్లు అందరూ వేయియుగాలకు చివర మళ్లీ జన్మిస్తారు. ఈదేవగణాలు మొత్తం ముప్ఫైమూడు. (ద్వాదశాదిత్యులు-12, ఏకాదశరుద్రులు-11, అష్టవసువులు-8 ఇంకా అశ్వినీదేవతలు ఇద్దరు.) వీళ్లు తమ ఇచ్ఛననుసరించి పుట్టగలిగినవారు.

తేషామపి చ భో విప్రా నిరోధోత్పత్తి రుచ్యతే ।
యథా సూర్యస్య గగన ఉదయాస్తమయా విహ ॥ 178 ॥

ఆకాశంలో సూర్యుడికి ఉదయం, అస్తమయం ఉన్నట్లుగానే ఈదేవతాగణాలకు కూడ పుట్టటం, పోవడం ఉన్నది.

ఏవం దేవనికాయాస్తే సమ్భవన్తి యుగే యుగే ।
దిత్యాః పుత్రద్వయం జజ్ఞే కశ్యపా దితి న శ్రుతమ్ ॥179 ॥

ఈవిధంగా దేవగణాలు ప్రతియుగంలోనూ సంభవిస్తుంటారు. కశ్యపుడివలన దితి ఇద్దరు కొడుకులను కన్నదని విన్నాం.

హిరణ్యకశిపు శ్చైవ హిరణ్యాక్షశ్చ వీర్యవాన్ ।
సింహికా చాభవత్ కన్యా విప్రచిత్తేః పరిగ్రహః ॥ 180 ॥

వారు హిరణ్యకశిపుడు, బలవంతు డైన హిరణ్యాక్షుడు. దితి సింహిక అనే ఒకకూతురును కూడ కన్నది. సింహిక విప్రచిత్తి అనేవాడికి భార్య అయింది.

సైంహికేయా ఇతి ఖ్యాతా యస్యాః పుత్రా మహాబలాః ।
హిరణ్యకశిపోః పుత్రా శ్చత్వారః ప్రథితౌజసః ॥ 181 ॥

సింహిక కొడుకులు సైంహికేయులు అని ప్రసిద్ధులైనారు. వారు మహాబలవంతులు. హిరణ్యకశిపుడి కొడుకులు నలుగురు. వారు మిక్కిలి పరాక్రమవంతులు.

హ్రాదశ్చ అనుహ్రాదశ్చ ప్రహ్రాదశ్చైవ వీర్యవాన్ ।
సంహ్రాదశ్చ చతుర్థోఽభూద్ హ్రాదపుత్రో హ్రద స్తథా ॥ 182 ॥

హ్రాదుడు, అనుహ్రాదుడు, శక్తిమంతుడైన ప్రహ్రాదుడు, నాలుగవవాడు సంహ్రాదుడు. (రేఫ లకారాల అభేదాన్నిబట్టి? వీళ్లు హ్లాద, ప్రహ్లాద, అనుహ్లాద, సంహ్లాద అని ప్రసిద్ధులు.) వారిలో హ్రాదునికొడుకు హ్రదుడు.

హ్రదస్య పుత్రో మాయావీ శివః కాల స్త థైవ చ ।
విరోచనశ్చ ప్రాహ్రాది ర్బలి ర్జజ్ఞే విరోచనాత్ ॥ 183 ॥

హ్రదుడి కొడుకు మాయావి. అలాగే శివుడు, కాలుడు అనేవారు కూడ హ్రదుడికొడుకులే. ప్రహ్లాదుడి కొడుకు విరోచనుడు. విరోచనుడి కొడుకు బలి.

బలేః పుత్రశతం త్వాసీద్ బాణజ్యేష్ఠం తపోధనాః ।
ధృతరాష్ట్రశ్చ సూర్యశ్చ చన్ద్రమా శ్చేన్ద్రతాపనః ॥ 184 ॥

కుమ్భనాభో గర్దభాక్షః కుక్షి రిత్యేవమాదయః ।
బాణ స్తేషా మతిబలో జ్యేష్ఠః పశుపతేః ప్రియః ॥ 185 ॥

బలికి నూరుమంది కొడుకులు గలిగారు. వాళ్లంతా తపస్వులు. వారిలో బాణుడు పెద్దకుమారుడు. ధృతరాష్ట్రుడు, సూర్యుడు, చంద్రమసుడు, ఇంద్రతాపనుడు, కుంభనాభుడు, గర్ధభాక్షుడు, కుక్షి మొదలైనవారు బలికుమారులు. వారిలో బాణుడు అధికబలవంతుడు. పెద్దవాడు. పరమేశ్వరుడికి ఇష్టమైనవాడు. (ఈశ్వరానుగ్రహం పొందిన గొప్పశివభక్తుడు.)

పురా కల్పే తు బాణేన ప్రసాద్యోమాపతిం ప్రభుమ్ ।
పార్శ్వతో విహరిష్యామి ఇత్యేవం యాచితో వరః ॥ 186 ॥

పూర్వకల్పంలో బాణుడు (గొప్ప తపస్సు చేసి) శివుడిని ప్రసన్నం చేసుకుని 'తాను ఎప్పుడూ పరమేశ్వరుని ప్రక్కనే (ఈశ్వరానుచరుడుగా) విహరించాలి' అనే వరం కోరుకున్నాడు.

హిరణ్యాక్షసుతాః పఞ్చ విద్వాంసశ్చ మహాబలాః ।
భర్భర శ్శకుని శ్చైవ భూతసన్తాపన స్తథా ॥ 187 ॥

మహానాభశ్చ విక్రాన్తః కాలనాభస్తథైవ చ ।
అభవన్ దనుపుత్రాశ్చ శతం తీవ్రపరాక్రమాః ॥ 188 ॥

హిరణ్యాక్షుడి కొడుకులు ఐదుగురు. వారు పండితులు. గొప్పబలవంతులు. వారిపేర్లు భర్భరుడు, శకుని, భూతసంతాపనుడు, మహానాభుడు, విక్రాంతుడు, కాలనాభుడు. దనువుకు నూరుగురు. వారు అత్యధికమైన పరాక్రమం గలిగినవారు.

తపస్వినో మహావీర్యాః ప్రాధాన్యేన బ్రవీమి తాన్ ।
ద్విమూర్ధా శఙ్కుకర్ణశ్చ తథా హయశిరా విభుః ॥ 189 ॥

అయోముఖ శ్శమ్బరశ్చ కపిలో వామన స్తథా ।
మారీచి ర్మఘవాంశ్చైవ ఇల్వల స్సృమణ స్తథా ॥ 190 ॥

విక్షోభణశ్చ కేతుశ్చ కేతువీర్యశతహ్రదౌ ।
ఇన్ద్రజిత్ సర్వజి చ్చైవ వజ్రనాభ స్తథైవ చ ॥ 191 ॥

ఏకచక్రో మహాబాహు స్తారకశ్చ మహాబలః ।
వైశ్వానరః పులోమా చ విద్రావణమహాశిరాః ॥ 192 ॥

స్వర్భాను ర్వృషపర్వా చ విప్రచిత్తిశ్చ వీర్యవాన్ ।
సర్వ ఏతే దనోః పుత్రాః కశ్యపా దభిజజ్ఞిరే ॥ 193 ॥

వారు తపస్వులు. గొప్పశక్తిమంతులు. ప్రాధాన్యాన్నిబట్టి వారిని పేర్కొంటాను. ద్విమూర్ధుడు, శంకుకర్ణుడు, హయశిరుడు, అయోముఖుడు, శంబరుడు, కపిలుడు, వామనుడు, మారీచి, మఘవంతుడు, ఇల్వలుడు, సృమణుడు, విక్షోభణుడు, కేతువు, కేతువీర్యుడు, శతహ్రదుడు, ఇంద్రజిత్తు, సర్వజిత్తు, వజ్రనాభుడు, ఏకచక్రుడు, మహాబాహుడు, బలవంతుడైన తారకుడు, వైశ్వానరుడు, పులోముడు, విద్రావణుడు, మహాశిరుడు, స్వర్భానువు, వృషపర్వుడు, శక్తిమంతుడైన విప్రచిత్తి. వీరు అందరూ దనువుకు కశ్యపుడివలన పుట్టారు.

విప్రచిత్తిప్రధానాస్తే దానవా స్సుమహాబలాః ।
ఏతేషాం యదపత్యం తు న తచ్ఛక్యం ద్విజోత్తమాః ॥194 ॥

ప్రసంఖ్యాతుం బహుత్వాచ్చ పుత్రపౌత్ర మనన్తకమ్ ।
స్వర్భానోస్తు ప్రభా కన్యా పులోమ్నస్తు శచీ సుతా ॥ 195 ॥

వీరిలో ముఖ్యుడైనవాడు విప్రచిత్తి దనువుపుత్రు లైనవీరందరూ, గొప్పబలవంతులు. వీరిసంతానాన్ని లెక్కించటం సాధ్యం కాదు. ఎందుకంటే వారు అనేకంగా. అంతులేకుండా ఉన్నారు. స్వర్భానుడి కూతురు ప్రభ. పులోముడి కూతురు శచి.

ఉపదానవీ హయశిరా శ్శర్మిష్ఠా వార్షపర్వణీ ।
పులోమా కాలకా చైవ వైశ్వానరసుతే ఉభే ॥ 196 ॥

బహ్వపత్యే మహాసత్త్వే మరీచేస్తు పరిగ్రహః ।
తయోః పుత్రసహస్రాణి షష్టి ర్దానవనన్దనాః ॥ 197 ॥

హయశిరుడి కూతురు ఉపదానవి. వృషపర్వుడికూతురు శర్మిష్ఠ. పులోమ, కాలక అనేవారు ఇద్దరు వైశ్వానరుడికుమార్తెలు. వీరు అత్యంతబలవతులు. అధికసంతానవతులు. ఇద్దరూ మరీచిని వివాహం చేసుకున్నారు. వారికి అరవై వేలమంది దానవులైన కొడుకులు కలిగారు.

చతుర్దశశతానన్యాన్ హిరణ్యపురవాసినః ।
మరీచి ర్జనయామాస మహతా తపసాన్వితః ॥198 ॥

(మా)మరీచి గొప్పతపస్సు చేసి పదునాల్గువందలమంది కొడుకులను వేరేవారిని కూడ కన్నాడు. వారు హిరణ్యపురంలో నివసిస్తుంటారు.

పౌలోమాః కాలకేయాశ్చ దానవా స్త్వతిదారుణాః ।
సింహికాయా మథోత్పన్నా విప్రచిత్తే స్సుతా స్తథా ।
దైత్యదానవసంయోగా జ్జాతాస్తీవ్రపరాక్రమాః ॥ 199 ॥

పౌలోములు(పులోమ కొడుకులు), కాలకేయులు (కాలక కొడుకులు) అనబడే ఆ దానవులు (హిరణ్యపురంలో ఉండే మరీచి కొడుకులు) మిక్కిలి భయంకరులు. విప్రచిత్తికి సింహికయందు కొడుకులు కలిగారు. దైత్యుల దానవుల కలయికతో పుట్టినవారు భయంకరమైన పరాక్రమం గలిగినవారు.

సైంహికేయా ఇతి ఖ్యాతా స్త్రయోదశ మహాబలాః ।
వంశ్య శ్శల్యశ్చ బలినౌ నలశ్చైవ తథా బలః ॥ 200 ॥

వాతాపి ర్నముచి శ్చైవ ఇల్వల స్సృమణ స్తథా ।
అఞ్జికో నరక శ్చైవ కాలనాభ స్త థైవ చ ॥ 201 ॥

సరమాన స్తథా చైవ స్వరకల్పశ్చ వీర్యవాన్ ।
మూషక శ్చైవ తుహుణ్డశ్చ హ్రదపుత్రౌ బభూవతుః ॥ 202 ॥

వారు సైంహికేయులు (సింహికకొడుకులు) అని ప్రసిద్ధి పొందారు. మహాబలవంతులైనవారు పదముగ్గురు. బలవంతులైన వంశ్యుడు, శల్యుడు, నలుడు, బలుడు, వాతాపి, నముచి, ఇల్వలుడు, సృమణుడు, అంజికుడు, నరకుడు, కాలనాభుడు, సరమానుడు, శక్తిమంతుడైన స్వరకల్పుడు. మూషకుడు, హుండుడు అనేవారు ఇద్దరు హ్రదుడికొడుకులు.

మారీచ స్సున్దపుత్ర స్తు తాడకాయాం వ్యజాయత ।
ఏతే వై దానవా శ్శ్రేష్ఠా దనో ర్వంశవివర్ధనాః ॥ 203 ॥

తాడకకు సుందుడివలన మారీచుడు జన్మించాడు. దనువు వంశాన్ని వృద్ధిపరచిన వీరు దానవులలోశ్రేష్ఠులు.

తేషాం పుత్రాశ్చ పౌత్రాశ్చ శతశోఽథ సహస్రశః ।
సంహ్రాదస్య తు దైత్యస్య నివాతకవచాః కులే ॥ 204 ॥

సముత్పన్నా స్సుమహతా తపసా భావితాత్మనః ।
వైద్యుతా స్సుమహాభాగా స్తామ్రాయాం పరికీర్తితాః ।
తిస్రః కోట్య స్సుతా స్తేషాం మణివత్యాం నివాసినః ॥ 205 ॥

వారికొడుకులు, మనుమలు వందలలో వేలలో ఉన్నారు. సంహ్రాదుడు అనే దైత్యుడికులంలో నివాతకవచులు అనేవారు సంభవించారు. వీరందరూ గొప్పతపస్సు చేసినవారు. ఆత్మానుభూతిని పొందినవారు. తామ్రయందు మహాత్ములైన వైద్యుతులు అనేవారు జన్మించారు. వారికి మూడుకోట్లమంది కొడుకులు గలిగారు. వారందరూ మణివతి (విద్యాధరులరాజధాని) నగరంలో నివసిస్తుంటారు.

అవధ్యాస్తేఽపి దేవానా మర్జునేన నిపాతితాః ।
క్రౌఞ్చీ శ్యేనీ చ భాసీ చ సుగ్రీవీ శుచి ర్గృధ్రికా ।
క్రౌఞ్చీ తు జనయామాస ఉలూక ప్రత్యులూకకాన్ ॥ 206 ॥

ఆ నివాతకవచులను దేవతలు కూడ సంహరింపలేకపోయారు. వారిని అర్జునుడు సంహరించాడు. తామ్రకు ఆరుగురు కూతుళ్లు కలిగారు. వారు క్రౌంచి, శ్యేని, భాసి, గృధ్రి, శుచి, సుగ్రీవి అనేవారు. వారిలో క్రౌంచి గ్రుడ్లగూబలనూ, కాకులనూ కన్నది.

శ్యేనీ శ్యేనాం స్తథా భాసీ భాసాన్ గృధ్రాంశ్చ గృధ్ర్యపి ।
శుచి రౌదకాన్ పక్షిగణాన్ సుగ్రీవీ తు ద్విజోత్తమాః ॥ 207 ॥

అశ్వా నుష్ట్రాన్ గర్దభాంశ్చ తామ్రవంశః ప్రకీర్తితః ।
వినతాయా స్తు ద్వౌ పుత్రౌ విఖ్యాతౌ గరుడారుణౌ ॥ 208 ॥

బ్రాహ్మణశ్రేష్ఠులారా! శ్యేని డేగలను, భాసి రాబందులను (కోడిపుంజులను), గృధ్రి గ్రద్దలను, శుచి నీటి పక్షులను, సుగ్రీవి గుఱ్ఱాలను, ఒంటెలను, గాడిదలను, ప్రసవించాయి. ఈవిధంగా తామ్రవంశం విస్తరించింది. వినతకు గరుడుడు, అరుణుడు అని యిద్దరు కొడుకులు.

గరుడః పతతాం శ్రేష్ఠో దారుణ స్స్వేన కర్మణా ।
సురసాయా స్సహస్రం తు సర్పాణా మమితౌజసామ్ ॥ 209 ॥

అనేక శిరసాం విప్రాః ఖేచరాణాం మహాత్మనామ్ ।
కాద్రవేయాస్తు బలిన స్సహస్ర మమితౌజసః ॥ 210 ॥

గరుడుడు పక్షులలో శ్రేష్ఠుడు (పక్షిగణనాయకుడు). తాను చేసిన పనుల వలన తీక్ష్ణుడు అయినాడు. సురస వేయిమంది పాములను కన్నది. వారు మిక్కిలిబలవంతులు. అనేకమైన తలలు (పడగలు) గలిగినవారు. మహాత్ములు. ఆకాశంలో సంచరించేవారు. బ్రాహ్మణులారా, కద్రువ కొడుకులు వేయిమంది. వారందరూ బలవంతులూ, మిక్కిలి పరాక్రమం గలిగినవారు.

సుపర్ణవశగా నాగా జజ్ఞిరే నైకమస్తకాః ।
యేషాం ప్రధానా స్సతతం శేష వాసుకి తక్షకాః ॥ 211 ॥
ఐరావతో మహాపద్మః కమ్బలాశ్వతరా వుభౌ ।
ఏలాపత్రశ్చ శఙ్ఖశ్చ కర్కోటక ధనఞ్జయౌ ॥ 212 ॥

మహానీల మహాకర్ణౌ ధృతరాష్ట్ర బలాహకౌ ।
కుహరః పుష్పదంష్ట్రశ్చ దుర్ముఖ స్సుముఖ స్తథా ॥ 213 ॥

శఙ్ఖశ్చ శఙ్ఖపాలశ్చ కపిలో వామన స్తథా ।
నహుష శ్శఙ్ఖరోమా చ మణిరి త్యేవ మాదయః ॥ 214 ॥

కద్రువ కొడుకులైన ఈసర్పాలు గరుడుడికి లోబడిఉంటారు. అనేకశిరస్సులు (పడగలు) గలిగినవారు. వీరిలో ఎప్పటికీ ముఖ్యమైనవారు – శేషుడు, వాసుకి, తక్షకుడు, ఐరావతుడు, మహాపద్ముడు, కవలలైన కంబలుడు,

అశ్వతరుడు, అనేవారు, ఏలాపత్రుడు, శంఖుడు, కర్కోటకుడు, ధనంజయుడు, మహానీలుడు, మహాకర్ణుడు, ధృతరాష్ట్రుడు, బలాహకుడు, కుహరుడు, పుష్పదంష్ట్రుడు, దుర్ముఖుడు, సుముఖుడు, శంఖుడు, శంఖపాలుడు, కపిలుడు, వామనుడు, నహుషుడు, శంఖరోముడు, మణి ఈ మొదలైనవారు (నాగజాతిలో ముఖ్యంగా పేర్కొనదగినవారు).

తేషాం పుత్రాశ్చ పౌత్రాశ్చ శతశోఽథ సహస్రశః ।
చతుర్దశసహస్రాణి క్రూరాణా మనిలాశినామ్ ॥ 215 ॥

గణః క్రోధవశో విప్రా స్తస్య సర్వేచ దంష్ట్రిణః ।
స్థలపక్షిణో హ్యనన్తాశ్చ ధారాయాః ప్రసవా స్మృతాః ॥ 216 ॥

వారికి కొడుకులు, మనుమళ్లు వందలలో, వేలల్లో ఉన్నారు. ఆపాములలో పదునాలుగువేలమంది చాలా దుర్మార్గులు. ఎపుడూ కోపానికి లోబడి ఉంటారు. ఇంక ధారకు సంతానమైన స్థలపక్షులకు అంతు లేదు.

గాస్తు వై జనయామాస సురభి ర్మహిషీ స్తథా ।
ఇరా వృక్షలతా వల్లీ స్తృణజాతీశ్చ సర్వశః ॥ 217 ॥

సురభి ఆవులకూ, గేదెలకూ జన్మనిచ్చింది. ఇర అన్నిచోట్లలోనూ చెట్లు, తీగలు, మొక్కలు, గడ్డితెగకు చెందిన మొక్కలను సృష్టి చేసింది.

ఖశా తు యక్ష రక్షాంసి ముని రప్సరస స్తథా ।
అరిష్టా తు మహాసత్త్వాన్ గన్ధర్వా నమితౌజసః ॥ 218 ॥

ఖశ (ఖస 165శ్లో) యక్షులనూ, రాక్షసులనూ కన్నది. ముని అప్సరసలను కన్నది. అరిష్ట గొప్పబలవంతులూ, పరాక్రమవంతులూ అయిన గంధర్వులకు జన్మనిచ్చింది.

ఏతే కశ్యపదాయాదాః కీర్తితాః స్థాణుజఙ్గమాః ।
యేషాం పుత్రాశ్చ పౌత్రాశ్చ శతశోఽథ సహస్రశః ॥219 ॥

ఇది స్థావరజంగమాత్మకమైన కశ్యపప్రజాపతిసంతానం. వీరికి కొడుకులూ, మనుమళ్లూ వందలలోనూ, వేలలోనూ కలిగారు.

ఏష మన్వన్తరే విప్రా స్సర్గ స్స్వారోచిషే స్మృతః ।
వైవస్వతేఽతిమహతి వారుణే వితతే క్రతౌ ॥ 220 ॥

జుహ్వానస్య బ్రహ్మణో వై ప్రజాసర్గ ఇహోచ్యతే ।
పూర్వం యత్ర సముత్పన్నాన్ బ్రహ్మర్షీన్ సప్త మానసాన్ ॥ 221 ॥

పుత్రత్వే కల్పయామాస స్వయ మేవ పితామహః ।
తతో విరోధే దేవానాం దానవానాం చ భో ద్విజాః ॥ 222 ॥

దితి ర్వినష్టపుత్రా వై తోషయామాస కశ్యపమ్ ।
కశ్యపస్తు ప్రసన్నాత్మా సమ్యగారాధితస్తయా ॥223 ॥

వరేణ ఛన్దయామాస సా చ వవ్రే వరం తదా ।
పుత్ర మిన్ద్రవధార్థాయ సమర్థ మమితౌజసమ్ ॥ 224 ॥

ఓ బ్రాహ్మణులారా! ఇది స్వారోచిషమన్వంతరంలో ఏర్పడిన సృష్టిక్రమం. తరువాత ప్రస్తుతం వైవస్వత మన్వంతరంలో వరుణుడు చేస్తున్న గొప్పయజ్ఞంలో హోమం చేస్తున్న బ్రహ్మదేవుడికి సంబంధించిన ప్రజాసృష్టిని గురించి ఇక చెప్తాను. పూర్వకల్పంలో తన మనసు నుండి సృష్టించిన ఏడుగురు బ్రహ్మర్షులను బ్రహ్మదేవుడు ఈ కల్పంలో మళ్లీ తనపుత్రులుగా ఏర్పరచాడు. ఓ బ్రాహ్మణులారా! దేవతలకూ దానవులకూ ఏర్పడిన శత్రుత్వంలో దితిపుత్రులు నశించిపోయారు. అపుడు దితి సంతానంకోసం కశ్యపుడిని చక్కగా ఆరాధించి, ఆతడిని సంతోషపెట్టింది. దితి సేవలకు సంతోషించిన కశ్యపుడు దితిని ఏ దైనా వరం కోరుకోమన్నాడు. అపుడు దితి సమర్థుడూ, మిక్కిలి పరాక్రమవంతుడూ, ఇంద్రుడిని సంహరించే కొడుకును ఇమ్మని కోరుకున్నది. (220 నుండి239 శ్లోకాలు - శివ. ఉమా. 33 అధ్యాయం 1 నుండి19 శ్లోకాలు)

స చ తస్యై వరం ప్రాదాత్ ప్రార్థిత స్సుమహాతపాః ।
దత్త్వా చ వర మవ్యగ్రో మారీచ స్తా మభాషత ॥ 225 ॥

మహాతపస్వి అయిన కశ్యపుడు దితి ప్రార్థనను మన్నించి కోరిన వరాన్ని ఇచ్చాడు. కొడుకును ప్రసాదిస్తూ కశ్యపుడు శాంతంగా దితితో ఇలా అన్నాడు.

ఇన్ద్రం పుత్రో నిహన్తా తే గర్భే వై శరదాం శతమ్ ।
యది ధారయసే శౌచ తత్పరా వ్రత మాస్థితా ॥ 226 ॥

నీవు అచంచలమైన శుచి భావంతో నియమాలు పాటిస్తూ నూరు సంవత్సరాలపాటు గర్భాన్ని ధరించగలిగితే, నీకు జన్మించినవాడు ఇంద్రుడిని చంపేవాడు అవుతాడు.

తథేత్యభిహితో భక్త్యా తయా దేవ్యా మహాతపాః ।
ధారయామాస గర్భం తు శుచి స్సా మునిసత్తమాః ॥ 227 ॥

భర్తపై భక్తితో దితి అందుకు సరే అన్నది. తపస్వి అయిన కశ్యపుడు దితిచేత గర్భాన్ని ధరింపజేశాడు. మునిశ్రేష్ఠులారా, దితి శుచియై గర్భాన్ని మోసింది.

తతోఽభ్యుపగమ ద్దిత్యాం గర్భ మాధాయ కశ్యపః ।
రోచయ ద్వై గణం శ్రేష్ఠం దేవానా మమితౌజసామ్ ॥ 228 ॥

దితియందు గర్భాన్ని నిలిపిన తరువాత కశ్యపుడు అక్కడ నుండి వెళ్లిపోయాడు. కశ్యపుడు ఆగర్భంలో మిక్కిలి పరాక్రమవంతులూ శ్రేష్ఠులూ ఐన దేవతాగణం కలగాలని కోరుకున్నాడు.

తేజ స్సంహత్య దుర్ధర్ష మవధ్య మమరై రపి ॥
జగామ పర్వతాయైవ తపసే సంశితవ్రతః ॥ 229 ॥

దేవతలు కూడ సంహరింపలేని అజేయమైన తన తేజస్సును దితి గర్భంలో నిలిపి, మాట నిలబెట్టుకుని, (దితి కిచ్చిన వరాన్ని నెరవేర్చి) తపస్సు చేసుకోవడానికి ఒకానొకపర్వతం మీదకు వెళ్లిపోయాడు.

తస్యా శ్చై వాన్తరప్రేప్సు రభవత్ పాకశాసనః ।
జాతే వర్షశతే చాస్యా దద ర్శాన్తర మచ్యుతః ॥ 230 ॥

దేవేంద్రుడు దితికి నియమభంగం ఎపుడు జరుగుతుందా అని ఎదురుచూస్తున్నాడు. నూరు సంవత్సరాలు పూర్తవుతుండగా, జాగ్రత్తగా దితిలో వ్రతలోపాన్ని గమనించాడు.

అకృత్వా పాదయో శ్శౌచం దితి శ్శయన మావిశత్ ।
నిద్రాం చాహారయామాస తస్యాః కుక్షిం ప్రవిశ్య సః ॥ 231 ॥

వజ్రపాణి స్తతో గర్భం సప్తధా తం న్యకృన్తయత్ ।
స పాట్యమానో గర్భోఽథ వజ్రేణ ప్రరురోద హ ॥ 232 ॥

ఒకనాడు దితి కాళ్లు కడుక్కోకుండ మంచ మెక్కి నిద్రకు ఉపక్రమించింది. అపుడు ఇంద్రుడు దితి కడుపులోనికి ప్రవేశించి, తనచేతిలోని వజ్రాయుధంతో ఆమె గర్భంలోని పిల్లవాడిని ఏడు ముక్కలుగా నరికాడు. అలా వజ్రాయుధంతో చీల్చివేయబడిన ఆపిల్లవాడు పెద్దగా ఏడవసాగాడు.

మా రోదీరితి తం బాలం శక్రః పునరథాబ్రవీత్ ।
సో ఽభవత్ సప్తధా గర్భ స్త మిన్ద్రో రుషితః పునః ॥ 233 ॥

అపుడు ఇంద్రుడు దితిగర్భంలోని పిల్లవాడిని ఏడవవద్దు అని మళ్లీ మళ్లీ చెప్పాడు. ఆమె గర్భంలోని పిల్లవాడు ఏడు ముక్కలైనాడు. ఇంద్రుడు ఆగర్భంముక్కలపై ఇంకా కోపగించాడు.

ఏకైకం సప్తధా చక్రే వజ్రేణైవారికర్షణః ।
మరుతో నామ తే బాలా బభూవు ర్ద్విజసత్తమాః ॥ 234 ॥

వజ్రాయుధంతో ఇంద్రుడు ఒక్కొక్క ముక్కను మళ్లీ ఏడుముక్కలు చేశాడు. ఓ బ్రాహ్మణోత్తములారా, ఆ నలభై తొమ్మిది ముక్కలయిన బాలకులు మరుత్తులు అనే పేరుతో దేవతలు అయినారు.

యథోక్తం వై మఘవతా తథైవ మరుతోఽభవన్ ।
దేవా శ్చైకోనపఞ్చాశత్ సహాయా వజ్రపాణినః ॥ 235 ॥

ఇంద్రుడు చెప్పిన ప్రకారంగా వారు మరుత్తులు అయినారు. మరుత్తులైన ఈదేవతలు (7×7=49) నలభైతొమ్మిదిమంది (ఇంద్రుడు చెప్పినట్లుగా) ఇంద్రుడికి సహాయకులు అయినారు.

తేషా మేవం ప్రవృత్తానాం భూతానాం ద్విజసత్తమాః ।
రోచయన్ వై గణశ్రేష్ఠం దేవానా మమితౌజసామ్ ॥ 236 ॥

నికాయేషు నికాయేషు హరిః ప్రాదాత్ ప్రజాపతీన్ ।
క్రమశ స్తాని రాజ్యాని పృథుపూర్వాణి భో ద్విజాః ॥ 237 ॥

ఓ ద్విజశ్రేష్ఠులారా! ఈవిధంగా ఏర్పడిన చరాచరభూతసమూహంలోనూ, పరాక్రమవంతులైన దేవతలలోనూ, ఆ యా గణాలకు శ్రీహరి ప్రజాపతులను ఏర్పరిచాడు. బ్రాహ్మణులారా! క్రమంగా పృథుమహారాజుతో ఆయారాజ్యాలు ప్రారంభం అయినాయి.

స హరిః పురుషో వీరః కృష్ణో విష్ణుః ప్రజాపతిః ।
పర్జన్య స్తపనో ఽనన్తస్య సర్వ మిదం జగత్ ॥ 238 ॥

ఆ శ్రీహరియే పురుషుడు. వీరుడు, కృష్ణుడు, విష్ణువు, ప్రజాపతి, పర్జన్యుడు (మేఘం), తపనుడు (సూర్యుడు), సమస్తమైన ఈజగత్తు అంతా అనంతుడైన ఆశ్రీహరికి సంబంధించినదే.

భూతసర్గ మిమం సమ్యగ్ జానతో ద్విజసత్తమాః ।
నావృత్తిభయ మ స్తీహ పరలోకభయం కుతః ॥ 239 ॥

బ్రాహ్మణశ్రేష్ఠులారా! ఈభూతసృష్టిని గూర్చి చక్కగా తెలుసుకున్నవాడు భూలోకానికి తిరిగి రాడు. ఊర్ధ్వలోకాలను గూర్చిన భయం లేదు. (నిశ్చయంగా పునరావృత్తి రహితమైన మోక్షపదవిని పొందుతాడు.)

ఇతి శ్రీబ్రహ్మపురాణే దేవాసురోత్పత్తికథనం నామ ప్రథమోఽధ్యాయః ॥ 1 ॥

శ్రీబ్రహ్మపురాణంలో దేవాసురోత్పత్తికథనం అనే ప్రథమాధ్యాయం సంపూర్ణం.



ద్వితీయోఽధ్యాయః - రెండవఅధ్యాయం

పృథుజన్మమాహాత్మ్యకథనమ్ - పృథుజన్మమాహాత్మ్యకథనం

లోమహర్షణ ఉవాచ:-లోమహర్షణుడు ఇలా చెప్తున్నాడు.

అభిషి చ్యాధిరాజేన్ద్రం పృథుం వైన్యం పితామహః ।
తతః క్రమేణ రాజ్యాని వ్యాదేష్టు ముపచక్రమే ॥ 1 ॥

బ్రహ్మ వేనుడిపుత్రుడైన పృథువును చక్రవర్తిగా అభిషేకించాడు. తర్వాత క్రమంగా ఆయాదేవతలకు వారు పాలించవలసిన రాజ్యాలను గూడ నియమించటం ప్రారంభించాడు.

ద్విజానాం వీరుధాం చైవ నక్షత్రగ్రహయో స్తథా ।
యజ్ఞానాం తపసాం చైవ సోమం రాజ్యేఽభ్యషేచయత్ ॥ 2 ॥

పక్షులకూ, పొదలకూ, నక్షత్రాలకూ, గ్రహాలకూ, యజ్ఞాలకూ, తపస్సులకూ సంబంధించిన రాజ్యానికి చంద్రుడిని రాజుగా అభిషేకించాడు.

అపాం తు వరుణం రాజ్యే రాజ్ఞాం వైశ్రవణం పతిమ్ ।
ఆదిత్యానాం తథా విష్ణుం వసూనా మథ పావకమ్ ॥ 3 ॥

జలసామ్రాజ్యానికి వరుణుడినీ, రాజులకు కుబేరుడినీ, ఆదిత్యులకు విష్ణువునూ, వసువులకు అగ్నినీ రాజులు చేశాడు.

ప్రజాపతీనాం దక్షం తు మరుతా మథ వాసవమ్ ।
దైత్యానాం దానవానాం వై ప్రహ్రాద మమితౌజసమ్ ॥ 4 ॥

ప్రజాపతులకు దక్షుడినీ, మరుత్తులకు ఇంద్రుడినీ, దైత్యులకూ (దితికొడుకులు) దానవులకూ (దనువు కొడుకులు) మిక్కిలిపరాక్రమవంతుడైన ప్రహ్లాదుడినీ, రాజులను చేశాడు.

వైవస్వతం పితౄణాం చ యమం రాజ్యేఽభ్యషేచయత్ ।
యక్షాణాం రాక్షసానాం చ పార్థివానాం తథైవ చ ॥ 5 ॥

సర్వభూతపిశాచానాం గిరీశం శూలపాణినమ్ ।
శైలానాం హిమవన్తం చ నదీనా మథ సాగరమ్ ॥ 6 ॥

పితృదేవతలరాజ్యానికి వివస్వంతుడి (సూర్యుడి) కొడుకైన యముడిని రాజుగా అభిషేకించాడు. యక్షులకూ, రాక్షసులకూ, భూపాలురకూ, సమస్తమైన భూతాలకూ, పిశాచాలకూ, త్రిశూలం చేతబట్టిన పరమేశ్వరుడిని రాజును చేశాడు. పర్వతాలకు హిమాలయాన్నీ, నదులకు సముద్రాన్నీ రాజులను చేశాడు.

గన్ధర్వాణా మధిపతిం చక్రే చిత్రరథం ప్రభుమ్ ।
నాగానాం వాసుకిం చక్రే సర్పాణామథ తక్షకమ్ ॥ 7 ॥

గంధర్వులకు సమర్థుడైన చిత్రరథుడిని అధిపతిని చేశాడు. నాగులకు వాసుకిని ప్రభువును చేశాడు. పాములకు తక్షకుడిని నాయకుడిని చేశాడు.

వారణానాం తు రాజాన మైరావత మథాదిశత్ ।
ఉచ్చైశ్శ్రవస మశ్వానాం గరుడం చైవ పక్షిణామ్ ॥ 8 ॥

ఏనుగులకు రాజుగా ఐరావతాన్ని నియమించాడు. గుఱ్ఱాలకు ఉచ్చైశ్శ్రవాన్నీ రాజు చేశాడు. పక్షులకు గరుడుడినీ రాజుగా చేశాడు.

మృగాణా మథ శార్దూలం గోవృషం తు గవాం పతిమ్ ।
వనస్పతీనాం రాజానం ప్లక్ష మే వాభ్యషేచయత్ ॥ 9 ॥

మృగాలకు పెద్దపులినీ, ఆవులకు ఆబోతునూ, వనస్పతులకు (పూత లేకుండ కాయలు కాచేచెట్లు) జువ్వి చెట్టును రాజుగా అభిషేకించాడు.

ఏవం విభజ్య రాజ్యాని క్రమేణైవ పితామహః ।
దిశాం పాలా నథ తతః స్థాపయామాస స ప్రభుః ॥ 10 ॥

రాజ్యాలను ఈవిధంగా విభాగం చేసి, వానివానికి రాజులను నిర్ణయించిన తర్వాత బ్రహ్మ దిక్కులకు అధిపతులను ప్రతిష్ఠించాడు.

పూర్వస్యాం దిశి పుత్రం తు వైరాజస్య ప్రజాపతేః ।
దిశః పాలం సుధన్వానం రాజానం సోఽభ్యషేచయత్ ॥11 ॥

వైరాజప్రజాపతి తనయుడైన సుధన్వుడిని తూర్పుదిక్కుకు రక్షకుడుగా, రాజుగా అభిషేకించాడు.

దక్షిణస్యాం మహాత్మానం కర్దమస్య ప్రజాపతేః ।
పుత్రం శఙ్ఖపదం నామ రాజానం సోఽభ్యషేచయత్ ॥ 12 ॥

దక్షిణదిక్కుకు అధిపతిగా మహాత్ముడైన కర్దమప్రజాపతి తనయుడైన శంఖపదుడు అనే పేరు గలవాడిని రాజుగా అభిషేకించాడు.

పశ్చిమస్యాం దిశి తథా రజసఃపుత్ర మచ్యుతమ్ ।
కేతుమన్తం మహాత్మానం రాజానం సోఽభ్యషేచయత్ ॥13 ॥

పడమటి దిక్కుకు స్థిరపరాక్రముడూ, మహాత్ముడూ, రజస్సు అనేవాడి కుమారుడూ అయిన కేతుమంతుడిని రాజుగా అభిషేకించాడు.

తథా హిరణ్యరోమాణం పర్జన్యస్య ప్రజాపతేః ।
ఉదీచ్యాం దిశి దుర్ధర్షం రాజానం సోఽభ్యషేచయత్ ॥ 14 ॥

ఉత్తర దిక్కుకు పర్జన్య ప్రజాపతి కొడుకూ, ఎదురు లేని పరాక్రమం కలిగినవాడూ, అయిన హిరణ్యరోముడిని రాజుగా అభిషేకించాడు.

తైరియం పృథివీ సర్వా సప్తద్వీపా సపత్తనా ।
యథాప్రదేశ మద్యాపి ధర్మేణ ప్రతిపాల్యతే ॥15॥

ఏడు ద్వీపాలు, (జంబూ, ప్లక్ష, కుశ, క్రౌంచ, శాక, శాల్మల, పుష్కరము లనే ప్రముఖద్వీపాలు ఏడు కలిగి ఉండటంచేత భూమికి సప్తద్వీప అని పేరు.) రాజధాని నగరాలతో సహా, ఈమొత్తం భూమండలాన్ని ఇప్పటివరకూ బ్రహ్మ నియమించిన ఆయా రాజులు వారి వారి పరిధులను అనుసరించి ధర్మబద్ధంగా పరిపాలిస్తున్నారు.

రాజసూయాభిషిక్తస్తు పృథు రైతై ర్నరాధిపైః ।
వేదదృష్టేన విధినా రాజా రాజ్యే నరాధిపః ॥16॥

ఈరాజులు అందరూ జననాయకుడైన పృథుమహారాజును వేదంలో చెప్పబడిన విధానంతో రాజసూయ యాగంలో చక్రవర్తిగా అభిషేకించారు.

తతో మన్వన్తరేఽ తీతే చాక్షుషేఽ మితతేజసి ।
వైవస్వతాయ మనవే పృథివ్యాం రాజ్యమాదిశత్ ॥17॥

మిక్కిలి ప్రభావవంతమైన చాక్షుషమన్వంతరం గడిచింది. భూమిపాలనకు వైవస్వతమనువును ఆదేశించడం జరిగింది.

తస్య విస్తర మాఖ్యాస్యే మనో ర్వైవస్వతస్య హ ।
భవతాం చానుకూల్యాయ యది శ్రోతు మిహేచ్ఛథ ।
మహదేతదధిష్ఠానం పురాణే పరినిష్ఠితమ్ ॥18॥

మీరు వినదలచుకుంటే, మీకు శుభం కలగడంకోసం వైవస్వతమనువును గురించి సవిస్తరంగా చెప్తాను. ఉత్తమమైన వైవస్వతుడివృత్తాంతం అంతా పురాణాలలో చక్కగా చెప్పబడిఉంది.

మునయ ఊచుః :-మునులు ఇలా అన్నారు.

విస్తరేణ పృథోర్జన్మ లోమహర్షణ కీర్తయ ।
యథా మహాత్మనా తేన దుగ్ధా చేయం వసున్ధరా ॥19॥

లోమహర్షణా! పృథువు పుట్టుకను గూర్చి వివరించి చెప్పు. ఆమహాత్ముడు ఈభూమిని ఏవిధంగా పితికాడో ఆవిషయం చెప్పు.

యథా చ పితృభి ర్దుగ్ధా యథా దేవై ర్మహర్షిభిః ।
యథా దైత్యైశ్చ నాగైశ్చ యథా యక్షై ర్యథా ద్రుమైః ॥ 20 ॥

యథా శైలైః పిశాచైశ్చ గన్ధర్వైశ్చ ద్విజోత్తమైః ।
రాక్షసైశ్చ మహాసత్త్వై ర్యథా దుగ్ధా వసున్ధరా ॥ 21 ॥

పితరులు, దేవతలు, మహర్షులు, దైత్యులు, నాగులు, యక్షులు, చెట్లు, కొండలు, పిశాచాలు, గంధర్వులు, బ్రాహ్మణశ్రేష్ఠులు, గొప్పశక్తిమంతులైన రాక్షసులు, వీళ్ళు అందరూ భూమిని ఎలా పితికారు?

తేషాం పాత్రవిశేషాంశ్చ వక్తు మర్హసి సువ్రత ।
వత్సక్షీరవిశేషాంశ్చ దోగ్ధారం చానుపూర్వశః ॥ 22 ॥

మహర్షీ! భూమిని పిదకటానికి వారు ఉపయోగించిన వివిధపాత్రలను గురించి చెప్పు. దూడలు ఏవి? పితికినపాలు ఏవి? పితికినవాడు ఎవడు? ఈవిషయాలన్నీ క్రమంగా చెప్పగలిగినవాడివి నీవే.

యస్మాచ్చ కారణాత్ పాణి ర్వేనస్య మథితః పురా ।
క్రుద్ధై ర్మహర్షిభి స్తాత కారణం త చ్చ కీర్తయ ॥ 23 ॥

తండ్రీ లోమహర్షణా! పూర్వం కోపం వచ్చిన మహర్షులు వేనుడి చేతిని ఎందుకు మథించారు? ఆ(మహర్షులకు కోపం గలగడానికి) కారణం చెప్పు.

లోమహర్షణ ఉవాచ:– లోమహర్షణుడు మునులతో చెప్తున్నాడు.

శృణుధ్వం కీర్తయిష్యామి పృథో ర్వైన్యస్య విస్తరమ్ ।
ఏకాగ్రాః ప్రయతాశ్చైవ శృణుధ్వం వై ద్విజర్షభాః ॥ 24 ॥

బ్రాహ్మణోత్తములారా! వేనమహారాజు తనయుడైన పృథువును గురించి వివరంగా చెప్తాను. శ్రద్ధతోనూ, వినయంతోనూ వినండి.

నాశుచేః క్షుద్రమనసో నాశిష్య స్యావ్రతస్య చ ।
కీర్తనీయ మిదం విప్రాః కృతఘ్నాయాహితాయ చ ॥ 25 ॥

బ్రాహ్మణులారా! అపవిత్రులకూ, నీచబుద్ధులకూ, చెప్పినది చేయనివాడికీ, చేసినమేలు మరిచేవాడికీ, కీడు చేసేవాడికీ, ఈపృథుచరిత్ర చెప్పగూడదు.

స్వర్గ్యం యశస్య మాయుష్యం ధన్యం వేదైశ్చ సమ్మితమ్ ।
రహస్య మృషిభిః ప్రోక్తం శృణుధ్వం వై యథా తథా ॥ 26 ॥

ఈ పృథుచరిత్ర (విన్నవాడికీ, చెప్పినవాడికీ) స్వర్గాన్నీ, కీర్తినీ, సంపదలనూ, కలిగిస్తుంది. వేదాలతో సమాన మైనది. మహర్షులు దర్శించి వివరించినది. రహస్యమైనది. అటువంటి పృథుమహారాజు చరిత్రను ఉన్నది ఉన్నట్లుగా (చెప్తాను) వినండి.

య శ్చేమం కీర్తయే న్నిత్యం పృథు ర్వైన్యస్య విస్తరమ్ ।
బ్రాహ్మణేభ్యో నమస్కృత్య న స శోచేత్ కృతాకృతమ్ ॥ 27 ॥

వేనుడికొడుకైన పృథువుకు సంబంధించిన ఈవృత్తాంతాన్ని నిత్యమూ బ్రాహ్మణుడికి నమస్కారం చేసి, స్మరించినవాడు చేయవలసిన పనులు చేయకపోవడం వల్ల గానీ, చేయగూడని పనులు చేయడంవల్ల గానీ, ఏవిధమైన బాధపడనవసరంలేదు.

ఆసీద్ధర్మస్య సంగోప్తా పూర్వ మత్రిసమఃప్రభుః ।
అత్రివంశే సముత్పన్న స్త్వఙ్గో నామ ప్రజాపతిః ॥ 28 ॥

పూర్వం అంగుడు అనే ప్రజాపతి ఉన్నాడు. ఆతడు అత్రివంశంలో పుట్టాడు. సమర్థుడు. అత్రిమహర్షితో సమానమైనవాడు. ధర్మాన్ని చక్కగా కాపాడేవాడు.

తస్య పుత్రోఽభవ ద్వేనో నాత్యర్థం ధర్మకోవిదః ।
జాతో మృత్యుసుతాయాం వై సునీథాయాం ప్రజాపతిః ॥29 ॥

ఆ అంగుడి కొడుకు వేనుడు. ఇతడు ధర్మాన్ని సమగ్రంగా తెలిసినవాడు. మృత్యుదేవత కూతు రైన సునీథయందు జన్మించాడు. వాడు ప్రజాపతి.

స మాతామహదోషేణ తేన కాలాత్మజాత్మజః ।
స్వధర్మం పృష్ఠతః కృత్వా కామలోభే ష్వవర్తత ॥ 30 ॥

మృత్యుదేవత కూతురు సునీథకు కొడుకైన వేనుడు తాత (సునీథ తండ్రి) చేసిన పెద్దతప్పు కారణంగా, స్వధర్మాన్ని విడిచిపెట్టి, కామానికీ, లోభానికీ వశుడై, నడుచుకునేవాడు.

మర్యాదాం భేదయామాస ధర్మోపేతాం స పార్థివః ।
వేదధర్మా నతిక్రమ్య సోఽధర్మనిరతోఽభవత్ ॥ 31 ॥

ఆ వేనరాజు ధర్మంతో కూడిన కట్టుబాట్లను చెడగొట్టాడు. వేదధర్మాలను దాటి ప్రవర్తించాడు. పాపపుపనులను మాత్రమే శ్రద్ధగా ఆచరించేవాడు.

నిస్స్వాధ్యాయవషట్కారాః ప్రజా స్తస్మిన్ ప్రజాపతౌ ।
ప్రవృత్తం న పపు స్సోమం హుతం యజ్ఞేషు దేవతాః ॥ 32 ॥

వేనప్రజాపతి రాజ్యం చేస్తుండగా ఆతనిరాజ్యంలోని ప్రజలు వేదాధ్యయనం విడిచిపెట్టారు. వషట్కారంతో కూడినమంత్రానుష్ఠానం మానుకున్నారు. యజ్ఞాలలో హోమం చేసిన(ద్రవ్యాలనూ) సోమరసాన్ని దేవతలు స్వీకరింపలేదు.

న యష్టవ్యం న హోతవ్య మితి తస్య ప్రజాపతేః ।
ఆసీత్ ప్రతిజ్ఞా క్రూరేయం వినాశే ప్రత్యుపస్థితే ॥ 33 ॥

వేనుడికి వినాశకాలం దాపురించినందువల్ల, తనరాజ్యంలో ఎవ్వరూ యజ్ఞాలు చేయరాదు, హోమాలు చేయరాదు అని భయంకరమైన శాసనం చేశాడు.

అహ మిజ్య శ్చ యష్టా చ యజ్ఞశ్చేతి క్రతూద్వహాః ।
మయి యజ్ఞో విధాతవ్యో మయి హోతవ్య మిత్యపి ॥ 34 ॥

'యజ్ఞాలు నన్ను గురించే చేయాలి. యజ్ఞం చేసేవాడిని నేనే. యజ్ఞమూ నేనే. నాకోసమే యజ్ఞం చేయాలి. నాకోసమే హోమం చేయాలి' అని శాసించాడు.

సమతిక్రాన్తమర్యాద మాదదాన మసాధ్వృతమ్ ।
ఊచు ర్మహర్షయ స్సర్వే మరీచిప్రముఖా స్తదా ॥ 35 ॥

హద్దులు మీరి, అనుచితంగా ప్రవర్తిస్తున్న ఆ వేనుడితో మరీచి మొదలైన మహర్షులు అందరూ ఇలా అన్నారు.

వయం దీక్షాం ప్రవేక్ష్యామ స్సంవత్సరగణాన్ బహూన్ ।
అధర్మం కురు మా వేన ఏష ధర్మ స్సనాతనః ॥ 36 ॥

వేనా! మేము అనేకసంవత్సరాలపాటు సాగే యజ్ఞానికి దీక్షలో ప్రవేశిస్తున్నాం. నీవు అధర్మం చేయవద్దు. ఇది (దేవతల నుద్దేశించి యజ్ఞం చేయటం, యజ్ఞాలను రాజులు సంరక్షించటం) సనాతనమైన వైదికధర్మం.

రాజ న్నత్రేః ప్రసూత స్త్వం ప్రజాపతి రసంశయమ్ ।
ప్రజా శ్చ పాలయిష్యేఽ హ మి తీహ సమయః కృతః ॥ 37 ॥

వేనరాజా! నీవు అత్రిమహర్షికి తరువాత ఆవంశంలో ప్రజాపతిగా జన్మించినవాడివి నీవే. సందేహం లేదు. రాజు అయ్యేసమయంలో ప్రజలను చక్కగా రక్షిస్తానని ప్రతిజ్ఞ చేశావు.

తాం స్తథా బ్రువత స్సర్వాన్ మహర్షీ నబ్రవీ త్తదా ।
వేనః ప్రహస్య దుర్బుద్ధి రిమ మర్థ మనర్థవిత్ ॥ 38 ॥

మరీచి మొదలైన మహర్షులు ఆవిధంగా చెప్తుండగా, ఆమాటలలోని తాత్పర్యం తెలియని వేనుడు దుర్మార్గపు ఆలోచనలతో ఎగతాళిగా నవ్వి, ఆమహర్షులతో ఈ అర్థాన్ని పలికాడు.

వేన ఉవాచ:- వేనుడు ఇలా అంటున్నాడు.

స్రష్టా ధర్మస్య కశ్చాన్య శ్శ్రోతవ్యం కస్య వా మయా ।
శ్రుతవీర్యతపస్సత్యై ర్మయా వా కస్సమో భువి ॥ 39 ॥

నాకంటె ధర్మాన్ని సృష్టించినవాడు ఇతరుడెవడు? ఇతరు లెవ్వరివల్లనో ధర్మాన్ని వినవలసిన అవసరం నాకు ఏమిటి? పాండిత్యంలోనూ, పరాక్రమంలోనూ, తపస్సులోనూ, సత్యంలోనూ నాతో సమానమైనవాడు ఈభూమిమీద ఎవడున్నాడు?

ప్రభవం సర్వభూతానాం ధర్మాణాం చ విశేషతః ।
సమ్మూఢా న విదు ర్నూనం భవన్తో మాం విచేతసః ॥ 40 ॥

సమస్తమైన ప్రాణులనూ, ధర్మాలనూ సృష్టించినవాడిని నేనే. మీకు బుద్ధి లేదు. మూర్ఖులు. నన్ను గురించి మీకు ఏమాత్రం తెలియదు.

ఇచ్ఛన్ దహేయం పృథివీం ప్లావయేయం జలైస్తథా ।
ద్యాం వై భువం చ రున్ధేయం నాత్ర కార్యా విచారణా ॥ 41 ॥

నేను తలుచుకుంటే, ఈభూమిని బూడిద చేయగలను. నీళ్లలో ముంచివేయగలను. నింగినీ, నేలనూ నిరోధించగలను. అందుకు సందేహం అక్కర లేదు.

యదా న శక్తా స్తే మోహాదవలేపాచ్చ పార్థివమ్ ।
అపనేతుం తదా వైనం, తతః క్రుద్ధా మహర్షయః ॥ 42 ॥

వేనమహారాజు అజ్ఞానాన్ని, అహంకారాన్ని తొలగించడం ఆమహర్షులకు సాధ్యం కాలేదు. అపుడు వారికి వేనుడిమీద బాగా కోపం వచ్చింది. వేనుని తొలిగించతలచిరి.

తం నిగృహ్య మహాత్మానో విస్ఫురన్తం మహాబలమ్ ।
తతోఽస్య సవ్యమూరుం తే మమన్థు ర్జాతమన్యవః ॥ 43 ॥

అపుడు ఆమహాత్ములు తేజస్వీ, మిక్కిలిబలవంతుడూ ఐన వేనుడిని బంధించారు. అతడి ఎడమతొడను మథించారు.

తస్మి న్నిర్మథ్యమానే వై రాజ్ఞ ఊరౌ తు జజ్ఞివాన్ ।
హ్రస్వోఽతిమాత్రః పురుషః కృష్ణ శ్చాతి బభూవ హ ॥ 44 ॥

అలా గట్టిగా చిలుకుతుండగా వేనుడి ఎడమతొడనుంచి ఒకానొక పురుషుడు జన్మించాడు. అతడు బాగా పొట్టిగానూ, మిక్కిలి నల్లగానూ ఉన్నాడు.

స భీతః ప్రాఞ్జలి ర్భూత్వా తస్థివాన్ ద్విజసత్తమాః ।
తమత్రి ర్విహ్వలం దృష్ట్వా నిషీదే త్యబ్రవీ త్తదా ॥ 45 ॥

బ్రాహ్మణోత్తములారా! అతడు భయంతో అంజలి ఘటించి ఆమహర్షులయెదుట నిలుచున్నాడు. వణుకుతూ నిలుచున్న ఆపురుషుడిని చూచి, అత్రిమహాముని కూర్చో (నిషీద) అన్నాడు.

నిషాదవంశకర్తాసౌ బభూవ వదతాం వరః ।
ధీవరా నసృజ చ్చాపి వేనకల్మషసమ్భవాన్ ॥ 46 ॥

మాటకారి అయిన ఆతడు బోయ(నిషాద)వంశానికి కర్త అయినాడు. అతడు వేనుడిశరీరమలం (పాపం) నుంచి చేపలుపట్టేవారిని సృష్టించాడు.

యే చాన్యే విన్ధ్యనిలయా స్తుషారా స్తుందురా స్తథా ।
అధర్మరుచయో విప్రా స్తే తు వై వేనకల్మషాః ॥ 47 ॥

బ్రాహ్మణులారా! అతడు ఇంకా, తుషారులు, తుందురులు అనే(కొండజాతివారు) ఇతరులను కూడ సృష్టించాడు. వేనుడిపాపం నుండి పుట్టిన వారందరూ అధర్మాన్ని ఇష్టంగా ఆచరించేవారు.

తతః పున ర్మహాత్మానః పాణిం వేనస్య దక్షిణమ్ ।
అరణీ మివ సంరబ్ధా మమన్థు ర్జాతమన్యవః ॥ 48 ॥

ఆతరువాత మరీచిప్రముఖులైన ఆమహర్షులు కోపంతో వేనుడి కుడిచేతిని అరణిగా చేసి, తీవ్రంగా మథించారు.

పృథు స్తస్మాత్ సముత్పన్నః కరా జ్జ్వలనసన్నిభః ।
దీప్యమాన స్స్వవపుషా సాక్షా దగ్ని రివ జ్వలన్ ॥ 49 ॥

వేనుడికుడిచేతినుండి తనశరీరకాంతితో ప్రకాశిస్తూ, ప్రత్యక్షంగా అగ్నిలాగా ప్రజ్వలిస్తూ, అగ్నికల్పు డైనపృథువు పుట్టాడు.

అథ సోఽజగవం నామ ధనుర్గృహ్య మహారవమ్ ।
శరాంశ్చ దివ్యాన్ రక్షార్థం కవచం చ మహాప్రభమ్ ॥ 50 ॥

ఆతడు (ప్రజలను రక్షించటానికి) గొప్పధ్వని చేసే అజగవం అనే ధనుస్సునూ, దివ్యమైన బాణాలనూ, పుచ్చుకుని, తనను రక్షించే కాంతిమంతమైన కవచాన్ని ధరించి జన్మించాడు.

తస్మి ఞ్జాతేఽథ భూతాని సంప్రహృష్టాని సర్వశః ।
సమాపేతు ర్మహాభాగా వేనస్తు త్రిదివం యయౌ ॥ 51 ॥

ఆ పృథువు పుట్టినసమయంలో ప్రాణులు అన్నీ ఎంతో సంతోషించాయి. పృథువును చూడడానికి అందరూ అన్ని ప్రాంతాలనుండి వచ్చారు. పిదప వేనుడు స్వర్గానికి వెళ్లాడు.

సముత్పన్నేన భో విప్రా స్సత్పుత్రేణ మహాత్మనా ।
త్రాత స్స పురుషవ్యాఘ్రః పుంనామ్నో నరకా త్తదా ॥ 52 ॥

వేనుడు (పాపకర్ముడైనా) పృథువువంటి ఉత్తముడైన మంచికొడుకు కలగడంవలన 'పుం' అనేనరకం నుండి రక్షణపొందాడు.

తం సముద్రాశ్చ నద్యశ్చ రత్నా న్యాదాయ సర్వశః ।
తోయాని చాభిషేకార్థం సర్వ ఏ వోపతస్థిరే ॥ 53 ॥

పృథువును రాజుగా అభిషేకించడానికి సమస్తప్రాంతాలనుండి సముద్రాలూ, నదులూ – రత్నాలనూ, పవిత్రజలాలనూ తీసుకుని ఆతనివద్దకు వచ్చాయి.

పితామహశ్చ భగవాన్ దేవై రాఙ్గిరసై స్సహ ।
స్థావరాణి చ భూతాని జఙ్గమాని చ సర్వశః ॥ 54 ॥

దేవతలతోనూ, అంగిరసుడిపుత్రుల(మహర్షుల)తోనూ కలిసి మహానుభావుడైన బ్రహ్మదేవుడు కూడ అక్కడికి వచ్చాడు. అచరాలు, చరాలు అయినసమస్తభూతాలు కూడ అన్నిప్రాంతాలనుండి అక్కడికి చేరుకున్నాయి.

సమాగమ్య తదా వైన్య మభ్యషిఞ్చ న్నరాధిపమ్ ।
మహతా రాజరాజేన ప్రజాస్తే నానురఞ్జితాః ॥ 55 ॥

ఆవచ్చినవారు అందరూ వేనకుమారుడైన పృథువును రాజుగా పట్టాభిషేకం చేశారు. రాజులకే రాజు అయిన ఆమహాత్ముడు పృథువు ప్రజలందరినీ చక్కగా ప్రేమగా పాలించాడు.

సోఽభిషిక్తో మహాతేజా విధివ ద్ధర్మకోవిదైః ।
ఆధిరాజ్యే తదా రాజ్ఞాం పృథు ర్వైన్యః ప్రతాపవాన్ ॥56 ॥

ధర్మశాస్త్రపండితులు శాస్త్రోక్తమైనరీతిలో మహాతేజుడూ, పరాక్రమవంతుడూ అయిన పృథువును చక్రవర్తిగా (రాజులకు రాజుగా) అభిషేకించారు.

పిత్రాఽపరఞ్జితా స్తస్య ప్రజాస్తేనానురఞ్జితాః ।
అనురాగాత్తత స్తస్య నామ రాజాభ్యజాయత ॥ 57 ॥

వేనుడిచేత బాధలు పడిన ప్రజలు పృథువు పాలకుడు అయిన తరువాత ఆతని ప్రేమవల్ల చాలా ఆనందించారు. దానివల్లనే పృథువుకు రాజు (ప్రజలను రంజింపజేసేవాడు) అనేపేరు సార్థకంగా ఏర్పడింది.

ఆప స్తస్తమ్భిరే తస్య సముద్ర మభియాస్యతః ।
పర్వతాశ్చ దదు ర్మార్గం ధ్వజభఙ్గశ్చ నాభవత్ ॥ 58 ॥

పృథుమహారాజు సముద్రం సమీపానికి వెళ్ళినపుడు, ఆతడు తనమీదుగా నడిచిపోవడానికి వీలుగా, సముద్రుడు తననీటిని కదలకుండా స్థిరంగా ఉంచేవాడు. పెద్దపెద్దకొండలు కూడా పృథుమహారాజు పతాకానికి దెబ్బ తగలకుండా (తప్పుకుని) దారి యిచ్చేవి.

అకృష్టపచ్యా పృథివీ సిధ్య న్త్యన్నాని చిన్తయా ।
సర్వకామదుఘా గావః పుటకే పుటకే మధు ॥ 59 ॥

వ్యవసాయం చేయకుండా, కేవలం తలచుకున్నమాత్రం చేతనే భూమి ప్రజలకు కావలసిన ఆహారాన్ని పండించి యిచ్చేది. ఆవులు కావలసినన్నిపాలను ఇచ్చేవి (వాటివల్ల ప్రజలకోరికలు అన్నీ నెరవేరేవి.) పట్టుపట్టులోనూ కావలసినంత తేనె లభించేది.

ఏతస్మి న్నేవ కాలే తు యజ్ఞే పైతామహే శుభే ।
సూత స్సూత్యాం సముత్పన్న స్సౌత్యేఽహని మహామతిః ॥ 60 ॥

ఈ సమయంలోనే బ్రహ్మదేవుడు చేస్తున్న ఒకానొక శుభంకరమైన యజ్ఞంలో సూతికి ఉత్సవదినాన బుద్ధిమంతుడైన సూతుడు జన్మించాడు.

తస్మి న్నేవ మహాయజ్ఞే జజ్ఞే సూతోఽథ మాగధః ।
పృథోః స్తవార్థం తౌ తత్ర సమాహూతౌ మహర్షిభిః ॥61 ॥

ఆ మహాయజ్ఞంలోనే సూతుడితోపాటు మాగధుడు అనేవాడు కూడ పుట్టాడు. పృథుమహారాజును స్తోత్రం చేయడానికి వారిద్దరినీ మహర్షులు సాదరంగా ఆహ్వానించారు.

తా వూచు రృషయ స్సర్వే స్తూయతా మేష పార్థివః ।
కర్మైత దనురూపం వాం పాత్రం చాయం నరాధిపః ॥ 62 ॥

ఆ ఋషులు సూతమాగధులతో 'ఈపృథుమహారాజును మీరు స్తుతించండి. స్తోత్రం చేయడం మీకు తగినది. స్తుతింపబడడానికి ఈపృథుమహారాజు తగినవాడు'.

తా వూచతు స్తదా సర్వాం స్తాన్ ఋషీన్ సూతమాగధౌ ।
ఆవాం దేవా నృషీంశ్చైవ ప్రీణయావ స్స్వకర్మభిః ॥ 63 ॥

అలా పలికి మహర్షులందరితో ఆసూతమాగధులు ఇలా అన్నారు. 'మేం ఇద్దరమూ మా(స్తోత్రం చేసే)పనులతో దేవతలనూ, మహర్షులను సంతోషపెట్టుంటాము.

న చాస్య విద్మో వై కర్మ నామ వా లక్షణం యశః ।
స్తోత్రం యే నాస్య కుర్యావ రాజ్ఞ స్తేజస్వినో ద్విజాః ॥64 ॥

ఈతడు చేసిన ఘనకార్యాలు కానీ, ఈతని పేరు గాని, ఈతని లక్షణాలు గానీ, ఈతని కీర్తిని గురించి కానీ, మాకు ఏమీ తెలియదు. బ్రాహ్మణోత్తములారా, తేజోవంతుడైన ఈతడిని ఏ మని స్తుతించం?

ఋషిభి స్తౌ నియుక్తౌ తు భవిష్యైః స్తూయతా మితి ॥
యాని కర్మాణి కృతవాన్ పృథుః పశ్చాన్మహాబలః ॥65 ॥

అపుడు ఆమహర్షులు 'ఈపృథుమహారాజు భావికాలంలో చేయబోయే పనులను (ఘనకార్యాలను చేయాలని ఆశీస్సులుగా) వర్ణించండి. అన్నారు. అపుడు సూతమాగధులు ఇద్దరూ మిక్కిలి బలవంతుడైన పృథువు భవిష్యత్తులో చేయవలసిన గొప్పగొప్ప పనులను గూర్చి వర్ణించారు.

తతః ప్రభృతి త్రైలోక్యే స్తవేషు మునిసత్తమాః ।
ఆశీర్వాదాః ప్రయుజ్యన్తే సూతమాగధవన్దిభిః ॥ 66 ॥

అప్పటినుండి, మూడు లోకాలలోనూ సూతులు, మాగధులు అనే స్తోత్రపాఠకులు చేసే స్తోత్రాలలో ఆశీర్వచనాలు చెప్పబడుతున్నాయి.

తయోః స్తవాత్తు సుప్రీతః పృథుః ప్రాదాత్ ప్రజేశ్వరః ।
అనూపదేశం సూతాయ మగధం మాగధాయ చ ॥ 67 ॥

వారిస్తోత్రానికి మిక్కిలి సంతోషించిన జననాథుడైన పృథుమహారాజు సూతుడికి అనూపం అనే దేశాన్నీ, మాగధుడికి మగధ అనే దేశాన్నీ (బహుమానంగా) ఇచ్చాడు.

తం దృష్ట్వా పరమప్రీతాః ప్రజాః ప్రోచు ర్మనీషిణః ।
వృత్తీనా మేష వో దాతా భవిష్యతి నరాధిపః ॥ 68 ॥

బుద్ధిమంతులైన మహర్షులు పృథుమహారాజు చర్యను చూచి ఎంతో సంతోషించారు. ప్రజలతో 'జననాయకుడైన ఈ పృథుమహారాజు మీకు జీవికలను ప్రసాదిస్తాడు' అన్నారు.

తతో వైన్యం మహాత్మానం ప్రజా స్సమభిదుద్రువుః ।
త్వం నో వృత్తిం విధత్స్వేతి మహర్షివచనా త్తదా ॥ 69 ॥

అపుడు ప్రజలు వేనకుమారుడైన పృథువువద్దకు పరుగుతీశారు. రాజా! ఈమహర్షులమాటల ననుసరించి నీవు మాకు వృత్తులను ఏర్పాటు చేయమని అడిగారు.

సో ఽ భిద్రుతః ప్రజాభిస్తు ప్రజాహితచికీర్షయా ।
ధనుర్గృహ్య పృషత్కాంశ్చ పృథివీమాద్రవద్ బలీ ॥ 70 ॥

ఈ విధంగా ప్రజలు తనవెంటబడగా, బలవంతుడైన పృథుమహారాజు ప్రజలకు మేలు చేద్దామనే కోరికతో ధనుస్సు, బాణాలు పుచ్చుకుని భూమివెంట పరుగులుతీశాడు.

తతో వైన్యభయత్రస్తా గౌర్భూత్వా ప్రాద్రవన్ మహీ ।
తాం పృథు ర్ధను రాదాయ ద్రవన్తీ మన్వధావత ॥ 71 ॥

తనవెంట బడిన పృథుమహారాజును చూచి భయపడి భూమి ఆవు రూపాన్ని ధరించి, పారిపోయింది. అలా పరుగుతీస్తున్న ఆవురూపంలో ఉన్న భూమివెంట పృథువు విల్లు చేతబట్టి పరుగుతీశాడు.

సా లోకాన్ బ్రహ్మలోకాదీన్ గత్వా వైన్యభయా త్తదా ।
ప్రదద ర్శాగ్రతో వైన్యం ప్రగృహీతశరాసనమ్ ॥ 72 ॥

ఆ ఆవు పృథుమహారాజు భయంతో బ్రహ్మలోకం మొదలుగా అన్ని లోకాలకూ తిరిగింది. అయితే అన్నిలోకాలలోనూ, తన ఎదురుగా ధనుస్సు ధరించిఉన్న పృథువును చూస్తూనే ఉంది.

జ్వలద్భి ర్నిశితై ర్బాణై ర్దీప్తతేజస మచ్యుతమ్ ।
మహాయోగం మహాత్మానం దుర్ధర్ష మమరై రపి ॥ 73 ॥

పృథువు మండుతున్న వాడి బాణాలను పట్టుకుని ఉన్నాడు. పరాక్రమంతో ప్రకాశిస్తున్నాడు. దృఢమైన సంకల్పంతో ఉన్నాడు. అతడు గొప్పయోగి. మహాత్ముడు. దేవతలు కూడా ఆతడికి ఎదురు నిలువలేరు.

అలభన్తీ తు సా త్రాణం వైన్య మే వాన్వపద్యత ।
కృతాఞ్జలిపుటా భూత్వా పూజ్యా లోకై స్త్రిభి స్తదా ॥ 74 ॥

అన్ని లోకాలచేతనూ పూజింపబడే భూదేవికి ఎవరినుండీ రక్షణ లభింపలేదు. చివరికి ఆ పృథుమహారాజునే చేతులు జోడించి, ఆశ్రయించింది.

ఉవాచ వైన్యం నాధర్మం స్త్రీవధే పరిపశ్యతి ।
కథం ధారయితా చాసి ప్రజా రాజన్ వినా మయా ॥75 ॥

పృథుమహారాజుతో ఆమె ఇలా అన్నది. రాజా! నీవు ఆడదానిని చంపటంలో పాపాన్ని గ్రహింపలేక పోతున్నావు. మరి నేను లేకుండ ప్రజలను ఏవిధంగా ధరిస్తావు.

మయి లోకాః స్థితా రాజన్ మయేదం ధార్యతే జగత్ ।
మద్వినాశే వినశ్యేయుః ప్రజాః పార్థివ విద్ధి తత్ ॥ 76 ॥

రాజా! ప్రజలు అందరూ నన్ను ఆశ్రయించుకునే ఉన్నారు. ఈలోకాన్ని నేనే ధరిస్తున్నాను. నేను నశిస్తే ప్రజలందరూ నశిస్తారు. పృథివీపాలకా, ఈవిషయాన్ని గ్రహించు.

న మా మర్హసి హన్తుం వై శ్రేయ శ్చే త్త్వం చికీర్షసి ।
ప్రజానాం పృథివీపాల శృణు చేదం వచో మమ ॥ 77 ॥

నన్ను చంపటం (రాజు వైన) నీకు తగదు. భూపాలకా! నీవు నిజంగా ప్రజలకు మేలు చేయాలి అనుకుంటే ఇదుగో నామాట విను.

ఉపాయత స్సమారబ్ధా స్సర్వే సిద్ధ్య న్త్యుపక్రమాః ।
ఉపాయం పశ్య యేన త్వం ధారయేథాః ప్రజా మిమామ్ ॥ 78 ॥

ఉపాయంతో చేసిన ప్రయత్నాలు అన్నీ ఫలిస్తాయి. నీవు ఈప్రజలను రక్షించే ఉపాయం తెలుసుకో.

హత్వాఒ పి మాం న శక్త స్త్వం ప్రజానాం పోషణే నృప ।
అనుకూలా భవిష్యామి యచ్ఛ కోపం మహామతే ॥ 79 ॥

నన్ను చంపినా, ప్రజలను పోషించడం నీవల్ల కాదు. నేను నీకు అనుకూలంగా ఉంటాను. బుద్ధిమంతుడా! కోపం విడిచిపెట్టు.

అవధ్యాం తు స్త్రియం ప్రాహు స్తిర్యగ్యోనిగతేష్వపి ।
సంపశ్యన్ పృథివీపాల న ధర్మం త్యక్తు మర్హసి ॥ 80 ॥

పశుపక్ష్యాదిజాతులలో జన్మించినప్పటికీ ఆడవారిని చంపగూడదని (ధర్మజ్ఞులు) చెప్తారు. రాజా, ఆవిషయాన్ని గ్రహించు. ధర్మాన్ని వదిలిపెట్టడం నీకు తగదు.

ఏవం బహువిధం వాక్యం శ్రుత్వా రాజా మహామనాః ।
కోపం నిగృహ్య ధర్మాత్మా వసుధామిదమబ్రవీత్ ॥ 81 ॥

ఈవిధంగా అనేక ప్రకారాలుగా చెప్పిన భూదేవి పలుకులు విని, ధర్మబుద్ధి అయిన పృథుమహారాజు కోపాన్ని నిగ్రహించుకుని, భూమితో ఇలా అన్నాడు.

పృథు రువాచ :-పృథువు ఇలా అంటున్నాడు.

ఏక స్యార్థే తు యో హన్యా దాత్మనో వా పరస్య వా ।
బహూన్ వా ప్రాణినోఽ థైకం భవే త్త స్యేహ పాతకమ్ ॥ 82 ॥

తనకోసం గానీ, ఇతరులకోసం గానీ ఒక్కడికోసం ఒక్కజీవి నైనా, అనేకజీవుల నైనా, చంపినవాడికి పాపం కలుగుతుంది.

సుఖ మేధన్తి బహవో యస్మిం స్తు నిహతే ఽ శుభే ।
తస్మిన్ హతే నాస్తి భద్రే పాతకం చోపపాతకమ్ ॥ 83 ॥

శుభంకరురాలా! ఎంతో మంది సుఖంగా జీవించడంకోసం, దుర్మార్గుడిని ఒక్కడిని చంపడంవల్ల పెద్దదైనా, చిన్నదైనా, ఏపాపమూ లేదు.

సోఽ హం ప్రజానిమిత్తం త్వాం హనిష్యామి వసున్ధరే ।
యది మే వచనా న్నాద్య కరిష్యసి జగద్ధితమ్ ॥ 84 ॥

ఓ భూమీ! నామాటప్రకారం నీవు ప్రజలకు మేలు కలిగించే పని చేయకపోతే, ప్రజలసుఖంకోసమే నిన్ను నేను చంపుతాను.

త్వాం నిహత్యాద్య బాణేన మచ్ఛాసనపరాఙ్ముఖీమ్ ।
ఆత్మానం ప్రథయిత్వాఽ హం ప్రజా ధారయితా స్వయమ్ ॥ 85 ॥

నా ఆజ్ఞను తిరస్కరించిన నిన్ను బాణంతో చంపి, నాఆజ్ఞ నిలుపుకుని, నేనే స్వయంగా ప్రజలను పోషించుకుంటాను.

సా త్వం శాసన మాస్థాయ మమ ధర్మభృతాం వరే ।
సంజీవయ ప్రజా స్సర్వా స్సమర్థాహ్యాసి ధారణే ॥ 86 ॥

భూమీ, ధర్మాన్ని కాపాడేవారిలో నీవు శ్రేష్ఠురాలివి. నీవు రాజాజ్ఞను అనుసరించి, ఈప్రజలందరినీ బ్రతికించు. ప్రజలను పోషించడంలో నీవు చాలా సమర్థురాలివి.

దుహితృత్వం చ మే గచ్ఛ తత ఏన మహం శరం ।
నియచ్ఛేయం త్వద్వధార్థ ముద్యన్తం ఘోరదర్శనమ్ ॥ 87 ॥

నీవు నాకు కుమార్తెవు కా. నిన్ను చంపడానికి పూనుకున్న, భయంకరమైన ఈబాణాన్ని నేను ఉపసంహరించుకుంటాను.

వసుధోవాచ :-భూదేవి ఇలా అన్నది.

సర్వ మేత దహం వీర విధాస్యామి న సంశయః ।
వత్సం తు మమ సంయచ్ఛ క్ష రేయం యేన వత్సలా ॥ 88 ॥

రాజా! నిస్సందేహంగా అంతా నీవు చెప్పినట్లే చేస్తాను. సందేహం వద్దు. అయితే, నాకు ఒకదూడను ఏర్పాటు చేయి. దానిపై ప్రేమతో నేను పాలు ఇస్తాను.

సమాం చ కురు సర్వత్ర మాం త్వం ధర్మభృతాం వర ।
యథా విస్యన్దమానం మే క్షీరం సర్వత్ర భావయేత్ ॥89 ॥

ధర్మాన్ని కాపాడే వాళ్లలో శ్రేష్ఠుడా, నన్ను (భూమిని) ఎత్తుపల్లాలు లేకుండా సమతలంగా ఉండేటట్లు చేయి. దానివల్ల నేను స్రవించే పాలు (భూమిమీద) అన్నిప్రాంతాలకూ అందుతాయి.

లోమహర్షణ ఉవాచ :- లోమహర్షణుడు ఇలా అంటున్నాడు.

తత ఉత్సారయామాస శైలాం చ్ఛతసహస్రశః ।
ధనుష్కోట్యా తదా వైన్య స్తేన శైలా వివర్ధితాః ॥ 90 ॥

అపుడు వేనకుమారుడు (పృథుమహారాజు) వందల వేల సంఖ్యలో ఉన్న కొండలను ధనురగ్రంనుండి వెలువడిన బాణాలతో దూరంగా ఎగరగొట్టాడు. దానివల్ల ఒకచోటికి చేరినకొండలు బాగా వృద్ధిచెందాయి.

న హి పూర్వవిసర్గే వై విషమే పృథివీతలే ।
సంవిభాగః పురాణాం వా గ్రామాణా మభవ త్తదా ॥ 91 ॥

పూర్వసృష్టిలో (చాక్షుషమన్వంతరంలో) భూమి అంతా ఎగుడు దిగుడుగా ఉండేది. భూమిమీద పల్లెలు, పట్టణాలు అనే విభాగం లేదు.

న సస్యాని న గోరక్ష్యం న కృషి ర్న వణిక్పథః ।
నైవ సత్యానృతం చాసీ న్న లోభో న చ మత్సరః ॥ 92 ॥

ఆకాలంలో పంటలు లేవు. పశుసంరక్షణం లేదు. వ్యవసాయం లేదు. వాణిజ్యమార్గం లేదు. వాణిజ్యం లేదు. లోభం (పిసినిగొట్టుస్వభావం) లేదు. మాత్సర్యం (ఇతరులగొప్పదనం చూచి ఓర్వలేకపోవడం) లేదు.

వైవస్వతేఽ న్తరే తస్మిన్ సామ్ప్రతం సముపస్థితే ।
వైన్యాత్ ప్రభృతి వై విప్రా స్సర్వ స్యైతస్య సమ్భవః ॥93 ॥

బ్రాహ్మణులారా! తరువాత వైవస్వతమన్వంతరం ప్రారంభమైనవి ఈ సమయంలో వేనకుమారుడు (పృథువు) రాజు అయినతరువాతనే ఇదంతా (కృషి వాణిజ్యాదులు) సంభవించినది.

యత్ర యత్ర సమం త్వస్యా భూమే రాసీ త్తదా ద్విజాః ।
తత్ర తత్ర ప్రజా స్సర్వా నివాసం సమరోచయన్ ॥ 94 ॥

బ్రాహ్మణులారా! భూమి ఎగుడుదిగుడు లేకుండా సమతలంగా ఉన్న అన్నిప్రదేశాలలోనూ నివసించడానికి ప్రజలందరూ ఇష్టపడ్డారు.

ఆహారః ఫలమూలాని ప్రజానా మభవ త్తదా ।
కృచ్ఛ్రేణ మహతా యుక్త ఇత్యేవ మనుశుశ్రుమ ॥ 95 ॥

ఆనాడు ప్రజలకు పండ్లు, దుంపలే ఆహారం. నాడు వారిజీవితం చాలా కష్టాలతో గూడినది అని వింటున్నాము.

స కల్పయిత్వా వత్సం తు మనుం స్వాయంభువం ప్రభుమ్ ।
స్వపాణౌ పురుషవ్యాఘ్రో దుదోహ పృథివీం తతః ॥ 96 ॥

పృథుమహారాజు స్వాయంభువ మనువును దూడగా ఏర్పాటు చేశాడు. ఆదూడను చూచి, పాలు చేపగా, తనచేతిని పాత్రగా చేసి, పృథుమహారాజు (ఆవురూపంలో ఉన్న) భూమిని పాలు పితికాడు.

సస్యజాతాని సర్వాణి పృథు ర్వైన్యః ప్రతాపవాన్ ।
తే నాన్నేన ప్రజా స్సర్వాః వర్తన్తేఽ ద్యాపి సర్వశః ॥ 97 ॥

అన్ని రకాలైనపంటలే ఆపాలు. ఆ అన్నంతోనే నేటికీ భూమిమీద అన్నిప్రాంతాలలోనూ, ప్రజలందరూ జీవిస్తున్నారు.

ఋషయశ్చ తదా దేవాః పితరోఽ థ సరీసృపాః ।
దైత్యా యక్షాః పుణ్యజనా గన్ధర్వాః పర్వతా నగాః ॥ 98 ॥

ఏతే పురా ద్విజశ్రేష్ఠా దుదుహు ర్ధరణీం కిల ।
క్షీరం వత్సశ్చ పాత్రం చ తేషాం దోగ్ధా పృథక్ పృథక్ ॥99 ॥

బ్రాహ్మణోత్తములారా! పూర్వం ఋషులు, దేవతలు, పితరులు, పాములు, దైత్యులు, యక్షులు, రాక్షసులు, గంధర్వులు, పర్వతాలు, వృక్షాదులు, వీరందరూ భూమిని పిదికారు. వారికి దూడ, పాత్ర, పాలు, పితికేవాడు, వేరువేరుగా ఉన్నారు.

ఋషీణా మభవత్ సోమో వత్సో దోగ్ధా బృహస్పతిః ।
క్షీరం తేషాం తపో బ్రహ్మ పాత్రం ఛన్దాంసి భో ద్విజాః ॥ 100 ॥

ఋషులకు సోముడు దూడ అయినాడు. పితికేవాడు బృహస్పతి. పితికినపాలు తపోరూపమైన బ్రహ్మ. పితకటానికి పాత్ర వేదాలు.

దేవానాం కాఞ్చనం పాత్రం వత్స స్తేషాం శతక్రతుః ।
క్షీర మోజస్కరం చైవ దోగ్ధా చ భగవాన్ రవిః ॥ 101 ॥

దేవతలకు దూడ ఇంద్రుడు. పితికేవాడు సూర్యభగవానుడు. పాలు పరాక్రమం(వర్ధక). పాత్ర బంగారం(గిన్నె).

పితౄణాం రాజతం పాత్రం యమో వత్సః ప్రతాపవాన్ ।
అన్తక శ్చాభవద్ దోగ్ధా క్షీరం తేషాం సుధా స్మృతా ॥102॥

పితరులకు దూడ పరాక్రమవంతుడైన యముడు. పితికేవాడు అంతకుడు. పాలు తేనె. పాత్ర వెండి(గిన్నె).

నాగానాం తక్షకో వత్సః పాత్రం చాలాబుసంజ్ఞకమ్ ।
దోగ్ధా త్వైరావతో నాగ స్తేషాం క్షీరం విషం స్మృతమ్ ॥103॥

సర్పాలకు దూడ తక్షకుడు. పితికేవాడు ఐరావతం అనే పేరు గలిగినపాము. పాలు విషం. పాత్ర సొరకాయ.

అసురాణాం మధు ర్దోగ్ధా క్షీరం మాయామయం స్మృతమ్ ।
విరోచనస్తు వత్సోఽభూ దాయసం పాత్ర మేవ చ ॥104॥

అసురులకు దూడ విరోచనుడు. పితికేవాడు మధువు(అనేరాక్షసుడు). పాలు మాయ. పాత్ర ఇనుము (ఇనుపగిన్నె).

యక్షాణా మామపాత్రం తు వత్సో వైశ్రవణః ప్రభుః ।
దోగ్ధా రజతనాభ స్తు క్షీరాన్తర్ధాన మేవ చ ॥ 105 ॥

యక్షులకు దూడ ప్రభువైన కుబేరుడు. పితికేవాడు రజతనాభుడు. పాలు అంతర్ధానం. పాత్ర మట్టికుండ.

సుమాలీ రాక్షసేన్ద్రాణాం వత్సః క్షీరం చ శోణితమ్ ।
దోగ్ధా రజతనాభస్తు కపాలం పాత్ర మేవ చ ॥106॥

రాక్షసులకు దూడ సుమాలి. పితికేవాడు రజతనాభుడు. పాలు రక్తం. పాత్ర పుఱ్ఱె.

గన్ధర్వాణాం చిత్రరథో వత్సః పాత్రం చ పఙ్కజమ్ ।
దోగ్ధా చ సురుచిః క్షీరం తేషాం గన్ధ శ్శుచి స్స్మృతః ॥107॥

గంధర్వులకు దూడ చిత్రరథుడు. పితికేవాడు సురుచి. పాలు శుద్ధమైన చందనం. పాత్ర తామరపూవు.

శైలం పాత్రం పర్వతానాం క్షీరం రత్నౌషధీ స్తథా ।
వత్సస్తు హిమవానాసీ ద్దోగ్ధా మేరు ర్మహాగిరిః ॥108॥

పర్వతాలకు దూడ హిమాలయపర్వతం. పితికేవాడు మేరుపర్వతం. పాలు రత్నాలు,ఓషధులు. పాత్ర కొండ.

ప్లక్షో వత్సస్తు వృక్షాణాం దోగ్ధా శాలస్తు పుష్పితః ।
పాలాశపాత్రం క్షీరం చ ఛిన్నదగ్ధప్రరోహణమ్ ॥ 109 ॥

చెట్లకు దూడ జువ్విచెట్టు. పితికేవాడు పూతకు వచ్చిన బొద్దుగచెట్టు. పాలు తెగినచోట, కాలినచోట మళ్లీ మొలకెత్తించే శక్తి. పాత్ర మోదుగచెట్టు (ఆకు).

సేయం ధాత్రీ విధాత్రీ చ పావనీ చ వసున్ధరా ।
చరాచరస్య సర్వస్య ప్రతిష్ఠా యోని రేవ చ ॥ 110 ॥

అటువంటి ఈభూమి అందరికీ తల్లివంటిది. అందరినీ నడిపిస్తుంది. పవిత్రమైనది. సంపదలను ధరించి ఉన్నది. స్థావరజంగమాత్మకమైన సమస్తభూతకోటినీ పుట్టిస్తుంది. ఆశ్రయమిస్తుంది.

సర్వకామదుఘా దోగ్ధ్రీ సర్వసస్యప్రరోహిణీ ।
ఆసీదియం సముద్రాన్తా మేదినీ పరివిశ్రుతా ॥ 111 ॥

సమస్తమైన కోరికలను వర్షిస్తుంది. పాలిచ్చే ఆవు. సమస్తమైన పంటలను పండిస్తుంది. సముద్రం అంచువరకూ వ్యాపించి ఉన్న ఈభూమి మేదిని అని ప్రసిద్ధమైనది.

మధు కైటభయోః కృత్స్నా మేదసా సమభిప్లుతా ।
తేనేయం మేదినీ దేవీ ఉచ్యతే బ్రహ్మవాదిభిః ॥ 112 ॥

మధువు, కైటభుడు అనే ఇద్దరు రాక్షసుల మెదడుతో ఈ నేల అంతా వ్యాపించిఉన్నది. అందుచేత బ్రహ్మవేత్తలు ఈమెను మేదిని అని పేర్కొన్నారు.

తతోఽభ్యుపాగమద్ రాజ్ఞః పృథో ర్వైన్యస్య భో ద్విజాః ।
దుహితృత్వ మనుప్రాప్తా దేవీ పృథ్వీతి చోచ్యతే ॥ 113 ॥

ఓ బ్రాహ్మణులారా! వేనకుమారు డైన పృథుమహారాజుకు మేదిని కూతురు అయింది. అందుచేత (పృథువు కూతురు కాబట్టి) పృథ్వి అని కూడా చెప్పబడుతున్నది.

పృథునా ప్రవిభక్తా చ శోధితా చ వసున్ధరా ।
సస్యాకరవతీ స్ఫీతా పురపత్తనశాలినీ ॥ 114 ॥

పృథువు ఈభూమిని రాజ్యాలుగా విభాగించాడు. (ఎత్తుపల్లాలు లేకుండా, సమతలంగా) సంస్కరించాడు. పంటలకు నెలవుగా (పంటలు పండటానికి అనుకూలంగా) చేశాడు. పురాలతో పట్టణాలతో ప్రకాశింపజేశాడు.

ఏవం ప్రభావో వైన్య స్స రాజాసీద్ రాజసత్తమః ।
నమస్యశ్చైవ పూజ్య శ్చ భూతగ్రామై ర్న సంశయః ॥ 115 ॥

ఇటువంటి గొప్పతనం గలిగిన పృథువు రాజులందరిలో ఉత్తముడు అయ్యాడు. సమస్తమైన జీవకోటికూడ ఏమాత్రం సందేహించకుండా పృథుమహారాజుకు నమస్కరిస్తుంది. పూజిస్తుంది.

బ్రాహ్మణైశ్చ మహాభాగై ర్వేదవేదాఙ్గపారగైః ।
పృథురేవ నమస్కార్యో బ్రహ్మయోని స్సనాతనః ॥ 116 ॥

వేదాలూ, వేదాంగాలూ సమగ్రంగా తెలుసుకున్న ఉత్తములైన బ్రాహ్మణులు కూడా నమస్కరింప దగినవాడు జ్ఞాననిష్ఠ కలిగినవాడూ, శాశ్వతుడూ (స్థిర మయినకీర్తి కలవాడు) అయిన పృథుమహారాజు ఒక్కడే.

పార్థివైశ్చ మహాభాగైః పార్థివత్వ మి హేచ్ఛుభిః ।
ఆదిరాజో నమస్కార్యః పృథు ర్వైన్యః ప్రతాపవాన్ ॥117 ॥

వేనకుమారుడైన పృథువు రాజులలో మొట్టమొదటిరాజు. పరాక్రమవంతుడు. మహాత్ములైన రాజులచేతనూ, రాజు కావాలని కోరుకునే వారిచేతనూ నమస్కరింపదగినవాడు.

యోధై రపి చ విక్రాన్తైః ప్రాప్తుకామై ర్జయం యుధి ।
ఆదిరాజో నమస్కార్యో వృత్తిదాతా మహాయశాః ॥ 118 ॥

బలవంతులైన రాజులకు, యుద్ధంలో జయం కోరుకునేవారిలో, ఆదిరాజు అయిన పృథువు నమస్కరింపదగినవాడు. పృథువు ప్రజలకు జీవనాధారమైన వృత్తులు ఇచ్చినవాడు. గొప్పకీర్తిమంతుడు.

యో హి యోద్ధా రణం యాతి కీర్తయిత్వా పృథుం నృపమ్ ।
స ఘోరరూపాత్ సఙ్గ్రామాత్ క్షేమీ భవతి కీర్తిమాన్ ॥119 ॥

పృథుమహారాజును స్తుతిస్తూ యుద్ధానికి వెళ్లిన యోధుడు ఎవడైనా భయంకరమైన యుద్ధంనుండి విజయంతో క్షేమంగా కీర్తిమంతుడై, తిరిగివస్తాడు.

వైశ్యై రపి చ విత్తార్థై ర్వైశ్యవృత్తివిధాయిభిః ।
పృథు రేవ నమస్కార్యో వృత్తిదాతా మహాయశాః ॥120 ॥

సంపదలు కోరి, వాణిజ్యవృత్తిని ఆశ్రయించిన వైశ్యులు కూడా, నమస్కరింపదగినవాడు పృథుమహారాజు ఒక్కడే. వారికి ఆవృత్తి నేర్పరచినవాడు కీర్తిమంతుడైన పృథువే.

తథైవ శూద్రై శ్శుచిభి స్త్రివర్ణపరిచారిభిః ।
పృథు రేవ నమస్కార్యః శ్రేయః పర మిహేప్సుభిః ॥121 ॥

అదేవిధంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య లనే మూడువర్ణాలవారిని సేవించుకునే శూద్రులు కూడ గొప్పమేలు కోరుకుంటే పృథుమహారాజు మాత్రమే నమస్కరింపదగినవాడు.

ఏతే వత్సవిశేషాశ్చ దోగ్ధారః క్షీర మేవ చ ।
పాత్రాణి చ మయోక్తాని కిం భూయో వర్ణయామి వః ॥122 ॥

విశేషమైన దూడలు, పాలు పితికేవారు, పాలపాత్రలు, పాలు అనేవిషయాలను గూర్చి వివరించాను. ద్విజులారా, తరువాత మీకు వివరింపవలసినది ఏమిటి? అని అడిగాడు లోమహర్షణుడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే పృథో ర్జన్మమాహాత్మ్యకథనం నామ ద్వితీయోఽధ్యాయః ॥ 2 ॥
శ్రీబ్రహ్మపురాణంలో పృథువు జన్మమాహాత్మ్యకథనం అనే ద్వితీయాధ్యాయం సంపూర్ణం.



తృతీయోऽధ్యాయః - మూడవ అధ్యాయం
మన్వంతరకీర్తనమ్ - మన్వంతరకీర్తనం

ఋషయ ఊచుః :-ఋషులు లోమహర్షణుడితో ఇలా అన్నారు.

మన్వన్తరాణి సర్వాణి విస్తరేణ మహామతే ।
తేషాం పూర్వవిసృష్టిం చ లోమహర్షణ కీర్తయ ॥1॥

ఓ మహాజ్ఞానీ! లోమహర్షణమహర్షీ! అన్ని మన్వంతరాలను గురించీ, ఆ మన్వంతరాలలో పూర్వం జరిగిన సృష్టివిశేషాలను గురించీ వివరించి చెప్పు. (శివ.ఉమా.34 అధ్యాయం)

యావన్తో మనవ శ్చైవ యావన్తం కాల మేవ చ ।
మన్వన్తరాణి భోః సూత శ్రోతు మిచ్ఛామ తత్త్వతః ॥ 2 ॥

ఓ సూతుడా! మనువులు ఎందరు? ఆ యా మన్వంతరాలకాలం ఎంత? సమగ్రంగా వినాలని మాకు కోరికగా ఉన్నది.

లోమహర్షణ ఉవాచ :-లోమహర్షణుడు మునులతో ఇలా చెప్తున్నాడు.

న శక్యో విస్తరో విప్రాః వక్తుం వర్షశతై రపి ।
మన్వన్తరాణాం సర్వేషాం సంక్షేపా చ్ఛృణుత ద్విజాః ॥ 3 ॥

బ్రాహ్మణులారా! మనువులు, మన్వంతరాలను గూర్చి విస్తరించి చెప్పాలంటే వందలసంవత్సరాలకు కూడా సాధ్యం కాదు. ద్విజన్ములారా! సంగ్రహంగా వినండి.

స్వాయంభువో మనుః పూర్వం మను స్స్వారోచిష స్తథా ।
ఉత్తమ స్తామస శ్చైవ రైవత శ్చాక్షుష స్తథా ॥ 4 ॥

మొట్టమొదటి మనువు 1.స్వాయంభువుడు. తరువాత 2. స్వారోచిషుడు. ఆతర్వాత క్రమంగా 3. ఉత్తముడు, 4. తామసుడు, 5. రైవతుడు, 6. చాక్షుషుడు అనేమనువులు ఉన్నారు. (ఈఆరుమన్వంతరాలు గడిచిపోయినవి.)

వైవస్వతశ్చ భో విప్రా స్సామ్ప్రతం మనురుచ్యతే ।
సావర్ణిశ్చ మను స్తద్వద్ రైభ్యో రౌచ్యస్తథైవ చ ॥ 5 ॥

తథైవ మేరుసావర్ణ్య శ్చత్వారో మనవ స్స్మృతాః ।

ప్రస్తుతం మనువు 7. వైవస్వతుడు. (వైవస్వతమన్వంతరం నడుస్తున్నది.) ఇక పైన 8. సావర్ణి, 9. రైభ్యుడు, 10. రౌచ్యుడు, 11. మేరుసావర్ణి అనేమనువులు ఉంటారు. మేరుసావర్ణులు నలుగురు. (11. బ్రహ్మసావర్ణి, 12. రుద్రసావర్ణి, 13. మేరుసావర్ణి, 14. దక్షసావర్ణి అనే నలుగురు మేరుపర్వతంమీద తపస్సు చేసి లక్ష్యాన్ని సాధించి ఉండటంచేత వీరందరినీ మేరు సావర్ణులు అంటారు.ఇలా మనువులు మొత్తం పద్నాలుగుమంది.)

అతీతా వర్తమానాశ్చ తథైవానాగతా ద్విజాః ॥ 6 ॥

కీర్తితా మనవ స్తుభ్యం మయైవైతే యథా శ్రుతాః ।
ఋషీం స్త్వేషాం ప్రవక్ష్యామి పుత్రాన్ దేవగణాం స్తథా ॥ 7 ॥

బ్రాహ్మణులారా! వీరు గతంలోనివారు, (ఆరుగురు), వర్తమానంలోని మనువు (ఒకడు), రాబోయేవారు (ఏడుగురు) అయిన మనువులను గురించి నేను విన్నదాని ననుసరించి మీకు వివరించాను. ఈమనువులకాలంలోని ఋషులను, మనువులతనయులను, నాటిదేవతాగణాలను పేర్కొంటాను.

మరీచి రత్రి ర్భగవా నఙ్గిరాః పులహః క్రతుః ।
పులస్త్యశ్చ వసిష్ఠశ్చ సప్తైతే బ్రహ్మణ స్సుతాః ॥8 ॥

1. మరీచి, 2. అత్రి, జ్ఞాని అయిన 3. అంగిరుడు, 4. పులహుడు, 5. క్రతువు, 6. పులస్త్యుడు, 7. వసిష్ఠుడు అనే వారు ఏడుగురు బ్రహ్మదేవుడి కొడుకులు. బ్రహ్మర్షులు.

ఉత్తరస్యాం దిశి తథా ద్విజా స్సప్తర్షయ స్తథా ।
ఆగ్నీధ్రశ్చాగ్నిబాహుశ్చ మేధ్యో మేధాతిథి ర్వసుః ॥ 9 ॥

జ్యోతిష్మాన్ ద్యుతిమాన్ హవ్యో మనుపుత్ర స్తథైవ చ ।
మనో స్స్వాయంభువ స్యైతే దశ పుత్రా మహౌజసః ॥ 10 ॥

ఏతద్ వై ప్రథమం విప్రా మన్వన్తరముదాహృతమ్ ।

వీరు ఉత్తరదిశలో ఉంటారు. బ్రాహ్మణులారా! వీరు స్వాయంభువమనువుకాలంలో సప్తఋషులు. ఆగ్నీధ్రుడు, అగ్ని బాహుడు, మేధ్యుడు, మేధాతిథి, వసువు, జ్యోతిష్మంతుడు, ద్యుతిమంతుడు, హవ్యుడు, అనేవారు పదిమంది, స్వాయంభువ మనువుకుమారులు. ఇది (స్వాయంభువమన్వంతరం) మొదటిమన్వంతరంగా చెప్పబడుతున్నది.

ఔర్వో వసిష్ఠపుత్ర శ్చ స్తమ్బః కశ్యప ఏవ చ ॥11 ॥
ప్రాణో బృహస్పతి శ్చైవ దత్తోఽత్రి శ్చ్యవన స్తథా ।
ఏతే మహర్షయో విప్రా వాయుప్రోక్తా మహావ్రతాః ॥ 12 ॥

స్వారోచిషమన్వంతరంలో వసిష్ఠుడి కొడు కైన ఔర్వుడు, స్తంబుడు, కశ్యపుడు, ప్రాణుడు, బృహస్పతి, దత్తుడు, చ్యవనుడు అనేవారు సప్తఋషులు. బ్రాహ్మణులారా! ఈమహర్షులు గొప్పనియమవంతులు. వాయుదేవుడిచేత ప్రశంసింపబడినారు.

దేవాశ్చ తుషితా నామ స్మృతా స్స్వారోచిషేఽన్తరే ।
హవిష్మ స్సుకృతి ర్జ్యోతి రాపో మూర్తి రపి స్మృతః ॥13 ॥

ప్రతీతశ్చ నభస్యశ్చ నభ ఊర్జ స్తథైవ చ ।
స్వారోచిషస్య పుత్రా స్తే మనో ర్విప్రా మహాత్మనః ॥14 ॥

కీర్తితాః పృథివీపాలా మహావీర్యపరాక్రమాః ।
ద్వితీయ మేతత్ కథితం విప్రా మన్వన్తరం మయా ॥15 ॥

స్వారోచిషమన్వంతరంలో దేవతలు తుషితులు అని పేర్కొనబడ్డారు. హవిఘ్నుడు, సుకృతి, జ్యోతి, ఆపుడు, మూర్తి (ఆపోమూర్తి), ప్రతీతుడు, నభస్యుడు, నభుడు, ఊర్జుడు అనేవారు స్వారోచిషమనువు కుమారులు. వీరు మహాత్ములు. భూపాలకులయినవీరు గొప్పబలపరాక్రమాలు గలిగినవారుగా స్తుతింపబడ్డారు. ద్విజులారా! ఇది రెండవ (స్వారోచిష) మన్వంతరం గురించి చెప్పాను.

ఇదం తృతీయం వక్ష్యామి తద్బుధ్యధ్వం ద్విజోత్తమాః ।
వసిష్ఠపుత్రా స్సప్తాసన్ వాసిష్ఠా ఇతి విశ్రుతాః ॥ 16 ॥

బ్రాహ్మణశ్రేష్ఠులారా! ఇక మూడవ(ఉత్తమ)మన్వంతరం గురించి చెప్తాను. తెలుసుకోండి. వసిష్ఠుడికి ఏడుగురు కొడుకులు కలిగారు. వారు వాసిష్ఠులు అనేపేరుతో ప్రసిద్ధులైనారు.(ఈమన్వంతరంలో వీరు సప్తఋషులు.)

హిరణ్యగర్భస్య సుతా ఊర్జా నామ సుతేజసః ।
ఋషయోఽత్ర మయా ప్రోక్తాః కీర్త్యమానా న్నిబోధత ॥ 17 ॥

హిరణ్యగర్భుడికుమారులు ఊర్జులు. వీరు మంచితేజస్సు గలిగినవారు. ఆ ఋషులను గురించి నేను చెప్పినది గ్రహించండి.

ఔత్తమేయాన్ మునిశ్రేష్ఠా! దశ పుత్రాన్ మనో రిమాన్ ।
ఇష ఊర్జ స్తనూజ స్తు మధు ర్మాధవ ఏవ చ ॥ 18 ॥

శుచి శ్శుక్ర స్సహ శ్చైవ నభస్యో నభ ఏవ చ ।
భానవ స్తత్ర దేవాశ్చ మన్వన్తరముదాహృతమ్ ॥ 19 ॥

మునిశ్రేష్ఠులారా! ఉత్తమమనువుకు పదిమంది కొడుకులు. వారు ఇషుడు, ఊర్జుడు, తనూజుడు, మధువు, మాధవుడు, శుచి, శుక్రుడు, సహుడు, నభస్యుడు, నభుడు అనేవారు. ఈమన్వంతరంలో దేవతలు భానువులు అని పేర్కొనబడేవారు.

మన్వన్తరం చతుర్థం వః కథయిష్యామి సామ్ప్రతమ్ ।
కావ్యః పృథు స్తథైవాగ్ని ర్జహ్ను ర్ధాతా ద్విజోత్తమాః ॥ 20 ॥

కపీవానకపీవాంశ్చ తత్ర సప్తర్షయో ద్విజాః ।
పురాణే కీర్తితా విప్రాః పుత్రా పౌత్రా ద్విజోత్తమాః ॥ 21 ॥

ఉత్తమబ్రాహ్మణులారా! ఇక ఇపుడు మీకు నాలుగవ(తామస)మన్వంతరం గురించి చెప్తాను. కావ్యుడు, పృథువు, అగ్ని, జహ్నువు, ధాత, కపీవంతుడు, అకపీవంతుడు అనేవారు ఈమన్వంతరంలో సప్తఋషులు. బ్రాహ్మణులారా! ఆ సప్తఋషుల కొడుకులు, మనుమలు ఉత్తమబ్రాహ్మణులుగా వేదవేత్తలుగా, పురాణాలలో ప్రశంసింపబడ్డారు.

సత్యా దేవగణా శ్చైవ తామస స్యాన్తరే మనోః ।
ద్యుతి స్తపస్య స్సుతపా స్తపోభూత స్సనాతనః ॥ 22 ॥

తపోరతి రకల్మాష స్తన్వీ ధన్వీ పరంతపః ।
తామసస్య మనో రేతే దశ పుత్రాః ప్రకీర్తితాః ॥ 23 ॥

తామసమన్వంతరంలో దేవతాగణాలు సత్యులు అని పేర్కొనబడ్డారు. తామసుడికి పదిమంది కొడుకులు. ద్యుతి, తపస్యుడు, సుతపుడు, తపోభూతుడు, సనాతనుడు, తపోరతి, అకల్మాషుడు, తన్వి, ధన్వి, పరంతపుడు అనేవారు సుప్రసిద్ధులు.

వాయుప్రోక్తా మునిశ్రేష్ఠా శ్చతుర్థం చైత దన్తరమ్ ।
దేవబాహు ర్యదుధ్రశ్చ ముని ర్వేదశిరా స్తథా ॥ 24 ॥

హిరణ్యరోమా పర్జన్య ఊర్ధ్వబాహుశ్చ సోమజః ।
సత్యనేత్ర స్తథాత్రేయ ఏతే సప్తర్షయోఽ పరే ॥ 25 ॥

తామసమనువు తనయులను గూర్చి వాయుదేవుడు చెప్పాడు. ఉత్తమమునులారా! నాలుగవమన్వంతరం తర్వాత అంటే ఐదవ(రైవత)మన్వంతరం గురించి చెప్తాను. ఈమన్వంతరంలో దేవబాహువు, యదుధ్రుడు, ముని అయిన వేదశిరుడు, హిరణ్యరోముడు, పర్జన్యుడు, సోముడి తనయు డైన ఊర్ధ్వబాహువు, అత్రితనయు డైన సత్యనేత్రుడు, అనేవారు సప్తఋషులు.

దేవా శ్చాభుక్తరజస స్తథా ప్రకృతయ స్స్మృతాః ।
పరిప్లవశ్చ రైభ్యశ్చ మనో రన్తర ముచ్యతే ॥ 26 ॥

ఈ మన్వంతరంలో దేవతలు అభుక్తరజసులు ప్రకృతులు అని చెప్పబడుతున్నారు (తపఃప్రకృతయ స్తథా అని శివపురాణం వీరు తపస్సు చేయడమే స్వభావంగా కలిగినవారుగా పేర్కొంది). పరిప్లవుడు, రైభ్యుడు అనేవారు కూడ ఈమన్వంతరంలో ఉన్నారు. ఇంకొక మన్వన్తరము చెప్పబడుచున్నది.

అథ పుత్రా నిమాం స్తస్య బుధ్యధ్వం గదతో మమ ।
ధృతిమా నవ్యయో యుక్త సత్త్వదర్శీ నిరుత్సుకః ॥ 27 ॥

ఆరణ్యశ్చ ప్రకాశశ్చ నిర్మోహ స్సత్యవాక్కృతీ ।
రైవతస్య మనోః పుత్రాః పఞ్చమం చైత దన్తరమ్ ॥ 28 ॥

ఇక రైవతమనువు పుత్రులను గురించి చెప్తాను గ్రహించండి. ధృతిమంతుడు, అవ్యయుడు, యుక్తుడు, తత్త్వదర్శి, నిరుత్సుకుడు, ఆరణ్యుడు, ప్రకాశుడు, నిర్మోహుడు, సత్యవాక్కు, కృతి అనేవారు. ఇది ఐదవ డైన రైవతమన్వంతరవిషయం.

షష్ఠం తు సమ్ప్రవక్ష్యామి తద్ బుధ్యధ్వం ద్విజోత్తమాః ।
భృగు ర్నభో వివస్వాంశ్చ సుధామా విరజా స్తథా ॥ 29 ॥

అతినామా సహిష్ణుశ్చ సప్తైతే చ మహర్షయః ।
చాక్షుష స్యాన్తరే విప్రా మనో ర్దేవాస్త్విమే స్మృతాః ॥ 30 ॥

బ్రాహ్మణోత్తములారా! తరువాత ఆరవ(చాక్షుష)మన్వంతరం గురించి చెప్తాను. గ్రహించండి. ఈమన్వంతరంలో భృగువు, నభుడు, వివస్వంతుడు, సుధాముడు, విరజుడు, అతినాముడు, సహిష్ణువు అనేవారు ఏడుగురు సప్తఋషులు. విప్రులారా! చాక్షుషమన్వంతరంలో దేవతలు వీరు.

అప్రభూతాశ్చ ఋషయః పృథక్త్వేన దివౌకసః ।
లేఖాశ్చ నామతో విప్రాః పఞ్చ దేవగణా స్స్మృతాః ॥ 31 ॥

ఋషే రఙ్గిరసః పుత్రాః మహాత్మానో మహౌజసః ।
నాడ్వలేయా మునిశ్రేష్ఠా దశ పుత్రాస్తు విశ్రుతాః ॥ 32 ॥

పురుప్రభృతయో విప్రా శ్చాక్షుషస్యాన్తరే మనోః ।
షష్ఠం మన్వన్తరం ప్రోక్తం సప్తమం తు నిబోధత ॥ 33 ॥

చాక్షుషమన్వంతరంలో అప్రభూతులు, ఋషులు, ప్రత్యేకంగా దివౌకసులు, లేఖులు, విప్రులు అనేపేర్లతో దేవగణాలు ఐదు ఉన్నాయి. మహాత్ములు, తేజస్వంతులు అయిన వీరు అందరూ అంగిరోముని కొడుకులు. చాక్షుషుడు అనేమనువుకు నడ్వల అనే భార్యయందు పురువు మొదలుగా మునిశ్రేష్ఠు లైన పదిమంది కొడుకులు ప్రసిద్ధు లైనారు. (ఇక్కడ రురుప్రభృతి అని పాఠం. కాని ఇంతకు పూర్వం (1-74,75 శ్లోకాలలో) చాక్షుషమనువుకు నడ్వలయందు పదిమంది కొడుకులను చెప్పినసందర్భంలో కుత్స, పురు, ప్రభృతులు పేర్కొనబడ్డారు. దాన్నిబట్టి ఇక్కడ గూడ పురు అని ఉండవలసిఉంది. అక్కడ 'రురు' అని ఉండడానికి అవకాశం తక్కువ. అక్కడే పురువు కుమారుడు అంగిరసుడు అని చెప్పబడింది. అతడు ఇచట 31వ శ్లోకంలో చెప్పిన అంగిరసుడికంటె భిన్నమైనవా డయిన గావచ్చును.) ఈవిధంగా ఆరవదైన చాక్షుషమన్వంతరం విషయం చెప్పబడింది. ఇక ఏడవ (వైవస్వత) మన్వంతరం గురించి తెలుసుకోండి.

అత్రి ర్వసిష్ఠో భగవాన్ కశ్యపశ్చ మహాన్ ఋషిః ।
గౌతమోఽథ భరద్వాజో విశ్వామిత్రస్తథైవ చ ॥ 34 ॥

తథైవ పుత్రో భగవాన్ ఋచీకస్య మహాత్మనః ।
సప్తమో జమదగ్నిశ్చ ఋషయస్సాంప్రతం దివి ॥ 35 ॥

ప్రస్తుతమైన వైవస్వతమన్వంతరంలో అత్రి, మహాజ్ఞాని అయిన వసిష్ఠుడు, మునిశ్రేష్ఠు డయిన కశ్యపుడు, గౌతముడు, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, అలాగే ఏడవవాడు ఋచీకమహర్షి కొడుకయిన మహాత్ముడు జమదగ్ని అనేవారు సప్తఋషులు.

సాధ్యా రుద్రాశ్చ విశ్వే చ వసవో మరుత స్తథా ।
ఆదిత్యాశ్చాశ్వినౌ చాపి దేవౌ వైవస్వతౌ స్మృతౌ ॥ 36 ॥

వైవస్వతమన్వంతరంలో సాధ్యులు, రుద్రులు, విశ్వేదేవతలు, మరుత్తులు, ఆదిత్యులు, అశ్వినులు అనేవారు దేవలోకంలో ఉండే దేవతలు.

మనో ర్వైవస్వత స్త్వైతే వర్తన్తే సామ్ప్రతేఽ న్తరే ।
ఇక్ష్వాకుప్రముఖాశ్చైవ దశ పుత్రా మహాత్మనః ॥ 37 ॥

ఈమన్వంతరంలో వైవస్వతమనువుకు ఇక్ష్వాకుడు మొదలుగా మహాత్ము లయిన పదిమంది తనయులు కలిగారు.

ఏతేషాం కీర్తితానాం తు మహర్షీణాం మహౌజసామ్ ।
తేషాం పుత్రాశ్చ పౌత్రాశ్చ దిక్షు సర్వాసు భో ద్విజాః ॥ 38 ॥

బ్రాహ్మణులారా! ఈవిధంగా పేర్కొనబడిన తేజస్వులయిన మహర్షులకు పుట్టిన కొడుకులు, మనుమలు అన్ని దిక్కులలోనూ నిండిఉన్నారు.

మన్వన్తరేషు సర్వేషు ప్రథితా స్సప్త సప్తకాః ।
లోకే ధర్మవ్యవస్థార్థం లోకసంరక్షణాయ చ ॥ 39 ॥

అన్ని మన్వంతరాలలోనూ ధర్మాన్ని నిలబెట్టడానికీ, లోకాలను కాపాడడానికీ సుప్రసిద్ధులైన సప్తకులు (సప్తర్షిగణాలు) ఏడు ప్రసిద్ధమై ఉన్నాయి. (ఇంతవరకు స్వాయంభువం నుండి వైవస్వతం వరకు ఏడు మన్వంతరాలు. ప్రతిమన్వంతరంలోనూ సప్తర్షులు ఋషిగణంగా ఉన్నారు. కాగా ఏడు మన్వంతరాలలోనూ సప్తర్షిగణాలు ఏడు అయినాయి.) ఈసప్తఋషులు ధర్మం చెడకుండా, ప్రజలను కాపాడటం కోసం ఏర్పడ్డారు.

మన్వన్తరే వ్యతిక్రాన్తే చత్వార స్సప్తకా గణాః ।
కృత్వా కర్మ దివం యాన్తి బ్రహ్మలోకమనామయమ్ ॥ 40 ॥

ఆ మన్వంతరం గడిచిపోగానే నాటి సప్తర్షిగణంలో నలుగురు ధర్మవ్యవస్థ, లోకరక్షణం అనేకర్మలను నిర్వహించి, శాశ్వతమైన బ్రహ్మలోకానికి వెళ్లిపోతారు.

తతోఽ న్యే తపసా యుక్తాః స్థానం తత్ పూరయ న్త్యుత ।
అతీతా వర్తమానాశ్చ క్రమేణైతేన భో ద్విజాః ॥ 41 ॥

ఇంక మిగిలినవారు తపస్సు ఆచరిస్తూ బ్రహ్మలోకానికి వెళ్ళినవారి (కర్మలను తామే ఆచరిస్తూ వారు లేనిలోటు లేకుండా వారి) స్థానాలను పూరిస్తారు. ఓ బ్రాహ్మణులారా! గడచిపోయిన, నడుస్తున్న మన్వంతరాలను గురించి క్రమంగా చెప్పడం అయింది.

అనాగతాశ్చ సప్తైతే స్మృతా దివి మహర్షయః ।
మనోరన్తరమాసాద్య సావర్ణ స్యోదితా ద్విజాః ॥ 42 ॥

బ్రాహ్మణులారా! ఇంకా రాని సప్తమహర్షులగణాలు ఏడు దేవలోకంలోనే ఉన్నాయి. (ప్రస్తుతం నడుస్తున్న వైవస్వత మన్వంతరం తర్వాత) రాబోయే సావర్ణి మన్వంతరంలో కలుగబోయే సప్తఋషులు –

రామో వ్యాస స్తథాత్రేయో దీప్తిమన్తో బహుశ్రుతాః ।
భారద్వాజ స్తథా ద్రౌణి రశ్వత్థామా మహాద్యుతిః ॥ 43 ॥

గౌతమశ్చాజరశ్చైవ శరద్వాన్ నామ గౌతమః ।
కౌశికో గాలవశ్చైవ ఔర్వః కాశ్యప ఏవ చ ॥ 44 ॥

వారు 1. రాముడు, 2. వ్యాసుడు, 3. ఆత్రేయుడు వీరు పండితులు. తేజస్వంతులు. భరద్వాజగోత్రజుడూ, ద్రోణుడి తనయుడూ, గొప్పతేజస్వీ అయిన 3. అశ్వత్థామ, ఎప్పటికీ ముసలితనం లేని 4. గౌతముడు, గౌతముడి తనయు డైన 5. శరద్వంతుడు, కుశిక నందను డైన 6. గాలవుడు, కశ్యపపుత్రు డైన 7. ఔర్వుడు అనేవారు.

సావర్ణస్య మనోః పుత్రా భవిష్యా మునిసత్తమాః ।
వైరీ చైవాధ్వరీవాంశ్చ శమనో ధృతిమాన్ వసుః ॥ 45 ॥

అరిష్టశ్చా పృధృష్టశ్చ వాజీ సుమతిరేవ చ ।
ఏతే సప్త మహాత్మానో వీరాశ్చ ద్విజపుఙ్గవాః ॥ 46 ॥

బ్రాహ్మణశ్రేష్ఠులారా! సావర్ణి మనువుకు కలుగబోయే కొడుకులు – వైరి, అధ్వరీవంతు డయిన శమనుడు, ధైర్యవంతుడైన వసువు, అరిష్టుడు, అధృష్టుడు, వాజి, సుమతి, అనేవారు. ఈ ఏడుగురు సావర్ణికొడుకులు మహాత్ములు, బలవంతులు.

ఏతేషాం కల్యముత్థాయ కీర్తనా త్సుఖమేధతే ।
యశ శ్చాప్నోతి సుమహదాయుష్మాంశ్చ భవేన్నరః ॥ 47 ॥

ఉదయమే నిద్ర లేచి వీరిని స్తుతిస్తే సుఖం వృద్ధి చెందుతుంది. కీర్తి కలుగుతుంది. మానవుడు దీర్ఘా యుష్మంతుడు అవుతాడు.

ఏతాన్యుక్తాని భో విప్రా స్సప్త సప్త చ తత్త్వతః ।
మన్వన్తరాణి సంక్షేపాచ్ఛృణు తాన్యాగతాన్యపి ॥ 48 ॥

ఓ బ్రాహ్మణులారా! జరిగిపోయినవి ఆరు, జరుగుతున్నది ఒకటి, మొత్తం మన్వంతరాలు ఏడింటినిగురించి సమగ్రంగా చెప్పాను. ఇంక రాబోయే మన్వంతరాలను గురించి కూడ సంగ్రహంగా చెప్తాను వినండి.

సావర్ణా మనవో విప్రాః పఞ్చ తాంశ్చ నిబోధత ।
ఏకో వైవస్వత స్తేషాం చత్వారస్తు ప్రజాపతేః ॥ 49 ॥

సావర్ణులు అనేపేరు గలిగినమనువులు ఐదుగురు. వారిని గురించి గ్రహించండి. ఆ అయిదుగురిలో ఒకడు వైవస్వతమనువు కుమారుడు (సావర్ణి). మిగిలిననలుగురు (మేరు, బ్రహ్మ, రుద్ర, దక్ష, సావర్ణులు) ప్రజాపతి కుమారులు.

పరమేష్ఠిసుతా విప్రా మేరుసావర్ణ్యతాం గతాః ।
దక్ష స్యైతే హి దౌహిత్రాః ప్రియాయా స్తనయా నృపాః ॥ 50 ॥

బ్రాహ్మణులారా! బ్రహ్మకుమారులైన ఆ నలుగురు (మేరువుతో సమానమైనవర్ణం కలిగి, బంగారు మేనిచాయతో) మేరుసావర్ణులు అయినారు. వీళ్లు దక్షప్రజాపతికూతురుకొడుకులు. దక్షుడి కూతురైన ప్రియకు జన్మించినవారు(1–128).

మహతా తపసా యుక్తా మేరుపృష్ఠే మహౌజసః ।
రుచేః ప్రజాపతేః పుత్రో రౌచ్యో నామ మను స్స్మృతః ॥ 51 ॥

తేజోమయులైన వీరు మేరుపర్వతశిఖరంపై తపస్సు చేశారు. (అందువలననే వీరు మేరుసావర్ణు లయినా రని హరివంశం.) రుచి అనేప్రజాపతికొడుకు రౌచ్యుడు అనే మనువు అయినాడు. (రైభ్యుడు మరొక మనువు)

భూత్యాం చోత్పాదితో దేవ్యాం భౌత్యో నామ రుచే స్సుతః ।
అనాగతాశ్చ సప్తైతే కల్పేఽ స్మిన్ మనవ స్స్మృతాః ॥ 52 ॥

రౌచ్యుడు రుచికి భూతి అనే స్త్రీయందు జన్మించాడు. అందువలన ఈ రుచి కుమారుడిని భౌత్యుడు అని కూడా అంటారు. ఈ ఏడుగురు ఈ శ్వేతవరాహకల్పంలో రాబోయే మన్వంతరాలలో మనువు లవుతారు.

తై రియం పృథివీ సర్వా సప్తద్వీపా సపత్తనా ।
పూర్ణం యుగసహస్రం తు పరిపాల్యా ద్విజోత్తమాః ॥ 53 ॥

సప్తద్వీపాలతోనూ, పట్టణాలతోనూ కూడిన ఈభూమండలాన్ని నిండా వేయియుగాలు (కృత, త్రేతా, ద్వాపర, కలి అనే నాలుగుయుగాలు కలిసిన మహాయుగాలు వేయి) ఈపదునాలుగుమంది మనువులు పరిపాలిస్తారు.

ప్రజాపతేశ్చ తపసా సంహార స్తేషు నిత్యశః ।
యుగాని సప్తతి స్తాని సాగ్రాణి కథితాని చ ॥ 54 ॥

కృతత్రేతాదియుక్తాని మనో రంతరముచ్యతే ।
చతుర్ద శైతే మనవః కథితాః కీర్తివర్ధనాః ॥ 55 ॥

వేదేషు సపురాణేషు సర్వేషు ప్రభవిష్ణవః ।
ప్రజానాం పతయో విప్రా ధన్యమేషాం ప్రకీర్తనమ్ ॥ 56 ॥

ప్రజాపతుల తపస్సువలన వారికి నాశనం కూడా నిత్యంగా జరుగుతుంది. కృత, త్రేతా, ద్వాపర, కలి అనే నాలుగుయుగాలు కలిసి (ఒకమహాయుగం)నవి డెబ్బైఒక్కటి కలిసి ఒకమన్వంతరం అని చెప్పబడుతుంది. ఈ పద్నాలుగుమంది మనువులుగానూ, ప్రజాపతులుగానూ వేదాలలో, పురాణాలలో కీర్తింపబడ్డారు. ఓ బ్రాహ్మణులారా! ఈమనువులను స్మరించటం శుభదాయకం.

మన్వన్తరేషు సంహారా స్సంహారాన్తేషు సమ్భవాః ।

న శక్యతేఽ న్త స్తేషాం వై వక్తుం వర్షశతైరపి ॥ 57 ॥
విసర్గస్య ప్రజానాం వై సంహారస్య చ భో ద్విజాః ।

మన్వంతరం చివరలో లయం జరుగుతుంది. లయం పూర్తి అయినతరువాత మళ్లీ సృష్టి జరుగుతుంది. ఓ విప్రులారా! ఈ విధంగ ప్రజలు సృష్టింపబడడమూ, లయం కావడమూ అనే క్రమం ఎప్పుడు ముగుస్తుందో, వందలసంవత్సరాలు వర్ణించినా, పూర్తిగా చెప్పడం సాధ్యం కాదు.

మన్వన్తరేషు సంహారా శ్శ్రూయన్తే ద్విజసత్తమాః ॥ 58 ॥

సశేషా స్తత్ర తిష్ఠన్తి దేవా స్సప్తర్షిభి స్సహ ।
తపసా బ్రహ్మచర్యేణ శ్రుతేన చ సమన్వితాః ॥ 59 ॥

మన్వంతరంలో చివర లయం వేదాదులలో వినబడుతున్నది. లయం అయిన సమయంలో తపస్సుతోనూ, బ్రహ్మచర్యంతోనూ పాండిత్యంతోనూ కూడిన దేవతలు సప్తర్షులతో సహా నశించకుండా మిగిలి ఉంటారు.

పూర్ణే యుగసహస్రే తు కల్పో నిశ్శేష ఉచ్యతే ।
తత్ర భూతాని సర్వాణి దగ్ధాన్యాదిత్యరశ్మిభిః ॥ 60 ॥

వేయిమహాయుగాలు పూర్తి అయినతరువాత మాత్రం ఆకల్పం మిగలకుండా లయం అయిపోతుంది. అపుడు సమస్తమైన చరాచరభూతకోటి ఆదిత్యకిరణాలకారణంగా కాలిపోతాయి.

బ్రహ్మాణ మగ్రతః కృత్వా సహాదిత్యగణై ర్ద్విజాః ।
ప్రవిశన్తి సురశ్రేష్ఠం హరిం నారాయణం ప్రభుమ్ ॥ 61 ॥

అపుడు బ్రహ్మను ముందు పెట్టుకుని ఆదిత్యగణాలతో కలిసి బ్రాహ్మణులు దేవదేవుడు, హరి, సమర్థుడు, శ్రీమన్నారాయణునిలో ప్రవేశిస్తారు.

స్రష్టారం సర్వభూతానాం కల్పాన్తేషు పునః పునః ।
అవ్యక్త శ్శాశ్వతో దేవ స్తస్య సర్వ మిదం జగత్ ॥ 62 ॥

పూర్వకల్పం పూర్తయిన తరువాత తరువాతి కల్పం ఆరంభంలో ప్రతీసారి మళ్లీ, మళ్లీ సమస్త మయిన స్థావరజంగమాత్మకమయిన భూతకోటిని ఆ శ్రీమన్నారాయణుడే సృష్టి చేస్తాడు. ఆ శ్రీహరి కనిపించడు. నిత్యంగా ఉంటాడు. ఈజగత్తు సమస్తమూ ఆయనదే.

అత్ర వః కీర్తయిష్యామి మనో ర్వైవస్వతస్య వై ।
విసర్గం మునిశార్దూలా స్సామ్ప్రతస్య మహాద్యుతేః ॥ 63 ॥

మహామునులారా! ఇక ప్రస్తుతం నడుస్తున్న మిక్కిలి కాంతిమంతుడైన వైవస్వతమనువుకాలంలోని సృష్టిని గూర్చి వివరిస్తాను.

అత్ర వంశప్రసఙ్గేన కథ్యమానం పురాతనమ్ ।
యత్రోత్పన్నో మహాత్మా స హరి ర్వృష్ణికులే ప్రభుః ॥ 64 ॥

తరువాత వివిధవంశానుకీర్తనసందర్భంలో పరమాత్ముడూ, జగత్ప్రభువూ ఐన శ్రీహరి ఉద్భవించిన పురాతనమైన వృష్ణివంశం గురించి చెప్తాను.

ఇతి శ్రీబ్రహ్మపురాణే మన్వన్తరకీర్తనం నామ తృతీయోఽధ్యాయః ॥3 ॥

ఇది శ్రీబ్రహ్మపురాణంలో మన్వంతరకీర్తనం అనే మూడవ అధ్యాయం సంపూర్ణం.

చతుర్థోఽధ్యాయః - నాల్గవ అధ్యాయం

ఆదిత్యోత్పత్తికథనమ్ - ఆదిత్యోత్పత్తికథనం

లోమహర్షణ ఉవాచ:- లోమహర్షణుడు ఇలా చెప్తున్నాడు.

వివస్వాన్ కశ్యపా జ్జజ్ఞే దాక్షాయణ్యాం ద్విజోత్తమాః ।
తస్య భార్యాఽభవత్ సంజ్ఞా త్వాష్ట్రీ దేవీ వివస్వతః ॥ 1 ॥

బ్రాహ్మణోత్తములారా! కశ్యపమహర్షివలన దక్షప్రజాపతికూతురికి వివస్వంతుడు జన్మించాడు. ఆ వివస్వంతుడిభార్య సంజ్ఞాదేవి. ఆమె త్వష్ట అనే ప్రజాపతి కూతురు. (శివ.ఉమా.35.అధ్యాయం)

సురేశ్వరీతి విఖ్యాతా త్రిషు లోకేషు భామినీ ।
సా వై భార్యా భగవతో మార్తణ్డస్య మహాత్మనః ॥ 2 ॥

ఆమె మూడులోకాలలోనూ సురేశ్వరి అని ప్రసిద్ధి పొందింది. ఆమే గొప్పవాడు, సర్వశక్తిమంతుడు అయిన మార్తాండుడికి భార్య.

భర్తృరూపేణ నాతుష్యద్ రూపయౌవనశాలినీ ।
సంజ్ఞా నామ స్వతపసా సుదీప్తేన సమన్వితా ॥ 3 ॥

సంజ్ఞాదేవి రూపవతి. వయసులో ఉంది. ఆమెకు భర్తరూపంవల్ల సంతృప్తి కలగలేదు. గొప్పతపస్సు చేసింది. దానివల్ల మంచికాంతితో ప్రకాశిస్తున్నది.

ఆదిత్యస్య హి తద్రూపం మణ్డలస్య సుతేజసా ।
గాత్రేషు పరిదగ్ధం వై నాతికాన్తమివాభవత్ ॥ 4 ॥

సూర్యమండలంయొక్క తీక్ష్ణమైన తేజస్సుచేత ఆమె శరీరం బాగా కాలిపోయింది. అందువల్ల ఆమె ఆకారం మరీ అంత మనోహరంగా ఉండేది కాదు.

న ఖల్వయం మృతోఽణ్డస్య ఇతి స్నేహాదభాషత ।
అజానన్ కాశ్యప స్తస్మా న్మార్తణ్డ ఇతి చోచ్యతే ॥ 5 ॥

ఒకసారి ఆమె తెలియక, ప్రేమతో 'ఇతడు మరణించలేదు అండానికి సంబంధించి ఉన్నాడు'. అన్నది. అందువల్ల కశ్యపుడికొడు కయిన సూర్యుడిని మార్తండుడు అని కూడా వ్యవహరిస్తున్నారు.

తేజ స్త్వభ్యధికం తస్య నిత్యమేవ వివస్వతః ।
యేనాతితాపయామాస త్రీన్ లోకాన్ కశ్యపాత్మజః ॥ 6 ॥

ఆ వివస్వంతుడితేజస్సు ఎప్పుడూ ఎక్కువగా ఉంటుంది. ఆ తేజస్సుతో సూర్యుడు (కశ్యపపుత్రుడు) మూడు లోకాలనూ మిక్కిలిగా తపింపజేస్తుంటాడు.

త్రీణ్యపత్యాని భో విప్రాః సంజ్ఞాయాం తపతాం వరః ।
ఆదిత్యో జనయామాస కన్యాం ద్వౌ చ ప్రజాపతీ ॥ 7 ॥

ఓ బ్రాహ్మణులారా! ఉత్తమతేజోవంతుడయిన ఆదిత్యుడికి సంజ్ఞాదేవియందు ముగ్గురు బిడ్డలు కలిగారు. వారిలో ఒకరు కన్య(ఆడపిల్ల). ఇద్దరు ప్రజాపతులు.

మను ర్వైవస్వతః పూర్వం శ్రాద్ధదేవః ప్రజాపతిః ।
యమశ్చ యమునా చైవ యమజౌ సంబభూవతుః ॥ 8 ॥

వారిలో మొదటివాడు వైవస్వతుడు. ఇతడు మనువు. తరువాతివాడు శ్రాద్ధకర్మలకు అధిదైవతం (యముడు). వివస్వంతుడి కూతురు యమున. యముడు, యమున ఇద్దరు కవలబిడ్డలు.

శ్యామవర్ణంతు తద్రూపం సంజ్ఞా దృష్ట్వా వివస్వతః ।
అసహన్తీ తు స్వాం ఛాయాం సవర్ణాం నిర్మమే తతః ॥ 9 ॥

సంజ్ఞ వివస్వంతుడి ఆరూపం నల్లగా (సౌందర్యహీనంగా) ఉండటం (యముడు, యమున ఇద్దరూ నల్లగా ఉంటారు. 'ఆత్మా వై పుత్ర నామాసి' అనే దానిప్రకారం వివస్వంతుడికి ప్రతిరూపాలు అయిన యముడు, యమున అనే తనకన్నబిడ్డల నల్లనిరూపం) చూసి, సంజ్ఞ సహించలేకపోయింది. అందమైన తనశరీరంతో సమాన మైన వర్ణంతో తననీడ వంటిదానిని సృష్టించింది.

మాయామయీ తు సా సంజ్ఞా తచ్ఛాయాయా స్సముత్థితా ।
ప్రాఞ్జలిః ప్రణతా భూత్వా ఛాయా సంజ్ఞాం ద్విజోత్తమాః ॥ 10 ॥

ఉవాచ కిం మయా కార్యం కథయస్వ శుచిస్మితే ।
స్థితాఽస్మి తవ నిర్దేశే శాధి మాం వరవర్ణిని ॥ 11 ॥

ఓ బ్రాహ్మణోత్తములారా! మాయామయి అయిన ఆ సంజ్ఞ (సంజ్ఞాదేవి సృష్టించినదీ, సంజ్ఞలాగా ఉన్నదీ అయిన సంజ్ఞ) లేచి, చేతులు జోడించి, సంజ్ఞాదేవికి నమస్కరించింది. పిదప ఛాయ సంజ్ఞతో ఇలా అన్నది. స్వచ్ఛమైన చిరునవ్వు కలిగినదానా! నేను ఏం చేయాలి? చెప్పు. నీఆజ్ఞకోసం ఎదురుచూస్తున్నాను. సుందరాంగీ, నన్ను ఆజ్ఞాపించు.

సంజ్ఞోవాచ :-సంజ్ఞ సవర్ణతో ఇలా అంటున్నది.

అహం యాస్యామి భద్రం తే స్వమేవ భవనం పితుః ।
త్వయైవ భవనే మహ్యం వస్తవ్యం నిర్విశఙ్కయా ॥ 12 ॥

నేను మాతండ్రిగారియింటికి వెళ్తున్నాను. (నేను నాతండ్రిఇంటిలో ఉన్నంతకాలం నాస్థానంలో) నీవు నాయింటిలో ఉండాలి. సందేహించవద్దు. నీకు మేలు జరుగుతుంది.

ఇమౌ చ బాలకౌ మహ్యం కన్యా చేయం సుమధ్యమా ।
సంభావ్యా స్తే న చాఖ్యేయ మిదం భగవతే శుభే ॥13॥

ఈబాలురు నాతనయులు. అందమైన ఈకన్య నాకూతురు. వీళ్లను జాగ్రత్తగా చూసుకో. ఈవిషయాన్ని నాభర్తకు తెలియనీయవద్దు. అతడు శక్తిమంతుడు.

సవర్ణోవాచ :–సవర్ణ (సంజ్ఞలాగా ఉన్న ఛాయ) సంజ్ఞతో ఇలా అంటున్నది.

ఆకచగ్రహణాద్దేవి ఆశాపాన్నైవ కర్హిచిత్ ।
ఆఖ్యాస్యామి నమస్తుభ్యం గచ్ఛ దేవి యథాసుఖమ్ ॥14॥

తల్లీ, వివస్వంతుడు నాజుట్టు పట్టుకోనంతవరకూ, నన్ను శపించకుండా ఉన్నంతవరకూ, ఎప్పటికీ ఈవిషయాన్ని ఆయనకు చెప్పను. క్షేమంగా వెళ్లి రా. నీకు నమస్కారం.

లోమహర్షణ ఉవాచ :–లోమహర్షణుడు మునులతో ఇలా అంటున్నాడు.

సమాదిశ్య సవర్ణాం తు తథేత్యుక్తా తయా చ సా ।
త్వష్టు స్సమీప మగమద్ వ్రీడితేవ తపస్వినీ ॥ 15 ॥

సంజ్ఞాదేవి ఈవిధంగా (తనబిడ్డలను జాగ్రత్తగా చూచుకొమ్మనీ, భర్తవద్ద తనకు మారుగా రహస్యంగా ఉండ మనీ) సవర్ణ (ఛాయ)ను ఆదేశించింది. (సవర్ణ చెప్పినవీడుకోలు మాటలకు) సంజ్ఞ సరే అన్నది. తపస్విని అయిన సంజ్ఞ తండ్రి త్వష్ట దగ్గరకు వెళ్ళింది. ఆయన ఎదుట సిగ్గుతో నిలబడింది.

పితు స్సమీపగా సా తు పిత్రా నిర్భర్త్సితా శుభా ।
భర్తు స్సమీపం గచ్ఛేతి నియుక్తా చ పునః పునః ॥16॥

భర్తను విడిచి తనదగ్గరకు వచ్చిన సంజ్ఞను ఆమె తండ్రి కోపంతో తిరస్కరించాడు. వెంటనే భర్తవద్దకు వెళ్లిపొమ్మని పదే పదే ఆజ్ఞాపించాడు.

ఆగచ్ఛద్ బడబాభూత్వాఽఽచ్ఛాద్య రూపమనిన్దితా ।
కురూన థోత్తరాన్ గత్వా తృణా న్యథ చచార హ ॥17॥

సంజ్ఞ తనరూపాన్ని కప్పిపెట్టుకుని బడబ (ఆడగుఱ్ఱం) ఆకారం ధరించి, ఉత్తరకురుదేశాలకు వెళ్లి, అక్కడ పచ్చిక ఉన్నప్రదేశాలలో పచ్చికను భక్షించుచూ గడిపినది.

ద్వితీయాయాం తు సంజ్ఞాయాం సంజ్ఞేయమితి చిన్తయన్ ।
ఆదిత్యో జనయామాస పుత్రమాత్మసమం తదా ॥18॥

ఇంక ఇక్కడ సూర్యుడు తనఇంట ఉన్న రెండవ(మాయా)సంజ్ఞనే అసలు సంజ్ఞ అనుకుని ఆమెయందు తనంతటికొడుకును ఒకడిని కన్నాడు.

పూర్వజస్య మనో ర్విప్రా స్సదృశోఽ యమితి ప్రభుః ।
మనురేవాభవన్నామ్నా సావర్ణ ఇతి చోచ్యతే ॥ 19 ॥

విప్రులారా! ఆమాయాసంజ్ఞ కొడుకు అంతకు పూర్వం పుట్టిన మనువుతో సమానమై, తాను కూడ మనువు అయినాడు. ఇతడు సావర్ణ (సావర్ణి అని ప్రసిద్ధి.) అని పేర్కొనబడుతున్నాడు. (మాయాసంజ్ఞ సవర్ణ అని పేర్కొనబడింది. సవర్ణ కొడుకు కాబట్టి సావర్ణుడు లేదా సావర్ణి అని వ్యవహారం.)

ద్వితీయో య స్సుత స్తస్యా స్స విజ్ఞేయ శ్శనైశ్చరః ।
సంజ్ఞా తు పార్థివీ విప్రా స్స్వస్య పుత్రస్య వై తదా ॥ 20 ॥

చకారాభ్యధికం స్నేహం న తథా పూర్వజేషు వై ।
మను స్తస్యా అక్షమత యమ స్తస్యా న చాక్షమే ॥ 21 ॥

మాయాసంజ్ఞకు రెండవబిడ్డగా జన్మించినవాడు శనైశ్చరుడు. ఓ విప్రులారా! అయితే ఆమె సాధారణ మానవజాతిస్త్రీ లాగా, తనకు బిడ్డలు కలిగినతరువాత అసలు సంజ్ఞాదేవి బిడ్డలను తనబిడ్డలపై ఉన్నంత గాఢ మైనప్రేమగా చూడలేకపోయింది. వైవస్వతమనువు ఆమె పక్షపాతాన్ని సహించాడు. కాని (వైవస్వతుని తమ్ము డైన) యముడు మాత్రం ఆమెను క్షమించలేకపోయాడు.

స వై రోషాచ్చ బాల్యాచ్చ భావినోఽ ర్థస్య వాఽ నఘ ।
పదా సంతర్జయామాస సంజ్ఞాం వైవస్వతో యమః ॥ 22 ॥

కోపంతోనూ, బాల్యం మూలంగానూ, భవిష్యత్తులో జరుగవలసినదాని కొరకు గానీ, వివస్వంతుడి కొడుకయిన యముడు (మాయా)సంజ్ఞను కాలెత్తి (తన్నబోయినట్లు) బెదిరించాడు.

తం శశాప తతః క్రోధాత్ సావర్ణజననీ తదా ।
చరణః పతతా మేష త వేతి భృశదుఃఖితా ॥ 23 ॥

సావర్ణమనువుకు తల్లి అయిన ఆ(మాయా)సంజ్ఞ అప్పుడు చాలా దుఃఖిస్తూ, కోపంతో '(నన్ను తన్నబోయిన) నీకాలు పడిపోవు గాక' అని యముడిని శపించింది.

యమ స్తు తత్పితు స్సర్వం ప్రాఞ్జలిః ప్రత్యవేదయత్ ।
భృశం శాపభయోద్విగ్న స్సంజ్ఞావాక్యై ర్విశఙ్కితః ॥ 24 ॥

యముడు (మాయా)సంజ్ఞ ఇచ్చిన శాపానికి భయంతో కలవరపడి, ఆమె మాటలవల్ల ఎప్పుడు ఏమి జరగబోతున్నదో అనే సందేహంతో, ఆవృత్తాంతం అంతా తనతండ్రికి చేతులు జోడించి, వినయంగా విన్నవించాడు.

శాపోఽ యం వినివర్తేత ప్రోవాచ పితరం ద్విజాః ।
మాత్రా స్నేహేన సర్వేషు వర్తితవ్యం సుతేషు వై ॥ 25 ॥

ఓ విప్రులారా! యముడు తండ్రితో 'నాయీశాపం తొలగిపోవాలి' అన్నాడు. 'బిడ్డ లందరిపైనా, తల్లి (సమాన మైన) ప్రేమతో ప్రవర్తించాలి కదా.

సేయ మస్మా నపా స్యేహ వివస్వన్ సమ్యుభూషతి ।
తస్యాం మయోద్యతః పాదో న తు దేహే నిపాతితః ॥ 26 ॥

తండ్రీ, వివస్వంతా, ఈఅమ్మ మమ్మల్ని వదిలించుకుని, (మాపై ఏమాత్రం ప్రేమ లేకుండా) తాను మాత్రమే సుఖంగా ఉండా' లని కోరుకుంటున్నది. నేను ఆమెపైకి కాలు ఎత్తానే కాని, ఆమె ఒంటిమీద వేయలేదు.

బాల్యాద్ వా యది వా లౌల్యా న్మోహాత్తత్ క్షన్తుమర్హసి ।
శప్తోఽ హమస్మి లోకేశ జనన్యా తపతాం వర ।
తవ ప్రసాదా చ్చరణో న పతే న్మమ గోపతే ॥ 27 ॥

చిన్నతనం చేతనో, చపలత్వం చేతనో, అజ్ఞానం చేతనో నేను చేసిన ఈతప్పును క్షమించు. లోకనాథా! తపనా! గోపతీ! నాకు కాలు పడిపోకుండాలి.

వివస్వానువాచ :–వివస్వంతుడు ఇలా అన్నాడు.

అసంశయం పుత్ర మహ ద్భవిష్యత్యత్ర కారణమ్ ।
యేన త్వా మావిశత్ క్రోధో ధర్మజ్ఞం సత్యవాదినమ్ ॥ 28 ॥

కుమారా! ఇలా జరగడానికి ఏదో గొప్పకారణం ఉండిఉంటుంది. దానివలననే ధర్మం తెలిసినవాడివీ, సత్యమే పలికేవాడివీ అయిన నిన్ను కోపం ఆవేశించింది.

న శక్యమేతన్మిథ్యా తు కర్తుం మాతృవచస్తవ ।
కృమయో మాంసమాదాయ యాస్యన్త్యవనిమేవ చ ॥ 29 ॥

నీతల్లివచనం వ్యర్థం చేయటం సాధ్యం కాదు. పురుగులు నీకాలిమాంసాన్ని తిని మళ్లీ భూమిలోకి వెళ్లిపోతాయి.

కృత మేవం వచ స్తథ్యం మాతు స్తవ భవిష్యతి ।
శాపస్య పరిహారేణ త్వం చ త్రాతో భవిష్యసి ॥ 30 ॥

ఈవిధంగా (నీకు కాలు లేకుండా పోయి) నీతల్లిమాట నిజం అవుతుంది. అలా శాపం పూర్తి కాగానే నీవు కూడా రక్షింపబడతావు.

ఆదిత్య శ్చాబ్రవీత్ సంజ్ఞాం కిమర్థం తనయేషు వై ।
తుల్యేష్వభ్యధికస్స్నేహ ఏకస్మిన్ క్రియతే త్వయా ॥ 31 ॥

ఆతరువాత సూర్యుడు (మాయా)సంజ్ఞతో కొడుకులు అందరూ సమానం అయి ఉండగా, నీవు కొంతమంది మీద మాత్రమే ఎందుకు విశేషమైన ప్రేమను చూపుతున్నావు? అని అడిగాడు.

సా తత్పరిహరన్తీ తు నాచచక్షే వివస్వతే ।
స చాత్మానం సమాధాయ యోగా త్తథ్య మపశ్యత ॥ 32 ॥

ఆమాటలను తప్పించింది కానీ, ఆమె వివస్వంతుడికి సమాధానం చెప్పలేదు. సూర్యభగవానుడు ఏమీ మాట్లాడక, యోగదృష్టితో యథార్థం తెలుసుకున్నాడు.

తాం శప్తుకామో భగవా న్నాశపన్ మునిసత్తమాః ॥ 33 ॥

మునిశ్రేష్ఠులారా! సూర్యభగవానుడు (మాయా)సంజ్ఞను శపిద్దా మనుకున్నాడు. కాని శపించలేదు.

తత స్సర్వం యథావృత్త మాచచక్షే వివస్వతే ।
వివస్వానథ తచ్ఛృత్వా క్రుద్ధ స్త్వష్టారమభ్యగాత్ ॥ 34 ॥

అపుడు ఆ(మాయా)సంజ్ఞ జరిగినది మొత్తం వివస్వంతుడికి వివరించింది.(జుట్టు పట్టుకున్నా, శపించ బోయినా జరిగినది చెప్తానని ముందుగానే అసలు సంజ్ఞతో ఈమె చెప్పింది.(14 శ్లో) ఆవృత్తాంతం విని వివస్వంతుడు కోపించి, త్వష్ట (సంజ్ఞతండ్రి) వద్దకు వెళ్లాడు.

దృష్ట్వా తు తం యథాన్యాయ మర్చయిత్వా విభావసుమ్ ।
నిర్దగ్ధుకామం రోషేణ సాన్త్వయామాస వై తదా ॥ 35 ॥

త్వష్ట ఆ వివస్వంతుడిని చూచి, అతడిని సముచితంగా పూజించాడు. కోపంతో తనను దగ్ధం చేయాలను కుంటున్న అతడికోపం చల్లారేవిధంగా అనునయించాడు.

త్వష్టోవాచ :–త్వష్ట ఇలా అన్నాడు.

తవాతితేజసాఽఽవిష్ట మిదం రూపం న శోభతే ॥36 ॥

అత్యధికమైన తేజస్సుతో నిండిపోయిన నీ యీ రూపం శోభించడం లేదు.

అసహన్తీ చ సంజ్ఞా సా వనే చరతి శాద్వలే ।

ద్రష్టా హి తాం భవా నద్య స్వాం భార్యాం శుభచారిణీమ్ ।
శ్లాఘ్యాం యోగబలోపేతాం యోగమాస్థాయ గోపతే ॥ 37 ॥

ఆతేజస్సును సహించలేని సంజ్ఞ అరణ్యంలో పచ్చికలలో తిరుగుతున్నది. నీభార్య మంచినడవడి గలిగినది. స్తుతింపదగినది. యోగశక్తితో కూడినది. ఓ సహస్రకిరణా, నీవు కూడ యోగమార్గంలో నీభార్యను ఇపుడే వెళ్లిచూడు.

అనుకూలం తు తే దేవ యది స్యాన్మమ సమ్మతమ్ ।
రూపం నిర్వర్తయా మ్యద్య తవ కాన్త మరిందమ ॥ 38 ॥

దేవా! శత్రువులను అణచేవాడా! నామాట నీకు అంగీకారయోగ్యమూ, అనుకూలమూ అయితే, ఇపుడే నీ ఈ రూపాన్ని మార్చి, మనోహరంగా తయారు చేస్తాను అన్నాడు.

తతోఽ భ్యుపగమా త్తస్య మార్తణ్డస్య వివస్వతః ।
భ్రమి మారోప్య తత్తేజ శ్శాతయామాస వై తదా ॥ 39 ॥

వివస్వంతుడు అంగీకరించాడు. అపుడు త్వష్ట మార్తండుడిని తిరిగేయంత్రం (సానబట్టె యంత్రం) మీదికి ఎక్కించి, అతడితేజస్సును తగ్గించాడు (సానబట్టాడు).

తతో నిర్భాసితం రూపం తేజసా సంహతేన వై ।
కాన్తాత్ కాన్తతరం ద్రష్టు మధికం శుశుభే తదా ॥ 40 ॥

తన తేజస్సు సంక్షేపించటంచేత మిరుమిట్లు గొలిపే వివస్వంతుడిరూపం చూడడానికి అందమైనవాటి కన్నింటికంటె ఎంతో అందంగా ప్రకాశించింది.

దదర్శ యోగమాస్థాయ స్వాం భార్యాం బడబాం తతః ।
అధృష్యాం సర్వభూతానాం తేజసా నియమేన చ ॥ 41 ॥

అపుడు వివస్వంతుడు యోగాన్ని ఆశ్రయించి తనభార్య బడబ(రూపంలో ఉన్న అసలైనసంజ్ఞ)ను కనుగొన్నాడు. ఆమె తన(పతివ్రతా)తేజస్సుతోనూ, నియమాచరణంచేతనూ, సమస్తప్రాణులకూ సమీపించడానికి కూడా వీలుకానిది.

బడబా వపుషా విప్రా శ్చరన్తీ మకుతోభయామ్ ।
సోఽ శ్వరూపేణ భగవాం స్తాం ముఖే సమభావయత్ ॥42 ॥

ఓ బ్రాహ్మణులారా! బడబా(ఆడగుఱ్ఱం)శరీరంతో, నిర్భయంగా సంచరిస్తున్న భార్యను వివస్వంతుడు కూడ (మగ) గుఱ్ఱంరూపం ధరించి, ఆమె ముఖంలో సంభోగించాడు.

మైథునాయ విచేష్టన్తీం పరపుంసోఽ వశఙ్కయా ।
సా తన్నిరవమచ్ఛుక్రం నాసికాభ్యాం వివస్వతః ॥ 43 ॥

వివస్వంతుడి మైథునకర్మకు సంజ్ఞ నిశ్చేష్టురా లయింది. పరపురుషుడు (త్వష్టవలన వివస్వంతుడు అంద మైనరూపం పొందడంచేత సంజ్ఞ అతడు తనభర్త కాదనుకుంది) అనేసందేహంతో సంజ్ఞ వివస్వంతుడివీర్యాన్ని తన ముక్కురంధ్రాలనుండి వెలుపలికి నెట్టివేసింది.

దేవౌ తస్యా మజాయేతా మశ్వినౌ భిషజౌ వరౌ ।
నాసత్యశ్చైవ దస్రశ్చ స్మృతౌ ద్వావశ్వినా వితి ॥ 44 ॥

ఆ తేజస్సునుండి వైద్యశ్రేష్ఠులయిన అశ్వినీ కుమారులు జన్మించారు. వారు నాసత్యుడు, దస్రుడు అనేపేర్లు గలిగిన ఇద్దరు.

మార్తణ్డస్యాత్మజావేతా వష్టమస్య ప్రజాపతేః ।
తాం తు రూపేణ కాన్తేన దర్శయామాస భాస్కరః ॥ 45 ॥

వీళ్లు (సంజ్ఞకు జనించిన 1.వైవస్వతుడు,2.యముడు, 3.యమున, సవర్ణకు పుట్టినకొడుకులు. 1.సావర్ణి, 2.శనైశ్చరుడు, తరువాత సంజ్ఞకు మళ్లీ జన్మించినవారు 1. నాసత్యుడు, 2.దస్రుడు అనేఅశ్వినీదేవతలు ఇద్దరు.) ఎనిమిదవ ప్రజాపతి అయిన మార్తండునికుమారులు. (వివస్వతుడు ఎనిమిదవప్రజాపతి. వైవస్వతుడు ఏడవమనువు) భార్యను భాస్కరుడు మనోహరమైన రూపంతో చూశాడు.

సా తు దృష్ట్వైవ భర్తారం తుతోష మునిసత్తమాః ।
యమస్తు కర్మణా తేన భృశం పీడితమానసః ॥ 46 ॥

మునిశ్రేష్ఠులారా! ఆ సంజ్ఞాదేవి కూడ (అందంగా ఉన్న) తనభర్తను చూచి (భర్తగా గ్రహించి), సంతోషించింది. యముడు మాత్రం తాను చేసినపాపపుపనికి (తల్లిని తన్నబోవడం) మనసులో బాధపడ్డాడు.

ధర్మేణ రఞ్జయామాస ధర్మరాజ ఇమాః ప్రజాః ।
స లేభే కర్మణా తేన శుభేన పరమద్యుతిః ॥ 47 ॥
పితౄణా మాధిపత్యం చ లోకపాలత్వ మేవ చ ।

ప్రజలను ధర్మంతో రంజింపజేసి ధర్మరాజు అయ్యాడు. తాను చేసిన ధర్మపాలనం, ప్రజారంజనం అనే మంచిపనులవలన మిక్కిలితేజస్వి అయిన యమధర్మరాజు పితరులపై ఆధిపత్యాన్నీ, లోకపాలకపదవినీ పొందాడు.

మనుః ప్రజాపతి స్త్వాసీత్ సావర్ణి స్స తపోధనాః ॥ 48 ॥

భావ్య స్సమాగతే తస్మిన్ మను స్సావర్ణికేఽ న్తరే ।
మేరుపృష్ఠే తపో నిత్యమద్యాపి స చరత్యుత ॥ 49 ॥

మహర్షులారా! ఆసావర్ణి (సవర్ణకు వివస్వంతుడివలన జన్మించినవాడు) రాబోయే సావర్ణిమన్వంతరంలో మనువు, ప్రజాపతీ అవుతాడు. ప్రస్తుతం సావర్ణి మేరుపర్వతశిఖరంమీద తపస్సు ఆచరిస్తున్నాడు.

భ్రాతా శనైశ్చర స్తస్య గ్రహత్వం స తు లబ్ధవాన్ ।

సావర్ణుడి తమ్ముడయిన శనైశ్చరుడు గ్రహస్థితిని పొందాడు.

త్వష్టా తు తేజసా తేన విష్ణో శ్చక్రమకల్పయత్ ।
తదప్రతిహతం యుద్ధే దానవాన్తచికీర్షయా ॥ 50 ॥

త్వష్ట వివస్వంతుడితేజస్సుతో (వివస్వంతుడి సానబెట్టినపుడు రాలిన ఆతడి అధికతేజస్సుతో) శ్రీమహావిష్ణువుకు చక్రాయుధాన్ని (సుదర్శనం) తయారుచేసియిచ్చాడు. యుద్ధంలో ఆచక్రం ఎదురులేనిది. దానవులను నిర్మూలనం చేయడంకోసం చక్రాన్ని త్వష్ట విష్ణుమూర్తికి ఇచ్చాడు.

యవీయసీ తు చాథాసీద్ యమీ కన్యా యశస్వినీ ।
అభవచ్చ సరిచ్ఛ్రేష్ఠా యమునా లోకభావినీ ॥ 51 ॥

సంజ్ఞబిడ్డలలో చిన్నదీ, యముడికి చెల్లెలూ, కీర్తిమతీ అయిన యమున నదులలో శ్రేష్ఠురాలు అయింది.

మనుశ్చేత్యుచ్యతే లోకే సావర్ణ ఇతిచోచ్యతే ॥ 52 ॥

సవర్ణకు జనించినవారిలో పెద్దవాడు లోకంలో మనువు అనీ, సావర్ణుడు (సావర్ణి) అనీ చెప్పబడుతున్నాడు.

ద్వితీయో యస్సుత స్తస్య మనో ర్భ్రాతా శనైశ్చరః ।
గ్రహత్వం స చ లేభే వై సర్వలోకాభిపూజితః ॥ 53 ॥

ఆ సావర్ణమనువుకు తమ్ముడు సవర్ణ రెండవకొడుకూ అయిన శనైశ్చరుడు (నవ)గ్రహాలలో చేరి, సమస్తలోకాలచేత పూజింప బడుతున్నాడు.

య ఇదం జన్మ దేవానాం శృణుయాద్ ధారయీత వా ।
ఆపదం ప్రాప్య ముచ్యేత ప్రాప్నుయాచ్చ మహద్యశః ॥ 54 ॥

దేవతలజన్మవృత్తాంతాన్ని విన్నవాడూ, మరుపు లేకుండా బుద్ధిలో నిలుపుకున్నవాడూ, (పూర్వపాపకర్మలవలన) కలిగిన బాధలనుండి బయటపడతాడు. మంచికీర్తిని కూడ పొందుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే ఆదిత్యోత్పత్తికథనం నామ చతుర్థోఽధ్యాయః ॥ 4 ॥

బ్రహ్మపురాణంలో ఆదిత్యోత్పతికథనం అనే నాల్గవ అధ్యాయం సంపూర్ణం.



పంచమోఽధ్యాయః - ఐదవ అధ్యాయం

సూర్యవంశనిరూపణమ్ - సూర్యవంశనిరూపణం

లోమహర్షణ ఉవాచ:- లోమహర్షణుడు మునులతో ఇలా చెప్తున్నాడు.

మనో ర్వైవస్వత స్యాసన్ పుత్రా వై నవ తత్సమాః ।
ఇక్ష్వాకుశ్చైవ నాభాగో ధృష్ట శ్శర్యాతిరేవ తు ॥ 1 ॥

నరిష్యన్తశ్చ షష్ఠో వై ప్రాంశూరిష్టశ్చ సప్తమః ।
కరూషశ్చ పృషధ్రశ్చ న వైతే మునిసత్తమాః ॥ 2 ॥

వైవస్వతమనువుకు తొమ్మిదిమంది కొడుకులు గలిగారు. అందరూ తండ్రి అంతటివారే. మునిశ్రేష్ఠులారా! ఆ తొమ్మండుగురు, ఇక్ష్వాకువు, నాభాగుడు, ధృష్టుడు, శర్యాతి, నరిష్యంతుడు, ప్రాంశువు (ఆరవవాడు), రిష్టుడు (ఏడవవాడు), కరూషుడు, పృషధ్రుడు అనేవారు. (శివ.ఉమా.36.అ)

అకరోత్ పుత్రకామ స్తు మను రిష్టిం ప్రజాపతిః ।
మిత్రావరుణయో ర్విప్రాః పూర్వమేవ మహామతిః ॥ 3 ॥

వీళ్లు పుట్టకపూర్వం వివేకవంతుడు, ప్రజాపతి అయిన వైవస్వతమనువు పుత్రులను కోరి, మిత్రావరుణదేవతల నుద్దేశించి ఒకానొకయజ్ఞం చేశాడు.

అనుత్పన్నేషు బహుషు పుత్రేష్వేతేషు భో ద్విజాః ।
తస్యాం చ వర్తమానాయా మిష్ట్యాం చ ద్విజసత్తమాః ॥ 4 ॥

మిత్రావరుణయో రంశే మను రాహుతి మాజుహోత్ ।

ఓ బ్రాహ్మణులారా! ఇంతమంది కొడుకులు కలగనిసమయంలో చేస్తున్న ఆ యజ్ఞంలో మిత్రావరుణులను ఉద్దేశించి, వైవస్వతమనువు అగ్నిలో ఆహుతులను చేశాడు.

తత్ర దివ్యామ్బరధరా దివ్యాభరణభూషితా ।
దివ్యసంహననా చైవ ఇలా జజ్ఞ ఇతి శ్రుతిః ॥ 5 ॥

ఆయజ్ఞగుండంలో దివ్యమైనవస్త్రాలూ, ఆభరణాలూ ధరించి, దివ్యమైనశరీరంతో ఇల జన్మించిందని వినికిడి.

తామిలేలేతి హోవాచ మను ర్దణ్డధర స్తదా ।
అనుగచ్ఛస్వ మాం భద్రే తమిలా ప్రత్యువాచ హ ॥ 6 ॥

ధర్మయుక్తమిదం వాక్యం పుత్రకామం ప్రజాపతిమ్ ॥7 ॥

అపుడు వైవస్వతమనువు దండం ధరించి, ఆమెతో ‘ఇలా, ఇలా, కల్యాణీ, నన్ను అనుసరించు’ అన్నాడు. పుత్రులు కావాలని కోరుకుంటున్న వైవస్వత ప్రజాపతితో ఇల ధర్మంతో కూడిన ఈమాటలు పలికింది.

ఇలోవాచ :-ఇల ఇలా పలికింది.

మిత్రావరుణయో రంశే జాతాస్మి వదతాం వర ।
తయో స్సకాశం యాస్యామి న మాం ధర్మహతాం కురు ॥ 8 ॥

నేర్పుగా మాటలాడుదానా! నేను మిత్రావరుణుల అంశలో పుట్టినదానిని. నేను వారివద్దకే వెళ్తాను. నన్ను (అక్కడికి వెళ్లకుండా ఆపి), ధర్మం తప్పినదానిని చేయవద్దు.

సైవ ముక్త్వా మనుం దేవం మిత్రావరుణయో రిలా ।
గత్వాఽన్తికం వరారోహా ప్రాఞ్జలి ర్వాక్యమబ్రవీత్ ॥ 9 ॥

వైవస్వతుడితో ఇలా చెప్పి, ఇలాదేవి మిత్రావరుణులదగ్గరకు వెళ్లి, వారికి చేతులు జోడించి, ఇలా అన్నది.

అంశేఽస్మిన్ యువయో ర్జాతా దేవౌ కిం కరవాణి వామ్ ।
మనునా చాహ ముక్తా వై అనుగచ్ఛస్వ మామితి ॥ 10 ॥

మిత్రావరుణదేవతలారా! నేను మీయిరువురి అంశతో జన్మించాను. మీకోసం నేను ఏం చేయాలి? వైవస్వతమనువు నన్ను తనవెంట ర మ్మంటున్నాడు.

తాం తథా వాదినీం సాధ్వీ మిలాం ధర్మపరాయణామ్ ।
మిత్రశ్చ వరుణశ్చోభావూచతుస్తు ద్విజోత్తమాః ॥ 11 ॥

బ్రాహ్మణశ్రేష్ఠులారా! సాధుస్వభావం కలిగి, ధర్మపరురాలై అలా పలికిన ఇలాదేవితో మిత్ర, వరుణదేవతలు ఇరువురూ ఈవిధంగా అన్నారు.

అనేన తవ ధర్మేణ ప్రశ్రయేణ దమేన చ ।
సత్యేన చైవ సుశ్రోణి ప్రీతౌ చ వరవర్ణిని ॥12 ॥

'సుందరీ, నీధర్మానికీ, వినయానికీ, ఇంద్రియనిగ్రహానికీ, సత్యదీక్షకూ, మాకు ఆనందం కలిగింది.

ఆవయో స్త్వం మహాభాగే ఖ్యాతిం కన్యేతి యాస్యసి ॥13 ॥

ఉత్తమురాలా! నీవు మాయిద్దరికూతురుగా ప్రసిద్ధిని పొందగలవు.

మనో ర్వంశకరః పుత్రస్త్వమేవ చ భవిష్యసి ।
సుద్యుమ్న ఇతి విఖ్యాత స్త్రిషు లోకేషు విశ్రుతః ॥ 14 ॥

వైవస్వతమనువుకు వంశం నిలబెట్టే పుత్రుడివి గూడ నీవే అవుతావు. సుద్యుమ్నుడు అని పేర్కొనబడుతూ, మూడు లోకాలలోనూ కీర్తిని పొందుతావు.

జగత్ప్రియో ధర్మశీలో మనో ర్వంశవివర్ధనః ।
నివృత్తా సా తు తచ్ఛ్రుత్వా గచ్ఛన్తీ పితురన్తికాత్ ॥15 ॥

ధర్మశీలుడివీ, లోకాలకన్నింటికీ ఇష్టమైనవాడివీ, వైవస్వతమనువువంశాన్ని వృద్ధి చేసేవాడివీ అవుతావు'. మిత్రావరుణదేవతల పలుకులు విని ఆమె తండ్రులవద్దనుంచి, (వైవస్వతమనువు వద్దకు) వెనుదిరిగింది.

బుధే నాన్తర మాసాద్య మైథునా యోపమన్త్రితా ।
సోమపుత్రాద్ బుధాద్ విప్రా స్తస్యాం జజ్ఞే పురూరవాః ॥ 16 ॥

అలా తిరిగి వెళ్లేసమయంలో దారిలో బుధుడు ఆమెను చూచి కామించాడు. సంభోగానికి ఆమెను ఆహ్వానించాడు. బ్రాహ్మణులారా! చంద్రకుమారుడైన బుధుడివలన ఆమెకు పురూరవుడు అనే కొడుకు కలిగాడు.

జనయిత్వా తత స్సా తమిలా సుద్యుమ్నతాం గతా ।
సుద్యుమ్నస్య తు దాయాదా స్త్రయః పరమధార్మికాః ॥ 17 ॥

పురూరవుడిని ప్రసవించిన తరువాత ఇల సుద్యుమ్నుడుగా మగవాడుగా మారిపోయింది. సుద్యుమ్నుడికి ముగ్గురు కొడుకులు. వారు ధార్మికోత్తములు.

ఉత్కలశ్చ గయశ్చైవ వినతాశ్వశ్చ భో ద్విజాః ।
ఉత్కల స్యోత్కలా విప్రా వినతాశ్వస్య పశ్చిమా ।
దిక్పూర్వా మునిశార్దూలా గయస్య తు గయా స్మృతా ॥ 18 ॥

ఓ బ్రాహ్మణులారా! మునిసత్తములారా! వారు ఉత్కలుడు, గయుడు, వినతాశ్వుడు అనేవారు. ఉత్కలుడికి ఉత్కలదేశాన్నీ వినతాశ్వుడికి పడమటిదిక్కునూ, గయుడికి తూర్పుదిక్కునూ పరిపాలించుటకు ఇచ్చారు. గయుడిపేరుమీదుగా గయానగరం ఏర్పడింది.

ప్రవిష్టే తు మనౌ విప్రా దివాకర మరిన్దమమ్ ।
దశధా తత్పునః క్షత్ర మకరోత్ పృథివీ మిమామ్ ॥ 19 ॥

మనువు శత్రువులను అణచివేసే సూర్యలోకంలో ప్రవేశించిన తరువాత, అతడితనయులు క్షత్రియులై, ఈభూమిని పది భాగాలు చేశారు.

ఇక్ష్వాకు ర్జ్యేష్ఠదాయాదో మధ్యదేశ మవాప్తవాన్ ।
కన్యాభావా త్తు సుద్యుమ్నో నైతద్ రాజ్య మవాప్తవాన్ ॥ 20 ॥

జ్యేష్ఠభాగస్థుడయిన ఇక్ష్వాకువు మధ్యదేశాన్ని పొందాడు. స్త్రీ (ఇల) లక్షణాలు కలిగిన సుద్యుమ్నుడు రాజ్యభాగం లభించలేదు.

వసిష్ఠవచనాత్త్వాసీత్ ప్రతిష్ఠానే మహాత్మనః ।
ప్రతిష్ఠా ధర్మరాజస్య సుద్యుమ్నస్య ద్విజోత్తమాః ॥ 21 ॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! ధర్మాన్ని చక్కగా రక్షించే మహాత్ముడయిన సుద్యుమ్నుడు వసిష్ఠుడిమాటప్రకారం ప్రతిష్ఠాననగరంలో సుప్రతిష్ఠితుడయినాడు.

(సుద్యుమ్నః కారయామాస ప్రతిష్ఠానే నృపక్రియామ్ ।
ధృష్ణక శ్చామ్బరీషశ్చ దణ్డకశ్చేతి తే సమాః ॥
య శ్చకార మహాత్మా వై దణ్డకారణ్యముత్తమమ్ ।
యత్ర ప్రవిష్టమాత్రస్తు నరః పాపాత్ ప్రముచ్యతే ॥
సుద్యుమ్నశ్చ దివం యాత ఐల ముత్పాద్య భో ద్విజాః ॥)

సుద్యుమ్నుడు ప్రతిష్ఠాననగరంలోనే రాజధర్మాన్ని ఆచరించాడు. ధృష్ణకుడు, అంబరీషుడు, దండకుడు అనేవారు సమానభాగాన్ని పొందారు. మహాత్ము డైన దండకుడు తన పురూరవుడు పేరుమీదుగా దండకారణ్యాన్ని ఏర్పరిచాడు. ఆ దండకారణ్యంలో ప్రవేశించినంత మాత్రంచేతనే మానవుడికి సమస్తమైన పాపాలు నశించిపోతాయి. ఐలుడు (ఇల కుమారుడు. సుద్యుమ్నుడు మొదట ఇల అనేస్త్రీ) అనేతనయుడు పురూరవుడు పుట్టినతరువాత సుద్యుమ్నుడు స్వర్గస్థు డయినాడు.)

తత్పురూరవసే ప్రాదాద్ రాజ్యం ప్రాప్య మహాయశాః ॥ 22 ॥

గొప్పకీర్తిమంతుడయిన సుద్యుమ్నుడు ఆ ప్రతిష్ఠానరాజ్యాన్ని పురూరవుడికి ఇచ్చాడు.

మానవేయో మునిశ్రేష్ఠాః స్త్రీపుంసో ర్లక్షణై ర్యుతః ।
ధృతవాం స్తామిలే త్యేవం సుద్యుమ్నేతి చ విశ్రుతః ॥ 23 ॥

మునిసత్తములారా! మనుతనయుడయిన సుద్యుమ్నుడు స్త్రీలక్షణాలు, పురుషలక్షణాలు రెండూ కలిసి ఉన్నవాడు. అందువల్ల అతడిని ఇల అనీ, సుద్యుమ్నుడు అనీ రెండు విధాలుగాను పేరుపడ్డాడు. అటువంటి సుద్యుమ్నుడు రాజ్యభారాన్ని వహించాడు.

(వైవస్వతమనువు కొడుకులయిన నరిష్యంతాదుల(శ్లో. 1.2)సంతానాన్ని గురించి చెప్తున్నాడు.)

నారిష్యన్తా శ్శకాః పుత్రా నాభాగస్య తు భో ద్విజాః ।
అమ్బరీషోఽ భవత్ పుత్రః పార్థివర్షభసత్తమః ॥ 24 ॥

ద్విజులారా! నరిష్యంతుడికొడుకులు (నారిష్యంతులు) శకులు. పృథివీపతులలో ఉత్తము డయిన అంబరీషుడు నాభాగుడికి పుత్రు డయినాడు.

ధృష్టస్య ధార్ష్టకం క్షత్రం రణే దృప్తం బభూవ హ ।
కరూషస్య చ కారూషాః క్షత్రియా యుద్ధదుర్మదాః ॥ 25 ॥

ధృష్టుడిపుత్రులు ధార్ష్టకులు. వీళ్లు క్షత్రియులు. యుద్ధంలో బలగర్వంతో ఉంటారు. కరూషుడికొడుకులు కారూషులు. వీరూ క్షత్రియులే. యుద్ధంలో ఎదురులేనివీరులు.

నాభాగధృష్టపుత్రాశ్చ క్షత్రియా వైశ్యతాం గతాః ।
ప్రాంశో రేకోఽ భవత్ పుత్రః ప్రజాపతి రితి స్మృతః ॥ 26 ॥

క్షత్రియు లయిన నాభాగుడికొడుకులు, ధృష్టుడికొడుకులు తరువాత వైశ్యజాతివారు అయినారు. ప్రాంశువుకు ప్రజాపతి అనేవాడు ఒక్కడే కొడుకు.

నరిష్యన్తస్య దాయాదో రాజా దణ్డధరో యమః ।
శర్యాతే ర్మిథునం త్వాసీ దానర్తో నామ విశ్రుతః ॥ 27 ॥

పుత్రః కన్యా సుకన్యా చ యా పత్నీ చ్యవనస్య హ ।
ఆనర్తస్య తు దాయాదో రైవో నామ మహాద్యుతిః ॥ 28 ॥

నరిష్యంతుడి కొడుకు దండధరుడైన యముడు రాజు అయినాడు. శర్యాతికి ఇద్దరు బిడ్డలు. వారిలో ఆనర్తుడు అనేకొడుకు ప్రసిద్ధుడు. కూతురు సుకన్య. ఈమె చ్యవనమహర్షికి భార్య. ఆనర్తుడికొడుకు రైవుడు. ఇతడు గొప్పకాంతిమంతుడు.

ఆనర్తవిషయ శ్చైవ పురీ చాస్య కుశస్థలీ ।
రైవస్య రైవతః పుత్రః కకుద్మీ నామ ధార్మికః ॥ 29 ॥

ఆనర్తుడు పరిపాలించినదేశం ఆనర్తదేశం. దానికి రాజధాని కుశస్థలి అనేనగరం. (ఆనర్తుడికొడుకయిన) రైవుడికొడుకు రైవతుడు. ఇతడినే కకుద్మి అని కూడా పేర్కొంటారు. ఇతడు ధార్మికుడు.

జ్యేష్ఠః పుత్ర స్స తస్యాసీ ద్రాజ్యం ప్రాప్య కుశస్థలీమ్ ।
స కన్యాసహిత శ్శృత్వా గాన్ధర్వం బ్రహ్మణోఽన్తికే ॥ 30 ॥

ముహూర్తభూతం దేవస్య తస్థౌ బహుయుగం ద్విజాః ।
ఆజగామ తు చై వాథ స్వాం పురీం యాదవై ర్వృతామ్ ॥ 31 ॥

ఆనర్తుడికి రైవతుడు పెద్దకొడుకు. ఇతడు కుశస్థలీరాజ్యానికి రాజు అయినాడు. అతడు తనకన్యతో వెళ్లి, బ్రహ్మదేవుడిసమీపంలో ఒకముహూర్తకాలం సంగీతం వింటూ అక్కడే ఉన్నాడు. బ్రహ్మదేవుడికి ఒక్కముహూర్తం అయిన ఆసమయంలో ఇక్కడ భూలోకంలో ఎన్నో యుగాలు గడిచిపోయాయి. ఆతరువాత రైవతుడు తనరాజధానికి తిరిగి వచ్చాడు. ఆసమయంలో రైవతుడిరాజధాని అంతటా యాదవులు ఆక్రమించుకుని ఉన్నారు.

కృతాం ద్వారవతీ నామ్నా బహుద్వారాం మనోరమామ్ ।
భోజవృష్ణ్యన్ధకై ర్గుప్తాం వాసుదేవపురోగమైః ॥ 32 ॥

ఆనగరం ద్వారవతి అనేపేరుతో, మనస్సును రంజింపజేసే అనేక మయినద్వారాలతో నిర్మింపబడింది. వాసుదేవుడు మొదలుగా, భోజ, వృష్ణి, అంధక వంశాలవారిచేత పాలింపబడుతున్నది.

తత స్తద్ రైవతో జ్ఞాత్వా యథాతత్త్వం ద్విజోత్తమాః ।
కన్యాం తాం బలదేవాయ సువ్రతాం నామ రేవతీమ్ ॥ 33 ॥

దత్త్వా జగామ శిఖరం మేరో స్తపసి సంస్థితః ।
రేమే రామోఽపి ధర్మాత్మా రేవత్యా సహిత స్సుఖీ ॥ 34 ॥

బ్రాహ్మణోత్తములారా! రైవతుడు ఆవృత్తాంతం అంతా సమగ్రంగా తెలుసుకున్నాడు. గొప్పనియమవతి అయిన తనకూతురు రేవతి అనేకన్యను బలదేవుడికి (భార్యగా) దానం చేసి, మేరుపర్వతశిఖరం పైకి వెళ్లాడు. అక్కడ తపస్సుకు కూచున్నాడు. ధర్మబుద్ధి అయినబలరాముడు కూడ, రేవతితో కలిసి సుఖంగా ఉంటున్నాడు.

మునయ ఊచుః :– అపుడు మునులు లోమహర్షణుడితో ఇలా అన్నారు.

కథం బహుయుగే కాలే సమతీతే మహామతే ।
న జరా రేవతీం ప్రాప్తా రైవతం వా కకుద్మినమ్ ॥ 35 ॥

బుద్ధిమంతుడా, లోమహర్షణమహర్షీ, ఎన్నోయుగాలు గడిచిపోయినా, రేవతికి గాని, కకుద్మి అనబడే రైవతుడికి గాని, ముసలితనం ఎందుకు రాలేదు.

మేరుం గతస్య వా తస్య శర్యాతే స్సంతతిః కథమ్ ।
స్థితా పృథివ్యామద్యాపి శ్రోతుమిచ్ఛామ తత్త్వతః ॥ 36 ॥

మేరుపర్వతంమీదికి వెళ్లిన శర్యాతిసంతానం ఇప్పటికీ, భూమిమీద ఎలా ఉన్నది? సమగ్రంగా తెలుసుకో గోరుతున్నాం.

లోమహర్షణ ఉవాచ: – లోమహర్షణుడు మునులకు ఇలా చెప్తున్నాడు.

న జరా క్షుత్పిపాసా వా న మృత్యు ర్మునిసత్తమాః ।
ఋతుచక్రం ప్రభవతి బ్రహ్మలోకే సదాఽనఘాః ॥ 37 ॥

మునివరేణ్యులారా! పాపరహితులారా! బ్రహ్మలోకంలో ఎప్పుడూ ముసలితనం గాని, ఆకలిదప్పులు గానీ, చావు గానీ, ఋతువులు వస్తూ పోతూ ఉండటం గానీ, ఏవీ ఉండవు.

కకుద్మిన స్స్వర్లోకం తు రైవతస్య గతస్య హ ।
హృతా పుణ్యజనై ర్విప్రా రాక్షసై స్సా కుశస్థలీ ॥ 38 ॥

ఓ విప్రులారా! రైవతు డయిన కకుద్మి స్వర్గలోకం వెళ్లినసమయంలో ఆతడి రాజధాని కుశస్థలినగరాన్ని పుణ్యజనులు అయిన రాక్షసులు ఆక్రమించుకున్నారు. అక్కడి బ్రాహ్మణులను సంహరించారు.

తస్య భ్రాతృశతం త్వాసీ ద్ధార్మికస్య మహాత్మనః ।
తద్వధ్యమానం రక్షోభి ర్దిశః ప్రాక్రమదప్యుత ॥ 39 ॥

ధార్మికుడూ, మహాత్ముడూ అయిన కకుద్మికి వందమంది సోదరులు ఉన్నారు. తమను చంపటానికి రాక్షసులు వెంటబడగా, వారు చెల్లాచెదరై, తలకొకదిక్కుగా పారిపోయారు.

విద్రుతస్య చ విప్రేన్ద్రా స్తస్య భ్రాతృశతస్య వై ।
అన్వవాయ స్తు సుమహాం స్తత్ర తత్ర ద్విజోత్తమాః ॥ 40 ॥

బ్రాహ్మణోత్తములారా! అలా పారిపోయిన కకుద్మి సోదరులు వందమందికి సంబంధించిన వంశం చాలా విస్తరించి, ఆయాప్రాంతాలలో నిండింది.

తేషామేతే మునిశ్రేష్ఠా శ్శర్యాతా ఇతి విశ్రుతాః ।
(క్షత్రియా గుణసమ్పన్నా, దిక్షు సర్వాసు విశ్రుతాః)
సర్వశ స్సర్వగహనం, ప్రవిష్టా స్తే మహౌజసః ॥ 41 ॥

మునివరులారా! కకుద్మిసోదరులు వందమందికి కలిగినసంతానం శర్యాతులు అనేపేరుతో బాగా ప్రసిద్ధ మయినారు. (శర్యాతులు క్షత్రియులు. ఉత్తమగుణసంపద గలిగినవారు. అన్నిదిక్కులలోనూ కీర్తింపబడ్డారు.) తేజస్వులయిన వారందరూ దట్టమైన అడవులలో, అన్నిచోట్లా నెలకొన్నారు.

నాభాగరిష్టపుత్రౌ ద్వౌ వైశ్యౌ బ్రాహ్మణతాం గతౌ ।
కరూషస్య తు కారూషాః క్షత్రియా యుద్ధదుర్మదాః ॥ 42 ॥

నాభాగుడు, రిష్టుడు అనే వైవస్వతకుమారుల కుమారులు ఇద్దరు. వారు వైశ్యులు. తర్వాత బ్రాహ్మణత్వాన్ని పొందారు. కరూషుడికొడుకులు కారూషులు. వీరు క్షత్రియులు. యుద్ధంలో ఎదురులేనివీరులు. (శ్లో. 25)

పృషధ్రో హింసయిత్వా తు గురో ర్గాం ద్విజసత్తమాః ।
శాపా చ్ఛూద్రత్వ మాపన్నో నవైతే పరికీర్తితాః ।

వైవస్వతస్య తనయా మనో ర్వై మునిసత్తమాః ॥ 43 ॥

ఓ బ్రాహ్మణోత్తములారా! పృషధ్రుడు గురువుగారి గోవును హింసించి, వారిశాపంతో శూద్రత్వాన్ని పొందారు. మునిశ్రేష్ఠులారా! ఈవిధంగా వైవస్వతుడి కుమారులు తొమ్మిదిమందియొక్క సంతానం విస్తరించింది.

క్షువత స్తు మనో ర్విప్రా ఇక్ష్వాకురభవత్ సుతః ।
తస్య పుత్రశతం త్వాసీ దిక్ష్వాకో ర్భూరిదక్షిణమ్ ॥ 44 ॥

బ్రాహ్మణులారా! వైవస్వతమనువు తుమ్ముతుండగా, ఆతనితుమ్మునుండి ఇక్ష్వాకువు పుట్టాడు. ఆ ఇక్ష్వాకువుకు నూరుమంది కొడుకులు గలిగారు. వీరు అత్యధికమైన దక్షిణలు ఇచ్చి యజ్ఞాదులు చేసేవారు. (శివ.ఉమా. 37.అ)

తేషాం వికుక్షి ర్జ్యేష్ఠ స్తు విక్రమేణ సమన్వితః ।
ప్రాప్తః పరమధర్మజ్ఞ స్సోఽ యోధ్యాధిపతిః ప్రభుః ॥ 45 ॥

వారిలో వికుక్షి అనేవాడు జ్యేష్ఠుడు. ఇతడు మిక్కిలిపరాక్రమవంతుడు. ఉత్తమధర్మాలు తెలిసినవాడు (ధర్మం తెలిసినవారిలో ఉత్తముడు.) ఇతడు అయోధ్యకు రాజు అయినాడు.

శకునిప్రముఖా స్తస్య పుత్రాః పఞ్చశతం స్మృతాః ।
ఉత్తరాపథదేశస్య రక్షితారో మహాబలాః ॥ 46 ॥

చత్వారింశద్దశాష్టౌ చ దక్షిణస్యాం తథా దిశి ।
శశాద ప్రముఖా శ్చాన్యే రక్షితారో ద్విజోత్తమాః ॥ 47 ॥

వికుక్షికి శకుని మొదలయినకొడుకులు ఐదువందలమంది కలిగారు. వారిలో మహాబలవంతులైన నలభైమంది ఉత్తరాపథదేశాన్ని పరిపాలించారు. ద్విజశ్రేష్ఠులారా! శశాదుడు మొదలైన ఇతరులు పద్దెనిమిదిమంది దక్షిణాపథదేశాన్ని పాలించారు.

ఇక్ష్వాకు స్తు వికుక్షిం వై అష్టకాయామథాదిశత్ ।
మాంస మానయ శ్రాద్ధార్థం శశాన్ హత్వా మహాబల ॥ 48 ॥

ఇక్ష్వాకువు అష్టకం అనేశ్రాద్ధంలో వికుక్షిని 'మహాబలవంతుడా, అష్టకశ్రాద్ధం పెట్టడానికి కుందేళ్లను చంపి, వాటిమాంసం పట్టుకునిరా', అని ఆజ్ఞాపించాడు.

శ్రాద్ధకర్మణి చోద్దిష్ట అకృతే శ్రాద్ధకర్మణి ।
భక్షయిత్వా శశం విప్రా శ్శశాదో మృగయాం గతః ॥ 49 ॥

శ్రాద్ధకర్మలో వినియోగించడానికి ఉద్దేశించిన కుందేలు మాంసాన్ని, శ్రాద్ధకర్మ చేయకముందే వికుక్షి తినేశాడు. (శశాన్ని అంటే కుందేటిని తిన్నాడు కాబట్టి వికుక్షికి నాటినుంచి శశాదుడు అనేపేరు వచ్చింది.)

ఇక్ష్వాకుణా పరిత్యక్తో వసిష్ఠవచనాత్ ప్రభుః ॥ 50 ॥

వసిష్ఠుడి ఆదేశాన్ని అనుసరించి ఇక్ష్వాకుమహారాజు వికుక్షిని (బహిష్కరించాడు) విడిచిపెట్టాడు.

ఇక్ష్వాకౌ సంస్థితే విప్రా శ్శశాద స్తు నృపోఽభవత్ ।
శశాదస్య తు దాయాదః, కకుత్స్థో నామ వీర్యవాన్ ॥ 51 ॥

విప్రులారా! ఇక్ష్వాకువు మరణించిన తరువాత శశాదుడు రాజు అయినాడు. శశాదుడికొడుకు కకుత్స్థుడు. ఇతడు గొప్పబలవంతుడు.

అనేనా స్తు కకుత్స్థస్య పృథు శ్చానేనస స్స్మృతః ।
విరాశ్వ స్తు పృథోః పుత్ర స్తస్మాదార్ద్రస్త్వజాయత ॥ 52 ॥

కకుత్స్థునితనయుడు అనేనుడు (పాపరహితుడు). అనేనుడికుమారుడు పృథువు. పృథువుకు విరాశ్వుడు జనించాడు. విరాశ్వుడికి ఆర్ద్రుడు పుట్టాడు.

ఆర్ద్రస్య యువనాశ్వస్తు శ్రావస్త స్తత్సుతో ద్విజాః ।
జజ్ఞే శ్రావస్తకో రాజా శ్రావస్తీ యేన నిర్మితా ॥ 53 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆర్ద్రుడికి యువనాశ్వుడు జనించాడు. యువనాశ్వుడితనయుడు శ్రావుడు. శ్రావుడికొడుకు శ్రావస్తుడు. ఇతడే శ్రావస్తి నగరాన్ని నిర్మించాడు.

శ్రావస్తస్య తు దాయాదో బృహదశ్వో మహీపతేః ।
కువలాశ్వ స్సుత స్తస్య రాజా పరమధార్మికః ॥ 54 ॥

శ్రావస్తమహారాజు కొడుకు బృహదశ్వుడు. ఆ బృహదశ్వుడికి కువలాశ్వుడు అనేరాజు జన్మించాడు. ఇతడు ధార్మికులలో ఉత్తముడు.

య స్స ధున్ధువధా ద్రాజా ధున్ధుమారత్వ మాగతః ॥ 55 ॥

ఆకువలాశ్వుడే ధుంధువు అనేరాక్షసుడిని సంహరించి, ధుంధుమారుడు అని పేరుగాంచాడు.

మునయ ఊచుః :–మునులు ఇలా పలికారు.

ధున్ధో ర్వధం మహాప్రాజ్ఞ శ్రోతు మిచ్ఛామ తత్త్వతః ।
యథా స కువలాశ్వోஉపి ధున్ధుమారత్వ మాగతః ॥ 56 ॥

ఉత్తమజ్ఞానీ, (లోమహర్షణా,) కువలాశ్వుడు ధుంధుమారుడు కావడానికి కారణమయిన ధుంధువధ వృత్తాంతం సమగ్రంగా తెలుసుకోగోరుతున్నాము.

లోమహర్షణ ఉవాచ:– లోమహర్షణుడు మునులకు ఈవిధంగా చెప్తున్నాడు.

కువలాశ్వస్య పుత్రాణాం శతముత్తమధన్వినామ్ ।
సర్వే విద్యాసు నిష్ణాతా బలవన్తో దురాసదాః ॥ 57 ॥

కువలాశ్వుడికి తనయులు నూరుగురు. వారు అందరూ ధనుర్విద్యాపారగులు. అన్ని విద్యలలోనూ నేర్పరులు. శక్తిమంతులు. శత్రువులు ఎదిరించలేనివారు.

బభూవు ర్ధార్మికా స్సర్వే యజ్వానో భూరిదక్షిణాః ।
కువలాశ్వం సుతం రాజ్యే బృహదశ్వోஉభ్యషేచయత్ ॥58 ॥

వారు అందరూ ధర్మపరులు. యజ్ఞాలు చేసినవారు. ఆయజ్ఞాలలో గొప్పదక్షిణలు ఇచ్చినవారు. బృహదశ్వుడు తనకొడుకయిన కువలాశ్వుడికి రాజ్యాభిషేకం చేశాడు.

పుత్రసంక్రామితశ్రీ స్తు వనం రాజా వివేశ సః ।
తముత్తఙ్కోஉథ విప్రర్షిః ప్రయాన్తం ప్రత్యవారయత్ ॥ 59 ॥

తనసంపదలు అన్నీ కొడుకుకు అప్పగించి, బృహదశ్వమహారాజు వానప్రస్థానికి సిద్ధ మయినాడు. అరణ్యాలకు వెళ్లబోతున్న మహారాజును ఉత్తంకుడు అనే బ్రహ్మర్షి వారించాడు.

ఉత్తఙ్క ఉవాచ :-బృహదశ్వుడితో ఉత్తంకుడు ఇలా అంటున్నాడు.

భవతా రక్షణం కార్యం తచ్చ కర్తుమిహార్హసి ।
నిరుద్విగ్న స్తపశ్చర్తుం న హి శక్నోమి పార్థివ ॥ 60 ॥

మహారాజా! నీవు చేయవలసినది ప్రజారక్షణం. ఆపని చేయడానికి తగినవాడవు నీవే. నేను (ఆందోళన లేకుండా) ప్రశాంతంగా, తపస్సు చేసుకోలేకపోతున్నాను.

మమాశ్రమసమీపే వై సమేషు మరుధన్వసు ।
సముద్రో వాలుకాపూర్ణ ఉద్దాలక ఇతి స్మృతః ॥ 61 ॥

నాఆశ్రమానికి దగ్గరలో మరుధన్వలు అనే చదునయినప్రదేశాలు ఉన్నాయి. అక్కడ సముద్రం ఇసుకతిన్నెలతో నిండి, ఉద్దాలకం అని వ్యవహరింపబడుతున్నది.

దేవతానామవధ్యశ్చ మహాకాయో మహాబలః ।
అన్తర్భూమిగత స్తత్ర వాలుకాన్తర్హితో మహాన్ ॥ 62 ॥

రాక్షసస్య మధోః పుత్రో ధున్ధుర్నామ మహాసురః ।
శేతే లోకవినాశాయ తప ఆస్థాయ దారుణమ్ ॥ 63 ॥

ఆప్రదేశంలో ఇసుకతిన్నెలలోపల ఒకడు నిద్రపోతూఉన్నాడు. అతడిని దేవతలు కూడ చంపలేరు. పెద్దశరీరం కలిగినవాడు. గొప్పబలవంతుడు. అతడు మధువు అనేరాక్షసుడికొడుకు. పేరు ధుంధువు. గొప్పరాక్షసుడు. లోకాలను నాశనం చేయాలనే కోరికతో భయంకరమైన తపస్సు చేస్తూ ఉన్నాడు.

సంవత్సరస్య పర్యన్తే స నిఃశ్వాసం విముఞ్చతి ।
తదా తదా మహీ తత్ర చలతి స్మ నరాధిప ॥ 64 ॥

మహారాజా! వాడు సంవత్సరాని కొకసారి నిట్టూర్పు విడుస్తాడు. ఆసమయంలో (వాడినిట్టూర్పుగాడ్పు వేగానికి) భూమి కంపిస్తుంది.

తస్య నిఃశ్వాసవాతేన రజ ఉద్ధూయతే మహత్ ।
ఆదిత్యపథ మావృత్య సప్తాహం భూమికంపనమ్ ॥ 65 ॥

వాడి నిట్టూర్పుగాడ్పు వేగానికి అక్కడి ఇసుక పెద్దఎత్తున పైకి లేస్తుంది. ఆలేచిన ఇసుక ఏడురోజులపాటు సూర్యమండలం దాక ఆకాశమార్గం అంతా కప్పివేస్తుంది.

సవిస్ఫులిఙ్గం సాఙ్గారం సధూమ మతిదారుణమ్ ।
తేన తాత న శక్నోమి తస్మిన్ స్థాతుం స్వ ఆశ్రమే ॥ 66 ॥

మిణుగురులతోనూ, నిప్పుకణికలతోనూ, దట్టమైనపొగతోనూ, నిండి చాలా భయంకరంగా ఉంటుంది. తండ్రీ, దానిమూలంగా నేను నా ఆశ్రమంలో ఉండటానికి కూడ సాధ్యం కావటం లేదు.

తం మారయ మహాకాయం లోకానాం హితకామ్యయా ।
లోకా స్స్వస్థా భవన్త్వద్య తస్మిన్ వినిహతే త్వయా ॥ 67 ॥

పెద్దశరీరంతో ఉన్న ఆధుంధువును చంపు. దీనివల్ల నాకే కాదు, లోకాలకు అన్నిటికీ మేలు జరుగుతుంది. నీవు ఆరాక్షసుడిని చంపితే, లోకాలు సుఖంగా ఉంటాయి.

త్వం హి తస్య వధాయైక స్సమర్థః పృథివీపతే ।
విష్ణునా చ వరో దత్తో మహ్యం పూర్వయుగే నృప ॥ 68 ॥

మహారాజా, వాడినిచంపడానికి నీవు ఒక్కడివి మాత్రమే సమర్థుడివి. రాజా! పూర్వయుగంలో విష్ణువు నాకు వరం ఇచ్చాడు.

య స్తం మహాసురం రౌద్రం హనిష్యతి మహాబలమ్ ।
తస్య త్వం వరదానేన తేజ శ్చాప్యాయయిష్యసి ॥ 69 ॥

భయంకరుడూ, మహాబలవంతుడూ, అయిన ఆమహారాక్షసుడిని చంపేవాడికి నీవు వరా లిచ్చి, ఆతని తేజస్సు వృద్ధి చేయగలవు. (అని విష్ణువు నాకు వరం ఇచ్చాడు. ఆవరప్రభావంచేత నీవు మాత్రమే ఆరాక్షసుడిని చంపగలుగుతావు.

న హి ధున్ధు ర్మహాతేజా స్తేజసాఽల్పేన శక్యతే ।
నిర్దగ్ధుం పృథివీపాల చిరం యుగశతై రపి ॥ 70 ॥

రాజా, గొప్పపరాక్రమవంతు డయిన ఆధుంధువును సామాన్య మైనబలంతో చంపడం నూరు యుగాలు గడిచినా, ఎంతకాలానికీ సాధ్యం కాదు.

వీర్యం చ సుమహ త్తస్య దేవై రపి దురాసదమ్ ।
స ఏవముక్తో రాజర్షి రుత్తఙ్కేన మహాత్మనా ।
కువలాశ్వం సుతం ప్రాదా త్తస్మై ధున్ధునిబర్హణే ॥ 71 ॥

ఆధుంధుడి బలం చాలా గొప్పది. దేవతలు కూడ గెలవలేరు. మహాత్ముడయిన ఉత్తంకుడు ఈవిధంగా చెప్పగా, రాజర్షి అయిన బృహదశ్వుడు ధుంధువును సంహరించడంకోసం, తన కొడుకు కువలాశ్వుడిని ఉత్తంకుడికి సమర్పించాడు.

బృహదశ్వ ఉవాచ:-బృహదశ్వుడు ఉత్తంకుడితో ఈవిధంగా అంటున్నాడు.

భగవన్ న్యస్తశస్త్రోఽహమయం తు తనయో మమ ।
భవిష్యతి ద్విజశ్రేష్ఠ ధున్ధుమారో న సంశయః ॥ 72 ॥

మహాత్మా! నేను ఆయుధం విడిచిపెట్టాను. ఇతడు నాపుత్రుడు. ధుంధువును సంహరిస్తాడు. సందేహం లేదు.

స తం వ్యాదిశ్య తనయం రాజర్షి ర్ధున్ధుమారణే ।
జగామ పర్వతా యైవ నృపతి శ్సంసితవ్రతః ॥ 73 ॥

అని పలికి, రాజర్షి అయినబృహదశ్వుడు ధుంధువును చంపమని కొడుకును ఆదేశించాడు. తరువాత బృహదశ్వమహారాజు తపోదీక్షతో పర్వతాలకు వెళ్లిపోయాడు.

లోమహర్షణ ఉవాచ:– లోమహర్షణుడు మునులతో ఈవిధంగా అంటున్నాడు.

కువలాశ్వ స్తు పుత్రాణాం శతేన సహ భో ద్విజాః ।
ప్రాయా దుత్తఙ్కసహితో ధున్ధో స్తస్య నిబర్హణే ॥ 74 ॥

ఓ బ్రాహ్మణులారా! ధుంధువును సంహరించడానికి కువలాశ్వుడు వందమందికొడుకులను తీసుకుని, ఉత్తంకుడితో బయలుదేరి వెళ్లాడు.

తమావిశత్ తదా విష్ణు స్తేజసా భగవాన్ ప్రభుః ।
ఉత్తఙ్కస్య నియోగాద్ వై లోకానాం హితకామ్యయా ॥ 75 ॥

ఉత్తంకుడికి ఇచ్చినవరాన్ని అనుసరించి, జగన్నాథు డయిన శ్రీమహావిష్ణుభగవానుడు లోకాలకు మేలు చేయాలనే సంకల్పంతో తనతేజస్సుతో ఆకువలాశ్వుడిని ఆవేశించాడు.

తస్మిన్ ప్రయాతే దుర్ధర్షే దివి శబ్దో మహా నభూత్ ।
ఏష శ్రీమా నవధ్యోఽ ద్య ధున్ధుమారో భవిష్యతి ॥ 76 ॥

ఎదురు లేని కువలాశ్వుడు ధుంధువును చంపడానికి బయలుదేరాడు. అప్పుడు ఆకాశంలో 'మహాత్ము డైన ఈకువలాశ్వుడు ఇపుడు ధుంధువును చంపుతాడు. అతడిని ఎవరూ వధించలేరు'. అనే పెద్దశబ్దం ఏర్పడింది.

దివ్యై ర్గన్ధైశ్చ మాల్యైశ్చ సమన్తాత్ సమవాకిరన్ ।
దేవదున్దుభయ శ్చైవ ప్రణేదు ర్హి తదా భృశమ్ ॥ 77 ॥

దేవలోకంలోనివారు ఆకువలాశ్వుడిమీద సుగంధద్రవ్యాలను, పూలమాలికలను, ఎడతెరిపి లేకుండా, చల్లారు. దేవదుందుభులు చాలగట్టిగా మ్రోగాయి.

స గత్వా జయతాం శ్రేష్ఠ స్తనయై స్సహ వీర్యవాన్ ।
సముద్రం ఖానయామాస వాలుకాన్తర మవ్యయమ్ ॥ 78 ॥

శక్తిమంతుడూ, ఉత్తమజయశీలుడూ అయిన కువలాశ్వుడు తనయులతో సహా వెళ్లి, పెద్దపెద్దఇసుకతిన్నెలతో నిండిఉన్న సముద్రాన్ని తవ్వించాడు.

తస్య పుత్రైః ఖనద్భిశ్చ వాలుకాన్తర్హిత స్తదా ।
ధున్ధురాసాదితో విప్రా దిశమావృత్య పశ్చిమామ్ ॥ 79 ॥

విప్రులారా! కువలాశ్వుడికొడుకులు ఇసుకతిన్నెలను తవ్వుతుండగా, ఆఇసుక కుప్పలలోపల దాగిఉన్న ధుంధువు బయటికి వచ్చాడు. ధుంధువు విల్లు ధరించి, పశ్చిమదిక్కు అంతటా ఆవరించి ఉన్నాడు.

ముఖజే నాగ్నినా క్రోధా ల్లోకా నుద్వర్తయన్నివ ।
వారి సుస్రావ వేగేన మహోదధిరివోదయే ॥ 80 ॥

సౌమస్య మునిశార్దూలా వరోర్మికలిలో మహాన్ ।
తస్య పుత్రశతం దగ్ధం త్రిభి రూనం తు రక్షసా ॥ 81 ॥

కోపంతో ఆధుంధువు ముఖంనుండి వెలువడుతున్న అగ్నిజ్వాలలు లోకా లన్నింటిని కమ్ముకున్నట్లుగా (దహించివేస్తున్నట్లు) ఉన్నాయి. చంద్రుడు ఉదయించేసమయంలో లాగా, బాగా ఎత్తుగా లేచిన అలలతో కూడి, ఆసముద్రంలో నీళ్లు మిక్కిలివేగంగా పైకి ఉబికాయి. మునిసత్తములారా! ధుంధురాక్షసుడు కువలాశ్వుడికొడుకులలో ముగ్గురు మినహా మిగిలినవారి నందరినీ, దహించివేశాడు.

తత స్స రాజా ద్యుతిమాన్ రాక్షసం తం మహాబలమ్ ।
ఆససాద మహాతేజా ధున్ధుం ధున్ధువినాశనః ॥ 82 ॥

అపుడు మిక్కిలి పరాక్రమవంతుడూ కాంతిమంతుడూ, ధుంధువును సంహరించగలిగినవాడూ అయిన కువలాశ్వమహారాజు బలవంతుడయిన ధుంధువుమీదికి వెళ్లాడు.

తస్య వారిమయం వేగ మాపీయ స నరాధిపః ।
యోగీ యోగేన వహ్నిం చ శమయామాస వారిణా ॥ 83 ॥

కువలాశ్వమహారాజు వేగంతో ఎగిసిపడుతున్న ఆ ధుంధురాక్షసుడి జలస్వరూపాన్ని త్రాగాడు. యోగి అయిన అతడు తనయోగశక్తితో ఆరాక్షసుడి ముఖంనుంచి వెలువడుతున్న అగ్నిజ్వాలలను ఆర్పివేశాడు.

నిహత్య తం మహాకాయం బలేనోదకరాక్షసమ్ ।
ఉత్తఙ్కం దర్శయామాస కృతకర్మా నరాధిపః ॥ 84 ॥

ఆరాజు మహాశరీరు డయిన ఆ ఉదకస్వరూపుడయిన రాక్షసుడిని సంహరించాడు. తాను చేయవలసినపని నెరవేర్చిన కువలాశ్వుడు ఉత్తంకుడికి తనను చూపించాడు.

ఉత్తఙ్క స్తు వరం ప్రాదా త్తస్మై రాజ్ఞే మహాత్మనే ।
దదౌ తస్యాక్షయం విత్తం శత్రుభి శ్చాపరాజయమ్ ॥ 85 ॥

మహాత్ముడయిన ఆ కువలాశ్వమహారాజుకు ఉత్తంకుడు నశించిపోని సంపదలనూ, శత్రువులపై నిరంతర జయమూ, వరంగా ఇచ్చాడు.

ధర్మే రతిం చ సతతం స్వర్గే వాసం తథాఽక్షయమ్ ।
పుత్రాణాం చాక్షయాన్ లోకాన్ స్వర్గే యే రక్షసా హతాః ॥ 86 ॥

ఆవిధంగానే నిరంతరం ధర్మం మీద ఆసక్తినీ, శాశ్వతంగా స్వర్గలోకంలో నివాసాన్నీ వరంగా ఇచ్చాడు. ధుంధురాక్షసుడిచేత చంపబడిన కువలాశ్వుడి పుత్రులకు అందరికీ కూడా స్వర్గంలో, శాశ్వతంగా ఉత్తమమైన ఊర్ధ్వలోకాల్లో నివాసాన్ని అనుగ్రహించాడు.

తస్య పుత్రా స్త్రయ శ్శిష్టా దృఢాశ్వో జ్యేష్ఠ ఉచ్యతే ।
చన్ద్రాశ్వకపిలాశ్వౌ తు కనీయాంసౌ కుమారకౌ ॥ 87 ॥

ధుంధువుచేతిలో మరణించగా, కువలాశ్వుడి కొడుకులలో మిగిలినవారు ముగ్గురిలో జ్యేష్ఠుడు దృఢాశ్వుడు. చంద్రాశ్వుడు, కపిలాశ్వుడు అనేవారు (కువలాశ్వుడి) చిన్నకుమారులు.

ధౌన్ధుమారే దృఢాశ్వస్య హర్యశ్వ శ్చాత్మజ స్స్మృతః ।
హర్యశ్వస్య నికుమ్భోఽభూత్ క్షత్రధర్మరత స్సదా ॥ 88 ॥

ధుంధుమారుడి (కువలాశ్వుడి) కొడు కయిన దృఢాశ్వుడికొడుకు హర్యశ్వుడు. హర్యశ్వుడికి నికుంభుడు జనించాడు. నికుంభుడు నిరంతరం క్షత్రియధర్మంమీద ఆసక్తి గలిగినవాడు.

సంహతాశ్వో నికుమ్భస్య సుతో రణవిశారదః ।
అకృశాశ్వకృశాశ్వౌ తు సంహతాశ్వసుతౌ ద్విజాః ॥ 89 ॥

బ్రాహ్మణులారా! నికుంభుడితనయుడు సంహతాశ్వుడు. ఇతడు యుద్ధంలో నేర్పరి. సంహతాశ్వుడికి అకృశాశ్వుడు, కృశాశ్వుడు అని ఇద్దరు పుత్రులు.

తస్య హైమవతీ కన్యా సా తు ఖ్యాతా దృషద్వతీ ।
విఖ్యాత స్త్రిషు లోకేషు పుత్ర శ్చాస్యాః ప్రసేనజిత్ ॥ 90 ॥

నికుంభుడికి హైమవతి అనేకూతురు కూడ కలిగింది. ఆమె దృషద్వతి అనేపేరుతో ప్రసిద్ధ మయింది. హైమవతి కొడుకు ప్రసేనజిత్తు. ఇతడు ముల్లోకాలలోనూ సుప్రసిద్ధుడు.

లేభే ప్రసేనజి ద్భార్యాం గౌరీం నామ పతివ్రతామ్ ।
అభిశప్తా తు సా భర్త్రా నదీ వై బాహుదాఽభవత్ ॥ 91 ॥

ప్రసేనజిత్తు గౌరిని భార్యగా పొందాడు. ఆమె పతివ్రత. గౌరి భర్తశాపం వల్ల బాహుద అనేనది అయింది.

తస్య పుత్రో మహా నాసీ ద్యువనాశ్వో నృపాధిపః ।
మాంధాతా యువనాశ్వస్య త్రిలోకవిజయీ సుతః ॥ 92 ॥

ప్రసేనజిత్తు తనయుడు యువనాశ్వుడు. ఆ మహాత్ముడు రాజులకు రాజు అయినాడు. యువనాశ్వుడి కొడుకు మాంధాత. ఇతడు మూడులోకాలనూ జయించాడు.

తస్య చైత్రరథీ భార్యా శశబిన్దో స్సుతాఽభవత్ ।
సాధ్వీ బిన్దుమతీ నామ రూపేణాసదృశీ భువి ॥ 93 ॥

మాంధాత భార్య చైత్రరథి. ఈమె శశబిందుడికూతురు. ఈమె ఉత్తమురాలు. ఈమెకు బిందుమతి అనేపేరు కూడ ఉంది. భూలోకంలో ఆమె అందానికి సాటి లేదు.

పతివ్రతా చ జ్యేష్ఠా చ భ్రాతౄణా మయుతస్య వై ।
తస్యా ముత్పాదయామాస మాంధాతా ద్వౌ సుతౌ ద్విజాః ॥ 94 ॥

బిందుమతి (చైత్రరథి) పతివ్రత. ఈమె తమ్ముళ్లు పదివేలమంది. బిందుమతియందు మాంధాత ఇద్దరు కొడుకులను కన్నాడు.

పురుకుత్సం చ ధర్మజ్ఞం ముచుకున్దం చ పార్థివమ్ ।
పురుకుత్ససుత స్త్వాసీ త్త్రసదస్యు ర్మహీపతిః ॥ 95 ॥

వారు ధర్మజ్ఞుడయిన పురుకుత్సుడు, పృథివీపతి అయిన ముచుకుందుడు. పురుకుత్సుడి కొడుకు త్రసదస్యుడు. ఇతడు రాజు అయినాడు.

నర్మదాయా మథోత్పన్న స్సమ్భూత స్తస్య చాత్మజః ।
సమ్భూతస్య తు దాయాద స్సుధన్వా రిపుమర్దనః ॥ 96 ॥

త్రసదస్యుడు పురుకుత్సుడికి నర్మద అనేస్త్రీయందు జన్మించాడు. త్రసదస్యుడితనయుడు సంభూతుడు. సంభూతుడికి సుధన్వుడు అనే పుత్రుడు కలిగాడు. ఇతడు శత్రువులను నిర్మూలించగలిగినవాడు.

సుధన్వన స్సుత శ్చాపి త్రిధన్వా రిపుమర్దనః ।
రాజ్ఞ స్త్రిధన్వన స్త్వాసీద్ విద్వాం స్త్రయ్యారుణః ప్రభుః ।
తస్య సత్యవ్రతో నామ కుమారోఽ భూన్మహాబలః ॥ 97 ॥

సుధన్వుడి కొడుకు త్రిధన్వుడు. ఇతడు శత్రువులను హింసిస్తాడు. రాజయిన త్రిధన్వుడికుమారుడు త్రయ్యారుణుడు. ఇతడు పండితుడు, సమర్థుడు. త్రయ్యారుణుడికి మహాబలు డయిన సత్యవ్రతుడు అనేకుమారుడు జన్మించాడు.

పాణిగ్రహణమన్త్రాణాం విఘ్నం చక్రే సుదుర్మతిః ।
యేన భార్యా కృతోద్వాహా హృతా చైవ పరస్య హ ॥ 98 ॥

సత్యవ్రతుడు దుష్టబుద్ధి. వివాహమంత్రాలకు విఘ్నం చేశాడు. అతడు వేరొకడు వివాహం చేసుకున్న స్త్రీని అపహరించాడు.

బాల్యాత్ కామాచ్చ మోహాచ్చ సాహసా చ్చాపలేన చ ।
జహార కన్యాం కామార్తః కస్యచిత్ పురవాసినః ॥ 99 ॥

కామార్తుడైన సత్యవ్రతుడు చిన్నతనంవల్లనూ, కోరికవల్లనూ, అజ్ఞానంచేతనూ, తొందరపాటువల్లనూ, చంచలమైనబుద్ధివల్లనూ, పురములో నివసించి ఉన్న కన్యనపహరించాడు.

అధర్మశఙ్కునా తేన తం స త్రయ్యారుణోఽ త్యజత్ ।
అపధ్వంసేతి బహుశో వదన్ క్రోధసమన్వితః ॥ 100 ॥

అధర్మపరుడనే ఉద్దేశ్యంతో త్రయ్యారుణుడు సత్యవ్రతుడిని వదిలేశాడు. కోపంతో పలుసార్లు 'నశించిపో' అన్నాడు.

సోఽ బ్రవీత్ పితరం త్యక్తః క్వ గచ్ఛా మీతి వై ముహుః ।
పితా చ తమథోవాచ శ్వపాకై స్సహ వర్తయ ॥ 101 ॥

'నిన్ను విడిచి ఎక్కడికి వెళ్తాను' అని సత్యవ్రతుడు తండ్రిని అడిగాడు. త్రయ్యారుణుడు 'చండాలురతో కలిసి ఉండు' అని పలికెను.

నాహం పుత్రేణ పుత్రార్థం త్వయాద్య కులపాంసన ।
ఇత్యుక్త స్స నిరాక్రామ న్నగరా ద్వచనా త్పితుః ।
న చ తం వారయామాస వసిష్ఠో భగవాన్ ఋషిః ॥ 102 ॥

'కులగౌరవం నాశనం చేసినవాడివి. నీవు నాకు కొడుకువే కాదు' అన్నాడు. తండ్రిమాటలతో సత్యవ్రతుడు రాజధాని నగరాన్ని విడిచి వెళ్లిపోయాడు. జ్ఞాని అయిన వసిష్ఠమహర్షి సత్యవ్రతుడిని వెళ్లవద్దని వారించలేదు.

స తు సత్యవ్రతో విప్రాః శ్వపాకావసథాన్తికే ।
పిత్రా త్యక్తోఽ వసద్వీరః పితాప్యస్య వనం యయౌ ॥ 103 ॥

తండ్రి విడిచిపెట్టిన ఆ సత్యవ్రతుడు చండాలురఇండ్లసమీపంలో నివసించసాగాడు. కొన్నాళ్లకు తండ్రి కూడ వనవాసానికి వెళ్లాడు.

తత స్తస్మింస్తు విషయే నావర్ష త్పాకశాసనః ।
సమా ద్వాదశ భో విప్రా స్తేనాధర్మేణ వై తదా ॥ 104 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆతరువాత, అధర్మం కారణంగా ఇంద్రుడు ఆరాజ్యంలో పండ్రెండుసంవత్సరాలపాటు వర్షం లేకుండా చేశాడు.

దారాం స్తు తస్య విషయే విశ్వామిత్రో మహాతపాః ।
సంన్యస్య సాగరాన్తే తు చకార విపులం తపః ॥ 105 ॥

గొప్పతపస్వి అయిన విశ్వామిత్రుడు భార్యను ఆరాజ్యంలో విడిచి, సముద్రతీరంలో విస్తారమైన తపస్సు చేశాడు.

తస్య పత్నీ గలే బధ్వా మధ్యమం పుత్రమౌరసమ్ ।
శేషస్య భరణార్థాయ వ్యక్రీణా ద్గోశతేన వై ॥ 106 ॥

విశ్వామిత్రుడిభార్య మిగిలినకొడుకులను పోషించడానికి, కొడుకులలో నడిమివాడిమెడలో (పశువులాగా), తాడు కట్టి, నూరుగోవులవెలకు అమ్మివేసింది.

తం చ బద్ధగలే దృష్ట్వా విక్రయార్థం నృపాత్మజః ।
మహర్షిపుత్రం ధర్మాత్మా మోక్షయామాస భో ద్విజాః ॥ 107 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆవిధంగా పశువులాగా అమ్మడంకోసం మెడలో తాడు కట్టి ఉంచినవాడిని చూచి, ధర్మబుద్ధి కలిగిన సత్యవ్రతుడు ఆవిశ్వామిత్రమహర్షికుమారుడిని విడిపించాడు.

సత్యవ్రతో మహాబాహు ర్భరణం తస్య చాకరోత్ ।
విశ్వామిత్రస్య తుష్ట్యర్థ మనుకమ్పార్థ మేవ చ ॥ 108 ॥

విశ్వామిత్రుడిని సంతోషపెట్టడానికీ, ఆయన అనుగ్రహం పొందడానికీ, బలవంతుడయిన సత్యవ్రతుడు ఆ విశ్వామిత్రకుమారుడిని తానే పోషించాడు.

సోऽభవద్గాలవో నామ్నా గలబన్ధా న్మహాతపాః ।
మహర్షిః కౌశికో ధీమాం స్తేన వీరేణ మోక్షితః ॥ 109 ॥

అమ్మకానికి గళం(మెడ)లో బంధింపబడడంచేత ఆ విశ్వామిత్రకుమారుడు గాలవుడు అయినాడు. గొప్పతపస్వి, బుద్ధిమంతుడు అయిన కౌశికమహర్షి సత్యవ్రతుడివలన (పుత్రుడిని రక్షించటంచేత - పుత్రదుఃఖంనుండి) బయటపడ్డాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే సూర్యవంశనిరూపణం నామ పఞ్చమోऽధ్యాయః ॥ 5 ॥

శ్రీబ్రహ్మపురాణంలో సూర్యవంశనిరూపణం అనే పేరు గలిగిన ఐదవ అధ్యాయం సంపూర్ణం.



షష్ఠోఽధ్యాయః - ఆరవ అధ్యాయం

ఆదిత్యవంశానుకీర్తనమ్ - ఆదిత్యవంశానుకీర్తనం

లోమహర్షణ ఉవాచ :-లోమహర్షణుడు మునులతో ఇలా చెప్తున్నాడు.

సత్యవ్రతస్తు భగవన్ కృపయాథ ప్రతిజ్ఞయా ।
విశ్వామిత్రకలత్రం తు బభార వినయే స్థితః ॥ 1 ॥

మహాత్మా! సత్యవ్రతుడు దయతోనూ, దృఢసంకల్పంతోనూ, వినయంతోనూ విశ్వామిత్రుడిభార్యను పోషించాడు. (శివ.ఉ.38)

హత్వా మృగాన్ వరాహాంశ్చ మహిషాంశ్చ వనేచరాన్ ।
విశ్వామిత్రాశ్రమాభ్యాశే మాంసం వృక్షే బబన్ధ చ ॥ 2 ॥

అతడు అరణ్యంలో సంచరించే జింకలనూ, పందులనూ, దున్నలనూ చంపి, వాటిమాంసాన్ని విశ్వామిత్రుడి ఆశ్రమం సమీపంలోనిచెట్లకు వేలాడగట్టాడు.

ఉపాంశువ్రత మాస్థాయ దీక్షాం ద్వాదశవార్షికీమ్ ।
పితు ర్నియోగా దవసత్ తస్మిన్ వనగతే నృపే ॥ 3 ॥

వనవాసానికి వెళ్లేసమయంలో తండ్రి ఇచ్చినఆజ్ఞను అనుసరించి, ఉపాంశువు (మౌనంగా ఉండటం - బాహ్యదృష్టి లేకుండా ఇంద్రియనిగ్రహంతో, అంతర్ముఖంగా మనసును పరమాత్మయందు లగ్నం చేసిఉండటం) అనేవ్రతాన్ని 12 సంవత్సరాలు ఆచరించాలని నియమం చేసుకుని, అడవులలో నివసిస్తున్నాడు.

అయోధ్యాం చైవ రాజ్యం చ తథైవాన్తఃపురం మునిః ।
యాజ్యోపాధ్యాయసంయోగా ద్వసిష్ఠః పర్యరక్షతి ॥ 4 ॥

సత్యవ్రతుడు అరణ్యాలలో ఉన్నసమయంలో - యజ్ఞం చేయించేవాడుగానూ, గురువుగానూ వసిష్ఠమహర్షి ఆరాజవంశంతో ఉన్నసంబంధాన్ని అనుసరించి అయోధ్యనూ, అలాగే రాజ్యం మొత్తాన్నీ, రాణివాసాన్నీ జాగ్రత్తగా రక్షించాడు.

సత్యవ్రతస్తు బాల్యాచ్చ భావినోఽర్థస్య చానఘః ।
వసిష్ఠేఽభ్యధికం మన్యుం ధారయామాస నిత్యదా ॥5 ॥

సత్యవ్రతుడు మాత్రం చిన్నతనంవల్లనూ, జరగవలసినదానిప్రభావంవల్లనూ, వసిష్ఠుడిమీద ఎప్పుడూ తీవ్రమైన కోపం గలిగిఉండేవాడు.

పిత్రా హి తం తదా రాష్ట్రాత్ త్యాజ్యమానం ప్రియం సుతమ్ ।
న వారయామాస ముని ర్వసిష్ఠః కారణేన హ ॥ 6 ॥

తండ్రి తనను రాజ్యం నుంచి బహిష్కరించినసమయంలో వసిష్ఠుడు వారించలేదనే కారణంచేత సత్యవ్రతుడికి వసిష్ఠుడిమీద కోపం కలిగింది.

పాణిగ్రహణమన్త్రాణాం నిష్ఠా స్యాత్ సప్తమే పదే ।
న చ సత్యవ్రత స్తస్మా ద్ధృతవాన్ సప్తమే పదే ॥ 7 ॥

వివాహమంత్రాలలో సారం అంతా ఏడడుగులకార్యక్రమంలోని ఏడవఅడుగులో ఉంది. అందుచేతనే సత్యవ్రతుడు వివాహసమయంలో ఆ ఏడవ అడుగులో ధర్మవిరుద్ధంగా వ్యవహరించలేదు.(వివాహంలో కన్యను అపహరించకుండా, వివాహం అయినతరువాత అపహరించాడు. (5అధ్యాయం. 98,99 శ్లోకాలు)

జానన్ ధర్మం వసిష్ఠ స్తు న మాం త్రాతీతి భో ద్విజాః ।
సత్యవ్రత స్తదా రోషం వసిష్ఠే మనసాఽకరోత్ ॥ 8 ॥

ఓ బ్రాహ్మణులారా! 'ధర్మం తెలిసిఉండి కూడా, వసిష్ఠుడు నన్ను రక్షించలేదు' అనే అభిప్రాయంతో సత్యవ్రతుడు వసిష్ఠుడిమీద మనసునిండా కోపం పెట్టుకున్నాడు.

గుణబుద్ధ్యా తు భగవాన్ వసిష్ఠః కృతవాం స్తథా ।
న చ సత్యవ్రత స్తస్య తముపాంశు మబుధ్యత ॥ 9 ॥

కాని సత్యవ్రతుడి దుష్టగుణాలనుబట్టే (భవిష్యత్తులో సత్యవ్రతుడికి మేలు జరగాలనే ఉద్దేశ్యంతోనే) వసిష్ఠుడు ఆవిధంగా చేశాడు. కాని, సత్యవ్రతుడు మాత్రం వసిష్ఠుడిమౌనాన్ని సరిగా గ్రహించలేకపోయాడు.

తస్మిన్నపరితోషశ్చ పితురాసీన్మహాత్మనః ।
తేన ద్వాదశవర్షాణి నావర్షత్ పాకశాసనః ॥ 10 ॥

దానివల్ల మహాత్ము డయిన తండ్రికి (త్రయ్యారుణుడికి) అసంతుష్టి కూడ కలిగింది. దానివల్ల ఆరాజ్యంలో 12 సంవత్సరాలపాటు ఇంద్రుడు వానలు లేకుండా చేశాడు.

తేన త్విదానీం వహతా దీక్షాం తాం దుర్వహాం భువి ।
కులస్య నిష్కృతి ర్విప్రాః కృతా సా వై భవేదితి ॥ 11 ॥

న తం వసిష్ఠో భగవాన్ పిత్రా త్యక్తం న్యవారయత్ ।
అభిషేక్ష్యామ్యహం పుత్ర మస్యేత్యేవం యతి ర్మునిః ॥ 12 ॥

విప్రులారా! అనావృష్టివల్ల ఏర్పడిన కష్టాలు తొలగించడానికి సత్యవ్రతుడు మిక్కిలికష్టసాధ్యమయిన దీక్ష వహిస్తాడు. దానివల్ల వారివంశానికి కలిగినదోషం తొలగిపోతుంది. ఆవిధంగా (దుష్కర్మఫలానుభవం అయి, సత్యవ్రతుడు శుద్ధుడు అయినతరువాత) ఈతనికుమారుడిని రాజుగా అభిషేకిస్తాను అని వసిష్ఠమహర్షి ఆనాడు రాజ్యబహిష్కారం అనే తండ్రిశాపంనుంచి సత్యవ్రతుడిని వారించలేదు.

స తు ద్వాదశ వర్షాణి తాం దీక్షా ముద్వహన్ బలీ ।
అవిద్యమానే మాంసే తు వసిష్ఠస్య మహాత్మనః ।
సర్వకామదుఘాం దోగ్ధ్రీం స దదర్శ నృపాత్మజః ॥ 13 ॥

శక్తిమంతుడయిన సత్యవ్రతుడు ఆవిధ మైన 12 సంవత్సరాల కఠోర (ఉపాంశువ్రత) దీక్షను వహించాడు. వర్షాలు లేక తీవ్రక్షామం ఏర్పడిన ఆసమయంలో అతడికి మాంసం (ఆహారం) లభించలేదు. అపుడు సత్యవ్రతుడు, అన్నికోరికలనూ తీర్చే, వసిష్ఠమహర్షి కామధేనువును చూశాడు.

తాం వై క్రోధాచ్చ మోహాచ్చ శ్రమా చ్చైవ క్షుధాన్వితః ।
దేశధర్మగతో రాజా జఘాన మునిసత్తమాః ॥ 14 ॥

మునిసత్తములారా! ఆకలితో ఉన్న సత్యవ్రతమహారాజు (ఆకలిబాధచేత కలిగిన) కోపంతోనూ, (ఆవు కంటబడడంతో దానిమాంసంమీద) కోరికతోనూ, తాను నివసిస్తున్న చండాలురనివాసప్రాంతం ప్రభావంతో చండాలుడులాగా ఆఆవును చంపాడు.

తన్మాంసం స స్వయం చైవ విశ్వామిత్రస్య చాత్మజాన్ ।
భోజయామాస తచ్ఛ్రుత్వా వసిష్ఠోఽ ప్యస్య చుక్రుధే ॥15 ॥

ఆ ఆవుమాంసాన్ని ఆకలిబాధ తట్టుకోలేక స్వయంగా తాను తిన్నాడు. విశ్వామిత్రుడికొడుకులకూ తినిపించాడు. ఆసంగతి విన్న వసిష్ఠమహర్షికి సత్యవ్రతుడిపైన కోపం వచ్చింది.

వసిష్ఠ ఉవాచ :–వసిష్ఠుడు సత్యవ్రతుడితో ఈవిధంగా అన్నాడు.

పాతయేయ మహం క్రూర తవ శఙ్కు మసంశయమ్ ।
యది తే ద్వావిమౌ శఙ్కూ న స్యాతాం వై కృతౌ పునః ॥ 16 ॥

సత్యవ్రతా! క్రూరుడా! నీవు ఈ రెండు పాపాలు (1. గోహత్య, 2. గోమాంసభక్షణం) చేసిఉండకపోయిన ట్లయితే లోగడ నీవు నీతండ్రివిషయంలో చేసిన ఘోరమైన పాపాన్ని తొలగించి ఉండేవాడిని. (ఇలా అనడంవల్ల సత్యవ్రతుడిని వసిష్ఠుడు రాజుగా అభిషేకించే ఉద్దేశ్యం మానుకున్నాడని స్పష్టం. అందుకే తరువాత విశ్వామిత్రుడు అభిషేకించాడు.)

పితు శ్చాపరితోషేణ గురుదోగ్ధ్రీవధేన చ ।
అప్రోక్షితోపయోగా చ్చ త్రివిధ స్తే వ్యతిక్రమః ॥ 17 ॥

తండ్రిని బాధించడమూ, గురువుగారి ఆవును సంహరించడమూ, (వేదమంత్రాలతో పవిత్రం చేయబడని) మాంసాన్ని తినడమూ అనేవిధంగా నీవు మూడు విధాలుగా ధర్మభంగం చేశావు.(యజ్ఞంకోసం పశువును వధించడం దోషం కాదు. అలాగే వేదమంత్రాలతో సంస్కరింపబడినమాంసాన్ని ఆహారంగా తీసుకోవడమూ దోషం కాదు. కాని కేవలం ఆకలితీర్చుకోవడానికి, అందులోనూ ఆవును చంపి, అలాగే తినడం మహాదోషం.)

ఏవం త్రీణ్యస్య శఙ్కూని తాని దృష్ట్వా మహాతపాః ।
త్రిశఙ్కు రితి హోవాచ త్రిశఙ్కు స్తేన స స్మృతః ॥ 18 ॥

ఈవిధంగా మూడువిధాలయిన శంకువులు అంటే పాపాలు చేయడం మూలంగా వసిష్ఠమహర్షి సత్యవ్రతుడిని త్రిశంకువు అన్నాడు. అందుచేత సత్యవ్రతుడు అప్పటినుండి త్రిశంకువు అయినాడు.

విశ్వామిత్రస్య దారాణా మనేన భరణం కృతమ్ ।
తేన తస్మై వరం ప్రాదా న్మునిః ప్రీత స్త్రిశఙ్కవే ॥ 19 ॥

అయితే త్రిశంకువు విశ్వామిత్రమహర్షి భార్యను, పిల్లలనూ పోషించాడు. కాబట్టి విశ్వామిత్రుడు త్రిశంకువువిషయంలో సంతోషించి, అతడికి ఒకవరం అనుగ్రహించాడు.

ఛన్ద్యమానో వరేణాథ వరం వవ్రే నృపాత్మజః ।
సశరీరో వ్రజే స్వర్గమిత్యేవం యాచితో వరః ॥ 20 ॥

ఆ వరంతో సంతోషించిన సత్యవ్రతుడు 'తాను ఈమానవశరీరంతోనే స్వర్గానికి వెళ్లాలి' అని విశ్వామిత్రుడిని మరొక్కవరం అడిగాడు.

అనావృష్టిభయే తస్మిన్ గతే ద్వాదశవార్షికే ।
పిత్ర్యే రాజ్యేऽభిషిచ్యాథ యాజయామాస తం మునిః ॥ 21 ॥

12 సంవత్సరాలు గడిచిపోయాయి. ఆరాజ్యంలో అనావృష్టిబాధ తొలగిపోయింది. (సమృద్ధిగా వర్షాలు ప్రారంభమయిన తరువాత) విశ్వామిత్రుడు త్రిశంకువును తండ్రిరాజ్యానికి రాజుగా అభిషేకించాడు. త్రిశంకుమహారాజుచేత (శరీరంతో స్వర్గం చేరడం అనే కోరిక తీర్చడానికి) యజ్ఞం చేయించాడు.

మిషతాం దేవతానాం చ వసిష్ఠస్య చ కౌశికః ।
దివ మారోపయామాస సశరీరం మహాతపాః ॥ 22 ॥

దేవతలూ, వసిష్ఠుడూ చూస్తుండగా, విశ్వామిత్రమహర్షి త్రిశంకువును శరీరంతో సహా దేవలోకానికి పంపాడు.

తస్య సత్యరథా నామ పత్నీ కైకేయవంశజా ।
కుమారం జనయామాస హరిశ్చన్ద్ర మకల్మషమ్ ॥ 23 ॥

ఆ త్రిశంకువు భార్య సత్యరథ. ఈమె కేకేయవంశంలో జన్మించింది. ఆమె త్రిశంకువువల్ల హరిశ్చంద్రుడు అనే కుమారుడిని కన్నది. ఇతడు పుణ్యచరిత్రుడు.

స వై రాజా హరిశ్చన్ద్ర స్త్రైశఙ్కవ ఇతి స్మృతః ।
ఆహర్తా రాజసూయస్య సమ్రాడితి హ విశ్రుతః ॥ 24 ॥

త్రిశంకువు కొడుకు కాబట్టి హరిశ్చంద్రుడు త్రైశంకుడు అనే పేరు పొందాడు. హరిశ్చంద్రుడు రాజసూయయాగం చేశాడు. దానివల్ల సమ్రాట్టుగా కీర్తింపబడ్డాడు.

హరిశ్చన్ద్రస్య పుత్రోఽభూద్ రోహితో నామ పార్థివః ।
హరితో రోహిత స్యాథ చంచు ర్హారిత ఉచ్యతే ॥ 25 ॥

హరిశ్చంద్రుడి తనయుడు రోహితుడు. (హరిశ్చంద్రుడితరువాత) రోహితుడు రాజు అయినాడు. రోహితుడి కొడుకు హరితుడు. హరితుడి పుత్రుడు చంచువు.

విజయ శ్చ మునిశ్రేష్ఠా శ్చంచుపుత్రో బభూవ హ ।
జేతా స సర్వపృథివీం విజయ స్తేన స స్మృతః ॥ 26 ॥

మునివరులారా! ఆచంచువు కొడుకు విజయుడు. అతడు సమస్తమైన భూమండలాన్ని జయించి నందుచేత విజయుడు అని పేరుగాంచాడు.

రురుక స్తనయ స్తస్య రాజధర్మార్థకోవిదః ।
రురుకస్య వృకః పుత్రో వృకా ద్బాహు స్తు జజ్ఞివాన్ ॥ 27 ॥

విజయునితనయుడు రురుకుడు. ఇతడు రాజధర్మాన్నీ, ఆర్థికశాస్త్రాన్నీ సమగ్రంగా తెలిసినవాడు. రురుకుడి కొడుకు వృకుడు. వృకుడికి బాహువు అనేవాడు జన్మించాడు.

హైహయా స్తాలజంఘాశ్చ నిరస్యన్తి స్మ తం నృపాః ।
తత్పత్నీ గర్భమాదాయ ఔర్వస్యాశ్రమమావిశత్ ॥ 28 ॥

హైహయులు, తాలజంఘులు అనే శత్రువులు రాజులు బాహువును రాజ్యాన్నుంచి వెళ్లగొట్టారు. అపుడు గర్భవతి అయిన బాహువుభార్య ఔర్వుడు అనే మహర్షి ఆశ్రమానికి చేరుకున్నది.

నాత్యర్థం ధార్మిక శ్చైవ స హ ధర్మయుగేఽభవత్ ।
సగర స్తు సుతో బాహో, ర్జజ్ఞే సహ గరేణ వై ॥ 29 ॥

మిక్కిలి ధార్మికుడయిన బాహువు కృతయుగంలో ఉన్నాడు. ఆబాహువు కుమారుడు సగరుడు. ఈతడిని చంపడానికి గర్భంలో ఉండగానే సవతితల్లి పెట్టిన విషంతో సహా పుట్టడంచేత ఇతడు సగరుడు అయ్యాడు.

ఔర్వస్యాశ్రమమాసాద్య భార్గవేణాభిరక్షితః ।
ఆగ్నేయమస్త్రం లబ్ధ్వా చ భార్గవాత్ సగరో నృపః ॥ 30 ॥

సగరుడు ఔర్వ మహర్షి ఆశ్రమమును చేరి ఔర్వునిచే రక్షింపబడి ఔర్వునిచేత ఆగ్నేయాస్త్రాన్ని పొందినవాడై

జిగాయ పృథివీం హత్వా తాలజంఘాన్ సహైహయాన్ ।
శకానాం పహ్లవానాం చ ధర్మం నిరస దచ్యుతః ।
క్షత్రియాణాం మునిశ్రేష్ఠాః పారదానాం చ ధర్మవిత్ ॥ 31 ॥

సగరుడు ధర్మాత్ముడయిన తనతండ్రిని అధికారభ్రష్టుడిని చేసిన తాలజంఘులనూ, హైహయులనూ సంహరించాడు. భూమండలం అంతటినీ జయించాడు. (సమ్రాట్టు అయినాడు). మునివరులారా! ధర్మజ్ఞుడయిన సగరుడు శకులు, పల్లవులు, పారదులు అనేక్షత్రియులు అనుసరిస్తున్న అవైదికధర్మాన్ని నిర్మూలించాడు. వైదికధర్మాన్ని నెలకొల్పాడు.

మునయ ఊచుః :-మునులు లోమహర్షణుడితో ఈవిధంగా అంటున్నారు.

కథం సహ గరేణైవ స వనే సమజాయత ।
కిమర్థం చ శకాదీనాం క్షత్రియాణాం మహౌజసామ్ ॥ 32 ॥

ధర్మాన్ కులోచితాన్ రాజా క్రుద్ధో నిరస దచ్యుతః ।
ఏతన్న స్సర్వ మాచక్ష్వ విస్తరేణ మహామతే ॥ 33 ॥

మహాబుద్ధీ! 'ఆఆశ్రమంలో సగరుడు విషంతో సహా ఎలా జన్మించాడు. పరాక్రమవంతులైన, శకులు మొదలయిన క్షత్రియజాతులవారు తమవంశానికి తగినధర్మాలను ఆచరిస్తున్నవారిపై సగరుడు కోపగించడం ఎందుకు? వారికులధర్మాలను నిరసించడం ఎందుకు? ఈవిషయం అంతా సవివరంగా చెప్పవలసినది'.

లోమహర్షణ ఉవాచ :-లోమహర్షణుడు మునులకు ఇలా చెప్తున్నాడు.

బాహో ర్వ్యసనిన స్సర్వం హృతం రాష్ట్ర మభూత్ కిల ।
హైహయై స్తాలజంఘైశ్చ శకై స్సార్ధం ద్విజోత్తమాః ॥ 35 ॥

బ్రాహ్మణోత్తములారా! బాహుమహారాజు వ్యసనపరుడు కావటంచేత హైహయులు, తాలజంఘులు, శకులు ఆబాహువు రాజ్యాన్ని అపహరించారు.

యవనాః పారదా శ్చైవ కామ్బోజాః పహ్లవా స్తథా ।
ఏతే హ్యపి గణాః పఞ్చ హైహయార్థం పరాక్రమన్ ॥ 36 ॥

హైహయులపక్షంలో శకులు, యవనులు, పారదులు, కాంభోజులు, పల్లవులు అనే అయిదుగణాలవారు యుద్ధంచేసి బాహువు రాజ్యం హరించారు.

హృతరాజ్య స్తదా రాజా స వై బాహు ర్వనం యయౌ ।
పత్న్యా చానుగతో దుఃఖీ తత్ర ప్రాణానవాసృజత్ ॥ 37 ॥

రాజ్యం కోల్పోయినబాహువు అడవులకు వెళ్ళిపోయాడు. భార్య అతడిని అనుసరించింది. రాజ్యం పోగొట్టుకున్న దుఃఖంతో బాహువు ఆఅడవులలోనే ప్రాణాలు వదిలాడు.

పత్నీ తు యాదవీ తస్య సగర్భా పృష్ఠతోఽన్వగాత్ ।
సపత్న్యా చ గర స్తస్యై దత్తః పూర్వం కిలాఽనఘాః ॥ 38 ॥

పుణ్యాత్ములారా! బాహువు భార్య గూడ భర్తవెంట అడవులకు వెళ్ళింది. అప్పటికి ఆమె గర్భవతి. ఆమె యదువంశంలో జన్మించినది. ఆమె సవతి గర్భవతి ఐనఆమెకు విషం పెట్టింది.

సా తు భర్తృశ్చితాం కృత్వా వనే తామభ్యరోహత ।
ఔర్వ స్తాం భార్గవో విప్రాః కారుణ్యాత్ సమవారయత్ ॥ 39 ॥

బాహువు మరణించినపుడు భర్తకోసం చితిని ఏర్పాటు చేసి, తాను కూడ భర్తతో వెళ్లిపోవడానికి ఆచితిమీదికి ఎక్కింది. భృగువంశంలో జన్మించిన ఔర్వుడు దయతో ఆమె కాలిపోకుండ, సహగమనం చేయకుండా నివారించాడు.

తస్యాశ్రమే చ గర్భ స్సగరే ణైవ సహ చ్యుతః ।
వ్యజాయత మహాబాహు స్సగరో నామ పార్థివః ॥ 40 ॥

ఆ ఔర్వుడి ఆశ్రమంలోనే ఆమెగర్భం సవతి పెట్టినవిషంతో సహా జారిపడింది. అందులోనుంచి మిక్కిలిపరాక్రమవంతుడయిన సగరుడు అనే భూపాలుడు జన్మించాడు.

ఔర్వస్తు జాతకర్మాదీం స్తస్య కృత్వా మహాత్మనః ।
అధ్యాప్య వేదశాస్త్రాణి తతోఽ స్త్రం ప్రత్యపాదయత్ ।
ఆగ్నేయం తు మహాభాగా అమరై రపి దుస్సహమ్ ॥ 41 ॥

ఔర్వుడే ఆసగరుడికి నామకరణాదులయిన సంస్కారాలు చేశాడు. వేదాలు, శాస్త్రాలు నేర్పాడు. తరువాత దేవతలు కూడ తట్టుకోలేని ఆగ్నేయం అనే మహాస్త్రాన్ని ఉపదేశించాడు.

స తేనాస్త్రబలే నాజౌ బలేన చ సమన్వితః ।
హైహయాన్ విజఘూ నాశు క్రుద్ధో రుద్రః పశూ నివ ॥ 42 ॥

ఆగ్నేయాస్త్రబలంతో సగరుడు ససైన్యంగా (తండ్రిని పారద్రోలి తమరాజ్యాన్ని ఆక్రమించుకున్న) హైహయుల మీదికి యుద్ధానికి వెళ్లాడు. ఆయుద్ధంలో హైహయులను సులువుగా, కోపించిన రుద్రుడు (ప్రళయసమయంలో) జీవకోటిని చంపినట్లుగా చంపివేశాడు.

ఆజహార చ లోకేషు యశః కీర్తిమతాం వరః ॥ 43 ॥

ఉత్తమయశస్వి అయిన సగరుడు శత్రుసంహారం వలన లోకాలలో తనకీర్తిని సంపాదించాడు..

తత శ్శకాంశ్చ యవనాన్ కామ్బోజాన్ పారదాం స్తథా ।
పహ్లవాం శ్చైవ నిశ్శేషాన్ కర్తుం వ్యవసితో నృపః ॥ 44 ॥

తర్వాత సగరుడు యవనులనూ, కాంభోజులనూ, పారదులనూ, పల్లవులనూ కూడ (వీరందరూ తమరాజ్యం అపహరించటంలో హైహయులకు తోడుపడినవాళ్లు) ఎవ్వరూ మిగలకుండా అందరినీ నిర్మూలించటానికి పూనుకున్నాడు.

తే వధ్యమానా వీరేణ సగరేణ మహాత్మనా ।
వసిష్ఠం శరణం గత్వా ప్రణిపేతు ర్మనీషిణమ్ ॥ 45 ॥

సగరుడిచేత చంపబడుతూ వారు అందరూ జ్ఞాని అయిన వసిష్ఠమహర్షిని శరణు కోరి, ఆయనను ఆశ్రయించారు.

వసిష్ఠ స్త్వథ తాన్ దృష్ట్వా సమయేన మహాద్యుతిః ।
సగరం వారయామాస తేషాం దత్త్వాఽభయం తదా ॥ 46 ॥

అపుడు తేజస్వి అయిన వసిష్ఠుడు, వారిని రక్షిస్తా నని ప్రతిజ్ఞ చేశాడు. వారికి అభయం ఇచ్చాడు. వారిని చంపకుండా సగరుడిని నివారించాడు.

సగర స్తాం ప్రతిజ్ఞాం తు గురో ర్వాక్యం నిశమ్య చ ।
ధర్మం జఘాన తేషాం చ వేషా నన్యాం శ్చకార హ ॥ 47 ॥

సగరుడు వశిష్ఠుడి ప్రతిజ్ఞను, గురువచనాలను విని, తనమాట భంగం కాకుండా, (గురువులమాటప్రకారం వారిని రక్షించి,) వారిధర్మాన్ని సంహరించాడు. వారివేషాలను వేరేవిధంగా మార్పు చేశాడు.

అర్ధం శకానాం శిరసో ముణ్డయిత్వా వ్యసర్జయత్ ।
యవనానాం శిర స్సర్వం కామ్బోజానాం తథైవ చ ॥ 48 ॥

శకులకు తల సగం గుండు చేసి విడిచిపెట్టాడు. యవనులకూ, కాంభోజులకూ తల పూర్తిగా గుండు చేయించాడు.

పారదా ముక్తకేశాశ్చ పహ్లవా శ్శ్మశ్రుధారిణః ।
నిస్స్వాధ్యాయవషట్కారాః కృతా స్తేన మహాత్మనా ॥ 49 ॥

పారదులను తల విరబోసుకొని ఉండేవిధంగా చేశాడు. పల్లవులను గడ్డాలు పెంచుకుని ఉండేటట్లు ఏర్పాటు చేశాడు. మహాత్ము డయిన సగరుడు శకాదులు అందరినీ, వేదాధ్యయనం లేకుండగానూ, మంత్రానుష్ఠానం మొదలైన వైదికకర్మలు లేకుండగానూ చేశాడు.

శకా యవనకామ్బోజాః పారదాశ్చ ద్విజోత్తమాః ।
కాలసర్పా మాహిషకా దర్వ్యా శ్చోలా స్సకేరలాః ॥ 50 ॥

సర్వే తు క్షత్రియా విప్రా ధర్మ స్తేషాం నిరాకృతః ।
వసిష్ఠవచనాద్ రాజ్ఞా సగరేణ మహాత్మనా ॥ 51 ॥

బ్రాహ్మణశ్రేష్ఠులారా! శకులు, యవనులు, కాంభోజులు, పారదులు వీరు అందరూ కాలసర్పులు, మాహిషులు, దర్వ్యులు, చోళులు, కేరళులు అనేపేరులతో క్షత్రియులే. బ్రాహ్మణులారా! వసిష్ఠమహర్షి మాటమీద సగరుడు వీరి (అవైదిక)ధర్మాన్ని తిరస్కరించాడు. ధర్మాన్ని నిర్మూలించాడు.

స ధర్మవిజయీ రాజా విజి త్యేమాం వసున్ధరామ్ ।
అశ్వం ప్రచారయామాస వాజిమేధాయ దీక్షితః ॥ 52 ॥

సగరుడు ధర్మమార్గంలోనే విజయం సాధిస్తాడు. అదేవిధంగా ఈభూమండలం మొత్తాన్నీ జయించాడు. తరువాత అశ్వమేధయాగానికి దీక్షవహించి, యాగాశ్వాన్ని వివిధరాజ్యాలకు పంపాడు.

తస్య చారయత స్సోఽ శ్వ స్సముద్రే పూర్వదక్షిణే ।
వేలాసమీపేఽ పహృతో భూమిం చైవ ప్రవేశితః ॥ 53 ॥

ఆ గుఱ్ఱం ఆగ్నేయదిశలో సంచరిస్తుండగా, సముద్రతీరప్రాంతంలో ఎవరో దానిని అపహరించి, దానిని భూమిలోపలికి తీసుకునివెళ్లారు.

స తం దేశం తదా పుత్రైః ఖానయామాస పార్థివః ।
ఆసేదుస్తే తదా తత్ర ఖన్యమానే మహార్ణవే ॥ 54 ॥

త మాదిపురుషం దేవం హరిం కృష్ణం ప్రజాపతిమ్ ।
విష్ణుం కపిలరూపేణ స్వపన్తం పురుషం తదా ॥ 55 ॥

సగరమహారాజు అపుడు తనకొడుకులతో ఆప్రాంతంలో నేలను తవ్వించాడు. వారు సముద్రాన్ని తవ్వుతూ పోయి, చివరకు అక్కడ ఒకానొకమహాపురుషుడిని చేరుకున్నారు. అతడు శ్రీమహావిష్ణువు, కృష్ణుడు, ప్రజాపతి, శ్రీహరి, ఆదిపురుషుడు. ఆపురుషుడు కపిలమహర్షిరూపంలో అక్కడ నిద్రిస్తూ ఉన్నాడు.

తస్య చక్షు స్సముత్థేన తేజసా ప్రతిబుధ్యతః ।
దగ్ధా స్సర్వే మునిశ్రేష్ఠా శ్చత్వార స్త్వవశేషితాః ॥ 56 ॥

సగరపుత్రుల సందడికి కపిలుడు మేలుకున్నాడు. కళ్లు తెరిచి చూశాడు. ఆచూపులనుండి అగ్నిజ్వాలలు వెలువడ్డాయి. నలుగురు తప్ప సగరుడికొడుకులు అందరూ ఆఅగ్నిజ్వాలలలో తగలబడిపోయారు.

బర్హికేతు స్సుకేతుశ్చ తథా ధర్మరథో నృపః ।
శూరః పఞ్చనద శ్చైవ తస్య వంశకరా నృపాః ॥ 57 ॥

ఆనలుగురు – బర్హికేతువు, సుకేతువు, ధర్మరథుడు, శూరుడైన పంచనదుడు అనేవారు. సగరవంశాన్ని నిలిపినరాజులు వీరే.

ప్రాదా చ్చ తస్మై భగవాన్ హరి ర్నారాయణో వరమ్ ।
అక్షయం వంశ మిక్ష్వాకోః కీర్తిం చాప్యనివర్తినీమ్ ॥ 58 ॥

శ్రీమన్నారాయణుడయిన హరిభగవానుడు అయిన కపిలముని ఇక్ష్వాకువంశం నిరంతరం అభివృద్ధి పొందేవిధంగానూ, సుస్థిరమైన కీర్తి కలిగేవిధంగానూ సగరుడికి వరం ప్రసాదించాడు.

పుత్రం సముద్రం చ విభు స్స్వర్గే వాసం తథాక్షయమ్ ।
సముద్ర శ్చార్ఘ్య మాదాయ వవన్దే తం మహీపతిమ్ ॥ 59 ॥

సముద్రుడిని సగరుడికి కొడుకుగా ఇచ్చాడు. అనంతరం శాశ్వతంగా స్వర్గలోకంలో నివసించేవిధంగా అనుగ్రహించాడు. తనకు తండ్రి అయిన సగరుడికి సముద్రుడు అర్ఘ్యం ఇచ్చి, నమస్కరించాడు.

సాగరత్వం చ లేభే స కర్మణా తేన తస్య హ ।
తం చాశ్వమేధికం సోఽశ్వం, సముద్రా దుపలబ్ధవాన్ ॥ 60 ॥

సగరుడికి తనయుడు కావడంచేత సముద్రుడు సాగరుడు అయినాడు. అశ్వమేధయాగాశ్వాన్ని సముద్రుడినుండి సగరుడు తిరిగిపొందాడు.

ఆజహారాశ్వమేధానాం శతం స తు మహాయశాః ।
పుత్రాణాం చ సహస్రాణి షష్టి స్తస్యేతి న శ్శ్రుతమ్ ॥ 61 ॥

గొప్ప యశస్వి అయిన సగరుడు నూరు అశ్వమేధయాగాలు చేశాడు. సగరుడికి కొడుకులు అరవై వేలమంది అని (పురాణాదులవలన) తెలుస్తుంది.

మునయ ఊచుః :– మునులు లోమహర్షణుడిని ఈవిధంగా అడిగారు.

సగర స్యాత్మజా వీరాః కథం జాతా మహాబలాః ।
విక్రాన్తా షష్టిసాహస్రా విధినా కేన సూతజ ॥ 62 ॥

సూతకుమారా! వీరులయిన సగరుడికి మహావీరులయిన కొడుకులు అరవై వేలమంది ఏవిధంగా కలిగారు? (శివ. ఉమా. 39అ)

లోమహర్షణ ఉవాచ: – లోమహర్షణుడు మునులకు ఈవిధంగా చెప్తున్నాడు.

ద్వే భార్యే సగర స్యాస్తాం తపసా దగ్ధకిల్బిషే ।
జ్యేష్ఠా విదర్భదుహితా కేశినీ నామ నామతః ॥ 63 ॥

సగరుడికి ఇద్దరు భార్యలు. వారు ఇద్దరూ తపస్సుచేసి దానివల్ల పాపాలు నశింపజేసుకున్నారు. వారిలో పెద్దభార్య పేరు కేశిని. ఈమె విదర్భదేశపురాజు కూతురు.

కనీయసీ తు మహతీ పత్నీ పరమధర్మిణీ ।
అరిష్టనేమిదుహితా రూపేణాప్రతిమా భువి ॥ 64 ॥

సగరుడి చిన్నభార్య మహతి. ఈమె మిక్కిలి ధర్మపరాయణ. అరిష్టనేమి కూతురు. ఈభూలోకంలో ఆమె సౌందర్యానికి సాటివచ్చేవారు లేరు.

ఔర్వ స్తాభ్యాం వరం ప్రాదాత్ తద్బుధ్యధ్వం ద్విజోత్తమాః ।
షష్టిం పుత్రసహస్రాణి గృహ్ణా త్వేకా తపస్వినీ ॥ 65 ॥

బ్రాహ్మణశ్రేష్ఠులారా! ఔర్వుడు వారిద్దరికీ ఒకవరం ఇచ్చాడు. అది గ్రహించండి. మీలో తపోనిష్ఠ గలిగిన ఒకరికి అరవైవేలమంది కొడుకులు గలుగుతారు.

ఏకం వంశధరం త్వేకా యథేష్టం వరయ త్వితి ।
తత్రైకా జగృహే పుత్రాన్ షష్టిసాహస్రసమ్మితాన్ ॥ 66 ॥

వేరొకరికి వంశాన్ని నిలబెట్టేవాడు ఒక్కకొడుకు మాత్రమే గలుగుతాడు. ఎవరికి ఏది కావాలో మీరే కోరుకోండి. అన్నాడు. సగరుడి భార్యలిద్దరిలో ఒకరు తనకు అరవైవేలమంది కొడుకులు కావాలని కోరుకున్నది.

ఏకం వంశధరం త్వేకా తథేత్యాహ తతో మునిః ।
కేశి న్యసూత సగరా దసమఞ్జసమాత్మజమ్ ।
రాజా పఞ్చజనో నామ బభూవ స మహాద్యుతిః ॥ 67 ॥

వేరొకతె తనకు వంశోద్ధారకు డయిన కొడుకు ఒక్కడిని కోరుకున్నది.'అలాగే జరుగుతుంది' అన్నాడు మహర్షి.వారిలో కేశిని సగరుడివలన అసమంజసుడు అనేకొడుకును కన్నది. తేజస్వి అయిన అతడు పంచజనుడు అనేపేరుతో ప్రసిద్ధుడయినాడు.

ఇతరా సుషువే తుమ్బీం బీజపూర్ణా మితి శ్రుతిః ।
తత్ర షష్టిసహస్రాణి గర్భా స్తే తిలసమ్మితాః ॥ 68 ॥

సగరుడిరెండవభార్య ఒక మాంసముద్దను అని ప్రసిద్ధి. అందులో నువ్వుగింజంత పరిమాణంలో అరవైవేల పిండాలు ఉన్నాయి.

సమ్బభూవు ర్యథాకాలం వవృధుశ్చ యథాసుఖమ్ ।
ఘృతపూర్ణేషు కుమ్భేషు తాన్ గర్భాన్ నిదధే తతః ॥ 69 ॥

ఆమె ప్రసవించినవెంటనే ఆపిండాలను నేతితో నిండినకుండలలో ఉంచింది. ఆపిండాలు సమయాను గుణంగా కుమారులుగా ఏర్పడ్డారు. సుఖంగా పెరిగారు.

ధాత్రీ శ్చైకైకశః ప్రాదాత్ తావతీః పోషణే నృపః ।
తతో దశసు మాసేషు సముత్తస్థు ర్యథాక్రమమ్ ।
కుమారా స్తే యథాకాలం సగరప్రీతివర్ధనాః ॥ 70 ॥

ఆపిండాలను పోషించడానికి సగరుడు ఒక్కొక్కగర్భానికి ఒక్కొక్క దాదిని ఏర్పాటు చేశాడు. పదినెలలూ నిండగానే క్రమంగా కాలానుగుణంగా ఆ పిండాలనుండి కుమారులు జన్మించారు. సగరుడికి సంతోషం అతిశయించింది.

షష్టిపుత్రసహస్రాణి తస్యైవమభవన్ ద్విజాః ।
గర్భాదలాబుమధ్యా ద్వై జాతాని పృథివీపతేః ॥ 71 ॥

విప్రులారా! ఈవిధంగా సగరుడికి ఆ మాంసపిండమునుండి అరవైవేలమంది సంతానం కలిగారు.

తేషాం నారాయణం తేజః ప్రవిష్టానాం మహాత్మనామ్ ।
ఏకః పఞ్చజనో నామ పుత్రో రాజా బభూవ హ ॥ 72 ॥

మహానుభావు లయిన సగరుడికొడుకులు అందరిలోనూ నారాయణతేజస్సు ప్రవేశించింది. సగరపుత్రులలో కేశినికి గలిగిన పంచజనుడు (అసమంజసుడు) అనేకొడుకు రాజు అయ్యాడు.

సుతః పఞ్చజన స్యాసీ దంశుమాన్ నామ వీర్యవాన్ ।
దిలీప స్తస్య తనయః ఖట్వాఙ్గ ఇతి విశ్రుతః ॥ 73 ॥

పంచజనుడికి పరాక్రమవంతు డయిన అంశుమంతుడు అనేకొడుకు కలిగాడు. అంశుమంతుడికొడుకు దిలీపుడు. ఇతడు ఖట్వాంగుడు అనేపేరుతో ప్రసిద్ధు డయినాడు.

యేన స్వర్గా దిహాగత్య ముహూర్తం ప్రాప్య జీవితమ్ ।
త్రయో ఽభిసంధితా లోకా బుద్ధ్యా సత్యేన చానఘాః ॥ 74 ॥

ఇతడు స్వర్గానికి వెళ్లివచ్చాడు. పుణ్యాత్ములారా! స్వర్గంనుంచి వచ్చిన వెంటనే ఒకముహూర్తకాలంలో తన బుద్ధివైభవంతోనూ, సత్యనిష్ఠతోనూ మూడులోకాలనూ ఏకం చేశాడు.

దిలీపస్య తు దాయాదో మహారాజో భగీరథః ।
య స్స గఙ్గాం సరిచ్ఛ్రేష్ఠా మవతారయత ప్రభుః ॥ 75 ॥

దిలీపుడికొడుకు మహారాజయిన భగీరథుడు. భగీరథుడు నదులలో ఉత్తమమైన గంగను భూమికి దింపాడు.

సముద్ర మానయ చ్చైనాం దుహితృత్వ మకల్పయత్ ॥ 76 ॥

ఆగంగను సముద్రంలోకి తీసుకునివెళ్లాడు. ఈవిధంగా (భూమిమీదకి తేవటం, సముద్రుడికి భార్యగా అప్పగించడం అనేపనులవలన) గంగ భగీరథుడికి కూతురు అయింది.

తస్మాద్ భాగీరథీ గఙ్గా కథ్యతే వంశచిన్తకైః ।
భగీరథసుతో రాజా శ్రుత ఇత్యభివిశ్రుతః ॥ 77 ॥

అందువల్ల (భగీరథుడికి కూతురు కావటంవల్ల) వంశచరిత్ర తెలిసినవాళ్లు గంగను భాగీరథి అంటారు. భగీరథుడికొడుకు అయిన మహారాజు శ్రుతుడు అని ప్రసిద్ధుడు.

నాభాగస్తు శ్రుత స్యాసీత్ పుత్రః పరమధార్మికః ।
అమ్బరీష స్తు నాభాగి స్సిన్ధుద్వీప పితాఽభవత్ ॥ 78 ॥

శ్రుతుడికొడుకు నాభాగుడు. ఇతడు ధార్మికులలో శ్రేష్ఠుడు. నాభాగుడి కొడుకు అంబరీషుడు. అంబరీషుడికొడుకు సింధుద్వీపుడు.

అయుతాజిత్తు దాయాద స్సిన్ధుద్వీపస్య వీర్యవాన్ ।
అయుతాజిత్సుత స్త్వాసీ దృతుపర్ణో మహాయశాః ॥ 79 ॥

సింధుద్వీపుడి కొడుకు అయుతాజిత్తు. ఇతడు గొప్పబలవంతుడు. అయుతాజిత్తు కొడుకు ఋతుపర్ణుడు. ఇతడు గొప్ప కీర్తిమంతుడు.

దివ్యాక్షహృదయజ్ఞో వై రాజా నలసఖో బలీ ।
ఋతుపర్ణసుత స్త్వాసీ దార్తపర్ణి ర్మహాయశాః ॥ 80 ॥

ఋతుపర్ణమహారాజు దివ్యమైన అక్షహృదయం అనే విద్య తెలిసినవాడు. నలమహారాజు మిత్రుడు. బలవంతుడు. ఋతుపర్ణుడి కొడుకు ఆర్తపర్ణి. ఇతడు కీర్తిమంతుడు.

సుదాస స్తస్య తనయో రాజా ఇన్ద్రసఖో౽భవత్ ।
సుదాసస్య సుతః ప్రోక్త స్సౌదాసో నామ పార్థివః ॥ 81 ॥

ఆర్తపర్ణి కొడుకు సుదాసుడు. ఇతడు ఇంద్రుడిచెలికాడు. సుదాసుడితనయుడు సౌదాసుడు అనే భూపాలుడు.

ఖ్యాతః కల్మాషపాదో వై రాజా మిత్రసహో౽భవత్ ।
కల్మాషపాదస్య సుత స్సర్వకర్మేతి విశ్రుతః ॥ 82 ॥

సౌదాసమహారాజు కల్మాషపాదుడు, మిత్రసహుడు అనేపేర్లతో ప్రసిద్ధ డయినాడు. కల్మాషపాదుడికొడుకు సర్వకర్మ అని ప్రసిద్ధుడు.

అనరణ్యస్తు పుత్రో౽భూద్ విశ్రుత స్సర్వకర్మణః ।
అనరణ్యసుతో నిఘ్నో నిఘ్నతో ద్వౌ బభూవతుః ॥ 83 ॥

సర్వకర్మ కొడుకు అనరణ్యుడు. ఇతడు లోకప్రసిద్ధ డయినాడు. అనరణ్యుడి కొడుకు నిఘ్నుడు. నిఘ్నుడికి ఇద్దరు కొడుకులు కలిగారు.

అనమిత్రో రఘు శ్చైవ పార్థివర్షభసత్తమౌ ।
అనమిత్రసుతో రాజా విద్వాన్ దులిదుహో౽భవత్ ॥ 84 ॥

వారు అనమిత్రుడు, రఘువు అనేవారు. ఇద్దరూ రాజులలో ఉత్తములు. అనమిత్రుడి కొడుకు దులిదుహుడు. ఇతడు పండితుడు.

దిలీప స్తస్య పుత్రో౽భూ ద్రామస్య ప్రపితామహః ।
దీర్ఘబాహు ర్దిలీపస్య రఘు ర్నామ్నా సుతో౽భవత్ ॥ 85 ॥

అనమిత్రుడి కొడుకు దిలీపుడు. ఇతడు శ్రీరాముడికి ముత్తాత. దిలీపుడికి రఘువు అనేకొడుకు కలిగాడు. రఘుమహారాజు మిక్కిలి పరాక్రమవంతుడు.

అయోధ్యాయాం మహారాజో రఘురాసీన్మహాబలః ।
అజస్తు రాఘవో జజ్ఞే తస్మా ద్దశరథోఽ భవత్ ॥ 86 ॥

బలవంతుడయిన రఘువు అయోధ్యకు మహారాజు అయి అయోధ్యానగరంలో (రాజధాని) ఉండేవాడు. రఘుమహారాజు కొడుకు అజుడు. అజుడికొడుకు దశరథుడు.

రామో దశరథా జ్జజ్ఞే ధర్మాత్మా సుమహాయశాః ।
రామస్య తనయో జజ్ఞే కుశ ఇత్యభివిశ్రుతః ॥ 87 ॥

దశరథుడిపుత్రుడు శ్రీరాముడు. ఇతడు మంచికీర్తిమంతుడు. రాముడి కొడుకు కుశుడు అని అంతటా ప్రసిద్ధుడు.

అతిథిస్తు కుశా జ్జజ్ఞే ధర్మాత్మా సుమహాయశాః ।
అతిథే స్త్వభవత్ పుత్రో నిషధో నామ వీర్యవాన్ ॥ 88 ॥

కుశమహారాజు తనయుడు అతిథి. ఇతడు మంచికీర్తికలవాడు. అతిథికి నిషధుడు అనేకొడుకు కలిగాడు. నిషధుడు గొప్పశక్తిమంతుడు.

నిషధస్య నలః పుత్రో నభః పుత్రో నలస్య చ ।
నభస్య పుణ్డరీకస్తు క్షేమధన్వా తత స్స్మృతః ॥ 89 ॥

నిషధుడి కొడుకు నలుడు. నలుడితనయుడు నభుడు. నభుడిపుత్రుడు పుండరీకుడు. పుండరీకుడి కొడుకు క్షేమధన్వుడు.

క్షేమధన్వసుత స్త్వాసీ ద్దేవానీకః ప్రతాపవాన్ ।
ఆసీ దహీనగు ర్నామ దేవానీకాత్మజః ప్రభుః ॥ 90 ॥

క్షేమధన్వుడికొడుకు దేవానీకుడు. ఇతడు పరాక్రమవంతుడు. దేవానీకుడి కొడుకు అహీనగువు అనేవాడు. ఇతడు సమర్థుడు.

అహీనగోస్తు దాయాద స్సుధన్వా నామ పార్థివః ।
సుధన్వన స్సుత శ్చాపి తతో జజ్ఞే శలో నృపః ॥ 91 ॥

అహీనగువు కొడుకు సుధన్వుడు అనేభూపాలుడు. సుధన్వుడి కొడుకు శలుడు అనే జనపాలకుడు.

ఉక్యో నామ స ధర్మాత్మా శలపుత్రో బభూవ హ ।
వజ్రనాభస్సుతస్తస్య నలస్తస్య మహాత్మనః ॥ 92 ॥

శలుడితనయుడు ఉక్యుడు. ఇతడు ధార్మికుడు. ఉక్యుడి పుత్రుడు వజ్రనాభుడు. ఆ వజ్రనాభుడి సుతుడు నలుడు.

నలౌ ద్వా వేవ విఖ్యాతౌ పురాణే మునిసత్తమాః ।
వీరసేనాత్మజ శ్చైవ య శ్చైక్ష్వాకుకులోద్వహః ॥ 93 ॥

మునివరులారా! పురాణాలలో నలుడు అనేపేరుతో ఇద్దరు ప్రసిద్ధులు. ఒకడు వీరసేనుడి కొడుకు. రెండవవాడు ఇక్ష్వాకుకులంలో జన్మించినవాడు.

ఇక్ష్వాకువంశప్రభవాః ప్రాధాన్యేన ప్రకీర్తితాః ।
ఏతే వివస్వతో వంశే రాజానో భూరితేజసః ॥ 94 ॥

ఇక్ష్వాకువంశంలో పుట్టినవారు ప్రముఖంగా కీర్తింపబడ్డారు. మిక్కిలి తేజోవంతుడయిన వివస్వంతుడివంశంలో పుట్టినరాజులు వీరు.

పఠన్ సమ్య గిమాం సృష్టి మాదిత్యస్య వివస్వతః ।

శ్రాద్ధదేవస్య దేవస్య ప్రజానాం పుష్టిదస్య చ ।
ప్రజావానేతి సాలోక్య మాప్నుయాచ్చ వివస్వతః ॥ 95 ॥

శ్రాద్ధదేవుడని పేర్కొనబడే అదితి తనయుడయిన వివస్వంతుడి సంతానమూ, దీప్తిమంతుడయిన శ్రాద్ధదేవుడి సంతానసౌష్ఠవమూ శ్రద్ధగా చదివినవాడు, (విన్నవాడు) సంతానాన్ని పొందుతాడు. చివరలో సూర్యలోకానికి చేరుకుంటాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే ఆదిత్యవంశానుకీర్తనం నామ షష్ఠోఽధ్యాయః ॥ 6 ॥

శ్రీబ్రహ్మపురాణంలో ఆదిత్యవంశానుకీర్తనం అనే ఆరవఅధ్యాయం సంపూర్ణం.



సప్తమోఽధ్యాయః - ఏడవ అధ్యాయం

సోమోత్పత్తికథనమ్ - సోమోత్పత్తికథనం

లోమహర్షణ ఉవాచ:- లోమహర్షణుడు మునులతో ఇలా చెప్తున్నాడు.

పితా సోమస్య భో విప్రా జజ్ఞేఽత్రి ర్భగవాన్ ఋషిః ।
బ్రహ్మణో మానసాత్ పూర్వం ప్రజాసర్గం విధిత్సతః ॥ 1 ॥

ఓ బ్రాహ్మణులారా! పూర్వం సృష్ట్యారంభంలో ప్రజలను సృష్టించడానికి పూనుకున్న బ్రహ్మదేవుడి మనస్సు నుండి(బ్రహ్మమానసపుత్రుడుగా)మహానుభావు డయిన అత్రి మహర్షి జన్మించాడు. అత్రిమహర్షి సోముడికి తండ్రి.

అనుత్తరం నామ తపో యేన తప్తం మహత్ పురా ।
త్రీణి వర్షసహస్రాణి దివ్యానీతి హి న శ్రుతమ్ ॥ 2 ॥

పూర్వం ఆ అత్రిమహర్షి మూడువేలదివ్యసంవత్సరాలు అనుత్తరం అనేపేరు గలిగిన గొప్పతపస్సు చేశాడని (పురాణాదులలో) వినబడుతున్నది.

ఊర్ధ్వ మాచక్రమే తస్య రేత స్సోమత్వ మీయివత్ ।
నేత్రాభ్యాం వారి సుస్రావ దశధా ద్యోతయన్ దిశః ॥ 3 ॥

తపస్తీవ్రతచేత అత్రిమహర్షి తేజస్సు పైకి (ఆకాశం) అంతటా వ్యాపించింది. ఆరేతస్సు చంద్రధర్మం (చల్లనికాంతి ముద్ద)గా ఏర్పడింది. అత్రిమహర్షి కన్నులనుండి పదిదిక్కులను తెలియజేస్తూ (దిక్కు లన్నింటా నిండి), పదిధారలుగా నీరు కారింది.

తం గర్భం విధినా హృష్టా దశ దేవ్యో దధు స్తతః ।
సమేత్య ధారయామాసు ర్న చ తా స్సమశక్నువన్ ॥ 4 ॥

బ్రహ్మవచనాల ననుసరించి పదిదిక్కుల దేవతలు ఒక్కటిగా ఏర్పడి ఆకాంతికిరణసముదాయాన్ని గర్భంగా ధరించారు. కాని ఆతేజస్సును గర్భంలో ఉంచుకోవడం వాళ్లకు సాధ్యం కాలేదు.

యదా న ధారణే శక్తా స్తా గర్భస్య దిశో దశ ।
తతస్తాభి స్సహైవాశు నిపపాత వసుంధరామ్ ॥ 5 ॥

దిగ్దేవతలు పదిమంది ఆ అత్రిమహర్షితేజస్సును గర్భంలో ధరించలేక ఒక్కసారిగా భూమిమీదికి జారవిడిచారు.

పతితం సోమ మాలోక్య బ్రహ్మా లోకపితామహః ।
రథమారోపయామాస లోకానాం హితకామ్యయా ॥ 6 ॥

లోకాలకు అన్నింటికీ పితామహుడయిన బ్రహ్మ లోకాలకు మేలు చేసేకోరికతో నేలమీద పడిన ఆతేజస్సును చూచి, దానిని తనరథం మీదికి ఎక్కించుకున్నాడు.

తస్మిన్నిపతితే దేవాః పుత్రేఽ త్రే స్సుమహాత్మనః ।
తుష్టువు ర్బ్రహ్మణః పుత్రా స్తథాన్యే మునిసత్తమాః ॥7 ॥

మహాత్ముడయిన అత్రిమహర్షికి కుమారుడయిన సోముడు ఆవిధంగా నేలమీదపడటం, (దానిని బ్రహ్మ రక్షించటం) చూచి బ్రహ్మకుమారులు అందరూ సంతోషించారు. అలాగే ఇతరమునివరులు కూడా అందరూ ఆనందించారు.

తస్య సంస్తూయమానస్య తేజస్సోమస్య భాస్వతః ।
ఆప్యాయనాయ లోకానాం భావయామాస సర్వతః ॥ 8 ॥

ప్రకాశిస్తున్న చంద్రునికాంతికిరణసముదాయం లోకాలను రక్షించటంకోసం అన్నివైపులా నిండింది. (వెన్నెల లోక మంతటా వ్యాపించింది.) చంద్రకిరణాలవల్ల ఓషధులవృద్ధి, దానివల్ల లోకాలకు నిరామయత్వంవల్ల చక్కటిపోషణ సంభవిస్తున్నాయి.

స తేన రథముఖ్యేన, సాగరాన్తాం వసున్ధరామ్ ।
త్రి స్సప్తకృత్వోఽ తియశా శ్చకారాభిప్రదక్షిణామ్ ॥9 ॥

బ్రహ్మదేవుడిరథం మీద ఉన్న సోముడు ఆరథంతో సహా, సముద్రపర్యంతమైన ఈభూమండలం మొత్తం ఇరవైఒక్కపర్యాయాలు ప్రదక్షిణం చేశాడు.

తస్య యత్ స్రావితం తేజః పృథివీం సమపద్యత ।
ఓషధ్య స్తా స్సముద్భూతా యాభి స్సన్ధార్యతే జగత్ ॥10 ॥

అపుడు చంద్రుడినుండి వెలువడిన కాంతి నేలమీదకు చేరింది. దానినుండి ఓషధులు పుట్టాయి. ఆఓషధుల వలననే లోకాలకు రక్షణ, పోషణ కలుగుతున్నది.

స లబ్ధతేజా భగవాన్ సంస్తవైస్తైశ్చ కర్మభిః ।
తప స్తేపే మహాభాగాః పద్మానాం దశతీ ర్దశ ॥ 11 ॥

దేవతలు మునులు చేసిన స్తోత్రాలవల్లనూ, తన ఘనకర్మలచేతనూ, సోముడితేజస్సు ఇంకా వృద్ధిచెందింది. ఆమహాత్ముడు వేయికోట్లసంవత్సరాలు తపస్సు చేశాడు.

తత స్తస్మై దదౌ రాజ్యం బ్రహ్మా బ్రహ్మవిదాం వరః ।
బీజౌషధీనాం విప్రాణా మపాం చ మునిసత్తమాః ॥12 ॥

మునివరులారా! బ్రహ్మవేత్తలలో శ్రేష్ఠుడయిన బ్రహ్మదేవుడు అపుడు సోముడిని బీజ, ఓషధి, బ్రాహ్మణ, జలసామ్రాజ్యానికి రాజును చేశాడు.

స తత్ ప్రాప్య మహారాజ్యం సోమ స్సౌమ్యవతాం వరః ।
సమాజహ్రే రాజసూయం సహస్రశతదక్షిణామ్ ॥13 ॥

ఉత్తమకాంతిమంతుడయిన సోముడు ఆరాజ్యాన్ని పొంది, రాజసూయయాగం చేశాడు. ఆయాగంలో లక్షలలో దక్షిణ లిచ్చాడు.

దక్షిణా మదదాత్ సోమ స్త్రీన్ లోకానితి న శ్రుతమ్ ।
తేభ్యో బ్రహ్మర్షిముఖ్యేభ్య స్సదస్యేభ్యశ్చ భో ద్విజాః ॥ 14 ॥

విప్రులారా! సోముడు ఆ రాజసూయయాగంలో బ్రహ్మర్షులు మొదలయినవారికీ, సదస్యులకు కూడా అందరికీ మూడు లోకాలనూ దక్షిణగా ఇచ్చాడని మేము విన్నాం.

హిరణ్యగర్భో బ్రహ్మాత్రి ర్భృగుశ్చ ఋత్విజోఽభవన్ ।
సదస్యోఽభూ ద్ధరి స్తత్ర మునిభి ర్బహుభిర్వృతః ॥ 15 ॥

ఆ యాగంలో హిరణ్యగర్భుడయిన బ్రహ్మే సాక్షాత్తుగా బ్రహ్మస్థానంలో కూర్చున్నాడు. అత్రి, భృగుమహర్షులు ఋత్విక్కులు అయినారు. పెక్కుమంది మహర్షులు తనను పరివేష్ఠింపగా, సాక్షాత్తు శ్రీమహావిష్ణువు సదస్యు డయినాడు.

సినీవాలీ కుహూశ్చైవ ద్యుతిః పుష్టిః ప్రభా వసుః ।
కీర్తి ర్ధృతిశ్చ లక్ష్మీశ్చ నవ దేవ్య స్సిషేవిరే ॥ 16 ॥

సినీవాలి, కుహువు,ద్యుతి, పుష్టి, ప్రభ, వసువు, కీర్తి, ధృతి, లక్ష్మి అనేతొమ్మిదిమంది దేవకాంతలు సోముడిని సేవించారు. (చంద్రుడిరాజసూయయాగంలో సన్నిహితమై ఉన్నారు.)

ప్రాప్యావభృథ మవ్యగ్ర స్సర్వదేవర్షిపూజితః ।
విరరాజాధిరాజేన్ద్రో దశధా భాసయన్ దిశః ॥ 17 ॥

సమస్తమైన దేవతలచేతనూ, మహర్షులచేతనూ పూజింపబడిన చంద్రుడు అవభృథస్నానం చేశాడు. పది దిక్కులనూ కాంతులతో నింపుతూ, రాజాధిరాజుగా ప్రకాశించాడు.

తస్య తత్ ప్రాప్య దుష్ప్రాప్య మైశ్వర్య మృషిసత్కృతమ్ ।
విబభ్రామ మతి స్తా తా వినయాదనయాహృతా ॥ 18 ॥

మహర్షులసత్కారంతో ఎవరూ పొందలేని గొప్పరాజ్యాధికారాన్ని పొందిన సోముడికి మతి భ్రమించింది. బుద్ధి అహంకరించింది. నీతిమాలింది.

బృహస్పతే స్స వై భార్యా మైశ్వర్యమదమోహితః ।
జహార తరసా సోమో విమత్యాఙ్గిరస స్సుతమ్ ॥19॥

ప్రభుత్వంవల్ల గలిగిన అహంకారంతో అజ్ఞానంతో, సోముడు బృహస్పతిని లెక్క చేయకుండా, ఆతడిభార్య (తార)ను బలాత్కారంగా అపహరించాడు.

స యాచ్యమానో దేవైశ్చ తథా దేవర్షిభిర్ముహుః ।
నైవ వ్యసర్జయత్తారాం తస్మై చాఙ్గిరసే తదా ॥ 20 ॥

దేవతలూ, దేవర్షులూ ఎన్నో పర్యాయాలు ప్రార్థించారు. కాని సోముడు తారను విడిచిపెట్టలేదు. బృహస్పతికి (అంగిరసునిపుత్రుడు) అప్పగించలేదు.

ఉశనా తస్య జగ్రాహ పార్ష్ణి మాఙ్గిరసస్య హ ।
రుద్రశ్చ పార్ష్ణిం జగ్రాహ గృహీ త్వాజగవం ధనుః ॥ 21 ॥

శుక్రాచార్యుడు చంద్రుడికి అండగా (బృహస్పతితో యుద్ధానికి) వచ్చాడు. పినాకం అనేధనుస్సును పట్టుకుని రుద్రుడు బృహస్పతికి అండగా నిలిచాడు.

తేన బ్రహ్మశిరో నామ పరమాస్త్రం మహాత్మనా ।
ఉద్దిశ్య దేవా నుత్సృష్టం యే నైషాం నాశితం యశః ॥ 22 ॥

మహాత్ముడయిన రుద్రుడు దేవతలను లక్ష్యంగా చేసుకుని ఉత్తమమైన బ్రహ్మశిరం అనే అస్త్రాన్ని ప్రయోగించాడు. దానివల్ల దేవతలకు అపఖ్యాతి వచ్చింది.

తత్ర తద్యుద్ధ మభవత్ ప్రఖ్యాతం తారకామయమ్ ।
దేవానాం దానవానాం చ లోకక్షయకరం మహత్ ॥ 23 ॥

క్రమంగా దేవతలకూ, దానవులకూ లోకా లన్నిటినీ నాశనం చేసే మహాయుద్ధం జరిగింది. ఆయుద్ధం తారకామయం అని ప్రసిద్ధమయింది.

తత్ర శిష్టాస్తు యే దేవా స్తుషితాశ్చైవ యే ద్విజాః ।
బ్రహ్మాణం శరణం జగ్ము రాదిదేవం సనాతనమ్ ॥ 24 ॥

బ్రహ్మశిరోనామకాస్త్రంచేత నశించిపోగా, మిగిలినదేవతలు, తుషితులు అనేవారూ, దేవాదిదేవుడూ, సనాతనుడూ అయిన బ్రహ్మను శరణు పొందారు.

తదా నివా ర్యోశనసం తం వై రుద్రం చ శఙ్కరమ్ ।
దదా వఙ్గిరసే తారాం స్వయమేవ పితామహః ॥ 25 ॥

అపుడు బ్రహ్మదేవుడు శుక్రాచార్యుడినీ, శివుడయిన రుద్రుడినీ యుద్ధంనుండి వారించాడు. తారను స్వయంగా బృహస్పతికి అప్పగించాడు.

తా మన్తఃప్రసవాం దృష్ట్వా క్రుద్ధః ప్రాహ బృహస్పతిః ।
మదీయాయాం న తే యోనౌ గర్భో ధార్యః కథంచన ॥ 26 ॥

అపుడు బృహస్పతి గర్భవతి అయిన తారను చూచి, కోపంతో 'నాదానవయిన నీలో ఇంకొకరికి సంబంధించిన గర్భం ఉండడం సరి కాదు' అన్నాడు.

ఇషీకా స్తమ్బ మాసాద్య గర్భం సా చోత్ససర్జ హ ।
జాతమాత్ర స్స భగవాన్ దేవానా మాక్షిపద్ వపుః ॥ 27 ॥

అపుడు తార తెల్లు(ముంజగడ్డి)పొదవద్దకు వెళ్లి, అక్కడ తనగర్భాన్ని జారవిడిచింది. అక్కడ జన్మించినశిశువు పుట్టినవెంటనే దేవతాశరీరాన్ని ధరించింది.

తత స్సంశయ మాపన్నా స్తారా మూచు స్సురోత్తమాః ।
సత్యం బ్రూహి సుతః కస్య సోమ స్యాథ బృహస్పతేః ॥ 28 ॥

అపుడు అనుమానించిన దేవతావరులు 'ఈబిడ్డ చంద్రుడికొడుకా, లేక బృహస్పతి కొడుకా? నిజం చెప్పు.' అని అడిగారు.

పృచ్ఛమానా యదా దేవై ర్నాహ సా విబుధాన్ కిల ।
తదా తాం శప్తు మారబ్ధః కుమారో దస్యుహన్తమః ॥ 29 ॥

దేవతలు ఎంతగా అడిగినా తార వారికి సమాధానం చెప్పలేదు. రాక్షససంహారకుడు అయిన కుమారుడు తారను శపింపబోయాడు.

తం నివార్య తదా బ్రహ్మా తారాం పప్రచ్ఛ సంశయమ్ ।
యదత్ర తథ్యం తద్ బ్రూహి తారే కస్య సుతస్త్వయమ్ ॥ 30 ॥

కుమారుడిప్రయత్నాన్ని అడ్డుకుని బ్రహ్మ ఆసందేహాన్ని తారను అడిగాడు. 'తారా! నిజ మేదో చెప్పు. ఈతడు ఎవరికుమారుడు?'

ఉవాచ ప్రాఞ్జలి స్సా తం సోమస్యేతి పితామహమ్ ।
తదా తం మూర్ధ్ని చాఘ్రాయ సోమో రాజా ప్రజాపతిః ॥ 31 ॥

తార అంజలిఘటించి బ్రహ్మతో 'చంద్రుడికొడుకు' అని చెప్పింది. అపుడు సంతానవంతుడు, రాజు అయినచంద్రుడు తనకుమారుడి శిరసు మూర్కొన్నాడు.

బుధ ఇత్యకరో న్నామ తస్య బాలస్య ధీమతః ।
ప్రతికూలం చ గగనే సమభ్యుత్తిష్ఠతే బుధః ॥ 32 ॥

చంద్రుడు బుద్ధిమంతుడయిన ఆపిల్లవాడికి బుధుడు అని పేరు పెట్టాడు. అందువల్లనే బుధుడు ఆకాశంలో బృహస్పతికి ఎదురుగా (వ్యతిరేకదిశలో) ఉదయిస్తాడు.

ఉత్పాదయామాస తదా పుత్రం వై రాజపుత్రికామ్ ।
తస్యాపత్యం మహాతేజా బభూవైలః పురూరవాః ॥ 33 ॥

బుధుడు ఒకకొడుకును, కూతురును కన్నాడు. ఆబుధుడి కొడుకు పురూరవుడు. ఇతడు (బుధుడివలన) ఇలకు జన్మించాడు. గొప్పతేజస్వి.

ఉర్వశ్యాం జజ్ఞిరే యస్య పుత్రా స్సప్త మహాత్మనః ।
ఏతత్ సోమస్య వో జన్మ కీర్తితం కీర్తివర్ధనమ్ ॥ 34 ॥

మహాత్ము డయిన పురూరవుడు ఉర్వశి అనే అప్సరఃకాంతయందు ఏడుగురు కొడుకులను కన్నాడు. చంద్రుడిజన్మవృత్తాంతం ఈవిధంగా ప్రస్తుతింపబడింది. ఇది (చదివినవారికీ, విన్నవారికీ) కీర్తిని పెంపొదిస్తుంది.

వంశమస్య మునిశ్రేష్ఠాః! కీర్త్యమానం నిబోధత ।
ధన్యమాయుష్యమారోగ్యం పుణ్యం సఙ్కల్పసాధకమ్ ॥35 ॥

మునివరులారా! ఈసోమజన్మవృత్తాంతాన్ని పఠించినవాడికి ధనమూ, ఆయువూ, ఆరోగ్యమూ, పుణ్యమూ కలుగుతాయి. ఈకథ కోరికలు అన్నిటినీ నెరవేరుస్తుంది.

సోమస్య జన్మ శ్రుత్వైవ పాపేభ్యో విప్రముచ్యతే ॥ 36 ॥

ఈసోముడి జన్మవృత్తాంతం విన్న (చదివిన)మాత్రంచేతనే సమస్త పాపాలు సమూలంగా నశించిపోతాయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణే సోమోత్పత్తికథనం నామ సప్తమోఽధ్యాయః ॥ 7 ॥

శ్రీబ్రహ్మపురాణంలో సోమోత్పత్తికథనం అనే ఏడవ అధ్యాయం సంపూర్ణం.



అష్టమోఽధ్యాయః - ఎనిమిదవ అధ్యాయం

సోమవంశ అమావసువంశానుకీర్తనమ్ - సోమవంశ అమావసువంశానుకీర్తనం

లోమహర్షణ ఉవాచ:- లోమహర్షణుడు మునులకు ఇలా చెప్తున్నాడు.

బుధస్య తు మునిశ్రేష్ఠా! విద్వాన్ పుత్రః పురూరవాః ।
తేజస్వీ దానశీలశ్చ యజ్వా విపులదక్షిణః ॥ 1 ॥

మునివరులారా! బుధుడి పుత్రుడు పురూరవుడు. ఇతడు పండితుడు. తేజోవంతుడు. దానం చేసే స్వభావం కలిగినవాడు. యజ్ఞాలు చేసినవాడు. గొప్ప గొప్ప దక్షిణలు ఇచ్చినవాడు.

బ్రహ్మవాదీ పరాక్రాన్త శ్శత్రుభి ర్యుధి దుర్దమః ।
ఆహర్తా చాగ్నిహోత్రస్య యజ్ఞానాం చ మహీపతిః ॥ 2 ॥

పురూరవుడు ఆత్మజ్ఞాని. గొప్పపరాక్రమవంతుడు. యుద్ధంలో శత్రువులకు లొంగడు. అగ్నిహోత్రాలను నిర్వహించినవాడు. యజ్ఞాలు చేసినవాడు.

సత్యవాదీ పుణ్యమతి స్సమ్యక్సంవృతమైథునః ।
అతీవ త్రిషు లోకేషు యశసాప్రతిమ స్సదా ॥ 3 ॥

సత్యమే పలికేవాడు. ధర్మకర్మలు ఆచరించాలనే బుద్ధి కలిగినవాడు. మిథునకర్మను రహస్యంగా ఆచరించేవాడు. మూడు లోకాలలోనూ సాటిలేని గొప్పకీర్తి గలిగినవాడు.

విశ్వం హి బ్రహ్మతపసా తదా తస్మిన్ సమర్పితమ్ ।
ఉర్వశీ వరయామాస హిత్వా మానం యశస్వినీ ॥ 4 ॥

పరమాత్మను గూర్చిన తపస్సుచేత (నిరంతరబ్రహ్మభావనచేత) సమస్తమూ పురూరవుడికి లోబడింది. కీర్తిమతి అయిన ఉర్వశి అనేఅప్సరస (దేవకాంతను అనే)అభిమానం వదులుకుని, (మానవు డయిన)పురూరవుడిని వరించింది.

తయా సహాఽవసద్రాజా దశవర్షాణి పఞ్చ చ ।
పఞ్చ షట్ సప్త చాష్టౌ చ ఉర్వశ్యా సహ భో ద్విజాః ॥ 5 ॥

వనే చైత్రరథే రమ్యే తదా మన్దాకినీతటే ।
అలకాయాం విశాలాయాం నన్దనే చ వనోత్తమే ॥ 6 ॥

పురూరవమహారాజు చైత్రరథం అనే అందమైన ఉద్యానవనంలో యాభైసంవత్సరాలు, మందాకినీనదీతీరంలో ఐదు సంవత్సరాలు, అలకానగరంలో ఆరుసంవత్సరాలు, విశాలానగరంలో ఏడు సంవత్సరాలు, ఉత్తమమైన నందనవనంలో ఎనిమిది సంవత్సరాలు, ఉర్వశితో కలిసి విహరించాడు.

ఉత్తరాన్ స కురూన్ ప్రాప్య మనోరమఫలద్రుమాన్ ।
గన్ధమాదనపాదేషు మేరుపృష్ఠే తథోత్తరే ॥ 7 ॥

ఉర్వశి పురూరవులు ఇంకా, అందమైన పండ్లచెట్లతో నిండిన ఉత్తరకురుభూములలోనూ, గంధమాదన పర్వతం చరియలమీద, మేరుపర్వతప్రాంతాలలోనూ, ఇంకా ఆపైన ఉత్తరప్రదేశాలలోనూ నివసించారు.

ఏతేషు వనముఖ్యేషు సురై రాచరితేషు చ ।
ఉర్వశ్యా సహితో రాజా రేమే పరమయా ముదా ॥ 8 ॥

దేవతలు విహరించే ఈప్రసిద్ధమైన ఉద్యానవనాలలో పురూరవమహారాజు ఉర్వశితో గలిసి పరమానందంగా భోగించాడు.

దేశే పుణ్యతమే చైవ మహర్షిభి రభిష్టుతే ।
రాజ్యం స కారయామాస ప్రయాగే పృథివీపతిః ॥ 9 ॥

ఆపురూరవమహారాజు మహర్షులు ప్రశంసించే ఉత్తమపుణ్యక్షేత్రమైన ప్రయాగ(రాజధాని)లో ఉండి రాజ్యాన్ని పరిపాలించాడు.

ఏవం ప్రభావో రాజాఽఽసీ దైల స్తు నరసత్తమః ।
ఉత్తరే జాహ్నవీతీరే ప్రతిష్ఠానే మహాయశాః ॥ 10 ॥

ఈవిధమైన ప్రశస్తితో ఇలా పుత్రుడయిన పురూరవమహారాజు మానవులలో ఉత్తముడయినాడు. గంగానదీతీరంలో ఉత్తరదిగ్భాగంలో ప్రతిష్ఠానరాజ్యాధిపతిగా గొప్పకీర్తిమంతుడయినాడు.

ఐలపుత్రా బభూవు స్తే సప్త దేవసుతోపమాః ।
దివి జాతా మహాత్మాన ఆయు ర్ధీమా నమావసుః ॥ 11 ॥

విశ్వాయుశ్చైవ ధర్మాత్మా శ్రుతాయుశ్చ తథాపరః ।
దృఢాయుశ్చ వనాయుశ్చ బహ్వాయుశ్చోర్వశీసుతాః ॥ 12 ॥

పురూరవుడికి కొడుకులు ఏడుగురు. వాళ్లు దేవకుమారులవంటివారు. ఆమహానుభావులజన్మ దివ్యమైనది. ఆయువు, వివేకవంతుడయిన అమావసుడు, విశ్వాయువు, ధర్మాత్ముడయిన శ్రుతాయువు, దృఢాయువు, వనాయువు, బహ్వాయువు అనే ఆఏడుగురు ఉర్వశికి పురూరవుడివలన జన్మించారు.

అమావసో స్తు దాయాదో భీమో రాజాథ రాజరాట్ ।
శ్రీమాన్ భీమస్య దాయాదో రాజాసీత్ కాఞ్చనప్రభః ॥13 ॥

అమావసువుకు పుత్రుడు భీముడు. ఆతడు రాజులకే రాజు, భీముడితనయుడు కాంచనప్రభుడు అనే మహారాజు. ఇతడు శ్రీమంతుడు.

విద్వాంస్తు కాఞ్చనస్యాపి సుహోత్రోఽభూ న్మహాబలః ।
సౌహోత్రి రభవ జ్జహ్నుః కేశిన్యా గర్భసమ్భవః ॥ 14 ॥

కాంచనప్రభుడికొడుకు సుహోత్రుడు. ఇతడు అమితబలవంతుడు. సుహోత్రుడివల్ల కేశినికి జహ్నువు జన్మించాడు.

ఆజహ్రే యో మహత్సత్రం సర్వమేధం మహామఖమ్ ।
పతిలోభేన యం గఙ్గా పతిత్వేన ససార హ ॥ 15 ॥

జహ్నువు సర్వమేధం అనే మహాయాగాన్ని చేశాడు. భర్తగా పొందాలనే కోరికతో గంగ జహ్నువును భర్తగా భావించి, అనుసరించింది.

నేచ్ఛతః ప్లావయామాస తస్య గఙ్గా తదా సదః ।
స తయా ప్లావితం దృష్ట్వా యజ్ఞవాటం సమన్తతః ॥16 ॥

జహ్నువు గంగను భార్యగా అంగీకరించలేదు. అందుచేత గంగ ఆయజ్ఞవాటికను జలప్రవాహంతో ముంచెత్తింది. జహ్నువు దానిని గమనించాడు.(11.83)

సౌహోత్రి రశపద్ గఙ్గాం క్రుద్ధో రాజా ద్విజోత్తమాః ।
ఏష తే విఫలం యత్నం పిబ న్నమ్భః కరోమ్యహమ్ ॥ 17 ॥

మునిసత్తములారా! సుహోత్రుడికొడుకు అయిన జహ్నువు గంగపై కోపించాడు. 'నీలోని నీళ్ళన్నీ త్రాగి, నీప్రయత్నం నిష్ఫలం చేస్తాను'.

అస్య గఙ్గేఽవలేపస్య సద్యః ఫలమవాప్నుహి ।
రాజర్షిణా తతః పీతాం గఙ్గాం దృష్ట్వా మహర్షయః ।

ఉపనిన్యుర్మహాభాగాం దుహితృత్వేన జాహ్నవీమ్ ॥18 ॥

'గంగా, నీవు చేసిన యీ అవమానానికి తగినఫలితాన్ని ఇపుడే అనుభవిస్తావు'. అని రాజర్షి అయినజహ్నువు గంగను త్రాగివేశాడు. అక్కడి మహర్షులు అది చూచి, ఆమెను జహ్నుమహర్షికి కూతురును చేశారు. (జహ్నువు కూతురు కావడంచేత గంగకు జాహ్నవి అనేపేరు వచ్చింది.)

యువనాశ్వస్య పుత్రీం తు కావేరీం జహ్ను రావహత్ ॥19 ॥

యువనాశ్వుడి కూతురయిన కావేరిని జహ్నువు వివాహం చేసుకున్నాడు.

యువనాశ్వస్య శాపేన గఙ్గార్ధేన వినిర్గతా ।
కావేరీం సరితాం శ్రేష్ఠాం జహ్నో ర్భార్యా మనిన్దితామ్ ॥ 20 ॥

యువనాశ్వుడు ఇచ్చిన శాపంచేత గంగనుండి సగభాగం విడిపోయి, జహ్నువుభార్య అయిన కావేరీనదిలో కలిసింది. కావేరి నదులలో ఉత్తమమైనది. పుణ్యప్రదమైనది. (11.87)

జహ్ను స్తు దయితం పుత్రం సునన్దం నామ ధార్మికమ్ ।
కావేర్యాం జనయామాస అజక స్తస్య చాత్మజః ॥ 21 ॥

జహ్నువు కావేరియందు సునందుడు అనే కొడుకును గన్నాడు. అతడు ధార్మికుడు. సునందుడికొడుకు అజకుడు.

అజకస్య తు దాయాదో బలాకాశ్వో మహీపతిః ।
బభూవ మృగయాశీలః కుశస్తస్యాత్మజోఽ భవత్ ॥ 22 ॥

అజకుడి కొడుకు బలాకాశ్వుడు అనేభూపాలుడు. బలాకాశ్వుడికి కుశుడు జన్మించాడు. వేటాడటం ఇతని స్వభావం.

కుశపుత్రా బభూవు ర్హి చత్వారో దేవవర్చసః ।
కుశికః కుశనాభశ్చ కుశామ్బో మూర్తిమాం స్తథా ॥ 23 ॥

కుశుడికి నలుగురు కొడుకులు గలిగారు. దేవతాతేజస్సు కలిగినవారు-కుశికుడు, కుశనాభుడు, కుశాంబుడు, మూర్తిమంతుడు.

పహ్లవై స్స నిరాక్రామ ద్రాజా వనచర స్తదా ।
కుశిక స్తు తప స్తేపే పుత్ర మిన్ద్రసమం ప్రభుమ్ ॥ 24 ॥

లభేయ మితి తం శక్ర స్త్రాసా దభ్యేత్య జజ్ఞివాన్ ।
పూర్ణే వర్షసహస్రే వై తత శ్శక్రో హ్యపశ్యత ॥ 25 ॥

కుశికమహారాజు పల్లవులచేతిలో ఓడిపోయి, అరణ్యాలలో సంచరించేవాడు. పిదప కుశికుడు ఇంద్రుడితో సమానంగా, సమర్థుడయిన పుత్రుడిని పొందాలని తపస్సు చేశాడు. తపస్సులో వేయేండ్లు నిండినాయి. కుశికుడితీవ్రమైన తపస్సుకు భయపడిన దేవేంద్రుడు కుశికుడిని దర్శించాడు.

అత్యుగ్రతాపసం దృష్ట్వా సహస్రాక్షః పురన్దరః ।
సమర్థం పుత్రజననే స్వయ మే వాన్వపద్యత ।
పుత్రత్వం కల్పయామాస దేవేన్ద్ర స్సురసత్తమః ॥ 26 ॥

వేయికన్నులు గలవాడూ, పురందరుడూ అయిన దేవేంద్రుడు కుశికుడి తపస్సుతీవ్రతను గ్రహించాడు. తనతపశ్శక్తిచేత కుశికుడు తానుకోరుకున్నట్లు ఇంద్రుడితో సమానమయిన పుత్రుడిని పొందటానికి తగినవాడని గుర్తించాడు. అందుకే దేవతలలో శ్రేష్ఠుడయిన ఇంద్రుడు స్వయంగా తానే కుశికుడికి పుత్రుడు అయినాడు.

స గాధి రభవ ద్రాజా మఘవాన్ కౌశిక స్స్వయమ్ ॥27 ॥

దేవేంద్రుడు స్వయంగా, కుశికుడికి కొడుకుగా, గాధి అనేమహారాజుగా జన్మించాడు.

పౌరుకుత్సా చ తద్భార్యా గాధి స్తస్యా మజాయత ।
గాధేః కన్యా మహాభాగా నామ్నా సత్యవతీ శుభా ॥ 28 ॥

కుశికుడిభార్య పురుకుత్సమహారాజు కూతురు (పౌరుకుత్స). ఆమెకు గాధి జన్మించాడు. గాధికి ఒకకూతురు గలిగింది. ఆమెపేరు సత్యవతి. ఆమహాత్మురాలు శుభంకరురాలు.

తాం గాధిః కావ్యపుత్రాయ ఋచీకస్య దదౌ ప్రభుః ।
తస్యాః ప్రీత స్స వై భర్తా భార్గవో భృగునన్దనః ॥ 29 ॥

గాధి తనకూతురిని శుక్రాచార్యుడితనయుడయిన ఋచీకుడికి (భార్యగా) ఇచ్చాడు. భృగు(శుక్ర)కుమారుడయిన ఋచీకుడికి భార్యపై (ఆమె చేసినసేవలవలన) అనుగ్రహం కలిగింది.

పుత్రార్థం సాధయామాస చరుం గాధే స్తథైవ చ ।
ఉవాచాహూయ తాం భార్యా మృచీకో భార్గవ స్తదా ॥ 30 ॥

అందువల్ల ఆమెకూ, గాధికీ ఇద్దరికీ పుత్రసంతానం కలుగజేయడానికి చరువును (యజ్ఞద్రవ్యం) సిద్ధం చేశాడు. ఋచీకుడు భార్యను పిలిచి (ఆమెతో) ఇలా అన్నాడు.

ఉపయోజ్య శ్చరు రయం త్వయా మాత్రా త్వయం తవ ।
తస్యాం జనిష్యతే పుత్రో దీప్తిమాన్ క్షత్రియర్షభః ।
అజేయః క్షత్రియై ర్లోకే క్షత్రియర్షభసూదనః ॥ 31 ॥

ఇదిగో ఈచరువును నీతల్లిని స్వీకరించ మని చెప్పు. ఈచరువును నీవు ఉపయోగించు. దీనివల్ల నీతల్లికి క్షత్రియోత్తముడూ, తేజస్వీ, క్షత్రియులకు జయింపరానివాడు, క్షత్రియులను నిర్మూలించేవాడూ అయిన తనయుడు కలుగుతాడు.

తవాపి పుత్రం కల్యాణి! ధృతిమన్తం తపోధనమ్ ।
శమాత్మకం ద్విజశ్రేష్ఠం చరు రేష విధాస్యతి ॥ 32 ॥

కల్యాణీ! ఈచరువువలన ధైర్యవంతుడూ, ఇంద్రియనిగ్రహం కలిగినవాడూ అయిన ఉత్తమబ్రాహ్మణుడు నీకు జన్మిస్తాడు.

ఏవ ముక్త్వా తు తాం భార్యా మృచీకో భృగునన్దనః ।
తపస్యభిరతో నిత్య మరణ్యం ప్రవివేశ హ ॥ 33 ॥

భార్యతో ఈవిధంగా చెప్పి భృగుకుమారుడయిన ఋచీకుడు తపస్సుమీది ఆసక్తితో అడవులకు వెళ్లాడు.

గాధి స్సదార స్తు తదా ఋచీకాశ్రమమభ్యగాత్ ।
తీర్థయాత్రాప్రసఙ్గేన సుతాం ద్రష్టుం నరేశ్వరః ॥ 34 ॥

గాధిమహారాజు భార్యతో కలిసి తీర్థయాత్రలు చేస్తూ, సందర్భవశంగా కూతురిని చూద్దామని ఋచీకుడి (అల్లుడి) ఆశ్రమానికి వెళ్లాడు.

చరుద్వయం గృహీత్వా తు ఋషే స్సత్యవతీ తదా ।
చరు మాదాయ యత్నేన సా తు మాత్రే న్యవేదయత్ ॥ 35 ॥

అపుడు సత్యవతి (తనకూ, తనతల్లికీ) ఋచీకుడు ఇచ్చినచరువులు రెండింటినీ తీసుకుని, జాగ్రత్తగా తల్లికి అందజేసింది.

మాతా తు తదభేదేన దుహిత్రే స్వం చరుం దదౌ ।
తస్యాశ్చరుమథాజ్ఞానా దాత్మసంస్థం చకార హ ॥ 36 ॥

చరువులు రెంటికీ భేదం లేకపోవడంచేత (రెండూ ఒకేవిధంగా ఉండడంవల్ల) సత్యవతితల్లి తెలియక తాను తీసుకోవలసిన చరువును కూతురు కిచ్చింది. కూతురు పుచ్చుకోవలసిన చరువును తాను స్వీకరించింది.

అథ సత్యవతీ గర్భే క్షత్రియాన్తకరం తదా ।
ధారయామాస దీప్తేన వపుషా ఘోరదర్శనా ॥ 37 ॥

అందుచేత సత్యవతి క్షత్రియకులాన్ని నాశనం చేసేబిడ్డను తనగర్భంలో ధరించింది. ఆగర్భంవల్ల సత్యవతి శరీరం మిక్కిలిగా ప్రకాశిస్తూ, భయంకరంగా కనబడింది.

తా మృచీక స్తతో దృష్ట్వా యోగే నాభ్యనుసృత్య చ ।
తతోఽ బ్రవీ ద్ద్విజశ్రేష్ఠ స్స్వాం భార్యాం వరవర్ణినీమ్ ॥ 38 ॥

ఋచీకుడు తనభార్యతేజస్సునూ రూపాన్ని చూచి,యోగశక్తితో యథార్థాన్ని గ్రహించాడు. ఆబ్రాహ్మణోత్తముడు (ఋచీకుడు) సుందరి అయిన తనభార్యతో ఇలా అన్నాడు.

మాత్రాఽసి వఞ్చితా భద్రే చరువ్యత్యాసహేతునా ।
భవిష్యతి హి పుత్ర స్తే క్రూరకర్మాఽతిదారుణః ॥ 39 ॥

కల్యాణీ, నీతల్లివల్ల మోసం జరిగింది. మీరు ఇద్దరూ పుచ్చుకోవలసిన చరువు తారుమారు కావటంవల్ల నీకు క్రూరమైన కర్మలు ఆచరించేవాడూ, మిక్కిలి భయంకరుడూ ఐన పుత్రుడు కలుగుతాడు.

భ్రాతా జనిష్యతే చాపి బ్రహ్మ భూత స్తపోధనః ।
విశ్వం హి తపసా బ్రహ్మమయా తస్మిన్ సమర్పితమ్ ॥ 40 ॥

నీకు సోదరుడు బ్రహ్మజ్ఞానీ, తపస్సంపన్నుడూ అవుతాడు. (అట్టివాడు నీతల్లికి జన్మిస్తాడు.) పరమాత్మతో నిండినతపశ్శక్తి సమస్తమూ నీతల్లి పుచ్చుకున్నచరుభాగంలోనే ఉంచబడింది.

ఏవ ముక్తా మహాభాగా భర్త్రా సత్యవతీ తదా ।
ప్రసాదయామాస పతిం పుత్రో మే నేదృశో భవేత్ ।
బ్రాహ్మణాపసద స్తత్ర ఇత్యుక్తో మునిరబ్రవీత్ ॥ 41 ॥

ఋచీకుడు ఈవిధంగా చెప్పగా విని సత్యవతి 'నాకొడుకు బ్రాహ్మణవంశానికి అపకీర్తిని తెచ్చేనీచుడు కాకూడదు'. అని భర్తను ప్రార్థించి ప్రసన్నం చేసుకుంది. అపుడు ఋచీకుడు అనుగ్రహంతో ఇలా అన్నాడు.

నైష సఙ్కల్పితః కామో మయా భద్రే తథాస్త్వితి ।
ఉగ్రకర్మా భవేత్ పుత్రః పితు ర్మాతుశ్చ కారణాత్ ॥ 42 ॥

భద్రురాలా! ఈవిధంగా జరగాలని నేను సంకల్పించలేదు. తల్లిదండ్రులకారణంగానే కొడుకు దుర్మార్గుడు అవుతాడు.

పున స్సత్యవతీ వాక్య మేవ ము క్త్వాబ్రవీదిదమ్ ।
ఇచ్ఛన్ లోకా నపి మునే సృజేథాః కిం పున స్సుతమ్ ॥ 43 ॥

సత్యవతి మళ్లీ ఇలా అన్నది – మహామునీ! మీరు తలుచుకుంటే సమస్తమైన లోకాలనూ సృష్టించగలరు. ఒక్కకొడుకును సృష్టించలేరా?

శమాత్మక మృజుం త్వం మే పుత్రం దాతుమిహార్హసి ।
కామమేవంవిధః పౌత్రో మమ స్యాత్తవ చ ప్రభో ॥ 44 ॥

యద్యన్యథా న శక్యం వై కర్తుమేతద్ద్విజోత్తమ ।

నిగ్రహవంతుడూ, ఋజువర్తనుడూ అయిన కొడుకును నాకు అనుగ్రహించదగుదువు. బ్రాహ్మణోత్తమా! అటువంటిదుర్మార్గుడు జన్మించకుండా ఆపడం సాధ్యం కానిపక్షంలో, కొడుకు కాకుండ మనకు మనుమడు దుర్మార్గుడు కావచ్చును'

తతః ప్రసాద మకరోత్ స తస్యా స్తపసో బలాత్ ॥ 45 ॥

అపుడు ఋచీకుడు భార్యను కరుణించి, తనతపశ్శక్తితో ఆమె కోరినవిధంగా కొడుకు ఉత్తమబ్రాహ్మణుడు అయ్యేవిధంగా అనుగ్రహించాడు.

పుత్రే నాస్తి విశేషో మే పౌత్రే వా వరవర్ణిని ।
త్వయా యథోక్తం వచనం తథా భద్రే భవిష్యతి ॥ 46 ॥

సుందరీ! శుభలక్షణా! నాదృష్టిలో (దుర్మార్గు డయ్యేవాడు) కొడుకయినా, మనుమడయినా, తేడా ఏమీ లేదు. అయినా నీవు చెప్పినప్రకారంగానే జరుగుతుంది.

తత స్సత్యవతీ పుత్రం జనయామాస భార్గవమ్ ।
తపస్యభిరతం దాన్తం జమదగ్నిం శమాత్మకమ్ ॥ 47 ॥

తరువాత సత్యవతి జమదగ్నిని ప్రసవించింది. అతడు తపస్సుపైన అత్యధికమైన ఆసక్తి కలవాడు. శాంతుడు. భృగువంశంలో ఉత్తముడు.

భృగో శ్చరువిపర్యాస ఐన్ద్రవైష్ణవయోః పురా ।
యజనా ద్వైష్ణవార్ధాంశో జమదగ్నిరజాయత ॥ 48 ॥

పూర్వం భృగుకుమారుడయిన ఋచీకమహర్షి ఇంద్రుడికీ, విష్ణువుకూ, ఉద్దేశించినచరువులను తనభార్యకూ, అత్తగారికీ ఇవ్వడంలో తారుమారు జరిగింది. అందులో విష్ణుసంబంధమైన సగభాగంవలన సత్యవతికి జమదగ్ని జన్మించాడు.

సా హి సత్యవతీ పుణ్యా సత్యధర్మపరాయణా ।
కౌశికీతి సమాఖ్యాతా ప్రవృ త్తేయం మహానదీ ॥ 49 ॥

సత్యధర్మనిష్ఠ కలిగిన పుణ్యవతి అయిన సత్యవతి కౌశికి అనేపేరుతో మహానదిగా వర్తిస్తున్నది.

ఇక్ష్వాకువంశప్రభవో రేణు ర్నామ నరాధిపః ।
తస్య కన్యా మహాభాగా కామలీ నామ రేణుకా ॥ 50 ॥

ఇక్ష్వాకువంశంలో రేణువు అనే జనపాలకుడు జనించాడు. ఆయనకూతురు కామలి. మహాత్మురాలు. ఈమెనే రేణుక అంటారు.

రేణుకాయాం తు కామల్యాం తపోవిద్యాసమన్వితః ।
ఆర్చీకో జనయామాస జామదగ్న్యం సుదారుణమ్ ॥ 51 ॥

గొప్పతపస్వీ, విద్యావంతుడు అయిన(ఋచీకుడితనయుడు) జమదగ్ని కామలియందు జామదగ్నుడిని కన్నాడు. అతడు భయంకరుడు.

సర్వవిద్యాన్తగం శ్రేష్ఠం ధనుర్వేదస్య పారగమ్ ।
రామం క్షత్రియహన్తారం ప్రదీప్తమివ పావకమ్ ॥ 52 ॥

సమస్తమైనవిద్యలు సమగ్రంగా తెలిసినవాడు. ధనుర్వేదం ఆసాంతం తెలిసినవాడు. ఉత్తముడు. క్షత్రియులను సంహరించేవాడు. మండుతున్న అగ్నివంటివాడు. అతడిపేరు (భార్గవ) రాముడు.

ఔర్వస్యైవ మృచీకస్య సత్యవత్యాం మహాయశాః ।
జమదగ్ని స్తపోవీర్యా జ్జజ్ఞే బ్రహ్మవిదాం వరః ।
(మధ్యమశ్చ శునశ్శేఫ శ్శునఃపుచ్ఛః కనిష్ఠః) ॥ 54 ॥

ఈవిధంగా బ్రహ్మజ్ఞానులలో ఉత్తముడూ, గొప్పకీర్తిమంతుడూ అయిన ఋచీకుడు తనతపశ్శక్తిచేత సత్యవతియందు జమదగ్నిని కన్నాడు. (మధ్యముడు శునశ్శేపుడు, చివరివాడు శునఃపుచ్ఛుడు)

విశ్వామిత్రం తు దాయాదం గాధిః కుశికనన్దనః ।
జనయామాస పుత్రం తు తపోవిద్యాశమాత్మకమ్ ॥ 55 ॥

కుశికతనయుడయిన గాధికి తపస్వీ, విద్యావంతుడూ, శాంతుడూ అయిన విశ్వామిత్రుడు జన్మించాడు.

ప్రాప్య బ్రహ్మర్షిసమతాం యోఽయం బ్రహ్మర్షితాం గతః ।
విశ్వామిత్ర స్తు ధర్మాత్మా నామ్నా విశ్వరథ స్స్మృతః ॥ 56 ॥

క్షత్రియుడయిన విశ్వామిత్రుడు క్రమంగా బ్రహ్మఋషులతో సమానస్థితిని సంపాదించి, బ్రహ్మర్షి అయ్యాడు. అతడు ధర్మస్వరూపుడు. ఇతడికి మరోపేరు విశ్వరథుడు.

జజ్ఞే భృగుప్రసాదేన కౌశికా ద్వంశవర్ధనః ।
విశ్వామిత్రస్య చ సుతా దేవరాతాదయ స్స్మృతాః ॥ 57 ॥

భృగుమహర్షి అనుగ్రహంచేత కౌశికుడయిన విశ్వామిత్రుడివలన కౌశికవంశాన్ని విస్తరించేవాడు జన్మించాడు. (విశ్వామిత్రుడివలన కౌశికవంశం విస్తరించింది.) విశ్వామిత్రుడికి దేవరాతుడు మొదలయిన కొడుకులు గలిగారు.

ప్రఖ్యాతా స్త్రిషు లోకేషు తేషాం నామా న్యతః పరమ్ ।
దేవరాతః కతిశ్చైవ యస్మాత్ కాత్యాయనా స్స్మృతాః ॥ 58 ॥

విశ్వామిత్రుడికొడుకులు అందరూ మూడులోకాలలోనూ ప్రసిద్ధులు. వారిపేర్లు ఇవి. 1. దేవరాతుడు 2. కతి. ఇతడికి కలిగినసంతానమే కాత్యాయనులు.

శాలావత్యాం హిరణ్యాక్షో రేణు ర్జజ్ఞేఽథ రేణుకః ।
సాంకృతి ర్గాలవశ్చైవ ముద్గల శ్చైవ విశ్రుతః ॥ 59 ॥

విశ్వామిత్రుడికి శాలావతి అనేస్త్రీయందు 3. హిరణ్యాక్షుడు, 4. రేణువు. వీరిలో రేణువుకు రేణుకుడు, సాంకృతి, గాలవుడు, ప్రసిద్ధుడయిన ముద్గలుడు అనే పుత్రులు కలిగారు.

మధుచ్ఛన్దో జయశ్చైవ దేవలశ్చ తథాష్టకః ।
కచ్ఛపో హారిత శ్చైవ విశ్వామిత్రస్య తే సుతాః ॥ 60 ॥

విశ్వామిత్రుడికుమారులు ఇంకా, 5. మధుచ్ఛందుడు, 6. జయుడు, 7. దేవలుడు, 8. అష్టకుడు. (కచ్ఛపుడు, హారితుడు అనేవారు కూడ విశ్వామిత్రుడికొడుకులు. (చూ. 67 శ్లో)

తేషాం ఖ్యాతాని గోత్రాణి కౌశికానాం మహాత్మనామ్ ।
ప్రాణినో బభ్రవశ్చైవ ధ్యానజప్యా స్తథైవ చ ॥ 61 ॥

పార్థివా దేవరాతాశ్చ శాలఙ్కాయనబాష్కలాః ।
లోహితా యమదూతాశ్చ తథా కారూషకా స్స్మృతాః ॥ 62 ॥

మహాత్ములయిన ఈకౌశికులవలన వీరివంశాలు ప్రత్యేకంగా ప్రసిద్ధ మయ్యాయి. ప్రాణులు, బభ్రువులు, ధ్యానజప్యులు, పార్థివులు, దేవరాతులు, శాలంకాయనులు, బాష్కలులు, లోహితులు, యమదూతలు, కారూషకులు.

(సౌశ్రవాః కౌశికా శ్చైవ తథాన్యే సైన్ధవాయనాః దేవలా రేణవ శ్చైవ యాజ్ఞవల్క్యాశ్చ మర్షణాః ।
ఔదుమ్బరామ్బుభిష్ణావా స్తారకాయణచుంచులాః శాలవత్యా హిరణాక్షా స్సాంకృత్యా గాలవా స్తథా ।
నారాయణి ర్నర శ్చాన్యే విశ్వామిత్రస్య ధీమతః ఋష్యన్తరవివాహ్యాశ్చ కౌశికా బహవ స్స్మృతాః ॥)

(సౌశ్రవులు, కౌశికులు, సైంధవాయనులు, దేవలులు, రేణువులు. యాజ్ఞవల్క్యుడికి మర్షణుడు.ఔదుంబరులు, అంబుభిష్ణావులు, తారకాయణులు, చుంచులులు, శాలవత్యులు హిరణ్యాక్షులు, సాంకృత్యులు, గాలవులు, జ్ఞాని అయినవిశ్వామిత్రుడికి నరుడు నారాయణి అనే మరొకఇద్దరు మహర్షులు కూడ కలిగారు. ఇంకా కౌశికవంశీయులు చాలామంది ఉన్నారు.)

పౌరవస్య మునిశ్రేష్టా బ్రహ్మర్షేః కౌశికస్య చ ।
సమ్బన్ధోఽ ప్యస్య వంశేఽ స్మిన్ బ్రహ్మక్షత్రస్య విశ్రుతః ॥ 63 ॥

మునివరులారా! పౌరవుడికీ, బ్రహ్మర్షి అయిన విశ్వామిత్రుడికీ ఉన్నసంబంధంవలన బ్రాహ్మణ, క్షత్రియవంశాలకు బాంధవ్యం ప్రసిద్ధమయింది.

విశ్వామిత్రాత్మజానాం తు శునశ్శేఫోఽ గ్రజ స్స్మృతః ।
భార్గవః కౌశికత్వం హి ప్రాప్త స్స మునిసత్తమః ॥ 64 ॥

విశ్వామిత్రుడితనయులలో శునశ్శేఫుడు పెద్దవాడు. భృగువంశంలో పుట్టిన ఆమునిశ్రేష్ఠుడు కౌశికత్వాన్ని పొందాడు.

విశ్వామిత్రస్య పుత్రస్తు శునశ్శేఫోఽ భవత్ కిల ।
హరిశ్చన్ద్రస్య యజ్ఞే తు పశుత్వే వినియోజితః ॥ 65 ॥

విశ్వామిత్రుడిపుత్రుడయిన శునశ్శేఫుడు హరిశ్చంద్రమహారాజు చేసిన యజ్ఞంలో (బలిపశువుగా) నియోగింపబడ్డాడు.

దేవై ర్దత్త శ్శునశ్శేఫో విశ్వామిత్రాయ వై పునః ।
దేవై ర్దత్త స్స వై యస్మా ద్దేవరాత స్తతోఽ భవత్ ॥ 66 ॥

ఆయజ్ఞంలో బలి కాకుండా, దేవతలు ఆతడిని రక్షించి, తిరిగి విశ్వామిత్రుడికి అప్పగించారు. దేవతలచేత రక్షింపబడినాడు కాబట్టి శునశ్శేఫుడు దేవరాతుడు అయినాడు.

దేవరాతాదయ స్సప్త విశ్వామిత్రస్య వై సుతాః ।
దృషద్వతీసుత శ్చాపి వైశ్వామిత్ర స్తథాష్టకః ॥ 67 ॥

దేవరాతుడు మొదలయినవారు ఏడుగురు? విశ్వామిత్రుడికొడుకులు. దృషద్వతికి జన్మించిన అష్టకుడు కూడ విశ్వామిత్రుడి తనయుడే.

అష్టకస్య సుతో లౌహిః ప్రోక్తో జహ్నుగణో మయా ।
అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి వంశ మాయో ర్మహాత్మనః ॥ 68 ॥

అష్టకుడి కొడుకు లౌహి. విప్రులారా! ఈవిధంగా జహ్నువుకు సంబంధించిన సంతానవిశేషాలను గురించి వివరించాను. ఇక పైన ఆయువుకు సంబంధించినవంశాన్ని గురించి చెప్తాను. అన్నాడు లోమహర్షణుడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే సోమవంశేఽ మావసువంశానుకీర్తనం నామాష్టమోఽ ధ్యాయః ॥ 8 ॥

శ్రీబ్రహ్మపురాణంలో సోమవంశంలో అమావసువంశానుకీర్తనం అనే ఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

నవమోఽ ధ్యాయః - తొమ్మిదవ అధ్యాయం

సోమవంశవృద్ధక్షత్రప్రసూతినిరూపణమ్ - సోమవంశ వృద్ధక్షత్రప్రసూతి నిరూపణం

లోమహర్షణ ఉవాచ:- లోమహర్షణుడు మునులకు ఇలా చెప్తున్నాడు.

ఆయోః పుత్రాశ్చ తే పఞ్చ సర్వే వీరా మహారథాః ।
స్వర్భానుతనయాయాం చ ప్రభాయాం జజ్ఞిరే నృపాః ॥ 1 ॥

ఆయువు కొడుకులు ఐదుగురు. అందరూ మహారథులయిన వీరులు. ఈ రాజులు ఆయువుకు రాహువుకుమార్తె అయిన ప్రభయందు జన్మించారు.

నహుషః ప్రథమం జజ్ఞే వృద్ధశర్మా తతః పరమ్ ।
రమ్భో రజి రనేనాశ్చ త్రిషు లోకేషు విశ్రుతః ॥ 2 ॥

ఆఐదుగురిలో మొదటివాడు నహుషుడు. అతడితర్వాత వృద్ధశర్మ, రంభుడు, రజి, అనేనసుడు అనేవాళ్లు కలిగారు. వీరు అందరూ ముల్లోకాలలోనూ ప్రసిద్ధులు.

రజిః పుత్రశతానీహ జనయామాస పఞ్చ వై ।
రాజేయమితి విఖ్యాతం క్షత్రమిన్ద్రభయావహమ్ ॥ 3 ॥

రజి అనేవాడికి ఐదువందలమంది కొడుకులు పుట్టారు. ఈరాజసమూహానికి రాజేయం అని పేరు. వీరు ఇంద్రుడిని గూడ భయపెట్టగలిగినవారు.

యత్ర దేవాసురే యుద్ధే సముత్పన్నే తు దారుణే ।
దేవాశ్చైవాసురాశ్చైవ పితామహమథాబ్రువన్ ॥ 4 ॥

ఒకప్పుడు దేవతలకూ, రాక్షసులకూ భయంకరమైన యుద్ధం సంభవించింది. ఆసమయంలో వారు ఇద్దరూ బ్రహ్మతో ఇలా అన్నారు.

దేవాసురా వూచతుః:- దేవతలూ, రాక్షసులూ బ్రహ్మదేవుడితో ఇలా అంటున్నారు.

ఆవయో ర్భగవన్ యుద్ధే కో విజేతా భవిష్యతి ।
బ్రూహి న స్సర్వభూతేశ శ్రోతుమిచ్ఛామ తత్త్వతః ॥ 5 ॥

మహాత్మా! సమస్తభూతకోటికీ ప్రభువువైన బ్రహ్మదేవా! మాయిద్దరికీ నడుమ నడుస్తున్న ఈయుద్ధంలో ఎవరు జయిస్తారు? వినగోరుతున్నాము. చెప్పు.

బ్రహ్మోవాచ:- బ్రహ్మదేవుడు దేవాసురులతో ఇలా చెప్తున్నాడు.

యేషా మర్థాయ సఙ్గ్రామే రజి రాత్తాయుధః ప్రభుః ।
యోత్స్యన్తే తే విజేష్యన్తి త్రీన్ లోకాన్ నాత్ర సంశయః ॥ 6 ॥

ఈయుద్ధంలో రజి ఎవరికోసం ఆయుధం ధరించి యుద్ధం చేస్తాడో వారే ముల్లోకాలూ జయిస్తారు. ఇందులో అనుమానం లేదు.

యతో రజి ర్ధృతి స్తత్ర శ్రీ శ్చ తత్ర యతో ధృతిః ।
యతో ధృతిశ్చ శ్రీశ్చైవ ధర్మస్తత్ర జయస్తథా ॥ 7 ॥

రజి ఉన్నచోట ధృతి, ధృతి ఉన్నచోట శ్రీ శ్రీఉన్నచోట ధృతి శ్రీధృతి ఉన్నచోట ధర్మము జయముఉంటాయి.

తే దేవా దానవాః ప్రీతా దేవే నోక్తా రజిం తదా ।
అభ్యయు ర్జయ మిచ్ఛన్తో వృణ్వానా స్తం నరర్షభమ్ ॥ 8 ॥

దానవులూ బ్రహ్మదేవుడిమాటలకు సంతోషించారు. ఇద్దరూ జయంకోసం ఎవరికి వారు రజిని తమపక్షంలోకి తెచ్చుకోవాలనుకున్నారు. ఇద్దరూ రజివద్దకు వెళ్లారు.

స హి స్వర్భానుదౌహిత్రః ప్రభాయాం సమపద్యత ।
రాజా పరమతేజస్వీ సోమవంశవివర్ధనః ॥ 9 ॥

ఆ రజి రాహువు దౌహిత్రుడికి (కూతురు కొడుకుకు) ప్రభయందు జన్మించాడు. ఆమహారాజు మిక్కిలి పరాక్రమవంతుడు. సోమవంశాన్ని చక్కగా అభివృద్ధిలోకి తెచ్చినవాడు.

తే హృష్టమనస స్సర్వే రజిం వై దేవదానవాః ।
ఊచు రస్మజ్జయాయ త్వం గృహాణ వరకార్ముకమ్ ॥ 10 ॥

దేవతలూ, దానవులూ అందరూ జయం విషయంలో చాలా సంతోషించారు. రజితో ఇలా అన్నారు. 'మావిజయంకోసం నీవు మాపక్షాన శ్రేష్ఠమైనవిల్లు ధరించాలి'.

అథోవాచ రజి స్తత్ర తయో ర్వై దేవదైత్యయోః ।
అర్థజ్ఞ స్స్వార్థ ముద్దిశ్య యశ స్స్వం చ ప్రకాశయన్ ॥ 11 ॥

లాభనష్టాలు తెలిసినవాడు కాబట్టి, తన ప్రయోజనాన్ని గూడ ఉద్దేశించి, తనపేరు నిలిచేవిధంగా, రజి ఆదేవదానవులతో ఇలా అన్నాడు.

రజి రువాచ :–రజి ఇంద్రుడితో ఈవిధంగా అంటున్నాడు.

యది దైత్యగణాన్ సర్వాన్ జిత్వా వీర్యేణ వాసవ! ।
ఇన్ద్రో భవామి ధర్మేణ తతో యోత్స్యామి సంయుగే ॥12 ॥

మహేంద్రా! నేను ఇంద్రుడిని అయ్యేపక్షంలో (ఇంద్రుడిని చేస్తే), నాపరాక్రమంతో దానవులసమూహాలను అన్నింటినీ జయిస్తాను. అపుడు ధర్మయుక్తంగా, నేను దేవతలపక్షాన యుద్ధం చేస్తాను.

దేవాః ప్రథమతో విప్రాః ప్రతీయు ర్హృష్టమానసాః ।
ఏవం యథేష్టం నృపతే కామ స్సమ్పద్యతాం తవ ॥ 13 ॥

మొదట దేవతలూ, తర్వాత బ్రాహ్మణులూ ఆనందంగా ఆమోదించారు. నీయిష్టప్రకారమే జరుగుతుంది. నీకోరిక నెరవేరుతుంది' అన్నారు.

శ్రుత్వా సురగణానాం తు వాక్యం రాజా రజి స్తదా ।
పప్రచ్ఛాసురముఖ్యాంస్తు యథా దేవా నపృచ్ఛత ॥ 14 ॥

దేవతలవచనాలను విని, రజిమహారాజు దేవతలను అడిగినవిధంగానే రాక్షసప్రముఖులను గూడా అడిగాడు.

దానవా దర్పసమ్పూర్ణా స్స్వార్థమేవావగమ్య హ ।
ప్రత్యూచుస్తం నృపవరం సాభిమానమిదం వచః ॥ 15 ॥

గర్వంతో నిండిన రాక్షసులు తమప్రయోజనాన్ని మాత్రమే ఉద్దేశించి, ఆరజిమహారాజుతో గర్వంగా ఇలా అన్నారు.

దానవా ఊచుః:– రజితో దానవులు ఇలా అంటున్నారు.

అస్మాక మిన్ద్రః ప్రహ్రాదో యస్యార్థం విజయామహే ।
అస్మింస్తు సమరే రాజం స్తిష్ఠ త్వం రాజసత్తమ ॥ 16 ॥

'మాకు రాజు ప్రహ్రాదుడు. ఆయనకోసమే మేము జయించాలని కోరుకుంటున్నాం. రాజోత్తమా! నీవు ఈయుద్ధంలో మాకు అండగానిలువు

స తథేతి బ్రువన్నేవ దేవై రప్యతిచోదితః ।
భవిష్యసీన్ద్రో జిత్వైనం దేవై రుక్తస్తు పార్థివః ॥17 ॥

అపుడు రజి సరే అన్నాడు. దేవతలు రజిని యుద్ధానికి ప్రోత్సహించారు. 'రాక్షసులను జయించి నీవు దేవతలకు ఇంద్రుడివి కా' అన్నారు.

జఘాన దానవాన్ సర్వాన్ యేఽవధ్యా వజ్రపాణినః ।
స విప్రనష్టాం దేవానాం పరమశ్రీ శ్శ్రియం వశీ ।
నిహత్య దానవాన్ సర్వా నాజహార రజిః ప్రభుః ॥ 18 ॥

అపుడు వజ్రపాణి అయిన దేవేంద్రుడు చంపలేని ఆదానవుల నందరినీ రజిమహారాజు సంహరించాడు. ఆవిధంగా రాక్షసులను చంపి, రజిమహారాజు అంతకు పూర్వం రాక్షసులచేతిలో ఓడి దేవతలు పోగొట్టుకున్న సంపదలను దేవతలకు తిరిగి ఇచ్చాడు.

తతో రజిం మహావీర్యం దేవై స్సహ శతక్రతుః ।
రజిపుత్రోఽహ మిత్యుక్త్వా పునరేవాబ్రవీద్ వచః ॥ 19 ॥

అపుడు దేవేంద్రుడు దేవతలతో కలిసివచ్చి, ఆరజిమహారాజును చూసి, నేను రజిమహారాజు పుత్రుడను, (అని రజికి తండ్రితో సమానమైన గౌరవాన్ని ఇచ్చి) తిరిగి ఇలా అన్నాడు.

ఇన్ద్రోఽసి తాత దేవానాం సర్వేషాం నాత్ర సంశయః ।
యస్యాహమిన్ద్రః పుత్ర స్తే ఖ్యాతిం యాస్యామి కర్మభిః ॥ 20 ॥

తండ్రీ! దేవతలకు అందరికీ నీవే ప్రభువువి. ఇందులో సందేహం లేదు. నేను చేసే పనులతో (పుత్రుడు లాగా నీకు చేసేసేవలతో) నీకు కొడుకు ననే కీర్తిని పొందుతాను.

స తు శక్రవచ శ్శ్రుత్వా వఞ్చిత స్తేన మాయయా ।
తథైవేత్యబ్రవీద్ రాజా ప్రీయమాణ శ్శతక్రతుమ్ ॥ 21 ॥

ఆరజిమహారాజు ఆదేవేంద్రుడిమాటలు విని మోసపోయాడు. ఇంద్రుడితో సంతోషంగా 'అలాగే' అన్నాడు.

తతస్తస్మింస్తు రాజర్షౌ దివం ప్రాప్తే మహీపతౌ ।
దాయాద్య మిన్ద్రా దాజహ్రూ రాజ్యం తత్తనయా రజేః ॥ 22 ॥

రాజర్షి అయిన ఆరజిమహారాజు తరువాత (కొంతకాలానికి) స్వర్గస్థుడు కాగా, ఆతడికొడుకులు ఇంద్రరాజ్యాన్ని పిత్రార్జితంగా గ్రహించారు.

పఞ్చపుత్రశతాన్యస్య తద్వై స్థానం శతక్రతోః ।
సమాక్రామన్త బహుధా స్వర్గలోకం త్రివిష్టపమ్ ॥ 23 ॥

రజిమహారాజుతనయులు అయిదువందలమంది ఆదేవేంద్రపదవినీ, త్రివిష్టపమైన స్వర్గలోకాన్ని ఆక్రమించుకున్నారు.

తే యదా తు సుసమ్మూఢా రాగోన్మత్తా విధర్మిణః ।
బ్రహ్మద్విషశ్చ సంవృత్తా హతవీర్యపరాక్రమాః ॥ 24 ॥

దానితో వాళ్లు అజ్ఞానంతో, మాత్సర్యంతో, అహంకరించి అధర్మాచరణంతో, బ్రహ్మద్వేషంతో, బలపరాక్రమాలు నశించిపోయినవారైనారు.

తతో లేభే స్వ మైశ్వర్య మిన్ద్రః స్థానం తథోత్తమమ్ ।
హత్వా రజిసుతాన్ సర్వాన్ కామక్రోధపరాయణాన్ ॥ 25 ॥

అపుడు దేవేంద్రుడు కామానికీ, క్రోధానికీ లోబడిపోయిన ఆరజిమహారాజుకొడుకులను అందరినీ సంహరించి ఉత్తమమైన ఇంద్రపదవిని పొందాడు.

య ఇదం చ్యావనం స్థానాత్ ప్రతిష్ఠానం శతక్రతోః ।
శృణుయా ద్ధారయే ద్వాఽపి న దౌర్గత్యమాప్నుయాత్ ॥ 26 ॥

ఇంద్రుడు తనపదవిని పోగొట్టుకోవడమూ, తిరిగి ఆపదవిలో నెలకొనడమూ అనే యీవృత్తాంతాన్ని విన్నా, మనసులో నిలుపుకున్నా (భావించినా), ఉత్తమగతులను పొందుతాడు.

లోమహర్షణ ఉవాచ:- లోమహర్షణుడు మునులతో ఇలా అంటున్నాడు.

రమ్భో౽ నపత్య స్త్వాసీచ్చ వంశం వక్ష్యామ్యనేనసః ।
అనేనస స్సుతో రాజా ప్రతిక్షత్రో మహాయశాః ॥ 27 ॥

(రజిమహారాజు సోదరు డయిన-2.శ్లో.) రంభుడికి సంతానం గలగలేదు. రజిమహారాజు మరోసోదరు డయిన అనేనసుడిసంతానం గురించి చెప్తాను. అనేనసుడికి కీర్తిమంతుడయిన ప్రతిక్షత్రుడు అనేమహారాజు జన్మించాడు.

ప్రతిక్షత్రసుత శ్చాసీత్ సృంజయో నామ విశ్రుతః ।
సృఞ్జయస్య జయః పుత్రో విజయ స్తస్య చాత్మజః ॥ 28 ॥

ప్రతిక్షత్రుడికి ప్రసిద్ధుడయిన సృంజయుడు జన్మించాడు. సృంజయుడికొడుకు జయుడు. జయుడితనయుడు విజయుడు.

విజయస్య కృతిః పుత్ర స్తస్య హర్యశ్వతస్సుతః ।
హర్యశ్వతసుతో రాజా సహదేవః ప్రతాపవాన్ ॥ 29 ॥

విజయుడికొడుకు కృతి. ఆకృతి పుత్రుడు హర్యశ్వతుడు. హర్యశ్వతుడిపుత్రుడు సహదేవుడు. ఈరాజు పరాక్రమవంతుడు.

సహదేవస్య ధర్మాత్మా నదీన ఇతి విశ్రుతః ।
నదీనస్య జయత్సేనో జయత్సేనస్య సఙ్కృతిః ॥ 30 ॥

సహదేవుడితనయుడు నదీనుడు. ఇతడు ధర్మాత్ముడుగా ప్రసిద్ధి పొందాడు. నదీనుడికొడుకు జయత్సేనుడు. జయత్సేనుడి తనయుడు సంకృతి.

సఙ్కృతే రపి ధర్మాత్మా క్షత్రవృద్ధో మహాయశాః ।
అనేనస స్సమాఖ్యాతః క్షత్రవృద్ధస్య చాపరః ॥ 31 ॥

సంకృతి పుత్రుడు క్షత్రవృద్ధుడు. ఇతడు ధర్మాత్ముడు. మిక్కిలి కీర్తిమంతుడు. ఇలా అనేనసుడిసంతానం గురించి చెప్పాను. ఇక క్షత్రవృద్ధుడి సంతానం గురించి చెప్తాను.

క్షత్రవృద్ధాత్మజ స్తత్ర సునహోత్రో మహాయశాః ।
సునహోత్రస్య దాయాదా స్త్రయః పరమధార్మికాః ॥ 32 ॥

క్షత్రవృద్ధుడి కొడుకు సునహోత్రుడు. ఇతడు మహాయశస్వి. సునహోత్రుడికొడుకులు ముగ్గురు. అందరూ ఉత్తములయిన ధార్మికులే.

కాశ్యశ్శల్లశ్చ ద్వా వేతౌ తథా గృత్సమదః ప్రభుః ।
పుత్రో గృత్సమదస్యాపి శునకో యస్య శౌనకః ॥ 33 ॥

వారు కాశ్యుడు, శల్లుడు అనేవారు ఇద్దరు, అలాగే మూడవవాడు గృత్సమదుడు. గృత్సమదుడికొడుకు శునకుడు. శునకుడితనయుడు శౌనకుడు.

బ్రాహ్మణాః క్షత్రియా శ్చైవ వైశ్యా శ్శూద్రా స్తథైవ చ ।
శల్లాత్మజ ఆర్ష్టిషేణ స్తనయ స్తస్య కాశ్యపః ॥ 34 ॥

ఆశౌనకుడికి బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు కలిగారు. శల్లుడితనయుడు ఆర్ష్టిషేణుడు. ఆర్ష్టిషేణుడికొడుకు కాశ్యపుడు.

కాశ్యస్య కాశిపో రాజా పుత్రో దీర్ఘతపా స్తథా ।
ధను స్తు దీర్ఘతపసో విద్వాన్ ధన్వన్తరి స్తతః ॥ 35 ॥

సునహోత్రుడితనయు డయిన కాశ్యుడి పుత్రుడు దీర్ఘతపుడు. ఈరాజు కాశీనగరాన్ని పరిపాలించాడు. దీర్ఘతపుడికి ధనువు. ధనువు తనయుడు ధన్వంతరి. ఇతడు గొప్పవిద్వాంసుడు.

తపసోఽన్తే సుమహతో జాతో వృద్ధస్య ధీమతః ।
పున ర్ధన్వన్తరి ర్దేవో మానుషే ష్విహ జన్మని ॥ 36 ॥

తస్య గేహే సముత్పన్నో దేవో ధన్వన్తరి స్తదా ।
కాశిరాజో మహారాజ స్సర్వరోగప్రణాశనః ॥ 37 ॥

బుద్ధిమంతుడయిన ధనువు చిరకాలం తపస్సు చేసి, వృద్ధుడయినాడు. ఆవృద్ధాప్యంలో అతడికి ధన్వంతరి జన్మించాడు. దేవుడయిన ఆధన్వంతరి ఈజన్మలో మానవుడుగా ధనువుఇంటిలో (ధనువు తపఃఫలంగా) జన్మించాడు. కాశీనగరానికి మహారాజు అయిన ఈధన్వంతరి సమస్తమయిన రోగాలను నిర్మూలిస్తాడు.

ఆయుర్వేదం భరద్వాజాత్ ప్రాప్యేహ స భిషక్క్రియః ।
త మష్టధా పున ర్వ్యస్య శిష్యేభ్యః ప్రత్యపాదయత్ ॥ 38 ॥

ఆధన్వంతరి భరద్వాజమహర్షి వద్ద ఆయుర్వేద విద్యను పొందాడు. ఆశాస్త్రజ్ఞానంతో వైద్యం చేశాడు. ఆవైద్యశాస్త్రాన్ని ఎనిమిదిగా (శల్యం, శాలాక్యం, కాయచికిత్స, మొద లయిన అష్టాంగాలతో) విభాగం చేసి శిష్యులకు అందించాడు.

ధన్వన్తరే స్తు తనయః కేతుమా నితి విశ్రుతః ।
అథ కేతుమతః పుత్రో వీరో భీమరథ స్స్మృతః ॥ 39 ॥

ధన్వంతరి తనయుడు కేతుమంతుడు. కేతుమంతుడికొడుకు భీమరథుడు. ఇతడు మహావీరుడు.

పుత్రో భీమరథ స్యాసీ ద్దివోదాసః ప్రజేశ్వరః ।
దివోదాస స్తు ధర్మాత్మా వారాణ స్యధిపోఽభవత్ ॥ 40 ॥

భీమరథుడితనయుడు దివోదాసుడు. ఇతడు ప్రజారంజకుడు. దివోదాసుడు గొప్పధర్మాత్ముడు. ఇతడు వారాణసికి మహారాజు అయినాడు.

ఏతస్మిన్నేవ కాలే తు పురీం వారాణసీం ద్విజాః ।
శూన్యాం నివేశయామాస క్షేమకో నామ రాక్షసః ॥ 41 ॥

ద్విజులారా! ఈతడు పరిపాలించిన రోజులలోనే క్షేమకుడు అనే రాక్షసుడు కాశీనగరాన్ని శూన్యంగా చేశాడు. (దివోదాసును ఓడించి, కాశీనగరాన్ని కొల్లగొట్టాడు. రాక్షసభయంతో నగరం నిర్జనం అయి పాడుబడింది.)

శప్తా హి సా మతిమతా నికుమ్భేన మహాత్మనా ।
శూన్యా వర్షసహస్రం వై భవిత్రీ తు న సంశయః ॥ 42 ॥

మహాత్ముడయిన నికుంభుడు 'వేయిసంవత్సరాలపాటు కాశీనగరం పాడుబడిఉంటుంది. సందేహం లేదు' అని శపించాడు. (ఆశాపం కారణంగా దివోదాసు ఓడిపోవటం, కాశీనగరం పాడుబడటం జరిగింది.)

తస్యాం హి శప్తమాత్రాయాం దివోదాసః ప్రజేశ్వరః ।
విషయాన్తే పురీం రమ్యాం గోమత్యాం సంన్యవేశయత్ ॥ 43 ॥

ఆవిధంగా నికుంభుడి శాపంచేత కాశీనగరం ప్రాభవం నశించిపోగా, దివోదాసమహారాజు ఆరాజ్యం చివరిభాగంలో గోమతీనదీతీరంలో మనోహరంగా మరో నగరాన్ని ఏర్పాటుచేశాడు.

భద్రశ్రేణ్యస్య పూర్వం తు పురీ వారాణసీ హ్యభూత్ ।
భద్రశ్రేణ్యస్య పుత్రాణాం శతముత్తమధన్వినామ్ ॥ 44 ॥

అంతకు పూర్వం ఈవారణాసీనగరం భద్రశ్రేణ్యమహారాజు ఏలుబడిలో ఉండేది. ఆభద్రశ్రేణ్యుడికుమారులు నూరుమంది. వారు ధనుర్విద్యాప్రవీణులు.

హత్వా నివేశయామాస దివోదాసో నరాధిపః ।
భద్రశ్రేణ్యస్య తద్రాజ్యం హృతం యేన బలీయసా ॥ 45 ॥

దివోదాసు వారందరినీ సంహరించాడు. బలవంతుడయిన దివోదాసు భద్రశ్రేణ్యుడిరాజ్యాన్ని ఆక్రమించు కున్నాడు. (అక్కడే నూతనంగా ఒకనగరాన్ని నిర్మించాడు.)

భద్రశ్రేణ్యస్య పుత్రస్తు దుర్దమో నామ విశ్రుతః ।
దివోదాసేన బాలేతి ఘృణయాసౌ విసర్జితః ॥ 46 ॥

భద్రశ్రేణ్యుడికుమారుడు దుర్దముడు. అతడు సుప్రసిద్ధుడు. (భద్రశ్రేణ్యుడికుమారులను చంపేటపుడు) దుర్దముడు పసివాడు కావటంచేత దివోదాసు జాలితో అతడిని చంపకుండా విడిచిపెట్టాడు.

హైహయస్య తు దాయాద్యం హృతవాన్ వై మహీపతిః ।
ఆజహ్రే పితృదాయాద్యం దివోదాసహృతం బలాత్ ॥47 ॥

భద్రశ్రేణ్యస్య పుత్రేణ దుర్దమేన మహాత్మనా ।
వైరస్యాన్తో మహాభాగాః! కృతశ్చాత్మీయతేజసా ॥ 48 ॥

పిత్రార్జితమైన హైహయుడి రాజ్యభాగాన్ని దివోదాసమహారాజు అపహరించాడు. దివోదాసు అపహరించిన తనతండ్రి రాజ్యభాగాన్ని భద్రశ్రేణ్యుడికుమారుడయిన దుర్దముడు తిరిగి సంపాదించుకున్నాడు. మహాత్ములారా! ఆవిధంగా దుర్దముడు తనపరాక్రమంతో దివోదాసుపై ప్రతీకారాన్ని తీర్చుకున్నాడు.

దివోదాసాద్ దృషద్వత్యాం వీరో జజ్ఞే ప్రతర్దనః ।
తేన బాలేన పుత్రేణ ప్రహృతం తు పునర్బలాత్ ॥ 49 ॥

దృషద్వతి అనే స్త్రీయందు దివోదాసుకు ప్రతర్దనుడు అనే వీరుడు జన్మించాడు. ప్రతర్దనుడు బాలుడయి ఉండి కూడా, దుర్దముడు అపహరించిన తండ్రిరాజ్యాన్ని బలవంతంగా తిరిగి ఆక్రమించుకున్నాడు.

ప్రతర్దనస్య పుత్రౌ ద్వౌ వత్సభర్గౌ సువిశ్రుతౌ ।
శత్రుజిద్ వత్సపుత్రోఽథ తస్య పుత్రో ఋతధ్వజః ॥ 50 ॥

ప్రతర్దనుడికి వత్సుడు, భర్గుడు అని ఇద్దరు కొడుకులు. వారు సుప్రసిద్ధులు. వారిలో వత్సుడితనయుడు శత్రుజిత్తు. ఆశత్రుజిత్తుకొడుకు ఋతధ్వజుడు.

అలర్క స్తస్య పుత్ర స్తు బ్రహ్మణ్య స్సత్యసఙ్గరః ।
అలర్కం ప్రతి రాజర్షిం శ్లోకో గీతః పురాతనైః ॥ 51 ॥

ఋతధ్వజుడికుమారుడు అలర్కుడు. ఇతడు బ్రహ్మజ్ఞానం పొందినవాడు. మాట తప్పనివాడు. రాజర్షి అయిన అలర్కుడిని గురించి ప్రాచీనులు ఒకశ్లోకం గానం చేశారు.

షష్టివర్షసహస్రాణి షష్టివర్షశతాని చ ।
యువా రూపేణ సమ్పన్నః ప్రాగాసీచ్చ కులోద్వహః ॥ 52 ॥

అలర్కుడు అరవై ఆరువేల సంవత్సరాలు యౌవనంతో రూపసంపద కలిగి వంశాన్ని ఉద్ధరించాడు.

లోపాముద్రాప్రసాదేన పరమాయురవాప సః ।
తస్యాసీత్ సుమహద్రాజ్యం రూపయౌవనశాలినః ॥ 53 ॥

ఆ లోపాముద్ర (అగస్త్యుడిభార్య) అనుగ్రహంతో అలర్కుడు సుదీర్ఘమైన ఆయువును పొందాడు. యౌవనమూ, రూపసౌందర్యమూ గలిగిన అలర్కుడికి మిక్కిలి విశాలమైనరాజ్యం ఉంది.

శాపస్యాన్తే మహాబాహు ర్హత్వా క్షేమకరాక్షసమ్ ।
రమ్యాం నివేశయామాస పురీం వారాణసీం పునః ॥ 54 ॥

(వేయిసంవత్సరాలు పాడుపోయిఉండాలనే) శాపకాలం పూర్తి అయిన తర్వాత అలర్కుడు క్షేమకుడు అనే ఆరాక్షసుడిని సంహరించాడు. వారాణసీపురాన్ని అందంగా తీర్చిదిద్దాడు.

సన్నతే రపి దాయాద స్సునీథో నామ ధార్మికః ।
సునీథస్య తు దాయాదః క్షేమో నామ మహాయశాః ॥55 ॥

సన్నతి కొడుకు సునీథుడు. ఇతడు ధర్మపరుడు. సునీథుడికుమారుడు క్షేముడు. ఇతడు గొప్పకీర్తిమంతుడు.

క్షేమస్య కేతుమాన్ పుత్ర స్సుకేతు స్తస్య చాత్మజః ।
సుకేతుతనయ శ్చాపి ధర్మకేతు రితి శ్రుతిః ॥ 56 ॥

క్షేముడికొడుకు కేతుమంతుడు. కేతుమంతుడి కుమారుడు సుకేతుడు. సుకేతువు కుమారుడు ధర్మకేతువు.

ధర్మకేతో స్తు దాయాద స్సత్యకేతు ర్మహారథః ।
సత్యకేతుసుతశ్చాపి విభు ర్నామ ప్రజేశ్వరః ॥ 57 ॥

ధర్మకేతువు కుమారుడు సత్యకేతువు. ఇతడు మహారథుడు. సత్యకేతువు కుమారుడు విభుడు. ఇతడు ప్రజారంజకుడు.

ఆనర్తశ్చ విభోః పుత్ర స్సుకుమారశ్చ తత్సుతః ।
సుకుమారస్య పుత్రస్తు ధృష్టకేతు స్సుధార్మికః ॥ 58 ॥

విభుడికొడుకు ఆనర్తుడు. ఆనర్తుడికుమారుడు సుకుమారుడు. సుకుమారుడికుమారుడు ధృష్టకేతుడు. ఇతడు గొప్పధార్మికుడు.

ధృష్టకేతో స్తు దాయాదో వేణుహోత్రః ప్రజేశ్వరః ।
వేణుహోత్రసుతశ్చాపి భర్గో నామ ప్రజేశ్వరః ॥ 59 ॥

ధృష్టకేతువు కుమారుడు వేణుహోత్రుడు. ఇతడు ఉత్తమప్రజాపాలకుడు. వేణుహోత్రుడికుమారుడు భర్గుడు అనేమహారాజు.

వత్సస్య వత్సభూమిస్తు భర్గభూమిస్తు భర్గజః ।
ఏతే త్వఙ్గిరసః పుత్రా జాతా వంశేఽథ భార్గవే ॥ 60 ॥

వత్సుడికి వత్సభూమి అనేవాడు, భర్గుడికి భర్గభూమి అనేవాడు జన్మించారు. వీరందరూ ఆంగిరసుడి సంతానం. భృగువంశంలో జన్మించినవారు.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా స్తేజోయుక్తా స్సహస్రశః ।
ఇత్యేతే కాశ్యపాః ప్రోక్తా నహుషస్య నిబోధత ॥ 61 ॥

శక్తిమంతులయిన బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, వేలకొలదిగా పుట్టారు. కాశ్యపులు అయినవీరిని గురించి చెప్పడం అయింది. ఇక నహుష వంశంవారిని గూర్చి చెప్తాను.

ఇతి శ్రీబ్రహ్మపురాణే సోమవంశే వృద్ధక్షత్రప్రసూతినిరూపణం నామ నవమోఽధ్యాయః ॥ 9 ॥

శ్రీబ్రహ్మపురాణంలో సోమవంశంలోని వృద్ధక్షత్రప్రసూతినిరూపణం అనే తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

దశమోఽధ్యాయః - పదవ అధ్యాయం

యయాతిచరితనిరూపణమ్ - యయాతిచరితనిరూపణం

లోమహర్షణ ఉవాచ :-లోమహర్షణుడు మునులకు ఇలా చెప్తున్నాడు.

ఉత్పన్నాః పితృకన్యాయాం విరజాయాం మహౌజసః ।
నహుషస్య తు దాయాదాః షడిన్ద్రోపేన్ద్రతేజసః ॥ 1 ॥

పితృకన్య అయిన విరజయందు పరాక్రమవంతుడయిన నహుషుడికి దేవేంద్రుడితో ఉపేన్ద్రునితో సమాన మైన పరాక్రమం గలిగినకొడుకులు ఆరుగురు కలిగారు.

యతి ర్యయాతి శ్శర్యాతి రాయాతి ర్యాతి రేవ చ ।
సుయాతి ష్షష్ఠ స్తేషాం వై యయాతిః పార్థివోఽభవత్ ॥2 ॥

వారు యతి, యయాతి, శర్యాతి, ఆయాతి, యాతి, ఆరవవాడు సుయాతి. వారిలో యయాతి రాజ్యాధిపతి అయినాడు.

యతి ర్జ్యేష్ఠస్తు తేషాం వై యయాతి స్తు తతఃపరమ్ ।
కకుత్స్థకన్యాం గాం నామ లేభే పరమధార్మికః ।
యతిస్తు మోక్షమాస్థాయ బ్రహ్మభూతోఽభిభవన్మునిః ॥ 3 ॥

నహుషుడికొడుకులు ఆరుగురిలోనూ యతి జ్యేష్ఠుడు. యయాతి యతికి తరువాత పుట్టినవాడు. ఉత్తమధర్మపరుడయిన యతి కకుత్స్థమహారాజు కూతురు అయిన గోవు (గోమతి)ను పెండ్లి చేసుకున్నాడు. యతి బుద్ధిని మోక్షం మీద నిలిపి, బ్రహ్మభావం పొంది ముని అయినాడు.

తేషాం యయాతిః పఞ్చానాం విజిత్య వసుధా మిమామ్ ।
దేవయానీ ముశనస స్సుతాం భార్యా మవాప సః ।
శర్మిష్ఠా మాసురీం చైవ తనయాం వృషపర్వణః ॥ 4 ॥

మిగిలిన అయిదుగురిలోనూ యయాతి ఈభూమండలాన్ని జయించి, శుక్రాచార్యులకూతు రయిన దేవయానిని భార్యగా పొందాడు. వృషపర్వుడి కూతురు అయిన శర్మిష్ఠ అనే రాక్షసకన్యను కూడ యయాతి వివాహమాడాడు.

యదుం చ తుర్వసుం చైవ దేవయానీ వ్యజాయత ।
ద్రుహ్యం చానుం చ పూరుం చ శర్మిష్ఠా వార్షపర్వణీ ॥ 5 ॥

దేవయాని యదువు, తుర్వసుడు అనే ఇద్దరు కుమారులను గన్నది. వృషపర్వుడికూతురయిన శర్మిష్ఠ ద్రుహ్యుడు, అనువు, పూరువు అనే ముగ్గురు కుమారులను గన్నది.

తస్మై శక్రో దదౌ ప్రీతో రథం పరమభాస్వరమ్ ।
సాఙ్గం చ కాఞ్చనం దివ్యం దివ్యైః పరమవాజిభిః ।
యుక్తం మనోజవై శ్శుభ్రై ర్యేన కార్యం సముద్వహన్ ॥ 6 ॥

యయాతి ఘనతకు సంతోషించి దేవేంద్రుడు యయాతికి ఉత్తమకాంతిమంతమయిన రథాన్ని కానుకగా ఇచ్చాడు. అది బంగారురథం. అన్నిభాగాలతోనూ చక్కగా కూడిఉన్నది. ఆరథానికి కట్టినగుఱ్ఱాలు దేవలోకంలో పుట్టినవి. అవి మనస్సుతో సమానమైన వేగం కలిగినవి. స్వచ్ఛమయినవి తెల్లనివి. యయాతి తనకార్యక్రమా లన్నీ ఈరథం మీద సంచరిస్తూనే నిర్వహిస్తుంటాడు.

స తేన రథముఖ్యేన షడ్రాత్రేణాజయన్ మహీమ్ ।
యయాతి ర్యుధి దుర్ధర్ష స్తథా దేవాన్ సదానవాన్ ॥ 7 ॥

ఆ యయాతి ఆ ఇంద్రరథంతోనే ఆరురాత్రులలో మొత్తం భూమండలాన్ని జయించాడు. ఓటమి ఎరుగని యయాతి యుద్ధంలో దేవతలనూ, దానవులనూ జయించాడు.

స రథః కౌరవాణాం తు సర్వేషా మభవ త్తదా ।
సంవర్తవసునామ్న స్తు కౌరవా జ్జనమేజయాత్ ॥ 8 ॥

కురోః పుత్రస్య రాజేన్ద్ర రాజ్ఞః పారీక్షితస్య హ ।
జగామ స రథో నాశం శాపాద్ గర్గస్య ధీమతః ॥ 9 ॥

ఆరథం కౌరవులందరికీ సొంతం అయింది. కురువంశీయుడయిన పరీక్షిన్మహారాజు తనయుడు జనమేజయుడు. ఇతడికే సంవర్తవసువు అనేపేరు కూడ ఉంది. గర్గమహామునిశాపం కారణంగా ఈరథం జనమేజయుడినుండి వెళ్లిపోయింది.

గర్గస్య హి సుతం బాలం స రాజా జనమేజయః ।
వాక్క్రూరం హింసయామాస బ్రహ్మహత్యా మవాప సః ॥ 10 ॥

పసివాడు, సాధువు అయిన గర్గుడి కుమారుడిని జనమేజయుడు క్రూరమైన వాక్కుతో బాధించాడు. దానివలన ఆజనమేజయుడు బ్రహ్మహత్యాపాతకం పొందాడు.

స లోహగన్ధీ రాజర్షిః పరిధావ న్నిత స్తతః ।
పౌరజానపదై స్త్యక్తో న లేభే శర్మ కర్హిచిత్ ॥ 12 ॥

ఆ పాపంవలన జనమేజయుడు ఇనుమువాసన కలిగిన శరీరంతో దిక్కుతోచక పరుగులు తీశాడు. పౌరులూ, జానపదులూ కూడ అతడిని ఆదరించలేదు. జనమేజయుడికి ఎక్కడా శాంతి లభించలేదు.

తత స్స దుఃఖసంతప్తో నాలభత్ సంవిదం క్వచిత్ ।
విప్రేన్ద్రం శౌనకం రాజా శరణం ప్రత్యపద్యత ॥ 13 ॥

దుఃఖంతో తపించిపోతున్న జనమేజయుడికి ఎక్కడా సానుభూతి దొరకలేదు. అపుడు జనమేజయమహారాజు బ్రాహ్మణోత్తముడయిన శౌనకుడిని శరణు పొందాడు.

యాజయామాస యజ్ఞేన శౌనకో జనమేజయమ్ ।
అశ్వమేధేన రాజానం పావనార్థం ద్విజోత్తమాః ॥ 14 ॥

ద్విజులారా! శౌనకుడు (బ్రహ్మహత్యాపాతకంనుండి విముక్తి గలిగించి) పవిత్రుడిని చేయటంకోసం, జనమేజయుడిచేత అశ్వమేధయాగం చేయించాడు.

స లోహగన్ధో వ్యనశత్తస్యాఽవభృథ మేత్య హ ।
స చ దివ్యరథో రాజ్ఞో వశశ్చేదిపతే స్తదా ॥ 15 ॥

జనమేజయుడి శరీరానికి పట్టుకున్న లోహగంధం అశ్వమేధయాగం చివర అవభృథస్నానం అయిన తరువాత తొలగిపోయింది. (ఇంద్రుడు యయాతికి కానుకగా ఇచ్చిన) దివ్యమైన ఆరథం చేది దేశాధిపతి అధీనంలోకి వెళ్లింది.

దత్త శ్శక్రేణ తుష్టేన లేభే తస్మాద్ బృహద్రథః ।
బృహద్రథాత్ క్రమే ణైవ గతో బార్హద్రథం నృపమ్ ॥ 16 ॥

దేవేంద్రుడు సంతోషించి, ఆదివ్యరథాన్ని బృహద్రథుడికి ఇచ్చాడు. బృహద్రథుడి నుండి క్రమంగా ఆతడి తనయుడయిన జరాసంధుడికి లభించింది.

తతో హత్వా జరాసన్ధం భీమ స్తం రథముత్తమమ్ ।
ప్రదదౌ వాసుదేవాయ ప్రీత్యా కౌరవనన్దనః ॥ 17 ॥

కౌరవకుమారుడయిన భీమసేనుడు ఆజరాసంధుడిని చంపి, ఉత్తమమైన ఆరథాన్ని సంతోషంగా వాసుదేవుడికి ఇచ్చాడు.

సప్తద్వీపాం యయాతిస్తు జిత్వా పృథ్వీం ససాగరామ్ ।
వ్యభజత్ స్వం తదా రాజ్యం పుత్రాణాం నాహుష స్తదా ॥ 18 ॥

నహుషుడితనయుడయిన యయాతి తనరాజ్యాన్ని అంటే, సప్తద్వీపాలతోనూ, సముద్రాలతోనూ కూడిన ఈభూమండలాన్ని కొడుకులకు పంచి యిచ్చాడు.

యయాతి ర్దిశి పూర్వస్యాం యదుం జ్యేష్ఠం న్యయోజయత్ ।
మధ్యే పూరుం చ రాజాన మభ్యషిఞ్చత్ స నాహుషః ॥ 19 ॥

కుమారులలో జ్యేష్ఠుడయిన యదువుకు తనరాజ్యంలో తూర్పుదిగ్భాగానికి రాజుగా నియమించాడు. రాజ్యంలో నడిమిభాగాన్ని పూరువును రాజుగా అభిషేకించాడు.

దిశి దక్షిణపూర్వస్యాం తుర్వసుం మతిమా న్నృపః ।
తైరియం పృథివీ సర్వా సప్తద్వీపా సపత్తనా ॥ 20 ॥

యథాప్రదేశమద్యాపి ధర్మేణ ప్రతిపాల్యతే ।
ప్రజా స్తేషాం పురస్తాత్తు వక్ష్యామి మునిసత్తమాః ॥ 21 ॥

వివేకి అయిన యయాతి తనరాజ్యంలోని ఆగ్నేయభాగాన్ని తుర్వసుడికి ఇచ్చాడు. యయాతి పుత్రులు పట్టణాలతో సప్తద్వీపాలతో కూడిన ఈభూమండలం మొత్తాన్నీ తండ్రి తమకు ఇచ్చిన ఆయాప్రాంతాలలో ఇప్పటికీ ధర్మంగా పరిపాలిస్తున్నారు. ఇక మీద యదువు మొదలయినవారి పుత్రులను గూర్చి చెప్తాను.

ధను ర్న్యస్య పృషత్కాంశ్చ పఞ్చభిః పురుషర్షభైః ।
జరావా నభవ ద్రాజా భార మావేశ్య బన్ధుషు ॥ 22 ॥

యయాతి ముసలివాడు అయ్యాడు. వింటినీ, బాణాలను (రాజ్యరక్షణబాధ్యతలను) వీరు లయిన తనకొడుకులు అయిదుగురికీ అప్పగించాడు. వివిధరాజకార్యనిర్వహణభారాన్ని బంధువులకు అప్పగించాడు.

నిక్షిప్తశస్త్రః పృథివీం చచార పృథివీపతిః ।
ప్రీతిమానభవద్రాజా యయాతి రపరాజితః ॥ 23 ॥

యయాతి మహారాజు ఆయుధాలను విడిచిపెట్టి, స్వేచ్ఛగా భూమండలం అంతటా సంతోషంగా సంచరించాడు.

ఏవం విభజ్య పృథివీం యయాతి ర్యదుమబ్రవీత్ ।
జరాం మే ప్రతిగృహ్ణీష్వ పుత్ర కృత్యాన్తరేణ వై ॥ 24 ॥

రాజ్యాన్ని ఈవిధంగా కొడుకులకు పంచి యిచ్చి, యయాతిమహారాజు యదువుతో ఇలా అన్నాడు. 'తనయా! నీవు నాముసలితనాన్ని స్వీకరించు'.

తరుణ స్తవ రూపేణ చరేయం పృథివీమిమామ్ ।
జరాం త్వయి సమాధాయ తం యదుః ప్రత్యువాచ హ ॥ 25 ॥

'నాముసలితనం నీ కిచ్చి, నీయౌవనరూపంతో నేను ఈభూమండలం అంతా తిరుగుతాను'. ఆమాటలకు యదువు తండ్రితో ఇలా అన్నాడు.

యదురువాచ:- యదువు యయాతితో ఈవిధంగా అంటున్నాడు.

అనిర్దిష్టా మయా భిక్షా బ్రాహ్మణస్య ప్రతిశ్రుతా ।
అనపాకృత్య తాం రాజన్ న గ్రహిష్యామి తే జరామ్ ॥ 26 ॥

'మహారాజా! నేను ఒకానొక బ్రాహ్మణుడికి భిక్ష యిస్తానని వాగ్దానం చేసి ఉన్నాను. ఆ వాగ్దానం నెరవేర్చకుండా, నీముసలితనాన్ని నేను స్వీకరింపలేను'.

జరాయాం బహవో దోషాః పానభోజనకారితాః ।
తస్మా జ్జరాం న తే రాజన్ గ్రహీతు మహముత్సహే ॥ 27 ॥

తినడం, తాగడం మొదలయిన అంశాలలో ముసలితనంవల్ల చాలా ఇబ్బందులు ఉన్నాయి. రాజా! అందుచేత నీముసలితనాన్ని స్వీకరించడానికి నేను సిద్ధంగా లేను.

సన్తి తే బహవః పుత్రా మత్తః ప్రియతరా నృప ।
ప్రతిగ్రహీతుం ధర్మజ్ఞ పుత్ర మన్యం వృణీష్వ వై ॥ 28 ॥

రాజా! నాకంటె బాగా ఇష్టమయిన కొడుకులు నీకు ఇంకా చాలామంది ఉన్నారు. ధర్మం తెలిసినవాడా! నీముసలితనాన్ని తీసుకోవడానికి మరొక కొడుకును చూసుకో'.

స ఏవ ముక్తో యదునా రాజా కోపసమన్వితః ।
ఉవాచ వదతాం శ్రేష్ఠో యయాతి ర్గర్హయన్ సుతమ్ ॥ 29 ॥

యదువు ఇలా అనేసరికి యయాతికి కోపం వచ్చింది. మాటనేర్పరి అయిన యయాతి కొడుకును నిందిస్తూ ఇలా అన్నాడు.

యయాతి రువాచ :- యయాతి యదువుతో ఈవిధంగా అంటున్నాడు.

క ఆశ్రమ స్తవాన్యోఽస్తి కో వా ధర్మో విధీయతే ।
మామనాదృత్య దుర్బుద్ధే యదహం తవ దేశికః ॥ 30 ॥

దురాత్ముడా! గురువునయిన నామాటను తిరస్కరించిన నీకు వేరే ఆశ్రమం ఏముంది? తండ్రిమాట వినడానికి మించిన ధర్మం ఎక్కడయినా చెప్పబడిందా?

ఏవ ముక్త్వా సుతం విప్రా శ్శశాపైనం స మన్యుమాన్ ।
అరాజ్యా స్తే ప్రజా మూఢ భవిష్యన్తి న సంశయః ॥ 31 ॥

ఈవిధంగా పలికి, యయాతి కోపంతో కొడుకు(యదువు)ను 'మూర్ఖుడా! నీసంతానం రాజ్యాధికారం లేకుండా పోదురు గాక! ఇది నిశ్చయం' అని శపించాడు.

ద్రుహ్యం చ తుర్వసుం చై వాప్యనుం చ ద్విజసత్తమాః ।
ఏవమేవాబ్రవీద్రాజా ప్రత్యాఖ్యాతశ్చ తైరపి ॥ 32 ॥

ద్విజశ్రేష్ఠులారా! యయాతిమహారాజు మిగిలినకొడుకులయిన ద్రుహ్యుడినీ, తుర్వసుడినీ, అనువునూ, అదేవిధంగా (తనముసలితనం తీసుకుని వారియౌవనం తన కిమ్మని) అడిగాడు. వారు కూడా యదువులాగానే తండ్రిమాట తిరస్కరించారు.

శశాప తానపి క్రుద్ధో యయాతి రపరాజితః ।
యథావత్కథితం సర్వం మయాస్య ద్విజసత్తమాః ॥ 33 ॥

బ్రాహ్మణోత్తములారా! జయశీలుడయిన యయాతి కోపించి, ఆకొడుకులను గూడ ఇంతకు ముందు చెప్పినవిధంగానే శపించాడు.

ఏవం శప్త్వా సుతాన్ సర్వాం శ్చతురః పూరుపూర్వజాన్ ।
తదేవ వచనం రాజా పూరుమప్యాహ భో ద్విజాః ॥ 34 ॥

బ్రాహ్మణులారా! పూరుడికంటె పూర్వం పుట్టిన తనకొడుకులు నలుగురినీ ఈవిధంగా శపించి, యయాతి పూరుడిని కూడా అదేవిధంగా అడిగాడు.

తరుణ స్తవరూపేణ చరేయం పృథివీమిమామ్ ।
జరాం త్వయి సమాధాయ త్వం పూరో యది మన్యసే ॥ 35 ॥

'పూరూ! నీవు అంగీకరిస్తే, నాముసలితనం నీయందుంచి, నీ యౌవనరూపంతో నేను ఈభూమండలం అంతా సంచరిస్తాను'.

స జరాం ప్రతిజగ్రాహ పితుః పూరుః ప్రతాపవాన్ ।
యయాతిరపి రూపేణ పూరోః పర్యచరన్ మహీమ్ ॥ 36 ॥

పరాక్రమవంతుడయిన పూరువు తండ్రి ముసలితనాన్ని స్వీకరించాడు. యయాతి కూడ పూరువు యౌవనరూపంతో భూమండలం అంతటా సంచరించాడు.

స మార్గమాణః కామానా మన్తం నృపతిసత్తమః ।
విశ్వాచ్యా సహితో రేమే వనే చైత్రరథే ప్రభుః ॥ 37 ॥

ఆ యయాతిమహారాజు పరమమైన సుఖాన్ని వెదుక్కుంటూ విశ్వాచితో కూడి చైత్రరథం అనే ఉద్యానవనంలో రమించాడు.

యదా త్వతృప్తః కామేషు భోగేషు చ నరాధిపః ।
తదా పూరో స్సకాశా ద్వై స్వాం జరాం ప్రత్యపద్యత ॥ 38 ॥

కామసుఖాలతో తృప్తి కలగని యయాతిమహారాజు తిరిగి పూరుడివద్దకు వెళ్లాడు. తన ముసలితనాన్ని తిరిగి తాను స్వీకరించాడు. (పూరువు యౌవనం అతనికి ఇచ్చాడు.)

యత్ర గాథా మునిశ్రేష్ఠా గీతాః కిల యయాతినా ।
యోఽభిప్రత్యాహరేత్ కామాన్ సర్వశోఽఙ్గాని కూర్మవత్ ॥ 39 ॥

మునివరులారా! యయాతిమహారాజు 'తాబేలు తనఅవయవాలను (వెలుపల) అన్నివైపులనుండీ లోపలికి ముడుచుకొన్నట్లుగా జీవుడు (బయట సంచరించే) అన్నింటినీ లోపలికి సంక్షేపించుకోవాలి' అనే అంశాన్ని లోకానికి చాటిచెప్పాడు. ఇంద్రియాలను విషయాలనుండి ఇంద్రియాలను వెనకకు మళ్ళించుకోవాలి. (గీత. 2. 57)

న జాతు కామః కామానా ముపభోగేవ శామ్యతి ।
హవిషా కృష్ణవర్త్మేన భూయ ఏవాభివర్ధతే ॥ 40 ॥

అగ్నిలో హవిస్సు వేసినకొద్దీ జ్వాలలు పైకి ఎగసిపడినట్లుగా ఇంద్రియాలకు సుఖాలను అందిస్తున్న కొద్దీ కోరికలు నశించవు సరి కదా, ఇంకా అధిక మవుతాయి. తీర్చుకుంటే కోరికలు తీరవు. పెరుగుతాయి. కోరికలను అణచివేయాలి.

యత్ పృథివ్యాం వ్రీహియవం హిరణ్యం పశవః స్త్రియః ।
నాలమేకస్య తత్సర్వమితి కృత్వా న ముహ్యతి ॥ 41 ॥

ఈ భూమిమీద ఉన్న వరి, యవలు (మొద లైనధాన్యాలు), బంగారం, పశువులు, స్త్రీలు మొదలయిన సంపదలన్నీ తనవే అయినా, ఏ ఒక్కడికీ చాలు అనిపించదు. ఈఅంశం గ్రహించినవాడు అజ్ఞానానికి వశం కాడు. భూమిమీద సంపదలు అన్ని ఇచ్చినా తృప్తి కలగదు.

యదా భావం న కురుతే సర్వభూతేషు పాపజమ్ ।
కర్మణా మనసా వాచా బ్రహ్మ సమ్పద్యతే తదా ॥ 42 ॥

మనస్సు, వాక్కు, కాయము అనే త్రికరణాలచేతనూ సమస్తభూతాలపైనా పాపపు(అపకార)బుద్ధి లేకున్నపుడు బ్రహ్మత్వం సిద్ధిస్తుంది.

య దాన్యేభ్యో న బిభేతి యదా చాస్మా న్న బిభ్యతి ।
యదా నేచ్ఛతి న ద్వేష్టి బ్రహ్మ సమ్పద్యతే తదా ॥ 43 ॥

ఇతరులవలన భయపడగూడదు. ఇతరులను భయపెట్టగూడదు. (గీత. 12.15) దేనినీ కోరగూడదు. దేనినీ ద్వేషించగూడదు. (గీత. 12.17) అపుడు బ్రహ్మత్వం సిద్ధిస్తుంది.

యా దుస్త్యజా దుర్మతిభి ర్యా న జీర్యతి జీర్యతః ।
యోఽసౌ ప్రాణాన్తకో రోగ స్తాం తృష్ణాం త్యజత స్సుఖమ్ ॥ 44 ॥

అజ్ఞానులు తృష్ణ (కోరిక)ను విడిచిపెట్టలేరు. శరీరం క్షీణించిపోతున్నా తృష్ణ మాత్రం తగ్గదు. తృష్ణ అనేది ప్రాణం తీసేరోగం. ఆతృష్ణను విడిచిపెట్టగలిగినవాడు సుఖపడతాడు.

జీర్యన్తి జీర్యతః కేశా దన్తా జీర్యన్తి జీర్యతః ।
ధనాశా జీవితాశా చ జీర్యతేఽపి న జీర్యతి ॥ 45 ॥

శరీరం క్షీణిస్తున్నకొద్దీ (ముసలితనం వచ్చేకొద్దీ) జుట్టు రాలిపోతుంది. పళ్లు ఊడిపోతాయి. కాని, శరీరం క్షీణించినా, ధనంమీద కోరికా, ఇంకా బ్రతకాలి అనేఆశా మాత్రం నశించవు.

య చ్చ కామసుఖం లోకే య చ్చ దివ్యం మహత్సుఖమ్ ।
తృష్ణాక్షయసుఖ స్యైతే నార్హన్తి షోడశీం కలామ్ ॥ 46 ॥

కోరికలు తీరడంవల్ల ఈలోకంలో కలిగే ఆనందం కానీ, లేదా స్వర్గం మొదలైన ఊర్ధ్వలోకాలలో పొందేసుఖాలు గానీ, ఏవీ కోరికలు నశించడంవల్ల కలిగేసుఖంలో పదహారోవంతుకు కూడా సరిపోవు.

ఏవముక్త్వా స రాజర్షి స్సదారః ప్రావిశద్వనమ్ ।
కాలేన మహతా చాపి చచార విపులం తపః ॥ 47 ॥

రాజర్షి అయిన యయాతి ఈవిధంగా పలికి, భార్యతో సహా అరణ్యంలో (గార్హస్థ్యం విడిచి వానప్రస్థాశ్రమంలోకి) ప్రవేశించాడు. చాలకాలం గొప్పతపస్సు ఆచరించాడు.

భృగుతుఙ్గే తప స్తప్త్వా తపసోఽన్తే మహాయశాః ।
అనశ్నన్ దేహ ముత్సృజ్య సదార స్స్వర్గ మవాప్తవాన్ ॥ 48 ॥

భృగుతుంగం అనేపర్వతం మీద తపస్సు చేసి, చివరకు నిరాహారియై, దేహత్యాగం చేశాడు. భార్యతో సహా స్వర్గానికి చేరుకున్నాడు.

తస్య వంశే మునిశ్రేష్ఠాః పఞ్చ రాజర్షిసత్తమాః ।
యై ర్వ్యాప్తా పృథివీ సర్వా సూర్యస్యేవ గభస్తిభిః ॥ 49 ॥

మునివరులారా! ఆయయాతివంశంలో అయిదుగురు రాజర్షిశ్రేష్ఠులు. సూర్యుడికిరణాలతో ఈభూమిఅంతా నిండిపోయినట్లుగా వారికీర్తితో ఈభూమండలం సమస్తం నిండిపోయింది.

యదో స్తు వంశం వక్ష్యామి శృణుధ్వం రాజసత్కృతమ్ ।
యత్ర నారాయణో జజ్ఞే హరి ర్వృష్ణికులోద్వహః ॥ 50 ॥

తరువాత యదువు వంశాన్ని గురించి చెప్తాను వినండి. యదువంశంలో ఉత్తములయిన రాజులు జన్మించారు. శ్రీమన్నారాయణుడు వృష్ణివంశాన్ని వృద్ధిచేసిన శ్రీకృష్ణుడుగా ఈవంశంలోనే జన్మించాడు.

శృణ్వన్ ప్రజావా నాయుష్మాన్ కీర్తిమాంశ్చ భవేన్నరః ।
యయాతిచరితం నిత్య మిదం శృణ్వన్ ద్విజోత్తమాః ॥ 51 ॥

ద్విజవరులారా! ఈయయాతిచరిత్రను నిత్యమూ శ్రద్ధగా విన్న మానవుడు సంతానవంతుడు, కీర్తిమంతుడూ అవుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే సోమవంశే యయాతిచరితనిరూపణం నామ దశమోఽధ్యాయః ॥ 10 ॥

శ్రీబ్రహ్మపురాణంలో సోమవంశంలో యయాతిచరితనిరూపణం అనే పేరుగలిగిన పదవ అధ్యాయం సంపూర్ణం.



ఏకాదశోఽధ్యాయః - పదకొండవ అధ్యాయం

యయాతివంశానుకీర్తనమ్ - యయాతివంశానుకీర్తనం

బ్రాహ్మణా ఊచుః :- బ్రాహ్మణులు లోమహర్షణుడిని ఇలా అడుగుతున్నారు.

పూరోర్వంశం వయం సూత శ్రోతుమిచ్ఛామ తత్త్వతః ।
ద్రుహ్యస్యానోర్యదోశ్చైవ తుర్వసోశ్చ పృథక్ పృథక్ ॥ 1 ॥

సూతా!, పూరువువంశం గురించి సమగ్రంగా తెలుసుకోవాలని కోరుతున్నాం. ద్రుహ్యుడు, అనువు, యదువు, తుర్వసుడు వీరివంశాలను గురించి కూడ ప్రత్యేకం ప్రత్యేకంగా వినాలని మాకోరిక.

లోమహర్షణ ఉవాచ :-లోమహర్షణుడు బ్రాహ్మణులతో ఇలా చెప్పాడు.

శృణుధ్వం మునిశార్దూలాః పూరోర్వంశం మహాత్మనః ।

విస్తరేణానుపూర్వ్యాం చ ప్రథమం వదతో మమ ॥2 ॥

ఓ మునివరులారా! మహాత్ముడయిన పూరునివంశం గురించి క్రమంగానూ, వివరంగానూ నేను చెప్పేది వినండి.

పూరోః పుత్రస్సువీరోఽభూన్మనస్యుస్తస్య చాత్మజః ।
రాజా చాభయదో నామ మనస్యోరభవత్ సుతః ॥ 3 ॥

పూరుడితనయుడు సువీరుడు. సువీరుడి కొడుకు మనస్యుడు. మనస్యుడికి అభయదుడు అనేరాజు కొడుకు అయినాడు.

తథైవాభయదస్యాసీత్ సుధన్వా చ మహీపతిః ।
సుధన్వనస్సుబాహుస్తు రౌద్రాశ్వస్తస్య చాత్మజః ॥ 4 ॥

అలాగే అభయదుడికొడుకు సుధన్వుడనేరాజు. సుధన్వుడి పుత్రుడు సుబాహువు. సుబాహువుకొడుకు రౌద్రాశ్వుడు.

రౌద్రాశ్వస్య దశార్ణేయుః కృకణేయుస్తథైవ చ ।
కక్షేయుః స్థణ్డిలేయుశ్చ సన్నతేయుస్తథైవ చ ॥ 5 ॥

ఋచేయుశ్చ జలేయుశ్చ స్థలేయుశ్చ మహాయశాః ।
ధనేయుశ్చ వనేయుశ్చ పుత్రకాశ్చ దశస్త్రియః ॥ 6 ॥

రౌద్రాశ్వుడికి దశార్ణేయుడు, కృకణేయువు, కక్షేయుడు, స్థండిలేయుడు, సన్నతేయుడు, ఋచేయువు, జలేయువు, కీర్తిమంతు డయిన స్థలేయువు, ధనేయువు, వనేయువు అని పదిమంది కొడుకులు గలిగారు. పదిమంది పుత్రికలు కూడా.

భద్రా శూద్రా చ మద్రా చ శలదా మలదా తథా ।
ఖలదా చ తతో విప్రా నలదా సురసాపి వా ॥ 7 ॥

తథా గోచపలా చ స్త్రీరత్నకూటా చ తా దశ ।
ఋషి ర్జాతోఽత్రివంశే చ తాసాం భర్తా ప్రభాకరః ॥ 8 ॥

విప్రులారా! తరువాత రౌద్రాశ్వుడికి భద్ర, శూద్ర, మద్ర, శలద, మలద, ఖలద, నలద, సురస, గోచపల, స్త్రీరత్నకూట అనే పదిమంది కుమార్తెలు పుట్టారు. అత్రిమహర్షివంశంలో జన్మించిన ప్రభాకరుడు ఈకన్యలకు భర్త..

భద్రాయాం జనయామాస సుతం సోమం యశస్వినమ్ ।
స్వర్భానునా హతే సూర్యే పతమానే దివో మహీమ్ ॥ 9 ॥

తమోఽభిభూతే లోకే చ ప్రభా యేన ప్రవర్తితా ।
స్వస్తి తేఽస్త్వితి చోక్త్వా వై పతమానో దివాకరః ॥ 10 ॥

ఆప్రభాకరుడు భద్ర అనేభార్యయందు కీర్తిమంతుడయిన సోముడు అనే కుమారుడిని కన్నాడు. సూర్యుడిని రాహువు పట్టుకోగా (గ్రహణంసమయంలో), సూర్యుడు ఆకాశంనుంచి నేలపై పడిపోతున్నపుడు లోకమంతా చీకటితో నిండిపోయింది. ఆసమయంలో ఈప్రభాకరుడివలననే లోకానికి వెలుగు కలిగింది. క్రిందికి పడిపోతున్న సూర్యుడిని చూచి ప్రభాకరుడు 'నీకు శుభమగు గాక!' అన్నాడు.

వచనాత్తస్య విప్రర్షేర్న పపాత దివో మహీమ్ ।
అత్రిశ్రేష్ఠాని గోత్రాణి యశ్చకార మహాతపాః ॥ 11 ॥

బ్రహ్మర్షి అయిన ఆప్రభాకరుడిఆశీర్వచనంవలన సూర్యుడు నేలమీద పడకుండా ఆకాశంలోనే ఆగిపోయాడు. గొప్ప తపస్వి అయిన ప్రభాకరుడు శ్రేష్ఠమయిన అత్రిమహర్షి వంశాలను లోకప్రసిద్ధం చేశాడు.

యజ్ఞేష్వత్రేర్బలం చైవ దేవైర్యస్య ప్రతిష్ఠితమ్ ।
స తాసు జనయామాస పుత్రికాస్వాత్మకామజాన్ ॥ 12 ॥

దశ పుత్రాన్ మహాసత్త్వాం స్తపస్యుగ్రే రతాం స్తథా ।
తే తు గోత్రకరా విప్రా ఋషయో వేదపారగాః ॥ 13 ॥

యజ్ఞాలలో అత్రిమహర్షిశక్తిని (స్థానాన్ని) దేవతలు ప్రభాకరుడికి ఇచ్చారు. అటువంటి ప్రభాకరమహర్షి రౌద్రాశ్వుడి కూతుళ్లయందు తనసంకల్పానికి అనుగుణంగా శక్తిమంతులయిన పదిమంది కొడుకులను గన్నాడు. వారందరూ తీవ్రమైన తపస్సు చేశారు. విప్రులారా! ప్రభాకరుడి కొడుకులు పదిమంది మహర్షులు వేదాలు సమగ్రంగా తెలిసినవారు. వంశాలను వృద్ధిచేశారు.

స్వస్త్యాత్రేయా ఇతి ఖ్యాతాః కిం చ త్రిధనవర్జితాః ।

వీరు (సూర్యుడికి స్వస్తి చెప్పిన మహర్షిపుత్రులు కావడంచేత) స్వస్త్యాత్రేయులు అని ప్రసిద్ధులయినారు. మూడువిధాలయిన ధనాలను (బంగారం, భూమి, పశువులు) విసర్జించారు.

కక్షేయోస్తనయాస్త్వాసంస్త్రయ ఏవ మహారథాః ।
సభానర శ్చాక్షుషశ్చ పరమన్యుస్తథైవ చ ॥ 14 ॥

కక్షేయుడికి మహారథులయిన ముగ్గురు కొడుకులు గలిగారు. సభానరుడు, చాక్షుషుడు, పరమన్యుడు అనేవారు ఆముగ్గురు.

సభానరస్య పుత్రస్తు విద్వాన్ కాలానలో నృపః ।
కాలానలస్య ధర్మజ్ఞస్సృఞ్జయో నామ వై సుతః ॥ 15 ॥

సభానరుడికొడుకు కాలానలమహారాజు. ఇతడు విద్వాంసుడు. కాలానలుడి కొడుకు సృంజయుడు. ఇతడు ధర్మం తెలిసినవాడు.

సృఞ్జయస్యాభవత్ పుత్రో వీరా రాజా పురంజయః ।
జనమేజయో మునిశ్రేష్ఠాః పురంజయసుతోఽభవత్ ॥ 16 ॥

సృంజయుడిపుత్రుడు పురంజయుడు. ఈమహారాజు గొప్పవీరుడు. మునివరులారా! పురంజయుడికొడుకు జనమేజయుడు.

జనమేజయస్య రాజర్షే ర్మహాశాలోఽభవత్ సుతః ।
దేవేషు యః పరిజ్ఞాతః ప్రతిష్ఠితయశా భువి ॥ 17 ॥

రాజర్షి అయిన జనమేజయుడి పుత్రుడు మహాశాలుడు. మహాశాలుడు దేవతలందరికీ బాగా తెలిసినవాడు (దేవలోకంలో ప్రసిద్ధుడు). ఈభూమండలంలో సుస్థిరమైన కీర్తి కలిగినవాడు.

మహామనా నామ సుతో మహాశాలస్య ధార్మికః ।
జజ్ఞే వీరస్సురగణైః పూజితస్స మహామనాః ॥18 ॥

మహాశాలుడితనయుడు మహామనుడు. ఇతడు గొప్పధార్మికుడు. మహామనుడు దేవతలచేత కూడ పూజింపబడేవాడు. మహావీరుడు.

మహామనాస్తు పుత్రౌ ద్వౌ జనయామాస భో ద్విజాః ।
ఉశీనరం చ ధర్మజ్ఞం తితిక్షుం చ మహాబలమ్ ॥ 19 ॥

బ్రాహ్మణులారా! మహామనుడికి కొడుకులు ఇద్దరు గలిగారు. వారు, ధర్మజ్ఞుడయిన ఉశీనరుడు, గొప్పబలవంతుడయిన తితిక్షువు.

ఉశీనరస్య పత్న్యస్తు పఞ్చ రాజర్షివంశజాః ।
నృగా కృమిర్నవా దర్వా పఞ్చమీ చ దృషద్వతీ ॥ 20 ॥

రాజర్షి(వృషుడు)కులంలో పుట్టినఅయిదుగురు కన్యలు ఉశీనరుడికి భార్యలు అయ్యారు. వారు నృగ, కృమి, నవ, దర్వ, దృషద్వతి అని ఐదుగురు.

ఉశీనరస్య పుత్రాస్తు పఞ్చ తాసు కులోద్వహాః ।
తపసా చైవ మహతా జాతా వృద్ధస్య చాత్మజాః ॥ 21 ॥

ఉశీనరుడికి అయిదుగురు కొడుకులు. వంశవృద్ధికరులు. ఉశీనరుడు ముసలివాడు అయిన తరువాత గొప్పతపస్సుకు ఫలితంగా వీరు జన్మించారు.

నృగాయాస్తు నృగః పుత్రః కృమ్యాం కృమిరజాయత ।
నవాయాస్తు నవః పుత్రో దర్వాయాస్సువ్రతోఽభవత్ ॥22 ॥

నృగ అనేభార్యకు నృగుడు జన్మించాడు. కృమియందు కృమి పుట్టాడు. నవ అనేస్త్రీకి నవుడు కలిగాడు. దర్వకు సువ్రతుడు పుట్టాడు.

దృషద్వత్యాస్తు సంజజ్ఞే శిబిరౌశీనరో నృపః ।
శిబేస్తు శిబయో విప్రా యౌధేయాస్తు నృగస్య హ ॥ 23 ॥

ఉశీనరుడివలన దృషద్వతికి శిబిచక్రవర్తి జన్మించాడు. బ్రాహ్మణులారా! శిబికి శిబులు (నలుగురు) పుట్టారు. నృగుడికి యౌధేయులు కలిగారు.

నవస్య నవరాష్ట్రం తు కృమేస్తు కృమిలాపురీ ।
సువ్రతస్య తథామ్బష్ఠాశ్శిబిపుత్రాన్నిబోధత ॥ 24 ॥

నవుడిరాజ్యం పేరు నవరాష్ట్రం. కృమికి కృమిల అనేనగరం. సువ్రతుడిపుత్రులు అంబష్టులు. ఇపుడు శిబిచక్రవర్తితనయులను గురించి తెలుసుకోండి.

శిబేస్తు శిబయః పుత్రాశ్చత్వారో లోకవిశ్రుతాః ।
వృషదర్భస్సువీరశ్చ కైకేయో భద్రక(మద్రకః)స్తథా ॥ 25 ॥

శిబికి నలుగురు కొడుకులు. వీరు జగత్ప్రసిద్ధులు. వారు వృషదర్భుడు, సువీరుడు, కైకేయుడు, భద్రకుడు అనేవారు.

తేషాం జనపదాః స్ఫీతాః కైకేయా మద్రకాస్తథా ।
వృషదర్భాస్సువీరాశ్చ తితిక్షోస్తు ప్రజాస్త్విమాః ॥ 26 ॥

వారు పరిపాలించేప్రాంతాలు బాగాసమృద్ధికల కైకేయములు, మద్రకములు, వృషదర్భములు, సువీరములు అని ప్రసిద్ధాలు. వీరు తితిక్షువు సంతానము.

తితిక్షురభవద్ రాజా పూర్వస్యాం దిశి భో ద్విజాః ।
ఉషద్రథో మహావీర్యః ఫేనస్తస్య సుతోఽభవత్ ॥ 27 ॥

బ్రాహ్మణులారా! తితిక్షువు తూర్పుదిక్కుకు రాజు అయినాడు. తితిక్షువు కుమారుడు ఉషద్రథుడు. ఇతడు గొప్పబలవంతుడు. ఉషద్రథుడి కుమారుడు ఫేనుడు.

ఫేనా త్తు సుతపా జజ్ఞే తతస్సుతపసో బలిః ॥ 28 ॥

ఫేనుడికి సుతపుడు జన్మించాడు. సుతపుడికుమారుడు బలి.

జాతో మానుషయోనౌ తు స రాజా కాఞ్చనేషుధిః ।
మహాయోగీ స తు బలిర్బభూవ నృపతిః పురా ॥ 29 ॥

బలి బంగారపుఅమ్ములపొది కలిగినవాడు. పూర్వం ఈబలి మహారాజు గొప్పయోగి. ఇపుడు మానవుడుగా జన్మించాడు.

పుత్రానుత్పాదయామాస పఞ్చవంశకరాన్ భువి ।
అఙ్గః ప్రథమతో జజ్ఞే వఙ్గస్సుహ్మస్తథైవ చ ॥ 30 ॥

పుణ్డ్రః కలిఙ్గశ్చ తథా బాలేయం క్షత్రముచ్యతే ।
బాలేయా బ్రాహ్మణాశ్చైవ తస్య వంశకరా భువి ॥ 31 ॥

బలికి వంశవృద్ధికరులయిన పుత్రులు అయిదుగురు కలిగారు. వారిలో మొదటివాడు అంగుడు. తరువాత వంగుడు, సుహ్ముడు, పుండ్రుడు, కలింగుడు అనేవారు పుట్టారు. క్షత్రియులయిన బలిచక్రవర్తి సంతానపరంపరను, వీరివంశాలను బాలేయులు అని పేర్కుంటారు. బాలేయులు, బ్రాహ్మణులు వీరివంశాన్ని భూమిమీద చక్కగా వృద్ధి చేశారు.

బలేశ్చ బ్రహ్మణా దత్తో వరః ప్రీతేన భో ద్విజాః ।
మహాయోగిత్వమాయుశ్చ కల్పస్య పరిమాణతః ॥ 32 ॥

బలేచాప్రతిమత్వం వై ధర్మతత్త్వార్థదర్శనమ్ ।
సఙ్గ్రామే చాప్యజేయత్వం ధర్మే చైవ ప్రధానతామ్ ॥ 33 ॥

త్రైలోక్యదర్శనం చాపి ప్రాధాన్యం ప్రసవే తథా ।
చతురో నియతాన్ వర్ణాన్త్వం చ స్థాపయితేతి చ ॥ 34 ॥

బ్రాహ్మణులారా! బ్రహ్మదేవుడు సంతోషించి, బలికి 'ఒకకల్పం పరిమాణం గలిగిన ఆయుర్దాయాన్నీ,మహాయోగిత్వాన్నీ సాటిలేని బలాన్నీ, ధర్మరహస్యాలను తెలియగలిగినశక్తినీ, యుద్ధంలో ఎప్పుడూ విజయమే కలిగేటట్లు గానూ, ధర్మమే ప్రధానంగా భావించేబుద్ధినీ, ముల్లోకాలనూ దర్శించగలిగినసామర్థ్యాన్నీ, సంతానం విషయంలో ప్రాధాన్యాన్నీ, తనరాజ్యంలో నాలుగువర్ణాలధర్మాలను తప్పకుండా ఆచరింపజేసేతీరుగానూ వరం ఇచ్చాడు.

ఇత్యుక్తో విభునా రాజా బలిశ్శాన్తిముపాయయౌ ।
కాలేన మహతా విప్రాః స్వర్గస్థానముపాగమత్ ॥ 35 ॥

బ్రాహ్మణులారా! బ్రహ్మ ఈవిధంగా చెప్పటంతో బలిచక్రవర్తికి మనసు శాంతించింది. చాల కాలం ఈవిధంగా రాజ్యమేలిన తరువాత బలిచక్రవర్తి స్వర్గానికి చేరుకున్నాడు.

తేషాం జనపదాః పఞ్చ అఙ్గా వఙ్గాశ్చ సుహ్మకాః ।
కలిఙ్గాః పుణ్డ్రకాశ్చైవ ప్రజాస్త్వఙ్గస్య సామ్ప్రతమ్ ॥ 36 ॥

వారివారిరాజ్యాలలోని ప్రజలు అంగులు, వంగులు, సుహ్మకులు, కాళింగులు, పుండ్రకులు అని అయిదువిధాలుగా పేర్కొనబడతారు. వారిలో అంగుడిపుత్రులను గురించి ఇపుడు చెప్తాను.

అఙ్గపుత్రో మహానాసీద్ రాజేన్ద్రో దధివాహనః ।
దధివాహనపుత్రస్తు రాజా దివిరథోఽ భవత్ ॥ 37 ॥

అంగుడిపుత్రుడు దధివాహనుడు అనే మహారాజు. దధివాహనుడితనయుడు దివిరథుడు అనేమహారాజు.

పుత్రో దివిరథస్యాసీచ్ఛక్రతుల్యపరాక్రమః ।
విద్వాన్ స్వర్గ ధర్మరథో నామ తస్య చిత్రరథస్సుతః ॥ 38 ॥

దివిరథుడికొడుకు స్వర్గరథుడు. ఇతడు ఇంద్రుడితో సమానమైన పరాక్రమం కలిగినవాడు. పండితుడు. స్వర్గరథుడికుమారుడు చిత్రరథుడు.

తేన స్వర్గ (ధర్మ)రథేనాథ తదా కాలంజరే గిరౌ ।
యజతా సహ శక్రేణ సోమః పీతో మహాత్మనా ॥ 39 ॥

స్వర్గరథుడు కాలంజరం అనేపర్వతంమీద యజ్ఞం చేసి, మహాత్ముడైన ఇంద్రుడితో కలిసి సోమరసాన్ని పుచ్చుకున్నాడు.

అథ చిత్రరథస్యాపి పుత్రో దశరథోఽ భవత్ ।
లోమపాదఇతి ఖ్యాతో యస్య శాన్తా సుతాఽ భవత్ ॥ 40 ॥

చిత్రరథుడికొడుకు దశరథుడు. దశరథుడు లోమపాదుడు అని మరొకపేరుతో ప్రసిద్ధుడు. దశరథుడికి శాంత అనే కూతురు కలిగింది.

తస్య దాశరథిర్వీరశ్చతురఙ్గో మహాయశాః ।
ఋష్యశృఙ్గప్రసాదేన జజ్ఞే కులవివర్ధనః ॥ 41 ॥

ఆ దశరథమహారాజుకు పుత్రుడు చతురంగుడు. ఇతడు గొప్పకీర్తిమంతుడు. వంశవివర్ధకుడయిన దశరథ మహారాజు ఋశ్యశృంగుడి అనుగ్రహంతో యజ్ఞం చేశాడు.

చతురఙ్గస్య పుత్రస్తు పృథులాక్ష ఇతి స్మృతః ।
పృథులాక్షసుతో రాజా చమ్పో నామ మహాయశాః ॥ 42 ॥

చతురంగుడికుమారుడు పృథులాక్షుడు. పృథులాక్షుడికొడుకు చంపుడు. ఈమహారాజు కీర్తిమంతుడు.

చమ్పస్య తు పురీ చమ్పా యా మాలిన్యభవత్ పురా ।
పూర్ణభద్రప్రసాదేన హర్యఙ్గస్తత్సుతోఽభవత్ ॥ 43 ॥

చంపుడిరాజధాని చంపానగరం. పూర్వం ఈనగరానికి మాలినీనగరం అని పేరు. పూర్ణభద్రుడి అనుగ్రహంచేత చంపుడికి హర్యంగుడు అనేకుమారుడు కలిగాడు.

తతో వైభాణ్డకిశ్చైవ వారణం శక్రవారణమ్ ।
అవతారయామాస మహీం మన్త్రైర్వాహనముత్తమమ్ ॥ 44 ॥

విభాండకమహర్షిసుతుడయిన ఋశ్యశృంగుడు మంత్రమహిమతో దేవేంద్రుడియేనుగు అయిన ఐరావతాన్ని భూమిమీదకి దించాడు. దాన్ని హర్యంగుడికి వాహనంగా ఇచ్చాడు.

హర్యఙ్గస్య సుతస్తత్ర రాజా భద్రరథస్స్మృతః ।
పుత్రో భద్రరథస్యాసీద్ బృహత్కర్మా ప్రజేశ్వరః ॥ 45 ॥

హర్యంగుడికుమారుడు భద్రరథుడు అనేమహారాజు. భద్రరథుడికొడుకు బృహత్కర్మ. ఇతడు ప్రజారంజకుడయినరాజు.

బృహద్దర్భస్సుతస్తస్య యస్మాజ్జజ్ఞే బృహన్మనాః ।
బృహన్మనాస్తు రాజేన్ద్రో జనయామాస వై సుతమ్ ॥ 46 ॥

బృహత్కర్మ కుమారుడు బృహద్దర్భుడు. బృహద్దర్భుడితనయుడు బృహన్మనుడు. బృహన్మనుడికుమారుడిపేరు జయద్రథమహారాజు.

నామ్నా జయద్రథం నామ యస్మాద్దృఢరథో నృపః ।
ఆసీద్దృఢరథస్యాపి విశ్వజిజ్జనమేజయః ॥ 47 ॥

జయద్రథుడికుమారుడు దృఢరథమహారాజు. దృఢరథుడికి జనమేజయుడు జన్మించాడు. జనమేజయుడు ప్రపంచం మొత్తాన్ని జయించాడు.

దాయాదస్తస్య వైకర్ణో వికర్ణస్తస్య చాత్మజః ।
తస్య పుత్రశతం త్వాసీదఙ్గానాం కులవర్ధనమ్ ॥ 48 ॥

ఆ జయద్రథుడికుమారుడు కర్ణుడు. కర్ణుడి కుమారుడు వికర్ణుడు. వికర్ణుడికి నూఱుమంది కొడుకులు గలిగారు. వారివల్ల అంగవంశం బాగా వృద్ధి చెందింది.

ఏతేఽఙ్గవంశజాస్సర్వే రాజానః కీర్తితా మయా ।
సత్యవ్రతా మహాత్మానః ప్రజావన్తో మహారథాః ॥ 49 ॥

అంగవంశంలో పుట్టినరాజులను గూర్చి వివరించాను. అంగవంశరాజులందరూ సత్యనిష్ఠులు, మహాత్ములు. సంతానవంతులు. మహారథులు.

ఋచేయోస్తు మునిశ్రేష్ఠా రౌద్రాశ్వతనయస్య వై ।
శృణుధ్వం సంప్రవక్ష్యామి వంశం రాజ్ఞస్తు భో ద్విజాః ॥ 50 ॥

ఓ బ్రాహ్మణులారా! మునివరులారా! రౌద్రాశ్వుడితనయుడయిన ఋచేయుడి రాజవంశాన్ని గురించి చెప్తాను వినండి.

ఋచేయోస్తనయో రాజా మతినారో మహీపతిః ।
మతినారసుతాస్త్వాసంస్త్రయః పరమధార్మికాః ॥ 51 ॥

ఋచేయుడితనయుడు మతినారుడు అనేభూపాలుడు. మతినారుడికొడుకులు ముగ్గురు. ఉత్తములయిన ధార్మికులు.

వసురోధః ప్రతిరథస్సుబాహుశ్చైవ ధార్మికః ।
సర్వే వేదవిదశ్చైవ బ్రహ్మణ్యాస్సత్యవాదినః ॥ 52 ॥

వసురోధుడు, ప్రతిరథుడు, ధర్మనిష్ఠుడయిన సుబాహుడు. వీరు ముగ్గురు కూడ వేదవేత్తలు. బ్రహ్మజ్ఞానులు. సత్యమే పలికేవారు.

ఇలా నామ తు యస్యాసీత్ కన్యా వై మునిసత్తమాః ।
బ్రహ్మవాదిన్యథ స్త్రీ సా తంసుస్తా మభ్యగచ్ఛత ॥ 53 ॥

మునిశ్రేష్ఠులారా! మతినారుడి కూతురు ఇల. ఆమె బ్రహ్మజ్ఞాని. ఆకన్యను తంసువు వివాహం చేసుకున్నాడు.

తంసోస్సుతోఽథ రాజర్షిర్ధర్మనేత్రః ప్రతాపవాన్ ।
బ్రహ్మవాదీ పరాక్రాన్తస్తస్య భార్యోపదానవీ ॥ 54 ॥

తంసువు తనయుడు ధర్మనేత్రుడు. అతడు రాజర్షి. పరాక్రమశాలి. బ్రహ్మజ్ఞాని. శత్రువులను లోబరుచుకున్నవాడు. ధర్మనేత్రుడిభార్య ఉపదానవి.

ఉపదానవీ తతః పుత్రాంశ్చతురోఽజనయచ్ఛుభాన్ ।
దుష్యన్తమథ సుష్మన్తం ప్రవీరమనఘం తథా ॥ 55 ॥

ఉపదానవి మంచిలక్షణాలు గలిగినకొడుకులు నలుగురిని కన్నది. వారు దుష్యంతుడు, సుష్మంతుడు, ప్రవీరుడు, అనఘుడు.

దుష్యన్తస్య తు దాయాదో భరతో నామ వీర్యవాన్ ।
స సర్వదమనో నామ నాగాయుతబలో మహాన్ ॥ 56 ॥

దుష్యంతుడితనయుడు భరతుడు. ఇతడు గొప్పబలశాలి. అతడు పదివేలయేనుగులబలం కలిగిన మహాత్ముడు. సర్వదమనుడు అని పేరుపొందాడు.

చక్రవర్తీ సుతో జజ్ఞే దుష్యన్తస్య మహాత్మనః ।
శకున్తలాయాం భరతో యస్య నామ్నా తు భారతమ్ ॥ 57 ॥

మహాత్ముడయిన దుష్యంతుడు శకుంతలయందు భరతుడు అనే చక్రవర్తిని కుమారుడుగా పొందాడు. ఆభరతుడిపేరుమీదుగానే ఈరాజ్యానికి భారతం అనేపేరు వచ్చింది.

భరతస్య వినష్టేషు తనయేషు మహీపతేః ।
మాతౄణాం తు ప్రకోపేణ మయా తత్కథితం పురా ॥ 58 ॥

భరతభూపాలుడికొడుకులు తల్లులకోపం మూలంగా నశించిపోయారు. ఆవిషయం ఇంతకు పూర్వం చెప్పాను.

బృహస్పతేరఙ్గిరసః పుత్రో విప్రో మహామునిః ।
అయాజయద్ భరద్వాజో మహద్భిః క్రతుభిర్విభుః ॥ 59 ॥

అంగిరసుడు అయిన బృహస్పతికి కొడుకు భరద్వాజుడు. ఇతడు వేదవేత్త. మహర్షి. భరద్వాజుడు భరతుడిచేత గొప్ప గొప్ప యజ్ఞాలు చేయించాడు.

పూర్వం తు వితథే తస్య కృతే వై పుత్రజన్మని ।
తతోఽథ వితథో నామ భరద్వాజాత్ సుతోఽభవత్ ॥ 60 ॥

భరతుడికి కొడుకు పుట్టటంకోసం చేసిన యాగాదిప్రయత్నాలు అన్నీ వ్యర్థం అయ్యాయి. ఆతరువాత భరద్వాజుడిఅనుగ్రహంవల్ల భరతుడికి వితథుడు అనే కొడుకు పుట్టాడు.

తతోఽథ వితథే జాతే భరతస్తు దివం యయౌ ।
వితథం చాభిషిచ్యాథ భరద్వాజో వనం యయౌ ॥ 61 ॥

వితథుడు పుట్టినతరువాత భరతుడు స్వర్గానికి వెళ్లాడు. వితథుడికి రాజ్యాభిషేకం చేసి, భరద్వాజుడు అరణ్యాలకు వెళ్లిపోయాడు.

స చాపి వితథః పుత్రాన్ జనయామాస పఞ్చ వై ।
సుహోత్రం చ సుహోతారం గయం గర్గం తథైవ చ ॥ 62 ॥

కపిలం చ మహాత్మానం సుహోత్రస్య సుతద్వయమ్ ।
కౌశికం చ మహాసత్త్వం తథా గృత్సమతిం నృపమ్ ॥ 63 ॥

ఆ వితథుడికి అయిదుగురు కొడుకులు గలిగారు. వారు సుహోత్రుడు, సుహోత, గయుడు, గర్గుడు, మహాత్ముడయిన కపిలుడు. సుహోత్రుడికి కొడుకులు ఇద్దరు. గొప్పబలశాలి అయిన కౌశికుడు, గృత్సమతి అనేరాజు.

తథా గృత్సమతేః పుత్రా బ్రాహ్మణాః క్షత్రియా విశః ।
కాశికస్య తు కాశేయః పుత్రో దీర్ఘతపాస్తథా ॥ 64 ॥

గృత్సమతికి కలిగినపుత్రులు బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు. కాశికుడితనయుడు (కాశేయుడు) దీర్ఘతపుడు.

బభూవ దీర్ఘతపసో విద్వాన్ ధన్వన్తరిస్సుతః ।
ధన్వన్తరేస్తు తనయః కేతుమానితి విశ్రుతః ॥ 65 ॥

దీర్ఘతపుడికి విద్వాంసు డయిన ధన్వంతరి జన్మించాడు. ధన్వంతరి తనయుడు కేతుమంతుడు. ఇతడు ప్రసిద్ధుడు.

తథా కేతుమతః పుత్రో విద్వాన్ భీమరథఃస్మృతః ।
పుత్రో భీమరథస్యాపి వారాణస్యధిపోఽభవత్ ॥ 66 ॥

కేతుమంతుడితనయుడు భీమరథుడు. ఇతడు పండితుడు. భీమరథుడికుమారుడు (దివోదాసుడు) వారాణసికి రాజు అయినాడు.

దివోదాస ఇతి ఖ్యాతస్సర్వక్షత్రప్రణాశనః ।
దివోదాసస్య పుత్రోఽభూద్ వీరో రాజా ప్రతర్దనః ॥ 67 ॥

భీమరథుడికొడుకు దివోదాసు అని కీర్తింపబడ్డాడు. ఇతడు సమస్తమయిన క్షత్రియవంశాలను నిర్మూలించినవాడు. దివోదాసుడి తనయుడు ప్రతర్దనుడు. ప్రతర్దనమహారాజు వీరుడు.

ప్రతర్దనస్య పుత్రో ద్వౌ వత్సో భార్గవ ఏవ చ ।
అలర్కో రాజపుత్రస్తు రాజా సన్మతిమానపి ॥ 68 ॥

ప్రతర్దనుడికి వత్సుడు, భార్గవుడు అని యిద్దరు కుమారులు. అలర్కుడు అనేరాజపుత్రుడు బుద్ధిమంతుడు.

హైహయస్య తు దాయాద్యం హృతవాన్ వై మహీపతిః ।
ఆజహ్రే పితృదాయాద్యం దివోదాసహృతం బలాత్ ॥ 69 ॥

భద్రశ్రేణ్యస్య పుత్రేణ దుర్దమేన మహాత్మనా ।
దివోదాసేన బాలేతి ఘృణయాసౌ విసర్జితః ॥ 70 ॥

భద్రశ్రేణ్యుడికుమారుడు మహాత్ముడయిన దుర్దముడు హైహయుడిరాజ్యాన్ని ఆక్రమించుకున్నాడు. దివోదాసు హరించిన తండ్రిరాజ్యభాగాన్ని బలవంతంగా తిరిగి తీసుకున్నాడు. పసివాడు అని దయతో దివోదాసుడు దుర్దముడిని

సంహరించకుండా విడిచిపెట్టాడు. (దానివల్ల దుర్దముడు తరువాత తండ్రిరాజ్యాన్ని దివోదాసుడినుండి తిరిగి లాక్కున్నాడు)

అష్టారథో నామ నృపస్సుతో భీమరథస్య వై ।
తేన పుత్రేణ బాలస్య ప్రహృతం తస్య భో ద్విజాః ॥ 71 ॥

వైరస్యాన్తం మునిశ్రేష్ఠాః క్షత్రియేణ విధిత్సతా ।
అలర్కః కాశిరాజస్తు బ్రహ్మణ్యస్సత్యసఙ్గరః ॥ 72 ॥

భీమరథుడికుమారుడు అష్టారథుడు. భీమరథుడే దివోదాసుడు. ఓ బ్రాహ్మణులారా! మునిశ్రేష్ఠులారా! ఆ క్షత్రియుడయిన అష్టారథుడు బాలుడయినదుర్దముడిరాజ్యం అపహరించి ప్రతీకారం తీర్చుకున్నాడు. కాశీరాజు అయిన అలర్కుడు బ్రహ్మమార్గంలో సంచరించేవాడు. మాట తప్పనివాడు.

షష్టిం వర్షసహస్రాణి షష్టిం వర్షశతాని చ ।
యువా రూపేణ సమ్పన్న ఆసీత్ కాశికులోద్వహః ॥ 73 ॥

అలర్కుడు అరవైఆరువేలసంవత్సరాలు యౌవనంతో రూపసంపద కలిగి, (కాశి)వంశాన్ని ఉద్ధరించాడు.

లోపాముద్రాప్రసాదేన పరమాయురవాప సః ।
వయసోఽన్తే మునిశ్రేష్ఠా హత్వా క్షేమకరాక్షసమ్ ॥ 74 ॥

లోపాముద్ర (అగస్త్యుడిభార్య) అనుగ్రహంతో అలర్కుడు సుదీర్ఘమైన ఆయువును పొందాడు. ఓ మునివరులారా! వయసుమళ్లినతరువాత చివరలో అలర్కుడు క్షేమకుడు అనే రాక్షసుడిని సంహరించాడు.

రమ్యాం నివేశయామాస పురీం వారాణసీం నృపః ।
అలర్కస్య తు దాయాదః క్షేమకో నామ పార్థివః ॥ 75 ॥

అలర్కమహారాజు వారాణసీపురాన్ని అందంగా తీర్చిదిద్దాడు. అలర్కుడికుమారుడు క్షేమకుడు అనేరాజు.

క్షేమకస్య తు పుత్రో వై వర్షకేతుస్తతోఽభవత్ ।
వర్షకేతోశ్చ దాయాదో విభుర్నామ ప్రజేశ్వరః ॥ 76 ॥

క్షేమకుడికుమారుడు వర్షకేతువు. వర్షకేతువు కుమారుడు విభువు అనేప్రజానాయకుడు. (9-56?)

ఆనర్తస్తు విభోః పుత్రస్సుకుమారస్తతోఽభవత్ ।
సుకుమారస్య పుత్రస్తు సత్యకేతుర్మహారథః ।
సుతోఽభవన్మహాతేజా రాజా పరమధార్మికః ॥ 77 ॥

విభుడికుమారుడు ఆనర్తుడు. ఆనర్తుడితనయుడు సుకుమారుడు. సుకుమారుడికుమారుడు సత్యకేతువు. ఇతడు మహారథుడు. ధార్మికులలో ఉత్తముడు.

వత్సస్య వత్సభూమిస్తు భర్గభూమిస్తు భార్గవాత్ ॥ 78 ॥

వత్సుడికి గొప్పతేజస్వి, ధార్మికులలో ఉత్తముడు అయిన వత్సభూమి జన్మించాడు. భార్గవుడికి భర్గభూమి పుట్టాడు.

ఏతే త్వఙ్గిరసః పుత్రా జాతా వంశేఽథ భార్గవే ।
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాశ్శూద్రాశ్చ మునిసత్తమాః ॥ 79 ॥

మునిశ్రేష్ఠులారా! వీరందరూ ఆంగిరసుడిసంతానం. భృగువంశంలో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులుగా జన్మించినవారు.

ఆజమీఢోఽపరో వంశశ్శ్రూయతాం ద్విజసత్తమాః ।
సుహోత్రస్య బృహత్పుత్రో బృహతస్తనయాస్త్రయః ॥ 80 ॥

మునివరులారా! ఇక తర్వాత ఆజమీఢవంశాన్ని గురించి వినండి. సుహోత్రుడిపుత్రుడు బృహతుడు. బృహతుడికి ముగ్గురు కొడుకులు.

అజమీఢో ద్విమీఢశ్చ పురుమీఢశ్చ వీర్యవాన్ ।
అజమీఢస్య పత్న్యస్తు తిస్రో వై యశసాన్వితాః ॥ 81 ॥

వారు అజమీఢుడు, ద్విమీఢుడు, శక్తిమంతుడయిన పురుమీఢుడు. అజమీఢుడికి కీర్తిమతులయిన భార్యలు ముగ్గురు.

నీలీ చ కేశినీ చైవ ధూమినీ చ వరాఙ్గనాః ।
అజమీఢస్య కేశిన్యాం జజ్ఞే జహ్నుః ప్రతాపవాన్ ॥ 82 ॥

వారు నీలి, కేశిని, ధూమిని అనే సుందరాంగులు. అజమీఢుడికి కేశినియందు జహ్నువు అనే పరాక్రమవంతుడు పుట్టాడు.

ఆజహ్రే యో మహాసత్రం సర్వమేధమఖం విభుః ।
పతిలోభేన యం గఙ్గా వినీతేవ ససార హ ॥ 83 ॥

జహ్నుమహారాజు సర్వమేధం అనే మహాసత్రయాగాన్ని చేశాడు. గంగ పతిబుద్ధితో, వినయంతో, జహ్నువును అనుసరించింది.

నేచ్ఛతః ప్లావయామాస తస్య గఙ్గా చ తత్సదః ।
తం తయా ప్లావితం దృష్ట్వా యజ్ఞవాటం సమన్తతః ॥ 84 ॥

జహ్నువు అంగీకరించలేదు. అయినా విడువకుండా గంగ జహ్నువును అనుసరించి అతడిఆశ్రమానికి వెళ్లింది. జహ్నువు యజ్ఞవాటికను జలప్రవాహంతో ముంచింది. (8.16)

జహ్నురప్యబ్రవీద్ గఙ్గాం క్రుద్ధో విప్రాస్తదా నృపః ।
ఏష తే త్రిషు లోకేషు సంక్షిప్యాపః పిబామ్యహమ్ ।
అస్య గఙ్గేఽవలేపస్య సద్యః ఫలమవాప్నుహి ॥ 85 ॥

బ్రాహ్మణులారా! తనయజ్ఞభూమి అంతటా గంగ ప్రవహించటంచేత జహ్నుమహారాజు కోపించి, గంగతో ఇలా అన్నాడు. (8–16) గంగా, నీవు చేసిన యీపాడుపనికి వెంటనే ఫలితం పొందుతావు. (8–17) మూడు లోకాలలోనూ సంచరించే నిన్ను కుదించి, నీజలం అంతటినీ తాగుతాను.(8–18)

తతః పీతాం మహాత్మానో దృష్ట్వా గఙ్గాం మహర్షయః ।
ఉపనిన్యుర్మహాభాగా దుహితృత్వేన జాహ్నవీమ్ ॥ 86 ॥

ఆవిధంగా మహాత్ముడయిన జహ్నువు గంగను తాగివేయగా చూచి మహర్షులు గంగను జహ్నునికి కూతురుగా జాహ్నవిగా చేశారు.(8–18,19)

యువనాశ్వస్య పుత్రీం తు కావేరీం జహ్నురావహత్ ।
గఙ్గాశాపేన దేహార్ధం యస్యాః పశ్చాన్నదీకృతమ్ ॥ 87 ॥

యువనాశ్వుడి కూతురు కావేరి. ఆమెను జహ్నువు వివాహం చేసుకున్నాడు. తరువాత గంగ యిచ్చినశాపం చేత కావేరిశరీరంలో సగభాగం నదిగా చేయబడింది. (8–19,20)

జహ్నోస్తు దయితః పుత్రో హ్యాజకో నామ వీర్యవాన్ ।
అజకస్య తు దాయాదో బలాకాశ్వో మహీపతిః ॥ 88 ॥

జహ్నువు కొడుకు అజకుడు. ఇతడు బలవంతుడు. అజకుడితనయుడు బలాకాశ్వుడు అనే భూపాలుడు. (8–21,22)

బభూవ మృగయాశీలః కుశికస్తస్య చాత్మజః ।
పహ్లవైస్సహ సంవృద్ధో రాజా వనచరైస్సహ ॥ 89 ॥

బలాకాశ్వుడికుమారుడు కుశికుడు. ఇతడు వేటాడేస్వభావం కలిగినవాడు. (8–22) కుశికుడు ఆటవికు లయిన పహ్లవులతో కలిసి పెరిగాడు. (8–24)

కుశికస్తు తపస్తేపే పుత్రమిన్ద్రసమం విభుమ్ ।
లభేయమితి తం శక్రస్త్రాసాదభ్యేత్య జజ్ఞివాన్ ॥ 90 ॥

దేవేంద్రుడితో సమానమైన కొడుకును పొందాలని కుశికుడు తపస్సు చేశాడు. ఇంద్రుడు భయపడి వచ్చి, కుశికుడికి కొడుకుగా జన్మించాడు. (8–24,25)

స గాధిరభవద్ రాజా మఘవాంత కౌశికస్స్వయమ్ ।
విశ్వామిత్రస్తు గాధేయో విశ్వామిత్రాత్తథాష్టకః ॥ 91 ॥

ఇంద్రుడు కుశికుడికి స్వయంగా తనయుడుగా జన్మించిన (కౌశికుడు) గాధి అయినాడు. (8–27) గాధితనయుడు (గాధేయుడు) విశ్వామిత్రుడు. విశ్వామిత్రుడి పుత్రుడు అష్టకుడు.

1. విశ్వబాధి శ్శ్వజి చ్చైవ తథా సత్యవతీ ద్విజాః ।
ఋచీకా జ్జమదగ్నిస్తు సత్యవత్యామజాయత.

2. విశ్వామిత్రస్య తు సుతా దేవరాతాదయ స్స్మృతాః ।
ప్రఖ్యాతా స్త్రిషు లోకేషు తేషాం నామాని భో ద్విజాః ॥

3. దేవరాతః కతిశ్చైవ యస్మాత్కాత్యాయన స్స్మృతః ।
శాలవత్యాం హిరణ్యాక్షో రేణుర్యస్యాథ రేణుకా ॥

4. సాఙ్కృత్యాం గాలవా విప్రా మౌద్గల్యా శ్చేతి విశ్రుతాః ।
తేషాం ఖ్యాతాని గోత్రాణి కౌశికానాం మహాత్మనామ్ ॥

5. ప్రాణినో బభ్రవశ్చైవ ధ్యానజప్యాస్తథైవ చ ।
పార్థివా దేవరాతాశ్చ శాలఙ్కాయనసౌశ్రవాః ॥
లోహితా యామభూతాశ్చ తథా కారీషయ స్స్మృతాః ।
సమ్బన్ధోఽసాథ వంశేఽస్మిన్ బ్రహ్మక్షత్రస్య వై సుతాః ॥
విశ్రుతాః కౌశికా విప్రా స్తథాన్యే సైన్ధవాయనాః ।

6. ఋష్యన్తరవివాహ్యాశ్చ కౌశికా బహవ స్స్మృతాః ।

7. పౌరవస్య మునిశ్రేష్ఠా బ్రహ్మర్షేః కౌశికస్య చ ।
సమ్బన్ధోఽస్యాథ వంశేఽస్మిన్ బ్రహ్మక్షత్రస్య విశ్రుతః ॥

8. విశ్వామిత్రాత్మజానాం తు శునశ్శేఫోఽగ్రజ స్స్మృతః ।
భార్గవః కౌశికత్వం హి ప్రాప్త స్స మునిపుఙ్గవాః ॥

9. దేవరాతాదయ శ్చాపి విశ్వామిత్రస్య వై సుతాః ।
దృషద్వతీసుతశ్చాపి విశ్వామిత్రస్తథాష్టకః ॥

1. బ్రాహ్మణులారా! విశ్వబాధి, శ్వజిత్తు, సత్యవతి అనేవారు కూడ విశ్వామిత్రుడిసంతానం. ఋచీకుడికి సత్యవతియందు జమదగ్ని జన్మించాడు. (11.28)

2. విశ్వామిత్రుడికుమారులు దేవరాతుడు మొదలయినవారు. వారు మూడులోకాలనూ సుప్రసిద్ధులు. (8–57,58) ఓ బ్రాహ్మణులారా! వారిపేర్లు ఇవి.

3. దేవరాతుడు, కతి. కతికి కాత్యాయనుడు జన్మించాడు. (8–58) విశ్వామిత్రుడికి శాలవతి అనేస్త్రీయందు హిరణ్యాక్షుడు, రేణువు, అనేవారు పుట్టారు. వీరిలో రేణువుకు రేణుక అనే కన్య జన్మించింది.

4. విప్రులారా! విశ్వామిత్రుడికి ఇంకా సాంకృతి అనేస్త్రీయందు గాలవులు, మౌద్గల్యులు అనే సుప్రసిద్ధులైన పుత్రులు కలిగారు. (8–59) మహాత్ములయిన ఆకౌశికులగోత్రాలు లోకంలో కీర్తింపబడ్డాయి. (8–61)

5. ప్రాణులు, బభ్రువులు, ధ్యానజప్యులు, (8–61) పార్థివులు, దేవరాతులు, శాలంకాయనులు, సౌశ్రవులు, లోహితులు, యామభూతులు, కారీషులు, (8–62) అలాగే సైంధవాయనులు అనేవారు కౌశికులుగా ప్రసిద్ధులు. (8–62)

6. కౌశికులు ఇతరఋషిగోత్రులతో కూడ వివాహసంబంధం గలిగిఉన్నారు. (8–62)

7. మునివరులారా! క్షత్రియులయిన పౌరవులకూ, బ్రహ్మర్షి అయిన కౌశికుడికి వివాహాదిసంబంధంచేత బ్రాహ్మణులకూ, క్షత్రియులకూ సంబంధాలు ఏర్పడ్డాయి. (8–63)

8. విశ్వామిత్రపుత్రులలో శునశ్శేఫుడు పెద్దవాడు. మునిశ్రేష్ఠులారా! భార్గవు (భృగువంశీయు) డయిన శునశ్శేఫుడు పిదప కౌశికత్వాన్ని పొందాడు.(8–64) (మధ్యమశ్చ శునశ్శేఫః – 8.54)

9. దేవరాతుడు మొదలయినవారు కూడ విశ్వామిత్రుడికుమారులే. విశ్వామిత్రుడివలన దృషద్వతికి అష్టకుడు జన్మించాడు.(8–67))

అష్టకస్య సుతో లౌహిః ప్రోక్తో జహ్నుగణో మయా ।
ఆజమీఢోఽ పరో వంశ శ్శ్రూయతాం మునిసత్తమాః ॥ 92 ॥

అష్టకుడికుమారుడు లౌహి. ఈవిధంగా జహ్నువంశీయులను గూర్చి చెప్పడం అయింది. ఆజమీఢుడివంశం మరొకటి ఉంది. మునిశ్రేష్ఠులారా! ఆజమీఢునివంశం గురించి చెప్తాను. వినండి.

అజమీఢాత్తు నీలిన్యాం సుశాన్తిరుదపద్యత ।
పురుజాతిస్సుశాన్తేశ్చ బాహ్యాశ్వః పురుజాతితః ॥ 93 ॥

అజమీఢుడికి నీలిని (నీలి) అనేభార్యయందు సుశాంతి పుట్టాడు. సుశాంతికి పురుజాతి జన్మించాడు. పురుజాతికి బాహ్యాశ్వుడు పుట్టాడు.

బాహ్యాశ్వతనయాః పఞ్చ బభూవురమరోపమాః ।
ముద్గలస్సృఞ్జయశ్చైవ రాజా బృహదిషుస్తథా ॥ 94 ॥

యవీనరశ్చ విక్రాన్తః కృమిలాశ్వశ్చ పఞ్చమః ।
పఞ్చైతే రక్షణాయాలం దేశానామితి విశ్రుతాః ॥ 95 ॥

బాహ్యాశ్వుడికి దేవతలతో సమానులయిన అయిదుగురు కుమారులు జన్మించారు. వారు ముద్గలుడు, సృంజయుడు, బృహదిషువు అనేరాజు, పరాక్రమవంతుడయిన యవీనరుడు, కృమిలాశ్వుడు అనేవారు. సమస్తమైన దేశాన్ని రక్షించడానికి ఈఅయిదుగురు మాత్రమే సమర్థులు అని ప్రసిద్ధి పొందారు.

పఞ్చానాం తే తు పఞ్చాలాః స్ఫీతా జనపదావృతాః ।
అలం సంరక్షణే తేషాం పఞ్చాలా ఇతి విశ్రుతాః ॥ 96 ॥

ఈఅయిదుగురు పాలించేదేశాలు కూడ పంచాలదేశాలుగా పేరుపొందాయి. ఈదేశాలను చక్కగా కాపాడడానికి ఈఅయిదుగురు (పంచ) మాత్రమే చాలు (అలం) అనే అర్థంతో ఈప్రాంతాలకు పంచాలములు అనే ప్రసిద్ధి ఏర్పడింది.

ముద్గలస్య తు దాయాదో మౌద్గల్యస్సుమహాయశాః ।
ఇన్ద్రసేనా యతో గర్భం వధ్న్యశ్వం (బ్రధ్నశ్వం) ప్రత్యపద్యత ॥ 97 ॥

ముద్గలుడికుమారుడు యశస్వి అయిన మౌద్గల్యుడు. మౌద్గల్యుడికి ఇంద్రసేన అనేస్త్రీయందు వధ్న్యశ్వుడు (బ్రధ్నశ్వుడు)జన్మించాడు.

(1. పుత్ర స్సత్యధృతి ర్నామ ధనుర్వేదస్య పారగః ।
తస్య సత్యధృతే రేతో దృష్ట్వాప్సరసమగ్రతః ॥

2. అవస్కన్నం శరస్తమ్బే మిథునం సమపద్యత ।
కృపయా తచ్చ జగృహే శన్తనుర్మృగయాం గతః ॥

3. కృపస్స్మృతస్స వై తస్మాద్ గౌతమీ చ కృపీ స్మృతా ।
ఏతే శారద్వతాః ప్రోక్తా ఏతే తే గౌతమా స్స్మృతాః ॥

4. అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి దివోదాసస్య సన్తతిమ్ ।
దివోదాసస్య దాయాదో బ్రహ్మర్షి ర్మిత్రయుర్నృపః ॥

5. మిత్రయోస్తు తత స్సోమో మైత్రేయా స్తే తతస్స్మృతాః ।
ఏతేఽపి సంశ్రితాః పక్షం క్షత్రోత్పన్నాస్తు భార్గవమ్.)

(1.వధ్న్యశ్వుడికుమారుడు సత్యధృతి. ఇతడు ధనుర్వేదవిద్యలో పారంగతుడు. ఎదురుగా ఒకానొక అప్సరసను చూచిన సత్యధృతికి 2.తెల్లుపొదలో రేతస్సు స్ఖలించింది. దానిలోనుంచి కవలపిల్లలు పుట్టారు. వేటకోసం అటు వెళ్ళిన శంతనుడు పసిపాపలపై దయతో ఆకవలపిల్లలను స్వీకరించాడు.

3. ఆకవలలలో మగపిల్లవాడిపేరు కృపుడు. రెండవపిల్ల ఆడపిల్లకు కృపి అనిపేరు. (కృపతో స్వీకరింపబడిన వారు కావడంచేత వీరికి ఈపేర్లు వచ్చిఉండవచ్చు.) వీరిని శారద్వతులు (తెల్లుపొదనుండి కలిగినసంతానం) అని వ్యవహరించారు. వీరినే గౌతములు అని కూడ అంటారు.

4. ఇక పైన దివోదాసుడిసంతానం గురించి చెప్తాను. దివోదాసుడికుమారుడు మిత్రయుడు అనేమహారాజు బ్రహ్మర్షి.

5. మిత్రయుడి కుమారుడు సోముడు. మిత్రయుడిసంతానం కావటంచేత వీరిని మైత్రేయులు అంటారు. వీరంతా క్షత్రియులే అయినప్పటికీ భార్గవులుగా (భృగువంశీయులుగా) పేర్కొనబడ్డారు.)

ఆసీత్ పఞ్చజనః పుత్రస్సృఞ్జయస్య మహాత్మనః ।
సుతః పఞ్చజనస్యాపి సోమదత్తో మహీపతిః ॥ 98 ॥

మహాత్ముడయిన సృంజయుడి తనయుడు పంచజనుడు. పంచజనుడికుమారుడు సోమదత్తుడు అనే భూపతి.

సోమదత్తస్య దాయాదస్సహదేవో మహాయశాః ।
సహదేవసుతశ్చాపి సోమకో నామ విశ్రుతః ॥
తథా గృత్సమతేః పుత్రో హ్యజమీఢో మహాబలః ॥ 99 ॥

సోమదత్తుడికుమారుడు సహదేవుడు. ఇతడు గొప్పకీర్తిమంతుడు. సహదేవుడితనయుడు సోమకుడు అని ప్రసిద్ధిపొందాడు. అలాగే గృత్సమతి పుత్రుడు అజమీఢుడు. ఇతడు బలవంతుడు.

అజమీఢసుతో జాతః క్షీణే వంశే తు సోమకః ।
సోమకస్య సుతో జన్తుర్యస్య పుత్రశతం బభౌ ॥ 100 ॥

వీరివంశం క్షీణించేపోయేదశలో అజమీఢుడికి సోమకుడు అనేకొడుకు కలిగాడు. సోమకుడి తనయుడు జంతువు. జంతువుకు వందమంది కొడుకులు పుట్టారు.

తేషాం యవీయాన్ పృషతో ద్రుపదస్య పితా ప్రభుః ।
ఆజమీఢాః స్మృతా హ్యేతే మహాత్మానస్తు సోమకాః ॥ 101 ॥

వారిలో అందరికంటె చిన్నవాడు పృషతుడు. ఈమహారాజు ద్రుపదుడికి తండ్రి. ఇంతవరకు ఉన్న మహాత్ములయిన సోమకుడి సంతానాన్ని ఆజమీఢులు అంటారు.

మహిషీ త్వజమీఢస్య ధూమినీ పుత్రగృద్ధినీ ।
పతివ్రతా మహాభాగా కులజా మునిసత్తమాః ॥ 102 ॥

మునివరులారా! అజమీఢుడి పట్టపురాణి ధూమిని. పుత్రసంతానంకోసం తపించింది. ఈమె పతివ్రత. మహాత్మురాలు. ఉత్తమవంశంలో పుట్టినది.

సా చ పుత్రార్థినీ దేవీ వ్రతచర్యాసమన్వితా ।
తతో వర్షాయుతం చక్రే తపః పరమదుశ్చరమ్ ॥ 103 ॥

కొడుకులకోసం ఆరాణి ఎన్నో వ్రతాలను ఆచరించింది. ఆతరువాత పదివేలసంవత్సరాలు అసాధ్య మయిన తపస్సు చేసింది.

హుత్వాగ్నిం విధివత్ సా తు పవిత్రామితభోజనా ।
అగ్నిహోత్రకుశేష్వేవ సుష్వాప మునిసత్తమాః ॥ 104 ॥

మునీశ్వరులారా! ఆమె అగ్నిలో హోమం చేసింది. పరిమితమైన ఆహారాన్ని మాత్రమే స్వీకరించింది. యజ్ఞగుండానికి సమీపంలో ఉంచిన దర్భలపైనే శయనించేది.

ధూమిన్యా స తయా దేవ్యా త్వజమీఢ స్సమీయివాన్ ।
ఋక్షం సఞ్జనయామాస ధూమ్రవర్ణం సుదర్శనమ్ ॥ 105 ॥

అజమీఢుడు ఆపట్టపురాణి ధూమినితో కలిసి, నలుపు, ఎరుపు కలిసిన మేనిచాయతో, అందంగా ఉన్న ఋక్షుడు అనే కుమారుడిని కన్నాడు.

ఋక్షాత్ సంవరణో జజ్ఞే కురుస్సంవరణాత్తతః ।
యః ప్రయాగాదతిక్రమ్య కురుక్షేత్రం చకార హ ॥ 106 ॥

ఋక్షుడికి సంవరణుడు పుట్టాడు. సంవరణుడికి కురువు జన్మించాడు. కురుమహారాజు ప్రయాగను దాటివెళ్లి కురుక్షేత్రం అనే నగరాన్ని నిర్మించాడు.

పుణ్యం చ రమణీయం చ పుణ్యకృద్భిర్నిషేవితమ్ ।
తస్యాన్వవాయస్సుమహాన్ యస్య నామ్నా తు కౌరవాః ॥ 107 ॥

కురుక్షేత్రం పుణ్యక్షేత్రం. అందంగా ఉంటుంది. అక్కడ పుణ్యాత్ములు నివసిస్తారు. ఆకురువువంశం చాలా పెద్దది. ఆవంశంవారిని కురువుపేరుమీదుగానే కౌరవులు అంటారు.

కురోశ్చ పుత్రాశ్చత్వారస్సుధన్వా సుధనుస్తథా ।
పరీక్షిచ్చ మహాబాహుః ప్రవరశ్చారిమేజయః ॥ 108 ॥

కురుమహారాజు కుమారులు నలుగురు. వారు సుధన్వుడు, సుధనుడు, గొప్పబాహువులు (భుజబలం) కలిగిన పరీక్షిత్తు, శత్రువులను జయించే ప్రవరుడు.

పరీక్షితస్తు దాయాదో ధార్మికో జనమేజయః ।
శ్రుతసేనోఽగ్రసేనశ్చ భీమసేనశ్చ నామతః ॥ 109 ॥

పరీక్షిత్తు కుమారుడు జనమేజయుడు. ఇతడు ధార్మికుడు. శ్రుతసేనుడు, అగ్రసేనుడు, భీమసేనుడు అనేవారు. (వీరు కూడ పరీక్షిత్తు తనయులు. జనమేజయుడిసోదరులు.)

(1. సుధన్వనస్తు దాయాదస్సుహోత్రో మతిమాన్ స్మృతః ।
చ్యవనస్తస్య పుత్రస్తు రాజా ధర్మార్థకోవిదః ॥
2. చ్యవనాత్ కృతయజ్ఞస్తు ఇష్ట్వా యజ్ఞైస్తు ధర్మవిత్ ।
విశ్రుతం జనయామాస పుత్ర మిద్రసఖం నృపమ్ ॥

3. **చైద్యోపరివరం వీరం వసుం నామ్నాన్తరిక్షగమ్ ।**
చైద్యోపరివరా జ్జజ్ఞే గిరికా సప్త మానవాన్ ॥

4. **మహారథో మగధరాట్ విశ్రుతో యో బృహద్రథః ।**
ప్రత్యగ్రథః క్రథశ్చైవ యమాహుర్మణివాహనమ్ ।
శాకలశ్చ జుహుశ్చైవ మత్స్యః కాలీ చ సప్తమః ॥

5. **బృహద్రథస్య దాయాదః కుశాగ్రో నామ విశ్రుతః ।**
కుశాగ్రస్యాత్మజో విద్వాన్ ఋషభో నామ వీర్యవాన్ ॥

6. **జుహో స్తు కథయిష్యామి వంశం సర్వగుణాన్వితమ్ ।**
జుహు స్త్వజనయత్ పుత్రం సురథం నామ భూమిపమ్ ॥

1.సుధన్వుడి కుమారుడు సుహోత్రుడు. ఇతడు బుద్ధిమంతుడు. సుహోత్రుడితనయుడు చ్యవనుడు. ఈమహారాజు ధర్మార్థాలు చక్కగా తెలిసినవాడు.

2. చ్యవనుడికుమారుడు కృతయజ్ఞుడు. ధర్మవేత్త అయిన కృతయజ్ఞుడు అనేకయజ్ఞాలు చేసి, విశ్రుతుడిని కన్నాడు. విశ్రుత మహారాజు దేవేంద్రుడికి ప్రియమిత్రుడు.

3.ఇతడినే చైద్యోపరివ(చ)రుడు, వసువు అంటారు. ఇతడు వీరుడు. ఆకాశంలో సంచరిస్తాడు. చైద్యోపరివ(చ)రుడివలన గిరిక అనే కన్య ఏడుగురు మానవులను ప్రసవించింది.

4. వారు మహారథుడు, మగధదేశానికి రాజూ, సుప్రసిద్ధుడూ అయిన (1) బృహద్రథుడు. (2) ప్రత్యగ్రథుడు, మణివాహనుడు అని పేర్కొనబడే (3) క్రథుడు. (4) శాకలుడు, (5) జహ్నువు, (6) మత్స్యుడు, ఏడవవాడు కాలి.

5. బృహద్రథుడికుమారుడు కుశాగ్రుడు. ఇతడు సుప్రసిద్ధుడు. కుశాగ్రుడితనయుడు ఋషభుడు. ఇతడు పండితుడు. బలశాలి.

6. సమస్తమయిన ఉత్తమగుణాలతో కూడిన జుహువు వంశాన్ని గురించి చెప్తాను. జుహువు కుమారుడు సురథుడు అనేమహారాజు.)

ఏతే సర్వే మహాభాగా విక్రాన్తా బలశాలినః ।
జనమేజయస్య పుత్రస్తు సురథో మతిమాంస్తథా ॥ 110 ॥

వీరందరూ మహాత్ములు. పరాక్రమశాలులు. జనమేజయుడికుమారుడు సురథుడు. ఇతడు తండ్రివలెనే బుద్ధిమంతుడు.

సురథస్య తు విక్రాన్తః పుత్రో జజ్ఞే విదూరథః ।
విదూరథస్య దాయాద ఋక్ష ఏవ మహాబలః ।
ద్వితీయస్తు భరద్వాజాన్నామ్నా తేనైవ విశ్రుతః ॥ 111 ॥

సురథుడికి వీరుడయిన విదూరథుడు జన్మించాడు. విదూరథుడికుమారుడు ఋక్షుడు. ఇతడు మహాబల వంతుడు. విదూరథుడికి భరద్వాజుడిఅనుగ్రహంవలన రెండవకుమారుడు గలిగాడు. అతడు భరద్వాజుడు అనే పేరు తోనే ప్రసిద్ధుడయినాడు.

ద్వావృక్షౌ సోమవంశేఽస్మిన్ ద్వావేవ చ పరీక్షితౌ ।
భీమసేనాస్త్రయో విప్రా ద్వౌ చాపి జనమేజయౌ ॥ 112 ॥

సోమవంశంలో ఇద్దరు ఋక్షులు, ఇద్దరు పరీక్షిత్తులు, ముగ్గురు భీమసేనులు, ఇద్దరు జనమేజయులు పుట్టారు.

ఋక్షస్య తు ద్వితీయస్య భీమసేనోఽభవత్ సుతః ॥113 ॥

రెండవవాడయిన ఋక్షుడి పుత్రుడు భీమసేనుడు.

ప్రతీపో భీమసేనా త్తు ప్రతీపస్య తు శన్తనుః ।
దేవాపిర్బాహ్లికశ్చాపి త్రయ ఏవ మహారథాః ॥114 ॥

భీమసేనుడితనయుడు ప్రతీపుడు. ప్రతీపుడికి శంతనుడు, దేవాపి, బాహ్లికుడు అనేముగ్గురు కుమారులు గలిగారు. వీరు ముగ్గురు మహారథులు.

శన్తనుస్త్వభవద్ రాజా వంశేఽస్మిన్ వై ద్విజోత్తమాః ।
బాహ్లికస్య తు రాజర్షేర్వంశం శృణుత భో ద్విజాః ॥115 ॥

బ్రాహ్మణోత్తములారా! ఈవంశంలో శంతనుడు రాజు అయినాడు. ద్విజులారా! బాహ్లికుడు అనేరాజర్షియొక్క వంశాన్ని గురించి వినండి.

బాహ్లికస్య సుతశ్చైవ సోమదత్తో మహాయశాః ।
జజ్ఞిరే సోమదత్తాత్తు భూరిర్భూరిశ్రవాశ్శలః ॥ 116 ॥

బాహ్లికుడికుమారుడు సోమదత్తుడు. ఇతడు గొప్పకీర్తిమంతుడు. సోమదత్తుడికి భూరి, భూరిశ్రవుడు, శలుడు జన్మించారు.

ఉపాధ్యాయస్తు దేవానాం దేవాపిరభవన్ మునిః ।
చ్యవనస్య పుత్రః కృతక ఇష్ట ఆసీన్మహాత్మనః ॥ 117 ॥

దేవాపి మహర్షి దేవతలకు ఉపాధ్యాయుడు అయినాడు. మహాత్ముడయిన దేవాపికి చ్యవనుడికుమారు డయిన కృతకుడు అంటే చాల ఇష్టం.

శన్తనుస్త్వభవద్రాజా కౌరవాణాం ధురంధరః ।
శన్తనోస్సమ్ప్రవక్ష్యామి వంశం త్రైలోక్యవిశ్రుతమ్ ॥118 ॥

కౌరవుల(వంశరక్షణ)భారాన్ని వహిస్తూ శంతనుడు రాజు అయినాడు. ఇక మూడులోకాలలోనూ ప్రసిద్ధ మయిన శంతనుడి వంశం గురించి వివరిస్తాను.

గాఙ్గం దేవవ్రతం నామ పుత్రం సోఽజనయత్ ప్రభుః ।
స తు భీష్మ ఇతి ఖ్యాతః పాణ్డవానాం పితామహః ॥119 ॥

ఆశంతనుమహారాజు గంగయందు దేవవ్రతుడు అనేకొడుకును కన్నాడు. పాండవులకు తాత అయిన ఇతడు భీష్ముడు అని సుప్రసిద్ధుడు.

కాలీ విచిత్రవీర్యం తు జనయామాస భో ద్విజాః ।
శన్తనోర్దయితం పుత్రం ధర్మాత్మానమకల్మషమ్ ॥ 120 ॥

ఓ బ్రాహ్మణులారా! శంతనుడికి భార్య అయిన కాళియందు విచిత్రవీర్యుడు జన్మించాడు. ఇతడు ధార్మికుడు, పాపరహితుడు.

కృష్ణద్వైపాయనాచ్చైవ క్షేత్రే వైచిత్ర్యవీర్యకే ।
ధృతరాష్ట్రం చ పాణ్డుం చ విదురం చాప్యజీజనత్ ॥ 121 ॥

విచిత్రవీర్యుడి భార్యయందు కృష్ణద్వైపాయనుడివలన ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు అనేవారు కలిగారు.

ధృతరాష్ట్రేణ గాన్ధార్యాం పుత్రా ఉత్పాదితా శ్శతమ్ ।
తేషాం దుర్యోధనశ్శ్రేష్ఠస్సర్వేషామపి స ప్రభుః ॥ 122 ॥

గాంధారియందు ధృతరాష్ట్రుడికి వందమంది కుమారులు గలిగారు. వారందరిలోనూ దుర్యోధనుడు పెద్దవాడు. అతడే రాజు అయినాడు.

పాణ్డోర్ధనఞ్జయః పుత్రస్సౌభద్రస్తస్య చాత్మజః ।
అభిమన్యోః పరీక్షిత్తు తతః పారీక్షితస్సుతః ॥ 123 ॥

పాండురాజు కుమారుడు ధనంజయుడు (అర్జునుడు). ధనంజయుడికుమారుడు సుభద్రకు గలిగిన అభిమన్యుడు. అభిమన్యుడికొడుకు పరీక్షిత్తు. పరీక్షిత్తు కుమారుడు జనమేజయుడు.

పారీక్షితస్య కాశ్యాయాం ద్వౌ పుత్రౌ సమ్బభూవతుః ।
చన్ద్రాపీడశ్చ నృపతిస్సూర్యపీడశ్చ మోక్షవిత్ ॥ 124 ॥

పరీక్షిత్తుపుత్రుడయిన జనమేజయుడికి కాశ్యయందు ఇద్దరు కుమారుల గలిగారు. రాజు అయిన చంద్రాపీడుడు, మోక్షజ్ఞాని అయిన సూర్యపీడుడు.

చన్ద్రాపీడస్య పుత్రాణాం శతముత్తమధన్వినామ్ ।
జానమేజయమిత్యేవం క్షాత్రం భువి పరిశ్రుతమ్ ॥ 125 ॥

చంద్రాపీడుడికి నూరుగురుకుమారులు. వారు అందరూ శ్రేష్ఠులయిన ధానుష్కులు. వీరివంశం జానమేజయం (జనమేజయుడికిసంబంధించినవంశం) అని భూమండలంలో ప్రసిద్ధ మయింది.

తేషాం జ్యేష్ఠస్తు తత్రాసీత్ పురే వారణసాహ్వయే ।
సత్యకర్ణో మహాబాహుర్యజ్వా విపులదక్షిణః ॥ 126 ॥

ఆవందమందిపుత్రులలో పెద్దవాడు సత్యకర్ణుడు. అతడు హస్తినాపురంలో ఉండేవాడు. మిక్కిలిబాహుబలం కలిగినవాడు. పెక్కు యజ్ఞాలు చేశాడు. దక్షిణలు అధికంగా ఇచ్చినవాడు.

సత్యకర్ణస్య దాయాదశ్వేతకర్ణః ప్రతాపవాన్ ।
అపుత్రస్స తు ధర్మాత్మా ప్రవివేశ తపోవనమ్ ॥ 127 ॥

సత్యకర్ణుడికుమారుడు శ్వేతకర్ణుడు. పరాక్రమవంతుడు. పుత్రసంతానం లేని ఆ ధర్మాత్ముడు తపస్సు ఆచరించడానికి అరణ్యాలకు వెళ్లాడు.

తస్మాద్ వనగతాద్ గర్భం యాదవీ ప్రత్యపద్యత ।
సుబాహోర్దుహితా సుభ్రూర్మాలినీ గ్రాహమాలినీ ॥128 ॥

ఆఅరణ్యంలో శ్వేతకర్ణుడివలన యదువంశంలో జనించిన మాలిని గర్భం ధరించింది. మాలిని సుబాహువు కుమార్తె. అందమైన కనుబొమ్మలు కలిగినది. ఈమెనే గ్రాహమాలిని అని కూడ అంటారు.

సమ్భూతే స చ గర్భే చ శ్వేతకర్ణః ప్రజేశ్వరః ।
అన్వగచ్ఛత్ కృతం పూర్వం మహాప్రస్థానమచ్యుతమ్ ॥ 129 ॥

భార్య గర్భం ధరించడంతో శ్వేతకర్ణమహారాజు పూర్వం చేసుకున్న నియమాన్ని అనుసరించి శాశ్వతమైన మహాప్రస్థానానికి వెళ్ళాడు.

సా తు దృష్ట్వా ప్రియం తం చ మాలినీ పృష్ఠతోఽన్వగాత్ ।
సుబాహోర్దుహితా సాధ్వీ వనే రాజీవలోచనా ॥ 130 ॥

సుబాహువుకూతురూ, కమలాక్షి, పతివ్రత అయిన మాలిని అలా వెళ్లిపోతున్న భర్తను వెన్నంటి అనుసరించింది.

పథి సా సుషువే బాలా సుకుమారం కుమారకమ్ ।
తమపాస్య చ తత్రైవ రాజానం సాన్వగచ్ఛత ।
పతివ్రతా మహాభాగా ద్రౌపదీవ పురా సతీ ॥ 131 ॥

దారిలోనే ఆమె సుకుమారుడయిన కుమారుడిని ప్రసవించింది. తనకొడుకును అక్కడే వదిలి ఆపతివ్రత పూర్వం భర్తలవెంట వెళ్లిన ద్రౌపదివలె భర్తను అనుసరించి వెళ్లింది.

కుమారస్సుకుమారోஉసౌ గిరికుఞ్జే రురోద హ ।
దయార్థం తస్య మేఘాస్తు ప్రాదురాసన్మహాత్మనః ॥ 132 ॥

సుకుమారుడయిన ఆమె కుమారుడు ఆకొండపొదలలో ఏడ్వసాగాడు. ఆపసిబిడ్డమీద దయతో మేఘాలు ఏర్పడి నీడను ఇచ్చాయి.

శ్రవిష్ఠాయాస్తు పుత్రౌ ద్వౌ పైప్పలాదిశ్చ కౌశికః ।
దృష్ట్వా కృపాన్వితౌ గృహ్య తాం ప్రాక్షాలయతాం జలే ॥ 133 ॥

శ్రవిష్ఠ కొడుకులు పైప్పలాది, కౌశికుడు అనే ఇద్దరు ఆబాలుడిని చూచి, దయతో వాడిని తీసుకునివెళ్లి నీళ్లలో కడిగారు.

నిఘృష్టౌ తస్య పార్శ్వే తు శిలాయాం రుధిరప్లుతౌ ।
అజశ్యామస్స పార్శ్వాభ్యాం ఘృష్టాభ్యాం సుసమాహితః ॥ 134 ॥

ఆపసివాడు రాళ్లపై ఉన్నసమయంలో అతడిశరీరం ప్రక్కభాగాలు రాళ్లతో ఒరిపిడివల్ల రక్తం కారుతున్నాయి. ఆఒరిపిడివల్ల ఆబాలుడిప్రక్కభాగాలు మేకలాగా నల్లగా అయినాయి.

అజశ్యామౌ తు తత్పార్శ్వే దైవేన సమ్బభూవతుః ।
అథాజపార్శ్వ ఇతి వై చక్రాతే నామ తస్య తౌ ॥ 135 ॥

దైవికంగా ఆపిల్లవాడిశరీరం పార్శ్వభాగాలు మేకవలె నల్లగా కావడంచేత ఆబాలుడికి వారు అజపార్శ్వుడు అనేపేరు పెట్టారు.

స తు రోమక శాలాయాం ద్విజాభ్యాం పరివర్ధితః ॥ 136 ॥

రోమకుడి ఇంట్లో ఇద్దరుబ్రాహ్మణులు ఆబాలుడిని పెంచారు.

రోమకస్య తు భార్యా తముద్వహత్ పుత్రకారణాత్ ।
రోమక్యాస్స తు పుత్రోஉభూత్ బ్రాహ్మణౌ సచివౌ తు తౌ ॥ 137 ॥

రోమకుడిభార్య ఆబాలుడిని కొడుకులాగా ఎత్తుకున్నది. రోమకికి (రోమకుడిభార్యకు) అతడు పుత్రుడు అయ్యాడు. ఆబ్రాహ్మణులు అతనికి సచివులు అయ్యారు.

తేషాం పుత్రాశ్చ పౌత్రాశ్చ యుగపత్తుల్యజీవినః ।
స ఏష పౌరవో వంశః పాణ్డవానాం ప్రతిష్ఠితః ॥ 138 ॥

వారి కొడుకులు, మనుమలు క్రమంగా కలిసి జీవించారు. ఇది పూరువుకు సంబంధించినవంశం. పాండవులు ఈవంశంలోనే పుట్టారు.

శ్లోకోஉపి చాత్ర గీతోஉయం నాహుషేణ యయాతినా ।
జరాసఙ్క్రమణే పూర్వం భృశం ప్రీతేన ధీమతా ॥ 139 ॥

పూర్వం నహుషుడికుమారుడూ, బుద్ధిమంతుడూ అయిన యయాతి కొడుకులతో తనముసలితనం మార్చుకునేసమయంలో సంతోషంతో ఇలా గానం చేశాడు.

ఆచన్ద్రార్కగ్రహా భూమిర్భవేదియమసంశయమ్ ।
అపౌరవా మహీ నైవ భవిష్యతి కదాచన ॥ 140 ॥

సూర్యుడూ, చంద్రుడూ, గ్రహాలూ ఉన్నంతకాలం ఈభూమండలం నిస్సందేహంగా ఉంటుంది. పూరు వంశీయులు లేకుండా ఈభూమి ఉండనే ఉండదు. (సూర్యాదులు ఉన్నంతకాలం ఈభూమిమీద పూరువంశీయులు ఉంటారు. అని తాత్పర్యం)

ఏష వః పౌరవో వంశో విఖ్యాతః కథితో మయా ।
రీతుర్వసోశ్చ ప్రవక్ష్యామి ద్రుహ్యోశ్చానోర్యదోస్తథా ॥ 141 ॥

ప్రసిద్ధమయిన పూరువంశాన్ని గురించి వివరించాను. ఇక తర్వాత తుర్వసుడు, ద్రుహ్యువు, అనువు, యదువు అనేవారి (యయాతికుమారుల) వంశాలను గురించి వివరిస్తాను. (10.5,6)

తుర్వసోశ్చ సుతో వహ్నిర్గోభానుస్తస్య చాత్మజః ।
గోభానోస్తు సుతో రాజా త్రైశానురపరాజితః ॥ 142 ॥

తుర్వసుడికుమారుడు వహ్ని. వహ్ని తనయుడు గోభానువు. గోభానువు కుమారుడు త్రైశానుడు. ఇతడు ఓటమి యెఱుగనిరాజు.

కరంధమస్తు త్రైశానోర్మరుత్తస్తస్య చాత్మజః ।
అన్యస్త్వావిక్షితో రాజా మరుత్తః కథితో మయా ॥ 143 ॥

త్రైశానుడికొడుకు కరంధముడు. ఆతడికుమారుడు మరుత్తుడు. ఆవిక్షితుడికి పుట్టిన వేరొక మరుత్తుడు అనేమహారాజును గురించి ఇంతకు పూర్వం చెప్పాను.

అనపత్యోఽభవద్ రాజా యజ్వా విపులదక్షిణః ।
దుహితా సంయతా నామ తస్యాసీత్ పృథివీపతేః ॥ 144 ॥

మరుత్తుడికి పుత్రసంతానం గలగలేదు. అతడు అనేకమైన యాగాలు చేశాడు. విస్తారమైన దక్షిణలు ఇచ్చాడు. ఆమహారాజుకు సంయత అనే కూతురు ఉన్నది.

దక్షిణార్థం తు సా దత్తా సంవర్తాయ మహాత్మనే ।
దుష్యన్తం పౌరవం చాపి లేభే పుత్రమకల్మషమ్ ॥ 145 ॥

మరుత్తుడు తనకూతురిని మహాత్ముడయిన సంవర్తుడికి దక్షిణగా ఇచ్చాడు. ఆమె దుష్యంతుడు అనేకుమారుడిని పొందింది. పూరువంశీయుడయిన దుష్యంతుడు పుణ్యాత్ముడు.

ఏవం యయాతిశాపేన జరాసఙ్క్రమణే తదా ।
పౌరవం తుర్వసోర్వశం ప్రవివేశ ద్విజోత్తమాః ॥ 146 ॥

బ్రాహ్మణోత్తములారా! ఈవిధంగా యయాతిశాపం మూలంగా ముసలితనం మార్చుకునేసందర్భంలో తుర్వసువంశం పూరువంశంలో కలిసింది.

దుష్యన్తస్య తు దాయాదః కరూరోమః ప్రజేశ్వరః ।
కరూరోమాదథాఽఽహ్రీదశ్చత్వార స్తస్య చాత్మజాః ॥ 147 ॥

దుష్యంతుడికుమారుడు కరూరోముడు అనే ప్రజానాయకుడు. కరూరోముడితనయుడు ఆహ్రీదుడు. ఆహ్రీదుడికి నలుగురు కొడుకులు.

పాణ్డ్యశ్చ కేరలశ్చైవ కోలశ్చోలశ్చ పార్థివః ।
తేషాం జనపదాః స్ఫీతాః పాణ్డ్యాశ్చోలాశ్చ కేరలాః ॥ 148 ॥

పాండ్యుడు, కేరలుడు, కోలుడు, చోలుడు అనేవారు. వారిరాజ్యప్రజలు పాండ్యులు, చోలులు, కేరళులు అని ప్రసిద్ధులు.

ద్రుహ్యోశ్చ తనయో రాజన్ బభ్రుసేతుశ్చ పార్థివః ।
అఙ్గారసేతుస్తత్పుత్రో మరుతాం పతి రుచ్యతే ।
యౌవనాశ్వేన సమరే కృచ్ఛ్రేణ నిహతో బలీ ॥ 149 ॥

రాజా! ద్రుహ్యువు కుమారుడు బభ్రుసేతువు అనే రాజు. బభ్రుసేతువు కుమారుడు అంగారసేతువు. అతడు మరుత్తులకు నాయకుడు. బలవంతుడయిన అంగారసేతువును యౌవనాశ్వుడు యుద్ధంలో సంహరించాడు.

యుద్ధం సుమహదప్యాసీన్మాసాన్పరిచరద్దశ ।
అఙ్గారసేతోర్దాయాదో గాన్ధారో నామ పార్థివః ॥ 150 ॥

వారికి పదినెలలపాటు తీవ్రమైన యుద్ధం జరిగింది. అంగారసేతువు కుమారుడు గాంధారుడు అనేమహారాజు.

ఖ్యాయతే యస్య నామ్నా వై గాన్ధారవిషయో మహాన్ ।
గాన్ధారదేశజాశ్చైవ తురగా వాజినాం వరాః ॥ 151 ॥

ఆతడిపేరుమీదుగానే గాంధారదేశం గొప్పగా ప్రసిద్ధ మయింది. గుఱ్ఱా లన్నింటిలోనూ గాంధారదేశంలో పుట్టినగుఱ్ఱాలు ఉత్తమమైనవి.

అనోస్తు పుత్రో ధర్మోఽభూద్ ధృతస్తస్యాత్మజోఽభవత్ ।
ధృతా చ్ఛతద్రుహో జజ్ఞే ప్రచేతా స్తస్య చాత్మజః ।
ప్రచేతసస్సుచేతాస్తు కీర్తితాస్తనయా మయా ॥ 152 ॥

అనువు కుమారుడు ధర్ముడు. ధర్ముడికుమారుడు ధృతుడు. ధృతుడికి శతద్రుహుడు. శతద్రుహుడికుమారుడు ప్రచేతుడు. ప్రచేతసుడికుమారుడు సుచేతసుడు. సుచేతసుడికుమారులను గురించి ఇంతకు ముందు చెప్పాను.

బభూవు స్తు యదోః పుత్రాః పఞ్చ దేవసుతోపమాః ।
సహస్రదః పయోదశ్చ క్రోష్టా నీలో౽ఞ్జిక స్తథా ॥153 ॥

ఇక యదువుకు దేవకుమారులవంటి కొడుకులు ఐదుగురు కలిగారు. వారు సహస్రదుడు, పయోదుడు, క్రోష్టుడు, నీలుడు, అంజికుడు.

సహస్రదస్య దాయాదాస్త్రయః పరమధార్మికాః ।
హైహయశ్చ హయశ్చైవ రాజా వేణుహయస్తథా ॥154 ॥

వీరిలో సహస్రదుడికి ధర్మపరాయణులయిన తనయులు ముగ్గురు కలిగారు. హైహయుడు, హయుడు, వేణుహయుడు అనేవారు.

హైహయస్యాభవత్ పుత్రో ధర్మనేత్ర ఇతి శ్రుతః ॥ 155 ॥

హైహయుడికి ధర్మనేత్రుడు అనేకొడుకు కలిగాడని వినబడుతున్నది.

ధర్మనేత్రస్య కార్తస్తు సాహఞ్జస్తస్య చాత్మజః ।
సాహఞ్జనీ నామ పురీ తేన రాజ్ఞా నివేశితా ॥ 156 ॥

ధర్మనేత్రుడికి కార్తుడు పుట్టాడు. కార్తుడికి సాహంజుడు జన్మించాడు. సాహంజమహారాజు సాహంజని అనే నగరాన్ని నిర్మించాడు.

ఆసీ న్మహిష్మతః పుత్రో భద్రశ్రేణ్యః ప్రతాపవాన్ ।
భద్రశ్రేణ్యస్య దాయాదో దుర్దమో నామ విశ్రుతః ॥157 ॥

మహిష్మంతుడికుమారుడు భద్రశ్రేణ్యుడు. ఇతడు పరాక్రమశాలి. భద్రశ్రేణ్యుడితనయుడు దుర్దముడు. (8.46)

దుర్దమస్య సుతో ధీమాన్ కనకో నామ నామతః ।
కనకస్య తు దాయాదా శ్చత్వారో లోకవిశ్రుతాః ॥ 158 ॥

దుర్దముడికుమారుడు కనకుడు. కనకుడికి జగత్ప్రసిద్ధులయిన కుమారులు నలుగురు.

కృతవీర్యః కృతౌజాశ్చ కృతకర్మా తథైవ చ ।
కృతాగ్నిస్తు చతుర్థో౽భూత్ కృతవీర్యాత్తథార్జునః ॥159 ॥

కృతవీర్యుడు, కృతౌజుడు, కృతకర్మ అలాగే కృతాగ్ని అనేవాడు నాలుగవవాడు. కృతవీర్యుడికుమారుడు అర్జునుడు.

యోఽసౌ బాహుసహస్రేణ సప్తద్వీపేశ్వరోఽభవత్ ।
జిగాయ పృథివీమేకో రథేనాదిత్యవర్చసా ॥ 160 ॥

అర్జునుడు వేయిబాహువులతో (బాహుబలంతో) సప్తద్వీపాలకూ (భూమండలం మొత్తానికీ) చక్రవర్తి అయినాడు. సూర్యతేజస్సు గలిగిన రథంతో అసహాయంగా భూమండల మంతటినీ జయించాడు.

స హి వర్షాయుతం తప్త్వా తపః పరమదుశ్చరమ్ ।
దత్తమారాధయామాస కార్తవీర్యోఽత్రిసమ్భవమ్ ॥ 161 ॥

పదివేలసంవత్సరాలు అసాధ్యమయిన గొప్ప తపస్సు చేశాడు. కృతవీర్యుడితనయుడయిన అర్జునుడు అత్రిమహర్షి కుమారు డయిన దత్తుడిని ఆరాధించాడు.

తస్మై దత్తో వరాన్ ప్రాదాచ్చతురో భూరితేజసః ।
పూర్వం బాహుసహస్రం వై ప్రార్థితం సుమహద్వరమ్ ॥ 162 ॥

తేజస్వి అయినకార్తవీర్యుడికి దత్తాత్రేయుడు నాలుగు వరాలను ప్రసాదించాడు. మొదట వేయిబాహువులు కావాలి అనే గొప్పవరాన్ని కార్తవీర్యుడు అడిగాడు.

అధర్మేఽధీయమానస్య సద్భిస్తత్ర నివారణమ్ ।
ఉగ్రేణ పృథివీం జిత్వా ధర్మేణైవానురఞ్జనమ్ ॥ 163 ॥

అధర్మమార్గంలో వర్తిస్తున్న వారిని సాధుజనులచేత నివారించడం రెండవవరం. భూమండలాన్ని మొత్తాన్ని జయించి, ప్రజలను ధర్మమార్గంలో సంతోషపెట్టడం మూడవది.

సఙ్గ్రామాన్ సుబహూన్ జిత్వా హత్వాచారీన్ సహస్రశః ।
సఙ్గ్రామే వర్తమానస్య వధం చాభ్యధికాద్రణే ॥ 164 ॥

అనేకమయిన యుద్ధాలలో విజయం సాధించి వేలాదిగా శత్రువులను సంహరించడం, యుద్ధం చేస్తూ తనకంటె గొప్పవీరుడిచేతిలో తాను మరణించడం అనేది నాలుగవవరంగానూ కోరుకున్నాడు.

తస్య బాహుసహస్రం తు యుధ్యతః కిల భో ద్విజాః ।
యోగాద్యోగేశ్వరస్యేవ ప్రాదుర్భవతి మాయయా ॥ 165 ॥

ఓ బ్రాహ్మణులారా! యుద్ధం చేస్తున్నసమయంలో కార్తవీర్యుడికి యోగశక్తిచేత యోగేశ్వరుడికివలె అద్భుతంగా, వేయి బాహువులు ఉద్భవిస్తాయి.

తేనేయం పృథివీ సర్వా సప్తద్వీపా సపత్తనా ।
ససముద్రా సనగరా ఉగ్రేణ విధినా జితా ॥ 166 ॥

ఆకార్తవీర్యుడు ఏడుద్వీపాలతోనూ, వివిధపట్టణాలతోనూ, నగరాలతోనూ, సముద్రంతోనూ, కూడిన ఈభూమండలాన్ని తీక్ష్ణమయినపరాక్రమంతో జయించాడు.

తేన సప్తసు ద్వీపేషు సప్త యజ్ఞశతాని వై ।
ప్రాప్తాని విధినా రాజ్ఞా శ్రూయన్తే మునిసత్తమాః ।। 167 ॥

మునివరులారా! కార్తవీర్యమహారాజు ఏడుద్వీపాలలోనూ, ఏడువందలయజ్ఞాలు విధిపూర్వకంగా, చేశాడని విన్నాం.

సర్వే యజ్ఞా మునిశ్రేష్ఠాస్సహస్రశతదక్షిణాః ।
సర్వే కాఞ్చనయూపాశ్చ సర్వే కాఞ్చనవేదయః ॥ 168 ॥

కార్తవీర్యుడు తాను చేసేయజ్ఞాలు అన్నింట్లోనూ లక్షలకొద్దీ దక్షిణ లిచ్చాడు. యజ్ఞం యూపస్తంభాలు అన్నీ బంగారంవే. యజ్ఞవేదికలు అన్నీ బంగారంవే.

సర్వైర్దేవైర్మునిశ్రేష్ఠా విమానస్థైరలఙ్కృతైః ।
గన్ధర్వైరప్సరోభిశ్చ నిత్య మేవోపశోభితాః ॥ 169 ॥

మునివరులారా! అందంగా అలంకరించుకుని, విమానాలలో విహరిస్తున్న సమస్తమైన దేవతలతో, గంధర్వులతో, అప్సరసలతో, కార్యవీర్యుడు నిత్యమూ చేసే యజ్ఞాలు ప్రకాశించాయి..

యస్య యజ్ఞే జగౌ గాథాం గన్ధర్వో నారదస్తథా ।
వరీదాసాత్మజో విద్వాన్ మహిమ్నా తస్య విస్మితః ॥ 170 ॥

ఆకార్తవీర్యుడియాగంలో వరీదాసుడితనయుడూ, గంధర్వుడూ, విద్వాంసుడూ అయిన నారదుడు కార్తవీర్యుడి మహిమలకు ఆశ్యర్యపడి ఆతడివిజయగాధలను గానం చేశాడు.

నారద ఉవాచ:- నారదుడు ఇలా అంటున్నాడు.

న నూనం కార్తవీర్యస్య గతిం యాస్యన్తి పార్థివాః ।
యజ్ఞైర్దానైస్తపోభిర్వా విక్రమేణ శ్రుతేన చ ॥ 171 ॥

యజ్ఞాలు, దానాలు, తపస్సులు, పరాక్రమం, పాండిత్యం దేనిచేత కూడా రాజులు ఎవ్వరూ కార్తవీర్యుడితో సమానమయిన స్థితిని పొందలేరు.

స హి సప్తసు ద్వీపేషు చర్మీ ఖడ్గీ శరాసనీ ।
రథీ ద్వీపాననుచరన్యోగీ సన్దృశ్యతే నృభిః ॥ 172 ॥

యోగి అయిన ఆకార్తవీర్యుడు డాలు, కత్తీ, విల్లూ, రథమూ కలిగి, సప్తద్వీపాలలోనూ సంచరిస్తూ ప్రజలకు (అన్నిచోట్లా) కనబడతాడు.

అనష్టద్రవ్యతా చైవ న శోకో న చ విభ్రమః ।
ప్రభావేణ మహారాజ్ఞః ప్రజా ధర్మేణ రక్షతః ॥ 173 ॥

ప్రజలందరినీ ధర్మబద్ధంగా రక్షించే కార్తవీర్యుడిప్రభావంచేత సంపదలు పోగొట్టుకోవడమూ, దుఃఖమూ, కలవరపాటు అనేవి ఏవి కూడా ఆ రాజ్యంలో లేవు.

స సర్వరత్నభోగాఢ్యశ్చక్రవర్తీ బభూవ హ ।
స ఏవ పశుపాలోఽభూత్ క్షేత్రపాలస్స ఏవ చ ॥ 174 ॥

ఆకార్తవీర్యుడు చక్రవర్తి. శ్రేష్ఠమైన సకలభోగాల్నీ పొందినవాడు. అతడే పశువులకు సంరక్షకుడు. వ్యవసాయభూములను కాపాడేవాడూ అతడే.

స ఏవ వృష్ట్యా పర్జన్యో యోగిత్వాదర్జునోఽభవత్ ।
స వై బాహుసహస్రేణ జ్యాఘాతకఠినత్వచా ।
భాతి రశ్మిసహస్రేణ శరదీవ చ భాస్కరః ॥ 175

యోగిధర్మంతో ఆకార్తవీర్యార్జునుడు వర్షం కురిపించడానికి అతడే మేఘం అయినాడు. వింటినారి ఒరిపిడిచేత కఱకయినచర్మం కలిగినవేయిబాహువులతో యుద్ధరంగంలో కార్తవీర్యుడు శరత్కాలంలోని వేయికిరణాలతో సూర్యుడులాగా ప్రకాశిస్తాడు.

స హి నాగాన్మనుష్యేషు మాహిష్మత్యాం మహాద్యుతిః ।
కర్కోటకసుతాఞ్జిత్వా పుర్యాం తస్యాం న్యవేశయత్ ॥ 176 ॥

మిక్కిలి తేజస్వి అయిన ఆకార్తవీర్యుడు కర్కోటకుడి కుమారులయిన నాగులను జయించి, (తనరాజధాని) మాహిష్మతీనగరంలో మానవులుగా నిలిపాడు.

స వై వేగం సముద్రస్య ప్రావృట్కాలేఽమ్బుజేక్షణః ।
క్రీడన్నివ భుజోద్భిన్నం ప్రతిస్రోతశ్చకార హ ॥ 177 ॥

తామరలవంటికన్నులు గలిగిన కార్తవీర్యుడు వర్షాకాలంలో సముద్రం వేగాన్ని తనబాహుబలంతో ఆటగా అడ్డగించి, వెనక్కి ప్రవహింపజేశాడు. (వర్షాకాలంలో సముద్రంలో నీటిప్రవాహం అత్యధికం అయి రాజ్యంలోకి ప్రవహిస్తుండగా, తనవేయిచేతులను బారచాచి ఆప్రవాహాన్ని అడ్డగించి, మళ్లీ వెనక్కు సముద్రంలోకి నెట్టేశాడు.)

లుణ్ఠితా క్రీడతా తేన నదీ తద్ధామమాలినీ ।
చలదూర్మిసహస్రేణ శఙ్కితాఽభ్యేతి నర్మదా ॥ 178 ॥

కార్తవీర్యుడు జలక్రీడలలో అడ్డుకోగా, కార్తవీర్యుడినగరాన్ని చుట్టిప్రవహిస్తున్న నర్మదానది సందేహంతో (భయపడి) కదులుతున్నవేలకొలది అలలసముదాయంతో కార్తవీర్యుడికి (గౌరవంతో) ఎదురు వచ్చేది.

తస్య బాహుసహస్రేణ క్షిప్యమాణే మహోదధౌ ।
భయా న్నిలీనా నిశ్చేష్టాః పాతాలస్థా మహాసురాః ॥ 179 ॥

కార్తవీర్యుడు తనవేయిబాహువులతో మహాసముద్రాన్ని అల్లకల్లోలం చేస్తూండగా, పాతాళలోకంలో ఉన్న గొప్పరాక్షసులు భయంలో మునిగి, నిశ్చేష్టులయ్యారు.

చూర్ణీకృతమహావీచిం చలన్మీనమహాతిమిమ్ ।
మారుతా విద్ధఫేనౌఘ మావర్తక్షోభసఙ్కులమ్ ॥ 180 ॥

సముద్రంలోని పెద్దపెద్దతరంగాలు చూర్ణం అయ్యాయి. చేపలు, తిమింగలాలు (మొదలయిన జల జంతువులు) సంచలించాయి. గాలివేగంచేత సముద్రంలోని నురగల కుప్పలు ఆకాశంలో ఎగిరిపడ్డాయి. సముద్రంలో సుడులు అధికమయ్యాయి.

ప్రావర్తయత్తదా రాజా సహస్రేణ చ బాహునా ।
దేవాసురసమాక్షిప్తః క్షీరోదమివ మన్దరః ॥ 181 ॥

అమృతంకోసం దేవతలూ, దానవులూ పాలసముద్రాన్ని చిలుకుతున్నపుడు మందరపర్వతంలాగా, కార్తవీర్యమహారాజు వేయిబాహువులతో ఆ సముద్రాన్ని కల్లోలం చేశాడు.

తత్సంక్షోభేణ చకితా స్తార్క్ష్యాగమనశఙ్కితాః ।
సహసోత్పతితా భీతా భీమం దృష్ట్వా నృపోత్తమమ్ ॥ 182 ॥

నతా నిశ్చలమూర్ధానో బభూవుస్తే మహోరగాః ।
సాయాహ్నే కదలీఖణ్డాః కమ్పితా ఇవ వాయునా ॥ 183 ॥

సముద్రంలోని మహాసర్పాలు కార్యవీర్యుడు చేస్తున్న అల్లకల్లోలానికి గరుత్మంతుడు వస్తున్నాడని సందేహించాయి. భయంకరంగా ఉన్న ఆకార్తవీర్యమహారాజును చూసి, ఆసర్పాలు భయంతో ఎత్తుగా ఎగిరిపడ్డాయి. పడగలు వాల్చేశాయి. వాటితలలు కదలకుండా నిలిచిపోయాయి. సాయంసమయంలో గాలికి కంపించిపోయే అరటిచెట్లలాగా అయ్యాయి.

స వై బద్ధ్వా ధనుర్జ్యాభిరుత్సిక్తం పఞ్చభిశ్శరైః ।
లఙ్కేశం మోహయిత్వా తు సబలం రావణం బలాత్ ।
నిర్జిత్య వశమానీయ మాహిష్మత్యాం బబన్ధ తమ్ ॥ 184 ॥

కార్తవీర్యుడు వింటికి నారి తొడిగి, ఐదు బాణాలు సంధించి, లంకాధిపతి అయిన రావణుడిని సైన్యంతో సహా రక్తసిక్తుడిని చేసి మూర్ఛ పోగొట్టాడు. రావణుడిని జయించి, మాహిష్మతీనగరానికి తెచ్చి బంధించాడు.

శ్రుత్వా తు బద్ధం పౌలస్త్యం రావణం త్వర్జునేన హ ।
తతో గత్వా పులస్త్యస్తమర్జునం దదృశే స్వయమ్ ॥ 185 ॥

తనకుమారుడయిన రావణుడిని కార్తవీర్యార్జునుడు బంధించాడని విని, పులస్త్యుడు స్వయంగా వెళ్లి కార్తవీర్యార్జు నుడిని దర్శించుకున్నాడు.

ముమోచ రక్షః పౌలస్త్యం పులస్త్యేనాభియాచితః ॥ 186 ॥

పులస్త్యుడు యాచించగా కార్తవీర్యుడు రావణుడిని విడిచిపెట్టాడు.

యస్య బాహుసహస్రస్య బభూవ జ్యాతలస్వనః ।
యుగాన్తే తోయదస్యేవ స్ఫురతో హ్యశనేరివ ॥ 187 ॥

కార్తవీర్యుడి వేయిబాహువులనుండి ఒక్కసారిగా వెలువడిన వింటినారిధ్వనులు ప్రళయకాలంలోని మేఘాలనుండి వెలువడే పిడుగులు అనిపించాయి.

అహో బత మృధే వీర్యం భార్గవస్య యదచ్ఛినత్ ।
రాజ్ఞో బాహుసహస్రం తు హైమం తాలవనం యథా ॥ 188 ॥

అహో, ఆశ్చర్యం. భార్గవరాముడిపరాక్రమం ఎంతటిదో. యుద్ధంలో కార్తవీర్యుడి వేయిబాహువులను బంగారుతాటితోటలాగా నరికేశాడు.

తృషితేన కదాచిత్ స భిక్షితశ్చిత్రభానునా ।
స భిక్షా మదదాద్వీరస్సప్తద్వీపాన్ విభావసోః ॥ 189 ॥

ఒకసారి అగ్నిదేవుడు దాహంతో భిక్ష కోరాడు. అపుడు వీరుడయిన కార్తవీర్యుడు సప్తద్వీపాలనూ భిక్షగా అగ్నికి ఇచ్చాడు.

పురాణి గ్రామఘోషాంశ్చ విషయాంశ్చైవ సర్వశః ।
జజ్వాల తస్య సర్వాణి చిత్రభాను ర్దిధక్షయా ॥ 190 ॥

అగ్నిదేవుడు సప్తద్వీపాలలోని పట్టణాలనూ, గ్రామాలనూ, గొల్లపల్లెలనూ సంచరించడానికి యోగ్యమైన ప్రదేశాలనూ అన్నింటినీ పూర్తిగా దహించాలనే కోరికతో ప్రజ్వరిల్లాడు.

స తస్య పురుషేన్ద్రస్య ప్రభావేణ మహాత్మనః ।
దదాహ కార్తవీర్యస్య శైలాంశ్చైవ వనాని చ ॥ 191 ॥

మహాత్ముడయిన కార్తవీర్యుడిప్రభావంచేత అగ్ని కార్తవీర్యుడి వనాలు, కొండలు కూడ దహించివేశాడు.

స శూన్యమాశ్రమం రమ్యం వరుణస్యాత్మజస్య వై ।
దదాహ బలవద్భీతాశ్చిత్రభానుస్సహైహయః ॥ 192 ॥

బలవంతుడయిన హైహయు(కార్తవీర్యు)డిఅండతో (వరుణుడితనయుడయిన) అగ్ని వశిష్ఠుడి శూన్యమూ, మనోహరమూ అయిన ఆశ్రమాన్ని కూడ భయపడుతూనే దహించాడు.

యం లేభే వరుణః పుత్రం పురా భాస్వన్తముత్తమమ్ ।
వసిష్ఠో నామ స మునిః ఖ్యాత ఆపవ ఇత్యుత ॥ 193 ॥

పూర్వం వరుణుడు శ్రేష్ఠుడూ, తేజస్వీ అయిన పుత్రుడిని పొందాడు. ఆకుమారుడే వసిష్ఠమహాముని. అతడే ఆపవుడు అనేపేరుతో ప్రసిద్ధుడయినాడు. (స్వాయంభువమనువుకు కూడ ఆపవుడు అనే పేరు ఉంది. 1.58)

యత్రాపవస్తు తం క్రోధాచ్ఛప్తవానర్జునం విభుః ।
యస్మాన్న వర్జితమిదం వనం తే మమ హైహయ ॥ 194 ॥

తస్మా త్తే దుష్కరం కర్మ కృతమన్యో హనిష్యతి ।
రామో నామ మహాబాహుర్జామదగ్న్యః ప్రతాపవాన్ ॥ 195 ॥

ఆపవుడు (వశిష్ఠుడు) తనఆశ్రమాన్ని దగ్గరఉండి తగలబెట్టించిన కార్తవీర్యుడిపై కోపించి ఇలా శపించాడు. 'కార్తవీర్యార్జునా! (నాపై ఏమాత్రం గౌరవం లేకుండా) నాఆశ్రమాన్ని కూడ విడవకుండా (రక్షించకుండా) దహించడంలో అగ్నికి సహకరించి, పాపపుపని చేశావు. ఆకారణంగా పరాక్రమశాలీ, గొప్పభుజబలం గలిగినవాడూ, జమదగ్నితనయుడూ అయిన పరశురాముడు కోపంతో నిన్ను సంహరిస్తాడు'.

ఛిత్త్వా బాహుసహస్రం తే ప్రమథ్య తరసా బలీ ।
తేజస్వీ (తపస్వీ) బ్రాహ్మణ స్త్వాం తు వధిష్యతి స భార్గవః ॥ 196 ॥

పరాక్రమవంతుడూ, బ్రాహ్మణుడూ, భృగువంశజుడూ అయిన పరశురాముడు నీవేయిచేతులనూ వేగంగా నరికి, నిన్ను చితకకొట్టి చంపుతాడు.

అనష్టద్రవ్యతా యస్య బభూవామిత్రకర్శిణః ।
ప్రతాపేన నరేన్ద్రస్య ప్రజా ధర్మేణ రక్షతః ॥ 197 ॥
ప్రాప్తస్తతోఽస్య మృత్యుర్వై తస్య శాపాన్మహామునేః ।
వరస్తథైవ భో విప్రాస్స్వయమేవ వృతః పురా ॥ 198 ॥

ద్రవ్యనాశం లేనివాడూ, పరాక్రమంచేత శత్రువులను తేలికగా నిర్మూలించేవాడూ, ప్రజలను ధర్మబద్ధంగా పరిపాలించేవాడూ అయిన కార్తవీర్యుడు ఆపవ(వశిష్ఠ)మహర్షిశాపంచేత మరణాన్ని పొందాడు. ఈవిధంగానే తనకు మరణం ప్రాప్తించాలని పూర్వం కార్తవీర్యుడు స్వయంగా వరం పొందాడు. (164 శ్లో)

తస్య పుత్రశతం త్వాసీత్ పఞ్చ శేషా మహాత్మనః ।
కృతాస్త్రా బలిన శ్శూరా ధర్మాత్మానో యశస్వినః ॥ 199 ॥

ఆకార్తవీర్యుడికి వందమంది పుత్రులు కలిగారు. వారిలో ఐదుగురు మిగిలారు. వారు అస్త్రవిద్యలో సిద్ధహస్తులు. బలవంతులు. ధర్మాత్ములు. కీర్తిమంతులు.

శూరసేనశ్చ శూరశ్చ వృషణో మధుపధ్వజః ।
జయధ్వజశ్చ నామ్నాఽఽసీ దావన్త్యో నృపతి ర్మహాన్ ॥ 200 ॥

శూరసేనుడు, శూరుడు, వృషణుడు, మధుపధ్వజుడు, జయధ్వజుడు అనేవి వారిపేర్లు. జయధ్వజుడు అవంతీదేశానికి రాజు.

కార్తవీర్యస్య తనయా వీర్యవన్తో మహాబలాః ।
జయధ్వజస్య పుత్రస్తు తాలజఙ్ఘో మహాబలః ॥ 201 ॥

కార్తవీర్యుడికుమారులు శక్తిమంతులు. మహాబలవంతులు. జయధ్వజుడికుమారుడు తాలజంఘుడు. ఇతడు గూడ మహాబలుడు.

తస్య పుత్రశతం ఖ్యాతా స్తాలజఙ్ఘా ఇతి శ్రుతాః ॥ 202 ॥

తాలజంఘుడికి వందమందికుమారులు. వాళ్లు తాలజంఘులు అని ప్రసిద్ధులయినారు.

తేషాం కులే మునిశ్రేష్ఠా హైహయానాం మహాత్మనామ్ ।
వీతిహోత్రాస్సువ్రతాశ్చ భోజాశ్చావన్తయస్స్మృతాః ॥ 203 ॥

తౌణ్డికేరాశ్చ విఖ్యాతాస్తాలజఙ్ఘా స్తథైవ చ ।
భరతాశ్చ సుజాతాశ్చ బహుత్వాన్నానుకీర్తితాః ॥ 204 ॥

మునివరులారా! మహాత్ములయిన ఆహైహయులకులంలో వీతిహోత్రులు, సువ్రతులు, భోజులు, అవంతులు, తౌండికేరులు, తాలజంఘులు ప్రసిద్ధులు. అలాగే భరతవంశీయులు, సుజాతులు చాలామంది కావటంచేత వారిని గురించి చెప్పడంలేదు.

వృషప్రభృతయో విప్రా యాదవాః పుణ్యకర్మిణః ।
వృషో వంశధరస్తత్ర తస్య పుత్రోఽ భవన్మధుః ॥ 205 ॥

బ్రాహ్మణులారా! యాదవులలో వృషుడు మొదలయినవారు పుణ్యకర్మలు ఆచరించేవారు. వృషుడు వంశకర్త. వృషుడి కుమారుడు మధువు.

మధోః పుత్రశతం త్వాసీద్ వృషణస్తస్య వంశకృత్ ।
వృషణాద్ వృష్ణయస్సర్వే మధోస్తు మాధవాస్స్మృతాః ।
యాదవా యదునామ్నా తే నిరుచ్యన్తే చ హైహయాః ॥ 206 ॥

మధువుకు వందమంది కుమారులు. వారిలో వృషణుడు వంశకర్త. వృషణుడివలన పుట్టినవా రందరు వృష్ణులు. మధువుకు కలిగినవారు మాధవులు. హైహయులు యదువు పేరుమీదుగా యాదవులు అని చెప్పబడుతున్నారు.

న తస్య విత్తనాశస్స్యాన్నష్టం ప్రతి లభేచ్చ సః ।
కార్తవీర్యస్య యో జన్మ కథయేదిహ నిత్యశః ॥ 207 ॥

కార్తవీర్యుడి(వృత్తాంతం)జన్మగురించి నిత్యమూ చెప్పేవారికి (వినేవారికీ) సంపదలు నశించవు. లోగడ నష్టపోయినసంపదలు కూడ తిరిగి లభిస్తాయి.

ఏతే యయాతిపుత్రాణాం పఞ్చ వంశా ద్విజోత్తమాః ॥ 208 ॥

బ్రాహ్మణశ్రేష్ఠులారా! యయాతి కొడుకులు ఐదుగురి వంశాలను గురించి చెప్పబడింది.

కీర్తితా లోకవీరాణాం యే లోకాన్ ధారయన్తి వై ।
భూతానీవ మునిశ్రేష్ఠాః పఞ్చ స్థావరజఙ్గమాన్ ॥ 209 ॥

మునివరులారా! యయాతి కొడుకులు అన్నిలోకాలలోనూ బలవంతులు. వాళ్లు (యయాతికొడుకులు) ఐదుగురూ పంచభూతాలలాగా చరాచరాత్మకమయిన లోకాల నన్నింటినీ నిలుపుతున్నారు.

శ్రుత్వా పఞ్చ విసర్గాస్తు, రాజా ధర్మార్థకోవిదః ।
వశీ భవతి పఞ్చానామాత్మజానాం తథేశ్వరః ॥ 210 ॥

ఈపంచవంశాలసృష్టిక్రమాన్ని గురించి విన్నరాజు ధర్మార్థాలు తెలిసినవాడవుతాడు. ఇంద్రియాలను జయించి, తనఅధీనంలో ఉంచుకుంటాడు. అయిదుగురు పుత్రులను పొందుతాడు.

లభేత్ పఞ్చ వరాం శ్చైవ దుర్లభానిహ లౌకికాన్ ।
ఆయుః కీర్తిస్తథా పుత్రానైశ్వర్యం భూతిమేవ వై ।
ధారణాచ్ఛ్రవణాచ్చైవ పఞ్చవర్గస్య భో ద్విజాః ॥ 211 ॥

ఓ బ్రాహ్మణులారా! ఈపంచవర్గములచరితను మనసులో నిలుపుకున్నా, విన్నా, లౌకికాలూ, అనితర సాధ్యాలూ అయిన ఆయువు, కీర్తి, పుత్రసంతానం, ప్రభుత్వమూ, సంపదలు అనే అయిదువరాలను పొందుతాడు.

క్రోష్టోర్వంశం మునిశ్రేష్ఠాః శ్రుణుధ్వం గదతో మమ ।
యదోర్వంశధరస్యాథ యజ్వినః పుణ్యకర్మిణః ॥ 212 ॥

మునివరులారా! యదువువంశాన్ని నిలిపినవాడూ, పుణ్యకర్మలు ఆచరించేవాడూ, యజ్ఞాలు చేసినవాడూ అయిన క్రోష్టువు వంశాన్ని గురించి చెప్తాను వినండి.

క్రోష్టోర్వంశం హి శ్రుత్వైవ సర్వపాపైః ప్రముచ్యతే ।
యస్యాన్వవాయజో విష్ణుర్హరిర్వృష్ణికులోద్వహః ॥ 213 ॥

క్రోష్టువువంశాన్ని గురించి విన్న మాత్రంచేతనే సమస్తమైనపాపాలు నశిస్తాయి. శ్రీమహావిష్ణువు వృష్ణివంశ శ్రేష్ఠుడయిన శ్రీకృష్ణుడుగా ఈవంశంలోనే జన్మించాడు. (అందువల్లనే ఈవంశచరిత్రవినడంచేత పాపాలన్నీ పోతాయి.)

ఇతి శ్రీబ్రహ్మపురాణే యయాతివంశానుకీర్తనం నామైకాదశోఽధ్యాయః ॥ 11 ॥
శ్రీబ్రహ్మపురాణంలో యయాతివంశానుకీర్తనం అనే పదకొండవ అధ్యాయం సంపూర్ణం.

ద్వాదశోఽధ్యాయః - పన్నెండవ అధ్యాయం

కృష్ణజన్మానుకీర్తనమ్ - కృష్ణజన్మానుకీర్తనం

లోమహర్షణ ఉవాచ: - లోమహర్షణుడు మునులతో ఇలా చెప్పాడు.

గాన్ధారీ చైవ మాద్రీ చ క్రోష్టోర్భార్యే బభూవతుః ।
గాన్ధారీ జనయామాస అనమిత్రం మహాబలమ్ ॥ 1 ॥

క్రోష్టుడికి గాంధారి, మాద్రి అని ఇద్దరు భార్యలు. గాంధారికి గొప్పబలవంతు డైన అనమిత్రుడు అనేపుత్రుడు కలిగాడు.(13.9)

మాద్రీ యుధాజితం పుత్రం తతోఽన్యం దేవమీఢుషమ్ ।
తేషాం వంశస్త్రిధా భూతో వృష్ణీనాం కులవర్ధనః ॥ 2 ॥

మాద్రి యుధాజిత్తు, దేవమీఢుషుడు అనేకొడుకులను కన్నది. వృష్ణులవంశాన్ని వర్ధిల్లజేసిన వారివంశం మూడు విధాలు అయింది.

మాద్ర్యాః పుత్రౌ తు జజ్ఞాతే శుభౌ వృష్ణ్యన్ధకావుభౌ ।
జజ్ఞాతే తనయౌ వృష్ణేః శ్వఫల్కశ్చిత్రకస్తథా ॥ 3 ॥

మాద్రి వృష్ణి అంధకుడు అనే(మరో)ఇద్దరు మంచిపుత్రులను కన్నది. వారిలో వృష్ణికి శ్వఫల్కుడు, చిత్రకుడు అనేపుత్రులు గలిగారు.

శ్వఫల్కస్తు మునిశ్రేష్ఠా ధర్మాత్మా యత్ర వర్తతే ।
నాస్తి వ్యాధిభయం తత్ర నావర్షభయమేవ చ ॥ 4 ॥

మునివరులారా! ధర్మపరుడయిన శ్వఫల్కుడు ఉన్నచోట రోగాలను గూర్చినభయం ఉండదు. అనావృష్టిభయం ఉండదు. (శ్వఫల్కుడు ఉన్నచోట అందరూ ఆరోగ్యంగా ఉంటారు. సకాలంలో వర్షాలు కురిసి దేశం సుభిక్షంగా ఉంటుంది.)

కదాచిత్ కాశిరాజస్య విషయే మునిసత్తమాః ।
త్రీణి వర్షాణి పూర్ణాని నావర్షత్ పాకశాసనః ॥ 5 ॥

మునివరేణ్యులారా! ఒకానొకప్పుడు కాశిరాజుపాలించేదేశంలో నిండా మూడుసంవత్సరాలపాటు (వర్షాధిపతి అయిన) ఇంద్రుడు వర్షాలు కురిపించలేదు.

స తత్ర చానయామాస శ్వఫల్కం పరమార్చితమ్ ॥
శ్వఫల్కపరివర్తేన వవర్ష హరివాహనః ॥ 6 ॥

కాశీరాజు పూజనీయుడయిన శ్వఫల్కుడిని, తనదేశానికి తీసుకువచ్చాడు. శ్వఫల్కుడిసంచారంవలన అపుడు ఆరాజ్యంలో ఇంద్రుడు వర్షాలు కురిపించాడు.

శ్వఫల్కః కాశిరాజస్య సుతాం భార్యామవిన్దత ।
గాన్దినీం నామ గాం సా తు దదౌ విప్రాయ నిత్యశః ॥ 7 ॥

శ్వఫల్కుడు కాశిరాజు కూతురయిన గాందినిని భార్యగా పొందాడు. ఆమె నిత్యమూ ఒకగోవును బ్రాహ్మణుడికి దానం చేస్తుంది.

దాతా యజ్వా చ వీరశ్చ శ్రుతవానతిథిప్రియః ।
అక్రూరస్సుషువే తస్మాచ్ఛ్వఫల్కాద్ భూరిదక్షిణః ॥ 8 ॥

శ్వఫల్కుడివలన గాందిని దానాలుచేసేస్వభావం గలిగినవాడూ, యజ్ఞాలు చేసినవాడూ, బలవంతుడూ, పండితుడూ, అతిథులను ఆదరించేవాడూ, యజ్ఞాదులలో దక్షిణలు చాలఅధికంగా ఇచ్చేవాడూ అయిన అక్రూరుడిని కన్నది.

ఉపమద్గుస్తథామద్గుర్మేదురశ్చారిమేజయః ।
అవిక్షితస్తథాక్షేప శ్శత్రుఘ్నశ్చారిమర్దనః ॥ 9 ॥

ధర్మధృగ్ యతిధర్మా చ ధర్మోక్షాన్ధకరుస్తథా ।
ఆవాహప్రతివాహౌ చ సున్దరీ చ వరాఙ్గనా ॥ 10 ॥

వీరితోపాటు (శ్వఫల్కుడివలన గాందినికి) ఉపమద్గుడు, మద్గుడు, మేదురుడు, అరిమేజయుడు, అవిక్షితుడు, అక్షేపుడు, శత్రుఘ్నుడు, అరిమర్దనుడు, ధర్మధృక్కు, యతిధర్ముడు, ధర్మోక్షుడు, అంధకరుడు, ఆవాహుడు, ప్రతివాహుడు, అనే పుత్రులు కలిగారు. సుందరాంగి అయిన సుందరి అనే కూతురు కూడ కలిగింది.

అక్రూరేణోగ్రసేనాయాం సుగాత్ర్యాం ద్విజసత్తమాః ।
ప్రసేనశ్చోపదేవశ్చ జజ్ఞాతే దేవవర్చసౌ ॥ 11 ॥

మునివరులారా! వారిలో అక్రూరుడికి శోభనాంగి అయిన సుగాత్రియందు ప్రసేనుడు, ఉపదేవుడు అనే ఇద్దరు కొడుకులు కలిగారు. వారు దేవతలవంటితేజస్సు కలిగినవారు.

చిత్రకస్యాభవన్ పుత్రాః పృథుర్విపృథురేవ చ ।
అశ్వగ్రీవోఽశ్వబాహుశ్చ స్వపార్శ్వకగవేషణౌ ॥ 12 ॥

అరిష్టనేమిరశ్వస్తు సుధర్మా ధర్మభృత్తథా ।
సుబాహుర్బహుబాహుశ్చ శ్రవిష్ఠాశ్రవణే స్త్రియౌ ॥ 13 ॥

(వృష్ణిపుత్రు డయిన 3.శ్లో) చిత్రకుడికి పృథువు, విపృథువు, అశ్వగ్రీవుడు, అశ్వబాహువు, స్వపార్శ్వకుడు, గవేషణుడు, అరిష్టనేమి, అశ్వుడు, సుధర్ముడు, ధర్మభృత్తు, సుబాహుడు, బహుబాహుడు అనేకుమారులూ, శ్రవిష్ఠ, శ్రవణ అనే కూతుళ్లూ జన్మించారు.(14.56,57)

అసిక్న్యాం జనయామాస శూరం వై దేవమీఢుషమ్ ।
మహిష్యాం జజ్ఞిరే శూరా భోజ్యాయాం పురుషా దశ ॥ 14 ॥

చిత్రకుడు అసిక్ని అనేభార్యయందు శూరుడు, దేవమీఢుషుడు అనేకుమారులను పొందాడు. పట్టపురాణి అయిన భోజ్యయందు (శూరుడు) పదిమంది శూరులు అనే కుమారులను కన్నాడు.

వసుదేవో మహాబాహుః పూర్వమానకదున్దుభిః ।
జజ్ఞే యస్య ప్రసూతస్య దున్దుభ్యః ప్రాణదన్ దివి ॥ 15 ॥

(ఆపదిమందిలో మొదటివాడు) వసుదేవుడు గొప్పభుజబలం గలవాడు. వసుదేవుడినే మొదట ఆనకదుందుభి అనేవారు. వసుదేవుడు జన్మించినసమయంలో స్వర్గలోకంలో దుందుభులు (భేరులు) గట్టిగా మ్రోగాయి.

ఆనకానాం చ సంహ్రాదస్సుమహానభవద్దివి ।
పపాత పుష్పవర్షశ్చ శూరస్య భవనే మహాన్ ॥ 16 ॥

స్వర్గలోకంలో తప్పెట్ల (మద్దెలల) చప్పుళ్లు చాలపెద్దగా ఏర్పడ్డాయి. (అందువలన వసుదేవుడికి మొదట్లో ఆనకదుందుభి అనేవ్యవహారం గలిగింది) శూరుడిమందిరంలో గొప్పపుష్పవర్షం కురిసింది. (వసుదేవుడు పుట్టినఆనందంతో దేవతలు భేరులు, తప్పెట్లు పెద్దగా మోగించారు. పుష్పాలను వర్షంలాగా చల్లారు.)

మనుష్యలోకే కృత్స్నేఽపి రూపే నాస్తి సమో భువి ।
యస్యాసీత్ పురుషాగ్ర్యస్య కాన్తిశ్చన్ద్రమసో యథా ॥ 17 ॥

భూమిమీద సమస్తమయిన మానవసముదాయంలోనూ ఆవసుదేవుడితో సమానమైన అందమైన ఆకారం గలిగినవాళ్లు లేరు. ఉత్తమపురుషుడయిన వసుదేవుడిశరీరకాంతి చంద్రుడివెన్నెల వెలుగులాగా ఉంటుంది.

దేవభాగస్తతో జజ్ఞే తథా దేవశ్రవాః పునః ।
అనాధృష్టిః కనవకో వత్సవా నథ గృఞ్జమః ॥ 18 ॥

శ్యామశ్శమీకో గణ్డూషః పఞ్చ చాస్య వరాఙ్గనాః ।
పృథుకీర్తిః పృథా చైవ శ్రుతదేవా శ్రుతశ్రవా ॥

రాజాధిదేవీ చ తథా పఞ్చైతా వీరమాతరః ।
ఆవన్త్యశ్శ్రుతదేవాయాం జగృహుస్సుషువే సుతః ॥ 19 ॥

వసుదేవుడి తరువాత దేవభాగుడు, దేవశ్రవుడు, అనాధృష్టి, కనవకుడు, వత్సవంతుడు, గృంజముడు, శ్యాముడు, శమీకుడు, గండూషుడు, అనేకుమారులు తొమ్మిదిమంది కలిగారు. శూరుడికి సుందరాంగు లయినకూతుళ్లు ఐదుగురు పుట్టారు. పృథుకీర్తి, పృథ, శ్రుతదేవ, శ్రుతశ్రవ, రాజాధిదేవి అనేవారు అయిదుగురు. వీరందరూ వీరమాతలు (వీరు లయినసంతానం కలవారు.) వారిలో శ్రుతదేవ అవంతీదేశపురాజువలన జగృహువు అనే కుమారుడిని కన్నది.

శ్రుతశ్రవాయాం చైద్యస్తు శిశుపాలోఽభవ న్నృపః ।
హిరణ్యకశిపుర్యోఽసౌ దైత్యరాజోఽభవత్ పురా ॥ 20 ॥

శ్రుతశ్రవకు శిశుపాలుడు అనే చైద్యరాజు జన్మించాడు. ఈశిశుపాలుడు పూర్వజన్మలో హిరణ్యకశిపుడు అనే రాక్షసరాజు.

పృథుకీర్త్యాం తు సంజజ్ఞే తనయో వృద్ధశర్మణః ।
కరూషాధిపతిర్వీరో దన్తవక్త్రో మహాబలః ॥ 21 ॥

వృద్ధశర్మకు పృథుకీర్తి(శూరునికుమార్తె)యందు దంతవక్త్రుడు జన్మించాడు. ఇతడు గొప్పబలవంతుడు. కరూషదేశానికి రాజు.

పృథాం దుహితరం చక్రే కున్తిస్తాం పాణ్డురావహత్ ।
యస్యాం స ధర్మవిద్ రాజా ధర్మా జ్జజ్ఞే యుధిష్ఠిరః ॥ 22 ॥

(శూరమహారాజు తనయ అయిన) పృథను కుంతి కూతురుగా దత్తత చేసుకున్నాడు. ఆమెను పాండురాజు వివాహం చేసుకున్నాడు. పృథకు ధర్ముడివరంవలన ధర్మవేత్త అయిన యుధిష్ఠిరుడు (ధర్మరాజు)అనేరాజు జన్మించాడు.

భీమసేనస్తథా వాతాదిన్ద్రాచ్చైవ ధనఞ్జయః ।
లోకేఽప్రతిరథో వీరశ్శక్రతుల్యపరాక్రమః ॥ 23 ॥

పృథకు వాయుదేవుడివరంవలన భీమసేనుడు పుట్టాడు.ఇంద్రుడివరంచేత ఇంద్రుడితో సమానమైన పరాక్రమం గలిగిన ఎదురులేనివీరుడు ధనంజయుడు (అర్జునుడు) జన్మించాడు.

అనమిత్రాచ్ఛిని ర్జజ్ఞే కనిష్ఠాద్ వృష్ణినన్దనాత్ ।
శైనేయస్సత్యకస్తస్మాద్ యుయుధానశ్చ సాత్యకిః ॥ 24 ॥

వృష్ణికుమారులలో చిన్నవాడయిన అనమిత్రుడికి శిని జన్మించాడు. శిని కుమారుడు (శైనేయుడు) సత్యకుడు. సత్యకుడి తనయుడు యుయుధానుడు. (సత్యకుడికుమారుడు కాబట్టి యుయుధానుడికి సాత్యకి అని గూడ వ్యవహారం)

ఉద్ధవో దేవభాగస్య మహాభాగస్సుతోఽభవత్ ॥ 25 ॥

దేవభాగుడికి మహానుభావుడయిన ఉద్ధవుడు జన్మించాడు.

పణ్డితానాం పరం ప్రాహుర్దేవశ్రవసముత్తమమ్ ।
అశ్మక్యాం ప్రాప్తవాన్ పుత్రమనాధృష్టిర్యశస్వినమ్ ॥ 26 ॥

ఉత్తముడయిన దేవశ్రవసుడిని పండితులలో శ్రేష్ఠుడు అంటారు. దేవశ్రవుడికి అశ్మకి అనే స్త్రీయందు కీర్తిమంతు డయిన అనాధృష్టి అనేకుమారుడు కలిగాడు.

నివృత్తశత్రుం శత్రుఘ్నం శ్రుతదేవా త్వజాయత ।
శ్రుతదేవాత్మజాతస్తు నైషాది ర్యః పరిశ్రుతః ।
ఏకలవ్యో మునిశ్రేష్ఠా నిషాదైః పరివర్ధితః ॥ 27 ॥

(శూరుడి కూతు రయిన) శ్రుతదేవకు శత్రువులను నిర్మూలించే శత్రుఘ్నుడు అనేకుమారుడు జన్మించాడు. (20శ్లో) మునివరులారా! శ్రుతదేవ కుమారుడు ఏకలవ్యుడు. అతడిని బోయజాతివాళ్లు పెంచారు. అందుచేత ఏకలవ్యుడిని నిషాదజాతికి చెందినవాడు(బోయవాడు)గా చెప్తారు.

వత్సవతే త్వపుత్రాయ వసుదేవః ప్రతాపవాన్ ।
అద్భిర్దదౌ సుతం వీరం శౌరిః కౌశికమౌరసమ్ ॥ 28 ॥

శూరుడికుమారుడూ, పరాక్రమశాలీ అయినవసుదేవుడు వీరుడయిన తనకుమారుడు కౌశికుడిని పుత్రసంతానం లేని వత్సవంతుడికి జలపూర్వకంగా దానం చేశాడు.

గణ్డూషాయ త్వపుత్రాయ విష్వక్సేనో దదౌ సుతాన్ ।
చారుదేష్ణం సుదేష్ణం చ పఞ్చాలం కృతలక్షణమ్ ॥ 29 ॥

కొడుకులు లేని (శూరపుత్రుడు 18శ్లో) గండూషుడికి విష్వక్సేనుడు తనకుమారులయిన చారుదేష్ణుడు, సుదేష్ణుడు, సర్వలక్షణయుక్తుడయిన పంచాలుడు అనే వారిని ఇచ్చాడు.

అసఙ్గ్రామేణ యో వీరో నావర్తత కదాచన ।
రౌక్మిణేయో మహాబాహుః కనీయాన్ ద్విజసత్తమాః ॥ 30 ॥

మునివరేణ్యులారా! చారుదేష్ణుడు రుక్మిణికుమారులలో చిట్టచివరివాడు. అతడు యుద్ధం చేయకుండా రణరంగంనుంచి తిరిగిరావడం అనేది ఎప్పుడూ లేదు.

వాయసానాం సహస్రాణి యం యాన్తుం పృష్ఠతోఽన్వయుః ।
చారూ నద్యోపభోక్ష్యామశ్చారుదేష్ణహతా నితి ॥ 31 ॥

ఈరోజు చారుదేష్ణుడిచేతిలో చచ్చేవారూ, రుచిగా ఉండేవారూ అయిన ప్రాణులను తిందామనే ఉద్దేశ్యంతో, చారుదేష్ణుడు యుద్ధానికి వెళ్లేటపుడు వేలకొలదీ కాకులు అతడిని అనుసరించి వెళ్తాయి.

తన్త్రిజస్తన్త్రపాలశ్చ సుతౌ కనవకస్య తౌ ।
వీరుశ్చాశ్వహనుశ్చైవ వీరౌ తావథ గృఞ్జిమౌ ॥ 32 ॥

(శూరుడికుమారుడయిన18.శ్లో) కనవకుడికి తంత్రిజుడు, తంత్రపాలుడు అని ఇద్దరు కుమారులు. అలాగే శూరకుమారుడయిన) గృంజిముడికి వీరువు, అశ్వహనువు అనే ఇద్దరు వీరులు పుత్రులు.

శ్యామపుత్రశ్శమీకస్తు శమీకో రాజ్యమావహత్ ।
జుగుప్సమానో భోజత్వాద్ రాజసూయమవాప సః ॥ 33 ॥

శ్యామపుత్రుడి కుమారుడు శమీకుడు.(18.శ్లో) ఇతడు రాజ్యభారాన్ని వహించాడు. భోజవంశంలో పుట్టడాన్ని అసహ్యించుకునే వాడు. రాజసూయయాగం చేశాడు.

అజాతశత్రు శ్శత్రూణాం జజ్ఞే తస్య వినాశనః ।

శమీకుడికి అజాతశత్రుడు జన్మించాడు. ఇతడు శత్రువులను నాశనం చేసేవాడు.

వసుదేవసుతాన్ వీరాన్ వర్ణయిష్యే మ్యతఃపరమ్ ॥ 34 ॥

ఇక తరువాత వసుదేవుడిపుత్రులనుగురించి వివరిస్తాను.

వృష్ణేస్త్రివిధమేవం తు బహుశాఖం మహౌజసమ్ ।
ధారయన్ విపులం వంశం నానర్థైరిహ పూజ్యతే ॥ 35 ॥

వృష్ణుడికి సంబంధించిన వృష్ణి, అంధక, భోజ వంశాలు మూడూ అనేకశాఖలుగా విస్తరించాయి. వీరందరూ గొప్ప పరాక్రమవంతులు. ఈవంశాలను స్మరించేవాడికి అనర్థాలు ఉండవు. వాడిని అందరూ గౌరవిస్తారు.

యాః పత్న్యో వసుదేవస్య చతుర్దశ వరాఙ్గనాః ।
పౌరవీ రోహిణీ నామ మదిరాదిస్తథా పరాః ॥ 36 ॥

వైశాఖీ చ తథా భద్రా సునామ్నీ చైవ పఞ్చమీ ।
సహదేవా శాన్తిదేవా శ్రీదేవీ దేవరక్షితా ॥ 37 ॥

వృకదేవ్యుపదేవీ చ దేవకీ చైవ సప్తమీ ।
సుతను ర్బడబా చైవ ద్వే ఏతే పరిచారికే ॥ 38 ॥

వసుదేవుడికి పద్నాలుగుమంది భార్యలు. అందరూ ఉత్తమస్త్రీలు. (వారిలో మొదటి అయిదుగురు వీరు.) పూరువంశంలో జన్మించిన (పౌరవి) రోహిణి మొదటిది. (తరువాత) మదిర, వైశాఖి, భద్ర, సునామ్ని (ఈమె ఐదవది). ఆతరువాతిభార్యలు ఏడుగురు. సహదేవ, శాంతిదేవ, శ్రీదేవి, దేవరక్షిత, వృకదేవి, ఉపదేవి, దేవకి (ఏడవది). సుతనువు, బడబా అనేవారు ఇద్దరు పరిచారికలు. (తరువాత భార్యలు అయినారు. 5+7+2=14)

పౌరవీ రోహిణీ నామ బాహ్లికస్యాత్మజాஉభవత్ ।
జ్యేష్ఠా పత్నీ మునిశ్రేష్ఠా దయితానకదున్దుభేః ॥ 39 ॥

మునివరేణ్యులారా! పూరువంశజాత అయిన రోహిణి బాహ్లికుడికూతురు. ఈమె ఆనకదుందుభి (వసుదేవుడి)కి పెద్దభార్య.

లేభే జ్యేష్ఠం సుతం రామం శరణ్యం (శారణం) శఠమేవ చ ।
దుర్దమం దమనం శుభ్రం పిణ్డారక ముశీనరమ్ ॥ 40 ॥

రోహిణి పెద్దకొడుకు (బల)రాముడు. శారణుడు, (శరణ్యుడు) శరుడు, దుర్దముడు, దమనుడు, శుభ్రుడు, పిండారకుడు, ఉశీనరుడు అనేవారు మరొకఏడుగురు (మొత్తం ఎనిమిదిమంది) కుమారులు.

చిత్రా నామ కుమారీ చ రోహిణీతనయా నవ ।
చిత్రా సుభద్రేతి పునర్విఖ్యాతా మునిసత్తమాః ॥ 41 ॥

మునివరులారా! రోహిణికి చిత్ర అనే కూతురు కలిగింది. ఈవిధంగా రోహిణిసంతానం మొత్తం తొమ్మిదిమంది. ఈచిత్రే తరువాత సుభద్ర అని సుప్రసిద్ధురాలు అయింది.

వసుదేవాచ్చ దేవక్యాం జజ్ఞే శౌరిర్మహాయశాః ।
రామాచ్చ నిశఠో జజ్ఞే రేవత్యాం దయితస్సుతః ॥ 42 ॥

వసుదేవుడివలన దేవకికి జగత్ప్రసిద్ధుడయిన శౌరి (శ్రీకృష్ణుడు) జన్మించాడు. (బల)రాముడికి రేవతి అనేభార్యయందు నిశఠుడు అనే కుమారుడు కలిగాడు.

సుభద్రాయాం రథీ పార్థాదభిమన్యురజాయత ।
అక్రూరాత్ కాశికన్యాయాం సత్యకేతురజాయత ॥ 43 ॥

అర్జునుడికి సుభద్ర(చిత్ర)యందు రథి అయిన అభిమన్యుడు జన్మించాడు. అక్రూరుడికి కాశికన్యయందు సత్యకేతువు పుట్టాడు.

వసుదేవస్య భార్యాసు మహాభాగాసు సప్తసు ।
యే పుత్రా జజ్ఞిరే శూరా నామత స్తాన్నిబోధత ॥ 44 ॥

మహానుభావురాళ్లు అయిన వసుదేవుడి భార్యలు ఏడుగురికి కలిగినకుమారులపేర్లను తెలుసుకోండి.

భోజశ్చ విజయశ్చైవ శాన్తిదేవాసుతావుభౌ ।
వృకదేవస్సునామాయాం గదశ్చాస్తాం సుతా వుభౌ ।
అగావహం మహాత్మానం వృకదేవీ వ్యజాయత ॥ 45 ॥

శాంతిదేవకు భోజుడు, విజయుడు అని ఇద్దరు కుమారులు. సునామకు వృకదేవుడు, గదుడు అని ఇద్దరు కొడుకులు. వృకదేవికి మహాత్ముడయిన అగావహుడు కలిగాడు.

కన్యా త్రిగర్తరాజస్య భార్యా వై శిశిరాయణేః ।
జిజ్ఞాసాం పౌరుషే చక్రే న చ స్కన్దే చ పౌరుషమ్ ॥ 46 ॥

త్రిగర్తరాజు కుమార్తె అయినశిశిరాయణుడిభార్య గార్గ్యమహర్షి పురుషత్వం ఎంతటిదో తెలుసుకోవాలనుకుంది. అతనివీర్యము స్ఖలించలేదు.

కృష్ణాయససమప్రఖ్యో వర్షే ద్వాదశమే తథా ॥ 47 ॥

పంద్రెండవసంవత్సరంలో నల్లనిఇనుముతో సమానమైనరూపం ధరించాడు.

మిథ్యాభిశస్తో గార్గ్యస్తు మన్యునాభిసమీరితః ।
ఘోషకన్యాముపాదాయ మైథునాయోపచక్రమే ॥ 48 ॥

(యాదవులు ఆతడిని నపుంసకుడని ఎగతాళి చేశారు.) అసత్యాలతో అవమానింపబడిన గార్గ్యుడు కోపంతో ఊగి పోయాడు. తనమగతనాన్ని నిరూపించడానికి ఒకానొకగొల్లపిల్లతో శృంగారక్రీడకు ఉపక్రమించాడు.

గోపాలీ చాప్సరా స్తస్య గోపస్త్రీవేషధారిణీ ।
ధారయామాస గార్గ్యస్య గర్భే దుర్ధరమచ్యుతమ్ ॥ 49 ॥

గోపికవేషాన్ని ధరించిన గోపాలి అనేఅప్సర భరించడానికి వీలు కానిదీ, నశించనిదీ అయినగార్గ్యుడితేజస్సును గర్భంలో ధరించింది.

మానుష్యాం గర్గభార్యాయాం నియోగాచ్ఛూలపాణినః ।
స కాలయవనో నామ జజ్ఞే శూరో మహాబలః ॥ 50 ॥

మనుష్యజాతికి చెందిన గర్గమహామునిభార్యయందు పరమేశ్వరుడిఆజ్ఞను అనుసరించి, మహాబలవంతుడూ, శూరుడూ అయిన కాలయవనుడు జన్మించాడు.

వృత్తపూర్వార్ధకాయస్తు సింహసంహననో యువా ।
అపుత్రస్య స రాజ్ఞస్తు వవృధేఽన్తఃపురే శిశుః ।
యవనస్య మునిశ్రేష్ఠాస్స కాలయవనోఽభవత్ ॥ 51 ॥

అతడిశరీరంలో పూర్వభాగం వృత్తాకారంలో (గుండ్రంగా) ఉంది. ఇతడు సింహాలను సంహరించగలిగిన శక్తిమంతుడు. యువకుడు. చిన్నప్పుడు కొడుకులు లేని యవనరాజు అంతఃపురంలో పెరిగాడు. మునివరులారా! అతడే కాలయవనుడు అయినాడు.

ఆయుధ్యమానో నృపతిః, పర్యపృచ్ఛద్ద్విజోత్తమమ్ ॥ 52 ॥

ఆకాలయవనుడు యుద్ధం చేయాలనే కోరికతో బ్రాహ్మణోత్తముడయిన నారదుడిని 'నాకు ఎవరితో నైనా యుద్ధం కావా' లని అడిగాడు.

వృష్ణ్యన్ధకకులం తస్య నారదోఽకథయద్ విభుః ।
అక్షౌహిణ్యా తు సైన్యస్య మధురామభ్యయాత్తదా ॥ 53 ॥

నారదుడు వృష్ణివంశంవారితోనూ, అంధకవంశంవారితోనూ యుద్ధం చేయు మని చెప్పాడు. కాలయవనుడు అక్షౌహిణి సైన్యంతో మధురానగరం మీదికి యుద్ధానికి వెళ్లాడు.

దూతం సమ్ప్రేషయామాస వృష్ణ్యన్ధకనివేశనమ్ ।
తతో వృష్ణ్యన్ధకాః కృష్ణం పురస్కృత్య మహామతిమ్ ॥ 54 ॥

సమేతామన్త్రయామాసుర్యవనస్య తదాభయాత్ ।
కృత్వా చ నిశ్చయం సర్వే పలాయనమరోచయన్ ॥ 55 ॥

కాలయవనుడు వృష్ణి, అంధకులనివాసానికి తనదూతను పంపాడు. వృష్ణి అంధకులు వివేకవంతుడయిన కృష్ణుడి నాయకత్వంలో, కాలయవనుడితో ఆలోచన చేశారు. చివరికి అందరూ కలిసి మధురనుండి పారిపోవడానికి నిశ్చయించుకున్నారు.

విహాయ మథురాం రమ్యాం మానయన్తః పినాకినమ్ ।
కుశస్థలీం ద్వారవతీం నివేశయితు మీప్సవః ॥ 56 ॥

అందమైన మధురానగరాన్ని విడిచిపెట్టారు. పరమేశ్వరుడిని పూజించి, ద్వారవతీనగరంలో నివసించాలనుకున్నారు.

ఇతి కృష్ణస్య జన్మేదం యశ్శుచిర్నియతేన్ద్రియః ।
పర్వసు శ్రావయేద్ విద్వాననృణస్సుఖీ భవేత్ ॥ 57 ॥

ఇంద్రియాలను జయించి, శుచిగా ఉండి, పర్వదినాలలో శ్రీకృష్ణుడి ఈజన్మవృత్తాంతాన్ని ఇతరులకు వినిపించినపండితుడు అన్నివిధాలయిన ఋణాలనుండి విముక్తిని పొంది సుఖపడతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే కృష్ణజన్మానుకీర్తనం నామ ద్వాదశోஉధ్యాయః ॥ 12 ॥

శ్రీబ్రహ్మపురాణంలో కృష్ణజన్మానుకీర్తనం అనే పంద్రెండవ అధ్యాయం సంపూర్ణం.



త్రయోదశోఽధ్యాయః – పదమూడవ అధ్యాయం

వృష్ణివంశనిరూపణమ్ – వృష్ణివంశనిరూపణం

లోమహర్షణ ఉవాచ: – లోమహర్షణుడు మునులకు ఇలా చెప్తున్నాడు.

క్రోష్టోరథాభవత్ పుత్రో వృజినీవాన్ మహాయశాః ।
వార్జినీవతమిచ్ఛన్తి స్వాహిం స్వాహాకృతాం వరమ్ ॥ 1 ॥

క్రోష్టుడికి వృజినీవంతుడు అనే యశస్వి జన్మించాడు. వృజినీవంతుడి కుమారుడు స్వాహి. ఇతడు యజ్ఞకర్తలలో శ్రేష్ఠుడు.

స్వాహిపుత్రోఽభవద్ రాజా ఉషద్గుర్వదతాం వరః ।
మహాక్రతుభి రీజే యో వివిధైర్భూరిదక్షిణైః ॥ 2 ॥

తతః ప్రసూతిమిచ్ఛన్ వై ఉషద్గుస్సోఽగ్ర్యమాత్మజమ్ ।
జజ్ఞే చిత్రరథస్తస్య పుత్రః కర్మభిరన్వితః ॥ 3 ॥

స్వాహి కుమారుడు ఉషద్గువు. ఈమహారాజు గొప్పమాటకారి. ఉత్తముడయిన పుత్రుడు కలగడంకోసం గొప్పగా దక్షిణలు ఇచ్చి, ఉషద్గువు ఎన్నో మహాయాగాలు చేశాడు. ఉషద్గువుకు కర్మిష్ఠుడయిన చిత్రరథుడు పుట్టాడు.

ఆసీ చ్చైత్రరథిర్వీరో యజ్వా విపులదక్షిణః ।
శశబిన్దుః పరం వృత్తం రాజర్షీణామనుష్ఠితః ॥ 4 ॥

చిత్రరథుడికుమారుడు శశబిందువు. ఇతడు వీరుడు. విస్తారమైన దక్షిణలు ఇచ్చి యజ్ఞాలు చేశాడు. పూర్వరాజర్షుల నడవడిని శ్రద్ధగా అనుసరించాడు.

పృథుశ్రవాః పృథుయశా రాజాసీచ్ఛాశబిన్దవః ।
శంసన్తి చ పురాణజ్ఞాః పార్థశ్రవసమన్తరమ్ ॥ 5 ॥

శశబిందువు కుమారుడు పృథుశ్రవుడు. ఈరాజు గొప్పకీర్తిమంతుడు. పురాణాలు తెలిసినవారు పృథుశ్రవుడికుమారుడు అంతరుడు అని చెప్తారు.

అన్తరస్య సుయజ్ఞస్తు సుయజ్ఞతనయోఽభవత్ ।
ఉషతో యజ్ఞమఖిలం స్వధర్మే చ కృతాదరః ॥ 6 ॥

అంతరుడికుమారుడు సుయజ్ఞుడు. సుయజ్ఞునితనయుడు ఉషతుడు. వైదికధర్మంలో మిక్కిలిఆదరం కలిగిన ఉషతుడు అనేకమైన యాగాలు చేశాడు.

శినేయురభవత్ పుత్ర ఉషతశ్శత్రుతాపనః ।
మరుత స్తస్య తనయో రాజర్షిరభవన్నృపః ॥ 7 ॥

ఉషతుడికొడుకు శినేయుడు. ఇతడు శత్రువులను బాధించేవాడు (పరాక్రమవంతుడు). శినేయుడికుమారుడు మరుతుడు. ఈజనపాలుడు రాజర్షి.

మరుతోఽలభత జ్యేష్ఠం సుతం కమ్బలబర్హిషమ్ ।
చచార విపులం ధర్మమమర్షాత్ ప్రత్యభాగపి ॥ 8 ॥

స సత్ప్రసూతిమిచ్ఛన్ వై పుత్రం కమ్బలబర్హిషః ।
బభూవ రుక్మకవచశ్శతప్రసవతస్సుతః ॥ 9 ॥

మరుతుడి పెద్దకుమారుడు కంబలబర్హి. కంబలబర్హి వైదికాచారాలకు వ్యతిరేకి అయినప్పటికీ యోగ్యుడయిన కుమారుడిని పొందాలనే కోరికచేత కోపంతో యజ్ఞాదులయిన వైదికధర్మాలను విస్తారంగా ఆచరించాడు. కంబలబర్హికి నూరుగురు సంతానం కలిగినతరువాత చివరికి రుక్మకవచుడు అనే కుమారుడు జన్మించాడు.

నిహత్య రుక్మకవచశ్శతం కవచినాం రణే ।
ధన్వినాం నిశితైర్బాణైరవాప శ్రియముత్తమమ్ ॥ 10 ॥

కవచాలను, ఉత్తమధనుస్సులను ధరించిన వందమందియోధులను వాడి అయిన బాణాలతో చంపి, రుక్మకవచుడు శ్రేష్ఠమయిన శుభపరంపరలను పొందాడు.

జజ్ఞే చ రుక్మకవచాత్ పరజిత్ పరవీరహా ।
జజ్ఞిరే పఞ్చపుత్రాశ్చ మహావీర్యాః పరాజితాః ॥ 11 ॥

రుక్మకవచుడికి శత్రువులను నిర్మూలించే పరజిత్తు అనే కుమారుడు జన్మించాడు. పరజిత్తు కుమారులు ఐదుగురు. వీరు గొప్పబలశాలులు.

రుక్మేషుః పృథురుక్మశ్చ జ్యామఘః పాలితో హరిః ।
పాలితం చ హరిం చైవ విదేహేభ్యః పితా దదౌ ॥ 12 ॥

వారు రుక్మేషువు, పృథురుక్ముడు, జ్యామఘుడు, పాలితుడు, హరి. వీరిలో పాలితుడు, హరి అనేవారిని పరజిత్తు విదేహులకు దత్తత చేశాడు.

రుక్మేషురభవద్ రాజా పృథురుక్మస్య సంశ్రయాత్ ।
తాభ్యాం ప్రవ్రాజితో రాజా జ్యామఘోఽవసదాశ్రమే ॥ 13 ॥

పృథురుక్ముడిసహాయంతో రుక్మేషుడు రాజు అయినాడు. వాళ్లు ఇద్దరు కలిసి వెళ్లగొట్టడంచేత జ్యామఘరాజు అరణ్యాలలో నివాసం ఏర్పరచుకున్నాడు.

ప్రశాన్తశ్చ తదా రాజా బ్రాహ్మణై శ్చావబోధితః ।
జగామ ధనురాదాయ దేశమన్యం ధ్వజీ రథీ ॥ 14 ॥

బ్రాహ్మణులబోధలతో ప్రశాంతిని పొందిన జ్యామఘుడు ధనుస్సు తీసుకుని ధ్వజంతో, రథంతో వేరొకదేశానికి వెళ్లిపోయాడు.

నర్మదాకూలమేకాకీ మేఖలాం మృత్తికావతీమ్ ।
ఋక్షవన్తం గిరిం జిత్వా శుక్తిమత్యామువాస సః ॥ 15 ॥

నర్మదానదీతీరంలో ఒంటరిగా మేఖల, మృత్తికావతి అనేదేశాలనూ, ఋక్షవంతం అనే(కుల)పర్వతాన్ని (కులపర్వతంవరకూ రాజ్యాలను) జయించి, శుక్తిమతీనగరం(పర్వతప్రాంతం)లో నివసించాడు.

జ్యామఘస్యాభవద్ భార్యా శైబ్యా బలవతీ సతీ ।
అపుత్రోఽపి చ రాజా స నాన్యాం భార్యామవిన్దత ॥16 ॥

జ్యామఘుడి భార్య శైబ్య. ఈమె మిక్కిలిబలవంతురాలు. కొడుకులు పుట్టకపోయినా జ్యామఘమహారాజు భార్యను విడిచిపెట్టలేదు. (ఇంకో పెళ్ళి చేసుకోలేదు.)

తస్యాసీద్ విజయో యుద్ధే తత్ర కన్యామవాప సః ।
భార్యా మువాచ సంత్రస్తస్స్నుషేయం తే జనేశ్వరః ॥17 ॥

జ్యామఘుడికి యుద్ధంలో విజయం లభించింది. అక్కడే కన్యను పొందాడు. భార్యకు భయపడి ఆకన్యను నీకోడలు అని పరిచయం చేశాడు.

ఏతచ్ఛ్రుత్వాబ్రవీదేనం కస్య దేవ స్నుషేతి వై ।
అబ్రవీత్ తదుపశ్రుత్య జ్యామఘో రాజసత్తమః ॥ 18 ॥

జ్యామఘుడిభార్య దేవా ఈమె ఎవరికోడలు అని అడిగింది. అది విని రాజశ్రేష్ఠుడయిన జ్యామఘుడు ఈవిధంగా అన్నాడు.

రాజోవాచ :-జ్యామఘుడు భార్యతో ఇలా చెప్తున్నాడు.

య స్తే జనిష్యతే పుత్ర స్తస్య భార్యోపపాదితా ॥ 19 ॥

నీకు పుట్టబోయేకుమారుడికి ఇది భార్య అవుతుంది.

లోమహర్షణ ఉవాచ :-లోమహర్షణుడు మునులకు ఈవిధంగా చెప్తున్నాడు.

ఉగ్రేణ తపసా తస్యాః కన్యాయాస్సా వ్యజాయత ।
పుత్రం విదర్భం సుభగా శైబ్యా పరిణతా సతీ ॥ 20 ॥

ఆకన్య తీవ్రమైన తపస్సు చేసింది. ఆతపస్సుకు ఫలంగా సుందరి అయిన శైబ్య(జ్యామఘుడిభార్య)కు వయసు మీరినతరువాత విదర్భుడు అనే కుమారుడు జన్మించాడు.

రాజపుత్ర్యాం విద్వాంసౌ స్నుషాయాం క్రథకైశికౌ ।
పశ్చాద్ విదర్భోఽజనయచ్ఛూరౌ రణవిశారదౌ ॥ 21 ॥

తర్వాత విదర్భుడు జ్యామఘుడికోడలు అయిన ఆరాజకుమారికయందు క్రథుడు, కైశికుడు అనే ఇద్దరు కుమారులను కన్నాడు. వారు విద్వాంసులు. శౌర్యవంతులు. యుద్ధనిపుణులు.

భీమో విదర్భస్య సుతః కున్తిస్తస్యాత్మజోఽభవత్ ।
కున్తే ర్ధృష్టస్సుతో జజ్ఞే రణధృష్టః ప్రతాపవాన్ ॥ 22 ॥

విదర్భుడికి భీముడు అని ఇంకొకకుమారుడు ఉన్నాడు. భీముడికుమారుడు కుంతి. కుంతి కొడుకు ధృష్టుడు. ఇతడు యుద్ధవిశారదుడు. పరాక్రమశాలి.

ధృష్టస్య జజ్ఞిరే శూరాస్త్రయః పరమధార్మికాః ।
అవన్తశ్చ దశార్హశ్చ బలీ విషహరశ్చ సః ॥ 23 ॥

ధృష్టుడికి ముగ్గురు కుమారులు. వీరులు, ధర్మపరాయణులలో ఉత్తములు. ఆముగ్గురు ఆవంతుడు, దశార్హుడు, బలవంతుడయిన విషహరుడు.

దశార్హస్య సుతో వ్యోమా వ్యోమ్నో జీమూత ఉచ్యతే ।
జీమూతపుత్రో వికృతిస్తస్య భీమరథస్సుతః ॥ 24 ॥

దశార్హుడికుమారుడు వ్యోముడు. వ్యోముడికొడుకు జీమూతుడు. జీమూతుడితనయుడు వికృతి. వికృతి కుమారుడు భీమరథుడు.

అథ భీమరథస్యాసీత్ పుత్రో నవరథస్తథా ।
తస్య చాసీద్దశరథశ్శకునిస్తస్య చాత్మజః ॥ 25 ॥

భీమరథుడికుమారుడు నవరథుడు. నవరథుడితనయుడు దశరథుడు. దశరథుడిపుత్రుడు శకుని.

తస్మాత్ కరమ్భః కారమ్భిర్దేవరాతోఽభవ న్నృపః ।
దేవక్షత్రోఽభవత్ తస్య దైవక్షత్రిర్మహాయశాః ।
దేవగర్భసమో జజ్ఞే దేవక్షత్రస్య నన్దనః ॥ 26 ॥

శకునికి కరంభుడు జన్మించాడు. కరంభుడికి దేవరాతుడు పుట్టాడు. దేవరాతుడితనయుడు దేవక్షత్రుడు. దేవక్షత్రుడికుమారుడు దైవక్షత్రి. గొప్పకీర్తిశాలి. ఇతడు దైవకుమారుడివంటి (దేవతాలక్షణాలు గలిగిన)వాడు.

మధూనాం వంశకృద్ రాజా మధుర్మధురవాగపి ।
మధోర్జజ్ఞేఽథ వైదర్భ్యాం పురుద్వాన్ పురుషోత్తమః ॥ 27 ॥

మధువులవంశాన్ని ఏర్పరచినవాడు మధువు. ఇతడు మధురంగా మాట్లాడేవాడు కూడ. మధువుకు వైదర్భియందు పురుద్వంతుడు అనే ఉత్తమపురుషుడు జన్మించాడు.

ఐక్ష్వాకీ చాభవద్ భార్యా మధోస్తస్యాం వ్యజాయత ।
సత్వాన్ సర్వగుణోపేతస్సాత్వతాం కీర్తివర్ధనః ॥ 28 ॥

మధువుకు ఇక్ష్వాకువంశంలో పుట్టినఇంకొకస్త్రీ కూడ భార్య అయింది. మధువుకు ఆమెయందు సమస్తసద్గుణాలతో కూడినవాడూ, సాత్వతవంశీయులకీర్తిని పెంపొందించేవాడూ అయిన సత్వంతుడు జన్మించాడు.

ఇమాం విసృష్టిం విజ్ఞాయ జ్యామఘస్య మహాత్మనః ।
యుజ్యతే పరమప్రీత్యా ప్రజావాంశ్చ భవేత్ సదా ॥ 29 ॥

మహానుభావుడయిన జ్యామఘుని ఈవంశచరిత్రను తెలుసుకున్నవాడు మిక్కిలిసంతోషాన్ని పొందుతాడు. సంతానవంతుడు కూడ అవుతాడు.

లోమహర్షణ ఉవాచ: – లోమహర్షణుడు మునులకు ఈవిధంగా చెప్తున్నాడు.

సాత్వతాత్ సత్త్వసమ్పన్నాత్ కౌశల్యా సుషువే సుతాన్ ।
భాగినం భజమానం చ దివ్యం దేవావృధం నృపమ్ ॥ 30 ॥

అన్ధకం చ మహాబాహుం వృష్ణిం చ యదునన్దనమ్ ।
తేషాం విసర్గాశ్చత్వారో విస్తరేణేహ కీర్తితాః ॥ 31 ॥

శక్తిసంపద గలిగినసాత్వతుడివలన కౌశల్య భాగ్యవంతుడయిన భజమానుడు, దివ్యుడయిన రాజు దేవావృధుడు, భుజబలశాలి అయినఅంధకుడు, యదునందనుడయిన వృష్ణి అనే పుత్రులను కన్నది. ఈనలుగురి వలన గలిగినసంతానం నాలుగువంశాలుగా వివరంగా ఇక్కడ చెప్పబడింది.

భజమానస్య సృఞ్జయ్యాం బాహ్యకా చోపబాహ్యకా ।
ఆస్తాం భార్యే తయోస్తస్మా జ్జజ్ఞిరే బహవస్సుతాః ॥ 32 ॥

భజమానుడికి బాహ్యక, ఉపబాహ్యక అనే ఇద్దరు భార్యలు ఉన్నారు. వీరు సృంజయివంశంలో జన్మించిన వారు. (సృంజయికుమార్తెలు) వారిద్దరికి భజమానుడివలన పెక్కుమంది కుమారులు గలిగారు.

క్రిమిశ్చ క్రమణశ్చైవ ధృష్టశ్శూరః పురఞ్జయః ।
ఏతే బాహ్యకసృఞ్జయ్యాం భజమానాద్విజజ్ఞిరే ॥ 33 ॥

భజమానుడికి బాహ్యకసృంజయియందు క్రిమి, క్రమణుడు, ధృష్టుడు, శూరుడు, పురంజయుడు, అనే కొడుకులు పుట్టారు.

ఆయుతాజిత్ సహస్రాజిచ్ఛతాజిత్త్వథ దాసకః ।
ఉపబాహ్యకసృఞ్జయ్యాం భజమానాద్ విజజ్ఞిరే ॥ 34 ॥

భజమానుడికి ఉపబాహ్యకసృంజయియందు ఆయుతాజిత్తు, సహస్రాజిత్తు, శతాజిత్తు, దాసకుడు అనే కుమారులు గలిగారు.

యజ్వా దేవావృధో రాజా చచార విపులం తపః ।
పుత్రస్సర్వగుణోపేతో మమ స్యాదితి నిశ్చితః ॥ 35 ॥

యజ్ఞాలు చేసిన దేవావృధమహారాజు తనకు సమస్తమయిన సద్గుణాలు కలిగిన కొడుకు పుట్టాలనే నిశ్చయంతో గొప్పతపస్సు చేశాడు.

సంయుజ్యమానస్తపసా పర్ణాశాయా జలం స్పృశన్ ।
స దోపస్పృశతస్తస్య చకార ప్రియమాపగా ॥ 36 ॥

పర్ణాశానది జలాన్ని ఆచమించి తపసుకు దీక్ష వహించాడు. ఆనది దేవావృధుడికి ఎప్పుడూ (స్నాన పానాదులకు) అన్ని విధాలుగా సహకరించి సంతోషపరచింది.

చిన్తయాభిపరీతా సా న జగామైవ నిశ్చయమ్ ।
కల్యాణత్వాన్నరపతేస్తస్య సా నిమ్నగోత్తమా ॥ 37 ॥

దేవావృధుడికి మేలు జరగడానికి తాను ఇంకా ఏమి చేయాలో ఆలోచిస్తూ, ఆనదీమతల్లి ఒకనిశ్చయానికి రాలేకపోయింది.

నాధ్యగచ్ఛత్తు తాం నారీం యస్యా మేవంవిధస్సుతః ।
భవేత్తస్మాత్ స్వయం గత్వా భవామ్యస్య సహోనుగా ॥38 ॥

దేవావృధుడు కోరుకున్నఉత్తమపుత్రుడిని కనిపెట్టడానికి తగినస్త్రీ ఎవ్వరూ ఇంతవరకూ ఈరాజుకు లభింపలేదు. అందుచేత నేనే స్వయంగా వెళ్లి ఇతడికి అనుకూల ఐన భార్యను అవుతాను. అనుకున్నది పర్ణాశానది.

అథ భూత్వా కుమారీ సా బిభ్రాణా పరమం వపుః ।
వరయామాస నృపతిం తామియేష చ స ప్రభుః ॥ 39 ॥

ఆ నిశ్చయానికి వచ్చినతరువాత ఆ నది అందమైనశరీరం ధరించి, కన్యారూపంతో ఆరాజును వరించింది. దేవావృధుడు కూడ ఆమెను ఇష్టపడ్డాడు.

తస్యా మాధత్త గర్భం స తేజస్విన ముదారధీః ।
అథ సా దశమే మాసి సుషువే సరితాం వరా ॥ 40 ॥
పుత్రం సర్వగుణోపేతం బభ్రుం దేవావృధం ద్విజాః ।

ఉదారబుద్ధి అయిన దేవావృధుడు ఆమెయందు గర్భాన్ని ఉంచాడు. బ్రాహ్మణోత్తములారా! అపుడు నదులలో శ్రేష్ఠురాలయిన ఆమె పదవనెలలో సమస్తసద్గుణాలు గలిగిన బభ్రుదేవావృధుడు అనేకుమారుడిని ప్రసవించింది.

అత్ర వంశే పురాణజ్ఞా గాయన్తీతి పరిశ్రుతమ్ ।
గుణాన్ దేవావృధస్యాపి కీర్తయన్తో మహాత్మనః ॥ 41 ॥

పురాణాలు తెలిసినవారు ఈవంశంలో మహాత్ముడయిన దేవావృధుడిసద్గుణాలను స్తుతిస్తూ, గానం చేస్తున్నారని ప్రసిద్ధి.

యథైవాగ్రే తథా దూరాత్ పశ్యామస్తావ దన్తికాత్ ।
బభ్రుశ్రేష్ఠో మనుష్యాణాం దేవైర్దేవావృధస్సమః ॥ 42 ॥

ఎదురుగా గాని, దూరంనుంచి కాని, లేదా దగ్గరనుంచి కాని పరిశీలిస్తే బభ్రుదేవావృధుడు మానవులలో ఉత్తముడనీ, దేవతలతో సమానుడనీ గ్రహిస్తాం.

షష్టిశ్చ షట్చ పురుషాస్సహస్రాణి చ సప్త చ ।
ఏతేఽమృతత్వం ప్రాప్తా వై బభ్రోర్దేవావృధాదపి ॥ 43 ॥

బభ్రుదేవావృధుడివలన ఏడువేలఅరవైఆరుమంది పురుషులు అమృతస్థితిని పొందారు.

యజ్వా దానపతిర్ధీమాన్ బ్రహ్మణ్యస్స దృఢాయుధః ।
తస్యాన్వవాయస్సుమహాన్ భోజా యే సార్తికావతాః ॥ 44 ॥

బభ్రుదేవావృధుడు ఎన్నో యజ్ఞాలు చేశాడు. దానశీలులలో శ్రేష్ఠుడు, వివేకవంతుడు, బ్రాహ్మణులకు మేలు చేసేవాడు, ఎదురులేని ఆయుధాలు ధరించినవాడు. ఆబభ్రుదేవావృధుడివంశం చాలా గొప్పది. ఆవంశంవారు భోజులు. వీరినే సార్తికావంతులు అంటారు.

అన్ధకాత్ కాశ్యదుహితా చతురోఽలభతాత్మజాన్ ।
కుకురం భజమానం చ ససకం బలబర్హిషమ్ ॥ 45 ॥

అంధకుడివలన కాశ్యుడికూతురు నలుగురు కుమారులను పొందింది. వారు కుకురుడు, భజమానుడు, ససకుడు, బలబర్హిషుడు.

కుకురస్య సుతో వృష్టిర్వృష్టేస్తు తనయస్తథా ।
కపోతరోమా తస్యాథ తిత్తిరిస్తనయోఽభవత్ ॥ 46 ॥

కుకురుడి కుమారుడు వృష్టి. వృష్టి కుమారుడు కపోతరోముడు. కపోతరోముడి కుమారుడు తిత్తిరి.

జజ్ఞే పునర్వసుస్తస్మాదభిజిచ్చ పునర్వసోః ।
తథా వై పుత్రమిథునం బభూవాభిజితః కిల ॥ 47 ॥

తిత్తిరి కుమారుడు పునర్వసువు. పునర్వసుడితనయుడు అభిజిత్తు. అభిజిత్తుకు కవలకొడుకులు గలిగారు.

ఆహుకశ్చాహుకశ్చైవ ఖ్యాతౌ ఖ్యాతిమతాం వరౌ ।
ఇమాంచోదాహరన్త్యత్ర గాథాం ప్రతి తమాహుకమ్ ॥ 48 ॥

కీర్తిమంతులయిన ఆకుమారులు ఆహుకుడు, శ్రాహుకుడు అనేపేర్లతో ప్రసిద్ధులు. ఆహుకుడు అనేకుమారుడిని గురించి ఈగాథను ఉదాహరిస్తారు.

శ్వేతేన పరివారేణ కిశోరప్రతిమో మహాన్ ।
అశీతివర్మణా యుక్త ఆహుకః ప్రథమం వ్రజేత్ ॥ 49 ॥

ఆహుకుడు మహాత్ముడు. సింహకిశోరంవంటివాడు (పరాక్రమవంతుడు). తెల్లనిపరివారంతో కూడినవాడు. ఆహుకుడు ఎనభై కవచాలతో కూడి, (సేనకు) అగ్రభాగంలో ఉండి (యుద్ధానికి) బయలుదేరుతాడు.

నాపుత్రవా న్నాశతదో నాసహస్రశతాయుషః ।
నాశుద్ధకర్మా నాయజ్వా యో భోజమభితో వ్రజేత్ ॥ 50 ॥

ఆభోజుడిని చూచినవాడు ఎవడూ కొడుకులు లేనివాడు కాడు. (పుత్రవంతుడు అవుతాడు) నూటికితక్కువగా ఇచ్చేవాడు కాడు (అధికంగా దానాలు చేస్తాడు). నూరువేలయేండ్లకు తక్కువ ఆయువు కలిగినవాడు కాడు (అత్యధికమైన ఆయుర్దాయం కలుగుతుంది.). పాపపుపనులు చేసేవాడు కాడు (పవిత్రమైన కర్మలు ఆచరిస్తాడు). యజ్ఞాలు చేయనివాడు కాడు (యజ్ఞాలు చేస్తాడు).

పూర్వస్యాం దిశి నాగానాం భోజస్య ప్రయయుః కిల ।
సోమాత్ సజ్జానుకర్షాణాం ధ్వజినాం సవరూథినామ్ ॥ 51 ॥

రథానాం మేఘఘోషాణాం సహస్రాణి దశైవ తు ।
రౌప్యకాఞ్చనకక్షాణాం సహస్రాణ్యేకవింశతిః ॥ 52 ॥

పదివేలయేనుగులు, పదివేలధ్వజాలు, పదివేలకవచాలు, మేఘంవంటిధ్వని గలిగిన పదివేలరథాలు, వెండి, బంగారం రంగులో ఉండే ఇరవైఒక్కవేల దున్నపోతులు, తూర్పుదిక్కులో భోజ(వంశీయు డయినబభ్రు)మహారాజును అనుసరించి వెళ్తాయి.

తావంత్యేవ సహస్రాణి ఉత్తరస్యాం తథా దిశి ॥ 53 ॥

అదేసంఖ్యలో అన్నీ ఉత్తరదిక్కునందు ఆమహారాజును అనుసరించి వెళ్తాయి.

ఆభూమిపాలా భోజాస్తు సన్తి జ్యాకిఙ్కిణీకినః ।
ఆహుః కించాప్యవన్తిభ్యస్సుసారం దదురన్ధకాః ॥ 54 ॥

భోజవంశంలోని రాజులు అందరూ వింటినారిచిరుగంటలు కలిగినవారు (యుద్ధవిశారదులు). అంధకులు తమవంశం వారిని అవంతిదేశీయులకు ఇస్తారు అని చెప్తారు.

ఆహుకస్య తు కాశ్యాయాం ద్వౌ పుత్రౌ సమ్బభూవతుః ।
దేవకశ్చోగ్రసేనశ్చ దేవగర్భసమావుభౌ ॥ 55 ॥

ఆహుకుడికి కాశ్య అనేస్త్రీయందు ఇద్దరు కుమారులు గలిగారు. దేవకుడు, ఉగ్రసేనుడు. ఇద్దరూ దేవకుమారులతో సమానులు.

దేవకస్యాభవత్ పుత్రాశ్చత్వారస్త్రిదశోపమాః ।
దేవవానుపదేవశ్చ సందేవో దేవరక్షితః ॥ 56 ॥

దేవకుడికి నలుగురు కొడుకులు. అందరూ దేవతలతో సమానులు. దేవవంతుడు, ఉపదేవుడు, సందేవుడు, దేవరక్షితుడు.

కుమార్యస్సప్త చాస్యాథ, వసుదేవాయ తా దదౌ ।
దేవకీ శాన్తిదేవా చ సుదేవా దేవరక్షితా ॥
వృకదేవ్యుపదేవీ చ సునామ్నీ చైవ సప్తమీ ॥ 57 ॥

కూతుళ్లు ఏడుగురు. వారిని వసుదేవుడికి భార్యలుగా ఇచ్చాడు. దేవకి, శాంతిదేవ, సుదేవ, దేవరక్షిత, వృకదేవి, ఉపదేవి, సునామ్ని అనేఆమె ఏడవది.

నవోగ్రసేనస్య సుతాస్తేషాం కంసస్తు పూర్వజః ।
న్యగ్రోధశ్చ సునామా చ తథా కఙ్కస్సుభూషణః ।
రాష్ట్రపాలోఽథ సుతనురనావృష్టిస్తు పుష్టిమాన్ ॥ 58 ॥

ఉగ్రసేనుడికుమారులు తొమ్మిదిమంది. వారిలో పెద్ద(మొదట పుట్టిన)వాడు 1.కంసుడు. 2.న్యగ్రోధుడు, 3.సునాముడు, 4.కంకుడు, 5.సుభూషణుడు, 6.రాష్ట్రపాలుడు, 7.సుతనుడు, 8.అనావృష్టి, 9.పుష్టిమంతుడు.

తేషాం స్వసారః పఞ్చాసన్ కంసా కంసవతీ తథా ।
సుతనూ రాష్ట్రపాలీ చ కఙ్కా చైవ వరాఙ్గనా ॥ 59 ॥

వారికి చెల్లెళ్లు ఐదుగురు. 1.కంస, 2.కంసవతి, 3.సుతనువు, 4.రాష్ట్రపాలి, సుందరాంగి అయిన 5.కంక.

ఉగ్రసేనస్సహాపత్యో వ్యాఖ్యాతః కుకురోద్భవః ॥ 60 ॥

కుకురుడికి జన్మించిన ఉగ్రసేనుడినిగురించి ఆతడిసంతానంతో సహా ఇంతకు ముందు వివరించడం జరిగింది.

కుకురాణామిమం వంశం ధారయన్నమితౌజసామ్ ।
ఆత్మనో విపులం వంశం ప్రజావానాప్నుయాన్నరః ॥ 61 ॥

మిక్కిలి పరాక్రమశాలులయిన కుకురుల ఈవంశచరిత్రను మనసులో ధరించినమానవుడు సంతానవంతుడయి, తనవంశాన్ని వృద్ధి చేస్తాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వృష్ణివంశనిరూపణం నామ త్రయోదశోఽధ్యాయః ॥ 13 ॥

శ్రీబ్రహ్మపురాణంలో వృష్ణివంశనిరూపణం అనే పదమూడవ అధ్యాయం సంపూర్ణం.

చతుర్దశోఽధ్యాయః – పద్నాల్గవఅధ్యాయం

స్యమంతకప్రత్యానయననిరూపణమ్ – స్యమంతకప్రత్యానయననిరూపణం

లోమహర్షణ ఉవాచ :–లోమహర్షణుడు మునులకు ఇలా చెప్తున్నాడు.

భజమానస్య పుత్రో వై రథముఖ్యో విదూరథః ।
రాజాధిదేవ శ్శూర స్తు విదూరథసుతోఽభవత్ ॥ 1 ॥

భజమానుడికుమారుడు విదూరథుడు. ఇతడు రథం మీదినుండి యుద్ధం చేసే వాళ్లలో (రథికులలో) ప్రధానుడు. విదూరథుడికొడుకు శూరుడయిన రాజాధిదేవుడు.

రాజాధిదేవస్య సుతా జజ్ఞిరే వీర్యవత్తరాః ।
దత్తాతిదత్తౌ బలినౌ శోణాశ్వ శ్శ్వేతవాహనః ॥ 2 ॥

శమీ చ దణ్డశర్మా చ దన్తశత్రుశ్చ శత్రుజిత్ ।
శ్రవణా చ శ్రవిష్ఠా చ స్వసారౌ సమ్బభూవతుః ॥ 3 ॥

రాజాధిదేవుడికుమారులు మిక్కిలిపరాక్రమవంతులు. బలవంతులయిన 1.దత్తుడు, 2.అతిదత్తుడు 3.శోణాశ్వుడు, 4.శ్వేతవాహనుడు, 5.శమి, 6.దండశర్మ, 7. దంతశత్రువు, 8.శత్రుజిత్తు అనేవారు. శ్రవణ, శ్రవిష్ఠ అనేవారు ఇద్దరు కుమార్తెలు.

శమిపుత్రః ప్రతిఛత్రః ప్రతిఛత్రస్య చాత్మజః ।
స్వయంభోజ స్స్వయంభోజా ద్ధృదీక స్సమ్బభూవ హ ॥ 4 ॥

వారిలో శమి కుమారుడు ప్రతిఛత్రుడు. ప్రతిక్షత్రుడికుమారుడు స్వయంభోజుడు. స్వయంభోజుడికి హృదీకుడు పుట్టాడు.

తస్య పుత్రా బభూవు ర్హి సర్వే భీమపరాక్రమాః ।
కృతవర్మాగ్రజ స్తేషాం శతధన్వా తు మధ్యమః ॥ 5 ॥

అతడికుమారులు అందరూ భయంకరమైన పరాక్రమం గలిగివారు. వారిలో అందరికంటె పెద్దవాడు కృతవర్మ. శతధన్వుడు మధ్యముడు..

దేవాన్తశ్చ నరాన్తశ్చ భిష గ్వైతరణశ్చ యః ।
సుదాన్త శ్చాతిదాన్తశ్చ నికాశ్యః కామదమ్భకః ॥ 6 ॥

దేవాంతుడు, నరాంతుడు, వైద్యుడయిన వైతరణుడు, సుదాంతుడు, అతిదాంతుడు, నికాశ్యుడు, కామదంభకుడు అనేవారు హృదీకుడి కుమారులు.

దేవాన్తస్యాభవత్ పుత్రో విద్వాన్ కమ్బలబర్హిషః ।
అసమౌజా స్సుత స్తస్య నాసమౌజాశ్చ తావుభౌ ॥ 7 ॥

దేవాంతుడికి విద్వాంసుడయిన కంబలబర్హిషుడు పుట్టాడు. కంబలబర్హిషుడికి అసమౌజసుడు, నాసమౌజసుడు అనే ఇద్దరు కుమారులు గలిగారు.

అజాతపుత్రాయ సుతాన్ ప్రదదా వసమౌజసే ।
సుదంష్ట్రశ్చ సుచారుశ్చ కృష్ణ ఇత్యన్ధకా స్స్మృతాః ॥ 8 ॥

అసమౌజసుడికి కొడుకులు గలగలేదు. (నాసమౌజసుడు) సుదంష్ట్రుడు, సుచారుడు, కృష్ణుడు అనే తనకొడుకులను అసమౌజసుడికి ఇచ్చాడు. వీరే అంధకులు.

గాన్ధారీ చైవ మాద్రీ చ క్రోష్టుభార్యే బభూవతుః ।
గాన్ధారీ జనయామాస హ్యనమిత్రో మహాబలమ్ ॥ 9 ॥

క్రోష్టువుకు గాంధారి, మాద్రి అనేవారు ఇద్దరు భార్యలు. గాంధారికి గొప్పబలవంతుడైన అనమిత్రుడు అనే పుత్రుడు కలిగాడు.

మాద్రీ యుధాజితం పుత్రం తతో వై దేవమీఢుషమ్ ।
అనమిత్ర మమిత్రాణాం జేతార మపరాజితమ్ ॥ 10 ॥

మాద్రి యుధాజిత్తు, దేవమీఢుడు అనే కొడుకులను కన్నది.(12–2) దేవమీఢుడు శత్రువులకు కూడ మిత్రుడే. (శత్రువులను గూడ మిత్రుడిలాగా ఆదరిస్తాడు) యుద్ధంలో జయం మాత్రమే పొందుతాడు. ఓడిపోవటం ఎప్పుడూ లేదు.

అనమిత్రపుత్రో నిఘ్నో నిఘ్నతో ద్వౌ బభూవతుః ।
ప్రసేనశ్చాథ సత్రాజిచ్ఛత్రుసేనాజితా వుభౌ ॥ 11 ॥

అనమిత్రుడికుమారుడు నిఘ్నుడు. నిఘ్నుడికి ప్రసేనుడు, సత్రాజిత్తు అనే కొడుకులు ఇద్దరు. వీరు శత్రు సైన్యాన్ని జయించేవారు.

ప్రసేనో ద్వారవత్యాం తు నివసన్ స మహామణిమ్ ।
దివ్యం స్యమన్తకం నామ స సూర్యాదుపలబ్ధవాన్ ॥ 12 ॥

ప్రసేనుడు ద్వారవతీనగరంలో నివసిస్తుంటాడు. (సత్రాజిత్తు) సూర్యుడినుండి స్యమంతకం అనే దివ్యమైన మణిని పొందాడు.

తస్య సత్రాజిత స్సూర్య స్సఖా ప్రాణసమోఽభవత్ ॥ 13 ॥

ఆ సత్రాజిత్తుకు సూర్యుడు ప్రాణంతో సమానమైన మిత్రుడు అయినాడు.

స కదాచిన్నిశాపాయే రథేన రథినాం వరః ।
తోయకూల మప స్స్పృష్ట ముపస్థాతుం యయౌ రవిమ్ ॥ 14 ॥

రథం నడపటంలో శ్రేష్ఠుడయిన సత్రాజిత్తు ఒకసారి రాత్రి గడచిపోగా, (తెల్లవారుజామున) స్నానం చేసి, సూర్యుడిని ఉపాసించడానికి జలాశయంవద్దకు రథం మీద వెళ్లాడు.

తస్యోపతిష్ఠత స్సూర్యం వివస్వానగ్రతః స్థితః ।
విస్పష్టమూర్తి ర్భగవాం స్తేజోమణ్డలవాన్ విభుః ॥ 15 ॥

సూర్యుడిని ఉద్దేశించి ఉపాసన చేస్తుండగా, స్పష్టమయిన స్వరూపంతో కాంతిమండలంతో సూర్య భగవానుడు అతడికి ఎదురుగా వచ్చి నిలిచాడు.

అథ రాజా వివస్వన్త మువాచ స్థితమగ్రతః ॥ 16 ॥

ఎదురుగా నిలిచిఉన్న సూర్యుడితో సత్రాజిత్తు మహారాజు ఇలా అన్నాడు.

యథైవ వ్యోమ్ని పశ్యామి సదా త్వాం జ్యోతిషాంపతే ।
తేజోమణ్డలినం దేవం తథైవ పురత స్స్థితమ్ ।
కో విశేషోఽ స్తి మే త్వత్త స్సహాయత్వం గతస్య వై ॥ 17 ॥

గ్రహనక్షత్రాదులకు అధిపతి అయినవాడా! ఎల్లపుడు కాంతిమండలస్వరూపంలో ఆకాశంలో చూస్తున్న విధంగానే ఎదురుగా (సన్నిహితంగా) చూస్తున్నాను. మిత్రుడుగా నీసహాయం పొందుతున్న నాకు దీనివలన (నీవు ప్రత్యక్షం కావటంవలన) విశేషప్రయోజనం ఏమున్నది?

ఏతచ్ఛృత్వా తు భగవాన్ మణిరత్నం స్యమన్తకమ్ ।
స్వకణ్ఠాదవముచ్యాథ ఏకాన్తే న్యస్తవాన్ విభుః ॥ 18 ॥

ఆమాటలు విని సూర్యభగవానుడు స్యమంతకం అనే గొప్పమణిని తనకంఠంనుండి తీసి రహస్యంగ (వారిద్దరిమధ్య) ఉంచాడు.

తతో విగ్రహవన్తం తం దదర్శ నృపతి స్తదా ॥ 19 ॥

అప్పుడు సత్రాజిత్తుమహారాజు సూర్యుడిని (కరచరణాదిఅవయవాలతో కూడిన) రూపంతో చూశాడు.

ప్రీతిమా నథ తం దృష్ట్వా ముహూర్తం కృతవాన్ కథామ్ ।
తమభిప్రస్థితం భూయో వివస్వన్తం స సత్రాజిత్ ॥ 20 ॥

ఆరూపంలో నిలిచిఉన్న వివస్వంతుడిని చూచి, సంతోషంగా సత్రాజిత్తు ఒకముహూర్తకాలం సూర్యుడితో ప్రసంగించాడు.

లోకానుద్భాసయన్ స్వామిన్! యేన త్వం సతతం విభో ।
తదేతన్మణిరత్నం మే భగవన్ దాతుమర్హసి ॥ 21 ॥

'స్వామీ! ప్రభూ! మహాత్మా! నీవు ఈలోకాలను నిరంతరం ప్రకాశింపజేస్తున్న ఆ మణిని నాకు ఇవ్వగలవు' అన్నాడు సత్రాజిత్తు.

తత స్స్యమన్తకమణిం దత్తవాన్ భాస్కర స్తదా ।
స తమాబధ్య నగరీం ప్రవివేశ మహీపతిః ॥ 22 ॥

అపుడు భాస్కరుడు స్యమంతకమణిని సత్రాజిత్తుకు ఇచ్చాడు. సత్రాజిన్మహారాజు ఆమణిని ధరించి రాజధానిలో ప్రవేశించాడు.

తం జనాః పర్యధావన్త సూర్యో౽యం గచ్ఛతీతి హ ।
స్వాం పురీం స విసిష్మాయ రాజా త్వన్తఃపురం తథా ॥ 23 ॥

సూర్యుడు క్రిందికి దిగి నేలపై సంచరిస్తున్నాడని భావిస్తూ ఆనగరంలోని ప్రజలందరూ సత్రాజిత్తువెంట పరుగులుతీశారు. ఈవిధంగా సత్రాజిత్తు తనరాజధానిలోని జనాలందరినీ ఆశ్చర్యంలో ముంచి మెల్లగా అంతః పురానికి చేరుకున్నాడు.

తం ప్రసేనజితం దివ్యం మణిరత్నం స్యమన్తకమ్ ।
దదౌ భ్రాత్రే నరపతిః ప్రేమ్ణా సత్రాజిదుత్తమమ్ ॥ 24 ॥

సత్రాజిన్మహారాజు స్యమంతకం అనే దివ్యమైన ఆ గొప్పమణిరత్నాన్ని తమ్ముడయిన ప్రసేనజిత్తుకు ప్రేమగా ఇచ్చాడు.

స మణి స్స్యన్దతే రుక్మం వృష్ణ్యన్ధకనివేశనే ।
కాలవర్షీ చ పర్జన్యో న చ వ్యాధిభయం హ్యభూత్ ॥ 25 ॥

ఆ స్యమంతకమణి వృష్ణి అంధకులనివాసంలో రోజూ బంగారాన్ని స్రవిస్తున్నది. స్యమంతకమణి ఉన్న ఆరాజ్యంలో మేఘాలు సకాలంలో వర్షిస్తున్నాయి. రోగాలభయం ఏమాత్రమూ లేకుండా పోయింది.

లిప్సాం చక్రే ప్రసేనస్య మణిరత్నే స్యమన్తకే ।
గోవిన్దో న చ తం లేభే శక్తో౽పి న జహార సః ॥ 26 ॥

ప్రసేనుడివద్ద ఉన్న స్యమంతకమణిని గోవిందుడు సొంతం చేసుకోవాలనుకున్నాడు. కాని పొందలేదు. సమర్థుడయినా కృష్ణుడు ఆమణిని హరించలేదు. (బలవంతంగానూ తీసుకోలేదు.)

కదాచిన్మృగయాం యాతః ప్రసేన స్తేన భూషితః ।
స్యమన్తకకృతే సింహా ద్వధం ప్రాప వనేచరాత్ ॥ 27 ॥

ఒకానొకసారి ప్రసేనుడు ఆ స్యమంతకమణిని అలంకరించుకుని వేటకు వెళ్లాడు. స్యమంతమణిని చూచి (అది మాంసం ముక్క అనుకుని బాగా మెరుస్తున్నదానిని తిందామనే ఉద్దేశంతో) సింహం ప్రసేనుడిని సంహరించింది.

అథ సింహం ప్రధావన్ తమృక్షరాజో మహాబలః ।
నిహత్య మణిరత్నం తదాదాయ ప్రావిశద్ గుహామ్ ॥ 28 ॥

మిక్కిలిబలవంతమయిన ఒకానొక ఎలుగుబంటి మణికోసం ఆసింహాన్ని వెంబడించింది. సింహాన్ని చంపి స్యమంతకమణిని తీసుకుని తనగుహలో ప్రవేశించింది.

తతో వృష్ణ్యన్ధకాః కృష్ణం ప్రసేనవధకారణాత్ ।
ప్రార్థనాం తాం మణే ర్బుద్ధ్వా సర్వ ఏవ శశఙ్కిరే ॥ 29 ॥

ప్రసేనుడు సంహరింపబడిన కారణంగా వృష్ణి అంధకులు పూర్వం శ్రీకృష్ణుడు ఆమణిని తనకు ఇమ్మని అడిగినవిషయాన్ని స్మరించి, మణికోసం కృష్ణుడే ప్రసేనుడిని చంపిఉంటాడని అనుమానించారు.

స శఙ్క్యమానో ధర్మాత్మా హ్యకారీ తస్య కర్మణః ।
ఆహరిష్యే మణిమితి ప్రతిజ్ఞాయ వనం యయౌ ॥ 30 ॥

వృష్ణ్యంధకులు తనను అనుమానిస్తున్నారని తెలిసి, ధర్మాత్ముడయిన గోవిందుడు ఆమణిని ఎలాగయినా తీసుకువస్తానని (వారికి తిరిగి ఇవ్వాలని) ప్రతిజ్ఞ చేసి, అరణ్యానికి వెళ్లాడు.

యత్ర ప్రసేనో మృగయాం వ్యచరత్ తత్ర చాప్యథ ।
ప్రసేనస్య పదం గృహ్య పురుషై రాప్తకారిభిః ॥ 31 ॥

ప్రసేనుడు సంచరించిన చోట పాదాల గుర్తులను చూశాడు. ఆప్తులవలన అవి ప్రసేనుడిపాదచిహ్నాలుగా గుర్తించాడు. వాటిని అనుసరించి ముందుకు వెళ్లాడు.

ఋక్షవన్తం గిరివరం విన్ధ్యం వా గిరిసత్తమమ్ ।
అన్వేషయన్ పరిశ్రాన్త స్స దదర్శ మహామనాః ।
సాశ్వం హతం ప్రసేనం తు నావిన్దత చ తన్మణిమ్ ॥ 32 ॥

ఋక్షవంతం అనేపెద్దకొండను, పర్వతశ్రేష్ఠమయన వింధ్యపర్వతాన్నీ వెదికి, వెదికి అలసిపోయాడు. చివరికి బుద్ధిమంతుడయిన కృష్ణుడు గుఱ్ఱంతో సహా చచ్చి పడి ఉన్న ప్రసేనుడిని చూశాడు. కాని స్యమంతకమణి మాత్రం కనబడలేదు.

అథ సింహః ప్రసేనస్య శరీరస్యావిదూరతః ।
ఋక్షేణ నిహతో దృష్టః పదై ఋక్షస్తు సూచితః ॥ 33 ॥

ప్రసేనుడికళేబరానికి కొంచెం దూరంలో ఎలుగుబంటిచేత చచ్చిన సింహాన్ని చూశాడు. కాలిగుర్తులనుబట్టి ఎలుగుబంటిని (సింహాన్ని చంపింది ఎలుగుబంటి అనీ) గుర్తించాడు.

పదై స్తై రన్వియా యాథ గృహ మృక్షస్య మాధవః ।
స హి ఋక్షబిలే వాణీం శుశ్రావ ప్రమదేరితమ్ ॥ 34 ॥

కాలిగుర్తులను అనుసరించి వెళ్లి ఎలుగుబంటి ఇంటిని చేరుకున్నాడు. ఆఎలుగునివాసంలో ఒకఆడదాని మాటలను విన్నాడు.

ధాత్ర్యా కుమారమాదాయ సుతం జామ్బవతో ద్విజాః ।
క్రీడయన్త్యా చ మణినా మా రోదీరిత్యథేరితామ్ ॥ 35 ॥

బ్రాహ్మణులారా! అక్కడ ఒకదాది జాంబవంతుడికుమారుడిని ఎత్తుకుని స్యమంతకమణితో పసివాడిని ఆడిస్తూ, 'ఏడవకు' అంటూ లాలిస్తున్నది.

ధాత్ర్యువాచ :– దాది ఇలా అంటున్నది.

సింహః ప్రసేన మవధీత్ సింహో జామ్బవతా హతః ।
సుకుమారక మా రోదీ స్తవ హ్యేష స్యమన్తకః ॥ 36 ॥

సింహం ప్రసేనుడిని చంపింది. ఆసింహాన్ని జాంబవంతుడు చంపాడు. కుమారా! ఏడవుకు. ఈ స్యమంతకమణి నీదే.

వ్యక్తిత స్తస్య శబ్దస్య తూర్ణమేవ బిలం యయౌ ।
ప్రవిశ్య తత్ర భగవాం స్తదృక్షబిలమఞ్జసా ॥ 37 ॥

ఆశబ్దం వినబడుతున్నదానిననుసరించి గోవిందుడు వేగంగా ఆబిలంవద్దకు వెళ్లాడు. వేగంగా శ్రీకృష్ణభగవానుడు ఆ ఎలుగుగుహలోకి ప్రవేశించాడు.

స్థాపయిత్వా బిలద్వారే యదూన్ లాఙ్గలినా సహ ।
శార్ఙ్గధన్వా బిలస్థం తు జామ్బవన్తం దదర్శ సః ॥ 38 ॥

తనవెంట వచ్చిన బలరాముడితో సహా యాదవు లందరినీ గుహవాకిట్లోనే నిలిపి, శార్ఙ్గి అయినగోవిందుడు తాను ఒక్కడే లోపలికి వెళ్లాడు. అక్కడ జాంబవంతుడిని చూశాడు.

యుయుధే వాసుదేవస్తు బిలే జామ్బవతా సహ ।
బాహుభ్యామేవ గోవిన్దో దివసా నేకవింశతిమ్ ॥ 39 ॥

వసుదేవతనయుడయిన గోవిందుడు జాంబవంతుడితో ఆగుహలోనే ఇరవైఒక్కరోజులపాటు (నిరాయుధుడై) బాహువులతో (ముష్టి)యుద్ధం చేశాడు.

ప్రవిష్టే ఽథ బిలే కృష్ణే బలదేవపురస్సరాః ।
పురీం ద్వారవతీ మేత్య హతం కృష్ణం తదా జగుః ॥ 40 ॥

కృష్ణుడు ఆబిలంలోకి వెళ్లినతరువాత తిరిగిరాకపోవడంతో బలరాముడు మొదలయినవారు అందరూ తిరిగి ద్వారకానగరానికి వెళ్లి కృష్ణుడిని చంపేశారని చెప్పారు.

వాసుదేవోఽపి నిర్జిత్య జామ్బవన్తం మహాబలమ్ ।
లేభే జామ్బవతీం కన్యా మృక్షరాజస్య సమ్మతామ్ ॥ 41 ॥

ఇక్కడ వసుదేవకుమారుడు మహాబలశాలి అయిన జాంబవంతుడిని జయించాడు. జాంబవంతుడి ఆమోదంతో (కోరికమీద) జాంబవతిని వివాహం చేసుకున్నాడు.

మణిం స్యమన్తకం చైవ జగ్రాహాత్మవిశుద్ధయే ।
అనునీయర్క్షరాజం తు నిర్యయౌ చ తతో బిలాత్ ।
ఉపాయా ద్ద్వారకాం కృష్ణ స్స వినీతైః పురస్సరైః ॥ 42 ॥

తనపై వచ్చిన నిందను తొలగించుకోవడానికి స్యమంతకమణిని గూడ తీసుకున్నాడు. (కూతురినీ, మణినీ తీసుకుని తాను వెళ్లిపోతున్నందుకు బాధపడుతున్న) జాంబవంతుడిని అనునయించి, కృష్ణుడు ఆగుహనుండి వెలువడ్డాడు. వినీతులయిన తనఅనుచరులతో శ్రీకృష్ణుడు ద్వారకానగరం చేరుకున్నాడు.

ఏవం స మణి మాహృత్య విశోధ్యాత్మనమచ్యుతః ।
దదౌ సత్రాజితే చైవ సర్వసాత్వతసంసది ॥ 43 ॥

ఈవిధంగా ఆ స్యమంతకమణిని తెచ్చి, కృష్ణుడు తనకు గలిగినమచ్చను తొలగించుకున్నాడు. సాత్వతులందరిసమక్షంలో ఆ స్యమంతకమణిని సత్రాజిత్తుకు ఇచ్చాడు.

ఏవం మిథ్యాభిశస్తేన కృష్ణేనామిత్రఘాతినా ।
ఆత్మా విశోధితః పాపా ద్వినిర్జిత్య స్యమన్తకమ్ ॥ 44 ॥

శత్రుసంహారకుడయిన కృష్ణుడు ఈవిధంగా తనపై వచ్చిన నిందలు అబద్ధాలని నిరూపించి, కళంకాన్ని (అపకీర్తిని) తొలగించుకున్నాడు. స్యమంతకమణిని తిరిగి ఇచ్చివేయడంద్వారా దాన్ని కాజేశాడనే పాపం నుండి బయటపడ్డాడు. (స్యమంతకం సొంతం చేసుకోవాలనే కోరికను విడిచిపెట్టడం ద్వారా స్యమంతకమణిని జయించాడు.)

సత్రాజితో దశ త్వాసన్ భార్యా స్తాసాం శతం సుతాః ॥ 45 ॥

సత్రాజిత్తుకు పదిమందిభార్యలు. వారిద్వారా సత్రాజిత్తుకు వందమంది కుమారులు కలిగారు.

ఖ్యాతిమన్త స్త్రయ స్తేషాం భఙ్గకారస్తు పూర్వజః ।
వీరో వాతమతిశ్చైవ వసుమేథ స్తథైవ చ ॥ 46 ॥

ఆవందమంది కుమారులలోనూ ముగ్గురు ప్రసిద్ధులు. వారిలో మొదటివాడు 1.భంగకారుడు. వీరుడయిన 2.వాతమతి అలాగే 3.వసుమేధుడు.

కుమార్యశ్చాపి తిస్రో వై దిక్షు ఖ్యాతా ద్విజోత్తమాః ॥ 47 ॥

బ్రాహ్మణోత్తములారా! అలాగే కుమార్తెలు కూడ ముగ్గురు అన్నిచోట్ల ప్రసిద్ధలయినారు.

సత్యభామోత్తమా తాసాం వ్రతినీ చ దృఢవ్రతా ।
తథా ప్రస్వాపినీ చైవ భార్యా కృష్ణాయ తా దదౌ ॥ 48 ॥

వారిలో సత్యభామ ఉత్తమురాలు. తరువాతికూతురు వ్రతిని (దృఢవ్రత). ఈమె వ్రతాలను పట్టుదలతో ఆచరిస్తుంది. (మూడవకూతురు) ప్రస్వాపిని. వీరు ముగ్గురినీ సత్రాజిత్తు కృష్ణుడికి భార్యలుగా ఇచ్చాడు.

సభాక్షో భఙ్గకారిస్తు నావేయశ్చ నరోత్తమౌ ।
జజ్ఞాతే గుణసమ్పన్నౌ విశ్రుతౌ రూపసంవృతౌ ॥ 49 ॥

భంగకారుడి కుమారులు సభాక్షుడు. నావేయుడు. వీరు ఇద్దరూ ఉత్తమమానవులు. మంచిగుణసంపద గలవారు. అందగాళ్లు. సుప్రసిద్ధులు.

మాద్ర్యాః పుత్రస్తు జజ్ఞేఽథ వృష్ణిపుత్రో యుధాజితః ।
జజ్ఞాతే తనయౌ వృష్ణేః శ్వఫల్క శ్చిత్రక స్తథా ॥ 50 ॥

మాద్రి (వృష్ణి అనేవాడు పుత్రుడుగా గలిగిన) యుధాజితుడిని కన్నది. యుధాజిత్తు కుమారుడు వృష్ణి. వృష్ణికి ఇద్దరు కుమారులు. శ్వఫల్కుడు, చిత్రకుడు.(12-3)

శ్వఫల్కః కాశిరాజస్య సుతాం భార్యా మవిన్దత ।
గాన్దినీం నామ తస్యాస్తు గాశ్చాస్య ప్రదదౌ పితా ॥ 51 ॥

శ్వఫల్కుడు కాశిరాజు కూతురయిన గాందిని అనే కన్యను భార్యగా పొందాడు. కాశిరాజు ఆమెకోసం శ్వఫల్కుడికి గోవులను గూడ ఇచ్చాడు. (12-7)

తస్యాం జజ్ఞే మహాబాహుః శ్రుతవానితి విశ్రుతః ।
అక్రూరోఽథ మహాభాగో జజ్ఞే విపులదక్షిణః ॥ 52 ॥

శ్వఫల్కుడు గాందినియందు బాహుబలశాలి అయిన శ్రుతవంతుడు అనే విద్వాంసుడిని కన్నాడు. (12-8) తరువాత శ్వఫల్కుడికి గాందినియందు మహానుభావుడు, విస్తారంగా దక్షిణ లిచ్చి యజ్ఞాలు చేసినవాడు అయిన అక్రూరుడు జన్మించాడు.

ఉపమద్గు స్తథా మద్గు ర్మదుర శ్చారిమర్దనః ।
ఆరిక్షేపస్తథోపేక్ష శ్శత్రుహా చారిమేజయః ॥ 53 ॥

ధర్మభృచ్చాపి ధర్మా చ గృధ్రభోజాన్ధక స్తథా ।
ఆవాహప్రతివాహౌ చ సున్దరీ చ వరాఙ్గనా ॥ 54 ॥

విశ్రుతాశ్వస్య మహిషీ కన్యా చాస్య వసున్ధరా ।
రూపయౌవనసమ్పన్నా సర్వసత్వమనోహరా ॥ 55 ॥

తరువాత ఉపమద్గుడు, మద్గుడు, మదురుడు, అరిమర్దనుడు, ఆరిక్షేపుడు, ఉపేక్షుడు, శత్రుసంహారకుడయిన అరిమేజయుడు, ధర్మభృత్తు, ధర్ముడు, గృధ్రభోజాంధకుడు, ఆవాహుడు, ప్రతివాహుడు, అనే కుమారులు జన్మించారు. తరువాత సుందరి, ఉత్తమమైన అవయవములు గలదీ అయిన వసుంధర అనే కూతురు పుట్టింది.

వసుంధర విశ్రుతాశ్వుడికి పట్టపురాణి అయింది. వసుంధర అందమైనరూపమూ, మంచియౌవనమూ గలిగినది. అందరిమనస్సులనూ హరించే సౌందర్యం కలిగినది.

అక్రూరేణోగ్రసేనాయాం సుతౌ వై కులనన్దనౌ ।
వసుదేవ శ్చోపదేవో జజ్ఞాతే దేవవర్చసౌ ॥ 56 ॥

అక్రూరుడికి ఉగ్రసేన అనేభార్యయందు వంశోద్ధారకు లయిన వసుదేవుడు, ఉపదేవుడు అనే దేవతేజస్సు గలిగిన కుమారులు ఇద్దరు జన్మించారు.

చిత్రకస్యాభవత్ పుత్రాః పృథుర్విపృథురేవ చ ।
అశ్వగ్రీవోఽశ్వబాహుశ్చ సుపార్శ్వకగవేషణౌ ॥ 57 ॥

అరిష్టనేమిశ్చ సుతా ధర్మో ధర్మభృదేవ చ ।
సుబాహుర్బహుబాహుశ్చ శ్రవిష్ఠాశ్రవణే స్త్రియౌ ॥ 58 ॥

చిత్రకుడికి పృథువు, విపృథువు, అశ్వగ్రీవుడు, అశ్వబాహువు, సుపార్శ్వకుడు, గవేషణుడు, అరిష్టనేమి, ధర్ముడు, ధర్మభృత్తు, సుబాహువు, బహుబాహువు అనే కుమారులు కలిగారు. (చిత్రకుడికి) శ్రవిష్ఠ, శ్రవణ అనే ఇద్దరు కూతుళ్లు జన్మించారు.

ఇమాం మిథ్యాభిశస్తిం యః కృష్ణస్య సముదాహృతామ్ ।
వేద మిథ్యాభిశాపా స్తం న స్పృశన్తి కదాచన ॥ 59 ॥

శ్రీకృష్ణుడికి అపవాదు (కలిగి తొలగిన) ఈకథను తెలుసుకున్నవాడికి అపవాదు ఎన్నటికీరాదు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్యమన్తకప్రత్యానయననిరూపణం నామ చతుర్దశోఽధ్యాయః ॥ 14 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్యమంతకప్రత్యానయననిరూపణం అనే పద్నాల్గవ అధ్యాయం సంపూర్ణం.



పఞ్చదశోఽధ్యాయః - పదిహేనవ అధ్యాయం

సోమవంశకథనమ్ - సోమవంశకథనం

లోమహర్షణ ఉవాచ:- లోమహర్షణుడు మునులకు ఇలా చెప్తున్నాడు.

యత్తు సత్రాజితే కృష్ణో మణిరత్నం స్యమన్తకమ్ ।
దదా వహారయద్ బభ్రు ర్భోజేన శతధన్వనా ॥ 1 ॥

శ్రీకృష్ణుడు సత్రాజిత్తుకు తిరిగి ఇచ్చివేసిన స్యమంతకమణిని బభ్రువు భోజవంశీయుడయిన శతధన్వుడిచేత హరింపజేశాడు.

సదా హి ప్రార్థయామాస సత్యభామామనిన్దితామ్ ।
అక్రూరోఽన్తర మన్విష్యన్ మణిం చైవ స్యమన్తకమ్ ॥ 2 ॥

అక్రూరుడు ఎప్పటినుండో అవకాశం వచ్చినపుడెల్ల పూజ్యురాలయిన సత్యభామనూ, స్యమంతకమణినీ తన కిమ్మని సత్రాజిత్తును అడుగుతునే ఉన్నాడు.

సత్రాజితం తతో హత్వా శతధన్వా మహాబలః ।
రాత్రౌ తం మణి మాదాయ తతోఽక్రూరాయ దత్తవాన్ ॥ 3 ॥

బలశాలి అయిన శతధన్వుడు రాత్రిసమయంలో సత్రాజిత్తును సంహరించి, ఆ స్యమంతకమణిని తీసుకునివచ్చి అక్రూరుడికి (బభ్రువుకు) ఇచ్చాడు.

అక్రూరస్తు తదా విప్రా రత్నమాదాయ చోత్తమమ్ ।
సమయం కారయాంచక్రే నావేద్యోఽహంత్వయేత్యుత ॥ 4 ॥

ద్విజులారా! అక్రూరుడు ఉత్తమమయిన ఆ స్యమంతకమణిని పుచ్చుకుని, స్యమంతకమణి తనదగ్గర ఉన్నవిషయాన్ని ఎవ్వరికి తెలియనీయనని శతధన్వుడిచేత ప్రమాణం చేయించుకున్నాడు.

వయ మభ్యుపపత్స్యామః కృష్ణేన త్వాం ప్రధర్షితమ్ ।
మమాద్య ద్వారకా సర్వా వశే తిష్ఠత్యసంశయమ్ ॥ 5 ॥

శ్రీకృష్ణుడు నీపై దాడిచేస్తే మేము నీకు అండగా నిలుస్తాము. ద్వారకానగరం మొత్తం ఇప్పుడు నాఅధీనంలో ఉన్నది. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. (అన్నాడు బభ్రువు శతధన్వుడితో)

హతే పితరి దుఃఖార్తా సత్యభామా మనస్వినీ ।
ప్రయయౌ రథ మారుహ్య నగరం వారణావతమ్ ॥ 6 ॥

తండ్రి సత్రాజిత్తు చంపబడగా, అభిమానవతి అయిన సత్యభామ దుఃఖంతో బాధపడుతూ, రథమెక్కి వారణావతనగరానికి వెళ్లింది.

సత్యభామా తు తద్వృత్తం భోజస్య శతధన్వనః ।
భర్తు ర్నివేద్య దుఃఖార్తా పార్శ్వస్థాశ్రూణ్యవర్తయత్ ॥ 7 ॥

భోజవంశీయుడయిన శతధన్వుడు చేసిన పనిని సత్యభామ భర్తకు (శ్రీకృష్ణుడికి) తెలియజేసింది. దుఃఖిస్తూ భర్త ప్రక్కనే ఉండి కన్నీరు పెట్టుకుంది.

పాణ్డవానాం చ దగ్ధానాం హరిః కృత్వోదకక్రియామ్ ।
కుల్యార్థం చాపి పాణ్డూనాం న్యయోజయత సాత్యకిమ్ ॥8॥

శ్రీకృష్ణుడు (లక్కయింటిలో తగలబడిపోయిన) పాండవులకు ఉదకక్రియలు ఆచరించాడు. పాండవుల అస్థినిమజ్జనానికి సాత్యకిని నియోగించాడు.

తత స్త్వరిత మాగమ్య ద్వారకాం మధుసూదనః ।
పూర్వజం హలినం శ్రీమా నిదం వచనమబ్రవీత్ ॥ 9 ॥

మధుసూదనుడు ఆపిదప వేగంగా ద్వారకానగరానికి వచ్చాడు. హలాయుధుడయిన అన్న బలరాముడితో శ్రీపతి ఇలా అన్నాడు.

శ్రీకృష్ణ ఉవాచ:-శ్రీకృష్ణుడు బలరాముడితో ఈవిధంగా అంటున్నాడు.

హతః ప్రసేన స్సింహేన సత్రాజి చ్ఛతధన్వనా ।
స్యమన్తక స్తు మద్గామీ తస్య ప్రభు రహం విభో ॥10॥

మహాత్మా! సింహం ప్రసేనుడిని సంహరించింది. శతధన్వుడు సత్రాజిత్తును చంపాడు. ఇపుడు స్యమంతకం నావద్దకు రావాలి. ఆ స్యమంతకమణికి యజమానిని నేనే.

తదారోహ రథం శీఘ్రం భోజం హత్వా మహారథమ్ ।
స్యమన్తకో మహాబాహో అస్మాకం స భవిష్యతి ॥ 11 ॥

కాబట్టి భుజబలశాలీ! రథాన్ని అధిరోహించు. త్వరగా భోజవంశీయుడూ, మహారథుడూ అయిన శతధన్వుడిని సంహరించి, స్యమంతకమణిని మనసొంతం చేసుకుందాం.

లోమహర్షణ ఉవాచ:-లోమహర్షణుడు మునులకు ఇలా చెప్తున్నాడు.

తతః ప్రవవృతే యుద్ధం తుములం భోజకృష్ణయోః ।
శతధన్వా తతోఽక్రూరం సర్వతోదిశ మైక్షత ॥ 12 ॥

అపుడు భోజుడయిన శతధన్వుడికీ కృష్ణుడికీ నడుమ భీకరమైన యుద్ధం జరిగింది. (కృష్ణుడు ఎదు రయినపుడు తనకు తోడుగా ఉంటానన్న) అక్రూరుడికోసం శతధన్వుడు దిక్కులన్నీ చూశాడు.

సంరబ్ధౌ తావుభౌ తత్ర దృష్ట్వా భోజజనార్దనౌ ।
శక్తోఽపి శాపా ద్ధార్దిక్య మక్రూరో నాన్వపద్యత ॥ 13 ॥

శతధన్వుడు, శ్రీకృష్ణుడు ఇద్దరూ తీవ్రంగా యుద్ధం చేస్తుండటం అక్రూరుడు వచ్చి చూశాడు. శతధన్వుడికి సహాయం చేయడానికి సమర్థుడయిఉండి కూడా కృష్ణుడు శపిస్తాడేమోననే భయంతో అక్రూరుడు బుద్ధిపూర్వకంగా సహాయపడలేదు.

అపయానే తతో బుద్ధిం భోజ శ్చక్రే భయార్దితః ।
యోజనానాం శతం సాగ్రం హృదయా ప్రత్యపద్యత ॥ 14 ॥

(అక్రూరుడిసహాయం లేకపోవటంతో ఒంటరిగా యుద్ధం చేయలేక) కృష్ణుడికి భయపడి శతధన్వుడు వెనుదిరిగి పారిపోదా మనుకున్నాడు. అపుడు హృదయ (గుఱ్ఱం) నూరుయోజనాలదూరం (800 మైళ్లు) వెళ్ళగలది.

విఖ్యాతా హృదయా నామ శతయోజనగామినీ ।
భోజస్య బడబా విప్రా యయా కృష్ణ మయోధయత్ ॥ 15 ॥

హృదయ అనేది శతధన్వుడి గుఱ్ఱం. ఇది గొప్పకీర్తిగలిగిన గుఱ్ఱం. దీనిమీదనే శతధన్వుడు కృష్ణుడితో యుద్ధానికి తలపడ్డాడు. ఆగుఱ్ఱం ఆగకుండా నూరుయోజనాలు పరుగు తీస్తుంది.

క్షీణాం జవేన హృదయా మధ్వన శ్శతయోజనే ।
దృష్ట్వా రథస్య స్వాం వృద్ధిం శతధన్వానమర్దయత్ ॥16 ॥

నూరుయోజనాలు వెళ్లిన హృదయవేగం నశించింది. కృష్ణుడిరథం వేగం పెరిగింది. అది గమనించిన కృష్ణుడు శతధన్వుడిని వెంటాడి బాధించాడు.

తత స్తస్యా హతాయా స్తు శ్రమాత్ ఖేదా చ్చ భో ద్విజాః ।
ఖముత్పేతురథ ప్రాణాః కృష్ణో రామమథాబ్రవీత్ ॥ 17 ॥

ఓ బ్రాహ్మణులారా! నూరుయోజనాలు ప్రయాణం చేసిన శ్రమవల్లనూ, బాధచేతనూ, దెబ్బతిన్న ఆహృదయ (శతధన్వుడిగుఱ్ఱం) ప్రాణవాయువులు గాలిలో కలిసిపోయాయి. అపుడు కృష్ణుడు బలరాముడితో ఇలా అన్నాడు.

శ్రీకృష్ణ ఉవాచ :-శ్రీకృష్ణుడు బలరాముడితో ఈవిధంగా అన్నాడు.

తిష్ఠేహ త్వం మహాబాహో దృష్టదోషా హయా మయా ।
పద్భ్యాం గత్వా హరిష్యామి మణిరత్నం స్యమన్తకమ్ ॥ 18 ॥

మహాబాహూ! బలరామా! నీవు ఇక్కడే ఉండు. శతధన్వుడిగుఱ్ఱంలో దోషాలు గమనించాను. (గుఱ్ఱం మరణించింది. వాహనం లేని శతధన్వుడివద్దకు నేను కూడ వాహనం లేకుండా) నేను శతధన్వుడివద్దకు నడిచి వెళ్లి స్యమంతకం అనే శ్రేష్ఠమయినమణిని సంగ్రహిస్తాను(అన్నాడు).

పద్భ్యామేవ తతో గత్వా శతధన్వానమచ్యుతః ।
మిథిలామభితో విప్రా జఘాన పరమాస్త్రవిత్ ॥ 19 ॥

అని అన్నకు చెప్పి ఉత్తమమైనఅస్త్రాలను తెలిసిన శ్రీకృష్ణుడు శతధన్వుడివద్దకు నడిచివెళ్లి మిథిలానగరప్రాంతంలో అతడిని సంహరించాడు.

స్యమన్తకం చ నాపశ్యద్ హత్వా భోజం మహాబలమ్ ।
నివృత్తం చాబ్రవీత్ కృష్ణం మణిం దేహీతి లాఙ్గలీ ॥ 20 ॥

అతడివద్ద స్యమంతకమణి కానరాలేదు. కృష్ణుడు శతధన్వుడిని వధించి, తిరిగి బలరాముడివద్దకు వచ్చాడు. బలరాముడు స్యమంతకమణిని ఇవ్వమన్నాడు.

నాస్తీతి కృష్ణశ్చోవాచ తతో రామో రుషాన్వితః ।
ధిక్‌శబ్దపూర్వమసకృత్ ప్రత్యువాచ జనార్దనమ్ ॥ 21 ॥

మణి లేదు అన్నాడు కృష్ణుడు. బలరాముడికి కోపం వచ్చింది. పలుమార్లు ధిక్, ధిక్ అని, కృష్ణుడితో ఇలా అన్నాడు.

బలరామ ఉవాచ :-బలరాముడు కృష్ణుడితో ఈవిధంగా అన్నాడు.

భ్రాతృత్వా న్మర్షయా మ్యేష స్వస్తి తేఽస్తు వ్రజామ్యహమ్ ।
కృత్యం న మే ద్వారకయా న త్వయా న చ వృష్ణిభిః ॥ 22 ॥

'సోదరుడివి కాబట్టి సహిస్తున్నాను. నీకు శుభమగు గాక! నేను ఇక్కడినుండి వెళ్లిపోతున్నాను. ఇంక ద్వారకతో గాని, నీతో గాని, వృష్ణివంశంతో గాని నాకు పని లేదు'.

ప్రవివేశ తతో రామో మిథిలా మరిమర్దనః ।
సర్వకామై రుపహృతై ర్మిథిలేనాభిపూజితః ॥ 23 ॥

శత్రుశిక్షకుడయిన బలరాముడు మిథిలానగరం ప్రవేశించాడు. మిథిలానగరాధిపతి బలరాముడిని సకలకామనలతో సమ్మానించాడు.

ఏతస్మిన్నేవ కాలే తు బభ్రు ర్మతిమతాం వరః ।
నానారూపాన్ క్రతూన్ సర్వా నాజహార నిరర్గలాన్ ॥ 24 ॥

ఈకాలంలో బుద్ధిమంతుడయిన బభ్రువు అనేకవిధాలయిన యజ్ఞాలను అన్నింటినీ నిరాటంకంగా ఆచరించాడు.

దీక్షామయం స కవచం రక్షార్థం ప్రవివేశ హ ।
స్యమన్తకకృతే ప్రాజ్ఞో గాన్దీపుత్రో మహాయశాః ॥ 25 ॥

గాందిని కుమారుడు, వివేకవంతుడూ, గొప్పకీర్తిమంతుడూ అయిన బభ్రువు ఆసమయంలో స్యమంతకమణిని రక్షించుకోవడంకోసం దీక్షతో గూడిన కవచంలో ప్రవేశించాడు.

అథ రత్నాని చాన్యాని ధనాని వివిధాని చ ।
షష్టిం వర్షాణి ధర్మాత్మా యజ్ఞే ష్వేవ న్యయోజయత్ ॥ 26 ॥

ఆసమయంలో అరవైసంవత్సరాలపాటు రత్నాలనూ, ఇంకా ఇతరమైన సంపదలనూ, అన్నింటినీ యజ్ఞాలకోసమే వినియోగించాడు.

అక్రూరయజ్ఞా ఇతి తే ఖ్యాతా స్తస్య మహాత్మనః ।
బహ్వన్నదక్షిణా స్సర్వే సర్వకామప్రదాయినః ॥ 27 ॥

ఆనాడు అక్రూరుడు (బభ్రువు) చేసినయజ్ఞాలే అక్రూరయజ్ఞాలు అనే పేరుతో ప్రసిద్ధమయినాయి. అక్రూర యజ్ఞాలు అన్నీ అత్యధికమైన అన్నంతోనూ, దక్షిణలతోనూ నిర్వహింపబడ్డాయి. (అన్నం, ధనం మాత్రమే కాక) సమస్తమయిన ఇతరకోరికలనూ తీర్చాయి.

అథ దుర్యోధనో రాజా గత్వా స మిథిలాం ప్రభుః ।
గదాశిక్షాం తతో దివ్యాం బలదేవా దవాప్తవాన్ ॥ 28 ॥

అపుడు దుర్యోధనమహారాజు మిథిలానగరానికి వెళ్ళి, బలరాముడివద్ద దివ్యమయిన గదావిద్యను నేర్చుకున్నాడు.

సమ్ప్రసాద్య తతో రామో వృష్ణ్యన్ధకమహారథైః ।
ఆనీతో ద్వారకామేవ కృష్ణేన చ మహాత్మనా ॥ 29 ॥

శ్రీకృష్ణుడు వృష్ణి, అంధకవీరులతో వెళ్ళి, బలరాముడిని ప్రసన్నుని చేసుకొని, తిరిగి ద్వారకానగరానికి తీసుకువచ్చాడు.

అక్రూర శ్చాన్ధకై స్సార్ధ మాయాతః పురుషర్షభః ।
హత్వా సత్రాజితం సుప్తం సహబన్ధుం మహాబలః ॥ 30 ॥

అంధకులతో కలిసి పురుషశ్రేష్ఠుడయిన అక్రూరుడు కూడా, ద్వారకకు వచ్చాడు. ఇంతకు ముందు ఇతడే సత్రాజిత్తును బంధువులతో సహా నిద్రపోతుండగా సంహరించాడు.

జ్ఞాతిభేదభయాత్ కృష్ణ స్త ముపేక్షితవాం స్తదా ।
అపయాతే తదాక్రూరే నావర్షత్ పాకశాసనః ॥ 31 ॥

అప్పుడు శ్రీకృష్ణుడు దాయాదులతో విరోధం కూడదని ఆతడిని పట్టించుకోలేదు. అక్రూరుడు (తిరిగి మిథిలకు వెళ్ళిపోయాడు) వెళ్ళిపోయినతరువాత ద్వారవతీనగరంలో ఇంద్రుడు వర్షాలు లేకుండా చేశాడు.

అనావృష్ట్యా తదా రాష్ట్ర మభవద్ బహుధా కృశమ్ ।
తతః ప్రసాదయామాసు రక్రూరం కుకురాన్ధకాః ॥ 32 ॥

వర్షాలు అసలు లేకపోవడంవల్ల ఆరాజ్యం క్షీణించింది. అపుడు కుకురులు, అంధకులు అక్రూరుడిని ప్రసన్నుడిని చేసుకున్నారు.

పున ర్ద్వారవతీం ప్రాప్తే తస్మిన్ దానపతౌ తతః ।
ప్రవవర్ష సహస్రాక్షః కక్షే జలనిధే స్తదా ॥33 ॥

దానగుణాధిపతి అయిన అక్రూరుడు తిరిగి ద్వారకానగరానికి వచ్చాడు. అపుడు దేవేంద్రుడు సముద్రతీరం వెంట వర్షాలు విస్తారంగా కురిపించాడు.

కన్యాం చ వాసుదేవాయ స్వసారం శీలసమ్మతామ్ ।
అక్రూరః ప్రదదౌ ధీమాన్ ప్రీత్యర్థం మునిసత్తమాః ॥ 34 ॥

మునివరులారా! అక్రూరుడు వసుదేవకుమారుని అనుగ్రహం సంపాదించటానికి సాధుశీల అయిన తనచెల్లెలిని, వాసుదేవుడికి (భార్యగా) ఇచ్చాడు.

అథ విజ్ఞాయ యోగేన కృష్ణో బభ్రుగతం మణిమ్ ।
సభామధ్యగతః ప్రాహ తమక్రూరం జనార్దనః ॥ 35 ॥

శ్రీకృష్ణుడు యోగశక్తితో స్యమంతకమణి బభ్రువు వద్ద ఉన్నదనే సంగతిని గ్రహించాడు. సభలో నడుమ ఉండి శ్రీకృష్ణుడు అక్రూరుడితో ఇలా అన్నాడు.

శ్రీకృష్ణ ఉవాచ: – శ్రీకృష్ణుడు అక్రూరుడితో ఈవిధంగా అన్నాడు.

యత్తద్రత్నం మణివరం తవ హస్తగతం విభో ।
తత్ ప్రయచ్ఛ చ మానార్హ మయి మానార్యకం కృథాః ॥ 36 ॥

మహాత్మా! పూజార్హా! నీచేతికి చిక్కిన స్యమంతకం అనే ఉత్తమమయిన మణిని నాకు ఇవ్వు. నావిషయంలో దుర్మార్గంగా వ్యవహరించవద్దు.

షష్టివర్షగతే కాలే యో రోషోఽ భూన్మమానఘ ।
స సంరూఢోఽ సకృత్ ప్రాప్త స్తతః కాలాత్యయో మహాన్ ॥ 37 ॥

పుణ్యాత్మా! స్యమంతకమణి నిమిత్తంగా నాకు గలిగిన కోపం అరవై సంవత్సరాలకాలం గడచిపోగా, ఇంకా వృద్ధిచెందుతున్నది. ఇంకా కాలం గడచిపోవడం (ఆలస్యం కావడం) సహించను.

స తతః కృష్ణవచనాత్ సర్వసాత్త్వతసంసది ।
ప్రదదౌ తం మణిం బభ్రు రక్లేశేన మహామతిః ॥ 38 ॥

సాత్వతులతో నిండినకొలువులో శ్రీకృష్ణుడు అన్నమాటలు విని, బుద్ధిమంతుడయిన అక్రూరుడు స్యమంతకమణిని సంతోషంగా కృష్ణుడికి తిరిగి ఇచ్చాడు.

తత స్త మార్జవాత్ ప్రాప్తం బభ్రో ర్హస్తా దరిందమః ।
దదౌ హృష్టమనాః కృష్ణ స్తం మణిం బభ్రవే పునః ॥ 39 ॥

బభ్రువు(అక్రూరుడి)చేతిమీదుగా సరాసరిగా తనకు చేరిన స్యమంతకమణిని చూచి, శత్రుదమను డయిన కృష్ణుడు ఆనందించాడు. కృష్ణుడు ఆమణిని అక్రూరుడికే తిరిగి ఇచ్చాడు.

స కృష్ణహస్తాత్ సమ్ప్రాప్తం మణిరత్నం స్యమన్తకమ్ ।
ఆబధ్య గాన్దినీపుత్రో విరరాజాంశుమానివ ॥ 40 ॥

శ్రీకృష్ణునిచేతులమీదుగా ప్రాప్తించిన స్యమంతకమణిని అలంకరించుకుని, గాందినీపుత్రుడు (అక్రూరుడు) సూర్యుడులాగా ప్రకాశించాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే సోమవంశకథనం నామ పఞ్చదశోఽ ధ్యాయః ॥ 15 ॥

శ్రీబ్రహ్మపురాణంలో సోమవంశకథనం అనే పదిహేనవ అధ్యాయం సంపూర్ణం.



షోడశోఽధ్యాయః - పదహారవ అధ్యాయం
భువనకోశద్వీపవర్ణనమ్ - భువనకోశద్వీపవర్ణనం

మునయ ఊచుః :-మునులు లోమహర్షణుడిని ఈవిధంగా అడిగారు.

అహో సుమహదాఖ్యానం భవతా పరికీర్తితమ్ ।
భారతానాం చ సర్వేషాం పార్థివానాం తథైవ చ ॥ 1 ॥

దేవానాం దానవానాం చ గన్ధర్వోరగరక్షసామ్ ।

దైత్యానా మథ సిద్ధానాం గుహ్యకానాం తథైవ చ ॥ 2 ॥

అత్యద్భుతాని కర్మాణి విక్రమా ధర్మనిశ్చయాః ।
వివిధాశ్చ కథా దివ్యా జన్మ చాగ్ర్య మనుత్తమమ్ ॥ 3 ॥

సూతమహర్షీ, భరతవంశీయులైనరాజులూ, దేవతలూ, దానవులూ, గంధర్వులూ, యక్షులూ, రాక్షసులూ, దైత్యులూ, సిద్ధులూ, గుహ్యులూ, వీళ్లందరికి సంబంధించిన ఆశ్చర్యకరమైనకర్మలనూ, పరాక్రమాలనూ, ధర్మనిర్ణయాలనూ, ఇంకా అనేకవిధమైన కథలనూ, అలౌకికమైన వారి ఉత్తమమైనజన్మవృత్తాంతాలనూ గురించి, చాలా విస్తారమైనగాథలను చెప్పావు.

సృష్టిః ప్రజాపతే స్సమ్యక్ త్వయా ప్రోక్తా మహామతే! ।
ప్రజాపతీనాం సర్వేషాం గుహ్యకాప్సరసాం తథా ॥ 4 ॥

బుద్ధిశాలీ, ప్రజాపతి సృష్టిని గురించి చక్కగా చెప్పావు. ప్రజాపతులందరిని గురించీ, అదేవిధంగా గుహ్యకులు, అప్సరసలను గురించీ వివరించావు.

స్థావరం జఙ్గమం సర్వ ముత్పన్నం వివిధం జగత్ ।
త్వయా ప్రోక్తం మహాభాగ! శ్రుతం చైత న్మనోహరమ్ ॥ 5 ॥

మహానుభావా, చరమూ, అచరమూ అయిన ఈసృష్టి మొత్తం ఎలా ఏర్పడిందో మనోహరంగా వివరించావు. అంతా శ్రద్ధగా విన్నాం.

కథితం పుణ్యఫలదం పురాణం శ్లక్ష్ణయా గిరా ।
మనఃకర్ణసుఖం సమ్యక్ ప్రీణా త్యమృతసమ్మితమ్ ॥ 6 ॥

పుణ్యఫలాన్ని ఇచ్చేదీ, అమృతంతో సమానమైనదీ, హృదయాలకూ, చెవులకూ, సుఖం గలిగించేదీ, అయిన పురాణాన్ని మధురమైన మాటలతో, చక్కగా చెప్పావు. అది మమ్మల్ని చక్కగా ఆనందింపజేస్తున్నది.

ఇదానీం శ్రోతు మిచ్ఛామ స్సకలం మణ్డలం భువః ।
వక్తు మర్హసి సర్వజ్ఞ! పరం కౌతూహలం మహత్ ॥ 7 ॥

సమస్తమూ తెలిసినవాడా, ఇపుడు ఈసమస్త భూమండలం గురించి విందామని కోరిక కలిగింది. చాలా కుతూహలంగా ఉంది. చెప్పదగినవాడివి నీవే. చెప్పు.

యావన్త స్సాగరా ద్వీపా స్తథా వర్షాణి పర్వతాః ।
వనాని సరితః పుణ్యా దేవాదీనాం మహామతే! ॥ 8 ॥

బుద్ధిశాలీ, సముద్రాలూ, ద్వీపాలూ, భూమిప్రాంతాలూ, పర్వతాలూ, అరణ్యాలూ, నదులూ, పుణ్యప్రదాలైన దేవతలక్షేత్రాలూ ఎంతటివో చెప్పు.

యత్ ప్రమాణ మిదం సర్వం యదాధారం యదాత్మకమ్ ।
సంస్థాన మస్య జగతో యథావద్ వక్తు మర్హసి ॥ 9 ॥

ఈ భూమి ప్రమాణం ఎంత? ఇది దేనిని ఆధారంగా చేసుకుని ఉంటున్నది? దీని అసలు స్వరూపం ఏమిటి? దీని ఉనికి ఏమిటి? యథార్థం వివరించవలసింది.

లోమహర్షణ ఉవాచ:–లోమహర్షణుడు మునులతో ఈవిధంగా చెప్తున్నాడు.

మునయ శ్రూయతా మేతత్ సంక్షేపాద్ వదతో మమ ।
నాస్య వర్షశతే నాపి వక్తుం శక్యోఽ తివిస్తరః ॥ 10 ॥

మునులారా, మీరు అడిగిన విషయాన్ని సంగ్రహంగా చెప్తాను వినండి. బాగా విస్తరించి చెప్పాలంటే నూరుసంవత్సరాలసమయ మైనా సాధ్యం కాదు.

జమ్బూప్లక్షాహ్వయౌ ద్వీపౌ శాల్మలశ్చాపరో ద్విజాః ।
కుశః క్రౌఞ్చ స్తథా శాకః పుష్కరశ్చైవ సప్తమః ॥ 11 ॥

ఆద్వీపాలు వరుసగా 1.జంబువు, 2.ప్లక్షం, 3.శాల్మలం, 4.కుశం,5.క్రౌంచం,6.శాకం,7.పుష్కరం ఏడవది.

ఏతే ద్వీపా స్సముద్రైస్తు సప్త సప్తభి రావృతాః ।
లవణేక్షుసురాసర్పి ర్దధిదుగ్ధజలై స్సమమ్ ॥ 12 ॥

ఈఏడు ద్వీపాలను ఏడు సముద్రాలు చుట్టుకుని ఉన్నాయి. ఆ సప్తసముద్రాలు ఇవి. 1. ఉప్పుసముద్రం, 2. చెరుకురస సముద్రం, 3. కల్లు సముద్రం, 4. నేతిసముద్రం, 5. పెరుగుసముద్రం 6. పాలసముద్రం, 7. మంచినీటిసముద్రం.

జమ్బూద్వీప స్సమస్తానా మేతేషాం మధ్యసంస్థితః ।
తస్యాపి మధ్యే విప్రేన్ద్రా మేరుః కనకపర్వతః ॥ 13 ॥

జంబూద్వీపం ఈద్వీపాలన్నింటికీ మధ్యలో ఉంది. ఆజంబూద్వీపానికి మధ్యలో మేరువు అనే బంగారుకొండ ఉంది.

చతురశీతిసాహస్రై ర్యోజనై స్తస్య చోచ్ఛ్రయః ।
ప్రవిష్టః షోడశాధస్తాద్ ద్వాత్రింశ న్మూర్ధ్ని విస్తృతః ॥ 14 ॥

ఆ మేరుపర్వతం ఎనభైనాలుగు యోజనాల ఎత్తూ, పదహారువేలయోజనాలలోతూ, ముప్పైరెండుయోజనాల విస్తీర్ణమూ కలిగిఉంది.

మూలే షోడశసాహస్రై ర్విస్తార స్తస్య పర్వతః ।
భూపద్మస్యాస్య శైలోఽసౌ కర్ణికాకారసంస్థితః ॥ 15 ॥

మేరువు మొదటిభాగం పదహారువేలయోజనాల వైశాల్యం కలిగిఉంది. భూమి అనే పద్మానికి నడుమ ఈమేరుపర్వతం బీజకోశంలాగా ఉంటుంది.

హిమవాన్ హేమకూటశ్చ నిషధ స్తస్య దక్షిణే ।
నీల శ్శ్వేతశ్చ శృఙ్గీ చ ఉత్తరే వర్షపర్వతాః ॥ 16 ॥

మేరుపర్వతానికి దక్షిణంగా హిమాలయం, హేమకూటం, నిషధం అనే కొండలు ఉన్నాయి. మేరువుకు ఉత్తరంగా నీలమూ, శ్వేతమూ, శృంగి(శృంగవంతం), అనేపర్వతాలు ఉన్నాయి. (మేరువుతో సహా ఇవి మొత్తం సప్త కులపర్వతాలు.)

లక్షప్రమాణౌ ద్వౌ మధ్యే దశ హీనా స్తథాపరే ।
సహస్రద్వితయోచ్ఛ్రాయాస్తావ ద్విస్తారిణశ్చ తే ॥ 17 ॥

ఈ ఏడుకొండలలో నడుమ ఉన్నవి రెండు ఒక్కొక్కటి లక్షలయోజనాల పరిమాణం కలిగి ఉన్నాయి. మిగిలిన అయిదూ పదితక్కువగా తొంభైవేలయోజనాల పరిమాణం కలిగిఉన్నాయి. రెండువేలయోజనాల ఎత్తూ, అంతే వైశాల్యమూ కలిగి ఉన్నాయి.

భారతం ప్రథమం వర్షం తతః కింపురుషం స్మృతమ్ ।
హరివర్షం త థై వాన్య న్మేరో ర్దక్షిణతో ద్విజాః! ॥ 18 ॥

బ్రాహ్మణులారా, (జంబూద్వీపంలో) మేరుపర్వతానికి దక్షిణంగా ఉన్నవాటిలో మొదటిది భారతవర్షం. ఆతరువాతిది కింపురుషవర్షం. ఆపైన ఉన్నది హరివర్షం.

రమ్యకం చోత్తరం వర్షం త స్యై వాను హిరణ్మయమ్ ।
ఉత్తరాః కురవ శ్చైవ యథా వై భారతం తథా ॥ 19 ॥

మేరుపర్వతానికి ఉత్తరంగా రమ్యకవర్షం, దానికి ఆనుకుని హిరణ్మయవర్షం. ఆతరువాత ఉత్తరంగా కురుభూములు (కురువర్షం) ఉన్నాయి. ఇవి భారతవర్షంలాగనే ఉంటాయి.

నవసాహస్ర మేకైక మేతేషాం ద్విజసత్తమాః! ।
ఇలావృతం చ తన్మధ్యే సౌవర్ణో మేరు రుచ్ఛ్రితః ॥ 20 ॥

బ్రాహ్మణోత్తములారా, ఇవి అన్నీ తొమ్మిదివేలయోజనాల పరిమాణం కలిగిఉన్నాయి. వీటిమధ్యలో ఇలావృతం అనేవర్షం ఉన్నది. ఇలావృత మధ్యలో ఎత్తుగా మేరుపర్వతం ఉన్నది.

మేరో శ్చతుర్దిశం తత్ర నవసాహస్రవిస్తృతమ్ ।
ఇలావృతం మహాభాగా శ్చత్వార శ్చాత్ర పర్వతాః ॥ 21 ॥

మేరువునకు నాలుగువైపులలోనూ ఇలావృతవర్షం తొమ్మిదివేలయోజనాలలో విస్తరించిఉన్నది. మహాత్ములారా, ఇలావృతవర్షంలో నాలుగు పర్వతాలు ఉన్నాయి.

విష్కమ్భా వితతా మేరో ర్యోజనాయుతవిస్తృతాః ।
పూర్వేణ మన్దరో నామ దక్షిణే గన్ధమాదనః ।
విపులః పశ్చిమే పార్శ్వే సుపార్శ్వ శ్చోత్తరే స్థితః ॥ 22 ॥

మేరువునకు మూలమైనస్తంభాలలాగా ఉన్న ఈనాలుగుపర్వతాలు ఒక్కొక్కటి పదివేలయోజనాలవైశాల్యం కలిగిఉన్నాయి. అవి (మేరువుకు) తూర్పుదిక్కులో మంథరం, దక్షిణంలో గంధమాదనం, పడమటిదిక్కులో విపులం, ఉత్తరదిక్కులో సుపార్శ్వం అనే పర్వతాలు.

కదమ్బ స్తేషు జమ్బూశ్చ పిప్పలో వట ఏవ చ ।
ఏకాదశశతాయామాః పాదపా గిరికేతవః ॥ 23 ॥

వీటిలో మందరపర్వతంమీద కడిమిచెట్టూ, గంధమాదనపర్వతంమీద నేరేడుచెట్టూ, విపులపర్వతంమీద రావిచెట్టూ, సుపార్శ్వపర్వతంమీద మఱ్ఱిచెట్టూ ఉన్నాయి. ఇవి ఒక్కొక్కటీ పదకొండువందలయోజనాల ఎత్తుగా, కొండమీద జెండాలలాగా ఉన్నాయి.

జమ్బూద్వీపస్య సా జమ్బూ ర్నామహేతు ర్ద్విజోత్తమాః ॥ 24 ॥

బ్రాహ్మణవరులారా, జంబువు అనే చెట్టువల్ల జంబూద్వీపానికి ఆపేరు వచ్చింది.

మహాగజప్రమాణాని జమ్బ్వా స్తస్యాః ఫలాని వై ।
పతన్తి భూభృతః పృష్ఠే శీర్యమాణాని సర్వతః ॥ 25 ॥

ఆ జంబూవృక్షం (నేరేడు) పండ్లు పెద్ద ఏనుగు పరిమాణంలో ఉంటాయి. అవి పర్వతంమీద రాలిపడు తున్నాయి. అలా రాలిపడేటపుడు పండ్లు చితికి కొండ అంతటా చల్లినట్లుగా ఉన్నాయి.

రసేన తేన విఖ్యాతా తత్ర జమ్బూనదీతి వై ।
సరిత్ ప్రవర్తతే సా చ పీయతే తన్నివాసిభిః ॥ 26 ॥

చితికిన నేరేడుపండ్లనుండి జారినరసం జంబూనది అనే పేరుతో నదిలాగా ప్రవహిస్తున్నది. ఆప్రాంతంలో నివసించేవాళ్లు ఆజంబూ(నదినీళ్లను)రసాన్ని త్రాగుతున్నారు.

న స్వేదో న దౌర్గన్ధ్యం న జరా నేన్ద్రియక్షయః ।
తత్పానస్వస్థమనసాం జనానాం తత్ర జాయతే ॥ 27 ॥

జంబూనదిలోని జంబూరసాన్ని త్రాగటంచేత ఆప్రాంతం ప్రజలకు మనస్సు స్వరూపస్థితిలో (ప్రశాంతంగా) ఉంటుంది. వారి శరీరానికి చెమట పుట్టదు. చెడువాసన ఉండదు. ముసలితనం రాదు. ఇంద్రియాలు బలహీనపడవు. (చెవుడు, చూపుతగ్గడం మొదలైనవి ఉండవు.)

తీరమృత్తద్రసం ప్రాప్య సుఖవాయువిశోషితా ।
జామ్బూనదాఖ్యం భవతి సువర్ణం సిద్ధభూషణమ్ ॥ 28 ॥

జంబూనది ఒడ్డుమీద ఉన్నమట్టి ఆనే రేడుపండ్లరసంతో కలిసి, అక్కడి పరిమళవాయువులతో ఎండి, జాంబూనదం అనే పేరుతో బంగారం అవుతుంది. దానిని ఆభరణాలుగా చేసుకుని సిద్ధులు గూడ ధరిస్తారు.

భద్రాశ్వం పూర్వతో మేరోః కేతుమాలం చ పశ్చిమే ।
వర్షే ద్వే తు మునిశ్రేష్ఠా స్తయో ర్మధ్యే త్విలావృతమ్ ॥ 29 ॥

మునిసత్తములారా, మేరువుకు తూర్పుదిక్కున భద్రాశ్వం, పడమటిదిక్కున కేతుమాలం అని రెండు వర్షాలు ఉన్నాయి. ఇలావృతం ఆరెండింటికీ మధ్యలో ఉంది.

వనం చైత్రరథం పూర్వే దక్షిణే గన్ధమాదనమ్ ।
వైభ్రాజం పశ్చిమే తద్వ దుత్తరే నన్దనం స్మృతమ్ ॥ 30 ॥

(మేరువుకు) తూర్పుదిక్కున చైత్రరథం, దక్షిణదిక్కున గంధమాదనం, పడమటిదిక్కున వైభ్రాజం, అలాగే ఉత్తరదిక్కున నందనమూ (అనే వనాలు) ఉన్నాయి.

అరుణోదం మహాభద్ర మసితోదం సమానసమ్ ।
సరాం స్యేతాని చత్వారి దేవభోగ్యాని సర్వదా ॥ 31 ॥

అదేవిధంగా (మేరువుకు తూర్పుదిక్కున) అరుణోదమూ, (దక్షిణదిక్కున) మహాభద్రమూ, (పడమటిదిక్కున) అసితోదమూ, (ఉత్తరదిక్కున) మానసమూ అనే సరస్సులు ఉన్నాయి. ఈసరస్సులలో దేవతలు నిత్యమూ సుఖిస్తారు.

శాన్తవాం శ్చక్రకుమ్భశ్చ కురరీ మాల్యవాం స్తథా ।
వైకఙ్కప్రముఖా మేరోః పూర్వతః కేసరాచలాః ॥ 32 ॥

మేరువుకు తూర్పువైపున శాంతవంతం, చక్రకుంభం, కురరి, మాల్యవంతం, వైకంకం, అనే కేసర పర్వతాలు ఉన్నాయి.

త్రికూట శ్శిశిర శ్చైవ పతఙ్గో రుచక స్తథా ।
నిషధాదయో దక్షిణత స్తస్య కేసరపర్వతాః ॥ 33 ॥

మేరువుకు దక్షిణం వైపున త్రికూటం, శిశిరం, పతంగం, నిషధం మొదలైన కేసర పర్వతాలు ఉన్నాయి.

శిఖివాస స్సవైదూర్యః కాపిలో గన్ధమాదనః ।
జానుధిప్రముఖా స్తద్వత్ పశ్చిమే కేసరాచలాః ।
మేరో రనన్తరా స్తే చ, జఠరాదిష్వవస్థితాః ॥ 34 ॥

మేరువుకు పడమటివైపున వైదూర్యం, కాపిలం, గంధమాదనం, జానుధి మొదలైన కేసర పర్వతాలు ఉన్నాయి. ఇవి మేరువుకు తరువాత (దానితో సమానంగా), మేరువుకు కుక్షి మొదలైనస్థానాలలో (సన్నిహితంగా) ఉంటాయి.

శఙ్ఖకూటో౽ థ ఋషభో హంసో నాగ స్తథాపరే ।
కాలాఞ్జరాద్యాశ్చ తథా ఉత్తరే కేసరాచలాః ॥ 35 ॥

మేరువుకు ఉత్తరం వైపున శంఖకూటం, ఋషభం, హంసం, నాగం, ఇంకా కాలాంజరం మొదలైన కేసర పర్వతాలు ఉన్నాయి. మేరువుకు అన్నిదిక్కులలో చుట్టూ ఉన్న ఈపర్వతాలు మేరువుకు జఠరం మొదలైన అవయవాలస్థానంలో ఉన్నవి.

చతుర్దశ సహస్రాణి యోజనానాం మహాపురీ ।
మేరో రుపరి విప్రేన్ద్రా బ్రహ్మణః కథితా దివి ॥ 36 ॥

బ్రాహ్మణోత్తములారా, మేరుపర్వతానికి పైభాగంలో బ్రహ్మదేవుడిమహానగరం పధ్నాలుగువేలయోజనాల పరిమాణంతో ఉన్నది.

తస్యాం సమన్తత శ్చాష్టౌ దిశాసు విదిశాసు చ ।
ఇన్ద్రాదిలోకపాలానాం ప్రఖ్యాతాః ప్రవరాః పురః ॥ 37 ॥

ఆ మహానగరానికి చుట్టూ ఎనిమిది దిక్కులలో, (నాలుగు దిక్కులు, నాలుగు విదిక్కులు–మూలలు) ఇంద్రుడు మొదలైన లోకపాలకుల ఉత్తమనగరాలు ప్రసిద్ధి పొందిఉన్నాయి.

విష్ణుపాదవినిష్క్రాన్తా ప్లావయన్తీన్దుమణ్డలమ్ ।
సమన్తాద్ బ్రహ్మణః పుర్యాం గఙ్గా పతతి వై దివః ॥ 38 ॥

శ్రీమహావిష్ణువు పాదంనుండి వెలువడి, చంద్రమండలాన్ని తడుపుతూ, గంగానది బ్రహ్మదేవుడినగరం అంతటా ప్రవహిస్తున్నది.

సా తత్ర పతితా దిక్షు చతుర్ధా ప్రత్యపద్యత ।
సీతా చాలకనన్దా చ చక్షు ర్భద్రా చ వై క్రమాత్ ॥ 39 ॥

అక్కడ పడిన గంగానది నాలుగుదిక్కులలోనూ సీత, అలకనంద, చక్షువు, భద్ర అని నాలుగుపాయలుగా విడిపోయి ప్రవహిస్తున్నది.

పూర్వేణ సీతా శైలాచ్చ శైలం యా న్త్యన్తరిక్షగా ।
తతశ్చ పూర్వవర్షేణ భద్రాశ్వే నైతి సార్ణవమ్ ॥ 40 ॥

తూర్పుదిక్కున సీత అనే గంగ ఆకాశంలోనే ఒకకొండమీదినుండి ఇంకొకకొండమీదికి ప్రవహిస్తుంది. తర్వాత తూర్పువర్షమైన భద్రాశ్వానికి తూర్పుభూభాగంలో ప్రవహిస్తూ వెళ్లి సముద్రంలో కలుస్తుంది.

త థైవాలకనన్దా చ దక్షిణే నైత్య భారతమ్ ।
ప్రయాతి సాగరం భూత్వా సప్తభేదా ద్విజోత్తమాః! ॥ 41 ॥

విప్రవరులారా! అదేవిధంగా అలకనంద అనే గంగ దక్షిణంవైపుగా ప్రవహిస్తూ భారతవర్షానికి చేరుకుని, అక్కడ ఏడుభాగాలుగా విడిపోయి సముద్రంలో కలుస్తుంది.

చక్షుశ్చ పశ్చిమగిరీ నతీత్య సకలాం స్తతః ।
పశ్చిమం కేతుమాలాఖ్యం వర్ష మన్వేతి సార్ణవమ్ ॥ 42 ॥

చక్షువు అనేగంగ పడమటికొండల నన్నింటినీ దాటి, ఆతరువాత పడమటిదిక్కులో ఉన్న కేతుమాలం అనే భూభాగంలో ప్రవహిస్తూ అక్కడినుండి సముద్రంలో కలుస్తుంది.

భద్రా తథోత్తరగిరీ నుత్తరాంశ్చ తథా కురూన్ ।
అతీ త్యోత్తర మమ్భోధిం సమభ్యేతి ద్విజోత్తమాః ॥ 43 ॥

విప్రోత్తములారా! భద్ర అనేగంగ ఉత్తరంవైపు కొండలను, ఉత్తరకురుభూములనూ దాటి, అక్కడినుండి సముద్రంలోకి ప్రవేశిస్తుంది.

ఆనీలనిషధాయామౌ మాల్యవద్గన్ధమాదనౌ ।
తయో ర్మధ్యగతో మేరుః కర్ణికాకారసంస్థితః ॥ 44 ॥

మాల్యవంతం గంధమాదనం అనేపర్వతాలు నీలపర్వతం నుండి నిషధపర్వతం వరకు చాల పొడవుగా విస్తరించి ఉన్నాయి. వాటిమధ్యలో ఉన్నమేరుపర్వతం తామరపూవులో నడుమ బీజకోశంలాగా ఉంటుంది.

భారతాః కేతుమాలాశ్చ భద్రాశ్వాః కురవ స్తథా ।
పత్రాణి లోకశైలస్య మర్యాదాశైలబాహ్యతః ॥ 45 ॥

మర్యాదాపర్వతాలకు వెలుపలగా ఉన్న భారతభూములు, కేతుమాలభూములు, భద్రాశ్వభూములు, కురుభూములు, లోకపర్వతానికి తామరరేకులవలె ఉంటాయి.

జఠరో దేవకూటశ్చ మర్యాదాపర్వతా వుభౌ ।
తౌ దక్షిణోత్తరాయామా వానీలనిషధాయతౌ ॥ 46 ॥

జఠరం, దేవకూటం అనేవి రెండూ మర్యాదాపర్వతాలు. అవి రెండూ దక్షిణంనుండి ఉత్తరంవరకూ నీలపర్వతంనుంచి నిషధపర్వతంవరకూ పొడవుగా వ్యాపించిఉన్నాయి. (ఇవి తూర్పుకొండలు)

గన్ధమాదనకైలాసౌ పూర్వపశ్చాత్తు తా వుభౌ ।
అశీతియోజనాయామా వర్ణవాన్తర్వ్యవస్థితౌ ॥ 47 ॥

గంధమాదనమూ, కైలాసమూ అనే రెండుపర్వతాలు తూర్పునుండి పడమటివరకూ ఎనభై యోజనాల పొడవున విస్తరించి సముద్రంలో ప్రవేశిస్తున్నాయి. (ఇవి దక్షిణపర్వతాలు)

నిషధః పారియాత్రశ్చ మర్యాదాపర్వతా వుభౌ ।
తౌ దక్షిణోత్తరాయామా వానీలనిషధాయతౌ ॥ 48 ॥

నిషధం, పారియాత్రం అనేవి రెండు మర్యాదాపర్వతాలు. ఇవి దక్షిణంనుంచి ఉత్తరంవరకు, నీలపర్వతం నుంటి నిషధపర్వతం వరకూ పొడవుగా వ్యాపించిఉన్నాయి.

మేరోః పశ్చిమదిగ్భాగే యథా పూర్వం తథా స్థితౌ ॥ 49 ॥

ఇవి మేరుపర్వతానికి పడమటిదిక్కులో పూర్వంలాగానే ఉన్నాయి. (పడమటివైపుపర్వతాలు)

త్రిశృఙ్గో జారుధి శ్చైవ ఉత్తరౌ వర్షపర్వతౌ ।
పూర్వపశ్చాయతా వేతా వర్ణవాన్త ర్వ్యవస్థితౌ ॥ 50 ॥

త్రిశృంగము, జారుధి అనేపర్వతాలు ఉత్తరదిక్కులో ఉన్నాయి. తూర్పుపడమరలుగా విస్తరించి ఇవి సముద్రం నడుమ ఉన్నాయి. (ఇవి ఉత్తరపర్వతాలు)

ఇత్యేతే హి మయా ప్రోక్తా మర్యాదాపర్వతా ద్విజాః ।
జఠరావస్థితా మేరో ర్యేషాం ద్వౌ ద్వౌ చతుర్దిశమ్ ॥ 51 ॥

బ్రాహ్మణులారా, ఇవి మర్యాదాపర్వతాలు. మేరుపర్వతానికి నడుమ రెండు రెండుగా ఇవి నాలుగు దిక్కులలోనూ జఠరస్థానంలో (మేరువుకు సన్నిహితంగా) ఉన్నాయి.

మేరో శ్చతుర్దిశం యే తు ప్రోక్తాః కేసరపర్వతాః ।
శీతాన్తాద్యా ద్విజా స్తేషా మతీవ హి మనోహరాః ॥ 52 ॥

విప్రులారా, మేరుపర్వతానికి నాలుగుదిక్కులలోనూ కేసరపర్వతాలుగా చెప్పబడినకొండలు అవి మొత్తం మొదటినుంచి చివరివరకూ చల్లగానూ, చాలా అందంగానూ ఉంటాయి.

శైలానా మన్తరద్రోణ్య స్సిద్ధచారణసేవితాః ।
సురమ్యాణి తథా తాసు కాననాని పురాణి చ ॥ 53 ॥

ఈ కొండల నడుమ లోయలలో సిద్ధులు, చారణులు విహరిస్తుంటారు. అక్కడ ఉన్న అరణ్యాలు, పట్టణాలు చాలా అందంగా ఉంటాయి.

లక్ష్మీవిష్ణ్వగ్నిసూర్యేన్ద్ర దేవానాం మునిసత్తమాః ।
తాస్వాయతన వర్యాణి జుష్టాని నరకిన్నరైః ॥ 54 ॥

మునివరులారా, అక్కడ లక్ష్మీనారాయణులకు, అగ్నికీ, సూర్యుడికీ, ఇంద్రుడికీ ఉత్తమ దేవాలయాలు ఉన్నాయి. మానవులు, కిన్నరులు వారిని సేవిస్తూ ఉంటారు.

గన్ధర్వయక్షరక్షాంసి తథా దైతేయదానవాః ।
క్రీడన్తి తాసు రమ్యాసు శైలద్రోణీ ష్వహర్నిశమ్ ॥ 55 ॥

ఆపర్వతాలలోని అందమైన లోయలలో గంధర్వులు, యక్షులు, రాక్షసులు, దైత్యులు, దానవులు రేయింబవళ్లు క్రీడిస్తుంటారు.

భౌమా హ్యేతే స్మృతా స్స్వర్గా ధర్మిణా మాలయా ద్విజాః ।
నైతేషు పాపకర్తారో యాన్తి జన్మశతై రపి ॥ 56 ॥

బ్రాహ్మణులారా, ఇవి భూమిమీద ఉన్న స్వర్గాలు. ధార్మికులకు నివాసస్థానాలు. పాపం చేసినవారు వందలకొద్దీ జన్మలు ఎత్తినా, ఈప్రాంతాలకు రాలేరు.

భద్రాశ్వే భగవాన్ విష్ణు రాస్తే హయశిరా ద్విజాః ।
వారాహః కేతుమాలే తు భారతే కూర్మరూపధృక్ ।
మత్స్యరూపశ్చ గోవిన్దః కురు ష్వాస్తే సనాతనః ॥ 57 ॥

విప్రులారా, శ్రీవిష్ణుభగవానుడు భద్రాశ్వవర్షంలో హయగ్రీవుడిరూపంలో ఉన్నాడు. కేతుమాలవర్షంలో వరాహరూపంలో ఉన్నాడు. భారతవర్షంలో కూర్మరూపంలో ఉన్నాడు. సనాతనుడైన గోవిందుడు కురుభూములలో మత్స్యరూపంలో ఉన్నాడు.

విశ్వరూపేణ సర్వత్ర సర్వ స్సర్వేశ్వరో హరిః ।
సర్వ స్యాధారభూతోఽ సౌ ద్విజా ఆస్తేఽ ఖిలాత్మకః ॥ 58 ॥

జగన్నాథుడైన శ్రీమహావిష్ణువు సమస్తమైన రూపాలతోనూ అన్నిచోట్లా ఉంటాడు. బ్రాహ్మణులారా, సర్వస్వరూపుడైనశ్రీహరి సమస్తానికి ఆధారమై ఉంటాడు.

యాని కింపురుషాద్యాని వర్షా ణ్యష్టౌ ద్విజోత్తమాః ।
న తేషు శోకో నాయాసో నోద్వేగః క్షుద్భయాదికమ్ ॥ 59 ॥

విప్రవరులారా, కింపురుషం మొదలైన ఎనిమిది వర్షాలలో బాధలు ఉండవు. ఆయాసం ఉండదు. ఆకలిబాధ మొదలైనకష్టాలు ఉండవు.

స్వస్థాః ప్రజా నిరాతఙ్కా స్సర్వదుఃఖవివర్జితాః ।
దశ ద్వాదశవర్షాణాం సహస్రాణి స్థిరాయుషః ॥ 60 ॥

ప్రజలు ఆరోగ్యంతో ఉంటారు. ఏవిధమైన అవరోధాలు ఉండవు. వారికి ఏవిధమైన దుఃఖమూ ఉండదు. పదివేలు, పన్నెండువేలసంవత్సరాలు ఎటువంటిబాధలూ లేకుండా, సుఖంగా, స్థిరంగా జీవిస్తారు.

నైతేషు భౌమా న్యన్యాని క్షుత్పిపాసాది నో ద్విజాః ।
కృతత్రేతాదికా నైవ తేషు స్థానేషు కల్పనా ॥ 61 ॥

విప్రులారా, ఈభూభాగాలలో భూమిమీద ఉండే ఆకలి, దప్పిక వంటి బాధలు ఏవీ ఉండవు. కృతయుగం, త్రేతాయుగం వంటి యుగవిభాగం కూడ లేదు. (భూమిమీద కృతయుగంలో లాగ వర్షాలలో సర్వకాలాలలోనూ ధర్మం నాలుగుపాదాలతో ఉంటుంది.)

సర్వేష్వేతేషు వర్షేషు సప్త సప్త కులాచలాః ।
నద్యశ్చ శతశ స్తేభ్యః ప్రసృతా యా ద్విజోత్తమాః ॥ 62 ॥

బ్రాహ్మణోత్తములారా, ఈభూభాగాలు అన్నింటిలోనూ ఏడు ఏడు చొప్పున కులపర్వతాలు ఉంటాయి. వందలకొద్దీ నదులు ప్రవహిస్తుంటాయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణే భువనకోశ ద్వీపవర్ణనం నామ షోడశోఽ ధ్యాయః ॥ 16 ॥

శ్రీబ్రహ్మపురాణంలో భువనకోశద్వీపవర్ణనం అనే పదహారవ అధ్యాయం సంపూర్ణం.

సప్తదశోఽధ్యాయః - పదిహేడవ అధ్యాయం

జంబూద్వీపనిరూపణమ్ - జంబూద్వీపనిరూపణం

లోమహర్షణ ఉవాచ:- లోమహర్షణుడు మునులతో ఈవిధంగా చెప్తున్నాడు.

ఉత్తరేణ సముద్రస్య హిమాద్రేశ్చైవ దక్షిణే ।
వర్షం తద్భారతం నామ భారతీ యత్ర సన్తతిః ॥ 1 ॥

సముద్రానికి ఉత్తరదిక్కుగానూ, హిమాలయపర్వతాలకు దక్షిణంగానూ ఉన్న భూభాగానికి భారతం అని పేరు. అక్కడ పుట్టినవారికి భారతి అనిపేరు.

నవయోజనసాహస్రో విస్తారశ్చ మునీశ్వరాః ।
కర్మభూమిరియం స్వర్గ మపవర్గం చ ఇచ్ఛతామ్ ॥ 2 ॥

మునివరేణ్యులారా, భారతవర్షం తొమ్మిదివేలయోజనాలు విస్తరించి ఉంది. స్వర్గం కానీ, మోక్షం కాని కోరుకునేవారు దానిని సాధించేందుకు అవసరమైన కర్మ ఆచరించడానికి తగినభూమి ఇది. అందుకే ఇది కర్మభూమి.

మహేన్ద్రో మలయ స్సహ్య శ్శుక్తిమాన్ ఋక్షపర్వతః ।
విన్ధ్యశ్చ పారియాత్రశ్చ సప్తాత్ర కులపర్వతాః ॥ 3 ॥

భారతవర్షంలో మహేంద్రం, మలయం, సహ్యం, శుక్తిమంతం, ఋక్షం, వింధ్యం, పారియాత్రం, అనే కులపర్వతాలు ఏడు ఉన్నాయి.

అత స్సమ్ప్రాప్యతే స్వర్గో ముక్తి మస్మాత్ ప్రయాతి వై ।
తిర్యక్త్వం నరకం చాపి యాన్త్యతః పురుషా ద్విజాః ॥ 4 ॥

విప్రులారా, జీవులు స్వర్గానికి గానీ, మోక్షానికి కానీ, ఈకర్మభూమినుండే వెళ్తారు. ఆవిధంగానే ఇక్కడినుండే జీవులు పశువులు, పక్షులు మొదలైన జన్మలు గానీ, నరకం గాని ఇక్కడినుండే (ఇక్కడ చేసినకర్మల ననుసరించే) పొందుతారు.

ఇత స్స్వర్గశ్చ మోక్షశ్చ మధ్యం చాన్తే చ గచ్ఛతి ।
న ఖల్వన్యత్ర మర్త్యానాం కర్మ భూమౌ విధీయతే ॥ 5 ॥

ఈ భారతవర్షం నుంచే జన్మల మధ్యలో స్వర్గాన్నీ (స్వర్గానికి వెళ్లినతర్వాత పుణ్యక్షయంతో మళ్లీభూమిమీద జన్మించాలి కాబట్టి స్వర్గం జన్మలమధ్యలో వచ్చేది), జన్మలు అన్నీ అయిపోయాక చివరలో (పునర్జన్మ లేని) మోక్షాన్నీ పొందుతారు. మరణించే జీవులకు (కర్మభూమి అయిన)ఈ భారతవర్షంలో తప్ప మరి ఎక్కడా కూడ స్వర్గమోక్షాలు సాధించేకర్మను ఆచరించడానికి అవకాశం లేదు.

భారత స్యాస్య వర్షస్య నవ భేదాన్నిశామయ ।
ఇన్ద్రద్వీపః కసేరుశ్చం తామ్రపర్ణో గభస్తిమాన్ ॥ 6 ॥
నాగద్వీప స్తథా సౌమ్యో గన్ధర్వ స్త్వథ వారుణః ।
అయం తు నవమ స్తేషాం ద్వీప స్సాగరసంవృతః ॥ 7 ॥

ఈ భారతవర్షంలో తొమ్మిది భేదాలు (ద్వీపభాగాలు) ఉన్నాయి. వినండి. ఇంద్రద్వీపం, కసేరుమంతం, తామ్రపర్ణం, గభస్తిమంతం, నాగద్వీపం, సౌమ్యం, గంధర్వం, వారుణం, ఇది (భారతం) తొమ్మిదవద్వీపం. దీని చుట్టూ సముద్రం ఉన్నది.

యోజనానాం సహస్రం చ ద్వీపోయం దక్షిణోత్తరాత్ ।
పూర్వే కిరాతా స్తిష్ఠన్తి పశ్చిమే యవనాః స్థితాః ॥ 8 ॥

ఈ జంబూద్వీపం దక్షిణంనుండి ఉత్తరానికి వేయియోజనాలు ఉంటుంది. ఈద్వీపంలో తూర్పున కిరాతులు ఉంటారు. పడమట యవనులు ఉంటారు.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా మధ్యే శూద్రాశ్చ భాగశః ।
ఇజ్యా యుద్ధ వణిజ్యాద్యై ర్వృత్తిమన్తో వ్యవస్థితాః ॥ 9 ॥

మధ్యలో ఆయాప్రాంతాలలో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు ఉంటారు. వీళ్లు క్రమంగా, (బ్రాహ్మణులు) యాగాలు, (క్షత్రియులు) యుద్ధాలు, (వైశ్యులు) వాణిజ్యం, (శూద్రులు సేవ) మొదలైన వృత్తులు చేసుకుంటూ ఉంటారు.

శతద్రు చన్ద్రభాగాద్యా హిమవత్పాద నిస్సృతాః ।
వేదస్మృతిముఖా శ్చాన్యాః పారియాత్రోద్భవా మునే ॥
నర్మదా సురసాద్యాశ్చ నద్యో విన్ధ్యవినిస్సృతాః ॥ 10 ॥

మునీ, (మునులారా,) శతద్రువు, చంద్రభాగ మొదలైన నదులు హిమాలయపర్వతం మొదట్లో పుట్టి ప్రవహిస్తుంటాయి. వేదం, స్మృతి,పారియాత్రపర్వతం వద్ద పుట్టినది. నర్మద, సురస మొదలైన నదులు వింధ్యపర్వతం నుండి పుట్టాయి.

తాపీ పయోష్ణీ నిర్విన్ధ్యా కావేరీప్రముఖా నదీః ।
ఋక్షపాదోద్భవా హ్యేతా శ్శృతాః పాపం హరన్తి యాః ॥ 11 ॥

తాపి, పయోష్ణి, నిర్వింధ్య, కావేరి మొదలైన నదులు ఋక్షపర్వతం మొదట్లో జన్మించాయి. ఈనదులు పాపం పోగొడ్తాయి.

గోదావరీ భీమరథీ కృష్ణవేణ్యాదికా స్తథా ।
సహ్యపాదోద్భవా నద్య స్స్మృతాః పాపభయాపహాః ॥ 12 ॥

గోదావరి, భీమరథి, కృష్ణవేణి మొదలైన నదులు సహ్యాపర్వతం మొదట్లో పుట్టాయి. ఈనదులు పాపభయాన్ని నిర్మూలిస్తాయి. (సమస్త మైన పాపాలు పోగొట్టాయి.)

కృతమాలా తామ్రపర్ణీ ప్రముఖా మలయోద్భవాః ।
త్రిసాన్ధ్యఋషికుల్యాద్యా మహేన్ద్రప్రభవా స్స్మృతాః ॥ 13 ॥

కృతమాల, తామ్రపర్ణి, మొదలైన నదులు మలయపర్వతంనుండి పుట్టాయి. త్రిసాంధ్యం, ఋషికుల్య మొదలైన నదులు మహేంద్రపర్వతంనుండి పుట్టాయి.

ఋషికుల్యా కుమారాద్యా శ్శుక్తిమత్పాదసమ్భవాః ।
ఆసాం నద్యుపనద్యశ్చ స న్త్యన్యా స్తు సహస్రశః ॥ 14 ॥

ఋషికుల్య, కుమార మొద లయిననదులు శుక్తిమంతం అనేపర్వతం మొదట్లో పుట్టాయి. ఈనదులకు ఉపనదులు వేలసంఖ్యలో ఉన్నాయి.

తాస్విమే కురుపఞ్చాల మధ్యదేశాదయో జనాః ।
పూర్వదేశాదికాశ్చైవ కామరూపనివాసినః ॥15 ॥

ఆనదులమధ్యలో కురు, పంచాల, మధ్య మొదలైన దేశాలప్రజలు నివసిస్తున్నారు. తూర్పుదిక్కున కామరూప దేశప్రజలు నివసిస్తున్నారు.

పౌణ్డ్రాః కలిఙ్గా మగధా దాక్షిణాత్యాశ్చ సర్వశః ॥ 16 ॥

పౌండ్రులు, కలింగులు, మగధులు దక్షిణదేశప్రజలు.

తథా పరాన్త్యా స్సౌరాష్ట్రా శ్శూద్రాభీరా స్తథార్బుదాః ।
మారుకా మాలవాశ్చైవ పారియాత్రనివాసినః ॥17 ॥

సౌవీరా స్సైన్ధవాపన్నా శ్శాల్వా శ్శాకలవాసినః ।
మద్రారామా స్త థామ్బష్ఠాః పారసీకాదయ స్తథా ॥ 18 ॥

సౌరాష్ట్రులు, శూద్రులు, ఆభీరులు, అర్బుదులు, మారుకులు, మాలవులు, పారియాత్రపర్వతప్రాంతవాసులు, సౌవీరులు, సైంధవులు, ఆపన్నులు, శాల్వులు, శాకలనివాసులు, మద్రదేశవాసులు, అంబష్ఠులు, పారసీకులు మొదలైనవారు పశ్చిమదిక్కున ఉండే ప్రజలు.

ఆసాం పిబన్తి సలిలం వసన్తి సరితాం సదా ।
సమోపేతా మహాభాగా హృష్టపుష్టజనాకులాః ॥ 19 ॥

మహానుభావులారా, వీళ్లు అందరూ సమంగా, పరిపూర్ణ మయిన ఆనందంతో, గుంపులుగా, పైనదులలోని నీళ్ళను తాగుతారు. ఆ నదీతీరంలో నివసిస్తుంటారు.

చత్వారి భారతే వర్షే యుగా న్యత్ర మహామునే ।
కృతం త్రేతా ద్వాపరం చ కలిశ్చాన్యత్ర న క్వచిత్ ॥ 20 ॥

ఓ మహామునీ, భారతవర్షంలో కృతం, త్రేత, ద్వాపరం, కలి అని యుగాలు నాలుగు ఉన్నాయి. ఈయుగాలు వేరొకచోట లేవు.

తప స్తప్యన్తి యతయో జుహ్వతే చాత్ర యజ్వినః ।
దానాని చాత్ర దీయన్తే పరలోకార్థ మాదరాత్ ॥ 21 ॥

ఈ భారతవర్షంలో యతులు తపస్సు చేస్తుంటారు. యజ్వలు యాగాలు చేస్తుంటారు. ఉత్తమలోకాలకోసం ఈ భారతవర్షంలో ప్రజలు ప్రేమగా దానాలు ఇస్తారు.

పురుషై ర్యజ్ఞపురుషో జమ్బూద్వీపే స దేజ్యతే ।
యజ్ఞై ర్యజ్ఞమయో విష్ణు రన్యద్వీపేషు చాన్యథా ॥ 22 ॥

జంబూద్వీపంలో పురుషులు నిత్యమూ యజ్ఞాలు చేస్తూ, యజ్ఞపురుషుడిని ఆరాధిస్తారు. యజ్ఞస్వరూపుడైన శ్రీమహావిష్ణువును యజ్ఞాలతో పూజిస్తారు. ఇతరద్వీపాలలో ఇతర(యజ్ఞాలు మొదలైనపేర్లతో కాకుండా)విధాలుగా ఆరాధిస్తారు.

అత్రాపి భారతం శ్రేష్ఠం జమ్బూద్వీపే మహామునే ।
యతో హి కర్మభూరేషా అతోఽ న్యా భోగభూమయః ॥ 23 ॥

ఓ మహామునీ, జంబూద్వీపంలో కూడ భారతవర్షం కర్మభూమి (స్వర్గ అపవర్గాలను సాధించేది) కాబట్టి చాలా ఉత్తమమైనది. ఇతరభూములు భోగభూములు.

అత్ర జన్మసహస్రాణాం సహస్రై రపి సత్తమ ।
కదాచిల్లభతే జన్తు ర్మానుష్యం పుణ్యసఞ్చయాత్ ॥ 24 ॥

ఉత్తముడా, ఎన్నో వేలజన్మలు వేలసార్లు ఎత్తితే, ఎప్పటికో పుణ్యపరంపరవలన, ఈభారతవర్షంలో మానవుడుగా జన్మించగలుగుతాడు.

గాయన్తి దేవాః కిల గీతికాని ధన్యాస్తు యే భారతభూమిభాగే ।
స్వర్గాపవర్గాస్పదహేతుభూతే భవన్తి భూయః పురుషా మనుష్యాః ॥ 25 ॥

దేవతలు ఈభారతభూమిని ఈ విధంగా స్తుతిస్తారు. స్వర్గమూ, మోక్షమూ సాధించటానికి కారణ(సాధన)మైన ఈభారతవర్షంలో జన్మించినమానవుడు ధన్యుడు.

కర్మా ణ్యసఙ్కల్పితతత్ఫలాని సంన్యస్య విష్ణౌ పరమాత్మరూపే ।
అవాప్య తాం కర్మమహీమనన్తే తస్మిం ల్లయం యే త్వమలాః ప్రయాన్తి ॥ 26 ॥

స్వర్గమోక్షసాధకమైన ఈకర్మభూమియందు జన్మించి, ఫలితాన్ని పరమాత్మ అయిన శ్రీమహావిష్ణువునందు సమర్పణ చేసి, ఫలితాన్ని కోరుకోకుండా (నిష్కామంగా), కర్మలు ఆచరిస్తూ, పాపవిదూరులై, అనంతుడైన ఆ పరమాత్మయందు లీనమయ్యే మానవులు ధన్యులు. (అవకాశం వినియోగించుకుంటే దేవతలకంటే మానవులే ముందుగా మోక్షపదవిని అందుకుంటారు కాబట్టి ధన్యులు.)

జానీమ నైతత్ క్వ వయం విలీనే స్వర్గప్రదే కర్మణి దేహబన్ధమ్ ।
ప్రాప్స్యన్తి ధన్యాః ఖలు తే మనుష్యా యే భారతే నేన్ద్రియవిప్రహీనాః ॥ 27 ॥

స్వర్గాన్ని సాధించే కర్మ నశించిన తరువాత (పుణ్యక్షయం అయిన తరువాత), ఎక్కడ ఉంటామో తెలియదు. (పుణ్యకర్మలకు ఫలితంగా స్వర్గలోకానికి చేరుకుని దేవతలు అయినారు. ఆపుణ్యఫలం ఖర్చు అయిన తరువాత మళ్లీ పుట్టాలి. దేవతలు అందరూ మళ్లీ జన్మ ఎత్తవలసిందే. అపుడు ఏశరీరం కలుగుతుందో తెలియదు. కాబట్టి దేవతలు గావడం శ్రేష్ఠం కాదు. మఱి?) ఇంద్రియలోలురు కాకుండా, (స్వర్గాదిలోకసుఖాలను కోరుకోకుండా) భారతవర్షంలో దేహబంధాన్ని పొందిన (పుట్టిన) మానవులే ధన్యులు.

నవవర్షే చ భో విప్రా జమ్బూద్వీప మిదం మయా ।
లక్షయోజనవిస్తారం సంక్షేపాత్ కథితం ద్విజాః ॥ 28 ॥

ఓ బ్రాహ్మణులారా, (ఇంద్రద్వీపాది శ్లో. 6,7) నవద్వీపాలతో, లక్షయోజనాలవైశాల్యంతో ఉన్నజంబూద్వీపం గురించి సంగ్రహంగా వివరించాను.

జమ్బూద్వీపం సమావృత్య లక్షయోజనవిస్తరః ।
భో ద్విజా వలయాకారః స్థితః క్షీరోదధి ర్బహిః ॥ 29 ॥

ఓ బ్రాహ్మణులారా, ఈజంబూద్వీపాన్ని చుట్టుకుని, ద్వీపానికి వెలుపలివైపు గుండ్రంగా, లక్షయోజనాల వైశాల్యంతో పాలసముద్రం ఉన్నది.

ఇతి శ్రీబ్రహ్మపురాణే భువనకోశే జమ్బూద్వీపనిరూపణం నామ సప్తదశోఽధ్యాయః ॥ 17 ॥

శ్రీబ్రహ్మపురాణంలో భువనకోశంలో జంబూద్వీపనిరూపణం అనే పదిహేడవ అధ్యాయం సంపూర్ణం.



అష్టాదశోఽధ్యాయః - పద్దెనిమిదవ అధ్యాయం
సముద్రద్వీపపరిమాణవర్ణనమ్ - సముద్రద్వీపపరిమాణవర్ణనం

లోమహర్షణ ఉవాచ:- లోమహర్షణుడు మునులతో (1.జంబూద్వీపాన్ని గురించి చెప్పినతరువాత రెండవప్లక్షద్వీపాన్ని గురించి) ఈవిధంగా చెప్తున్నాడు.

2. ప్లక్షద్వీపం

క్షీరోదేన యథా ద్వీపో జమ్బూసంజ్ఞోఽభివేష్టితః ।
సంవేష్ట్య క్షార ముదధిం ప్లక్షద్వీప స్తథా స్థితః ॥ 1 ॥

జంబూద్వీపానికి చుట్టూ పాలసముద్రం ఉన్నట్లుగా ప్లక్షద్వీపానికి చుట్టూ ఉప్పుసముద్రం ఉన్నది.

జమ్బూద్వీపస్య విస్తార శ్శతసాహస్రసమ్మితః ।
స ఏవ ద్విగుణో విప్రాః ప్లక్షద్వీపోఽప్యుదాహృతః ॥ 2 ॥

బ్రాహ్మణులారా, జంబూద్వీపం లక్షయోజనాలు విస్తరించి ఉన్నది. ప్లక్షద్వీపం దానికి రెట్టింపు (రెండు లక్షలయోజనాలు) విస్తీర్ణంలో ఉంది.

సప్త మేధాతిథేః పుత్రాః ప్లక్షద్వీపేశ్వరస్య వై ।
శ్రేష్ఠ శ్శాన్తమయో నామ శిశిర స్తదనన్తరమ్ ॥ 3 ॥

ప్లక్షద్వీపానికి రాజు మేధాతిథి. అతడికి ఏడుగురు కుమారులు. వారిలో మొదటివాడు 1. శాంతమయుడు. తరువాతివాడు 2. శిశిరుడు.

సుఖోదయ స్తథానన్ద శ్శివః క్షేమక ఏవ చ ।
ధ్రువశ్చ సప్తమ స్తేషాం ప్లక్షద్వీపేశ్వరా హి తే ॥ 4 ॥

3. సుఖోదయుడు, 4. ఆనందుడు, 5. శివుడు, 6. క్షేమకుడు, 7. ధ్రువుడు ఏడవవాడు. వీరు అందరూ ప్లక్షద్వీపాన్ని పాలించినవారే.

పూర్వం శాన్తమయం వర్షం శిశిరం సుఖదం తథా ।
ఆనన్దం చ శివం చైవ క్షేమకం ధ్రువ మేవ చ ॥ 5 ॥

వీరు పాలించినరాజ్యాలు (మొదటివాడైన శాంతమయుడు పాలించిన)మొదటిభూభాగం శాంతమయం. శిశిరుడు పాలించినది శిశిరం. అలాగే సుఖోదయుడు పాలించినరాజ్యం సుఖదం సుఖోదయం, ఆనందుడు పాలించినభూమి ఆనందం, శివుడు పరిపాలించినదేశం శివం, క్షేమకుడు పాలించినది క్షేమకం, ధ్రువుడు పరిపాలించింది ధ్రువం.

మర్యాదాకారకా స్తేషాం త థాన్యే వర్షపర్వతాః ।
స ప్తైవ తేషాం నామాని శృణుధ్వం మునిసత్తమాః ॥ 6 ॥

మునివరులారా, ఈ ఏడురాజ్యభాగాలను వేరుచేస్తూ, మధ్య హద్దుగా ఏర్పడిన పర్వతాలు ఏడు ఉన్నాయి. ఆఏడుపర్వతాల పేర్లు వినండి.

గోమేద శ్చైవ చన్ద్ర శ్చ నారదో దున్దుభి స్తథా ।
సోమక స్సుమనా శ్శైలో వైభ్రాజ శ్చైవ సప్తమః ॥ 7 ॥

1. గోమేదం, 2. చంద్రం, 3. నారదం, 4. దుందుభి, 5. సోమకం, 6. సుమనసం, 7. వైభ్రాజం అనేది ఏడవపర్వతం.

వర్షాచలేషు రమ్యేషు వర్షే ష్వేతేషు చానఘాః ।
వసన్తి దేవగన్ధర్వ సహితా స్సతతం ప్రజాః ॥ 8 ॥

పుణ్యాత్ములారా, మనోహరమైన ఈభూభాగాలలోనూ, ఇక్కడి కులపర్వతాలమీదనూ ప్రజలు దేవతలతో, గంధర్వులతో కలిసి నివసిస్తుంటారు.

తేషు పుణ్యా జానపదా శ్చిరా చ్చ మ్రియతే జనః ।
నాధయో వ్యాధయో వాపి సర్వకాలం సుఖం హి తత్ ॥ 9 ॥

ఇక్కడి పల్లెలు పుణ్యప్రదాలు. ఈప్రాంతం ప్రజలు శక్తిమంతులు. ఇక్కడి ప్రజలకు మానసికమైనవి కానీ, శారీరకమైనవి కానీ ఏవిధ మయినరోగాలు ఉండవు. అన్నికాలాలలోనూ ప్రజలందరూ సుఖంగా ఉంటారు. చాలాకాలానికి సంతానాన్ని పొందుతారు.

తేషాం నద్యశ్చ సప్తైవ వర్షాణాంతు సముద్రగాః ।
నామత స్తాః ప్రవక్ష్యామి, శ్రుతాః పాపం హరన్తి యాః ॥ 10 ॥

ఈప్లక్షద్వీపంలో నదులు కూడ ఏడు. ఇవి అన్నీ సముద్రం దిక్కుగా ప్రవహిస్తాయి. వాటిపేర్లు చెప్తాను. వాటిపేర్లు విన్నంతమాత్రం చేతనే ఆనదులు పాపాలను నశింపజేస్తాయి.

అనుతప్తా శిఖీ చైవ విపాశా త్రిదివా క్రముః ।
అమృతా సుకృతా చైవ సప్తైతా స్తత్ర నిమ్నగాః ॥11 ॥

1.అనుతప్త, 2.శిఖి, 3.విపాశ, 4.త్రిదివ, 5.క్రమువు, 6. అమృత, 7. సుకృత. ఈఏడు ప్లక్షద్వీపంలో ప్రవహించేనదులు.

ఏతే శైలా స్తథా నద్యః ప్రధానాః కథితా ద్విజాః ।
క్షుద్రనద్య స్తథా శైలా స్తత్ర సన్తి సహస్రశః ॥12 ॥

ఈచెప్పిన పర్వతాలు, నదులు ప్లక్షద్వీపంలో ప్రధానమైనవి మాత్రమే. ఇంక చిన్న చిన్ననదులూ, పర్వతాలూ, వేలల్లో ఉన్నాయి.

తాః పిబన్తి ముదా హృష్టా నదీ ర్జనపదా స్తు తే ।
అవసర్పిణీ నదీ తేషాం న చైవోత్సర్పిణీ ద్విజాః ॥ 13 ॥

ప్రజలు ఆనదులలోని జలాలను ఆనందంగా పుచ్చుకుంటారు. విప్రులారా, ఆనదులు జలం వెనక్కి తగ్గటం, (నదులు ఎండిపోవడం) కానీ, పొంగి పొర్లటం కానీ, ఎపుడూ ఉండదు. (సంవత్సరం పొడుగునా, సమంగా ప్రవహిస్తుంటాయి)

న తిష్ఠన్తి యుగావస్థా తేషు స్థానేషు సప్తసు ।
త్రేతాయుగసమః కాల స్సర్వ ద్రైవ ద్విజోత్తమాః ॥ 14 ॥

విప్రోత్తములారా, మేధాతిథి కొడుకులు పాలిస్తున్న ఆ ఏడు రాజ్యాలలోనూ (ప్లక్షద్వీపంలో) యుగస్థితి లేదు. ఎల్లప్పుడూ కాలం త్రేతాయుగంతో సమంగా ఉంటుంది.

ప్లక్షద్వీపాదికే విప్రా శ్శాకద్వీపాన్తికేషు చ ।
పఞ్చవర్షసహస్రాణి జనా జీవ న్త్యనామయాః ॥ 15 ॥

ద్విజులారా, ప్లక్షం మొదలుగా శాకద్వీపంవరకూ అన్నిద్వీపాలలోనూ ప్రజలు పూర్తి ఆరోగ్యంతో, ఐదువేల సంవత్సరాలు జీవిస్తారు.

ధర్మ శ్చతుర్విధ స్తేషు వర్ణాశ్రమవిభాగజః ।
వర్ణాశ్చ తత్ర చత్వార స్తాన్ బుధాః ప్రవదామి వః ॥ 16 ॥

విజ్ఞులారా, ఆరాజ్యాలలో ధర్మం బ్రాహ్మణాదివర్ణాలు, బ్రహ్మచర్యాది ఆశ్రమాలను అనుసరించి నాలుగు విధాలుగా ఉంటుంది. అక్కడ వర్ణాలు నాలుగు. మీకు వాటిని గురించి చెప్తాను.

ఆర్యకాః కురవ శ్చైవ వివిశ్వా భావినశ్చ తే ।
విప్రక్షత్రియవైశ్యా స్తే శూద్రాశ్చ మునిసత్తమాః ॥ 17 ॥

మునివరులారా, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనేనాలుగువర్ణాలవారే, ప్లక్షద్వీపంలో 1.ఆర్యకులు, 2.కురవులు, 3.వివిశ్వులు, 4.భావులు అనేపేర్లతో ఉంటారు.

జమ్బూవృక్షప్రమాణ స్తు తన్మధ్యే సుమహాతరుః ।
ప్లక్ష స్తన్నామసంజ్ఞోఽయం ప్లక్షద్వీపో ద్విజోత్తమాః ॥ 18 ॥

జంబూద్వీపంలో జంబూవృక్షం పరిమాణంలోనే ఇక్కడ కూడ ఒకపెద్దవృక్షం ఉన్నది. దానిపేరు ప్లక్షం(జువ్విచెట్టు). ఆ చెట్టు పేరుమీదుగానే దీనికి ప్లక్షద్వీపం అనే పేరు వచ్చింది.

ఇజ్యతే తత్ర భగవాం స్తై ర్వర్ణై రార్యకాదిభిః ।
సోమరూపీ జగత్స్రష్టా సర్వ స్సర్వేశ్వరో హరిః ॥ 19 ॥

అక్కడ ఆర్యకులు మొదలైన నాలుగువర్ణాలవారు సోముడిరూపంలో ఉన్న సర్వలోకనాథుడూ, భగవంతుడు, అయిన శ్రీహరిని సేవిస్తారు.

ప్లక్షద్వీపప్రమాణేన ప్లక్షద్వీప స్సమావృతః ।
త థై వేక్షురసోదేన పరివేషానుకారిణా ॥ 20 ॥

చెఱకురసం సముద్రంనీరు ఆప్లక్షద్వీపం చుట్టూ, పరివేషం(వృత్తం)లాగా, ఆప్లక్షద్వీపం అంతపరిమాణం గలిగి, చుట్టుకునిఉంది. (ప్లక్షద్వీపం చుట్టూ ఉప్పుసముద్రం1.శ్లో. దానిపైన చెరకురససముద్రం. దానితరువాత శాల్మలద్వీపం.)

ఇ త్యేతద్ వో మునిశ్రేష్ఠాః ప్లక్షద్వీప ముదాహృతమ్ ।
సంక్షేపేణ మయా భూయ శ్శాల్మలం మే నిబోధత ॥ 21 ॥

మునివరేణ్యులారా, ప్లక్షద్వీపం గురించిన వివరాలు చెప్పాను. ఇక శాల్మలద్వీపం గురించి సంగ్రహంగా చెప్తాను. గ్రహించండి.

3. శాల్మలద్వీపం

శాల్మల స్యేశ్వరో వీరో వపుష్మాం స్తు తతో ద్విజాః ।
తేషాం తు నామ సంజ్ఞాని సప్తవర్షాణి తాని వై ॥ 22 ॥

విప్రులారా, శాల్మలద్వీపానికి రాజు వపుష్మంతుడు. ఇతడు వీరుడు. వపుష్మంతుడికి గలిగినవారి(కొడుకుల) పేరుమీదుగా అక్కడ (వారుపరిపాలించిన) రాజ్యాలు ఏడు ఏర్పడ్డాయి.

శ్వేతోఽథ హరిత శ్చైవ జీమూతో రోహిత స్తథా ।
వైద్యుతో మానసశ్చైవ సుప్రభశ్చ ద్విజోత్తమాః ॥ 23 ॥

మునివరులారా, (వపుష్మంతుడి కొడుకులు ఏడుగురి పేర్లు ఇవి) 1.శ్వేతుడు, 2. హరితుడు, 3.జీమూతుడు, 4.రోహితుడు, 5.వైద్యుతుడు, 6.మానసుడు, 7.సుప్రభుడు. (29 శ్లోకంలో వీరిరాజ్యాలపేర్లు ఈలాగే పేర్కొనబడ్డాయి.)

శాల్మలేన సముద్రోఽసౌ ద్వీపే నేక్షురసోదకః ।
విస్తారాద్ ద్విగుణే నాథ సర్వత స్సంవృతః స్థితః ॥ 24 ॥

ప్లక్షద్వీపానికి రెట్టింపు పరిమాణం గలిగిన ఈశాల్మలద్వీపానికి చుట్టూ చెఱకురససముద్రం జలం ఆవరించి ఉంది.

తత్రాపి పర్వతా స్సప్త విజ్ఞేయా రత్నయోనయః ।
వర్షాభివ్యఞ్జకా స్తత్ర తథా సప్తైవ నిమ్నగాః ॥ 25 ॥

రత్నాలతో నిండినపర్వతాలు కూడ ఇక్కడ ఏడు ఉన్నాయి. వర్షజలంతో చక్కగా ప్రవహించే నదులు కూడ ఏడు ఉన్నాయి.

కుముద శ్చోన్నత శ్చైవ తృతీయస్తు బలాహకః ।
ద్రోణో యత్ర మహౌషధ్య స్స చతుర్థో మహీధరః ॥ 26 ॥

1.కుముదం, 2.ఉన్నతం, 3. బలాహకం మూడవపర్వతం. 4.గొప్ప గొప్ప ఓషధులతో కూడిన ద్రోణం నాలుగవ పర్వతం.

కఙ్క స్తు పఞ్చమః షష్ఠో మహిష స్సప్తమ స్తథా ।
కకుద్మాన్ పర్వతవర స్సరిన్నామా న్యతో ద్విజాః ॥ 27 ॥

ఐదవపర్వతం పేరు కంకం. మహిషం ఆరవపర్వతం. ఏడవదైన ఉత్తమపర్వతం కకుద్మంతం. బ్రాహ్మణులారా, ఇంక నదులపేర్లు చెప్తాను.

శ్రోణీ తోయా వితృష్ణా చ చక్రా శుక్రా విమోచనీ ।
నివృత్తి స్సప్తమీ తాసాం స్మృతా స్తా పాపశాన్తిదాః ॥ 28 ॥

1. శ్రోణి, 2. తోయ, 3.వితృష్ణ, 4.చక్ర 5.శుక్ర, 6.విమోచని, 7. అక్కడినదులలో ఏడవది నివృత్తి. ఆ నదులు తలచుకుంటేనే పాపాలను పోగొట్తాయి.

శ్వేతం చ లోహితం చైవ జీమూతం హరితం తథా ।
వైద్యుతం మానసం చైవ సుప్రభం నామ సప్తమమ్ ॥ 29 ॥

ఆ ఏడురాజ్యాలు 1.శ్వేతం, 2. హరితం 3.జీమూతం, 4.రోహితం, 5.వైద్యుతం, 6.మానసం, 7.సుప్రభం. (ఇవి 23 శ్లోకంలో వపుష్మంతుడికుమారులపేర్లుగా చెప్పబడ్డాయి.)

సప్తైతాని తు వర్షాణి చాతుర్వర్ణ్యయుతాని చ ।
వర్ణాశ్చ శాల్మలేయే చ వర్తన్త్యేషు ద్విజోత్తమాః ॥ 30 ॥

ఈ ఏడురాజ్యాలు కూడ నాలుగువర్ణాలవారితో కూడి ఉన్నాయి. విప్రవరేణ్యులారా, శాల్మలద్వీపంలోని వర్ణాలు నాలుగు.

కపిలాశ్చారుణాః పీతాః కృష్ణా శ్చైవ పృథక్ పృథక్ ।
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా శ్శూద్రాశ్చైవ యజన్తి తమ్ ॥ 31 ॥

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే నాలుగువర్ణాలవారే అక్కడ 1.కపిలులు, 2.అరుణులు, 3.పీతులు, 4.కృష్ణులు, అనేపేర్లతో శాల్మలద్వీపంలో నివసిస్తుంటారు.

భగవన్తం సమస్తస్య విష్ణు మాత్మాన మవ్యయమ్ ।
వాయుభూతం మఖశ్రేష్ఠై ర్యజ్వినో యజ్ఞసంస్థితమ్ ॥ 32 ॥

అన్నిలోకాలకూ భగవంతుడు, పరమాత్మ, అవ్యయుడు, యజ్ఞంలో ఉండేవాడు (యజ్ఞస్వరూపుడు), అక్కడ వాయుస్వరూపంలో ఉన్న శ్రీమహావిష్ణువును శాల్మలద్వీపవాసులు (నాలుగువర్ణాలవారూ) శ్రేష్ఠమైన యజ్ఞాలతో అర్చిస్తారు.

దేవానా మత్ర సాంనిధ్య మతీవ సుమనోహరే ।
శాల్మలిశ్చ మహావృక్షో నామ నిర్వృత్తికారకః ॥ 33 ॥

అత్యంతసుందరమైన ఈశాల్మలద్వీపంలో దేవతలు సన్నిహితంగా ఉంటారు. ఇక్కడ శాల్మలం (బూరుగు చెట్టు) అనేపేరు గలిగిన మహావృక్షం ఉన్నది. ఆవృక్షంవల్లనే ఆద్వీపానికి శాల్మలద్వీపం అనేపేరు వచ్చింది.

ఏష ద్వీప స్సముద్రేణ సురోదేన సమావృతః ।
విస్తారా చ్ఛాల్మలే శ్చైవ సమేన తు సమన్తతః ॥ 34 ॥

ఈశాల్మలద్వీపం చుట్టూ సురా(కల్లు)సముద్రం ఆవరించిఉంది. అన్నివిధాలుగానూ శాల్మలిద్వీపంతో సమాన మైనవైశాల్యం కలిగిఉంది. (శాల్మలద్వీపం చుట్టూ ఇక్షురససముద్రం. 24.శ్లో. దానిపైన సురాసముద్రం. ఆ తరువాత కుశద్వీపం.)

(ఇక్కడితో శాల్మలద్వీపం గురించి చెప్పడం అయింది. ఇక కుశద్వీపంగురించి చెప్పబడుతుంది.)

4. కుశద్వీపం

సురోదకః పరివృతః కుశద్వీపేన సర్వతః ।
శాల్మలస్య తు విస్తారాద్ ద్విగుణేన సమన్తతః ॥ 35 ॥

కుశద్వీపం చుట్టూ సురా(కల్లు)సముద్రం ఆవరించి ఉంది. ఇది వైశాల్యంలో శాల్మలద్వీపానికి రెట్టింపు పరిమాణంలో విస్తరించిఉంటుంది.

జ్యోతిష్మతః కుశద్వీపే సప్తపుత్రా న్నిబోధత ।
ఉద్భిదో వేణుమాం శ్చైవ స్వైరథో రన్ధనో ధృతిః ॥ 36 ॥
ప్రభాకరోఽథ కపిల స్తన్నామ్నా వర్షపద్ధతిః ।
తస్మిన్ వసన్తి మనుజా స్సహ దైతేయదానవైః ॥ 37 ॥

కుశద్వీపానికి రాజు జ్యోతిష్మంతుడు. ఇతడికి కుమారులు ఏడుగురు. వారిని గ్రహించండి. 1. ఉద్భిదుడు, 2.వేణుమంతుడు, 3.స్వైరథుడు, 4.అంధనుడు, 5. ధృతి, 6. ప్రభాకరుడు, 7.కపిలుడు. (వారు పరిపాలించిన రాజ్యాలు) వారిపేర్లతోనే వ్యవహరింపబడుతున్నాయి. అక్కడి ప్రజలు దైత్యులతోనూ దానవులతోనూ కలిసి నివసిస్తారు.

తథైవ దేవగన్ధర్వా యక్షకింపురుషాదయః ।
వర్ణా స్తత్రాపి చత్వారో నిజానుష్ఠానతత్పరాః ॥ 38 ॥

అలాగే కుశద్వీపంలో దేవతలు, గంధర్వులు, యక్షులు, కింపురుషులు మొదలైనవారు కూడ ఉంటారు. కుశద్వీపంలో వర్ణాలు నాలుగు. అన్ని వర్ణాలవారు శ్రద్ధగా తమతమవర్ణానికి నిర్ణయింపబడిన వృత్తిని చేసుకుంటూ ఉంటారు.

దమిన శ్శుష్మిణ స్స్నేహా మన్దేహాశ్చ ద్విజోత్తమాః ।
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా శూద్రా శ్చానుక్రమోదితాః ॥ 39 ॥

బ్రాహ్మణవర్యులారా, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనేనాలుగువర్ణాలవారే క్రమంగా కుశద్వీపంలో 1.దములు, 2.శుష్మలు, 3.స్నేహులు, 4.మందేహులు అనేపేర్లతో ఉంటారు.

యథోక్తకర్మకర్తృత్వాత్ స్వాధికారక్షయాయ తే ।
తత్ర తే తు కుశద్వీపే బ్రహ్మరూపం జనార్దనమ్ ।
యజన్తః క్షపయ న్త్యుగ్ర మధికారఫలప్రదమ్ ॥ 40 ॥

ఆ కుశద్వీపంలోని ఈ నాలుగువర్ణాలవారు కూడ తమ తమ స్థానాలలో ఉండటంకోసం(వర్ణధర్మాలు సంకరం కాకుండా, వర్ణస్వరూపం నిలిచిఉండటంకోసం), తమకు విహితమైనకర్మలను (వర్ణధర్మాలను) చక్కగా ఆచరిస్తారు.ఇంకా, అధికారఫలాన్ని ఇచ్చే బ్రహ్మరూపంలో ఉన్నజనార్దనుడిని తీవ్రంగా ఆరాధిస్తూ కాలం గడుపుతారు.

విద్రుమో హేమశైలశ్చ ద్యుతిమాన్ పుష్టిమాం స్తథా ।
కుశేశయో హరిశ్చైవ సప్తమో మన్దరాచలః ॥ 41 ॥

వర్షాచలాస్తు సప్తైతే ద్వీపే తత్ర ద్విజోత్తమాః ॥ 42 ॥

బ్రాహ్మణోత్తములారా, ఆ కుశద్వీపంలో 1.విద్రుమం, 2.హేమశైలం, 3.ద్యుతిమంతం, 4.పుష్టిమంతం, 5.కుశేశయం, 6.హరి, 7. ఏడవదైనమందరపర్వతం అనేవి ఏడు వర్షపర్వతాలు.

నద్యశ్చ సప్త తాసాం తు శృణు నామా న్యనుక్రమాత్ ।
ధూతపాపా శివా చైవ పవిత్రా సమ్మతి స్తథా ॥ 43 ॥

విద్యుదమ్భో మహీ చాన్యా సర్వపాపహరా స్త్విమాః ।
అన్యా స్సహస్రశ స్తత్ర క్షుద్రనద్య స్త థాచలాః ॥ 44 ॥

అక్కడ నదులు కూడ ఏడు ఉన్నాయి. వాటిపేర్లను క్రమంగా వినండి. 1.ధూతపాప, 2.శివ, 3.పవిత్ర, 4.సమ్మతి, 5.విద్యుదంభం, 6.మహి, 7. సర్వపాపహర అనే ఏడు కుశద్వీపంలోని నదులు. ఇంక చిన్నచిన్ననదులూ, పర్వతాలు కుశద్వీపంలో వేలసంఖ్యలో ఉన్నాయి.

కుశద్వీపే కుశస్తమ్బ స్సంజ్ఞయా తస్య తత్ స్మృతమ్ ।
తత్ప్రమాణేన స ద్వీపో ఘృతోదేన సమావృతః ॥ 45 ॥

కుశద్వీపంలో కుశస్తంబం (దర్భపొద) ఉన్నది. దానివల్లనే ఈద్వీపానికి కుశద్వీపం అనేపేరు వచ్చింది. ఆకుశద్వీపం పరిమాణంలో ఉన్ననేతిసముద్రం దానిని చుట్టుకుని ఉన్నది. (కుశద్వీపం చుట్టూ సురాసముద్రం. 35. శ్లో. దానిపైన ఘృతసముద్రం. ఆతరువాత క్రౌంచద్వీపం.)

5. క్రౌంచద్వీపం

ఘృతోదశ్చ సముద్రోఽసౌ క్రౌఞ్చద్వీపేన సంవృతః ।
క్రౌఞ్చద్వీపో మునిశ్రేష్ఠా శ్రూయతాం చాపరో మహాన్ ॥ 46 ॥

మునివరులారా, క్రౌంచద్వీపం అనేపేరు గలిగిన మరొకమహాద్వీపం ఉంది. దాన్ని గురించి వినండి. ఆక్రౌంచద్వీపం చుట్టూ నేతిసముద్రం ఆవరించి ఉంది.

కుశద్వీపస్య విస్తారాద్ ద్విగుణో యస్య విస్తరః ।
క్రౌఞ్చద్వీపే ద్యుతిమతః పుత్రా స్సప్త మహాత్మనః ॥ 47 ॥

క్రౌంచద్వీపం కుశద్వీపానికి రెట్టింపు విస్తీర్ణంలో ఉంటుంది. క్రౌంచద్వీపానికి రాజు ద్యుతిమంతుడు. ఆమహాత్ముడికి ఏడుగురు కుమారులు.

తన్నామాని చ వర్షాణి తేషాం చక్రే మహీపతిః ।
కుశగో మన్దగ శ్చోష్ణః పీవరోఽథాన్ధకారకః ॥ 48 ॥

మునిశ్చ దున్దుభిశ్చైవ సప్తైతే తత్సుతా ద్విజాః ।
తత్రాపి దేవగన్ధర్వ సేవితా స్సుమనోరమాః ॥ 49 ॥

తనకుమారులు పరిపాలించే భూభాగాలకు ద్యుతిమంతుడు వారిపేర్లే ఉంచాడు. 1. కుశగుడు, 2. మందగుడు, 3. ఉష్ణుడు, 4. పీవరుడు, 5. అంధకారకుడు, 6. ముని, 7. దుందుభి. ఈఏడుగురు ద్యుతిమంతుడి కుమారులు. విప్రులారా, వీరిరాజ్యాలలో దేవతలు, గంధర్వులు సంచరిస్తుంటారు. ఆరాజ్యాలు అందంగా ఉంటాయి.

వర్షాచలా మునిశ్రేష్ఠా స్తేషాం నామా న్యతఃపరమ్ ।
క్రౌఞ్చ శ్చ వామన శ్చైవ తృతీయ శ్చాన్ధకారకః ॥ 50 ॥

దేవవ్రతో ధమ శ్చైవ తథాన్యః పుణ్డరీకవాన్ ।
దున్దుభి శ్చ మహాశైలో ద్విగుణా స్తే పరస్పరమ్ ॥ 51 ॥

మునివరేణ్యులారా, అక్కడ ఉండే వర్షపర్వతాలపేర్లు ఇపుడు చెప్తాను. 1. క్రౌంచం, 2. వామనం, 3. మూడవది అంధకారకం, 4. దేవవ్రతం, 5. ధమం, 6. పుండరీకవంతం, 7. దుందుభి. ఈఏడు ఆ ద్వీపంలో ఉన్న మహాకుల పర్వతాలు. అవి అన్నీ ఒకదానికంటె తరువాతిది రెట్టింపు పరిమాణంలో ఉంటాయి.

ద్వీపాద్ ద్వీపేషు వై శైలా స్తథా ద్వీపాని తే తథా ।
వర్షే ష్వేతేషు రమ్యేషు వర్షశైలవరేషు చ ।
నివసన్తి నిరాతఙ్కా స్సహ దేవగణైః ప్రజాః ॥ 52 ॥

ఏద్వీపానికి ఆద్వీపంలో ప్రత్యేకంగా కులపర్వతాలు ఉన్నాయి. అదేవిధంగా ద్వీపాలు కూడ దేని కది ప్రత్యేకంగా ఉన్నాయి. మనోహరమైన ఈరాజ్యాలలోనూ, ఇక్కడి కులపర్వతాలమీదనూ ప్రజలు ఎటువంటి బాధలు లేకుండా, దేవగణాలతో కలిసి నివసిస్తుంటారు.

పుష్కలా పుష్కరా ధన్యా స్తే ఖ్యాతా శ్చ ద్విజోత్తమాః ।
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా శ్శూద్రా శ్చానుక్రమోదితాః ॥ 53 ॥

విప్రవరేణ్యులారా, ఈ క్రౌంచద్వీపంలో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే నాలుగువర్ణాల వారు క్రమంగా 1. పుష్కలులు, 2. పుష్కరులు 3. ధన్యులు, 4.ఖ్యాతులు, అనేపేర్లతో నివసిస్తుంటారు.

తత్ర నద్యో మునిశ్రేష్ఠా యాః పిబన్తి శృణుష్వ తాః ।
సప్త ప్రధానా శ్శతశ స్త త్రాన్యాః క్షేత్రనిమ్నగాః ॥ 54 ॥

మునివరులారా, క్రౌంచద్వీపంలో ప్రజలు పుచ్చుకునే నీటిని ఇచ్చే ప్రధానమైన నదులు ఏడు ఉన్నాయి. చిన్నచిన్న నదులు వందలసంఖ్యలో అక్కడ ప్రవహిస్తున్నాయి.

గౌరీ కుముద్వతీ చైవ సన్ధ్యా రాత్రి ర్మనోజవా ।
ఖ్యాతిశ్చ పుణ్డరీకాచ సప్తైతా వర్షనిమ్నగాః ॥ 55 ॥

1. గౌరి, 2. కుముద్వతి, 3. సంధ్య, 4. రాత్రి, 5. మనోజవ, 6. ఖ్యాతి, 7. పుండరీక అనేవి ఏడు క్రౌంచద్వీపంలో ప్రధానమైన నదులు.

తత్రాపి వర్ణై ర్భగవాన్ పుష్కరాద్యై ర్జనార్దనః ।
యోగిరుద్రస్వరూపస్తు ఇజ్యతే యజ్ఞసన్నిధౌ ॥ 56 ॥

క్రౌంచద్వీపంలో ఉన్న పుష్కరులు మొదలైన వర్ణాలవారు యజ్ఞాలలో యోగి అయిన రుద్రుడిస్వరూపంలో ఉన్న జనార్దనుడిని అర్చిస్తుంటారు.

క్రౌఞ్చద్వీప స్సముద్రేణ దధిమణ్డోదకేన తు ।
ఆవృత స్సర్వతః క్రౌఞ్చ ద్వీపతుల్యేన మానతః ॥ 57 ॥

క్రౌంచద్వీపం మీగడతో గూడినపెరుగుసముద్రజలంతో పూర్తిగా ఆవరింపబడి ఉంటుంది. ఆపెరుగు సముద్రం క్రౌంచద్వీపం అంత పరిమాణంలో ఉంటుంది.(క్రౌంచద్వీపం చుట్టూ నేతిసముద్రం. 46.శ్లో. దానిపైన పెరుగుసముద్రం. ఆతరువాత శాకద్వీపం.)

6. శాకద్వీపం

దధిమణ్డోదకశ్చాపి శాకద్వీపేన సంవృతః ।
క్రౌఞ్చద్వీపస్య విస్తారాద్ ద్విగుణేన ద్విజోత్తమాః ॥ 58 ॥

ఆ మీగడ నిండినపెరుగుసముద్రం శాకద్వీపంచేత ఆవరింపబడి ఉంది. అది క్రౌంచద్వీపానికి రెట్టింపు పరిమాణంలో ఉంటుంది.

శాకద్వీపేశ్వరస్యాపి భవ్యస్య సుమహాత్మనః ।
సప్తైవ తనయా స్తేషాం దదౌ వర్షాణి సప్త సః ॥ 59 ॥

శాకద్వీపానికి రాజు భవ్యుడు. మహానుభావుడైన భవ్యుడికి ఏడుగురు కుమారులు. భవ్యుడు ఆఏడుగురు కుమారులకు ఏడురాజ్యాలను ఇచ్చాడు.

జలదశ్చ కుమారశ్చ సుకుమారో మనీరకః ।
కుసుమోదశ్చ మోదాకి స్సప్తమశ్చ మహాద్రుమః ॥ 60 ॥

1.జలదుడు, 2.కుమారుడు, 3.సుకుమారుడు, 4.మనీరకుడు, 5. కుసుమోదుడు, 6. మోదాకి, 7.ఏడవవాడు మహాద్రుముడు.

తత్సంజ్ఞాన్యేవ తత్రాపి సప్తవర్షాణ్యనుక్రమాత్ ।
తత్రాపి పర్వతా స్సప్త వర్షవిచ్ఛేదకారకాః ॥ 61 ॥

వారు పరిపాలించేరాజ్యాలకు కూడ క్రమంగా వారిపేర్లే. ఆఏడురాజ్యాలను విభాగించేపర్వతాలు కూడ ఏడు ఉన్నాయి.

పూర్వే తత్రోదయగిరి ర్జలధార స్తథాపరః ।
తథా రైవతక శ్శ్యామ స్త థైవామ్భోగిరిర్ద్విజాః ॥ 62 ॥

ఆస్తికేయ స్తథా రమ్యః కేసరీ పర్వతోత్తమః ॥ 63 ॥

విప్రులారా, 1. ఉదయగిరి (మొదటిది. తరువాత) 2. జలధార, 3. రైవతకం, 4.శ్యామం, 5.అంభోగిరి 6.ఆస్తికేయం, 7. కేసరి. కేసరిపర్వతం పర్వతాలన్నిటిలో శ్రేష్ఠం. అందంగా ఉంటుంది.

శాక శ్చాత్ర మహావృక్ష స్సిద్ధగన్ధర్వసేవితః ।
యత్పత్రవాతసంస్పర్శా దాహ్లాదో జాయతే పరః ॥ 64 ॥

శాకద్వీపంలో చాలపెద్ద శాకవృక్షం (కడిమిచెట్టు) ఉన్నది. ఆవృక్షంమీద సిద్ధులు, గంధర్వులు సంచరిస్తుంటారు. ఆచెట్టుఆకులమీదనుండి వచ్చేవాయువు సోకితే, అత్యంతమైన ఆనందం కలుగుతుంది.

తత్ర పుణ్యా జనపదా శ్చాతుర్వర్ణ్యసమన్వితాః ।
నివసన్తి మహాత్మానో నిరాతఙ్కా నిరామయాః ॥ 65 ॥

శాకద్వీపంలో నాలుగువర్ణాలప్రజలు నివసిస్తున్నారు. వారు పుణ్యాత్ములు. మహానుభావులు. వారికి ఏవిధమైనబాధలు లేవు. ఆరోగ్యవంతులు.

నద్య శ్చాత్ర మహాపుణ్యా స్సర్వపాపభయాపహాః ।
సుకుమారీ కుమారీ చ నలినీ రేణుకా చ యా ॥ 66 ॥

ఇక్షుశ్చ ధేనుకాచైవ గభస్తీ సప్తమీ తథా ।
అన్యా స్త్వయుతశ స్తత్ర క్షుద్రనద్యో ద్విజోత్తమాః ॥ 67 ॥

శాకద్వీపంలో సమస్తమైన పాపాలను నిర్మూలించే పుణ్యనదులు ఏడు ఉన్నాయి. 1. సుకుమారి, 2. కుమారి, 3. నళిని, 4. రేణుక, 5. ఇక్షువు, 6. ధేనుక, 7. ఏడవది గభస్తి. ఇంకా ఇతరనదులు చిన్నచిన్నవి (పది) వేలల్లో ఉన్నాయి.

మహీధరా స్తథా సన్తి శతశోఽథ సహస్రశః ।
తాః పిబన్తి ముదా యుక్తా జలదాదిషు యే స్థితాః ॥ 68 ॥

అలాగే ఈద్వీపంలో చిన్న చిన్న పర్వతాలు కూడ వందలలో, వేలలో ఉన్నాయి. జలదం మొదలయిన ఆ ఏడురాజ్యాలలో (60,61శ్లో) (అలాగే కొండలమీద ఇతరత్ర) నివసించే ప్రజలు ఆనందంగా ఆనదులలోని జలాన్ని పుచ్చుకుంటారు.

వర్షేషు యే జనపదా శ్చతుర్థార్థసమన్వితాః ।
నద్య శ్చాత్ర మహాపుణ్యాః స్వర్గా దభ్యేత్య మేదినీమ్ ॥ 69 ॥

ఈద్వీపంలోని ఏడు రాజ్యాలలోని ప్రజలు నాలగవదయిన మోక్షం అనే పురుషార్థం మీద ఆసక్తి కలిగి ఉంటారు. ఈ రాజ్యాలలోని నదులు మహాపుణ్యప్రదాలు. ఇవి స్వర్గం నుండి నేలమీదికి వచ్చాయి.

ధర్మహాని ర్న తేష్వస్తి న సంహర్షో న శుక్తథా ।
మర్యాదావ్యుత్క్రమశ్చాపి తేషు దేశేషు సప్తసు ॥ 70 ॥

శాకద్వీపంలో ఏడు రాజ్యాలలోని ప్రజలలోనూ ధర్మానికి లోపం లేదు. వీరు సుఖదుఃఖాలకు (ద్వంద్వాలకు) అతీతులు. వేదోక్తమైన నియమాలను అతిక్రమించటం లేదు. (వైదికధర్మాన్ని విడిచిపెట్టకుండా ఆచరిస్తారు.)

మగాశ్చ మాగధాశ్చైవ మానసా మన్దగా స్తథా ।
మగా బ్రాహ్మణభూయిష్ఠా మాగధాః క్షత్రియాస్తు తే ।
వైశ్యాస్తు మానసా స్తేషాం శూద్రా జ్ఞేయాస్తు మన్దగాః ॥ 71 ॥

ఇక్కడ మగులు, మాగధుల, మానసులు, మందగులు, అనే వర్ణాల ప్రజలు ఉన్నారు. వీరిలో మగులు బ్రాహ్మణులు. మాగధులు క్షత్రియులు. మానసులు వైశ్యులు. మందగులు శూద్రులు.

శాకద్వీపస్థితై ర్విష్ణు స్సూర్యరూపధరో హరిః ।
యథోక్తై రిజ్యతే సమ్యక్ కర్మభి ర్నియతాత్మభిః ॥ 72 ॥

శాకద్వీపంలోని ప్రజలు నియమబద్ధంగా, శాస్త్రంలో చెప్పబడిన ప్రకారంగా కర్మలను ఆచరిస్తూ, సూర్యుడిరూపంలో శ్రీమహావిష్ణువైన హరిని అర్చిస్తారు.

శాకద్వీప స్తతో విప్రాః క్షీరోదేన సమన్తతః ।
శాకద్వీపప్రమాణేన వలయేనేవ వేష్టితః ॥ 73 ॥

బ్రాహ్మణులారా, శాకద్వీపం చుట్టూ గుండ్రంగా పాలసముద్రం ఆవరించి ఉన్నది. పాలసముద్రం శాకద్వీపం పరిమాణంలో ఉంటుంది.(శాకద్వీపం చుట్టూ పెరుగుసముద్రం. దానిపైన పాలసముద్రం. ఆతరువాత పుష్కరద్వీపం.)

7. పుష్కరద్వీపం

క్షీరాబ్ధి స్సర్వతో విప్రాః పుష్కరాఖ్యేన వేష్టితః ।
ద్వీపేన శాకద్వీపాత్తు ద్విగుణేన సమన్తతః ॥ 74 ॥

ద్విజులారా, పాలసముద్రం పుష్కరద్వీపంతో చుట్టుకొనబడి ఉంది. పుష్కరద్వీపం విస్తీర్ణం శాకద్వీపానికి రెట్టింపు పరిమాణంలో ఉంటుంది.

పుష్కరే సవనస్యాపి మహావీతోఽ భవత్ సుతః ।
ధాతకిశ్చ తయో స్తద్వద్ ద్వే వర్షే నామ సంజ్ఞితే ॥ 75 ॥

మహావీతం త థై వాన్యద్ ధాతకీఖణ్డసంజ్ఞితమ్ ॥ 76 ॥

పుష్కరద్వీపానికి రాజు సవనుడు. ఇతడికి మహావీతుడు, ధాతకి అనేవారు ఇద్దరు కుమారులు. వారు పరిపాలించే రాజ్యాలు కూడ అదేవిధంగా మహావీతం, అలాగే రెండవది ధాతకి అని వారిపేర్లతోనే ఉన్నాయి.

ఏకశ్చాత్ర మహాభాగాః ప్రఖ్యాతో వర్షపర్వతః ।
మానసోత్తరసంజ్ఞోవై మధ్యతో వలయాకృతిః ॥ 77 ॥

మహాత్ములారా, ఇక్కడ (ఈరెండు రాజ్యాలను వేరుచేసే) వర్షపర్వతం ఒక్కటే. ఇది చాల ప్రసిద్ధమైనది. దానిపేరు మానసోత్తరం. అది ఈద్వీపం మధ్యలో వలయాకారంలో (గుండ్రంగా) ఉంటుంది.

యోజనానాం సహస్రాణి ఊర్ధ్వం పఞ్చాశ దుచ్ఛ్రితః ।
తావ దేవ చ విస్తీర్ణ స్సర్వతః పరిమణ్డలః ॥ 78 ॥

ఈ పర్వతం ఎత్తు యాభైవేల యోజనాలు. దాని వెడల్పు కూడ అంతే పరిమాణంలో ఉంటుంది. పుష్కరద్వీపం చక్కగా గుండ్రంగా ఉంటుంది.

పుష్కరద్వీపవలయం మధ్యేన విభజన్నివ ।
స్థితోఽసౌ తేన విచ్ఛిన్నం జాతం తద్ద్వీపకద్వయమ్ ।
వలయాకార మేకైకం తయో ర్మధ్యే మహాగిరిః ॥ 79 ॥

ఈ మానసోత్తరపర్వతం పుష్కరద్వీపాన్ని మధ్యకు విడదీస్తున్నట్లుగా ఉంటుంది. ఈపర్వతం కారణంగా పుష్కరద్వీపం రెండు చిన్నద్వీపాలు అయినట్లుగా ఉంటుంది. ఆరెండు చిన్నద్వీపాలు ఒక్కొక్కటి వలయాకారంలో ఉంటాయి. ఈపర్వతం వాటిమధ్యలో ఉంటుంది.

దశవర్షసహస్రాణి తత్ర జీవన్తి మానవాః ।
నిరామయా విశోకాశ్చ రాగద్వేషవివర్జితాః ॥ 80 ॥

ఈద్వీపంలోని మానవులు రోగం, శోకం, ప్రేమ, ద్వేషం లేకుండా పదివేలసంవత్సరాలు జీవిస్తారు.

అధమోత్తమౌ న తే ష్వాస్తాం న వధ్యవధకౌ ద్విజాః ।
ఈర్ష్యాసూయా భయం రోషో దోషో లోభాదికం న చ ॥ 81 ॥

బ్రాహ్మణులారా, పుష్కరద్వీపంలోని ప్రజలలో గొప్పవారు, తక్కువవారు అనేభేదం లేదు. (అందరూ సమానులే) చంపేవాడు, చంపబడేవాడు ఉండరు. ఈర్ష్య (ఇతరులలోని గొప్పతనాన్ని చూసి ఓర్వలేకపోవటం), అసూయ(ఇతరులలోని మంచిని చెడుగా భావించటం), భయం, కోపం, తప్పుచేయటం, పిసినిగొట్టుతనం మొదలైన అవగుణాలు ఏవీ ఈప్రజలలో లేవు.

మహావీతం బహిర్వర్షం ధాతకీఖణ్డమణ్డితమ్ ।
మానసోత్తరశైలస్య దేవదైత్యాదిసేవితమ్ ॥ 82 ॥

మానసోత్తరపర్వతానికి వెలుపలగా ఉన్న మహావీతరాజ్యంలోనూ, ధాతకి రాజ్యభాగంలోనూ దేవతలూ, దైత్యులూ విహరిస్తుంటారు.

సత్యానృతే న త త్రాస్తాం ద్వీపే పుష్కరసంజ్ఞితే ।
న తత్ర నద్య శ్శైలా వా ద్వీపే పుష్కరసంజ్ఞితే ॥ 83 ॥

ఆ పుష్కరద్వీపంలో సత్యం, అసత్యం అనేవి లేవు. అలాగే నదులు లేవు, కొండలు లేవు.

తుల్యవేషాస్తు మనుజా దైవై స్తత్రైకరూపిణః ॥ 84 ॥

పుష్కరద్వీపంలో మానవులు దేవతలతో సమానమైన వేషంలో ఒకేరూపంతో ఉంటారు.

వర్ణాశ్రమాచారహీనం ధర్మాహరణవర్జితమ్ ।
త్రయీ వార్తా దణ్డనీతి శుశ్రూషారహితం చ తత్ ॥ 85 ॥

ఆద్వీపంలో వర్ణాశ్రమధర్మాలు లేవు. ధర్మం లేదు. వేదప్రస్తావన లేదు. శిక్షలు లేవు. ఒకరిని ఇంకొకరు సేవించటం లేదు.

వర్షద్వయం తతో విప్రా భౌమస్వర్గోఽయ ముచ్యతే ।
సర్వస్య సుఖదః కాలో జరారోగవివర్జితః ॥ 86 ॥

ద్విజులారా, పుష్కరద్వీపంలోని రెండురాజ్యాలూ భూలోకస్వర్గాలుగా చెప్తారు.(ప్రజలకు ఎంత వయసు వచ్చినా) ముసలితనం లేదు. రోగం లేదు. కాలం అందరికీ సుఖప్రదంగా ఉంటుంది.

పుష్కరే ధాతకీ ఖణ్డే మహావీతే చ వై ద్విజాః ।
న్యగ్రోధః పుష్కరద్వీపే బ్రహ్మణః స్థాన ముత్తమమ్ ।
తస్మి న్నివసతి బ్రహ్మా పూజ్యమాన స్సురాసురైః ॥ 87 ॥

విప్రులారా, మహావీతం, ధాతకి అనే రెండురాజ్యాలు గలిగిన పుష్కరద్వీపంలో పెద్దమఱ్ఱిచెట్టు ఉన్నది. పుష్కరద్వీపంలో ఉత్తమమైన బ్రహ్మస్థానం ఉన్నది. అక్కడ బ్రహ్మదేవుడు నివసిస్తుంటాడు. ఆబ్రహ్మను దేవతలూ, రాక్షసులూ పూజిస్తుంటారు.

స్వాదూదకే నోదధినా పుష్కరః పరివేష్టితః ।
సమేన పుష్కర స్యైవ విస్తారా న్మణ్డలా త్తథా ॥ 88 ॥

పుష్కరద్వీపం చుట్టూ మంచినీటిసముద్రం ఆవరించి ఉన్నది. ఆ మంచినీటిసముద్రం పుష్కరద్వీపంతో సమానమైన పరిమాణంలో ఉంటుంది.

ఏవం ద్వీపా స్సముద్రైస్తు సప్త సప్తభిరావృతాః ।
ద్వీపశ్చైవ సముద్రశ్చ సమానౌ ద్విగుణౌ పరౌ ॥ 89 ॥

ఈవిధంగా జంబు, ప్లక్ష మొదలైన ద్వీపాలు ఏడూ ఏడు సముద్రాలతో చుట్టుకొనబడి ఉన్నాయి. ((జంబూద్వీపం చుట్టూ పాలసముద్రం, ప్లక్షద్వీపం - ఉప్పునీటిసముద్రం, శాల్మలద్వీపం - చెఱకురససముద్రం, కుశద్వీపం - కల్లుసముద్రం, క్రౌంచద్వీపం - నేతిసముద్రం, శాకద్వీపం - పెరుగుసముద్రం, పుష్కరద్వీపం- మంచినీటిసముద్రం. అని ఈపురాణం) ద్వీపాలు సముద్రాలు రెండూ సమానమే. ఒకదానికంటె తరువాతిది రెట్టింపు పరిమాణంలో ఉంటుంది.

పయాంసి సర్వదా సర్వ సముద్రేషు సమాని వై ।
న్యూనాతిరిక్తాశ్చ తేషాం కదాచిన్నైవ జాయతే ॥ 90 ॥

అన్ని సముద్రాలలోనూ నీళ్లు సమానంగా ఉంటాయి. ఒకప్పుడు కూడా ఎక్కువ తక్కువలు ఉండవు.

స్థాలీస్థ మగ్నిసంయోగా దుద్రిక్తం సలిలం యథా ।
త థేన్దువృద్ధౌ సలిలం సముద్రేషు సమం హి వై ॥ 91 ॥

గిన్నెలో ఉన్ననీళ్లు (కాగబెట్టినపుడు)నిప్పువేడికి ఏవిధంగా పొంగుతాయో, ఆవిధంగా చంద్రుడి వృద్ధిలో ఉన్నపుడు (చంద్రుడు నిండుగా ఉన్నపుడు - పూర్ణిమనాడు) అన్ని సముద్రాలలోనూ నీరు ఒకేవిధంగా పొంగుతుంది

అన్యూనాతిరిక్తాశ్చ వర్ధన్త్యాపో హ్రసన్తి చ ।
ఉదయాస్తమయే ష్విన్దోః పక్షయో శ్శుక్లకృష్ణయోః ॥ 92 ॥

శుక్లపక్షంలోనూ, కృష్ణపక్షంలోనూ, అలాగే చంద్రుడు ఉదయించేసమయంలోనూ, అస్తమించేసమయంలోనూ అన్ని సముద్రాలలోని నీళ్లు ఎక్కువతక్కువలు లేకుండా, ఒకేవిధంగా పొంగుతాయి, తగ్గుతాయి,

దశోత్తరాణి పఞ్చైవ అఙ్గులానాం శతాని చ ।
అపాం వృద్ధిక్షయౌ దృష్టౌ సముద్రాణాం ద్విజోత్తమాః ॥ 93 ॥

విప్రవరేణ్యులారా, సముద్రాలలోని నీరు పదిహేనువందలఅంగుళాలు (శుక్లపక్షంలో, చంద్రోదయ సమయంలో) పెరుగుతుంది, (కృష్ణపక్షంలో, చంద్రాస్తమయసమయంలో) అంతే పరిమాణంలో తగ్గుతుంది.

భోజనం పుష్కరద్వీపే తత్ర స్వయ ముపస్థితమ్ ।
భుఞ్జన్తి షడ్రసం విప్రాః ప్రజా స్సర్వా స్స దైవ హి ॥ 94 ॥

ద్విజులారా, పుష్కరద్వీపంలోని ప్రజలు అందరూ దానంతట అదిగా (అప్రయత్నంగా) లభించిన ఆరు రుచులతో కూడిన ఆహారాన్ని భుజిస్తారు.

స్వాదూదకస్య పరితో దృశ్యతే లోకసంస్థితిః ।
ద్విగుణా కాఞ్చనీ భూమి స్సర్వజన్తువివర్జితా ॥ 95 ॥

మంచినీటిసముద్రానికి చుట్టూ లోకాలముగింపు ఉన్నట్లు తెలుస్తున్నది. అది మంచినీటిసముద్రానికి రెట్టింపు పరిమాణంలో ఉంటుంది. అక్కడి నేల బంగారుభూమి. ఆ నేలమీద ఏవిధమైన జంతువులు ఉండవు.

లోకాలోక స్తత శ్శైలో యోజనాయుతవిస్తృతః ।
ఉచ్ఛ్రయేణాపి తావన్తి సహస్రాణ్యవరో హి సః ॥ 96 ॥

ఆ భూమికి తరువాత లోకాలోకపర్వతం ఉంది. అది పదివేలయోజనాలు విస్తరించిఉన్నది. దానియెత్తు, లోతు కూడ అదేవిధంగా పదివేలయోజనాలు ఉంటుంది.

తత స్తమ స్సమావృత్య తం శైలం సర్వతః స్థితమ్ ।
తమ శ్చాణ్డకటాహేన సమన్తాత్ పరివేష్టితమ్ ॥ 97 ॥

ఆతరువాత అన్నిదిక్కులలోనూ చీకటితో ఆవరింపబడిన(చీకటి)పర్వతం ఉంది. అందులో బ్రహ్మాండ మంతటిపరిమాణంలో చీకటి నిండిఉంది.

పఞ్చాశత్కోటివిస్తారా సేయ మూర్వీ ద్విజోత్తమాః ।
స హై వాణ్డకటాహేన సద్వీపాబ్ధిమహీధరా ॥ 98 ॥

విప్రవర్యులారా, బ్రహ్మాండంతో సహా, ద్వీపాలు, సముద్రాలూ, పర్వతాలూ అన్నింటితోనూ కూడినటువంటి ఈభూమి యాభైకోట్లయోజనాలు విస్తరించిఉంది.

సేయం ధాత్రీ విధాత్రీ చ సర్వభూతగుణాధికా ।
ఆధారభూతా సర్వేషాం జగతాం సా ద్విజోత్తమాః ॥ 99 ॥

బ్రాహ్మణవరేణ్యులారా, అటువంటిఈభూమి ప్రాణులసృష్టి కలిగినది. సమస్తమైనభూతకోటికంటె అధికమైన గుణాలు కలిగినది. అన్నిలోకాలకూ ఈభూమి ఆధారం అయిఉన్నది.

ఇతి శ్రీబ్రహ్మపురాణే సముద్రద్వీపపరిమాణవర్ణనం నామాష్టాదశోఽధ్యాయః ॥ 18 ॥

శ్రీబ్రహ్మపురాణంలో సముద్రద్వీపపరిమాణవర్ణనం అనే పద్దెనిమిదవ అధ్యాయం సంపూర్ణం.



ఏకోనవింశోఽధ్యాయః - పందొమ్మిదవ అధ్యాయం

పాతాలప్రమాణకీర్తనమ్ - పాతాలప్రమాణకీర్తనం

లోమహర్షణ ఉవాచ :-లోమహర్షణుడు మునులతో ఈవిధంగా చెప్తున్నాడు.

విస్తార ఏష కథితః పృథివ్యా మునిసత్తమాః ।
సప్తతిస్తు సహస్రాణి తదుచ్ఛ్రాయోఽపి కథ్యతే ॥ 1 ॥

మునివరేణ్యులారా, ఈభూమి డెబ్భైవేలయోజనాలవిస్తీర్ణం, డెబ్భైవేలయోజనాల ఎత్తు ఉంటుందని పేర్కొనబడుతున్నది.

దశసాహస్ర మేకైకం పాతాలం మునిసత్తమాః ।
అతలం వితలం చైవ నితలం సుతలం తథా ।
తలాతలం రసాతలం, పాతాలం చాపి సప్తమమ్ ॥ 2 ॥

మునివరులారా, పాతాలం ఒక్కొక్కటి పదివేలయోజనాల వైశాల్యంలో ఉంటుంది. పాతాళలోకాలు 1.అతలం, 2.వితలం, 3.నితలం, 4.సుతలం, 5.తలాతలం, 6.రసాతలం, 7.పాతాలం అనేది ఏడవది.

కృష్ణా శుక్లారుణా పీతా శర్కరా శైలకాఞ్చనీ ।
భూమయో యత్ర విప్రేన్ద్రా వరప్రాసాదశోభితాః ॥ 3 ॥

ద్విజోత్తములారా, ఆభూములు 1.కృష్ణ, 2.శుక్ల 3.అరుణ, 4.పీత, 5.శర్కర, 6.శైల 7.కాంచని, అని ఏడువిధాలు. ఈభూములు అన్నీ శ్రేష్ఠమైనభవనాలతో ప్రకాశిస్తున్నాయి.

తేషు దానవదైత్యానాం జాతయస్తు సహస్రశః ।
నాగానాం చ మహోజ్గానాం జాతయశ్చ ద్విజోత్తమాః ॥ 4 ॥

ఆ భూములలో దానవులు, దైత్యులజాతులు వేలసంఖ్యలో నివసిస్తున్నారు. బ్రాహ్మణశ్రేష్ఠులారా, అక్కడ పెద్దపెద్ద పాములజాతులు కూడ వేలసంఖ్యలోనే ఉన్నాయి.

స్వర్లోకా దపి రమ్యాణి పాతాలానీతి నారదః ।
ప్రాహ స్వర్గసదోమధ్యే పాతాలేభ్యో గతో దివమ్ ॥ 5 ॥

ఒకసారి పాతాళలోకాలనుంచి స్వర్గలోకానికి వెళ్లిన నారదుడు అక్కడ దేవతలసభలో 'స్వర్గలోకం కంటె పాతాళలోకాలు మనోహరమైనవి' అని చెప్పాడు.

ఆహ్లాదకారిణ శ్శుభ్రా మణయో యత్ర సుప్రభాః ।
నాగాభరణభూషాశ్చ పాతాలం కేన తత్సమమ్ ॥ 6 ॥

పాతాళలోకాలలో మనసును ఆహ్లాదపరిచే మంచికాంతి కలిగినరత్నాలు ఉన్నాయి. ఉత్తమమైన పాములసొమ్ములు ఉన్నాయి. అటువంటిపాతాలంతో ఏలోకమూ సాటిరాదు.

దైత్యదానవకన్యాభి రితశ్చేతశ్చ శోభితే ।
పాతాలే కస్య న ప్రీతి ర్విముక్తస్యాపి జాయతే ॥ 7 ॥

ఎక్కడ బడితే అక్కడ దైత్యకన్యలతోనూ, దానవకన్యలతోనూ వెలిగిపోతున్న పాతాళలోకం అందరికీ ఆనందం ఇస్తుంది. మోక్షాన్ని పొందినవాడికి కూడ పాతాళలోకంలో ఆనందం కలుగుతుంది.

దివార్కరశ్మయో యత్ర ప్రభాస్తన్వన్తి నాతపమ్ ।
శశినశ్చ న శీతాయ నిశి ద్యోతాయ కేవలమ్ ॥ 8 ॥

పగలు సూర్యుడికిరణాలు ఎండ లేకుండా, మంచికాంతితో ఆనందపెట్తాయి. రాత్రిపూట చంద్రకిరణాలు కూడ మరీ చలి పుట్టించకుండా చక్కనికాంతిని ఇస్తాయి.

భక్ష్యభోజ్యమహాపానముదితై శ్చాపి భోగిభిః ।
యత్ర న జ్ఞాయతే కాలో గతోఽపి దనుజాదిభిః ॥ 9 ॥

పాతాళంలో నాగులు భక్ష్యాలూ, భోజ్యాలూ, మంచి పానీయాలతో ఆనందిస్తున్న నాగులకు, దానవులు మొదలైన జాతుల వారికీ ఎంత కాలం గడిచిందో కూడ తెలియడంలేదు.

వనాని నద్యో రమ్యాణి సరాంసి కమలాకరాః ।
పుంస్కోకిలాదిలాపాశ్చ మనోజ్ఞా న్యమ్బరాణి చ ॥ 10 ॥

పాతాళంలో ఉద్యానవనాలు, నదులు, చెఱువులు, తామరకొలనులు, సుందరంగా ఉంటాయి. గండు కోయిలల కూతలూ, అక్కడివారు కట్టుకునే వస్త్రాలు మనోహరంగా ఉంటాయి.

భూషణా న్యతిరమ్యాణి గన్ధాద్య మనులేపనమ్ ।
వీణావేణుమృదఙ్గానాం నిస్వనాశ్చ సదా ద్విజాః ॥ 11 ॥

విప్రులారా, పాతాళవాసుల ఆభరణాలు, ఒంటికి పూసుకునే మంచిగంధం మొదలైన సుగంధద్రవ్యాలు, వీణలు, వేణువులు, మృదంగాల ధ్వనులు ఎంతో మనోహరంగా ఉంటాయి.

ఏతాన్యన్యాని రమ్యాణి భాగ్యభోగ్యాని దానవైః ।
దైత్యోరగైశ్చ భుజ్యన్తే పాతాలాన్తరగోచరైః ॥ 12 ॥

పాతాళలోకంలో నివసిస్తున్న దానవులు, దైత్యులు, నాగులు ఇవి మాత్రమే కాకుండా, ఇంకా అనేకమైన, అందమైన, విలువైన, భోగ్యవస్తువులను అనుభవిస్తున్నారు.

పాతాలానా మథ శ్చాస్తే విష్ణో ర్యా తామసీ తనుః ।
శేషాఖ్యా యద్గుణాన్ వక్తుం న శక్తా దైత్యదానవాః ॥ 13 ॥

యోఽనన్తః పఠ్యతే సిద్ధై ర్దేవదేవర్షిపూజితః ॥ 14 ॥

ఈఏడుపాతాళలోకాలకు క్రిందిభాగంలో శ్రీమహావిష్ణువు ఆదిశేషుడు అనేపేరుతో తమోగుణమయమైన రూపంతో ఉంటాడు. దైత్యులు, దానవులు, ఎవరూ ఆవిష్ణువు గుణాలను వర్ణింపలేరు. ఆ అనంతుడిని దేవతలూ, దేవఋషులూ పూజిస్తారు. సిద్ధులు స్తోత్రపాఠాలు చదువుతారు.

సహస్రశిరసా వ్యక్త స్స్వస్తికామలభూషణః ।
ఫణామణిసహస్రేణ య స్స విద్యోతయన్ దిశః ॥ 15 ॥

ఆ(ఆదిశేషుడిరూపంలో ఉన్న)అనంతుడికి వేయిశిరస్సులు ఉన్నాయి. స్వస్తిక చిహ్నం కలిగిన శుభ్ర మయినహారాలు ధరిస్తాడు. వేయిపడగలమీద ఉన్నరత్నాలతో దిక్కు లన్నింటిని ప్రకాశింపజేస్తుంటాడు.

సర్వాన్ కరోతి నిర్వీర్యాన్ హితాయ జగతోఽసురాన్ ।
మదాఘూర్ణితనేత్రోఽసౌ యస్సదైవైకకుణ్డలః ॥ 16 ॥

ఆ అనంతుడు లోకాలకు మేలు చేయటంకోసం ఒకే విశాల మయిన(వేయిపడగలు కూడిన) పడగతో, మదంతో కదులుతున్నకళ్లతో రాక్షసులను అందరినీ శక్తిహీనులను చేస్తుంటాడు.

కిరీటీ స్రగ్ధరో భాతి సాగ్నిశ్వేత ఇవాచలః ।
నీలవాసా మదోత్సిక్త శ్శ్వేతహారోపశోభితః ॥ 17 ॥

ఆ అనంతుడు కిరీటం ధరించి, పూలమాలలను అలంకరించుకుని, అగ్నితో గూడిన శ్వేతపర్వతంలాగా ప్రకాశిస్తున్నాడు. నల్లనివస్త్రాలను కట్టుకున్నాడు. మద్యం మత్తుతో ఉద్రేకంతో ఉన్నాడు. తెల్లనిహారాలతో వెలిగిపోతున్నాడు.

సాభ్రగఙ్గాప్రపాతోఽసౌ, కైలాసాద్రి రివోన్నతః ।
లాఙ్గలాసక్తహస్తాగ్రో బిభ్రన్ ముసలముత్తమమ్ ॥ 18 ॥

పైనించి ఆకాశగంగ పడుతున్న కైలాసపర్వతంలాగా చాలా ఉన్నతంగా ఉన్నాడు. (బలరామస్వరూపంతో) ఒకచేతితో నాగలి పట్టుకుని, వేరొకచేతిలో శ్రేష్ఠమైన రోకలిని ధరించాడు.

ఉపాస్యతే స్వయం కాన్త్యా యో వారుణ్యా చ మూర్తయా ॥ 19 ॥

మూర్తీభవించిన వారుణితో స్వీయమైన కాంతితో ఉపాసింపబడుతున్నాడు.

కల్పాన్తే యస్య వక్త్రేభ్యో విషానలశిఖోజ్జ్వలః ।
సఙ్కర్షణాత్మకో రుద్రో నిష్క్రామ్యాత్తి జగత్త్రయమ్ ॥ 20 ॥

కల్పం ముగిసిన సమయంలో ఈ ఆదిశేషుడి వేయిముఖాలనుండి ఉజ్జ్వలమైన అగ్నిజ్వాలలతో, రుద్రుడు సంకర్షణస్వరూపంతో వెలువడి, మూడులోకాలను మింగివేస్తాడు.

స బిభ్ర చ్ఛిఖరీభూత మశేషం క్షితిమణ్డలమ్ ।
ఆస్తే పాతాలమూలస్థ శ్శేషోఽశేషసురార్చితః ॥ 21 ॥

ఆదిశేషుడు సమస్తమైన భూమండలాన్ని తనపడగలమీద నిలుపుకుని, పాతాళానికి అడుగున, దేవత లందరిచేత పూజింపబడుతూ ఉంటాడు.

తస్య వీర్యం ప్రభావశ్చ స్వరూపం రూపమేవ చ ।
న హి వర్ణయితుం శక్యం జ్ఞాతుం వా త్రిదశై రపి ॥ 22 ॥

ఆ అనంతుడి శక్తినీ, మాహాత్మ్యాన్నీ, లక్షణాలనూ, ఆకారాన్నీ, వర్ణించడం కానీ, (కనీసం) అర్థంచేసుకోవడం కానీ, దేవతలకు కూడా సాధ్యం కాదు.

యస్యైషా సకలా పృథ్వీ ఫణామణిశిఖారుణా ।
ఆస్తే కుసుమమాలేవ కస్తద్వీర్యం వదిష్యతి ॥ 23 ॥

సమస్తమైనఈభూమండలం ఆదిశేషుడి పడగలమీదిమణులకాంతులతో ఎఱ్ఱగా (ఎఱ్ఱతామర) పూలమాలలాగా ఉంది. ఆ అనంతుడిశక్తిని ఎవడు వర్ణించగలడు?

యదా విజృమ్భతేఽనన్తో మదాఘూర్ణితలోచనః ।
తదా చలతి భూ రేషా సాద్రితోయధికాననా ॥ 24 ॥

మద్యం మత్తుతో సంచలించే కళ్లతో అనంతుడు విజృంభించినపుడు ఆతడితలపై ఉన్న ఈభూమి కొండలూ, సముద్రాలూ, అరణ్యాలతో సహా కంపిస్తుంది.

గన్ధర్వాప్సరస స్సిద్ధా కిన్నరోరగరాక్షసాః ।
నాన్తం గుణానాం గచ్ఛన్తి తతోఽనన్తోఽ య మవ్యయః ॥ 25 ॥

గంధర్వులూ, అప్సరసలూ, సిద్ధులూ, కిన్నరులూ, నాగులూ, రాక్షసులూ, ఈతడి గుణాల అంతు తెలియలేరు. అందుకే ఇతడు అనంతుడు. అవ్యయుడు.

యస్య నాగవధూహస్తై ర్లేపితం హరిచన్దనమ్ ।
ముహు శ్శ్వాసానిలాయస్తం యాతి దిక్పటవాసతామ్ ॥ 26 ॥

నాగకన్యలు తమచేతులతో పూసే హరిచందనం ఈ అనంతుడి శ్వాసవాయువులచేత ఎగిరి దిక్కులకు (పరిమళాన్ని కప్పింది) పరిమళద్రవ్యం అయింది.

య మారాధ్య పురాణర్షి ర్గర్గో జ్యోతీంషి తత్త్వతః ।
జ్ఞాతవాన్ సకలం చైవ నిమిత్తపఠితం ఫలమ్ ॥ 27 ॥

పురాణఋషి అయిన గర్గుడు ఈఅనంతుడిని ఆరాధించి, జ్యోతిర్విషయాలను సమగ్రంగా తెలుసుకున్నాడు. అన్ని శకునాలకు ఫలితాన్ని గ్రహించాడు.

తే నేయం నాగవర్యేణ శిరసా విధృతా మహీ ।
బిభర్తి సకలాన్ లోకాన్ సదేవాసురమానుషాన్ ॥ 28 ॥

ఈ సర్పరాజు తన శిరస్సుమీద ధరించడంచేత ఈభూమి దేవతలతోనూ, రాక్షసులతోనూ, మానవులతోనూ కూడిన సమస్తమైనలోకాలనూ భరించగలుగుతున్నది.

శ్రీబ్రహ్మపురాణే పాతాలప్రమాణకీర్తనం నా మైకోనవింశోఽధ్యాయః ॥ 19 ॥
శ్రీబ్రహ్మపురాణంలో పాతాలప్రమాణకీర్తనం అనే పందొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

వింశోఽధ్యాయః - ఇరవైయవ అధ్యాయం

పాతాలనరకకీర్తనమ్ - పాతాలనరకకీర్తనం

లోమహర్షణ ఉవాచ :-లోమహర్షణుడు మునులతో ఈవిధంగా చెప్తున్నాడు.

తతశ్చ నరకా విప్రా బభూవు స్సలిలా దధః ।
పాపినో యేషు పాత్యన్తే తచ్ఛృణుధ్వం ద్విజోత్తమాః ॥ 1 ॥

విప్రవరులారా, ఇక తరువాత - పాపాత్ములు పడిపోయే సముద్రజలాలకు అడుగున నరకలోకాలు ఉంటాయి. పాపకర్మలు చేసినవారు ఆలోకాలలో పడిపోతారు. ఆ నరకలోకాలను గురించి వినండి.

రౌరవ శ్శౌకరో రోధ స్తానో విశసన స్తథా ।
మహాజ్వాల స్తప్తకుమ్భో మహాలోభో విమోహనః ॥ 2 ॥

రుధిరాన్ధో వైతరణీ కృమీశః కృమిభోజనః ।
అసిపత్రవనః కృష్ణో లాలాభక్ష శ్చ దారుణః ॥ 3 ॥

తథా పూయవహః పాపో వహ్నిజ్వాలో హ్యధశ్శిరాః ।
సదంశః కృష్ణసూత్రశ్చ తమశ్చావీచి రేవ చ ॥ 4 ॥

శ్వభోజనోఽథాప్రతిష్ఠో హ్యావీచిశ్చ తథాపరః ।
ఇత్యేవమాదయశ్చాన్యే నరకా భృశదారుణాః ॥ 5 ॥

రౌరవం, శౌకరం, రోధం, తానం, విశసనం, మహాజ్వాలం, తప్తకుంభం, మహాలోభం, విమోహనం, రుధిరాంధం, వైతరణి, కృమీశం, కృమిభోజనం, అసిపత్రవనం, కృష్ణం, భయంకర మైన లాలాభక్షం, పూయవహం, పాపం, వహ్నిజ్వాలం, అధశ్శిరం, సదంశం, కృష్ణసూత్రం, తమం, అవీచి, శ్వభోజనం, అప్రతిష్ఠం, ఆవీచి, మొదలైనవి నరకలోకాలు. ఇంకా భయంకరమైన నరకలోకాలు ఎన్నో ఉన్నాయి.

యమస్య విషయే ఘోరా శ్శస్త్రాగ్నిభయదాయినః ।
పతన్తి యేషు పురుషాః పాపకర్మరతాశ్చ యే ॥ 6 ॥

ఈలోకాలు యమధర్మరాజు పరిపాలనలో ఉంటాయి. ఇవి భయంకరమైన ఆయుధాలు, అగ్ని, (మొదలైన వాటిచేత) భయం పుట్టిస్తాయి. పాపపుపనులు చేసేవాళ్లు ఈనరకలోకాలలో వచ్చి పడతారు.

కూటసాక్షీ తథా సమ్యక్ పక్షపాతేన యో వదేత్ ।
య శ్చాన్య దనృతం వక్తి స నరో యాతి రౌరవమ్ ॥ 7 ॥

అబద్ధపుసాక్ష్యం చెప్పేవాడూ, పక్షపాతంతో మాట్లాడేవాడూ, అసత్యం మాట్లాడేవాడూ రౌరవం అనే నరకానికి వెళ్తాడు.

భ్రూణహా గురుహన్తా చ గోఘ్నశ్చ మునిసత్తమాః ।
యాన్తి తే రౌరవం ఘోరం య శ్చోచ్ఛ్వాసనిరోధకః ॥ 8 ॥

మునిశ్రేష్ఠులారా, గర్భంలో ఉన్నశిశువును చంపినవాడూ, గురువును చంపినవాడూ, ఊపిరి ఆపినవాడూ (ఊపిరాడకుండా చేసి చంపినవాడు) భయంకరమైన రౌరవనరకానికి వెళ్తాడు.

సురాపో బ్రహ్మహా హర్తా సువర్ణస్య చ శూకరే ।
ప్రయాతి నరకే యశ్చ తై స్సంసర్గ ముపైతి చ ॥ 9 ॥

కల్లు తాగినవాడూ, బ్రాహ్మణుడిని చంపినవాడూ, బంగారం దొంగిలించినవాడూ, వీరితో కలిసి తిరిగేవాడూ, శూకరం అనే నరకానికి వెళ్తారు.

రాజన్యవైశ్యహన్తా చ తథైవ గురుతల్పగః ।
తప్తకుమ్భే స్వసృగామీ హన్తి రాజభటం చ యః ॥ 10 ॥

క్షత్రియులనూ, వైశ్యులనూ చంపినవాడూ, గురువుగారిభార్యనూ, అక్కాచెల్లెళ్లనూ పొందినవాడూ, రాజభటులను చంపినవాడూ, తప్తకుంభం అనే నరకలోకానికి వెళ్తాడు.

సాధ్వీవిక్రయకృన్ మద్య పాలః కేసరవిక్రయీ ।
తప్తలోహే పత న్త్యేతే య శ్చ భక్తం పరిత్యజేత్ ॥ 11 ॥

భార్యను అమ్ముకున్నవాడూ, మద్యాన్ని రక్షించేవాడూ, కేసరాన్ని అమ్మేవాడూ, సేవకుడిని పోషించకుండా వదిలేసినవాడూ, తప్తలోహం అనే నరకలోకానికి వెళ్తాడు.

సుతాం స్నుషాం చాపి గత్వా మహాజ్వాలే నిపాత్యతే ।
అవమన్తా గురూణాం యో యశ్చాక్రోష్టా నరాధమః ॥ 12 ॥

కూతురిని పొందినవాడూ, కోడలిని పొందినవాడూ, గురువులను (పెద్దవారిని) అవమానించినవాడూ, ఇతరులను నిందించినవాడూ, మహాజ్వాలం అనే నరకానికి వెళ్తాడు.

వేదదూషయితా యశ్చ వేదవిక్రయకశ్చ యః ।
అగమ్యగామీ యశ్చస్యాత్తే యాన్తి శబలం ద్విజాః ॥ 13 ॥

బ్రాహ్మణులారా, వేదాలను నిందించేవాడూ, వేదవిద్యను అమ్ముకునేవాడూ, పొందరానివారిని పొందేవాడూ, శబలం అనే నరకానికి వెళ్తాడు.

చోరో విమోహే పతతి మర్యాదాదూషక స్తథా ।
దేవద్విజపితృద్వేష్టా రత్నదూషయితా చ యః ।
స యాతి కృమిభక్ష్యే వై కృమీశే తు దురిష్టకృత్ ॥ 14 ॥

దొంగతనం చేసినవాడూ, ధర్మాన్ని నిందించేవాడూ, విమోహం అనే నరకానికి వెళ్తాడు. దేవతలనూ బ్రాహ్మణులనూ, పితరులనూ ద్వేషించేవాడూ, రత్నాలను నిందించేవాడూ, కృమిభక్ష్యం అనేనరకానికి వెళ్తాడు. ఇతరులకు కీడు చేసే, దుర్మార్గమైన యాగాలు చేసినవాడు కృమీశం అనేనరకానికి వెళ్తాడు.

పితృదేవాతిథీన్ యస్తు పర్యశ్నాతి నరాధమః ।
లాలాభక్ష్యే స యాత్యుగ్రే శరకర్తా చ వేధకే ॥ 15 ॥

పితరులను, దేవతలను, అతిథులను విడిచి తాను మాత్రమే తినేవాడు భయంకరమైన లాలాభక్ష్యం అనే నరకానికి వెళ్తాడు. బాణాలు తయారుచేసేవాడు వేధకం అనే నరకానికి వెళ్తాడు.

కరోతి కర్ణినో యశ్చ యశ్చ ఖడ్గాదికృన్నరః ।
గచ్ఛన్త్యేతే విశసనే నరకే భృశదారుణే ॥ 16 ॥

కర్ణి అనే రకమైనబాణాలు, కత్తులు మొదలైన ఇతరఆయుధాలను తయారుచేసినవాడూ మిక్కిలిభయంకరమైన విశసనం అనే నరకానికి వెళ్తారు.

అసత్ప్రతిగ్రహీతా చ నరకే యా త్యధోముఖే ॥ 17 ॥

అయోగ్యులనుండి దానం పుచ్చుకున్నవాడు అధోముఖం అనే నరకానికి వెళ్తాడు.

అయాజ్యయాజక స్తత్ర తథా నక్షత్రసూచకః ।
కృమిపూయే నర శ్చైకో యాతి మిష్టాన్నభుక్ సదా ॥ 18 ॥

అయోగ్యులైనవారిచేత యజ్ఞం చేయించినవాడూ, నక్షత్రాలను గురించి తెలిపేవాడూ, (శాస్త్రం తెలియకుండా, జ్యోతిషం చెప్పేవాడు) నిత్యమూ రుచిగలిగిన పదార్థాలను (ఇతరులకు పెట్టకుండా రహస్యంగా) తినేవాడూ, కృమిపూయం అనే నరకానికి వెళ్తాడు.

లాక్షామాంసరసానాం చ తిలానాం లవణస్య చ ।
విక్రేతా బ్రాహ్మణో యాతి త మేవ నరకం ద్విజాః ॥ 19 ॥

బ్రాహ్మణులారా, లక్కనూ, మాంసాన్నీ, భోజనాన్నీ, నువ్వులనూ, ఉప్పునూ అమ్మే బ్రాహ్మణుడు కూడ కృమిపూయం అనే నరకానికి వెళ్తాడు.

మార్జారకుక్కుటచ్ఛాగ శ్వవరాహవిహంగమాన్ ।
పోషయన్ నరకం యాతి తమేవ ద్విజసత్తమాః ॥ 20 ॥

విప్రవరులారా, పిల్లులనూ, కోళ్లనూ, మేకలనూ, కుక్కలనూ, పందులనూ, పక్షులనూ పెంచేవాడు కూడ కృమిపూయం అనే నరకానికే వెళ్తాడు.

రఙ్గోపజీవీ కైవర్తః కుణ్డాశీ గరద స్తథా ।
సూచీ మాహిషికశ్చైవ పర్వగామీ చ యో ద్విజః ॥ 21 ॥

అగారదాహీ మిత్రఘ్న శ్శకునిగ్రామయాజకః ।
రుధిరాన్ధే పత న్త్యేతే సోమం విక్రీణతే చ యే ॥ 22 ॥

నాట్యం వృత్తి చేసుకుని దానితో బ్రతికేవాడూ, చేపలు పట్టేవాడూ, భర్త బ్రతికుండగా రంకుమగడికి పుట్టినసంతానం (కుండులు) పెట్టినఅన్నం తిన్నవాడూ, విషం ఇచ్చినవాడూ, తప్పు చేసినవాడిని రక్షించేసాక్ష్యం చెప్పేవాడూ, వ్యభిచారం చేసే స్త్రీలను కోరుకునేవాడూ, పండుగరోజులలో స్త్రీని పొందేబ్రాహ్మణుడూ, ఇళ్లు తగలబెట్టే వాడూ, స్నేహితుడికి అపకారం చేసినవాడూ (నమ్మించి మోసం చేసేవాడు), శకునాలు చెప్పేవాడూ, గ్రామ పురోహితుడూ, సోమరసాన్ని అమ్మేవాడూ, రుధిరాంధం అనే నరకానికి వెళ్తారు.

మధుహా గ్రామహన్తా చ యాతి వైతరణీం నరః ॥ 23 ॥

తేనెను దొంగిలించేవాడూ, ఊరికి కీడు చేసేవాడూ, వైతరణి అనే నరకానికి వెళ్తాడు.

రేతఃపానాదికర్తారో మర్యాదాభేదినశ్చ యే ।
తే కృచ్ఛ్రే యా న్త్యశౌచా శ్చ కుహకాజీవినశ్చ యే ।
అసిపత్రవనం యాతి వనచ్ఛేదీ వృథైవ యః ॥ 24 ॥

వీర్యాన్ని తాగటం మొదలైన నీచపుపనులు చేసినవాడూ, ఆచారం కట్టుబాట్లను ఉల్లంఘించినవాడూ, ఇతరులను మోసంచేసి బతికేవాడూ, వ్యర్థంగా అడవులను (చెట్లను) నరికేవాడూ అసిపత్రవనం అనే నరకానికి వెళ్తాడు.

ఔరభ్రికా మృగవ్యాధా వహ్నిజ్వాలే పతన్తి వై ।
యాన్తి తత్రైవ తే విప్రా యశ్చాపాకేషు వహ్నిదః ॥ 25 ॥

గొఱ్ఱెలపై ఆధారపడి బ్రతికేవాడూ, జంతువులను వేటాడి జీవించేవాడూ, వహ్నిజ్వాలం అనే నరకంలో పడతారు. వండగూడని పదార్థాలకు నిప్పు పెట్టిన(వండిన) బ్రాహ్మణుడు కూడ వహ్నిజ్వాలం అనే నరకానికే వెళ్తాడు.

వ్రతోపలోపకో య శ్చ స్వాశ్రమా ద్విచ్యుత శ్చ యః ।
సదంశయాతనామధ్యే పతత స్తా వుభా వపి ॥ 26 ॥

వ్రతాలు ఆచరించడంలో లోపం చేసినవాడూ, తన (బ్రహ్మచర్యం మొద లయిన) ఆశ్రమానికి సంబంధించిన ధర్మానికి విరుద్ధంగా ఆచరించేవాడూ, ఇద్దరూ సదంశం అనేనరకయాతనలు అనుభవిస్తారు.

దివా స్వప్నేషు స్కన్దన్తే యే నరా బ్రహ్మచారిణః ।
పుత్రై రధ్యాపితా యే తు తే పతన్తి శ్వభోజనే ॥ 27 ॥

పగటిపూట కలలుకంటూ వీర్యం స్థలించుకునే (పగలు నిద్రపోయే) బ్రహ్మచారులూ, కొడుకులవద్ద వేదవిద్య అధ్యయనం చేసేవారు శ్వభోజనం అనే నరకంలో పడతారు.

ఏతే చాన్యే చ నరకా శ్శతశోఽథ సహస్రశః ।
యేషు దుష్కృతకర్మాణః పచ్యన్తే యాతనాగతాః ॥ 28 ॥

ఇవే కాక ఇంకా వందలూ వేలూ నరకాలు ఎన్నో ఉన్నాయి. ఆ యా పాపపుకర్మలు చేసినవారు ఆ నరకాలలో పడి యాతనలు పడుతుంటారు.

తథైవ పాపాన్యేతాని తథాఽన్యాని సహస్రశః ।
భుజ్యన్తే జాతిపురుషై ర్నరకాన్తరగోచరైః ॥ 29 ॥

అలాగే ఇక్కడ చెప్పినవాటికంటె ఇతరమైనపాపాలు కూడ వేలకొద్దీ ఇంకా ఎన్నో ఉన్నాయి. ఆయాపాపాలు చేసినవారు ఆయానరకాలలో పడి వివిధమైన బాధలు అనుభవిస్తుంటారు.

వర్ణాశ్రమవిరుద్ధం చ కర్మ కుర్వన్తి యే నరాః ।
కర్మణా మనసా వాచా నిరయేషు పతన్తి తే ॥ 30 ॥

మనస్సు, వాక్కు, కాయము అనే త్రికరణాలతో, తమతమ (బ్రాహ్మణాది)వర్ణాలకు, (బ్రహ్మచర్యాది) ఆశ్రమాలకు విరుద్ధమైనకర్మలు చేసినమానవులు నరకాలలో పడిపోతారు.

అధశ్శిరోభి ర్దృశ్యన్తే నారకై ర్దివి దేవతాః ।
దేవా శ్చాధోముఖాన్ సర్వా నధః పశ్యన్తి నారకాన్ ॥ 31 ॥

నరకంలోనివాళ్లు తలక్రిందులుగా ఉంటారు. వీళ్లు దేవతలను చూస్తూంటే వారికి దేవతలు (పైన) తలక్రిందులుగా ఉన్నట్లు కనబడతారు. అదే విధంగా దేవతలకు నరకలోకవాసులు తమకు క్రిందిభాగంలో, తలక్రిందులుగా కనబడతారు.

స్థావరాః కృమయోఽబ్జాశ్చ పక్షిణః పశవో నరాః ।
ధార్మికా స్త్రిదశా స్తద్వ న్మోక్షిణశ్చ యథాక్రమమ్ ॥ 32 ॥

జడవస్తువులు, పురుగులు, జలజీవులు, పక్షులు, పశువులు, మానవులు, ధర్మపరాయణులు (అయిన మానవోత్తములు), దేవతలు, మోక్షం పొందినవారు అనే వరుసలో జీవులు జన్మలు ఎత్తి, క్రమంగా ముక్తిని పొందుతారు.

సహస్రభాగః ప్రథమాద్ ద్వితీయోఽనుక్రమాత్తథా ।
సర్వేహ్యేతే మహాభాగా యావన్ముక్తిసమాశ్రితాః ॥33 ॥

ఈ వరుసలో ముందరివారికంటె తరువాతివారు క్రమంగా వేయవవంతు అధికం. ఇలా మోక్షం పొందేవరకు వీరు అందరూ మహాత్ములు అవుతారు. (అచరాలకంటె, పురుగులు అనేక్రమంలో ఒకరికంటె తరువాతివారుగా ఈజీవులు ముక్తిసాధనలో సన్నిహితులు అవుతారు)

యావన్తో జన్తవ స్స్వర్గే తావన్తో నరకౌకసః ।
పాపకృద్ యాతి నరకం ప్రాయశ్చిత్తపరాఙ్ముఖః ॥ 34 ॥

స్వర్గంలో ఎంతమంది జీవులు ఉన్నారో నరకంలో కూడ అంతమంది జీవులు నివసిస్తుంటారు. పాపకర్మలు చేసి, వాటికి ప్రాయశ్చిత్తం చేసుకోవడానికి ఇష్టపడనివారు నరకాలకు పోతారు.

పాపానా మనురూపాణి ప్రాయశ్చిత్తాని యద్ యథా ।
తథా తథైవ సంస్మృత్య ప్రోక్తాని పరమర్షిభిః ॥ 35 ॥

ఏయే పాపానికి ఏది ప్రాయశ్చిత్తమో ఆయాపాపాలకు అనుగుణంగా మహర్షులు పరిశోధించి, స్మృతిగ్రంథాలలో నిర్ణయించారు.

పాపే గురూణి గురుణి స్వల్పా న్యల్పే చ తద్విదః ।
ప్రాయశ్చిత్తాని విప్రేన్ద్రా జగు స్స్వాయమ్భువాదయః ॥ 36 ॥

బ్రాహ్మణోత్తములారా, పెద్దపాపానికి ప్రాయశ్చిత్తం కూడ పెద్దదిగానే ఉంటుంది. చిన్నపాపానికి ప్రాయశ్చితం చిన్నదిగా ఉంటుంది. స్వాయంభువుడు మొదలైన మనువులు ఈప్రాయశ్చిత్తాలను వివరించారు.

ప్రాయశ్చిత్తా న్యశేషాణి తపఃకర్మాత్మకాని వై ।
యాని తేషా మశేషాణాం కృష్ణానుస్మరణం పరమ్ ॥ 37 ॥

తపోరూపంలోనూ, వివిధకర్మలరూపంలోనూ ప్రాయశ్చిత్తాలు అసంఖ్యాకంగా ఉన్నాయి. అయితే చిన్నా, పెద్దా ప్రాయశ్చిత్తాలు అన్నింటికీ బదులుగా కృష్ణ నామస్మరణం ఒక్కటే సరి అయినప్రాయశ్చిత్తం.

కృతే పాపేఽనుతాపో వై యస్య పుంసః ప్రజాయతే ।
ప్రాయశ్చిత్తం తు తస్యైకం హరిసంస్మరణం పరమ్ ॥ 38 ॥

పాపం చేసినవాడు తరువాత తప్పు చేశానని బాధ గలిగితే అదే ప్రాయశ్చిత్తం. దానికి హరినామస్మరణం ఒక్కటే ఉత్తమమైనమార్గం.

ప్రాత ర్నిశి తథా సన్ధ్యా మధ్యాహ్నాదిషు సంస్మరన్ ।
నారాయణ మవాప్నోతి సద్యః పాపక్షయా న్నరః ॥ 39 ॥

ఉదయమూ, రాత్రీ, సంధ్యాసమయమూ, మధ్యాహ్నకాలాలలో నారాయణ నామాన్ని స్మరించాలి. నామాన్ని స్మరించినవెంటనే పాపం నశించిపోతుంది. ఆమానవుడు శ్రీమన్నారాయణుడిని పొందుతాడు.

విష్ణుసంస్మరణాత్ క్షీణ సమస్తక్లేశసఞ్చయః ।
ముక్తిం ప్రయాతి స్వర్గాప్తి స్తస్య విఘ్నోఽనుమీయతే ॥ 40 ॥

శ్రీమహావిష్ణువును స్మరించడంచేత (ఎప్పు డెప్పుడో చేసిన) కష్ట(పాప)పరంపరలు అన్నీ నశించిపోతాయి. వాడు మోక్షానికి వెళ్తాడు. విష్ణునామస్మరణం చేసేవాడు స్వర్గలోకం కూడ మోక్షానికి విఘ్నంగా భావిస్తాడు.

వాసుదేవే మనో యస్య జపహోమార్చనాదిషు ।
తస్యాన్తరాయో విప్రేన్ద్రా దేవేన్ద్రత్వాదికం ఫలమ్ ॥ 41 ॥

వాసుదేవునియందూ, జపమూ, హోమమూ, పూజనమూ, మొదలైన కర్మలు ఆచరించడంలోనూ మనసు లగ్నమైనవాడికి దేవేంద్రపదవి మొదలైనవి కూడ అవరోధాలు అనిపిస్తాయి. (స్వర్గాదికసుఖాలను తిరస్కరిస్తారు)

క్వ నాకపృష్ఠగమనం పునరావృత్తిలక్షణమ్ ।
క్వ జపో వాసుదేవేతి ముక్తిబీజ మనుత్తమమ్ ॥ 42 ॥

(పుణ్యఫలం అయిపోయినతరువాత) తిరిగి వెనక్కి వచ్చి భూలోకంలో పుట్టవలసిఉన్న (క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి) స్వర్గం వెంటబడిపోవడ మెక్కడ? సర్వోత్తమమూ, మోక్షానికి మూలసాధనమూ అయిన 'వాసుదేవ' మంత్రజపం ఎక్కడ?

తస్మా దహర్నిశం విష్ణుం సంస్మరన్ పురుషో ద్విజః ।
న యాతి నరకం శుద్ధ స్సంక్షీణాఖిలపాతకః ॥ 43 ॥

అందుచేత మానవుడు రాత్రింబగళ్లు శ్రీమహావిష్ణువును స్మరించాలి. ఆవిధంగా స్మరించినవాడికి సమస్త మయిన పాపాలు నశించిపోతాయి. వాడు ఎంతమాత్రమూ నరకానికి వెళ్లడు.

మనఃప్రీతికర స్స్వర్గో నరక స్తద్విపర్యయః ।
నరకస్వర్గసంజ్ఞే వై పాపపుణ్యే ద్విజోత్తమాః ॥ 44 ॥

బ్రాహ్మణోత్తములారా, స్వర్గంవల్ల మనసు ఆనందిస్తుంది. నరకంవల్ల కష్టపడుతుంది. నరకం అంటే పాపం, స్వర్గం అంటే పుణ్యం. అంతకంటె వేరుగా ఏమీ లేదు.

వస్త్వేక మేవ దుఃఖాయ సుఖా యేర్ష్యోద్భవాయ చ ।
కోపాయ చ యత స్తస్మాద్ వస్తు దుఃఖాత్మకం కుతః ॥ 45 ॥

వస్తువు ఒక్కటే. కాని దానివల్లనే ఒకసందర్భంలో సంతోషం, మరొకసందర్భంలో దుఃఖం,అలాగే ఈర్ష్య, కోపం మొదలైన భావాలు కలుగుతాయి. కాబట్టి వస్తువేదైనా దానిలక్షణం దుఃఖమే. అని ఎందుకుచెప్పాలి.

తదేవ ప్రీతయే భూత్వా పునర్దుఃఖాయ జాయతే ।
తదేవ కోపాయ యతః ప్రసాదాయ చ జాయతే ॥ 46 ॥

వస్తువొకటే. అదే సంతోషం గలిగిస్తున్నది. మళ్లీ అదే బాధ పుట్టిస్తుంది. అదే కోపం కలగడానికి కారణం అవుతున్నది. అదే శాంతినీ కలిగిస్తుంది.

తస్మాద్ దుఃఖాత్మకం నాస్తి న చ కిఞ్చిత్ సుఖాత్మకమ్ ।
మనసః పరిణామోఽయం సుఖదుఃఖాదిలక్షణః ॥ 47 ॥

అందుచేత సృష్టిలో ఏవస్తువూ కేవలం దుఃఖకారణం కాదు. అలాగే కేవలం సుఖం మాత్రమే ఇచ్చేదీ కాదు. మనసులో కలిగే మార్పే సుఖమో, దుఃఖమో అవుతుంది.

జ్ఞాన మేవ పరం బ్రహ్మ జ్ఞానం బన్ధాయ చేష్యతే ।
జ్ఞానాత్మక మిదం విశ్వం న జ్ఞానా ద్విద్యతే పరమ్ ।
విద్యావిద్యే హి భో విప్రా జ్ఞాన మే వావధార్యతామ్ ॥ 48 ॥

కాబట్టి జ్ఞానమే సర్వోత్తమమైనబ్రహ్మస్వరూపం. లౌకికమైనవిజ్ఞానం ఈలోకంతో బంధాలను పెంచుతుంది. ఈసమస్తం కూడ జ్ఞానలక్షణమే. (పారమార్థిక) జ్ఞానంకంటె మించినది లేదు. ద్విజవరులారా, అవే విద్య, అవిద్యలు బ్రహ్మజ్ఞానం విద్య. లౌకికమైనశాస్త్రాదిజ్ఞానం అవిద్య. అని గ్రహించండి.

ఏవమేతన్మయాఽఽఖ్యాతం భవతాం మణ్డలం భువః ।
పాతాలాని చ సర్వాణి తథైవ నరకా ద్విజాః ॥ 49 ॥

ద్విజవరులారా! ఈవిధంగా భూమండలమూ, సమస్తమైనపాతాళలోకాలూ, అలాగే వివిధనరకలోకాలను గురించి చెప్పాను.

సముద్రాః పర్వతాశ్చైవ ద్వీపా వర్షాణి నిమ్నగాః ।
సంక్షేపాత్ సర్వమాఖ్యాతం కిం భూయ శ్రోతుమిచ్ఛథ ॥ 50 ॥

సముద్రాలూ, పర్వతాలూ, ద్వీపాలూ, భూభాగాలూ, నదులూ, అనే వాటిని గురించి సమస్తవిషయాలూ సంగ్రహంగా చెప్పడం జరిగింది. ఇంక తరువాత మీరు ఏమి వినగోరుతున్నారు? (అని లోమహర్షణుడు మునులను అడిగాడు.)

ఇతి శ్రీబ్రహ్మపురాణే పాతాలనరకకీర్తనం నామ వింశోఽధ్యాయః ॥ 20 ॥

శ్రీబ్రహ్మపురాణంలో పాతాలనగరకీర్తనం అనే ఇరవైయవ అధ్యాయం సంపూర్ణం.



ఏకవింశోఽ ధ్యాయః - ఇరవైఒకటవ అధ్యాయం

భూర్భువస్స్వరాదికీర్తనమ్ - భూర్భువస్స్వరాదికీర్తనం

మునయ ఊచుః : - లోమహర్షణుడితో నైమిశారణ్యంలోని మునులు ఈవిధంగా అన్నారు.

కథితం భవతా సర్వమస్మాకం సకలం తథా ।
భువర్లోకాదికాన్ లోకాన్ శ్రోతుమిచ్ఛామహే వయమ్ ॥ 1 ॥

మహాత్మా, నీవు అన్ని (పాతాళాదులైన అధోలోకాల) విషయాలు మాకు సమగ్రంగా చెప్పావు. మేము ప్రస్తుతం భువర్లోకం మొదలైన (ఊర్ధ్వ)లోకాలను గురించి వినాలని కోరుకుంటున్నాం.

తథైవ గ్రహసంస్థానం ప్రమాణాని యథా తథా ।
సమాచక్ష్వ మహాభాగ యథావల్లోమహర్షణ ॥ 2 ॥

మహాత్మా, లోమహర్షణ, భువరాదిలోకాలతోపాటు గ్రహాలు ఎక్కడ ఉన్నాయో, వాటిపరిమాణం ఎంతో ఉన్న దున్నట్లుగా వివరించి చెప్పు.

లోమహర్షణ ఉవాచ :-లోమహర్షణుడు మునులతో ఈవిధంగా చెప్పాడు.

రవిచన్ద్రమసోర్యావన్మయూఖైరవభాస్యతే ।
ససముద్రసరిచ్ఛైలా తావతీ పృథివీ స్మృతా ॥ 3 ॥

సూర్యచంద్రులకిరణాలు ఎంతదూరంవరకు ప్రకాశిస్తాయో, సముద్రాలూ, నదులూ, పర్వతాలతో కూడిఉన్న అంతమేర భూమి భూలోకం అని చెప్పబడింది. (శివ. ఉమా. 29అధ్యాయం)

యావత్ప్రమాణా పృథివీ విస్తారపరిమణ్డలా ।
నభస్తావత్ ప్రమాణం హి విస్తారపరిమణ్డలమ్ ॥ 4 ॥

భూలోకం ఎంత వైశాల్యంతో గుండ్రంగా ఉన్నదో, ఆకాశం కూడ అంతే వైశాల్యం, గుండ్రని ఆకారమూ కలిగిఉన్నది.

భూమేర్యోజనలక్షే తు సౌరం విప్రాస్తు మణ్డలమ్ ।
లక్షే దివాకరాచ్చాపి మణ్డలం శశినః స్థితమ్ ॥ 5 ॥

ద్విజులారా, భూలోకానికి పైన లక్షయోజనాల దూరంలో సూర్యమండలం ఉన్నది. సూర్యమండలం నుండి ఇంకా పైన లక్షయోజనాలదూరంలో చంద్రమండలం ఉన్నది.

పూర్ణే శతసహస్రే తు యోజనానాం నిశాకరాత్ ।
నక్షత్రమణ్డలం కృత్స్న ముపరిష్టాత్ ప్రకాశతే ॥ 6 ॥

చంద్రమండలంనుండి లక్షయోజనాలదూరంలో ఇంకా పైన మొత్తం నక్షత్రమండలం ప్రకాశిస్తున్నది.

ద్విలక్షే చోత్తరే విప్రా బుధో నక్షత్రమణ్డలాత్ ।
తావత్ ప్రమాణభాగే తు బుధస్యాప్యుశనా స్థితః ॥ 7 ॥

బ్రాహ్మణులారా, నక్షత్రమండలంనుండి ఇంకా పైన రెండులక్షలయోజనాలదూరంలో బుధగ్రహమండలం ఉన్నది. బుధమండలం నుండి ఇంకా పైన అంతే (రెండులక్షలయోజనాల)దూరంలో శుక్రగ్రహమండలం ఉన్నది.

అఙ్గారకోఽపి శుక్రస్య తత్ప్రమాణో వ్యవస్థితః ।
లక్షద్వయేన భౌమస్య స్థితో దేవపురోహితః ॥ 8 ॥

శుక్రమండలం నుండి ఇంకా పైన అంతే (రెండులక్షలయోజనాల)దూరంలో అంగారకగ్రహమండలం ఉన్నది. అంగారక మండలం నుండి ఇంకా పైన రెండులక్షలయోజనాలదూరంలో గురుగ్రహమండలం ఉన్నది.

సౌరిర్బృహస్పతేరూర్ధ్వం ద్విలక్షే సమవస్థితః ।
సప్తర్షిమణ్డలం తస్మాల్లక్షమేకం ద్విజోత్తమాః ॥ 9 ॥

బ్రాహ్మణవరులారా, గురుమండలంనుండి ఇంకా పైన రెండులక్షలయోజనాలదూరంలో శనిగ్రహమండలం ఉన్నది. శనిమండలంనుండి ఇంకా పైన లక్షయోజనాలదూరంలో సప్తర్షిమండలం ఉన్నది.

ఋషిభ్యస్తు సహస్రాణాం శతాదూర్ధ్వం వ్యవస్థితః ।
మేఢీభూతస్సమస్తస్య జ్యోతిశ్చక్రస్య వై ధ్రువః ॥ 10 ॥

సప్తర్షిమండలంనుండి ఇంకా పైన లక్షయోజనాలదూరంలో ధ్రువమండలం ఉన్నది. ధ్రువమండలం సమస్తమైనగ్రహనక్షత్ర మండలాలకు కేంద్రస్థానం. (దీనిని ఆధారం చేసుకునే గ్రహనక్షత్రమండలం నిలిచి ఉంటుంది)

త్రైలోక్యమేతత్ కథితం సంక్షేపేణ ద్విజోత్తమాః ।
ఇజ్యాఫలస్య భూరేషా ఇజ్యా చాత్ర ప్రతిష్ఠితా ॥ 11 ॥

విప్రవరేణ్యులారా, ముల్లోకాలను గురించి (ఊర్ధ్వ, అధో, మధ్య, లోకాలు) సంగ్రహంగా చెప్పాను. ఈ భూమండలం యజ్ఞాలఫలాన్ని ఇచ్చేలోకం. యజ్ఞకర్మ ఈ భూలోకంలో స్థాపింపబడింది.

ధ్రువాదూర్ధ్వం మహర్లోకో యత్ర తే కల్పవాసినః ।
ఏకయోజనకోటీషు మహర్లోకో విధీయతే ॥ 12 ॥

ధ్రువలోకానికి పైన కోటియోజనాలదూరంలో మహర్లోకం ఉంది. కల్పాంతంలో (నశించకుండా) మిగిలి ఉండేవాళ్లు మహర్లోకంలో నివసిస్తుంటారు.

ద్వే కోట్యౌ తు జనో లోకో యత్ర తే బ్రహ్మణస్సుతాః ।
సనన్దనాద్యాః కథితా విప్రాశ్చామలచేతసః ॥ 13 ॥

ద్విజులారా, మహర్లోకానికి పైన రెండుకోట్లయోజనాలదూరంలో జనోలోకం ఉన్నది. బ్రహ్మమానసపుత్రులైన సనందనుడు మొదలైనవారు జనోలోకంలో నివసిస్తుంటారు. వారు పుణ్యాత్ములు.

చతుర్గుణోత్తరం చోర్ధ్వం జనోలోకాత్తపః స్మృతమ్ ।
వైరాజా యత్ర తే దేవాః స్థితా దేహవివర్జితాః ॥ 14 ॥

జనోలోకానికి పైన (నాలుగురెట్లు అధికం) ఎనిమిదికోట్లయోజనాలదూరంలో తపోలోకం ఉన్నది. అక్కడ శరీరం లేని వైరాజులు అనే దేవతలు నివసిస్తుంటారు.

షడ్గుణేన తపోలోకాత్ సత్యలోకో విరాజతే ।
అపునర్మారకం యత్ర బ్రహ్మలోకో హి సంస్మృతః ॥ 15 ॥

తపోలోకానికి పైన దానికి ఆరురెట్లు అధికమయిన దూరంలో అంటే నలభై ఎనిమిదికోట్లయోజనాల దూరంలో సత్యలోకం ప్రకాశిస్తున్నది. దీనికే బ్రహ్మలోకం అని ప్రసిద్ధి. ఈలోకంలో నివసించేవారికి మళ్లీ చావటం (పుట్టటం) ఉండదు.

పాదగమ్యం తు యత్కిఞ్చిద్ వస్త్వస్తి పృథివీమయమ్ ।
స భూర్లోకస్సమాఖ్యాతో విస్తారోఽస్య మయోదితః ॥ 16 ॥

కాళ్లతో నడిచి, వెళ్లదగిన నేలతో నిండినదానిని భూలోకం అంటారు. దీనివైశాల్యం గూర్చి ఇంతకుముందు చెప్పాను.(16.అ)

భూమిసూర్యాన్తరం యచ్చ సిద్ధాదిమునిసేవితమ్ ।
భువర్లోకస్తు సో ప్యుక్తో ద్వితీయో మునిసత్తమాః ॥ 17 ॥

మునివరులారా, ఊర్ధ్వలోకాలలో రెండవది భువర్లోకం. ఇది భూమికీ, సూర్యుడికీ నడుమ ఉన్నది. సిద్ధులు మునులు మొదలైనవారు ఈ లోకంలో సంచరిస్తారు. దీనివైశాల్యం కూడ చెప్పాను.

ధ్రువసూర్యాన్తరం యత్తు నియుతాని చతుర్దశ ।
స్వర్లోక స్సోఽపి కథితో లోకసంస్థానచిన్తకైః ॥ 18 ॥

సూర్యుడికీ, ధ్రువుడికీ నడుమ స్వర్లోకం ఉన్నది. ఇది పధ్నాలుగులక్షలయోజనాలవైశాల్యం గలిగిఉంటుంది. లోకాలఉనికిని గురించి పరిశోధించినవారు దీనిని గురించి కూడ వివరించారు.

త్రైలోక్యమేతత్ కృతకం విప్రైస్తు పరిపఠ్యతే ।
జనస్తపస్తథా సత్యమితి చాకృతకం త్రయమ్ ॥ 19 ॥

వేదవేత్తలు భూర్, భువర్, స్వర్లోకాలు మూడింటిని కృతకలోకాలు అని పేర్కొంటారు. తరువాత ఉన్న జనస్, తపస్, సత్య లోకాలు మూడింటిని అకృతకలోకాలు అని చెప్తారు.

కృతకాకృతకో మధ్యే మహర్లోక ఇతి స్మృతః ।
శూన్యో భవతి కల్పాన్తే యోఽత్యన్తం న వినశ్యతి ॥ 20 ॥

కృతకలోకాలకూ, అకృతకలోకాలకూ నడుమ ఉన్నది మహర్లోకం. దీనిని కృతకాకృతకలోకం అంటారు. కల్పం ముగిసిన తరువాత అన్నిలోకాలు నశించిపోతాయి. కాని ఈమహర్లోకం మాత్రం నశించదు. శూన్యం అయిపోతుంది.

ఏతే సప్త మహాలోకా మయా వః కథితా ద్విజాః ।
పాతాలాని చ సప్తైవ బ్రహ్మాణ్డస్యైష విస్తరః ॥ 21 ॥

బ్రాహ్మణులారా, ఇవి మొత్తం సప్తలోకాలు (మూడు కృతకాలు, మూడు అకృతకాలు, ఒకటి కృతకాకృతకం). పాతాళ (అధో)లోకాలు కూడ ఏడు. వాటిని గురించి ఇంతకు ముందు మీకు చెప్పాను. (19.అ) ఈవిధంగా బ్రహ్మాండం (పధ్నాలుగులోకాలతో) విస్తరించి ఉన్నది.

ఏతదణ్డకటాహేన తిర్యగూర్ధ్వమధస్తథా ।
కపిత్థస్య యథా బీజం సర్వతో వై సమావృతమ్ ॥ 22 ॥

ఈ బ్రహ్మాండగోళం అణ్డమనెడు బూర్లమూకుడుతో ప్రక్కలలోనూ, పైనా, క్రిందా, అన్నివైపులా వెలగపండు గింజలాగా, పూర్తిగా ఆవరింపబడి ఉంది. (బ్రహ్మాండం వెలగపండులాగా గోళాకారంలో ఉన్నది. వెలగపండులో గింజలవలె ఊర్ధ్వ, అధోలోకాలు బ్రహ్మాండ మంతటా నిండి ఉన్నాయి. ఇటువంటి బ్రహ్మాండాలు అనేకంగాఉన్నాయి.)

దశోత్తరేణ పయసా ద్విజాశ్చాణ్డం చ తద్వృతమ్ ।
స చామ్బుపరివారోऽసౌ వహ్నినా పరివేష్టితః ॥ 23 ॥

విప్రులారా, ఈబ్రహ్మాండాన్ని ఆవరించి (చుట్టూ), దీనికి పదిరెట్లు అధికమైనపరిమాణంలో నీరు ఉన్నది. ఆ నీటిచుట్టూ నిప్పు ఆవరించుకునిఉన్నది.

వహ్నిస్తు వాయునా వాయుర్విప్రాస్తు నభసాऽऽవృతః ।
ఆకాశోऽపి మునిశ్రేష్ఠా మహతా పరివేష్టితః ॥ 24 ॥

బ్రాహ్మణులారా, ఆ అగ్నిచుట్టూ వాయువు వ్యాపించి ఉంది. ఆ వాయువు చుట్టూ ఆకాశం వ్యాపించి ఉంది. మునివరులారా, ఆ ఆకాశం కూడ మహత్తుచేత ఆవరింపబడి ఉంది.

దశోత్తరాణ్యశేషాణి విప్రాశ్చైతాని సప్త వై ।
మహాన్తం చ సమావృత్య ప్రధానం సమవస్థితమ్ ॥ 25 ॥

ద్విజులారా, మహత్తును ఆవరించి ప్రధానం ఉన్నది. ఈ యేడూ (నేల, నీరు, నిప్పు, గాలి, నింగి, మహత్తు, ప్రధానం) ముందరి దానికంటె తరువాతవి పదిరెట్లు అధికంగా పరిపూర్ణంగా విస్తరించి ఉన్నాయి.

అనన్తస్య న తస్యాన్తస్సంఖ్యానం చాపి విద్యతే ।
తదనన్తమసంఖ్యాతం ప్రమాణేనాపి వై యతః ।
హేతుభూతమశేషస్య ప్రకృతిస్సా పరా ద్విజాః ॥ 26 ॥

ప్రధానం ఏ కొలత ప్రకారం కూడ కొలవడానికీ, లెక్కించడానికీ వీలు లేదు. కాబట్టి దానికి అంతు లేదు. దానికొలత (పరిమాణం) తెలియదు. విప్రులారా, ఈ ప్రధానం సమస్తానికీ (బ్రహ్మాండాలు అన్నింటికీ-సృష్టి మొత్తానికీ) మూలకారణం. దీనినే పరా ప్రకృతి అంటారు.

అణ్డానాం తు సహస్రాణాం సహస్రాణ్యయుతాని చ ।
ఈదృశానాం తథా తత్ర కోటికోటిశతాని చ ॥ 27 ॥

(ఈ పరాప్రకృతి-ప్రధానంనుండి) బ్రహ్మాండాలు లక్షకోట్లసంఖ్యలో (అనంతంగా) ఏర్పడ్డాయి ఈ విధమైన బ్రహ్మాండాలు ఇంకా నూరుకోట్లకోట్లు (లెక్కించడానికి వీలు లేనన్ని) ఉన్నాయి.

దారుణ్యగ్నిర్యథా తైలం తిలే తద్వత్ పుమానిహ ।
ప్రధానేఽ వస్థితో వ్యాపీ చేతనాత్మనివేదనః ॥ 28 ॥

కట్టెలో నిప్పులాగా, నువ్వులలో నూనెలాగా, ప్రధానం(ప్రకృతి)లో పురుషుడు ఉన్నాడు. ఆపురుషుడు చైతన్యస్వరూపుడై, ఆత్మగా తెలియబడుతూ అన్నింటిలోనూ నిండి ఉంటాడు.

ప్రధానం చ పుమాంశ్చైవ సర్వభూతాత్మభూతయా ।
విష్ణుశక్త్యా ద్విజశ్రేష్ఠా ధృతౌ సంశ్రయధర్మిణౌ ॥ 29 ॥

విప్రవరేణ్యులారా, చరాచరమైన సృష్టి అంతటిలోనూ అంతర్యామిగా నెలకొన్న విష్ణుశక్తియే తనను (విష్ణుశక్తిని) ఆశ్రయించుకొని ఉండడమే ధర్మంగా కలిగిన ప్రకృతినీ, పురుషుడినీ నిలుపుతున్నది.

తయోస్సైవ పృథగ్భావే కారణం సంశ్రయస్య చ ।
క్షోభకారణభూతా చ సర్గకాలే ద్విజోత్తమాః ॥ 30 ॥

విప్రవరులారా, పరమాత్మను ఆశ్రయించుకుని ఉండడానికి గాని, పరమాత్మనుండి విడిపోవడానికి గాని, ఆ విష్ణుశక్తే కారణం. అలాగే సృష్టిసమయంలో (జడంగా ఉన్నదానిలో) సంచలనం కలగడానికి కూడ విష్ణుశక్తే కారణం.

యథా శైత్యం జలే వాతో బిభర్తి కణికాగతమ్ ।
జగచ్ఛక్తిస్తథా విష్ణోః ప్రధానపురుషాత్మకమ్ ॥ 31 ॥

నీటిబిందువులలోని చల్లదనం గాలిలో నిండినట్లుగా, విష్ణువులోని జగత్కారణమైన(సృష్టి)శక్తి ప్రధానపురుషులలో నిండి ఉంటుంది.

యథా చ పాదపో మూల స్కన్ధశాఖాది సంయుతః ।
ఆద్యబీజాత్ ప్రభవతి బీజాన్యన్యాని వై తతః ॥ 32 ॥

మొదటి విత్తనం నుండి వేళ్లు, కాండం, కొమ్మలు, మొదలైనవాటితో చెట్టు ఏర్పడుతుంది. తరువాత ఆ చెట్టునుండి మళ్లీ అదే చెట్టును పుట్టించడానికి తగిన విత్తనాలు ఏర్పడతాయి.

ప్రభవన్తి తతస్తేభ్యో భవన్త్యన్యే పరే ద్రుమాః ।
తేఽపి తల్లక్షణద్రవ్య కారణానుగతాస్స్మృతాః ॥ 33 ॥

ఆ విత్తనాలనుండి మళ్లీ అటువంటి చెట్లు వేరుగా ప్రత్యేకంగా (ఒక్కొక్కవిత్తనం నుండి ఒక్కటిగా, అనేకం) ఏర్పడతాయి. అవి కూడ మొదటివిత్తనం నుండి పుట్టిన చెట్టులాగానే ఆయా లక్షణాలు కలిగిన అవయవాలతో (వేళ్లు, కొమ్మలు మొ.) కూడినవే అవుతాయి.

ఏవమవ్యాకృతాత్ పూర్వం జాయన్తే మహదాదయః ।
విశేషాన్తాస్తతస్తేభ్యస్సంభవన్తి సురాదయః ॥ 34 ॥

ఈ విధంగా మొదట అవ్యక్తం నుండి మహత్తు, (అహంకారం, బుద్ధి) మొదలైనవి జన్మిస్తాయి. ఆ మహత్తు నుండి దేవతలు మొదలైనవారు పుడతారు.

తేభ్యశ్చ పుత్రాస్తేషాం చ పుత్రాణామపరే సుతాః ॥ 35 ॥

ఆ దేవతాదులకు పుత్రులు, ఆ పుత్రులకు మళ్లీ పుత్రులు ఈవిధంగా సృష్టి విస్తరించింది.

బీజాద్ వృక్షప్రరోహేణ యథా నాపచయస్తరోః ।
భూతానాం భూతసర్గేణ నైవాస్త్యపచయస్తథా ॥ 36 ॥

విత్తనం నుండి చెట్టు పుడుతుంది. ఆ చెట్టునుండి మళ్లీవిత్తనాలు, ఆ విత్తనాలనుండి చెట్లు పుడ్తాయి. అలా పుట్టినప్పటికీ ముందరి చెట్టు నశించకుండా నిలిచి ఉన్నట్లుగా, చరాచరవస్తుసముదాయం నుండి తిరిగి అదే చరాచర భూతకోటి జన్మించినప్పటికీ, పూర్వం ఉన్నభూతాలకు నాశం ఉండదు.

సన్నిధానాద్యథాఽఽకాశ కాలాద్యాః కారణం తరోః ।
తథైవాపరిణామేన విశ్వస్య భగవాన్ హరిః ॥ 37 ॥

చెట్టు ఉనికికి ఆకాశం, కాలం మొదలైనవి సన్నిహితంగా ఉండటమే కారణం అయినట్లుగా సమస్త ప్రపంచానికి కూడ ఏ విధమైనమార్పులు లేని పరమాత్ముడైన శ్రీహరే కారణం.

వ్రీహిబీజే యథా మూలం నాలం పత్రాఙ్కురౌ తథా ।
కాణ్డకోశస్తథా పుష్పం క్షీరం తద్వచ్చ తణ్డులః ॥ 38 ॥

తుషాః కణాశ్చ సన్తో వై యాన్త్యావిర్భావమాత్మనః ।
ప్రరోహహేతుసామగ్ర్యమాసాద్య మునిసత్తమాః ॥ 39 ॥

మునివరేణ్యులారా, వడ్లగింజలో వేరు, ఆకు, మొలక, కాడ (వరిగడ్డిపోచ), మొగ్గ, పూవు, (పచ్చిగింజనుండి కారే)పాలు, బియ్యం, ఊక (వరిగింజమీద ఉండే పొట్టు), నూకలు, అనే పదార్థాలు (కనబడకుండా) ఉండి, తరువాత మొలకెత్తడానికి తగిన కారణసామగ్రి లభింపగనే ఆ వడ్లగింజనుండి క్రమంగా పుట్టుకువస్తాయి (వ్యక్త మవుతాయి).

తథా కర్మస్వనేకేషు దేవాద్యాస్తనవః స్థితాః ।
విష్ణుశక్తిం సమాసాద్య ప్రరోహముపయాన్తి వై ॥ 40 ॥

అదేవిధంగా అనేకమైన కర్మలయందు దేవతలు మొదలైన చరాచరాలశరీరాలు ఉంటాయి. అవి విష్ణుశక్తిని పొంది, ఆవిర్భవిస్తాయి. (1. వడ్లగింజ – కర్మ. భూతకోటి ఆవిర్భావానికి బీజం కర్మ. బీజంలో అవ్యక్తంగా ఉన్నవి వేరు, ఆకు, మొలక, మొ. కర్మలో అవ్యక్తంగా ఉన్నవి – దేవతలు, మానవులు మొదలైన చరాచరభూతకోటిశరీరాలు. మొలకెత్తడానికి తగినకారణసామగ్రి ఆకాశం కాలం మొదలైనవాటిసాన్నిధ్యం. చరాచరభూతఆవిర్భావానికి కారణ సామగ్రి విష్ణుశక్తి)

స చ విష్ణుః పరం బ్రహ్మ యతస్సర్వమిదం జగత్ ।
జగచ్చ యో యత్ర చేదం యస్మింశ్చ లయమేష్యతి ॥ 41 ॥

ఆ విష్ణువు పరబ్రహ్మ. ఈ లోకాలు అన్నీ ఆవిష్ణువునుండే పుడుతున్నాయి. ఆ విష్ణువులోనే ఉన్నాయి. ఆ విష్ణువు లోనే లీన మవుతున్నాయి. ఆ విష్ణువే ఈ లోకాలు.(జగత్తు విష్ణువుస్వరూపమే కాని, విష్ణువుకంటే వేరుకాదు.)

తద్ బ్రహ్మ పరమం ధామ సదసత్పరమం పదమ్ ।
యస్య సర్వమభేదేన జగదేతచ్చరాచరమ్ ॥ 42 ॥

ఆ బ్రహ్మమే ఉత్తమమైనస్థానం (వైకుంఠం). అదే సద్రూపము, అసద్రూపమైన ప్రపంచము కూడాబ్రహ్మమే, అదే మోక్షం.స్థావరమూ, జంగమమూ అయిన ఈజగత్తు సమస్తమూ, ఆ పరబ్రహ్మమే (విష్ణువే). భేదం ఏమీలేదు.

స ఏవ మూలప్రకృతి ర్వ్యక్తరూపీ జగచ్చ సః ।
తస్మిన్నేవ లయం సర్వే యాన్తి తత్ర భవన్తి వై ॥ 43 ॥

ఆ విష్ణువే సర్వసృష్టికీ మూలమైన అవ్యక్తప్రకృతి. వ్యక్తమైనజగత్తు కూడ ఆ విష్ణువే. సమస్త మైనచరాచర భూతకోటి ఆవిష్ణువునందే లీనమవుతుంది. మళ్లీ ఆవిష్ణువునుండే ఆవిర్భవిస్తుంది.

కర్తా క్రియాణాం చ స ఇజ్యతే క్రతు స్స ఏవ తత్కర్మఫలం చ తస్య యత్ ।
యాగాదియత్సాధనమప్యశేషతో హరేర్న కిఞ్చిద్ వ్యతిరిక్తమస్తి తత్ ॥ 44 ॥

అన్నికర్మలకు కర్త ఆ విష్ణువే. (యజ్ఞం చేసేవాడు విష్ణువు). ఆ విష్ణువే యజ్ఞంలో యజింపబడుతున్నాడు. యజ్ఞకర్మ కూడ విష్ణువే. యజ్ఞానికి ఫలితం కూడ ఆ విష్ణువే. యజ్ఞాదికర్మలకు ఉపకరణాలు సమస్తమూ విష్ణువే. ఆ శ్రీమహావిష్ణువుకంటె వేరుగా కొంచెం కూడ ఏమీ లేదు. (సమస్తమూ విష్ణువే).

ఇతి శ్రీబ్రహ్మపురాణే భూర్భువస్స్వరాదికీర్తనం నామైకవింశోఽధ్యాయః ॥ 21 ॥

శ్రీబ్రహ్మపురాణంలో భూర్భువస్స్వరాదికీర్తనం అనే ఇరవై ఒకటవ అధ్యాయం సంపూర్ణం.



ద్వావింశోఽధ్యాయః - ఇరవైరెండవ అధ్యాయం

ధ్రువసంస్థితినిరూపణమ్ - ధ్రువసంస్థితినిరూపణం

లోమహర్షణ ఉవాచ:- లోమహర్షణుడు మునులతో ఈవిధంగా చెప్పాడు.

తారామయం భగవతశ్శిశుమారాకృతిః ప్రభోః ।
దివి రూపం హరేర్యత్తు తస్య పుచ్ఛే స్థితో ధ్రువః ॥ 1 ॥

ఆకాశంలో మొసలి ఆకారంలో కలసిఉన్న నక్షత్రాలసముదాయం భగవంతుడూ, ప్రభువూ అయిన శ్రీమహావిష్ణువు రూపమే. దానికి వెనక ధ్రువనక్షత్రం ఉన్నది.

సైష భ్రమన్ భ్రామయతి చన్ద్రాదిత్యాదికాన్ గ్రహాన్ ।
భ్రమన్తమను తం యాన్తి నక్షత్రాణి చ చక్రవత్ ॥ 2 ॥

ఆ ధ్రువుడు (తనచుట్టూ తాను) తిరుగుతూ, చంద్రుడు, సూర్యుడు మొదలయిన ఇతరగ్రహాలను కూడా (తనచుట్టూ) తిప్పుతున్నాడు. అలా తిరుగుతున్న ధ్రువుడిని అనుసరించి నక్షత్రాలు కూడ చక్రంలాగా (గుండ్రంగా) తిరుగుతున్నాయి.

సూర్యాచన్ద్రమసౌ తారా నక్షత్రాణి గ్రహైస్సహ ।
వాతానీకమయైర్బన్ధైర్ధ్రువే బద్ధాని తాని వై ॥ 3 ॥

సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, అశ్విని మొదలైన 27 తారలు, గ్రహాలతో సహా వాయుమయమైన బంధాలతో ధ్రువుడితో బంధింపబడిఉన్నాయి.

శిశుమారాకృతిప్రోక్తం యద్రూపం జ్యోతిషాం దివి ।
నారాయణః పరం ధామ తస్యాధారస్స్వయం హృది ॥4 ॥

ఆకాశంలో మొసలి ఆకారంలో ఉన్నదిగా చెప్పబడిన నక్షత్రాల ఆకారానికి ఆధారం శ్రీమన్నారాయణుడే. ఆ నక్షత్రమండలానికి హృదయం అయిన ఉత్తమస్థానం ఆ శ్రీమన్నారాయణుడు.

ఉత్తానపాదతనయస్తమారాధ్య ప్రజాపతిమ్ ।
స తారాశిశుమారస్య ధ్రువః పుచ్ఛే వ్యవస్థితః ॥ 5 ॥

ఉత్తానపాదుడి కుమారుడైన ధ్రువుడు ప్రజాపతి అయిన ఆ శ్రీమన్నారాయణుడిని ఆరాధించి, మొసలి ఆకారంలో ఉన్న ఆనక్షత్ర మండలానికి చివర (అత్యున్నతస్థానంలో) నియమింపబడినాడు.

ఆధారశ్శిశుమారస్య సర్వాధ్యక్షో జనార్దనః ।
ధ్రువస్య శిశుమారశ్చ ధ్రువే భానుర్వ్యవస్థితః ॥ 6 ॥

ఆ శిశుమారచక్రానికి సమస్తానికీ నియామకుడైన జనార్దనుడు ఆధారం. ధ్రువుడికి శిశుమారచక్రం ఆధారం. ఆ ధ్రువుడిలో భానుడు ఉన్నాడు. (భానుడికి ధ్రువుడు ఆధారం 24శ్లో.)

తదాధారం జగచ్చేదం సదేవాసురమానుషమ్ ।
యేన విప్రా విధానేన తన్మే శృణుత సామ్ప్రతమ్ ॥ 7 ॥

ద్విజులారా, దేవతలూ, రాక్షసులూ, మానవులతో కూడిన ఈ జగత్తు ఆ సూర్యుడిని ఆధారం చేసుకుని ఉన్నది. జగత్తుకు సూర్యుడు ఏవిధంగా ఆధారమైనాడో ఇపుడు జాగ్రత్తగా వినండి.

వివస్వానష్టభిర్మాసైర్గ్రసత్యమ్భోరసాత్మకమ్ ।
వర్షత్యమ్బు తత శ్చాన్నమన్నాదమఖిలం జగత్ ॥ 8 ॥

సూర్యుడు ఎనిమిది నెలలపాటు అమృతరూపమైన నీటిని ఆహారంగా స్వీకరిస్తాడు. తరువాత ఆ నీటిని వర్షిస్తాడు. ఆ వర్షజలంనుండి అన్నం ఏర్పడుతుంది. ఆ అన్నాన్నుండి ప్రాణులు (అన్నం తినేవారు–జగత్తు) ఏర్పడతారు.

వివస్వానంశుభిస్తీక్ష్ణైరాదాయ జగతో జలమ్ ।
సోమం పుష్యత్యథేన్దుశ్చ వాయునాడీమయైర్దివి ॥ 9 ॥

జలైర్విక్షిప్యతేఽభ్రేషు ధూమాగ్న్యనిలమూర్తిషు ।
న భ్రశ్యన్తి యతస్తేభ్యో జలాన్యభ్రాణి తాన్యతః ॥ 10 ॥

సూర్యుడు తీక్ష్ణములైన తన కిరణాలతో జగత్తునుండి నీటిని తీసుకుని చంద్రుడిని పోషిస్తాడు. పిదప చంద్రుడు వాయురూపమైన నాళాలద్వారా ఆకాశంలో ఆ నీటిని పొగ, నిప్పు, గాలి, అనేవాటితో కూడిన మేఘాలలో నింపుతాడు. ఆ మేఘాలనుండి నీళ్లు జారిపడవు. కాబట్టి మేఘాలను అభ్రాలు అంటారు.

అభ్రస్థాః ప్రపతన్త్యాపో వాయునా సముదీరితాః ।
సంస్కారం కాలజనితం విప్రాశ్చాసాద్య నిర్మలాః ॥ 11 ॥

ద్విజవరులారా, ఆ మేఘాలలో ఉన్న నీళ్లు కాలానికి తగినవిధంగా సంస్కారాన్ని (మంచి మార్పులను) పొందుతాయి. నిష్కల్మషం అవుతాయి. గాలితో ప్రేరేపింపబడి, నేలమీదికి వచ్చిపడతాయి.

సరిత్సముద్రా భౌమాస్తు, తథాఽఽపః ప్రాణిసమ్భవాః ।
చతుష్ప్రకారా భగవానాదత్తే సవితా ద్విజాః ॥ 12 ॥

విప్రులారా, సూర్యభగవానుడు నేలమీద ఉన్ననీళ్లను – నదులు, సముద్రాలు, నేలనుండి పుట్టినవి (నూతులు మొ.), జీవులనుండి జనించినవి అని నాలుగువిధాలుగా స్వీకరిస్తాడు.

ఆకాశగఙ్గాసలిలం తథాఽఽహృత్య గభస్తిమాన్ ।
అనభ్రగతమేవోర్వ్యాం సద్యః క్షిపన్తి రశ్మిభిః ॥ 13 ॥

అదే విధంగా ఆకాశంలోనూ సూర్యుడు తనకిరణాలతో మేఘాలలో కాకుండా, (ఆకాశ)గంగానదిలో ఉన్ననీటిని స్వీకరించి, వెంటనే నేలమీదికి విడిచిపెడ్తాడు.

తస్య సంస్పర్శనిర్ధూత పాపపఙ్కో ద్విజోత్తమాః ।
న యాతి నరకం మర్త్యో దివ్యం స్నానం హి తత్ స్మృతమ్ ॥ 14 ॥

బ్రాహ్మణోత్తములారా, ఆ ఆకాశగంగనీరు స్పృశించినమాత్రంచేతనే సమస్తమైన పాపాలు ఎగిరిపోగా, మానవుడు ఇక నరకానికి వెళ్లడు. అది దివ్యమైన (దేవలోకానికి సంబంధించిన) స్నానం.

దృష్టసూర్యం హి తద్వారి పతత్యభ్రైర్వినా దివః ।
ఆకాశగఙ్గాసలిలం తద్గోభిః క్షిప్యతే రవేః ॥ 15 ॥

మేఘాలు లేకుండగనే, సూర్యుడిని దర్శించినమాత్రం చేతనే ఆకాశగంగాజలం సూర్యుడి కిరణాలచేత ఆకాశంనుండి నేలమీద వెదజల్లబడుతుంది.

కృత్తికాదిషు ఋక్షేషు విషమేష్వమ్బు యద్దివః ।
దృష్ట్వాఽర్కం పతితం జ్ఞేయం తద్గాఙ్గం దిగ్గజోజ్ఝితమ్ ॥ 16 ॥

బేసిసంఖ్యలో ఉన్న కృత్తిక మొదలైన నక్షత్రాలసమయంలో, సూర్యుడిని దర్శించి, ఆకాశంనుండి పడిననీళ్లు దిగ్గజాలు (తొండాలతో ఎత్తి) విడిచిన గంగాజలం అని గ్రహించాలి.

యుగ్మర్క్షేషు తు యత్తోయం పతత్యర్కోద్ధృతమ్ దివః ।
తత్సూర్యరశ్మిభిస్సద్యస్సమాదాయ నిరస్యతే ॥ 17 ॥

సరిసంఖ్య గలిగిన నక్షత్రాలసమయంలో పడిన నీళ్లు సూర్యకిరణాలు అప్పుడే స్వీకరించి, వెంటనే ఆకాశంనుండి విడిచిపెట్టిన జలం అని గ్రహించాలి.

ఉభయం పుణ్యమత్యర్థం నృణాం పాపహరం ద్విజాః ।
ఆకాశగఙ్గాసలిలం దివ్యం స్నానం ద్విజోత్తమాః ॥ 18 ॥

బ్రాహ్మణులారా, ఈ రెండు విధాలైన వర్షజలం కూడ మానవులకు అత్యధికమయిన పుణ్యాన్ని ఇస్తుంది. సమస్తపాపాలను హరిస్తుంది. ఆ నీళ్లు ఆకాశగంగాజలాలు. వాటితో చేసిన స్నానం దివ్యం.

యత్తు మేఘైస్సముత్సృష్టం వారి తత్ప్రాణినాం ద్విజాః ।
పుష్ణాత్యోషధయస్సర్వా జీవనాయామృతం హి తత్ ॥ 19 ॥

మేఘాలు విడిచిపెట్టిన నీరు సమస్తమైన ఓషధులను పోషిస్తుంది. (వానిలో ఓషధిగుణాలను నింపుతుంది). ప్రాణులు జీవించడానికి వర్షజలం అమృతం వంటిది.

తేన వృద్ధిం పరాం నీత స్సకలశ్చౌషధీగణః ।
సాధకః ఫలపాకాన్తః ప్రజానాం తు ప్రజాయతే ॥ 20 ॥

ఆ వర్షజలంచేత ఓషధులు అన్నీ బాగా వృద్ధిని పొందుతాయి. ఫలితం ఇవ్వగానే (పండగానే) నశించే ఈ ఓషధులు ప్రాణులకు సమస్తమైన కోరికలను తీరుస్తాయి.

తేన యజ్ఞాన్ యథాప్రోక్తాన్ మానవాశ్శాస్త్రచక్షుషః ।
కుర్వతేఽహరహశ్చైవ దేవానాప్యాయయన్తి తే ॥ 21 ॥

అందుచేత (సకలశ్రేయస్సులను సాధించుకోడానకి కావలసినది వర్షం. కాబట్టి ఆ వర్షం సరిగా కురవడం కోసం) మానవులు వేదశాస్త్రాలను పరిశీలించి గ్రహించి, ప్రతిరోజూ, వివిధయజ్ఞాలను శాస్త్రోక్తవిధానం ప్రకారం ఆచరిస్తారు. దానితో వారు దేవతలను తృప్తి పరుస్తారు.

ఏవం యజ్ఞాశ్చ వేదాశ్చ వర్ణాశ్చ ద్విజపూర్వకాః ।
సర్వదేవనికాయాశ్చ పశుభూతగణాశ్చ యే ॥ 22 ॥

వృష్ట్యా ధృతమిదం సర్వం జగత్ స్థావరజఙ్గమమ్ ।
సాఽపి నిష్పాద్యతే వృష్టిస్సవిత్రా మునిసత్తమాః ॥ 23 ॥

ఈవిధంగా, యజ్ఞాలూ, వేదాలూ, బ్రాహ్మణులు మొదలైన(నాలుగు)వర్ణాలవారూ, సమస్తమైన దేవతల సముదాయమూ, పశుగణాలూ, భూతగణాలూ, చరాచరాత్మకమైన జగత్తు మొత్తమూ, వర్షంకారణంగా నిలిచి ఉంటున్నది. మునివరులారా, ఆవర్షం సూర్యుడివలన ఏర్పడుతున్నది.

ఆధారభూతస్సవితుర్ ధ్రువో మునివరోత్తమాః ।
ధ్రువస్య శిశుమారోఽసౌ సోఽపి నారాయణాశ్రయః ॥ 24 ॥

మునివరేణ్యులారా, (ఈవిధంగా జగత్తుకు ఆధారమైన) ఆ సూర్యుడికి ఆధారం ధ్రువుడు. ఆ ధ్రువుడికి శిశుమారం (నక్షత్రమండలం).ఆధారం. ఆశిశుమారానికి ఆధారం శ్రీమన్నారాయణుడు.

హృది నారాయణస్తస్య శిశుమారస్య సంస్థితః ।
బిభర్తా సర్వభూతానామాదిభూతస్సనాతనః ॥ 25 ॥

ఆ శిశుమారం హృదయస్థానంలో నారాయణుడు నిలిచి ఉన్నాడు. ఆ నారాయణుడు చరాచరభూతకోటి నంతటినీ పోషించేవాడు. అన్నింటికి మొదటివాడు. శాశ్వతుడు.

ఏవం మయా మునిశ్రేష్ఠా బ్రహ్మాణ్డం సముదాహృతమ్ ।
భూసముద్రాదిభిర్యుక్తం కిమన్యచ్ఛ్రోతు మిచ్ఛథ ॥ 26 ॥

మునివరేణ్యులారా, భూమి, సముద్రాలు, మొదలైనవాటితో కూడిన బ్రహ్మాండాన్ని గురించి ఈవిధంగా వివరించడం అయింది. ఇక తరువాత మీరు ఏమి వినదలచుకున్నారు. (అని అడిగాడు లోమహర్షణుడు).

ఇతి శ్రీబ్రహ్మపురాణే ధ్రువసంస్థితినిరూపణం నామ ద్వావింశోఽధ్యాయః ॥ 22 ॥

శ్రీబ్రహ్మపురాణంలో ధ్రువసంస్థితినిరూపణం అనే ఇరవైరెండవ అధ్యాయం సంపూర్ణం.



త్రయోవింశోఽధ్యాయః – ఇరవైమూడవ అధ్యాయం

తీర్థనామమాహాత్మ్యవర్ణనమ్ – తీర్థనామమాహాత్మ్యవర్ణనం

మునయ ఊచుః :– లోమహర్షణుడిని మునులు ఈవిధంగా అడిగారు.

పృథివ్యాం యాని తీర్థాని ధన్యాన్యాయతనాని చ ।
వక్తుమర్హసి ధర్మజ్ఞ శ్రోతుం నో వర్తతే మనః ॥ 1 ॥

ధర్మవేదీ! లోమహర్షణా! ఈ భూమిమీద ఉన్న పుణ్యతీర్థాలూ, పుణ్యక్షేత్రాలూ అన్నిటిని గూర్చి వినాలని మా మనస్సు కోరుకుంటున్నది. చెప్పదగినవాడివి నీవే.

లోమహర్షణ ఉవాచ :– లోమహర్షణుడు మునులతో ఈవిధంగా చెప్పాడు.

యస్య హస్తౌ చ పాదౌ చ మనశ్చైవ సుసంయతమ్ ।
విద్యా తపశ్చ కీర్తిశ్చ స తీర్థఫలమశ్నుతే ॥ 2 ॥

చేతులూ, కాళ్లూ, మనస్సూ తన అధీనంలో ఉంచుకున్నవాడు, పాండిత్యం, తపస్సు, మంచిపేరు గలిగినవాడు, సమస్తమయిన పుణ్యతీర్థాలు సేవించిన ఫలితాన్ని పొందుతాడు.

మనో విశుద్ధం పురుషస్య తీర్థం వాచాం తథా చేన్ద్రియనిగ్రహశ్చ ।
ఏతాని తీర్థాని శరీరజాని స్వర్గస్య మార్గం ప్రతిబోధయన్తి ॥ 3 ॥

మానవుడికి నిర్మలమయిన మనస్సే పుణ్యతీర్థం. అలాగే శుద్ధమయిన వాక్కు పుణ్యతీర్థం, ఇంద్రియాలను నిగ్రహించటం పుణ్యతీర్థం. ఇవి (మనస్సు, వాక్కు, జ్ఞానేంద్రియాలు అనే మూడు శరీరం నుండి పుట్టిన పుణ్యతీర్థాలు. ఇవే స్వర్గానికి మార్గాన్ని తెలియజేస్తాయి.

చిత్త మన్తర్గతం దుష్టం తీర్థస్నానై ర్న శుధ్యతి ।
శతశోఽపి జలై ర్ధౌతం సురాభాణ్డమివాశుచి ॥ 4 ॥

వందలకొద్దీ పుణ్యజలాలతో వందలసార్లు కడిగినా కల్లుకుండ పరిశుద్ధం కానట్లే, బాహ్యమయిన శరీరాన్ని ఎన్నిపుణ్య తీర్థాలలో (ముంచినా) స్నానం చేయించినా, లోపల ఉన్న మనస్సు చెడ్డదయినచో మనస్సుకు శుద్ధి గలుగదు.

న తీర్థాని న దానాని న వ్రతాని న చాశ్రమాః ।
దుష్టాశయం దమ్భరుచిం న పునన్త్యజితేన్ద్రియమ్ ॥ 5 ॥

ఇంద్రియాలకు లోబడినవాడిని, మనసులో దుర్మార్గపు ఆలోచనలతో, పైకి మంచిగా ప్రవర్తించేవాడిని – పుణ్యతీర్థాలు గానీ, దానాలు కానీ, వ్రతాలు కానీ, బ్రహ్మచర్యాదు లయిన ఆశ్రమాలు కానీ, ఏమాత్రమూ పవిత్రం చేయవు.

ఇన్ద్రియాణి వశే కృత్వా యత్ర యత్ర వసేన్నరః ।
తత్ర తత్ర కురుక్షేత్రం ప్రయాగం పుష్కరం తథా ॥ 6 ॥

ఇంద్రియాలను తన వశంలో ఉంచుకున్న మానవుడు ఉన్నచోటే కురుక్షేత్రం, ప్రయాగ, పుష్కరతీర్థం. (అక్కడే సమస్తమయిన పుణ్యతీర్థాలు, పుణ్యక్షేత్రాలు ఉంటాయి. వాటికోసం ఎక్కడికో వెళ్ల నవసరం లేదు. ఇంద్రియాలను జయించినవాడు పుణ్యతీర్థాలు సేవింపనవసరం లేదు. వాడే గొప్ప పుణ్యక్షేత్రం. వాడినే ఇతరులు సేవించాలి.)

తస్మాచ్ఛృణుధ్వం వక్ష్యామి తీర్థాన్యాయతనాని చ ।
సంక్షేపేణ మునిశ్రేష్ఠాః పృథివ్యాం యాని కాని వై ॥ 7 ॥

మునివరులారా! అందుచేత ఈభూమి మీద ఏయే పుణ్యతీర్థాలు, పుణ్యక్షేత్రాలు ఉన్నాయో వాటినిగూర్చి సంగ్రహంగా చెప్తాను. వినండి.

విస్తరేణ న శక్యన్తే వక్తుం వర్షశతైరపి ।

వాటినిగురించి వివరించి చెప్పాలంటే వందలసంవత్సరాలకు కూడా సాధ్యం కాదు. (అందువల్ల సంగ్రహంగా చెప్తాను.) (అని పుణ్యతీర్థక్షేత్రాలపేర్లు మాత్రమే పేర్కొంటున్నాడు.)

ప్రథమం పుష్కరం తీర్థం నైమిషారణ్యమేవ చ ॥ 8 ॥

మొట్టమొదట పుష్కరతీర్థం. నైమిశారణ్యం.

ప్రయాగం చ ప్రవక్ష్యామి ధర్మారణ్యం ద్విజోత్తమాః ।
ధేనుకం చమ్పకారణ్యం సైన్ధవారణ్యమేవ చ ॥ 9 ॥

బ్రాహ్మణవరేణ్యులారా! ప్రయాగ, ధర్మారణ్యం, ధేనుకం, చంపకారణ్యం, సైంధవారణ్యం.

పుణ్యం చ సగరారణ్యం దణ్డకారణ్యమేవ చ ।
గయా ప్రభాసం శ్రీతీర్థం దివ్యం కనఖలం తథా ॥ 10 ॥

పుణ్యప్రద మయిన – సగరారణ్యం, దండకారణ్యం, గయ, ప్రభాసం, శ్రీతీర్థం, ప్రభావవంత మయిన – కనఖలం.

భృగుతుఙ్గం హిరణ్యాక్షం భీమారణ్యం కుశస్థలీ ।
లోహార్గలం సకేదారం మన్దరారణ్యమేవ చ ॥ 11 ॥

భృగుతుంగం, హిరణ్యాక్షం, భీమారణ్యం, కుశస్థలి, లోహార్గలం, సకేదారం, మందరారణ్యం,

మహాలయం కోటితీర్థం సర్వపాపహరం తథా ।
రూపతీర్థం శూకరఞ్చ చక్రతీర్థం మహాఫలమ్ ॥ 12 ॥

మహాలయం, సమస్తమయిన పాపాలను హరించే కోటితీర్థం, రూపతీర్థం, శూకరతీర్థం, అధికమయిన ఫలితాలను ఇచ్చే చక్రతీర్థం.

వ్యాసతీర్థం సోమతీర్థం తీర్థం శాఖోటకం తథా ।
తీర్థం కోకాముఖం పుణ్యం బదరీశైలమేవ చ ॥ 13 ॥

వ్యాసతీర్థం, సోమతీర్థం, శాఖోటకతీర్థం, కోకాముఖతీర్థం, పుణ్యప్రదమయిన బదరీపర్వతం,

సోమతీర్థం తుఙ్గకూటం తీర్థం స్కన్దాశ్రమం తథా ।
సూర్యప్రభం ధేనుసర స్సప్త మాయుష్మికం తథా ॥ 14 ॥

సోమతీర్థం, తుంగకూటం, స్కందాశ్రమం, సూర్యప్రభం, ధేనుసరం, సప్తతీర్థం, ఆయుష్మికతీర్థం,

ధర్మోద్భవం కోటితీర్థం సార్వకామికమేవ చ ।
సూర్యప్రభం మహాకుణ్డం తీర్థం సోమాభిషేచనమ్ ॥ 15 ॥

ధర్మోద్భవం, కోటితీర్థం, సార్వకామికం, సూర్యప్రభం (14 శ్లోకంలో చెప్పినదానికంటె ఇది వేరు అని గ్రహించాలి. ఇలాగే కొన్ని పేర్లు పునరుక్తంగా కానవచ్చినవి వేరే ప్రదేశాలని తెలియాలి), మహాకుండం, సోమాభిషేచనతీర్థం,

మహాశ్రోత్రం కోరకం చ పఞ్చధారం త్రిధారకమ్ ।
సప్తధారైకధారం చ తీర్థం చామరకణ్టకమ్ ॥ 16 ॥

మహాశ్రోత్రం, కోరకం, పంచధారం, త్రిధారం, సప్తధారం, ఏకధారం, అమరకంటకతీర్థం,

శాలగ్రామఞ్చక్రతీర్థం కదలీహ్రదముత్తమమ్ ।
విద్యుత్ప్రభం దేవహ్రదం తీర్థం విష్ణుప్రభస్తథా ॥ 17 ॥

శాలగ్రామతీర్థం, చక్రతీర్థం, శ్రేష్ఠమయిన – కదలీహ్రదం, విద్యుత్ప్రభం, దేవహ్రదం, విష్ణుప్రభతీర్థం,

శఙ్ఖప్రభం దేవకుణ్డం తీర్థం వజ్రాయుధం తథా ।
వస్త్రాపదం బర్హపదం లోకారోహణమేవ చ ॥ 18 ॥

శంఖప్రభం, దేవకుండం, వజ్రాయుధతీర్థం, వస్త్రాపదం, బర్హపదం, లోకారోహణం,

స్వయంవటం భద్రబలం కౌశాంబఞ్చ దివాకరమ్ ।
ద్వీపం సారస్వతం దేవం విజయం కామజం తథా ॥ 19 ॥

స్వయంవటం, భద్రబలం, కౌశాంబం, దివాకరం, సారస్వతద్వీపం, దేవం, విజయం, కామజం,

సోల్లయాజ్ఞోపచారశ్చ చవరమ్బునపూర్ణవత్ ।
స్నానకుణ్డం ప్రయాగం చ గుహావిష్ణుపదస్తథా ॥ 20 ॥

సోల్లయాంగోపచారం, చవరంబనం, పూర్ణవంతం, స్నానకుండం, ప్రయాగ, గుహావిష్ణుపదం,

కన్యాకుణ్డం వాయుకుణ్డం జమ్బూమార్గస్తథోత్తమమ్ ।
గభస్తితీర్థఞ్చ తథా యయాతిపత్తనం శుచి ॥ 21 ॥

కన్యాకుండం, వాయుకుండం, జంబూమార్గం, ఉత్తమం, గభస్తితీర్థం, నిర్మలమయిన యయాతిపట్టణం,

కోటితీర్థం భద్రవటం మహాకాలవనం తథా ।
నర్మదా చ పరం తీర్థం తీర్థబీజం తథార్బుదమ్ ॥ 22 ॥

కోటితీర్థం, భద్రవటం, మహాకాలవనం, తీర్థాలలోకెల్ల ఉత్తమమయిన నర్మదాతీర్థం, తీర్థబీజం, అర్బుదతీర్థం,

పఞ్చతీర్థం సవాసిష్ఠం తీర్థం వైప్రియసంజ్ఞకమ్ ।
తీర్థఞ్చ వార్షికం నామ తథా పఞ్జీరకం శుభమ్ ॥ 23 ॥

పంచతీర్థం, వసిష్ఠతీర్థం, వైప్రియతీర్థం, వార్షికతీర్థం, శుభప్రదమయిన – పంజిరకతీర్థం,

సుతీర్థం బ్రహ్మరుద్రఞ్చ తీర్థం కన్యాకుమారికా ।
శక్రతీర్థం పఞ్చనదం రేణుకాతీర్థమేవ చ ॥ 24 ॥

సుతీర్థం, బ్రహ్మరుద్రం, కన్యాకుమారికాతీర్థం, శక్రతీర్థం, పంచనదం, రేణుకాతీర్థం,

పైతామహఞ్చ విమలం రౌద్రపాదం తథోత్తమమ్ ।
మణిమన్తఞ్చ కామాఖ్యం కృష్ణతీర్థం కులిఙ్గకమ్ ॥ 25 ॥

నిర్మలమయిన – పైతామహం, శ్రేష్ఠమయిన – రౌద్రపాదం, మణిమంతం, కామతీర్థం, కృష్ణతీర్థం, కులింగకతీర్థం,

శ్రీశక్రయజనఞ్చైవ తథైవ బ్రహ్మవాలుకా ।
పుణ్యం వ్యాసం పుణ్డరీకం మణిమన్థం తథోత్తమమ్ ॥ 26 ॥

శ్రీశక్రయజనతీర్థం, బ్రహ్మవాలుకాతీర్థం, పుణ్యప్రదమయిన వ్యాసతీర్థం, పుండరీకం, ఉత్తమమయిన – మణిమంథం,

దీర్ఘమన్తం హంసపాదం తీర్థం చ శయనం తథా ।
దశాశ్వమేధం కేదారం తమసోద్భేదమేవ చ ॥ 27 ॥

దీర్ఘమంతం, హంసపాదం, శయనతీర్థం, దశాశ్వమేధం, కేదారం, తమసోద్భేదం,

రుద్రకూపం సంయమనీతీర్థం సంత్రావనాసికమ్ ।
స్యమన్తపఞ్చకం తీర్థం బ్రహ్మతీర్థం సుదర్శనమ్ ॥ 28 ॥

రుద్రకూపం, సంయమనీతీర్థం, సంత్రావనాసికం, స్యమంతకపంచకతీర్థం, చక్కని బ్రహ్మతీర్థం,

సతతం పృథివీతీర్థం పారిప్లవపృథూదకౌ ।
దశాశ్వమేధికం తీర్థం సాక్షిదం విజయం తథా ॥ 29 ॥

పృథివీతీర్థం, పారిప్లవం, పృథూదకం, దశాశ్వమేధికం(27శ్లో.), సాక్షిదతీర్థం, విజయతీర్థం,

కోటితీర్థం పఞ్చనదం వారాహం యక్షిణీహ్రదం ।
పుణ్డరీకం సోమతీర్థం ముఞ్జావటరథోత్తమమ్ ॥ 30 ॥

కోటితీర్థం, పంచనదతీర్థం, వారాహతీర్థం, యక్షిణీహ్రదం, పుండరీకతీర్థం, సోమతీర్థం, ఉత్తమమయిన ముంజావటరథం అనే తీర్థం,

బదరీవనమాసీనం బఙూరవణమేవ చ ।
స్వర్లోకద్వారకం తీర్థం కపిలాతీర్థమేవ చ ॥ 31 ॥

బదరీవనంలో ఉన్న బఙూరవణతీర్థం, స్వర్లోకద్వారకతీర్థం, కపిలాతీర్థం,

సూర్యతీర్థం వరుస్థానం భవాభవనమేవ చ ।
తీర్థం చ యక్షరాక్షస్యం బ్రహ్మతీర్థం సుతీర్థకమ్ ॥ 32 ॥

సూర్యతీర్థం, వరుస్థానం, భవాభవనం, యక్షరాక్షస్యం, గొప్పపుణ్యతీర్థం అయిన బ్రహ్మతీర్థం,

కామేశ్వరం మాతృతీర్థం తీర్థం శాతవనం తథా ।
స్థానం భౌమస్య హంసస్య సారసం సరసం తథా ॥ 33 ॥

కామేశ్వరతీర్థం, మాతృతీర్థం, శాతవనతీర్థం, భూమిమీద నెలకొన్న – హంసతీర్థం, రసవంత మయిన – సారసతీర్థం,

దశాశ్వమేధం కేదారం బ్రహ్మజ్ఞమ్వర మేవ చ ।
సప్తర్షికుణ్డం చ తథా తీర్థం దేవ్యాస్సుసంయతమ్ ॥ 34 ॥

దశాశ్వమేధం, కేదారం(27,29శ్లో.), శ్రేష్ఠ మయిన బ్రహ్మజ్ఞం, సప్తర్షికుండం, అందంగా ఏర్పడిన దేవీతీర్థం,

ఇహాస్పదం కోటికృతం కింవానం కింజయం తథా ।
కారణ్డవస్తు విశ్వం చ త్రివిష్టప మథాపరమ్ ॥ 35 ॥

ఇహాస్పదం, కోటికృతతీర్థం, కింవానం, కింజయం, కారండవం, విశ్వతీర్థం, త్రివిష్టపతీర్థం,

పాణిఖాతం మిశ్రకం చ మధుకణ్టమనోమయే ।
కౌశికీ దేవతీర్థం చ కన్యాతీర్థమథోత్తమమ్ ॥ 36 ॥

పాణిఖాతం, మిశ్రకం, మధుకంటం, మనోమయం, దేవతలతీర్థం అయిన కౌశికీతీర్థం, శ్రేష్ఠమయిన కన్యాతీర్థం,

బ్రహ్మతీర్థం మనస్తీర్థం చైవాత్ర పావనమ్ ।
సౌగన్ధికం వనఞ్చైవ మణితీర్థం సరస్వతీ ॥ 37 ॥

బ్రహ్మతీర్థం, ఈభూలోకంలో పవిత్రమయిన–మనస్తీర్థం, సౌగంధికవనం, మణితీర్థం, సరస్వతీతీర్థం,

ఈశానతీర్థం ప్రవరం పావనం పఞ్చయజ్ఞకమ్ ।
త్రిశూలధారం మాహేన్ద్రం దేవస్థానం మహాలయమ్ ॥ 38 ॥

ఉత్తమ మయిన – ఈశానతీర్థం, పవిత్రమయిన – పంచయజ్ఞకతీర్థం, త్రిశూలధారం, దేవతలు విహరించే – మాహేంద్రం, మహాలయం,

శాకమ్భరీ దేవతీర్థం సువర్ణాఖ్యం కపీమదమ్ ।
క్షీరేశ్వరం విరూపాక్షం భృగుతీర్థం కుశోద్భవమ్ ॥ 39 ॥

శాకంభరీతీర్థం, దేవతలతీర్థం అయిన సువర్ణతీర్థం, కపీమదతీర్థం, క్షీరేశ్వరం, విరూపాక్షతీర్థం, భృగుతీర్థం, కుశోద్భవతీర్థం,

బ్రహ్మావర్తం బ్రహ్మయోనిర్నీలపర్వతమేవ వా ।
భద్రకర్ణం హ్రదఞ్చైవ శక్రకర్ణం హ్రదం తథా ॥ 40 ॥

బ్రహ్మావర్తం, బ్రహ్మయోని, నీలపర్వతం, భద్రకర్ణహ్రదం, శక్రకర్ణహ్రదం,

సప్తసారస్వతం చైవ తీర్థమౌశనసం తథా ।
కపాలమోచనం చైవ అవకీర్ణం చ పఞ్చకమ్ ॥ 41 ॥

సప్తసారస్వతతీర్థం, ఔశనసతీర్థం, కపాలమోచనం, అవకీర్ణతీర్థం, పంచకతీర్థం,

చతుస్సాముద్రికం చైవ సత్కాఞ్చనసహస్రికమ్ ।
రేణుకం పఞ్చకటుకం విమోచనమథౌజసమ్ ॥ 42 ॥

చతుస్సాముద్రికం, శ్రేష్ఠమయిన కాంచనసహస్రికం, రేణుకతీర్థం, పంచకటుకతీర్థం, ఔజసతీర్థం, విమోచనతీర్థం,

స్థాణుతీర్థం కురో స్తీర్థం స్వర్గద్వారం కుశధ్వజమ్ ।
విశ్వేశ్వరం వామకరం తథా నారాయణాశ్రమమ్ ॥ 43 ॥

స్థాణుతీర్థం, కురుతీర్థం, స్వర్గద్వారతీర్థం, కుశధ్వజతీర్థం, విశ్వేశ్వరతీర్థం, వామకరతీర్థం, నారాయణాశ్రమం,

గఙ్గాద్వారం వటం చైవ బదరీపావనం తథా ।
ఇన్ద్రమార్గణకేశత్రం జిరికావాసమేవ చ ॥ 44 ॥

గంగాద్వారం, వటం, పవిత్ర మయిన – బదరీపావనం, ఇంద్రమార్గణకేశత్రం, జిరికావాసం,

సోమతీర్థఞ్చ భో విప్రాః కోటితీర్థఞ్చ పుణ్యదమ్ ।
కోటితీర్థస్థలీ చైవ భద్రకాలీహ్రదం తథా ॥ 45 ॥

ఓ ద్విజులారా! సోమతీర్థం, పుణ్యప్రదమయిన – కోటితీర్థం, కోటితీర్థస్థలి, భద్రకాళీహ్రదం,

అరున్ధతీవనం చైవ బ్రహ్మావర్తం తథోత్తమమ్ ।
అశ్వదేవీ కుబ్జవనం యమునాప్రభవం తథా ॥ 46 ॥

అరుంధతీవనం, శ్రేష్ఠమయిన – బ్రహ్మావర్తం, అశ్వదేవి, కుబ్జవనం, యమునాప్రభవం,

వీరప్రమోక్షం సిద్ధార్థం మాయావిద్యోద్భవం తథా ।
మహాహ్రదో వేతసికా రూపం సున్దరికాశ్రమమ్ ॥ 47 ॥

వీరప్రమోక్షం, సిద్ధార్థం, మాయావిద్యోద్భవం, మహాహ్రదం, వేతసికారూపం, సుందరికాశ్రమం,

బ్రహ్మణీ సుమహత్తీర్థం గఙ్గోద్భవసరస్వతీ ।
తీర్థఞ్చ బాహుకా నామ విమలాశోకమేవ చ ॥ 48 ॥

మిక్కిలి ప్రశస్తమయిన బ్రహ్మణీతీర్థం, గంగనుండి ఏర్పడిన సరస్వతీతీర్థం, బాహుకాతీర్థం, విమలాశోకతీర్థం,

గౌతమైరావతీతీర్థం తీర్థం శతసహస్రికమ్ ।
భర్తృస్థానం కోటితీర్థం వరాచైవాథ కాపిలీ ॥ 49 ॥

గౌతమైరావతీతీర్థం, శతసహస్రికతీర్థం, తీర్థాలలో శ్రేష్ఠమయిన కోటితీర్థం, ఉత్తమమయిన కాపిలీతీర్థం,

తీర్థం పఞ్చనదఞ్చైవ మార్కణ్డేయస్య ధీమతః ।
సోమతీర్థం శివోదశ్చ తీర్థం మత్స్యోదరీ తథా ॥ 50 ॥

బుద్ధిమంతుడయిన మార్కండేయమహర్షి ఏర్పాటు చేసిన పంచనదతీర్థం, సోమతీర్థం, శివోదం అనేతీర్థం, మత్స్యోదరీతీర్థం,

సూర్యప్రభం సూర్యతీర్థం సోమకం వనమేవ చ ।
అరుణాస్పదం వామనకం సూర్యతీర్థం సవాలుకమ్ ॥ 51 ॥

సూర్యప్రభం, సూర్యతీర్థం, సోమకవనం, అరుణాస్పదం, వామనకం, ఇసుకతిన్నెలతో కూడిన – సూర్యతీర్థం,

తీర్థం చైవావిముక్తాఖ్యం నీలకణ్ఠహ్రదం తథా ।
పిశాచమోచనం చైవ సుభద్రాహ్రదమేవ చ ॥ 52 ॥

అవిముక్తం అనేతీర్థం, నీలకంఠహ్రదం, పిశాచమోచనం, సుభద్రాహ్రదం,

కుణ్డం హి విమలం తస్య తీర్థఞ్చణ్డీశ్వరస్య చ ।
శ్రేష్ఠస్థానహ్రదం చైవ సముద్రం కూపమేవ చ ॥ 53 ॥

విమలం అనే కుండం, చండీశ్వరతీర్థం, శ్రేష్ఠస్థానహ్రదం, సముద్రం, కూపం,

జైగీషవ్యవనం చైవ హరికేశవనం తథా ।
అజాముఖరసఞ్చైవ ఘణ్టాకర్ణహ్రదం తథా ॥ 54 ॥

జైగీషవ్యవనం, హరికేశవనం, అజాముఖరసం, ఘంటాకర్ణహ్రదం,

పుణ్డరీకహ్రదఞ్చైవ వాపికా కాష్టకస్య చ ।
శ్మశానస్తమ్భం కుమ్భఞ్చ వినాయకహ్రదం తథా ॥ 55 ॥

పుండరీకహ్రదం, కాష్టకం అనే వాపి(నూయి), శ్మశానస్తంభం, కుంభం, వినాయకహ్రదం,

కూపం సిద్ధోద్భవఞ్చైవ పుణ్యం బ్రహ్మసరస్తథా ।
భద్రావాసం తథా తీర్థం నాగతీర్థం ససోమకమ్ ॥ 56 ॥

సిద్ధోద్భవం అనే కూపం (బావి), పుణ్యప్రదమయిన బ్రహ్మసరం అనే తీర్థమూ, భద్రావాసం, నాగతీర్థం, సోమ(క)తీర్థం,

భద్రహ్రదం క్షీరసరం ప్రేతాధారం కుమారకమ్ ।
బ్రహ్మావర్తం కుశావర్తం దధికర్ణోదయాత్మకమ్ ॥ 57 ॥

భద్రహ్రదం, క్షీరసరస్సు, ప్రేతాధారం, కుమారకం, బ్రహ్మావర్తం, కుశావర్తం, దధికర్ణోదయం,

శృఙ్గతీర్థం మహాతీర్థం తీర్థశ్రేష్ఠం మహానదీ ।
దివ్యం బ్రహ్మసరః పుణ్యం గయాశీర్షాక్షయం వటమ్ ॥ 58 ॥

గొప్పపుణ్యతీర్థమయిన - శృంగతీర్థం, తీర్థాలలో ఉత్తమమయిన - మహానది, దేవతలకు సంబంధించిన - బ్రహ్మసరస్సు, పుణ్యప్రదమైనదీ, గయకు శిరస్స్థానమైనదీ (గయాపట్టణంలో ఉత్తమస్థానం) అయిన అక్షయవటం,

దక్షిణం చోత్తరం చైవ గోమయం హయశాన్తికమ్ ।
కపిలాహ్రదం గృధ్రకూటం సావిత్రీహ్రదమేవ చ ॥ 59 ॥

దక్షిణగోమయం, ఉత్తరగోమయం, హయశాంతికం, కపిలాహ్రదం, గృధ్రకూటం, సావిత్రీహ్రదం,

అఘనాశనం గీతవనం యోనిద్వారఞ్చ ధేనుకమ్ ।
ధన్వకం లోహికాఖ్యఞ్చ మాతఙ్గహ్రదమేవ చ ॥ 60 ॥

పాపాలను నశింపజేసే - గీతవనం, యోనిద్వారం, ధేనుకం, ధన్వకం, లోహికం, మాతంగహ్రదం,

పితృకూపం రుద్రకూపం మతితీర్థం సుమాలినమ్ ।
బ్రహ్మస్థానం సప్తకుణ్డం మణిరత్నహ్రదం తథా ॥ 61 ॥

పితృకూపం, రుద్రకూపం, మతితీర్థం, సుమాలి, బ్రహ్మస్థానం, సప్తకుండం, మణిరత్నహ్రదం,

ముద్గలస్యాశ్రమఞ్చైవ ముద్గలహ్రదమేవ చ ।
తీర్థం జనకకూపాఖ్యం పుణ్యం వినశనం తథా ॥ 62 ॥

ముద్గల(మహర్షి)ఆశ్రమం, ముద్గలహ్రదం, జనకకూపతీర్థం, పుణ్యప్రదమయిన – వినశనం,

శోకాఖ్యం భారతం చైవ తీర్థం జ్యేష్ఠాలికం తథా ।
విశ్వేశ్వరం పుణ్యశతం కన్యాసంవేధమేవ చ ॥ 63 ॥

శోకతీర్థం, భారతతీర్థం, జ్యేష్ఠాలికతీర్థం, విశ్వేశ్వరతీర్థం, పుణ్యశతతీర్థం, కన్యాసంవేధతీర్థం,

నిధిరామభవఞ్చైవ వసిష్ఠాశ్రమమేవ చ ।
దేవకూటఞ్చ కూపఞ్చ కౌశికాశ్రమమేవ చ ॥ 64 ॥

నిధిరామభవం, వసిష్ఠాశ్రమం, దేవకూటం, దేవకూపం, కౌశికాశ్రమం,

కులకర్ణహ్రదం చైవ కౌశికీద్రుమమేవ చ ।
ధర్మతీర్థం కాఞ్చనం చ తీర్థమౌద్దాలికం తథా ॥ 65 ॥

కులకర్ణహ్రదం, కౌశికీద్రుమం, ధర్మతీర్థం, కాంచనతీర్థం, ఔద్దాలికతీర్థం,

దణ్డాత్మా మాలినీతీర్థం తీర్థం చ వనచణ్డికా ।
సన్ధ్యాతీర్థం కాలతీర్థం కపిలా లోహితార్ణవమ్ ॥ 66 ॥

దండాత్మతీర్థం, మాలినీతీర్థం, వనచండికాతీర్థం, సంధ్యాతీర్థం, కాలతీర్థం, కపిలాతీర్థమ్, లోహితార్ణవతీర్థం,

శోణోద్భవం వంశగుల్మం రామభఙ్గీకతీర్థకమ్ ।
పుణ్యావర్తహ్రదం శ్రీమ త్తీర్థం బదరికాశ్రమమ్ ॥ 67 ॥

శోణోద్భవం, వంశగుల్మం, రామభంగీకతీర్థం, పుణ్యావర్తహ్రదం, శ్రీమత్తీర్థం, బదరికాశ్రమం,

రామతీర్థం వితస్తా చ మేరుజాతీయమేవ చ ।
రోహిణ్యాః కూపవరదమిన్ద్రద్యుమ్నసరస్తథా ॥ 68 ॥

రామతీర్థం, వితస్తాతీర్థం, మేరుజాతీయతీర్థం, రోహిణీకూపవరదతీర్థం, ఇంద్రద్యుమ్నసరస్సు,

సావసర్గం సమాహేన్ద్రం శ్రీతీర్థం శ్రీనదీ తథా ।
ఇషుతీర్థం వార్షికం చ కౌబేరహ్రదమేవ చ ॥ 69 ॥

అవసర్గం, మాహేంద్రం, శ్రీతీర్థం, శ్రీనది, ఇషుతీర్థం, వార్షికతీర్థం, కౌబేరహ్రదం,

కన్యాతీర్థం చ గోకర్ణం గోపతిస్థానమేవ చ ।
సమ్వర్తం చాపి విశ్వాసం సప్తగోదావరీహ్రదమ్ ॥ 70 ॥

కన్యాతీర్థం, గోకర్ణతీర్థం, గోపతిస్థానం, సంవర్తతీర్థం, విశ్వాసం, సప్తగోదావరీహ్రదం,

బదరీహ్రదమన్యచ్చ బ్రహ్మస్థానవివర్ధనమ్ ।
జాతీహ్రదం దేవహ్రదం కుశప్రథనమేవ చ ॥ 71 ॥

బదరీహ్రదం, బ్రహ్మస్థానవివర్ధనం, జాతీహ్రదం, దేవహ్రదం, కుశప్రథనతీర్థం,

సర్వదేవవ్రతఞ్చైవ కన్యాశ్రమహ్రదం తథా ।
మహారాజహ్రదం పుణ్యం శక్రతీర్థం చ కున్దకమ్ ॥ 72 ॥

సర్వదేవవ్రతం, కన్యాశ్రమహ్రదం, మహారాజహ్రదం, పుణ్యప్రదమయిన – శక్రతీర్థం, కుందకతీర్థం,

అఙ్గారతీర్థఞ్చ తథా రుద్రారణ్యకమేవ చ ।
మేధావినం దేవహ్రదం తీర్థఞ్చామరవర్తనమ్ ॥ 73 ॥

అంగారతీర్థం, రుద్రారణ్యం, మేధావితీర్థం, దేవహ్రదం, అమరవర్తనతీర్థం,

మన్దాకినీహ్రదం పుణ్యం క్షమమ్మాహేశ్వరం తథా ।
గఙ్గాతీర్థం త్రిపురుషం భీమతాణ్డవవామఖమ్ ॥ 74 ॥

పుణ్యదాయకమయిన – మందాకినీహ్రదం, క్షమతీర్థం, మాహేశ్వరతీర్థం, గంగాతీర్థం, త్రిపురుషతీర్థం, భీమతాండవవాముఖం,

పృథుకూటం శాల్వకూటం శోణం రోహితకం పునః ।
కపిలాహ్రదం సమాల్యఞ్చ వాసిష్ఠం కపిలాహ్రదమ్ ॥ 75 ॥

పృథుకూటం, శాల్వకూటం, శోణం, రోహితం, కపిలాహ్రదం, సమాల్యం, వసిష్ఠతీర్థం, కపిలాహ్రదం,

తథాஉన్యద్ వాలఖిల్యానాం సప్తర్షీణాం తథాపరమ్ ।
తథాஉన్యచ్చ మహర్షీణామఖణ్డితహ్రదం తథా ॥ 76 ॥

వాలఖిల్యతీర్థం, సప్తర్షితీర్థం, మహర్షులకు చెందిన అఖండితహ్రదం,

తీర్థేష్వేతేషు విధివత్ సమ్యక్ శ్రద్ధాసమన్వితః ।
స్నానం కరోతి యో మర్త్యస్సోపవాసో జితేన్ద్రియః ॥ 77 ॥

ఈపుణ్యతీర్థాలలో శాస్త్రోక్తవిధానంగా చక్కగా శ్రద్ధగా స్నానం చేయాలి. ఇంద్రియనిగ్రహం కలిగి ఉండాలి. ఉపవాసం ఉండాలి.

దేవాన్ ఋషీన్ మనుష్యాంశ్చ పితౄన్ సన్తర్ప్య చ క్రమాత్ ।
అభ్యర్చ్య దేవతాస్తత్ర స్థిత్వా చ రజనీత్రయమ్ ॥ 78 ॥

క్రమంగా దేవతలనూ, ఋషులనూ, పితరులనూ, ఉద్దేశించి తర్పణం (దేవ, ఋషి, పితృతర్పణం) ఆచరించాలి. దేవతార్చనం చేయాలి. ఆ పుణ్యతీర్థాలలో(క్షేత్రాలలో) మూడు రాత్రులు (రోజులు) నివసించాలి.

పృథక్ పృథక్ ఫలం తేషు ప్రతితీర్థేషు భో ద్విజాః ।
ప్రాప్నోతి హయమేధస్య నరో నాస్త్యత్ర సంశయః ॥ 79 ॥

ఓ విప్రులారా! పై పుణ్యతీర్థాలలో ఇలా ఆచరిస్తే, ప్రతితీర్థానికి దేనికి దానికిగా వేరు వేరుగా ప్రత్యేకమయిన ఫలితం సిద్ధిస్తుంది. అశ్వమేధయాగం చేసినపుణ్యం కలుగుతుంది. ఇందులో సందేహం లేదు.

యస్త్విదం శృణుయా న్నిత్యం తీర్థమాహాత్మ్యముత్తమమ్ ।
పఠేచ్ఛ శ్రావయేద్ వాపి సర్వపాపైః ప్రముచ్యతే ॥ 80 ॥

ఉత్తమమయిన ఈపుణ్యతీర్థమాహాత్మ్యాన్ని నిత్యమూ చదివినా, విన్నా, వినిపించినా, వారికి సమస్త మయిన పాపాలు నశిస్తాయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణే తీర్థనామమాహాత్మ్యవర్ణనం నామ త్రయోవింశోఽధ్యాయః ॥ 23 ॥

శ్రీబ్రహ్మపురాణంలో తీర్థనామమాహాత్మ్యవర్ణనం అనే ఇరవైమూడవ అధ్యాయం సంపూర్ణం.



చతుర్వింశోఽ ధ్యాయః - ఇరవైనాల్గవ అధ్యాయం

స్వయంభూ బ్రహ్మర్షిసంవాదమ్- ప్రశ్ననిరూపణమ్ - స్వయంభూ బ్రహ్మర్షిసంవాదం - ప్రశ్ననిరూపణం

మునయ ఊచుః :-లోమహర్షణుడిని మునులు ఈవిధంగా అడుగుతున్నారు.

పృథివ్యా ముత్తమాం భూమిం ధర్మకామార్థమోక్షదామ్ ।
తీర్థానాముత్తమం తీర్థం బ్రూహి నో వదతాం వర ॥ 1 ॥

మాటకారులలో మేటి అయిన లోమహర్షణమహర్షీ! ఈ భూమిమీద ధర్మ, కామ, అర్థ, మోక్షాలను (చతుర్విధ పురుషార్థాలను) ప్రసాదించేటటువంటి ఉత్తమమయిన పుణ్యక్షేత్రాన్నీ, తీర్థాలలో ఉత్తమమయిన పుణ్యతీర్థాన్నీ చెప్పవలసింది.

లోమహర్షణ ఉవాచ :-లోమహర్షణుడు మునులతో ఈవిధంగా చెప్తున్నాడు.

ఇమం ప్రశ్నం మమ గురుం పప్రచ్ఛు ర్మునయః పురా ।
తమహం సంప్రవక్ష్యామి యత్ పృచ్ఛధ్వం ద్విజోత్తమాః ॥ 2 ॥

బ్రాహ్మణోత్తములారా! పూర్వం మహర్షులు ఇదే ప్రశ్నను మాగురువు వ్యాసభగవానుడిని అడిగారు. అపుడు వ్యాసుడు మహర్షులకు చెప్పినవిషయాన్నే మీరడిగినదానికి (సమాధానంగా) చెప్తాను.

స్వాశ్రమే సుమహాపుణ్యే నానాపుష్పోపశోభితే ।
నానాద్రుమలతాకీర్ణే నానామృగగణై ర్యుతే ॥ 3 ॥

అది వ్యాసమహర్షిఆశ్రమం. ఆఆశ్రమం రకరకాలపూలతో అందంగా ఉంది. రకరకాలయిన చెట్లతో గుబురుగా ఉంది. రకరకాలయిన జంతువులతో కూడిఉంది.

పున్నాగైః కర్ణికారైశ్చ సరలై ర్దేవదారుభిః ।
శాలై స్తాలై స్తమాలైశ్చ పనసై ర్ధవఖాదిరైః ॥ 4 ॥

పున్నాగం, కొండగోగు, తెల్లతెగడ, దేవదారువు, బొద్దుగ, తాడి, చీకటిచెట్లు, పనసచెట్లు, ఉమ్మెత్త, చంద్ర,

పాటలాశోకవకులైః కరవీరై స్సచమ్పకైః ।
అన్యైశ్చ వివిధై ర్వృక్షై ర్నానాపుష్పోపశోభితైః ॥ 5 ॥

పొన్న, కంకేళి, పొగడ, గన్నేరు, సంపంగి ఇంకా రకరకాలయిన ఇతరవృక్షాలతోనూ, పూలతోనూ చక్కగా ప్రకాశిస్తున్నది.

కురుక్షేత్రే సమాసీనం వ్యాసం మతిమతాం వరమ్ ।
మహాభారతకర్తారం సర్వశాస్త్రవిశారదమ్ ॥ 6 ॥

వ్యాసభగవానుడు కురుక్షేత్రంలో (తనఆశ్రమంలో) చక్కగా ఆసీనుడై ఉన్నాడు. వ్యాసుడు బుద్ధిమంతులలో ఉత్తముడు. మహాభారత ఇతిహాసాన్ని రచించినవాడు. అన్నిశాస్త్రాలలోనూ నిష్ణాతుడు.

అధ్యాత్మనిష్ఠం సర్వజ్ఞం సర్వభూతహితే రతమ్ ।
పురాణాగమవక్తారం వేదవేదాఙ్గపారగమ్ ॥ 7 ॥

ఆత్మదర్శనంలో నిష్ఠ గలిగినవాడు. సమస్తమూ తెలిసినవాడు. సమస్తమయిన చరాచరకోటికి మేలు చేయడంలో ఆసక్తి కలిగినవాడు. పురాణాలూ, స్మృతులూ పేర్కొన్నవాడు. వేదాలనూ వేదాంగాలనూ తుదిముట్ట గ్రహించినవాడు.

పరాశరసుతం శాన్తం పద్మపత్రాయతేక్షణమ్ ।
ద్రష్టు మభ్యాయయుః ప్రీత్యా మునయ శ్శంసితవ్రతాః ॥ 8 ॥

వ్యాసుడు పరాశరమహర్షి కుమారుడు, ఇంద్రియాలను జయించినవాడు. తామరరేకులవలె విశాల మయినకన్నులు కలిగినవాడు. అటువంటి వ్యాసమహర్షిని దర్శించుకోవడంకోసం ప్రశస్తమయిన వ్రతదీక్షలో ఉన్న మహామునులు ఆనందంగా వ్యాసుడి ఆశ్రమానికి వచ్చారు.

కశ్యపో జమదగ్నిశ్చ భరద్వాజోஉథ గౌతమః ।
వసిష్ఠో జైమిని ర్ధౌమ్యో మార్కణ్డేయశ్చ వాల్మీకిః ॥ 9 ॥

ఆ వచ్చిన మహామునులు – కశ్యపుడు, జమదగ్ని, భరద్వాజుడు, గౌతముడు, వసిష్ఠుడు, జైమిని, మార్కండేయుడు, వాల్మీకి,

విశ్వామిత్ర శ్శతానన్దో వాత్స్యో గర్గోஉథ ఆసురిః ।
సుమన్తు ర్భార్గవో నామ కణ్వో మేధాతిథి ర్గురుః ॥ 10 ॥

విశ్వామిత్రుడు, శతానందుడు, వాత్స్యుడు, గర్గుడు, ఆసురి, సుమంతుడు, భార్గవుడు, కణ్వుడు, మేధాతిథి, గురువు,

మాణ్డవ్య శ్చ్యవనో ధూమ్రో హ్యసితో దేవల స్తథా ।
మౌద్గల్య స్తృణబాహుశ్చ పిప్పలాదోஉకృతవ్రణః ॥ 11 ॥

మాండవ్యుడు, చ్యవనుడు, ధూమ్రుడు, అసితుడు, దేవలుడు, మౌద్గల్యుడు, తృణబాహుడు, పిప్పలాదుడు, కృతవ్రణుడు,

సంవర్తః కౌశికో రైభ్యో మైత్రేయో హారిత స్తథా ।
శాణ్డిల్యశ్చ తథాగస్త్యో దుర్వాసా లోమశ స్తథా ॥ 12 ॥

సంవర్తుడు, కౌశికుడు, రైభ్యుడు, మైత్రేయుడు, హారితుడు, శాండిల్యుడు, అగస్త్యుడు, దుర్వాసుడు, లోమశుడు,

నారదః పర్వతశ్చైవ వైశంపాయనగాలవౌ ।
భాస్కరిః పూరణి స్సూతః పులస్త్యః కపిల స్తథా ॥ 13 ॥

నారదుడు, పర్వతుడు, వైశంపాయనుడు, గాలవుడు, భాస్కరి, పూరణి, సూతుడు, పులస్త్యుడు, కపిలుడు,

ఉలూకః పులహో వాయు ర్దేవస్థానశ్చ తుమ్బురుః ।
సనత్కుమారః పైలశ్చ కృష్ణః కృష్ణానుభౌతికః ॥ 14 ॥

ఉలూకుడు, పులహుడు, వాయువు, దేవస్థానుడు, తుంబురుడు, సనత్కుమారుడు, పైలుడు, కృష్ణుడు, కృష్ణానుభౌతికుడు,

ఏతైర్మునివరైశ్చాన్యై ర్వృత స్సత్యవతీసుతః ।
రరాజ స ముని ర్ధీమాన్ నక్షత్రైరివ చన్ద్రమాః ॥ 15 ॥

వీరూ, ఇంకా ఇతరులయిన మహామునులు ఎందరో వ్యాసుడివద్దకు వచ్చారు. ఆమహర్షులు అందరూ వ్యాసమహర్షి చుట్టూ చేరి కూర్చునిఉండగా, సత్యవతికుమారుడూ, బుద్ధిమంతుడూ అయిన వ్యాసముని నక్షత్రాలనడుమ ఉన్న చంద్రుడిలాగా చక్కగా ప్రకాశించాడు.

తానాగతాన్ మునీన్ సర్వాన్ పూజయామాస వేదవిత్ ।
తేఽపి తం ప్రతిపూజ్యైవ కథాం చక్రుః పరస్పరమ్ ॥ 16 ॥

వేదవేత్త అయిన వ్యాసుడు తనవద్దకు వచ్చిన ఆమహర్షులందరినీ చక్కగా పూజించాడు. వారు కూడ వ్యాసభగవానుడికి ప్రతిపూజలు చేశారు. వారు అందరూ ఒకరితో ఒకరు (కుశలప్రశ్నలు మొదలయిన అంశాలతో) సంభాషించుకున్నారు.

కథాన్తే తే మునిశ్రేష్ఠాః కృష్ణం సత్యవతీసుతమ్ ।
పప్రచ్ఛు స్సంశయం సర్వే తపోవననివాసినః ॥ 17 ॥

అలా మాట్లాడుకున్నతరువాత చివరికి ఆమునివరేణ్యులూ, ఆతపోవనంలో నివసించేవారూ అందరూ తమసందేహాన్ని గురించి వేదవ్యాసమహర్షిని ప్రశ్నించారు.

మునయ ఊచుః:- ఆమునులు వ్యాసమునిని ఈవిధంగా అడిగారు.

మునే వేదాంశ్చ శాస్త్రాణి పురాణాగమభారతమ్ ।
భూతం భవ్యం భవిష్యం చ సర్వం జానాసి వాఙ్మయమ్ ॥ 18 ॥

మహర్షీ! వేదాలనూ, శాస్త్రాలనూ, పురాణాలనూ, ఆగమాలనూ, భారతాన్నీ, సమస్తమయిన వాఙ్మయాన్నీ, అలాగే జరిగిపోయినదీ, జరుగుతున్నదీ, జరగబోయేదీ, అయిన వృత్తాంతాలు మొత్తమూ తెలిసినవాడివి.

కష్టేఽస్మిన్ దుఃఖబహులే నిస్సారే భవసాగరే ।
రాగగ్రాహాకులే రౌద్రే విషయోదకసంప్లవే ॥ 19 ॥

ఈ సంసారం ఒకసముద్రం. దీనిలో సారం లేదు. బాధలు అధికం. మమత్వం అనే మొసళ్లతో నిండిఉంది. భయంకర మైనది. ఈ సంసారసాగరంలో ఇంద్రియార్థాలు అనే నీళ్లు ఉవ్వెత్తున లేచి జనాలను ముంచివేస్తున్నాయి.

ఇన్ద్రియావర్తకలిలే దృష్టోర్మిశతసఙ్కులే ।
మోహపఙ్కావిలే దుర్గే లోభగమ్భీరదుస్తరే ॥ 20 ॥

ఈసంసారం ఇంద్రియాలు (వాటివిషయాలు) అనే సుడిగుండాలతో భయంకరమైనది. వందలకొద్దీ అలలతో నిండిఉంది. స్త్రీవ్యామోహం అనే బురదతో కలతపెడుతుంది. ప్రవేశించటానికి వీలు లేనిది. పిసినారితనం అనే అంతులేని లోతు గలిగినది.

నిమజ్జజ్జగదాలోక్య నిరాలమ్బ మచేతనమ్ ।
పృచ్ఛామ స్త్వాం మహాభాగం బ్రూహి నో మునిసత్తమ ॥ 21 ॥

అటువంటి సంసారసముద్రంలో లోకం మునిగిపోతున్నది. బయటపడడానికి ఆధారం లేదు. దిక్కుతోచక నిశ్చేష్టమై ఉన్నది. అటువంటి ఈ లోకాన్ని చూసి, నిన్ను అడుగుతున్నాం. మహాత్మా! మహర్షివరేణ్యా! మాకు ఈవిషయం చెప్పు.

శ్రేయః కిమత్ర సంసారే భైరవే లోమహర్షణే ।
ఉపదేశప్రదానేన లోకా నుద్ధర్తుమర్హసి ॥ 22 ॥

ఈసంసారం చూస్తుంటే భయంతో వెంట్రుకలు నిక్కబొడుచుకుంటున్నాయి. సంసారంలో పడిఉన్న మేము సాధింపవలసిన శ్రేయస్సు ఏమిటి? కర్తవ్యాన్ని ఉపదేశించి, లోకాలను ఉద్ధరింపదగినవాడివి నీవే.

దుర్లభం పరమం క్షేత్రం వక్తు మర్హసి మోక్షదమ్ ।
పృథివ్యాం కర్మభూమిం చ శ్రోతుమిచ్ఛామహే వయమ్ ॥ 23 ॥

మోక్షాన్ని ఇచ్చేదీ, ఇంక ఎక్కడా లేనిదీ, (సాటిలేనిదీ), ఉత్తమమయినదీ అయిన పుణ్యక్షేత్రం ఏదో చెప్పు. ఈ భూమిమీద శ్రేయస్సును సాధించే కర్మలను ఆచరించడానికి యోగ్యమయిన భూమిని తెలుసుకోవాలని మేము కోరుతున్నాం.

కృత్వా కిల నర స్సమ్యక్ కర్మభూమౌ యథోదితమ్ ।
ప్రాప్నోతి పరమాం సిద్ధిం నరకం చ వికర్మతః ॥ 24 ॥

వేదాలలో చెప్పబడిన ఉత్తమమయిన కర్మను చేసి, మానవుడు ఈభూమిమీదనే ఉత్తమమయిన సిద్ధి పొందుతాడు. దుష్టకర్మలను చేయడంచేత నరకం పొందుతాడు.

మోక్షక్షేత్రే తథా మోక్షం ప్రాప్నోతి పరమం సుధీః ।
తస్మాద్ బ్రూహి మహాప్రాజ్ఞ యత్ పృష్టోఽసి ద్విజోత్తమైః ॥ 25 ॥

బుద్ధిమంతుడు మోక్షప్రదమయిన పుణ్యక్షేత్రంలో మోక్షాన్ని పొందుతాడు. గొప్పబుద్ధిమంతుడా! బ్రాహ్మణోత్తములు అడిగిన ఈవిషయాన్ని గురించి చెప్పు.

శ్రుత్వా తు వచనం తేషాం మునీనాం భావితాత్మనామ్ ।
వ్యాసః ప్రోవాచ మతిమాన్ భూతభవ్యభవిష్యవిత్ ॥ 26 ॥

జరిగినదీ, జరుగుతున్నదీ, జరగబోయేదీ సర్వమూ తెలిసిన, బుద్ధిమంతుడయిన వ్యాసభగవానుడు ఆత్మజ్ఞానులయిన ఆ మునివరుల మాటలు విని వారితో ఇలా అన్నాడు.

వ్యాస ఉవాచ:- మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

శృణుధ్వం మునయ స్సర్వే వక్ష్యామి యది పృచ్ఛథ ।
య స్సంవాదోఽభవత్ పూర్వ మృషీణాం బ్రహ్మణా సహ ॥ 27 ॥

మహర్షులారా! మీరు అడిగిన విషయం పూర్వం ఒకప్పుడు మహర్షులకు బ్రహ్మదేవుడితో సంభాషణరూపంలో ఏర్పడి ఉంది. ఆవృత్తాంతాన్ని చెప్తాను. అందరూ వినండి.

మేరుపృష్ఠే తు విస్తీర్ణే నానారత్నవిభూషితే ।
నానాద్రుమలతాకీర్ణే నానాపుష్పోపశోభితే ॥ 28 ॥

అది మేరుపర్వతం మీద ఒకానొకప్రదేశం. ఆప్రదేశం అనేకమయిన రత్నాలతో అలంకరింపబడి ఉంది. వివిధమయిన చెట్లతో దట్టంగా ఉంది. రకరకాలయిన పూవులతో అందంగా ఉంది.

నానాపక్షిరుతే రమ్యే నానాప్రసవసఙ్కులే ।
నానాసత్త్వసమాకీర్ణే నానాశ్చర్యసమన్వితే ॥ 29 ॥

రకరకాలపక్షుల అరుపులతో ఆప్రదేశం మనోహరంగా ఉంది. పలురకాల పూలతో నిండి ఉంది. అనేక మయిన జంతువులతో నిండిపోయి ఉంది. రకరకాలయిన వింతలతో కూడిఉంది.

నానావర్ణశిలాకీర్ణే నానాధాతువిభూషితే ।
నానామునిజనాకీర్ణే నానాశ్రమసమన్వితే ॥ 30 ॥

అనేకమయిన రంగులరాళ్ళతో వ్యాపించి ఉంది. పలుతెరగులయిన ధాతువులతో అలంకరింపబడి ఉంది. చాలమంది మహర్షులతో సందడిగా ఉంది. పలు ముని ఆశ్రమాలతో కూడిఉంది.

తత్రాసీనం జగన్నాథం జగద్యోనిం చతుర్ముఖమ్ ।
జగత్పతిం జగద్వన్ద్యం జగదాధారమీశ్వరమ్ ॥ 31 ॥

లోకభర్త అయిన బ్రహ్మదేవుడు అక్కడ ఆసీను డయిఉన్నాడు. ఆయనే ఈజగత్తులను సృష్టించాడు. ఆయనే ఈజగత్తులను పోషిస్తాడు. అతడికి నాలుగు ముఖాలు ఉన్నాయి. ఆయన ఈలోకాలకు అన్నింటికీ నాథుడు. లోకాలు ఆయనకు నమస్కరిస్తాయి. లోకాలకు ఆయన ఆధారం. ఆతడే అందరికీ ప్రభువు.

దేవదానవగన్ధర్వై ర్యక్షవిద్యాధరోరగైః ।
మునిసిద్ధాప్సరోభిశ్చ వృతమన్యైర్దివాలయైః ॥ 32 ॥

దేవతలు, దానవులు, గంధర్వులు, యక్షులు, విద్యాధరులు, నాగులు, మునులు, సిద్ధులు, అప్సరసలు, ఇంకా ఇతరమయిన దేవలోకనివాసులు అందరూ చుట్టూ చేరి, ఆ బ్రహ్మదేవుడిని సేవిస్తున్నారు.

కేచిత్ స్తువన్తి తం దేవం కేచిద్ ధ్యాయన్తి చాగ్రతః ।
కేచిద్ వాద్యాని వాద్యన్తే కేచి న్నృత్యన్తి చాపరే ॥ 33 ॥

ఆబ్రహ్మదేవుడిని కొందరు స్తోత్రం చేస్తున్నారు. మరి కొందరు ఎదురుగా ధ్యానం చేస్తున్నారు. కొందరు వివిధవాద్యాలను వాయిస్తున్నారు. మరి కొందరు నాట్యం చేస్తున్నారు.

ఏవం ప్రముదితే కాలే సర్వభూతసమాగమే ।
నానాకుసుమగన్ధాఢ్యే దక్షిణానిలసేవితే ॥ 34 ॥

ఈవిధంగా ఆసమయం ఆనందమయంగా ఉన్నది. సమస్తమయిన భూతకోటులు అక్కడకు చేరుకున్నాయి. అనేకమయిన పూవుల పరిమళంతో నిండిన మలయపర్వతం మీది గాలులు ఆప్రదేశమంతటా నిండి ఉన్నాయి.

భృగ్వాద్యా మునయో దేవం ప్రణిపత్య పితామహమ్ ।
ఇమ మర్థ మృషివరాః పప్రచ్ఛుః పితరం ద్విజాః ॥ 35 ॥

భృగువు మొదలయిన మునులు బ్రహ్మదేవుడికి నమస్కరించారు. ఆ బ్రాహ్మణులు ఆ బ్రహ్మదేవుడిని ఈవిషయాన్ని గురించి అడిగారు.

ఋషయ ఊచుః:- బ్రహ్మదేవుడితో మహర్షులు ఈవిధంగా అంటున్నారు.

భగవన్ శ్రోతుమిచ్ఛామః కర్మభూమిం మహీతలే ।
వక్తుమర్హసి దేవేశ మోక్షక్షేత్రం చ దుర్లభమ్ ॥ 36 ॥

మహానుభావా! ఈభూమిమీద కర్మభూమిని గురించి వినగోరుతున్నాం. దేవతాపతీ! వేరొకచోట ఎక్కడా లేని మోక్షభూమిని గురించి చెప్పదగినవాడివి నీవే.

వ్యాస ఉవాచ :-ఆమహర్షులతో వ్యాసభగవానుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తేషాం వచనమాకర్ణ్య ప్రాహ బ్రహ్మా సురేశ్వరః ।
పప్రచ్ఛు స్తే యథా ప్రశ్నం తత్సర్వం మునిసత్తమాః ॥ 37 ॥

ఆమహర్షుల ప్రశ్నలు విని దేవపతి అయిన బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు. మునివరేణ్యులారా! మీరు అడిగినప్రశ్నకు తగినవిధంగా అన్ని విషయాలను చెప్తాను. వినండి. (ఇది ఒకప్పుడు మహర్షులకు స్వయంభువు చెప్పినది. కాబట్టి 24 నుండి 70 అధ్యాయం వరకు స్వయంభూబ్రహ్మర్షిసంవాదం. దీనిని తరువాత వ్యాసుడు తనఆశ్రమంలో మహర్షులకు చెప్పాడు. ప్రస్తుతం ఆవృత్తాంతాన్ని లోమహర్షణుడు నైమిశారణ్యమునులకు చెప్తున్నాడు.)

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భృషిసంవాదే ప్రశ్ననిరూపణం నామ చతుర్వింశోఽధ్యాయః ॥ 24 ॥
శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో ప్రశ్ననిరూపణం అనే ఇరవైనాలుగవ అధ్యాయం సంపూర్ణం.

పఞ్చవింశోऽధ్యాయః - ఇరవైఐదవ అధ్యాయం

భారతవర్షానుకీర్తనమ్ - భారతవర్షానుకీర్తనం

బ్రహ్మోవాచ :- మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

శృణుధ్వం మునయ స్సర్వే యద్ వో వక్ష్యామి సామ్ప్రతమ్ ।
పురాణం వేదసమ్బద్ధం భుక్తిముక్తిప్రదం శుభమ్ ॥ 1 ॥

మహర్షులారా! ఇపుడు మీకు చెప్పేవిషయాన్ని అందరూ జాగ్రత్తగా వినండి. ఇది ప్రాచీనులవచనం. వేదాలకు అనుగుణం. బ్రతికిఉండగా సుఖానుభవాన్ని, తరువాత ముక్తిని ప్రసాదిస్తుంది. శుభాలను కలుగజేస్తుంది.

పృథివ్యాం భారతం వర్షం కర్మభూమి రుదాహృతా ।
కర్మణః ఫలభూమిశ్చ స్వర్గం చ నరకం తథా ॥ 2 ॥

ఈభూమిమీద భారతదేశాన్ని కర్మభూమి అంటారు. కర్మలకు ఫలితమయిన ప్రదేశాలు స్వర్గమూ, నరకమూ. (కర్మలకు ఫలితంగా స్వర్గమూ, నరకమూ కలుగుతాయి.)

తస్మిన్ వర్షే నరః పాపం కృత్వా ధర్మం చ భో ద్విజాః ।
అవశ్యం ఫలమాప్నోతి అశుభస్య శుభస్య చ ॥ 3 ॥

ఓ బ్రాహ్మణులారా! మానవుడు భారతవర్షంలో పాపపు పనులు చేసి అశుభమయిన ఫలితాన్నీ (నరకాన్నీ), ధర్మకార్యాలు ఆచరించి శుభఫలితాన్నీ (స్వర్గాన్నీ) తప్పకుండా పొందుతాడు.

బ్రాహ్మణాద్యా స్స్వకం కర్మ కృత్వా సమ్యక్ సుసంయతాః ।
ప్రాప్నువన్తి పరాం సిద్ధిం తస్మిన్ వర్షే న సంశయః ॥ 4 ॥

బ్రాహ్మణులు మొదలయిన(నాలుగు)వర్ణాలవారూ ఈభారతవర్షంలో తమ తమ వర్ణాలకు తగిన కర్మలను శ్రద్ధగా ఆచరించి, ఉత్తమోత్తమమయిన ఫలితాన్ని పొందుతారు. ఇందులో సందేహం లేదు.

ధర్మం చార్థం చ కామం చ మోక్షం చ ద్విజసత్తమాః ।
ప్రాప్నోతి పురుష స్సర్వం తస్మిన్ వర్షే తు సంయతః ॥ 5 ॥

బ్రాహ్మణోత్తములారా! భారతవర్షంలో ఇంద్రియాలను నిగ్రహించిన మానవుడు ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే నాలుగు పురుషార్థాలను పొందుతాడు.

ఇన్ద్రాద్యాశ్చ సురా స్సర్వే తస్మిన్ వర్షే ద్విజోత్తమాః ।
కృత్వా సుశోభనం కర్మ దేవత్వం ప్రతిపేదిరే ॥ 6 ॥

విప్రవరులారా! ఇంద్రుడు మొదలయిన దేవతలు కూడా దేవతలు కాకపూర్వం మానవులుగా ఉండి భారతవర్షంలో పుణ్యకర్మలను ఆచరించడం వల్లనే దేవత్వాన్ని పొందారు.

అన్యేऽపి లేభిరే మోక్షం పురుషా స్సంయతేన్ద్రియాః ।
తస్మిన్ వర్షే బుధా శ్శాన్తా వీతరాగా విమత్సరాః ॥ 7 ॥

ఈభారతవర్షంలో ఇంద్రియాలను తమ అధీనంలో ఉంచుకున్నవారు, జ్ఞానులు, అహంకార, మమకారాలను విడిచిపెట్టినవారు, అసూయ లేనివారు అయిన ఇతరమానవులు కూడ (స్వర్గాదులను కోరక) మోక్షాన్ని పొందారు.

యే చాపి స్వర్గే తిష్ఠన్తి విమానేన గతజ్వరాః ।
తేఽపి కృత్వా శుభం కర్మ తస్మిన్ వర్షే దివం గతాః ॥ 8 ॥

ఇపుడు స్వర్గలోకంలో ఉన్న దేవతలు మొదలయినవారు కూడ ఒకప్పుడు భారతవర్షంలో మంచికర్మలను చేసి, బాధలు అన్నీ నశించిపోగా, విమానమెక్కి స్వర్గలోకానికి వెళ్లిన మానవులే.

నివాసం భారతే వర్షే ఆకాంక్షన్తి సదా సురాః ।
స్వర్గాపవర్గఫలదే తత్ పశ్యామః కదా వయమ్ ॥ 9 ॥

అందువల్లనే దేవతలు కూడా స్వర్గాన్నీ మోక్షాన్నీ ఇచ్చేటటువంటి భారతవర్షంలో నిరంతరమూ నివసించాలని కోరుకుంటారు. ఆ భారతవర్షాన్ని ఎప్పుడు చూస్తామా అని ఎదురుచూస్తుంటారు.

మునయ ఊచుః :– బ్రహ్మదేవుడితో మహర్షులు ఈవిధంగా అంటున్నారు.

యదేతద్ భవతా ప్రోక్తం కర్మ నాన్యత్ర పుణ్యదమ్ ।
పాపాయ వా సురశ్రేష్ఠ వర్జయిత్వా చ భారతమ్ ॥ 10 ॥

దేవతావరేణ్యా! 'భారతవర్షంలో తప్ప ఇతరప్రదేశాలలో ఎక్కడా, చేసిన కర్మ పుణ్యం లేదా పాపం ఇవ్వదు.' అని చెప్పారు.

తత స్స్వర్గశ్చ మోక్షశ్చ మధ్యమన్తం చ గమ్యతే ।
నవాన్యత్ర చ మర్త్యానాం భూమౌ కర్మ విధీయతే ॥ 11 ॥

ఈభారతవర్షం నుండే (జన్మల)మధ్యలో స్వర్గానికీ, (జన్మ లన్నింటికీ) చివర మోక్షాన్నీ చేరుకుంటారు. మరణం స్వభావంగా కలిగిన మానవులకు భూలోకంలో భారతవర్షంలో తప్ప మరి ఇంక ఎక్కడా కర్మలు చేయడం విధింపబడలేదు. (ఇతరస్థలాలలో కర్మకు ఫలితం ఉండదు. కాబట్టి స్వర్గమోక్షాదులయిన ఫలం పొందటంకోసం ఆయా కర్మలు భారతవర్షంలో మాత్రమే చెప్పబడ్డాయి.) అని మీరు చెప్పారు.

తస్మాద్ విస్తరతో బ్రహ్మ న్నస్మాకం భారతం వద ।
యది తే హి దయాస్మాసు యథావస్థితిరేవ చ ॥ 12 ॥

అందుచేత బ్రహ్మదేవా! నీకు మామీద అనుగ్రహంతో, భారతవర్షాన్ని గురించిన యథార్థాలు అన్నీ మాకు విస్తరించి చెప్పు.

తస్మాద్ వర్షమిదం నాథ యే వాఽస్మిన్ వర్షపర్వతాః ।
భేదాశ్చ తస్య వర్షస్య బ్రూహి సర్వానశేషతః ॥ 13 ॥

మహాత్మా! ఈ భారతవర్షం గురించి, భారతంలోని వర్షపర్వతాలు ఏవో, భారతవర్షంలోని భేదాలు ఏమిటో, మొదలుగా అన్ని అంశాలను విడిచిపెట్టకుండా చెప్పు.

బ్రహ్మోవాచ:- మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

శృణుధ్వం భారతం వర్షం నవభేదేన భో ద్విజాః ।
సముద్రాన్తరితా జ్ఞేయా స్తే సమా శ్చ పరస్పరమ్ ॥ 14 ॥

ఓ బ్రాహ్మణులారా! వినండి. భారతవర్షంలో తొమ్మిది భాగాలు ఉన్నాయి. అవి అన్నీ పరస్పరం సముద్రాలచేత వేరుచేయబడి ఉన్నాయి. అన్ని భాగాలు సమానంగా ఉంటాయి.

ఇన్ద్రద్వీపః కశేరుశ్చ తామ్రవర్ణో గభస్తిమాన్ ।
నాగద్వీప స్తథా సౌమ్యో గాన్ధర్వో వారుణ స్తథా ॥15 ॥

1. ఇంద్రద్వీపం, 2. కశేరువు, 3. తామ్రవ(ప)ర్ణం, 4. గభస్తిమంతం, 5. నాగద్వీపం, 6. సౌమ్యం, 7. గాంధర్వం, 8. వారుణం.

అయం తు నవమ స్తేషాం ద్వీప స్సాగరసంవృతః ।
యోజనానాఞ్చ సాహస్రం ద్వీపోఽ యం దక్షిణోత్తరః ॥ 16 ॥

ఆ తొమ్మిదిద్వీపాలలోనూ భారతవర్షం తొమ్మిదవద్వీపం. దీనిచుట్టూ సముద్రం ఉన్నది. ఈ భారతద్వీపం దక్షిణం నుండి ఉత్తరానికి వేయియోజనాల నిడివి కలిగిఉంది. (17.7,8)

పూర్వే కిరాతా యస్యాసన్ పశ్చిమే యవనా స్తథా ॥ 17 ॥

ఈద్వీపంలో తూర్పున కిరాతులు ఉంటారు. పడమట యవనులు ఉంటారు.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా శ్శూద్రా శ్చాత్ర స్థితా ద్విజాః ।
ఇజ్యాయుద్ధవణిజ్యాద్యైః కర్మభిః కృతపావనాః ॥ 18 ॥

విప్రులారా! ఇక్కడ ఉన్న బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు (అనేనాలుగువర్ణాలవారు) క్రమంగా (బ్రాహ్మణులు) యాగాలు, (క్షత్రియులు) యుద్ధాలు, (వైశ్యులు) వాణిజ్యం, (శూద్రులు) పరిచర్య మొదలయిన వృత్తులు ఆచరిస్తూ పవిత్రులయినారు. (వర్ణధర్మాలను సరిగా ఆచరించటంచేత ఉత్తములయినారు.)

తేషాం సద్వ్యవహారశ్చ ఏభిః కర్మభిరిష్యతే ।
స్వర్గాపవర్గహేతుశ్చ పుణ్యం పాపం చ వై తథా ॥ 19 ॥

తమ తమ వర్ణాలకు తగిన కర్మలను ఆచరించడంచేత వారికి ఉత్తమమయిన నడవడిక కలిగింది. వారి ప్రవర్తనం స్వర్గానికీ, మోక్షానికీ కారణమయింది. అదేవిధంగా పుణ్యమూ పాపమూ తరువాతిగతులకు కారణ మవుతాయి.

మహేన్ద్రో మలయ స్సహ్యః శ్శుక్తిమాన్ ఋక్షపర్వతః ।
విన్ధ్యశ్చ పారియాత్రశ్చ సప్తైవాత్ర కులాచలాః ॥

భారతవర్షంలో మహేంద్రం, మలయం, సహ్యం, శుక్తిమంతం, ఋక్షం, వింధ్యం, పారియాత్రం అనే కులపర్వతాలు ఏడు ఉన్నాయి.

తేషాం సహస్రశ శ్చాన్యే భూధరా యే సమీపగాః ।
విస్తారోచ్ఛ్రియిణో రమ్యా విపులా శ్చిత్రసానవః ॥ 20 ॥

ఈ సప్తకులపర్వతాలకు సమీపంలో ఇతరపర్వతాలు వేలసంఖ్యలో ఉన్నాయి. అవి అన్నీ బాగా ఎత్తయినవి. అందమైనవి. విశాలమయినవీ, ఆశ్చర్యకరమయిన శిఖరాలు కలిగినవి.

కోలాహల స్స వైభ్రాజో మన్దరో దర్దులాచలః ।
వాతాధ్వగో దైవతశ్చ మైనాక స్సురస స్తథా ॥ 21 ॥

(ఆపర్వతాలపేర్లు కొన్ని ఇవి.) కోలాహలం, వైభ్రాజం, మందరం, దర్దులం, వాతాధ్వగం, దైవతం, మైనాకం, సురసం,

తుఙ్గప్రస్థో నాగగిరి ర్గోధనః పాణ్డురాచలః ।
పుష్పగిరి ర్వైజయన్తో రైవతోఽర్బుద ఏవ చ ॥ 22 ॥

తుంగప్రస్థం, నాగం, గోధనం, పాండురం, పుష్పం, వైజయంతం, రైవతం, అర్బుదం,

ఋష్యమూకస్తు గోమన్థః కృతశైలః కృతాచలః ।
శ్రీపర్వతశ్చకోరశ్చ శతశోఽన్యే చ పర్వతాః ॥ 23 ॥

ఋష్యమూకం, గోమంథం, కృతశైలం, కృతాచలం, శ్రీపర్వతం, చకోరం, ఇంకా ఇతర పర్వతాలు వందలకొద్దీ ఉన్నాయి.

తై ర్విమిశ్రా జనపదా మ్లేచ్ఛాద్యా శ్చైవ భాగశః ।
తైః పీయన్తే సరిచ్ఛ్రేష్ఠా స్తా బుధ్యధ్వం ద్విజోత్తమాః ॥ 24 ॥

ఆయాపర్వతప్రాంతాలలో మ్లేచ్ఛులు మొదలయినవారు నివసించే అనేకజనావాసాలు (గ్రామాలు) అక్కడక్కడా ఉన్నాయి. బ్రాహ్మణవర్యులారా! ఆప్రజలు పుచ్చుకునే (తాగే)నీరు గలిగిననదులను గురించి తెలుసుకోండి.

గఙ్గా సరస్వతీ సిన్ధు శ్చన్ద్రభాగా తథాఽపరా ।
యమునా శతద్రు ర్విపాశా వితస్తైరావతీ కుహూః ॥ 25 ॥

గోమతీ ధూతపాపా చ బాహుదా చ దృషద్వతీ ।
విపాశా దేవికా చక్షు ర్నిష్ఠీవా గణ్డకీ తథా ॥ 26 ॥

కౌశికీ చాపగా చైవ హిమవత్పాదనిస్సృతాః ॥ 27 ॥

గంగ, సరస్వతి, సింధువు, చంద్రభాగ, యమున, శతద్రువు, విపాశ, వితస్త, ఐరావతి, కుహువు, గోమతి, ధూతపాప, బాహుద, దృషద్వతి, విపాశ (ఇంతకు ముందు శ్లోకంలో పేర్కొనబడిన విపాశ కంటె ఇది వేరు.),దేవిక, చక్షువు, నిష్ఠీవ, గండకి, కౌశికి అనే నదులు హిమాలయపర్వతం పాదప్రదేశం(మొదటి)నుండి వెలువడ్డాయి.(17.10)

దేవస్మృతి ర్దేవవతీ వాతఘ్నీ సిన్ధురేవ చ ।
వేణ్యా తు చన్దనా చైవ సదానీరా మహీ తథా ॥ 28 ॥

చర్మణ్వతీ వృషీ చైవ విదిశా వేత్రవత్యపి ।
శిప్రా ద్రవన్తీ చ తథా పారియాత్రానుగా స్స్మృతాః ॥ 29 ॥

దేవస్మృతి దేవవతి, వాతఘ్ని, సింధువు, వేణి, చందన, సదానీర, మహి, చర్మణ్వతి, వృషి, విదిశ, వేత్రవతి, శిప్ర, ద్రవంతి అనే నదులు పారియాత్రపర్వతం నుండి పుట్టాయి.

శోణా మహానదీ చైవ నర్మదా సురథా క్రియా ।
మన్దాకినీ దశార్ణా చ చిత్రకూటా తథాపరా ॥ 30 ॥

చిత్రోత్పలా వేత్రవతీ కరమోదా పిశాచికా ।
తథాఽ న్యాఽ తిలఘుశ్రోణీ విపాశా శైవలా నదీ ॥ 31 ॥

సమేరుజా శుక్తిమతీ శకునీ త్రిదివా క్రముః ।
ఋక్షపాదప్రసూతా వై తథాఽ న్యా వేగవాహినీ ॥ 32 ॥

శోణ, మహానది, నర్మద, సురథ, క్రియ, మందాకిని, దశార్ణ, చిత్రకూట, చిత్రోత్పల, వేత్రవతి (29), కరమోద, పిశాచిక, అతిలఘుశ్రోణి, విపాశ (25,26), శైవల, సమేరుజ, శుక్తిమతి, శకుని, త్రిదివ, క్రమువు, వేగవాహిని అనే నదులు ఋక్షపర్వతం మొదటినుండి పుట్టాయి. (17.12)

శిప్రా పయోష్ణీ నిర్విన్ధ్యా తాపీ చైవ సరిద్వరా ।
వేణా వైతరణీ చైవ సినీవాలీ కుముద్వతీ ॥ 33 ॥

తోయా చైవ మహాగౌరీ దుర్గా చాన్తశ్శిలా తథా ।
విన్ధ్యపాదప్రభూతాస్తా నద్యః పుణ్యజలా శ్శుభాః ॥ 34 ॥

శిప్ర, పయోష్ణి, నిర్వింధ్య, నదులలో శ్రేష్ఠమయిన తాపి, వేణ, వైతరణి, సినీవాలి, కుముద్వతి, తోయ, మహాగౌరి, దుర్గ, అంతశ్శిల అనే నదులు పవిత్రమయిన నీరు గలిగినవి, శుభాలు గలిగించేవి. ఈ నదులు వింధ్యపర్వతం మొదట్లో పుట్టాయి.(17.11)

గోదావరీ భీమరథీ కృష్ణవేణీ తథాపగా ।
తుఙ్గభద్రా సుప్రయోగా తథాఽ న్యా పాపనాశినీ ।
సహ్యపాదవినిష్క్రాన్తా ఇత్యేతా స్సరితాం వరాః ॥ 35 ॥

గోదావరి, భీమరథి, కృష్ణవేణ(ణి), తుంగభద్ర, సుప్రయోగ, పాపనాశిని అనే శ్రేష్ఠమయిననదులు సహ్యాపర్వతం మొదట్లో పుట్టాయి.

కృతమాలా తామ్రపర్ణీ పుష్పవత్యుపలావతీ ।
మలయాద్రిసముద్భూతాః పుణ్యా శ్శీతజలా స్త్విమాః ॥ 36 ॥

కృతమాల, తామ్రపర్ణి, పుష్పవతి, ఉపలావతి అనే పుణ్యనదులు చల్లనినీరు గలిగినవి. ఈనదులు మలయ పర్వతం మొదట్లో పుట్టాయి.

పితృసోమర్షికుల్యా చ వఞ్జులా త్రిదివా చ యా ।
లాఙ్గలినీ వంశకరా మహేన్ద్రప్రభవా స్స్మృతాః ॥ 37 ॥

పితృసోమ, ఋషికుల్య, వంజుల, త్రిదివ, లాంగలిని, వంశకర అనేనదులు మహేంద్రపర్వతం మొదట్లో పుట్టాయి.

సువికాలా కుమారీ చ మనుగా మన్దగామినీ ।
క్షయా పలాశినీ చైవ శుక్తిమత్ప్రభవా స్స్మృతాః ॥ 38 ॥

సువికాల, కుమారి, మనుగ, మందగామిని, క్షయ, పలాశిని అనే నదులు శుక్తిమంతం పర్వతం మొదట్లో పుట్టాయి.

సర్వాః పుణ్యా స్సరస్వత్య స్సర్వా గఙ్గా స్సముద్రగాః ।
విశ్వస్య మాతర స్సర్వా స్సర్వాః పాపహరాః స్మృతాః ॥ 39 ॥

ఈనదులు అన్నీ సరస్వతీనదివంటివి. గంగానదివంటివి. పుణ్యప్రదమైనవి. అన్నీ సముద్రంలోకి చేరతాయి. ఈనదులు అన్నీ ప్రపంచానికి తల్లుల వంటివి. పాపాలను నశింపజేస్తాయి.

అన్యా స్సహస్రశ స్సన్తి క్షుద్రనద్యో ద్విజోత్తమాః ।
ప్రావృట్కాలవహా స్సన్తి సదాకాలవహాశ్చ యాః ॥ 40 ॥

విప్రవర్యులారా! ఇంకా చిన్న చిన్న నదులు వేలకొద్దీ భారతవర్షంలో ఉన్నాయి. వీటిలో కొన్ని వర్షాకాలంలో (మాత్రమే) ప్రవహిస్తాయి. కొన్ని అన్ని కాలాలలోనూ ప్రవహిస్తుంటాయి.

మత్స్యాః కుముదమాల్యాశ్చ క్రతులాః కాశికోశలాః ।
అన్ధ్రకాశ్చ కలిఙ్గాశ్చ మశకాశ్చ వృకైస్సహ ।
మధ్యదేశా జనపదాః ప్రాయశోఽమీ ప్రకీర్తితాః ॥ 41 ॥

భారతవర్షంలో మధ్యప్రాంతంలో మత్స్యములు, కుముదమాల్యములు, క్రతులములు, కాశికోశలములు, అంధ్రకములు, కలింగములు, మశకములు, వృకములు అనే దేశాలు ప్రధానంగా ప్రసిద్ధమైనాయి.

సహ్యస్య చోత్తరే యస్తు యత్ర గోదావరీ నదీ ।
పృథివ్యా మపి కృత్స్నాయాం స ప్రదేశో మనోరమః ॥ 42 ॥

సహ్యపర్వతానికి ఉత్తరప్రాంతంలో గోదావరీనది ప్రవహించేప్రాంతం భూలోకం మొత్తంలోనూ అంద మయినప్రదేశం.

గోవర్ధనపురం రమ్యం భార్గవస్య మహాత్మనః ॥ 43 ॥

ఈప్రాంతంలో మహానుభావుడయిన భార్గవుడు నివసించే గోవర్ధనపురం ఇంకా రమణీయమయినది.

వాహీ కరాట ధానాశ్చ సుతీరాః కాలతోయదాః ।
అపరాన్తాశ్చ శూద్రాశ్చ బాహ్లికాశ్చ సకేరలాః ॥ 44 ॥

గాన్ధారా యవనాశ్చైవ సిన్ధు సౌవీర మద్రకాః ।
శతద్రుహాః కలిఙ్గాశ్చ పారదా హరిభూషికాః ॥ 45 ॥

మాఠరాశ్చైవ కనకాః కైకేయా దమ్భమాలికాః ।
క్షత్రియోపమదేశాశ్చ వైశ్యశూద్రకులాని చ ॥ 46 ॥

వాహీకములు, రాటధానములు, సుతీరములు, కాలతోయదములు, అపరాంతములు, శూద్రములు, బాహ్లికములు, కేరళములు, గాంధారములు, యవనములు, సింధువులు, సౌవీరములు, మద్రకములు, శతద్రువులు, కలింగములు, పారదములు, హరిభూషికములు, మాఠరములు, కనకములు, కైకేయములు, దంభమాలికములు అనేవి క్షత్రియ (ప్రధానంగా క్షత్రియులు నివసిస్తున్న) దేశాలు. ఇక్కడ వైశ్య, శూద్రకులాలవారు కూడ ఉన్నారు.

కామ్భోజాశ్చైవ విప్రేన్ద్రా బర్బరాశ్చ సలౌకికాః ।
వీరాశ్చైవ తుషారాశ్చ పహ్లవా ధాయతా నరాః ॥ 47 ॥

ఆత్రేయాశ్చ భారద్వాజాః పుష్కలాశ్చ దశేరకాః ।
లమ్పకాశ్శునశోకాశ్చ కులికా జాఙ్గలై స్సహ ॥ 48 ॥

ఔషధ్యశ్చలచన్ద్రాశ్చ కిరాతానాం చ జాతయః ।
తోమరా హంసమార్గాశ్చ కాశ్మీరాః కరుణా స్తథా ॥ 49 ॥

శూలికాః కుహకా శ్చైవ మాగధాశ్చ తథైవ చ ।
ఏతే దేశా ఉదీచ్యాస్తు ప్రాచ్యాన్ దేశాన్ నిబోధత ॥ 50 ॥

బ్రాహ్మణోత్తములారా! కాంభోజములు, బర్బరములు, లౌకికములు, వీరములు, తుషారములు, పహ్లవములు, ధాయతములు, నరములు, ఆత్రేయములు, భారద్వాజములు, పుష్కలములు, దశేరకములు, లంపకములు, శునశోకములు, కులికములు, జాంగలములు, ఓషధులు, చలచంద్రములు, వివిధజాతులకు

చెందిన కిరాతులు నివసించేదేశాలు, తోమరములు, హంస మార్గములు, కాశ్మీరములు, కరుణములు, శూలికములు, కుహకములు, మాగధములు అనేవి భారతవర్షంలో ఉత్తరదిక్కుగా ఉండే దేశాలు. ఇక తరువాత తూర్పుదిక్కుగా ఉండేదేశాలను గురించి తెలుసుకోండి.

అన్ధా వామఙ్కురాకాశ్చ వల్లకాశ్చ మఖాన్తకాః ।
తథాఽ పరేఽ ఙ్గా వఙ్గాశ్చ మలదా మాలవర్తికాః ॥ 51 ॥

భద్రతుఙ్గాః ప్రతిజయా భార్యాఙ్గాశ్చాపమర్దకాః ।
ప్రాగ్జ్యోతిషాశ్చ మద్రాశ్చ విదేహా స్తామ్రలిప్తకాః ॥ 52 ॥

మల్లా మగధకా నన్దాః ప్రాచ్యా జనపదా స్తథా ॥ 53 ॥

అంధములు, వామంకురాకములు, వల్లకములు, మఖాంతకములు, అంగములు, వంగములు, మలదములు, మాలవములు, ఋతికములు, భద్రతుంగములు, ప్రతిజయములు, భార్యాంగములు, అపమర్దకములు, ప్రాగ్జ్యోతిషములు, మద్రములు, విదేహములు, తామ్రలిప్తకములు, మల్లములు, మగధములు, నందములు అనేవి భారతవర్షంలో తూర్పుదిక్కుగా ఉన్నదేశాలు.

అథాపరే జనపదా దక్షిణాపథవాసినః ।
పూర్ణాశ్చ కేవలాశ్చైవ గోలాఙ్గూలాస్తథైవ చ ॥ 54 ॥

ఋషికా ముషికాశ్చైవ కుమారా రామఠా శ్శకాః ।
మహారాష్ట్రా మాహిషకాః కలిఙ్గా శ్చైవ సర్వశః ॥ 55 ॥

ఆభీరా స్సహ వైశిక్యా అటవ్యా స్సరవాశ్చ యే ।
పులిన్దాశ్చైవ మౌలేయా వైదర్భా దణ్డకై స్సహ ॥ 56 ॥

పౌలికా మౌలికా శ్చైవ అశ్మకా భోజవర్ధనాః ।
కౌలికాః కున్తలా శ్చైవ దమ్భకా నీలకాలకాః ॥ 57 ॥

దాక్షిణాత్యా స్త్వమీ దేశా హ్యపరాన్తా న్నిబోధత ॥ 58 ॥

ఇక తర్వాత భారతవర్షంలో దక్షిణాపథంలో (దక్షిణదిక్కులో) ఉన్నదేశాలు ఇవి. పూర్ణములు, కేవలములు, గోలాంగూలములు, ఋషికములు, ముషికములు, కుమారములు, రామఠములు, శకములు, మహారాష్ట్రములు, మాహిషకములు, కళింగములు, ఆభీరములు, వైశిక్యములు, అటవ్యములు, సరవములు, పుళిందములు, మౌలేయములు, వైదర్భములు, దండకములు, పౌలికములు, మౌలికములు, అశ్మకములు, భోజవర్ధనములు, కౌలికములు, కుంతలములు, దంభకములు, నీలకాలకములు ఇవి దక్షిణదిక్కున ఉన్నదేశములు. ఇక తరువాత భారతవర్షంలో పడమరదిక్కులో ఉన్న(పశ్చిమ)దేశాలను గ్రహించండి.

శూర్పారకాః కాలిధనా లోలా స్తాలకటై స్సహ ।
ఇత్యేతేహ్యపరాన్తాశ్చ శృణుధ్వం విన్ధ్యవాసినః ॥ 59 ॥

శూర్పారకములు, కాలిధనములు, లోలములు, తాలకటములు ఇవి పశ్చిమదేశాలు. తరువాత వింధ్యపర్వత ప్రాంతంలో ఉన్నదేశాలను గురించి వినండి.

మలజాః కర్కశాశ్చైవ మేలకాశ్చోలకై స్సహ ।
ఉత్తమార్ణా దశార్ణాశ్చ భోజాః కిష్కిన్ధకై స్సహ ॥ 60 ॥

తోషలాః కోశలాశ్చైవ త్రైపురా వైదిశా స్తథా ।
తుమ్బురాస్తు చరాశ్చైవ యవనాః పవనై స్సహ ॥ 61 ॥

అభయా రుణ్డికేరాశ్చ చర్చురా హోత్రధర్తయః ।
ఏతే జనపదాస్సర్వే తత్ర విన్ధ్యనివాసినః ॥ 62 ॥

మలజములు, కర్కశములు, మేలకములు, చోలకములు, ఉత్తమార్ణములు, దశార్ణములు, భోజములు, కిష్కింధకములు, తోషలములు, కోశలములు, త్రైపురములు, వైదిశములు, తుంబురములు, చరములు, యవనములు, పవనములు, అభయములు, రుండికేరములు, చర్చరములు, హోత్రధర్తులు ఇవి వింధ్యపర్వత ప్రాంతంలో జనం నివసించే ప్రదేశాలు.

అతో దేశాన్ ప్రవక్ష్యామి పర్వతాశ్రయిణశ్చ యే ।
నీహారా స్తుషమార్గాశ్చ కురవ స్తుఙ్గణాః ఖసాః ॥ 63 ॥

కర్ణప్రావరణా శ్చైవ ఊర్ణా దర్ఘా స్సకుఞ్చకాః ।
చిత్రమార్గా మాలవాశ్చ కిరాతా స్తోమరై స్సహ ॥ 64 ॥

ఇక పర్వతాలను ఆశ్రయించుకుని ఉన్నదేశాలను గురించి చెప్తాను.

నీహారములు, తుషమార్గములు, కురువులు, తుంగణములు, ఖసములు, కర్ణప్రావరణములు, ఊర్ణములు, దర్ఘములు, కుంచకములు, చిత్రమార్గములు, మాళవములు, కిరాతములు, తోమరములు. (అనేవి పర్వతాలను ఆశ్రయించుకుని ఉన్నదేశాలు).

కృతత్రేతాదికశ్చాత్ర చతుర్యుగకృతో విధిః ।
ఏవం తు భారతం వర్షం నవసంస్థానసంస్థితమ్ ॥ 65 ॥

ఈభారతవర్షంలో కృతయుగం, త్రేతాయుగం మొదలయిన ద్వాపర, కలి నాలుగుయుగాలధర్మం నడుస్తుంది.

దక్షిణే పరతో యస్య పూర్వం చైవ మహోదధిః ।
హిమవానుత్తరేణాస్య కార్ముకస్య యథా గుణః ।
తదేతద్ భారతం వర్షం సర్వబీజం ద్విజోత్తమాః ॥66 ॥

ఈభారతవర్షానికి వింటికి కట్టినతాదు (నారి) లాగా, దక్షిణం దిక్కునుండి, తూర్పుదిక్కువరకూ మహాసముద్రం ఉన్నది. ఉత్తరదిక్కున హిమాలయపర్వతం ఉన్నది. విప్రవరులారా! భారతవర్షం స్వరూపం ఇది. అన్నిదేశాలకూ ఈ భారతవర్షం మూలమయిన ఆధారం.

బ్రహ్మత్వ మమరేశత్వం దేవత్వం మరుతాం తథా ।
మృగయక్షాప్సరోయోనిం తద్వత్సర్పసరీసృపాః ॥ 67 ॥

స్థావరాణాం చ సర్వేషా మితో విప్రా శ్శుభాశుభైః ।
ప్రయాన్తి కర్మభూ ర్విప్రా నాన్యా లోకేషు విద్యతే ॥ 68 ॥

ద్విజులారా! ఈభారతవర్షంలో చేసిన పుణ్య, పాపకర్మలద్వారా బ్రహ్మపదాన్ని, దేవేంద్రపదవిని, దేవత్వాన్నీ పొందుతారు. అలాగే జంతువులు, యక్షులు, అప్సరసలు, పాములు, జడపదార్థాలు మొదలయిన జాతులలో జన్మిస్తారు. ఈవిధంగా కర్మలకు తగినఫలితాన్ని పొందటం ఇతరలోకాలలో ఎక్కడా లేదు.

దేవానామపి భో విప్రా స్స దై వైష మనోరథః ।
భారతం భవ మాప్స్యామో దేవత్వాత్ ప్రచ్యుతాః క్షితౌ ॥ 69 ॥

ద్విజులారా! దేవతలకు కూడ నిత్యమూ ఒక్కటే కోరిక. దేవజన్మనుండి కిందికి దిగి, భూమిమీద భారత వర్షంలో ఎప్పుడు పుట్టామా? అని.

మానుష్యం కురుతే యత్తు తన్న శక్యం సురాసురైః ।
తత్కర్మనిరతై స్తైస్తు తత్కర్మక్షపణోన్ముఖైః ॥ 70 ॥

కర్మక్షయం పొందటానికి మానవులు ఏ యే కర్మలు శ్రద్ధగా చేస్తారో, ఆ కర్మ దేవతలు గానీ, రాక్షసులు గానీ చేయలేరు. (కర్మక్షయం అయితే కాని మోక్షం లభించదు. పుణ్యకర్మఫలం అయిన స్వర్గాన్ని పొందిన దేవతలు, పాపకర్మఫలితం అయిన నీచజన్మను పొందిన రాక్షసులు ఆ యా కర్మలఫలాన్ని తొలగించుకోవడానికి తగినకర్మ చేయలేరు. కాబట్టి వాళ్లకు మనుష్యులకులాగా మోక్షం పొందటం సాధ్యం కాదు.)

న భారతసమం వర్షం పృథివ్యా మస్తి భో ద్విజాః ।
యత్ర విప్రాదయో వర్ణాః ప్రాప్తువన్త్యభివాఞ్ఛితమ్ ॥ 71 ॥

ఓ బ్రాహ్మణులారా! ఈభూమిమీద భారతవర్షంతో సాటివచ్చే భూభాగం లేదు. ఇక్కడ బ్రాహ్మణులు, మొదలుగా అన్నివర్ణాలవారు తమవర్ణాలకు తగినకర్మలను ఆచరించడంచేత తమకోరికలను పొందగల్గుతున్నారు.

ధన్యాస్తే భారతే వర్షే జాయన్తే యే నరోత్తమాః ।
ధర్మార్థకామమోక్షాణాం ప్రాప్నువన్తి మహాఫలమ్ ॥ 72 ॥

అటువంటి భారతవర్షంలో పుట్టిన ఉత్తములైనమానవులు ధన్యులు. ఎందుకంటే వారు ధర్మ, అర్థ,కామ, మోక్షాలు అనే పురుషార్థాలఫలితాన్ని పొందుతున్నారు. ఇతరలోకవాసులకు అది లేకపోవటంచేత వారు ధన్యులుకారు.

ప్రాప్యతే యత్ర తపసః ఫలం పరమదుర్లభమ్ ।
సర్వదానఫలం చైవ సర్వయజ్ఞఫలం తథా ॥ 73 ॥

తీర్థయాత్రాఫలం సమ్యక్ గురుసేవాఫలం తథా ।
దేవతారాధనఫలం గార్హస్థ్యే చైవ యత్ ఫలమ్ ॥ 74 ॥

మిక్కిలి కష్టసాధ్యమయిన తపస్సులు చేయటంవలన, వివిధమయిన దానాలు చేయటంవలన, అనేకమయిన యజ్ఞాలు చేయడంవలన, పెక్కుపుణ్యతీర్థాలను సేవించటంవలన, చక్కగా గురువులను సేవించడంవలన, దేవతలను ఆరాధించటంవలన, గృహస్థధర్మాలను ఆచరించటంవలన భారతవర్షంలో చక్కనిపుణ్యఫలాన్ని పొందుతున్నారు.

యత్ర దేవా స్సదా హృష్టా జన్మ వాఞ్ఛన్తి శోభనమ్ ।

దేవతలు భారతవర్షంలో పుట్టడాన్ని ఆనందంగా కోరుకుంటారు. (69శ్లో.) భారతవర్షంలో పుట్టటం శుభాలను కలిగిస్తుంది.

నానావ్రతఫలం చైవ నానాశాస్త్రఫలం తథా ॥ 75 ॥

అహింసాదిఫలం సమ్యక్ ఫలం సర్వాభివాఞ్ఛితమ్ ।
బ్రహ్మచర్యఫలం చైవ స్వాధ్యాయేన చ యత్ఫలమ్ ॥ 76 ॥

యత్ఫలం వనవాసేన సంన్యాసేన చ యత్ఫలమ్ ।
ఇష్టాపూర్తఫలం చైవ తథాన్యచ్ఛుభకర్మణామ్ ॥ 77 ॥

ప్రాప్యతే భారతే వర్షే న చాన్యత్ర ద్విజోత్తమాః! ।
క శృక్నోతి గుణాన్ వక్తుం భారతస్యాఖిలాన్ ద్విజాః! ॥ 78 ॥

బ్రాహ్మణోత్తములారా! అనేకమయిన వ్రతాలు ఆచరించిన ఫలితం, వివిధమయిన శాస్త్రవచనాలను అనుసరించిన ఫలితం, అహింస మొదలయిన వేదధర్మాలను ఆచరించినఫలితం ఇంకా ఇతరమయిన అన్నిఫలితాలూ, బ్రహ్మచర్యం ఆచరించిన ఫలితం, వేదాధ్యయనఫలితం, వానప్రస్థాశ్రమం చక్కగా నడిపినఫలితం, సన్న్యాసాశ్రమం స్వీకరించిన ఫలితం, (నాలుగువర్ణాలధర్మాలను, నాలుగుఆశ్రమాలధర్మాలను చక్కగా ఆచరించినఫలితం), అగ్నిహోత్రం మొదలయిన(ఇష్ట)కర్మలను, వాపీ, కూప, తటాకాదినిర్మాణం మొదలయిన (పూర్త)కర్మలను ఆచరించినఫలితం – ఇవన్నీ భారతవర్షంలో మాత్రమే పొందవచ్చు. ఇతరలోకాలలో ఈకర్మలు గానీ, ఫలితం గానీ లభింపవు. ఈవిధంగా భారతవర్షానికి సంబంధించిన విశిష్టలక్షణాలను అన్నింటినీ చెప్పటం ఎవడివల్లాకాదు.

ఏవం సమ్యఙ్మయా ప్రోక్తం భారతం వర్షముత్తమమ్ ।
సర్వపాపహరం పుణ్యం ధన్యం బుద్ధివివర్ధనమ్ ॥ 79 ॥

భారతవర్షాన్నిగురించి వివరంగా చెప్పాను. నవద్వీపాలలోనూ భారతవర్షం ఉత్తమం. ఇది అన్నిపాపాలను పోగొడుతుంది. పుణ్యఫలాన్ని ఇస్తుంది. ప్రశంసింపదగినది. వివేకాన్ని పెంచుతుంది.

య ఇదం శృణుయా న్నిత్యం జపేద్ వా నియతేన్ద్రియః ।
సర్వపాపై ర్వినిర్ముక్తో విష్ణులోకం స గచ్ఛతి ॥ 80 ॥

ఇంద్రియాలను అదుపులో పెట్టుకుని ఈభారతవర్షం మాహాత్మ్యాన్ని విన్నవాడూ, నిత్యమూ ధ్యానించేవాడూ అన్ని పాపాలూ నశించి విష్ణులోకానికి వెళ్తాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే భారతవర్షానుకీర్తనం నామ పఞ్చవింశోఽధ్యాయః ॥ 25 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ, ఋషి సంవాదంలో భారతవర్షానుకీర్తనం అనే ఇరవైఐదవ అధ్యాయం సంపూర్ణం.

షడ్వింశోఽధ్యాయః - ఇరవైఆరవ అధ్యాయం

కోణాదిత్యమాహాత్మ్యవర్ణనమ్ - కోణాదిత్యమాహాత్మ్యవర్ణనం

బ్రహ్మోవాచ :- మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తత్రాస్తే భారతే వర్షే దక్షిణోదధిసంస్థితః ।
ఓణ్డ్రదేశ ఇతి ఖ్యాత స్స్వర్గమోక్షప్రదాయకః ॥ 1 ॥

భారతవర్షంలో దక్షిణసముద్రంతీరంలో ఓండదేశం అని ప్రసిద్ధమయిన దేశం ఉన్నది. అది స్వర్గాన్ని, మోక్షాన్నీ ప్రసాదించే పుణ్యదేశం.

సముద్రాదుత్తరం యావత్ రమ్యం విరజమణ్డలమ్ ।
దేశోఽసౌ గుణశీలానాం గుణై స్సర్వైరలఙ్కృతః ॥ 2 ॥

సముద్రానికి ఉత్తరంగా మనోహరమయిన విరజమండలంవరకూ ఓండదేశం విస్తరించిఉన్నది. ఆదేశంలో సమస్తమయిన సద్గుణాలతో, మంచినడవడిక గలిగిన మానవులు ఉంటున్నారు.

తత్ర దేశప్రసూతా యే బ్రాహ్మణా స్సంయతేన్ద్రియాః ।
తపస్స్వాధ్యాయనిరతా వన్ద్యాః పూజ్యాశ్చ తే సదా ॥ 3 ॥

ఆదేశంలో పుట్టిన బ్రాహ్మణులు అందరూ ఇంద్రియాలను నిగ్రహించుకున్నవారు. తపస్సు ఆచరించడం లోనూ, తమతమ వేద శాఖలను చక్కగా అధ్యయనం చేయడంలోనూ దీక్ష కలిగినవారు. నిత్యమూ నమస్కరింపదగిన వారు. పూజింపదగినవారు.

శ్రాద్ధే దానే వివాహే చ యజ్ఞే వాచార్యకర్మణి ।
ప్రశస్తా స్సర్వకార్యేషు తత్ర దేశోద్భవా ద్విజాః ॥ 4 ॥

అక్కడి భూసురులు శ్రాద్ధకర్మలలోనూ, దానం స్వీకరించడంలోనూ, పెండ్లిండ్లు, యజ్ఞాలు మొదలయిన అన్ని కర్మలను ఆచార్యస్థానంలో ఉండి నిర్వహించడంలోనూ పేరుగన్నవారు.

షట్కర్మనిరతా స్తత్ర బ్రాహ్మణా వేదపారగాః ।
ఇతిహాసవిదశ్చైవ పురాణార్థవిశారదాః ॥ 5 ॥

ఆబ్రాహ్మణులు నిత్య మయిన (స్నానసంధ్యాహోమదేవతార్చనాది) షట్కర్మలయందు ఆసక్తి కలిగినవారు. ఇతిహాసాలు తెలిసినవారు. పురాణసారాన్ని సంపూర్ణంగా గ్రహించినవారు.

సర్వశాస్త్రార్థకుశలా యజ్వానో వీతమత్సరాః ।
అగ్నిహోత్రరతాః కేచిత్ కేచిత్ స్మార్తాగ్నితత్పరాః ॥ 6 ॥

అన్నిశాస్త్రాలలోనూ నిపుణులు. యాగాలు చేసినవారు. అసూయ లేనివారు. కొందరు శ్రద్ధగా, వేదోక్త మయిన విధానంలో అగ్నికార్యాలు చేసేవారు. మరి కొందరు స్మృతిగ్రంథాలలో పేర్కొనబడినవిధానంలో అగ్నికార్యాలు చేసేవారు.

పుత్రదారధనై ర్యుక్తా హోతార స్సత్యవాదినః ।
నివసన్త్యుత్కలే పుణ్యే యజ్ఞోత్సవవిభూషితే ॥ 7 ॥

వారు పుత్రసంతానమూ, భార్య, సంపదలు కలిగినవారు. యజ్ఞాలు చేసేవారు. సత్యమే మాట్లాడేవారు. శ్రేష్ఠమయిన యజ్ఞాలతో నిండి, పుణ్యప్రదమయిన ఆఉత్కలదేశంలో బ్రాహ్మణులు ఈవిధంగా నివసిస్తున్నారు.

ఇతరేఽ పి త్రయో వర్ణాః క్షత్రియాద్యా స్సుసంయతాః ।
స్వకర్మనిరతా శ్శాన్తా స్తత్ర తిష్ఠన్తి ధార్మికాః ॥ 8 ॥

క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే ఇతరవర్ణాలవారు కూడ ఆదేశంలో ఉన్నారు. ఆవర్ణాలవారు కూడ నియమవంతులు. తమతమవర్ణాలకు ఉచితమయిన కర్మలను ఆచరించేవారు. ఇంద్రియాలను జయించినవారు. ధర్మాన్ని చక్కగా ఆచరించేవారు.

కోణాదిత్య ఇతి ఖ్యాత స్తస్మిన్ దేవో దివాకరః ।
యం దృష్ట్వా భాస్కరం మర్త్య స్సర్వపాపైః ప్రముచ్యతే ॥ 9 ॥

ఆదేశంలోని దేవుడు కోణాదిత్యుడు అని ప్రసిద్ధుడు. ఆకోణాదిత్యభాస్కరుడిని దర్శించిన మానవులు సమస్తపాపాలనుండి విముక్తులు అవుతారు.

మునయ ఊచుః:- మహర్షులు బ్రహ్మదేవుడితో ఈవిధంగా అంటున్నారు.

శ్రోతుమిచ్ఛామ తద్ బ్రూహి క్షేత్రం సూర్యస్య సామ్ప్రతమ్ ।
తస్మిన్ దేశే సురశ్రేష్ఠ యత్రాస్తే స దివాకరః ॥ 10 ॥

దేవేశ్వరా! ఆకోణాదిత్యభాస్కరుడు వెలసిఉన్న ఆసూర్యక్షేత్రాన్ని గురించి ఇపుడే వినాలని కోరుకుంటున్నాము. చెప్పవలసినది.

బ్రహ్మోవాచ :-ఆమహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

లవణ స్యోదధే స్తీరే పవిత్రే సుమనోహరే ।
సర్వత్ర వాలుకాకీర్ణే దేశే సర్వగుణాన్వితే ॥ 11 ॥

అది ఉప్పుసముద్రం ఒడ్డు. పవిత్ర మయినది. చాలా అందంగా ఉంటుంది. ఆప్రదేశం అంతా కాలువలతో నిండిఉంది. మంచిలక్షణాలు అన్నీ గలిగిఉన్నది.

చమ్పకాశోకవకులైః కరవీరై స్సపాటలైః ।
పున్నాగైః కర్ణికారైశ్చ వకులై ర్నాగకేసరైః ॥ 12 ॥

అక్కడ సంపెంగ, పొగడ, కంకేళి, కొండగోగు, కలిగొట్టు, పొన్న, ఱేల, (పొగడ,) నాగకేసరం,

తగరై ర్ధవబాణైశ్చ అతిముక్తై స్సకుబ్జకైః ।
మాలతీకున్దపుష్పైశ్చ తథాఽ న్యైర్మల్లికాదిభిః ॥ 13 ॥

నందివర్ధనం, ఉమ్మెత్త, నల్లగోరింట, తుమ్మికి, గొజ్జంగి, జాజి, మొల్ల, మల్లె మొదలయినవి.

కేతకీవనఖణ్డైశ్చ సర్వర్తుకుసుమోజ్జ్వలైః ।
కదమ్బై ర్లకుచై శ్శాలైః పనసై ర్దేవదారుభిః ॥ 14 ॥

మొగలిపొదలు, అన్ని ఋతువులలోనూ వివిధ మయినపూవులతో ప్రకాశించే మొక్కలు, కడిమి, గజనిమ్మ, బొద్దుగ, పనస, దేవదారువు,

సరలై ర్ముచుకున్దైశ్చ చన్దనైశ్చ సితేతరైః ।
అశ్వత్థై స్సప్తపర్ణైశ్చ ఆమ్రై రామ్రాతకై స్తథా ॥ 15 ॥

తెల్లతెగడ (సరళ), ముచకుందవృక్షాలు, రక్తచందనవృక్షాలు, రావి, ఏడాకులఅరటి, మామిడి, అంబాళం,

తాలైః పూగఫలైశ్చైవ నారికేలైః కపిత్థకైః ।
అన్యైశ్చ వివిధై ర్వృక్షై స్సర్వతస్సమలఙ్కృతమ్ ॥ 16 ॥

తాడి, పోక, కొబ్బరి, వెలగ, ఇంకా ఇతరమయిన రకరకాలయిన వృక్షాలతో అంతటా నిండి, ఆప్రాంతం అందంగాఉంది.

క్షేత్రం తత్ర రవేః పుణ్య మాస్తే జగతి విశ్రుతమ్ ।
సమన్తాద్ యోజనం సాగ్రం భుక్తిముక్తిప్రదాయకమ్ ॥ 17 ॥

సూర్యభగవానుడికి సంబంధించిన ఆపుణ్యక్షేత్రం లోకంలో బాగా ప్రసిద్ధం. ఆక్షేత్రం ఇహలోకంలో సుఖానుభవాన్నీ, తరువాత ముక్తినీ ఇస్తుంది. క్షేత్రం పూర్తిగా ఎనిమిదిమైళ్లమేర విస్తరించిఉంటుంది.

ఆస్తే తత్ర స్వయం దేవ స్సహస్రాంశు ర్దివాకరః ।
కోణాదిత్య ఇతి ఖ్యాతో భుక్తిముక్తిప్రదాయకః ॥ 18 ॥

అనంతకిరణుడయిన సూర్యుడు ఆక్షేత్రంలో స్వయంగా నెలకొన్నాడు (స్వయంభువు). ఆక్షేత్రంలో వెలసిన సూర్యుడు కోణాదిత్యుడు అనేపేరుతో సుప్రసిద్ధుడు. ఆ సూర్యుడు ఈ లోకంలో (బ్రతికిఉండగా) భోగాలనూ, అనంతరం మోక్షాన్నీ అనుగ్రహిస్తాడు.

మాఘే మాసి సితే పక్షే సప్తమ్యాం సంయతేన్ద్రియః ।
కృతోపవాసో య స్తత్ర స్నాత్వా తు మకరాలయే ॥ 19 ॥

మాఘమాసంలో శుక్లపక్షంలో, సప్తమీతిథినాడు ఉపవాసం ఉండాలి. ఇంద్రియాలను నిగ్రహించుకోవాలి. ఆ(కోణార్క)క్షేత్రం దగ్గరలో ఉన్నసముద్రంలో స్నానం చేయాలి.

కృతశౌచో విశుద్ధాత్మా స్మరన్ దేవం దివాకరమ్ ।
సాగరే విధివత్ స్నాత్వా సూర్యోపాన్తే సమాహితః ॥ 20 ॥

ఇంకా ఇతరమయిన శౌచక్రియలను ఆచరించాలి. మనస్సును స్వచ్ఛంగా ఉంచుకోవాలి. అక్కడి కోణాదిత్యుడిని స్మరించాలి. శాస్త్రం చెప్పినపద్ధతిలో సముద్రంలో స్నానం చేయాలి. ఏకాగ్రమయిన బుద్ధితో, సూర్యుడికి సమీపంలో ఉండాలి.

దేవాన్ ఋషీన్ మనుష్యాంశ్చ పితౄన్ సన్తర్ప్య చ ద్విజాః ।
ఉత్తీర్య వాససీ ధౌతే పరిధాయ సునిర్మలే ॥ 21 ॥

దేవతలకూ, ఋషులకూ, పితరులకూ తర్పణం విడిచిపెట్టాలి. ఆతరువాత సాగరం వెలువడి వచ్చి, ఒడ్డున ఉతికిన శుభ్రమయిన పొడి బట్టలు ధరించాలి.

ఆచమ్య ప్రయతో భూత్వా తీరే తస్య మహోదధేః ।
ఉపవిశ్యోదయే కాలే ప్రాఙ్ముఖ స్సవితు స్తదా ॥ 22 ॥

సూర్యోదయసమయంలో సముద్రం ఒడ్డున తూర్పుముఖంగా సూర్యుడికి ఎదురుగా కూర్చోవాలి. ఆచమనం చేయాలి. పవిత్రంగా ఉండాలి.

విలిఖ్య పద్మం మేధావీ రక్తచన్దనవారిణా ।
అష్టపత్రం కేసరాఢ్యం వర్తులం చోర్ధ్వకర్ణికమ్ ॥ 23 ॥

అక్కడ ఎఱ్ఱచందనం కలిపిననీళ్లతో పద్మాన్ని లిఖించాలి. ఆపద్మానికి ఎనిమిదిరేకులు ఉండాలి. పద్మం గుండ్రంగా ఉండాలి. అందులో కేసరాలు అధికంగా ఉండాలి. అవి ఊర్ధ్వముఖంగా ఉండాలి.

తిలతణ్డులతోయం చ రక్తచన్దనసంయుతమ్ ।
రక్తపుష్పం సదర్భం చ ప్రక్షిపేత్ తామ్రభాజనే ॥ 24 ॥

రాగిపాత్రలో ఎఱ్ఱచందనం నీరు ఉంచాలి. ఆనీటిలో నువ్వులూ, బియ్యమూ కలపాలి. ఆపాత్రలో ఎఱ్ఱనిపూలు, దర్భలు వేయాలి.

తామ్రాభావేఽర్కపత్రస్య పుటే కృత్వా తిలాదికమ్ ।
పిధాయ తన్మునిశ్రేష్ఠాః పాత్రం పాత్రేణ విన్యసేత్ ॥ 25 ॥

రాగిపాత్ర దొరకకపోతే, జిల్లేడుఆకును దొన్నె (పాత్రలాగా) చేసి, నువ్వులు మొదలైనవాటిని అందులో ఉంచాలి. (తిలాదులు ఉన్న) ఆపాత్రను మరొకపాత్రతో మూయాలి. (మూతగా మరొకపాత్రను ఉంచాలి.)

కరన్యాసాఙ్గవిన్యాసం కృత్వాఙ్గైర్హృదయాదిభిః ।
ఆత్మానం భాస్కరం ధ్యాత్వా సమ్యక్ శ్రద్ధాసమన్వితః ॥ 26 ॥

ఆతరువాత (చేతులతో) కరన్యాసమూ, హృదయం మొదలయిన అవయవాలతో అంగన్యాసమూ చేయాలి. శ్రద్ధతో చక్కగా తననే సూర్యుడుగా భావించి ధ్యానం చేయాలి. (హ్రాం, హ్రీం, హ్రూం, హ్రైం, హ్రౌం, హ్రః అనే బీజాక్షరాలతో షడంగన్యాసం చేసుకోవాలి.)

మధ్యే చాగ్నిదలే ధీమాన్ నైరృతే శ్వసనే దలే ।
కామారిగోచరే చైవ సుమధ్యే చైవ పూజయేత్ ॥ 27 ॥

మధ్యలో(కర్ణికలో)నూ, ఆగ్నేయ, నైఋతి, వాయవ్య, ఈశాన్య దళాల (లిఖించినపద్మంలోనిరేకుల)లోనూ, వాటిమధ్యలో (విదిక్కులకు మధ్యలో అంటే దక్షిణం, పడమర, ఉత్తరం, తూర్పు దిక్కులలో) ఉన్న(పద్మ)దళాలలోనూ సూర్యుడిని పూజించాలి.

ప్రభూతం విమలం దేవమారాధ్య పరమం సుఖమ్ ।
సమ్పూజ్య పద్మఞ్చావాహ్య గగనా త్తత్ర భాస్కరమ్ ॥ 28 ॥

ప్రత్యక్షంగా తోచే, నిర్మలుడయిన సూర్యదేవుడిని ఆనందంగా ఆరాధించాలి. ఆపద్మాన్ని చక్కగా పూజించాలి. ఆకాశంనుండి భాస్కరుడిని (ఆపద్మంలోనికి) ఆవాహనం చేయాలి (ఆహ్వానించాలి).

కర్ణికోపరి సంస్థాప్య తతో ముద్రాం ప్రదర్శయేత్ ।
కృత్వా స్నానాదికం సర్వం ధ్యాత్వా తం సుసమాహితః ॥ 29 ॥

పద్మంలోని బీజకోశంపై సూర్యుడిని స్థాపించాలి. తరువాత (సూర్య)ముద్రలు ప్రదర్శించాలి. స్నానం మొదలయిన కర్మలు అన్నీ పూర్తి అయిన తరువాత, ఏకాగ్రమయిన మనస్సుతో సూర్యభగవానుడిని ఈరూపంలో ధ్యానించాలి.

సితపద్మోపరి రవిం తేజోబిమ్బే వ్యవస్థితమ్ ।
పిఙ్గాక్షం ద్విభుజం రక్తం పద్మపత్రారుణామ్బరమ్ ॥ 30 ॥

(ధ్యానించవలసినసూర్యరూపం –) తెల్లదామరపూవుపైన కాంతిబింబంగా ఉన్నవాడు. గోరోచనం రంగు కన్నులు, రెండు బాహువులు కలవాడు, ఎఱ్ఱనిశరీరం కలవాడు. తామరరేకులవలె ఎఱ్ఱనైన వస్త్రాలు ధరించినవాడు.

సర్వలక్షణసంయుక్తం సర్వాభరణభూషితమ్ ।
సురూపం వరదం శాన్తం ప్రభామణ్డలభూషితమ్ ॥ 31 ॥

అన్ని ఉత్తమలక్షణాలు కలిగినవాడు. సమస్తమయిన ఆభరణాలు అలంకరింపబడినవాడు. అందమయిన రూపం కలవాడు. వరాలను ఇచ్చేవాడు (వరదముద్ర కలిగినవాడు). వికారాలు లేనిరూపం కలిగినవాడు. కాంతిమండలంతో అలంకరింపబడినవాడు.

ఉద్యన్తం భాస్కరం దృష్ట్వా సాన్ద్రసిన్దూరసన్నిభమ్ ।
తత స్తత్పాత్ర మాదాయ జానుభ్యాం ధరణీం గతః ॥ 32 ॥

ఉదయిస్తూ ఉన్నవాడు. దట్టమయిన సిందూరంవంటివన్నె కలిగినవాడు అయిన సూర్యభగవానుడిరూపాన్ని దర్శిస్తూ, పైరాగిపాత్రను తీసుకుని, మోకాళ్లను నేలకు ఆనించి,

కృత్వా శిరసి తత్పాత్ర మేకచిత్తస్తు వాగ్యతః ।
త్ర్యక్షరేణ తు మన్త్రేణ సూర్యాయార్ఘ్యం నివేదయేత్ ॥ 33 ॥

శ్రద్ధగా ఆరాగిపాత్రను తలపై ఉంచుకుని, మౌనంగా, మూడక్షరాలసూర్యమంత్రంతో సూర్యుడికి అర్ఘ్యం ఇవ్వాలి.

అదీక్షితస్తు తస్యైవ నామ్నైవార్ఘ్యం ప్రయచ్ఛతి ।
శ్రద్ధయా భావయుక్తేన భక్తిగ్రాహ్యో రవి ర్యతః ॥ 34 ॥

(త్ర్యక్షరమంత్రఉపదేశం లేనివాడు) సూర్యుడి (ఏదో ఒక) నామంతో సూర్యుడికి అర్ఘ్యం ఇవ్వాలి. సూర్య భగవానుడు భక్తితో చేరుకొనదగినవాడు. కాబట్టి అర్ఘ్యం (మంత్రంతో లేదా నామంతో) ఎలా ఇచ్చినా, శ్రద్ధతో, సూర్యుడినే భావిస్తూ ఇవ్వాలి.

అగ్నినిరృతివాయ్వీశ మధ్యపూర్వాదిదిక్షు చ ।
హృచ్ఛిరశ్చ శిఖావర్మ నేత్రాణ్యస్త్రం చ పూజయేత్ ॥ 35 ॥

ఆగ్నేయం, నైరృతి, వాయవ్యం, ఈశాన్యం, మధ్య, తూర్పు మొదలయిన (దక్షిణం, పడమర, ఉత్తరం) దిక్కులలో, హృదయం, శిరస్సు, శిఖ, కవచం, నేత్ర(త్రయ)ం, అస్త్రం అనేఅంగాలను పూజించాలి.

దత్త్వాఽర్ఘ్యం గన్ధధూపం చ దీపం నైవేద్యమేవ చ ।
జప్త్వా స్తుత్వా నమస్కృత్వా ముద్రాం బద్ధ్వా విసర్జయేత్ ॥ 36 ॥

(సూర్యుడికి) అర్ఘ్యం ఇచ్చినతరువాత, గంధం, ధూపం, దీపం, నైవేద్యం, ఇవ్వాలి. సూర్యమంత్రాన్ని జపించి, సూర్యుడిని స్తుతించి, సూర్యుడికి నమస్కరించి, ముద్రను బంధించి, విడిచిపెట్టాలి.

యే చార్ఘ్యం సమ్ప్రయచ్ఛన్తి సూర్యాయ నియతేన్ద్రియాః ।
బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః స్త్రియశ్శూద్రాశ్చ సంయతాః ॥ 37 ॥

భక్తిభావేన సతతం విశుద్ధే నాన్తరాత్మనా ।
తే భుక్త్వాఽభిమతాన్ భోగాన్ ప్రాప్నువన్తి పరాం గతిమ్ ॥ 38 ॥

ఇంద్రియనిగ్రహం గలిగి, భక్తినిండినమనస్సుతో, నిర్మలమయిన అంతరంగంతో, నిత్యమూ నియమ బద్ధులయి, సూర్యుడికి అర్ఘ్యాన్ని ఇచ్చిన బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, ఈలోకంలో తమకు కావలసినభోగాలు అన్నీ అనుభవించి, చివరకు ఉత్తమగతులను పొందుతారు.

త్రైలోక్యదీపకం దేవం భాస్కరం గగనేచరమ్ ।
యే సంస్మరన్తి మనుజా స్తే స్యు సుఖస్య భాజనమ్ ॥ 39 ॥

మూడులోకాలనూ ప్రకాశింపజేసేవాడూ, ఆకాశంలో సంచరించేవాడూ అయిన సూర్యభగవానుడిని శ్రద్ధగా తలచుకునే మానవులు అన్ని సుఖాలను అనుభవించడానికి అర్హు లవుతారు.

యావన్న దీయతే చార్ఘ్యం భాస్కరాయ యథోదితమ్ ।
తావన్న పూజయేద్ విష్ణుం శఙ్కరం వా సురేశ్వరమ్ ॥ 40 ॥

ఉదయిస్తున్న సూర్యుడికి అర్ఘ్యం ఇవ్వనంతవరకు విష్ణువును గానీ, శివుడిని గానీ, ఇంద్రుడిని గానీ, పూజించగూడదు. (సంధ్యావందనం-సూర్యుడికి అర్ఘ్యప్రదానం చేయకుండా చేసిన ఇతర దైవకార్యం ఏదీఫలాన్ని ఇవ్వదు. కాబట్టి ఏకార్య మయినా, సంధ్యావందనం, అందులోనూ అర్ఘ్యప్రదానం అయిన తరువాతనే ఆచరించాలి.)

తస్మాత్ ప్రయత్నమాస్థాయ దద్యా దర్ఘ్యం దినే దినే ।
ఆదిత్యాయ శుచి ర్భూత్వా పుష్పై ర్గన్ధై ర్మనోరమైః ॥ 41 ॥

అందుచేత ఎంతో పూనికతో శుచి అయి, మనోహరమయిన పుష్పాలతోనూ, గంధాలతోనూ, (కూడిన జలంతో) (ఉదయ సమయంలో) సూర్యుడికి ప్రతిరోజూ తప్పకుండా అర్ఘ్యం ఇవ్వాలి.

ఏవం దదాతి యశ్చార్ఘ్యం సప్తమ్యాం సుసమాహితః ।
ఆదిత్యాయ శుచి స్స్నాతస్స లభేదీప్సితం ఫలమ్ ॥ 42 ॥

ఈవిధంగా శుచిగా స్నానం చేసి, సప్తమీతిథినాడు సూర్యుడికి శ్రద్ధగా అర్ఘ్యం ఇచ్చినవాడు ఇష్టమయిన కోరికలను పొందుతాడు.

రోగీ విముచ్యతే రోగాద్ విత్తార్థీ లభతే ధనమ్ ।
విద్యాం ప్రాప్నోతి విద్యార్థీ సుతార్థీ సుతవాన్ భవేత్ ॥ 43 ॥

రోగం కలిగినవాడికి రోగం వదిలిపోతుంది. డబ్బు కావలసినవాడికి డబ్బు వస్తుంది. చదువు కావలసిన వాడికి చదువు వస్తుంది. కొడుకులు కావలసిన వాడికి కొడుకులు కలుగుతారు.

యం యం కామ మభిధ్యాయన్ సూర్యాయార్ఘ్యం ప్రయచ్ఛతి ।
తస్య తస్య ఫలం సమ్యక్ ప్రాప్నోతి పురుష స్సుధీః ॥ 44 ॥

మంచిబుద్ధి కలిగినమానవుడు ఏకోరిక తీరా లని సూర్యుడికి అర్ఘ్యం ఇస్తాడో వాడికి ఆకోరిక చక్కగా నెరవేరుతుంది.

స్నాత్వైవం సాగరే దత్త్వా సూర్యాయార్ఘ్యం ప్రణమ్య చ ।
నరో వా యది వా నారీ సర్వకామఫలం లభేత్ ॥ 45 ॥

ఈవిధంగా సముద్రస్నానం చేసి, సూర్యుడికి అర్ఘ్యం ఇచ్చి, సాష్టాంగంగా నమస్కరించిన పురుషుడయినా, స్త్రీ అయినా, అన్ని కోరికలనూ పొందుతారు.

సూర్యగఙ్గామ్భసి స్నాతః కుశై స్సంసిచ్య మూర్ధని ।
సర్వపాపవినిర్ముక్తో నరో యాతి త్రివిష్టపమ్ ॥

సూర్యగంగలో స్నానం చేసి దర్భజలంతో శిరసు తడుపుకున్నవాడు పాపాలు సమస్తం నశించి, స్వర్గలోకానికి వెళ్తాడు.

తత స్సూర్యాలయం గచ్ఛేత్ పుష్పమాదాయ వాగ్యతః ।
ప్రవిశ్య పూజయేద్ భానుం కృత్వా తు త్రిః ప్రదక్షిణమ్ ॥ 46 ॥

(స్నానాదుల) తరువాత సూర్యదేవాలయానికి వెళ్లాలి. పూవులు పట్టుకుని, మౌనంగా, సూర్యుడికి మూడుసార్లు ప్రదక్షిణం చేసి, ఆలయంలో ప్రవేశించి సూర్యుడిని పూజించాలి.

తాన్త్రికై ర్వైదికై ర్మన్త్రై ర్బుధో భానో స్తిథౌ తథా ।
పూజయేత్ పరయా భక్త్యా కోణార్కం మునిసత్తమాః ॥ 47 ॥

గన్ధైః పుష్పై స్తథా దీపై ర్ధూపై ర్నైవేద్యకైరపి ।
దణ్డవత్ ప్రణిపాతైశ్చ జయశబ్దైస్తథా స్తవైః ॥ 48 ॥

మునివరులారా! బుద్ధిమంతుడు సూర్యతిథి(సప్తమి)నాడు తాంత్రికాలు, లేదా వేదోక్తాలు అయిన మంత్రాలతో, గంధాలు (రక్తచందనం మొ.) పుష్పాలు, ధూపాలు, దీపాలు, నైవేద్యాలు, సాష్టాంగనమస్కారాలు, జయ జయ ధ్వనులు, సూర్యస్తోత్రాలు మొదలయిన వాటితో కోణార్కుడు అనేపేరు గల సూర్యుడిని అత్యంతభక్తితో పూజించాలి.

ఏవం సమ్పూజ్య తం దేవం సహస్రాంశుం జగత్ప్రభుమ్ ।
దశానా మశ్వమేధానాం ఫలం ప్రాప్నోతి మానవః ॥ 49 ॥

జగన్నాథుడు, అనంతమయిన కిరణాలు కలిగినవాడు అయిన సూర్యదేవుడిని ఈవిధంగా చక్కగా పూజించిన మానవుడు పది అశ్వమేధయాగాలు చేసిన పుణ్యఫలాన్ని పొందుతాడు.

సర్వపాపవినిర్ముక్తో యువా దివ్యవపుర్ధరః ।
సప్తావరాన్ సప్త పరాన్ వంశా నుద్ధృత్య భో ద్విజాః ॥ 50 ॥

విమానేనార్కవర్ణేన కామగేన సువర్చసా ।
ఉపగీయమానో గన్ధర్వై స్సూర్యలోకం స గచ్ఛతి ॥ 51 ॥

పాపాలన్నీ తొలగిపోయి, యుక్తవయసులో ఉండి, దేవతాసంబంధమయిన తేజశ్శరీరాన్ని పొంది, తననుంచి వెనకపుట్టిన ఏడు తరాలవారిని, తన తరువాత పుట్టబోయే ఏడుతరాలవారిని (నరకాదిఅధోలోకాలనుండి) ఉద్ధరించి, సూర్యుడితో సమానమయిన తేజస్సు కలిగి, భక్తుని ఇష్టంప్రకారం నడిచే విమానంలో, గంధర్వులు స్తోత్రం చేస్తుండగా, సూర్యలోకానికి వెళ్తాడు.

భుక్త్వా తత్ర వరాన్ భోగాన్ యావదాభూతసంప్లవమ్ ।
పుణ్యక్షయాదిహాయాతః ప్రవరే యోగినాం కులే ॥ 52 ॥

సర్వజగత్ప్రళయం అయ్యేవరకు సూర్యలోకంలో శ్రేష్ఠమయిన భోగాలను అనుభవిస్తాడు. పుణ్యం క్షీణించిన తరువాత తిరిగి భూలోకానికి వచ్చి, యోగులవంశంలో (యోగిగా) జన్మిస్తాడు.

చతుర్వేదీ భవేద్ విప్ర స్స్వధర్మనిరత శ్శుచిః ।
యోగం వివస్వతః ప్రాప్య తతో మోక్ష మవాప్నుయాత్ ॥ 53 ॥

నాలుగువేదాలూ తెలిసిన విప్రుడుగా జన్మిస్తాడు. బ్రాహ్మణధర్మాన్ని నిష్ఠగా ఆచరిస్తాడు. నిర్మలుడై, వివస్వంతుడినుండి యోగాన్ని పొందుతాడు. చివరికి మోక్షస్థితికి చేరుకుంటాడు.

చైత్రే మాసి సితే పక్షే యాత్రాం దమనభఞ్జికామ్ ।
యః కరోతి నర స్తత్ర పూర్వోక్తం స ఫలం లభేత్ ॥ 54 ॥

చైత్రమాసంలో శుక్లపక్షంలో, దమనభంజిక అనేయాత్రను చేసిన మానవుడుకూడ ఇంతకు ముందు చెప్పిన(సూర్యఉపాసనవలన గలిగే) పుణ్యఫలాన్ని పొందుతాడు.

శయనోత్థాపనే భానో స్సఙ్క్రాన్త్యాం విషువాయనే ।
వారే రవే స్తిథౌ చైవ పర్వకాలేఽథవా ద్విజాః ॥ 55 ॥

యే తత్ర యాత్రాం కుర్వన్తి పురుషా స్సంయతేన్ద్రియాః ।
విమానే నార్కవర్ణేన సూర్యలోకం వ్రజన్తి తే ॥ 56 ॥

బ్రాహ్మణులారా! శయన ఉత్థాపన ఏకాదశీ తిథులందు, సూర్యసంక్రమణంనాడు విషువసమయాలలో, అయనవేళలలో, ఆది(రవి)వారం నాడు సప్తమి (రవితిథి) నాడు పూర్ణిమ, అమావాస్యలందు, ఇంద్రియనిగ్రహంతో పై (దమనభంజిక) యాత్రను చేసినమానవులు సూర్యతేజస్సు గలిగిన విమానంలో సూర్యలోకానికి వెళ్తారు.

ఆస్తే తత్ర మహాదేవ స్తీరే నదనదీపతేః ।
రామేశ్వర ఇతి ఖ్యాత స్సర్వకామఫలప్రదః ॥ 57 ॥

నదాలకూ, నదులకూ నాథుడయిన ఆసముద్రంతీరంలో మహాదేవుడు రామేశ్వరుడు అనేపేరుతో ఉన్నాడు. రామేశ్వరుడు సమస్తమయిన కోరికలను తీరుస్తాడు.

యే తం పశ్యన్తి కామారిం స్నాత్వా సమ్యజ్ మహోదధౌ ।
గన్ధైః పుష్పై స్తథా ధూపై ర్దీపై ర్నైవేద్యకై ర్వరైః ॥ 58 ॥

ప్రణిపాతై స్తథా స్తోత్రై ర్గీతవాద్యై ర్మనోహరైః ।
రాజసూయఫలం సమ్యగ్ వాజిమేధఫలం తథా ॥ 59 ॥

ప్రాప్నువన్తి మహాత్మాన స్సంసిద్ధిం పరమాం తథా ॥ 60 ॥

మహాత్ములు సముద్రంలో చక్కగా స్నానం చేసి, అక్కడ రామేశ్వరుడిని దర్శించి, గంధాలు, పుష్పాలు, ధూపాలు, దీపాలు, మంచినైవేద్యాలు, నమస్కారాలు, శివస్తుతులు, మనోహరమయిన సంగీతాలూ, వాద్యాలతో

మహాదేవుడిని సేవించిన మహాత్ములు రాజసూయం, అశ్వమేధం అనే యజ్ఞాలు చేసినంతటి ఫలితాన్ని పొందుతారు. అలాగే ఉత్తమమయిన సిద్ధిని పొందుతారు.

కామగేన విమానేన కిఙ్కిణీజాలమాలినా ।
ఉపగీయమానా గన్ధర్వై శ్శివలోకం వ్రజన్తి తే ॥ 61 ॥

చిరుగంటల సమూహం మాలగా కలిగి, భక్తుని ఇష్టం ప్రకారం నడిచే విమానంమీద, గంధర్వులు స్తోత్రాలు గానం చేస్తుండగా, వారు శివలోకానికి వెళ్తారు.

ఆభూతసంప్లవం యావద్ భుక్త్వా భోగాన్ మనోరమాన్ ।
పుణ్యక్షయాదిహాగత్య చాతుర్వేదా భవన్తి తే ॥ 62 ॥

సర్వజగత్ప్రళయం అయ్యేంతవరకూ ఆశివలోకంలో మనోహరమయిన భోగాలు అనుభవిస్తారు. పుణ్యం క్షీణించినతరువాత భూలోకానికి తిరిగి వచ్చి, ఇక్కడ చతుర్వేదపారంగతులు అవుతారు.

శాఙ్కరం యోగ మాసాద్య తతో మోక్షం వ్రజన్తి తే ॥ 63 ॥

ఆతరువాత శంకరుడికి సంబంధించినయోగాన్ని పొంది, మోక్షానికి వెళ్తారు.

య స్తత్ర సవితుః క్షేత్రే ప్రాణా స్త్యజతి మానవః ।
స సూర్యలోకమాస్థాయ దేవవ న్మోదతే దివి ॥ 63 ॥

కోణార్కం అనే సూర్యపుణ్యక్షేత్రంలో మరణించిన మానవుడు సూర్యలోకానికి వెళ్లి, ఆదేవలోకంలో దేవతలవలే ఆనందిస్తాడు.

పునర్మానుషతాం ప్రాప్య రాజా భవతి ధార్మికః ।
యోగం రవే స్సమాసాద్య తతో మోక్ష మవాప్నుయాత్ ॥ 64 ॥

పుణ్యక్షయం అయినతరువాత తిరిగి మానవుడుగా జన్మించి, భూలోకంలో ధర్మపరుడయిన మహారాజు అవుతాడు. ఆపిదప సూర్యుడివలన యోగాన్ని పొంది, మోక్షం పొందుతాడు.

ఏవం మయా మునిశ్రేష్ఠాః క్షేత్రం ప్రోక్తం సుదుర్లభమ్ ।
కోణార్క స్యోదధే స్తీరే భుక్తిముక్తిఫలప్రదమ్ ॥ 65 ॥

మునివరులారా! ఈవిధంగా సముద్రతీరంలో ఉన్నదీ, భోగాలనూ, మోక్షాన్నీ ఇచ్చేదీ, సులువుగా చేరటానికి సాధ్యం కానిదీ, అయిన కోణార్క పుణ్యక్షేత్రాన్ని గురించి మీకు వివరించాను.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భృషిసంవాదే కోణాదిత్యమాహాత్మ్యవర్ణనం నామ షడ్వింశోఽధ్యాయః ॥26॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషి సంవాదంలో కోణాదిత్యమాహాత్మ్యవర్ణనం అనే ఇరవైఆరవ అధ్యాయం సంపూర్ణం.

సప్తవింశోఽధ్యాయః - ఇరవైఏడవ అధ్యాయం

సూర్యపూజానియమభక్తిమాహాత్మ్యవర్ణనమ్ - సూర్యపూజానియమభక్తిమాహాత్మ్యవర్ణనం

మునయ ఊచుః :-మహర్షులు బ్రహ్మదేవుడితో ఈవిధంగా అంటున్నారు.

> **శ్రుతోఽస్మాభి స్సురశ్రేష్ఠ భవతా యదుదాహృతమ్ ।**
> **భాస్కరస్య పరం క్షేత్రం భుక్తిముక్తిఫలప్రదమ్ ॥ 1 ॥**

దేవవరేణ్యా! భోగమోక్షాలను ప్రసాదించే సూర్యుడికి సంబంధించిన ఉత్తమమయిన పుణ్యక్షేత్రాన్ని గురించి నీవు వివరించావు. మేమూ శ్రద్ధగా విన్నాం.

> **న తృప్తి మధిగచ్ఛామ శ్శృణ్వన్త స్సుఖదాం కథామ్ ।**
> **భవద్వక్త్రోద్భవాం పుణ్యామాదిత్యస్యాఘనాశినీమ్ ॥ 2 ॥**

ఆ సూర్యపుణ్యక్షేత్రకథ పాపాలను నిర్మూలిస్తుంది. పుణ్యాలను అనుగ్రహిస్తుంది. సుఖాలు ఇస్తుంది. అటువంటి కథను నీనోటవెలువడగా విన్నాం. అయినా, మాకు సంతృప్తి కలగలేదు. (ఇంకా వినాలి అనిపిస్తున్నది)

> **అతః పరం సురశ్రేష్ఠ బ్రూహి నో వదతాం వర ।**
> **దేవపూజాఫలం యచ్చ యచ్చ దానఫలం భవేత్ ॥ 3 ॥**

సురవరా! మాటకారులలో మేటీ, ఇకమీద సూర్యదేవుడిని పూజించటంవలన గలిగేఫలితం ఏమిటి? (సూర్యుడిని ఉద్దేశించి) దానం చేయడం వలన గలిగే ఫలితం ఏమిటి? చెప్పు.

> **ప్రణిపాతే నమస్కారే తథా చైవ ప్రదక్షిణే ।**
> **దీపధూపప్రదానే చ సమ్మార్జనవిధౌ చ యత్ ॥ 4 ॥**

అలాగే, సూర్యుడికి సాష్టాంగపడడంవలనా, నమస్కరించడంవలనా, ప్రదక్షిణం చేయడంవలనా, దీపాలూ, ధూపాలూ ఇవ్వడంవలనా, అభిషేకించడంవలనా కలిగే పుణ్యఫలం ఏదో వివరించు.

> **ఉపవాసే చ యత్పుణ్యం యత్పుణ్యం నక్తభోజనే ।**
> **అర్ఘశ్చ కీదృశః ప్రోక్తః కుత్ర వా సమ్ప్రదీయతే ॥ 5 ॥**

సూర్యుడిని గురించి (రోజు మొత్తం) ఉపవాసం చేయడంవలన పుణ్యం ఏమిటి? పగలంతా ఉపవాసం ఉండి, రాత్రి భోజనం చేయడంవలన వచ్చేపుణ్యం ఏమిటి? అర్ఘ్యం ఎలా ఇవ్వాలి? ఎక్కడ ఇవ్వాలి?

> **కథం చ క్రియతే భక్తిః కథం దేవః ప్రసీదతి ।**
> **ఏతత్ సర్వం సురశ్రేష్ఠ శ్రోతుమిచ్ఛామహే వయమ్ ॥ 6 ॥**

సూర్యుడిని ఏవిధంగా సేవించాలి? సూర్యభగవానుడు ఏవిధంగా అనుగ్రహిస్తాడు? దేవశ్రేష్ఠా! ఈవిషయం అంతా మేం వినాలని కోరుకుంటున్నాం.

బ్రహ్మోవాచ :- బ్రహ్మదేవుడు మహర్షులతో ఈవిధంగా చెప్తున్నాడు.

అర్ఘ్యం పూజాదికం సర్వం భాస్కరస్య ద్విజోత్తమాః ।
భక్తిం శ్రద్ధాం సమాధిం చ కథ్యమానం నిబోధత ॥ 7 ॥

విప్రవరేణ్యులారా! సూర్యుడికి అర్ఘ్యం ఎలా ఇవ్వాలో, పూజలు మొదలయిన సేవలు ఎలా చేయాలో, సూర్యుడిపైన భక్తి, శ్రద్ధ ఎలా ఉండాలో, ఎలా ధ్యానించాలో చెప్తాను. వినండి.

మానసీ భావనా భక్తి రిష్టా శ్రద్ధా చ కీర్త్యతే ।
ధ్యానం సమాధిరిత్యుక్తం శృణుధ్వం సుసమాహితాః ॥ 8 ॥

మనసులో నిరంతరం (సూర్యుడిని గురించి) తలచుకోవడమే భక్తి, శ్రద్ధ, ధ్యానం, సమాధి అని పేర్కొంటారు. ఏకాగ్రబుద్ధితో వినండి.

తత్కథాం శ్రావయేద్యస్తు భక్తిమాన్ పూజయేత్తు వా ।
అగ్నిశుశ్రూషకశ్చైవ స వై భక్త స్సనాతనః ॥ 9 ॥

భక్తితో సూర్యుడి కథను వినిపించినవాడు, సూర్యుడిని పూజించినవాడు, సూర్యుడిని ఉద్దేశించి అగ్నిలో ఆహుతులు ఇచ్చినవాడు, శాశ్వత మయిన (సూర్య) భక్తుడు.

తచ్చిత్తస్తన్మనాశ్చైవ దేవపూజారతస్సదా ।
తత్కర్మకృద్ భవేద్ యస్తు స వై భక్త స్సనాతనః ॥ 10 ॥

నిజమయిన(సూర్య)భక్తుడు బుద్ధినీ, మనస్సునూ సూర్యుడిపై నిలిపిఉంచుతాడు. దృఢమైన ఆసక్తితో సూర్యుడిని పూజిస్తాడు. సూర్యుడికి సంబంధించిన పనులు (సూర్యక్షేత్రాలకు వెళ్లడం, దర్శించడం, మొ.) చేస్తాడు.

వేదార్థం క్రియమాణాని యః కర్మాణ్యనుమన్యతే ।
కీర్తనాద్ వా పరో విప్రా స్స వై భక్తః పరో నరః ॥ 11 ॥

బ్రాహ్మణులారా! వేదంకోసం (వేదాలలో చెప్పబడినకర్మలను ఆచరించడం ద్వారా వేదధర్మాన్ని నిలపడం కోసం) సూర్యుడిని గురించి చేస్తున్నకర్మలను (సూర్యుడిని గురించి వేదాలలో చెప్పబడినకర్మలను) ఆమోదించేవాడు (సహకరించేవాడు), ఆకర్మలను ప్రశంసించేవాడు అయిన మానవుడు ఉత్తమ(సూర్య)భక్తుడు.

నాభ్యసూయేతే తద్భక్తా న్న నిన్ద్యా చ్చాన్యదేవతామ్ ।
ఆదిత్యవ్రతచారీ చ స వై భక్తతరో నరః ॥12 ॥

సూర్యభక్తుడు ఇతర(సూర్య)భక్తులగొప్పదనానికి అసూయ చెందకూడదు. వాడు ఇతరదేవతలను నిందించ కూడదు. సూర్యుడికి సంబంధించిన నియమాలను నిత్యమూ ఆచరిస్తాడు. ఈలక్షణాలు గలిగినవాడే భక్తులలో శ్రేష్ఠుడు.

గచ్ఛం స్తిష్ఠన్ స్వప జ్జాగ్ర న్నున్మిష న్నిమిషన్నపి ।
య స్స్మరేద్ భాస్కరం నిత్యం స వై భక్తః పరో నరః ॥13 ॥

నడుస్తూ, నిలుచొని, నిద్రిస్తూ, కనులుమూస్తు రెప్పవాలుస్తూ, (ఆహారం తీసుకుంటూ), కళ్లు తెరిచినా, మూసినా, (ఏపని చేస్తున్నా) నిరంతరం సూర్యుని స్మరిస్తుండేవాడు ఉత్తమ(సూర్య)భక్తుడు.

ఏవం విధాత్వియం భక్తి స్సదా కార్యా విజానతా ।

వివేకం ఉన్నవాడు ఈవిధంగా సూర్యుడి పైన భక్తిని ఆచరించాలి.

భక్త్యా సమాధినా చైవ తత్త్వేన మనసా తథా ॥ 14 ॥

క్రియతే నియమో య స్తు దానం విప్రాయ దీయతే ।
ప్రతిగృహ్ణన్తి తం దేవా మనుష్యాః పితృభిర్యుతాః ॥ 15 ॥

పూజాదులతోనూ, ధ్యానంతోనూ, జ్ఞానంతోనూ, మనసుతోనూ నియమాలను ఆచరిస్తూ, బ్రాహ్మణులకు దానం చేయాలి. అలా చేసిన దానాన్ని దేవతలూ, మానవులు, పితరులూ స్వయంగా స్వీకరిస్తారు.

పత్రం పుష్పం ఫలం తోయం యద్ భక్త్యా సముపాహృతమ్ ।
ప్రతిగృహ్ణన్తి తద్దేవా నాస్తికాన్ వర్జయన్తి చ ॥ 16 ॥

ఆకు గాని, పూవు గాని, పండు గాని, నీళ్లు అయినా కాని భక్తితో ఇచ్చిన దానిని దేనినయినా, దేవతలు స్వీకరిస్తారు. దేవుడి ఉనికిని విశ్వసించని వారిని వదిలేస్తారు.

భావశుద్ధిః ప్రయోక్తవ్యా నియమాచారసంయుతా ।
క్రియతే భావశుద్ధ్యా యత్ తత్సర్వం సఫలం భవేత్ ॥ 17 ॥

నియమాలతోనూ, ఆచారంతోనూ కూడిన చిత్తశుద్ధి ఉండాలి. మనసును పరిశుద్ధంగా ఉంచి చేసేకర్మ అంతా సఫలం అవుతుంది.

స్తుతిజప్యోపహారేణ పూజయాపి వివస్వతః ।
ఉపవాసేన భక్త్యా వై సర్వపాపైః ప్రముచ్యతే ॥ 18 ॥

సూర్యదేవుడిని భక్తితో స్తుతించడంచేతనూ, జపించడంచేతనూ, కానుకలు సమర్పించడంచేతనూ, ఉపవాసం ఉండటంచేతనూ, సమస్తమయిన పాపాలు నశించిపోతాయి.

ప్రణిధాయ శిరో భూమ్యాం నమస్కారం కరోతి యః ।
తత్క్షణాత్ సర్వపాపేభ్యో ముచ్యతే నాత్ర సంశయః ॥ 19 ॥

తలను నేలకు ఆనించి, సూర్యుడికి నమస్కారం చేసినవాడి పాపాలు అన్నీ నమస్కరించిన క్షణంలోనే నశించిపోతాయి. ఇందులో సందేహం లేదు.

భక్తియుక్తో నరో యోఽసౌ రవేః కుర్యాత్ ప్రదక్షిణమ్ ।
ప్రదక్షిణీకృతా తేన సప్తద్వీపా వసున్ధరా ॥ 20 ॥

సూర్యుడికి భక్తితో ప్రదక్షిణం చేస్తే, ఏడుద్వీపాలతో కూడ మొత్తం భూమండలానికి ప్రదక్షిణం చేసినట్లే. (అంతటి పుణ్యఫలం కలుగుతుంది)

సూర్యం మనసి యః కృత్వా కుర్యాద్ వ్యోమప్రదక్షిణమ్ ।
ప్రదక్షిణీకృతా స్తేన సర్వే దేవా భవన్తి హి ॥ 21 ॥

సూర్యుడిని మనసులో నిలుపుకుని సూర్యదేవాలయానికి ప్రదక్షిణం చేస్తే, సమస్తమయిన దేవతలకు ప్రదక్షిణం చేసినట్లే. (దేవతలందరికీ ప్రక్షిణం చేసిన పుణ్యఫలం కలుగుతుంది.)

ఏకాహారో నరో భూత్వా షష్ఠ్యాం యోఽర్చయతే రవిమ్ ।
నియమవ్రతచారీ చ రవే ర్భక్తిసమన్వితః ।
సప్తమ్యాం చ మహాభాగా స్సోఽశ్వమేధఫలం లభేత్ ॥ 22 ॥

మహాత్ములారా! షష్ఠితిథినాడు ఒంటిపూట భోజనం చేసి, సప్తమినాడు భక్తితో నియమాలను పాటిస్తూ, శ్రద్ధగా సూర్యుడిని పూజించినవాడు అశ్వమేధయాగం చేసిన పుణ్యఫలాన్ని పొందుతాడు.

అహోరాత్రోపవాసేన పూజయేద్ య స్తు భాస్కరమ్ ।
అగ్నిప్రభేణ యానేన సూర్యలోకం స గచ్ఛతి ॥ 23 ॥

సప్తమినాడు రాత్రీ, పగలు రెండుపూటలు (రోజంతా) ఉపవాసం ఉండి, సూర్యుడిని పూజించినవాడు అగ్నివంటికాంతి కలిగిన విమానంలో సూర్యలోకానికి వెళ్తాడు.

సప్తమ్యా ముత షష్ఠ్యాం వా స యాతి పరమాం గతిమ్ ॥ 24 ॥

సప్తమినాడు గాని, షష్ఠినాడు గాని, పైవిధంగా ఉపవాసం ఉండి సూర్యుడిని పూజించినవాడు ఉత్తమగతికి (మోక్షస్థితికి) చేరుకుంటాడు.

కృష్ణపక్షస్య సప్తమ్యాం సోపవాసో జితేన్ద్రియః ।
సర్వరత్నోపహారేణ పూజయేద్ యస్తు భాస్కరమ్ ।
పద్మప్రభేణ యానేన సూర్యలోకం స గచ్ఛతి ॥ 25 ॥

కృష్ణపక్షంలో సప్తమినాడు ఉపవాసం ఉండి, ఇంద్రియాలను తనవశంలో ఉంచుకుని, సమస్తమయిన రత్నాలను కానుకలుగా సమర్పిస్తూ, సూర్యుడిని పూజించినవాడు పద్మపుకాంతులు కలిగినవిమానంలో సూర్యలోకానికి వెళ్తాడు.

శుక్లపక్షస్య సప్తమ్యా ముపవాసపరో నరః ।
సర్వశుక్లోపహారేణ పూజయే ద్యస్తు భాస్కరమ్ ।
సర్వపాపవినిర్ముక్త స్సూర్యలోకం స గచ్ఛతి ॥ 26 ॥

శుక్లపక్షంలో సప్తమినాడు ఉపవాసం ఉండి, మొత్తం తెల్లగా ఉండే ద్రవ్యాలతో సూర్యుడిని పూజించినవాడు పాపాలు అన్నీ నశించి, సూర్యలోకానికి వెళ్తాడు.

అర్కసంపుటసంయుక్త ముదకం ప్రసృతం పిబేత్ ।
క్రమవృద్ధ్యా చతుర్వింశ మేకైకం క్షపయేత్ పునః ॥ 27 ॥

రాగిపాత్రలో ఉన్ననీరు పుడిసెడు (అరచేతిలో పట్టినన్ని) మాత్రం త్రాగాలి. రోజుకు ఒక్కటి చొప్పున క్రమంగా పెంచుకుంటూ, ఇరవైనాలుగురోజులు పుచ్చుకోవాలి. ఆతరువాత అదే క్రమంలో తగ్గించుకుని పుచ్చుకోవాలి.

ద్వాభ్యాం సంవత్సరాభ్యాం తు సమాప్తనియమో భవేత్ ।
సర్వకామప్రదా హ్యేషా ప్రశస్తాహ్యర్కసప్తమీ ॥ 28 ॥

రెండుసంవత్సరాలపాటు ఇలా నియమం పాటిస్తే ఈవ్రతం ముగుస్తుంది. అర్కసప్తమి అనే ఈవ్రతం చాల గొప్పది. కోరికలు అన్నింటినీ తీరుస్తుంది.

శుక్లపక్షస్య సప్తమ్యాం యదాఽఽదిత్యదినం భవేత్ ।
సప్తమీ విజయా నామ తత్ర దత్తం మహత్ఫలమ్ ॥ 29 ॥

శుక్లపక్షంలో సప్తమినాడు భాను(ఆది)వారం అయితే, దానికి విజయసప్తమి అని పేరు. ఆరోజు చేసినదానం ఎంతో గొప్పపుణ్యఫలితాన్ని ఇస్తుంది.

స్నానం దానం తపో హోమ ఉపవాస స్తథైవ చ ।
సర్వం విజయసప్తమ్యాం మహాపాతకనాశనమ్ ॥ 30 ॥

విజయసప్తమినాడు చేసిన స్నానం, దానం, తపస్సు, హోమం, ఉపవాసం అన్నీ తీవ్రమయిన పాపాలను గూడ నిర్మూలిస్తాయి.

యేచాదిత్యదినే ప్రాప్తే శ్రాద్ధం కుర్వన్తి మానవాః ।
యజన్తి చ మహాశ్వేతం తే లభన్తే మహాఫలమ్ ॥ 31 ॥

భాను(ఆది)వారంనాడు శ్రాద్ధం చేసినవారు, అసమానతేజస్వి అయిన సూర్యుడిని పూజించినవారు గొప్పపుణ్యఫలాన్ని పొందుతారు.

తేషాం ధర్మ్యాః క్రియా స్సర్వా స్సదైవోద్దిశ్య భాస్కరమ్ ।
న కులే జాయతే తేషాం దరిద్రో వ్యాధితోఽపి వా ॥ 32 ॥

ఎల్లపుడూ సూర్యుడిని ఉద్దేశించి ధర్మయుక్తమయిన కర్మలను ఆచరించినవారి వంశంలో దరిద్రుడు గాని, రోగగ్రస్తుడు కాని జన్మింపడు.

శ్వేతయా రక్తయా వాపి పీతమృత్తికయాపి వా ।
ఉపలేపనకర్తా తు చిన్తితం లభతే ఫలమ్ ॥ 33 ॥

తెల్లనిది గాని, ఎఱ్ఱనిది గాని, పచ్చనిది గాని అయిన మృత్తిక(మట్టి)తో సూర్యదేవాలయానికి లేపనం చేసినవాడు (సున్నం, రంగులు పూయించినవాడు) కోరుకున్నఫలితాన్ని పొందుతాడు.

చిత్రభానుం విచిత్రై స్తు కుసుమైశ్చ సుగన్ధిభిః ।
పూజయేత్ సోపవాసో య స్స కామా నీప్సితాన్ లభేత్ ॥ 34 ॥

ఉపవాసం ఉండి, సువాసనలు గలిగిన వింత వింత పూలతో సూర్యుడిని పూజించినవాడు, ఇష్ట మయిన కోరికలను పొందుతాడు.

ఘృతేన దీపం ప్రజ్వాల్య తిలతైలేన వా పునః ।
దీర్ఘాయు ర్వపుషా యుక్త శ్చక్షుషా న స హీయతే ॥ 35 ॥

ఆవునేతితో గాని, నూవులనూనెతో గాని దీపాన్ని వెలిగించినవాడు చక్కని (రోగాలు లేని) శరీరంతో, చాలకాలం జీవిస్తాడు. వాడికి కన్నులు లేకపోవటం ఉండదు(కంటిరోగాలు ఉండవు, మంచిచూపు ఉంటుంది).

దీపదానపరో నిత్యం జ్ఞానదీపేన దీప్యతే ।
స్పష్టబుద్ధీంద్రియైశ్చాపి న కదాచిత్ ప్రముచ్యతే ॥ 36 ॥

నిత్యమూ దీపం దానం చేసేవాడు, జ్ఞానకాంతులతో ప్రకాశిస్తాడు. అసాధారణమయిన తెలివితో, ఇంద్రియ శక్తితో అతనెప్పుడూ భ్రష్టుడు కాడు (విడువబడడు)

తిలాః పవిత్రాః పరమా స్తిలానాం దానముత్తమమ్ ।
అగ్నికార్యే చ దీపే చ మహాపాతకనాశనమ్ ॥ 37 ॥

నువ్వులు చాల పవిత్ర మయినవి. ఉత్తమమయినవి. దానాలలో నువ్వులదానం చాల శ్రేష్ఠం. హోమానికీ, (నూనె రూపంలో) దీపానికీ, ఉపయోగించిన నూవులు పాపాలన్నిటినీ పోగొట్టాయి.

దీపం దదాతి యో నిత్యం దేవతాయతనేషు చ ।
చతుష్పథేషు రథ్యాసు రూపవాన్ సుభగో భవేత్ ॥ 38 ॥

దేవాలయాలలోనూ, నాలుగువీధులకూడలిలోనూ, వీథులలోనూ, (నువ్వులనూనెతో) దీపం పెట్టినవాడు మంచిరూపం కలిగినవాడు, అందగాడు, అవుతాడు.

హవిర్భిః ప్రథమః కల్పో ద్వితీయ శ్చౌషధీరసైః ।
వసామేదోస్థినిర్యాసై ర్న తు దేయః కదాచన ॥ 39 ॥

ఆవునేతితో దీపం పెట్టడం ఉత్తమపద్ధతి. ఓషధీరసాలతో దీపం రెండవపక్షం. మజ్జ (ఎముకలలో ఉండేద్రవం), వప, (పేగులు మొద లయినవాటిపైన ఉండే పొర), ఎముకలు, వీటినుండి తీసినకొవ్వుతో ఎప్పుడూ దీపాన్ని పెట్టగూడదు.

భవే దూర్ధ్వగతి ర్దీపో న కదాచిదధోగతిః ।
దాతా దీప్యతి చాప్యేవం న తిర్యగ్గతి మాప్నుయాత్ ॥ 40 ॥

దీపజ్వాల పై దిక్కుకే ఉంటుంది. ఎప్పుడూ క్రిందివైపుగా వెలగదు. అదే విధంగా దీపదానం చేసినవాడు కూడా ఎప్పుడూ ఊర్ధ్వ (ఉత్తమ) గతినే పొందుతాడు. కాని ఎప్పటికీ (నీచస్థితిని) పొందదు.

జ్వలమానం సదా దీపం న హరే న్నాపి నాశయేత్ ।
దీపహర్తా నరో బన్ధం నాశం క్రోధం తమో వ్రజేత్ ॥ 41 ॥

వెలుగుతూ ఉన్నదీపాన్ని ఎప్పుడూ తగ్గించగూడదు. ఆర్పివేయగూడదు. దీపాన్ని హరించినమానవుడు బంధింపబడతాడు. నశించిపోతాడు. వాడికి దీర్ఘ మయినకోపం ఉంటుంది. తమోగుణం కలగుతుంది. (జ్ఞానం కలగదు. ఉన్న జ్ఞానం నశిస్తుంది.)

దీపదాతా స్వర్గలోకే దీపమాలేవ రాజతే ॥ 42 ॥

దీపాన్ని దానం చేసినవాడు స్వర్గలోకంలో దీపాలమాలికలాగా వెలుగుతాడు.

య స్సమాలభతే నిత్యం కుఙ్కుమాగురుచన్దనైః ।
సమ్పద్యతే నరశ్రేష్ఠో ధనేన యశసా శ్రియా ॥ 43 ॥

కుంకుమ, అగరు, మంచిగంధాలతో నిత్యమూ శుచిగా సూర్యుడిని పూజించినమానవుడు సంపదలతోనూ, మంచికీర్తితోనూ, శుభపరంపరలతోనూ మానవులలో ఉత్తముడు అవుతాడు.

రక్తచన్దనసమ్మిశ్రై రక్తపుష్పై శ్శుచి ర్నరః ।
ఉదయేఽర్ఘ్యం సదా దత్త్వా సిద్ధిం సంవత్సరా ల్లభేత్ ॥ 44 ॥

నిత్యమూ ఉదయం సమయంలో సూర్యుడికి ఎఱ్ఱచందనం, ఎఱ్ఱనిపూలతో (కలిపిననీటితో) అర్ఘ్యం ఇచ్చిన మానవుడు ఒకసంవత్సరంలో కోరుకున్నదానిని పొందుతాడు.

ఉదయాత్ పరివర్తేత యావదస్తమనే స్థితః ।
జప న్నభిముఖః కిఞ్చి న్మన్త్రం స్తోత్రమథాపి వా ।
ఆదిత్యవ్రతమేతత్తు మహాపాతకనాశనమ్ ॥ 45 ॥

సూర్యుడు ఉదయించినప్పటినుండి అస్తమించేవరకు సూర్యుడికి ఎదురుగా నిలుచుండి, ఏదయినా మంత్రాన్ని జపించినా, స్తోత్రాన్ని పఠించినా, అది ఆదిత్యవ్రతం అవుతుంది. ఈవ్రతం ఎంతటి మహాపాపాల నయినా పోగొట్టుంది.

అర్ఘ్యేణ సహితం చైవ సర్వం సాఙ్గం ప్రదాపయేత్ ।
ఉదయే శ్రద్ధయా యుక్త స్సర్వపాపైః ప్రముచ్యతే ॥ 46 ॥

ఉదయం సమయంలో శ్రద్ధగా, అర్ఘ్యంతో సహా, ధూపం, దీపం, నైవేద్యం మొదలయిన అన్నిభాగాలతో కూడిన అర్చనను సూర్యుడికి సమర్పించినవాడు సమస్తమయిన పాపాలనుండి విముక్తిని పొందుతాడు.

సువర్ణధేన్వనడ్వాహ వసుధావస్త్రసంయుతమ్ ।
అర్ఘ్యప్రదాతా లభతే సప్తజన్మానుగం ఫలమ్ ॥ 47 ॥

సూర్యుడికి బంగారం, ఆవు, ఎద్దు, భూమి, వస్త్రాలు కూడ దానంగా చేసి అర్ఘ్యం ఇచ్చినవాడు ఆపుణ్యఫలాన్ని ఏడుజన్మలపాటు వరుసగా అనుభవిస్తాడు.

అగ్నౌ తోయేఽన్తరిక్షే శుచౌ భూమ్యాం తథైవ చ ।
ప్రతిమాయాం తథా పిణ్డ్యాం దేయ మర్ఘ్యం ప్రయత్నతః ॥ 48 ॥

అగ్నిలోనూ, నీళ్లలోనూ, ఆకాశంలోనూ, నేలమీదా, అలాగే (వరి)పిండితో చేసిన విగ్రహంలోనూ, శ్రద్ధగా, సూర్యుడికి అర్ఘ్యం ఇవ్వాలి.

నాపసవ్యం న సవ్యం చ దద్యా దభిముఖ స్సదా ।
సఘృతం గుగ్గులం చాపి రవే ర్భక్తిసమన్వితః ॥ 49 ॥

సూర్యుడికి భక్తితో ఆవునేయి కలిపినగుగ్గులుతో ధూపాన్ని ఎదురుగా ఉండి ఇవ్వాలి. సూర్యుడికి ఎడమవైపుగా గాని, కుడివైపుగా గాని ఇవ్వగూడదు.

దద్యా దభిముఖం సర్వ మర్చనం భక్తిమాన్ నరః ।
తత్క్షణాత్ సర్వపాపేభ్యో ముచ్యతే నాత్ర సంశయః ॥ 50 ॥

సూర్యుడికి చేసే పూజ మొత్తమూ ఎదురుగా ఉండి మాత్రమే చేయాలి. అలా పూజించినవాడికి పాపాలు అన్నీ ఆక్షణంలోనే నశించిపోతాయి. ఇందులో సందేహం లేదు.

శ్రీవాసం దేవదారుం చ సర్జకం చ తథైవ చ ।
కర్పూరాగరుధూపాని దత్వా వై స్వర్గగామినః ॥ 51 ॥

సూర్యుడికి కర్పూరతైలం, దేవదారువృక్షరసం, మద్దిచెట్టునుండి కారినద్రవం, కర్పూరం, అగరు ద్రవ్యాలతో ధూపం వేసినవారు స్వర్గానికి వెళ్తారు.

అయనే తూత్తరే సూర్య మథవా దక్షిణాయనే ।
పూజయిత్వా విశేషేణ సర్వపాపైః ప్రముచ్యతే ॥ 52 ॥

ఉత్తరాయణం(సూర్యుడు మకరరాశి నుండి మిథునరాశి వరకు సంచరించేకాలం)లో కాని, దక్షిణాయనం (సూర్యుడు కర్కాటకరాశి నుండి ధనూరాశిలో సంచరించువరకు)లో కాని, సూర్యుడిని ప్రత్యేకంగా పూజించినవాడు, సమస్తమయిన పాపాలనుండి విముక్తిని పొందుతాడు.

విషువేషూపరాగేషు షడశీతిముఖేషు చ ।
పూజయిత్వా విశేషేణ సర్వపాపైః ప్రముచ్యతే ॥ 53 ॥

అదే విధంగా సూర్యుడు మేషరాశిలోనూ, తులారాశిలోనూ ప్రవేశించే సమయాలలోనూ, గ్రహణసమయాల లోనూ (షడశీతిముఖాలలోనూ) సూర్యుడిని విశేషంగా పూజించినవాడు సమస్తమయిన పాపాలనుండి విముక్తిని పొందుతాడు.

ఏవం వేలాసు సర్వాసు అవేలాసు చ మానవః ।
భక్త్యా పూజయతే యోఽర్కం, సోఽర్కలోకే మహీయతే ॥ 54 ॥

ఈవిధంగా ఆయా ప్రత్యేకసమయాలలో కాని, లేదా ఇతరసాధారణసమయాలలో గాని ఎప్పుడయినా, భక్తితో సూర్యుడిని పూజించినవాడు సూర్యలోకానికి వెళ్లి అక్కడ పూజింపబడతాడు.

కృసరైః పాయసైః పూపైః ఫలమూలఘృతౌదనైః ।
బలిం దత్త్వా చ సూర్యాయ సర్వాన్ కామా నవాప్నుయాత్ ॥ 55 ॥

పులగం, పాయసం, అప్పాలు (చిన్నబూరెలు), పండ్లు, దుంపలు, ఆవునేయి, అన్నం, వీటితో సూర్యుడికి బలి ఇచ్చినవాడికి కోరికలు అన్నీ తీరుతాయి.

ఘృతేన తర్పణం కృత్వా సర్వశ్రేష్ఠో భవే న్నరః ।
క్షీరేణ తర్పణం కృత్వా మనస్తాపై ర్న యుజ్యతే ।
దధ్నా తు తర్పణం కృత్వా కార్యసిద్ధిం లభేన్నరః ॥ 56 ॥

సూర్యుడికి ఆవునేతితో తర్పణమిచ్చినమానవుడు అందరికంటె గొప్పవాడు అవుతాడు. ఆవుపాలతో తర్పణం చేసినవాడికి మానసికమైన బాధలు ఏమీ ఉండవు. ఆవుపెరుగుతో సూర్యుడికి తర్పణం విడిచిన మానవుడు ప్రారంభించినపని చక్కగా నెరవేరుతుంది.

స్నానార్థమాహరేద్ యస్తు జలం భానో స్సమాహితః ।
తీర్థాద్ వా శుచివాప్యావా స యాతి పరమాం గతిమ్ ॥ 57 ॥

సూర్యుడిస్నానానికి (అభిషేకానికి) నదినుండి కాని, శుభ్రమయిన బావినుండి కాని, శ్రద్ధగా నీళ్లు తీసుకునివచ్చినవాడు ఉత్తమగతి (మోక్షం) పొందుతాడు.

ఛత్రం ధ్వజం వితానం వా పతాకాం చామరాణి చ ।
శ్రద్ధయా భానవే దత్త్వా గతి మిష్ట మవాప్నుయాత్ ॥ 58 ॥

సూర్యుడికి శ్రద్ధగా గొడుగు, ధ్వజం, మేలుకట్టు, పతాకం, చామరాలు ఇచ్చినవాడు (ఈవస్తువులతో సేవించినవాడు) కోరుకున్న స్థానాన్ని పొందుతాడు.

యద్య ద్ద్రవ్యం నరో భక్త్యా ఆదిత్యాయ ప్రయచ్ఛతి ।
తత్తస్య శతసాహస్ర ముత్పాదయతి భాస్కరః ॥ 59 ॥

సూర్యుడికి భక్తితో ఏ యే ద్రవ్యాలను ఇస్తే సూర్యుడు వాటికి వందరెట్లు, వేయిరెట్లుగా ఆభక్తుడికి తిరిగి ఇస్తాడు.

మానసం వాచికం వాపి కాయజం యచ్చ దుష్కృతమ్ ।
సర్వం సూర్యప్రణామేన తదశేషం వ్యపోహతి ॥ 60 ॥

సూర్యభగవానుడికి సాష్టాంగనమస్కారం చేస్తే, మనసుతో కాని, మాటతో కాని, శరీరంతో కాని (త్రికరణాలలో దేనితో నైనా) చేసినపాపం పూర్తిగా నశించిపోతుంది.

ఏకాహేనాపి యద్భానోః పూజాయాః ప్రాప్యతే ఫలమ్ ।
యథోక్తదక్షిణైరిష్టైర్న తత్ క్రతుశతైరపి ॥ 61 ॥

సూర్యుడికి ఒక్కరోజు పూజ చేయడంవల్ల లభించే పుణ్యం, బ్రాహ్మణులకు తృప్తిగా దక్షిణలు ఇచ్చి, చేసిన వందలకొద్దీ యజ్ఞాలవల్ల కూడ సిద్ధించదు.

ఇతి శ్రీబ్రహ్మమహాపురాణే స్వయమ్భ్వృషిసంవాదే సూర్యపూజానియమభక్తిమాహాత్మ్యవర్ణనం నామ సప్తవింశోఽధ్యాయః ॥ 27 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషి సంవాదంలో సూర్యపూజానియమభక్తిమాహాత్మ్యవర్ణనం అనే ఇరవైఏడవ అధ్యాయం సంపూర్ణం.



అష్టావింశోఽధ్యాయః - ఇరవైఎనిమిదవ అధ్యాయం

ఆదిత్యమాహాత్మ్యవర్ణనమ్ - ఆదిత్యమాహాత్మ్యవర్ణనం

మునయ ఊచుః :- మహర్షులు బ్రహ్మదేవుడితో ఈవిధంగా అంటున్నారు.

అహో దేవస్య మాహాత్మ్యం శ్రుత మేవం జగత్పతేః ।
భాస్కరస్య సురశ్రేష్ఠ వదత స్తేషు దుర్లభమ్ ॥ 1 ॥

దేవతావరేణ్యా! (బ్రహ్మదేవా!) లోకనాథుడయిన సూర్యభగవానుడిమాహాత్మ్యం వినడం సులువుగా లభించదు. నీవు ఈవిధంగా (చక్కగా) చెప్పగా మేం వినగలిగాం.

భూయః ప్రబ్రూహి దేవేశ యత్ పృచ్ఛామో జగత్పతే ।
శ్రోతు మిచ్ఛామహే బ్రహ్మన్ పరం కౌతూహలం హి నః ॥ 2 ॥

సురనాయకా! లోకేశ్వరా! వినాలి అనేకోరికతో అడుగుతున్నాం. ఇంకా వివరంగా చెప్పు. బ్రహ్మదేవా! తెలుసుకోవాలనే కుతూహలం మాకు చాలా అధికంగ ఉంది.

గృహస్థో బ్రహ్మచారీ చ వానప్రస్థోఽథ భిక్షుకః ।
య ఇచ్ఛేన్మోక్షమాస్థాతుం దేవతాం కాం యజేత సః ॥ 3 ॥

మోక్షస్థితిలో ఉండాలని కోరుకునే బ్రహ్మచారి కాని, గృహస్థుడు కాని, వానప్రస్థుడు గాని, సన్న్యాసి కాని (ఏఆశ్రమంలో ఉన్నవాడయినా) ఏదేవుడిని పూజించాలి?

కుతో హ్యస్య ధ్రువ స్స్వర్గః కుతో నిశ్శ్రేయసం పరమ్ ।
స్వర్గత శ్చైవ కిం కుర్యాద్ యేన న చ్యవతే పునః ॥ 4 ॥

ఏదేవుడిని సేవిస్తే స్వర్గం తప్పకుండా కలుగుతుంది? ఏదేవుడివలన ఉత్తమమయిన మోక్షం సిద్ధిస్తుంది? స్వర్గంనుండి క్రింద పడిపోకుండా (తిరిగి భూలోకంలో పుట్టకుండా) ఉండాలంటే, ఏకర్మలను ఆచరించాలి?

దేవానాం చాత్ర కో దేవః పితౄణాం చాత్ర కః పితా ।
యస్మాత్ పరతరం నాస్తి తన్మే బ్రూహి సురేశ్వర ॥ 5 ॥

దేవతలు కూడా సేవించవలసిన దేవుడు ఎవరు? పితృదేవతలు సేవించవలసినవాడు (పిత) ఎవరు? అన్నింటికంటె ఉత్తమమయినది ఏది?

కుత స్సృష్ట మిదం విశ్వం బ్రహ్మన్ స్థావరజఙ్గమమ్ ।
ప్రలయే చ కమభ్యేతి తద్ భవాన్ వక్తుమర్హతి ॥ 6 ॥

బ్రహ్మదేవా! చరాచరాత్మకమయిన ఈసృష్టి సమస్తాన్నీ సృష్టించినవాడు ఎవడు? ప్రలయకాలంలో ఈజగత్తు ఎవడిలో లీనమవుతుంది? ఈవిషయాలన్నీ చెప్పదగినవాడివి నీవే.

బ్రహ్మోవాచ :-బ్రహ్మదేవుడు మహర్షులతో ఈవిధంగా చెప్తున్నాడు.

ఉద్యన్నేవైష కురుతే జగద్వితిమిరం కరైః ।
నాతః పరతరో దేవః కశ్చి దన్యో ద్విజోత్తమాః ॥ 7 ॥

విప్రవరులారా! ఈ సూర్యుడు ఉదయిస్తూనే తనకిరణాలతో ఈలోకా లన్నింటిలోని చీకటిని తొలగిస్తున్నాడు. (ఉదయించిన వెంటనే అజ్ఞానులకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదిస్తాడు) ఈ సూర్యుడికంటె గొప్పదేవుడు ఇంకొకడు ఎవడూ లేడు.

అనాదినిధనో హ్యేష పురుష శ్శాశ్వతోఽ వ్యయః ।
తాపయత్యేష త్రీన్ లోకాన్ భ్రమన్ రశ్మిభిరుల్బణః ॥ 8 ॥

ఈసూర్యుడు అందరిహృదయాలలోనూ ఉంటాడు (పురుషుడు), చావుపుట్టుకలు లేనివాడు. నిరంతరం ఉండేవాడు. తగ్గిపోడు. ఈమహాత్ముడు మూడులోకాలలోనూ సంచరిస్తూ తనకిరణాలతో కాంతులు నింపుతాడు.

సర్వదేవమయో హ్యేష తపతాం తపనో వరః ।
సర్వస్య జగతో నాథ స్సర్వసాక్షీ శుభాశుభే ॥ 9 ॥

ఈసూర్యుడు సమస్తదేవతాస్వరూపుడు. వెలిగించేవాటిలో గొప్పవెలుగు. లోకాలన్నిటికీ దిక్కు. శుభాలు అశుభాలు అయిన కర్మలు అన్నింటినీ ప్రత్యక్షంగా చూసేవాడు.

సంక్షిపత్యేష భూతాని తథా విసృజతే పునః ।
ఏష భాతి తపత్యేష వర్షత్యేష గభస్తిభిః ॥ 10 ॥

ఈసూర్యభగవానుడు చరాచరభూతకోటిని (ప్రళయకాలంలో) తనలో కలుపుకుంటాడు (లయం చేస్తాడు). తరువాత (సృష్టి సమయంలో) తిరిగి తనలోనుండి వెలుపలికి విడిచిపెట్టాడు. ఈసూర్యుడు తనకిరణాలతో ప్రకాశిస్తాడు. తపింపజేస్తాడు. వర్షిస్తాడు (ఆదిత్యహృదయం).

ఏష ధాతా విధాతా చ భూతాది ర్భూతభావనః ।
న హ్యేష క్షయమాయాతి న హ్యేష క్షయమణ్డలః ॥ 11 ॥

ఈసూర్యుడు చరాచరభూతకోటిని పోషిస్తాడు. సృష్టిస్తాడు. సృష్టికి పూర్వం ఉన్నవాడు. ఈస్థావరజంగమాలను సృష్టించి, పోషిస్తాడు. ఈసూర్యుడు ఎప్పటికీ నశించడు. సూర్యమండలం క్షీణించదు.

పితౄణాం హి పితా హ్యేష దేవతానాం హి దేవతా ।
ధ్రువం స్థానం స్మృతం హ్యేతద్ యస్మా న్న చ్యవతే పునః ॥ 12 ॥

ఈ ఆదిత్యుడు పితరులకు పిత. దేవతలకు దేవుడు. సూర్యుడిస్థానం నుండి పతనం ఉండదు. అందుకే ఈసూర్యలోకం సుస్థిరమయినది.

సర్గకాలే జగత్ కృత్స్న మాదిత్యాత్ సంప్రచక్షతే ।
ప్రలయే చ తమభ్యేతి భాస్కరం దీప్తతేజసమ్ ॥ 13 ॥

సృష్టిసమయంలో ఈజగత్తు సమస్తమూ ఆదిత్యుడినుండే వెలువడుతుంది. ప్రళయసమయంలో మిక్కిలిగా ప్రకాశించే ఆదిత్యుడిలోకే తిరిగి వెళ్లిపోతుంది.

యోగినశ్చాప్యసంఖ్యాతా స్త్యక్త్వా గృహకలేవరమ్ ।
వాయుభూతా విశన్త్యస్మింస్తేజోరాశౌ దివాకరే ॥ 14 ॥

యోగులు కూడ తమకు నివాసమైన శరీరాన్ని విడిచిపెట్టి వాయురూపాన్ని పొంది, సూర్యుడి కాంతి సమూహంలో ప్రవేశిస్తారు.

అస్య రశ్మిసహస్రాణి శాఖా ఇవ విహఙ్గమాః ।
వసన్త్యాశ్రిత్య మునయ స్సంసిద్ధా దైవతై స్సహ ॥ 15 ॥

పక్షులు చెట్టుకొమ్మలను ఆశ్రయించుకుని ఉన్నట్లుగా మునులూ, సిద్ధులూ, దేవతలూ అనంత మయిన సూర్యుడికిరణాలను ఆశ్రయించుకుని ఉంటారు.

గృహస్థా జనకాద్యాశ్చ రాజానో యోగధర్మిణః ।
వాలఖిల్యాదయశ్చైవ ఋషయో బ్రహ్మవాదినః ॥ 16 ॥

వానప్రస్థాశ్చ యే చాన్యే వ్యాసాద్యా భిక్షవ స్తథా ।
యోగమాస్థాయ సర్వే తే ప్రవిష్టా స్సూర్యమణ్డలమ్ ॥ 17 ॥

యోగధర్మాలను ఆచరిస్తూ, గృహస్థాశ్రమంలో ఉన్న జనకుడు మొదలయిన మహారాజులు, బ్రహ్మను గూర్చి చింతిస్తూ ఆత్మజ్ఞానాన్ని గురించి బోధలు చేసే వాలఖిల్యాదులయిన మహర్షులు, అరణ్యంలో నివసించే (తపమాచరించే) వ్యాసుడు మొదలయినవారు, సంన్యాసులు యోగాన్ని ఆశ్రయించి సూర్యమండలంలో ప్రవేశిస్తారు.

శుకో వ్యాససుత శ్శ్రీమాన్ యోగధర్మ మవాప్య సః ।
ఆదిత్యకిరణాన్ గత్వా హ్యపునర్యోగ మాస్థితః ॥ 18 ॥

వ్యాసుడికుమారుడయిన శుకమహర్షి యోగధర్మాన్ని పొంది ఉత్తముడై, సూర్యకిరణాలలో ప్రవేశించి, పునర్జన్మ లేని(ముక్త)స్థితిని పొందాడు.

శబ్దమాత్రశ్రుతిసుఖా బ్రహ్మవిష్ణుశివాదయః ।
ప్రత్యక్షోఽయం పరో దేవ స్సూర్య స్తిమిరనాశనః ॥ 19 ॥

బ్రహ్మ, విష్ణువు, శివుడు మొదలయిన దేవతలు వేదాలలో స్తుతింపబడ్డారు. వారు వేదశబ్దంచేత మాత్రమే గోచరించేవారు. (వేదశబ్దంచేత కొందరికి మాత్రమే తెలియబడుతూ, వారికి కూడా పరోక్షంగా మనసులో కనబడతారు.) చీకట్లను నశింపజేసే ఈ సూర్యభగవానుడు మాత్రం (అందరికీ) కన్నులయెదుట కనిపిస్తాడు.

తస్మాదన్యత్ర భక్తిర్ద్విః న కార్యా శుభమిచ్ఛతా ।
దృష్టం న బాధతే యస్మాదదృష్టం నిత్యమేవ హి ॥ 20 ॥

మంచి గలగాలని కోరుకునేవాడు, సూర్యుడిపైన మాత్రమే భక్తి కలిగిఉండాలి. ఇతరదేవతలపై భక్తి ఉండరాదు. పరోక్షమయిన(వేదశబ్దాదులచేత ఊహింపదగిన) విష్ణువు మొదలయిన దేవతలను కనుగొనడంలో అందరికీ శ్రమ అధికం. ఇక ప్రత్యక్షంగా గోచరిస్తున్న సూర్యనారాయణుడిని తెలుసుకోవడంలో ఏమాత్రం శ్రమ లేదు.(ప్రత్యక్షంగా కనిపించే సూర్యనారాయణుడిని ఉపాసించడం, ఇష్టాన్ని పొందటంలో శ్రమ ఉండదు. కాబట్టి పరోక్షంగా ఊహింపబడే ఇతరదేవతలకంటె ప్రత్యక్షనారాయణుడయిన సూర్యుడిని భక్తితో సేవించడం, కామ్యాలను పొందటం సులభం. కాబట్టి సూర్యుడిని మాత్రమే సేవించాలి అని తాత్పర్యం)

తతో భవద్భి స్సతత మభ్యర్చ్యో భగవాన్ రవిః ।
స హి మాతా పితా చైవ కృత్స్నస్య జగతో గురుః ॥ 21 ॥

అందుచేత మీరు నిరంతరం సూర్యభగవానుడిని పూజించండి. లోకా లన్నింటికీ సూర్యుడే తల్లి, తండ్రి, గురువు.

అనాద్యో లోకనాథోఽసౌ రశ్మిమాలీ జగత్పతిః ।
మిత్రత్వే చ స్థితో యస్మాత్ తపతే యో ద్విజోత్తమాః ॥ 22 ॥

బ్రాహ్మణోత్తములారా! లోకాలకు గతి అయిన కిరణములు మాలగా గలవాడు. జగత్తులకు అన్నింటికీ భర్త. లోకాలను రక్షిస్తున్నాడు కాబట్టి మిత్రుడు.

అనాదినిధనో బ్రహ్మ నిత్య మక్షయ ఏవ చ ।
సృష్ట్వా ససాగరాన్ ద్వీపాన్ భువనాని చతుర్దశ ॥ 23 ॥

ఈసూర్యుడు మొదలు, చివర లేనివాడు. బ్రహ్మ. నిత్యుడు. తరగనివాడు. సముద్రాలనూ, ద్వీపాలనూ, పద్నాలుగు భువనాలను సృష్టించినవాడు.

లోకానాం స హితార్థాయ స్థిత శ్చన్ద్రసరిత్తటే ।
సృష్ట్వా ప్రజాపతీన్ సర్వాన్ సృష్ట్వా చ వివిధాః ప్రజాః ॥ 24 ॥

ఆసూర్యుడు ప్రజాపతు లందరినీ, ప్రజల నందరినీ సృష్టించి, లోకాలకు మేలు చేయడంకోసం చంద్రనదీ తీరంలో ఉంటున్నాడు.

తత శ్శతసహస్రాంశు రవ్యక్తశ్చ పునస్స్వయమ్ ।
కృత్వా ద్వాదశధాత్మాన మాదిత్యముపపద్యతే ॥ 25 ॥

వందలవేలకిరణాలు (అనంతంగా) కలిగినసూర్యుడు వ్యక్తం కాకుండా, తనను తాను పన్నెండుభాగాలుగా చేసుకుని ద్వాదశాదిత్యులుగా అయినాడు. ఆదిత్యుని చేరుతాడు.

ఇన్ద్రో ధాతా చ పర్జన్య స్త్వష్టా పూషార్యమా భగః ।
వివస్వాన్ విష్ణురంశశ్చ వరుణో మిత్ర ఏవ చ ॥ 26 ॥

ఆపన్నెండు మంది 1. ఇంద్రుడు, 2. ధాత, 3. పర్జన్యుడు, 4. త్వష్ట, 5. పూష, 6. అర్యముడు, 7. భగుడు, 8. వివస్వంతుడు, 9. విష్ణువు, 10. అంశుడు, 11. వరుణుడు, 12. మిత్రుడు అనేపేర్లు గలిగినవారు.

ఆభి ర్ద్వాదశభి స్తేన సూర్యేణ పరమాత్మనా ।
కృత్స్నం జగదిదం వ్యాప్తం మూర్తిభిశ్చ ద్విజోత్తమాః ॥ 27 ॥

బ్రాహ్మణవర్యులారా! ఈపన్నెండు రూపాలతోనూ సూర్యపరమాత్మ ఈలోకమంతటా నిండిఉన్నాడు.

తస్య యా ప్రథమా మూర్తి రాదిత్యస్యేన్ద్రసంజ్ఞితా ।
స్థితా సా దేవరాజత్వే దేవానాం రిపునాశినీ ॥ 28 ॥

ఆదిత్యుడి మొదటి మూర్తి ఇంద్రుడు అనేపేరు గలిగినది. ఆరూపం దేవతలశత్రువులను (రాక్షసులను) నిర్మూలిస్తూ దేవతలకు రాజు అయిన పదవిలో ఉంది.

ద్వితీయా తస్య యా మూర్తి ర్నామ్నా ధాతేతి కీర్తితా ।
స్థితా ప్రజాపతిత్వే చ వివిధా స్సృజతే ప్రజాః ॥ 29 ॥

ఆదిత్యుడి రెండవమూర్తి ధాత అనేపేరుతో ప్రసిద్ధమైనది. ఆరూపం ప్రజాపతిగా చరాచరము లయిన వివిధప్రజలను సృష్టి చేస్తుంది.

తృతీయా తస్య మూర్తి ర్యా పర్జన్య ఇతి విశ్రుతా ।
మేఘే ష్వవస్థితా సా తు వర్షతే చ గభస్తిభిః ॥ 30 ॥

ఆదిత్యుడి మూడవమూర్తి పర్జన్యుడు అనేపేరుతో ప్రఖ్యాతమైనది. ఆపర్జన్యమూర్తి మేఘాలలో నిలిచి, తనకిరణాలతో వర్షం కురిపిస్తాడు.

చతుర్థీ తస్య యా మూర్తి ర్నామ్నా త్వష్టేతి విశ్రుతా ।
స్థితా వనస్పతౌ సా తు ఓషధీషు చ సర్వతః ॥ 31 ॥

ఆదిత్యుడి నాలుగవమూర్తి త్వష్ట అనేపేరుతో ప్రసిద్ధమైనది. ఆరూపం వనస్పతులలోనూ, ఓషధులలోనూ అంతటా నిండిఉంది.

పఞ్చమీ తస్య యా మూర్తి ర్నామ్నా పూషేతి విశ్రుతా ।
అన్నే వ్యవస్థితా సా తు ప్రజాం పుష్ణాతి నిత్యశః ॥ 32 ॥

ఆదిత్యుడి ఐదవమూర్తి పూషుడు అనే పేరుతో ప్రసిద్ధమైనది. ఆరూపం ఆహారంలో నిలిచి, ప్రజలను నిత్యమూ పోషిస్తుంది.

మూర్తి ష్షష్ఠీ రవే ర్యా తు అర్యమా ఇతి విశ్రుతా ।
వాయో స్సంవరణా సా తు దేవేష్వేవ సమాశ్రితా ॥ 33 ॥

ఆదిత్యుడి ఆరవమూర్తి అర్యముడు అనేపేరుతో ప్రసిద్ధమైనది. ఆరూపం దేవతలను ఆశ్రయించిఉన్నది. దీనిని వాయువు ఆవరించిఉంటుంది.

భానోర్యా సప్తమీ మూర్తి ర్నామ్నా భగేతి విశ్రుతా ।
భూతేష్వవస్థితా సా తు శరీరేషు చ దేహినామ్ ॥ 34 ॥

ఆదిత్యుడి ఏడవమూర్తి భగుడు అనేపేరుతో ప్రసిద్ధ మైనది. ఈరూపం అన్నిభూతాలలోనూ, శరీరధారుల శరీరాలలోనూ ఉంటుంది.

మూర్తి ర్యాత్వష్టమీ తస్య వివస్వా నితి విశ్రుతా ।
అగ్నౌ ప్రతిష్ఠితా సా తు పచ త్యన్నం శరీరిణామ్ ॥ 35 ॥

ఆదిత్యుడి ఎనిమిదవమూర్తి వివస్వంతుడు అనేపేరుతో ప్రసిద్ధమైనది. ఆరూపం (కడుపులో ఉన్న – జఠర)అగ్నిలో నిలిచి, జీవులఆహారాన్ని జీర్ణం చేస్తుంది.

నవమీ చిత్రభానో ర్యా మూర్తి ర్విష్ణుశ్చ నామతః ।
ప్రాదుర్భవతి సా నిత్యం దేవానాం రిపునాశినీ ॥ 36 ॥

ఆదిత్యుడి తొమ్మిదవమూర్తి విష్ణువు అనేపేరుతో ప్రసిద్ధ మైనది. ఆ రూపం నిరంతరమూ దేవతలశత్రువులను (రాక్షసులను) సంహరిస్తుంది.

దశమీ తస్య యా మూర్తి రంశుమానితి విశ్రుతా ।
వాయౌ ప్రతిష్ఠితా సా తు ప్రహ్లాదయతి వై ప్రజాః ॥ 37 ॥

ఆదిత్యుడి పదవమూర్తి అంశుమంతుడు అనేపేరుతో ప్రసిద్ధమైనది. ఆరూపం వాయువులో నిలిచి ప్రజలను ఆహ్లాదపరుస్తుంది.

మూర్తి స్త్వేకాదశీ భానో ర్నామ్నా వరుణసంజ్ఞితా ।
జలేష్వవస్థితా సా తు ప్రజా రక్షతి నిత్యశః ॥ 38 ॥

ఆదిత్యుడి పదకొండవమూర్తి వరుణుడు అనేపేరుతో ప్రసిద్ధమైనది. ఆరూపం నీళ్లలో నిలిచిఉండి, నిత్యమూ ప్రజలను కాపాడుతుంది.

మూర్తి ర్యా ద్వాదశీ భానో ర్నామ్నా మిత్రేతి సంజ్ఞితా ।
లోకానాం సా హితార్థాయ స్థితా చన్ద్రసరిత్తటే ॥ 39 ॥

ఆదిత్యుడి పన్నెండవమూర్తి మిత్రుడు అనేపేరుతో ప్రసిద్ధ మైనది. లోకాలకు మేలు చేయడంకోసం ఆమూర్తి చంద్రనదీతీరంలో ఉన్నది.

వాయుభక్ష స్తప స్తేపే స్థితో మైత్రేణ చక్షుషా ।
అనుగృహ్ణన్ సదా భక్తాన్ వరై ర్నానావిధైస్తు సః ॥ 40 ॥

మిత్రుడు చంద్రనదీతీరంలో గాలిని మాత్రమే ఆహారంగా తీసుకుంటూ, గొప్ప తపస్సు చేశాడు. ఆరూపం ఎల్లప్పుడూ వాత్సల్యం నిండిన చూపులతో, అనేకమయిన వరాలను ఇచ్చి, భక్తులను అనుగ్రహిస్తుంది.

ఏవ మాద్యం హి తత్స్థానం పశ్చాత్ సామ్బేన స్థాపితమ్ ।
తత్ర మిత్రః స్థితో యస్మా, త్తస్మా న్మిత్రవనం స్మృతమ్ ॥ 41 ॥

ప్రథమ (శ్రేష్ఠ) మయిన ఆప్రదేశాన్ని తరువాత పరమేశ్వరుడు (తనతపస్సుతో) ఉత్తమంగా నెలకొల్పాడు. మిత్రుడు (సూర్యుడి పన్నెండవమూర్తి) అక్కడ (తపస్సు చేసుకుంటూ) ఉన్నకారణంగా దానికి మిత్రవనం అనేపేరు వచ్చింది.

ఆభి ర్ద్వాదశభి స్తేన సవిత్రా పరమాత్మనా ।
కృత్స్నం జగదిదం వ్యాప్తం మూర్తిభిశ్చ ద్విజోత్తమాః ॥ 42 ॥

బ్రాహ్మణోత్తములారా! ఆదిత్యుడు ఈపన్నెండురూపాలతో ఈజగత్తు అంతటా నిండిఉన్నాడు.(27 శ్లో)

తస్మా ద్ధ్యేయో నమస్యశ్చ ద్వాదశస్థాసు మూర్తిషు ।
భక్తిమద్భి ర్నరై ర్నిత్యం తద్గతేనాన్తరాత్మనా ॥ 43 ॥

అందుచేత భక్తులు ఎల్లప్పుడూ సూర్యుడి ద్వాదశమూర్తులమీద మనసు నిలిపిఉంచి, ఆసూర్యుడిని ధ్యానించాలి. ఆతడికి నమస్కరించాలి.

ఇత్యేవం ద్వాదశాదిత్యా న్నమస్కృత్వా తు మానవః ।
నిత్యం శ్రుత్వా పఠిత్వా చ సూర్యలోకే మహీయతే ॥ 44 ॥

ఈవిధంగా మానవుడు ద్వాదశాదిత్యులకు నమస్కరించి, నిత్యమూ ఆమూర్తులను గురించి విన్నా, చదివినా, సూర్యలోకంలో పూజింపబడతాడు.

మునయ ఊచుః :- మహర్షులు బ్రహ్మదేవుడితో ఈవిధంగా అంటున్నారు.

యది తావ దయం సూర్యశ్చాదిదేవ స్సనాతనః ।
తతః కస్మా త్తప స్తేపే వరేప్సుః ప్రాకృతో యథా ॥ 45 ॥

మహాత్మా! ఈసూర్యుడే దేవతల కందరికీ మొదటివాడూ, పరమాత్మా, అయిఉంటే వరాలు పొందటంకోసం పామరుడులాగా ఎందుకు తపస్సు చేశాడు?

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఏతద్వ స్సంప్రవక్ష్యామి పరం గుహ్యం విభావసోః ।
పృష్టం మిత్రేణ యత్పూర్వం నారదాయ మహాత్మనే ॥ 46 ॥

సూర్యుడికి సంబంధించి మీరు అడిగినవిషయం చాల రహస్యం. ఇంతకుపూర్వం ఇదే విషయాన్ని నారదుడు అడిగినపుడు మిత్రుడు (అనే ఆదిత్యుడు స్వయంగా) చెప్పినప్రకారంగా, మీకు నేను చెప్తాను.

ప్రాఙ్మయోక్తాస్తు యుష్మభ్యం రవే ర్ద్వాదశమూర్తయః ।
మిత్రశ్చ వరుణశ్చోభౌ తాసాం తపసి సంస్థితౌ ॥ 7 ॥

ఇంతకుముందు నేను సూర్యుడిద్వాదశమూర్తులను గూర్చి మీకు చెప్పాను. ఆపన్నెండుమంది ఆదిత్యులలో మిత్రుడు, వరుణుడు అనేవారు ఇద్దరు తపోదీక్షలో ఉన్నారు.

అబ్భక్షో వరుణ స్తాసాం తస్థౌ పశ్చిమసాగరే ।
మిత్రో మిత్రవనే తస్మిన్ వాయుభక్ష శ్చరం స్తపః ॥ 48 ॥

వారిలో వరుణుడు నీరు మాత్రమే ఆహారంగా పడమటి సముద్రంలో తపస్సు చేస్తూ ఉండేవాడు. గాలి మాత్రమే ఆహారంగా మిత్రుడు మిత్రవనంలో తపస్సు చేస్తున్నాడు.

అథ మేరుగిరే శ్శృఙ్గాత్ ప్రచ్యుతో గన్ధమాదనమ్ ।
నారదస్తు మహాయోగీ సర్వాం లోకాంశ్చరన్ వశీ ॥ 49 ॥

ఆజగామాథ తత్రైవ యత్ర మిత్రోఽ చరత్తపః ।

జితేంద్రియుడు, గొప్పయోగి అయిన నారదమహర్షి లోకాలన్నింట సంచరిస్తూ మేరుపర్వతం దిగి వస్తూ, మిత్రుడు తపస్సు చేసుకుంటున్న గంధమాదనపర్వతానికి వచ్చాడు.

తం దృష్ట్వా తు తపస్యన్తం తస్య కౌతూహలం హ్యభూత్ ॥ 50 ॥

అక్కడ తపస్సు చేసుకుంటున్న మిత్రుడిని చూచిన నారదుడికి ఒకసందేహం కలిగింది.

యోఽ క్షయ శ్చావ్యయ శ్చైవ వ్యక్తావ్యక్త స్సనాతనః ।
ధృతమేకాత్మకం యేన త్రైలోక్యం సుమహాత్మనా ॥ 51 ॥

యః పితా సర్వదేవానాం పరాణామపి యః పరః ।

అయజద్దేవతాం కాం పితౄన్ వా కా నసౌ యజేత్ ।
ఇతి సంచిన్త్య మనసా తం దేవం నారదోఽ బ్రవీత్ ॥ 52 ॥

క్షీణించనివాడు, నశించనివాడు, తెలియబడేవాడు, తెలియబడనివాడు, పురాతనుడు, మూడులోకాలనూ ఒక్కటిచేసి ధరించినమహానుభావుడూ, దేవతలకు అందరికీ జనకుడూ, పరులందరికీ పరుడు అయిన సూర్యభగవానుడు ఏ దేవుడిని గూర్చి తపస్సు చేస్తున్నాడు? లేదా ఏ పితృదేవతను గూర్చి తపస్సు చేస్తున్నాడు? అని మనసులో ఆలోచించి, మిత్రుడిమూర్తితో ఉన్న సూర్యభగవానుడితో నారదుడు ఇలా అన్నాడు.

నారద ఉవాచ:- నారదుడు మిత్రుడితో ఈవిధంగా అంటున్నాడు.

వేదేషు సపురాణేషు సాఙ్గోపాఙ్గేషు గీయసే ।
త్వమజ శ్శాశ్వతో ధాతా మహామూర్తి రనుత్తమః ॥ 53 ॥

అంగాలతో ఉపాంగాలతో కూడిన వేదాలూ, పురాణాలూ నిన్ను స్తోత్రం చేస్తాయి. (వాటినిబట్టి) నీవు పుట్టుక లేనివాడివి. అన్నికాలాలలోనూ ఉండేవాడివి. సృష్టి చేసేవాడివి. గొప్ప ఆకారం కలిగినవాడివి. అందరికంటె ఉత్తముడివి.

భూతం భవ్యం భవిష్యచ్చ త్వయి సర్వం ప్రతిష్ఠితమ్ ।
చత్వార శ్చాశ్రమా దేవ గృహస్థాద్యా స్తథైవ చ ॥ 54 ॥
యజన్తి త్వామహరహ ర్నానామూర్తిసమాశ్రితమ్ ।
పితా మాతా చ సర్వస్య దైవతం త్వం హి శాశ్వతమ్ ॥ 55 ॥
యజసే పితరం కం త్వం దేవం వాపి న విద్మహే ॥ 56 ॥

దేవా! గతకాలంలో ఉన్నదీ, ప్రస్తుతం ఉన్నదీ, భావికాలంలో రాబోయేదీ అయినసృష్టి మొత్తం నీలో స్థిరంగా ఉన్నది. (బ్రహ్మచర్యం,) గృహస్థాశ్రమం మొదలయిన (వానప్రస్థం, సంన్యాసం) నాలుగుఆశ్రమాలూ, నీలోనే ఉన్నాయి. మిత్రవరుణాదు లయిన అనేకమూర్తులు గలిగిఉన్ననిన్ను అందరూ ప్రతిరోజూ అర్చిస్తారు. అందరికీ అన్నికాలాలలోనూ (అన్నిజన్మలలోనూ) నీవే తల్లివి, తండ్రివి, దేవుడివి. (జనులందరూ నిన్ను అర్చిస్తుంటే) నీవు ఏదేవుడిని అర్చిస్తున్నావు? ఏపితరుడిని కొలుస్తున్నావు?

మిత్ర ఉవాచ:- నారదుడితో మిత్రుడు ఈవిధంగా చెప్తున్నాడు.

అవాచ్య మేత ద్వక్తవ్యం పరం గుహ్యం సనాతనమ్ ।
త్వయి భక్తిమతి బ్రహ్మన్ ప్రవక్ష్యామి యథాతథమ్ ॥ 57 ॥

బ్రహ్మర్షీ! నారదా! నీవు చెప్పమని అడిగిన ఈవిషయం పెద్ద రహస్యం. ఎవరికీ చెప్పగూడనిది అయినా, (నామీద) భక్తి గలిగినవాడివి కాబట్టి నీకు ఉన్నది ఉన్నట్లుగా చెప్తాను.

యత్తత్ సూక్ష్మ మవిజ్ఞేయ మవ్యక్తమచలం ధ్రువమ్ ।
ఇన్ద్రియై రిన్ద్రియార్థైశ్చ సర్వభూతైర్వివర్జితమ్ ॥ 58 ॥

మిక్కిలిసూక్ష్మ పరిమాణంలో ఉన్నదీ, తెలియరానిదీ, కనబడనిదీ, స్థిరమైనదీ, నిశ్చితమైనదీ, ఇంద్రియాలకూ, ఇంద్రియవిషయాలకూ, సమస్తచరాచరభూతకోటీ తెలియలేనిదీ అయిన పరమాత్మనే.

సహ్యన్తరాత్మా భూతానాం క్షేత్రజ్ఞ శ్చైవ కథ్యతే ।
త్రిగుణాద్ వ్యతిరిక్తోఽసౌ పురుషశ్చైవ కల్పితః ॥ 59 ॥

ఆపరమాత్మే అన్నిపదార్థాలలోను అంతర్యామిగా ఉంటాడు. అతడినే క్షేత్రజ్ఞుడు అంటారు. అతడు సత్త్వ రజస్తమోగుణాలు మూడింటికంటె భిన్నమయినవాడు. అతడే పురుషుడు అని పేర్కొనబడ్డాడు.

హిరణ్యగర్భో భగవాన్ సైవ బుద్ధి రితి స్మృతః ।
మహానితి చ యోగేషు ప్రధానమితి కథ్యతే ॥ 60 ॥

ఆతడే భగవంతుడు. హిరణ్యగర్భుడు, బుద్ధి. అతడినే యోగశాస్త్రాలలో మహత్తు, ప్రధానం అని చెప్తారు.

సాంఖ్యే చ కథ్యతే యోగే నామభి ర్బహుధాత్మకః ।
స చ త్రిరూపో విశ్వాత్మా ఏకాక్షర ఇతి స్మృతః ॥ 61 ॥

యోగంలోనూ, సాంఖ్యంలోనూ అతడిని రకరకాలయినపేర్లతో పేర్కొంటారు. అతడు మూడుమూర్తులు గలిగినవాడు. జగత్ స్వరూపుడు, ఏకాక్షరుడు (ప్రణవం).

ధృత మేకాత్మకం తేన త్రైలోక్యమిదమాత్మనా ।
అశరీర శ్శరీరేషు సర్వేషు నివసత్యసౌ ॥ 62 ॥

అతడు ఈమూడులోకాలనూ అంతరాత్మ అయి ఒకేరూపంతో ధరిస్తున్నాడు. తాను మాత్రం శరీరం లేకుండా (అంతర్యామి ఐ) అందరిశరీరాలలోనూ నివసిస్తుంటాడు.

వసన్నపి శరీరేషు న స లిప్యతి కర్మభిః ।
మమాన్తరాత్మా తవ చ యే చాన్యే దేహసంస్థితాః ॥ 63 ॥

దేహాలలో ఉండి కూడా, ఆశరీరాలు చేస్తున్న పుణ్యాపాపకర్మలతో సంబంధం లేకుండా (సాక్షిమాత్రంగా) ఉంటాడు. నీలోనూ, నాలోనూ, శరీరం ధరించినఅందరిలోనూ, (అందరి దేహాలలోనూ) అంతరాత్మగా ఉంటాడు.

సర్వేషాం సాక్షిభూతోఽసౌ న గ్రాహ్యః కేనచిత్ క్వచిత్ ।
సగుణో నిర్గుణో విశ్వో జ్ఞానగమ్యో హ్యసౌ స్మృతః ॥ 64 ॥

అందరిలో పరమాత్మగా ఉన్న అతడిని ఎవ్వడూ ఎప్పటికీ గ్రహించలేడు. అతడు గుణవంతుడు. (ఆకారం కలిగినవాడు.) ఏవిధమయిన రూపమూ లేనివాడు. సమస్తము అతడే. (సృష్టిలో ఉన్న అన్నిరూపాలూ అతడే). జ్ఞానంతో మాత్రమే ఆపరమాత్మను పొందటం సాధ్య మవుతుంది.

సర్వతః పాణిపాదాన్త స్సర్వతోఽక్షిశిరోముఖః ।
సర్వత శ్రుతిమాన్ లోకే సర్వ మావృత్య తిష్ఠతి ॥65 ॥

ఆపరమాత్మ చేతులు, కాళ్లు అంతటా నిండిఉన్నాయి. (జగత్తు పరమాత్మ కాబట్టి జగత్తులోని అందరికాళ్లూ, చేతులూ అన్నీ ఆపరమాత్మవే. ఇలా పరమాత్మ పాదాది అవయవాలు జగత్తు అంతటా వ్యాపించిఉంటాయి.) అలాగే ఆపరమాత్మ కన్నులు, శిరస్సులు, నోళ్లు, చెవులు (అన్ని అవయవాలు) లోకమంతటా నిండిఉన్నాయి. అతడు ఈజగత్తు అంతటినీ ఆవరించి ఉంటాడు.

విశ్వమూర్ధా విశ్వభుజో విశ్వపాదాక్షినాసికః ।
ఏకశ్చరతి వై క్షేత్రే స్వైరచారీ యథాసుఖమ్ ॥ 66 ॥

జగత్తులోని సమస్తమయిన శిరస్సులు, చేతులు, కాళ్లు, కళ్లు, ముక్కులు అన్నీ అతడే అయి, ప్రతివాడి శరీరంలోనూ సుఖంగా తనయిష్టం వచ్చినట్లు సంచరిస్తుంటాడు.

క్షేత్రాణీహ శరీరాణి తేషాం చైవ యథాసుఖమ్ ।
తాని వేత్తి స యోగాత్మా తతః క్షేత్రజ్ఞ ఉచ్యతే ॥ 67 ॥

శరీరాలే క్షేత్రాలు. ఆక్షేత్రాలలో (శరీరాలలో) సుఖంగా ఉండి, క్షేత్రాలను గురించి తెలుసుకునిఉంటాడు. అందువలననే యోగస్వరూపుడై, శరీరంలో కలిసిఉన్న ఆపరమాత్మను క్షేత్రజ్ఞుడు అంటారు.

అవ్యక్తే చ పురే శేతే పురుష స్తేన చోచ్యతే ।
విశ్వం బహువిధం జ్ఞేయం సర్వ స్సర్వత్ర ఉచ్యతే ॥ 68 ॥

(శరీరంలో) తెలియరానిపురం(హృదయగుహ)లో శయనించిఉండేవాడు కాబట్టి పురుషుడు అంటారు. జగత్తు అనేకవిధమైనది. పరమాత్మ జగత్తులోని అన్నిపదార్థాలలోనూ, అంతటా ఉంటాడు.

తస్మాత్ స బహురూపత్వాద్ విశ్వరూప ఇతి స్మృతః ।
తస్యైకస్య మహత్త్వం హి స చైకః పురుష స్స్మృతః ॥ 69 ॥

ఈవిధంగా అనేకమయిన రూపాలు కలిగినవాడు (జగత్తు ఆయన స్వరూపమే) కాబట్టి పరమాత్మ విశ్వరూపుడు. మహత్త్వం ఆపరమాత్మ ఒక్కడిలోనే ఉంటుంది. ఆపరమాత్మ ఒక్కడే పురుషుడు.

మహాపురుషశబ్దం హి బిభ ర్త్యేక స్సనాతనః ।
సత్త్వబుద్ధిక్రియాపన్నస్సృజత్యాత్మానమాత్మనా ॥ 70 ॥

అందుచేతనే అతడు మహాపురుషుడు అని పేరుమోశాడు. సత్త్వగుణంతో, సంకల్పశక్తి (ప్రజ్ఞాపాటవం)తో, క్రియాశక్తితో తనను తాను సృష్టించుకుంటాడు.

శతధా సహస్రధా చైవ తథా శతసహస్రధా ।
కోటిశశ్చ కరో త్యేష ప్రత్యగాత్మాన మాత్మనా ॥ 71 ॥

ఆతడు తనను తాను నూరువిధాలుగా, వేయివిధాలుగా, లక్షవిధాలుగా, కోటివిధాలుగా, ప్రత్యేకస్వరూపాలుగా ఏర్పరచుకుంటాడు. (తాను ఒక్కడే కోట్లకొలదిగా, అసంఖ్యాకంగా అవుతాడు)

ఆకాశాత్ పతితం తోయం యాతి స్వాద్వన్తరం యథా ॥
భూమే రసవిశేషేణ తథా గుణరసాత్తు సః ॥ 72 ॥

ఆకాశంనుండి నేలమీద పడిననీరు, ఆనేలగంధవిశేషాలనుబట్టి, రకరకాలరుచులు గలిగినదిగా మారిన విధంగా ఆపరమాత్మ గుణము మొదలయిన భేదాలనుబట్టి అనేకవిధాలుగా అవుతున్నాడు.

ఏక ఏవ యథా వాయు ర్దేహేష్వేవ హి పఞ్చధా ।
ఏకత్వం చ పృథక్త్వం చ తథా తస్య న సంశయః ॥ 73 ॥

ఒకే వాయువు, శరీరంలో పంచప్రాణాలుగా ఐదురూపాలతో ఉన్నట్లుగా, ఒక్కడే అయిన పరమాత్మ జగత్తులో అనంతమయినరూపాలతో ఉంటాడు. ఇందులో సందేహం లేదు.

స్థానాన్తరవిశేషాచ్చ యథా అగ్ని ర్లభతే పరామ్ ।
సంజ్ఞాం యథా ధ్రువాద్యేషు బ్రహ్మాద్యేషు తథా వయమ్ ॥ 74 ॥

స్థానభేదాన్నిబట్టి అగ్ని అనేక మయినపేర్లు పొందినట్లుగా, పరమాత్మ ఉపాధిభేదాన్ని అనుసరించి ధ్రువుడు మొదలయినవి, బ్రహ్మ మొదలయినవి, అలాగే మనలాంటి భూతకోటినామాలను వహిస్తున్నాడు.

యథా దీపసహస్రాణి దీప ఏకః ప్రసూయతే ।
తథా రూపసహస్రాణి స ఏక స్సంప్రసూయతే ॥ 75 ॥

ఒకే దీపంనుండి వేలకొలదీ దీపాలు పుట్టినట్లుగా, ఒక్కడే అయినపరమాత్మ వేలకొలదీరూపాలను (ఉపాధులను) పుట్టిస్తాడు.

యదా చ బుధ్యత్యాత్మానం తదా భవతి కేవలః ।
ఏకత్వప్రలయే చాస్య బహుత్వం చ ప్రవర్తతే ॥ 76 ॥

(జీవుడు) తనను తాను తెలుసుకున్నతరువాత (ఆత్మజ్ఞానం కలిగినపుడు) కేవలుడు (అన్నింట ఉన్నది ఒక్కడే పరమాత్మ అనేదృష్టి కలిగినవాడు) అవుతాడు. ఏకత్వం నశించినపుడు (ఆత్మజ్ఞానం కోలుపోయినపుడు) బహుత్వంతో (అనేకం – భిన్నం అనేభావనతో) వర్తిస్తాడు.

నిత్యం హి నాస్తి జగతి భూతం స్థావరజఙ్గమమ్ ।
అక్షయ శ్చాప్రమేయశ్చ సర్వగశ్చ స ఉచ్యతే ॥ 77 ॥

ఈలోకంలో చరమయినా, అచరమయినా, ఏపదార్థమూ నిత్యం కాదు. (పరమాత్మ ఒక్కడే నిత్యుడు) ఆపరమాత్మ మాత్రమే ఎప్పుడూ ఉండేవాడు, పరిమితి లేనివాడు, అంతటా నిండిఉన్నవాడు.

తస్మా దవ్యక్త ముత్పన్నం త్రిగుణం మునిసత్తమాః ।
అవ్యక్తా వ్యక్తభావస్థా యా సా ప్రకృతి రుచ్యతే ॥ 78 ॥

మునివరులారా! ఆపరమాత్మనుండి సత్త్వ,రజ,స్తమోగుణాలు కూడి ఉన్న అవ్యక్తం ఉద్భవించింది. త్రిగుణాలు కలిసిఉన్నఅవ్యక్తం నుంచి త్రిగుణాలు వేరయి, వ్యక్తమయినాయి. ఇలా అవ్యక్తంగానూ, వ్యక్తంగానూ త్రిగుణాలు కలిగిన స్థితిని ప్రకృతి అంటారు.

తాం యోనిం బ్రహ్మణో విద్ధి యోఽసౌ సదసదాత్మకః ।
లోకే చ పూజ్యతే యోఽసౌ దైవే పిత్ర్యే చ కర్మణి ॥ 79 ॥

ఆప్రకృతే బ్రహ్మకు కారణం. సత్తు(ఉనికి కలిగినది), అసత్తు (ఉనికి లేనిది) అయినది బ్రహ్మం. లోకంలో దైవకార్యాలలోనూ, పితృకార్యాలలోనూ ఆపరబ్రహ్మం అర్చింపబడుతున్నది.

నాస్తి తస్మాత్ పరో హ్యన్యః పితా దేవోఽపి వా ద్విజాః ।
ఆత్మనా స తు విజ్ఞేయ స్తత స్తం పూజయామ్యహమ్ ॥ 80 ॥

బ్రాహ్మణులారా! ఆపరమాత్మకంటె అధికమయిన జనకుడు కాని, దేవుడు గాని, ఇంకొకడు ఎవరూ లేరు. ఆపరమాత్మను ఆత్మచేతనే తెలుసుకోవాలి. అతడినే నేను పూజిస్తున్నాను.

స్వర్గస్థాపి హి యే కేచిత్తం నమస్యన్తి దేహినః ।
తే చ గచ్ఛన్తి దేవర్షే తేనోద్దిష్టఫలాం గతిమ్ ॥ 81 ॥

దేవఋషీ! శరీరంతో స్వర్గంలో ఉండి కూడా, (పుణ్యఫలాన్ని అనుభవిస్తూ కూడ, స్వర్గాదులకంటె అధిక మయిన ప్రయోజనాన్ని, మోక్షాన్ని ఉద్దేశించి) ఆపరమాత్మకు నమస్కరించినవారు తమకు కావలసిన ఉత్తమస్థానాన్ని (మోక్షాన్ని) పొందుతారు.

తం దేవా స్స్వాశ్రమస్థాశ్చ నానామూర్తిసమాశ్రితాః ।
భక్త్యా సమ్పూజయ న్త్యాద్యం గతి శ్చైషాం దదాతి సః ॥ 82 ॥

రకరకాలరూపాలతో తమతమస్థానాలలో ఉన్నఆయాదేవతలు భక్తితో ఆఆదిదేవుడిని చక్కగా పూజిస్తారు. ఆదేవుడు కూడ వారు కోరుకున్న ఉత్తమగతిని వారికి ఇస్తాడు.

స హి సర్వగతశ్చైవ నిర్గుణశ్చైవ కథ్యతే ।
ఏవం శ్రుత్వా తథా జ్ఞాత్వా పూజయామి దివాకరమ్ ॥ 83 ॥

అంతటా నిండిఉన్నవాడు ఆదేవుడే. ఏగుణమూ(ఆకారం) లేనివాడు. ఆదేవుడు సూర్యుడే, అని విని, ఆసూర్యుడే పరదైవతం అని తెలుసుకుని, సూర్యుడిని పూజిస్తున్నాను.

యే చ తద్భావితా లోక ఏకతత్త్వం సమాశ్రితాః ।
ఏతదప్యధికం తేషాం యదేకం ప్రవిశన్త్యుత ॥ 84 ॥

ఆసూర్యుడిచేత ప్రేరేపింపబడి, సమస్తదేవతలసారరూపమయిన తత్త్వంగా సూర్యుడిని ఆశ్రయించినవారు అప్రధానతత్త్వంలో (సూర్యుడిలో) లీనమవుతారు. అది వారికి అత్యంతమయిన ప్రయోజనం.

ఇతి గుహ్యసముద్దేశ స్తవ నారద కీర్తితః ।
అస్మద్భక్త్యాపి దేవర్షే త్వయాఽపి పరమం స్మృతమ్ ॥ 85 ॥

దేవఋషీ! నారదా! ఇది చాల రహస్యవిషయం. నాపైన భక్తి గలిగినవాడివి కాబట్టి ఈగొప్పరహస్యం నీవు పొందగలిగావు.

సర్వైశ్చ మునిభిర్వాఽపి పురాణే యైరిదం శ్రుతమ్ ।
సర్వే తే పరమాత్మానం పూజయన్తి దివాకరమ్ ॥ 86 ॥

పురాణంలోని ఈసూర్యమాహాత్మ్యం (నారదుడితోపాటు) విన్న మహర్షులు అందరూ కూడ పరమాత్ము డయిన సూర్యుడిని పూజిస్తున్నారు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మదేవుడు మహర్షులతో ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవ మేతత్ పురాఽఽఖ్యాతం నారదాయ తు భానునా ।
మయాఽపి వ స్సమాఖ్యాతా కథా భానో ర్ద్విజోత్తమాః ॥ 87 ॥

విప్రవరేణ్యులారా! పూర్వం (మిత్రుడు అనే)సూర్యుడు ఈవిధంగా (సూర్యమాహాత్మ్యాన్ని) నారదమహర్షికి చెప్పాడు. ఇపుడు నేను కూడ (అదే ప్రకారంగా) సూర్యుడికథను మీకు చెప్పాను.

ఇదమాఖ్యానమాఖ్యేయం మయా ఽఽఖ్యాతం ద్విజోత్తమాః ।
న హ్యనాదిత్యభక్తాయ ఇదం దేయం కదాచన ॥ 88 ॥

బ్రాహ్మణోత్తములారా! నేను మీకు చెప్పిన ఈసూర్యకథను సూర్యభక్తుడు కానివాడికి ఎట్టిపరిస్థితులలోనూ చెప్పకూడదు. తెలియనీయగూడదు.

యశ్చైతచ్ఛ్రావయే న్నిత్యం యశ్చైవ శృణుయా న్నరః ।
స సహస్రార్చిషం దేవం ప్రవిశేన్నాత్ర సంశయః ॥ 89 ॥

ఈసూర్యకథను (సూర్యభక్తులకు) వినిపించినవాడూ, విన్నవాడూ, సూర్యదేవుడిలో ప్రవేశిస్తారు. ఇందులో సందేహం లేదు.

ముచ్యేతార్త స్తథా రోగా చ్ఛ్రుత్వేమా మాదితః కథామ్ ॥
జిజ్ఞాసు ర్లభతే జ్ఞానం గతిమిష్టాం తథైవ చ ॥ 90 ॥

ఈ సూర్యకథను మొదటినుండి శ్రద్ధగా వింటే, రోగంతో బాధపడేవాడికి రోగాలనుండి విముక్తి కలుగుతుంది. జ్ఞానాన్ని కోరుకుంటే జ్ఞానాన్ని పొందుతాడు. తరువాత ఉత్తమగతినీ పొందుతాడు.

క్షణేన లభతేఽధ్వాన మిదం యః పఠతే మునే ।
యో యం కామయతే కామం స తం ప్రాప్నో త్యసంశయమ్ ॥ 91 ॥

మునులారా! ఈసూర్యకథను చదివినవాడు వెంటనే మోక్షమార్గం గ్రహిస్తాడు. కోరుకున్నదానిని పొందుతాడు. సందేహం లేదు.

తస్మాద్ భవద్భి స్సతత మభ్యర్చ్యో భగవాన్ రవిః ।
స చ ధాతా విధాతా చ సర్వస్య జగతో గురుః ॥ 92 ॥

అందుచేత మీరు అందరూ నిత్యమూ సూర్యభగవానుడిని పూజించండి. ఆసూర్యుడే ఈలోక మంతటినీ సృష్టించినవాడు. పెంచినవాడు. అందరికీ గురువు (తరించేమార్గాన్ని ఉపదేశించినవాడు).

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భృషిసంవాదే ఆదిత్యమాహాత్మ్యవర్ణనం నామాష్టావింశోఽధ్యాయః ॥28 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషి సంవాదంలో ఆదిత్యమాహాత్మ్యవర్ణనం అనే ఇరవైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

ఏకోనత్రింశోఽ ధ్యాయః - ఇరవైతొమ్మిదవ అధ్యాయం

మార్తండఏకవింశతినామానుకీర్తనమ్ - మార్తండఏకవింశతినామానుకీర్తనం

బ్రహ్మోవాచ:- బ్రహ్మదేవుడు మహర్షులతో ఈవిధంగా చెప్తున్నాడు.

ఆదిత్యమూల మఖిలం త్రైలోక్యం మునిసత్తమాః ।
భవత్యస్మా జ్జగత్ సర్వం స దేవాసురమానుషమ్ ॥ 1 ॥

మునివరేణ్యులారా! ఈమూడులోకాలు అన్నిటికీ మూలం సూర్యుడే. సూర్యుడివల్లనే దేవతలూ, మానవులూ, రాక్షసులతో కూడిన ఈజగత్తు మొత్తం ఏర్పడింది.

రుద్రోపేన్ద్రమహేన్ద్రాణాం విప్రేన్ద్ర త్రిదివౌకసామ్ ।
మహాద్యుతిమతాం చైవ తేజో వై సార్వలౌకికమ్ ॥ 2 ॥

బ్రాహ్మణోత్తములారా! రుద్రుడు, విష్ణువు, మహేంద్రుడు, భూసురోత్తములు, దేవతలు, మిక్కిలి కాంతి మంతులు, ఇంక సమస్త మయిన లోకాలకు సంబంధించిన తేజస్సు కూడ ఈసూర్యభగవానుడినుండి కలిగినదే.

సర్వాత్మా సర్వలోకేశో దేవదేవః ప్రజాపతిః ।
సూర్య ఏవ త్రిలోకస్య మూలం పరమదైవతమ్ ॥ 3 ॥

సూర్యుడు సమస్తమూ తానే అయినవాడు, సమస్తలోకాలకూ ప్రభువూ, దేవతలకు కూడ దేవుడు. ముల్లోకాలకూ ఆధారమయిన సర్వోత్కృష్టుడయిన దైవం.

అగ్నౌ ప్రాస్తాహుతి స్సమ్య గాదిత్య ముపతిష్ఠతే ।
ఆదిత్యా జ్జాయతే వృష్టి ర్వృష్టే రన్నం తతః ప్రజాః ॥ 4 ॥

అగ్నిలో వేల్చబడిన హోమద్రవ్యం చక్కగా సూర్యుడిని చేరుకుంటుంది.(దానివలన) సూర్యుడినుండి వర్షం కురుస్తుంది. వర్షంవలన అన్నం ఏర్పడుతుంది. అన్నం నుండి ప్రజలు ఉద్భవిస్తారు.

సూర్యాత్ ప్రసూయతే సర్వం తత్ర చైవ ప్రలీయతే ।
భావాభావౌ హి లోకానా మాదిత్యా న్నిస్సృతౌ పురా ॥ 5 ॥

సూర్యుడినుండే సమస్తమయిన భూతకోటి పుట్టుంది. తిరిగి సూర్యుడిలోనే లీనమవుతుంది. లోకాలు ఉండటం (ఉనికి, పుట్టి పెరగడం మొ.), లేకపోవడం (లయం కావడం), సూర్యుడివలననే ఏర్పడుతున్నాయి.

ఏతత్తు ధ్యానినాం ధ్యానం మోక్షశ్చాప్యేష మోక్షిణామ్ ।
తత్ర గచ్ఛన్తి నిర్వాణం జాయన్తేఽ స్మాత్ పునః పునః ॥ 6 ॥

ధ్యానం చేసేవారికి ధ్యానింపదగినవాడు సూర్యుడే. మోక్షం కోరుకునేవారు పొందే మోక్షం కూడ సూర్యుడే. ఆసూర్యుడిలోనే కలిసిపోతారు. మళ్లీ ఆసూర్యుడినుండే జన్మిస్తారు. మళ్లీ మళ్లీ ఇలాగే మరణించడం, పుట్టడం జరుగుతుంది.

క్షణా ముహూర్తా దివసా నిశా పక్షాశ్చ నిత్యశః ।
మాసా స్సంవత్సరా శ్చైవ ఋతవశ్చ యుగాని చ ॥ 7 ॥

నిత్యమూ క్షణాలు (కనురెప్పపాటుసమయం), ముహూర్తాలు (48 నిమిషాలసమయం), పగళ్లు, రాత్రులు, (శుక్ల,కృష్ణ) పక్షాలు, నెలలు, సంవత్సరాలు, ఋతువులు,యుగాలు, అనే కాలవిభాగం సూర్యుడివలననే సంభవిస్తుంది.

అథాదిత్యా దృతే హ్యేషాం కాలసంఖ్యా న విద్యతే ।
కాలా దృతే న నియమో నాగ్నె విహరణక్రియా ॥ 8 ॥

సూర్యుడు లేకుండా ఏవిధమైన కాలవిభాగం లేదు. కాలగణనం లేకుండా (వ్రతాది) నియమాలు లేవు. అగ్నికార్యాలు లేవు.

ఋతూనాం ప్రవిభాగశ్చ కుతః పుష్పఫలం కుతః ।
కుతో వై సస్యనిష్పత్తి స్తృణౌషధిగణః కుతః ॥ 9 ॥

సూర్యుడు లేకుండా ఋతువుల విభాగం లేదు. పూలు, పండ్లు ఉండవు. పంటలు పండవు. గడ్డి, ఓషధులు మొదలయినవి ఉండవు.

అభావో వ్యవహారాణాం జన్తూనాం దివి చేహ చ ।
జగత్ ప్రభావాద్ విశతే భాస్కరాత్ వారితస్కరాత్ ॥ 10 ॥

భూలోకంలోనూ, స్వర్గలోకంలోనూ, ప్రాణులనడవడి సాగదు. నీటిని సంగ్రహించే ఆదిత్యుడి ప్రభావంచేతనే ఈలోకాలు చక్కగా నడుస్తున్నాయి.

నావృష్ట్యా తపతే సూర్యో నావృష్ట్యా పరిశుష్యతి ।
నావృష్ట్యా పరిధిం ధత్తే వారిణా దీప్యతే రవిః ॥ 11 ॥

వర్షం లేకుండా సూర్యుడు తపించదు. (వర్షం ఇవ్వవలసినఅవసరం లేకుంటే సూర్యుడు వేడిగా ఉండడు) వర్షం లేకుండా నీటిని ఎండింపడు (వర్షం కురువకపోతే నీటిని స్వీకరింపడు). వర్షం లేకుండా (చుట్టూ) గూడు కట్టడు.(సూర్యుడిచుట్టూ వలయాకారంలో ఆవరణం ఏర్పడితే వర్షం కురవబోతుందని సూచన. తరువాత వర్షం కురుస్తుంది.) వర్షం లేకుండా సూర్యుడు నీటితో ప్రకాశించడు. (సూర్యుడు నీటిని వర్షించేవాడు కాబట్టి వర్షం కురవకపోతే నీటితో సూర్యుడికి పని ఉండదు.)

వసన్తే కపిల స్సూర్యో గ్రీష్మే కాఞ్చనసన్నిభః ।
శ్వేతో వర్షాసు వర్ణేన పాణ్డు శ్శరది భాస్కరః ।
హేమన్తే తామ్రవర్ణాభ శ్శిశిరే లోహితో రవిః ॥ 12 ॥

సూర్యుడు వసంతఋతువులో కపిలవర్ణం(నలుపు, పసుపు కలిసినరంగు)లో ఉంటాడు. గ్రీష్మఋతువులో బంగారురంగులో, వర్షఋతువులో తెల్లరంగులోనూ, శరదృతువులో పాండువర్ణం (తెలుపు అధికంగానూ, కొంచెం పచ్చదనమూ కలిసినరంగు)లోనూ ఉంటాడు. హేమంత ఋతువులో రాగిరంగులోనూ, శిశిరఋతువులో ఎఱుపు రంగులోనూ, ఉంటాడు.

ఇత్థం వర్ణా స్సమాఖ్యాతా స్సూర్యస్య ఋతుసమ్భవాః ।
ఋతుస్వభావవర్ణై శ్చ సూర్యః క్షేమసుభిక్షకృత్ ॥ 13 ॥

ఈవిధంగా ఆ యా ఋతువులలో సూర్యుడికి కలిగేరంగులను గురించి చెప్పడం జరిగింది. ఆ యా ఋతువులస్వభావానికి అనుగుణమయిన రంగులతో ఉన్నసూర్యుడు లోకాలకు క్షేమాన్ని, సమృద్ధమయిన పాడిపంటలను ఇస్తాడు.

తథాఽ ఽ దిత్యస్య నామాని సామాన్యా నీహ ద్వాదశ ।
ద్వాద శైవ పృథక్త్వేన తాని వక్ష్యా మ్యశేషతః ॥ 14 ॥

సూర్యుడికి సంబంధించిన సాధారణమయిన నామాలు పన్నెండు ఉన్నాయి. ఆపన్నెండింటిని ప్రత్యేకంగా సమగ్రంగా చెప్తాను. (అన్నాడు లోమహర్షణుడు)

ఆదిత్య స్సవితా సూర్యో మిహిరోఽ ర్కః ప్రభాకరః ।
మార్తణ్డో భాస్కరో భాను శ్చిత్రభాను ర్దివాకరః ।
రవి ర్ద్వాదశభి స్తేషాం జ్ఞేయ స్సామాన్యనామభిః ॥ 15 ॥

1.ఆదిత్యుడు, 2.సవిత, 3.సూర్యుడు, 4.మిహిరుడు, 5.అర్కుడు, 6.ప్రభాకరుడు, 7.మార్తండుడు, 8.భాస్కరుడు, 9.భానుడు, 10.చిత్రభానుడు, 11.దివాకరుడు, 12.రవి. ఇవి సూర్యుడి సామాన్యమయిన ద్వాదశనామాలు.

విష్ణు ర్ధాతా భగః పూషా మిత్రేన్ద్రో వరుణోఽ ర్యమా ।
వివస్వా నంశుమాం స్త్వష్టా పర్జన్యో ద్వాదశ స్స్మృతః ॥ 16 ॥

1.విష్ణువు, 2.ధాత, 3.భగుడు, 4.పూషుడు, 5.మిత్రుడు, 6.ఇంద్రుడు, 7.వరుణుడు, 8.అర్యముడు, 9.వివస్వంతుడు, 10.అంశుమంతుడు, 11.త్వష్ట, 12.పర్జన్యుడు.

ఇత్యేతే ద్వాదశాదిత్యాః పృథక్త్వేన వ్యవస్థితాః ।
ఉత్తిష్ఠన్తి సదా హ్యేతే మాసై ర్ద్వాదశభిః క్రమాత్ ॥ 17 ॥

అనే(విశేష)నామాలతో ద్వాదశాదిత్యులు ప్రత్యేకంగా ఉన్నారు. ఈ పన్నెండుమంది పన్నెండు నెలలలోనూ ఈ వరుసలో ప్రకాశిస్తారు.

విష్ణు స్తపతి చైత్రే వైశాఖే చార్యమా తథా ।
వివస్వాన్ జ్యేష్ఠమాసే తు ఆషాఢే చాంశుమాన్ స్మృతః ॥ 18 ॥

చైత్రమాసంలో విష్ణువు, వైశాఖమాసంలో అర్యముడు, జ్యేష్ఠమాసంలో వివస్వంతుడు, ఆషాఢమాసంలో అంశుమంతుడు,

పర్జన్య శ్శ్రావణే మాసి వరుణః ప్రౌష్ఠసంజ్ఞకే ।
ఇన్ద్ర ఆశ్వయుజే మాసి ధాతా తపతి కార్తికే ॥ 19 ॥

శ్రావణమాసంలో పర్జన్యుడు, భాద్రపదమాసంలో వరుణుడు, ఆశ్వయుజమాసంలో ఇంద్రుడు, కార్తిక మాసంలో ధాత,

మార్గశీర్షే తథా మిత్రః పౌషే పూషా దివాకరః ।
మాఘే భగ స్తు విజ్ఞేయ స్త్వష్టా తపతి ఫాల్గునే ॥ 20 ॥

మార్గశీర్షమాసంలో మిత్రుడు, పౌష(పుష్య)మాసంలో పూషుడు, మాఘమాసంలో భగుడు, ఫాల్గునమాసంలో త్వష్ట ప్రకాశిస్తారు.

శతై ర్ద్వాదశభి ర్విష్ణు రంశుభి ర్దీప్యతే సదా ।
దీప్యతే గోసహస్రేణ శతై శ్చ త్రిభి రర్యమా ॥ 21 ॥

విష్ణువు (చైత్రమాసంలోనిసూర్యుడు) పన్నెండువందలకిరణాలతో వెలుగుతాడు. అర్యముడు (వైశాఖమాస సూర్యుడు) పదమూడువందలకిరణాలతో ప్రకాశిస్తాడు.

ద్విస్సప్తకై ర్వివస్వాం స్తు అంశుమాన్ పఞ్చభి స్త్రిభిః ।
వివస్వానివ పర్జన్యో వరుణ శ్చార్యమా తథా ॥ 22 ॥

వివస్వంతుడు (జ్యేష్ఠసూర్యుడు) పద్నాలుగు వందలకిరణాలతోనూ, అంశుమంతుడు (ఆషాఢసూర్యుడు) పదిహేనువందల కిరణాలతోనూ, పర్జన్యుడు (శ్రావణసూర్యుడు) వివస్వంతుడికివలె పద్నాలుగువందలకిరణాలతోనూ, వరుణుడు (భాద్రపదసూర్యుడు) అర్యముడికివలె పదమూడువందలకిరణాలతోనూ ప్రకాశిస్తారు.

మిత్రవద్ భగవాం స్త్వష్టా సహస్రేణ శతేన చ ।
ఇన్ద్రస్తు ద్విగుణైః షడ్భి ర్ధాతైకాదశభి స్స్మృతః ॥ 23 ॥

భగుడు (మాఘసూర్యుడు), మిత్రుడు(మార్గశీర్షసూర్యుడు)లాగా వెయ్యికిరణాలతో ప్రకాశిస్తాడు. త్వష్ట పదకొండు వందలకిరణాలతో ప్రకాశిస్తాడు. ఇంద్రుడు (ఆశ్వయుజసూర్యుడు) పన్నెండువందలకిరణాలతోనూ, ధాత (కార్తికసూర్యుడు) పదకొండువందల కిరణాలతోనూ ప్రకాశిస్తారు.

సహస్రేణ తు మిత్రో వై పూషా తు నవభి శ్శతైః ॥ 24 ॥

మిత్రుడు (మార్గశీర్షసూర్యుడు) వేయికిరణాలతోనూ, పూష (పౌషమాససూర్యుడు) తొమ్మిదివందల కిరణాలతోనూ ప్రకాశిస్తారు.

ఉత్తరోపక్రమేఽ ర్కస్య వర్ధన్తే రశ్మయ స్తథా ।
దక్షిణోపక్రమే భూయో హ్రసన్తే సూర్యరశ్మయః ॥ 25 ॥

ఉత్తరాయణం ప్రారంభం కాగానే సూర్యుడికిరణాలు క్రమంగా వృద్ధి చెందుతాయి. దక్షిణాయనంనుండి సూర్యకిరణాలు తిరిగి క్రమంగా తగ్గుతాయి.

ఏవం రశ్మి సహస్రేణ సూర్యలోకస్య సఙ్గ్రహః ।
విద్యతే ఋతు మాసాద్య సఙ్గ్రహో బహుధా పునః ॥ 26 ॥

ఈవిధంగా వేయి(అనంత మయిన)కిరణాలతో సూర్యమండలం ప్రకాశిస్తుంది. ఋతుధర్మాలను పొంది సూర్యుడు లోకాలను అనేకవిధాలుగా పోషిస్తున్నాడు.

ఏవం నామ్నాం చతుర్వింశ దేక ఏషాం ప్రకీర్తితః ।
విస్తరేణ సహస్రం తు పునరన్యత్ ప్రకీర్తితమ్ ॥ 27 ॥

ఈవిధంగా సూర్యనామాలు (సామాన్యనామాలు–12, విశేషనామాలు–12) ఇరవై నాలుగింటిని ఒకరీతిగా వివరించడం జరిగింది. మరొకతీరుగా సూర్యుడికి వేయినామాలు కూడ ప్రసిద్ధంగా ఉన్నాయి.

మునయ ఊచుః :–బ్రహ్మదేవుడితో మహర్షులు ఈవిధంగా అంటున్నారు.

యేతన్నామసహస్రేణ స్తువ న్త్యర్కం ప్రజాపతే ।
తేషాం భవతి కిం పుణ్యం గతిశ్చ పరమేశ్వర ॥ 28 ॥

బ్రహ్మదేవా! ప్రజాపతీ! ఈ సహస్రనామాలతో సూర్యదేవుడిని స్తుతించినవారికి ఏవిధమయిన పుణ్యం గలుగుతుంది? పరమాత్మా! ఎటువంటి ఉత్తమగతి గలుగుతుంది?

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

శృణుధ్వం మునిశార్దూలాస్సారభూతం సనాతనమ్ ।
అలం నామసహస్రేణ పఠ న్నేవం స్తవం శుభమ్ ॥ 29 ॥

మునిశ్రేష్ఠులారా! పురాతనమూ,శుభప్రదమూ, సూర్యస్తోత్రా లన్నిటిలోనూ సారమూ అయిన వేయినామాలతో స్తుతించవలసిన పని లేదు. ఆనామాలకు అన్నింటికీ సారం (సహస్రనామస్తోత్రంతో సమానమయినపుణ్యఫలాన్ని ఇచ్చేది) అయిన స్తోత్రం మరొకటి ఉన్నది. అది, పురాతనం, శుభప్రదం అది వినండి.

యాని నామాని గుహ్యాని పవిత్రాణి శుభాని చ ।
తాని వః కీర్తయిష్యామి శృణుధ్వం భాస్కరస్య వై ॥ 30 ॥

సూర్యుడి ఈ నామాలు రహస్యమయినవి. పావనమయినవి. మేలు గలిగిస్తాయి. అటువంటి సూర్యసహస్ర నామసారమయిన నామాలను మీకు వివరిస్తాను, వినండి.

వికర్తనో వివస్వాం శ్చ మార్తణ్డో భాస్కరో రవిః ।
లోకప్రకాశక శ్శ్రీమాన్ లోకచక్షు ర్మహేశ్వరః ॥ 31 ॥

1. వికర్తనుడు, 2. వివస్వంతుడు, 3. మార్తండుడు, 4. భాస్కరుడు, 5. రవి, 6. లోకప్రకాశకుడు, 7. శ్రీమంతుడు, 8. లోకచక్షువు. 9. మహేశ్వరుడు,

లోకసాక్షీ త్రిలోకేశః కర్తా హర్తా తమిస్రహా ।
తపన స్తాపన శ్చైవ శుచి స్సప్తాశ్వవాహనః ॥ 32 ॥

10. లోకసాక్షి, 11. త్రిలోకేశుడు, 12. కర్త, 13. హర్త, 14. తమిస్రఘ్నుడు, 15. తపనుడు, 16.తాపనుడు, 17.శుచి, 18.సప్తాశ్వవాహనుడు,

గభస్తిహస్తో బ్రహ్మణ్య స్సర్వదేవనమస్కృతః ।
ఏకవింశతి రి త్యేష స్తవ ఇష్ట స్సదా రవేః ॥ 33 ॥

19. గభస్తిహస్తుడు, 20. బ్రహ్మణ్యుడు, 21. సర్వదేవనమస్కృతుడు అనే ఇరవైఒక్క(సూర్య)నామాలు ఉన్న ఈస్తోత్రం సూర్యుడికి చాల ప్రియ మయినది.

శరీరారోగ్యదశ్చైవ ధనవృద్ధియశస్కరః ।
స్తవరాజ ఇతి ఖ్యాత స్త్రిషు లోకేషు విశ్రుతః ॥ 34 ॥

ఈస్తోత్రం శరీరంలో ఆరోగ్యాన్ని ఇస్తుంది (రోగాలు పోగొట్టుంది). సంపదలనూ, మంచికీర్తినీ సమృద్ధిగా ఇస్తుంది అని మూడులోకాలలోనూ బాగా ప్రసిద్ధమయింది.

య ఏతేన ద్విజశ్రేష్ఠాః ద్విసన్ధ్యేఽస్తమనోదయే ।
స్తౌతి సూర్యం శుచి ర్భూత్వా సర్వపాపైః ప్రముచ్యతే ॥ 35 ॥

విప్రవరేణ్యులారా! రోజూ రెండు సంధ్యాసమయాలలో సూర్యుడు ఉదయిస్తున్నపుడు, అస్తమిస్తున్నపుడు, శుచి అయి, సూర్యుడిని ఈస్తోత్రంతో స్తుతించినవాడి పాపాలు సమస్తమూ నశించిపోతాయి.

మానసం వాచికం వాపి దేహజం కర్మజం తథా ।
ఏకజప్యేన తత్సర్వం నశ్య త్యర్కస్య సన్నిధౌ ॥ 36 ॥

సూర్యుడిసన్నిధానంలో ఈస్తోత్రాన్ని ఒకసారి పఠిస్తే, మనసుచేత గాని, మాటచేత గాని, కర్మ(శరీరం)చేత కాని, (మనోవాక్కాయాలు అనే త్రికరణాలతో) చేసిన పాపం సమస్తం నశిస్తుంది.

ఏకజప్యశ్చ హోమశ్చ సన్ధ్యోపాసనమేవ చ ।
ధూపమన్త్రోఽర్ఘ్యమన్త్రశ్చ బలిమన్త్ర స్తథైవ చ ॥ 37 ॥

ఒక్కసారి ఆ నామాలను జపించాలి. ఆ నామాలతో హోమం చేయాలి. సంధ్యాసమయాలలో వీటిని ఉపాసించాలి. ధూపం, అర్ఘ్యం, బలి ఇచ్చేసమయాలలో ఈ నామాలను మంత్రంగా పఠించాలి.

అన్నప్రదానే దానే చ ప్రణిపాతే ప్రదక్షిణే ।
పూజితోఽయం మహామన్త్ర స్సర్వపాపహర శ్శుభః ॥ 38 ॥

అన్నం లేదా మరే దైనా దానం చేసేసమయంలోనూ, సాష్టాంగనమస్కారం చేసేసమయంలోనూ, ప్రదక్షిణం చేసేటపుడు ఈనామాలను మంత్రంగా ప్రయోగిస్తే పాపాలు సమస్తం నశించి, అన్నిరకాలయిన శుభాలుకలుగుతాయి.

తస్మాద్ యూయం ప్రయత్నేన స్తవేనానేన వై ద్విజాః ।
స్తువీధ్వం వరదం దేవం సర్వకామఫలప్రదమ్ ॥ 39 ॥

విప్రులారా! అందుచేత మీరు అన్నికోరికలను తీర్చేవాడూ, వరాలు ఇచ్చేవాడు, దేవుడూ అయిన సూర్యుడిని శ్రమపడి అయినా, ఈఇరవైఒక్కనామాల స్తోత్రంతో స్తుతించండి.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదేమార్తణ్డ స్యైకవింశతినామానుకీర్తనం నామైకోనత్రింశోఽధ్యాయః ॥29॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో మార్తండుని ఇరవైఒక్కనామాలకీర్తనం అనే ఇరవై తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

త్రింశోఽధ్యాయః - ముప్పైయవ అధ్యాయం

జన్మశరీరలిఖనమ్ - జన్మశరీరలిఖనం

మునయ ఊచుః :-మహర్షులు బ్రహ్మదేవుడితో ఈవిధంగా అంటున్నారు.

నిర్గుణ శ్శాశ్వతో దేవ స్త్వయా ప్రోక్తో దివాకరః ।
పున ర్ద్వాదశధా జాత శ్ర్శుతోఽస్మాభిస్త్వయోదితః ॥ 1 ॥

బ్రహ్మదేవా! సూర్యభగవానుడు గుణరహితుడూ, నిత్యుడూ, దీప్తిమంతుడూ అని చెప్పావు. మళ్లీ సూర్యుడు పన్నెండు రూపాలతో పుట్టినట్లు చెప్పావు. మేమూ విన్నాం.

స కథం తేజసో రాశిః స్త్రియా గర్భే మహాద్యుతిః ।
సమ్భూతో భాస్కరో దేవ స్తత్ర న స్సంశయో మహాన్ ॥ 2 ॥

రాశిగా కూడినతేజస్సూ, గొప్పకాంతిమంతుడూ అయిన సూర్యుడు ఒకానొక ఆడుదాని కడుపులోనుండి ఎలా పుట్టాడు? ఆవిషయంలో మాకు పెద్ద సందేహం కలుగుతున్నది.

బ్రహ్మోవాచ :-బ్రహ్మదేవుడు మహర్షులతో ఈవిధంగా చెప్తున్నాడు.

షష్టి ర్దక్షస్య దుహితా బభూవు శ్శ్రేష్ఠశోభనాః ।
అదితి ర్దితిర్దనుశ్చైవ వినతాద్యా స్తథైవ చ ॥ 3 ॥

దక్షప్రజాపతికి ఉత్తమమయిన శుభం కలిగించేకూతుళ్లు అరవై మంది పుట్టారు. వారు అదితి, దితి, దనువు, వినత మొదలయినవారు.

దక్ష స్తాః ప్రదదౌ కన్యాః కశ్యపాయ త్రయోదశ ।
అదితి ర్జనయామాస దేవాం స్త్రిభువనేశ్వరాన్ ॥ 4 ॥

దక్షుడు వారిలో పదముగ్గురు కూతుళ్ళను కశ్యపమహర్షికి భార్యలుగా ఇచ్చాడు. వారిలో అదితి మూడులోకాలకూ అధిపతులయిన దేవతలను కన్నది.

దైత్యాన్ దితి ర్దను శ్చోగ్రాన్ దానవాన్ బలదర్పితాన్ ।
వినతాద్యా స్తథా చాన్యా స్సుషువుః స్థాణుజఙ్గమాన్ ॥ 5 ॥

దితి అనే ఆమె దైత్యులు అనే సుతులను కన్నది. దనువు అనేకూతురు దానవులు అనేసంతానాన్ని ప్రసవించింది. దానవులు బలంతో గర్వించిఉన్నారు. ఇంక వినత మొదలయిన మిగిలినకూతుళ్లు చరాచరాలు అయిన రకరకాలసంతానాన్ని కన్నారు.

ఆసాఞ్చ పుత్రదౌహిత్రైః పౌత్రదౌహిత్రకాదిభిః ।
వ్యాప్త మేత జ్జగ త్సర్వం తేషాం తాసాం చ వై మునే ॥ 6 ॥

వారికొడుకుల కొడుకులు, కూతుళ్ల కొడుకులతో, వారికి పుట్టిన ఆడ, మగ సంతానంతో (కొడుకుల మనమళ్లు, కూతుళ్లమనుమళ్లు మొ.) ఈలోకం అంతా నిండిపోయింది.

తేషాం కశ్యపపుత్రాణాం ప్రధానా దేవతాగణాః ।
సాత్త్వికా రాజసా శ్చాన్యే తామసాశ్చ గణా స్స్మృతాః ॥ 7 ॥

ఆ కశ్యపమహర్షి కొడుకులలో దేవతలగణాలు ముఖ్య మైనవి. ఆ దేవతల గణాలు సత్త్వగుణం గలిగినవారు, రజోగుణవంతులు, తమోగుణం గలిగినవారు.

దేవాన్ యజ్ఞభుజ శ్చక్రే తథా త్రిభువనేశ్వరాన్ ।
స్రష్టా బ్రహ్మవిదాం శ్రేష్ఠః పరమేష్ఠీ ప్రజాపతిః ।
తానబాధన్త సహితా స్సాపత్న్యా దైత్యదానవాః ॥ 8 ॥

సృష్టికర్త, బ్రహ్మజ్ఞానులలో శ్రేష్ఠుడూ, పరమేష్ఠి, ప్రజాపతి అయినబ్రహ్మదేవుడు మూడులోకాలకూ అధిపతులయిన దేవతలను యజ్ఞభోక్తలను చేశాడు. సవతులయిన దితి(దైత్యులు), దనువుల కుమారులు(దానవులు) అదితికొడుకులను (దేవతలను) బాధించేవారు.

(రాక్షసాశ్చ తతో యుద్ధం తేషా మాసీత్ సుదారుణమ్ ।
దివ్యం వర్షసహస్రన్తు తత్రాతప్యన్త దేవతాః ।
బలిన శ్చాభవన్ యుద్ధే జయినో దైత్యదానవాః ॥

తరువాత రాక్షసులకు దేవతలకు గొప్పయుద్ధం జరిగింది. దేవతలు వేయి దివ్యసంవత్సరాలు ఘోరంగా తపస్సు చేశారు. అయినా బలవంతులయిన దైత్యులు, దానవులూ యుద్ధంలో దేవతలను జయించారు.)

తతో నిరాకృతాన్ పుత్రాన్ దైతేయై ర్దానవై స్తథా ।
హతం త్రిభువనం దృష్ట్వా అదితి ర్మునిసత్తమాః! ॥ 9 ॥

ఆచ్ఛిన దృజ్ఞభాగాంశ్చ క్షుధాసమ్పీడితాన్ భృశమ్ ।
ఆరాధనాయ సవితుః పరం యత్నం ప్రచక్రమే ॥ 10 ॥

మునివరులారా! దైత్యులూ, దానవులూ, అదితికుమారులను జయించారు. మూడులోకాలనూ బాధించారు. దేవతలయజ్ఞభాగాలను అపహరించారు. (యజ్ఞభాగాలు కోల్పోయిన) తనకుమారులు ఆకలితో అలమటించటం చూచి, అదితి (ఆకష్టాలనుండి బయడపడడానికి) సూర్యదేవుడిని ఆరాధించడానికి పూనుకుంది.

ఏకాగ్రా నియతాహారా పరం నియమమాశ్రితా ।
తుష్టావ తేజసాం రాశిం గగనస్థం దివాకరమ్ ॥ 11 ॥

నిశ్చలమయినబుద్ధితో, ఆహారనియమాలు పాటిస్తూ, ఉత్తమమయిన(అర్చనా)నియమాలు అనుసరిస్తూ, ఆకాశంలో కాంతిపుంజంగా ఉన్న సూర్యుడిని స్తుతించింది.

అదితి రువాచ :–సూర్యభగవానుడిని అదితి ఈవిధంగా స్తుతించింది.

నమస్తుభ్యం పరం సూక్ష్మం ప్రణమ్యం బిభ్రతేఽ తులమ్ ।
ధామ ధామవతా మీశం ధామాధారం చ శాశ్వతమ్ ॥ 12 ॥

సూర్యదేవా! నీతేజస్సు మిక్కిలి ఉత్తమమైనది. అత్యంతం నిశితమైనది. సాటిలేనిది, నమస్కరింపదగినది. అటువంటి తేజస్సును ధరించిన నీకు నమస్కారం. నీవు కాంతిమంతులకు స్థానం. (కాంతిమంతులయినవారందరూ నీనుండే ఆతేజస్సును పొందారు). (జగత్తులకు) నీవే ప్రభువువి. కాంతులన్నింటికీ నీవే మూలం. నీవు గతంలోనూ, వర్తమానంలోనూ, భవిష్యత్తులోనూ అన్నికాలాల్లో ఉంటావు.

జగతా ముపకారాయ తథాహం నౌమి గోపతే ।
ఆదదానస్య యద్రూపం తీవ్రం తస్మై నమామ్యహమ్ ॥ 13 ॥

కిరణాలకు అధిపతీ! నీకు నమస్కారం. లోకాలకు మేలు చేయడంకోసం తీక్షణమయిన రూపాన్ని ధరించిన నీకు నమస్కరిస్తున్నాను.

గ్రహీతుమష్టమాసేషు కాలేనామ్బుమయం రసమ్ ।
బిభ్రత స్తవ యద్రూప మతితీవ్రం నతాస్మి తత్ ॥ 14 ॥

ఎనిమిదినెలలసమయంలో నీటిలోని సారాన్ని గ్రహించడానికి నీవు ధరించిన మిక్కిలి తీక్షణమయిన రూపానికి నమస్కరిస్తున్నాను.

సంధ్యయో రుభయో ర్యత్తద్ రజసా సంయుతం స మే ।
మనోరథం చ యో దద్యా న్నమ స్తస్మై గుణాత్మనే ॥ 15 ॥

ప్రాతస్సంధ్య, సాయంసంధ్యలు రెండింటిలోనూ రజోగుణంతో కూడినదీ, మూడుగుణాలు కలిగినదీ, నాకు వర మిచ్చేదీ అయిన నీరూపానికి నమస్కారం.

యద్రూప మృగ్యజుస్సామ్నా మైక్యేన తపతే తవ ।
విశ్వ మేతత్ త్రయీసంజ్ఞం నమ స్తస్మై ప్రభావతే ॥ 16 ॥

నీరూపం ఋక్కు, యజుస్సు, సామం అనేమూడువేదాలు కలిసిఉన్నది. ఆరూపానికి త్రయి అని పేరు. ఆరూపంతో నీవు ఈ ప్రపంచాన్ని తపింపజేస్తున్నావు. ఆరూపం మిక్కిలి కాంతిమంత మయినది. దానికి నమస్కారం.

యత్తు తస్మాత్పరం రూపమోమిత్యుక్త్వాఽ భిసంహితమ్ ।
అస్థూలం స్థూల మమలం నమ స్తస్మై సనాతన ॥ 17 ॥

పరమాత్మా! ఆ త్రయీరూపంకంటే ఉత్తమమయిన నీరూపం ఓం అనే ప్రణవాక్షరంచేత తెలియబడుతుంది. స్థూలమూ (ప్రత్యక్షమూ), సూక్ష్మమూ (పరోక్షమూ), పవిత్రమూ అయిన ఆ నీరూపానికి నమస్కారం.

బ్రహ్మోవాచ :- బ్రహ్మదేవుడు ఆమునులతో ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవం సా నియతా దేవీ చక్రే స్తోత్రమహర్నిశమ్ ।
నిరాహారా వివస్వన్త మారిరాధయిషు ర్ద్విజాః ॥ 18 ॥

బ్రాహ్మణులారా! ఈవిధంగా అదితి ఆహారం తీసుకోకుండా, పగలూ, రాత్రీ నియమంగా, సూర్యుడిని ఆరాధిస్తూ ఆయనను స్తుతించింది.

తతః కాలేన మహతా భగవాం స్తపనో ద్విజాః ।
ప్రత్యక్షతా మగా త్తస్యా దాక్షాయణ్యా ద్విజోత్తమాః ॥ 19 ॥

విప్రులారా! ఇలా ఆరాధిస్తుండగా చాలాకాలానికి సూర్యభగవానుడు దక్షుడికూతు రయిన అదితికి ప్రత్యక్ష మయినాడు.

సా దదర్శ మహాకూటం తేజసోఽమ్బరసంవృతమ్ ।
భూమౌ చ సంస్థితం భానుం జ్వాలామాలాతిదుస్సహమ్ ॥ 20 ॥

ప్రత్యక్షమయిన ఆసూర్యుడు రాసిపోసినకాంతి లాగా ఉన్నాడు. ఆకాంతి ఆకాశం అంతటా నిండిఉంది. సూర్యుడు నేలమీది నిలిచిఉన్నాడు. అగ్నిజ్వాలలమాలికలతో (జీవులు) తట్టుకోలేనివిధంగా ఉన్నాడు.

తం దృష్ట్వా చ తతో దేవీ సాధ్వసం పరమం గతా ॥ 21 ॥

అటువంటి సూర్యభగవానుడిని చూచి అదితి మిక్కిలిగా భయపడింది.

అదితి రువాచ:- ప్రత్యక్షమయిన సూర్యుడితో అదితి ఇలా అంటున్నది.

జగదాద్య ప్రసీదేతి న త్వాం పశ్యామి గోపతే ।
ప్రసాదం కురు పశ్యేయం యద్రూపం తే దివాకర ।
భక్తానుకమ్పక విభో త్వద్భక్తాన్ పాహి మే సుతాన్ ॥ 22 ॥

సూర్యదేవా! నేను నిన్ను చూడలేకపోతున్నాను. కాపాడు. లోకాలకు అన్నింటికీ మొదటివాడా! నన్ను అనుగ్రహించు. దివాకరా! చూడడానికి సాధ్యమయిన రూపంతో కనిపించు. భక్తులను అనుగ్రహించేవాడా! నీభక్తులయిన నాకుమారులను రక్షించు.

తత స్స తేజస స్తస్మా దావిర్భూతో విభావసుః ।
అదృశ్యత తదాదిత్య స్తప్తతామ్రోపమః ప్రభుః ॥ 23 ॥

అప్పుడు ఆకాంతిసముదాయంలోనుండి సూర్యుడు ఆవిర్భవించి అదితికి కన్పించాడు. అప్పటి ఆదిత్యుడు వేడిచేసిన రాగివన్నెలో ప్రకాశిస్తున్నాడు.

తత్ర తాం ప్రణతాం దేవీం తస్యా స్సన్దర్శనే ద్విజాః ।
ప్రాహ భాస్వాన్ వృణు ష్వైకం వరం మత్తో యమిచ్ఛసి ॥ 24 ॥

విప్రవరులారా! ఆరూపం చూచి అపుడు అదితి సూర్యుడికి ప్రణమిల్లింది. అటువంటి అదితితో సూర్యుడు 'నీకు నావలన కావలసినవరం కోరుకో' అన్నాడు.

ప్రణతా శిరసా సా తు జానుపీడితమేదినీ ।
ప్రత్యువాచ వివస్వన్తం వరదం సముపస్థితమ్ ॥ 25 ॥

వరమివ్వడానికి వచ్చిన సూర్యుడికి అదితి శిరసు వంచి, మోకాళ్లను నేలకు ఆనించి, నమస్కరించింది. పిదప సూర్యభగవానుడితో ఇలా అన్నది.

అదితి రువాచ :– ప్రత్యక్షమయిన సూర్యుడితో అదితి ఈవిధంగా అంటున్నది.

దేవ ప్రసీద పుత్రాణాం హృతం త్రిభువనం మమ ।
యజ్ఞభాగాశ్చ దైతేయై ర్దానవైశ్చ బలాధికైః ॥ 26 ॥

దేవా! నన్ను అనుగ్రహించు. నాకుమారులకు చెందిన మూడులోకాల సామ్రాజ్యాన్నీ, యజ్ఞభాగాలనూ దైత్యులూ, దానవులూ, బలవంతంగా అపహరించారు.

తన్నిమిత్తం ప్రసాదం త్వం కురుష్వ మమ గోపతే ।
అంశేన తేషాం భ్రాతృత్వం గత్వా తాన్నాశయ ద్విషః ॥ 27 ॥

సూర్యదేవా! అందువలన నీవు నామీద దయ చూపించు. ఆదేవతల అంశతో వారికి సోదరుడుగా (నాకు) జన్మించి, శత్రువులయిన దైత్యదానవులను సంహరించు.

యథా మే తనయా భూయో యజ్ఞభాగభుజః ప్రభో ।
భవేయు రధిపా శ్చైవ త్రైలోక్యస్య దివాకర ॥ 28 ॥

తథాఽనుకమ్పాం పుత్రేషు సుప్రసన్నో రవే మమ ।
కురు ప్రపన్నార్తిహార కార్యకర్తా త్వమచ్యుత ॥ 29 ॥

దేవా! నాకుమారులు మళ్లీ యజ్ఞభాగాన్ని అనుభవించేవిధంగానూ, ముల్లోకాలకూ అధిపతులయ్యేవిధంగానూ వారిని అనుగ్రహించు. నా(మా)పై దయ చూపు. శరణు వేడినవారి బాధలు పోగొట్టేవాడా, ఈపని చేయగలిగినవాడివి నీవే అని ప్రసిద్ధిని పొందావు.

తతస్తామాహ భగవాన్ భాస్కరో వారితస్కరః ।
ప్రణతా మదితిం విప్రాః ప్రసాదసుముఖో విభుః ॥ 30 ॥

బ్రాహ్మణులారా! అప్పుడు నేలమీదినుంచి నీటిని స్వీకరించే సూర్యప్రభుడు అనుగ్రహింపదలచి, తనకు ప్రణమిల్లిన అదితితో ఇలా అన్నాడు.

సహస్రాంశేన తే గర్భ స్సమ్భూ యాహ మశేషతః ।
త్వత్పుత్రశత్రూన్ దక్షోఽహం నాశయామ్యాశు నిర్వృతః ॥ 31 ॥

అమ్మా! నేను నాతేజస్సులో వెయ్యోవంతు (మిక్కిలిస్వల్ప మయిన)శక్తితో నీగర్భంలో ప్రవేశించి, నీకు పుత్రుడుగా పుట్టాను. నీకుమారులకు శత్రువులయిన దైత్యులనూ, దానవులనూ అందరినీ సమర్థతతో వెంటనే సులువుగా సంహరిస్తాను.

ఇత్యుక్త్వా భగవాన్ భాస్వా నన్తర్ధానముపాగతః ।
నివృత్తా సాపి తపస స్సమ్ప్రాప్తాఖిలవాఞ్ఛితా ॥ 32 ॥

అదితితో ఇలా పలికి సూర్యభగవానుడు అంతర్ధానం చెందాడు. తపస్సుతో తనకోరికలు అన్నీ నేరవేరగా, అదితి కూడ తపస్సు మానుకున్నది.

తతో రశ్మిసహస్రా త్తు సుషుమ్నాఖ్యో రవేః కరః ।
తత స్సంవత్సరస్యాన్తే తత్కామపూరణాయ సః ।
నివాసం సవితా చక్రే దేవమాతు స్తదోదరే ॥ 33 ॥

అదితికోరిక నెరవేర్చడానికి సూర్యుడు తరువాత సంవత్సరం చివరలో తన వేయికిరణాలలోనూ సుషుమ్న అనేపేరు గలిగినకిరణం రూపంలో దేవతలతల్లి అయిన ఆఅదితిగర్భంలో ప్రవేశించి, అక్కడే నివసించసాగాడు.

కృచ్ఛ్రచాన్ద్రాయణాదీంశ్చ సా చక్రే సుసమాహితా ।
శుచినా ధారయా మ్యేతం దివ్యం గర్భమితి ద్విజాః ॥ 34 ॥

విప్రులా! సూర్యుడు తనగర్భంలో ఉండటంచేత 'దివ్యమయిన ఈగర్భాన్ని నేను శుచిగా ధరిస్తాను' అని నిశ్చయించుకుని అదితి సూర్యుడు గర్భంలో ఉన్నకాలంలో కృచ్ఛ్రచాంద్రాయణం మొదలయిన వ్రతాలను ఆచరించింది.

తత స్తాం కశ్యపః ప్రాహ కిఞ్చిత్ కోపప్లుతాక్షరమ్ ।
కిం మారయసి గర్భాణ్డ మితి నిత్యోపవాసినీ ॥ 35 ॥

అపుడు కశ్యపుడు అదితితో కొంచెం కోపంగా, 'రోజూ ఉపవాసాలు చేస్తూ కడుపులోని పిండాన్ని చంపేస్తావా' అన్నాడు.

సా చ తం ప్రాహ గర్భాణ్డ మేతత్ పశ్యేతి కోపనా ।
న మారితం విపక్షాణాం మృత్యురేవ భవిష్యతి ॥ 36 ॥

అపుడు అదితి కూడ కశ్యపుడితో కోపంగానే 'ఈగర్భం చావలేదు. (ఉపవాసాలతో నేను చంపలేదు.) చూడు. ఈనాగర్భం శత్రువులకు చావు అవుతుంది. (దైత్యదానవులను చంపుతుంది)' అన్నది.

ఇత్యుక్త్వా తం తతో గర్భ ముత్ససర్జ సుదారుణమ్ ।
జాజ్వల్యమానం తేజోభిః పత్యు ర్వచనకోపితా ॥ 37 ॥

అని పలికి, బిడ్డను చంపుతున్నానన్న భర్తమాటలకు కోపగించిన అదితి (కోపం ఆపుకోలేక, గర్భం సజీవంగానే ఉన్నదని నిరూపించడానికి) తేజస్సుతో వెలిగిపోతున్న తనగర్భాన్ని కనికరం లేకుండా జారవిడిచింది.

తం దృష్ట్వా కశ్యపో గర్భ ముద్యద్భాస్కరవర్చసమ్ ।
తుష్టావ ప్రణతో భూత్వా వాగ్భి రాద్యాభి రాదరాత్ ॥ 38 ॥

ఉదయిస్తున్న సూర్యుడితేజస్సు కలిగిఉన్న ఆ(అదితిగర్భంనుండి వెలువడిన)పిండాన్ని చూచి, కశ్యపుడు దానికి నమస్కరించాడు. వేదవాక్కులతో ఆబిడ్డను సంతోషపెట్టాడు.

సంస్తూయమాన స్స తదా గర్భాణ్డాత్ ప్రకటోఽభవత్ ।
పద్మపత్రసవర్ణాభ స్తేజసా వ్యాప్తదిఙ్ముఖః ॥ 39 ॥

కశ్యపుడు స్తోత్రం చేస్తుండగా, తామరరేకులతో సమానమయిన కాంతితో, దిక్కు లన్నింటా వెలుగులు నింపుతూ ఆగర్భం అండంనుండి బిడ్డ బయటపడ్డాడు.

అథాన్తరిక్షా దాభాష్య కశ్యపం మునిసత్తమమ్ ।
సభార్యం మేఘగమ్భీరా వాగువాచాశరీరిణీ ॥ 40 ॥

అపుడు ఆకాశవాణి మేఘంలాగా గంభీరమయిన మాటలతో భార్యతో కూడిఉన్న, మునులలో శ్రేష్ఠుడయిన కశ్యపుడితో ఇలా అన్నది.

వాగువాచ:– కశ్యపుడితో అశరీరవాణి ఇలా అంటున్నది.

మారిత న్తే యతః ప్రోక్త మేతదణ్డం త్వయాదితేః ।
తస్మా న్మునే సుత స్తేఽయం మార్తణ్డాఖ్యో భవిష్యతి ॥ 41 ॥

మహర్షీ! నీవు అదితిగర్భంలోని 'మారితం అండం' (నీగర్భాన్ని నీవే చంపావా) అన్నావు. కాబట్టి ఈనీకుమారుడికి మార్తండుడు అనేపేరు కలుగుతుంది.

హనిష్య త్యసురాం శ్చాయం యజ్ఞభాగహరాం స్త్వరీన్ ।
దేవా నిశమ్యేతి వచో గగనాత్సముపాగతమ్ ।
ప్రహర్ష మతులం యాతా దానవాశ్చ హతౌజసః ॥ 42 ॥

దేవతలకు శత్రువు లయి, వారి యజ్ఞభాగాలను హరించిన రాక్షసులను ఈకుమారుడు సంహరిస్తాడు. ఆకాశంనుండి వెలువడిన ఈఅశరీరవాణి మాటలు విని దేవతలు అందరూ సాటిలేని ఆనందం పొందారు. దానవులు తేజస్సు కోల్పోయారు (భయపడ్డారు).

తతో యుద్ధాయ దైతేయా నాజుహావ శతక్రతుః ।
సహ దేవై ర్ముదా యుక్తో దానవాశ్చ తమభ్యయుః ॥ 43 ॥

అపుడు ఇంద్రుడు దైత్యులను (దానవులను) యుద్ధానికి ఆహ్వానించాడు. దానవులు కూడ దేవతలతో యుద్ధం చేయడానికి ఆనందంగా దైత్యులతో కలిసి వచ్చారు.

తేషాం యుద్ధ మభూ ద్ఘోరం దేవానా మసురై స్సహ ।
శ్రస్త్రాస్త్రవృష్టిసన్దీప్త సమస్తభువనాన్తరమ్ ॥ 44 ॥

అపుడు దేవతలకు రాక్షసులతో భయంకరమయిన యుద్ధం జరిగింది. ఆయుద్ధంలో వారు ప్రయోగించిన శస్త్రాలు, అస్త్రాలు వర్షంలాగా భూమ్యాకాశాలమధ్యప్రదేశం అంతటా నిండి, వెలిగిపోయాయి.

తస్మిన్ యుద్ధే భగవతా మార్తణ్డేన నిరీక్షితాః ।
తేజసా దహ్యమానా స్తే భస్మీభూతా మహాసురాః ॥ 45 ॥

ఆయుద్ధంలో మార్తండభగవానుడి చూపు పడిన రాక్షసులు అందరూ, ఆతడితేజస్సుతో కాలి, బూడిద అయినారు.

తతః ప్రహర్ష మతులం ప్రాప్తా స్సర్వే దివౌకసః ।
తుష్టువు స్తేజసాం యోనిం మార్తణ్డ మదితిం తథా ।
స్వాధికారాం స్తతః ప్రాప్తా యజ్ఞభాగాంశ్చ పూర్వవత్ ॥ 46 ॥

అపుడు దేవతలందరూ సాటిలేని ఆనందం పొందారు. వారు తేజస్సంభవుడు అయినమార్తండుడిని, అదితిని స్తుతించి, సంతోషపెట్టారు. దేవతలు యథాపూర్వంగా తమ త్రిభువన ఆధిపత్యాన్నీ, యజ్ఞభాగాలనూ తిరిగి పొందారు.

భగవానపి మార్తణ్డ స్స్వాధికారమథాకరోత్ ।
కదమ్బపుష్పవద్భాస్వా నధశ్చోర్ధ్వం చ రశ్మిభిః ।
వృతోఽగ్నిపిణ్డసదృశో యే నాభాతి స్ఫుటం వపుః ॥ 47 ॥

తనకిరణాలు క్రిందికీ, పైకీ వ్యాపించి చుట్టూ నిండిఉండగా, మార్తండుడి శరీరం (ఆకారం) అగ్నిగోళంలాగా స్పష్టంగా వెలుగుతున్నది. భగవానుడయిన ఆమార్తండుడు తనఅధిపత్యాన్ని నడిపాడు. (దేవతలు తమకు పూర్వవైభవం తెచ్చియిచ్చిన మార్తండుడి ఆజ్ఞకు లోబడి నడుచుకున్నారు.)

మునయ ఊచుః:- మహర్షులు బ్రహ్మదేవుడితో ఇలా అన్నారు.

కథం కాన్తతరం పశ్చా ద్రూపం సంలబ్ధవాన్ రవిః ।
కదమ్బగోలకాకారం తన్నో బ్రూహి జగత్పతే! ॥ 48 ॥

జగన్నాథా! బ్రహ్మదేవా! మార్తండుడు ఆతరువాత కడిమి మొగ్గవలె గుండ్రని అందమైన ఆకారం ఎలా పొందాడు? ఆవిషయాన్ని మాకు చెప్పవలసింది.

బ్రహ్మోవాచ :-బ్రహ్మదేవుడు మహర్షులతో ఈవిధంగా చెప్తున్నాడు.

త్వష్టా తస్మై దదౌ కన్యాం సంజ్ఞాం నామ వివస్వతే ।
ప్రసాద్య ప్రణతో భూత్వా విశ్వకర్మా ప్రజాపతిః ॥ 49 ॥

విశ్వకర్మ, ప్రజాపతి అయినత్వష్ట నిత్యమూ సూర్యనమస్కారాలు చేశాడు. సూర్యుడిని ప్రసన్నం చేసుకున్నాడు. కూతురయిన సంజ్ఞను సూర్యుడికి భార్యగా ఇచ్చాడు. (6.1)

త్రీణ్యపత్యాన్యసౌ తస్యాం జనయామాస గోపతిః ।
ద్వౌ పుత్రౌ సుమహాభాగౌ కన్యాం చ యమునాం పునః ॥ 50 ॥

సూర్యుడివలన సంజ్ఞకు ముగ్గురు బిడ్డలు కలిగారు. వారిలో ఇద్దరు కుమారులు. వీరు మహానుభావులు. ఒకరు కూతురు. ఆమెపేరు యమున. (6.7)

యత్తేజోఽభ్యధికం తస్య మార్తణ్డస్య వివస్వతః ।
తే నాతితాపయామాస త్రీన్ లోకాన్ సచరాచరాన్ ॥ 51 ॥

మార్తండుడు అయిన ఆసూర్యుడికి తేజస్సు చాల అధికం. ఆతేజస్సుతో సూర్యుడు స్థావరజంగమాత్మక మయిన మూడులోకాలనూ మిక్కిలి తపింపజేశాడు.(6.6)

తద్రూపం గోలకాకారం దృష్ట్వా సంజ్ఞా వివస్వతః ।
అసహన్తీ మహత్తేజ స్స్వాం ఛాయాం వాక్యమబ్రవీత్ ॥ 52 ॥

గోళాకారంలో ఉన్న సూర్యుడిరూపాన్నీ, అతడిఅధికమయిన తేజస్సునూ సంజ్ఞ సహించలేకపోయింది. తననీడ అయిన ఛాయతో సంజ్ఞ ఇలా అన్నది. (6.9)

సంజ్ఞోవాచ:- ఛాయతో సంజ్ఞ ఈవిధంగా అంటున్నది.

అహం యాస్యామి భద్రం తే స్వమేవ భవనం పితుః ।
నిర్వికారం త్వయాత్రైవ స్థేయం మచ్ఛాసనా చ్ఛుభే ॥ 53 ॥

నేను మాతండ్రిగారిఇంటికి వెళ్తున్నాను. నీకు శుభం జరుగుతుంది. ఉత్తమురాలా! నీవు నామాట విని మొగమోటపడకుండా నాస్థానంలో ఇక్కడే ఉండు. (6.12)

ఇమౌ చ బాలకౌ మహ్యం కన్యా చ వరవర్ణినీ ।
సంభావ్యా నైవ చాఖ్యేయ మిదం భగవతే త్వయా ॥ 54 ॥

సుందరాంగీ! వీళ్లు ఇద్దరు నాకుమారులు. ఇది నాకూతురు. వీళ్లను ప్రేమగా చూసుకో. నేను మాపుట్టింటికి వెళ్ళినవిషయాన్ని సూర్యభగవానుడికి తెలియనీయకు. (6.13)

ఛాయోవాచ :-సంజ్ఞతో ఛాయ ఇలా అంటున్నది.

ఆకేశగ్రహణా ద్దేవి ఆశాపా న్నైవ కర్హిచిత్ ।
ఆఖ్యాస్యామి మతం తుభ్యం గమ్యతాం యత్ర వాఞ్ఛితమ్ ॥ 55 ॥

దేవీ! నాజుట్టు పట్టుకోకుండా ఉన్నంతవరకూ, నాకు శాపం ఇవ్వనంతవరకూ, నీసంగతి నేను సూర్యుడికి చెప్పను. నీవు నీయిష్టం వచ్చినచోటికి వెళ్లు. (6.14)

ఇత్యుక్తా వ్రీడితా సంజ్ఞా జగామ పితృమన్దిరమ్ ।
వత్సరాణాం సహస్రం తు వసమానా పితుర్గృహే ॥ 56 ॥

ఛాయ అలా అనటంతో సంజ్ఞ (భర్తను విడిచి పుట్టింట ఉండటానికి వస్తున్నందుకు) సిగ్గుపడుతూ, తండ్రి ఇంటికి వెళ్లింది. తండ్రి ఇంట్లో వేలసంవత్సరాలు ఉండిపోయింది.(6.15)

భర్తు స్సమీపం యాహీతి పిత్రోక్తా సా పునః పునః ।
ఆగచ్ఛద్ బడబా భూత్వా కురూనథోత్తరాం స్తతః ॥ 57 ॥

సంజ్ఞ తండ్రి ఆమెను భర్తవద్దకు వెళ్లమని పదే పదే చెప్పాడు. అపుడు సంజ్ఞాదేవి (భర్త వద్దకు వెళ్లడం ఇష్టం లేక) ఆడుగుఱ్ఱంగా మారి ఉత్తరకురుభూములకు వెళ్లింది.(6.16,17)

తత్ర తేపే తప స్సాధ్వీ నిరాహారా ద్విజోత్తమాః ॥ 58 ॥

విప్రవరేణ్యులారా! సాధుస్వభావ అయిన సంజ్ఞ ఆహారం తీసుకోకుండా, ఆప్రదేశంలో తీవ్రమయిన తపస్సు చేసింది.

పితు స్సమీపం యాతాయాం సంజ్ఞాయాం వాక్యతత్పరా ।
తద్రూపధారిణీ ఛాయా భాస్కరం సముపస్థితా ॥ 59 ॥

సంజ్ఞ తండ్రివద్దకు వెళ్లిపోగా, ఆమెరూపం ధరించిన ఛాయ, ఇచ్చినమాటకు కట్టుబడి, సంజ్ఞలాగానే సూర్యుడితో కలిసి జీవించసాగింది.

తస్యాం చ భగవాన్ సూర్యః సంజ్ఞేయమితి చిన్తయన్ ।
తథైవ జనయామాస ద్వౌ పుత్రౌ కన్యకాం తథా ॥ 60 ॥

సూర్యుడు కూడ ఆమె సంజ్ఞ అనుకుని ఛాయతో కలిసి, ఆమెవలన మరొక ఇద్దరు కుమారులనూ, ఒకకుమార్తెను కన్నాడు.(6.18)

సంజ్ఞా తు పార్థివీ తేషా మాత్మజానాం యథాఽకరోత్ ।
స్నేహం న పూర్వజాతానాం తథా కృతవతీ తు సా ॥ 61 ॥

మానవమాత్రురాలు అయిన సంజ్ఞ (రూపంలో ఉన్నఛాయ) సొంతబిడ్డలపైన చూపినంతటిప్రేమను అసలు సంజ్ఞ(సవతి)బిడ్డలమీద చూపలేకపోయింది. (6.20)

మనుస్తత్ క్షాన్తవాంస్తస్యా యమస్తస్యా న చ క్షమే ।
బహుధా పీడ్యమానస్తు పితుః పత్న్యా సుదుఃఖితః ॥ 62 ॥

ఆవిధంగా పక్షపాతంగా ఉన్నప్పటికీ మనువు (సంజ్ఞ కుమారుడు) సహించాడు. కాని, యముడు మాత్రం సహించలేకపోయాడు. అనేకవిధాలుగా బాధిస్తున్న పినతల్లివల్ల దుఃఖపడుతున్నాడు. (6.21)

స వై కోపాచ్చ బాల్యాచ్చ భావినోఽ ర్థస్య వై బలాత్ ।
పదా సన్తర్జయామాస న తు దేహే న్యపాతయత్ ॥ 63 ॥

పసితనంచేతనూ, భవిష్యత్తులో జరుగవలసినదాని(విధి)బలంవల్లనూ, యముడు ఛాయను కాలితో (తంతానని) బెదిరించాడు. కాని తన్నలేదు సరి కదా, కాలితో ఛాయశరీరాన్ని స్పృశించను గూడా లేదు. (6.22)

ఛాయోవాచ :- తనను తన్నబోయిన యముడితో ఛాయ ఇలా అంటున్నది.

పదా తర్జయసే యస్మాత్ పితు ర్భార్యాం గరీయసీమ్ ।
తస్మా త్త వైష చరణః పతిష్యతి న సంశయః ॥ 64 ॥

గౌరవింపదగిన తల్లిని కాలితో (తంతానని) భయపెట్టావు కాబట్టి, (నన్ను తన్నడానికి లేపిన) ఆకాలు పడిపోతుంది. సందేహం లేదు. (అని ఛాయ యముడిని శపించింది.) (6.23)

బ్రహ్మోవాచ :- బ్రహ్మదేవుడు మహర్షులతో ఇలా అంటున్నాడు.

యమస్తు తేన శాపేన భృశం పీడితమానసః ।
మనునా సహ ధర్మాత్మా పిత్రే సర్వం న్యవేదయత్ ॥ 65 ॥

తల్లిశాపానికి యముడు మనసులో చాల బాధపడ్డాడు. ధర్మస్వరూపుడయిన యముడు (తనసోదరుడయిన)మనువుతో కలిసి వెళ్లి జరిగింది అంతా తండ్రికి విన్నవించాడు. (6.24)

యమ ఉవాచ :- సూర్యుడితో యముడు ఇలా అంటున్నాడు.

స్నేహేన తుల్య మస్మాసు మాతా దేవ న వర్తతే ।
విసృజ్య జ్యాయసం భక్త్యా కనీయాంసం బుభూషతి ॥ 66 ॥

పితృదేవా! మాతల్లి బిడ్డలమయిన మమ్మల్ని అందరినీ సమానమయిన ప్రేమతో చూడటం లేదు. పెద్దవాళ్లను విడిచి చిన్నపిల్లలను గొప్పగా ఆదరిస్తున్నది. (6.26)

తస్యాం సముద్యతః పాదో న తు దేహే నిపాతితః ।
బాల్యా ద్వా యది వా మోహాత్తద్భవాన్ క్షన్తుమర్హతి ॥ 67 ॥

అందుచేత కోపంతో నేను ఆమెపై కాలెత్తాను. కాని కాలితో ఆమెను తాకను గూడా లేదు. పసితనంచేత కానీ, అజ్ఞానంచేత కాని, నేను చేసిన ఈపొరపాటుపనిని క్షమించదగినవాడివి. (6.26)

శప్తోఽహం తాత కోపేన జనన్యా తనయో యతః ।
తతో మన్యే న జననీ మిమాం వై తపతాం వర ॥ 68 ॥

తండ్రీ! (తన్నబోయాననే) కోపంతో మాతల్లి నన్ను శపించింది. తపనులలో శ్రేష్ఠుడా! తల్లి తనకొడుకును శపించడం అసంభవం కాబట్టి ఈమె నాకు తల్లి కాదనుకుంటున్నాను.

తవ ప్రసాదా చ్చరణో న పతేద్ భగవన్ యథా ।
మాతృశాపా దయం దేవ తథా చిన్తయ గోపతే ॥ 69 ॥

మహానుభావా! సూర్యదేవా! తల్లిశాపంప్రకారం నాకాలు నీదయచేత పడిపోకుండాఉండేవిధంగా ఆలోచించు. (6.27)

రవి రువాచ :– సూర్యుడు తనకుమారుడయిన యముడితో ఇలా అంటున్నాడు.

అసంశయం పుత్ర మహ ద్భవిష్యత్యత్ర కారణమ్ ।
యేన త్వా మావిశత్ క్రోధో ధర్మజ్ఞం ధర్మశాలినమ్ ॥ 70 ॥

కుమారా! ధర్మం చక్కగా తెలిసినవాడివి. ధర్మంతో కూడినవాడివి. అటువంటినిన్ను కోపం ఆవేశించిందంటే, అందుకు ఏదో పెద్దకారణమే ఉండి ఉంటుంది. సందేహం లేదు. (6.28)

సర్వేషామేవ శాపానాం ప్రతిఘాతో హి విద్యతే ।
న తు మాత్రాభిశప్తానాం క్వచి చ్ఛాపనివర్తనమ్ ॥ 71 ॥

శాపాలకు అన్నింటికీ విరుగుడు ఉంటుంది. కాని తల్లిశాపానికి మాత్రం తిరుగు లేదు. (6.29)

న శక్యమేతన్మిథ్యా తు కర్తుం మాతుర్వచస్తవ ।
కిఞ్చిత్తేఽహం విధాస్యామి తవ శాపాపనోదనమ్ ॥ 72 ॥

నీతల్లి నీకు ఇచ్చినశాపాన్ని వ్యర్థం చేయటం, సాధ్యం కాదు. అయినా, ఆశాపప్రభావం కొంచెం తగ్గడానికి నీకు ఒకమార్గం చెప్తాను.

కృమయో మాంస మాదాయ ప్రయాస్యన్తి మహీతలమ్ ।
కృతం తస్యా వచ స్సత్యం త్వం చ త్రాతో భవిష్యసి ॥ 73 ॥

పురుగులు నీకాలిలోనిమాంసాన్ని తీసుకుని నేలమీద రాలిపడతాయి. దీనితో నీతల్లిశాపం నిజ మవుతుంది. నీవూ రక్షింపబడతావు.(6.29,30)

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఇలా అంటున్నాడు.

ఆదిత్యస్త్వబ్రవీచ్ఛాయాం కిమర్థం తనయేషు వై ।
తుల్యేష్వప్యధికస్స్నేహ ఏకం ప్రతి కృతస్త్వయా ॥ 74 ॥

అపుడు ఆదిత్యుడు సంజ్ఞతో ఇలా అన్నాడు. అందరూ సమానమయిన బిడ్డలలో ఒక్కరి (కొంతమంది)మీద ఎక్కువప్రేమను, చూపుతున్నావెందుకు? (6.31)

నూనం నైషాం త్వం జననీ సంజ్ఞాఖ్యాఽపి క్వచిద్గతా ।
నిర్గుణేష్వప్యపత్యేషు మాతా శాపం న దాస్యతి ॥ 75 ॥

నీవు వీరికి తప్పకుండా తల్లివి కాదు. అసలయిన సంజ్ఞ ఎక్కడికో వెళ్లింది. ఎంతగా గుణహీనుడయినా, (దుర్మార్గుడయినా) తల్లి కన్నకొడుకును శపించదు.

సా తత్పరిహరన్తీ చ శాపాద్ భీతా తదా రవేః ।
కథయామాస వృత్తాన్తం స శ్రుత్వా శ్వశురం యయౌ ॥ 76 ॥

అపుడు సూర్యుడు తనకు శాపం ఇస్తాడని ఛాయ భయపడింది. సూర్యుడన్నమాటలు యథార్థం కాదని తెలియజేయడానికి, జరిగినవృత్తాంతమంతా యథాతథంగా ఛాయ సూర్యుడికి చెప్పింది. సూర్యుడు అది విని మామగారివద్దకు వెళ్ళాడు. (6.32)

స చాదిత్యం యథాన్యాయ మర్చయిత్వా విభావసుమ్ ।
నిర్దగ్ధుకామం కోపేన సాన్త్వయామాస సువ్రతః ॥ 77 ॥

త్వష్ట అనేప్రజాపతి (సూర్యుడిమామగారు) కూడ సూర్యుడిని తగినవిధంగా అర్చించాడు. కోపంతో తనను దహించాలనుకుంటున్న అల్లుడిని నియమవంతుడయిన త్వష్ట మెల్లగా సమాధానపరిచాడు. (6.35) (త్వష్ట ధర్మం తప్పనివాడు– కూతురిని మందలించి, భర్తవద్దకు పంపకుండా, తనఇంట్లోనే ఉంచుకుని, అధర్మం చేశాడు కాబట్టి శిక్షించాలనుకున్నాడు సూర్యుడు. త్వష్ట ధర్మభంగం చేయలేదనీ, చేసేవాడే కాదనీ, సువ్రతః అనేవిశేషణం చెప్తుంది.)

విశ్వకర్మోవాచ :– సూర్యుడితో విశ్వకర్మ అయిన త్వష్ట ఇలా అంటున్నాడు.

తవాతితేజసా వ్యాప్త మిదం రూపం సుదుస్సహమ్ ।
అసహన్తీ తు తత్సంజ్ఞా వనే చరతి వై తపః ॥ 78 ॥

నీరూపం అత్యధికమయిన తేజస్సుతో నిండిఉంది. దానిని తట్టుకోలేక సంజ్ఞ అరణ్యంలో తపస్సు చేసు కుంటున్నది.(6.36)

ద్రక్ష్యతే తాం భవా నద్య స్వాం భార్యాం శుభచారిణీమ్ ।
రూపార్థం భవతోఽరణ్యే చరన్తీం సుమహత్తపః ॥ 79 ॥

నీకు సుందరమయినరూపం గలగటంకోసం నీభార్య అడవులలో తీవ్రమయిన తపస్సు చేస్తున్నది. మంచినడవడిక గలిగిన నీభార్యను నీవు ఇప్పుడే అక్కడ చూడవచ్చు. (6.37)

శ్రుతం మే బ్రహ్మణో వాక్యం యది తే దేవ రోచతే ।
రూపం నిర్వర్తయామ్యద్య తవ కాన్తం దివస్పతే ॥ 80 ॥

నేను బ్రహ్మదేవుడివలన ఒకమాట (తీక్ష్ణమయిన తేజస్సు తగ్గి నీకు అందమయినరూపం వస్తుందని) విన్నాను. నీకు ఇష్టమయితే, నీరూపాన్ని అందంగా తయారు చేస్తాను. (6.38)

బ్రహ్మోవాచ :- బ్రహ్మదేవుడు మహర్షులతో ఇలా చెప్తున్నాడు.

తతస్తథేతి తం ప్రాహ త్వష్టారం భగవాన్ రవిః ।
తతో వివస్వతో రూపం ప్రాగాసీత్ పరిమణ్డలమ్ ॥ 81 ॥

అప్పుడు సూర్యభగవానుడు త్వష్టతో 'సరే, అలాగే (నారూపాన్ని మనోహరంగా చెయ్యి)' అన్నాడు. అపుడు సూర్యుడిరూపం మొదట్లో మండలాకారంలో ఉండేది.

విశ్వకర్మాభ్యనుజ్ఞాత శ్శాకద్వీపే వివస్వతా ।
భ్రమిమారోప్య తత్తేజ శ్శాతనాయోపచక్రమే ॥ 82 ॥

రూపం సుందరంగా మార్పు చేయడానికి సూర్యుడు అనుమతింపగా, విశ్వకర్మ సూర్యమండలాన్ని గుండ్రంగా తిరిగేఒకయంత్రం మీద ఉంచి, సూర్యుడితేజస్సును తగ్గించడం ప్రారంభించాడు.

భ్రమతా ఽ శేషజగతాం నాభిభూతేన భాస్వతా ।
సముద్రాద్రివనోపేతా త్వారురోహ మహీ నభః ॥ 83 ॥

సమస్తమయిన జగత్తులకు నాభిలాగా, కేంద్రస్థానమయినసూర్యుడిని (భ్రమణయంత్రం మీద ఉంచి చెక్కుతూ) తిప్పుతూండడంచేత సముద్రాలు, పర్వతాలు, అరణ్యాలతో కూడిన భూమి ఆకాశంపైకి ఎక్కింది. (భూమి ఆకాశంస్థానంలో ఉంది.)

గగనం చాఖిలం విప్రా స్సచన్ద్రగ్రహతారకమ్ ।
అధోగతం మహాభాగా బభూ వాక్షిప్త మాకులమ్ ॥ 84 ॥

మహర్షులారా! చంద్రుడితోనూ, గ్రహాలతోనూ, నక్షత్రాలతోనూ కూడినఆకాశం మొత్తం సంక్షోభించి, పైనుండి నెట్టివేయబడి, క్రిందికి దిగింది. (భూమి ఉండవలసినస్థానంలో ఆకాశం ఉంది. భూమి, ఆకాశం తలక్రిందులైనాయి)

విక్షిప్తసలిలా స్సర్వే బభూవుశ్చ తథార్ణవాః ।
వ్యభిద్యన్త మహాశైలా శ్శీర్ణసానునిబన్ధనాః ॥ 85 ॥

అన్నిసముద్రాలలోనినీళ్లు చెల్లాచెదరుగా ఎగిరిపడ్డాయి. కొండచరియలు బ్రద్దలయినాయి. పర్వతాలు ముక్కలయినాయి.

ధ్రువాధారాణ్యశేషాణి ధిష్ణ్యాని మునిసత్తమాః ।
త్రుట్యద్రశ్మినిబన్ధీని బన్ధనాని అధో యయుః ॥ 86 ॥

మునివరులారా! ధ్రువుడిని ఆధారంగా చేసుకునిఉన్న నక్షత్రాలు అన్నీ, కిరణాలకట్టుతాళ్లు తెగిపోయి, నేలరాలాయి.

వేగభ్రమణసమ్భూత వాయుక్షిప్తా స్సహస్రశః ।
వ్యశీర్యన్త మహామేఘా ఘోరారావవిరావిణః ॥ 87 ॥

సానపట్టుతున్నయంత్రం తిరుగుతున్నవేగంవల్ల ఏర్పడిన సుడిగాలిచేత మేఘాలు వేలకొలదిగా ముక్కలు ముక్కలయి, పెద్దగా అరుచుకుంటూ (గర్జిస్తూ), చెల్లాచెద రయినాయి.

భాస్వద్భ్రమణవిభ్రాన్త భూమ్యాకాశరసాతలమ్ ।
జగదాకులమత్యర్థం తదాఽఽసీ న్మునిసత్తమాః ॥ 88 ॥

మునివరేణ్యులారా! ఆయంత్రంతిరిగేవేగానికి భూమి, ఆకాశం, పాతాళం, (మూడులోకాలు కూడా) తీవ్రంగా వ్యాకులపడ్డాయి.

త్రైలోక్యం సకలం వీక్ష్య భ్రమమాణం సురర్షయః ।
దేవాశ్చ బ్రహ్మణా సార్ధం భాస్వన్తమభితుష్టువుః ॥ 89 ॥

మహర్షులారా! మూడులోకాలు కూడ సంచలించిపోతుండడం గమనించిన దేవతలు, మహర్షులు, బ్రహ్మతో సహా అందరూ ప్రకాశిస్తున్న సూర్యుడిని ఇలా స్తుతించి, సంతోషపెట్టారు.

ఆదిదేవోఽసి దేవానాం జాత స్త్వం భూతయే భువః ।
సర్గస్థిత్యన్తకాలేషు త్రిధా భేదేన తిష్ఠసి ।
స్వస్తి తేఽస్తు జగన్నాథ ధర్మవర్ష దివాకర ॥ 90 ॥

దేవతలకు అందరికంటె నీవే ముందుగా ఆవిర్భవించావు. సృష్టి, స్థితి, లయసమయాలలో మూడు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వర) భేదాలతో భూలోకం ఉనికికోసం ఉన్నావు. భాస్కరా! ధర్మాన్ని వర్షించేవాడా! లోకనాయకా! దేవా! నీకు జయం.

ఇన్ద్రాదయ స్తదా దేవా లిఖ్యమానమథాస్తువన్ ।
జయ దేవ జగత్స్వామిన్ జయాశేషజగత్పతే ॥ 91 ॥

ఇంద్రుడు మొదలయిన దేవతలు సానపెట్టబడుతున్న సూర్యుడిని ఇంకా ఇలా స్తుతించారు. లోకనాథా! నీకు శుభమగు గాక! లోకాలకు అన్నింటికీ దిక్కు అయినవాడా! నీకు జయం.

ఋషయశ్చ తత స్సప్త వసిష్ఠాత్రిపురోగమాః ।
తుష్టువు ర్వివిధైః స్తోత్రై స్స్వస్తి స్వస్తీతివాదినః ॥ 92 ॥

వసిష్ఠుడు, అత్రి మొదలయిన సప్తఋషులు కూడ వివిధమయిన స్తోత్రాలతోనూ, స్వస్తి, స్వస్తి అని (నీకు శుభం కలగాలని పదే పదే ఆశీస్సులను అందిస్తూ) సూర్యుడిని సంతోషపెట్టారు.

వేదోక్తిభి రథాగ్ర్యాభి ర్వాలఖిల్యాశ్చ తుష్టువుః ।
అఙ్గిరాద్యాశ్చ భాస్వన్తం లిఖ్యమానం ముదా యుతాః ॥ 93 ॥

వాలఖిల్యుడు మొదలయినవారు, అంగిరుడు మొదలయినవారు కూడ సానపెడుతుండగా, చక్కగా ప్రకాశిస్తున్న సూర్యుడిని శ్రేష్ఠమయిన వేదమంత్రాలతో స్తుతించారు.

త్వం నాథ మోక్షిణాం మోక్షో ధ్యేయస్త్వం ధ్యానినాం పరః ।
త్వం గతి స్సర్వభూతానాం కర్మకాణ్డవివర్తినామ్ ॥ 94 ॥

సమ్పూజ్య స్త్వం తు దేవేశ శం నోఽ స్తు జగతాం పతే ।
శం నోఽ స్తు ద్విపదే నిత్యం శం న శ్చాస్తు చతుష్పదే ॥ 95 ॥

దేవా! మోక్షం కోరుకునేవారికి (లభించే) మోక్షం నీవే. ధ్యానం చేసేవారికి ధ్యానం చేయదగిన ఉత్తముడివి నీవే. చరాచరసృష్టికి అంతటికీ నీవే దిక్కు. అర్చనాదికర్మలను నిష్ఠగా ఆచరించేవారు పూజింపదగినవాడివి నీవే. దేవపతీ! లోకేశ్వరా! (నీఅనుగ్రహంచేత) మాకు నిత్యమూ శుభం కలుగుగాక. మాకు సంబంధించిన రెండు పాదాలు గలిగిన ప్రాణులందరికీ (బంధువులు, ఆశ్రితులు మొదలయినవారు) శుభం కలుగుగాక. మాకు సంబంధించిన నాలుగు పాదాల జీవులకు కూడ మేలు కలుగుగాక.

తతో విద్యాధరగణా యక్షరాక్షసపన్నగాః ।
కృతాఞ్జలిపుటా స్సర్వే శిరోభిః ప్రణతా రవిమ్ ॥ 96 ॥

అపుడు విద్యాధరులు, యక్షులు, రాక్షసులు, నాగులు, అందరూ చేతులు జోడించి, తలవంచి, సూర్యుడికి నమస్కరించారు.

ఊచు స్తే వివిధా వాచో మనశ్శ్రోత్రసుఖావహాః ।
సహ్యం భవతు తేజస్తే భూతానాం భూతభావన ॥ 97 ॥

వారు మనసుకూ, చెవులకూ ఇంపు కలిగించే అనేకమయిన స్తోత్రాలు చేశారు. చరాచరభూతకోటిని సృష్టించి, పోషించేవాడా! నీతేజస్సు సర్వభూతాలకూ తట్టుకోగలిగినది కావాలి (అన్నారు).

తతో హాహాశ్చ హూహూశ్చ నారద స్తుమ్బురు స్తథా ।
ఉపగాయితు మారబ్ధా గాన్ధర్వకుశలా రవిమ్ ॥ 98 ॥

షడ్జమధ్యమగాన్ధార గానత్రయవిశారదాః ।
మూర్ఛనాభిశ్చ తాలైశ్చ సంప్రయోగై స్సుఖప్రదమ్ ॥ 99 ॥

అప్పుడు సంగీతవిద్యలో నేర్పరులు, షడ్జం, మధ్యమం, గాంధారం అనే మూడు విధాలయిన గానాలలో నిపుణులూ అయిన, హాహా, హూహూ అనే గంధర్వులు, నారదుడు, తుంబురుడు, సూర్యుడిని గూర్చి స్తుతులను మూర్ఛనలు, తాళాల విశేషప్రయోగంతో, సుఖప్రదంగా గానం చేయడం ప్రారంభించారు.

విశ్వాచీ చ ఘృతాచీ చ ఉర్వశ్యథ తిలోత్తమా ।
మేనకా సహజన్యా చ రమ్భా చాప్సరసాం వరాః ॥ 100 ॥

ననృతుర్జగతా మీశే లిఖ్యమానే విభావసౌ ।
భావహావవిలాసాద్యాన్ కుర్వన్త్యోఽభినయాన్ బహూన్ ॥ 101 ॥

జగన్నాథుడయిన సూర్యుడిని మనోహరంగా తయారు చేస్తున్న సమయంలో, విశ్వాచి, ఘృతాచి, ఉర్వశి, తిలోత్తమ, మేనక, సహజన్య, రంభ అనే ఉత్తమఅప్సరసలు హావాలు, భావాలు, విలాసాలు మొదలయినవాటిని చక్కగా వ్యక్తం చేస్తూ, అనేకవిధమయిన అభినయాలతో నాట్యం చేశారు.

ప్రావాద్యన్త తత స్తత్ర వీణావేణ్వాదిఝర్ఝరాః ।
పణవాః పుష్కరాశ్చైవ మృదఙ్గాః పటహానకాః ।
దేవదున్దుభయశ్శఙ్ఖా శ్శతశోఽథ సహస్రశః ॥ 102 ॥

అపుడు అక్కడ వందల, వేలసంఖ్యలో (లెక్క లేనన్ని) వీణలు, వేణువులు, డమరుకాలు, డోళ్లు మొదలయిన చర్మవాద్యాలు, పుష్కరాలు, మృదంగాలు, తప్పెటలు, మద్దెలలు, దేవతల ఢక్కావాద్యాలు, శంఖాలు, పెద్దగా మ్రోగాయి.

గాయద్భి శ్చైవ నృత్యద్భి ర్గాన్ధర్వై శ్చాప్సరో గణైః ।
తూర్యవాదిత్రనిర్ఘోషై స్సర్వం కోలాహలీకృతమ్ ॥ 103 ॥

గంధర్వుల గానంతోనూ, అప్సరసల నాట్యంతోనూ, తప్పెటలు, వీణలు మొదలయినవాటి పెద్ద పెద్ద ధ్వనులతోనూ, ఆ సమయంలో ఆప్రదేశం అంతా కోలాహలంగా ఉంది.

తతః కృతాఞ్జలిపుటా భక్తినమ్రాత్మమూర్తయః ।
లిఖ్యమానే సహస్రాంశౌ ప్రణేము స్సర్వదేవతాః ॥ 104 ॥

అప్పుడు చేతులు జోడించి, భక్తితో వంగిపోయిన మనశ్శరీరాలతో దేవతలు అందరూ సానపెట్టబడుతున్న సూర్యుడికి సాష్టాంగంగా నమస్కరించారు.

తతః కోలాహలే తస్మిన్ సర్వభూతసమాగమే ।
తేజస శ్శాతనం చక్రే విశ్వకర్మా శనై శ్శనైః ॥ 105 ॥

సమస్తమయిన భూతకోటి ఆప్రదేశంలో ఒక్కచోటికి చేరి, కోలాహలంగా ఉండగా, విశ్వకర్మ మెల్లమెల్లగా సూర్యుడితేజస్సును చెక్కాడు (తగ్గించాడు).

ఆజానులిఖితశ్చాసౌ నిపుణం విశ్వకర్మణా ।
నాభ్యనన్దత్తు లిఖనం తత స్తేనావతారితః ॥ 106 ॥

విశ్వకర్మ సూర్యుడిని మోకాళ్లవరకు నేర్పుగా చెక్కివేశాడు. కాని సూర్యుడు అందుకు (తనతేజస్సు తగ్గిపోయినందుకు) సంతోషించలేదు. తృప్తిపడలేదు. అందుచేత విశ్వకర్మ సూర్యుడిని (సానపెట్టే)యంత్రంనుండి క్రిందికి దింపాడు.

న తు నిర్భత్సితం రూపం తేజసో హననేన తు ।
కాన్తాత్ కాన్తతరం రూపమధికం శుశుభే తతః ॥ 107 ॥

తేజస్సు తగ్గిపోయినతనరూపాన్ని సూర్యభగవానుడు తిరస్కరింపనూ లేదు. అప్పుడు సూర్యుడిరూపం అందమయినవాటికంటె అందంగా ప్రకాశించింది.

ఇతి హిమజలఘర్మకాలహేతో ర్హరకమలాసనవిష్ణుసంస్తుతస్య ।
తదుపరి లిఖనం నిశమ్య భానో ర్వ్రజతి దివాకరలోకమాయుషోఽన్తే ॥ 108 ॥

చలికాలం, వానలకాలం, ఎండలకాలం అనేమూడు కాలాలకు కారణమైనవాడు, హరి, హర, బ్రహ్మలు స్తుతించేవాడు అయిన సూర్యుడి లిఖనం (రూపాన్ని చెక్కివేయడం ద్వారా తేజస్సు తగ్గించడం) అనేఈవృత్తాంతాన్ని విన్నవారు దీర్ఘకాలం జీవించి, అనంతరం సూర్యలోకానికి చేరుకుంటారు.

ఏవం జన్మ రవేః పూర్వం బభూవ మునిసత్తమాః ।
రూపం చ పరమం తస్య మయా సమ్పరికీర్తితమ్ ॥ 109 ॥

మునివరేణ్యులారా! పూర్వం సూర్యుడిపుట్టుక ఈవిధంగా జరిగింది. (అందంగా మారిన)సూర్యుడి ఉత్తమ మయిన రూపాన్ని కూడ వివరించాను. (అని మహర్షులకు బ్రహ్మదేవుడు చెప్పాడు.)

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయంభ్వృషిసంవాదే మార్తణ్డస్య జన్మశరీరలిఖనం నామ త్రింశోఽధ్యాయః ॥30 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషి సంవాదంలో మార్తండుడి జన్మ, శరీరలిఖనం అనే ముప్పైయవ సంపూర్ణం.



ఏకత్రింశోఽధ్యాయః- ముప్పైఒకటవ అధ్యాయం

సూర్యనామాష్టోత్తరశతమ్ - సూర్యనామాష్టోత్తరశతం

మునయ ఊచుః :- మహర్షులు బ్రహ్మదేవుడితో ఈవిధంగా అంటున్నారు.

భూయోఽపి కథయాస్మాకం కథాం సూర్యసమాశ్రితామ్ ।
న తృప్తిమధిగచ్ఛామ శృణ్వన్త స్సుఖదాం కథామ్ ॥ 1 ॥

పరమాత్మా, సూర్యుడికి సంబంధించిన కథను ఇంకా చెప్పు. ఆనందం కలిగించే సూర్యకథ ఎంత విన్నా, మాకు సంతృప్తి కలగడం లేదు.

యోఽయం దీప్తో మహాతేజా వహ్నిరాశిసమప్రభః ।
ఏతద్వేదితుమిచ్ఛామః ప్రభావోఽస్య కుతః ప్రభో ॥ 2 ॥

దేవా! నిప్పుల కుప్పవంటి కాంతితో వెలుగుతున్న ఈగొప్ప తేజస్వి ఎవరు? ఈతడికి ఇంతటి ప్రభావం ఎక్కడినుంచి వచ్చింది? తెలుసుకొనగోరుతున్నాం.

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఇలా చెప్తున్నాడు.

తమోభూతేషు లోకేషు నష్టే స్థావరజఙ్గమే ।
ప్రకృతేర్గుణహేతుస్తు పూర్వం బుద్ధిరజాయత ॥ 3 ॥

లోకాలు అన్నీ చీకటిమయం అయి, చరాచరభూతకోటి అంతా నశించిపోగా, సత్త్వరజస్తమస్సులనే ప్రకృతి గుణాలకు కారణమయిన బుద్ధి ముందుగా ఏర్పడింది.

అహఙ్కార స్తతో జాతో మహాభూతప్రవర్తకః ।
వాయ్వగ్నిరాపః ఖం భూమి స్తత స్త్వణ్డమజాయత ॥ 4 ॥

ఆ బుద్ధినుండి అహంకారం పుట్టింది. అహంకారంనుండి గాలి, (వాయువునుండి) నిప్పు, (నిప్పునుండి) నీరు, (నీటినుండి) నింగి, (నింగినుండి) నేల అనే పంచమహాభూతాలు ఏర్పడ్డాయి. పంచభూతాలనుండి అండం ఏర్పడింది.

తస్మిన్నణ్డేత్విమే లోకా స్సప్త చైవ ప్రతిష్ఠితాః ।
పృథివీ సప్తభిర్ద్వీపై స్సముద్రైశ్చైవ సప్తభిః ॥ 5 ॥

ఆఅండంలో ఏడు లోకాలు సుస్థిరంగా ఏర్పడిఉన్నాయి. ద్వీపాలతోనూ, ఏడు సప్తసముద్రాలతోనూ, కూడిన భూమి కూడ అందులో ఉంది.

తత్రైవావస్థితో హ్యాసీదహం విష్ణు ర్మహేశ్వరః ।
విమూఢా స్తామసా స్సర్వే ప్రధ్యాయన్తి తమీశ్వరమ్ ॥ 6 ॥

(సప్తలోకాలతోపాటు) నేను (బ్రహ్మ), విష్ణువు, పరమేశ్వరుడు, కూడ ఆఅండంలోనే ఉన్నాం. తమోగుణం నిండిన అజ్ఞానులు (మేము ముగ్గురం కూడ) ఈశ్వరుడిని ధ్యానించేవారు.

తతో వై సుమహాతేజాః ప్రాదుర్భూత స్తమోనుదః ।
ధ్యానయోగేన చాస్మాభిర్విజ్ఞాత స్సవితా తదా ॥ 7 ॥

అప్పుడు దట్టమయిన ఆచీకటిని నిర్మూలించే గొప్ప తేజస్సు పుట్టింది. ధ్యానయోగంతో మేము ఆతేజోరాశిని సవితృదేవతగా తెలుసుకున్నాం.

జ్ఞాత్వా చ పరమాత్మానం సర్వ ఏవ పృథక్ పృథక్ ।
దివ్యాభి స్తుతిభిర్దేవః స్తుతోఽ స్మాభిస్తదేశ్వరః ॥ 8 ॥

అందరమూ ఎవరికి వారు ప్రత్యేకంగా ఆసూర్యదేవుడిని పరమాత్మగా గ్రహించి, దివ్యమయిన స్తోత్రాలతో ఆదేవదేవుడిని కీర్తించాం.

ఆదిదేవోఽ సి దేవానా మైశ్వర్యా చ్చ త్వమీశ్వరః ।
ఆదికర్తాఽ సి భూతానాం దేవదేవో దివాకరః ॥ 9 ॥

సూర్యదేవా! దేవతలందరిలో నీవే మొదటి దేవుడివి. లోకాలను అన్నింటినీ పోషించటంచేత నీవు ఈశ్వరుడివి అయినావు. చరాచరభూతసముదాయాన్ని మొట్టమొదట సృష్టి చేసినవాడివి నీవే. దేవతలకు కూడా నీవే దేవుడివి. లోకానికి వెలుగు నిచ్చి పగటికాలాన్ని ఏర్పాటు చేసే దివాకరుడివి.

జీవన స్సర్వభూతానాం దేవగన్ధర్వరక్షసామ్ ।
మునికిన్నరసిద్ధానాం తథైవోరగపక్షిణామ్ ॥ 10 ॥

దేవతలకూ, గంధర్వులకూ, రాక్షసులకూ, మునులకూ, కిన్నరులకూ, మానవులకూ, సిద్ధులకూ,ఆ విధంగానే నాగులకూ, పక్షులకూ, సమస్తమయిన భూతకోటికీ బ్రతుకు నిచ్చేవాడివి నీవే.

త్వం బ్రహ్మా త్వం మహాదేవ స్త్వం విష్ణు స్త్వం ప్రజాపతిః ।
వాయురిన్ద్రశ్చ సోమశ్చ వివస్వాన్ వరుణస్తథా ॥ 11 ॥

నీవే బ్రహ్మదేవుడివి, నీవే శంకరుడివి. నీవే శ్రీమహావిష్ణువువి. నీవే ప్రజాపతివి. వాయువూ, ఇంద్రుడూ, చంద్రుడూ, సూర్యుడూ, వరుణుడూ నీవే.

త్వం కాల స్సృష్టికర్తా చ హర్తా భర్తా తథా ప్రభుః ।
సరిత స్సాగరా శ్శైలా విద్యుదిన్ద్రధనూంషి చ ।
ప్రలయః ప్రభవశ్చైవ వ్యక్తావ్యక్త స్సనాతనః ॥ 12 ॥

నీవే కాలానివి. సృష్టించేవాడివీ, పోషించేవాడివీ, లయం చేసేవాడివీ, నీవే. ఈలోకాలు అన్నీ నీ అధీనంలో ఉన్నాయి. నదులూ, సముద్రాలూ, పర్వతాలూ, మెరుపులూ, ఇంద్రధనుస్సులూ, అన్నీ నీవే. ప్రళయమూ నీవే, సృష్టీ నీవే. తెలియబడుతూ, తెలియబడకుండా ఉంటావు. నిత్యమూ స్థిరంగా ఉండేవాడివి నీవే.

ఈశ్వరాత్ పరతో విద్యా విద్యాయాః పరత శ్శివః ।
శివాత్ పరతరో దేవ స్త్వమేవ పరమేశ్వరః ॥ 13 ॥

ప్రభువుకంటే (అధికారం కలిగినవాడికంటె) విద్య (వివేకం) గొప్పది. విద్యకంటె శ్రేష్ఠమయినవాడు శివుడు. శివుడికంటె శ్రేష్ఠమయినవాడివి నీవు. నీవే దేవుడివి, ఈశ్వరులందరికంటె ఉత్తముడివి.

సర్వతః పాణిపాదాన్త స్సర్వతోఽ క్షిశిరోముఖః ।
సహస్రాంశు స్సహస్రాస్య స్సహస్రచరణేక్షణః ॥ 14 ॥

లోకాలన్నింటా నీచేతులూ, కాళ్లూ, నిండి ఉన్నాయి, దిక్కు లన్నింటా నీకన్నులు, శిరస్సులు, ముఖాలు నిండి ఉన్నాయి. నీవు వేయి (అంతు లేని) కిరణాలూ, వేయి (లెక్క లేనన్ని) ముఖాలూ గలవాడివి. నీవు వేయి (అంతులేని) పాదాలూ, నేత్రాలూ కలవాడివి.

భూతాది ర్భూర్భువస్స్వశ్చ మహ స్సత్యం తపో జనః ॥ 15 ॥

భూతాలకు అన్నింటికీ ఆద్యుడివి నీవు. భూలోకం, భువర్లోకం, స్వర్లోకం, మహోలోకం, జనోలోకం, సత్యలోకం, తపోలోకం, అనేసప్తలోకాలూ నీవే.

ప్రదీప్తం దీపనం దివ్యం సర్వలోకప్రకాశకమ్ ।
దుర్నిరీక్ష్యం సురేన్ద్రాణాం యద్రూపం తస్య తే నమః ॥ 16 ॥

చక్కగా ప్రకాశించేవాడివి. ప్రకాశింపజేసేవాడివి. దేవలోకానికి సంబంధించిన కాంతి కలవాడివి. లోకాల నన్నింటినీ ప్రకాశింపజేసేవాడివి. దేవతాశ్రేష్ఠులకు కూడా చూడనలవికాని నీరూపానికి నమస్కారం.

సురసిద్ధగణై ర్జుష్టం భృగ్వత్రిపులహాదిభిః ।
స్తుతస్య పర మవ్యక్తం యద్రూపం తస్య తే నమః ॥ 17 ॥

ఆరూపాన్ని దేవతాగణాలూ, సిద్ధగణాలూ సేవిస్తారు. భృగువు, అత్రి, పులహుడు మొదలయిన మహర్షులు స్తుతిస్తారు. ఉత్తమమూ, అవ్యక్తమూ అయిన ఆ నీ రూపానికి నమస్కారం.

వేద్యం వేదవిదాం నిత్యం సర్వజ్ఞానసమన్వితమ్ ।
సర్వదేవాధిదేవస్య యద్రూపం తస్య తే నమః ॥ 18 ॥

ఆరూపం వేదవేత్తలు మాత్రమే గ్రహిస్తారు. అది శాశ్వతమయినది. సమస్తమయిన జ్ఞానంతో కూడినది. దేవతలందరికీ ప్రధానదేవుడయిన నీ ఆ రూపానికి నమస్కారం.

విశ్వకృద్ విశ్వభూతం చ వైశ్వానరసురార్చితమ్ ।
విశ్వస్థితమవేద్యం చ యద్రూపం తస్య తే నమః ॥ 19 ॥

ఆరూపం ఈవిశ్వాన్ని సృష్టిస్తుంది. ఆవిశ్వమే తాను అయినది. అది విశ్వంలోనే ఉన్నది. తెలియరానిది. ఆరూపాన్నే అగ్ని మొదలయిన దేవతలు అర్చిస్తారు. అటువంటి నీరూపానికి నమస్కారం.

పరం యజ్ఞాత్ పరం వేదాత్ పరం లోకాత్ పరం దివః ।
పరమాత్మేత్యభిఖ్యాతం యద్రూపం తస్య తే నమః ॥ 20 ॥

నీరూపం యజ్ఞంకంటె ఉన్నతమైనది. వేదంకంటె ఉన్నతమయినది. ఈభూలోకంకంటె ఉన్నతమయినది. స్వర్గంకంటె ఉన్నతమయినది. పరమాత్మ అని చెప్పబడే ఆనీ రూపానికి నమస్కారం.

అవిజ్ఞేయ మనాలక్ష్య మధ్యానగతమవ్యయమ్ ।
అనాదినిధనం చైవ యద్రూపం తస్య తే నమః ॥ 21 ॥

తెలుసుకోవడానికి సాధ్యం కానిదీ, ఊహకు అందనిదీ, ధ్యానంచేత కూడ పొందరానిదీ, అవ్యయమైనది మొదలు చివరా లేనిదీ అయిన ఆనీరూపానికి నమస్కారం.

నమో నమః కారణకారణాయ నమో నమః పాపవిమోచనాయ ।
నమో నమస్తేఽ దితివన్దితాయ నమో నమో రోగవినాశనాయ ॥ 22 ॥

కారణాలకే కారణమయిన నీకు మళ్లీ మళ్లీ నమస్కారం. పాపాలను నిర్మూలించే నీకు నమస్కారం. అదితి(తల్లి) కూడ నమస్కరించే నీరూపానికి నమస్కారం. రోగాలను పోగొట్టే నీకు నమస్కారం.

నమో నమ స్సర్వవరప్రదాయ నమో నమ స్సర్వసుఖప్రదాయ ।
నమో నమ స్సర్వధనప్రదాయ నమో నమ స్సర్వమతిప్రదాయ ॥ 23 ॥

కావలసిన వరాలు అన్నీ (అందరికీ) ఇచ్చే నీకు మళ్లీ మళ్లీ నమస్కారం. సమస్తమయిన సుఖాలను (అందరికీ) ఇచ్చే నీకు నమస్కారం. సమస్తమయిన సంపదలను ఇచ్చే నీకు నమస్కారం. సమస్తమయిన (అందరికీ) బుద్ధులనూ ఇచ్చే నీకు నమస్కారం.

స్తుత స్స భగవానేవం తైజసం రూపమాస్థితః ।
ఉవాచ వాచా కల్యాణ్యా కో వరో వః ప్రదీయతామ్ ॥ 24 ॥

కాంతిరూపంలో ఉన్న ఆసూర్యభగవానుడు ఆ శుభప్రదమయిన పలుకులకు సంతోషించాడు. 'మీకు ఏమి వరం ఇవ్వాలో చెప్పండి' అన్నాడు.

దేవా ఊచుః :– సూర్యభగవానుడితో దేవతలు ఈవిధంగా అంటున్నారు.

తవాతితైజసం రూపం న కశ్చిత్ సోఢుముత్సహేత్ ।
సహనీయం తద్ భవతు హితాయ జగతః ప్రభో ॥ 25 ॥

లోకేశ్వరా! మిక్కిలి కాంతిమంతమయిన నీరూపాన్ని ఎవరూ తట్టుకోలేరు. ఈలోకాల మేలుకోసం నీవు చూడడానికి సాధ్యమయిన రూపాన్ని ధరించు.

ఏవమస్త్వితి సోఽ ప్యుక్త్వా భగవానాదికృత్ ప్రభుః ।
లోకానాం కార్యసిద్ధ్యర్థం ఘర్మవర్షహిమప్రదః ॥ 26 ॥

లోకాలను మొట్టమొదట సృజించినవాడు, జగన్నాయకుడు అయిన సూర్యభగవానుడు 'సరే,అలాగే' అన్నాడు. చరాచరభూతకోటికీ మేలు చేయడంకోసం అప్పటినుండీ ఎండనూ, వర్షాన్నీ, మంచునూ వర్షించడం ఆరంభించాడు.

తత స్సాఙ్ఖ్యాశ్చ యోగాశ్చ యే చాన్యే మోక్షకాఙ్క్షిణః ।
ధ్యాయన్తి ధ్యాయినో దేవం హృదయస్థం దివాకరమ్ ॥ 27 ॥

అప్పుడు సాంఖ్యులు (జ్ఞానులు), యోగజ్ఞులు, ఇంకా మోక్షాన్ని కోరుకునే ఇతరులు కూడ హృదయంలో అంతర్యామిగా ఉన్నవాడూ, ధ్యానింపదగినవాడూ అయిన సూర్యభగవానుడిని నిరంతరం ధ్యానించసాగారు.

సర్వలక్షణహీనోఽపి యుక్తో వా సర్వపాతకైః ।
సర్వం తు తరతే పాపం దేవ మర్కం సమాశ్రితః ॥ 28 ॥

మంచిగుణాలు ఏమాత్రమూ లేనివాడూ, అన్నివిధ ములయిన పాపాలు చేసేవాడు కూడ సూర్యుడిని శరణు పొందితే సమస్తమయిన పాపాలనుండి బయటపడతాడు. (వాడి పాపాలన్నీ నశిస్తాయి.)

అగ్నిహోత్రం చ వేదాశ్చ యజ్ఞాశ్చ బహుదక్షిణాః ।
భానో ర్భక్తినమస్కార కలాం నార్హన్తి షోడశీమ్ ॥ 29 ॥

అగ్నిహోత్రమూ, వేదాలూ, అధికంగా దక్షిణ లిచ్చిన యజ్ఞాలూ, ఏవీ కూడ సూర్యభగవానుడికి చేసిన ఒక్క నమస్కారంవల్ల వచ్చే పుణ్యఫలంలో పదహారవవంతుకు కూడ సాటిరావు.

తీర్థానాం పరమం తీర్థం మఙ్గలానాం చ మఙ్గలమ్ ।
పవిత్రం చ పవిత్రాణాం ప్రపద్యన్తే దివాకరమ్ ॥ 30 ॥

తేజోరాశి అయిన సూర్యుడిరూపం పుణ్యతీర్థాలలో ఉత్తమమయిన పుణ్యతీర్థం. శుభాలన్నింటిలోనూ మిక్కిలి శుభప్రదం. పావనమయిన వాటిఅన్నింటిలోనూ అత్యంతపుణ్యప్రదం.

శక్రాద్యై స్సంస్తుతం దేవం యే నమస్యన్తి భాస్కరమ్ ।
సర్వకల్మషనిర్ముక్తా స్సూర్యలోకం వ్రజన్తి తే ॥ 31 ॥

ఇంద్రుడు మొదలయినవారు కూడ కీర్తించే సూర్యభగవానుడికి నమస్కరించినవారు పాపాలన్నీ నశించిపోయి, సూర్యలోకానికి చేరుకుంటారు.

మునయ ఊచుః :-మహర్షులు లోమహర్షుడితో ఈవిధంగా అంటున్నారు.

చిరాత్ ప్రభృతి నో బ్రహ్మన్ శ్రోతు మిచ్ఛా ప్రవర్తతే ।
నామ్నామష్టశతం బ్రూహి యత్ త్వయోక్తం పురా రవేః ॥ 32 ॥

బ్రహ్మదేవా! చాలాకాలం నుండి మాకు సూర్యుడి 108 (అష్టోత్తరశత) నామాలను వినాలనే కోరిక ఉన్నది. ఈస్తోత్రాన్ని ఇంతకు మునుపు నీవే చెప్పావు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మదేవుడు మహర్షులతో అష్టోత్తరశతనామస్తోత్రాన్ని ఇలా చెప్తున్నాడు.

అష్టోత్తరశతం నామ్నాం శృణుధ్వం గదతో మమ ।
భాస్కరస్య పరం గుహ్యం స్వర్గమోక్షప్రదం ద్విజాః ॥ 33 ॥

బ్రాహ్మణులారా! సూర్యుడి అష్టోత్తరశతనామస్తోత్రం చాలా రహస్యం. అయినా చెప్తాను వినండి. ఈస్తోత్రం మొదట స్వర్గాన్నీ, పిదప మోక్షాన్నీ ఇస్తుంది.

ఓమ్. సూర్యోఽ ర్యమా భగ స్త్వష్టా పూషాఽ ర్క స్సవితా రవిః ।
గభస్తిమా నజః కాలో మృత్యుర్ధాతా ప్రభాకరః ॥ 34 ॥

1. సూర్యుడు, 2. అర్యముడు, 3. భగుడు, 4. త్వష్ట, 5. పూషుడు, 6. అర్కుడు, 7. సవిత, 8. రవి, 9. గభస్తిమంతుడు, 10. అజుడు, 11. కాలుడు, 12. మృత్యువు, 13. ధాత, 14. ప్రభాకరుడు,

పృథివ్యాపశ్చ తేజశ్చ ఖం వాయుశ్చ పరాయణమ్ ।
సోమో బృహస్పతి శ్శుక్రో బుధోఽ ఙ్గారక ఏవ చ ॥ 35 ॥

15. పృథివి, 16. అప్పు(జలం), 17. తేజస్సు (అగ్ని), 18. ఆకాశం, 19. వాయువు, 20. పరాయణుడు, 21. సోముడు, 22. బృహస్పతి, 23. శుక్రుడు, 24. బుధుడు, 25. అంగారకుడు,

ఇన్ద్రో వివస్వాన్ దీప్తాంశు, శ్శుచి శ్శౌరి శ్శనైశ్చరః ।
బ్రహ్మా విష్ణుశ్చ రుద్రశ్చ స్కన్దో వైశ్రవణో యమః ॥ 36 ॥

26. ఇంద్రుడు, 27. వివస్వంతుడు, 28. దీప్తాంశువు, 29. శుచి, 30. శౌరి, 31. శనైశ్చరుడు, 32. బ్రహ్మ, 33. విష్ణువు, 34. రుద్రుడు, 35. స్కందుడు, 36. వైశ్రవణుడు, 37. యముడు,

వైద్యుతో జాఠర శ్చాగ్ని రైన్ధన స్తేజసాం పతిః ।
ధర్మధ్వజో వేదకర్తా వేదాఙ్గో వేదవాహనః ॥ 37 ॥

38. వైద్యుతుడు, 39. జఠరాగ్ని, 40. ఇంధనాగ్ని, 41. తేజస్పతి (తేజసాం పతి), 42. ధర్మధ్వజుడు, 43. వేదకర్త, 44. వేదాంగుడు, 45. వేదవాహనుడు,

కృతం త్రేతా ద్వాపరశ్చ కలి స్సర్వామరాశ్రయః ।
కలాకాష్ఠాముహూర్తాశ్చ క్షపా యామ స్తథా క్షణాః ॥ 38 ॥

46. కృత(యుగ)ం, 47. త్రేత 48. ద్వాపరం, 49. కలి(యుగం), 50. సర్వామరాశ్రయుడు, 51. కళ, 52.కాష్ఠ, 53.ముహూర్తం, 54. క్షప, 55. యామం (జాము–మూడు గంటల సమయం), 56. క్షణం, (7–29)

సంవత్సరకరోఽ శ్వత్థః కాలచక్రో విభావసుః ।
పురుష శ్శాశ్వతో యోగీ వ్యక్తావ్యక్త స్సనాతనః ॥ 39 ॥

57. సంవత్సరకరుడు, 58. అశ్వత్థం, 59. కాలచక్రం, 60. విభావసుడు, 61. శాశ్వతపురుషుడు, 62. యోగి, 63. వ్యక్తావ్యక్తుడు, 64. సనాతనుడు,

కాలాధ్యక్షః ప్రజాధ్యక్షో విశ్వకర్మా తమోనుదః ।
వరుణ స్సాగరోఽంశశ్చ జీమూతో జీవనోఽరిహా ॥ 40 ॥

65. కాలాధ్యక్షుడు, 66. ప్రజాధ్యక్షుడు, 67. విశ్వకర్మ, 68. తమోనుదుడు, 69. వరుణుడు, 70. సాగరుడు, 71. అంశుడు, 72. జీమూతుడు, 73. జీవనుడు, 74. అరిఘ్నుడు,

భూతాశ్రయో భూతపతి స్సర్వలోకనమస్కృతః ।
స్రష్టా వివర్తకో యజ్ఞీ సర్వస్యాదిరలోలుపః ॥ 41 ॥

75. భూతాశ్రయుడు, 76. భూతపతి, 77. సర్వలోకనమస్కృతుడు, 78. స్రష్ట, 79. వివర్తకుడు, 80. యజ్ఞి, 81. సర్వాది, 82. అలోలుపుడు,

అనన్తః కపిలో భానుః కామద స్సర్వతోముఖః ।
జయో విశాలో వరద స్సర్వభూతహితే రతః ॥ 42 ॥

83. అనంతుడు, 84. కపిలుడు, 85. భానుడు, 86. కామదుడు, 87. సర్వతోముఖుడు, 88. జయుడు, 89. విశాలుడు, 83. వరదుడు, 84. సర్వభూతహితరతుడు,

మనస్సుపర్ణో భూతాదిశ్శీఘ్రగః ప్రాణధారణః ।
ధన్వన్తరి ర్ధూమకేతు రాదిదేవోఽదితే స్సుతః ॥ 43 ॥

90. మనస్సు, 91. సుపర్ణుడు, 92. భూతాది, 93. శీఘ్రగుడు, 94. ప్రాణధారణుడు, 95. ధన్వంతరి, 96. ధూమకేతువు, 97. ఆదిదేవుడు, 98. అదితిసుతుడు,

ద్వాదశాత్మా రవిర్దక్షః పితా మాతా పితామహః ।
స్వర్గద్వారం ప్రజాద్వారం మోక్షద్వారం త్రివిష్టపమ్ ॥ 44 ॥

99. ద్వాదశాత్ముడు, 100. రవి, 101. దక్షుడు, 102. పిత, 103. మాత, 104. పితామహుడు, 105. స్వర్గద్వారం, 106. ప్రజాద్వారం, ప్రజాద్వారం 107. మోక్షద్వారం, 108. త్రివిష్టపం,

దేహకర్తా ప్రశాన్తాత్మా విశ్వాత్మా విశ్వతోముఖః ।
చరాచరాత్మా సూక్ష్మాత్మా మైత్రేయః కరుణాన్వితః ॥ 45 ॥

109. దేహకర్త, 110. ప్రశాంతాత్ముడు, 111. విశ్వాత్ముడు, 112. విశ్వతోముఖుడు, 113. చరాచరాత్ముడు, 114. సూక్ష్మాత్ముడు, 115. మైత్రేయుడు, 116. కరుణాన్వితుడు. (అష్టోత్తరశతనామాలు 116 అయినాయి. ఈనామాలవిభాగం, దానిని అనుసరించి ఉండే నామసంఖ్యలవిషయంలో భేదాలు గోచరిస్తాయి.)

ఏతద్ వై కీర్తనీయస్య సూర్యస్యామితతేజసః ।
నామ్నామష్టశతం రమ్యం మయా ప్రోక్తం ద్విజోత్తమాః ॥ 46 ॥

బ్రాహ్మణోత్తములారా! సూర్యుడు స్తుతింపదగినవాడు. అపరిమితమయిన తేజస్సు కలిగినవాడు. ఆసూర్యుడికి సంబంధించిన మనోహర మయిన108 నామాల స్తోత్రం ఇది. మీకు చెప్పాను.

సురగణపితృయక్షసేవితం హ్యసురనిశాకరసిద్ధవన్దితమ్ ।
వరకనకహుతాశనప్రభం ప్రణిపతితోఽస్మి హితాయ భాస్కరమ్ ॥ 47 ॥

దేవతాగణాలూ, పితృదేవతలూ, యక్షులు సూర్యభగవానుడిని సేవిస్తారు. అసురులూ, చంద్రుడూ, సిద్ధులూ సూర్యుడికి నమస్కరిస్తారు. సూర్యుడు మేలిమిబంగారం, అగ్నిజ్వాలవంటి కాంతి గలిగినవాడు. శుభం జరగడానికి అటువంటి సూర్యుడికి వినమ్రంగా నమస్కరిస్తున్నాను.

సూర్యోదయే య స్సుసమాహితః పఠేత్ స పుత్రదారాన్ ధనరత్నసఞ్చయాన్ ।
లభేత జాతిస్మరతాం నరస్సదా స్మృతిం చ మేధాం చ స విన్దతే పరామ్ ॥ 48 ॥

ఈఅష్టోత్తరశతనామస్తోత్రాన్ని సూర్యుడు ఉదయించే సమయంలో శ్రద్ధగా చదివినవాడు, భార్యనూ, పుత్రసంతానాన్నీ, ధనాన్నీ, రత్నాల కుప్పలనూ, పూర్వజన్మస్మృతినీ, జ్ఞాపకశక్తినీ, ఉత్తమమయిన బుద్ధినీ పొందుతాడు.

ఇమం స్తవం దేవవరస్య యో నరః ప్రకీర్తయేచ్ఛుద్ధమనా స్సమాహితః ।
విముచ్యతే శోకదవాగ్నిసాగరా ల్లభేత కామాన్ మనసా యథేప్సితాన్ ॥ 49 ॥

దేవతాశ్రేష్ఠుడయిన సూర్యభగవానుడి ఈఅష్టోత్తరశతనామస్తోత్రాన్ని నిర్మలమయిన మనస్సుతో, శ్రద్ధగా గానం చేసిన మానవుడు దావాగ్నివంటి, సముద్రంలాంటి (సంసార)దుఃఖంనుండి బయటపడతాడు. మనసులో కోరుకున్న కోరికలన్నిటినీ పొందుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భృషిసంవాదే సూర్యనామాష్టోత్తరశతం నామైకత్రింశోఽధ్యాయః ॥ 31 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషి సంవాదంలో సూర్యనామాష్టోత్తరశతనామం అనే ముప్పైఒకటవ సంపూర్ణం.



ద్వాత్రింశోఽధ్యాయః - ముప్పైరెండవ అధ్యాయం

రుద్రాఖ్యానమ్ - రుద్రాఖ్యానం

బ్రహ్మోవాచ :- బ్రహ్మదేవుడు మహర్షులతో ఇలా చెప్తున్నాడు.

యోఽసౌ సర్వగతో దేవ స్త్రిపురారి స్త్రిలోచనః ।
ఉమాప్రియకరో రుద్ర శ్చన్ద్రార్ధకృతశేఖరః ॥ 1 ॥

రుద్రుడు సర్వాంతర్యామి. దేవుడు, త్రిపురాసురులను చంపినవాడు. మూడుకన్నులు గలిగినవాడు, ఉమాదేవికి ఇష్టమయినవాడు. శిరసున చంద్రరేఖను అలంకరించుకున్నవాడు.

విద్రావ్య విబుధాన్ సర్వాన్ సిద్ధవిద్యాధరాన్ ఋషీన్ ।
గన్ధర్వయక్షనాగాంశ్చ తథాఽన్యాంశ్చ సమాహితాన్ ॥ 2 ॥

జఘాన పూర్వం దక్షస్య యజతో ధరణీతలే ।
యజ్ఞం సమృద్ధం రత్నాఢ్యం సర్వసమ్భారసంభృతమ్ ॥ 3 ॥

ఆపరమేశ్వరుడు పూర్వం దక్షుడు యజ్ఞం చేస్తుండగా, యాగస్థలానికి వచ్చిన సమస్తదేవతలనూ, సిద్ధులనూ, విద్యాధరులనూ, మహర్షులనూ, గంధర్వులనూ, యక్షులనూ, నాగులనూ, అలాగే ఇతరు లందరినీ పారద్రోలి, చంపివేశాడు. అపుడు ఆయజ్ఞవాటిక సమస్తమయిన యజ్ఞద్రవ్యాలతో సమృద్ధంగా ఉన్నది. రత్నాలతో నిండి ఉన్నది. సమస్తమయిన యజ్ఞవస్తువులతో సహా శివుడు యజ్ఞవాటికను ధ్వంసం చేశాడు.

యస్య ప్రతాపసంత్రస్తా శ్శక్రాద్యా స్త్రిదివౌకసః ।
శాన్తిం న లేభిరే విప్రాః పునస్తం శరణం గతాః ॥ 4 ॥

బ్రాహ్మణులారా! ఇంద్రుడు మొదలయిన దేవతలు ఆరుద్రుడి పరాక్రమానికి బాగా భయపడిపోయారు. ఎక్కడా శాంతి దొరకక, చివరికి ఆరుద్రుడినే శరణు కోరుకున్నారు.

స ఆస్తే తత్ర వరద శ్శూలపాణిః వృషధ్వజః ।
పినాకపాణి ర్భగవాన్ దక్షయజ్ఞవినాశనః ॥ 5 ॥

మహాదేవోత్కలే దేశే కృత్తివాసా వృషధ్వజః ।
ఏకామ్రకే మునిశ్రేష్ఠా స్సర్వకామప్రదో హరః ॥ 6 ॥

మునివరులారా! ఆమహాదేవుడు వరాలు ఇచ్చేవాడు. ఒకచేత శూలం ధరించాడు. మరొక చేత పినాకం అనే ధనుస్సును ధరించాడు. అతడిపతాకం మీద ఎద్దు గుర్తు ఉన్నది. ఆభగవానుడు దక్షయజ్ఞాన్ని ధ్వంసం చేశాడు. చర్మాన్ని వస్త్రంలాగా ధరించాడు. ఆపరమేశ్వరుడు అందరికీ కావలసిన వరాలను ప్రసాదిస్తూ, ఉత్కలదేశంలో ఏకామ్రనగరంలో నెలకొన్నాడు.

మునయ ఊచుః :-మహర్షులు బ్రహ్మదేవుడితో ఈవిధంగా అంటున్నారు.

కిమర్థం స భవో దేవ స్సర్వభూతహితే రతః ।
జఘాన యజ్ఞం దక్షస్య దేవై స్సర్వైరలఙ్కృతమ్ ॥ 7 ॥

మహాత్మా! ఎల్లపుడూ సమస్తభూతకోటికీ మేలు చేయగోరే మహాదేవుడు దేవతలందరూ వేంచేసి ఉన్న ఆదక్షుడి యజ్ఞాన్ని ఎందుకు నాశనం చేశాడు?

న హ్యల్పం కారణం తత్ర ప్రభో మన్యామహే వయమ్ ।
శ్రోతుమిచ్ఛామహే బ్రూహి పరం కౌతూహలం హి నః ॥ 8 ॥

పరమేశ్వరుడు ఈవిధంగా చేయడంలో ఏదో పెద్ద కారణమే ఉండి ఉంటుందనుకుంటున్నాం. ఆవృత్తాంతాన్ని మేమందరం వినగోరుతున్నాం. మాకు చాలా కుతూహలంగా ఉంది. చెప్పవలసినది.

బ్రహ్మోవాచ :-బ్రహ్మదేవుడు మహర్షులకు దక్షాధ్వరధ్వంసవృత్తాంతాన్ని ఇలా చెప్తున్నాడు.

దక్షస్యాసన్నష్టకన్యాయాశ్చైవ పతిసఙ్గతాః ।
స్వేభ్యో గృహేభ్యశ్చానీయ తాః పితాఽభ్యర్చయద్ గృహే ॥ 9 ॥

దక్షప్రజాపతికి ఎనమండుగురు కూతుళ్లు. అందరికీ పెళ్లిళ్లయి భర్తలతో కలిసి, సుఖంగా జీవిస్తున్నారు. దక్షుడు కూతుళ్లను వారియింటినుండి తీసుకునివచ్చి, తనయింట వారికి సత్కారాలు చేశాడు.

తత స్త్వభ్యర్చితా విప్రా నివసన్త్యః పితుర్గృహే ।
తాసాం జ్యేష్ఠా సతీ నామ పత్నీయా త్ర్యమ్బకస్య వై ।
నాజుహావాత్మజాం తాం వై దక్షో రుద్ర మభిద్విషన్ ॥ 10 ॥

దక్షుడి కుమార్తెలు కూడ తండ్రిసత్కారాలకు సంతోషించి, తండ్రి యింటిలో ఉంటున్నారు. దక్షుడి కూతుళ్లలో సతి అనే ఆమె పెద్దది. ఆమె ముక్కంటిభార్య. దక్షుడు రుద్రుడిని చాల ద్వేషిస్తుంటాడు. అల్లుడిమీది కోపంతో దక్షుడు కూతురయిన సతిని తన యింటికి ఆహ్వానించలేదు.

అకరోత్ సన్నతిం దక్షే న చ కాఞ్చిన్మహేశ్వరః ।
జామాతా శ్వశురే తస్మిన్ స్వభావా త్తేజసి స్థితః ॥ 11 ॥

అల్లుడూ, శక్తిమంతుడూ అయిన మహేశ్వరుడు సహజలక్షణంచేత మామగారయిన దక్షుడియెడల విధేయత చూపలేదు.

తతో జ్ఞాత్వా సతీ సర్వాం స్తాస్తు ప్రాప్తాః పితుర్గృహమ్ ।
ఆజగామాప్యనాహూతా సా సతీ స్వపితుర్గృహమ్ ॥ 12 ॥

తనచెల్లెళ్ళు అందరూ పుట్టింటికి వచ్చారని సతికి తెలిసింది. పిలవకపోయినా, (తానూ) తండ్రి యింటికి వచ్చింది.

తాభ్యో హీనాం పితా చక్రే సత్యాః పూజామసమ్మతామ్ ।
తతోఽబ్రవీత్ సా పితరం దేవీ క్రోధాదమర్షితా ॥ 13 ॥

సతి అంటే ఇష్టం లేకపోవటంచేత దక్షుడు మిగిలిన కూతుళ్లకంటె సతిని గౌరవించడంలో తక్కువ చేశాడు. సతీదేవి ఆఅవమానాన్ని సహించలేకపోయింది. కోపంగా తండ్రితో ఇలా అన్నది.

సత్యువాచ :– సతీదేవి దక్షప్రజాపతితో ఈవిధంగా అంటున్నది.

యవీయసీభ్య శ్శ్రేష్ఠాఽహం కిం న పూజసి మాం విభో ।
అసత్కృతా మవిజ్ఞాయ కృతవానసి గర్హితామ్ ।
అహం జ్యేష్ఠా వరిష్ఠా చ మాం త్వం సత్కర్తుమర్హసి ॥ 14 ॥

తండ్రీ, వీరందరూ నాకంటె చిన్నవారు. వీరికంటె నేను పూజ్యురాలిని. నన్ను సరిగా సత్కరించవేమిటి? అజ్ఞానంతో నన్ను సత్కరించకుండా అవమానం చేశావు. నీకుమార్తె లందరిలోనూ నేను జ్యేష్ఠురాలిని. ఉత్తమురాలిని. నన్ను నీవు సముచితంగా సత్కరించాలి.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవముక్తోఽబ్రవీదేనాం దక్ష స్సంరక్తలోచనః ॥ 15 ॥

ఆవిధంగా పలికిన సతీదేవితో దక్షుడు కోపంతో ఎఱ్ఱబడిన కళ్లతో ఈవిధంగా అన్నాడు.

దక్ష ఉవాచ :–సతీదేవితో దక్షుడు ఈవిధంగా అంటున్నాడు.

త్వత్తశ్శ్రేష్ఠా వరిష్ఠాశ్చ పూజ్యా బాలా స్సుతా మమ ।
తాసాం యే చైవ భర్తారస్తే మే బహుమతా స్సతి ॥ 16 ॥

సతీ! నాకుమార్తెలయిన ఈబాలలు (చిన్నవారయినా) నీకంటె అన్నివిధాలుగానూ గొప్పవాళ్లు. పూజింపదగిన వాళ్లు. వీళ్ల భర్తలు కూడ నాకు చాల గౌరవింపదగినవారు.

బ్రహ్మిష్ఠాశ్చ వ్రతస్థాశ్చ మహాయోగా స్సుధార్మికాః ।
గుణైశ్చైవాధికాః శ్లాఘ్యా స్సర్వే తే త్ర్యమ్బకాత్ సతి ॥ 17 ॥

సతీ! ఆఅల్లుళ్లు అందరూ బ్రహ్మజ్ఞానులు. వ్రతపరాయణులు. గొప్ప యోగులు. ఉత్తమధర్మపరులు. సద్గుణాలవలన ఉత్తములు. నీభర్త అయిన ముక్కంటికంటె ప్రశస్తమయినవారు.

వసిష్ఠోఽత్రిః పులస్త్యశ్చ అఙ్గిరాః పులహః క్రతుః ।
భృగుర్మరీచి శ్చతథా శ్రేష్ఠా జామాతరో మమ ॥ 18 ॥

వారు 1. వసిష్ఠుడు, 2. అత్రి, 3. పులస్త్యుడు, 4. అంగిరుడు, 5. పులహుడు, 6. క్రతువు, 7. భృగువు, 8. మరీచి అనే నా అల్లుళ్లు ఉత్తములు. (స్వాయంభువమన్వంతరంలో సప్తర్షులు. బ్రహ్మమానసపుత్రులు. 3.8)

తైశ్చాపి స్పర్ధతే శర్వో నిత్యం తే చైవ తం ప్రతి ।
తేన త్వాం న బుభూషామి ప్రతికూలో హి మే భవః ॥ 19 ॥

నీభర్త రుద్రుడు నిత్యమూ ఉత్తములయిన నాఅల్లుళ్లతో వివాదపడుతుంటాడు. వాళ్లు కూడ రుద్రుడితో విరోధపడుతుంటారు. పరమేశ్వరుడు నాకు కూడ విరోధి. ఆపరమేశ్వరుడికి భార్యవు కావడంచేత నిన్ను నేను సత్కరింపను.

ఇత్యుక్తవాం స్తదా దక్ష స్సమ్ప్రమూఢేన చేతసా ।
శాపార్థ మాత్మనశ్చైవ యేనోక్తా వై మహర్షయః ॥ 20 ॥

మునివరులారా! దక్షుడు సతీదేవితో మిక్కిలి అజ్ఞానంతో ఈవిధంగా (శివనింద చేస్తూ) అన్నాడు. శాపం తనకు రావడానికే ఆవిధంగా పలికి ఉంటాడు.

తథోక్తా పితరం సా వై క్రుద్ధా దేవీ తమబ్రవీత్ ।

ఆవిధంగా తన భర్తను నిందిస్తూ పలికిన తండ్రితో సతీదేవి కోపంగా ఇలా అన్నది.

సత్యువాచ :– దక్షుడితో సతి ఈవిధంగా అంటున్నది.

వాఙ్మనఃకర్మభిర్యస్మా దదుష్టం తం విగర్హసి ।
తస్మాత్త్యజామ్యహం దేహ మిమం తాత తవాత్మజమ్ ॥ 21 ॥

తండ్రీ! నాభర్త వాక్కు, మనస్సు, కాయం అనే త్రికరణాలచేతనూ, ఏతప్పూ చేయలేదు. అయినా, నాభర్తను నీవు ద్వేషిస్తున్నావు. కాబట్టి నీవలన కలిగిన ఈశరీరాన్ని నేను విడిచిపెట్టున్నాను.

బ్రహ్మోవాచ:– మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తత స్తే నాపమానేన సతీ దుఃఖాదమర్షితా ।
అబ్రవీద్ వచనం దేవీ నమస్కృత్య స్వయమ్భువే ॥ 22 ॥

సతీదేవి ఆఅవమానాన్ని సహింపలేకపోయింది. అక్కడే ఉన్న బ్రహ్మదేవుడికి నమస్కరించి, బాధతో ఇలా అన్నది.

సత్యువాచ:– బ్రహ్మతో సతీదేవి ఈవిధంగా అంటున్నది.

యత్రాహ ముపపద్యే వై పునర్దేహేన భాస్వతా ।
తత్రాప్యహ మసమ్మూఢా సమ్భూతా ధార్మికీ పునః ।
గచ్ఛేయం ధర్మపత్నీత్వం త్ర్యమ్బకస్యైవ ధీమతః ॥ 23 ॥

(ఈశరీరం విడిచిన)నేను తిరిగి ప్రకాశించే శరీరంతో ఎక్కడ జన్మిస్తానో, అక్కడ కూడ జ్ఞానవతినై, ధర్మపరాయణనై, తిరిగి ఆపరమేశ్వరుడికే ధర్మపత్ని నవుతాను. (రాబోయే జన్మలో కూడ పరమేశ్వరుడికే భార్య అయ్యే విధంగా చేయమని బ్రహ్మకు సతి వినతి.)

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఇలా చెప్తున్నాడు.

తత్రైవాథ సమాసీనా రుష్టాఽ ఽ త్మానం సమాదధే ।
ధారయామాస చాగ్నేయీం ధారణామాత్మనాఽ ఽ త్మని ॥ 24 ॥

అని పలికి సతి రోషంతో అక్కడే కూర్చుండి, మనస్సును ఏకాగ్రంగా నిశ్చలంగా ఉంచింది. మనసుతోనే తనశరీరంలో అగ్నిని నిలుపుకుంది.

తతస్స్వాత్మాన ముత్థాప్య వాయునా సముదీరితః ।
సర్వాఙ్గేభ్యో వినిస్సృత్య వహ్నిర్భస్మ చకార తామ్ ॥ 25 ॥

తరువాత, గాలి ప్రేరేపింపగా, ఆఅగ్ని ప్రజ్వలించి, సతీదేవి అవయవాలన్నింటినుండి వెలువడి ఆమెను భస్మం చేసింది.

తదుపశ్రుత్య నిధనం సత్యా దేవ్యా స్స శూలధృక్ ।
సంవాదం చ తయోర్బుద్ధ్వా యాథాతథ్యేన శఙ్కరః ।
దక్షస్య చ వినాశాయ చుకోప భగవాన్ ప్రభుః ॥ 26 ॥

సతీదేవి భస్మమయిన వార్తను పరమేశ్వరుడు విన్నాడు. ఆశంకరుడు దక్షుడికీ, సతికీ నడుమ జరిగిన వివాదాన్ని యథాతథంగా తెలుసుకున్నాడు. దక్షుడిపై కోపించాడు. సమర్థుడయిన ఆరుద్రభగవానుడు దక్షుడిని నాశనం చేయాలనుకున్నాడు.

శ్రీశఙ్కర ఉవాచ :-పరమేశ్వరుడు ఈవిధంగా అంటున్నాడు.

యస్మాదవమతా దక్ష సహసైవాగతా సతీ ।
ప్రశస్తా శ్చేతరా స్సర్వాస్త్వత్సుతా భర్తృభి స్సహ ॥ 27 ॥

ఓరీ దక్షా! తొందరపడి (పిలవకపోయినా) నీయింటికి వచ్చిన నాసతిని అవమానించావు. మిగిలిన కుమార్తెల నందరినీ వారి భర్తలతో సహా సత్కరించావు.

తస్మాద్వైవస్వతే ప్రాప్తే పున రేతే మహర్షయః ।
ఉత్పత్స్యన్తి ద్వితీయే వై తవ యజ్ఞే హ్యయోనిజాః ॥ 28 ॥

రాబోయే వైవస్వతమన్వంతరంలో నీవు చేయబోయే రెండవ యాగంలో ఈమహర్షులందరూ (దక్షుడి సత్కారం అందుకున్న అల్లుళ్ళు అయిన సప్తర్షులు 3-8) తిరిగి అయోనిజులుగా పుట్టారు. (సతిని అవమానిస్తుండగా, దక్షుడు శివనింద చేస్తుండగా, నివారించకుండా, ఉపేక్షించారు కాబట్టి దక్షుడి అల్లుళ్లను శివుడు శపించాడు)

హుతే వై బ్రహ్మణస్సత్రే చాక్షుషస్యాన్తరే మనోః ।
అభివ్యాహృత్య సప్తర్షీన్ దక్షం సోఽ భ్యశపత్ పునః ॥ 29 ॥

చాక్షుషమన్వంతరంలో బ్రహ్మదేవుడు చేసే సత్రయాగంలో ఆహుతులు సమర్పించిన పిదప ఈసప్తర్షులు తిరిగి జన్మిస్తారు. ఈ విధంగా సప్తర్షులను శపించిన తరువాత శంకరుడు తిరిగి దక్షుడిని ఇలా శపించాడు.

భవితా మానుషో రాజా చాక్షుషస్యాన్తరే మనోః ।
ప్రాచీనబర్హిషః పౌత్రః పుత్రశ్చాపి ప్రచేతసః ॥ 30 ॥

నీవు కూడ చాక్షుషమన్వంతరంలో ప్రాచీనబర్హికి మనుమడుగా, ప్రచేతసులకు కుమారుడుగా, మానవుడిగా, రాజుగా జన్మిస్తావు.

దక్ష ఇత్యేవ నామ్నా త్వం మారిషాయాం జనిష్యసి ।
కన్యాయాం శాఖినాం చైవ ప్రాప్తే వై చాక్షుషేఽన్తరే ॥ 31 ॥

అప్పుడు కూడ దక్షుడు అనే పేరుతోనే వృక్షాలకు కూతురయిన మారిష అనే స్త్రీకి జన్మిస్తావు. (1-112)

అహం తత్రాపి తే విఘ్న మాచరిష్యామి సువ్రత ।
ధర్మకామార్థయుక్తేషు కర్మస్విహ పునః పునః ॥ 32 ॥

ఉత్తమమయిన నియమాలను ఆచరించేవాడా! నేను అక్కడ కూడ నీవు చేసే ధర్మ, కామాలతో కూడిన కర్మలకు తేపతేపకు అడ్డంకులు కలిగిస్తాను.

తతో వై వ్యాహృతో దక్షో రుద్రం సోఽభ్యశపత్ పునః ॥ 33 ॥

ఈవిధంగా రుద్రుడు తనను శపింపగా, దక్షుడు తిరిగి రుద్రుడిని ఇలా శపించాడు.

దక్ష ఉవాచ :- శంకరుడితో దక్షుడు ఇలా అంటున్నాడు.

యస్మాత్త్వం మత్కృతే క్రూర ఋషీన్ వ్యాహృతవానసి ।
తస్మాత్ సార్ధం సురైర్యజ్ఞే న త్వాం యక్ష్యన్తి వై ద్విజాః ॥ 34 ॥

క్రూరుడా! నానిమిత్తంగా ఈమహర్షులను శపించావు. అందువల్ల ఇక ముందు బ్రాహ్మణులు యజ్ఞాలలో ఇతరదేవతలందరినీ పూజిస్తారు కాని, నిన్ను మాత్రం పూజించకుందురు గాక!

కృత్వాఽఽహుతిం తవ క్రూర అపః స్పృశన్తి కర్మసు ।
ఇహైవ వత్స్యసే లోకే దివం హిత్వాఽఽయుగక్షయాత్ ।
తతో దేవైశ్చ తైస్సార్ధం నేజ్యసే పృథివీతలే ॥ 35 ॥

దుర్మార్గుడా! ఒకవేళ (పొరపాటున) నీకు ఆహుతులు ఇస్తే, ఆకర్మలలో వెంటనే జలాన్ని స్పృశిస్తారు. (శివుడికి ఆహుతి ఇవ్వడం అనే పాపం పోయి, పవిత్రం కావడానికి నీళ్లను తాకుతారు.) ఈయుగం పూర్తి అయ్యేవరకు నీవు ఈలోకంలోనే ఉంటావు. దేవలోకానికి వెళ్లలేవు. అందుచేత ఈభూమిమీద ఎవ్వరూ నిన్ను దేవుడుగా పూజించరు.

రుద్ర ఉవాచ :- దక్షుడితో రుద్రుడు ఇలా అంటున్నాడు.

చాతుర్వర్ణ్యం తు దేవానాం తే చాప్యేకత్ర భుఞ్జతే ।
న భోక్ష్యే సహితై స్తైస్తు తతో భోక్ష్యామ్యహం పృథక్ ॥ 36 ॥

దేవతలు వారిలోని నాలుగు వర్ణాలవారితో కలిసి, ఒకే బంతిలో భోజనాలు చేస్తారు. నేను వారితో కలిసి తినను. వేరుగా భుజిస్తాను.

సర్వేషామేవ లోకానా మాది ర్భూలోక ఉచ్యతే ।
తమహం ధారయామ్యేక స్స్వేచ్ఛయా న తవాజ్ఞయా ॥ 37 ॥

లోకాలన్నిటిలోనూ భూలోకమే మొదటిది అని చెప్తారు. ఆభూలోకాన్ని నేనొక్కడినే పోషిస్తాను. ఇది నాయిష్టప్రకారం చేస్తాను కాని, నీ ఆజ్ఞప్రకారం కాదు.

తస్మిన్ ధృతే సర్వలోకా స్సర్వే తిష్ఠన్తి శాశ్వతాః ।
తస్మాదహం వసామీహ సతతం న తవాజ్ఞయా ॥ 38 ॥

ఆభూలోకాన్ని కాపాడితే లోకాలు అన్నీ స్థిరంగా సురక్షితంగా ఉంటాయి. అందుచేత నేను ఎప్పుడూ భూలోకంలోనే ఉంటాను. అంతే కాని నీవు ఆజ్ఞాపించావని కాదు. (భూలోకంలో ఉండే లోకాలు అన్నిటినీ రక్షిస్తానని తాత్పర్యం)

బ్రహ్మోవాచ :- మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా అంటున్నాడు.

తతోఽభివ్యాహృతో దక్షో రుద్రేణామితతేజసా ।
స్వాయమ్భువీం తనుం త్యక్త్వా ఉత్పన్నో మానుషేష్విహ ॥ 39 ॥

ఈవిధంగా మిక్కిలి తేజస్వి అయిన రుద్రుడు శపింపగా, దక్షుడు స్వాయంభువుడికి సంబంధించిన (బ్రహ్మమానసపుత్రుడుగా లభించిన) శరీరాన్ని విడిచిపెట్టి, భూలోకంలో మానవుడుగా జన్మించాడు.

యదా గృహపతిర్దక్షో యజ్ఞానామీశ్వరః ప్రభుః ।
సమస్తేనేహ యజ్ఞేన సోఽయజ ద్దైవతైస్సహ ॥ 40 ॥

మానవజన్మలో కూడ దక్షుడు అనే పేరుతోనే గృహస్థాశ్రమాన్ని స్వీకరించాడు. సమర్థుడయిన దక్షుడు యజ్ఞాలకు యజమాని అయినాడు. దేవతలతో కలిసి వివిధమయిన యజ్ఞాలన్నీ ఆచరించాడు.

అథ దేవీ సతీ యా తు ప్రాప్తే వైవస్వతేఽన్తరే ।
మేనాయాం తాముమాం దేవీం జనయామాస శైలరాట్ ॥ 41 ॥

వైవస్వతమన్వంతరం ప్రవేశించగానే సతీదేవి హిమవంతుడికి మేన అనే భార్యయందు ఉమాదేవిగా జన్మించింది.

సా తు దేవీ సతీ పూర్వమాసీత్ పశ్చాదుమాఽభవత్ ।
సహవ్రతా భవస్యైవ నైతయా ముచ్యతే భవః ।
యావదిచ్ఛతి సంస్థానం ప్రభుర్మన్వన్తరేష్విహ ॥ 42 ॥

ఆమె మొదట సతీదేవి అనేపేరుతోనే ఉండేది. ఆతర్వాత ఉమ అనే పేరు గలిగిన దయింది. పరమేశ్వరుడికి సహధర్మచారిణి అయింది. పరమేశ్వరుడు ఇక్కడ ఎన్ని మన్వంతరాలు ఉండాలనుకుంటాడో అంతకాలమూ,ఎప్పుడూ ఉమాదేవిని విడిచిఉండడు.

మారీచం కశ్యపం దేవీ యథాఽదితిరనువ్రతా ।
సార్ధం నారాయణం శ్రీస్తు మఘవన్తం శచీ యథా ॥ 43 ॥

విష్ణుం కీర్తి రుషా సూర్యం వసిష్ఠం చాప్యరున్ధతీ ।
నైతాంస్తు విజహత్యేతా భర్తౄన్ దేవ్యః కథఞ్చన ॥ 44 ॥

మరీచి మహర్షిపుత్రుడయిన కశ్యపుడిని అదితి, నారాయణుడిని లక్ష్మీదేవి, దేవేంద్రుడిని శచీదేవి, శ్రీమహావిష్ణువును కీర్తి, సూర్యుడిని ఉషాదేవి, వసిష్ఠమహర్షిని అరుంధతి, పతివ్రతలయి, భర్తను నిరంతరమూ విడువకుండా కలిసి ఉన్నట్లుగా ఉమాదేవి పరమేశ్వరుడిని అనుసరించి ఉంటుంది.

ఏవం ప్రాచేతసో దక్షో జజ్ఞే వై చాక్షుషేఽన్తరే ।
ప్రాచీనబర్హిషః పౌత్రః పుత్ర శ్చాపి ప్రచేతసామ్ ॥ 45 ॥

ఈ విధంగా చాక్షుషమన్వంతరంలో ప్రాచీనబర్హికి మనుమడిగానూ, ప్రచేతసులకు పుత్రుడుగానూ దక్షుడు జన్మించాడు.

దశభ్యస్తు ప్రచేతేభ్యో మారిషాయాం పున ర్నృపః ।
జజ్ఞే రుద్రాభిశాపేన ద్వితీయ మితి న శ్శ్రుతమ్ ॥ 46 ॥

రుద్రుడిశాపంచేత ప్రచేతసులు పదిమందికీ మారిషఅనేస్త్రీయందు రెండవసారి దక్షుడు రాజుగా జన్మించాడని విన్నాం. (1.103)

భృగ్వాదయస్తు తే సర్వే జజ్ఞిరే వై మహర్షయః ।
ఆద్యే త్రేతాయుగే పూర్వం మనోర్వైవస్వతస్య హ ।
దేవస్య మహతో యజ్ఞే వారుణీం బిభ్రత స్తనుమ్ ॥ 47 ॥

పూర్వం వైవస్వతమన్వంతరంలోని మొదటిత్రేతాయుగంలో బ్రహ్మదేవుడు వరుణుడికి సంబంధించిన రూపాన్ని ధరించి చేస్తున్నయజ్ఞంలో భృగువు మొదలయిన మహర్షులు అందరూ తిరిగి జన్మించారు.

ఇత్యేషోఽనుశయో హ్యాసీ త్తయో ర్జాత్యన్తరే గతః ।
శాపే తయో ర్వై దక్షస్య త్ర్యమ్బకస్య చ ధీమతః ॥ 48 ॥

దక్షుడూ, సర్వజ్ఞుడయినపరమేశ్వరుడూ విరోధంతో పరస్పరం ఇచ్చుకున్నశాపాలవలన తరువాతి పుట్టుకలలో కూడ వాళ్లిద్దరిమధ్యా విరోధం కొనసాగింది.

తస్మా న్న సంశయః కార్యో వైరేష్విహ కదాచన ॥ 49 ॥

అందుచేత పూర్వజన్మలోని విరోధాలు (మొద లయినభావాలు) తరువాతిజన్మలలోకి కూడ అనుసరించి వస్తాయనడంలో సందేహపడనవసరంలేదు.

జాత్యన్తరగతస్యాపి భావితస్య శుభాశుభైః ।
జన్తో ర్న భూతయే ఖ్యాతి స్త న్న కార్యం విజానతా ॥ 50 ॥

తాము చేసిన పుణ్యపాపకర్మలు తరువాతిజన్మలలో తమను అనుసరించి వస్తాయి. (తరువాత పుణ్యాపాపకర్మలకు అనుగుణమయిన జన్మ వస్తుంది.) అందుచేత ఆజన్మలలో కూడ జీవులకు అపూర్వంగా మేలు జరగదు. కాబట్టి బుద్ధిమంతుడు ఎవరితోనూ వైరం పెట్టుకోగూడదు.

(దేహాన్తరే స్వభావశ్చ పున ర్దేహం న ముఞ్చతి, వాసనా న జహా త్యేవ దేహాన్తరగతేష్వపి.
దుఃఖం త్వనుశయాత్ పుంస స్త్రత్ర కార్యం విజానతా.

తరువాతిజన్మలో వేరొకఉపాధి ఏర్పడినా, పూర్వజన్మలోని శరీరానికి సంబంధించినధర్మం తరువాతిశరీరాన్ని విడిచిపెట్టదు. వేరొక శరీరం పొందినప్పటికీ, పూర్వజన్మవాసనలు నశించవు. విరోధంవలన జీవులకు ఎప్పటికీ దుఃఖమే. బుద్ధిమంతులు ఎవరితోనూ వైరం పెట్టుకోవడం తగదు.)

మునయ ఊచుః – బ్రహ్మదేవుడితో మహర్షులు ఈవిధంగా అంటున్నారు.

కథం రోషేణ సా పూర్వం దక్షస్య దుహితా సతీ
త్యక్త్వా దేహం పున ర్జాతా గిరిరాజగృహే ప్రభో ॥ 51 ॥

ప్రభూ! దక్షప్రజాపతి కూతురయిన సతి, తండ్రిపై కోపంతో శరీరాన్ని విడిచిపెట్టి, మళ్లీ హిమవంతుడిఇంట ఏవిధంగా జన్మించింది?

దేహాన్తరే పున స్తస్యాః కథం దేహో బభూవ హ ।
భవేన సహ సంయోగ స్సంవాదశ్చ తయోః కథమ్ ॥ 52 ॥

తరువాతిజన్మలో సతీదేవికి ఎటువంటిశరీరం కలిగింది? ఆమెకు పరమేశ్వరుడితో సమాగమం ఎలా సంభవించింది? పార్వతీపరమేశ్వరులమధ్య జరిగినసంవాదం ఏమిటి?

స్వయంవరః కథం వృత్త స్తస్మిన్ మహతి జన్మని ।
వివాహశ్చ జగన్నాథ సర్వాశ్చర్యసమన్వితః ॥ 53 ॥

లోకేశ్వరా! ఉత్తమమయిన ఆజన్మలో పార్వతి పరమేశ్వరుడిని స్వయంగా ఏవిధంగా వరించింది? వారి వివాహం ఎంతో ఆశ్చర్యకరం. పార్వతీకల్యాణం ఏవిధంగా జరిగింది?

తత్సర్వం విస్తరాద్ బ్రహ్మన్ వక్తు మర్హసి సామ్ప్రతమ్ ।
శ్రోతుమిచ్ఛామహే పుణ్యాం కథాంచాతిమనోహరామ్ ॥ 54 ॥

బ్రహ్మదేవా! ఆవృత్తాంతం అంతా సవిస్తరంగా ఇప్పుడే నీవు చెప్పదగుదువు. ఎంతో హృదయంగమ మయిన ఆపుణ్యకథను వినాలని కోరుతున్నాం.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మ పార్వతీపరమేశ్వరకల్యాణం గురించి ఇలా చెప్తున్నాడు.

శృణుధ్వం మునిశార్దూలాః కథాం పాపప్రణాశినీమ్ ।
ఉమాశఙ్కరయోః పుణ్యాం సర్వకామఫలప్రదామ్ ॥ 55 ॥

మునిసత్తములారా! పార్వతీపరమేశ్వరులపుణ్యకథ సమస్తమయిన పాపాలను నాశనం చేస్తుంది. అన్ని కోరికలనూ తీరుస్తుంది. ఆకథను వినండి.

కదాచిత్ స్వగృహాత్ ప్రాప్తం కశ్యపం ద్విపదాం వరమ్ ।
అపృచ్ఛద్ధిమవాన్ వృత్తం లోకే ఖ్యాతికరం హితమ్ ॥ 56 ॥

వినండి. ఒకానొకప్పుడు మానవోత్తముడయిన కశ్యపమహర్షి హిమవంతుడియింటికి వచ్చాడు. అప్పుడు హిమవంతుడు కశ్యపుడిని 'మానవులందరికి మేలు చేసేదీ, కీర్తి కలిగించేదీ అయిన పూర్వం జరిగినకథను' ఉద్దేశించి అడిగాడు.

కేనాక్షయాశ్చ లోకాస్స్యుః ఖ్యాతిశ్చ పరమా మునే ।
తథైవ చార్చనీయత్వం సత్సు తత్ కథయస్వ మే ॥ 57 ॥

మహర్షీ! శాశ్వతమయిన ఉత్తమలోకాలు దేనివలన సిద్ధిస్తాయి? ఉత్తమమయిన కీర్తి ఎలా కలుగుతుంది? సత్పురుషులలో గౌరవస్థానం ఎలా లభిస్తుంది? ఆవిషయాలను వివరించవలసింది. (అని హిమవంతుడు కశ్యపుడిని అడిగాడు.)

కశ్యప ఉవాచ :–కశ్యపమహర్షి హిమవంతుడితో ఈవిధంగా చెప్తున్నాడు.

అపత్యేన మహాబాహో సర్వమేతదవాప్యతే ।
మమాఖ్యాతిరపత్యేన బ్రహ్మణో ఋషిభి స్సహ ॥ 58 ॥

గొప్పభుజబలం గలిగినవాడా! నీవు కోరినవి అన్నీ సంతానంవల్ల లభిస్తాయి. బ్రహ్మకూ, మహర్షులకూ, నాకు కూడ ఈవిధంగా సంతానంవల్లనే గొప్పప్రసిద్ధి కలిగింది.

కిం న పశ్యసి శైలేన్ద్ర యతో మాం పరిపృచ్ఛసి ।
వర్తయిష్యామి యచ్చాపి యథా దృష్టం పురాఽచల ॥ 59 ॥

పర్వతరాజా! నీవు మాత్రం చూడటం లేదా? మళ్లీ నన్ను అడుగుతా వెందుకు? హిమవత్పర్వతా! పూర్వం నేను చూచినదానిని యథాతథంగా నీకు చెప్తాను.

వారాణసీ మహం గచ్ఛ న్నపశ్యం సంస్థితం దివి ।
విమానం సునవం దివ్య మనౌపమ్యం మహర్ధిమత్ ॥ 60 ॥

ఒకప్పుడు నేను వారాణసీనగరానికి వెళ్తూ ఆకాశంలో ఒకానొకవిమానాన్ని చూశాను. అది చాల క్రొత్తగా ఉన్నది. దేవలోకానికి సంబంధించినది. ఎక్కడా సాటి లేనిది. సమృద్ధ మయినది.

తస్యాధస్తా దార్తనాదం గర్తస్థానే శృణోమ్యహమ్ ।
తమహం తపసా జ్ఞాత్వా తత్రైవాన్తర్హితః స్థితః ॥ 61 ॥

ఆవిమానానికి కిందుగా ఒకగుంటలో బాధనిండినఅరుపు విన్నాను. తపశ్శక్తితో దానిని గూర్చి తెలుసుకున్నాను. ఎవ్వరికీ కనబడకుండా అక్కడే ఉన్నాను.

అథాగాత్తత్ర శైలేన్ద్ర విప్రో నియమవాన్ శుచిః ।
తీర్థాభిషేకపూతాత్మా పరే తపసి సంస్థితః ॥ 62 ॥

పర్వతరాజా! ఆగుంటదగ్గరకు ఒకానొకబ్రాహ్మణుడు వచ్చాడు. అతడు నియమవంతుడు. శుచి. నీటితో పూర్తిగా తడిసి, పవిత్రంగా ఉన్నాడు. గొప్పతపోదీక్షలో ఉన్నాడు.

అథ స వ్రజమానస్తు వ్యాఘ్రేణాభీషితో ద్విజః ।
వివేశ తం తదా దేశం స గర్తో యత్ర భూధర ॥ 63 ॥

హిమవత్పర్వతా! ఆబ్రాహ్మణుడు దారిన వెళ్తూ, ఒకపెద్దపులిని చూచి, భయపడ్డాడు. పారిపోతూ వచ్చి, ఆగుంటలో పడిపోయాడు.

గర్తాధో వీరణస్తమ్బే లమ్బమానాం స్తదా పితౄన్ ।
అపశ్య దార్తో దుఃఖార్తాం స్తా నపృచ్ఛచ్చ స ద్విజః ॥ 64 ॥

ఆగుంటలో అడుగున వట్టివేరుకాడలను పట్టుకుని వేలాడుతున్న పితరులను చూశాడు. (వారిస్థితికి) బాధపడ్డాడు. కష్టాలతో దుఃఖిస్తున్న పితరులను ఆబ్రాహ్మణుడు ఈవిధంగా అడిగాడు.

ద్విజ ఉవాచ : – బ్రాహ్మణుడు పితరులతో ఈవిధంగా అంటున్నాడు.

కే యూయం వీరణస్తమ్బే లమ్బమానా హ్యధోముఖాః ।
దుఃఖితాః కేన మోక్షశ్చ యుష్మాకం భవితాఽనఘాః ॥ 65

పుణ్యాత్ములారా! వట్టివేరుకాడలకు తలక్రిందులుగా వేళ్లాడుతున్న మీరు ఎవరు? ఎందుకు దుఃఖపడుతున్నారు? మీకు ఈకష్టం నుండి విముక్తి ఏవిధంగా లభిస్తుంది?

పితర ఊచుః :– ఆబ్రాహ్మణుడితో పితరులు ఇలా అంటున్నారు.

వయం తే కృతపుణ్యస్య పితర స్సపితామహాః ।
ప్రపితామహాశ్చ క్లిశ్యామ స్తవ దుష్టేన కర్మణా ॥ 66 ॥

నాయనా! మేము పుణ్యాత్ముడివయిన నీకు తండ్రులమూ, తాతలమూ, ముత్తాతలమూ. నీదుర్మార్గపుపనుల వలననే మేము ఈవిధంగా కష్టపడుతున్నాం.

నరకోఽయం మహాభాగ గర్తరూపేణ సంస్థితః ।
త్వం చాపి వీరణస్తమ్బ స్త్వయి లమ్బామహే వయమ్ ॥ 67 ॥

మహాత్మా! గుంటరూపంలో ఉన్న ఇది నరకం. వట్టివేరుకాడ నీవే. నిన్ను ఆధారంగా చేసుకునే మేము ఇక్కడ వేలాడుతున్నాం.

యావత్ త్వం జీవసే విప్ర తావదేవ వయం స్థితాః ।
మృతే త్వయి గమిష్యామో నరకం పాపచేతసః ॥ 68 ॥

బ్రాహ్మణోత్తమా! నీవు జీవించినంతకాలం మాత్రమే మేం ఈవిధంగానయినా ఉంటాం. నీవు మరణించిన వెంటనే పాపాత్ములమైన మేము నరకానికి వెళ్లిపోతాం.

యది త్వం దారసంయోగం కృత్వాఽపత్యం గుణోత్తరమ్ ।
ఉత్పాదయసి తేనాస్మా న్ముచ్యేమ వయమేన సః ॥ 69 ॥

నీవు పెళ్లి చేసుకుని గుణవంతు డయినకుమారుడిని కనినట్లయితే, అప్పుడు మేము ఈపాపంనుండి బయటపడతాం.

నాన్యేన తపసా పుత్ర తీర్థానాం చ ఫలేన చ ।
ఏతత్కురు మహాబుద్ధే తారయస్వ పితౄన్ భయాత్ ॥ 70 ॥

నాయనా! (నీకు కొడుకు పుట్టే తప్ప) ఇంక తపస్సుచేత గానీ, పుణ్యతీర్థాలను సేవించడంచేత గానీ, మాకు విముక్తి కలగదు. బుద్ధిమంతుడా! నీపితరులను తరింపజేయి. నరకభయాన్ని పోగొట్టు. (పెళ్లి చేసుకో, కొడుకును కను.)

కశ్యప ఉవాచ: – కశ్యపమహర్షి హిమవంతుడితో ఇలా చెప్తున్నాడు.

స తథేతి ప్రతిజ్ఞాయ ఆరాధ్య వృషభధ్వజమ్ ।
పితౄన్ భయాత్ సముద్ధృత్య గణత్వం ప్రచకార వై ॥ 71 ॥

ఆబ్రాహ్మణుడు 'సరే, అలాగే' అన్నాడు. పరమేశ్వరుడిని ఆరాధించాడు. నరకభయంనుండి పితరులను ఉద్ధరించాడు. వారిని రుద్రగణాలుగా చేశాడు.

స్వయం రుద్రస్య దయిత స్సువేశో నామ నామతః ।
సమ్మతో విమలశ్చైవ రుద్రస్య గణపోఽభవత్ ॥ 72 ॥

స్వయంగా తాను కూడ సువేశుడు అనే పేరుతో రుద్రుడికి ఇష్టుడూ, సహచరుడూ, పుణ్యాత్ముడూ, రుద్రగణాలకు నాయకుడూ అయినాడు.

తస్మాత్ కృత్వా తపో ఘోర మపత్యం గుణవద్ భృశమ్ ।
ఉత్పాదయస్వ శైలేన్ద్ర సుతాం త్వం వరవర్ణినీమ్ ॥ 73 ॥

పర్వతోత్తమా! అందుచేత నీవు కూడ తీవ్రమయిన తపస్సు చేసి, మిక్కిలి గుణవంతుడయిన పుత్రుడినీ, సుందరాంగి అయిన కూతురునూ, కను.

బ్రహ్మోవాచ :– మహర్షులతో బ్రహ్మ ఇలా చెప్తున్నాడు.

స ఏవ ముక్తో ఋషిణా శైలేన్ద్రో నియమస్థితః ।
తపశ్చకారాప్యతులం యేన తుష్టిరభూన్మమ ॥ 74 ॥

కశ్యపమహర్షి ఈవిధంగా చెప్పగా హిమవత్పర్వతరాజు నియమబద్ధంగా అసమానమయిన తపస్సు చేశాడు. ఆతపస్సుకు నాకు సంతోషం గలిగింది.

తదా తముత్పపాతాహం వరదోఽస్మీతి చాబ్రవమ్ ।
బ్రూహి తుష్టోఽస్మి శైలేన్ద్ర తపసాఽనేన సువ్రత ॥ 75 ॥

అప్పుడు నేను హిమవంతుడికి ఎదురుగా నిలిచి, 'గొప్ప తపోదీక్ష గలిగినవాడా! పర్వతనాయకా! నీతపస్సుకు సంతోషించాను. నీకు ఏం కావాలో అడుగు, ఆవరం ఇస్తాను' అని చెప్పాను.

హిమవానువాచ :– బ్రహ్మదేవుడితో హిమవంతుడు ఇలా అంటున్నాడు.

భగవన్ పుత్రమిచ్ఛామి గుణై స్సర్వై రలఙ్కృతమ్ ।
ఏవం వరం ప్రయచ్ఛస్వ యది తుష్టోఽసి మే ప్రభో ॥ 76 ॥

'పరమాత్మా! సర్వసద్గుణాలు కలిగిన కుమారుడిని కోరుకుంటున్నాను. ప్రభూ! నాయెడ నీకు సంతోషం గలిగితే ఈవరాన్ని నాకు ప్రసాదించు'.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఇలా చెప్తున్నాడు.

తస్య తద్వచనం శ్రుత్వా గిరిరాజస్య భో ద్విజాః ।
తదా తస్మై వరం చాహం దత్తవాన్ మనసేప్సితమ్ ॥ 77 ॥

ఓ బ్రాహ్మణులారా! హిమవత్పర్వతరాజు మాటలు విని, నేను అప్పుడు ఆతడికి ఇష్టమయిన వరాన్ని ఇచ్చాను.

కన్యా భవిత్రీ శైలేన్ద్ర తపసాఽనేన సువ్రత ।
యస్యాః ప్రసాదాత్ సర్వత్ర కీర్తిమాప్స్యసి శోభనామ్ ॥ 78 ॥

పర్వతోత్తమా! నీతపఃప్రభావంచేత నీకు కుమార్తె పుడుతుంది. నియమశాలీ! ఆమె అనుగ్రహంవల్ల నీకు అన్ని లోకాలలోనూ మంచికీర్తి లభిస్తుంది.

అర్చిత స్సర్వదేవానాం తీర్థకోటిసమావృతః ।
పావనైశ్చైవ పుణ్యైశ్చ దేవానామపి సర్వతః ॥ 79 ॥

సమస్తమయిన దేవతలతో సహా అందరూ నిన్ను పూజిస్తారు. దేవతలను కూడా పవిత్రం చేసే పుణ్యప్రద మయిన తీర్థాలు కోట్ల సంఖ్యలో నిన్ను ఆశ్రయించుకుని ఈపర్వతం మీద అంతటా నిండి ఉంటాయి.

జ్యేష్ఠా చ సా భవిత్రీ తే అన్యే చానుగతే శుభే ॥ 80 ॥

ఆమె నీకు పెద్దకూతురు అవుతుంది. ఆమె తర్వాత నీకు మరొక ఇద్దరు శుభప్రదలయిన కూతుళ్లు జన్మిస్తారు.

బ్రహ్మోవాచ :– మహర్షులతో బ్రహ్మదేవుడు ఇలా చెప్తున్నాడు.

ఏవముక్త్వా తతశ్చాహం తత్రైవాన్తరధీతవాన్ ।
సోఽపి కాలేన శైలేన్ద్రో మేనాయాముదపాదయత్ ।
అపర్ణా మేకపర్ణాం చ తథా చైవైకపాటలామ్ ॥ 81 ॥

హిమవంతుడితో ఈవిధంగా పలికి అప్పుడు అక్కడే నేను అంతర్ధానమయ్యాను. ఆహిమవంతుడు కూడ తర్వాత కొంతకాలానికి భార్య అయిన మేనయందు అపర్ణ, ఏకపర్ణ,ఏకపాటల అనే ముగ్గురు కూతుళ్లను కన్నాడు.

న్యగ్రోధ మేకపర్ణం తు పాటలం చైకపాటలామ్ ।
అశిత్వా త్వేకపర్ణం తు అనికేత స్తపోఽచరత్ ।
శతం వర్షసహస్రాణాం దుశ్చరం దేవదానవైః ॥ 82 ॥

ఒక్క మఱ్ఱి ఆకును ఆహారంగా తీసుకుంటూ ఏకపర్ణ, పాటలం చెట్టు ఆకు ఒక్కటి ఆహారంగా తీసుకుంటూ ఏకపాటల తీవ్రమయిన తపస్సు చేశారు. ఏకపాటల ఎక్కడా నివాసం లేకుండా(ఎక్కువ కాలం ఒకచోట ఉండకుండా) తపస్సు చేసింది. వీళ్లు దేవతలకూ, దానవులకూ కూడా అసాధ్యమయిన తపస్సు లక్షసంవత్సరాలు చేశారు.

ఆహార మేకపర్ణం తు ఏకపర్ణా సమాచరత్ ।
పాటలేన తథైకేన విదధే చైకపాటలా ॥ 83 ॥

ఏకపర్ణ ఒక్క(మఱ్ఱి)ఆకును ఆహారంగా తీసుకుంటూ తపస్సు చేసింది. అలాగే ఏకపాటల పాటలంచెట్టు ఆకు ఒక్కటి ఆహారంగా తీసుకుంటూ తపస్సు చేసింది.

పూర్ణే వర్షసహస్రే తు ఆహారం తే ప్రచక్రతుః ॥ 84 ॥

వేయి సంవత్సరాలు పూర్తిగా నిండిన తరువాత ఒకసారి వారు మామూలుగా ఆహారం తీసుకున్నారు. (ఇలా లక్ష సంవత్సరాలు తపస్సు చేశారు.)

అపర్ణా తు నిరాహారా తాం మాతా ప్రత్యభాషత ।
నిషేధయన్తీ చోమేతి మాతృస్నేహేన దుఃఖితా ॥ 85 ॥

హిమవంతుడి కుమార్తెలలో జ్యేష్ఠురాలయిన అపర్ణ అసలు ఆహారం ఏమీ (ఆకు కూడా) లేకుండా తపస్సు చేసింది. ఆవిధంగా తీవ్రమయిన తపస్సు చేస్తున్న అపర్ణతో మేన, మాతృవాత్సల్యంతో బాధపడుతూ 'ఓ (అమ్మాయీ), (ఈతపస్సు) మానుకో' ('ఉ-మా') అని నివారించింది.

సా తథోక్తా తయా మాత్రా దేవీ దుశ్చరచారిణీ ।
తేనైవ నామ్నా లోకేషు విఖ్యాతా సురపూజితా ॥ 86 ॥

కష్టసాధ్యమయిన తపస్సు ఆచరిస్తూ, దేవతలచేత గౌరవింపబడుతున్న అపర్ణ 'ఉ-మా' ('ఓ (అమ్మాయీ), (ఈతపస్సు) మానుకో') అని తల్లి పలికిన మాటలవలన, అప్పటినుండి ఆపేరుతోనే 'ఉమ' అని అన్నిలోకాలలో సుప్రసిద్ధురాలయింది.

ఏతత్తు త్రికుమారీకం జగత్ స్థావరజఙ్గమమ్ ।
ఏతాసాం తపసాం వృత్తం యావద్భూమిర్ధరిష్యతి ॥ 87 ॥

ఈహిమవంతుడి కూతుళ్ల తపోవృత్తాంతం ఈభూమి మీద ఎన్ని నాళ్లు నిలిచి ఉంటుందో, అంతకాలం చరాచరాత్మకమయిన ఈజగత్తు ఈముగ్గురు హిమవత్పర్వతం కూతుళ్లశక్తితో నిండిఉంటుంది.

తపశ్శరీరా స్తాస్సర్వా స్త్రిస్రో యోగం సమాశ్రితాః ।
సర్వాశ్చైవ మహాభాగా స్తథా చ స్థిరయౌవనాః ॥ 88 ॥

హిమవంతుడి కుమార్తెలు ముగ్గురూ తపోమూర్తులు. యోగాన్ని ఆశ్రయించినవారు (యోగశక్తి గలవారు). మహాత్మురాళ్లు అయినవీరు ముగ్గురూ నిత్యమూ యౌవనంలోనే ఉంటారు.

తా లోకమాతరశ్చైవ బ్రహ్మచారిణ్య ఏవ చ ।
అనుగృహ్ణన్తి లోకాంశ్చ తపసా స్వేన సర్వదా ॥ 89 ॥

వీరు ముగ్గురూ లోకాలు అన్నింటికీ తల్లులు. బ్రహ్మచారిణులు. తమ తపశ్శక్తితో ఎల్లప్పుడూ అన్ని లోకాలనూ రక్షిస్తుంటారు.

ఉమా తాసాం వరిష్ఠా చ జ్యేష్ఠా చ వరవర్ణినీ ।
మహాయోగబలోపేతా మహాదేవముపస్థితా ॥ 90 ॥

ఆముగ్గురిలో ఉమ శ్రేష్ఠురాలు. జ్యేష్ఠురాలు. పతివ్రత. గొప్ప యోగశక్తితో కూడినది. పరమేశ్వరుడిని (భర్తగా) చేరుకున్నది.

దత్తక శ్చోశనాస్తస్య పుత్రస్స భృగునన్దనః ।
ఆసీత్త స్యైకపర్ణా తు దేవలం సుషువే సుతమ్ ॥ 91 ॥

ఉశనసుడు (శుక్రుడు) దత్తుడు. అతడి కుమారుడు భృగునందనుడు. ఏకపర్ణ ఆతడికి భార్య అయింది. ఆమె దేవలుడు అనే కుమారుడిని కన్నది.

యా తు తాసాం కుమారీణాం తృతీయా హ్యేకపాటలా ।
పుత్రం సా తమలర్కస్య జైగీషవ్యముపస్థితా ॥ 92 ॥

హిమవంతుడి కుమార్తెలలో మూడవది అయిన ఏకపాటల అలర్కుడి కుమారుడయిన జైగీషవ్యుడిని వివాహం చేసుకుంది.

తస్యాశ్చ శఙ్ఖలిఖితౌ స్మృతౌ పుత్రా వయోనిజౌ ।
ఉమా తు యా తుభ్యం కీర్తితా వరవర్ణినీ ॥ 93 ॥

ఏకపాటలకు ఇద్దరు కుమారులు. శంఖుడు, లిఖితుడు. వీరు అయోనిజులు. సుందరాంగి అయిన ఉమాదేవిని గురించి మీకు ఇంతకు ముందే వివరంగా చెప్పాను

అథ తస్యా స్తపోయోగాత్ త్రైలోక్యమఖిలం తదా ।
ప్రధూపిత మిహాలక్ష్య వచస్తా మహమబ్రవమ్ ॥ 94 ॥

ఉమ తపఃప్రభావంచేత మొత్తం మూడు లోకాలూ పొగతో నిండిపోయాయి. దానిని గమనించి, నేను (బ్రహ్మ) ఆమెతో ఇలా అన్నాను.

దేవి కిం తపసా లోకాం స్తాపయిష్యసి శోభనే ।
త్వయా సృష్ట మిదం సర్వం మా కృత్వా తద్వినాశయ ॥ 95 ॥

అమ్మా! శుభాంగీ! నీతపశ్శక్తితో లోకాలన్నింటినీ బాధిస్తున్నావేమి? ఈలోకాలను నీవే సృష్టించావు. స్వయంగా నీవు సృష్టించినవానిని నీవే నాశనం చేయడం తగదు.

త్వం హి ధారయసే లోకానిమాన్ సర్వాన్ స్వతేజసా ।
బ్రూహి కిం తే జగన్మాతః ప్రార్థితం సంప్రసీద నః ॥ 96 ॥

ఈలోకాలన్నిటినీ నీశక్తితో నీవే కాపాడుతున్నావు. లోకమాతా, నీకు ఏమి కావాలో చెప్పు. మమ్మల్ని అనుగ్రహించు.

దేవ్యువాచ :- బ్రహ్మదేవుడితో ఉమ ఇలా అంటున్నది.

యదర్థం తపసో హ్యస్య చరణం మే పితామహ! ।
త్వమేవ తత్త్వం జానీషే తతః పృచ్ఛసి కిం పునః ॥ 97 ॥

తాతా! నేను ఎందుకు తపస్సు చేస్తున్నానో ఆరహస్యం నీకే బాగా తెలుసు. మళ్లీ అడుగుతావెందుకు?

బ్రహ్మోవాచ :- బ్రహ్మదేవుడు మహర్షులతో ఇలా చెప్తున్నాడు.

తత స్తా మబ్రవం చాహం యదర్థం తప్యసే శుభే ।
స త్వాం స్వయముపాగమ్య ఇహైవ వరయిష్యతి ॥ 98 ॥

అప్పుడు నేను ఆఉమాదేవితో ఇలా అన్నాను. శుభాంగీ! నీవు ఎవరిని గురించి తపస్సు చేస్తున్నావో, అతడు స్వయంగా ఇక్కడకు వచ్చి నిన్ను వరిస్తాడు.

శర్వ ఏవ పతిశ్రేష్ఠ స్సర్వలోకేశ్వరేశ్వరః ।
వయం సదైవ యస్యేమే వశ్యా వై కిఙ్కరా శ్శుభే ॥ 99 ॥

శుభాంగీ! పరమేశ్వరుడే నీకు భర్త. ఆతడు ఉత్తముడు. సమస్తమయిన లోకాలకూ ఆయనే ప్రభువు. మేం నిరంతరమూ ఆపరమేశ్వరుడికి సేవకుల మయి, ఆయన ఆజ్ఞకు లోబడి ఉంటాం.

స దేవదేవః పరమేశ్వర స్స్వయమ్ స్వయంభు రాయాస్యతి దేవి తేఽన్తికమ్ ।
ఉదారరూపో వికృతాదిరూప స్సమానరూపోఽపి న యస్య కస్యచిత్ ॥ 100 ॥

అమ్మా! దేవతలకే దేవుడూ, స్వయంభువూ అయిన ఆపరమేశ్వరుడు తనకు తానుగా నీదగ్గరకు వస్తాడు. ఆతడు చాలా అందమైనవాడు సగుణరూపాన్ని ధరించినవాడు. ఆయనతో సమానమయిన రూపం కలిగినవాడు ఇంకొకడు లేడు.

మహేశ్వరః పర్వతలోకవాసీ చరాచరేశః ప్రథమోఽప్రమేయః ।
వినేన్దునాహీన్ద్రసమానవర్చసా విభీషణం రూపమివాస్థితో యః ॥ 101 ॥

అతడే మహేశ్వరుడు. కైలాసపర్వతంపై నివసిస్తుంటాడు. స్థావరజంగమాత్మకమయిన సమస్తసృష్టికీ ప్రభువు. అన్నింటికీ మొదటివాడు. మేర లేనివాడు. చంద్రుడు లేకుండా (సిగపై చంద్రుడిని ధరించకుండా), దేవేంద్రుడితో సమానమయిన తేజస్సుతో, భయంకరమయిన రూపంతో (ఇక్కడికి) వస్తాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భృషిసంవాదే రుద్రాఖ్యానం నామ ద్వాత్రింశోఽధ్యాయః ॥ 32 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషి సంవాదంలో రుద్రాఖ్యానం అనే ముప్పైరెండవ సంపూర్ణం.



తయస్త్రింశోఽధ్యాయః - ముప్పైమూడవ అధ్యాయం

పార్వతీసత్త్వదర్శనమ్ - పార్వతీసత్త్వదర్శనం

బ్రహ్మోవాచ:- బ్రహ్మదేవుడు మహర్షులతో ఇలా చెప్తున్నాడు.

తతస్తా మబ్రువన్ దేవా స్తదా గత్వాఽతి సత్వరమ్ ।
దేవి యేనైవ సృష్టాఽసి న వినా యస్త్వయా శివే ।
స భర్తా తవ దేవేశో భవితా మా తపః కృథాః ॥ 1 ॥

దేవతలు తీవ్రంగా తపస్సు చేస్తున్న పార్వతి వద్దకు చాల వేగంగా వెళ్లి ఇలా అన్నారు. 'అమ్మా! శివా! నిన్ను సృష్టించినవాడూ, నీవు లేకుండా ఉండలేనివాడూ అయిన పరమశివుడు నీకు తప్పకుండా భర్త అవుతాడు. ఇంక తపస్సు చేయకు.

తతః ప్రదక్షిణీకృత్య దేవా విప్రా గిరే స్సుతామ్ ।
జగ్ము శ్చాదర్శనం తస్యా స్సాచాపి విరరామ హ ॥ 2 ॥

బ్రాహ్మణులారా! అప్పుడు దేవతలు ఆపార్వతికి ప్రదక్షిణం చేసి, కనబడకుండా వెళ్లిపోయినారు. పార్వతి కూడ తపస్సు చేయడం మానుకుంది.

సా దేవీ సూక్త మిత్యేవ ముక్త్వా స్వస్యాశ్రమే శుభే ।
ద్వారి జాతమశోకం చ సముపాశ్రిత్య చాఽస్థితా ॥ 3 ॥

దేవతలు చాల మంచిమాట చెప్పారు అని పార్వతి శుభప్రదమయిన తన ఆశ్రమం వాకిట్లో ఉన్న అశోకవృక్షాన్ని ఆశ్రయించుకుని ఉండసాగింది.

అథాగాచ్చన్ద్రతిలక స్త్రిదశార్తిహరో హరః ।
వికృతం రూపమాస్థాయ హ్రస్వో బాహుక ఏవ చ ।
విభగ్ననాసికో భూత్వా కుబ్జః కేశాన్తపిఙ్గలః ॥ 4 ॥

అప్పుడు దేవతల బాధలను తీర్చే చంద్రశేఖరుడయిన పరమేశ్వరుడు - పొట్టి చేతులతో, సొట్ట ముక్కుతో, రాగిరంగు జడలతో, పొట్టివాడుగా వికారమయిన ఆకారం ధరించి పార్వతివద్దకు వచ్చాడు.

ఉవాచ వికృతాస్యశ్చ దేవి త్వాం వరయామ్యహమ్ ।
అథోమా యోగసంసిద్ధా జ్ఞాత్వా శఙ్కరమాగతమ్ ॥ 5 ॥

వికృతమయిన ముఖంతో 'దేవీ! నిన్ను నేను పెండ్లి చేసుకుంటాను' అన్నాడు. ఉమాదేవి యోగసిద్ధి కలిగినది కాబట్టి ఆవచ్చిన వికృతరూపుడు పరమేశ్వరుడే అని గ్రహించింది.

అన్తర్భావవిశుద్ధాత్మా కృపానుష్మానలిప్సయా ।
తమువాచార్ఘ్యపాద్యాభ్యాం మధుపర్కేణ చైవ హి ।
సమ్పూజ్య సుమనోభిస్తం బ్రాహ్మణం బ్రాహ్మణప్రియా ॥ 6 ॥

స్వచ్ఛమయిన మనోబుద్ధులతో, పరమేశ్వరుడి అనుగ్రహాన్ని పొందాలనే కోరికతో పార్వతి పరమేశ్వరుడికి, చేతులు కడుక్కోవడానికీ (అర్ఘ్యం), కాళ్లు కడుక్కోవడానికీ (పాద్యం) నీళ్లు ఇచ్చింది. మధుపర్కం (ఆవు పెరుగు, నేయి, తేనె కలిపిన పదార్థం) సమర్పించింది. ఉత్తమమయిన పూవులతో పరమేశ్వరుడిని పూజించింది. బ్రాహ్మణులయెడ భక్తిశ్రద్ధలు గలిగిన పార్వతి బ్రాహ్మణరూపంలో ఉన్న పరమేశ్వరుడితో ఇలా అన్నది.

దేవ్యువాచ:- పార్వతి పరమేశ్వరుడితో ఈవిధంగా అంటున్నది.

భగవన్! న స్వతన్త్రాఽహం పితా మే జననీ తథా ।
స ప్రభు ర్మమ దానే వై కన్యాఽహం ద్విజపుఙ్గవ ॥ 9 ॥

మహాత్మా! బ్రాహ్మణోత్తమా! నేను స్వతంత్రురాలిని కాదు. కన్యను. తల్లిదండ్రుల రక్షణలో ఉన్నాను. నన్ను (కన్యా)దానం చేయడానికి, నాతండ్రి మాత్రమే సమర్థుడు.

గత్వా యాచస్వ పితరం మమ శైలేన్ద్రమవ్యయమ్
స చేద్దదాతి మాం విప్ర తుభ్యం తదుచితం మమ ॥ 10 ॥

అందుచేత నీవు వెళ్లి పర్వతరాజు, సుస్థిరుడూ అయిన నాతండ్రిని 'నన్ను ఇ' మ్మని అడుగు. బ్రాహ్మణా! నాతండ్రి నన్ను నీకు దానం చేస్తే, అది నాకు యుక్తంగా ఉంటుంది.

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తత స్స భగవాన్ దేవ స్తథైవ వికృతః ప్రభుః ।
ఉవాచ శైలరాజం తం సుతాం మే యచ్ఛ శైలరాట్ ॥ 11 ॥

అప్పుడు వికారరూపంలో ఉన్న సమర్థుడయిన ఆశివభగవానుడు పార్వతి చెప్పిన ప్రకారంగా హిమవంతుడి వద్దకు వెళ్లాడు. 'పర్వతరాజా! నీకుమార్తెను నాకు భార్యగా ఇవ్వు' అని హిమవంతుడిని అడిగాడు.

స తం వికృతరూపేణ జ్ఞాత్వా రుద్రమథావ్యయమ్ ।
భీత శ్శాపాచ్చ విమనా ఇదం వచనమబ్రవీత్ ॥ 12 ॥

హిమవంతుడు వికృతమయిన ఆకారంలో ఉన్న అతడు శాశ్వతుడయిన రుద్రుడే అని తెలుసుకున్నాడు. (కాదంటే) శపిస్తాడేమోననే భయంతో అనిష్టంగానే ఇలా అన్నాడు.

శైలేన్ద్ర ఉవాచ:- పర్వతరాజు అయిన హిమవంతుడు పరమేశ్వరుడితో ఈవిధంగా అంటున్నాడు.

భగవన్! నవమన్యేఽహం బ్రాహ్మణాన్ భువి దేవతాః ।
మనీషితం తు యత్ పూర్వం తచ్ఛృణుష్వ మహామతే ॥ 13 ॥

మహాత్మా! నేను బ్రాహ్మణులను అవమానించను. వాళ్లు ఈభూమి మీద ఉన్న దేవతలు. బుద్ధిమంతుడా! (మాకుమార్తె వివాహం గురించి) పూర్వం నేను ఏమి కోరుకున్నానో చెప్తాను, విను.

స్వయంవరో మే దుహితు ర్భవితా విప్రపూజితః ।
వరయేద్ యం స్వయం తత్ర స భర్తాఽస్యా భవేదితి ॥ 14 ॥

'నాకుమార్తెకు స్వయంవరం చేయాలి. అందులో ఆమె బ్రాహ్మణులు గౌరవించే ఉత్తముడిని స్వయంగా వరించాలి. అతడే ఆమెకు భర్త కావాలి'. అని (కోరుకున్నాను).

తచ్ఛ్రుత్వా శైలవచనం భగవాన్ వృషభధ్వజః ।
దేవ్యా స్సమీపమాగత్య ఇదమాహ మహామనాః ॥ 15 ॥

వృషభం ధ్వజంగా గలిగిన పరమేశ్వరుడు హిమవంతుడి మాటలు ఆలకించాడు. తిరిగి పార్వతీదేవివద్దకు వచ్చాడు. బుద్ధిమంతుడయిన శివుడు పార్వతితో ఇలా అన్నాడు.

శివ ఉవాచ :–పార్వతితో పరమేశ్వరుడు ఈవిధంగా అంటున్నాడు.

దేవి పిత్రా త్వనుజ్ఞాత స్స్వయంవర ఇతి శ్రుతిః ।
తత్ర త్వం వరయిత్రీ యం స తే భర్తా కిలానఘే ॥ 16 ॥

దేవి! నీతండ్రి నీకు ఇష్టమయినవాడిని వరించే విధంగా అనుమతించినట్లు విన్నాను. కాబట్టి పుణ్యాత్మురాలా! నీవు వరించినవాడే నీకు భర్త అవుతాడు.

తదాపృచ్ఛ్య గమిష్యామి దుర్లభాం త్వాం వరాననే ।
రూపవన్తం సముత్సృజ్య వృణీషే మాదృశం కథమ్ ॥ 17 ॥

'అందగాడిని విడిచి, నీరూపానికి సరితూగని నావంటి వికారరూపుడిని ఎందుకు వరిస్తావు? ఈవిషయం నీకు చెప్పి పోదామని వచ్చాను. ఇంక వెళ్తున్నాను'. అన్నాడు పరమశివుడు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మదేవుడు మహర్షులతో ఈవిధంగా అంటున్నాడు.

తేనోక్తా తదా తత్ర భావయన్తీ తదీరితమ్ ।
భావం చ రుద్రనిహితం ప్రసాదం మనస స్తథా ॥ 18 ॥

అప్పుడు పార్వతి పరమేశ్వరుడి మాటలను భావన చేసింది. తన మనస్సు రుద్రుడియందు లగ్నమయి ఉండటాన్ని స్మరించుకుంది. దానితో మనస్సు (అలజడి తగ్గి) ప్రశాంతం అయింది.

సవ్రీడాప్యోవాచ దేవేశం మా తేఽభూద్ బుద్ధి రన్యథా ।
అహం త్వాం వరయిష్యామి నాద్భుతం తు కథఞ్చన ॥ 19 ॥

పార్వతి మనస్సులో పరమేశ్వరుడితో వివాహాన్ని నిశ్చయించుకున్నది. నీవు మరొకవిధంగా (నిన్ను గాకుండా, అందంగా ఉన్నాడని ఇంకెవరినో వరిస్తానని) అనుకోవద్దు. నేను నిన్నే వరిస్తాను. ఇందులో విచిత్రం ఏమీ లేదు.

అథవా తేఽస్తి సన్దేహో మయి విప్ర కథఞ్చన ।
ఇహైవ త్వా మహాభాగ వరయామి మనోగతమ్ ॥ 20 ॥

బ్రాహ్మణోత్తమా! ఒకవేళ నీకు నామీద సందేహం ఉంటే, మహాత్మా! నామనసులో నిలిచి ఉన్న నిన్ను ఇక్కడే (స్వయంవరం దాక ఆగకుండా) వరిస్తాను.

బ్రహ్మోవాచ:- బ్రహ్మదేవుడు మహర్షులతో ఈవిధంగా చెప్తున్నాడు.

గృహీత్వా స్తబకం పౌష్పం హస్తాభ్యాం తత్ర సంస్థితా ।
స్కన్ధే శమ్భో స్సమాధాయ దేవీ ప్రాహ వృతోఽసి మే ॥ 21 ॥

అప్పుడు పార్వతి రెండు చేతులతోనూ పూలమాల గ్రహించి, పరమేశ్వరుడికి ఎదుట నిలిచి, శంకరుడి మెడలో ఆపూలమాలను ఉంచి, 'నేను నిన్ను భర్తగా వరించాను' అన్నది.

తత స్స భగవాన్ దేవ స్తయా దేవ్యా వృత స్తదా ।
ఉవాచ తమశోకం వై వాచా సఞ్జీవయన్నివ ॥ 22 ॥

ఆవిధంగా పార్వతీదేవి తనను వరించగా, ఆపరమేశ్వరుడు పార్వతి ఉన్న అశోకవృక్షానికి తన మాటలతో ప్రాణం పోస్తున్నాడా అన్నట్లుగా ఆచెట్టుతో ఇలా అన్నాడు.

శివ ఉవాచ :- పరమేశ్వరుడు అశోకవృక్షంతో ఇలా అంటున్నాడు.

యస్మా త్తవ సుపుణ్యేన స్తబకేన వృతోఽస్మ్యహమ్ ।
తస్మా త్త్వం జరయా త్యక్త స్త్వమరస్సమ్భవిష్యసి ॥ 23 ॥

అశోకమా! పుణ్యప్రదమయిన నీపూలమాలతో పార్వతి నన్ను వరించింది. కాబట్టి నీకు ముసలితనం ఉండదు. మరణం సంభవించదు.

కామరూపీ కామపుష్పః కామదో దయితో మమ ।
సర్వాభరణపుష్పాఢ్య స్సర్వపుష్పఫలోపగః ॥ 24 ॥

నీవు నీకు ఇష్టమయిన రూపంతో ఉంటావు. కోరికలు తీర్చే పూవులు కలిగి ఉంటావు. నాకు ఇష్ట మయిన దానివి అవుతావు. సమస్తమయిన సొమ్ములవంటి పూలు సమృద్ధిగా ఉంటాయి. అన్ని రకాలపూలు, పండ్లతో నిండి ఉంటావు.

సర్వాన్నభక్షక శ్చైవ అమృతస్వాద ఏవ చ ।
సర్వగన్ధశ్చ దేవానాం, భవిష్యసి దృఢప్రియః ॥ 25 ॥

సమస్తమయిన ఆహారాలను తినేదానివి అవుతావు. (అన్నిరకాల నైవేద్యాలు ప్రియంగా స్వీకరిస్తావు.) అమృతాన్ని స్వీకరిస్తావు. సమస్తమయిన సువాసనలు గలిగి ఉంటావు. దేవతలకు అత్యంతం ప్రీతిపాత్రం అవుతావు.

నిర్భయ స్సర్వలోకేషు చరిష్యసి మునిర్వృతః ।
ఆశ్రమం చేమ మత్యర్థం చిత్రకూటేతి విశ్రుతమ్ ॥ 26 ॥

భయం లేకుండా నీవు అన్నిలోకాలలోనూ సంచరిస్తావు. మునులతో నిండి ఈ ఆశ్రమం చిత్రకూటం అనే పేరుతో మిక్కిలి ప్రసిద్ధం అవుతుంది.

యో హి యాస్యతి పుణ్యార్థీ సోஉశ్వమేధ మవాప్స్యతి ।
యస్తు తత్ర మృతశ్చాపి బ్రహ్మలోకం గమిష్యతి ॥ 27 ॥

పుణ్యాన్ని సంపాదించడంకోసం ఈఆశ్రమానికి వచ్చినవాడు అశ్వమేధయాగం చేసిన పుణ్యఫలం పొందుతాడు. ఈప్రదేశంలో మరణించినవాడు బ్రహ్మలోకానికి వెళ్తాడు.

యశ్చాత్ర నియమైర్యుక్తః ప్రాణాన్ సమ్యక్ పరిత్యజేత్ ।
స దేవ్యాస్తపసా యుక్తో మహాగణపతిర్భవేత్ ॥ 28 ॥

ఈఆశ్రమంలో నియమాలను చక్కగా పాటిస్తూ ప్రాణాలను విడిచినవాడు, పార్వతీదేవి తపఃఫలాన్ని పొంది, మహాగణాలకు అధిపతి అవుతాడు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మదేవుడు మహర్షులతో ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవముక్త్వా తదా దేవ ఆపృచ్ఛ్య హిమవత్సుతామ్ ।
అన్తర్దధే జగత్స్రష్టా సర్వభూతమహేశ్వరః ॥ 29 ॥

ఈవిధంగా పలికి లోకాలను అన్నింటిని సృష్టించినవాడూ, సమస్తమయిన భూతకోటిని పాలించేవాడూ అయిన పరమేశ్వరుడు పార్వతివద్ద సెలవు తీసుకుని అంతర్ధానం చెందాడు.

సాపి దేవీ గతే తస్మిన్ భగవత్యమితాత్మని ।
తత ఏవోన్ముఖీ భూత్వా శిలాయాం సమ్బభూవ హ ॥ 30 ॥

పార్వతీదేవి అమేయస్వరూపుడయిన ఆపరమేశ్వరుడియందు మనసు నిలిపి, ఆతడు వెళ్లినవైపే చూస్తూ, అక్కడ ఒకరాతి మీద కూర్చుంది.

ఉన్ముఖీ సా భవే తస్మిన్ మహేశే జగతాం ప్రభౌ ।
నిశేవ చన్ద్రరహితా న బభౌ విమనా స్తదా ॥ 31 ॥

లోకాలకు ప్రభువయిన మహేశ్వరుడి మీద లగ్నమైన మనస్సుతో బాధపడుతున్నది. దానివల్ల పార్వతి చంద్రుడు లేని రాత్రిలాగా ప్రకాశించడంలేదు.

అథ శుశ్రావ శబ్దం చ బాలస్యార్తస్య శైలజా ।
సరస్యుదకసమ్పూర్ణే సమీపే చాశ్రమస్య చ ॥ 32 ॥

ఆసమయంలో ఆశ్రమం దగ్గరగా నీటితో నిండిఉన్న సరస్సులోనుంచి బాధతో కూడినపిల్లవాడి అరుపు విన్నది.

స కృత్వా బాలరూపం తు దేవదేవ శ్శివస్తదా ।
క్రీడాహేతోస్సరో మధ్యే గ్రాహగ్రస్తోఽ భవ త్తదా ॥ 33 ॥

దేవతలకు దేవుడయిన పరమేశ్వరుడు పిల్లవాడి రూపం ధరించాడు. ఆటగా ఆసరస్సుమధ్యలోకి వెళ్లాడు. అక్కడ ఆపసివాడిని ఒక మొసలి పట్టుకున్నది.

యోగమాయాం సమాస్థాయ ప్రపఞ్చోద్భవకారణమ్ ।
తద్రూపం సరసో మధ్యే కృత్వైవం సమభాషత ॥ 34 ॥

లోకాలను సృష్టించే పరమేశ్వరుడు యోగమాయతో చెరువు నడుమ ఆవిధమయిన రూపంతో (తాను పసివాడుగానూ, తనను మొసలి పట్టుకున్నట్లుగానూ) ఉండి, ఇలా అన్నాడు.

బాల ఉవాచ :–బాలుడి రూపంలో ఉన్న పరమేశ్వరుడు ఈవిధంగా అంటున్నాడు.

త్రాతు మాం కశ్చిదిత్యాహ గ్రాహేణ హృతచేతసమ్ ।
ధిక్ కష్టం బాల ఏవాహ మప్రాప్తార్థమనోరథః ॥ 35 ॥

నన్ను ఒక మొసలి పట్టుకుంది. నేను బాలుడిని. (మొసలినుండి నన్ను నేను కాపాడుకోలేను.) ఇంకా నాకు జీవితంలో ఏకోరికా తీరలేదు. ఇక్కడ నన్ను ఎవరయినా రక్షించండి.

ప్రయామి నిధనం వక్త్రే గ్రాహస్యాస్య దురాత్మనః ।
శోచామి న స్వకం దేహం గ్రాహగ్రస్త స్సుదుఃఖితః ॥ 36 ॥

క్రూరమయిన ఈమొసలినోటబడి చచ్చిపోతున్నాను. నాశరీరాన్ని గురించి (చచ్చిపోవటంచేత శరీరం నశించిపోతుందని) నేను ఏమాత్రం బాధపడడం లేదు.

కిన్తు శోచామి పితరం మాతరం చ తపస్వినీమ్ ।
గ్రాహగృహీతం మాం శ్రుత్వా ప్రాప్తం నిధనముత్సుకౌ ॥ 37 ॥

కాని నాతండ్రిని గురించి, తపస్విని అయిన నాతల్లిని గురించి మిక్కిలిగా విచారిస్తున్నాను. మొసలివాతబడి, నేను మరణించానని తెలిస్తే నాతల్లిదండ్రులు నాపైని అమితప్రేమతో మరణిస్తారు.

ప్రియపుత్రా వేకపుత్రౌ ప్రాణాన్ నూనం త్యజిష్యతః ।
అహో బత సుకష్టం వై యోఽహం బాలోఽ కృతాశ్రమః ।
అన్తర్గ్రాహేణ గ్రస్త స్తు యాస్యామి నిధనం కిల ॥ 38 ॥

నాతల్లిదండ్రులకు నేను ఒక్కడినే కొడుకును. వారికి చాల ఇష్టమయినవాడిని. అందుచేత నామరణవార్త విని వాళ్లు తప్పకుండా ప్రాణాలు వదులుతారు. అయ్యో, ఎంత కష్టం వచ్చి పడింది. నేను ఇంకా చిన్నవాడిని. బ్రహ్మచర్యాశ్రమంలోకి కూడ ప్రవేశించనివాడిని (ఉపనయనం కూడ కానివాడిని). ఈమొసలినోటబడి చచ్చిపోతున్నాను గదా.

బ్రహ్మోవాచ:- బ్రహ్మదేవుడు మహర్షులతో ఈవిధంగా చెప్తున్నాడు.

శ్రుత్వా తు దేవీ తం నాదం విప్రస్యార్తస్య శోభనా ।
ఉత్థాయ ప్రస్థితా తత్ర యత్ర తిష్ఠత్యసౌ ద్విజః ॥ 39 ॥

బాధతో ఆపిల్లవాడు చేస్తున్న అరుపుల ధ్వనిని పార్వతి విన్నది. కూర్చున్న చోటినుండి లేచి, ఈబాలకుడు ఉన్న చోటికి బయలుదేరింది.

సాపశ్యదిన్దువదనా బాలకం చారురూపిణమ్ ।
గ్రాహస్య ముఖమాపన్నం వేపమానమవస్థితమ్ ॥ 40 ॥

చంద్రముఖి అయిన పార్వతి అందమైన రూపంతో మొసలినోటిలో చిక్కుకుని, కష్టాలలో పడి, కొట్టుకుంటున్న ఆబాలుడిని చూచింది.

సోఽపి గ్రాహవర శ్రీమాన్ దృష్ట్వా దేవీముపాగతామ్ ।
తం గృహీత్వా ద్రుతం యాతో మధ్యం సరస ఏవ హి ॥ 41 ॥

శ్రీమంతమయిన ఆమొసలికూడ పార్వతి అక్కడికి రావటం చూచి, ఆబాలుడిని తీసుకుని వేగంగా నీళ్ళలోకి వెళ్లిపోయింది.

స కృష్యమాణస్తేజస్వీ నాదమార్తం తదాఽకరోత్ ।
అథాహ దేవీ దుఃఖార్తా బాలం దృష్ట్వా మహావ్రతా ॥ 42 ॥

మొసలి తనను బలవంతంగా లోపలికి లాక్కుని వెళ్తుంటే ఆబాలుడు భయంతో పెద్దగా కేకలు పెట్టాడు. వ్రతదీక్షలో ఉన్న పార్వతి ఆపిల్లవాడి అరుపులు విని, బాధతో ఇలా అన్నది.

పార్వత్యువాచ :-బాలుడి రూపంలో ఉన్న పరమేశ్వరుడిని పట్టుకున్న మొసలితో పార్వతి ఈవిధంగా అంటున్నది.

గ్రాహరాజ! మహాసత్త్వ! బాలకం హ్యేకపుత్రకమ్ ।
విసృజేమం మహాదంష్ట్ర క్షిప్రం భీమపరాక్రమ ॥ 43 ॥

ఓ గొప్పమొసలీ! మిక్కిలి శక్తిమంతమయినదానా! భయంకరమయిన పరాక్రమం కలిగినదానా! పెద్దపెద్ద కోరలు కలిగినదానా! తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకయిన ఈబాలకుడిని విడిచిపెట్టు.

గ్రాహ ఉవాచ :-పార్వతితో మొసలి ఈవిధంగా అంటున్నది.

యో దేవి దివసే షష్ఠే ప్రథమం సముపైతి మామ్ ।
స ఆహారో మమ పురా విహితో లోకకర్తృభిః ॥ 44 ॥

దేవీ! ప్రతి ఆరవనాడు మొదటిసారిగా నాదగ్గరకు వచ్చినవాడు నాకు ఆహారం అవుతాడని పూర్వం సృష్టికర్త నిర్ణయించాడు.

సోఽయం మమ మహాభాగే షష్ఠేఽహని గిరీన్ద్రజే ।
బ్రహ్మణా ప్రేరితో నూనం నైనం మోక్ష్యే కథఞ్చన ॥ 45 ॥

మహాత్మురాలా! పార్వతీదేవీ! ఆవిధంగా నేడు ఆరవ రోజున ఈతడు వచ్చాడు. నిశ్చయంగా బ్రహ్మదేవుడే ఇతడిని నాకు ఆహారంగా పంపాడు. నేను వీడిని విడిచిపెట్టను.

దేవ్యువాచ :–మొసలితో పార్వతి ఇలా అంటున్నది.

యన్మయా హిమవచ్ఛృఙ్గే చరితం తప ఉత్తమమ్ ।
తేన బాల మిమం ముఞ్చ గ్రాహరాజ నమోఽస్తు తే ॥ 46 ॥

మొసలిఱేడా! హిమవత్పర్వతశిఖరం మీద నేను చేసిన గొప్ప తపస్సుఫలం మొత్తం స్వీకరించి, ఈబాలకుడిని విడిచిపెట్టు. నీకు దండం పెట్తాను.

గ్రాహ ఉవాచ :–పార్వతితో మొసలి ఇలా అంటున్నది.

మా వ్యయ స్తపసో దేవి భృశం బాలే శుభాననే ।
యద్ బ్రవీమి కురుశ్రేష్ఠే తథా మోక్ష మవాప్స్యతి ॥ 47 ॥

దేవీ! బాలా! తపస్సు అనవసరంగా ఖర్చు చేసుకోవద్దు. సుందరముఖీ! నేను చెప్పేది విను. ఉత్తమురాలా! అలా చేస్తే ఈపిల్లవాడిని విడిచిపెట్తాను.

దేవ్యువాచ :–మొసలితో పార్వతి ఇలా అంటున్నది.

గ్రాహాధిప వదస్వాశు యత్ సతా మవిగర్హితమ్ ।
తత్ కృతం నాత్ర సన్దేహో యతో మే బ్రాహ్మణాః ప్రియాః ॥ 48 ॥

మొసళ్లనాయకుడా! సత్పురుషులు మెచ్చేమాట ఏదయినా సరే, వెంటనే చెప్పు. అలాగయితే తప్పకుండా నీవు చెప్పినట్లే చేస్తాను. సందేహం వద్దు. ఎందుకంటే నాకు బ్రాహ్మణులంటే చాల ఇష్టం.

గ్రాహ ఉవాచ :– మొసలి పార్వతితో ఇలా అంటున్నది.

యత్కృతం వై తపః కిఞ్చిద్ భవత్యా స్వల్పముత్తమమ్ ।
తత్ సర్వం మే ప్రయచ్ఛాశు తతో మోక్ష మవాప్స్యతి ॥ 49 ॥

దేవీ, నీవు చేసిన తపస్సు కొద్దిగా (స్వల్పకాలంలో చేసినది) ఐనా, చాలా శ్రేష్ఠమయినది. ఆతపస్సు మొత్తం నాకు ఇవ్వు. వెంటనే ఈపిల్లవాడు ఆపదనుండి బయటపడతాడు.

దేవ్యువాచ:– మొసలితో పార్వతి ఇలా అంటున్నది.

జన్మప్రభృతి యత్పుణ్యం మహాగ్రాహ కృతం మయా ।
తత్తే సర్వమయా దత్తం ముఞ్చ బాలం మహాగ్రహ ॥ 50 ॥

పెద్ద మొసలీ! నేను పుట్టినప్పటినుండి నేటివరకూ ఎంతటి పుణ్యం చేశానో, అది మొత్తం నీకు ఇచ్చేశాను. ఈబాలుడిని విడిచిపెట్టు.

బ్రహ్మోవాచ:- మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ప్రజజ్వాల తతో గ్రాహ స్తపసా తేన సంవృతః ।
ఆదిత్య ఇవ మధ్యాహ్నే దుర్నిరీక్ష్య స్తదాఽభవత్ ।
ఉవాచ చైవం తుష్టాత్మా దేవీం లోకస్య ధారిణీమ్ ॥ 51 ॥

పార్వతితపఃఫలం మొత్తం స్వీకరించిన మొసలిని ఆతపశ్శక్తి ఆవరించింది. దానిచేత ఆమొసలిశరీరం కాంతి, మట్టమధ్యాహ్నం సమయంలోని సూర్యబింబంలాగా, చూడటానికి వీలు లేనంతగా, మిరుమిట్లుగా ప్రకాశించింది. అప్పుడు ఆమొసలి సంతోషంగా లోకాల నన్నింటినీ కాపాడే పార్వతీదేవితో ఇలా అన్నది.

గ్రాహ ఉవాచ :-మొసలి పార్వతితో ఇలా అంటున్నది.

దేవి కిం కృత్య మేతావదనిశ్చిత్య మహావ్రతే ।
తపసోఽప్యర్జనం దుఃఖం తస్య త్యాగో న శస్యతే ॥ 52 ॥

తీవ్రమయిన నియమాలను పాటించేదానా! ఆలోచించకుండా ఎంతపని చేశావు. తపశ్శక్తిని తిరిగి సంపాదించటం సాధ్యమేనా? తిరిగి సంపాదించలేని తపస్సును త్యాగం చేయటం మంచిది కాదు. బాధాకరం.

గృహాణ తప ఏవ త్వం బాలం చేమం సుమధ్యమే ।
తుష్టోఽస్మి తే విప్రభక్త్యా వరం తస్మా ద్దదామి తే ॥

సుందరీ! నీబ్రాహ్మణభక్తికి నాకు సంతోషం గలిగింది. అందుచేత నీకు వరమిస్తున్నాను. నీవు ఇచ్చిన తపస్సునూ, ఈబాలుడినీ కూడ నీవే తీసుకో.

సాత్వేవ ముక్తా గ్రాహేణ ఉవాచేదం మహావ్రతా ॥ 53 ॥

మొసలి ఈవిధంగా పలుకగా నియమవతి అయిన పార్వతి ఇలా అన్నది.

దేవ్యువాచ :-పార్వతి మొసలితో ఈవిధంగా అంటున్నది.

దేహే నాపి మయా గ్రాహ రక్ష్యో విప్రః ప్రయత్నతః ।
తపః పునర్మయా ప్రాప్యం న ప్రాప్యో బ్రాహ్మణః పునః ॥ 54 ॥

మొసలీ! నాదేహం ఇచ్చి అయినా, ఇంక ఏదైన ప్రయత్నం చేసి అయినా, ఈబ్రాహ్మణ బాలుడిని నేను రక్షించవలసిందే. (ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న నేను తపస్సు ఇవ్వడంలో విశేషం ఏముంది?) ఆతపస్సును మళ్లీ సంపాదించుకోవచ్చు. కాని ప్రాణం పోతే ఈబ్రాహ్మణుడు తిరిగి రాడు.

సునిశ్చిత్య మహాగ్రాహ కృతం బాలస్య మోక్షణమ్ ।
న విప్రేభ్య స్తప శ్శ్రేష్ఠం శ్రేష్ఠా మే బ్రాహ్మణా మతాః ॥ 55 ॥

అందువలననే నేను జాగ్రత్తగా ఆలోచించే ఈవిధంగా తపస్సు ఇవ్వడానికి నిర్ణయించుకున్నాను. బ్రాహ్మణులకంటె తపస్సు గొప్పది కాదు. అన్నింటికంటె బ్రాహ్మణులు మాత్రమే శ్రేష్ఠులని నాఅభిప్రాయం.

దత్త్వా చాహం న గృహ్ణామి గ్రాహేన్ద్ర విహితం హి తే ।
న హి కశ్చిన్నరో గ్రాహ ప్రదత్తం పున రాహరేత్ ॥ 56 ॥

మొసలిఱేడా! ఇచ్చిన దానిని నేను తిరిగి పుచ్చుకోను. తపస్సు నీకు ఇవ్వడం అయిపోయింది. మొసలీ! మనిషి అయినవాడు ఎవడూ ఇచ్చినదానిని తిరిగి తీసుకోడు.

దత్తమేతన్మయా తుభ్యం నాఽదదానీహ తత్పునః ।
త్వయ్యేవ రమతా మేతద్ బాలశ్చాయం విముచ్యతామ్ ॥ 57 ॥

ఈతపస్సు నీకు ఇచ్చేశాను. దానిని తిరిగి తీసుకోను. ఆతపస్సును నీవద్దే ఉంచుకో. ఈబ్రాహ్మణబాలుడిని మాత్రం విడిచిపెట్టు.

బ్రహోవాచ :– మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తథోక్తస్తాం ప్రశస్యాథ ముక్త్వా బాలం నమస్య చ ।
దేవీ మాదిశ్య స గ్రాహ స్తత్రైవాన్తరధీయత ॥ 58 ॥

ఆవిధంగా పలికిన పార్వతిని మొసలి మెచ్చుకుంది. పార్వతికీ, బాలుడికీ నమస్కారం చేసి, ఆబాలుడిని చంపకుండా విడిచిపెట్టింది. అతడిని పార్వతికి అప్పగించి, మొసలి అక్కడే అంతర్ధానమయింది.

బాలోఽపి సరసస్తీరే ముక్తో గ్రాహేణ వై తదా ।
స్వప్నలబ్ధ ఇవార్థౌఘ స్తత్రైవాన్తరధీయత ॥ 59 ॥

మొసలి సరస్సుతీరంలో విడిచిపెట్టిన ఆబ్రాహ్మణబాలుడు కూడ కలలో లభించిన సంపదల (ప్రయోజనాల) లాగా, అక్కడే (మొసలిలాగా) అంతర్ధానం చెందాడు.

తపసోఽపచయం మత్వా దేవీ హిమగిరీన్ద్రజా ।
భూయ ఏవ తపః కర్తు మారేభే నియమస్థితా ॥ 60 ॥

హిమవత్పర్వతరాజు కూతురు తాను చేసిన తపస్సు తగ్గిపోయిందనుకుని, మళ్లీ నియమపూర్వకంగా, తపస్సు చేయడం ఆరంభించింది.

కర్తుకామాం తపో భూయో జ్ఞాత్వా తాం శఙ్కరస్స్వయమ్ ।
ప్రోవాచ వచనం విప్రా మా కృథా స్తప ఇత్యుత ॥ 61 ॥

పార్వతి మళ్లీ తపస్సు చేయాలనుకుంటున్నదని తెలిసి, శంకరుడు స్వయంగా ఎదుట కనిపించి, 'తపస్సు చేయవద్దు' అని చెప్పాడు.

మహ్యా మేతత్తపో దేవి త్వయా దత్తం మహావ్రతే ।
తత్తే నైవాక్షయం తుభ్యం భవిష్యతి సహస్రధా ॥ 62 ॥

దేవీ! ఉత్తమనియమవతీ! నీవు ఇచ్చిన తపస్సు నాకు అందింది. అదే తగ్గిపోకుండా, శాశ్వతంగా నీతోనే ఉంటుంది.

ఇతి లబ్ధ్వా వరం దేవీ తపసోఽక్షయముత్తమమ్ ।
స్వయంవర ముదీక్షన్తీ తస్థౌ ప్రీతా ముదా యుతా ॥ 63 ॥

పార్వతి ఈవిధంగా పరమేశ్వరుడినుండి, ఉత్తమమయిన తపస్సు అక్షయంగా ఉండటం వరంగా పొందింది. తనస్వయంవరంకోసం ఎదురు చూస్తూ, ఆనందంగా ఉంది.

ఇదం పఠేద్ యో హి నర స్సదైవ గిరీన్ద్రకన్యాచరణఞ్చ సమ్యక్ ।
స దేహభేదం సమవాప్య పూతో భవేద్ గణేశస్తు కుమారతుల్యః ॥ 64 ॥

పార్వతి చేసిన ఈఘనకార్యానికి సంబంధించినవృత్తాంతాన్ని నిరంతరమూ శ్రద్ధగా చదివేమానవుడు పూర్వంకంటె భిన్నమయిన లక్షణాలు కలిగిన శరీరంతో పవిత్రుడవుతాడు. (బాలుడయిన శివుడికథ చదవడంవలన శివకుమారు లయిన) గణపతితోనూ, కుమారస్వామితోనూ సమానుడవుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే పార్వత్యా స్సత్త్వదర్శనం నామ త్రయస్త్రింశోఽధ్యాయః॥33॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషి సంవాదంలో పార్వతీసత్త్వదర్శనం అనే ముప్పైమూడవ అధ్యాయం సంపూర్ణం.



చతుస్త్రింశోఽధ్యాయః. - ముప్పైనాల్గవ అధ్యాయం

ఉమామహేశ్వరవివాహనిరూపణమ్ - ఉమామహేశ్వరవివాహనిరూపణం

బ్రహ్మోవాచ :-బ్రహ్మదేవుడు మహర్షులతో ఇలా చెప్తున్నాడు.

విస్తృతే హిమవత్పృష్ఠే విమానశతసఙ్కులే ।
అభవత్ స తు కాలేన శైలపుత్ర్యా స్స్వయంవరః ॥ 1 ॥

హిమాలయపర్వతం చాల విశాల మయినది. దానిమీద వందలకొద్దీ విమానాలు గుంపులుగా చేరిఉంటాయి. అక్కడే పార్వతీదేవి స్వయంవరం జరుగుతున్నది.

అథ పర్వతరాజోఽసౌ హిమవాన్ ధ్యానకోవిదః ।
దుహితుర్దేవదేవేన జ్ఞాత్వా తదభిమన్త్రితమ్ ॥ 2 ॥

ధ్యానంలో నిపుణుడయిన హిమవత్పర్వతరాజు తనకూతురు దేవదేవుడయిన పరమేశ్వరుడితో సంభాషించిన విషయాన్ని, (ధ్యానశక్తితో) తెలుసుకున్నాడు.

జానన్నపి మహాశైల స్సమయాఽరక్షణేప్సయా ।
స్వయంవరం తతో దేవ్యా స్సర్వలోకేష్వఘోషయత్ ॥ 3 ॥

ఆవిషయం తెలిసినప్పటికీ, ఆపర్వతరాజు తనకూతురు స్వయంవరంలో భర్తను వరించాలని తాను చేసుకున్న నిర్ణయంప్రకారం(33.13,14శ్లో), స్వయంవరం జరపాలనుకున్నాడు. పార్వతీస్వయంవరాన్ని అన్నిలోకాల లోనూ చాటించాడు.

దేవదానవసిద్ధానాం సర్వలోకనివాసినామ్ ।
వృణుయాత్తం మహాదేవం సమక్షం యది మే సుతా ॥
తదేవ సుకృతం శ్లాఘ్యం మమాభ్యుదయసమ్మతమ్ ॥ 4 ॥

ఒకవేళ నాకుమార్తె దేవతలూ, దానవులూ, సిద్ధులూ, ఇంకా సమస్తమయిన ఇతరలోకాలలో నివసించే వారందరి సమక్షంలో స్వయంవరంలో పరమేశ్వరుడిని వరిస్తే, అదే నాపుణ్యఫలం. ప్రశంసనీయం. నాకు శ్రేయస్కరం.

ఇతి సంచిన్త్య శైలేన్ద్రః కృత్వా హృది మహేశ్వరమ్ ।
ఆబ్రహ్మకేషు దేవేషు దేవ్యా శ్శైలేన్ద్రసత్తమః ॥
కృత్వా రత్నాకులం దేశం స్వయంవరమచీకరత్ ॥ 5 ॥

అని ఆలోచించి, హిమవంతుడు పరమేశ్వరుడినే తనఅల్లుడిగా మనసులో నిశ్చయించుకున్నాడు. బ్రహ్మ మొదలయిన దేవతలందరిలోనూ పార్వతీస్వయంవరాన్ని ప్రకటించాడు. తనరాజ్యాన్ని రత్నాలతో అలంకరించి పార్వతీస్వయంవరాన్ని నిర్వహించాడు.

అథైవమాఘోషితమాత్ర ఏవ స్వయంవరే తత్ర నగేన్ద్రపుత్ర్యాః ।
దేవాదయస్సర్వజగన్నివాసాస్సమాయయు ర్దివ్యగృహీతవేషాః ॥ 6 ॥

ఆవిధంగా హిమవంతుడు చాటించినవార్త తెలిసి, దేవతలు మొదలుగా అన్ని లోకాలలోనూ నివసించేవారు అందరూ అందంగా అలంకరించుకుని, పార్వతీస్వయంవరానికి వచ్చారు.

ప్రఫుల్లపద్మాసనసన్నివిష్ట స్సిద్ధైర్వృతో యోగిభిరప్రమేయైః ।
విజ్ఞాపితస్తేన మహీధ్రరాజ్ఞాఽ ఽ గతస్తదాఽ హం త్రిదశైరుపేతః ॥ 7 ॥

ఆహిమవంతుడు నన్ను (బ్రహ్మను) గూడ స్వయంవరానికి రమ్మని కోరాడు. దేవతలతో కలిసి సిద్ధులూ, అసంఖ్యాక మయిన యోగులూ సేవిస్తుండగా, చక్కగా వికసించిన పద్మాసనంలో వేంచేసి నేనూ పార్వతీస్వయం వరానికి వచ్చాను.

అక్షిణాం సహస్రం సురరాట్ స బిభ్రద్దివ్యాఙ్గహారస్రగుదారరూపః ।
ఐరావతం సర్వగజేన్ద్రముఖ్యం స్రవన్మదాసారకృతప్రవాహమ్ ॥ 8 ॥

ఆరుహ్య సర్వామరరాట్ స వజ్రం బిభ్రత్ సమాగాత్ పురత స్సురాణామ్ ॥9 ॥

దేవేంద్రుడు దివ్యమయిన వివిధాలంకారాలనూ, పూలమాలలనూ ధరించాడు. అతడి రూపం అందంగా ఉంది. అతడి వాహనం ఐరావతం. అది ఏనుగులలో చాల ఉత్తమమయినది. దాని చెంపలనుండి కారుతున్న మదద్రవం ప్రవాహంలాగా సాగుతున్నది. సమస్తదేవతలకు రాజు అయిన ఇంద్రుడు ఆఐరావతాన్ని ఎక్కాడు. వజ్రాయుధాన్ని ధరించాడు. దేవతలు అతడిని వెన్నంటి వస్తున్నారు. ఆప్రకారంగా ఇంద్రుడు పార్వతీస్వయంవరానికి వచ్చాడు.

తేజఃప్రభావాధికతుల్యరూపీ ప్రోద్భాసయన్ సర్వదిశో వివస్వాన్ ।
హైమం విమానం స చలత్పతాక మారూఢ ఆగాత్ త్వరితం జవేన ॥ 10 ॥

సూర్యుడు రెపరెపలాడుతున్న జెండాతో కూడిన బంగారువిమాన మెక్కి, తొందరతో వేగంగా పార్వతీస్వయం వరానికి వెళ్లాడు. అతడిరూపం తేజస్సుమహిమచేత ఉత్తమంగా ఉంది. అటువంటిసూర్యుడు దిక్కు లన్నింటినీ తన తేజస్సుతో ప్రకాశింపజేస్తూ (స్వయంవరానికి) వెళ్లాడు.

మణిప్రదీప్తోజ్జ్వలకుణ్డలశ్చ వహ్న్యర్కతేజఃప్రతిమే విమానే ।
సమభ్యగాత్ కశ్యపసూను రేక ఆదిత్యమధ్యాద్ భగనామధారీ ॥ 11 ॥

కశ్యపమహర్షి కుమారుడు భగుడు. ఇతడు ద్వాదశాదిత్యులలో ఒకడు. రత్నాలతో మెరుస్తున్న చెవికమ్మలు ధరించాడు. అటువంటి భగుడు అనేఆదిత్యుడు అగ్నితోనూ, సూర్యుడితోనూ సమానమయిన తేజస్సు గలిగిన విమానం మీద పార్వతీస్వయంవరానికి వచ్చాడు.(34శ్లో. "ఆదిత్యమధ్యాహ్నగతో మరీచిః" అనేపాఠం సరిగా అన్వయించదు. 34.శ్లోకాన్నిబట్టి ఈపాఠం గ్రహింపదగిఉన్నది.)

పీతాఙ్గయష్టి స్సుకృతాఙ్గహారః తేజోబలాజ్ఞాసదృశప్రభావః ।
దణ్డం సమాగృహ్య కృతాన్తః ఆగా దారుహ్య భీమం మహిషం జవేన ॥ 12 ॥

యముడు ధ్వజస్తంభంలాగా ఒడ్డూ, పొడుగూ గలిగినవాడు. శరీరం రంగు (పసుపు)పచ్చగా ఉంటుంది. ఒంటినిండా, రకరకాల ఆభరణాలను ధరించాడు. తన తేజస్సుకూ, శక్తికీ, అధికారానికీ తగినమహిమ గలిగి ఉన్నాడు. దండాయుధాన్ని ధరించాడు. అటువంటి యముడు భయంకరమయిన దున్నపోతుమీద ఎక్కి, తొందర తొందరగా పార్వతీస్వయంవరానికి వచ్చాడు.

మహామహీధ్రోచ్ఛ్రయపీనగాత్రః స్వర్ణాదిరత్నాఞ్చితచారువేశః ।
సమీరణ స్సర్వజగద్బిభర్తా విమాన మారుహ్య సమభ్యగాద్ధి ॥ 13 ॥

వాయుదేవుడు సమస్తమయిన లోకాలనూ పోషిస్తుంటాడు. అతడి శరీరం పెద్ద పర్వతంలాగా బాగా ఎత్తుగా, లావుగా ఉంటుంది. రత్నాలు పొదిగిన బంగారుఆభరణాలు మొదలయినవాటితో అతడి వేషం అందంగా ఉంది. అటువంటి వాయుదేవుడు విమానమెక్కి పార్వతీస్వయంవరానికి వచ్చాడు.

సన్తాపయన్ సర్వసురాసురేశాన్ తేజోఽధిక స్తేజసి సన్నివిష్టః ।
వహ్ని స్సమభ్యేత్య సురేన్ద్రమధ్యే జ్వలన్ ప్రతస్థో వరవేశధారీ ॥ 14 ॥

అగ్నిదేవుడు సమస్తమయిన దేవతలనూ, రాక్షసులనూ తపింపజేస్తాడు. అత్యధికమయిన తేజస్సు గలవాడు. ఎప్పుడూ మండుతూ ఉంటాడు. ఉత్తమమయిన వేషం ధరించాడు. అటువంటి అగ్నిదేవుడు తేజస్సుతో కూడి, పార్వతీస్వయంవరానికి విచ్చేశాడు. వచ్చి, దేవతల మధ్యలో కూర్చున్నాడు.

నానామణిప్రజ్వలితాఙ్గయష్టిః జగద్ధరం దివ్యవిమానమగ్ర్యమ్ ।
ఆరుహ్య సర్వద్రవిణాధిపేశః స రాజరాజస్త్వరితోఽభ్యగాచ్చ ॥ 15 ॥

కుబేరుడు అన్ని రకాల సంపదలకు అధిపతి. అతడి శరీరం కఱ్ఱలాగా, దృఢంగా ఉంటుంది. రకరకాలయిన రత్నాలతో వెలుగుతున్నాడు. అటువంటి కుబేరుడు లోకాలను కాపాడే దేవ(పుష్పక)విమాన మెక్కి, వేగంగా, పార్వతీస్వయంవరానికి వచ్చాడు.

ఆప్యాయయన్ సర్వసురాసురేశాన్ కాన్త్యా చ వేశేన చ చారురూపః ।
జ్వలన్మహారత్నవిచిత్రరూపం విమాన మారుహ్య శశీ సమాయాత్ ॥ 16 ॥

చంద్రుడు దేవతలనూ, రాక్షసులనూ అందరినీ పోషిస్తుంటాడు. చల్లని కాంతితోనూ, అంద మయిన వేషంతోనూ అతడిరూపం మనోహరంగా ఉన్నది. ప్రకాశిస్తున్న గొప్పరత్నాలతో అతడి ఆకారం అద్భుతంగా ఉంది. అటువంటి చంద్రుడు విమాన మెక్కి పార్వతీ స్వయంవరానికి వచ్చాడు.

శ్యామాఙ్గయష్టి స్సువిచిత్రవేశ స్సర్వాఙ్గ ఆబద్ధసుగన్ధిమాల్యః ।
తార్క్ష్యం సమారుహ్య మహీధ్రకల్పం గదాధరోఽసౌ త్వరిత స్సమేతః ॥ 17 ॥

శ్రీమహావిష్ణువు నల్లని దృఢమయిన శరీరం గలిగినవాడు. మిక్కిలి అద్భుతమయిన వేషంలో ఉన్నాడు. గొప్ప పరిమళం కలిగిన పూలమాలలను ఒంటినిండా చుట్టుకున్నాడు. అటువంటి శ్రీమహావిష్ణువు పర్వతంవంటి గరుత్మంతుడి మీద ఎక్కి, త్వరత్వరగా పార్వతీస్వయంవరానికి వచ్చాడు.

అథాశ్వినౌ చాపి భిషగ్వరౌ ద్వావేకం విమానం త్వరయాఽధిరుహ్య ।
మనోహరా వుజ్జ్వలచారువేశా వా జగ్మతు ర్దేవవరౌ సుధీరౌ ॥ 18 ॥

అశ్వినులు ఇద్దరూ సొగసరులు. ఉత్తమవైద్యులు. మిరుమిట్లు గొలిపే మనోహరమయిన వేషాలు ధరించారు. ఆఅశ్వినులు ఇద్దరూ ఒకే విమానం ఎక్కి వేగంగా పార్వతీస్వయంవరానికి వచ్చారు.

సహస్రనాగ స్స్ఫురదగ్నివర్ణం బిభ్రత్తదానీం జ్వలనార్కతేజాః ।
సార్థం స నాగై రపరైర్మహాత్మా విమానమారుహ్య సమభ్యగాచ్ఛ ॥ 19 ॥

వేయితలల నాగేంద్రుడు అగ్ని, సూర్యులవంటితేజస్సు గలిగిన మహాత్ముడు. ఇతరనాగులు తనను సేవిస్తుండగా, ఎగసిపడే అగ్నిజ్వాలవంటి రంగులో ఉన్న విమానం ఎక్కి, పార్వతీస్వయంవరానికి వచ్చాడు.

దితే స్సుతానాం చ మహాసురాణాం వహ్న్యర్కశక్రానిలతుల్యభాసామ్ ।
వరానురూపం ప్రవిధాయ వేశం వృన్దం సమాగాత్ పురతస్సురాణామ్ ॥ 20 ॥

దైత్యులు గొప్పరాక్షసులు. అగ్ని, సూర్యుడు, ఇంద్రుడు, వాయువు, వీరితో సమానమయిన తేజస్సు కలిగినవారు. ఆరాక్షసులు పెండ్లికుమారుల వేషం వేసుకుని, గుంపుగా దేవతలకంటే ముందుగానే పార్వతీస్వయం వరానికి వచ్చారు.

గన్ధర్వరాజస్స చ చారురూపీ దివ్యాఙ్గదో దివ్యవిమానచారీ ।
గన్ధర్వసఙ్ఘై స్సహితోఽప్సరోభిః శక్రాజ్ఞయా తత్ర సమాజగామ ॥ 21 ॥

గంధర్వుల రాజు (విశ్వావసువు) అంద మయిన రూపం గలవాడు. దేవలోకానికి సంబంధించిన ఆభరణాలు ధరించాడు. దివ్యమయిన విమానంలో తిరుగుతుంటాడు. అటువంటి గంధర్వరాజు ఇంద్రుడి అనుమతితో, గంధర్వులతోనూ, అప్సరసలతోనూ కూడి పార్వతీ స్వయంవరానికి వచ్చాడు.

అన్యే చ దేవా స్త్రిదివాత్తదానీం పృథక్ పృథక్ చారుగృహీతవేషాః ।
ఆజగ్మురారుహ్య విమానపృష్ఠం గన్ధర్వయక్షోరగకింనరాశ్చ ॥ 22 ॥

ఇంకా ఇతరులయిన దేవతలూ, దేవలోకవాసులయిన గంధర్వులూ, యక్షులూ, ఉరగులూ, కింనరులూ, ప్రత్యేకంగా, స్వయంవరానికి తగిన అందమయిన వేషంతో విమానమెక్కి, పార్వతీస్వయంవరానికి వచ్చారు.

రాజ్ఞాం పతిస్తత్ర సురేన్ద్రమధ్యే రాజాధిరాజోఽధికతుల్యమూర్తిః ।
ఆజ్ఞాబలైశ్వర్యకృతప్రమోదః స్వయంవరం తమలంచకార ॥23 ॥

హిమవంతుడు పర్వతరాజులకు రాజు. చక్రవర్తి. స్వయంవరానికి వచ్చిన దేవతాప్రధానులలో కొందరికంటె అధికమయినవాడు, మరి కొందరితో సమానమయినవాడు. అతడు తన అధికారంతోనూ, పరాక్రమంతోనూ, ఐశ్వర్యంతోనూ, ఆవచ్చినవారందరినీ సంతోషపెట్టాడు. ఆ స్వయంవరస్థలానికి అందాన్ని కల్గించాడు.

హేతుస్త్రిలోకస్య జగత్ప్రసూతేర్మాతా చ తేషాం ససురాసురాణామ్ ।
పత్నీ చ శమ్భోః పురుషస్య ధీమతో గీతా పురాణే ప్రకృతిః పరా యా ॥ 24 ॥

సతీదేవి ముల్లోకాల ఉనికికి కారణమైనది. లోకాలన్నింటినీ సృష్టించింది. దేవతలకూ రాక్షసులకూ ఇద్దరికీ తల్లి. సర్వజ్ఞు డయిన పరమేశ్వరుడికి భార్య. పురాణంలో ప్రకృతికంటె పరమయినదిగా ప్రశంసింపబడింది.

దక్షస్య కోపాద్ధిమవద్గృహం సా కార్యార్థ మాయాత్ త్రిదివౌకసాం హి ॥ 25 ॥

దక్షుడిమీద కోపంతోనూ, ఒకానొక దేవకార్యం నిర్వహించడంకోసమున్నూ హిమవంతుడి ఇంటికి అతడి కూతురుగా వచ్చింది.

విమానపృష్ఠే మణిహేమజుష్టే స్థితా చలచ్చామరవీజితాఙ్గీ ।
సర్వర్తుపుష్పాం సుసుగన్ధమాలాం ప్రగృహ్య దేవీ ప్రసభం ప్రతస్థే ॥ 26 ॥

దేవకాంతలు ఇరువైపులా వింజామరలు వీస్తుండగా, రత్నాలతోనూ, బంగారంతోనూ నిండిన విమానంమీద, అన్ని ఋతువులకు సంబంధించిన పూలతో కూడిన పరిమళభరితమయిన స్వయంవరమాలికను తీసుకుని పార్వతి మెల్లగా స్వయంవరానికి బయలుదేరింది.

బ్రహ్మోవాచ:- మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

మాలాం ప్రగృహ్య దేవ్యాం తు స్థితాయాం దేవసంసది ।
శక్రాద్యై రాగతై ర్దేవై స్స్వయంవర ఉపాగతే ॥ 27 ॥

దేవ్యా జిజ్ఞాసయా శమ్భుర్భూత్వా పఞ్చశిఖశ్శిశుః ।
ఉత్సఙ్గతలసంసుప్తో బభూవ చ మహాద్యుతిః ॥ 28 ॥

స్వయంవరమాల పుచ్చుకుని పార్వతి స్వయంవరమండపంలో ఉన్నది. దేవేంద్రుడు మొదలయిన దేవతలు ఆస్వయంవరానికి విచ్చేసిఉన్నారు. ఆస్థితిలో పరమేశ్వరుడు పార్వతి మనస్సును తెలుసుకుందామనుకున్నాడు. పంచశిఖలతో చిన్నపిల్లవాడు అయినాడు. ఎంతో కాంతిమంతుడయిన శివుడు పార్వతీదేవి ఒడిలో పసివాడయి నిద్రపోయాడు.

తతో దదర్శ తం దేవీ శిశుం పఞ్చశిఖం స్థితమ్ ।
జ్ఞాత్వా తం సమవధ్యానాజ్జగృహే ప్రీతిసంయుతా ॥ 29 ॥

పార్వతి తన ఒడిలో పంచశిఖలతో ఉన్న పసివాడిని చూసింది. అతడు పరమేశ్వరుడే అని గ్రహించింది. ప్రేమగా ఆపసివాడిని దగ్గరకు తీసుకుంది.

అథ సా శుద్ధసఙ్కల్పా కాఙ్క్షితం ప్రాప్య సత్పతిమ్ ।
నివృత్త్యైవ తదా తస్థౌ కృత్వా సా హృది తం విభుమ్ ॥ 30 ॥

నిర్మలమయిన సంకల్పంతో తాను కోరుకున్న భర్త లభించడంతో పార్వతి తన మనస్సులో ఆపరమేశ్వరుడినే నిలుపుకుని, స్వయంవరమంటపంనుండి వెళ్లిపోయింది.

తతో దృష్ట్వా శిశుం దేవా దేవ్యా ఉత్సఙ్గవర్తినమ్ ।
కోఽ యమత్రేతి సమ్మన్త్ర్య చుక్రుశుః భృశమోహితాః ॥ 31 ॥

పార్వతి ఒడిలో ఉన్న పసివాడిని చూచి, దేవతలు అజ్ఞానంతో ఇతడు ఎవరు? ఇక్కడికి ఎలా వచ్చాడు? అని తమలో తాము చర్చించుకున్నారు. ఆపసివాడిపై కోపగించారు.

వజ్ర మాహారయత్తస్య బాహు ముత్క్షిప్య వృత్రహా ।
స బాహు రుత్థితస్తస్య తథైవ సమతిష్ఠత ॥ 32 ॥

అప్పుడు ఇంద్రుడు ఆబాలుడిని సంహరించడానికి వజ్రాయుధం పట్టుకుని, ఆచేయి పైకెత్తాడు. పైకి లేచిన దేవేంద్రుడి చేయి అలాగే ఉండిపోయింది.

స్తమ్భితశ్శిశురూపేణ దేవదేవేన శమ్భునా ।
శశాక వజ్రం క్షేప్తుం న వృత్రహా చలితుం న చ ॥ 33 ॥

శిశువు రూపంలో ఉన్న మహాదేవుడు ఆఇంద్రుడి చేతిని కదలకుండా చేశాడు. అందువల్ల దేవేంద్రుడు వజ్రాన్ని ప్రయోగించ లేకపోగా, (వజ్రాయుధం పట్టుకున్న) చేతిని గూడ కదిలించలేకపోయాడు.

భగో నామ తతో దేవ ఆదిత్యః కాశ్యపో బలీ ।
ఉత్క్షిప్య స్వాయుధం దీప్తం ఛేత్తుమిచ్ఛన్ విమోహితః ॥ 34 ॥

కశ్యపకుమారుడయిన భగుడు అనే ఆదిత్యుడు బలవంతుడు. ఆతడు అజ్ఞానంతో ఆపసివాడిని నరికి వేద్దామని, వెలుగులు చిమ్మే తనఆయుధాన్ని పై కెత్తాడు.

తస్యాపి భగవాన్ బాహుం తథైవాస్తమ్భయద్ విభుః ।
బలం తేజశ్చ యోగఞ్చ తథైవాస్తమ్భయద్ విభుః ॥ 35 ॥

పరమేశ్వరుడు భగుడిచేతిని గూడ అదే విధంగా (ఇంద్రుడికివలెనే) కదలకుండా బిగుసుకుపోయేటట్లు చేశాడు. భగుడి తేజస్సునూ, బలాన్నీ, యోగశక్తినీ పరమేశ్వరుడు స్తంభింపజేశాడు.(11శ్లో)

శిరః ప్రకమ్పయన్ విష్ణు శ్శఙ్కరం సమవైక్షత ॥ 36 ॥

శ్రీమహావిష్ణువు తలపంకిస్తూ (శిశువురూపంలో ఉన్న)శంకరుడిని చూశాడు.

అథ తేషు స్థితేష్వేవం మన్యుమత్సు సురేషు చ ।
అహం పరమసంవిగ్నో ధ్యానమాస్థాయ శఙ్కరమ్ ॥
బుద్ధవాన్ దేవదేవేశ ముమోత్సఙ్గే సమాస్థితమ్ ॥ 37 ॥

దేవత లందరూ ఈవిధంగా కోపంతో ఉండగా, నేను (బ్రహ్మ) చాల కలవరపాటు చెందాను. ధ్యానస్థితిలోకి వెళ్ళాను. పార్వతి ఒడిలో ఉన్న బాలుడు దేవదేవుడయిన శంకరుడు అని (ధ్యానంలో) తెలుసుకున్నాను.

జ్ఞాత్వాఽ హం పరమేశానం శీఘ్రముత్థాయ సాదరమ్ ।
వవన్దే చరణం శమ్భోస్తుతవాం స్తమహం ద్విజాః ॥
పురాణై స్సామసజ్గీతైః పుణ్యాఖ్యైర్గుహ్యానామభిః ॥ 38 ॥

అతడు పరమేశ్వరుడని గ్రహించిన నేను వెంటనే ఆసనంనుండి లేచి, ఆప్యాయంగా శంకరుడి పాదాలకు నమస్కరించాను. బాహ్మణులారా! సనాతనాలయిన సామవేదానికి సంబంధించిన సంగీతాలతోనూ, పుణ్యప్రద మయిన శివుడి రహస్యనామాలతోనూ, పరమేశ్వరుడిని స్తుతించాను.

అజస్త్వమజరో దేవస్రష్టా దేవః పరాపరమ్ ।
ప్రధానం పురుషో యస్త్వం బ్రహ్మ ధ్యేయం తదక్షరమ్ ॥ 39 ॥

పరమేశ్వరా! నీవు పుట్టుక లేనివాడివి. నీకు ముసలితనం లేదు. దేవుడివి. సృష్టికర్తవు. సర్వోత్తముడివీ, సాధారణుడివీ నీవే. ప్రకృతీ, పురుషుడూ నీవే. జ్ఞానం నీవు. ధ్యానింపదగినవాడివి. స్థిరంగా ఉండేవాడివి.

అమృతం పరమాత్మా చ ఈశ్వరః కారణం మహత్ ।
బ్రహ్మసృక్ ప్రకృతేస్స్రష్టా సర్వకృత్ ప్రకృతేః పరః ॥ 40 ॥

మృత్యువు లేనివాడివి. పరమాత్మవు. ఈశ్వరుడివి. ప్రకృతికి కారణమయినవాడివి. మహత్పదార్థం నీవే. బ్రహ్మను సృష్టించినవాడివి. ప్రకృతిని సృష్టించివాడివి. సమస్తాన్నీ కల్పించినవాడివి. ప్రకృతికి పరమయినవాడివి.

ఇయం చ ప్రకృతిర్దేవీ సదా తే సృష్టికారిణీ ।
పత్నీరూపం సమాస్థాయ జగత్కారణమాగతా ॥ 41 ॥

ఈపార్వతీ దేవి ప్రకృతి. నీ సృష్టికర్మకు సాధనం ఈ దేవియే. నీకు భార్యరూపాన్ని పొంది, లోకాలకోసం (సృష్టించి పోషించడానికి) వచ్చినది.

నమస్తుభ్యం మహాదేవ దేవ్యా వై సహితాయ చ ॥ 42 ॥

మహాదేవా! పార్వతీదేవితో కూడిన నీకు నమస్కారం.

ప్రసాదాత్తవ దేవేశ నియోగాచ్చ మయా ప్రజాః ।
దేవాద్యాస్తు ఇమాస్స్రృష్టా మూఢా స్త్వద్యోగమాయయా ॥ 43 ॥

దేవపతీ! నీ అనుగ్రహంచేతనూ, నీ ఆదేశంచేతనూ, నీ యోగమాయాశక్తిచేతనూ, నేను ప్రజలు, దేవతలూ మొదలయినవారిని సృష్టించాను.

కురు ప్రసాదమేతేషాం యథాపూర్వం భవన్త్విమే ॥ 44 ॥

స్వయంవరమంటపంలో ఉన్న వీరందరిపై దయ చూపు. వీళ్లందరూ ఇంతకుపూర్వం ఉన్నట్లుగానే సుఖంగా ఉండాలి.

తత ఏవ మహం విప్రా విజ్ఞాప్య పరమేశ్వరమ్ ।
స్తమ్భితాన్ సర్వదేవాంస్తానిదం చాహం తదోక్తవాన్ ॥ 45 ॥

బ్రాహ్మణులారా! ఈవిధంగా పరమేశ్వరుడిని స్తుతించి, వినతులు చేసి, నిశ్చేష్టులయి ఉన్న దేవతలతో ఈవిధంగా అన్నాను.

మూఢాశ్చ దేవతాస్సర్వా నైనం బుధ్యత శఙ్కరమ్ ।
గచ్ఛధ్వం శరణం సర్వే శీఘ్రఙ్చైవ మహేశ్వరమ్ ॥
సార్ధం భవాన్యా దేవేశం పరమాత్మానమవ్యయమ్ ॥ 46 ॥

దేవతలారా! మీరు అజ్ఞానంచేత, ఈబాలుడు శంకరుడని తెలుసుకోలేకపోయారు. ఈ శంకరుడు పరమాత్మ. మార్పు లేక స్థిరంగా ఇలాగే ఉంటాడు. వెంటనే అందరూ భవానితో కూడి ఉన్న ఈ భవుడిని శరణు వేడండి.

తతస్సంస్తమ్భితా స్సర్వే తథైవ త్రిదివౌకసః ।
ప్రణేముర్మనసా శర్వం భావశుద్ధేన చేతసా ॥ 47 ॥

చేష్టలుడిగిన దేవతలు అందరూ బ్రహ్మ చెప్పిన ప్రకారం వెంటనే నిర్మల మయిన బుద్ధితో, మనఃపూర్వకంగా పరమేశ్వరుడికి సాష్టాంగంగా నమస్కరించారు.

అథ తేషాం ప్రసన్నోఽభూ ద్దేవదేవో మహేశ్వరః ।
యథాపూర్వం చకారాశు దేవతానాం తనూస్తదా ॥ 48 ॥

దేవతలకు దేవుడయిన మహాదేవుడు దేవతలను దయ తలచాడు. వారి శరీరాలను పూర్వం లాగా సాధారణస్థితిలోకి తెప్పించాడు.

తత ఏవం ప్రవృత్తే తు సర్వదేవనివారణే ।
వపుశ్చకార దేవేశస్త్ర్యక్షం పరమమద్భుతమ్ ॥ 49 ॥

ఈ విధంగా సమస్తమయిన దేవతలకు కష్టం తొలగిన తరువాత, పరమేశ్వరుడు మూడు కన్నులతో మిక్కిలి ఆశ్చర్యకరమయిన శరీరం ధరించి ప్రత్యక్షమయ్యాడు.

తేజసా తస్య తే ధ్వస్తా శ్చక్షుస్సర్వే న్యమీలయన్ ।
తేభ్యస్స పరమం చక్షు స్స్వవపు ర్దృష్టిశక్తిమత్ ॥
ప్రాదాత్ పరమదేవేశ మపశ్యంస్తే తదా విభుమ్ ॥ 50 ॥

ఆ పరమేశ్వరుడి అమితమైన తేజస్సును చూడలేక అందరూ ఒక్కసారిగా కన్నులు మూసుకున్నారు. పరమేశ్వరుడు వారికి తన శరీరాన్ని చూడగలిగిన సామర్థ్యం ఉన్న దివ్యచక్షువును ప్రసాదించాడు. అప్పుడు వారు ఆ దివ్యనేత్రంతో పరమేశ్వరుడిని చూశారు.

తే దృష్ట్వా పరమేశానం తృతీయేక్షణధారిణమ్ ।
శక్రాద్యా మేనిరే దేవాస్సర్వ ఏవ సురేశ్వరాః ॥ 51 ॥

ఇంద్రాదులయిన దేవతలు అందరూ మూడవ కంటిని ధరించిన ఆతడిని చూచి, ఆతడు పరమేశ్వరుడు అని గ్రహించారు.

తస్య దేవీ తదా హృష్టా సమక్షం త్రిదివౌకసామ్ ।
పాదయోః స్థాపయామాస స్రజ్మాలామమితద్యుతేః ॥ 52 ॥

అప్పుడు పార్వతి ఎంతో సంతోషించింది. దేవతలందరూ చూస్తుండగా, చేతిలోని స్వయంవరమాలను అమేయతేజస్సు గలిగిన పరమేశ్వరుడి పాదయుగళి వద్ద ఉంచింది.

సాధు సాధ్వితి సమ్ప్రోచ్య సర్వే దేవాః పునర్విభుమ్ ।
సహ దేవ్యా నమశ్చక్రు శ్శిరోభిర్భూతలాశ్రితైః ॥ 53 ॥

దేవత లందరూ సాధు, సాధు, (చాల మంచిది, శుభం) అన్నారు. తలలు నేల కానించి, పార్వతీదేవితో గూడిన పరమేశ్వరుడికి మళ్లీ నమస్కరించారు.

అథాస్మిన్నన్తరే విప్రా స్తమహం దైవతైస్సహ ।
హిమవన్తం మహాశైల ముక్తవాంశ్చ మహాద్యుతిమ్ ॥ 54 ॥

బ్రాహ్మణులారా! ఆసమయంలో దేవతలతో కూడి, నేను (బ్రహ్మ) – పర్వతరాజూ, గొప్ప కాంతిమంతుడూ అయిన హిమవంతుడితో ఈ విధంగా అన్నాను.

శ్లాఘ్యః పూజ్యశ్చ వన్ద్యశ్చ సర్వేషాం త్వం మహానసి ।
శర్వేణ సహ సమ్బన్ధో యస్య తేఽభ్యుదయో మహాన్ ॥ 55 ॥

పరమేశ్వరుడితో చుట్టరికం నీకు గొప్ప శుభపరంపరలు కలిగిస్తుంది. ఆ సంబంధంమూలంగా నీవు స్తుతింపదగినవాడివీ, పూజింపదగినవాడివీ, నమస్కరింపదగినవాడివీ అయినావు. అందరిలోనూ నీవే గొప్పవాడివి అయినావు.

క్రియతాం చారురుద్వాహః కిమర్థం స్థీయతే పరమ్ ।
తతః ప్రణమ్య హిమవాంస్తదా మాం ప్రత్యభాషత ॥ 56 ॥

ఇంక ఆలస్యం ఎందుకు? వెంటనే పార్వతీపరమేశ్వరులకు మహోత్సవంగా వివాహం చేయి అన్నాను. అప్పుడు హిమవంతుడు నాకు (బ్రహ్మకు) నమస్కరించి ఇలా అన్నాడు.

హిమవానువాచ :– బ్రహ్మదేవుడితో హిమవంతుడు ఈవిధంగా అంటున్నాడు.

త్వమేవ కారణం దేవ యస్య సర్వోదయే మమ ।
ప్రసాద స్సహసోత్పన్నో హేతుశ్చాపి త్వమేవ హి ॥
ఉద్వాహస్తు యదా యాదృక్ త్వం విధత్స్వ పితామహ ॥ 57 ॥

దేవా, నా అభ్యుదయాని కంతటికీ కారణం నీవే. నీ అనుగ్రహం నాకు అప్రయత్నంగా, అకస్మాత్తుగా లభించింది. దీనికీ కారణం నీవే కదా. బ్రహ్మదేవా, అందుచేత వీరి వివాహాన్ని ఎప్పుడు ఏవిధంగా చేయాలో నీవే నిశ్చయించు.

బ్రహ్మోవాచ :– మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తత ఏవం వచశ్శ్రుత్వా గిరిరాజస్య భో ద్విజాః ।
ఉద్వాహః క్రియతాం దేవ ఇత్యహం చోక్తవాన్ విభుమ్ ॥ 58 ॥

ఓ బ్రాహ్మణులారా! పర్వతరాజయిన హిమవంతుడి పలుకులు విని, నేను పరమేశ్వరుడితో 'మహాదేవా, వివాహం చేసుకో' అని చెప్పాను.

మామాహ శఙ్కరో దేవో యథేష్టమితి లోకపః ॥ 59 ॥

విప్రులారా! అప్పుడు లోకపాలకుడయిన శంకరుడు నాతో 'మీయిష్టం' అన్నాడు.

తత్క్షణాచ్చ తతో విప్రా అస్మాభిర్నిర్మితం పురమ్ ।
ఉద్వాహార్థం మహేశస్య నానారత్నోపశోభితమ్ ॥ 60 ॥

ఆక్షణం నుండే మేము పరమేశ్వరుడి వివాహంకోసం రకరకాలయిన రత్నాలతో ప్రకాశించే నగరాన్ని నిర్మించాం.

రత్నాని మణయశ్చిత్రా హేమమౌక్తికమేవ చ ।
మూర్తిమన్త ఉపాగమ్య అలఞ్చక్రుః పురోత్తమమ్ ॥ 61 ॥

నవరత్నాలూ, విచిత్రమయిన మణులూ, బంగారమూ, ముత్యాలూ, స్వయంగా ఆకారాన్ని ధరించి వచ్చి, ఆనగరాన్ని అలంకరించాయి.

చిత్రా మారకతీ భూమిస్సువర్ణస్తమ్భభూషితా ।
భాస్వత్స్ఫటికభిత్తిశ్చ ముక్తాహారప్రలమ్బితా ॥
తస్మిన్ ద్వారి పురే రమ్యే ఉద్వాహార్థం వినిర్మితమ్ ॥ 62 ॥

పార్వతీపరమేశ్వరుల కల్యాణంకోసం (కల్యాణమంటపం) బంగారం స్తంభాలతో అలంకరించారు. నేలమీద మరకతమణులు పొదిగారు. గోడలు స్ఫటికమణులతో ప్రకాశిస్తున్నాయి. మనోహరమయిన ద్వారాలకు ముత్యాల దండలు వేలాడుతున్నాయి.

శుశుభే దేవదేవస్య మహేశస్య మహాత్మనః ।
సోమాదిత్యౌ సమం తత్ర తాపయన్తౌ మహామణీ ॥ 63 ॥

సూర్యుడూ, చంద్రుడూ ఇద్దరూ ఒకేసారి రెండు మణులలాగా, మహానుభావుడయిన ఆమహాదేవుడి కల్యాణవేదికపైన ప్రకాశించారు.

సౌరభేయం మనోరమ్యం గన్ధమాదాయ మారుతః ।
ప్రవవౌ సుఖసంస్పర్శో భవభక్తిం ప్రదర్శయన్ ॥ 64 ॥

వాయుదేవుడు శివుడిమీద తనకున్న భక్తిని ప్రదర్శిస్తూ, మనస్సుకు ఆహ్లాదం కలిగించే వివిధసువాసనలతో నిండి, శరీరానికి సుఖం అనిపించే స్పర్శను అందిస్తూ, తగిన పద్ధతిలో సంచరించాడు.

సముద్రాస్తత్ర చత్వారశ్శక్రాద్యాశ్చ సురోత్తమాః ।
దేవనద్యో మహానద్యస్సిద్ధా మునయ ఏవ చ ॥ 65 ॥

గన్ధర్వాప్సరస స్సర్వే నాగా యక్షా స్సరాక్షసాః ।
ఔదకాః ఖేచరాశ్చాన్యే కింనరా దేవచారణాః ॥ 66 ॥

తుమ్బురు ర్నారదో హాహా హూహూ శ్చైవ తు సామగాః ।
రత్నాన్యాదాయ చాన్యాని తత్రాజగ్ము స్తదా పురమ్ ॥ 67 ॥

నాలుగు సముద్రాలూ, ఇంద్రుడు మొదలయిన దేవతాశ్రేష్ఠులూ, దేవనదులూ, మహానదులూ, సిద్ధులూ, మునులూ, గంధర్వులూ, అప్సరసలూ, నాగులూ, యక్షులూ, రాక్షసులూ, నీళ్లలో నివసించేవారూ, ఆకాశంలో సంచరించేవారూ, కిన్నరులూ, దేవతాజాతికి చెందినచారణులూ, తుంబురుడూ, నారదుడూ, సామం గానం చేసే హాహా, హూహూ అనేగంధర్వులూ, ఇంకా రత్నాలూ, ఇంకా ఇతరమయిన రకరకాల మణులూ మొద లయినవి తీసుకుని శివకల్యాణప్రదేశానికి వచ్చారు.

ఋషయః కుశలా స్తత్ర వేదగీతాస్తపోధనాః ।
పుణ్యాన్ వైవాహికాన్ మన్త్రా ఞ్జేపుః సంప్రహృష్టమానసాః ॥ 68 ॥

వేదగాననిపుణులూ, తపస్సంపన్నులూ అయిన మహర్షులు మనసు నిండిన సంతోషంతో, పవిత్రమయిన వివాహమంత్రాలను జపించారు.

జగతోమాతర స్సర్వా దేవకన్యాశ్చ కృత్స్నశః ।
గాయన్తి హర్షితా స్సర్వా ఉద్వాహే పరమేష్ఠినః ॥ 69 ॥

పరమేశ్వరుడికల్యాణమహోత్సవసమయంలో లోకమాతలూ, దేవకన్యలూ, అందరూ సంపూర్ణ మయిన సంతోషంతో గానం చేశారు.

ఋతవష్షట్ సమం తత్ర నానాగన్ధసుఖావహాః ।
ఉద్వాహే శఙ్కరస్యైతే మూర్తిమన్త ఉపస్థితాః ॥ 70 ॥

శివకల్యాణసమయంలో ఋతువులు ఆరూ ఆకారాలు ధరించి వచ్చి, ఒకేసారిగా రకరకాలయిన పరిమళాలను వెదజల్లుతూ, అందరికీ సుఖాన్ని అందిస్తున్నాయి.

నీలజీమూతసఙ్కాశై ర్మన్ద్రధ్వనిప్రహర్షిభిః ।
కేకాయమానై శ్శిఖిభి ర్నృత్యమానైశ్చ సర్వశః ॥ 71 ॥

(వర్షఋతువు ఇలా ఉంది.) ఆప్రదేశ మంతటా, నెమిళ్లు నల్లని మేఘాలవలె (మేనిరంగు గలిగి) ఉన్నాయి. వేదధ్వనులతో (ఉరుములచప్పుళ్ళతో) ఆనందిస్తున్నాయి. క్రేంకారాలు చేస్తున్నాయి. నాట్యం చేస్తున్నాయి.

విలోలపిఙ్గలస్పష్ట విద్యుల్లేఖావిలాసితా ।
కుముదాపీడశుక్లాభి ర్బలాకాభిశ్చ శోభితా ॥ 72 ॥

మిక్కిలి చంచలంగా, పింగళవర్ణంలో మెరుస్తున్న మెరుపురేఖలతో అందంగా ఉంది. తెల్ల కలువలను తిరస్కరించే మిక్కిలి తెల్లగా ఉన్న కొంగల వరుసలతో (ఆకాశం) ప్రకాశిస్తున్నది.

ప్రత్యగ్రసఞ్జాతశిలీన్ధ్రకన్దలీ లతాద్రుమాద్యుద్గతపల్లవా శుభా ।
శుభామ్బుధారాప్రణయప్రబోధితైర్మదాలసైర్భేకగణైశ్చ నాదితా ॥ 73 ॥

క్రొత్తగా మొలకెత్తిన పుట్టగొడుగుల మొలకలూ తీగలల్లుకొన్న చెట్లయొక్క చిగురుటాకులతో అనేపేర్లు చెట్లనుండి పొడమిన చిగురాకులతో మనోహరంగా ఉన్నది. ఉత్తమమయిన జలధారల స్పర్శతో మేల్కొని మత్తువలన అలసిన కప్పల గుంపుల అరుపులతో కూడిఉన్నది.

ప్రియేషు మానోద్ధతమానసానాం మనస్వినీనామపి కామినామ్ ।
మయూరకేకాభిరుతైః క్షణేన మనోహరైర్మానవిభఙ్గహేతుభిః ॥ 74 ॥

అభిమానంతో తమ భర్తలమీద కోపించిన మానవతుల అభిమానాన్ని మనసును హరించే నెమిళ్ల క్రేంకారాలు ఒక్కక్షణంలో తొలగిస్తున్నాయి. (తాపం కలిగించి, వారిని తమ భర్తల వద్దకు చేరుస్తున్నాయి.)

తథా వివర్ణోజ్జ్వలచారుమూర్తినా సువర్ణకాన్త్యా కుటిలేన సర్వతః ।
పయోదసఙ్ఘాతసమీపవర్తినా మహేన్ద్రచాపేన భృశం విరాజితా ॥ 75 ॥

ఇంద్రధనుస్సు వివిధమయిన రంగులతో అందంగా ఉంది. శ్రేష్ఠమయిన రంగులతో వంకరగా ఆకాశ మంతటా నిండిఉంది. మేఘసముదాయానికి దగ్గరలో ఉన్నది. అటువంటి ఇంద్రధనుస్సుతో వర్షఋతువు చక్కగా ప్రకాశిస్తున్నది.

విచిత్రపుష్పామ్బుభవై స్సుగన్ధిభిర్ఘనామ్బుసమ్పర్కతయా సుశీతలైః ।
వికమ్పయన్తీ పవనై ర్మనోహరై స్సురాఙ్గనానా మలకావలీ శ్శుభాః ॥ 76 ॥

అక్కడి గాలులు వింత వింత పూవులనుండి జారిపడిన నీటినుండి వెలువడిన పరిమళాలతో కూడి ఉన్నాయి. వర్షపునీటితో కూడి ఉండటంవల్ల ఆగాలులు చల్లగా ఉన్నాయి. మనోహర మయిన ఆగాలుల తాకిడిచేత దేవకాంతల ముంగురులు మెల్లమెల్లగా కదులుతున్నాయి.

గర్జత్పయోదస్థగితేన్దుబిమ్బా నవామ్బుసిక్తోదకచారుదూర్వా ।
నిరీక్షితా సాదర ముత్సుకాభి ర్నిశ్వాసధూమ్రం పథికాఙ్గనాభిః ॥ 77 ॥

ఉరుముతున్న మేఘాలు చంద్రబింబాన్ని కప్పివేశాయి. కొత్త(వాన)నీటితో తడిసి ఆనీటిబిందువులతో గడ్డిపరకలు అందంగా ఉన్నాయి. బాటసారుల కాంతలు (భర్త సమీపంలో లేనికాంతలు) నిట్టూర్పుల పొగలతో, అనురాగంతోనూ, ఉత్కంఠతోనూ భర్తలకోసం ఎదురుచూస్తున్నారు.

హంసనూపురశబ్దాఢ్యా సమున్నతపయోధరా ।
చలద్విద్యుల్లతాహారా స్పష్టపద్మవిలోచనా ॥ 78 ॥

వర్షఋతువు అనే కాంత–హంసల అరుపులు అనే అందెలధ్వని మిక్కుటంగా కలిగిఉన్నది. ఎత్తుగా ఉన్న మబ్బులు అనే కుచములు కలిగినది. కదులుతున్న మెరుపుతీగెలు అనే హారాలు కలిగి ఉన్నది. వికసించిన తామరలు అనే కన్నులు కలిగిఉన్నది.

అసితజలదబృన్దాధారచిత్రామ్బుహంసా
గలితసలిలధారోత్పాతనమ్రోత్పలాక్షీ ॥

సురభికుసుమరేణుక్లుప్తసర్వాఙ్గశోభా
గిరిదుహితృవివాహే ప్రావృడావిర్బభూవ ॥ 79 ॥

అద్భుతమయిన హంసలు నల్లని మబ్బుల గుంపులను ఆశ్రయించుకుని ఉన్నాయి. ఆమబ్బులనుండి జారిపడిన నీటిధారలు మీద పడడంచేత వంగిపోయిన కలువల కన్నులు కలిగినది. పరిమళంతో నిండిన పుప్పొడి అన్ని దిక్కులలోనూ అందంగా ఉన్నదై, వర్షఋతువు పార్వతి వివాహసమయంలో కల్యాణపురంలో ప్రవేశించింది.

మేఘకఞ్చుకనిర్ముక్తా పద్మకోశోద్భవస్తనీ ।
హంసనూపురనిర్హ్రాదా శరద్రమ్యదిగన్తరా ॥ 80 ॥

శరదృతువు అనేస్త్రీకి మబ్బులు అనేతొడుగు తొలగిపోయినది. తామరపూల బీజకోశం అనే కుచాలు కలిగినది. హంసల అరుపులు అనే అందెల ధ్వనులు గలిగినది. అన్ని దిక్కులలోనూ మనోహరంగా ఉన్నది.

విస్తీర్ణపులినశ్రోణీ కూజత్సారసమేఖలా ।
ప్రోత్ఫుల్లేన్దీవరశ్యామ విలోచనమనోహరా ॥ 81 ॥

విశాల మయిన ఇసుకతిన్నెలు అనే పిరుదులు కలిగినది. కూస్తున్న సారసపక్షులు అనే(చప్పుడు చేసే) మొలనూలు కలిగినది. చక్కగా వికసించిన కలువపూలలాగా నల్లనయిన కన్నులతో అందంగా ఉన్నది.

పక్వబిమ్బాధరపుటా కున్దదన్తప్రహాసినీ ।
నవశ్యామలతాశ్యామ రోమరాజిపురస్కృతా ॥ 82 ॥

బాగాపండిన దొండపండువంటి క్రిందిపెదవి కలిగినది. మల్లెమొగ్గలవంటి దంతాలపై చిరునవ్వు గలిగినది. క్రొత్త శ్యామలతలాగా నల్లనయిన వెంట్రుకలతో ప్రకాశిస్తున్నది.

చన్ద్రాంశుహారవర్యేణ కణ్ఠోరఃస్థలగామినా ।
ప్రహ్లాదయన్తీ నారీవ సర్వేషాం త్రిదివౌకసామ్ ॥ 83 ॥

వెన్నెలవంటి స్వచ్ఛమయిన హారాలు మెడమీదనుండి వక్షఃస్థలంపై కదులుతున్నాయి. దేవతలకు అందరికీ శరదృతువు కాంతవలె ఆహ్లాదాన్ని కలిగించింది.

సమదాలికులోద్గీతమధురస్వరభాషిణీ ।
చలత్కుముదసఙ్ఘాతచారుకుణ్డలశోభినీ ॥ 84 ॥

మదించిన తుమ్మెదల గుంపు చేసిన గానం శరదృతువు అనే కాంత సంభాషించే సమయంలోని తీయని కంఠస్వరం. కదులుతున్న ఎఱ్ఱతామరపూలసముదాయమే అందమయిన ఆమె కర్ణాభరణాలు.

రక్తాశోకప్రశాఖోత్థ పల్లవాఙ్గులిధారిణీ ।
తత్పుష్పసఞ్చయమయై ర్వాసోభిస్సమలఙ్కృతా ॥ 85 ॥

ఎఱ్ఱని అశోకవృక్షం కొమ్మలనుండి పుట్టిన చిగుళ్లు ఆశరదృతుకాంత వ్రేళ్లు. రకరకాల పూలసమూహాలు ఆమె కట్టిన వస్త్రాలు.

రక్తోత్పలాగ్రచరణా జాతీపుష్పనఖావలీ ।
కదలీస్తమ్భచారూరుశ్శశాఙ్కవదనా తథా ॥ 86 ॥

ఎఱ్ఱ కలువలే ఆమె పాదాగ్రాలు. ఆమె గోళ్లు జాజిపూలు. ఆమె తొడలు అరటికంబాలు. చంద్రుడే ఆమె ముఖం.

సర్వలక్షణసమ్పన్నా సర్వాలఙ్కారభూషితా ।
ప్రేమ్ణా స్పృశతి కాన్తేవ సానురాగా మనోరమా ॥ 87 ॥

శరదృతువు అనేకాంత సమస్తమయిన ఉత్తమలక్షణాలు గలిగినది. సమస్తమయిన ఆభరణాలనూ అలంకరించుకున్నది. అందమయిన స్త్రీ అనురాగంతో ప్రేమగా స్పృశించినట్లుగా సుఖకరంగా ఉన్నది.

నిర్ముక్తాసితమేఘకఞ్చుకపుటా పూర్ణేన్దుబిమ్బాననా
నీలామ్భోజవిలోచనా రవికరప్రోద్భిన్నపద్మస్తనీ ।
నానాపుష్పరజస్సుగన్ధిపవనప్రహ్లాదినీ చేతసాం
తత్రాసీత్ కలహంసనూపురరవా దేవ్యా వివాహే శరత్ ॥ 88 ॥

శరదృతువులో నల్లని మబ్బుల కవచాలు తొలగిపోయాయి. శరత్కాంతముఖం నిండు చంద్రుడిలాగా ఉంది. కన్నులు నల్లకలువలవలె ఉన్నాయి. స్తనాలు సూర్యుడి కిరణాల స్పర్శతో విచ్చుకున్న పద్మాలవలె ఉన్నాయి.

రకరకాల పూలపరిమళంతోనూ, పుప్పొడితోనూ, కూడి గాలులతో మనసులకు ఆహ్లాదం కలిగిస్తున్నది. జాతిహంసల అరుపులు అనే అందెల చప్పుడు గలిగి ఉన్నది. పార్వతీకల్యాణసమయంలో శరదృతువు ఈవిధంగా అక్కడనెలకొన్నది.

అత్యర్థశీతలామ్భోభిః ప్లావయన్తౌ దిశస్తదా ।
ఋతూ హేమన్తశిశిరౌ ఆజగ్మతురతిద్యుతీ ॥ 89 ॥

అన్ని దిక్కులలోనూ మిక్కిలి చల్లనయిన నీళ్లను అంతటా ప్రవహింపజేస్తూ, హేమంతఋతువూ, శిశిరఋతువూ అత్యధికమయిన తేజస్సుతో పార్వతీకల్యాణసమయాన అక్కడికి వచ్చాయి.

తాభ్యా మృతుభ్యాం సమ్ప్రాప్తో హిమవాన్ స నగోత్తమః ।
ప్రాలేయచూర్ణవర్షిభ్యాం క్షిప్రం రౌప్య ఇవాబభౌ ॥ 90 ॥

మంచుపొడిని కురుస్తూ, హేమంతశిశిరఋతువులు రావడంచేత పర్వతరాజయిన హిమవంతుడు వెండిలాగా ప్రకాశించాడు. (ప్రేష్య అనేపాఠం సరిగా అన్వయించదు. హిమవంతుడు సేవకుడు ఇత్యాదిగా చెప్పవలసిరావటం సరిగాదు కదా.)

తేన ప్రాలేయవర్షేణ ఘనేనైవ హిమాలయః ।
అగాధేన తదా రేజే క్షీరోద ఇవ సాగరః ॥ 91 ॥

అంతులేని పెద్ద మంచువానచేత హిమవంతుడు పాలసముద్రంలాగా వెలుగుతున్నాడు.

ఋతుపర్యాయసమ్ప్రాప్తో బభూవ స మహాగిరిః ।
సాధూపచారాత్ సహసా కృతార్థ ఇవ దుర్జనః ॥ 92 ॥

సజ్జనుడిని సేవించి దుర్మార్గుడు తత్క్షణమే ధన్యుడు అయిన విధంగా, హేమంతశిశిరఋతువులు ఒకదాని వెంట ఒకటిగా వచ్చి సేవించడంచేత హిమాలయపర్వతరాజు(?) ప్రకాశించాడు.

ప్రాలేయపటలచ్ఛన్నై శ్శృఙ్గై స్తు శుశుభే నగః ।
ఛత్రైరివ మహాభోగైః పాణ్డురైః పృథివీపతిః ॥ 93 ॥

చక్రవర్తి వెల్లగొడుగులతో వెలిగినట్లుగా, హిమవత్పర్వతం దట్టంగా మంచు కప్పిన శిఖరాలతో గొప్పగా ప్రకాశించింది. (మంచు కమ్మి కొండకొప్పులు ధవళచ్ఛత్రాలులాగ ఉన్నాయి.)

మనోభవోద్రేకకరాస్సురాణాం సురాఙ్గనానాం చ ముహుస్సమీరాః ।
స్వచ్ఛామ్బుపూర్ణాశ్చ తథా నలిన్యః పద్మోత్పలానాం కుసుమైరుపేతాః ॥ 94 ॥
వివాహే గురుకన్యాయా వసన్త స్సమగా దృతుః ॥ 95 ॥

శివపార్వతుల కల్యాణవేదిక వద్దకు వసంతఋతువు వచ్చింది. అప్పుడు అక్కడ మెల్లనిగాలులు దేవతలకూ, దేవతాకాంతలకూ, మన్మథభావాలను పెంచుతున్నాయి. నదులు నిర్మలమయిన నీటితో, తామర పూలతో, కలువపూలతో కూడిఉన్నాయి.

ఈషత్సముద్భిన్నపయోధరాగ్రా నార్యో యథా రమ్యతరా బభూవుః ।
నాత్యుష్ణశీతాని పయ స్సరాంసి కిఞ్జల్కచూర్ణైః కపిలీకృతాని ॥ 96 ॥

చక్రాహ్వయుగ్మై రుపనాదితాని యయుః ప్రహృష్టాస్సురదన్తిముఖ్యాః ॥ 97 ॥

కొంచెంగా కనబడుతున్న మబ్బులతో వసంతఋతువు, కనబడీ కనబడకుండా ఉన్న వక్షఃస్థలంతోడి స్త్రీలలాగా అందంగా ఉన్నది. సరస్సులలో నీళ్లు మరీ వేడిగానూ లేవు. మరీ చల్లగానూ లేవు (సమశీతోష్ణంతో సుఖస్పర్శ కలిగిఉన్నాయి). ఆ నీళ్లు పుప్పొడి దుమ్ముతో కూడి, గోరోచనవర్ణంలోకి మారాయి. చక్రవాకపక్షులు మధురంగా అరుస్తున్నాయి. దేవతల యేనుగులు జలక్రీడలకోసం అక్కడికి సంతోషంగా చేరుకున్నాయి. (ఈవిధంగా వసంతఋతువు పార్వతీకల్యాణానికి వచ్చింది.)

ప్రియఙ్గూశ్చూతతరవశ్చూతాం శ్చాపి ప్రియఙ్గవః ।
తర్జయన్త ఇవాన్యోన్యం మఞ్జరీభిశ్చకాసిరే ॥ 98 ॥

పిప్పలి చెట్లను మామిడి చెట్లు, మామిడి చెట్లను పిప్పలిచెట్లు పరస్పరం ఒకదాని నొకటి భయపెట్టు కుంటున్నాయా–అన్నట్లుగా పూలగుత్తులతో (వసంతఋతువులో) ప్రకాశిస్తున్నాయి. (పిప్పలి, మామిడిచెట్లు పోటీ పడుతున్నట్లు ఒకదానికంటె ఒకటి అధికంగా పుష్పించాయి.)

హిమశృఙ్గేషు శుక్లేషు తిలకాః కుసుమోత్కరైః ।
శిశుభిః కార్యముద్దిశ్య వృద్ధా ఇవ సమాగతాః ॥ 99 ॥

పసిపిల్లలను వాత్సల్యంతో దగ్గరకు తీసుకోవడానికి వచ్చిన పెద్దవారిలాగా, తెల్లని తిలకవృక్షాలు పూల సముదాయంతో హిమాలయ పర్వతం శిఖరాల మీదికి వచ్చాయి.

ఫుల్లాశోకలతా స్తత్ర రేజిరే శాలసంశ్రితాః ।
కామిన్య ఇవ కాన్తానాం కణ్ఠాలమ్బితబాహవః ॥ 100 ॥

భర్తమెడ చుట్టూ చేతులు చాచి కౌగిలించుకుని ఆనందిస్తున్న కాంతలలాగా, శాలవృక్షాన్ని ఆశ్రయించుకుని ఉన్న అశోకలతలు బాగా వికసించిన పుష్పాలతో కూడిఉన్నాయి.

తస్మిన్ ఋతౌ చూతకదమ్బనీపాస్తాలాస్తమాలాస్సరలాః కపిత్థాః ।
అశోకసర్జార్జునకోవిదారాః పుంనాగనాగేశ్వరకర్ణికారాః ॥ 101 ॥

ఆవసంతఋతువులో మామిడిచెట్లు, కడిమిచెట్లు, మంకెనచెట్లు, తాడిచెట్లు, చీకటిచెట్లు, తెల్లతెగడచెట్లు, వెలగచెట్లు, అశోకవృక్షాలు, మద్దిచెట్లు, తెల్లమద్దిచెట్లు, ఎఱ్ఱకాంచనవృక్షాలు, పొన్నచెట్లు, నాగకేసరవృక్షాలు, కొండగోగుచెట్లు,

లవఙ్గకాలాగురుసప్తపర్ణా న్యగ్రోధశోభాఞ్జననారికేలాః ।
వృక్షా స్తథాఽన్యే ఫలపుష్పవన్తో దృశ్యన్తి సర్వత్ర మనోహరాఙ్గాః ॥ 102 ॥

లవంగతీగెలు, నల్ల అగురుచెట్లు, ఏడాకుల అరటిచెట్లు, మఱ్ఱిచెట్లు, మునగచెట్లు, కొబ్బరిచెట్లు, ఇంకా అనేకమయిన పండ్లచెట్లు, పూలచెట్లు, ఆప్రదేశం అంతటా అందంగా కనబడుతున్నాయి.

జలాశయాశ్చైవ సువర్ణతోయాశ్చక్రాహ్వకారణ్డవహంసజుష్టాః ।
కోయష్టిదాత్యూహబలాకయుక్తా దృశ్యన్తి నీలోత్పలమీనపూర్ణాః ॥ 103 ॥

చెరువులు బంగారు నీళ్లతో నిండిఉన్నాయి. ఆనీటిపై చక్రవాకాలు, కన్నెలేడిపిట్టలు, హంసలు, విహరిస్తున్నాయి. ఇంకా అక్కడ నీటిగంప పులుగులు, చాతకపక్షులు, కొంగలు, నల్లగలువలు, చేపలు సమృద్ధిగా ఉన్నాయి.

ఖగాశ్చ నానావిధభూషితాఙ్గా దృశ్యన్తి వృక్షేషు సుచిత్రపక్షాః ।
క్రీడాసు యుక్తానథ తర్జయన్తః కుర్వన్తి శబ్దం మదనేరితాఙ్గాః ॥ 104 ॥

అక్కడ పక్షులు అనేకవిధమయిన అలంకారాలు కలిగిఉన్నాయి. వింతరంగుల రెక్కలు కలిగిఉన్నాయి. వాటి శరీరాలు మన్మథతాపంతో వేగుతున్నాయి. అవి ఆటలాడుతున్న వాటిని బెదిరిస్తూ శబ్దం చేస్తున్నాయి. ఈవిధంగా అక్కడ రకరకాల పక్షులు చెట్లపై విహరిస్తూ కనబడుతున్నాయి.

తస్మిన్ గిరావద్రిసుతావివాహే వవుశ్చ వాతా స్సుఖశీతలాఙ్గాః ।
పుష్పాణి శుభ్రాణ్యపి పాతయన్తశ్శనై ర్నగేభ్యో మలయాద్రిజాతాః ॥ 105 ॥

పర్వతరాజుకూతురు వివాహసమయంలో మలయపర్వతంమీద నుంచి వస్తున్న గాలులు ఆహిమాలయ పర్వతంమీద సుఖప్రదంగా చల్లగా వీస్తున్నాయి. ఆ పిల్లగాలులు నిర్మలమయిన పూవులను తీసుకుని వచ్చి హిమాలయంమీద జల్లుతున్నాయి.

తథైవ సర్వే ఋతవశ్చ పుణ్యాశ్చకాశిరేఽ న్యోన్యవిమిశ్రితాఙ్గాః ।
యేషాం సులిఙ్గాని చ కీర్తితాని తే తత్ర ఆసన్ సుమనోజ్ఞరూపాః ॥ 106 ॥

అన్ని ఋతువుల లక్షణాలు ఒకదానితో మరొకటి కలిసి, పుణ్యప్రదమయిన ఋతువులు అన్నీ, ఒకే సమయంలో (పార్వతీపరిణయవేళలో) హిమాలయపర్వతం మీద ప్రకాశించాయి. ఆయా ఋతువులకు సంబంధించినవిగా చెప్పబడిన లక్షణాలు అన్నీ మనోహరంగా అక్కడ ఉన్నాయి.

సమదాలికులోద్గీత లతాకుసుమసఞ్చయైః ।
పరస్పరం హి మాలత్యో భాషయన్త్యో విరేజిరే ॥ 107 ॥

పూల సముదాయంతో నిండిన మాలతీలతలు మదించిన తుమ్మెదల గుంపుల గానంతో పరస్పరం సంభాషించు కుంటున్నట్లుగా ఉన్నాయి.

నీలాని నీలామ్బురుహైః పయాంసి గౌరాణి గౌరైశ్చ మృణాలదణ్డైః ।
రక్తైశ్చ రక్తాని భృశం కృతాని మత్తద్విరేఫావలిజుష్టపత్రైః ॥ 108 ॥

అక్కడి సరస్సులలోనినీళ్లు నల్లకలువలవలన నల్లగా ఉన్నాయి. గౌరవర్ణంలో ఉన్న తామరతూడులవలన ఆనీళ్లు గౌరవర్ణం కలిగినవి అవుతున్నాయి. (సరసులలోని స్వచ్ఛమయిన నీళ్లు అక్కడ ఏరంగు పూలు ఉంటే ఆపూల రంగులో కనిపిస్తున్నాయి.) ఎఱ్ఱ తామరపూలవలన సరస్సులలోని నీళ్లు బాగా ఎఱ్ఱగా అవుతున్నాయి. ఆతామరరేకులను మదించి తుమ్మెదరెక్కలు కప్పివేశాయి.

హైమాని విస్తీర్ణజలేషు కేషుచి న్నిరన్తరం చారుతరాణి కేషుచిత్ ।
వైదూర్యనాలాని సరస్సు కేషుచిత్ ప్రజజ్ఞిరే పద్మవనాని సర్వతః ॥ 109 ॥

అక్కడ తామరలు తోటలుగా ఏర్పడిఉన్నాయి. కొన్నిచోట్ల విస్తారమయిన నీటిలో బంగారు పూలలాగా ఉన్నాయి. కొన్నిచోట్ల తామరపూలు ఎడం లేకుండా దట్టంగా వ్యాపించి, మనోహరంగా ఉన్నాయి. కొన్నిచోట్ల సరస్సులలో వైదూర్యమణులవంటి తామరతూళ్లతో కూడిఉన్నాయి.

వాప్య స్తత్రాభవన్ రమ్యాః కమలోత్పలపుష్పితాః ।
నానావిహఙ్గసఙ్ఘుష్టా హైమసోపానపఙ్క్తయః ॥ 110 ॥

అక్కడ దిగుడుబావులు వికసించిన తామరపూలతోనూ, కలువపూలతోనూ నిండి, మనోహరంగా ఉన్నాయి. రకరకాలయిన పక్షులగుంపులతో సందడిగా ఉన్నాయి. బంగారుమెట్లు కలిగిఉన్నాయి.

శృఙ్గాణి తస్యతు గిరేః కర్ణికారైస్సుపుష్పితైః ।
సముచ్ఛ్రితాన్యవిరలైర్హేమా నీవ బభుర్ద్విజాః ॥ 111 ॥

బ్రాహ్మణులారా! బాగా ఎత్తుగానూ, దట్టంగానూ ఉన్న హిమవత్పర్వతశిఖరాలు చక్కగా వికసించి కొండగోగుపూలతో నిండి, బంగారుమయంగా ప్రకాశించాయి.

ఈషదుద్భిన్నకుసుమైః పాటలైశ్చాపి పాటలాః ।
సమ్బభూవుర్దిశ స్సర్వాః పవనాకమ్పిమూర్తిభిః ॥ 112 ॥

కొద్దిగా వికసించి, గాలికి చక్కగా కదులాడుతున్న, పాటలపుష్పాలతో అక్కడిదిక్కులన్నీ పాటలవర్ణంగా మారిపోయాయి.

కృష్ణార్జునా దశగుణా నీలాశోకమహీరుహాః ।
గిరౌ వవృధిరే ఫుల్లాస్స్పర్ధయన్తః పరస్పరమ్ ॥ 113 ॥

హిమవత్పర్వంమీద విస్తరించిన నల్ల అశోకవృక్షాలు, నల్లమద్దిచెట్లు ఒకదానితో ఒకటి పోటీపడుతూ బాగా పెరిగి పది రెట్లుగా వృద్ధిచెందాయి.

చారురావవిఘుష్టాని కింశుకానాం వనాని చ ।
పర్వతస్య నితమ్బేషు సర్వేషు చ విరేజిరే ॥ 114 ॥

హిమాలయపర్వతం చరియలు అన్నింటిమీదా, మనోహరమయిన(పక్షుల)అరుపుల కోలాహలంతో మోదుగచెట్ల తోపులు చక్కగా ప్రకాశించాయి.

తమాలగుల్మై స్త స్యాసీ చ్ఛోభా హిమవత స్తదా ।
నీలజీమూతసజ్ఘాతై ర్నిలీనై రివ సన్ధిషు ॥ 115 ॥

చీకటిచెట్ల సముదాయాలవలన అక్కడ నల్లని మబ్బులు గుంపులుగా కూడుకున్నాయా అన్నట్లుగా ఆహిమవత్పర్వతం సంధ్యాసమయాలలో చక్కగా శోభించింది.

నికామపుష్పైస్సువిశాలశాఖైస్సముచ్ఛ్రితైశ్చన్దనచమ్పకైశ్చ ॥
ప్రమత్తపుంస్కోకిలసమ్ప్రలాపై ర్హిమాచలోఽతీవ తదా రరాజ ॥ 116 ॥

పూలతో నిండిన విశాలమయిన కొమ్మలతో, బాగా ఎత్తుగా ఎదిగి ఉన్న చందనపు చెట్లతోనూ, సంపెంగచెట్ల తోనూ, మత్తిల్లిన మగతుమ్మెదల కూతలతోనూ, ఆహిమవత్పర్వతం ఎంతో ప్రకాశించింది.

శ్రుత్వా శబ్దం మృదుమదకలం సర్వతః కోకిలానాం
వల్గత్పక్షాస్సుమధురతరం నీలకణ్ఠా వినేదుః ॥
తేషాం శబ్దై రుపచితబలః పుష్పచాపేషు హస్తః
సజ్జీభూత స్త్రిదశవనితా వేద్ధు మఙ్గేష్వనఙ్గః ॥ 117 ॥

మృదువుగానూ, మదంచేత మధురంగానూ ఉన్న కోకిల కంఠస్వరాలు విని, నెమిళ్లు రెక్కలు విచ్చుకుని అంతకంటె మనోహరంగా అరిచాయి. ఆశబ్దాలతో మన్మథుడి బలం పెరిగింది. (ఉత్సాహంగా) పూవిల్లును, పూలబాణాలను చేతబట్టి, దేవకాంతల శరీరాలను కొట్టడానికి సిద్ధపడ్డాడు.

పటు స్సూర్యాతపశ్చాపి ప్రాయశోఽల్పజలాశయః ।
దేవీవివాహసమయే గ్రీష్మ ఆగా ద్ధిమాచలమ్ ॥ 118 ॥

తరువాత ఎండలు పెరిగాయి. చెరువులలో నీళ్లు చాలవరకు ఇంకిపోయాయి. ఆవిధంగా గ్రీష్మఋతువు హిమవత్పర్వతంమీదికి వచ్చింది.

స చాపి తరుభి స్తత్ర బహుభిః కుసుమోత్కరైః ।
శోభయామాస శృఙ్గాణి ప్రాలేయాద్రే స్సమన్తతః ॥ 119 ॥

ఆగ్రీష్మఋతువు పూలతో నిండిన రకరకాల చెట్లతో కూడినదై హిమవత్పర్వతశిఖరాలని అంతటా మనోహరంగా ప్రకాశింపచేసింది.

తస్యాపి చ ఋతో స్తత్ర వాయవ స్సుమనోహరాః ।
వవుః పాటలవిస్తీర్ణకదమ్బార్జునగన్ధినః ॥ 120 ॥

ఆగ్రీష్మఋతువు యొక్క గాలులు పొన్న, కడిమి, గన్నేరుపూల సువాసనలతో కూడుకొని, అత్యంతం మనోహరంగా విస్తారంగా వీచాయి.

వాప్యః ప్రఫుల్లపద్మౌఘకేసరారుణమూర్తయః ।
అభవం స్తటసంఘుష్టకలహంసకదమ్బకాః ॥ 121 ॥

అక్కడిది గుడు బావులు బాగా వికసించి తామరతంపరల పుప్పొడికాడలతో ఎఱ్ఱబడ్డాయి. ఒడ్డుల మీద కలహంసలు గుంపులుగా సందడి చేస్తున్నాయి.

తథా కురవకా శ్చాపి కుసుమావృతమూర్తయః ।
సర్వేషు నగశృఙ్గేషు భ్రమరావలిసేవితాః ॥ 122 ॥

కొండకొమ్ము లన్నింట ఎఱ్ఱగోరంటచెట్లు పూలతో నిండి, తుమ్మెదల గుంపులతో కూడిఉన్నాయి.

వకులాశ్చ నితమ్బేషు విశాలేషు మహీభృతః ।
ససృజుశ్చ మనోజ్ఞాని కుసుమాని సమన్తతః ॥ 123 ॥

పొగడచెట్లు హిమవత్పర్వతంమీద విశాలమయిన చరియలపైన అంతటా అందమయిన పూవులను వెదజల్లాయి.

ఇతి కుసుమవిచిత్రసర్వవృక్షా వివిధవిహఙ్గమనాదరమ్యదేశాః ।
హిమగిరితనయావివాహభూత్యై సముపయయు ర్ఋతుభి ర్మునిప్రవీరాః ॥ 124 ॥

మునివరులారా! పార్వతివివాహవేదికకు అందాన్ని దిద్దుతూ, వింతవింతపూలతో నిండి అన్నిరకాల చెట్లూ, అనేకమయిన పక్షుల మనోహర కంఠస్వరాలతో కూడిన ప్రదేశాలూ, ఋతువులతో కలిసి అక్కడికివచ్చాయి.

తత ఏవం ప్రవృత్తే తు సర్వభూతసమాగమే ।
నానావాద్యశతాకీర్ణే హ్యహం తత్ర ద్విజాతయః ॥ 125 ॥

శైలపుత్రీ మలఙ్కృత్య యోగ్యాభరణసమ్పదా ।
పురం ప్రవేశితవాం స్తాం స్వయమాదాయ భో ద్విజాః ॥ 126 ॥

విప్రులారా! ఈవిధంగా సమస్తమయిన భూతాలు కూడ పార్వతీవివాహసమయంలో హిమాలయపర్వతం మీద ఒకచోటికి చేరుకున్నాయి. అనేకవిధమయిన వాద్యాలు వందలకొద్దీ మోగుతున్నాయి. ఓ బ్రాహ్మణులారా! ఆ సమయంలో, నేను (బ్రహ్మ) పార్వతీదేవిని ఆమెకు (పెండ్లికూతురుకు) తగిన ఆభరణాలతో చక్కగా అలంకరింప జేసి, స్వయంగా ఆమెను వెంటబెట్టుకుని కల్యాణస్థలానికి తీసుకునివచ్చాను.

తతస్తు పునరేవేశ మహంచైవోక్తవాన్ విభుమ్ ।
హవిర్జుహోమి వహ్నౌ తే ఉపాధ్యాయపదే స్థితః ॥ 127 ॥

అప్పుడు నేను పరమేశ్వరుడితో ఈవిధంగా చెప్పాను. 'ఈశ్వరా! నేను ఈవివాహయజ్ఞంలో బ్రహ్మస్థానంలో ఉండి, అగ్నిలో హవిస్సును హోమం చేస్తాను.

దదాసి మహ్యం యద్యాజ్ఞాం కర్తవ్యోఽయం క్రియావిధిః ।
మామాహ శఙ్కరశ్చైవం దేవదేవో జగత్పతిః ॥ 128 ॥

ఈకార్యక్రమాన్ని ఈవిధంగా చేయాలి అని నాకు ఆజ్ఞ ఇస్తే ఆప్రకారం చేస్తాను' (అని చెప్పాను). అపుడు దేవతలకే దేవుడు, జగన్నాథుడూ అయిన పరమేశ్వరుడు నాతో ఇలాగ అన్నాడు.

శివ ఉవాచ :-పరమేశ్వరుడు బ్రహ్మదేవుడితో ఈవిధంగా అంటున్నాడు.

యదుద్దిష్టం సురేశాన తత్కురుష్వ యథేప్సితమ్ ।
కర్తాఽస్మి వచనం సర్వం బ్రహ్మం స్తవ జగద్విభో ॥ 129 ॥

దేవతాసార్వభౌమ! లోకనాయకా! బ్రహ్మదేవా! నీఉద్దేశ్యంప్రకారం నీకు ఇష్టమయినవిధంగా చేయి. అంతా నీవు చేయమన్న ప్రకారమే చేస్తాను (అన్నాడు పరమేశ్వరుడు).

తతశ్చాహం ప్రహృష్టాత్మా కుశానాదాయ సత్వరమ్ ।
హస్తం దేవస్య దేవ్యాశ్చ యోగబన్ధేన యుక్తవాన్ ॥ 130 ॥

ఆమాటలకు నేను చాలా సంతోషించాను. వెంటనే దర్భలను పుచ్చుకుని, పార్వతీపరమేశ్వరుల చేతులను యోగబంధంతో కలిపాను.

జ్వలనశ్చ స్వయం తత్ర కృతాఞ్జలిపుటః స్థితః ।
శ్రుతిగీతై ర్మహామన్త్రై మూర్తిమద్భి రుపస్థితైః ॥ 131 ॥

యథోక్తవిధినా హుత్వా సర్పి స్తదమృతం హవిః ।
తత స్తం జ్వలనం దేవం కారయిత్వా ప్రదక్షిణమ్ ॥ 132 ॥

అగ్నిదేవుడు (హవిస్సును అందుకోవడానికి) స్వయంగా వచ్చి చేతులు జోడించి నిలుచున్నాడు. వేదాలు గానం చేసిన మహామంత్రాలు ఆకారం ధరించి అక్కడికి వచ్చాయి. ఆవేదమంత్రాలతో శాస్త్రోక్తప్రకారంగా ఆజ్యాన్ని అమృతమయిన హవిస్సుగా హోమం చేయించాను. ఆతరువాత, (నూతనదంపతులచేత) ఆఅగ్నిదేవుడికి ప్రదక్షిణం చేయించాను.

ముక్త్వా హస్తసమాయోగం సహిత స్సర్వదైవతైః ।
పుత్రైశ్చ మానసై స్సిద్ధైః ప్రహృష్టేనాన్తరాత్మనా ॥
వృత్త ఉద్వాహకాలే తు ప్రణమ్య చ వృషధ్వజమ్ ॥ 133 ॥

అనంతరం వారి చేతులు విడిపించాను. వివాహం అయిన తరువాత మనసంతా నిండిన ఆనందంతో సమస్తమయిన దేవతలతోనూ, నామానసపుత్రులతోనూ (సనకసనందనాదులు), సిద్ధులతోనూ, కలిసి ఆపరమేశ్వరదంపతులకు ప్రణామం చేశాను.

యోగేనైవ తయో ర్విప్రా స్తదుమాపరమేశయోః ।
ఉద్వాహ స్సపరో వృత్తో యం దేవా న విదుః క్వచిత్ ॥ 134 ॥

బ్రాహ్మణులారా! ఉత్తమమయిన ఆపార్వతీపరమేశ్వరుల వివాహం యోగంతోనే జరిగింది. ఈవిషయం దేవతలకు కూడ ఎవ్వరికీ తెలియదు.

ఇతి వస్సర్వమాఖ్యాతం స్వయంవరమిదం శుభమ్ ।
ఉద్వాహ శ్చైవ దేవస్య శృణుధ్వం పరమాద్భుతమ్ ॥ 135 ॥

ఈవిధంగా మిక్కిలి శుభప్రదమయిన పార్వతీస్వయంవరవృత్తాంతాన్నీ, పరమేశ్వరుడి వివాహవృత్తాంతాన్నీ వివరించాను. ఇక మరొక అద్భుతాన్ని (అద్భుతస్తోత్రాన్ని) వినండి.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భృషిసంవాదే ఉమామహేశ్వరయోః వివాహనిరూపణం నామ చతుస్త్రింశోఽధ్యాయః ॥ 34 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో ఉమామహేశ్వరులవివాహనిరూపణం అనే ముప్పైనాల్గవ సంపూర్ణం.



పఞ్చత్రింశోఽధ్యాయః - ముప్పైఐదవ అధ్యాయం

శివస్తుతినిరూపణమ్ - శివస్తుతినిరూపణం

బ్రహ్మోవాచ :- బ్రహ్మదేవుడు మహర్షులతో ఇలా చెప్తున్నాడు.

అథ వృత్తే వివాహే తు భవస్యామితతేజసః ।
ప్రహర్ష మతులం గత్వా దేవాశ్శక్రపురోగమాః ॥
తుష్టువుఽర్వాగ్భి రిష్టాభిః ప్రణేము స్తే మహేశ్వరమ్ ॥ 1 ॥

అత్యంతతేజోవంతుడయిన పరమేశ్వరుడివివాహంచేత ఇంద్రాదిదేవతలు మిక్కిలి సంతోషించారు. వివాహానంతరం పరమేశ్వరుడికి ప్రణామం చేసి, ప్రీతికరమయిన వాక్కులతో స్తుతించి పరమేశ్వరుడిని సంతోష పెట్టారు.

దేవాఊచుః:- ఇంద్రాదిదేవతలు పరమేశ్వరుడిని ఈవిధంగా స్తోత్రం చేస్తున్నారు.

నమః పర్వతలిఙ్గాయ పర్వతేశాయ వై నమః ।
నమః పవనవేగాయ విరూపాయాజితాయ చ ॥
నమః క్లేశనాశాయ దాత్రే చ శుభసమ్పదామ్ ॥ 2 ॥

పర్వతం గుర్తుగా గలిగినవాడికి నమస్కారం. పర్వతానికి అధిపతి అయినవాడికి నమస్కారం. వాయువుతో సమానమయినవేగం కలిగినవాడికి నమస్కారం. విలక్షణమయినరూపం కలిగినవాడికి, ఎవనిచేత జయింప బడనివానికి నమస్కారం. కష్టాలు పోగొట్టేవాడికి, శుభసంపదలు ఇచ్చేవాడికి నమస్కారం.

నమో నీలశిఖణ్డాయ అమ్బికాపతయే నమః ।
నమః పవనరూపాయ శతరూపాయ వై నమః ॥ 3 ॥

నల్లనిసిగ గలిగినవాడికి నమస్కారం. పార్వతీపతికి నమస్కారం. వాయువురూపంలో ఉన్నవాడికి నమస్కారం. అనేకరూపాలు కలిగినవాడికి నమస్కారం.

నమో భైరవరూపాయ విరూపనయనాయ చ ।
నమ స్సహస్రనేత్రాయ సహస్రచరణాయ చ ॥ 4 ॥

భయంకరమయినరూపం కలిగినవాడికి నమస్కారం. మూడు కన్నులవాడికి నమస్కారం. వేయికన్నులు కలిగినవాడికి నమస్కారం. వేయిపాదాలు కలిగినవాడికి నమస్కారం.

నమో దేవస్వరూపాయ వేదాఙ్గాయ నమో నమః ।
విష్టమ్భనాయ శక్రస్య బాహ్వో ర్వేదాఙ్కురాయ చ ॥ 5 ॥

దేవరూపం కలిగినవాడికి నమస్కారం. వేదాలకు అంగాలు (శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం) అయినవాడికి నమస్కారం. ఇంద్రుడి చేతులు కట్టిపడవేసినవాడికి నమస్కారం. వేదాలకు అఙ్కురం అయిన వానికి నమస్కారం.

చరాచరాధిపతయే శమనాయ నమో నమః ।
సలిలాశయలిఙ్గాయ యుగాన్తాయ నమో నమః ॥ 6 ॥

జంగమాలూ, స్థావరాలూ అయిన భూతకోటిని పాలించేవాడికి నమస్కారం. సృష్టిని లయింపజేసేవాడికి నమస్కారం. జలలింగ స్వరూపుడికి నమస్కారం. యుగాలను అంతం చేసేవాడికి నమస్కారం.

నమః కపాలమాలాయ కపాలసూత్రధారిణే ।
నమః కపాలహస్తాయ దణ్డినే గదినే నమః ॥ 7 ॥

పుఱ్ఱెలదండలు ధరించినవాడికి నమస్కారం. కపాల సూత్రధారికి నమస్కారం. పుఱ్ఱెని(భిక్షాపాత్రగా) చేతబట్టినవాడికి నమస్కారం. దండమూ, గద ధరించినవాడికి నమస్కారం.

నమ స్త్రైలోక్యనాథాయ పశులోకరతాయ చ ।
నమః ఖట్వాఙ్గహస్తాయ ప్రణతార్తిహరాయ చ ॥ 8 ॥

మూడులోకాలకు భర్త అయినవాడికి నమస్కారం. జీవకోటిపై అనురాగం కలిగినవాడికి నమస్కారం. ఖట్వాంగం అనేఆయుధాన్ని చేతబట్టినవాడికి నమస్కారం. ఆశ్రయించినవారిబాధలను హరించేవాడికి నమస్కారం.

నమో యజ్ఞశిరోహన్త్రే కృష్ణకేశాపహారిణే ।
భగనేత్రనిపాతాయ పూష్ణో దన్తహరాయ చ ॥ 9 ॥

యజ్ఞం యొక్క శిరస్సుని ధ్వంసం చేసినవాడికి నమస్కారం. దక్షయజ్ఞాగ్నిని హరించినవానికి నమస్కారం. భగుడు అనేఆదిత్యుడి కన్ను పడగొట్టినవాడికి నమస్కారం. పూష అనేఆదిత్యుడి దంతాలు భంగం చేసిన వానికి నమస్కారం.

నమః పినాకశూలాసిఖడ్గముద్గలధారిణే ।
నమోఽస్తు కాలకాలాయ తృతీయనయనాయ చ ॥ 10 ॥

పినాకం అనేధనుస్సునూ, శూలం, కత్తి (పొట్టికత్తి), ఖడ్గం (బారుకత్తి), ముద్గరం (సుత్తివంటిది) అనే ఆయుధాలను ధరించినవాడికి నమస్కారం. యముడికి యముడయినవాడికి నమస్కారం. మూడవకన్ను గలవాడికి నమస్కారం.

అన్తకాన్తకృతే చైవ నమః పర్వతవాసినే ।
సువర్ణరేతసే చైవ నమః కుణ్డలధారిణే ॥ 11 ॥

అంతకుడిని అంతం చేసినవాడికి నమస్కారం. కైలాసపర్వతంమీద నివసించేవాడికి నమస్కారం. బంగారురేతస్సు కలిగినవాడికి నమస్కారం. చెవులకు కుండలాలు ధరించినవాడికి నమస్కారం.

దైత్యానాం యోగనాశాయ యోగినే గురవే నమః ।
శశాఙ్కాదిత్యనేత్రాయ లలాటనయనాయ చ ॥ 12 ॥

రాక్షసుల యోగశక్తిని నాశనం చేసేవాడికి నమస్కారం. మహాయోగి, అందరికీ గురువు అయినవాడికి నమస్కారం. చంద్రుడు (ఎడమకన్ను), సూర్యుడు (కుడికన్ను) కన్నులు అయినవాడికి నమస్కారం. నుదుట (మూడవ)కన్ను కలిగినవాడికి నమస్కారం.

నమశ్శ్మశానరతయే శ్మశానవరదాయ చ ।
నమోఽ వినీతనాశాయ వ్యంశకాయ నమో నమః ॥
అశనీశతహాసాయ పర్వతేశాయ వై నమః ॥ 13 ॥

శ్మశానాలు అంటే ఇష్టమయినవాడికి నమస్కారం. కైవల్యం అనే వరాన్ని ఇచ్చేవాడికి (లయకారుడికి) నమస్కారం. దుర్మార్గులను నాశనం చేసేవాడికి నమస్కారం. మోసగాడికి నమస్కారం. (ప్రళయసమయంలో) నూరుపిడుగులవంటినవ్వు కలిగినవాడికి నమస్కారం. పర్వతాలకు ప్రభువు అయినవాడికి నమస్కారం.

గృహస్థసాధవే నిత్యం జటినే బ్రహ్మచారిణే ।
నమో ముణ్డార్ధముణ్డాయ పశూనాం పతయే నమః ॥14 ॥

గృహస్థులలో ఉత్తముడయినవాడికి ఎప్పుడూ నమస్కారం. జడలు ధరించినవాడికి నమస్కారం. బ్రహ్మచారికి నమస్కారం. తలపై జుట్టు అసలు లేనివాడికి, సగంవరకు లేనివాడికి నమస్కారం. పశుపతికి నమస్కారం.

సలిలే తప్యమానాయ యోగైశ్వర్యప్రదాయ చ ।
నమఽ శ్శాన్తాయ దాన్తాయ ప్రలయోత్పత్తికారిణే ॥ 15 ॥

నీళ్లలో నిలిచి తపస్సు చేసేవాడికి నమస్కారం. యోగశక్తిని, ప్రభుత్వాన్నీ ఇచ్చేవాడికి నమస్కారం. బహిరంతరింద్రియనిగ్రహం కలిగినవాడికి నమస్కారం. ప్రళయాన్నీ, తిరిగి సృష్టినీ చేసేవాడికి నమస్కారం.

నమోఽ నుగ్రహకర్త్రే చ స్థితికర్త్రే నమో నమః ।
నమో రుద్రాయ వసవ ఆదిత్యాయాశ్వినే నమః ॥ 16 ॥

భక్తులను అనుగ్రహించేవాడికి నమస్కారం. అందరినీ పోషించేవాడికి నమస్కారం. రుద్రుడు (సంసారదుఃఖం పోగొట్టేవాడు), వసువు, ఆదిత్యుడు, ఆశ్వినులు అయినవాడికి నమస్కారం.

నమః పిత్రేఽ థ సాఙ్ఖ్యాయ విశ్వేదేవాయ వై నమః ।
నమ శ్శర్వాయ ఉగ్రాయ శివాయ వరదాయ చ ॥ 17 ॥

తండ్రి అయినవాడికి నమస్కారం. జ్ఞానరూపుడికి నమస్కారం. విశ్వేదేవతలరూపంలో ఉన్నవాడికి నమస్కారం. శర్వుడు (సంసారబంధాన్ని, రక్షణనూ ఇచ్చేవాడు), ఉగ్రుడు (అందరిలోనూ శ్రేష్ఠుడు), శివుడు (శుభాలు కలిగించేవాడు), అయినవాడికి నమస్కారం. వరాలు ఇచ్చేవాడికి నమస్కారం.

నమో భీమాయ సేనాన్యే పశూనాం పతయే నమః ।
శుచయే వైరిహానాయ సద్యోజాతాయ వై నమః ॥ 18 ॥

అందరికీ భయం పుట్టించేవాడికి నమస్కారం. సేనాని అయినవాడికి నమస్కారం. పశుపతికి నమస్కారం. అగ్ని స్వరూప మయినవాడికి నమస్కారం. శత్రువులను సంహరించేవాడికి నమస్కారం. సద్యోజాతుడు అనేపేరు గలిగినవాడికి నమస్కారం.

మహాదేవాయ చిత్రాయ శూలినే చ నమో నమః ।
ప్రధానాయాప్రమేయాయ కార్యాయ కారణాయ చ ॥ 19 ॥

మహాదేవుడికి, విచిత్రమయినవాడికి, శూలాన్ని ధరించినవాడికి నమస్కారం. ప్రకృతి రూపు డయినవాడికి, హద్దులేనివాడికి, కార్య(జగత్తు)స్వరూపుడికి, కారణ(పరమాత్మ)స్వరూపుడికి నమస్కారం.

పురుషాయ నమస్తేఽస్తు పురుషేచ్ఛాకరాయ చ ।
నమః పురుషసంయోగప్రధానగుణకారిణే ॥ 20 ॥

పురుషుడికి నమస్కారం. పురుషుని యొక్క కోరికని ఇచ్చేవాడికి నమస్కారం. పురుషుడితో కలయికవలన ప్రకృతికి త్రిగుణాలను కలిగించేవాడికి నమస్కారం.

ప్రవర్తకాయ ప్రకృతేః పురుషస్య చ సర్వశః ।
కృతాకృతస్య సఙ్కర్త్రే ఫలసంయోగదాయ చ ॥ 21 ॥

అన్నివిధాలుగానూ ప్రకృతినీ, పురుషుడినీ నడిపించేవాడికి (ప్రధానపురుషేశ్వరుడికి) నమస్కారం. చేసినదానిలోనూ, చేయనిదానిలోనూ లోపాలు సంస్కరించేవానికి నమస్కారం. కర్మలకు తగిన ఫలసిద్ధిని కలిగించే వాడికి నమస్కారం.

కాలజ్ఞాయ చ సర్వేషాం నమో నియమకారిణే ।
నమో వైషమ్యకర్త్రే చ గుణానాం వృత్తిదాయ చ ॥ 22 ॥

అందరికాలాన్ని గురించి తెలిసినవాడికి నమస్కారం. ధర్మనియమాలను ఏర్పరచినవాడికి నమస్కారం. భౌతిక విషయాలపైన వైరాగ్యం కలిగించే (దుర్మార్గులస్వరూపం అయిన) వాడికి, గుణాలకు ప్రవృత్తిని కల్పించినవాడికి నమస్కారం.

నమస్తే దేవదేవేశ నమస్తే భూతభావన ।
శివ సౌమ్యముఖో ద్రష్టుం భవ సౌమ్యో హి నః ప్రభో ॥ 23 ॥

దేవతలకు దేవుడయినవాడా! నీకు నమస్కారం. ప్రభూ! చరాచరభూతకోటిని సృష్టించి పోషించేవాడా! నీకు నమస్కారం. శుభకరుడా! శాంతమయినముఖం కలిగినవాడవై, మేము చూడడానికి వీ లయినప్రశాంతరూపంతో ఉండు.

బ్రహ్మోవాచ :–బ్రహ్మదేవుడు మహర్షులతో ఈవిధంగా అంటున్నాడు.

ఏవం స భగవాన్ దేవో జగత్పతి రుమాపతిః ।
స్తూయమాన స్సురై స్సర్వైఽ రమరానిదమబ్రవీత్ ॥ 24 ॥

దేవత లందరూ ఈవిధంగా స్తుతిస్తుండగా భగవంతుడు, లోకనాథుడు, అయినపార్వతీపతి దేవతలతో ఇలా అన్నాడు.

శ్రీరుద్ర ఉవాచ :–పరమేశ్వరుడు దేవతలతో ఈవిధంగా అంటున్నాడు.

దంష్ట్రాముఖశ్చ సౌమ్యశ్చ దేవానామస్మి భో స్సురాః ।
వరాన్ బ్రూత యథేష్టం చ దాతాఽస్మి తదసంశయమ్ ॥ 25 ॥

ఓ దేవతలారా! నేను దేవతలకు కోరలు గలిగినముఖంతో భయంకరంగానూ, (సౌమ్యమయినముఖంతో) శాంతంగానూ కనిపిస్తాను. మీకు కావలసినవరాలను అడగండి. ఇస్తాను. సందేహపడవద్దు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మదేవుడు మహర్షులతో ఈవిధంగా చెప్తున్నాడు.

తత స్తే ప్రణతా స్సర్వే సురా ఊచు స్త్రిలోచనమ్ ॥ 26 ॥

అప్పుడు దేవతలు అందరూ ముక్కంటికి ప్రణమిల్లి ఇలా అన్నారు.

దేవా ఊచుః:– పరమేశ్వరుడితో దేవతలు ఇలా అన్నారు.

తవైవ భగవన్ హస్తే వర ఏషోఽవతిష్ఠతామ్ ।
యదా కార్యం తదా న స్త్వం దాస్యసే వర మీప్సితమ్ ॥ 27 ॥

భగవంతుడా! ఆవరాలను నీవద్దనే భద్రంగా ఉంచు. పని పడినప్పుడు మాకు కావలసినవరాన్ని ఇవ్వు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మదేవుడు మహర్షులతో ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవమస్త్వితి తానుక్త్వా విసృజ్య చ సురాన్ హరః ।
లోకాంశ్చ ప్రమథై స్సార్ధం వివేశ భవనం తతః ॥ 28 ॥

అలాగే అగు గాక! అని దేవతలతో పలికి, పరమేశ్వరుడు దేవతలనూ, ఇతరులనూ విడిచి, ప్రమథగణాలతో కలిసి తనభవనానికి వెళ్లాడు.

యస్తు హరోత్సవ మద్భుత మేనం గాయతి దైవతవిప్రసమక్షమ్ ।
సోఽప్రతిరూపగణేశసమానో దేహవిపర్యయ మేత్య సుఖీ స్యాత్ ॥ 29 ॥

దేవతలు, బ్రాహ్మణులసమక్షంలో అద్భుతమయిన ఈపరమేశ్వరుడి వివాహమహోత్సవాన్ని గానం చేసినవాడు మరణానంతరం సాటిలేని ప్రమథగణనాయకుడితో సమానమయిన రూపాన్ని పొంది సుఖంగా ఉంటాడు.

విప్రవర్యాః స్తవం హీమం శృణుయాద్ యః పఠేత్ తథా ।
స సర్వలోకగో దేవైః పూజ్యతేఽచాసురాదిభిః ॥ 30 ॥

బ్రాహ్మణోత్తములారా! ఈశివస్తుతిని విన్నవాడు, చదివినవాడు (స్వర్గము సత్యము మొదలయిన) సమస్త లోకాలలోనూ సంచరించగలుగుతాడు. అతడిని దేవతలు, రాక్షసులు మొదలయినవారు అందరూ పూజిస్తారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే శివస్తుతినిరూపణం నామ పఞ్చత్రింశోఽధ్యాయః ॥ 35 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషి సంవాదంలో శివస్తుతినిరూపణం అనే ముప్పైఐదవ అధ్యాయం ॥35 ॥



షట్త్రింశోఽధ్యాయః - ముప్పైఆరవ అధ్యాయం

ఉమాశంకరులహిమవత్పరిత్యాగనిరూపణమ్ - ఉమాశంకరుల హిమవత్పరిత్యాగనిరూపణం

బ్రహ్మోవాచ :-బ్రహ్మదేవుడు మహర్షులతో ఇలా చెప్తున్నాడు.

ప్రవిష్టే భవనం దేవే సూపవిష్టే వరాసనే ।
సపత్నో మన్మథః క్రూరో దేవం వేద్ధుమనాభవత్ ॥ 1 ॥

మహేశ్వరుడు తనయింటికి వెళ్లి, ఉత్తమమయిన ఆసనం మీద సుఖంగా కూర్చున్నాడు. ఆసమయంలో జితేంద్రియుడయిన పరమేశ్వరుడికి శత్రువూ, క్రూరుడూ అయిన మన్మథుడు ఆమహాదేవుడిని బాణాలతో బాధించాలనుకున్నాడు.

తమనాచారసంయుక్తం దురాత్మానం కులాధమమ్ ।
లోకాన్ సర్వాం స్తాపయన్తం సర్వాఙ్గావరణాత్మకమ్ ॥ 2 ॥

ఆమన్మథుడినడవడి సరి అయినది కాదు. దుర్మార్గపు పనులు చేస్తుంటాడు. వంశానికి అపకీర్తి తెచ్చేనీచుడు. లోకాలు అన్నింటినీ బాధిస్తుంటాడు. తనశరీరం కనపడకుండా ముసుగు కప్పుకున్నవాడు.

ఋషీణాం విఘ్నకర్తారం నియమానాం వ్రతై స్సహ ।
చక్రాహ్వయస్య రూపేణ రత్యా సహ సమాగతమ్ ॥ 3 ॥

తాపసుల నియమాలకూ, వారివ్రతదీక్షలకూ అడ్డంకులు కల్పిస్తాడు. చక్రం అనేపేరు గలిగినరూపంతో రతీదేవితో కలిసి పరమేశ్వరుడు ఉన్నచోటికి వచ్చాడు.

అథాఽతతాయినం విప్రా వేద్ధుకామం సురేశ్వరః ।
నయనేన తృతీయేన సావజ్ఞం సమవైక్షత ॥ 4 ॥

బ్రాహ్మణులారా! తనను బాణాలతో కొట్టి అవమానింపదలచిన దుర్మార్గుడయిన మన్మథుడిని పరమేశ్వరుడు కోపంతో మూడవకన్ను తెరిచి చూశాడు.

తతోఽస్య నేత్రజో వహ్ని ర్జ్వాలామాలాసహస్రవాన్ ।
సహసా రతిభర్తార మదహత్ సపరిచ్ఛదమ్ ॥ 5 ॥

అప్పుడు మహాదేవుడి కంటినుండి పుట్టిన అగ్ని వేలకొద్దీ జ్వాలలతో వెంటనే మన్మథుడిని అతడిఆచ్ఛాదనంతో సహా దహించివేసింది.

స దహ్యమానః కరుణ మార్తో ఽక్రోశత విస్వరమ్ ।
ప్రసాదయంశ్చ తం దేవం పపాత ధరణీతలే ॥ 6 ॥

తగలబడిపోతున్న మన్మథుడు జాలి కలిగేవిధంగా వికృతమయిన స్వరంతో బాధగా అరిచాడు. శివుడికి అనుగ్రహం కలిగేవిధంగా నేలకూలాడు.

అథ సోఽగ్నిపరీతాఙ్గో మన్మథో లోకతాపనః ।
పపాత సహసా మూర్ఛా క్షణేన సమపద్యత ॥ 7 ॥

లోకాలన్నింటినీ తపింపజేసే మన్మథుడు ముక్కంటికంటిమంటలు చుట్టుముట్టగా, నేలపై బడి, క్షణంలో మూర్ఛపోయాడు.

పత్నీ తు కరుణం తస్య విలలాప సుదుఃఖితా ।
దేవీం దేవం చ దుఃఖార్తా అయాచత్ కరుణావతీ ॥ 8 ॥

మన్మథుడిభార్య మిక్కిలిదుఃఖంతో బాధగా ఏడ్చింది. దుఃఖంతో దీనంగా, జాలికొలిపేవిధంగా రతి తనభర్తను రక్షించమని పార్వతీపరమేశ్వరులను యాచించింది.

తస్యాశ్చ కరుణాం జ్ఞాత్వా దేవౌ తౌ కరుణాత్మకౌ ।
ఊచతు స్తాం సమాలోక్య సమాశ్వాస్య చ దుఃఖితామ్ ॥ 9 ॥

దయామూర్తులయిన పార్వతీపరమేశ్వరులు రతీదేవిబాధను గ్రహించారు. కష్టంలో ఉన్నరతిని ఓదార్చి, ఆమెతో ఇలా అన్నారు.

ఉమామహేశ్వరా వూచతుః :-ఉమామహేశ్వరులు రతీదేవితో ఈవిధంగా అంటున్నారు.

దగ్ధ ఏష ధ్రువం భద్రే నా స్యోత్పత్తిరిహేష్యతే ।
అశరీరోఽపి తే భద్రే కార్యం సర్వం కరిష్యతి ॥ 10 ॥

కల్యాణీ! నీభర్త తగలబడిపోయాడు. ఇక ఇప్పుడు మళ్లీ పుట్టడం జరగదు. ఇది నిశ్చయం. భద్రురాలా! శరీరం లేకపోయినప్పటికీ, నీభర్త అన్ని పనులు చేస్తాడు.

యదా తు విష్ణు ర్భగవాన్ వసుదేవసుత శ్శుభే ।
తదా తస్య సుతో భూయః పతి స్తే సమ్భవిష్యతి ॥ 11 ॥

శోభనాంగీ! శ్రీమహావిష్ణువు భూలోకంలో వసుదేవుడికుమారుడుగా శ్రీకృష్ణుడయి జన్మిస్తాడు. అప్పుడు ఆశ్రీకృష్ణుడికి కుమారుడుగా నీభర్త మళ్లీ జన్మిస్తాడు.

బ్రహ్మోవాచ:-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తత స్సా చ వరం లబ్ధ్వా కామపత్నీ శుభాననా ।
జగామేష్టం తదా దేశం ప్రీతియుక్తా గతక్లమా ॥ 12 ॥

సుందరవదన అయిన మన్మథుడిభార్య పార్వతీపరమేశ్వరులవలన తనభర్తను వరంగా తిరిగి పొందింది. అప్పుడు ఆనందంతో తన కిష్టమయిన చోటికి వెళ్లిపోయింది.

దగ్ధ్వా కామం తదా విప్రా స్స తు దేవో వృషధ్వజః ।
రేమే తత్రోమయా సార్థం ప్రహృష్టస్తు హిమాచలే ॥ 13 ॥

ద్విజులారా! మన్మథుడిని దహించి, మహాదేవుడు హిమాలయపర్వతం మీద ఉమాదేవితో కలిసి, సంతోషంగా విహరించాడు.

కన్దరేషు చ రమ్యేషు పద్మినీషు సరస్సు చ ।
నిర్జనేషు చ రమ్యేషు కర్ణికారవనేషు చ ॥ 14 ॥

అందమయిన కొండగుహలలోనూ, తామరతంపరలయిన సరస్సులలోనూ, జనసంచారం లేని మనోహర మయిన కొండగోగు తోటలలోనూ, (పార్వతీపరమేశ్వరులు విహరించారు)

నదీతీరేషు కాన్తేషు కింనరాచరితేషు చ ।
శృఙ్గేషు శైలరాజస్య తడాగేషు సరస్సు చ ॥15 ॥

సుందరమయిన నదిఒడ్డులలోనూ, కిన్నరులు సంచరించే హిమాలయశిఖరాలమీద, చెరువులలోనూ, చిన్నప్రవాహాల(వాగుల) లోనూ, (వారు విహరించారు)

వనరాజిషు చమ్పాసు నానాపక్షిరుతేషు చ ।
తీర్థేషు పుణ్యతోయేషు మణీనా మఙ్గణేషు చ ॥ 16 ॥

సంపంగితోటలలోనూ, రకరకాలపక్షులఅరుపులతో నిండిన పుణ్యతీర్థాలలోనూ, మణిభవనాలలోనూ, (విహరించారు)

ఏతేషు పుణ్యేషు మనోహరేషు దేశేషు విద్యాధరభూషితేషు ।
గన్ధర్వయక్షామరసేవితేషు రేమే స దేవ్యా సహితస్త్రినేత్రః ॥ 17 ॥

విద్యాధరులు, గంధర్వులు, యక్షులు, దేవతలు, సంచరించే ఇటువంటి పుణ్యప్రదమయిన సుందర ప్రదేశాలలో పరమేశ్వరుడు పార్వతితో కలిసి సుఖించాడు.

దేవై స్సహేన్ద్రై ర్మునియక్షసిద్ధై ర్గన్ధర్వవిద్యాధరదైత్యముఖ్యైః ।
అన్యైశ్చ సర్వై ర్వివిధై ర్వృతోఽసౌ తస్మి న్నగే హర్ష మవాప శమ్భుః ॥ 18 ॥

ఇంద్రుడితో సహా దేవతలు, మునులు, యక్షులు, సిద్ధులు, గంధర్వులు, విద్యాధరులు, దైత్యులు మొద లయినవారు, ఇంకా ఇతరులయినవారు అందరూ చుట్టూ ఉండి తనను సేవిస్తుండగా, పరమేశ్వరుడు హిమాలయ పర్వతం మీద చాల సంతోషంగా ఉంటున్నాడు.

నృత్యన్తి తత్రాప్సరస స్సురేశా గాయన్తి గన్ధర్వగణాః ప్రహృష్టాః ।
ధ్యాయన్తి విప్రా స్త్వథ వాదయన్తి కేచి ద్ద్రుతం దేవవరం స్తువన్తి ॥ 19 ॥

అక్కడ అప్సరసలు నాట్యం చేస్తున్నారు. దేవతానాయకులు, గంధర్వులు ఆనందంతో గానం చేస్తున్నారు. బ్రాహ్మణులు ధ్యానం చేస్తున్నారు. కొంతమంది వివిధవాద్యాలను వాయిస్తున్నారు. మరి కొంతమంది పరమేశ్వరుడిని గట్టిగా స్తోత్రాలు చేస్తున్నారు.

ఏవం స దేవస్స్వగణైరుపేతో మహాబలై శ్శక్రయమాగ్నితుల్యైః ।
దేవ్యాః ప్రియార్థం భగనేత్రహన్తా గిరిం న తత్యాజ తదా మహాత్మా ॥ 20 ॥

భగుడు అనేఆదిత్యుడికన్ను పెకలించిన పరమేశ్వరుడు ఇంద్రుడితోనూ, యముడితోనూ సమానమయి, గొప్పబలవంతులయిన తనప్రమథగణాలతో కూడి, పార్వతిని ఆనందపెట్టడానికి ఆహిమాలయపర్వతంమీదనే విడువకుండా ఉంటున్నాడు.

ఋషయ ఊచుః :– మహర్షులు బ్రహ్మదేవుడితో ఇలా అన్నారు.

దేవ్యా స్సమం తు భగవాం స్తిష్ఠం స్తత్ర స కామహా ।
అకరోత్ కిం మహాదేవ ఏతదిచ్ఛామ వేదితుమ్ ॥ 21 ॥

మన్మథుడిని దహించిన మహాదేవుడు, హిమాలయపర్వతం మీద పార్వతీదేవితో కలిసిఉంటూ, ఆతరువాత ఏం చేశాడు? ఈవిషయం వినా లని కోరుకుంటున్నాం (అన్నారు).

బ్రహ్మోవాచ:–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

భగవాన్ హిమవచ్ఛృఙ్గే స హి దేవ్యాః ప్రియేచ్ఛయా ।
గణేశై ర్వివిధాకారై ర్హాసం సఞ్జనయన్ ముహుః ॥ 22 ॥

మహాదేవుడు హిమాలయపర్వతశిఖరంమీద ఉండి, పార్వతీదేవిని ఆనందింపజేయాలనే కోరికతో ప్రమథ గణపతులతో రకరకాల వేషాలు వేయించి (నటింపజేసి) పార్వతికి నవ్వు తెప్పించాడు.

దేవీం బాలేన్దుతిలకో రమయంశ్చ రరామ చ ।
మహానుభావై స్సర్వజ్ఞైః కామరూపధరై శ్శుభైః ॥ 23 ॥

చంద్రరేఖను తిలకంగా ధరించిన పరమేశ్వరుడు, శుభప్రదులూ, సమస్తమూ తెలిసినవాళ్లూ, కోరుకున్న రూపాన్ని ధరించేవాళ్ళూ, అయినమహాత్ములచేత వేడుకలు చేయించి, పార్వతి సంతోషపెట్టాడు. (పార్వతి సంతోషించటంచేత) తానూ సంతోషించాడు.

అథ దేవ్యా ససాదైకా మాతరం పరమేశ్వరీ ।
ఆసీనాం కాఞ్చనే శుభ్ర ఆసనే పరమాద్భుతే ॥ 24 ॥

ఒకనాడు పార్వతి ఒంటరిగా తల్లివద్దకు వెళ్లింది. అప్పుడు పార్వతితల్లి మిక్కిలిఅద్భుతమూ, శుభ్రమూ, అయినబంగారు ఆసనంమీద కూర్చునిఉన్నది.

సాஉథ దృష్ట్వా సతీం దేవీ మాగతాం సురరూపిణీమ్ ।
ఆసనేన మహార్హే ణాసమ్పాదయ దనిన్దితామ్ ॥ 25 ॥

దేవతాస్వరూపంతో వచ్చిన పూజ్యురాలయిన పార్వతీదేవిని చూచి, ఆమెతల్లి పార్వతికి తగినఆసనం ఇచ్చి కూర్చుండబెట్టింది.

అథ దేవ్యా స హాసీనా మేనా కమలలోచనా ।
ఆసీనాం తామథోవాచ తథా హిమవతః ప్రియా ॥ 26 ॥

తామరలవంటి కన్నులు కలిగిన మేన(పార్వతితల్లి) వచ్చి, కూతురు ప్రక్కనే కూర్చున్నది. అలా కూర్చున్న తరువాత పార్వతితో హిమవంతుడిభార్య ఇలా అన్నది.

మేనోవాచ :–పార్వతితో మేన ఈవిధంగా అంటున్నది.

చిరస్యాగమనం తేஉద్య వద పుత్రి శుభేక్షణే ।
దరిద్రక్రీడనై స్త్వం హి భర్త్రా క్రీడసి సజ్గతా ॥ 27 ॥

అమ్మాయీ! చాలకాలం తర్వాత ఇప్పటికి వచ్చావు. అందమయినచూపులు కలిగినదానా! పనికిమాలిన ఆటబొమ్మలతో (ప్రమథగణాలతో) క్రీడించే భర్తతో కలిసి ఆనందిస్తున్నావు కదా.

యే దరిద్రా భవ న్తీహ తథైవ చ నిరాశ్రయాః ।
ఉమే త ఏవం క్రీడన్తి యథా తవ పతి శ్శుభే ॥ 28 ॥

ఉమా! శుభస్వరూపిణీ! నిలువ నీడ కూడా లేని ధనహీనులే నీభర్తలాగా ఈవిధంగా క్రీడిస్తారు.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

సైవ ముక్తా మాత్రా తు నాతిహృష్టమనాஉభవత్ ।
మహత్యా క్షమయా యుక్తా కిఞ్చి న్నోవాచ మాతరమ్ ॥ 29 ॥

తల్లి ఈవిధంగా అనడంతో పార్వతి కొంచెం బాధపడింది. ఎంతో ఓర్పుతో తల్లితో తిరిగి ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉన్నది.

విసృష్టా చ తదా మాత్రా గత్వా దేవ మువాచ హ ॥ 30 ॥

తరువాత తల్లి వీడుకోలుతో, ఇంటికి వెళ్లి మహాదేవుడితో ఇలా అన్నది.

పార్వత్యువాచ :–పరమేశ్వరుడితో పార్వతి ఈవిధంగా అంటున్నది.

భగవన్! దేవదేవేశ! నేహ వత్స్యామి భూధరే ।
అన్యం కురు మమావాసం భువనేషు మహాద్యుతే ॥ 31 ॥

మహాత్మా! దేవదేవా! తేజస్వీ! ఇంక నేను ఈహిమాలయపర్వతం పైన ఉండను. ఈలోకాలలో వేరే ఎక్క డైనా నాకు నివాసం ఏర్పాటు చేయి.

మహాదేవ ఉవాచ:- పార్వతితో మహాదేవుడు ఈవిధంగా అంటున్నాడు.

సదా త్వ ముచ్యమానా వై మయా వాసార్థ మీశ్వరి ।
అన్యం న రోచితవతీ వాసం వై దేవి కర్హిచిత్ ॥ 32 ॥

దేవీ! నేను ఎప్పుడూ వేరే ఇంకొకచోట ఉందా మని చెప్తున్నా, నీవు ఇక్కడ తప్ప ఇంకెక్కడా ఉండడానికి ఇష్టపడలేదు.

ఇదానీం స్వయ మేవ త్వం వాస మన్యత్ర శోభనే ।
కస్మా న్మృగయసే దేవి బ్రూహి తన్మే శుచిస్మితే ॥ 33 ॥

కల్యాణీ! స్వచ్ఛమయిన చిరునవ్వు కలిగినదానా! ఇప్పుడు నీఅంతట నీవే ఉండడానికి వేరే చోటు వెదుక్కుంటున్నావు. ఎందుకు? నాకు వివరంగా చెప్పు. (అని అడిగాడు శంకరుడు)

దేవ్యువాచ :- పరమేశ్వరుడితో పార్వతి ఈవిధంగా అంటున్నది.

గృహం గతాఽ హం దేవేశ పితురద్య మహాత్మనః ।
దృష్ట్వా చ తత్ర మే మాతా విజనే లోకభావన ॥
ఆసనాదిభి రభ్యర్చ్య మా మేవం సమభాషత ॥ 34 ॥

దేవేశ్వరా! లోకాలను సృష్టించి పోషించేవాడా! ఈనాడు నేను మహాత్ము డయినమాతండ్రిగారి ఇంటికివెళ్లాను. అక్కడ ఏకాంతంలో మాతల్లిని చూచాను. మాఅమ్మ ఆసనం మొదలయిన వాటితో నన్ను ఆదరించి ఇలా అన్నది.

ఉమే తవ సదా భర్తా దరిద్రక్రీడనై శ్శుభే ।
క్రీడతే న హి దేవానాం క్రీడా భవతి తాదృశీ ॥ 35 ॥

'ఉమా! నీభర్త నిరంతరమూ నీచమయిన ఆటలతో ఆడుకుంటుంటాడు. దేవతల యొక్క ఆట ఆవిధంగా ఉండదు.

యత్ కిల త్వం మహాదేవ గణైశ్చ వివిధై స్తథా ।
రమసే తదనిష్టం హి మమ మాతు ర్వృషధ్వజ ॥ 36 ॥

మహాదేవా! వృషధ్వజా! నీవు వివిధప్రమథగణాలతో విహరిస్తుంటావు కదా! అది మాఅమ్మకు ఇష్టంఉండదు.

బ్రహ్మోవాచ :- మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా అంటున్నాడు.

తతో దేవః ప్రహస్యాహ దేవీం హాసయితుం ప్రభుః ॥ 37 ॥

అప్పుడు ప్రభువయిన పరమేశ్వరుడు పార్వతిని నవ్వించడానికి ఇలా అన్నాడు.

దేవ ఉవాచ :-పార్వతితో పరమేశ్వరుడు ఈవిధంగా అంటున్నాడు.

ఏవమేవ న సన్దేహః కస్మాన్మన్యురభూత్తవ ।
కృత్తివాసా హ్యవాసాశ్చ శ్మశాననిలయశ్చ హ ॥ 38 ॥

దేవీ! మీఅమ్మ అన్నమాట నిజమే కదా. సందేహం ఏముంది? నీకు కోపమెందుకు వచ్చింది? నేను చర్మాన్ని ధరిస్తాను. నాకు వేరే వస్త్రం లేనివాడిని శ్మశానంలో ఉంటాను.

అనికేతో హ్యరణ్యేషు పర్వతానాం గుహాసు చ ।
విచరామి గణై ర్నగ్నై ర్వృతోఽ ఽ మ్భోజవిలోచనే ॥ 39 ॥

తామరకన్నులదానా! నాకు ఉండటానికి చోటు లేదు. అడవులలోనూ, కొండలమీదా, కొండలగుహలలోనూ, ప్రమథగణాలతో కలిసి సంచరిస్తుంటాను.

మా క్రుధో దేవి మాత్రే త్వం తథ్యం మాతాఽ వద త్తవ ।
న హి మాతృసమో బన్ధుఽ ర్జన్తూనా మస్తి భూతలే ॥ 40 ॥

దేవీ! మీఅమ్మమీద కోపగించకు. నీతల్లి నీకు నిజమే చెప్పింది. ఈభూమిమీద తల్లితో సమాన మయినబంధువు ఎవరూ లేరు సుమా!

దేవ్యువాచ :-పరమేశ్వరుడితో పార్వతి ఈవిధంగా అన్నది.

న మేఽ స్తి బన్ధుభిః కృత్యం కిఞ్చిత్ త్రిపురనాశన ।
తథా కురు మహాదేవ యథాఽ హం సుఖమాప్నుయామ్ ॥ 41 ॥

త్రిపురాసురసంహారం చేసినవాడా! నాకు బంధువులతో కొంచెం కూడ పనిలేదు. ఓ మహాదేవా! నేను యేవిధంగా సుఖాన్ని పొందుతానో ఆ విధంగా చేయి.

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఇలా చెప్తున్నాడు.

శ్రుత్వా స దేవ్యా వచనం సురేశ స్తస్యాః ప్రియార్థం శ్వశురం విహాయ ।
జగామ మేరుం సురసిద్ధసేవితం భార్యాసహాయ స్స్వగణైశ్చ యుక్తః ॥ 42 ॥

భార్య మాటలు విని పరమేశ్వరుడు ఆమెకు ఇష్టం కలగడంకోసం మామగారిని (హిమాలయపర్వతాన్ని) విడిచిపెట్టి, భార్యతో కలిసి, ప్రమథగణాలతో కూడి, దేవతలతోనూ, సిద్ధులతోనూ కూడిన మేరుపర్వతానికివెళ్లాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే ఉమాశఙ్కరయో ర్హిమవత్పరిత్యాగనిరూపణం నామ షట్త్రింశోఽ ధ్యాయః ॥ 36 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషి సంవాదంలో ఉమాశంకరులహిమవత్పరిత్యాగనిరూపణం అనే ముప్పైఆరవ అధ్యాయం సంపూర్ణం.

సప్తత్రింశోఽధ్యాయః - ముప్పైఏడవ అధ్యాయం

దక్షయజ్ఞవిధ్వంసనమ్ - దక్షయజ్ఞవిధ్వంసనం

ఋషయ ఊచుః :- మహర్షులు బ్రహ్మదేవుడితో ఇలా అన్నారు.

ప్రాచేతసస్య దక్షస్య కథం వైవస్వతేఽన్తరే ।
వినాశ మగమద్ బ్రహ్మన్ హయమేధః ప్రజాపతేః ॥ 1 ॥

బ్రహ్మదేవా! వైవస్వతమన్వంతరంలో ప్రచేతసుడికుమారుడయిన దక్షప్రజాపతి చేసిన అశ్వమేధయాగం ఏవిధంగా ధ్వంసమయింది?

దేవ్యా మన్యుకృతం బుద్ధ్వా క్రుద్ధ స్సర్వాత్మకః ప్రభుః ॥
కథం వినాశితో యజ్ఞో దక్షస్యామితతేజసః ॥
మహాదేవేన రోషాద్ వై త న్నః ప్రబ్రూహి విస్తరాత్ ॥ 2 ॥

సతీదేవి కోపంతో చేసినదానిని తెలుసుకుని, విశ్వాత్మకుడయిన మహాదేవుడు కోపించి, మహాతేజస్వి అయిన దక్షుడియజ్ఞాన్ని ఏవిధంగా నాశనం చేశాడో ఆవృత్తాంతాన్ని వివరంగా మాకు చెప్పవలసినది. (అని మహర్షులు బ్రహ్మను అడిగారు)

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా అంటున్నాడు.

వర్ణయిష్యామి వో విప్రా మహాదేవేన వై యథా ।
క్రోధాద్ విధ్వంసితో యజ్ఞో దేవ్యాః ప్రియచికీర్షయా ॥ 3 ॥

బ్రాహ్మణులారా! భార్యను సంతోషపెట్టడానికి మహాదేవుడు దక్షుడియజ్ఞాన్ని కోపంతో ఏప్రకారంగా ధ్వంసం చేశాడో మీకు వివరిస్తాను.

పురా మేరో ర్ద్విజశ్రేష్ఠాః శృఙ్గం త్రైలోక్యపూజితమ్ ।
జ్యోతిఃస్థలం నామ చిత్రం సర్వరత్నవిభూషితమ్ ॥
అప్రమేయ మనాధృష్యం సర్వలోకనమస్కృతమ్ ॥ 4 ॥

బ్రాహ్మణోత్తములారా! పూర్వం జ్యోతిస్థలం అనే మేరుశిఖరం చాల వింత ఐనది. సమస్త మయిన రత్నాలతో అలంకరింపబడిఉంది. మూడులోకాలవాసులూ ఆశిఖరాన్ని గౌరవించేవారు. ఆశిఖరం కొలతలకు అందనిది. ఆదరింపదగినది. అన్నిలోకాలవారూ దానికి నమస్కరిస్తారు.

తత్ర దేవో గిరితటే సర్వధాతువిచిత్రితే ।
పర్యఙ్క ఇవ విభ్రాజ న్నుపవిష్టో బభూవ హ ॥ 5 ॥

అన్నిరకాలయిన ధాతువులతోనూ విచిత్రమై, మంచం లాగా ప్రకాశిస్తున్న ఆశిఖరం మీద కూర్చుని మహాదేవుడు వెలుగొందుతున్నాడు.

శైలరాజసుతా చాస్య నిత్యం పార్శ్వస్థితాఽభవత్ ॥ 6 ॥

పార్వతి ఎప్పుడూ ఆపరమేశ్వరుడికి ప్రక్కనే ఉండేది.

ఆదిత్యాశ్చ మహాత్మానో వసవశ్చ మహౌజసః ।
తథైవ చ మహాత్మానా వశ్వినౌ భిషజాం వరౌ ॥ 7 ॥

ఇంకా మహానుభావులయిన ద్వాదశ ఆదిత్యులు, మిక్కిలి కాంతిమంతులయిన అష్టవసువులు, అలాగే వైద్యులలో శ్రేష్ఠులూ, మహానుభావులూ అయిన అశ్వినులు ఇద్దరూ, శివుడిని సేవిస్తూ అక్కడే ఉన్నారు.

తథా వైశ్రవణో రాజా గుహ్యకైః పరివారితః ।
యక్షాణా మీశ్వర శ్శ్రీమాన్ కైలాసనిలయః ప్రభుః ॥ 8 ॥

సర్వసమర్థుడు, కైలాసనివాసీ, శ్రీమన్తుడూ, యక్షులకు ప్రభువూ అయిన వైశ్రవణుడు (కుబేరుడు) యక్షగణాలతో చుట్టబడి ఉన్నవాడై–

ఉపాసతే మహాత్మాన ముశనా చ మహామునిః ।
సనత్కుమారప్రముఖా స్తథైవ పరమర్షయః ॥ 9 ॥

మహానుభావుడయిన శుక్రమహర్షి పరమేశ్వరుడిని ఉపాసిస్తూ అక్కడే ఉన్నాడు. అలాగే మహాముని లయిన సనత్కుమారుడు మొదలయినవారు కూడ శివునిసమీపంలో ఉపాసిస్తూ ఉన్నారు.

అఙ్గిరఃప్రముఖా శ్చైవ తథా దేవర్షయోఽపి చ ।
విశ్వావసుశ్చ గన్ధర్వ స్తథా నారదపర్వతౌ ॥ 10 ॥

అంగిరుడు మొదలయినవారు, దేవఋషులు, విశ్వావసువు అనేగంధర్వుడు, నారదుడు, పర్వతుడు అక్కడ ఉన్నారు.

అప్సరోగణసఙ్ఘా శ్చ సమాజగ్ము రనేకశః ॥ 11 ॥

అప్సరసలు గుంపులుగా అక్కడికి వచ్చారు.

వవౌ సుఖశివో వాయు ర్నానాగన్ధవహ శ్శుచిః ।
సర్వర్తుకుసుమోపేతాః పుష్పవన్తో వనద్రుమాః ॥ 12 ॥

అక్కడ గాలి స్వచ్ఛంగా, అనేక మయినపరిమళాలతో కూడి, సుఖంగానూ, శుభంగానూ వీచింది. ఉద్యానవనంలోనిచెట్లు అన్ని ఋతువులకు సంబంధించినపూవులతో నిండిఉన్నాయి.

తథా విద్యాధరా స్సాధ్యా స్సిద్ధా శ్చైవ తపోధనాః ।
మహాదేవం పశుపతిం పర్యుపాసత తత్ర వై ॥ 13 ॥

విద్యాధరులు, సాధ్యులు, సిద్ధులు, తపస్వులు, పశుపతి అయిన పరమేశ్వరుడిని ఆగిరిశిఖరంమీద ఉపాసన చేస్తుంటారు.

భూతాని చ తథాఽన్యాని నానారూపధరాణ్యథ ।
రాక్షసాశ్చ మహారౌద్రాః పిశాచాశ్చ మహాబలాః ॥ 14 ॥

వివిధమయిన రూపాలతో ఉన్న ఇతరప్రాణులు, భయంకరులయిన రాక్షసులు, గొప్పబలం కలిగినపిశాచాలు, ఆగిరిశిఖరంమీద ఉన్నారు.

బహురూపధరా ధృష్టాః నానాప్రహరణాయుధాః ।
దేవస్యానుచరా స్తత్ర తస్థు ర్వైశ్వానరోపమాః ॥ 15 ॥

మహాదేవుడి అనుచరులు అక్కడ పరమేశ్వరుడిసన్నిధిలో రకరకాలరూపాలు ధరించిఉన్నారు. తీవ్రమైన దర్పం గలవారు. వివిధ మయినఆయుధాలను ధరించిఉన్నారు. వారు అగ్నితో సమానమయినవారు.

నన్దీశ్వరశ్చ భగవాన్ దేవస్యానుమతే స్థితః ।
ప్రగృహ్య జ్వలితం శూలం దీప్యమానం స్వతేజసా ॥ 16 ॥

పరమేశ్వరుడి అనుమతితో మహాత్ముడయిన నందీశ్వరుడు (శివాజ్ఞకయి ఎదురు చూస్తూ కింకరుడై) అక్కడ ఉన్నాడు. నిప్పులు కక్కుతున్న శూలాన్ని ధరించాడు. తనతేజస్సుతో ప్రకాశిస్తున్నాడు.

గఙ్గా చ సరితాం శ్రేష్ఠా సర్వతీర్థజలోద్భవా ।
పర్యుపాసత తం దేవం రూపిణీ ద్విజసత్తమాః ॥ 17 ॥

బ్రాహ్మణోత్తములారా! సమస్తమయిన పుణ్యతీర్థాలతో కూడినగంగానదీమతల్లి (స్త్రీ)రూపం ధరించి వచ్చి మహాదేవుడిని సేవిస్తున్నది.

ఏవం స భగవాం స్తత్ర పూజ్యమాన స్సురర్షిభిః ।
దేవైశ్చ సుమహాభాగై ర్మహాదేవో వ్యవస్థితః ॥ 18 ॥

ఈవిధంగా దేవఋషులూ, దేవతలూ, ఇంకా ఇతరమహానుభావులు అందరూ పూజిస్తుండగా, మహాదేవుడు ఆపర్వతశిఖరం మీద నివసిస్తున్నాడు.

కస్యచి త్త్వథ కాలస్య దక్షో నామ ప్రజాపతిః ।
పూర్వోక్తేన విధానేన యక్ష్యమాణోఽభ్యపద్యత ॥ 19 ॥

ఇలా ఉండగా, కొంతకాలంతర్వాత ఒకానొకప్పుడు దక్షుడు అనేప్రజాపతి ఇంతకు ముందు చెప్పినప్రకారంగా యజ్ఞం చేయడానికి పూనుకున్నాడు.

తత స్తస్య మఖే దేవా స్సర్వే శక్రపురోగమాః ।
స్వర్గస్థానాదథాగమ్య దక్షమాపేదిరే తథా ॥ 20 ॥

అప్పుడు ఇంద్రుడు మొదలయిన దేవతలు స్వర్గలోకంనుండి దక్షుడు యజ్ఞం చేస్తున్నచోటికి వచ్చారు.

తే విమానై ర్మహాత్మానో జ్వలద్భి ర్జ్వలనప్రభాః ।
దేవస్యానుమతేఽ గచ్ఛన్ గఙ్గాద్వార మితి శ్రుతిః ॥ 21 ॥

అగ్నివంటితేజస్సు కలిగి, మహాత్ములయిన ఇంద్రాదిదేవతలు పరమేశ్వరుడిఅనుమతి తీసుకుని, కాంతిమంత మయిన విమానాల మీద బయలుదేరి, గంగాద్వారం (హరిద్వారం) వద్దకు వెళ్లారని విన్నాం.

గన్ధర్వాప్సరసాకీర్ణం నానాద్రుమలతావృతమ్ ।
ఋషిసఙ్ఘైః పరివృతం దక్షం ధర్మభృతాం వరమ్ ॥ 22 ॥

ఆచోటు గంధర్వులతోనూ, అప్సరసలతోనూ నిండిఉంది. రకరకాలచెట్లతోనూ, తీగెలతోనూ కూడిఉంది. అక్కడ ధర్మాన్ని కాపాడేవాళ్లలో ఉత్తముడయిన దక్షప్రజాపతి చుట్టూ మహర్షులు పరివేష్టించిఉన్నారు.

పృథివ్యా మన్తరిక్షే చ యే చ స్వర్లోకవాసినః ।
సర్వే ప్రాఞ్జలయో భూత్వా ఉపతస్థుః ప్రజాపతిమ్ ॥ 23 ॥

భూలోకంలోనూ, అంతరిక్షంలోనూ, స్వర్గలోకంలోనూ ఉండేవాళ్ళు అందరూ అంజలి ఘటించి, ఆదక్ష ప్రజాపతిని చేరుకున్నారు.

ఆదిత్యా వసవో రుద్రా స్సాధ్యాశ్చ సమరుద్గణాః ।
విష్ణునా సహితా స్సర్వే ఆగతా యజ్ఞభాగినః ॥ 24 ॥

ఆదిత్యులు, వసువులు, రుద్రులు, సాధ్యులు, మరుద్గణాలు, విష్ణువుతో సహా యజ్ఞంలో భాగం కలిగినవారు అందరూ అక్కడికి వచ్చారు.

తత్రాగతా స్సురవరా ఆజ్యపా స్సోమపా స్తథా ।
అశ్వినౌ మరుత శ్చైవ నానాదేవగణైస్సహ ॥ 25 ॥

దేవతలూ ఆజ్యాన్ని తాగేవారూ, సోమరసాన్ని తాగేవారూ, అశ్వినులు, మరుత్తులు, వివిధదేవతాగణాలతో కూడి అందరూ దక్షయజ్ఞానికి వచ్చారు.

ఏతే చాన్యే చ బహవో భూతగ్రామా స్తథైవ చ ।
జరాయుజాణ్డజాశ్చైవ తథైవ స్వేదజోద్భిదః ॥ 26 ॥

వీరే కాక, మావినుండి పుట్టే మనుష్యులు, పశువులు మొదలయినవీ (జరాయుజములు), గుడ్డునుండి పుట్టే పక్షులు మొదలయినవీ (అండజములు), చెమటనుండి పుట్టే నల్లులూ, చీమలూ మొద లయినవీ(స్వేదజములు), నేలనుండి పుట్టే చెట్లు, తీగెలు మొదలయినవీ (ఉద్భిదములు), ఇంకా వివిధమయిన ఇతరప్రాణిసముదాయాలు ఎన్నో ఆదక్షయజ్ఞానికి వచ్చాయి.

ఆహూతా మన్త్రితా స్సర్వే దేవాః స్త్రీభి స్సహర్షిభిః ।
విరాజన్తే విమానస్థా దీప్యమానా ఇవాగ్నయః ॥ 27 ॥

దక్షుడు యజ్ఞానికి ఆహ్వానించినవాళ్లు అందరూ యజ్ఞానికి వచ్చారు. దేవతలు తమఆడువారితోనూ, మహర్షులతోనూ, విమానాలలో ఉండి, అగ్నులలాగా ప్రకాశిస్తున్నారు.

(దధీచిస్తు మహాంస్తత్ర ఋషిస్తం యజ్ఞమణ్డపమ్ ।
రుద్రేణ రహితం దృష్ట్వా ఋషీన్ వాక్య మభాషత ॥

యజ్ఞమండపం దగ్గర పరమేశ్వరుడు లేకపోవడం దధీచిమహర్షి గమనించాడు. అక్కడిఋషులతో ఇలా అన్నారు.

ఋషయోఽస్మిన్ మహాయజ్ఞే శఙ్కర స్సర్వనాయకః ।
న దృశ్యతే వినా తేన యజ్ఞోఽయం నైవ శోభతే ॥

'ఋషులారా! ఈమహాయాగంలో అందరికీ ప్రభువైనశంకరుడు కనబడటం లేదు. అతడు లేకుండా యజ్ఞం శోభించదు'.)

అపూజ్యపూజనే చైవ పూజ్యానాం చాప్యపూజనే ।
నరః పాపమవాప్నోతి మహద్ వై నాత్ర సంశయః ॥ 28 ॥

పూజింప గూడనివారిని పూజించినా, పూజించవలసినవారిని పూజించక పోయినా, మానవుడు మహాపాపం పొందుతాడు. ఇందులో సందేహం లేదు. (అని దధీచి మహర్షి చెప్పాడు.) (ఈవాక్యం అన్వయించా లంటే పైని కుండలీకృత మయినశ్లోకం కూడ ఇక్కడ తప్పకుండా ఉండాలి.)

బ్రహ్మోవాచ :- మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవ ముక్త్వా తు విప్రర్షిః పున ర్దక్ష మువాచ హ ॥ 29 ॥

దధీచిమహర్షి ఋషులందరితో ఈవిధంగా చెప్పి, మళ్లీ ప్రత్యేకంగా దక్షుడితో ఇలా అంటున్నాడు.

దధీచి రువాచ :- దధీచిమహర్షి దక్షుడితో ఈవిధంగా అంటున్నాడు.

పూజ్యం చ పశుభర్తారం కస్మా న్నార్చయసే విభుమ్ ॥ 30 ॥

మనకు ప్రభువూ, పూజింపవలసినవాడూ అయినపశుపతిని నీవు ఎందుకు పూజించడం లేదు?

దక్ష ఉవాచ :- దధీచిమహర్షితో దక్షుడు ఇలా అంటున్నాడు.

సన్తి మే బహవో రుద్రా శ్శూలహస్తాః కపర్దినః ।
ఏకాదశస్థానగతా నాన్యం విద్మో మహేశ్వరమ్ ॥ 31 ॥

శూలాన్నీ, జడలనూ ధరించినరుద్రులు పదకొండు స్థానాలలోనూ చాల(పదకొండు)మంది ఇక్కడ ఉన్నారు. వీళ్లకంటె భిన్నంగా ఇంకొక మహేశ్వరు డెవరో మాకు తెలియదు.

దధీచి రువాచ :– దధీచిమహర్షి దక్షుడితో ఈవిధంగా అంటున్నాడు.

సర్వేషా మేకమన్త్రోఽయం మమేశో న నిమన్త్రితః ।
యథాఽహం శఙ్కరా దూర్ధ్వం నాన్యం పశ్యామి దైవతమ్ ॥
తథా దక్షస్య విపులో యజ్ఞోఽయం న భవిష్యతి ॥ 32 ॥

మీఅందరికీ నేను చేసే ముఖ్యమయిన నాసూచన ఇదే. పరమేశ్వరుడిని యజ్ఞానికి పిలవలేదు. శంకరుడిని మించిన వేరొకదేవుడిని నేను చూడలేదు. ఉన్నాడని నేను అనుకోవడం లేదు. అందుచేత దక్షుడు ప్రారంభించిన ఈమహాయజ్ఞం సక్రమంగా పూర్తికాదు.

దక్ష ఉవాచ :–దధీచిమహర్షితో దక్షుడు ఇలా అంటున్నాడు

(ఏత న్మఖేశాయ సువర్ణపాత్రై ర్హవి స్సమస్తం విధిమన్త్రపూతమ్ ।
విష్ణో ర్నయా మ్యప్రతిమస్య భాగం యజ్ఞస్య విప్రా న తు శఙ్కరాయ ॥)

ద్విజులారా! శ్రీమహావిష్ణువు యజ్ఞేశ్వరుడు. అతడితో సాటివచ్చేవాడు లేడు. అటువంటివిష్ణువుకు వేద మంత్రాలతో పవిత్రమయిన హవిస్సును బంగారుపాత్రలతో సమర్పిస్తున్నాను. శంకరుడికి ఈయజ్ఞంలో భాగంలేదు.)

జగత్ప్రభో స్తస్య దధీచ భాగం విష్ణోశ్చ నిత్యం విధినా ప్రయుక్తమ్ ।
తస్మా దహం దేవవరాయ దద్యాం యజ్ఞస్య భాగం న తు శఙ్కరాయ ॥ 33 ॥

దధీచా! ఈవిధంగా యజ్ఞంలో భాగాన్ని లోకాధిపతి అయిన శ్రీమహావిష్ణువుకు నిత్యమూ విధిగా సమర్పించాలి. అందుచేత యథాపూర్వంగా యజ్ఞభాగాన్ని దేవతలలో ఉత్తముడయిన శ్రీమహావిష్ణువుకే ఇస్తాను, గాని శంకరుడికి ఇవ్వను.

బ్రహ్మోవాచ :– మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా అంటున్నాడు.

గతా స్తు దేవతా జ్ఞాత్వా శైలరాజసుతా తదా ।
ఉవాచ వచనం సాధ్వీ దేవం పశుపతిం పతిమ్ ॥ 34 ॥

దేవతలు (దక్షుడియజ్ఞానికి) వెళ్ళారని పార్వతికి తెలిసింది. పతివ్రత అయిన పార్వతి అప్పుడు తనభర్త పరమేశ్వరుడితో ఇలా అన్నది.

ఉమోవాచ :– పరమేశ్వరుడితో పార్వతి ఈవిధంగా అంటున్నది.

భగవన్ కుత్ర యా న్త్యేతే దేవా శ్శక్రపురోగమాః ।
బ్రూహి తత్త్వేన తత్త్వజ్ఞ సంశయో మే మహానయమ్ ॥ 35 ॥

పరమాత్మా! ఇంద్రుడు మొదలయిన ఈదేవతలు అందరూ ఎక్కడికి వెళ్తున్నారు. నాకు ఇదొకపెద్ద సందేహంగా ఉంది. రహస్యం తెలిసినవాడా! యథార్థం చెప్పవలసింది.

మహేశ్వర ఉవాచ :-పార్వతితో పరమేశ్వరుడు ఈవిధంగా అంటున్నాడు.

దక్షో నామ మహాభాగః ప్రజానాం పతి రుత్తమః ।
హయమేధేన యజతే తత్ర యాన్తి దివౌకసః ॥ 36 ॥

దక్షుడు అనేవాడు మహాత్ముడు. ప్రజాపతి. ఉత్తముడు. అతడు అశ్వమేధయాగం చేస్తున్నాడు. స్వర్గలోకవాసు లందరూ ఆయజ్ఞానికే వెళ్తున్నారు.

దేవ్యువాచ :-పరమేశ్వరుడితో పార్వతి ఈవిధంగా అంటున్నది.

యజ్ఞ మేతం మహాభాగ కిమర్థం త్వం న గచ్ఛసి ।
కేన వా ప్రతిషేధేన గమనం తే న విద్యతే ॥ 37 ॥

మహాత్మా! ఈయజ్ఞానికి నీవు ఎందుకు వెళ్లడం లేదు? యజ్ఞానికి మీరు వెళ్లకుండా ఎవరు అడ్డగించారు?

మహేశ్వర ఉవాచ :-పార్వతితో పరమేశ్వరుడు ఈవిధంగా అంటున్నాడు.

సురై రేవ మహాభాగే సర్వమేతదనుష్ఠితమ్ ।
యజ్ఞేషు మమ సర్వేషు న భాగ ఉపకల్పితః ॥ 38 ॥

ఉత్తమురాలా! ఇదంతా దేవతలు చేశారు. వాళ్లు అన్నివిధాలయిన యజ్ఞాలలోనూ నాకు భాగం లేకుండా చేశారు.

పూర్వభాగోపపన్నేన మార్గేణ వరవర్ణిని ।
న మే సురాః ప్రయచ్ఛన్తి భాగం యజ్ఞస్య ధర్మతః ॥ 39 ॥

సుందరాంగీ! మొదటినుంచీ వస్తున్నపద్ధతిలోనే దేవతలు ఇపుడు కూడ యజ్ఞంలో నాకు భాగం ఇవ్వడంలేదు.

ఉమోవాచ:- పరమేశ్వరుడితో పార్వతి ఈవిధంగా అంటున్నది.

భగవన్ సర్వదేవేషు ప్రభావాభ్యధికో గుణైః ।
అజేయ శ్చాప్యధృష్యశ్చ తేజసా యశసా శ్రియా ॥ 40 ॥

పరమాత్మా! దేవతలందరిలోనూ విశిష్టమయిన లక్షణాలకారణంగానూ గుణాలచేత నీవే ఎక్కువప్రభావం గలిగినవాడివి. పరాక్రమంచేతనూ, కీర్తిచేతనూ, ఐశ్వర్యంచేతనూ, నిన్ను ఎవరూ జయించలేరు. అవమానించలేరు.

అనేన తు మహాభాగ ప్రతిషేధేన భాగతః ।
అతీవదుఃఖమాపన్నా వేపథుశ్చ మహానయమ్ ॥ 41 ॥

ఈవిధంగా నీకు యజ్ఞంలో భాగం లేకుండా చేయడంవలన నాకు చాల బాధ కలుగుతున్నది. వణుకుతున్నది.

కిం నామ దానం నియమం తపో వా కుర్యామహం యేన పతిర్మమాద్య ।
లభేత భాగం భగవా ననన్తో యజ్ఞస్య భాగం హ్యథవా తృతీయమ్ ॥ 42 ॥

అనంతుడూ, భగవంతుడూ అయిన నాభర్త యజ్ఞంలో కనీసం మూడవభాగం అయినా, పొందాలంటే, ఇపుడు నేను ఏమి దానం చేయాలి, ఏమి వ్రతం ఆచరించాలి? ఏవిధమయిన తపస్సు చేయాలి?

ఏవం బ్రువాణం భగవాన్ విచిన్త్య పత్నీం ప్రహృష్టః క్షుభితాము వాచ ।
న వేత్సి మాం దేవి కృశోదరాఙ్గి కిం నామ యుక్తం వచనం తవేదమ్ ॥ 43 ॥

ఈవిధంగా మాటలాడుతున్న పార్వతిని పరమేశ్వరుడు గమనించాడు. సంతోషించాడు. తననుగురించి బాధపడుతున్న భార్యతో ఇలా అన్నాడు. 'దేవీ! తన్వంగీ! నాగురించి నీకు తెలియడం లేదు. నీఅంతటిస్త్రీ ఇలా మాట్లాడటం తగునా?

అహం హి జానామి విశాలనేత్రే ధ్యానేన సర్వే చ విదన్తి సన్తః ।
తవాద్య కోపేన తు సర్వదేవా లోకత్రయం సర్వమథో వినష్టమ్ ॥ 44 ॥

పెద్దపెద్దకన్నులు గలిగినదానా! నాకు తెలుసు. సత్పురుషులు అందరూ ధ్యానంతో తెలుసుకుంటారు. ఇప్పటినీకోపంచేత దేవతలు అందరూ, అలాగే మూడు లోకాలు సమస్తం వెంటనే నశించిపోతాయి.

మా మధ్వరేశం నితరాం స్తువన్తి
రథన్తరం సామ గాయన్తి మహ్యమ్ ।
మాం బ్రాహ్మణాః క్రతుభి ర్వై యజన్తే
మ మాధ్వర్యవః కల్పయన్తే చ భాగమ్ ॥ 45 ॥

బ్రాహ్మణులు నన్ను యజ్ఞేశ్వరుడుగా స్తుతిస్తారు. నన్ను గురించి రథంతరసామాన్ని గానం చేస్తారు. నన్ను యజ్ఞాలతో అర్చిస్తారు. అధ్వర్యులు నాకు యజ్ఞంలో భాగం కూడ ఏర్పరుస్తారు.

దేవ్యువాచ :-పార్వతి పరమేశ్వరుడితో ఇలా అన్నది.

ప్రాకృతోఽపీహ భగవన్ మనస్వీ జనసంసది ।
స్తౌతి గర్వాయతే చాపి స్త్రీసాన్నిధ్యే విశేషతః ॥ 46 ॥

మహాత్మా! సామాన్యజనుడిలాగా పదుగురిలో, అందులోనూ ప్రత్యేకంగా ఆడవారిమధ్య నిన్ను నీవు పొగడుకుంటున్నావు. నీకు నీవే గొప్పవాడి ననుకుని గర్వపడుతున్నావు.

భగవానువాచ :–పార్వతితో పరమేశ్వరుడు ఇలా అంటున్నాడు.

నాత్మానం స్తౌమి దేవేశి యథా త్వమనుగచ్ఛసి ।
సంస్రక్ష్యామి వరారోహే భాగార్థం వరవర్ణిని ॥ 47 ॥

పరమేశ్వరీ! భార్యామణీ! సుందరీ! నువ్వు అనుకుంటున్నట్లుగా నన్ను నేను పొగడుకోవటం లేదు. యజ్ఞంలో నాభాగాన్ని నేను సృష్టించుకుంటున్నాను.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఇత్యుక్త్వా భగవాన్ పత్నీముమాం ప్రాణైరపి ప్రియామ్ ।
సోఽసృజద్ భగవాన్ వక్త్రాద్ భూతం క్రోధాగ్నిసమ్భవమ్ ॥ 48 ॥

(పంచ)ప్రాణాలకంటె ఎక్కువ ఇష్టమయిన ఉమాదేవితో ఇలా చెప్పి, పరమేశ్వరుడు కోపం అనేఅగ్నిలోనుండి వెలువడినట్లున్న ఒకానొకభూతాన్ని తనముఖంనుంచి సృష్టించాడు.

తమువాచ ధ్వంసమఖం దక్షస్యేతి మహేశ్వరః ।
నాశయాశు వ్రతం తస్య దక్షస్య మదనుజ్ఞయా ॥ 49 ॥

ఆభూతంతో మహేశ్వరుడు ఇలా అన్నాడు. 'దక్షుడియజ్ఞాన్ని ధ్వంసం చేయి. నిన్ను అనుమతిస్తున్నాను. వెంటనే దక్షుడి యజ్ఞవ్రతదీక్షను నాశనం చెయ్యి' అన్నాడు.

బ్రహ్మోవాచ :– మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తతో రుద్రప్రయుక్తేన సింహవేషేణ లీలయా ।
దేవ్యా మన్యుకృతం జ్ఞాత్వా హతో దక్షస్య స క్రతుః ॥ 50 ॥

పార్వతియొక్క కోపకారణాన్ని తెలిసికున్న పరమేశ్వరుడు ప్రయోగించిన సింహవేషంతో ఉన్న భూతంచేత అవలీలగా దక్షునియజ్ఞం నాశనం చెయ్యబడింది.

మన్యునా చ మహాభీమా భద్రకాలీ మహేశ్వరీ ।
ఆత్మనః కర్మసాక్షిత్వే తేన సార్థం సహానుగా ॥ 51 ॥

పరమేశ్వరి అయిన పార్వతి కోపంతో భద్రకాళి అయి తాను కర్మసాక్షి కాబట్టి ఆభూతంతో కలిసి, దక్షయజ్ఞస్థలానికి (సాక్షిగా) వెళ్లింది.

స ఏష భగవాన్ క్రోధః ప్రేతావాసకృతాలయః ।
వీరభద్రేతి విఖ్యాతో దేవ్యా మన్యుప్రమార్జకః ॥ 52 ॥

రుద్రుడు సృష్టించిన ఆమహాభూతం రుద్రుడిక్రోధస్వరూపం. శ్మశానం దానికి నివాసం. పరమేశ్వరి కోపాన్ని తొలగించినకారణంగా, వీరభద్రుడు అనేపేరు ప్రసిద్ధ మయింది.

సోఽ ఽ సృజద్ రోమకూపేభ్య ఆత్మ నైవ గణేశ్వరాన్ ।
రుద్రానుగాన్ గణాన్ రుద్రాన్ రుద్రవీర్యపరాక్రమాన్ ॥ 53 ॥

వీరభద్రుడు తనరోమకూపాలనుండి గణనాయకులను సృష్టించాడు. వారు రుద్రులు. రుద్రుడి వెంట నడిచేవారు. రుద్రుడితో సమానమయినశక్తి పరాక్రమం కలిగినవారు.

రుద్రస్యానుచరా స్సర్వే సర్వే రుద్రపరాక్రమాః ।
తే నిపేతు స్తత స్తూర్ణం శతశోఽథ సహస్రశః ॥ 54 ॥

వాళ్లు అందరూ రుద్రుడిని అనుసరించి ఉంటారు. రుద్రుడితో సమానమయిన పరాక్రమం గలిగినవారు. వందలు, వేలసంఖ్యలో అక్కడికి వచ్చి వాలారు.

తతః కిలకిలాశబ్ద ఆకాశం పూరయన్నివ ।
సమభూత్ సుమహాన్ విప్రా స్సర్వరుద్రగణైః కృతః ॥ 55 ॥

బ్రాహ్మణులారా! ఆసమయంలో రుద్రగణాలు అన్నీ చేసిన గొప్ప కలకలధ్వనులు ఆకాశం అంతటానిండాయి.

తేన శబ్దేన మహతా త్రస్తా స్సర్వే దివౌకసః ।
పర్వతాశ్చ వ్యశీర్యన్త చకమ్పే చ వసున్ధరా ॥ 56 ॥

ఆమహాధ్వనులతో దేవలోకంలో నివసించేవారు అందరూ భయపడ్డారు. పర్వతాలు పొడి పొడిగా అయ్యాయి. భూమి కంపించింది.

మరుతశ్చ వవుః క్రూరా శ్చుక్షుభే వరుణాలయః ।
అగ్నయో వై న దీప్యన్తే నచాదీప్యత భాస్కరః ॥ 57 ॥

సుడిగాలులు తీవ్రంగా వీచాయి. సముద్రం క్షోభించింది. అగ్నులు ఆరిపోయాయి. సూర్యుడు ప్రకాశించడం మానివేశాడు.

గ్రహా నైవ ప్రకాశన్తే నక్షత్రాణి న తారకాః ।
ఋషయో న ప్రభాసన్తే న దేవా న చ దానవాః ॥ 58 ॥

గ్రహాలు, నక్షత్రాలు, తారకలు కనిపించడం లేదు. మహర్షులు, దేవతలు, దానవులు తమతమతేజస్సులని కోల్పోయారు.

ఏవం హి తిమిరీభూతే నిర్దహన్తి విమానితాః ।
ప్రభఞ్జనా వవు ర్ఘోరాః పూయవిట్‌గన్ధిన స్తథా ॥ 59 ॥

ఈవిధంగా లోకమంతా చీకటిమయం అయింది. (పరమేశ్వరుడిని గౌరవింపపోవటంచేత) అవమానింపబడిన రుద్రగణాలు యజ్ఞవేదికలను తగులబెట్టున్నాయి. చీమూ, మలములదుర్వాసనలతో కూడిన పెనుగాలులు భయంకరంగా వీచసాగాయి.

ప్రణదన్తి తథా చాన్యే విమర్దన్తి తథా పరే ।
త్వరితం వై ప్రధావన్తి వాయువేగా మనోజవాః ॥ 60 ॥

కొందరు పెద్దగా అరుస్తున్నారు. కొందరు గట్టిగా మర్దిస్తున్నారు. కొందరు వాయువేగ మనోవేగాలతో పరుగులు తీస్తున్నారు.

చూర్ణ్యన్తే యజ్ఞపాత్రాణి యజ్ఞస్యాయతనాని చ ।
శీర్యమాణా న్యదృశ్యన్త తారా ఇవ నభస్తలాత్ ॥ 61 ॥

కొందరు యజ్ఞసామగ్రిని పిండి చేస్తున్నారు. కొందరు యజ్ఞశాలలను కూల్చివేస్తున్నారు. దానివల్ల యజ్ఞశాలలు ఆకాశంలో నక్షత్రాలలాగా స్పష్టంగా కనబడడం లేదు.

దివ్యాన్నపానభక్ష్యాణాం రాశయః పర్వతోపమాః ।
క్షీరనద్య స్తథా చాన్యా ఘృతపాయసకర్దమాః ॥ 62 ॥

ఆయజ్ఞప్రదేశంలో దివ్యమయిన అన్నాలు, పానీయాలు, భక్ష్యాలు, కొండలలాగా రాశులుపోసిఉన్నాయి. పాలు నదులలాగా ప్రవహిస్తున్నాయి. పేరిననేయి, పాయసాలు బురదలాగా ఉన్నాయి.

మధుమణ్డోదకా దివ్యాః ఖణ్డశర్కరవాలుకాః ।
షడ్రసాన్నివహన్త్యన్యా గుడకుల్యా మనోరమాః ॥ 63 ॥

దేవలోకంలో పుట్టిన తేనెలు, గండచక్కెరలదిబ్బలు, బెల్లంపాకం కాలువలు, ఆరురుచులతో రకరకాల ద్రవ్యాలు ఆప్రదేశం అంతటా ప్రవహిస్తున్నాయి.

ఉచ్చావచాని మాంసాని భక్ష్యాణి వివిధాని చ ।
యాని కాని చ దివ్యాని లేహ్యచోష్యాణి యాని చ ॥ 64 ॥

అక్కడ అనేక విధములుఅయిన మాంసాలు, రకరకాలపిండివంటలు, ఇంకా ఎన్నో పచ్చడులు పులుగులూ -పదార్థాలు, పీల్చేపదార్థాలు ఉన్నాయి.

భుఞ్జన్తి వివిధై ర్వక్త్రై ర్విలుమ్పన్తి క్షిపన్తి చ ।
రుద్రకోపా మహాకాయాః కాలాగ్నిసదృశోపమాః ॥ 65 ॥

పెద్ద పెద్ద శరీరాలతో, ప్రళయసమయంలోని అగ్నిలాగా ఉన్న రుద్రగణాలు తీవ్రమయిన కోపంతో అక్కడి పదార్థాలను పలునోళ్లతో తింటున్నారు. పాత్రలు పగలగొడుతున్నారు. పదార్థాన్ని పారబోస్తున్నారు.

క్షోభయన్తో౽థ శైలాభా భీషయన్తశ్చ సర్వతః ।
క్రీడన్తి వివిధాకారా శ్చిక్షిపు స్సురయోషితః ॥ 66 ॥

రుద్రగణాలు వివిధమయిన రూపాలతో కొండలలాగా ఉన్నారు. వారు ఆప్రదేశం అంతటినీ కలతపెట్టారు. అన్నిదిక్కులలో అందరినీ భయపెట్టారు. దేవకాంతలను పట్టుకుని దూరంగా విసరివేశారు.

ఏవం గణాశ్చ తైర్యుక్తో వీరభద్రః ప్రతాపవాన్ ।
రుద్రకోపప్రయుక్తశ్చ సర్వదేవై స్సురక్షితమ్ ॥
తం యజ్ఞమదహచ్ఛీఘ్రం భద్రకాల్యాస్సమీపతః ॥ 67 ॥

దేవతలు అందరూ కలిసి కాపాడుతున్న ఆదక్షుడి యజ్ఞాన్ని రుద్రగణాలు ఈవిధంగా నాశనం చేశాయి. రుద్రుడికోపంతో ప్రయోగింపబడిన వీరభద్రుడు భద్రకాళి ప్రక్కనే ఉండగా, పరాక్రమంతో తనగణాలతో కలిసి దక్షయజ్ఞాన్ని తగలబెట్టాడు.

చక్రురన్యే తథా నాదాన్ సర్వభూతభయఙ్కరాన్ ।
ఛిత్త్వా శిరోఽన్యే యజ్ఞస్య వ్యనదన్త భయఙ్కరమ్ ॥ 68 ॥

ఇతరులు కొంతమంది సృష్టి కంతటికీ భయం పుట్టేవిధంగా పెద్దగా కేకలు వేశారు. మరి కొందరు యజ్ఞపురుషుడి తల నరికి భయంకరంగా అరిచారు.

తతశ్శక్రాదయో దేవా దక్ష శ్చైవ ప్రజాపతిః ।
ఊచుః ప్రాఞ్జలయో భూత్వా కథ్యతాం కో భవానితి ॥ 69 ॥

అప్పుడు ఇంద్రుడు మొదలయిన దేవతలూ, దక్షప్రజాపతీ, వీరభద్రుడికి చేతులు జోడించి, వీరభద్రుడితో 'అయ్యా! నీవు ఎవరో చెప్పు' అని అడిగారు.

వీరభద్ర ఉవాచ :- దేవతలతోనూ దక్షుడితోనూ వీరభద్రుడు ఇలా అన్నాడు.

నాహం దేవో న దైత్యో వా న చ భోక్తుమిహాగతః ।
నైవ ద్రష్టుం చ దేవేన్ద్రా న చ కౌతూహలాన్వితః ॥ 70 ॥

నేను దేవుడిని కాదు. దైత్యుడినీ కాదు. యజ్ఞంలో భాగంకోసమూ ఇక్కడికి రాలేదు. ఇంద్రుడు మొదలయినవారిని చూడటానికీ రాలేదు. యజ్ఞం చూడాలనే కుతూహలంతోనూ ఇక్కడికి రాలేదు.

దక్షయజ్ఞవినాశార్థం సమ్ప్రాప్తోఽహం సురోత్తమాః ।
వీరభద్రేతి విఖ్యాతో రుద్రకోపాద్వినిస్సృతః ॥ 71 ॥

దేవవరులారా! దక్షుడియజ్ఞాన్ని నాశనం చేయడానికి వచ్చాను. వీరభద్రుడు అనేపేరుతో ప్రసిద్ధుడిని. రుద్రుడికోపంనుంచి వెలువడ్డాను.

భద్రకాలీ చ విజ్ఞేయా దేవ్యాః క్రోధాద్ వినిర్గతా ।
ప్రేషితా దేవదేవేన యజ్ఞాన్తికముపాగతా ॥ 72 ॥

ఈమె భద్రకాళి అని గ్రహించండి. ఈమె పార్వతిదేవి కోపంనుంచి వెలవడింది. పరమేశ్వరుడు పంపగా ఈయజ్ఞంవద్దకు వచ్చింది.

శరణం గచ్ఛ రాజేన్ద్ర దేవదేవముమాపతిమ్ ।
వరం క్రోధోఽపి దేవస్య న వైరం పరిచారకైః ॥ 73 ॥

దక్షప్రజాపతీ! దేవతలకు దేవుడయిన ఆపరమేశ్వరుడిని శరణు పొందు. ఆపరమేశ్వరుడికి కోపం తెప్పించినా బాధ లేదు, కాని పరమేశ్వరుడిసేవకులతో విరోధం ఎంతమాత్రం మంచిది కాదు.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

నిఖాతోత్పాటితై ర్యూపై రపవిద్ధై స్తతస్తతః ।
ఉత్పతద్భిః పతద్భిశ్చ గృధ్రై రామిషగృధ్నుభిః ॥ 74 ॥

గుంట తీసి లోతుగా పాతిపెట్టిన యజ్ఞస్తంభాలను ఊడబెరికారు. ముక్కలు ముక్కలుగా విరిచేశారు. అక్కడ (శవాల)మాంసంమీద ఆశతో గ్రద్దలు ఆప్రాంతంలో పైకీ, క్రిందికీ ఎగురుతున్నాయి.

పక్షవాతవినిర్ధూతై శ్శివాశతనినాదితైః ।
మత్తస్య యజ్ఞో నృపతే ర్బాధ్యమాన స్తదా గణైః ॥
ఆస్థాయ మృగరూపం వై ఖ మేవాభ్యపతత్తదా ॥ 75 ॥

రెక్కలగాలితో ఆప్రాంతంలోని దుమ్ము ఆకాశంలోకి ఎగురుతున్నది. నక్కలు వందలకొద్దీ అక్కడకు చేరి అరుస్తున్నాయి. మదించిన ఆదక్షుడియజ్ఞాన్ని రుద్రగణాలు ఎంతో బాధించాయి. రుద్రగణాలు బాధిస్తుండగా దక్షుడియజ్ఞం జింకరూపాన్ని ధరించి, ఆకాశంలోకి ఎగిరిపోయింది.

తం తు యజ్ఞం తథారూపం గచ్ఛన్త ముపలభ్య సః ।
ధనురాదాయ బాణం చ తదర్థమగమత్ ప్రభుః ॥ 76 ॥

ఆవిధంగా దక్షయజ్ఞం జింకరూపంతో ఎగిరిపోతూ ఉండటం గమనించి, దానిని పట్టుకోవడానికి వీరభద్రుడు ధనుస్సునూ, బాణాన్నీ చేత పుచ్చుకుని, (ఆకాశంలోకి) వెళ్లాడు.

తత స్తస్య గణేశస్య క్రోధాదమితతేజసః ।
లలాటాత్ ప్రసృతో ఘోర స్స్వేదబిన్దు ర్బభూవ హ ॥ 77 ॥

ఆసమయంలో ఆరుద్రగణనాయకుడయిన వీరభద్రుడినుదుటినుండి భయంకరమైన చెమటచుక్క జారి నేలమీద పడింది.

తస్మిన్ పతితమాత్రే చ స్వేదబిన్దౌ తదా భువి ।
ప్రాదుర్భూతో మహా నగ్ని ర్జ్వలత్కాలానలోపమః ॥ 78 ॥

ఆచెమటబిందువు నేలమీదపడినవెంటనే దానినుండి ప్రళయకాలంనాటి అగ్నివంటి భయంకరమైన అగ్ని పుట్టింది.

తత్రోదపద్యత తదా పురుషో ద్విజసత్తమాః ।
హ్రస్వోఽతిమాత్రో రక్తాక్షో హరిచ్ఛ్మశ్రు ర్విభీషణః ॥ 79 ॥

బ్రాహ్మణోత్తములారా! అక్కడ ఒకానొకపురుషుడు ఉద్భవించాడు. అతడు చాల పొట్టివాడు. కన్నులు ఎఱ్ఱగా గలిగినవాడు. మీసాలు గడ్డాలు ఆకుపచ్చగా ఉన్నాయి.

ఊర్ధ్వకేశోఽతిరోమాఙ్గ శ్శ్యేణకర్ణ స్త థైవ చ ।
కరాలకృష్ణవర్ణఽశ్చ రక్తవాసాఽస్త థైవ చ ॥ 80 ॥

జుట్టు పైకి లేచినిలబడిఉంది. ఒంటినిండా వెంట్రుకలున్నాయి. చెవులు ఎఱ్ఱగా ఉన్నాయి. శరీరం భయంకరమైన కారునలుపురంగులో ఉన్నది. ఎఱ్ఱనివస్త్రాలు ధరించాడు.

తం యజ్ఞం స మహాసత్త్వోఽదహత్ కక్షమివానలః ।
దేవాశ్చ ప్రద్రుతా స్సర్వే గతా భీతా దిశో దశ ॥ 81 ॥

మిక్కిలిశక్తిమంతుడైన అతడు ఎండిపోయినగడ్డిని నిప్పు దహించినట్లుగా దక్షుడియజ్ఞాన్ని అవలీలగా ధ్వంసం చేశాడు. దేవతలు భయంతో పదిదిక్కులవెంటనూ పరుగులుతీశారు.

తేన తస్మిన్ విచరతా విక్రమేణ తదా తు వై ।
పృథివీ వ్యచలత్ సర్వా సప్తద్వీపా సమన్తతః ॥ 82 ॥

దక్షయజ్ఞాన్ని నాశనం చేస్తూ అతడు పరాక్రమిస్తున్నసమయంలో ఏడు ద్వీపాలతో సహా భూమండలం అంతా కంపించింది.

మహాభూతే ప్రవృత్తే తు దేవలోకభయఙ్కరే ।
తదా చాహం మహాదేవమబ్రవం ప్రతిపూజయన్ ॥ 83 ॥

దేవలోకానికి కూడా భయంకరుడైన ఆమహాప్రాణి ఈవిధంగా ప్రవర్తిస్తుండగా, నేను (బ్రహ్మ) మహాదేవుడిని పూజించి ఇలా అన్నాను.

భవతేఽపి సురా స్సర్వే భాగం దాస్యన్తి వై ప్రభో ।
క్రియతాం ప్రతిసంహారస్సర్వదేవేశ్వర త్వయా ॥ 84 ॥

'మహాత్మా! దేవతలందరూ నీకు కూడ యజ్ఞంలో భాగం ఇస్తారు. దేవతలందరికీ దిక్కు అయినవాడా! ఈఉపద్రవాన్ని తొలగించు.

ఇమాశ్చ దేవతా స్సర్వా ఋషయశ్చ సహస్రశః ।
తవ క్రోధా న్మహాదేవ న శాన్తిముపలేభిరే ॥ 85 ॥

మహాదేవా! ఈదేవతలు అందరూ, వేలకొద్దీ మహర్షులూ, నీకోపంవల్ల శాంతిని పొందలేకపోతున్నారు.

యస్త్వైవ పురుషో జాత స్స్వేదజ స్తే సురర్షభ ।
జ్వరో నా మైష ధర్మజ్ఞ లోకేషు ప్రచరిష్యతి ॥ 86 ॥

దేవోత్తమా! ధర్మం తెలిసినవాడా! నీ(వీరభద్రుడిరూపంలోని మహాదేవుడి)చెమటబిందువునుండి పుట్టిన ఈమహాపురుషుడు జ్వరుడు అనేపేరుతో లోకాలలో సంచరిస్తుంటాడు.

ఏకీభూతస్య న హ్యస్య ధారణే తేజసః ప్రభో ।
సమర్థా సకలా పృథ్వీ బహుధా సృజ్యతా మయమ్ ॥ 87 ॥

ప్రభూ! తేజస్సు అంతా ఒకచోటికి చేరినట్లున్న ఈమహాపురుషుడిని ఈభూమి సమస్తం కూడ భరించలేదు. ఈతేజస్సును అనేకభాగాలుగా విభాగం చేయవలసింది'.

ఇత్యుక్త స్స మయా దేవో భాగేచాపి ప్రకల్పితే ।
భగవాన్ మాం తథేత్యాహ దేవదేవః పినాకధృక్ ॥ 88 ॥

నేను (బ్రహ్మ) ఈవిధంగా చెప్పటంచేతనూ, దేవతలు పరమేశ్వరుడికి యజ్ఞంలో భాగం ఏర్పాటు చేయడం చేతనూ, పినాకం అనేవిల్లు ధరించినవాడూ, దేవతలకు దేవుడూ అయినఆభగవానుడు నాతో 'అలాగే' అన్నాడు.

పరాం చ ప్రీతి మగమత్ స స్వయం చ పినాకధృక్ ।
దక్షోఽపి మనసా దేవం భవం శరణమన్వగాత్ ॥ 89 ॥

ఆపినాకధారి స్వయంగా చాల సంతోషించాడు. దక్షప్రజాపతి కూడ మనసుతోనే ఆపరమేశ్వరుడిని శరణు పొందాడు.

ప్రాణాపానౌ సన్నిరుధ్య చక్షుస్స్థానే ప్రయత్నతః ।
వివార్య సర్వతో దృష్టిం వృత్తదృష్టి రమిత్రజిత్ ॥
స్మితం కృత్వాఽబ్రవీద్ వాక్యం కిం కరవాణి తే ॥ 90 ॥

శత్రుంజయుడయిన పరమేశ్వరుడు కనుబొమ్మలనడుమ ప్రాణాన్నీ, అపానాన్నీ, కదలకుండానిలిపి, దిక్కులు చూడకుండా దృష్టిని దృఢంగా నిలిపి, ఏకాగ్రమయిన దృష్టితో చిరునవ్వు నవ్వి, 'నీకోసం ఏమిచేయమంటావు' అన్నాడు.

శ్రావితే చ మహాఖ్యానే దేవానాం పితృభి స్సహ ॥ 91 ॥

దేవతల యొక్క ఈవృత్తాంతాన్ని పితృదేవతలతో సహా అందరూ విన్నారు.

తమువాచాఞ్జలిం కృత్వా దక్షో దేవం ప్రజాపతిః ।
భీతశ్శఙ్కితవిత్రస్త స్సబాష్పవదనేక్షణః ॥ 92 ॥

అప్పుడు భయపడిఉన్న దక్షప్రజాపతి అంజలి ఘటించి, సందేహంతోనూ, భయంతోనూ, ముఖమూ కన్నులూ కన్నీటితో నిండగా, పరమేశ్వరుడితో ఇలా అన్నాడు.

దక్ష ఉవాచ :- పరమేశ్వరుడితో దక్షుడు ఈవిధంగా అంటున్నాడు.

యది ప్రసన్నో భగవన్ యది వాఽహం తవ ప్రియః ।
యది చాహమనుగ్రాహ్యో యది దేయో వరో మమ ॥ 93 ॥

పరమాత్మా! మహాదేవా! నీవు నన్ను దయతలిస్తే, నేనంటే నీకు ఇష్ట మయితే, నేను అనుగ్రహింపదగినవాడిని అయితే, నాకు ఒకవరం ఇవ్వు.

యద్భక్ష్యం భక్షితం పీతం గ్రసితం యచ్చ నాశితమ్ ।
చూర్ణీకృతాపవిద్ధం చ యజ్ఞసమ్భారమీదృశమ్ ॥ 94 ॥

తినదగిన పదార్థాలు అన్నిటినీ రుద్రగణాలు తినేశారు. తాగేశారు. నాశనం చేశారు. పిండి చేశారు. కొల్లగొట్టారు. నాయజ్ఞప్రయత్నం అంతా ఈవిధంగా ధ్వంసం అయిపోయింది.

దీర్ఘకాలేన మహతా ప్రయత్నేన చ సాధితమ్ ।
న చ మిథ్యా భవే న్మహ్యం త్వత్ప్రసాదా న్మహేశ్వర ॥ 95 ॥

చాల కాలంగా ఎంతో ప్రయత్నంతో ఈయజ్ఞపదార్థా లన్నీ సమకూర్చుకున్నాను. ఈప్రయత్నం వ్యర్థం కాకూడదు. నీదయవల్ల నేను తలపెట్టినయజ్ఞం సక్రమంగా జరగాలి' (అని దక్షుడు వరమడిగాడు.)

బ్రహ్మోవాచ:- మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తథాఽస్త్విత్యాహ భగవాన్ భగనేత్రహరో హరః ॥ 96 ॥

భగుడు అనేఆదిత్యుడికన్ను అపహరించిన పరమేశ్వరభగవానుడు 'తథాస్తు' (అలాగే అవుతుంది) అన్నాడు.

ధర్మాధ్యక్షం మహాదేవం త్ర్యమ్బకం చ ప్రజాపతిః ।
జానుభ్యా మవనీం గత్వా దక్షో లబ్ధ్వా భవాద్ వరమ్ ॥
నామ్నాం చాష్టసహస్రేణ స్తుతవాన్ వృషభధ్వజమ్ ॥ 97 ॥

పరమేశ్వరుడివలన వరం పొందిన దక్షప్రజాపతి ధర్మానికి అధిపతీ, ముక్కంటి, అయిన మహాదేవుడికి మోకాళ్లను నేల కానించి మ్రొక్కి, అష్టోత్తరసహస్రనామాలతో ఆపరమేశ్వరుడిని స్తుతించాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే దక్షయజ్ఞవిధ్వంసనం నామ సప్తత్రింశోఽధ్యాయః ॥ 37 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషి సంవాదంలో దక్షయజ్ఞవిధ్వంసనం అనే ముప్పైఏడవ అధ్యాయం సంపూర్ణం.



అష్టత్రింశోఽ ధ్యాయః - ముప్పైఎనిమిదవ అధ్యాయం

దక్షస్తవనిరూపణమ్ - దక్షస్తవనిరూపణం

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవం దృష్ట్వా తదా దక్ష శ్శమ్భో ర్వీర్యం ద్విజోత్తమాః ।
ప్రాఞ్జలిః ప్రణతో భూత్వా సంస్తోతుముపచక్రమే ॥ 1 ॥

బ్రాహ్మణోత్తములారా! ఈవిధంగా పరమేశ్వరుడిశక్తిని చూచిన దక్షప్రజాపతి చేతులు జోడించి, సాష్టాంగపడి, మహాదేవుడిని స్తుతించడం ప్రారంభించాడు.

దక్ష ఉవాచ :-దక్షుడు పరమేశ్వరుడితో ఈవిధంగా అన్నాడు. (పరమేశ్వరుని ఇలా స్తుతించాడు)

నమస్తే దేవదేవేశ నమస్తే బలసూదన ।
దేవేన్ద్ర త్వం బలశ్రేష్ఠ దేవదానవపూజిత ॥ 2 ॥

దేవతలకే దేవుడవయినపరమేశ్వరా! నీకు నమస్కారం. బలుడు అనే రాక్షసుడిని సంహరించినవాడా! నీకు నమస్కారం. దేవేంద్రరూపా! నీవు బలవంతులలో శివుడవు. దేవతలచేతనూ, దానవులచేతనూ పూజింపబడే వాడా! నీకు నమస్కారం.

సహస్రాక్ష విరూపాక్ష త్ర్యక్ష యక్షాధిపప్రియ ।
సర్వతఃపాణిపాద స్త్వం సర్వతోఽ క్షిశిరోముఖః ॥ 3 ॥

వేయికన్నులు గలవాడా! బేసికన్నులవాడా! ముక్కంటీ! కుబేరుడికి ఇష్టమైనవాడా! నీకాళ్ళు చేతులు అంతటా నిండి ఉన్నాయి. అలాగే నీకన్నులు, తలలు, ముఖాలు సర్వత్ర వ్యాపించి ఉన్నాయి. (సమస్తమూ పరమేశ్వర స్వరూపం కాబట్టి సృష్టిలో అందరికాళ్లూ, చేతులూ, కన్నులూ, తలలూ, ముఖాలూ అన్ని అవయవాలూ పరమేశ్వరుడివే).

సర్వత శ్రుతిమాన్ లోకే సర్వమావృత్య తిష్ఠసి ।
శఙ్కుకర్ణో మహాకర్ణః కుమ్భకర్ణోఽ ర్ణవాలయః ॥ 4 ॥

అంతటా నిండిన చెవులు గలిగినవాడివి. లోకంలో అన్నింటినీ ఆవరించి ఉంటావు. నీవు శంకువువంటి చెవులు గలవాడివి.(శంకుకర్ణుడు). విశాలమైన చెవులు కలవాడివి. (మహాకర్ణుడు). కుండవంటి లోతైనచెవులు కలవాడివి (కుంభకర్ణుడు). అర్ణవాలయుడివి (సముద్రంలో ఉండేవాడు - విష్ణుస్వరూపుడు.).

గజేన్ద్రకర్ణో గోకర్ణ శ్శతకర్ణో నమోఽ స్తు తే ।
శతోదర శ్శతావర్త శ్శతజిహ్వ స్సనాతనః ॥ 5 ॥

గజేంద్రకర్ణుడివి (పెద్దయేనుగుచెవులవాడివి. (గజేంద్రకర్ణుడు). ఆవుచెవులవంటిచెవులు కలవాడివి. (గోకర్ణుడు). నూరు అంటే లెక్క లేనన్నిచెవులు గలవాడివి. (శతకర్ణుడు). అసంఖ్యాకమైన పొట్టలు కలిగినవాడివి.

(శతోదరుడు). (తలపై అసంఖ్యాకమైన సుదులు కలిగినవాడివి. (శతావర్తుడు). అసంఖ్యాకమైన నాలుకలు గలిగిన వాడివి (శతజిహ్వుడు). అనాదిగా ఉండటంచేత మిక్కిలి పురాతనుడివి. (సనాతనుడు). అటువంటినీకు నమస్కారం.

గాయన్తి త్వం గాయత్రిణో అర్చయన్తిహ్యాకర్మిణః ।
దేవదానవగోప్తా చ బ్రహ్మా చ త్వం శతక్రతుః ॥ 6 ॥

గాయత్రిని ఉపాసనచేసేవారు నిన్ను (గాయత్రిగా) స్తుతిస్తారు. కర్మసన్న్యాసులు కూడ నిన్ను పూజిస్తారు. దేవతలనూ, దానవులనూ నీవే రక్షిస్తున్నావు. నీవే బ్రహ్మవు. నూరుయజ్ఞాలు చేసినఇంద్రుడివి నీవే.

మూర్తిమాంస్త్వం మహామూర్తి స్సముద్రస్సరసాం నిధిః ।
త్వయి సర్వా దేవతా హి గావో గోష్ఠ ఇవాసతే ॥ 7 ॥

నీవు శరీరంతో ఆకారం కలిగినవాడివి. నీస్వరూపం చాల విస్తరించిఉన్నది. ప్రవాహాలకు నిధిఅయిన సముద్రుడివి. గోష్ఠంలో ఆవులలాగా సమస్తమైన దేవతలూ నీలో నివసిస్తారు.

త్వత్త శ్శరీరే పశ్యామి సోమమగ్నిం జలేశ్వరమ్ ।
ఆదిత్యమథ విష్ణుం చ బ్రహ్మాణం సబృహస్పతిమ్ ॥ 8 ॥

నీశరీరంలో చంద్రుడినీ, అగ్నిదేవుడినీ, జలాధిపతి అయిన వరుణుడినీ, ఆదిత్యుడినీ, విష్ణువునూ, బ్రహ్మనూ, బృహస్పతితో కూడ అందరినీ చూస్తున్నాను.

క్రియాకరణకార్యే చ కర్తా కారణ మేవ చ ।
అసచ్చ స దసచ్చైవ తథైవ ప్రభావాప్యయౌ ॥ 9 ॥

వ్యాపారమూ, సాధనమూ, కార్యమూ, చేసేదీ, చేయించేదీ, ఉనికి, లేకపోవడమూ, మహిమ, పుట్టుక నాశనం అన్నీ నువ్వే.

నమో భవాయ శర్వాయ రుద్రాయ వరదాయ చ ।
పశూనాం పతయే చైవ నమోఽ స్త్వన్ధకఘాతినే ॥ 10 ॥

భవుడు (ఇతడినుండి సృష్టి ఏర్పడింది కాబట్టి భవుడు), శర్వుడు (సంహరించేవాడు), రుద్రుడు (సంసార దుఃఖాన్ని పోగొట్టేవాడు), వరదుడు (కావలసినవాటిని ఇచ్చేవాడు), పశుపతి (సంసారం అనేపాశాలతో బంధింప బడేజీవులచేత తనఆజ్ఞలను ఆచరింపజేసే వాడు.), అంధకాసురుడిని చంపినవాడూ అయిన శివుడికి నమస్కారం.

త్రిజటాయ త్రిశీర్షాయ త్రిశూలవరధారిణే ।
త్ర్యమ్బకాయ త్రినేత్రాయ త్రిపురఘ్నాయ వై నమః ॥ 11 ॥

మూడు జడలు గలవాడు, మూడుశిరస్సులు కలవాడు, శ్రేష్ఠమైన మూడంచులశూలాన్ని ధరించినవాడు, మూడు కన్నులు కలవాడు, త్రిపురాసురుడిని సంహరించినవాడు అయిన శివుడికి నమస్కారం.

నమశ్చణ్డాయ ముణ్డాయ విశ్వచణ్డధరాయ చ ।
దణ్డినే శఙ్కుకర్ణాయ చణ్డీచణ్డాయ వై నమః ॥ 12 ॥

తీక్షణమయినవాడూ, తలపై జుట్టు తొలగించుకున్నవాడు, సంపూర్ణమైన ఉగ్రత్వాన్ని ధరించినవాడు, దండాయుధం కలిగినవాడు, శంకువులవంటి చెవులు గలిగినవాడు, ఉగ్రస్వరూపిణులయిన దేవతలకు భయం కలిగించేవాడు అయిన శివుడికి నమస్కారం.

నమోఽర్ధదండికేశాయ శుష్కాయ వికృతాయ చ ।
విలోహితాయ ధూమ్రాయ నీలగ్రీవాయ వై నమః ॥ 13 ॥

తలపై సగం మేర జుట్టు గలిగినవాడు, తలనిండ జుట్టు గలిగినవాడు, పొడిబారినవాడు, వికారమయిన రూపం గలిగినవాడు, ఎఱ్ఱనివాడు, నలుపు కలిసినఎఱుపురంగులో ఉన్నవాడు, నల్లని కంఠం కలిగినవాడు, అయినశివుడికి నమస్కారం.

నమోఽస్త్వప్రతిరూపాయ విరూపాయ శివాయ చ ।
సూర్యాయ సూర్యపతయే సూర్యధ్వజపతాకినే ॥ 14 ॥

సాటిలేని ఆకారం గలిగినవాడు, వికృతమైనరూపం కలిగినవాడు, మంగళకరుడూ సూర్యుడు (ప్రకాశించేవాడు), సూర్యపతీ సూర్యుడు గుర్తు గలిగినజెండా కలవాడు అయిన శివుడికి నమస్కారం.

నమః ప్రమథనాథాయ వృషస్కన్ధాయ వై నమః ।
నమో హిరణ్యవర్ణాయ హిరణ్యకవచాయ చ ॥ 15 ॥

ప్రమథగణాలకు అధిపతి అయినవాడు, ఆబోతువంటి (దృఢ మయిన)భుజాలు కలిగినవాడు, బంగారుచాయ గలిగినవాడు, బంగారుకవచం ధరించినవాడు అయిన శివుడికి నమస్కారం.

హిరణ్యకృతచూడాయ హిరణ్యపతయే నమః ।
శత్రుఘాతాయ చణ్డాయ పర్ణసఙ్ఘశయాయ చ ॥ 16 ॥

బంగారంతో చేసినకిరీటం కలిగినవాడు, బంగారానికి అధిపతి అయినవాడు, శత్రువులను సంహరించేవాడు, ఉగ్రుడూ, ఆకులసముదాయంలో శయనించేవాడు అయినశివుడికి నమస్కారం.

నమః స్తుతాయ స్తుతయే స్తూయమానాయ వై నమః ।
సర్వాయ సర్వభక్షాయ సర్వభూతాన్తరాత్మనే ॥ 17 ॥

(పూర్వం) స్తుతింపబడేవాడు, స్తుతిస్వరూపుడు, (ప్రస్తుతం) స్తుతింపబడుతున్నవాడు, సమస్తమూ తానే అయినవాడు, సమస్తాన్ని లయం చేసేవాడు, సమస్తమైన చరాచరమైన పదార్థాలకు అన్నింటిలోనూ అంతర్యామిగా ఉండేవాడు అయిన శివుడికి నమస్కారం.

నమో హోమాయ మన్త్రాయ శుక్లధ్వజపతాకినే ।
నమోఽ నమ్యాయ నమ్యాయ నమః కిల కిలాయ చ ॥ 18 ॥

యజ్ఞస్వరూపుడు, మంత్రస్వరూపుడు, తెల్లని జెండాకఱ్ఱ, జెండా(వస్త్రం) కలిగినవాడు, నమస్కరింపదగిన వాడు, నమస్కరింపలేనివాడు సందడిచేసే(శంఖడమరుకాదుల)ధ్వనులు కలిగినవాడు అయిన శివుడికి నమస్కారం.

నమస్త్వాం శయమానాయ శయితాయోత్థితాయ చ ।
స్థితాయ ధావమానాయ భూతాయ కుటిలాయ చ ॥ 19 ॥

పడుకుంటున్నవాడు, పడుకున్నవాడు, పడుకోని లేచినవాడు, (ఒకచోట) నిలుచున్నవాడు, పరుగెత్తేవాడు, ఉన్నవాడూ అయినవాడు అయినశివుడికి నమస్కారం.

నమో నర్తనశీలాయ ముఖవాదిత్రకారిణే ।
బాధాపహాయ లుబ్ధాయ గీతవాదిత్రకారిణే ॥ 20 ॥

నృత్యంచేసేవాడు, నోటితో వాద్యాన్ని పలికించేవాడు, అందరిబాధలు పోగొట్టేవాడు, అత్యాశ గలిగినవాడు, గీతాలనీ వాద్యాలనీ చేసేవాడు అయినశివుడికి నమస్కారం.

నమో జ్యేష్ఠాయ శ్రేష్ఠాయ బలప్రమథనాయ చ ।
కల్పనాయ చ కల్ప్యాయ క్షమాయోపక్షమాయ చ ॥
ఉగ్రాయ చ నమో నిత్యం నమశ్చ దశబాహవే ॥ 21 ॥

అందరికన్న అన్నింటా గొప్పవాడు, అందరికంటె ఉత్తము డయినవాడు, ఇతరుల సైన్యాలను, ఇతరులశక్తినీ నశింపజేసేవాడు, ధ్యానంలో తెలియదగినవాడు,ఊహింపదగినవాడు, సహనస్వరూపుడు (సమర్థుడు),సహనానికి దగ్గరివాడు, (చాలవరకు సమర్థుడు) భయంకరుడు, పదిచేతులు కలిగినవాడు అయినశివుడికి నిత్యమూ నమస్కారం.

నమః కపాలహస్తాయ సితభస్మప్రియాయ చ ।
విభీషణాయ భీమాయ భీమవ్రతధరాయ చ ॥ 22 ॥

పుఱ్ఱెను చేత (భిక్షాపాత్రగా) పట్టినవాడు, తెల్లనిబూడిద అంటే ఇష్టం అయినవాడు, శత్రువులకు భయం కలిగించేవాడు, ఉగ్రమయిన రూపం గలిగినవాడు, ఉగ్రమయిన నియమాలు పాటించేవాడు అయిన శివుడికి నమస్కారం.

నానావికృతవక్త్రాయ ఖడ్గజిహ్వోగ్రదంష్ట్రిణే ।
పక్షమాసలవాద్యాయ తుమ్బీవీణాప్రియాయ చ ॥ 23 ॥

వికృతంగా ఉన్నరకరకాలముఖాలు కలిగినవాడు, కత్తివంటినాలుక, తీక్ష్ణమైన కోరలు కలిగినవాడు, పక్షం (పదిహేనురోజుల శుక్ల, కృష్ణపక్షాలు), లవం, మొదలైన కాలాలరూపం అయినవాడు, సొరకాయబుఱ్ఱతో చేసినవీణ అంటే ఇష్టపడేవాడు అయిన శివుడికి నమస్కారం.

అఘోరఘోరరూపాయ ఘోరాద్ ఘోరతరాయ చ ।
నమశ్శివాయ శాన్తాయ నమశ్శాన్తతరాయ చ ॥ 24 ॥

శాంతమూ, భయంకరమూ అయినరూపాలు గలిగినవాడు, భయంకర మైనవాటికంటె ఇంకా భయంకర మయినవాడు, శుభస్వరూపుడు, కామం మొదలైనవికారాలు లేనివాడు, శాంతులలో శ్రేష్ఠుడు అయినశివుడికి నమస్కారం.

నమో బుద్ధాయ శుద్ధాయ సంవిభాగప్రియాయ చ ।
ప్రపఞ్చాయ తథోగ్రాయ నమ స్స్వజ్ఞ్యపరాయ చ ॥ 25 ॥

తత్త్వం తెలిసినవాడు, కళంకం లేనివాడు(కేవలుడు), పంచి ఇవ్వడం అంటే ఇష్టమైనవాడు, ప్రపంచ స్వరూపుడు, తీక్ష్ణమైనవాడు, ఉత్తమమైన జ్ఞానమే స్వరూపం అయినవాడు అయిన శివుడికి నమస్కారం.

నమ శ్చణ్డైకఘణ్టాయ ఘణ్టానాదాయ ఘణ్టినే ।
సహస్రశతఘణ్టాయ ఘణ్టామాలాప్రియాయ చ ॥ 26 ॥

భయంకరమై, ప్రధానమైన ఘంట రూపంగా కలవాడు, ఆఘంట ధ్వని రూపమైనవాడు, ఘంటను ధరించినవాడు, వేయినూర్ల (లెక్క లేనన్ని) ఘంటలు కలిగినవాడు, ఘంటలహారాలు అంటే ఇష్టపడేవాడు అయిన శివుడికి నమస్కారం.

ప్రాణదణ్డాయ నిత్యాయ నమస్తే లోహితాయ చ ।
హూంహూంకారాయ రుద్రాయ హూంహూంకారప్రియాయ చ ॥ 27 ॥

ప్రాణాలను శిక్షించేవాడు(లయకరుడు), శాశ్వతుడు, ఎఱ్ఱనిమేనిచాయ గలిగినవాడు, హూం హూం అనే (శంఖ)ధ్వని రూప మయినవాడు, రుద్రుడు, హూం హూం అనేధ్వని అంటే ఇష్ట మైనవాడు–అయినశివుడికి నమస్కారం.

నమోఽపారవతే నిత్యం గిరివృక్షప్రియాయ చ ।
మార్గమాంసశృగాలాయ తారకాయ తరాయ చ ॥
నమో యజ్ఞాధిపతయే కృతాయ ప్రకృతాయ చ ॥ 28 ॥

హద్దులులేనివాడు, ఎప్పుడూ కొండలనూ, చెట్లనూ ఇష్టపడేవాడు, దారులవెంట మాంసం నోటకరుచుకుని తిరిగే నక్కరూప మైనవాడు, అందరినీ సంసారబాధలనుండి బయటపడవేసేవాడు, తాను స్వయంగా అన్నింటినీ దాటినవాడు, యజ్ఞాలకు అధిపతి అయినవాడు, చేసేవాడు, సమర్థంగా చేసేవాడు అయిన శివుడికి నమస్కారం.

యజ్ఞవాహాయ దాన్తాయ తథ్యాయ వితథాయ చ ।
నమస్తటాయ తట్యాయ తటినీపతయే నమః ॥ 29 ॥

యజ్ఞాన్ని వాహనంగా చేసుకున్నవాడూ (యజ్ఞాలను అధిరోహించినవాడు), ఇంద్రియాలను జయించినవాడు, సత్యస్వరూపుడు, అసత్యస్వరూపుడు, నది మొదలైన ప్రవాహాల తీరం స్వరూపమైనవాడు, నదీతీరాలలో నెలకొన్నవాడు, నదులకు భర్త అయిన సముద్రం స్వరూపం అయినవాడు, అయిన శివుడికి నమస్కారం.

అన్నదాయాన్నపతయే నమస్త్వన్నభుజాయ చ ।
నమస్సహస్రశీర్షాయ సహస్రచరణాయ చ ॥ 30 ॥

అందరికీ ఆహారాన్ని ఇచ్చేవాడు, అన్నాలకు అధిపతి, అన్నం తినేవాడు, వేయి (లెక్క లేనన్ని)తలలు గలిగినవాడు, వేయి(లెక్క లేనన్ని) పాదాలు కలిగినవాడు అయిన శివుడికి నమస్కారం.

సహస్రోద్యతశూలాయ సహస్రనయనాయ చ ।
నమో బాలార్కవర్ణాయ బాలరూపధరాయ చ ॥ 31 ॥

వేయి (లెక్క లేనన్ని) శూలాలు ఎత్తిపట్టుకున్నవాడు (శూలాలతో చంపడానికి సిద్ధంగా ఉన్నవాడు), వేయి (లెక్క లేనన్ని) కన్నులు కలిగినవాడు, ఉదయించే సూర్యుడివంటిమేనిచాయ (ఎరుపు) కలిగినవాడు, బాలుడి ఆకారాన్ని ధరించినవాడు అయిన శివుడికి నమస్కారం.

నమో బాలార్కరూపాయ బాలక్రీడనకాయ చ ।
నమశ్శుద్ధాయ బుద్ధాయ క్షోభణాయ క్షయాయ చ ॥ 32 ॥

ఉదయిస్తున్న సూర్యుడిరూపం కలవాడు (ఉదయించేసూర్యుడు శివుడే), పిల్లలు ఆడుకునే వస్తువులరూపం అయినవాడు, త్రిగుణాలకు అతీతుడు, జ్ఞానరూపుడు, లోకాలను హింసించేవాడు, లోకాలను నశింపజేసేవాడు అయిన శివుడికి నమస్కారం.

తరఙ్గాఙ్కితకేశాయ ముక్తకేశాయ వై నమః ।
నమ షట్కర్మతుష్టాయ త్రికర్మనిరతాయ చ ॥ 33 ॥

అలలవంటిజుట్టు గలవాడు, జుట్టు విరబోసుకున్నవాడు, ఆరుకర్మలచేత (అధ్యయనం, అధ్యాపనం, యజనం, యాజనం, దానం, ప్రతిగ్రహం అనేబ్రాహ్మణకర్మలు ఆరు) సంతోషించేవాడు, మూడు (మనోవాక్కాయ) కర్మలయందు మిక్కిలిశ్రద్ధ కలిగినవాడు అయిన శివుడికి నమస్కారం.

వర్ణాశ్రమాణాం విధివత్ పృథగ్ధర్మప్రవర్తినే ।
నమశ్శ్రేష్ఠాయ జ్యేష్ఠాయ నమః కలకలాయ చ ॥ 34 ॥

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు అనేనాలుగువర్ణాలవారికి, బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసాలు అనే నాలగుఆశ్రమాలవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేకమైన ధర్మాలను ప్రవర్తింపజేసేవాడు, అందరికంటె ఉత్తముడూ, అందరికంటె ముందుగా ఉన్నవాడు, ఆనందరూపమైన కలకలధ్వనిస్వరూపుడు అయిన శివుడికి నమస్కారం.

శ్వేతపిఙ్గలనేత్రాయ కృష్ణరక్తేక్షణాయ చ ।
ధర్మకామార్థమోక్షాయ క్రథాయ క్రథనాయ చ ॥ 35 ॥

తెల్లగానూ (సూర్యచంద్రనయనాలు రెండు), గోరోజనం రంగులోనూ ఉన్న (అగ్నినేత్రమూ) కన్నులు కలిగినవాడు (శాంతుడు), నల్లని, ఎఱ్ఱనిచూపులు కలిగినవాడు(ఉగ్రుడు), ధర్మం, అర్థం, కామం, మోక్షం అనేనాలుగు పురుషార్థాలు స్వరూపం అయినవాడు, హింస రూపం అయినవాడు, హింసించేవాడు అయిన శివుడికి నమస్కారం.

సాఙ్ఖ్యాయ సాఙ్ఖ్యముఖ్యాయ యోగాధిపతయే నమః ।
నమో రథ్యాధిరథ్యాయ చతుష్పథపథాయ చ ॥ 36 ॥

జ్ఞానస్వరూపుడు, జ్ఞానులలో ప్రధానుడు, యోగవిద్యకు అధిపతి, మార్గస్వరూపుడు, అన్నింటిలోనూ ఉత్తమ మార్గం అయినవాడు, నాలుగుదారులు కలిసేచోటుకి మార్గం అయినవాడు అయిన శివుడికి నమస్కారం.

కృష్ణాజినోత్తరీయాయ వ్యాలయజ్ఞోపవీతినే ।
ఈశాన రుద్రసఙ్ఘాత హరికేశ నమోఽస్తు తే ॥ 37 ॥

నల్లజింకచర్మం ఉత్తరీయంగా ధరించినవాడు, పామును ఉపవీతంగా ధరించినవాడు, ఈశానుడూ, ఏకాదశరుద్రులస్వరూపం అయినవాడు, పచ్చనిజుట్టు గలిగినవాడు అయిన పరమశివా! నీకు నమస్కారం.

త్ర్యమ్బకా యామ్బికానాథ వ్యక్తావ్యక్త నమోఽస్తు తే ।
కాల కామద కామఘ్న దుష్టోద్వృత్తనివారణ ॥ 38 ॥

(పరమేశ్వరుడు) మూడు కన్నులు కలిగినవాడు, పార్వతీపతి, తెలియవచ్చేవాడు, తెలియరానివాడు, కాలస్వరూపుడు, కోరికలను తీర్చేవాడు, కోరికలను నిర్మూలించేవాడు (మన్మథుడిని బూడిద చేసినవాడు), దుర్మార్గుల క్రూరమైన ప్రవర్తనను నశింపజేసేవాడు అయినటువంటి శివుడికి నమస్కారం.

సర్వగర్హితసర్వఘ్న సద్యోజాత నమోఽస్తు తే ।
ఉన్మాదన శతావర్తగఙ్గాతోయార్ద్రమూర్ధజ ॥ 39 ॥

సమస్తమందు విరక్తిగలవాడు అన్నింటినీ లయం చేసేవాడూ సద్యోజాతుడు (స్మరించినవెంటనే స్ఫురించే వాడు), అయిన శివా! నీకు నమస్కారం. ఉన్మాదమును కలిగించేవాడు నూరుసుడిగుండాలతో కూడిన గఙ్గాజలంతో తడిసిన జడలుగలవాడా! నీకు నమస్కారం.

చన్ద్రార్ధసంయుగావర్త మేఘావర్త నమోఽస్తు తే ।
నానార్థదానభర్తా చ అర్థదశ్చ త్వమేవ హి ॥
అన్నస్రష్టా చ భోక్తా చ యజ్ఞభుక్ చ తథాఽనలః ॥ 40 ॥

చంద్రకళతో కూడినసిగముడి కలిగినవాడు, మబ్బులవంటివెంట్రుకలసుడి కలిగినవాడు! అయిన శివా! నీకు నమస్కారం. అనేకవిధమైనలాభాలను ప్రసాదిస్తూ సృష్టిని పోషించేవాడివీ, సంపదలను ఇచ్చేవాడివీ, నీవే కదా! ఆహారాన్ని సృష్టించేవాడు, తినేవాడు, యజ్ఞఫలాన్ని పొందేవాడు, అగ్ని నీవే.

జరాయుజాణ్డజా శ్చైవ స్వేదజోద్భిజ్జ ఏవ చ ।
త్వమేవ దేవదేవేశ భూతగ్రామ శ్చతుర్విధః ॥
చరాచరస్య స్రష్టా త్వం ప్రతిహర్తా త్వమేవ చ ॥ 41 ॥

దేవతాచక్రవర్తీ! మావినుండి పుట్టే మానవులు పశువులు మొదలైనవారు, గ్రుడ్డునుండి పుట్టే పక్షులు మొదలైనవి, చెమటనుండి పుట్టే క్రిములు మొదలైనవి, నేలను చీల్చుకుని పైకి వచ్చే (మొలకెత్తే) చెట్లు మొదలైనవి, అనేనాలుగువిధాలైన సృష్టి నీవే. జంగమమూ, స్థావరమూ అయిన ఈసమస్తాన్నీ సృష్టించేవాడివీ నీవే, దాన్ని లయంచేసేవాడివీ నీవే.

త్వమేవ బ్రహ్మ విశ్వేశ అప్సు బ్రహ్మ వదన్తి తే ।
సర్వస్య పరమా యోని స్స్వధా త్వం జ్యోతిషాం నిధిః ॥ 42 ॥

పరమేశ్వరా! నీవే బ్రహ్మదేవుడివి. జలాలలో నిన్ను బ్రహ్మగా చెప్తారు. అన్నింటిపుట్టుకకు మూలమైన స్థానం నీవు. నీవు స్వధవు. స్వధ అంటే (పితృదేవతలకు ఇచ్చేఆహుతి) నీవు నక్షత్రాలకు రాజు అయిన చంద్రుడివి.

ఋక్సామాని తథౌఙ్కార మాహు స్త్వాం బ్రహ్మవాదినః ॥ 43 ॥

బ్రహ్మజ్ఞానులు నిన్ను ఋగ్వేదమంత్రాలుగానూ, సామవేదమంత్రాలుగానూ పేర్కొంటారు. అదే విధంగా నీవే ఓంకారం (ప్రణవస్వరూపుడవు) అని చెప్తారు.

హాయి హాయి హరే హాయి హువాహా వేతి వాఽసకృత్ ।
గాయన్తి త్వాం సురశ్రేష్ఠా స్సామగా బ్రహ్మవాదినః ॥ 44 ॥

దేవతలు, సామవేదం తెలిసినవారు, బ్రహ్మజ్ఞానులు, నిన్ను 'హాయి హాయి హరే హాయి హువా హావ' అని అనేకపర్యాయాలు (నిరంతరం) గానం చేస్తుంటారు.

యజుర్మయ ఋఙ్మయఽస్త్వం సామాథర్వయుతస్తథా ।
సేవ్యసే బ్రహ్మవిద్భి స్త్వం కల్పోపనిషదాం గణైః ॥ 45 ॥

పరమేశ్వరా! నీవు యజుర్వేదమయుడివి. ఋగ్వేదమయుడివి. సామవేదమయుడివి, అథర్వవేదమయుడివి. కల్పాలు, ఉపనిషత్తుల సముదాయాలతో బ్రహ్మవేత్తలు నిన్ను సేవిస్తుంటారు.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా శ్శూద్రా వర్ణాశ్రమాశ్చ యే ।
త్వమేఽ వాశ్రమసఙ్ఘాశ్చ విద్యుత్స్వనితమేవ చ ॥ 46 ॥

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, నాలుగువర్ణాలవారిలోనినాలుగుఆశ్రమాలు గూడ నీవే. ఆశ్రమాలసముదాయాలు నీవే. మెరుపులు, పిడుగులు నీవే.

సంవత్సరస్త్వం ఋతవో మాసో మాసార్ధమేవ చ ।
కలా కాష్ఠా నిమేషాశ్చ నక్షత్రాణి యుగాని చ ॥ 47 ॥

సంవత్సరం, (ఆరు)ఋతువులు, నెల, పక్షం, కళ (30 కాష్ఠలకాలం) కాష్ఠ (18 రెప్పపాట్లసమయం), నిమేషం (రెప్పపాటుకాలం), నక్షత్రాలు, యుగాలు నీవే.

వృషాణాం కకుదం త్వం హి గిరీణాం శిఖరాణి చ ।
సింహో మృగాణాం చ పతి స్తక్షకోఽ నన్తభోగినామ్ ॥ 48 ॥

ఎద్దుల మూపు నీవు. పర్వతాలశిఖరాలు కూడ నీవే. జంతువులలో మృగరాజు అయినసింహానివి. విస్తారమైన పడగ కలిగిన సర్పనాయకులలో తక్షకుడివి నీవు.

క్షీరోదో హ్యుదధీనాం చ మన్త్రాణాం యజు రేవ చ ।
వజ్రం ప్రహరణానాం చ వ్రతానాం సత్య మేవ చ ॥ 49 ॥

సముద్రాలలో పాలసముద్రానివి. మంత్రాలలో యజుర్వేదమంత్రానివి. ఆయుధాలలో వజ్రాయుధానివి. వ్రతాలలో సత్యానివి.

త్వమేవేచ్ఛా చ ద్వేషశ్చ రాగో మోహశ్శమః క్షమా ।
వ్యవసాయో ధృతి ర్లోభః కామక్రోధౌ జయాజయౌ ॥ 50 ॥

నీవే కోరికవు. ద్వేషానివి. రాగానివి. మోహానివి. ఇంద్రియనిగ్రహానివి. సహనానివి. ప్రయత్నానివి. ధైర్యానివి. లోభానివి. కామానివి. క్రోధానివి. గెలుపు నీవు. ఓటమి నీవు.

త్వం గదీ త్వం శరీ చాపి ఖట్వాఙ్గీ త్వం ధ్వజీ రథీ ।
ఛేత్తా భేత్తా ప్రహర్తా చ నేతా మన్తాఽ సి నో మతః ॥ 51 ॥

గద ఆయుధం కలవాడివి. బాణం, ధనుస్సు, మంచంకోడువంటిఆయుధం, ధ్వజం, రథం కలిగినవాడివి. నరికేవాడివి. చీల్చేవాడివి. దెబ్బలు కొట్టేవాడివి. నడిపించేవాడివి. మననం చేసేవాడివి. అని మాఅభిప్రాయం.

దశలక్షణసంయుక్తో ధర్మోఽ ర్థః కామ ఏవ చ ॥ 52 ॥

పదిలక్షణాలు గలిగిన (ధృతిః, క్షమా, దమో, ఽ స్తేయం, శౌచ, మింద్రియనిగ్రహః, ధీ, ర్విద్యా, సత్య, మక్రోధో, దశకం ధర్మలక్షణమ్. – మనుస్మృతి) ధర్మం, అర్థం, కామం నీవే.

ఇన్ద్ర స్సముద్ర స్సరితః పల్వలాని సరాంసి చ ।
లతావల్ల్య స్తృణౌషధ్యః పశవో మృగపక్షిణః ॥ 53 ॥

నీవు ఇంద్రుడివి. సముద్రుడివి. నదులు, నీటికుంటలు, సరస్సులు, తీగెలు, తృణధాన్యాలు, ఓషధులు, పశువులు, జంతువులు, పక్షులు నీవే.

ద్రవ్యకర్మగుణారమ్భః కాలపుష్పఫలప్రదః ।
ఆదిశ్చాన్తశ్చ మధ్యశ్చ గాయత్ర్యోఙ్కార ఏవ చ ॥ 54 ॥

పృథివి మొదలైన పదార్థాలకు, వివిధమైన కార్యాలకు, వివిధమైన వస్తువులధర్మాలకు, ప్రారంభం నీవు. ఆయాఋతువులకు సంబంధించిన పూలను,పండ్లను ఇచ్చేవాడివి. సృష్టి అంతటికీ మొదట, నడుమ, చివర అన్నీ నీవే. నీవు గాయత్రివి. ఓంకారానివి.

హరితో లోహితః కృష్ణో నీలః పీత స్తథాఽరుణః ।
కద్రుశ్చ కపిలో బభ్రుః కపోతో మేచక స్తథా ॥ 55 ॥

ఆకుపచ్చరంగు, ఎఱుపు, కారునలుపు, నీలం, పసుపుపచ్చ, ఎరుపు, నలుపు కలిసినఎరుపు, సాధారణ మయిననలుపు, నలుపు, పసుపు కలిసినరంగు, గోరోచనంరంగు, కొద్దిగా గోరోచనానికి సన్నిహితమైనరంగు, పావురాయిరంగు, నలుపు, రంగులు నీవు.

సువర్ణరేతా విఖ్యాత స్సువర్ణశ్చాప్యథో మతః ।
సువర్ణనామా చ తథా సువర్ణప్రియ ఏవ చ ॥ 56 ॥

బంగారువీర్యం కలిగినవాడివిగా ప్రసిద్ధుడి వైనావు. బంగారానివి కూడా నీవే. నీపేరే సువర్ణం. బంగారం అంటే నీకు చాల ఇష్టం.

త్వమిన్ద్రశ్చ యమశ్చైవ వరుణో ధనదోఽనలః ।
ఉత్ఫుల్ల శ్చిత్రభానుశ్చ స్వర్భాను భానురేవ చ ॥ 57 ॥

ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు, అగ్ని, అనేకవిధములైన కాన్తులు జిహ్వారూపమయిన కిరణాలు గలవాడు, సూర్యుడు, రాహువు, కాంతి కూడ నీవే.

హోత్రం హోతా హోమ్యం చ హుతం చైవ తథా ప్రభుః ।
త్రిసౌపర్ణ స్తథా బ్రహ్మన్ యజుషాం శతరుద్రియమ్ ॥ 58 ॥

యజ్ఞమూ, యజ్ఞం చేసేవాడూ, హోమం చేసే నేయి మొదలైన ద్రవ్యమూ, అగ్నిలో హుతమైన పదార్థమూ, యజ్ఞస్వామీ నీవు. పరమాత్మా! (ఋగ్వేదంలో దశమమండలంలోని) త్రిసుపర్ణం అనేమంత్ర భాగమూ, యజుర్వేదంలోని శతరుద్రియం అనే మంత్రభాగమూ నీవు.

పవిత్రం చ పవిత్రాణాం మఙ్గలానాం చ మఙ్గలమ్ ।
గిరిః పాపాన్తకో వృక్షో జీవః ప్రలయ ఏవ చ ॥
ప్రాణశ్చ త్వం రజశ్చ త్వం తమ స్సత్త్వయుత స్తథా ॥ 59 ॥

పావనమైనవాటిలో మిక్కిలి పావనమైనవాడివి. శుభప్రదమైనవాటిలో మిక్కిలి శుభప్రదుడివి. (కైలాస)పర్వతానివి. పాపాలను నిర్మూలించేవాడివి. కల్పవృక్షానివి. జీవుడివి. ప్రళయానివి. ప్రాణం నీవు. నీవు సత్త్వమూ, రజస్సూ, తమస్సూ అనే గుణాలతో గూడినవాడివి.

ప్రాణోఽపానస్సమానశ్చ ఉదానో వ్యాన ఏవ చ ।
ఉన్మేషశ్చ నిమేషశ్చ కాలః కల్పస్తథైవ చ ॥ 60 ॥

ప్రాణం, అపానం, సమానం, ఉదానం, వ్యానం అనేఐదువాయువులూ నీవే. కనురెప్ప తెరవడమూ, కనురెప్పవాల్చటమూ రెండూ నీవే. కాలమూ, కల్పమూ నీవు.

లోహితాఙ్గశ్చ దంష్ట్రీ చ మహావక్త్రో మహోదరః ।
శుచిరోమా హరిచ్ఛ్మశ్రు రూర్ధ్వకేశ శ్చలాచలః ॥ 61 ॥

ఎఱ్ఱని అవయవాలు కలవాడివి. కోరలు గలిగినవాడివి. నీనోరు చాల విస్తార మైనది. పొట్ట చాల పెద్దది. వెంట్రుకలు పవిత్ర మైనవి. మీసాలూ, గడ్డమూ పచ్చగా ఉంటాయి. నీజుట్టు పైకి నిక్కబొడుచుకున్నట్లుగా ఉంటుంది. కదలికూడా కదలనివాడవి.

గీతవాదిత్రనృత్యాఙ్గో గీతవాదనకప్రియః ।
మత్స్యో జాలో జలోఽజయ్యో జలవ్యాలః కుటీచరః ॥ 62 ॥

గీతవాదిత్రనృత్యాలే అంగంగా గలవాడు గానమూ, వాద్యమూ నీకు ఇష్ట మయినవి. చేప, చేపలు పట్టేవల, నీళ్లు, జయించటం సాధ్యం కానినీటిపాములు, గుడిసెలలో సంచరించేవాడు అన్నీ నీవే.

వికాలశ్చ సుకాలశ్చ దుష్కాలః కాలనాశనః ।
మృత్యుశ్చైవాక్షయోఽన్తశ్చ క్షమా మాయాకరోత్కరః ॥ 63 ॥

(దేవకార్యాలు, పితృకార్యాలు మొదలయినవి చేయడానికి వీలు కాని) అసురసంధ్యాసమయమూ, శుభాలు చేకూర్చేకాలమూ, అశుభాలు కలిగించే కాలమూ, కాలాన్ని నశింపజేసేవాడు (ప్రళయం) మరణమూ, క్షయంలేని వాడివీ, వినాశమూ, సహనమూ, గారడివాళ్లసముదాయమూ నీవే.

సంవర్తో వర్తక శ్చైవ సంవర్తకబలాహకౌ ।
ఘణ్టాకీ ఘణ్టకీ ఘణ్టీ చూడాలో లవణోదధిః ॥ 64 ॥

లయం చేసేవాడు, పోషించేవాడు (స్థితికర్త), సంవర్తకం, బలాహకం అనే మేఘాలరూప మైనవాడు, ఘంటాకి, ఘంటకి, ఘంట ఆయుధాలుగా కలిగినవాడు, జుట్టు (సిగ) కలిగినవాడు, ఉప్పుసముద్రమూ నీవే.

బ్రహ్మా కాలాగ్నివక్త్రశ్చ దణ్డీముణ్డస్త్రిదణ్డధృక్ ।
చతుర్యుగ శ్చతుర్వేద శ్చతుర్హోత్ర శ్చతుష్పథః ॥ 65 ॥

బ్రహ్మ, ప్రళయకాలంనాటి అగ్ని ముఖంగా కలిగినవాడు (ఆముఖంతో సమస్తసృష్టినీ భస్మం చేసేవాడు), దండం ధరించినవాడు, తలపై జుట్టు తొలగించుకున్నవాడు, మూడుదండాలను ధరించినవాడు, కృతాదులైన నాలుగుయుగాలరూపమైనవాడు, ఋగాదులైన నాలుగువేదాలరూపం అయినవాడు, నాలుగుదిక్కులలోనూ ఉన్న అగ్ని రూపమైనవాడు, నాలుగుదారులు కలిసినచోటు అయినవాడు నీవు.

చాతురాశ్రమ్యనేతా చ చాతుర్వర్ణ్యకరశ్చ హి ।
క్షరాక్షరః ప్రియో ధూర్తో గణై ర్గణ్యో గణాధిపః ॥ 66 ॥

బ్రహ్మచర్యం మొదలైన నాలుగు ఆశ్రమాలను చక్కగా నడిపించేవాడు, బ్రాహ్మణులు మొదలైన నాలుగు వర్ణాలవారిని ఏర్పరచినవాడు, నశించేవాడు, నాశం లేనివాడు, అందరికీ ఇష్టమైనవాడు, మోసకాడు, ప్రమథ గణాలచేత స్తుతింపబడేవాడు, గణాలకి అధిపతి నీవే.

రక్తమాల్యామ్బరధరో గిరీశో గిరిజాప్రియః ।
శిల్పీశ శ్శిల్పిన శ్శ్రేష్ఠ స్సర్వశిల్పప్రవర్తకః ॥ 67 ॥

ఎఱ్ఱనిపూలమాలలను, ఎఱ్ఱనివస్త్రాలను ధరించేవాడు, కైలాసపర్వతనాథుడు, పార్వతికి ఇష్టమైనవాడు, శిల్పులకు ప్రభువు, శిల్పులలో శ్రేష్ఠుడు, సమస్తమైన శిల్పాలను ఏర్పరచినవాడు నీవే.

భగనేత్రాన్తకశ్చణ్డః పూష్ణోదన్తవినాశనః ।
స్వాహా స్వధా వషట్కారో నమస్కార నమోఽస్తు తే ॥ 68 ॥

భగుడు అనేఆదిత్యుడికన్ను తొలగించినవాడు, తీక్ష్ణమైనవాడు, పూష అనేఆదిత్యుడికి పళ్లు రాలగొట్టినవాడు, స్వాహాదేవత, స్వధాదేవత, వషట్కారం, నమస్కారస్వరూపుడు అయిన పరమేశ్వరా! నీకునమస్కారం.

గూఢవ్రతశ్చ గూఢశ్చ గూఢవ్రతనిషేవితః ।
తరణస్తారణ శ్చైవ సర్వానుస్యూతచారణః ॥ 69 ॥

రహస్యమైన వ్రతములు గలిగినవాడు, రహస్యంగా ఉండేవాడు, రహస్యమైన వ్రతాలతో సేవింపబడే వాడు, తరించటం అనేక్రియాస్వరూపం అయినవాడు, (సంసారంనుండి) తరింపజేసేవాడు, అందరూ ఏక మయి అనుసరించే నడవడిగలిగినవాడవు నీవు.

ధాతా విధాతా సంధాతా నిధాతా ధరణీధరః ।
తపో బ్రహ్మ చ సత్యం చ బ్రహ్మచర్యం తథార్జవమ్ ॥ 70 ॥

చరాచరభూతకోటిని పోషించేవాడు, సృష్టించేవాడు, (కర్మఫలానుగుణంగా ఆయావారిని) ఒకచోటికి చేర్చే వాడు, అందరికీ ఆశ్రయమైనవాడు, పర్వతం, తపస్సు, తత్త్వం, సత్యం, బ్రహ్మచర్యం, ఋజుత్వం నీవే.

భూతాత్మా భూతకృద్ భూతో భూతభవ్యభవోద్భవః ।
భూర్భువ స్స్వరితశ్చైవ వృతోహ్యగ్నిర్మహేశ్వరః ॥ 71 ॥

చరాచరపదార్థస్వరూపుడు, చరాచరాలను సృష్టించినవాడు, భూత భవిష్యవర్తమానపదార్థాలకి కారణం అయినవాడు, భూమినీ, అంతరిక్షాన్నీ, స్వర్గాన్నీ అంతటా ఆవరించిఉన్నవాడు, అగ్ని, మహేశ్వరుడు నీవే.

రేక్షణో దోక్షణాకాన్తో దాన్తోఽ దాన్తవినాశనః ।
బ్రహ్మావర్త స్సురావర్తః కామావర్త నమోఽ స్తు తే ॥ 72 ॥

ముక్కంటి, సతీదేవి ప్రియుడూ, బాహ్యమైన ఇంద్రియాలను అణచినవాడు, ఇంద్రియనిగ్రహం లేనివారిని నశింపజేసేవాడు, బ్రహ్మావర్తం (సరస్వతి, దృషద్వతి అనేదేవనదులకు నడుమ దేవతలు నిర్మించినదేశం), సురావర్తం, కామావర్తం అనేపుణ్యక్షేత్రాలు నీవు. అటువంటి పరమేశ్వరా! నీకు నమస్కారం.

కామబిమ్బవినిర్హన్తా కర్ణికారస్రజప్రియః ।
గోనేతా గోప్రచారశ్చ గోవృషేశ్వరవాహనః ॥
త్రైలోక్యగోప్తా గోవిన్దో గోప్తా గోగర్గ ఏవ చ ॥ 73 ॥

మన్మథుడిఆకారాన్ని నాశనం చేసినవాడు, కొండగోగుపూలమాలలు ఇష్టపడేవాడు, వాహనమైన వృషభాన్ని (ధర్మాన్ని) నడిపించేవాడు, వృషభంపై సంచరించేవాడు, శ్రేష్ఠమైన ఆబోతు వాహనంగా గలిగినవాడు, మూడులోకాలను కాపాడేవాడు, గోవులకు అధిపతి, అందరినీ రక్షించేవాడు, ఆబోతు రూపమైనవాడు నీవు.

అఖణ్డచన్ద్రాభిముఖ స్సుముఖో దుర్ముఖో ముఖః ।
చతుర్ముఖో బహుముఖో రణేష్వభిముఖ స్సదా ॥ 74 ॥

నిండుజాబిల్లివంటి సుందరమైన మోము గలిగినవాడు, అందమైన ముఖం గలవాడు, వికారముఖం గలవాడు, అనేకమైన ముఖాలు గలిగినవాడు, అసలు ముఖం లేనివాడు (నిరాకారుడు), నాలుగుముఖాలు కలిగినవాడు(బ్రహ్మ), ఎల్లప్పుడు యుద్ధానికి సిద్ధంగా ఉండేవాడు నీవే.

హిరణ్యగర్భశ్శకునిర్ధనదోఽ న్నపతి ర్విరాట్ ।
అధర్మహా మహాదక్షో దణ్డధారీ రణప్రియః ॥ 75 ॥

అండంనుండి జన్మించినబ్రహ్మ, పక్షి, కుబేరుడు, అన్నానికి అధిపతి, విరాట్పురుషుడు, అధర్మాన్ని నిర్మూలించే వాడు, మిక్కిలి సమర్థుడు, దండాన్ని (దుర్మార్గులను శిక్షించేలక్షణం) ధరించినవాడు, యుద్ధాన్ని ఇష్టపడేవాడునీవు.

తిష్ఠన్ స్థిరశ్చ స్థాణుశ్చ నిష్కమ్పశ్చ సునిశ్చలః ।
దుర్వారణో దుర్విషహో దుర్దర్పో దురతిక్రమః ॥ 76 ॥

నిలిచిఉండేవాడు, ఎల్లప్పుడు నిలిచి ఉండేవాడు. కదలకుండా ఉండేవాడు, చలించనివాడు, కదలిక ఏమాత్రమూ లేనివాడు, అడ్డగింపరానివాడు, సహించటం సాధ్యం కానివాడు, మిక్కిలి (సహించరాని) అహంకారం కలిగినవాడు, దాటడానికి వీలు లేనివాడు నీవు.

దుర్ధరో దుర్వశో నిత్యో దుర్దమో విజయో జయః ।
శశశ్శశాఙ్కనయనశ్శీతోష్ణః క్షుత్ తృషా జరా ॥ 77 ॥

భరింపరానివాడు, లొంగనివాడు, అణపరానివాడు, గెలిచేవాడు, జయం స్వరూపం అయినవాడు, కుందేలు, చంద్రుడు కన్నుగా కలిగినవాడు, చల్లదనమూ వేడీ గలవాడు, ఆకలి, దాహం, ముసలితనం నీవు.

ఆధయో వ్యాధయ శ్చైవ వ్యాధిహా వ్యాధిపశ్చ యః ।
సహ్యో యజ్ఞమృగవ్యాధో వ్యాధీనా మాకరోఽ కరః ॥ 78 ॥

మానసికమైన రోగాలు, శారీరకమైన రోగాలు, రోగాలను పోగొట్టేవాడు, వ్యాధులను కాపాడేవాడు, రోగాలను ఉపశమింప జేసేవాడు, జింకరూపంలో ఉన్న దక్షయజ్ఞాన్ని వేటాడినవాడు, రోగాలకు స్థానం అయినవాడు, అకర్త (ఏమీ చేయనివాడు) నీవు.

శిఖణ్డీ పుణ్డరీకశ్చ పుణ్డరీకావలోకనః ।
దణ్డధృక్ చక్రదణ్డశ్చ రౌద్రభాగవినాశనః ॥ 79 ॥

నెమలి, పద్మం, పద్మనేత్రుడు, (పరశువు మొదలైనరకరకాల) ఆయుధాలను ధరించినవాడు, చక్రం ఆయుధంగా కలిగినవాడు. రుద్రుడికి సంబంధించిన అంశతో జగత్తును నశింపజేసేవాడు – నీవు.

విషపోఽ మృతపశ్చైవ సురాపః క్షీరసోమపః ।
మధుపశ్చాపపశ్చైవ సర్వపశ్చ బలాబలః ॥ 80 ॥

కాలకూటవిషం తాగినవాడు, అమృతం తాగినవాడు, కల్లు తాగినవాడు, పాలు, సోమరసమూ తాగేవాడు, తేనె తాగేవాడు, నీళ్లు తాగేవాడు, సమస్తమూ తాగేవాడు, బలవంతుడు, బలహీనుడు నీవు.

వృషాఙ్గవాహ్యో వృషభ స్తథా వృషభలోచనః ।
వృషభశ్చైవ విఖ్యాతో లోకానాం లోకసంస్కృతః ॥ 81 ॥

ఎద్దుమూపుపై ఎక్కి విహరించేవాడు, ఆబోతు, ఆబోతువంటికన్నులు గలవాడు, వృషభుడు అనేపేరుతో ప్రసిద్ధుడు, లోకా లన్నింటిలోనూ అందరిలోనూ విద్వాంసుడు నీవు.

చన్ద్రాదిత్యౌ చక్షుషీ తే హృదయం చ పితామహః ।
అగ్నిష్టోమ స్తథా దేహో ధర్మకర్మప్రసాధితః ॥ 82 ॥

నీకు చంద్రుడు, సూర్యుడు కళ్లు. నీహృదయం బ్రహ్మ. ధర్మబద్ధ మయినకర్మలతో అలంకరింపబడిననీశరీరం అగ్నిష్టోమం.

న బ్రహ్మా న చ గోవిన్దః పురాణఋషయో న చ ।
మాహాత్మ్యం వేదితుం శక్తా యాథాతథ్యేన తే శివ ॥ 83 ॥

పరమేశ్వరా! బ్రహ్మ గాని, విష్ణువు గాని, పురాతనులైనమహర్షులు గాని, ఎవ్వరూ నీమాహాత్మ్యాన్ని యథాతథంగా తెలుసుకోవడానికి సమర్థులు కాదు.

శివ యా మూర్తయ సూక్ష్మా స్తా మహ్యం యాన్తు దర్శనమ్ ।
తాభి ర్మాం సతతం రక్ష పితా పుత్రమివౌరసమ్ ॥ 84 ॥

మహేశ్వరా! సూక్ష్మమైన నీరూపాలను నాకు చూపు. ఆమూర్తులతో తండ్రి (ధర్మపత్నియందు తనకు పుట్టిన) కొడుకును రక్షించినట్లుగా నీవు నన్ను నిరంతరం కాపాడు.

రక్ష మాం రక్షణీయోఽహం తవానఘ నమోఽస్తు తే ।
భక్తానుకమ్పీ భగవాన్ భక్త శ్చాహం సదా త్వయి ॥ 85 ॥

పుణ్యాత్మా! నీకు నమస్కారం. నేను నీచేత రక్షింపదగినవాడిని. నన్ను రక్షించు. పరమాత్మా! భగవంతుడు భక్తుడిపై అనుగ్రహం కలిగిఉంటాడు. నేను నిరంతరం నీభక్తుడిని.

య స్సహస్రాణ్యనేకాని పుంసామావృత్య దుర్దశామ్ ।
తిష్ఠత్యేకస్సముద్రాన్తే స మే గోప్తాస్తు నిత్యశః ॥ 86 ॥

వేలసంఖ్యలో అసంఖ్యాకంగా ఉన్నజీవులకష్టాలను చుట్టుకుని (జీవులకష్టాలు తొలగించడానికి), సముద్రానికి చివరిభాగంలో (లోకాలకు అవతలిభాగంలో) ఒక్కడే అయిఉన్నపరమాత్మ నన్ను ఎల్లప్పుడూ కాపాడుగాక.

జితనిద్రా జితశ్వాసా స్సత్త్వస్థా స్సమదర్శినః ।
జ్యోతిః పశ్యన్తి యుఞ్జానా స్తస్మై యోగాత్మనే నమః ॥ 87 ॥

నిద్రను జయించినవారు, శ్వాసను జయించినవారు (ప్రాణాయామపరాయణులు), స్వరూపస్థితిలో ఉన్నవారు, సమస్తాన్నీ సమమైన దృష్టితో చూచేవారూ (అద్వయస్థితిలో), యే యోగంతో (జీవాత్మను పరమాత్మతో ఏకంచేసి) పరంజ్యోతిగా దర్శించుతారో ఆ యోగస్వరూపమైన పరమాత్మకు నమస్కరిస్తున్నాను.

సమ్భక్ష్య సర్వభూతాని యుగాన్తే సముపస్థితే ।
య శ్శేతే జలమధ్యస్థ స్తం ప్రపద్యేఽమ్బుశాయినమ్ ॥ 88 ॥

యుగం ముగిసేసమయం వచ్చినపుడు సమస్తమైన భూతకోటిని మిగలకుండా మింగి, సముద్రంనడుమ నీళ్లలో శయనించిఉండే ఆపరమాత్మను శరణు వేడుతున్నాను.

ప్రవిశ్య వదనం రాహో ర్య స్సోమం పిబతే నిశి ।
గ్రసత్యర్కం చ స్వర్భాను ర్భూత్వా సోమాగ్ని రేవ చ ॥ 89 ॥

సోమాగ్ని? రాహువుముఖంలో ప్రవేశించి రాత్రిసమయంలో చంద్రుడిలోని సోమరసాన్ని తాగుతాడో. రాహువుగా ఏర్పడి పగలు సూర్యుడిని మింగుతాడో.

అఙ్గుష్ఠమాత్రాః పురుషా దేహస్థా స్సర్వదేహినామ్ ।
రక్షన్తు తే చ మాం నిత్యం నిత్యం చాప్యాయయన్తు మామ్ ॥ 90 ॥

జీవులశరీరాలలో బొట్టనవేలిపరిమాణంలో ఉండే శివమూర్తులు మమ్మల్ని నిత్యమూ రక్షించెదరు గాక! ఇంకా నిత్యమూ పోషించి నాకు ఆనందం కలిగింతురు గాక!

యే నాప్యుత్పాదితా దేవాః పఞ్చత్వం చ గతా శ్చ యే ।
తేషాం స్వాహా స్వధా చైవ అహ స్త్వాఞ్చ స్తువన్తి చ ॥ 91 ॥

దేవతలను గూడ ఎవరు సృష్టించారో, అందరూ ఎవరివలన మరణించారో, ఆరుద్రస్వరూపులకు స్వాహా, స్వధా, అహస్సులు, స్తోత్రం చేస్తున్నాయి.

యత్రారోహన్తి దేహస్థాః ప్రాణినోఽవతరన్తి చ ।
హర్షయన్తి న కృష్యన్తి నమస్తేభ్యస్తు నిత్యశః ॥ 92 ॥

ఎవరివలన శరీరధారులు గర్భంలో ప్రవేశిస్తున్నారో, ఎవరివలన గర్భంనుండి వెలువడుతున్నారో, ఎవరు ఆనందపెడుతున్నారో, కష్టం కలిగించరో, ఆ రుద్రస్వరూపులకు నమస్కారం.

యే సముద్రే నదీదుర్గే పర్వతేషు గుహాసు చ ।
వృక్షమూలేషు గోష్ఠేషు కాన్తారగహనేషు చ ॥ 93 ॥

సముద్రంలోనూ, నదులలోని దుర్గమమైన దారులలోనూ, కొండలమీదనూ, పర్వతగుహలలోనూ, చెట్లమొదళ్ళలోనూ, గోవులు ఉండేస్థానాలలోనూ, దట్టమైన అరణ్యాలలోనూ,

చతుష్పథేషు రథ్యాసు కాన్తారేషు సభాసు చ ।
హస్త్యశ్వరథశాలాసు జీర్ణోద్యానాలయేషు చ ॥ 94 ॥

నాలుగువీథులకూడళ్ళలోనూ, దారులలోనూ, సభలలోనూ, ఏనుగుశాలలోనూ, గుఱ్ఱాలశాలలోనూ, రథశాలలలోనూ, పాడుబడినఉద్యానవనాలలోనూ, పాడుబడ్డ దేవాలయాలలోనూ,

యేషు పఞ్చసు భూతేషు దిశాసు విదిశాసు చ ।
ఇన్ద్రార్కయో ర్మధ్యగతా యే చ చన్ద్రార్కరశ్మిషు ॥ 95 ॥

పంచభూతాలలోనూ, నాలుగుదిక్కులలోనూ. ఈశాన్యం మొదలైన నాలుగుమూలలలోనూ, ఇంద్రుడికీ సూర్యుడికీ నడుమనూ, చంద్ర సూర్యకిరణాలలోనూ,

రసాతలగతా యే చ యే చ తస్మాత్ పరం గతాః ।
నమస్తేభ్యో నమస్తేభ్యో నమస్తేభ్యోఽస్తు నిత్యశః ॥ 96 ॥

పాతాళలోకంలో ఉన్నవారు, దానికి పైలోకాలలో ఉన్నవారు, అయిన రుద్రస్వరూపులకు నమస్కారం. నిత్యమూ నమస్కారం.

సర్వ స్త్వం సర్వగో దేవస్సర్వభూతపతిర్భవః ।
సర్వభూతాన్తరాత్మా చ తేన త్వం న నిమన్త్రితః ॥ 97 ॥

మహాదేవ! నీవే సమస్తం. అన్నింటా నీవే ఉన్నావు. సమస్తమైన సృష్టికీ నీవే భర్తవు. భవుడు అనేపేరు గలవాడివి. సృష్టిలోని సమస్తపదార్థాలలోనూ అంతర్యామిగా ఉండేవాడివి నీవే. అందుకనే నేను నిన్ను ప్రత్యేకంగా ఆహ్వానించలేదు.

త్వమేవ చేజ్యసే దేవ యజ్ఞై ర్వివిధదక్షిణైః ।
త్వమేవ కర్తా సర్వస్య తేన త్వం న నిమన్త్రితః ॥ 98 ॥

వివిధమైన దక్షిణలతో ఆయాయజ్ఞాలలో అర్చింపబడుతున్నది నీవే. అన్నింటికీ కర్తవు నీవే. అందువలననే నిన్ను ప్రత్యేకంగా ఆహ్వానించలేదు.

అథవా మాయయా దేవ మోహిత స్సూక్ష్మయా తవ ।
తస్మాత్తు కారణాద్ వాఽపి త్వ మ్మయా న నిమన్త్రితః ॥ 99 ॥

కానీ, మహాదేవా! తెలియడానికి సాధ్యం కాని నీమాయవలన అజ్ఞానంలో పడిపోయాను. ఆకారణంచేత కూడ నేను నిన్ను యజ్ఞానికి ఆహ్వానించలేకపోయాను.

ప్రసీద మమ దేవేశ త్వమేవ శరణం మమ ।
త్వం గతి స్త్వం ప్రతిష్ఠా చ నాన్యోఽస్తీతి మతి ర్మమ ॥ 100 ॥

దేవతాసార్వభౌమా! నాకు ప్రసన్నుడవు కమ్ము. నీవే నాకు దిక్కు. నాకు గమ్యం నీవే. నాకు ఆధారం నీవే. నాకు ఇంక ఎవ్వరూ లేరు అని నాఅభిప్రాయం.

బ్రహ్మోవాచ :- మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

స్తు త్వైవం స మహాదేవం విరరామ మహామతిః ।
భగవానపి సుప్రీతః పునర్దక్ష మభాషత ॥ 101 ॥

దక్షుడు పరమేశ్వరుడిని ఈవిధంగా స్తోత్రం చేసి, విరమించాడు. మహాదేవుడు కూడ చాల సంతోషించాడు. సంతోషంతో దక్షుడితో ఇలా అన్నాడు.

శ్రీభగవానువాచ :–దక్షుడితో పరమేశ్వరుడు ఈవిధంగా అంటున్నాడు.

పరితుష్టోఽస్మి తే దక్ష స్తవే నానేన సువ్రత ।
బహునాత్ర కిముక్తేన మత్సమీపం గమిష్యసి ॥ 102 ॥

దక్షప్రజాపతీ! నీవు చేసినఈస్తోత్రానికి చాల సంతోషించాను. అధికంగా మాట్లాడటం ఎందుకు? నీవు నాసన్నిధికి చేరుకుంటావు.

బ్రహ్మోవాచ:– మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తథైవ మబ్రవీద్వాక్యం త్రైలోక్యాధిపతి ర్భవః ।
కృత్వా ఽఽశ్వాసకరం వాక్యం సర్వజ్ఞో వాక్యసంహితమ్ ॥ 103 ॥

ముల్లోకాలకు నాయకుడు అయిన పరమేశ్వరుడు దక్షుడికి ఈవిధంగా ఓదార్పుమాటలు చెప్పి, తిరిగి దక్షుడితో యుక్తమైన ఈమాటలు చెప్పాడు.

శ్రీశివ ఉవాచ :– దక్షుడితో పరమేశ్వరుడు ఈవిధంగా అంటున్నాడు.

దక్ష దుఃఖం న కర్తవ్యం యజ్ఞవిధ్వంసనం ప్రతి ।
అహం యజ్ఞహన స్తుభ్యం దృష్టమేతత్ పురాఽనఘ ॥ 104 ॥

దక్షప్రజాపతీ! యజ్ఞం ధ్వంసం అయినందుకు బాధపడతగదు. నీయజ్ఞాన్ని ధ్వంసం చేసింది నేనే. పుణ్యాత్మా! పూర్వమే ఈవిధంగా యజ్ఞధ్వంసం నిశ్చయింపబడిఉంది. పూర్వమే ఇది నా చేత చూడబడింది.

భూయశ్చ త్వం వర మిమం మత్తో గృహ్ణీష్వ సువ్రత ।
ప్రసన్నసుముఖో భూత్వా మమైకాగ్రమనా శ్శృణు ॥ 105 ॥

ఉత్తమనియమవంతుడా! నేను నీకు ఈవరం ఇస్తాను. పుచ్చుకో. దుఃఖం విడిచిపెట్టు. సుముఖుడివి కా(ఆనందంగా ఉండు). ఏకాగ్రమైన మనసుతో నేను చెప్పేది విను.

అశ్వమేధసహస్రస్య వాజపేయశతస్య చ ।
ప్రజాపతే మత్ప్రసాదాత్ ఫలభాగీ భవిష్యసి ॥ 106 ॥

దక్షప్రజాపతీ! నాఅనుగ్రహంచేత నీకు వేయి అశ్వమేధాలు, నూరు వాజపేయయాగాలు, చేసినఫలితం లభిస్తుంది.

వేదాన్ షడఙ్గాన్ బుధ్యస్వ సాఙ్ఖ్యయోగాంశ్చ కృత్స్నశః ।
తపశ్చ విపులం తప్త్వా దుశ్చరం దేవదానవైః ॥107 ॥

శిక్షావ్యాకరణాదులైన షడంగాలతో కూడినవేదాలను తెలుసుకో. సమగ్రంగా కర్మజ్ఞానయోగాలను గ్రహించు. దేవతలూ, దానవులూ కూడ చేయలేని తీవ్రమైన తపస్సు చేయి.

అబ్దై ర్ద్వాదశభి ర్యుక్తం సూక్ష్మ మప్రజ్ఞనిన్దితమ్ ।
వర్ణాశ్రమకృతై ర్ధర్మై ర్వినీతం న క్వచిత్ క్వచిత్ ॥ 108 ॥

పండ్రెండు సంవత్సరాలు చేయాలి. సూక్ష్మ మయినది. బుద్ధి లేనివారు మాత్రమే నిందించేది. వర్ణధర్మాల తోనూ, ఆశ్రమధర్మాలతోనూ నీతిమంత మయినది. ఇది ఇతరత్రా వేరేచోట దొరకనిది.

సమాగతం వ్యవసితం పశుపాశవిమోక్షణమ్ ।
సర్వేషా మాశ్రమాణాం చ మయా పాశుపతం వ్రతమ్ ॥
ఉత్పాదితం దక్ష సర్వపాపవిమోచనమ్ ॥ 109 ॥

ఓ దక్షప్రజాపతీ! సమస్త ఆశ్రమాలలో పశువులుగా చెప్పబడినవారికి బన్ధనాలను తెంపేది నిశ్చయింపబడినదీ సమస్త పాపాలని వదిలించేదీ అయిన పాశుపతవ్రతం నా చేత సృష్టించబడింది. అది నీకు సంక్రమించుతున్నది.

అస్య చీర్ణస్య యత్ సమ్యక్ ఫలం భవతి పుష్కలమ్ ।
తచ్చాస్తు సుమహాభాగ మానస స్త్యజ్యతాం జ్వరః ॥ 110 ॥

మహాత్మా! ఈవ్రతాన్ని ఆచరిస్తే చక్కనిఫలితం సమృద్ధిగా సిద్ధిస్తుంది. ఈఫలితం నీకు కూడ కలుగుతుంది. అందుచేత మనసులో దిగులు మానుకో.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా అంటున్నాడు.

ఏవముక్త్వాతు దేవేశస్సపత్నీకస్సహానుగః ।
అదర్శనమనుప్రాప్తో దక్షస్యామితతేజసః ॥ 111 ॥

పరమేశ్వరుడు ఈవిధంగా చెప్పి పార్వతితోనూ, ప్రమథగణాలతోనూ, మిక్కిలి తేజోమూర్తి అయిన దక్షప్రజాపతి ఎదుటనుండి అదృశ్యమైనాడు.

అవాప్య చ తథా భాగం యథోక్తం చోమయా భవః ।
జ్వరం చ సర్వధర్మజ్ఞో బహుధా వ్యభజ త్తదా ॥
శాన్త్యర్థం సర్వభూతానాం శృణుధ్వ మథ వై ద్విజాః ॥ 112 ॥

సమస్తమైన ధర్మాలు తెలిసిన పరమేశ్వరుడు పార్వతితో సహా పూర్వం చెప్పినప్రకారంగా యజ్ఞభాగాన్ని పొంది, దక్షాధ్వరం నాశనం చేయడానికి తాను సృష్టించిన జ్వరాన్ని సృష్టిలోని సమస్తమైన పదార్థాలకు శాంతి కలగడంకోసం, అనేకభాగాలుగా విభజించాడు.

శిఖాభితాపో నాగానాం పర్వతానాం శిలాజతు ।
అపాం తు నీలికాం విద్యా న్నిర్మోకో భుజగేషు చ ॥ 113 ॥

ఆజ్వరాన్ని ఏనుగులలో శిరస్తాపంగానూ, పర్వతాలలో శిలాజిత్తు(జేగురురాయి)గానూ, నీళ్లలో నీలిక(నీళ్లను పాడుచేసేదోషం)గానూ, పాములలో కుబుసంగానూ ఉంచాడు.

ఖోరకస్సౌరభేయాణాఽ మూఖరః పృథివీతలే ।
శునామపి చ ధర్మజ్ఞా దృష్టిప్రత్యవరోధనమ్ ॥ 114 ॥

రన్ధ్రాగతమథాశ్వానాం శిఖోద్భేదశ్చ బర్హిణామ్ ।
నేత్రరాగః కోకిలానాం జ్వరః ప్రోక్తో మహాత్మనామ్ ॥ 115 ॥

ధర్మం తెలిసినవారలారా! ఆవులలో ఖోరకం (దగ్గుగానూ), నేలలో చవిటినేలగనూ, కుక్కలలో గుడ్డితనం గానూ, గుఱ్ఱాలకు రంధ్రాగతంగానూ, నెమిళ్లకు పింఛాలు ఊడిపోవడంగానూ, కోకిలలకు కంటిలో ఎఱ్ఱదనంగానూ, జ్వరం ఆయాస్థలాలలో ఆయారూపాలతో ఉంటుదని పెద్దలు పేర్కొన్నారు.

జనానా మపి చ భేదశ్చ సర్వేషామితి న శ్రుతమ్ ।
శుకానామపి సర్వేషాం హిక్కికా ప్రోచ్యతే జ్వరః ॥ 116 ॥

జ్వరం మానవులందరిలోనూ ఒకరంటే ఒకరికి పడకపోవడంగా ఉంటుందని విన్నాం. చిలుకలలో జ్వరం ఎక్కిళ్లరూపంలో ఉంటుంది.

శార్దూలేష్వథ వై విప్రా శ్రమో జ్వర ఇహోచ్యతే ।
మానుషేషు చ ధర్మజ్ఞా జ్వరో నామైష కీర్తితః ॥
మరణే జన్మని తథా మధ్యే చాపి నివేశితః ॥ 117 ॥

బ్రాహ్మణులారా! పెద్దపులులలో జ్వరం అలసటగా ఉంటుంది. ధర్మజ్ఞులారా! ఈజ్వరం మానవులలో మరణించేసమయంలోనూ, పుట్టేటపుడూ, జీవించిఉన్నపుడూ, జ్వరం అనేపేరు గలిగిన రోగం రూపంలో ఉంటుంది.

ఏత న్మాహేశ్వరం తేజో జ్వరో నామ సుదారుణః ।
నమస్యశ్చైవ మాన్యశ్చ సర్వప్రాణిభి రీశ్వరః ॥ 118 ॥

ఈభయంకరమైన జ్వరం మహేశ్వరుడినుండి ఏర్పడింది. జనమందరూ పరమేశ్వరుడికి ఎప్పుడూ నమస్కారం చేయాలి. పరమేశ్వరుడిని నిరంతరం గౌరవించాలి.

ఇమాం జ్వరోత్పత్తి మదీనమానసః పఠేత్ సదా యస్తు సమాహితో నరః ।
విముక్తరోగ స్స నరో ముదా యుతో లభేత కామాంశ్చ యథా మనీషితాన్ ॥ 119 ॥

ఈజ్వరం పుట్టినవృత్తాంతాన్ని ఉత్సాహంతో శ్రద్ధగా చదివినమానవుడికి రోగాలు అన్నీ తొలగిపోతాయి. ఆనందం కలుగుతుంది. కోరినకోరికలు తీరతాయి.

దక్షప్రోక్తం స్తవం చాపి కీర్తయే ద్యశ్శృణోతి వా ।
నాశుభం ప్రాప్నుయాత్ కిఞ్చిద్ దీర్ఘమాయురవాప్నుయాత్ ॥ 120 ॥

దక్షప్రజాపతి చెప్పిన ఈశివస్తోత్రాన్ని చదివినా, విన్నా, కొంచెం కూడ కష్టం గలగదు. పరిపూర్ణమైన ఆయుర్దాయం కలుగుతుంది.

యథా సర్వేషు దేవేషు వరిష్ఠో భగవాన్ భవః ।
తథా స్తవో వరిష్ఠోఽయం స్తవానాం దక్షనిర్మితః ॥ 121 ॥

దేవతలందరిలో శ్రేష్ఠుడు పరమేశ్వరుడు. అలాగే అన్నివిధాలైన స్తోత్రాలలోనూ దక్షుడు నిర్మించిన ఈశివస్తోత్రమే శ్రేష్ఠం.

యశస్స్వర్గసురైశ్వర్యవిత్తాదిజయకాఙ్క్షిభిః ।
స్తోతవ్యో భక్తి మాస్థాయ విద్యాకామైశ్చ యత్నతః ॥ 122 ॥

కీర్తి, స్వర్గలోకసుఖాలు, దేవతాభోగాలు, సంపదలు, ప్రారంభించినకార్యాలలో జయాలు, వివిధమైనవిద్యలు, కోరుకునేమానవులు భక్తితో ప్రయత్నపూర్వకంగా (దక్షుడు చేసిన శివస్తోత్రంతో) పరమేశ్వరుడి నిస్తుతించాలి.

వ్యాధితో దుఃఖితో దీనో నరో గ్రస్తో భయాదిభిః ।
రాజకార్యనియుక్తో వా ముచ్యతే మహతో భయాత్ ॥ 123 ॥

రోగం వచ్చినవాడు, బాధలలో ఉన్నవాడు, దీనుడూ, భయమూ మొదలైనవి గలిగినవాడు, అలాగే, రాజుగారు ఆయాపనులలో నియోగించినమానవుడు అత్యంతమైన ఆభయాలనుండి ముక్తిని పొందుతాడు.

అనేనైవ చ దేహేన గణానాం చ మహేశ్వరాత్ ।
ఇహ లోకే సుఖం ప్రాప్య గణరాడుపపద్యతే ॥ 124 ॥

ఈస్తోత్రాన్ని పఠించినవాడు లేదా చదివినవాడు ఈదేహంతోనే పరమేశ్వరునివలన, శివభక్తులైన శివగణాలవలన ఈలోకంలో అన్ని రకాలయిన శుభాలు పొంది. అలాగే వాడు ప్రమథగణాలకు రాజు అవుతాడు.

న యక్షా న పిశాచా వా న నాగా న వినాయకాః ।
కుర్యుర్విఘ్నం గృహే తస్య యత్ర సంస్తూయతే భవః ॥ 125 ॥

ఈస్తోత్రంతో శివుడిని స్తుతించినవాడి ఇంటిలో యక్షులు గాని, పిశాచాలు గాని, పాములు గాని, గణపతులు కాని ఏవిధమైన అడ్డంకులు తీసుకురారు. (వారు తలచినపనులన్నీ నిర్విఘ్నంగా సఫలమవుతాయి.)

శృణుయా ద్వా ఇదం నారీ భక్త్యాఽథ భవభావితా ।
పితృపక్షే భర్తృపక్షే పూజ్యా భవతి చైవ హి ॥ 126 ॥

పరమేశ్వరుడిని తలుచుకుంటూ, ఈస్తోత్రాన్ని విన్న స్త్రీనీ పుట్టినింటిలోనూ, మెట్టినింటిలోనూ, అందరూ నిశ్చయంగా గౌరవిస్తారు.

శృణుయా ద్వా ఇదం సర్వం కీర్తయేద్ వాఽ ప్యభీక్ష్ణశః ।
తస్య సర్వాణి కార్యాణి సిద్ధిం గచ్ఛ న్త్యవిఘ్నతః ॥ 127 ॥

ఈమొత్తం వృత్తాంతాన్ని మొత్తాన్ని సమగ్రంగా పఠించినమానవుడికి, పనులు అన్నీ ఎలాంటి అడ్డంకులు లేకుండా ఫలిస్తాయి.

మనసా చిన్తితం యచ్చ వాచాప్యుదీరితమ్ ।
తత్తత్ సమ్పద్యతే స్తవ స్యా స్యానుకీర్తనాత్ ॥ 128 ॥

ఈస్తోత్రాన్ని పఠించడంవలన, మనసులో తలచుకున్నవీ, మాటలో పేర్కొన్నవీ, అయినకోరికలు అన్నీ నెరవేరతాయి.

దేవస్య సగుహ స్యాథ దేవ్యా నన్దీశ్వరస్య చ ।
బలిం విభవతః కృత్వా దమేన నియమేన చ ॥ 129 ॥

ఇంద్రియనిగ్రహంతోనూ, నియమవంతంగానూ కుమారస్వామితో సహా, పరమేశ్వరుడికీ, పార్వతికీ, నందీశ్వరుడికీ, యథాశక్తిగా వేర్వేరుగా బలిని ఇవ్వాలి.

తతః ప్రయుక్తో గృహ్ణీయా న్నామా న్యాశు యథాక్రమమ్ ।
ఈప్సితాం ల్లభతేఽ ప్యర్థాన్ కామాన్ భోగాంశ్చ మానవః ॥ 130 ॥

ఆతర్వాత శివనామాలను వరుసగా పారాయణ చేయాలి. దానివల్ల మానవుడు కోరుకున్నకోరికలను, సుఖాలను పొందుతాడు.

మృతశ్చ స్వర్గ మాప్నోతి స్త్రీసహస్రసమావృతః ॥ 131 ॥

మరణించినతరువాత వేలకొద్దీ ఆడవాళ్లు చుట్టుచేరిఉండగా, స్వర్గలోకానికి వెళ్తాడు.

సర్వకామసుయుక్తో వా యుక్తో వా సర్వపాతకైః ।
పఠన్ దక్షకృతం స్తోత్రం సర్వపాపైః ప్రముచ్యతే ॥ 132 ॥

అన్నీ తనకే కావాలని కోరుకునేవాడయినా, అన్ని రకాలయిన పాపాలను చేసినవాడయినా, దక్షుడు చేసినఈశివస్తోత్రాన్ని చదివితే సమస్తమైన పాపాలనుండి విముక్తిని పొందుతాడు. (కోరికలన్నీ నెరవేరతాయి.)

మృతశ్చ గణసాయుజ్యం పూజ్యమాన స్సురాసురైః ।
వృషేణ వినియుక్తేన విమానేన విరాజతే ॥ 133 ॥

మరణించినవెంటనే దేవతలూ, రాక్షసులూ పూజిస్తుండగా, ప్రమథగణాలలో చేరిపోతాడు. ఎద్దును వాహనంగా చేసుకుని (శివుడిలాగా) విహరిస్తాడు.

ఆభూతసంప్లవస్థాయీ రుద్రస్యానుచరో భవేత్ ॥ 134 ॥

సర్వప్రళయంవరకు రుద్రుడికి అనుచరుడుగా సంచరిస్తాడు.

ఇత్యాహ భగవాన్ వ్యాసః పరాశరసుతః ప్రభుః ।
నైత ద్వేదయతే కశ్చి న్నైత చ్ఛ్రావ్యం చ కస్యచిత్ ॥ 135 ॥

పరాశరమహర్షికుమారుడైన వ్యాసభగవానుడు దక్షస్తుతిని ఈవిధంగా చెప్పాడు. ఈస్తోత్రం ఇంక ఎవరికీ తెలియదు. ఎవరికీ దీనిని చెప్పగూడదు.

శ్రుత్వేమం పరమం గుహ్యం యేఽపి స్యుః పాపయోనయః ।
వైశ్యాః స్త్రియశ్చ శూద్రాశ్చ రుద్రలోక మవాప్నుయుః ॥ 136 ॥

ఎంతో రహస్యమైన ఈశివస్తోత్రాన్ని విన్నవాడు ఎంతటిపాపజన్ముడైనా, వైశ్యుడు గాని, శూద్రుడు గాని, స్త్రీ గాని, ఎటువంటివారైనా రుద్రలోకానికి వెళ్తారు.

శ్రావయేద్యశ్చ విప్రేభ్య స్సదా పర్వసు పర్వసు ।
రుద్రలోక మవాప్నోతి ద్విజో వై నాత్ర సంశయః ॥ 137 ॥

ప్రతిపర్వదినంనాడు కూడ ఈశివస్తోత్రాన్ని బ్రాహ్మణులకు వినిపించిన బ్రాహ్మణుడు రుద్రలోకానికి చేరు కుంటాడు. ఇందులో సందేహం లేదు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భృషిసంవాదే దక్షస్తవనిరూపణం నామాష్టత్రింశోఽధ్యాయః ॥ 38 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషి సంవాదంలో దక్షస్తవనిరూపణం అనే ముప్పైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.



ఏకోనచత్వారింశోஉధ్యాయః - ముప్పైతొమ్మిదవ అధ్యాయం

ఏకామ్రక్షేత్రమాహాత్మ్యవర్ణనమ్ - ఏకామ్రక్షేత్రమాహాత్మ్యవర్ణనం

లోమహర్షణ ఉవాచ :-లోమహర్షణుడు చెప్తున్నాడు.

శ్రుత్వైవం తే మునివరాః కథాం పాపప్రణాశినీమ్ ।
రుద్రక్రోధోద్భవాం పుణ్యాం వ్యాసస్య వదతో ద్విజాః ॥ 1 ॥

బ్రాహ్మణులారా, వ్యాసుడు ఈవిధంగా దక్షాధ్వరధ్వంసగాధను చెప్పగా అక్కడిమహర్షులు విన్నారు. ఈకథ పాపాలను నాశనం చేస్తుంది. ఇది రుద్రుడి కోపంనుండి పుట్టింది. పుణ్యప్రదమైనది.

పార్వత్యా శ్చ తథా రోషం క్రోధం శమ్భోశ్చ దుస్సహమ్
ఉత్పత్తిం వీరభద్రస్య భద్రకాల్యాశ్చ సమ్భవమ్ ॥ 2 ॥

పరమేశ్వరుడిని నిందించడం చేత పార్వతికి కోపం రావడమూ, పార్వతికి జరిగిన అవమానం వలన పరమేశ్వరుడికి దుస్సహమైన కోపం రావడమూ, పార్వతీపరమేశ్వరుల కోపం నుంచి భద్రకాళి, వీరభద్రుడు పుట్టడమూ,

దక్షయజ్ఞవినాశం చ వీర్యం శమ్భో స్తథాஉద్భుతమ్ ।
పునః ప్రసాదం దేవస్య దక్షస్య సుమహాత్మనః ॥ 3 ॥

దక్షుడియజ్ఞం విధ్వంసం కావడమూ, ఆశ్చర్యకరమైన పరమేశ్వరుడి పరాక్రమమూ, పరమేశ్వరుడికి వెంటనే మహాత్ముడైన దక్షప్రజాపతిపై అనుగ్రహం కలగడమూ,

యజ్ఞభాగం చ రుద్రస్య దక్షస్య చ ఫలం క్రతోః ।
ద్విజా బభూవు స్సుప్రీతా విస్మితాశ్చ పునః పునః ॥ 4 ॥

పరమేశ్వరుడికి యజ్ఞంలో భాగం ఇవ్వడమూ, దక్షుడికి యజ్ఞం సక్రమంగా జరిగిన ఫలితం రావడమూ అనే వృత్తాంతాలు బ్రహ్మ చెప్పిన ప్రకారంగా వ్యాసుడు చెప్పగా విన్న బ్రాహ్మణులు చాల సంతోషించారు. చాలా ఆశ్చర్యపడ్డారు.

పప్రచ్ఛుశ్చ పున ర్వ్యాసం కథాశేషం చ తే తదా ।
పృష్టః ప్రోవాచ తాన్ వ్యాసః క్షేత్రమేకామ్రకం పునః ॥ 5 ॥

తరువాత ఆ బ్రాహ్మణులు ఆతరువాతి కథను గూర్చి వ్యాసమహర్షిని అడిగారు. అప్పుడు వ్యాసుడు ఏకామ్రక్షేత్రం గురించి చెప్పడం ప్రారంభించాడు.

వ్యాస ఉవాచ :-వ్యాసుడు చెప్తున్నాడు.

బ్రహ్మప్రోక్తాం కథాం చైవ, శ్రుత్వా తదృషిపుఙ్గవాః ।
ప్రశశంసు స్తదా హృష్టా, రోమాఞ్చితతనూరుహాః ॥ 6 ॥

బ్రహ్మదేవుడు చెప్పిన దక్షయజ్ఞధ్వంస కథను విని, అక్కడి మహర్షులు ఆనందంతో పులకరించారు. బ్రహ్మదేవుడిని ప్రశంసించారు.

ఋషయ ఊచుః :- మహర్షులు అంటున్నారు.

అహో దేవస్య మాహాత్మ్యం త్వయా శమ్భోః ప్రకీర్తితమ్ ।
దక్షస్య చ సురశ్రేష్ఠ యజ్ఞవిధ్వంసనం తథా ॥ 7 ॥

సురోత్తమా, బ్రహ్మదేవా, నీవు వివరించిన పరమేశ్వర మహాదేవుడి మాహాత్మ్యం, అలాగే దక్షయజ్ఞవిధ్వంసనం కూడ మిక్కిలి ఆశ్చర్యం కలిగించాయి.

ఏకామ్రకం క్షేత్రవరం వక్తు మర్హసి సామ్ప్రతమ్ ।
శ్రోతు మిచ్ఛామహే బ్రహ్మన్ పరం కౌతూహలం హి నః ॥ 8 ॥

బ్రహ్మదేవా, ఇప్పుడు ఏకామ్రకం అనే పుణ్యక్షేత్రాన్ని గురించి చెప్పు. మాకు ఆ పుణ్యక్షేత్రాన్ని గురించి వినా లని చాలా కుతూహలంగా ఉంది.

వ్యాస ఉవాచ :-వ్యాసుడు చెప్తున్నాడు.

తేషాం తద్వచనం శ్రుత్వా లోకనాథ శ్చతుర్ముఖః ।
ప్రోవాచ శమ్భో స్తత్క్షేత్రం భూతలే భుక్తిముక్తిదమ్ ॥ 9 ॥

సర్వలోకనాయకుడైన బ్రహ్మదేవుడు ఆ మునుల మాటను విని పరమేశ్వరుడు నెలకొన్న ఏకామ్రక్షేత్రం గురించి చెప్పాడు. అది ఈ భూమిమీద భోగమోక్షాలను ప్రసాదించే క్షేతం.

బ్రహ్మోవాచ :- బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

శృణుధ్వం మునిశార్దూలాః ప్రవక్ష్యామి సమాసతః ।
సర్వపాపహరం పుణ్యం క్షేత్రం పరమదుర్లభమ్ ॥ 10 ॥

మునివరేణ్యులారా, సంగ్రహంగా చెప్తాను. వినండి. ఏకామ్రపుణ్యక్షేత్రం సమస్త మయిన పాపాలను నిర్మూలిస్తుంది. ఇటువంటి పుణ్యక్షేత్రం ఇంక ఎక్కడా లేదు.

లిఙ్గకోటిసమాయుక్తం వారాణస్యా సమం శుభమ్ ।
ఏకామ్రకేతి విఖ్యాతం తీర్థాష్టకసమన్వితమ్ ॥ 11 ॥

ఈపుణ్యక్షేత్రంలో కోటి శివలింగాలు ఉన్నాయి. ఇది కాశితో సమానంగా శుభాలు చేకూరుస్తుంది. ఏకామ్రకం అనే పేరుతో ప్రసిద్ధమైంది. ఇక్కడ ఎనిమిది పుణ్యతీర్థాలు ఉన్నాయి.

ఏకామ్రవృక్ష స్త త్రాసీత్ పురా కల్పే ద్విజోత్తమాః ।
నామ్నా తస్యైవ తత్ క్షేత్ర మేకామ్రకమితి శ్రుతమ్ ॥ 12 ॥

బ్రాహ్మణశ్రేష్ఠులారా, పూర్వకల్పంలో ఇక్కడ ఏకామ్రవృక్షం (ఒక్కమామిడిపండు మాత్రమే కాసేచెట్టు) ఉన్నది. ఆ చెట్టుపేరుమీదుగానే ఈపుణ్యక్షేత్రం ఏకామ్రకం అనే పేరుతో ప్రసిద్ధమైంది.

హృష్టపుష్టజనాకీర్ణం నరనారీసమన్వితమ్ ।
విద్యావద్గణభూయిష్ఠం ధనధాన్యాదిసంయుతమ్ ॥ 13 ॥

ఆ క్షేత్రంలో ఆడవారూ, మగవారూ జనం అందరూ ఆనందంగానూ, పుష్టిగానూ ఉంటారు. అందరూ బాగా చదువుకున్నవారు. అక్కడ సంపదలూ, పంటలూ పుష్కలంగా ఉన్నాయి.

గృహగోకులసమ్బాధం గోపురైశ్చ సుభూషితమ్ ।
నానావణిక్సమాకీర్ణం నానారత్నోపశోభితమ్ ॥ 14 ॥

ఆ క్షేత్రం పెద్ద పెద్ద ఇళ్లతోనూ, గోష్ఠాలతోనూ నిండి ఉంటుంది. పెద్దపెద్ద గోపురాలు ఆఊరికి అలంకారంగా ఉంటాయి. ఆ ఊళ్లో వ్యాపారవేత్తలు చాలమంది ఉన్నారు. ఆక్షేత్రం రకరకాల రత్నాలతో ప్రకాశిస్తుంది.

పురాట్టాలకసంయుక్తం వీథీభి స్సమలఙ్కృతమ్ ।
రాజహంసనిభై శ్శుభ్రైః ప్రాసాదై రుపశోభితమ్ ॥ 15 ॥

ఆ పురమునకు రక్షగా చుట్టూకందుకాలున్నాయి. వీధులు అందంగా అలంకరింపబడిఉన్నాయి. రాజహంసల లాగా బాగా తెల్లగా ఉండే పెద్దపెద్దమేడలతో ఆఊరు చాలా అందంగా ఉంటుంది.

త్రికచ త్వరసంయుక్తం సిత ప్రాకారశోభితమ్ ।
రక్షితం శస్త్రసఙ్ఘైశ్చ పరిఖాభి రలఙ్కృతమ్ ॥ 16 ॥

ఆక్షేత్రం మూడు వీధులు కలిసినప్రదేశాలు, నాలుగువీధులు కలిసినప్రదేశాలు కలిగిఉంటుంది. తెల్లని ఎత్తైనభవనాలతో మనోహరంగా ఉంటుంది. అనేకమైన ఆయుధాలు ధరించిన యోధులు ఆక్షేత్రాన్ని నిరంతరం రక్షిస్తుంటారు. అగడ్తలు ఆఊరికి అలంకారంగా ఉన్నాయి.

సితరక్తై స్తథా పీతైః కృష్ణశ్యామైశ్చ వర్ణకైః ।
సమీరణోద్ధతాభిశ్చ పతాకాభి రలఙ్కృతమ్ ॥ 17 ॥

తెలుపు, ఎఱుపు, పసుపు, నలుపు, కారునలుపు రంగుల జెండాలు గాలికి పైకి ఎగురుతుంటే ఆక్షేత్రం అందంగా ఉన్నది.

నిత్యోత్సవ ప్రముదితం నానావాదిత్రవాదితమ్ ।
వీణావేణుమృదఙ్గైశ్చ క్షేపణీభి రలఙ్కృతమ్ ॥ 18 ॥

ప్రతిదినమూ ఉత్సవాలతో ఆక్షేత్రం అంతటా ఆనందం నిండిఉంటుంది. రకరకాల వాద్యాలు మోగుతుంటాయి. వీణలు, వేణువులు మృదంగాలు, కదిలించే వాద్యాలు (డమ్ములవంటివి) శోభాయమానంగా ఉంటాయి.

దేవతాయతనై ర్దివ్యైః ప్రాకారోద్యానమణ్డితైః ।
పూజావిచిత్రరచితై స్సర్వత్ర సమలఙ్కృతమ్ ॥ 19 ॥

ఆ క్షేత్రంనిండా దివ్యమైన అనేకదేవాలయాలు ఉన్నాయి. అవి పెద్దపెద్ద ప్రాకారాలతోనూ, ఉద్యానవనాలతోనూ మనోహరంగా ఉన్నాయి. ఆదేవాలయాలలో పూజలు ఆశ్చర్యకరమైన పద్ధతులలో జరుగుతుంటాయి.

స్త్రియస్తు ముదితా స్తత్ర దృశ్యన్తే తనుమధ్యమాః ।
హారై రలఙ్కృతగ్రీవాః పద్మపత్రాయతేక్షణాః ॥ 20 ॥

ఆ క్షేత్రంలో సన్ననినడుము గలిగిన సుందరాంగులు సంతోషంగా కనబడతారు. వారు మెడనిండా హారాలు అలంకరించుకుంటారు. వారికన్నులు తామరరేకులలాగా విశాలంగా ఉంటాయి.

పీనోన్నతకుచా శ్శ్యామాః పూర్ణచన్ద్రసమాననాః ।
స్థిరాలకా స్సుకపోలాః కాఞ్చీనూపురనాదితాః ॥ 21 ॥

ఆతరుణలు మంచియౌవనంలో ఉన్నారు. వారివక్షోజాలు దృఢంగానూ, ఎత్తుగానూ ఉంటాయి. వారిముఖం నిండు చందురుడు లాగా ఉంటుంది. ఆ ముఖం మీద ముంగురులు స్పష్టంగా ఉంటాయి. వారి చెక్కిళ్లు అందంగా ఉంటాయి. వారి మొలనూలుకు ఉన్న అందెలు మనోహరంగా ధ్వనిస్తుంటాయి.

సుకేశ్య శ్చారుజఘనాః కర్ణాన్తాయతలోచనాః ।
సర్వలక్షణసమ్పన్నా స్సర్వాభరణభూషితాః ॥ 22 ॥

వారు మంచి కేశసంపద గలిగిఉంటారు. వారిపిరుదులు మనోహరంగా ఉంటాయి. వారికి ఉత్తమమైన లక్షణాలు అన్నీ ఉన్నాయి. వారు అన్నిరకాలైన ఆభరణాలు ధరించి ఉంటారు.

దివ్యవస్త్రధరా శ్శుభ్రాః కాశ్చిత్ కాఞ్చనసన్నిభాః ।
హంసవారణగామిన్యః కుచభారావనామితాః ॥ 23 ॥

మనోహరమైన వస్త్రాలను ధరిస్తారు. శుభ్రంగా ఉంటారు. కొందరు కాంతలు బంగారు మేనిచాయ గలిగిఉంటారు. హంసలలాగా (అందంగానూ), ఏనుగులలాగా (మెల్లగానూ) నడుస్తారు. వక్షస్స్థలంబరువువల్ల వారు కొద్దిగా ముందుకు వంగిపోయి ఉంటారు.

దివ్యగన్ధానులిప్తాఙ్గాః కర్ణాభరణభూషితాః ।
మదాలసాశ్చ సుశ్రోణ్యో నిత్యం ప్రహసితాననాః ॥ 24 ॥

ఒంటికి అపూర్వ మయిన పరిమళద్రవ్యాలను పూసుకుంటారు. చెవులకు ఆభరణాలను అలంకరించు కుంటారు. మదంచేత అలసలు. ఉన్నత మయిన పిరుదులు కలిగిఉంటారు. వారి ముఖంమీద ఎల్లప్పుడూ నవ్వు వెలుగుతుంటుంది.

విద్యుద్విస్పష్టదశనా బిమ్బోష్ఠా మధురస్వరాః ।
తామ్బూలరఞ్జితముఖా విదగ్ధాః ప్రియదర్శనాః ॥ 25 ॥

మెరుపులాగా తళుక్కుమనే పలువరుస కలిగిఉంటారు. వారికి క్రిందిపెదవి దొండపండులాగా (ఎఱ్ఱగా) ఉంటుంది. కంఠస్వరం తీయగా ఉంటుంది. వారినోరు తాంబూలంతో ఎఱ్ఱబడి ఉంటుంది. వారు నెఱజాణలు. అందంగా కనబడతారు.

సుభగాః ప్రియవాదిన్యో నిత్యం యౌవనగర్వితాః ।
దివ్యవస్త్రధరా స్సర్వా స్సదా చారిత్రమణ్డితాః ॥ 26 ॥

అందరూ సుందరాంగులు. ఇష్టం కలిగేవిధంగా మాట్లాడతారు. ఎల్లకాలమూ యౌవనంతో అహంకరించి ఉంటారు. అందరూ అపురూపమైన వస్త్రాలు ధరిస్తారు. ఉత్తమమైన శీలం వారికి అలంకారం.

క్రీడన్తి తా స్సదా తత్ర స్త్రియ శ్చాప్సరసోపమాః ।
స్వే స్వే గృహే ప్రముదితా దివా రాత్రౌ వరాఙ్గనాః ॥ 27 ॥

అక్కడి స్త్రీలు అప్సరసలలా ఉంటారు. మంచి అవయవసౌష్ఠవం కలిగినవారు. వారు తమతమ ఇళ్లలో రాత్రింబగళ్లు ఆనందంగా క్రీడిస్తుంటారు.

పురుషా స్తత్ర దృశ్యన్తే రూపయౌవనగర్వితాః ।
సర్వలక్షణసమ్పన్నా స్సర్వాభరణభూషితాః ॥ 28 ॥

ఆక్షేత్రంలో పురుషులు రూపంతోనూ, యౌవనంతోనూ గర్వించి కనబడతారు. సమస్తమైన ఉత్తమ లక్షణాలు కలిగిఉంటారు. సమస్తమైన ఆభరణాలు ధరించిఉంటారు.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా శ్శూద్రాశ్చ మునిసత్తమాః ।
స్వధర్మనిరతా స్తత్ర నివసన్తి సుధార్మికాః ॥ 29 ॥

మునివరులారా, ఆ ఏకామ్రక్షేత్రంలో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే నాలుగువర్ణాలవారు కూడ తమతమ వర్ణధర్మాలను శ్రద్ధగా ఆచరిస్తారు. అందరూ గొప్పధర్మపరులు.

అన్యాశ్చ తత్ర తిష్ఠన్తి వారముఖ్యా స్సులోచనాః ।
ఘృతాచీ మేనకా తుల్యా యథా రమ్భా తిలోత్తమా ॥ 30 ॥

ఇంకా ఆక్షేత్రంలో వారకాంతలు ఘృతాచి, మేనక, రంభ, తిలోత్తమ అనే అప్సరసలతో సమాన మైనసౌందర్యం కలిగిఉంటారు.

ఉర్వశీసదృశాశ్చైవ విప్రచిత్తినిభా స్తథా ।
విశ్వాచీ సహజన్యాశ్చ ప్రమ్లోచాసదృశా స్తథా ॥ 31 ॥

అక్కడివారకాంతలు ఊర్వశితో సమానమైనవారు. విప్రచిత్తిలాగా ఉంటారు. విశ్వాచికి తోడబుట్టినట్లుగా ఉంటారు. ప్రమ్లోచవలె ఉంటారు.

సర్వాస్తాః ప్రియవాదిన్య స్సర్వా విహసితాననాః ।
కలాకౌశలసంయుక్తా స్సర్వా శ్చ గుణమణ్డితాః ॥ 32 ॥

ఆ వారస్త్రీలు అందరూ ఇష్టం కలిగే విధంగా మాట్లాడతారు. అందరూ నవ్వుమొగంవాళ్లు. అందరూ అన్నివిద్యలలోనూ నేర్పరులు. అందరూ మంచిగుణాలు సమృద్ధిగా కలిగినవారే.

ఏవం భూతాః స్త్రియ స్తత్ర నృత్యగీతవిశారదాః ।
నివసన్తి మునిశ్రేష్ఠా స్సర్వస్త్రీగుణగర్వితాః ॥ 33 ॥

మహర్షులారా, ఈవిధంగా ఉన్న ఏకామ్రక్షేత్రంలోని స్త్రీలు నృత్యం, సంగీతం అనే కళలలో నేర్పరులు. వాళ్లందరూ సమస్తమైన ఆడవారి గుణాలతోనూ కూడి, గర్వించిఉంటారు.

ప్రేక్షణాలాపకుశలా స్సున్దర్యః ప్రియదర్శనాః ।
యాసాం కటాక్షపాతేన మోహం గచ్ఛన్తి మానవాః ॥ 34 ॥

అక్కడి స్త్రీలు నెఱజాణచూపులలోనూ, మాటలలోనూ నేర్పరులు. అందగత్తెలు. అందరికీ ఇష్టం పుట్టేవిధంగా కనబడతారు. ఆ స్త్రీలకడగంటిచూపులకు మానవులు అందరూ మోహంలో పడిపోతారు.

న రూపహీనా దుర్వృత్తా న పరద్రోహకారికాః ।
న తత్ర నిర్ధనా స్సన్తి న మూర్ఖా నాపి విద్విషః ॥ 35 ॥

ఆపుణ్యక్షేత్రంలో (మగవాళ్లు) అందరూ అందగాళ్ళే. వారి ప్రవర్తన ఉత్తమమైనది. ధనహీనులు లేరు. తెలివితక్కువవారు లేరు. ద్వేషించేవారు లేరు (అక్కడివారికి శత్రువులు లేరు).

న రోగిణో న మలినా న కదర్యా న మాయినః ।
న రూపహీనా దుర్వృత్తా న పరద్రోహకారిణః ॥ 36 ॥

ఆ పుణ్యక్షేత్రంలో రోగగ్రస్తులు లేరు. పాపాత్ములు లేరు. పిసినిగొట్టులు లేరు. మోసగాళ్లు లేరు. అందం లేనివాళ్లు లేరు. చెడునడవడి గలిగినవాళ్లు లేరు. ఇతరులకు అపకారం చేసేవాళ్లు లేరు. (ఈశ్లోకంఉత్తరార్ధం 35శ్లోకంపూర్వార్ధమే. 41.అ.32 శ్లో.)

తిష్ఠన్తి మానవా స్తత్ర క్షేత్రే జగతి విశ్రుతే ।
సర్వత్ర సుఖసఞ్చారం సర్వసత్త్వసుఖావహమ్ ॥ 37 ॥

ఆ పుణ్యక్షేత్రం లోకంలో చాల సుప్రసిద్ధమైనది. మానవులు ఆ క్షేత్రాన్ని విడువకుండా, అక్కడే ఉండిపోతారు. ఆ క్షేత్రంలో అన్నిప్రదేశాలు సుఖంగా సంచరించడానికి అనువుగా ఉంటాయి. ఆ క్షేత్రం అన్నిరకాలైన ప్రాణులకు సుఖప్రదంగా ఉంటుంది.

నానాజనసమాకీర్ణం సర్వసస్యసమన్వితమ్ ।
కర్ణికారైశ్చ పనసై శ్చమ్పకై ర్నాగకేసరైః ॥ 38 ॥

ఆ పుణ్యక్షేత్రం నిండా రకరకాలైన జనాలు కలిసిఉంటారు. అక్కడ అన్నివిధాలైన పంటలు పుష్కలంగా ఉన్నాయి. కొండగోగులు, పనసలు, సంపెంగలు, నాగకేసరాలు,

పాటలాశోకవకులైః కపిత్థై ర్బృహులై ర్ధవైః ।
చూతనిమ్బకదమ్బై శ్చ తథాన్యైః పుష్పజాతిభిః ॥ 39 ॥

కలిగొట్టు, అశోకం, పొగడ, వెలగ, పెద్ద యేలకి, ధవ(వెలమ)వృక్షాలు, మామిడి, మందారం (వేప), కడిమి, ఇంకా అనేకమైన ఇతరపుష్పజాతులు,

నీపకై ర్ధవఖదిరై ర్లతాభిశ్చ విరాజితమ్ ।
శాలై స్తాలై స్తమాలైశ్చ నారికేలైః శుభాఞ్జనైః ॥ 40 ॥

మంకెన, ఉమ్మెత్త, చంద్ర, ఇంకా రకరకాలైన తీగలతో, బొద్దుగచెట్లు, తాటిచెట్లు, చీకటిచెట్లు, కొబ్బరిచెట్లు, మంచి తుమికిచెట్లతో ఆక్షేత్రం ప్రకాశిస్తున్నది,

అర్జునై స్సప్తపర్ణైశ్చ కోవిదారై స్సపిప్పలైః ।
లకుచై స్సరలై ర్లోధ్రై ర్హిన్తాలై ర్దేవదారుభిః ॥ 41 ॥

జువ్వి, ఏడాకుల అరటి, ఎఱ్ఱ కాంచనం, రావి, గజనిమ్మ, తెల్లతెగడ, లొద్దుగచెట్లు, గిరకతాడి, దేవదారు వృక్షాలు,

పలాశై ర్ముచుకున్దైశ్చ పారిజాతై స్సకుబ్జకైః ।
కదలీవనఖణ్డైశ్చ జమ్బూపూగఫలైస్తథా ॥ 42 ॥

మోదుగ, ముచుకుందం, పారిజాతాలు, తినిశం, అరటితోటలు, నేరేడు, పోకచెట్లు,

కేతకీకరవీరైశ్చ అతిముక్తైశ్చ కింశుకైః ।
మన్దారకున్దపుష్పై స్తథాన్యైః పుష్పజాతిభిః ॥ 43 ॥

మొగలి, గన్నేరు, తిందుకవృక్షాలు, నందివృక్షాలు, మందారాలు, మొల్లలు, ఇంకా ఇతరమైన రకరకాల పూలజాతులు, ఆపుణ్యక్షేత్రంలో ఉన్నాయి.

నానాపక్షిరుతై స్సేవ్యై రుద్యానై ర్నన్దనోపమైః ।
ఫలభారానతై ర్వృక్షై స్సర్వసత్త్వసముత్కరైః ॥ 44 ॥

ఏకామ్రక్షేత్రంలో నందనవనం వంటి ఉద్యానవనాలు ఉన్నాయి. ఆ ఉద్యానవనాలు రకరకాల పక్షుల అరుపులతో నిండిఉన్నాయి. అక్కడ చెట్లు పండ్లబరువుతో వంగిపోయిఉన్నాయి. అన్నివిధాలైన ప్రాణులూ అక్కడ నివసిస్తాయి.

చకోరై శ్శతపత్రైశ్చ భృఙ్గరాజైశ్చ కోకిలైః ।
కలవిఙ్కై ర్మయూరైశ్చ ప్రియపుత్రై శ్శుకై స్తథా ॥ 45 ॥

జీవంజీవకహారీతైశ్చాతకై ర్వనవేష్టితైః ।
నానాపక్షిగణై శ్చాన్యైః కూజద్భి ర్మధురస్వరైః ॥ 46 ॥

వెన్నెలపక్షులు, సారసపక్షులు, గండుతుమ్మెదలు, కోకిలలు, పిచ్చుకలు, నెమళ్లు, ప్రియపుత్రం అనేపేరు గలిగినపక్షులు, చిలుకలు, వెన్నెలపక్షులు, వన్నెపక్షులు, పావురాలు, వానకోయిలలు, ఇంకా ఇతరమైన రకరకాల పక్షులు ఆ ఉద్యానవనాలలో మధురంగా కూస్తూ ఆ సందడిగా తిరుగుతుంటాయి.

దీర్ఘికాభి స్తడాగైశ్చ పుష్కరీభిశ్చ వాపిభిః ।
నానాజలాశయైః పుణ్యైః పద్మినీఖణ్డమణ్డితైః ॥ 47 ॥

ఆక్షేత్రంలో దిగుడుబావులు, చెరువులు, కోనేరులు, బావులు, అనేకవిధమైన నీటిపట్టులు ఉన్నాయి. అవి అన్నీ పుణ్యప్రదాలు. అన్నీ తామరపూలతో అందంగా ఉన్నాయి.

సరాంసి చ మనోజ్ఞాని ప్రసన్నసలిలాని చ ।
కుముదైః పుణ్డరీకైశ్చ తథా నీలోత్పలై శ్శుభైః ॥ 48 ॥

అక్కడిసరస్సులు చాల మనోహరంగా ఉంటాయి. అందులోని నీళ్లు స్వచ్ఛంగా ఉంటాయి. ఇంకా ఆ సరస్సులలో తెల్లకలువలు (ఎఱ్ఱదామరలు), తెల్లతామరలు, మంచి నల్లకలువలు, విస్తారంగా ఉంటాయి.

కాదమ్బై శ్చక్రవాకైశ్చ తథైవ జలకుక్కుటైః ।
కారణ్డవైః ప్లవై ర్హంసై స్తథాఽన్యై ర్జలచారిభిః ॥ 49 ॥

ఆ సరస్సులలో కలహంసలు (ముక్కు, కాళ్లు, రెక్కలు పొగరంగులో ఉండేహంసలు), జక్కవపక్షులు, నీటికోళ్లు, కన్నెలేడిపిట్టలు, నీటికాకులు, హంసలు, ఇంకా అనేకవిధమైన నీటిపక్షులు మనోహరంగా ఉన్నాయి.

ఏవం నానావిధై ర్వృక్షైః పుష్పై ర్నానావిధై ర్వరైః ।
నానాజలాశయైః పుణ్యై శ్శోభితం తత్ సమన్తతః ॥ 50 ॥

ఈవిధంగా రకరకాలైన చెట్లతోనూ, శ్రేష్ఠమైన రకరకాలపూలతోనూ, పుణ్యప్రదమైన రకరకాల జలాశయాల తోనూ, ఆఏకామ్రక్షేత్రం మొత్తం మనోహరంగా ఉంది.

ఆస్తే తత్ర స్వయం దేవః కృత్తివాసా వృషధ్వజః ।
హితాయ సర్వలోకస్య భుక్తిముక్తిప్రద శ్శివః ॥ 51 ॥

అక్కడ స్వామి పరమేశ్వరుడు. (గజ)చర్మాన్ని వస్త్రంగా ధరించాడు. ఆస్వామి ధ్వజం మీద వృషభం గుర్తు ఉంటుంది. భోగాలనూ, మోక్షాన్నీ ప్రసాదిస్తాడు. ఆస్వామి ఈ లోకంలోనివారికందరికీ మేలు చేయడం కోసం ఆ పుణ్యక్షేత్రంలో స్వయంగా కోరివచ్చి, నెలకొన్నాడు.

పృథివ్యాం యాని తీర్థాని సరితశ్చ సరాంసి చ ।
పుష్కరిణ్య స్తడాగాని వాప్యః కూపాశ్చ సాగరాః ॥ 52 ॥

తేభ్యః పూర్వం సమాహృత్య జలబిన్దూన్ పృథక్ పృథక్ ।
సర్వలోకహితార్థాయ రుద్ర స్సర్వసురై స్సహ ॥ 53 ॥

తీర్థం బిన్దుసరో నామ తస్మిన్ క్షేత్రే ద్విజోత్తమాః ।
చకార ఋషిభి స్సార్థం తేన బిన్దుసర స్స్మృతమ్ ॥ 54 ॥

బ్రాహ్మణోత్తములారా, పూర్వం ఒకానొకప్పుడు లోకాలకు అన్నింటికి మేలు కలగడంకోసం, పరమేశ్వరుడు దేవతలందరితో కలిసి, ఈభూమిమీద ఉన్న అన్నిపుణ్యతీర్థాలు, నదులు, సరస్సులు, కోనేరులు, చెరువులు, దిగుడు బావులు, మామూలుబావులు, సముద్రాల నుండి ప్రత్యేకంగా నీటిబిందువులను (సార మయినజలాలను) తీసుకుని వచ్చి, ఆపుణ్యక్షేత్రంలో మహర్షులసహకారంతో, బిందుసరస్సు అనేపేరుతో ఒకపుణ్యతీర్థాన్ని ఏర్పాటుచేశాడు. అందుచేత(అన్నిపుణ్యతీర్థాలలోని జలబిందువులు కలసి ఏర్పడిన సరస్సు కావడంచేత) దానికి బిందుసరం అనేపేరు కలిగింది.

అష్టమ్యాం బహులే పక్షే మార్గశీర్షే ద్విజోత్తమాః ।
య స్తత్ర యాత్రాం కురుతే విషువే విజితేన్ద్రియః ॥ 55 ॥

బ్రాహ్మణోత్తములారా, మార్గశిరమాసంలో కృష్ణపక్షంలో అష్టమినాడు, అలాగే విషువంనాడు (రాత్రింబగళ్లు సమపరిమాణంలో ఉండేరోజు, సూర్యుడు తులా మేషరాశులలో సంక్రమించినరోజు) ఏకామ్రక్షేత్రానికి తీర్థయాత్రగా వెళ్లాలి. ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవాలి.

విధివద్ బిన్దుసరసి స్నాత్వా శ్రద్ధాసమన్వితః ।
దేవాన్ ఋషీన్ మనుష్యాంశ్చ పితౄన్ సన్తర్ప్య యత్నతః ॥ 56 ॥

బిందుసరస్సులో విధివిధానంతో శ్రద్ధగా స్నానం చేయాలి. తరువాత దేవతలకూ, ఋషులకూ, పితరులకూ, తర్పణం విడిచిపెట్టాలి (దేవ, ఋషి, పితృతర్పణాలు చేయాలి).

తిలోదకేన విధినా నామగోత్రవిధానవిత్ ।
స్నాత్వైవం విధివత్ తత్ర సోఽశ్వమేధఫలం లభేత్ ॥ 57 ॥

ఆ బిందుసరస్సు తీరంలో శాస్త్రోక్తమైన పద్ధతిలో శ్రద్ధగా నల్లని నువ్వులతో పితరులకు తర్పణం ఇవ్వాలి. పితృదేవతల నామాలను గోత్రాలను బంధుత్వం మొదలైన వివరాలను తెలుసుకునిఉండాలి. (వారి నామగోత్రాదులను ఉటంకిస్తూ తర్పణలు ఇవ్వాలి.) పద్ధతిప్రకారం బిందుసరంలో స్నానం (దేవ ఋషి పితృతర్పణం) చేసినవాడు అశ్వమేధయాగం చేసినపుణ్యఫలితాన్ని పొందుతాడు.

గ్రహోపరాగే విషువే సఙ్క్రాన్త్యా మయనే తథా ।
యుగాదిషడశీత్యాం చ తథాన్యత్ర శుభే తిథౌ ॥ 58 ॥

యే తత్ర దానం విప్రేభ్యః ప్రయచ్ఛన్తి ధనాదికమ్ ।
అన్యతీర్థా చ్ఛతగుణం ఫలం తే ప్రాప్నువన్తి వై ॥ 59 ॥

ఆ బిందుసరం తీరంలో సూర్య, చంద్ర గ్రహణాలసమయంలోనూ, విషువంనాడు, సూర్యుడు ఆయా (పన్నెండు) రాశులలో సంక్రమించే దినాలలోనూ, ఉత్తర, దక్షిణాయనకాలాలలోనూ, కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు ప్రారంభమైన తిథులలోనూ, తులాప్రవేశం మొదలుకొని ప్రతి 86 వ రోజున, అలాగే ఇంకా ఇతరమైన పుణ్యదినాలలోనూ, ధనం మొదలైనవాటిని బిందుసరం తీరంలో బ్రాహ్మణులకు దానం చేయాలి. బిందుతీర్థంలో దానం చేయడంవల్ల, మిగిలిన పుణ్యతీర్థాలలో దానం చేసినదానికి నూరురెట్లు అధికమైన ఫలితాన్ని పొందుతారు.

పిణ్డం యే సమ్ప్రయచ్ఛన్తి పితృభ్య స్సరస స్తటే ।
పితౄణా మక్షయాం తృప్తిం తే కుర్వన్తి న సంశయః ॥ 60 ॥

ఆ బిందుసరం తీరంలో పితృదేవతలకు పిండప్రదానం చేసినవారు తమపితరులకు సుస్థిర మయిన తృప్తిని గలిగిస్తున్నారు. సందేహం లేదు.

తత శ్శమ్భో ర్గృహం గత్వా వాగ్యత స్సంయతేన్ద్రియః ।
ప్రవిశ్య పూజయే చ్ఛర్వం కృత్వా తం త్రిః ప్రదక్షిణమ్ ॥ 61 ॥

ఆ తరువాత పరమేశ్వరుడి ఆలయానికి వెళ్లాలి. వ్యర్థ మయినమాటలు మాట్లాడకూడదు. ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవాలి. ఆలయంలో ప్రవేశించిన తరువాత ముందుగా పరమేశ్వరుడికి (ప్రధానాలయానికి) మూడుసార్లు ప్రదక్షిణం చేయాలి. తరువాత ఏకామ్రేశ్వరుడిని చక్కగా పూజించాలి.

ఘృతక్షీరాదిభి స్స్నానం కారయిత్వా భవం శుచిః ।
చన్దనేన సుగన్ధేన విలిప్య కుసుమేన చ ॥ 62 ॥

తాను శుచిగా ఉండి, ఏకామ్రేశ్వరుడికి ఆవునేయి, ఆవుపాలు, మొదలైన(పంచామృతాలు) వాటితో స్నానం చేయించాలి. తరువాత పరిమళభరితమైన మంచిగంధాన్ని పూవుకు అద్ది, ఆపూవుతో పరమేశ్వరుడికి గంధం పూయాలి.

తత్ర సమ్పూజయే ద్దేవం చన్ద్రమౌలిముమాపతిమ్ ।
పుష్పై ర్నానావిధై ర్మేధ్యై ర్బిల్వార్కకమలాదిభిః ॥ 63 ॥

తరువాత మారేడుదళాలతోనూ, జిల్లేడు, పద్మాలు మొదలైన పూవులతోనూ, ఇంకా పవిత్రమైన రకరకాల పూలతోనూ చంద్రశేఖరుడైన పార్వతీపతిని శ్రద్ధగా పూజించాలి.

ఆగమోక్తేన మన్త్రేణ వేదోక్తేన చ శఙ్కరమ్ ।
అదీక్షితస్తు నామ్నైవ మూలమన్త్రేణ చార్చయేత్ ॥ 64 ॥

స్మృతులలో చెప్పబడిన మంత్రాలతోనూ, వేదంలో చెప్పబడిన మంత్రాలతోనూ ఏకామ్రేశ్వరుడిని పూజించాలి. దీక్ష లేనివాడు కేవలం శివనామంతోనే పూజ చేయవచ్చు. మూల(పంచాక్షరీ)మంత్రంతో కూడ శివుడిని అర్చించవచ్చు.

ఏవం సమ్పూజ్య తం దేవం గన్ధపుష్పామ్బరాదిభిః ।
ధూపదీపైశ్చ నైవేద్యై రుపహారై స్తథా స్తవైః ॥ 65 ॥

ఈవిధంగా గంధం, పుష్పం, వస్త్రం, మొదలైన వాటితోనూ, ధూపం, దీపం, నైవేద్యం, కానుకలు, స్తోత్రాలు మొదలైన వాటితోనూ పరమేశ్వరుడిని చక్కగా పూజించాలి.

దణ్డవత్ ప్రణిపాతైశ్చ గీతై ర్వాద్యై ర్మనోహరైః ।
నృత్యజప్యనమస్కారై ర్జయశబ్దైః ప్రదక్షిణైః ॥ 66 ॥

కఱ్ఱలాగా శరీరం మొత్తం నేలకు ఆనుకునేవిధంగా బోరగిలపడి, శివుడికి సాష్టాంగనమస్కారాలు చేయాలి. శివుడిని గురించిన పాటలు పాడాలి. వివిధమైన వాద్యాలను మనోహరంగా వాయించాలి. నాట్యం చేయాలి. శివమంత్రాలను జపించాలి. జయ జయ ధ్వానాలు చేయాలి. ప్రదక్షిణలు చేయాలి. నమస్కారాలు చేయాలి.

ఏవం సమ్పూజ్య విధివద్ దేవదేవ ముమాపతిమ్ ।
సర్వపాపవినిర్ముక్తా రూపయౌవనగర్వితాః ॥ 67 ॥

దేవతలకు దేవుడైన ఏకామ్రేశ్వరుడికి ఈవిధంగా, శాస్త్రోక్తమైన ప్రకారంలో పూజలు చేసినవాడికి పాపాలు అన్నీ నశించిపోతాయి. ఉత్తమమైనరూపమూ, మంచియౌవనంలో వయసు, చక్కగా ఏర్పడతాయి.

కులైకవింశ ముద్ధృత్య దివ్యాభరణభూషితాః ।
యజ్వానో దానశీలాశ్చ పృథివ్యాః పతయ స్తథా ॥ 68 ॥

ఈ విధంగా ఏకామ్రేశ్వరుడిని పూజించినవారు తమకులంలో ఇరవైఒక్కతరాలవారిని నరకం మొదలైన అధోలోకాలనుండి ఉద్ధరిస్తారు.(వారికి ఉత్తమలోకాలు గలుగుతాయి.) మనోహరమైన ఆభరణాలను పొందుతారు. యజ్ఞాలు చేస్తారు. నిరంతరం దానం చేయాలనే ఉత్తమగుణం కలుగుతుంది. భూపతులు (రాజులు) అవుతారు.

ముక్తీశ్వరఞ్చ సిద్ధేశం స్వర్ణజాలేశ్వరం తథా ।
పరమేశ్వరం చ విఖ్యాతం సూక్ష్మం చామ్రాతికేశ్వరమ్ ॥ 69 ॥

యే పశ్యన్త్యర్చయిత్వా చ స్నాత్వా బిన్దుసరోఽమ్భసి ।
సౌవర్ణేన విమానేన కిఙ్కిణీజాలమాలినా ॥ 70 ॥

ఉపగీయమానా గన్ధర్వై రప్సరోభి రలఙ్కృతాః ।
ద్యోతయన్తో దిశ స్సర్వా శ్శివలోకం వ్రజన్తి తే ॥ 71 ॥

ముక్తీశ్వరుడు, సిద్ధేశ్వరుడు, స్వర్ణజాలేశ్వరుడు, పరమేశ్వరుడు, అయిన ఏకామ్రేశ్వరుడిని నిశితంగా దర్శించినవారు, పూజించినవారు, బిందుసరం నీటిలో స్నానం చేసినవారు, చిరుగంటలతో సమూహముల మాలలతో కూడిన బంగారు విమానంమీద, గంధర్వులు గానం చేస్తుండగా, అప్సరసలు సేవిస్తుండగా, దిక్కులను వెలిగిస్తూ శివలోకానికి చేరుకుంటారు.

భుక్త్వా తత్ర సుఖం విప్రా మనసః ప్రీతిదాయకమ్ ।
తల్లోకవాసిభి స్సార్ధం యావదాభూతసంప్లవమ్ ॥ 72 ॥

బ్రాహ్మణులారా, వారు శివలోకంలో నివసించేవాళ్లతో కలిసి, సృష్టి సమస్తం నశించిపోయే(ఆత్యంతిక) ప్రళయం వరకు, మనసుకు ఆనందం కలిగించే సుఖం అనుభవిస్తారు.

తత స్తస్మాదిహాయాతాః పృథివ్యాం పుణ్యసంక్షయే ।
జాయన్తే యోగినాం గేహే చతుర్వేదా ద్విజోత్తమాః ॥
యోగం పాశుపతం ప్రాప్య తతో మోక్షమవాప్నుయుః ॥ 73 ॥

బ్రాహ్మణోత్తములారా, తమపుణ్యఫలం అంతా నశించిపోయినతరువాత శివలోకంనుండి భూలోకానికి తిరిగి వస్తారు. ఇక్కడ యోగుల ఇండ్లలో జన్మిస్తారు. నాలుగువేదాలలోనూ పండితులు అవుతారు. తరువాత పాశుపతయోగాన్ని పొంది, ఆ తరువాత మోక్షానికి చేరుకుంటారు.

శయనోత్థాపనేచైవ సఙ్క్రాన్త్యామయనే తథా ।
అశోకాఖ్యాం తథాఽష్టమ్యాం పవిత్రారోపణే తథా ॥ 74 ॥

యే చ పశ్యన్తి తం దేవం కృత్తివాసస ముత్తమమ్ ।
విమానే నార్కవర్ణేన శివలోకం వ్రజన్తి తే ॥ 75 ॥

శయనైకాదశి (ఆషాఢశుద్ధ ఏకాదశి), ఉత్థానైకాదశి (కార్తికశుద్ధ ఏకాదశి)తిథులలోనూ, (ద్వాదశరాశులలో సూర్యుడు) సంక్రమణ(సూర్యుడు ఆయారాశులలోకి ప్రవేశించే) సమయాలలోనూ, ఉత్తర, దక్షిణ అయనాలలోనూ, అశోకాష్టమి(చైత్రశుద్ధ అష్టమి)లోనూ, యజ్ఞోపవీతదానఉత్సవ సమయంలోనూ, చర్మాంబరధరుడు, ఉత్తముడూ అయిన ఆ పరమేశ్వరుడిని దర్శించినవారు సూర్యతేజస్సు గలిగిన విమానంమీద శివలోకానికి వెళ్తారు.

సర్వకాలేఽపి తం దేవం యే పశ్యన్తి సుమేధసః ।
తేఽపి పాపవినిర్ముక్తా శ్శివలోకం వ్రజన్తి వై ॥ 76 ॥

ఎల్లవేళల ఆ పరమేశ్వరుడిని దర్శించే జ్ఞానులు గూడ పాపాలు నశించి, శివలోకానికి చేరుకుంటారు.

దేవస్య పశ్చిమే పూర్వే దక్షిణే చోత్తరే తథా ।
యోజనద్వితయం సార్ధం క్షేత్రం తద్ భుక్తిముక్తిదమ్ ॥ 77 ॥

ఏకామ్రేశ్వరుడికి పడమరవైపూ, తూర్పుదిశలోనూ, దక్షిణదిక్కుగానూ, ఉత్తరదిక్కులోనూ రెండుయోజనాల మేర (16మైళ్లవరకు), ఉన్నప్రదేశం అంతా (శివక్షేత్రం) భోగమోక్షాలను ప్రసాదిస్తుంది.

తస్మిన్ క్షేత్రవరే లిఙ్గం భాస్కరేశ్వరసంజ్ఞితమ్ ।
పశ్యన్తి యే తు తం దేవం స్నాత్వా కుణ్డే మహేశ్వరమ్ ॥ 78 ॥

ఆదిత్యేనార్చితం పూర్వం దేవదేవం త్రిలోచనమ్ ।
సర్వపాపవినిర్ముక్తా విమానవర మాస్థితాః ॥ 79 ॥

ఉపగీయమానా గన్ధర్వై శ్శివలోకం వ్రజన్తి తే ।
తిష్ఠన్తి తత్ర ముదితాః కల్పమేకం ద్విజోత్తమాః ॥ 80 ॥

ఈ గొప్ప పుణ్యక్షేత్రంలో (ఇంకొక)శివలింగం ఉంది. దానిపేరు భాస్కరేశ్వరుడు. పూర్వం ఈ శివలింగాన్ని భాస్కరుడు పూజించాడు. (అందుకే ఈ ఈశ్వరుడు భాస్కరేశ్వరుడు). అక్కడి కోనేరులో స్నానం చేసి, దేవతలకుదేవుడు, ముక్కంటి అయిన భాస్కరేశ్వరుడిని దర్శించినవారికి పాపాలు అన్నీ నశించిపోతాయి. ఉత్తమమైన విమానం ఎక్కి, గంధర్వులు గానం చేస్తుండగా, శివలోకానికి చేరుకుంటారు. బ్రాహ్మణోత్తములారా, ఒక కల్పంకాలం(కృత, త్రేత,ద్వాపర,కలియుగాలు నాలుగూ వేలుపర్యాయాలు నడచినకాలం–ఇది బ్రహ్మకు ఒకపగలు. రాత్రి కూడ ఇదే పరిమాణం. ఇలాంటిరోజులతో వందసంవత్సరాలు బ్రహ్మ ఆయుర్దాయం) ఆశివలోకంలో ఆనందంగా ఉండిపోతారు.

భుక్త్వా తు విపులాన్ భోగాన్ శివలోకే మనోరమాన్ ।
పుణ్యక్షయాదిహాయాతా జాయన్తే ప్రవరే కులే ॥ 81 ॥

శివలోకంలో మనసుకు నచ్చినభోగాలు విస్తారంగా అనుభవిస్తారు. పుణ్యఫలం అయిపోయిన తరువాత, తిరిగి భూలోకానికి వస్తారు. ఇక్కడ ఉత్తమమైనజాతిలో పుట్టారు.

అథవా యోగినాం గేహే వేదవేదాఙ్గపారగాః ।
ఉత్పద్యన్తే ద్విజవరా స్సర్వభూతహితే రతాః ॥ 82 ॥

బ్రాహ్మణవరేణ్యులారా, అలా కానిపక్షంలో వారు భూలోకంలో యోగుల ఇంటిలో జన్మిస్తారు. వేదాలు, వేదాంగాలు సమగ్రంగా తెలిసినవారవుతారు. చరాచరపదార్థాలు అన్నింటికీ శ్రద్ధగా హితం చేస్తారు.

మోక్షశాస్త్రార్థకుశలా స్సర్వత్ర సమబుద్ధయః ।
యోగం శమ్భో ర్వరం ప్రాప్య తతో మోక్షం హి యాన్తి వై ॥ 83 ॥

వేదాంతశాస్త్రంలో నేర్పరులు అవుతారు. అన్నింట సమానమైన బుద్ధి (సుఖదుఃఖాదిద్వంద్వాలకు అతీత మైనది) కలిగిఉంటారు. పరమేశ్వరుడు వారికి యోగాన్ని వరంగా ప్రసాదిస్తాడు. దానితో మోక్షస్థితికి చేరుకుంటారు.

తస్మిన్ క్షేత్రవరే పుణ్యే లిఙ్గం యద్దృశ్యతే ద్విజాః ।
పూజ్యాపూజ్యం చ సర్వత్ర వనే రథ్యాన్తరేఽపి వా ॥ 84 ॥

చతుష్పథే శ్మశానే వా యత్ర కుత్ర చ తిష్ఠతి ।
దృష్ట్వా తల్లిఙ్గ మవ్యగ్రం శ్రద్ధయా సుసమాహితః ॥ 85 ॥

బ్రాహ్మణులారా, శ్రేష్ఠమైన ఆ పుణ్యక్షేత్రంలో పూజింపదగినది అయినా, కాకపోయినా, అడవులలో గాని, రాచబాటలో గాని, నాలుగువీథులకూడళ్లలో గాని, వల్లకాటిలో గాని, ఏచోటనయినా, శివలింగం కనబడితే, దానిని, శ్రద్ధగా దృఢంగా మనసుపెట్టి (పూజించాలి.) ఆ శివలింగం శాశ్వతమైన దని గ్రహించాలి.

స్నాపయిత్వా తు తం భక్త్యా గన్ధైః పుష్పై ర్మనోహరైః ।
ధూపై ర్దీపై స్సనైవేద్యై ర్నమస్కారై స్తథా స్తవైః ॥ 86 ॥

దణ్డవత్ ప్రణిపాతై శ్చ నృత్యగీతాదిభి స్తథా ।
సమ్పూ జ్యైవం విధానేన శివలోకం వ్రజే న్నరః ॥ 87 ॥

ఆశివలింగానికి భక్తితో అభిషేకం చేయాలి. పరిమళగంధాలతోనూ, మనోహర మయిన పుష్పాలతోనూ, వివిధమైన ధూపాలతోనూ, రకరకాల దీపాలతోనూ, పలురకాలైన నైవేద్యాలతోనూ, నమస్కారాలతోనూ, స్తోత్రాలతోనూ, సాష్టాంగ దండప్రణామాలతోనూ, నాట్యాలతోనూ, గానాలు మొదలైనవాటితో శాస్త్రోక్తమైన పద్ధతిలో పూజించాలి. ఆవిధమైన లింగపూజలవలన మానవుడు శివలోకానికి వెళ్తాడు.

నారీ వా ద్విజశార్దూలా స్సమ్పూజ్య శ్రద్ధయాన్వితా ।
పూర్వోక్తం ఫలమాప్నోతి నాత్ర కార్యా విచారణా ॥ 88 ॥

బ్రాహ్మణోత్తములారా, స్త్రీ అయినా, ఈవిధంగా ఆక్షేత్రంలో శివలింగాన్ని శ్రద్ధతో పూజిస్తే, ఇంతకు ముందు చెప్పిన ఫలితాన్ని (శివలోకప్రాప్తి) పొందుతుంది. ఇందులో సందేహం లేదు. (స్త్రీలు కూడ శివలింగాన్ని పూజించవచ్చును.)

కశ్శక్నోతి గుణాన్ వక్తుం సమగ్రాన్ మునిసత్తమాః ।
తస్య క్షేత్రవరస్యాథ ఋతే దేవా న్మహేశ్వరాత్ ॥ 89 ॥

మునివరులారా, ఆ గొప్పపుణ్యక్షేత్రం మహిమలను పూర్తిగా చెప్పడం ఆమహేశ్వరుడికి తప్ప, ఇంక ఎవ్వరికీ సాధ్యం కాదు.

తస్మిన్ క్షేత్రోత్తమే గత్వా శ్రద్ధయాశ్రద్ధయాపి వా ।
మాధవాదిషు మాసేషు నరో వా యది వాఙ్గనా ॥ 90 ॥

యస్మిన్ యస్మిన్ స్తిథౌ విప్రా స్స్నాత్వా బిన్దుసరోఽమ్భసి ।
పశ్యే ద్దేవం విరూపాక్షం దేవీం చ వరదాం శివామ్ ॥ 91 ॥

గణం చణ్డం కార్తికేయం గణేశం వృషభం తథా ।
కల్పద్రుమం చ సావిత్రీం శివలోకం స గచ్ఛతి ॥ 92 ॥

పురుషుడైనా, స్త్రీ అయినా, శ్రద్ధతో కానీ, శ్రద్ధ లేకుండా కానీ, వైశాఖం మొదలైనమాసాలలో ఏదో ఒకనాడు, ఆనాడు తిథి మంచిదైనా, కాకపోయినా, ఉత్తమమైన ఆ ఏకామ్రేశ్వరపుణ్యక్షేత్రానికి వెళ్లాలి. అక్కడ

బిందుసరంలో స్నానం చేయాలి. తరువాత విరూపాక్షదేవుడినీ, వరాలు ఇచ్చేపార్వతీదేవినీ, ప్రమథగణాలనూ, చండుడినీ, కుమారస్వామినీ, గణపతినీ, వృషభాన్నీ, కల్పవృక్షాన్నీ, సావిత్రినీ, దర్శించాలి. ఆవిధంగా చేసినవాడు (ఆమె) శివలోకానికి వెళ్తాడు.

స్నాత్వా చ కాపిలే తీర్థే విధివత్ పాపనాశనే ।
ప్రాప్నో త్యభిమతాన్ కామాన్ శివలోకం స గచ్ఛతి ॥ 93 ॥

అక్కడ ఉన్న కపిలతీర్థంలో యథావిధిగా స్నానం చేయాలి. ఆతీర్థం సమస్తమైన పాపాలనూ నాశనం చేస్తుంది. దానిలో స్నానం చేసినవారికి కావలసిన కోరికలను ప్రసాదిస్తుంది. వాడు చివరికి శివలోకానికి వెళ్తాడు.

య స్తత్ర తీర్థే విధివత్ కరోతి నియతేన్ద్రియః ।
కులైకవింశముద్ధృత్య శివలోకం స గచ్ఛతి ॥ 94 ॥

ఆ ఏకామ్రపుణ్యక్షేత్రంలో ఇంద్రియనిగ్రహంతో, స్నానపూజాదులు యథావిధిగా చేసినవాడు తన వంశంలో ఇరవైఒక్క తరాలవారిని (తండ్రివైపు ఏడుతరాలవారు, తల్లివైపు ఏడుతరాలవారు, భార్యవైపు ఏడుతరాలవారు,) నరకాదిబాధలనుండి ఉద్ధరిస్తాడు. వాళ్లతో సహా తాను శివలోకానికి వెళ్తాడు.

ఏకామ్రకే శివక్షేత్రే వారాణసీ సమే శుభే ।
స్నానం కరోతి య స్తత్ర మోక్షం స లభతే ధ్రువమ్ ॥ 95 ॥

కాశీనగరంతో సమానమైన ఏకామ్రం అనే శుభప్రదమైన శివక్షేత్రంలో స్నానం చేసినవాడు నిశ్చయంగా మోక్షాన్ని పొందుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భృషిసంవాద ఏకామ్రక్షేత్రమాహాత్మ్యవర్ణనం నామైకోనచత్వారింశోఽధ్యాయః ॥ 39 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషిసంవాదంలో ఏకామ్రక్షేత్రమాహాత్మ్యవర్ణనం అనే ముప్పైతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.



చత్వారింశోఽధ్యాయః – నలబైయవ అధ్యాయం

ఉత్కలక్షేత్రవర్ణనమ్ – ఉత్కలక్షేత్రవర్ణనం

బ్రహ్మోవాచ:– మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

విరజే విరజా మాతా బ్రహ్మాణీ సమ్ప్రతిష్ఠితా ।
యస్యా స్సన్దర్శనా న్మర్త్యః పునాత్యాసప్తమం కులమ్ ॥ 1 ॥

విరజం అనే పుణ్యక్షేత్రంలో విరజ అనేపేరుతో సరస్వతీమాత ప్రతిష్ఠింపబడిఉంది. ఆమెను దర్శించిన మానవుడు ఏడుతరాలవరకు తన వంశంలో వారిని అందరినీ తరింపజేస్తాడు.

సకృద్దృష్ట్వా తు తాం దేవీం భక్త్యాఽఽపూజ్య ప్రణమ్య చ ।
నర స్స్వవంశ ముద్ధృత్య మమ లోకం స గచ్ఛతి ॥ 2 ॥

ఆ విరజామాతను ఒక్కసారి దర్శించి, భక్తితో పూజించి, సాష్టాంగంగా నమస్కరించిన మానవుడు తన వంశం అంతటినీ ఉద్ధరించి (నరకాదిలోకాలలో పడకుండా చేసి,వారితో సహా),తాను బ్రహ్మలోకానికి చేరుకుంటాడు.

అన్యాశ్చ తత్ర తిష్ఠన్తి విరజే లోకమాతరః ।
సర్వపాపహరా దేవ్యో వరదా భక్తవత్సలాః ॥ 3 ॥

విరజ క్షేత్రంలో విరజామాత మాత్రమే కాక, ఇంకా వేరే లోకమాతలు కూడా (ప్రతిష్ఠింపబడి) ఉన్నారు. వారు కూడ అందరూ అన్ని పాపాలను పోగొట్టారు. వరాలను ప్రసాదిస్తారు. భక్తులమీద వాత్సల్యం కలిగినవారు.

ఆస్తే వైతరణీ తత్ర సర్వపాపహరా నదీ ।
యస్యాం స్నాత్వా నరశ్రేష్ఠ స్సర్వపాపైః ప్రముచ్యతే ॥ 4 ॥

విరజక్షేత్రంలో వైతరణి అనే నది ఉన్నది. అది సమస్తమైన పాపాలను హరిస్తుంది. ఆనదిలో స్నానం చేసిన మానవుడి పాపాలు అన్నీ నశించిపోతాయి.

ఆస్తే స్వయమ్భూ స్త త్రైవ క్రోడరూపీ హరి స్స్వయమ్ ।
దృష్ట్వా ప్రణమ్య తం భక్త్యా నరో విష్ణుపదం వ్రజేత్ ॥ 5 ॥

ఆ క్షేత్రంలో శ్రీహరి స్వయంభువుగా వరాహరూపంలో వెలిశాడు. ఆ మూర్తిని భక్తితో దర్శించి, ప్రణమిల్లిన మానవుడు విష్ణులోకానికి వెళ్తాడు.

కాపిలే గోగ్రహే సోమే తీర్థే చాలాబుసంజ్ఞితే ।
మృత్యుఞ్జయే క్రోడతీర్థే వాసుకే సిద్ధకేశ్వరే ॥ 6 ॥

తీర్థేష్వేతేషు మతిమాన్ విరజే సంయతేన్ద్రియః ।
గత్వాష్టతీర్థం విధివత్ స్నాత్వా దేవాన్ ప్రణమ్య చ ॥ 7 ॥

సర్వపాపవినిర్ముక్తో విమానవర మాస్థితః ।
ఉపగీయమానో గన్ధర్వైర్మమ లోకే మహీయతే ॥ 8 ॥

విరజ క్షేత్రంలో 1. కపిలతీర్థం, 2. గోగ్రహతీర్థం, 3. సోమతీర్థం, 4. ఆలాబుతీర్థం, 5. మృత్యుంజయతీర్థం, 6. క్రోడతీర్థం, 7.వాసుకతీర్థం, 8.సిద్ధకేశ్వరతీర్థం, అనే అష్టతీర్థాలు ఉన్నాయి. ఇంద్రియనిగ్రహం కలిగిన బుద్ధిమంతుడు విరజాక్షేత్రానికి వెళ్లాలి. అక్కడి పుణ్యతీర్థాలలో యథావిధిగా స్నానం చేయాలి. పిదప దేవతలకు ప్రణామం చేయాలి. అపుడు వాడిపాపాలు అన్నీ నశించిపోతాయి. అతడు ఉత్తమ మైనవిమానం ఎక్కి, గంధర్వులు గానం చేస్తుండగా, బ్రహ్మలోకానికి వెళ్లి, అక్కడ సత్కరింపబడతాడు.

విరజే యో మమ క్షేత్రే పిణ్డదానం కరోతి వై ।
స కరోత్యక్షయాం తృప్తిం పితౄణాం నాత్ర సంశయః ॥ 9 ॥

నా(బ్రహ్మక్షేత్రం-విరజ అనే పేరుతో బ్రహ్మేణి వెలసిన క్షేత్రం కాబట్టి బ్రహ్మక్షేత్రం) విరజక్షేత్రంలో పితృ దేవతలకు పిండప్రదానం చేయాలి. దానివల్ల పితరులకు శాశ్వతమైనతృప్తి కలుగుతుంది. ఇందులో సందేహం లేదు.

మమ క్షేత్రే మునిశ్రేష్ఠా విరజే యే కలేవరమ్ ।
పరిత్యజన్తి పురుషా స్తే మోక్షం ప్రాప్నువన్తి వై ॥ 10 ॥

మునివరేణ్యులారా! విరజామాత నెలకొన్నవిరజక్షేత్రంలో శరీరాన్ని విడిచిపెట్టినమానవులు తప్పకుండా మోక్షం పొందుతారు.

స్నాత్వా య స్సాగరే మర్త్యో దృష్ట్వా చ కపిలం హరిమ్ ।
పశ్యే ద్దేవీం చ వారాహీం స యాతి త్రిదశాలయమ్ ॥ 11 ॥

అక్కడ సముద్రంలో స్నానం చేయాలి. తరువాత అక్కడ ఉన్న శ్రీమహావిష్ణువును దర్శించాలి. అక్కడ నెలకొన్న విష్ణువును కపిలుడు అని పిలుస్తారు. ఆ తరువాత వారాహీదేవి దర్శనం చేసుకోవాలి. ఇలా చేసినమానవుడు స్వర్గలోకానికి వెళ్తాడు.

సన్తి చాన్యాని తీర్థాని పుణ్యా న్యాయతనాని చ ।
తత్సమాని మునిశ్రేష్ఠా వేదితవ్యాని తాని వై ॥ 12 ॥

మునివరులారా! విరజక్షేత్రంలో ఇవే కాక, ఇతరపుణ్యతీర్థాలూ, పవిత్రమైన దేవాలయాలూ ఇంకా చాలా ఉన్నాయి. అవి కూడ విరజానదీస్నాన సమమైన కపిల దర్శనముతో సమానమైన పుణ్యాన్ని ఇస్తుంది.

సముద్ర స్యోత్తరే తీరే తస్మిన్ దేశే ద్విజోత్తమాః ।
ఆస్తే గుహ్యం పరం క్షేత్రం ముక్తిదం పాపనాశనమ్ ॥ 13 ॥

విప్రవరులారా! ఆ ప్రదేశంలో సముద్రానికి ఉత్తరంవైపు ఒడ్డుమీద మరొక గొప్ప పుణ్యక్షేత్రం ఉన్నది. అది పాపాలను నాశనం చేస్తుంది. మోక్షాన్ని ఇస్తుంది.

సర్వత్ర వాలుకాకీర్ణం పవిత్రం సర్వకామదమ్ ।
దశయోజనవిస్తీర్ణం క్షేత్రం పరమదుర్లభమ్ ॥ 14 ॥

ఆక్షేత్రం నిండా కాలువలు ఉన్నాయి. అది చాల పవిత్రమైనది. అన్ని కోరికలు తీరుస్తుంది. పదియోజనాల మేర వ్యాపించి ఉంటుంది. ఇటువంటి పుణ్యక్షేత్రం మరొకటి ఎక్కడా దొరకదు.

అశోకార్జునపుంనాగై ర్వకులై స్సరలద్రుమైః ।
పనసై ర్నారికేలైశ్చ శాలై స్తాలైః కపిత్థకైః ॥ 15 ॥

అక్కడ అశోకం, జువ్వి, పున్నాగం, పొగడ, తెల్లతెగడ, పనస, కొబ్బరి, బొద్దుగ, తాటి, వెలగచెట్లు ఉన్నాయి.

చమ్పకైః కర్ణికారైశ్చ చూతబిల్వై స్సపాటలైః ।
కదమ్బై కోవిదారైశ్చ లకుచై ర్నాగకేసరైః ॥ 16 ॥

సంపెంగలు, కొండగోగులు, మామిడి, మారేడు, కలిగొట్టు, కడిమి, ఎఱ్ఱకాంచనం, గజనిమ్మ, నాగకేసరం చెట్లు, ఉన్నాయి.

సమీచామలకై ర్లోధ్రై ర్నారఙ్గై ర్ధవఖాదిరైః ।
సర్జభూర్జాశ్వకర్ణైశ్చ తమాలై ర్దేవదారుభిః ॥ 17 ॥

సముద్రపుఉసిరి, లొద్దుగచెట్లు, నారింజచెట్లు, ఉమ్మెత్త, చంద్ర, మద్ది, కొండరావివంటిచెట్టు, నల్లమద్ది, చీకటిచెట్లు, దేవదారు వృక్షాలు ఉన్నాయి.

మన్దారైః పారిజాతైశ్చ న్యగ్రోధాగురుచన్దనైః ।
ఖర్జూరామ్రాతకై స్సిద్ధై ర్ముచుకున్దై స్సకింశుకైః ॥ 18 ॥

మందారాలు, పారిజాతాలు, మఱ్ఱి, అగురు, చందనం చెట్లు, ఖర్జూరం చెట్లు, అంబాళ వృక్షాలు, నల్ల ఉమ్మెత్త, ముచుకుందం అనే పూలచెట్లు, మోదుగచెట్లు ఉన్నాయి.

అశ్వత్థై స్సప్తపర్ణైశ్చ మధుధారశుభాఞ్జనైః ।
శింశుపామలకై ర్నీపై ర్నిమ్బతిన్దువిభీతకైః ॥ 19 ॥

రావి, ఏడాకులఅరటి, ఇప్ప, మధుధారవృక్షాలు, శుభాంజనవృక్షాలు, శింశుప అనే పేరుగలచెట్లు, ఉసిరిక చెట్లు, నీలాశోక (కడిమి, నీరుకడిమి, మంకెన)వృక్షాలు, వేపచెట్లు, తుమ్మికిచెట్లు, తాటిచెట్లు ఉన్నాయి.

సర్వర్తుఫలగన్ధాఢ్యై స్సర్వర్తుకుసుమోజ్జ్వలైః ।
మనోహ్లాదకరై శ్శుభ్రై ర్నానావిహగనాదితైః ॥ 20 ॥

ఆక్షేత్రం అన్ని ఋతువులలోనూ ఉండే పండ్లు, పరిమళాలతోనూ, పూలతోనూ, నిండిఉన్నది. మనస్సుకు ఆహ్లాదం కలిగించే, స్వచ్ఛమైన రకరకాల పక్షుల కూతలతో కూడిఉన్నది.

శ్రోత్రరమ్యై స్సుమధురై ర్బలనిర్మదనేరితైః ।
మనసః ప్రీతిజనకైః శ్శబ్దై ఖగముఖేరితైః ॥ 21 ॥

అక్కడి పక్షులకంఠాలనుండి వెలువడిన ధ్వనులు తీయగా, చెవికి ఇంపుగా ఉన్నాయి. మన్మథభావాలను ప్రేరేపిస్తాయి. మనసుకు ప్రీతి కలిగిస్తున్నాయి.

చకోరై శ్శతపత్రై శ్చ భృఙ్గరాజై స్తథా శుకైః ।
కోకిలైః కలవిఙ్కై శ్చ హారీతై ర్జీవజీవకైః ॥ 22 ॥

ప్రియపుత్రై శ్చాతకైశ్చ తథాన్యై ర్మధురస్వరైః ।
శ్రోత్రరమ్యైః ప్రియకరైః కూజద్భిశ్చార్వధిష్ఠితైః ॥ 23 ॥

అక్కడ వెన్నెలపక్షులు, నెమళ్లు, గండుతుమ్మెదలు, చిలుకలు, కోకిలలు, పిచ్చుకలు, పావురాలు, వెన్నెలపక్షులు (ఇంతకు ముందు ఇక్కడే చకోరాలు పేర్కొనబడినాయి.), ప్రియపుత్రం అనేపక్షులు, వానకోయిలలు, ఇంకా ఇతర మయిన అనేకపక్షులు కొమ్మలపై ఉండి చక్కగా అరుస్తున్నాయి. వాటి కంఠధ్వనులు తీయగా ఉన్నాయి. చెవికి ఇంపుగా ఉన్నాయి. (మనసుకు) ప్రీతి కలిగిస్తున్నాయి.

కేతకీవనఖణ్డైశ్చ అతిముక్తై స్సకుబ్జకైః ।
మాలతీకున్దబాణైశ్చ కరవీరై స్సితేతరైః ॥ 24 ॥

మొగలిపూలతోటలు, మాధవీలతలు, ఉత్తరేణు, జాజి, మొల్ల, నల్లగోరింట, ఎఱ్ఱగన్నేరు,

జమ్బీరారుణకజోల్లై ర్దాడిమై ర్బీజపూరకైః ।
మాతులుఙ్గైః పూగఫలై ర్హిన్తాలైః కదలీవనైః ॥ 25 ॥

నిమ్మ(మరువం), పొన్న (జిల్లేడు), కంకోలవృక్షాలు, దానిమ్మ, మాదీఫలం, దబ్బచెట్లు, పోక, ఖర్జూరవిశేష వృక్షాలు,అరటితోటలు,

అన్యై శ్చ వివిధై ర్వృక్షైః పుష్పై శ్చాన్యై ర్మనోహరైః ।
లతావితానగుల్మైశ్చ వివిధైశ్చ జలాశయైః ॥ 26 ॥

ఇంకా అనేకమైన రకరకాలచెట్లు, మనోహరమైన రకరకాలపూలు, తీగలు, పూలపొదలు, అనేకవిధమైన నీటిపట్టులు అక్కడ ఉన్నాయి.

దీర్ఘికాభి స్తడాగై శ్చ పుష్కరిణీభిశ్చ వాపిభిః ।
నానాజలాశయైః పుణ్యైః పద్మినీఖణ్డమణ్డితైః ॥ 27 ॥

దిగుడుబావులు, చెరువులు, కోనేరులు, బావులు, పుణ్యప్రదమైనపెక్కునీటిపట్టులు ఉన్నాయి. తామరపూలతో నిండి, ఈ జలాశయాలు మనోహరంగా ఉన్నాయి.

సరాంసి చ మనోజ్ఞాని ప్రసన్నసలిలాని చ ।
కుముదైః పుణ్డరీకైశ్చ తథా నీలోత్పలై శ్శుభైః ॥ 28 ॥

సరస్సులు అందంగా ఉన్నాయి. వాటిలో నీళ్లు స్వచ్ఛంగా ఉన్నాయి. ఆ సరస్సులనిండా, తెల్లకలువలు, ఎఱ్ఱతామరలు, అలాగే మంచి నల్లగలువలు ఉన్నాయి.

కల్హారైః కమలైశ్చాపి అన్వితాని సమన్తతః ।
కాదమ్బై శ్చక్రవాకైశ్చ తథైవ జలకుక్కుటైః ॥ 29 ॥

సౌగంధికాలు (కొద్దిగా ఎరుపు, తెలుపురంగులో ఉండి బాగా పరిమళించేకలువ), ఎఱ్ఱతామరలు, అంతటా నిండిఉన్నాయి. కలహంసలు, జక్కవపక్షులు, నీటికోళ్ళు,

కారణ్డవైః ప్లవహంసైః కూర్మై ర్మత్స్యైశ్చ మద్గుభిః ।
దాత్యూహసారసాకీర్ణైః కోయష్టిబకశోభితైః ॥ 30 ॥

కన్నెలేడిపిట్టలు,ఈదులాడే హంసలు, తాబేళ్లు, చేపలు, నీటికాకులు, చాతకపక్షులు, బెగ్గురుపక్షులు, నీటిగంపపులుగులు, కొంగలు,

ఏతై శ్చాన్యైశ్చ కూజద్భి స్సమన్తా జ్జలచారిభిః ।
ఖగైర్జలచరై శ్చాన్యైః కుసుమైశ్చ జలోద్భవైః ॥ 31 ॥

ఇంకా ఇతర మయినపక్షులు ఆ ప్రదేశమంతటా మధురంగా కూస్తున్నాయి. అవి నీళ్లలో సంచరిస్తున్నాయి. అలాగే ఇంకా, నీళ్లలో తిరిగేపక్షులు, ఆకాశంలో ఎగిరేపక్షులు నీటిలో పుట్టిన పుష్పాలు అక్కడ విస్తరించి ఉన్నాయి.

ఏవం నానావిధై ర్వృక్షైః పుష్పైః స్థలజలోద్భవైః ।
గజైర్జలచరై శ్చాన్యై ర్భూషితం సుమనోహరమ్ ॥ 32 ॥

ఈ ప్రకారంగా అనేకవిధమైన చెట్లు, నేలమీద, నీటిలోనూ పుట్టినపుష్పాలు, నీటిలో సంచరించే (నీటి)ఏనుగులు, ఇంకా ఇతరజలచరాలతో ఆ ప్రదేశం అందంగా ఎంతో మనోహరంగా ఉన్నది.

బ్రహ్మచారిగృహస్థై శ్చ వానప్రస్థైశ్చ భిక్షుభిః ।
స్వధర్మనిరతై ర్వర్ణై స్తథాన్యై స్సమలఙ్కృతమ్ ॥ 33 ॥

బ్రహ్మచారులు, గృహస్థులు, వానప్రస్థులు, సన్న్యాసులు, అనే నాలుగువిధాలైన ఆశ్రమాలవారు కూడ తమతమ ఆశ్రమానికి విహితమైన కర్మలను ఆచరిస్తున్నారు. అలాగే మిగిలినవాళ్లు కూడ తమతమధర్మాలను ఆచరిస్తున్నారు. స్వధర్మాచరణపరాయణు లయిన మానవులతో ఆప్రదేశం ఎంతో గౌరవభరితంగా ఉంది.

హృష్టపుష్టజనాకీర్ణం నరనారీసమాకులమ్ ।
అశేషవిద్యానిలయం సర్వధర్మగుణాకరమ్ ॥ 34 ॥

అక్కడి జనాలు ఎప్పుడూ సంతోషంగా ఉంటారు. ఎంతో పుష్టిగా ఉంటారు. ఆడవారూ, మగవారూ సందడిగా ఉంటారు. సమస్తమైన చదువులకు ఆ ప్రదేశం స్థావరం. సమస్తమైన ధర్మాలూ, కర్మలూ అక్కడ పోగుపడిఉన్నాయి.

ఏవం సర్వగుణోపేతం క్షేత్రం పరమదుర్లభమ్ ।
ఆస్తే తత్ర మునిశ్రేష్ఠా విఖ్యాతః పురుషోత్తమః ॥ 35 ॥

మునివరులారా, ఈవిధంగా అన్నీ మంచిలక్షణాలతో కూడి ఉన్న ఇలాంటి పుణ్యక్షేత్రం ఇంక ఎక్కడా మళ్లీ దొరకదు. శ్రీమహావిష్ణువు అక్కడ చాల ప్రసిద్ధుడు. కోరిన కోరికలు నెరవేర్చేవాడుగా పేరుపొందాడు.

యావదుత్కలమర్యాదా దిక్క్రమేణ ప్రకీర్తితా ।
తావత్ కృష్ణప్రసాదేన దేశః పుణ్యతమో హి సః ॥ 36 ॥

ఉత్కలక్షేత్రం మహిమ కొంచెంగా దిఙ్మాత్రంగా చెప్పాను. శ్రీకృష్ణుడి అనుగ్రహం కారణంగా ఈక్షేత్రం పవిత్రమైన క్షేత్రాలన్నింటిలోకెల్ల మిక్కిలి పవిత్రం.

యత్ర తిష్ఠతి విశ్వాత్మా దేశే స పురుషోత్తమః ।
జగద్వ్యాపీ జగన్నాథ స్తత్ర సర్వం ప్రతిష్ఠితమ్ ॥ 37 ॥

విశ్వమే తనరూపం అయినవాడూ, పురుషశ్రేష్ఠుడూ, అన్ని లోకాలలోనూ నిండి ఉన్నవాడూ అయిన జగన్నాథస్వామి వెలసినచోట సమస్తమూ ఉంటాయనడంలో సందేహం లేదు.

అహం రుద్రశ్చ శక్రశ్చ దేవాశ్చాగ్నిపురోగమాః ।
నివసామో మునిశ్రేష్ఠా స్తస్మిన్ దేశే సదా వయమ్ ॥ 38 ॥

మునివరేణ్యులారా, నేను, రుద్రుడు, ఇంద్రుడు, శివుడు, అగ్నిదేవుడు, మొదలైనవారం అందరమూ, నిరంతరం ఆ పుణ్యక్షేత్రంలోనే స్థిరంగా నివసిస్తున్నాం.

గన్ధర్వాప్సరస స్సర్వాః పితరో దేవమానుషాః ।
యక్షా విద్యాధరా స్సిద్ధా మునయ శ్శంసితవ్రతాః ॥ 39 ॥

గంధర్వులు, అప్సరసలు, దేవతలు, పితృదేవతలు, మానవులు, యక్షులు, విద్యాధరులు, సిద్ధులు, మహామునులు, అందరూ నియమాలను పాటిస్తు అక్కడ జీవిస్తుంటారు.

ఋషయో వాలఖిల్యాశ్చ కశ్యపాద్యాః ప్రజేశ్వరాః ।
సుపర్ణాః కింనరా నాగా స్తథాన్యే స్వర్గవాసినః ॥ 40 ॥

వాలఖిల్యుడు మొదలైన మహర్షులు, కశ్యపుడు మొదలైన ప్రజాపతులు, సుపర్ణులు, కింనరులు, నాగులు, ఇంకా స్వర్గలోకంలో మిగిలినవారు అందరూ, అక్కడ ఉంటారు.

సాఙ్గాశ్చ చతురో వేదా శ్శాస్త్రాణి వివిధాని చ ।
ఇతిహాసపురాణాని యజ్ఞా శ్చ వరదక్షిణాః ॥ 41 ॥

వేదాంగాలతో సహా నాలుగువేదాలనూ, వివిధ మయిన శాస్త్రాలనూ, ఇతిహాసాలనూ, పురాణాలనూ చక్కగా తెలిసినవారు. గొప్ప దక్షిణలు ఇచ్చి, యాగాలు చేశారు.

నద్యశ్చ వివిధాః పుణ్యా స్తీర్థాన్యాయతనాని చ ।
సాగరాశ్చ తథా శైలా స్తస్మిన్ దేశే వ్యవస్థితాః ॥ 42 ॥

అక్కడ వివిధమైన నదులు, పుణ్యప్రదమైన తీర్థాలు, ఆలయాలు, సముద్రాలూ, పర్వతాలూ, ఆ క్షేత్రంలో చక్కగా నెలకొనిఉన్నాయి.

ఏవం పుణ్యతమే దేశే దేవర్షిపితృసేవితే ।
సర్వోపభోగసహితే వాసః కస్య న రోచతే ॥ 43 ॥

ఇది గొప్ప పుణ్యక్షేత్రం. దీన్ని దేవతలూ, మహర్షులూ, పితరులూ సేవించుకుంటారు. ఇక్కడ సమస్తమైన సౌఖ్యాలు ఉన్నాయి. అటువంటిఈ పుణ్యక్షేత్రంలో నివసించాలని అందరూ కోరుకుంటారు. ఇది ఎవరికి నచ్చదు?

శ్రేష్ఠత్వం కస్య దేశస్య కిం చాన్య దధికం తతః ।
ఆస్తే యత్ర స్వయం దేవో ముక్తిదః పురుషోత్తమః ॥ 44 ॥

మోక్షాన్ని ప్రసాదించే శ్రీమహావిష్ణువు స్వయంగా (స్వయంభువుగా) నెలకొన్న పుణ్యక్షేత్రం ఇది. ఇంతటి మహిమ గలిగిన క్షేత్రం వేరొకటి లేదు. దీనికంటె అధికమైనది ఎక్కడా ఉండదు.

ధన్యాస్తే విబుధప్రఖ్యా యే వసన్త్యుత్కలే నరాః ।
తీర్థరాజజలే స్నాత్వా పశ్యన్తి పురుషోత్తమమ్ ॥ 45 ॥

అటువంటి ఈ ఉత్కలక్షేత్రంలో నివసించే మానవులు దేవతలతో సమానం. వారు నిత్యమూ అక్కడి పుణ్య తీర్థాలలో స్నానం చేసి, పురుషోత్తముడిని దర్శించుకుంటారు.

స్వర్గే వసన్తి తే మర్త్యాః న తే యాన్తి యమాలయే ।
యే వసన్త్యుత్కలే క్షేత్రే పుణ్యే శ్రీపురుషోత్తమే ॥ 46 ॥

శ్రీ పురుషోత్తమస్వామి నెలకొన్నదీ, పుణ్యప్రదమూ అయిన ఉత్కలక్షేత్రంలో నివసించే మానవులు నరకానికి వెళ్లరు. వాళ్లు స్వర్గలోకానికి వెళ్లి అక్కడ నివసిస్తారు.

సఫలం జీవితం తేషా ముత్కలానాం సుమేధసామ్ ।
యే పశ్యన్తి సురశ్రేష్ఠం ప్రసన్నాయతలోచనమ్ ॥ 47 ॥

చారుభ్రూకేశముకుటం చారుకర్ణావతంసకమ్ ।
చారుస్మితం చారుదన్తం చారుకుణ్డలమణ్డితమ్ ॥ 48 ॥

సునాసం సుకపోలం చ సులలాటం సులక్షణమ్ ।
త్రైలోక్యానన్దజననం కృష్ణస్య ముఖపఙ్కజమ్ ॥ 49 ॥

ఉత్కలక్షేత్రంలో నెలకొన్న పురుషోత్తమస్వామిని దర్శించిన ఉత్కలక్షేత్రవాసులు వివేకులు. వారిజీవితం సార్థకం. ఆ స్వామి దేవతలలో ఉత్తముడు. ఆ పురుషోత్తముడి కన్నులు విశాలంగా ఉంటాయి. అనుగ్రహంతో నిండిఉంటాయి. కనుబొమ్మలు, జుట్టుముడి, కర్ణాభరణాలు, చిరునవ్వు, పలువరుస, చెవికమ్మలు ఎంతో మనోహరంగా ఉంటాయి. ముక్కు, చెక్కిలి, నుదురు మిక్కిలి అందంగా ఉంటాయి. ఆపురుషోత్తముడి ముఖపద్మం ఈవిధంగా సమస్తమైన ఉత్తమలక్షణాలు కలిగిఉన్నది. ఆస్వామిముఖం ముల్లోకాలవారికీ ఆనందం కలిగిస్తుంది. (అటువంటి ఆ శ్రీకృష్ణుడి ముఖపద్మం నిత్యమూ దర్శించే ఉత్కలక్షేత్రవాసుల జీవితం ధన్యం.)

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే ఉత్కలక్షేత్రవర్ణనం నామ చత్వారింశోఽధ్యాయః ॥ 40 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషిసంవాదంలో ఉత్కలక్షేత్రవర్ణనం అనే నలభైయవ అధ్యాయం ॥ 40 ॥

ఏకచత్వారింశోఽధ్యాయః - నలబైఒకటవ అధ్యాయం

అవంతికావర్ణనమ్ - అవంతికావర్ణనం

బ్రహ్మోవాచ :- మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

పురా కృతయుగే విప్రా శ్శక్రతుల్యపరాక్రమః ।
బభూవ నృపతి శ్శ్రీమా నిన్ద్రద్యుమ్న ఇతి శ్రుతః ॥ 1 ॥

బ్రాహ్మణులారా, పూర్వం కృతయుగంలో ఇంద్రద్యుమ్నుడు అనే రాజు ఉన్నాడు. అతడు ఇంద్రుడితో సమానమైన పరాక్రమం కలిగినవాడు. శ్రీమంతుడు. చాలా సుప్రసిద్ధుడు.

సత్యవాదీ శుచి ర్దక్ష స్సర్వశస్త్రభృతాం వరః ।
రూపవాన్ సుభగ శ్శూరో దాతా భోక్తా ప్రియంవదః ॥ 2 ॥

సత్యమే పలికేవాడు. పుణ్యాత్ముడు. సమర్థుడు. ఆయుధం పట్టినవారిలో శ్రేష్ఠుడు (వివిధమైన ఆయుధాలను ప్రయోగించడంలో నేర్పరి. యుద్ధవిశారదుడు). మంచి ఆకారసౌష్ఠవం కలిగినవాడు. అందగాడు. శక్తిమంతుడు. దానం చేసే స్వభావం కలిగినవాడు. అనుభవం కలిగినవాడు, ప్రియం కలిగే విధంగా మాట్లాడేవాడు.

యష్టా సమస్తయజ్ఞానాం బ్రహ్మణ్య స్సత్యసఙ్గరః ।
ధనుర్వేదే చ వేదే చ శాస్త్రే చ నిపుణః కృతీ ॥ 3 ॥

ఇంద్రద్యుమ్నుడు యజ్ఞాలు అన్నీ చేశాడు. బ్రాహ్మణులకు మేలు చేసేవాడు (ఆత్మజ్ఞానం గలిగినవాడు). సత్యాన్ని వ్రతంగా ఆచరించినవాడు (ఆడినమాట తప్పనివాడు). ధనుర్వేదంలోనూ ఋక్ మొదలైన వేదాలు అన్నింటిలోనూ, ఇతరశాస్త్రాలలోనూ నేర్పరి. సమర్థుడు.

వల్లభో నరనారీణాం పౌర్ణమాస్యాం యథా శశీ ।
ఆదిత్య ఇవ దుష్ప్రేక్ష్య శ్శత్రుసఙ్ఘభయఙ్కరః ॥ 4 ॥

పున్నమినాటి చంద్రుడులాగా ఆడవారికీ, మగవారికీ ఆరాజు అంటే ఇష్టం. సూర్యుడిలాగా కన్నెత్తి చూడడానికి వీలు లేనివాడు. శత్రువులగుంపులకు భయం కలిగిస్తాడు..

వైష్ణవ స్సత్త్వసమ్పన్నో జితక్రోధో జితేన్ద్రియః ।
అధ్యాత్మవిద్యాభిరతో ముముక్షు ర్ధర్మతత్పరః ॥ 5 ॥

ఆ రాజుకు విష్ణుదేవుడిపై భక్తి అధికం. కోపాన్ని జయించినవాడు (కోపం లేనివాడు). ఇంద్రియాలను తన అధీనంలో ఉంచుకున్నాడు. ఆత్మవిద్య మీద దృఢమైన ఆసక్తి గలిగినవాడు. మోక్షాన్ని కోరుకుంటాడు. ధర్మాన్ని ఆచరించడంలో శ్రద్ధ కలవాడు.

ఏవం స పాలయన్ పృథ్వీం రాజా సర్వగుణాకరః ।
తస్య బుద్ధి స్సముత్పన్నా హరే రారాధనం ప్రతి ॥ 6 ॥

ఈవిధంగా సమస్తమైన ఉత్తమగుణాలు కలిగిన ఇంద్రద్యుమ్నుడు రాజ్యాన్ని చక్కగా పరిపాలించేవాడు. అటువంటివాడికి ఒకనాడు శ్రీమహావిష్ణువును పూజించాలి అనే ఆలోచన కలిగింది.

కథ మారాధయిష్యామి దేవదేవం జనార్దనమ్ ।
కస్మిన్ క్షేత్రేఽథవా తీర్థే నదీతీరే తథాఽఽశ్రమే ॥ 7 ॥

'దేవతలకు దేవుడైన జనార్దనుడిని ఏవిధంగా పూజించగలను? ఏ పుణ్యక్షేత్రంలో లేదా పుణ్యతీర్థంలో, ఏనది ఒడ్డున, ఏ మహర్షి ఆశ్రమంలో విష్ణువును సేవించాలి'?

ఏవం చిన్తాపర స్సోఽథ నిరీక్ష్య మనసా మహీమ్ ।
ఆలోక్య సర్వతీర్థాని క్షేత్రాణ్యథ పురాణ్యపి ॥ 8 ॥

ఈవిధంగా చింతిస్తూ ఆ మహారాజు మనసులోనే ఈ భూమండలం అంతటా వెదికాడు. భూలోకంలోని పుణ్యక్షేత్రాలనూ, తీర్థాలనూ, నగరాలనూ (మనసులోనే) చూశాడు.

తాని సర్వాణి సఞ్చిన్త్య జగామ మనసా పునః ।
విఖ్యాతం పరమం క్షేత్రం ముక్తిదం పురుషోత్తమమ్ ॥ 9 ॥

అన్ని పుణ్యస్థలాలనూ పరిశీలించాడు. చివరికి సుప్రసిద్ధమైన పురుషోత్తమక్షేత్రాన్ని మనసులో సాక్షాత్కరించింది. అది మోక్షాన్ని ప్రసాదించే ఉత్తమపుణ్యక్షేత్రం.

స గత్వా నృపతి స్తత్ర సమృద్ధబలవాహనః ।
అయజ చ్చాశ్వమేధేన విధివద్ భూరిదక్షిణః ॥ 10 ॥

సేనలతోనూ, రథగజతురగాదివాహనాలతోనూ, మనోవేగంతో ఆ పుణ్యక్షేత్రానికి చేరుకున్నాడు. శాస్త్రోక్త ప్రకారంగా, గొప్ప గొప్ప దక్షిణలు ఇచ్చి, ఆక్షేత్రంలో అశ్వమేధయాగం చేశాడు.

కారయిత్వా మహోత్సేధం ప్రాసాదం చైవ విశ్రుతమ్ ।
తత్ర సఙ్కర్షణం కృష్ణం సుభద్రాం స్థాప్య వీర్యవాన్ ॥ 11 ॥

సమర్థుడైన ఇంద్రద్యుమ్నుడు ఆక్షేత్రంలో బ్రహ్మాండమైనపెద్దభవనం (దేవాలయం) నిర్మించాడు. అది లోకంలో చాల ప్రసిద్ధిని పొందింది. ఆ ఆలయంలో బలరాముడినీ, శ్రీకృష్ణుడినీ, సుభద్రనూ ప్రతిష్ఠించాడు.

పఞ్చతీర్థం చ విధివత్ కృత్వా తత్ర మహీపతిః ।
స్నానం దానం తపో హోమం దేవతాప్రేక్షణం తథా ॥ 12 ॥

స్నానం, దానం, తపస్సు, హోమం, దైవదర్శనం అనే అయిదు కార్యాలకూ తగినస్థానాలను పంచతీర్థంగా విధివిధానంగా ఇంద్రద్యుమ్నమహారాజు ఆక్షేత్రంలో ఏర్పాటు చేశాడు.

భక్త్యా చారాధ్య విధివత్ ప్రత్యహం పురుషోత్తమమ్ ।
ప్రసాదా ద్దేవదేవస్య తతో మోక్ష మవాప్తవాన్ ॥ 13 ॥

అక్కడ పురుషోత్తమదేవుడిని ప్రతిరోజూ పద్ధతిప్రకారంగా, భక్తితో ఆరాధించాడు. చివరకు ఆపురుషోత్తముడి అనుగ్రహంతో మోక్షాన్ని పొందాడు.

మార్కణ్డేయం వటం కృష్ణం దృష్ట్వా రామం చ భో ద్విజాః ।
సాగరే చేన్ద్రద్యుమ్నాఖ్యే స్నాత్వా మోక్షం లభేద్ ధ్రువమ్ ॥ 14 ॥

ఓ బ్రాహ్మణులారా, అక్కడ ఇంద్రద్యుమ్నం అనే పేరు గలిగిన సముద్రఘట్టంలో స్నానం చేసి, మార్కండేయుడినీ, వటవృక్షాన్నీ, శ్రీకృష్ణస్వామినీ, బలదేవుడినీ దర్శనం చేసుకున్నవాడు తప్పకుండా మోక్షాన్ని పొందుతాడు.

మునయ ఊచుః :–మహర్షులు అంటున్నారు.

కస్మాత్ స నృపతిః పూర్వ మిన్ద్రద్యుమ్నో జగత్పతిః ।
జగామ పరమం క్షేత్రం ముక్తిదం పురుషోత్తమమ్ ॥ 15 ॥

మహాత్మా, పూర్వం – లోకనాథుడైన ఆ ఇంద్రద్యుమ్నమహారాజు మోక్షదాయకమూ, సర్వశ్రేష్ఠమూ అయిన ఆపురుషోత్తమక్షేత్రానికి ఎందుకు వెళ్లాడు?

గత్వా తత్ర సురశ్రేష్ఠ కథం స నృపసత్తమః ।
వాజిమేధేన విధివ దిష్టవాన్ పురుషోత్తమమ్ ॥ 16 ॥

దేవనాయకా, ఆరాజోత్తముడు పురుషోత్తమక్షేత్రానికి వెళ్లి, అక్కడ అశ్వమేధయాగాన్ని శాస్త్రోక్తమయిన పద్ధతిలో ఎలా చేశాడు‘

కథం స సర్వఫలదే క్షేత్రే పరమదుర్లభే ।
ప్రాసాదం కారయామాస శ్రేష్ఠం త్రైలోక్యవిశ్రుతమ్ ॥ 17 ॥

పురుషోత్తమక్షేత్రం సమస్తమైనప్రయోజనాలను ఇస్తుంది. అక్కడికి వెళ్లడం సులువు కాదు. (ఎంతో పుణ్యం చేసుకుంటే కాని ఆక్షేత్రానికి వెళ్లడం సాధ్యం కాదు.) అటువంటిక్షేత్రంలో ఇంద్రద్యుమ్నుడు ముల్లోకాలలోనూ పేరు గాంచిన దేవాలయాన్ని ఎలా నిర్మించగలిగాడు?

కథం స కృష్ణం రామం చ సుభద్రాం చ ప్రజాపతే ।
నిర్మమే రాజశార్దూల స్సర్వలక్షణలక్షితమ్ ॥ 18 ॥

బ్రహ్మదేవా, ఆమహారాజు ఉండవలసినలక్షణాలు అన్నీ ఉన్న (ఏలోపమూ లేకుండా) బలరాముడు, కృష్ణుడు, సుభద్ర విగ్రహాలను ఎలా నిర్మించగలిగాడు?

కథం తత్ర మహీపాలః ప్రాసాదే భువనోత్తమే ।
స్థాపయామాస మతిమాన్ కృష్ణాదీం స్త్రిదశార్చితాన్ ॥ 19 ॥

బుద్ధిమంతుడైన ఆ భూపాలుడు లోకాలన్నిటిలోనూ శ్రేష్ఠమైన ఆ ఆలయంలో దేవతలు పూజించే కృష్ణుడు మొదలైనవారిని ఎలా ప్రతిష్ఠించాడు?

ఏతత్ సర్వం సురశ్రేష్ఠ విస్తరేణ యథాతథమ్ ।
వక్తు మర్హ స్యశేషేణ చరితం తస్య ధీమతః ॥ 20 ॥

దేవోత్తమా, వివేకవంతుడైన ఆ ఇంద్రద్యుమ్నమహారాజు చరిత్ర మొత్తం, ఉన్నది ఉన్నట్లుగా, ఏమాత్రం విడిచిపెట్టకుండా, వివరించి చెప్పటానికి నీవే తగినవాడివి. చెప్పవలసింది.

న తృప్తి మధిగచ్ఛామ స్తవ వాక్యామృతేన వై ।
శ్రోతు మిచ్ఛామహే తస్మాత్ పరం కౌతూహలం హి నః ॥ 21 ॥

అమృతం వంటి నీమాటలమాధుర్యం ఆస్వాదిస్తుంటే మాకు తృప్తి కలగడం లేదు. (ఇంక చాలు అనిపించడం లేదు.) ఇంకా ఇంకా వినాలనిపిస్తున్నది. మాకు చాలా ఉత్కంఠగా ఉన్నది. కాబట్టి చెప్పవలసినది.

బ్రహ్మోవాచ :– బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

సాధు సాధు ద్విజశ్రేష్ఠా యత్ పృచ్ఛధ్వం పురాతనమ్ ।
సర్వపాపహరం పుణ్యం భుక్తిముక్తిప్రదం శుభమ్ ॥ 22 ॥

బ్రాహ్మణోత్తములారా, చాలా మంచిది. మీరు అడిగినవిషయం పూర్వం ఎప్పుడో జరిగినది. ఇది సమస్తమైన పాపాలను పోగొడుతుంది. పుణ్యాన్ని ప్రసాదిస్తుంది. ఈలోకంలో భోగాలనూ, అనంతరం మోక్షాన్నీ అనుగ్రహిస్తుంది. సమస్తమైనశుభాలను చేకూరుస్తుంది.

వక్ష్యామి తస్య చరితం యథావృత్తం కృతే యుగే ।
శ్రుణుధ్వం మునిశార్దూలాః ప్రయతా స్సంయతేన్ద్రియాః ॥ 23 ॥

మునివరేణ్యులారా, పూర్వం కృతయుగంలో జరిగిన ఆ మహారాజు వృత్తాంతం యథాతథంగా చెప్తాను. ఇంద్రియాలను నియమించుకుని శ్రద్ధగా వినండి.

అవన్తీ నామ నగరీ మాలవే భువి విశ్రుతా ।
బభూవ తస్య నృపతేః పృథివీ కకుదోపమా ॥ 24 ॥

ఈభూలోకంలో మాలవదేశంలో అవంతి అనే నగరం ఉన్నది. అది ఆదేశం మహారాజుకు నివాసస్థానం. (మాలవదేశానికి రాజధాని). భూమండలానికి మూపురం వంటిది. (ఆదేశంలో సర్వోన్నత మయినది.)

హృష్టపుష్టజనాకీర్ణా దృఢప్రాకారతోరణా ।
దృఢయన్త్రార్గలద్వారా పరిఖాభి రలఙ్కృతా ॥ 25 ॥

ఆ నగరంలోని ప్రజలందరూ ఎప్పుడూ సంతోషంగా ఉంటారు. ధనధాన్యాలతో పుష్టిగా ఉంటారు. ఆ నగరం అభేద్యమైన చుట్టుగోడలతోనూ, తోరణాలతోనూ కూడి ఉన్నది. ఆ నగరం ప్రవేశద్వారాలకు దృఢమైన యంత్రాలతో కూర్చిన గడియలు ఏర్పరపబడి ఉన్నాయి. నగరం చుట్టూ కందకాలు ఉన్నాయి.

నానావణిక్సమాకీర్ణా నానాభాణ్డసువిక్రియా ।
రథ్యాపణవతీ రమ్యా త్రికచత్వరభూషితా ॥ 26 ॥

అనేకులయిన వణిక్కులతో నిండి ఉంది. అక్కడ రకరకాలైన సామగ్రితో వ్యాపారం నడుస్తుంది. దారులన్నీ అనేకమైన అంగళ్లతో కూడి ఉన్నాయి. మూడువీథులు కలిసిన ప్రదేశాలు, నాలుగువీథులు కలిసిన ప్రదేశాలతో అందంగా ఉంటుంది.

పురాట్టాలకసంయుక్తా సువిభక్తచతుష్పథా ।
గృహగోపురసమ్బాధా వీథీభి స్సమలఙ్కృతా ॥ 27 ॥

ఆ నగరంలో మేడలూ, మేడలమీద ప్రత్యేకమైన గదులూ, ఉన్నాయి. వీధులు వరుసలో ఒక క్రమంగా ఉండేవిధంగా చక్కగా విడదీయబడి ఉన్నాయి. పెద్ద పెద్ద ఇండ్లతోనూ, వీధిద్వారాలతోనూ నగరం ఇరుకుగా ఉన్నది. వీధులు అందంగా ఉన్నాయి.

రాజహంసనిభై శ్శుభ్రై శ్చిత్రగ్రీవై ర్మనోహరైః ।
అనేకశతసాహస్రైః ప్రాసాదై స్సమలఙ్కృతా ॥ 28 ॥

పెక్కు వందలవేల సంఖ్యలో ఉన్నమేడలు ఆ నగరానికి అందాన్ని తెస్తున్నాయి. అవి రాజహంసలలాగా తెల్లగానూ, వింతగానూ, ఎత్తుగానూ, అందంగానూ, ఉన్నాయి.

యజ్ఞోత్సవప్రముదితా గీతవాదిత్రనిస్స్వనా ।
నానావర్ణపతాకాభి ర్ధ్వజైశ్చ సమలఙ్కృతా ॥ 29 ॥

వివిధమైన యజ్ఞాలతోనూ, పండుగ సంబరాలతోనూ ఆ నగరం సంతోషంతో నిండిఉంది. రకరకాలయిన సంగీతాలతోనూ వాద్యాల ధ్వనులతోనూ కూడి ఉంది. రంగురంగుల జెండాలు, జెండాకఱ్ఱలు ఆ నగరాన్ని అలంకరిస్తున్నాయి.

హస్త్యశ్వరథసఙ్కీర్ణా పదాతిగణసఙ్కులా ।
నానాయోధసమాకీర్ణా నానాజనపదై ర్యుతా ॥ 30 ॥

ఆ నగరం నిండా ఏనుగులూ, గుఱ్ఱాలూ, రథాలూ సందడిగా ఉన్నాయి. అక్కడ భటులు గుంపులుగా సంచరిస్తున్నారు. ఎంతో మంది వీరులతో ఆ నగరం నిండిఉంది. (చతురంగబలాలు, యోధులతోపాటు) ఇంకా సాధారణప్రజలు ఎందరో అక్కడ సుఖంగా ఉన్నారు.

బ్రాహ్మణైః క్షత్రియై ర్వైశ్యై శ్శూద్రై శ్చైవ ద్విజాతిభిః ।
సమృద్ధా సా మునిశ్రేష్ఠా విద్వద్భి స్సమలఙ్కృతా ॥ 31 ॥

మునివరేణ్యులారా, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, ఇంకా ఇతరజాతులవారు, విద్వాంసులు ఆ నగరంలో సమృద్ధిగా ఉన్నారు.

న తత్ర మలినా స్సన్తి న మూర్ఖా నాపి దుర్బలాః ।
న రోగిణో న హీనాఙ్గా న ద్యూతవ్యసనాన్వితాః ॥ 32 ॥

ఆ నగరంలో ఆచారరహితులు లేరు. మూర్ఖులు లేరు, బలహీనులు లేరు. రోగులు లేరు. వికలాంగులు లేరు. జూదం (మొదలైన)వ్యసనాలకు లోనైన వారు లేరు.

సదా హృష్టా స్సుమనసో దృశ్యన్తే పురుషాః స్త్రియః ।
క్రీడన్త్యస్మిన్ దివారాత్రౌ హృష్టా స్తత్ర పృథక్ పృథక్ ॥ 33 ॥

ఆ నగరంలో పురుషులు స్త్రీలు ఎప్పుడూ మంచిమనసుతో, సంతోషంగా కనబడతారు. స్త్రీపురుషులు రేయింబవళ్లు ఎవరికి వారు ప్రత్యేకంగా ఆనందంగా విహరిస్తూ ఉంటారు.

సువేషాః పురుషా స్తత్ర దృశ్యన్తే మృష్టకుణ్డలాః ।
సురూపా స్సుగుణా శ్చైవ దివ్యాలఙ్కారభూషితాః ॥ 34 ॥

ఆ నగరంలోని పురుషులు మంచివేషం ధరిస్తారు. మిరుమిట్లు గొలిపే కర్ణాభరణాలు ధరిస్తారు. అందంగా ఉంటారు. మంచిగుణవంతులు. అతిలోకమైన ఆభరణాలను అలంకరించుకుంటారు.

కామదేవప్రతీకాశాః సర్వలక్షణలక్షితాః ।
సుకేశా స్సుకపోలాశ్చ సుముఖా శ్శ్మశ్రుధారిణః ॥ 35 ॥

ఆ నగరంలోని పురుషులు మన్మథుడితో సమానమైన సౌందర్యం కలిగిఉంటారు..వారికి సకలసులక్షణాలు పరిపూర్ణంగా ఉన్నాయి. వారిజుట్టు బాగా దట్టంగా ఉంటుంది. చెక్కిళ్లు చక్కగా ఉంటాయి. వారిముఖాలు మనోహరంగా ఉంటాయి. అందరికీ మీసాలు, గడ్డాలు దండిగా ఉంటాయి.

జ్ఞాతార స్సర్వశాస్త్రాణాం భేత్తార శ్శత్రువాహినీమ్ ।
దాతార స్సర్వరత్నానాం భోక్తార స్సర్వసమ్పదామ్ ॥ 36 ॥

వారు శాస్త్రాలు అన్నీ చక్కగా గ్రహించినవారు. శత్రుసైన్యాన్ని చీల్చి చెండాడతారు. అన్నివిధాలైన రత్నాలను దానం చేస్తారు. సమస్తమైన సంపదలతో అన్ని సుఖాలను అనుభవిస్తుంటారు.

స్త్రియ స్తత్ర మునిశ్రేష్ఠా దృశ్యన్తే సుమనోహరాః ।
హంసవారణగామిన్యః కర్ణాన్తాయతలోచనాః ॥ 37 ॥

మునివరులారా, ఆ నగరంలోని స్త్రీలు మనసుదోచే అందగత్తెలు. వారినడక హంసలలాగా(అందంగా)నూ, ఏనుగుల లాగా(మెల్లగా)నూ ఉంటుంది. వారికన్నులు విశాలమై, చెవులవరకు వ్యాపించిఉంటాయి.

సుమధ్యా శ్చారుజఘనాః పీనోన్నతపయోధరాః ।
సుకేశా శ్చారువదనా స్సుకపోలాః స్థిరాలకాః ॥ 38 ॥

వారినడుము అందంగా (సన్నగా) ఉంటుంది. అందమైన పిరుదులు కలవారు. వారి వక్షోజాలు బలిసిన, ఎత్తైనవి ఉంటాయి. విస్తారమైన కేశపాశం కలిగినవారు. వారిముఖాలు అందంగా ఉంటాయి. చెక్కిళ్లు మనోహరంగా ఉంటాయి. ముంగురులు చెదరకుండా ఉంటాయి.

విద్యుద్విస్పష్టదశనాః పూర్ణచన్ద్రసమాననాః ।
హావభావానతగ్రీవాః కర్ణాభరణభూషితాః ॥ 39 ॥

వారిదంతాలు మెరుపులలాగా స్వచ్ఛంగా ఉంటాయి. ముఖాలు నిండుచందురుడిలాగా ఉంటాయి. కనుబొమ్మలకదలికలతో ముఖం వంచి(సిగ్గులొలుకుతూ) ఉంటారు. చెవులకు కమ్మలను అలంకరించుకుంటారు.

బిమ్బోష్ఠ్యో రఞ్జితముఖా స్తామ్బూలేన విరాజితాః ।
సువర్ణాభరణోపేతా స్సర్వాలఙ్కారభూషితాః ॥ 40 ॥

వారిక్రిందిపెదవులు పండిన దొండపండులాగా (ఎఱ్ఱగా, మృదువుగా) ఉంటాయి. అనురాగంతో వారిముఖం ఎఱ్ఱబడి ఉంటుంది. తాంబూలం వేసుకుని మెరిసిపోతుంటారు. (తాంబూలంతో ఎఱ్ఱబడిననోటితో ప్రకాశిస్తుంటారు) బంగారు. ఆభరణాలను అలంకరించుకుంటారు. శరీరమంతటా అన్నిరకాలయిన అలంకారాలను ధరిస్తారు.

శ్యామావదాతా స్సుశ్రోణ్యః కాఞ్చీనూపురనాదితాః ।
దివ్యమాల్యామ్బరధరా దివ్యగన్ధానులేపనాః ॥ 41 ॥

వారు చామనిచాయలోనూ, తెల్లగానూ ఉంటారు (యౌవనంలో మనోహరంగా ఉంటారు). వారిమొలనూలు, కాలిఅందెలు ధ్వనిస్తుంటాయి. దివ్యమైన దండలనూ, వస్త్రాలనూ ధరించిఉంటారు. దివ్యమైన సుగంధ ద్రవ్యాలను పూసుకుంటారు.

విదగ్ధా స్సుముఖాః కాన్తా శ్చార్వఙ్గ్యః ప్రియదర్శనాః ।
రూపలావణ్యసంయుక్తా స్సర్వాః ప్రహసితాననాః ॥ 42 ॥

వారు జాణలు. మంచిముఖం గలిగినవారు. అందంగా ఉంటారు. వారి అవయవాలు మనోహరంగా ఉంటాయి. కంటికి ఇంపుగా ఉంటారు. అవయవసౌష్ఠవమూ, సౌందర్యమూ కలిగినవారు. అందరూ నవ్వుముఖం వారు.

క్రీడన్త్యశ్చ మదోన్మత్తా స్సభాసు చత్వరేషు చ ।
గీతవాద్యకథాలాపై రమయన్త్యశ్చ తాః స్త్రియః ॥ 43 ॥

వారు ఆటలలో మునిగితేలుతుంటారు. గర్వంతో స్వేచ్ఛగా సంచరిస్తుంటారు. సభలలోనూ, మేడలపై ఉండే గదులలోనూ, పాటలు పాడుతూ, రకరకాలవాద్యాలను వాయిస్తూ, కథలు చెప్పుకుంటూ,ఆనందిస్తూ ఉంటారు.

వారముఖ్యాశ్చ దృశ్యన్తే నృత్యగీతవిశారదాః ।
ప్రేక్షణాలాపకుశలా స్సర్వయోషిద్గుణాన్వితాః ॥ 44 ॥

ఆ నగరంలో వారకాంతలు కూడ కనబడతారు. వారు నాట్యంలోనూ, సంగీతంలోనూ, నైపుణ్యం గలిగిన వారు. చూపులలో, మాటలలో జాణతనం గలిగినవారు. వారికి స్త్రీలక్షణాలు సమగ్రంగా ఉన్నాయి.

అన్యాశ్చ తత్ర దృశ్యన్తే గుణాఢ్యాస్తు కులస్త్రియః ।
పతివ్రతాశ్చ సుభగా గుణై స్సర్వై రలఙ్కృతాః ॥ 45 ॥

ఆ నగరంలోని కులస్త్రీలు గుణవతులు. పతివ్రతలు. అందంగా ఉంటారు. సద్గుణాలు అన్నీ వారికి అలంకార మయినాయి.

వనై శ్చోపవనైః పుణ్యై రుద్యానైశ్చ మనోహరైః ।
దేవతాయతనై ర్దివ్యై ర్నానాకుసుమశోభితైః ॥ 46 ॥

ఆ నగరంలో పుణ్యప్రదమైన పెద్దపెద్ద తోటలు, చిన్నతోటలు, అందమైన ఉద్యానవనాలు, మహిమలు గలిగినదేవాలయాలు ఉన్నాయి. ఇంకా అక్కడ రకరకాల పూలతో అందమైన చెట్లు (ఇలా) ఉన్నాయి.

శాలై స్తాలై స్తమాలైశ్చ వకులైర్నాగకేసరైః ।
పిప్పలైః కర్ణికారైశ్చ చన్దనాగురుచమ్పకైః ॥ 47 ॥

బొద్దుగచెట్లు (శాల), తాటిచెట్లు (తాల), చీకటిచెట్లు (తమాల), పొగడచెట్లు (వకుళ), నాగకేసరవృక్షాలు, రావిచెట్లు (పిప్పల), కొండగోగు (కర్ణికార), గంధపుచెట్లు, అగురువృక్షాలు, సంపెంగచెట్లు,

పున్నాగై ర్నారికేలైశ్చ పనసై స్సరలద్రుమైః ।
నారఙ్గై ర్లకుచై ర్లోధ్రై స్సప్తపర్ణై శ్శుభాఞ్జనైః ॥ 48 ॥

సురపొన్న చెట్లు (పున్నాగ), కొబ్బరిచెట్లు, పనసచెట్లు, తెల్లతెగడచెట్లు (సరళ), నారింజచెట్లు (నారంగ). గజనిమ్మచెట్లు (లకుచ) లొద్దుగచెట్లు (లోధ్ర), ఏడాకులఅరటిచెట్లు (సప్తపర్ణ), శుభాంజనవృక్షాలు (తుమికిచెట్లు?),

చూతబిల్వకదమ్బైశ్చ శింశుపై ర్ధవఖాదిరైః ।
పాటలాశోకతగరైః కరవీరై స్సితేతరైః ॥ 49 ॥

మామిడిచెట్లు (చూత),మారేడుచెట్లు (బిల్వ),కడిమిచెట్లు (కదంబ),శింశుపవృక్షాలు, ఉమ్మెత్త (ధవ), చండ్ర (ఖాదిర), కలిగొట్టుచెట్లు (పాటల), కంకేళిచెట్లు(అశోక), నందివర్ధనం చెట్లు (తగర), ఎఱ్ఱగన్నేరు చెట్లు (కరవీర),

పీతార్జునకభల్లాతైః సిద్ధై రామ్రాతకై స్తథా ।
న్యగ్రోధాశ్వత్థకాశ్మర్యైః పలాశై ర్దేవదారుభిః ॥ 50 ॥

ఊడుగుచెట్లు (పీత), జువ్విచెట్లు (అర్జున), జీడిచెట్లు (భల్లాత), నల్లఉమ్మెత్తచెట్లు (సిద్ధ), అంబాళవృక్షాలు (ఆమ్రాతక), మఱ్ఱి (న్యగ్రోధ), రావిచెట్లు (అశ్వత్థ–పిప్పల–47శ్లో.),గుమ్ముడుచెట్లు (కాశ్మరి),మోదుగచెట్లు (పలాశ), దేవదారువృక్షాలు,

మన్దారైః పారిజాతైశ్చ తిన్తిడీకవిభీతకైః ।
ప్రాచీనామలకైః ప్లక్షై ర్జమ్బూశిరీషపాదపైః ॥ 51 ॥

మందారంచెట్లు, పారిజాతవృక్షాలు, చింతచెట్లు (తింతిడీక), తాండ్రచెట్లు (విభీతక), నీటిఉసిరికచెట్లు (ప్రాచీనామలక), కలుజువ్విచెట్లు (ప్లక్ష), నేరేడుచెట్లు (జంబూ), దిరిసెనచెట్లు (శిరీష),

కాలేయైః కాఞ్చనారైశ్చ మధుజమ్బీరతిన్దుకైః ।
ఖర్జూరాగస్త్యవకులై శ్శాఖోటకహరీతకైః ॥ 52 ॥

పచ్చచందనంచెట్లు, ఎఱ్ఱకాంచనంచెట్లు (కాంచనార,కోవిదార), జీవంతివృక్షాలు (మధు), నిమ్మచెట్లు (జంబీర), తుమ్మికిచెట్లు (తిందుక), ఖర్జూరవృక్షాలు, అవిసెచెట్లు (అగస్త్య), పొగడ (వకుల 47శ్లో.),

కఙ్కోలై ర్ముచుకున్దై శ్చ హిన్తాలై ర్బీజపూరకైః ।
కేతకీవనఖణ్డై శ్చ అతిముక్తై స్సకుబ్జకైః ॥ 53 ॥

కంకోలం అనేచెట్లు, ముచుకుందం అనేపూలచెట్లు, ఖర్జూరవిశేష వృక్షాలు (హింతాల), మాదీఫలవృక్షాలు (బీజపూర), మొగిలిపూలతోటలు, పువ్వులగురివెంద చెట్లు (అతిముక్త), పొట్లచెట్లు (కుబ్జ),

మల్లికాకున్దబాణైశ్చ కదలీఖణ్డమణ్డితైః ।
మాతులుఙ్గైః పూగఫలైః కరుణై స్సిన్ధువారకైః ॥ 54 ॥

మల్లె, మొల్ల (కుంద), నల్లగోరంట (బాణ) చెట్లు, అరటితోటలు, మాదీఫలవృక్షాలు (మాతులుంగ–53శ్లో), పోకచెట్లు (పూగ), కరుణం అనేచెట్లు, వావిలిచెట్లు (సింధువారక),

బహువారైః కోవిదారై ర్బదరై స్సకరఞ్జకైః ।
అన్యైశ్చ వివిధైః పుష్పవృక్షై శ్చాన్యైర్మనోహరైః ॥ 55 ॥

విరిగిచెట్లు(బహువార),కాంచనవృక్షాలు (కోవిదార), రేగుచెట్లు (బదర), కానుగచెట్లు (లేదా పులిగోరుచెట్లు) (కరంజక), ఇంకా ఇతరమైన రకరకాల వృక్షాలు, మనోహరమైన రకరకాల పూలచెట్లు,

లతాగుల్మై ర్వితానై శ్చ ఉద్యానై ర్నన్దనోపమైః ।
సదా కుసుమగన్ధాఢ్యై స్సదా ఫలభరానతైః ॥ 56 ॥

పలు పూలపొదలు, నందనవనం లాంటి ఉద్యానవనాలు, ఎన్నో ఆ క్షేత్రంలో ఉన్నాయి. అవి అన్ని ఋతువులలోనూ పూల పరిమళంతో నిండిఉంటాయి. అక్కడిచెట్లు ఎల్లకాలమూ పండ్లబరువుతో నేలకు వంగిఉంటాయి.

నానాపక్షిరుతై రమ్యై ర్నానామృగగణావృతైః ।
చకోరై శ్శతపత్రైశ్చ భృఙ్గారైః ప్రియపుత్రకైః ॥ 57 ॥

అక్కడ మనోహరమైన రకరకాల పక్షుల అరుపులు వినిపిస్తాయి. అనేకవిధమైన జంతువులు గుంపులు గుంపులుగా ఆ ప్రాంత మంతటా ఉంటాయి. వెన్నెలపులుగులు (చకోర), వడ్రంగిపిట్టలు (శతపత్ర), భృంగారపక్షులు, ప్రియపుత్రం అనేపక్షులు,

కలవిఙ్కై ర్మయూరైశ్చ శుకైః కోకిలకై స్తథా ।
కపోతైః ఖఞ్జరీటైశ్చ శ్యేనైః పారావతై స్తథా ॥
ఖగై శ్చాన్యై ర్బహువిధై శ్శ్రోత్రరమ్యై ర్మనోరమైః ॥ 58 ॥

ఊరబిచ్చుకలు (కలవింక), నెమిళ్లు (మయూర), చిలుకలు (శుక), కోయిలలు(కోకిల), అడవిపావురాలు (కపోత), కాటుక పిట్టలు, డేగలు, పావురాలు, ఇంకా ఇతరమైన రకరకాలపక్షులు మనోహరంగా, చెవి కింపుగా కూస్తూ ఉంటాయి.

సరితః పుష్కరిణ్యశ్చ సరాంసి సుబహూని చ ।
అన్యైర్జలాశయైః పుణ్యైః కుముదోత్పలమణ్డితైః ॥ 59 ॥

ఆ క్షేత్రంలో నదులు, కోనేరులు, అనేకమైన సరస్సులు, ఇంకా వివిధమైన నీటిపట్టులు ఉన్నాయి. అవి అన్నీ పుణ్యప్రదాలు. కలువలతోనూ, తామరలతోనూ నిండిఉన్నాయి.

పద్మై స్సితేతరై శ్శుభ్రైః కహ్లారైశ్చ సుగన్ధిభిః ।
అన్యై ర్బహువిధైః పుష్పై ర్జలజై స్సుమనోహరైః ॥
గన్ధామోదకరై ర్దివ్యై స్సర్వర్తుకుసుమోజ్జ్వలైః ॥ 60 ॥

ఆ జలాశయాలలో స్వచ్ఛమైన ఎఱ్ఱతామరలు, పరిమళభరితమైన సౌగంధికపుష్పాలు, ఇంకా నీటినుండి పుట్టిన రకరకాల పూలు ఎంతో మనోహరంగా ఉన్నాయి. వేర్వేరు ఋతువులలో పూసే పూలన్నీ ఒకే సమయంలో అక్కడ ఉజ్జ్వలంగా ప్రకాశిస్తున్నాయి. వాటిపరిమళం దివ్యమై, అందరికీ సుఖాన్ని కలిగిస్తున్నది.

హంసకారణ్డవాకీర్ణై శ్చక్రవాకోపశోభితైః ।
సారసైశ్చ బలాకైశ్చ కూర్మై ర్మత్స్యై స్సనక్రకైః ॥ 61 ॥

ఆ జలాశయాలనిండా, హంసలు, కన్నెలేడిపిట్టలు, నిండుగా ఉన్నాయి. జక్కవ పక్షులు చక్కగా ప్రకాశిస్తున్నాయి. బెగ్గురు పక్షులు, కొక్కెరపక్షులు, తాబేళ్లు, చేపలు, మొసళ్లు కూడ ఉన్నాయి.

జలపాదైః కదమ్బైశ్చ ప్లవైశ్చ జలకుక్కుటైః ।
ఖగై ర్జలచరై శ్చాన్యై ర్నానారవవిభూషితైః ॥ 62 ॥

ఆ జలాశయాలలో జలపాదపక్షుల సమూహాలు, నీటికాకులు (ప్లవ), నీటికోళ్లు (జలకుక్కుట), ఇంకా నీళ్లలో ఉండే వివిధపక్షుల రకరకాల అరుపులు ఆజలాశయాలను అలంకరిస్తున్నాయి.

నానావర్ణై స్సదా హృష్టై రఞ్చితాని సమన్తతః ।
ఏవం నానావిధైః పుష్పై ర్వివిధైశ్చ జలాశయైః ॥ 63 ॥

ఆ పక్షులు రకరకాల రంగులలో ఉన్నాయి. అన్నీ ఆనందంగా తిరుగుతూ ఆ ప్రాంతమంతటినీ మనోహరంగా చేస్తున్నాయి. ఈవిధంగా ఆక్షేత్రంలో రకరకాల పూవులు, వివిధ మయినజలాశయాలు ఉన్నాయి.

వివిధైః పాదపైః పుణ్యై రుద్యానై ర్వివిధై స్తథా ।
జలస్థలచరై శ్చైవ విహగై శ్చార్వధిష్ఠితైః ॥ 64 ॥

పుణ్యప్రదమైన రకరకాల వృక్షాలు, రకరకాల ఉద్యానవనాలు ఉన్నాయి. నేలపైన తిరిగేవీ, నీళ్లలో సంచరించేవీ అయిన రకరకాల అందమైన పక్షులు ఆ క్షేత్రంలో నివసిస్తున్నాయి.

దేవతాయతనై ర్దివ్యై శ్శోభితా సా మహాపురీ ।
తత్రాస్తే భగవాన్ దేవ స్త్రిపురారి స్త్రిలోచనః ॥
మహాకాలేతి విఖ్యాత స్సర్వకామప్రద శ్శివః ॥ 65 ॥

ఆ మహానగరం ఉత్తమమైన దేవాలయాలతో ప్రకాశిస్తున్నది. అటువంటి పురుషోత్తమపుణ్యక్షేత్రంలో త్రిపురాసురులను సంహరించిన ముక్కంటి మహాదేవుడు నెలకొన్నాడు. ఆ క్షేత్రంలోని శివుడు మహాకాలుడు అనే పేరుతో ప్రసిద్ధుడు. అందరికీ అన్ని కోరికలను అనుగ్రహిస్తాడు.

శివకుణ్డే నర స్స్నాత్వా విధివత్ పాపనాశనే ।
దేవాన్ పితౄన్ ఋషీంశ్చైవ సన్తర్ప్య విధివద్ బుధః ॥ 66 ॥

అక్కడ పాపాలను నిర్మూలించే శివకుండం ఉంది. అందులో స్నానం చేయాలి. ఆ తరువాత, దేవతలకు, ఋషులకు, పితరులకు విధివిధానంగా తర్పణాలు విడిచి పెట్టాలి.

గత్వా శివాలయం పశ్చాత్ కృత్వా తం త్రిః ప్రదక్షిణమ్ ।
ప్రవిశ్య సంయతో భూత్వా ధౌతవాసా జితేన్ద్రియః ॥ 67 ॥

తరువాత శివాలయానికి వెళ్లాలి. ఆలయానికి మూడు పర్యాయాలు ప్రదక్షిణం చేయాలి. ఆ తరువాత నియమాలు పాటిస్తూ, ఆలయంలోకి ప్రవేశించాలి. ఉతికిన(తెల్లని)వస్త్రాలు ధరించాలి. ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవాలి.

స్నానైః పుష్పై స్తథా గన్ధై ర్ధూపదీపైశ్చ భక్తితః ।
నైవేద్యై రుపహారైశ్చ గీతవాద్యైః ప్రదక్షిణైః ॥ 68 ॥

తరువాత మహాకాలుడిని భక్తితో వివిధద్రవ్యాలతో స్నానాలు చేయించాలి. వివిధగంధాలు పూయాలి. రకరకాల పూలు సమర్పించాలి. వేర్వేరుద్రవ్యాలతో ధూపాలు ఇవ్వాలి. వివిధమైన దీపాలు చూపాలి. శివుడికి వివిధపదార్థాలను నివేదించాలి. కానుకలు ఇవ్వాలి. పాటలు పాడాలి. వివిధవాద్యాలు వాయించాలి. ప్రదక్షిణలు చేయాలి.

దణ్డవత్ ప్రణిపాతైశ్చ నృత్యైః స్తోత్రైశ్చ శఙ్కరమ్ ।
సమ్పూజ్య విధివద్ భక్త్యా మహాకాలం సకృచ్ఛివమ్ ॥
అశ్వమేధసహస్రస్య ఫలం ప్రాప్నోతి మానవః ॥ 69 ॥

సాష్టాంగంగా కట్టెలాగా నేలమీద పడి నమస్కరించాలి. నాట్యాలు చేయాలి. స్వామిని స్తుతించాలి. విధ్యుక్త పద్ధతిలో భక్తిగా మహాకాలుడిని ఈవిధంగా ఒక్కసారి పూజించిన మానవుడు వేయి అశ్వమేధయాగాలు చేసిన పుణ్యఫలాన్ని పొందుతాడు.

పాపై స్సర్వై ర్వినిర్ముక్తో విమానై స్సార్వకామికైః ।
ఆరుహ్య త్రిదివం యాతి యత్ర శమ్భో ర్నికేతనమ్ ॥ 70 ॥

అతడికి అన్నిరకాలైన పాపాలు నశించిపోతాయి. సమస్తమైన కోరికలను తీర్చే విమానాల నెక్కి స్వర్గలోకానికి వెళ్తాడు. పరమేశ్వరుడినివాసం అక్కడే ఉన్నది. (పరమేశ్వరుడు నివసించేలోకానికి వెళ్తాడు.)

దివ్యరూపధర శ్రీమాన్ దివ్యాలఙ్కారభూషితః ।
భుఙ్క్తే తత్ర వరాన్ భోగాన్ యావదాభూతసంప్లవమ్ ॥
శివలోకే మునిశ్రేష్ఠా జరామరణవర్జితః ॥ 71 ॥

మునివరులారా, అతడు (మహాకాలుడిని సేవించిన మానవుడు) దేవతారూపాన్ని ధరించి, శివలోకంలో నివసిస్తాడు. దేవతలు ధరించే ఆభరణాలను అలంకరించుకుంటాడు. అతడికి రోగాలు గానీ, ముసలితనం గాని ఉండవు. సమస్త మయిన సృష్టి నశించే మహాప్రళయం వచ్చేంతవరకు శివలోకంలో ఉత్తమమైన సుఖాలను అనుభవిస్తాడు.

పుణ్యక్షయా ది హాయాతః ప్రవరే బ్రాహ్మణే కులే ।
చతుర్వేదీ భవేద్ విప్రః సర్వశాస్త్రవిశారదః ॥ 72 ॥

పుణ్యఫలం మొత్తం అనుభవించి, తరువాత తిరిగి భూలోకానికి వస్తాడు. ఇక్కడ ఉత్తమమైన బ్రాహ్మణ వంశంలో జన్మిస్తాడు.నాలుగువేదాలలో విద్వాంసుడు అవుతాడు. సమస్తమైన శాస్త్రాలలో నేర్పరి అవుతాడు.

యోగం పాశుపతం ప్రాప్య తతో మోక్ష మవాప్నుయాత్ ॥ 73 ॥

చివరికి పాశుపతయోగాన్ని అనుష్ఠించి, మోక్షాన్ని పొందుతాడు.

ఆస్తే తత్ర నదీ పుణ్యా క్షిప్రా నామేతి విశ్రుతా ।
తస్యాం స్నాత స్తు విధివత్ సన్తర్ప్య పితృదేవతాః ॥ 74 ॥

సర్వపాపవినిర్ముక్తో విమానవర మాస్థితః ।
భుఙ్క్తే బహువిధాన్ భోగాన్ స్వర్గలోకే నరోత్తమః ॥ 75 ॥

ఆ పురుషోత్తమక్షేత్రంలో క్షిప్ర అనే పేరుతో ప్రసిద్ధమైన నది ఉన్నది. విధ్యుక్తవిధానంగా క్షిప్రానదిలో స్నానం చేసి, పితృదేవతలకు తర్పణలు ఇచ్చిన వాడికి పాపాలు అన్నీ నశించిపోతాయి. ఆ పుణ్యాత్ముడు ఉత్తమ మైనవిమానం మీద స్వర్గలోకానికి వెళ్తాడు. అక్కడ అనేకవిధమైన(స్వర్గ)సుఖాలను అనుభవిస్తాడు.

ఆస్తే త త్రైవ భగవాన్ దేవదేవో జనార్దనః ।
గోవిన్దస్వామి నామాసౌ భుక్తిముక్తిప్రదో హరిః ॥ 76 ॥

ఆ క్షేత్రంలోనే దేవదేవుడైన జనార్దనుడు ఉన్నాడు. ఆ క్షేత్రంలోని భగవానుడికి గోవిందస్వామి అని పేరు. ఆ శ్రీమహావిష్ణువు భోగాలనూ, మోక్షాన్నీ ప్రసాదిస్తాడు.

తం దృష్ట్వా ముక్తి మాప్నోతి త్రిసప్తకులసంయుతః ।
విమానేనార్కవర్ణేన కిఙ్కిణీజాలమాలినా ॥ 77 ॥

సర్వకామసమృద్ధేన కామగే నాస్థిరేణ చ ।
ఉపగీయమానో గన్ధర్వై ర్విష్ణులోకే మహీయతే ॥ 78 ॥

ఆ క్షేత్రంలోని గోవిందుడిని దర్శించినవాడు మోక్షం పొందుతాడు. తనవంశంలో 21 తరాలవారిని తనతో కూడ తీసుకుని విమాన మెక్కుతాడు. ఆ విమానం సూర్యుడివంటి కాంతితో ప్రకాశిస్తుంటుంది. దానిచుట్టూ చిరుగంటలగుత్తులు దండలుగా వేళ్లాడుతుంటాయి. ఆవిమానం కోరిక లన్నింటిని సమృద్ధిగా ఇస్తుంది. అది స్వేచ్ఛగా నిరంతరం సంచరిస్తూనే ఉంటుంది. గంధర్వులు చుట్టూ చేరి స్తోత్రాలు గానం చేస్తుండగా, ఆవిమానం మీద తనవారందరితో సహా, విష్ణులోకానికి వెళ్లి అక్కడ పూజింపబడతాడు.

భుఙ్క్తే చ వివిధాన్ కామాన్ నిరాతఙ్కో గతజ్వరః ।
ఆభూతసంప్లవం యావత్ సురూప స్సుభగ స్సుఖీ ॥ 79 ॥

అక్కడ విష్ణులోకంలో అతడికి ఏదిగులూ ఉండదు. అవయవసౌష్ఠవంతో మంచిరూపాన్ని పొందుతాడు. అందంగా ఉంటాడు. సర్వజగత్ప్రళయం జరిగేవరకు అక్కడ అడ్డూ, ఆపూ లేకుండా వివిధమైనసుఖాలను అనుభవిస్తాడు.

కాలే నాగత్య మతిమాన్ బ్రాహ్మణ స్స్యా న్మహీతలే ।
ప్రవరే యోగినాం గేహే వేదశాస్త్రార్థతత్త్వవిత్ ॥ 80 ॥

వివేకవంతుడయిన అతడు కాలానుగుణంగా (పుణ్యక్షయం అయినతరువాత) ఈభూలోకానికి తిరిగి వస్తాడు. ఉత్తమమయిన యోగుల ఇంట బ్రాహ్మణుడుగా జన్మిస్తాడు. వేదాలనూ శాస్త్రాలనూ సమగ్రంగా తెలుసు కుంటాడు.

వైష్ణవం యోగ మాస్థాయ తతో మోక్ష మవాప్నుయాత్ ॥ 81 ॥

చివరికి వైష్ణవమైన యోగాన్ని అనుష్ఠించి, మోక్షాన్ని పొందుతాడు.

విక్రమస్వామినామానం విష్ణుం తత్రైవ భో ద్విజాః ।
దృష్ట్వా నరో వా నారీ వా ఫలం పూర్వోదితం లభేత్ ॥ 82 ॥

ఓ బ్రాహ్మణులారా, అక్కడ శ్రీమహావిష్ణువు త్రివిక్రమస్వామి అనేపేరుతో ఉంటాడు. స్త్రీ కాని, పురుషుడు కాని ఆప్రదేశంలోని త్రివిక్రమదేవుడి దర్శనం చేసుకుంటే, ఇంతకు ముందు చెప్పిన పుణ్యఫలితాన్ని పొందుతారు.

అన్యేఽపి తత్ర తిష్ఠన్తి దేవా శ్శక్రపురోగమాః ।
మాతరశ్చ మునిశ్రేష్ఠా స్సర్వకామఫలప్రదాః ॥ 83 ॥

మునివరేణ్యులారా! ఆ క్షేత్రంలో ఇంకా ఇంద్రుడు మొదలైన ఇతరదేవతలు జగన్మాతలు కూడ ఉన్నారు. వాళ్లు అందరూ సమస్తమైన కోరికలను, ఫలాలను ఇస్తారు.

దృష్ట్వా తాన్ విధివద్ భక్త్యా సమ్పూజ్య ప్రణిపత్య చ ।
సర్వపాపవినిర్ముక్తో నరో యాతి త్రివిష్టపమ్ ॥ 84 ॥

వారిని దర్శించుకుని, భక్తితో విధివిధానంగా చక్కగా పూజించి, సాష్టాంగనమస్కారాలు సమర్పించిన మానవుడికి సమస్త మయిన పాపాలు నశిస్తాయి. అతడు స్వర్గానికి వెళ్తాడు.

ఏవం సా నగరీ రమ్యా రాజసింహేన పాలితా ।
నిత్యోత్సవప్రముదితా, యథేన్ద్రస్యామరావతీ ॥ 85 ॥

రాజశ్రేష్ఠుడైన ఇంద్రద్యుమ్నుడు పాలిస్తున్న ఆ నగరం ఈవిధంగా మనోహరంగా ఉంటుంది. ఇంద్రుడు పరిపాలించే అమరావతిలాగా నిత్యమూ ఉత్సవాలతో ఆనందభరితమై ఉంటుంది.

పురాష్టాదశసంయుక్తా సువిస్తీర్ణచతుష్పథా ।
ధనుర్జ్యాఘోషనినదా సిద్ధసఙ్గమభూషితా ॥ 86 ॥

ఆ నగరంలో పద్దెనిమిది పురాలు (భాగాలు పేటలవంటివి) ఉన్నాయి. వీధులు విశాలంగా ఉంటాయి. అక్కడ నిరంతరమూ వింటినారి చప్పుళ్ళు వినిపిస్తుంటాయి (అక్కడిజనులు ధనుర్విద్యావిశారదులయినయోధులు). గొప్పమేధావులు అంతా ఆ నగరంలో కూడి నగరానికి అలంకారంగా ఉన్నారు.

విద్యావద్గణభూయిష్ఠా వేదనిర్ఘోషనాదితా ॥ 87 ॥

ఆ నగరం నిండా విద్యావంతులే. అక్కడ ఎప్పుడూ వేదధ్వనులు మారుమోగుతుంటాయి.

ఇతిహాసపురాణాని శాస్త్రాణి వివిధాని చ ।
కావ్యాలాపకథా శ్చైవ శ్రూయన్తేఽహర్నిశం ద్విజాః ॥ 88 ॥

బ్రాహ్మణులారా! ఆ నగరంలో రేయింబవళ్లు ఇతిహాసాలు, పురాణాలు, వివిధశాస్త్రాలు, సాహిత్యచర్చలు వినిపిస్తుంటాయి.

ఏవం మయా గుణాఢ్యా సా హ్యవన్తీ సముదాహృతా ।
యస్యాం రాజాఽభవత్ పూర్వ మిన్ద్రద్యుమ్నో మహామతిః ॥ 89 ॥

పూర్వం కృతయుగంలో బుద్ధిమంతుడైన ఇంద్రద్యుమ్నుడు రాజుగా ఉన్న ఉత్తమలక్షణాలు గలిగిన అవంతి(ఉజ్జయిని)నగరాన్ని గురించి వివరించాను.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే ఽవన్తికావర్ణనం నామైకచత్వారింశోఽధ్యాయః ॥41 ॥
శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో అవంతికావర్ణనం అనే నలభైఒకటవ అధ్యాయం సంపూర్ణం.

ద్విచత్వారింశోఽ ధ్యాయః - నలభైరెండవ అధ్యాయం

క్షేత్రదర్శనమ్ - క్షేత్రదర్శనం

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తస్యాం స నృపతిః పూర్వం కుర్వన్ రాజ్య మనుత్తమమ్ ।
పాలయామాస మతిమాన్ ప్రజాః పుత్రానివౌరసాన్ ॥ 1 ॥

పూర్వం ఇంద్రద్యుమ్నమహారాజు ఆ అవంతీనగరంలో ఉంటూ, సర్వోత్తమమైన ఈ రాజ్యాన్ని పరిపాలించాడు. బుద్ధిమంతుడైన ఆరాజు తనరాజ్యంలోని ప్రజలను కన్నబిడ్డలలాగా పరిపాలించాడు.

సత్యవాదీ మహాప్రాజ్ఞ శ్శూర స్సర్వగుణాకరః ।
శ్రుతిమాన్ ధర్మసమ్పన్న స్సర్వశస్త్రభృతాం వరః ॥ 2 ॥

ఇంద్రద్యుమ్నుడు సత్యమే పలుకుతాడు. అతడి తెలివితేటలు అమోఘం. గొప్పపరాక్రమవంతుడు. మంచిగుణాలు అన్నీ అతడివద్దనే ఉన్నాయి. అనేకవిషయాలను గ్రహించినవాడు. గొప్పధార్మికుడు. యుద్ధవిద్యలో సాటిలేనివాడు.

సత్యవాఞ్ఛీలవాన్ దాన్తః శ్రీమాన్ పరపురఞ్జయః ।
ఆదిత్య ఇవ తేజస్వీ రూపై రాశ్వినయో రివ ॥ 3 ॥

సత్యవంతుడు. అతడి నడత ఉత్తమం.ఇంద్రియాలను తన అధీనంలో ఉంచుకున్నాడు. శ్రీమంతుడు. శత్రురాజ్యాలను స్వాధీనపరచుకున్నాడు. అతడి తేజస్సు సూర్యుడితో సమానం. అందం అశ్వినీకుమారులలాగా ఉంటుంది.

వర్ధమానగుణై ర్యుక్త శ్శక్రతుల్యపరాక్రమః ।
శారదేందురివాభాతి లక్షణై స్సమలఙ్కృతః ॥ 4 ॥

అతడిలోని సద్గుణాలు నిరంతరం వృద్ధిచెందుతుంటాయి. అతడిపరాక్రమం దేవేంద్రుడితో సమానం.ఉత్తమ మైన లక్షణాలు అన్నీ ఆమహారాజుకు ఉన్నాయి. అతడు శరత్కాలం చంద్రుడిలాగా ప్రజలను చల్లగా చూస్తాడు.

ఆహర్తా సర్వయజ్ఞానాం హయమేధాదికృత్ తథా ।
దానై ర్యజ్ఞై స్తపోభిశ్చ తత్తుల్యో నాస్తి భూపతిః ॥ 5 ॥

అన్నియజ్ఞాలూ ఆచరించాడు. అశ్వమేధం మొదలైన యజ్ఞాలు చేశాడు. దానాలు, యజ్ఞాలు, తపస్సులు చేయటంలో అతడితో సాటివచ్చే రాజు లేడు.

సువర్ణమణిముక్తానాం గజాశ్వానాం చ భూపతిః ।
ప్రదదౌ విప్రముఖ్యేభ్యో యాగే యాగే మహాధనమ్ ॥ 6 ॥

అతడు తాను చేసిన ప్రతియాగంలోనూ, ఉత్తములైన బ్రాహ్మణులకు బంగారాన్నీ, రత్నాలనూ, ముత్యాలనూ, ఏనుగులనూ, గుఱ్ఱాలనూ, గొప్పగొప్ప సంపదలను ఇచ్చాడు.

హస్త్యశ్వరథముఖ్యానాం కమ్బలాజినవాససామ్ ।
రత్నానాం ధనధాన్యానా మన్త స్తస్య న విద్యతే ॥ 7 ॥

అతడివద్ద ఏనుగులకూ, గుఱ్ఱాలకూ, కంబళ్లకూ, మృగచర్మాలకూ, రత్నాలకూ, సంపదలకూ, రకరకాల ధాన్యాలకూ అంతు లేదు.

ఏవం సర్వధనై ర్యుక్తో గుణై స్సర్వై రలఙ్కృతః ।
సర్వకామసమృద్ధాత్మా కుర్వన్ రాజ్య మనుత్తమమ్ ॥ 8 ॥

ఈ విధంగా సమస్తవిధమైన సంపదలు కలిగినవాడూ, సమస్త మయిన సద్గుణాలు తనకు అలంకార మయినవాడూ, సమస్త మయిన కోరికలు పుష్కలంగా నెరవేర్చుకున్నవాడూ అయిన ఆ మహారాజు తనరాజ్యాన్ని చక్కగా పరిపాలించాడు.

తస్యేయం మతి రుత్పన్నా సర్వయోగేశ్వరం హరిమ్ ।
కథ మారాధయిష్యామి భుక్తిముక్తిప్రదం విభుమ్ ॥ 9 ॥

అటువంటి ఆమహారాజుకు ఒకసారి యోగాలన్నిటికీ ప్రభువైన శ్రీమహావిష్ణువును సేవించాలనే కోరిక కలిగింది. భోగమోక్షాలను ప్రసాదించే ఆశ్రీమన్నారాయణుడిని ఆరాధించేవిధానం ఏమిటీ అని ఆలోచించాడు.

విచార్య సర్వశాస్త్రాణి తన్త్రాణ్యాగమవిస్తరమ్ ।
ఇతిహాసపురాణాని వేదాఙ్గాని చ సర్వశః ॥ 10 ॥

సమస్తమైనశాస్త్రాలనూ, తంత్రగ్రంథాలనూ, ఆగమాలనూ, ఇతిహాసాలనూ, పురాణాలనూ, శిక్షావ్యాకరణాదు లయిన వేదాంగాలనూ సమగ్రంగా పరిశీలించాడు.

ధర్మశాస్త్రాణి సర్వాణి నియమాన్ ఋషిభాషితాన్ ।
వేదాఙ్గాని చ శాస్త్రాణి విద్యాస్థానాని యాని చ ॥ 11 ॥

స్మృతిగ్రంథాలు అన్నింటినీ విచారించాడు. మహర్షులు పేర్కొన్న వివిధ నియమాలను చూశాడు. శాస్త్రాలనూ (వేదాలనూ), వేదాంగాలనూ, ఇంకా దీనికి సంబంధించిన విషయాలు ఉండే రకరకాలైన వాఙ్మయాలనూ పరికించాడు.

గురూన్ సంసేవ్య యత్నేన బ్రాహ్మణాన్ వేదపారగాన్ ।
ఆధాయ పరమాం కాష్ఠాం కృతకృత్యోఽభవ త్తదా ॥ 12 ॥

నాలుగువేదాలనూ సాంతం గ్రహించిన బ్రాహ్మణులైన గురువులను ఆశ్రయించాడు. వారివల్ల ఉత్తమమైన వివేకాన్ని పొందాడు. అనుకున్నది సాధించి, కృతార్థుడయినాడు.

సమ్ప్రాప్య పరమం తత్త్వం వాసుదేవాఖ్య మవ్యయమ్ ।
భ్రాన్తిజ్ఞానా దతీత స్తు ముముక్షు స్సంయతేన్ద్రియః ॥ 13 ॥

శాశ్వతమైన వాసుదేవుడే ఉత్తమమైన తత్త్వం అని గ్రహించాడు. దానివల్ల అజ్ఞానం నశించింది (సత్యాసత్యవివేకం కలిగింది). మోక్షం మీద కోరిక ఏర్పడింది. ఇంద్రియాలను స్వాధీనం చేసుకున్నాడు.

కథ మారాధయిష్యామి దేవదేవం సనాతనమ్ ।
పీతవస్త్రం చతుర్బాహుం శఙ్ఖచక్రగదాధరమ్ ॥ 14 ॥

దేవతలందరిలో శ్రేష్ఠుడూ, పురాతనుడూ, అయిన శ్రీమన్నారాయణుడిని ఏవిధంగా ఆరాధించాలి అనుకున్నాడు. ఆదేవుడు పట్టుపుట్టాలు కట్టినవాడూ, నాలుగుచేతులు గలవాడూ, శంఖం, చక్రం, గద ధరించి ఉంటాడు.

వనమాలావృతోరస్కం పద్మపత్రాయతేక్షణమ్ ।
శ్రీవత్సోరస్సమాయుక్తం మకుటాఙ్గదశోభితమ్ ॥ 15 ॥

ఆ దేవుడి వక్షఃస్థలాన్ని వనమాల కప్పివేసింది. అతడి కన్నులు తామరరేకులలాగా విశాలంగా ఉన్నాయి. వక్షస్థలం మీద శ్రీవత్సం అనే పుట్టుమచ్చ ఉంది. కిరీటమూ, భుజకీర్తులూ స్వామి అందాన్ని పెంచుతున్నాయి.

స్వపురాత్ స తు నిష్క్రాన్త ఉజ్జయిన్యా మహీపతిః ।
బలేన మహతా యుక్త స్సభృత్య స్సపురోహితః ॥ 16 ॥

ఇంద్రద్యుమ్నమహారాజు ఉజ్జయినీ నగరాన్ని విడిచిపెట్టాడు. పెద్దసైన్యంతోనూ, సేవకులతోనూ, పురోహితుడితోనూ రాజధానిని విడిచి, బయలుదేరాడు.

అనుజగ్ముస్తు తం సర్వే రథిన శ్శస్త్రపాణయః ।
రథై ర్విమానసఙ్కాశైః పతాకాధ్వజసేవితైః ॥ 17 ॥

రథికులయిన వీరులు అందరూ ఆయుధాలు చేత బట్టి విమానాలవంటి రథాలమీద మహారాజును అనుసరించారు. ఆ రథాలు జెండాకఱ్ఱలతో, జెండాలతో కూడిఉన్నాయి.

సాదినశ్చ తథా సర్వే ప్రాసతోమరపాణయః ।
అశ్వైః పవనసఙ్కాశై రనుజగ్ముస్తు తం నృపమ్ ॥ 18 ॥

ఆశ్వికులయిన వీరులు అందరూ ప్రాస, తోమరం అనే ఆయుధాలు చేతబట్టి, వాయువేగం కలిగిన గుఱ్ఱాలమీద ఆ మహారాజును అనుసరించి వెళ్లారు.

హిమవత్సమ్భవై ర్మత్తై ర్వారణైః పర్వతోపమైః ।
ఈషాదన్తై స్సదా మత్తైః ప్రచణ్డై ష్షష్టిహాయనైః ॥ 19 ॥

కొందరు ఏనుగులమీద రాజును అనుసరించారు. ఆ ఏనుగులు హిమాలయం మీద పుట్టినవి. బాగా మదించిఉన్నాయి. పర్వతాలలాగ ఎత్తయినవి. వాటిదంతాలు నాగలికోలలాగా చాలా పెద్దవి. భయంకరంగాఉన్నాయి. అవి అరవైయేళ్లవయసులో ఉన్నాయి.

హేమకక్షైః స్సపతాకై ర్ఘణ్టారవవిభూషితైః ।
అనుజగ్ముశ్చ తం సర్వే జయయుద్ధవిశారదాః ॥ 20 ॥

ఆ యేనుగుల నడుముకు బంగారుహారాలు కట్టారు. ఏనుగులమీద ఆయా యోధుల జెండాలు ఉన్నాయి. ఆ యేనుగుల మెడలోని గంటలు మనోహరంగా ధ్వనిస్తున్నాయి. గజయుద్ధనిపుణులైన మహావీరులు ఆ ఏనుగులమీద మహారాజును అనుసరించి వెళ్లారు.

అసఙ్ఖ్యేయాశ్చ పాదాతా ధనుఃప్రాసాసిపాణయః ।
దివ్యమాల్యామ్బరధరా దివ్యగన్ధానులేపనాః ॥ 21 ॥

పదాతులైన భటులు గూడ లెక్కలేనంతమంది ఇంద్రద్యుమ్నుడిని అనుసరించి వెళ్లారు. ఆ భటులు విల్లులు, ఈటెలు, కత్తులు, చేత ధరించిఉన్నారు. అతిలోకమైన వస్త్రాలను, పూమాలలనూ ధరించారు. దివ్యమైన సుగంధద్రవ్యాలను ఒంటినిండా చక్కగా పూసుకున్నారు.

అనుజగ్ముశ్చ తం సర్వే యువానో మృష్టకుణ్డలాః ।
సర్వాస్త్రకుశలా శ్శూరా స్సదా సఙ్గ్రామలాలసాః ॥ 22 ॥

వారు అందరూ యువకులు. మేలిమిబంగారు చెవికమ్మలు ధరించారు. అన్నిరకాలైన ఆయుధాలను ప్రయోగించడంలో నేర్పరులు. ఎప్పుడూ యుద్ధం చేయాలని కోరుకుంటారు. అటువంటి పదాతిసైన్యం మహారాజును అనుసరించి వెళ్లింది.

అన్తఃపురనివాసిన్యః స్త్రియ స్సర్వా స్స్వలఙ్కృతాః ।
రూపయౌవనసమ్పన్నా స్సర్వాభరణభూషితాః ॥ 23 ॥

అంతఃపురాలలో నివసించేకాంతలు అందరూ చక్కగా అలంకరించుకున్నారు. యుక్తవయస్సులో చాలా అందమైన రూపంతో ఉన్నారు. అన్ని రకాలైన ఆభరణాలను ఒంటినిండా ధరించారు.

దివ్యవస్త్రధరా స్సర్వా దివ్యమాల్యవిభూషితాః ।
దివ్యగన్ధానులిప్తాఙ్గా శ్శరదిన్దుసమాననాః ॥ 24 ॥

అందరూ అతిలోక మయిన వస్త్రాలు ధరించారు. దివ్యమైన మాలలను అలంకరించుకున్నారు. దివ్యమైన సుగంధద్రవ్యాలను ఒళ్లంతా పూసుకున్నారు. వారిముఖాలు శరత్కాలపు చంద్రబింబంలా మనోహరంగా ఉన్నాయి.

సుమధ్యమా శ్చారువేషా శ్చారుకర్ణాలకాఞ్చితాః ।
బిమ్బోష్ఠ్య శ్చారుదశనాః పద్మపత్రాయతేక్షణాః ॥ 25 ॥

వారినడుము సన్నగా అందంగా ఉంది. వేషం సుందరంగా ఉంది. వారిచెవులు, ముంగురులు మనోహరంగా ఉన్నాయి. వారిక్రిందిపెదవులు దొండపండులాగా (ఎఱ్ఱగా మృదువుగా రసనిర్భరంగా) ఉన్నాయి. పలువరుస అందంగా ఉంది. కళ్లు తామరరేకులలాగా విశాలంగా ఉన్నాయి.

తామ్బూలరఞ్జితముఖా రక్షిభిశ్చ సురక్షితాః ।
యానై రుచ్చావచై శ్శుభ్రై ర్మణికాఞ్చనభూషితైః ॥ 26 ॥

వారినోళ్లు తాంబూలంతో ఎఱుపెక్కి ఉన్నాయి. అంతఃపుర సంరక్షకులు వారిని జాగ్రత్తగా కాపాడుతున్నారు. ఆ అంతఃపురస్త్రీలు తగినంత ఎత్తులో ఉన్నవాహనాలను అధిరోహించారు. ఆవాహనాలు శుభ్రంగా ఉన్నాయి.

ఉపగీయమానా స్తా స్సర్వా గాయనైః స్తుతిపాఠకైః ।
వేష్టితా శ్శస్త్రహస్తైశ్చ హ్యనుజగ్ముశ్చ తే నృపమ్ ॥ 27 ॥

ఆ వాహనాలను బంగారంతోనూ, రత్నాలతోనూ అలంకరించారు. గాయకులు, స్తోత్రపాఠకులు వారివెంట ఉండి, వాళ్లను గురించి స్తుతులను గానం చేస్తున్నారు. వారికి రక్షణగా గొప్పయోధులు చేత ఆయుధాలను ధరించి వారిచుట్టూ ఉన్నారు. ఇలా అంతఃపురకాంతలు ఇంద్రద్యుమ్నమహారాజును అనుసరించివెళ్లారు.

వేశ్యా స్సర్వాఙ్గసున్దర్యో నానాలఙ్కారభూషితాః ।
సురూపా స్సుభగాః కాన్తా స్సర్వస్త్రీగుణసంయుతాః ॥ 28 ॥

ఇంద్రద్యుమ్నమహారాజును వేశ్యలు కూడ అనుసరించి వెళ్లారు. వాళ్లకు ఒళ్ళంతా అందమే. అనేకమయిన ఆభరణాలను ధరించారు. మనోహరమైనరూపం. చూడగానే ఇష్టం పుట్టిస్తారు. మెరిసిపోతుంటారు. ఆడగుణాలు అన్నీ ఉన్నవారు.

సర్వాస్తా వివిధై ర్యానై స్సర్వాలఙ్కారభూషితాః ।
పరివారగణై స్సార్ధ మనుజగ్ము స్తథా నృపమ్ ॥ 29 ॥

ఆ వేశ్యలు అందరూ రకరకాలైన వాహనాలమీద బయలుదేరారు. వారు అన్నిరకాలైన ఆభరణాలనూ ధరించారు. పరిచారికలతో కలిసి ఇంద్రద్యుమ్నమహారాజు వెంట వెళ్లారు.

సాఙ్గవేదవిదశ్చైవ నానాశాస్త్రార్థపారగాః ।
బ్రాహ్మణా క్షత్రియా వైశ్యా శ్శూద్రా శ్చైవాష్టజాతయః ॥ 30 ॥

అక్కడ బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు (త్రివర్ణాలవారు) వేదాంగాలతో సహా వేదాలనూ అన్నింటినీ సమగ్రంగా తెలుసుకున్నారు. శూద్రులు ఎనిమిది తెగలవారు ఉన్నారు. వీళ్లంతా మహారాజును అనుసరించి వెళ్లారు.

స్వర్ణకారాశ్చ కర్మారా లోహకారాశ్మకుట్టకాః ।
మణికారాః కుమ్భకారా శ్చర్మకారాశ్చ పాచకాః ॥ 31 ॥

ఇంకా, బంగారం పనివాళ్లు (కమసాలులు), ఇనుము పనివాళ్లు (కమ్మరులు), ఇతర లోహాల పనివాళ్లు (కమ్మరులనే లోహకారులు అని కూడ అంటారు), రాతిపనివాళ్లు, రత్నాలపనివాళ్లు, మట్టిపాత్రలు చేసేవాళ్లు (కుమ్మరులు), చెప్పులు కుట్టటం మొదలైన విధంగా చర్మం పనిచేసేవాళ్లు, వంటవాళ్లు,

పణ్యకారా వేత్రకారా ముద్గకారాశ్చ శిల్పినః ।
కేశకారా స్తుమ్బికారా ఇషుకారా స్స్వజీవినః ॥ 32 ॥

స్వతంత్రమైన వృత్తితో జీవించే చిన్నవర్తకులు, పేము పనివాళ్లు, మూతలు తయారు చేసేవాళ్లు, శిల్పాలు చెక్కేవాళ్లు, మంగళ్లు, వీణెకాయలు చేసేవాళ్లు, బాణాలు చేసేవాళ్లు,

స్వర్ణకారాః ఖడ్గకారా స్స్వధాకారాశ్చ వాహకాః ।
అపూపకారకా స్సర్వే తోయవిక్రయకా స్తథా ॥
మాలాకారాః పర్వకారా స్సర్వవిక్రయిణశ్చ యే ॥ 33 ॥

బంగారం పనివాళ్లు, కత్తులు చేసేవాళ్లు, పితృకార్యాలు చేసేవాళ్లు, వాహనాలు చేసేవాళ్లు, అప్పాలు (తీయనిపిండి వంటలు) చేసేవాళ్లు, నీళ్లు అమ్ముకునేవాళ్ళు, మాలలు తయారుచేసేవాళ్లు, కీళ్లు తయారు చేసేవాళ్లు, ఇంకా అన్ని రకాలైన వస్తువులను అమ్మేవాళ్లు,

వణిగ్గ్రామగణా స్సర్వే నానాపురనివాసినః ।
ధనై రత్నై స్సువర్ణైశ్చ సదారా స్సపరిచ్ఛదాః ॥ 34 ॥

గ్రామాలలో ఉండేవ్యాపారులు, నగరాలలో నివసించేవ్యాపారులు, అందరూ వారి వారి సంపదలతోనూ, రత్నాలతోనూ, బంగారంతోనూ, భార్యలతోనూ, సేవకపరివారంతోనూ కలిసి రాజువెంట వెళ్లారు,

అస్త్రవిక్రయకాశ్చైవ తామ్బూలపణ్యజీవినః ।
తృణవిక్రయకాశ్చైవ కాష్ఠవిక్రయకారకాః ॥ 35 ॥

ఆయుధవ్యాపారులు, తాంబూలాలు అమ్ముకుని జీవించేవాళ్లు, గడ్డివ్యాపారం చేసేవాళ్లు, కట్టెలు అమ్ముకునే వాళ్లు,

రఙ్గోపజీవిన స్సర్వే మాంసవిక్రయిణ స్తథా ।
తైలవిక్రయకాశ్చైవ వస్త్రవిక్రయకా స్తథా ॥ 36 ॥

రంగస్థలాన్ని (వేదికలను) నిర్మించడం, అలంకరించడం వంటి వృత్తితో జీవించేవాళ్లు), మాంసం అమ్ముకునే వాళ్లు, నూనెలు అమ్మేవాళ్లు,వస్త్రవ్యాపారులు,

ఫలవిక్రయిణశ్చైవ పత్రవిక్రయిణ స్తథా ।
తథా యవసహారాశ్చ రజకాశ్చ సహస్రశః ॥ 37 ॥

పండ్లవ్యాపారులు, ఆకులు అమ్ముకునేవాళ్లు, కసవు మోసేవాళ్లు, చాకళ్లు, వేలకొలదిగా రాజువెంట వెళ్లారు.

గోపాలా నాపితాశ్చైవ తథాన్యే వస్త్రసూచకాః
మేషపాలా శ్చాజపాలా మృగపాలాశ్చ హంసకాః ॥ 38 ॥

గొడ్లుకాచేవాళ్లు, మంగళ్లు (31శ్లో) గుడ్డలు కుట్టేవాళ్లు, మేకలు కాచేవాళ్లు, గొఱ్ఱెలను కాచేవాళ్లు, జింకలనూ, హంసలనూ పెంచేవాళ్లు,

ధాన్యవిక్రయిణశ్చైవ సక్తువిక్రయిణశ్చ యే ।
గుడవిక్రయిణశ్చైవ తథా లవణజీవినః ॥ 39 ॥

ధాన్యవ్యాపారులు, పేలపిండి అమ్ముకునేవాళ్లు, బెల్లం వ్యాపారులు, ఉప్పు అమ్మేవాళ్లు,

గాయకా నర్తకాశ్చైవ తథా మఙ్గలపాఠకాః ।
శైలూషాః కథకాశ్చైవ పురాణార్థవిశారదాః ॥ 40 ॥

పాటలు పాడేవాళ్లు, నాట్యం చేసేవాళ్లు, స్తోత్రపాఠం చేసేవాళ్లు, నటులు, కథలు చెప్పేవాళ్లు, పురాణ రహస్యాలు చక్కగా తెలిసినవాళ్లు,

కవయః కావ్యకర్తారో నానాకావ్యవిశారదాః ।
విషఘ్నా గారుడాశ్చైవ నానారత్నపరీక్షకాః ॥ 41 ॥

కవులు, కావ్యాలు రచించినవాళ్లు, వివిధకావ్యాలను చక్కగా చదివినవాళ్లు, విషానికి విరుగుడు ఇచ్చేవాళ్లు, గరుడమంత్రం తెలిసినవాళ్లు, వివిధమైన రత్నాల లక్షణాలను చక్కగా పరీక్షించి నిశ్చయించగలిగినవాళ్లు,

వ్యోకారా స్తామ్రకారాశ్చ కాంస్యకారాశ్చ రూఠకాః ।
కౌషకారా శ్చిత్రకారాః కున్దకారాశ్చ పావకాః ॥ 42 ॥

లోహకారులు (కమ్మరులు), రాగిపనులు చేసేవాళ్లు, కంచు పనులుచేసేవాళ్లు, ఇత్తడిపనిచేసేవాళ్ళు రూఠకులు?, బొమ్మలు గీసేవాళ్లు, ఆయుధాలకు సానపెట్టే యంత్రాలు చేసేవాళ్లు, శుభ్రం చేసేవాళ్ళు,

దణ్డకారా శ్చాసికారా స్సురాద్యూతోపజీవినః ।
మల్లా దూతాశ్చ కాయస్థా యే చాన్యే కర్మకారిణః ॥ 43 ॥

చేతికఱ్ఱలు, శిక్షించేకఱ్ఱలు చేసేవాళ్ళు, కత్తులు చేసేవాళ్లు కల్లు అమ్ముతూ, జూదం ఆడుతూ జీవించేవాళ్లు, కుస్తీలు పట్టేవాళ్లు, వార్తలు చేరవేసేవాళ్లు, లెక్కలు వ్రాసేవారూ, ఇంకా ఇతరమైన పనులు చేసేవాళ్లు,

తన్తువాయా రూపకారా వార్తికా స్తైలపాఠకాః ।
లావజీవా స్తైత్తిరికా మృగపక్ష్యుపజీవినః ॥ 44 ॥

గుడ్డలు నేసేవాళ్లు, బొమ్మలు గీసేవాళ్లు, వార్తలు మోసేవాళ్లు, నూనెబొమ్మలు వేసేవాళ్లు, జంతువులనూ, పక్షులనూ చంపి జీవించేవాళ్లు, తిత్తిరిపక్షులను వేటాడేవాళ్లు, ఇంకా ఇతరమైన మృగాలనూ, పక్షులనూ పట్టుకుని జీవించేవాళ్లు,

గజవైద్యాశ్చ వైద్యాశ్చ నరవైద్యాశ్చ యే నరాః ।
వృక్షవైద్యాశ్చ గోవైద్యా యే చాన్యే ఛేదదాహకాః ॥ 45 ॥

ఏనుగుల రోగాలకు చికిత్స చేసేవైద్యులు, మనుషులకు వైద్యం చేసే వైద్యులు, చెట్లకు వైద్యం చేసేవాళ్లు, ఆవులకు వైద్యం చేసేవాళ్లు, ఇంకా శస్త్రచికిత్సలు చేసేవాళ్లు, కాల్చడం ద్వారా వైద్యం చేసేవాళ్లు,

ఏతే నాగరకా స్సర్వే యే చాన్యే నానుకీర్తితాః ।
అనుజగ్ముస్తు రాజానం సమస్తపురవాసినః ॥ 46 ॥

నగరాలలో ఉండే వీళ్లందరూ రాజువెంట వెళ్లారు. వీళ్లే కాకుండా ఇక్కడ పేర్కొనబడనివాళ్లు కూడ అన్ని ఊళ్లనుండి బయలుదేరి, ఇంద్రద్యుమ్నమహారాజును అనుసరించి వెళ్లారు.

యథా వ్రజన్తం పితరం గ్రామాన్తరసముత్సుకాః ।
అనుయాన్తి యథా పుత్రా స్తథా తం తేఽ పి నాగరాః ॥ 47 ॥

ఇంకో ఊరికి వెళ్లడానికి ఉత్సాహంతో తండ్రిని అనుసరించి వెళ్లే బిడ్డలలాగా వివిధ నగరప్రజలు అందరూ రాజును అనుసరించారు.

ఏవం స నృపతి శ్శ్రీమాన్ వృత స్సర్వై ర్మహాజనైః ।
హస్త్యశ్వరథపాదాతై ర్జగామ చ శనై శ్శనైః ॥ 48 ॥

ఈవిధంగా పెద్దలందరూ చుట్టూ చేరి, సేవిస్తుండగా, గజబలం, అశ్వబలం, రథబలం, పదాతిబలం అనే చతురంగబలాలలతో కలిసి, ఇంద్రద్యుమ్నమహారాజు మెల్ల మెల్లగా ఆక్షేత్రానికి వెళ్లాడు.

ఏవం గత్వా స నృపతి ర్దక్షిణ స్యోదధే స్తటమ్ ।
సర్వై స్తై ర్దీర్ఘకాలేన బలై రనుగతః ప్రభుః ॥ 49 ॥

ఈ విధంగా ఆ మహారాజు తనసమస్తమైనబలగంతో కలిసి, చాలా కాలానికి, దక్షిణదిక్కున ఉన్నమహా సముద్రం తీరానికి చేరుకున్నాడు.

దదర్శ సాగరం రమ్యం నృత్యన్తమివ చ స్థితమ్ ।
అనేకశతసాహస్రై రూర్మిభిశ్చ సమాకులమ్ ॥ 50 ॥

అక్కడ మనోహరమైన సముద్రాన్ని చూశాడు. ఆ సముద్రం (అలలకదలికలతో) నాట్యం చేస్తున్నట్లుగా ఉన్నది. అనేకమయిన వందలు వేలసంఖ్యలో ఉన్న అలలతో సందడిగా ఉంది.

నానారత్నాలయం పూర్ణం నానాప్రాణిసమాకులమ్ ।
వీచీతరంగబహులం మహాశ్చర్యసమన్వితమ్ ॥ 51 ॥

ఆ సముద్రం అంతటా రకరకాల రత్నాలు నెలకొని ఉన్నాయి. వివిధమైన జీవులతో నిండి ఉంది. అంతటా ఎన్నో తరంగాలు ఎగసిపడుతున్నాయి. ఆవిధంగా సముద్రం అందరికీ అద్భుతాలను చూపుతున్నది.

తీర్థరాజం మహాశబ్ద మపారం సుభయఙ్కరమ్ ।
మేఘబృన్దప్రతీకాశ మగాధం మకరాలయమ్ ॥ 52 ॥

ఆ సముద్రం గొప్పపుణ్యజలం. పెద్దపెద్దశబ్దాలు చేస్తున్నది. అవతలి ఒడ్డు కనబడడం లేదు. మిక్కిలి భయంకరంగా ఉంది. రాసిపోసిన మబ్బులలాగా (అంతటా నల్లగా) ఉంది. లోతు తెలియరాకుండా ఉంది. అందులో మొసళ్లు నివసిస్తున్నాయి.

మత్స్యైః కూర్మైశ్చ శఙ్ఖైశ్చ శుక్తికానక్రశంకుభిః ।
శిశుమారైః కర్కటైశ్చ వృతం సర్పై ర్మహావిషైః ॥ 53 ॥

ఆ సముద్రం నిండా చేపలు, తాబేళ్లు, శంఖాలు, ముత్యాలు, మొసళ్లు, శంకులు అనే విశేషమైన జాతిచేపలు, విశేషజాతికి చెందినమొసళ్లు, ఎండ్రకాయలు, భయంకరమైన విషసర్పాలు ఉన్నాయి.

లవణోదం హరేః స్థానం శయనస్య నదీపతిమ్ ।
సర్వపాపహరం పుణ్యం సర్వవాఞ్ఛాఫలప్రదమ్ ॥ 54 ॥

ఆ ఉప్పుసముద్రం శ్రీమహావిష్ణువుకు శయనమందిరం. నదులన్నీ ఆసముద్రంలోకి వచ్చిచేరతాయి. అది పాపాలు అన్నిటినీ పోగొడుతుంది. పుణ్యాన్ని ఇస్తుంది. అన్ని కోరికలనూ నెరవేరుస్తుంది.

అనేకావర్తగమ్భీరం దానవానాం సమాశ్రయమ్ ।
అమృత స్యారణిం దివ్యం దేవయోని మపాం పతిమ్ ॥ 55 ॥

ఆ సముద్రం పెక్కు సుడిగుండాలతో ఎంతో లోతుగా ఉంటుంది. (సముద్ర)రాక్షసులు దాన్ని ఆశ్రయించుకుని జీవిస్తుంటారు. అందులోనుండే అమృతం పుట్టింది. అతిలోకమయిన మహత్తు కలిగినది. లక్ష్మీదేవి మొదలైనదేవతలు అందులోనుండే జన్మించారు. ఆ సముద్రం నీళ్లు అన్నింటికీ రాజు.

విశిష్టం సర్వభూతానాం ప్రాణినాం జీవధారణమ్ ।
సుపవిత్రం పవిత్రాణాం మఙ్గలానాం చ మఙ్గలమ్ ॥ 56 ॥

చరాచరసృష్టిమొత్తంలో గొప్పది. జీవులకు ప్రాణాలను నిలబెడుతుంది. పావనమైన వాటి అన్నింటిలోనూ పావనమైనది. శుభప్రదమైన వాటన్నింటిలో శుభప్రదమైనది.

తీర్థానా ముత్తమం తీర్థ మవ్యయం యాదసాం పతిమ్ ।
చన్ద్రవృద్ధిక్షయస్యైవ యస్య మానం ప్రతిష్ఠితమ్ ॥ 57 ॥

ఆ సముద్రం పుణ్యతీర్థాలన్నింటిలోనూ శ్రేష్ఠం. నీళ్లకు అధిష్ఠానం. శుక్లపక్షంలో చంద్రుడు పెరుగుతున్న క్రమంలో సముద్రంలో అలలవేగం పెరుగుతూ ఉంటుంది. అలాగే కృష్ణపక్షంలో చంద్రుడు తరిగిపోతున్న క్రమంలో సముద్రం అలలవడి తగ్గుతుంటుంది.

అభేద్యం సర్వభూతానాం దేవానా మమృతాలయమ్ ।
ఉత్పత్తిస్థితిసంహార హేతుభూతం సనాతనమ్ ॥ 58 ॥

ఏశక్తీ ఆసముద్రాన్ని చెదరగొట్టలేదు. దేవతలకు ఆహారమైన అమృతం అక్కడే నెలకొనిఉంది. సృష్టికీ, స్థితికీ, లయానికీ ఈ సముద్రమే కారణం. సృష్టికి ప్రారంభంనుండి ఉన్న సముద్రం మిక్కిలి పురాతనం.

ఉపజీవ్యం చ సర్వేషాం పుణ్యం నదనదీపతిమ్ ।
దృష్ట్వా తం నృపతిశ్రేష్ఠో విస్మయం పరమం గతః ॥ 59 ॥

జీవులందరికీ బ్రతకడానికి సముద్రం సాధనం. అది పవిత్రం. నదులనూ, నదాలనూ అన్నింటినీ భరిస్తుంది. (తూర్పునుండీ పడమరనుండీ నదీనదాలు వచ్చి ఈ సముద్రంలో కలిసిపోతాయి. వాటినన్నింటినీ సముద్రం తనలో కలుపుకుంటుంది.) అటువంటి సముద్రాన్ని చూచి ఇంద్రద్యుమ్నమహారాజు చాల ఆశ్చర్యపడ్డాడు.

నివాస మకరో త్తత్ర వేలా మాసాద్య సాగరీమ్ ।
పుణ్యే మనోహరే దేశే సర్వభూమిగుణైర్యుతే ॥ 60 ॥

ఆ సముద్రం తీరం చేరుకుని మంచిలక్షణాలు గలిగి, పుణ్యప్రదమూ, మనోహరమూ, అయిన ఆ ప్రదేశంలోనే రాజు నివాసం ఏర్పాటు చేసుకున్నాడు.

వృతం శాలైః కదమ్బైశ్చ పుంనాగై స్సరలద్రుమైః ।
పనసై ర్నారికేళైశ్చ వకులైర్నాగకేసరైః ॥ 61 ॥

ఆ ప్రదేశంలో వృక్షాలు ఇలా ఉన్నాయి. . బొద్దుగచెట్లు (శాల), కడిమిచెట్లు (కదంబ), పొన్నచెట్లు, తెల్లతెగడచెట్లు (సరల), పనసచెట్లు, కొబ్బరిచెట్లు, పొగడచెట్లు (వకుళ), నాగకేసరవృక్షాలు,

ఖర్జూరైః పిప్పలై స్తాలై ర్నారంగై ర్బీజపూరకైః ।
శాలై రామ్రాతకై ర్లోధ్రై ర్వకులై ర్బహువారకైః ॥ 62 ॥

ఖర్జూరం చెట్లు, రావిచెట్లు (పిప్పల), తాటిచెట్లు, నారింజచెట్లు, మాదీఫలవృక్షాలు, బొద్దుగచెట్లు (60 శ్లో), అంబాళం చెట్లు (ఆమ్రాతక), లొద్దుగచెట్లు (లోధ్ర), పొగడచెట్లు (వకుళ 60శ్లో), విరిగిచెట్లు (బహువార),

కపిత్థైః కర్ణికారైశ్చ పాటలాశోకచమ్పకైః ।
దాడిమైశ్చ తమాలైశ్చ పారిజాతై స్తథార్జునైః ॥ 63 ॥

వెలగచెట్లు, కొండగోగుచెట్లు (కర్ణికార), పాటలవృక్షాలు, అశోకవృక్షాలు, సంపెంగచెట్లు, దానిమ్మచెట్లు, చీకటిచెట్లు, పారిజాత వృక్షాలు, మద్దిచెట్లు (అర్జున),

ప్రాచీనామలకై ర్బిల్వైః ప్రియఙ్గువటఖాదిరైః ।
ఇఙ్గుదీసప్తపర్ణైశ్చ అశ్వత్థాగస్త్యజమ్బుకైః ॥ 64 ॥

నీటిఉసిరికచెట్లు (ప్రాచీనామలక), మారేడుచెట్లు, ప్రేంకణవృక్షాలు (ప్రియంగు), మఱ్ఱిచెట్లు, చంద్రచెట్లు (ఖాదిర), గారచెట్లు (ఇంగుది), ఏడాకుల అరటిచెట్లు, రావిచెట్లు (అశ్వత్థ), అవిసెచెట్లు (అగస్త్య), నేరేడుచెట్లు,

మధుకైః కర్ణికారైశ్చ బహువారై స్సతిన్దుకైః ।
పలాశబదరై ర్నీపై స్సిద్ధనిమ్బశుభాఙ్జనైః ॥ 65 ॥

ఇప్పచెట్లు (మధుక), కొండగోగుచెట్లు (కర్ణికార 62శ్లో), విరిగిచెట్లు (బహువార 61 శ్లో), తుమ్మికిచెట్లు (తిందుక), మోదుగచెట్లు (పలాశ), రేగుచెట్లు (బదరి), మంకెనచెట్లు (నీప), నల్లఉమ్మెత్తచెట్లు (సిద్ధ), వేపచెట్లు, శుభాంజనవృక్షాలు (తుమికిచెట్లు? 41అధ్యాయం 48శ్లో),

వారకైః కోవిదారైశ్చ భల్లాతామలకై స్తథా ।
తాడహిన్తాలకజ్కోలైః కరఞ్జై స్సవిభీతకైః ॥ 66 ॥

కురువేరుచెట్లు (వారక), ఎఱ్ఱకాంచనం చెట్లు (కోవిదార), జీడిచెట్లు (భల్లాత), ఉసిరికచెట్లు, తాటిచెట్లు (తాడ–తాల 61శ్లో) ఖర్జూరవిశేషవృక్షాలు (హింతాలక), ఊడుగుచెట్లు (అంకోల) (41–58శ్లోకం కోలవృక్షాలు), కానుగుచెట్లు (కరంజ), తాండ్రచెట్లు (విభీతక),

ససర్జ మధుకాశ్మర్యైః శాల్మలీదేవదారుభిః ।
శాఖోటకై ర్నిమ్బవటైః కుమ్భికోష్ఠహరీతకైః ॥ 67 ॥

మద్దిచెట్లు (సర్జ), ఇప్పచెట్లు (మధు 64శ్లో), గుమ్ముడు చెట్లు (కాశ్మరి), బూరుగుచెట్లు (శాల్మలి), దేవదారు వృక్షాలు, శాఖోటకవృక్షాలు, వేపచెట్లు (నింబ), మఱ్ఱిచెట్లు (63శ్లో), గుగ్గిలంచెట్లు (కుంభి),

గుగ్గులై శ్చన్దనైర్వృక్షై స్తథైవాగురుపాటలైః ।
జమ్బీరకరుణైర్వృక్షై స్తిన్తిడీరక్తచన్దనైః ॥ 68 ॥

గుగ్గులుచెట్లు, మంచిగంధంచెట్లు, అగురుచెట్లు, మరువంతీగెలు, నిమ్మచెట్లు (కరుణ), చింతచెట్లు (తింతిడీకం), ఎఱ్ఱచందనం చెట్లు,

ఏవం నానావిధైర్వృక్షై స్త థాఽన్యై ర్బహుపాదపైః ।
కల్పద్రుమై ర్నిత్యఫలై స్సర్వర్తుకుసుమోత్కరైః ॥ 69 ॥

ఈవిధంగా అక్కడ రకరకాలైనచెట్లు ఉన్నాయి. ఇంకా ఇక్కడ చెప్పని ఇతరవృక్షాలు కూడ ఎన్నో ఉన్నాయి. ఇవి కల్పవృక్షాలు. అన్ని ఋతువులలోనూ అన్నిరకాల పండ్లతోనూ, పూలతోనూ నిండి ఉంటాయి.

నానాపక్షిరుతై ర్దివ్యై ర్మత్తకోకిలనాదితైః ।
మయూరవరసఙ్ఘుష్టై శ్శుకసారికసఙ్కులైః ॥ 70 ॥

ఇంకా ఆ చెట్లు అక్కడ మదించిన కోకిలల కుహూకారాలూ అనేకవిధమైన పక్షుల కూతలు దివ్యంగా వినిపిస్తాయి. నెమిళ్లు, చిలుకలు, గోరువంకలు గుంపులుగా సంచరిస్తుంటాయి.

హారీతైర్ భృఙ్గరాజైశ్చ చాతకై ర్బహుపుత్రకైః ।
జీవం జీవకకాకోలైః కలవిఙ్కైః కపోతకైః ॥ 71 ॥

విశేషమైన పావురాలు, మదించిన తుమ్మెదలు, వానకోయిలలు, బహుపుత్రం అనే పక్షులు, వెన్నెలపక్షులు (జీవంజీవక), మాలకాకులు (కాకోల), పిచ్చుకలు (కలవింక), పావురాలు,

ఖగై ర్నానావిధై శ్చాన్యై శ్శ్రోత్రరమ్యై ర్మనోహరైః ।
పుష్పితాగ్రేషు వృక్షేషు కూజద్భి శ్చార్వధిష్ఠితైః ॥ 72 ॥

ఇంకా ఇతరమయిన రకరకాలపక్షులు అసంఖ్యాకంగా చక్కగా పుష్పించిన కొమ్మలపై అందంగా (కలవరం లేకుండా ప్రశాంతంగా)కూర్చుని, చెవికింపుగా మధురంగా కూస్తున్నాయి.

కేతకీవనఖణ్డైశ్చ సదా పుష్పధరై స్సితైః ।
మల్లికాకున్దకుసుమై ర్యూథికాతగరై స్తథా ॥ 73 ॥

తెల్లనిపూలతో నిండిన మొగలిపూల తోటలు, మల్లెపూవులు, మొల్లపూవులు, పెద్దగోరంటపూలు (యూథిక), నందివర్ధనం పూలు (తగర),

కుటజై ర్బాణపుష్పైశ్చ అతిముక్తై స్సకుబ్జకైః ।
మాలతీకరవీరైశ్చ తథా కదలకాఞ్చనైః ॥ 74 ॥

కొండమల్లెలు (కుటజ), నల్లగోరింటపూలు (బాణపుష్ప), మాధవీలతలు (అతిముక్త), ఉత్తరేణుపూలు, జాజిపూలు (మాలతి), గన్నేరుపూలు (కరవీర), కోలపొన్నపూలు (కదల), ఉమ్మెత్తపూలు (కాంచన),

అన్యై ర్నానావిధైః పుష్పై స్సుగన్ధై శ్చారుదర్శనైః ।
వనోద్యానోపవనజై ర్నానావర్ణై స్సుగన్ధిభిః ॥75 ॥

ఇంకా ఆక్షేత్రంలోని వనాలలోనూ, ఉద్యానాలలోనూ, ఉపవనాలలోనూ, ఇతరమైన రకరకాలపూలు ఉన్నాయి. ఆపూలు గొప్పసువాసనలతో, వివిధమైన రంగులలో ఉన్నాయి.

విద్యాధరగణాకీర్ణై స్సిద్ధచారణసేవితైః ।
గన్ధర్వోరగరక్షోభి ర్భూతాప్సరసకిన్నరైః ॥
మునియక్షగణాకీర్ణై ర్నానాసత్త్వనిషేవితైః ॥ 76 ॥

ఆ ప్రాంతం విద్యాధరులసమూహాలతో నిండిపోయింది. సిద్ధులు, చారణులు, గంధర్వులు, నాగులు, రాక్షసులు, వివిధప్రాణులు, అప్సరసలు, కింనరులు ఆ క్షేత్రాన్ని సేవించుకుంటున్నారు. మహర్షులు, యక్షులు అక్కడ గుంపులుగా ఉన్నారు. ఇంకా ఇతరమైన అనేకవిధమైన ప్రాణికోటి ఆక్షేత్రాన్ని సేవించుకుంటున్నారు.

మృగై శ్శాఖామృగై స్సింహై ర్వరాహమహిషాకులైః ।
తథాఽ న్యైః కృష్ణసారాద్యైః మృగై స్సర్వత్ర శోభితైః ॥
శార్దూలై ర్దీప్తమాతఙ్గై స్తథాఽ న్యై ర్వనచారిభిః ॥ 77 ॥

ఇంకా జింకలు, కోతులు, సింహాలు, వరాహాలు, దున్నపోతులు, నల్లజింకలు, పులులు, మదించిన ఏనుగులు మొదలుగా అడవులలో తిరిగే ఇతరజంతువులు అనేకం ఆప్రదేశం అంతటా విహరిస్తున్నాయి.

ఏవం నానావిధై ర్వృక్షై రుద్యానై ర్నన్దనోపమైః ।
లతాగుల్మవితానైశ్చ వివిధైశ్చ జలాశయైః ॥ 78 ॥

ఈవిధంగా ఆప్రదేశం రకరకా లయిన చెట్లు, నందనవనంతో సమాన మయిన ఉద్యానవనాలు, పూదీగెల పొదలూ, అనేక మయిన జలాశయాలతో నిండిఉంది.

హంసకారణ్డవాకీర్ణైః పద్మినీఖణ్డమణ్డితైః ।
కాదమ్బైశ్చ ప్లవై ర్హంసై శ్చక్రవాకోపశోభితైః ॥ 79 ॥

అక్కడి జలాశయాలలో హంసలు, కన్నెలేడిపిట్టలు గుంపులుగా సంచరిస్తున్నాయి. తామరపూలు తోటలుగా శోభిస్తున్నాయి. కలహంసలు, నీటికాకులు, జక్కవపక్షులతో ఆ నీటిపట్టులు ప్రకాశిస్తున్నాయి.

కమలై శ్శతపత్రైశ్చ కహ్లారైః కుముదోత్పలైః ।
ఖగైర్జలచరై శ్చాన్యైః పుష్పై ర్జలసముద్భవైః ॥ 80 ॥

ఇంకా ఆ జలాశయాలలో నూరురేకుల తామరపూలు, సౌగంధికపుష్పాలు, తెల్లగలువలు, నల్లగలువలు, నీటిలో సంచరించే ఇంకా వేరేపక్షులు, నీటినుండి పుట్టినపూలు విస్తారంగా ఉన్నాయి.

పర్వతై ర్దీప్తశిఖరై శ్చారుకన్దరమణ్డితైః ।
నానావృక్షసమాకీర్ణై ర్నానాధాతువిభూషితైః ॥ 81 ॥

అక్కడ పర్వతాలు ఉన్నతమైన శిఖరాలతో వెలుగుతున్నాయి. అందమైనగుహలు అలంకారంగా ఉన్నాయి. ఆపర్వతాలపై పెద్ద పెద్ద చెట్లు దట్టంగా ఉన్నాయి. అనేకమైన ధాతువులు ఆపర్వతాలను అలంకరిస్తున్నాయి.

సర్వాశ్చర్యమయై శ్శృఙ్గై స్సర్వభూతాలయై శ్శుభైః ।
సర్వౌషధిసమాయుక్తై ర్విపులై శ్చిత్రసానుభిః ॥ 82 ॥

ఆ పర్వతాలశిఖరాలు అందరికీ ఆశ్చర్యం గలిగిస్తాయి. ఆపర్వతాలపై అన్నివిధములైన ప్రాణులు, స్థావరాలు సుఖంగ ఉన్నాయి. ఆకొండలనిండా సమస్తమైన ఓషధులు ఉన్నాయి. చరియలు విశాలంగానూ, అందంగానూ ఉన్నాయి.

ఏవం సర్వై స్సముదితై శ్శోభితం సుమనోహరైః ।
దదర్శ స మహీపాలః స్థానం త్రైలోక్యపూజితమ్ ॥ 83 ॥

ఈవిధంగా ఆ ప్రదేశంలో అన్నీ మిక్కిలి మనోహరంగా ప్రకాశిస్తున్నాయి. (అక్కడ లేనిది ఇంక ఎక్కడా లేదు.) ముల్లోకాలు గూడ పూజించే ఆ పవిత్రప్రదేశాన్ని ఇంద్రద్యుమ్న మహారాజు చూశాడు.

దశయోజనవిస్తీర్ణం పఞ్చయోజన మాయతమ్ ।
నానాశ్చర్యసమాయుక్తం క్షేత్రం పరమదుర్లభమ్ ॥ 84 ॥

ఆ ప్రదేశం ఎనభైమైళ్లమేర విస్తరించిఉంది. నలభైమైళ్ల పొడవుగా ఉంది. అక్కడ అనేకమైన వింతలున్నాయి. అటువంటి పుణ్యక్షేత్రం మరొకటి ఎక్కడా ఉండదు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే క్షేత్రదర్శనం నామ ద్విచత్వారింశోఽధ్యాయః ॥ 42 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో క్షేత్రదర్శనం అనే నలభైరెండవ అధ్యాయం సంపూర్ణం.



త్రిచత్వారింశోఽ ధ్యాయః - నలభైమూడవ అధ్యాయం

పూర్వవృత్తానువర్ణనమ్ - పూర్వవృత్తానువర్ణనం

మునయ ఊచుః :- బ్రహ్మదేవుడితో మహర్షులు ఈవిధంగా అంటున్నారు.

తస్మిన్ క్షేత్రవరే పుణ్యే వైష్ణవే పురుషోత్తమే ।
కిం తత్ర ప్రతిమాపూర్వం న స్థితా వైష్ణవీ ప్రభో ॥ 1 ॥

మహాత్మా, బ్రహ్మదేవా, పుణ్యప్రదమూ, ఉత్తమమూ, విష్ణువుకు సంబంధించినదీ అయిన ఆ పురుషోత్తమ క్షేత్రంలో ఇంద్రద్యుమ్నుడు ప్రతిష్ఠించకపూర్వం శ్రీమహావిష్ణువుకు సంబంధించిన ఏ విగ్రహమూ లేదా?

యేనాసౌ నృపతి స్తత్ర గత్వా సబలవాహనః ।
స్థాపయామాస కృష్ణం చ రామం భద్రాం శుభప్రదామ్ ॥ 2 ॥

అందువల్లనే (అంతకు ముందు అక్కడ ఏ విగ్రహమూ లేనందువల్లనే) ఇంద్రద్యుమ్నమహారాజు చతురంగ బలాలతోనూ, పరివారంతోనూ ఆ క్షేత్రానికి వెళ్ళి, అక్కడ కృష్ణ, బలరామ, శుభాలను ప్రసాదించే సుభద్రాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించాడా?

సంశయో నో మహానత్ర విస్మయశ్చ జగత్పతే ।
శ్రోతు మిచ్ఛామహే సర్వం బ్రూహి తత్కారణం చ నః ॥ 3 ॥

లోకేశ్వరా, బ్రహ్మదేవా, ఇది మాకు పెద్దసందేహం. (అక్కడ ఏవిగ్రహం లేకపోవడం) చాల వింతగాఉంది. దీన్నిగురించి సమగ్రంగా తెలుసుకుందా మని మాకు కోరికగా ఉంది. అందుకు (స్వామిని ప్రతిష్ఠించకపోవడానికి) కారణం కూడ వివరించు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

శృణుధ్వం పూర్వసంవృత్తాం కథాం పాపప్రణాశినీమ్ ।
ప్రవక్ష్యామి సమాసేన శ్రియా పృష్టః పురా హరిః ॥ 4 ॥

మహర్షులారా, ఈవృత్తాంతం పూర్వం ఎప్పుడో జరిగింది. దీనిని వింటే పాపాలన్నీ నశించిపోతాయి. మీకు సంగ్రహంగా చెప్తాను. వినండి. పూర్వం ఈవిషయాన్నే లక్ష్మీదేవి శ్రీమహావిష్ణువును అడిగింది.

సుమేరోః కాఞ్చనే శృఙ్గే సర్వాశ్చర్యసమన్వితే ।
సిద్ధవిద్యాధరై ర్యక్షైః కిన్నరై రుపశోభితే ॥ 5 ॥

సుమేరుపర్వతం మీద బంగారుశిఖరం అనేకమైన వింతలతో నిండి ఉంటుంది. అక్కడ సిద్ధులు, విద్యాధరులు, యక్షులు, కిన్నరులు సంచరిస్తుంటారు.

దేవదానవగంధర్వై ర్నాగై రప్సరసాం గణైః ।
మునిభిర్ గుహ్యకై స్సిద్ధై స్సౌపర్ణై స్సమరుద్గణైః ॥ 6 ॥

అక్కడ దేవతలు, రాక్షసులు, గంధర్వులు, నాగులు, అప్సరసలు, మహర్షులు, గుహ్యులు, సిద్ధులు, గరుడజాతికి చెందినవారు మరుత్తులగణాలు గుంపులుగా నివసిస్తుంటారు.

అన్యై ర్దేవాలయై స్సాధ్యైః కశ్యపాద్యైః ప్రజేశ్వరైః ।
వాలఖిల్యాదిభి శ్చైవ శోభితే సుమనోహరే ॥ 7 ॥

ఇంకా ఇతరమైన దేవతలనివాసాలు గూడ అక్కడ ఉన్నాయి. సాధ్యులు, కశ్యపుడు మొదలైన ప్రజాపతులు, వాలఖిల్యుడు మొదలైన (వారు 60వేలమంది. వీరు క్రతువు అనేప్రజాపతికి సంతతి అనేభార్యవల్ల పుట్టారు. వీరు బొటనవేలిమొదటికణుపు పరిమాణంలో ఉంటారు. మిక్కిలి తేజస్వులు) తపస్వులతో ఆ సుమేరుపర్వతం చాల మనోహరంగా ఉంటుంది.

కర్ణికారవనై ర్దివ్యై స్సర్వర్తుకుసుమోత్కరైః ।
జాతరూపప్రతీకాశై ర్భూషితై స్సూర్యసన్నిభైః ॥ 8 ॥

అక్కడ దేవతాసంబంధమైన కొండగోగుపూలతోటలు ఉన్నాయి. అవి అన్ని ఋతువులలోనూ పూలతో నిండి ఉంటాయి. ఆపూలు బంగారురంగులో సూర్యకాంతితో ప్రకాశిస్తున్నాయి.

అన్యైశ్చ బహుభి ర్వృక్షై శ్శాల తాలాదిభి ర్వనైః ।
పున్నాగాశోక సరల న్యగ్రో ధామ్రాత కార్జునైః ॥ 9 ॥

ఇంకా అనేక మయిన చెట్లు తోటలుగా ఉన్నాయి. బొద్దుగచెట్లు, తాటిచెట్లు, అడవులలాగా విస్తరించిఉన్నాయి. పున్నాగచెట్లు, అశోకవృక్షాలు, తెల్లతెగడచెట్లు, మఱ్ఱిచెట్లు (జమ్మిచెట్లు), అంబాళం చెట్లు, జువ్విచెట్లు,

పారిజా తామ్ర ఖదిర నీప బిల్వ కదమ్బకైః ।
ధవ ఖాదిర పాలాశ శీర్షామలక తిన్దుకైః ॥ 10 ॥

పారిజాతవృక్షాలు, మామిడిచెట్లు, చంద్రచెట్లు, నీలాశోకవృక్షాలు, మారేడుచెట్లు, కడిమిచెట్లు, వెలమచెట్లు, విశేషమైన చంద్రచెట్లు, మోదుగచెట్లు, విశిష్టమైన ఉసిరికచెట్లు, తుమ్మికిచెట్లు,

నారఙ్గ కోల వకుల లోధ్ర దాడిమ దారుకైః ।
సర్జైశ్చ కర్ణై స్తగరై శ్శిశిభూర్జవ నిమ్బకైః ॥ 11 ॥

నారింజచెట్లు, తక్కోలవృక్షాలు, పొగడచెట్లు, లొద్దుగచెట్లు, దానిమ్మచెట్లు, దేవదారువృక్షాలు, మద్దిచెట్లు, కర్ణవృక్షాలు, నందివర్ధనం చెట్లు, శిశిభూర్జవ వృక్షాలు, వేపచెట్లు,

అన్యైశ్చ కాఞ్చనై శ్చైవ ఫలభారైశ్చ నామితైః ।
నానాకుసుమగన్ధాఢ్యై ర్భూషితే త్రిదశాఞ్చితే ॥ 12 ॥

ఇంకా ఇతరమైన చెట్లు చాలా ఉన్నాయి. కొన్నిచెట్లు బంగారు రంగులో ఉన్న పండ్లబరువుతో నేలకు వంగిపోయినాయి. మరికొన్ని పరిమళభరితమైన రకరకాలపూలతో ఆక్షేత్రానికి అలంకారంగా ఉన్నాయి. అక్కడ దేవతలు సంచరిస్తారు.

మాలతీ యూథికా మల్లీ కున్ద బాణ కురుణ్టకైః ।
కరవీరైశ్చ గుప్తైశ్చ కేతకీ కుబ్జ కింశుకైః ॥ 13 ॥

జాజి, కొండగోరింట, మల్లె, మొల్ల, నల్లగోరింట, పచ్చగోరింట, గన్నేరు, మొగలి, ఉత్తరేణు, మోదుగ,

పాటలాగస్త్య కుటజ మన్దార కుసుమాదిభిః ।
అన్యైశ్చ వివిధైః పుష్పై ర్మనసః ప్రీతిదాయకైః ॥ 14 ॥

కలిగొట్టు, అవిసె, కొండమల్లె, మందారం, మొదలయిన పూలతోపాటు ఇంకా మనసు ఇష్టపడే ఇతరమైన రకరకాలపూలు, (పూలు నిండినచెట్లు) ఉన్నాయి.

నానావిహగసంఘై శ్చ కూజద్భి ర్మధురస్వరైః ।
పుంస్కోకిలరుతై ర్దివ్యై ర్మత్తబర్హిణనాదితైః ॥ 15 ॥

ఇంకా అక్కడ రకరకాలపక్షులు గుంపులుగా సంచరిస్తున్నాయి. అవి చెవికింపుగా తీయగా కూస్తున్నాయి. మగకోకిలల దివ్యమయిన కూతలు, మదించిన నెమిళ్ల అరుపులు, ఆక్షేత్రంలో నిండిఉన్నాయి.

ఏవం నానావిధై ర్వృక్షైః పుష్పై ర్నానావిధై స్తథా ।
ఖగై ర్నానావిధైశ్చైవ శోభితే సురసేవితే ॥ 16 ॥

ఈవిధంగా అనేకవిధమైన చెట్లతోనూ, రకరకాల పూలతోనూ, వివిధమైన పక్షులతోనూ, దేవతలు నివసించే ఆపుణ్యక్షేత్రం మనోహరంగా ప్రకాశిస్తున్నది.

తత్ర స్థితం జగన్నాథం జగత్స్రష్టార మవ్యయమ్ ।
సర్వలోకవిధాతారం వాసుదేవాఖ్య మవ్యయమ్ ॥ 17 ॥

సుమేరుపర్వతశిఖరంమీద శ్రీమహావిష్ణువు నెలకొనిఉన్నాడు. ఆదేవుడు లోకాలను సృష్టిస్తాడు. ఆయన నిత్యుడు. లోకాలన్నింటిని రక్షిస్తాడు. ఆయనను వాసుదేవుడు అంటారు. ఏవిధమైన మార్పు లేనివాడు.

ప్రణమ్య శిరసా దేవీ లోకానాం హితకామ్యయా ।
పప్రచ్ఛేమం మహాప్రశ్నం పద్మజాత మనుత్తమమ్ ॥ 18 ॥

తామరపూవునుండి పుట్టినలక్ష్మీదేవి ఆజగన్నాథుడికి శిరసు వంచి నమస్కరించి, లోకాలకు మేలు చేయాలనే కోరికతో శ్రీమహావిష్ణువును ఈవిధంగా సర్వశ్రేష్ఠమయిన సందేహాన్ని అడిగింది.

శ్రీ రువాచ :–లక్ష్మీదేవి జగన్నాథుడిని ఈవిధంగా ప్రశ్నిస్తున్నది.

బ్రూహి త్వం సర్వలోకేశ సంశయో మే హృది స్థితమ్ ।
మర్త్యలోకే మహాశ్చర్యే కర్మభూమౌ సుదుర్లభే ॥ 19 ॥

లోభమోహగ్రహగ్రస్తే కామక్రోధమహార్ణవే ।
యేన ముచ్యేత దేవేశ అస్మాత్ సంసారసాగరాత్ ॥ 20 ॥

లోకేశ్వరా, నామనసులో ఒక సందేహం ఉన్నది. దానికి నీవే సమాధానం చెప్పాలి. ఈమానవలోకం కర్మ భూమి. ఇది చాల విచిత్రమైనది. ఇక్కడ పుట్టే అవకాశం తేలికగా దొరకదు. అత్యాశ, అజ్ఞానం అనే గ్రహాలు మానవుడిని పట్టి పీడిస్తున్నాయి. మానవుడు కోరికలు, కోపమూ అనే పెద్దసముద్రంలో మునిగిపోయాడు. సురనాయకా, సంసారం అనే ఈసముద్రంనుండి మానవుడు బయటపడేమార్గం ఏమిటి?

ఆచక్ష్వ సర్వదేవేశ ప్రణతాం యది మన్యసే ।
త్వదృతే నాస్తి లోకేஉస్మిన్ వక్తా సంశయనిర్ణయే ॥ 21 ॥

దేవతాసార్వభౌమా, మేము నిన్నే నమ్ముకుని ఉన్నాం. మాకు చెప్పదగినదయితే దయతో ఆ విషయం చెప్పవలసింది. ఈసందేహాన్ని తీర్చగలిగినవారు ఈలోకంలో నీవు తప్ప ఇంకెవరూ లేరు.

శ్రుత్వైవం వచనం తస్యా దేవదేవో జనార్దనః ।
ప్రోవాచ పరయా ప్రీత్యా పరం సారామృతోపమమ్ ॥ 22 ॥

లక్ష్మీదేవి మాటలు విని, దేవదేవుడయిన జనార్దనుడు అత్యంతప్రేమతో అమృతానికి సారమయినమాటలను ఇలా చెప్పాడు.

శ్రీభగవానువాచ :-జగన్నాథస్వామి చెప్తున్నాడు.

సుఖోపాస్య స్సుసాధ్య శ్చాభిరామ సుసత్ఫలః ।
ఆస్తే తీర్థవరే దేవి విఖ్యాతః పురుషోత్తమః ॥ 23 ॥

దేవీ, భూలోకంలో ఉత్తమమైన పుణ్యక్షేత్రం ఒకటి ఉంది. అక్కడ పురుషోత్తముడు అనే దేవుడు చాలా ప్రసిద్ధిని పొందిఉన్నాడు. ఆ దేవుడిని సేవించడం చాల సుఖం. తేలికగా దొరుకుతాడు. చాల మనోహరంగా ఉంటాడు. మంచిఫలితాలను అనుగ్రహిస్తాడు.

న తేన సదృశః కశ్చి త్త్రిషు లోకేషు విద్యతే ।
కీర్తనాద్ యస్య దేవస్య ముచ్యతే సర్వపాతకైః ॥ 24 ॥

ఆ దేవుడితో సాటివచ్చేవాడు మూడులోకాలలో ఎవ్వడూ లేడు. ఆక్షేత్రంలోని పురుషోత్తమదేవుడిని స్తుతిస్తే సమస్త మయిన పాపాలు నశించిపోతాయి.

న విజ్ఞాతోஉమరై స్సర్వై ర్న దైత్యై ర్న చ దానవైః ।
మరీచ్యాద్యై ర్మునివరై ర్గోపితం మే వరాననే ॥ 25 ॥

సుముఖీ, దేవతలకు గాని, దైత్యులకు గాని, దానవులకు గాని, మరీచి మొదలయిన మహర్షులకు గాని పురుషోత్తముడు నెలకొన్న ఆ పుణ్యక్షేత్రం గురించి తెలియదు. నేను దానిని చాల రహస్యంగా ఉంచాను.

తత్ తేஉహం సమ్ప్రవక్ష్యామి తీర్థరాజం చ సామ్ప్రతమ్ ।
భావేనైకేన సుశ్రోణి శృణుష్వ వరవర్ణిని ॥ 26 ॥

సుందరాంగీ, లక్ష్మీదేవీ, అటువంటి రహస్యమయిన పుణ్యక్షేత్రాన్ని గురించి ఇపుడు మొదటిసారిగా నీకు చెప్తున్నాను. సావధానంగా విను.

ఆసీత్ కల్పే సముత్పన్నే నష్టే స్థావరజఙ్గమే ।
ప్రలీనా దేవగన్ధర్వదైత్యవిద్యాధరోరగాః ॥ 27 ॥

పూర్వం కల్పం (14 మన్వంతరాలకాలం) ప్రారంభంలో అంతకు ముందరికల్పం చివర, ప్రళయసమయంలో చరమూ అచరమూ అయినసృష్టి అంతా నశించిపోయింది. దేవతలూ, గంధర్వులూ, దైత్యులూ, విద్యాధరులూ, నాగులూ (ఊర్ధ్వఅధోలోకాలూ) అందరూ పరమాత్మలో లీనమైపోయారు.

తమోభూత మిదం సర్వం న ప్రాజ్ఞాయత కించన ।
తస్మి ఞ్జాగర్తి భూతాత్మా పరమాత్మా జగద్గురుః ॥ 28 ॥

ఈ బ్రహ్మాండం అంతా చీకటిమయం అయింది. ఏమీ తెలియడం లేదు. ఆ సమయంలో సర్వభూతాలలోనూ అంతర్యామిగా ఉండే పరమాత్మ ఒక్కడు మాత్రమే మెలకువగా ఉన్నాడు. ఆస్వామి అన్ని లోకాలకూ గురువు.

శ్రీమాం స్త్రిమూర్తికృద్ దేవో జగత్కర్తా మహేశ్వరః ।
వాసుదేవేతి విఖ్యాతో యోగాత్మా హరిరీశ్వరః ॥ 29 ॥

అతడు శుభప్రదుడు. బ్రహ్మవిష్ణుమహేశ్వరులను ఏర్పాటుచేసింది ఆయనే. లోకాలను ఆదేవుడే సృష్టించాడు. సర్వోత్తముడైన ప్రభువు. యోగస్వరూపుడు. శ్రీహరి. సమర్థుడు. వాసుదేవుడు అని ప్రసిద్ధిని పొందాడు.

సోఽసృజద్ యోగనిద్రాన్తే నాభ్యమ్భోరుహమధ్యగమ్ ।
పద్మకేశరసఙ్కాశం బ్రహ్మాణం భూత మవ్యయమ్ ॥ 30 ॥

ఆ పరమాత్మ యోగనిద్రనుండి మేలుకొన్న తరువాత, మొదట తనబొడ్డునుండి ఏర్పడిన తామరలోనుండి బ్రహ్మను సృష్టించాడు. ఆ బ్రహ్మదేవుడు తామరపుప్పొడివంటిశరీరచ్ఛాయ గలిగిఉంటాడు. స్థిరంగా ఉంటాడు.

తాదృగ్భూత స్తతో బ్రహ్మా సర్వలోకమహేశ్వరః ।
పఞ్చభూతసమాయుక్తం సృజతే చ శనై శ్శనైః ॥ 31 ॥

ఆవిధంగా జన్మించిన బ్రహ్మదేవుడు లోకాలన్నింటికీ ప్రభువు. ఆయన మెల్లమెల్లగా (పంచీకృత మైన) పంచభూతాలతో సృష్టిని చేస్తాడు.

మాత్రాయోనీని భూతాని స్థూలసూక్ష్మాణి యాని చ ।
చతుర్విధాని సర్వాణి స్థావరాణి చరాణి చ ॥ 31 ॥

శబ్దస్పర్శరూపరసగంధాలు అనే తన్మాత్రలు ఏర్పడడానికి మూలమయినవీ, పెద్దవిగానూ, చిన్నవిగానూ ఉండే ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథివి అనే అయిదు మహాభూతాలను సృష్టించాడు. కదలకుండా స్థిరంగా ఉండేవీ, కదిలేవీ అయిన నాలుగు (జరాయుజ,అండజ,స్వేదజ,ఉద్భిజాలు) విధాలుగా ఉండేపదార్థాల నన్నింటినీ సృష్టించాడు.

తతః ప్రజాపతిర్ బ్రహ్మా చక్రే సర్వం చరాచరమ్ ।
సఞ్చిన్త్య మనసాఽఽత్మానం ససర్జ వివిధాః ప్రజాః ॥ 32 ॥

ఆతరువాత ప్రజాపతి అయిన బ్రహ్మదేవుడు వాటిని సంచరించే విధం(జంగమాలు)గానూ, స్థిరంగా ఉండే విధం(స్థావరాలు)గానూ చేశాడు. బ్రహ్మదేవుడు మనసులో తనను తాను ధ్యానించి (ఆత్మజ్ఞానంతో), రకరకాలైన ప్రజలను సృష్టిచేశాడు.

మరీచ్యాదీన్ మునీన్ సర్వాన్ గన్ధర్వోరగరాక్షసాన్ ।
యక్షవిద్యాధరాం శ్చాన్యాన్ గఙ్గాద్యా స్సరిత స్తథా ॥ 33 ॥

మరీచి మొదలైన మహర్షులనూ, సమస్తమైన గంధర్వులనూ, నాగులనూ, రాక్షసులనూ, యక్షులనూ, విద్యాధరులనూ, ఇంకా ఇతరులనూ అందరినీ బ్రహ్మదేవుడు సృష్టించాడు. అలాగే గంగ మొదలైన నదులను కూడ సృష్టించాడు.

(సప్త స్వర్గాన్ సపాతాలాన్ భువనాని చతుర్దశ ।
ద్వీపా నసృజ దమ్బోధీన్ గఙ్గాద్యా స్సరిత స్తథా ॥ 34 ॥

స్వర్గం మొదలైన ఊర్ధ్వలోకాలు ఏడూ, పాతాళలోకాలు ఏడూ మొత్తం పధ్నాలుగుభువనాలనూ, ద్వీపాలనూ, సముద్రాలనూ, గంగ మొదలైన నదులనూ బ్రహ్మదేవుడు సృష్టించాడు. గంగాది సరిత్తులు పూర్వశ్లోకంలో ఉంది. ఈశ్లోకం ప్రక్షిప్తమే.కొన్నిటిలో ఈశ్లోకం లేదు.)

నరవానరసింహాంశ్చ వివిధాంశ్చ విహఙ్గమాన్ ।
జరాయూనణ్డజాన్ దేవి స్వేదజోద్భేదజాం స్తథా ॥ 35 ॥

లక్ష్మీదేవీ, మానవులనూ, కోతులనూ, సింహాలనూ, అలాగే రకరకాలపక్షులనూ సృష్టించాడు. మావినుండి పుట్టే మానవులు పశువులు మొదలైనవారు (జరాయుజాలు), గ్రుడ్డునుండి పుట్టే పక్షులు మొదలైనవి (అండజాలు), చెమటనుండి పుట్టే క్రిములు మొదలైనవి (స్వేదజాలు), నేలను చీల్చుకుని పైకి వచ్చే (మొలకెత్తే) చెట్లు మొదలైనవి (ఉద్భిజాలు), అనే నాలుగువిధాలైనజీవులను సృష్టించాడు.

బ్రహ్మ క్షత్త్రం తథా వైశ్యం శూద్రం చైవ చతుష్టయమ్ ।
అన్త్యజాతాంశ్చ మ్లేచ్ఛాంశ్చ ససర్జ వివిధాన్ పృథక్ ॥ 36 ॥

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అనే విధమైన నాలుగువర్ణాలవారినీ, మాలలనూ, మ్లేచ్ఛులనూ సృష్టించాడు. అలాగే ఇంకా ఇతరమైన రకరకాలజాతులవారిని కూడ వేరువేరుగా సృష్టించాడు.

యత్కిఞ్చిజ్జీవసంజ్ఞం తు తృణగుల్మపిపీలికమ్ ।
బ్రహ్మా భూత్వా జగత్సర్వం నిర్మమే సచరాచరమ్ ॥ 37 ॥

పరమాత్మ బ్రహ్మరూపాన్ని స్వీకరించి, ఇంకా గడ్డి, పొదలు, చీమలు మొదలుగా అన్నిరకాలయిన ప్రాణులను సృష్టి చేశాడు. ఇంకా జంగమాలు, స్థావరాలు అయిన జగత్తు మొత్తాన్ని సృష్టి చేశాడు.

దక్షిణాఙ్గే తథాత్మానం సఞ్చిన్త్య పురుషం స్వయమ్ ।
వామే చైవ తు నారీం స ద్విధా భూత మకల్పయత్ ॥ 38 ॥

తన శరీరంలో కుడివైపునుండి తననే పురుషుడుగా భావించి, ఆ భాగం నుండి పురుషుడిని సృష్టించాడు. అలాగే తన శరీరంలో ఎడమ భాగాన్ని స్త్రీగా భావించి, అక్కడినుండి స్త్రీని సృష్టించాడు.

తతః ప్రభృతి లోకేஉస్మిన్ ప్రజా మైథునసమ్భవాః ।
అధమోత్తమమధ్యాశ్చ మమ క్షేత్రాణి యాని చ ॥ 39 ॥

అప్పటినుండి ఈలోకంలో ప్రజలు దాంపత్య ధర్మంవల్ల జన్మిస్తున్నారు. ఇలా ఏర్పడిన నీచమూ, మధ్యమమూ, ఉత్తమమూ అయిన నాశరీరాలు అన్నీ ఇలాగే ఏర్పడ్డాయి(సృష్టిలోని చరాచరవస్తుజాలం అంతా పరమాత్మస్వరూపమే).

ఏవం సఞ్చిన్త్య దేవోஉసౌ పురా సలిలయోనిజః ।
జగామ ధ్యాన మాస్థాయ వాసుదేవాత్మికాం తనుమ్ ॥ 40 ॥

పూర్వం పద్మంనుండి పుట్టిన ఆచతుర్ముఖబ్రహ్మ తన సృష్టిని గురించి, ఈ విధంగా ఆలోచించి ధ్యానంలోకి వెళ్లాడు. ధ్యానస్థితిలో వాసుదేవస్వరూపాన్ని దర్శించాడు.

ధ్యానమాత్రేణ దేవేన స్వయమేవ జనార్దనః ।
తస్మిన్ క్షణే సముత్పన్న స్సహస్రాక్ష స్సహస్రపాత్ ॥ 41 ॥

బ్రహ్మదేవుడు ఆవిధంగా ధ్యానించిన మాత్రం చేతనే ఆ క్షణంలోనే జనార్దనుడు స్వయంగా బ్రహ్మకు గోచరించాడు. అలా గోచరించిన జనార్దనుడికి కన్నులు అనంతంగా ఉన్నాయి. పాదాలు లెక్క లేనన్ని ఉన్నాయి.

సహస్రశీర్షా పురుషః పుణ్డరీకనిభేక్షణః ।
సలిలధ్వాన్తమేఘాభ శ్శ్రీమాన్ శ్రీవత్సలక్షణః ॥ 42 ॥

ఆ పురుషుడికి అంతు లేనన్ని తలలున్నాయి. కన్నులు తామరలవలె ఉన్నాయి. నీరు నిండినకారు(చీకటి) మేఘాలలాగా, ఆస్వామి నల్లగా ఉన్నాడు. ఆమూర్తి చక్కగా ప్రకాశిస్తున్నది. వక్షస్స్థలంమీద శ్రీవత్సం అనే మచ్చ ఉన్నది.

అపశ్యత్ సహసా తం తు బ్రహ్మా లోకపితామహః ।
ఆసనై రర్ఘ్యపాద్యైశ్చ అక్షతై రభినన్ద్య చ ॥
తుష్టావ పరమైః స్తోత్రై ర్వ్యరిఞ్చి స్సుసమాహితః ॥ 43 ॥

లోకాలన్నింటికి పితామహుడయిన బ్రహ్మదేవుడు ఆపరమాత్మను ఆత్రంగా చూశాడు. ఆస్వామికి ఆసనం సమర్పించాడు. (స్వామి కూర్చున్న తర్వాత) చేతులు కడుగుకునే జలమూ, కాళ్లు కడుగుకునే జలమూ సమర్పించాడు. (స్వామి చేతులనూ పాదాలనూ స్వయంగా కడిగాడు). అక్షతలతో అర్చించాడు. మనసంతా లగ్నం చేసి ఆ పురుషోత్తముడిని సర్వశ్రేష్ఠమైన స్తోత్రాలతో స్తుతించాడు.

తతోஉహ ముక్తవాన్ దేవం బ్రహ్మాణం కమలోద్భవమ్ ।
కారణం వద మాం తాత మమ ధ్యానస్య సామ్ప్రతమ్ ॥ 44 ॥

అప్పుడు నేను (విష్ణుమూర్తి) పద్మసంభవుడైన బ్రహ్మతో ఇలా అన్నాను. తండ్రీ, ఇప్పుడు నన్ను ధ్యానించడానికి కారణం ఏమిటి. చెప్పు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ అంటున్నాడు.

జగద్ధితాయ దేవేశ మర్త్యలోకైశ్చ దుర్లభమ్ ।
స్వర్గద్వారస్య మార్గాణి యజ్ఞదానవ్రతాని చ ॥ 45 ॥

యోగ స్సత్యం తప శ్శ్రద్ధా తీర్థాని వివిధాని చ ।
విహాయ సర్వ మేతేషాం సుఖం తత్సాధనం వద ॥ 46 ॥

దేవనాథా, యజ్ఞాలు, దానాలు, వ్రతాలు, యోగం, సత్యవ్రతం, తపస్సు, ఏకాగ్రత, అనేకమైన పుణ్య తీర్థాలను సేవించడం మొదలైనవి స్వర్గంలో ప్రవేశించడానికి మార్గాలు. వీటితో దేనితోనూ పని లేకుండా, సుఖంగా స్వర్గద్వారానికి చేరుకునే సాధనం ఏదో చెప్పు. లోకాలన్నింటికీ మేలుగలగడం కోసం, మానవులకు దుర్లభమైన ఆ మోక్షసాధనాన్ని వివరించు.

స్థానం జగత్పతే మహ్యా ముత్కృష్టం చ య దుచ్యతే ।
సర్వేషా ముత్తమం స్థానం బ్రూహి మే పురుషోత్తమ ॥ 47 ॥

పురుషోత్తమస్వామీ, ఈ భూమిమీద ఆ జగన్నాథుడు నెలకొన్నదీ, ఉత్తమంగా పేరు గాంచినదీ, అయిన ప్రదేశం ఏది? క్షేత్రాలు అన్నింటికంటె శ్రేష్ఠమయిన ఆపుణ్యక్షేత్రాన్ని గురించి నాకు చెప్పవలసింది.

విధాతు ర్వచనం శ్రుత్వా తతోఽహం ప్రోక్తవాన్ ప్రియే ।
శృణు బ్రహ్మన్ ప్రవక్ష్యామి నిర్మలం భువి దుర్లభమ్ ॥ 48 ॥

ప్రియసతీ, బ్రహ్మమాటలు విని అపుడు నేను ఇలా అన్నాను. 'బ్రహ్మా, చెప్తాను, విను. అది చాల పవిత్రమైనది. దానిని పొందడం (అక్కడికి వెళ్ళడం) అంత తేలిక కాదు.

ఉత్తమం సర్వక్షేత్రాణాం ధన్యం సంసారతారణమ్ ।
గోబ్రాహ్మణహితం పుణ్యం చాతుర్వర్ణ్యసుఖోదయమ్ ॥ 49 ॥

క్షేత్రాలన్నింటిలోనూ అది శ్రేష్ఠం. సంసారంనుండి తరింపజేస్తుంది (మోక్షాన్ని ఇస్తుంది). (ఈలోకంలో) సంపదలను ఇస్తుంది. పుణ్యాన్ని ప్రసాదిస్తుంది. ఆవులకూ, బ్రాహ్మణులకూ హితం చేస్తుంది. నాలుగు వర్ణాలవారికీ సుఖం కలిగిస్తుంది.

భుక్తిముక్తిప్రదం నృణాం క్షేత్రం పరమశోభనమ్ ।
మహాపుణ్యం తు సర్వేషాం వసతాం ప్రపితామహ ॥ 50 ॥

పూర్వపితామహా, ఈపుణ్యక్షేత్రం మానవులకు భోగమోక్షాలను కలిగిస్తుంది. అందరికీ ఉత్తమమైన శుభాలు చేకూరుస్తుంది ఆక్షేత్రంలో నివసిస్తున్న వారందరికీ (నివసించడంమాత్రం చేతనే) గొప్పపుణ్యాన్ని అనుగ్రహిస్తుంది.

తస్మాదాసీత్ సముత్పన్నం తీర్థరాజం సనాతనమ్ ।
విఖ్యాతం పరమం క్షేత్రం చతుర్యుగనిషేవితమ్ ॥ 51 ॥

అక్కడ పురాతనమైన ఉత్తమతీర్థం ఏర్పడి ఉంది. ప్రసిద్ధమైన ఆపుణ్యతీర్థాన్ని నాలుగు యుగాలనుండీ జనం అంతా సేవించుకున్నారు (కృతయుగం నుంచీ ఉన్న ఈ తీర్థం కలియుగంలోనూ వృద్ధిచెందుతూనేఉన్నది).

సర్వేషామేవ దేవానా మృషీణాం బ్రహ్మచారిణామ్ ।
దైత్యదానవసిద్ధానాం గన్ధర్వోరగరక్షసామ్ ॥ 52 ॥

నాగవిద్యాధరాణాం చ స్థావరస్య చరస్య చ ।
ఉత్తమః పురుషో యస్మాత్ తస్మాత్ స పురుషోత్తమః ॥ 53 ॥

దేవతలు, మహర్షులు, ఆత్మజ్ఞానులు, దైత్యులు, దానవులు, సిద్ధులు, గంధర్వులు, ఉరగులు, రాక్షసులు, నాగులు, విద్యాధరులు, ఇంకా ఇతరజీవులు అందరిలోనూ ఉత్తముడైన పురుషుడు కావడంచేత ఆ క్షేత్రాధిపతి అయిన స్వామి పురుషోత్తముడు అయినాడు.

దక్షిణ స్యోదధే స్తీరే న్యగ్రోధో యత్ర తిష్ఠతి ।
దశయోజనవిస్తీర్ణం క్షేత్రం పరమదుర్లభమ్ ॥ 54 ॥

దక్షిణం సముద్రతీరంలో ఒకానొకపుణ్యక్షేత్రం ఉంది. అది ఎనభైమైళ్లమేర విస్తరించి ఉంటుంది. ఇటువంటి పుణ్యక్షేత్రం ఇంక ఎక్కడా లేదు. ఆక్షేత్రంలో ఒక పెద్ద మఱ్ఱిచెట్టు ఉంది.

య స్తు కల్పే సముత్పన్నే సర్వలోకనిబర్హణే ।
వినాశం నైవ మభ్యేతి స్వయం తత్రైవ మాస్థితః ॥ 55 ॥

కల్పం ముగిసి, మహాప్రళయం ఏర్పడి సమస్తమైన సృష్టి అంతరించిపోయే సమయంలో కూడ ఆక్షేత్రం నశించదు. అంతకు పూర్వం ఉన్నట్లుగా చెక్కుచెదరకుండా అలాగే ఉంటుంది.

దృష్టమాత్రే వటే తస్మిన్ ఛాయామాక్రమ్య చాసకృత్ ।
బ్రహ్మహత్యా ప్రముచ్యేత పాపేష్వన్యేషు కా కథా ॥ 56 ॥

ఆ క్షేత్రంలోని మఱ్ఱిచెట్టును ఒకసారి చూసినా, దాని నీడలో ఉన్నా, బ్రహ్మహత్యాపాపం కూడా సులువుగా నశించిపోతుంది. ఇంక మిగిలిన చిన్న చిన్న పాపాలను గురించి చెప్పే దేముంది?

ప్రదక్షిణా కృతా యై స్తు నమస్కారశ్చ జన్తుభిః ।
సర్వం నిర్ధూతపాప్మాన స్తే గతాః కేశవాలయమ్ ॥ 57 ॥

ఆ మఱ్ఱిచెట్టుకు ప్రదక్షిణం చేసినవారు, నమస్కారం చేసినవారు, పాపాలన్నీ నశించిపోయి, వైకుంఠానికి చేరుకుంటారు.

న్యగ్రోధ స్యోత్తరే కిఞ్చిద్ దక్షిణే కేశవస్య తు ।
ప్రాసాద స్తత్ర తిష్ఠేత్తు పదం ధర్మమయం హి తత్ ॥ 58 ॥

ఆ మఱ్ఱిచెట్టుకు ఉత్తరంగానూ, కృష్ణస్వామికి కొంచెం దక్షిణం దిక్కుగానూ ఒక పెద్దభవనం (దేవాలయం) ఉంది. అది ధర్మంతో నిండిన పవిత్రప్రదేశం.

ప్రతిమాం తత్ర వై దృష్ట్వా స్వయం దేవేన నిర్మితామ్ ।
అనాయాసేన వై యాన్తి భువనం మే తతో నరాః ॥ 59 ॥

ఆ దేవాలయంలోని విగ్రహాన్ని భగవంతుడు స్వయంగా నిర్మించాడు (ఆ మూర్తి స్వయంభువు). దానిని దర్శించుకున్న మానవులు ఏమాత్రం కష్టపడకుండా వెంటనే నా లోకానికి (వైకుంఠానికి) చేరుకుంటారు.

గచ్ఛమానాంస్తు తాన్ ప్రేక్ష్య ఏకదా ధర్మరాట్ ప్రియే ।
మదన్తిక మనుప్రాప్య ప్రణమ్య శిరసాబ్రవీత్ ॥ 60 ॥

ప్రియసతీ, ఆ విధంగా (స్వామిమూర్తిని దర్శించినందువల్ల) వైకుంఠానికి వెళ్తున్న మానవులను చూసి, ఒకనాడు యమధర్మరాజు నావద్దకు వచ్చాడు. నాకు శిరసువంచి నమస్కరించాడు. తరువాత ఇలా అన్నాడు.

యమ ఉవాచ :-యమధర్మరాజు అంటున్నాడు.

నమస్తే భగవన్ దేవ లోకనాథ జగత్పతే ।
క్షీరోదవాసినం దేవం శేషభోగానుశాయినమ్ ॥ 61 ॥

దేవా, జగన్నాథా, విశ్వేశ్వరా, నీకు నమస్కారం. నీవు పాలసముద్రంలో నివసించే దేవుడివి. ఆదిశేషుడి పడగలమీద శయనిస్తావు.

వరం వరేణ్యం వరదం కర్తారమకృతం ప్రభుమ్ ।
విశ్వేశ్వర మజం విష్ణుం సర్వజ్ఞమపరాజితమ్ ॥ 62 ॥

మాకు నీవు ప్రభువువి. ప్రధానుడివి. అందరికీ కావలసిన వరాలను ఇస్తావు. అన్నింటినీ నీవే సృష్టించావు. నిన్ను ఎవరూ సృష్టించలేదు. (స్వయంగా ఉన్నవాడివి). మాకు పాలకుడివి. లోకాలన్నిటికీ నీవే అధిపతివి. నీకు పుట్టుక లేదు. అన్నింటా నిండి ఉంటావు. సర్వమూ తెలిసినవాడివి. నీకు ఎదురు లేదు. (సమస్తాన్నీ జయిస్తావు.)

నీలోత్పలదలశ్యామం పుణ్డరీకనిభేక్షణమ్ ।
సర్వజ్ఞం నిర్గుణం శాన్తం జగద్ధాతార మవ్యయమ్ ॥ 63 ॥

నీవు నల్లకలువ పూవురేకులలాగా నల్లగా ఉంటావు. నీకన్నులు తామరపూలలాగా ఉంటాయి. నీవు పరమాత్మవు. త్రిగుణాలకు అతీతుడివి. నిశ్చలంగా ఉంటావు. లోకాలను సృష్టిస్తావు. నీకు ఎటువంటి వికారాలూలేవు.

సర్వలోకవిధాతారం సర్వలోకసుఖావహమ్ ।
పురాణం పురుషం వేద్యం వ్యక్తావ్యక్తం సనాతనమ్ ॥ 64 ॥

లోకాలు అన్నింటినీ నీవే సృష్టిచేశావు (సృష్టికర్తవు). అన్ని లోకాలకూ సుఖాన్ని కలిగిస్తావు (స్థితికర్తవు). నీవు సృష్టికి పూర్వంనుంచి ఉన్నావు. పరమాత్మవు. (సంకీర్తనాదులచేత) తెలియదగినవాడివి. (ఆత్మజ్ఞానంచేత) తెలియబడతావు. తెలియబడకుండా అన్నింటా ఉంటావు. శాశ్వతుడివి.

పరావరాణాం స్రష్టారం లోకనాథం జగద్గురుమ్ ।
శ్రీవత్సోరస్కసంయుక్తం వనమాలావిభూషితమ్ ॥ 65 ॥

దూరంగా ఉండేవారినీ, దగ్గరలో ఉండేవారినీ (ఊర్ధ్వ అధోలోకాలను) చాల పెద్ద పదార్థాలనూ, చాలచిన్న పదార్థాలనూ అన్నింటినీ నీవే సృష్టించావు. లోకాలను అన్నింటినీ కాపాడతావు. లోకాలకు జ్ఞానాన్ని ఇస్తావు. నీ వక్షస్స్థలం మీద శ్రీవత్సం అనే పుట్టుమచ్చ ఉన్నది. అన్ని ఋతువులలో ఉండేపూలతో కూర్చిన పెద్దమాల నీకు అలంకారం అయింది.

పీతవస్త్రం చతుర్బాహుం శంఖచక్రగదాధరమ్ ।
హారకేయూరసంయుక్తం ముకుటాఙ్గదధారిణమ్ ॥ 66 ॥

పచ్చని పట్టు వస్త్రాన్ని ధరించావు. నీకు నాలుగు బాహువులు ఉన్నాయి. ఆచేతులలో శంఖం, చక్రం,గద అనేవాటిని ధరించావు. మెడనిండా హారాలు, చేతులకు భుజకీర్తులు, ఇంకా కిరీటం, హస్తాభరణాలు ధరించావు.

సర్వలక్షణసమ్పూర్ణం సర్వేన్ద్రియవివర్జితమ్ ।
కూటస్థమచలం సూక్ష్మం జ్యోతీరూపం సనాతనమ్ ॥ 67 ॥

సమస్తమైన ఉత్తమలక్షణాలు సమగ్రంగా కలిగిఉన్నావు. ఇంద్రియాలకు అతీతుడివి. నీకు ఎటువంటి వికారాలు లేవు. స్థిరంగా ఉంటావు. మిక్కిలి తక్కువపరిమాణంలో ఉంటావు. జ్యోతిరూపంలో ఉంటావు. పురాణ పురుషుడివి.

భావాభావవినిర్ముక్తం వ్యాపినం ప్రకృతేః పరమ్ ।
నమస్యామి జగన్నాథ మీశ్వరం సుఖదం ప్రభుమ్ ॥ 68 ॥

ఉండటం, లేకపోవడం అనేస్థితులకు అతీతమైనవాడివి. అంతటా నిండిఉంటావు. ప్రకృతికంటె అధిక మైనవాడివి. లోకాలకు ప్రభువువి. సంపదలు ఇస్తావు. సుఖాన్ని ఇస్తావు. పాలిస్తావు. అటువంటి నీకు నమస్కారం.

ఇత్యేవం ధర్మరాజస్తు పురా న్యగ్రోధసన్నిధౌ ।
స్తుత్వా నానావిధైః స్తోత్రైః ప్రణామమకరోత్ తదా ॥ 69 ॥

ఈ విధంగా యమధర్మరాజు ఆ మఱ్ఱిచెట్టు సన్నిధిలో రకరకాలైన స్తోత్రాలతో పూర్వం నన్ను స్తుతించాడు. తర్వాత సాష్టాంగంగా నమస్కరించాడు.

తం దృష్ట్వా తు మహాభాగే ప్రణతం ప్రాఞ్జలిం స్థితమ్ ।
స్తోత్రస్య కారణం దేవి పృష్టవానహ మన్తకమ్ ॥ 70 ॥

లక్ష్మీ, సౌభాగ్యవతీ, ఈవిధంగా చేతులు జోడించి, వినయంగా వంగి నమస్కరించిన ఆ యమధర్మరాజును చూచి, ఎందుకు నన్ను స్తుతించడానికి కారణం ఏమిటి? అని అడిగాను.

వైవస్వత మహాబాహో సర్వదేవోత్తమో హ్యసి ।
కిమర్థం స్తుతవాన్ మాం త్వం సంక్షేపాత్ తద్ బ్రవీహి మే ॥ 71 ॥

దీర్ఘ మయినబాహువులు కలిగిన యమధర్మరాజా, దేవతలందరిలోనూ నీవు శ్రేష్ఠుడివి కదా. నన్ను ఎందుకు స్తుతించావు? నాకు సంగ్రహంగా చెప్పు.

ధర్మరాజ ఉవాచ :- శ్రీమహావిష్ణువుతో యమధర్మరాజు ఇలా చెప్తున్నాడు.

అస్మి న్నాయతనే పుణ్యే విఖ్యాతే పురుషోత్తమే ।
ఇంద్రనీలమయీ శ్రేష్ఠా ప్రతిమా సార్వకామికీ ॥ 72 ॥

పుణ్యప్రదమైన ఈక్షేత్రంలోని పురుషోత్తముని దేవాలయంలోని స్వామి విగ్రహం ఇంద్రనీలమణులతో ఏర్పడిఉంది. ఇది చాల ఉత్తమమైనది. (దర్శించినవారికి) అన్నికోరికలనూ తీరుస్తుంది.

తాం దృష్ట్వా పుణ్డరీకాక్ష భావే నైకేన శ్రద్ధయా ।
శ్వేతాఖ్యం భవనం యాన్తి నిష్కామాశ్చైవ మానవాః ॥ 73 ॥

పద్మనేత్రా!, ఏకాగ్రమైనబుద్ధితో శ్రద్ధతో ఆ స్వామివిగ్రహాన్ని దర్శించిన మానవులకు కోరికలు నశించి పోతాయి. వారు శ్వేతం భవనానికి చేరుకుంటున్నారు.

అతః కర్తుం న శక్నోమి వ్యాపార మరిసూదన ।
ప్రసీద సుమహాదేవ సంహర ప్రతిమాం విభో ॥ 74 ॥

దేవదేవా, దీనివలన (ఈవిగ్రహాన్ని చూసిన మానవులందరూ సరాసరి వైకుంఠానికి వెళ్లిపోతున్నందున) నేను నాకర్తవ్యాన్ని నిర్వహించలేకపోతున్నాను. నన్ను అనుగ్రహించు. మహానుభావా, ఆక్షేత్రంలోని పురుషోత్తమ దేవుడి ప్రతిమను తొలగించు.

శ్రుత్వా వైవస్వత స్యైతద్వాక్య మేత దువాచ హ ।
యమ తాం గోపయిష్యామి సికతాభి స్సమన్తతః ॥ 75 ॥

యమధర్మరాజు మాటలు విని నేను 'యమధర్మరాజా, ఆవిగ్రహాన్ని పూర్తిగా ఇసుకతో కప్పివేసి, ఎవరికీ కనబడకుండా చేస్తాను' అని చెప్పాను.

తత స్సా ప్రతిమా దేవి వల్లిభి ర్గోపితా మయా ।
యథా తత్ర న పశ్యన్తి మనుజా స్స్వర్గకాంక్షిణః ॥ 76 ॥

లక్ష్మీదేవీ, స్వర్గాన్ని కోరుకునేమానవులు ఎవరూ చూడకుండా, ఆ పురుషోత్తమవిగ్రహాన్ని (ఇసుకరేణువుల మధ్యలో) పొదలలో రహస్యంగా దాచాను.

ప్రచ్ఛాద్య వల్లికై ర్దేవి జాతరూపపరిచ్ఛదైః ।
యమం ప్రస్థాపయామాస స్వాం పురీం దక్షిణాం దిశమ్ ॥ 77 ॥

దేవీ, బంగారు (రంగులో ఉన్న) తీగెలతో స్వామి విగ్రహాన్ని కప్పివేశాను. నా అనుజ్ఞతో యముడు తాను పరిపాలించే దక్షిణ దిక్కుకు వెళ్లిపోయాడు.

బ్రహ్మోవాచ :- మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

లుప్తాయాం ప్రతిమాయాం తు ఇన్ద్రనీలస్య భో ద్విజాః ।
తస్మిన్ క్షేత్రవరే పుణ్యే విఖ్యాతే పురుషోత్తమే ॥ 78 ॥

యో భూత స్తత్ర వృత్తాన్తో దేవదేవో జనార్దనః ।
తం సర్వం కథయామాస స తస్యై భగవాన్ పురా ॥ 79 ॥

ఓ బ్రాహ్మణులారా, ఇంద్రనీలమణిమయమైన ఆ పురుషోత్తమస్వామి విగ్రహం ఈవిధంగా (దాచిఉంచడం చేత) కనబడకుండా పోయేసరికి సుప్రసిద్ధమైన ఆపురుషోత్తమక్షేత్రంలో తరువాత జరిగినవృత్తాంతం సమస్తం పూర్వం శ్రీమహావిష్ణువు లక్ష్మీదేవికి వివరించాడు.

ఇన్ద్రద్యుమ్నస్య గమనం క్షేత్రసన్దర్శనం తథా ।
క్షేత్రస్య వర్ణనం చైవ ప్రాసాదకరణం తథా ॥ 80 ॥

ఇంద్రద్యుమ్నుడు పురుషోత్తమక్షేత్రానికి సపరివారంగా వెళ్లడం, ఆక్షేత్రాన్ని చక్కగా దర్శించడం, ఆ పురుషోత్తమక్షేత్రవర్ణనం, అక్కడ స్వామికి ఇంద్రద్యుమ్నుడు ఉత్తమమైన ఆలయాన్ని నిర్మించడం, వివరించాడు.

హయమేధస్య యజనం స్వప్నదర్శన మేవ చ ।
లవణ స్యోదధే స్తీరే కాష్ఠసన్దర్శనం తథా ॥ 81 ॥

అక్కడ అశ్వమేధయాగం చేయడం, కలగనడం, ఉప్పుసముద్రం తీరంలో కొయ్యను చూడటం చెప్పాడు.

దర్శనం వాసుదేవస్య శిల్పిరాజస్య చ ద్విజాః ।
నిర్మాణం ప్రతిమాయాస్తు యథావర్ణం విశేషతః ॥ 82 ॥

ఓ బ్రాహ్మణులారా, (మారురూపాలతో వచ్చిన) కృష్ణస్వామినీ, విశ్వకర్మనూ దర్శించుకోవడం, స్వామి రూపానికి తగిన రంగులతో ఆస్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా నిర్మింపజేయడం, పేర్కొన్నాడు.

స్థాపనం చైవ సర్వేషాం ప్రాసాదే భువనోత్తమే ।
యాత్రాకాలే చ విప్రేన్ద్రాః కల్పసఙ్కీర్తనం తథా ॥ 83 ॥

బ్రాహ్మణవరేణ్యులారా, ఆవిగ్రహాలను లోకాలన్నిటిలోనూ శ్రేష్ఠమైన ఆలయంలో ప్రతిష్ఠించడం, యాత్రగా అక్కడికి వెళ్లేసమయంలో కల్పాలను గురించి వర్ణించడం, వివరించాడు.

మార్కణ్డేయస్య చరితం స్థాపనం శఙ్కరస్య చ ।
పఞ్చతీర్థస్య మాహాత్మ్యం దర్శనం శూలపాణినః ॥ 84 ॥

మార్కండేయమహర్షి చరిత్ర, శివలింగాన్ని ప్రతిష్ఠించడం, పంచతీర్థాల మాహాత్మ్యం, శివుడిని దర్శించుకోవడం పేర్కొన్నాడు.

వటస్య దర్శనం చైవ వ్యుష్టిం తస్య చ భో ద్విజాః ।
దర్శనం బలదేవస్య కృష్ణస్య చ విశేషతః ॥ 85 ॥

సుభద్రాయాశ్చ తత్రైవ మాహాత్మ్యం చైవ సర్వశః ।
దర్శనం నరసింహస్య వ్యుష్టిసఙ్కీర్తనం తథా ॥ 86 ॥

ఓ బ్రాహ్మణులారా, అక్కడ ఉన్న మఱ్ఱిచెట్టును దర్శించడం, ఆచెట్టును స్తుతించడం, అక్కడ బలరాముడిని, ప్రత్యేకంగా శ్రీకృష్ణుడినీ, సుభద్రాదేవినీ దర్శించుకోవడం వివరించాడు. ఆక్షేత్రంలో వారిమహిమలను సమగ్రంగా చెప్పాడు. తరువాత నరసింహస్వామిని దర్శించడం, ఆస్వామి మహిమను కీర్తించడం పేర్కొన్నాడు.

అనన్తవాసుదేవస్య దర్శనం పుణ్యకీర్తనమ్ ।
శ్వేతమాధవమాహాత్మ్యం స్వర్గద్వారస్య దర్శనమ్ ॥ 87 ॥

అనంతుడైన వాసుదేవస్వామిని దర్శించుకోవడం, పుణ్యప్రదుడైన ఆస్వామిని స్తుతించడం, శ్వేత ద్వీపంలో మాధవుడి మహిమనూ, స్వర్గం ప్రవేశద్వారాలను దర్శించుకోవడం వర్ణించాడు.

ఉదధే ర్దర్శనం చైవ స్నానం తర్పణమేవ చ ।
సముద్రస్నానమాహాత్మ మిన్ద్రద్యుమ్నస్య చ ద్విజాః ॥ 88 ॥

విప్రులారా, ఇంద్రద్యుమ్నుడు దక్షిణసముద్రాన్ని దర్శించుకోవడం, అక్కడ స్నానం చేయడం, దేవ ఋషి పితరులకు తర్పణాలు విడవడం, అక్కడి సముద్రంలో స్నానం చేయడంవల్ల కలిగేపుణ్యవిశేషాలనూ వివరించాడు.

పఞ్చతీర్థఫలం చైవ మహాజ్యేష్ఠం తథైవ చ ।
స్థానం కృష్ణస్య హలిన స్సర్వయాత్రాఫలం తథా ॥ 89 ॥

పంచతీర్థాలలో స్నానం వల్ల కలిగే పుణ్యం, జ్యేష్ఠమాసం లోని పూర్ణిమనాడు స్వామిని సేవించే విధానాన్నీ, కృష్ణబలరాములు నెలకొన్న ప్రదేశమూ, పురుషోత్తమ క్షేత్ర యాత్రవలన కలిగేప్రయోజనమూ చెప్పాడు.

వర్ణనం విష్ణులోకస్య క్షేత్రస్య చ పున స్స్వయమ్ ।
సర్వం కథితవాం స్తుభ్యం తస్మై స పురుషోత్తమః ॥ 90 ॥

వైకుంఠలోకాన్ని వర్ణించాడు. ఆక్షేత్రంమాహాత్మ్యాన్ని మళ్లీ మరోసారి పేర్కొన్నాడు. ఈవిధంగా పురుషోత్తము డైన ఆ శ్రీమహావిష్ణువు ఈ క్షేత్రాన్ని గురించి సమస్తవిషయాలూ మీకోసం (అందరినీ తరింపజేయడంకోసం) శ్రీదేవికి వర్ణించిచెప్పాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే పూర్వవృత్తానువర్ణనం నామ త్రిచత్వారింశోఽధ్యాయః ॥ 43 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో పూర్వవృత్తాంతవర్ణనం అనే నలభైమూడవ అధ్యాయం సంపూర్ణం.



చతుశ్చత్వారింశోఽధ్యాయః - నలభైనాల్గవ అధ్యాయం
క్షేత్రవర్ణనమ్ - క్షేత్రవర్ణనం

మునయ ఊచుః :-మహర్షులు అంటున్నారు.

శ్రోతు మిచ్ఛామహే దేవ కథాశేషం మహీపతేః ।
తస్మిన్ క్షేత్రవరే గత్వా కిం చకార నరాధిపః ॥ 1 ॥

బ్రహ్మదేవా! ఇంద్రద్యుమ్నుడికి సంబంధించిన మిగిలిన కథాభాగం కూడ వినాలని మాకు కోరికగా ఉంది. ఆపురుషోత్తమక్షేత్రానికి వెళ్లి ఇంద్రద్యుమ్నుడు ఏమి చేశాడు?

బ్రహ్మోవాచ :-బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

శృణుధ్వం మునిశార్దూలాః ప్రవక్ష్యామి సమాసతః ।
క్షేత్రసన్దర్శనం చైవ కృత్యం తస్య చ భూపతేః ॥ 2 ॥

మునివరేణ్యులారా! ఆమహారాజు పురుషోత్తమక్షేత్రాన్ని సందర్శించి, ఆ తరువాత ఏమి చేశాడో, సంగ్రహంగా చెప్తాను. వినండి.

గత్వా తత్ర మహీపాలః క్షేత్రే త్రైలోక్యవిశ్రుతే ।
దదర్శ రమణీయాని స్థానాని సరిత స్తథా ॥ 3 ॥

మూడులోకాలలోనూ ప్రసిద్ధమైన ఆపుణ్యక్షేత్రానికి వెళ్లిన ఇంద్రద్యుమ్నుడు అక్కడ ఉన్న మనోహరమైన ప్రదేశాలనూ, నదులనూ చూశాడు.

నదీ తత్ర మహాపుణ్యా విన్ధ్యపాదవినిర్గతా ।
విన్ధ్యాపలేతి విఖ్యాతా సర్వపాపహరా శుభా ॥ 4 ॥

అక్కడ ఒక గొప్ప పుణ్యనది ఉన్నది. ఆ నది వింధ్యపర్వతం మొదట్లో నుండి పుట్టింది. వింధ్యాపల అనే పేరుతో ప్రసిద్ధమైంది. సమస్తమైన పాపాలనూ పోగొడుతుంది. శుభాలను చేకూరుస్తుంది.

గఙ్గాతుల్యా మహాస్రోతా దక్షిణార్ణవగామినీ ।
మహానదీతి నామ్నా సా పుణ్యతోయా సరిద్వరా ॥ 5 ॥

ఆ నదికి మహానది అనిపేరు. అది గంగతో సమానమైనది. ఆ నదిప్రవాహం చాల పెద్దది. అది దక్షిణంగా ప్రవహిస్తూ సముద్రంలో కలుస్తుంది. అది నదులన్నిటిలో ఉత్తమమైనది. దానిలోని నీళ్లు చాల పవిత్రమయినవి.

దక్షిణస్యోదధేః కాన్తా దుహితృశతశోభితా ।
ఉభయో స్తీరయో ర్యస్యా గ్రామాశ్చ నగరాణి చ ॥ 6 ॥

దక్షిణ సముద్రానికి భార్య అయిన ఆ నదికి వందమంది కూతుళ్లు. దానికి రెండువైపుల ఒడ్డుమీద గ్రామాలు, నగరాలూ ఉన్నాయి.

దృశ్యన్తే మునిశార్దూలా స్సుసస్యా స్సుమనోహరాః ।
హృష్టపుష్టజనాకీర్ణా వస్త్రాభరణభూషితాః ॥ 7 ॥

మునివరులారా! ఆ నదికి రెండువైపులా తీరం వెంట ఉత్తమమైనపైర్లు సమృద్ధిగా, కనువిందుగా ఉంటాయి. ఆ జనావాసాలలో ఉండే ప్రజలు మంచిపోషణతో ఉంటారు. ఎప్పుడూ సంతోషంగా ఉంటారు. రకరకాలవస్త్రాలు, ఆభరణాలు అలంకరించుకుంటారు.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా శ్శూద్రా స్తత్ర పృథక్ పృథక్ ।
స్వధర్మనిరతా శ్శాన్తా దృశ్యన్తే శుభలక్షణాః ॥ 8 ॥

అక్కడ బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు ఎవరికి వారు తమ తమ వర్ణధర్మాలను శ్రద్ధగా ఆచరిస్తారు. ప్రశాంతంగా జీవిస్తుంటారు. ఉత్తమ లక్షణాలు కలిగి ఉంటారు.

తామ్బూలపూర్ణవదనా మాలాదామవిభూషితాః ।
వేదపూర్ణముఖా విప్రా స్సషడఙ్గపదక్రమాః ॥ 9 ॥

అక్కడ బ్రాహ్మణులకు నోటినిండా తాంబూలం ఉంటుంది. పూలమాలలు, హారాలు అలంకరించుకుంటారు. వేదాలను కంఠస్థం చేశారు. వేదాంగాలు ఆరింటినీ తెలుసుకున్నారు. వేదాలను పదం, క్రమం (జట, ఘన)చక్కగా గ్రహించారు.

అగ్నిహోత్రరతాః కేచిత్ కేచిదౌపాసనక్రియాః ।
సర్వశాస్త్రార్థకుశలా యజ్వానో భూరిదక్షిణాః ॥ 10 ॥

కొందరు నియమంగా హోమాలు చేస్తుంటారు. కొందరు గృహ్యాగ్నిలో ఉదయం, సాయంకాలం నిత్యహోమం చేస్తుంటారు. అన్ని శాస్త్రాలలోనూ విషయచర్చలు చేయడంలో నేర్పరులు. పెద్ద పెద్ద దక్షిణలతో యజ్ఞాలుచేశారు.

చత్వరే రాజమార్గేషు వనేషూపవనేషు చ ।
సభామణ్డలహర్మ్యేషు దేవతాయతనేషు చ ॥ 11 ॥

ఇతిహాసపురాణాని వేదా స్సాఙ్గా స్సులక్షణాః ।
కావ్యశాస్త్రకథా స్తత్ర శ్రూయన్తే చ మహాజనైః ॥ 12 ॥

నాలుగు దారులు కలిసే చోటులలోనూ, మహారాజు సంచరించే ప్రధాన వీధులలోనూ, పెద్దపెద్దతోటల లోనూ, ఉద్యానవనాలలోనూ, పెద్ద పెద్ద సభాభవనాలలోనూ, దేవాలయాలలోనూ, ఉత్తములయిన పండితులు ఇతిహాసాలనూ, పురాణాలనూ,వేదాంగాలనూ,వేదాలనూ, కావ్యాలనూ, శాస్త్రాలనూ, ఇతరమైన కథలనూ చక్కగా వినిపిస్తుంటారు.

స్త్రియ స్తద్దేశవాసిన్యో రూపయౌవనగర్వితాః ।
సమ్పూర్ణలక్షణోపేతా విస్తీర్ణశ్రోణిమణ్డలాః ॥ 13 ॥

ఆ క్షేత్రంలో నివసించే స్త్రీలరూపం మనోహరంగా ఉంటుంది. వారు మంచి యౌవనంలో ఉన్నారు. వారికి స్త్రీ లక్షణాలు అన్నీ సమగ్రంగా ఉన్నాయి. వారి జఘనభాగం విశాలంగా ఉంటుంది.

సరోరుహముఖా శ్యామా శ్శరచ్చన్ద్రనిభాననాః ।
పీనోన్నతకుచా స్సర్వా స్సమృద్ధ్యా చారుదర్శనాః ॥ 14 ॥

వారి ముఖం తామరపూవులాగానూ, శరత్కాలంచంద్రుడితో సమానంగానూ ఉంటుంది. అందరూ అందంగా ఉంటారు. వారి వక్షోజాలు బలిసి, ఎత్తుగానూ ఉంటాయి. అందరూ చూడ చక్కనివారు.

సౌవర్ణవలయాక్రాన్తా దివ్యై ర్వస్త్రై రలఙ్కృతాః ।
కదలీగర్భసఙ్కాశాః పద్మకిఞ్జల్కసప్రభాః ॥ 15 ॥

ముంజేతులకు బంగారు కంకణాలు (గాజులు) ధరిస్తారు. అతిలోకమైన వస్త్రాలతో అలంకరించు కుంటారు. అరటిదూట లాగా సుకుమారంగా ఉంటారు. వారి శరీరచ్ఛాయ తామరపూపొడిలాగా ఉంటుంది.

బిమ్బాధరపుటాః కాన్తాః కర్ణాన్తాయతలోచనాః ।
సుముఖా శ్చారుకేశాశ్చ హారభారావనామితాః ॥ 16 ॥

వారిక్రిందిపెదవులు దొండపండ్లలాగా ఉంటాయి. అందంగా ఉంటారు. వాళ్లకళ్లు చెవులదాకా విస్తరించి, విశాలంగా ఉంటాయి. ముఖాలు మనోహరంగా ఉంటాయి. వారితలవెంట్రుకలు అందంగా ఉంటాయి. మెడలోని హారాల బరువుకు ముందుకు వంగి పోయిఉంటారు.

కాశ్చిత్ పద్మపలాశాక్ష్యః కాశ్చిదిన్దీవరేక్షణాః ।
విద్యుద్విస్పష్టదశనా స్తన్వఙ్గ్యశ్చ తథాఽపరాః ॥ 17 ॥

కొందరు స్త్రీలకు కళ్లు తామరరేకులలాగా ఉంటాయి. మరి కొందరికళ్లు నల్ల గలువలలాగా ఉంటాయి. దంతాలు మెరుపులలాగా తెల్లగా మెరుస్తుంటాయి. మరి కొంతమందికి శరీరం సన్నగా అందంగా ఉంటుంది.

కుటిలాలకసంయుక్తా స్సీమన్తేన విరాజితాః ।
గ్రీవాభరణసంయుక్తాః మాల్యదామవిభూషితాః ॥ 18 ॥

వారి ముంగురులు వంకరతిరిగి మనోహరంగా ఉంటాయి. పాపట అందంగా ఉంటుంది. మెడలో రకరకాలఆభరణాలు ధరిస్తారు. పూలదండలు అలంకరించుకుంటారు.

కుణ్డలై రత్నసంయుక్తైః కర్ణపూరై ర్మనోహరైః ।
దేవయోషిత్ప్రతీకాశా దృశ్యన్తే శుభలక్షణాః ॥ 19 ॥

ఆ క్షేత్రంలోని ఆడవారు చెవులకు మణులు పొదిగినఆభరణాలు ధరిస్తారు. కొందరు చెవులకు అందమైన నల్ల గలువపూలను అలంకరించుకుంటారు. వారు దేవకాంతలలాగా ఉంటారు. వారిలో అన్నివిధాలైన శుభలక్షణాలు తొణికిసలాడుతుంటాయి.

దివ్యగీతవరై ర్ధన్యైః క్రీడమానా వరాఙ్గనాః ।
వీణావేణుమృదఙ్గైశ్చ పణవైశ్చైవ గోముఖైః ॥ 20 ॥

శఙ్ఖదున్దుభినిర్ఘోషై ర్నానావాద్యై ర్మనోహరైః ।
క్రీడన్త్య స్తా స్సదా హృష్టా విలాసిన్యః పరస్పరమ్ ॥ 21 ॥

ఆ క్షేత్రంలోని స్త్రీలు ఉత్తమమైన అవయవసౌందర్యం కలిగిఉంటారు. మంచిపాటలు పాడుతుంటారు. వీణలు, పిల్లనగ్రోవులు, మృదంగాలు, చర్మంతో చేసినవాద్యాలు, ఆవుకొమ్ముబూరలు, శంఖాలు, భేరులు, మొదలైన అనేక రకాల వాద్యాలను చెవికింపుగా వాయిస్తారు. వాళ్లు అందరూ ఆనందంగా కలిసి క్రీడిస్తుంటారు.

ఏవ మాది తథానేకగీతవాద్యవిశారదాః ।
దివారాత్రౌ ముదాయుక్తాః కామోన్మత్తా వరాఙ్గనాః ॥ 22 ॥

ఇలాగ ఇంకా అనేకమైన పాటలు పాడటంలోనూ, వాద్యాలను వాయించడంలోనూ ఆక్షేత్రంలోని వనితలు నేర్పరులు. ఇలాగా వాళ్లు రాత్రింబవళ్లు ఆనందిస్తుంటారు. ఉత్తములైన అక్కడి స్త్రీలకు కామం కొంచెం అధికం.

భిక్షువైఖానసై స్సిద్ధై స్స్నాతకై ర్బ్రహ్మచారిభిః ।
మన్త్రసిద్ధై స్తపస్సిద్ధై ర్యజ్ఞసిద్ధై ర్నిషేవితమ్ ॥ 23 ॥

ఇంకా ఆక్షేత్రంలో సన్న్యాసులు, వానప్రస్థులు, యోగులు, గృహస్థులు, బ్రహ్మచారులు, తాము ఉపాసించే మంత్రం సిద్ధించినవారు, తపస్సుకు ఫలం పొందినవారు, యజ్ఞఫలాన్ని పొందినవారు, నివసిస్తుంటారు.

ఇత్యేవం దదృశే రాజా క్షేత్రం పరమదుర్లభమ్ ।
అత్రైవారాధయిష్యామి భగవన్తం సనాతనమ్ ॥ 24 ॥

మిక్కిలి దుర్లభమైన అటువంటి పుణ్యక్షేత్రాన్ని ఇంద్రద్యుమ్న మహారాజు సందర్శించాడు. 'ఈ క్షేత్రంలో శ్రీవిష్ణుభగవానుడిని ఆరాధిస్తాను' అనుకున్నాడు.

జగద్గురుం పరం దేవం పరం పారం పరం పదమ్ ।
సర్వేశ్వరేశ్వరం విష్ణు మనన్త మపరాజితమ్ ॥ 25 ॥

ఆ మహావిష్ణువు లోకాలన్నింటికీ గురువు. దేవతలందరిలోనూ ఉత్తముడు. ఉత్తమమైన గతి. అత్యుత్తమ మైనస్థానం. సమస్తానికీ తిరుగులేని ప్రభువు. సర్వత్ర నిండిఉన్నవాడు. తుది లేనివాడు. ఎదురులేనివాడు.

ఇదం తన్మానసం తీర్థం జ్ఞాతం మే పురుషోత్తమమ్ ।
కల్పవృక్షో మహాకాయో న్యగ్రోధో యత్ర తిష్ఠతి ॥ 26 ॥

ఈ పుణ్యక్షేత్రం ఆవిష్ణువుకు మానసమయిన పుణ్యతీర్థం. కల్పవృక్షంవంటి (కోరికలు తీర్చే) పెద్ద మఱ్ఱిచెట్టు నెలకొన్న ఈప్రదేశమే పురుషోత్తమక్షేత్రం అని నాకు అర్థ మయింది.

ప్రతిమా చేన్ద్రనీలాఖ్యా స్వయం దేవేన గోపితా ।
న చాత్ర దృశ్యతే చాన్యా ప్రతిమా వైష్ణవీ శుభా ॥ 27 ॥

ఈ పురుషోత్తమక్షేత్రంలోని స్వామివిగ్రహం ఇంద్రనీలమయం. ఈ విగ్రహాన్ని ఆ పురుషోత్తముడు స్వయంగా తానే రహస్యంగా దాచిపెట్టాడు. ఇక్కడ విష్ణువుకు సంబంధించిన మరొక శుభంకరమైన విగ్రహం కనబడదు.

తథా యత్నం కరిష్యామి యథా దేవో జగత్పతిః ।
ప్రత్యక్షం మమ చాభ్యేతి విష్ణు స్సత్యపరాక్రమః ॥ 28 ॥

సత్యమే (అన్నమాటను నిలుపుకోవటమే) శక్తిగా కలిగి, జగన్నాథుడైన శ్రీమహావిష్ణుదేవుడు నా కనులయెదుట నిలిచేవిధంగా ప్రయత్నిస్తాను.

యజ్ఞై ర్దానై స్తపోభిశ్చ హోమై ర్ధ్యానై స్త థార్చనైః ।
ఉపవాసైశ్చ విధివ చ్చరేయం వ్రతముత్తమమ్ ॥ 29 ॥

వివిధమైన యజ్ఞాలు, దానాలు, తపస్సులు, హోమాలు, ధ్యానాలు, పూజలు, ఉపవాసాలు చేస్తాను. శాస్త్రోక్తమైన విధానంలో ఉత్తమమైన వ్రతాన్ని ఆచరిస్తాను.

అనన్యమనసా చైవ తన్మనా నాన్యమానసః ।
విష్ణ్వాయతనవిన్యాసే ప్రారమ్భం చ కరోమ్యహమ్ ॥ 30 ॥

మనసును కదలకుండా, ఏకాగ్రంగా పురుషోత్తముడిమీద నిలిపి ఉంచుతాను. బుద్ధి వేరొకదానివైపు మరలనివ్వను. శ్రీమహావిష్ణువుకు ఆలయాన్ని నిర్మించడానికి పూనుకుంటాను' అని ఇంద్రద్యుమ్న మహారాజు నిశ్చయించుకున్నాడు.

ఇతి బ్రహ్మపురాణే స్వయమ్భృషిసంవాదే క్షేత్రవర్ణనం నామ చతుశ్చత్వారింశోఽధ్యాయః ॥ 44 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో క్షేత్రవర్ణనం అనే నలభైనాల్గవ అధ్యాయం ॥ 44 ॥



పఞ్చచత్వారింశోఽధ్యాయః - నలబైఐదవ అధ్యాయం

అశ్వమేధకరణమ్ - అశ్వమేధకరణం

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా అంటున్నారు.

ఏవం స పృథివీపాల శ్చిన్తయిత్వా ద్విజోత్తమాః ।
ప్రాసాదార్థం హరే స్తత్ర ప్రారమ్భమకరో త్తదా ॥ 1 ॥

బ్రాహ్మణవరేణ్యులారా! ఇంద్రద్యుమ్నమహారాజు ఈవిధంగా ఆలోచించి, ఆపుణ్యప్రదేశంలో శ్రీమహావిష్ణువుకు ఆలయం నిర్మించటానికి పూనుకున్నాడు.

ఆనాయ్య గణకాన్ సర్వాన్ జ్యోతిశ్శాస్త్రస్య పారగాన్ ।
భూమిం సంశోధ్య యత్నేన రాజా తు పరయా ముదా ॥ 2 ॥

నక్షత్ర గణకులను జ్యోతిషశాస్త్రపండితులనూ పిలిపించాడు. వారితో ఆప్రదేశంలో ఆలయనిర్మాణానికి యోగ్యమైన ప్రాంతాన్ని శ్రద్ధగా పరిశోధించాడు. ఆ ప్రదేశం తెలుసుకుని ఎంతో సంతోషించాడు.

బ్రాహ్మణైర్ జ్ఞానసమ్పన్నై ర్వేదశాస్త్రార్థపారగైః ।
అమాత్యై ర్మన్త్రిభిశ్చైవ వాస్తువిద్యావిశారదైః ॥ 3 ॥

వేదాలనూ, శాస్త్రాలనూ ఆసాంతం క్షుణ్ణంగా తెలుసుకుని, చక్కని విషయపరిజ్ఞానం కలిగిన బ్రాహ్మణులనూ, అమాత్యులనూ, మంత్రులనూ, వాస్తుశాస్త్రంలో నైపుణ్యం కలిగిన వారినీ రప్పించాడు.

తై స్సార్థం తు సమాలోచ్య సుముహూర్తే శుభే దినే ।
సుచన్ద్రతారాసంయోగే గ్రహానుకూల్యసంయుతే ॥ 4 ॥

వారితో ఆలోచనలు చేశాడు. మంచిరోజున తారాబలమూ, చంద్రబలమూ చక్కగా ఉండి, గ్రహాలు అన్నీ అనుకూలంగా ఉన్న సమయంలో మంచిముహూర్తం నిశ్చయించాడు.

జయమఙ్గలశబ్దైశ్చ నానావాద్యై ర్మనోహరైః ।
వేదాధ్యయననిర్ఘోషై ర్గీతై స్సుమధురస్వరైః ॥ 5 ॥

జనాలు మంగళప్రదంగా జేజేలు పలుకుతున్నారు. రకరకాల వాద్యాలు చెవికి ఇంపుగా మోగుతున్నాయి. వేదనాదం అతిశయించింది. గానం తీయగా సాగుతున్నది.

పుష్పలాజాక్షతై ర్గన్ధైః పూర్ణకుమ్భై స్సదీపకైః ।
దదా వర్ఘ్యం తతో రాజా శ్రద్ధయా సుసమాహితః ॥ 6 ॥

ఆ సమయంలో ఇంద్రద్యుమ్నుడు ఏకాగ్రమైన బుద్ధితో శ్రద్ధగా పూలు, పేలాలు, అక్షతలు, పూర్ణకుంభాలు, దీపపంక్తులతో, విష్ణుదేవుడికి అర్ఘ్యం ఇచ్చాడు.

దత్త్వైవమర్ఘ్యం విధివ దానాయ్య స మహీపతిః ।
కలిఙ్గాధిపతిం శూర ముత్కలాధిపతిం తథా ॥
కోశలాధిపతిం చైవ తా నువాచ తదా నృపః ॥ 7 ॥

ఈ విధంగా శాస్త్రోక్తప్రకారంగా దేవుడికి అర్ఘ్యం ఇచ్చిన తరువాత ఇంద్రద్యుమ్నమహారాజు శక్తిమంతులయిన కళింగ, ఉత్కళ, కోసలదేశాలరాజులను రప్పించి, వారితో ఇలా అన్నాడు.

రాజోవాచ :–ఇంద్రద్యుమ్నుడు అంటున్నాడు.

గచ్ఛధ్వం సహితా స్సర్వే శిలార్థే సుసమాహితాః ।
గృహీత్వా శిల్పిముఖ్యాంశ్చ శిలాకర్మవిశారదాన్ ॥ 8 ॥

రాజులారా! మీరు అందరూ కలిసి, స్వామివిగ్రహం నిర్మించడానికి తగినశిలను సంపాదించడానికి వెళ్ళండి. శిల్పనిర్మాణవిద్యలో నిపుణులయిన ప్రధానశిల్పులను తోడు తీసుకుని జాగ్రత్తగా వెళ్ళండి.

విన్ధ్యాచలం సువిస్తీర్ణం బహుకన్దరశోభితమ్ ।
నిరూప్య సర్వసానూని ఛ్ఛేదయిత్వా శిలా శ్శుభాః ॥
సంవాహ్యాన్తాం చ శకటై ర్నౌకాభి ర్మా విలమ్బథ ॥ 9 ॥

వింధ్యపర్వతం చాల విశాలమయింది. అనేకమైన గుహలతో అందంగా ఉంటుంది. అక్కడి సాను ప్రదేశాలను అన్నింటినీ శ్రద్ధగా పరిశీలించండి. అక్కడి శుభప్రదమైన శిలలను కావలసినవిధంగా భేదించి, వాటిని బండ్లమీద, నౌకలమీద వేసుకుని తీసుకుని రండి. ఆలస్యం చేయవద్దు.

బ్రహ్మోవాచ :–బ్రహ్మదేవుడు మహర్షులతో ఇలా చెప్తున్నాడు.

ఏవం గన్తుం సమాదిశ్య తా న్నృపాన్ స మహీపతిః ।
పున రే వాబ్రవీద్ వాక్యం సామాత్యాన్ సపురోహితాన్ ॥ 10 ॥

ఇంద్రద్యుమ్నుడు ఈవిధంగా శిల్పనిర్మాణానికి తగిన శిలకోసం వెళ్ళండని మంత్రి పురోహితులతో కూడిన కళింగాదిదేశపాలకులను ఆజ్ఞాపించాడు. ఆతరువాత (తనవారితో) ఇలా అంటున్నాడు.

రాజోవాచ:–ఇంద్రద్యుమ్నుడు (దూతలతో) ఇలా అంటున్నాడు.

గచ్ఛన్తు దూతా స్సర్వత్ర మమాజ్ఞాం ప్రవదన్తు వై ।
యత్ర తిష్ఠన్తి రాజానః పృథివ్యాం తాన్ సుశీఘ్రగాః ॥ 11 ॥

దూతలారా! మీరు అందరూ త్వరగా వెళ్ళండి. ఈ భూమండలంలోని అన్ని రాజ్యాలలోనూ రాజులందరికీ నాఆజ్ఞను తెలియజేయండి.

హస్త్యశ్వరథపాదాతై స్సామాత్యై స్సపురోహితైః ।
గచ్ఛన్తు సహితా స్సర్వ ఇన్ద్రద్యుమ్నస్య శాసనాత్ ॥ 12 ॥

'ఇంద్రద్యుమ్నమహారాజు ఆజ్ఞప్రకారం మీరు (రాజులు) అందరూ ఏనుగులూ, గుఱ్ఱాలూ, రథాలూ, పదాతులూ, (చతురంగ) అయిన సేనాబలంతోనూ, మంత్రిపురోహితులతోనూ కలిసి, ఇంద్రద్యుమ్నుడిసన్నిధికి వెళ్లండి'. అని రాజులందరికీ తెలియజేయమని దూతలకు రాజు ఆజ్ఞ

బ్రహ్మోవాచ :-బ్రహ్మదేవుడు మహర్షులతో ఇలా చెప్తున్నాడు.

ఏవం దూతా స్సమాజ్ఞాతా రాజ్ఞా తేన మహాత్మనా ।
గత్వా తదా నృపా నూచు ర్వచనం తస్య భూపతేః ॥ 13 ॥

మహారాజు ఈవిధంగా ఆజ్ఞాపించగా, దూతలు వివిధరాజ్యాలకు వెళ్లి, అక్కడ రాజులకు ఇంద్రద్యుమ్నుడి ఆజ్ఞను తెలియజేశారు.

శ్రుత్వా తే తు తదా సర్వే దూతానాం వచనం నృపాః ।
ఆజగ్ము స్త్వరితా స్సర్వే స్వసైన్యైః పరివారితాః ॥ 14 ॥

దూతల వాక్యాలు విని, ఆ రాజులు అందరూ తమతమ సైన్యాలను తీసుకుని, వేగంగా ఇంద్రద్యుమ్నుడి వద్దకు వచ్చారు.

పూర్వదిక్సంస్థితా యే చ దక్షిణాం దిశ మాస్థితాః ।
పశ్చిమాయాం స్థితా యే చ ఉత్తరాపథసంస్థితాః ॥ 15 ॥

తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తర దిక్కులలో ఉన్న(అన్నిదిక్కులలోని)రాజులు అందరూ ఇంద్రద్యుమ్నుడి వద్దకు వచ్చారు.

ప్రత్యన్తవాసినో యే వా యే చ సన్నిధివాసినః ।
పార్వతీయాశ్చ యే కేచిత్ తథా ద్వీపనివాసినః ॥ 16 ॥

రథై ర్నాగైః పదాతైశ్చ వాజిభి ర్ధనవిస్తరైః ।
సమ్ప్రాప్తా బహుశో విప్రా శ్శక్రేన్ద్రద్యుమ్నశాసనమ్ ॥ 17 ॥

బ్రాహ్మణులారా! ఇంద్రద్యుమ్నమహారాజు ఆజ్ఞను అనుసరించి, దూరంగా ఉన్నవారూ, దగ్గరలో ఉన్నవారూ, కొండలపై ఉండేవారూ, అలాగే ద్వీపాలలో నివసించేవారూ, అందరూ రథాలు, ఏనుగులు, కాలుబలం, గుఱ్ఱాలు, విస్తారమైన సంపదలు అన్నీ తీసుకుని వచ్చారు.

ప్రాప్తాన్ నానానృపాన్ దృష్ట్వా సామాత్యాన్ సపురోహితాన్ ।
ప్రోవాచ రాజా హృష్టాత్మా కార్య ముద్దిశ్య గౌరవాత్ ॥ 18 ॥

అమాత్యులతోనూ, పురోహితులతోనూ, వచ్చిన వివిధదేశాధీశులను చూసి, ఇంద్రద్యుమ్నమహారాజు సంతోషించాడు. జరగవలసిన బృహత్తరకార్యాన్ని ఉద్దేశించి వారితో ఆదరంగా ఈవిధంగా చెప్పాడు.

రాజోవాచ :–ఇంద్రద్యుమ్నుడు అంటున్నాడు.

శృణుధ్వం నృపశార్దూలా యథా కిఞ్చిద్ బ్రవీమ్యహమ్ ।
అస్మిన్ క్షేత్రవరే పుణ్యే భుక్తిముక్తిప్రదే శివే ॥ 19 ॥

హయమేధం మహాయజ్ఞం ప్రాసాదం చైవ వైష్ణవమ్ ।
కథం శక్నోమ్యహం కర్తుమితి చిన్తాకులం మనః ॥ 20 ॥

రాజవరేణ్యులారా! నేను చెప్పే మాటలు శ్రద్ధగా వినండి. ఇది పుణ్యక్షేత్రాలన్నింటిలోనూ శ్రేష్ఠమయినది. పుణ్యాన్నీ, భోగాలనూ, మోక్షాన్నీ గూడ ఇస్తుంది. శుభాలను కలిగిస్తుంది. అటువంటి మహిమాన్వితమైన ఈ క్షేత్రంలో అశ్వమేధమహాయాగం చేయాలనీ, విష్ణుమూర్తికి ఒకఆలయాన్ని నిర్మించాలనీ అనుకుంటున్నాను. ఆ బృహత్కార్యం ఏవిధంగా నిర్వహింపగలనా అని నామనస్సు కలవరపడుతున్నది.

భవద్భి స్సమవేతైశ్చ సర్వ మేతత్ కరో మ్యహమ్ ।
యది యూయం సహాయా మే భవధ్వం నృపసత్తమాః ॥ 21 ॥

రాజోత్తములారా! మీరందరూ నాకు సహాయంగా ఉంటే, ఈ కార్యం ఏలోటు లేకుండా పూర్తిగా నిర్వహించ గలను.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఇలా చెప్తున్నాడు.

ఇత్యేవం వదమానస్య రాజరాజస్య ధీమతః ।
సర్వే ప్రముదితా భూత్వా హృష్టా స్తే తస్య శాసనాత్ ॥ 22 ॥

బుద్ధిమంతుడైన ఇంద్రద్యుమ్నమహారాజు ఈవిధంగా చెప్పగా, ఆ రాజులు అందరూ ఆనందంగా విన్నారు. ఇంద్రద్యుమ్నుడి ఆజ్ఞకు సంతోషించారు.

వవృషు ర్ధనరత్నైశ్చ సువర్ణమణిమౌక్తికైః ।
కమ్బలాజినరత్నైశ్చ రాఙ్కవాస్తరణై శ్శుభైః ॥ 23 ॥

ఆ రాజులు ధనాన్నీ, రత్నాలనూ, బంగారాన్నీ, మణులనూ, ముత్యాలనూ, శ్రేష్ఠమైన దుప్పట్లనూ, జింకచర్మాలనూ, మంచి ఉన్నివస్త్రాలనూ ఇంద్రద్యుమ్నుడికి అందజేశారు.

వజ్రవైదూర్యమాణిక్యైః పద్మరాగేన్ద్రనీలకైః ।
గజై రశ్వై ర్ధనై శ్చాన్యై రథైశ్చ కరేణుభిః ॥ 24 ॥

వజ్రాలనూ, వైదూర్యాలనూ, మాణిక్యాలనూ, పద్మరాగమణులనూ, ఇంద్రనీలమణులనూ, ఏనుగులనూ, గుఱ్ఱాలనూ, ఇతరధన సంపదలనూ, రథాలనూ, ఆడుఏనుగులనూ, ఇచ్చారు.

అసంఖ్యేయై ర్బహువిధైర్ ద్రవ్యై రుచ్చావచై స్తథా ।
శాలివ్రీహియవైశ్చైవ మాషముద్గతిలై స్తథా ॥ 25 ॥

ఇంకా గొప్పవీ, సాధారణమైనవీ అయిన రకరకాలపదార్థాలను లెక్కలేనంత పరిమాణంలో అందించారు. వరిధాన్యం, యవలు, మినుములు, పెసలు, నువ్వులు ఇచ్చారు.

సిద్ధార్థచణకైశ్చైవ గోధూమైర్మసురాదిభిః ।
శ్యామాకై ర్మధుకై శ్చైవ నీవారై స్సకులత్థకైః ॥ 26 ॥

తెల్ల ఆవాలు, సెనగలు, గోధుమలు, గుండ్రటి సెనగలు (బటాణీలు), చామలు అనే పేరు గలిగినధాన్యం, ఇప్పపూలు, నివ్వరిధాన్యం, ఉలవధాన్యం, ఇచ్చారు.

అన్యైశ్చ వివిధై ర్ధాన్యైర్ గ్రామ్యారణ్యై స్సహస్రశః ।
బహుధాన్య సహస్రాణాం తణ్డులానాం చ రాశిభిః ॥ 27 ॥

ఇంకా గ్రామాలలోనూ, అడవులలోనూ పండే రకరకాలైన ధాన్యాలను సమృద్ధిగా ఇచ్చారు. వేలరకాల ధాన్యాలూ, అలాగే బియ్యమూ పెద్దపెద్దరాసులుగా తెచ్చి ఇచ్చారు.

ఆపూర్య హవిషా కుమ్భాన్ శతశోఽథ సహస్రశః ।
తథాన్యై ర్వివిధైర్ ద్రవ్యైర్ భక్ష్యభోజ్యానులేపనైః ॥ 28 ॥

వందలు వేల కుండలలో నింపి, నేతిని పట్టుకువచ్చారు. ఇంకా రకరకాలపిండివంటలు, సాధారణ వంటకాలు, ఒంటికి పూసుకునే పూతలు, అన్నీ తీసుకువచ్చారు.

రాజానః పూరయామాసు ర్యత్ కిఞ్చిద్ ద్రవ్యసమ్భవైః ।
తాన్ దృష్ట్వా యజ్ఞసమ్భారాన్ సర్వసమ్పత్సమన్వితాన్ ॥ 29 ॥

ఆ రాజులు యజ్ఞనిర్వహణకు అవసరమైనపదార్థాలను అన్నింటినీ సంపూర్ణంగా ఏర్పాటు చేశారు. అన్నివిధాలుగానూ సమృద్ధిగా ఉన్న ఆ యజ్ఞద్రవ్యాలను ఇంద్రద్యుమ్నుడు పరికించాడు.

యజ్ఞకర్మవిదో విప్రాన్ వేదవేదాఙ్గపారగాన్ ।
శాస్త్రేషు నిపుణాన్ దక్షాన్ కుశలాన్ సర్వకర్మసు ॥ 30 ॥

అక్కడికి వచ్చిన బ్రాహ్మణులు వేదాలు, వేదాంగాలు క్షుణ్ణంగా తెలిసినవారు. యజ్ఞప్రక్రియను నిర్వహించడం చక్కగా తెలిసినవారు. వివిధశాస్త్రాలలో పండితులు. అన్నివిధాలైన వైదికకర్మలను నిర్వహించడంలో నేర్పరులు.

ఋషీంశ్చైవ మహర్షీంశ్చ దేవర్షీంశ్చైవ తాపసాన్ ।
బ్రహ్మచారిగృహస్థాంశ్చ వానప్రస్థాన్ యతీంస్తథా ॥31 ॥

ఆ వచ్చినవారిలో ఋషులు, మహాఋషులు, దేవఋషులు, తపస్వులు, బ్రహ్మచారులు, గృహస్థులు, వాన ప్రస్థులు, యతులు ఉన్నారు.

స్నాతకాన్ బ్రాహ్మణాం శ్చాన్యా నగ్నిహోత్రే సదా స్థితాన్ ।
ఆచార్యోపాధ్యాయవరాన్ స్వాధ్యాయతపసాఽన్వితాన్ ॥ 32 ॥

వేదవిద్యాభ్యాసాన్ని పూర్తి చేసిన బ్రాహ్మణులు, నిత్యాగ్నిహోత్రులు, వేదాలను చదివించే ఉత్తములైన ఆచార్యులు, వేదంలో కొంత కొంత భాగాన్ని చదివించే శ్రేష్ఠులైన ఉపాధ్యాయులు, తమతమ వేదశాఖలను అభ్యసించేవారు, వ్రతనియమవంతులు ఉన్నారు.

సదస్యాన్ శాస్త్ర కుశలాంస్తథాఽన్యాన్ పావకాన్ బహూన్ ।
దృష్ట్వా తాన్ నృపతి శ్శ్రీమా నువాచ స్వం పురోహితమ్ ॥ 33 ॥

రాజసభాసభ్యులు, నిపుణులు, ఇంకా పుణ్యాత్ములు, ఎందరో ఉన్నారు. శ్రీమంతుడైన ఇంద్రద్యుమ్నుడు యజ్ఞానికి వచ్చినవారినందరినీ చూచి, తన పురోహితుడితో ఇలా అన్నాడు.

రాజోవాచ :–ఇంద్రద్యుమ్నుడు అంటున్నాడు.

తతః ప్రయాన్తు విద్వాంసో బ్రాహ్మణా వేదపారగాః ।
వాజిమేధార్థసిద్ధ్యర్థం దేశం పశ్యన్తు యజ్ఞియమ్ ॥ 34 ॥

పండితులూ చతుర్వేదపారంగతులూ అయిన బ్రాహ్మణులు, అశ్వమేధయాగం చేయడానికి యోగ్య మయిన ప్రదేశాన్ని తెలుసుకోవడానికి వెళ్లాలి (విద్వాంసులను అక్కడికి పంపమని పురోహితుడికి రాజు ఆజ్ఞ).

బ్రహ్మోవాచ :–బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

ఇత్యుక్త స్స తథా చక్రే వచనం తస్య భూపతేః ।
హృష్ట స్స మన్త్రిభి స్సార్ధం తదా రాజపురోహితః ॥ 35 ॥

ఇంద్రద్యుమ్నుడి పురోహితుడు సంతోషించాడు. అపుడు మంత్రులతో కలిసి రాజు ఆజ్ఞాపించిన ప్రకారం చేశాడు.

తతో యయౌ పురోధాశ్చ ప్రాజ్ఞః స్థపతిభి స్సహ ।
బ్రాహ్మణాన్ పురతః కృత్వా కుశలాన్ యజ్ఞకర్మణి ॥ 36 ॥

అపుడు బుద్ధిమంతుడైన రాజపురోహితుడు శిల్పులనూ, యజ్ఞనిర్వహణంలో నేర్పరులైన బ్రాహ్మణులనూ ముందుంచుకుని, యజ్ఞం చేయడానికి తగిన ప్రదేశాన్ని నిర్ణయించడానికి బయలుదేరాడు.

తం దేశం ధీవరగ్రామం సప్రతోలివిటఙ్కినమ్ ।
కారయామాస విప్రోఽసౌ యజ్ఞవాటం యథావిధి ॥ 37 ॥

ఆప్రాంతంలో విశాలమైన వీధులతోనూ, గొందులతోనూ కూడి, చేపలుపట్టేవాళ్ల పల్లె ఒకటి యజ్ఞానికి తగిఉన్నది. రాజపురోహితుడు ఆగ్రామాన్ని శాస్త్రోక్తమైన పద్ధతిలో యజ్ఞానికి వేదికగా సిద్ధం చేయించాడు.

ప్రాసాదశతసమ్బాధం మణిప్రవరశోభితమ్ ।
ఇన్ద్రసద్మనిభం రమ్యం హేమరత్నావభూషితమ్ ॥ 38 ॥

వందలకొలదీ పెద్ద భవనాలు సముదాయాలుగా నిర్మించారు. వాటికి శ్రేష్ఠమైనమణులను అందంగా కూర్చారు. అవి ఇంద్రభవనాలలాగా ఉన్నాయి. బంగారంతోనూ, రత్నాలతోనూ అలంకరింపబడి మనోహరంగా ఉన్నాయి.

స్తమ్భాన్ కనకచిత్రాంశ్చ తోరణాని బృహన్తి చ ।
యజ్ఞాయతనదేశేషు దత్త్వా శుద్ధం చ కాఞ్చనమ్ ॥ 39 ॥

యజ్ఞభవనాలలోని స్తంభాలు మేలిమి బంగారంతో అద్భుతంగా నిర్మించారు. ఆ భవనాల బహిర్ద్వారాలు చాల పెద్దవి. వాటి నిర్మాణానికి స్వచ్ఛమైన బంగారాన్ని ఉపయోగించారు.

అన్తఃపురాణి రాజ్ఞాం చ నానాదేశనివాసినామ్ ।
కారయామాస ధర్మాత్మా తత్ర తత్ర యథావిధి ॥ 40 ॥

ధార్మికుడైన ఇంద్రద్యుమ్నమహారాజు అనేకదేశాలనుండి వచ్చిన రాజులకోసం వారివారిప్రాభవానికి తగినవిధంగా అక్కడ అంతఃపురాలు పద్ధతిప్రకారం కట్టించాడు.

బ్రాహ్మణానాం చ వైశ్యానాం నానాదేశసమీయుషామ్ ।
కారయామాస విధివత్ సుఖవాసా న్యనేకశః ॥ 41 ॥

వివిధదేశాలనుండి వచ్చిన బ్రాహ్మణులకు, వైశ్యులకు వాస్తు శాస్త్రానికి అనుగుణంగా, సుఖవంతమైన అనేకమైన భవనాలు కట్టించాడు.

ప్రియార్థం తస్య నృపతే రాయయుర్ నృపసత్తమాః ।
రత్నాన్యనేకా న్యాదాయ స్త్రియ శ్చాయయు రుత్సవే ॥ 42 ॥

ఇంద్రద్యుమ్నమహారాజుకు ప్రీతికలగడానికి రాజులు అందరూ అనేకమైన రత్నాలు కానుకలుగా తీసుకుని వచ్చారు. ఆ ఉత్సవానికి ఆ రాజులఅంతఃపురకాంతలు కూడ వచ్చారు.

తేషాం నిర్విశతాం స్వేషు శిబిరేషు మహాత్మనామ్ ।
నదత స్సాగరస్యేవ దివిస్పృగభవత్ స్వనః ॥ 43 ॥

వారు అందరూ తమతమ విడిదిగృహాలలో ప్రవేశించారు. అప్పటి ఆ జనసమూహం సందడి సముద్రం రొదలాగా అధికమై ఆకాశాన్ని తాకింది.

తేషాం సమాగతానాం చ స రాజా మునిసత్తమాః ।
వ్యాదిదేశాన్నపానాని శయ్యాశ్చా ప్యుపచారతః ॥ 44 ॥

మహర్షులారా! ఇంద్రద్యుమ్నమహారాజు తన యాగోత్సవానికి వచ్చిన వారికి అందరికీ తినడానికీ, తాగడానికీ, పడుకోవడానికీ అన్నివిధాలైన సేవలకు ఏర్పాట్లు చేయించాడు.

భోజనాని విచిత్రాణి శాలీక్షుయవగోరసైః ।
ఉపేత్య నృపతిశ్రేష్ఠో వ్యాదిదేశ స్వయం తదా ॥ 45 ॥

వరి, చెరకు, యవధాన్యం, ఆవుపాలతో వింత వింతలైన విందుభోజనాల ఏర్పాట్లను ఇంద్రద్యుమ్న మహారాజు స్వయంగా పర్యవేక్షించాడు.

తథా తస్మిన్ మహాయజ్ఞే బహవో బ్రహ్మవాదినః ।
యే చ ద్విజాతిప్రవరా స్త త్రాసన్ ద్విజసత్తమాః ॥
సమాజగ్ము స్సశిష్యా స్తాన్ ప్రీత్యా జగ్రాహ పార్థివః ॥46 ॥

బ్రాహ్మణోత్తములారా! అటువంటి మహాయాగానికి బ్రహ్మజ్ఞానులు, శ్రేష్ఠులైన బ్రాహ్మణులు తమతమ శిష్యులతో సహా, ఎంతో మంది వచ్చారు. వారి నందరినీ ఇంద్రద్యుమ్నమహారాజు సంతోషంగా స్వాగతించాడు.

సర్వాంశ్చ తాననుయయౌ యావదావసథా నితి ।
స్వయమేవ మహాతేజా దమ్భం త్యక్త్వా నృపోత్తమః ॥ 47 ॥

పరాక్రమవంతుడైన ఆమహారాజు ఏమాత్రం అహంకారం లేకుండా, అందరినీ వారివారి వసతిగృహాల వరకు వెంటఉండి స్వయంగా తీసుకొనివెళ్లాడు.

తతః కృత్వా స్వశిల్పం చ శిల్పినోఽన్యే చ యే తదా ।
కృత్స్నం యజ్ఞవిధిం రాజ్ఞే తదా తస్మై న్యవేదయన్ ॥ 48 ॥

తరువాత శిల్పులు అందరూ తాము నిర్మించవలసిన శిల్పాలను చక్కగా తయారుచేశారు. యజ్ఞానికి కావలసిన పనులన్నీ అయిన విషయాన్ని ఇంద్రద్యుమ్న మహారాజుకు తెలియజేశారు.

తత శ్శృత్వా నృపశ్రేష్ఠః కృతం సర్వ మతన్ద్రితః ।
హృష్టరోమాఽభవద్ రాజా సహ మన్త్రిభి రచ్యుతః ॥ 49 ॥

ఇంద్రద్యుమ్నమహారాజు శ్రద్ధగా పరిశీలించి, యజ్ఞానికి కావలసిన పనులు అన్నీ పూర్తి అయినాయని తెలుసుకున్నాడు. ఏమరుపాటు లేకుండా, జరిగినపనులను చూచి, రాజు మంత్రులతో సహా ఆనందంతో పులకించి పోయాడు.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఇలా చెప్తున్నాడు.

తస్మిన్ యజ్ఞే ప్రవృత్తే తు వాగ్మినో హేతువాదినః ।
హేతువాదాన్ బహూనాహుః పరస్పరజిగీషవః ॥ 50 ॥

యజ్ఞం ప్రారంభం అయింది. అపుడు మాటనేర్పుగలిగిన శాస్త్రపండితులు ఒకరి నొకరు గెలవాలనే పట్టుదలతో రకరకాలుగా శాస్త్రచర్చలను చేశారు.

దేవేన్ద్రస్యేవ విహితం రాజసింహేన భో ద్విజాః ।
దదృశు స్తోరణా న్యత్ర శాతకుమ్భమయాని చ ॥ 51 ॥

బ్రాహ్మణులారా! వారు రాజవరేణ్యుడైన ఇంద్రద్యుమ్నుడు ఇంద్రభవనంలోలాగా యజ్ఞవాటికలో నిర్మించిన స్వర్ణమయమైన బహిర్ద్వారాలను చూశారు.

శయ్యాసనవికారాంశ్చ సుబహూన్ రత్నసఞ్చయాన్ ।
స్ఫాటికాని చ గేహాని కలశాన్ వర్ధమానకాన్ ॥ 52 ॥

రత్నాలు పొదిగిన మంచాలు, సింహాసనాలు అనేకం ఏర్పాటు చేశారు. స్ఫటికాలతో నిర్మించిన భవనాలు, పాత్రసామగ్రి, మూకుళ్లు సమకూర్చారు.

న హి కశ్చి దసౌవర్ణ మపశ్య ద్వసుధాధిపః ।
యూపాంశ్చ శాస్త్రపఠితాన్ దారవాన్ హేమభూషితాన్ ॥ 53 ॥

ఇంద్రద్యుమ్నమహారాజు వాటినన్నిటినీ చూశాడు. అక్కడ అన్నీ బంగారంతోనే నిర్మించారు. యజ్ఞస్తంభాలు మొదలైనవి మాత్రం శాస్త్రోక్తపద్ధతిలో చెక్కతోనే నిర్మించారు. కాని వాటిని బంగారుపూతతో అలంకరించారు.

ఉపక్షిప్తాన్ యథాకాలం విధివద్ భూరివర్చసః ।
స్థలజా జలజా యే చ పశవః కేచన ద్విజాః ॥ 54 ॥

విప్రులారా! యజ్ఞకర్మకోసం సమయానుగుణంగా విధివిధానాన్ని అనుసరించి, నేలమీదా, నీళ్లలోనూ పుట్టిన పశువులను ఏర్పాటు చేసి ఉంచారు.

సర్వానేవ సమాయాతానపశ్యం స్తత్ర తే నృపాః ।
గావశ్చైవ మహిష్యశ్చైవ తథా వృద్ధస్త్రియోఽపి వా ॥ 55 ॥

యజ్ఞానికి వచ్చిన రాజులు అక్కడకు వచ్చిన ఆవులు, గేదెలను చూశారు. అలాగే ముసలి ఆడవారిని అందరినీ చూశారు.

ఔదకాని చ సత్త్వాని శ్వాపదాని వయాంసి చ ।
జరాయుజాణ్డజాతాని స్వేదజా న్యుద్భిదాని చ ॥
పార్వతా న్యుపధాన్యాని భూతాని దదృశుశ్చ తే ॥ 56 ॥

అక్కడ నీళ్లలోనుండి పుట్టిన వివిధజంతువులు ఉన్నాయి. పెద్దపులులు ఉన్నాయి. రకరకాల పక్షులు ఉన్నాయి. మావినుండి పుట్టే మానవులు పశువులు మొదలైనవారు, గ్రుడ్డునుండి పుట్టే పక్షులు మొదలైనవి, చెమటనుండి పుట్టే క్రిములు మొదలైనవి, నేలను చీల్చుకుని పైకి వచ్చే (మొలకెత్తే) చెట్లు మొదలైనవి, అనే నాలుగువిధాలైనజీవులూ ఉన్నాయి. కొండలపైన పండినధాన్యాలు, కొండలలో నివసించేవారు ఉన్నారు. యజ్ఞానికి వచ్చిన రాజులు వీళ్లందరినీ చూసి ఆనందించారు.

ఏవం ప్రముదితం సర్వం పశుతో ధనధాన్యతః ।
యజ్ఞవాటం నృపా దృష్ట్వా పరం విస్మయ మాగమన్ ॥ 57 ॥

ఈ విధంగా పశువులతోనూ, వివిధ సంపదలతోనూ, ధాన్యాలతోనూ ఆ యజ్ఞవాటిక అంతా సంతోషంతో నిండింది. దానిని చూచి, యజ్ఞానికి వచ్చినరాజులు ఎంతో ఆశ్చర్యపడ్డారు.

బ్రాహ్మణానాం విశాం చైవ బహు మిష్టాన్న మృద్ధిమత్ ॥ 58 ॥

ఆ యజ్ఞప్రదేశంలో బ్రాహ్మణులకు, వైశ్యులకు మధురమయిన భోజనాలు సమృద్ధిగానూ, విస్తారంగానూ ఏర్పాటుచేశారు.

పూర్ణే శతసహస్రే తు విప్రాణాం తత్ర భుఞ్జతామ్ ।
దున్దుభి ర్మేఘనిర్ఘోషాన్ ముహు ర్ముహు రథాకరోత్ ॥ 59 ॥

అక్కడ ఒకలక్షమంది బ్రాహ్మణులు తృప్తిగా భోజనం చేసిన తరువాత ఉరుములవంటిధ్వనులతో భేరీని మోగించారు. ఆవిధ మైన భేరీధ్వనులు మళ్ళీ మళ్లీ నిరంతరంగా మోగుతునే ఉన్నాయి.(ఆయజ్ఞంలో అనేకలక్షలమంది బ్రాహ్మణులు భోజనాలు చేశారు.)

విననాదాసకృచ్చాపి దివసే దివసే గతే ।
ఏవం స వవృధే యజ్ఞ స్తస్య రాజ్ఞస్తు ధీమతః ॥ 60 ॥

రోజు గడుస్తున్న కొద్దీ భేరులు మోగడం అధికం అవుతున్నది. వివేకవంతుడైన ఇంద్రద్యుమ్నుడి యజ్ఞం ఈవిధంగా దినదినప్రవర్ధమానం అయింది.

అన్నస్య సుబహూన్ విప్రా ఉత్సర్గా న్నిర్గతోపమాన్ ।
దధికుల్యాశ్చ దదృశుః పయసశ్చ హ్రదాం స్తదా ॥ 61 ॥

బ్రాహ్మణులారా! అక్కడ అత్యధికంగా జరుగుతున్న అన్నదానానికి సాటిలేదు. పెరుగు కాలువలాగా ప్రవహించడమూ, పాలు పెద్ద చెరువులలాగా విస్తరించడమూ రాజులు ప్రత్యక్షంగా చూశారు,

జమ్బూద్వీపో హి సకలో నానాజనపదై ర్యుతః ।
ద్విజాశ్చ తత్ర దృశ్యన్తే రాజ్ఞస్తస్య మహామఖే ॥ 62 ॥

జంబూద్వీపం మొత్తం ఇంద్రద్యుమ్నమహారాజు చేస్తున్న ఆ మహాయాగప్రదేశంలోనే ఉన్నదా అన్నట్లుగా ఊళ్లన్నీ కదలివచ్చాయి. ద్వీపంలోని బ్రాహ్మణులు అందరూ ఆ మహారాజుయజ్ఞవాటికలోనే కనిపిస్తున్నారు.

తత్ర యాని సహస్రాణి పురుషాణాం తత స్తతః ।
గృహీత్వా భాజనం జగ్ము ర్బహూని ద్విజసత్తమాః ॥ 63 ॥

విప్రోత్తములారా! ఎన్నో వేలమంది పురుషులు ఆయజ్ఞంలో ఆయాచోట్ల తమవంతు పాత్రను చక్కగా నిర్వహించారు.

శ్రావిణశ్చాపి తే సర్వే సుమృష్టమణికుణ్డలాః ।
పర్యవేషయన్ ద్విజాతీన్ శతశోఽథ సహస్రశః ॥ 64 ॥

యజ్ఞకార్యనిర్వాహకులు వందలు, వేలసంఖ్యలో ఉన్నారు. అందరూ ఉత్తమమైన మణులు పొదిగిన చెవిపోగులు ధరించారు. వస్త్రభూషణాదులతో వారు బ్రాహ్మణులను చక్కగా సేవించారు.

వివిధాన్యనుపానాని పురుషా యేఽనుయాయినః ।
తే వై నృపోపభోజ్యాని బ్రాహ్మణేభ్యో దదు స్సహ ॥ 65 ॥

వారిని అనుసరించి ఉండేపురుషులు మహారాజులకు తగినభోజనాలనూ, రకరకాలైన మధుర పదార్థాలను (భోజనంతోపాటు స్వీకరించేవి) బ్రాహ్మణులకు అందజేశారు.

సమాగతాన్ వేదవిదో రాజ్ఞశ్చ పృథివీశ్వరాన్ ।
పూజాం చక్రే తదా తేషాం విధివద్ భూరిదక్షిణః ॥ 66 ॥

ఆ ఇంద్రద్యుమ్నమహారాజు యజ్ఞానికి వచ్చిన వివిధ దేశాధిపతులకూ, వేదపండితులకూ, శాస్త్రోక్త మయినమార్గంలో కానుకలనూ, దక్షిణలనూ విస్తారంగా ఇచ్చి చక్కగా గౌరవించాడు.

దిగ్దేశా దాగతాన్ రాజ్ఞో మహాసంగ్రామశాలినః ।
నటనర్తకకాదీంశ్చ గీతనృత్యవిశారదాన్ ॥ 67 ॥

వివిధ రాజ్యాలనుండి యజ్ఞంకోసం వచ్చిన యుద్ధవిశారదులైన మహారాజులను ఇంద్రద్యుమ్నుడు చక్కగా సత్కరించాడు. నటించేవారినీ, నాట్యం చేసేవారినీ, పాటలు పాడేవారినీ, చక్కగా నృత్యం చేసేవారినీ గౌరవించాడు.

పత్న్యో మనోరమా స్తస్య పీనోన్నతపయోధరాః ।
ఇన్దీవరపలాశాక్ష్యశ్శరచ్చన్ద్రసమాననాః ॥ 68 ॥

ఇంద్రద్యుమ్నుడిభార్యలు గొప్పసుందరీమణులు. వారివక్షోజాలు బలిసి ఎత్తుగానూ ఉంటాయి. కన్నులు నల్లగలువ రేకులలాగా ఉంటాయి. వారిముఖాలు శరత్కాలపు చంద్రుడిలాగా ఉంటాయి.

కులశీలగుణోపేతా స్సహస్రైకం శతాధికమ్ ।
ఏవం తద్భూపపరమపత్నీగణసమన్వితమ్ ॥ 69 ॥

వారు అందరూ ఉత్తమమైన వంశంలో పుట్టినవారు. మంచినడవడిక కలిగినవారు. ఇంద్రద్యుమ్నుడి భార్యలు పదకొండువందల మంది ఉన్నారు. ఇటువంటి ఉత్తమగుణాలు కలిగిన మహారాజు భార్యలు ఆ యజ్ఞవాటికను అలంకరించారు.

రత్నమాలాకులం దివ్యం పతాకాధ్వజశోభితమ్ ।
రత్నహారయుతం దివ్యం చన్ద్రకాన్తిసమప్రభమ్ ॥ 70 ॥

ఆయజ్ఞవాటికకు రత్నాలదండలు అలంకరించారు. అది అతిలోకంగా ఉంది. ఆ ప్రదేశమంతటా జెండాలు, జెండాకఱ్ఱలు అందంగా ఉన్నాయి. అంతటా రత్నాలు పొదిగినహారాలు కూర్చారు. ఆ యజ్ఞవాటం దివ్యమైన వెన్నెలవంటి వెలుగుతో ఉంది.

కరిణః పర్వతాకారాన్ మదసిక్తాన్ మనోహరాన్ ।
శతశః కోటిసఙ్ఘాతై ర్దన్తిభిః కృతభూషణైః ॥ 71 ॥

ఆయజ్ఞవాటికలో ఉన్నఏనుగులు ఆకారంలో కొండలవలె ఉన్నాయి. మదద్రవంతో తడిసి, అందంగా ఉన్నాయి. వందలసంఖ్యలో కోట్లసంఖ్యలో (అత్యధికంగా) ఉన్నాయి. మావటీలు ఆ ఏనుగులను వివిధ ఆభరణాలతో చక్కగా అలంకరించారు.

వాతవేగజవై రశ్వై స్సిన్ధుజాతై స్సుశోభనైః ।
శ్వేతాశ్వై శ్శ్యామకర్ణైశ్చ కోట్యనేకై ర్ధ్వజాన్వితైః ॥ 72 ॥

అక్కడ ఉన్న గుఱ్ఱాలు వాయువేగంతో సమానమైన వేగం కలిగినవి. అవి సింధుదేశంలో పుట్టిన ఉత్తమజాతి గుఱ్ఱాలు. చాల అందంగా ఉన్నాయి. వాటికి ఒళ్లంతా తెల్లగానూ, చెవులు మాత్రం నల్లగానూ ఉన్నది. అనేకకోట్ల సంఖ్యలో ఉన్నాయి. మంచివేగం గలిగిన గుఱ్ఱాలు.

సన్నద్ధబద్ధకక్షైశ్చ నానాప్రహరణోద్యతైః ।
అసంఖ్యేయైః పదాతైశ్చ దేవపుత్రోపమై స్తథా ॥ 73 ॥

అక్కడ భటులు లెక్కలేనంతమంది ఉన్నారు. గోచీలు బిగించి, ఎంతటిపనికైనా సిద్ధంగా ఉన్నారు. వారు దేవకుమారులవలె ప్రకాశిస్తున్నారు. రకరకాలైన ఆయుధాలను ధరించి యజ్ఞప్రదేశసంరక్షణంలో అప్రమత్తంగా ఉన్నారు.

ఇత్యేవం దదృశే రాజా యజ్ఞవాటం సవిస్తరమ్ ।
ముదం లేభే తదా రాజా సంహృష్టో వాక్య మబ్రవీత్ ॥ 74 ॥

ఇంద్రద్యుమ్నమహారాజు ఈవిధంగా ఉన్న యజ్ఞవాటికను అన్ని వైపులూ పరికించి చూచి ఆవైభవానికి సంతోషించాడు. ఆనందంగా ఇలా అంటున్నాడు.

రాజోవాచ :–ఇంద్రద్యుమ్నుడు అక్కడివారితో ఇలా అంటున్నాడు.

ఆనయధ్వం హయశ్రేష్ఠం సర్వలక్షణలక్షితమ్ ।
చారయధ్వం పృథివ్యాం వై రాజపుత్రా స్సుసంయతాః ॥ 75 ॥

ఉత్తమలక్షణాలు కలిగిన మంచిగుఱ్ఱాన్ని తీసుకుని రండి. వీరులను అడ్డగింపగలిగిన రాజకుమారులు ఆ గుఱ్ఱంవెంట ఉండి, భూమండలం అంతటా తిరగండి.

విద్వద్భి ర్ధర్మవిద్భిశ్చ హ్యత్ర హోమో విధీయతామ్ ॥ 76 ॥

ధర్మజ్ఞు లయిన విద్వాంసులచేత ఇక్కడ యజ్ఞహోమం నిర్వహించండి.

ఇష్టయశ్చ ప్రవర్తన్తాం ప్రాసాదో వైష్ణవ స్తతః ।
సర్వ మేతచ్చ విప్రేభ్యో దీయతాం మనసేప్సితమ్ ॥ 77 ॥

యజ్ఞాలు ప్రారంభించండి. తరువాత విష్ణు ఆలయం నిర్మించాలి. బ్రాహ్మణులకు వారు కోరుకున్నవి అన్నీ ఇవ్వండి.

స్త్రియశ్చ రత్నకోట్యశ్చ గ్రామా శ్చ నగరాణి చ ।
సమ్యక్ సమృద్ధభూమ్యశ్చ విషయా శ్చైవమర్థినామ్ ॥ 78 ॥

వనితలు, కోట్లకొద్దీ రత్నాలు, గ్రామాలు, నగరాలు. చక్కనిపంటలు మొదలైనవి పుష్కలంగా కలిగిన భూములు, ఇతరభూములు అడిగినవారికి అడిగినట్లుగా ఇవ్వండి.

అన్యాని ద్రవ్యజాతాని మనోజ్ఞాని బహూని చ ।
సర్వేషాం యాచమానానాం నాస్తి హ్యేత న్న భాషయేత్ ॥ 79 ॥

ఇంకా అందరికీ మనోహరమైన వస్తువులను సమృద్ధిగా ఇవ్వండి. అడిగినవారికి లేదు అని అనకండి.

తావత్ ప్రవర్తన్తాం యజ్ఞో యావ ద్దేవః పురాతనః ।
ప్రత్యక్షం మమ చాభ్యేతి యజ్ఞ స్యాస్య సమీపతః ॥ 80 ॥

సనాతనుడైన శ్రీమహావిష్ణుదేవుడు ఈ యజ్ఞంసన్నిధిలో నాకు ప్రత్యక్షంగా నిలిచేవరకు ఈవిధంగా అడిగినవారికి అడిగినట్లుగా ఇస్తూనే ఉండండి.

ఏవ ముక్త్వా తదా విప్రా రాజసింహో మహాభుజః ।
దదౌ సువర్ణసఙ్ఘాతం కోటీనాశ్చైవ భూషణమ్ ॥ 81 ॥

బ్రాహ్మణులారా! పరాక్రమవంతుడైన ఇంద్రద్యుమ్నమహారాజు ఈవిధంగా చెప్పి, బంగారురాశులను, కోట్లకొద్దీ ఆభరణాలనూ అక్కడి రాజపురుషులకు ఇచ్చాడు.

కరేణుశతసాహస్రం వాజినో నియుతాని చ ।
అర్బుదం చైవ వృషభం స్వర్ణశృఙ్గీశ్చ ధేనుకాః ॥ 82 ॥

హస్తిన షష్టివర్షైస్తు కృష్ణసారమృగం ద్విజాన్ ।
అనడ్వాహం చ గాశ్చైవ సర్వాంశ్చ పశుపాలకాన్ ॥ 83 ॥

ఏవ మానాయ్య వస్తూని సహేమకరకాణి చ ।
బ్రాహ్మణేభ్యో దదౌ రాజా శ్రద్ధయా విధిపూర్వకమ్ ॥ 84 ॥

అరవై సంవత్సరాలు నిండిన ఏనుగులను, నల్లజింకలను, అవసరమైన పక్షులను, ఎద్దులను, ఆవులను, ఆ పశువులకాపరులను, ఈవిధంగా బంగారు కమండలాలతో సహా యజ్ఞానికి కావలసిన సమస్తమైన సాధనాలను తీసుకుని వచ్చి, ఇంద్రద్యుమ్నమహారాజు శ్రద్ధగా, శాస్త్రోక్తమైన పద్ధతిలో యజ్ఞనిర్వాహకులైన బ్రాహ్మణులకు అందజేశాడు.

సురూపా స్సురభీ శ్చైవ కాంస్యదోహాః పయస్వినీః ।
ప్రాయచ్ఛత్ స తు విప్రేభ్యో వేదవిద్భ్యో ముదాయుతః ॥ 85 ॥

వేదపండితులైన బ్రాహ్మణులకు లక్ష ఏనుగులనూ, పెక్కుపదిలక్షలగుఱ్ఱాలనూ, పదికోట్ల ఎద్దులనూ, కొమ్ములకు బంగారం తొడిగిన పదికోట్లఆవులనూ, పాలు పిండుకోవడానికి కంచుపాత్రలతో సహా, అందమైన పాడి ఆవులనూ, సంతోషంగా దానం చేశాడు.

వాసాంసి చ మహార్హాణి రాఙ్కవాస్తరణాని చ ।
సుశుక్లాని చ శుభ్రాణి ప్రవాలమణిముత్తమమ్ ॥ 86 ॥

అదదత్ స మహాయజ్ఞే రత్నాని వివిధాని చ ।
వజ్రవైడూర్యమాణిక్యముక్తికాద్యాని యాని చ ॥ 87 ॥

స్వచ్ఛంగానూ, తెల్లగానూ ఉన్న మిక్కిలియోగ్యమైన (విలువైన) వస్త్రాలనూ, ఉన్నిచాపలనూ, శ్రేష్ఠమైన పగడాలనూ ఇచ్చాడు. ఇంద్రద్యుమ్నుడు ఆ మహాయాగంలో ఇంకా వజ్రాలు, వైడూర్యాలు, మాణిక్యాలు, ముత్యాలు మొద లయిన వివిధరత్నాలను బ్రాహ్మణులకు దానం చేశాడు.

అలఙ్కారవతీ శ్శుభ్రా కన్యా రాజీవలోచనాః ।
శతాని పఞ్చ విప్రేభ్యో రాజా హృష్టః ప్రదత్తవాన్ ॥ 88 ॥

ఇంద్రద్యుమ్నుడు తామరరేకులవంటికన్నులతో, అనేకమైన ఆభరణాలు ధరించి, అందంగా ఉన్న అయిదువందలమంది స్వచ్ఛమైన కన్నెలను తృప్తిగా బ్రాహ్మణులకు దానం చేశాడు.

స్త్రియః పీనపయోభారాః కఞ్చుకై స్స్వస్తనావృతాః ।
మధ్యహీనాశ్చ సుశ్రోణ్యః పద్మపత్రాయతేక్షణాః ॥ 89 ॥

మరికొందరు స్త్రీలు బలిసిన వక్షోజాలు కలిగిఉన్నారు. వక్షఃస్థలంమీద పయిట కప్పుకున్నారు. వారికి నడుము లేదేమో అన్నంత సన్నగా ఉంది. పిరుదులు అందంగా ఉన్నాయి. తామరరేకులలాగా కన్నులు విశాలంగా ఉన్నాయి.

హావభావాన్వితగ్రీవా బహ్వ్యో వలయభూషితాః ।
పాదనూపురసంయుక్తాః పట్టదుకూలవాససః ॥ 90 ॥

వారు మెడకదలికలతో (ముఖాలలో) శృంగారాభావాలూ, చేష్టలూ ప్రదర్శిస్తున్నారు. చేతులకు కంకణాలు (గాజులు) కాళ్లకు అందెలు ధరించారు. పట్టువస్త్రాలు కట్టుకున్నారు. వారు చాలమంది ఉన్నారు.

నానాదేశనివాసిభ్యో నృపేభ్యో విధివద్ధనమ్ ।
గజా నశ్వాన్ సువాసాంసి దేశాన్ ప్రాయచ్ఛ దీశ్వరః ॥ 91 ॥

వివిధరాజ్యాలనుండి వచ్చినరాజులకు తగినంతగా ధనసంపదలనూ, ఏనుగులనూ, గుఱ్ఱాలనూ, శ్రేష్ఠమైన వస్త్రాలనూ, రాజ్యభాగాలనూ, కానుకలుగా ఇచ్చాడు.

ఏకైకశోఽ దదాత్ తస్మిన్ కామ్యాశ్చ కామినీ ర్బహూః ।
అర్థిభ్యో బ్రాహ్మణాదిభ్యో హయమేధే ద్విజోత్తమాః ॥ 92 ॥

విప్రవరులారా! ఆ అశ్వమేధయాగంలో ఇంద్రద్యుమ్నుడు ఇలాంటిస్త్రీలను కోరుకున్న బ్రాహ్మణులు మొదలయినవారికి ఒక్కొక్కళ్లకీ ఎంతోమంది స్త్రీలను ఇచ్చాడు.

భక్ష్యం భోజ్యం చ సమ్పూర్ణం నానాసమ్భారసంయుతమ్ ।
ఖణ్డకాద్యా న్యనేకాని స్విన్నపక్వాంశ్చ పిష్టకాన్ ॥ 93 ॥

అన్నాన్యన్యాని మేధ్యాంశ్చ ఘృతపూరాంశ్చ ఖాణ్డవాన్ ।
మధురాం స్తర్జితాన్ పూపా నన్నం మృష్టం సుపాకికమ్ ॥ 94 ॥

ప్రీత్యర్థం సర్వసత్త్వానాం దీయతేఽ న్నం పునః పునః ।
దత్తస్య దీయమానస్య ధనస్యాన్తో న విద్యతే ॥ 95 ॥

పిండివంటలు, తినడానికి ఇష్టపడే రకరకాలపదార్థాలు తృప్తిగా ఇచ్చాడు. వివిధమైన కండచక్కెరలు, చక్కగా ఉడకబెట్టినపదార్థాలు, రకరకాలపిండ్లు, వివిధమైన అన్నాలు, యవధాన్యం వంటలు, నేయి కారుతున్న తినుబండారాలు, రకరకాలైన తీపివంటకాలూ, అప్పాలు, చక్కగా వండిన రుచికరమైన అన్నం, మొదలయినవి అన్నిరకాలవారికీ సంతృప్తి గలిగేవిధంగా మళ్లీ, మళ్లీ అందించారు. ఇచ్చినధనానికీ, ఇస్తున్నధనానికీ అంతే లేదు.

ఏవం దృష్ట్వా మహాయజ్ఞం దేవదైత్యా స్సచారణాః ।
గన్ధర్వాప్సరస స్సిద్ధా ఋషయశ్చ ప్రజేశ్వరాః ॥ 96 ॥

విస్మయం పరమం యాతా దృష్ట్వా క్రతువరం శుభమ్ ।
పురోధా మన్త్రిణో రాజా హృష్టా స్తత్రైవ సర్వశః ॥ 97 ॥

ఈవిధంగా సాగుతున్న ఆ మహాయాగాన్ని చూసి, దేవతలూ, దైత్యులూ, చారణులూ, గంధర్వులూ, అప్సరసలూ, సిద్ధులూ, ఋషులూ, రాజులూ, ఎంతో ఆశ్చర్యపడ్డారు. ఆ అశ్వమేధయాగం శుభప్రదంగానూ ఉత్తమంగానూ జరగడం చూచి, ఋత్విక్కులు, మంత్రులు, ఇంద్రద్యుమ్నుడు, ఎంతో సంతోషించారు.

న తత్ర మలినః కశ్చి న్న దీనో న క్షుధాఽ న్వితః ।
న చోపసర్గో న గ్లాని ర్నాధయో వ్యాధయ స్తథా ॥ 98 ॥

ఆ యాగప్రదేశంలో అపవిత్రులు కాని, దీనులు కాని, ఆకలిగొన్నవారు కాని, లేరు. ఇబ్బందులు గాని, బాధలు గానీ, చింతలు గానీ, రోగాలు గానీ, లేవు.

నాకాలమరణం తత్ర న దంశో న గ్రహో విషమ్ ।
హృష్టపుష్టజనా స్సర్వే తస్మిన్ రాజ్ఞో మహోత్సవే ॥ 99 ॥

పిన్నవయసులో మరణించడం గాని, ఈగలు, దోమలు కాని, దుష్టగ్రహాలుగాని, విషంకాని, లేవు. ఆ యాగోత్సవంలో అందరూ పుష్టిగా తుష్టిగా ఉన్నారు.

యే చ తత్ర తపస్సిద్ధా మునయ శ్చిరజీవినః ।
న జాత స్తాదృశో యజ్ఞో ధనధాన్యసమన్వితః ॥ 100 ॥

చిరకాలంగా జీవించి, ఎన్నోయాగాలు చూచిన తపస్సిద్ధులు ధనధాన్యాలతో సమృద్ధమైన ఇటువంటి యాగం ఇంతకు ముందు ఎప్పుడూ జరగలేదు అన్నారు.

ఏవం స రాజా విధివద్వాజిమేధం ద్విజోత్తమాః ।
క్రతుం సమాపయామాస ప్రాసాదం వైష్ణవం తథా ॥ 101 ॥

బ్రాహ్మణోత్తములారా! ఇంద్రద్యుమ్నమహారాజు ఈవిధంగా అశ్వమేధయాగాన్ని శాస్త్రోక్తమార్గంలో చక్కగా పూర్తిచేశాడు. అలాగే విష్ణువుకు ఆలయం కూడ నిర్మించాడు.

విప్రా న్నానావిధై రత్నై ర్భక్ష్యభోజ్యాదిసంయుతైః ।
సన్తర్ప్య దీనానాథాంశ్చ దత్త్వా నానావిధేప్సితమ్ ॥ 102 ॥

రకరకాలరత్నాలతోనూ, విందుభోజనాలతోనూ బ్రాహ్మణులను సంతోషపెట్టాడు. దరిద్రులకూ, దిక్కు లేనివారికీ వారికి కావలసినవి అన్నీ ఇచ్చాడు.

విప్రాన్ నృపాన్ విశ శ్శూద్రాం స్తర్పితా నిష్టదానతః ।
అనుజజ్ఞే స్వదేశేభ్యో గమనాయ నృపోత్తమః ॥ 103 ॥

కోరుకున్నవన్నీ ఇచ్చి, బ్రాహ్మణులనూ, రాజులనూ, వైశ్యులనూ, శూద్రులనూ, తృప్తిపరిచాడు. ఆతర్వాత ఇంద్రద్యుమ్నమహారాజు వారిని తమతమ దేశాలకు తిరిగి వెళ్లిపోవడానికి అనుమతించాడు.

స్వకుటుమ్బం దాసదాసీ స్సన్తో ష్యేష్టప్రదానతః ।
మేనే కృతార్థమాత్మాన మశ్వమేధమఖేన సః ॥ 104 ॥

తరువాత తన ఇంటివారికి, సేవకులకు కూడ మగవారికీ, ఆడవారికీ కావలసినవి ఇచ్చి సంతోషపెట్టాడు. అందరూ అన్నివిధాలుగా తృప్తిపడిన తరువాత ఇంద్రద్యుమ్నమహారాజు అశ్వమేధయాగం చక్కగా జరిగినందుకు తాను కృతార్థుడైనట్లు భావించాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే రాజ్ఞోఽశ్వమేధకరణం నామ పఞ్చచత్వారింశోఽధ్యాయః ॥45 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో అశ్వమేధకరణం అనే నలభైఐదవ అధ్యాయం సంపూర్ణం.

షట్చత్వారింశోఽధ్యాయః - నలబైఆరవ అధ్యాయం

కారుణ్యస్తవవర్ణనమ్ - కారుణ్యస్తవవర్ణనం

మునయ ఊచుః :-బ్రహ్మదేవుడితో మునులు ఈవిధంగా అన్నారు.

బ్రూహి నో దేవదేవేశ యత్ పృచ్ఛామః పురాతనమ్ ।
యథా తాః ప్రతిమాః పూర్వ మిన్ద్రద్యుమ్నేన నిర్మితాః ॥ 1 ॥

దేవతలకు దేవుడివైన బ్రహ్మదేవా, పూర్వం జరిగిన ఈవృత్తాంతాన్ని అడుగుతున్నాం. చెప్పవలసినది. పూర్వం ఇంద్రద్యుమ్నుడు బలరామాదులవిగ్రహాలను ఏవిధంగా నిర్మింపజేశాడు?

కేన చైవ ప్రకారేణ తుష్ట స్తస్మై స మాధవః ।
తత్సర్వం వద చాస్మాకం పరం కౌతూహలం హి నః ॥ 2 ॥

ఆ రాజు ఏవిధంగా విష్ణుదేవుడిని సంతోషపెట్టాడు? ఆవృత్తాంతం మొత్తం చెప్పు. తెలుసుకోవాలని మాకు ఎంతో ఉత్కంఠగా ఉంది.

శృణుధ్వం మునిశార్దూలాః పురాణం వేదసమ్మితమ్ ।
కథయామి పురా వృత్తం ప్రతిమానాం చ సమ్భవమ్ ॥ 3 ॥

మహర్షులారా! ఈవృత్తాంతం వేదాలలో ప్రతిపాదింపబడింది. సనాతనమైనది. పూర్వం ఈ ప్రతిమలు ఏవిధంగా ఏర్పడ్డాయో చెప్తాను, వినండి.

ప్రవృత్తే చ మహాయజ్ఞే ప్రాసాదే చైవ నిర్మితే ।
చిన్తా తస్య బభూవాథ ప్రతిమార్థ మహర్నిశమ్ ॥ 4 ॥

ఇంద్రద్యుమ్నుడు ప్రారంభించిన అశ్వమేధయాగం పూర్తయింది. శ్రీమహావిష్ణువుకు పెద్ద ఆలయం కూడ నిర్మించడం జరిగింది. అందులో ఉంచవలసిన దేవతలవిగ్రహాలను గురించి ఇంద్రద్యుమ్నుడికి రాత్రింబగళ్లు ఒకటే చింత అయింది.

న వేద్మి కేన దేవేశం సర్వేశం లోకపావనమ్ ।
సర్గస్థిత్యన్తకర్తారం పశ్యామి పురుషోత్తమమ్ ॥ 5 ॥

ఆ శ్రీమహావిష్ణువు దేవతలకే ప్రభువు. సమస్తానికీ ఆయనే నియామకుడు. లోకాలను అన్నింటినీ పవిత్రం చేస్తాడు. జగత్తులను సృష్టి చేస్తాడు. పోషిస్తాడు. చివరికి లయం చేస్తాడు. సృష్టిస్థితిలయాలు చేసేవాడు. ఆయనే పురుషోత్తముడు. అటువంటిస్వామిని ఎలా చూడగలుగుతానో తెలియడం లేదు.

చిన్తావిష్ట స్త్వభూద్ రాజా శేతే రాత్రౌ దివాఽపి న ।
న భుఙ్క్తే వివిధాన్ భోగాన్ న చ స్నానం ప్రసాధనమ్ ॥ 6 ॥

ఇంద్రద్యుమ్నుడికి ఈవిధమైన దిగులు మనసంతా నిండిపోయింది. దానితో అతడికి రాత్రింబగళ్లు నిద్రపట్టడం లేదు. రాజయి ఉండి కూడ ఏవిధమైన సుఖాలనూ అనుభవించడం లేదు. స్నానం చేయడు. అలంకరించుకోడు.

నైవ వాద్యేన గన్ధేన గాయనై ర్వర్ణకై రపి ।
న గజై ర్మదయుక్తైశ్చ న చానేకై ర్హయాన్వితైః ॥ 7 ॥

వాద్యసంగీతం ఆలకింపడు. సుగంధద్రవ్యాలు పూసుకోడు. పాటలు వినడు. రకరకాల రంగులను ఆదరించడు. అసంఖ్యాకమైన మత్తేభాలను గాని, మంచిగుఱ్ఱాలను గాని పట్టించుకోడు.

నేన్ద్రనీలై ర్మహానీలైః పద్మరాగమయై ర్న చ ।
సువర్ణరజతాద్యైశ్చ వజ్రస్ఫటికసంయుతైః ॥ 8 ॥

ఇంద్రనీలాలు, మహానీలాలు, పద్మరాగాలు, వజ్రాలు, స్ఫటికాలు, బంగారం, వెండి, మొదలైన వాటిని వేటినీ చూడడు.

బహురాగార్థకామైర్వా న వన్యై రన్తరిక్షగైః ।
బభూవ తస్య నృపతే ర్మనస స్తుష్టివర్ధనమ్ ॥ 9 ॥

అందరికీ ఎంతో ఇష్టం గలిగించే అర్థం కానీ, కామం కానీ, అలాగే అరణ్యాలకు చెందినవి కానీ, ఆకాశానికి సంబంధించినవి కానీ, ఏవీ కూడ ఇంద్రద్యుమ్నుడికి మనసుకు సంతోషాన్ని కలిగించడం లేదు.

శైలమృద్దారుజాతేషు ప్రశస్తం కిం మహీతలే ।
విష్ణుప్రతిమాయోగ్యం చ సర్వలక్షణలక్షితమ్ ॥ 10 ॥

విష్ణుదేవుడి విగ్రహం నిర్మించడానికి ఈభూమండలంలో రాళ్లు, మట్టి, చెక్క అనేవాటిలో మంచిలక్షణాలు అన్నీ కలిగినదీ, ఉత్తమమైనదీ ఏది?

ఏతై రేవ త్రయాణాం తు దయితం స్యాత్ సురార్చితమ్ ।
స్థాపితే ప్రీతి మభ్యేతి ఇతి చిన్తాపరోఽభవత్ ॥ 11 ॥

రాళ్లు, మట్టి, చెక్క అనే ఈమూడింటితో చేసిన ప్రతిమలను మాత్రమే దేవతలు ఇష్టపడతారు. దేవతలు కూడ ఆ మూడువిధాలైన ప్రతిమలనే పూజిస్తారు. అటువంటి ప్రతిమను ప్రతిష్ఠ చేస్తేనే శ్రీమహావిష్ణువు సంతోషిస్తాడు. (అర్చామూర్తిలో సన్నిహితుడై, భక్తుల పూజలను స్వయంగా స్వీకరించి ఆనందిస్తాడు.) అటువంటి ప్రతిమను నిర్మించడం ఎలాగా? అని ఇంద్రద్యుమ్నుడు దిగులుపడుతున్నాడు.

పఞ్చరాత్రవిధానేన సమ్పూజ్య పురుషోత్తమమ్ ।
చిన్తావిష్టో మహీపాల స్సంస్తోతు ముపచక్రమే ॥ 12 ॥

ఇంద్రద్యుమ్నుడు ఈవిధంగా ఆలోచిస్తూ, పాంచరాత్రసంప్రదాయంలో శ్రీమహావిష్ణువును పూజించాడు. తరువాత స్వామిని ఇలా స్తుతించడం ప్రారంభించాడు.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా అంటున్నారు.

ఏవం వేదోక్తవిధినా హయమేధం మహామఖమ్ ।
స్వాన్తఃకరణశుద్ధ్యర్థం భీత స్సంసారసాగరాత్ ॥ 13 ॥

ఏకాన్త ఉపవిశ్యాథ ప్రాప్తుం విష్ణోః పరం పదమ్ ।
తుష్టావ జగతాం నాథం జగదానన్దదాయకమ్ ॥ 14 ॥

ఇంద్రద్యుమ్నమహారాజు వేదంలో చెప్పబడినమార్గంలో అశ్వమేధయాగాన్ని చక్కగా పూర్తిచేశాడు. సముద్రం లాంటి సంసారంలో మునిగి ఉండటానికి భయపడ్డాడు. చిత్తశుద్ధిని పొందదానికీ, ఉత్తమోత్తమమైన శ్రీమహావిష్ణువు స్థానాన్ని పొందడానికీ, నిశ్చయించుకున్నాడు. ఒంటరిగా కూర్చుని, లోకాలన్నింటికీ ఆనందాన్ని కలిగించే జగన్నాథుడిని ఈస్తోత్రంతో సంతోషపెట్టాడు.

రాజోవాచ :–ఇంద్రద్యుమ్నుడు శ్రీమహావిష్ణువును ఈవిధంగా స్తుతిస్తున్నాడు.

జగదాధార విశ్వేశ సర్వకామప్రపూరక ।
లక్ష్మీకాన్త కృపాసిన్ధో భక్తవత్సల సత్ప్రియ ॥
త్రాహి విష్ణో మహారాజ మగ్నం మాం భవసాగరే ॥ 15 ॥

లోకాలకు ఆధారమైనవాడా! జగన్నాథా! కోరికలన్నింటినీ నేరవేర్చేవాడా! లక్ష్మీపతీ, దయాసముద్రుడా! భక్తులపై వాత్సల్యం కలిగినవాడా! సాధుజనులను ఇష్టపడేవాడా! సంసారం అనే సముద్రంలో మునిగిపోయి ఉన్న నన్ను కాపాడు.

ప్రలయానలసఙ్కాశ నమస్తే దితిజాన్తక ।
నరసింహ మహావీర్య త్రాహి మాం దీప్తలోచన ॥ 16 ॥

ప్రళయకాలపు అగ్నిలాగా ప్రకాశించేవాడా! రాక్షసులను సంహరించేవాడా! నీకు నమస్కారం. నృసింహావతారా, మిక్కిలి పరాక్రమవంతుడా, జ్వలించేకన్నులు కలిగినవాడా! నన్ను రక్షించు.

వాసుదేవ నమస్తేஉస్తు నమస్తే మోక్షకారణ ।
త్రాహి మాం సర్వలోకేశ జన్మసంసారసాగరాత్ ॥ 17 ॥

వాసుదేవా, నీకు నమస్కారం. మోక్షాన్ని ప్రసాదించేస్వామీ నీకు నమస్కారం. సర్వజగన్నాథా! మళ్లీ మళ్లీ పుట్టటం అనే సముద్రం నుండి నన్ను కాపాడు. (పుట్టుక లేకుండా చేయి, మోక్షాన్ని ఇవ్వు.)

నిర్మలామ్బరసఙ్కాశ నమస్తే పురుషోత్తమ ।
సఙ్కర్షణ నమస్తేஉస్తు త్రాహి మాం ధరణీశ్వర ॥ 18 ॥

స్వచ్ఛమైన ఆకాశంవంటివాడా! పురుషోత్తమా! నీకు నమస్కారం. సంకర్షణ నామధేయా! నీకు నమస్కారం. భూదేవీనాథా! నన్ను రక్షించు.

నమస్తే హేమగర్భాభ నమస్తే మకరధ్వజ ।
రతికాన్త నమ స్తేఽస్తు త్రాహి మాం సంవరాన్తక ॥ 19 ॥

హిరణ్యగర్భా! నీకు నమస్కారం. మన్మథదేవా! రతీదేవీనాథా! నీకు నమస్కారం. శంబరాసురుడిని సంహరించినవాడా, నన్ను కాపాడు.

నమస్తేఽఞ్జనసఙ్కాశ నమస్తే భక్తవత్సల ।
అనిరుద్ధ నమస్తేఽస్తు త్రాహి మాం వరదో భవ ॥ 20 ॥

కాటుకవంటిమేనిచాయవాడా! నీకు నమస్కారం. భక్తులపై వాత్సల్యం కలిగినవాడా! నీకు నమస్కారం. అనిరుద్ధుడా! నీకు నమస్కారం. నన్ను రక్షించు. వరాలను ప్రసాదించు.

నమస్తే విబుధావాస నమస్తే విబుధప్రియ ।
నారాయణ నమస్తేఽస్తు త్రాహి మాం శరణాగతమ్ ॥ 21 ॥

జ్ఞానులలో నిలిచి ఉండేవాడా! నీకు నమస్కారం. దేవతలకు ఇష్టమైనవాడా! నీకు నమస్కారం. నారాయణదేవా! నీకు నమస్కారం. నిన్నే నమ్ముకుని వచ్చాను. నన్ను కాపాడు.

నమస్తే బలినాం శ్రేష్ఠ నమస్తే లాఙ్గలాయుధ ।
చతుర్ముఖ జగద్ధామ త్రాహి మాం ప్రపితామహ ॥ 22 ॥

బలవంతులలో ఉత్తముడా! నీకు నమస్కారం. నాగలి ఆయుధంగా కలిగిన బలరామస్వరూపుడా! నీకు నమస్కారం. బ్రహ్మరూపంలో ఉన్నవాడా, లోకాలన్నింట నిండి ఉన్నవాడా, పితామహుడికంటే పూర్వం ఉన్నవాడా! నన్ను కాపాడు.

నమస్తే నీలమేఘాభ నమస్తే త్రిదశార్చిత ॥ 23 ॥

కారుమేఘంవంటి మేనిచాయ గలిగినవాడా! నీకు నమస్కారం. దేవతలచేత పూజింపబడేవాడా! నీకు నమస్కారం.

యథా రసాతలా దుర్వీ త్వయా దంష్ట్రోద్ధృతా పురా ।
తథా మహావరాహ త్వం త్రాహి మాం దుఃఖసాగరాత్ ॥ 24 ॥

పూర్వం వరాహావతారంలో నీవు కోరతో ఈ భూమిని పాతాళం(సముద్రం అడుగు)నుండి పైకి ఉద్ధరించిన విధంగా, నన్ను కష్టాల కడలినుండి పైకి లేపి, కాపాడు.

త వైతా మూర్తయః కృష్ణ వరదా స్సంస్తుతా మయా ।
త్వఞ్చేమే బలదేవాద్యాః పృథగ్రూపేణ సంస్థితాః ॥ 25 ॥

కృష్ణా, వరాలను అనుగ్రహించే నీ అవతారరూపాలను ప్రస్తుతిస్తాను. నీవు బలరాముడు మొదలైన, ఇతరులూ వేరువేరు రూపాలతో కనిపిస్తారు. కాని అంతా ఒక్కటే. అది నీవే

అఙ్గాని తవ దేవేశ గరుత్మాద్యా స్తథా ప్రభో ।
దిక్పాలా స్సాయుధా శ్చైవ కేశవాద్యా స్త థాఽచ్యుత ॥ 26 ॥

ప్రభూ, సురనాయకా! గరుత్మంతుడు మొదలైనవారు, ఆయుధాలతో సహా దిక్పాలకులు, అలాగే కేశవుడు మొదలైన రూపాలు కూడ నీశరీరంలో భాగాలే (నీవే తప్ప వేరు కాదు).

యే చాన్యే తవ దేవేశ భేదాః ప్రోక్తా మనీషిభిః ।
తేఽపి సర్వే జగన్నాథ ప్రసన్నాయతలోచన ॥ 27 ॥

లోకేశ్వరా! దయతో నిండిన పెద్దపెద్దకన్నులు కలిగినస్వామీ, బుద్ధిమంతులు పేర్కొనే ఇతరమైన వివిధరూపాలు అన్నీ నీకు సంబంధించినవే.

మ యార్చితాః స్తుతా స్సర్వే తథా యూయం నమస్కృతాః ।
ప్రయచ్ఛధ్వం వరం మహ్యం ధర్మకామార్థమోక్షదాః ॥ 28 ॥

ఆయా రూపాలను అన్నింటినీ స్తుతిస్తున్నాను. నమస్కరిస్తున్నాను. ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే నాలుగుపురుషార్థాలనూ (సాధించే విధంగా ఆశీస్సులను) నాకు వరంగా ప్రసాదించు.

భేదాస్తే కీర్తితా యే తు హరసఙ్కర్షణాదయః ।
తవ పూజార్థసమ్భూతా స్తే చ త్వయి సమాశ్రితాః ॥ 29 ॥

శ్రీహరీ! భక్తులు ప్రస్తుతించే హరుద, సంకర్షణుడు మొదలైనవారు విభిన్నమైన నీరూపాలే. నిన్ను పూజించడానికే భిన్నరూపాలలో సంకర్షణాదులు ఏర్పడ్డారు. వారు అందరూ నిన్ను ఆశ్రయించుకుని నీలోనేఉన్నారు.

న భేద స్తవ దేవేశ విద్యతే పరమార్థతః ।
వివిధం తవ యజ్ఞార్థం రూపం తదుపచారతః ॥ 30 ॥

పైకి భిన్నరూపాలుగా కనిపిస్తున్నప్పటికీ, యథార్థానికి నీలో భేదాలు ఏమీ లేవు. అంతా ఒక్కటే. ఆ(శంకరుడు మొదలైన) రూపాలు భక్తులు తమతమ ఇష్టాన్ని అనుసరించి పూజించుకోవడానికి వీలుగా వ్యవహారంకోసం ఏర్పడినవే.

అద్వైతం త్వాం కథం ద్వైతం వక్తుం శక్నోతి మానవః ।
ఏక స్త్వం హి హరే వ్యాపీ చిత్స్వభావో నిరఞ్జనః ॥ 31 ॥

ఏకైకస్వరూపం అయిన నిన్ను మానవుడు (వివిధరూపాలనుబట్టి) అనేకవిధాలుగా (దేవతలు చాలమందిఅని) చెప్పడం ఎలా కుదురుతుంది? శ్రీహరీ, నీవు ఒక్కడివే. అన్నింటా నిండిఉంటావు. జ్ఞానమే నీస్వరూపం. నిర్మలుడివి.

పరమం తవ యద్రూపం భావాభావవివర్జితమ్ ॥
నిర్లేపం విమలం సూక్ష్మం కూటస్థమచలం ధ్రువమ్ ॥ 32 ॥

నీరూపం ఉత్తమం. నీకు ఉండటం, లేకపోవడం అనేవి లేవు. నీకు దేనిమీద సంగం లేదు. శుద్ధుడివి. పరిమాణం మిక్కిలిస్వల్పం. ఏవిధమైన వికారం లేదు. స్థిరంగా ఉంటావు. నిశ్చయస్వరూపుడివి.

సర్వపాపవినిర్ముక్తం సత్తామాత్రవ్యవస్థితమ్ ।
తద్దేవాశ్చ న జానన్తి కథం జానా మ్యహం ప్రభో ॥ 33 ॥

నీకు ఏపాపమూ అంటదు. యథార్థమైన స్థితితో నియతంగా ఉంటావు. మహాత్మా, అటువంటి నీరూపాన్ని దేవతలు కూడా తెలుసుకోలేరు. ఇంక నాకు ఏవిధంగా తెలుస్తుంది.

అపరం తవ యద్రూపం పీతవస్త్రం చతుర్భుజమ్ ।
శఙ్ఖచక్రగదాపాణిముకుటాఙ్గదధారిణమ్ ॥ 34 ॥

సాకార మయినరూపం నీకు ఇంకొకటి ఉంది. ఆరూపంలో నీవు పట్టువస్త్రాలు ధరించిఉంటావు. నాలుగుచేతులు ఉంటాయి. చేతులలో శంఖం, చక్రం, గదలను ధరిస్తావు. కిరీటం, భుజకీర్తులు, ధరిస్తావు.

శ్రీవత్సోరస్కసంయుక్తం వనమాలావిభూషితమ్ ।
త దర్చయన్తి విబుధా యే చాన్యే తవ సంశ్రయాః ॥ 35 ॥

వక్షఃస్థలంమీద శ్రీవత్సం అనేపుట్టుమచ్చ ఉంటుంది. వనమాలను అలంకరించుకుని ఉంటావు. జ్ఞానులు ఇంకా నిన్ను ఆశ్రయించిన సామాన్యులు అందరూ సగుణమైన ఆరూపాన్ని పూజిస్తారు.

దేవదేవ సురశ్రేష్ఠ భక్తానామభయప్రద ।
త్రాహి మాం పద్మపత్రాక్ష మగ్నం విషయసాగరే ॥ 36 ॥

దేవతలచేత అర్చింపబడేవాడా! దేవతలలో ఉత్తముడా! భక్తుల భయాలు తొలగించేవాడా! తామరరేకులవంటి కన్నులు గలవాడా! ఇంద్రియవిషయాలు అనే సముద్రంలో పడి కొట్టుకుంటున్న నన్ను రక్షించు.

నాన్యం పశ్యామి లోకేశ యస్యాహం శరణం వ్రజే ।
త్వామృతే కమలాకాన్త ప్రసీద మధుసూదన ॥ 37 ॥

జగన్నాథా! నీవు తప్ప నాకు దిక్కు ఇంకెవ్వరూ కనబడడం లేదు. నిన్నే శరణు పొందుతున్నాను. లక్ష్మీనాథా! మధు వనే రాక్షసుడిని చంపినవాడా! నన్ను కాపాడు.

జరావ్యాధిశతై ర్యుక్తో నానాదుఃఖై ర్నిపీడితః ।
హర్షశోకాన్వితో మూఢః కర్మపాశై స్సుయన్త్రితః ॥ 38 ॥

వందలకొద్దీ రోగాలూ, ముసలితనమూ, ఇంకా ఎన్నో బాధలు నన్ను పీడిస్తున్నాయి. పూర్వం చేసుకున్న కర్మలు అనేబంధాలలో చిక్కుకుని, ఒకప్పుడు ఆనందం, ఒకప్పుడు దుఃఖం కలుగుతుండగా, అజ్ఞానంతో జీవితం గడుపుతున్నాను.

పతితోఽ హం మహారౌద్రే ఘోరే సంసారసాగరే ।
విషయోదకదుష్పారే రాగద్వేషఝషాకులే ॥ 39 ॥

నేను సంసారం అనేసముద్రంలో పడిపోయాను. ఈసముద్రం మిక్కిలితీవ్రమైనది. చాలా భయంకరమైనది. ఇంద్రియసుఖాలు అనే నీళ్ళతో నిండి, ఒడ్డుకు చేరటం సాధ్యం కాకున్నది. ఇష్టం, ద్వేషం అనే చేపలతో కలత పెడుతుంది.

ఇన్ద్రియావర్తగమ్భీరే తృష్ణాశోకోర్మిసఙ్కులే ।
నిరాశ్రయే నిరాలమ్బే నిస్సారేఽ త్యన్తచఞ్చలే ॥ 40 ॥

సంసారసాగరంలో ఇంద్రియకర్మలు అనేపెద్దపెద్దసుడిగుండాలు ఉన్నాయి. ఇందులో ఆశ, దుఃఖం అనే అలలు దట్టంగా వ్యాపించిఉన్నాయి. ఇతరులను ఎవ్వరినీ దగ్గరకు చేరనీయదు. ఎవ్వరినీ స్థిరంగా ఉండనీయదు. ఇందులో సారం ఏమీ లేదు. మిక్కిలి చపలమైనది.

మాయయా మోహిత స్తత్ర భ్రమామి సుచిరం ప్రభో ।
నానాజాతిసహస్రేషు జాయమానః పునః పునః ॥ 41 ॥

దేవా, అజ్ఞానంతో భ్రమలకు లోబడి, ఈ సంసారసాగరంలో పడి తిరుగుతున్నాను. వేలకొద్దీ రకరకాల జాతులలో మళ్లీ మళ్లీ పుడుతున్నాను.

మయా జన్మాన్యనేకాని సహస్రాణ్యయుతాని చ ।
వివిధాన్యనుభూతాని సంసారేఽ స్మిన్ జనార్దన ॥ 42 ॥

ప్రజలను కాపాడేవాడా! ఈ సంసారంలో నేను వేలు, పదివేలుగా లెక్కలేనన్ని రకరకాల జన్మలెత్తి నానాబాధలు అనుభవించాను.

వేదా స్సాఙ్గా మయాధీతా శ్శాస్త్రాణి వివిధాని చ ।
ఇతిహాసపురాణాని తథా శిల్పా న్యనేకశః ॥ 43 ॥

ఆ యా జన్మలలో వేదాంగాలతో సహా వేదాలు అన్నీ నేర్చుకున్నాను. సమస్త మయిన శాస్త్రాలు చక్కగా చదివాను. అలాగే ఇతిహాసాలు, పురాణాలు, శిల్పవిద్య ఇలా అనేకవిషయాలు అధ్యయనం చేశాను.

అసన్తోషాశ్చ సన్తోషా స్సఞ్చయాపచయా వ్యయాః ।
మయా ప్రాప్తా జగన్నాథ జయవృద్ధ్యుదయేతరాః ॥ 44 ॥

లోకేశ్వరా, సంతోషాలు అనుభవించాను. కష్టాలు పడ్డాను. వృద్ధిని పొందాను. తగ్గిపోయాను. నష్టపోయాను. విజయాలు, అపజయాలు, పెరుగుదలలు, తగ్గుదలలు, రావడాలు, పోవడాలు, అన్నీ అనుభవించాను.

భార్యారిమిత్రబన్ధూనాం వియోగా స్సఙ్గమా స్తథా ।
పితరో వివిధా దృష్టా మాతరశ్చ తథా మయా ॥ 45 ॥

భార్యలు, శత్రువులు, స్నేహితులు, చుట్టాలతో కలవడమూ, విడిపోవడమూ జరిగాయి. (వేర్వేరు జన్మలలో) వేర్వేరు తండ్రులనూ, తల్లులనూ పొందాను.

దుఃఖాని చానుభూతాని యాని సౌఖ్యా న్యనేకశః ।
ప్రాప్తా శ్చ బాన్ధవాః పుత్రా భ్రాతరో జ్ఞాతయ స్తథా ॥ 46 ॥

ఎన్నో సుఖాలు అనుభవించాను. బాధలు అనుభవించాను. (కష్టాలను సుఖాలుగా భ్రమించి ఆనందించాను.) చుట్టాలు, కొడుకులు, సోదరులు, దాయాదులు ఎంతోమంది ఏర్పడ్డారు.

మయోషితం తథా స్త్రీణాం కోష్ఠే విణ్మూత్రవిప్లవే ।
గర్భవాసే మహాదుఃఖ మనుభూతం తథా ప్రభో ॥ 47 ॥

ప్రభూ! మలమూత్రాదులకు నిలయమైన స్త్రీలగర్భంలో నివసించాను. ఆగర్భంలో ఉంటున్నపుడు ఎన్నో బాధలు అనుభవించాను.

దుఃఖాని యాన్యనేకాని బాల్యయౌవనగోచరే ।
వార్ధకే చ హృషీకేశ తాని ప్రాప్తాని వై మయా ॥ 48 ॥

ఇంద్రియాలకు అధిపతి అయినవాడా, పుట్టినతరువాత బాల్యంలోనూ, యౌవనంలోనూ, ముసలితనంలోనూ సాధారణంగా వచ్చేకష్టాలు అన్నీ నాకు వచ్చాయి.

మరణే యాని దుఃఖాని యమమార్గే యమాలయే ।
మయా తా న్యనుభూతాని నరకే యాతనాకులే ॥ 49 ॥

ఆయా జన్మలలో మరణించే సమయంలోనూ, యమపురానికి వెళ్లే దారిలోనూ, యమపురంలోనూ ఉన్న బాధలన్నీ అనుభవించాను. యాతనలతో నిండిన నరకంలో ఉండే కష్టాలు కూడ అనుభవించాను.

కృమికీటద్రుమాణాం చ హస్త్యశ్వమృగపక్షిణామ్ ।
మహిషోష్ట్రగవాం చైవ తథాన్యేషాం వనౌకసామ్ ॥ 50 ॥

ద్విజాతీనాం చ సర్వేషాం శూద్రాణాం చైవ యోనిషు ।
ధనినాం క్షత్రియాణాం చ దరిద్రాణాం తపస్వినామ్ ॥ 51 ॥

నృపాణాం నృపభృత్యానాం తథాన్యేషాం చ దేహినామ్ ।
గృహేషు తేషా ముత్పన్నో దేవ చాహం పునః పునః ॥ 52 ॥

చిన్న చిన్న పురుగులు, చెట్లు, ఏనుగులు, గుఱ్ఱాలు, ఇతరజంతువులు, పక్షులు, దున్నపోతులు, ఒంటెలు, ఆవులు, ఇంకా ఇతరమైన కోతులు మొదలైన అడవిజంతువులు, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు,

ఇలా అన్నిజాతులలోనూ జన్మించాను. అదే విధంగా ధనవంతులైన క్షత్రియులు, దరిద్రులైన తపస్వులు, రాజులు, రాజసేవకులు, అలాగే అనేక మయినఇతరజీవుల ఇండ్లలో ఎన్నో పర్యాయాలు జన్మించాను.

గతోఽస్మి దాసతాం నాథ శ్రీమతాం బహుశో నృణామ్ ।
దరిద్రత్వంచేశ్వరత్వం స్వామిత్వం చ తథా గతః ॥ 53 ॥

దేవా! ధనవంతులయిన ఎంతోమంది రాజులకు సేవకుడుగా పుట్టాను. అదేవిధంగా ధనహీనుడి నయినాను. ప్రభువు నయినాను. యజమానుడి నయినాను.

హతా మయా హత శ్చాన్యై ర్ఘాతితో ఘాతితా స్తథా ।
దత్తం మమాన్యై రన్యేభ్యో మయా దత్త మనేకశః ॥ 54 ॥

ఆయాజన్మలలో నేను ఎందరినో చంపాను. ఇతరులూ నన్ను చంపారు. నన్ను ఇతరులు దెబ్బతీశారు. నేనూ ఇతరులను చావుదెబ్బలు కొట్టాను. నేను (సంపన్నుడినై జన్మించినపుడు) ఇతరులకు దానం చేశాను. అలాగే ఇతరులు నాకు (దరిద్రుడి నైనపుడు) దానం చేశారు.

పితృమాతృసుహృద్భ్రాతృకలత్రాణాం కృతే న చ ।
ధనినాం శ్రోత్రియాణాం చ దరిద్రాణాం తపస్వినామ్ ॥
ఉక్తం దైన్యం బహువిధం త్యక్త్వా లజ్జాం జనార్దన ॥ 55 ॥

లోకరక్షకా! విష్ణుదేవా! నాతల్లిదండ్రులు, స్నేహితులు, అన్నదమ్ములు, భార్యలు, వీళ్లందరికోసం ధనవంతులనూ, వైదికులనూ, చివరకు దరిద్రులను గూడ సిగ్గు విడిచి దయనీయంగా యాచించాను.

దేవతిర్యఙ్మనుష్యేషు స్థావరేషు చరేషు చ ।
న పశ్యామి తు తత్స్థానం యత్రాహం న గతః ప్రభో ॥ 56 ॥

మహాత్మా! దేవతలలో గానీ, పశువులు పక్షులు మొదలైన జాతులలో గానీ, మానవులలో గానీ, జడపదార్థాలలో గానీ, జీవపదార్థాలలో గానీ, నేను పుట్టనిజాతి ఏదీ కనబడదు. (చరాచరమైనఅన్నిపదార్థాలు గానూ జన్మించాను.)

కదా మే నరకే వాసః కదా స్వర్గే జగత్పతే ।
కదా మనుష్యలోకేషు కదా తీర్థజలేషు చ ॥ 57 ॥

జగన్నాథా! నేను నరకంలో ఎంతకాలం ఉన్నానో? స్వర్గంలో ఎంతకాలం ఉన్నానో? మానవలోకంలో ఎంతకాలం ఉన్నానో? పుణ్యక్షేత్రాలలో, పుణ్యనదులలో ఎంతకాలం సంచరించానో?

జలయన్త్రే యథా చక్రే ఘటీ రజ్జునిబన్ధినీ ।
యాతి చోర్ధ్వ మధశ్చైవ కదా మధ్యే చ తిష్ఠతి ॥ 58 ॥

తథా చాహం సురశ్రేష్ఠ కర్మరజ్జుసమాశ్రితః ।
అధశ్చోర్ధ్వం తథా మధ్యే భ్రమామి కర్మయోగతః ॥ 59 ॥

దేవేశ్వరా! తాడుతో కట్టిన కుండ నీటియంత్రంలో చక్రం ఆధారంగా పైకీ, కిందికీ, మధ్యలోనూ ఎలా కదులుతూ ఉంటుందో (గిలకమీద తాడు ఉండగా, ఆతాడుకు కట్టిన చేద పైకీ కిందికీ కదిలినట్లుగా), అలాగా, నేను పూర్వం చేసినకర్మ అనేతాడు పట్టుకుని, కిందికీ (నరకానికీ), పైకీ (స్వర్గానికి), మధ్యలోనూ (భూలోకంలో), నాకర్మఫలానికి అనుగుణంగా తిరుగుతున్నాను.

ఏవం సంసారచక్రేఽస్మిన్ భైరవే రోమహర్షణే ।
భ్రమామి సుచిరం కాలం నాన్తం పశ్యామి కర్హిచిత్ ॥ 60 ॥

ఒళ్లు గగుర్పొడిచేవిధంగా భయంకర మైన ఈసంసారం అనే చక్రంలో నేను ఎంతకాలంనుండో స్వర్గానికీ, నరకానికీ, నడుమ భూలోకంలోనూ తిరుగుతున్నాను. దీనికి అంతు ఎక్కడా కనబడంలేదు.

న జానే కిం కరోమ్యద్య హరే వ్యాకులితేన్ద్రియః ।
శోకతృష్ణాభిభూతశ్చ కాన్దిశీకో విచేతనః ॥ 61 ॥

శ్రీహరీ! ఇంద్రియాలు కలవరపెడుతున్నాయి. ఇప్పుడు ఏం చేయాలో తెలియడం లేదు. ఆశలూ, బాధలూ నన్ను ఆక్రమించుకున్నాయి. దానివల్ల దిక్కు తోచడం లేదు. జ్ఞానం నశించింది.

ఇదానీం త్వా మహం దేవ విహ్వల శ్శరణం గతః ।
త్రాహి మాం దుఃఖితం కృష్ణ మగ్నం సంసారసాగరే ॥ 62 ॥

దేవా! శ్రీకృష్ణా! ఇక ఇప్పుడు నిన్ను భయంతో నీశరణు కోరి వచ్చాను. బాధలలో ఉన్న నన్ను రక్షించు. సంసారం అనే సముద్రంలో మునిగిపోయిన నన్ను ఉద్ధరించు.

కృపాం కురు జగన్నాథ భక్తం మాం యది మన్యసే ।
త్వదృతే నాస్తి మే బన్ధు ర్యోఽసౌ చిన్తాం కరిష్యతి ॥ 63 ॥

లోకేశ్వరా! నేను నీభక్తుడిని అనుకుంటే నామీద దయ చూపించు. భక్తులక్షేమాన్ని గురించి ఆలోచించేవాడివి నీవే. నాకు నీవు తప్ప ఇంకొకబంధువు (రక్షించేవాడు) లేదు.

దేవ త్వాం నాథమాసాద్య న భయం మేఽస్తి కుత్రచిత్ ।
జీవితే మరణేచైవ యోగక్షేమేఽథ వా ప్రభో ॥ 64 ॥

అనాథనాథా! ఈశ్వరా! నీవే దిక్కు అని నిన్ను చేరుకున్ననాకు బ్రతకడంగురించి కాని, మరణించడంగూర్చి కానీ, శుభపరంపరలు పొందడంలో కాని, వాటిని స్థిరంగా అనుభవించడంలో కానీ, ఏమాత్రం భయం లేదు.

యే తు త్వాం విధివద్ దేవ నార్చయన్తి నరాధమాః ।
సుగతి స్తు కథం తేషాం భవేత్ సంసారబన్ధనాత్ ॥ 65 ॥

దేవా! నిన్ను పద్ధతి ప్రకారం పూజించని నీచమానవులు సంసారం అనేబంధం నుండి ఏవిధంగా బయటపడతారు? వారికి ఉత్తమగతులు ఎలా కలుగుతాయి?

కిం తేషాం కులశీలేన విద్యయా జీవితేన వా ।
యేషాం న జాయతే భక్తి ర్జగద్ధాతరి కేశవే ॥ 66 ॥

లోకాలన్నింటినీ సృష్టించిన శ్రీమహావిష్ణువు మీద భక్తి కలగకపోతే, ఎంత గొప్ప వంశంలో జన్మించినా, ఎంత మంచి నడవడి కలిగిఉన్నా, ఎంత గొప్ప చదువులు చదివినా, ప్రయోజనం లేదు. అసలు బ్రతికి ఉండటం కూడ వ్యర్థమే.

ప్రకృతిం చాసురీం ప్రాప్య యే త్వాం నిన్దన్తి మోహితాః ।
పతన్తి నరకే తే తు జాయమానాః పునః పునః ॥ 67 ॥

రాక్షసప్రవృత్తి కలిగి, అజ్ఞానంతో (తమోగుణంతో) నిన్ను నిందించే మానవులు మళ్లీ మళ్లీ జన్మలు ఎత్తుతూ, ప్రతిసారీ మరణానంతరం నరకంలో పడిపోతారు.

న తేషాం నిష్కృతి స్తస్మాద్ విద్యతే నరకార్ణవాత్ ।
యే దూషయన్తి దుర్వృత్తా స్త్వాం దేవ పురుషాధమాః ॥ 68 ॥

వారికి నరకం అనే ఆ సముద్రంనుండి బయటపడేమార్గం ఇంక ఏదీ లేదు. స్వామీ, నిన్ను నిందించేవాళ్లు ఎవరైనా మానవులందరిలో వాళ్లే నీచులు. దుర్మార్గులు.

యత్ర యత్ర భవే జ్జన్మ మమ కర్మనిబన్ధనాత్ ।
తత్ర తత్ర హరే భక్తి స్త్వయి చాస్తు దృఢా సదా ॥ 69 ॥

శ్రీహరీ! పూర్వకర్మానుసారంగా నాకు ఏ ఏ చోట్ల జన్మ కలిగినా, ఆ జన్మలలో నీఅనుగ్రహంతో నీమీద నిత్యమూ నిశ్చలమైన భక్తి కలగాలి.

ఆరాధ్య త్వాం సురా దైత్యా నరా శ్చాన్యేఽపి సంయతాః ।
అవాపుః పరమాం సిద్ధిం క స్త్వాం దేవం న పూజయేత్ ॥ 70 ॥

దేవతలూ, రాక్షసులూ, మానవులూ, ఇంకా ఇతరభూతాలు ఏవైనా, నియమంగా నిన్ను పూజించి, ఉత్తమోత్తమమైన స్థానాన్ని పొందారు. అందువల్ల అందరూ నిన్ను నిశ్చయంగా ఆరాధిస్తూనేఉంటారు.

న శక్నువన్తి బ్రహ్మాద్యాః స్తోతుం త్వాం త్రిదశా హరే ।
కథం మానుషబుద్ధ్యాఽహం స్తౌమి త్వాం ప్రకృతేః పరమ్ ॥ 71 ॥

ఓ శ్రీహరీ! బ్రహ్మ మొదలైన దేవతలకే నిన్ను స్తుతించడం సాధ్యం కాదు. అటువంటపుడు ప్రకృతికి ఆవలివాడివైన నిన్ను సామాన్యమైన మానవబుద్ధితో నేను నిన్ను ఎలా స్తుతించగలను?

తథా చాజ్ఞానభావేన సంస్తుతోఽసి మయా ప్రభో ।
తత్ క్షమ స్వాపరాధం మే యది చాస్తి కృపా మయి ॥ 72 ॥

అయినా, తెలివితక్కువగా నేను నిన్ను స్తుతించాను. దేవా, నీకు నామీద దయ ఉంటే, నాతప్పు మన్నించు.

కృతాపరాధేఽపి హరే క్షమాం కుర్వన్తి సాధవః ।
తస్మాత్ ప్రసీద దేవేశ భక్తస్నేహం సమాశ్రితః ॥ 73 ॥

శ్రీహరీ! సజ్జనులు తప్పు చేసినవాడిని కూడ మన్నిస్తారు. దేవనాయకా, పైగా నీవు భక్తులమీద వాత్సల్యం కలిగినవాడివి. అందుచేత నన్ను కాపాడు.

స్తుతోఽసి యన్మయా దేవ భక్తిభావేన చేతసా ।
సత్యం భవతు తత్సర్వం వాసుదేవ నమోఽస్తు తే ॥ 74 ॥

నీమీద మనసు నిండా భక్తిభావంతో నేను చేసిన ఈస్తోత్రం (తెలివితక్కువ మాటలు అయినా), ఆమాటలన్నీ యథార్థాలు కావాలి. వాసుదేవా, నీకు నమస్కారం.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఇత్థం స్తుత స్తదా తేన ప్రసన్నో గరుడధ్వజః ।
దదౌ తస్మై మునిశ్రేష్ఠా స్సకలం మన సేప్సితమ్ ॥ 75 ॥

మునివరేణ్యులారా! ఇంద్రద్యుమ్నుడు ఈవిధంగా చేసిన సోత్రానికి శ్రీమహావిష్ణువు ప్రసన్నుడైనాడు. ఇంద్రద్యుమ్నుడు మనసులో కోరుకున్నవి అన్నీ ఇచ్చాడు.

య స్సమ్పూజ్య జగన్నాథం ప్రత్యహం స్తౌతి మానవః ।
స్తోత్రే ణానేన మతిమాన్ స మోక్షం లభతే ధ్రువమ్ ॥ 76 ॥

శ్రీమన్నారాయణుడిని ప్రతిదినమూ పూజించి, ఇంద్రద్యుమ్నుడు చేసిన ఈస్తోత్రంతో స్తుతించే మానవుడు బుద్ధిమంతుడు. ఈ స్తోత్రంవల్ల అతడు నిశ్చయంగా మోక్షాన్ని పొందుతాడు.

త్రిసన్ధ్యం యో జపేద్ విద్వా నిదం స్తోత్రవరం శుచిః ।
ధర్మం చార్థం చ కామం చ మోక్షం చ లభతే నరః ॥ 77 ॥

శ్రేష్ఠమైన ఈస్తోత్రాన్ని మూడు సంధ్యాసమయాలలోనూ, శుచిగా, జపించిన మానవుడు విద్వాంసుడై, ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే నాలుగుపురుషార్థాలనూ పొందుతాడు.

యః పఠే చ్ఛృణుయాద్ వాపి శ్రావయేద్ వా సమాహితః ।
స లోకం దివ్య మాప్నోతి విష్ణో ర్నిర్ధూతకల్మషః ॥ 78 ॥

ఈవిష్ణుస్తోత్రాన్ని శ్రద్ధగా చదివినా, విన్నా, ఇతరులకు వినిపించినా, సమస్తమైన పాపాలు నశించి పోతాయి. వాడు విష్ణులోకానికి చేరుకుంటాడు.

ధన్యం పాపహరం చేదం భుక్తిముక్తిప్రదం శివమ్ ।
గుహ్యం సుదుర్లభం పుణ్యం న దేయం యస్య కస్యచిత్ ॥ 79 ॥

ఈస్తోత్రం సంపదలను ప్రసాదిస్తుంది. పాపాలను పోగొడుతుంది. ఇప్పుడు భోగాలనూ, తరువాత మోక్షాన్ని ఇస్తుంది. శుభాలను కలుగజేస్తుంది. ఇది గొప్పరహస్యం. తేలికగా ఎవరికీ లభించదు. పుణ్యాన్ని ఇస్తుంది. అందుచేత ఈస్తోత్రాన్ని ఎవరికి పడితే వారికి పంచిపెట్టగూడదు.

న నాస్తికాయ మూర్ఖాయ న కృతఘ్నాయ మానినే ।
న దుష్టమతయే దద్యాన్న ధూర్తాయ కదాచన ॥ 80 ॥

దేవుడిని నమ్మనివాడికీ, మొండివాడికీ, చేసినమేలు మరిచేవాడికీ, గర్వించేవాడికీ, దురాలోచనలు చేసేవాడికీ, మోసాలు చేసేవాడికీ, ఎన్నటికీ ఈసోత్రాన్ని ఉపదేశించకూడదు.

దాతవ్యం భక్తియుక్తాయ గుణశీలాన్వితాయ చ ।
విష్ణుభక్తాయ శాన్తాయ శ్రద్ధానుష్ఠానశాలినే ॥ 81 ॥

సేవాభావమూ, మంచిగుణాలు, మంచినడవడి కలిగినవాడికీ, శ్రీమన్నారాయణుడిపైన భక్తి ఉన్నవాడికీ, ఇంద్రియాలను జయించినవాడికీ, ఏకాగ్రతతో అనుసంధానం చేసేవాడికీ ఈసోత్రాన్ని తప్పకుండా ఉపదేశించాలి.

ఇదం సమస్తాఘవినాశహేతు కారుణ్యసంజ్ఞం సుఖమోక్షదం చ ।
అశేషవాఞ్ఛాఫలదం వరిష్ఠం స్తోత్రం మయోక్తం పురుషోత్తమస్య ॥ 82 ॥

పురుషోత్తమస్వామికి సంబంధించిన ఈసోత్రానికి కారుణ్యస్తవం అనిపేరు. ఇది సమస్తమైన పాపాలను నశింపజేస్తుంది. భోగాలనూ, మోక్షాన్నీ ఇస్తుంది. కోరికలన్నింటినీ సంపూర్ణంగా నెరవేరుస్తుంది. స్తోత్రాలన్నింటిలో శ్రేష్ఠమైనది. దీనిని (విష్ణుభక్తుడివి కాబట్టి) నీకు ఉపదేశించాను.

యే తం సుసూక్ష్మం విమలం మురారిం
ధ్యాయన్తి నిత్యం పురుషం పురాణమ్ ।
తే ముక్తిభాజః ప్రవిశన్తి విష్ణుం
మన్త్రై ర్యథాజ్యం హుత మధ్వరాగ్నౌ ॥ 83 ॥

శ్రీవిష్ణుదేవుడు మిక్కిలి సూక్ష్మమైనవాడు. శుద్ధుడు. మురుడనే రాక్షసుడిని సంహరించినవాడు. పురాణ పురుషుడు. ఈదేవుడిని నిత్యమూ ధ్యానించేవారు మోక్షాన్ని పొందడానికి అర్హులౌతారు. యాగాగ్నిలో మంత్రాలతో హుతం చేసిన ఆవునేయిలాగా, ఈసోత్రాన్ని చదివినవాళ్లు విష్ణుమూర్తి శరీరంలో ప్రవేశిస్తారు.

ఏక స్స దేవో భవదుఃఖహన్తా పరః పరేషాం న తతోఽస్తి చాన్యత్ ।
స్రష్టా స పాతా స తు నాశకర్తా విష్ణు స్సమస్తాఖిలసారభూతః ॥ 84 ॥

ఆ విష్ణువు ఒక్కడే దేవుడు. అతడు సంసారబాధలను తొలగిస్తాడు. ఉత్తములందరికంటె ఉత్తముడు. ఆయనకంటె వేరయినది ఏదీ లేదు. ఆవిష్ణువే (జగత్తు లన్నింటినీ) సృష్టిస్తాడు. అతడే అందరినీ పోషిస్తాడు. అతడే తాను సృష్టించిన సమస్తాన్నీ లయం చేస్తాడు. అన్నింటిలోనూ అన్నివిధాలుగానూ సారమైనవాడు విష్ణువే.

కిం విద్యయా కిం స్వగుణైశ్చ తేషాం యజ్ఞైశ్చ దానైశ్చ తపోభిరుగ్రైః ।
యేషాం న భక్తిర్భవతీహ కృష్ణే జగద్గురౌ మోక్షసుఖప్రదే చ ॥ 85 ॥

విష్ణువు జగత్తులన్నిటికీ గురువు. భోగాలనూ మోక్షాన్నీ ఇస్తాడు. అటువంటి విష్ణువుమీద భక్తిలేనివారికి ఇంక చదువు లెందుకు? మంచిగుణాలెందుకు? యాగాలు, దానాలు, తీవ్రమైన తపస్సులు ఎన్ని ఉన్నా, వాటివల్ల ఏమాత్రం ప్రయోజనంలేదు.

లోకే స ధన్య స్స శుచి స్స విద్వాన్ మఖై స్తపోభి స్స గుణై ర్వరిష్ఠః ।
జ్ఞాతా స దాతా స తు సత్యవక్తా యస్యాస్తి భక్తిః పురుషోత్తమాఖ్యే ॥ 86 ॥

పురుషోత్తముడు అనే పేరుతో ఉన్న ఈక్షేత్రంలోని విష్ణువుమీద భక్తి గలిగినవాడే లోకంలో ధన్యుడు. వాడే శుచి. వాడే విద్వాంసుడు. వాడే ఉత్తమయజ్వ. ఉత్తమతపస్వి. ఉత్తమగుణవంతుడు. సర్వజ్ఞుడు. దాత. సత్యవ్రతుడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే కారుణ్యస్తవవర్ణనం నామ షట్చత్వారింశోఽధ్యాయః ॥ 46 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో కారుణ్యస్తవవర్ణనం అనే నలభైఆరవ అధ్యాయం ॥ 46 ॥



సప్తచత్వారింశోఽధ్యాయః - నలభైఏడవ అధ్యాయం

ప్రతిమోత్పత్తికథనమ్ - ప్రతిమోత్పత్తికథనం

బ్రహ్మోవాచ :-బ్రహ్మదేవుడు అంటున్నాడు.

స్తుత్వైవం మునిశార్దూలాః ప్రణమ్య చ సనాతనమ్ ।
వాసుదేవం జగన్నాథం సర్వకామఫలప్రదమ్ ॥ 1 ॥

మహర్షివరేణ్యులారా! ఇంద్రద్యుమ్నుడు ఈవిధంగా శ్రీమహావిష్ణువును స్తుతించి, నమస్కరించాడు. ఆ దేవుడు సనాతనుడు. అన్నింట నిండి ఉంటాడు. లోకాలన్నింటికీ ఆయనే దిక్కు. కోరికలన్నింటినీ తీర్చేవాడు.

చిన్తావిష్టో మహీపాలః కుశానాస్తీర్య భూతలే ।
వస్త్రం చ తన్మనా భూత్వా సుష్వాప నియతేన్ద్రియః ॥ 2 ॥

ఇంద్రద్యుమ్నమహారాజు విచారిస్తూ నేలమీద దర్భలను పరుచుకొని, వాటిమీద వస్త్రం వేసుకుని, ఇంద్రియాలను నిగ్రహించుకుని, మనసులో ఆ విష్ణుదేవుడినే తలుచుకుంటూ నిద్రించాడు.

కథం ప్రత్యక్షమభ్యేతి దేవదేవో జనార్దనః ।
మమ సోఽఽర్తిహరో దేవస్తదాసావితి చిన్తయన్ ॥ 3 ॥

దేవతలకు దేవుడైన ఆలోకరక్షకుడు నా కన్నులయెదుట కనిపించడం ఎలా? ఆ దేవుడు నా బాధను అప్పుడే (ప్రత్యక్ష మయినవెంటనే) పోగొడతాడని ఆలోచిస్తున్నాడు.

సుప్తస్య తస్య నృపతేర్వాసుదేవో జగద్గురుః ।
ఆత్మానం దర్శయామాస శఙ్ఖచక్రగదాభృతమ్ ॥ 4 ॥

నిద్రిస్తున్న ఆ మహారాజుకు జగద్గురువైన వాసుదేవుడు శంఖం, చక్రం, గద ధరించి కనిపించాడు.

స దదర్శ చ స్వప్నేఽథ దేవదేవం జగద్గురుమ్ ।
శఙ్ఖచక్రధరం దేవం గదాచక్రోగ్రపాణినమ్ ॥ 5 ॥

ఇంద్రద్యుమ్నుడు కలలో జగద్గురువైన విష్ణుదేవుడిని ఈ విధంగా చూశాడు. విష్ణువు శంఖచక్రాలు ధరించి ఉన్నాడు. భయంకరమైన గదనూ, సుదర్శనచక్రాన్నీ చేత ధరించాడు.

శార్ఙ్గబాణాసిసంయుక్తం జ్వలత్తేజోగ్రమణ్డలమ్ ।
యుగాన్తాదిత్యవర్ణాభం నీలవైదూర్యసన్నిభమ్ ॥ 6 ॥

శార్ఙ్గం అనే ధనుస్సునూ, బాణాలనూ, (నందకం అనే)కత్తినీ ధరించాడు. స్వామి చుట్టూదట్టమైన కాంతి ప్రజ్వల్లరిల్లుతున్నది. ప్రళయకాలంలోని సూర్యమండలంవంటి తేజస్సు కలిగి ఉన్నాడు. స్వామి శరీరం ఇంద్ర నీలమణులలాగా, వైడూర్యమణులలాగా ప్రకాశిస్తున్నది.

సుపర్ణాంసే సమాసీనం షోడశార్ధభుజం శుభమ్ ।
స చాస్మై ప్రాబ్రవీద్ధీరాస్సాధు రాజన్ మహామతే ॥ 7 ॥

నిశ్చలచిత్తులారా! ఆ కృష్ణభగవానుడు గరుత్మంతుడి మూపుమీద ఆసీనుడైఉన్నాడు. ఎనిమిదిచేతులతో శుభ్రప్రదు డై ఉన్నాడు. అపుడు శ్రీమహావిష్ణువు ఇంద్రద్యుమ్నుడితో ఇలా పలికాడు. దొడ్డబుద్ధికల రాజా! మేలు.

క్రతునానేన దివ్యేన తథా భక్త్యా చ శ్రద్ధయా ।
తుష్టోఽస్మి తే మహీపాల వృథా కిమనుశోచసి ॥ 8 ॥

భూపాలకా! భక్తితో శ్రద్ధగా నీవు చేసిన ఈ అశ్వమేధమహాయాగానికి నీ విషయంలో సంతోషించాను. అనవసరంగా విచారిస్తావెందుకు?

యదత్ర ప్రతిమా రాజన్ జగత్పూజ్యా సనాతనీ ।
యథా తాం ప్రాప్యసే భూప తదుపాయం బ్రవీమి తే ॥ 9 ॥

మహారాజా! ఇక్కడ గూఢంగా ఉన్న ప్రతిమ చాల ప్రాచీనమైనది. లోకాన్నీ పూజింపదగినది. దీనిని నీవు పొందే ఉపాయం చెప్తాను. విను.

ప్రభాతాయాఞ్చ శర్వర్యాం నిర్మలే భాస్కరోదయే ।
సాగరస్య జలస్యాన్తే నానాద్రుమవిభూషితే ॥ 10 ॥

జలం తథైవ వేలాయాం దృశ్యతే తత్ర వై మహత్ ।
లవణస్యోదధే రాజంస్తరఙ్గైస్సమభిప్లుతమ్ ॥ 11 ॥

ఈ రాత్రి గడిచి, సూర్యుడు ఉదయించిన స్వచ్ఛమైన సమయంలో, ఈ ఉప్పుసముద్రానికి అవతలివైపు ఒడ్డుకు వెళ్ళు. అక్కడ రకరకాల చెట్ల గుంపులతో నిండిన గొప్పప్రదేశం కనిపిస్తుంది. ఆ ఒడ్డున కూడ సముద్రం ఇలాగే పెద్దపెద్ద అలలతో ప్రవహిస్తుంటుంది.

కూలాలమ్బీ మహావృక్షః స్థితః స్థలజలేషు చ ।
వేలాభిర్హన్యమానస్తు న చాసౌ కమ్పతే ద్రుమః ॥ 12 ॥

ఆ తీరాన్ని ఆనుకుని ఒక మహావృక్షం ఉంటుంది. అది కొంతభాగం సముద్రజలంలోనూ, కొంతభాగం నేలమీద విస్తరించి ఉంటుంది. పెద్ద పెద్ద సముద్రపు అలలు వేగంగా వచ్చి కొట్టుకుంటున్నా, ఆ మహావృక్షం కొంచెం కూడ చలించదు.

పరశుమాదాయ హస్తేన ఊర్మేరన్తస్తతో వ్రజ ।
ఏకాకీ విహరన్ రాజన్ స త్వం పశ్యసి పాదపమ్ ॥ 13 ॥

రాజా! నీవు ఒంటరిగా, నిర్భయంగా, ఒక గొడ్డలిని చేత పుచ్చుకుని, అలల వెంబడే వెళ్లు. అక్కడ నీకు ఆ చెట్టు కనిపిస్తుంది.

అశ్వత్థం తు సమాలోక్య ఛేదయత్వమశఙ్కితః ।
శాత్యమానం తు తం వృక్షం ప్రాతరద్భుతదర్శనమ్ ॥ 14 ॥

అది రావిచెట్టు. చూచినవెంటనే ఆ చెట్టును ఏమాత్రం సందేహించకుండా నరికివేయి. నీవు నరికిన ఆ రావిచెట్టుప్రొద్దున నీకు చాల అద్భుతంగా కనిపిస్తుంది.

దృష్ట్వా తేనైవ సఞ్ఛిన్న్య తతో భూపాలదర్శనాత్ ।
కురు మే ప్రతిమాం దివ్యాం జహి చిన్తాం విమోహినీమ్ ॥ 15 ॥

రాజా! నరికిన ఆ చెట్టును చూచి, జాగ్రత్తగా పరిశీలించి, ఆ చెక్కతోనే మనోహరమైన నా(విష్ణు)విగ్రహాన్ని చెక్కించు. ఇంక నీవు దేవతావిగ్రహాలను గురించిన విచారం విడిచిపెట్టు. అజ్ఞానంలో పడకు.

బ్రహ్మోవాచ :-బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

ఏవముక్త్వా మహాభాగో జగామాదర్శనం హరిః ।
స చాపి స్వప్నమాలోక్య పరం విస్మయమాగతః ॥ 16 ॥

మహాత్ముడైన వాసుదేవుడు ఇంద్రద్యుమ్నుడికి కలలో కనిపించి, ఈవిధంగా కర్తవ్యాన్ని వివరించి అదృశ్య మైనాడు. ఇంద్రద్యుమ్నుడు కూడ తనకు వచ్చిన కలను తలచుకుని చాలా ఆశ్చర్యపడ్డాడు.

తాం నిశాం స సముద్వీక్ష్య స్థితస్తద్గతమానసః ।
వ్యాహరన్ వైష్ణవాన్ మన్త్రాన్ సూక్తం చైవ తదాత్మకమ్ ॥ 17 ॥

ఆ మహారాజు తనకు వచ్చిన కలను గురించే ఆలోచిస్తూ ఉన్నాడు. మనసును విష్ణువుపై నిలిపి ఉంచాడు. విష్ణువుకు సంబంధించిన మంత్రాలనూ, విష్ణుసూక్తాలనూ పారాయణం చేశాడు. ఈవిధంగా ఆ రాత్రంతా గడిపాడు.

ప్రభాతాయాం రజన్యాం తు ఉత్థితో నృపతిస్తదా ।
స స్నాత్వా సాగరే సమ్యగ్ యథావద్ విధినా తతః ॥ 18 ॥

ఇలా ఆ రాత్రి తెల్లవారింది. ఇంద్రద్యుమ్నుడు ఉదయమే లేచాడు. యథావిధిగా చక్కగా సముద్రంలో స్నానం చేశాడు.

దత్త్వా దానం చ విప్రేభ్యో గ్రామాంశ్చ నగరాణి చ ।
కృత్వా పౌర్వాహ్ణికం కర్మ జగామ స నృపోత్తమః ॥ 19 ॥

స్నానం చేసిన తరువాత ఆ మహారాజు బ్రాహ్మణులకు గ్రామాలనూ, నగరాలనూ దానం చేశాడు. ప్రాతః కాలంలో చేయవలసిన నిత్యకర్మలను అన్నిటినీ చక్కగా పూర్తిచేశాడు. తరువాత (కలలో విష్ణువు చెప్పిన ప్రకారం) బయలుదేరి వెళ్ళాడు.

న రథో న పదాతిశ్చ న గజో న చ సారథిః ।
ఏకాకీ స మహావేలాం ప్రవివేశ మహామతిః ॥ 20 ॥

రథం లేదు. వెంట ఒక్క బంటు కూడ లేడు. ఏనుగు లేదు. సారథి లేడు. వివేకవంతుడైన ఆ రాజు ఒంటరిగా బయలుదేరి సముద్రం ఆవలి ఒడ్డుకు చేరుకున్నాడు.

తత్రాపశ్యన్ మహావృక్షం తేజస్వన్తం మహాద్రుమమ్ ।
మహాతీక్ష్ణం మహారౌద్రం పుణ్యం విపులమేవ చ ॥ 21 ॥

అక్కడ ఒక పెద్దచెట్టు చూశాడు. అది గొప్పకాంతులు విరజిమ్ముతున్నది. చాల మేర వ్యాపించి ఉంది. చాల దృఢంగా ఉంది. మిక్కిలి భయంకరంగా ఉంది. పుణ్యప్రదమైనది. చాల విశాలంగా ఉన్నది.

మహోత్సేధం మహాకాయం ప్రగుప్తం చ జలాన్తికే ।
సాన్ద్రమాఞ్జిష్ఠవర్ణాభం నామజాతివివర్జితమ్ ॥ 22 ॥

ఆ చెట్టు చాల ఎత్తుగా ఉంది. దాని కాండం చాల పెద్దదిగా ఉంది. సముద్రపునీటికి దగ్గరగా, ఎటువంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా చక్కగా ఉంది. దట్టమైన పసుపురంగు కలిగి ఉంది. దాని పేరు ఏదో, అది ఏ జాతి వృక్షమో తెలియరాకున్నది.

నరనాథస్తదా విప్రా ద్రుమం దృష్ట్వా ముదాన్వితః ।
పరశునా శాతయామాస నిశితేన దృఢేన చ ॥ 23 ॥

బ్రాహ్మణులారా! ఇంద్రద్యుమ్నమహారాజు ఆ చెట్టును చూసి సంతోషించాడు. పదునైన, బాగా దృఢంగా ఉన్న గొడ్డలితో ఆ చెట్టును నరికాడు.

ద్వైధీకర్తుమనాస్తత్ర బభూవేన్ద్రసఖస్య చ ।
నిరీక్ష్యమాణే కాష్ఠే తు బభూవాద్భుతదర్శనమ్ ॥ 24 ॥

ఇంద్రుడిమిత్రుడైన ఇంద్రద్యుమ్నమహారాజు ఆ చెట్టును రెండుముక్కలుగా నరుకుదా మనుకున్నాడు. అందుకోసం ఆ చెట్టు కాండాన్ని పరిశీలించి చూస్తున్నాడు. ఆ సమయంలో విపరీతమైన ఆశ్చర్యకరమైన ఘటన జరిగింది.

విశ్వకర్మా చ విష్ణుశ్చ విప్రవేషధరావుభౌ ।
ఆజగ్మతుర్మహాభాగౌ తదా తుల్యాగ్రజన్మనౌ ॥ 25 ॥

విశ్వకర్మ! విష్ణుమూర్తి! ఇద్దరూ బ్రాహ్మణవేషం ధరించి వచ్చారు. వారిద్దరూ మహానుభావులు. ఇద్దరూ ఒకేవిధంగా బ్రహ్మస్వరూపులే.

జ్వలమానౌ స్వతేజోభిర్దివ్యస్రగనులేపనౌ ।
అథ తౌ తం సమాగమ్య నృపమిన్ద్రసఖం తదా ॥ 26 ॥

తావూచతుర్మహారాజ కిమత్ర త్వం కరిష్యసి ।
కిమర్థం చ మహాబాహో శాతితశ్చ వనస్పతిః ॥ 27 ॥

వారు బ్రహ్మతేజస్సుతో వెలిగిపోతున్నారు. దేవలోకానికి సంబంధించిన పూలదండలనూ, మైపూతలను ధరించారు. వారు అక్కడికి వచ్చి, దేవేంద్రుడికి మిత్రుడైన ఇంద్రద్యుమ్నుడితో ఇలా అన్నారు. మహారాజా! ఇక్కడ నువ్వు ఏం చేస్తున్నావు? దీర్ఘమైన బలిష్ఠమైన భుజాలు కలిగినవాడా, ఈ చెట్టును ఎందుకు నరికావు?

అసహాయో మహాబాహో నిర్జనే గహనే వనే ।
మహాసిన్ధుతటే చైవ కథం వై శాతితో ద్రుమః ॥ 28 ॥

గొప్పబాహువులు కలవాడా! సముద్రం ఒడ్డున, జనం ఎవ్వరూ ప్రవేశించలేని ఈ దట్టమైన అరణ్యంలో, ఒంటరిగా ఈ వృక్షాన్ని ఎలా నరికావు?

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తయోశ్శృత్వా వచో విప్రాస్స తు రాజా ముదాఽన్వితః ।
బభాషే వచనం తాభ్యాం మృదు వై మధురం తథా ॥ 29 ॥

బ్రాహ్మణులారా! ఆ విష్ణు,విశ్వకర్మల మాటలు విని, ఇంద్రద్యుమ్నుడు సంతోషించాడు. వారితో మెత్తని, తీయని పలుకులతో ఇలా అన్నాడు.

దృష్ట్వా తౌ రూపసమ్పన్నౌ చన్ద్రసూర్యావివాగతౌ ।
నమస్కృత్య జగన్నాథావవాఙ్ముఖమవస్థితః ॥ 30 ॥

లోకాలకు రక్షకులై, చంద్రుడు, సూర్యుడు లాగా వచ్చిన ఆ సుందరాకారులను చూచి, ఇంద్రద్యుమ్నుడు వారికి నమస్కరించి, వినయంతో తలవంచి, ఇలా అన్నాడు

రాజోవాచ :–ఇంద్రద్యుమ్నుడు అంటున్నాడు.

దేవదేవమనాద్యన్తమనన్తం జగతాం పతిమ్ ।
ఆరాధనాయ ప్రతిమాం కరోమీతి మతిర్మమ ॥ 31 ॥

దేవతలకు దేవుడు, తుది మొదలు లేనివాడు, సమస్తం తానే అయినవాడు, లోకాలకు అధిపతి, అయిన శ్రీమహావిష్ణువును ఆరాధించుకోవడానికి ఆ స్వామి విగ్రహం నిర్మించాలి అని నాకు బుద్ధి పుట్టింది.

అహం స దేవదేవేన పరమేణ మహాత్మనా ।
స్వప్నాన్తే చ సముద్దిష్టో భవద్భ్యాం శ్రావితం మయా ॥ 32 ॥

దేవదేవుడు, పరమాత్మ అయిన ఆ మహానుభావుడు కలలో కనిపించి, ఆ విగ్రహం పొందే విధానాన్ని నాకు తెలియజేశాడు. ఆ సంగతే మీకు వినిపించాను.

రాజ్ఞస్తు వచనం శ్రుత్వా దేవేన్ద్రప్రతిమస్య చ ।
ప్రహస్య తస్మై విశ్వేశస్తుష్టో వచనమబ్రవీత్ ॥ 33 ॥

దేవేంద్రుడితో సమానుడైన ఇంద్రద్యుమ్నమహారాజు మాటలు విని, నవ్వి, విశ్వేశ్వరుడైన విష్ణుదేవుడు రాజుతో సంతోషంగా ఇలా అన్నాడు.

విష్ణురువాచ :–ఇంద్రద్యుమ్నుడితో విష్ణుభగవానుడు ఇలా అంటున్నాడు

సాధు సాధు మహాభాగ యదేతన్మతముత్తమమ్ ॥ 34 ॥

మహాత్మా! చాల బాగుంది. విష్ణువు నారాధించాలనే నీ ఉద్దేశ్యం చాలా గొప్పది.

సంసారసాగరే ఘోరే కదలీదలసన్నిభే ।
నిస్సారే దుఃఖబహులే భోగగ్రాహసమాకులే ॥ 35 ॥

ఈ సంసారం అరటిఆకులాగా చాల అస్థిరమైనది. భయంకరమైనది. సారం లేనిది. దీనినిండా అన్నీ బాధలే. ఇది పెద్ద సముద్రం. సుఖాలు అనే మొసళ్లతో నిండి ఉంటుంది.

ఇన్ద్రియావర్తకలిలే దుస్తరే రోమహర్షణే ।
నానావ్యాధిశతావర్తే జలబుద్బుదసన్నిభే ॥ 36 ॥

ఇంద్రియాలు అనే సుడిగుండా లుంటాయి. దీనినుంచి బయటపడడం సాధ్యం కాదు. దీన్ని తలుచుకుంటే (భయంతో) ఒళ్ళు గగుర్పొడుస్తుంది. రకరకాల రోగాలు అసంఖ్యాకంగా సుడులు కడుతుంటాయి. ఈ సంసారం నీటిబుడగలాగా అశాశ్వతమైనది.

యతస్తే మతిరుత్పన్నా విష్ణోరారాధనాయ వై ।
ధన్యస్త్వం నృపశార్దూల గుణైస్సర్వైరలఙ్కృతః ॥ 37 ॥

రాజశేఖరా! (అటువంటి సంసారం నుండి బయటపడడానికి) విష్ణువును ఆరాధించాలి అనే బుద్ధి పుట్టినందు వల్ల నీవు ధన్యుడివైనావు. నీవు సకలసద్గుణాలు కలిగినవాడివైనావు.

సప్రజా పృథివీ ధన్యా సశైలవనకాననా ।
సపురగ్రామనగరా చతుర్వర్ణైరలఙ్కృతా ॥
యతస్త్వం నృపశార్దూల ప్రజాః పాలయితా ప్రభుః ॥ 38 ॥

రాజోత్తమా! (నీవే కాక) నీవంటి ఉత్తముడు రాజుగా పరిపాలించడంచేత ప్రజలతోనూ, కొండలు, తోటలు, అరణ్యాలతోనూ, పట్టణాలు, గ్రామాలు, నగరాలతోనూ, నాలుగువర్ణాలవారితోనూ కూడిన ఈ భూమండలం మొత్తం ధన్యమైంది.

ఏహ్యేహి సుమహాభాగ ద్రుమేఽస్మిన్ సుఖశీతలే ।
ఆవాభ్యాం సహ తిష్ఠ త్వం కథాభిర్ధర్మసంశ్రితః ॥ 39 ॥

మహానుభావా! ధర్మాన్ని అనుసరించేవాడా! రా! మావద్దకు రా! సుఖంగా, చల్లగా ఉన్న ఈ చెట్టునీడన మాతో కలిసి కూర్చో. మంచికథలు చెప్పుకొందాం.

అయం మమ సహాయస్తు ఆగతశ్శిల్పినాం వరః ।
విశ్వకర్మసమస్సాక్షాన్నిపుణస్సర్వకర్మసు ॥ 40 ॥

ఈతడు (విశ్వకర్మ) శిల్పులలో శ్రేష్ఠుడు. సాక్షాత్తుగా విశ్వకర్మతో సమానమైనవాడు. అన్ని కళలలోనూ చక్కని నేర్పు కలిగినవాడు. నాకు తోడుగా వచ్చాడు.

మయోద్దిష్టాం తు ప్రతిమాం కరోత్యేష తటం త్యజ ॥ 41 ॥

నేను ఉద్దేశించిన ప్రతిమను ఇతడు నిర్మిస్తాడు. సముద్రంఒడ్డు దిగి రా.

శ్రుత్వైవం వచనం తస్య తదా రాజా ద్విజన్మనః ।
సాగరస్య తటం త్యక్త్వా గత్వా తస్య సమీపతః ॥ 42 ॥

బ్రాహ్మణవేషంలో ఉన్న శ్రీమహావిష్ణువు చెప్పిన మాటలు విని ఇంద్రద్యుమ్నమహారాజు సముద్రం ఒడ్డు చేరి, వారిదగ్గరకు వెళ్ళాడు.

తస్థౌ స నృపతిశ్రేష్ఠో వృక్షచ్ఛాయే సుశీతలే ।
తతస్తస్మై స విశ్వాత్మా దదావాజ్ఞాం ద్విజాకృతిః ॥
శిల్పిముఖ్యాయ విప్రేన్ద్రః కురుష్వ ప్రతిమామిమామ్ ॥ 43 ॥

ఆ మహారాజు చల్లని ఆ చెట్టునీడలోకి వెళ్ళాడు. బ్రాహ్మణుడిరూపంలో ఉన్న విష్ణుదేవుడు విశ్వకర్మతో 'బ్రాహ్మణోత్తమా! ఈ ప్రతిమను నిర్మించు' అని ఆజ్ఞ ఇచ్చాడు.

కృష్ణరూపం పరం శాన్తం పద్మపత్రాయతేక్షణమ్ ।
శ్రీవత్సకౌస్తుభధరం శఙ్ఖచక్రగదాధరమ్ ॥ 44 ॥

శ్రీకృష్ణుడివిగ్రహాన్ని చెక్కాలి. కృష్ణుడు మిక్కిలి శాంతమూర్తి. తామరరేకులలాగా విశాలమైన కన్నులు కలవాడు. శ్రీవత్సవునే పుట్టుమచ్చను, కౌస్తుభమనే రత్నాన్ని వక్షస్స్థలం మీద ధరించి ఉంటాడు. చేతులలో శంఖం, చక్రం, గదలను ధరిస్తాడు.

చన్ద్రగోక్షీరవర్ణాభం ద్వితీయం స్వస్తికాఙ్కితమ్ ।
లాఙ్గలాస్త్రధరం దేవమనన్తాఖ్యం మహాబలమ్ ॥ 45 ॥

నిర్మించవలసిన రెండవమూర్తి బలరాముడు. ఆయన చంద్రుడితోనూ, ఆవుపాలతోనూ సమానంగా తెల్లని మేనిచాయ గలిగి ఉంటాడు. శుభప్రదమైన వరదముద్ర ధరించిఉంటాడు. నాగలి అనే ఆయుధాన్ని ధరిస్తాడు. అనంతుడు అనే పేరు గలవాడు. (ఆదిశేషుడి అవతారం). గొప్ప బలవంతుడు.

దేవదానవగన్ధర్వయక్షవిద్యాధరోరగైః ।
న విజ్ఞాతో హి తస్యాన్తస్తేనానన్త ఇతి స్మృతః ॥ 46 ॥

దేవతలు, రాక్షసులు, గంధర్వులు, యక్షులు, విద్యాధరులు, నాగులు కూడ ఆ బలరాముడిని సమగ్రంగా తెలుసుకోలేరు. అందుకే ఆయనకు అనంతుడు అనే పేరు వచ్చింది.

భగినీం వాసుదేవస్య రుక్మవర్ణాం సుశోభనామ్ ।
తృతీయాం వై సుభద్రాం చ సర్వలక్షణలక్షితామ్ ॥ 47 ॥

ఇంక చెక్కవలసిన మూడవ ప్రతిమ సుభద్ర. ఈమె వాసుదేవుడి చెల్లెలు. బంగారు మేనిచాయ కలిగినది. చాల అందంగా శుభప్రదంగా ఉంటుంది. సమస్తమైన ఉత్తమలక్షణాలు కలిగినది.

బ్రహ్మోవాచ :–బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

శ్రుత్వైతద్ వచనం తస్య విశ్వకర్మా సుకర్మకృత్ ।
తత్క్షణాత్ కారయామాస ప్రతిమాశ్శుభలక్షణాః ॥ 48 ॥

విష్ణుదేవుడి పలుకులు విని, విశ్వకర్మ ఆ క్షణంలోనే ఆ ప్రతిమలన్నింటినీ నిర్మించాడు. అవన్నీ మంచిలక్షణాలు కలిగి ఉన్నాయి. విశ్వకర్మ ఉత్తమమైన పనులే చేస్తాడు. చాల నేర్పుగా చేస్తాడు.

కుణ్డలాభ్యాం విచిత్రాభ్యాం కర్ణాభ్యాం సువిరాజితమ్ ।
చక్రలాఙ్గలవిన్యస్తహస్తాభ్యాం సాధుసమ్మతమ్ ॥ 49 ॥

(ఆ విగ్రహాలలో) సుభద్ర చెవులు విచిత్రమైన చెవికమ్మలతో చక్కగా ప్రకాశిస్తున్నాయి. చేతిలో చక్రంతో శ్రీకృష్ణుడు, నాగలితో బలరాముడు భక్తజనులకు ఆనందం కలిగిస్తున్నారు.

ప్రథమం శుక్లవర్ణాభం శారదేన్దుసమప్రభమ్ ।
ఆరక్తాక్షం మహాకాయం ఫణావికటమస్తకమ్ ॥ 50 ॥

ఆ ప్రతిమలలో మొదటిది బలరాముడు. తెల్లగా, శరత్కాలపు చంద్రుడిలాంటి కాంతితో వెలుగుతున్నాడు. కన్నులు పూర్తిగా ఎఱ్ఱగా ఉన్నాయి. శరీరం పెద్దదిగా ఉంది. శిరస్సు పాముపడగలతో అందంగా ఉంది.

నీలామ్బరధరం చోగ్రం బలం బలమదోద్ధతమ్ ।
కుణ్డలైకధరం దివ్యం గదాముసలధారిణమ్ ॥ 51 ॥

బలరాముడు నల్లనివస్త్రం ధరించాడు. భయంకరంగా, దృఢంగా ఉన్నాడు. బాగా బలంతో ఠీవిగా ఉన్నాడు. ఒక్క చెవికి మాత్రమే కర్ణాభరణం ధరించాడు. దేవలోకం నుంచి దిగివచ్చినట్లుగా ఉన్నాడు. గదనూ, రోకలినీ ఆయుధాలుగా ధరించాడు.

ద్వితీయం పుణ్డరీకాక్షం నీలజీమూతసన్నిభమ్ ।
అతసీపుష్పసఙ్కాశం పద్మపత్రాయతేక్షణమ్ ॥ 52 ॥

ఇంక రెండవ ప్రతిమ శ్రీకృష్ణుడు. శరీరచ్ఛాయ నల్లని మబ్బులాగా, నల్లని అవిసెపూవులాగా ఉన్నది. కన్నులు తామరరేకులలాగా విశాలంగా ఉన్నాయి.

పీతవాససమత్యుగ్రం శుభం శ్రీవత్సలక్షణమ్ ।
చక్రపూర్ణకరం దివ్యం సర్వపాపహరం హరిమ్ ॥ 53 ॥

కృష్ణుడు పచ్చని పట్టువస్త్రం ధరించాడు. మిక్కిలి తీక్షణంగా ఉన్నాడు. శుభాలు అనుగ్రహిస్తాడు. గుండెమీద శ్రీవత్సం అనే గుర్తు ఉంది. చేతిలో సుదర్శనాయుధం ఉంది. చక్కగా ప్రకాశిస్తున్నాడు. శ్రీకృష్ణుడు పాపాలన్నిటినీ నాశనం చేస్తాడు.

తృతీయాం స్వర్ణవర్ణాభాం పద్మపత్రాయతేక్షణామ్ ।
విచిత్రవస్త్రసఞ్ఛన్నాం హారకేయూరభూషితామ్ ॥ 54 ॥

ఆ తరువాత మూడవ ప్రతిమ సుభద్ర. ఆమె శరీరం బంగారంరంగులో ఉంది. కన్నులు తామరరేకులలాగా విశాలంగా ఉన్నాయి. ఆశ్చర్యం కలిగించే వస్త్రాలు ధరించింది. మెడలో హారాలు, చేతులకు వంకీలు అలంకరించు కుంది.

విచిత్రాభరణోపేతాం రత్నహారావలమ్బితామ్ ।
పీనోన్నతకుచాం రమ్యాం విశ్వకర్మా వినిర్మమే ॥ 55 ॥

ఇంకా వింత వింత ఆభరణాలు ధరించింది. ఆమె మెడలో రత్నాలు పొదిగిన హారాలు వ్రేలాడుతున్నాయి. ఆమె వక్షోజాలు బలిసి, ఎత్తుగా ఉన్నాయి. రూపం మనోహరంగా ఉంది. విశ్వకర్మ ఈవిధంగా కృష్ణ, బలరామ, సుభద్రల విగ్రహాలను చక్కగా నిర్మించాడు.

స తు రాజాద్భుతం దృష్ట్వా క్షణేనైకేన నిర్మితాః ।
దివ్యవస్త్రయుగచ్ఛన్నా నానారత్నైరలఙ్కృతాః ॥ 56 ॥

ఒక్క క్షణంలో విగ్రహాలు అన్నీ నిర్మించడం చూసి, ఇంద్రద్యుమ్నమహారాజు చాల ఆశ్చర్యపోయాడు. ఆ ప్రతిమలు మనోహరమైన వస్త్రాలు ధరించి ఉన్నాయి. రకరకాల రత్నాలతో అలంకరింపబడి ఉన్నాయి.

సర్వలక్షణసమ్పన్నాః ప్రతిమాశ్చ మనోహరాః ।
విస్మయం పరమం గత్వా ఇదం వచనమబ్రవీత్ ॥ 57 ॥

అవి ఉత్తమలక్షణాలన్నీ కలిగి ఉన్నాయి. ప్రతిమలు అన్నీ అందంగా ఉన్నాయి. అటువంటి దేవతా ప్రతిమలను చూసి, ఎంతో ఆశ్చర్యపడి, ఇంద్రద్యుమ్నుడు ఇలా అన్నాడు.

ఇన్ద్రద్యుమ్న ఉవాచ :-ఇంద్రద్యుమ్నుడు అంటున్నాడు.

కిం దేవౌ సమనుప్రాప్తౌ ద్విజరూపధరావుభౌ ।
ఉభౌ చాద్భుతకర్మాణౌ దేవవృత్తౌ న మానుషౌ ॥ 58 ॥

స్వామీ! మీరు ఇద్దరూ దేవతలే. బ్రాహ్మణరూపాన్ని ధరించి ఇక్కడికి వచ్చారా? ఇద్దరూ ఆశ్చర్యకరమైన పనులు చేసేవారు. దేవతలలాగా ప్రవర్తించేవారు. మీరు సాధారణులైన మానవులు కారు.

దేవౌ వా మానుషౌ వాపి యక్షవిద్యాధరౌ చ కిమ్ ।
కిం ను బ్రహ్మహృషీకేశౌ కిం వసూ కిముతాశ్వినౌ ॥ 59 ॥

మీరు దేవతలా? మనుష్యులా? యక్షులా? విద్యాధరులా? బ్రహ్మ, విష్ణువులా? వసువులా? లేక అశ్వినీకుమారులా?

న వేద్మి సత్యసద్భావౌ మాయారూపేణ సంస్థితౌ ।
యువాం గతోఽస్మి శరణమాత్మా స్వో మే ప్రకాశ్యతామ్ ॥ 60 ॥

మాయరూపంలో ఉన్న మీ యథార్థస్వరూపాన్ని నేను తెలుసుకోలేకపోతున్నాను. నేను మీ శరణు పొందుతున్నాను. మీ రెవరో నాకు తెలియజేయండి.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే ప్రతిమోత్పత్తికథనం నామ సప్తచత్వారింశోఽధ్యాయః ॥ 47 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలోప్రతిమోత్పత్తికథనం అనే నలభైఏడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టచత్వారింశోఽధ్యాయః - నలభైఎనిమిదవ అధ్యాయం

పురుషోత్తమవర్ణనమ్ - పురుషోత్తమవర్ణనం

శ్రీ భగవానువాచ :- శ్రీమహావిష్ణువు అంటున్నాడు.

నాహం దేవో న యక్షో వా న దైత్యో న చ దేవరాట్ ।
న బ్రహ్మా న చ రుద్రోఽహం విద్ధి మాం పరమేశ్వరమ్ ॥ 1 ॥

రాజా! నేను దేవుడిని కాను. యక్షుడిని కాను. దైత్యుడిని కాను. దేవేంద్రుడిని కాను. బ్రహ్మను కాను. రుద్రుడిని కాను. నన్ను పరమాత్మగా గ్రహించు.

ఆర్తిహా సర్వలోకానాం సమగ్రబలపౌరుషః ।
ఆరాధనీయో భూతానామన్తో యస్య న విద్యతే ॥ 2 ॥

అన్ని లోకాలవారికీ బాధలను తొలగిస్తాను. అంతులేని శక్తిసామర్థ్యాలు గలిగినవాడిని. చరాచర సృష్టి అంతా ఆరాధింపవలసినవాడిని. నాకు అంతం లేదు.

పఠ్యతే సర్వశాస్త్రేషు వేదాన్తేషు నిగద్యతే ।
యమాహుర్జ్ఞానగమ్యేతి వాసుదేవేతి యోగినః ॥ 3 ॥

శాస్త్రాలు, వేదాలు అన్నీ నా గురించి వివరిస్తున్నాయి. యోగులు నన్ను జ్ఞానంచేత పొందదగినవాడిననీ, వాసుదేవుడిననీ చెప్తారు.

అహమేవ స్వయం బ్రహ్మా అహం విష్ణుశ్శివోఽప్యహమ్ ।
ఇన్ద్రోఽహం దేవరాజశ్చ జగత్సంయమనే యమః ॥ 4 ॥

నేనే స్వయంగా బ్రహ్మను. విష్ణువును నేనే. శివుడు కూడా నేనే. దేవతలకు రాజైన ఇంద్రుడిని నేనే. లోకాలను లయం చేసే యమధర్మరాజును నేనే.

పృథివ్యాదీని భూతాని త్రేతాగ్నిర్హుతభుజ్ నృప ।
వరుణోఽపాంపతిశ్చాహం ధరిత్రీ చ మహీధరః ॥ 5 ॥

రాజా! నేల మొదలైన(నింగి, నిప్పు, నీళ్లు, గాలి) పంచభూతాలు నేనే. గార్హపత్యం, ఆహవనీయం, దక్షిణాగ్ని అనే మూడు అగ్నులు నేనే. యాగాదులలో హోమం చేసే పదార్థాన్ని స్వీకరించి హుతం చేసేవాడిని నేనే. జలానికి అధిపతి అయిన వరుణుడిని నేనే. భూమి, భూమిభారాన్ని మోసే పర్వతాలు మొదలైనవీ నేనే.

యత్ కిఞ్చిద్ వాఙ్మయం లోకే జగత్ స్థావరజఙ్గమమ్ ।
చరాచరం చ యద్విశ్వం మదన్యన్నాస్తి కిఞ్చన ॥ 6 ॥

లోకంలో శబ్దంచేత తెలియజేయబడే చేతన పదార్థం కాని, అచేతన పదార్థం కానీ అన్నీ నేనే. కదలేదీ, కదలనిదీ అయిన సమస్త సృష్టీ నాకంటె వేరుగా ఏమీ లేదు. అంతా నేనే.

ప్రీతోఽహం తే నృపశ్రేష్ఠ వరం వరయ సువ్రత ।
యదిష్టం తత్ ప్రయచ్ఛామి హృది యత్తే వ్యవస్థితమ్ ॥ 7 ॥

రాజవరేణ్యా! నీయెడల నాకు సంప్రీతి కలిగింది. ఉత్తమ నియమాలు కలిగినవాడా! ఏదైనా వరం కోరుకో. నీ మనస్సులో ఏముందో, నీకు ఏది ఇష్టమో అది ఇస్తాను.

మద్దర్శనమపుణ్యానాం స్వప్నాన్తేఽపి న జాయతే ।
త్వం పునర్దృఢభక్తిత్వాత్ ప్రత్యక్షం దృష్టవానసి ॥ 8 ॥

పుణ్యం చేయనివారికి నా దర్శనం కలలో కూడ లభించదు. నీవు నాపై చాల దృఢమైన భక్తి కలిగినవాడివి కాబట్టి నన్ను ప్రత్యక్షంగా చూడగలుగుతున్నావు.

బ్రహ్మోవాచ :-బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

శ్రుత్వైవం వాసుదేవస్య వచనం తస్య భో ద్విజాః ।
రోమాఞ్చితతనుర్భూత్వా ఇదం స్తోత్రం జగౌ నృపః ॥ 9 ॥

ఓ బ్రాహ్మణులారా, ఈ వాసుదేవుడిమాటలు విని, ఇంద్రద్యుమ్నమహారాజు సంతోషంతో పులకించి, స్వామిని ఈవిధంగా స్తుతించాడు.

రాజోవాచ :-ఇంద్రద్యుమ్నుడు స్తుతించాడు.

శ్రియఃకాన్త నమస్తేఽస్తు శ్రీపతే పీతవాససే ।
శ్రీదశ్రీశ శ్రీనివాస నమస్తే శ్రీనికేతన ॥ 10 ॥

లక్ష్మీమనోహరా! లక్ష్మీపతీ! పట్టుపుట్టం ధరించినవాడా! నీకు నమస్కారం. సంపదలు ఇచ్చేవాడా! లక్ష్మీదేవిని పాలించేవాడా! లక్ష్మికి నివాసమైనవాడా! శుభాలకు స్థానమైనవాడా! నీకు నమస్కారం. (శ్రీద శ్రీశ శ్రీనివాసః. విష్ణుసహస్రనామం)

ఆద్యం పురుషమీశానం సర్వేశం సర్వతోముఖమ్ ।
నిష్కలం పరమం దేవం ప్రణతోఽస్మి సనాతనమ్ ॥ 11 ॥

సృష్టికి పూర్వం, అన్నింటికంటే ముందుగా ఉన్నవాడూ, అందరి హృదయాలలో ఉండేవాడూ, సమస్తానికీ అధిపతి అయినవాడూ, సంపూర్ణుడూ, అఖండస్వరూపుడూ, అన్నింటికంటె అధికమైనవాడూ, శాశ్వతుడూ అయిన వాసుదేవుడికి నమస్కరిస్తున్నాను.

శబ్దాతీతం గుణాతీతం భావాభావవివర్జితమ్ ।
నిర్లేపం నిర్గుణం సూక్ష్మం సర్వజ్ఞం సర్వభావనమ్ ॥ 12 ॥

మాటలకు అందనివాడూ, గుణాలకు ఆవలివాడూ, ఉండటం లేకపోవటం అనే స్థితులు లేనివాడూ, దేనిపైనా ఆసక్తి లేనివాడూ, ఏ గుణమూ లేనివాడూ, అన్నింట నిండి ఉన్న చైతన్యస్వరూపుడూ, సమస్తం తెలిసినవాడూ, అందరిచేత ధ్యానించబడేవాడూ, అయిన స్వామికి నమస్కారం.

ప్రావృణ్మేఘప్రతీకాశం గోబ్రాహ్మణహితే రతమ్ ।
సర్వేషామేవ గోప్తారం వ్యాపినం సర్వభావినమ్ ॥ 13 ॥

వర్షాకాలపు మేఘంతో సమానమైనవాడూ (నల్లగా ఉండేవాడూ, కోరికలను వర్షించేవాడు), ఆవులకూ బ్రాహ్మణులకూ మేలు చేయడంలో శ్రద్ధ కలిగినవాడూ, అందర్నీ కాపాడేవాడూ, అన్నింటా నిండిఉన్నవాడూ, సమస్తాన్నీ సృష్టించినవాడూ అయిన స్వామికి నమస్కారం.

శఙ్ఖచక్రధరం దేవం గదాముసలధారిణమ్ ।
నమస్యే వరదం దేవం నీలోత్పలదలచ్ఛవిమ్ ॥ 14 ॥

శంఖమూ, చక్రమూ గద, ముసలమూ (రోకలి) ధరించిన దేవుడూ, అందరికీ వరా లిచ్చేవాడూ, నల్లని కలువపూవు వంటి మేనిరంగు గలిగినవాడూ, అయిన వాసుదేవుడికి నమస్కారం చేస్తున్నాను.

నాగపర్యఙ్కశయనం క్షీరోదార్ణవవాసినమ్ ।
నమస్యేఽహం హృషీకేశం సర్వపాపహరం హరిమ్ ॥ 15 ॥

ఆదిశేషుడనే శయ్యమీద శయనించేవాడూ, పాలసముద్రంలో నివసించేవాడూ, ఇంద్రియాలకు అధిపతియైన వాడూ, పాపాలన్నీ పోగొట్టేవాడూ అయిన శ్రీహరికి నేను నమస్కరిస్తున్నాను.

పునస్త్వాం దేవదేవేశం నమస్యే వరదం విభుమ్ ।
సర్వలోకేశ్వరం విష్ణుం మోక్షకారణమవ్యయమ్ ॥ 16 ॥

దేవతలకు దేవుడూ, వరాలిచ్చేవాడూ, వైభవం కలిగినవాడూ, లోకాలన్నిటికీ ప్రభువూ, అంతటా వ్యాపించి ఉన్నవాడూ, మోక్షాన్నిచ్చేవాడూ, ఏవిధమైనమార్పూ లేకుండా స్థిరంగా ఉండేవాడూ ఐన నీకు మళ్లీ మళ్లీ నమస్కరిస్తున్నాను.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవం స్తుత్వా తు తం దేవం ప్రణిపత్య కృతాఞ్జలిః ।
ఉవాచ ప్రణతో భూత్వా నిపత్య వసుధాతలే ॥ 17 ॥

ఇంద్రద్యుమ్నుడు వాసుదేవస్వామిని ఈవిధంగా స్తోత్రం చేసి, చేతులు జోడించి నమస్కరించాడు. తరువాత నేలమీద సాష్టాంగపడి, వినయంగా ఇలా అన్నాడు.

రాజోవాచ :– ఇంద్రద్యుమ్నుడు అంటున్నాడు.

ప్రీతోఽసి యది మే నాథ వృణోమి వరముత్తమమ్ ।
దేవాసురాస్సగన్ధర్వా యక్షరక్షోమహోరగాః ॥ 18 ॥

సిద్ధవిద్యాధరాస్సాధ్యాః కిన్నరా గుహ్యకాస్తథా ।
ఋషయో యే మహాభాగా నానాశాస్త్రవిశారదాః ॥ 19 ॥

పరివ్రాడ్ యోగయుక్తాశ్చ వేదతత్త్వార్థచిన్తకాః ।
మోక్షశాస్త్రవిదో యేఽన్యే ధ్యాయన్తి పరమం పదమ్ ॥ 20 ॥

నిర్గుణం నిర్మలం శాన్తం గుహ్యం పరమపావనమ్ ।
తత్పదం గన్తుమిచ్ఛామి త్వత్ప్రసాదాత్ సుదుర్లభమ్ ॥ 21 ॥

స్వామీ! నీకు నాపై అనుగ్రహం కలిగితే నేను ఒక మంచి వరం కోరుకుంటాను. దేవతలు, దానవులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, నాగులు, సిద్ధులు, విద్యాధరులు, సాధ్యులు, కిన్నరులు, గుహ్యకులు, మహర్షులు, ఇంకా వివిధశాస్త్రాలన్నీ చదివిన పుణ్యాత్ములు పరివ్రాజకులు, యోగులు, నిరంతరం వేదరహస్యాలను స్మరించే వారు, మోక్షవిషయం తెలిసినవారు ధ్యానించే పరమోత్తమ స్థానాన్ని, గుణరహితమూ, శుద్ధమూ, ప్రశాంతమూ, రహస్యమూ, మిక్కిలిపవిత్రమూ, కష్టసాధ్యమూ ఐన ఆ స్థానాన్ని నీ అనుగ్రహంచేత పొందాలని కోరుకుంటున్నాను.

శ్రీభగవానువాచ :–విష్ణుదేవుడు అంటున్నాడు.

సర్వం భవతు భద్రం తే యథేష్టం సర్వమాప్నుహి ।
భవిష్యతి యథాకామం మత్ప్రసాదాన్న సంశయః ॥ 22 ॥

రాజా! నీకు అంతా మంచే జరుగుతుంది. నీవు కోరినది అంతా పొందుతావు. నా అనుగ్రహంచేత నీ కోరిక త్వరలో నెరవేరుతుంది. సందేహం లేదు.

దశవర్షసహస్రాణి తథా నవ శతాని చ ।
అవిచ్ఛిన్నం మహారాజ్యం కురు త్వం నృపసత్తమ ॥ 23 ॥

రాజవరేణ్యా! పదివేల తొమ్మిదివందల సంవత్సరాలు విశాలమైన ఈ సామ్రాజ్యాన్ని ఎదురులేకుండా నీవు పరిపాలించు.

ప్రయాస్యసి పదం దివ్యం దుర్లభం యత్ సురాసురైః ।
పూర్ణం మనోరథం శాన్తం గుహ్యమవ్యక్తమవ్యయమ్ ॥ 24 ॥

ఆ తరువాత దేవతలకూ రాక్షసులకూ కూడ లభించని ఉత్తమమైన స్థానానికి చేరుకుంటావు. నీ కోరిక పరిపూర్ణంగా సిద్ధిస్తుంది. నీవు పొందబోయే ఆ స్థానం పరిపూర్ణమైనది. ప్రశాంతంగా ఉంటుంది. రహస్యమైనది. ఎవరికీ తెలియరానిది. శాశ్వతంగా ఉండేది.

పరాత్పరతరం సూక్ష్మం నిర్లేపం నిశ్చలం ధ్రువమ్ ।
జరాశోకవినిర్ముక్తం క్రియాకారణవర్జితమ్ ॥ 25 ॥

ఉత్తమమైన వాటికంటె ఉత్తమమైనది. సారభూతమైనది. ఆవరణలు లేనిది. స్వచ్ఛమైనది. చలించనిది. నిశ్చయరూపమైనది. అక్కడ ముసలితనం ఉండదు. దుఃఖం ఉండదు. కార్యం, కారణం అనే సంబంధం ఉండదు.

తదహం దర్శయిష్యామి జ్ఞేయాఖ్యం పరమం పదమ్ ।
యం ప్రాప్య పరమానన్దం ప్రాప్స్యసే పరమాం గతిమ్ ॥ 26 ॥

తెలుసుకోవలసిన ఆ ఉత్తమస్థానాన్ని నీకు నేను చూపిస్తాను. ఆ ఉత్తమగతిని పొందిన తరువాత నీవు పరమానందపడతావు.

కీర్తిశ్చ తవ రాజేన్ద్ర తిష్ఠత్వత్ర మహీతలే ।
యావద్ ఘనా నభో యావద్ యావచ్చన్ద్రార్కతారకమ్ ॥ 27 ॥

రాజోత్తమా! మేఘాలు, ఆకాశం, చంద్రుడు, సూర్యుడు, నక్షత్రాలు ఉన్నంతకాలం ఈ భూలోకంలో నీ కీర్తి శాశ్వతంగా ఉంటుంది.

యావత్ సముద్రాస్సప్తైవ యావన్మేర్వాదిపర్వతాః ।
తిష్ఠన్తి దివి దేవాశ్చ తావత్ సర్వత్ర చావ్యయా ॥ 28 ॥

(భూమిమీద) సప్తసముద్రాలూ, మేరువు మొదలైన కులపర్వతాలు, దేవలోకంలో దేవతలు, ఉన్నంతకాలం నీ కీర్తి అన్నిదిక్కులలోనూ సుస్థిరంగా ఉంటుంది.

ఇన్ద్రద్యుమ్నసరో నామ తీర్థం యజ్ఞాఙ్గసమ్భవమ్ ।
యత్ర స్నాత్వా సకృల్లోకశ్శక్రలోకమవాప్నుయాత్ ॥ 29 ॥

యజ్ఞంలో భాగంగా ఏర్పడిన ఈ పుణ్యతీర్థం ఇంద్రద్యుమ్నం అనేపేరుతో ప్రసిద్ధ మవుతుంది. ఈ సరస్సులో ఒక్కసారి స్నానం చేసినవాడు ఇంద్రలోకానికి వెళ్తాడు.

దాపయిష్యతి యః పిణ్డాస్తటేఽస్మిన్ సరసశ్శుభే ।
కులైకవింశముద్ధృత్య శక్రలోకం గమిష్యతి ॥ 30 ॥

శుభప్రదమైన ఈ ఇంద్రద్యుమ్నసరస్సు ఒడ్డున పితృదేవతలకు పిండప్రదానం చేసినవాడు ఇరవైఒక్కతరాల వారిని నరకలోకాలనుండి ఉద్ధరించి, వారితో సహా ఇంద్రలోకానికి వెళ్తాడు.

పూజ్యమానోఽప్సరోభిశ్చ గన్ధర్వైర్గీతనిస్స్వనైః ।
విమానేన వసేత్ తత్ర యావదిన్ద్రాశ్చతుర్దశ ॥ 31 ॥

అక్కడ అప్సరసలు (నాట్యాలతో), గంధర్వులు సంగీతధ్వనులతో పూజిస్తుండగా, పధ్నాలుగుమంది ఇంద్రులు రాజ్యం చేసినంతకాలం అతడు ఇంద్రలోకంలో విమానంలో విహరిస్తాడు. (బ్రహ్మకు ఒకపూట నైమిత్తిక ప్రలయం వరకు)

సరసో దక్షిణే భాగే నైరృత్యాం తు సమాశ్రితః ।
న్యగ్రోధస్తిష్ఠతే తత్ర తత్సమీపే తు మణ్డపః ॥ 32 ॥

ఇంద్రద్యుమ్నసరస్సుకు దక్షిణదిక్కులో నైరృతిమూలగా ఒకపెద్ద మఱ్ఱిచెట్టు ఉంది. దానికి దగ్గరలో ఒక మండపం ఉంది.

కేతకీవనసఞ్ఛన్నో నానాపాదపసఙ్కులః ।
నారికేలైరసంఖ్యేయైశ్చమ్పకైర్వకులావృతైః ॥ 33 ॥

ఆ మండపం మొగలిపొదలతో కప్పబడినట్లుగా ఉంటుంది. ఇంకా అక్కడ రకరకాలచెట్లు గుంపులుగా ఉన్నాయి. కొబ్బరిచెట్లు లెక్కలేనన్ని ఉన్నాయి. సంపెంగచెట్లు, పొగడచెట్లు ఆ ప్రదేశం అంతటా ఆవరించి ఉన్నాయి.

అశోకైః కర్ణికారైశ్చ పున్నాగైర్నాగకేసరైః ।
పాటలామ్రాతసరలైశ్చన్దనైర్దేవదారుభిః ॥ 34 ॥

అశోకవృక్షాలు, కొండగోగుచెట్లు, పొన్నచెట్లు, నాగకేసరవృక్షాలు, కలిగొట్టుచెట్లు, అంబాళంచెట్లు, మంచి గంధంచెట్లు, దేవదారువృక్షాలు,

న్యగ్రోధాశ్వత్థఖదిరైః పారిజాతైస్సహార్జునైః ।
హిన్తాలైశ్చైవ తాలైశ్చ శింశపైర్బదరైస్తథా ॥ 35 ॥

మఱ్ఱిచెట్లు, రావిచెట్లు, చంద్రచెట్లు, పారిజాతవృక్షాలు, జువ్విచెట్లు, విశేషమైన ఖర్జూరం చెట్లు, తాటిచెట్లు, శింశుపావృక్షాలు, రేగుచెట్లు,

కలఞ్జైర్లకుచైఃప్లక్షై పనసైర్బిల్వధాతుకైః ।
అన్యైర్బహువిధైర్వృక్షైశ్శోభితస్సమలఙ్కృతః ॥ 36 ॥

కానుగచెట్లు, గజనిమ్మచెట్లు, కలుజువ్విచెట్లు, పనసచెట్లు, మారేడుచెట్లు, ధాతుకవృక్షాలు, ఇంకా ఇతరమైన రకరకాల చెట్లు ఆ ప్రాంతాన్ని అందంగా అలంకరించాయి.

ఆషాఢస్య సితే పక్షే పఞ్చమ్యాం పితృదైవతే ।
ఋక్షే నేష్యన్తి నస్తత్ర నీత్వా సప్త దినాని వై ॥ 37 ॥

ఆషాఢమాసం శుక్లపక్షంలో పంచమీతిథినాడు పితృదేవతలకు సంబంధించిన మఘానక్షత్రంలో మమ్మల్ని (స్వామిప్రతిమను) ఆ మండపంవద్దకు తీసుకునివెళ్తారు. అక్కడ ఏడు రోజులపాటు ఉంచుతారు.

మణ్డపే స్థాపయిష్యన్తి సువేశ్యాభిస్సుశోభనైః ।
క్రీడావిశేషబహులైర్నృత్యగీతమనోహరైః ॥ 38 ॥

తరువాత ఆ విగ్రహాలను మండపంలో ప్రతిష్ఠించి, పూజిస్తారు. ఆ సమయంలో అందమైన వేశ్యలు వస్తారు. విశేషమైన రకరకాల ఆటలు ఆడతారు. మనోహరమైన నాట్యాలు, గానాలు చేస్తారు.

చామరైస్స్వర్ణదండైశ్చ వ్యజనై రత్నభూషితైః ।
వీజయన్తస్తథాఽస్మభ్యం స్థాపయిష్యన్తి మఙ్గలాః ॥ 39 ॥

బంగారుపిడులు కలిగినచామరాలతోనూ, రత్నాలు పొదిగిన విసనకఱ్ఱలతోనూ వీస్తూ, శుభప్రదంగా మమ్మల్ని ఆ మందిరంలో ప్రతిష్ఠ చేస్తారు.

బ్రహ్మచారీ యతి శ్చైవ స్నాతకాశ్చ ద్విజోత్తమాః ।
వానప్రస్థా గృహస్థాశ్చ సిద్ధాశ్చాన్యే చ బ్రాహ్మణాః ॥ 40 ॥

నానావర్ణపదైః స్తోత్రైరృగ్యజుస్సామనిస్స్వనైః ।
కరిష్యన్తి స్తుతిం రాజన్ రామకేశవయోః పునః ॥ 41 ॥

విప్రవరులారా! బ్రహ్మచారులు, సన్న్యాసులు, వేదవిద్యాభ్యాసం పూర్తిచేసిన వారు, గృహస్థులు, వానప్రస్థాశ్రమంలో ఉన్నవారు, సిద్ధులు, ఇంకా ఇతరులైన విప్రులు, అనేకవిధాలైన వర్ణాలతోనూ (బీజాక్షరాలతో) పదాలతో కూడిన స్తోత్రాలతోనూ, ఋక్,యజుస్, సామ వేదనాదాలతోనూ, బలరామకృష్ణులను పలుమార్లు స్తుతిస్తారు.

తతః స్తుత్వా చ దృష్ట్వా చ నమస్కృత్వా చ భక్తితః ।
నరో వర్షాయుతం దివ్యం శ్రీమద్ధరిపురే వసేత్ ॥ 42 ॥

బలరామకృష్ణులను భక్తితో స్తుతించినా, దర్శించినా, నమస్కరించినా మానవుడు పదివేల సంవత్సరాల పాటు విష్ణులోకంలో నివసిస్తాడు.

పూజ్యమానోఽ ప్సరోభిశ్చ గన్ధర్వైర్గీతనిస్స్వనైః ।
హరేరనుచరస్తత్ర క్రీడతే కేశవేన వై ॥ 43 ॥

అప్సరసలు, గంధర్వులు చేస్తున్న గాన ధ్వనులతో పూజిస్తుండగా, శ్రీమహావిష్ణువుకు దాసుడు, కృష్ణుడితో కలిసి క్రీడిస్తాడు.

విమానేనార్కవర్ణేణ రత్నహారేణ రాజతా ।
సర్వకామైర్మహాభోగైస్తిష్ఠతే భువనోత్తమే ॥ 44 ॥

ఉత్తమమైన ఆ విష్ణులోకంలో సూర్యుడితో సమానమైన తేజస్సు గలిగిన విమానంలో విహరిస్తాడు. రత్నాలు పొదిగిన హారాలతో ప్రకాశిస్తాడు. కోరికలన్నీ నెరవేరతాయి. గొప్పగొప్పభోగాలు అనుభవిస్తూ ఉంటాడు.

తపఃక్షయాదిహాగత్య మనుష్యో బ్రాహ్మణో భవేత్ ।
కోటీ ధనపతి శ్శ్రీమాంశ్చతుర్వేదీ భవేద్ ధ్రువమ్ ॥ 45 ॥

పుణ్యఫలం అనుభవించిన తరువాత, భూలోకంలో మానవుడై బ్రాహ్మణుడుగా జన్మిస్తాడు. కోట్లకొద్దీ ధనానికి సంపదలకు అధిపతి అవుతాడు. వివిధ సంపదలను పొందుతాడు. నాలుగు వేదాలూ తెలుసుకుంటాడు. ఇది నిశ్చయం.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవం తస్మై వరం దత్వా కృత్వా చ సమయం హరిః ।
జగామాదర్శనం విప్రాస్సహితో విశ్వకర్మణా ॥ 46 ॥

బ్రాహ్మణులారా! ఈవిధంగా ఇంద్రద్యుమ్నుడికి వరం ఇచ్చి, రాజ్యపాలనాకాలాన్ని నిర్ణయించి, శ్రీమహావిష్ణువు విశ్వకర్మతో కలిసి అదృశ్యమైనాడు.

స తు రాజా తదా హృష్టో రోమాఞ్చితతనూరుహః ।
కృతకృత్యమివాత్మానం మేనే సన్దర్శనాద్ధరేః ॥ 47 ॥

అపుడు ఇంద్రద్యుమ్నమహారాజు సంతోషంతో పులకించాడు. శ్రీహరిని దర్శించడంచేత తాను కృతార్థుడ నైనానని భావించాడు.

తతః కృష్ణం చ రామం చ సుభద్రాం చ వరప్రదామ్ ।
రథైర్విమానసఙ్కాశైర్మణికాఞ్చనచిత్రితైః ॥ 48 ॥

ఆ తరువాత బలరాముడు, కృష్ణుడు, వరాలు ఇచ్చే సుభద్ర ప్రతిమలను రథాలలో చేర్చారు. ఆ రథాలు విమానాలలాగా ఉన్నాయి. ఆ రథాలను బంగారంతో నిర్మించారు. మణులు పొదిగారు.

సంవాహ్య తాస్తదా రాజా జయమఙ్గలనిస్స్వనైః ।
ఆనయామాస మతిమాన్ సామాత్యస్సపురోహితః ॥ 49 ॥

బుద్ధిమంతుడైన ఇంద్రద్యుమ్నుడు ఆ దేవతావిగ్రహాలను ఆ రథాలలోకి ఎక్కించి, శుభప్రదమైన జయ జయ ధ్వనులతో, తీసుకునివచ్చాడు. మంత్రులు, పురోహితులు రాజు వెంట వచ్చారు.

నానావాదిత్రనిర్ఘోషైర్నానావేదస్వనైశ్శుభైః ।
సంస్థాప్య చ శుభే దేశే పవిత్రే సుమనోహరే ॥ 50 ॥

రకరకాల వాద్యాల ధ్వనులతో, మంగళప్రదమైన వేదనాదాలతో, ఆదేవతాప్రతిమలను అందంగా ఉన్న పవిత్రప్రదేశంలో చక్కగా ఉంచారు.

తతశ్శుభతిథౌ కాలే నక్షత్రే శుభలక్షణే ।
ప్రతిష్ఠాం కారయామాస సుముహూర్తే ద్విజైస్సహ ॥ 51 ॥

తర్వాత, శుభతిథి, శుభనక్షత్రం, అన్నివిధాలైన శుభలక్షణాలు కలిగిన శుభసమయంలో, శుభముహూర్తంలో ఆ విగ్రహాలను బ్రాహ్మణులతో కలిసి ఇంద్రద్యుమ్నుడు ఆ మందిరంలో ప్రతిష్ఠ చేయించాడు.

యథోక్తేన విధానేన విధిదృష్టేన కర్మణా ।
ఆచార్యానుమతేనైవ సర్వం కృత్వా మహీపతిః ॥ 52 ॥

శాస్త్రం చెప్పిన పద్ధతిలో, విధ్యుక్తమైన కార్యకలాపంతో, గురువుల ఆమోదంతో ఆ మహారాజు అన్నిపనులను సక్రమంగా పూర్తిచేశాడు.

ఆచార్యాయ తదా దత్త్వా దక్షిణాం విధివత్ ప్రభుః ।
ఋత్విగ్భ్యశ్చ విధానేన తథాన్యేభ్యో ధనం దదౌ ॥ 53 ॥

ప్రతిష్ఠాకార్యక్రమ నిర్వాహకుడైన ఆచార్యునికి యోగ్యమైనవిధంగా దక్షిణ ఇచ్చాడు. ఋత్విక్కులకు, ఇంకా ఇతరులకు అందరికీ పద్ధతిప్రకారం దక్షిణలు ఇచ్చాడు.

కృత్వా ప్రతిష్ఠాం విధివత్ ప్రాసాదే భవనోత్తమే ।
స్థాపయామాస తాన్ సర్వాన్ విధిదృష్టేన కర్మణా ॥ 54 ॥

ఉత్తమమైన ఆ భవనంలో ప్రతిష్ఠాకార్యక్రమాలు యథావిధిగా పూర్తిచేశాడు. శాస్త్రం చెప్పిన ప్రకారంగా అందులో దేవతలను ప్రతిష్ఠించాడు.

తతస్సమ్పూజ్య విధినా నానాపుష్పైస్సుగన్ధిభిః ।
సువర్ణమణిముక్తాద్యైర్నానావస్త్రైస్సుశోభనైః ॥ 55 ॥

పరిమళభరితమైన రకరకాల పుష్పాలతోనూ, బంగారం, మణులు, ముత్యాలు మొదలైన వాటితోనూ, అందమైన వివిధవస్త్రాలతోనూ, ఆ దేవతలను పద్ధతి ప్రకారం పూజించాడు.

రత్నైశ్చ వివిధైర్దివ్యై రాసనైర్గ్రామపత్తనైః ।
దదౌ చాన్యాన్ స విషయాన్ పురాణి నగరాణి చ ॥ 56 ॥

ఆ అర్చనలో వారికి రకరకాల రత్నాలు, సింహాసనాలు, గ్రామాలు, పట్టణాలు, పురాలు, నగరాలు, క్షేత్రాలు, ఎన్నో సమర్పించాడు.

ఏవం బహువిధం దత్త్వా రాజ్యం కృత్వా యథోచితమ్ ।
ఇష్ట్వా చ వివిధైర్యజ్ఞైర్దత్త్వా దానాన్యనేకశః ॥ 57 ॥

ఈవిధంగా అనేకమైన వాటిని కానుకలుగా ఇచ్చి ప్రతిష్ఠాకార్యక్రమాన్ని చక్కగా పూర్తిచేశాడు. రాజ్యాన్ని చక్కగా పరిపాలించాడు. అనేక యజ్ఞాలు చేశాడు. లెక్కలేనన్ని దానాలు చేశాడు.

కృతకృత్యస్తతో రాజా త్యక్తసర్వపరిగ్రహః ।
జగామ పరమం స్థానం తద్విష్ణోః పరమం పదమ్ ॥ 58 ॥

ఈవిధమైన సత్కర్మలతో ఇంద్రద్యుమ్నమహారాజు జన్మ చరితార్థం చేసుకున్నాడు. తాను సంపాదించిన దంతా దానం చేశాడు. తరువాత ఉత్తమమైన శ్రీమహావిష్ణువు పరమపదానికి వెళ్లాడు.

ఏవం మయా మునిశ్రేష్ఠాః కథితోఽసౌ నృపోత్తమః ।
క్షేత్రస్య చైవ మాహాత్మ్యం కిమన్యచ్ఛ్రోతుమిచ్ఛథ ॥ 59 ॥

మహర్షులారా! ఈవిధంగా ఇంద్రద్యుమ్నమహారాజు వృత్తాంతాన్నీ, పురుషోత్తమక్షేత్రం మహిమలనూ మీకు వివరించాను. తరువాత మీరు ఇక దేనిని గురించి వినాలనుకుంటున్నారు?

శ్రుత్వైవం వచనం తస్య బ్రహ్మణోఽవ్యక్తజన్మనః ।
ఆశ్చర్యం మేనిరే విప్రాః పప్రచ్ఛుశ్చ పునర్ముదా ॥ 60 ॥

పుట్టుక ఎరుగరాని ఆ బ్రహ్మదేవుడి ఈ మాటలు విని, అక్కడి బ్రాహ్మణులు మిక్కిలి ఆశ్చర్యపడ్డారు. సంతోషంగా మళ్లీ ఈవిధంగా అడుగుతున్నారు.

మునయ ఊచుః :–మహర్షులు అంటున్నారు.

కస్మిన్ కాలే సురశ్రేష్ఠ గన్తవ్యం పురుషోత్తమమ్ ।
విధినా కేన కర్తవ్యం పఞ్చతీర్థమితి ప్రభో ॥ 61 ॥

దేవనాథా! ప్రభూ! పురుషోత్తమక్షేత్రానికి ఎప్పుడు వెళ్లాలి? ఆ యాత్ర ఎలా చేయాలి? పంచతీర్థం అని ప్రసిద్ధమైన పుణ్యస్థలంలో ఆచరించవలసిన విధులు ఏమిటి?

ఏకైకస్య చ తీర్థస్య స్నానదానస్య యత్ఫలమ్ ।
దేవతాప్రేక్షణే చైవ బ్రూహి సర్వం పృథక్ పృథక్ ॥ 62 ॥

పంచతీర్థంలోని ఆయా తీర్థాలలో ఏ తీర్థంలో స్నానం చేస్తే, దానం చేస్తే, ఏమి ఫలితం వస్తుంది? అక్కడ దేవతలను దర్శించడంవల్ల వచ్చే ఫలితం ఏమిటి? అన్ని విషయాలను విడివిడిగా వివరంగా చెప్పవలసింది.

బ్రహ్మోవాచ:–బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

నిరాహారః కురుక్షేత్రే పాదేనైకేన య స్తపేత్ ।
జితేన్ద్రియో జితక్రోధస్సప్తసంవత్సరాయుతమ్ ॥ 63 ॥

దృష్ట్వా సకృద్ ద్విజశ్రేష్ఠా ద్వాదశ్యాం పురుషోత్తమమ్ ।
కృతోపవాసః ప్రాప్నోతి తతోఽధికతరం ఫలమ్ ॥ 64 ॥

బ్రాహ్మణోత్తములారా! కురుక్షేత్రంలో ఇంద్రియాలను అదుపులో ఉంచుకుని, కోపాన్ని విడిచిపెట్టి, ఏమీ తినకుండా, ఒంటికాలి మీద నిలబడి, డెబ్భైవేలసంవత్సరాలు తపస్సు చేస్తే కలిగే ఫలం దానికంటె అధికమైన ఫలితం–ఈపురుషోత్తమ క్షేత్రంలో ద్వాదశినాడు ఉపవాసం ఉండి, స్వామివారిని ఒక్కసారి చూస్తే కలుగుతుంది.

తస్మాజ్జ్యేష్ఠే మునిశ్రేష్ఠాః ప్రయత్నేన సుసంయతైః ।
స్వర్గలోకేప్సువిప్రాద్యైర్ద్రష్టవ్యః పురుషోత్తమః ॥ 65 ॥

మునివరులారా! స్వర్గలోకం కావాలని కోరుకునే బ్రాహ్మణులు మొదలైన అన్నివర్ణాలవారు కూడ ఎంత శ్రమపడి ఐనా, నియమంగా, ఈ క్షేత్రంలోని పురుషోత్తమస్వామిని జ్యేష్ఠమాసంలో తప్పకుండా దర్శించు కోవాలి.

పఞ్చతీర్థం తు విధివత్ కృత్వా జ్యేష్ఠే నరోత్తమః ।
శుక్లపక్షస్య ద్వాదశ్యాం పశ్యేత్ తం పురుషోత్తమమ్ ॥ 66 ॥

ఉత్తముడైన మానవుడు జ్యేష్ఠమాసంలో శుక్లపక్షంలో ద్వాదశినాడు పంచతీర్థాలలో విధ్యుక్తంగా స్నానం చేసి, పురుషోత్తమస్వామిని దర్శించుకోవాలి.

యే పశ్యన్త్యవ్యయం దేవం ద్వాదశ్యాం పురుషోత్తమమ్ ।
తే విష్ణులోకమాసాద్య న చ్యవన్తే కదాచన ॥ 67 ॥

శాశ్వతుడైన పురుషోత్తమస్వామిని (జ్యేష్ఠ) ద్వాదశినాడు దర్శించుకున్న మానవుడు విష్ణులోకానికి వెళ్లి, శాశ్వతంగా అక్కడే ఉండిపోతాడు. ఎప్పటికీ క్రిందిలోకాలలోకి రాడు (తిరిగి జన్మించదు).

తస్మాజ్జ్యేష్ఠే ప్రయత్నేన గన్తవ్యం భో ద్విజోత్తమాః ।
కృత్వా తస్మిన్ పఞ్చతీర్థం ద్రష్టవ్యః పురుషోత్తమః ॥ 68 ॥

బ్రాహ్మణోత్తములారా! అందుచేత జ్యేష్ఠమాసంలో గట్టిగా ప్రయత్నం చేసి, తప్పకుండా పురుషోత్తమక్షేత్రానికి యాత్ర చేయాలి. అక్కడి పంచతీర్థాలలో స్నానం చేసి, పురుషోత్తమస్వామిని దర్శించాలి.

సుదూరస్థోఽపి యో భక్త్యా కీర్తయేత్ పురుషోత్తమమ్ ।
అహన్యహని శుద్ధాత్మా సోఽపి విష్ణుపురం వ్రజేత్ ॥ 69 ॥

(పురుషోత్తమక్షేత్రానికి వెళ్ళలేనంత) దూరంగా ఎక్కడో ఉన్నా, నిర్మల మయిన మనస్సుతో ప్రతిరోజూ పురుషోత్తమస్వామిని భక్తితో స్మరించినవాడు కూడ విష్ణులోకానికి వెళ్తాడు.

యాత్రాం కరోతి కృష్ణస్య శ్రద్ధయా యస్సమాహితః ।
సర్వపాపవినిర్ముక్తో విష్ణులోకం వ్రజేన్నరః ॥ 70 ॥

శ్రీకృష్ణుడు నెలకొన్న పురుషోత్తమక్షేత్రానికి ఏకాగ్రబుద్ధితో, ఇంద్రియనిగ్రహంతో, యాత్ర చేసిన మానవుడికి పాపాలన్నీ నశించి పోతాయి. అతడు విష్ణులోకానికి వెళ్తాడు.

చక్రం దృష్ట్వా హరేర్దూరాత్ ప్రాసాదోపరి సంస్థితమ్ ।
సహసా ముచ్యతే పాపాన్నరో భక్త్యా ప్రణమ్య తత్ ॥ 71 ॥

పురుషోత్తమదేవాలయం శిఖరంపైన ఉన్న విష్ణు(సుదర్శన)చక్రాన్ని ఎంతో దూరంనుంచైనా చూసి, భక్తితో ఆ చక్రానికి నమస్కరించిన మానవుడి పాపాలన్నీ వెంటనే నశించిపోతాయి. (పాపరహితుడై, విష్ణులోకానికివెళ్తాడు.)

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే పురుషోత్తమవర్ణనం నామ అష్టచత్వారింశోఽధ్యాయః ॥ 48 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలోపురుషోత్తమవర్ణనం అనే నలభైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

ఏకోనపఞ్చాశత్తమోఽ ధ్యాయః - నలబైతొమ్మిదవ అధ్యాయం
మార్కండేయవటదర్శనమ్ - మార్కండేయవటదర్శనం

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఆసీత్ కల్పే మునిశ్రేష్ఠాస్సమ్ప్రవృత్తే మహాక్షయే ।
నష్టేఽ ర్కచన్ద్రే పవనే నష్టే స్థావరజఙ్గమే ॥ 1 ॥

మహర్షులారా! పూర్వం కల్పం చివరిలో మహాప్రళయం ఏర్పడింది. ఆ సమయంలో సూర్యుడు, చంద్రుడు, వాయువు నశించారు. చరాచరమైన పదార్థం సమస్తం నాశనమైంది.

ఉదితే ప్రలయాదిత్యే ప్రచణ్డే ఘనగర్జితే ।
విద్యుదుత్పాతసఙ్ఘాతైస్సమ్భగ్నే తరుపర్వతే ॥ 2 ॥

సర్వం నశింపజేసే ఆదిత్యుడు ఉదయించాడు. ప్రళయమేఘాలు భయంకరంగా ఉరిమాయి. మెరుపులు గుంపులుగా ఏర్పడి వెరపుగొలిపాయి. చెట్లు కూలాయి. కొండలు పగిలాయి.

లోకే చ సంహతే సర్వే మహదుల్కానిబర్హణే ।
శుష్కేషు సర్వతోయేషు సరస్సు చ సరిత్సు చ ॥ 3 ॥

పెద్దపెద్ద ఉల్కలు రాలాయి. సరస్సులలోనూ, నదులలోనూ నీరు మొత్తం ఇంకిపోయింది. లోక మంతా దెబ్బతిన్నది.

తతస్సంవర్తకో వహ్నిర్వాయునా సహితో ద్విజాః ।
లోకం తు ప్రావిశత్ సర్వమాదిత్యైరుపశోభితమ్ ॥ 4 ॥

బ్రాహ్మణులారా! అపుడు సంవర్తకం అనే ప్రళయకాలపు అగ్ని, గాలితో కలిసి లోకంలోకి ప్రవేశించింది. ప్రళయంలో ఆదిత్యులు పన్నెండుమంది లోకం అంతటినీ మండించారు.

పశ్చాత్ స పృథివీం భిత్వా ప్రవిశ్య చ రసాతలమ్ ।
దేవదానవయక్షాణాం భయం జనయతే మహత్ ॥ 5 ॥

ఆ ప్రళయాగ్ని, ద్వాదశాదిత్యుల తేజస్సు, భూమిని చీల్చుకుని పాతాళంలోకి ప్రవేశించింది. దేవతలకూ, దానవులకూ, యక్షులకూ మహాభయం పుట్టింది.

నిర్దహన్నాగలోకం చ యచ్చ కిఞ్చిత్ క్షితావిహ ।
అధస్తాన్మునిశార్దూలాస్సర్వం నాశయతే క్షణాత్ ॥ 6 ॥

మునివరులారా! నాగలోకం మొత్తం తగులబడింది. ఒక్కక్షణంలో ఈ భూమిపైన ఉన్నదానినీ, భూమికి అడుగున ఉన్నదానినీ సమస్తాన్నీ సర్వనాశనం చేసింది.

తతో యోజనవింశానాం సహస్రాణి శతాని చ ।
నిర్దహన్నాశుగో వాయుస్స చ సంవర్తకోఽనలః ॥ 7 ॥

సంవర్తకం అనే అగ్ని, చాలవేగంగా వీస్తున్న ప్రళయకాలపుగాలీ కలిసి ఇష్టం వచ్చినట్లుగా ఇరవైరెండు (అసంఖ్యాకమైన) వేల యోజనాలుగా సమస్తమూ తగులబెట్టింది.

సదేవాసురగన్ధర్వం సయక్షోరగరాక్షసమ్ ।
తతో దహతి సన్తప్తస్సర్వమేవ జగత్ ప్రభుః ॥ 8 ॥

ఆ అగ్నిదేవుడు దేవతలు, అసురులు, గంధర్వులు, యక్షులు, నాగులు, రాక్షసులతో సహా, లోకాలన్నింటినీ దహించాడు.

ప్రదీప్తోఽసౌ మహారౌద్రః కల్పాగ్నిరితి సంశ్రుతః ।
మహాజ్వాలో మహార్చిష్మాన్ సమ్ప్రదీప్తమహాస్వనః ॥ 9 ॥

మిక్కిలిగా ప్రజ్వలిస్తున్న భయంకరమైన ఆ అగ్ని కల్పాగ్ని అనే పేరుతో లోకంలో ప్రసిద్ధమైంది. పెద్దపెద్ద మంటలు రేగాయి. కాంతి తీక్షణమైంది. మంటల చప్పుళ్లు పెచ్చు మీరాయి.

సూర్యకోటిప్రతీకాశో జ్వలన్నివ స్వతేజసా ।
త్రైలోక్యం చాదహత్ తూర్ణం ససురాసురమానుషమ్ ॥ 10 ॥

దాని తేజస్సు కోటిమంది సూర్యులకాంతితో సమానంగా ప్రకాశిస్తున్నది. అది దేవతలు, రాక్షసులు, మానవులతో సహా మూడులోకాలనూ చాల వేగంగా దహించివేసింది.

ఏవంవిధే మహాఘోరే మహాప్రలయదారుణే ।
ఋషిః పరమధర్మాత్మా ధ్యానయోగపరోఽభవత్ ॥ 11 ॥

ఈవిధంగా మిక్కిలిభయంకరంగా తీవ్రంగా లోకప్రళయం జరుగుతుండగా, ఉత్తమధార్మికుడైన ఒకానొకమహర్షి ధ్యానయోగంలో నిమగ్నమై ఉన్నాడు.

ఏకస్సన్తిష్ఠతే విప్రా మార్కణ్డేయేతి విశ్రుతః ।
మోహపాశైర్నిబద్ధోఽసౌ క్షుత్తృష్ణావ్యాకులేన్ద్రియః ॥12 ॥

ద్విజులారా! ఆ మహర్షియే మార్కండేయుడు. ఏకాంతంలో ధ్యానంలో కూర్చున్నాడు. అతడు భ్రమలు అనే కట్టుతాళ్లతో కట్టబడిఉన్నాడు. ఆకలితో, దాహంతో అతడి ఇంద్రియాలు కలవరపడుతున్నాయి.

స దృష్ట్వాఽథ మహావహ్నిం శుష్కకణ్ఠోష్ఠతాలుకః ।
తృషార్తః ప్రస్ఖలన్ విప్రాస్తదాసౌ భయవిహ్వలః ॥ 13 ॥

బ్రాహ్మణులారా! మార్కండేయుడు ఆ ప్రళయాగ్నిని చూశాడు. అపుడు మహర్షికి గొంతు, నాలుక, పెదవులు, నోరు తడిఆరిపోయాయి. దాహంతో కలతచెందాడు. భయంతో బెదిరిపోయాడు.

బభ్రామ పృథివీం సర్వాం కాన్దిశీకో విచేతనః ।
త్రాతారం నాధిగచ్ఛన్ వై ఇతశ్చేతశ్చ ధావతి ॥ 14 ॥

మార్కండేయమహర్షికి బుద్ధి పనిచేయలేదు. దిక్కు తోచక భూమండలం అంతటా పరిభ్రమించాడు. తనను కాపాడేవాడు ఎవరూ కనబడక, అటూ ఇటూ పరుగులుతీశాడు.

న లేభే స తదా శర్మ యత్ర విశ్రమ్యతే ద్విజాః ।
కరోమి కిం న జానామి యమహం శరణం వ్రజే ॥ 15 ॥

విప్రులారా! ఆయనకు ఎక్కడా సుఖం దొరకలేదు. విశ్రాంతి లేదు. (ఇలా అనుకున్నాడు) ఏం చేయాలో తెలియడం లేదు. ఎవరిని శరణు పొందాలి.

కథం పశ్యామి తం దేవం పురుషేశం సనాతనమ్ ।
ఇతి సఞ్చిన్తయన్ దేవమేకాగ్రేణ సనాతనమ్ ॥ 16 ॥

శాశ్వతుడైన ఆ పురుషోత్తముని ఏవిధంగా చూడగలుగుదునా అని శ్రద్ధగా ఆలోచించాడు.

ప్రాప్తవాంస్తత్పదం దివ్యం మహాప్రలయకారణమ్ ।
పురుషేశమితి ఖ్యాతం వటరాజం సనాతనమ్ ॥ 17 ॥

ఈ మహాప్రళయానికి కారణమైన పురుషోత్తమం అనే వటవృక్షాన్ని చేరుకున్నాడు. అది దివ్యమైన ఉత్తమస్థానం.

త్వరాయుక్తో మునిశ్చాసౌ న్యగ్రోధస్యాన్తికం యయౌ ।
ఆసాద్య తం మునిశ్రేష్ఠాస్తస్య మూలే సమావిశత్ ॥ 18 ॥

మహర్షులారా! మార్కండేయమహర్షి తొందర తొందరగా ఆ మఱ్ఱిచెట్టు దగ్గరకు వెళ్లాడు. ఆ చెట్టు మొదట్లో కూర్చున్నాడు.

న కాలాగ్నిభయం తత్ర న చాఙ్గారప్రవర్షణమ్ ।
న సంవర్తాగమస్తత్ర న చ వజ్రాశనిస్తథా ॥ 19 ॥

అక్కడ ప్రళయకాలాగ్నికి సంబంధించిన భయం లేదు. అక్కడ నిప్పులవాన లేదు. సంవర్తాగ్ని అక్కడికి చేరుకోలేదు. అక్కడ పిడుగులు, మెరుపులు ఉండవు. (ప్రళయమేఘాల భయం కూడ లేదు).

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే మార్కణ్డేయవటదర్శనం నామైకోనపఞ్చాశత్తమోఽధ్యాయః ॥49 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో మార్కండేయ వటదర్శనం అనే నలభైతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.



పఞ్చాశత్తమోఽధ్యాయః - యాభైయవ అధ్యాయం
మార్కండేయప్రళయదర్శనమ్ - మార్కండేయప్రళయదర్శనం

బ్రహ్మోవాచ:-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తతో గజకులప్రఖ్యాస్తడిన్మాలావిభూషితాః ।
సముత్తస్థుర్మహామేఘా నభస్యద్భుతదర్శనాః ॥ 1 ॥

అపుడు ఆకాశంలో పెద్దపెద్దమేఘాలు అద్భుతంగా ఏర్పడ్డాయి. అవి ఏనుగుల గుంపులాగా ఉన్నాయి. వరుసమెరపులతో మెరసిపోతున్నాయి.

కేచిన్నీలోత్పలశ్యామాః కేచిత్ కుముదసన్నిభాః ।
కేచిత్ కిఞ్జల్కసఙ్కాశాః కేచిత్ పీతాః పయోధరాః ॥ 2 ॥

కొన్నిమేఘాలు నల్లగా నల్లగలువలలాగా ఉన్నాయి. మరికొన్ని తెల్లగా తెల్లకలువలలాగా ఉన్నాయి. మరికొన్ని మేఘాలు పుప్పొడికాడలలాగా ఎఱ్ఱగా ఉన్నాయి. ఇంక కొన్ని మేఘాలు పసుపుపచ్చగా ఉన్నాయి.

కేచిద్ధరితసఙ్కాశాః కాకాణ్డకనిభాస్తథా ।
కేచిత్ కమలపత్రాభాః కేచిద్ధిఙ్గులసన్నిభాః ॥ 3 ॥

కొన్నిమేఘాలు ఆకుపచ్చరంగులో కనిపిస్తున్నాయి. కొన్ని పెద్దవేపచెట్లలాగా ఉన్నాయి. మరి కొన్ని తామరరేకుల వర్ణంలోనూ, ఇంక కొన్ని ఇంగువరంగులోనూ ఉన్నాయి.

కేచిత్ పురవరాకారాః కేచిద్గిరివరోపమాః ।
కేచిదఞ్జనసఙ్కాశాః కేచిన్మరకతప్రభాః ॥ 4 ॥

కొన్నిమేఘాలు పెద్దపట్టణమంత పరిమాణంలో ఉన్నాయి. కొన్ని పెద్దపర్వతం ఆకారంలో ఉన్నాయి. కొన్ని మేఘాలు కాటుకకొండలాగా ఉన్నాయి. మరి కొన్ని మరకతమణుల కాంతిలో ఉన్నాయి.

విద్యున్మాలాపినద్ధాఙ్గాస్సముత్తస్థుర్మహాఘనాః ।
ఘోరరూపా మహాభాగా ఘోరస్వననినాదినః ॥ 5 ॥

కొన్నిమేఘాలు మెరపులను హారాలుగా ఒంటినిండా అలంకరించుకుని నింగిపై తిరుగుతున్నాయి. వాటి ఆకారం భయంకరంగా ఉంది. మహిమ కలిగిఉన్నాయి. పిడుగులతో పెద్దపెద్ద ధ్వనులు వినిపిస్తున్నాయి.

తతో జలధరాస్సర్వే సమావృణ్వన్ నభస్తలమ్ ।
తైరియం పృథివీ సర్వా సపర్వతవనాకరా ॥ 6 ॥

ఆ మేఘాలు అన్నీ ఆకాశం అంతటా వ్యాపించాయి. కొండలు, అడవులతో సహా ఈ భూమండలం అంతటా ఆవరించాయి.

ఆపూరితా దిశస్సర్వాస్సలిలౌఘప్రవర్షిభిః ।
తతస్తే జలదా ఘోరా వారిణా మునిసత్తమాః ॥ 7 ॥

మహర్షులారా! భయంకరమైన ఆ మేఘాలు నీటిని ప్రవాహంగా కురుస్తుంటే, ఆ వర్షధారలతో దిక్కులన్నీ నిండిపోయాయి.

సర్వతః ప్లావయామాసుశ్చోదితాః పరమేష్ఠినా ।
వర్షమాణా మహాతోయం పూరయన్తో వసున్ధరామ్ ॥ 8 ॥

పరమాత్మ ప్రేరేపించి, పంపిన ఆ మేఘాలు వర్షిస్తున్న విస్తారమైన నీరు వరదలై, భూమి అంతటా ప్రవహించింది.

సుఘోరమశివం రౌద్రం నాశయన్తి స్మ పావకమ్ ।
తతో ద్వాదశ వర్షాణి పయోదా స్సముపప్లవే ॥ 9 ॥

మిక్కిలి భయంకరంగా, కడగండ్లపాలు చేస్తూ, ఆ మేఘాలు పన్నెండు సంవత్సరాలపాటు ఆగకుండా కురిశాయి. ఆ జలప్రవాహం అంతకు ముందున్న ప్రళయాగ్నిని ఆర్పివేసింది.

ధారాభిః పూరయన్తో వై చోద్యమానా మహాత్మనా ।
తతస్సముద్రాస్స్వాం వేలామతిక్రామన్తి భో ద్విజాః ॥ 10 ॥

ఓ బ్రాహ్మణులారా! పరమాత్మ ప్రేరేపించిన ఆ మేఘాలు వర్షధారలతో అంతటా నీళ్లు నింపాయి. ఆ మహాప్రవాహాలు వచ్చి చేరడంతో సముద్రాలు చెలియలికట్టలు దాటి ప్రవహిస్తున్నాయి.

పర్వతాశ్చ వ్యశీర్యన్తే మహీచాప్సు నిమజ్జతి ।
సర్వతస్సుమహాభ్రాన్తాస్తే పయోదా నభస్తలమ్ ॥ 11 ॥

ఆ వర్షధారలకు కొండలు నుగ్గు అయినాయి. భూమి నీళ్లలో మునిగిపోయింది. ఆ మేఘాలు ఆకాశ మంతటా వేగంగా సంచరిస్తున్నాయి.

సంవేష్టయిత్వా నశ్యన్తి వాయువేగసమాహతాః ।
తతస్తం మారుతం ఘోరం స విష్ణుర్మునిసత్తమాః ॥ 12 ॥

ఆదిపద్మాలయో దేవః పీత్వా స్వపితి ద్విజాః ।
తస్మిన్నేకార్ణవే ఘోరే తమోభూతే నిరాశ్రయే ॥ 13 ॥

మహర్షులారా! మేఘాల చుట్టూ తిరుగుతున్న వాయువు వేగంగా తాకటంచేత ఆ మేఘాలు ముక్కలుగా విడిపోయి చెల్లాచెదరయ్యాయి. బ్రాహ్మణులారా! భయంకరమైన ఆ ప్రళయకాలపు ప్రచండవాయువును పద్మాసనంలో కూర్చున్న విష్ణుదేవుడు తాగివేశాడు. ఏవిధమైన ఆధారం లేదు. అంతా చీకటి నిండిపోయింది. కేవలం జలం మాత్రమే ఉన్నది. ఆ ఏకార్ణవంలో, స్వామి ఒక్కడే నిద్రించాడు.

నష్టే దేవాసురనరే యక్షరాక్షసవర్జితే ।
తతో మునిస్సవిశ్రాన్తో ధ్యాత్వా చ పురుషోత్తమమ్ ॥ 14 ॥

దేవతలూ, అసురులూ, మానవులూ యక్షులు, రాక్షసులూ అందరూ నశించిపోయారు (మహాప్రళయంలో చరాచరసృష్టి అంతా నశించింది). ఆ సమయంలో మార్కండేయమహాముని నిశ్చింతగా, పురుషోత్తముడిని ధ్యానించాడు.

దదర్శ చక్షురున్మీల్య జలపూర్ణాం వసున్ధరామ్ ।
నాపశ్యత్తం వటం నోర్వీం న దిగాది న భాస్కరమ్ ॥ 15 ॥

ఆ తరువాత కళ్లు తెరిచి నీటిలో మునిగిపోయి ఉన్న భూమిని చూశాడు. అక్కడ మార్కండేయుడికి ఆ మఱ్ఱిచెట్టు (49.17) గాని, నేల గాని, దిక్కులు గాని, సూర్యుడు గాని, ఏమీ కనబడలేదు.

న చన్ద్రార్కాగ్నిపవనం న దేవాసురపన్నగమ్ ।
తస్మిన్నేకార్ణవే ఘోరే నష్టే స్థావరజఙ్గమే ॥ 16 ॥

ప్రళయాంతంలో చరాచరసృష్టి సమస్తం నశించింది. కేవలం నీళ్లు మాత్రమే నిలిచివున్నాయి. అంతా ఏకార్ణవం అయింది. ఆ సమయంలో చంద్రుడు, ఇంద్రుడు, అగ్ని, వాయువు, దేవతలు, అసురులు, నాగులు, మొదలుగా ఎవ్వరూ కనబడలేదు.

నిమజ్జన్ స తదా విప్రాస్సన్తర్తుముపచక్రమే ।
బభ్రామాసౌ మునిశ్చార్త ఇతశ్చేతశ్చ సంప్లవన్ ॥ 17 ॥

ద్విజులారా! మార్కండేయుడు ఆ సముద్రంలో మునిగిపోయాడు. దానిలోనుండి బయటపడడానికి ప్రయత్నించాడు. ఆందుకోసం అతికష్టంగా సముద్రంలో అటూ ఇటూ (ఒడ్డుకోసం) ఈదుతున్నాడు.

నిమమజ్జ తదా విప్రాస్త్రాతారం నాధిగచ్ఛతి ।
ఏవం తం విహ్వలం దృష్ట్వా కృపయా పురుషోత్తమః ॥
ప్రోవాచ మునిశార్దూలం తదా ధ్యానేన తోషితః ॥ 18 ॥

బ్రాహ్మణులారా! తీరం దొరకక, మార్కండేయుడు ఆ సముద్రంలో మునిగిపోయాడు. రక్షించేవాడు కనబడలేదు. ఆ సమయంలో మార్కండేయమహర్షి ధ్యానానికి సంతోషించి, పురుషోత్తమస్వామి ప్రత్యక్షమైనాడు. భయపడుతున్న మహర్షిని చూచాడు. దయతో ఇలా అన్నాడు.

శ్రీభగవానువాచ :–పురుషోత్తమస్వామి అంటున్నాడు.

వత్స శ్రాన్తోఽసి బాలస్త్వం భక్తశ్చ మమ సువ్రత ।
ఆగచ్ఛాగచ్ఛ శీఘ్రం త్వం మార్కణ్డేయ మమాన్తికమ్ ॥ 19 ॥

నాయనా! మార్కండేయా! చాల శ్రమపడ్డావు. నువ్వు పసివాడివి. నాకు భక్తుడివి. గొప్ప నియమవంతుడివి. రా, త్వరగా నా వద్దకు రా.

మా భైర్వత్స మునిశ్రేష్ఠ సమ్ప్రాప్తోఽసి మమాగ్రతః ।
మార్కణ్డేయ మహాధీర బాలస్త్వం శ్రమపీడితః ॥ 20 ॥

నాయనా! భయపడకు. మహర్షీ! నా దగ్గరకు వచ్చావు గదా (ఇంక భయం లేదు). మార్కండేయా! చిన్నవాడివి. ఎంతో పెద్దకష్టంలో పడ్డావు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

తస్య తద్వచనం శ్రుత్వా మునిః పరమకోపితః ।
ఉవాచ స తదా విప్రా విస్మితశ్చాభవన్ముహుః ॥ 21 ॥

బ్రాహ్మణులారా! ఆ విష్ణుమూర్తి మాటలు విని మార్కండేయమహర్షికి బాగా కోపం వచ్చింది. మళ్లీ మళ్లీ ఆశ్చర్యం కూడ కలిగింది. పురుషోత్తముడితో ఇలా అన్నాడు.

మార్కణ్డేయ ఉవాచ :–మార్కండేయమహర్షి అంటున్నాడు.

కో మన్నామ్నా కీర్తయతి తపః పరిభవన్నివ ।
బహువర్షసహస్రాఖ్యం ధర్షయన్నివ మే వపుః ॥ 22 ॥

ఎవరు నువ్వు? నన్ను పేరుతో పేర్కొంటున్నావు. (బాలుడు అంటూ) నా తపశ్శక్తిని అవమానిస్తున్నావు. ఎన్నో వేల సంవత్సరాల వయసు గలిగిన ఈ శరీరాన్ని అవమానిస్తూ మాట్లాడుతున్నావు.

న హ్యేష సముదాచారో దేవేష్వపి సమాహితః ।
మాం బ్రహ్మా సర్వదేవేశో దీర్ఘాయురితి భాషతే ॥ 23 ॥

ఇది మంచిపద్ధతి కాదు. దేవతలు కూడా నన్ను గౌరవిస్తారు. సమస్తమైన దేవతలకూ ప్రభువైన బ్రహ్మదేవుడే నన్ను 'దీర్ఘాయువు' అని గౌరవిస్తాడు.

కస్తపో ఘోరశిరసో మమాద్య త్యక్తజీవితః ।
మార్కణ్డేయేతి చోక్త్వా మాం మృత్యుం గన్తు మిహేచ్ఛతి ॥ 24 ॥

బ్రదుకుమీద ఆశ వదులుకున్నవా డెవడు? తీవ్రమైన తపస్సుతో సుప్రసిద్ధు డైన నన్ను మార్కండేయా అని పేరుపెట్టి పిలిచి, చావదలచుకున్నవాడెవ్వడు?

బ్రహ్మోవాచ :–బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

ఏవ ముక్త్వా తదా విప్రాశ్చిన్తావిష్టోఽభవ న్మునిః ।
కిం స్వప్నోఽయం మయా దృష్టః కిం వా మోహోఽయ మాగతః ॥ 25 ॥

ద్విజవరులారా! పురుషోత్తముడితో ఇలా అని మార్కండేయుడు విచారించసాగాడు. ఇదేమిటి? నేను కలగన్నానా? లేకపోతే భ్రాంతిపడ్డానా?

ఇత్థం చిన్తయతస్తస్య ఉత్పన్నా దుఃఖహా మతిః ।
వ్రజామి శరణం దేవం భక్త్యాఽహం పురుషోత్తమమ్ ॥ 26 ॥

ఇలా తర్కించుకుంటున్న మార్కండేయమహర్షికి దుఃఖాన్ని పోగొట్టే ఆలోచన కలిగింది. దేవదేవుడైన పురుషోత్తముడిని నేను భక్తితో శరణువేడుకుంటాను.

స గత్వా శరణం విష్ణుం మునిస్తద్గతమానసః ।
దదర్శ తం వటం భూయో విశాలం సలిలోపరి ॥ 27 ॥

అని నిశ్చయించుకుని మార్కండేయుడు విష్ణువుపైన మనసు నిలిపి, ఆ స్వామిని శరణు పొందాడు. అక్కడ లోగడ తాను చూచిన విశాలమైన మఱ్ఱిచెట్టును ఆ నీళ్లమీద తిరిగి కనుగొన్నాడు.

శాఖాయాం తస్య సౌవర్ణం విస్తీర్ణాయాం మహాద్భుతమ్ ।
రుచిరం దివ్యపర్యఙ్కం రచితం విశ్వకర్మణా ॥ 28 ॥

విస్తారమైన ఆ మఱ్ఱిచెట్టుకొమ్మమీద ఒక బంగారుశయనం ఉన్నది. అది చాల అందంగా ఉంది. దానిని విశ్వకర్మ నిర్మించాడు.

వజ్రవైదూర్యరచితం మణివిద్రుమశోభితమ్ ।
పద్మరాగాదిభిర్జుష్టం రత్నైరన్యైరలఙ్కృతమ్ ॥ 29 ॥

ఆ శయ్యపై వజ్రాలు వైడూర్యాలు పొదిగారు. పగడపుమణులతో ప్రకాశిస్తున్నది. పద్మరాగాలు మొదలైన రత్నాలు కూర్చారు. ఇంకా ఇతర రత్నాలు కూడ శయ్య నిండా అమర్చారు.

నానాస్తరణసంవీతం నానారత్నోపశోభితమ్ ।
నానాశ్చర్యసమాయుక్తం ప్రభామణ్డలమణ్డితమ్ ॥ 30 ॥

అనేకవిధమైన పక్కలు పరచబడిఉన్నాయి. రకరకాల రత్నాలతో అందంగా ఉన్నది. చిత్రవిచిత్రంగా ఉంది. కాంతులు, దానిచుట్టూ గొప్పతేజస్సు అలంకారంగా ఉంది.

తస్యోపరి స్థితం దేవం కృష్ణం బాలవపుర్ధరమ్ ।
సూర్యకోటిప్రతీకాశం దీప్యమానం సువర్చసమ్ ॥ 31 ॥

దానిమీద శ్రీకృష్ణస్వామి పసివాడిరూపంలో ఉన్నాడు.ఆ దేవుడు కోటిమందిసూర్యులతో సమానంగా గొప్పతేజస్సుతో ప్రకాశిస్తున్నాడు.

చతుర్భుజం సున్దరాఙ్గం పద్మపత్రాయతేక్షణమ్ ।
శ్రీవత్సవక్షసం దేవం శఙ్ఖచక్రగదాధరమ్ ॥ 32 ॥

స్వామికి నాలుగు బాహువులు ఉన్నాయి. అవయవాలు అన్నీ చాల అందంగా ఉన్నాయి. కళ్లు తామర రేకులలాగా విశాలంగా ఉన్నాయి. వక్షఃస్థలంపైన శ్రీవత్సం అనే మచ్చ ఉన్నది. ఆ దేవుడు శంఖం, చక్రం, గద ధరించి ఉన్నాడు.

వనమాలావృతోరస్కం దివ్యకుణ్డలధారిణమ్ ।
హారభారార్పితగ్రీవం దివ్యరత్నవిభూషితమ్ ॥ 33 ॥

మోకాళ్లవరకూ వేలాడుతూ ఉన్న పెద్దపూలమాల వక్షఃస్థలం మొత్తం కప్పివేస్తున్నది. స్వామి ధరించిన చెవికమ్మలు మిరుమిట్లు గొలుపుతున్నాయి. రకరకాల హారాలు మెడనిండా బరువుగా ఉన్నాయి. దేవలోకంలో పుట్టిన రత్నాలు స్వామిని అలంకరిస్తున్నాయి.

దృష్ట్వా తదా మునిర్దేవం విస్మయోత్ఫుల్లలోచనః ।
రోమాఞ్చితతనుర్దేవం ప్రణిపత్యేదమబ్రవీత్ ॥ 34 ॥

ఆ కృష్ణపరమాత్మను చూస్తుంటే మార్కండేయుడి కన్నులు ఆశ్చర్యంతో విశాల మయ్యాయి. శరీరం పులకలతో నిండింది. సాష్టాంగనమస్కారం చేసి, మహర్షి కృష్ణస్వామితో ఇలా అంటున్నాడు.

మార్కణ్డేయ ఉవాచ :–మార్కండేయుడు అంటున్నాడు.

అహో చైకార్ణవే ఘోరే వినష్టే సచరాచరే ।
కథమేకో హ్యయం బాలస్తిష్ఠత్యత్ర సునిర్భయః ॥ 35 ॥

ఆహా! ఎక్కడ చూచినా సముద్రం మాత్రమే కనబడుతున్నది. స్థావరజంగమస్వరూపమైనసృష్టి అంతా నశించిపోయింది. భయంకరమైన ఈ స్థితిలో ఈ పసివాడు ఒంటరిగా, ఏమాత్రం భయం లేకుండా,ఎలా ఉన్నాడు?

బ్రహ్మోవాచ :–బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

భూతం భవ్యం భవిష్యచ్చ జానన్నపి మహామునిః ।
బుబుధే న తతో దేవం మాయయా తస్య మోహితః ॥ 36 ॥

మార్కండేయమహర్షి జరిగినదీ, జరుగుతున్నదీ, జరగబోయేదీ సమస్తం తెలిసినవాడు. అయినప్పటికీ ఇప్పుడు విష్ణుమాయతో అజ్ఞానంలో పడి, ఏమీ గ్రహించలేకపోయాడు.

యదా న బుబుధే చైనం తదా ఖేదాదువాచ హ ॥ 37 ॥

ఏమీ అర్థం కాకపోవడంతో మార్కండేయుడు దుఃఖపడుతూ ఇలా అంటున్నాడు.

మార్కణ్డేయ ఉవాచ :–మార్కండేయమహర్షి అనుకుంటున్నాడు.

వృథా మే తపసో వీర్యం వృథా జ్ఞానం వృథా క్రియాః ।
వృథా మే జీవితం దీర్ఘం వృథా మానుష్యజన్మ చ ॥
యోఽహం సుప్తం న జానామి పర్యఙ్కే దివ్యబాలకమ్ ॥ 38 ॥

నా తపోబలం అంతా వ్యర్థం. నాకున్న జ్ఞానం పనికిమాలినది. నేను చేసిన సత్కర్మలు అన్నీ లాభం లేనివి. దీర్ఘకాలంగా సాగుతున్న నా బ్రతుకు వ్యర్థం. నేను మనిషిగా పుట్టడమే వృథా. ఈ శయ్యపై నిద్రిస్తున్న మహిమాన్వితుడైన ఈ పసివాడు ఎవరో గుర్తింపలేకపోతున్నాను.

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఇలా చెప్తున్నాడు.

ఏవం సఞ్చిన్తయన్ విప్రః ప్లవమానో విచేతనః ।
త్రాణార్థం విహ్వలశ్చాసౌ నిర్వేదం గతవాంస్తదా ॥ 39 ॥

మార్కండేయుడు ఈవిధంగా ఆలోచిస్తూ ఆ సముద్రంలో ఈదుకుంటూ వెళ్తున్నాడు. రక్షించేవాడు దొరక్క, భయంతో విరక్తి చెందాడు.

తతో బాలార్కసఙ్కాశం స్వమహిమ్నా వ్యవస్థితమ్ ।
బాలతేజోమయం విప్రా న శశాకాభివీక్షితుమ్ ॥ 40 ॥

బ్రాహ్మణులారా! శయ్యపై బాలుడు ఉదయభానుడిలాగా ఉన్నాడు. తన తేజస్సుతో చక్కగా వెలుగుతున్నాడు. పసితనపు వెలుగులతో నిండి ఉన్నాడు. చూడలేకపోయినాడు.

దృష్ట్వా తం మునిమాయాన్తం స బాలః ప్రహసన్నివ ।
ప్రోవాచ మునిశార్దూలాస్తదా మేఘౌఘనిస్వనః ॥ 41 ॥

మహర్షులారా! ఈదుకుంటూ తనవైపుగా వస్తున్నమార్కండేయుడిని చూచి, ఆ బాలుడు చిరునవ్వు నవ్వాడు. మబ్బుల ఒక్కసారిగా అరిచినట్లుగా (పిడుగులు పడిన చప్పుడుతో) మార్కండేయుడితో ఇలా అన్నాడు.

శ్రీభగవానువాచ :- కృష్ణస్వామి మార్కండేయుడితో ఇలా అంటున్నాడు.

వత్స జానామి శ్రాన్తం త్వాం త్రాణార్థం మాముపస్థితమ్ ।
శరీరం విశ మే క్షిప్రం విశ్రామసే మయోదితః ॥ 42 ॥

నాయనా! నువ్వు సముద్రాన్ని తరించడానికి ఈదీ, ఈదీ, చాలా అలిసిపోయావనీ, రక్షణకోసం నా వద్దకు వచ్చావనీ, నాకు తెలుసు. నా శరీరంలో ప్రవేశించు. నాలో చేరినవెంటనే విశ్రాంతిని పొందుతావు.

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

శ్రుత్వా స వచనం తస్య కిఞ్చిన్నోవాచ మోహితః ।
వివేశ వదనం తస్య వివృతం చావశో మునిః ॥ 43 ॥

ఆ బాలుడి మాటలు విని కూడా, మార్కండేయుడు అజ్ఞానంతో ఏమీ బదులు చెప్పలేదు. ఆ మహర్షి తనకు తెలియకుండానే ఆ బాలుడిముఖంలో ప్రవేశించాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే మార్కణ్డేయప్రలయదర్శనం నామ పఞ్చాశత్తమోఽధ్యాయః ॥50 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో మార్కండేయప్రలయదర్శనం అనే యాభైయవ అధ్యాయం॥50॥

ఏకపఞ్చాశత్తమోఽధ్యాయః - యాభైఒకటవ అధ్యాయం

భగవత్కుక్షిపరివర్తనమ్ - భగవత్కుక్షిపరివర్తనం

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

స ప్రవిఽశ్యోదరే తస్య బాలస్య మునిసత్తమః ।
దదర్శ పృథివీం కృత్స్నాం నానాజనపదైఽర్వృతామ్ ॥ 1 ॥

ఆ మార్కండేయమహర్షి ఆ బాలకుడిపొట్టలో ప్రవేశించాడు. ఆ స్వామికడుపులో జననివాసాలతో కూడిన భూమండలం మొత్తాన్నీ చూశాడు.

లవణేక్షుసురాసర్పిర్దధిదుగ్ధజలోదధీన్ ।
దదర్శ తాన్ సముద్రాంశ్చ జమ్బు ప్లక్షం చ శాల్మలమ్ ॥ 2 ॥

కుశం క్రౌఞ్చం చ శాకం చ పుష్కరం చ దదర్శ సః ॥
భారతాదీని వర్షాణి తథా సర్వాంశ్చ పర్వతాన్ ॥ 3 ॥

ఉప్పుసముద్రం, చెరుకురసం సముద్రం, కల్లుసముద్రం, నేతిసముద్రం, పెరుగుసముద్రం, పాలసముద్రం, నీటిసముద్రం అనే సప్తసముద్రాలను స్వామికడుపులో చూశాడు. అలాగే జంబూద్వీపం, ప్లక్షద్వీపం, శాల్మలద్వీపం, కుశద్వీపం, క్రౌంచద్వీపం, శాకద్వీపం, పుష్కరద్వీపం, అనే సప్తద్వీపాలను చూశాడు. భారతం మొదలైన వర్షాలనూ, అన్ని పర్వతాలనూ చూశాడు.

మేరుం చ సర్వరత్నౌఘమపశ్యత్ కనకాచలమ్ ।
నానారత్నాన్వితైశ్శృఙ్గైర్భూషితం బహుకన్దరమ్ ॥ 4 ॥(1)

స్వామికడుపులో ఇంకా మేరుపర్వతాన్ని చూశాడు. అది అన్నిరత్నాలతో నిండిఉంది. ఆ పర్వతం అంతా బంగారమే. ఆ కొండశిఖరాలు రత్నాలతో నిండి ఉన్నాయి. ఆ శిఖరాలు మేరువుకు అలంకారంగా ఉన్నాయి. మేరుపర్వతంలో గుహలు అసంఖ్యాకంగా ఉన్నాయి.

---

(1) 4వ శ్లోకంతర్వాత 5శ్లోకం మొదలుగా అధికపాఠంగా ఈభాగం కొన్నిప్రతులలో కనబడుతున్నది.

1. నానామునిజనాకీర్ణం నానావృక్షవనాకులమ్, నానాసత్త్వసమాయుక్తం నానాశ్చర్యసమన్వితమ్.

మేరుపర్వతం అనేకమంది మహర్షులతో నిండి ఉన్నది. రకరకాలచెట్లు దట్టంగా వ్యాపించిఉన్నాయి. ఆ ప్రాంతమంతటా అనేకవిధాలైన జంతువులు సంచరిస్తున్నాయి. అక్కడ అన్నీ వింతగా ఉన్నాయి. (53. అధస్సూచి. 3, 4)

2. వ్యాఘ్రైస్సింహైర్వరాహైశ్చ చామరైర్మహిషైర్గజైః, మృగైశ్శాఖామృగైశ్చాన్యైర్భూషితం సుమనోహరమ్.

పెద్దపులులు, సింహాలు, అడవిపందులు, చమరీమృగాలు, అడవిదున్నలు, ఏనుగులు, జింకలు, కోతులు, (ఉడుతలు) మొదలైన జంతువులతో ఆ ప్రదేశం మనోహరంగా ప్రకాశిస్తున్నది. (53 అధ్యాయం అధస్సూచి. 4)

3. శక్రాద్యైర్వివిధైర్దేవైస్సిద్ధచారణపన్నగైః, మునియక్షాప్సరోభిశ్చ వృతైశ్చాన్యైస్సురాలయైః.

ఇంద్రుడు మొదలైన దేవతలు, సిద్ధులు, చారణులు, నాగులు, మహర్షులు, యక్షులు, అప్సరసలు, ఇంకా ఇతర దేవలోకనివాసులతో ఆ ప్రదేశం సందడిగా ఉంది. (53 అధ్యాయం అధస్సూచి. 5)

అన్త్యజానన్త్యజాతీంశ్చ సోఽ పశ్యత్తస్య చోదరే ।
మృగాఞ్ఛాఖామృగాన్ సింహాన్ వరాహాన్ సృమరాఞ్ఛశాన్ ॥
గజాంశ్చాన్యాంస్తథా సత్త్వాన్ సోఽ పశ్యత్తస్య చోదరే ॥ 5 ॥

మార్కండేయుడు స్వామిగర్భంలో ఇంకా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రవర్ణాలవారిని అందరినీ చూశాడు. జింకలనూ, కోతులనూ, సింహాలనూ, అడవిపందులనూ, పెద్దచమరీమృగాలనూ, కుందేళ్లనూ, ఏనుగులనూ, ఇంకా రకరకాల ఇతర జంతువులనూ కృష్ణస్వామి గర్భంలో చూశాడు.

పృథివ్యాం యాని తీర్థాని గ్రామాశ్చ నగరాణి చ ।
కృషిగోరక్షవాణిజ్యం క్రయవిక్రయణం తథా ॥ 6 ॥

ఈ భూమండలంమీద ఉన్న పుణ్యతీర్థాలను, గ్రామాలను, నగరాలను, అన్నింటినీ మార్కండేయుడు స్వామిగర్భంలో చూశాడు. అలాగే వ్యవసాయం, ఆవులకాపు, వ్యాపారం, కొనుగోళ్లు, అమ్మకాలు, అన్నీ చూశాడు.

శక్రాదీన్ విబుధాంశ్ఛ్రేష్ఠాంస్తథాన్యాంశ్చ దివౌకసః ।
గన్ధర్వాప్సరసో యక్షాన్ ఋషీంశ్చైవ సనాతనాన్ ॥ 7 ॥

ఇంద్రుడు మొదలైన వరిష్ఠులైన దేవతలనూ, సామాన్య దేవతలనూ గంధర్వులనూ, అప్సరసలనూ, యక్షులనూ, ప్రాచీనమహర్షులనూ, అందరినీ చూశాడు.

దైత్యదానవసర్పాంశ్చ నాగాంశ్చ మునిసత్తమాః ।
సింహికాతనయాంశ్చైవ యే చాన్యే సురశత్రవః ॥ 8 ॥

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

4. ఏవం సుమేరుం శ్రీమన్తమపశ్యన్మునిసత్తమః, పర్యటన్ స తదా విప్రస్తస్య బాలస్య చోదరే.

మార్కండేయమహర్షి ఆ పరమాత్మ కడుపులో అటూ ఇటూ సంచరిస్తూ ఈవిధంగా సంపదలతో సమృద్ధంగా ఉన్న సుమేరుపర్వతాన్ని చూశాడు. (ఇంకా అనేక పర్వతాలను చూశాడు.) (53 అధ్యాయం అధస్సూచి. 6)

5. హిమవన్తం హేమకూటం నిషధం గన్ధమాదనమ్, శ్వేతం చ దుర్ధరం నీలం కైలాసం మన్దరం గిరిమ్.

6. మహేన్ద్రం మలయం విన్ధ్యం పారియాత్రం త థార్బుదమ్, సహ్యం చ శుక్తిమన్తం చ మైనాకం వక్రపర్వతమ్.

హిమాలయం, హేమకూటం, నిషధం, గంధమాదనం, శ్వేతం, దుర్ధరం, నీలం, కైలాసం, మందరం, మహేంద్రం, మలయం, వింధ్యం, పారియాత్రం, అర్బుదం, సహ్యం, శుక్తిమంతం, మైనాకం, వక్రపర్వతమ్, అనే పర్వతాలను మార్కండేయుడు ఆ బాలుడి కడుపులో చూచాడు. (53అధ్యాయం అధస్సూచి. 7, 8)

7. ఏతే చాన్యే చ బహవో యావన్తః పృథివీధరాః, తతస్తాంస్తు మునిశ్రేష్ఠాస్సోఽ పశ్యద్రత్నభూషితాన్.

మహర్షులారా! ఇవి మాత్రమే కాకుండా, ఈ భూమిమీద ఉన్న ఇతర పర్వతాలు అన్నింటినీ కూడ మార్కండేయుడు ఆ బాలుడికడుపులో చూశాడు. అవి అన్నీ రత్నాలతో అలంకరింపబడి ఉన్నాయి. (53 అధ్యాయం అధస్సూచి. 9)

8. కురుక్షేత్రం చ పాఞ్చాలాన్ మత్స్యాన్ మద్రాన్ సకేకయాన్, బాహ్లీకాన్ శూరసేనాంశ్చ కాశ్మీరాంస్తఙ్గణాన్ ఖశాన్, పార్వతీయాన్ కిరాతాంశ్చ కర్ణప్రావరణాన్ మరూన్.

కురుక్షేత్ర, పాంచాల, మత్స్య, మద్ర, కేకయ, బాహ్లీక, శూరసేన, కాశ్మీర, తంగణ, ఖశ,పర్వతప్రాంత, కిరాత, కర్ణప్రావరణ, మరు దేశాలను స్వామికడుపులో మార్కండేయుడు చూశాడు. (53 అధ్యాయం అధస్సూచి. 10)

మహర్షులారా! మార్కండేయుడు స్వామిగర్భంలో దైత్యులనూ, దానవులనూ, సర్పజాతివారినీ, నాగజాతి వారినీ, సింహికకుమారులైన రాహువు మొదలైనవారినీ, ఇంకా దేవతలకు శత్రువులైన ఇతరులనూ అందరినీ చూశాడు.

యత్కిఞ్చిత్తేన లోకేఽస్మిన్ దృష్టపూర్వం చరాచరమ్ ।
అపశ్యత్ స తదా సర్వం తస్య కుక్షౌ ద్విజోత్తమాః ॥ 9 ॥

విప్రవరేణ్యులారా! మార్కండేయుడు ఇంతకుముందు ఈ లోకంలో చూసిన స్థావరాలూ, జంగమాలైన పదార్థాలన్నింటినీ స్వామికడుపులో చూశాడు.

అథ వా కిం బహూక్తేన కీర్తితేన పునః పునః ।
బ్రహ్మాదిస్తమ్బపర్యన్తం యత్కిఞ్చిత్ సచరాచరమ్ ॥ 10 ॥

అయినా, ఎక్కువమాట లెందుకు? మళ్లీ మళ్లీ చెప్పనవసరం లేదు. బ్రహ్మ మొదలుకొని గడ్డిపరకవరకూ స్థావరజంగమాలైన సమస్తపదార్థాలూ స్వామిగర్భంలో మార్కండేయుడు చూశాడు.

భూలోకం చ భువర్లోకం స్వర్లోకం చ ద్విజోత్తమాః ।
మహర్జనస్తపస్సత్యమతలం వితలం తథా ॥ 11 ॥

పాతాలం భూతలఞ్చైవ వితలం చ రసాతలమ్ ।
మహాతలం చ బ్రహ్మాణ్డఽమపశ్యత్తస్య చోదరే ॥ 12 ॥

బ్రాహ్మణోత్తములారా! భూలోకం, భువర్లోకం, స్వర్గలోకం, మహోలోకం, జనోలోకం, తపోలోకం, సత్యలోకం అనే ఊర్ధ్వలోకాలు ఏడూ అక్కడ చూశాడు. ఇంకా అతలం, వితలం, పాతాళం, భూతలం, రసాతలం, మహాతలం సుతలా అనే అధోలోకాలు ఏడూ స్వామిగర్భంలో కనిపించాయి. (ఇందులో వితలం రెండుసార్లు చెప్పబడింది. భూతలం చేరింది.) (అధోలోకాలు–అతల, వితల, సుతల, రసాతల, తలాతల, మహాతల, పాతాళాలు. పాతాలం సుతలఞ్చైవ తలాతలరసాతలౌ' అని ఉండవచ్చునేమో.)

అవ్యాహతా గతిస్తస్య తదాభూద్ ద్విజసత్తమాః ।
ప్రసాదాత్తస్య దేవస్య స్మృతిలోపశ్చ నాభవత్ ॥ 13 ॥

బ్రాహ్మణోత్తములారా! ఆ పరమాత్మ అనుగ్రహవిశేషంచేత మార్కండేయుడు ఎటువంటి అవరోధం లేకుండా ముందుకు సాగాడు. ఆ మహర్షికి భ్రాంతి తొలగిపోయింది.

భ్రమమాణస్తదా కుక్షౌ కృత్స్నం జగదిదం ద్విజాః ।
నాన్తం జగామ దేహస్య తస్య విష్ణోః కదాచన ॥ 14 ॥

విప్రులారా! స్వామిఉదరంలో సంచరిస్తున్న మార్కండేయుడు ఈ లోకాలన్నింటినీ చూశాడు. కాని స్వామి గర్భంలో ఏవైపుగా కూడ, సముద్రంఅంచుకు ఎంతకాలానికీ చేరుకోలేకపోయాడు.

యదాసౌ నాగతఽశ్చాన్తం తస్య దేహస్య భో ద్విజాః ।
తదా తం వరదం దేవం శరణం గతవాన్ మునిః ॥ 15 ॥

బ్రాహ్మణులారా! స్వామిశరీరంలో చివరిభాగానికి చేరుకోలేకపోయిన మార్కండేయమహర్షి కోరికలను నెరవేర్చే ఆ దేవదేవుడిని శరణు పొందాడు.

తతోఽఽసౌ సహసా విప్రా వాయువేగేన నిస్సృతః ।
మహాత్మనో ముఖాఽత్తస్య వివృతాత్ పురుషస్య సః ॥ 16 ॥

ద్విజులారా! ఆ మహాపురుషుడు నోరు తెరిచాడు. అప్పుడు మార్కండేయుడు పరమాత్మగర్భంలోనుండి, ఆ స్వామి నోటిగుండా, వాయువేగంతో వెలుపలకు వచ్చాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే భగవత్కుక్షిపరివర్తనం నామ ఏకపఞ్చాశత్తమోఽధ్యాయః ॥51॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో భగవత్కుక్షిపరివర్తనం (మార్కండేయుడు భగవానుడి కడుపులో పరిభ్రమించడం) అనే యాభైఒకటవ అధ్యాయం ॥ 51 ॥



ద్విపఞ్చాశత్తమోఽధ్యాయః - యాభైరెండవ అధ్యాయం

భగవత్స్తవనిరూపణమ్ - భగవత్స్తవనిరూపణం

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

స నిష్క్రమ్యోదరాత్తస్య బాలస్య మునిసత్తమాః ।
పునశ్చైకార్ణవాముర్వీమపశ్యజ్జనవర్జితామ్ ॥ 1 ॥

మహర్షివరులారా! మార్కండేయుడు ఆ బాలుడికడుపులోనుండి బయటకు వచ్చాడు. మళ్లీ సమస్తం ఒకటే సముద్రంగా ఉన్న భూమిని చూశాడు. ఆ నేలమీద ప్రాణులు ఎవరూ లేరు.

పూర్వదృష్టం చ తం దేవం దదర్శ శిశురూపిణమ్ ।
శాఖాయాం వటవృక్షస్య పర్యఙ్కోపరి సంస్థితమ్ ॥ 2 ॥

అంతకు ముందు తాను చూచిన, బాలుడిరూపంలో ఉన్న దేవుడిని కూడ మళ్లీ చూశాడు. ఆతడు మఱ్ఱిచెట్టు కొమ్మమీద ఉన్న శయ్యపై ఉన్నాడు.

శ్రీవత్సవక్షసం దేవం పీతవస్త్రం చతుర్భుజమ్ ।
జగదాదాయ తిష్ఠన్తం పద్మపత్రాయతేక్షణమ్ ॥ 3 ॥

ఆ స్వామి గుండెమీద శ్రీవత్సం అనే మచ్చ ఉన్నది. పచ్చని పట్టువస్త్రం ధరించాడు. అతడికి నాలుగు చేతులు ఉన్నాయి. కన్నులు తామరరేకులలాగా విశాలంగా ఉన్నాయి. లోకాలన్నింటినీ ధరించి ఉన్నాడు.

సోఽపి తం మునిమాయాన్తం ప్లవమానఽమచేతనమ్ ।
దృష్ట్వా ముఖాద్వినిష్క్రాన్తం ప్రోవాచ ప్రహసన్నివ ॥ 4 ॥

ఆ సముద్రంలో ఈదుతూ, తననోటినుండి వెలువడి, చేష్టలుడిగిఉన్న మార్కండేయమహర్షిని చూచి, నవ్వుతూ బాలుడిరూపంలో ఉన్న కృష్ణస్వామి ఇలా అన్నాడు.

శ్రీభగవానువాచ :- మార్కండేయుడితో కృష్ణస్వామి ఈవిధంగా అంటున్నాడు.

కచ్చిత్త్వయోషితం వత్స విశ్రాన్తం చ మమోదరే ।
భ్రమమాణశ్చ కిం తత్ర ఆశ్చర్యం దృష్టవానసి ॥ 5 ॥

నాయనా! నీవు నా గర్భంలో సుఖంగా ఉన్నావు గదా. అక్కడ తిరుగుతున్న సమయంలో అక్కడ ఏమేమి వింతలు చూశావు?

భక్తోఽసి మే మునిశ్రేష్ఠ శ్రాన్తోఽసి చ మఽమాశ్రితః ।
తేన త్వాముపకారాయ సమ్భాషే పశ్య మామిహ ॥ 6 ॥

మహర్షీ! నీవు నాకు భక్తుడివి. కష్టపడ్డావు. నన్ను ఆశ్రయించావు. అందుచేత నీకు మేలు చేయడంకోసం చెప్తున్నాను. నా వైపు చూడు.

బ్రహ్మోవాచ:-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

శ్రుత్వా స వచనం తస్య సమ్ప్రహృష్టతనూరుహః ।
దదర్శ తం సుదుష్ప్రేక్షం రత్నైర్దివ్యైరలఙ్కృతమ్ ॥ 7 ॥

కృష్ణస్వామి పలుకులు విని మార్కండేయమహర్షి పులకించాడు. ఎంతటివారికి కూడ కానరాని ఆ స్వామి దివ్యమైనరత్నాల అలంకారాలతో మార్కండేయుడికి కనిపించాడు.

ప్రసన్నా నిర్మలా దృష్టిర్ముహూర్తాత్తస్య భో ద్విజాః ।
ప్రసాదాత్తస్య దేవస్య ప్రాదుర్భూతా పునర్నవా ॥ 8 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆ స్వామి అనుగ్రహంచేత ఒక్క క్షణంలోనే మార్కండేయుడి చూపులో కొత్తదనం ఏర్పడింది. ఆ చూపులో కలతలు తొలగిపోయాయి, నిర్మలంగా ఉంది.

రక్తాఙ్గులితలౌ పాదౌ తతస్తస్య సురార్చితౌ ।
ప్రణమ్య శిరసా విప్రా హర్షగద్గదయా గిరా ॥ 9 ॥

కృతాఞ్జలిస్తదా హృష్టో విస్మితశ్చ పునః పునః ।
దృష్ట్వా తం పరమాత్మానం సంస్తోతు ముపచక్రమే ॥ 10 ॥

ద్విజులారా! స్వామిపాదాల వేళ్లభాగాలు సుకుమారంగా, ఎఱ్ఱగా ఉన్నాయి. ఆ పాదాలను దేవతలు ఎప్పుడూ పూజిస్తారు. మార్కండేయుడు స్వామిపాదాలకు తలవంచి నమస్కరించాడు. చేతులు జోడించాడు. స్వామిపై చూపు నిలిపాడు. ఆశ్చర్యంతోనూ, మళ్లీ మళ్లీ ఆనందంతోనూ గరగరలాడుతున్నగొంతుతో మహర్షి స్వామిని ఇలా స్తుతించడం ప్రారంభించాడు.

మార్కణ్డేయ ఉవాచ :-మార్కండేయుడు కృష్ణస్వామిని ఈవిధంగా స్తుతిస్తున్నాడు.

దేవదేవ జగన్నాథ మాయాబాలవపుర్ధర ।
త్రాహి మాం చారుపద్మాక్ష దుఃఖితం శరణాగతమ్ ॥ 11 ॥

దేవతలకే దేవుడా! లోకేశ్వరా! అసత్యమైనపిల్లవాడిరూపం ధరించినవాడా! అందమైన తామరలవంటి కన్నులు గలవాడా! బాధతో నీ శరణుచొచ్చిన నన్ను కాపాడు.

సన్తప్తోఽస్మి సురశ్రేష్ఠ సంవర్తాఖ్యేన వహ్నినా ।
అఙ్గారవర్షభీతం చ త్రాహి మాం పురుషోత్తమ ॥ 12 ॥

దేవవరేణ్యా! సంవర్తం అనే ఈ అగ్నివలన బాధపడుతున్నాను. నిప్పులవానకు భయపడుతున్నాను. పురుషోత్తమా! నన్ను కాపాడు.

శోషితశ్చ ప్రచణ్డేన వాయునా జగదాయునా ।
విహ్వలోఽహం తథా శ్రాన్తస్త్రాహి మాం పురుషోత్తమ ॥ 13 ॥

లోకాలకు ప్రాణాలు పోసే గాలి భయంకరంగా వీస్తున్నది. ఈ సుడిగాలికి వాడిపోయాను. బెదిరిపోయాను. అలసిపోయాను. పురుషోత్తమా! నన్ను కాపాడు.

తాపితశ్చ తథాదిత్యైః ప్రలయావర్తకాదిభిః ।
న శాన్తిమధిగచ్ఛామి త్రాహి మాం పురుషోత్తమ ॥ 14 ॥

ప్రళయకాలంనాటి పన్నెండుమంది ఆదిత్యులతోనూ, ప్రళయకాలపు మేఘాలతోనూ తపింపచేయబడ్డాను. నాకు శాంతి లేకుండాపోయింది. పురుషోత్తమా! నన్ను కాపాడు.

తృషితశ్చ క్షుధావిష్టో దుఃఖితశ్చ జగత్పతే ।
త్రాతారం నాత్ర పశ్యామి త్రాహి మాం పురుషోత్తమ ॥ 15 ॥

ఓ లోకరక్షకా! నాకు దాహంగా ఉంది. ఆకలి ఆవేశించింది. బాధ మిక్కుటమైంది. ఇక్కడ కాపాడేవాడు కనబడడం లేదు. పురుషోత్తమా! నీవే నన్ను కాపాడు.

అస్మిన్నేకార్ణవే ఘోరే వినష్టే సచరాచరే ।
న చాన్తమధిగచ్ఛామి త్రాహి మాం పురుషోత్తమ ॥ 16 ॥

సమస్తం ఒకటే సముద్రం అయింది. ఈ సముద్రం భయంకరంగా ఉంది. ప్రళయాగ్నిలో స్థావరజంగమాత్మకమైన సృష్టి అంతా నశించిపోయింది. ఈసముద్రానికి అంతు కనబడడం లేదు. పురుషోత్తమా! నన్నుకాపాడు.

తవోదరే చ దేవేశ మయా దృష్టం చరాచరమ్ ।
విస్మితోఽహం విషణ్ణశ్చ త్రాహి మాం పురుషోత్తమ ॥ 17 ॥

దేవరక్షకా! స్థావరం, జంగమమైన సృష్టి సమస్తమూ నీ గర్భంలో చూశాను. ఆశ్చర్యం కలిగింది. దుఃఖమూ కలిగింది. పురుషోత్తమా! నన్ను కాపాడు.

సంసారేఽస్మిన్నిరాలమ్బే ప్రసీద పురుషోత్తమ ।
ప్రసీద విబుధశ్రేష్ఠ ప్రసీద విబుధప్రియ ॥ 18 ॥

పురుషోత్తమా! ఈ సంసారంలో దిక్కు తోచటం లేదు (సంసారంనుండి బయటపడే మార్గం తెలియడం లేదు). నీవే దిక్కు. దయ చూపించు. దేవతావరేణ్యా! ఉద్ధరించు. జ్ఞానులను ఇష్టపడేవాడా! నన్ను రక్షించు.

ప్రసీద విబుధాం నాథ ప్రసీద విబుధాశ్రయ ।
ప్రసీద సర్వలోకేశ జగత్కారణకారణ ॥ 19 ॥

దేవతలను రక్షించేవాడా! నన్ను అనుగ్రహించు. దేవతలు ఆశ్రయించేవాడా! దయ చూపు. లోకాలన్నింటికీ అధిపతీ! జగత్తులకు కారణమైన దానికే కారణమైనవాడా! నాకు ప్రసన్నుడివి కా.

ప్రసీద సర్వదేవేశ ప్రసీద మమ భూధర ।
ప్రసీద సలిలావాస ప్రసీద మధుసూదన ॥ 20 ॥

దేవతలరాజా! నన్ను కాపాడు. భూభారాన్ని భరించేవాడా! రక్షించు. పాలసముద్రంలో నివసించేవాడా! అనుగ్రహించు. మధువనే రాక్షసుడిని సంహరించినవాడా! పాలించు.

ప్రసీద కమలాకాన్త ప్రసీద త్రిదశేశ్వర ।
ప్రసీద కంసకేశిఘ్న ప్రసీదారిష్టనాశన ॥ 21 ॥

లక్ష్మీపతీ! అనుగ్రహించు. దేవతానాయకా! ప్రసన్నుడివికా. కంసుడినీ, కేశి అనే రాక్షసుడినీ సంహరించిన వాడా! రక్షించు. బాధలు తొలగించేవాడా! కాపాడు.

ప్రసీద కృష్ణ దైత్యఘ్న ప్రసీద దనుజాన్తక ।
ప్రసీద మధురావాస ప్రసీద యదునన్దన ॥ 22 ॥

శ్రీకృష్ణా! దితిపుత్రులను నిర్మూలించేవాడా! కాపాడు. దనువుసంతానాన్ని సంహరించేవాడా! రక్షించు. మధురానగరంలో నివసించేవాడా! అనుగ్రహించు. యదుకుమారా! పాలించు.

ప్రసీద శక్రావరజ ప్రసీద వరదావ్యయ ।
త్వం మహీ త్వం జలం దేవ త్వమగ్నిస్త్వం సమీరణః ॥ 23 ॥

ఉపేంద్రా! అనుగ్రహించు. వరాలను ప్రసాదించేవాడా! కాపాడు. శాశ్వతమైనవాడా! నేల నీవే. నీరు నీవే. నిప్పు నీవే. గాలి నీవే.

త్వం నభస్త్వం మనశ్చైవ త్వమహఙ్కార ఏవ చ ।
త్వం బుద్ధిః ప్రకృతిశ్చైవ సత్త్వాద్యాస్త్వం జగత్పతే ॥ 24 ॥

జగన్నాథా! నింగి నీవే. మనస్సు నీవే. అహంకారం నీవే. బుద్ధి నీవే. ప్రకృతి నీవే. సత్త్వం, రజస్సు, తమస్సు అనే గుణాలు నీవే.

పురుషస్త్వం జగద్బీజం పురుషాదపి చోత్తమః ।
త్వమిన్ద్రియాణి సర్వాణి శబ్దాద్యా విషయాః ప్రభో ॥ 25 ॥

ప్రభూ! పురుషుడు నీవే. జగత్తుకు మూలం నీవే. పురుషుడికంటె ఉత్తముడైన పరమాత్మ (ప్రధాన పురుషేశ్వరః) నీవే. ఇంద్రియాలు అన్నీ నీవే. శబ్దస్పర్శరూపరసగంధాలనే ఇంద్రియవిషయాలు నీవే.

త్వం దిక్పాలాశ్చ ధర్మాశ్చ వేదా యజ్ఞాస్సదక్షిణాః ।
త్వమిన్ద్రస్త్వం శివో దేవస్త్వం హవిస్త్వం హుతాశనః ॥ 26 ॥

దేవా! దిక్కులను పాలించేవారు అందరూ నీవే. ధర్మాలు అన్నీ నీవే. వేదాలు నీవే. గొప్పదక్షిణలతో కూడిన యజ్ఞాలు నీవే. ఇంద్రుడు నీవే. శివుడు నీవే. హవిస్సు నీవే. హోమాగ్ని నీవే.

త్వం యమః పితృరాట్ దేవ త్వం రక్షోధిపతిస్స్వయమ్ ।
వరుణస్త్వమపాం నాథస్త్వం వాయుస్త్వం ధనేశ్వరః ॥ 27 ॥

దేవా! పితరులకు రాజైన యముడు(దక్షిణదిక్పాలకుడు) నీవే. రాక్షసాధిపతి ఐన నిరృతి (నైఋతి విదిక్కుకు అధిపతి) నీవే. జలాధిపతి ఐనవరుణుడు (పశ్చిమ దిక్పాలకుడు) నీవే. వాయువు (వాయవ్య విదిక్కుకు అధిపతి) నీవే. కుబేరుడు (ఉత్తర దిక్పాలకుడు) నీవే.

త్వమీశానస్త్వమనన్తస్త్వం గణేశశ్చ షణ్ముఖః ।
వసవస్త్వం తథా రుద్రాస్త్వమాదిత్యాశ్చ ఖేచరాః ॥ 28 ॥

ఈశానుడు (ఐశాన్య విదిక్కుకు అధిపతి) నీవే. ఆదిశేషుడు నీవే. గణపతి నీవే. కుమారస్వామి నీవే.ఎనిమిది మంది వసువులు నీవే. పదకొండుమంది రుద్రులు నీవే. ఆకాశంలో సంచరించే పన్నెండుమంది ఆదిత్యులు నీవే.

దానవాస్త్వం తథా యక్షా స్త్వం దైత్యాస్సమరుద్గణాః ।
సిద్ధాశ్చాప్సరసో నాగా గన్ధర్వాస్త్వం సచారణాః ॥ 29 ॥

దానవులు నీవే. యక్షులు నీవే. దైత్యులు నీవే. మరుద్గణాలు నీవే. సిద్ధులు నీవే. అప్సరసలు నీవే. నాగులు నీవే. గంధర్వులు నీవే. చారణులు నీవే.

పితరో వాలఖిల్యాశ్చ ప్రజానాం పతయోఽచ్యుత ।
మునయస్త్వమృషిగణాస్త్వమశ్వినౌ నిశాచరాః ॥
అన్యాశ్చ జాతయస్త్వం హి యత్కిఞ్చిజ్జీవసంజ్ఞితమ్ ॥ 30 ॥

స్థిరంగా ఉండేవాడా! పితృదేవతలు నీవే. వాలఖిల్యుడు మొదలైన మహర్షులు నీవే. ప్రజాపతులు నీవే. మునులు నీవే. ఋషుల సమూహాలు నీవే. అశ్వినీకుమారులు నీవే. రాక్షసులు నీవే. ఇంకా ఇతరంగా ఉన్న జీవులు అనబడే జాతులు మొత్తం నీవే.

కిఞ్చాత్ర బహునోక్తేన బ్రహ్మాదిస్తమ్బగోచరమ్ ।
భూతం భవ్యం భవిష్యం చ త్వం జగత్ సచరాచరమ్ ॥ 31 ॥

ఎక్కువ మాట లెందుకు? బ్రహ్మ నుంచి గడ్డిపరక వరకు సమస్తమూ నీవే. ఇంతకు ముందు ఉన్నదీ, ఇప్పుడు ఉన్నదీ, ఇంక ముందు ఉండబోయేదీ (భూత, భవిష్యద్, వర్తమానాలలో ఉండే పదార్థం) అంతా నీవే. జంగమ, స్థావరాలైన పదార్థాలతో ఏర్పడిన ఈ ప్రపంచం మొత్తమూ నీవే.

యత్తే రూపం పరం దేవ కూటస్థమచలం ధ్రువమ్ ।
బ్రహ్మాద్యాస్తన్న జానన్తి కథమన్యేఽల్పమేధసః? ॥ 32 ॥

దేవా! ఎప్పుడూ ఎటువంటి మార్పులూ లేనిదీ, చలించనిదీ, నిశ్చయమైనదీ, అన్నింటికంటె ఉత్తమ మైన నీరూపాన్ని బ్రహ్మ మొదలైనవారే తెలుసుకోలేరు. ఇంక కొంచెపుబుద్ధి గలిగిన మానవులు మొదలైనవారు ఎలా తెలుసుకుంటారు?

దేవ శుద్ధస్వభావోఽసి నిత్యస్త్వం ప్రకృతేః పరః ।
అవ్యక్తశ్శాశ్వతోఽనన్తస్సర్వవ్యాపీ మహేశ్వరః ॥ 33 ॥

దేవా! నీవు సత్యస్వరూపుడివి. వికారాలు లేనివాడివి. ప్రకృతికంటె పరమైనవాడివి. ఎవ్వరికీ తెలియరాని వాడివి. ఎల్లకాలమూ ఉండేవాడివి. అంతం లేనివాడివి.అంతటా నిండిఉంటావు. అన్నింటిపైన ఆధిపత్యం కలిగిన మహేశ్వరుడివి.

త్వమాకాశః పరశ్శాన్తో అజస్త్వం విభురవ్యయః ।
ఏవం త్వాం నిర్గుణం స్తోతుం కశ్శక్నోతి నిరఞ్జనమ్ ॥ 34 ॥

నీవు ఉత్తమమైన ఆకాశం. శాంతుడివి. పుట్టుక లేనివాడివి. వైభవం కలిగినవాడివి. మార్పు లేనివాడివి. ఏ దోషమూ లేని పరమాత్మవైన నిన్ను స్తుతించడం ఎవరికీ సాధ్యం కాదు.

స్తుతోఽసి యన్మయా దేవ వికలేనాల్పచేతసా ।
తత్సర్వం దేవదేవేశ క్షన్తుమర్హసి చావ్యయ ॥ 35 ॥

దేవా! మార్పు లేనివాడా! నాకు బుద్ధి తక్కువ. అది కూడ కలత చెంది ఉంది. అయినప్పటికీ నిన్ను స్తుతించాను. నా మాటలు అన్నింటినీ క్షమించు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భృషిసంవాదే భగవత్స్తవనిరూపణం నామ ద్విపఞ్చాశత్తమోఽధ్యాయః ॥ 52 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో భగవత్స్తవనిరూపణం అనే యాభైరెండవ అధ్యాయం సంపూర్ణం.



త్రిపఞ్చాశత్తమోఽధ్యాయః - యాభైమూడవ అధ్యాయం

శ్రీభగవద్దర్శనమ్ - శ్రీభగవద్దర్శనం

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఇత్థం స్తుతస్తదా తేన మార్కణ్డేయేన భో ద్విజాః ।
ప్రీతః ప్రోవాచ భగవాన్ మేఘగమ్భీరయా గిరా ॥ 1 ॥

ఓ బ్రాహ్మణులారా! మార్కండేయమహర్షి చేసిన ఈ స్తోత్రానికి కృష్ణపరమాత్మ సంతోషించాడు. పిదప స్వామి గంభీరంగా పిడుగులవంటి ధ్వనితో మార్కండేయుడితో ఇలా అన్నాడు.

శ్రీభగవానువాచ :–విష్ణుభగవానుడు మార్కండేయుడితో ఈవిధంగా అంటున్నాడు.

బ్రూహి కామం మునిశ్రేష్ఠ యత్తే మనసి వర్తతే ।
దదామి సర్వం విప్రర్షే మత్తో యదభివాఞ్ఛసి ॥ 2 ॥

మునివరేణ్యా! నీ మనసులో ఉన్న కోరిక ఏమిటో చెప్పు. బ్రహ్మర్షీ, నా వలన నీకు కావలసినది సమస్తం ఇస్తాను.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

శ్రుత్వా స వచనం విప్రాశ్శిశోస్తస్య మహాత్మనః ।
ఉవాచ పరమప్రీతో మునిస్తద్గతమానసః ॥ 3 ॥

బ్రాహ్మణులారా! ఆపసివాడిరూపంలో ఉన్న పరమాత్మపలుకులు విని మార్కండేయమహర్షి ఆ స్వామిపై మనసు నిలిపి, సంతోషంగా ఇలా అన్నాడు.

మార్కణ్డేయ ఉవాచ :–బాలకుడితో మార్కండేయమహర్షి ఈవిధంగా అంటున్నాడు.

జ్ఞాతుమిచ్ఛామి దేవ త్వాం మాయాం వై తవ మోక్షద ।
త్వత్ప్రసాదాచ్చ దేవేశ స్మృతిర్న పరిహీయతే ॥ 4 ॥

దేవా! మోక్షాన్ని అనుగ్రహించే స్వామీ! నీ వెవరో, నీ మాయ ఏమిటో తెలుసుకో గోరుతున్నాను.సురేశ్వరా, నీ దయవల్ల నాకు జ్ఞాపకశక్తి తగ్గిపోలేదు.

ద్రుతమన్తశ్శరీరేణ సతతం పరివర్తితమ్ ।
ఇచ్ఛామి పుణ్డరీకాక్ష జ్ఞాతుం త్వామహమవ్యయమ్ ॥ 5 ॥

5శ్లోకం తర్వాత అధికపాఠంగా ఈభాగం కొన్నిప్రతులలో కనబడుతున్నది.

1. **ఆస్యేన తే ప్రవిష్టోఽహం శరీరం భగవంస్తవ, దృష్టవాన్ భగవన్ లోకాన్ సమస్తాన్ జఠరే హి తే.**
పరమాత్మా, నీ నోటిగుండా నేను నీ శరీరంలోకి ప్రవేశించాను. మహానుభావా, నీ గర్భంలో లోకాలలన్నింటినీ చూశాను.

కమలనయనా! నీ గర్భంలో నిరంతరంగా జరుగుతున్న వింతలను త్వరగా తెలుసుకోవాలని కోరికగా ఉంది. (ప్రళయంలో అన్నీ నశించినప్పటికీ నిలిచిఉండి) శాశ్వతుడివైన నిన్ను గూర్చి తెలుసుకోవాలని ఉంది.

---

2. తవ దేవ శరీరస్థా దేవదానవరాక్షసాః, యక్షగన్ధర్వనాగాంశ్చ జగత్ స్థావరజఙ్గమమ్.

దేవా, దేవతలూ, దానవులూ, రాక్షసులూ, యక్షులూ, గంధర్వులూ, నాగులూ, చరాచరమైన సృష్టి సమస్తం నీ శరీరంలోనే ఉన్నది.

3. నానామునిజనాకీర్ణం నానాధాతువిభూషితమ్, నానాద్రుమలతాకీర్ణం నానాప్రస్రవణాకులమ్.

అనేకులైన మహర్షులతోనూ, రకరకాల ధాతువులతోనూ, చెట్లతోనూ, తీగలతోనూ, సెలయేరులతోనూ కూడిఉన్నది.

4. నానాసత్త్వసమాకీర్ణం నానాశ్చర్యసమన్వితమ్, వ్యాఘ్రైస్సింహైర్వరాహైశ్చ చమరైర్మహిషైర్గజైః, మృగైశ్శాఖామృగైశ్చాన్యైర్భూషితం సుమనోహరమ్.

ఆ(మేరుపర్వత)ప్రాంత మంతటా అనేకవిధమైన జంతువులు సంచరిస్తున్నాయి. అక్కడ అన్నీ వింతగా ఉన్నాయి. పెద్దపులులు, సింహాలు, అడవిపందులు, చమరీమృగాలు, అడవిదున్నలు, ఏనుగులు, జింకలు, కోతులు, (ఉడుతలు) మొదలైన జంతువులతో ఆ ప్రదేశం మనోహరంగా ప్రకాశిస్తున్నది. (51అధ్యాయం అధస్సూచి. 2)

5. శక్రాద్యైర్వివిధైర్దేవైస్సిద్ధచారణపన్నగైః, మునియక్షాప్సరోభిశ్చ వృతఞ్చాన్యైస్సురాలయైః.

ఇంద్రుడు మొదలైన దేవతలు, సిద్ధులు, చారణులు, నాగులు, మహర్షులు, యక్షులు, అప్సరసలు, ఇంకా ఇతరమైన దేవలోకనివాసులతో ఆ ప్రదేశం సందడిగా ఉంది. (51అధ్యాయం అధస్సూచి. 3)

(**బ్రహ్మోవాచ –** మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు. ఇక్కడ ఇది లేదు. కాని ఇక పైశ్లోకాలలో మార్కండేయమహర్షి ప్రథమపురుషార్థంలో పేర్కొనబడుతుండడాన్నిబట్టి ఇక్కడ ఈ వచనం ఉండాలి. 51అధ్యాయం అధస్సూచికలో ఉంది.)

6. ఏవం సుమేరుం శ్రీమన్తమపశ్యన్మునిసత్తమః, పర్యటన్ స తదా విప్రస్తస్య బాలస్య చోదరే.

మార్కండేయమహర్షి ఆ పరమాత్మ కడుపులో అటూ ఇటూ సంచరిస్తూ, సంపదలతో సమృద్ధంగా ఉన్న సుమేరుపర్వతాన్ని చూశాడు. (ఇంకా అనేకపర్వతాలను చూశాడు.) (51అధ్యాయం అధస్సూచి. 4) (**ఏవం సుమేరుసీమాన్తం తతోఽహం మునిసత్తమః, పర్యటంస్తు తదా విప్రస్తవ బాలస్య చోదరే.** అని నాగ్‌పబ్లిషర్సు ముద్రితప్రతిలో ఉంది. మునిసత్తమః అహం అనే దానికంటె పైపాఠం మేలనిపిస్తుంది)

7. హిమవన్తం హేమకూటం నిషధం గన్ధమాదనమ్, శ్వేతం చ కఙ్కనీలం చ కైలాసం దుర్దరం గిరిమ్,

8. మహేన్ద్రం మలయం విన్ధ్యం పారియాత్రం తథార్బుదమ్, సహ్యం చ శుక్తిమన్తం చ మైనాకం చక్రపర్వతమ్.

హిమాలయం, హేమకూటం, నిషధం, గంధమాదనం, శ్వేతం, కంకనీలం, కైలాసం, దుర్ధరపర్వతం, మహేంద్రం, మలయం, వింధ్యం, పారియాత్రం, అర్బుదం, సహ్యం, శుక్తిమంతం, మైనాకం, చక్రపర్వతం, (అనే పర్వతాలను మార్కండేయుడు ఆ బాలుడి కడుపులో చూచాడు.) (51అధ్యాయం అధస్సూచి. 5,6)

9. ఏతే చాన్యే చ బహవో యావన్తః పృథివీధరాః, తతస్తాంస్తు మునిశ్రేష్ఠాస్సోఽపశ్యద్రత్నభూషితాన్.

మహర్షులారా! ఇవి మాత్రమే కాకుండా, ఈభూమిమీద ఉన్న ఇతరమైన పర్వతాలు అన్నింటినీ కూడ మార్కండేయుడు ఆ బాలుడి కడుపులో చూశాడు. అవి అన్నీ రత్నాలతో అలంకరింపబడిఉన్నాయి. (51అధ్యాయం అధస్సూచి. 7) (**ఏవం చాన్యే చ బహవో యావన్తః పృథివీధరాః, తాంస్తు దేవ మునిశ్రేష్ఠస్సోఽపశ్యం రత్నభూషితాన్.** అని నాగ్‌పబ్లిషర్సు ప్రతి. మునిశ్రేష్ఠః సః అహం అపశ్యం అన్నచోట ఉత్తమపురుషక్రియాపదం అన్వయం కూడ క్లిష్టం. మునిశ్రేష్ఠస్సః అనేచోట అహం శబ్దం అధ్యాహారం చేసుకోవాలి. అన్వయం విశేషమే.)

ఇహ భూత్వా శిశుస్సాక్షాత్ కిం భవానవతిష్ఠతే ।
పీత్వా జగదిదం సర్వమేతదాఖ్యాతుమర్హసి ॥ 6 ॥

---

10. కురుక్షేత్రం చ పాఞ్చాల్యం మత్స్యమద్రాన్ సకేకయాన్, బాహ్లీకాన్ శూరసేనాంశ్చ కాశ్మీరాన్ సగణాంశ్చ తాన్, పార్వతీయాన్ కిరాతాంశ్చ కర్ణప్రావరణాన్ వరాన్.

శ్రేష్ఠమైన కురుక్షేత్ర, పాంచాల, మత్స్య, మద్ర, కేకయ, బాహ్లీక, శూరసేన, కాశ్మీర, సగణ, ఖశ, పర్వతప్రాంత, కిరాత, కర్ణ ప్రావరణ,దేశాల(ప్రజల)ను స్వామికడుపులో మార్కండేయుడు చూశాడు.(51అధ్యాయం అధస్సూచి.8) (ఇంతవరకు 51 అధ్యాయంలో అధికంగా ఉన్నభాగమే యిక్కడ గూడ దాదాపు యథాతథంగా ఉంది. ఇక్కడ నుండి నాగ్‌ప్రతిలో విశేషం.)

11. ఏకపాదాన్ ద్విపాదాంశ్చ త్రిపాదాన్ బహునేత్రకాన్, ఐన్ద్రప్రాగ్జ్యోతిషాంశ్చైవ కామ్బోజాంస్తామ్రలిప్తకాన్.

ఒక్కకాలు ఉన్నవారు, రెండుకాళ్లవాళ్లు, మూడుకాళ్లవాళ్లు, అనేక కళ్లు కలిగినవాళ్లు, ఇంద్ర, ప్రాగ్జ్యోతిష, కాంభోజ, తామ్రలిప్త దేశాల(ప్రజల)ను చూశాడు.

12. అఙ్గాన్ వఙ్గాన్ ససుహ్మాంశ్చ కలాపాంశ్చోత్కలాన్ ద్విజః, మహోరగాన్ కాలిఙ్గాంశ్చ కోఙ్కణానర్బుదాని చ.

మార్కండేయుడు ఇంకా అంగ, వంగ, అనుహ్మ, కలాప, ఉత్కల, మహోరగ, కలింగ,కొంకణ, అర్బుద దేశాల(ప్రజల)ను చూశాడు.

13. మాలవాన్ ద్రావిడాంశ్చ సౌరాష్ట్రాన్ యవనాంస్తథా, ఏతాం శ్చాన్యాంశ్చ దేశాంశ్చ పర్యటన్ మునిసత్తమః.

మార్కండేయమహర్షి మాలవ, ద్రవిడ, సౌరాష్ట్ర, యవన దేశాల(ప్రజల)ను ఇంకా ఇతర దేశాలను గూడ చూశాడు. స్వామిగర్భం లోని ఆ దేశాలలో సంచరించాడు.

14. అపశ్యం తే మునిశ్రేష్ఠస్తవ కుక్షౌ మహాత్మనః, ప్రయాగం చ కురుక్షేత్రం పుష్కరం నైమిషం గయామ్.

పరమాత్ముడివైన నీ ఉదరంలో ప్రయాగ, కురుక్షేత్రం, పుష్కరం, నైమిషారణ్యం, గయ క్షేత్రాలను మార్కండేయముని చూశాను(డు). (ఇక్కడ మళ్లీ మునిశ్రేష్ఠః తవ, తే కుక్షౌ అపశ్యం అనడంవల్ల అహం శబ్దాన్ని అధ్యాహారం చేసుకుని ఉత్తమపురుషార్థాన్ని సమన్వయించ వలసి వస్తున్నది.)

15. గఙ్గాద్వారం చ కుబ్జామ్రం బదరీం సిన్ధుసాగరమ్, కోకాముఖం శుద్ధతీర్థం బ్రహ్మావర్తం కుశస్థలీమ్.

హరిద్వారం, కుబ్జామ్రం, బదరి, సింధుసాగరం, కోకాముఖం, శుద్ధతీర్థం, బ్రహ్మావర్తం, కుశస్థలి, క్షేత్రాలను చూశాను(డు).

16. లౌహజఙ్ఘంత్వశ్వతీర్థం సర్వపాపప్రమోచనమ్, కర్దమాలం చాగ్నితీర్థం తథా చామరకణ్టకమ్.

లౌహజంఘం, అశ్వతీర్థం, సర్వపాపప్రమోచనతీర్థం,కర్దమాలం, అగ్నితీర్థం, అమరకంటకం, క్షేత్రాలను చూశాను(డు).

17. లోహార్గలం జమ్బుమార్గం భోగతీర్థం పృథూదకమ్, ఉత్పలావర్తకం తీర్థం తథా శ్రీపురుషోత్తమమ్.

లోహార్గలం, జంబుమార్గం, భోగతీర్థం, పృథూదకతీర్థం, ఉత్పలావర్తకతీర్థం, శ్రీపురుషోత్తమతీర్థం, చూశాను(డు).

18. ఏకాముఖం కేదారం కాశీం చ విరజం ద్విజః, కాలఞ్జరం చ గోకర్ణం శ్రీశైలం గన్ధమాదనమ్.

మార్కండేయుడు ఏకాముఖం, కేదారం, కాశి, విరజ, కాలంజరం, గోకర్ణం, శ్రీశైలం, గంధమాదనం చూశా(ను)డు. (ఇక్కడ మళ్లీ అహం అధ్యాహారం చేసుకోవాలి.)

19. ఏతాన్యన్యాని తీర్థాని క్షేత్రాణ్యాయతనాని చ, అపశ్యముదరే దేవ బాలస్య మునిసత్తమః.

ఇవి మాత్రమే కాక, ఇంకా అనేక పుణ్యతీర్థాలు, క్షేత్రాలు, ఆలయాలు ఎన్నో ఆ మార్కండేయమహర్షి బాలుడి గర్భంలో చూశాను(డు). (దేవ అపశ్యం అనేవాటినిబట్టి, ఇక్కడ కూడ అహం అధ్యాహారం చేసుకోవాలి.)

స్వామీ! నీవు పసివాడుగా మారి, ఈ జగత్తు సమస్తాన్నీ నీ కడుపులో నిలుపుకుని, ప్రత్యక్షంగా ఇక్కడ ఎందుకు ఉన్నావు? అన్ని విషయాలు వివరంగా చెప్పవలసింది.

(కిమర్థం వా జగత్సర్వం శరీరస్థం తవానఘ,
కియన్తం చ త్వయా కాలమిహ స్థేయమరిన్దమ.)

పుణ్యాత్మా! ఈ జగత్తు సమస్తం నీ కడుపులో ఎందుకున్నది? శత్రువులను అణచేవాడా, నీవు ఇక్కడ ఎంతకాలం ఉంటావు?)

జ్ఞాతుమిచ్ఛామి దేవేశ బ్రూహి సర్వమశేషతః ॥ 7 ॥

త్వత్తః కమలపత్రాక్ష విస్తరేణ యథాతథమ్ ।
మహదేతదచిన్త్యం చ యదహం దృష్టవాన్ ప్రభో ॥ 8 ॥

తామరరేకులవంటి కన్నులు కలవాడా! నీ ద్వారానే తెలుసుకోవాలని కోరికగా ఉన్నది. ఏమీ విడిచిపెట్టకుండా సమస్తవిషయాలు ఉన్నది ఉన్నట్లుగా వివరించి, చెప్పు. ఓ ప్రభూ! నేను దేనిని చూచానో అది ఊహకందనిది. అమేయం.

---

20. **గఙ్గాం శతద్రూం చ తథా యమునామథ కౌశికీమ్, చర్మణ్వతీం వేత్రవతీం చన్ద్రభాగాం సరస్వతీమ్.**
గంగ, శతద్రు, యమున, కౌశికి, చర్మణ్వతి, వేత్రవతి, చంద్రభాగ, సరస్వతి, నదులను చూశాను(డు).

21. **విపాశాం చ వితస్తాం చ సిన్ధుం గోదావరీం నదీమ్, వస్వేకసారాం నలినీం పయోష్ణీం నర్మదాం ద్విజః.**
విపాశ, వితస్త, సింధు, గోదావరి, వస్వేకసార, నళిని, పయోష్ణి, నర్మద నదులను మార్కండేయమహర్షి ఆ బాలుడిఉదరంలో చూశాను (డు).

22. **అపర్ణాం తుఙ్గభద్రాఞ్చ కరతోయాం మహానదీమ్, సువర్ణాం కృష్ణవేణీం చ శిబిరాం చ మహానదీమ్.**
అపర్ణ, తుంగభద్ర, కరతోయ, మహానది, సువర్ణ, కృష్ణవేణి, శిబిర, మహానది అనే నదులను చూశాను(డు).

23. **వైతరణీం చై కావేరీం శోణఞ్చైవ మహానదీమ్, భీమరథీం విశాలాఞ్చ శిప్రాం వేత్రవతీం నదీమ్.**
వైతరణి, కావేరి, శోణ, మహానది, భీమరథి, విశాల, శిప్ర, వేత్రవతి (21) నదులను చూశాను(డు).

24. **ఏతాశ్చాన్యాశ్చ పృథివ్యాం వై ద్విజోత్తమాః, పరిభ్రాన్తశ్చ సమ్పూర్ణం తవ కుక్షౌ మహాత్మనః.**
బ్రాహ్మణోత్తములారా! మార్కండేయమహర్షి ఆ పరమాత్మగర్భంలో సంచరిస్తూ ఇవి మాత్రమే కాక, భూమండలంమీద ఉన్న అనేక నదులను చూశాడు. (తవ శబ్దం మార్కండేయుడు చెప్తున్నట్లుగా ఉంది. కాని ద్విజోత్తమాః, అనేది బ్రహ్మ చెప్తున్నట్లు తెలుపుతుంది. ద్విజోత్తమః అని ఏకవచనం ఉన్నా అలాగే చెప్పాలి. తరువాతి శ్లోకాలు మార్కండేయుడు చెప్తున్నట్లుగా ఉన్నాయి. ఈ ప్రక్షిప్తభాగంలో బ్రహ్మ చెప్తున్నాడో, మార్కండేయుడు చెప్తున్నాడో అర్థం కాక విషయం కలగాపులగం అయింది.)

25. **అపశ్యం గగనఞ్చైవ చన్ద్రసూర్యవిరాజితమ్, జాజ్వల్యమానం తేజోభిః పావకార్కసమప్రభమ్.**
స్వామిగర్భంలో ఆకాశం చంద్రుడితోనూ, సూర్యుడితోనూ చక్కగా ప్రకాశిస్తున్నది. అగ్నిసూర్యులకాంతితో సమానంగా వెలిగిపోతున్నది. అటువంటి ఆకాశాన్ని మార్కండేయుడు స్వామిగర్భంలో చూశాను(డు).

26. **అపశ్యం చ మహీం బాల కాననైరుపశోభితామ్, యజన్తే వివిధైస్తత్ర బ్రాహ్మణాః బహుభిర్మఖైః.**
నాయనా! అరణ్యాలతో అందంగా ఉన్న ఈ భూమండలాన్ని చక్కగా చూశాను. అక్కడ బ్రాహ్మణులు వివిధ యజ్ఞాలు చేస్తున్నారు.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఇత్యుక్తస్స తదా తేన దేవదేవో మహాద్యుతిః ।
సాన్త్వయామాస తదా వాక్యమువాచ వదతాం వరః ॥ 9 ॥

మార్కండేయుడు ఈవిధంగా అడగటంతో తేజోవంతుడూ, దేవతలకు దేవుడూ, వక్తలలో శ్రేష్ఠుడూ ఐన, విష్ణుదేవుడు అప్పుడు మార్కండేయుడిని, ఓదార్చి, ఇలా చెప్పాడు.

శ్రీభగవానువాచ :–శ్రీమహావిష్ణువు మార్కండేయుడితో ఈవిధంగా చెప్పాడు.

కామం దేవాశ్చ మాం విప్ర న హి జానన్తి తత్త్వతః ।
తవ ప్రీత్యా ప్రవక్ష్యామి యథేదం విసృజామ్యహమ్ ॥ 10 ॥

ద్విజోత్తమా! నా యథార్థస్వరూపాన్ని దేవతలు గూడ పూర్తిగా తెలుసుకోలేరు. కాని, నాకు నువ్వంటే ఇష్టం కాబట్టి ఈ జగత్తును ఏవిధంగా సృష్టి చేస్తానో నీకు చెప్తాను.

పితృభక్తోఽసి విప్రర్షే మామేవ శరణం గతః ।
తతో దృష్టోఽస్మి తే సాక్షాద్ బ్రహ్మచర్యం చ తే మహత్ ॥ 11 ॥

బ్రహ్మర్షీ! నీవు తల్లిదండ్రులమీద భక్తి గలిగినవాడివి. నాశరణు కోరివచ్చావు. నీ బ్రహ్మచర్యం చాల గొప్పది. అందువలన నేను నీకు సాక్షాత్కరించాను.

ఆపో నారా ఇతి పురా సంజ్ఞాకర్మ కృతం మయా ।
తేన నారాయణోఽస్మ్యుక్తో మమ తాస్త్వయనం సదా ॥ 12 ॥

పూర్వం నేను నీటికి నారములు అని పేరు పెట్టాను. ఆ నీరే నాకు నివాస(అయనం)స్థానం. కాబట్టి నన్ను నారాయణుడు అంటారు.

అహం నారాయణో నామ ప్రభవశ్శాశ్వతోఽవ్యయః ।
విధాతా సర్వభూతానాం సంహర్తా చ ద్విజోత్తమ ॥ 13 ॥

బ్రాహ్మణోత్తమా! నారాయణుడు అని పేర్కొనబడే నేను ఈ సృష్టికి కారణం. ఎటువంటి మార్పు లేకుండా ఎల్లప్పుడూ ఉంటాను. స్థావరాలు, జంగమాలు ఐనసమస్తపదార్థాలను నేనే సృష్టిస్తాను. నేనే సంహరిస్తాను.

---

27. క్షత్రియాశ్చ ప్రవర్తన్తే సర్వవర్ణానురఞ్జనైః, వైశ్యాః కృషిం యథాన్యాయం కారయన్తి చ నిత్యశః.
ఏవ మాదీని సర్వాణి దృష్టాని పురుషోత్తమ.

క్షత్రియులు తమపాలనలో ఉన్న అన్ని వర్ణాలవారినీ సంతోషపెడుతున్నారు. వైశ్యజాతివారు తమకు తగిన వ్యవసాయవృత్తిని నిత్యమూ చక్కగా ఆచరిస్తున్నారు. పురుషోత్తమస్వామీ! ఈవిధంగా అన్ని విషయాలను నీ గర్భంలో నేను చక్కగా చూశాను.

అహం విష్ణురహం బ్రహ్మా శక్రశ్చాపి ద్విజోత్తమ ।
అహం వైశ్రవణో రాజా యమః ప్రేతాధిప స్తథా ॥ 14 ॥

ద్విజవరేణ్యా! నేనే విష్ణువును. బ్రహ్మను నేనే. ఇంద్రుడూ నేనే. యక్షరాజైన కుబేరుడు నేనే. ప్రేతాలకు అధిపతియైన యమధర్మరాజును నేనే.

అహం శివశ్చ సోమశ్చ కశ్యపశ్చ ప్రజాపతిః ।
అహం ధాతా విధాతా చ యజ్ఞశ్చాహం ద్విజోత్తమ ॥ 15 ॥

బ్రాహ్మణోత్తమా! శివుడు నేనే. చంద్రుడూ నేనే. నేనే కశ్యపప్రజాపతిని. పుట్టించేవాడిని నేనే. వారిని పోషించేవాడిని నేనే. యజ్ఞం నేనే.

అగ్నిరాస్యం క్షితిః పాదౌ చన్ద్రాదిత్యౌ చ లోచనే ।
ద్యౌర్మూర్ధా ఖం దిశశ్శ్రోత్రే తథాపస్స్వేదసమ్భవాః ॥ 16 ॥

నాకు ముఖం అగ్ని. పాదాలు భూమి. చంద్రుడు, సూర్యుడు ఇద్దరూ నాకు రెండు కళ్లు. అన్తరిక్షం నా శిరస్సు. ఆకాశమూ, దిక్కులూ నాకు చెవులు. నీరు నా చెమటనుండి పుట్టాయి.

సదిశం చ నభః కాయో వాయుర్మనసి మే స్థితః ।
మయా క్రతుశతైరిష్టం బహుభిశ్చాప్తదక్షిణైః ॥

దిక్కులతో కూడిన ఆకాశం మొత్తం నాకు శరీరం. వాయువు నా మనసులో ఉంది. నేను వందలకొద్దీ యజ్ఞాలు చేశాను. ఆ యజ్ఞాలలో సంతృప్తిగ నిండైన దక్షిణలు ఇచ్చాను.

యజన్తే వేదవిదుషో మాం దేవయజనే స్థితమ్ ॥ 17 ॥

దేవయజ్ఞంలో ప్రతిష్ఠించి, నన్ను వేదవిద్వాంసులు పూజిస్తారు.

పృథివ్యాం క్షత్రియేన్ద్రాశ్చ పార్థివాస్స్వర్గకాఙ్క్షిణః ।
యజన్తే మాం తథా వైశ్యాస్స్వర్గలోకజిగీషవః ॥ 18 ॥

భూలోకంలో స్వర్గాన్ని కోరుకునే ఉత్తమక్షత్రియులైన మహారాజులు నన్ను అర్చిస్తారు. అదేవిధంగా స్వర్గలోకాన్ని కూడ జయించాలనుకునే (పొందాలనుకునే) వైశ్యులు కూడ నన్ను పూజిస్తారు.

చతుస్సముద్రపర్యన్తాం మేరుమన్దరభూషణామ్ ।
శేషో భూత్వాஉహమేకో హి ధారయామి వసున్ధరామ్ ॥ 19 ॥

నాలుగు వైపులా నాలుగు సముద్రాలు చుట్టుకుని ఉన్నదీ, మేరువు, మందరం అనే పర్వతాలతో అలంకరింప బడినదీ అయిన ఈ భూమండలాన్ని నేను ఆదిశేషుడినై, వహిస్తాను.

వారాహం రూపమాస్థాయ మమేయం జగతీ పురా ।
మజ్జమానా జలే విప్ర వీర్యేణాసీత్ సముద్ధృతా ॥ 20 ॥

బ్రాహ్మణవరేణ్యా! మార్కండేయా, పూర్వం ఏకార్ణవంలో నీళ్లలో మునిగిపోతున్న ఈ భూమిని వరాహరూపం ధరించి, నా శక్తితో ఉద్ధరించాను.

అగ్నిశ్చ బాడబో విప్ర భూత్వాహం ద్విజసత్తమ ।
పిబామ్యపస్సమావిష్టస్తాశ్చైవ విసృజామ్యహమ్ ॥ 21 ॥

ద్విజవరా! నేను బడబాగ్నిగా ఏర్పడి, నీళ్లలో ఉండి, ఆ నీళ్లనే తాగుతాను. బ్రాహ్మణోత్తమా! ఆ నీటిని పోగుచేసి, మళ్లీ విడిచిపెట్టాను.

బ్రహ్మ వక్త్రం భుజౌ క్షత్రమూరూ మే సంశ్రితా విశః ।
పాదౌ శూద్రా భవన్తీమే విక్రమేణ క్రమేణ చ ॥ 22 ॥

బ్రాహ్మణులు నాకు ముఖం. క్షత్రియులు నా బాహువులు. వైశ్యులు నా తొడలు. శూద్రులు నా పాదాలు. ఈవిధంగా వీరందరూ వారి శక్తిసామర్థ్యాలను అనుసరించి నాశరీరంలో భాగాలు అవుతున్నారు. (బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్...పురుషసూక్తం.)

ఋగ్వేదస్సామవేదశ్చ యజుర్వేదస్త్వథర్వణః ।
మత్తః ప్రాదుర్భవన్త్యేతే మామేవ ప్రవిశన్తి చ ॥ 23 ॥

ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అథర్వణవేదం అనే నాలుగు వేదాలూ నానుండే ఏర్పడుతున్నాయి. మళ్లీ నాలోనే ప్రవేశిస్తాయి.

యతయశ్శాన్తిపరమా యతాత్మానో బుభుత్సవః ।
కామక్రోధద్వేషముక్తా నిస్సఙ్గా వీతకల్మషాః ॥ 24 ॥

సత్త్వస్థా నిరహఙ్కారా నిత్యమధ్యాత్మకోవిదాః ।
మామేవ సతతం విప్రాశ్చిన్తయన్త ఉపాసతే ॥ 25 ॥

ఇంద్రియాలను జయించినవారూ, ఉత్తమమైనశాంతస్థితిని పొందినవారూ, తమను తాము నియమించుకున్న వారూ, బ్రహ్మజ్ఞానాన్ని కోరుకునేవారూ, కోరికలనూ, కోపాన్నీ, ద్వేషాన్నీ విడిచిపెట్టినవారూ, దేనిమీదా ఆసక్తి లేనివారూ, పాపపు ఆలోచనలు లేనివారూ, సత్త్వగుణంలో ఉన్నవారూ, అహంకారం విడిచిపెట్టిన వారూ, నిరంతరం ఆత్మను గూర్చిన అనుభవంలో ఉండేవారూ, అయిన బ్రాహ్మణులు నన్ను గురించే ఆలోచిస్తూ నన్ను ఉపాసిస్తారు.

అహం సంవర్తకో జ్యోతిరహం సంవర్తకోఽనలః ।
అహం సంవర్తకస్సూర్యస్త్వహం సంవర్తకోఽనిలః ॥ 26 ॥

సంవర్తకం అనే(ప్రళయకాలానికి సంబంధించిన) కాంతి ప్రళయకాలకాంతిని నేను. సమస్తాన్నీ లయం చేసే ప్రళయాగ్నిని నేను. సృష్టిని లయం చేసే (సంవర్తకం అనే)సూర్యుడు నేను. లయం చేసే(సంవర్తకం అనే) వాయువు నేను.

తారారూపాణి దృశ్యన్తే యాన్యేతాని నభస్తలే ।
మమ వై రోమకూపాణి విద్ధి త్వం ద్విజసత్తమ ॥ 27 ॥

బ్రాహ్మణశ్రేష్ఠా! ఆకాశంలో నక్షత్రాలుగా కనబడేవి నారోమకూపాలు (చర్మంమీద వెంట్రుకలు పుట్టినచోటి రంధ్రాలు) అని గ్రహించు.

రత్నాకరాస్సముద్రాశ్చ సర్వ ఏవ చతుర్దిశః ।
వసనం శయనం చైవ నిలయం చైవ విద్ధి మే ॥ 28 ॥

రత్నాలకు నిలయమైన సప్తసముద్రాలు, నాలుగు దిక్కులు అన్నీ నాకు వస్త్రాలు, శయనం, నివాసం అని తెలుసుకో.

కామః క్రోధశ్చ హర్షశ్చ భయం మోహస్తథైవ చ ।
మమైవ విద్ధి రూపాణి సర్వాణ్యేతాని సత్తమ ॥ 29 ॥

మహర్షీ! కామం, క్రోధం, సంతోషం, భయం, మోహం, మొదలైనవన్నీ నా స్వరూపాలే అని గ్రహించు.

ప్రాప్నువన్తి నరా విప్ర యత్ కృత్వా కర్మ శోభనమ్ ।
సత్యం దానం తపశ్చోగ్రమహింసాం సర్వజన్తుషు ॥ 30 ॥

ద్విజవరేణ్యా! మానవులు సత్యం, దానం, తీవ్రమైన తపస్సు, అన్ని ప్రాణులలోను అహింస అనే సత్కర్మలను ఆచరించి, నన్ను పొందుతారు. (నాదగ్గరకు చేర్చే) ఆ సత్కర్మలు నేనే.

మద్విధానేన విహితా మమ దేహవిచారిణః ।
మయాభిభూతవిజ్ఞానాశ్చేష్టయన్తి న కామతః ॥ 31 ॥

నాకు సంబంధించిన మార్గంలో నడుచుకునేవారూ, నా రూపాన్ని గురించి విచారణ చేసేవారూ (విష్ణుభక్తులు), నాచేత ఆవరించబడిన విజ్ఞానం కలవారై (నా ప్రేరణతో) మాత్రమే ఆయా కర్మలు ఆచరిస్తున్నారు. అంతే కాని వారంతట వారు స్వేచ్ఛగా చేయడం లేదు.

సమ్యగ్వేదమధీయానా యజన్తో వివిధైర్మఖైః ।
యతాత్మానో జితక్రోధాః ప్రాప్నువన్తి ద్విజాతయః ॥ 32 ॥

నా ప్రేరణతోనే ద్విజన్ములు (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు), వేదాన్ని బాగా అధ్యయనం చేసి, అనేక యాగాలను చక్కగా ఆచరించి, ఆవిధంగా నన్ను అర్చిస్తారు. మనసును నిగ్రహించుకుంటారు. కోపాన్ని జయిస్తారు. తరువాత నన్ను పొందుతారు.

ప్రాప్తుం శక్యో న చైవాహం నరైర్దుష్కృతకర్మభిః ।
లోభాభిభూతైః కృపణైరనార్యైరకృతాత్మభిః ॥ 33 ॥

ఇతరుల వస్తువులపైన దురాశగలవారూ, బుద్ధిహీనులూ, అసాధువులు, మూర్ఖులు, పాపకర్మలు చేసే మానవులు నన్ను చేరలేరు.

ఏతన్మహాఫలం విద్ధి నరాణాం భావితాత్మనామ్ ।
సుదుష్ప్రాపం విమూఢానాం మాయాయోగనిషేవిణామ్ ॥ 34 ॥

బ్రహ్మజ్ఞానంతో పవిత్రమైన మనస్సు కలిగిన మానవులకు పరమాత్మను చేరడమే గొప్పఫలం అని గ్రహించు. అజ్ఞానులకూ, మూర్ఖులకూ, అసన్మార్గాలను అనుసరించేవారికీ నేను లభించను.

యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి సత్తమ ।
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥ 35 ॥

మహాత్మా! యెప్పుడెప్పుడు ధర్మానికి కీడు కలిగి, అధర్మం తలయెత్తుతుందో ఆ సమయాల్లో నాకు నేనుగా అవతరిస్తాను. (గీత.4.8)

దైత్యా హింసానురక్తాశ్చ అవధ్యాస్సురసత్తమైః ।
రాక్షసాశ్చాపి లోకేఽస్మిన్ యదోత్పత్స్యన్తి దారుణాః ॥ 36 ॥

తదాహం సమ్ప్రసూయామి గృహేషు పుణ్యకర్మణామ్ ।
ప్రవిష్టో మానుషం దేహం సర్వం ప్రశమయామ్యహమ్ ॥ 37 ॥

ఎప్పుడూ ఇతరులను హింసిస్తూ ఆనందించే దైత్యులను దేవతలు సంహరింపలేరు. ఈ భూమిమీద భయంకరమైనరాక్షసులు పుట్టినప్పుడు, నేను మానవశరీరం ధరించి, పుణ్యాత్ముల యిండ్లలో జన్మిస్తాను. అప్పుడు దుర్మార్గుల నందరినీ అణచివేస్తాను.

సృష్ట్వా దేవమనుష్యాంశ్చ గన్ధర్వోరగరాక్షసాన్ ।
స్థావరాణిచ భూతాని సంహరామ్యాత్మమాయయా ॥ 38 ॥

దేవతలనూ, గంధర్వులనూ, ఉరగులనూ, రాక్షసులనూ, ఇంకా స్థిరంగా ఉండే పదార్థాలను (చరాచరాలను) సృష్టిస్తాను. తరువాత నేనే నా మాయతో ఆ చరాచర వస్తుసముదాయా న్నంతటినీ సంహరిస్తాను.

కర్మకాలే పునర్దేహమనుచిన్త్య సృజామ్యహమ్ ॥ 39 ॥(1)

(నేను జన్మించవలసిన) అవసరం వచ్చినపుడు ఆలోచించి, మళ్లీ ఆ సందర్భానికి తగిన శరీరాన్ని సృష్టిస్తాను (మళ్లీ జన్మిస్తాను).

---

(1) 39శ్లోకం తర్వాత అధికపాఠంగా ఈభాగం కొన్నిప్రతులలో కనబడుతున్నది.

1. ఆవిశ్య మానుషం దేహం మర్యాదాబన్ధకారణాత్, శ్వేతః కృతయుగే ధర్మశ్శ్యామస్త్రేతాయుగే మమ.

జగత్తు సాగవలసిన విధానాన్ని కాపాడేందుకు నేను మానవరూపాన్ని ధరించి వస్తాను. నా రూపం కృతయుగంలో తెల్లగానూ, త్రేతాయుగంలో నల్లగానూ ఉంటుంది.

ఏవం ప్రణిహితస్సమ్యఙ్మమాత్మా మునిసత్తమ ।
సర్వభూతేషు విప్రేన్ద్ర న చ మాం వేత్తి కశ్చన ॥ 40 ॥

మార్కండేయమహర్షీ! బ్రాహ్మణవరేణ్యా! ఈవిధంగా నా తత్త్వం చరాచరాత్మకమైన సమస్తభూతాలలోనూ నిండిఉంది. అయినప్పటికీ ఎవ్వరూ నన్ను తెలుసుకోలేరు.

సర్వలోకే చ మాం భక్తాః పూజయన్తి చ సర్వశః ॥ 41 ॥

బ్రాహ్మణోత్తమా! అన్ని లోకాలలోనూ భక్తులు నన్ను అన్ని విధాలుగానూ పూజిస్తుంటారు.

యచ్చ కిఞ్చిత్ త్వయా ప్రాప్తం మయి క్లేశాత్మకం ద్విజ ।
సుఖోదయాయ తత్సర్వం శ్రేయసే చ త వానఘ ॥ 42 ॥

బ్రాహ్మణోత్తమా! నా ఉదరంలో సంచరిస్తున్నపుడు నీకు చాల కష్టం కలిగింది. ఆ కష్టం అంతా భవిష్యత్తులో నీకు అనేకసుఖాలు, శుభాలు కలగడంకోసమే.

యచ్చ కిఞ్చిత్ త్వయా లోకే దృష్టం స్థావరజఙ్గమమ్ ।
విహితం సర్వమేవాసౌ మమాత్మా భూతభావనః ॥ 43 ॥

జగత్తులో నీకు కనిపించే చరమూ, అచరమూ ఐన సమస్తపదార్థాలు మొత్తం నేను సృష్టించినవే. నా సృష్టిశక్తి సర్వత్ర వ్యాపించి ఉన్నది.

అహం నారాయణో నామ శఙ్ఖచక్రగదాధరః ।
యావద్యుగానాం విప్రర్షే సహస్రం పరివర్తతే ॥
తావత్ స్వపిమి విశ్వాత్మా సర్వవిశ్వాని మోహయన్ ॥ 44 ॥

---

2. **రక్తో ద్వాపరమాసాద్య కృష్ణః కలియుగే తథా, త్రయో భాగా హ్యధర్మస్య తస్మిన్ కాలే భవన్తి చ.**
ద్వాపరయుగంలో ఎఱ్ఱగానూ, కలియుగంలో కారునలుపురంగులోనూ ఉంటుంది. కలికాలంలో అధర్మం మూడుపాదాలుగా (ధర్మం ఒకపాదంగానూ) ఉంటుంది.

3. **అన్తకాలే చ సమ్ప్రాప్తే కాలో భూత్వాతిదారుణః, త్రైలోక్యం నాశయామ్యేకస్సర్వం స్థావరజఙ్గమమ్.**
ప్రళయసమయం వచ్చినపుడు మిక్కిలిభయంకరమైన మృత్యురూపాన్ని ధరించి, ఒంటరిగా, ముల్లోకాలలోనూ, చరాచరమైన పదార్థాలను అన్నింటినీ నాశనం చేస్తాను.

4. **అహం త్రిధర్మా విశ్వాత్మా సర్వలోకసుఖావహః, అభిన్నస్సర్వగోऽనన్త హృషీకేశ ఉరుక్రమః.**
నాకు సృష్టించడం, పోషించడం, లయం చేయడం అనే మూడు ధర్మాలు ఉన్నాయి. సమస్తమూ నేనే. అన్నిలోకాలకూ సుఖాన్ని కలిగిస్తాను. అందరూ నేనే అయి ఉన్నాను. సర్వత్రా వ్యాపించి ఉంటాను. నాకు అంతం లేదు. ఇంద్రియాలకు అధిపతిని. త్రివిక్రముడిని.

5. **కాలచక్రం నయామ్యేకో బ్రహ్మరూపం మమైవ తత్, శమనం సర్వభూతానాం సర్వభూతకృతోద్యమమ్.**
కాలాన్ని చక్రంలాగా నేనే నడిపిస్తాను. స్థావరజంగమాత్మకమైన సమస్తభూతాలను లయం చేసేదీ, సమస్తమైనభూతాలను సృష్టించి, రక్షించేవాడూ ఐన పరమాత్మ నేనే.

బ్రహ్మర్షీ! నన్ను నారాయణుడు అని పేర్కొంటారు. శంఖం, చక్రం, గద అనేవాటిని ధరిస్తాను. జగత్ స్వరూపుడిని ఐననేను సమస్తమైన జగత్తులనూ అజ్ఞానంలో ఉంచి, వేలకొద్దీ మహాయుగాలు గడుస్తున్నంత కాలం నిద్రిస్తూ ఉంటాను.

ఏవం సర్వమహం కాలమిహాసే మునిసత్తమ ।
అశిశుశ్శిశురూపేణ యావద్ బ్రహ్మా న బుధ్యతే ॥ 45 ॥

మార్కండేయమహర్షీ! నేను పసివాడిని కాకపోయినా, పసివాడులాగా, బ్రహ్మదేవుడు మేలుకునే(ఏర్పడే)వరకూ నిత్యమూ ఇక్కడే ఉంటాను.

మయా చ దత్తో విప్రేన్ద్ర వరస్తే బ్రహ్మరూపిణా ।
అసకృత్ పరితుష్టేన విప్రర్షిగణపూజిత ॥ 46 ॥

బ్రాహ్మణోత్తమా! బ్రహ్మర్షులు పూజించేవాడా, పరమాత్మనైన నేను చాలామారులు నీపైన సంతోషపడి నందున నీకు ఈ వరమిస్తున్నాను.

సర్వమేకార్ణవం కృత్వా నష్టే స్థావరజఙ్గమే ।
నిర్గతోఽసి మయాజ్ఞాతస్తతస్తే దర్శితం జగత్ ॥ 47 ॥

జగత్ప్రళయంలో చరాచరాత్మకమైన సృష్టి సమస్తం నశించి, అంతా జలమయంగా, మహాసముద్రం అయింది. ఆ సమయంలో నువ్వు నా ఆజ్ఞప్రకారం వెలువడ్డావు. నా గర్భంలో ప్రవేశించిన నీకు అక్కడ సమస్త జగత్తును చూపించాను.

అభ్యన్తరం శరీరస్య ప్రవిష్టోఽసి యదా మమ ।
దృష్ట్వా లోకం సమస్తం హి విస్మితో నావబుధ్యసే ॥ 48 ॥

నా శరీరంలోపలికి ప్రవేశించినపుడు అక్కడ లోకాలన్నీ చూసి, చాలా ఆశ్చర్యపడ్డావు. నీకు ఏమీ అర్థంకాలేదు.

తతోఽసి వక్త్రాద్ విప్రర్షే ద్రుతం నిస్సారితో మయా ।
ఆఖ్యాతస్తే మయా చాత్మా దుర్జ్ఞేయో హి సురాసురైః ॥ 49 ॥

బ్రహ్మర్షీ! అప్పుడు నేను నిన్ను వెంటనే నా నోటినుండి వెలుపలికి పంపాను. దేవతలూ, రాక్షసులూ కూడ తెలుసుకోలేని నా తత్త్వాన్ని నీకు వివరించాను.

యావత్ స భగవాన్ బ్రహ్మా న బుధ్యేత మహాతపాః ।
తావత్ త్వమిహ విప్రర్షే విస్రబ్ధశ్చర వై సుఖమ్ ॥ 50 ॥

బ్రహ్మర్షీ! గొప్పతపస్వి ఐన బ్రహ్మదేవుడు మేలుకొనేంతవరకూ నీవు ఇక్కడ స్వేచ్ఛగా,సుఖంగా సంచరించు.

తతో విబుద్ధే తస్మింస్తు సర్వలోకపితామహే ।
ఏకో భూతాని స్రక్ష్యామి శరీరాణి ద్విజోత్తమ ॥ 51 ॥

బ్రాహ్మణోత్తమా! సమస్త లోకాలకూ పితామహుడైనబ్రహ్మదేవుడు మేలుకాంచిన తరువాత నేనే (బ్రహ్మ రూపంలో) పంచభూతాలనూ, స్థావరాలు, జంగమాలు ఐనఅన్ని శరీరాలనూ సృష్టిస్తాను.

ఆకాశం పృథివీం జ్యోతిర్వాయుస్సలిలమేవ చ ।
లోకే యచ్చ భవేత్ కిఞ్చిదిహ స్థావరజఙ్గమమ్ ॥ 52 ॥

నింగి, నేల, నిప్పు, గాలి, నీరు అనే పంచభూతాలనూ, ఇంకా లోకంలో చరమూ, అచరమూ ఐన పదార్థాలు సమస్తమూ సృష్టిస్తాను.

బ్రహ్మోవాచ :–మహర్షులతోబ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవ ముక్త్వా తదా విప్రాః పునఽ స్తం ప్రాహ మాధవః ।
పూర్ణే యుగసహస్రే తు మేఘగమ్భీరనిస్స్వనః ॥ 53 ॥

బ్రాహ్మణులారా! శ్రీకృష్ణస్వామి మార్కండేయుడితో ఈవిధంగా చెప్పి, ఆ తరువాత వేయి మహాయుగాలు గడిచిగడువగానే అపుడు స్వామి పిడుగులలాగా గంభీరమైన కంఠస్వరంతో ఇలా అన్నాడు.

శ్రీభగవానువాచ :–శ్రీకృష్ణస్వామి మార్కండేయుడితో ఈవిధంగా చెప్తున్నాడు.

మునే బ్రూహి యదర్థం మాం స్తుతవాన్ పరమార్థతః ।
వరం వృణీష్వ యచ్ఛ్రేష్ఠం దదామి న చిరాదహమ్ ॥ 54 ॥

మార్కండేయమహర్షీ! నీవు నన్ను దేనికోసం స్తుతించావో, యథార్థం చెప్పు. ఉత్తమమైన వరం కోరుకో, వెంటనే ఇస్తాను.

ఆయుష్మానసి దేవానాం మద్భక్తోఽ సి దృఢవ్రతః ।
తేన త్వమసి విప్రేన్ద్ర పునర్దీర్ఘాయురాప్నుహి ॥ 55 ॥

బ్రాహ్మణోత్తమా! దేవతలకంటె కూడ మించిన ఆయుర్దాయం కలిగినవాడివి. నాకు భక్తుడివి. గట్టి పట్టుదల గలవాడివి. నీవు ఇంకా అధికంగా దీర్ఘమైన ఆయుర్దాయాన్ని పొందుతావు.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

శ్రుత్వా వాణీం శుభాం తస్య విలోక్య స తదా పునః ।
మూర్ధ్నా నిపత్య సహసా ప్రణమ్య పునఽ రబ్రవీత్ ॥ 56 ॥

ఆ విష్ణుదేవుడు పలికిన శుభప్రదమైన పలుకులు విని, మార్కండేయుడు స్వామిని చూచి, వెంటనే సాష్టాంగంగా నమస్కారం చేసి, తలవంచి, వినయంగా మళ్లీ ఇలా అన్నాడు.

మార్కణ్డేయ ఉవాచ :–శ్రీకృష్ణస్వామితో మార్కండేయుడు ఈవిధంగా అంటున్నాడు.

దృష్టం యదద్య దేవేశ తవ రూపం ద్విజోత్తమ ।
మోహోఽ యం విగతస్సత్యం త్వయి దృష్టే తు మే హరే ॥ 57 ॥

సురేశ్వరా! ద్విజులలో శ్రేష్ఠుడా! నీ రూపాన్ని ఇప్పుడు నేను చూడగలిగాను. శ్రీహరీ! నిన్ను చూడటంచేత నాలోని అజ్ఞానం నశించింది. ఇది నిజం.

ఏవమేవ జగన్నాథ ఇచ్ఛేయం త్వత్ప్రసాదతః ।
లోకానాం చ హితార్థాయ నానాభావప్రశాన్తయే ॥ 58 ॥

లోకాధిపతీ! అన్ని లోకాలకు మేలు కలగడంకోసమూ, రకరకాల చిత్తవికారాలు నశించిపోవడానికీ, నీ అనుగ్రహంచేత, ఈవిధంగా జరగాలని కోరుకుంటున్నాను.

శైవభాగవతానాం చ వాదార్థప్రతిషేధకమ్ ।
అస్మిన్ క్షేత్రవరే పుణ్యే నిర్మలే పురుషోత్తమే ॥ 59 ॥

పుణ్యప్రదమూ, పవిత్రమూ, ఉత్తమమూ ఐన ఈ పురుషోత్తమక్షేత్రంలో (పూరీ) శివభక్తులూ, విష్ణుభక్తులూ తగవులాడుకోకుండా కలిసిఉండాలి.

శివస్యాయతనం దేవ కరోమి పరమం మహత్ ।
ప్రతిష్ఠేయం తథా తత్ర తవ స్థానే చ శఙ్కరమ్ ॥ 60 ॥

అందుకోసం ఇక్కడ శివుడికి కూడ మిక్కిలి ఉత్తమమైన ఆలయాన్ని నిర్మిస్తాను. నీవు ఉన్న ఈ ప్రదేశంలో పరమేశ్వరుడిని కూడ ప్రతిష్ఠ చేస్తాను. అనుగ్రహించు.

తతో జ్ఞాస్యన్తి లోకేఽస్మిన్నేకమూర్తీ హరీశ్వరౌ ।
ప్రత్యువాచ జగన్నాథస్స పునస్తం మహామునిమ్ ॥ 61 ॥

శివకేశవులు ఇద్దరూ ఒకేచోట కలిసి ఉండటంచేత ఈ లోకంలో ప్రజలంతా, విష్ణువు, శివుడు ఇద్దరూ ఒక్కరే అని గ్రహిస్తారు. మార్కండేయమహర్షి కోరికకు జగన్నాథస్వామి (సంతోషించి) ఆ మహర్షితో ఇలా అన్నాడు.

శ్రీభగవానువాచ :–శ్రీమహావిష్ణువు మార్కండేయుడితో ఈవిధంగా చెప్తున్నాడు.

యదేతత్ పరమం దేవం కారణం భువనేశ్వరమ్ ।
లిఙ్గమారాధనార్థాయ నానాభావప్రశాన్తయే ॥ 62 ॥

బ్రాహ్మణోత్తమా! ప్రజలు పూజించుకోవడానికి వీలుగా, లోకాలన్నింటికీ మూలకారణమైన ఆ పరమేశ్వరుడిని లింగరూపంలో (భువనేశ్వరలింగాన్ని) స్థాపించు. దానివల్ల రకరకాల భేదభావాలు పూర్తిగా నశించిపోతాయి.

మమాదేశేన విప్రేన్ద్ర కురు శీఘ్రం శివాలయమ్ ।
తత్ప్రభావాచ్ఛివే లోకే తిష్ఠ త్వం చ తఽథాక్షయమ్ ॥ 63 ॥

నా ఆజ్ఞ ప్రకారం ఇక్కడ వెంటనే శివాలయాన్ని నిర్మించు. శివాలయాన్ని నిర్మించి, శివుడిని ప్రతిష్ఠ చేసిన మాహాత్మ్యం కారణంగా నువ్వు శివలోకంలో శాశ్వతంగా ఉండిపో.

శివే సంస్థాపితే విప్ర మమ సంస్థాపనం భవేత్ ।
నావయోరన్తరం కిఞ్చిదేకభావౌ ద్విధాకృతౌ ॥ 64 ॥

బ్రాహ్మణోత్తమా! శివుడిని స్థాపిస్తే నన్ను (విష్ణువును) స్థాపించినట్లు అవుతుంది. మా యిద్దరికీ కొంచెం కూడ భేదం లేదు. ఒకే(పరమాత్మ)తత్త్వం రెండు(శివకేశవులు)గా ఏర్పడింది.

యో రుద్రస్స స్వయం విష్ణుర్యో విష్ణుస్స మహేశ్వరః ।
ఉభయోరన్తరం నాస్తి పవనాకాశయో రివ ॥ 65 ॥

శివుడే విష్ణువు. విష్ణువే శివుడు. గాలికీ ఆకాశానికీ భేదం లేనట్లుగా మా యిద్దరికీ కూడ భేదం లేదు.

బాలాస్తు నాభిజానన్తి య ఏవ గరుడధ్వజః ।
వృషధ్వజస్స ఏవేతి త్రిపురఘ్నం త్రిలోచనమ్ ॥ 66 ॥

గరుడుడు ధ్వజంగా కలిగిన విష్ణువే, ఎద్దు ధ్వజంగా కలిగిన పరమేశ్వరుడు. త్రిపురాసురసంహారం చేసిన వాడూ, ముక్కంటీ ఐన ఈ శివుడే విష్ణువు. తెలివితక్కువవారు ఈ విషయాన్ని గ్రహించలేరు.

తవ నామాఙ్కితం తస్మాత్ కురు విప్ర శివాలయమ్ ।
ఉత్తరే దేవదేవస్య కురు తీర్థం సుశోభనమ్ ॥ 67 ॥

ద్విజోత్తమా! మార్కండేయా! శివాలయాన్ని నీపేరుమీదుగా నిర్మించు. ఆ దేవుడికి ఉత్తరదిక్కుగా పవిత్రమైన తీర్థాన్ని (కోనేరు) ఏర్పాటు చేయి.

మార్కణ్డేయహ్రదో నామ నరలోకేషు విశ్రుతః ।
భవిష్యతి ద్విజశ్రేష్ఠ సర్వపాపప్రణాశనః ॥ 68 ॥

బ్రాహ్మణోత్తమా! ఆ కోనేరు అందరి పాపాలనూ నిశ్శేషంగా నిర్మూలిస్తుంది. అది మార్కండేయహ్రదం అనే పేరుతో మానవ లోకాలలో ప్రసిద్ధమవుతుంది.

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఇత్యుక్త్వా స తదా దేవస్తత్రైవాన్తరధీయత ।
మార్కణ్డేయం మునిశ్రేష్ఠాస్సర్వవ్యాపీ జనార్దనః ॥ 69 ॥

మహర్షులారా! మార్కండేయుడికి ఈవిధంగా చెప్పి, అంతటా నిండిఉండే ఆ కృష్ణపరమాత్మ అక్కడే అదృశ్యమైనాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భృషిసంవాదే మార్కణ్డేయస్య భగవద్దర్శనం నామ త్రిపఞ్చాశత్తమోఽధ్యాయః ॥53॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో భగవద్దర్శనం అనే యాభైమూడవ అధ్యాయం సంపూర్ణం.



చతుఃపఞ్చాశత్తమోఽధ్యాయః - యాభైనాల్గవ అధ్యాయం

కృష్ణదర్శనమాహాత్మ్యమ్ - కృష్ణదర్శనమాహాత్మ్యం

బ్రహ్మోవాచ:-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

అతః పరం ప్రవక్ష్యామి పఞ్చతీర్థవిధిం ద్విజాః ।
యత్ఫలం స్నానదానేన దేవతాప్రేక్షణేన చ ॥ 1 ॥

బ్రాహ్మణులారా! ఇక ఆ తరువాత పంచతీర్థవిధిని గూర్చి చెప్తాను. పంచతీర్థాలలో స్నానం చేసినందువల్లనూ, అక్కడ దానం చేయడంవల్లనూ, ఆ క్షేత్రంలోని దేవుడిని దర్శించుకున్నందువల్లనూ ఏ ఫలితం వస్తుందో చెప్తాను.

మార్కణ్డేయహ్రదం గత్వా నరశ్చోదఙ్ముఖశ్శుచిః ।
నిమజ్జేత వారాం స్త్రీనిమం మన్త్రముదీరయేత్ ॥ 2 ॥

మానవుడు మార్కండేయహ్రదానికి వెళ్లిన తర్వాత ముందుగా ఉత్తరం దిక్కుగా తిరిగి, (కాళ్లు చేతులు కడుగుకుని) శుచియై, ఆ సరస్సులో మూడు సార్లు మునకలు వేయాలి. అప్పుడు ఈ మంత్రాన్ని ఉచ్చరించాలి.

సంసారసాగరే మగ్నం పాపగ్రస్తమచేతనమ్ ।
త్రాహి మాం భగనేత్రఘ్న త్రిపురారే నమోఽస్తు తే ॥ 3 ॥

త్రిపురాసురసంహారం చేసినవాడా! భగుడు అనే సూర్యుడి కన్ను తొలగించిన స్వామీ! నేను సంసారం అనే సముద్రంలో మునిగిపోయాను. నేను చేసిన పాపాలు నన్ను చుట్టుముట్టాయి. ఏమీ చేయలేని స్థితిలో ఉన్నాను. నన్ను రక్షించు. నీకు నమస్కారం.

నమశ్శివాయ శాన్తాయ సర్వపాపహరాయ చ ।
స్నానం కరోమి దేవేశ మమ నశ్యతు పాతకమ్ ॥ 4 ॥

శుభమూ, శాంతమూ ఐన స్వరూపం గలిగినవాడివీ, పాపాలన్నింటినీ నిర్మూలించేవాడివీ ఐన నీకు నమస్కారం. దేవతాసార్వభౌమా! ఈ మార్కండేయహ్రదంలో స్నానం చేస్తున్నాను. నా పాపాలన్నీ నశించిపోవాలి. (అని చెప్తూ స్నానం చేయాలి.)

నాభిమాత్రే జలే స్నాత్వా విధివద్దేవతాఋషీన్ ।
తిలోదకేన మతిమాన్ పితౄంశ్చాన్యాంశ్చ తర్పయేత్ ॥ 5 ॥

ఈవిధంగా ఉచ్చరిస్తూ బొడ్డులోతు నీళ్ళలో నిలుచుండి స్నానం చేయాలి. స్నానం అయిన తరువాత ఒడ్డున జలంతో దేవతర్పణం, ఋషితర్పణమూ చేయాలి. తరువాత పితరులకూ, ఇతరులకూ నల్లనువ్వులతో పితృతర్పణం చేయాలి.

స్నాత్వా తథైవ చాచమ్య తతో గచ్ఛేచ్ఛివాలయమ్ ।
ప్రవిశ్య దేవతాగారం కృత్వా తం త్రిః ప్రదక్షిణమ్ ॥ 6 ॥

స్నానం చేసి, అనంతరం ఆచమనం చేసి, అపుడు శివాలయానికి వెళ్లాలి. దేవాలయంలో ప్రవేశించగానే ముందుగా ఆలయానికి మూడుమార్లు ప్రదక్షిణం చేయాలి.

మూలమన్త్రేణ సమ్పూజ్య మార్కణ్డేయస్య చేశ్వరమ్ ।
అఘోరేణ చ భో విప్రాః ప్రణిపత్య ప్రసాదయేత్ ॥ 7 ॥

ద్విజులారా! మార్కండేయుడు స్థాపించిన ఆ పరమేశ్వరుడిని మూలమంత్రం(శివపంచాక్షరి)తో పూజించాలి. అఘోర('అఘోరేభ్యోఽ థ ఘోరేభ్యో ఘోరఘోరతరేభ్యస్సర్వేభ్యో సర్వశర్వేభ్యో నమస్తేఽ స్తు రుద్రరూపేభ్యః' అనే) మంత్రంతో స్వామికి సాష్టాంగనమస్కారం చేసి శివుడి అనుగ్రహాన్ని పొందాలి.(ఆ తరువాత స్వామిని ఇలా స్తుతించాలి.)

త్రిలోచన నమస్తేఽ స్తు నమస్తే శశిభూషణ ।
త్రాహి మాం త్వం విరూపాక్ష మహాదేవ నమోఽ స్తు తే ॥ 8 ॥

మూడుకన్నులవాడా! నీకు నమస్కారం. చంద్రుడిని సిగలో అలంకారంగా కలిగినవాడా! నీకు నమస్కారం. విరూపాక్షస్వామీ! నన్ను కాపాడు. మహాదేవా! నీకు నమస్కారం.

మార్కణ్డేయహ్రదే త్వేవం స్నాత్వా దృష్ట్వా చ శఙ్కరమ్ ।
దశానామశ్వమేధానాం ఫలం ప్రాప్నోతి మానవః ॥ 9 ॥

మార్కండేయహ్రదంలో స్నానం చేసి, అక్కడిశంకరుడిని దర్శనం చేసుకున్న మానవుడు, పది అశ్వమేధ యాగాలు చేసిన ఫలితాన్ని పొందుతాడు.

పాపైస్సర్వైర్వినిర్ముక్తశ్శివలోకం స గచ్ఛతి ।
తత్ర భుక్త్వా వరాన్ భోగాన్ యావదాభూతసంప్లవమ్ ॥ 10 ॥

అతడి పాపాలన్నీ నశిస్తాయి. అతడు శివలోకానికి వెళ్తాడు. ఆత్యంతిక ప్రళయం వచ్చి, సృష్టి సమస్తమూ నశించిపోయేవరకూ శివలోకంలో ఉత్తమోత్తమ సుఖాలు అనుభవిస్తాడు.

ఇహలోకం సమాసాద్య భవేద్ విప్రో బహుశ్రుతః ।
శాఙ్కరం యోగమాసాద్య తతో మోక్ష మవాప్నుయాత్ ॥ 11 ॥

ఆ తరువాత భూలోకంలో, విద్వాంసుడైన బ్రాహ్మణుడుగా జన్మిస్తాడు. ఆ జన్మలో శివుడికి సంబంధించిన శాంకరయోగాన్ని ఆచరించి, ఆ తర్వాత మోక్షాన్ని పొందుతాడు.

కల్పవృక్షం తతో గత్వా కృత్వా తం త్రిః ప్రదక్షిణమ్ ।
పూజయేత్ పరయా భక్త్యా మన్త్రేణానేన తం వటమ్ ॥ 12 ॥

తర్వాత కల్పవృక్షంవంటి మఱ్ఱిచెట్టు వద్దకు వెళ్లి, దానికి మూడుసార్లు ప్రదక్షిణం చేయాలి. ఈ క్రింది మంత్రంతో ఆ మఱ్ఱిచెట్టును భక్తితో పూజించాలి.

ఓం నమోఽ వ్యక్తరూపాయ మహాప్రలయకారిణే ।
మహద్రసోపవిష్టాయ న్యగ్రోధాయ నమోఽ స్తు తే ॥ 13 ॥

(మఱ్ఱిచెట్టు) అసలు స్వరూపం (పరమాత్మతత్త్వం) తెలుసుకోలేనిది, మహాప్రళయాన్ని కలిగిస్తున్నదీ, ఉత్తమమైన అమృతరసానికి ఆధారమైన ఓ మఱ్ఱిచెట్టా! నీకు నమస్కారం.

అమరస్త్వం సదా కల్పే హరేశ్చాయతనం వట ।
న్యగ్రోధ హర మే పాపం కల్పవృక్ష నమోఽ స్తు తే ॥ 14 ॥

ఓ వటవక్షమా! నీకు మరణం లేదు. కల్పాంతం వరకు నిలిచిఉంటావు. శ్రీమహావిష్ణువు నీలోనే నివసిస్తాడు. ఓ మఱ్ఱిచెట్టా! నా పాపాన్ని హరించు. కల్పవృక్షమా! నీకు నమస్కారం.

భక్త్యా ప్రదక్షిణం కృత్వా నత్వా కల్పవటం నరః ।
సహసా ముచ్యతే పాపాజ్జీర్ణత్వచ ఇవోరగః ॥ 15 ॥

కల్పవృక్షమైన ఆ మఱ్ఱిచెట్టుకు భక్తితో ప్రదక్షిణం చేసి, నమస్కరించిన మానవుడి పాపాలన్నీ నశించి పోతాయి. పామునుండి కుబుసం విడిపోయినట్లుగా ఆతడినుండి పాపాలు వెళ్లిపోతాయి.(అతడు కుబుసం విడిచిన పాములాగా ఉత్తమతేజోవంతు డవుతాడు.)

ఛాయాం తస్య సమాక్రమ్య కల్పవృక్షస్య భో ద్విజాః ।
బ్రహ్మహత్యాం నరో జహ్యాత్ పాపేష్వన్యేషు కా కథా ॥ 16 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆ కల్పవృక్షం నీడలో ఉన్న మానవుడికి బ్రహ్మహత్యాపాపం కూడ నశించిపోతుంది. ఇక మిగిలిన సాధారణమైన పాపాల సంగతి చెప్పేదేముంది?

దృష్ట్వా కృష్ణాఙ్గసమ్భూతం బ్రహ్మతేజోమయం పరమ్ ।
న్యగ్రోధాకృతికం విష్ణుం ప్రణిపత్య చ భో ద్విజాః ॥ 17 ॥

రాజసూయాశ్వమేధాభ్యాం ఫలం ప్రాప్నోతి చాధికమ్ ।
తథా స్వవంశముద్ధృత్య విష్ణులోకం స గచ్ఛతి ॥ 18 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆవృక్షం శ్రీకృష్ణుడి శరీరంనుండి ఏర్పడింది. బ్రహ్మతేజస్సుతో నిండి ఉంటుంది. ఉత్తమమైనది. మఱ్ఱిచెట్టు రూపంలో ఉన్న శ్రీమహావిష్ణువుకు నమస్కరించినవాడు రాజసూయం, అశ్వమేధం అనేయాగాలు చేసినదానికంటె అధికమైన ఫలితాన్ని పొందుతాడు. తన వంశం వారిని నరకలోకాలనుండి ఉద్ధరిస్తాడు. (వారిని తీసుకుని)తాను విష్ణులోకానికి వెళ్తాడు.

వైనతేయం నమస్కృత్య కృష్ణస్య పురతః స్థితమ్ ।
సర్వపాపవినిర్ముక్తస్తతో విష్ణుపురం వ్రజేత్ ॥ 19 ॥

కృష్ణస్వామికి ఎదురుగా ఉన్న గరుత్మంతుడికి నమస్కరించినవాడికి చేసిన పాపాలన్నీ నశించిపోతాయి. తరువాత అతడు వైకుంఠానికి వెళ్తాడు.

దృష్ట్వా వటం వైనతేయం యః పశ్యేద్ పురుషోత్తమమ్ ।
సఙ్కర్షణం సుభద్రాం చ స యాతి పరమాం గతిమ్ ॥ 20 ॥

మఱ్ఱిచెట్టునూ, గరుత్మంతుడినీ, శ్రీకృష్ణస్వామినీ, బలరాముడినీ, సుభద్రనూ దర్శించుకున్నవాడు ఉత్తమోత్తమమైన మోక్షస్థితిని పొందుతాడు.

ప్రవిశ్యాయతనం విష్ణోః కృత్వా తం త్రిః ప్రదక్షిణమ్ ।
సఙ్కర్షణం స్వమన్త్రేణ భద్రాం పూజ్య ప్రసాదయేత్ ॥ 21 ॥

అక్కడ విష్ణుదేవుడి ఆలయానికి వెళ్లాలి. దానికి మూడుమార్లు ప్రదక్షిణం చేయాలి. బలరాముడినీ, సుభద్రనూ వారివారి మంత్రాలతో పూజించాలి. వారి అనుగ్రహాన్ని పొందాలి.

నమస్తే హలధృగ్ రామ నమస్తే ముసలాయుధ ।
నమస్తే రేవతీకాన్త నమస్తే భక్తవత్సల ॥ 22 ॥

నాగలిని ఆయుధంగా ధరించినవాడా! బలరామా! నీకు నమస్కారం. రోకలిని ఆయుధంగా కలిగినవాడా! నీకు నమస్కారం. రేవతీరమణా! నీకు నమస్కారం. భక్తులమీద వాత్సల్యం కలిగినవాడా నీకు నమస్కారం.

నమస్తే బలినాం శ్రేష్ఠ నమస్తే ధరణీధర ।
ప్రలమ్బారే నమస్తేఽస్తు త్రాహి మాం కృష్ణపూర్వజ ॥ 23 ॥

బలవంతులలో శ్రేష్ఠుడా! నీకు నమస్కారం. (ఆదిశేషుడిరూపంలో) భూమిని మోసే స్వామీ నీకు నమస్కారం. ప్రలంబుడు అనే రాక్షసుడిని సంహరించినవాడా! నీకు నమస్కారం. శ్రీకృష్ణుడికి ముందుగా (అన్నగా) పుట్టినవాడా! నీకు నమస్కారం.

ఏవం ప్రసాద్య తం దేవమజేయం త్రిదశార్చితమ్ ।
కైలాసశిఖరాకారం చన్ద్రాత్ కాన్తతరాననమ్ ॥ 24 ॥

నీలవస్త్రధరం దేవం ఫణావికటమస్తకమ్ ।
మహాబలం హలధరం కుణ్డలైకవిభూషితమ్ ॥ 25 ॥

రౌహిణేయం నరో భక్త్యా లభేదభిమతం ఫలమ్ ।
సర్వపాపైర్వినిర్ముక్తో విష్ణులోకం స గచ్ఛతి ॥ 26 ॥

స్వయంగా ప్రకాశించేవాడూ, జయింప శక్యంకానివాడూ, దేవతలచేత పూజింపబడేవాడూ కైలాసశిఖరంవలె తెల్లని ఆకారం కలవాడూ, చంద్రుని కన్న అందమైన ముఖం కలవాడూ, నల్లని బట్టని ధరించేవాడూ, దేవుడూ (పూజింపదగినవాడూ), పాముపడగవలె వికారమైన తల కలవాడూ, గొప్ప బలవంతుడూ, నాగలి ఆయుధంగా

కలవాడూ, ప్రధానంగా కుండలాలచేత అలంకరించబడినవాడూ, రోహిణి యొక్క కుమారుడూ ఐన బలరాముని మానవుడు భక్తితో ఈవిధంగా ప్రసన్నుడిని చేసికొని తనకు అభిమతమైన ఫలితాన్ని పొందవలెను. ఆ మానవుడు సమస్త పాపాలచేత విడువబడినవాడై వైకుంఠానికి వెళతాడు.

ఆభూతసంప్లవం యావద్ భుక్త్వా తత్ర సుఖం నరః ।
పుణ్యక్షయాదిహాయాతః ప్రవరే యోగినాం కులే ॥ 27 ॥

మహాప్రళయం వచ్చి, సమస్తభూతకోటి నశించిపోయేవరకు వైకుంఠంలో సుఖంగా ఉంటాడు. పుణ్యం అంతా ఖర్చైన తరువాత భూలోకానికి తిరిగివస్తాడు. ఇక్కడ ఉత్తమమైన యోగుల వంశంలో జన్మిస్తాడు.

బ్రాహ్మణప్రవరో భూత్వా సర్వశాస్త్రార్థపారగః ।
జ్ఞానం తత్ర సమాసాద్య ముక్తిం ప్రాప్నోతి దుర్లభామ్ ॥ 28 ॥

ఉత్తముడైన బ్రాహ్మణుడుగా జన్మించి, సమస్తశాస్త్రాలూ చక్కగా తెలుసుకుంటాడు. ఆ విధంగా జ్ఞానాన్ని సంపాదించి, ఆ జ్ఞానం ద్వారా ఎంతో కష్టసాధ్యమైన మోక్షాన్ని సులువుగా పొందుతాడు.

ఏవఒ మభ్యర్చ్య హలినం తతః కృష్ణం విచక్షణః ।
ద్వాదశాక్షరమన్త్రేణ పూజయేత్ సుసమాహితః ॥ 29 ॥

బలరాముడిని ఈవిధంగా పూజించిన తరువాత బుద్ధిమంతుడు ఎంతో శ్రద్ధగా, ద్వాదశాక్షరమంత్రం(ఓం నమో భగవతే వాసుదేవాయ)తో శ్రీకృష్ణస్వామిని పూజించాలి.

ద్విషట్కవర్ణమన్త్రేణ భక్త్యా యే పురుషోత్తమమ్ ।
పూజయన్తి సదా ధీరాస్తే మోక్షం ప్రాప్నువన్తి వై ॥ 30 ॥

ద్వాదశాక్షరమంత్రంతో శ్రీకృష్ణస్వామిని శ్రద్ధగా పూజించిన పండితులు ఎప్పుడూ తప్పకుండా మోక్షాన్ని పొందుతారు.

న తాం గతిం సురా యాన్తి యోగినో నైవ సామగాః ।
యాం గతిం యాన్తి భో విప్రా ద్వాదశాక్షరతత్పరాః ॥ 31 ॥

ఓ బ్రాహ్మణులారా! ద్వాదశాక్షరమంత్రం మీద శ్రద్ధ గలిగినవారు (శ్రద్ధగా అనుష్ఠించేవాళ్లు) పొందే ఉత్తమగతిని దేవతలు గాని, యోగులు గాని, సామవేదపారగులు గాని, ఎవ్వరూ పొందలేరు.

తస్మాత్తేనైవ మన్త్రేణ భక్త్యా కృష్ణం జగద్గురుమ్ ।
సమ్పూజ్య గన్ధపుష్పాద్యైః ప్రణిపత్య ప్రసాదయేత్ ॥ 32 ॥

అందుచేత ద్వాదశాక్షరమంత్రంతోనే జగద్గురువైన శ్రీకృష్ణుడిని చక్కగా గంధం, పూలు, మొదలైన వాటితో పూజించాలి. తరువాత సాష్టాంగంగా నమస్కరించి, స్వామి అనుగ్రహాన్ని పొందాలి.

జయ కృష్ణ జగన్నాథ జయ సర్వాఘనాశన ।
జయ చాణూరకేశిఘ్న జయ కంసనిషూదన ॥ 33 ॥

శ్రీకృష్ణా! లోకేశ్వరా! నీకు జయ మగు గాక. పాపాలు సమస్తమూ నాశనం చేసేవాడా! జయం. చాణూరుడు, కేశి అనే రాక్షసులను చంపినవాడా! జయం. కంసుడిని సంహరించినవాడా! జయం.

జయ పద్మపలాశాక్ష జయ చక్రగదాధర ।
జయ నీలామ్బుదశ్యామ జయ సర్వసుఖప్రద ॥ 34 ॥

తామరరేకులవంటికన్నులు కలవాడా! జయం. చక్రం గద అనే ఆయుధాలను ధరించినవాడా! జయం. వానకాలపు మబ్బులాగా నల్లనైన వాడా! జయం. అందరికీ అన్నివిధాలైన సౌఖ్యాలను అందించేవాడా! జయం.

జయ దేవ జగత్పూజ్య జయ సంసారనాశన ।
జయ విష్ణో లోకపూజ్య జయ వాఞ్ఛాఫలప్రద ॥ 35 ॥

దేవతలకు ప్రభువా! లోకాలన్నీ పూజించేవాడా! జయం. చావుపుట్టుకలు లేకుండా చేసేవాడా!(మోక్షంఇచ్చే వాడా!) జయం. శ్రీమహావిష్ణూ! జగత్తులచేత పూజింపబడేవాడా! జయం. కోరిన కోరికలను తీర్చేవాడా! జయం.

సంసారసాగరే ఘోరే నిస్సారే దుఃఖఫేనిలే ।
క్రోధగ్రాహాకులే రౌద్రే విషయోదకసంప్లవే ॥ 36 ॥

సంసారం మహాభయంకరం. ఇది పెద్దసముద్రం. బాధలు అనే నురుగు అధికం. దీనినిండా కోపం అనే మొసళ్లు సంచరిస్తుంటాయి. ఇది జనాలను ఏడిపిస్తుంది. ఇంద్రియసుఖాలు అనే నీళ్ళతో నిండినది.

నానారోగోర్మికలిలే మోహావర్తసుదుస్తరే ।
నిమగ్నోఽహం సురశ్రేష్ఠ త్రాహి మాం పురుషోత్తమ ॥ 37 ॥

సంసారం అనే సముద్రంలో రకరకాల రోగాలు అనే అలలు ఎగసిపడుతున్నాయి. అజ్ఞానం అనే సుడిగుండాల మూలంగా బయటపడడానికి వీలులేకుండా ఉంది. ఇందులో (సంసారసముద్రంలో) మునిగి ఉన్నాను. దేవతా సార్వభౌమా! శ్రీకృష్ణస్వామీ! నన్ను రక్షించు.

ఏవం ప్రసాద్య దేవేశం వరదం భక్తవత్సలమ్ ।
సర్వపాపహరం దేవం సర్వకామఫలప్రదమ్ ॥ 38 ॥

ఈవిధంగా దేవదేవుడైన కృష్ణస్వామిని స్తుతించాలి. ఆ స్వామి వరాలను ప్రసాదిస్తాడు. భక్తులమీద వాత్సల్యం కలిగినవాడు. సమస్త పాపాలను హరిస్తాడు. ఆ దేవుడు ఇష్టమైన కోరికలను అన్నింటినీ తీరుస్తాడు.

పీనాంసం ద్విభుజం కృష్ణం పద్మపత్రాయతేక్షణమ్ ।
మహోరస్కం మహాబాహుం పీతవస్త్రం శుభాననమ్ ॥ 39 ॥

స్వామిభుజాలు దృఢంగా ఉంటాయి. రెండుచేతులుంటాయి. నల్లగా ఉంటాడు. కన్నులు తామరరేకులలాగా విశాలంగా ఉంటాయి. వక్షఃస్థలం విస్తారంగా ఉంటుంది. బాహువులు మిక్కిలి పొడవుగా ఉంటాయి. పచ్చని పట్టుబట్ట కట్టుకుంటాడు. ముఖం మనోహరంగా ఉంటుంది.

శఙ్ఖచక్రగదాపాణిం ముకుటాఙ్గదభూషణమ్ ।
సర్వలక్షణసంయుక్తం వనమాలావిభూషితమ్ ॥ 40 ॥

చేతులలో శంఖం, చక్రం, గద ధరిస్తాడు. కిరీటం, భుజకీర్తులు అలంకారాలుగా ఉంటాయి. ఉత్తమలక్షణాలు సమస్తమూ కలిగి ఉంటాడు. మోకాళ్లవరకూ వేలాడే పొడుగుపాటి పూలమాలను అందంగా ధరిస్తాడు.

దృష్ట్వా నరోఽఞ్జలిం కృత్వా దణ్డవత్ ప్రణిపత్య చ ।
అశ్వమేధసహస్రాణాం ఫలం ప్రాప్నోతి వై ద్విజాః ॥ 41 ॥

బ్రాహ్మణులారా! అటువంటి శ్రీకృష్ణస్వామిని దర్శించుకుని, దండంలాగా సాష్టాంగంగా పడి, నమస్కరించిన మానవుడు వేయి అశ్వమేధయాగాలు చేసిన ఫలితాన్ని పొందుతాడు.

యత్ఫలం సర్వతీర్థేషు స్నానే దానే ప్రకీర్తితమ్ ।
నరస్తత్ఫలమాప్నోతి దృష్ట్వా కృష్ణం ప్రణమ్య చ ॥ 42 ॥

ఆ శ్రీకృష్ణుడిని దర్శించి, నమస్కరించిన మానవుడు ఈ లోకంలోని అన్ని పుణ్యతీర్థాలలోనూ స్నానం చేసి, అక్కడ దానం చేస్తే ఎంతటి ఫలితం వస్తుందో అంతటి ఫలితాన్ని పొందుతాడు.

యత్ఫలం సర్వరత్నాద్యైరిష్టే బహుసువర్ణకే ।
నరస్తత్ఫలమాప్నోతి దృష్ట్వా కృష్ణం ప్రణమ్య చ ॥ 43 ॥

ఆ శ్రీకృష్ణుడిని దర్శించి, నమస్కరించిన మానవుడు సమస్తమైన రత్నాలనూ, బంగారాన్నీ (దానాలుగానూ) దక్షిణలుగా ఇచ్చి యజ్ఞం చేస్తే, ఎంతటి ఫలితం వస్తుందో అంతటి ఫలితాన్ని పొందుతాడు.

యత్ఫలం సర్వవేదేషు సర్వయజ్ఞేషు కీర్తితమ్ ।
తత్ఫలం సమవాప్నోతి నరః కృష్ణం ప్రణమ్య చ ॥ 44 ॥

ఆ శ్రీకృష్ణుడిని దర్శించి, నమస్కరించిన మానవుడు అన్ని వేదాలను అభ్యసించడం చేతనూ, అన్ని యాగాలు చేయడంవల్లనూ ఎంతటి ఫలితం వస్తుందో అంతటి ఫలితాన్ని పొందుతాడు.

యత్ఫలం సర్వదానేన వ్రతేన నియమేన చ ।
నరస్తత్ఫలమాప్నోతి దృష్ట్వా కృష్ణం ప్రణమ్య చ ॥ 45 ॥

ఆ శ్రీకృష్ణుడిని దర్శించి, నమస్కరించిన మానవుడు తనకున్నది అంతా దానం చేయడంచేతనూ, వ్రతాలు ఆచరించడంచేతనూ, నియమాలు పాటించడంచేతనూ ఎంతటి ఫలితం వస్తుందో అంతటి ఫలితాన్ని పొందుతాడు.

తపోభిర్వివిధైరుగ్రైర్యత్ఫలం సముదాహృతమ్ ।
నరస్తత్ఫలమాప్నోతి దృష్ట్వా కృష్ణం ప్రణమ్య చ ॥ 46 ॥

ఆ శ్రీకృష్ణుడిని దర్శించి, నమస్కరించిన మానవుడు రకరకాలైన తపస్సులను అతితీవ్రంగా ఆచరిస్తే ఎంతటి ఫలితం వస్తుందో అంతటి ఫలితాన్ని పొందుతాడు.

యత్ఫలం బ్రహ్మచర్యేణ సమ్యక్ చీర్ణేన కీర్తితమ్ ।
నరస్తత్ఫలమాప్నోతి దృష్ట్వా కృష్ణం ప్రణమ్య చ ॥ 47 ॥

ఆ శ్రీకృష్ణుడిని దర్శించి, నమస్కరించిన మానవుడు బ్రహ్మచర్యవ్రత నియమాలను చక్కగా ఆచరించిన బ్రహ్మచారికి, ఎంతటి ఫలితం వస్తుందో అంతటి ఫలితాన్ని పొందుతాడు.

యత్ఫలం చ గృహస్థస్య యథోక్తాచారవర్తినః ।
నరస్తత్ఫలమాప్నోతి దృష్ట్వా కృష్ణం ప్రణమ్య చ ॥ 48 ॥

ఆ శ్రీకృష్ణుడిని దర్శించి, నమస్కరించిన మానవుడు గృహస్థుడు శాస్త్రోక్తమైన గృహస్థాశ్రమ ధర్మాలను శ్రద్ధగా ఆచరించిన గృహస్థుడికి, ఎంతటి ఫలితం వస్తుందో అంతటి ఫలితాన్ని పొందుతాడు.

యత్ఫలం వనవాసేన వానప్రస్థస్య కీర్తితమ్ ।
నరస్తత్ఫలమాప్నోతి దృష్ట్వా కృష్ణం ప్రణమ్య చ ॥ 49 ॥

ఆ శ్రీకృష్ణుడిని దర్శించి, నమస్కరించిన మానవుడు వానప్రస్థ ఆశ్రమ నియమాలను పాటిస్తూ, అరణ్యాలలో నివసిస్తే,వానప్రస్థుడికి, ఎంతటి ఫలితం వస్తుందో అంతటి ఫలితాన్ని పొందుతాడు.

సన్న్యాసేన యథోక్తేన యత్ఫలం సముదాహృతమ్ ।
నరస్తత్ఫలమాప్నోతి దృష్ట్వా కృష్ణం ప్రణమ్య చ ॥ 50 ॥

ఆ శ్రీకృష్ణుడిని దర్శించి, నమస్కరించిన మానవుడు సన్న్యాసాశ్రమానికి తగిన కర్మలను శాస్త్రోక్తమైన పద్ధతులను పాటించిన సన్యాసికి ఎంతటి ఫలితం వస్తుందో అంతటి ఫలితాన్ని పొందుతాడు.

కిం చాత్ర బహునోక్తేన మాహాత్మ్యే తస్య భో ద్విజాః ।
దృష్ట్వా కృష్ణం పరా భక్త్యా మోక్షం ప్రాప్నోతి దుర్లభమ్ ॥ 51 ॥

ఓ బ్రాహ్మణులారా! శ్రీకృష్ణస్వామి మాహాత్మ్యాన్ని గూర్చి చెప్పడానికి ఇన్ని మాటలు అవసరం లేదు. ఇక్కడ శ్రీకృష్ణభగవానుడిని దర్శించుకున్నవాడు ఎంతో కష్టపడితే కాని దొరకని మోక్షాన్ని చాల సులువుగా పొందుతాడు.

సర్వపాపైర్వినిర్ముక్తః కల్పకోటిసముద్భవైః ।
శ్రియా పరమయా యుక్తస్సర్వైస్సముదితో గుణైః ॥ 52 ॥

(కృష్ణుడికి నమస్కరించినవాడికి) ఎన్నో కోట్లకల్పాల కాలంనుండి కూడబెట్టుకున్న పాపాలు అన్నీ వదిలి పోతాయి. ఉత్తమోత్తమమైన శుభపరంపరలు సిద్ధిస్తాయి. సమస్త సద్గుణాలు అతడివద్దకు చేరతాయి.

సర్వకామసమృద్ధేన విమానేన సువర్చసా ।
త్రిసప్తకులముద్ధృత్య నరో విష్ణుపురం వ్రజేత్ ॥ 53 ॥

ఇరవైఒక్క తరాలవారిని నరకలోకాలనుండి ఉద్ధరిస్తాడు. వారిని తీసుకుని, కోరికల నన్నింటినీ సమృద్ధిగా తీర్చే కాంతిమంతమైన విమానమెక్కి, వైకుంఠానికి వెళ్తాడు.

తత్ర కల్పశతం యావద్ భుక్త్వా భోగాన్ మనోరమాన్ ।
గన్ధర్వాప్సరసైస్సార్ధం యథా విష్ణుశ్చతుర్భుజః ॥ 54 ॥

నాలుగు చేతులు కలిగిన విష్ణుమూర్తిలాగా (సారూప్యముక్తితో) అతడు వైకుంఠంలో గంధర్వులతోనూ, అప్సరసలతోనూ కలిసి, నూరు కల్పాల కాలం కోరుకున్న భోగాలనుభవిస్తాడు.

చ్యుతస్తస్మాదిహాయాతో విప్రాణాం ప్రవరే కులే ।
ధర్మజ్ఞస్సర్వవేదీ చ జాయతే గతమత్సరః ॥ 55 ॥

(పుణ్యక్షయమైన) తర్వాత భూలోకానికి తిరిగివస్తాడు. ఇక్కడ ఉత్తమమైన బ్రాహ్మణుల వంశంలో జన్మిస్తాడు. అప్పుడు సమస్తమైన ధర్మాలూ, వేదాలూ, అన్నీ తెలుసుకుంటాడు. వాడికి అసూయ ఉండదు.

స్వధర్మనిరతశ్శాన్తో దాన్తో భూతహితే రతః ।
ఆసాద్య వైష్ణవం జ్ఞానం తతో మోక్షమవాప్నుయాత్ ॥ 56 ॥

తనకు విహితమైన ధర్మాలను శ్రద్ధగా ఆచరిస్తాడు. లోపలా, బయటా ఇంద్రియాలన్నిటినీ జయిస్తాడు. అన్ని ప్రాణులకు మేలు చేయడంలో ఆసక్తి కలిగి ఉంటాడు. విష్ణుమూర్తికి సంబంధించిన జ్ఞానాన్ని అంది, తరువాత మోక్షాన్ని పొందుతాడు.

తతఽస్సమ్పూజ్య మన్త్రేణ సుభద్రాం భక్తవత్సలామ్ ।
ప్రసాదయేత్ తతో విప్రాః ప్రణిపత్య కృతాఞ్జలిః ॥ 57 ॥

ద్విజులారా! ఆ తరువాత భక్తులపైన వాత్సల్యం కలిగిన సుభద్రాదేవిని ఆ దేవి మంత్రంతో చక్కగా పూజించాలి. చేతులు జోడించి నమస్కరించి, స్తోత్రాలతో ఆమెను అనుగ్రహింపజేసుకోవాలి.

నమస్తే సర్వగే దేవి నమస్తే శుభసౌఖ్యదే ।
త్రాహి మాం పద్మపత్రాక్షి కాత్యాయని నమోఽస్తు తే ॥ 58 ॥

అన్నిటా నిండిఉన్నదేవీ! నీకు నమస్కారం. శుభాలనూ, సుఖాలనూ ప్రసాదించే తల్లీ! నీకు నమస్కారం. తామరరేకుల వంటి కన్నులు కలిగిన అమ్మా! నన్ను రక్షించు. పార్వతీదేవీ! నీకు నమస్కారం.

ఏవం ప్రసాద్య తాం దేవీం జగద్ధాత్రీం జగద్ధితామ్ ।
బలదేవస్య భగినీం సుభద్రాం వరదాం శివామ్ ॥ 59 ॥

ఈవిధంగా సుభద్రాదేవిని స్తుతించాలి. సుభద్ర జగన్మాత. లోకాలకు మేలు చేసే తల్లి. బలరాముడి చెల్లెలు. కావలసిన వరాలను ఇస్తుంది. ఆమె శుభస్వరూపిణి.

కామగేన విమానేన నరో విష్ణుపురం వ్రజేత్ ।
ఆభూతసంప్లవం యావత్ క్రీడిత్వా తత్ర దేవవత్ ॥ 60 ॥

సుభద్ర అనుగ్రహంచేత మానవుడు స్వేచ్ఛగా సంచరించే విమానంలో వైకుంఠానికి వెళ్తాడు. మహాప్రళయం వచ్చి సమస్తమూ నాశనం అయ్యేంతవరకూ వైకుంఠంలో విష్ణుస్వరూపంతో సుఖిస్తాడు.

ఇహ మానుషతాం ప్రాప్తో బ్రాహ్మణో వేదవిద్ భవేత్ ।
ప్రాప్య యోగం హరేస్తత్ర మోక్షం చ లభతే ధ్రువమ్ ॥ 61 ॥

తరువాత (పునస్సృష్టిలో) మానవుడుగా జన్మిస్తాడు. అప్పుడు వేదవేత్త అయిన బ్రాహ్మణుడు అవుతాడు. విష్ణుదేవుడికి సంబంధించిన యోగాన్ని అనుష్ఠించి, నిశ్చయంగా మోక్షాన్ని పొందుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే మార్కణ్డేయస్య కృష్ణదర్శనమాహాత్మ్యం నామ చతుఃపఞ్చాశత్తమోఽధ్యాయః ॥ 54 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషి సంవాదంలో కృష్ణదర్శనమాహాత్మ్యం అనే యాభైనాల్గవ అధ్యాయం ॥ 54 ॥



పఞ్చపఞ్చాశత్తమోఽధ్యాయః - యాభైఐదవ అధ్యాయం

నరసింహమాహాత్మ్యవర్ణనమ్ - నరసింహమాహాత్మ్యవర్ణనం

బ్రహ్మోవాచ :- మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవం దృష్ట్వా బలం కృష్ణం సుభద్రాం ప్రణిపత్య చ ।
ధర్మం చార్థం చ కామం చ మోక్షం చ లభతే ధ్రువమ్ ॥ 1 ॥

ఈవిధంగా బలరాముడినీ, శ్రీకృష్ణుడినీ, సుభద్రనూ దర్శించుకుని, వారికి నమస్కరిస్తే, ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలనూ (మానవుడు) నిశ్చయంగా పొందుతాడు.

నిష్క్రమ్య దేవతాగారాత్ కృతకృత్యో భవేన్నరః ।
ప్రణమ్యాయతనం పశ్చాద్ వ్రజేత్ తత్ర సమాహితః ॥ 2 ॥

ఆ దేవాలయం నుండి వెలువడిన వెంటనే భగవంతుడి అనుగ్రహంతో కృతార్థుడవుతాడు. ఆ తర్వాత ఆలయానికి నమస్కరించి, ఏకాగ్రమైన బుద్ధితో దేవదేవుడిని తలుచుకుంటూ తిరిగి (ఇంద్రనీలమయుడైన విష్ణువు విగ్రహం రహస్యంగా ఉన్నచోటికి) వెళ్లాలి.

ఇన్ద్రనీలమయో విష్ణుర్యత్రాస్తే వాలుకావృతః ।
అన్తర్ధానగతం నత్వా తతో విష్ణుపురం వ్రజేత్ ॥ 3 ॥

శ్రీమహావిష్ణువు ఇంద్రనీలమణుల స్వరూపంలో అక్కడ ఇసుకలో కప్పబడి అదృశ్యంగా ఉన్నాడు. ఆ స్వామికి నమస్కరించిన భక్తుడు వైకుంఠానికి చేరుకుంటాడు.

సర్వదేవమయో యోఽసౌ హతవానసురోత్తమమ్ ।
స ఆస్తే తత్ర భో విప్రాస్సింహార్ధకృతవిగ్రహః ॥ 4 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆ పురుషోత్తముడు సమస్తదేవతాస్వరూపుడు. హిరణ్యకశిపుడు అనే రాక్షసుడిని సంహరించినవాడు. ఆ స్వామి మూర్తి సగం సింహం ఆకారంలో (సగం మానవుడిరూపంలోనూ) ఉంటుంది.

భక్త్యా దృష్ట్వా తు తం దేవం ప్రణమ్య నరకేసరిమ్ ।
ముచ్యతే పాతకైర్మర్త్యస్సమస్తైర్నాత్ర సంశయః ॥ 5 ॥

ఆ నరసింహస్వామిని భక్తితో కనులార చూచి, నమస్కరించిన మానవుడు సమస్తపాపాలనుండి విముక్తుడవుతాడు. ఇందులో సందేహం లేదు.

నరసింహస్య యే భక్తా భవన్తి భువి మానవాః ।
న తేషాం దుష్కృతం కిఞ్చిత్ ఫలం స్యాద్యద్యదీప్సితమ్ ॥ 6 ॥

ఈ భూమిమీద నరసింహస్వామికి భక్తులైన మానవులకు ఎంతమాత్రమూ పాపం ఉండదు. (ఉన్నదంతా నశిస్తుంది). ఇంక పైగా వారికోరికలన్నీ, తప్పకుండా నెరవేరుతాయి.

తస్మాత్ సర్వప్రయత్నేన నరసింహం సమాశ్రయేత్ ।
ధర్మార్థకామమోక్షాణాం ఫలం యస్మాత్ ప్రయచ్ఛతి ॥ 7 ॥

అందుచేత ఎంతో పూనికతో, పట్టుదలతో నరసింహస్వామిని ఆశ్రయించాలి. ఆ స్వామివల్లనే ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే పురుషార్థాలు సిద్ధిస్తాయి.

మునయ ఊచుః :- బ్రహ్మదేవుడితో మహర్షులు ఈవిధంగా అంటున్నారు.

మాహాత్మ్యం నారసింహస్య సుఖదం భువి దుర్లభమ్ ।
యథా కథయసే దేవ తతో నో విస్మయో మహాన్ ॥ 8 ॥

బ్రహ్మదేవా! నరసింహస్వామి మహిమ అందరికీ సుఖాన్ని ఇస్తుంది. అంతటిది భూలోకంలో ఇం కొకటి లేదు అని నీవు చెప్పిన విషయాలు మాకు చాల ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి.

ప్రభావం తస్య దేవస్య విస్తరేణ జగత్పతే ।
శ్రోతుమిచ్ఛామహే బ్రూహి పరం కౌతూహలం హి నః ॥ 9 ॥

జగన్నాథా! నరసింహస్వామి ప్రభావాన్ని గురించి, వినాలని కోరుకుంటున్నాం. తెలుసుకోవా లని మాకు చాల కుతూహలంగా ఉంది. వివరించి చెప్పవలసింది.

యథా ప్రసీదేద్దేవోఽసౌ నరసింహో మహాబలః ।
భక్తానాముపకారాయ బ్రూహి దేవ నమోఽస్తు తే ॥ 10 ॥

బ్రహ్మదేవా! నీకు నమస్కారం. మిక్కిలి బలవంతుడైన ఆ నరసింహస్వామి ఆశ్రితులను ఏవిధంగా అనుగ్రహిస్తాడో, చెప్పు. నరసింహస్వామి భక్తులకు మేలు కలగడంకోసం వివరించు.

ప్రసాదాన్నరసింహస్య యా భవన్త్యత్ర సిద్ధయః ।
బ్రూహి తాః కురు చాస్మాకం ప్రసాదం ప్రపితామహ ॥ 11 ॥

బ్రహ్మదేవా! నరసింహస్వామివారి అనుగ్రహంచేత ఏ ఏ సిద్ధులు లభిస్తాయి? మా మీద దయతో ఆ సిద్ధులను గురించి చెప్పు.

బ్రహ్మోవాచ:-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

శృణుధ్వం తస్య భో విప్రాః ప్రభావం వదతో మమ ।
అజితస్యాప్రమేయస్య భుక్తిముక్తిప్రదస్య చ ॥ 12 ॥

ఓ బ్రాహ్మణులారా! నరసింహస్వామికి ఓటమి లేదు. ఆ స్వామికి పరిమితి లేదు. భోగమోక్షాలను ప్రసాదిస్తాడు. ఆ స్వామి మహిమలను చెప్తాను, వినండి. తరించండి.

కశ్శక్నోతి గుణాన్ వక్తుం సమస్తాంస్తస్య భో ద్విజాః ।
సింహార్ధకృతదేహస్య ప్రవక్ష్యామి సమాసతః ॥ 13 ॥

ద్విజవరులారా! సగం సింహం శరీరం కలిగిన ఆ నరసింహస్వామి గుణాలను సమగ్రంగా చెప్పడం అశక్యం. అందుచేత సంగ్రహంగా చెప్తాను.

యాః కాశ్చిత్ సిద్ధయశ్చాత్ర శ్రూయన్తే దేవమానుషాః ।
ప్రసాదాత్ తస్య తాస్సర్వాస్సిద్ధ్యన్త్యత్ర న సంశయః ॥ 14 ॥

దేవతలకూ మానవులకూ సంబంధించినవిగా వినబడుతున్న సిద్ధులు సమస్తమూ ఆ స్వామి అనుగ్రహంచేత కలుగుతాయి. ఇందులో సందేహం లేదు.

స్వర్గే మర్త్యే చ పాతాలే దిక్షు తోయే పురే నగే ।
ప్రసాదాత్తస్య దేవస్య భవత్యవ్యాహతా గతిః ॥ 15 ॥

ఆ స్వామి అనుగ్రహంచేత స్వర్గంలో, మానవలోకంలో, పాతాలంలో, అన్ని దిక్కులలోనూ, నీళ్లలో, నగరంలో, పర్వతాలమీద ఎక్కడైనా ఎటువంటి అడ్డంకులూ లేకుండా సంచరించవచ్చు.

అసాధ్యం తస్య దేవస్య నాస్త్యత్ర సచరాచరే ।
నరసింహస్య భో విప్రాస్సదా భక్తానుకమ్పినః ॥ 16 ॥

ఓ ద్విజులారా! స్థావర జంగమ స్వరూపమైన సమస్త జగత్తులోనూ నరసింహస్వామికి సాధ్యం కానిదంటూ ఏమీ లేదు. ఆ స్వామి నిరంతరం భక్తులపై అనుగ్రహం కలిగి ఉంటాడు.

విధానం తస్య వక్ష్యామి భక్తానాముపకారకమ్ ।
యేన ప్రసీదేచ్చైవాసౌ సింహార్ధకృతవిగ్రహః ॥ 17 ॥

సగం సింహం, సగం నరుడు అయిన ఆ స్వామిని ఉపాసించే పద్ధతిని చెప్తాను. ఇది స్వామిభక్తులకు అందరికీ ఉపయోగపడుతుంది. ఈవిధమైన ఉపాసనచేత స్వామి తొందరగా అనుగ్రహిస్తాడు.

శృణుధ్వం మునిశార్దూలాః కల్పరాజం సనాతనమ్ ।
నరసింహస్య తత్త్వం చ యన్న జ్ఞాతం సురాసురైః ॥ 18 ॥

మహర్షిపుంగవులారా! నరసింహస్వామి తత్త్వమూ, స్వామిని ఉపాసించే విధానమూ వేదాలలో చెప్పబడింది. ఇది దేవతలకూ, దానవులకూ కూడ తెలియదు. మీకు చెప్తాను. వినండి.

శాకయావకమూలైస్తు ఫలపిణ్యాకసక్తుకైః ।
పయసో భక్షణే విప్రాః వర్తయేత్ సాధకేశ్వరః ॥ 19 ॥

బ్రాహ్మణులారా! నరసింహస్వామిని ఉపాసించే మహాత్ముడు కూరలు, యవధాన్యంతో చేసిన అన్నం, దుంపలు, పండ్లు, తెలగపిండి, పేలపిండి, పాలు ఆహారంగా తీసుకోవాలి.

శుద్ధకౌపీనవాసాశ్చ ధ్యానయుక్తో జితేన్ద్రియః ।
అరణ్యే విజనే దేశే పర్వతే సిన్ధుసఙ్గమే ॥ 20 ॥

ఊషరే సిద్ధక్షేత్రే చ నరసింహాశ్రమే తథా ।
ప్రతిష్ఠాప్య స్వయం చాపి పూజాం కృత్వా విధానతః ॥ 21 ॥

శుభ్రమైన(ఉతికిన) గోచీ పెట్టుకోవాలి. నిరంతరం స్వామినే ధ్యానిస్తూ ఉండాలి. ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవాలి. అడవిలోనో, జనసంచారంలేని ఏకాంతప్రదేశంలోనో, కొండమీదనో, నదులు సముద్రంలో కలిసే సంగమప్రదేశంలోనో, చవిటినేలమీదనో, (దేవుడు స్వయంభువుగా వెలసిన) పుణ్యక్షేత్రంలోనో, నరసింహస్వామి మఠంలోనో స్వయంగా స్వామివిగ్రహాన్ని స్థాపించుకుని, శాస్త్రోక్తమైన పద్ధతిలో పూజించాలి.

ద్వాదశ్యాం శుక్లపక్షస్య ఉపోష్య మునిపుఙ్గవాః ।
జపేల్లక్షాణి వై వింశన్ మనసా సంయతేన్ద్రియః ॥ 22 ॥

మునివరేణ్యులారా! శుక్లపక్షంలో ద్వాదశితిథినాడు ఉపవాసం ఉండాలి. ఇంద్రియాలను నిగ్రహించుకుని (ఏకాగ్రంగా), శబ్దం పైకి వినపడకుండా, పెదవులు కదిలించకుండా, మనసులోనే నృసింహమంత్రాన్ని ఇరవైలక్షల సార్లు జపించాలి.

ఉపపాతకయుక్తశ్చ మహాపాతకసంయుతః ।
ముక్తో భవేత్తతో విప్రాస్సాధకో నాత్ర సంశయః ॥ 23 ॥

బ్రాహ్మణులారా! నరసింహస్వామిని ఈవిధంగా ఉపాసించిన సాధకుడికి మహాపాపాలు, ఉపపాతకాలు, అన్నీ నశించిపోతాయి. ఇందులో సందేహం లేదు.

కృత్వా ప్రదక్షిణం తత్ర నరసింహం ప్రపూజయేత్ ।
పుష్పగన్ధాదిభిర్ధూపైః ప్రణమ్య శిరసా ప్రభుమ్ ॥ 24 ॥

నరసింహస్వామికి ప్రదక్షిణం చేయాలి. పూలు, వివిధ గంధాలు, వేర్వేరు ధూపాలు, మొదలైన వాటితో స్వామిని చక్కగా పూజించాలి. స్వామికి తలవంచి నమస్కరించాలి.

కర్పూరచన్దనాక్తాని జాతీపుష్పాణి మస్తకే ।
ప్రదద్యాన్నరసింహస్య తతస్సిద్ధిః ప్రజాయతే ॥ 25 ॥

కర్పూరమూ, మంచిగంధమూ అద్దిన జాజిపూలను నరసింహస్వామి శిరసుమీద ఉంచాలి. దానివల్ల దివ్యమైనశక్తి కలుగుతుంది.

భగవాన్ సర్వకార్యేషు న క్వచిత్ ప్రతిహన్యతే ।
తేజస్సోఢుం న శక్తాస్స్యుర్బ్రహ్మరుద్రాదయస్సురాః ॥ 26 ॥

సాధకుడు ప్రారంభించిన ఏ పనికైనా, ఎక్కడా ఆటంకం రాకుండా నరసింహస్వామి దయతో చూస్తాడు. బ్రహ్మ, రుద్రుడు మొదలైన దేవతలు కూడ ఆ స్వామితేజస్సును భరించలేరు.

కిం పునర్దానవా లోకే సిద్ధగన్ధర్వమానుషాః ।
విద్యాధరా యక్షగణాస్సకిన్నరమహోరగాః ॥ 27 ॥

ఇంక దానవులు, సిద్ధులు, గంధర్వులు, మానవులు, విద్యాధరులు, యక్షులు, కిన్నరులు, ఉరగులు, మొదలైన సామాన్యులు స్వామి తేజస్సును ఏమాత్రమూ భరించలేరు.

వన్త్రగ్రామం సమీహన్తే జపన్త్యేకేఽన్యసాధకాః ।
తే సర్వే ప్రలయం యాన్తి దృష్ట్వాదిత్యాగ్నివర్చసః ॥ 28 ॥

నరసింహస్వామిని కాక, ఇతరదేవతలను ఉపాసించేవాళ్లు, ఎన్నో మంత్రాలు కోరుకుంటారు. ఉపాసిస్తారు. అటువంటివాళ్లు అందరూ సూర్యుడు, అగ్ని తేజస్సులను చూచి (న చీకటిలాగా) నశించిపోతారు. (నరసింహోపాసకులు నరసింహమంత్రం ఒక్కదానిని మాత్రమే కోరుకుని, దానిని మాత్రమే ఉపాసిస్తూ ఆదిత్య, అగ్ని తేజస్సు పొందుతారు. ఎప్పటికీ నశించరు.)

సకృజ్జప్తం తు కవచం సర్వసౌఖ్యాచలప్రదమ్ ।
ద్విర్జప్తం కవచం దివ్యం రక్షతే దేవదానవాత్ ॥ 29 ॥

శ్రీనరసింహకవచాన్ని ఒక్కసారి జపిస్తే, అది సమస్తమైన సుఖాలను ఇస్తుంది. ఆ సుఖాలు ఎప్పటికీ నశించవు. మహిమలతో కూడిన ఆ కవచాన్ని రెండుసార్లు జపిస్తే, అది దేవతలనుండి, దానవులనుండి ఏవిధమైన ఇబ్బంది లేకుండా కాపాడుతుంది.

గన్ధర్వాః కిన్నరా యక్షా విద్యాధరమహోరగాః ।
భూతాః పిశాచా రక్షాంసి యే చాన్యే పరిపన్థినః ॥ 30 ॥

గంధర్వులు, కిన్నరులు, యక్షులు, విద్యాధరులు, ఉరగులు, భూతాలు, పిశాచాలు, రాక్షసులు, ఇంకా ఇతర శత్రువులు ఎవరైనా, అందరినుండీ నరసింహకవచం కాపాడుతుంది.

త్రిర్జప్తం కవచం దివ్యమభేద్యం చ సురాసురైః ।
ద్వాదశాభ్యన్తరే చైవ యోజనానాం ద్విజోత్తమాః ॥
రక్షతే భగవాన్ దేవో నరసింహో మహాబలః ॥ 31 ॥

విప్రవరులారా! నరసింహకవచాన్ని మూడుసార్లు జపిస్తే, అది సాధకుడి చుట్టూ పన్నెండుయోజనాలమేర దేవతలనుండి, రాక్షసులనుండి, చెక్కుచెదరని రక్షణగా నిలుస్తుంది. మిక్కిలి బలవంతుడైన నరసింహ భగవానుడు ఈ కవచజపం చేసిన వారిని నిరంతరం రక్షిస్తాడు.

తతో గత్వా బిలద్వారముపోష్య రజనీత్రయమ్ ।
పలాశకాష్ఠైః ప్రజ్వాల్య భగవన్తం హుతాశనమ్ ॥ 32 ॥

ఆ(నరసింహకవచం జపించిన)తరువాత నరసింహగుహ ద్వారంవద్దకు వెళ్లాలి. అక్కడ మూడు రాత్రులు ఉపవాసం చేయాలి. మోదుగ పుల్లలతో మంటలు రేగే విధంగా అగ్నిహోత్రుడిని రాజేయాలి.

పలాశసమిధస్తత్ర జుహుయాత్ త్రిమధుప్లుతాః ।
ద్వే శతే ద్విజశార్దూలా వషట్కారేణ సాధకః ॥ 33 ॥

బ్రాహ్మణోత్తములారా! రెండువందల మోదుగ సమిధలను తేనె, పంచదార, నేయి (పాలు) అనే త్రిమధురాలతో తడిపి, మంత్రం చివర 'వషట్' అనే శబ్దంతో మండుతున్న ఆ అగ్నిలో హోమం చేయాలి.

తతో వివరద్వారం తు ప్రకటం జాయతే క్షణాత్ ।
తతో విశేత్ తు నిశ్శఙ్కం కవచీ వివరం బుధః ॥ 34 ॥

అప్పుడు ఒక్కక్షణంలో నరసింహస్వామిగుహ వాకిలి చక్కగా తెరుచుకుంటుంది. కవచాన్ని జపించిన సాధకుడు సందేహించకుండా, ఆ వాకిలిగుండా నరసింహస్వామిగుహలోకి ప్రవేశించాలి.

గచ్ఛతస్సఙ్కటం తస్య తమో మోహశ్చ నశ్యతి ।
రాజమార్గస్సువిస్తీర్ణో దృశ్యతే భ్రమరాఞ్చితః ॥ 35 ॥

ఆ గుహలో వెళ్తుండగా, అతడికి అవరోధాలు తొలగిపోతాయి. అజ్ఞానం అనే చీకటి, భ్రాంతి నశిస్తాయి. తుమ్మెదలతో కూడిన (పరిమళభరితమైన పూవులతో నిండిన) సువిశాలమైన ప్రధానమార్గం కనబడుతుంది.

నరసింహం స్మరన్స్తత్ర పాతాలం విశతే ద్విజాః ।
గత్వా తత్ర జపేత్ తత్త్వం నరసింహాఖ్యమవ్యయమ్ ॥ 36 ॥

బ్రాహ్మణులారా! ఆసాధకుడు నరసింహస్వామిని తలుచుకుంటూ అక్కడినుండి పాతాళంలో ప్రవేశిస్తాడు. ఆ పాతాళలోకంలో శాశ్వతుడైన నరసింహస్వామి తత్త్వాన్ని గూర్చి జపం చెయ్యాలి.

తతః స్త్రీణాం సహస్రాణి వీణావాదనకర్మణామ్ ।
నిర్గచ్ఛన్తి పురో విప్రాస్స్వాగతం తా వదన్తి చ ॥ 37 ॥

ద్విజులారా! అక్కడ వీణను వాయిస్తున్న వేలకొద్దీ స్త్రీలు లేచి, ఆ సాధకుడికి ఎదురు వస్తారు. వారు సాధకుడికి స్వాగతం చెప్తారు.

ప్రవేశయన్తి తా హస్తే గృహీత్వా సాధకేశ్వరమ్ ।
తతో రసాయనం దివ్యం పాపయన్తి ద్విజోత్తమాః ॥ 38 ॥

బ్రాహ్మణవరులారా! ఆ స్త్రీలు సాధకుడి చేయి పుచ్చుకుని లోపలికి తీసుకువెళ్తారు. మహిమతో కూడిన అమృతం లాంటి పదార్థాన్ని తాగిస్తారు.

పీతమాత్రే దివ్యదేహో జాయతే సుమహాబలః ।
క్రీడతే సహ కన్యాభిర్యావదాభూతసంప్లవమ్ ॥ 39 ॥

ఆ ఓషధీరసాన్ని తాగిన వెంటనే నరసింహ ఉపాసకుడికి దేవశరీరం కలుగుతుంది. అతడు గొప్పబలవంతు డవుతాడు. మహాప్రళయం వచ్చేవరకూ అక్కడ కన్యలతో సుఖపడతాడు.

భిన్నదేహో వాసుదేవే లీయతే నాత్ర సంశయః ॥ 40 ॥

సర్వప్రళయంలో ఆ శరీరం నశించిపోయిన తరువాత వాసుదేవపరమాత్మలో కలిసిపోతాడు (సాయుజ్యముక్తిని పొందుతాడు).

యదా న రోచతే వాసస్తస్మాన్నిర్గచ్ఛతే పునః ।
పట్టం శూలం చ ఖడ్గం చ రోచనాం చ మణిం తథా ॥ 41 ॥

రసం రసాయనం చైవ పాదుకాఞ్జనమేవ చ ।
కృష్ణాజినం మునిశ్రేష్ఠా గుటికాంచ మనోహరామ్ ॥ 42 ॥

కమణ్డలుంచాక్షసూత్రం యష్టిం సఞ్జీవనీం తథా ।
సిద్ధవిద్యాంచ శాస్త్రాణి గృహీత్వా సాధకేశ్వరః ॥ 43 ॥

ఒకవేళ నరసింహోపాసకుడు ఆ గుహలో ఉండడానికి ఇష్టపడకపోతే, ఆ గుహనుండి బయటకు వచ్చేస్తాడు. డాలు, ఈటె, కత్తి, గోరోచనం, రత్నం, పాదరసం, ఓషధీరసం, పాదుకాంజనం అనే పదార్థం, నల్లజింకతోలు, అందమైన గుండ్రనిమాత్ర, కమండలువు, జపమాల, దండం, సంజీవనీ విద్య, రకరకాల సిద్ధులను కలిగించే విద్యలు, వివిధశాస్త్రాలు పుచ్చుకుని ఆ గుహ (పాతాళలోకం)నుండి వెలుపలికి వస్తాడు.

జ్వలద్వహ్నిస్ఫులిఙ్గోర్మివేష్టితం త్రిశిఖం హృది ।
సకృన్న్యస్తం దహేత్ సర్వం వృజినం జన్మకోటిజమ్ ॥ 44 ॥

మండుతున్న నిప్పుకణికల తరంగాలతో ఆవరించిన త్రిశిఖవిద్యను (నరసింహకవచం?) మనసులో ఒక్కసారి నిలుపుకుంటే కోటిజన్మలలో చేసిన పాపం మొత్తమూ పోతుంది.

విషే న్యస్తం విషం హన్యాత్ కుష్ఠం హన్యాత్ తనౌ స్థితమ్ ।
స్వదేహే భ్రూణహత్యాది కృత్వా దివ్యేన శుధ్యతి ॥ 45 ॥

ఆ త్రిశిఖవిద్యను విషంమీద ప్రయోగిస్తే అందులోని విషలక్షణం నశిస్తుంది. శరీరంలో కుష్ఠరోగాన్ని హరిస్తుంది. అలాగే శరీరానికి అంటుకుని ఉన్నటువంటి, పసిపిల్లలను చంపటం మొదలైన పాపాలను తొలగించి, పవిత్రం చేస్తుంది.

మహాగ్రహగృహీతేషు జ్వలమానం విచిన్తయేత్ ।
హృదన్తే వై తతశ్శీఘ్రం నశ్యేయుర్దారుణాగ్రహాః ॥ 46 ॥

భయంకరమైన గ్రహాలు ఆవేశించిన సందర్భాలలో మండుతున్న ఆ త్రిశిఖాన్ని మనసులో స్మరించుకుంటే వెంటనే ఆ దుష్టగ్రహాలు అన్నీ నశించిపోతాయి.

బాలానాం కణ్ఠకే బద్ధం రక్షా భవతి నిత్యశః ।
గణ్డపిణ్డకలూతానాం నాశనం కురుతే ధ్రువమ్ ॥ 47 ॥

పసిపిల్లలమెడలో తాయెత్తు చేసి కడితే వారికి నిరంతరం రక్షగా ఉంటుంది. పుండ్లనూ (బాలారిష్టాలనూ), బొబ్బలనూ, సాలెపురుగు(సూక్ష్మక్రిముల)వల్ల కలిగే విషరోగాలనూ, నిర్మూలిస్తుంది. ఇది నిజం.

వ్యాధిజాతైస్సమిద్భిశ్చ ఘృతక్షీరేణ హోమయేత్ ।
త్రిసన్ధ్యం మాసమేకం తు సర్వరోగాన్ వినాశయేత్ ॥ 48 ॥

ఏవైనా నయంగాని వ్యాధులు వచ్చినపుడు సమిధలతోనూ, ఆవునేతితో, ఆవుపాలతో హోమం చేయాలి. ఒక నెలరోజులు ప్రతిరోజూ మూడుసంధ్యలలో ఇలా హోమం చేస్తే అన్నిరోగాలూ పోతాయి.

అసాధ్యం తు న పశ్యామి త్రైలోక్యే సచరాచరే ।
యాం యాం కామయతే సిద్ధిం తాం తాం ప్రాప్నోతి స ధ్రువమ్ ॥ 49 ॥

స్థావరజంగమాత్మకమైన ఈ జగత్తులో నరసింహకవచం ధరించినవాడికి సాధ్యం కానిది అంటూ ఏమీ లేదు. కోరుకున్న ప్రతిదానినీ పొందుతాడు. ఇది నిశ్చయం.

అష్టోత్తరశతంత్వేకే పూజయిత్వా మృగాధిపమ్ ।
మృత్తికాస్సప్త వల్మీకే శ్మశానే చ చతుష్పథే ॥ 50 ॥

నరసింహస్వామిని ఏకాగ్రతతో నూటఎనిమిది పర్యాయాలు పూజించి. పాముపుట్ట, శ్మశానం, నాలుగు వీథులు కలిసిన చోట్లలో మట్టిని సేకరించాలి. దానితో ఏడు ఉండలు తయారుచేయాలి.

రక్తచన్దనసమ్మిశ్రా గవాం క్షీరేణ లోడయేత్ ।
సింహస్య ప్రతిమాం కృత్వా ప్రమాణేన షడఙ్గులామ్ ॥ 51 ॥

ఆ మట్టిని, ఎఱ్ఱచందనంతోనూ, ఆవుపాలతోనూ మెదపాలి. దానితో ఆరు అంగుళాల పరిమాణంలో నరసింహస్వామి విగ్రహాన్ని తయారుచేయాలి.

లిమ్పేత్తథా భూర్జపత్రే రోచనయా సమాలిఖేత్ ।
నరసింహస్య కణ్ఠే తు బద్ధ్వా చైవ హి మన్త్రవిత్ ॥ 52 ॥

భూర్జం అనే (ఒకానొకరావి)చెట్టు ఆకుమీద గోరోచనంతో నరసింహమంత్రాన్ని ఆ మంత్రం చక్కగా తెలిసినవాడు వ్రాయాలి. ఆ ఆకును నరసింహస్వామి విగ్రహం మెడలో కట్టాలి.

జపేత్ సఙ్ఖ్యావిహీనం తు పూజయిత్వా జలాశయే ।
యావత్ సప్తాహమాత్రం తు జపేత్ సంయమితేన్ద్రియః ॥ 53 ॥

దానిని చక్కగా పూజించాలి. ఆ తరువాత నీళ్లలో నిలిచి, నరసింహమంత్రాన్ని లెక్కపెట్టకుండా, ఏడురోజుల పాటు నియమంగా జపించాలి. ఆ సమయంలో ఇంద్రియనిగ్రహాన్ని పాటించాలి.

జలాకీర్ణా ముహూర్తేన జాయతే సర్వమేదినీ ।
అథవా శుష్కవృక్షాగ్రే నరసింహం తు పూజయేత్ ॥ 54 ॥

(ఆ జపప్రభావంచేత) ఈ నేలమొత్తం ఒక్కక్షణంలో నీళ్లతో నిండిపోతుంది. ఇలా చేయడం కుదరకపోతే ఎండినచెట్టుపైన (భావనలో నిలుపుకుని) నరసింహస్వామిని పూజించాలి.

జప్త్వా చాష్టశతం తత్స్వం వర్షణం వినివారయేత్ ।
తమేవం పిఙ్గకే బద్ధ్వా భ్రామయేత్ సాధకోత్తమః ॥ 55 ॥

ఇలా నరసింహమంత్రాన్ని నూటయెనిమిది సార్లు జపిస్తే కురుస్తున్న వర్షాన్ని ఆపవచ్చు. ఉత్తముడైన నరసింహోపాసకుడు నరసింహస్వామిని పసుపుముద్దలో కూర్చి దానిని గిరగిరా త్రిప్పాలి.

మహావాతో ముహూర్తేన ఆగచ్ఛేన్నాత్ర సంశయః ।
పునశ్చ ధారయేత్ క్షిప్రం సప్తజప్తేన వారిణా ॥ 56 ॥

దానివల్ల ఒక్కక్షణంలో పెద్దసుడిగాలి వస్తుంది. ఇందులో సందేహం లేదు. తరువాత నరసింహమంత్రాన్ని ఏడుసార్లు జపిస్తే, ఆ జపతీర్థంతో ఆ సుడిగాలి ఆగిపోతుంది.

అథ తాం ప్రతిమాం ద్వారి నిఖనేద్ యస్య సాధకః ।
గోత్రోత్సాదో భవేత్ తస్య ఉద్ధృతే చైవ శాన్తిదః ॥ 57 ॥

తరువాత నరసింహస్వామి ప్రతిమను ఎవరి వాకిట్లో పాతిపెడితే వాడి వంశం నాశన మవుతుంది. ఆ విగ్రహాన్ని భూమిలోనుండి తీసివేస్తే ఆ వంశం మళ్లీ నిలబడుతుంది.

తస్మాత్ తం మునిశార్దూలా భక్త్యా సమ్పూజయేత్ సదా ।
మృగరాజం మహావీర్యం సర్వకామఫలప్రదమ్ ॥ 58 ॥

మహర్షులారా! అందుచేత సమస్తమైన కోరికలనూ తీర్చి శుభఫలితాలను ఇచ్చే గొప్పశక్తిమంతుడైన నరసింహస్వామిని భక్తితో ఎల్లప్పుడూ పూజించాలి.

విముక్తస్సర్వపాపేభ్యో విష్ణులోకం చ గచ్ఛతి ॥ 59 ॥

నృసింహస్వామిని నిరంతరమూ పూజించేవాడు పాపాలన్నీ పోయి, వైకుంఠానికి వెళ్తాడు.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః స్త్రియశ్శూద్రాన్త్యజాతయః ।
సమ్పూజ్య తు సురశ్రేష్ఠం భక్త్యా సింహవపుర్ధరమ్ ॥
ముచ్యన్తే చాశుభైర్దుఃఖైర్జన్మకోటిసముద్భవైః ॥ 60 ॥

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, ఆడవాళ్లు, శూద్రులు, ఇంకా తక్కువజాతివాళ్ళు అందరూ దేవతాధిపతి అయిన నరసింహస్వామిని భక్తితో పూజిస్తే, కోటిజన్మలనుంచి వెంట వస్తున్న పాపాలకు ఫలితమైన కష్టాలు, బాధలు, అన్నీ తొలగిపోతాయి.

సమ్పూజ్య తం సురశ్రేష్ఠం ప్రాప్నువన్త్యభివాఞ్ఛితమ్ ।
దేవత్వమమరేశత్వం గన్ధర్వత్వం చ భో ద్విజాః ॥
యక్షవిద్యాధరత్వం చ తథాన్యచ్చాభివాఞ్ఛితమ్ ॥ 61 ॥

దేవతలలో ఉత్తముడైన నరసింహస్వామిని పూజించినమానవులు తమకు కావలసిన కోరికలు అన్నీ పొందుతారు. ఓ బ్రాహ్మణులారా! దేవుడు, ఇంద్రుడు, గంధర్వుడు, యక్షుడు, విద్యాధరుడు, ఇంకా ఎవరైనా, ఎలా కోరుకుంటే ఆ జాతివారు అవుతారు.

దృష్ట్వా స్తుత్వా నమస్కృత్వా సమ్పూజ్య నరకేసరిమ్ ।
ప్రాప్నువన్తి నరా రాజ్యం స్వర్గం మోక్షం చ దుర్లభమ్ ॥ 62 ॥

నరసింహస్వామిని చూచినా, స్తోత్రం చేసినా, నమస్కరించినా, పూజించినా, మానవుడు మహారాజు అవుతాడు. ఎవరికీ లభించని మోక్షస్థితిని పొందుతాడు.

నరసింహం నరో దృష్ట్వా లభేదభిమతం ఫలమ్ ।
నిర్ముక్తస్సర్వపాపేభ్యో విష్ణులోకం చ గచ్ఛతి ॥ 63 ॥

నరసింహస్వామిని దర్శించుకున్న మానవుడు కోరుకున్న లాభాన్ని పొందుతాడు. పాపాలన్నీ నశించి, వైకుంఠానికి వెళ్తాడు.

సకృద్ దృష్ట్వా తు తం దేవం భక్త్యా సింహవపుర్ధరమ్ ।
ముచ్యతే చాశుభైర్దుఃఖైర్జన్మకోటిసముద్భవైః ॥ 64 ॥

ఆ నృసింహదేవుడిని భక్తితో ఒక్కసారి దర్శించినా, కోటిజన్మలనుంచి వెంట వస్తున్న పాపాలకు ఫలితమైన కష్టాలు, బాధలు, అన్నీ తొలగిపోతాయి.

సఙ్గ్రామే సఙ్కటే దుర్గే చోరవ్యాఘ్రాదిపీడితే ।
కాన్తారే ప్రాణసన్దేహే విషవహ్నిజలేషు చ ॥ 65 ॥

రాజాదిభ్యస్సముద్రేభ్యో గ్రహరోగాదిపీడితే ।
స్మృత్వా తం పురుషస్సర్వైరాపద్గ్రామైర్విముచ్యతే ॥ 66 ॥

యుద్ధరంగంలో, బాధలో, సంచరించడానికి వీలు లేని (కొండలవంటి)ప్రదేశంలో, దొంగలు, పులులు మొదలైనవారివల్ల కష్టం కలిగినప్పుడూ, అరణ్యంలో, ప్రాణం పోతుందేమో అనిపించే సందర్భంలో, విషం, అగ్ని, నీళ్ళవల్ల ప్రాణభయం కలిగినపుడూ, రాజువలన, సముద్రంవలన, గ్రహాలవలనా, రోగాలు మొదలైన బాధలవలనా ప్రాణభయం కలిగిన సందర్భంలోనూ ఆ నరసింహస్వామిని స్మరిస్తే సమస్తమైన ఆపదలు తొలగి పోతాయి.

సూర్యోదయే యథా నాశం తమోఽ భ్యేతి మహత్తరమ్ ।
తథా సన్దర్శనే తస్య వినాశం యాన్త్యుపద్రవాః ॥ 67 ॥

సూర్యుడు ఉదయించగానే దట్టమైన కారుచీకట్లు నాశనమైనట్లుగా, నృసింహస్వామిని దర్శించినవెంటనే కష్టాలన్నీ నశించిపోతాయి.

గుటికాఞ్జనపాతాలపాదుకే చ రసాయనమ్ ।
నరసింహే ప్రసన్నే తు ప్రాప్నోత్యన్యాంశ్చ వాఞ్ఛితాన్ ॥ 68 ॥

నరసింహస్వామి అనుగ్రహం కలిగితే, విశిష్టమైన కాటుక, పాతాళలోకంలో నడవడానికి అవకాశం గలిగించే చెప్పులు, అమృతరసం, ఇంకా ఇతరమైన కోరికలు ఏవైనా, అన్నీ మానవుడు పొందుతాడు.

యాన్ యాన్ కామానభిధ్యాయన్ భజతే నరకేసరిమ్ ।
తాం స్తాన్ కామానవాప్నోతి నరో నాస్త్యత్ర సంశయః ॥ 69 ॥

మానవుడు ఏ ఏ కోరికలతో నరసింహస్వామిని ధ్యానం చేస్తాడో, సేవిస్తాడో, ఆ యా కోరికలు అన్నీ స్వామి అనుగ్రహంచేత తప్పకుండా పొందుతాడు. ఇందులో సందేహం లేదు.

దృష్ట్వా తం దేవదేవేశం భక్త్యాపూజ్య ప్రణమ్య చ ।
దశానామశ్వమేధానాం ఫలం దశగుణం లభేత్ ॥ 70 ॥

దేవతలకు దేవుడైన ఆ నరసింహస్వామిని భక్తితో దర్శనం చేసుకుని, చక్కగా పూజించి, నమస్కరించినవాడు పది అశ్వమేధయాగాలు చేస్తే వచ్చే ఫలితానికి పదిరెట్లు ఫలితాన్ని పొందుతాడు.

పాపైస్సర్వైర్వినిర్ముక్తో గుణైస్సర్వైరలఙ్కృతః ।
సర్వకామసమృద్ధాత్మా జరామరణవర్జితః ॥ 71 ॥

అతడి పాపాలు అన్నీ నశించిపోతాయి. సమస్తమైన సద్గుణాలు (పుణ్యాలు) కలుగుతాయి. కోరికలు అన్నీ సమృద్ధిగా నెరవేరుతాయి. అతడికి ముసలితనం రాదు. చావు లేదు.

సౌవర్ణేన విమానేన కిఙ్కిణీజాలమాలినా ।
సర్వకామసమృద్ధేన కామగేన సువర్చసా ॥ 72 ॥

విమానంపై ఊర్ధ్వలోకాలకు వెళ్తాడు. అది బంగారు విమానం. చిరుగజ్జెల జాలరులతో కూడి ఉంటుంది. కోరుకున్నవి అన్నీ ఆ విమానంలో పుష్కలంగా ఉంటాయి. ఎక్కడికి కావాలంటే అక్కడికి స్వేచ్ఛగా తీసుకుని వెళ్తుంది. మంచి కాంతి కలిగి ఉంటుంది.

తరుణాదిత్యవర్ణేన ముక్తాహారావలమ్బినా ।
దివ్యస్త్రీశతయుక్తేన దివ్యగన్ధర్వనాదినా ॥ 73 ॥

మిట్టమధ్యాహ్నసమయంలోని సూర్యుడితో సమానమైన తేజస్సు కలిగి ఉంటుంది. దానికి ముత్యాల హారాలు వేలాడుతుంటాయి. అందులో వందలకొద్దీ దేవతాస్త్రీలు ఉంటారు. మనోహరమైన సంగీత ధ్వనులు వినిపిస్తుంటాయి.

కులైకవింశముద్ధృత్య దేవవన్ముదితస్సుఖీ ।
స్తూయమానోఽ ప్సరోభిశ్చ విష్ణులోకం వ్రజేన్నరః ॥ 74 ॥

తనవంశంలో ఇరవైఒక్క తరాలవారిని నరకాదులైన అధోలోకాలనుండి ఉద్ధరించి, అటువంటివిమానంలో తనతోపాటు వైకుంఠానికి తీసుకువెళ్తాడు. దేవతాస్వరూపాన్ని ధరించి, అక్కడ ఆనందంగా, సుఖంగా ఉంటాడు.

భుక్త్వా తత్ర వరాన్ భోగాన్ విష్ణులోకే ద్విజోత్తమాః ।
గన్ధర్వైరప్సరైర్యుక్తః కృత్వా రూపం చతుర్భుజమ్ ॥ 75 ॥

బ్రాహ్మణోత్తములారా! అక్కడ వైకుంఠంలో (తనవారితో కలిసి) ఉత్తమమైన భోగాలను అనుభవిస్తాడు. నాలుగు చేతులతో విష్ణువువంటి రూపాన్ని ధరిస్తాడు (సారూప్యముక్తిని పొందుతాడు). గంధర్వులతోనూ, అప్సరసలతోనూ, కలిసి సుఖంగా ఉంటాడు.

మనోహ్లాదకరం సౌఖ్యం యావదాభూతసంప్లవమ్ ।
పుణ్యక్షయాదిహాయాతః ప్రవరే యోగినాం కులే ॥ 76 ॥

నరసింహస్వామి సేవల ఫలితంగా కలిగినపుణ్యానికి ఫలితంగా మహాప్రళయం జరిగే వరకు వైకుంఠంలో సుఖాలను అనుభవిస్తాడు. ఆ పుణ్యఫలం అయిపోయిన తరువాత భూలోకానికి తిరిగివస్తాడు. ఇక్కడ ఉత్తమమైన యోగుల వంశంలో జన్మిస్తాడు.

చతుర్వేదీ భవేద్ విప్రో వేదవేదాఙ్గపారగః ।
వైష్ణవం యోగమాస్థాయ తతో మోక్షమవాప్నుయాత్ ॥ 77 ॥

నాలుగు వేదాలలోనూ గొప్పపండితుడవుతాడు. వేదాలు, వేదాంగాలు సమగ్రంగా తెలుసుకుంటాడు. విష్ణుదేవుడికి సంబంధించిన యోగాన్ని అనుష్ఠిస్తాడు. (మనసును మహావిష్ణువులో లీనం చేసి, తన ఉనికిని మరిచిపోతాడు.) తరువాత మోక్షాన్ని పొందుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భృషిసంవాదే నరసింహమాహాత్మ్యవర్ణనం నామ పఞ్చపఞ్చాశత్తమోఽధ్యాయః ॥ 55 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషి సంవాదంలో నరసింహమాహాత్మ్యవర్ణనం అనే యాభైఐదవ అధ్యాయం సంపూర్ణం.



షట్పఞ్చాశత్తమోఽధ్యాయః– యాభైఆరవ అధ్యాయం
శ్వేతమాధవమాహాత్మ్యవర్ణనమ్ – శ్వేతమాధవమాహాత్మ్యవర్ణనం

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

అనన్తాఖ్యం వాసుదేవం దృష్ట్వా భక్త్యా ప్రణమ్య చ ।
సర్వపాపవినిర్ముక్తో నరో యాతి పరం పదమ్ ॥ 1 ॥

అనంతుడు అనే పేరు గలిగిన వాసుదేవస్వామిని దర్శించుకుని, భక్తితో నమస్కారం చేసిన మానవుడికి పాపాలు మొత్తం నశిస్తాయి. అతడు మోక్షం పొందుతాడు.

మయాచారాధితశ్చాసౌ శక్రేణ తదనన్తరమ్ ।
విభీషణేన రామేణ కస్తం నారాధయేత్ పుమాన్ ॥ 2 ॥

ఆ దేవదేవుడిని మొదట నేను (బ్రహ్మదేవుడు) ఆరాధించాను. తరువాత దేవేంద్రుడు ఆరాధించాడు. తర్వాత విభీషణుడు, రాముడు కూడ ఆరాధించారు. ఇంక ఈస్వామిని ఆరాధించని మగవా డెవడు?

శ్వేతగఙ్గాం నరస్స్నాత్వా యః పశ్యేచ్ఛ్వేతమాధవమ్ ।
మత్స్యాఖ్యం మాధవం చైవ శ్వేతద్వీపం స గచ్ఛతి ॥ 3 ॥

శ్వేతగంగానదిలో స్నానం చేసి, శ్వేతమాధవుడిని, మత్స్య(రూపంలో ఉన్న)మాధవుడిని దర్శించినమానవుడు శ్రీహరి నివాసమైన శ్వేతద్వీపానికి వెళ్తాడు.

మునయ ఊచుః :–మహర్షులు బ్రహ్మదేవుడితో ఈవిధంగా అంటున్నారు.

శ్వేతమాధవమాహాత్మ్యం వక్తుమర్హస్యశేషతః ।
విస్తరేణ జగన్నాథ ప్రతిష్ఠాం తస్య వై హరేః ॥ 4 ॥

లోకేశ్వరా! బ్రహ్మదేవా! శ్వేతమాధవుడి మహిమలను సమగ్రంగా చెప్పడానికి తగినవాడివి నీవే. ఆ శ్రీహరి ప్రతిష్ఠింపబడిన విధానాన్ని కూడ వివరంగా చెప్పు.

తస్మిన్ క్షేత్రవరే పుణ్యే విఖ్యాతే జగతీతలే ।
శ్వేతాఖ్యం మాధవం దేవం కస్తం స్థాపితవాన్ పురా ॥ 5 ॥

భూలోకంలో ఆ(పురుషోత్తమ)క్షేత్రం చాల ప్రసిద్ధం. పుణ్యక్షేత్రాలన్నిటిలో శ్రేష్ఠం. పుణ్యప్రదం. పూర్వం అక్కడ శ్వేతమాధవదేవుడిని ప్రతిష్ఠించింది ఎవరు?

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

అభూత్ కృతయుగే విప్రాః శ్వేతో నామ నృపో బలీ ।
మతిమాన్ ధర్మవిచ్ఛూరస్సత్యసన్ధో దృఢవ్రతః ॥ 6 ॥

ద్విజులారా, పూర్వం కృతయుగంలో శ్వేతుడు అనే మహారాజు ఉండేవాడు. అతడు గొప్ప బలవంతుడు, బుద్ధిమంతుడు, ధర్మజ్ఞుడు, పరాక్రమవంతుడు, సత్యదీక్ష గలిగినవాడు, ఆడినమాట నెరవేర్చటంలో చలించని పట్టుదల గలిగినవాడు.

యస్య రాజ్యే తు వర్షాణాం సహస్రం దశ మానవాః ।
జీవన్తి రోగరహితా బాలస్తస్మిన్న సీదతి ॥ 7 ॥

ఆ మహారాజు రాజ్యంలో ప్రజలు ఎటువంటి రోగాలు లేకుండా, పదివేల సంవత్సరాలు సుఖంగా జీవించే వారు. పసిపిల్లలు చనిపోవడం (అకాలమరణం) అసలు లేదు.

వర్తమానే తదా రాజ్యే కిఞ్చిత్కాలే గతే ద్విజాః ।
కపాలగౌతమో నామ ఋషిః పరమధార్మికః ॥ 8 ॥

సుతోఽస్యాజాతదన్తశ్చ మృతః కాలవశాద్ ద్విజాః ।
తమాదాయ ఋషిర్ధీమాన్ నృపస్యాన్తికమానయత్ ॥ 9 ॥

మహర్షులారా! ఈవిధంగా రాజ్యపాలన నడుస్తుండగా, ఒకానొకరోజు గొప్పధర్మపరుడైన కపాల గౌతముడు అనే మహర్షి కొడుకు పసితనంలోనే మరణించాడు. అప్పటికి ఇంకా అతడికి దంతాలు కూడ రాలేదు. విప్రవరులారా! బుద్ధిమంతుడైన కపాలగౌతముడు కుమారుడి శవాన్ని తీసుకుని శ్వేతమహారాజు దగ్గరకు వచ్చాడు.

దృష్ట్వైవం నృపతిస్సుప్తం కుమారం గతచేతసమ్ ।
ప్రతిజ్ఞామకరోద్ విప్రా జీవనార్థం శిశో స్తదా ॥ 10 ॥

మహర్షికుమారుడు నిద్రపోతున్నట్లుగా ఉన్నాడు. కాని ప్రాణాలు లేవు. అచేతనంగా ఉన్న మహర్షి కుమారుడిని చూసి, అప్పుడు శ్వేతమహారాజు ఆ పసివాడిని బ్రతికిస్తానని శపథం చేశాడు.

రాజోవాచ :– శ్వేతమహారాజు ఈవిధంగా అంటున్నాడు.

యావద్ బాలమహంత్వేనం యమస్య సదనే గతమ్ ।
నానయే సప్తరాత్రేణ చితాం దీప్తాం సమారుహే ॥ 11 ॥

యముడి యింటికి వెళ్లిన (మరణించిన) ఈ బాలుడిని ఏడు రాత్రుల లోపుగా తిరిగి తీసుకుని వస్తాను. అలా తీకుకురాకపోతే, నేను మండుతున్న చితిపై కెక్కుతాను.

బ్రహ్మోవాచ :– మహర్షులతో బ్రహ్మదేవుడు ఇలా చెప్తున్నాడు.

ఏవము క్త్వాసితైః పద్మైశ్శతైర్దశశతాదికైః ।
సమ్పూజ్య తం మహాదేవం రాజా విద్యాం పునర్జపేత్ ॥ 12 ॥

శ్వేతమహారాజు ఈవిధంగా శపథం చేసి, శివమహాదేవుడిని పదకొండువందల ఎఱ్ఱతామరపూలతో శ్రద్ధగా పూజించాడు. తరువాత మళ్లీ మహాదేవమంత్రాన్ని జపించాడు.

అతిభక్తిం తు సంవీక్ష్య నృపస్య జగదీశ్వరః ।
సాన్నిధ్యమగమత్ తుష్టోఽ స్మీత్యువాచ సహోమయా ॥ 13 ॥

శ్వేతమహారాజు గొప్పభక్తిని చూచి, పరమేశ్వరుడు పార్వతీదేవితో సహా, ప్రత్యక్షమైనాడు. రాజా నీ భక్తికి సంతోషించాను అన్నాడు.

శ్రుత్వైవం గిరమీశస్య విలోక్య సహసా హరమ్ ।
భస్మదిగ్ధం విరూపాక్షం శరత్కున్దేన్దువర్చసమ్ ॥ 14 ॥

శ్వేతమహారాజు పరమేశ్వరుడి పలుకులు విన్నాడు. వెంటనే కనులు తెరిచి, పరమేశ్వరుడిని చూచాడు. శివుడు ఒళ్ళంతా విభూతి పూసుకొని ఉన్నాడు. కన్నులు మూడు ఉన్నాయి. శరత్కాలంలోని మొల్లలలాగా, చంద్రుడిలాగా తెల్లగా చల్లగా ప్రకాశిస్తున్నాడు.

శార్దూలచర్మవసనం శశాఙ్కాఙ్కితమూర్ధజమ్ ।
మహీం నిపత్య సహసా ప్రణమ్య చ తమబ్రవీత్ ॥ 15 ॥

పులితోలు వస్త్రంలాగా ధరించాడు. సిగపై చంద్రుడు నెలకొనిఉన్నాడు. అటువంటి పరమేశ్వరుడిని చూచిన వెంటనే శ్వేతమహారాజు నేలపై పడి, ఆదిదంపతులకు సాష్టాంగంగా నమస్కారం చేశాడు. తరువాత శివుడితో ఇలా అన్నాడు.

శ్వేత ఉవాచ :- పరమేశ్వరుడితో శ్వేతమహారాజు ఇలా అంటున్నాడు.

కారుణ్యం యది మే దృష్ట్వా ప్రసన్నోఽ సి ప్రభో యది ।
కాలస్య వశమాపన్నో బాలకో ద్విజపుత్రకః ॥
జీవత్వేష పునర్బాల ఇత్యేవం వ్రతమాహితమ్ ॥ 16 ॥

ప్రభూ! ఈ పసివాడు బ్రాహ్మణకుమారుడు. మరణించి యముడి అధీనంలో ఉన్నాడు. నన్ను చూసి నాపై నీకు దయ కలిగితే, నన్ను అనుగ్రహించదలిస్తే, మరణించిన ఈ బాలుడిని తిరిగి బ్రతికించు. ఇతడిని మళ్ళీ బ్రతికిస్తా నని నేను ప్రతిజ్ఞ చేశాను.

అకస్మాచ్చ మృతం బాలం నియమ్య భగవన్ స్వయమ్ ।
యథోక్తాయుష్యసంయుక్తం క్షేమం కురు మహేశ్వర ॥ 17 ॥

మహాదేవా! హఠాత్తుగా మరణించినఈపసివాడిమీద దయ చూపు. ఆయముడిని నిగ్రహించి, ఇతడికి పూర్ణమైన ఆయుర్దాయాన్ని ప్రసాదించి మేలు చేయి.

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

శ్వేతస్యైతద్వచశ్శ్రుత్వా ముదం ప్రాప హరస్తదా ।
కాలం సమాహ్వయామాస సర్వభూతభయఙ్కరమ్ ॥ 18 ॥

శ్వేతమహారాజు పలుకులు విని, పరమేశ్వరుడు సంతోషించాడు. సమస్తమైన సృష్టికీ భయాన్ని కలిగించే యముడిని అక్కడికి పిలిపించాడు.

నియమ్య కాలం దుర్ధర్షం యమస్యాజ్ఞాకరం ద్విజాః ।
బాలం సఞ్జీవయామాస మృత్యోర్ముఖగతం పునః ॥ 19 ॥

విప్రులారా! యమధర్మరాజు ఆజ్ఞలను పరిపాలించే కాలుడికి ఎదురు లేదు. అటువంటి కాలుడిని శివుడు కట్టడిచేసి, మృత్యువునోట చిక్కిన ఆ పసివాడిని తిరిగి బ్రతికించాడు.

కృత్వా క్షేమం జగత్ సర్వం మునేః పుత్రం చ భో ద్విజాః ॥
దేవ్యా సహోమయా దేవస్తత్రైవాన్తరధీయత ॥ 20 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆ బాలుడితోపాటు లోకాలకు అన్నింటికీ మేలు కలిగించి, మహాదేవుడు పార్వతితో సహా అక్కడే అదృశ్యమైనాడు.

ఏవం సఞ్జీవయామాస మునేః పుత్రం నృపోత్తమః ॥ 21 ॥

ఈవిధంగా శ్వేతమహారాజు కపాలగౌతమమహర్షి కుమారుడిని తిరిగి బ్రతికించి తన శపథం నెరవేర్చుకున్నాడు.

మునయ ఊచుః :– మహర్షులు బ్రహ్మదేవుడితో ఇలా అంటున్నారు.

దేవదేవ జగన్నాథ త్రైలోక్యప్రభవావ్యయ ।
బ్రూహి నః పరమం తథ్యం శ్వేతాఖ్యస్య చ సామ్ప్రతమ్ ॥ 22 ॥

దేవతలకే దేవుడా! సర్వలోకేశ్వరా! మూడులోకాలను సృష్టించినవాడా! శాశ్వతంగా ఉండేవాడా! శ్వేతుడు అనే పేరు గలిగిన ఆ దేవుడి వృత్తాంతాన్ని యథాతథంగా మాకు ఇప్పుడే చెప్పు.

బ్రహ్మోవాచ :– మహర్షులతో బ్రహ్మదేవుడు ఇలా చెప్తున్నాడు.

శృణుధ్వం మునిశార్దూలాస్సర్వసత్త్వహితాయ వై ।
ప్రవక్ష్యామి యథాతథ్యం యత్ పృచ్ఛథ మమానఘాః ॥ 23 ॥

మహర్షిసత్తములారా! చరాచరసృష్టి సమస్తానికీ మేలు జరగటంకోసం మీరు అడిగిన శ్వేతమాధవుడి వృత్తాంతాన్ని ఉన్నది ఉన్నట్లుగా చెప్తాను. వినండి.

మాధవస్యతు మాహాత్మ్యం సర్వపాపప్రణాశనమ్ ।
యచ్ఛృత్వాభిమతాన్ కామాన్ ధ్రువం ప్రాప్నోతి మానవః ॥ 24 ॥

మాధవదేవుడి మహిమలను ఆలకించడంవల్ల మానవుడికి సమస్తమైన పాపాలూ నశిస్తాయి. ఇష్టమైన కోరికలు అన్నీ నిశ్చయంగా సిద్ధిస్తాయి.

శ్రుతవాన్ ఋషిభిః పూర్వం తథ్యం మాధవాఖ్యస్య భో ద్విజాః ।
శృణుధ్వం తాం కథాం దివ్యాం భయశోకార్తినాశినీమ్ ॥ 25 ॥

ఓ విప్రులారా! మాధవుడి మాహాత్మ్యాన్ని పూర్వం మహర్షులవలన నేను విన్నాను. ఆ కథ అతిలోకమైనది. అన్నిరకాల భయాలనూ, దుఃఖాలనూ, బాధలనూ పోగొడుతుంది. అటువంటి మాధవుడి కథను వినండి.

స కృత్వా రాజ్యమేకాగ్ర్యం వర్షాణాం చ సహస్రశః ।
విచార్య లౌకికాన్ ధర్మాన్ వైదికాన్ నియమాంస్తథా ॥ 26 ॥

శ్వేతమహారాజు వేలకొద్దీ సంవత్సరాలు రాజ్యాన్ని చక్కగా పరిపాలించాడు. లౌకికమైన ధర్మాలను, వేదాలలో చెప్పబడిన (శాస్త్ర)నియమాలనూ చక్కగా విచారించాడు.

కేశవారాధనే విప్రా నిశ్చితం వ్రత మాస్థితః ।
స గత్వా పరమం క్షేత్రం సాగరం దక్షిణాశ్రయమ్ ॥ 27 ॥

బ్రాహ్మణులారా! శ్రీహరిని ఆరాధించడం అనే దృఢమైన దీక్షను స్వీకరించాడు. అందుకోసం దక్షిణ దిక్కులోని సముద్రంతీరంలో ఉన్న ఉత్తమమైన (పురుషోత్తమ) పుణ్యక్షేత్రానికి వెళ్లాడు.

తటే తస్మిన్ శుభే రమ్యే దేశే కృష్ణస్య చాన్తికే ।
శ్వేతోఽథ కారయామాస ప్రాసాదం శుభలక్షణమ్ ॥
ధన్వన్తరశతం చైకం దేవదేవస్య దక్షిణే ॥ 28 ॥

శ్వేతమహారాజు ఆ దక్షిణసముద్రం తీరంలో మనోహరం పుణ్యప్రదమైన ఒకానొక ప్రదేశంలో, శ్రీకృష్ణస్వామికి సమీపంలో, స్వామికి దక్షిణం దిక్కులో పెద్ద ఆలయాన్ని నిర్మించాడు. ఆ దేవాలయం శుభప్రదమైన లక్షణాలు కలిగి ఉన్నది. దాని ఎత్తు నూరు విండ్ల పరిమాణం(నాలుగు వందల మూరల ఎత్తు)లో ఉంటుంది.

తతశ్శ్వేతేన విప్రేన్ద్రాశ్శ్వేతశైలమయేన చ ।
కృతస్స భగవాన్ శ్వేతో మాధవశ్చన్ద్రసన్నిభః ॥ 29 ॥

బ్రాహ్మణోత్తములారా! శ్వేతుడు ఆ తరువాత తెల్లని చలువరాళ్లతో చంద్రుడివంటి కాంతి గలిగిన మాధవస్వామి మూర్తిని (పాలరాతివిగ్రహం) నిర్మించాడు.

ప్రతిష్ఠాం విధివచ్చక్రే యథోద్దిష్టాం స్వయం తు సః ।
దత్త్వా దానం ద్విజాతిభ్యో దీనానాథతపస్వినామ్ ॥ 30 ॥

శ్వేతుడు తాను కోరుకున్న విధంగా ఆ ఆలయంలో శాస్త్రోక్తమైన పద్ధతిలో మాధవస్వామిని ప్రతిష్ఠించాడు. ఆ సందర్భంలో బ్రాహ్మణులకూ, దీనులకూ, అనాథులకూ, తపస్వులకూ అనేక దానాలు చేశాడు.

అథానన్తరతో స రాజా మాధవస్య చ సన్నిధౌ ।
మహీం నిపత్య సహసా సౌంకారం ద్వాదశాక్షరమ్ ॥ 31 ॥

జపన్ స మౌనమాస్థాయమాసమేకం సమాధినా ।
నిరాహారో మహాభాగస్సమ్యగ్ విష్ణుపదే స్థితః ॥ 32 ॥

తరువాత ఆశ్వేతమహారాజు మాధవస్వామి సన్నిధికి వెళ్లి, నేలపై బడి, స్వామికి సాష్టాంగంగా నమస్కరించాడు. ఓంకారంతో కూడిన ద్వాదశాక్షర మంత్రాన్ని (ఓం నమో భగవతే వాసుదేవాయ) మానసికంగా, ఏకాగ్రంగా, ఒక నెలరోజులపాటు జపించాడు. ఆ నెలరోజులు ఆ మహానుభావుడు ఆహారం ఏమీ తీసుకోలేదు. కదలకుండా శ్రీహరి చరణాల సమీపంలోనే కూర్చున్నాడు.

జపాన్తే స తు దేవేశం సంస్తోతుముపచక్రమే ॥ 33 ॥

ద్వాదశాక్షర మంత్రజపం పూర్తైన తరువాత ఆ శ్వేతమహారాజు దేవదేవుడైన శ్రీహరిని ఈవిధంగా స్తుతించడం ప్రారంభించాడు.

శ్వేత ఉవాచ:-శ్వేతుడు మాధవస్వామిని ఈవిధంగా స్తుతిస్తున్నాడు.

ఓం నమో వాసుదేవాయ నమస్సఙ్కర్షణాయ చ ।
ప్రద్యుమ్నాయానిరుద్ధాయ నమో నారాయణాయ చ ॥ 34 ॥

చరాచరభూతకోటి అంతటా నిండి ప్రకాశించే వాసుదేవస్వామికి నమస్కారం. ప్రళయసమయంలో సమస్తమైన సృష్టినీ ఒక్కసారిగా తనలోకి చేర్చుకునే సంకర్షణుడికి నమస్కారం. ప్రద్యుమ్నుడికి, యుద్ధంలో శత్రువులు నిరోధించలేని అనిరుద్ధుడికి (వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ అనే నాలుగు వ్యూహాలకు), నారాయణుడికి నమస్కారం.

నమోఽస్తు బహురూపాయ విశ్వరూపాయ వేధసే ।
నిర్గుణాయాప్రతర్క్యాయ శుచయే శుక్లకర్మణే ॥ 35 ॥

అనేక రూపాలు కలిగినవాడికి నమస్కారం. బ్రహ్మమే స్వరూపమైనవాడికి నమస్కారం. సత్త్వం మొదలైన గుణాలు లేనివాడికీ, సందేహించడానికి అవకాశం లేనివాడికీ (ఊహల కందనివాడు) నమస్కారం. శుభప్రదమైన కర్మలను ఆచరించేవాడికి నమస్కారం.

ఓం నమః పద్మనాభాయ పద్మగర్భోద్భవాయ చ ।
నమోఽస్తు పద్మవర్ణాయ పద్మహస్తాయ తే నమః ॥ 36 ॥

ప్రణవస్వరూపుడికి నమస్కారం. సృష్టికి మూలమైన తామరను బొడ్డులో గలిగినవాడికి, ఆ తామరపూవునుండి బ్రహ్మదేవుడిని పుట్టించినవాడికి నమస్కారం. తామరవంటి రంగు గలిగినవాడికి నమస్కారం. చేతిలో తామరపూవు ధరించిన స్వామీ! నీకు నమస్కారం.

ఓం నమః పుష్కరాక్షాయ సహస్రాక్షాయ మీఢుషే ।
నమస్సహస్రపాదాయ సహస్రభుజమన్యవే ॥ 37 ॥

తామరలవంటి కన్నులు కలిగినవాడికి నమస్కారం. వేయి (అనంతమైన) కన్నులు (ఇంద్రియాలు), పాదాలు, బాహువులు కలిగినవాడికి నమస్కారం. కోరికలను వర్షించేవాడికి నమస్కారం. వేయి (అనంతమైన) యజ్ఞాలు స్వరూపమైనవాడికి నమస్కారం.

ఓం నమోఽస్తు వరాహాయ వరదాయ సుమేధసే ।
వరిష్ఠాయ వరేణ్యాయ హిరణ్యాయాచ్యుతాయ చ ॥ 38 ॥

ఆదివరాహస్వరూపుడికి నమస్కారం. కోరిన వరాలను ఇచ్చేవాడికి నమస్కారం. శుభప్రద (సర్వోత్కృష్ట) మైన జ్ఞానం కలిగినవాడికి నమస్కారం. అన్నింటిలోనూ శ్రేష్ఠమైనవాడికి నమస్కారం. ఆశ్రయించ దగినవాడికి నమస్కారం. బంగారం (సంపద) రూపమైనవాడికి నమస్కారం. అచ్యుతాయ నమః=నాశనం లేనివానికి నమస్కారం.

ఓం నమో బాలరూపాయ బాలపద్మప్రభాయ చ ।
బాలార్కసోమనేత్రాయ ముఞ్జకేశాయ ధీమతే ॥ 39 ॥

బాలుడి (వామనుడు) రూపంలో ఉన్నవాడికి నమస్కారం. అప్పుడే పూచిన తామరపూవు చాయ కలిగినవాడికి నమస్కారం. అప్పుడే ఉదయించిన సూర్యుడూ, చంద్రుడూ కన్నులుగా కలిగినవాడికి (పగలూ, రాత్రీ నిరంతరంగా జగత్తును చూచి కాపాడేవాడికి) నమస్కారం. దట్టంగా, అందంగా ఉన్న కేశసంపద గలిగినవాడికి నమస్కారం. దొడ్డబుద్ధి కలవాడికి నమస్కారం.

కేశవాయ నమో నిత్యం నమో నారాయణాయ చ ।
మాధవాయ వరిష్ఠాయ గోవిన్దాయ నమో నమః ॥ 40 ॥

కేశి అనే రాక్షసుడిని సంహరించినవాడికి నమస్కారం. సృష్టి అంతటా లోపలా, బయటా నిండిఉన్న శ్రీమన్నారాయణుడికి నిరంతరమూ నమస్కారం. మౌనం, ధ్యానం, యోగం అనే వాటిద్వారా తెలియబడే మాధవుడికి నమస్కారం. సర్వశ్రేష్ఠుడికి నమస్కారం. ఉపనిషద్వాక్యాలచేత తెలియబడే గోవిందుడికి నమస్కారం.

ఓం నమో విష్ణవే నిత్యం దేవాయ వసురేతసే ।
మధుసూదనాయ నమశ్శుద్ధాయాంశుధరాయ చ ॥ 41 ॥

అంతటా నిండిఉన్న శ్రీమహావిష్ణువుకు నమస్కారం. అందరిలోనూ ఆత్మగా ప్రకాశించేవాడికి నిరంతరమూ నమస్కారం. బంగారం వీర్యంగా గలిగినవాడికి నమస్కారం. మధువు అనే రాక్షసుడిని చంపినవాడికి నమస్కారం. గుణాలు మొదలైన వికారాలు ఏవీ లేని శుద్ధస్వరూపుడికి నమస్కారం. ఆదిత్యమండలాంతర్వర్తియైన నారాయణుడికి నమస్కారం.

నమోఽనన్తాయ సూక్ష్మాయ నమశ్శ్రీవత్సధారిణే ।
త్రివిక్రమాయ చ నమో దివ్యపీతామ్బరాయ చ ॥ 42 ॥

ఆదిశేషుడి స్వరూపంలో ఉండేవాడికి నమస్కారం. శబ్దం, స్పర్శ మొదలైన గుణాలకు అతీతుడైన సూక్ష్మరూపుడికి నమస్కారం. వక్షఃస్థలంమీద శ్రీవత్సం అనే మచ్చను ధరించినవాడికి నమస్కారం. వామనావతారంలో మూడులోకాలను ఆక్రమించినవాడికి నమస్కారం. దేవలోకంలో ఏర్పడిన పట్టువస్త్రాన్ని ధరించినవాడికి నమస్కారం.

సృష్టికర్త్రే నమస్తుభ్యం గోప్త్రే ధాత్రే నమో నమః ।
నమోఽస్తు గుణభూతాయ నిర్గుణాయ నమో నమః ॥ 43 ॥

సమస్తభూతకోటిని సృష్టి చేసేవాడికి నమస్కారం. లోకాలన్నింటినీ పోషించేవాడికి నమస్కారం. ఆదిశేషుడి రూపంలో భూమిని మోసేవాడికి నమస్కారం. గుణస్వరూపుడికి నమస్కారం. వాస్తవంగా ఏవిధమైన గుణాలూ లేనివాడికి నమస్కారం.

నమో వామనరూపాయ నమో వామనకర్మణే ।
నమో వామననేత్రాయ నమో వామనవాహినే ॥ 44 ॥

దేవతలను రక్షించడానికి వామనుడి రూపంలో అవతరించినవాడికి నమస్కారం. ఆశ్రితరక్షణకోసం చేయిచాచడం వంటి అల్పమైన పనులు చేసినవాడికి నమస్కారం. అందమైన చిట్టికన్నులు గలవాడికి నమస్కారం. వినయంగా వంగిఉండే (విధేయుడైన) గరుడుడు వాహనంగా గలిగినవాడికి నమస్కారం.

నమోఽనన్తాయ పూజ్యాయ నమోఽస్త్వవ్యక్తరూపిణే ।
అప్రతర్క్యాయ శుద్ధాయ నమో భయహరాయ చ ॥ 45 ॥

దేశం కాలం మొదలైన కొలతలకు అందనివాడికి నమస్కారం. అందరిచేత పూజింపదగినవాడికి నమస్కారం. తెలియరాని రూపం గలిగినవాడికి (రూపం లేనివాడికి) నమస్కారం. పరిశోధనలకు అందనివాడికి నమస్కారం. పరిశుద్ధస్వరూపుడికి నమస్కారం. సంసారభయాన్ని పోగొట్టేవాడికి నమస్కారం.

సంసారార్ణవపోతాయ ప్రశాన్తాయ స్వరూపిణే ।
శివాయ సౌమ్యరూపాయ ఘోరరూపధరాయ చ ॥ 46 ॥

సంసారం అనే సముద్రంలో చిక్కుకున్నవారిని ఒడ్డుకు చేర్చే తెప్పయైన స్వామికి నమస్కారం. విషయ సుఖాలపై ఏమాత్రం ఆసక్తి లేనివాడికి నమస్కారం. సత్త్వాది గుణాలు లేని నిర్మలుడికి నమస్కారం. శాంతస్వరూపుడికి నమస్కారం. భయంకరమైన రూపం ధరించినవాడికి నమస్కారం.

భవభఙ్గకృతే చైవ భవభోగప్రదాయ చ ।
భవసఙ్ఘాతరూపాయ భవసృష్టికృతే నమః ॥ 47 ॥

సంసారాన్ని నిర్మూలించేవాడికి (చావుపుట్టుకలు లేనిస్థితిని అంటే మోక్షాన్ని ఇచ్చేవాడు), సంసారసుఖాలను ప్రసాదించేవాడికి, అనేక పుట్టుకలు కలిగినవాడికి (విశ్వరూపుడికి), జగత్తులను సృష్టించేవాడికి నమస్కారం.

ఓం నమో దివ్యరూపాయ సోమాగ్నిశ్వసితాయ చ ।
సోమసూర్యాంశుకేశాయ గోబ్రాహ్మణహితాయ చ ॥ 48 ॥

ప్రకాశించే దేవతారూపం ధరించినవాడికి నమస్కారం. చంద్రుడు ఉచ్ఛ్వాసగాను, అగ్ని నిశ్శ్వాసగాను కలిగినవాడికి నమస్కారం. సూర్యచంద్రుల కిరణాలు తలవెంట్రుకలుగా కలిగినవాడికి నమస్కారం. ఆవులకు, బ్రాహ్మణులకు మేలు చేసేవాడికి నమస్కారం.

ఓం నమ ఋక్స్వరూపాయ పదక్రమస్వరూపిణే ।
ఋక్‌స్తుతాయ నమస్తుభ్యం నమో ఋక్సాధనాయ చ ॥ 49 ॥

ఋగ్వేదం స్వరూపమైన వాడికి నమస్కారం. ఋక్కులోని పదాలు, క్రమమే స్వరూపమైన వాడికి నమస్కారం. ఋగ్వేదంచేత స్తుతించబడే వాడికి నమస్కారం. ఋగ్వేదమంత్రాలకు సాధనమైన వానికి నమస్కారం.

ఓం నమో యజుషాం ధాత్రే యజూరూపధరాయ చ ।
యజుర్యాజ్యాయ జుష్టాయ యజుషాం పతయే నమః ॥ 50 ॥

యజుర్వేదమంత్రాలను ఏర్పరచినవాడికి నమస్కారం. యజుర్వేదమంత్రాలు అనే రూపాన్ని ధరించినవాడికి నమస్కారం. యజుర్వేదమంత్రాలతో అర్చింపబడేవాడికి నమస్కారం. యజుర్మంత్రాలతో (చేసిన సేవలవల్ల) సంతోషించేవాడికి నమస్కారం. యజుర్వేదమంత్రాలకు యజమానుడైనవాడికి నమస్కారం.

ఓం నమశ్శ్రీపతే దేవ శ్రీధరాయ వరాయ చ ।
శ్రియఃకాన్తాయ దాన్తాయ యోగిచిన్త్యాయ యోగినే ॥ 51 ॥

దేవా! శ్రీనాథా! నీకు నమస్కారం. జగన్మాత శ్రీదేవిని వక్షస్స్థలంమీద ధరించినవాడికి నమస్కారం. అందరిలోనూ శ్రేష్ఠుడికి నమస్కారం. లక్ష్మీమనోహరుడికి నమస్కారం. బాహ్యమైన ఇంద్రియాలను నిగ్రహించిన వాడికి నమస్కారం. యోగులు ధ్యానించే ఉత్తమయోగికి నమస్కారం.

ఓం నమస్సామరూపాయ సామధ్వనివరాయ చ ।
ఓం నమస్సామసౌమ్యాయ సామయోగవిదే నమః ॥ 52 ॥

సామవేదం స్వరూపమైనవాడికి నమస్కారం. ఉత్తమమైన సామవేదధ్వని (సామగానం) స్వరూపమైనవాడికి నమస్కారం. సామవేద(నాద)ంలాగా మనోహరమైనవాడికి నమస్కారం. సామయోగాన్ని తెలిసిన వాడికి నమస్కారం.

సామ్నే చ సామగీతాయ ఓం నమస్సామధారిణే ।
సామయజ్ఞవిదే చైవ నమస్సామకరాయ చ ॥ 53 ॥

సామవేదస్వరూపుడికి నమస్కారం. సామవేదంచేత స్తుతించబడేవాడికి నమస్కారం. సామవేదాన్ని ధరించినవాడికి నమస్కారం. సామవేదమంత్రాలతో నిర్వహించబడే యజ్ఞవిషయం తెలిసినవాడికి నమస్కారం. సామవేదాన్ని ఏర్పరచినవాడికి నమస్కారం.

నమస్త్వథర్వశిరసే నమోఽథర్వస్వరూపిణే ।
నమోఽస్త్వథర్వపాదాయ నమోఽథర్వకరాయ చ ॥ 54 ॥

అథర్వవేదం శిరస్సైనవాడికి నమస్కారం. అథర్వవేదం స్వరూపమైనవాడికి నమస్కారం. అథర్వవేదం పాదాలైనవాడికి నమస్కారం. అథర్వవేదాన్ని ఏర్పరచిన వాడికి నమస్కారం.

ఓం నమో వజ్రశీర్షాయ మధుకైటభఘాతినే ।
మహోదధిజలస్థాయ వేదాహరణకారిణే ॥ 55 ॥

వజ్రంవంటి శిరస్సు గలిగినవాడికి నమస్కారం. మధువు, కైటభుడు అనే రాక్షసులను సంహరించిన వాడికి నమస్కారం. జలధిశాయికి (ప్రళయానంతరం ఏకార్ణవమైన జలంలో ఉండేవాడికి) నమస్కారం. హిరణ్యాక్షుడిని సంహరించి, ఆ రాక్షసుడు అపహరించిన వేదాలను సముద్రంనుండి వెలుపలికి తెచ్చిన మత్స్యావతారుడికి నమస్కారం.

నమో దీప్తస్వరూపాయ హృషీకేశాయ వై నమః ।
నమో భగవతే తుభ్యం వాసుదేవాయ తే నమః ॥ 56 ॥

మిక్కిలి తేజోవంతమైన రూపం కలిగినవాడికి నమస్కారం. ఇంద్రియాలకు అధిపతి అయినవాడికి నమస్కారం. ఐశ్వర్యాదులు కలిగిన నీకు నమస్కారం. లోకాలన్నింటినీ తనమాయతో కప్పి, చక్కగా ప్రకాశించే స్వామీ నీకు నమస్కారం.

నారాయణ నమస్తుభ్యం నమో లోకహితాయ చ ।
ఓం నమో మోహనాశాయ భవభఙ్గకరాయ చ ॥ 57 ॥

శ్రీమన్నారాయణా! నీకు నమస్కారం. లోకాలకు మేలు చేసేవాడికి నమస్కారం. అజ్ఞానాన్ని నాశనం చేసేవాడికి నమస్కారం. సంసారాన్ని నిర్మూలించే(మోక్ష మిచ్చే)వాడికి నమస్కారం.

గతిప్రదాయ చ నమో నమో బన్ధహరాయ చ ।
త్రైలోక్యతేజసాం కర్త్రే నమస్తేజస్స్వరూపిణే ॥ 58 ॥

ఉత్తమమైన మోక్షస్థితిని ఇచ్చేవాడికి నమస్కారం. (భగవంతుడికంటె వేరైన) సంసారబంధాల నన్నింటినీ తొలగించేవాడికి నమస్కారం. మూడులోకాలను ప్రకాశింపజేసేవాడికి నమస్కారం. తేజస్సు స్వరూపమైనవాడికి నమస్కారం. (తేజోరూపంలో లోకాలన్నింటా నిండి ఉంటాడు.)

యోగీశ్వరాయ శుద్ధాయ రామాయోత్తరణాయ చ ।
సుఖాయ సుఖనేత్రాయ నమస్సుకృతధారిణే ॥ 59 ॥

యోగులకు నాయకుడైన కృష్ణస్వామికి నమస్కారం. నిర్మలుడికి నమస్కారం. శ్రీరాముడికి నమస్కారం. సంసారంనుంచి ఉద్ధరించే స్వామికి నమస్కారం. సుఖస్వరూపుడికి నమస్కారం. సుఖప్రదమైన కన్నులు (కటాక్షాలు) కలిగినవాడికి నమస్కారం. పుణ్యాన్ని ధరించినవాడికి నమస్కారం.

వాసుదేవాయ వన్ద్యాయ వామదేవాయ వై నమః ।
దేహినాం దేహకర్త్రే చ భేదభఙ్గకరాయ చ ॥ 60 ॥

వాసుదేవుడికి నమస్కారం. నమస్కరింపదగిన స్వామికి నమస్కారం. వామదేవునికి నమస్కారం. జీవులకు శరీరాన్ని కల్పించేవాడికి నమస్కారం. సృష్టిలో భేదాలను తొలగించేవాడికి (చరాచరభూతకోటి సమస్తాన్నీ రాగద్వేషాది రహితంగా, సమానంగా చూసేవాడికి) నమస్కారం.

దేవైర్వన్దితదేహాయ నమస్తే దివ్యమౌలినే ।
నమో వాసనివాసాయ వాసవ్యవహరాయ చ ॥ 61 ॥

దేవతలు నమస్కరించే స్వామిస్వరూపానికి నమస్కారం. దివ్యమైన కిరీటం ధరించిన దేవా! నీకు నమస్కారం. నివసించడానికి యోగ్యమైన ప్రదేశాలలో నివసించేవాడికి నమస్కారం. నివాసమునుండే వ్యవహరించేవాని కొరకు నమస్కారం.

ఓం నమో వసుకర్త్రే చ వసువాసప్రదాయ చ ।
నమో యజ్ఞస్వరూపాయ యజ్ఞేశాయ చ యోగినే ॥ 62 ॥

సంపదలను సృష్టించేవాడికి నమస్కారం. సంపదలనూ, గృహాది నివాసస్థానాలనూ ఇచ్చేవాడికి, నమస్కారం. యజ్ఞం స్వరూపమైనవాడికి నమస్కారం. యజ్ఞాలకు ప్రభువైన వాడికి నమస్కారం. యోగియైనవాడికి నమస్కారం.

యతియోగకరేశాయ నమో యజ్ఞాఙ్గధారిణే ।
సఙ్కర్షణాయ చ నమః ప్రలమ్బమథనాయ చ ॥ 63 ॥

యతులకు, యోగులకు నాయకుడైనవాడికి నమస్కారం. యజ్ఞనిర్వహణకు అవసరమైనవాటిని ధరించేవాడికి నమస్కారం. ప్రళయసమయంలో సృష్టినంతటినీ తనలోనికి ఆకర్షించుకునే స్వామికి నమస్కారం. ప్రలంబుడు అనే రాక్షసుడిని సంహరించినవాడికి నమస్కారం.

మేఘఘోషస్వనోత్తీర్ణవేగలాఙ్గలధారిణే ।
నమోఽస్తు జ్ఞానినాం జ్ఞాన నారాయణపరాయణ ॥ 64 ॥

మబ్బుల అరుపులకంటె (పిడుగులకంటె) అధికమైన ధ్వని కలిగి, మిక్కిలి వేగంగా కదిలే నాగలిని ఆయుధంగా ధరించినవాడికి (బలరామస్వరూపుడికి) నమస్కారం. జ్ఞానులలోని జ్ఞానం స్వరూపమైనవాడికి నమస్కారం. నారాయణుడే ప్రధాన స్థానంగా కలవాడా! నీకు నమస్కారం.

న మే ఽస్తి త్వామృతే బన్ధుర్నరకోత్తారణే ప్రభో ।
అతస్త్వాం సర్వభావేన ప్రణతో నతవత్సల ॥ 65 ॥

ప్రభూ! నరకంనుంచి నన్ను ఉద్ధరించడానికి నీవు తప్ప నాకు కావలసినవాడు ఎవ్వడూ లేడు. ఆశ్రితులను ప్రేమగా రక్షించేవాడా! అందువలన అన్నివిధాలుగానూ నిన్నే శరణు కోరుతున్నాను.

మలం యత్ కాయజం వాపి మానసం చైవ కేశవ ।
న తస్యాన్యోఽస్తి దేవేశ క్షాలకస్త్వామృతేఽచ్యుత ॥ 66 ॥

బ్రహ్మ విష్ణు శివ స్వరూపుడవైన స్వామీ, శరీరానికీ, మనసుకూ సంబంధించిన నాలోని మలినాలను శుభ్రంగా తొలగించేవాడు నీవు తప్ప ఇంకొకడు లేడు.

సంసర్గాణి సమస్తాని విహాయ త్వాముపస్థితః ।
సఙ్గో మేఽస్తు త్వయా సార్ధమాత్మలాభాయ కేశవ ॥ 67 ॥

కృష్ణా! అన్ని బంధాలను వదిలించుకుని, నేను నీ దగ్గరకు వచ్చాను. ఆత్మజ్ఞానం సిద్ధించడానికి నాకు నీతో నిత్యసంబంధం ఏర్పడాలని ప్రార్థిస్తున్నాను.

కష్టమాపత్సు దుష్పారం సంసారం వేద్మి కేశవ ।
తాపత్రయపరిక్లిష్టస్తేన త్వాం శరణం గతః ॥ 68 ॥

కేశవా! సంసారంవల్ల కలిగిన ఆపదలు, వాటిలో ఉన్నబాధలు తెలుసుకున్నాను. ఈ సంసారంనుంచి బయట పడడం చాల కష్టం. ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతిక బాధలతో కష్టపడుతున్నాను. అందువలన శరణు కోరి నిన్ను ఆశ్రయించాను.

ఏషణాభిర్జగత్ సర్వం మోహితం మాయయా తవ ।
ఆకర్షితం చ లోభాద్యైరతస్త్వామహమాశ్రితః ॥ 69 ॥

స్వామీ! నీ మాయవల్ల లోకమంతా దారపుత్రధనేషణలతో అజ్ఞానంలో పడిపోయింది. లోభం మొదలైనవి (కామ క్రోధ లోభ మోహ మదమాత్సర్యాలు అనే అరిషడ్వర్గం) తమవైపు లాకుంటున్నాయి. ాటినుంచి రక్షణకోసం నేను నిన్ను ఆశ్రయిస్తున్నాను.

నాస్తి కిఞ్చిత్ సుఖం విష్ణో సంసారస్థస్య దేహినః ॥ 70 ॥

శ్రీమహావిష్ణూ, శరీరాన్ని ధరించి (పుట్టి), సంసారంలో పడిఉన్నవాడికి సుఖం కొంచెం కూడా లేదు.

యథా యథా హి యజ్ఞేశ త్వయి చేతః ప్రవర్తతే ।
తథా ఫలవిహీనం తు సుఖమాత్యన్తికం లభేత్ ॥ 71 ॥

యజ్ఞేశ్వరా! మనసు నీపై ఎంతగా లగ్నమైతే, అంతగా తాను చేసిన కర్మలకు ఫలితం మీద ఆశ నశించి పోతుంది. (కామం నశించి, దానివల్ల క్రోధాదులు కలగవు కాబట్టి బాధలు ఉండవు.) ఇంక శాశ్వతమైన (మోక్ష)సుఖం లభిస్తుంది.

నష్టో వివేకశూన్యోఽస్మి దృశ్యతే జగదాతురమ్ ।
గోవిన్ద త్రాహి సంసారాన్మాముద్ధర్తుం త్వమర్హసి ॥ 72 ॥

వేదవచనాలచేత తెలిసేవాడా! చాల నష్టపోయాను. జ్ఞానం ఏమాత్రం లేదు. లోకం (సంసారం) సమస్తం కష్టాలమయంగా కనబడుతున్నది. ఈ సంసారంనుండి నన్ను నీవే బయటపడేయాలి.

మగ్నస్య మోహసలిలే నిరుత్తారే భవార్ణవే ।
ఉద్ధర్తా పుణ్డరీకాక్ష త్వామృతేఽన్యో న విద్యతే ॥ 73 ॥

పద్మనయనా! సంసారం సముద్రం. అజ్ఞానం అనే నీళ్లతో నిండిఉంది. దాటటానికి వీలులేనిది. అటువంటి సంసారసాగరంనుండి ఉద్ధరించేవాడు నీవు తప్ప ఇంకొకడు లేదు.

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఇలా చెప్తున్నాడు.

ఇత్థం స్తుతస్తతస్తేనరాజ్ఞా శ్వేతేన భో ద్విజాః ।
తస్మిన్ క్షేత్రవరే దివ్యే విఖ్యాతే పురుషోత్తమే ॥ 74 ॥

భక్తిం తస్య తు సఞ్చిన్త్య దేవదేవో జగద్గురుః ।
ఆజగామ నృపస్యాగ్రే సర్వైర్దేవైర్వృతో హరిః ॥75 ॥

ఓ బ్రాహ్మణులారా! శ్రేష్ఠమూ, ప్రసిద్ధమూ, అయి, దేవతాసంబంధం కలిగిన ఆ పురుషోత్తమ పుణ్యక్షేత్రంలో శ్వేతమహారాజు తనను ఈవిధంగా స్తోత్రం చేయగా, లోకాలకు గురువూ, దేవతలకు దేవుడూ అయిన శ్రీహరి ఆ మహారాజు భక్తికి సంతోషించి, దేవతలు అందరూ తనను చేరి సేవిస్తుండగా, ఆ శ్వేతమహారాజు ఎదుట ప్రత్యక్షమైనాడు.

నీలజీమూతసఙ్కాశః పద్మపత్రాయతేక్షణః ।
దధత్ సుదర్శనం శ్రీమాన్ కరాగ్రే దీప్తమణ్డలమ్ ॥ 76 ॥

ఆ స్వామి నల్లని మబ్బులాగా ఉన్నాడు. స్వామి కన్నులు తామర రేకులవలె విశాలంగా ఉన్నాయి. ఆ శ్రీనివాసుడు చేతిలో సుదర్శనచక్రాన్ని ధరించాడు. ఆ చక్రం చుట్టూ కాంతి మిక్కిలిగా ప్రకాశిస్తున్నది.

క్షీరోదజలసఙ్కాశో విమలశ్చన్ద్రసన్నిభః ।
రరాజ వామహస్తేఽస్య పాఞ్చజన్యో మహాద్యుతిః ॥ 77 ॥

ఆ స్వామి ఎడమచేతిలో పాంచజన్యం అనే శంఖం గొప్పగా ప్రకాశిస్తున్నది. అది పాలసముద్రంలోని జలంలాగా(తెల్లగా)ఉన్నది. నిర్మలంగానూ, చంద్రుడితో సమానంగా (తెల్లగా) అధికమైనకాంతితోనూ వెలుగు తున్నది.

పక్షిరాజధ్వజశ్శ్రీమాన్ గదాశార్ఙ్గాసిచక్రధృక్ ।
ఉవాచ సాధు భో రాజన్ యస్య తే మతిరుత్తమా ॥
యదిష్టం వరం భద్రం తే ప్రసన్నోఽస్మి తవానఘ ॥ 78 ॥

శ్రీమహావిష్ణువు గరుడధ్వజం కలిగినవాడు. (కౌమోదకం అనే)గదను, శార్ఙ్గం అనే విల్లును, (నందకం అనే) కత్తిని, (సుదర్శనం అనే) చక్రాన్ని ధరించి ఉన్నాడు. అటువంటి స్వామి శ్వేతుడితో 'మహారాజా! మంచిది. నీకు శుభమగు గాక. పుణ్యాత్మా! నీ బుద్ధి చాల దొడ్డది. అందుచేత నీపై నాకు అనుగ్రహం కలిగింది. నీకు ఇష్ట మైన వరం కోరుకో' అన్నాడు.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

శ్రుత్వైవం దేవదేవస్య వాక్యం తత్ పరమామృతమ్ ।
ప్రణమ్య శిరసా భక్త్యా ముదా తద్గతమానసః ॥ 79 ॥

దేవదేవుడైన శ్రీమహావిష్ణువు పలికిన మాట ఉత్తమమైన అమృతం. దాని నాస్వాదించిన శ్వేతమహారాజు ఆ దేవుడిపై మనసు నిలిపి, భక్తితో శిరసు వంచి నమస్కరించి ఇలా అంటున్నాడు.

శ్వేత ఉవాచ :–శ్వేతమహారాజు శ్రీమహావిష్ణువుతో ఇలా అంటున్నాడు.

యద్యహం భగవన్ భక్తః ప్రయచ్ఛ వరముత్తమమ్ ।
ఆబ్రహ్మభువనాదూర్ధ్వం వైష్ణవం పదమవ్యయమ్ ॥ 80 ॥

మహాత్మా! నేను నీ భక్తుడినైతే, సర్వశ్రేష్ఠమైన ఈ వరాన్ని ప్రసాదించు. బ్రహ్మదేవుడుండే సత్యలోకం కంటేపైన విష్ణుదేవుడు ఉండే శాశ్వతమైన స్థానాన్ని నాకు అనుగ్రహించు.

విమలం విరజం శుద్ధం సంసారసఙ్గవర్జితమ్ ।
తత్పదం గన్తుమిచ్ఛామి త్వత్ప్రసాదాత్ జగత్పతే ॥ 81 ॥

లోకేశ్వరా! వైకుంఠంలో పాపాలు ఉండవు. అది పుణ్యస్థానం. అక్కడ కామం క్రోధం వంటివి ఉండవు. చావుపుట్టుకలు అనే సంసారబాధలు ఉండవు. (విష్ణులోకానికి వెళ్లినవాడు తిరిగి పుట్టడు.) నీ అనుగ్రహంతో ఆ వైకుంఠ పదానికి వెళ్లాలని కోరుకుంటున్నాను.

శ్రీభగవానువాచ :–శ్వేతమహారాజుతో శ్రీవిష్ణుదేవుడు ఈవిధంగా అంటున్నాడు.

యత్పదం విబుధాస్సర్వే మునయస్సిద్ధయోగినః ।
నాభిగచ్ఛన్తి యద్రమ్యం పరం పదమనామయమ్ ॥ 82 ॥

రాజా! దేవతలూ, మునులూ, సిద్ధులూ, యోగులూ, (మొదలుగా) ఎవ్వరూ ఆ విష్ణుపదానికి చేరుకోలేరు. ఆ స్థానం మనోహరం, పరమోత్తమం. అక్కడ ఏవిధమైన బాధలూ ఉండవు.

యాస్యసి త్వం పరం స్థానం రాజ్యామృతముపాస్య చ ।
సర్వాన్ లోకానతిక్రమ్య మమ లోకం గమిష్యసి ॥ 83 ॥

మహారాజా! నీవు ముందుగా ఈ లోకంలో సమస్తమైన రాజ్యభోగాలు అనుభవిస్తావు. ఆ తర్వాత, సర్వోత్తమమైన ఆ చోటికి చేరుకుంటావు. దారిలో ఉన్న స్వర్గాదిలోకాలు అన్నింటినీ దాటుకుని, నేను ఉండే వైకుంఠలోకానికి వెళ్తావు.

కీర్తిస్తవాత్ర రాజేన్ద్ర త్రీన్ లోకాంశ్చ గమిష్యతి ।
సాన్నిధ్యం మమ చైవాత్ర సర్వదైవ భవిష్యతి ॥ 84 ॥

రాజవరేణ్యా! నీ యశస్సు ముల్లోకాలలోనూ నిండిపోతుంది. నీవు నిరంతరం నాతో కలిసి ఉంటావు.

శ్వేతగఙ్గేతి గాస్యన్తి సర్వేవైదేవదానవాః ।
కుశాగ్రేణాపి రాజేన్ద్ర శ్వేతగాఙ్గేయమమ్బు చ ॥
స్పృష్ట్వా స్వర్గం గమిష్యన్తి మద్భక్తా యే సమాహితాః ॥ 85 ॥

రాజోత్తమా! (దక్షిణసముద్రతీరంలో శ్వేతుడు నిర్మించిన శ్వేతమాధవ దేవాలయం ఉన్న పుణ్యక్షేత్రంలోని పుణ్యజలాన్ని) దేవతలూ, దానవులూ శ్వేతగంగ అని కీర్తిస్తారు. నా మీద ఏకాగ్రమైన భక్తిభావంతో, ఈశ్వేత గంగలోని పుణ్యజలం, దర్భమొనమీద నుంచి జారిన చిన్ని నీటిచుక్కను తాకినా, ఆ భాగవతోత్తములు స్వర్గలోకానికి వెళ్తారు.

యస్త్విమాం ప్రతిమాం గచ్ఛేన్మాధవాఖ్యాం శశిప్రభామ్ ।
శఙ్ఖగోక్షీరసఙ్కాశామశేషాఘవినాశినీమ్ ॥ 86 ॥

తాం ప్రణమ్య సకృద్ భక్త్యా పుణ్డరీకనిభేక్షణామ్ ।
విహాయ సర్వలోకాన్ వై మమ లోకే మహీయతే ॥ 87 ॥

మాధవుడు అనే పేరు గలిగిన ఈ క్షేత్రంలోని విష్ణువు మూర్తి చంద్రుడులాగా తెల్లగా ప్రకాశిస్తుంటుంది. శంఖంలాగా, ఆవుపాలలాగా (తెల్లగా) ఉంటుంది. అందరి పాపాలనూ మిగలకుండా నాశనం చేస్తుంది. ఆ స్వామి కన్నులు తామరపూవులలాగా మనోహరంగా ఉంటాయి. ఈ మాధవక్షేత్రానికి వచ్చినవాడూ, ఈ స్వామికి భక్తితో ఒక్కసారి ప్రణమిల్లినవాడూ ఇతరమైన పుణ్యలోకాలన్నిటినీ దాటుకుని నా(వైకుంఠ)లోకానికి చేరుకుంటాడు. అక్కడ చక్కగా పూజింపబడతాడు.

మన్వన్తరాణి తత్రైవ దేవకన్యాభిరావృతః ।
గీయమానశ్చ మధురం సిద్ధగన్ధర్వసేవితః ॥
భునక్తి విపులాన్ భోగాన్ యథేష్టం మామకైస్సహ ॥ 88 ॥

కొన్ని మన్వంతరాల కాలం వైకుంఠంలో ఉంటాడు. దేవకన్యలు చుట్టూ చేరి అతడిని సేవిస్తారు. సిద్ధులు, గంధర్వులు అతడిని ఆశ్రయిస్తారు. అతడిని గురించిన స్తోత్రాలను మధురంగా గానం చేస్తారు. ఆ పుణ్యాత్ముడు వైకుంఠంలో నా వారితో (వైష్ణవులతో) కలిసి కోరుకున్న సుఖాలు విస్తారంగా అనుభవిస్తాడు.

చ్యుతస్తస్మాదిహాగత్య మనుష్యో బ్రాహ్మణో భవేత్ ।
వేదవేదాఙ్గవిచ్ఛ్రీమాన్ భోగవాంశ్చిరజీవితః ॥ 89 ॥

(పుణ్యక్షయం అయిన) తరువాత వైకుంఠంనుంచి మళ్లీ మానవలోకానికి తిరిగి వస్తాడు. ఆ జన్మలో బ్రాహ్మణుడు అవుతాడు. వేదాలనూ, వేదాంగాలనూ చక్కగా తెలుసుకుంటాడు. గొప్పధనవంతు డవుతాడు. వివిధమైన భోగాలు అనుభవిస్తాడు. దీర్ఘకాలం జీవిస్తాడు.

గజాశ్వరథయానాఢ్యో ధనధాన్యావృతశ్శుచిః ।
రూపవాన్ బహుభాగ్యశ్చ పుత్రపౌత్రసమన్వితః ॥ 90 ॥

ఏనుగులు, గుఱ్ఱాలు, రథాలు మొదలైన వాహనాలు, రకరకాల సంపదలు, పంటలు పుష్కలంగా ఉంటాయి. పుణ్యాత్ముడవుతాడు. సౌందర్యం సిద్ధిస్తుంది. గొప్ప అదృష్టవంతు డవుతాడు. కొడుకులు, మనుమలు సమృద్ధిగా కలుగుతారు.

పురుషోత్తమం పునః ప్రాప్య వటమూలేఽథ సాగరే ।
త్యక్త్వా దేహం హరిం స్మృత్వా తతశ్శాన్తపదం వ్రజేత్ ॥ 91 ॥

మళ్లీ పురుషోత్తమ క్షేత్రానికి వెళ్తాడు. అక్కడ దక్షిణసాగరతీరంలో ఉన్న (మార్కండేయవటం అనే) మఱ్ఱిచెట్టు మొదట్లో ఉన్న పురుషోత్తమస్వామిని చేరుకుంటాడు. ఆ పుణ్యక్షేత్రంలో శ్రీహరిని స్మరిస్తూ, ప్రాణాలు విడిచి, శాంతికి స్థానమైన విష్ణుపదానికి వెళ్తాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే శ్వేతమాధవమాహాత్మ్యవర్ణనం నామ షట్పఞ్చాశత్తమోఽధ్యాయః ॥ 56 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషి సంవాదంలో శ్వేతమాధవ మాహాత్మ్యవర్ణనం అనే యాభైఆరవ అధ్యాయం సంపూర్ణం.



సప్తపఞ్చాశత్తమోఽధ్యాయః - యాభైఏడవ అధ్యాయం

సముద్రస్నానవిధినిరూపణమ్ - సముద్రస్నానవిధి నిరూపణం

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

శ్వేతమాధవమాలోక్య సమీపే మత్స్యమాధవమ్ ।
ఏకార్ణవజలే పూర్వం రోహితం రూపమాస్థితమ్ ॥ 1 ॥

మహర్షులారా! దక్షిణసముద్రతీరంలో శ్వేతమాధవస్వామిని దర్శించుకుని, తరువాత ఆ ప్రక్కనే ఉన్న మత్స్యమాధవస్వామిని దర్శించుకోవాలి. మాధవుడు పూర్వం ప్రళయానంతరం సమస్తం ఏకార్ణవమైఉండగా, ఆ సముద్రంలో రోహితం అనే జాతికి సంబంధించిన చేపరూపం ధరించిఉన్నాడు.

వేదానాం హరణార్థాయ రసాతలతలే స్థితామ్ ।
చిన్తయిత్వా క్షితిం సమ్యక్ తస్మిన్ స్థానే ప్రతిష్ఠితమ్ ॥ 2 ॥

హిరణ్యాక్షుడు అనే రాక్షసుడు వేదాలను దొంగిలించుకుని తీసుకునివెళ్ళి సముద్రంలో దాక్కున్నాడు. ఆ వేదాలను తిరిగి తీసుకురావడానికి శ్రీమహావిష్ణువు సంకల్పించాడు. అప్పుడు భూలోకం రసాతలం అనే అధో లోకంలో ఉండటాన్ని గ్రహించాడు. ఆ భూలోకాన్ని తిరిగి దానిస్థానంలో దానిని నెలకొల్పాడు.

ఆద్యావతరణం రూపం మాధవం మత్స్యరూపిణమ్ ।
ప్రణమ్య ప్రణతో భూత్వా సర్వదుఃఖాద్ విముచ్యతే ॥ 3 ॥

ఏకార్ణవంలో మగ్నమైన భూమిని ఉద్ధరించి, రాక్షసహస్తగతమైన వేదాలను ఉద్ధరించడానికి శ్రీమహావిష్ణువు మొట్టమొదటిసారిగా మత్స్యరూపం ధరించాడు. అటువంటి మత్స్యరూపంలో ఉన్న మాధవస్వామికి వినయంగా భక్తితో నమస్కరించినవాడికి బాధలన్నీ తొలగిపోతాయి.

ప్రయాతి పరమం స్థానం యత్ర దేవో హరిస్స్వయమ్ ।
కాలే పునరిహాయాతో రాజా స్యాత్ పృథివీతలే ॥ 4 ॥

(మత్స్యమాధవుడిని సేవించినవాడు) శ్రీహరి స్వయంగా నెలకొన్న ఉత్తమోత్తమమైన వైకుంఠలోకానికి వెళ్తాడు. పుణ్యఫలం పూర్తిగా అనుభవించిన తరువాత తిరిగి భూలోకానికి వస్తాడు. ఈ లోకంలో మహారాజుగా జన్మిస్తాడు.

మత్స్యమాధవమాసాద్య దురాధర్షో భవేన్నరః ।
దాతా భోక్తా భవేద్ యజ్వా వైష్ణవస్సత్యసఙ్గరః ॥
యోగం ప్రాప్య హరేః పశ్చాత్ తతో మోక్షమవాప్నుయాత్ ॥ 5 ॥

మత్స్యరూపంలో ఉన్న మాధవుడిని దర్శిస్తాడు. ఇక వాడికి ఎదురు ఉండదు. గొప్పగా దానాలు చేస్తాడు. భోగాలు అనుభవిస్తాడు. యాగాలు చేస్తాడు. విష్ణుభక్తుడవుతాడు. సత్యవ్రతాన్ని నియతంగా పాటిస్తాడు. తరువాత వైష్ణవయోగాన్ని పొందుతాడు. దానితో వాడికి మోక్షం కలుగుతుంది.

మత్స్యమాధవమాహాత్మ్యం మయా సమ్పరికీర్తితమ్ ।
యం దృష్ట్వా మునిశార్దూలాస్సర్వాన్ కామానవాప్నుయాత్ ॥ 6 ॥

మత్స్యమాధవస్వామిని దర్శించినవారికి కోరికలన్నీ నెరవేరుతాయి. మహర్షులారా! ఈవిధంగా మత్స్యమాధవస్వామి మహిమలను విపులంగా వివరించాను.

మునయ ఊచుః :– బ్రహ్మదేవుడితో మహర్షులు ఈవిధంగా అంటున్నారు.

భగవన్ శ్రోతుమిచ్ఛామో మార్జనం వరుణాలయే ।
క్రియతే స్నానదానాది తస్యాశేషఫలం వద ॥ 7 ॥

మహాత్మా! బ్రహ్మదేవా! శ్వేతమాధవస్వామి నెలకొన్న ఆ పుణ్యక్షేత్రంలోని సముద్రజలాన్ని శిరసుపై చల్లుకుంటే, ఆ నీటిలో స్నానం చేస్తే, ఆ సముద్రతీరంలో దానం మొదలైన కర్మలను ఆచరిస్తే, కలిగే అనంతమైన పుణ్యఫలాన్ని గురించి వినాలనుకుంటున్నాం. చెప్పవలసింది.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

శృణుధ్వం మునిశార్దూలా మార్జనస్య యథావిధి ।
భక్త్యా తు తన్మనా భూత్వా సమ్ప్రాప్య పుణ్యముత్తమమ్ ॥ 8 ॥

మహర్షులారా! సముద్రజలంతో మార్జనం చేసుకునే విధానాన్ని, భక్తితో మనసును మాధవుడియందు లగ్నం చేసి, ఆ పుణ్యతీర్థానికి వెళ్లడంవల్ల కలిగే ఉత్తమమైన పుణ్యాన్ని గురించి వినండి.

మార్కణ్డేయహ్రదే స్నానం పూర్వకాలే ప్రశస్యతే ।
చతుర్దశ్యాం విశేషేణ సర్వపాపప్రణాశనమ్ ॥ 9 ॥

మహర్షులారా! అక్కడి మార్కండేయ హ్రదంలో ప్రాతఃకాలంలో స్నానం చేయడం ఉత్తమం. అందులోనూ చతుర్దశి తిథినాడు చేయడం ఇంకా విశేషం. దానివల్ల పాపాలన్నీ నశించిపోతాయి.

తద్వత్ స్నానం సముద్రస్య సర్వకాలం ప్రశస్యతే ।
పౌర్ణమాస్యాం విశేషేణ హయమేధఫలం లభేత్ ॥ 10 ॥

అదేవిధంగా సముద్రంలో స్నానం అన్నివేళలలోనూ ప్రశస్తమే. అయితే పూర్ణిమనాడు సముద్రస్నానం చేస్తే ఇంకా విశేషమైన ప్రయోజనం కలుగుతుంది. దానివల్ల అశ్వమేధయాగం చేసిన పుణ్యం లభిస్తుంది.

మార్కణ్డేయం వటం కృష్ణం రౌహిణేయం మహోదధిమ్ ।
ఇన్ద్రద్యుమ్నసరశ్చైవ పఞ్చతీర్థీ విధిః స్మృతః ॥ 11 ॥

మార్కండేయవటం, శ్రీకృష్ణస్వామి, బలరాముడు, దక్షిణసముద్రం, ఇంద్రద్యుమ్నసరస్సు ఈ అయిదింటినీ సేవించడాన్ని పంచతీర్థవిధి అంటారు.

పూర్ణిమా జ్యేష్ఠమాసస్య జ్యేష్ఠా ఋక్షం యదా భవేత్ ।
తదా గచ్ఛేద్ విశేషేణ తీర్థరాజం పరం శుభమ్ ॥ 12 ॥

జ్యేష్ఠమాసంలో పూర్ణిమ తిథి, జ్యేష్ఠ నక్షత్రం కలిసివచ్చిననాడు ఆ పుణ్యతీర్థానికి వెళ్లాలి. ఆ సమయంలో సేవించడం వల్ల విశేషమైన శుభఫలితం కలుగుతుంది.

కాయవాఙ్మానసైశ్శుద్ధస్తద్భావో నాన్యమానసః ।
సర్వద్వన్ద్వవినిర్ముక్తో వీతరాగో విమత్సరః ॥ 13 ॥

మనస్సు, శరీరం, మాట, అనే కరణాలు మూడింటిలోనూ దోషం ఉండకూడదు. ఇతరమైన ఆలోచన ఏదీ మనసులోనికి రానీయకూడదు. మనసును పూర్తిగా శ్రీహరియందే లగ్నం చేయాలి. సుఖం, దుఃఖం అనే అన్ని ద్వంద్వాలను విడిచిపెట్టాలి. (అన్నింటినీ సమంగా చూడగలగాలి.) దేనిమీదా కోరిక ఉండగూడదు. ఎవరిని గురించి కూడ అసూయ పడగూడదు. (ఆ క్షేత్రంలో ఇలాంటి ఉత్తమ లక్షణాలతో ప్రవర్తించాలి.)

కల్పవృక్షవటం రమ్యం తత్ర స్నాత్వా జనార్దనమ్ ।
ప్రదక్షిణం ప్రకుర్వీత త్రివారం సుసమాహితః ॥ 14 ॥

అక్కడి మార్కండేయవటం కల్పవృక్షం. అది ఉన్న ప్రదేశం మనోహరం. మార్కండేయహ్రదంలో స్నానం చేసి, మాధవస్వామికి మూడుమార్లు శ్రద్ధగా ప్రదక్షిణం చేయాలి.

యం దృష్ట్వా ముచ్యతే పాపాత్ సప్తజన్మసముద్భవాత్ ।
పుణ్యం చాప్నోతి విపులం గతిమిష్టాం చ భో ద్విజాః ॥ 15 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆ క్షేత్రంలోని శ్రీహరిని దర్శించినవాడికి పూర్వం ఏడు జన్మలనుండి చేసిన పాపాలు మొత్తం నశిస్తాయి. ఇంకా ఎంతో గొప్పపుణ్యం లభిస్తుంది. కోరుకున్న ఉత్తమగతి (మోక్షం) కూడా సిద్ధిస్తుంది.

తస్య నామాని వక్ష్యామి ప్రమాణం చ యుగే యుగే ।
యథాసఙ్ఖ్యం చ భో విప్రాః కృతాదిషు యథాక్రమమ్ ॥ 16 ॥

ఓ ద్విజులారా! కృతయుగం మొదలుగా ఆయా కాలాలలో వరుసగా ఆ మార్కండేయవటం ఏ యే పేర్లతో ఉన్నదో, ఎంత పరిమాణంలో ఉన్నదో వివరిస్తాను.

వటం వటేశ్వరం పూర్వం పురాణపురుషం ద్విజాః ।
వటస్యైతాని నామాని కీర్తితాని కృతాదిషు ॥ 17 ॥

విప్రులారా! పూర్వం కృతయుగంలో ఈవటవృక్షానికి వటం అని పేరు. త్రేతాయుగంలో వటేశ్వరం అనీ, ద్వాపరయుగంలో పురాణపురుషుడు అనే పేర్లతో ఇది ప్రసిద్ధమైంది.(పూర్వం అనే చోట కృష్ణం అని పాఠాంతరం. దానినిబట్టి ద్వాపరయుగంలో కృష్ణుడు అనీ, కలియుగంలో పురాణపురుషు డనీ పేర్లు. నాలుగు యుగాల విషయమూ చెప్పినట్లవుతుంది. తరువాతి శ్లోకంలో వటపరిమాణం నాలుగు యుగాల్లోనూ చెప్పబడింది.)

యోజనం పాదహీనం చ యోజనార్థం తదర్ధకమ్ ।
ప్రమాణం కల్పవృక్షస్య కృతాదౌ పరికీర్తితమ్ ॥ 18 ॥

కృతయుగంలో ఈ వటవృక్షం ఎనిమిదిమైళ్ల వైశాల్యం కలిగిఉండేది. తరువాత త్రేతాయుగంలో నాలుగవవంతు తగ్గి, ఆరుమైళ్ల ప్రమాణంలో ఉండేది. ఆ తరువాత ద్వాపరయుగంలో ఇంకొక నాలుగవవంతు తగ్గి, నాలుగుమైళ్ల వైశాల్యంతో ఉండేది. ఇపుడు కలియుగంలో రెండుమైళ్ల ప్రమాణంతో ఉంది.

పూర్వోక్తేన తు మన్త్రేణ నమస్కృత్వా తు తం వటమ్ ।
దక్షిణాభిముఖో గచ్ఛేద్ ధన్వన్తరశతత్రయమ్ ॥ 19 ॥

మహర్షులారా! ఇంతకు ముందు చెప్పిన మంత్రంతో ఆ మార్కండేయ వటవృక్షానికి నమస్కరించి, దక్షిణ దిక్కువైపుగా మూడువందల విండ్లదూరం (పన్నెండు వందల మూరలు) వెళ్లాలి.

యత్రాసౌ దృశ్యతే విష్ణుః స్వర్గద్వారం మనోరమమ్ ।
సాగరామ్భస్సమాకృష్టం కాష్ఠం సర్వగుణాన్వితమ్ ॥ 20 ॥

అక్కడ శ్రీమహావిష్ణువు దర్శనం ఇస్తాడు. అది స్వర్గానికి మనోహరమైన ద్వారం. (అక్కడి విష్ణుదర్శనం స్వర్గలోకానికి తీసుకుని వెళ్తుంది.) సమస్త గుణాలతో గూడిన కొయ్య సముద్ర జలాలచేత లాక్కురాబడుతుంది. దానితో జగన్నాథమూర్తి చెయ్యబడుతుంది.

ప్రణిపత్య తతస్తం భోః పరిపూజ్య తతః పునః ।
ముచ్యతే సర్వరోగాద్యైస్తథా పాపైర్గ్రహాదిభిః ॥ 21 ॥

ఓ మహర్షులారా! ఆ విష్ణువుమూర్తికి సాష్టాంగంగా నమస్కరించాలి. ఆ తరువాత చక్కగా పూజించాలి. అలా చేసినవాడికి రోగాలు మొదలైనబాధలన్నీ పోతాయి. అతడిని పట్టుకుని బాధిస్తున్న పాపగ్రహాలు, మొదలైన పీడలు వదిలిపోతాయి.

ఉగ్రసేనం పురా దృష్ట్వా స్వర్గద్వారేణ సాగరమ్ ।
గత్వాచమ్య శుచిస్తత్ర ధ్యాత్వా నారాయణం పరమ్ ॥ 22 ॥

స్వర్గద్వారం గుండా అక్కడ ఎదురుగా భయంకరమైన ఆకారంతో ఉన్న సముద్రుడిని దర్శనం చేసుకోవాలి. తరువాత ఆచమనం చేసి, శుచి అయి, పరమాత్మ అయిన శ్రీమన్నారాయణుడిని చక్కగా ధ్యానించాలి.

న్యసేదష్టాక్షరం మన్త్రం పశ్చాద్ధస్తశరీరయోః ।
ఓం నమో నారాయణాయేతి యం వదన్తి మనీషిణః ॥ 23 ॥

జ్ఞానులు ఓం నమో నారాయణాయ అని పేర్కొనే నారాయణ అష్టాక్షరీమంత్రాన్ని చేతులలోనూ, శరీరంలోనూ నిలుపుకోవాలి. (కరన్యాసం, అంగన్యాసం చేసుకోవాలి.)

కిం కార్యం బహుభిర్మన్త్రైర్మనోవిభ్రమకారకైః ।
ఓం నమో నారాయణాయేతి మన్త్రస్సర్వార్థసాధకః ॥ 24 ॥

మనస్సుకి భ్రాంతిని కలిగించే మిగిలినమంత్రాలు ఎన్ని ఉంటే మాత్రం ఏం ప్రయోజనం? (ఈ మంత్రంకంటె ఆ మంత్రం మంచిది, దానికంటె ఇంకొకటి గొప్పది అనే విధంగా ఏ మంత్రం మీద కూడ ఏకాగ్రత కుదరదు.) ఓం నమో నారాయణాయ అనే అష్టాక్షరీమంత్రం ఒక్కటి మాత్రమే సమస్తమైన ప్రయోజనాలను సిద్ధింపజేస్తుంది.

ఆపో నరస్య సూనుత్వాన్నారా ఇతి హ కీర్తితాః ।
విష్ణోస్తాస్త్వయనం పూర్వం తేన నారాయణస్స్మృతః ॥ 25 ॥

నరుడికి కుమారులు కావటంచేత నీటికి 'నార'ములు అని పేరు. ఆ నారాలు పూర్వం విష్ణువుకు నివాస స్థానాలు కావడంచేత నారములు నివాసం గలిగిన విష్ణువు నారాయణుడు అయినాడు.

నారాయణపరా లోకా నారాయణపరాస్సురాః ।
నారాయణపరం సత్యం నారాయణపరం పదమ్ ॥ 26 ॥

జగత్తులన్నీ నారాయణుడిని ఆశ్రయించుకుని ఉన్నాయి (నారాయణస్వరూపాలు). దేవతలు అందరూ నారాయణుడియందే తాత్పర్యం గలిగి ఉన్నారు. సత్యం, మోక్షం నారాయణుడిని ఆశ్రయించకుని ఉన్నాయి (సత్యమూ, మోక్షమూ నారాయణ స్వరూపాలు).

నారాయణపరా పృథ్వీ నారాయణపరం జలమ్ ।
నారాయణపరో వహ్నిర్నారాయణపరం నమః ॥ 27 ॥

భూమి, నీరు, నిప్పు, అన్నీ నారాయణ స్వరూపాలే. అట్టి శ్రేష్ఠుడైన నారాయణునికే నమస్కారం.

నారాయణపరో వాయుర్నారాయణపరం మనః ।
అహఙ్కారశ్చ బుద్ధిశ్చ ఉభే నారాయణాత్మకే ॥ 28 ॥

గాలి నారాయణుడే. మనసు నారాయణుడే. అహంకారం, బుద్ధి రెండూ నారాయణ స్వరూపాలే.

భూతం భవ్యం భవిష్యం చ యత్ కిఞ్చిజ్జీవసంజ్ఞకమ్ ।
స్థూలం సూక్ష్మం పరం చైవ సర్వం నారాయణాత్మకమ్ ॥ 29 ॥

పూర్వకాలంలో ఉన్నదీ, భవిష్యత్తులో ఉండబోయేదీ, ప్రస్తుతం ఉన్నదీ అయిన జీవుడు అనే పేరు గలిగిన పదార్థం సమస్తమూ నారాయణుడే. మిక్కిలి విస్తారమైనదీ, మిక్కిలి తక్కువైనదీ, అన్నింటికంటె శ్రేష్ఠమైనదీ సమస్తమూ నారాయణ స్వరూపమే.

శబ్దాద్యా విషయాస్సర్వే శ్రోత్రాదీనీన్ద్రియాణి చ ।
ప్రకృతిః పురుషశ్చైవ సర్వే నారాయణాత్మకాః ॥ 30 ॥

శబ్దం, స్పర్శం, రూపం, రసం, గంధం, అనే ఇంద్రియవిషయాలు, చెవి (చర్మం, కన్ను, నాలుక, ముక్కు) మొదలైన ఇంద్రియాలు సమస్తమూ నారాయణుడే. ప్రకృతి, పురుషుడు, మొత్తం అన్నీ నారాయణ స్వరూపాలే.

జలే స్థలే చ పాతాలే స్వర్గలోకేఽమ్బరే నగే ।
అవష్టభ్య ఇదం సర్వమాస్తే నారాయణః ప్రభుః ॥ 31 ॥

సర్వానికీ నియామకుడైన నారాయణుడు నీటిలోనూ, నేలలోనూ, పాతాళంలోనూ, స్వర్గలోకంలోనూ, ఆకాశంలోనూ, పర్వతాలలోనూ, నిండి జగత్తు నిండా వ్యాపించి ఉన్నాడు.

కిం చాత్ర బహునోక్తేన జగదేతచ్చరాచరమ్ ।
బ్రహ్మాదిస్తమ్బపర్యన్తం సర్వం నారాయణాత్మకమ్ ॥ 32 ॥

ఇన్ని మాట లెందుకు? బ్రహ్మ మొదలుకొని గడ్డిపరక వరకూ జంగమమూ, స్థావరమూ అయిన ఈ జగత్తు మొత్తం నారాయణ స్వరూపమే.

నారాయణాత్ పరం కిఞ్చిన్నేహ పశ్యామి భో ద్విజాః ।
తేన వ్యాప్తమిదం సర్వం దృశ్యాదృశ్యం చరాచరమ్ ॥ 33 ॥

ఓ బ్రాహ్మణులారా! నారాయణుడికంటె వేరుగా ఈ సృష్టిలో కొంచెం కూడా కనబడదు. కనిపించేదీ, కనిపించనిదీ అయిన ఈ స్థావర జంగమ సృష్టి సమస్తంలోనూ నారాయణుడు నిండి ఉన్నాడు.

ఆపో హ్యాయతనం విష్ణోస్స చ ఏవామ్బసాం పతిః ।
తస్మాదప్సు స్మరేన్నిత్యం నారాయణమఘాపహమ్ ॥ 34 ॥

శ్రీమహావిష్ణువుకు నీళ్లే నివాసం. ఆయనే జలాధిపతి. అందుచేత నారాయణుడిని నిత్యమూ నీళ్లలో తలచుకోవాలి. నారాయణుడు సమస్తమైన పాపాలను పోగొడతాడు.

స్నానకాలే విశేషేణ చోపస్థాయ జలే శుచిః ।
స్మరేన్నారాయణం ధ్యాయేద్ధస్తే కాయే చ విన్యసేత్ ॥ 35 ॥

ముఖ్యంగా స్నానం చేసే సమయంలో నీళ్లలో శుచిగా ఉండి, నారాయణుడిని స్మరించాలి, ధ్యానించాలి. నారాయణ మంత్రాన్ని చేతులలోనూ, శరీరంలోనూ న్యాసం చేసుకోవాలి.

ఓఙ్కారం చ నకారం చ అఙ్గుష్ఠే హస్తయోర్న్యసేత్ ।
శేషైర్వస్తతలం యావత్ తర్జన్యాదిషు విన్యసేత్ ॥ 36 ॥

కుడి, ఎడమచేతులు రెండింటిలోనూ బొటనవేళ్లలో ఓంకారాన్నీ నకారాన్నీ, న్యాసం చేసుకోవాలి.(ఓం నం అంగుష్ఠాభ్యాం నమః). మిగిలిన మంత్రాక్షరాలను కూడ ఈవిధంగా చేతులలో మిగిలిన చూపుడువేలు మొదలైన వాటిలో న్యాసం చేసుకోవాలి.(ఓం మోం తర్జనీభ్యాం నమః, ఓం నాం మధ్యమాభ్యాం నమః, ఓం రాం అనామి కాభ్యాం నమః, ఓం యం కనిష్ఠికాభ్యాం నమః ఓం ణాం కరతలాభ్యాం నమః, ఓం యం కరపృష్ఠాభ్యాం నమ.)

ఓఙ్కారం వామపాదే తు నకారం దక్షిణే న్యసేత్ ।
మోకారం వామకట్యాం తు నాకారం దక్షిణే న్యసేత్ ॥ 37 ॥

(ఇంక నారాయణమంత్రాన్ని శరీరంలో ఈవిధంగా న్యాసం చేసుకోవాలి.) ఎడమపాదంలో ఓంకారాన్నీ (ఓం నమో వామపాదే) నకారాన్ని కుడిపాదంలో నిలుపుకోవాలి (నాం దక్షిణపాదే నమః). మో కారాన్ని ఎడమ కటి (పిరుదు)యందు నిలుపుకోవాలి (మోం వామకట్యాం నమః). నాకారాన్ని కుడి కటియందు నిలుపుకోవాలి (నాం దక్షిణకట్యాం నమః)

రాకారం నాభిదేశే తు యకారం వామబాహుకే ।
ణాకారం దక్షిణే న్యస్య యకారం మూర్ధ్ని విన్యసేత్ ॥ 38 ॥

రాకారాన్ని బొడ్డులోనూ (రాం నాభ్యాం నమః), యకారాన్ని ఎడమ భుజంలోనూ (యం వామబాహౌ నమః), ణాకారాన్ని కుడి భుజంలోనూ (ణాం దక్షిణబాహౌ నమః), యకారాన్ని మాడులో(యం మూర్ధ్నే నమః) న్యాసం చేసుకోవాలి.

అధశ్చోర్ధ్వం చ హృదయే పార్శ్వతః పృష్ఠతోఽగ్రతః ।
ధ్యాత్వా నారాయణం పశ్చాదారభేత్ కవచం బుధః ॥ 39 ॥

కింద, పైన, హృదయంలోనూ, కుడిప్రక్క, ఎడమప్రక్క, ముందు, వెనుక, నారాయణుడి రూపాన్ని ధ్యానించాలి. తన లోపలా, బయటా నారాయణుడు నిండిఉన్నట్లు భావించాలి.) తరువాత నారాయణ కవచాన్ని ధరించాలి.

పూర్వే మాం పాతు గోవిన్దో దక్షిణే మధుసూదనః ।
పశ్చిమే శ్రీధరో దేవః కేశవస్తు తథోత్తరే ॥ 40 ॥

తూర్పువైపున గోవిందుడు, దక్షిణం దిక్కులో మధుసూదనుడు, పడమటి దిక్కున శ్రీధరుడు, ఉత్తరం దిక్కులో కేశవస్వామి నన్ను రక్షించును గాక.

పాతు విష్ణుస్తథాగ్నేయే నైరృతే మాధవోఽవ్యయః ।
వాయవ్యే తు హృషీకేశస్తథేశానే చ వామనః ॥ 41 ॥

ఆగ్నేయమూలలో విష్ణుమూర్తి, నైరృతిమూలలో శాశ్వతుడైన మాధవస్వామి, వాయవ్యమూలలో హృషీకేశుడు, ఐశాన్యమూలలో వామనుడు నన్ను రక్షించును గాక.

భూతలే పాతు వారాహస్తథోర్ధ్వం చ త్రివిక్రమః ।
కృత్వైవం కవచం పశ్చాదాత్మానం చిన్తయేత్ తతః ॥ 42 ॥

నేలమీద వరాహస్వామి, ఆకాశంలో త్రివిక్రముడు, నన్ను రక్షించును గాక. ఈవిధంగా దశదిశలలోనూ స్వామిని కవచంగా ఏర్పరచుకుని, ఆ తరువాత ఆత్మధ్యానం (తానే నారాయణుడు అనే భావన) చేయాలి.

అహం నారాయణో దేవశ్శఙ్ఖచక్రగదాధరః ।
ఏవం ధ్యాత్వా తదాత్మానమిమం మన్త్రముదీరయేత్ ॥ 43 ॥

శంఖం, చక్రం, గదలను ధరించిన శ్రీమన్నారాయణుడిని నేనే అని తనను నారాయణుడిగా ధ్యానించి, తరువాత ఈ మంత్రాన్ని ఉచ్చరించాలి.

త్వమగ్నిర్ద్విపదాం నాథ రేతోఘః కామదీపనః ।
ప్రధానస్సర్వభూతానాం జీవానాం ప్రభురవ్యయః ॥ 44 ॥

ప్రభూ! మానవులలో అగ్ని (జఠరాగ్ని) నీవు. వీర్యప్రవాహం నీవు. కామాన్ని పెంపొందించేవాడివి నీవు. చరాచరపదార్థా లన్నింటిలోనూ ప్రధానం నీవు. జీవు లందరికీ ప్రభువు నీవు. శాశ్వతుడివి.

అమృతస్యారణి స్త్వం హి దేవయోనిరపాం పతే ।
వృజినం హర మే సర్వం తీర్థరాజ నమోఽస్తు తే ॥ 45 ॥

జలాధిపతీ! శ్రేష్ఠమైన పుణ్యతీర్థమా! అమృతానికి ఉత్పత్తిస్థానం నీవు. దేవతలు నీ నుండే పుట్టారు. నా పాపాలు అన్నింటినీ తొలగించు. నీకు నమస్కారం.

ఏవముచ్చార్య విధివత్తతస్స్నానం సమాచరేత్ ।
అన్యథా భో ద్విజశ్రేష్ఠాస్స్నానం తత్ర న శస్యతే ॥ 46 ॥

ఓ బ్రాహ్మణోత్తములారా! ఈ (పై రెండు శ్లోకాలు) మంత్రాన్ని శ్రద్ధగా పలికి, తరువాత శాస్త్రోక్తమైన విధానంలో స్నానం చేయాలి. అలా కాకుండా(ఊరికే నీళ్లలో మునుగుతూ)చేసిన స్నానంవల్ల ప్రయోజనం ఉండదు.

కృత్వా చాబ్దైవతైర్మన్త్రైరభిషేకం చ మార్జనమ్ ।
అన్తర్జలే జపేత్ పశ్చాత్ త్రిరావృత్త్యాఘమర్షణమ్ ॥ 47 ॥

జలదేవతకు సంబంధించిన మంత్రాలతో శిరసుపై నీళ్లు చల్లుకోవాలి. తరువాత చక్కగా స్నానం చేయాలి. ఆ తరువాత నీళ్లలోనే ఉండి, అఘమర్షణ మంత్రాలను ముమ్మారు జపించాలి.

హయమేధో యథా విప్రాస్సర్వపాపహరః క్రతుః ।
తథాఘమర్షణం చాత్ర సూక్తం సర్వాఘనాశనమ్ ॥ 48 ॥

ద్విజులారా! ఈవిధంగా స్నానం చేయడంవల్ల అశ్వమేధయాగం చేసిన ఫలితం సిద్ధిస్తుంది. దానివల్ల సమస్త పాపాలు నశిస్తాయి. ఇక్కడ (నీళ్లలో) జపించిన అఘమర్షణసూక్తం అన్నిపాపాలను నాశనం చేస్తుంది.

ఉత్తీర్య వాససీ ధౌతే నిర్మలే పరిధాయ వై ।
ప్రాణానాయమ్య చాచమ్య సన్ధ్యాం చోపాస్య భాస్కరమ్ ॥ 49 ॥

తరువాత నీళ్లలోనుండి ఒడ్డుకు వచ్చి, శుభ్రంగా ఉతికిన వస్త్రాలను ధరించాలి. తరువాత ఒడ్డున కూర్చుని ఆచమనం, ప్రాణాయామమూ చేయాలి. తరువాత సంధ్యావందనం చేయాలి. సూర్యుడికి నమస్కరించాలి.

ఉపతిష్ఠేత్తతశ్చోర్ధ్వం క్షిప్త్వా పుష్పజలాఞ్జలిమ్ ।
ఉపస్థాయోర్ధ్వబాహుశ్చ తల్లిఙ్గైర్భాస్కరం తతః ॥ 50 ॥

తరువాత దోసిలినిండుగా నీళ్లు, పూలు కలిపి తీసుకుని, పైకెగురవేసి, సూర్యుడికి సమర్పించాలి. రెండు బాహువులు పై కెత్తి సవితృమంత్రాలతో సూర్యుడికి ఉపస్థానం (ఉపాసనం) చేయాలి.

గాయత్రీం పావనీం దేవీం జపేదష్టోత్తరం శతమ్ ।
అన్యాంశ్చ సౌరమన్త్రాంశ్చ జప్త్వా తిష్ఠేత్ సమాహితః ॥ 51 ॥

పవిత్రమైనగాయత్రీమంత్రాన్ని నూటయెనిమిదిసార్లు జపించాలి. ఇంకా ఇతరసూర్య మంత్రాలను గూడ ఏకాగ్రంగా జపిస్తూ ఉండాలి.

కృత్వా ప్రదక్షిణం సూర్యం నమస్కృత్యోపవిశ్యచ ।
స్వాధ్యాయం ప్రాఙ్ముఖః కృత్వా తర్పయేద్దైవతాన్ ఋషీన్ ॥ 52 ॥

తరువాత సూర్యుడికి ప్రదక్షిణమూ, నమస్కారమూ చేయాలి. ఆ తరువాత తూర్పుముఖంగా కూర్చుని, స్వశాఖకు సంబంధించిన వేదాన్ని పారాయణం చేయాలి. ఆ తరువాత (తూర్పుముఖంగా కూర్చుని) దేవతలకూ, ఋషులకూ తర్పణాలు విడిచిపెట్టాలి.

మనుష్యాంశ్చ పితౄంశ్చాన్యాన్నామగోత్రేణ మన్త్రవిత్ ।
తోయేన తిలమిశ్రేణ విధివత్ సుసమాహితః ॥ 53 ॥

దేవ ఋషి తర్పణం అయిన తరువాత మానవులకు, పితరులకు, ఇంకా ఇతరులకు (కారుణ్యం) తర్పణాలు విడిచిపెట్టాలి. వారి వారి గోత్రాలనూ, పేర్లనూ తెలుసుకుని ఆ క్రమంలో నల్లని నువ్వులతో కలిపిన నీళ్లతో శాస్త్రోక్తమైన విధానంలో శ్రద్ధగా పితృతర్పణం చేయాలి.

తర్పణం దేవతానాం చ పూర్వం కృత్వా సమాహితః ।
అధికారీ భవేత్ పశ్చాత్ పితౄణాం తర్పణే ద్విజః ॥ 54 ॥

బ్రాహ్మణుడు మొదట దేవతలకు తర్పణం చేయాలి. అప్పుడే తరువాత పితరులకు తర్పణం చేయడానికి అధికారం లభిస్తుంది. (దేవతర్పణం చేయకుండా పితృతర్పణం చేయగూడదు.)

శ్రాద్ధకాలేఽన్నకాలేచ పాణినైకేన నిర్వపేత్ ।
తర్పణే తూభయం కుర్యాదేష ఏవ విధిస్సదా ॥ 55 ॥

శ్రాద్ధం పెట్టే సమయంలోనూ, పితృదేవతలకు అన్నం పెట్టే(పిండప్రదాన)సమయంలోనూ, ఒక్కచేతితో ఇవ్వవచ్చును. తర్పణం మాత్రం రెండు చేతులతోనూ ఇవ్వాలి. ఇది నిత్యమూ పాటించవలసిన నియమం. (ఈ నియమం ఎప్పటికీ తప్పరాదు.)

అన్వారబ్ధేన సవ్యేన పాణినా దక్షిణేన తు ।
తృప్యతామితి వక్తవ్యం నామగోత్రేణ వాగ్యతః ॥ 56 ॥

తర్పణంలో (కుడిమోకాలు, ఎడమపాదం నేల కానించి కూర్చుండి) కుడిచేతిపై నుండి, ఎడమచేతిని నేల కానించి, కుడిచేతిద్వారా (నువ్వులు) నీళ్లు విడిచిపెట్టేసమయంలో ఎవరి నుద్దేశించి విడిచిపెడుతున్నామో వారి పేరును, గోత్రాన్ని ఉచ్చరించి, ఆ తరువాత 'తృప్యతామ్' అని చెప్పాలి. తర్పణసమయంలో మాటను నియమించు కోవాలి (అనవసరమైన మాటలు మాట్లాడగూడదు).

కాయస్థైర్యస్తిలైర్మోహాత్ కరోతి పితృతర్పణమ్ ।
తర్పితాస్తేన పితరస్త్వఙ్మాంసరుధిరాస్థిభిః ॥ 57 ॥

విధానం తెలియకుండా, శరీరం మీద పడిఉన్న నువ్వులతో పితృదేవతలకు తర్పణం చేస్తే, పితరులకు చర్మం, మాంసం, రక్తం, ఎముకలతో తర్పణం చేసిన ట్లవుతుంది. (రక్తమాంసాదులతో తర్పణం చేసిన పాపం కలుగుతుంది.) (తర్పణం చేసేటప్పుడు నువ్వులు, నీళ్లు శరీరం మీద పడగూడదు. వాటిని పితృతీర్థం ద్వారా సరాసరిగా దర్భాదులపైనే విడిచిపెట్టాలి.)

అఙ్గస్థైర్న తిలైః కుర్యాద్దేవతాపితృతర్పణమ్ ।
రుధిరం తద్ భవేత్ తోయం ప్రదాతా కిల్బిషీ భవేత్ ॥ 58 ॥

ఒంటిమీద ఉన్న నువ్వులతో దేవతలకూ, పితరులకూ తర్పణం చేయగూడదు. అలా విడిచిన నీళ్లు నెత్తురు అవుతుంది. ఆవిధంగా తర్పణం చేసినవాడు పాపి అవుతాడు.

భూమ్యాం యద్దీయతే తోయం దాతా చైవ జలే స్థితః ।
వృథా తన్మునిశార్దూలా నోపతిష్ఠతి కస్యచిత్ ॥ 59 ॥

మహర్షులారా! తర్పణం చేసేవాడు నీళ్లలో ఉండి, తర్పణజలాన్ని నేలపైన విడిచిపెడితే, ఆ నీళ్లు వ్యర్థం. అవి పితరులకు ఎప్పటికీ చేరవు.

స్థలే స్థిత్వా జలే యస్తు ప్రయచ్ఛేదుదకం నరః ।
పితౄణాం నోపతిష్ఠేత సలిలం తన్నిరర్థకమ్ ॥ 60 ॥

అదే విధంగా తర్పణం చేసేవాడు నేలమీద ఉండి, తర్పణజలాన్ని నీళ్లలో విడిచిపెడితే ఆ జలం కూడ పితృదేవతలకు చేరదు. అలా విడిచిపెట్టిన నీళ్లు నిష్ప్రయోజనం అవుతాయి.

ఉదకే నోదకం కుర్యాత్ పితృభ్యశ్చ కదాచన ।
ఉత్తీర్య తు శుచౌ దేశే కుర్యాదుదకతర్పణమ్ ॥ 61 ॥

పితృదేవతలకు తర్పణం నీళ్లలో ఉండి ఎప్పుడూ విడిచిపెట్టగూడదు. స్నానాదులు అయిన తరువాత ఒడ్డుకు వచ్చి, పవిత్రమైన స్థలంలో తర్పణం చేయాలి.

నోదకేషు న పాత్రేషు న క్రుద్ధో నైకపాణినా ।
నోపతిష్ఠతి తత్తోయం యద్ భూమ్యాం న ప్రదీయతే ॥ 62 ॥

ఈ తర్పణాలను నీళ్లలో విడువరాదు. పాత్రలలో విడిచిపెట్టగూడదు. కోపంతో విడువగూడదు. ఒంటిచేత్తో విడువగూడదు. తర్పణజలాన్ని నేలమీదనే విడిచిపెట్టాలి. అలా చెయ్యకపోతే (నీళ్లలో, పాత్రలో మొదలుగా ఇంకో రకంగా విడిచిన)తర్పణజలం పితృదేవతలకు చేరదు.

పితౄణామక్షయం స్థానం మహీ దత్తా మయా ద్విజాః ।
తస్మాత్తత్రైవ దాతవ్యం పితౄణాం ప్రీతిమిచ్ఛతా ॥ 63 ॥

బ్రాహ్మణులారా! పితరులకు నిత్యమైన స్థానం భూమి. భూమిని పితరులకోసమే ఇచ్చాను. అందుచేత పితృదేవతలకు తృప్తి కలగాలని కోరుకునేవాడు తర్పణం ఎప్పుడూ నేల మీదనే విడిచిపెట్టాలి.

భూమిపృష్ఠే సముత్పన్నా భూమ్యాం చైవ చ సంస్థితాః ।
భూమ్యాం చైవ లయం యాతా భూమౌ దద్యాత్తతో జలమ్ ॥ 64 ॥

పితరులు భూమికి వెనుకవైపున పుట్టారు. భూమిమీద ఉంటున్నారు. తిరిగి వారు భూమిలోనే కలిసిపోతారు. అందుచేత పితరులకు తర్పణజలం భూమిమీదనే ఇవ్వాలి.

ఆస్తీర్య చ కుశాన్స్వాగ్రాంస్తానావాహ్య స్వమన్త్రతః ।
ప్రాచీనాగ్రేషు వై దేవాన్ యామ్యాగ్రేషు తథా పితౄన్ ॥ 65 ॥

చివరలు తూర్పువైపు ఉండేవిధంగా దర్భలను నేలమీద పరవాలి. వాటిపైన ఆయామంత్రాలతో వారిని ఆహ్వానించాలి. తూరుపు చివరలుగా ఉన్నదర్భలమీద దేవతలకు తర్పణం ఇవ్వాలి. దర్భల చివరలు దక్షిణముఖంగా ఉంచి వాటిపైన పితరులకు తర్పణం ఇవ్వాలి.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భృషిసంవాదే సముద్రస్నానవిధినిరూపణం నామ సప్తపఞ్చాశత్తమోఽధ్యాయ ॥ 57 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషి సంవాదంలో సముద్ర స్నానవిధి నిరూపణం అనే యాభైఏడవ అధ్యాయం సంపూర్ణం.



అష్టపఞ్చాశత్తమోఽధ్యాయః - యాభైఎనిమిదవ అధ్యాయం

పూజావిధిమంత్రకథనమ్ - పూజావిధిమంత్రకథనం

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

దేవాన్ పితౄంస్తథాచాన్యాన్ సన్తర్ప్యాచమ్య వాగ్యతః ।
హస్తమాత్రం చతుష్కోణం చతుర్ద్వారం సుశోభనమ్ ॥ 1 ॥

పురం విలిఖ్య భో విప్రాస్తీరే తస్య మహోదధేః ।
పురమధ్యే లిఖేత్ పద్మమష్టపత్రం సకర్ణికమ్ ॥ 2 ॥

ఈవిధంగా దేవతలకూ, పితరులకూ, ఇతరులకూ విధివిధానంగా తర్పణం చేసిన తరువాత మౌనంగా (అనవసరమైన మాటలు మాట్లాడకుండా), ఆచమనం చేయాలి. బ్రాహ్మణోత్తములారా తరువాత ఆ సముద్రం తీరంలో ఒకపురాన్ని (చతురశ్రమండలాన్ని) లిఖించాలి. చేయి(లొడితెడు-బొటనవేలు, చూపుడువేలు చాచినపుడు ఆ రెంటి నడుమ ఉండే ప్రదేశం అంత) పరిమాణంలో చతుష్కోణం వ్రాయాలి. దానికి అందంగా నాలుగు ద్వారాలు ఏర్పరచాలి. దాని మధ్యభాగంలో ఎనిమిది రేకులతో తామరపూవును చిత్రించాలి. దానికి నడుమ కర్ణిక(పుప్పొడికాడ) లిఖించాలి.

ఏవం మణ్డలమాలిఖ్య పూజయేత్ తత్ర భో ద్విజాః ।
అష్టాక్షరవిధానేన నారాయణమజం విభుమ్ ॥ 3 ॥

ఆ పద్మం ఉన్న ప్రదేశంలో పుట్టుక లేనివాడూ, బ్రహ్మ మొదలైన అనేక రూపాలలో ఉండేవాడూ, అయిన శ్రీమన్నారాయణమూర్తిని అష్టాక్షరీమంత్రవిధానంలో స్థాపించి, పూజించాలి.

అతః పరం ప్రవక్ష్యామి కాయశోధనముత్తమమ్ ।
అకారం హృదయే చిన్త్యం చక్రరేఖాసమన్వితమ్ ॥
జ్వలన్తం త్రిశిఖం చైవ దహన్తం పాపనాశనమ్ ॥ 4 ॥

ఇక పూజచేసేవాడు (పూజచేయడానికి అర్హత పొందడానికి) తన శరీరాన్ని శుద్ధి చేసుకునే విధానాన్ని చెప్తాను. ఇది చాల శ్రేష్ఠమైనది (తప్పక ఆచరించవలసినది). 'అ'కారాన్ని మనసులో ధ్యానించాలి. అందమైన చక్రం ఆ కారంలో నడుమ ఉన్నట్లుగా భావించాలి. అక్కడ ప్రజ్వలిస్తున్న అగ్నిని కూడ ధ్యానించాలి. ఆ అగ్ని పాపాలను దహించివేస్తుంది.

చన్ద్రమణ్డలమధ్యస్థం రాకారం మూర్ధ్ని చిన్తయేత్ ।
శుక్లవర్ణం ప్రవర్షన్తమమృతం ప్లావయన్ మహీమ్ ॥ 5 ॥

చంద్రమండలం నడుమ స్వచ్ఛమైన తెలుపురంగులో ఉండి, భూమండలం అంతటా అమృతాన్ని వర్షించే 'రా' అనే అక్షరాన్ని శిరసు నడిమిభాగంలో ధ్యానించాలి. (మనసులో అగ్నిని ధ్యానించడంచేత కల్మషాలన్నీ దహించబడిపోగా, శరీరం పవిత్రమై, చంద్రకాంతితో ప్రకాశిస్తుంది.)

ఏవం నిర్ధూతపాపస్తు దివ్యదేహస్తతో భవేత్ ।
అష్టాక్షరం తతో మన్త్రం న్యసేదేవాత్మనో బుధః ॥ 6 ॥

ఈవిధంగా పాపాలన్నీ నశించిపోగా, శరీరం గొప్పకాంతితో, దేవతాసంబంధం కలిగి, తేజోమయం అవుతుంది. వివేకం కలిగిన సాధకుడు ఆ(పాపాలు పోయి, శరీరం పవిత్రమూ తేజోమయమూ అయిన) తరువాత తనలో అష్టాక్షరీమంత్రాన్ని న్యాసం చేసుకోవాలి.

వామపాదం సమారభ్య క్రమశశ్చైవ విన్యసేత్ ।
పఞ్చాఙ్గం వైష్ణవం చైవ చతుర్వ్యూహం తథైవ చ ॥ 7 ॥

మంత్రాక్షరాలను ఎడమపాదంతో ప్రారంభించి, క్రమంగా శరీరం అంతటా న్యాసం చేసుకోవాలి. విష్ణుసంబంధమైన పంచాంగాలను (శిరసు, శిఖ, కవచం, దిగ్బంధం, అస్త్రం చూ. 12 శ్లో. తరువాత) నాలుగు వ్యూహాలను న్యాసం చేసుకోవాలి.

కరశుద్ధిం ప్రకుర్వీత మూలమన్త్రేణ సాధకః ।
ఏకైకం చైవ వర్ణం తు అఙ్గులీషు పృథక్ పృథక్ ॥ 8 ॥

సాధకుడు మూలమంత్రంతో కరశుద్ధి చేసుకోవాలి. ఒక్కొక్కవర్ణంతో చేతివ్రేళ్లలో ప్రత్యేకంగా న్యాసం చేసుకోవాలి.

(ఇక్కడ ముందుగా 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరీ మంత్రాక్షర న్యాసం చెప్పబడుతున్నది.)

ఓంకారం పృథివీం శుక్లాం వామపాదే తు విన్యసేత్ ।
నకారశ్శామ్భవశ్శ్యామో దక్షిణే తు వ్యవస్థితః ॥ 9 ॥

భూమికి సంబంధించినదీ, తెలుపురంగులో ఉన్నదీ అయిన (1) **ఓం**కారాన్ని ఎడమపాదంలో న్యాసం చేసుకోవాలి. శివుడికి సంబంధించినదీ, నలుపువర్ణంలో ఉన్నదీ అయిన (2) **న**కారాన్ని కుడిపాదంలో న్యాసం చేసుకోవాలి.

మోకారం కాలమేవాహుర్వామకట్యాం నిధాపయేత్ ।
నాకారస్సర్వబీజం తు దక్షిణస్యాం వ్యవస్థితః ॥ 10 ॥

కాలస్వరూపం (యమరూపమూ, కారునలుపువర్ణమూ) అయిన (3) **మో**కారాన్ని ఎడమపిరుదులోనూ, సమస్తమైన సృష్టికీ మూలమైన (4) **నా**కారాన్ని కుడిపిరుదులోనూ న్యాసం చేసుకోవాలి.

రాకారస్తేజ ఇత్యాహు ర్నాభిదేశే వ్యవస్థితః ।
వాయవ్యోఽ యం యకారస్తు వామస్కంధే సమాశ్రితః ॥ 11 ॥

రాకారం అగ్నిబీజం. (5) **రా**కారాన్ని బొడ్డులో న్యాసం చేసుకోవాలి. (6) **య**కారం వాయురూపం. దాన్ని ఎడమ భుజంలో న్యాసం చేసుకోవాలి.

ణాకారస్సర్వగో జ్ఞేయో దక్షిణాంసే వ్యవస్థితః ।
యకారోఽయం శిరస్థశ్చ యత్ర లోకాః ప్రతిష్ఠితాః ॥ 12 ॥

ణాకారం సర్వవ్యాపకం. (7) **ణా**కారాన్ని కుడిభుజంలో న్యాసం చేసుకోవాలి. లోకా లన్నీ యకారంలో ఉంటాయి. (8) **య**కారాన్ని శిరసులో న్యాసం చేసుకోవాలి.

(అష్టాక్షరీ మంత్రాక్షర న్యాసం తరువాత పంచాంగ న్యాసం చెప్పబడుతున్నది.)

ఓం విష్ణవే నమ ఇతి శిరః.

1. 'ఓం విష్ణవే నమ శ్శిరసి' అంటూ ఆ మంత్రాన్ని శిరసులో న్యాసం చేసుకోవాలి.

ఓం జ్వలనాయ నమ ఇతి శిఖా.

2. 'ఓం జ్వలనాయ నమ శ్శిఖాయామ్' అంటూ ఆ మంత్రాన్ని శిఖ(పిలక)లో న్యాసం చేసుకోవాలి.

ఓం విష్ణవే నమ ఇతి కవచమ్.

3. 'ఓం విష్ణవే నమః కవచే' అంటూ ఆ మంత్రాన్ని శరీరం అంతటా కవచంలాగా న్యాసం చేసుకోవాలి.

ఓం విష్ణవే నమ ఇతి స్ఫురణం దిశో బన్ధాయ.

4. 'ఓం విష్ణవే నమః ఇతి దిగ్బంధః' అంటూ ఆ మంత్రంతో దిగ్బంధం చేసుకోవాలి.

ఓం హుం ఫడిత్యస్త్రమ్.

5. 'ఓం హుం ఫట్ ఇత్యస్త్రే' అంటూ ఆ మంత్రాన్ని అస్త్రంగా న్యాసం చేసుకోవాలి. (ఇక్కడ శిరసే స్వాహా, శిఖాయై వషట్, కవచాయ హుం, అస్త్రాయ ఫట్, ఇత్యాదిగా న్యాసం చేస్తుంటారు.)

(అష్టాక్షరీ మంత్రాక్షర న్యాసం, పంచాంగ న్యాసం తరువాత చతుర్వ్యూహ న్యాసం చెప్పబడుతున్నది.)

ఓం శిరసి శుక్లో వాసుదేవ ఇతి.

1. 'ఓం శిరసి శుక్లో వాసుదేవః' అనే మంత్రంతో శిరసునందు తెల్లని వాసుదేవ వ్యూహాన్ని న్యాసం చేసుకోవాలి.

ఓం ఆం లలాటే రక్తస్సఙ్కర్షణో గరుత్మాన్ వహ్నిస్తేజ ఆదిత్య ఇతి.

2. 'ఓం ఆం లలాటే రక్తస్సఙ్కర్షణో గరుత్మాన్ వహ్నిస్తేజ ఆదిత్యః' అనే మంత్రంతో నుదుటి ప్రదేశంలో ఎఱ్ఱనివాడు, గరుత్మంతుడు, అగ్ని, తేజస్సు, ఆదిత్యుడు అయిన సంకర్షణుడిని న్యాసం చేసుకోవాలి.

ఓం ఆం గ్రీవాయాం పీతః ప్రద్యుమ్నో వాయుమేఘ ఇతి.

3. 'ఓం గ్రీవాయాం పీతః ప్రద్యుమ్నో వాయుమేఘః' అనే మంత్రంతో కంఠంలో పసుపుపచ్చనివాడు, వాయుమేఘుడు అయిన ప్రద్యుమ్నుడిని న్యాసం చేసుకోవాలి.

ఓం అం హృదయే కృష్ణోఽ నిరుద్ధస్సర్వశక్తిసమన్విత ఇతి.

4. 'ఓం అం హృదయే కృష్ణోఽ నిరుద్ధస్సర్వశక్తిసమన్వితః' అనే మంత్రంతో హృదయంలో వాయుమేఘుడూ, నల్లనివాడూ, సమస్తశక్తులతో కూడిన వాడూ అయిన అనిరుద్ధుడిని న్యాసం చేసుకోవాలి.

ఏవం చతుర్వ్యూహ మాత్మానం కృత్వా తతః కవచమారభేత్ ॥ 13 ॥

ఈవిధంగా, (అష్టాక్షర, పంచాంగ న్యాసాలు అయిన తరువాత) తాను శ్రీమన్నారాయణుని చతుర్వ్యూహాలుగా (న్యాసం) చేసుకుని, ఆ పిదప కవచాన్ని ప్రారంభించాలి.

మామగ్రేఽ వస్థితో విష్ణుః పృష్ఠతశ్చాపి కేశవః ।
గోవిన్దో దక్షిణే పార్శ్వే వామే తు మధుసూదనః ॥ 14 ॥

ముందువైపు విష్ణువు, వెనుకవైపు కేశవుడు, కుడిప్రక్క గోవిందుడు, ఎడమప్రక్క మధుసూదనుడు, ఉందురు గాక. (ఉండి, నన్ను రక్షింతురు గాక).

ఉపరిష్టాత్తు వైకుణ్ఠో వారాహః పృథివీతలే ।
అవాన్తరదిశో యాస్తు తాసు సర్వాసు మాధవః ॥ 15 ॥

ఆకాశంలో వైకుంఠుడు, నేలమీద వరాహస్వామి, నడుమ అన్ని దిక్కులలోనూ (ఆగ్నేయ, నైరృతి, వాయవ్య, ఐశాన్యాలు) మాధవుడు ఉండును గాక.

గచ్ఛతస్తిష్ఠతో వాపి జాగ్రతస్స్వపతోఽ పి వా ।
నరసింహకృతా గుప్తిర్వాసుదేవమయో హ్యహమ్ ॥ 16 ॥

నడుస్తూ ఉన్నపుడూ, కూర్చున్నపుడూ, మెలకువగా ఉన్నపుడూ, నిద్ర పోయేటపుడూ, నరసింహస్వామి రక్షించును గాక. ఈ రక్షణతో నేను వాసుదేవమయుడిని అవుతాను.

ఏవం విష్ణుమయో భూత్వా తతః కర్మ సమారభేత్ ।
యథా దేహే తథా దేవే సర్వతత్త్వాని యోజయేత్ ॥ 17 ॥

ఈ కవచంతో సాధకుడు తాను స్వయంగా విష్ణుస్వరూపుడై, తరువాత అర్చనం ప్రారంభించాలి. దేహంలో వివిధతత్త్వాలను నిలుపుకున్న విధంగానే అర్చించబోయే దైవప్రతిమలోనూ, సమస్తమైన తత్త్వాలనూ నిలపాలి.

తతశ్చైవ ప్రకుర్వీత ప్రోక్షణం ప్రణవేన తు ।
ఫట్కారాన్తం సముద్దిష్టం సర్వారిష్టహరం శుభమ్ ॥ 18 ॥

తరువాత అర్చన చేయవలసిన ప్రదేశంలో 'ఓం' కారంతో 'ఫట్' అనే అక్షరాన్ని కూర్చి (ఓం ఫట్ అనే మంత్రంతో) ప్రోక్షణం చేయాలి. దీనివల్ల సమస్తమైన విఘ్నాలు (అర్చనకు అవరోధాలు) నశిస్తాయి.

తత్రార్కచన్ద్రవహ్నీనాం మణ్డలాని విచిన్తయేత్ ।
పద్మమధ్యే న్యసేద్ విష్ణుం పవనస్యామ్బరస్య చ ॥ 19 ॥

ఆ ప్రదేశంలో సూర్యుడు, చంద్రుడు, అగ్ని, వాయువు, ఆకాశం అనే మండలాలను ఏర్పరచాలి. వాటి మధ్యలో పద్మాన్నీ, ఆ పద్మం నడుమ శ్రీమహావిష్ణువును ఉంచాలి.

తతో విచిన్త్య హృదయ ఓంకారం జ్యోతీరూపిణమ్ ।
కర్ణికాయాం సమాసీనం జ్యోతీరూపం సనాతనమ్ ॥ 20 ॥

ఆ పిదప పద్మం నడుమ కర్ణికలో జ్యోతిస్వరూపంలో కూర్చున్న పరమాత్మను హృదయంలో జ్యోతి స్స్వరూపంలో ఓంకారంగా ధ్యానించాలి.

అష్టాక్షరం తతో మన్త్రం విన్యసేచ్చ యథాక్రమమ్ ।
తేన వ్యస్తసమస్తేన పూజనం పరమం స్మృతమ్ ॥ 21 ॥

ఆ తరువాత (విష్ణువులో) అష్టాక్షరమంత్రాన్ని యథాక్రమంగా న్యాసం చేయాలి. తరువాత ఓం అనే ప్రణవాక్షరం ఒక్కదానితో గానీ (ఓం నమః), లేదా మూలమంత్రం మొత్తంతో గానీ (ఓం నమో నారాయణాయ) పూజించడం శ్రేష్ఠం. (శ్లో 35. ఆ శ్లోకం ఇక్కడ ఉంటే ఈ అంశం ఇంకా సులువుగా తెలుసుకోవచ్చు.)

ద్వాదశాక్షరమన్త్రేణ యజేద్ దేవం సనాతనమ్ ।
తతోఽవధార్య హృదయే కర్ణికాయాం బహిర్న్యసేత్ ॥ 22 ॥

ద్వాదశాక్షరమంత్రం(ఓం నమో భగవతే వాసుదేవాయ)తో సనాతనుడైన పరమాత్మను అర్చించాలి. పరమాత్మను మనసులో నిలుపుకుని, బాహ్యంగా ఎదురుగా పద్మంలోని పుప్పొడికాడలో నిలపాలి. (ఎదురుగా వెలుపల పద్మంలోను, లోపలివైపున మనసులోనూ నిలుపుకోవాలి.)

చతుర్భుజం మహాసత్త్వం సూర్యకోటిసమప్రభమ్ ।
చిన్తయిత్వా మహాయోగం జ్యోతీరూపం సనాతనమ్ ॥
తతశ్చావాహయేన్మన్త్రం క్రమేణాచిన్త్య మానసే ॥ 23 ॥

నాలుగు చేతులు గలిగినవాడు, మిక్కిలి శక్తిసంపద గలవాడు, కోటిమంది సూర్యులతో సమానమైన కాంతి కలిగినవాడు, గొప్ప యోగస్వరూపుడూ, జ్యోతి రూపంలో ఉండేవాడు, సృష్టికి పూర్వంనుండి ఉన్నవాడు, అయిన దేవుడిని మనసులో ధ్యానించాలి. మంత్రపూర్వకంగా స్వామిని ఆవాహనం చేయాలి.

మీనరూపో వరాహశ్చ నరసింహోఽథ వామనః ।
ఆయాతు దేవో వరదో మమ నారాయణోఽగ్రతః ॥

మత్స్యం, వరాహం, నరసింహుడు, వామనుడు, అయిన (లోపల అంతర్యామిగా ఉన్న) శ్రీమన్నారాయణ మహాదేవుడు నా యెదురుగా ఇక్కడకు వచ్చు గాక.

ఓం నమో నారాయణాయేత్యావాహనమ్ ॥ 24 ॥

ఓం నమో నారాయణాయ అనే మంత్రంతో స్వామిని (1) ఆహ్వానించాలి. (పైశ్లోకంతో ఈ మంత్రం కలిపి చెప్పి, స్వామిని అర్చాస్థానంలోకి ఆహ్వానించాలి.)

సుమేరుపాదపీఠాన్తే పద్మకల్పిత మాసనమ్ ।
సర్వసత్త్వహితార్థాయ తిష్ఠ త్వం మధుసూదన ॥

మధువనే రాక్షసుడిని కూల్చినవాడా! స్వామీ ఇదిగో సుమేరుపర్వతం. నీవు పాదాలు ఉంచడానికి పీట. ఈపద్మం నీకు కూర్చోవడానికి ఆసనంగా ఏర్పాటు చేయబడింది. సమస్త ప్రాణులకు మేలు గలుగజేయడంకోసం నీవు వచ్చి ఈ ఆసనంలో కూర్చోవలసింది.

ఓం నమో నారాయణాయేత్యాసనస్థాపనమ్ ॥ 25 ॥

ఓం నమో నారాయణాయ అనే మంత్రంతో (పై శ్లోకంతో ఈ మంత్రం కలిపి చెప్పి) స్వామికి (2) ఆసనం ఇవ్వాలి.

ఓం త్రైలోక్యపతీనాం పతయే దేవదేవాయ హృషీకేశాయ విష్ణవే నమః ।

ఓం. మూడులోకాలకు అధిపతులైన వారికి ప్రభువు, దేవతలకే దేవుడు, ఇంద్రియాలకు అధిపతీ అయిన శ్రీమహావిష్ణుమూర్తికి నమస్కారం.

ఓం నమో నారాయణాయేత్యర్ఘ్యః ॥ 26 ॥

ఓం నమో నారాయణాయ అనే మంత్రంతో (పై శ్లోకంతో ఈ మంత్రం కలిపి చెప్పి)స్వామికి చేతులు కడుగుకునేందుకు పవిత్రమైన జలాన్ని (3) అర్ఘ్యంగా ఇవ్వాలి.

ఓం పాద్యం పాదయోర్దేవ పద్మనాభ సనాతన ।
విష్ణో కమలపత్రాక్ష గృహాణ మధుసూదన ॥

ఓం. మధుసూదనా! తామరరేకుల వంటి కన్నులు గలవాడా! బొడ్డులో తామరపూవు కలిగినవాడా! సృష్టికి పూర్వం నుండి ఉన్నవాడా! దేవా! శ్రీవిష్ణూ! నీ పాదాలకు నీళ్లు ఇవిగో. స్వీకరించు.

ఓం నమో నారాయణాయేతి పాద్యమ్ ॥ 27 ॥

ఓం నమో నారాయణాయ అనే మంత్రంతో (పై శ్లోకంతో ఈ మంత్రం కలిపి చెప్పి) (4) స్వామిపాదాలకు నీళ్లు సమర్పించాలి.

మధుపర్కం మహాదేవ బ్రహ్మాద్యైః కల్పితం తవ ।
మయా నివేదితం భక్త్యా గృహాణ పురుషోత్తమ ॥

దేవా! పురుషోత్తమా! బ్రహ్మ మొదలైన దేవతలు నీ కోసం మధుపర్కం అనే ఉపచారాన్ని ఏర్పరచారు. భక్తితో నేను నీకు సమర్పిస్తున్నాను. స్వీకరించు.

ఓం నమో నారాయణాయేతి మధుపర్కమ్ ॥ 28 ॥

ఓం నమో నారాయణాయ అనే మంత్రంతో (పై శ్లోకంతో ఈ మంత్రం కలిపి చెప్పి) స్వామికి (5) మధుపర్కం సమర్పించాలి.

మన్దాకిన్యా శ్చైవ సితం వారి సర్వపాపహరం శివమ్ ।
గృహాణాచమనీయం త్వం మయా భక్త్యా నివేదితమ్ ॥

స్వామీ! మందాకినీ నదీజలం చాల స్వచ్ఛమైనది. సమస్త పాపాలను హరిస్తుంది. శుభాలను కలిగిస్తుంది. అటువంటి గంగాజలాన్ని నీకు ఆచమించడానికి భక్తితో సమర్పిస్తున్నాను. స్వీకరించు.

ఓం నమో నారాయణాయేత్యాచమనీయమ్ ॥ 29 ॥

ఓం నమో నారాయణాయ అనే మంత్రంతో (పై శ్లోకంతో ఈ మంత్రం కలిపి చెప్పి) స్వామికి (6) ఆచమనీయజలం ఇవ్వాలి.

త్వమాపః పృథివీచైవ జ్యోతిస్త్వం వాయురేవ చ ।
లోకేశ వృత్తిమాత్రేణ వారిణా స్నాపయామ్యహమ్ ॥

జగన్నాథా! నీరు, నేల, నిప్పు, (నింగి) గాలి అన్నీ నీవే. ఏదో చేయాలి కాబట్టి, ఉపచారంగా నీకు ఈ నీటితో స్నానం సమర్పిస్తున్నాను.

ఓం నమో నారాయణాయేతి స్నానమ్ ॥ 30 ॥

ఓం నమో నారాయణాయ అనే మంత్రంతో (పై శ్లోకంతో ఈమంత్రం కలిపి చెప్పి) స్వామికి (7) స్నానం చేయించాలి.

దేవతత్త్వసమాయుక్త యజ్ఞవర్ణసమన్విత ।
స్వర్ణవర్ణప్రభే దేవ వాససీ తవ కేశవ ॥

దేవా! కేశవా! దైవతత్త్వంతో కూడినవాడా! యజ్ఞతేజస్సుతో కూడినవాడా! (యజ్ఞస్వరూపా!), బంగారురంగులో విరాజిల్లుతున్న ఈ జంటవస్త్రాలను నీకు సమర్పిస్తున్నాను.

ఓం నమో నారాయణాయేతి వస్త్రే ॥ 31 ॥

ఓం నమో నారాయణాయ అనే మంత్రంతో (పై శ్లోకంతో ఈ మంత్రం కలిపి చెప్పి) స్వామికి (8) వస్త్రద్వయం సమర్పించాలి.

శరీరం తే న జానామి చేష్టాం చైవ చ కేశవ ।
మయా నివేదితో గన్ధః ప్రతిగృహ్య విలిప్యతామ్ ॥

కేశవా! నీ మేని సంగతి తెలియదు. నీ చేతలు ఎరుగను. నీకు మంచిగంధం సమర్పిస్తున్నాను. స్వీకరించి ఒంటికి పూసుకో.

ఓం నమో నారాయణాయేతి విలేపనమ్ ॥ 32 ॥

ఓం నమో నారాయణాయ అనే మంత్రంతో (పై శ్లోకంతో ఈ మంత్రం కలిపి చెప్పి) స్వామికి (9) సుగంధ ద్రవ్యం ఇవ్వాలి.

ఋగ్యజుస్సామమన్త్రేణ త్రివృతం పద్మయోనినా ।
సావిత్రీగ్రన్థిసంయుక్తముపవీతం తవార్పయే ॥

బ్రహ్మదేవుడు ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం మంత్రాలతో మూడు పోగులుగా కూర్చినదీ, సవితృదేవతకు సంబంధించిన ముడితో కూడినదీ అయిన యజ్ఞోపవీతాన్ని నీకు సమర్పిస్తున్నాను.

ఓం నమో నారాయణాయేతి యజ్ఞోపవీతమ్ ॥ 33 ॥

ఓం నమో నారాయణాయ అనే మంత్రంతో (పై శ్లోకంతో ఈ మంత్రం కలిపి చెప్పి) స్వామికి (10) యజ్ఞోపవీతం ఇవ్వాలి.

దివ్యరత్నసమాయుక్త వహ్నిభానుసమప్రభ ।
గాత్రాణి తవ శోభన్తు సాలఙ్కారాణి మాధవ ॥

దేవలోకసంభూతమైన రత్నాలతో కూడినవాడా! లక్ష్మీపతీ, అగ్నితోనూ, సూర్యుడితోనూ సమానమైన కాంతి కలిగినవాడా! ఈ అలంకారాలతో నీ శరీరావయవాలు ఇంకా శోభించును గాక.

ఓం నమో నారాయణాయేత్యలఙ్కారాః ॥ 34 ॥

ఓం నమో నారాయణాయ అనే మంత్రంతో (పై శ్లోకంతో ఈ మంత్రం కలిపి చెప్పి) స్వామికి (11) ఆభరణాలు సమర్పించాలి.

ఓం నమ ఇతి ప్రత్యక్షరమ్ సమస్తేన మూలమన్త్రేణ వా పూజయేత్ ॥ 35 ॥

ఓం (నమః) అనే ప్రణవాక్షరం ఒక్కదానితో గానీ, ఓం నమో నారాయణాయ అనే మూలమంత్రం మొత్తంతో గాని, స్వామిని పూజించాలి. (ఈ శ్లోకం 21 శ్లోకం తరువాత అన్వయించదగి ఉంది.)

వనస్పతిరసో దివ్యో గన్ధాఢ్య స్సురభిశ్చ తే ।
మయా నివేదితో భక్త్యా ధూపోఽయం ప్రతిగృహ్యతామ్ ॥

స్వామీ! వనస్పతుల రసంతో మనోహరమైన గొప్ప సువాసనలతో కూడిన ధూపాన్ని భక్తితో సమర్పిస్తున్నాను. స్వీకరించు.

ఓం నమో నారాయణాయేతి ధూపః ॥ 36 ॥

ఓం నమో నారాయణాయ అనే మంత్రంతో (పై శ్లోకంతో ఈ మంత్రం కలిపి చెప్పి) స్వామికి (12) ధూపం సమర్పించాలి.

సూర్యచన్ద్రసమో జ్యోతిర్విద్యుదగ్న్యోస్తథైవ చ ।
త్వమేవ జ్యోతిషాం దేవ దీపోఽయం ప్రతిగృహ్యతామ్ ॥

దేవా! తేజస్వంతమైన పదార్థాలలో సూర్యుడితోనూ, చంద్రుడితోనూ సమానమైన వాడివి (సూర్యచంద్రులతో సమానమైన కాంతి కలవాడు). అదే విధంగా మెరపులోనూ, అగ్నిలోనూ ఉన్న కాంతి నీవే. అధిక దీపుడివైన నీవు దీపాన్ని స్వీకరించు. (సమర్పిస్తున్నాను).

ఓం నమో నారాయణాయేతి దీపః ॥ 37 ॥

ఓం నమో నారాయణాయ అనే మంత్రంతో (పై శ్లోకంతో ఈ మంత్రం కలిపి చెప్పి) స్వామికి (13) దీపం సమర్పించాలి.

అన్నం చతుర్విధం చైవ రసైష్షడ్భిస్సమన్వితమ్ ।
మయా నివేదితం భక్త్యా నైవేద్యం తవ కేశవ ॥

కేశవా! ఆరు(తీపి, చేదు, ఉప్పు, కారం, పులుపు, వగరు) రుచులతో కూడినదీ, భక్ష్యమూ, భోజ్యమూ, లేహ్యమూ, చోష్యమూ అనే నాలుగు విధాలుగా ఉన్నదీ అయిన అన్నాన్ని, భక్తితో నీకు నైవేద్యంగా సమర్పిస్తున్నాను.

ఓం నమో నారాయణాయేతి నైవేద్యమ్ ॥ 38 ॥

ఓం నమో నారాయణాయ అనే మంత్రంతో (పై శ్లోకంతో ఈ మంత్రం కలిపి చెప్పి) స్వామికి (14) నైవేద్యం సమర్పించాలి. (దీనితో అర్చన అయిపోతున్నది. అర్చనానంతరం మళ్లీ న్యాసం చెప్పబడుతున్నది.)

పూర్వే దలే వాసుదేవం యామ్యే సఙ్కర్షణం న్యసేత్ ।
ప్రద్యుమ్నం పశ్చిమే కుర్యాదనిరుద్ధం తథోత్తరే ॥ 39 ॥

పద్మంలో నడుమ ఉన్న స్వామికి తూర్పుగా ఉన్న రేకులో వాసుదేవుడినీ, దక్షిణంగా ఉన్న రేకులో సంకర్షణుడినీ, పడమటి వైపు రేకులో ప్రద్యుమ్నుడినీ, ఉత్తరం వైపు ఉన్న రేకులో అనిరుద్ధుడినీ న్యాసం చేయాలి.

వారాహం చ తథాగ్నేయే నరసింహం చ నైరృతే ।
వాయవ్యే మాధవం చైవ తథైశానే త్రివిక్రమమ్ ॥ 40 ॥

అలాగే స్వామికి ఆగ్నేయమూలలో వరాహస్వామినీ, నైరృతిమూలలో నరసింహస్వామినీ, వాయవ్యమూలలో మాధవుడినీ, ఐశాన్యమూలలో త్రివిక్రముడినీ నిలపాలి.

తథాఽష్టాక్షరదేవస్య గరుడం పురతో న్యసేత్ ।
వామపార్శ్వే తథా చక్రం శఙ్ఖం దక్షిణతో న్యసేత్ ॥ 41 ॥

అష్టాక్షరీ మంత్రదేవత అయిన శ్రీమన్నారాయణుడికి ఎదురుగా గరుడుడినీ, ఎడమప్రక్క సుదర్శనచక్రాన్నీ, కుడిప్రక్క పాంచజన్యశంఖాన్నీ ఉంచాలి (న్యాసం చేయాలి).

తథా మహాగదాం చైవ న్యసేద్దేవస్య దక్షిణే ।
తతశ్శార్ఙ్గం ధనుర్విద్వాన్న్యసేద్ దేవస్య వామతః ॥ 42 ॥

విద్వాంసుడైన సాధకుడు స్వామికి కుడివైపున కౌమోదకి అనే గదనూ, ఎడమవైపున శార్ఙ్గం అనే విల్లునూ నిలపాలి.

దక్షిణే నేషుధీ దివ్యే ఖడ్గం వామే చ విన్యసేత్ ।
శ్రియం దక్షిణతః స్థాప్య పుష్టిముత్తరతో న్యసేత్ ॥ 43 ॥

స్వామికి కుడివైపున దివ్యమైన రెండు అమ్ములపొదులు, ఎడమవైపున నందకం అనే కత్తిని నిలపాలి. స్వామికి దక్షిణదిక్కున లక్ష్మీదేవినీ, ఉత్తరదిక్కున పుష్టిని నిలపాలి.

వనమాలాం చ పురతస్తత్శ్రీవత్సకౌస్తుభౌ ।
విన్యసేద్ధృదయాదీని పూర్వాదిషు చతుర్దిశమ్ ॥ 44 ॥

తతోఽస్త్రం దేవదేవస్య కోణే చైవ తు విన్యసేత్ ॥ 45 ॥

స్వామికి ఎదురుగా వనమాలనూ, తరువాత శ్రీవత్సాన్నీ, కౌస్తుభమణినీ ఉంచాలి. తూర్పున హృదయాన్ని, దక్షిణాన శిరస్సునూ, పడమర శిఖనూ, ఉత్తరాన కవచాన్ని నిలపాలి. స్వామికి దేవదేవుడికి సంబంధించిన కోణంలో, ఐశాన్యంలో అస్త్రాన్ని నిలపాలి.

ఇన్ద్రమగ్నిం యమం చైవ నైరృతం వరుణం తథా ।
వాయుం ధనదమీశానమనన్తం బ్రహ్మణా సహ ।
పూజయేత్ తాన్త్రికైర్మన్త్రైరధశ్చోర్ధ్వం తథైవ చ ॥ 46 ॥

ఇంద్రుడిని తూర్పు దిక్కులోనూ, అగ్నిని ఆగ్నేయ దిక్కులోనూ, యముడిని దక్షిణంలోనూ, నిరృతిని నైరుతి దిక్కు లోనూ, వరుణుడిని పడమటి దిక్కులోనూ, వాయువును వాయవ్య దిక్కులోనూ, కుబేరుడిని ఉత్తర దిక్కులోనూ, ఈశానుడిని ఐశాన్య దిక్కులోనూ, క్రింద ఆదిశేషుడినీ, పైన బ్రహ్మదేవుడినీ ఈవిధంగా పది దిక్కులలోనూ ఆయా దేవతలను తాంత్రికములైన మంత్రాలతో పూజించాలి.

ఏవం సమ్పూజ్య దేవేశం మణ్డలస్థం జనార్దనమ్ ।
లభేదభిమతాన్ కామాన్ నరో నాస్త్యత్ర సంశయః ॥ 47 ॥

పూజామండలంలో ఆవాహనం చేసిన దేవదేవుడైన జనార్దనుడిని ఈవిధంగా పూజించిన మానవుడు తనకు కావలసిన కోరికల నన్నింటినీ పొందుతాడు. ఇందులో సందేహం లేదు.

అనేనైవ విధానేన మణ్డలస్థం జనార్దనమ్ ।
పూజితం యః ప్రపశ్యేద్వై స విశేద్విష్ణుమవ్యయమ్ ॥ 48 ॥

పూజామండలంలో ఈవిధంగా పూజింపబడిన జనార్దనుడిని భక్తితో శ్రద్ధగా దర్శించుకున్న మానవుడు కూడ శాశ్వతుడైన ఆ విష్ణువును చేరుకుంటాడు. (సాయుజ్యముక్తిని పొందుతాడు.)

సకృ ద ప్యర్చితో యేన విధినానేన కేశవః ।
జన్మమృత్యుజరాం తీర్త్వా స విష్ణోః పదమాప్నుయాత్ ॥ 49 ॥

జీవితంలో ఒక్కసారైనా ఈ పద్ధతిలో కేశవుడిని పూజించినవాడు పుట్టడం, చావడం, ముసలితనం రావడం, వంటి అన్ని బాధలనుండి విముక్తుడై, వైకుంఠలోకానికి చేరుకుంటాడు.

య స్స్మరేత్ సతతం భక్త్యా నారాయణమతన్ద్రితః ।
అన్వహం తస్య వాసాయ శ్వేతద్వీపః ప్రకల్పితః ॥ 50 ॥

నిరంతరమూ, బద్ధకించకుండా, భక్తితో శ్రీమన్నారాయణుడిని స్మరించేవాడు నిత్యమూ నివసించడానికే శ్వేతద్వీపం ఏర్పాటు చేయబడింది. (నారాయణుడిని తలచుకునేవాడు విష్ణులోకానికి వెళ్తాడు.)

ఓంకారాదిసమాయుక్తం నమఃకారాన్తదీపితమ్ ।
త న్నామ సర్వతత్త్వానాం మన్త్ర ఇత్యభిధీయతే ॥ 51 ॥

ఓం కారంతో ప్రారంభమై, నమః అనే శబ్దంతో ముగుస్తూ (ఓం నమః), నడుమ నారాయణనామం కలిగిన ఆ శబ్దం (ఓం నమో నారాయణాయ) అనేది సమస్తమైన దేవతాతత్త్వాలకు మహామంత్రమని చెప్ప బడుతుంది. (నారాయణమంత్రం సర్వదేవతామంత్రాలకు సారం. ఏ దేవతను ఉపాసించాలన్నా నారాయణమంత్రం సాధక మవుతుంది.)

అనేనైవ విధానేన గన్ధపుష్పం నివేదయేత్ ।
ఏకైకస్య ప్రకుర్వీత యథోద్దిష్టం క్రమేణ తు ॥ 52 ॥

ఈవిధంగా గంధమూ, పుష్పమూ స్వామికి సమర్పించుకోవాలి. తమ అభీష్టానికి అనుగుణంగా ఆయా ఉపచారాలు అన్నీ ఈప్రకారంగానే చేయాలి.

ముద్రాస్తతో నిబధ్నీయాద్ యథోక్తక్రమచోదితాః ।
జపం చైవ ప్రకుర్వీత మూలమన్త్రేణ మన్త్రవిత్ ॥ 53 ॥

పూజానంతరం విధ్యుక్తమైన క్రమంలో ముద్రలను ప్రదర్శించాలి. మంత్రం తెలిసినవాడు (ముద్రలను చూపి) మూలమంత్రాన్ని జపించాలి.

అష్టావింశతిమష్టౌ వా శతమష్టోత్తరం తథా ।
కామేషు చ యథాప్రోక్తం యథాశక్తి సమాహితః ॥ 54 ॥

ఏ కోరికకు ఎంత సంఖ్యలో మంత్రం జపించవలసి ఉంటుందో, ఆ సంఖ్యలో తనకు చేతనైనట్లుగా, మూలమంత్రాన్ని 28, లేదా 8, లేదా 108 (మొదలుగా) స్వామిపై మనసు నిలిపి, జపం చేయాలి.

పద్మం శఙ్ఖశ్చ శ్రీవత్సో గదా గరుడ ఏవ చ ।
చక్రం ఖడ్గశ్చ శార్ఙ్గం చ అష్టౌ ముద్రాః ప్రకీర్తితాః ॥ 55 ॥

1. పద్మం, 2. శంఖం, 3. శ్రీవత్సం, 4. గద, 5. గరుడం, 6. చక్రం, 7. ఖడ్గం, 8. శార్ఙ్గం అనేవి అష్ట ముద్రలుగా ప్రసిద్ధిని పొందాయి.

గచ్ఛ గచ్ఛ పరం స్థానం పురాణపురుషోత్తమ ।
యత్ర బ్రహ్మాదయో దేవా విన్దన్తి పరమం పదమ్ ॥

పురాణపురుషా! పురుషోత్తమా! బ్రహ్మ మొదలైన దేవతలు ఉత్తమోత్తమమైన స్థానంగా తెలుసుకున్న ఆ పరమపదానికి వెళ్లు.

ఓం నమో నారాయణాయేతి విసర్జనమ్ ॥ 56 ॥

ఓం నమో నారాయణాయ అనే మంత్రంతో (పై శ్లోకంతో ఈ మంత్రం కలిపి చెప్పి) స్వామికి (15) ఉద్వాసనం చెప్పాలి.

అర్చనం యే న జానన్తి హరేర్మన్త్రైర్యథోదితమ్ ।
తే తత్ర మూలమన్త్రేణ పూజయన్త్వచ్యుతం సదా ॥ 57 ॥

ఆయా మంత్రాలతో కూర్చిన శ్రీహరి పూజనవిధానం తెలియనివారు ఓం నమో నారాయణాయ అనే మూలమంత్రం ఒక్కదానితోనైనా, శ్రీమన్నారాయణుడిని నిత్యమూ పూజించాలి.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే పూజావిధిమంత్రకథనం నామ అష్టపఞ్చాశత్తమోఽధ్యాయః ॥ 58 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో పూజావిధిమంత్రకథనం అనే యాభైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.



ఏకోనషష్టితమోఽధ్యాయః - యాభైతొమ్మిదవ అధ్యాయం
సముద్రస్నానమాహాత్మ్యవర్ణనమ్ - సముద్రస్నానమాహాత్మ్యవర్ణనం

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవం సమ్పూజ్య విధివద్ భక్త్యా తం పురుషోత్తమమ్ ।
ప్రణమ్య శిరసా పశ్చాత్ సాగరం చ ప్రసాదయేత్ ॥ 1 ॥

ఆ క్షేత్రంలోని పురుషోత్తమస్వామిని ఈవిధంగా శాస్త్రోక్తమైన పద్ధతిలో భక్తితో పూజించిన తరువాత సముద్రానికి కూడ తలవంచి నమస్కరించి, తనను అనుగ్రహించేటట్లు చేసుకోవాలి. (సముద్రానికి నమస్కరించే సమయంలో క్రింది శ్లోకాన్ని పఠించాలి.)

ప్రాణస్త్వం సర్వభూతానాం యోనిశ్చ సరితాం పతే ।
తీర్థరాజ నమస్తేఽస్తు త్రాహి మామచ్యుతప్రియ ॥ 2 ॥

నదీనాథా! చరాచరమైనసృష్టి మొత్తానికీ నీవు జీవనాధారానివి. ప్రాణులన్నీ నీ నుండే ఏర్పడ్డాయి. ఉత్తమతీర్థమా! నీకు నమస్కారం. శ్రీమహావిష్ణువుకు ఇష్టమైన వాడా! నన్ను కాపాడు.

స్నాత్వైవం సాగరే సమ్యక్ తస్మిన్ క్షేత్రవరే ద్విజాః ।
తీరే చాభ్యర్చ్య విధివన్నారాయణమనామయమ్ ॥ 3 ॥

విప్రులారా! ఆ మహాపుణ్యక్షేత్రంలో సముద్రాన్ని స్తుతిస్తూ చక్కగా స్నానం చేయాలి. ఆ తరువాత సముద్రం ఒడ్డున శ్రీమన్నారాయణుడిని యథావిధిగా పూజించాలి. ఆ నారాయణుడు కర్మలవలన కలిగే ఆధివ్యాధులు లేనివాడు (కర్మ లేనివాడు).

రామం కృష్ణం సుభద్రాం చ ప్రణిపత్య చ సాగరమ్ ।
శతానామశ్వమేధానాం ఫలం ప్రాప్నోతి మానవః ॥ 4 ॥

ఆ దివ్యక్షేత్రంలో బలరాముడికీ, కృష్ణస్వామికీ, సుభద్రాదేవికీ, సముద్రానికీ నమస్కారం చేసిన మానవుడు నూరు అశ్వమేధ యాగాలు చేసినంతటి ఫలితాన్ని పొందుతాడు.

సర్వపాపవినిర్ముక్తస్సర్వదుఃఖవివర్జితః ।
బృన్దారక ఇవ శ్రీమాన్ రూపయౌవనగర్వితః ॥ 5 ॥

అతడి పాపాలు అన్నీ నశించిపోతాయి. బాధలు మొత్తం వదిలిపోతాయి. దేవతలలాగా శ్రీమంతు డవుతాడు. అందమైన రూపం వస్తుంది. యౌవనం కలుగుతుంది.

విమానేనార్కవర్ణేన దివ్యగన్ధర్వనాదినా ।
కులైకవింశముద్ధృత్య విష్ణులోకం స గచ్ఛతి ॥ 6 ॥

సూర్యుడివంటి కాంతి గలిగిన విమానంలో, గంధర్వులు స్తోత్రగానం చేస్తుండగా విష్ణులోకానికి వెళ్తాడు. తన వంశంలోని ఇరవైఒక్క తరాలవారిని నరకలోకాల నుండి ఉద్ధరిస్తాడు. (తనతో విష్ణులోకానికి తీసుకువెళ్తాడు.)

భుక్త్వా తత్ర వరాన్ భోగాన్ క్రీడిత్వా చాప్సరైస్సహ ।
మన్వన్తరశతం సాగ్రం జరామృత్యువివర్జితః ॥ 7 ॥

పూర్తిగా నూరు మన్వంతరాల కాలం వైకుంఠంలో నివసిస్తాడు. అప్పుడు ఉత్తమమైన రకరకాల భోగాలను అనుభవిస్తాడు. అప్సరసలతో క్రీడిస్తాడు. అతడికి ముసలితనం రాదు. మరణం లేదు.

పుణ్యక్షయాదిహాయాతః కులే సర్వగుణాన్వితే ।
రూపవాన్ సుభగశ్శ్రీమాన్ సత్యవాదీ జితేన్ద్రియః ॥ 8 ॥

తాను చేసిన పుణ్యఫలం పూర్తిగా అనుభవించిన తర్వాత భూలోకానికి తిరిగివస్తాడు. ఇక్కడ సమస్తమైన సద్గుణాలు కలిగిన వంశంలో జన్మిస్తాడు. అందమైన రూపం కలుగుతుంది. అదృష్టవంతు డవుతాడు. సంపన్ను డవుతాడు. నిత్యమూ సత్యమే మాట్లాడుతాడు. ఇంద్రియాలను అదుపులో పెట్టుకుంటాడు.

వేదశాస్త్రార్థవిద్ విప్రో భవేద్ యజ్వా తు వైష్ణవః ।
యోగం చ వైష్ణవం ప్రాప్య తతో మోక్షమవాప్నుయాత్ ॥ 9 ॥

వేదాలనూ, ఇతర శాస్త్రాలనూ చక్కగా తెలుసుకుంటాడు. యాగాలు చేస్తాడు. విష్ణుభక్తు డవుతాడు. వైష్ణవ యోగాన్ని పొంది (విష్ణుఉపాసనతో తాను విష్ణువుగా అయిపోతాడు), చివరకు మోక్షాన్ని పొందుతాడు.

గ్రహోపరాగే సఙ్క్రాన్త్యామయనే విషువే తథా ।
యుగాదిషు షడశీత్యాం వ్యతీపాతే దినక్షయే ॥ 10 ॥

ఆషాఢ్యాం చైవ కార్తిక్యాం మాఘ్యాం వాన్యే శుభే తిథౌ ।
యే తత్ర దానం విప్రేభ్యః ప్రయచ్ఛన్తి సుమేధసః ॥
ఫలం సహస్రగుణితమన్యతీర్థాల్లభన్తి తే ॥ 11 ॥

రాహుకేతువులు సూర్యచంద్రులను పట్టుకునే గ్రహణసమయాలలోనూ, సూర్యుడు ఒకరాశినుండి మరొక రాశిలోకి ప్రవేశించే సంక్రమణ సమయాలలోనూ, సూర్యుడు ఉత్తరదక్షిణదిక్కులకు వెళ్లనారంభించే ఉత్తరాయణ, దక్షిణాయన సమయాలలోనూ, రాత్రి, పగలు సమానంగా ఉండే విషువ సమయాలలోనూ, కృతాదియుగాలు ఆరంభమైన రోజులు, షడశీతి దినాలలోనూ, వ్యతీపాతం అనే యోగం ఉన్న సమయంలోనూ (1.ఆదివారం– అమావాస్య, 2. సోమవారం– పూర్ణిమ కలిసి ఉన్న కాలం), సాయంకాలంలోనూ, ఆషాఢపూర్ణిమ, కార్తికపూర్ణిమ, మాఘపూర్ణిమ, లేదా మరొక శుభతిథినాడు ఆ క్షేత్రంలో సముద్రం ఒడ్డున బ్రాహ్మణులకు దానం చేసిన పుణ్యాత్ములు ఇతర పుణ్యతీర్థాలలో చేసిన దానంవల్ల కలిగే ఫలితానికి వేయిరెట్లు అధికమైన ఫలితాన్ని పొందుతారు.

పితౄణాం యే ప్రయచ్ఛన్తి పిణ్డం తత్ర విధానతః ।
అక్షయాం పితర స్తేషాం తృప్తిం చ ప్రాప్నువన్తి వై ॥ 12 ॥

ఆ సముద్రతీరంలో యథావిధిగా పితరులకు పిండప్రదానం చేస్తే, వారి పితృదేవతలు శాశ్వతమైన తృప్తిని పొందుతారు.

ఏవం స్నానఫలం సమ్యక్ సాగరస్య మయోదితమ్ ।
దానస్య చ ఫలం విప్రాః పిణ్డదానస్య చైవ హి ॥ 13 ॥

ద్విజులారా! ఈవిధంగా ఆ దివ్యక్షేత్రంలో సముద్రస్నానం, దానం, పిండప్రదానం చేయడంవల్ల కలిగే ఫలితాలను స్పష్టంగా చెప్పడం అయింది.

ధర్మార్థమోక్షఫలదమాయుష్కీర్తియశస్కరమ్ ।
భుక్తిముక్తిఫలం నృణాం ధన్యం దుఃఖప్రణాశనమ్ ॥ 14 ॥

సర్వపాపహరం పుణ్యం సర్వకామఫలప్రదమ్ ।
నాస్తికాయ న వక్తవ్యం పురాణం చ ద్విజోత్తమాః ॥ 15 ॥

బ్రాహ్మణవర్యులారా! పురాణం మానవులకు ధర్మం, అర్థం, మోక్షం అనే ఫలితాలను ఇస్తుంది. ఆయువును పెంచుతుంది. కీర్తినీ, జ్ఞానాన్నీ కలిగిస్తుంది. భోగాలనూ, అనంతరం మోక్షాన్నీ ప్రసాదిస్తుంది. సంపదల నిస్తుంది. బాధలను పోగొడుతుంది. అన్నివిధాలైన పాపాలనూ హరిస్తుంది. పుణ్యాన్ని ఇస్తుంది. కోరికలన్నింటినీ నెరవేరుస్తుంది. అటువంటి ఈ పురాణాన్ని దేవుడిపై నమ్మకం లేనివారికి చెప్పగూడదు.

తావద్ గర్జన్తి తీర్థాని మాహాత్మ్యైస్స్వైః పృథక్ పృథక్ ।
యావన్న తీర్థరాజస్య మాహాత్మ్యం వర్ణ్యతే ద్విజాః ॥ 16 ॥

బ్రాహ్మణులారా! శ్రేష్ఠమైన ఈ తీర్థం మహిమలను గూర్చి చెప్పనంతవరకు, మిగిలిన పుణ్యతీర్థాలు అన్నీ దేని కది తమ మహిమలను గూర్చి గొప్పలు చెప్పుకుంటాయి. (ఈ తీర్థం మహిమ తెలిసిన తరువాత మిగిలిన తీర్థాలు అన్నీ తాము హీనములని గ్రహించి, మిన్నకుంటాయి. ఈ తీర్థం ముందు మిగిలిన తీర్థాలన్నీ ప్రయోజన హీనాలే.)

పుష్కరాదీని తీర్థాని ప్రయచ్ఛన్తి స్వకం ఫలమ్ ।
తీర్థరాజస్తు స పునస్సర్వతీర్థఫలప్రదః ॥ 17 ॥

పుష్కరం మొదలైన ఆయాతీర్థాలు అన్నీ తమ తమ తీర్థంవలన గలిగే ప్రయోజనం మాత్రమే ఇస్తాయి. ఈ తీర్థరాజం ఒక్కటే అన్నితీర్థాల పుణ్యఫలాన్ని ఇస్తుంది.

భూతలే యాని తీర్థాని సరితశ్చ సరాంసి చ ।
విశన్తి సర్వతీర్థాని తేనాసౌ శ్రేష్ఠతాం గతః ॥ 18 ॥

ఈ భూమండలంలో ఉన్న పుణ్యతీర్థాలు, నదులు, సరస్సులు అన్నీ ఈ తీర్థరాజంలో (ప్రవేశిస్తాయి) నెలకొని ఉంటాయి. అందువల్లనే ఇది పుణ్యతీర్థా లన్నింటిలో శ్రేష్ఠం అయింది.

రాజా సమస్తతీర్థానాం సాగరస్సరితాం పతిః ।
తస్మాత్ సమస్తతీర్థేభ్యశ్శ్రేష్ఠోఽసౌ సర్వకామదః ॥ 19 ॥

సముద్రం నదులకు భర్త. భూమండలంలోని పుణ్యతీర్థా లన్నింటికీ రాజువంటిది. అందుచేత ఈ దివ్యక్షేత్రంలోని సముద్రజలం సమస్తమైన పుణ్యజలాలకంటె ఉత్తమం (సర్వశ్రేష్ఠం). కోరిక లన్నింటినీ తీరుస్తుంది.

తమోనాశం యథాభ్యేతి భాస్కరేఽభ్యుదితే ద్విజాః ।
స్నానేన తీర్థరాజస్య తథా సర్వాఘసంక్షయః ॥ 20 ॥

విప్రులారా! సూర్యుడు ఉదయించిన వెంటనే చీకటి నాశనమైన విధంగా, ఈ తీర్థరాజంలో స్నానం చేసిన వెంటనే సమస్తమైన పాపాలు నశించిపోతాయి.

తీర్థరాజసమం తీర్థం న భూతం న భవిష్యతి ॥ 21 ॥

ఈ పుణ్యతీర్థంతో సమానమైన పుణ్యతీర్థం ఇంతవరకు (భూతకాలంలో) లేదు. ఇంక ముందు (భవిష్యత్కాలంలో) కూడ ఉండదు.

అధిష్ఠానం యదా యత్ర ప్రభోర్నారాయణస్య వై ।
కశ్శక్నోతి గుణాన్ వక్తుం తీర్థరాజస్య భో ద్విజాః ॥
కోట్యో నవనవత్యస్తు యత్ర తీర్థాని సన్తి వై ॥ 22 ॥

ఓ బ్రాహ్మణులారా! ఈ తీర్థరాజంలో తొంభైతొమ్మిదికోట్ల పుణ్యతీర్థాలు ఉన్నాయి. శ్రీమన్నారాయణస్వామికి నిత్యనివాసమైన ఈ పుణ్యతీర్థం మహిమలను, వర్ణించడం ఎవరికీ సాధ్యం కాదు.

తస్మాత్ స్నానం చ దానం చ హోమం జప్యం సురార్చనమ్ ।
యత్కిఞ్చిత్ క్రియతే తత్ర చాక్షయం క్రియతే ద్విజాః ॥ 23 ॥

విప్రులారా! ఈపుణ్యతీర్థంలో స్నానం, దానం, హోమం, జపం, దేవతార్చనం మొదలైన కర్మలు ఏ కొంచెం ఆచరించినా, అది నిరంతరంగా నిత్యమూ చేసినది అవుతుంది. (దానివల్ల గలిగిన పుణ్యఫలం నశించదు.)

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భుృషిసంవాదే సముద్రస్నానవిధిమాహాత్మ్యవర్ణనం నామ ఏకోనషష్టితమోఽధ్యాయః ॥ 59 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషి సంవాదంలో సముద్రస్నానవిధి మాహాత్మ్యవర్ణనం అనే యాభైతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.



షష్టితమోఽధ్యాయః - అరవైయవ అధ్యాయం

పంచతీర్థమాహాత్మ్యనిరూపణమ్ - పంచతీర్థమాహాత్మ్యనిరూపణం

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తతో గచ్ఛేద్ ద్విజశ్రేష్ఠాస్తీర్థం యజ్ఞాఙ్గసమ్భవమ్ ।
ఇన్ద్రద్యుమ్నసరో నామ యత్రాస్తే పావనం శుభమ్ ॥ 1 ॥

విప్రోత్తములారా! సముద్రస్నానాదులు చేసిన తరువాత అశ్వమేధ యాగపురుషుడి శరీరంనుండి పుట్టిన ఇంద్రద్యుమ్నం అనే సరస్సు ఉన్న ప్రదేశానికి వెళ్లాలి. ఆ సరస్సు పవిత్రమూ శుభప్రదమూ అయినది.

గత్వా తత్ర శుచిర్ధీమానాచమ్య మనసా హరిమ్ ।
ధ్యాత్వోపస్థాప్య చ జలమిమం మన్త్రముదీరయేత్ ॥ 2 ॥

పవిత్రుడూ, బుద్ధిమంతుడూ అయిన సాధకుడు ఇంద్రద్యుమ్న సరస్సువద్దకు వెళ్లి, ఆచమనం చేయాలి. మనస్సులో శ్రీహరిని ధ్యానించాలి. ఆ సరస్సుజలాన్ని సమీపించి (స్నానం చేసేముందు) ఈ మంత్రాన్ని ఉచ్చరించాలి.

అశ్వమేధాఙ్గసమ్భూత తీర్థ సర్వాఘనాశన ।
స్నానం త్వయి కరోమ్యద్య పాపం హర నమోఽస్తు తే ॥ 3 ॥

అశ్వమేధయాగంలో భాగంగా పుట్టిన పుణ్యతీర్థమా, సమస్తమైనపాపాలను నశింపజేసేదానా! ఇప్పుడు నీ నీటిలో స్నానం చేస్తున్నాను. నా పాపాన్ని నిర్మూలించు. నీకు నమస్కారం. (అనే అర్థాన్ని భావిస్తూ పై శ్లోకాన్ని చదివి తర్వాత ఆ సరస్సులో స్నానం చేయాలి.)

ఏవముచ్చార్య విధివత్ స్నాత్వా దేవాన్ ఋషీన్ పితౄన్ ।
తిలోదకేన చాన్యాంశ్చ సన్తర్ప్యాచమ్య వాగ్యతః ॥ 4 ॥

పై మంత్రాన్ని (3శ్లోకాన్ని) పఠించి, యథావిధిగా ఇంద్రద్యుమ్నసరస్సులో స్నానం చేయాలి. తరువాత దేవతలకు, ఋషులకు, పితరులకు తర్పణలు ఇవ్వాలి. (పితృదేవతలకు) నువ్వులతో కలిపిన నీళ్లతో తర్పణం విడిచిపెట్టాలి. విధివిధానంగా ఇతరులకు కూడా తర్పణం చేయాలి. తర్పణాలు అయిన తరువాత మౌనంగా, ఆచమనం చేయాలి.

దత్త్వా పితౄణాం పిణ్డాంశ్చ సమ్పూజ్య పురుషోత్తమమ్ ।
దశాశ్వమేధికం పుణ్యం ఫలం ప్రాప్నోతి మానవః ॥ 5 ॥

పితృదేవతలకు పిండప్రదానం చేయాలి. పురుషోత్తమస్వామిని చక్కగా పూజించాలి. ఇలా చేసినదానికి ఫలితంగా, మానవులకు పది అశ్వమేధయాగాలు చేసిన పుణ్యం వస్తుంది.

సప్తావరాన్ సప్త పరాన్ వంశానుద్ధృత్య దేవవత్ ।
కామగేన విమానేన విష్ణులోకం స గచ్ఛతి ॥ 6 ॥

ఇంకా అతడు తన వంశంలో తనకు పూర్వం ఏడు తరాలవారినీ, తనకు తరువాత ఏడు తరాలవారినీ నరకాది లోకాలనుండి ఉద్ధరిస్తాడు. తన ఇష్టం ప్రకారం నడిచే విమానంమీద దేవుడిలాగా విష్ణులోకానికి వెళ్తాడు.

భుక్త్వా తత్ర సుఖాన్ భోగాన్ యావచ్చన్ద్రార్కతారకమ్ ।
చ్యుతస్తస్మాదిహాయాతో మోక్షం చ లభతే ధ్రువమ్ ॥ 7 ॥

సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు ఉన్నంతకాలం (మహాప్రళయం వచ్చేవరకు) వైకుంఠంలో వివిధ భోగాలనూ, సుఖాలనూ అనుభవిస్తాడు. పుణ్యక్షయమైనతరువాత వైకుంఠం నుండి తిరిగి భూలోకానికి వస్తాడు. తరువాత నిశ్చయంగా మోక్షం పొందుతాడు. (స్వర్గాది లోకాలనుంచి సరాసరిగా మోక్షం పొందటం సాధ్యం కాదు. భూలోకానికి తిరిగివచ్చి, సాధనలద్వారా మోక్షం ఇక్కడినుండే సాధ్యం అవుతుంది.)

ఏవం కృత్వా పఞ్చతీర్థీమేకాదశ్యాముపోషితః ।
జ్యేష్ఠశుక్లపఞ్చదశ్యాం యః పశ్యేత్ పురుషోత్తమమ్ ॥ 8 ॥

స పూర్వోక్తం ఫలం ప్రాప్య క్రీడిత్వాత్వచ్యుతాలయే ।
ప్రయాతి పరమం స్థానం యస్మాన్నావర్తతే పునః ॥ 9 ॥

పంచతీర్థాలను సేవించుకున్నవాడు(57-11), ఏకాదశినాడు ఉపవాసం ఉన్నవాడు, జ్యేష్ఠమాసంలో పూర్ణిమనాడు పురుషోత్తమస్వామిని దర్శించుకున్నవాడు కూడ ఇంతకు ముందు చెప్పిన పుణ్యఫలాన్ని పొందుతాడు. శ్రీమహావిష్ణువు నెలకొన్న వైకుంఠంలో భోగాలను అనుభవించి, మోక్షానికి వెళ్తాడు. ఇంక అతడు భూలోకానికి తిరిగిరాడు.

మునయ ఊచుః :-మహర్షులు బ్రహ్మదేవుడితో ఇలా అంటున్నారు.

మాసానన్యాన్ పరిత్యజ్య మాఘాదీన్ ప్రపితామహ ।
ప్రశంససి కథం జ్యేష్ఠం బ్రూహి తత్కారణం ప్రభో ॥ 10 ॥

సర్వలోకపితామహా! మాఘం మొదలుగా పుణ్యమాసాలు ఎన్నో ఉండగా, వాటి నన్నిటినీ విడిచిపెట్టి జ్యేష్ఠమాసాన్ని ప్రత్యేకంగా కీర్తిస్తున్నా వేమిటి? బ్రహ్మదేవా! కారణం చెప్పవలసినది.

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

శృణుధ్వం మునిశార్దూలాః ప్రవక్ష్యామి సమాసతః ।
జ్యేష్ఠం మాసం యథా తేభ్యః ప్రశంసామి పునః పునః ॥ 11 ॥

మహర్షులారా! మిగిలిన మాసాలకంటె జ్యేష్ఠాన్ని మళ్లీ మళ్లీ గొప్పగా పొగడటానికి కారణం ఏమిటో సంగ్రహంగా చెప్తాను వినండి.

పృథివ్యాం యాని తీర్థాని సరితశ్చ సరాంసి చ ।
పుష్కరిణ్యస్తడాగాని వాప్యః కూపాస్తథా హ్రదాః ॥ 12 ॥

నానానద్యస్సముద్రాశ్చ సప్తాహం పురుషోత్తమే ।
జ్యేష్ఠశుక్లదశమ్యాది ప్రత్యక్షం యాన్తి సర్వదా ॥ 13 ॥

ఈ భూమిమీద ఉన్న పుణ్యతీర్థాలు, నదులు, సరస్సులు, పుష్కరిణులు, చెరువులు, దిగుడుబావులు, బావులు, ప్రవాహాలు, రకరకాలైన నదులు, సముద్రాలు, మొత్తం అన్నీ జ్యేష్ఠమాసంలో శుక్లపక్షంలో దశమి మొదలుకొని ఏడురోజులు పురుషోత్తమక్షేత్రంలో ప్రత్యక్షంగా ఉంటాయి.

స్నానదానాదికం తస్మాద్దేవతాప్రేక్షణం ద్విజాః ।
యత్కిఞ్చిత్ క్రియతే తత్ర తస్మిన్ కాలేఽక్షయం భవేత్ ॥ 14 ॥

విప్రులారా! ఆ కాలంలో పురుషోత్తమక్షేత్రంలో స్నానం, దానం, దేవతలను దర్శించటం మొదలుగా ఏ కొంచెం పుణ్యకర్మ ఆచరించినా, అది ఎన్నటికీ నశించదు. శాశ్వతమైన ఫలాన్ని ఇస్తుంది.

శుక్లపక్షస్య దశమీ జ్యేష్ఠే మాసి ద్విజోత్తమాః ।
హరతే దశ పాపాని తస్మాద్దశహరా స్మృతా ॥ 15 ॥

బ్రాహ్మణోత్తములారా! జ్యేష్ఠమాసంలో శుక్లపక్షంలో దశమీతిథి (దశమినాడు చేసిన పుణ్యకర్మ) దశవిధ పాపాలను హరిస్తుంది. అందుచేతనే ఆ తిథికి దశహర అనే ప్రసిద్ధి కలిగింది.

యస్తస్యాం హలినం కృష్ణం పశ్యేద్ భద్రాం సమాహితః ।
సర్వపాపవినిర్ముక్తో విష్ణులోకం వ్రజేన్నరః ॥ 16 ॥

ఆ రోజు (జ్యేష్ఠశుద్ధదశమినాడు) పురుషోత్తమ క్షేత్రంలో ఏకాగ్రమైన భక్తితో బలభద్రుడినీ, కృష్ణస్వామినీ, సుభద్రాదేవినీ, దర్శించుకున్నవాడు తాను చేసిన పాపాలు సమస్తం నశించి, వైకుంఠానికి వెళ్తాడు.

ఉత్తరే దక్షిణే విప్రాస్త్వయనే పురుషోత్తమమ్ ।
దృష్ట్వా రామం సుభద్రాం చ విష్ణులోకం వ్రజేన్నరః ॥ 17 ॥

ద్విజులారా! ఉత్తరాయణంలోనూ, దక్షిణాయనంలోనూ పురుషోత్తముడైన కృష్ణస్వామినీ, బలరాముడినీ, సుభద్రనూ దర్శించిన మానవుడు వైకుంఠానికి వెళ్తాడు.

నరో డోలాగతం దృష్ట్వా గోవిన్దం త్రిదశోత్తమమ్ ।
ఫాల్గున్యాం సంయతో భూత్వా గోవిన్దస్య పురం వ్రజేత్ ॥ 18 ॥

ఫాల్గునమాసంలో పూర్ణిమనాడు పురుషోత్తమక్షేత్రంలో దేవదేవుడైన గోవిందుడు ఉయ్యాలలో ఉండగా, భక్తితో దర్శించినవాడు వైకుంఠానికి వెళ్తాడు.

విష్ణోస్తు దివసే ప్రాప్తే పఞ్చతీర్థీవిధానతః ।
కృత్వా సఙ్కర్షణం కృష్ణం దృష్ట్వా భద్రాం చ భో ద్విజాః ॥ 19 ॥

నరస్సమస్తయజ్ఞానాం ఫలం ప్రాప్నోతి దుర్లభమ్ ।
విముక్తస్సర్వపాపేభ్యో విష్ణులోకం చ గచ్ఛతి ॥ 20 ॥

ఓ విప్రులారా! విష్ణుదేవుడికి ప్రీతికరమైన ద్వాదశీతిథినాడు పంచతీర్థాలను సేవించుకుని, బలరాముడినీ, కృష్ణస్వామినీ, సుభద్రనూ దర్శించుకున్న మానవుడు అన్ని విధాలైన యాగాలు చేసిన పుణ్యఫలాన్ని పొందుతాడు. ఈ పుణ్యం అంత తేలికగా ఎవరికీ లభించదు. ఇంక పాపాలు అన్నీ నశించి, అతడు విష్ణులోకానికి వెళ్తాడు.

యః పశ్యతి తృతీయాయాం కృష్ణం చన్దనరూషితమ్ ।
వైశాఖస్య సితే పక్షే స యాత్యచ్యుతమన్దిరమ్ ॥ 21 ॥

వైశాఖమాసంలో శుక్లపక్షంలో తదియనాడు ఒళ్లంతా మంచిగంధం పూసుకుని ఉన్న కృష్ణస్వామిని దర్శించిన వాడు విష్ణులోకానికి వెళ్తాడు.

జ్యైష్ఠ్యాం జ్యేష్ఠర్క్షయుక్తాయాం యః పశ్యేత్ పురుషోత్తమమ్ ।
కులైకవింశముద్ధృత్య విష్ణులోకం స గచ్ఛతి ॥ 22 ॥

జ్యేష్ఠమాసంలో చంద్రుడు జ్యేష్ఠానక్షత్రంతో కూడి ఉన్న పూర్ణిమనాడు పురుషోత్తమక్షేత్రంలో కృష్ణస్వామిని దర్శించుకున్నవాడు తన వంశంలో ఇరవైఒక్క తరాలవారిని నరకలోకాలనుండి ఉద్ధరిస్తాడు. (వారితో సహా) తాను విష్ణులోకానికి వెళ్తాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భృషిసంవాదే పఞ్చతీర్థీమాహాత్మ్య రూపణం నామ షష్టితమోఽధ్యాయః ॥60॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషి సంవాదంలో పంచతీర్థీ మాహాత్మ్య నిరూపణం అనే అరవైయవ అధ్యాయం సంపూర్ణం.



ఏకషష్టితమోऽధ్యాయః – అరవైఒకటవ అధ్యాయం

మహాజ్యైష్ఠీప్రశంసావర్ణనమ్ – మహాజ్యైష్ఠీప్రశంసావర్ణనం

బ్రహ్మోవాచ :– మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

యదా భవేన్మహాజ్యైష్ఠీ రాశినక్షత్రయోగతః ।
ప్రయత్నేన తదా మర్త్యైర్గన్తవ్యం పురుషోత్తమమ్ ॥ 1 ॥

రాశి, జ్యేష్ఠానక్షత్రాల కలయికతో మహాజ్యైష్ఠి పర్వదినం ఏర్పడిననాడు మానవులు ప్రత్యేకమైన పూనికతో పురుషోత్తమక్షేత్రానికి తప్పక వెళ్లాలి.

కృష్ణం దృష్ట్వా మహాజ్యైష్ఠ్యాం రామం భద్రాం చ భో ద్విజాః ।
నరో ద్వాదశయాత్రాయాః ఫలం ప్రాప్నోతి చాధికమ్ ॥ 2 ॥

విప్రులారా! పురుషోత్తమక్షేత్రంలో మహాజ్యైష్ఠినాడు కృష్ణస్వామినీ, బలభద్రుడినీ, సుభద్రనూ దర్శించిన మానవుడు ద్వాదశ యాత్రలు (64 అధ్యాయం) చేసిన దానికంటె అధికమైన ఫలితాన్ని పొందుతాడు.

ప్రయాగే చ కురుక్షేత్రే నైమిషే పుష్కరే గయే ।
గఙ్గాద్వారే కుశావర్తే గఙ్గాసాగరసఙ్గమే ॥ 3 ॥

బ్రాహ్మణులారా! ప్రయాగ, కురుక్షేత్రం, నైమిషారణ్యం, పుష్కరక్షేత్రం, గయ, గంగాద్వారం (హరిద్వారం), కుశావర్తం, గంగాసాగర సంగమక్షేత్రం,

కోకాముఖే శూకరే చ మథురాయాం మరుస్థలే ।
శాలగ్రామే వాయుతీర్థే మన్దరే సిన్ధుసాగరే ॥ 4 ॥

కోకాముఖం, శూకరం, మథుర, మరుస్థలం, శాలగ్రామం, వాయుతీర్థం, మందరం, సింధుసాగరం,

పిణ్డారకే చిత్రకూటే ప్రభాసే కనఖలే తథా ।
శఙ్ఖోద్ధారే ద్వారకాయాం తథా బదరికాశ్రమే ॥ 5 ॥

పిండారకం, చిత్రకూటం, ప్రభాసం, కనఖలం, శంఖోద్ధారం, ద్వారక, బదరికాశ్రమం,

లోహకుణ్డే చాశ్వతీర్థే సర్వపాపప్రమోచనే ।
కామాలయే కోటితీర్థే తథా చామరకణ్టకే ॥ 6 ॥

లోహకుండం, పాపాలన్నిటినీ పోగొట్టే అశ్వతీర్థం, కామాలయం, కోటితీర్థం, అమరకంటకం,

లోహార్గలే జమ్బుమార్గే సోమతీర్థే పృథూదకే ।
ఉత్పలావర్తకే చైవ పృథుతుఙ్గే సుకుబ్జకే ॥ 7 ॥

లోహార్గలం, జంబుమార్గం, సోమతీర్థం, పృథూదకం, ఉత్పలావర్తకం, పృథుతుంగం, సుకుబ్జకం,

ఏకామ్రకే చ కేదారే కాశ్యాం చ విరజే ద్విజాః ।
కాలఞ్జరే చ గోకర్ణే శ్రీశైలే గన్ధమాదనే ॥ 8 ॥

ఏకామ్రం, కేదారం, కాశి, విరజ, కాలంజరం, గోకర్ణం, శ్రీశైలం, గంధమాదనం,

మహేన్ద్రే మలయే విన్ధ్యే పారియాత్రే హిమాలయే ।
సహ్యే చ శుక్తిమన్తే చ గోమన్తే చార్బుదే తథా ॥ 9 ॥

మహేంద్రం, మలయం, వింధ్యం, పారియాత్రం, హిమాలయం, సహ్యం, శుక్తిమంతం, గోమంతం, అర్బుదం,

గఙ్గాయాం సర్వతీర్థేషు యామునేషు చ భో ద్విజాః ।
సారస్వతేషు గోమత్యాం బ్రహ్మపుత్రేషు సప్తసు ॥ 10 ॥

గంగ, యమున, సరస్వతులకు సంబంధించిన అన్ని పుణ్యతీర్థాలు, గోమతి, బ్రహ్మపుత్రకు చెందిన ఏడు తీర్థాలు,

గోదావరీ భీమరథీ తుఙ్గభద్రా చ నర్మదా ।
తాపీ పయోష్ణీ కావేరీ క్షిప్రా చర్మణ్వతీ ద్విజాః ॥ 11 ॥

గోదావరి, భీమరథి, తుంగభద్ర, నర్మద, తాపి, పయోష్ణి, కావేరి, క్షిప్ర, చర్మణ్వతి,

వితస్తా చన్ద్రభాగా చ శతద్రుర్బాహుదా తథా ।
ఋషికుల్యా కుమారీ చ విపాశా చ దృషద్వతీ ॥ 12 ॥

వితస్త, చంద్రభాగ, శతద్రువు, బాహుద, ఋషికుల్య, కుమారి, విపాశ, దృషద్వతి,

సరయూశ్చైవ గఙ్గా చ గణ్డకీ చ మహానదీ ।
కౌశికీ కరతోయా చ త్రిస్రోతా మధువాహినీ ॥ 13 ॥

సరయూనది, ఆకాశగంగ, గండకి, మహానది, కౌశికి, కరతోయ, త్రిస్రోత, మధువాహిని,

మహానదీ వైతరణీ యాశ్చాన్యా నానుకీర్తితాః ।
అథవా కిం బహూక్తేన భాషితేన ద్విజోత్తమాః ॥ 14 ॥

మహానది, వైతరణి, ఇంకా ఇక్కడ పేర్కొనబడనటువంటి ఇతర పుణ్యతీర్థాలు వీటన్నిటిలోనూ స్నానాదులు చేసిన పుణ్యఫలం (జ్యేష్ఠపూర్ణిమనాడు పురుషోత్తమక్షేత్రంలో కృష్ణ,బలరామ,సుభద్రలను దర్శించుకున్నవాడికి) లభిస్తుంది. విప్రోత్తములారా! అధికంగా ఇన్ని మాట లెందుకు?

పృథివ్యాం సర్వతీర్థేషు సర్వేష్వాయతనేషు చ ।
సాగరేషు చ శైలేషు నదీషు చ సరస్సు చ ॥ 15 ॥

యత్ఫలం స్నానదానేన రాహుగ్రస్తే దివాకరే ।
తత్ఫలం కృష్ణమాలోక్య మహాజ్యైష్ఠ్యాం లభేన్నరః ॥ 16 ॥

సూర్యుడిని రాహువు పట్టుకున్న సమయం(సూర్యగ్రహణం)లో ఈ భూమిమీద ఉన్న సమస్త తీర్థాలలోనూ, సమస్త దేవాలయాలలోనూ, సముద్రాలలోనూ, పర్వతాలలోనూ, నదులలోనూ, సరస్సులలోనూ, స్నానం, దానం చేస్తే ఎంతటి ఫలితం వస్తుందో అంత ఫలితమూ మహాజ్యైష్ఠినాడు పురుషోత్తమ క్షేత్రంలో శ్రీకృష్ణస్వామిని దర్శించిన(మాత్రంచేతనే) మానవుడు పొందుతాడు.

తస్మాత్ సర్వప్రయత్నేన గన్తవ్యం పురుషోత్తమే ।
మహాజ్యైష్ఠ్యాం మునిశ్రేష్ఠాస్సర్వకామఫలేప్సుభిః ॥ 17 ॥

అందుచేత మహర్షులారా! ఏ కోరిక తీరాలన్నా, అన్ని రకాలుగానూ ప్రయత్నించి, ఎలాగైనా మహాజ్యైష్ఠినాడు పురుషోత్తమ క్షేత్రానికి తప్పకుండా వెళ్లాలి.

దృష్ట్వా రామం మహాజ్యైష్ఠ్యాం కృష్ణం సుభద్రయా సహ ।
విష్ణులోకం నరో యాతి సముద్ధృత్య స్వకం కులమ్ ॥ 18 ॥

మహాజ్యైష్ఠినాడు పురుషోత్తమక్షేత్రంలో బలరాముడినీ, కృష్ణుడినీ, సుభద్రనూ దర్శించుకున్న మానవుడు తన కులం వారిని అందరినీ నరకాది లోకాలనుండి ఉద్ధరిస్తాడు. తాను (తన కులంవారితో సహా) విష్ణులోకానికి వెళ్తాడు.

భుక్త్వా తత్ర వరాన్ భోగాన్ యావదాభూతసంప్లవమ్ ।
పుణ్యక్షయాదిహాగత్య చతుర్వేదీ ద్విజో భవేత్ ॥ 19 ॥

మహాప్రళయం జరిగేవరకూ వైకుంఠలోకంలో ఉత్తమమైన భోగాలు అనుభవిస్తాడు. ఆ పుణ్యఫలం అంతా అనుభవించిన తరువాత భూలోకానికి తిరిగివస్తాడు. ఈ జన్మలో నాలుగు వేదాలు తెలిసిన బ్రాహ్మణుడు అవుతాడు.

స్వధర్మనిరతశ్శాన్తః కృష్ణభక్తో జితేన్ద్రియః ।
వైష్ణవం యోగమాస్థాయ తతో మోక్షమవాప్నుయాత్ ॥ 20 ॥

బ్రాహ్మణధర్మాలను శ్రద్ధగా ఆచరిస్తాడు. విషయసుఖాలను విడిచిపెడతాడు. కృష్ణస్వామియందు భక్తి గలిగి ఉంటాడు. ఇంద్రియాలను తన అదుపులో ఉంచుకుంటాడు. విష్ణుసంబంధమైన యోగాన్ని అవలంబించి, దానివల్ల మోక్షాన్ని పొందుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే మహాజ్యైష్ఠీప్రశంసావర్ణనం నామ ఏకషష్టితమోఽధ్యాయః ॥ 61 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషి సంవాదంలో మహాజ్యైష్ఠీప్రశంసావర్ణనం అనే అరవైఒకటవ అధ్యాయం సంపూర్ణం.

ద్విషష్టితమోఽధ్యాయః - అరవైరెండవ అధ్యాయం

కృష్ణస్నానమాహాత్మ్యవర్ణనమ్ - కృష్ణస్నానమాహాత్మ్యవర్ణనం

మునయ ఊచుః :-మహర్షులు అంటున్నారు.

కస్మిన్ కాలే భవేత్ స్నానం కృష్ణస్య కమలోద్భవ ।
విధినా కేన తద్ బ్రూహి తతో విధివిదాం వర ॥ 1 ॥

శాస్త్రవిధులు తెలిసిన వారిలో ఉత్తముడైన బ్రహ్మదేవా! శ్రీకృష్ణస్వామికి స్నానం (అభిషేకం) ఏ సమయంలో జరుగుతుంది? ఏ ప్రకారంగా జరుగుతుంది? ఆ విషయం చెప్పవలసింది.

బ్రహ్మోవాచ :-బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

శృణుధ్వం మునయస్స్నానం కృష్ణస్య వదతో మమ ।
రామస్య చ సుభద్రాయాః పుణ్యం సర్వాఘనాశనమ్ ॥ 2 ॥

మహర్షులారా! కృష్ణుడు, బలరాముడు, సుభద్రాదేవి వీరి స్నానవిషయం పుణ్యప్రదమైనది. సమస్తమైన పాపాలు నశింపజేస్తుంది. దాన్ని గురించి చెప్తాను వినండి.

మాసి జ్యేష్ఠే చ సమ్ప్రాప్తే నక్షత్రే చన్ద్రదైవతే ।
పౌర్ణమాస్యాం తదా స్నానం సర్వకాలం హరేర్ద్విజాః ॥ 3 ॥

విప్రులారా! జ్యేష్ఠమాసంలో చంద్రుడు దేవతగా గలిగిన జ్యేష్ఠానక్షత్రం కలిసి వచ్చినపుడు, అంటే జ్యేష్ఠపూర్ణిమనాడు శ్రీకృష్ణస్వామి స్నానం సర్వదా ప్రశస్తం.

సర్వతీర్థమయః కూపస్తత్రాస్తే నిర్మలశ్శుచిః ।
తదా భోగవతీ తత్ర ప్రత్యక్షా భవతి ద్విజాః ॥ 4 ॥

బ్రాహ్మణులారా! పురుషోత్తమక్షేత్రంలో ఒక బావి ఉన్నది. అందులో నీళ్లు చాల స్వచ్ఛంగానూ, పవిత్రంగానూ ఉంటాయి. జ్యేష్ఠ పూర్ణిమనాడు సమస్తమైన పుణ్యతీర్థాలలోని నీళ్లూ ఆ బావినీళ్లలో కలిసి ఉంటాయి. ఆనాడు భోగవతి అనే నది కూడ అక్కడ ప్రత్యక్షంగా కనబడుతుంది.

తస్మాజ్జైష్ఠ్యాం సముద్ధృత్య హేమాద్యైః కలశైర్జలమ్ ।
కృష్ణరామాభిషేకార్థం సుభద్రాయాశ్చ భో ద్విజాః ॥ 5 ॥

ఓ విప్రులారా! అందుచేత జ్యేష్ఠపూర్ణిమరోజు కృష్ణ, రామ, సుభద్రలకు అభిషేకం చేయడానికి ఆ బావిలోని నీళ్లను బంగారు కలశాలతో పట్టి తీసుకువస్తారు.

కృత్వా సుశోభనం మఞ్చం పతాకాభిరలఙ్కృతమ్ ।
సుదృఢం సుఖసఞ్చారం వస్త్రైః పుష్పైస్సుశోభితమ్ ॥ 6 ॥

అందమైన ఒక ఎత్తైన పెద్ద వేదికను ఏర్పాటు చేస్తారు. దానిమీద సులువుగా తిరగడానికి వీలుగా ఆ వేదికను చాల గట్టిగా నిర్మిస్తారు. ఆ వేదికకు చుట్టూ జెండాలు అలంకరిస్తారు. రంగురంగుల పూలతో వస్త్రాలతో, దానిని అందంగా తీర్చిదిద్దుతారు.

విస్తీర్ణం ధూపితం ధూపైస్స్నానార్థం రామకృష్ణయోః ।
సితవస్త్రైః పరిచ్ఛన్నం ముక్తాహారావలమ్బితమ్ ॥ 7 ॥

వేదిక చాల విశాలంగా ఉంటుంది. బలరామకృష్ణుల స్నానం కోసం నిర్మించిన ఆ వేదికను వివిధ సుగంధధూపాలతో నింపుతారు. తెల్లని వస్త్రాలు పరుస్తారు. ముత్యాలదండలు వేలాడదీస్తారు.

తత్ర నానావిధైర్వాద్యైః కృష్ణం నీలామ్బరం ద్విజాః ।
మధ్యే సుభద్రాం చాస్థాప్య జయమఙ్గలనిస్వనైః ॥ 8 ॥

విప్రులారా! రకరకాల వాద్యాలు మోగిస్తారు. మంగళప్రదమైన జయజయధ్వానాలు చేస్తారు. ఆ ధ్వనుల నడుమ కృష్ణుడినీ, బలరాముడినీ, సుభద్రనూ ఆ వేదికమధ్యలో ప్రతిష్ఠిస్తారు.

బ్రాహ్మణైః క్షత్రియైర్వైశ్యై శ్శూద్రైశ్చాన్యైశ్చ జాతిభిః ।
అనేకశతసాహస్రైర్వృతం స్త్రీపురుషైర్ద్విజాః ॥ 9 ॥

బ్రాహ్మణులారా! బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు ఇంకా ఇతరమైన వివిధజాతుల స్త్రీలూ, పురుషులూ ఎన్నో వందలు, వేలసంఖ్యలో ఆ ప్రదేశ మంతటా నిండిపోతారు.

గృహస్థాస్స్నాతకాశ్చైవ యతయో బ్రహ్మచారిణః ।
స్నాపయన్తి తదా కృష్ణం మఞ్చస్థం సహలాయుధమ్ ॥ 10 ॥

గృహస్థులూ! వేదపండితులు, యతులు, బ్రహ్మచారులు, అందరూ బలరాముడితో సహా వేదికపై ఉన్న శ్రీకృష్ణస్వామిని అభిషేకిస్తారు.

తథా సమస్తతీర్థాని పూర్వోక్తాని ద్విజోత్తమాః ।
స్వోదకైః పుష్పమిశ్రైశ్చ స్నాపయన్తి పృథక్ పృథక్ ॥ 11 ॥

బ్రాహ్మణవరేణ్యులారా! ఇంతకు ముందు చెప్పిన పుణ్యతీర్థాలు అన్నీ తమతమ పుణ్యజలాలతో, పూలను కూడ కలిపి దేనికది ప్రత్యేకంగా కృష్ణ బలరామ సుభద్రలకు అభిషేకం చేస్తాయి.

పశ్చాత్ పటహశఙ్ఖాద్యైర్భేరీమురజనిస్వనైః ।
కాహలైస్తాలశబ్దైశ్చ మృదఙ్గైర్ఝుర్ఝురైస్తథా ॥ 12 ॥

ఆ తరువాత తప్పెట్లు, శంఖాలు, భేరులు, మద్దెలలు, బాకాలు, కంచుతాళంచిప్పలు, మృదంగాలు, డమరుకాలు మొదలైన వాద్యాల ధ్వనులు అతిశయిస్తాయి.

అన్యైశ్చ వివిధైర్వాద్యైర్ఘణ్టాస్వనవిభూషితైః ।
స్త్రీణాం మఙ్గలశబ్దైశ్చ మునిసఙ్ఘైర్మనోహరైః ॥ 13 ॥

జయశబ్దైస్తథా స్తోత్రైర్వీణావేణునినాదితైః ।
శ్రూయతే సుమహాన్ శబ్దస్సాగరస్యేవ గర్జతః ॥ 14 ॥

ఇంకా ఇతరమైన రకరకాల వాద్యాలు మోగుతున్నాయి. గంటలు మోగుతున్నాయి. స్త్రీలు మంగళ ధ్వనులు చేస్తున్నారు. మహర్షులు గుంపులుగా చేరి మనోహరంగా జయ జయ ధ్వానాలు చేస్తున్నారు. స్తుతులు గానం చేస్తున్నారు. వీణలు, వేణువులు ధ్వనిస్తున్నాయి. ఆ సమయంలో సముద్రం గర్జిస్తున్నట్లుగా అక్కడ రకరకాల ధ్వనులు గొప్పగా వినిపిస్తాయి.

మునీనాం వేదశబ్దేన మన్త్రశబ్దైస్తథాపరైః ।
నానాస్తోత్రరవైః పుణ్యైస్సామశబ్దోపబృంహితైః ॥ 15 ॥

మహర్షులు కొందరు స్వరయుక్తంగా వేదం పఠిస్తున్నారు. కొందరు మునులు వివిధ మంత్రాలను పెద్దగా ఉచ్చరిస్తున్నారు. రకరకాల స్తోత్రాలు ధ్వనిస్తున్నాయి. పవిత్రమైన సామవేదగానం ఆ ప్రాంత మంతటా నిండింది.

యతిభిస్స్నాతకైశ్చైవ గృహస్థైర్బ్రహ్మచారిభిః ।
స్నానకాలే సురశ్రేష్ఠాస్తువన్తి పరయా ముదా ॥ 16 ॥

యతులు, వేదపండితులు, గృహస్థులు, బ్రహ్మచారులు అందరూ రకరకాల స్తోత్రాలు చేస్తున్నారు. రామకృష్ణ సుభద్రలస్నాన(అభిషేక) సమయంలో దేవతలు కూడ మిక్కిలి సంతోషంతో స్వామిని స్తుతిస్తున్నారు.

శ్యామైర్వేశ్యాజనైశ్చైవ కుచభారావనామిభిః ।
పీతరక్తామ్బరైశ్చైవ మాల్యదామావనామిభిః ॥ 17 ॥

అక్కడ అందమైన వేశ్యలు ఉన్నారు. వారు స్తనాల బరువుచేత వంగిపోయి ఉన్నారు. పచ్చని, ఎఱ్ఱని వస్త్రాలు ధరించారు. మోయలేనన్ని పుష్పమాలికలు దండిగా ధరించారు.

సరత్నైః కుణ్డలైర్దివ్యైస్సువర్ణస్తబకాన్వితైః ।
చామరై రత్నదణ్డైశ్చ వీజ్యేతే రామకేశవౌ ॥ 18 ॥

దివ్యమైన రత్నాలు పొదిగిన కర్ణాభరణాలు ధరించారు. బంగారు హారాలు వేసుకున్నారు. అటువంటి వేశ్యలు బలరామకృష్ణులకు రత్నాలతో చేసిన పిడి గలిగిన వింజామరలతో వీస్తున్నారు.

యక్షవిద్యాధరైస్సిద్ధైః కిన్నరైశ్చాప్సరోగణైః ।
పరివార్యామ్బరగతైర్దేవగన్ధర్వచారణైః ॥ 19 ॥

ఆదిత్యా వసవో రుద్రాస్సాధ్యా విశ్వే మరుద్గణాః ।
లోకపాలాస్తథా చాన్యే స్తువన్తి పురుషోత్తమమ్ ॥ 20 ॥

యక్షులు, విద్యాధరులు, సిద్ధులు, కిన్నరులు, అప్సరసలు, దేవతలు, గంధర్వులు, చారణులు చుట్టూ చేరి ఉండగా, ఆదిత్యులు, వసువులు, రుద్రులు, సాధ్యులు, విశ్వేదేవతలు, మరుత్తులు, లోకపాలకులు, ఇంకా ఇతరులు ఆకాశంలో ఉండి, పురుషోత్తమస్వామిని ఈవిధంగా స్తుతిస్తున్నారు.

నమస్తే దేవదేవేశ పురాణ పురుషోత్తమ ।
సర్గస్థిత్యన్తకృద్ దేవ లోకనాథ జగత్పతే ॥ 21 ॥

దేవతలకే దేవుడవైన స్వామీ! సనాతనుడా! జీవులకంటె ఉత్తముడా! సృష్టి, స్థితి, లయాలను చేసేవాడా! దేవా! జగన్నాథా! లోకేశ్వరా! నీకు నమస్కారం.

త్రైలోక్యధారిణం దేవం బ్రహ్మణ్యం మోక్షకారణమ్ ।
తం నమస్యామహే భక్త్యా సర్వకామఫలప్రదమ్ ॥ 22 ॥

మూడు లోకాలనూ కాపాడేవాడూ, బ్రాహ్మణులకు హితం చేసేవాడూ, మోక్షం ఇచ్చేవాడూ, సమస్తమైన కోరికలను తీర్చేవాడూ అయిన పురుషోత్తమదేవుడికి భక్తితో నమస్కరిస్తున్నాం.

స్తుత్వైవం విబుధాః కృష్ణం రామం చైవ మహాబలమ్ ।
సుభద్రాం చ మునిశ్రేష్ఠాస్తదాకాశే వ్యవస్థితాః ॥ 23 ॥

మహర్షులారా! కృష్ణుడినీ, గొప్పబలవంతుడైన బలరాముడినీ, సుభద్రాదేవినీ, ఈవిధంగా స్తుతించి దేవతలు ఆకాశంలోనే ఉన్నారు.

గాయన్తి దేవగన్ధర్వా నృత్యన్త్యప్సరసస్తథా ।
దేవతూర్యాణ్యవాద్యన్త వాతా వాన్తి సుశీతలాః ॥ 24 ॥

దేవతలూ, గంధర్వులూ స్తోత్రాలు గానం చేస్తున్నారు. అప్సరసలు నాట్యం చేస్తున్నారు. దేవదుందుభులు మోగుతున్నాయి. గాలులు చల్లగా సుఖంగా వీస్తున్నాయి.

పుష్పమిశ్రం తదా మేఘా వర్షన్త్యాకాశగోచరాః ।
జయశబ్దం చ కుర్వన్తి మునయస్సిద్ధచారణాః ॥ 25 ॥

మేఘాలు ఆకాశంనుండి పూవులతో కూడిన నీటిని (పూలవాన) కురుస్తున్నాయి. మునులు, సిద్ధులు, చారణులు జయజయధ్వానాలు చేస్తున్నారు.

శక్రాద్యా విబుధాస్సర్వే ఋషయః పితర స్తథా ।
ప్రజానాం పతయో నాగా యే చాన్యే స్వర్గవాసినః ॥ 26 ॥

ఇంద్రుడు మొదలైన దేవతలూ, మహర్షులూ, పితృదేవతలూ, ప్రజాపతులు, నాగులు ఇంకా స్వర్గలోకంలో ఉండే ఇతర జాతుల వారందరూ ఆకాశంలో ఉండి జయజయ ధ్వనులు చేస్తున్నారు.

తతో మఙ్గలసమ్భారైర్విధిమన్త్రపురస్కృతమ్ ।
అభిషేచనికం ద్రవ్యం గృహీత్వా దేవతాగణాః ॥ 27 ॥

దేవతల సముదాయాలు మంగలద్రవ్యాలతో విధివిధానంగా మంత్రంతో పవిత్రమైన అభిషేచన పదార్థాలను తీసుకుని వచ్చారు.

ఇన్ద్రో విష్ణుర్మహావీర్యస్సూర్యాచన్ద్రమసౌ తథా ।
ధాతా చైవ విధాతా చ తథా చైవానిలానలౌ ॥ 28 ॥

ఇంద్రుడు, గొప్పశక్తిమంతుడైన విష్ణువు, సూర్యుడు, చంద్రుడు, ధాత, విధాత, వాయువు, అగ్ని,

పూషా భగోఽర్యమా త్వష్టా అంశునైవ వివస్వతా ।
పత్నీభ్యాం సహితో ధీమాన్ మిత్రేణ వరుణేన చ ॥ 29 ॥

పూష, భగుడు, అర్యముడు, త్వష్ట, అంశుమంతుడు, వివస్వంతుడు, మిత్రుడు, వరుణుడు, ఇద్దరు భార్యలతో సహా ధీమంతుడు అనే ఆదిత్యులు కూడ ఆకాశంలో ఉన్నారు.

రుద్రైర్వసుభిరాదిత్యైరశ్విభ్యాం చ వృతః ప్రభుః ।
విశ్వేదేవైర్మరుద్భిశ్చ సాధ్యైశ్చ పితృభిస్సహ ॥ 30 ॥

ఏకాదశ రుద్రులు, అష్ట వసువులు, ద్వాదశాదిత్యులు, అశ్వినీదేవత లిద్దరు, విశ్వేదేవతలు, మరుత్తులు, సాధ్యులు, పితరులు కూడ అక్కడ స్వామిని పరివేష్ఠించి ఉన్నారు.

గన్ధర్వైరప్సరోభిశ్చ యక్షరాక్షసపన్నగైః ।
దేవర్షిభిరసఙ్ఖ్యేయైస్తథా బ్రహ్మర్షిభిర్వరైః ॥ 31 ॥

గంధర్వులు, అప్సరసలు, యక్షులు, రాక్షసులు, పన్నగులు, లెక్క లేనంతమంది దేవఋషులు, శ్రేష్ఠులైన బ్రహ్మర్షులు,

వైఖానసైర్వాలఖిల్యైర్వాయ్వాహారైర్మరీచిపైః ।
భృగుభిశ్చాఙ్గిరోభిశ్చ యతిభిశ్చ మహాత్మభిః ॥ 32 ॥

వైఖానసులు, గాలిని, సూర్యకిరణాలను మాత్రమే ఆహారంగా పుచ్చుకునే వాలఖిల్యుడు మొదలైనవారు, భృగువులు, అంగిరసులు, మహానుభావులైన యతులు,

తథా విద్యాధరైః పుణ్యైర్యోగసిద్ధిభిరావృతః ।
పితామహః పులస్త్యశ్చ పులహశ్చ మహాతపాః ॥ 33 ॥

పుణ్యాత్ములైన విద్యాధరులు, యోగసిద్ధులు మొదలైన వారితో కూడి బ్రహ్మదేవుడు అక్కడ ఉన్నాడు. అలాగే పులస్త్యుడు, గొప్ప తపస్వి అయిన పులహుడు వచ్చారు.

అఙ్గిరాః కాశ్యపోఽ త్రిశ్చ మరీచిర్భృగురేవ చ ।
క్రతుర్హరః ప్రచేతాశ్చ మనుర్దక్షస్తథైవ చ ॥ 34 ॥

అంగిరసుడు, కాశ్యపుడు, అత్రి, మరీచి, భృగువు, క్రతువు, హరుడు, ప్రచేతసుడు, మనువు, దక్షుడు వచ్చారు.

ఋతవశ్చ గ్రహాశ్చైవ జ్యోతీంషి చ ద్విజోత్తమాః ।
మూర్తిమత్యశ్చ సరితో దేవాశ్చైవ సనాతనాః ॥ 35 ॥

విప్రవరులారా! ఋతువులు, గ్రహాలు, నక్షత్రాలు, పురాతనులైన దేవతలు, అక్కడికి వచ్చారు. నదులు ఆకారం ధరించి వచ్చాయి.

సముద్రాశ్చ హ్రదాశ్చైవ తీర్థాని వివిధాని చ ।
పృథివీ ద్యౌర్దిశశ్చైవ పాదపాశ్చ ద్విజోత్తమాః ॥ 36 ॥

బ్రాహ్మణోత్తములారా! సముద్రాలు, ప్రవాహాలు, అనేక పుణ్యతీర్థాలు, భూమి, ఆకాశం, దిక్కులు, వృక్షాలు, అక్కడికి వచ్చాయి.

అదితిర్దేవమాతా చ హ్రీః శ్రీః స్వాహా సరస్వతీ ।
ఉమా శచీ సినీవాలీ తథా చానుమతిః కుహూః ॥ 37 ॥

దేవతలకు తల్లి అయిన అదితి, హ్రీదేవి, శ్రీదేవి, స్వాహాదేవి, సరస్వతీదేవి, ఉమాదేవి, శచీదేవి, సినీవాలి (చంద్రకళతో కూడిన అమావాస్య), అనుమతి (ఒక్కకళ తక్కువైన చంద్రుడు కలిగిన పూర్ణిమ), కుహువు (చంద్రకళ కనబడని అమావాస్య) వచ్చాయి.

రాకా చ ధిషణా చైవ పత్న్యశ్చాన్యా దివౌకసామ్ ।
హిమవాంశ్చైవ విన్ధ్యశ్చ మేరుశ్చానేకశృఙ్గవాన్ ॥ 38 ॥

రాక(అన్ని కళలు గల పూర్ణచంద్రుడు గలిగిన పూర్ణిమ), ధిషణ (బుద్ధి), ఇంకా దేవతల భార్యలైన ఇతర కాంతలు ఆకాశంలో చేరి ఉన్నారు. హిమాలయం, వింధ్యం, పెక్కు శిఖరాలు గలిగిన మేరువు వచ్చాయి.

ఐరావతస్సానుచరః కలాః కాష్ఠాస్తథైవ చ ।
మాసార్ధం మాసఋతవస్తథా రాత్ర్యహనీ ద్విజాః ॥ 39 ॥

విప్రులారా! ఇంకా, అనుచరులతో కూడిన ఐరావతం, కళలు, కాష్ఠలు, పక్షం, నెలలు, ఋతువులు, రాత్రి, పగలు వచ్చాయి.

ఉచ్చైశ్శ్రవా హయశ్రేష్ఠో నాగరాజశ్చ వామనః ।
అరుణో గరుడశ్చైవ వృక్షాశ్చౌషధిభిస్సహ ॥ 40 ॥

గుఱ్ఱాలలో ఉత్తమమైన ఉచ్చైశ్రవమూ, వాసుకి, వామనుడు, అరుణుడు, గరుడుడు, వృక్షాలు, ఓషధులు వచ్చాయి.

ధర్మశ్చ భగవాన్ దేవస్సమాజగ్ముర్హి సఙ్గతాః ।
కాలో యమశ్చ మృత్యుశ్చ యమస్యానుచరాశ్చ యే ॥ 41 ॥

మహాత్ముడైన ధర్మదేవత, అందరూ కలిసి అక్కడికి వచ్చారు. కాలుడు, యముడు, మృత్యువు, ఇంకా యముడి అనుచరులైన ఇతరులు కూడ అక్కడికి వచ్చారు.

బహులత్వాచ్చ నోక్తా యే వివిధా దేవతాగణాః ।
తే దేవస్యాభిషేకార్థం సమాయాన్తి తతస్తతః ॥ 42 ॥

ఇంకా అనేక దేవతాగణాలు ఆ చోటికి వచ్చాయి. కాని వారు అసంఖ్యాకంగా ఉండటంచేత వారిని గురించి చెప్పడం లేదు. వీళ్లందరూ కూడ స్వామి అభిషేకం కోసమే తమ తమ ప్రాంతాలనుండి ఆ పురుషోత్తమ పుణ్యక్షేత్రానికి వచ్చారు.

గృహీత్వా తే తదా విప్రాస్సర్వే దేవా దివౌకసః ।
ఆభిషేచనికం భాణ్డం మఙ్గలాని చ సర్వశః ॥ 43 ॥

ద్విజులారా! స్వర్గంలో ఉండే దేవతలు మొదలైనవారు అందరూ అభిషేకానికి కావలసిన జలకలశాలు మొదలైన మంగళద్రవ్యాలను తీసుకుని అక్కడికి వచ్చారు.

దివ్యసమ్భారసంయుక్తైః కలశైః కాఞ్చనైర్ద్విజాః ।
సారస్వతీభిః పుణ్యాభిర్దివ్యతోయాభి రేవ చ ॥ 44 ॥

విప్రులారా! వారు అభిషేకానికి కావలసిన వివిధ మంగళ ద్రవ్యాలనూ, బంగారు కలశాలనూ, సరస్వతీ నదిలోని పవిత్ర జలాలనూ తీసుకుని వచ్చారు.

తోయేనాకాశగఙ్గాయాః కృష్ణం రామేణ సఙ్గతమ్ ।
సపుష్పైః కాఞ్చనైః కుమ్భైస్స్నాపయన్త్యమ్బరే స్థితాః ॥ 45 ॥

వారు ఆకాశంలో నిలిచి, బంగారు కలశాలలో నింపుకువచ్చిన పూలతో కూడిన ఆకాశగంగాజలంతో బలరాముడితో కలిసి ఉన్న కృష్ణస్వామిని (సుభద్రను) అభిషేకిస్తున్నారు.

సఞ్చరన్తి విమానాని దేవానామమ్బరే తథా ।
ఉచ్చావచాని దివ్యాని కామగాని స్థిరాణి చ ॥ 46 ॥

దేవతలు ఎక్కి వచ్చిన విమానాలు ఆకాశంలో సంచరిస్తున్నాయి. ఆ విమానాలు దివ్యమైనవి. కొన్ని బాగా ఎత్తుగానూ, కొన్ని తక్కువ ఎత్తుగానూ ఉన్నాయి. ఆ విమానాలు అన్నీ దృఢంగా చెక్కు చెదరకుండా ఉన్నాయి. అవి స్వేచ్ఛగా తమ యిష్టం వచ్చిన చోటికి వెళ్తాయి.

దివ్యరత్నవిచిత్రాణి సేవితాన్యప్సరోగణైః ।
గీతైర్వాద్యైః పతాకాభిశ్శోభితాని సమన్తతః ॥ 47 ॥

ఆ విమానాలు దేవలోకంలో పుట్టిన రకరకాలరత్నాలతో మనోహరంగా ఉన్నాయి. వాటిలో అప్సరసలు సేవలందిస్తుంటారు. సంగీతధ్వనులతోనూ, వివిధ వాద్యధ్వనులతోనూ, జెండాలతోనూ ఆ విమానాలు అంతటా చక్కగా ప్రకాశిస్తున్నాయి.

ఏవం తదా మునిశ్రేష్ఠాః కృష్ణం రామేణ సఙ్గతమ్ ।
స్నాపయిత్వా సుభద్రాం చ సంస్తువన్తి ముదాన్వితాః ॥ 48 ॥

మహర్షులారా! దేవతలు మొదలైనవారు అందరూ ఈవిధంగా శ్రీకృష్ణస్వామిని, బలరాముడినీ, సుభద్రనూ చక్కగా అభిషేకించి, సంతోషంగా వారిని ఈవిధంగా స్తుతిస్తున్నారు.

జయ జయ లోకపాల భక్తరక్షక జయ జయ ప్రణతవత్సల ।

లోకాలను పోషించేవాడా! భక్తులను కాపాడేవాడా! నీకు జయం. జయం. ఆశ్రయించినవారిపై ప్రేమ గలిగినస్వామీ! జయం, జయం.

జయ జయ భూతశరణ జయ జయ ఆదిదేవ బహుకారణ ।

అందరికీ దిక్కు అయినవాడా జయం, జయం. దేవతలకు కూడా ఆద్యుడా! అన్నింటికీ మూలమైనవాడా! జయం, జయం.

జయ జయ వాసుదేవ జయ జయాసురసంహరణ ।

అన్నింటా నిండి ఉన్నవాడా! జయం, జయం. రాక్షసులను సంహరించేవాడా! జయం, జయం.

జయ జయ దివ్యమీన జయ జయ త్రిదశవర ।

మత్స్యంగా అవతరించిన దైవమా, జయం, జయం. దేవతలలో శ్రేష్ఠుడా! జయం, జయం.

జయ జయ జలధిశయన జయ జయ యోగివర ।

సముద్రంలో శయనించేవాడా! జయం, జయం. యోగులలో శ్రేష్ఠుడా! జయం, జయం.

జయ జయ సూర్యనేత్ర జయ జయ దేవరాజ ।

సూర్యుడు కన్నుగా కలిగినవాడా! జయం, జయం. దేవతలను సంతోషపెట్టేవాడా! జయం, జయం.

జయ జయ కైటభారే జయ జయ వేదవర ।

కైటభుడు అనే రాక్షసుడిని సంహరించినవాడా! జయం, జయం. ఉత్తమమైన వేదం స్వరూపమైనవాడా! జయం, జయం.

జయ జయ కూర్మరూప జయ జయ యజ్ఞవర ।

కూర్మంగా అవతరించినస్వామీ! జయం, జయం. ఉత్తమమైన యజ్ఞం స్వరూపమైనవాడా! జయం, జయం.

జయ జయ కమలనాభ జయ జయ శైలచర ।

బొడ్డులో తామరపూవు కలిగినవాడా! జయం, జయం. మేరువు మొదలైన పర్వతాల మీద సంచరించేవాడా! జయం, జయం.

జయ జయ యోగశాయిన్ జయ జయ వేగధర ।

యోగవిద్యలో నిలిచి ఉండేవాడా! జయం, జయం. మిక్కిలి వేగం గలిగినవాడా! జయం, జయం.

జయ జయ విశ్వమూర్తే జయ జయ చక్రధర ।

విశ్వం స్వరూపమైనవాడా! జయం, జయం. సుదర్శనం అనే చక్రాన్ని ధరించినవాడా! జయం, జయం.

జయ జయ భూతనాథ జయ జయ ధరణీధర ।

సమస్తసృష్టికీ ప్రభువు అయినవాడా! జయం, జయం. శేష కూర్మాదిరూపాలలో భూమిని ధరించినవాడా! జయం, జయం.

జయ జయ శేషశాయిన్ జయ జయ పీతవాసః ।

ఆదిశేషుడిపై శయనించేవాడా! జయం, జయం. పచ్చని పట్టువస్త్రాన్ని ధరించినవాడా! జయం, జయం.

జయ జయ సోమకాన్త జయ జయ యోగవాస ।

చంద్రుడిలాగా చల్లనికాంతి గలిగిన స్వామీ! జయం, జయం. యోగంలో ఉండేవాడా! జయం, జయం.

జయ జయ దహనవక్త్ర జయ జయ ధర్మవాస ।

నోట అగ్ని గలిగిన(నోటినుండి అగ్నిని పుట్టించే)వాడా! జయం, జయం. ధర్మంలో నిలిచిఉండేవాడా! జయం, జయం.

జయ జయ గుణనిధాన జయ జయ శ్రీనివాస ।

సద్గుణాలకు నిలయమైనవాడా! జయం, జయం. లక్ష్మికి ఆధారమైనవాడా! జయం, జయం.

జయ జయ గరుడగమన జయ జయ సుఖనివాస ।

గరుడవాహనం మీద సంచరించేవాడా! జయం, జయం. సుఖమైన నివాసం కలిగినవాడా! జయం, జయం.

జయ జయ ధర్మకేతో జయ జయ మహీనివాస ।

ధర్మమే జెండా (గుర్తు)గా కలిగినవాడా! (ధర్మస్వరూపా!), జయం, జయం. ఆ యా అవతారాలలో భూమి మీద నివసించినవాడా! జయం, జయం.

జయ జయ గహనచరిత్ర జయ జయ యోగిగమ్య ।

తెలుసుకోవడానికి వీలులేని చరిత్ర గలిగినవాడా! జయం, జయం. యోగులకు లక్ష్యమైనవాడా! జయం, జయం.

జయ జయ మఖనివాస జయ జయ వేదవేద్య ।

యజ్ఞాలలో ఉండేవాడా! (యజ్ఞస్వరూపా!), జయం, జయం. వేదాలచేత మాత్రమే తెలియదగినవాడా! జయం, జయం.

జయ జయ శాన్తికర జయ జయ యోగిచిన్త్య ।

శాంతిని కలిగించేవాడా! జయం, జయం. యోగులచేత ధ్యానింపబడేవాడా! జయం, జయం.

జయ జయ పుష్టికర జయ జయ జ్ఞానమూర్తే ।

పుష్టిని కలిగించేవాడా! జయం, జయం. జ్ఞానమే స్వరూపమైనవాడా! జయం, జయం.

జయ జయ కమలాకర జయ జయ భావవేద్య ।

పుణ్యసరస్సు రూపమైనవాడా! జయం, జయం. మనసుతో మాత్రమే తెలుసుకోదగినవాడా! (కన్నులయెదుట కానరానివాడు) జయం, జయం.

జయ జయ ముక్తికర జయ జయ విమలదేహ ।

మోక్ష మిచ్చేవాడా! జయం, జయం. విశుద్ధమైన శరీరం కలిగినవాడా! జయం, జయం.

జయ జయ సత్త్వనిలయ జయ జయ గుణసముద్ర ।

శుద్ధమైన సత్త్వగుణానికి స్థానమైనవాడా! జయం, జయం. సముద్రమంతటి(మేర లేని)సద్గుణాలు కలిగినవాడా! జయం, జయం.

జయ జయ యజ్ఞకర జయ జయ గుణవిహీన ।

యజ్ఞం చేసేవాడా! జయం, జయం. ఏ గుణాలూ లేనివాడా! (గుణాలకు అతీతమైనవాడా!), జయం, జయం.

జయ జయ మోక్షకర జయ జయ భూశరణ్య ।

మోక్షాన్ని అనుగ్రహించేవాడా! జయం, జయం. మానవులందరకు దిక్కైనవాడా! జయం, జయం.

జయ జయ కాన్తియుత జయ జయ లోకశరణ ।

దివ్యమైన కాంతితో కూడినవాడా! జయం, జయం. లోకాలన్నింటికి దిక్కైనవాడా! జయం, జయం.

జయ జయ లక్ష్మీయుత జయ జయ పఙ్కజాక్ష ।

లక్ష్మీదేవితో కూడినవాడా! జయం, జయం. తామరపూవులవంటి కన్నులు కలిగినవాడా! జయం, జయం.

జయ జయ సృష్టికర జయ జయ యోగయుత ।

జగత్తులను సృష్టిచేసేవాడా! జయం, జయం. యోగంతో కూడినవాడా! జయం, జయం.

జయ జయాతసీకుసుమశ్యామదేహ జయ జయ సముద్రావిష్టదేహ ।

నల్ల అవిసెపూవువలె నల్లనైన శరీరం కలవాడా! జయం, జయం. సముద్రంలో శయనించేవాడా! జయం, జయం.

జయ జయ లక్ష్మీపఙ్కజషట్చరణ జయ జయ భక్తవశ ।

లక్ష్మీదేవి అనే పద్మానికి తుమ్మెదవంటివాడా! (లక్ష్మీరమణా!), జయం, జయం. భక్తులకు వశమయ్యేవాడా! జయం, జయం.

జయ జయ లోకకాన్త జయ జయ పరమశాన్త ।

లోకాలన్నింటికీ మనోహరమైనవాడా! జయం, జయం. ఉత్తమమైన శాంతమే రూపమైనవాడా! జయం, జయం.

జయ జయ పరమసార జయ జయ చక్రధర ।

సమస్తానికీ సారభూతమైనవాడా! జయం, జయం. సుదర్శనచక్రాన్ని ధరించినవాడా! జయం, జయం.

జయ జయ భోగియుత జయ జయ నీలామ్బర ।

నిరంతరం ఆదిశేషుడిపై శయనించి ఉండేవాడా! జయం, జయం. నల్లనివస్త్రాలు ధరించేవాడా! (బలరామ స్వరూపుడా!), జయం, జయం.

జయ జయ శాన్తికర జయ జయ మోక్షకర ।
జయ జయ కలుషహర ॥ 49 ॥

అందరికీ శాంతిని ఇచ్చేవాడా!, జయం, జయం. మోక్షాన్ని ఇచ్చేవాడా!, జయం, జయం. పాపాలను తొలగించేవాడా!, జయం, జయం.

జయ జయ కృష్ణ జగన్నాథ జయ జయ సఙ్కర్షణానుజ ।
జయ జయ పద్మపలాశాక్ష జయ జయ వాఞ్ఛాఫలప్రద ॥ 50 ॥

నల్లనివాడా! లోకాలన్నిటినీ రక్షించేవాడా! జయం, జయం. బలరాముడికి వెన్నంటి (తమ్ముడిగా) పుట్టినవాడా! జయం, జయం. తామర రేకుల వంటి కన్నులు కలవాడా! జయం, జయం. కోరిన కోరికలు ఇచ్చేవాడా! జయం, జయం.

జయ జయ మాలావృతోరస్క జయ జయ చక్రగదాధర ।
జయ జయ పద్మాలయాకాన్త జయ జయ విష్ణో నమోஉస్తు తే ॥ 51 ॥

మెడనిండా పూలమాలలు ధరించినవాడా! జయం, జయం. సుదర్శనచక్రాన్నీ, కౌమోదకీ గదను ధరించిన వాడా! జయం, జయం. లక్ష్మీనాథా! జయం, జయం. శ్రీమహావిష్ణూ! జయం, జయం. స్వామీ! నీకు నమస్కారం.

బ్రహ్మోవాచ:–బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

ఏవం స్తుత్వా తదా దేవాశ్శక్రాద్యా హృష్టమానసాః ।
సిద్ధచారణసఙ్ఘాశ్చ యే చాన్యే స్వర్గవాసినః ॥ 52 ॥

ఇంద్రుడు మొదలైన దేవతలూ, సిద్ధులూ, చారణులూ, ఇంకా స్వర్గలోకంలో నివసించే ఇతర జాతులవారు అందరూ ఆనందంగా ఈవిధంగా పురుషోత్తమస్వామిని జయజయధ్వానాలతో కీర్తించారు.

మునయో వాలఖిల్యాశ్చ కృష్ణం రామేణ సఙ్గతమ్ ।
సుభద్రాం చ మునిశ్రేష్ఠాః ప్రణిపత్యామ్బరే స్థితాః ॥ 53 ॥

మహర్షులారా! వాలఖిల్యుడు మొదలైన మహర్షులు కూడ బలరాముడితో కలిసి ఉన్న శ్రీకృష్ణస్వామికీ, సుభద్రకూ వినమ్రంగా నమస్కరించి ఆకాశంలో నిలిచి ఉన్నారు.

దృష్ట్వా స్తుత్వా నమస్కృత్వా తదా తే త్రిదివౌకసః ।
కృష్ణం రామం సుభద్రాం చ యాన్తి స్వం స్వం నివేశనమ్ ॥ 54 ॥

స్వర్గలోకనివాసులు అందరూ శ్రీకృష్ణ, బలరామ, సుభద్రలను దర్శనం చేసుకుని, స్తుతించి, నమస్కరించి ఎవరి ఇండ్లకు వాళ్లు వెళ్లిపోయారు.

సఞ్చరన్తి విమానాని దేవానామమ్బరే తదా ।
ఉచ్చావచాని దివ్యాని కామగాని స్థిరాణి చ ॥ 55 ॥

దేవతలు పురుషోత్తమక్షేత్రంనుండి తమ తమ నివాసాలకు తిరిగి బయలుదేరిన విమానాలు ఆకాశంలో సంచరిస్తున్నాయి. ఆ విమానాలు దివ్యమైనవి. కొన్ని బాగా ఎత్తుగానూ, కొన్ని తక్కువఎత్తుగానూ ఉన్నాయి. ఆ విమానాలు అన్నీ దృఢంగా చెక్కు చెదరకుండా ఉంటాయి. అవి స్వేచ్ఛగా తమ యిష్టం వచ్చిన చోటికి వెళ్తాయి.

దివ్యరత్నవిచిత్రాణి సేవితాన్యప్సరోగణైః ।
గీతైర్వాద్యైః పతాకాభిశ్శోభితాని సమన్తతః ॥ 56 ॥

అవి దేవలోకంలో పుట్టిన రకరకాల రత్నాలతో మనోహరంగా ఉన్నాయి. వాటిలో అప్సరసలు సేవ లందిస్తుంటారు. సంగీత ధ్వనులతోనూ, వివిధ వాద్యధ్వనులతోనూ, జెండాలతోనూ ఆ విమానాలు అంతటా చక్కగా ప్రకాశిస్తున్నాయి.

తస్మిన్ కాలే తు యే మర్త్యాః పశ్యన్తి పురుషోత్తమమ్ ।
బలభద్రం సుభద్రాం చ తే యాన్తి పదమవ్యయమ్ ॥ 57 ॥

ఆ సమయంలో (జ్యేష్ఠపూర్ణిమనాడు) పురుషోత్తమక్షేత్రంలో కృష్ణుడినీ, బలరాముడినీ, సుభద్రనూ దర్శించిన మానవులు శాశ్వతమైన మోక్షపదవిని పొందుతారు.

సుభద్రారామసహితం మఞ్చస్థం పురుషోత్తమమ్ ।
దృష్ట్వా నిరామయం స్థానం యాన్తి నాస్త్యత్ర సంశయః ॥ 58 ॥

సుభద్రతోనూ, బలరాముడితోనూ కలిసి పురుషోత్తమస్వామిని వేదికపై ఉండగా దర్శించివారు నిస్సందేహంగా శుభనిర్భరమైన స్థానానికి వెళ్తారు.

కపిలాశతదానేన యత్ఫలం పుష్కరే స్మృతమ్ ।
తత్ఫలం కృష్ణమాలోక్య మఞ్చస్థం సహలాయుధమ్ ॥
సుభద్రాం చ మునిశ్రేష్ఠాః ప్రాప్నోతి శుభకృన్నరః ॥ 59 ॥

మహర్షులారా! శుభకర్మల నాచరించే మానవుడు, బలరాముడితో కలిసిఉన్న శ్రీకృష్ణస్వామినీ, సుభద్రాదేవినీ (జ్యేష్ఠపూర్ణిమనాడు పురుషోత్తమక్షేత్రంలో) వేదికపై ఉండగా దర్శించుకుంటే, పుష్కరతీర్థంలో నూరు కపిలగోవులను దానం చేసిన పుణ్యఫలాన్ని పొందుతాడు.

కన్యాశతప్రదానేన యత్ఫలం సముదాహృతమ్ ।
తత్ఫలం కృష్ణమాలోక్య మఞ్చస్థం లభతే నరః ॥ 60 ॥

(పురుషోత్తమక్షేత్రంలో జ్యేష్ఠపూర్ణిమనాడు అభిషేక) వేదికపై (బలరాముడు, సుభద్రలతో కలిసి వేంచేసి) ఉన్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు, వందమంది కన్యలను దానంచేస్తే ఏ పుణ్యం వస్తుందని శాస్త్రాలు చెప్తున్నాయో, ఆ పుణ్యం పొందుతాడు.

సువర్ణశతనిష్కాణాం దానేన యత్ఫలం స్మృతమ్ ।
తత్ఫలం కృష్ణమాలోక్య మఞ్చస్థం లభతే నరః ॥ 61 ॥

(పురుషోత్తమక్షేత్రంలో జ్యేష్ఠపూర్ణిమనాడు అభిషేక) వేదికపై (బలరాముడు, సుభద్రలతో కలిసి వేంచేసి) ఉన్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు నూరు బంగారు నాణాలు దానం చేసిన పుణ్యఫలం పొందుతాడు.

గోసహస్రప్రదానేన యత్ఫలం పరికీర్తితమ్ ।
తత్ఫలం కృష్ణమాలోక్య మఞ్చస్థం లభతే నరః ॥ 62 ॥

(పురుషోత్తమక్షేత్రంలో జ్యేష్ఠపూర్ణిమనాడు అభిషేక) వేదికపై (బలరాముడు, సుభద్రలతో కలిసి వేంచేసి) ఉన్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు వేయి ఆవులు దానం చేసిన పుణ్యఫలం పొందుతాడు.

**భూమిదానేన విధివద్ యత్ఫలం సముదాహృతమ్ ।
తత్ఫలం కృష్ణమాలోక్య మఞ్చస్థం లభతే నరః ॥ 63 ॥**

పురుషోత్తమక్షేత్రంలో జ్యేష్ఠపూర్ణిమనాడు అభిషేక వేదికపై బలరాముడు, సుభద్రలతో కలిసి వేంచేసి ఉన్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు విధివిధానంగా భూమిని దానం చేస్తే ఏ ఫలం వస్తుందని చెప్తారో, ఆ పుణ్యఫలం పొందుతాడు.

**యత్ఫలం చాన్నదానేన అర్ఘాతిథ్యేన కీర్తితమ్ ।
తత్ఫలం కృష్ణమాలోక్య మఞ్చస్థం లభతే నరః ॥ 64 ॥**

పురుషోత్తమక్షేత్రంలో జ్యేష్ఠపూర్ణిమనాడు అభిషేక వేదికపై బలరాముడు, సుభద్రలతో కలిసి వేంచేసి ఉన్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు అతిథులకు అర్ఘ్యం, పాద్యం మొదలైన ఉపచారాలతో, అన్నదానం చేసిన పుణ్యఫలం పొందుతాడు.

**వృషోత్సర్గేణ విధివద్ యత్ఫలం సముదాహృతమ్ ।
తత్ఫలం కృష్ణమాలోక్య మఞ్చస్థం లభతే నరః ॥ 65 ॥**

పురుషోత్తమక్షేత్రంలో జ్యేష్ఠపూర్ణిమనాడు అభిషేక వేదికపై బలరాముడు, సుభద్రలతో కలిసి వేంచేసి ఉన్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు శాస్త్రోక్తమైన పద్ధతిలో ఆబోతును ఊరికి విడిచి పెట్టడంచేత ఏ ఫలం వస్తుందని చెప్తారో, ఆ పుణ్యఫలం పొందుతాడు.

**యత్ఫలం తోయదానేన గ్రీష్మే వాన్యత్ర కీర్తితమ్ ।
తత్ఫలం కృష్ణమాలోక్య మఞ్చస్థం లభతే నరః ॥ 66 ॥**

పురుషోత్తమక్షేత్రంలో జ్యేష్ఠపూర్ణిమనాడు అభిషేక వేదికపై బలరాముడు, సుభద్రలతో కలిసి వేంచేసి ఉన్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు వేసవి కాలంలోనూ, ఇంకా అలా బాగా దాహం వేసే సమయంలో నీటిని దానం చేసిన పుణ్యఫలం పొందుతాడు.

**తిలధేనుప్రదానేన యత్ఫలం పరికీర్తితమ్ ।
తత్ఫలం కృష్ణమాలోక్య మఞ్చస్థం లభతే నరః ॥ 67 ॥**

(పురుషోత్తమక్షేత్రంలో జ్యేష్ఠపూర్ణిమనాడు అభిషేక) వేదికపై (బలరాముడు, సుభద్రలతో కలిసి వేంచేసి) ఉన్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు ఆవు(పరిమాణంలో) అంతటి ఎత్తుగా రాసిపోసి నువ్వులను దానం చేస్తే (బ్రాహ్మణులకు దానం చేసిన ఆవు తిలధేనువని మరొక అభిప్రాయం) ఏ ఫలం వస్తుందని చెప్తారో, ఆ పుణ్యఫలం పొందుతాడు.

**గజాశ్వరథదానేన యత్ఫలం సముదాహృతమ్ ।
తత్ఫలం కృష్ణమాలోక్య మఞ్చస్థం లభతే నరః ॥ 68 ॥**

పురుషోత్తమక్షేత్రంలో జ్యేష్ఠపూర్ణిమనాడు అభిషేక వేదికపై బలరాముడు, సుభద్రలతో కలిసి వేంచేసి ఉన్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు ఏనుగులు, గుఱ్ఱాలు, రథాలు దానం చేసిన పుణ్యఫలం పొందుతాడు.

సువర్ణశృఙ్గీదానేన యత్ఫలం సముదాహృతమ్ ।
తత్ఫలం కృష్ణమాలోక్య మఞ్చస్థం లభతే నరః ॥ 69 ॥

పురుషోత్తమక్షేత్రంలో జ్యేష్ఠపూర్ణిమనాడు అభిషేక వేదికపై బలరాముడు, సుభద్రలతో కలిసి వేంచేసి ఉన్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు కొమ్ములకు బంగారు తొడుగులు వేసిన ఆవులను దానం చేసిన పుణ్యఫలం పొందుతాడు.

జలధేనుప్రదానేన యత్ఫలం సముదాహృతమ్ ।
తత్ఫలం కృష్ణమాలోక్య మఞ్చస్థం లభతే నరః ॥ 70 ॥

పురుషోత్తమక్షేత్రంలో జ్యేష్ఠపూర్ణిమనాడు అభిషేక వేదికపై బలరాముడు, సుభద్రలతో కలిసి వేంచేసి ఉన్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు గర్భవతి అయిన ఆవును (కడుపులోని బిడ్డతో సహా) చేసిన పుణ్యఫలం పొందుతాడు.

దానేన ఘృతధేన్వాశ్చ ఫలం యత్ సముదాహృతమ్ ।
తత్ఫలం కృష్ణమాలోక్య మఞ్చస్థం లభతే నరః ॥ 71 ॥

పురుషోత్తమక్షేత్రంలో జ్యేష్ఠపూర్ణిమనాడు అభిషేక వేదికపై బలరాముడు, సుభద్రలతో కలిసి వేంచేసి ఉన్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు నేయి ఎక్కువగా వచ్చే పాలు ఇచ్చే (మంచిపాడి)ఆవును దానం చేసిన పుణ్యఫలం పొందుతాడు.

చాన్ద్రాయణేన చీర్ణేన యత్ఫలం సముదాహృతమ్ ।
తత్ఫలం కృష్ణమాలోక్య మఞ్చస్థం లభతే నరః ॥ 72 ॥

పురుషోత్తమక్షేత్రంలో జ్యేష్ఠపూర్ణిమనాడు అభిషేక వేదికపై బలరాముడు, సుభద్రలతో కలిసి వేంచేసి ఉన్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు చాంద్రాయణవ్రతాన్ని నెలపొడుగునా చంద్రుడికళలతో సమానసంఖ్యలో మాత్రమే అన్నం ముద్దలు ఆహారంగా తీసుకోవడం) చేస్తే ఏ ఫలం వస్తుందని చెప్పబడిందో, ఆ పుణ్యఫలం పొందుతాడు.

మాసోపవాసైర్విధివద్ యత్ఫలం సముదాహృతమ్ ।
తత్ఫలం కృష్ణమాలోక్య మఞ్చస్థం లభతే నరః ॥ 73 ॥

పురుషోత్తమక్షేత్రంలో జ్యేష్ఠపూర్ణిమనాడు అభిషేక వేదికపై బలరాముడు, సుభద్రలతో కలిసి వేంచేసి ఉన్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు విధివిధానంగా నెల మొత్తం ఉపవాసం ఉంటే ఏ ఫలం వస్తుందని చెప్పబడిందో, ఆ పుణ్యఫలం పొందుతాడు.

అథ కిం బహునోక్తేన భాషితేన పునః పునః ।
తస్య దేవస్య మాహాత్మ్యం మఞ్చస్థస్య ద్విజోత్తమాః ॥ 74 ॥

బ్రాహ్మణోత్తములారా! ఇంతెందుకు? వేదికపై ఉన్న పురుషోత్తమస్వామి మహిమను గురించి, చెప్పిన విషయాన్నే మళ్లీ మళ్లీ ఎక్కువగా చెప్పడం దేనికి?

యత్ఫలం సర్వతీర్థేషు వ్రతైర్దానైశ్చ కీర్తితమ్ ।
తత్ఫలం కృష్ణమాలోక్య మఞ్చస్థం సహలాయుధమ్ ॥ 75 ॥

సుభద్రాం చ మునిశ్రేష్ఠాః ప్రాప్నోతి శుభకృన్నరః ।
తస్మాన్నరోఽథ వా నారీ పశ్యేత్తం పురుషోత్తమమ్ ॥ 76 ॥

విప్రోత్తములారా! సమస్తమైన పుణ్యతీర్థాలను సేవిస్తేనూ, ఆ తీర్థాలలో రకరకాల వ్రతాలూ, దానాలూ చేస్తేనూ ఏ ఫలం వస్తుం దని చెప్తారో, ఆ పుణ్యఫలం మొత్తం పురుషోత్తమక్షేత్రంలో జ్యేష్ఠపూర్ణిమనాడు అభిషేకవేదికపై బలరాముడు, సుభద్రలతో కలిసి వేంచేసి ఉన్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు పొందుతాడు. అందుచేత పురుషుడు కానీ, స్త్రీ కాని ఎవరయినా పురుషోత్తముడిని తప్పకుండా దర్శించుకోవాలి.

తతస్సమస్తతీర్థానాం లభేత్ స్నానాదికం ఫలమ్ ।
స్నానశేషేణ కృష్ణస్య తోయేనాత్మాఽభిషిచ్యతే ॥ 77 ॥

శ్రీకృష్ణస్వామికి అభిషేకం చేసిన తరువాత మిగిలిన ఆ నీళ్ళతో భక్తుడు తన శరీరం అంతా తడుపుకోవాలి. దానివల్ల అతడు సమస్తమైన పుణ్యతీర్థాలలోనూ స్నానం చేసిన ఫలితాన్ని పొందుతాడు.

వన్ధ్యా మృతప్రజా యా తు దుర్భగా గ్రహపీడితా ।
రాక్షసాద్యైర్గృహీతా వా తథా రోగైశ్చ సంహతాః ॥ 78 ॥

సద్యస్తాస్స్నానశేషేణ ఉదకే నాభిషేచితాః ।
ప్రాప్నువన్తీప్సితాన్ కామాన్ యాన్ వాఞ్ఛన్తి తథేప్సితాన్ ॥ 79 ॥

బిడ్డలు లేనిదీ (గొడ్రాలు), బిడ్డలు చనిపోయినదీ, భర్త విడిచిపెట్టినదీ, గ్రహాలవలన బాధపడుతున్నదీ, రాక్షసులు మొదలైన దుర్మార్గుల బారిన పడినదీ, రోగాలతో బాధలు పడేదీ అయినస్త్రీ, పురుషోత్తమస్వామికి స్నానం చేయించగా మిగిలిన నీళ్లతో స్నానం చేస్తే తత్క్షణమే కోరుకున్నవాటి నన్నిటినీ పొందుతుంది. మనసులో ఉన్న చిరకాల వాంఛితాలు కూడ పొందుతుంది.

పుత్రార్థినీ లభేత్ పుత్రాన్ సౌభాగ్యం చ సుఖార్థినీ ।
రోగార్తా ముచ్యతే రోగాద్ ధనం చ ధనకాఙ్క్షిణీ ॥ 80 ॥

కొడుకులను కోరుకున్న స్త్రీకి కొడుకులు పుట్టారు. సుఖం కోరుకున్న స్త్రీకి మాంగల్యభాగ్యం లభిస్తుంది. రోగాలతో బాధపడే స్త్రీకి ఆ రోగాలు పోతాయి. సంపదలు కావాలనుకున్న స్త్రీకి సంపదలు కలుగుతాయి.

పుణ్యాని యాని తోయాని తిష్ఠన్తి ధరణీతలే ।
తాని స్నానావశేషస్య కలాం నార్హన్తి షోడశీమ్ ॥ 81 ॥

ఈ భూమిమీద ఉన్న మిక్కిలి పుణ్యప్రదమైనతీర్థాలు అన్నీ కృష్ణస్వామి స్నానం చేయగా మిగిలిన నీళ్లలో పదహారవకళకు కూడ సరిపోవు. (పదహారోవంతు పుణ్యం కూడ ఇవ్వలేవు.)

తస్మాత్ స్నానావశేషం యత్ కృష్ణస్య సలిలం ద్విజాః ।
తే నాభిషిఞ్చేద్ గాత్రాణి సర్వకామప్రదం హి తత్ ॥ 82 ॥

విప్రులారా! అందుచేత కృష్ణస్వామికి అభిషేకం చేయగా మిగిలిన నీళ్ళతో చక్కగా స్నానం చేయాలి. దానివల్ల కోరిక లన్నీ సిద్ధిస్తాయి.

స్నాతం పశ్యన్తి యే కృష్ణం వ్రజన్తం దక్షిణాముఖమ్ ।
బ్రహ్మహత్యాదిభిః పాపైర్ముచ్యన్తే తే న సంశయః ॥ 83 ॥

స్నానం చేసి, దక్షిణంవైపుగా (రథంలో ఊరేగింపుగా) బయలుదేరిన కృష్ణస్వామిని దర్శించుకున్నవారికి బ్రహ్మహత్య మొదలైన మహాపాతకాలు కూడ నశిస్తాయి. సందేహం లేదు.

శాస్త్రేషు యత్ఫలం ప్రోక్తం పృథివ్యాస్త్రిప్రదక్షిణైః ।
దృష్ట్వా నరో లభేత్ కృష్ణం వ్రజన్తం దక్షిణాముఖమ్ ॥ 84 ॥

భూమి చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేస్తే ఏ ఫలితం లభిస్తుందో, ఆ పుణ్యఫలం దక్షిణంవైపుగా పయనిస్తున్న (ఊరేగుతున్న) కృష్ణస్వామిని దర్శించిన మానవుడు పొందుతాడు.

తీర్థయాత్రాఫలం యత్తు పృథివ్యాం సముదాహృతమ్ ।
దృష్ట్వా నరో లభేత్ కృష్ణం తత్ఫలం దక్షిణాముఖమ్ ॥ 85 ॥

భూమిమీద ఉన్న పుణ్యతీర్థాలన్నీ తిరిగి సేవిస్తే కలిగే పుణ్యఫలం దక్షిణం వైపుగా ఊరేగుతున్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు పొందుతాడు.

బదర్యా యత్ఫలం ప్రోక్తం దృష్ట్వా నారాయణం నరమ్ ।
దృష్ట్వా నరో లభేత్ కృష్ణం తత్ఫలం దక్షిణాముఖమ్ ॥ 86 ॥

బదరీక్షేత్రానికి వెళ్లి, అక్కడ నరనారాయణులను దర్శించుకుంటే లభించే పుణ్యఫలం దక్షిణంవైపుగా ఊరేగుతున్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు పొందుతాడు.

గఙ్గాద్వారే కురుక్షేత్రే స్నానదానేన యత్ఫలమ్ ।
దృష్ట్వా నరో లభేత్ కృష్ణం తత్ఫలం దక్షిణాముఖమ్ ॥ 87 ॥

గంగాద్వారం (హరిద్వారం)లోనూ, కురుక్షేత్రంలోనూ స్నానమూ, దానమూ చేస్తే లభించే పుణ్యఫలం దక్షిణంవైపుగా ఊరేగుతున్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు పొందుతాడు.

ప్రయాగే చ మహామాఘ్యాం యత్ఫలం సముదాహృతమ్ ।
దృష్ట్వా నరో లభేత్ కృష్ణం తత్ఫలం దక్షిణాముఖమ్ ॥ 88 ॥

మాఘమాసంలోని పూర్ణిమ (మహామాఘి) నాడు ప్రయాగలో స్నానమూ, దానమూ చేస్తే లభించే పుణ్యఫలం దక్షిణంవైపుగా ఊరేగుతున్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు పొందుతాడు.

శాలగ్రామే మహాచైత్ర్యాం స్నానదానేన యత్ఫలమ్ ।
దృష్ట్వా నరో లభేత్ కృష్ణం తత్ఫలం దక్షిణాముఖమ్ ॥ 89 ॥

చైత్రమాసంలోని పూర్ణిమ (మహాచైత్రి) నాడు శాలగ్రామతీర్థంలో స్నానమూ, దానమూ చేస్తే లభించే పుణ్యఫలం దక్షిణం వైపుగా ఊరేగుతున్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు పొందుతాడు.

మహాభిధానకార్తిక్యాం పుష్కరే యత్ఫలం స్మృతమ్ ।
దృష్ట్వా నరో లభేత్ కృష్ణం తత్ఫలం దక్షిణాముఖమ్ ॥ 90 ॥

కార్తికమాసంలోని పూర్ణిమ (మహాకార్తికి) నాడు పుష్కరతీర్థంలో స్నానమూ, దానమూ చేస్తే లభించే పుణ్యఫలం దక్షిణంవైపుగా ఊరేగుతున్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు పొందుతాడు.

యత్ఫలం స్నానదానేన గఙ్గాసాగరసఙ్గమే ।
దృష్ట్వా నరో లభేత్ కృష్ణం తత్ఫలం దక్షిణాముఖమ్ ॥ 91 ॥

గంగానది సముద్రంలో కలిసిన పవిత్రతీర్థంలో స్నానమూ, దానమూ చేస్తే లభించే పుణ్యఫలం దక్షిణంవైపుగా ఊరేగుతున్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు పొందుతాడు.

గ్రస్తే సూర్యే కురుక్షేత్రే స్నానదానేన యత్ఫలమ్ ।
దృష్ట్వా నరో లభేత్ కృష్ణం తత్ఫలం దక్షిణాముఖమ్ ॥ 92 ॥

సూర్యగ్రహణంనాడు కురుక్షేత్రంలో స్నానమూ, దానమూ చేస్తే లభించే పుణ్యఫలం దక్షిణం వైపుగా ఊరేగుతున్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు పొందుతాడు.

గంగాయాం సర్వతీర్థేషు యామునేషు చ భో ద్విజాః ।
సారస్వతేషు తీర్థేషు తథాన్యేషు సరస్సు చ ॥ 93 ॥

యత్ఫలం స్నానదానేన విధివత్ సముదాహృతమ్ ।
దృష్ట్వా నరో లభేత్ కృష్ణం తత్ఫలం దక్షిణాముఖమ్ ॥ 94 ॥

ఓ బ్రాహ్మణులారా! గంగా, యమునా, సరస్వతీ నదులకు సంబంధించిన వివిధ నదులలో, అదే విధంగా ఇతరమైన పుణ్యసరస్సులలోనూ శాస్త్రోక్తమైన పద్ధతిలో స్నానమూ, దానమూ చేస్తే లభించే పుణ్యఫలం దక్షిణంవైపుగా ఊరేగుతున్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు పొందుతాడు.

పుష్కరే చాథ తీర్థేషు గయే చామరకణ్టకే ।
నిమిషాదిషు తీర్థేషు క్షేత్రేష్వాయతనేషు చ ॥ 95 ॥

యత్ఫలం స్నానదానేన రాహుగ్రస్తే దివాకరే ।
దృష్ట్వా నరో లభేత్ కృష్ణం తత్ఫలం దక్షిణాముఖమ్ ॥ 96 ॥

సూర్యుడిని రాహువు పట్టుకున్న (సూర్యగ్రహణ) సమయంలో పుష్కరం, గయ, అమరకంటకం, నైమిషం, మొదలైన పుణ్యతీర్థాలలోనూ, పుణ్యక్షేత్రాలలోనూ, దేవాలయాలలోనూ, స్నానమూ, దానమూ, దర్శనమూ చేయడంవల్ల లభించే పుణ్యఫలం దక్షిణం వైపుగా ఊరేగుతున్న కృష్ణస్వామిని దర్శించిన మానవుడు పొందుతాడు.

అథ కిం పునరుక్తేన భాషితేన పునః పునః ।
యత్కిఞ్చిత్ కథితం చాత్ర ఫలం పుణ్యస్య కర్మణః ॥ 97 ॥

వేదే శాస్త్రే పురాణే చ భారతే చ ద్విజోత్తమాః ।
ధర్మశాస్త్రేషు సర్వేషు తథాఽన్యత్ర మనీషిభిః ॥ 98 ॥

దృష్ట్వా నరో లభేత్ కృష్ణం నారీ వా హలాయుధమ్ ।
తత్ఫలం భద్రయా సార్ధం వ్రజన్తం దక్షిణాముఖమ్ ॥ 99 ॥

చెప్పిన విషయాన్నే మళ్లీ మళ్లీ ఎక్కువగా చెప్పడం దేనికి? ఆయా పుణ్యకర్మలకు ఏ ఫలితం గలుగుతుందని వేదాలూ, ఇతర శాస్త్రాలూ, పురాణాలూ, భారతమూ, ధర్మశాస్త్రాలూ ఇంకా ఇతర గ్రంథాలు సమస్తమూ చెప్తున్నాయో, ఆయా సందర్భాలలో మహాత్ములు చెప్పారో, ఆ పుణ్యఫలం సమస్తం బలరాముడితోనూ, సుభద్రతోనూ కలిసి, దక్షిణంవైపుగా ఊరేగుతున్న శ్రీకృష్ణస్వామిని చూచిన పురుషుడు, గానీ స్త్రీ కానీ తప్పక పొందుతారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే కృష్ణస్నానమాహాత్మ్యవర్ణనం నామ ద్విషష్టితమోఽధ్యాయః ॥ 62 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషి సంవాదంలో కృష్ణస్నానమాహాత్మ్యవర్ణనం అనే అరవైరెండవ అధ్యాయం సంపూర్ణం.



త్రిషష్టితమోఽ ధ్యాయః - అరవైమూడవ అధ్యాయం

గుండికా యాత్రామాహాత్మ్యనిరూపణమ్ - గుండికా యాత్రా మాహాత్మ్యనిరూపణం

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈ విధంగా చెప్తున్నాడు.

గుణ్డికామణ్డపం యాన్తం యే పశ్యన్తి రథే స్థితమ్ ।
కృష్ణం బలం సుభద్రాం చ తే యాన్తి భవనం హరేః ॥ 1 ॥

రథం మీద, గుండిక అనే పేరు గల మండపానికి వెళ్తున్న కృష్ణుడు, బలరాముడు, సుభద్రలను దర్శించుకున్న వారు శ్రీమహావిష్ణుమందిరానికి వెళ్తారు.

యే పశ్యన్తి తదా కృష్ణం సప్తాహం మణ్డపే స్థితమ్ ।
హలినం చ సుభద్రాం చ విష్ణులోకం వ్రజన్తి తే ॥ 2 ॥

ఏడు రోజులపాటు గుండికామండపంలో ఉన్న కృష్ణస్వామినీ, బలభద్రుడినీ, సుభద్రనూ దర్శించినవారు విష్ణులోకానికి వెళ్తారు.

మునయ ఊచుః :-మహర్షులు బ్రహ్మదేవుడితో ఇలా అంటున్నారు.

కేన సా నిర్మితా యాత్రా గుణ్డికామణ్డపే శుభే ।
యాత్రాఫలం చ కిం తత్ర ప్రాప్యతే బ్రూహి మానవైః ॥ 3 ॥

బ్రహ్మదేవా! శుభప్రదమైన గుండికా మండప యాత్రను ఎవరు ఏర్పరిచారు? ఆ యాత్ర చేయడంవల్ల మానవులు పొందే ఫలితం ఏమిటో చెప్పవలసింది.

కిమర్థం సరస స్తీరే రాజ్ఞస్తస్య జగత్పతిః ।
పవిత్రే విజనే దేశే గత్వా తత్ర చ మణ్డపే ॥ 4 ॥

కృష్ణస్సఙ్కర్షణశ్చైవ సుభద్రా వా రథేన తే ।
స్వస్థానం సమ్పరిత్యజ్య సప్తరాత్రం వసన్తి చ ॥ 5 ॥

లోకనాథుడైన శ్రీకృష్ణస్వామి, బలరాముడు, సుభద్రలు ముగ్గురు రథం మీద నిర్మానుష్యమూ, పావనమూ అయిన ఇంద్రద్యుమ్న సరస్సు తీరప్రదేశానికి ఎందుకు వెళ్లారు? తమ నివాసాన్ని (దేవాలయాన్ని) విడిచిపెట్టి, గుండికా మండపంలో ఏడు రోజులు ఎందుకున్నారు?

బ్రహ్మోవాచ :-బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

ఇన్ద్రద్యుమ్నేన భో విప్రాః పురా వై ప్రార్థితో హరిః ।
సప్తాహం సరసస్తీరే మమ యాత్రా భవత్వితి ॥ 6 ॥

ఓ బ్రాహ్మణులారా! పూర్వం ఇంద్రద్యుమ్న మహారాజు శ్రీహరిని తాను నిర్మించిన (ఇంద్రద్యుమ్న) సరస్సు ఒడ్డున, ఏడురోజులు పాటు యాత్ర చేయమని ప్రార్థించాడు.

గుణ్డికా నామ దేవేశ భుక్తిముక్తిఫలప్రదా ।
తస్మై కిల వరం చాసౌ దదౌ స పురుషోత్తమః ॥ 7 ॥

గుండిక అనే ఆ ప్రదేశం ఇంద్రభోగాలనూ, మోక్షాన్నీ ప్రసాదిస్తుంది. దేవతాసార్వభౌముడైన శ్రీ మహావిష్ణువు ఇంద్రద్యుమ్నుడు కోరిన విధంగా అక్కడ ఉంటానని వరమిచ్చాడు.

శ్రీభగవానువాచ :– శ్రీమన్నారాయణుడు అంటున్నాడు.

సప్తాహం సరసస్తీరే తవ రాజన్ భవిష్యతి ।
గుణ్డికా నామ యాత్రా మే సర్వకామఫలప్రదా ॥ 8 ॥

మహారాజా! ఇంద్రద్యుమ్న సరస్సు తీరంలో ఏడు రోజులు నా యాత్ర జరుగుతుంది. గుండిక అనే పేరు గలిగిన ఆ యాత్ర సమస్తమైన కోరికలను తీరుస్తుంది.

యే మాం తత్రార్చయిష్యన్తి శ్రద్ధయా మణ్డపే స్థితమ్ ।
సఙ్కర్షణం సుభద్రాం చ విధివత్ సుసమాహితాః ॥ 9 ॥

రాజా! ఇంద్రద్యుమ్న సరస్సు తీరంలో వేదికపై ఉన్న నన్ను, బలరాముడినీ, సుభద్రనూ శాస్త్రోక్తమైన పద్ధతిలో తదేకబుద్ధితో పూజించాలి.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః స్త్రియశ్శూద్రాశ్చ వై నృప ।
పుష్పైర్గన్ధైస్తథా ధూపైర్దీపైర్నైవేద్యకైర్వరైః ॥ 10 ॥

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, స్త్రీలు, అందరూ పూజించవచ్చు. ఆ అర్చనలో ఉత్తమమైన వివిధ గంధాలూ, పుష్పాలూ, ధూపాలూ, దీపాలూ, నైవేద్యాలూ సమర్పించాలి.

ఉపహారైర్బహువిధైః ప్రణిపాతైః ప్రదక్షిణైః ।
జయశబ్దైస్తథా స్తోత్రైర్గీతైర్వాద్యైర్మనోహరైః ॥ 11 ॥

రకరకాల కానుకలు ఇవ్వాలి. ప్రదక్షిణలు చేయాలి. సాష్టాంగనమస్కారాలు చేయాలి. జయ జయ ధ్వానాలు చేయాలి. మనోహరమైన స్తోత్రాలు పఠించాలి. పాటలు పాడాలి. వివిధ వాద్యాలను వాయించాలి.

న తేషాం దుర్లభం కిఞ్చిత్ ఫలం యస్య యదీప్సితమ్ ।
భవిష్యతి నృపశ్రేష్ఠ మత్ప్రసాదాదసంశయమ్ ॥ 12 ॥

మహారాజా! గుండికామండపంలో నన్ను ఈవిధంగా చక్కగా పూజించిన వారందరికీ సాధ్యం కాని దంటూ ఏమీ ఉండదు. నా అనుగ్రహంచేత వారి కోరికలన్నీ నెరవేరతాయి. సందేహం లేదు.

బ్రహ్మోవాచ :–బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

ఏవముక్త్వా తు తం దేవ స్తత్రైవాన్తరధీయత ।
స తు రాజవరశ్శ్రీమాన్ కృతకృత్యోఽభవత్ తదా ॥ 13 ॥

ఇంద్రద్యుమ్నుడితో ఇలా చెప్పి, శ్రీమహావిష్ణువు అక్కడే అంతర్ధానమైనాడు. శ్రీమన్నారాయణుని అనుగ్రహం చేత మహాత్ముడైన ఇంద్రద్యుమ్న మహారాజు కృతార్థుడైనాడు.

తస్మాత్ సర్వప్రయత్నేన గుణ్డికాయాం ద్విజోత్తమాః ।
సర్వకామప్రదం దేవం పశ్యేత్ తం పురుషోత్తమమ్ ॥ 14 ॥

విప్రవరేణ్యులారా! అందుచేత గుండికామండపంలో వేంచేసి, అందరి కోరికలన్నీ తీర్చే పురుషోత్తమస్వామిని అన్నివిధాలుగానూ ప్రయత్నించి, దర్శించుకోవాలి.

అపుత్రో లభతే పుత్రాన్ నిర్ధనో లభతే ధనమ్ ।
రోగాచ్చ ముచ్యతే రోగీ కన్యా ప్రాప్నోతి సత్పతిమ్ ॥ 15 ॥

అలా దర్శనం చేస్తే, కొడుకులు లేనివారికి కొడుకులు పుడతారు. దరిద్రుడికి సంపదలు లభిస్తాయి. రోగం ఉన్నవాడికి ఆ రోగం తగ్గిపోతుంది. పెండ్లికాని స్త్రీకి ఉత్తముడైన భర్త లభిస్తాడు.

ఆయుః కీర్తిం యశో మేధాం బలం విద్యాం ధృతిం పశూన్ ।
నరస్సన్తతిమాప్నోతి రూపయౌవనసమ్పదమ్ ॥ 16 ॥

గుండికామండపంలో పురుషోత్తముడిని దర్శించిన మానవుడు ఆయుర్దాయం, పేరు, ప్రతిష్ఠ, బుద్ధి, బలం, విద్య, ధైర్యం, పశుసంపద, సంతానం, అందమైన ఆకారం, నిండు యౌవనం, మొదలుగా సమస్తమైన అభీష్టాలను పొందుతాడు.

యాన్ యాన్ సమీహతే భోగాన్ దృష్ట్వా తం పురుషోత్తమమ్ ।
నరో వాప్యథవా నారీ తాంస్తాన్ ప్రాప్నోత్యసంశయమ్ ॥ 17 ॥

పురుషుడైనా, స్త్రీ అయినా, గుండికా మండపంలో పురుషోత్తమస్వామిని దర్శించుకుంటే, వారు కోరుకున్న అన్ని భోగాలనూ చక్కగా అనుభవిస్తారు. ఇందులో సందేహం ఏమీ లేదు.

యాత్రాం కృత్వా గుణ్డికాఖ్యాం విధివత్ సుసమాహితః ।
ఆషాఢస్య సితే పక్షే నరో యోషిదథాపి వా ॥ 18 ॥

దృష్ట్వా కృష్ణం చ రామం చ సుభద్రాం చ ద్విజోత్తమాః ।
దశపఞ్చాశ్వమేధానాం ఫలం ప్రాప్నోతి చాధికమ్ ॥ 19 ॥

విప్రవరేణ్యులారా! పురుషుడు కానీ, స్త్రీ కానీ, ఆషాఢమాసంలో శుక్లపక్షంలో విధివిధానంగా శ్రద్ధతో గుండికా యాత్ర చేసి, అక్కడ కృష్ణస్వామినీ, బలరాముడినీ, సుభద్రనూ దర్శించుకుంటే, పదిహేను అశ్వమేధయాగాలు చేసిన దానికంటె ఇంకా ఎక్కువ పుణ్యఫలం పొందుతారు.

సప్తావరాన్ సప్త పరాన్ వంశానుద్ధృత్య చాత్మనః ।
కామగేన విమానేన సర్వరత్నైరలఙ్కృతః ॥ 20 ॥

గన్ధర్వైరప్సరోభిశ్చ సేవ్యమానో యథోత్తరైః ।
రూపవాన్ సుభగశ్శూరో నరో విష్ణుపురం వ్రజేత్ ॥ 21 ॥

గుండికామండపంలో పురుషోత్తమస్వామిని దర్శించినవాడు తమ వంశంలో తమకు వెనుక ఏడు తరాల వారినీ, తమకు తర్వాత ఏడు తరాలవారినీ, నరకాది లోకాలనుండి ఉద్ధరించి, ఉత్తమలోకాలకు తీసుకువెళ్తాడు. తన ఇష్టం ప్రకారం నడిచే విమానంలో ప్రయాణిస్తాడు. ఆ విమానం సమస్తమైన రత్నాలతో అలంకరింపబడి ఉంటుంది. అందులో గంధర్వులు గానం చేస్తుంటారు. అప్సరసలు నాట్యం చేస్తుంటారు. అతడి రూపం అందంగా మారుతుంది. అదృష్టవంతుడూ, ధైర్యవంతుడూ, సమర్థుడూ అవుతాడు. ఆ విమానంలో విష్ణులోకానికి వెళ్తాడు.

తత్ర భుక్త్వా వరాన్ భోగాన్ యావదాభూతసంప్లవమ్ ।
సర్వకామసమృద్ధాత్మా జరామరణవర్జితః ॥ 22 ॥

మహాప్రళయం వచ్చేవరకూ విష్ణులోకంలో శ్రేష్ఠమైన భోగాలు అనుభవిస్తాడు. అతడికి ముసలితనం గానీ, మరణం గానీ ఉండదు. కోరికలన్నీ సమృద్ధిగా నెరవేరతాయి.

పుణ్యక్షయాదిహాగత్య చతుర్వేదీ ద్విజో భవేత్ ।
వైష్ణవం యోగమాస్థాయ తతో మోక్షమవాప్నుయాత్ ॥ 23 ॥

పుణ్యఫలం మొత్తం అనుభవించిన తర్వాత, తిరిగి భూలోకంలో బ్రాహ్మణుడిగా జన్మిస్తాడు. నాలుగు వేదాల లోనూ పండితుడు అవుతాడు. తరువాత విష్ణువుపై మనసు లీనం చేసి, మోక్షాన్ని పొందుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భృషిసంవాదే గుణ్డికాయాత్రామాహాత్మ్యనిరూపణం నామ త్రిషష్టితమోఽధ్యాయః ॥ 63 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషి సంవాదంలో గుండికా యాత్రామాహాత్మ్య నిరూపణం అనే అరవైమూడవ అధ్యాయం సంపూర్ణం.



చతుష్షష్టితమోఽధ్యాయః - అరవైనాల్గవ అధ్యాయం

ద్వాదశయాత్రాఫలమాహాత్మ్యనిరూపణమ్ - ద్వాదశ యాత్రాఫల మాహాత్మ్యనిరూపణం

మునయ ఊచుః :-బ్రహ్మదేవుడితో మహర్షులు ఇలా అంటున్నారు.

ఏకైకస్యాస్తు యాత్రాయాః ఫలం బ్రూహి పృథక్ పృథక్ ।
యత్ ప్రాప్నోతి నరః కృత్వా నారీ వా తత్ర సంయతా ॥ 1 ॥

బ్రహ్మదేవా! పురుషుడు గానీ, స్త్రీ కానీ నియమంగా అనేక పర్యాయాలు గుండికాయాత్రను చేస్తే, ఒక్కొక్క యాత్రవలన ఏ ఫలితం కలుగుతుందో దేనికది ప్రత్యేకంగా చెప్పవలసింది.

బ్రహ్మోవాచ :-బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

ప్రతి యాత్రాఫలం విప్రా శృణుధ్వం గదతో మమ ।
యత్ ప్రాప్నోతి నరః కృత్వా తస్మిన్ క్షేత్రే సుసంయతః ॥ 2 ॥

బ్రాహ్మణులారా! ఆ పురుషోత్తమక్షేత్రంలో ఇంద్రియాలను గట్టిగా నిగ్రహించుకుని, గుండికా యాత్రలను చేసిన మానవుడు ఒక్కొక్క యాత్రవలన ఏ యే ఫలితం పొందుతాడో, చెప్తాను. శ్రద్ధగా వినండి.

గుణ్డికాయాం తథోత్థానే ఫాల్గున్యాం విషువే తథా ।
యాత్రాం కృత్వా విధానేన దృష్ట్వా కృష్ణం ప్రణమ్య చ ॥ 3 ॥

సఙ్కర్షణం సుభద్రాం చ లభేత్ సర్వత్ర వై ఫలమ్ ।
నరః పృథగ్విష్ణులోకే యావదిన్ద్రాశ్చతుర్దశ ॥ 4 ॥

ఉత్థానఏకాదశి(విష్ణువు నిద్రలేచే కార్తికశుద్ధఏకాదశి)నాడు, ఫాల్గుణమాసంలో పూర్ణిమనాడు, విషువం(రాత్రింబగళ్లు సమానంగా ఉండే రోజు- మేష తులా రాశుల ప్రథమభాగం)నాడు, పద్ధతి ప్రకారం గుండికా క్షేత్రానికి వెళ్లాలి. అక్కడ శ్రీకృష్ణస్వామికీ, బలరాముడికీ, సుభద్రకూ సాష్టాంగనమస్కారం చేయాలి. ఆవిధంగా చేసిన మానవుడు అన్ని విషయాలలోనూ సత్ఫలితాలు పొందుతాడు. ఇంకా దేవలోకాన్ని పధ్నాలుగుమంది ఇంద్రులు పరిపాలించినంత కాలం విష్ణులోకంలో ఆనందంగా ఉంటాడు.

యావద్ యాత్రాం జ్యేష్ఠమాసే కరోతి విధివన్నరః ।
తావత్ కల్పం విష్ణులోకే సుఖం భుఙ్క్తే న సంశయః ॥ 5 ॥

మానవుడు జ్యేష్ఠమాసంలో ఎంతమేర విధి విధానంగా గుండికాయాత్ర చేస్తాడో, అంతమేర కల్పం అయ్యేంతవరకు విష్ణులోకంలో సుఖం అనుభవిస్తాడు. సందేహం లేదు.

తస్మిన్ క్షేత్రవరే పుణ్యే రమ్యే శ్రీపురుషోత్తమే ।
భుక్తిముక్తిప్రదే నృణాం సర్వసత్త్వసుఖావహే ॥ 6 ॥

ఆ పురుషోత్తమక్షేత్రం పుణ్యప్రదం. మనోహరం. మానవులకు వివిధ భోగాలనూ, మోక్షాన్నీ ఇస్తుంది. సమస్త జీవరాశులకూ సుఖసంతోషాలను కలిగిస్తుంది.

జ్యేష్ఠే యాత్రాం నరః కృత్వా నారీ వా సంయతేన్ద్రియః ।
యథోక్తేన విధానేన దశ ద్వే చ సమాహితః ॥ 7 ॥

ప్రతిష్ఠాం కురుతే యస్తు శాఠ్యదమ్భవివర్జితః ।
స భుక్త్వా వివిధాన్ భోగాన్ మోక్షం చాన్తే లభేన్నరః ॥ 8 ॥

అటువంటి పురుషోత్తమక్షేత్రానికి పురుషుడు గానీ, స్త్రీ కానీ ఇంద్రియాలను నిగ్రహించుకుని (నియమాలను పాటిస్తూ), విధి విధానంగా జ్యేష్ఠమాసంలో పన్నెండు పర్యాయాలు గుండికాయాత్ర చేయాలి. తరువాత స్వామిని ప్రతిష్ఠించాలి. ఆ ప్రయత్నంలో శక్తివంచన పనికిరాదు. డంబాచారం పనికి రాదు. (శ్రద్ధగా ఏకాగ్రతతో యథాశక్తిగా స్వామిని సేవించాలి.) అలా చేసినవాడు ఈ లోకంలో రకరకాల సుఖాలను అనుభవించి, చివరికి మోక్షం పొందుతాడు.

మునయ ఊచుః :–మహర్షులు అంటున్నారు.

శ్రోతుమిచ్ఛామహే దేవ ప్రతిష్ఠాం వదతస్తవ ।
విధానం చార్చనం దానం ఫలం తత్ర జగత్పతేః ॥ 9 ॥

బ్రహ్మదేవా! జగన్నాథుడైన ఆ పురుషోత్తమస్వామి ప్రతిష్ఠను గురించీ, ఆ ప్రతిష్ఠ చేయవలసిన విధానం గురించీ, ఆ స్వామిని పూజించే విధానాన్నీ, ఆ క్షేత్రంలో చేసే దానాన్నీ, అవి చేయడంవల్ల కలిగే పుణ్యఫలాన్నీ నీవు చెప్తుండగా వినాలని మా కోరిక.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

శృణుధ్వం మునిశార్దూలాః ప్రతిష్ఠాం విధిచోదితామ్ ।
యాం కృత్వా తు నరో భక్త్యా నారీ వా లభతే ఫలమ్ ॥ 10 ॥

మహర్షులారా! స్వామిప్రతిష్ఠను గురించి శాస్త్రగ్రంథాలు చెప్పిన విధానం వినండి. ఆవిధంగా ప్రతిష్ఠ చేయడంవల్ల పురుషుడు లేదా స్త్రీ పొందే పుణ్యఫలాన్ని వినండి.

యాత్రా ద్వాదశ సంపూర్ణా యదా స్యుస్తు ద్విజోత్తమాః ।
తదా కుర్వీత విధివత్ ప్రతిష్ఠాం పాపనాశినీమ్ ॥ 11 ॥

బ్రాహ్మణవరేణ్యులారా! పురుషోత్తమక్షేత్రానికి పన్నెండుసార్లు గుండికా మండప యాత్రలు చేయడం పూర్తైన తరువాత శాస్త్రాలు నిర్ణయించిన మార్గంలో ప్రతిష్ఠ చేయాలి. అలా చేయడంవల్ల పాపాలన్నీ నశించిపోతాయి.

జ్యేష్ఠే మాసి సితే పక్షే త్వేకాదశ్యాం సమాహితః ।
గత్వా జలాశయం పుణ్యమాచాన్తః ప్రయతశ్శుచిః ॥ 12 ॥

జ్యేష్ఠమాసంలో శుక్లపక్షంలో ఏకాదశినాడు తదేకబుద్ధితో పుణ్యప్రదమైన ఇంద్రద్యుమ్న సరస్సు వద్దకు వెళ్లాలి. ప్రయత్నపూర్వకంగా శుచియై, ఆచమనం చేయాలి.

ఆవాహ్య సర్వతీర్థాని ధ్యాత్వా నారాయణం తథా ।
తత స్స్నానం ప్రకుర్వీత విధివత్ సుసమాహితః ॥ 13 ॥

తరువాత సమస్తమైన పుణ్యతీర్థాలను ఇంద్రద్యుమ్న సరస్సులోకి ఆహ్వానించాలి. మనసులో శ్రీమన్నారాయణుడిని ధ్యానించాలి. ఆ తరువాత విధివిధానంగా ఆ సరస్సులో శ్రద్ధగా స్నానం చేయాలి.

యస్య యో విధిరుద్దిష్ట ఋషిభిస్స్నానకర్మణి ।
తేనైవ తు విధానేన స్నానం తస్య విధీయతే ॥ 14 ॥

భక్తులు తమ తమ ఋషులు నిర్దేశించిన విధానంలో తమ తమ సంప్రదాయంలో స్నానం చేయాలి. ఇది తప్పకుండా పాటించవలసిన నియమం.

స్నాత్వా సమ్యగ్విధానేన తతో దేవాన్ ఋషీన్ పితౄన్ ।
సన్తర్పయేత్తథాన్యాంశ్చ నామగోత్రవిధానవిత్ ॥ 15 ॥

పద్ధతిప్రకారం చక్కగా స్నానం చేసిన తరువాత దేవతలకు, ఋషులకు, పితరులకు, ఇతరులకూ (కారుణ్యం), వారి పేరు, గోత్రం, వరుసలు తెలుసుకుని తర్పణం చేయాలి.

ఉత్తీర్య వాససీ ధౌతే నిర్మలే పరిధాయ వై ।
ఉపస్పృశ్య విధానేన భాస్కరాభిముఖే స్థితః ॥ 16 ॥

సరస్సులోనుండి వెలువడి వచ్చిన తరువాత శుభ్రంగా ఉదికిన వస్త్రాలు ధరించాలి. సంకల్పం చేసి, నీటిని ఆచమించాలి. సూర్యుడికి ఎదురుగా నిలబడాలి.

గాయత్రీం పావనీం దేవీం మనసా వేదమాతరమ్ ।
సర్వపాపహరాం పుణ్యాం జపే దష్టోత్తరశతమ్ ॥ 17 ॥

వేదమాత గాయత్రిని మనసులో ధ్యానం చేసి, సమస్త పాపాలను పోగొట్టి, పుణ్యాన్నిచ్చే గాయత్రీమాతను (గాయత్రీమంత్రంతో) నూటయెనిమిదిసార్లు జపించాలి.

పుణ్యాంశ్చ సౌరమన్త్రాంశ్చ శ్రద్ధయా సుసమాహితః ।
త్రిః ప్రదక్షిణమావృత్య భాస్కరం ప్రణమేత్ తతః ॥ 18 ॥

ఆ తరువాత సూర్యుడిపై మనసు నిలిపి, పవిత్రమైన సూర్యమంత్రాలను శ్రద్ధగా జపించాలి. ఆ తరువాత సూర్యభగవానుడికి మూడుసార్లు ప్రదక్షిణలు చేసి, సాష్టాంగనమస్కారం చేయాలి.

వేదోక్తం త్రిషు వర్ణేషు స్నానం జాప్యముదాహృతమ్ ।
స్త్రీశూద్రయోస్స్నానజాప్యం వేదోక్తవిధివర్జితమ్ ॥ 19 ॥

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు అనే మూడు వర్ణాలవారు స్నానాన్నీ జపాన్నీ వేదంలో చెప్పబడిన మంత్రాలతో చేయాలి. స్త్రీలు, శూద్రులు మాత్రం పురాణాలలో చెప్పబడిన వాక్యాలతో (వేదంలోనివి ఉపయోగించగూడదు) స్నాన జపాలను ఆచరించాలి.

తతో గచ్ఛేద్ గృహం మౌనీ పూజయేత్ పురుషోత్తమమ్ ।
ప్రక్షాల్య హస్తౌ పాదౌ చ ఉపస్పృశ్య యథావిధి ॥ 20 ॥

స్నానజపాలు అయిన తరువాత మౌనంగా ఇంటికి వెళ్లి, కాళ్లు, చేతులు కడుక్కోవాలి. ఆచమనం చేసి, సంకల్పం చేసి, విధ్యుక్తప్రకారంగా పురుషోత్తమస్వామిని పూజించాలి.

ఘృతేన స్నాపయేద్ దేవం క్షీరేణ తదనన్తరమ్ ।
మధుగన్ధోదకేనైవ తీర్థచన్దనవారిణా ॥ 21 ॥

పురుషోత్తమస్వామికి (ధ్యాన, ఆవాహనాదుల తరువాత) ఆవునేతితో స్నానం చేయించాలి. తరువాత ఆవుపాలతో అభిషేకం చేయాలి. ఆ తరువాత తేనెతోనూ, సుగంధజలంతోనూ, పవిత్రమైన మంచి గంధపు నీటితోనూ అభిషేకించాలి.

తతో వస్త్రయుగం శ్రేష్ఠం భక్త్యా తం పరిధాపయేత్ ।
చన్దనాగరుకర్పూరైః కుఙ్కుమేన విలేపయేత్ ॥ 22 ॥

స్నానానంతరం ఉత్తమమైన జంటవస్త్రాలను (కట్టుబట్ట, పైబట్ట) ధరింపజేయాలి. స్వామిశరీరానికి చందనం, అగురు, కర్పూరం, కుంకుమలతో పూయాలి.

పూజయేత్ పరయా భక్త్యా పద్మైశ్చ పురుషోత్తమమ్ ।
అన్యైశ్చ వైష్ణవైః పుష్పైరర్చయేన్మల్లికాదిభిః ॥ 23 ॥

ఆ తరువాత మిక్కిలి భక్తితో పురుషోత్తమస్వామిని తామరపూలతో పూజించాలి. విష్ణుమూర్తికి ఇష్టమైన మల్లె మొదలైన వేరే పూలతో కూడ పూజించాలి.

సమ్పూజ్యైవం జగన్నాథం భుక్తిముక్తిప్రదం హరిమ్ ।
ధూపం చాగురుసంయుక్తం దహేద్దేవస్య చాగ్రతః ॥ 24 ॥

భోగమోక్షాలను ప్రసాదించే శ్రీహరిని ఈవిధంగా (విష్ణుప్రీతికరాలైన రకరకాల పూలతో) పూజించిన తరువాత స్వామికి ఎదురుగా అగురుతో కూడిన ద్రవ్యాలను ధూపం వేయాలి.

గుగ్గులం వా మునిశ్రేష్ఠా దహేద్ గన్ధసమన్వితమ్ ।
దీపం ప్రజ్వాలయేద్ భక్త్యా యథాశక్తి ఘృతేన వై ॥ 25 ॥

మహర్షులారా! స్వామికి ఎదురుగా సుగంధంతో కూడిన గుగ్గులమైనా కాల్చి ధూపం వేయాలి. ఆ తరువాత భక్తిగా తన శక్తికొలదిగా ఆవునేతితో దీపాన్ని చక్కగా వెలిగించాలి.

అన్యాంశ్చ దీపకాన్ దద్యాద్ ద్వాదశైవ సమాహితః ।
ఘృతేన చ మునిశ్రేష్ఠాస్తిలతైలేన వా పునః ॥ 26 ॥

మునివరులారా! ఆవునేతితో గానీ, లేదా నువ్వులనూనెతో గానీ, స్వామికి భక్తితో పన్నెండు దీపాలు వెలిగించాలి.

నైవేద్యే పాయసాపూపశష్కులీవటకం తథా ।
మోదకం ఫాణితం వాల్పం ఫలాని చ నివేదయేత్ ॥ 27 ॥

ఆ తరువాత నైవేద్యం సమర్పించాలి. స్వామికి పాయసాన్నం, అప్పాలు, చక్కిలాలు, చిట్టిగారెలు, ఉండ్రాళ్లు, కొద్దిగా కండచక్కెర, రకరకాలైన పండ్లు నివేదించాలి.

ఏవం పఞ్చోపచారేణ సమ్పూజ్య పురుషోత్తమమ్ ।
ఓం నమః పురుషోత్తమాయేతి జపేదష్టోత్తరం శతమ్ ॥ 28 ॥

ఈవిధంగా ప్రధానంగా ఐదు (గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం) ఉపచారాలతో పురుషోత్తమ స్వామిని శ్రద్ధగా పూజించాలి. ఆ తరువాత 'ఓం నమః పురుషోత్తమాయ' అనే మంత్రాన్ని నూటయెనిమిదిసార్లు జపించాలి.

తతః ప్రసాదయేద్దేవం భక్త్యా తం పురుషోత్తమమ్ ॥ 29 ॥

ఆ తరువాత భక్తితో పురుషోత్తమస్వామిని ఈవిధంగా స్తుతించి, అనుగ్రహింప జేసుకోవాలి.

నమస్తే సర్వలోకేశ భక్తానామభయప్రద ।
సంసారసాగరే మగ్నం త్రాహి మాం పురుషోత్తమ ॥ 30 ॥

లోకాలన్నిటికీ అధిపతివైనవాడా! భక్తుల భయాలను తొలగించేవాడా! పురుషోత్తమస్వామీ! సంసారం అనే సముద్రంలో మునిగిపోయిన నన్ను రక్షించు.

యాస్తే మయా కృతా యాత్రా ద్వాదశైవ జగత్పతే ।
ప్రసాదాత్తవ గోవిన్ద సమ్పూర్ణాస్తా భవన్తు మే ॥ 31 ॥

జగన్నాథా! నీ అనుగ్రహంతో ఈ పురుషోత్తమ క్షేత్రానికి పన్నెండుసార్లు తీర్థయాత్రగా వచ్చాను. గోవిందా! నీ దయతో ఈ యాత్ర సంపూర్ణం కావాలి. (సమగ్రమైన ఫలితాన్నివ్వాలి).

ఏవం ప్రసాద్య తం దేవం దణ్డవత్ ప్రణిపత్య చ ।
తతోఽర్చయేద్ గురుం భక్త్యా పుష్పవస్త్రానులేపనైః ॥
నానయోరన్తరం యస్మాద్ విద్యతే మునిసత్తమాః ॥ 32 ॥

ఈవిధంగా స్తుతించి, స్వామికి సాష్టాంగంగా నమస్కారం చేయాలి. ఆవిధంగా పురుషోత్తమస్వామి అనుగ్రహాన్ని పొందాలి. మునివరులారా! ఆ తరువాత పూలు, వస్త్రాలు, గంధాలు మొదలైన వాటితో ఆచార్యుడిని భక్తిగా పూజించాలి. ఎందుకంటే గురువుకూ దేవుడికీ భేదం లేదు.

దేవస్యోపరి కుర్వీత శ్రద్ధయా సుసమాహితః ।
నానాపుష్పైర్మునిశ్రేష్ఠా విచిత్రం పుష్పమణ్డపమ్ ॥ 33 ॥

మహర్షులారా! శ్రద్ధతోనూ, ఏకాగ్రబుద్ధితోనూ పురుషోత్తమస్వామికి రకరకాల పూలతో (పుష్ప)మండపాన్ని నిర్మించాలి.

కృత్వావధారణం పశ్చాజ్జాగరం కారయేన్నిశి ।
కథాం చ వాసుదేవస్య గీతికాం చాపి కారయేత్ ॥ 34 ॥

స్వామికి వినమ్రంగా వేదశాస్త్ర పురాణాదులను వినిపించాలి. తరువాత కృష్ణస్వామి కథలను చెప్పుకోవాలి. శ్రీహరి స్తోత్రాలను గానం చేయాలి. ఇలా ఆ రాత్రి అంతా జాగరం చేయాలి.

ధ్యాయన్ పఠన్ స్తువన్ దేవం ప్రణయేద్ రజనీం బుధః ।
తతః ప్రభాతే విమలే ద్వాదశ్యాం ద్వాదశైవ తు ॥ 35 ॥

నిమన్త్రయేద్ వ్రతస్నాతాన్ బ్రాహ్మణాన్ వేదపారగాన్ ।
ఇతిహాసపురాణజ్ఞాన్ శ్రోత్రియాన్ సంయతేన్ద్రియాన్ ॥ 36 ॥

బుద్ధిమంతుడైన ఆ విష్ణుభక్తుడు ధ్యానం చేస్తూ, స్వామికథలను పారాయణం చేస్తూ, స్వామి సోత్రాలను గానం చేస్తూ, ఆ రాత్రి మొత్తం పురుషోత్తమ స్మరణతో గడపాలి. తెల్లవారిన తరువాత పవిత్రమైన ద్వాదశీతిథినాడు పన్నెండుమంది బ్రాహ్మణులను భోజనానికి ఆహ్వానించాలి. వారు గృహస్థులూ, వేదపండితులూ, ఇతిహాసాలు, పురాణాలు తెలిసినవారూ, నిష్ఠాగరిష్ఠులూ, ఇంద్రియాలను అదుపులో ఉంచుకున్నవారూ, అయిఉండాలి.

స్నాత్వా సమ్యగ్విధానేన ధౌతవాసా జితేన్ద్రియః ।
స్నాపయేత్ పూర్వవద్ భక్త్యా తతస్తం పురుషోత్తమమ్ ॥ 37 ॥

శాస్త్రోక్తమైన పద్ధతిలో చక్కగా స్నానం చేయాలి. ఉతికిన శుభ్రమైన వస్త్రాలను ధరించాలి. ఇంద్రియాలను తన అధీనంలో ఉంచుకోవాలి. ఆ తరువాత భక్తిగా పురుషోత్తమస్వామిని ఇంతకుముందు చెప్పిన ప్రకారంగా (ఆవునేయి మొదలైనవాటితో) అభిషేకించాలి.

గన్ధైః పుష్పైరుపహారైర్నైవేద్యైర్దీపకైస్తథా ।
ఉపచారైర్బహువిధైః ప్రణిపాతైః ప్రదక్షిణైః ॥ 38 ॥

రకరకాలైన గంధాలు, పుష్పాలు, కానుకలు, నైవేద్యాలు, దీపాలు మొదలైన అనేక ఉపచారాలతో పూజించాలి. ప్రదక్షిణలు చేయాలి. సాష్టాంగనమస్కారాలు చేయాలి.

జాప్యైః స్తుతినమస్కారైర్గీతవాద్యైర్మనోహరైః ।
సమ్పూజ్యైవం జగన్నాథం బ్రాహ్మణాన్ పూజయేత్ తతః ॥ 39 ॥

విష్ణుమంత్రాలు జపించాలి. శ్రీహరి స్తోత్రాలు పఠించాలి. స్వామికి నమస్కరించాలి. మనోహరమైన పాటలు పాడాలి. వివిధ వాద్యాలు వాయించాలి. ఈవిధంగా పురుషోత్తమస్వామిని పూజించిన తరువాత ఆ పన్నెండుమంది బ్రాహ్మణులను పూజించాలి.

ద్వాదశైవ తు గాస్తేభ్యో దత్త్వా కనకమేవ చ ।
ఛత్రోపానద్యుగం చైవ శ్రద్ధాభక్తిపురస్సరః ॥ 40 ॥

ఆ పన్నెండు మంది బ్రాహ్మణులకు శ్రద్ధతోనూ, భక్తితోనూ, పన్నెండు ఆవులను దానం చేయాలి. బంగారమూ, గొడుగూ, చెప్పులజోడూ ఇవ్వాలి.

భక్త్యా తు స ధనం తేభ్యో దద్యాద్ వస్త్రాదికం ద్విజాః ।
సద్భావేన తు గోవిన్దస్తోష్యతే పూజితో యతః ॥ 41 ॥

విప్రులారా! వారికి ధనమూ, వస్త్రాలు మొదలైనవి భక్తిగా ఇవ్వాలి. వారిని ఎంత గౌరవంతో పూజిస్తే గోవిందుడు అంతగా ఆనందిస్తాడు.

ఆచార్యాయ తతో దద్యాద్ గోవస్త్రం కనకం తథా ।
ఛత్రోపానద్యుగం ధాన్యం కాంస్యపాత్రం చ భక్తితః ॥ 42 ॥

తరువాత గురువుగారికి ఆవులు, వస్త్రాలు, బంగారమూ, గొడుగూ, చెప్పులజోడూ, ధాన్యమూ, (నీరు నింపిన) కంచుపాత్ర భక్తితో ఇవ్వాలి.

తతస్తాన్ భోజయేద్ విప్రాన్ భోజ్యం పాయసపూర్వకమ్ ।
పక్వాన్నం భక్ష్యభోజ్యం చ గుడసర్పిస్సమన్వితమ్ ॥ 43 ॥

ఆ పిదప వారికి పాయసాన్నంతో ప్రారంభించి, చక్కగా పక్వమైన అన్నమూ, బెల్లం, నెయ్యితో సహా భక్ష్యాలూ, భోజ్యాలతో చక్కని భోజనం పెట్టాలి.

తతస్తానన్నతృప్తాంశ్చ బ్రాహ్మణాన్ స్వస్థమానసాన్ ।
ద్వాదశైవోదకుమ్భాంశ్చ దద్యాత్తేభ్యస్సమోదకాన్ ॥ 44 ॥

తృప్తిగా భోజనం చేసి, మనసు స్థిమితపడిన ఆ బ్రాహ్మణులకు ఉండ్రాళ్లతో సహా, పన్నెండు ఉదకుంభాలను (నీరు నింపినపాత్రలు) దానం చేయాలి.

దక్షిణాం చ యథాశక్తి దద్యాత్ తేభ్యో విమత్సరః ।
కుమ్భం చ దక్షిణాం చైవ ఆచార్యాయ నివేదయేత్ ॥ 45 ॥

ఆ బ్రాహ్మణులకు అందరికీ పక్షపాతం లేకుండా, తన శక్తికి తగిన విధంగా దక్షిణలు ఇవ్వాలి. ఆచార్యుడికి కూడ అదేవిధంగా ఉదకుంభాన్ని తగినంత దక్షిణనూ సమర్పించుకోవాలి.

ఏవం సమ్పూజ్య తాన్ విప్రాన్ గురుం జ్ఞానప్రదాయకమ్ ।
పూజయేత్ పరయా భక్త్యా విష్ణుతుల్యం ద్విజోత్తమాః ॥ 46 ॥

బ్రాహ్మణవరులారా! ఈవిధంగా పన్నెండుమంది బ్రాహ్మణులను అర్చించిన తరువాత, శ్రీమహావిష్ణువుతో సమానమైనవాడూ, జ్ఞానప్రదాతా అయిన ఆచార్యుడినీ అత్యంత భక్తిభావంతో పూజించాలి.

సువర్ణవస్త్రగోధాన్యైర్ద్రవ్యైశ్చాన్యైర్వరైర్బుధః ।
సమ్పూజ్య తం నమస్కృత్య ఇమం మన్త్రముదీరయేత్ ॥ 47 ॥

బంగారం, నూతన వస్త్రాలూ, ఆవులూ, ధాన్యమూ, ఇంకా ఉత్తమ మైన ఇతర వస్తువులతోనూ గురువుగారిని (ద్వాదశ బ్రాహ్మణులనూ) చక్కగా పూజించి, బుద్ధిమంతుడైన సాధకుడు ఈ(క్రిందిశ్లోక)మంత్రాన్ని ఉచ్చరించాలి.

సర్వవ్యాపీ జగన్నాథశ్శఙ్ఖచక్రగదాధరః ।
అనాదినిధనో దేవః ప్రీయతాం పురుషోత్తమః ॥ 48 ॥

అంతటా నిండి ఉన్నవాడూ, లోకాలన్నిటికీ అధిపతీ, శంఖం, చక్రం, గదలను ధరించినవాడూ, తుది మొదలు లేనివాడూ, అయిన పురుషోత్తమదేవుడు (ఈ దేవ బ్రాహ్మణ పూజచేత) సంతోషించును గాక.

ఇత్యుచ్చార్య తతో విప్రాంస్త్రిః కృత్వా చ ప్రదక్షిణామ్ ।
ప్రణమ్య శిరసా భక్త్యా ఆచార్యం తు విసర్జయేత్ ॥ 49 ॥

పై శ్లోకమంత్రాన్ని ఉచ్చరించి, తరువాత ఆ బ్రాహ్మణులకు మూడుసార్లు ప్రదక్షిణం చేయాలి. పిదప వినయంగా తల వంచి నమస్కరించాలి. ఆ తరువాత గురువుగారిని వారి యింటికి సాదరంగా సాగనంపాలి.

తతస్తాన్ బ్రాహ్మణాన్ భక్త్యా చాసీమాన్తమనువ్రజేత్ ।
అనువ్రజ్య తు తాన్ సర్వాన్ నమస్కృత్య విసర్జయేత్ ॥ 50 ॥

ఆ తరువాత ఆ ద్వాదశబ్రాహ్మణులను తన యింటి వాకిటి వరకు భక్తితో అనుసరించి, వెంట వెళ్లాలి. అక్కడ వారందరికీ వినయంగా నమస్కరించి, అక్కడినుండి తమ తమ ఇండ్లకు సాగనంపాలి.

బాన్ధవైస్స్వజనైర్యుక్తస్తతో భుఞ్జీత వాగ్యతః ।
అన్యైశ్చోపాసకైర్దీనైర్భిక్షుకైశ్చాన్నకాఙ్క్షిభిః ॥ 51 ॥

బ్రాహ్మణులను పంపిన తరువాత చుట్టాలు, మిత్రులు మొదలైన తనవారు, అనుష్ఠానపరులు, బీదవాళ్లు, బిచ్చగాళ్లు మొదలైన ఆకలిగొన్నవారితో కలిసి మౌనంగా భోజనం చేయాలి.

ఏవం కృత్వా నరస్సమ్యఙ్నారీ వా లభతే ఫలమ్ ।
అశ్వమేధసహస్రాణాం రాజసూయశతస్య చ ॥ 52 ॥

పురుషుడు కానీ, స్త్రీ కానీ, ఈవిధంగా పురుషోత్తమక్షేత్రంలో విష్ణుపూజాదులు విధ్యుక్తప్రకారంగా చేస్తే, వారికి వేయి అశ్వమేధయాగాలు, నూరు రాజసూయయాగాలు చేసిన పుణ్యఫలం లభిస్తుంది.

అతీతం శతమాదాయ పురుషాణాం నరోత్తమః ।
భవిష్యం చ శతం విప్రాస్స్వర్గత్యా దివ్యరూపధృక్ ॥ 53 ॥

బ్రాహ్మణులారా! ఈవిధంగా చేసినవాడు మరణించిన తరువాత తన వంశంలో తనకు పూర్వం నూరు తరాల వారినీ, తర్వాత నూరు తరాల వారినీ తీసుకుని ఉత్తమ గతులను పొందుతాడు. తాను దేవరూపాన్ని ధరిస్తాడు.

సర్వలక్షణసమ్పన్నస్సర్వాలఙ్కారభూషితః ।
సర్వకామసమృద్ధాత్మా దేవవద్విగతజ్వరః ॥ 54 ॥

అతడు సమస్తమైన మంచిలక్షణాలు పొందుతాడు. సమస్తమైన ఆభరణాలను అలంకరించు కుంటాడు. సమస్తమైన కోరికలు సమృద్ధిగా పొందుతాడు. సమస్తమైన బాధలు తొలగిపోతాయి. ఈ విధంగా దేవుడిలాగా అవుతాడు.

రూపయౌవనసమ్పన్నో గుణైస్సర్వైరలఙ్కృతః ।
స్తూయమానోఽప్సరోభిశ్చ గన్ధర్వైస్సమలఙ్కృతః ॥ 55 ॥

మంచి అందం వస్తుంది. యుక్తమైన వయసులో ఉంటాడు. సమస్తమైన సద్గుణాలు కలుగుతాయి. గంధర్వులు, అప్సరసలు మనోహరంగా అతడికి స్తోత్రాలు గానం చేస్తారు.

విమానేనార్కవర్ణేన కామగేన స్థిరేణ చ ।
పతాకాధ్వజయుక్తేన సర్వరత్నైరలఙ్కృతః ॥ 56 ॥

అతడు విమానాన్ని అధిరోహిస్తాడు. ఆ విమానం సూర్యుడితో సమానమైన తేజస్సుతో ప్రకాశిస్తుంది. స్వేచ్ఛగా సంచరిస్తుంది. ఎప్పుడూ దగ్గరే ఉంటుంది. జెండాలు, జెండాకఱ్ఱలతో కూడి ఉంటుంది. అన్ని రకాలైన రత్నాలతోనూ అలంకరించబడి ఉంటుంది.

ఉద్యోతయన్ దిశస్సర్వా ఆకాశే విగతక్లమః ।
యువా మహాబలో ధీమాన్ విష్ణులోకం స గచ్ఛతి ॥ 57 ॥

అతడు తన తేజస్సుతో ఆకాశం అంతటా, దిక్కులన్నింటినీ ప్రకాశింపజేస్తాడు. అతడికి అలసట అనేదే ఉండదు. యువకుడూ, గొప్ప బలవంతుడూ, బుద్ధిమంతుడూ అవుతాడు. ఆ విమానంలో మొదటగా విష్ణులోకానికి వెళ్తాడు.

తత్ర కల్పశతం యావద్ భుఙ్క్తే భోగాన్ మనోగతాన్ ।
సిద్ధాప్సరోభిర్గన్ధర్వైస్సురవిద్యాధరోరగైః ॥ 58 ॥

స్తూయమానో మునివరైస్తిష్ఠతే విగతజ్వరః ।
యథా దేవో జగన్నాథః శఙ్ఖచక్రగదాధరః ॥ 59 ॥

ఆ వైకుంఠలోకంలో నూరు కల్పాల కాలం పూర్తియ్యేవరకు మనసుపడ్డ సుఖాలన్నీ అనుభవిస్తాడు. సిద్ధులూ, అప్సరసలూ, గంధర్వులూ, సురలూ, విద్యాధరులూ, నాగులూ, మహర్షులూ, అతడిని స్తుతిస్తారు. అతడికి ఏవిధమైన బాధలూ ఉండవు. శంఖం, చక్రం, గద ధరించిన శ్రీమహావిష్ణువులాగా అక్కడ స్థిరంగా ఉంటాడు.

తథాసౌ ముదితో విప్రాః కృత్వా రూపం చతుర్భుజమ్ ।
భుక్త్వా తత్ర వరాన్ భోగాన్ క్రీడాం కృత్వా సురైస్సహ ॥ 60 ॥

ద్విజులారా! ఆ విష్ణుభక్తుడు నాలుగుచేతులు గలిగిన శ్రీమహావిష్ణువు రూపం (సారూప్యముక్తి) పొంది ఆనందంగా ఉంటాడు. అక్కడ స్వర్గసుఖాలు అనుభవిస్తాడు. దేవతలతో కలిసి విహరిస్తాడు.

తదన్తే బ్రహ్మభవనమాయాతి సర్వకామదమ్ ।
సిద్ధవిద్యాధరైశ్చాపి శోభితం సురకిన్నరైః ॥ 61 ॥

(వైకుంఠంలో నూరుకల్పాలు అయిన)తరువాత అక్కడనుండి (కొంత పుణ్యం క్షయం కాగా వైకుంఠానికి దిగువ నున్న) బ్రహ్మలోకానికి వస్తాడు. బ్రహ్మలోకం సమస్తమైన సంతోషాలను ఇస్తుంది. బ్రహ్మలోకంలో సిద్ధులు, విద్యాధరులు, సురలు, కిన్నరులు నివసిస్తారు.

కాలం నవతికల్పం తు తత్ర భుక్త్వా సుఖం నరః ।
తస్మాదాయాతి విప్రేన్ద్రాస్సర్వకామఫలప్రదమ్ ॥ 62 ॥

రుద్రలోకం సురగణైస్సేవితం సుఖమోక్షదమ్ ।
అనేకశతసాహస్రైర్విమానైస్సమలఙ్కృతమ్ ॥ 63 ॥

బ్రాహ్మణోత్తములారా! ఆ విష్ణుభక్తుడు తొంభై కల్పాల కాలం బ్రహ్మలోకంలో సకల సుఖాలు అనుభవిస్తాడు. తరువాత బ్రహ్మలోకం నుండి (క్రింద ఉన్న) రుద్రలోకానికి వస్తాడు. రుద్రలోకం సమస్తమైన కోరికలనూ తీరుస్తుంది. అక్కడ దేవతలు గుంపులుగా ఉంటారు. ఆ లోకం భోగాలనూ, మోక్షాన్నీ ప్రసాదిస్తుంది. రుద్రలోకంలో ఎన్నో వందల, వేల విమానాలు మనోహరంగా ఉంటాయి.

సిద్ధవిద్యాధరైర్యక్షైర్భూషితం దైత్యదానవైః ।
అశీతికల్పకాలం తు తత్ర భుక్త్వా సుఖం నరః ॥ 64 ॥

రుద్రలోకంలో సిద్ధులూ, విద్యాధరులూ, యక్షులూ, దైత్యులూ, దానవులూ, విహరిస్తుంటారు. విష్ణుభక్తుడు రుద్రలోకంలో ఎనభై కల్పాల కాలం సుఖాలు అనుభవిస్తాడు.

తదన్తే యాతి గోలోకం సర్వభోగసమన్వితమ్ ।
సురసిద్ధాప్సరోభిశ్చ భూషితం సుమనోహరమ్ ॥ 65 ॥

ఆ తరువాత రుద్రలోకంనుండి (క్రింద ఉన్న) గోలోకానికి వెళ్తాడు. ఆ లోకంలో సమస్తమైన భోగాలు ఉంటాయి. చాల అందంగా ఉంటుంది. అక్కడ దేవతలూ, సిద్ధులూ, అప్సరసలూ ఉంటారు.

తత్ర సప్తతికల్పాంస్తు భుక్త్వా భోగమనుత్తమమ్ ।
దుర్లభం త్రిషు లోకేషు స్వస్థచిత్తో యథామరః ॥ 66 ॥

విష్ణుభక్తుడు గోలోకంలో డెబ్బై కల్పాల కాలం దేవుడిలాగా, మనసులో ఎటువంటి దిగులు లేకుండా, సర్వోత్తమమైన భోగాలు అనుభవిస్తాడు. ఆ లోకం మూడు లోకాలలోనూ ఎవ్వరికీ పొందడం సాధ్యం కాదు.

తస్మాదాగచ్ఛతే లోకం ప్రాజాపత్యమనుత్తమమ్ ।
గన్ధర్వాప్సరసైస్సిద్ధైర్మునివిద్యాధరైర్వృతః ॥ 67 ॥

ఆ తరువాత గోలోకంనుండి (క్రింద ఉన్న)ప్రజాపతిలోకానికి వస్తాడు. ఆ లోకం మిక్కిలి శ్రేష్ఠమైనది. ప్రజాపతిలోకం నిండా, గంధర్వులూ, అప్సరసలూ, సిద్ధులూ, మహర్షులూ, విద్యాధరులూ ఉంటారు.

షష్టికల్పాన్ సుఖం తత్ర భుక్త్వా నానావిధం ముదా ।
తదన్తే శక్రభవనం నానాశ్చర్యసమన్వితమ్ ॥ 68 ॥

ప్రజాపతిలోకంలో అరవై కల్పాల కాలం ఆనందంగా రకరకాల సుఖాలు అనుభవిస్తాడు. ఆ తరువాత (దానికి దిగువ నున్న) ఇంద్రుడుండే చోటికి వస్తాడు. ఆ ప్రదేశం రకరకాల వింతలతో కూడి ఉంటుంది.

గన్ధర్వైః కిన్నరైస్సిద్ధైస్సురవిద్యాధరోరగైః ।
గుహ్యకాప్సరసైస్సాధ్యైర్వృతశ్చాన్యైస్సురోత్తమైః ॥ 69 ॥

ఆ ప్రదేశ మంతటా గంధర్వులూ, కిన్నరులూ, సిద్ధులూ, దేవతలూ, విద్యాధరులూ, నాగులూ, గుహ్యకులూ, అప్సరసలూ, సాధ్యులూ, ఇంకా వేర్వేరు ఉత్తమ దేవజాతుల వారూ ఉంటారు.

ఆగత్య తత్ర పఞ్చాశత్కల్పాన్ భుక్త్వా సుఖం నరః ।
సురలోకం తతో గత్వా విమానైస్సమలఙ్కృతమ్ ॥ 70 ॥

అటువంటి విష్ణుభక్తుడు ఇంద్రభవనానికి వస్తాడు. అక్కడ అతడు యాభై కల్పాల కాలం సుఖాలు అనుభవిస్తాడు. ఇంద్రభవనంనుండి (దిగువ ఉన్న) సురలోకానికి వెళ్తాడు. ఆ లోకం నిండా విమానాలు అందంగా అలంకారంగా ఉంటాయి.

దుర్లభం పావనం ధీమాన్ దైవైస్సర్వైరలఙ్కృతమ్ ।
చత్వారింశత్తు కల్పాంస్తు భుక్త్వా భోగాన్ సుదుర్లభాన్ ॥ 71 ॥

పవిత్రమైన ఆ సురలోకం సులువుగా ఎవ్వరికీ లభించదు. దేవతలు అందరూ అక్కడే ఉంటారు. విష్ణుభక్తుడు నలభై కల్పాల కాలం సురలోకంలో అసాధ్యమైన గొప్ప గొప్ప సుఖాలు అనుభవిస్తాడు.

ఆగచ్ఛతే తతో లోకం నక్షత్రాఖ్యం సుదుర్లభమ్ ।
తతో భోగాన్ వరాన్ భుఙ్క్తే త్రింశత్కల్పాన్ యథేప్సితాన్ ॥ 72 ॥

ఆ భక్తుడు సురలోకం నుండి (దిగువ ఉన్న) నక్షత్రలోకానికి వస్తాడు. ఆ లోకానికి వెళ్లడం అందరికీ సాధ్యం కాదు. నక్షత్రలోకంలో ముప్ఫై కల్పాల కాలం కోరుకున్న గొప్ప గొప్ప సుఖాలను అనుభవిస్తాడు.

తస్మాదాగచ్ఛతే లోకం శశాఙ్కస్య ద్విజోత్తమాః ।
యత్రాసౌ తిష్ఠతే సోమస్సర్వైర్దేవైరలఙ్కృతః ॥ 73 ॥

విప్రవరులారా! ఆ భక్తుడు నక్షత్రలోకం నుండి తరువాత (దానికి దిగువ ఉన్న) చంద్రలోకానికి వస్తాడు. ఆ లోకంలో చంద్రుడు ఉంటాడు. అక్కడ చంద్రుడిని దేవత లందరూ సేవిస్తుంటారు.

తత్ర వింశతికల్పాంస్తు భుక్త్వా భోగం సుదుర్లభమ్ ।
ఆదిత్యస్య తతో లోకమాయాతి సురపూజితమ్ ॥ 74 ॥

చంద్రలోకంలో ఇరవై కల్పాల కాలం మిక్కిలి గొప్పభోగాలు అనుభవిస్తాడు. భక్తుడు ఆ తరువాత దేవతలు పూజించే (చంద్రలోకానికి దిగువ ఉన్న) సూర్యలోకానికి వెళ్తాడు.

నానాశ్చర్యమయం దివ్యం గన్ధర్వాప్సరసైర్వృతమ్ ।
తత్ర భుక్త్వా శుభాన్ భోగాన్ దశకల్పాన్ ద్విజోత్తమాః ॥ 75 ॥

విప్రవరులారా! ఆ సూర్యలోకం రకరకాల వింతలతో గొప్పగా ప్రకాశిస్తుంది. ఆ లోకం అంతటా గంధర్వులు, అప్సరసలు ఉంటారు. విష్ణుభక్తుడు ఆదిత్యలోకంలో పదికల్పాల కాలం మంచి భోగాలను అనుభవిస్తాడు.

తస్మాదాయాతి భువనం గన్ధర్వాణాం సుదుర్లభమ్ ।
తత్ర భోగాన్ సమస్తాంశ్చ కల్పమేకం యథాసుఖమ్ ॥ 76 ॥

భక్తుడు సూర్యలోకం నుండి ఆ తరువాత (సూర్యలోకానికి దిగువ ఉన్న) దుర్లభమైన గంధర్వలోకానికి వెళ్తాడు. అక్కడ అన్నివిధాలైన సుఖాలను తనకు నచ్చిన విధంగా ఒక్క కల్పకాలం అనుభవిస్తాడు.

భుక్త్వా చాయాతి మేదిన్యాం రాజా భవతి ధార్మికః ।
చక్రవర్తీ మహావీర్యో గుణైస్సర్వైరలఙ్కృతః ॥ 77 ॥

అక్కడినుండి భూలోకానికి వస్తాడు. ఈలోకంలో ధర్మపరుడైన రాజు అవుతాడు. సమస్తమైన సద్గుణాలు గలిగి, గొప్ప పరాక్రమవంతుడైన చక్రవర్తి అవుతాడు.

కృత్వా రాజ్యం స్వధర్మేణ యజ్ఞైరిష్ట్వా సుదక్షిణైః ।
తదన్తే యోగినాం లోకం గత్వా మోక్షప్రదం శివమ్ ॥ 78 ॥

భూలోకంలో రాజ్యాన్ని చక్కగా పరిపాలిస్తాడు. అధికమైన దక్షిణలిచ్చి గొప్ప గొప్ప యాగాలు చేస్తాడు. ఆ తరువాత యోగులకు మోక్షాన్నిచ్చేదీ, శుభప్రదమైనదీ అయిన యోగుల లోకానికి వెళ్తాడు.

తత్ర భుక్త్వా వరాన్ భోగాన్ యావదాభూతసంప్లవమ్ ।
తస్మాదాగచ్ఛతే చాత్ర జాయతే యోగినాం కులే ॥
ప్రవరే వైష్ణవే విప్రా దుర్లభే సాధుసమ్మతే ॥ 79 ॥

యోగిలోకంలో మహాప్రళయం వచ్చేవరకూ శ్రేష్ఠమైన భోగాలు అనుభవిస్తాడు. ఆ తరువాత ఇక్కడే ఉత్తమమూ, దుర్లభమూ, మహర్షులకు ఇష్టమూ అయిన విష్ణుభక్తులైన యోగుల వంశంలో జన్మిస్తాడు.

చతుర్వేదీ విప్రవరో యజ్ఞైరిష్ట్వాఽఽప్తదక్షిణైః ।
వైష్ణవం యోగ మాస్థాయ తతో మోక్షమవాప్నుయాత్ ॥ 80 ॥

బ్రాహ్మణులలో ఉత్తము డవుతాడు. నాలుగు వేదాలనూ సమగ్రంగా తెలుసుకుంటాడు. మంచి దక్షిణ లిచ్చి, గొప్పయజ్ఞాలు చేస్తాడు. మనసును శ్రీమహావిష్ణువుపై దృఢంగా నిలిపి, విష్ణుయోగంతో తరువాత మోక్షాన్ని పొందుతాడు.

ఏవం యాత్రాఫలం విప్రా మయా సమ్యగుదాహృతమ్ ।
భుక్తిముక్తిప్రదం నృణాం కిమన్యచ్ఛ్రోతుమిచ్ఛథ ॥ 81 ॥

బ్రాహ్మణులారా! ఈవిధంగా మానవులకు భోగమోక్షాలను ప్రసాదించే ద్వాదశ యాత్రాఫలాన్ని గురించి మీకు పూర్తిగా వివరించాను. ఇక తర్వాత మీరు ఏమి వినాలనుకుంటున్నారు?

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే ద్వాదశయాత్రాఫలమాహాత్మ్యనిరూపణం నామ చతుష్షష్టితమోఽధ్యాయః ॥ 64 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషి సంవాదంలో ద్వాదశ యాత్రాఫల మాహాత్మ్య నిరూపణం అనే అరవైనాల్గవ అధ్యాయం సంపూర్ణం.



పఞ్చషష్టితమోఽధ్యాయః - అరవైఐదవ అధ్యాయం

విష్ణులోకానుకీర్తనమ్ - విష్ణులోకానుకీర్తనం

మునయ ఊచుః :-మహర్షులు అంటున్నారు.

శ్రోతుమిచ్ఛామహే దేవ విష్ణులోకమనామయమ్ ।
లోకానన్దకరం కాన్తం సర్వాశ్చర్యసమన్వితమ్ ॥ 1 ॥

బ్రహ్మదేవా! విష్ణులోకం గురించి విందామనుకుంటున్నాం. అక్కడ అనారోగ్యం మొదలైన బాధలు ఏమీ ఉండవు. అది అన్ని లోకాల వారికీ ఆనందాన్ని కలిగిస్తుంది. అంతటా వింతలతో నిండి ఉంటుంది. ఆ విష్ణులోకం చాల మనోహరమైనది.

ప్రమాణం తస్య లోకస్య భోగం కాన్తిం బలం ప్రభో ।
కర్మణా కేన గచ్ఛన్తి తత్ర ధర్మపరా నరాః ॥ 2 ॥

ప్రభూ! విష్ణులోకం పరిమాణం ఎంత? అక్కడి భోగాలు, దాని గొప్పతనం, శక్తి ఏమిటి? ధర్మపరాయణులైన మానవులు ఆ లోకానికి వెళ్లాలంటే ఏం చేయాలి?

దర్శనాత్ స్పర్శనాద్వాపి తీర్థస్నానాదినాఽపి వా ।
విస్తరాద్బ్రూహి తత్త్వేన పరం కౌతూహలం హి నః ॥ 3 ॥

(దేవాది) దర్శనం, స్పర్శనం, పుణ్యతీర్థాలలో స్నానం మొదలుగా ఏవిధమైన కర్మలను ఆచరిస్తే విష్ణులోకం ప్రాప్తిస్తుందో, ఆ రహస్యాలను వివరించి చెప్పవలసింది. ఆ విషయాలన్నీ తెలుసుకోవాలని మాకు చాల ఉత్కంఠగా ఉంది.

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

శృణుధ్వం మునయస్సర్వే యత్ పరం పరమం పదమ్ ।
భక్తానామీహితం ధన్యం పుణ్యం సంసారనాశనమ్ ॥ 4 ॥

మహర్షులారా! అందరూ శ్రద్ధగా వినండి. విష్ణులోకం లోకాలన్నింటికంటె పైన ఉంటుంది. దానికి మించిన స్థానం లేదు. భక్తులందరూ విష్ణులోకానికి చేరుకోవాలని కోరుకుంటారు. విష్ణులోకం ప్రయోజనవంతం, పుణ్యప్రదం, సంసారబాధలను నిర్మూలిస్తుంది.

ప్రవరం సర్వలోకానాం విష్ణ్వాఖ్యం వదతో మమ ।
సర్వాశ్చర్యమయం పుణ్యం స్థానం త్రైలోక్యపూజితమ్ ॥ 5 ॥

అన్ని లోకాలలోనూ శ్రేష్ఠమైన ఆ విష్ణులోకాన్ని గురించి చెప్తాను. వినండి. విష్ణులోకంలో అన్నీ వింతలే. పుణ్యాత్ములు నివసించే స్థానం. మూడు(సమస్తమైన) లోకాలూ విష్ణులోకాన్ని అర్చిస్తాయి.

అశోకైః పారిజాతైశ్చ మన్దారైశ్చమ్పకద్రుమైః ।
మాలతీమల్లికాకున్దైర్వకులైర్నాగకేసరైః ॥ 6 ॥

విష్ణులోకంలో అశోకం, పారిజాతం, మందారం, సంపెంగ, జాజి, మల్లె, మొల్ల, పొగడ, నాగకేసరం చెట్లు, తీగలు ఉన్నాయి.

పున్నాగైరతిముక్తైశ్చ ప్రియఙ్గుతగరార్జునైః ।
పాటలాచూతఖదిరైః కర్ణికారవనోజ్జ్వలైః ॥ 7 ॥

పొన్న, మాధవీలతలు, ప్రేంకణం, నందివర్ధనం, జువ్వి, కలిగొట్టు, మామిడి, చంద్ర, కొండగోగుచెట్లు గుంపులుగా ఉన్నాయి.

నారఙ్గైః పనసైర్లోధ్రైర్నిమ్బదాడిమసర్జకైః ।
ద్రాక్షాలకుచఖర్జూరైర్మధుకేన్ద్రఫలద్రుమైః ॥ 8 ॥

నారింజ, పనస, లొద్దుగ, వేప, దానిమ్మ, మద్ది, ద్రాక్ష, గజనిమ్మ, ఖర్జూరం, ఇప్ప, ఇంద్రఫలం చెట్లు ఉన్నాయి.

కపిత్థైర్నారికేరైశ్చ తాలైశ్శ్రీఫలసమ్భవైః ।
కల్పవృక్షైరసఙ్ఖ్యైశ్చ వన్యైరన్యైస్సుశోభనైః ॥ 9 ॥

వెలగ, కొబ్బరి, తాడి, మారేడు, మొదలైన మనోహరమైన అడవిచెట్లు, ఇంకా ఇతరమైన చెట్లు కల్పవృక్షాల లాగా, విష్ణులోకంలో లెక్కలేనన్ని ఉన్నాయి.

సరలైశ్చన్దనైర్నీపైర్దేవదారుశుభాఞ్జనైః ।
జాతీలవఙ్గకఙ్కోలైః కర్పూరామోదవాసిభిః ॥ 10 ॥

తెల్లతెగడ, చందనం, కడిమి, దేవదారువు, తుమికి, జాజి, లవంగం, కంకోలం, కర్పూరం పరిమళం కలిగినచెట్లు ఉన్నాయి.

తామ్బూలపత్రనిచయైస్తథా పూగీఫలద్రుమైః ।
అన్యైశ్చ వివిధైర్వృక్షైస్సర్వర్తుఫలశోభితైః ॥ 11 ॥

తమలపాకుతీగలు, పోకచెట్లు, ఇంకా ఇతరమైన రకరకాలచెట్లు వివిధమైన ఋతువులలో ఉండేవన్నీ అన్ని ఋతువులలోనూ సమృద్ధిగా విష్ణులోకంలో ఉంటాయి.

పుష్పైర్నానావిధైశ్చైవ లతాగుచ్ఛసముద్భవైః ।
నానాజలాశయైః పుణ్యైర్నానాపక్షిరుతైర్వరైః ॥ 12 ॥

విష్ణులోకంలో వివిధమైన తీగలనుండి పుట్టిన రకరకాల పూలు ఉంటాయి. పుణ్యప్రదమైన నీటిపట్టులు ఎన్నో ఉన్నాయి. ఆ నీటిపట్టులు ఉత్తమమైన రకరకాల పక్షుల కూతలు నిండి ఉంటాయి.

దీర్ఘికాశతసఙ్ఘాతైస్తోయపూర్ణైర్మనోహరైః ।
కుముదైశ్శతపత్రైశ్చ పుష్పైః కోకనదైర్వరైః ॥ 13 ॥

అక్కడ వందలకొద్దీ దిగుడుబావులు ఉన్నాయి. అవి నిండా నీళ్లు కలిగి ఉన్నాయి. ఆ నీటినిండా ఉన్న శ్రేష్ఠమైన ఎఱ్ఱతామర పూలతోనూ, తెల్లకలువ పూలతోనూ ఆ బావులు మనోహరంగా ఉన్నాయి.

రక్తనీలోత్పలైః కాన్తైః కహ్లారైశ్చ సుగన్ధిభిః ।
అన్యైశ్చ జలజైః పుష్పైర్నానావర్ణైస్సుశోభనైః ॥ 14 ॥

మనోహరమైన ఎఱ్ఱకలువలు, నల్లగలువలు, పరిమళభరితమైన సౌగంధికపుష్పాలు, ఇంకా నీటినుండి పుట్టిన రకరకాలైన ఇతర పుష్పాలు రంగురంగులలో చక్కగా ప్రకాశిస్తుంటాయి.

హంసకారణ్డవాకీర్ణైశ్చక్రవాకోపశోభితైః ।
కోయష్టికైశ్చ దాత్యూహైః కారణ్డవరవాకులైః ॥ 15 ॥

ఆ ప్రాంతం నిండా హంసలు, కన్నెలేడిపిట్టలు ఉన్నాయి. చక్రవాకపక్షులు చక్కగా ప్రకాశిస్తున్నాయి. నీటిగంప పులుగులు, చాతకపక్షులు ఉన్నాయి. కన్నెలేడిపిట్టల కూతలు ఆ ప్రాంతమంతటా దండిగా వినిపిస్తున్నాయి.

చాతకైః ప్రియపుత్రైశ్చ జీవఞ్జీవకజాతిభిః ।
అన్యైర్దివ్యైర్జలచరైః ఖగైశ్చ మధురస్వనైః ॥ 16 ॥

చాతకాలు, ప్రియపుత్రం అనే పేరు గల పక్షులు, వెన్నెలపక్షులు, ఇంకా నీటిలో సంచరిస్తూ ఆకాశంలో ఎగిరే అనేక పక్షులు ఉన్నాయి. ఆ పక్షులు దివ్యమైనవి. వాటి కూతలు చెవికింపుగా ఉంటాయి.

ఏవం నానావిధైర్దివ్యైర్నానాశ్చర్యసమన్వితైః ।
వృక్షైర్జలాశయైః పుణ్యైర్భూషితం సుమనోహరైః ॥ 17 ॥

ఆ విష్ణులోకం ఈవిధంగా రకరకాలైన వింత వింత చెట్లతోనూ, పవిత్రమైన నీటిపట్టులతోనూ కూడి ఉంది. అవి అందంగానూ, వింతగానూ, లోకాతీతంగానూ ఉంటాయి.

తత్ర దివ్యైర్విమానైశ్చ నానారత్నవిభూషితైః ।
కామగైః కాఞ్చనైశ్శుభ్రైర్దివ్యగన్ధర్వనాదితైః ॥ 18 ॥

విష్ణులోకంలో దేవతల విమానాలు అనేకం ఉన్నాయి. వాటిని బంగారంతో నిర్మించారు. ఇంకా వాటికి రకరకాల రత్నాలు అందంగా పొదిగారు. అవి తమ ఇష్టం వచ్చినవిధంగా సంచరిస్తాయి. పవిత్రంగా ఉంటాయి. దివ్యమైన గంధర్వుల సంగీతధ్వనులతో నిండిఉన్నాయి.

తరుణాదిత్యసఙ్కాశైరప్సరోభిరలఙ్కృతైః ।
హేమశయ్యాసనయుతైర్నానాభోగసమన్వితైః ॥ 19 ॥

ఆ విమానాలు మధ్యాహ్నసమయంలోని సూర్యుడులాగా తీక్ష్ణమైన కాంతి కలిగి ఉన్నాయి. అప్సరసలతో అవి అందంగా ఉన్నాయి. ఆ విమానాలలో బంగారపు సింహాసనాలు, బంగారపు శయ్యలు ఉన్నాయి. ఇని మాత్రమే కాక ఇంకా అనేకమైన భోగాలతో నిండి ఉన్నాయి.

ఖేచరైస్సపతాకైశ్చ ముక్తాహారావలమ్బిభిః ।
నానావర్ణైరసఙ్ఖ్యాతైర్జాతరూపపరిచ్ఛదైః ॥ 20 ॥

ఆ విమానాలమీద ఎత్తుగా ఉన్న జెండాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. వాటి చుట్టూ ముత్యాలహారాలు వేలాడుతున్నాయి. అందులో రంగురంగుల బంగారుబట్టలు లెక్క లేనన్ని ఉన్నాయి.

నానాకుసుమగన్ధాఢ్యైశ్చన్దనాగురుభూషితైః ।
సుఖప్రచారబహులైర్నానావాదిత్రనిస్స్వనైః ॥ 21 ॥

అవి అనేకమైన పూవుల పరిమళాలతో నిండి ఉన్నాయి. చందనం అగురులతో అలంకరించబడి ఉన్నాయి. విస్తారంగానూ, సుఖకరంగానూ సంచరిస్తాయి. రకరకాల వాద్యాల ధ్వనులతో కూడి ఉంటాయి.

మనోమారుతతుల్యైశ్చ కిఙ్కిణీస్తబకాకులైః ।
విహరన్తి పురే తస్మిన్ వైష్ణవే లోకపూజితే ॥ 22 ॥

ఆ విమానాలు మనసుతోనూ, గాలితోనూ సమానమైన వేగం గలిగి ఉంటాయి. వాటికి చిరుగజ్జెలు దండిగా అలంకరించబడి ఉన్నాయి. లోకాన్నీ పూజించే ఆ విష్ణునగరంలో ఇటువంటి విమానాలు ఎన్నో చక్కగా విహరిస్తుంటాయి.

నానాఙ్గనాభిస్సతతం గన్ధర్వాప్సరసాదిభిః ।
చన్ద్రాననాభిః కాన్తాభిర్యోషిద్భిస్సుమనోహరైః ॥ 23 ॥

ఆ విమానాల నిండా అందమైన కాంతలు ఎందరో ఉంటారు. చంద్రుడితో సమానమైన ముఖసౌందర్యం కలిగి, మనసులను హరించే స్త్రీలు ఉంటారు. గంధర్వులు, అప్సరసలు ఉంటారు.

పీనోన్నతకుచాగ్రాభిస్సుమధ్యాభి స్సమన్తతః ।
శ్యామావదాతవర్ణాభిర్మత్తమాతఙ్గగామిభిః ॥ 24 ॥

వారివక్షోజాలు బలిసినవిగా ఎత్తుగానూ ఉంటాయి. నడుము ఎంతో అందంగా ఉంటుంది. కొందరు చామని చాయ మేనివారు మరికొందరు తెల్లగా ఉంటారు. మదించిన ఏనుగులాగా గంభీరమైన నడకసౌందర్యం కలిగి ఉంటారు.

పరివార్య నరశ్రేష్ఠం వీజయన్తి స్మ తాః స్త్రియః ।
చామరైరుక్మదణ్డైశ్చ నానారత్నవిభూషితైః ॥ 25 ॥

ఆ విమానంలోని స్త్రీలు విష్ణులోకానికి వస్తున్న విష్ణుభక్తుడికి వింజామరలతో వీస్తుంటారు. ఆ చామరాలకు బంగారు పిడి ఉంటుంది. అవి ఇంకా రకరకాల రత్నాలతో చక్కగా అలంకరించబడి ఉన్నాయి.

గీతనృత్యైస్తథా వాద్యైర్మోదమానైర్మదాలసైః ।
యక్షవిద్యాధరైస్సిద్ధైర్గన్ధర్వైరప్సరోగణైః ॥ 26 ॥

సురసఙ్ఘైశ్చ ఋషిభిశ్శుశుభే భువనోత్తమమ్ ।
తత్ర ప్రాప్య మహాభోగాన్ ప్రాప్నువన్తి మనీషిణః ॥ 27 ॥

విమానాలలో ఆ స్త్రీలు పాడే గీతాలతో, ఆడే నాట్యాలతో, యక్షులూ, విద్యాధరులూ, సిద్ధులూ, గంధర్వులూ, అప్సరసలూ, దేవతల సమూహాలూ, మహర్షులూ పరవశు లై, ఆనందిస్తున్నారు. అటువంటి వారితో వైకుంఠలోకం చక్కగా ప్రకాశిస్తున్నది. పురుషోత్తముడిని పూజించిన వారు ఆ వైకుంఠలోకానికి వెళ్లి, గొప్ప గొప్ప భోగాలను అనుభవిస్తారు.

వటరాజసమీపే తు దక్షిణస్యోదధేస్తటే ।
దృష్టో యైర్భగవాన్ కృష్ణః పుష్కరాక్షో జగత్పతిః ॥
క్రీడన్త్యప్సరసైస్సార్ధం యావద్ ద్యౌశ్చన్ద్రార్కతారకమ్ ॥ 28 ॥

దక్షిణసముద్రం తీరంలో, పురుషోత్తమక్షేత్రంలో, ఉత్తమమైన వటవృక్షం సమీపంలో, పుండరీకాక్షుడు, జగన్నాథుడూ అయిన శ్రీకృష్ణభగవానుడిని దర్శించుకున్నవారు ఆకాశం, చంద్రుడు, సూర్యుడు, నక్షత్రాలు ఉన్నంతకాలం వైకుంఠలోకంలో అప్సరసలతో కలిసి క్రీడిస్తారు.

ప్రతప్తహేమసఙ్కాశా జరామరణవర్జితాః ।
సర్వదుఃఖవిహీనాశ్చ తృష్ణాగ్లానివివర్జితాః ॥ 29 ॥

వారు మంచి మేలిమి బంగారంలాగా మెరిసిపోతుంటారు. వారికి ముసలితనం రాదు. మరణం ఉండదు. వారికి ఏవిధమైన బాధలూ ఉండవు. కోరికలు ఉండవు. హాని ఉండదు.

చతుర్భుజా మహావీర్యా వనమాలావిభూషితాః ।
శ్రీవత్సలాఞ్ఛనైర్యుక్తాశ్శఙ్ఖచక్రగదాధరాః ॥ 30 ॥

వారికి నాలుగు బాహువులు ఉంటాయి. గొప్ప శక్తిమంతు లవుతారు. మోకాళ్లదాకా ఉండే పెద్దపూలమాలను అలంకరించుకుంటారు. శ్రీవత్సం అనే గుర్తును ధరిస్తారు. శంఖం, చక్రం, గదలను ధరిస్తారు (శ్రీమహావిష్ణు స్వరూపాన్ని అంటే సారూప్యముక్తిని పొందుతారు).

కేచిన్నీలోత్పలశ్యామాః కేచిత్ కాఞ్చనసన్నిభాః ।
కేచిన్మరకతప్రేక్ష్యాః కేచిద్ వైడూర్యసన్నిభాః ॥ 31 ॥

కొందరు నల్లకలువలాగా నలుపురంగులో ఉంటారు. మరి కొందరు బంగారంలాగా పసిమి రంగులో ఉంటారు. కొందరు మరకతమణులలాగా ఆకుపచ్చ రంగులో ఉంటారు. ఇంక కొందరు వైడూర్యమణుల వన్నె (పిల్లికన్నుల రంగు)లో ఉంటారు.

శ్యామవర్ణాః కుణ్డలినస్తథాన్యే వజ్రసన్నిభాః ॥ 32 ॥

కొందరు ఆకుపచ్చ, నలుపు కలిసిన రంగులో ఉంటారు. మరి కొందరు నెమలి రంగులో ఉంటారు. ఇంకా కొందరు వజ్రంలాగా తెల్లగా మెరుస్తుంటారు.

న తాదృక్ సర్వదేవానాం భాన్తి లోకా ద్విజోత్తమాః ।
యాదృగ్ భాతి హరేర్లోకస్సర్వాశ్చర్యసమన్వితః ॥ 33 ॥

విప్రవరులారా! సమస్తమైన వింతలతో నిండిన విష్ణులోకం ప్రకాశించినట్లుగా ఇతర దేవతల లోకాలు ఏవీ ప్రకాశించవు.

న తత్ర పునరావృత్తిర్గమనాజ్జాయతే ద్విజాః ।
ప్రభావాత్ తస్య దేవస్య యావదాభూతసంప్లవమ్ ॥ 34 ॥

విప్రులారా! విష్ణులోకానికి వెళ్లినవాడు భూలోకానికి తిరిగి రాడు. శ్రీమహావిష్ణువు మహిమచేత ఆత్యంతిక ప్రళయం వచ్చేవరకు విష్ణులోకంలోనే సుఖంగా ఉంటాడు.

విచరన్తి పురే దివ్యే రూపయౌవనగర్వితాః ।
కృష్ణం రామం సుభద్రాం చ పశ్యన్తి పురుషోత్తమే ॥ 35 ॥

విష్ణులోకం దివ్యమైనది. పురుషోత్తమక్షేత్రంలో కృష్ణస్వామినీ, బలరాముడినీ, సుభద్రనూ దర్శించుకున్నవారు సుందరమైన రూపాన్నీ, పరిపూర్ణమైన యౌవనాన్నీ పొంది విష్ణులోకంలో విహరిస్తారు.

ప్రతప్తహేమసఙ్కాశం తరుణాదిత్యసన్నిభమ్ ।
పురమధ్యే హరేర్భాతి మన్దిరం రత్నభూషితమ్ ॥ 36 ॥

ఆ విష్ణులోకం మధ్యలో శ్రీహరి నివసించే భవనం ఉంటుంది. అది మేలిమి బంగారం రంగులో ఉంటుంది. మధ్యాహ్నపు సూర్యుడితో సమానమైన తేజస్సు గలిగి ఉంటుంది. వివిధరత్నాలతో అలంకరించబడి ఉంటుంది.

అనేకశతసాహస్రైః పతాకైస్సమలఙ్కృతమ్ ।
యోజనాయుతవిస్తీర్ణం హేమప్రాకారవేష్టితమ్ ॥ 37 ॥

విష్ణుమందిరం ఎన్నో వందలూ వేలూ జెండాలతో అలంకరించబడి ఉంటుంది. పదివేల యోజనాల వైశాల్యం కలిగి ఉంటుంది. దానికి చుట్టూ బంగారు ప్రాకారాలు ఉన్నాయి.

నానావర్ణైర్ధ్వజైశ్చిత్రైః కల్పితైస్సుమనోహరైః ।
విభాతి శారదీయో హి నక్షత్రైరివ చన్ద్రమాః ॥ 38 ॥

ఆ జెండాలు రకరకాల రంగులలో చిత్రంగానూ, మనోహరంగానూ ఉంటాయి. మెరిసే జెండా(కట్ట)లతో విష్ణుమందిరం శరత్కాలంలో నక్షత్రాల నడుమ చంద్రుడిలాగా ప్రకాశిస్తుంది.

చతుర్ద్వారం సువిస్తీర్ణం రక్షకైః పరిరక్షితమ్ ।
పురసప్తకసంయుక్తం మహోత్సేధమనోహరమ్ ॥ 39 ॥

ఆ విష్ణుమందిరానికి నాలుగు దిక్కులలోనూ నాలుగు ప్రవేశద్వారాలు ఉన్నాయి. ఆ భవనం చాల విశాలమైనది. అంతటా రక్షకభటులు జాగ్రత్తగా కాపలా కాస్తూ ఉంటారు. అంతఃపురాల వంటి పెద్ద పెద్ద పురములు ఏడు ఉన్నాయి. అవి మిక్కిలి ఎత్తుగానూ అందంగానూ ఉంటాయి.

ప్రథమం కాఞ్చనం తత్ర ద్వితీయం మరకతైర్యుతమ్ ।
ఇన్ద్రనీలం తృతీయం తు మహానీలం తతః పరమ్ ॥ 40 ॥

వాటిలో మొదటిది బంగారంతో నిర్మించబడింది. రెండవది మరకతమణుల(పచ్చల)తోనూ, మూడవది ఇంద్రనీలమణులతోనూ, నాలగవది మహానీలమణులతోనూ నిర్మించబడినాయి.

పురం తు పఞ్చమం దీప్తం పద్మసరోమయం పురమ్ ।
షష్ఠం వజ్రమయం విప్రా వైడూర్యం సప్తమం పురమ్ ॥ 41 ॥

బ్రాహ్మణులారా! ఐదవ పురం పద్మరాగమణులతోనూ, ఆరవది వజ్రాలతోనూ, ఏడవది వైడూర్యమణులతోనూ నిర్మించబడినాయి.

నానారత్నమయైర్హేమప్రవాలాఙ్కురశోభితైః ।
స్తమ్భైరద్భుతసఙ్కాశైర్భాతి తద్భవనం మహత్ ॥ 42 ॥

విష్ణుమందిరంలోని స్తంభాలనిండా రకరకాల రత్నాలు పొదిగారు. ఆ స్తంభాలు బంగారంతోనూ పగడపు మొగ్గలతోనూ ప్రకాశిస్తున్నాయి. ఎంతో ఆశ్చర్యం గలిగిస్తున్న స్తంభాలతో విష్ణుమందిరం చాల గొప్పగా వెలుగుతున్నది.

దృశ్యన్తే తత్ర సిద్ధాశ్చ భాసయన్తి దిశో దశ ।
పౌర్ణమాస్యాం సనక్షత్రో యథా భాతి నిశాకరః ॥ 43 ॥

అక్కడ సిద్ధులు సంచరిస్తున్నారు. వారు (తమ తేజస్సుతో) పది దిక్కులనూ కాంతులు నింపుతున్నారు. పూర్ణిమనాడు నక్షత్రాల నడుమ చంద్రుడులాగా ఆ ఏడు భవనాల సముదాయం నడుమ విష్ణుమందిరం విశేషంగా ప్రకాశిస్తున్నది.

ఆరూఢస్తత్ర భగవాన్ సలక్ష్మీకో జనార్దనః ।
పీతామ్బరధరశ్శ్యామశ్శ్రీవత్సలక్ష్మసంయుతః ॥ 44 ॥

ఆ మందిరంలో జనార్దనస్వామి లక్ష్మీదేవితో కలిసి వేంచేసి ఉంటాడు. ఆ భగవానుడు పచ్చని పట్టువస్త్రం ధరించాడు. నల్లగా ఉంటాడు. శ్రీవత్సం అనే చిహ్నాన్ని ధరించి ఉంటాడు.

జ్వలత్సుదర్శనం చక్రం ఘోరం సర్వాస్త్రనాశనమ్ ।
దధార దక్షిణే హస్తే సర్వతేజోమయం హరిః ॥ 45 ॥

ఆ శ్రీహరి కుడిచేతిలో సుదర్శనం అనే చక్రాయుధాన్ని ధరించాడు. ఆ సుదర్శనం నిప్పులు కక్కుతున్నట్లుగా జ్వలిస్తుంటుంది. (పాపులకు) భయం కలిగిస్తుంది. ఇతరమైన ఆయుధాల నన్నింటిని నాశనం చేస్తుంది. సమస్తమైన తేజస్సులతో నిండిఉంటుంది.

కున్దేన్దురజతప్రఖ్యం హారగోక్షీరసన్నిభమ్ ।
ఆదాయ తం మునిశ్రేష్ఠాస్సవ్యహస్తేన కేశవః ॥ 46 ॥

యస్య శబ్దేన సకలం సంక్షోభం జాయతే జగత్ ।
విశ్రుతం పాఞ్చజన్యేతి సహస్రావర్తభూషితమ్ ॥ 47 ॥

మహర్షులారా! కేశవుడు ఎడమచేతిలో శంఖాన్ని ధరిస్తాడు. ఆ శంఖం మొల్లలలాగా, చంద్రుడిలాగా, వెండిలాగా ముత్యాలలాగా, ఆవుపాలలాగా, స్వచ్ఛంగా తెల్లగా ప్రకాశిస్తుంది. వేయి సుడులతో కూడి ఉంటుంది. అది పాంచజన్యం అనే పేరుతో ప్రసిద్ధమయింది. ఆ శంఖం ధ్వనికి లోకం సమస్తం కంపించిపోతుంది.

దుష్కృతాన్తకరీం రౌద్రాం దైత్యదానవనాశినీమ్ ।
జ్వలద్వహ్నిశిఖాకారాం దుస్సహాం త్రిదశైరపి ॥
కౌమోదకీం గదాం చాసౌ ధృతవాన్ దక్షిణే కరే ॥ 48 ॥

శ్రీమహావిష్ణువు మరొక కుడిచేతిలో కౌమోదకి అనే గదను ధరించాడు. అది పాపాలను నిర్మూలిస్తుంది. పాపులకు భయం పుట్టిస్తుంది. దైత్యులనూ, దానవులనూ సంహరిస్తుంది. మండుతున్న అగ్నిజ్వాలవంటి ఆకారంలో ఉంటుంది. దానిని దేవతలు కూడ తట్టుకోలేరు.

వామే విస్ఫురతి హ్యస్య శార్ఙ్గం సూర్యసమప్రభమ్ ।
శరైరాదిత్యసఙ్కాశైర్జ్వాలామాలాకులైర్వరైః ॥
యోஉసౌ సంహరతే దేవస్త్రైలోక్యం సచరాచరమ్ ॥ 49 ॥

ఆ స్వామి మరొక ఎడమచేతిలో శార్ఙ్గం అనే ధనుస్సు ధరిస్తాడు. అది సూర్యుడితో సమానమైన తేజస్సు కలిగి ఉంటుంది. ఆ ధనుస్సుతో స్వామి మండుతున్న అగ్నిజ్వాలలతో నిండి, సూర్యుడిలాగా తీక్ష్ణమైన గొప్ప బాణాలను ప్రయోగించి, స్థావర జంగమ రూపమైన లోకం సమస్తాన్నీ సంహరిస్తాడు.

సర్వానన్దకరశ్శ్రీమాన్ సర్వశాస్త్రవిశారదః ।
సర్వలోకగురుర్దేవస్సర్వైర్దేవైర్నమస్కృతః ॥ 50 ॥

శ్రీకృష్ణస్వామి అందరికీ ఆనందాన్ని కలిగిస్తాడు. ఎప్పుడూ లక్ష్మీదేవితో కూడి ఉంటాడు. సమస్తమైన శాస్త్రాలలోనూ నిపుణుడు. ఆ స్వామి జగద్గురువు. దేవతలు అందరూ ఆ స్వామికి నమస్కరిస్తారు.

సహస్రమూర్ధా దేవేశస్సహస్రచరణేక్షణః ।
సహస్రాఖ్యస్సహస్రాఙ్గస్సహస్రభుజవాన్ ప్రభుః ॥ 51 ॥

దేవతలకు సార్వభౌముడైన ఆ స్వామికి వేయి (అంతు లేని) శిరస్సులు, పాదాలు, కన్నులు, పేర్లు, దేహాలు, బాహువులు ఉన్నాయి.

సింహాసనగతో దేవః పద్మపత్రాయతేక్షణః ।
విద్యుద్విస్పష్టసఙ్కాశో జగన్నాథో జగద్గురుః ॥ 52 ॥

తామరరేకులలాగా విశాలమైన కన్నులు కలిగిన శ్రీవిష్ణుభగవానుడు సింహాసనం మీద ఆసీనుడై, చక్కనైన మెరపులాగా ప్రకాశిస్తున్నాడు. ఆ స్వామి లోకాలన్నింటికీ రక్షకుడు. గురువు.

పరీతస్సురసిద్ధైశ్చ గన్ధర్వాప్సరసాం గణైః ।
యక్షవిద్యాధరైర్నాగైర్మునిసిద్ధైస్సచారణైః ॥ 53 ॥

సుపర్ణైర్దానవైర్దైత్యై రాక్షసైర్గుహ్యకిన్నరైః ।
అన్యైర్దేవగణైర్దివ్యైః స్తూయమానో విరాజతే ॥ 54 ॥

దేవతలు, సిద్ధులు, గంధర్వులు, అప్సరసలు, యక్షులు, విద్యాధరులు, నాగులు, మహర్షులు, సిద్ధులు, చారణులు, సుపర్ణులు (గరుత్మంతుడి జాతికి చెందినవారు), దానవులు, దైత్యులు, రాక్షసులు, గుహ్యకులు,కిన్నరులు. ఇంకా ఇతరమైన వివిధ దేవజాతులవారు, చుట్టూ చేరి, స్తోత్రాలు చేస్తుండగా ఆ స్వామి గొప్పగా వెలిగిపోతున్నాడు.

తత్రస్థా సతతం కీర్తిః ప్రజ్ఞా మేధా సరస్వతీ ।
బుద్ధిర్మతిస్తథా క్షాన్తిస్సిద్ధిర్మూర్తిస్తథా ద్యుతిః ॥ 55 ॥

నిరంతరమూ (స్వామిని సేవిస్తూ) ఈ దేవతలు అక్కడే ఉంటారు. (ఆ దేవతలు) కీర్తి, ప్రజ్ఞ, మేధ, సరస్వతి, బుద్ధి, మతి, క్షాంతి, సిద్ధి, మూర్తి, ద్యుతి,

గాయత్రీ చైవ సావిత్రీ మఙ్గలా సర్వమఙ్గలా ।
ప్రభా మతిస్తథా కాన్తిస్తత్ర నారాయణీ స్థితా ॥ 56 ॥

గాయత్రి, సావిత్రి, మంగళ, సర్వమంగళ, ప్రభ, మతి, కాంతి, నారాయణి,

శ్రద్ధా చ కౌశికీ దేవీ విద్యుత్సౌదామినీ తథా ।
నిద్రా రాత్రిస్తథా మాయా తథాఽన్యామరయోషితః ॥ 57 ॥

శ్రద్ధ, కౌశికి, విద్యుత్, సౌదామిని, నిద్ర, రాత్రి, మాయ, ఇంకా ఇతర దేవతాస్త్రీలు

వాసుదేవస్య సర్వాస్తా భవనే సమ్ప్రతిష్ఠితాః ।
అథ కిం బహునోక్తేన సర్వం తత్ర ప్రతిష్ఠితమ్ ॥ 58 ॥

అందరూ విడువకుండా వాసుదేవుడి మందిరంలో ఉంటారు. ఇన్ని మాట లెందుకు? సమస్తమూ స్వామి మందరింలో సుస్థిరంగా ఉంటుంది.

ఘృతాచీ మేనకా రమ్భా సహజన్యా తిలోత్తమా ।
ఉర్వశీ చైవ నిమ్లోచా తథాన్యా వామనా పరా ॥ 59 ॥

ఘృతాచి, మేనక, రంభ, సహజన్య, తిలోత్తమ, ఉర్వశి, నిమ్లోచ, వామన,

మన్దోదరీ చ సుభగా విశ్వాచీ విపులాననా ।
భద్రాఙ్గీ చిత్రసేనా చ ప్రమ్లోచా సుమనోహరా ॥ 60 ॥

మందోదరి, సుభగ, విశ్వాచి, విపులానన, భద్రాంగి, చిత్రసేన, ప్రమ్లోచ, సుమనోహర,

మునిసమ్మోహినీ రామా చన్ద్రమధ్యా శుభాననా ।
సుకేశీ నీలకేశా చ తథా మన్మథదీపినీ ॥ 61 ॥

మునిసమ్మోహిని, రామ, చంద్రమధ్య, శుభానన, సుకేశి, నీలకేశ, మన్మథదీపిని,

అలమ్బుషా మిశ్రకేశీ తథాన్యా పుఞ్జికస్థలా ।
క్రతుస్థలా వరాఙ్గీ చ పూర్వచిత్తి స్తథా పరా ॥ 62 ॥

అలంబుస, మిశ్రకేశి, పుంజికస్థల, క్రతుస్థల, వరాంగి, పూర్వచిత్తి,

పరావతీ మహారూపా శశిలేఖా శుభాననా ।
హంసలీలానుగామినీ మత్తవారణగామినీ ॥ 63 ॥

పరావతి, మహారూప, సుందరముఖి అయిన శశిలేఖ, హంసలీలానుగామిని, మత్తవారణగామిని,

బిమ్బోష్ఠీ నవగర్భా చ విఖ్యాతా స్సురయోషితః ।
ఏతాశ్చాన్యా అప్సరసో రూపయౌవనగర్వితాః ॥ 64 ॥

బింబోష్ఠి, నవగర్భ, అనేవారు ప్రసిద్ధి పొందిన దేవకాంతలు. వీరూ, ఇంకా సుందరరూపమూ, యుక్తవయసూ గలిగిన జాణలైన ఇతర అప్సరసలు స్వామిని సేవిస్తూ ఉన్నారు.

సుమధ్యాశ్చారువదనాస్సర్వాలఙ్కారభూషితాః ।
గీతమాధుర్యసంయుక్తాస్సర్వలక్షణసంయుతాః ॥ 65 ॥

వారి నడుము చాల చక్కగా సన్నగా ఉంటుంది. ముఖం అందంగా ఉంటుంది. సమస్తమైన ఆభరణాలు ధరించారు. చెవికింపుగా గానం చేస్తారు. వారికి మంచి లక్షణాలు సమస్తమూ ఉన్నాయి.

గీతవాద్యే చ కుశలాస్సురగన్ధర్వయోషితః ।
నృత్యన్త్యనుదినం తత్ర యత్రాసౌ పురుషోత్తమః ॥ 66 ॥

గానంలోనూ, నాట్యంలోనూ నేర్పరులైన దేవకాంతలు, గంధర్వ స్త్రీలు శ్రీమహావిష్ణువు వేంచేసిన ఆ చోట ప్రతిరోజూ నాట్యం చేస్తుంటారు.

న తత్ర రోగో నో గ్లానిర్న మృత్యుర్న హిమాతపౌ ।
న క్షుత్ పిపాసా న జరా న వైరూప్యం న చాసుఖమ్ ॥ 67 ॥

శ్రీమహావిష్ణువు నెలకొన్న ఆ ప్రదేశంలో రోగాలు ఉండవు. హాని ఉండదు. మరణం ఉండదు. తట్టుకోలేని చలీ, వేడీ ఉండవు. దాహం, ఆకలి, ముసలితనం, అవయవలోపం, కష్టం ఉండవు.

పరమానన్దజననం సర్వకామఫలప్రదమ్ ।
విష్ణులోకాత్ పరం లోకం నాత్ర పశ్యామి భో ద్విజాః ॥ 68 ॥

ఓ బ్రాహ్మణులారా! విష్ణులోకం సర్వోత్తమమైన శాశ్వతానందాన్ని ఇస్తుంది. సమస్తమైన కోరికలను తీరుస్తుంది. విష్ణులోకాన్ని మించిన లోకం నాకు ఎక్కడా కనబడలేదు.

యే లోకాస్స్వర్గలోకే తు శ్రూయన్తే పుణ్యకర్మణామ్ ।
విష్ణులోకస్య తే విప్రాః కలాం నార్హన్తి షోడశీమ్ ॥ 69 ॥

ద్విజులారా! పుణ్యకర్మలను చేసినవారు (పుణ్యఫలమైన సుఖాలు అనుభవించడానికి) స్వర్గం మొదలైన ఉత్తమలోకాలకు వెళ్తారని వింటుంటాం. కాని ఆ లోకాలు ఏవీ, విష్ణులోకం(సుఖాలతో) పదహారోవంతుకు కూడ చాలవు.

ఏవం హరేః పరం స్థానం సర్వభోగగుణాన్వితమ్ ।
సర్వసౌఖ్యకరం పుణ్యం సర్వాశ్చర్యమయం ద్విజాః ॥ 70 ॥

విప్రులారా! శ్రీహరి ఉండే ఉత్తమమైన ఆ చోటు సమస్తమైన భోగాలకూ నిలయం. అది సమస్తమైన సుఖాలను అందిస్తుంది. పుణ్యప్రదమైనది. సమస్తమైన వింతలతో నిండి ఉంటుంది.

న తత్ర నాస్తికా యాన్తి పురుషా విషయాత్మకాః ।
న కృతఘ్నా న పిశునా నో స్తేనా నాజితేన్ద్రియాః ॥ 71 ॥

దేవుడిని నమ్మనివారు, ఇంద్రియసుఖాలకు లోబడినవారు, చేసిన మేలు మరిచేవారు, మోసగాళ్లు, దొంగలు, ఇంద్రియాలను తమ అదుపులో పెట్టనివారు విష్ణులోకానికి వెళ్లలేరు.

యేఽర్చయన్తి సదా భక్త్యా వాసుదేవం జగద్గురుమ్ ।
తే తత్ర వైష్ణవా యాన్తి విష్ణులోకం న సంశయః ॥ 72 ॥

లోకాలకు గురువైన వాసుదేవుడిని భక్తితో నిరంతరమూ పూజించే విష్ణుభక్తులు మాత్రమే విష్ణులోకానికి తప్పకుండా వెళ్తారు. ఇందులో సందేహం లేదు.

దక్షిణస్యోదధేస్తీరే క్షేత్రే పరమదుర్లభే ।
దృష్ట్వా కృష్ణం చ రామం చ సుభద్రాం చ ద్విజోత్తమాః ॥ 73 ॥

విప్రవరేణ్యులారా! దక్షిణసముద్రం తీరంలో ఉన్న పురుషోత్తమక్షేత్రానికి వెళ్లడం అంత తేలిక కాదు. ఆ క్షేత్రానికి వెళ్లి, అక్కడ ఉన్న కృష్ణస్వామినీ, బలరాముడినీ, సుభద్రనూ దర్శించుకున్నవారు విష్ణులోకానికి వెళ్తారు.

కల్పవృక్షసమీపే తు యే త్యజన్తి కలేబరమ్ ।
తే తత్ర మనుజా యాన్తి మృతా యే పురుషోత్తమే ॥ 74 ॥

(కృష్ణ, రామ, సుభద్రలను చూచిన తరువాత) పురుషోత్తమక్షేత్రంలో దక్షిణసముద్రం తీరంలో ఉన్న కల్పవృక్షం వంటి వటవృక్షం దగ్గర శరీరాన్ని విడిచిపెట్టిన వారు విష్ణులోకానికి వెళ్తారు. పురుషోత్తమక్షేత్రంలో (ఎక్కడైనా) మరణించిన మానవులు విష్ణులోకానికి వెళ్తారు.

వటసాగరయోర్మధ్యే యస్స్మరేత్ పురుషోత్తమమ్ ।
తేఽపి తత్ర నరా యాన్తి యే మృతాః పురుషోత్తమే ॥ 75 ॥

తేఽపి తత్ర పరం స్థానం యాన్తి నాస్త్యత్ర సంశయః ॥ 76 ॥

దక్షిణసముద్రానికీ, ఆ సముద్రంతీరంలో ఉన్న వటవృక్షానికీ నడుమ ఉండి, పురుషోత్తమస్వామిని తలచుకున్న మానవులు కూడ విష్ణులోకానికి వెళ్తారు. పురుషోత్తమక్షేత్రంలో మరణించిన మానవులు సైతం (పురుషోత్తమస్వామిని తలుచుకోకపోయినా, కేవలం క్షేత్రమహిమతో) ఉత్తమపదమైన ఆ విష్ణులోకానికి వెళ్తారు. ఇందులో సందేహం ఏమాత్రం లేదు.

ఏవం మయా మునిశ్రేష్ఠా విష్ణులోకస్సనాతనః ।
సర్వానన్దకరః ప్రోక్తో భుక్తిముక్తిఫలప్రదః ॥ 77 ॥

మహర్షులారా! విష్ణులోకం అన్నింటికంటె ప్రాచీనమైనది. సమస్తమైన సుఖాలను ఇస్తుంది. భోగాలనూ, మోక్షాన్నీ ఇస్తుందని పురాణాదులలో కీర్తించబడింది. ఈవిధంగా విష్ణులోకాన్ని గురించి మీకు వివరించడం జరిగింది.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే విష్ణులోకానుకీర్తనం నామ పఞ్చషష్టితమోఽధ్యాయః ॥ 65 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషి సంవాదంలో విష్ణులోకానుకీర్తనం అనే అరవైఐదవ అధ్యాయం సంపూర్ణం.



షట్షష్టితమోఽధ్యాయః - అరవైఆరవ అధ్యాయం

పురుషోత్తమమాహాత్మ్యనిరూపణమ్ - పురుషోత్తమమాహాత్మ్యనిరూపణం

మునయ ఊచుః :-మహర్షులు అంటున్నారు.

బహ్వాశ్చర్యస్త్వయా ప్రోక్తో విష్ణులోకో జగత్పతే ।
నిత్యానన్దకరశ్శ్రీమాన్ భుక్తిముక్తిఫలప్రదః ॥ 1 ॥

లోకేశ్వరా! బ్రహ్మదేవా! నీవు చెప్పినదానిని బట్టి విష్ణులోకం అనేకమైన వింతలతో నిండి ఉంటుంది. శాశ్వతమైన ఆనందాన్ని ఇస్తుంది. మిక్కిలి కాంతిమంతం. సత్కర్మలకు ఫలితంగా భోగాలనూ మోక్షాన్నీ ఇస్తుంది.

క్షేత్రం చ దుర్లభం లోకే కీర్తితం పురుషోత్తమమ్ ।
త్యక్త్వా యత్ర నరో దేహం యాతి సాలోక్యతాం హరేః ॥ 2 ॥

పురుషోత్తమ క్షేత్రంతో సమానమైన పుణ్యక్షేత్రం భూలోకంలో మరొకటి లేదు అని యిది కీర్తించబడుతున్నది. ఎందుకంటే ఈ పురుషోత్తమక్షేత్రంలో శరీరం విడిచిపెట్టిన(మరణించిన)వాడు విష్ణులోకానికి వెళ్తాడు కదా.

సమ్యక్ క్షేత్రస్య మాహాత్మ్యం త్వయా సమ్యక్ ప్రకీర్తితమ్ ।
యత్ర స్వదేహసన్త్యాగాద్విష్ణులోకం వ్రజేన్నరః ॥ 3 ॥

మానవుడు ఎక్కడ శరీరం విడిచిపెడితే (మరణిస్తే) సరాసరిగా విష్ణులోకానికి వెళ్తాడో, శ్రేష్ఠమైన ఆ పురుషోత్తమక్షేత్రం మహిమలను చక్కగా వర్ణించి చెప్పావు.

అహో మోక్షస్య మార్గోఽయం దేహత్యాగస్త్వయోదితః ।
నరాణాముపకారాయ పురుషాఖ్యే న సంశయః ॥ 4 ॥

పురుషోత్తమక్షేత్రం మోక్షానికి మార్గం. మానవులకు మేలు చేయడంకోసం పురుషోత్తమక్షేత్రంలో శరీరం విడిచిపెట్టడంవల్ల మోక్షం లభిస్తుందనే విషయాన్ని ప్రకటించావు. సందేహం లేదు.

అనాయాసేన దేవేశ దేహం త్యక్త్వా నరోత్తమాః ।
తస్మిన్ క్షేత్రే పరం విష్ణోః పదం యాన్తి నిరామయమ్ ॥ 5 ॥

బ్రహ్మదేవా! ఉత్తములైన మానవులు ఏమాత్రం కష్టపడకుండా, కేవలం పురుషోత్తమక్షేత్రంలో శరీరత్యాగం చేయడంచేత మాత్రమే సర్వశ్రేష్ఠమైన విష్ణులోకానికి వెళ్లవచ్చు.

శ్రుత్వా క్షేత్రస్య మాహాత్మ్యం విస్మయో నో మహానభూత్ ।
రోమహర్షశ్చ దేవేశ సన్తోషశ్చ పునః పునః ॥ 6 ॥

సురేశ్వరా! ఆ పురుషోత్తమక్షేత్రమాహాత్మ్యం వింటుంటే మాకు మహాశ్చర్యం కలుగుతున్నది. ఒళ్లు పులకరిస్తున్నది. మళ్లీ మళ్లీ ఎంతో ఆనందం కలుగుతున్నది.

ప్రయాగపుష్కరాదీని క్షేత్రాణ్యాయతనాని చ ।
పృథివ్యాం సర్వతీర్థాని సరితశ్చ సరాంసి చ ॥ 7 ॥

ఈ భూమిమీద ప్రయాగ, పుష్కరం మొదలైన పుణ్యక్షేత్రాలు, పవిత్రమైన దేవాలయాలు, పుణ్యతీర్థాలు, నదులు, సరస్సులు ఎన్నో ఉన్నాయి.

న తథా తాని సర్వాణి ప్రశంససి సురోత్తమ ।
యథా ప్రశంససి క్షేత్రం పురుషాఖ్యం పునః పునః ॥ 8 ॥

దేవదేవా! పురుషోత్తమక్షేత్రాన్ని ప్రశంసించినట్లుగా మిగిలిన క్షేత్రాలను వేటిని కూడ నీవు ప్రశంసించడంలేదు.

జ్ఞాతోఽ స్మాభిరభిప్రాయస్తవేదానీం పితామహ ।
యేన ప్రశంససి క్షేత్రం ముక్తిదం పురుషోత్తమమ్ ॥ 9 ॥

పితామహా! మోక్షాన్ని ప్రసాదించే పురుషోత్తమక్షేత్రాన్ని ఒక్కదానిని మాత్రమే కీర్తించడాన్నిబట్టి నీ అభిప్రాయం ఇపుడు మాకు తెలిసింది.

పురుషాఖ్యసమం నూనం క్షేత్రం నాస్తి మహీతలే ।
తేన త్వం విబుధశ్రేష్ఠ ప్రశంససి పునః పునః ॥ 10 ॥

సురవరేణ్యా! ఈ భూమిమీద పురుషోత్తమక్షేత్రంతో సాటివచ్చే పుణ్యక్షేత్రం ఏదీ లేదు. అందుచేతనే నీవు మళ్ళీ మళ్ళీ పురుషోత్తమ క్షేత్రాన్ని గొప్పగా చెప్తున్నావు.

బ్రహ్మోవాచ :–బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

సత్యం సత్యం మునిశ్రేష్ఠా భవద్భిస్సముదాహృతమ్ ।
పురుషాఖ్యసమం నూనం క్షేత్రం నాస్తి మహీతలే ॥ 11 ॥

మునివరులారా! నిజం. మీరు చెప్పినది నిజం. పురుషోత్తమక్షేత్రంతో సాటివచ్చే పుణ్యక్షేత్రం ఈ భూమిమీద వేరొకటి లేనేలేదు.

సన్తి యాని తు తీర్థాని పుణ్యాన్యాయతనాని చ ।
తాని శ్రీపురుషాఖ్యస్య కలాం నార్హన్తి షోడశీమ్ ॥ 12 ॥

ఈ భూమిమీద ఉన్న పుణ్యతీర్థాలూ, దేవాలయాలూ మొత్తం శ్రీపురుషోత్తమక్షేత్రం మాహాత్మ్యంలో పదహారో వంతుకు కూడ సరిపోవు.

యథా సర్వేశ్వరో విష్ణుస్సర్వలోకోత్తమోత్తమః ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 13 ॥

సమస్తానికీ ప్రభువైన విష్ణుమూర్తి సమస్తమైన లోకాలలోనూ అందరికంటె శ్రేష్ఠుడైనట్లు పుణ్యతీర్థా లన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం.

ఆదిత్యానాం యథా విష్ణుశ్శ్రేష్ఠత్వే సముదాహృతః ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 14 ॥

అదితికుమారు లందరిలోనూ (పన్నెండుమంది ఆదిత్యులలో పన్నెండవవాడైన) విష్ణువు శ్రేష్ఠుడైనట్లు పుణ్య తీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం. (ఆదిత్యానామహం విష్ణుః. గీత. 10.21)

నక్షత్రాణాం యథా సోమస్సరసాం సాగరో యథా ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 15 ॥

నక్షత్రాలలో చంద్రుడు, జలాశయాలలో సముద్రమూ శ్రేష్ఠుడైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమ క్షేత్రం శ్రేష్ఠం. (నక్షత్రాణామహం శశీ. గీత. 10.21)

వసూనాం పావకో యద్వద్ రుద్రాణాం శఙ్కరో యథా ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 16 ॥

ఎనిమిదిమంది వసువులలో అగ్ని, పదకొండుమంది రుద్రులలో శంకరుడూ శ్రేష్ఠుడైనట్లు పుణ్యతీర్థా లన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం.(రుద్రాణాం శఙ్కరశ్చాస్మి. వసూనాం పావకోఽస్మి. గీత. 10.22)

వర్ణానాం బ్రాహ్మణో యద్వద్ వైనతేయశ్చ పక్షిణామ్ ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 17 ॥

నాలుగువర్ణాలలో బ్రాహ్మణులు, పక్షులలో గరుత్మంతుడు శ్రేష్ఠుడైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం. (వైనతేయశ్చ పక్షిణామ్. గీత. 10.30)

శిఖరిణాం యథా మేరుః పర్వతానాం హిమాలయః ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 18 ॥

ఎత్తైన శిఖరాలు గలిగిన వాటిలో మేరువూ, పర్వతాలలో హిమాలయమూ శ్రేష్ఠమైనట్లు పుణ్యతీర్థాలన్నింటి లోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం. (మేరుశ్శిఖరిణామహమ్. గీత. 10.23, స్థావరాణాం హిమాలయః. గీత. 10.25)

ప్రమదానాం యథా లక్ష్మీస్సరితాం జాహ్నవీ యథా ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 19 ॥

స్త్రీలలో లక్ష్మీదేవి, నదులలో గంగ, శ్రేష్ఠమైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం. (కీర్తిశ్శ్రీర్వాక్ చ నారీణాం స్మృతిర్మేధా ధృతిః క్షమా. గీత. 10.34. స్రోతసామస్మి జాహ్నవీ. గీత. 10.31)

ఐరావతో గజేన్ద్రాణాం మహర్షీణాం భృగుర్యథా ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 20 ॥

ఏనుగులలో ఐరావతమూ, మహర్షులలో భృగుమహర్షి శ్రేష్ఠమైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమ క్షేత్రం శ్రేష్ఠం. (ఐరావతం గజేన్ద్రాణామ్. గీత. 10.28. మహర్షీణాం భృగురహమ్. గీత. 10.25)

సేనానీనాం యథా స్కన్దస్సిద్ధానాం కపిలో యథా ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 21 ॥

సేనాధిపతులలో కుమారస్వామీ, సిద్ధులలో కపిలుడూ, శ్రేష్ఠులైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమ క్షేత్రం శ్రేష్ఠం.(సేనానీనామహం స్కన్దః. గీత.10.24. సిద్ధానాం కపిలో మునిః. గీత.10.26)

ఉచ్చైశ్శ్రవా యథాశ్వానాం కవీనాముశనా కవిః ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 22 ॥

గుఱ్ఱాలలో ఉచ్చైశ్శ్రవమూ, కవులలో శుక్రాచార్యుడు, శ్రేష్ఠులైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమ క్షేత్రం శ్రేష్ఠం. (ఉచ్చైశ్శ్రవసమశ్వానామ్. గీత.10.27. కవీనాముశనా కవిః. గీత.10.37)

మునీనాం చ యథా వ్యాసః కుబేరో యక్షరక్షసామ్ ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 23 ॥

మునులలో వ్యాసుడూ, యక్షులలోనూ, రాక్షసులలోనూ కుబేరుడూ, శ్రేష్ఠుడైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం.(మునీనామహం వ్యాసః. గీత.10.37. విత్తేశో యక్షరక్షసామ్. గీత.10.23)

ఇన్ద్రియాణాం మనో యద్వద్ భూతానామవనీ యథా ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 24 ॥

ఇంద్రియాలలో (మనస్సు, చక్షుశ్శ్రోత్రనాసికాత్వగ్రసనాపాయూపస్థహస్తపాదవాక్కులు) మనస్సు, పంచ భూతాలలో భూమి, శ్రేష్ఠమైనట్లు పుణ్యతీర్థా లన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం. (ఇన్ద్రియాణామ్మనశ్చాస్మి. గీత.10.23.)

అశ్వత్థస్సర్వవృక్షాణాం పవనః ప్లవతాం యథా ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 25 ॥

వృక్షాలన్నిటిలోనూ రావిచెట్టు, వీచేవాటిలో గాలీ, శ్రేష్ఠమైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం.(అశ్వత్థస్సర్వవృక్షాణామ్. గీత.10.26. పవనః పవతామస్మి. గీత.10.31)

భూషణానాం తు సర్వేషాం యథా చూడామణిర్ద్విజాః ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 26 ॥

విప్రులారా! ఆభరణాలన్నింటిలోనూ చూడామణి (శిరోభూషణం) శ్రేష్ఠమైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం.

గన్ధర్వాణాం చిత్రరథశ్శస్త్రాణాం కులిశో యథా ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 27 ॥

గంధర్వులలో చిత్రరథుడూ, ఆయుధాలలో వజ్రాయుధమూ, శ్రేష్ఠమైనట్లుగా పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం.(గన్ధర్వాణాం చిత్రరథః. గీత. 10.26. ఆయుధానామహం వజ్రమ్. గీత. 10.28)

అకారస్సర్వవర్ణానాం గాయత్రీ ఛన్దసాం యథా ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 28 ॥

అక్షరాలు అన్నింటిలోనూ అకారమూ, ఛందస్సులలో గాయత్రి, శ్రేష్ఠమైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం. (అక్షరాణామకారోఽస్మి. గీత. 10.33. గాయత్రీ ఛన్దసామహమ్. గీత. 10.35)

సర్వాఙ్గేభ్యో యథా శ్రేష్ఠముత్తమాఙ్గం ద్విజోత్తమాః ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 29 ॥

విప్రవరులారా! అవయవాలన్నింటిలోనూ శిరస్సు శ్రేష్ఠమైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం.

అరున్ధతీ యథా స్త్రీణాం సతీనాం శ్రేష్ఠతాం గతా ।
తథా సమస్తతీర్థానాం శ్రేష్ఠం తత్ పురుషోత్తమమ్ ॥ 30 ॥

పతివ్రతలలో అరుంధతి శ్రేష్ఠురాలైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం.

యథా సమస్తవిద్యానాం మోక్షవిద్యా పరా స్మృతా ।
తథా సమస్తతీర్థానాం శ్రేష్ఠం తత్ పురుషోత్తమమ్ ॥ 31 ॥

విద్యలన్నింటిలోనూ అధ్యాత్మవిద్య శ్రేష్ఠమైనట్లు, పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం. (అధ్యాత్మవిద్యా విద్యానామ్. గీత. 10.32)

మనుష్యాణాం యథా రాజా ధేనూనామపి కామధుక్ ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 32 ॥

మానవులలో మహారాజూ, ఆవులలో కామధేనువూ, శ్రేష్ఠమైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం. (నరాణాం చ నరాధిపమ్. గీత. 10.27. ధేనూనాం కామధుక్. గీత. 10.28)

సువర్ణం సర్వరత్నానాం సర్పాణాం వాసుకిర్యథా ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 33 ॥

రత్నాలన్నింటిలోనూ బంగారమూ, సర్పాలలో వాసుకీ, శ్రేష్ఠమైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమ క్షేత్రం శ్రేష్ఠం. (సర్పాణామస్మి వాసుకిః. గీత. 10.28.)

ప్రహ్లాదస్సర్వదైత్యానాం రామశ్శస్త్రభృతాం యథా ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 34 ॥

దితిపుత్రులలో (రాక్షసులలో) ప్రహ్లాదుడూ, ఆయుధం పట్టిన వారిలో (యుద్ధవిశారదులలో) శ్రీరాముడూ శ్రేష్ఠులైనట్లుగా పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం. (ప్రహ్లాదశ్చాస్మి దైత్యానామ్. గీత. 10.30. రామశ్శస్త్రభృతామహమ్. గీత. 10.31)

ఝషాణాం మకరోయద్వన్మృగాణాం మృగరాడ్యథా ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 35 ॥

చేపలు మొదలైన జలజీవులలో మొసలి, (భూచరాలైన)జంతువులలో సింహమూ, శ్రేష్ఠములైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం. (ఝషాణాం మకరశ్చాస్మి. గీత. 10.31 మృగాణాం మృగేన్ద్రోఽ హమ్. గీత. 10.30)

సముద్రాణాం యథా శ్రేష్ఠః క్షీరోదస్సరితాం పతిః ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 36 ॥

సముద్రాలలో పాలసముద్రం శ్రేష్ఠమైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం.

వరుణో యాదసాం యద్వద్ యమస్సంయమినాం యథా ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 37 ॥

జలదేవతలలో వరుణుడూ, ప్రాణులను అణిచే(సంహరించే)వారిలో యముడూ, శ్రేష్ఠులైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం. (వరుణో యాదసామహమ్. యమస్సంయమతామహమ్. గీత. 10.29.)

దేవర్షీణాం యథా శ్రేష్ఠో నారదో మునిసత్తమాః ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 38 ॥

మహర్షులారా! దేవర్షులలో నారదుడు శ్రేష్ఠుడైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం. (దేవర్షీణాం చ నారదః. గీత. 26)

ధాతూనాం కాఞ్చనం యద్వత్ పవిత్రాణాం చ దక్షిణా ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 39 ॥

లోహాలలో బంగారమూ, పాపాలను పోగొట్టేవాటిలో ఋత్విక్కులకు ఇచ్చే ధనమూ, శ్రేష్ఠమైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం.

ప్రజాపతిర్యథా దక్ష ఋషీణాం కశ్యపో యథా ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 40 ॥

ప్రజాపతులలో దక్షప్రజాపతీ, ఋషులలో కశ్యపుడూ, శ్రేష్ఠులైనట్లు పుణ్యతీర్థా లన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం.

గ్రహాణాం భాస్కరో యద్వన్మన్త్రాణాం ప్రణవో యథా ।
తథా సమస్తతీర్థానాం వరిష్ఠం పురుషోత్తమమ్ ॥ 41 ॥

గ్రహాలలో గ్రహాధిపతి అయిన సూర్యుడూ, మంత్రాలలో ఓంకారమూ, శ్రేష్ఠమైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం. (గిరామస్మ్యేకాక్షరమ్. గీత. 10.25)

అశ్వమేధస్తు యజ్ఞానాం యథా శ్రేష్ఠః ప్రకీర్తితః ।
తథా సమస్తతీర్థానాం క్షేత్రం తచ్చ ద్విజోత్తమాః ॥ 42 ॥

బ్రాహ్మణవరేణ్యులారా! యాగాలలో అశ్వమేధయాగం శ్రేష్ఠమైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమ క్షేత్రం శ్రేష్ఠం.

ఓషధీనాం యథా ధాన్యం తృణేషు తృణరాద్యథా ।
తథా సమస్తతీర్థానాముత్తమం పురుషోత్తమమ్ ॥ 43 ॥

ఓషధులలో ధాన్యమూ (బ్రతికించే పదార్థాలలో అన్నం), గడ్డిజాతులలో దర్భ శ్రేష్ఠమైనట్లు పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం శ్రేష్ఠం.

యథా సమస్తతీర్థానాం ధర్మస్సంసారతారకః ।
తథా సమస్తతీర్థానాం శ్రేష్ఠం తత్ పురుషోత్తమమ్ ॥ 44 ॥

సమస్తమైన పుణ్యతీర్థాలలోనూ ధర్మం ఏవిధంగా జననమరణాల చక్రంనుండి ఉద్ధరించి, మోక్షాన్ని ఇస్తూ శ్రేష్ఠమైనట్లుగా పుణ్యతీర్థాలన్నింటిలోనూ పురుషోత్తమక్షేత్రం (మోక్షాన్ని ఇస్తుంది కాబట్టి) శ్రేష్ఠం.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భుఋషిసంవాదే పురుషోత్తమమాహాత్మ్యనిరూపణం నామ షట్షష్టితమోఽధ్యాయః ॥ 66 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూ ఋషి సంవాదంలో పురుషోత్తమ మాహాత్మ్య నిరూపణం అనే అరవై ఆరవ అధ్యాయం సంపూర్ణం.



సప్తషష్టితమోऽధ్యాయః - అరవైఏడవ అధ్యాయం

అనంతవాసుదేవమాహాత్మ్యనిరూపణమ్ - అనంతవాసుదేవమాహాత్మ్యనిరూపణం

బ్రహ్మోవాచ :-బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

సర్వేషాం చైవ తీర్థానాం క్షేత్రాణాం చ ద్విజోత్తమాః ।
జపహోమవ్రతానాం చ తపోదానఫలాని చ ॥ 1 ॥

న తత్ పశ్యామి భో విప్రా యత్ తేన సదృశం భువి ।
కిం చాత్ర బహునోక్తేన భాషితేన పునః పునః ॥ 2 ॥

విప్రవరులారా! ఈభూమిమీద సమస్తమైన తీర్థాలలో మునిగినందువల్లనూ, పుణ్యక్షేత్రాలు దర్శించుకున్నందు వల్లనూ, అలాగే జపాలు, హోమాలు, నోములూ, తపస్సులూ, దానాలూ చేసినందువల్లనూ కలిగేఫలితం ఏదీ, ఆపురుషోత్తమక్షేత్రంవల్ల కలిగేఫలితంతో సమానం కాదు. ద్విజులారా! అదే విషయాన్ని పలువిధాలుగా మళ్లీ, మళ్లీ చెప్పనవసరం లేదు.

సత్యం సత్యం పున స్సత్యం క్షేత్రం తత్ పరమం మహత్ ॥ 3 ॥

పురుషోత్తమక్షేత్రం అన్నింటికంటె అత్యంతమైన మహిమ కలిగినదనేవిషయం ముమ్మాటికీ నిజం.

పురుషాఖ్యం సకృద్ దృష్ట్వా సాగరామ్బు స్సకృత్ స్పృశన్ ।
బ్రహ్మవిద్యాం సకృద్ జ్ఞాత్వా గర్భవాసో న విద్యతే ॥ 4 ॥

పురుషోత్తమక్షేత్రాన్ని ఒక్కసారి దర్శించుకున్నా, అక్కడి దక్షిణసముద్రం నీటిని ఒక్కసారి తాకినా (స్నానం చేసినా), మోక్షవిద్యను ఒక్కసారి గ్రహించినా, ఇక మళ్లీ భూమిమీద తిరిగిపుట్టడం జరగదు.

హరే స్సన్నిహితే స్థాన ఉత్తమే పురుషోత్తమే ।
సంవత్సర ముపాసీత మాసమాత్ర మథాపి వా ॥ 5 ॥

పురుషోత్తమక్షేత్రంలో, అందులోనూ ఇంకా ఉత్తమమయిన శ్రీహరిసన్నిధానంలో, సంవత్సరం పాటు శ్రీహరిని ఉపాసించాలి. కనీసం నెలరోజులపాటయినా స్వామిని సేవించాలి.

తేన జప్తం హుతం తేన తేన తప్తం తపో మహత్ ।
స యాతి పరమం స్థానం యత్ర యోగేశ్వరో హరిః ॥ 6 ॥

ఆప్రదేశంలో (సంవత్సరం లేదా ఒక్కనెలరోజులు) చేసినజపమూ, హోమమూ, తపస్సూ కొంచెమయినా మిక్కిలి గొప్పఫలితాన్ని ఇస్తాయి. అక్కడ జపాదులు చేసినవాడు యోగానికే ప్రభువయిన శ్రీహరి నివసించే పరమపదమయిన వైకుంఠలోకానికి వెళ్తాడు.

భుక్త్వా భోగాన్ విచిత్రాంశ్చ దేవయోషిత్సమన్వితః ।
కల్పాన్తే పునరాగమ్య మర్త్యలోకే నరోత్తమః ॥ 7 ॥

జాయతే యోగినాం విప్రా జ్ఞానజ్ఞేయోద్యతో గృహే ।
సమ్ప్రాప్య వైష్ణవం యోగం హరే స్స్వచ్ఛన్దతాం వ్రజేత్ ॥ 8 ॥

ద్విజులారా! పురుషోత్తమక్షేత్రంలో శ్రీహరిని ఉపాసించిన మానవోత్తముడు వైకుంఠంలో దేవతాకాంతలతో కూడి వివిధమయిన భోగాలను అనుభవిస్తాడు. ఆ కల్పం అయిన తరువాత (మహాప్రళయానంతరం పునస్సృష్టిలో) భూలోకానికి తిరిగివస్తాడు. ఇక్కడ యోగులఇంట జన్మిస్తాడు. జ్ఞానమార్గంలో ఆత్మవిద్యను పూనికతో తెలుసు కుంటాడు. దానివల్ల మనసును శ్రీమహావిష్ణువులో లయం చేసి, మోక్షం చేరుకుంటాడు.

కల్పవృక్షస్య రామస్య కృష్ణస్య భద్రయా సహ ।
మార్కణ్డేయేన్ద్రద్యుమ్నస్య మాహాత్మ్యం మాధవస్య చ ॥ 9 ॥

మహర్షులారా! కల్పవృక్షమయిన వటవృక్షాన్ని గురించి, బలరాముడిని గురించి, శ్రీకృష్ణస్వామిని గురించి, సుభద్రను గురించి, మార్కండేయుడు, ఇంద్రద్యుమ్నమహారాజుల గొప్పతనాన్ని (మార్కండేయహ్రదమూ(53.68), ఇంద్రద్యుమ్నసరస్సు(48.29)లను గురించి, శ్వేతమత్స్యమాధవుడి మహిమను(56,57అ.) గురించి వివరించాను.

స్వర్గద్వారస్య మాహాత్మ్యం సాగరస్య విధిః క్రమాత్ ।
మార్జనస్య యథా కాలే భాగీరథ్యా స్సమాగమమ్ ॥ 10 ॥

అలాగే స్వర్గద్వారం గురించి, ఆ యా పుణ్యతిథులలో సముద్రజలమార్జనం, స్నానం చేయవలసిన విధానాన్ని గురించి, గంగాసాగరసంగమం గురించి వివరించాను.

సర్వమేతన్మయా ఖ్యాతం యత్పరం శ్రోతుమిచ్ఛథ ।
ఇన్ద్రద్యుమ్నస్య మాహాత్మ్యం సర్వం వై కథితం మయా ॥ 11 ॥

ఈవిషయాలన్నీ సమగ్రంగా వివరించాను. ఇంద్రద్యుమ్నుడి మాహాత్మ్యాన్ని గురించి కూడ మొత్తం చెప్పాను. ఇక తరువాత మీరు ఏమి వినగోరుతున్నారు?

సర్వాశ్చర్యం సమాఖ్యాతం రహస్యం పుణ్యముత్తమమ్ ।
పురాణం పరమం గుహ్యం ధన్యం సంసారమోచనమ్ ॥ 12 ॥

ఈపురాణం ఆశ్చర్యం కలిగించే అనేకమయిన విషయాలతో కూడినది. మిక్కిలి రహస్యం. సర్వశ్రేష్ఠ మయి పుణ్యఫలాన్ని ఇస్తుంది. చాల పురాతన మయినది. మిక్కిలి గూఢ మయినది. ఎంతో ప్రయోజనవంతం. జన్మబంధాలనుండి ముక్తిని ఇస్తుంది. (అంతటిదానిని మీకు చెప్పాను.)

మునయ ఊచుః :–మహర్షులు అంటున్నారు.

న హి న స్తృప్తి రస్తీహ శృణ్వతాం భగవత్కథామ్ ।
పునరేవ పరం గుహ్యం వక్తుమర్హస్యశేషతః ॥ 13 ॥

దేవా! విష్ణుకథలు వింటుంటే మాకు తృప్తి కలగడం లేదు. ఇంక చాలు అనిపించడం లేదు. కృష్ణభగవానుడిని గురించి ఇంకా చెప్పు. రహస్యవిషయాలు ఏవీ విడిచిపెట్టవద్దు.

అనన్తవాసుదేవస్య న సమ్యగ్ వర్ణితం త్వయా ।
శ్రోతు మిచ్ఛామహే దేవ విస్తరేణ వదస్వ నః ॥ 14 ॥

అనంతవాసుదేవుడిని గురించి నీవు పూర్తిగా చెప్పలేదు. ఆవిషయాలు వినాలని మాకు కోరికగా ఉంది. సవిస్తరంగా చెప్పు.

బ్రహ్మోవాచ :–బ్రహ్మదేవుడు చెప్తున్నాడు.

ప్రవక్ష్యామి మునిశ్రేష్ఠా స్సారాత్ సారతరం పరమ్ ।
అనన్తవాసుదేవస్య మాహాత్మ్యం త్రిషు దుర్లభమ్ ॥15 ॥

మహర్షులారా! సారమయిన వాటిలో సారమయినదీ, మిక్కిలి ఉత్తమమయినదీ, మూడులోకాలలోనూ ఎక్కడా దొరకనిదీ అయిన అనంతవాసుదేవుడి మాహాత్మ్యాన్ని గురించి చెప్తాను. వినండి.

ఆదికల్పే పురా విప్రా స్త్వహ మవ్యక్తజన్మవాన్ ।
విశ్వకర్మాణ మాహూయ వచనం ప్రోక్తవానిదమ్ ॥ 16 ॥

ద్విజులారా! పూర్వం ప్రథమకల్పంలో అప్పటికి ఇంకా జన్మ ప్రకటం కాక(అవ్యక్తంగా ఉన్న)నేను విశ్వకర్మను పిలిచి ఇలా అన్నాను.

వరిష్ఠం దేవశిల్పీన్ద్రం విశ్వకర్మాగ్రకర్మిణమ్ ।
ప్రతిమాం వాసుదేవస్య కురు శైలమయీం భువి ॥ 17 ॥

అతడు ఉత్తముడు. దేవశిల్పులలో శ్రేష్ఠుడు. విశ్వకర్మలకు నాయకుడు. అటువంటి విశ్వకర్మతో వాసుదేవుడి మూర్తిని రాతితో తయారు చేయమని చెప్పాను.

యాం ప్రేక్ష్య విధివద్ భక్త్యా స్సేన్ద్రా వై మానుషాదయః ।
యేన దానవరక్షోభ్యో విజ్ఞాయ సుమహద్భయమ్ ॥ 18 ॥

ఆ విగ్రహాన్ని భక్తితో, శాస్త్రోక్తమయిన పద్ధతిలో దర్శిస్తే, ఇంద్రుడితో సహా దేవతలూ,మానవులూ, అందరూ దానవులవల్లనూ, రాక్షసులవల్లనూ ఏవిధమయిన భయమూ లేకుండా సుఖంగా ఉంటారు.

త్రిదివం సమనుప్రాప్య సుమేరుశిఖరం చిరమ్ ।
వాసుదేవం సమారాధ్య నిరాతఙ్కా వసన్తి తే ॥ 19 ॥

వాసుదేవుడిని ఆరాధించిన మానవులు (భూలోకంలో అన్నిభోగాలు అనుభవించిన) తరువాత (మరణానంతరం) స్వర్గానికి వెళ్లాలి. వారు సుమేరుపర్వతశిఖరం మీద, ఏవిధమయిన అడ్డంకులూ లేకుండా, చిరకాలం వాసుదేవుడిని ఆరాధిస్తూ ఉంటారు.

మమ తద్వచనం శ్రుత్వా విశ్వకర్మా తు తత్క్షణాత్ ।
చకార ప్రతిమాం శుద్ధాం శఙ్ఖచక్రగదాధరామ్ ॥ 20 ॥

నామాటలు విని విశ్వకర్మ ఆక్షణమే శంఖం,చక్రం,గద ధరించిన విష్ణుని పవిత్రమయిన మూర్తిని చేశాడు.

సర్వలక్షణసంయుక్తాం పుణ్డరీకాయతేక్షణామ్ ।
శ్రీవత్సలక్ష్మసంయుక్తా మత్యుగ్రాం ప్రతిమోత్తమామ్ ॥ 21 ॥

ఆమూర్తి శ్రీమహావిష్ణువులక్షణాలు అన్నీ కలిగిఉన్నది. స్వామికన్నులు తామరరేకులలాగా విశాలంగా ఉన్నాయి. శ్రీవత్సం అనేచిహ్నం కలిగిఉన్నది. మిక్కిలి తీక్షణంగా (చూచినవెంటనే మనసులో నాటుకొనిఉండేవిధంగా) ఉంది. అది ప్రతిమలన్నింటిలోనూ మిక్కిలిశ్రేష్ఠంగా ఉంది.

వనమాలావృతోరస్కాం ముకుటాఙ్గదధారిణీమ్ ।
పీతవస్త్రాం సుపీనాంసాం కుణ్డలాభ్యా మలఙ్కృతామ్ ॥ 22 ॥

ఆవిగ్రహంలో వనమాల విష్ణుని వక్షస్స్థలం మొత్తం కప్పివేసింది. కిరీటం, భుజకీర్తులు, పచ్చని పట్టువస్త్రం ధరించిఉన్నది. భుజాలు చాల దృఢంగా ఉన్నాయి. చెవులకు కమ్మలు అలంకరింపబడిఉన్నాయి.

ఏవం సా ప్రతిమాం దివ్యాం గుహ్యమన్త్రై స్తదా స్వయమ్ ।
ప్రతిష్ఠాకాల మాసాద్య మయాసౌ నిర్మితా పురా ॥ 23 ॥

ఈవిధంగా ప్రతిష్ఠాసమయానికి పూర్వమే, నా ఆజ్ఞప్రకారం దివ్యమయిన ఆవిష్ణుమూర్తి విగ్రహాన్ని, రహస్యమయిన వేదమంత్రాలతో నేనే స్వయంగా నిర్మించాను.

తస్మిన్ కాలే తదా శక్రో దేవరాట్ ఖేచరై ర్వృతః ।
జగామ బ్రహ్మసదనమారుహ్య గజముత్తమమ్ ॥ 24 ॥

ఆవిగ్రహాన్ని ప్రతిష్ఠించే సమయంలో దేవతలు తనని పరివేష్ఠించి వెంట రాగా, దేవేంద్రుడు ఐరావత మెక్కి బ్రహ్మనిలయానికి విచ్చేశాడు.

ప్రసాద్య ప్రతిమాం శక్ర స్స్నానదానైః పునః పునః ।
ప్రతిమాం తాం సమాదాయ స్వపురం పునరాగమత్ ॥ 25 ॥

ఆప్రతిమకు అనేకపర్యాయాలు అభిషేకం చేశాడు. వివిధమయిన కానుకలు సమర్పించాడు. ఆమూర్తిని చక్కగా అలంకరించి ఆరాధించాడు. తరువాత ఆప్రతిమను తీసుకుని అమరావతికి తిరిగి వచ్చాడు.

తాం సమారాధ్య సుచిరం యతవాక్కాయమానసః ।
వృత్రాద్యాన్ అసురాన్ క్రూరాన్ నముచిప్రముఖాం స్తథా ॥ 26 ॥
నిహత్య దానవాన్ భీమాన్ భుక్తవాన్ భూర్భువరాదికమ్ ।

ద్వితీయే చ యుగే ప్రాప్తే త్రేతాయాం రాక్షసాధిపః ॥
బభూవ సుమహావీర్యో దశగ్రీవః ప్రతాపవాన్ ॥ 27 ॥

దశ వర్షసహస్రాణి నిరాహారో జితేన్ద్రియః ।
చచార వ్రతమత్యుగ్రం తపః పరమదుశ్చరమ్ ॥ 28 ॥

తపసా తేన తుష్టోఽహం వరం తస్మై ప్రదత్తవాన్ ।
అవధ్య స్సర్వదేవానాం స దైత్యోరగరాక్షసామ్ ॥
శాపప్రహరణై రుగ్రై రవధ్యో యమకిఙ్కరైః ॥ 29 ॥

మాట, మేను, మనసు, అనే త్రికరణాలను నియమించుకుని, చాలకాలం ఆప్రతిమను శ్రద్ధగా ఆరాధించాడు. అందువలననే దుర్మార్గులూ, భయంకరులూ అయిన వృత్రుడు మొదలైన రాక్షసులను, అదేవిధంగా నముచి మొదలయిన దానవులను సంహరించాడు. భూలోకం, భువర్లోకం మొదలైన లోకాలన్నింటికీ ప్రభువైనాడు. భోగాలనుభవించాడు. రెండవత్రేతాయుగంలో రావణుడు అనేరాక్షసరాజు ఉండేవాడు. అతడు దశకంఠుడు. మిక్కిలిగొప్పబలవంతుడు. పరాక్రమవంతుడు. ఆహారం ఏమీ తీసుకోకుండా, ఇంద్రియాలను తనఅధీనంలో ఉంచుకుని, పదివేలసంవత్సరాలు మిక్కిలి తీవ్రమైన తపస్సు చేశాడు. ఆవిధంగా దీక్షతో తపస్సు చేయడం ఆదశకంఠుడికి తప్ప ఇతరులకు ఎంతమాత్రం సాధ్యం కాదు.

అతడితపస్సుకు నాకు సంతోషం గలిగింది. దశకంఠుడికి వరం ఇచ్చాను. దానివల్ల అతడిని దేవతలు, దైత్యులు, ఉరగులు, రాక్షసులు, ఎవ్వరూ సంహరించలేరు. భయంకరమైన శాపాలు కూడ అతడిని చంపలేవు. ఆరావణుడిని యమకింకరులు కూడ ఏమీ చేయలేరు.

వరం ప్రాప్య తదా రక్షో యక్షాన్ సర్వగణా నిమాన్ ।
ధనాధ్యక్షం వినిర్జిత్య శక్రం జేతుం సముద్యతః ॥ 30 ॥

ఈవిధంగా, నాచేత వరం పొందినరావణాసురుడు రాక్షసులు, యక్షులు మొదలుగా అన్ని జాతులవారినీ జయించాడు. కుబేరుడిని జయించాడు. ఇంద్రుడిని ఓడించడానికి సిద్ధమైనాడు.

సఙ్గ్రామం సుమహాఘోరం కృత్వా దేవై స్స రాక్షసః ।
దేవరాజం వినిర్జిత్య తదా ఇన్ద్రజితేతి వై ॥ 31 ॥

రాక్షస స్తత్సుతో నామ మేఘనాదః ప్రలబ్ధవాన్ ।
అమరావతీం తతః ప్రాప్య దేవరాజగృహే శుభే ॥ 32 ॥

రావణుడి కుమారుడైన మేఘనాదుడు దేవతలతో భయంకరమైన యుద్ధం చేసి, దేవేంద్రుడిని జయించాడు. దానివల్ల మేఘనాదుడికి ఇంద్రజిత్తు అనే ప్రసిద్ధి కలిగింది. తనకొడుకు ఇంద్రుడిని జయించగా, రావణుడు అమరావతిని ఆక్రమించుకుని, దేవేంద్రుడి ఇంటికి వెళ్లాడు.

దదర్శాఞ్జనసఙ్కాశాం రావణ స్తు బలాన్వితః ।
ప్రతిమాం వాసుదేవస్య సర్వలక్షణసంయుతామ్ ॥ 33 ॥

ససైన్యంగా వెళ్లిన రావణుడు ఆఇంద్రభవనంలో వాసుదేవుడిప్రతిమను చూశాడు. అది కాటుకలాగా నల్లగా ఉంది. ఆవిగ్రహంలో ఉత్తమలక్షణాలు అన్నీ ఉన్నాయి.

శ్రీవత్సలక్ష్మసంయుక్తాం పద్మపత్రాయతేక్షణామ్ ।
వనమాలావృతోరస్కాం ముకుటాఙ్గదభూషితామ్ ॥ 34 ॥

ఆవిష్ణువువిగ్రహం శ్రీవత్సం అనేచిహ్నంతో కూడిఉన్నది. కన్నులు తామరరేకులలాగా విశాలంగా ఉన్నాయి. వక్షస్స్థలంమీద వనమాల నిండుగా ఉంది. కిరీటం, భుజకీర్తులు అలంకరింపబడిఉన్నాయి.

శఙ్ఖచక్రగదాహస్తాం పీతవస్త్రాం చతుర్భుజామ్ ।
సర్వాభరణసంయుక్తాం సర్వకామఫలప్రదామ్ ॥ 35 ॥

చేతులలో శంఖమూ, చక్రమూ, గదా ఉన్నాయి. పచ్చనివస్త్రం ధరించిఉన్నది. నాలుగు చేతులు ఉన్నాయి. సమస్త మయిన ఆభరణాలతో కూడిఉన్నది. ఆమూర్తి భక్తులకోరిక లన్నింటినీ తీరుస్తుంది.

విహాయ రత్నసఙ్ఘాం శ్చ ప్రతిమాం శుభలక్షణామ్ ।
పుష్పకేణ విమానేన లఙ్కాం ప్రాస్థాపయద్ ద్రుతమ్ ॥ 36 ॥

రావణుడు అక్కడ ఉన్నరత్నాలు మొద లయిన సంపదల నన్నింటినీ విడిచిపెట్టి, మంచిలక్షణాలతో కూడిన ఆవిగ్రహాన్ని మాత్రం తీసుకున్నాడు. ఆవిగ్రహాన్ని పుష్పకవిమానం మీద పెట్టుకుని, వెంటనే లంకకు తీసుకుని వెళ్లిపోయాడు.

పురాధ్యక్షః స్థిత శ్శ్రీమాన్ ధర్మాత్మా స విభీషణః ।
రావణ స్యానుజో మన్త్రీ నారాయణపరాయణః ॥ 37 ॥

ఆనగరానికి అధ్యక్షుడు విభీషణుడు. అతడు రావణుడికి తమ్ముడు. గొప్పశ్రీమంతుడు. ధర్మపరాయణుడు. ఉత్తమ మయినఆలోచనలు చేయగలిగినవాడు. శ్రీమన్నారాయణుడిపై మిక్కిలి ఆసక్తి కలిగిఉంటాడు.

దృష్ట్వా తాం ప్రతిమాం దివ్యాం దేవేన్ద్రభవనచ్యుతామ్ ।
రోమాఞ్చితతను ర్భూత్వా విస్మయం సమపద్యత ॥ 38 ॥

దేవేంద్రుడిభవనంనుండి వచ్చిన, దివ్యమైన ఆవిష్ణుప్రతిమను చూచి విభీషణుడు ఆశ్చర్యపడ్డాడు. అతడిశరీరం పులకరించింది.

ప్రణమ్య శిరసా దేవం ప్రహృష్టే నాన్తరాత్మనా ।
అద్య మే సఫలం జన్మ అద్య మే సఫలం తపః ॥ 39 ॥

మనసంతా సంతోషం నిండింది. ఆప్రతిమకు శిరసువంచి నమస్కరించాడు. నాస్వామిని దర్శించడంచేత నేడు నాజన్మ చరితార్థ మయింది. నేను చేసినతపస్సు ఈవిధంగా ఫలించింది.

ఇత్యుక్త్వా స తు ధర్మాత్మా ప్రణిపత్య ముహు ర్ముహుః ।
జ్యేష్ఠం భ్రాతరమాసాద్య కృతాఞ్జలి రభాషత ॥ 40 ॥

అని పలికి, ధర్మపరుడైన విభీషణుడు స్వామికి ఆనందంతో మాటిమాటికి నమస్కారం చేశాడు. తనపెద్దన్న గారి వద్దకు వెళ్లి, చేతులు జోడించి, ఇలా అన్నాడు.

రాజన్ ప్రతిమయా త్వం మే ప్రసాదం కర్తుమర్హసి ।
యామారాధ్య జగన్నాథ నిస్తరేయం భవార్ణవమ్ ॥ 41 ॥

మహారాజా! లోకేశ్వరా! ఈప్రతిమను నాకు ఇచ్చి నాపై దయ చూపించు. ఈస్వామిని సేవించుకుని నేను సంసారసాగరం నుండి బయటపడతాను.

భ్రాతు ర్వచన మాకర్ణ్య రావణస్తు తదాబ్రవీత్ ।
గృహాణ ప్రతిమాం వీర త్వనయా కిం కరోమ్యహమ్ ॥ 42 ॥

తమ్ముడిమాటలు విని రావణుడు ఇలా అన్నాడు. మహావీర! ఈప్రతిమను తీసుకో. దీనిని నేనేమి చేసుకుంటాను.

స్వయమ్భువం సమారాధ్య త్రైలోక్యం విజయే త్వహమ్ ।
నానాశ్చర్యమహాదేవం సర్వభూతభవోద్భవమ్ ॥ 43 ॥

అనేకమైన వింతలకు నిలయమైనవాడూ, సమస్తమైన లోకాలనూ సృష్టించినవాడూ అయిన బ్రహ్మదేవుడిని ఆరాధించి, నేను మూడులోకాలనూ జయించాను. (కాబట్టి ఈప్రతిమతో నాకు పనిలేదు.)

విభీషణో మహాబుద్ధి స్తదా తాం ప్రతిమాం శుభామ్ ।
శత మష్టోత్తరం చాబ్దం సమారాధ్య జనార్దనమ్ ॥ 44 ॥

గొప్పజ్ఞాని అయిన విభీషణుడు శుభప్రదమైన ఆవిష్ణుప్రతిమను స్వీకరించాడు. ఆప్రతిమలో జనార్దనస్వామిని నూటఎనిమిది సంవత్సరాలు చక్కగా ఆరాధించాడు.

అజరామరణం ప్రాప్త మణిమాదిగుణై ర్యుతమ్ ।
రాజ్యం లఙ్కాధిపత్యం చ భోగాన్ భుఙ్క్తే యథేప్సితాన్ ॥ 45 ॥

ఆస్వామిమహిమతో ముసలితనమూ, మరణమూ లేని సుఖమయమైన జీవితాన్ని చాలకాలం గడిపాడు. అణిమ, మొదలైన సిద్ధులను పొందాడు. లంకారాజ్యానికి అధిపతి అయినాడు. కోరుకున్నభోగాలు అన్నీ అనుభవించాడు.

మునయ ఊచుః :–బ్రహ్మదేవుడితో మహర్షులు ఇలా అన్నారు.

అహో నో విస్మయో జాత శ్శ్రు త్వేదం పరమామృతమ్ ।
అనన్తవాసుదేవస్య సమ్భవం భువి దుర్లభమ్ ॥ 46 ॥
శ్రోతుమిచ్ఛామహే దేవ విస్తరేణ యథాతథమ్ ।
తస్య దేవస్య మాహాత్మ్యం వక్తుమర్హస్యశేషతః ॥ 47 ॥

మహాత్మా! ఉత్తమోత్తమమైనఅమృతంవంటి ఈవృత్తాంతాన్ని వింటుంటే మాకు చాల ఆశ్చర్యం కలుగుతున్నది. మాకు అనంతవాసుదేవుడిపుట్టుకను గూర్చి వినాలని కోరికగా ఉన్నది. అది ఈభూమిమీద ఎక్కడా లభించదు.

(నీవు తప్ప ఇంకెవరూ దానిని చెప్పలేరు.) అనంతవాసుదేవుడి మహిమను ఉన్నదున్నట్లుగానూ, సవిస్తరంగానూ, సమగ్రంగానూ నీవే చెప్పదగుదువు.

బ్రహ్మోవాచ :–మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తదా స రాక్షసః క్రూరో దేవగన్ధర్వకిన్నరాన్ ।
లోకపాలాన్ సమనుజాన్ మునిసిద్ధాంశ్చ పాపకృత్ ॥ 48 ॥

విజిత్య సమరే సర్వా నాజహార వరాఙ్గనాః ।
సంస్థాప్య నగరీం లఙ్కాం పున స్సీతార్థముద్యతః ॥ 49 ॥

దయలేనివాడూ, పాపపుపనులు చేసేవాడూ అయిన ఆరావణాసురుడు అపుడు యుద్ధంలో దేవతలనూ, గంధర్వులనూ, కిన్నరులనూ, లోకపాలకులనూ, మానవులనూ మునులనూ, సిద్ధులనూ జయించాడు. వారిభార్యలను చెరపట్టి, తీసుకునివచ్చి లంకలో ఉంచాడు. అంతటితో ఆగకుండా శ్రీరాముడిభార్య అయిన సీతను తీసుకురావడానికి పూనుకున్నాడు.

ఛలిత్వా మృగరూపేణ సౌవర్ణేన చ రాఘవమ్ ।
తతః క్రుద్ధేన రామేణ రణే సౌమిత్రిణా సహ ॥ 50 ॥

రావణస్య వధార్థాయ హత్వా వాలిం మనోజవమ్ ।
అభిషిక్తశ్చ సుగ్రీవో యువరాజోఽ ఙ్గద స్తథా ॥ 51 ॥

బంగారులేడిరూపంలో (మారీచుడిద్వారా) శ్రీరాముడిని మోసగించాడు. సీతను లంకకు తెచ్చాడు. రావణుడిపై రాముడు కోపించాడు. యుద్ధంలో రావణుడిని చంపడానికి రాముడు లక్ష్మణుడితో కలిసి బయలుదేరాడు. (రావణుడిని జయించిన) పరాక్రమవంతుడైన వాలిని చంపాడు. వానరరాజ్యానికి సుగ్రీవుడిని మహారాజుగా అభిషేకించాడు. వాలికుమారుడైన అంగదుడిని యువరాజుగా అభిషేకించాడు.

హనుమాన్ నలనీలౌ చ జామ్బవాన్ పనస స్తథా ।
గవయశ్చ గవాక్షశ్చ పావనాః పరమౌజసః ॥ 52 ॥

ఉత్తములూ, గొప్పపరాక్రమవంతులూ అయిన హనుమంతుడు, నలుడు, నీలుడు, జాంబవంతుడు, పనసుడు, గవయుడు, గవాక్షుడు,

ఏతై శ్చాన్యైశ్చ బహుభి ర్వానరై స్స మహాబలైః ।
సమావృతో మహాఘోరై రామో రాజీవలోచనః ॥ 53 ॥

ఇంకా బలవంతులూ, భయంకరులూ అయినపెక్కుమంది వానరవీరులు తోడు రాగా, రావణుడితో యుద్ధానికి వెళ్లాడు.

గిరీణాం సర్వసఙ్ఘాతై స్సేతుం బద్ధ్వా మహోదధౌ ।
బలేన మహతా రామ స్సముత్తీర్య మహోదధిమ్ ॥ 54 ॥

కొండలు మొద లయినవాటితో సముద్రానికి వారధి నిర్మించాడు. ఆవారధిమీదుగా విస్తారమైన సైన్యంతో సహా రాముడు సముద్రాన్ని దాటాడు.

సఙ్గ్రామ మతులం చక్రే రక్షోగణసమన్వితాన్ ।
యమహస్తం ప్రహస్తం చ నికుమ్భం కుమ్భమేవ చ ॥ 55 ॥

రాక్షసులతో సాటిలేని యుద్ధం చేశాడు. ఆయుద్ధంలో రాక్షసులను కుప్పలు కుప్పలుగా సంహరించాడు. వారితో వచ్చిన యమహస్తుడు, ప్రహస్తుడు, నికుంభుడు, కుంభుడు అనేరాక్షసులను సంహరించాడు.

నరాన్తకం మహావీర్యం తథా చైవ యమాన్తకమ్ ।
మాలాఢ్యం మాలికాఢ్యం చ హత్వా రామస్తు వీర్యవాన్ ॥ 56 ॥

అలాగే మహాబలుడైన శ్రీరాముడు నరాంతకుడు, మహావీర్యుడు, యమాంతకుడు, మాలాఢ్యుడు, మాలికాఢ్యుడు, అనే రాక్షసనాయకులను కూడ సంహరించాడు.

పున రిన్ద్రజితం హత్వా కుమ్భకర్ణం సరావణమ్ ।
వైదేహీం చాగ్ని నాశోధ్య దత్త్వా రాజ్యం విభీషణే ॥ 57 ॥

తరువాత ఇంద్రజిత్తును, కుంభకర్ణుడినీ, రావణుడినీ సంహరించాడు. అగ్నిపరీక్షలో జానకి పవిత్రతను లోకానికి తెలియజేశాడు. రావణుడి లంకారాజ్యాన్ని విభీషణుడికి ఇచ్చాడు.

వాసుదేవం సమాదాయ యానం పుష్పక మారుహత్ ।
లీలయా సమనుప్రాప దయోధ్యాం పూర్వపాలితామ్ ॥ 58 ॥

ఆతరువాత శ్రీరాముడు వాసుదేవప్రతిమను తీసుకుని పుష్పకవిమానం ఎక్కాడు. పూర్వం తాను పరిపాలించిన అయోధ్యానగరానికి సుఖంగా తిరిగివచ్చాడు.

కనిష్ఠం భరతం స్నేహా చ్ఛత్రుఘ్నం భక్తవత్సలః ।
అభిషిచ్య తదా రామ స్సర్వరాజ్యేఽధిరాజవత్ ॥ 59 ॥

భక్తులపై వాత్సల్యం కలిగిన శ్రీరాముడు స్నేహంతో తమ్ముడైన భరతుడినీ శత్రుఘ్నుడినీ రాజులుగా అభిషేకం చేశాడు. సమస్తమైన రాజ్యానికి తాను చక్రవర్తి అయి రాజ్యాన్ని పరిపాలించాడు.

పురాతనీం స్వమూర్తిం చ సమారాధ్య తతో హరిః ।
దశ వర్షసహస్రాణి దశ వర్షశతాని చ ॥ 60 ॥

భుక్త్వా సాగరపర్యన్తాం మేదినీం స తు రాఘవః ।
రాజ్య మాసాద్య స్వగతిం వైష్ణవం పదమావిశత్ ॥ 61 ॥

పూర్వపు తనశ్రీహరిస్వరూపం అయిన ఆవాసుదేవప్రతిమను చక్కగా ఆరాధిస్తూ, సముద్రంవరకు వ్యాపించి ఉన్న రాజ్యాన్ని పదకొండువందలసంవత్సరాలపాటు శ్రీరాముడు చక్కగా పాలించాడు. ఆతరువాత అవతారం చాలించి, స్వస్థానమైన వైకుంఠానికి తిరిగివెళ్లాడు.

తాం చాపి ప్రతిమాం రామ స్సముద్రేశాయ దత్తవాన్ ।
ధన్యో రక్షయితాసి త్వం తోయే చాత్ర సుసంహితః ॥ 62 ॥

తాను అర్చించిన వాసుదేవప్రతిమను శ్రీరాముడు సముద్రుడికి ఇచ్చాడు. (ఆప్రతిమను సముద్రుడికి ఇస్తూ ఇలా చెప్పాడు.) 'ఓయీ, నీవు ధన్యుడివి. ఈప్రతిమను జాగ్రత్తగా కాపాడేఅవకాశం నీకు లభించింది. నీ(సముద్ర)జలంలో ఈప్రతిమను అప్రమత్తంగా ఉండి రక్షించు.

ద్వాపరం యుగమాసాద్య యదా దేవో జగద్గురుః ।
ధరణ్యా శ్చానురోధేన భావశైథిల్యకారణాత్ ॥ 63 ॥

అవతీర్ణ స్స భగవాన్ వసుదేవకులే ప్రభుః ।
కంసాదీనాం వధార్థాయ సఙ్కర్షణసహాయవాన్ ॥ 64 ॥

జగద్గురువయిన శ్రీకృష్ణభగవానుడు ద్వాపరయుగంలో భూదేవిప్రార్థనపై భూమిబాధలు తొలగించడం కోసమూ, భూలోకంలో కంసుడు మొదలైనవారిని సంహరించడంకోసమూ, వసుదేవుడివంశంలో అవతరిస్తాడు. అపుడు అతడికి బలరాముడు తోడుగా ఉంటాడు.

తదా తాం ప్రతిమాం విప్రా స్సర్వవాఞ్ఛాఫలప్రదామ్ ।
సర్వలోకహితార్థాయ కస్మింశ్చిత్ కారణాన్తరే ॥ 65 ॥

తస్మిన్ క్షేత్రవరే పుణ్యే దుర్లభే పురుషోత్తమే ।
ఉజ్జహార స్వయం తోయాత్ సాముద్రాత్ సరితాం పతేః ॥ 66 ॥

ద్విజులారా! అప్పుడు శ్రీకృష్ణుడు సమస్తమైన లోకాలకూ మేలు చేయడంకోసం, కోరికలన్నింటినీ తీర్చే ఆవాసుదేవప్రతిమను ఒకానొకకారణంచేత సముద్రజలంనుండి పైకి తీస్తాడు. దానిని పుణ్యప్రదమైన పురుషోత్తమ క్షేత్రంలో నిలుపుతాడు.

తదా ప్రభృతి తత్రైవ క్షేత్రే ముక్తిప్రదే ద్విజాః ।
ఆస్తే స దేవో దేవానా మార్తిహా సర్వకామదః ॥ 67 ॥

విప్రులారా! అప్పటినుండి దేవతలకష్టాలను కూడ తొలగించేదీ, సమస్తమైనకోరికలను తీర్చేదీ అయిన ఆవాసుదేవప్రతిమ మోక్షప్రదమైన ఆపురుషోత్తమక్షేత్రంలోనే ఉంది.

యే సంశ్రయన్తి చానన్తం భక్త్యా సర్వేశ్వరం ప్రభుమ్ ।
వాఙ్మనఃకర్మభి ర్నిత్యం తే యాన్తి పరమం పదమ్ ॥ 68 ॥

వాక్కు, మనస్సు, కర్మ (కాయం) అనేత్రికరణాలతోనూ భక్తితో పురుషోత్తమక్షేత్రంలోని సర్వలోకేశ్వరుడయిన అనంతవాసుదేవుడిని ఆశ్రయించినవారు మోక్షం పొందుతారు.

దృష్ట్వానన్తం సకృద్ భక్త్యా సమ్పూజ్య ప్రణిపత్య చ ।
రాజసూయాశ్వమేధాభ్యాం ఫలం దశగుణం లభేత్ ॥ 69 ॥

పురుషోత్తమక్షేత్రంలోని అనంతవాసుదేవుడిని శ్రద్ధగా ఒక్కసారి పూజించినా, నమస్కరించినా, రాజసూయ, అశ్వమేధయాగాలు చేసినదానికి పదిరెట్లు పుణ్యఫలం లభిస్తుంది.

సర్వకామసమృద్ధేన కామగేన సువర్చసా ।
విమానే నార్కవర్ణేన కిఙ్కిణీజాలమాలినా ॥ 70 ॥

త్రిస్సప్తకుల ముద్ధృత్య దివ్యస్త్రీగణసేవితః ।
ఉపగీయమానో గన్ధర్వై ర్నరో విష్ణుపురం వ్రజేత్ ॥ 71 ॥

విమానమెక్కి విష్ణులోకానికి వెళ్తాడు. ఆవిమానం కోరిక లన్నింటిని సమృద్ధిగా నెరవేరుస్తుంది. తనయిష్టానికి అనుగుణంగా ప్రయాణిస్తుంది. మంచికాంతి గలిగిఉంటుంది. సూర్యుడితో సమానమైన తేజస్సు కలిగిఉంటుంది. దానికి చుట్టూ చిరుగజ్జెలదండలు వేలాడుతుంటాయి. ఆవిమానంలో దేవకాంతలు అతడిని సేవిస్తారు. గంధర్వులు స్తోత్రాలు చేస్తుంటారు. తనవంశంలోని ఇరవై ఒక్కతరాలవారిని అధోలోకాలనుండి ఉద్ధరిస్తాడు.

తత్ర భుక్త్వా వరాన్ భోగాన్ జరామరణవర్జితః ।
దివ్యరూపధర శ్రీమాన్ యావదాభూతసంప్లవమ్ ॥ 72 ॥

విష్ణులోకంలో ఉత్తమమైన భోగాలు అనుభవిస్తాడు. అక్కడ అతడికి ముసలితనం కానీ, మరణం కాని ఉండదు. దేవతా సంబంధమైన రూపం వస్తుంది. గొప్పతేజస్సు కలిగిఉంటాడు. సృష్టి సమస్తమూ (అన్నిలోకాలూ) నశించిపోయే, మహాప్రళయం వచ్చేవరకు విష్ణులోకంలో ఉంటాడు.

పుణ్యక్షయాదిహాయాత శ్చతుర్వేదీ ద్విజో భవేత్ ।
వైష్ణవం యోగమాస్థాయ తతో మోక్షమవాప్నుయాత్ ॥ 73 ॥

పుణ్యఫలం అనుభవించడం అయిపోయినతరువాత భూలోకానికి తిరిగివస్తాడు. ఇక్కడ నాలుగువేదాలూ తెలిసినబ్రాహ్మణుడుగా జన్మిస్తాడు. తరువాత విష్ణువుతో మనసు లయంచేసి మోక్షాన్ని పొందుతాడు.

ఏవం మయా త్వనన్తోఽసౌ కీర్తితో మునిసత్తమాః ।
క శ్శక్నోతి గుణాన్ వక్తుం సర్వాన్ వర్షశతై రపి ॥ 74 ॥

మహర్షివరులారా! అనంతవాసుదేవుడిమాహాత్మ్యాన్నిగురించి ఈవిధంగా నాకు తెలిసినది చెప్పాను. వందల కొద్దీ సంవత్సరాలు వర్ణించినా ఆస్వామిగుణాలు సమస్తమూ చెప్పడం ఎవరికీ సాధ్యం కాదు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే అనన్తవాసుదేవమాహాత్మ్యనిరూపణం నామ సప్తషష్టితమోఽధ్యాయ ॥ 67 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో అనంతవాసుదేవమాహాత్మ్యనిరూపణం అనే అరవైఏడవ అధ్యాయం సంపూర్ణం.



అష్టషష్టితమోఽధ్యాయః - అరవైఎనిమిదవ అధ్యాయం

పురుషోత్తమక్షేత్రమాహాత్మ్యవర్ణనమ్ - పురుషోత్తమక్షేత్రమాహాత్మ్యవర్ణనం

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవం వోఽనన్తమాహాత్మ్యం క్షేత్రం చ పురుషోత్తమమ్ ।
భుక్తిముక్తిప్రదం నృణాం మయా ప్రోక్తం సుదుర్లభమ్ ॥ 1 ॥

ఈవిధంగా మీకు అనంతవాసుదేవుడిమాహాత్మ్యాన్ని గురించి చెప్పాను. పురుషోత్తమక్షేత్రాన్ని గురించి, చెప్పాను. ఆక్షేత్రం మానవులకు భోగమోక్షాలను ఇస్తుంది. అటువంటిపుణ్యక్షేత్రం ఇంకెక్కడా లేదు.

యత్రాస్తే పుణ్డరీకాక్ష శ్శఙ్ఖచక్రగదాధరః ।
పీతామ్బరధరశ్శ్రీమాన్ కంసకేశినిషూదనః ॥ 2 ॥

పురుషోత్తమక్షేత్రంలో శ్రీకృష్ణస్వామి నెలకొన్నాడు. ఆస్వామి శంఖ, చక్ర, గదలను ధరించిఉన్నాడు. పచ్చనిపట్టువస్త్రం కట్టుకున్నాడు. కంసుడు, కేశి అనేరాక్షసులను సంహరించినవాడు. శ్రీమంతుడు.

యే తత్ర కృష్ణం పశ్యన్తి సురాసురనమస్కృతమ్ ।
సఙ్కర్షణం సుభద్రాం చ ధన్యా స్తే నాత్ర సంశయః ॥ 3 ॥

దేవతలూ, రాక్షసులూ కొలిచే ఆకృష్ణస్వామినీ, బలరాముడినీ, సుభద్రనూ ఆక్షేత్రంలో దర్శించుకున్నవారు ధన్యాత్ములు.

త్రైలోక్యాధిపతిం దేవం సర్వకామఫలప్రదమ్ ।
యే ధ్యాయన్తి సదా కృష్ణం ముక్తా స్తే నాత్ర సంశయః ॥ 4 ॥

మూడులోకాలకూ ప్రభువూ, సమస్తమైన కోరికలను తీర్చేవాడూ అయిన కృష్ణస్వామిని ధ్యానించేవారికి మోక్షం కలుగుతుంది. ఈవిషయంలో సందేహం లేదు.

కృష్ణే రతాః కృష్ణ మనుస్మరన్తి రాత్రౌ చ కృష్ణం పునరుత్థితా యే ।
తే భిన్నదేహాః ప్రవిశన్తి కృష్ణం హవి ర్యథా మన్త్రహుతం హుతాశమ్ ॥ 5 ॥

కృష్ణుడిమీద ప్రేమ కలిగినవారు రాత్రిసమయంలోనూ, నిద్ర లేచినతరువాత, (రాత్రింబగళ్లు) ఆకృష్ణుడినే స్మరిస్తారు. వేదమంత్రాలతో హోమం చేసినద్రవ్యం హోమాగ్నిలో ప్రవేశించినవిధంగా, మరణానంతరం వారు శ్రీకృష్ణస్వామిలో లీనమవుతారు. (సాయుజ్య ముక్తిని పొందుతారు.)

తస్మాత్ సదా మునిశ్రేష్ఠాః కృష్ణః కమలలోచనః ।
తస్మిన్ క్షేత్రే ప్రయత్నేన ద్రష్టవ్యో మోక్షకాఙ్క్షిభిః ॥ 6 ॥

మహర్షులారా! అందుచేత మోక్షాన్ని కోరుకునేవారు ఎంత శ్రమపడి అయినా, పురుషోత్తమక్షేత్రంలో పుండరీకాక్షుడైన కృష్ణస్వామిని తప్పక దర్శించుకోవాలి.

శయనోత్థాపనే కృష్ణం యే పశ్యన్తి మనీషిణః ।
హలాయుధం సుభద్రాం చ హరేః స్థానం వ్రజన్తి తే ॥ 7 ॥

నిద్ర పోయేముందు, నిద్ర లేచినవెంటనే, శ్రీకృష్ణుడినీ, బలరాముడినీ, సుభద్రనూ, చూచినబుద్ధిమంతులు శ్రీహరిపదం చేరుకుంటారు.

సర్వకాలేఽ పి యే భక్త్యా పశ్యన్తి పురుషోత్తమమ్ ।
రౌహిణేయం సుభద్రాం చ విష్ణులోకం వ్రజన్తి తే ॥ 8 ॥

శ్రీకృష్ణస్వామినీ, బలభద్రుడినీ, సుభద్రనూ, నిరంతరం భక్తితో దర్శించేవారు విష్ణులోకానికి వెళ్తారు.

ఆస్తే య శ్చతురో మాసాన్ వార్షికాన్ పురుషోత్తమే ।
పృథివ్యా స్తీర్థయాత్రాయాః ఫలం ప్రాప్నోతి చాధికమ్ ॥ 9 ॥

సంవత్సరంలో వర్షాకాలం నాలుగునెలలూ, పురుషోత్తమక్షేత్రంలో నివసించినవారు భూమండలంలోని పుణ్యతీర్థాలు సమస్తమూ సేవించినదానికంటె అధికమైన పుణ్యఫలాన్ని పొందుతారు.

యే సర్వకాలం తత్రైవ నివసన్తి మనీషిణః ।
జితేన్ద్రియా జితక్రోధా లభన్తే తపసఃఫలమ్ ॥ 10 ॥

కోపాన్ని విడిచిపెట్టి, ఇంద్రియాలను అదుపులో ఉంచుకున్న బుద్ధిమంతులు జీవించిఉన్నంతకాలమూ పురుషోత్తమక్షేత్రంలోనే నివసిస్తే ఎంతో తీవ్రమైన తపస్సు చేసినఫలితాన్ని పొందుతారు.

తపస్తప్త్వాఽ న్యతీర్థేషు వర్షాణా మయుతం నరః ।
యదాప్నోతి తదాప్నోతి మాసేన పురుషోత్తమే ॥ 11 ॥

ఇతరపుణ్యక్షేత్రాలలో పదివేలసంవత్సరాలు తపస్సు చేసినవారు ఏపుణ్యఫలితాన్ని పొందుతారో ఆఫలం పురుషోత్తమక్షేత్రంలో ఒక్కనెలరోజులు చేస్తేనే లభిస్తుంది.

తపసా బ్రహ్మచర్యేణ సఙ్గత్యాగేన యత్ఫలమ్ ।
తత్ఫలం సతతం తత్ర ప్రాప్నువన్తి మనీషిణః ॥ 12 ॥

తపస్సుచేయడంవల్లనూ, బ్రహ్మచర్యనియమాలను పాటించడంవల్లనూ, దేనిపైనా ఆసక్తి లేకుండటంవల్లనూ, కలిగేపుణ్యఫలం పురుషోత్తమక్షేత్రాన్ని సేవించడంవల్ల కలుగుతుంది.

సర్వతీర్థేషు యత్పుణ్యం స్నానదానేన కీర్తితమ్ ।
తత్ఫలం సతతం తత్ర ప్రాప్నువన్తి మనీషిణః ॥ 13 ॥

ఈభూమిమీద ఉన్న సమస్త పుణ్యతీర్థాలలోనూ స్నానాలూ, దానాలూ చేయడంవల్ల కలిగేపుణ్యఫలం పురుషోత్తమక్షేత్రాన్ని (ఒక్కసారి) సేవించడంవల్ల కలుగుతుంది.

సమ్యక్ తీర్థేన యత్ ప్రోక్తం వ్రతేన నియమేన చ ।
తత్ఫలం లభతే తత్ర ప్రత్యహం పురుష శ్శుచిః ॥ 14 ॥

శాస్త్రోక్తమైన పద్ధతిలో చక్కగా తీర్థయాత్ర చేసినందువల్లనూ, వ్రతాలూ, నియమాలూ ఆచరించడం వల్లనూ, కలిగేపుణ్యఫలం పురుషోత్తమక్షేత్రాన్ని నిత్యమూ పవిత్రంగా సేవించినమానవుడు పొందుతాడు.

ఇష్ట్వా నానావిధై ర్యజ్ఞై ర్యత్ఫలం లభతే నరః ।
తత్ఫలం సతతం తత్ర ప్రత్యహం సంయతేన్ద్రియః ॥ 15 ॥

వివిధమైన యాగాలు చేసినందువల్ల కలిగేపుణ్యఫలం పురుషోత్తమక్షేత్రంలో నిత్యమూ ఇంద్రియ నిగ్రహంతో ఉన్నవాడు పొందుతాడు.

దేహం త్యజన్తి మనుజా స్తత్ర యే పురుషోత్తమే ।
కల్పవృక్షం సమాసాద్య ముక్తా స్తే నాత్ర సంశయః ॥ 16 ॥

పురుషోత్తమక్షేత్రంలో మరణించినమానవులు, అలాగే అక్కడ ఉన్న వటవృక్షాన్ని సేవించినవారు, తప్పక మోక్షం పొందుతారు. అనుమానం లేదు.

వటసాగరయో ర్మధ్యే యే త్యజన్తి కలేబరమ్ ।
తే దుర్లభం పరం మోక్షం ప్రాప్నువన్తి న సంశయః ॥ 17 ॥

వటవృక్షానికీ, సముద్రానికీ నడుమ శరీరాన్ని విడిచిపెట్టినవారు మిక్కిలి కష్టసాధ్యమైన మోక్షాన్ని సులువుగా, తప్పకుండా పొందుతారు. సందేహం లేదు.

అనిచ్ఛన్నపి య స్తత్ర ప్రాణాం స్త్యజతి మానవః ।
సోఽపి దుఃఖవినిర్ముక్తో ముక్తిం ప్రాప్నోతి దుర్లభామ్ ॥ 18 ॥

అనుకోకుండా అయినప్పటికీ పురుషోత్తమక్షేత్రంలో ప్రాణాలు విడిచినమానవుడికి పాపాలన్నీ నశించిపోతాయి. ఎంతో కష్టపడితే కాని రానిమోక్షాన్ని సులువుగా పొందుతాడు.

కృమికీటపతఙ్గాద్యా స్తిర్యగ్యోనిగతాశ్చ యే ।
తత్ర దేహం పరిత్యజ్య తేఽపి యాన్తి పరాం గతిమ్ ॥ 19 ॥

చిన్నక్రిములు, పురుగులు, పక్షులు, పశువులు మొదలైనవి ఏవయినా, పురుషోత్తమక్షేత్రంలో ప్రాణాలు విడిస్తే, ఉత్తమగతులను పొందుతాయి.

భ్రాన్తిం లోకస్య పశ్యధ్వ మన్యతీర్థం ప్రతి ద్విజాః ।
పురుషాఖ్యేన యత్ప్రాప్త మన్యతీర్థఫలాదికమ్ ॥ 20 ॥

విప్రులారా! పురుషోత్తమక్షేత్రాన్ని విడిచిపెట్టి, మిగిలిన పుణ్యక్షేత్రాలవెంట తిరుగుతున్న మానవులు ఎంత భ్రమపడుతున్నారో చూడండి. పుణ్యతీర్థా లన్నింటివలన కలిగేపుణ్యఫలం ఒకేఒక్క పురుషోత్తమక్షేత్రాన్ని సేవించడంవల్ల మాత్రమే కలుగుతున్నదనే వివేకం వారికి కలగడం లేదు.

సకృత్ పశ్యతి యో మర్త్య శ్రద్ధయా పురుషోత్తమమ్ ।
పురుషాణాం సహస్రేషు స భవేదుత్తమః పుమాన్ ॥ 21 ॥

జీవితంలో ఒక్కసారైనా పురుషోత్తమక్షేత్రాన్ని భక్తిగా దర్శించుకున్నమానవుడు వేలకొద్దీపురుషులలో ఉత్తముడు అవుతాడు.

ప్రకృతే స్స పరో యస్మాత్ పురుషా దపి చోత్తమః ।
తస్మాద్ వేదే పురాణే చ లోకేఽస్మిన్ పురుషోత్తమః ॥ 22 ॥

ప్రకృతికంటె, పురుషుడికంటె ఉత్తముడు కావడంచేతనే వేదాలూ, పురాణాలూ ఈలోకంలో కృష్ణస్వామిని పురుషోత్తముడు అని కీర్తిస్తున్నాయి.

యోఽసౌ పురాణే వేదాన్తే పరమాత్మే త్యుదాహృతః ।
ఆస్తే విశ్వోపకారాయ తేనాసౌ పురుషోత్తమః ॥ 23 ॥

పురుషోత్తమక్షేత్రంలో నెలకొన్నకృష్ణస్వామినే పురాణాలూ, వేదాలూ, ఉపనిషత్తులూ, పరమాత్మ అని ప్రస్తుతించాయి. ఆపరమాత్మ లోకాలకు మేలు చేయడానికే ఇక్కడ అవతరించిఉన్నాడు. అందుకే ఆయన పురుషోత్తముడు.

పథి శ్మశానే గృహమణ్డపే వా రథ్యాప్రదేశే ష్వపి యత్ర కుత్ర ।
ఇచ్ఛన్ననిచ్ఛన్నపి తత్ర దేహం సన్త్యజ్య మోక్షం లభతే మనుష్యః ॥ 24 ॥

పురుషోత్తమక్షేత్రంలో దారిలో గాని, శ్మశానంలో గాని, ఆలయంలో గాని, రాజమార్గంలో గాని, ఎక్కడయినా సరే, శరీరాన్ని విడిచిపెట్టినమానవుడు కోరుకున్నా, కోరుకోకపోయినా, తప్పక మోక్షాన్ని పొందుతాడు.

తస్మాత్ సర్వప్రయత్నేన తస్మిన్ క్షేత్రే ద్విజోత్తమాః ।
దేహత్యాగో నరైః కార్యః సమ్య జ్మోక్షాభికాఙ్క్షిభిః ॥ 25 ॥

విప్రవరులారా! అందుచేత మోక్షాన్ని కోరుకునేమానవులు ఎంత కష్టపడి అయినా, పురుషోత్తమక్షేత్రంలో శరీరాన్ని విడిచిపెట్టాలి.

పురుషాఖ్యస్య మాహాత్మ్యం వక్తుం శక్నోతి కః పుమాన్ ।
నరో యత్ర వటం దృష్ట్వా బ్రహ్మహత్యాం వ్యపోహతి ॥ 26 ॥

పురుషోత్తమక్షేత్రం మహిమలను వర్ణించడం ఎవ్వడికీ సాధ్యం కాదు. ఆక్షేత్రంలో ఉన్నమఱ్ఱిచెట్టును దర్శిస్తే, బ్రాహ్మణుడిని చంపిన (బ్రహ్మహత్యా) మహాపాతకం కూడ నశిస్తుంది.

గుణానా మేకదేశోఽ యం మయా క్షేత్రస్య కీర్తితః ।
క స్సమస్తాన్ గుణాన్ వక్తుం శక్తో వర్షశతైరపి ॥ 27 ॥

ఇంతవరకూ నేను వివరించింది, ఆపురుషోత్తమక్షేత్రం మహిమలలో కొద్దిభాగం మాత్రమే. వందలకొద్దీ సంవత్సరాలు చెప్పినా, ఆక్షేత్రం మహిమలు అన్నీ చెప్పడం సాధ్యం కాదు.

యది యూయం మునిశ్రేష్ఠా మోక్ష మిచ్ఛథ శాశ్వతమ్ ।
తస్మిన్ క్షేత్రవరే పుణ్యే నివసధ్వ మతన్ద్రితాః ॥ 28 ॥

మహర్షులారా! పునరావృత్తిరహితమైన మోక్షాన్ని గనుక మీరు కోరుకుంటే, ఉత్తమమైన ఆపురుషోత్తమపుణ్యక్షేత్రంలో అప్రమత్తంగా జీవించండి.

వ్యాస ఉవాచ :-మహర్షులతో వ్యాసుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తే తస్య వచనం శ్రుత్వా బ్రహ్మణోఽ వ్యక్తజన్మనః ।
నివాసం చక్రిరే తత్ర అవాపుః పరమం పదమ్ ॥ 29 ॥

పుట్టుకను గూర్చి తెలియరాని బ్రహ్మదేవుడిఈమాటలు విని అక్కడిమహర్షులు పురుషోత్తమక్షేత్రంలో నివాసం ఏర్పరచుకున్నారు. మరణానంతరం వారు మోక్షం పొందారు.

తస్మాద్ యూయం ప్రయత్నేన నివసధ్వం ద్విజోత్తమాః ।
పురుషాఖ్యే వరే క్షేత్రే యది ముక్తి మభీప్సథ ॥ 30 ॥

బ్రాహ్మణోత్తములారా! అందుచేత మోక్షం కావాలనుకుంటే, మీరు కూడ ప్రయత్నపూర్వకంగా ఉత్తమమైన పురుషోత్తమక్షేత్రంలో నివసించండి.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే పురుషోత్తమక్షేత్రమాహాత్మ్యవర్ణనం నామ అష్టషష్టితమోఽ ధ్యాయః ॥ 68 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో పురుషోత్తమక్షేత్రమాహాత్మ్యవర్ణనం అనే అరవైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.



ఏకోనసప్తతితమోఽధ్యాయః - అరవైతొమ్మిదవ అధ్యాయం

కందూపాఖ్యాననిరూపణమ్ - కందూపాఖ్యాననిరూపణం

వ్యాస ఉవాచ :-మహర్షులతో వ్యాసుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తస్మిన్ క్షేత్రే మునిశ్రేష్ఠా స్సర్వసత్త్వసుఖావహే ।
ధర్మార్థకామమోక్షాణాం ఫలదే పురుషోత్తమే ॥ 1 ॥

మహర్షులారా! ఆపురుషోత్తమక్షేత్రం సమస్తమైన జీవులకు సుఖాన్ని ఇస్తుంది. ధర్మం, అర్థం, కామం, మోక్షం అనేనాలుగు పురుషార్థాలఫలితాన్ని ఇస్తుంది.

కణ్డు ర్నామ మహాతేజా ఋషిః పరమధార్మికః ।
సత్యవాదీ శుచి ర్దాన్త స్సర్వభూతహితే రతః ॥ 2 ॥

అటువంటిపురుషోత్తమక్షేత్రంలో కండువు అనే మహర్షి ఉండేవాడు. ఆయన గొప్ప తేజస్వి. ధర్మ పరాయణుడు. నియమంగా సత్యం మాత్రమే మాటాడేవాడు. పుణ్యకర్మలను ఆచరించేవాడు. ఇంద్రియాలను అదుపులో ఉంచుకున్నవాడు. నిత్యమూ సమస్తమైన జీవులకు మేలు చేస్తూఉంటాడు.

జితేన్ద్రియో జితక్రోధో వేదవేదాఙ్గపారగః ।
అవాప పరమాం సిద్ధి మారాధ్య పురుషోత్తమమ్ ॥ 3 ॥

ఇంద్రియాలను జయించాడు. కోపం లేనివాడు. వేదాలనూ వేదాంగాలనూ ఆమూలాగ్రం తెలుసుకున్నాడు. ఆక్షేత్రంలో పురుషోత్తమదేవుడిని ఆరాధించి, ఉత్తమమైన సిద్ధిని పొందాడు.

అన్యేఽపి తత్ర సంసిద్ధా మునయ స్సంశితవ్రతాః ।
సర్వభూతహితా దాన్తా జితక్రోధా విమత్సరాః ॥ 4 ॥

ఆక్షేత్రంలో తపస్సిద్ధిని పొందిన మహర్షులు ఇంకా చాలమంది ఉన్నారు. వారు కూడ శ్రద్ధగా నియమాలను పాటిస్తారు. అన్నిజీవులకూ మేలు చేస్తారు. ఇంద్రియాలను జయించారు. వారికి కోపం లేదు. ఇతరులలోనిమంచిని ఆదరిస్తారు.

మునయ ఊచుః :-వ్యాసమహర్షితో మునులు ఇలా అంటున్నారు.

కోఽసౌ కణ్డుః కథం తత్ర జగామ పరమాం గతిమ్ ।
శ్రోతుమిచ్ఛామహే తస్య చరితం బ్రూహి సత్తమ ॥ 5 ॥

మహాత్మా! ఈకండువు ఎవరు?అతడు పురుషోత్తమక్షేత్రంలో ఉత్తమగతిని ఏవిధంగా పొందాడు? మాకు ఆకండుమహర్షిచరిత్రను తెలుసుకోవాలనే కోరిక కలిగింది. చెప్పవలసింది.

వ్యాస ఉవాచ :-మహర్షులతో వ్యాసుడు ఈవిధంగా చెప్తున్నాడు.

శృణుధ్వం మునిశార్దూలాః కథాం తస్య మనోహరామ్ ।
ప్రవక్ష్యామి సమాసేన మునే స్తస్య విచేష్టితమ్ ॥ 6 ॥

మహర్షులారా! వినండి. ఆకండుమహర్షికథ అందరిమనసులను ఆకట్టుకుంటుంది. ఆమహర్షిచరిత్రను సంగ్రహంగా చెప్తాను.

పవిత్రే గౌతమీతీరే విజనే సుమనోహరే ।
కన్దమూలఫలైః పూర్ణే సమిత్పుష్పకుశాన్వితే ॥ 7 ॥

గౌతమీనది ఒడ్డున ఒకానొకపవిత్రప్రదేశం ఉంది. అక్కడ జనాలు సంచరించరు. అది చాల మనోహరంగా ఉంటుంది. ఆప్రాంత మంతటా దుంపలు, పండ్లు, సమిధలు, దర్భలు పుష్కలంగా ఉంటాయి.

నానాద్రుమలతాకీర్ణే నానాపుష్పోపశోభితే ।
నానాపక్షిరుతే రమ్యే నానామృగగణాన్వితే ॥ 8 ॥

ఆప్రదేశం అంతా రకరకాలచెట్లతో నిండిఉంటుంది. రకరకాలపూలతో అందంగా ఉంటుంది. రకరకాల పక్షులఅరుపులు మనోహరంగా వినిపిస్తాయి. రకరకాలజంతువులు కలిసి నివసిస్తుంటాయి.

తత్రాశ్రమపదం కణ్డో ర్బభూవ మునిసత్తమాః ।
సర్వర్తుఫలపుష్పాఢ్యం కదలీఖణ్డమణ్డితమ్ ॥ 9 ॥

మునీశ్వరులారా! అక్కడ కండుమహర్షి ఆశ్రమం ఉంది. ఆఆశ్రమంలో ఆయాఋతువులలో పూసే పూలు సమస్తమూ అన్ని ఋతువులలోనూ సమృద్ధిగా ఉంటాయి. అక్కడ అరటితోపులు అధికం.

తప స్తేపే ముని స్తత్ర సుమహత్ పరమాద్భుతమ్ ।
వ్రతోపవాసై ర్నియమై స్స్నానమౌనసుసంయమైః ॥ 10 ॥

అక్కడ కండుమహర్షి ఆశ్చర్యకరమైన గొప్పతపస్సు చేశాడు. వ్రతాలు, ఉపవాసాలు ఆచరించాడు. స్నానం, మౌనం మొదలైన ఉత్తమనియమాలు పాటించాడు.

గ్రీష్మే పఞ్చతపా భూత్వా వర్షాసు స్థణ్డిలేశయః ।
ఆకణ్ఠమగ్నో హేమన్తే స తేపే సుమహత్తపః ॥ 11 ॥

ఎండలకాలంలో చుట్టూ నాలుగుదిక్కులలో అగ్ని, ఆకాశంలో సూర్యుడు అనే అయిదుఅగ్నులనడుమ ఉండి తపస్సు చేసేవాడు. వానలకాలంలో (ఆచ్ఛాదనలు లేకుండా) ఆరుబయట కూర్చుండి తపస్సు చేసేవాడు. చలికాలంలో గొంతువరకూ నీళ్లలో నిలిచి తపస్సు చేసేవాడు. ఈవిధంగా కండువు తీవ్రమైన తపస్సుచేశాడు.

దృష్ట్వా తత్తపసో వీర్యం మునే స్తస్య సువిస్మితాః ।
బభూవు ర్దేవగన్ధర్వా స్సిద్ధవిద్యాధరా స్తథా ॥ 12 ॥

కండుమహర్షితపశ్శక్తిని చూసి దేవతలూ, గంధర్వులూ, సిద్ధులూ, విద్యాధరులూ కూడ చాల ఆశ్చర్యపడ్డారు.

భూమిం తథాన్తరిక్షం చ దివం చ మునిసత్తమాః ।
కణ్డు స్సన్తాపయామాస త్రైలోక్యం తపసో బలాత్ ॥ 13 ॥

మునివరేణ్యులారా! కండుమహర్షి తనతపశ్శక్తితో భూమి, ఆకాశం, స్వర్గం అనేమూడులోకాలనూ తపింపజేశాడు.

అహో౽స్య పరమం ధైర్య మహో౽స్య పరమం తపః ।
ఇత్యబ్రువం స్తదా దృష్ట్వా దేవా స్తం తపసి స్థితమ్ ॥ 14 ॥

తీవ్రమైన తపస్సులో నిమగ్నమై ఉన్న కండుమహర్షిని చూసి, దేవతలు 'ఆహా, ఈమహర్షి ధైర్యం ఎంత గొప్పదో? ఓహో, ఈమహాముని తపస్సు ఎంత గొప్పదో?' అని ప్రశంసించారు.

మన్త్రయామాసు రవ్యగ్రా శ్శక్రేణ సహితా స్తదా ।
భయాత్ తస్య సముద్విగ్నా స్తపోవిఘ్న మభీప్సవః ॥ 15 ॥

కండుమహర్షి తపస్సుతీవ్రతకు దేవతలు కలవరపడ్డారు. ఆయనతపస్సుకు ఎలాగైనా ఆటంకాలు కలిగించాలనుకున్నారు. దేవేంద్రుడితో కలిసి సావధానంగా ఆలోచనలు చేశారు.

జ్ఞాత్వా తేషా మభిప్రాయం శక్ర స్త్రిభువనేశ్వరః ।
ప్రమ్లోచాఖ్యాం వరారోహాం రూపయౌవనగర్వితామ్ ॥ 16 ॥

ముల్లోకాలకు అధిపతి అయిన దేవేంద్రుడు దేవతలఉద్దేశ్యాన్ని తెలుసుకున్నాడు. కండుమహర్షి తపస్సుకు విఘ్నం కలిగించడానికి ప్రమ్లోచ అనే అప్సరసను పంపాలనుకున్నాడు. ఆమె మంచిరూపం కలిగినది. యుక్తవయసులో ఉన్నది.

సుమధ్యాం చారుదశనాం పీనశ్రోణిపయోధరామ్ ।
సర్వలక్షణసమ్పన్నాం ప్రోవాచ బలసూదనః ॥ 17 ॥

ఆమె నడుము అందంగా ఉంటుంది. దంతాలు మనోహరంగా ఉంటాయి. వక్షోజాలు, పిరుదులు దృఢంగానూ, ఎత్తుగానూ ఉంటాయి. ఉత్తమస్త్రీలక్షణాలు అన్నీ ఉన్నాయి. అటువంటిప్రమ్లోచతో ఇంద్రుడు ఇలా అన్నాడు.

శక్ర ఉవాచ :–ప్రమ్లోచ అనేఅప్సరసతో ఇంద్రుడు ఇలా అంటున్నాడు.

ప్రమ్లోచే గచ్ఛ శీఘ్రం త్వం యత్రాసౌ తప్యతే మునిః ।
విఘ్నార్థం తస్య తపసః క్షోభయస్వ మనశ్శుభే ॥ 18 ॥

కల్యాణీ! ప్రమ్లోచా! వెంటనే కండుమహర్షితపస్సు చేస్తున్నచోటికి వెళ్లు. ఆమహర్షితపస్సుకు అడ్డంకులు కలిగించు. అతడికి తపస్సులో ఏకాగ్రతను చెడగొట్టి, మనస్సును కలతపెట్టు.

ప్రమ్లోచోవాచ :–ఇంద్రుడితో ప్రమ్లోచ ఇలా అంటున్నది.

తవ వాక్యం సురశ్రేష్ఠ కరోమి సతతం ప్రభో ।
కిన్తు శఙ్కా మమైవాత్ర జీవితస్య చ సంశయః ॥ 19 ॥

దేవవరేణ్యా! ప్రభూ! నీవు ఆజ్ఞాపించినట్లు తప్పకుండా చేస్తాను. అయితే, నాకు ఒకసందేహం కలుగుతున్నది. ఈప్రయత్నంలో నాకు ప్రాణహాని కలుగుతుందేమో అనిపిస్తున్నది.

బిభేమి తం మునివరం బ్రహ్మచర్యవ్రతే స్థితమ్ ।
అత్యుగ్రం దీప్తతపసం జ్వలనార్కసమప్రభమ్ ॥ 20 ॥

బ్రహ్మచర్యనియమాలను కఠోరంగా పాటిస్తున్న కండుమహర్షిని గురించి నేను భయపడుతున్నాను. అతడు మిక్కిలిభయంకరమైన తపస్సు చేస్తున్నాడు. తపస్సుచేత అతడితేజస్సు అగ్నిజ్వాలలాగా, మండుతున్నసూర్యుడిలాగ చాలా తీక్షణంగా (సమీపించడానికి వీలు లేకుండా) ఉంది.

జ్ఞాత్వా మాం స మునిః క్రోధాద్ విఘ్నార్థం సముపాగతామ్ ।
కణ్డుః పరమతేజస్వీ శాపం దాస్యతి దుస్సహమ్ ॥ 21 ॥

గొప్పతేజోవంతుడైన కండుమహర్షి తనతపస్సుకు విఘ్నం కలిగించడానికి వచ్చానని తెలిసి, కోపంతో నేను తట్టుకోలేనిశాపం ఇస్తాడు.

ఉర్వశీ మేనకా రమ్భా ఘృతాచీ పుఞ్జికస్థలా ।
విశ్వాచీ సహజన్యా చ పూర్వచిత్తి స్తిలోత్తమా ॥ 22 ॥

అలమ్బుసా మిశ్రకేశీ శశిలేఖా చ వామనా ।
అన్యా శ్చాప్సరస స్సన్తి రూపయౌవనగర్వితాః ॥ 23 ॥

ఉర్వశి, మేనక, రంభ, ఘృతాచి, పుంజికస్థల, విశ్వాచి, సహజన్య, పూర్వచిత్తి, తిలోత్తమ, అలంబుస,మిశ్రకేశి, శశిలేఖ, వామన, మొదలైన అప్సరసలు ఎంతోమంది నాకంటె ఎక్కువ అందం, మంచివయసు కలిగినవారు తమఅధీనంలో ఉన్నారు.

సుమధ్యా శ్చారువదనాః పీనోన్నతపయోధరాః ।
కామప్రచారకుశలా స్తా స్తత్ర వినియోజయ ॥ 24 ॥

వారందరూ సొగసయిననడుము కలిగినవారు. ముఖాలు చాల అందంగా ఉంటాయి. వారివక్షోజాలు దృఢంగానూ, ఎత్తుగానూ ఉంటాయి. మన్మథవిద్యను ప్రదర్శించడంలో నెరజాణలు. అందుచేత ఈపనికి వాళ్లను పంపించు.

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తస్యా స్తద్వచనం శ్రుత్వా పునః ప్రాహ శచీపతిః ।
తిష్ఠన్తు నామ చాన్యా స్తా స్త్వం చాత్ర కుశలా శుభే ॥ 25 ॥

ప్రమ్లోచపలుకులు విని దేవేంద్రుడు ఇలా అన్నాడు. 'శోభనాంగీ, వేరేఅప్సరసలు ఎంతమంది అయినా ఉండవచ్చును గాక. కాని కండుమహర్షివంటివాడి తపస్సు భగ్నం చేయడానికి మాత్రం నీవే సమర్థురాలివి.

కామం వసన్తం వాయుం చ సహాయార్థం దదామి తే ।
తై స్సార్థం గచ్ఛ సుశ్రోణి యత్రాస్తే స మహామునిః ॥ 26 ॥

ఘనజఘనా! నీకు సహాయంగా మన్మథుడినీ, వసంతుడినీ, మలయమారుతాన్నీ ఇస్తున్నాను. వాళ్లను తోడుతీసుకుని కండుమహర్షి తపస్సు చేస్తున్నచోటికి వెళ్లు.

శక్రస్య వచనం శ్రుత్వా తదా సా చారులోచనా ।
జగామాకాశమార్గేణ తై స్సార్థం చ వరాఙ్గనా ॥ 27 ॥

దేవేంద్రుడిమాట విని, అందమయినకన్నులు కలిగిన ఆసుందరాంగి వారిని కూడా తీసుకుని ఆకాశమార్గంలో కండుమహర్షి తపస్సు చేస్తున్నప్రాంతానికి వెళ్లింది.

గత్వా సా తత్ర రుచిరం దదర్శ వనముత్తమమ్ ।
మునిం చ దీప్తతపస మాశ్రమస్థమకల్మషమ్ ॥ 28 ॥

అలా వెళ్లి, ప్రమ్లోచ అక్కడ ఒకవనాన్ని చూసింది. ఉత్తమమైన ఆవనం చాల అందంగా ఉంది. ఆవనంలోని ఆశ్రమంలో పవిత్రుడైన కండుమహర్షిని చూసింది. అతడు తపశ్శక్తితో తేజరిల్లుతున్నాడు.

అపశ్యత్ సా వనం రమ్యం తై స్సార్థం నన్దనోపమమ్ ।
సర్వర్తువరపుష్పాఢ్యం శాఖామృగగణాకులమ్ ॥ 29

మన్మథాదులతో సహా ప్రమ్లోచ ఆవనాన్ని చూసింది. అది నందనవనంలాగా అందంగా ఉంది. ఆయా ఋతువులలో పూసే పూలు సమస్తమూ సమృద్ధిగా ఉన్నాయి. అక్కడ కోతులు గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి.

పుణ్యం పద్మవనోపేతం సపల్లవనగాకులమ్ ।
శ్రోత్రరమ్యాన్ సుమధురాన్ శబ్దాన్ ఖగముఖేరితాన్ ॥ 30 ॥

అది చాల పవిత్రంగా ఉంది. అక్కడ తామరతోటలున్నాయి. చెట్లు చిగురాకులతో నిండిఉన్నాయి. అక్కడ రకరకాలపక్షుల అరుపులు తీయగా, చెవి కింపుగా ఉన్నాయి.

సర్వర్తుఫలభారాఢ్యాన్ సర్వర్తుకుసుమోజ్జ్వలాన్ ।
అపశ్యత్ పాదపాం శ్చైవ విహఙ్గై రనునాదితాన్ ॥ 31 ॥

అక్కడిచెట్లు ఆయాఋతువులలో ఉండే అన్నిరకాలపండ్లబరువుతో వంగిఉన్నాయి. అన్నిఋతువులపూలతో ప్రకాశిస్తున్నాయి. రకరకాలపక్షులకూతలతో నిండిఉన్నాయి. అటువంటిచెట్లను ఆఅచ్చర చూసింది.

ఆమ్రా నామ్రాతకాన్ భవ్యాన్ నారికేరాన్ సతిన్దుకాన్ ।
అథ బిల్వాం స్తథా జీవాన్ దాడిమాన్ బీజపూరకాన్ ॥ 32 ॥

మామిడి, అంబాళం, కొబ్బరి, తుమ్మికి, మారేడు, వేగిస, దానిమ్మ, మాదీఫలం,

పనసాన్ లకుచాన్ నీపాన్ శిరీషాన్ సుమనోహరాన్ ।
పారావతాం స్తథా కోలా నరిమేదామ్లవేతసాన్ ॥ 33 ॥

పనస, గజనిమ్మ, కడిమి, దిరిసెన, కోతితుమికి, పిప్పలి, వెలితుమ్మ, చింత, ప్రబ్బలి,

భల్లాతకా నామలకాన్ శతపర్ణాంశ్చ కింశుకాన్ ।
ఇఙ్గుదాన్ కరవీరాంశ్చ హరీతకవిభీతకాన్ ॥ 34 ॥

జీడి, ఉసిరి, శతపర్ణం, మోదుగ, గార, గన్నేరు, హారీతకం, మద్ది,

ఏతా నన్యాంశ్చ సా వృక్షాన్ దదర్శ పృథులోచనా ।
తథైవాశోకపున్నాగకేతకీవకులాం స్తథా ॥ 35 ॥

పారిజాతాన్ కోవిదారాన్ మన్దారేన్దీవరాం స్తథా ।
పాటలాన్ పుష్పితాన్ రమ్యాన్ దేవదారుద్రుమాం స్తథా ॥ 36 ॥

ఇవే కాకుండా ఇంకా అనేకమైన చెట్లను పెద్దపెద్దకన్నులు కలిగినప్రమ్లోచ ఆవనంలో చూసింది. ఇంకా, అశోకం, పున్నాగం, మొగలి, పొగడ, పారిజాతం, ఎఱ్ఱకాంచనం, మందారం, నల్లకలువ పూలతో కూడినచెట్లనూ తీగలనూ చూసింది. పూలతో నిండినపాటలంచెట్లనూ, అందమైన దేవదారువృక్షాలను ప్రమ్లోచ చూసింది.

శాలాం స్తాలాం స్తమాలాంశ్చ నిచులాన్ లోమకాం స్తథా ।
అన్యాంశ్చ పాదపశ్రేష్ఠా నపశ్యత్ ఫలపుష్పితాన్ ॥ 37 ॥

పండ్లతోనూ పూలతోనూ నిండిన బొద్దుగ, తాడి, చీకటిచెట్లు, ఎఱ్ఱగన్నేరు, లోమకం, ఇంకా ఇతర మయిన అనేకమైన గొప్పవృక్షాలను ఆవనంలో ప్రమ్లోచ చూసింది.

చకోరై శ్శతపత్రైశ్చ భృఙ్గరాజై స్తథా శుకైః ।
కోకిలైః కలవిఙ్కైశ్చ హారీతై ర్జీవజీవకైః ॥ 38 ॥

వెన్నెలపక్షులు, నెమళ్లు, గండుతుమ్మెదలు, చిలుకలు, కోయిలలు, పిచ్చుకలు, పావురాలు, వెన్నెలపులుగులు (చకోరాలే),

ప్రియపుత్రై శ్చాతకైశ్చ తథాన్యై ర్వివిధైః ఖగైః ।
శ్రోత్రరమ్యం సుమధురం కూజద్భి శ్చాప్యధిష్ఠితమ్ ॥ 39 ॥

ప్రియపుత్రపక్షులు, వానకోయిలలు, ఇంకా అనేకమైన రకరకాలపక్షులు ఆచెట్లపై సంచరిస్తున్నాయి. ఆపక్షులు తీయగా, చెవి కింపుగా కూస్తున్నాయి.

సరాంసి చ మనోజ్ఞాని ప్రసన్నసలిలాని చ ।
కుముదైః పుణ్డరీకైశ్చ తథా నీలోత్పలై శ్శుభైః ॥ 40 ॥
కహ్లారైః కమలై శ్చైవ ఆచితాని సమన్తతః ॥ 41 ॥

ఆప్రదేశంలో సరస్సులు మనసు మెచ్చేవిధంగా ఉన్నాయి. ఆసరసులలోనినీళ్లు స్వచ్ఛంగా ఉన్నాయి. తెల్లగలువలు, తెల్లదామరలు, నల్లగలువలు, ఎఱుపు తెలుపు గలిసినరంగులో ఉన్నకలువలు, ఎఱ్ఱదామరలు, పుష్కలంగా ఉండి, ఆసరసులలోనినీళ్లను కప్పి వేస్తున్నాయి.

కాదమ్బై శ్చక్రవాకైశ్చ తథైవ జలకుక్కుటైః ।
కారణ్డవై ర్ప్లవై ర్హంసైః కూర్మై ర్మద్గుభిరేవ చ ॥ 42 ॥

కలహంసలు, చక్రవాకపక్షులు, నీటికోళ్లు, కన్నెలేడిపిట్టలు, హంసలు, తాబేళ్లు, నీటికాకులు,

ఏతైశ్చాన్యైశ్చ కీర్ణాని సమన్తా జ్జలచారిభిః ।
క్రమేణైవ తథా సా తు వనం బభ్రామ తై స్సహ ॥ 43 ॥

ఇవేకాక ఇంకా నీళ్లలో సంచరించే అనేకమైన ఇతరజాతిపక్షులు కూడ ఆసరసులనిండా సంచరిస్తున్నాయి. తనకు తోడుగా వచ్చిన మన్మథుడు, వసంతుడు, వాయువులతో కలిసి ప్రమ్లోచ ఆవనమంతా తిరిగిచూచింది.

ఏవం దృష్ట్వా వనం రమ్యం తై స్సార్ధం పరమాద్భుతమ్ ।
విస్మయోత్ఫుల్లనయనా సా బభూవ వరాఙ్గనా ॥ 44 ॥

ఈవిధంగా అద్భుతంగా ఉన్నఆవనాన్ని మన్మథాదులతో కలిసి పరికించినసుందరాంగి ఆప్రమ్లోచకు ఆశ్చర్యంతో కన్నులు విప్పారినాయి.

ప్రోవాచ వాయుం కామం చ వసన్తం చ ద్విజోత్తమాః ।

బ్రాహ్మణోత్తములారా! అపుడు ప్రమ్లోచ మన్మథుడితోనూ, వసంతుడితోనూ, వాయువుతోనూ ఇలా పలికింది.

ప్రమ్లోచోవాచ :–మన్మథుడు మొదలైన సహచరులతో ప్రమ్లోచ ఇలా అంటున్నది.

కురుధ్వం మమ సాహాయ్యం సజ్జా స్సర్వే పృథక్ పృథక్ ॥ 45 ॥

(కండువు తపస్సు భగ్నం చేయడానికి) అందరూ సిద్ధం కండి. ఈకష్టకార్యంలో ఎవరికి చేత నయినట్లు వారు నాకు సహకరించండి.

బ్రహ్మోవాచ :-మహర్షులతో బ్రహ్మదేవుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవముక్త్వా తదా సా తు శక్తిక్షోభేణ గర్వితా ।
ప్రత్యువాచ యాస్యామి యత్రాసౌ సంస్థితో మునిః ॥ 46 ॥

ఎంతటిమహర్షులనైనా తాను కలతపెట్టగలనని అహంకరించే ప్రమ్లోచ ఇలా పలికినతరువాత 'నేను కండుమహర్షి ఉన్నచోటికి వెళ్తున్నాను' అన్నది.

అద్య తం దేహయన్తారం ప్రయుక్తేన్ద్రియవాజినమ్ ।
స్మరశస్త్రగలద్రశ్మిం కరిష్యామి కుసారథిమ్ ॥ 47 ॥

ఇంద్రియాలనే గుఱ్ఱాలను అదుపులో ఉంచుకుని, శరీరం అనే రథాన్ని సరియైనమార్గంలో నడిపిస్తున్న ఆమహర్షిని, మన్మథబాణాలతో పగ్గాలు వదిలించి, రథం నడపడం చేతకానిసారథిగా చేస్తాను.

బ్రహ్మా జనార్దనో వాపి యది వా నీలలోహితః ।
తథాఽప్యద్య కరిష్యామి కామబాణక్షతాన్తరమ్ ॥ 48 ॥

బ్రహ్మదేవుడయినా, శ్రీమహావిష్ణువే అయినా, ఆపరమేశ్వరుడే అయినా సరే, మన్మథుడిబాణాలతో అతడి మనస్సును ఈక్షణమే గాయపరుస్తాను.

ఇత్యుక్త్వా ప్రజగా మాథ యత్రాసౌ తిష్ఠతే మునిః ।
మునే స్తపఃప్రభావేణ ప్రశాన్తశ్వాపదాశ్రమమ్ ॥ 49 ॥

ఈవిధంగా చెప్పి ప్రమ్లోచ కండుమహర్షి తపస్సు చేసుకుంటున్నప్రదేశానికి వెళ్లింది. కండుమహర్షి తపశ్శక్తిచేత క్రూరమైన బెబ్బులివంటిజంతువులు కూడ ఆఆశ్రమంలో ప్రశాంతంగా జీవిస్తున్నాయి.

సా పుంస్కోకిలమాధుర్యా నదీతీరే వ్యవస్థితా ।
స్తోకమాత్రం స్థితా తస్మా దగాయత వరాప్సరాః ॥ 50 ॥

మగకోయిలకూతలమధురిమలతో నిండిన నదిఒడ్డున ప్రమ్లోచ కొంచెంసేపు నిలబడింది. తరువాత అక్కడినుండి గానం చేయడం ప్రారంభించింది.

తతో వసన్త స్సహసా బలం సమకరోత్ తదా ।
కోకిలారావమధుర మకాలికమనోహరమ్ ॥ 51 ॥

అప్పుడు వసంతుడు వసంతకాలం కాకపోయినా, కోయిలలతీయనిఅరుపులను కల్పించి, ప్రమ్లోచకు చక్కగా సహకరించాడు.

వవౌ గన్ధవహ శ్చైవ మలయాద్రినికేతనః ।
పుష్పా నుచ్చావచాన్ మేధ్యాన్ పాతయంశ్చ శనై శ్శనైః ॥ 52 ॥

మలయపర్వతం మీదినుండి చల్లనివాయువు మంచిగంధాలను వెదజల్లుతూ, ఎత్తుపల్లాలలో ఉండేపవిత్రమైన పూవులను మెల్ల మెల్లగా నేలకు రాలుస్తూ, ఆప్రదేశం అంతటా వీస్తున్నది.

పుష్పబాణధరశ్చైవ గత్వా తస్య సమీపతః ।
మునేశ్చ క్షోభయామాస కామ స్తస్యాపి మానసమ్ ॥ 53 ॥

మన్మథుడు పూవుబాణాలను ధరించి, కండుమహర్షివద్దకు వెళ్లాడు. పూలబాణాలతో ఆమహర్షి మనస్సును కలతపెట్టాడు.

తతో గీతధ్వనిం శ్రుత్వా ముని ర్విస్మితమానసః ।
జగామ యత్ర సా సుభ్రూః కామబాణప్రపీడితః ॥ 54 ॥

కండుమహర్షి ప్రమ్లోచ చేస్తున్న గాననాదం విని చాల ఆశ్చర్యపడ్డాడు. మన్మథబాణాలదెబ్బలకు తపించి పోతూ, ఆమహర్షి ఆగీతం వినిపిస్తున్న వైపుగా, ప్రమ్లోచ ఉన్నచోటికి వెళ్లాడు.

దృష్ట్వా తామాహ సంహృష్టో విస్మయోత్ఫుల్లలోచనః ।
భ్రష్టోత్తరీయో వికలః పులకాఞ్చితవిగ్రహః ॥ 55 ॥

అక్కడ ప్రమ్లోచను చూశాడు. ఆమె అందానికి ఆశ్చర్యంతో మహర్షికన్నులు విప్పారాయి. భుజం మీద ఉత్తరీయం జారిపోయింది. మనసు వికల మయింది. ఒళ్లంత పులకింత లయ్యాయి.

ఋషి రువాచ :-ప్రమ్లోచతో కండుమహర్షి ఇలా అంటున్నాడు.

కాఽసి కస్యాసి సుశ్రోణి సుభగే చారుహాసిని ।
మనో హరసి మే సుభ్రు బ్రూహి సత్యం సుమధ్యమే ॥ 56 ॥

అందమైన జఘనం గలిగినదానా, నీ వెవ్వరు? సుందరాంగీ, ఎవరిదానవు? అందమైన చిరునవ్వులు గలదానా! నామనసు హరిస్తున్నావు. అందమైన కనుబొమ్మలు, చక్కనినడుము కలిగినదానా! నిజం చెప్పు.

ప్రమ్లోచోవాచ :-కండుమహర్షితో ప్రమ్లోచ ఇలా అంటున్నది.

తవ కర్మకరా చాహం పుష్పార్థ మహ మాగతా ।
ఆదేశం దేహి మే క్షిప్రం కిం కరోమి తవాజ్ఞయా ॥ 57 ॥

మహాత్మా! నేను నీకు సేవకురాలిని. పూలు కోసి ఇద్దామని వచ్చాను. స్వామీ! నీకు ఏమి సేవలు చేయాలో ఆజ్ఞాపించు. నీవు ఆదేశించినపనులన్నీ చేస్తాను.

వ్యాస ఉవాచ :-అక్కడిమహర్షులతో వ్యాసుడు ఇలా చెప్తున్నాడు.

శ్రుత్వైవం వచనం తస్యా స్త్యక్త్వా ధైర్యం విమోహితః ।
ఆదాయ హస్తే తాం బాలాం ప్రవివేశ స్వమాశ్రమమ్ ॥ 58 ॥

ఆమెమాటలు విన్న కండుమహర్షికి ధైర్యం తొలగిపోయింది. అజ్ఞానం ఆవరించింది. చేయి పట్టుకుని ఆఅప్సరసను తనఆశ్రమంలోనికి తీసుకువెళ్లాడు.

తతః కామశ్చ వాయుశ్చ వసన్తశ్చ ద్విజోత్తమాః ।
జగ్ము ర్యథాగతం సర్వే కృతకృత్యా స్త్రివిష్టపమ్ ॥ 59 ॥

బ్రాహ్మణవర్యులారా! అప్పుడు మన్మథుడు, వాయువు, వసంతుడు అందరూ తమపని అయిపోవడంతో, వచ్చినదారినే తిరిగి స్వర్గలోకానికి వెళ్లిపోయారు.

శశంసుశ్చ హరిం గత్వా తస్యా స్తస్య విచేష్టితమ్ ।
శ్రుత్వా శక్ర స్తదా దేవాః ప్రీతా స్సుమనసోఽభవన్ ॥ 60 ॥

అందరూ కలిసి ఇంద్రుడివద్దకు వెళ్లారు. కండుమహర్షి ప్రమ్లోచతో సుఖపడడాన్ని ఇంద్రుడికి వివరించారు. అది విని దేవేంద్రుడూ, మిగిలినదేవతలూ అందరూ చాల సంతోషించారు. వారిమనస్సు శాంతించింది.

స చ కణ్డు స్తయా సార్ధం ప్రవిశన్నేవ చాశ్రమమ్ ।
ఆత్మనః పరమం రూపం చకార మదనాకృతి ॥ 61 ॥

ప్రమ్లోచతో కూడి ఆశ్రమంలో ప్రవేశించిన వెంటనే కండుమహర్షి తనరూపాన్ని మనోహరంగా మార్చుకున్నాడు. మన్మథుడిలాగా మారిపోయాడు.

రూపయౌవనసమ్పన్న మతీవ సుమనోహరమ్ ।
దివ్యాలఙ్కారసంయుక్తం షోడశవత్సరాకృతి ॥ 62 ॥

అందమైనరూపం వచ్చింది. మంచియౌవనం ఏర్పడింది. మహర్షి చాల అందంగా ఉన్నాడు. చక్కటి ఆభరణాలను ధరించాడు. పదహారేండ్లవాడిరూపంలో ఉన్నాడు.

దివ్యవస్త్రధరం కాన్తం దివ్యస్రగ్గన్ధభూషితమ్ ।
సర్వోపభోగసమ్పన్నం సహసా తపసో బలాత్ ॥ 63 ॥

దేవతావస్త్రాలు ధరించాడు. దేవలోకంలో పుట్టినపూలమాలలు, మంచిగంధాలను అలంకరించుకున్నాడు. మనసు హరిస్తున్నాడు. సమస్తమైన భోగాలను అనుభవించడానికి సమర్థుడు అయినాడు. కండుమహర్షి తనతపశ్శక్తితో క్షణంలో పైవిధంగా తయారయినాడు.

దృష్ట్వా సా తస్య తద్వీర్యం పరం విస్మయమాగతా ।
అహోఽస్య తపసో వీర్యమిత్యుక్త్వా ముదితాఽభవత్ ॥ 64 ॥

కండుమహర్షిశక్తిసామర్థ్యాలను చూసి ప్రమ్లోచ చాల ఆశ్చర్యపడింది. 'ఆహా ఈమహర్షితపశ్శక్తి ఎంతటిదో' అని ఆనందించింది.

స్నానం సన్ధ్యాం జపం హోమం స్వాధ్యాయం దేవతార్చనమ్ ।
వ్రతోపవాసనియమం ధ్యానం చ మునిసత్తమాః ॥ 65 ॥

త్యక్త్వా స రేమే ముదిత స్తయా సార్ధ మహర్నిశమ్ ।
మన్మథావిష్టహృదయో న బుబోధ తపఃక్షయమ్ ॥ 66 ॥

మహర్షులారా! కండుమహర్షి స్నానం, సంధ్యావందనం, మంత్రజపం, హోమం, వేదాధ్యయనం, దేవతా పూజనం, వ్రతాలూ, ఉపవాసాలు మొదలైన నియమాలూ, ధ్యానమూ అన్నీ వదిలేశాడు. ఆఅప్సరసతో కలిసి రాత్రింబగళ్లు భోగాలలో మునిగి తేలుతున్నాడు. మనసంతా మన్మథుడు నిండిఉన్నాడు. ఆతడికి తనతపశ్శక్తి నశించిపోతుండడం కూడ తెలియడం లేదు.

సన్ధ్యారాత్రిదివాపక్షమాసర్త్వయనహాయనమ్ ।
న బుబోధ గతం కాలం విషయాసక్తమానసః ॥ 67 ॥

సంధ్యాసమయాలు, రాత్రులు, పగళ్లు, పక్షాలు, మాసాలు, ఋతువులు, అయనాలు, సంవత్సరాలు ఏవీ తెలియడం లేదు. విషయభోగాలలో మునిగిన కండుమహర్షికి జరిగిపోతున్నకాలం బొత్తిగా తెలియడం లేదు.

సా చ తం కామజై ర్భావై ర్విదగ్ధా రహసి ద్విజాః ।
రమయామాస సుశ్రోణిః ప్రలాపకుశలా తథా ॥ 68 ॥

విప్రులారా! నెరజాణ అయిన ఆసుందరాంగి (ప్రమ్లోచ) కూడ మన్మథభావాలను ప్రదర్శిస్తూ, నర్మసంభాషణ లతో అతడితో ఏకాంతంగా సుఖిస్తున్నది.

ఏవం కణ్డు స్తయా సార్ధం వర్షాణా మధికం శతమ్ ।
అతిష్ఠ న్మన్దరద్రోణ్యాం గ్రామ్యధర్మరతో మునిః ॥ 69 ॥

ఈవిధంగా కండుమహర్షి ప్రమ్లోచతో కలిసి, మందరపర్వతంపైన జలాశయాలతీరాలలో నూరేండ్లకు పైగా, సంభోగసుఖాలలో మునిగిపోయాడు.

సా తం ప్రాహ మహాభాగం గన్తుమిచ్ఛామ్యహం దివమ్ ।
ప్రసాదసుముఖో బ్రహ్మ న్ననుజ్ఞాతుం త్వమర్హసి ॥ 70 ॥

ఒకనాడు ప్రమోచ కండుమహర్షితో 'బ్రాహ్మణోత్తమా! నేను స్వర్గానికి తిరిగివెళ్దా మనుకుంటున్నాను. నాపై దయఉంచి, వెళ్లడానికి నాకు అనుమతి నివ్వు'.

తయైవ ముక్త స్స ముని స్తస్యా మాసక్తమానసః ।
దినాని కతిచిద్ భద్రే స్థీయతామిత్యభాషత ॥ 71 ॥

ప్రమ్లోచ ఈవిధంగా అడగ్గా, ఆమెఆకర్షణలో పడిఉన్న కండుమహర్షి ప్రమ్లోచతో 'కల్యాణీ, మరి కొద్దిరోజులు ఇక్కడే ఉండు' అన్నాడు.

ఏవముక్తా తత స్తేన సాగ్రం వర్షశతం పునః ।
బుభుజే విషయాం స్తన్వీ తేన సార్ధం మహాత్మనా ॥ 72 ॥

కండుమహర్షి కొన్నాళ్లు ఉండమనడంచేత ప్రమ్లోచ మరొకనూరుసంవత్సరాలు ఆఆశ్రమంలోనే ఉండిపోయింది. అన్నిరోజులూ కండుమహర్షితో కలిసి భోగాలు అనుభవించింది.

అనుజ్ఞాం దేహి భగవన్ వ్రజామి త్రిదశాలయమ్ ।
ఉక్త స్త యేతి స పునః స్థీయతా మిత్యభాషత ॥ 73 ॥

తరువాత ఒకనాడు ప్రమ్లోచ 'మహాత్మా! స్వర్గానికి తిరిగి వెళ్తాను. అనుమతి ఇవ్వండి'. అన్నది. కండుమహర్షి పూర్వంలాగానే 'ఇంక కొంతకాలం ఉండు' అన్నాడు.

పున ర్గతే వర్షశతే సాధికే సా శుభాననా ।
యా మ్యహం త్రిదివం బ్రహ్మన్ ప్రణయస్మితశోభనమ్ ॥ 74 ॥

ప్రమ్లోచ 'అలాగే' ఉన్నది. మళ్లీ నూరేళ్లకు పైగా గడిచిపోయాయి. సుందరాస్య అయిన ప్రమ్లోచ మళ్లీ 'బ్రాహ్మణోత్తమా! స్వర్గానికి వెళ్తాను' అని స్నేహం నిండినచిరునవ్వుతో తీయగా పలికింది.

ఉక్త స్త యైవంస మునిః పునరాహాయతేక్షణామ్ ।
ఇహాస్యతాం మయా సుభ్రు చిరం కాలం గమిష్యసి ॥ 75 ॥

పెద్దపెద్దకన్నులు గలిగిన ఆఅప్సరసపలుకులు విని, కండుమహర్షి 'అందమైనకనుబొమ్మలు కలిగిన సుందరీ, ఇంకా చాలాకాలం నాతో కలిసి, ఇక్కడే ఉండు. తరువాత వెళ్లవచ్చు' అన్నాడు.

తచ్ఛాపభీతా సుశ్రోణీ సహ తే నర్షిణా పునః ।
శతద్వయం కిఞ్చిదూనం వర్షాణా మన్వతిష్ఠత ॥ 76 ॥

కాదంటే ముని శపిస్తాడేమోననే భయంతో ఆసుందరాంగి ఆమహర్షితోనే ఉండిపోయింది. అలా దాదాపుగా మరొకరెండువందలసంవత్సరాలు గడిచిపోయాయి.

గమనాయ మహాభాగో దేవరాజనివేశనమ్ ।
ప్రోక్తః ప్రోక్త స్తయా తన్వ్యా స్థీయతామిత్యభాషత ॥ 77 ॥

ఆతరువాత మళ్ళీ 'మహానుభావా! దేవేంద్రుడివద్దకు వెళ్తాను. అనుమతించు' అన్నది. కండుమహర్షి 'ఇక్కడే ఉండు' అన్నాడు.

తస్య శాపభయాద్ భీరు ర్దాక్షిణ్యేన చ దక్షిణా ।
ప్రోక్తా ప్రణయభఙ్గార్తివేదినీ న జహౌ మునిమ్ ॥ 78 ॥

మహర్షిమాటకు ఎదురు చెప్తే శపిస్తాడేమోననే భయంతోనూ, స్నేహం కలిగినచోట విడిపోతే కలిగే బాధ తెలిసినది కావడంచేతనూ, మహర్షిపై జాలితోనూ, దయాస్వభావ అయినప్రమ్లోచ కండుమహర్షితో కలిసిఉంది.

తయా చ రమత స్తస్య పరమర్షే రహర్నిశమ్ ।
నవం నవ మభూత్ ప్రేమ మన్మథాసక్తచేతసః ॥ 79 ॥

కండుమహర్షి రాత్రింబగళ్లు ప్రమ్లోచతో కామసుఖాలలో మునిగితేలుతున్నాడు. రోజురోజుకూ అతడిలో ఆమెపై అనురాగం కొత్తకొత్తగా విస్తరిస్తున్నది. అతడిమనసంతా మన్మథభావాలతో నిండిపోతున్నది.

ఏకదా తు త్వరాయుక్తో నిశ్చక్రా మోటజా న్మునిః ।
నిష్క్రామన్తం చ కుత్రేతి గమ్యతే ప్రాహ సా శుభా ॥ 80 ॥

ఒకనాడు కండుమహర్షి ఆశ్రమంనుండి త్వరత్వరగా వెలుపలికి వెళ్తున్నాడు. అలా వెళ్ళిపోతున్న మహర్షిని చూచి, ఆఅచ్చర 'ఎక్కడికి వెళ్తున్నావు' అని అడిగింది.

ఇత్యుక్త స్స తయా ప్రాహ పరివృత్త మహ శ్శుభే ।
సన్ధ్యోపాస్తిం కరిష్యామి క్రియాలోపోఽ న్యథా భవేత్ ॥ 81 ॥

సుందరీ! తెల్లవారుతున్నది. సంధ్యాదేవతను ఉపాసించవలసిఉంది. లేకపోతే అనుష్ఠానంలో లోపం ఏర్పడుతుంది అన్నాడు.

తతః ప్రహస్య ముదితా సా తం ప్రాహ మహామునిమ్ ।
కిమద్య సర్వధర్మజ్ఞ పరివృత్త మహ స్తవ ॥
గత మేత న్న కురుతే విస్మయం కస్య కథ్యతే ॥ 82 ॥

ఆమాటలకు ప్రమ్లోచ ఒకనవ్వు నవ్వి, మహర్షితో ఇలా అంది. సమస్తమైనధర్మాలు తెలిసినవాడా! నీకు ఇప్పుడే తెల్లవారిందా? చాల కాలం గడిచింది. తమకు అనుష్ఠానక్రియాలోపం జరిగింది. ఈరోజు విశేషంగా ఎవరికి చెప్తావు? నీమాటలు అందరికీ వింతగొలుపుతున్నాయి.

ముని రువాచ :-ప్రమ్లోచతో కండుమహర్షి ఇలా అంటున్నాడు.

ప్రాత స్త్వ మాగతా భద్రే నదీతీర మిదం శుభమ్ ।
మయా దృష్టాఽ సి సుశ్రోణి ప్రవిష్టా చ మమాశ్రమమ్ ॥ 83 ॥

కల్యాణీ! ఈరోజు ఉదయమే కదా నువ్వు ఈనదిఒడ్డుకు వచ్చింది? అప్పుడే కదా నేను నిన్ను చూశాను? నువ్వు నాఆశ్రమంలో ప్రవేశించింది కూడ ఈనాడు ఉదయమే కదా!

ఇయం చ వర్తతే సన్ధ్యా పరిణామమహో గతమ్ ।
అవహాసః కిమర్థోఽ యం సద్భావః కథ్యతాం మమ ॥ 84 ॥

ఇదుగో ఇప్పుడే సంధ్యాసమయం అయింది. పగటికాలం ఏర్పడింది ఇప్పుడే కదా. ఎగతాళిగా నవ్వుతా వెందుకు? యథార్థం చెప్పు నాకు.

ప్రమ్లోచోవాచ :-కండుమహర్షితో ప్రమ్లోచ ఇలా అంటున్నది.

ప్రత్యూష స్యాగతా బ్రహ్మన్ సత్య మేత న్న మే మృషా ।
కిం త్వద్య తస్య కాలస్య గతా న్యబ్దశతాని తే ॥ 85 ॥

నేను ప్రాతఃకాలంలో వచ్చినమాట నిజమే. అబద్ధం చెప్పడం లేదు. కాని నేను ఇక్కడికి వచ్చినఆఉదయం గడిచి, ఇప్పటికి వందలసంవత్సరాలు గడిచిపోయాయి.

తత స్ససాధ్వసో విప్ర స్తాం ప్రప్ర చ్ఛాయతేక్షణామ్ ।
కథ్యతాం భీరు కః కాల స్త్వయా మే రమత స్సదా ॥ 86 ॥

అప్పుడు కండుమహర్షి విశాలమైన కన్నులు కలిగినఆఅప్సరసతో తడబడుతూ ఇలా అన్నాడు. 'సుందరీ! నేను నీతో సుఖిస్తుండగా ఇప్పటికి ఎంతకాలం గడిచింది?

ప్రమ్లోచోవాచ :- కండుమహర్షితో ప్రమ్లోచ ఇలా చెప్తున్నది.

సప్తోత్తరాణ్యతీతాని నవవర్షశతాని వై ।
మాసాశ్చ షట్ తథైవాద్య సమతీతం దినత్రయమ్ ॥ 87 ॥

ఇప్పటికి తొమ్మిదివందలఏడుసంవత్సరాల, ఆరునెలల, మూడురోజులు గడిచిపోయాయి.

ఋషి రువాచ :-ప్రమ్లోచతో కండుమహర్షి ఇలా అంటున్నాడు.

సత్యం భీరు వద స్యైతత్ పరిహాసోఽ థవా శుభే ।
దినమేకమహం మన్యే త్వయా సార్ధమిహాస్థితః ॥ 88 ॥

అమ్మాయీ! నీవు చెప్తున్నది నిజమేనా? నవ్వులాటకోసం చెప్తున్నావా? నేను నీతో కలిసిఉన్నది ఒక్కపగలు మాత్రమే అనుకుంటున్నాను.

ప్రమ్లో చోవాచ :-కండుమహర్షితో ప్రమ్లోచ చెప్తున్నది.

వదిష్యా మ్యనృతం బ్రహ్మన్ కథమత్ర తవాన్తికే ।
విశేషా దద్య భవతా పృష్టా మార్గానుగామినా ॥ 89 ॥

మహర్షీ! నీదగ్గర నేను అబద్ధం ఎలా చెప్పగలను? అందులోనూ ధర్మమార్గం తప్పనిమీరు స్వయంగా అడిగినసందర్భంలో ఎంతమాత్రం అసత్యం చెప్పను.

వ్యాస ఉవాచ:-వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

నిశమ్య తద్వచ స్తస్యా స్స ముని ర్ద్విజసత్తమాః ।
ధిగ్ ధిఙ్మామిత్యనాచారం వినిన్ద్యాత్మానమాత్మనా ॥ 90 ॥

విప్రవరులారా! ఆప్రమ్లోచపలుకులు విని కండుమహర్షి 'ఛీ, ఛీ, నేను ఎంతగా ఆచారభ్రష్టుడి నయినాను?' అని తనను తాను తిట్టుకున్నాడు.

ముని రువాచ :-ప్రమ్లోచతో కండుమహర్షి ఇలా అంటున్నాడు.

తపాంసి మమ నష్టాని హతం బ్రహ్మవిదాం ధనమ్ ।
హృతో వివేకః కేనాపి యోషిన్మోహాయ నిర్మితా ॥ 91 ॥

నాతపస్సంతా నాశనం అయిపోయింది. నాఆత్మజ్ఞానసంపద చచ్చిపోయింది. ఎవడో నావిచక్షణాజ్ఞానాన్ని కొల్లగొట్టాడు. అజ్ఞానంలో ముంచివేయడానికే ఆడది సృష్టింపబడింది.

ఊర్మిషట్కాతిగం బ్రహ్మ జ్ఞేయమాత్మజయేన మే ।
గతి రేషా కృతా యేన ధిక్ తం కామమహాగ్రహమ్ ॥ 92 ॥

ఆకలి, దప్పిక, దుఃఖం, అజ్ఞానం, ముసలితనం, మరణం అనేఆరుభావాలకు అతీత మయినదీ, ఆత్మ జయంతో తెలుసుకొనదగినదీ, అయినబ్రహ్మజ్ఞాన మే మయింది? ఛీ, కామం అనేమహాగ్రహం నాకు ఈదుర్గతి పట్టించింది.

వ్రతాని సర్వే వేదాశ్చ కారణాన్యఖిలాని చ ।
నరకగ్రామమార్గేణ కామేనాద్య హతాని మే ॥ 93 ॥

నేను చేసినవ్రతాలూ, చదివినవేదాలూ, ఇంకా ఉత్తమగతులు పొందడానికి చేసినప్రయత్నాలు సమస్తమూ ఈకామంవల్ల ఈనాడు నాశనం అయిపోయినాయి. కామం నరకాలన్నింటికీ తిన్ననిదారి.

విని న్ద్యేత్థం స ధర్మజ్ఞ స్స్వయమాత్మానమాత్మనా ।
తా మప్సరస మాసీనా మిదం వచనమబ్రవీత్ ॥ 94 ॥

ధర్మపరాయణుడైన కండుమహర్షి ఈవిధంగా తనను తాను నిందించుకున్నాడు. తరువాత అక్కడే కూర్చునిఉన్న ప్రమ్లోచతో ఇలా అన్నాడు.

ఋషి రువాచ :-ప్రమ్లోచతో కండుమహర్షి ఇలా అంటున్నాడు.

గచ్ఛ పాపే యథాకామం యత్ కార్యం తత్ త్వయా కృతమ్ ।
దేవరాజస్య మత్క్షోభం కుర్వన్త్యా భావచేష్టితైః ॥ 95 ॥

పాపాత్మురాలా! వెళ్లిపో. నీహావభావవిలాసాలతో నామనస్సును కలతపెట్టి నాతపస్సు భగ్నంచేశావు. దేవేంద్రుడిపనిని నువ్వు కోరుకున్నట్లుగానే పూర్తి చేశావు కదా.

న త్వాం కరోమ్యహం భస్మ క్రోధతీవ్రేణ వహ్నినా ।
సతాం సాప్తపదం మైత్ర్య ముషితోఽహం త్వయా సహ ॥ 96 ॥

ఏడడుగులు నడిస్తే (ఏడు మాటలు మాట్లాడినా) వారితో సత్పురుషులు మిత్రభావాన్ని పాటిస్తారు. నేను నీతో కలిసిజీవించాను. కాబట్టి, నీపాపకార్యంవల్ల నాకు తీవ్రమైనకోపం కలిగినా, ఆకోపాగ్నితో నేను నిన్ను భస్మం చేయను.

అథ వా తవ దోషః కః కిం వా కుర్యా మహం తవ ।
మమైవ దోషో నితరాం యేనాహ మజితేన్ద్రియః ॥ 97 ॥

అయినా, ఇందులో నీతప్పు మాత్రం ఏముంది? నిన్ను నేను ఏం చేయాలి గనుక. (నీ తప్పేమీ లేదు కనుక ఏమీ చేయక్కర లేదు.) తప్పంతా నాదే. ఇంద్రియాలకు బాగా వశుడినైపోయాను కదా!

యథా శక్రప్రియార్థిన్యా కృతో మత్తపసో వ్యయః ।
త్వయా ధిక్ త్వాం మహామోహకారిణీం తు జుగుప్సితామ్ ॥ 98 ॥

దేవేంద్రుడికి ప్రీతి కలగడంకోసం నీవు నాతపస్సును నాశనం చేశావు. ఛీ, నన్ను దారుణమైనమోహంలో పడేశావు. నిన్ను చూస్తే నాకు అసహ్యం కలుగుతున్నది.

వ్యాస ఉవాచ :–వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

యావదిత్థం స విప్రర్షి స్తాం బ్రవీతి సుమధ్యమామ్ ।
తావత్ స్ఖలత్స్వేదజలా సా బభూవాతివేపథుః ॥ 99 ॥

బ్రహ్మర్షి అయినకండువు ఇలా అంటుంటే, ఆసుందరాంగి ప్రమ్లోచకు భయంతో ఒళ్లంతా చెమటలు కారినయి. ఆమె వణికిపోతున్నది.

ప్రవేపమానాం స చ తాం స్విన్నగాత్రలతాం సతీమ్ ।
గచ్ఛ గచ్ఛేతి సక్రోధ మువాచ మునిసత్తమః ॥ 100 ॥

వణుకుతూ, చెమటలు కారుతున్న ఆప్రమ్లోచతో కండుమహర్షి తీవ్రమైనకోపంతో పో, వెళ్లిపో అన్నాడు.

సా తు నిర్భర్త్సితా తేన వినిష్క్రమ్య తదాశ్రమాత్ ।
ఆకాశగామినీ స్వేదం మమార్జ తరుపల్లవైః ॥ 101 ॥

కండుమహర్షికి భయపడిన ప్రమ్లోచ ఆమునిఆశ్రమంనుండి గగనమార్గంలో వెళ్లిపోయింది. చిగురుటాకులతో చెమటను తుడుచుకుంది.

వృక్షాద్ వృక్షం యయౌ బాలా ఉదగ్రారుణపల్లవైః ।
నిర్మమార్జ చ గాత్రాణి గలత్స్వేదజలాని వై ॥ 102 ॥

చెట్టుచెట్టుకూ వెళ్లి ఆచెట్ల ఎఱ్ఱనిచిగురాకులతో ఒళ్లంతా జారిపడుతున్నచెమటను శుభ్రంగా తుడుచుకుంది.

ఋషిణా య స్తదా గర్భ స్తస్యా దేహే సమాహితః ।
నిర్జగామ సరోమాఞ్చ స్వేదరూపీ తదఙ్గతః ॥ 103 ॥

అంతకు ముందు కండుమహర్షివలన ఆమెకు గర్భం ఏర్పడింది. ఆగర్భం ప్రమ్లోచ శరీరంమీదిపులకలు, చెమటబిందువుల రూపంలో (చిన్నచిన్నముక్కలుగా) వెలువడింది.

తం వృక్షా జగృహు ర్గర్భ మేకం చక్రే చ మారుతః ।
సోమేనాప్యాయితో గోభి స్స తదా వవృధే శనైః ॥ 104 ॥

బయటపడిన ఆగర్భాన్ని అక్కడి చెట్లు స్వీకరించాయి. వాయువు ఆగర్భభాగాల నన్నింటినీ కలిపి, ఒక్కటిగా (ముద్దగా) చేసింది. చంద్రుడు తనఅమృతకిరణాలతో ఆగర్భాన్ని పోషించాడు. ఆగర్భం మెల్లమెల్లగా వృద్ధిచెందింది.

మారిషా నామ కన్యాభూద్ వృక్షాణాం చారులోచనా ।
ప్రాచేతసానాం సా భార్యా దక్షస్య జననీ ద్విజాః ॥ 105 ॥

విప్రులారా! ఆగర్భం చెట్లకు కూతురు అయింది. ఆమె పేరు మారిష. అందమైనకన్నులు గలిగినది. మారిష ప్రచేతసుడికొడుకులకు అందరికీ భార్య అయింది. ఆమే దక్షప్రజాపతికి తల్లి.(1-99,100)

స చాపి భగవాన్ కణ్డుః క్షీణే తపసి సత్తమః ।
పురుషోత్తమాఖ్యం భో విప్రా విష్ణో రాయతనం యయౌ ॥ 106 ॥

ఓ బ్రాహ్మణులారా! మహానుభావుడైన కండుమహర్షి తనతపశ్శక్తి తగ్గిపోవడంతో, పరమాత్మ అనుగ్రహం పొందడానికి శ్రీమహావిష్ణువు నెలకొన్న పురుషోత్తమక్షేత్రానికి వెళ్లాడు.

దదర్శ పరమం క్షేత్రం ముక్తిదం భువి దుర్లభమ్ ।
దక్షిణస్యోదధే స్తీరే సర్వకామఫలప్రదమ్ ॥ 107 ॥

భూలోకంలో ఇంకెక్కడా లేనిదీ, మోక్షాన్ని ఇచ్చేదీ, సమస్తమైన కోరికలను తీర్చేదీ అయిన ఆఉత్తమ పుణ్యక్షేత్రాన్ని దక్షిణసముద్రంఒడ్డున కండువు దర్శించాడు.

సురమ్యం వాలుకాకీర్ణం కేతకీవనశోభితమ్ ।
నానాద్రుమలతాకీర్ణం నానాపక్షిరుతం శివమ్ ॥ 108 ॥

ఆపురుషోత్తమక్షేత్రం చాల అందంగా ఉంటుంది. ఆప్రదేశం అంతా ఇసుకమయం. మొగలితోటలు అందంగా ఉంటాయి. రకరకాలచెట్లు దట్టంగా ఉంటాయి. వివిధజాతులపక్షులకూతలతో సందడిగా ఉంటుంది. ఆక్షేత్రం శుభప్రదమైనది.

సర్వత్ర సుఖసఞ్చారం సర్వర్తుకుసుమాన్వితమ్ ।
సర్వసౌఖ్యప్రదం నృణాం ధన్యం సర్వగుణాకరమ్ ॥ 109 ॥

ఆక్షేత్రం అంతటా సుఖం విలసిల్లుతుంటుంది. ఆయాఋతువులలో పూసేపూలు ఆక్షేత్రంలో అన్నిఋతువుల లోనూ ఉంటాయి. మానవు లందరికీ అన్నివిధాలైన భోగాలను కలిగిస్తుంది. ఉత్తమమైన గుణాలు సమస్తమూ కలిగినగొప్పక్షేత్రం అది.

భృగ్వాద్యై స్సేవితం పూర్వం మునిసిద్ధవరై స్తథా ।
గన్ధర్వైః కిన్నరై ర్యక్షైస్తథాన్యై ర్మోక్షకాఙ్క్షిభిః ॥ 110 ॥

పూర్వం భృగువు మొదలైన మహర్షులు, మోక్షాన్ని కోరుకునే మునులు, సిద్ధులు, గంధర్వులు, కిన్నరులు, ఇంకా ఇతరజాతులవారు అందరూ ఆపుణ్యక్షేత్రాన్ని సేవించుకున్నారు.

దదర్శ స హరిం తత్ర దేవై స్సర్వై రలఙ్కృతమ్ ।
బ్రాహ్మణాద్యై స్తథా వర్ణై రాశ్రమస్థై ర్నిషేవితమ్ ॥ 111 ॥

ఆపురుషోత్తమక్షేత్రంలో కండుమహర్షి సమస్తమైన దేవతలు, బ్రాహ్మణులు మొదలుగా అన్ని వర్ణాలవారు, బ్రహ్మచారులు మొదలుగా అన్నిఆశ్రమాలవారూ అందరూ నిరంతరమూ సేవించే పురుషోత్తమస్వామిని దర్శించు కున్నాడు.

దృష్ట్వైవ స తదా క్షేత్రం దేవం చ పురుషోత్తమమ్ ।
కృతకృత్యమివాత్మానం మేనే స మునిసత్తమః ॥ 112 ॥

ఆపురుషోత్తమక్షేత్రాన్నీ, ఆక్షేత్రంలో పురుషోత్తమస్వామినీ, దర్శించుకున్న కండుమహర్షి తాను ఈజన్మలో తాను చేయవలసినపని చక్కగా చేసినట్లు, తాను కృతార్థుడయినట్లు భావించాడు.

తత్రైకాగ్రమనా భూత్వా చకారారాధనం హరేః ।
బ్రహ్మపారమయం కుర్వన్ జపమేకాగ్రమానసః ॥
ఊర్ధ్వబాహు ర్మహాయోగీ స్థిత్వాసౌ మునిసత్తమః ॥ 113 ॥

కండుమహర్షి పురుషోత్తమక్షేత్రంలో శ్రీహరిపై మనసు నిలిపి, పురుషోత్తమస్వామిని ఆరాధించాడు. ఆమహర్షి మనసును కృష్ణస్వామిమీద లగ్నం చేసి, గొప్పయోగంతో బ్రహ్మపారం అనేమహామంత్రాన్ని జపించాడు.

మునయ ఊచుః :–అక్కడిమునులు వ్యాసుడితో ఇలా అంటున్నారు.

బ్రహ్మపారం మునే శ్రోతు మిచ్ఛామః పరమం శుభమ్ ।
జపతా కణ్డునా దేవో యేనారాధ్యత కేశవః ॥ 114 ॥

వ్యాసమహర్షీ! శ్రీకృష్ణస్వామిని ఆరాధిస్తూ, కండుమహర్షి జపించిన బ్రహ్మపారం అనేమంత్రాన్ని గురించి వినాలని మాకు కోరికగా ఉంది. ఆమంత్రం ఉత్తమశుభాలను అందిస్తుంది.

వ్యాస ఉవాచ :–ఆమునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

పారం పరం విష్ణు రపారపారః పరః పరేభ్యః పరమాత్మరూపః ।
స బ్రహ్మపారః పరపారభూతః పరః పరాణా మపి పారపారః ॥ 115 ॥

శ్రీమహావిష్ణువు సంసారానికి ఆవలిదీ, చివరిదయినతీరం. (సంసారసముద్రాన్ని దాటించేవాడు.) దానికి అవతల ఇంకేమీ లేదు. మేర లేనివాడు. ఆపరమాత్మకు అంతం లేదు. ఉత్తమమైనవాటి కన్నింటికంటె ఉత్తమ

మయినవాడు. శ్రీహరిని మించిన దేదీ లేదు. సర్వోత్కృష్టుడు. ఆవిష్ణువే పరమాత్మ. నిర్గుణ మయినపరమాత్మ ఒక ఆకారం ధరించగా ఏర్పడినదే శ్రీమహావిష్ణుస్వరూపం. వేదవేత్తలూ, తపస్సంపన్నులూ చేరవలసినవాడు. బ్రహ్మర్షులు మొద లయినవారికి కూడ గమ్యం శ్రీమహావిష్ణువే. అసత్య మయినపదార్థానికి కూడ హద్దు అయినవాడు. అజ్ఞానానికి అవధి అయినచోటు కూడ విష్ణువే. అక్కడే అజ్ఞానం అంతం అయి, బ్రహ్మజ్ఞానసిద్ధి అవుతుంది. ఆత్మకంటె వేరు అయినఇంద్రియాదులకు అతీతమైనవాడు. అన్నింటికంటె ఉత్తమమైనవాటికంటె ఉత్తమ మయినవాడు. అతడిని మించినది ఏదీ లేదు.

స కారణం కారణసంశ్రితోఽపి తస్యాపి హేతుః పరహేతుహేతుః ।
కార్యేషు చైవం సహ కర్మకర్తృరూపై రనేకై రవ తీహ సర్వమ్ ॥ 116 ॥

అన్నింటికీ కారణం విష్ణువే. కారణాలు అయినవాటికి కూడ కారణం అతడే. సృష్టికి కారణమైన పంచభూతాలు మొదలైనవాటిఉనికికి కూడ విష్ణువే కారణం. ఆపంచభూతాలకు కారణమైనదానికికూడ కారణ మైనవాడు. అన్నికర్మలలోనూ, కర్తగానూ, కర్మగానూ, ఇంకా అనేకరూపాలతో ఈసృష్టిని సంరక్షిస్తుంటాడు.

బ్రహ్మ ప్రభుర్ బ్రహ్మ స చ సర్వభూతో
బ్రహ్మ ప్రజానాం పతి రచ్యుతోఽసౌ ।
బ్రహ్మావ్యయం నిత్యమజం స
విష్ణు రపక్షయాద్యై రఖిలై రసఙ్గః ॥ 117 ॥

అతడు వేదస్వరూపుడు. వేదాంగాలు మొదలైనవి కూడ అతడే. గోచరమయ్యేప్రతివస్తువూ ఆస్వామిరూపమే. మనువు మొద లయినవారికి అతడే ప్రభువు. ఎటువంటివికారాలు లేనివాడు. శాశ్వతంగా ఉంటాడు. పుట్టుక లేనివాడు. ఏవిధంగానూ తగ్గిపోకుండా ఎప్పుడూ ఒకేవిధంగా ఉంటాడు.

బ్రహ్మాక్షర మజం నిత్యం యథాసౌ పురుషోత్తమః ।
తథా రాగాదయో దోషాః ప్రయాన్తు ప్రశమం మమ ॥ 118 ॥

నాశం లేనివాడు. భక్తులహృదయంలో ప్రవేశిస్తాడు. అన్నికాలాలలోనూ ఉండేవాడు. పురుషోత్తమస్వామి కూడ ఇదేవిధమైన శ్రీమహావిష్ణుదేవుడిలక్షణాలు అన్నీ కలిగినవాడు. ఈస్వామి అనుగ్రహంతో నాలోని రాగం,ద్వేషం మొదలైన ద్వంద్వభావాలు అన్నీ అణగిపోవును గాక.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసుడు ఇలా చెప్తున్నాడు.

శ్రుత్వా తస్య మునే ర్జాప్యం బ్రహ్మపారం ద్విజోత్తమాః ।
భక్తిం చ పరమాం జ్ఞాత్వా సుదృఢాం పురుషోత్తమః ॥ 119 ॥

విప్రవరులారా! పురుషోత్తమస్వామి కండుమహర్షి జపించిన ఈబ్రహ్మపారం అనేమంత్రం విన్నాడు. మహర్షికి తనపై దృఢంగా ఉన్నతమైన భక్తిని గ్రహించాడు.

ప్రీత్యా స పరయా దేవ స్త దాసౌ భక్తవత్సలః ।
గత్వా తస్య సమీపం తు ప్రోవాచ మధుసూదనః ॥ 120 ॥

మేఘగమ్భీరయా వాచా దిశ స్సన్నాదయ న్నివ ।
ఆరుహ్య గరుడం విప్రా వినతాకులనన్దనమ్ ॥ 121 ॥

ద్విజులారా! ఆకందుమహర్షిభక్తిశ్రద్ధలకు పురుషోత్తమస్వామి చాల సంతోషించాడు. భక్తులమీద వాత్సల్యం కలిగినఆమధుసూదనస్వామి వైనతేయుడైన గరుత్మంతుడిమీద ఎక్కి, కందుమహర్షివద్దకు వెళ్లాడు. మేఘంలాగా గంభీరంగా ధ్వనిస్తున్నమాటలతో దిక్కులు మారుమోగేవిధంగా ఇలా అన్నాడు.

శ్రీభగవానువాచ :–కందుమహర్షితో కృష్ణస్వామి ఇలా అంటున్నాడు.

మునే బ్రూహి పరం కార్యం యత్ తే మనసి వర్తతే ।
వరదోఽహ మనుప్రాప్తో వరం వరయ సువ్రత ॥ 122 ॥

మహర్షీ! నీకు ఏం కావాలో, నీమనసులో ఉన్నది చెప్పు. నీకు వరం ఇవ్వడానికే వచ్చాను. ఉత్తమ మయిననియమాలను పాటించేవాడా! నీకు కావలసినవరం కోరుకో.

శ్రుత్వైతద్వచనం తస్య దేవదేవస్య చక్రిణః ।
చక్షు రున్మీల్య సహసా దదర్శ పురతో హరిమ్ ॥ 123 ॥

సుదర్శనాయుధుడైన శ్రీకృష్ణభగవానుడిపలుకులను విని, కందుమహర్షి మెల్లగా కన్నులు తెరిచాడు. ఎదురుగా శ్రీహరిని దర్శించాడు.

అతసీపుష్పసఙ్కాశం పద్మపత్రాయతేక్షణమ్ ।
శఙ్ఖచక్రగదాపాణిం ముకుటాఙ్గదధారిణమ్ ॥ 124 ॥

ఎదుట నిలిచినఆస్వామి అవిసెపూవులాగా నల్లగా ఉన్నాడు. స్వామి కన్నులు తామరరేకులలాగా విశాలంగా ఉన్నాయి. శంఖమూ, చక్రమూ, గదలను ధరించిఉన్నాడు. కిరీటమూ, భుజకీర్తులనూ ధరించాడు.

చతుర్బాహు ముదారాఙ్గం పీతవస్త్రధరం ప్రభుమ్ ।
శ్రీవత్సలక్ష్మసంయుక్తం వనమాలావిభూషితమ్ ॥ 125 ॥

నాలుగుబాహువులు కలిగినవాడు. ఉత్తమమైన అవయవాలు కలిగినవాడు. పట్టుబట్టను కట్టుకున్నాడు. వక్షస్స్థలంమీద శ్రీవత్సం అనేగుర్తును ధరించాడు. మోకాళ్లవరకూ వేలాడుతూ ఉన్నపెద్దపూమాల అలంకారంగా ఉంది.

సర్వలక్షణసంయుక్తం సర్వరత్నవిభూషితమ్ ।
దివ్యచన్దనలిప్తాఙ్గం దివ్యమాల్యవిభూషితమ్ ॥ (అధికపాఠం)

ఆస్వామి సమస్తమైన ఉత్తమలక్షణాలు కలిగినవాడు. అన్నిరకాలరత్నాలతో అలంకరింపబడిఉన్నాడు. ఒళ్లంతా దేవలోకంలో ఏర్పడిన చందనం పులుముకున్నాడు. అలాగే దేవలోకంలో పుట్టినపూలమాలలతో అలంకరింప బడిఉన్నాడు.

తత స్స విస్మయావిష్టో రోమాఞ్చితతనూరుహః ।
దణ్డవత్ ప్రణిపత్యోర్వ్యాం ప్రణామమకరోత్ తదా ॥ 126 ॥

అటువంటికృష్ణస్వామిని చూసి, కండుమహర్షి చాల విస్తుపోయాడు. ఒళ్లు పులకరించింది. వెంటనే కఱ్ఱలాగా నేలమీద సాగిలపడి స్వామికి సాష్టాంగనమస్కారం చేశాడు.

అద్య మే సఫలం జన్మ అద్య మే సఫలం తపః ।
ఇత్యుక్త్వా మునిశార్దూల స్తం స్తోతు ముపచక్రమే ॥ 127 ॥

అప్పుడు కండుమహర్షి 'నాజన్మ ఇప్పుడు చరితార్థం అయింది. నాతపస్సు చక్కగా ఫలించింది'. అని కృష్ణస్వామిని స్తుతించడం ప్రారంభించాడు.

కణ్డు రువాచ :-కండుమహర్షి కృష్ణస్వామిని ఈవిధంగా స్తోత్రం చేస్తున్నాడు.

నారాయణ హరే కృష్ణ శ్రీవత్సాఙ్క జగత్పతే ।
జగద్బీజ జగద్ధామ జగత్సాక్షిన్ నమోఽస్తు తే ॥ 128 ॥

జీవులకు గమ్యస్థానం అయినవాడా! సంసారబాధలు లేకుండ చేసేవాడా! సచ్చిదానందస్వరూపుడా! శ్రీవత్సం అనేచిహ్నం కలిగినవాడా! లోకాలన్నింటినీ కాపాడేవాడా! జగత్తులకు మూలమైనవాడా! (స్వామినుండే జగత్తులు ఉద్భవించాయి కనుక జగద్బీజం), జగత్తులన్నింట నిండిఉన్నవాడా! జగత్తులను ప్రక్కనేఉండి స్వరూపజ్ఞానంతో చూసేవాడా! నీకు నమస్కారం.

అవ్యక్త జిష్ణో ప్రభవ ప్రధానపురుషోత్తమ ।
పుణ్డరీకాక్ష గోవిన్ద లోకనాథ నమోఽస్తు తే ॥ 129 ॥

ఎన్నో రూపాలు ఉన్నా అసలురూపం ఇది అని నిశ్చయించి చెప్పడానికి వీలు లేనివాడా! జయమే లక్షణంగా కలిగినవాడా! భూతాలు అన్నింటినీ పుట్టించినవాడా! (సమస్త మయినభూతాలు విష్ణువునుండే పుట్టాయి. కాబట్టి ప్రభవుడు),ప్రకృతిజీవులకు ప్రభువై, శ్రేష్ఠుడైనవాడా! హృదయం అనేపద్మంలో నిండిఉన్నవాడా! (అంతర్యామి), ఉపనిషద్వాక్యాలచేత తెలిసేవాడా! లోకాలన్నింటికీ దిక్కు అయినవాడా! నీకు నమస్కారం.

హిరణ్యగర్భ శ్రీధామ పద్మనాభ సనాతన ।
భూగర్భ ధ్రువ ఈశాన హృషీకేశ నమోఽస్తు తే ॥ 130 ॥

బ్రహ్మస్వరూపంలో ఉండేవాడా! (బ్రహ్మదేవుడు విష్ణువురూపమే), లక్ష్మీదేవికి నివాసమైనవాడా! సమస్త మయినజగత్తులు పుట్టడానికి కారణమైనపద్మం నాభియందు గలిగినవాడా! మిక్కిలి పురాతన మయినవాడా!

విరాడ్రూపంలో నీగర్భంలో భూమి (మొదలైనలోకాలు) కలిగినవాడా! వినాశం లేనివాడా! సమస్త మయిన భూతాలను నియమించేవాడా! ఇంద్రియాలను నడిపించేవాడా! నీకు నమస్కారం.

అనాద్య న్నామృ తాజేయ జయ త్వం జయతాం వర ।
అజి తాఖణ్డల కృష్ణ శ్రీనివాస నమోఽస్తు తే ॥ 131 ॥

మొదలు చివర లేనివాడా! మరణం లేనివాడా! ఇతరులకు జయించడం సాధ్యం కానివాడా! విజయం స్వరూపం అయినవాడా! జయించేవాళ్లలో శ్రేష్ఠుడా! ఏఅవతారంలోనూ ఇతరులచే జయింపబడనివాడా! పర్వతాలరెక్కలను నరికినవాడా! (ఇంద్రస్వరూపుడా), వ్యాసస్వరూపుడా! సిరికి నివాస (సంపత్తురూపంలో) మైనవాడా! నీకు నమస్కారం.

యోగాత్మ న్నప్రమేయాత్మన్ లోకాత్మం స్త్వం సనాతనః ।
కూటస్థాచల దుర్జ్ఞేయ కుశేశయ నమోఽస్తు తే ॥ 132 ॥

జీవుడు, ఈశ్వరుడూ కలిసిఉండడమే స్వరూపం అయినవాడా! అన్నిరకాలప్రమాణాలకు అతీతమైనవాడా! అన్నిలోకాలు స్వరూప మయినవాడా! నీవు మిక్కిలి ప్రాచీనుడివి. ఎప్పటికీ ఏవిధమైన మార్పులూలేనివాడా! స్థిరమైనసామర్థ్యం కలిగిన వాడా! మహాత్ములకు కూడ తెలియరానివాడా! నీటిలో ఉండేవాడా! నీకు నమస్కారం

వరేణ్య వర దానన్త బ్రహ్మయోనే గుణాకర ।
ప్రలయోత్పత్తియోగేశ వాసుదేవ నమోఽస్తు తే ॥ 133 ॥

అందరిలోనూ శ్రేష్ఠుడా! వరాలను ఇచ్చేవాడా! అంతు లేనివాడా, బ్రహ్మను పుట్టించినవాడా! సమస్త మయినసద్గుణాలకు స్థానం అయినవాడా! సృష్టినాశమూ, ఉద్భవమూ, స్థితులను ఏర్పరచినవాడా! మాయతో జగత్తులను కప్పివేసి ప్రకాశించేవాడా! నీకు నమస్కారం.

పర్జన్యధర్మకర్తా చ దుష్పార దురధిష్ఠిత ।
దుఃఖార్తినాశన హరే జలశాయి న్నమోఽస్తు తే ॥ 134 ॥

మేఘాలను వర్షింపజేసేవాడా! దాటడానికి వీలు లేనివాడా! కష్టించి ఆశ్రయింపదగినవాడా! కష్టాలనూ, పాపాలను హరింపజేసేవాడా! పాలసముద్రంలో పవళించేవాడా! నీకు నమస్కారం.

భూత పావ్యక్త భూతేశ భూతతత్త్వై రనాకుల ।
భూతాధివాస భూతాత్మన్ భూతగర్భ నమోఽస్తు తే ॥ 135 ॥

స్థావరజంగమాత్మకమయిన సమస్తసృష్టినీ పాలించేవాడా! వ్యక్తం కానివాడా! సమస్తభూతాలకూ ప్రభు వయినవాడా! భూతాల లక్షణాలచేత చలించనివాడా! సమస్తమైన భూతాలలోనూ ఉండేవాడా! భూతాలు స్వరూపం అయినవాడా! సమస్తభూతాలను సృష్టించినవాడా! నీకు నమస్కారం.

యజ్ఞ యజ్వన్ యజ్ఞధర యజ్ఞఘా తాభయప్రద ।
యజ్ఞగర్భ హిరణ్యాంగ పృశ్నిగర్భ నమోఽస్తు తే ॥ 136 ॥

యజ్ఞాలను చేసినవాడా! యజ్ఞాన్ని రక్షించేవాడా! యజ్ఞాన్ని భగ్నం చేసేవాడా! భయాన్ని పోగొట్టేవాడా! యజ్ఞానికి మూల మయినవాడా! బంగారుఅవయవాలు కలిగినవాడా! దేవకీదేవికి జన్మించినవాడా! నీకు నమస్కారం.

క్షేత్రజ్ఞః క్షేత్రభృత్ క్షేత్రీ క్షేత్రహా క్షేత్రకృద్ వశీ ।
క్షేత్రాత్మన్ క్షేత్రరహిత క్షేత్రస్రష్టే నమోఽస్తు తే ॥ 137 ॥

(జీవభావంతో) శరీరాన్ని గురించి తెలిసినవాడా! శరీరాన్ని భరించేవాడా! శరీరం కలిగినవాడా! శరీరాన్ని నాశనం చేసేవాడా! శరీరాన్ని సిద్ధం చేసేవాడా! సమస్తాన్నీ నీఅధీనంలో ఉంచుకున్నవాడా! శరీరం స్వరూపం అయినవాడా! శరీరం లేనివాడా! శరీరాన్ని సృష్టించేవాడా! నీకు నమస్కారం.

గుణాలయ గుణావాస గుణాశ్రయ గుణావహ ।
గుణభోక్తృ గుణారామ గుణత్యాగిన్ నమోఽస్తు తే ॥ 138 ॥

గుణాలకు నిలయ మయినవాడా! గుణాలలో ఉండేవాడా! గుణాలకు ఆధారమయినవాడా! గుణాలను కల్పించేవాడా! గుణాలను అనుభవించేవాడా! గుణాలలో ఆనందించేవాడా! గుణాలను విడిచిపెట్టినవాడా! నీకు నమస్కారం.

త్వం విష్ణు స్త్వం హరి శ్చక్రీ త్వం జిష్ణు స్త్వం జనార్దనః ।
త్వం భూత స్త్వం వషట్కార స్త్వం భవ్య స్త్వం భవత్ప్రభుః ॥ 139 ॥

అంతటా నిండిఉన్నవిష్ణువు నీవు, ఆకాశం అంతటా అత్యధికంగా వ్యాపించినకాంతి గలిగినవాడివి.(వి.స. 2, 258,657). నీవు పాపాలను హరించే శ్రీహరివి. సుదర్శనాయుధాన్ని ధరించినవాడివి. జయలక్షణం గలినవాడివి. దుర్మార్గుల నరకానికి పంపేవాడివి(వి.స. 126). పుట్టిన దంతా నీవే. పుట్టబోయేదీ నీవే. పుడుతూఉన్నదీ నీవే. అన్నిటికీ నీవే అధిపతివి. (వి.స. 4) యజ్ఞంలో వషట్కారం నీవే. అనేదానిచేత స్తుతింపబడేవాడివి నీవు.(వి.స. 3)

త్వం భూతకృత్ త్వ మవ్యక్త స్త్వం భవో భూతభృద్ భవాన్ ।
త్వం భూతభావనో దేవ స్త్వా మాహు రజ మీశ్వరమ్ ॥ 140 ॥

రజోగుణంతో బ్రహ్మస్వరూపంలో భూతకోటిని సృష్టించేవాడివి(వి.స. 5). నిన్ను తెలుసుకోవడం ఎవరివల్లా కాదు(వి.స. 722). అన్నింటికీ మూలకారణం నీవు. నీవు సత్త్వగుణంతో భూతకోటిని రక్షించేవాడివి (వి.స. 6). సృష్టిస్థితిలయాలనేపనులతో ఆడుకునేవాడివి. (వి.స. 375). భూతాలను సృష్టించేవాడివి. పెంచేవాడివి(వి.స. 9). భక్తులహృదయాలలో ప్రవేశించేవాడివి. శత్రువులపై బాణాలు ప్రయోగించే (వి.స. 95,204,524) సర్వశక్తులు గలిగినవాడివి. (వి.స. 36,74)

త్వ మనన్తః కృతజ్ఞ స్త్వం ప్రకృతి స్త్వం వృషాకపిః ।
త్వం రుద్ర స్త్వం దురాధర్ష స్త్వమమోఘ స్త్వమీశ్వరః ॥ 141 ॥

ఆదిశేషుడిరూపంలో ఉన్నవాడు నీవు (వి.స. 886). జీవులు చేసినపుణ్యపాపకర్మలను తెలిసనవాడివి. పూజలు స్వీకరించి మోక్ష మిచ్చేవాడివి (వి.స. 82,532). సృష్టికి సంబంధించినసంకల్పం నీవు. వృషం (ధర్మం),

కపి (వరాహం) రూపాలు అయినవాడివి (వి.స. 101). ప్రళయకాలంలో జీవులను చంపి, ఏడ్పించేవాడివి. దుఃఖాలకు మూలమయిన సంసారాన్ని తొలగించేవాడివి. (వి.స. 114). రాక్షసులు మొదలుగా ఎవ్వరూ భయపెట్టలేని వాడివి. (వి.స. 81).

త్వం విశ్వకర్మా జిష్ణు స్త్వం త్వం శమ్భు స్త్వం వృషాకృతిః ।
త్వం శఙ్కర స్త్వ ముశనా త్వం సత్యం త్వం తపో జనాః ॥ 142 ॥

జగత్తును ఏర్పరచినవాడివి (వి.స. 50). భక్తులకు సుఖాన్ని ఇచ్చేవాడివి (వి.స. 38). ధర్మాన్ని రక్షించడంకోసం అవతరించినవాడివి (వి.స. 113). అందరికీ మేలు చేసేవాడివి. శుక్రాచార్యుడివి నీవు. ప్రాణం, అన్నం, ఆదిత్యుడు రూపాలయినవాడివి (వి.స. 106, 865). సత్యలోకం, తపోలోకం, జనోలోకం నీవు.

త్వం విశ్వజేతా త్వం శర్మ త్వం శరణ్య స్త్వమక్షరమ్ ।
త్వం శమ్భు స్త్వం స్వయమ్భూ శ్చ త్వం జ్యేష్ఠ స్త్వం పరాయణః ॥ 143 ॥

ప్రపంచాన్ని జయించినవాడివి. సుఖం నీవు. బాధలలో ఉన్నవారికి (బాధలు పోగొట్టే) దిక్కు నీవు వినాశనం లేనివాడు. (వి.స. 86). శివుడివి నీవు. బ్రహ్మవు నీవు. అందరికంటె పెద్దవాడివి (వి.స. 67). వెనకకు (భూలోకానికి) తిరిగిరా నవసరం లేనిఉత్తమస్థానం (మోక్షం) నీవు (వి.స. 585).

త్వ మాదిత్య స్త్వ మోఙ్కార స్త్వం ప్రాణ స్త్వం తమిస్రహా ।
త్వం పర్జన్య స్త్వం ప్రథిత స్త్వం వేధా స్త్వం సురేశ్వరః ॥ 144 ॥

కశ్యపమహర్షివలన అదితికి జన్మించిన ఆదిత్యుడివి నీవు (వి.స. 563). ప్రణవం స్వరూపం ఐనవాడివి. ప్రాణవాయువు స్వరూపం అయినవాడివి. (వి.స. 320,407). చీకటిని (జీవులఅజ్ఞానాన్ని) పోగొట్టేవాడివి. మేఘంలాగా జీవులతాపత్రయాన్ని కడిగేసేవాడు, కర్మఫలాలను వర్షించేవాడివి (వి.స. 810). లోకాలను సృష్టించడం, పెంచడం, లయంచేయడం అనేకర్మలద్వారా ప్రసిద్ధిని పొందినవాడివి (వి.స. 319). బ్రహ్మరుద్రాదులయిన దేవతలకు ప్రభువువి (వి.స. 286).

త్వ మృగ్యజుస్సామ చైవ త్వమాత్మా సమ్మతో భవాన్ ।
త్వ మగ్ని స్త్వం చ పవనః కుబేర స్త్వం హవి స్తథా ॥ 145 ॥

ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం నీవే. అన్నింటికీ ఆధారమైనవాడివి. అందరిచేత గౌరవింప బడేవాడివి. అగ్ని, వాయువు, కుబేరుడు, హవిస్సు నీవు.

త్వం స్రష్టా త్వం తథా భోక్తా హోతా త్వం చ హవిః క్రతుః ।
త్వం కవి స్త్వం హరి శ్రేష్ఠ స్త్వం లోకపతిరచ్యుతః ॥ 146 ॥

సర్గకాలంలో సమస్తాన్ని సృష్టి చేసినవాడివి (వి.స. 588,990). పురుషుడిరూపంలో ప్రకృతిని అనుభవించే వాడివి (వి.స. 143,500,888). హోమం చేసేవాడివి నీవు. హోమం చేయబడేద్రవ్యం నీవు(వి.స. 698). యూపం (యజ్ఞంలో బలిపశువును కట్టే స్తంభం) గలిగిన యజ్ఞం నీవు (వి.స. 448). సమస్తాన్నీ చూచేవాడివి (వి.స. 132).

పాపాలను పోగొట్టేవాడివి (వి.స.650). అన్నింటికంటె ఉత్తముడివి (వి.స.68). లోకాలనన్నింటినీ కాపాడేవాడివి. ఉత్పత్తి, మొదలైన ఆరురకాలవికారాలు లేనివాడివి (వి.స.100,318).

త్వం సర్వదర్శన శ్రీమాం స్త్వం సర్వదమనోఽ రిహా ।
త్వ మహ స్త్వం తథా రాత్రి స్త్వా మాహు ర్వత్సరం బుధాః ॥ 147 ॥

అనంతమైన కన్నులతో సమస్తాన్నీ చూచేవాడివి (వి.స.94). సమస్తమైన ఐశ్వర్యాలు కలిగినవాడివి (వి.స.22, 178, 220,613) సమస్తమైన సృష్టిని లయం చేసేవాడివి. శత్రువులను (రాక్షసాదులను) సంహరించే వాడివి. పగలు, రాత్రి, సంవత్సరం అన్నీ నీవే అని పండితులు చెప్తారు.

త్వం కాల స్త్వం కలా కాష్ఠా త్వం ముహూర్తః క్షణా లవాః ।
త్వం బాల స్త్వం తథా వృద్ధ స్త్వం పుమాన్ స్త్రీ నపుంసకః ॥ 148 ॥

సమస్తాన్ని లెక్కపెట్టేవాడివి(వి.స.418) కాలం స్వరూపం అయినవాడివి. కళ (ముప్పైకాష్ఠలకాలం), కాష్ఠ (పద్దెనిమిది రెప్పపాటులకాలం), ముహూర్తం (నలభైఎనిమిదినిమిషాలకాలం), క్షణం (గడియలో ఆరవవంతు కాలం), లవం, నీవే. పసివాడివీ, పెద్దవాడివీ నీవే. పురుషుడూ, స్త్రీ నపుంసకుడూ నీవే.

త్వం విశ్వయోని స్త్వం చక్షు స్త్వం స్థాణు స్త్వం శుచిశ్రవాః ।
త్వం శాశ్వత స్త్వ మజిత స్త్వ ముపేన్ద్ర స్త్వముత్తమః ॥ 149 ॥

ప్రపంచానికి కారణమైనవాడివి (వి.స.117,149). నీవు కన్నువి. స్థిరంగా ఉండేవాడివి (వి.స.28). పవిత్రమైనవీ, చెవి కింపయినవీ అయిన నామాలు గలిగినవాడివి (వి.స.118). అన్ని కాలాలలోనూ ఉండేవాడివి (వి.స.56). ఏఅవతారంలోనూ ఎవరిచేతనూ జయింపబడనివాడివి (వి.స.549). ఇంద్రుడికి తమ్ముడుగా వామనుడై అవతరించినవాడివి (వి.స.151). సర్వశ్రేష్ఠుడివి.

త్వం సర్వవిశ్వసుఖద స్త్వం వేదాఙ్గం త్వ మవ్యయః ।
త్వం వేదవేద స్త్వం ధాతా విధాతా త్వం సమాహితః ॥ 150 ॥

సమస్తమైన లోకాలకూ సుఖాన్ని ఇచ్చేవాడివి. శిక్ష, వ్యాకరణం మొదలైన వేదాంగాలు నీవు. నాశం లేనివాడివి (వి.స.13). వేదాలకే వేదం నీవు. ఆదిశేషుడిరూపంలో భూమిభారాన్ని మోసేవాడివి (వి.స.43,951). కర్మలకు, కర్మలఫలాలకూ కర్తవు (వి.స.44,484). నిశ్చలంగా ఉండేవాడివి.

జగద్యోని రమూల స్త్వం ధాతా త్వం చ పునర్వసుః ।
త్వం వైద్య స్త్వం ధృతాత్మా చ త్వ మతీన్ద్రియగోచరః ॥ 151 ॥

లోకాలన్నింటికీ మూలకారణం నీవు. నీకు మూలం ఏదీ లేనివాడివి. విశ్వానికి ధారణనీవే (వి.స.43,951). (వి.స.150). సమస్తమైన విద్యలమూలాలను తెలిసినవాడివి (వి.స.164). పుట్టుక, మరణం మొదలైనవి లేకపోవడం చేత ఎప్పుడూ ఒకేవిధంగా ఉండేవాడివి (వి.స.160). ఇంద్రియాలచేత తెలియరానివాడివి.

త్వ మగ్రణీర్ గ్రామణీ స్త్వం త్వం సుపర్ణ స్త్వ మాదిమాన్ ।
త్వం సఙ్గ్రహ స్త్వం సుమహత్ త్వం ధృతాత్మా త్వమచ్యుతః ॥ 152 ॥

కోరుకున్నవాళ్లను మోక్షమార్గంలో నడిపించేవాడివి (మోక్షాన్ని ఇచ్చేవాడివి) (వి.స. 218). భూతాల సమూహాన్ని నడిపించేవాడివి. వేదమయమైన పక్షములు కలవాడివి. (వి.స. 219). అన్నింటికంటె మొదటివాడివి. సమస్తాన్ని ఉపసంహరించేవాడివి. లయం చేసేవాడివి (సమస్తాన్ని కుదించిన అణురూపంతో ఉన్నవాడు)(వి.స. 158). లోనుండి ప్రపంచాన్ని విస్తృతంగా వెలువరిచేవాడివి. అన్నింటికంటె విస్తారమైనవాడివి. (వి.స. 841). జనన మరణాదులు లేకపోవడంచేత ఎప్పుడూ ఒకేరూపంలో ఉండేవాడివి (వి.స. 160). ఎప్పటికీ ఏవిధమైన తగ్గుదల లేనివాడివి. (వి.స. 100).

త్వం యమ స్త్వం చ నియమ స్త్వం ప్రాంశు స్త్వం చతుర్భుజః ।
త్వమేవాన్నాన్తరాత్మా త్వం పరమాత్మా త్వముచ్యతే ॥ 153 ॥

జీవులందరిలోను అంతర్యామిగా ఉండి, వారిని తమతమపనులు చేయడానికి ప్రేరేపించేవాడివి (వి.స. 162). ప్రజలను తమతమ కార్యములందు నియోగించేవాడివి (వి.స. 161). వామనరూపంనుండి మూడులోకాలనూ ఆక్రమించిన త్రివిక్రముడివి (వి.స. 153). నాలుగుబాహువులు గలిగినవాడివి (వి.స. 766). జీవులఆహారంలో పరమాత్మగా (జీవశక్తిగా) ఉండేవాడివి (వి.స. 983). కార్యకారణాలకు అతీతుడు కావడంచేత నిత్యశుద్ధబుద్ధముక్తస్వభావుడ వని పెద్దలు పేర్కొంటారు (వి.స. 11).

త్వం గురు స్త్వం గురుతమ స్త్వం వామ స్త్వం ప్రదక్షిణః ।
త్వం పిప్పల స్త్వ మగమ స్త్వం వ్యక్త స్త్వం ప్రజాపతిః ॥ 154 ॥

సమస్తమైన విద్యలను ఉపదేశించేవాడివి, సమస్తాన్నీ సృష్టించినవాడివి (వి.స. 209). బ్రహ్మ మొదలయిన వారికి కూడ బ్రహ్మవిద్యాసంప్రదాయాన్ని తెలియజేసినవాడివి (వి.స. 210). ఎడమప్రక్క (దిక్కు) నీవు. కుడిప్రక్క (దిక్కు) నీవు. రావిచెట్టు నీవు. సులువుగా పొందరానివాడివి. తపోధ్యానాదులచేత తెలియబడేవాడివి (వి.స. 305). ప్రజ లందరకూ దిక్కు అయినఈశ్వరుడివి (వి.స. 69,197).

హిరణ్యనాభ స్త్వం దేవ స్త్వం శశీ త్వం ప్రజాపతిః ।
అనిర్దేశ్యవపు స్త్వం వై త్వం యమ స్త్వం సురారిహా ॥ 155 ॥

బంగారంలాగా అందమైన బొడ్డు గలిగినవాడివి (వి.స. 194). ఆత్మస్వరూపంతో ప్రకాశించేవాడివి (వి.స. 375). చంద్రుడు నీవే. అందరికీ తండ్రివి (వి.స. 69,197). ఈవిధంగా ఉంటుంది అని నిరూపించడానికి అవకాశం లేనిరూపం గలిగినవాడివి (వి.స. 177,656). యమం అనే యోగాంగంచేత తెలియబడేవాడివి (మృత్యురూపుడివి) (వి.స. 162, 866). దేవతలకు శత్రువులైన రాక్షసులను సంహరించేవాడివి (వి.స. 208).

త్వం చ సఙ్కర్షణో దేవ స్త్వం కర్తా త్వం సనాతనః ।
త్వం వాసుదేవోఽమేయాత్మా త్వమేవ గుణవర్జితః ॥ 156 ॥

సంహారకాలంలో జీవులందరినీ ఒక్కసారిగా లోపలికి లాక్కునే శక్తిమంతుడివి (వి.స.552). స్వతంత్రుడివి (వి.స.380). మిక్కిలి పురాతనుడివి. వసుదేవుడిపుత్రుడివి (వి.స.332,695,709). కొలతల కందనిరూపం కలిగినవాడివి (వి.స.248). సత్త్వాది గుణాలకు అతీతుడివి.

త్వం జ్యేష్ఠ స్త్వం వరిష్ఠ స్త్వం త్వం సహిష్ణుశ్చ మాధవః ।
సహస్రశీర్షా త్వం దేవ స్త్వ మవ్యక్త స్సహస్రదృక్ ॥ 157 ॥

అందరికన్న పెద్దవాడివి, అన్నింటికీ కారణమైనవాడివి (వి.స.67). అందరికంటె గొప్పవాడివి(వి.స.68). ఆశ్రితులతప్పులను మన్నించేస్వభావం కలిగినవాడివి. మధువు అనేవిద్యచేత తెలియబడేవాడివి (72,167,735) అంతులేని తలలు గలిగినవాడివి (వి.స.224) (సహస్రశీర్షా పురుషః). (అంతర్యామిగా ఉండి) వెలుపల కనబడని వాడివి (వి.స.722). అంతులేని కన్నులు, ఇంద్రియాలు గలిగినవాడివి. (వి.స.226) (సహస్రాక్షః. పురుష.).

సహస్రపాద స్త్వం దేవ స్త్వం విరాట్ త్వం సురప్రభుః ।
త్వమేవ తిష్ఠసే భూయో దేవదేవ దశాఙ్గులః ॥ 158 ॥

అంతులేని పాదాలు గలిగినదేవుడివి (వి.స.227) (సహస్రపాత్. పురుష.) విశ్వస్వరూపుడివి (విరాజో అధిపూరుషః. పురుష.). దేవతలకు అధిపతివి (వి.స.85) దేవతలకు దేవుడయిన స్వామీ నీవు ఈవిశ్వమంతా నిండగా, ఇంకా పదిఅంగుళాలు అధికంగా అవ్యక్తంగా ఉంటావు.

యద్ భూతం తత్ త్వమేవోక్తః పురుష శ్శక్ర ఉత్తమః ।
యద్ భావ్యం తత్ త్వమీశాన స్త్వ మృత స్త్వం తథామృతః ॥ 159 ॥

జరిగిపోయింది అంతా నీవే. పురుషుడు నీవు. ఉత్తముడయిన ఇంద్రుడు నీవు. జరగబోయేదీ నీవే. నీవే ఈశానుడివి. సత్యం, అమృతం నీవు.(వి.స.69,197) (పురుష ఏవేదగ్ం సర్వం యద్భూతం యచ్చ భవ్యమ్. ఉతామృతత్వస్యేశానః. పురుష.)

త్వత్తో రోహ త్యయం లోకో మహీయాం స్త్వ మనుత్తమః ।
త్వం జ్యాయాన్ పురుష స్త్వం చ త్వం దేవ దశధా స్థితః ॥ 160 ॥

ఈలోకం నీనుండే ఉద్భవిస్తుంది. అన్నింటికంటె విస్తార మయినరూపం నీవు. నీకంటె ఉత్తమ మయినది వేరొకటి లేదు (వి.స.80). నీవు అందరికంటె పెద్దవాడివి. దేవా! నీవు పదివిధాలుగా ఉంటావు. (ఏతావా నస్య మహిమా, అతో జ్యాయాగ్ం శ్చ పూరుషః. పురుష.)

విశ్వభూత శ్చతుర్భాగో నవభాగోఽ మృతో దివి ।
నవభాగోఽ న్తరిక్షస్థః పౌరుషేయ స్సనాతనః ॥ 161 ॥

పురాతనమైన పురుషుడిలోని నాలుగుభాగాలు ఈప్రపంచంగా ఏర్పడింది. తొమ్మిదిభాగాలు స్వర్గంలో అమృతరూపంలో ఉంది. తొమ్మిదిభాగాలు ఆకాశంలో ఉన్నది. (పాదోఽ స్య విశ్వాభూతాని, త్రిపాదూర్ధ్వ ఉదైత్ పురుషః. పురుష.)

భాగద్వయం చ భూసంస్థం చతుర్భాగోఽ ప్యభూ దిహ ।
త్వత్తో యజ్ఞా స్సమ్భవన్తి జగతో వృష్టికారణమ్ ॥ 162 ॥

నీలోనిరెండుభాగాలు తిరిగి భూమిమీద నెలకొన్నాయి. నాలుగుభాగాలు ఇక్కడే ఉన్నాయి (161శ్లో). లోకాలలో వర్షానికి మూలమైన యజ్ఞాలు నీనుండే ఏర్పడుతున్నాయి.

త్వత్తో విరాట్ సముత్పన్నో జగతో హృది యః పుమాన్ ।
సోఽ తిరిచ్యత భూతేభ్య స్తేజసా యశసా శ్రియా ॥ 163 ॥

నీనుండి విరాట్పురుషుడు ఉద్భవించాడు. అతడు లోకంలో అందరిహృదయాలలోను ఉండేపురుషుడు. అతడు తేజస్సుచేతనూ, యశస్సుచేతనూ, సంపదలచేతనూ సమస్తభూతాలకంటె అధికమైనవాడు. (తస్మాద్ విరాడజాయత, విరాజో అధి పూరుషః స జాతో అత్యరిచ్యత, పశ్చాద్ భూమి మథో పురః. పురుష.)

త్వత్త స్సురాణా మాహారః పృషదాజ్య మజాయత ।
గ్రామ్యారణ్యా శ్చౌషధయ స్త్వత్తః పశుమృగాదయః ॥ 164 ॥

దేవతలకు ఆహారమయిన పృషదాజ్యం (పెరుగుతో తడిసినఆవునెయ్యి) నీనుండే ఏర్పడింది. గ్రామాలలో పుట్టినవీ, అడవులలో పుట్టినవీ అయినఓషధులు, గ్రామాలలో ఉండే పెంపుడుజంతువులు, అడవులలో నివసించే జంతువులు మొదలైనవి అన్నీ నీనుండే ఏర్పడ్డాయి. (తస్మాద్ యజ్ఞాత్ సర్వహుతః, సంభృతం పృషదాజ్యం, పశూగ్ స్తాగ్ శ్చక్రే వాయవ్యాన్, ఆరణ్యాన్ గ్రామ్యాశ్చ యే. పురుష.)

ధ్యేయధ్యానపర స్త్వం చ కృతవానపి చౌషధీః ।
త్వం దేవదేవ సప్తాస్య కాలాఖ్యో దీప్తవిగ్రహః ॥ 165 ॥

ధ్యానం చేయదగినవాడివి నీవు. ధ్యానం స్వరూపం కూడ నీవే. ఓషధులను నీవే నిర్మించావు. దేవతలకే దేవుడివి. జ్వలిస్తున్నదేహంతో, ఏడుముఖాలతో కూడిన కాలుడు అనేపేరు గలిగినవాడివి. (సప్తాస్యాసన్ పరిధయ .పురుష.)

జఙ్గమాజఙ్గమం సర్వం జగదేతచ్చరాచరమ్ ।
త్వత్త స్సర్వ మిదం జాతం త్వయి సర్వం ప్రతిష్ఠితమ్ ॥ 166 ॥

స్థిరంగా ఉండేదీ, కదిలేదీ అంటే స్థావరమూ జంగమమూ అయినఈజగత్తు సమస్తమూ నీవల్లనే పుట్టింది. ఇది అంతా నీలోనే స్థిరంగా ఉన్నది.

అనిరుద్ధ స్త్వం మాధవ స్త్వం త్వం ప్రద్యుమ్న స్సురారిహా ।
దేవ సర్వసురశ్రేష్ఠ సర్వలోకపరాయణ ॥ 167 ॥

దైవమా! దేవత లందరిలోను శ్రేష్ఠుడా! సమస్తలోకాలనూ రక్షించేవాడా! నిన్ను శత్రువు లెవరూ అడ్డగించలేరు (వి.స.638). మధువు అనేయాదవుడివంశంలో పుట్టినవాడివి (వి.స.735). అత్యధిక మయినధనం కలిగినవాడివి (వి.స.640). దేవతలవిరోధులను సంహరించేవాడివి (వి.స.208) నీవే.

త్రాహి మా మరవిన్దాక్ష నారాయణ నమోఽస్తు తే ।
నమస్తే భగవన్ విష్ణో నమస్తే పురుషోత్తమ ॥ 168 ॥

పుండరీకాక్షా! నన్ను కాపాడు. శ్రీమన్నారాయణా! నీకు నమస్కారం. శ్రీమహావిష్ణూ! భగవంతుడా! నీకు నమస్కారం. పురుషోత్తమస్వామీ! నీకు నమస్కారం.

నమస్తే సర్వలోకేశ నమస్తే కమలాలయ ।
గుణాలయ నమస్తేఽస్తు నమస్తేఽస్తు గుణాకర ॥ 169 ॥

అన్నిలోకాలకూ ప్రభువైనవాడా! నీకు నమస్కారం. హృదయపుండరీకంలో నెలకొన్నవాడా! నీకు నమస్కారం. సమస్తమైన సద్గుణాలకు ఆశ్రయమైనవాడా! నీకు నమస్కారం. సమస్తగుణాల స్వరూపం అయినవాడా! నీకు నమస్కారం.

వాసుదేవ నమస్తేఽస్తు నమస్తేఽస్తు సురోత్తమ ।
జనార్దన నమస్తేఽస్తు నమస్తేఽస్తు సనాతన ॥ 170 ॥

వాసుదేవస్వామీ! నీకు నమస్కారం. దేవతలలో ఉత్తముడా! నీకు నమస్కారం. జనార్దనా! నీకు నమస్కారం. పురాతనుడా! నీకు నమస్కారం.

నమస్తే యోగినాం గమ్య యోగావాస నమోఽస్తు తే ।
మాపతే శ్రీపతే నిత్యం నమస్తేఽస్తు జగత్పతే ॥ 171 ॥

యోగులు పొందవలసినవాడా! నీకు నమస్కారం. యోగంలో ఉండేవాడా! నీకు నమస్కారం. లక్ష్మీనాథా! నీకు నమస్కారం. కాంతికి మూలమైనవాడా! నీకు నమస్కారం. లోకాలను రక్షించేవాడా! నీకు నమస్కారం.

జగత్పతే జగత్సూతే నమ స్తే జ్ఞానినాం పతే ।
దివస్పతే నమస్తేఽస్తు నమస్తేఽస్తు మహీపతే ॥ 172 ॥

జగన్నాథస్వామీ! జగత్తులను సృష్టించినవాడా! నీకు నమస్కారం. జ్ఞానులకు దిక్కు అయినవాడా! నీకు నమస్కారం. సూర్యదేవా! నమస్కారం. భూమినాథా! నీకు నమస్కారం.

నమస్తే మధుహన్త్రే చ నమస్తే పుష్కరేక్షణ ।
కైటభఘ్న నమస్తేఽస్తు సుబ్రహ్మణ్య నమోఽస్తు తే ॥ 173 ॥

మధువు అనేరాక్షసుడిని చంపినవాడా! నీకు నమస్కారం. పుండరీకాక్షా! నీకు నమస్కారం. కైటభుడు అనే రాక్షసుడిని సంహరించినవాడా! నీకు నమస్కారం. సుబ్రహ్మణ్యస్వామి నీకు నమస్కారం.

నమోఽస్తు తే మహామీన శ్రుతిపృష్ఠధరాచ్యుత ।
సముద్రసలిలక్షోభ పద్మజాహ్లాదకారిణే ॥ 174 ॥

పెద్దచేపగా అవతరించినస్వామీ! వేదాలను వీపుపై పెట్టుకొని మోసినవాడా! (మత్స్యావతారంలో హిరణ్యాక్షుడిని సంహరించి, వేదాలను ఉద్ధరించినవాడా), స్థిర మయినసామర్థ్యం కలిగినవాడా! (హిరణ్యాక్షసంహారాది సమయాలలో) సముద్రంలోనినీటిని కలతపెట్టినవాడా! నీకు నమస్కారం. లక్ష్మీదేవికి ఆనందం కలిగించేవాడికి నమస్కారం.

అశ్వశీర్ష మహాఘోణ మహాపురుషవిగ్రహ ।
మధుకైటభహన్త్రే చ నమస్తే తురగానన ॥ 175 ॥

గుఱ్ఱం తల గలిగిన హయగ్రీవస్వామి, పెద్దముట్టె గలిగినవాడు, శ్రేష్ఠమైన పురుష ఆకారం గలిగినవాడు, మధువు, కైటభుడు అనేరాక్షసులను చంపినవాడు అయిన నీకు నమస్కారం.

మహాకమఠభోగాయ పృథివ్యుద్ధరణాయ చ ।
విధృతాద్రిస్వరూపాయ మహాకూర్మాయ తే నమః ॥ 176 ॥

పెద్దతాబేలుగా అవతరించినవాడు, భూమిని రక్షించినవాడు, మంథరపర్వతాన్ని చక్కగా మోసినగొప్పరూపం కలిగినవాడు, మహాకూర్మావతారుడవు అయిన నీకు నమస్కారం.

నమో మహావరాహాయ పృథివ్యుద్ధారకారిణే ।
నమ శ్చాదివరాహాయ విశ్వరూపాయ వేధసే ॥ 177 ॥

గొప్పవరాహం రూపం ధరించినవాడికి నమస్కారం. ఏకార్ణవం నుండి భూమిని ఉద్ధరించినవాడికి నమస్కారం. సృష్టిలో మొట్టమొదటి వరాహరూపానికి నమస్కారం. సమస్తమూ తనస్వరూపమే అయినవాడికి నమస్కారం. బ్రహ్మస్వరూపుడికి నమస్కారం.

నమోఽనన్తాయ సూక్ష్మాయ ముఖ్యాయ చ వరాయ చ ।
పరమాణుస్వరూపాయ యోగిగమ్యాయ తే నమః ॥ 178 ॥

అంతం లేనివాడికి, మిక్కిలిచిన్నరూపం కలిగినవాడికి, (శబ్దస్పర్శాదిగుణాలు లేనివాడు) అన్నింటిలోనూ ప్రధానమైనవాడికి, అందరిలోనూ శ్రేష్ఠుడైనవాడికీ, మిక్కిలిసూక్ష్మమైన స్వరూపం కలిగినవాడికి, యోగశక్తితో యోగులు పొందేవాడికి నమస్కారం.

తస్మై నమః పరమకారణకారణాయ
యోగీన్ద్రవృత్తనిలయాయ సుదుర్విదాయ ।
క్షీరార్ణవాశ్రితమహాహిసుతల్పగాయ
తుభ్యం నమః కనకరత్నసుకుణ్డలాయ ॥ 179 ॥

కారణాల కన్నింటికీ మూలకారణమైనవాడికి నమస్కారం. మహాయోగుల యోగసాధనలో నిలిచిఉండే వాడికి నమస్కారం. ఎంతో శ్రమతో మాత్రమే తెలుసుకోదగినవాడికి నమస్కారం. పాలసముద్రంలో ఉన్నఆదిశేషుడు

అనే మహాసర్పమే శయనంగా కలిగినవాడికి నమస్కారం. రత్నాలు పొదిగినబంగారుకర్ణాభరణాలు కలిగిన పురుషోత్తమస్వామికి నమస్కారం.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్థం స్తుత స్తదా తేన ప్రీతః ప్రోవాచ మాధవః ।
క్షిప్రం బ్రూహి మునిశ్రేష్ఠ మత్తో యదభివాఞ్ఛసి ॥ 180 ॥

కండుమహర్షి చేసిన ఈస్తోత్రానికి పురుషోత్తమస్వామి చాల సంతోషించాడు. కండుమహర్షితో 'మునివరా! నావలన ఏం కోరుకుంటున్నావో చెప్పు' అన్నాడు.

కణ్డురువాచ :-పురుషోత్తమస్వామితో కండుమహర్షి ఇలా అంటున్నాడు.

సంసారేఽస్మిన్ జగన్నాథ దుస్తరే లోమహర్షణే ।
అనిత్యే దుఃఖబహులే కదలీదలసన్నిభే ॥ 181 ॥

లోకేశ్వరా! ఈసంసారం దాటడానికి సాధ్యం కానిది. దీన్ని తలుచుకుంటేనే భయంతో ఒళ్లు గగుర్పొడుస్తుంది. ఇందులో సుఖం తాత్కాలిక మైనది. బాధలు ఎన్నో ఉంటాయి. అరటాకులాగా పేలవమైనది.

నిరాశ్రయే నిరాలమ్బే జలబుద్బుదచఞ్చలే ।
సర్వోపద్రవసంయుక్తే దుస్తరే చాతిభైరవే ॥ 182 ॥

తగినఆశ్రయం లేనిది. ఈసంసారానికి ఆధారం లేదు. నీటిబుడగలాగా కేవలం తాత్కాలిక మయినది. కష్టాలన్నీ ఇందులోనే ఉంటాయి. ఒకసారి ప్రవేశిస్తే బయటపడడానికి అవకాశం ఉండదు. మిక్కిలిభయంకర మయినది.

భ్రమామి సుచిరం కాలం మాయయా మోహిత స్తవ ।
న చాన్తమభిగచ్ఛామి విషయాసక్తమానసః ॥ 183 ॥

అటువంటిఈసంసారంలో చాలా కాలంగా కొట్టుమిట్టాడుతున్నాను. నీమాయతో అజ్ఞానంలో పడిపోయాను. ఇంద్రియసుఖాలకు లోబడి సంసారం అంతు తెలుసుకోలేకపోతున్నాను.

త్వామహం చాద్య దేవేశ సంసారభయపీడితః ।
గతోఽస్మి శరణం కృష్ణ మా ముద్ధర భవార్ణవాత్ ॥ 184 ॥

సురేశ్వరా! సంసారంమీదిభయంతో బాధలుపడ్తున్న నేను ఇప్పటికి నీశరణు కోరివచ్చాను. కృష్ణా! ఈసంసారం అనేసముద్రంలో మునిగిపోయిన నన్ను బయటపడవేయి.

గన్తు మిచ్ఛామి పరమం పదం యత్ తే సనాతనమ్ ।
దైత్యదానవదేవేశ పునరావృత్తిదుర్లభమ్ ॥ 185 ॥

దితిపుత్రులకూ, దనువుకొడుకులకూ, దేవతలకూ అందరికీ ప్రభువయిన స్వామీ! నీపరమపదాన్ని పొందాలని కోరుకుంటున్నాను. అది సనాతనం. అక్కడికి చేరినవాడు తిరిగి భూలోకంలో పుట్టడం జరగదు.

శ్రీభగవానువాచ :–కండుమహర్షితో కృష్ణభగవానుడు ఇలా చెప్తున్నాడు.

భక్తోఽ సి మే మునిశ్రేష్ఠ మా మారాధయ నిత్యశః ।
మత్ప్రసాదా ద్ధ్రువం మోక్షం ప్రాప్యసి త్వం సమీహితమ్ ॥ 186 ॥

మహర్షీ! నీవు నాభక్తుడివి. నిత్యమూ నన్ను అర్చించు.(దానివల్ల నాఅనుగ్రహం పొందుతావు.) నాఅనుగ్రహం చేత నీవు కోరుకునే మోక్షం నీకు తప్పకుండా లభిస్తుంది.

మద్భక్తాః క్షత్రియా వైశ్యాః స్త్రియ శ్శూద్రా స్తథాన్త్యజాః ।
ప్రాప్నువన్తి పరాం సిద్ధిం కిం పున స్త్వం ద్విజోత్తమ ॥ 187 ॥

విష్ణువుమీద భక్తి గలిగినవారు క్షత్రియులూ, వైశ్యులూ, స్త్రీలూ, శూద్రులూ, ఇంకా అంత్యకులంలో జన్మించినవారు కూడా ఉత్తమమైనసిద్ధిని పొందారు. ఇంక బ్రాహ్మణుడివయిన నీకు ఆవిధమైన ఉత్తమగతులు కలగడంలో అబ్బుర మేముంది?

శ్వపాకోఽ పి చ మద్భక్త స్సమ్యక్ శ్రద్ధాసమన్వితః ।
ప్రాప్నోత్యభిమతాం సిద్ధి మన్యేషా మత్ర కా కథా ॥ 188 ॥

కుక్కమాంసం తినేవాడయినా, నాయందు భక్తి కలిగి, శ్రద్ధతో నన్ను సేవిస్తే, తనకు కావలసినకోరికను సులువుగా పొందుతాడు. ఇంక మిగిలినవారిసంగతి చెప్పేదేముంది?

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవముక్త్వా తు తం విప్రా స్స దేవో భక్తవత్సలః ।
దుర్విజ్ఞేయగతి ర్విష్ణు స్త త్రైవాన్తరధీయత ॥ 189 ॥

ద్విజులారా! భక్తులపై మిక్కిలివాత్సల్యం కలిగిన శ్రీమహావిష్ణువు కండుమహర్షికి ఈవిధంగా ఉపదేశం చేసి, ఆక్షణమే అదృశ్యమైనాడు. ఆస్వామివర్తనం ఎవ్వరికీ తెలియరానిది కదా!

గతే తస్మిన్ మునిశ్రేష్ఠాః కణ్డు స్సంహృష్టమానసః ।
సర్వాన్ కామాన్ పరిత్యజ్య స్వస్థచిత్తోఽ భవత్ పునః ॥ 190 ॥

మహర్షులారా! శ్రీమహావిష్ణువు అదృశ్యమై వెళ్లిపోగా, స్వామిదర్శనంచేత కండుమహర్షి మనసంతా సంతోషంతో నిండింది. కోరికలన్నింటినీ విడిచిపెట్టాడు. అతడిమనస్సు ప్రశాంతం అయింది.

సర్వేన్ద్రియాణి సంయమ్య నిర్మమో నిరహఙ్కృతిః ।
ఏకాగ్రమానస స్సమ్యగ్ ధ్యాత్వా తం పురుషోత్తమమ్ ॥ 191 ॥

నిర్లేపం నిర్గుణం శాన్తం సత్తామాత్రవ్యవస్థితమ్ ।
అవాప పరమం మోక్షం సురాణామపి దుర్లభమ్ ॥ 192 ॥

ఇంద్రియా లన్నింటినీ అదుపులో ఉంచుకున్నాడు. నేను, నాది అనేఅహంకారమమకారాలు విడిచిపెట్టాడు. మనసును పురుషోత్తమ స్వామిమీద స్థిరంగా లగ్నం చేసి, దేనిచేతా అంటబడనివాడూ, గుణాలు ఏవీ లేనివాడూ, శాంతుడూ, ఉనికిచేత గుర్తింపదగినవాడూ అయిన పురుషోత్తమస్వామిని ధ్యానం చేశాడు. ఈవిధమైన విష్ణుసేవతో దేవతలకు కూడా లభించని ఉత్తమమైన మోక్షస్థితిని పొందాడు.

యః పఠే చ్ఛృణుయాద్ వాపి కథాం కణ్డో ర్మహాత్మనః ।
విముక్త స్సర్వపాపేభ్య స్స్వర్గలోకం స గచ్ఛతి ॥ 193 ॥

మహానుభావుడైన కండుమహర్షికథను చదివినా, విన్నా, మానవుడు సమస్తపాపాలు నశించి, స్వర్గలోకానికి వెళ్తాడు.

ఏవం మయా మునిశ్రేష్ఠాః కర్మభూమి రుదాహృతా ।
మోక్షక్షేత్రం చ పరమం దేవం చ పురుషోత్తమమ్ ॥ 194 ॥

మహర్షులారా! ఈవిధంగా కర్మభూమి అయిన భారతదేశం గురించీ, అందులో మోక్షాన్ని ఇచ్చే పురుషోత్తమక్షేత్రాన్ని గురించీ, దేవదేవుడైన పురుషోత్తమస్వామిని గురించీ చెప్పడం అయింది.

యే పశ్యన్తి విభుం స్తువన్తి వరదం ధ్యాయన్తి ముక్తిప్రదం
భక్త్యా శ్రీపురుషోత్తమాఖ్య మజరం సంసారదుఃఖాపహమ్ ।
తే భుక్త్వా మనుజేన్ద్రభోగ మమలా స్స్వర్గే చ దివ్యం సుఖం
పశ్చాద్ యాన్తి సమస్తదోషరహితాః స్థానం హరే రవ్యయమ్ ॥ 195 ॥

పురుషోత్తమదేవుడు అందరికీ ప్రభువు. కోరినవరాలు ఇస్తాడు. మోక్షం ప్రసాదిస్తాడు. శాశ్వతంగా ఉంటాడు. సంసారబాధలను నిర్మూలిస్తాడు. అటువంటిపురుషోత్తమస్వామిని దర్శించినవారూ, స్తోత్రం చేసినవారూ, ధ్యానించిన వారూ, నిష్కల్మషులవుతారు. (దర్శించినవారిని ప్రభువులాగా కాపాడతాడు. స్తుతించినవారికి వరాలు ఇస్తాడు. ధ్యానించినవారికి మోక్షం ఇస్తాడు.) (స్వామిని దర్శించినవారు) ఈలోకంలో రాజభోగాలు అనుభవిస్తారు. (స్వామిని స్తుతించినవారు) అనంతరం స్వర్గానికి వెళ్లి, అక్కడ దేవభోగాలు అనుభవిస్తారు. (స్వామిని ధ్యానించినవారు) ఆతరువాత పాపలేశాలు కూడా నశించి, శాశ్వతమైన శ్రీహరిపదాన్ని చేరుకుంటారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే స్వయమ్భ్వృషిసంవాదే కణ్డూపాఖ్యాననిరూపణం నామ ఏకోనసప్తతితమోఽధ్యాయః ॥ 69 ॥

శ్రీబ్రహ్మపురాణంలో స్వయంభూఋషిసంవాదంలో కండూపాఖ్యాననిరూపణం అనే అరవైతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

సప్తతితమోஉధ్యాయః - డెబ్బైయవ అధ్యాయం

ఋషిప్రశ్ననిరూపణమ్ - ఋషిప్రశ్ననిరూపణం

లోమహర్షణ ఉవాచ :-మహర్షులతో లోమహర్షణుడు ఈవిధంగా చెప్తున్నాడు.

వ్యాసస్య వచనం శ్రుత్వా మునయ స్సంయతేన్ద్రియాః ।
ప్రీతా బభూవు స్సంహృష్టా విస్మితా శ్చ పునః పునః ॥ 1 ॥

వ్యాసమహర్షిపలుకులు విని, అక్కడి మునులందరూ చాల సంతోషించారు. అవే తలుచుకుని, మళ్ళీ మళ్ళీ ఆనందపడ్డారు. ఆశ్చర్యపడ్డారు. ఆమును లందరూ ఇంద్రియాలను అదుపులో పెట్టుకున్నవారు.

మునయ ఊచుః :-ఆమునులు వ్యాసమహర్షితో ఇలా అంటున్నారు.

అహో భారతవర్షస్య త్వయా సఙ్కీర్తితా గుణాః ।
తద్వచ్చ పురుషాఖ్యస్య క్షేత్రస్య పురుషోత్తమ ॥ 2 ॥

మహాత్మా! నీవు వర్ణించినభారతదేశగుణాలు ఎంత గొప్పగా ఉన్నాయో. అదే విధంగా పురుషోత్తమక్షేత్రం మాహాత్మ్యాన్ని గురించి ఎంత చక్కగా చెప్పావు.

విస్మయో న భవేత్ కస్య శ్రుత్వా మాహాత్మ్యముత్తమమ్ ।
పురుషాఖ్యస్య క్షేత్రస్య ప్రీతిశ్చ వదతాం వర ॥ 3 ॥

మాటనేర్పుకాడా! నీవు చెప్పినఉత్తమ మయినఆపురుషోత్తమక్షేత్రమహిమలను వింటే ప్రతివాడికీ ఆశ్చర్యమూ, ఆనందమూ గలగక తప్పదు. (మాకు చాల ఆశ్చర్యానందాలు కలిగాయి.)

చిరాత్ ప్రభృతి చాస్మాకం సంశయో హృది వర్తతే ।
త్వదృతే సంశయ స్యాస్య ఛేత్తా నాన్యోஉస్తి భూతలే ॥ 4 ॥

ఎప్పటినుంచో మామనసులో ఒకసందేహం నిలిచిఉంది. నీవు తప్ప ఆసందేహాన్ని నివృత్తి చేయగలిగినవాడు ఈభూమిమీద ఇంకొకడు లేడు.

ఉత్పత్తిం బలదేవస్య కృష్ణస్య చ మహీతలే ।
సుభద్రాయాశ్చ కార్త్స్న్యేన పృచ్ఛామ స్త్వాం మహామునే ॥ 5 ॥

మహర్షీ! బలరాముడు, కృష్ణస్వామి, సుభద్ర అనేవీరు భూలోకంలో అవతరించినతీరును గూర్చి నిన్ను పూర్తిశ్రద్ధతో అడుగుతున్నాం.

కిమర్థం తౌ సముత్పన్నౌ కృష్ణసఙ్కర్షణా వుభౌ ।
వసుదేవగృహే వీరౌ సా చ తత్ర గృహే మునే ॥ 6 ॥

మహామునీ! మహావీరులైన కృష్ణబలరాములు ఇద్దరూ వసుదేవుడిఇంట్లో ఎందుకు జన్మించారు? అలాగే సుభద్ర కూడ ఆయింట్లో ఎందుకు పుట్టింది?

నిస్సారే మృత్యులోకేఽస్మిన్ దుఃఖప్రాయేఽతిచఞ్చలే ।
జలబుద్బుదసఙ్కాశే భైరవే లోమహర్షణే ॥ 7 ॥

ఈమానవలోకం సారం లేనిది. ఇక్కడ అన్నీ కష్టాలే ఉంటాయి. నీటిబుడగలాగా మిక్కిలి అశాశ్వత మయినది. ఒళ్లు గగుర్పొడిచేటట్లుగా భయం కలిగిస్తుంది.

విణ్మూత్రపిచ్ఛలం కష్టం సఙ్కటం దుఃఖదాయకమ్ ।
కథం ఘోరతరం తేషాం గర్భవాస మరోచత ॥ 8 ॥

(ఇంక తల్లిగర్భంలో నవమాసాలు ఉండవలసిరావడం ఇంకా ఘోరం.) గర్భం మలమూత్రాదులతో నిండి అసహ్యంగా ఉంటుంది. చాల బాధ కలిగిస్తుంది. బాగా ఇరుకుగా ఉంటుంది. దుఃఖపెడుతుంది. ఎంతో భయంకరంగా ఉండే అటువంటిగర్భనివాసాన్ని వారు ఎందుకు కోరుకున్నారు?

యాని కర్మాణి చక్రు స్తే సముత్పన్నా మహీతలే ।
విస్తరేణ మునే తాని బ్రూహి నో వదతాం వర ॥ 9 ॥

మహర్షీ! భూమిమీద జన్మించినతరువాత వారు ఏఏఘనకార్యాలు చేశారు? కథకశిరోమణీ! ఆవిషయాలు అన్నీ మాకు విస్తరంగా వినిపించవలసింది.

వదస్వ చరితం తేషా మద్భుతం చాతిమానుషమ్ ।

కథం స భగవాన్ దేవ స్సురేశ స్సురసత్తమః ॥
వసుదేవగృహే ధీమాన్ వాసుదేవత్వమాగతః ॥ 10 ॥

అమరై శ్చావృతం పుణ్యం పుణ్యకృద్భి రలఙ్కృతమ్ ।
దేవలోకం సముత్సృజ్య మర్త్యలోక ఇహాగతః ॥ 11 ॥

మానవాతీతమూ, ఆశ్చర్యకరమూ అయిన వారిచరిత్రను మాకు చెప్పవలసినది. దేవుడూ, దేవతలలో ఉత్తముడూ, దేవతలకు అధిపతీ, జ్ఞానీ అయినశ్రీకృష్ణభగవానుడు వసుదేవుడిఇంట్లో వసుదేవుడికి కొడుకు ఎలా అయినాడు. స్వర్గం పుణ్యలోకం. దేవతలతో నిండిఉంటుంది. ఆలోకం నిండా పుణ్యాత్ములే ఉంటారు. అటువంటి దేవలోకాన్ని విడిచిపెట్టి మరణం తప్పని ఈభూలోకానికి ఎందుకు వచ్చాడు?

దేవమానుషయో ర్నేతా ద్యాభువః ప్రభవోఽవ్యయః ।
కిమర్థం దివ్యమాత్మానం మానుషేషు న్యయోజయత్ ॥ 12 ॥

ఆస్వామి దేవతలకూ మానవులకూ నాయకుడు. భూమినీ, ఆకాశాన్నీ సృష్టించినవాడు. ఎల్లకాలమూ ఎటువంటి మార్పూ లేకుండా ఉండేవాడు. అటువంటికృష్ణపరమాత్మ తనను తాను మానవులలో ఎందుకు సృష్టించుకున్నాడు?

యశ్చక్రం వర్తయ త్యేకో మానుషాణామనామయమ్ ।
మానుష్యే స కథం బుద్ధిం చక్రే చక్రగదాధరః ॥ 13 ॥

చక్రాయుధాన్నీ గదనూ ధరించేస్వామి మానవులసృష్టిస్థితిలయాలను చక్రంలాగా ఏవిధమయిన ఆటంకాలు లేకుండా తిప్పుతుంటాడు. మానవులను నడిపించేమహానుభావుడు తాను మానవుడు కావాలని ఎందుకనుకున్నాడు?

గోపాయనం యః కురుతే జగతస్సార్వభౌతికమ్ ।
స కథం గాం గతో విష్ణు ర్గోపత్వమకరోత్ ప్రభుః ॥ 14 ॥

లోకాలలోని చరాచరసృష్టి సమస్తాన్నీ కాపాడే శ్రీమహావిష్ణువు భూలోకానికి ఎందుకు వచ్చాడు? సర్వ లోకాధిపతి అయినస్వామి ఆవులను కాచేపని ఎందుకు చేశాడు?

మహాభూతాని భూతాత్మా యో దధార చకార చ ।
శ్రీగర్భ స్స కథం గర్భే స్త్రియా భూచరయా ధృతః ॥ 15 ॥

ఆస్వామి పంచమహాభూతాలను సృష్టిస్తున్నాడు. వాటిని జాగ్రత్తగా కాపాడుతున్నాడు. సమస్తసంపదలతో పుట్టినఆస్వామి భూలోకంలో సంచరించే, సామాన్యమైన ఒకఆడుదానికడుపులో ఎలా ఉన్నాడు?

యేన లోకాన్ క్రమై ర్జిత్వా త్రిభి స్త్రై త్రిదశేప్సయా ।
స్థాపితా జవతో మార్గా స్త్రివర్గప్రవరా స్త్రయః ॥ 16 ॥

దేవతలకోరికపై, మూడులోకాలనూ క్రమంగా ఆక్రమించినత్రివిక్రమస్వామి ధర్మార్థకామాలు అనే మూడు పురుషార్థాలను ఈభూలోకంలో స్థిరంగా ఉండేటట్లు చేశాడు.

యోఽన్తకాలే జగత్ పీత్వా కృత్వా తోయమయం వపుః ।
లోకమేకార్ణవం చక్రే దృశ్యాదృశ్యేన చాత్మనా ॥ 17 ॥

ప్రళయసమయంలో లోకాల నన్నింటినీ మింగి, తాను జలరూపం ధరించి, అంతటా నిండి, జలమయం (ఏకార్ణవం) అయి, జలరూపంలో కనబడుతూనూ, తత్త్వం తెలియరాక అదృశ్యంగానూ ఉంటాడు.

యః పురాణః పురాణాత్మా వారాహం రూప మాస్థితః ।
విషాణాగ్రేణ వసుధా ముజ్జహా రారిసూదనః ॥ 18 ॥

ఎప్పటినుండో ఉన్నవాడూ, తానే పురాతనమైనవాడూ అయి ఆదివరాహరూపం ధరించాడు. ఆఏకార్ణవంలో మునిగిఉన్న ఈభూమిని తనకోరచివరిభాగంతో లేపి, పైన నిలిపాడు.

యః పురా పురుహూతార్థం త్రైలోక్యమిదమవ్యయమ్ ।
దదౌ జిత్వా వసుమతీం సురాణాం సురసత్తమః ॥ 19 ॥

అలాగే దేవతలలో శ్రేష్ఠుడైన ఈస్వామి పూర్వం త్రివిక్రము డై, మూడులోకాలను జయించి, దేవేంద్రుడికి అప్పగించాడు.

యేన సింహవపుః కృత్వా ద్విధా కృత్వా చ తత్ పునః ।
పూర్వదైత్యో మహావీర్యో హిరణ్యకశిపు ర్హతః ॥ 20 ॥

సగం సింహం (సగం మానవుడూ) అయినరెండుభాగాలశరీరాన్ని ధరించి, మిక్కిలిపరాక్రమవంతుడూ, రాక్షసరాజూ అయిన హిరణ్యకశిపుడిని సంహరించాడు.

యః పురా హ్యనలో భూత్వా ఔర్వ స్సంవర్తకో విభుః ।
పాతాలస్థోఽ ర్ణవరసం పపౌ తోయమయం హరిః ॥ 21 ॥

ఈమహావిష్ణువు పూర్వం ఔర్వుడు అనేభృగువంశమహర్షి కోపాన్నుండి ప్రళయాగ్నివంటిబడబాగ్నిగా పుట్టాడు. సముద్రం అడుగునపాతాళ లోకంలో ఉండి, సముద్రం మేరమీరకుండా, సముద్రసారమైన జలాన్ని తాగాడు.

సహస్రచరణం బ్రహ్మ సహస్రాంశుసహస్రదమ్ ।
సహస్రశిరసం దేవం య మాహు ర్వై యుగే యుగే ॥ 22 ॥

విష్ణుమూర్తిని గురించి తెలిసినవారు ఆస్వామి ప్రతియుగంలోనూ అనంతమైన పాదాలు కలిగినవాడు గానూ, అనంతమైన కిరణాలు కలిగినవాడుగానూ, అంతు లేకుండా వరాలు ఇచ్చేవాడుగానూ, అనంతమైన శిరస్సులు కలవాడుగానూ, పరమాత్మగానూ దేవదేవుడుగానూ చెప్తుంటారు.

నాభ్యాం పద్మం సముద్భూతం యస్య పైతామహం గృహమ్ ।
ఏకార్ణవే నాగలోకే తప్తకాఞ్చనపఙ్కజమ్ ॥ 23 ॥

ఆస్వామి బొడ్డునుండి తామరపూవు పుట్టింది. ఆతామరపూవు బ్రహ్మదేవుడికి నివాసం (జన్మస్థానం)అయింది. అది సృష్టి సమస్తమూ జలమయం అయినపుడు, నాగలోకంనుండి వెలువడిన మేలిమిబంగారు తామరపూవు.

యేన తే నిహతా దైత్యా స్సఙ్గ్రామే తారకామయే ।
సర్వదేవమయం కృత్వా సర్వాయుధధరం వపుః ॥ 24 ॥

ఆవిష్ణువు తారకామయం అనేయుద్ధంలో (తార గర్భవతిగా ఉన్నసమయంలో చంద్రుడికీ, బహస్పతిబలగానికీ జరిగినయుద్ధం) దైత్యులందరినీ సంహరించాడు. దేవతలందరిలోనూ తానే నిలిచి, ఒంటినిండా సమస్తమైన ఆయుధాలు ధరించి శత్రువులను సంహరించాడు.

గరుడస్థేన చోత్సిక్తః కాలనేమి ర్నిపాతితః ॥ 25 ॥

బలగర్వితుడైన కాలనేమిని శ్రీమహావిష్ణుదేవుడు గరుత్మంతుడి నెక్కి వచ్చి సంహరించాడు.

ఉత్తరాన్తే సముద్రస్య క్షీరోద స్యామృతోదధౌ ।
య శ్శేతే శాశ్వతం యోగ మాస్థాయ తిమిరం మహత్ ॥ 26 ॥

జగత్ప్రళయానంతరం సమస్తం అంధకారమయం అయిఉండగా, పాలసముద్రంలో ఉత్తరభాగంచివరలో అమృతసాగరంలో శాశ్వతమైన యోగస్థితిలో శయనించి ఉంటాడు.

సురారణీ గర్భ మధత్త దివ్యం తపః ప్రకర్షా దదితిః పురాణమ్ ।
శక్రం చ యో దైత్యగణావరుద్ధం గర్భావధానేన కృతం చకార ॥ 27 ॥

పూర్వం అదితి గొప్పతపస్సు చేసి, దేవతలు జన్మించడానికి మూలమైన గర్భం ధరించింది. అగ్ని పుట్టడానికి అరణిలాగా అదితిగర్భం ప్రకాశించింది. ఆగర్భంలో ధరించిన దేవేంద్రుడిని రాక్షసగణాలు బాధించకుండా, ఆశ్రీమహావిష్ణుదేవుడు కాపాడాడు.

పదాని యో యోగమయాని కృత్వా చకార దైత్యాన్ సలిలేశయస్థాన్ ।
కృత్వా చ దేవాం స్త్రిదశేశ్వరాంస్తు చక్రే సురేశం పురుహూతమేవ ॥ 28 ॥

యోగమయమైన మూడడుగులతో ఆస్వామి రాక్షసులను సముద్రంలో పడవేశాడు. దేవతలనూ, దేవాధిపతులనూ చేశాడు. ఇంద్రుడిని దేవతలకు రాజును చేశాడు.

గార్హపత్యేన విధినా అన్వాహార్యేణ కర్మణా ।
అగ్ని మాహవనీయం చ వేదం దీక్షాం సమిద్ధ్రువమ్ ॥ 29 ॥

ప్రోక్షణీయం స్రువం చైవ ఆవభృథ్యం తథైవ చ ।
అవాక్పాణిస్తు యశ్చక్రే హవ్యభాగభుజ స్తథా ॥ 30 ॥

అన్వాహార్యం అనేకర్మతో ఆస్వామి గార్హపత్యవిధానంలో ఆహవనీయాగ్నిని, వేదాన్ని, సమిధలనూ, ధ్రువపాత్రనూ, ప్రోక్షణీయపాత్రనూ, స్రువాన్ని, యజ్ఞం పూర్తి అయినతరువాత చేసే శుద్ధికర్మను ఆచరించి, మాట, చేత లేకుండగానే దేవతలను హవ్యభాగభోక్తలను చేశాడు.

హవ్యాదాంశ్చ సురాంశ్చక్రే క్రవ్యాదాంశ్చ పితౄనపి ।
భాగార్థం యజ్ఞవిధినా యోజయద్ యజ్ఞకర్మణి ॥ 31 ॥

దేవతలకు హవ్యం ఆహారం చేశాడు. పితరులకు క్రవ్యం ఆహారం చేశాడు. యజ్ఞక్రియలో భాగం పొందడానికి యజ్ఞవిధానంతోనే దేవతలను నియోగించాడు.

పాత్రాణి దక్షిణాం దీక్షాం చరూం శ్చోలూఖలాని చ ।
యూపం సమిత్స్రువం సోమం పవిత్రాన్ పరిధీనపి ॥ 32 ॥

యజ్ఞపాత్రలను, దక్షిణను, దీక్షను, చరువును, మేడికఱ్ఱలను, యజ్ఞస్తంభాలను, సమిధలను, స్రువాన్ని, సోమరసాన్ని, దర్భలను, పరిధులనూ,

యజ్ఞియాని చ ద్రవ్యాణి చమసాంశ్చ తథాపరాన్ ।
సదస్యాన్ యజమానాంశ్చ మేధాదీంశ్చ క్రతూత్తమాన్ ॥ 33 ॥

యజ్ఞానికి కావలసినపదార్థాలు, ఇంకా మోదుగకఱ్ఱ మొదలైన వాటితో చేసిన యజ్ఞపాత్రలు, ఋత్విక్కులు, యజ్ఞాలను చేయించేవారు, హవిస్సు మొదలైనవి, ఉత్తమమైన యజ్ఞాలు,

విబభాజ పురా యస్తు పారమేష్ఠ్యేన కర్మణా ।
యుగానురూపం యః కృత్వా లోకాననుపరాక్రమాత్ ॥ 34 ॥

మొదలైనవాటిని, అలాగే ఆయాలోకాలనూ (ప్రజలనూ) ఆయాయుగాలకు తగినసామర్థ్యంతో, బ్రహ్మకార్యంగా పూర్వమే విభాగం చేసిఉంచాడు.

క్షణా నిమేషాః కాష్ఠా శ్చ కలా స్త్రైకాల్య మేవ చ ।
ముహూర్తా స్తిథయో మాసా దినం సంవత్సర స్తథా ॥ 35 ॥

క్షణాలు, నిమిషాలు, కాష్ఠలు, కళలు, భూతభవిష్యద్వర్తమానా లనేమూడురకా లయినకాలాలు, ముహూర్తాలు, తిథులు, నెలలు, రోజులు, సంవత్సరాలు,

ఋతవః కాలయోగాశ్చ ప్రమాణం త్రివిధం త్రిషు ।
ఆయుఃక్షేత్రా ణ్యుపచయో లక్షణం రూపసౌష్ఠవమ్ ॥ 36 ॥

ఋతువులు, కాలయోగాలు, ఇంకా కాలానికి సంబంధించిన రకరకాలైన కూడికలు, భూతాదులైన మూడుకాలాలకు మూడువిధమయిన కొలతలు, వయసు ఆధారంగా శరీరాలను, వాటిపెరుగుదలను, స్వరూపం, ఆకారంలో అన్నిలక్షణాలఉనికిని, ఆవిష్ణుదేవుడు సృష్టించాడు.

త్రయో లోకా స్త్రయో దేవా స్త్రైవిద్యం పావకా స్త్రయః ।
త్రైకాల్యం త్రీణి కర్మాణి త్రయో వర్ణా స్త్రయో గుణాః ॥ 37 ॥

మూడు లోకాలు, మూడు మూర్తు లయినదేవతలు, మూడు విద్యలు, మూడు అగ్నులు, మూడు కాలాలు, మూడు (మనో వాక్ కాయ) కర్మలు, బ్రాహ్మణక్షత్రియవైశ్య లనే మూడువర్ణాలు, సత్త్వరజస్తమస్సు లనేమూడు గుణాలను ఆదేవుడు సృష్టించాడు.

సృష్టా లోకాః పురా సర్వే యే నానన్తేన కర్మణా ।
సర్వభూతగత స్స్రష్టా సర్వభూతగుణాత్మనా ॥ 38 ॥

పూర్వం ఈలోకాల నన్నింటినీ ఆపరమాత్మ నిరంతరమైన ప్రక్రియగా సృష్టించాడు. వీటిని సృష్టించిన ఆతడు ఈసమస్తమైన భూతకోటిలోనూ అంతర్యామిగా ఉన్నాడు. చరాచరపదార్థా లన్నింటిలోనూ ఆయాపదార్థాల గుణాలరూపంలో ఉన్నాడు.

నృణా మిన్ద్రియపూర్వేణ యోగేన రమతే చ యః ।
గతాగతాభ్యాం యో నేతా య ఏవ విధి రీశ్వరః ॥ 39 ॥

మానవులలో ఆయాయింద్రియాలు తమకు విషయాలయినవాటితో కలిసినపుడు పొందే సుఖదుఃఖాదుల రూపంలో ఆస్వామి క్రీడిస్తాడు. జరిగినదానినీ, జరగబోయేదానినీ నడిపించేవాడు ఆయనే. అతడే విధి (సృష్టికర్త). అతడే సర్వేశ్వరుడు (తాను సృష్టించిన ఈసమస్తానికీ ప్రభువు, రక్షకుడు).

యో గతి ర్ధర్మయుక్తానా మగతిః పాపకర్మణామ్ ।
చాతుర్వర్ణ్యస్య ప్రభవ శ్చాతుర్వర్ణ్యస్య రక్షితా ॥ 40 ॥

ఆశ్రీమహావిష్ణువే ధర్మపరులకు గలిగే ఉత్తమగతి.అవైదికకర్మలను ఆచరించేవారికి కలిగే దుర్గతులు కూడ ఆయనే. బ్రాహ్మణాదులయిన నాలుగువర్ణాలనూ సృష్టించింది ఆయనే. ఆనాలుగువర్ణాలవారినీ కాపాడేవాడూఆయనే.

చాతుర్విద్యస్య యో వేత్తా చాతురాశ్రమ్యసంశ్రయః ।
దిగన్తరం నభో భూమి ర్వాయు ర్వాఽథ విభావసుః ॥ 41 ॥

నాలుగువిధాలయిన విద్యలనూ తెలిసినవాడు. బ్రహ్మచర్యం మొదలయిననాలుగుఆశ్రమాలకూ ఆశ్రయం అయినవాడు. ఆతడే దిక్కుల నడిమిభాగం. ఆకాశం. భూమి. వాయువు. అగ్ని.

చన్ద్రసూర్యమయం జ్యోతి ర్యుగేశః క్షణదాచరః ।
యః పరం శ్రూయతే జ్యోతి ర్యః పరం శ్రూయతే తపః ॥42 ॥

చంద్రుడు, సూర్యుడు అనేవారిలో ఉన్నతేజస్సు ఆవిష్ణువే. ఆస్వామి యుగాలకు ప్రభువు. రాత్రివేళలో సంచరిస్తాడు. జ్యోతిస్సు లన్నింటిలోనూ ఉత్తమమయినజ్యోతి. తపస్సులన్నింటా ఉత్తమ మయిన తపస్సు.

యం పరం ప్రాహు రపరం యః పరః పరమాత్మవాన్ ।
ఆదిత్యానాం తు యో దేవో యశ్చ దైత్యాన్తకో విభుః ॥ 43 ॥

అతడే మోక్షం. అతడే స్వర్గాదికమయిన ఊర్ధ్వలోకం. అన్నింటికంటె శ్రేష్ఠమైనవాడు అతడే. అతడే పరమాత్మ. అదితిపుత్రులలో ఉత్తముడైన దేవేంద్రుడు. రాక్షసులను సంహరించిన ఉపేంద్రుడు.

యుగాన్తేష్వన్తకో యశ్చ యశ్చ లోకాన్తకాన్తకః ।
సేతు ర్యో లోకసేతూనాం మేధ్యో యో మేధ్యకర్మణామ్ ॥ 44 ॥

యుగం పరిసమాప్తి అయ్యేసమయంలో సృష్టిని నాశనం చేసే అంతకుడు. లోకాలను నాశనం చేసేవాళ్లను కూడ నాశనం చేసేవాడు. లోకం ఆచరించవలసిన ధర్మాలలోనిధర్మం ఆస్వామి. (ఇహంనుండి పరం చేరడానికి వంతెనవంటిధర్మాలకు మూల మయినధర్మం). పవిత్రకర్మలలోనిపవిత్రత అతడు.

వేద్యో యో వేదవిదుషాం ప్రభు ర్యః ప్రభవాత్మనామ్ ।
సోమభూత స్తు సౌమ్యానా మగ్నిభూతోఽగ్నివర్చసామ్ ॥ 45 ॥

వేదవేత్తలు మాత్రమే తెలుసుకోదగినవాడు (వేదంద్వారా తెలియదగినవాడు). కారణాలకు కారణ మయినవాడు. కాంతిమంతమయిన వాటిలో కాంతిరూపమయినవాడు. నిప్పువంటితేజస్సు గలవారిలో నిప్పు అయినవాడు.

య శ్శక్రాణా మీశభూత స్తపోభూత స్తపస్వినామ్ ।
వినయో నయవృత్తీనాం తేజ స్తేజస్వినా మపి ॥ 46 ॥

ఇంద్రులలో ప్రభువు. తపస్వులలోని తపస్సు. వినయప్రవర్తనం కలిగినవారిలోని వినయం. తేజోవంతులలోని తేజస్సు ఆయనే.

విగ్రహో విగ్రహార్వాణాం గతి ర్గతిమతా మపి ॥ 47 ॥

దేహధారులలోని దేహం అతడే. మంచినడవడి కలిగినవారిలో మంచితనం అతడు (జ్ఞానులలోని జ్ఞానం).

ఆకాశప్రభవో వాయు ర్వాయోః ప్రాణా ద్ధుతాశనః ।
దివో హుతాశనః ప్రాణః ప్రాణోఽగ్ని ర్మధుసూదనః ॥ 48 ॥

ఆకాశం నుండి వాయువు పుట్టింది. ప్రాణవాయువునుండి అగ్ని జనించింది. ఆకాశం, అగ్ని, ప్రాణవాయువు (ప్రాణం అగ్ని?) అన్నీ మధుసూదనుడే.

రసా చ్ఛోణితసమ్భూతి శ్శోణితా న్మాంస ముచ్యతే ।
మాంసా త్తు మేదసో జన్మ మేదసోఽస్థి నిరుచ్యతే ॥ 49 ॥

అన్నసారంనుండి రక్తం ఏర్పడుతుంది. రక్తంనుండి మాంసం ఏర్పడుతుంది. మాంసంనుండి కొవ్వు ఏర్పడుతుంది. కొవ్వునుండి ఎముక ఏర్పడుతుంది.

అస్థ్నో మజ్జా సమభవ న్మజ్జాత శ్శుక్రసమ్భవః ।
శుక్రాద్ గర్భ స్సమభవద్ రసమూలేన కర్మణా ॥ 50 ॥

ఎముకనుండి మజ్జ ఏర్పడుతుంది. మజ్జనుండి శుక్రం ఏర్పడుతుంది. శుక్రం నుండి గర్భం కలుగుతుంది. ఈవిధంగా అన్నరసాన్ని ఆధారం చేసుకుని, సృష్టికార్యం చక్కగా నడుస్తుంది.

తత్రాపాం ప్రథమో భాగ స్స సౌమ్యో రాశి రుచ్యతే ।
గర్భోష్మసమ్భవో జ్ఞేయో ద్వితీయో రాశి రుచ్యతే ॥ 51 ॥

గర్భంలో మొదటిభాగం నీరు. దానిని సౌమ్యరాశి (చంద్రుడికి సంబంధించినది) అంటారు. ఆగర్భంలోని వేడి(అగ్ని)నుండి పుట్టినదానిని రెండవరాశి అని చెప్తారు.

శుక్రం సోమాత్మకం విద్యా దార్తవం పావకాత్మకమ్ ।
భావా రసానుగా శ్చైషాం బీజే చ శశిపావకౌ ॥ 52 ॥

వీర్యం చంద్రస్వరూపం అనీ, శోణితం అగ్నిస్వరూపం అనీ తెలుసుకోవాలి. భావాలు రసాన్ని అనుసరించి ఉంటాయి. బీజంలో చంద్రుడూ, అగ్నీ ఉంటారు.

కఫవర్గే భవే చ్ఛుక్రం పిత్తవర్గే చ శోణితమ్ ।
కఫస్య హృదయం స్థానం నాభ్యాం పిత్తం ప్రతిష్ఠితమ్ ॥ 53 ॥

వీర్యం కఫవర్గానికి సంబంధించినది. శోణితం పిత్తవర్గానికి సంబంధించినది. కఫానికి స్థానం హృదయం. పిత్తానికి స్థానం నాభి అని నిశ్చయింపబడింది.

దేహస్య మధ్యే హృదయం స్థానం తన్మనస స్స్మృతమ్ ।
నాభికోష్ఠాన్తరం స్థానం తత్ర దేవో హుతాశనః ॥ 54 ॥

(కఫానికి స్థానమయిన) హృదయం శరీరానికి మధ్యలో ఉంటుంది. ఆహృదయంలో మనస్సు ఉంటుంది. (పిత్తానికి స్థానమయిన) నాభి ఉదరం మధ్యలో ఉంటుంది. అక్కడ అగ్నిదేవుడు (జఠరాగ్ని) ఉంటాడు.

మనః ప్రజాపతిర్ జ్ఞేయః కఫ స్సోమో విభావ్యతే ।
పిత్త మగ్ని స్స్మృతం త్వేవ మగ్నిసోమాత్మకం జగత్ ॥ 55 ॥

మనస్సు ప్రజాపతి అనీ, కఫం చంద్రుడనీ, పిత్తం అగ్ని అనీ తెలుసుకోవాలి. ఈవిధంగా ఈజగత్తు (సృష్టి) అంతా అగ్ని చంద్రులస్వరూపం అయిఉంది.

ఏవం ప్రవర్తితే గర్భే వర్ధితేఽర్బుదసన్నిభే ।
వాయుః ప్రవేశం సఞ్చక్రే సఙ్గతః పరమాత్మనా ॥ 56 ॥

ఈవిధంగా (అగ్నిసోమాత్మకంగా) ఏర్పడినగర్భం పిండంగా పెరుగుతుండగా, ఆపిండంలోకి పరమాత్మతో పాటు వాయువు (వాయురూపంలో పరమాత్మ) ప్రవేశిస్తాడు.

స పఞ్చధా శరీరస్థో భిద్యతే వర్ధతే పునః ।
ప్రాణాపానౌ సమానశ్చ ఉదానో వ్యాన ఏవ చ ॥ 57 ॥

గర్భంలో ప్రవేశించిన ఆవాయువు 1. ప్రాణం, 2. అపానం, 3. సమానం, 4. ఉదానం, 5. వ్యానం, అని ఐదుభాగాలుగా విడిపోయి, క్రమంగా వృద్ధిచెందుతుంది.

ప్రాణోఽస్య పరమాత్మానం వర్ధయన్ పరివర్తతే ।
అపానః పశ్చిమం కాయ ముదానోఽర్ధం శరీరిణః ॥ 58 ॥

ప్రాణవాయువు పరమాత్మను వృద్ధిచెందిస్తూ హృదయంలో సంచరిస్తుంది. అపానవాయువు శరీరంలో నాభిక్రిందిభాగంలో (గుదస్థానంలో) సంచరిస్తుంది. ఉదానవాయువు శరీరంలోని పైసగంభాగంలో (పూర్వకాయంలో) సంచరిస్తుంది.

వ్యాన స్తు వ్యాప్యతే యేన సమాన స్సన్నివర్తతే ।
భూతావాప్తి స్తత స్తస్య జాయే తేన్ద్రియగోచరా ॥ 59 ॥

వ్యానం అనేవాయువు శరీర మంతటా నిండిఉంటుంది. సమానవాయువు మిగిలినవాయువులను వెనక్కు మరలిస్తూ నాభిప్రదేశంలో సంచరిస్తుంది.

పృథివీ వాయు రాకాశ మాపో జ్యోతిశ్చ పఞ్చమమ్ ।
తస్యేన్ద్రియనివిష్టాని స్వం స్వం భాగం ప్రచక్రిరే ॥ 60 ॥

నేల, గాలి, నింగి, నీళ్లు, నిప్పు అనేపంచభూతాలు ఆయాఇంద్రియాలతో కలిసి తమతమభాగాలను ఏర్పరుస్తాయి.

పార్థివం దేహ మాహు స్తు ప్రాణాత్మానం చ మారుతమ్ ।
ఛిద్రా ణ్యాకాశయోనీని జలాత్ స్రావః ప్రవర్తతే ॥ 61 ॥

శరీరం పృథివీభూతస్వరూపం. వాయువు ప్రాణస్వరూపం. శరీరంలోని నవరంధ్రాలు ఆకాశంనుండి ఏర్పడుతున్నాయి. జలంనుండి నెత్తురు మొదలైన ద్రవాలు ఏర్పడతాయి. అని తద్‌జ్ఞులు చెప్తారు.

జ్యోతి శ్చక్షూంషి తేజశ్చ యన్తా తేషాం మన స్స్మృతమ్ ।
గ్రామాశ్చ విషయాశ్చైవ యస్య వీర్యాత్ ప్రవర్తితాః ॥ 62 ॥

అగ్నిలోని కాంతిస్వరూపం కన్నులలో ఉంటుంది. వీటన్నింటినీ నడిపించేది మనస్సు. ఆమనస్సు శక్తిచేతనే ఇంద్రియాలు ఇంద్రియవిషయాలపై ప్రవర్తిస్తాయి.

ఇత్యేతాన్ పురుష స్సర్వాన్ సృజన్ లోకాన్ సనాతనాన్ ।
నైధనేఽస్మిన్ కథం లోకే నరత్వం విష్ణు రాగతః ॥ 63 ॥

ఈవిధంగా సమగ్రమైనసామగ్రితో సనాతన మయినలోకాల నన్నింటినీ పరమాత్మ సృష్టిచేశాడు. మరి, చావు సహజ మయినఈలోకంలో శ్రీమహావిష్ణువు మానవుడుగా ఎందుకు అవతరించాడు?

ఏష న స్సంశయో బ్రహ్మ న్నేష నో విస్మయో మహాన్ ।
కథం గతి ర్గతిమతా మాపన్నో మానుషీం తనుమ్ ॥ 64 ॥

బ్రహ్మర్షీ! ఇది మాకు పెద్ద సందేహంగా ఉంది. ఇది మాకు చాలా ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఉత్తములకే ఉత్తమగతి అయిన శ్రీమహావిష్ణువు మానవశరీరాన్ని ఎందుకు స్వీకరించాడు?

ఆశ్చర్యం పరమం విష్ణుర్ దేవైర్ దైత్యైశ్చ కథ్యతే ।
విష్ణో రుత్పత్తి మాశ్చర్యం కథయస్వ మహామునే ॥ 65 ॥

దేవతలూ, రాక్షసులూ కూడ ఈఅంశాన్ని మిక్కిలివింతగా చెప్తారు. మహర్షీ, ఆశ్చర్యకరమైన ఆవిష్ణుదేవుడి కృష్ణావతారం గురించి చెప్పవలసింది.

ప్రఖ్యాతబలవీర్యస్య విష్ణో రమితతేజసః ।
కర్మణాశ్చర్యభూతస్య విష్ణో స్తత్త్వమిహోచ్యతామ్ ॥ 66 ॥

శ్రీమహావిష్ణువు గొప్పతేజశ్శాలి. అతడు చేసేపనులు చాల ఆశ్చర్యం కలిగిస్తాయి. అందరూ గొప్పగా కీర్తించే బలపరాక్రమాలు గలిగిన విష్ణుమూర్తితత్త్వాన్ని చెప్పవలసింది.

కథం స దేవో దేవానా మార్తిహా పురుషోత్తమః ।
సర్వవ్యాపీ జగన్నాథ స్సర్వలోకమహేశ్వరః ॥ 67 ॥

ఆపురుషోత్తమస్వామి దేవతలబాధలను గూడ పోగొట్టేవాడు. అంతటా నిండిఉన్నవాడు. లోకాల కన్నింటినీ రక్షించేవాడు. అన్నిలోకాలకూ అధిపతి.

సర్గస్థిత్యన్తకృద్ దేవ స్సర్వలోకసుఖావహః ।
అక్షయ శ్శాశ్వతోఽనన్తః క్షయవృద్ధివివర్జితః ॥ 68 ॥

సృష్టిస్థితిలయాలను చేసేవాడు. సమస్తలోకాలను సుఖపెట్టేవాడు. నాశనం లేనివాడు. అన్నికాలాలలోనూ ఉంటాడు. అతడికి అంతం లేదు. తగ్గటం, పెరగటంవంటిమార్పులు ఏవీ లేనివాడు.

నిర్లేపో నిర్గుణ స్సూక్ష్మో నిర్వికారో నిరఞ్జనః ।
సర్వోపాధివినిర్ముక్త స్సత్తామాత్రవ్యవస్థితః ॥ 69 ॥

దేనితోనూ సంబంధం లేనివాడు. గుణరహితుడు. మిక్కిలితక్కువపరిమాణంలో ఉంటాడు. ఏవిధ మయిన వికారమూ లేనివాడు. రూపం (శరీరాదులు) లేనివాడు. ఉన్నాడని మాత్రమే గ్రహింపదగినవాడు.

అవికారీ విభు ర్నిత్యః పరమాత్మా సనాతనః ।
అచలో నిర్మలో వ్యాపీ నిత్యతృప్తో నిరాశ్రయః ॥ 70 ॥

ఏవిధమైనమార్పులు లేనివాడు. అన్నిలోకాలకూ ప్రభువు. నిత్యశుద్ధబుద్ధముక్తస్వభావుడు. పురాతనుడు. స్థిరంగా ఉండేవాడు.మలినాలు లేనివాడు. అంతటా నిండిఉన్నవాడు. నిత్యమూ సంతృప్తితో ఉండేవాడు. స్వతంత్రుడు.

విష్ణుత్వం శ్రూయతే యస్య హరిత్వం చ కృతే యుగే ।
వైకుణ్ఠత్వం చ దేవేషు కృష్ణత్వం మానుషేషు చ ॥ 71 ॥

ఆస్వామి కృతయుగంలో శ్రీమహావిష్ణువనీ, శ్రీహరి అనీ, దేవతలలో వైకుంఠుడనీ, మానవులలో శ్రీకృష్ణుడనీ కీర్తింపబడుతున్నాడు.

ఈశ్వరస్య స దైవాస్య గహనాం కర్మణో గతిమ్ ।
సమతీతా భవిష్యం చ శ్రోతుమిచ్ఛా ప్రవర్తతే ॥ 72 ॥

ఆపరమాత్మ లీలలతీరు తెలుసుకోవడం చాల కష్టం. గతంలో జరిగినదీ, భవిష్యత్కాలంలో జరగబోయేదీ అయిన శ్రీమహావిష్ణువుచరిత్రను వినా లని మాకు చాల కోరికగా ఉన్నది.

అవ్యక్తో వ్యక్తలిఙ్గస్థో య ఏష భగవాన్ ప్రభుః ।
నారాయణో హ్యనన్తాత్మా ప్రభవోఽవ్యయ ఏవ చ ॥ 73 ॥

ఆస్వామి తెలుసుకోవడానికి సాధ్యం కాని నిరాకారుదు. భక్తుల ననుగ్రహించడంకోసం రూపం ధరించి కనబడతాడు. అటువంటిశ్రీమన్నారాయణుడు దేశాన్నిబట్టి గాని, కాలాన్నిబట్టి గాని, వస్తువునుబట్టిగాని నిశ్చయింపరానివాడు. లోకాలను సృష్టించినవాడు. నశింపు లేనివాడు.

ఏష నారాయణో భూత్వా హరి రాసీత్ సనాతనః ।
బ్రహ్మా శక్రశ్చ రుద్రశ్చ ధర్మ శ్శుక్రో బృహస్పతిః ॥ 74 ॥

ఈనారాయణుడు పూర్వం శ్రీహరి అయినాడు. ఆస్వామియే బ్రహ్మ, ఇంద్రుడు, రుద్రుడు, యముడు, శుక్రుడు, బృహస్పతి రూపాలు ధరించాడు.

ప్రధానాత్మా పురా హ్యేష బ్రహ్మాణ మసృజత్ ప్రభుః ।
సోఽ సృజత్ పూర్వపురుషః పురా కల్పే ప్రజాపతీన్ ॥ 75 ॥

పూర్వం ఈస్వామి ప్రకృతిరూపంలో ఉండి, బ్రహ్మను సృష్టించాడు. పురాణపురుషుడైన ఆబ్రహ్మదేవుడు ఆదికల్పంలో సృష్టినిమిత్తంగా మొదట ప్రజాపతులను సృష్టించాడు.

ఏవం స భగవాన్ విష్ణు స్సర్వలోకేశ్వరేశ్వరః ।
కిమర్థం మర్త్య లోకేఽ స్మిన్ యాతో యదుకులే హరిః ॥ 76 ॥

సమస్తలోకాధిపతులకు అధిపతి అయిన శ్రీవిష్ణుభగవానుడు, శ్రీహరి ఈమర్త్యలోకంలో యదువంశంలో ఎందుకు అవతరించాడు?

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసర్షిసంవాదే ఋషిప్రశ్ననిరూపణం నామ సప్తతితమోఽ ధ్యాయః ॥ 70 ॥

శ్రీబ్రహ్మపురాణంలో వ్యాసఋషిసంవాదంలో ఋషిప్రశ్ననిరూపణం అనే డెబ్బైయవ అధ్యాయం సంపూర్ణం.



ఏకసప్తతితమోఽధ్యాయః - డెబ్బైఒకటవ అధ్యాయం
చతుర్వ్యూహవర్ణనమ్ - చతుర్వ్యూహవర్ణనం

వ్యాస ఉవాచ :-మహర్షులతో వ్యాసుడు ఈవిధంగా చెప్తున్నాడు.

నమస్కృత్వా సురేశాయ విష్ణవే ప్రభవిష్ణవే ।
పురుషాయ పురాణాయ శాశ్వతాయావ్యయాయ చ ॥ 1 ॥

దేవతలకు ప్రభువూ, అంతటా నిండిఉన్నవాడూ, జగత్తులను సృష్టించేవాడూ, పురాణపురుషుడూ, అన్నికాలాల లోనూ ఉండేవాడూ, మార్పు లేక ఎల్లకాలమూ స్థిరంగా ఉండేవాడూ అయిన ఆపరమాత్మకు నమస్కరిస్తున్నాను.

చతుర్వ్యూహాత్మనే తస్మై నిర్గుణాయ గుణాయ చ ।
వరిష్ఠాయ గరిష్ఠాయ వరేణ్యాయామితాయ చ ॥ 2 ॥

శ్రీమహావిష్ణువు నాలుగువ్యూహాలు రూపమైనవాడు. గుణాలు లేనివాడు. సమస్తగుణాలు కలిగినవాడు. శ్రేష్ఠుడు. అంతటా విస్తరించిఉన్నవాడు. ఉత్తముడు. కొలతలకు అందనివాడు. అటువంటిస్వామికి నమస్కారం.

యజ్ఞాఙ్గా యాఖిలాఙ్గాయ వేదాద్యై రీప్సితాయ చ ।
యస్మా దల్పతరం నాస్తి యస్మా న్నాస్తి బృహత్తరమ్ ॥ 3 ॥

యజ్ఞాలు అంగాలయిన ఆదివరాహస్వరూపుడు. సమస్తమూ తనలో భాగం అయినవాడు. వేదాలు మొద లయినవాటిచేత పొందదగినవాడు. ఆస్వామికంటె చిన్నవస్తువు లేదు. అలాగే ఆస్వామికంటె పెద్దవస్తువూ లేదు. అటువంటిస్వామికి నమస్కారం.

యేన విశ్వమిదం వ్యాప్త మజేన సచరాచరమ్ ।
ఆవిర్భావతిరోభావదృష్టాదృష్టవిలక్షణమ్ ॥ 4 ॥

పుట్టుక లేనిఆపరమాత్మయే స్థావరజంగమాత్మకమయిన ఈజగత్తు అంతటా నిండిఉన్నాడు. పుట్టడమూ, మరణించడమూ, కనిపించడమూ, కనిపించకుండా పోవడమూ అనేలక్షణాలకు భిన్న మయినవాడు. అటువంటి స్వామికి నమస్కారం.

వదన్తి యత్ సృష్టమితి తథైవా ప్యుపసంహృతమ్ ।
బ్రహ్మణే చాదిదేవాయ నమస్కృత్య సమాధినా ॥ 5 ॥

సృష్టింపబడినది అనీ, లయం చేయబడినదనీ చెప్పబడే జగత్తుకు మూలమైనవాడు. దేవతలందరికీ ఆద్యుడు. పరమాత్మ అయిన స్వామిపై మనసు నిలిపి నమస్కరిస్తున్నాను.

అవికారాయ శుద్ధాయ నిత్యాయ పరమాత్మనే ।
సదైకరూపరూపాయ విష్ణవే ప్రభవిష్ణవే ॥ 6 ॥

ఆస్వామి ఎటువంటివికారాలు లేనివాడు, శుద్ధస్వరూపుడు. శాశ్వతుడు. పరమాత్మ. ఎప్పటికీ ప్రధాన మయినఒకేరూపంతో ఉండేవాడు, (సమస్తమూ ఆపరమాత్మే) అంతటా నిండిఉన్నాడు. అన్నింటినీ సృష్టించినవాడు. అటువంటిస్వామికి నమస్కారం.

నమో హిరణ్యగర్భాయ హరయే శఙ్కరాయ చ ।
వాసుదేవాయ సారాయ సర్గస్థిత్యన్తకారిణే ॥ 7 ॥

బ్రహ్మ, విష్ణువు, శివుడు (మూడుమూర్తులూ) అయినవాడికి నమస్కారం. అందరిలోనూ నివసించే వాసుదేవస్వామికి నమస్కారం. సంసారబాధలు తొలగించేవాడికి నమస్కారం. సృష్టి, స్థితి, లయాలు చేసేవాడికి నమస్కారం.

ఏకానేకస్వరూపాయ స్థూలసూక్ష్మాత్మనే నమః ।
అవ్యక్తవ్యక్తరూపాయ విష్ణవే ముక్తిహేతవే ॥ 8 ॥

నిర్గుణుడై, సర్వమూ ఒక్కటేఅయినవాడికి, సగుణుడై, వివిధరూపాలు ధరించినవాడికి నమస్కారం. శబ్దసర్శాదిగుణాలు లేనివాడు కాబట్టి అన్నింటికంటె పెద్దవాడు. అందరిలో అంతరాత్మగా ఉండి, అన్నింటికంటె చిన్నవాడు. ఇలా స్థూలమూ, సూక్ష్మమూ రెండూ అయినస్వామికి నమస్కారం. తెలియరానిదీ, తెలియవచ్చేదీ అయినస్వరూపం కలిగినవాడికి నమస్కారం. శ్రీమహావిష్ణుమూర్తికి నమస్కారం. మోక్షానికి కారణ మయిన (మోక్షం ఇచ్చే) స్వామికి నమస్కారం.

సర్గస్థితివినాశానాం జగతో యో జగన్మయః ।
మూలభూతో నమ స్తస్మై విష్ణవే పరమాత్మనే ॥ 9 ॥

జగత్తును సృష్టించేవాడూ, రక్షించేవాడూ, సంహరించేవాడూ అయినస్వామికి నమస్కారం. జగత్తు అంతటా నిండిఉన్నవాడికి నమస్కారం. జగత్తుకు మూలకారణ మయినవాడికి నమస్కారం. పరమాత్మ అయిన శ్రీమహావిష్ణు దేవుడికి నమస్కారం.

ఆధారభూతం విశ్వస్యా ప్యణీయాంస మణీయసామ్ ।
ప్రణమ్య సర్వభూతస్థ మచ్యుతం పురుషోత్తమమ్ ॥ 10 ॥

ఆస్వామి ప్రపంచానికి ఆధారం. మిక్కిలిచిన్నవాటికంటె ఇంకా చిన్నవాడు. చరాచరభూతసంఘం అంతటిలోనూ ఉంటాడు. చ్యుతి లేనివాడు. జీవులకంటె ఉత్తముడు. అటువంటిస్వామికి నమస్కారం.

జ్ఞానస్వరూప మత్యన్తం నిర్మలం పరమార్థతః ।
తమేవార్థస్వరూపేణ భ్రాన్తిదర్శనతః స్థితమ్ ॥ 11 ॥

ఉత్తమమైనజ్ఞానమే రూపం అయినవాడు. యథార్థంగా మలరహితుడు, నిర్గుణుడు. అయినప్పటికీ ప్రయోజనాపేక్షతో మాయారూపాలను ధరించి కనిపిస్తాడు.

విష్ణుం గ్రసిష్ణుం విశ్వస్య స్థితిసర్గే తథా ప్రభుమ్ ।
అనాదిం జగతా మీశ మజమక్షయమవ్యయమ్ ॥ 12 ॥

ఆస్వామి అంతటా వ్యాపించిఉంటాడు, జగత్తును మింగివేస్తాడు. జగత్తును సృష్టించి, రక్షించేప్రభువు. మొదలు లేనివాడు. లోకాలకు దిక్కు. అతడికి పుట్టుక లేదు. మరణం లేదు. మార్పు లేనివాడు. (అటువంటిస్వామికి నమస్కారం.)

కథయామి యథా పూర్వం యక్షాద్యై ర్మునిసత్తమైః ।
పృష్టః ప్రోవాచ భగవా నబ్జయోనిః పితామహః ॥ 13 ॥

పూర్వం యక్షులు, మహర్షులు మొదలైనవారు అడిగినపుడు పద్మసంభవుడైన బ్రహ్మదేవుడు వారికి చెప్పినప్రకారంగా మీకు కృష్ణస్వామిచరిత్రను తెలియజేస్తాను.

ఋక్సామా న్యుద్గిరన్ వక్త్రై ర్యః పునాతి జగత్త్రయమ్ ।
ప్రణిపత్య తథేశాన మేకార్ణవవినిర్గతమ్ ॥ 14 ॥

పూర్వం యుగాంతంలో సమస్తం జలమయమై, ఏకార్ణవంగా ఉండగా, ఆసముద్రంలోనుండి బ్రహ్మదేవుడు వెలుపలికి వచ్చాడు. ఆస్వామి ఋక్, యజుస్, సామమంత్రాలను తననోట వెలువరిస్తూ, మూడులోకాలను పవిత్రం చేస్తాడు.

యస్యాసురగణై ర్మర్త్యైః పాల్యతే శాసనం ధ్రువమ్ ।
ప్రవక్ష్యామి మతం కృత్స్నం బ్రహ్మణోఽ వ్యక్తజన్మనః ॥
యేన సృష్టిం సముద్దిశ్య ధర్మాద్యాః ప్రకటీకృతాః ॥ 15 ॥

బ్రహ్మపుట్టుక ఎవ్వరికీ తెలియరాదు. రాక్షసులు, మానవులు ఆబ్రహ్మదేవుడిఆజ్ఞను శిరసావహిస్తారు. ఆయన తాను సృష్టించినవారికోసం ధర్మం, అర్థం, కామం, మోక్షం అనేపురుషార్థాలను తెలియజేశాడు. అటువంటిబ్రహ్మదేవుడికి నమస్కరించి, ఆయన అభిప్రాయాన్ని సమగ్రంగా తెలియజెప్తాను.

ఆపో నారా ఇతి ప్రోక్తా మునిభి స్తత్త్వదర్శిభిః ।
అయనం తస్య తాః పూర్వం తేన నారాయణ స్స్మృతః ॥ 16 ॥

తత్త్వం తెలిసినమహర్షులు నీటిని నారములంటారు. సృష్ట్యాదిలో ఆనీళ్లు స్థానంగా కలిగినవాడు కావడంచేత స్వామికి నారాయణుడు అని ప్రసిద్ధి.

స దేవో భగవాన్ సర్వం వ్యాప్య నారాయణో విభుః ।
చతుర్ధా సంస్థితో బ్రహ్మ సగుణో నిర్గుణ స్తథా ॥ 17 ॥

ఆశ్రీమన్నారాయణప్రభువు లోకా లన్నింటా నిండిఉన్నాడు. ఆయన ఆకారం కలిగి సగుణంగానూ, ఆకారం లేకుండా నిర్గుణంగానూ ఉంటాడు. అటువంటిపరమాత్మ నాలుగువిధాలుగా ఉన్నాడు.

ఏకా మూర్తి రనుద్దేశ్యా శుక్లాం పశ్యన్తి తాం బుధాః ।
జ్వాలామాలావనద్ధాఙ్గీ నిష్ఠా సా యోగినాం పరా ॥ 18 ॥

ఆనాలుగింటిలో ఒకమూర్తి ఇలా ఉంటుందని వివరించడానికి (సామాన్యులకు) వీలు లేనిది. జ్ఞానులు అది మిక్కిలితెల్లగా ఉంటుందని గ్రహించారు. అది మొత్తం అగ్నిశిఖలవరుసలతో కప్పబడిఉంటుంది. ఉన్నది అని తెలియదగినది. యోగులు మాత్రమే దానిని దర్శించగలరు.

దూరస్థా చాన్తికస్థా చ విజ్ఞేయా సా గుణాతిగా ।
వాసుదేవాభిధానాసౌ నిర్మమత్వేన దృశ్యతే ॥

రూపవర్ణాదయ స్తస్యా న భావాః కల్పనామయాః ।
ఆస్తే చ సా సదా శుద్ధా సుప్రతిష్ఠైకరూపిణీ ॥ 19 ॥

అది ఎక్కడో చాల దూరంలో ఉంటుంది. చాల దగ్గరలోనూ ఉంటుంది. దానికి వాసుదేవుడు అని పేరు. అది మమకారం లేనిస్థితిగా కనబడుతుంది. (శ్రీమన్నారాయణుడిచతుర్వ్యూహాలలో వాసుదేవుడు అనేది ప్రథమవ్యూహం.) ఆవాసుదేవవ్యూహానికి రూపం, రంగు మొదలైన గుణాలు లేవు. ఈభావాలు అన్నీ కల్పించినవే గాని సహజం కావు. ఆవాసుదేవతత్త్వం గుణాదులసంపర్కం లేకశుభ్రంగా ఉంటుంది. దానిలక్షణం సుస్థిరంగానూ అద్వితీయంగానూ ఉంటుంది.

ద్వితీయా పృథివీం మూర్ధ్నా శేషాఖ్యా ధారయ త్యధః ।
తామసీ సా సమాఖ్యాతా తిర్యక్త్వం సముపాగతా ॥ 20 ॥

ఇక తరువాత రెండవవ్యూహం శేషుడు అనేపేరుతో ఉంటుంది. అది ఈభూమిని తనశిరస్సుపై ఉంచుకుని కాపాడుతుంది. అది తమోగుణంతో నిండిఉంటుంది. పశువులు పక్షులు మొదలైనవాటిలో చేరిఉంటుంది.

తృతీయా కర్మ కురుతే ప్రజాపాలనతత్పరా ।
సత్త్వోద్రిక్తా తు సా జ్ఞేయా ధర్మసంస్థానకారిణీ ॥ 21 ॥

ఇంక మూడవమూర్తి (తృతీయవ్యూహం) సృష్టిని పాలించడంలో నిమగ్నమై ఉంటుంది. స్థితికర్మను ఆచరిస్తుంది. ఆరూపం స్తత్వగుణం ప్రధానంగా కలిగిఉంటుంది. అది జగత్తులో ధర్మాన్ని నిలబెడుతుంది.

చతుర్థీ సా జలమధ్యస్థా శేతే పన్నగతల్పగా ।
రజ స్తస్యా గుణ స్సర్గం సా కరోతి సదైవ హి ॥ 23 ॥

నాలుగవమూర్తి (చతుర్థవ్యూహం) సముద్రంనడుమ ఆదిశేషుడు అనే శయ్యమీద శయనించిఉంటుంది. అది రజోగుణంతో కూడిఉంటుంది. అది నిరంతరం సృష్టి చేస్తుంటుంది.

యా తృతీయా హరే ర్మూర్తిః ప్రజాపాలనతత్పరా ।
సా తు ధర్మవ్యవస్థానం కరోతి నియతం భువి ॥ 24 ॥

శ్రీమహావిష్ణువుకు సంబంధించినమూడవమూర్తి నిరంతరం చరాచరసృష్టిని శ్రద్ధగా రక్షిస్తుంది. అది నియమంగా ఈలోకంలో ధర్మాన్ని చక్కగా స్థాపిస్తుంది.

క్రోద్ధతా నసురాన్ హన్తి ధర్మవ్యుచ్ఛిత్తికారిణః ।
పాతి దేవాన్ సగన్ధర్వాన్ ధర్మరక్షాపరాయణాన్ ॥ 25 ॥

ధర్మాన్ని విచ్ఛిన్నం చేస్తూ విజృంభించే రాక్షసులను సంహరిస్తుంది. ధర్మాన్ని శ్రద్ధగా రక్షించే దేవతలనూ, గంధర్వులనూ కాపాడుతుంది.

యదా యదా చ ధర్మస్య గ్లాని స్సముపజాయతే ।
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజ త్యసౌ ॥ 26 ॥

ధర్మానికి హాని ఏర్పడినప్పుడూ, అధర్మం తలయెత్తినప్పుడు ఆపరమాత్మ తనను తాను సృష్టించుకుంటాడు.

భూత్వా పురా వరాహేణ తుణ్డే నాపో నిరస్య చ ।
ఏకయా దంష్ట్ర యోత్ఖాతా నలినీవ వసున్ధరా ॥ 27 ॥

అందుకోసమే పూర్వం స్వామి ఆదివరాహంగా మారి, తనముట్టెతో ఏకార్ణవజలాన్ని నెట్టివేసి, ఆసముద్రజలమధ్యంనుండి, తనఒంటికోరతో భూమిని తామరతీగను పైకి లాగినట్లుగా ఉద్ధరించాడు.

కృత్వా నృసింహరూపం చ హిరణ్యకశిపు ర్హతః ।
విప్రచిత్తిముఖా శ్చాన్యే దానవా వినిపాతితాః ॥ 28 ॥

ధర్మాన్ని నిలబెట్టడంకోసమే ఆతర్వాత శ్రీమహావిష్ణువు నరసింహరూపాన్ని ధరించి, హిరణ్యకశిపుడిని సంహరించాడు. ఇంకా విప్రచిత్తి మొద లయినపెక్కుమందిరాక్షసులను నేల గూల్చాడు.

వామనం రూపమాస్థాయ బలిం సంయమ్య మాయయా ।
త్రైలోక్యం క్రాన్తవానేవ వినిర్జిత్య దితే స్సుతాన్ ॥ 29 ॥

ఆతర్వాత వామనరూపాన్ని ధరించి మాయతో బలిచక్రవర్తిని నియంత్రించాడు. దితికుమారులను జయించాడు. త్రివిక్రముడై మూడులోకాలనూ ఆక్రమించాడు.

భృగో ర్వంశే సముత్పన్నో జామదగ్న్యః ప్రతాపవాన్ ।
జఘాన క్షత్రియాన్ రామః పితుర్వధమనుస్మరన్ ॥ 30 ॥

ఆపిదప భృగువంశంలో జమదగ్నిమహర్షికి కుమారుడు(పరశురాముడు)గా, మిక్కిలిపరాక్రమవంతుడై జన్మించాడు. తనతండ్రిని చంపినవారిని తలచుకుని, క్షత్రియజాతిని సంహరించాడు.

తథాత్రితనయో భూత్వా దత్తాత్రేయః ప్రతాపవాన్ ।
యోగమష్టాఙ్గమాచఖ్యా వలర్కాయ మహాత్మనే ॥ 31 ॥

ఒకసారి అత్రిమహర్షికి కుమారుడుగా, పరాక్రమవంతుడై దత్తాత్రేయుడుగా జన్మించాడు. ఆఅవతారంలో మహాత్ముడైన అలర్కుడనేవాడికి అష్టాంగయోగాన్ని ఉపదేశించాడు.

రామో దాశరథి ర్భూత్వా స తు దేవః ప్రతాపవాన్ ।
జఘాన రావణం సఙ్ఖ్యే త్రైలోక్యస్య భయఙ్కరమ్ ॥ 32 ॥

ఆశ్రీమహావిష్ణువే తరువాత దశరథుడికి కుమారుడుగా, మిక్కిలిపరాక్రమవంతుడై, శ్రీరాముడుగా అవతరించాడు. అప్పుడు మూడులోకాలను భయపెట్టినరావణాసురుడిని యుద్ధరంగంలో సంహరించాడు.

యదా చైకార్ణవే సుప్తో దేవదేవో జగత్పతిః ।
సహస్రయుగపర్యన్తం నాగపర్యఙ్కగో విభుః ॥ 33 ॥

యోగనిద్రాం సమాస్థాయ స్వే మహిమ్ని వ్యవస్థితః ।
త్రైలోక్యముదరే కృత్వా జగత్స్థావరజఙ్గమమ్ ॥
జనలోకగతై స్సిద్ధై స్తూయమానో మహర్షిభిః ॥ 34 ॥

దేవతలకు దేవుడైన ఆజగన్నాథుడు మహాప్రళయానంతరం అంతా జలమయమై ఒకేసముద్రంలాగా ఉన్నసమయంలో, తనమహిమతో కూడినవాడై, ఆసముద్రంలో ఆదిశేషుడు అనేశయ్యమీద వేయియుగాల కాలంవరకు యోగనిద్రలో శయనించిఉంటాడు. ఆసమయంలో చరాచరమైన పదార్థాలన్నింటితోనూ కూడిన మూడులోకాలనూ తనకడుపులో పెట్టుకుని, భద్రంగా కాపాడుతుంటాడు. జనోలోకంలోని సిద్ధులు, మహర్షులు స్వామిని స్తుతిస్తుంటారు.

తస్య నాభౌ సముత్పన్నం పద్మం దిక్పత్రమణ్డితమ్ ।
జ్వలనార్కప్రతీకాశం శైలకేసరమణ్డితమ్ ॥ 35 ॥

ఆస్వామి నాభినుండి దిక్కులే రేకులుగా కలిగిన ఒకపద్మం పుట్టింది. అది మండుతున్నసూర్యుడితో సమానంగా ప్రకాశిస్తున్నది. పర్వతాలు అనేపుప్పొడికాడలు ఆతామరపూవుకు అలంకారంగా ఉన్నాయి.

మరుత్కిఞ్జల్కసంయుక్తం గృహం పైతామహం వరమ్ ।
యత్ర బ్రహ్మా సముత్పన్నో దేవదేవ శ్చతుర్ముఖః ॥36 ॥

వాయువు అనేపుప్పొడితో కూడిఉంది. ఆతామరపూవు శ్రేష్ఠమైన బ్రహ్మదేవుడినివాసం. దేవతలకు దేవుడూ, నాలుగు ముఖాలు కలిగినవాడూ అయినబ్రహ్మదేవుడు ఆతామరపూవునుండే పుట్టాడు.

తదా కర్ణమలోద్భూతౌ దానవౌ మధుకైటభౌ ।
మహాబలౌ మహావీర్యౌ బ్రహ్మాణం హన్తుముద్యతౌ ॥ 37 ॥

ఏకార్ణవంలో యోగనిద్రలో ఉండగా, శ్రీమహావిష్ణువు చెవిమలినం (గుబిలి) నుండి మధువు, కైటభుడు అనే ఇద్దరు రాక్షసులు వెలువడ్డారు. ఆ రాక్షసులు మిక్కిలి బలవంతులు, శక్తిమంతులు. వారు బ్రహ్మదేవుడిని సంహరించడానికి పూనుకున్నారు.

జఘాన తౌ దురాధర్షౌ ఉత్థాయ శయనోదధేః ।
ఏవమాదీంస్తథైవాన్యాన్న సఙ్ఖ్యాతుమిహోత్సహే ॥ 38 ॥

సముద్రం శయనంనుండి లేచి, శ్రీమహావిష్ణువు బ్రహ్మను చంపబోతున్న మధుకైటభులను సంహరించాడు. ఇవి మొదలుగా ఆ మహావిష్ణుదేవుడి లీలలు ఇంకా ఇతరమైనవి ఎన్నో ఉన్నాయి. వాటిని లెక్కపెట్టడం అసాధ్యం.

అవతారో హ్యజస్యేహ మాధురస్సాంప్రతస్త్వయమ్ ।
ఇతి సా సాత్త్వికీ మూర్తిరవతారం కరోతి చ ॥ 39 ॥

ఆ పరమాత్మ ప్రస్తుతం మధురానగరంలో అవతరించి ఉన్నాడు. ఈవిధంగా పరమాత్మకు సంబంధించిన సత్త్వగుణమూర్తి భూమిపై అవతరిస్తుంది.

ప్రద్యుమ్నేతి సమాఖ్యాతా రక్షాకర్మణ్యవస్థితా ।
దేవత్వేఽథ మనుష్యత్వే తిర్యగ్యోనౌ చ సంస్థితా ॥ 40 ॥

ఆ అవతారమూర్తికి ప్రద్యుమ్నుడు అని పేరు. ప్రద్యుమ్నస్వామి జగత్తులను రక్షించే పనిలో నియమంగా వర్తిస్తుంటాడు. ఆ స్వామి దేవతగానూ, మానవుడుగానూ, పశువులు, పక్షులు మొదలైన జీవులుగాను ఉంటుంది. (దేవమానవాది రూపాలు ధరిస్తుంది)

గృహ్ణాతి తత్స్వభావశ్చ వాసుదేవేచ్ఛయా సదా ।
దదాత్యభిమతాన్ కామాన్ పూజితా సా ద్విజోత్తమాః ॥ 41 ॥

విప్రవరేణ్యులారా! వాసుదేవపరమాత్మ తన ఇష్టాన్ని అనుసరించి, దేవతలు మొదలైన వాటిలో ఏ రూపంలో ఉంటే వారి స్వభావాన్ని పొందుతాడు. శ్రద్ధగా పూజిస్తే, ఆ అవతారమూర్తి భక్తుడికి కావలసిన కోరికలనుఇస్తుంది.

ఏవం మయా సమాఖ్యాతః కృతకృత్యోఽపి యః ప్రభుః ।
మానుషత్వం గతో విష్ణు శృణుధ్వం చోత్తరం పునః ॥ 42 ॥

ఈవిధంగా స్వామి చతుర్వ్యూహాల మాహాత్మ్యాన్ని గురించి మీకు చెప్పడం అయింది. అన్నీ ఉన్నా, తనకు కావలసినది ఏమీ లేకపోయినా, శ్రీమహావిష్ణువు శ్రీకృష్ణుడుగా మనుష్యరూపాన్ని ధరించాడు. ఇక పైన ఆ శ్రీకృష్ణస్వామి లీలలను చెప్తాను వినండి.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసఋషిసంవాదే చతుర్వ్యూహవర్ణనం నామ ఏకసప్తతితమోఽధ్యాయః ॥ 71 ॥

శ్రీబ్రహ్మపురాణంలోవ్యాస ఋషి సంవాదంలో చతుర్వ్యూహవర్ణనం అనే డెబ్బైఒకటవ అధ్యాయం సంపూర్ణం.

ద్విసప్తతితమోఽధ్యాయః - డెబ్బైరెండవ అధ్యాయం

హరిఅంశావతారనిరూపణమ్ - హరి అంశావతార నిరూపణం

వ్యాస ఉవాచ :-మహర్షులతో వ్యాసుడు ఈవిధంగా చెప్తున్నాడు.

శృణుధ్వం మునిశార్దూలాః ప్రవక్ష్యామి సమాసతః ।
అవతారం హరేశ్చాత్ర భారావతరణేచ్ఛయా ॥ 1 ॥

మహర్షులారా! భూమిభారాన్ని తొలగించడానికి శ్రీహరి భూమిపై అవతరించిన విధానాన్ని సంగ్రహంగా చెప్తాను. వినండి.

యదా యదా త్వధర్మస్య వృద్ధిర్భవతి భో ద్విజాః ।
ధర్మశ్చ హ్రాసమభ్యేతి తదా దేవో జనార్దనః ॥ 2 ॥

అవతారం కరోత్యత్ర ద్విధా కృత్వాత్మనస్తనుమ్ ।
సాధూనాం రక్షణార్థాయ ధర్మసంస్థాపనాయ చ ॥ 3 ॥

ఓ బ్రాహ్మణులారా! భూమిమీద అధర్మం పెచ్చరిల్లినపుడు, ధర్మానికి హాని గలిగినపుడు శ్రీమహావిష్ణువు నేలపై అవతరిస్తాడు. సజ్జనులను కాపాడడం కోసమూ, ధర్మాన్ని నిలబెట్టడం కోసమూ తన శరీరాన్ని రెండు భాగాలుగా విభాగించుకుని వస్తాడు.

దుష్టానాం నిగ్రహార్థాయ హ్యన్యేషాం చ సురద్విషామ్ ।
ప్రజానాం రక్షణార్థాయ జాయతేఽసౌ యుగే యుగే ॥ 4 ॥

దుర్మార్గులనూ, దేవతలకు శత్రువులైన రాక్షసులనూ, అణచివేయడానికి, ప్రజలను రక్షించడానికీ ప్రతియుగంలోనూ స్వామి భూమిపై పుడుతుంటాడు.

పురా కిల మహీ విప్రా భూరిభారావపీడితా ।
జగామ ధరణీ మేరౌ సమాజే త్రిదివౌకసామ్ ॥ 5 ॥

ద్విజులారా! పూర్వం ఒకానొకప్పుడు అధికమైన జీవకోటితో భూమిపై భారం పెరిగింది. భూదేవి ఆ బరువు మోయలేక బాధపడసాగింది. తన బాధలను దేవతలకు విన్నవించుకోవడానికి ఆమె మేరుపర్వతం మీదికి వెళ్లింది. ఆ సమయంలో దేవతలందరూ అక్కడ సమావేశమై ఉన్నారు.

సబ్రహ్మకాన్ సురాన్ సర్వాన్ ప్రణిపత్యాథ మేదినీ ।
కథయామాస తత్సర్వం ఖేదాత్ కరుణభాషిణీ ॥ 6 ॥

అపుడు భూదేవి బ్రహ్మదేవుడు మొదలుగా అక్కడ ఉన్న దేవతలందరికీ సాష్టాంగనమస్కారం చేసింది. దుఃఖంతో దీనంగా జాలి కలిగే విధంగా, తన బాధలను వారికి తెలియజేసింది.

ధరణ్యువాచ :–బ్రహ్మాదిదేవతలతో భూదేవి ఇలా చెప్తున్నది.

అగ్నిస్సువర్ణస్య గురుర్గవాం సూర్యోఽపరో గురుః ।
మమాప్యఖిలలోకానాం వన్ద్యో నారాయణో గురుః ॥ 7 ॥

బంగారానికి గురువు అగ్ని. గ్రహాలకు గురువు సూర్యుడు. నాకూ, అన్ని లోకాలవారికీ పూజింపదగిన గురువు శ్రీమన్నారాయణుడు.

తత్ సాంప్రతమిమే దైత్యాః కాలనేమిపురోగమాః ।
మర్త్యలోకం సమాగమ్య బాధన్తేఽహర్నిశం ప్రజాః ॥ 8 ॥

ఇప్పుడు కాలనేమి మొదలైన ఈ రాక్షసులు మానవలోకానికి వచ్చారు. వాళ్లు రాత్రింబగళ్లు ప్రజలను పీడిస్తున్నారు.

కాలనేమిర్హతో యోఽసౌ విష్ణునా ప్రభవిష్ణునా ।
ఉగ్రసేనసుతః కంస సమ్భూతస్స మహాసురః ॥ 9 ॥

సర్వశ్రేష్ఠుడూ, సృష్టికర్త అయిన శ్రీమహావిష్ణువు కాలనేమిని సంహరించాడు. ఆ మహారాక్షసుడు ఇప్పుడు మళ్లీ ఉగ్రసేనమహారాజు కుమారుడుగా కంసుడు అనే పేరుతో భూమిమీద జన్మించాడు.

అరిష్టో ధేనుకః కేశీ ప్రలమ్బో నరకస్తథా ।
సున్దోఽసురస్తథాత్యుగ్రో బాణశ్చాపి బలేస్సుతః ॥ 10 ॥

అరిష్టుడు, ధేనుకుడు, కేశి, ప్రలంబుడు, నరకుడు, మిక్కిలి భయంకరుడైన సుందుడు, బలిచక్రవర్తి కుమారుడైన బాణాసురుడు,

తథాఽన్యే చ మహావీర్యా నృపాణాం భవనేషు యే ।
సముత్పన్నా దురాత్మానస్తాన్న సఙ్ఖ్యాతుముత్సహే ॥ 11 ॥

ఇంకా ఎంతో మంది ఆయా రాజుల ఇండ్లలో జన్మించారు. వాళ్ళు అందరూ మిక్కిలి పరాక్రమవంతులు. దుష్టమైన బుద్ధి గలిగినవారు. వారిసంఖ్య ఇంత అని చెప్పలేను.

అక్షౌహిణ్యో హి బహులా దివ్యమూర్తిధరాస్సురాః ।
మహాబలానాం దృప్తానాం దైత్యేన్ద్రాణాం మమోపరి ॥ 12 ॥

దివ్యమైన శరీరాలను ధరించిన దేవతలు, మిక్కిలి బలంతో బాగా గర్వించిఉన్న రాక్షసరాజులు, అక్షౌహిణులసంఖ్యలో నామీద (భూమిమీద) నెలకొని ఉన్నారు.

తద్ భూరిభారపీడార్తా న శక్నోమ్యమరేశ్వరాః ।
బిభర్తుమాత్మానమహమితి విజ్ఞాపయామి వః ॥ 13 ॥

దేవనాయకులారా! మిక్కుటమైన వారిభారాన్ని మోయలేక నేను చాల బాధపడ్తున్నాను. ఆ భారాన్ని ఇంక నేను మోయలేను అని మీకు విన్నవించుకుంటున్నాను.

క్రియతాం తన్మహాభాగా మమ భారావతారణమ్ ।
యథా రసాతలం నాహం గచ్ఛేయమతివిహ్వలా ॥ 14 ॥

మహాత్ములారా! ఆ బరువుమూలంగా పాతాళంలోకి కుంగిపోతానేమోనని నాకు చాల భయంగా ఉంది. అలా జరగకుండా, ఆ భారాన్ని తొలగించండి.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా అంటున్నాడు.

ఇత్యాకర్ణ్య ధరావాక్యమశేషైస్త్రిదశైస్స్తుతః ।
భువో భారావతారార్థం బ్రహ్మా ప్రాహ చ చోదితః ॥ 15 ॥

ఆ భూదేవి పలుకులు విని, దేవతలు అందరూ భూభారాన్ని తొలగించా లని బ్రహ్మదేవుడిని ప్రేరేపించారు. అపుడు దేవతలతో బ్రహ్మ ఇలా అన్నాడు.

బ్రహ్మోవాచ :-దేవతలతో బ్రహ్మ ఈవిధంగా చెప్తున్నాడు.

యదాహ వసుధా సర్వం సత్యమేతద్దివౌకసః ।
అహం భవో భవన్త శ్చ సర్వం నారాయణాత్మకమ్ ॥ 16 ॥

దేవతలారా! భూదేవి చెప్పినదంతా నిజమే. నేనూ, శంకరుడూ, మీరూ అందరమూ నారాయణ స్వరూపులమే.

విభూతయస్తు యాస్తస్య తాసామేవ పరస్పరమ్ ।
ఆధిక్యం న్యూనతా బాధ్యబాధకత్వేన వర్తతే ॥ 17 ॥

అన్నీ శ్రీమన్నారాయణుడి విభూతులే. అవి ఒకదానితో ఒకటి ఎక్కువ, తక్కువలతోనూ, బాధపెట్టేదీ, బాధపడేదీగానూ ఉంటాయి.

తదాగచ్ఛత గచ్ఛామః క్షీరాబ్ధేస్తటముత్తమమ్ ।
తత్రారాధ్య హరిం తస్మై సర్వం విజ్ఞాపయామ వై ॥ 18 ॥

రండి. అందరం కలిసి, శ్రేష్ఠమైన పాలసముద్రం తీరానికి వెళ్దాం. అక్కడ శ్రీహరిని సేవించి, అన్ని సంగతులూ ఆయనకు విన్నవించుకుందాం.

సర్వదైవ జగత్యర్థం స సర్వాత్మా జగన్మయః ।
స్వల్పాంశేనావతీర్యోర్వ్యాం ధర్మస్య కురుతే స్థితిమ్ ॥ 19 ॥

అన్నీ తానే అయి, అంతటా నిండిఉన్న శ్రీమహావిష్ణువు లోకసంరక్షణ చేయవలసిన అన్ని సమయాలలోనూ, తనకు సంబంధించిన స్వల్పమైన అంశతో భూమిమీద అవతరిస్తాడు. ధర్మాన్ని స్థాపిస్తాడు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసుడు ఇలా అంటున్నాడు.

ఇత్యుక్త్వా ప్రయయౌ తత్ర సహ దేవైః పితామహః ।
సమాహితమతిశ్చైనం తుష్టావ గరుడధ్వజమ్ ॥ 20 ॥

అని చెప్పి బ్రహ్మదేవుడు మిగిలిన దేవతలందరితో కలిసి, శ్రీమహావిష్ణువు వద్దకు వెళ్లాడు. అక్కడ స్వామిని ఏకాగ్రమైన బుద్ధితో ధ్యానించి, గరుడవాహనుడిని సంతోషపెట్టాడు.

బ్రహ్మోవాచ :–శ్రీమహావిష్ణువును బ్రహ్మదేవుడు ఇలా స్తుతిస్తున్నాడు.

నమో నమస్తేఽస్తు సహస్రమూర్తే సహస్రబాహో బహువక్త్రపాద ।
నమో నమస్తే జగతః ప్రవృత్తిర్వినాశసంస్థానపరాప్రమేయ ॥ 21 ॥

వేయి(అనంతమైన)రూపాలు కలిగినవాడా! నమస్కారం. వేయి(అనంతమైన)బాహువులు కలిగిన వాడా! నీకు నమస్కారం. అనేక (అనంత)మైన ముఖాలు, పాదాలు కలిగినవాడా! నీకు నమస్కారం. జగత్తును సృష్టించేవాడా! రక్షించేవాడా! లయం చేసేవాడా! నమస్కారం. ఏ ప్రమాణానికి కూడా అందనివాడా! నీకు నమస్కారం.

సూక్ష్మాతిసూక్ష్మం చ బృహత్ప్రమాణం గరీయసామప్యతిగౌరవాత్మన్ ।
ప్రధానబుద్ధీన్ద్రియవాన్ ప్రధాన లోకాత్మకాత్మన్ భగవన్ ప్రసీద ॥ 22 ॥

సూక్ష్మమైన దానికంటె సూక్ష్మమైనవాడా! మిక్కిలి పెద్ద ఆకారం కలిగినవాడా! విస్తారమైన వాటి కంటె మిక్కిలి విస్తారమైనవాడా! ప్రధానం, బుద్ధి, ఇంద్రియాలు కలిగిన(స్వరూపమైన)వాడా! సర్వప్రధానమైనవాడా! లోకం స్వరూపమైనవాడా! భగవంతుడా! నన్ను అనుగ్రహించు.

ఏషా మహీ దేవ మహీప్రసూతైర్మహాసురైః పీడితశైలబన్ధా ।
పరాయణం త్వాం జగతాముపైతి భారావతారార్థమపారపారమ్ ॥ 23 ॥

దేవా! మహామహారాక్షసులు భూమిమీద పుట్టారు. వాళ్లు కొండలతో సహా భూమిని మిక్కుటంగా బాధిస్తున్నారు. అందువలన ఈ భూదేవి తనమీద నెలకొన్న వీరిభారం తొలగించమని మేరమీరిన శక్తిమంతుడవూ, లోకరక్షకుడవూ అయిన నిన్ను ఆశ్రయించింది.

ఏతే వయం వృత్రరిపుస్తథాఽయం నాసత్యదస్రౌ వరుణస్తథైషః ।
ఇమే చ రుద్రా వసవస్ససూర్యాస్సమీరణాగ్నిప్రముఖాస్తథాన్యే ॥ 24 ॥

ఇదుగో ఇతడు ఇంద్రుడు. వీరు అశ్వినీదేవతలు. ఇతడు వరుణుడు. వీరుగో రుద్రులు. వీరు వసువులు. వీరు సూర్యుడు, వాయుదేవుడు, అగ్నిదేవుడు, మొదలైన దేవతలందరమూ ఇక్కడకు వచ్చాము.

సురాస్సమస్తాస్సురనాథ కార్యమేభిర్మయా యచ్చ తదీశ సర్వమ్ ।
ఆజ్ఞాపయాజ్ఞాం ప్రతిపాలయన్తస్తవైవ తిష్ఠామ సదాస్తదోషాః ॥ 25 ॥

దేవదేవా! దేవతలం అందరం ఈ కార్యం మీదనే నీ వద్దకు వచ్చాం. మేము ఎవరు ఏపని చేయాలో ఆజ్ఞాపించు. నీఆజ్ఞలను స్వీకరించి,ఆప్రకారం నడుచుకుంటాం. నీఆజ్ఞను పాలించడంలో ఏవిధమైనపొరపాట్లుచేయం.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఇలా అంటున్నాడు.

ఏవం సంస్తూయమానస్తు భగవాన్ పరమేశ్వరః ।
ఉజ్జహారాత్మనః కేశౌ సితకృష్ణౌ ద్విజోత్తమాః ॥ 26 ॥

విప్రవరులారా! దేవతలు ఈవిధంగా స్తుతిస్తుండగా, శ్రీమహావిష్ణుదేవుడు తెలుపు, నలుపు రంగులో ఉన్న తన వెంట్రుకలను ఊడబెరికాడు.

ఉవాచ స సురానేతౌ మత్కేశౌ వసుధాతలే ।
అవతీర్య భువో భారక్లేశహానిం కరిష్యతః ॥ 27 ॥

పిదప దేవతలతో ఇలా అన్నాడు. ఈ తెల్లని, నల్లనివెంట్రుకలు భూమిమీద అవతరిస్తాయి. భూమిభారాన్ని, ఆ భారంవల్ల భూదేవికి కలిగిన బాధలను తొలగిస్తాయి.

సురాశ్చ సకలాస్స్వాంశైరవతీర్య మహీతలే ।
కుర్వన్తు యుద్ధమున్మత్తైః పూర్వోత్పన్నైర్మహాసురైః ॥ 28 ॥

దేవతలు కూడా అందరూ తమ తమ అంశలతో భూమిమీద అవతరించండి. ఇప్పటికే అక్కడ పుట్టిఉన్న మహారాక్షసులతో యుద్ధం చేయండి (రాక్షసులను సంహరించండి).

తతః క్షయమశేషాస్తే దైతేయా ధరణీతలే ।
ప్రయాస్యన్తి న సన్దేహో నానాయుధవిచూర్ణితాః ॥ 29 ॥

ఆ యుద్ధంలో రకరకాల ఆయుధాల దెబ్బలతో ఈ భూమిమీద ఉన్న రాక్షసులందరూ నుగ్గునుగ్గై నశించిపోతారు. సందేహం లేదు.

వసుదేవస్య యా పత్నీ దేవకీ దేవతోపమా ।
తస్యా గర్భోఽష్టమోఽయం తు మత్కేశో భవితామరాః ॥ 30 ॥

దేవతలారా! వసుదేవుడి భార్య దేవకి. ఆమె దేవతాస్త్రీలతో సమానమైనది. ఈ నా(నల్లని)వెంట్రుక ఆమె ఎనిమిదవ సంతానంగా భూమిపై జన్మిస్తుంది.

అవతీర్యచ తత్రాయం కంసం ఘాతయితా భువి ।
కాలనేమిసముద్భూతమిత్యుక్త్వాఽన్తర్దధే హరిః ॥ 31 ॥

ఆవిధంగా భూమిమీద అవతరించిన ఈ వెంట్రుక కాలనేమి అంశతో పుట్టిన కంసుడిని సంహరిస్తుందని చెప్పి శ్రీహరి అక్కడే అదృశ్యమైనాడు.

అదృశ్యాయ తతస్తేఽపి ప్రణిపత్య మహాత్మనే ।
మేరుపృష్ఠం సురా జగ్మురవతేరుశ్చ భూతలే ॥ 32 ॥

అదృశ్యమైన శ్రీమహావిష్ణుభగవానుడికి దేవతలందరూ సాష్టాంగపడి నమస్కరించారు. తరువాత మేరుపర్వత శిఖరంమీదికి చేరుకున్నారు. భూలోకానికి దిగివచ్చారు.

కంసాయ చాష్టమో గర్భో దేవక్యా ధరణీతలే ।
హనిష్యతీత్యాచచక్షే భగవాన్ నారదో మునిః ॥ 33 ॥

నారదమహాముని కంసుడివద్దకు వచ్చి, 'దేవకీదేవి ఎనిమిదవ చూలు నిన్ను సంహరిస్తుంది' అని చెప్పాడు.

కంసోఽపి తదుపశ్రుత్య నారదాత్ కుపితస్తతః ।
దేవకీం వసుదేవం చ గృహే గుప్తావధారయత్ ॥ 34 ॥

నారదుడివలన ఆ మాటలు విని కంసుడు దేవకిపై కోపించాడు. వెంటనే దేవకీవసుదేవులను ఇంటిలో నిర్బంధించి, రహస్యంగా అప్రమత్తంగా పర్యవేక్షిస్తున్నాడు.

జాతం జాతం చ కంసాయ తేనైవోక్తం యథా పురా ।
తథైవ వసుదేవోఽపి పుత్రమర్పితవాన్ ద్విజాః ॥ 35 ॥

విప్రులారా! అంతకు ముందు కంసుడికి తాను ఇచ్చిన మాట ప్రకారంగా, వసుదేవుడు తనకు కలిగిన కొడుకులను పుట్టినవాడిని పుట్టినట్లుగా వెంటనే, కంసుడికి అప్పగించాడు.

హిరణ్యకశిపోః పుత్రాష్షడ్గర్భా ఇతి విశ్రుతాః ।
విష్ణుప్రయుక్తా తాన్ నిద్రా క్రమాద్ గర్భే న్యయోజయత్ ॥ 36 ॥

హిరణ్యకశిపుడి సంతానం ఆరుగురు దేవకికి వరుసగా ఆరు గర్భాలు అయినట్లు ప్రసిద్ధి. విష్ణుప్రేరణతో హిరణ్యకశిపుడి కుమారులను నిద్రాదేవి దేవకిగర్భంలో నిలిపింది.

యోగనిద్రా మహామాయా వైష్ణవీ మోహితం యయా ।
అవిద్యయా జగత్ సర్వం తామాహ భగవాన్ హరిః ॥ 37 ॥

యోగనిద్ర, మహామాయ, వైష్ణవి అనే పేర్లతో కీర్తించబడే ఆదేవి అజ్ఞానం అనే పదార్థంతో లోకమంతటినీ మోహంలో పడేస్తుంది. ఆ యోగమాయతో శ్రీహరి ఇలా అంటున్నాడు.

విష్ణురువాచ :–యోగనిద్రతో శ్రీమహావిష్ణువు ఇలా అంటున్నాడు.

గచ్ఛ నిద్రే మమాదేశాత్ పాతాలతలసంశ్రయాన్ ।
ఏకైకశశ్చ షడ్గర్భాన్ దేవకీజఠరే నయ ॥ 38 ॥

నిద్రాదేవీ! నా ఆజ్ఞప్రకారం వెళ్లు. పాతాళంలో ఉన్న హిరణ్యకశిపుడి కుమారులు ఆరుగురిని ఒకరి తరువాత ఒకరుగా దేవకీదేవి గర్భంలో ప్రవేశపెట్టు.

హతేషు తేషు కంసేన శేషాఖ్యోఽంశస్తతోఽనఘః ।
అంశాంశేనోదరే తస్యాస్సప్తమస్సమ్భవిష్యతి ॥ 39 ॥

ఆ ఆరుగురిని కంసుడు సంహరిస్తాడు. ఆ తరువాత ఆదిశేషుడి అంశతో ఒకానొక పుణ్యమూర్తి దేవకీదేవికి ఏడవగర్భంగా ఏర్పడతాడు.

గోకులే వసుదేవస్య భార్యాఽన్యా రోహిణీ స్థితా ।
తస్యాః ప్రసూతిసమయే గర్భో నేయస్త్వయోదరమ్ ॥ 40 ॥

వసుదేవుడికి మరొక భార్య రోహిణి. ఆమె గోకులంలో ఉంటుంది. ఆమె ప్రసవించే సమయంలో దేవకీదేవి ఏడవ గర్భాన్ని నీవు తీసుకునివెళ్లి ఆ రోహిణిగర్భంలో ప్రవేశపెట్టాలి.

సప్తమో భోజరాజస్య భయాద్ రోధోపరోధతః ।
దేవక్యాః పతితో గర్భ ఇతి లోకో వదిష్యతి ॥ 41 ॥

భోజరాజు అయిన కంసుడి భయంతో దేవకి ఏడవ గర్భం పడిపోయిందని, (గర్భస్రావం అయిందని) లోకంలో వదంతి ఏర్పడుతుంది.

గర్భసఙ్కర్షణాత్ సోఽథ లోకే సఙ్కర్షణేతి వై ।
సంజ్ఞామవాప్స్యతే వీరశ్శ్వేతాద్రిశిఖరోపమః ॥ 42 ॥

దేవకీ రోహిణీదేవుల గర్భాలు రెండింట కలియడంచేత ఆ శిశువు సంకర్షణుడు అని పేరు పొందుతాడు. అతడు మహావీరుడు. వెండికొండ శిఖరంలాగా ఉన్నతుడు.

తతోఽహం సమ్భవిష్యామి దేవకీజఠరే శుభే ।
గర్భే త్వయా యశోదాయా గన్తవ్యమవిలమ్బితమ్ ॥ 43 ॥

ఆ తరువాత నేను దేవకీదేవి గర్భంలో ప్రవేశిస్తాను. నీవు కూడ ఆలస్యం చేయకుండా, అదే సమయంలో యశోదాదేవి గర్భంలో ప్రవేశించాలి.

ప్రావృట్కాలే చ నభసి కృష్ణాష్టమ్యామహం నిశి ।
ఉత్పస్యామి నవమ్యాం చ ప్రసూతిం త్వమవాప్స్యసి ॥ 44 ॥

ఆకాశం మేఘాలతో నిండిఉండే వర్షఋతువులో కృష్ణపక్షంలో అష్టమీతిథినాడు రాత్రిసమయంలో నేను ఉదయిస్తాను. నవమినాడు నీవు జన్మిస్తావు.

యశోదాశయనే మాం తు దేవక్యా స్త్వామనిన్దితే ।
మచ్ఛక్తిప్రేరితమతిర్వసుదేవో నయిష్యతి ॥ 45 ॥

నా మహిమతో ప్రేరేపించబడిన బుద్ధితో, వసుదేవుడు యశోదాదేవి మంచం మీదికి నన్నూ, దేవకీదేవి మంచం మీదికి నిన్నూ తీసుకునివెళ్తాడు.

కంసశ్చ త్వాముపాదాయ దేవి శైలశిలాతలే ।
ప్రక్షేప్స్యత్యన్తరిక్షే చ త్వం స్థానం సమవాప్స్యసి ॥ 46 ॥

దేవీ! నీవు దేవకి సంతానం అనుకుని కంసుడు నిన్ను పట్టుకుని కొండరాతిమీద విసరికొడతాడు. నీవు వెంటనే ఎగిరి ఆకాశంలో నిలిచిఉంటావు.

తతస్త్వాం శతధా శక్రః ప్రణమ్య మమ గౌరవాత్ ।
ప్రణిపాతానతశిరా భగినీత్వే గ్రహిష్యతి ॥ 47 ॥

అప్పుడు ఇంద్రుడు నామీది పూజ్యభావంతో నీకు అనేక పర్యాయాలు సాష్టాంగపడతాడు. వినయంగా వంచిన శిరస్సుతో నిన్ను చెల్లెలుగా ఆదరిస్తాడు.

తతశ్శుమ్భనిశుమ్భాదీన్ హత్వా దైత్యాన్ సహస్రశః ।
స్థానైరనేకైః పృథివీమశేషాం మండయిష్యసి ॥ 48 ॥

ఆ తరువాత నీవు శుంభుడు, నిశుంభుడు మొదలైన రాక్షసులను వేలకొలదిగా సంహరించి, ఆయాప్రదేశాలలో, ఆయారూపాలతో, భూలోకమంతటినీ అలంకరిస్తావు.

త్వం భూతిస్సన్నతిః కీర్తిః కాన్తిర్వై పృథివీ ధృతిః ।
లజ్జా పుష్టిరుమా యా చ కాచిదన్యా త్వమేవ సా ॥ 49 ॥

భూతి, సన్నతి, కీర్తి, కాంతి, పృథివి, ధృతి, లజ్జ, పుష్టి, ఉమ, ఇంకా మిగిలిఉన్న ఇతరమైన శక్తులు అన్నీ నీవే.

యే త్వామార్యేతి దుర్గేతి వేదగర్భేఽమ్బికేతి చ ।
భద్రేతి భద్రకాలీతి క్షేమ్యా క్షేమకరీతి చ ॥ 50 ॥

ప్రాతశ్చైవాపరాహ్ణే చ స్తోష్యన్త్యానమ్రమూర్తయః ।
తేషాం హి వాఞ్ఛితం సర్వం మత్ప్రసాదాద్ భవిష్యతి ॥ 51 ॥

అందరూ వినయంగా వంగి, నమస్కరిస్తూ, నిన్ను ఆర్య, దుర్గ, వేదగర్భ, అంబిక, భద్ర, భద్రకాళి, క్షేమ్య, క్షేమకరి, అనే నామాలతో ఉదయమూ, సాయంకాలమూ నిన్ను స్తుతిస్తారు. నిన్ను కీర్తించిన వారికందరికీ నా అనుగ్రహంచేత వారివారి కోరికలు అన్నీ సిద్ధిస్తాయి.

సురామాంసోపహారైస్తు భక్ష్యభోజ్యైశ్చ పూజితా ।
నృణామశేషకామాంస్త్వం ప్రసన్నా పూరయిష్యసి ॥ 52 ॥

కల్లు, మాంసం, భక్ష్యాలు, భోజ్యాలు మొదలైన నివేదనలతో మానవులు నిన్ను పూజిస్తారు. నిన్ను పూజించిన ఆ మానవుల కోరికలు సమస్తమూ నీవు దయతో సమగ్రంగా నెరవేరుస్తావు.

తే సర్వే సర్వదా భద్రా మత్ప్రసాదాదసంశయమ్ ।
అసన్దిగ్ధం భవిష్యన్తి గచ్ఛ దేవి యథోదితమ్ ॥ 53 ॥

దేవీ! ఆవిధంగా నిన్ను పూజించిన వారందరూ ఎల్లకాలమూ నా అనుగ్రహంతో శుభపరంపరలను నిశ్చయంగా పొందుతారు. సందేహం లేదు. వెళ్లు. నేను చెప్పినట్లు చేయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణే (వ్యాసఋషిసంవాదే) హరేరంశావతారనిరూపణం నామ ద్విసప్తతితమోఽధ్యాయః॥72॥

శ్రీబ్రహ్మపురాణంలో (వ్యాస ఋషి సంవాదంలో) హరి అంశావతార నిరూపణం అనే డెబ్బైరెండవ అధ్యాయం సంపూర్ణం.

త్రిసప్తతితమోఽధ్యాయః - డెబ్బైమూడవ అధ్యాయం

శ్రీకృష్ణోత్పత్తికథానిరూపణమ్ – శ్రీకృష్ణోత్పత్తి కథా నిరూపణం

వ్యాస ఉవాచ :–మహర్షులతో వ్యాసుడు ఈవిధంగా చెప్తున్నాడు.

యథోక్తం సా జగద్ధాత్రీ దేవదేవేన వై పురా ।
షడ్గర్భగర్భవిన్యాసం చక్రే చాన్యస్య కర్షణమ్ ॥ 1 ॥

జగన్మాత అయిన యోగమాయ శ్రీమహావిష్ణువు చెప్పిన ప్రకారంగా కాలనేమి కుమారులు ఆరుగురిని దేవకిగర్భంలో ఉంచింది. తరువాత ఏడవ గర్భాన్ని దేవకినుండి ఆకర్షించింది.

సప్తమే రోహిణీం ప్రాప్తే గర్భే గర్భే తతో హరిః ।
లోకత్రయోపకారాయ దేవక్యాః ప్రవివేశ వై ॥ 2 ॥

దేవకి ఏడవ గర్భాన్ని తెచ్చి యోగమాయ రోహిణి గర్భంలో ప్రవేశపెట్టింది. ఆ తరువాత ముల్లోకాలకు మేలు చేయడంకోసం శ్రీహరి దేవకీదేవి గర్భంలో ప్రవేశించాడు.

యోగనిద్రా యశోదాయాం తస్మిన్నేవ తతో దినే ।
సమ్భూతా జఠరే తద్వద్ యథోక్తం పరమేష్ఠినా ॥ 3 ॥

బ్రహ్మదేవుడు చెప్పిన ప్రకారంగా అదే రోజున (శ్రీకృష్ణుడు జన్మించిన రోజున) యశోద గర్భంనుండి యోగనిద్ర ఉద్భవించింది.

తతో గ్రహగణస్సమ్యక్ ప్రచచార దివి ద్విజాః ।
విష్ణోరంశే మహీం యాత ఋతవోఽప్యభవచ్ఛుభాః ॥ 4 ॥

విప్రులారా! విష్ణువు అంశ ఈ భూమిమీద అవతరించే ఆ సమయంలో గ్రహాలన్నీ శుభస్థానాలలో సంచరిస్తున్నాయి. ఋతువులు కూడ శుభప్రదంగా ఉన్నాయి.

నోత్సేహే దేవకీం ద్రష్టుం కశ్చిదప్యతితేజసా ।
జాజ్వల్యమానాం తాం దృష్ట్వా మనాంసి క్షోభమాయయుః ॥ 5 ॥

ఆ సమయంలో అత్యధికమైన తేజస్సుతో వెలుగుతున్న దేవకీదేవిని ఎవరూ చూడలేకపోయారు. మిక్కిలి కాంతితో మిరుమిట్లు గొలుపుతున్న దేవకిని చూచినవారి మనస్సులు చాలా కలత చెందాయి.

అదృష్టాం పురుషైః స్త్రీభిర్దేవకీం దేవతాగణాః ।
బిభ్రాణాం వపుషా విష్ణుం తుష్టువుస్తామహర్నిశమ్ ॥ 6 ॥

శ్రీమహావిష్ణువును గర్భంలో మోస్తున్న దేవకీదేవి పురుషులు గానీ, స్త్రీలు గానీ ఎవ్వరూ చూడడానికి వీలులేని తేజస్సుతో ప్రకాశిస్తున్నది. ఆమెను దేవతల సమూహాలు రాత్రింబగళ్లు ఈవిధంగా స్తుతించారు.

దేవా ఊచుః :-దేవతలు దేవకిని ఈవిధంగా స్తుతిస్తున్నారు.

త్వం స్వాహా త్వం స్వధా విద్యా సుధా త్వం జ్యోతిరేవ చ ।
త్వం సర్వలోకరక్షార్థమవతీర్ణా మహీతలే ॥ 7 ॥

నీవు స్వాహాదేవివి. స్వధాదేవివి. విద్యాదేవివి. సుధవు. జ్యోతివి. సమస్తమైన లోకాలను కాపాడడంకోసం ఈ భూమిమీద అవతరించావు.

ప్రసీద దేవి సర్వస్య జగతస్త్వం శుభం కురు ।
ప్రీత్యర్థం ధారయేశానం ధృతం యేనాఖిలం జగత్ ॥ 8 ॥

దేవీ! మమ్మల్ని అనుగ్రహించు. లోకమంతటికీ శుభం కలిగించు. మాకు ఆనందం కలగడంకోసం లోకాలన్నింటినీ ధరించిన ఆ విష్ణుభగవానుడిని నీవు నీ గర్భంలో ధరించు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఏవం సంస్తూయమానా సా దేవైర్దేవమధారయత్ ।
గర్భేణ పుణ్డరీకాక్షం జగతాం త్రాణకారణమ్ ॥ 9 ॥

దేవతలు ఈవిధంగా తనను స్తుతిస్తుండగా, దేవకీదేవి లోకాలనన్నింటినీ రక్షించేవాడూ, కమలనేత్రుడూ అయిన శ్రీమహావిష్ణువును తన గర్భంలో ధరించింది.

తతోఽఖిలజగత్పద్మబోధాయాచ్యుతభానునా ।
దేవక్యాః పూర్వసన్ధ్యాయామావిర్భూతం మహాత్మనా ॥ 10 ॥

ఆ పిదప సమస్తమైన లోకాలు అనే తామరపూలను వికసింపజేయడానికి, మహానుభావుడైన అచ్యుతుడు అనే సూర్యభగవానుడు ప్రాతస్సంధ్యకు పూర్వభాగంలో (అర్ధరాత్రివేళ), దేవకీదేవిలో ఆవిర్భవించాడు.

మధ్యరాత్రేఽఖిలాధారే జాయమానే జనార్దనే ।
మన్దం జగర్జుర్జలదాః పుష్పవృష్టిముచస్సురాః ॥ 11 ॥

అర్ధరాత్రి సమయంలో లోకాలన్నిటికీ ఆధారమైన జనార్దనస్వామి జన్మించే సమయంలో మేఘాలు మెల్ల మెల్లగా గర్జించాయి. దేవతలు పుష్పవర్షాన్ని కురిపించారు.

ఫుల్లేన్దీవరపత్రాభం చతుర్బాహుముదీక్ష్య తమ్ ।
శ్రీవత్సవక్షసం జాతం తుష్టావానకదున్దుభిః ॥ 12 ॥

ఆ పుట్టిన పసివాడి కన్నులు చక్కగా వికసించిన నల్లకలువ రేకులలాగా ఉన్నాయి. అతడికి నాలుగుచేతులు ఉన్నాయి. వక్షస్స్థలంమీద శ్రీవత్సం అనే గుర్తు ఉంది. అటువంటి కుమారుడిని చూచి వసుదేవుడు స్తుతించాడు.

అభిష్టూయ చ తం వాగ్భిః ప్రసన్నాభిర్మహామతిః ।
విజ్ఞాపయామాస తదా కంసాద్ భీతో ద్విజోత్తమాః ॥ 13 ॥

విప్రవరేణ్యులారా! ఆ అవతారపురుషుడిని సుకుమారమైన పలుకులతో చక్కగా స్తుతించాడు. బుద్ధిమంతుడైన వసుదేవుడు కంసుడివలన భయంతో స్వామికి ఇలా విన్నవించాడు.

వసుదేవ ఉవాచ :–అప్పుడే పుట్టినతనబిడ్డతో వసుదేవుడు ఇలా అంటున్నాడు.

జ్ఞాతోఽసి దేవదేవేశ శఙ్ఖచక్రగదాధర ।
దివ్యం రూపమిదం దేవ ప్రసాదేనోపసంహర ॥ 14 ॥

దేవతలకు దేవుడవైన స్వామీ, శంఖం, చక్రం, గదలను ధరించినవాడా! నీవు శ్రీమహావిష్ణువు అని తెలుసుకున్నాను. నా మీద అనుగ్రహంతో దేవతాసంబంధమైన ఈ రూపాన్ని విడిచిపెట్టు.

అద్యైవం దేవ కంసోఽయం కురుతే మమ యాతనామ్ ।
అవతీర్ణమితి జ్ఞాత్వా త్వామస్మిన్ మన్దిరే మమ ॥ 15 ॥

పరమాత్మా! నీవు స్వయంగా నా యింట అవతరించావని తెలిస్తే, నీచుడైన కంసుడు ఇప్పుడే నన్ను అనేక విధాలుగా బాధిస్తాడు.

దేవ క్యువాచ :– కుమారుడితో దేవకీదేవి ఇలా అంటున్నది.

యోఽనన్తరూపోఽఖిలవిశ్వరూపో గర్భే చ లోకాన్ వపుషా బిభర్తి ।
ప్రసీదతామేషస దేవదేవస్స్వమాయయాఽఽవిష్కృతబాలరూపః ॥ 16 ॥

అంతం లేని ఆకారం గలిగినవాడూ, విశ్వమే తనరూపమైన వాడూ, లోకాలన్నింటిని తన కడుపులో పెట్టుకుని కాపాడేవాడూ, అయిన దేవదేవుడు తన మాయతో పసివాడి రూపంతో పొగడబడుతున్నాడు. ఈ స్వామి మమ్మల్ని అనుగ్రహించును గాక.

ఉపసంహర సర్వాత్మన్ రూపమేతచ్చతుర్భుజమ్ ।
జానాతు మావతారం తే కంసోఽయం దితిజాన్తక ॥ 17 ॥

సమస్తమూ రూపమైన దేవా! నాలుగు చేతులతో కూడిన ఈ రూపాన్ని విడిచిపెట్టు. రాక్షసులను నిర్మూలించే వాడా! నీ ఈ అవతారం కంసుడికి తెలియనీయకు.

శ్రీభగవానువాచ :–దేవకీవసుదేవులతో శ్రీవిష్ణుభగవానుడు ఇలా అంటున్నాడు.

స్తుతోఽహం యత్ త్వయా పూర్వం పుత్రార్థిన్యా తదద్య తే ।
సఫలం దేవి సఞ్జాతం జాతోఽహం యత్తవోదరాత్ ॥ 18 ॥

అమ్మా! పూర్వం నేను నీకు కొడుకును కావాలని కోరుతూ నన్ను స్తుతించావు. నీవు కోరిన విధంగా నేను నీ కడుపున పుట్టాను. ఆనాడు నీవు చేసిన స్తోత్రం ఇప్పుడు ఇలా ఫలించింది.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసభగవానుడు ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్త్వా భగవాంస్తూష్ణీం బభూవ మునిసత్తమాః ।
వసుదేవోఽపి తం రాత్రావాదాయ ప్రయయౌ బహిః ॥ 19 ॥

మహర్షులారా! శ్రీవిష్ణుభగవానుడు ఈవిధంగా పలికి మిన్నకున్నాడు. వసుదేవుడు ఆ రాత్రివేళనే ఆ పసివాడిని తీసుకుని తన మందిరం నుండి వెలుపలికి వెళ్లిపోయాడు.

మోహితాశ్చాభవంస్తత్ర రక్షిణో యోగనిద్రయా ।
మధురాద్వారపాలాశ్చ వ్రజత్యానకదున్దుభౌ ॥ 20 ॥

వసుదేవుడు పసిబిడ్డను తీసుకుని వెళ్తున్న సమయంలో ఇక్కడ కారాగారాన్ని రక్షించేవాళ్లు, అక్కడ మధురా నగరంలో ద్వారపాలకులు కూడ యోగనిద్ర మాహాత్మ్యంచేత తెలివితప్పి పడిఉన్నారు.

వర్షతాం జలదానాం చ తత్తోయముల్బణం నిశి ।
సఞ్ఛాద్య తం యయౌ శేషః ఫణైరానకదున్దుభిమ్ ॥ 21 ॥

వసుదేవుడు పరమాత్మను మధురకు తీసుకువెళ్తున్న ఆ రాత్రివేళ మేఘాలు తీవ్రంగా వర్షించాయి. అపుడు ఆదిశేషుడు వేయిపడగలతో వసుదేవుడిని కప్పిఉంచి, అతడివెంటే వెళ్లాడు.

యమునాం చాతిగమ్భీరాం నానావర్తశతాకులామ్ ।
వసుదేవో వహన్ విష్ణుం జానుమాత్రావహాం యయౌ ॥ 22 ॥

ఆ సమయంలో యమునానది మిక్కిలిలోతుగా ప్రవహిస్తున్నది. వందలకొద్దీ సుడులతో నది చాల భయంకరంగా ఉంది. అయినా, వసుదేవుడికి మోకాళ్లలోతు మాత్రమే అయింది. ఆ యమునానది ప్రవాహంగుండా వసుదేవుడు శ్రీవిష్ణుదేవుడిని తీసుకుని మధురానగరానికి వెళ్లాడు.

కంసస్య కరమాదాయ తత్రైవాభ్యాగతాంస్తటే ।
నన్దాదీన్ గోపవృద్ధాంశ్చ యమునాయాం దదర్శ సః ॥ 23 ॥

అదే సమయంలో కంసమహారాజుకు కప్పం చెల్లించడానికి వస్తున్న నందుడు మొదలైన గొల్లపెద్దలను ఆ యమునానది ఒడ్డున వసుదేవుడు చూచాడు.

తస్మిన్ కాలే యశోదాఽపి మోహితా యోగనిద్రయా ।
తామేవ కన్యాం మునయః ప్రాసూత మోహితే జనే ॥ 24 ॥

మహర్షులారా! ఆ సమయంలో యశోద కూడ యోగనిద్ర ప్రభావంతో స్మృతితప్పి ఉంది. చుట్టుప్రక్కల ఉన్న జనం కూడ తెలివితప్పి పడిఉన్నారు. అప్పుడు యశోద ఆ యోగనిద్రనే (కూతురుగా) ప్రసవించింది.

వసుదేవోఽపి విన్యస్య బాలమాదాయ దారికామ్ ।
యశోదాశయనే తూర్ణమాజగామామితద్యుతిః ॥ 25 ॥

తేజోవంతుడైన వసుదేవుడు తాను తీసుకునివచ్చిన బాలవిష్ణుమూర్తిని యశోద పక్కలో పడుకోబెట్టాడు. యశోదకూతురిని (యోగమాయను) తీసుకుని వేగంగా కంసుడి నగరానికి తిరిగివచ్చాడు.

దదర్శ చ విబుద్ధ్వా సా యశోదా జాతమాత్మజమ్ ।
నీలోత్పలదలశ్యామం తతోఽత్యర్థం ముదం యయౌ ॥ 26 ॥

కొంతసేపటికి యశోదకు తెలివి వచ్చింది. కొడుకు పుట్టాడని తెలుసుకుంది. నల్లకలువరేకులవంటి చక్కని మేని చాయ గలిగిన కుమారుడిని చూచి, అపరిమితంగా సంతోషించింది.

ఆదాయ వసుదేవోఽపి దారికాం నిజమన్దిరమ్ ।
దేవకీశయనే న్యస్య యథాపూర్వమతిష్ఠత ॥ 27 ॥

వసుదేవుడు యశోదకూతురిని తన మందిరానికి తీసుకునివచ్చి, దేవకీదేవి పక్కలో పడుకోబెట్టాడు. ఏమీ జరగనట్లుగా మామూలుగా ఉన్నాడు.

తతో బాలధ్వనిం శ్రుత్వా రక్షిణస్సహసోత్థితాః ।
కంసమావేదయామాసుర్దేవకీప్రసవం ద్విజాః ॥ 28 ॥

విప్రులారా! అప్పుడు పసిపిల్లవాడి యేడుపుచప్పుడు విని కారాగార రక్షకభటులు దిగ్గన లేచి, దేవకి ప్రసవించిం దని కంసుడికి విన్నవించారు.

కంసస్తూర్ణముపేత్యైనాం తతో జగ్రాహ బాలికామ్ ।
ముఞ్చ ముఞ్చేతి దేవక్యాసన్నకణ్ఠం నివారితః ॥ 29 ॥

కంసుడు కూడ వెంటనే దేవకీవసుదేవులున్న చోటికి వచ్చాడు. దేవకి పక్కలోఉన్న పసిబిడ్డను తీసుకున్నాడు. దేవకి (నా కూతురిని) విడిచిపెట్టు, విడిచిపెట్టు అని బాధగా మెల్లని కంఠస్వరంతో కంసుడిని అడ్డుకున్నది.

చిక్షేప చ శిలాపృష్ఠే సా క్షిప్తా వియతి స్థితిమ్ ।
అవాప రూపం చ మహత్ సాయుధాష్టమహాభుజమ్ ॥
ప్రజహాస తథైవోచ్చైః కంసం చ రుషితాబ్రవీత్ ॥ 30 ॥

ఆ మాటలు వినిపించుకోకుండా కంసుడు ఆ పసిదానిని బండరాతిమీదికి విసరికొట్టాడు. ఆ పిల్ల వెంటనే పై కెగిరి ఆకాశంలో నిలిచింది. ఆ యోగమాయ ఆయుధాలతో కూడిన ఎనిమిది బాహువులతో ఒకానొక విస్తారమైన ఆకారాన్ని ధరించింది. వికటాట్టహాసం చేసింది. కోపంతో కంసుడితో ఇలా అంది.

యోగమాయోవాచ :-కంసుడితో యోగమాయ ఇలా అంటున్నది.

కిం మయాక్షిప్తయా కంస జాతో యస్త్వాం హనిష్యతి ।
సర్వస్వభూతో దేవానామాసీన్మృత్యుః పురా స తే ॥
తదేతత్ సమ్ప్రధార్యాశు క్రియతాం హితమాత్మనః ॥ 31 ॥

కంసా! నన్ను ఎగరగొట్టినందువల్ల ప్రయోజనం ఏముంది? నిన్ను చంపేవాడు ఇప్పటికే పుట్టాడు. దేవత లందరికీ తానే సమస్తమైన దేవదేవుడు నీకు మృత్యువై, జన్మించాడు. ఇది గుర్తుంచుకో. ఇకనైనా నీకు మంచి జరిగే పనులు చేయి (దుర్మార్గపు పనులు మానుకో).

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా అంటున్నాడు.

ఇత్యుక్త్వా ప్రయయౌ దేవీ దివ్యస్రగ్గన్ధభూషణా ।
పశ్యతో భోజరాజస్య స్తుతా సిద్ధైర్విహాయసా ॥ 32 ॥

దివ్యమైన పూలమాలలు, సుగంధాలు, ఆభరణాలు ధరించిన ఆ యోగమాయ కంసుడితో ఇలా పలికి, అతడు చూస్తుండగా, సిద్ధులు స్తోత్రం చేస్తుండగా, ఆకాశమార్గంలో వెళ్లిపోయింది.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసఋషిసంవాదే శ్రీకృష్ణోత్పత్తికథానిరూపణం నామ త్రిసప్తతితమోఽధ్యాయః ॥ 73 ॥

శ్రీబ్రహ్మపురాణంలో వ్యాస ఋషి సంవాదంలో శ్రీకృష్ణోత్పత్తి కథా నిరూపణం అనే డెబ్బైమూడవ అధ్యాయం సంపూర్ణం.

చతుస్సప్తతితమోఽధ్యాయః - డెబ్బైనాల్గవ అధ్యాయం

కంసవిచారకథనమ్ - కంసవిచారకథనం

వ్యాస ఉవాచ :-మహర్షులతో వ్యాసుడు ఈవిధంగా చెప్తున్నాడు.

కంసస్త్వథోద్విగ్నమనాః ప్రాహ సర్వాన్ మహాసురాన్ ।
ప్రలమ్బకేశిప్రముఖానాహూయాసురపుఙ్గవాన్ ॥ 1 ॥

యోగమాయ హెచ్చరికతో కంసుడి మనసు బాగా కలవరపడింది. అతడు వెంటనే ప్రలంబుడు, కేశి మొదలుగా ప్రధానులైన రాక్షసనాయకు లందరిని తన వద్దకు పిలిపించాడు.

కంస ఉవాచ :-రాక్షసనాయకులతో కంసుడు ఇలా అంటున్నాడు.

హే ప్రలమ్బ మహాబాహో కేశిన్ ధేనుక పూతనే ।
అరిష్టాద్యైస్తథాచాన్యైశ్శ్రూయతాం వచనం మమ ॥ 2 ॥

ఓ ప్రలంబా! మహాబాహూ! కేశీ! ధేనుకాసురా! పూతనా! అరిష్టుడు మొదలైన ఇతర రాక్షసులారా! అందరూ నా మాట జాగ్రత్తగా వినండి.

మాం హన్తుమమరైర్యత్నః కృతః కిల దురాత్మభిః ।
మద్వీర్యతాపితాన్ వీరాన్ నత్వేతాన్ గణయామ్యహమ్[1] ॥ 3 ॥

దుర్మార్గులైన దేవతలు నన్ను చంపడానికి ప్రయత్నం చేశారు కదా! నా పరాక్రమంతో చావుదెబ్బలు తిని, బాధలు పడిన ఆ దేవవీరులను నేను లెక్కచేయను.

ఆశ్చర్యం కన్యయా చోక్తం జాయతే దైత్యపుఙ్గవాః ।
హాస్యం మే జాయతే వీరాస్తేషు యత్నపరేష్వపి ॥ 4 ॥

రాక్షసోత్తములారా! ఈ ఆడుపిల్ల మాటలకు నాకు చాల ఆశ్చర్యం కలుగుతున్నది. నన్ను చంపడానికి రకరకాలుగా తీవ్రంగా ప్రయత్నిస్తున్న దేవతలను చూస్తుంటే నాకు నవ్వు వస్తున్నది.

తథాఽపి ఖలు దుష్టానాం తేషామప్యధికం మయా ।
అపకారాయ దైత్యేన్ద్రా యతనీయం దురాత్మనామ్ ॥ 5 ॥

రాక్షసనేతలారా! అయినప్పటికీ ఎప్పుడూ దురాలోచనలు చేసే ఆ దుర్మార్గులకు వారికంటె ఎక్కువగా కీడు చేయడానికి నేను కూడ ప్రయత్నించవలసిందే.

ఉత్పన్నశ్చాపి మృత్యుర్మే భూతభవ్యభవత్ప్రభుః ।
ఇత్యేతద్ బాలికా ప్రాహ దేవకీగర్భసమ్భవా ॥ 6 ॥

---

1. ధరావాక్యేన దేవైశ్చ ప్రేషితో వాసవానుజః,
మద్వీర్యతాపితం వీరా నత్వేతం గణయామ్యహమ్. అని పాఠాంతరం.
భూదేవి విన్నపం మేరకు దేవతలు ఉపేంద్రుడిని నా మీదకు పురికొలిపి, పంపారు. వీరులారా! అతడు కూడ నా పరాక్రమానికి బాధలు పడ్డవాడే. అతడిని నేను లెక్కచేయను.

భూత భవిష్యద్ వర్తమానాలలో ఉండే లోకాలకు అన్నింటికీ అధిపతి అయిన విష్ణువు నాకు మరణంగా (నన్ను చంపడంకోసమే) పుట్టినట్లు దేవకి కూతురైన ఆ బాలిక చెప్పింది.

తస్మాద్ బాలేషు పరమో యత్నః కార్యో మహీతలే ।
యత్రోద్రిక్తం బలం బాలే స హన్తవ్యః ప్రయత్నతః ॥ 7 ॥

అందుచేత ఈ భూమిమీద కొత్తగా పుట్టిన బిడ్డలను గురించి దృఢమైన ప్రయత్నం చేయాలి. ఈ లోకంలో మిక్కిలి బలవంతుడుగా ఉన్న బాలుడిని తీవ్రంగా ప్రయత్నించి, పట్టుకుని చంపాలి.

వ్యాస ఉవాచ :-మహర్షులతో వ్యాసుడు ఇలా అంటున్నాడు.

ఇత్యాజ్ఞాప్యాసురాన్ కంసః ప్రవిశ్యాత్మగృహం తతః ।
ఉవాచ వసుదేవం చ దేవకీమవిరోధతః ॥ 8 ॥

రాక్షసులను ఈవిధంగా ఆజ్ఞాపించి, కంసుడు తనయింట్లోకి వెళ్లిపోయాడు. స్నేహం ఒలకబోస్తూ దేవకీ వసుదేవులతో ఇలా అన్నాడు.

కంస ఉవాచ :-దేవకీవసుదేవులతో కంసుడు ఇలా అంటున్నాడు.

యువయోర్ఘాతితా గర్భా వృథైవైతే మ యాధునా ।
కోఽప్యన్య ఏవ నాశాయ బాలో మమ సముద్గతః ॥ 9 ॥

ఇంతవరకు మీ బిడ్డలను అందరినీ నేను చంపాను. (చావు తప్పించుకోవాలని నేను చేసిన) ఆ ప్రయత్నం అంతా వ్యర్థం అయింది. నన్ను చంపడానికి ఇప్పుడు ఇంకొక డెవడో పుట్టాడట.

తదలం పరితాపేన నూనం యద్ భావినో హి తే ।
అర్భకా యువయోః కో వా ఆయుషోఽన్తే న హన్యతే ॥ 10 ॥

ఇంక మీరు బాధపడకండి.జరగవలసింది జరగక తప్పదు. మీ సంతానం ఎవరూ లేరు. అయినా, ఆయువు తీరిన తరువాత చావకుండా ఎవడుంటాడు. (మీ పిల్లలు ఆయువు తీరిన కారణంగా మరణించారు తప్ప, వారిని చంపడంలో నా తప్పు లేదు.)

వ్యాస ఉవాచ :-మహర్షులతో వ్యాసుడు ఇలా అంటున్నాడు.

ఇత్యాశ్వాస్య విముచ్యైవ కంసస్తౌ పరితోష్య చ ।
అన్తర్గృహం ద్విజశ్రేష్ఠాః ప్రవివేశ పునస్స్వకమ్ ॥ 11 ॥

కంసు డీవిధంగా దేవకీవసుదేవులను ఊరడించాడు. కారాగారం నుండి విడుదల చేసి, వారిని సంతోష పెట్టాడు.

ఇతిశ్రీబ్రహ్మపురాణే(వ్యాసర్షిసంవాదే)శ్రీకృష్ణబాలచరితే కంసవిచారకథనం నామ చతుస్సప్తతితమోఽధ్యాయః॥74॥

శ్రీబ్రహ్మపురాణంలో (వ్యాస ఋషి సంవాదంలో) బాలకృష్ణుడి చరిత్రలో కంసవిచార కథనం అనే డెబ్బైనాల్గవ అధ్యాయం సంపూర్ణం.

పఞ్చసప్తతితమోఽధ్యాయః - డెబ్బైఐదవ అధ్యాయం

పూతనాశకటవధః - పూతనాశకటవధ

వ్యాస ఉవాచ:-మహర్షులతో వ్యాసుడు ఈవిధంగా చెప్తున్నాడు.

విముక్తో వసుదేవోఽపి నన్దస్య శకటం గతః ।
ప్రహృష్టం దృష్టవాన్ నన్దం పుత్రో జాతో మమేతి వై ॥ 1 ॥

కంసుడు చెరసాలనుండి విడిచిపెట్టగా, వసుదేవుడు నందునిబండి యెక్కాడు. తనకు కొడుకు పుట్టినందుకు సంతసిస్తున్న నందుడిని చూచాడు.

వసుదేవోఽపి తం ప్రాహ దిష్ట్యా దిష్ట్యేతి సాదరమ్ ।
వార్ధకేఽపి సముత్పన్నస్తనయోఽయం తవాధునా ॥ 2 ॥

వసుదేవుడు నందుడితో ప్రేమగా ఇలా అంటున్నాడు. 'ఆహా! ఏమి అదృష్టం! ఇంత ముసలితనంలో కూడ ఇప్పుడు నీకు కుమారుడు జన్మించాడు గదా.

దత్తో హి వార్షికస్సర్వో భవద్భిర్నృపతేః కరః ।
యదర్థమాగతస్తస్మాన్నాత్ర స్థేయం మహాత్మనా ॥ 3 ॥

రాజుగారికి ఏటేటా కట్టవలసిన పన్ను మొత్తం కట్టేశారు కదా. మీరు వచ్చిన పని అయిపోయింది. మహాత్ములైనమీరు ఇంక ఇక్కడ ఉండరాదు.

యదర్థమాగతః కార్యం తన్నిష్పన్నం కిమాస్యతే ।
భవద్భిర్గమ్యతాం నన్ద తచ్ఛీఘ్రం నిజగోకులమ్ ॥ 4 ॥

నందా! మీరు వచ్చిన పని అయిపోయిన తరువాత ఇంకా ఆలస్యం ఎందుకు? మీ గోకులానికి తొందరగా వెళ్లిపొండి.

మమాపి బాలకస్తత్ర రోహిణీ ప్రసవో హి యః ।
సంరక్షణీయో భవతా యథాయం తనయో నిజః ॥ 5 ॥

రోహిణివలన నాకు కూడ అక్కడ కొడుకు పుట్టినాడు. ఆ పసివాడిని మీరు మీ సొంత కొడుకులాగా జాగ్రత్తగా కాపాడాలి.

వ్యాస ఉవాచ:-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్తాః ప్రయయుర్గోపా నన్దగోపపురోగమాః ।
శకటారోపితైర్భాణ్డైః కరం దత్త్వా మహాబలాః ॥ 6 ॥

వసుదేవుడి పలుకులు విని నందుడు మొదలుగా కలిగిన గొప్ప బలవంతులైన గోపాలకులు అందరూ కప్పం చెల్లించడం పూర్తి చేసి, కుండలను బండ్లమీది కెక్కించుకుని, వ్రేపల్లెకు వెళ్లిపోయారు.

వసతాం గోకులే తేషాం పూతనా బాలఘాతినీ ।
సుప్తం కృష్ణముపాదాయ రాత్రౌ చ ప్రదదౌ స్తనమ్ ॥ 7 ॥

వారు వ్రేపల్లెలో ఉంటుండగా, పసిపిల్లలను చంపే పూతన అనే రాక్షసి ఒకానొకనాడు రాత్రిసమయంలో నిద్రిస్తున్న బాలకృష్ణుడిని తీసుకుని వెళ్ళి పాలు ఇవ్వసాగింది.

యస్మై యస్మై స్తనం రాత్రౌ పూతనా సమ్ప్రయచ్ఛతి ।
తస్య తస్య క్షణేనాఙ్గం బాలకస్యోపహన్యతే ॥ 8 ॥

పూతన రాత్రిపూట చన్నిచ్చిన పిల్లలందరూ ఆ క్షణంలోనే చచ్చిపోయారు.

కృష్ణస్తస్యాః స్తనం గాఢం కరాభ్యామతిపీడితమ్ ।
గృహీత్వా ప్రాణసహితం పపౌ క్రోధసమన్వితః ॥ 9 ॥

బాలకృష్ణుడు మాత్రం పూతన చన్నులు రెండు చేతులతో పట్టుకుని, కోపంతో గట్టిగా నొక్కుతూ, పాలతోపాటు పూతన ప్రాణాలు కూడ పీల్చేశాడు.

సా విముక్తమహారావా విచ్ఛిన్నస్నాయుబన్ధనా ।
పపాత పూతనా భూమౌ మ్రియమాణాऽతిభీషణా ॥10 ॥

ఆ దెబ్బతో పూతన పెద్దగా కేకలు పెట్టూ, ప్రేగులు తెగిపోయి, మరణిస్తూ, అతిభయంకరంగా నేలవ్రాలింది.

తన్నాదశ్రుతిసన్త్రాసాద్ విబుద్ధాస్తే వ్రజౌకసః ।
దదృశుః పూతనోత్సఙ్గే కృష్ణం తాం చ నిపాతితామ్ ॥ 11 ॥

భయంకరమైన పూతన అరుపులు విని, గొల్లపల్లెవాసు లందరు మేలుకున్నారు. పూతన ఒడిలో ఉన్న కృష్ణుడిని చూశారు. చచ్చి పడిఉన్న పూతననూ చూశారు.

ఆదాయ కృష్ణం సన్త్రస్తా యశోదా చ తతో ద్విజాః ।
గోపుచ్ఛభ్రామణాద్యైశ్చ బాలదోషమపాకరోత్ ॥12 ॥

బ్రాహ్మణులారా! యశోద చాలా భయపడిపోయింది. వెంటనే బాలకృష్ణుడిని చేతులలోకి తీసుకున్నది. కృష్ణుడిచుట్టూ ఆవుతోకను తిప్పటం మొదలైన పనులతో పసివాడికి దృష్టిదోషాన్ని తొలగించింది.

గోపురీషముపాదాయ నన్దగోపోऽపి మస్తకే ।
కృష్ణస్య ప్రదదౌ రక్షాం కుర్వన్నిదముదైరయత్ ॥ 13 ॥

గోపాలకుడైన నందుడు కూడ ఆవుపేడను తెచ్చి బాలకృష్ణుడితలపై ఉంచి, పసివాడికి దుష్టులనుండి రక్షణను ఏర్పరిచాడు. పిదప ఈవిధంగా రక్షాకవచాన్ని పఠించాడు.

నన్ద ఉవాచ :-నందుడు అంటున్నాడు.

రక్షతు త్వామశేషాణాం భూతానాం ప్రభవో హరిః ।
యస్య నాభిసముద్భూతాత్ పఙ్కజాదభవ జ్జగత్ ॥ 14 ॥

శ్రీమహావిష్ణుదేవుడి బొడ్డునుండి పుట్టిన తామరపూవునుండి (అక్కడ ఉన్న బ్రహ్మదేవుడిద్వారా) ఈ జగత్తు సమస్తం పుట్టింది. చరాచరమైన భూతాలను అన్నింటిని సృష్టించిన ఆ శ్రీహరి నిన్ను రక్షించును గాక.

యేన దంష్ట్రాగ్రవిధృతా ధారయత్యవనీ జగత్ ।
వరాహరూపధృగ్ దేవస్స త్వాం రక్షతు కేశవః ॥ 15 ॥

ఆ శ్రీమహావిష్ణువే వరాహరూపాన్ని ధరించాడు. ఆ రూపంలో కోరకొనతో ఈ భూమిని ఉద్ధరించాడు. ఆ భూమే సమస్తమైన చరాచర జగత్తును మోస్తున్నది. ఆ ఆదివరాహస్వామి నిన్ను ఆపదలనుండి రక్షించును గాక.

నఖాఙ్కురవినిర్భిన్నవైరివక్షస్స్థలో విభుః ।
నృసింహరూపీ సర్వత్ర స త్వాం రక్షతు కేశవః ॥ 16 ॥

ఆ శ్రీమహావిష్ణువు పిదప నరసింహరూపాన్ని ధరించి వచ్చాడు. ఆ రూపంలో స్వామి రాక్షసుడైన హిరణ్య కశిపుడి గుండెలను చీల్చాడు. నరసింహస్వామి రూపంలో ఉన్న శ్రీమహావిష్ణువు నిన్ను అన్నిరకాలైన ఆపదలనుండి రక్షించును గాక.

గుహ్యం స జఠరం విష్ణుర్జఙ్ఘాపాదౌ జనార్దనః ॥ 17 ॥

నీ గుహ్యప్రదేశాన్నీ, ఉదరాన్నీ శ్రీమహావిష్ణువు రక్షించును గాక. పిక్కలనూ, పాదాలనూ జనార్దనస్వామి రక్షించును గాక.

వామనో రక్షతు సదా భవన్తం యః క్షణాదభూత్ ।
త్రివిక్రమక్రమాక్రాన్తత్రైలోక్యస్ఫురదాయుధః ॥ 18 ॥

ఒక్క క్షణంలో చూస్తుండగనే, త్రివిక్రమస్వరూపంతో మూడు లోకాలనూ ఆక్రమించి, శంఖచక్రాది ఆయుధాలతో ప్రకాశిస్తున్న వామనమూర్తి నిన్ను ఎల్లప్పుడు రక్షించును గాక.

శిరస్తే పాతు గోవిన్దః కణ్ఠం రక్షతు కేశవః ॥ 19 ॥

నీశిరస్సును గోవిందుడు బ్రోచును గాక. కంఠాన్ని కేశవుడు కాపాడును గాక.

ముఖబాహూ ప్రబాహూ చ మనస్సర్వేన్ద్రియాణి చ ।
రక్షత్వవ్యాహతైశ్వర్యస్తవ నారాయణోఽవ్యయః ॥ 20 ॥

శాశ్వతుడూ, ఎదురు లేని ప్రభుత్వం కలిగినవాడూ అయిన శ్రీమన్నారాయణుడు నీ ముఖాన్నీ, భుజాలనూ, ముంజేతులనూ, మనస్సు మొదలైన ఇంద్రియాలన్నింటినీ రక్షించును గాక.

త్వాం దిక్షు పాతు గోవిన్దో విదిక్షు మధుసూదనః ।
హృషీకేశోఽమ్బరే భూమౌ రక్షతు త్వాం మహీధరః ॥ 21 ॥

తూర్పు మొదలైన అన్ని దిక్కులలోనూ నిన్ను గోవిందుడు కాపాడును గాక. ఆగ్నేయం మొదలుగా అన్ని మూలలలో నిన్ను మధుసూదనుడు రక్షించును గాక. ఆకాశంలో హృషీకేశుడూ, నేలమీద మహీధరస్వామి కాపాడును గాక.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఏవం కృతస్వస్త్యయనో నన్దగోపేన బాలకః ।
శాయితశ్శకటస్యాధో బాలపర్యఙ్కికాతలే ॥ 22 ॥

ఈవిధంగా గోపనాయకుడైన నందుడు బాలకృష్ణుడికి మంగళాశాసనాలు చేశాడు. తరువాత యశోద ఆ పసివాడిని ఒకానొక బండికింద బిడ్డపొత్తిళ్లలో పడుకోబెట్టింది.

తే చ గోపా మహద్దృష్ట్వా పూతనాయాః కలేబరమ్ ।
మృతాయాః పరమం త్రాసం విస్మయం చ పరం యయుః ॥ 23 ॥

ఆ గొల్లవాళ్లు మరణించిన పూతన మహాశరీరాన్ని చూసి, ఎంతో భయపడ్డారు. ఇంకా చాల ఆశ్చర్యపడ్డారు.

కదాచిచ్ఛకటస్యాధశ్శయానో మధుసూదనః ।
చిక్షేప చరణావూర్ధ్వం స్తనార్థం ప్రరురోద చ ॥ 24 ॥

బండికింద పడుకున్న బాలకృష్ణుడు ఆకలై, పాలకోసం ఏడుస్తూ, రెండుకాళ్లూ పైకి ఎగురవేశాడు.

తస్య పాదప్రహారేణ శకటం పరివర్తితమ్ ।
విధ్వస్తభాణ్డకుమ్భం తద్విపరీతం పపాత వై ॥ 25 ॥

బాలకృష్ణుడి కాలిదెబ్బకు ఆ బండి తిరగబడింది. ఆ బండిలో ఉన్న పాలకుండలన్నీ తలక్రిందులుగా పడిపోయాయి.

తతో హాహాకృతస్సర్వో గోపగోపీజనో ద్విజాః ।
ఆజగామ తదా జ్ఞాత్వా బాలముత్తానశాయినమ్ ॥ 26 ॥

విప్రులారా! అప్పుడు గొల్లలు, ఆడవారు, మగవారు అందరూ భయంతో హాహాకారాలు చేశారు. అందరూ అక్కడికి చేరుకున్నారు. పిల్లవాడు వెల్లకిల పడుకుని ఉండటం చూశారు.

గోపాః కేనేతి జగదుశ్శకటం పరివర్తితమ్ ।
తత్రైవ బాలకాః ప్రోచుర్బాలేనానేన పాతితమ్ ॥ 27 ॥

గొల్లపెద్దలు ఈ బండిని ఇలా తలకిందులుగా పడేసిం దెవరని అడిగారు? అక్కడ ఉన్న పిల్లలు ఈ బాలకృష్ణుడే పడేశాడని చెప్పారు.

రుదతా దృష్టమస్మాభిః పాదవిక్షేపతాడితమ్ ।
శకటం పరివృత్తం వై నైతదన్యస్య చేష్టితమ్ ॥ 28 ॥

మేము కూడా కృష్ణుడి కేమైందో అని ఏడుస్తూ చూశాం. కృష్ణుడి కాలిదెబ్బకే బండి ఇలా తిరగబడింది. ఇతరు లెవ్వరూ ఈ పని చేయలేదు. (అని చెప్పారు)

తతః పునరతీవాసన్ గోపా విస్మితచేతసః ।
నన్దగోపోఽపి జగ్రాహ బాలమత్యన్తవిస్మితః ॥ 29 ॥

ఆ మాటలకు గొల్లపెద్దలు మళ్లీ ఎంతో ఆశ్చర్యపడ్డారు. నందుడు కూడ మిక్కిలి ఆశ్చర్యంతో బాలకృష్ణుడిని దగ్గరకు తీసుకున్నాడు.

యశోదా విస్మయారూఢా భగ్నభాణ్డకపాలకమ్ ।
శకటం చార్చయామాస దధిపుష్పఫలాక్షతైః ॥ 30 ॥

ముక్క లైన కుండపెంకులను చూచి, యశోద ఇంకా ఎంతో ఆశ్చర్యపడింది. పెరుగు, పూలు, పండ్లు, అక్షతలతో ఆ బండిని పూజించింది.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసఋషిసంవాదే పూతనాశకటవధో నామ పఞ్చసప్తతితమోఽధ్యాయః ॥ 75 ॥

శ్రీబ్రహ్మపురాణంలో వ్యాస ఋషి సంవాదంలో పూతనాశకటవధ అనే డెబ్భైఐదవ అధ్యాయం సంపూర్ణం.



షట్సప్తతితమోఽధ్యాయః - డెబ్బైఆరవ అధ్యాయం

బృందావనప్రవేశవర్ణనమ్ - బృందావన ప్రవేశ వర్ణనం

వ్యాస ఉవాచ :-మహర్షులతో వ్యాసుడు ఈవిధంగా చెప్తున్నాడు.

గర్గశ్చ గోకులే తత్ర వసుదేవప్రచోదితః ।
ప్రచ్ఛన్న ఏవ గోపానాం సంస్కారమకరోత్తయోః ॥ 1 ॥

పిల్లలకు నామకరణాది సంస్కారాలు చేయడానికి వసుదేవుడు గర్గాచార్యులను ఏర్పరిచాడు. గర్గుడు (కంసుడికి తెలియకుండా) రహస్యంగా యశోదబిడ్డకు, రోహిణిబిడ్డకు నామకరణాది సంస్కారాలు చేశాడు.

జ్యేష్ఠం చ రామమిత్యాహ కృష్ణం చైవ తథాపరమ్ ।
గర్గో మతిమతాం శ్రేష్ఠో నామ కుర్వన్ మహామతిః ॥ 2 ॥

జ్ఞానులలో శ్రేష్ఠుడూ, బుద్ధిమంతుడూ అయిన గర్గుడు, ఆ పిల్లలలో పెద్దవాడికి (రోహిణి కుమారుడికి) రాముడు అనీ, చిన్నవాడికి (యశోద తనయుడికి) కృష్ణుడు అనీ నామకరణం చేశాడు.

అల్పేనైవ హి కాలేన విజ్ఞాతౌ తౌ మహాబలౌ ।
ఘృష్టజానుకరౌ విప్రా బభూవతురుభావపి ॥ 3 ॥

బ్రాహ్మణులారా! ఆ పిల్లలు కొద్దికాలంలోనే గొప్ప శక్తిమంతు లని అందరికీ తెలిసిపోయింది. ఇద్దరూ చేతులు మోకాళ్లు నేలకు ఒరుసుకుంటుండగా పాకే స్థితిలోకి వచ్చారు.

కరీషభస్మదిగ్ధాఙ్గౌ భ్రమమాణావితస్తతః ।
న వారయితుముత్సేహే యశోదా తౌ న రోహిణీ ॥ 4 ॥

ఆవుపేడ పిడకలు కాల్చిన బూడిదను ఒంటినిండా పూసుకుని, గొల్లపల్లెలో ఇటూ అటూ తిరుగుతూ ఉన్న రామ కృష్ణులను, యశోద కాని, రోహిణి కాని ఆపడానికి ఇష్టపడలేదు. (ఊరంతా ఇష్టం వచ్చినట్లుగా తిరిగేవారు.)

గోవాటమధ్యే క్రీడన్తౌ వత్సవాటగతౌ పునః ।
తదహర్జాతగోవత్సపుచ్ఛాకర్షణతత్పరౌ ॥ 5 ॥

ఒకసారి ఆవులు ఉండేచోట ఆడుకునేవారు. మరొకసారి దూడలదొడ్డిలో తిరుగుతుండేవారు. ఆ రోజే పుట్టిన లేగదూడల తోకలను పట్టుకుని లాగుతుండేవారు.

యదా యశోదా తౌ బాలావేకస్థానచరావుభౌ ।
శశాక నో వారయితుం క్రీడన్తావతిచఞ్చలౌ ॥ 6 ॥

ఒకచోట క్షణం నిలవకుండా రామకృష్ణులు ఇద్దరూ కలిసి, తిరుగుతూ ఆడుకుంటూ ఉండగా, వారిని ఆపడం యశోదకు చేతకాలేదు.

దామ్నా బద్ధ్వా తదా మధ్యే నిబబన్ధ ఉలూఖలే ।
కృష్ణమక్లిష్టకర్మాణమాహ చేద మమర్షితా ॥ 7 ॥

అప్పుడు యశోద బాలకృష్ణుడిని తాడుతో బంధించి, ఆ తాడు రోటిమధ్యలో కట్టివేసింది. చిలిపి పనుల చిన్నవాడితో కోపంతో ఇలా అన్నది.

యశోదోవాచ :–బాలకృష్ణుడితో యశోద ఇలా అంటున్నది.

యది శక్తోఽసి గచ్ఛ త్వమతిచఞ్చలచేష్టిత ॥ 8 ॥

చపలచిత్తంతో అల్లరిపనులు చేసేవాడా! చేతనైతే ఈ కట్టు వదిలించుకుని వెళ్లు. (అన్నది.)

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసుడు ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్త్వా చ నిజం కర్మ సా చకార కుటుమ్బినీ ॥ 9 ॥

చిన్నికృష్ణుడిని ఇలా బెదిరించి, ఆ యిల్లాలు యశోద ఇంటిపనులు చేసుకుంటున్నది.

వ్యగ్రాయామథ తస్యాం స కర్షమాన ఉలూఖలమ్ ।
యమలార్జునయోర్మధ్యే జగామ కమలేక్షణః ॥ 10 ॥

యశోద ఇంటిపనులలో పరాకుగా ఉండగా, చిన్నికృష్ణుడు తనను కట్టిన రోటిని లాక్కొని, రెండు మద్దిచెట్ల నడుమకు వెళ్లాడు.

కర్షతా వృక్షయోర్మధ్యే తిర్యగేవములూఖలమ్ ।
భగ్నావుత్తుఙ్గశాఖాగ్రౌ తేన తౌ యమలార్జునౌ ॥ 11 ॥

ఆ మద్దిచెట్ల మధ్యలోనుంచి రోటిని అడ్డంగా వేసి లాగుతుంటే, బాగా ఎత్తయిన కొమ్మలతో వున్న ఆ చెట్లు రెండూ ఒక్కసారిగా నేలకూలాయి.

తతః కటకటాశబ్దసమాకర్ణనకాతరః ।
ఆజగామ వ్రజజనో దదృశే చ మహాద్రుమౌ ॥
భగ్నస్కన్ధౌ నిపతితౌ భగ్నశాఖౌ మహీతలే ॥ 12 ॥

ఆ చెట్లు విరిగిపడేసమయంలో వెలువడిన కట, కటా అనే మహాధ్వనిని విని, భయపడిన గొల్లలు పరుగెత్తుకుని అక్కడికి వచ్చారు. కొమ్మలు, మానులు విరిగి నేలమీద పడిపోయిన మహావృక్షాలను చూశారు.

దదర్శ చాల్పదన్తాస్యం స్మితహాసం చ బాలకమ్ ।
తయోర్మధ్యగతం బద్ధం దామ్నాగాఢం తథోదరే ॥ 13 ॥

పొట్టకు గట్టిగాకట్టిన తాడుతో ఆ రెండు మద్దిచెట్లమధ్యలో వచ్చీరాని దంతాలతో, చిరునవ్వులు చిందిస్తూ ఉన్న బాలకృష్ణుడిని చూశారు.

తతశ్చ దామోదరతాం స యయౌ దామబన్ధనాత్ ॥ 14 ॥

ఉదరానికి కట్టిన దామంతో (చూపిన మహిమలవలన అప్పుడినుండి) స్వామికి దామోదరుడు అనే పేరు వచ్చింది.

గోపవృద్ధాస్తతస్సర్వే నన్దగోపపురోగమాః ।
మన్త్రయామాసురుద్విగ్నా మహోత్పాతాదిభీరవః ॥ 15 ॥

గోపనాయకుడైన నందుడు మొదలుగా గొల్లపెద్ద లందరు గొల్లపల్లెలో జరుగుతున్న పెద్దపెద్ద కీడులకు భయపడిపోయారు. కలవరపాటుతో అందరూ కలిసి ఆలోచనలు చేయసాగారు.

స్థానేనేహ న నః కార్యం వ్రజామోఽన్యన్మహావనమ్ ।
ఉత్పాతా బహవో హ్యత్ర దృశ్యన్తే నాశహేతవః ॥ 16 ॥

ఇక మనకు ఈ చోటితో పని లేదు. ఇక్కడ ఎన్నో ఉపద్రవాలు వచ్చిపడుతున్నాయి. ఇటువంటి ప్రమాదాలకు దూరంగా వేరొక మంచిచోటికి వెళ్ళిపోదాం.

పూతనాయా వినాశశ్చ శకటస్య విపర్యయః ।
వినా వాతాదిదోషేణ ద్రుమయోః పతనం తథా ॥17 ॥

ఇక్కడ పూతన మరణించింది. బండి తలక్రిందులైంది. సుడిగాలివంటి కారణాలు లేకుండానే ఇపుడు పెద్దపెద్ద చెట్లు కూలిపోయాయి.

బృన్దావనమితః స్థానాత్ తస్మాద్ గచ్ఛామ మా చిరమ్ ।
యావద్ భౌమమహోత్పాతదోషో నాభిభవేద్ వ్రజమ్ ॥ 18 ॥

ఇక్కడికి దగ్గరలోనే బృందావనం ఉంది. ఆలస్యం చేయకుండా అక్కడికి వెళ్లిపోదాం. పదండి. ఇంకా పెద్దపెద్ద ఉపద్రవాలు గొల్లపల్లెను ముంచివేయకముందే ఇక్కడినుంచి బయలుదేరుదాం.

ఇతి కృత్వా మతిం సర్వే గమనే తే వ్రజౌకసః ।
ఊచు స్స్వం స్వం కులం శీఘ్రం గమ్యతాం మా విలమ్బ్యతామ్ ॥ 19 ॥

బృందావనానికి వెళ్లిపోదామని నిశ్చయించుకుని వ్రేపల్లెవాసులు అందరూ తమ తమ వారినందరినీ 'తొందరగా రండి, ఎంత మాత్రమూ ఆలస్యం చేయవద్దు' అని చెప్పారు.

తతః క్షణేన ప్రయయుశ్శకటైర్గోధనైస్తథా ।
యూథశో వత్సపాలీశ్చ కాలయన్తో వ్రజౌకసః ॥ 20 ॥

వెంటనే ఒక్కక్షణంలో బండ్లతోనూ, ఆవులమందలతోనూ, కలిసి బయలుదేరారు. ఆవులను మేపేవారినీ, ఇంకా వ్రేపల్లెలో నివసిస్తున్నవారి నందరినీ త్వరగా రమ్మని పిలుస్తూ, గుంపులు గుంపులుగా వ్రేపల్లెవాసులు బృందావనానికి తరలివెళ్లారు.

ద్రవ్యావయవనిర్ధూతం క్షణమాత్రేణ తత్ తదా ।
కాకకాకీసమాకీర్ణం వ్రజస్థానమభూద్ ద్విజాః ॥ 21 ॥

విప్రులారా! ఊరిలో ఉన్నవారందరూ తమ తమ సామగ్రితో సహా వెళ్లిపోవడంతో ఆ వ్రేపల్లె ఒక్కక్షణంలో శూన్యమైంది. గొల్లలు నివసించే ఆ చోటు (మనుష్యసంచారం లేక) కాకుల రొదలతో నిండిపోయింది.

బృన్దావనం భగవతా కృష్ణేనాక్లిష్టకర్మణా ।
శుభేన మనసా ధ్యాతం గవాం వృద్ధిమభీప్సతా ॥ 22 ॥

ఎప్పుడూ ఏపనినైనా సమర్థంగా, సులువుగా చేయగలిగిన కృష్ణభగవానుడు ఆవుల అభివృద్ధిని కోరుతూ, మంచిమనసుతో బృందావనాన్ని ధ్యానించాడు.

తతస్తత్రాతిరూక్షోఽపి ఘర్మకాలే ద్విజోత్తమాః ।
ప్రావృట్కాల ఇవాభూచ్చ నవశష్పం సమన్తతః ॥ 23 ॥

దానివల్ల మిక్కిలిగా తాపం కలిగించే గ్రీష్మకాలం కూడ బృందావనంలో వానల కాలంలాగా అయింది. నూతనమైన లేతపచ్చికలు ఆ ప్రాంతమంతటా విస్తరించాయి.

స సమావాసితస్సర్వో వ్రజో బృన్దావనే తతః ।
శకటీవాటపర్యన్తచన్ద్రార్ధాకారసంస్థితిః ॥ 24 ॥

వ్రేపల్లెవాసు లందరూ ఇప్పుడు బృందావనంలో బండ్లను అర్ధచంద్రాకారంలో నిలిపి, అక్కడ స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. (ఊరు అర్ధచంద్రాకారంలో ఉంది.)

వత్సపాలౌ చ సంవృత్తౌ రామదామోదరౌ తదా ।
తత్ర స్థితౌ తౌ చ గోష్ఠే చేరతుర్బాలలీలయా ॥ 25 ॥

బృందావనంలో బలరామకృష్ణులు ఆవుల కాపరులైనారు. అక్కడ వారు గొడ్లచావళ్లలో పిల్లచేష్టలతో ఆడుకున్నారు.

బర్హిపుచ్ఛకృతాపీడౌ వన్యపుష్పావతంసకౌ ।
గోపవేణుకృతాతోద్యపత్రవాద్యకృతస్వనౌ ॥ 26 ॥

సిగలలో నెమలిపింఛాలు ధరించారు. బృందావనంలోని పూవులను చెవులకు ఆభరణాలుగా అందంగా అలంకరించుకున్నారు. వెదురుతోనూ, ఆకులతోనూ, చేసిన పిల్లనగ్రోవులు మొదలైన వివిధ వాద్యాలతో మనోహరమైన సంగీతాన్ని ఆలపించారు.

కాకపక్షధరౌ బాలౌ కుమారావివ పావకౌ ।
హసన్తౌ రమన్తౌ చ చేరతుస్తన్మహద్వనమ్ ॥ 27 ॥

చెవికి ప్రక్కగా చుట్టుకున్న జట్టుతో బాలకులైన ఆ బలరామకృష్ణ కుమారులు అగ్నిశిఖల వలె ఉన్నారు. నవ్వుతూ, తుళ్లుతూ వాళ్లు ఆ బృందావన మంతటా తిరిగారు.

క్వచిద్ధసన్తావన్యోన్యం క్రీడమానౌ తథా పరైః ।
గోపపుత్రైస్సమం వత్సాంశ్చారయన్తౌ విచేరతుః ॥ 28 ॥

ఒకప్పుడు నవ్వుతూ ఇద్దరూ కలిసి ఆడుకుంటారు. మరొకసారి ఇతరులతో కలిసి ఆడుకుంటారు. మిగిలిన గొల్లపిల్లలతో సమానంగా ఆవుదూడలను తోలుతూ బృందావన మంతటా సంచరిస్తుంటారు.

కాలేన గచ్ఛతా తౌ తు సప్తవర్షౌ బభూవతుః ।
సర్వస్య జగతః పాలౌ వత్సపాలౌ మహావ్రజే ॥ 29 ॥

ఇలా కాలం గడుస్తూ ఉండగా వారికి ఏడు సంవత్సరాల వయసు వచ్చింది. సమస్త లోకాలను రక్షించే రామకృష్ణులు ఆ బృందావనంలో దూడలను కాచేవారైనారు.

ప్రావృట్కాలస్తతోఽతీవ మేఘౌఘస్థగితామ్బరః ।
బభూవ వారిధారాభిరైక్యం కుర్వన్ దిశామివ ॥ 30 ॥

ఇంతలో వానాకాలం వచ్చింది. ఆ సమయంలో మబ్బుల గుంపులు ఆకాశాన్ని కప్పివేశాయి. వర్షధారలతో దిక్కులన్నీ ఒక్కటయ్యాయి. (దిక్కు తోచకుండా వర్షధారలు దట్టంగా వ్యాపించాయి.)

ప్రరూఢనవపుష్పాఢ్యా శక్రగోపవృతా మహీ ।
యథా మారకతేవాసీత్ పద్మరాగవిభూషితా ॥ 31 ॥

నేల అంతటా చెట్లనిండా, కొత్తగా పూచిన పూలు దట్టంగా ఉన్నాయి. ఆరుద్రపురుగులు నేలను కప్పివేశాయి. నేల మరకతమణులు పరచి, నడుమ నడుమ అలంకారంగా పద్మరాగమణులు పొదిగినట్లుగా ఉంది.

ఊహురున్మార్గగామీని నిమ్నగామ్భాంసి సర్వతః ।
మనాంసి దుర్వినీతానాం ప్రాప్య లక్ష్మీం నవామివ ॥ 32 ॥

నడుమంత్రపుసిరి గలిగిన దుర్మార్గుల మనస్సులలాగా, నదులలోని నీళ్లు వరదలై, (కట్టుబాటు లేకుండా) ఇష్టం వచ్చిన విధంగా చెలరేగి ప్రవహిస్తున్నాయి.

వికాలే చ యథాకామం వ్రజమేత్య మహాబలౌ ।
గోపైస్సమానైస్సహితౌ చిక్రీడాతేఽమరా వివ ॥ 33 ॥

మిక్కిలి బలవంతులైన బలరామకృష్ణులు విశిష్టమైన ఆ సమయంలో బృందావనానికి వచ్చి, తమతో సమానమైన వయస్సు కలిగిన గోపబాలకులతో కలిసి దేవకుమారులలాగా విహరిస్తున్నారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే (వ్యాసఋషిసంవాదే) బాలచరితే బృన్దావనప్రవేశవర్ణనం నామ షట్సప్తతితమోఽధ్యాయః ॥ 76 ॥

శ్రీబ్రహ్మపురాణంలో (వ్యాస ఋషి సంవాదంలో) బాలచరిత్రలో బృందావనప్రవేశం అనే డెబ్బైఆరవ అధ్యాయం ॥ 76 ॥

సప్తసప్తతితమోఽధ్యాయః - డెబ్బైఏడవ అధ్యాయం
కాలీయదమననిరూపణమ్ - కాలీయ దమన నిరూపణం

వ్యాస ఉవాచ :-మహర్షులతో వ్యాసుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఏకదా తు వినా రామం కృష్ణో బృన్దావనం యయౌ ।
విచచార వృతో గోపైర్వన్యపుష్పస్రగుజ్జ్వలః ॥ 1 ॥

ఒకసారి బలరాముడు తోడు లేకుండా, కృష్ణుడొక్కడే బృందావనానికి వెళ్లాడు. ఒంటినిండా అడవిపూల మాలలతో కృష్ణస్వామి వెలిగిపోతున్నాడు. గొల్లలు కృష్ణుడిచుట్టూ చేరారు.

స జగామాథ కాలిన్దీం లోలకల్లోలశాలినీమ్ ।
తీరసంలగ్నఫేనౌఘైర్హసన్తీమివ సర్వతః ॥ 2 ॥

గొల్లపిల్లలతో కలిసి కృష్ణుడు కాళిందినది వద్దకు వెళ్లాడు. ఆ నదిలో అలలు వేగంగా కదులుతున్నాయి. ఒడ్డువెంట దట్టంగా పేరుకున్న నురుగుతో, ఆ నది అన్నివైపులనుంచీ నవ్వుతున్నట్లుగా ఉంది.

తస్యాం చాతిమహాభీమం విషాగ్నికణదూషితమ్ ।
హ్రదం కాలీయనాగస్య దదర్శాతివిభీషణమ్ ॥ 3 ॥

ఆ కాళిందీనదిలో ఒక్క మడుగును చూశాడు. అది మిక్కిలి భయంకరంగా ఉంది. విషం అనే నిప్పుకణికలు వ్యాపించి, దగ్గరకు రావడానికి వీలు లేకుండా ఉంది. ఆ మడుగులో కాళీయుడు అనే సర్పం నివసిస్తున్నది. దానివల్ల అది ఇంకా భయం కలిగిస్తున్నది.

విషాగ్నినా విసరతా దగ్ధతీరమహాతరుమ్ ।
వాతాహతామ్బువిక్షేపస్పర్శదగ్ధవిహఙ్గమమ్ ॥ 4 ॥

ఎగసి పడేవిషాగ్నిజ్వాలలతో కాళిందీనది ఒడ్డున ఉన్న పెద్దపెద్దచెట్లు అన్నీ తగలబడిపోయాయి. గాలితాకిడికి పైకి లేచిన విషపునీటి తాకిడికి అక్కడి పక్షులు మాడి మసి అయ్యాయి.

తమతీవ మహారౌద్రం మృత్యువక్త్రమివాపరమ్ ।
విలోక్య చిన్తయామాస భగవాన్ మధుసూదనః ॥ 5 ॥

ఆ కాలీయుడి మడుగు మిక్కిలి భయంకరంగా మరొక మృత్యుముఖంలాగా ఉంది. దానిని చూసి, కృష్ణ భగవానుడు ఇలా ఆలోచించసాగాడు.

అస్మిన్ వసతి దుష్టాత్మా కాలీయోఽసౌ విషాయుధః ।
యో మయా నిర్జితస్త్యక్త్వా దుష్టో నష్టః పయోనిధౌ ॥ 6 ॥

క్రూరుడైన కాలియుడు విషమే ఆయుధంగా ధరించి, ఈ మడుగులో నివసిస్తున్నాడు. ఇంతకు ముందు నా చేతిలో ఓడిపోయిన కాళియుడు సముద్రం విడిచి పారిపోయి ఇక్కడ తలదాచుకున్నాడు.

తేనేయం దూషితా సర్వా యమునా సాగరఙ్గమా ।
న నరైర్గోధనైర్వాఽపి తృషార్తైరుపభుజ్యతే ॥ 7 ॥

సముద్రంలో కలిసే ఈ కాళిందీనది మొత్తం క్రూరుడైన ఆ కాళీయుడిమూలంగా పాడయిపోయింది. మనుషులు గానీ, ఆవులు(జంతువులు)గానీ దాహంతో ఎంత బాధ కలిగినా, ఈ కాళిందీ నదీజలాన్ని తాగడంలేదు.

తదస్య నాగరాజస్య కర్తవ్యో నిగ్రహో మయా ।
నిత్యత్రస్తాస్సుఖం యేన చరేయుర్వ్రజవాసినః ॥ 8 ॥

ఆ కాళీయనాగరాజును నేను అణచివేయవలసిఉంది. ఈ పామువల్ల నిరంతరం భయంతో జీవించే గొల్లపల్లె నివాసులు దీనిని శిక్షిస్తేనే ఇక్కడ సుఖంగా తిరగగలుగుతారు.

ఏతదర్థం నృలోకేఽస్మిన్నవతారో మయా కృతః ।
యదేషాముత్పథస్థానాం కార్యా శాస్తిర్దురాత్మనామ్ ॥ 9 ॥

ఇందుకోసమే నేను మానవలోకంలో అవతరించాను. సాధువులను కాపాడడంకోసం రెచ్చిపోతున్న దుర్మార్గులను తప్పకుండా శిక్షించాలి. వాళ్ళకు తగిన శాస్తి చేయాలి.

తదేతన్నాతిదూరస్థం కదమ్బమురుశాఖినమ్ ।
అధిరుహ్యోత్పతిష్యామి హ్రదేఽస్మిన్ జీవనాశినః ॥ 10 ॥

ఇదుగో, ఈ కడిమిచెట్టు ఈ మడుగుకు చాల దగ్గరగా ఉంది. ఈ చెట్టునెక్కి, జీవులను చంపుతున్న ఈ మడుగులోకి దూకుతాను.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్థం విచిన్త్య బధ్వా చ గాఢం పరికరం తతః ।
నిపపాత హ్రదే తత్ర సర్పరాజస్య వేగతః ॥ 11 ॥

ఈవిధంగా ఆలోచిస్తూ, కృష్ణుడు ఉత్తరీయాన్ని నడుముకు గట్టిగా బిగించి, కాళీయుడి మడుగులోకి వేగంగా దూకాడు.

తేనాపి పతతా తత్ర క్షోభితస్స మహాహ్రదః ।
అత్యర్థదూరజాతాంశ్చ తాంశ్చాసిఞ్చన్మహీరుహాన్ ॥ 12 ॥

కృష్ణుడు వేగంగా వచ్చిపడడంతో ఆ మడుగులోనినీరు కల్లోలితమై, చుట్టుపక్కల ఎగిసిపడింది. ఆ నీళ్లు దూరంగా ఉన్న చెట్లను గూడ పూర్తిగా తడిపివేశాయి.

తేఽహి దుష్టవిషజ్వాలాతప్తామ్బుతపనోక్షితాః ।
జజ్వలుః పాదపాస్సద్యో జ్వాలావ్యాప్తదిగన్తరాః ॥ 13 ॥

భయంకరమైన విషాగ్నికీలలతో కాగిన నీళ్ళతో తడిసిన ఆచెట్లు నిప్పు అంటుకుని మండాయి. ఆ మంటలు దిక్కులన్నిట కమ్ముకున్నాయి.(కాళియుడి విషం నీళ్లు కూడ నిప్పులయ్యేంత భయంకరంగా ఉంది.)

ఆస్ఫోటయామాస తదా కృష్ణో నాగహ్రదం భుజైః ।
తచ్ఛబ్దశ్రవణాచ్చాథ నాగరాజోऽభ్యుపాగమత్ ॥ 14 ॥

కృష్ణస్వామి కాళీయుడి మడుగును రెండుచేతులతోనూ కొట్టసాగాడు. ఆ దెబ్బల చప్పుడుకు కాళీయనాగరాజు మడుగులోనుండి పైకి వచ్చాడు.

ఆతామ్రనయనః కోపాద్ విషజ్వాలాకులైః ఫణైః ।
వృతో మహావిషైశ్చాన్యైరరుణైరనిలాశనైః ॥ 15 ॥

కాళియుడికి విపరీతమైన కోపం వచ్చింది. ఆ కోపంతో అతడి కళ్లు బాగా ఎరుపెక్కాయి. పడగలు విషాగ్నిజ్వాలలను వెలువరిస్తున్నాయి. భయంకరమైన విషం కలిగిన ఎఱ్ఱని సర్పాలు మరి కొన్ని ఆ కాళీయుడి చుట్టూ చేరి, సేవిస్తున్నాయి.

నాగపత్న్యశ్చ శతశో హారిహారోపశోభితాః ।
ప్రకమ్పితతనూత్క్షేపచలత్కుణ్డలకాన్తయః ॥ 16 ॥

కాళియుడి భార్యలు వందల కొలదిగా ఉన్నారు.వారు మనోహరమైన హారాలు ధరించి అందంగా ఉన్నారు. వారి ఒళ్లు (కోపంతో) కంపిస్తున్నది. చెవికమ్మలు ఊగుతుండగా, అందులోని మణులకాంతులు కదిలి ఆడుతున్నాయి.

తతః ప్రవేష్టితస్సర్పైస్స కృష్ణో భోగబన్ధనైః ।
దదంశుశ్చాపి తే కృష్ణం విషజ్వాలావిలైర్ముఖైః ॥ 17 ॥

మడుగు వెలుపలికి వచ్చిన పాములన్నీ కృష్ణస్వామిని చుట్టుముట్టాయి. తమ తమ పడగలతో కృష్ణుడిని కట్టి పడేశాయి. అన్నీ కలిసి, భయంకరమైన విషాగ్నులు కక్కే నోళ్లతో కృష్ణుడిని కాటువేశాయి.

తం తత్ర పతితం దృష్ట్వా నాగభోగనిపీడితమ్ ।
గోపా వ్రజముపాగత్య చుక్రుశుశ్శోకలాలసాః ॥ 18 ॥

కృష్ణుడు ఆ పాముల పడగదెబ్బలకు పడిపోయాడు. అది చూచిన గొల్లవాళ్లు గొల్లపల్లెకు వెళ్లి, దుఃఖంతో ఏడువసాగారు.

గోపా ఊచుః :-పాములదెబ్బలకు పడిపోయినకృష్ణుడిని చూచి, గొల్లవాళ్లు బాధతో ఇలా అంటున్నారు.

ఏష కృష్ణో గతో మోహాన్మగ్నో వై కాలియే హ్రదే ।
భక్ష్యతే సర్పరాజేన తదాగచ్ఛత మా చిరమ్ ॥ 19 ॥

ఇదుగో కృష్ణుడు బుద్ధి లేకుండా, కాళీయుడి మడుగులోకి దిగాడు. అక్కడ నాగరాజు కాళీయుడు కృష్ణుడిని తినేస్తున్నాడు. వెంటనే అందరూ రండి. ఆలస్యం చేయవద్దు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఏతచ్ఛ్రుత్వా తతో గోపా వజ్రపాతోపమం వచః ।
గోప్యశ్చ త్వరితా జగ్ముర్యశోదాప్రముఖా హ్రదమ్ ॥ 20 ॥

వజ్రం దెబ్బలవంటి ఈ మాటలు విని, యశోద మొదలుగా ఆడవాళ్లు, మగవాళ్లు గొల్లలందరూ త్వరత్వరగా కాళీయుడి మడుగువద్దకు వెళ్లారు.

హా హా క్వాసావితి జనో గోపీనామతివిహ్వలః ।
యశోదాయా సమం భ్రాన్తో ద్రుతః ప్రస్ఖలితో యయౌ ॥ 21 ॥

యశోదతో సమానంగా గొల్లస్త్రీలు అందరూ 'అయ్యయ్యో, ఈ కృష్ణుడెక్కడ?' అంటూ బెదిరిపోయి, తడబడుతున్న అడుగులతో త్వరత్వరగా అక్కడికి వచ్చారు.

నన్దగోపశ్చ గోపాశ్చ రామశ్చాద్భుతవిక్రమః ।
త్వరితం యమునాం జగ్ముః కృష్ణదర్శనలాలసాః ॥ 22 ॥

నందుడు, ఇతరగొల్లనాయకులు ఆశ్చర్యకరమైన పరాక్రమం కలిగిన బలరాముడు, శ్రీకృష్ణస్వామిని చూడాలనే కోరికతో హడావిడిగా యమునా నదీతీరానికి వెళ్లారు.

దదృశుశ్చాపి తే తత్ర సర్పరాజవశఙ్గతమ్ ।
నిష్ప్రయత్నం కృతం కృష్ణం సర్పభోగేన వేష్టితమ్ ॥ 23 ॥

అక్కడ కాళియుడి మడుగులో కాళియసర్పం వశంలో ఉన్న కృష్ణుడిని చూశారు. ఆ పాము పడగతో కట్టివేయగా, కృష్ణుడు తప్పించుకోలేని స్థితిలో ఉన్నాడు.

నన్దగోపశ్చ నిశ్చేష్టః పశ్యన్ పుత్రముఖం భృశమ్ ।
యశోదా చ మహాభాగా బభూవ మునిసత్తమాః ॥ 24 ॥

మహర్షులారా! కొడుకు ముఖం చూచిన నందగోపుడికీ, పుణ్యాత్మురాలైన యశోదకూ కాలూ చే యాడలేదు.

గోప్యశ్చాన్యా రుదన్త్యశ్చ దదృశుశ్శోకకాతరాః ।
ప్రోచుశ్చ కేశవం ప్రీత్యా భయకాతరమానసాః ॥ 25 ॥

మిగిలిన గోపికలు అందరూ కృష్ణుడిని చూసి, దుఃఖంతో బాధగా ఏడుస్తున్నారు. ఆ పాము కృష్ణుడిని ఏమి చేస్తుందో అనే భయంతో బెదిరిపోతూ, కృష్ణుడిమీది ప్రేమతో ఇలా అన్నారు.

సర్వా యశోదయా సార్ధం విశామోఽత్ర మహాహ్రదే ।
నాగరాజస్య నో గన్తుమస్మాకం యుజ్యతే వ్రజే ॥ 26 ॥

యశోదతో సహా మన మందరం ఈ కాళీయుడి మడుగులోకి దూకుదాం. (కృష్ణుడితోపాటే మనం కూడ మరణిద్దాం) కృష్ణుడు ఇలా ఉండగా మనం ఇంటికి పోవడం సమంజసం కాదు.

దివసః కో వినా సూర్యం వినా చన్ద్రేణ కా నిశా ।
వినా దుగ్ధేన కా గావో వినా కృష్ణేన కో వ్రజః ॥
వినాకృతా న యాస్యామః కృష్ణేనానేన గోకులమ్ ॥ 27 ॥

సూర్యుడు లేకుండా పగలు ఎలా ఉంటుంది? చంద్రుడు లేకపోతే అది రాత్రి కాదు. పాలు లేనివి ఆవులు కావు. కృష్ణుడు లేకుంటే గొల్లపల్లె లేదు. ఈ కృష్ణస్వామి లేకుండా మనం గోకులానికి వెళ్లవద్దు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇతి గోపీవచశ్శ్రుత్వా రౌహిణేయో మహాబలః ।
ఉవాచ గోపాన్ విధురాన్ విలోక్యస్తిమితేక్షణః ॥ 28 ॥

నన్దం చ దీనమత్యర్థం న్యస్తదృష్టిం సుతాననే ।
మూర్ఛాకులాం యశోదాం చ కృష్ణమాహాత్మ్యసంజ్ఞయా ॥ 29 ॥

మిక్కిలి బలవంతుడైన బలరాముడు గొల్ల స్త్రీల ఈ పలుకులు విన్నాడు. కృష్ణుడికి దూరమై దుఃఖిస్తున్న గొల్లవారిని స్తిమితంగా చూచాడు. కన్నకొడుకుమీద కన్ను నిలిపి, తదేకంగా చూస్తూ దిగులుగా ఉన్న నందుడినీ, మూర్ఛస్థితిలో ఉన్న యశోదనూ గమనించాడు. శ్రీకృష్ణస్వామి మహిమను తెలుపుతూ బలరాముడు వారితో ఇలా అన్నాడు.

బలరామ ఉవాచ :-గొల్లలతో బలరాముడు ఇలా అంటున్నాడు.

కిమయం దేవదేవేశ భావోఽయం మానుషస్త్వయా ।
వ్యజ్యతేఽత్యన్తమాత్మానం స్వకీయం త్వం న వేత్సి కిమ్ ॥ 30 ॥

దేవదేవా! నీవు ఇలా సామాన్యమైన మానవుడి ధర్మాన్ని ప్రకటిస్తున్నా వేమిటి? నీవు ఇలా ఉండట మేమిటి? సహజమైన నీ పరమాత్మతత్త్వం నీకు తెలియదా?

త్వమస్య జగతో నాభిస్సురాణామేవ చాశ్రయః ।
కర్తాపహర్తా పాతా చ త్రైలోక్యం త్వం త్రయీమయః ॥ 31 ॥

ఈ సృష్టి సమస్తానికి మూలాధారం నీవు. దేవతలకు కూడ నీవే దిక్కు. ఈ లోకాన్ని సృష్టించేదీ, రక్షించేదీ, లయం చేసేదీ నీవే. మూడు వేదాలూ నీ స్వరూపమే.

అత్రావతీర్ణయోః కృష్ణ గోపా ఏవ హి బాన్ధవాః ।
గోప్యశ్చ సీదతః కస్మాత్ త్వం బన్ధూన్ సముపేక్షసే ॥ 32 ॥

కృష్ణా! ఈ భూమిమీద అవతరించిన మన యిద్దరికీ (బలరామకృష్ణులకు) ఈ గోపాలకులూ, గోపికలే కదా చుట్టాలు. నీ కోసం దుఃఖిస్తున్న నీ బంధువుల బాధ పోగొట్టక, ఉపేక్షిస్తున్నా వేమిటి?

దర్శితో మానుషో భావో దర్శితం బాలచాపలమ్ ।
తదయం దమ్యతాం కృష్ణ దురాత్మా దశనాయుధః ॥ 33 ॥

మానవధర్మాన్ని ప్రదర్శిస్తున్నావు. పిల్లచేష్టలను చేస్తున్నావు. ఇక చాలు. ఇప్పటికైనా, దుర్మార్గుడైన కాళీయ సర్పాన్ని అణగగొట్టు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇతి సంస్మారితః కృష్ణః స్మితభిన్నోష్ఠసమ్పుటః ।
ఆస్ఫోట్య మోచయామాస స్వం దేహం భోగబన్ధనాత్ ॥ 34 ॥

బలరాముడు ఈవిధంగా తన తత్త్వాన్ని గురించి స్మరించడంతో కృష్ణస్వామి పెదవులు కొంచెం విచ్చుకునే విధంగా చిన్ననవ్వు నవ్వాడు. జబ్బలు చరచుకున్నాడు. ఆ కాళీయుడి పడగల పట్టునుండి తనను విడిపించుకున్నాడు.

ఆనమ్య చాపి హస్తాభ్యాముభాభ్యాం మధ్యమం ఫణమ్ ।
ఆరుహ్య భుగ్నశిరసః ప్రననర్తోరువిక్రమః ॥ 35 ॥

మిక్కిలి పరాక్రమవంతుడైన శ్రీకృష్ణుడు తన రెండు చేతులతో కాళీయుడి నడిమి(ప్రధానమైన)పడగను వంగదీసి, వంగిపోయిన శిరస్సుమీదుగా కాళీయుడి పైకెక్కి, ఉత్సాహంగా నాట్యం చేశాడు.

వ్రణాః ఫణేఽభవంస్తస్య కృష్ణస్యాఙ్ఘ్రివికుట్టనైః ।
యత్రోన్నతిం చ కురుతే ననామాస్య తతశ్శిరః ॥ 36 ॥

శ్రీకృష్ణస్వామి పాదాల తొక్కిడికి కాళీయుడి పడగకు ఎన్నో గాయా లయ్యాయి. లేచిన పడగమీద కాలు పెట్టి తొక్కి, కృష్ణుడు ఆ తలను వంచేస్తున్నాడు.

మూర్చ్ఛాం పరాం యయౌ భ్రాన్త్యా నాగః కృష్ణస్య కుట్టనైః ।
చణ్డపాతనిపాతేన వవామ రుధిరం బహు ॥ 37 ॥

శ్రీకృష్ణుడి పాదాహతులను తట్టుకోలేక స్మృతి తప్పి, కాళియుడు మూర్ఛపోయాడు. తీవ్రమైన పాద ఘట్టనలకు అత్యధికంగా నెత్తురు కక్కుకున్నాడు.

తం నిర్భుగ్నశిరోగ్రీవమాస్యప్రస్రుతశోణితమ్ ।
విలోక్య శరణం జగ్ముస్తత్పత్న్యో మధుసూదనమ్ ॥ 38 ॥

ఈవిధంగా కాళియుడు తలలు, మెడలు విరిగి, అన్నినోళ్లనుండి నెత్తురోడుతుండగా, చూసి, కాళియుడి భార్యలు శ్రీకృష్ణస్వామిని శరణు వేడుకున్నారు.

నాగపత్న్య ఊచుః :-కాళియుడి భార్యలు కృష్ణుడితో ఇలా అంటున్నారు.

జ్ఞాతోఽసి దేవదేవేశ సర్వేశ త్వమనుత్తమః ।
పరం జ్యోతిరచిన్త్యం యత్తదంశః పరమేశ్వరః ॥ 39 ॥

దేవదేవా! సమస్తానికీ నీవే ప్రభువువి. నిన్ను మించినవాడు ఎవడూ లేడు. అన్నింటికంటె శ్రేష్ఠమైన తేజస్సు నీవే. నిన్ను తెలుసుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. పరమాత్మ అంశతో ఉన్నవాడివి. అందరినీ నియమించేవాడివి నీవే అని గ్రహించాము.

న సమర్థాస్సురా స్తోతుం యమనన్యభవం ప్రభుమ్ ।
స్వరూపవర్ణనం తస్య కథం యోషిత్ కరిష్యతి ॥ 40 ॥

నీ అంతట నీవుగా ఏర్పడినవాడివి. నిన్ను స్తుతించడం దేవతలకు కూడ సాధ్యం కాదు. అటువంటి నీ స్వరూపాన్ని ఒకఆడది ఏవిధంగా వర్ణించగలదు?

యస్యాఖిలమహీవ్యోమజలాగ్నిపవనాత్మకమ్ ।
బ్రహ్మాణ్డమల్పకాంశాంశః స్తోష్యామస్తం కథం వయమ్ ॥ 41 ॥

భూమి, ఆకాశం, నీరు, తేజస్సు, వాయువు అనే మొత్తం పంచభూతాల రూపమైన బ్రహ్మాండం నీలో అత్యంతం అల్పమైన భాగం. అటువంటి నిన్ను (నీలో అల్పాల్పమైన బ్రహ్మాండంలో మిక్కిలి అల్పులమైన) మేము ఏమని పొగడగలం? స్తుతించగలం?

తతః కురు జగత్స్వామిన్ ప్రసాదమవసీదతః ।
ప్రాణాం స్త్యజతి నాగోఽయం భర్తృభిక్షా ప్రదీయతామ్ ॥ 42 ॥

జగన్నాథా! దీనుడైన ఈ కాళియుడిమీద దయచూపించు. లేకుంటే ఈ నాగరాజు ప్రాణాలు పోతాయి. మా భర్తను మాకు భిక్షగా అనుగ్రహించు.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్తే కాతరాక్ష శ్చ క్లాన్తదేహోఽపి పన్నగః ।
ప్రసీద దేవదేవేతి ప్రాహ వాక్యం శనైశ్శనైః ॥ 43 ॥

శ్రీకృష్ణస్వామిని తన భార్యలు ఈవిధంగా స్తుతించగా, కాళియుడు బెదురు చూపులతో, నలిగిపోయిన శరీరంతో, మెల్లమెల్లగా 'దేవదేవా, నన్ను రక్షించు' అన్నాడు.

తవాష్టగుణమైశ్వర్యం నాథ స్వాభావికం పరమ్ ।
నిరస్తాతిశయం యస్య తస్య స్తోష్యామి కిన్వహమ్ ॥ 44 ॥

స్వామీ! నీ ఐశ్వర్యం ఎనిమిది విధాలు (అష్టైశ్వర్యాలు గలిగినవాడివి). అవి నీకు సహజంగా ఉన్నవి. వాటికి మించినవి ఇంకేవీ లేవు. సర్వసమృద్ధిని తిరస్కరించే ఆధిక్యం కలిగిన నిన్ను నేను ఏవిధంగా పొగడగలను?

త్వం పరస్త్వం పరస్యాద్యః పరం త్వం తత్పరాత్మకమ్ ।
పరస్మాత్ పరమో యస్త్వం తస్య స్తోష్యామి కిన్వహమ్ ॥ 45 ॥

అన్నింటికంటె ఉత్తమమైన వాడివి నీవు. దానికి మూలమైన వాడివి నీవే. పరమతత్త్వం నీవు. ఆ పరమతత్త్వస్వరూపం నీవే. దానికంటె ఉత్తమమైనదీ నీవే. ఇంక నిన్ను ఏమని పొగడను?

యథాఽహం భవతా సృష్టో జాత్యా రూపేణ చేశ్వర ।
స్వభావేన చ సంయుక్తస్తథేదం చేష్టితం మయా ॥ 46 ॥

ప్రభూ! ఈ జాతిలో, ఈ రూపంతో నన్ను ఇలా సృష్టించింది నువ్వే. నాకు ఈ స్వభావాన్ని ఇచ్చింది నువ్వే. ఈ విధమైన నడవడికను కూడ నాకు నీవే ఇచ్చావు.

యద్యన్యథా ప్రవర్తేయం దేవదేవ తతో మయి ।
న్యాయ్యో దణ్డనిపాతస్తే తవైవ వచనం యథా ॥ 47 ॥

నీవు నిర్ణయించిన దానికంటె భిన్నంగా ప్రవర్తిస్తే అప్పుడు నన్ను నువ్వు శిక్షించవచ్చును. నేను నీ మాట ప్రకారమే నడుచుకున్నాను. (పాముగా నీవు నిర్ణయించిన ధర్మాన్నే ఆచరిస్తున్నాను.)

తథాఽపి యం జగత్స్వామీ దణ్డం పాతితవాన్ మయి ।
స సోఢోఽయం వరో దణ్డస్త్వత్తో నాన్యోఽస్తు మే వరః ॥ 48 ॥

లోకేశ్వరా! నీవు చెప్పిన ప్రకారమే నడుచుకుంటున్నా, నన్ను శిక్షించావు. నీవు విధించినది కాబట్టి,ఉత్తమమైన ఆ శిక్షను సంతోషంగా భరిస్తాను.నీ వలన(నీవు ఇచ్చిన ఈ శిక్షకంటె)నాకు కావలసిన వరం ఇంకొకటి లేదు.

హతవీర్యో హతవిషో దమితోఽహం త్వయాచ్యుత ।
జీవనం దీయతామేకమాజ్ఞాపయ కరోమి కిమ్ ॥ 49 ॥

పరమాత్మా! నా శక్తిని హరించావు. నా విషాన్ని నాశనం చేశావు. నన్ను అణచివేశావు. నా ప్రాణాన్ని కాపాడు. ఇక నేను ఏమి చేయాలో ఆజ్ఞాపించు.

శ్రీభగవానువాచ:-కాళీయుడితో కృష్ణభగవానుడు ఇలా అంటున్నాడు.

నాత్ర స్థేయం త్వయా సర్ప కదాచిద్ యమునాజలే ।
సపుత్రపరివారస్త్వం సముద్రసలిలం వ్రజ ॥ 50 ॥

కాళియసర్పమా! ఇంక నీవు ఈ యమునానదిలో ఎంతమాత్రమూ ఉండరాదు. ఆలుబిడ్డలనూ, సేవకులు మొదలైన వారినందరినీ తీసుకుని సముద్రజలంలోకి వెళ్లిపో.

మత్పదాని చ తే సర్ప దృష్ట్వా మూర్ధని సాగరే ।
గరుడః పన్నగరిపుస్త్వయి న ప్రహరిష్యతి ॥ 51 ॥

నాగరాజా! సముద్రంలో ఉండగా, పాములకు ఆగర్భశత్రువైన గరుత్మంతుడు, నీ శిరస్సుమీద నా పాద ముద్రలను చూసి, నిన్ను ఏమీ బాధించడు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్త్వా సర్వరాజానం ముమోచ భగవాన్ హరిః ।
ప్రణమ్య సోఽపి కృష్ణాయ జగామ పయసాం నిధిమ్ ॥ 52 ॥

పశ్యతాం సర్వభూతానాం సభృత్యాపత్యబాన్ధవః ।
సమస్తభార్యాసహితః పరిత్యజ్య స్వకం హ్రదమ్ ॥ 53 ॥

ఇలా ఆజ్ఞాపించి! కృష్ణస్వామి కాళియుడిని సంహరించకుండా విడిచిపెట్టాడు. కాళియుడు కూడ స్వామికి నమస్కరించి, సమస్త ప్రాణులు చూస్తుండగా, సంతానంతోనూ, బంధువులతోనూ, సేవకులతోనూ, భార్యల తోనూ కలిసి, తనదైన యమునానదిలోని ఆ మడుగును విడిచిపెట్టి, సముద్రజలంలోకి వెళ్లాడు.

గతే సర్పే పరిష్వజ్య మృతం పున రివాగతమ్ ।
గోపా మూర్ధని గోవిన్దమసిఞ్చన్నేత్రజైర్జలైః ॥ 54 ॥

కాళియుడు ఆ మడుగును విడిచిపెట్టి వెళ్లిపోయిన తరువాత, గోపాలకులు కృష్ణస్వామిని చచ్చి బ్రదికిన వాడినిలాగా ఆప్యాయంగా కౌగిలించుకున్నారు. ఆనందబాష్పాలతో స్వామి తల తడిపారు.

కృష్ణమక్లిష్టకర్మాణమన్యే విస్మితచేతసః ।
తుష్టువుర్ముదితా గోపా దృష్ట్వా శివజలాం నదీమ్ ॥ 55 ॥

కాళియమదాన్ని అణచి ఘనకార్యాన్ని నిర్వహించిన కృష్ణస్వామిని చూసి గొల్ల లందరూ ఆశ్చర్యపడ్డారు. ఆనందించారు. శుభప్రదమైన యమునా నదీజలాన్ని చూశారు. అలా చేసిన కృష్ణస్వామిని స్తుతించారు.

గీయమానోఽథ గోపీభిశ్చారితైశ్చారుచేష్టితైః ।
సంస్తూయమానో గోపాలైః కృష్ణో వ్రజముపాగమత్ ॥ 56 ॥

గోపికలు మనోహరమైన స్వామిలీలలను గానం చేస్తుండగా, గోపాలకులు స్తోత్రాలు చేస్తుండగా, శ్రీకృష్ణుడు గొల్లపల్లెకు చేరుకున్నాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే బాలచరితే కాలీయదమననిరూపణం నామ సప్తసప్తతితమోఽధ్యాయః ॥ 77 ॥

శ్రీబ్రహ్మపురాణంలో బాలచరిత్రలో కాలీయ దమన నిరూపణం అనే డెబ్బైఏడవ అధ్యాయం సంపూర్ణం.



అష్టసప్తతితమోఽధ్యాయః – డెబ్బైఎనిమిదవ అధ్యాయం
ధేనుకప్రలంబాసురవధనిరూపణమ్ – ధేనుక ప్రలంబాసుర వధ నిరూపణం

వ్యాస ఉవాచ :–మహర్షులతో వ్యాసుడు ఈవిధంగా చెప్తున్నాడు.

గాః పాలయన్తౌ చ పునస్సహితౌ బలకేశవౌ ।
భ్రమమాణౌ వనే తత్ర రమ్యం తాలవనం గతౌ ॥ 1 ॥

ఆవులను కాస్తూ ఆ వనంలో కలిసి తిరుగుతున్న బలరామకృష్ణులు మనోహరమైన ఒక తాటితోపులోకి వెళ్లారు.

తచ్చ తాలవనం నిత్యం ధేనుకో నామ దానవః ।
నృగోమాంసకృతాహారస్సదాధ్యాస్తే ఖరాకృతిః ॥ 2 ॥

ఆ తాటితోపులో ధేనుకుడు అనే రాక్షసుడు నివసిస్తుంటాడు. వాడు గాడిదరూపంలో ఉంటాడు. నరమాంసాన్ని, ఆవులమాంసాన్ని తింటూ ఉంటాడు.

తత్ర తాలవనం రమ్యం ఫలసమ్పత్సమన్వితమ్ ।
దృష్ట్వా స్పృహాన్వితా గోపాః ఫలాదానేఽబ్రువన్ వచః ॥ 3 ॥

ఆ తాటితోపులో తాటిచెట్లు పండ్లతో నిండి ఉన్నాయి. ఆ పండ్లను తీసుకోవాలనే కోరికతో గోపాలకులు ఇలా అన్నారు.

గోపా ఊచుః :–గోపాలకులు బలరామకృష్ణులతో ఇలా అంటున్నారు.

హే రామ హే కృష్ణ సదా ధేనుకేనైవ రక్ష్యతే ।
భూప్రదేశో యతస్తస్మాత్ త్యక్తానీమాని సన్తి వై ॥ 4 ॥

ఓ బలరామా! ఓ కృష్ణా! ఈ ప్రదేశాన్ని ధేనుకుడు అనేరాక్షసుడు కాపాడుతూండడంచేత వాడిమీద భయంతో ఎవరూ ఈ పండ్లజోలికి రావడం లేదు.

ఫలాని పశ్య తాలానాం గన్ధమోదయుతాని వై ।
వయమేతాన్యభీప్సామః పాత్యన్తాం యది రోచతే ॥ 5 ॥

ఈ తాటిచెట్లపైనున్న పండ్లను చూడండి. బాగా పండి, మంచివాసనలు చిమ్ముతున్నాయి. మనం వీటిని తీసుకుందాం. మీకు ఇష్టమైతే ఈ పండ్లను రాలగొడదాం.

ఇతి గోపకుమారాణాం శ్రుత్వా సఙ్కర్షణో వచః ।
కృష్ణశ్చ పాతయామాస భువి తాలఫలాని వై ॥ 6 ॥

గోపకుమారుల పలుకులు విని, బలరాముడు, కృష్ణుడు తాటిపండ్లను నేలమీదికి రాలగొట్టారు.

తాలానాం పతతాం శబ్దమాకర్ణ్యాసురరాట్ తతః ।
ఆజగామ స దుష్టాత్మా కోపాద్ దైతేయగర్దభః ॥ 7 ॥

తాటిపండ్లు చెట్టుమీదనుండి కిందపడుతున్నపుడు వస్తున్న పెద్ద చప్పుడు విని, గాడిదరూపంలో ఉన్న ధేనుకుడు అనే ఆ దుష్టరాక్షసుడు అక్కడికి వచ్చాడు.

పద్భ్యాముభాభ్యాం స తదా పశ్చిమాభ్యాం బలీ బలాత్ ।
జఘానోరసి తాభ్యాం చ స చ తే నాప్యగృహ్యత ॥ 8 ॥

గాడిదరూపంలో ఉన్న ఆ రాక్షసుడు తన వెనుకకాళ్లు రెండూ ఎత్తి బలంగా బలరాముడి గుండెలమీద తన్నాడు. బలరాముడు ఆ రెండు కాళ్లు గట్టిగా పట్టుకున్నాడు.

గృహీత్వా భ్రామణేనైవ చామ్బరే గతజీవితమ్ ।
తస్మిన్నేవ ప్రచిక్షేప వేగేన తృణరాజని ॥ 9 ॥

బలరాముడు ధేనుకాసురుడి కాళ్లు రెండూ పట్టుకుని, ఆకాశంలో గిరగిరా తిప్పి, ఆ తాటిచెట్లపైకి వేగంగా విసిరేశాడు. వాడి ప్రాణాలు అక్కడే పోయాయి.

తతః ఫలాన్యనేకాని తాలాగ్రాన్నిపతన్ ఖరః ।
పృథివ్యాం పాతయామాస మహావాతోఽమ్బుదానివ ॥ 10 ॥

తాటిచెట్లమీదనుంచి ధేనుకాసురుడి శరీరం క్రింద పడుతున్నపుడు, పెద్ద సుడిగాలికి మబ్బులు కొట్టుకుని పోయినట్లుగా, వాడితోపాటు తాటిపండ్లు కూడ కుప్పలు కుప్పలుగా చెట్టుమీదనుంచి నేల రాలాయి.

అన్యానప్యస్య వై జ్ఞాతీనాగతాన్ దైత్యగర్దభాన్ ।
కృష్ణశ్చిక్షేప తాలాగ్రే బలభద్రశ్చ లీలయా ॥ 11 ॥

ధేనుకుడికి దాయాదులైన మరికొందరు గాడిదరూపంలో ఉన్న రాక్షసులు (ధేనుకుడి తమ్ముళ్లు) బలరామ కృష్ణుల మీదికి వచ్చారు. వారిని కూడా బలరామకృష్ణు లిద్దరూ విలాసంగా తాటిచెట్టు పైకి విసరివేశారు.

క్షణేనాలఙ్కృతా పృథ్వీ పక్వైస్తాలఫలైస్తదా ।
దైత్యగర్దభదేహైశ్చ మునయశ్శుశుభేఽధికమ్ ॥ 12 ॥

మహర్షులారా! ఒక్కక్షణంలో అక్కడ నేల అంతా ముదరపండిన తాటిపండ్లతోనూ, గాడిదల రూపంలో ఉన్న రాక్షసులతోనూ నిండి, చాల అందంగా ప్రకాశించింది.

తతో గావో నిరాబాధాస్తస్మింస్తాలవనే ద్విజాః ।
నవశష్పం సుఖం చేరుర్యత్ర భుక్తమభూత్ పురా ॥ 13 ॥

విప్రులారా! ధేనుకాసురుడి మరణంతో తాలవనంలో ఆవులకు ఎటువంటి కష్టమూ లేకుండా పోయింది. కాగా ఆవులు పూర్వం కొంత తిని (ధేనుకుడి భయంతో) విడిచిపెట్టి పోయిన లేతపచ్చికలను ఆరగిస్తూ ఆ వనంలో నిశ్చింతగా సంచరించాయి.

తస్మిన్ రాసభదైతేయే సానుజే వినిపాతితే ।
సర్వగోపాలగోపీనాం రమ్యం తాలవనం బభౌ ॥ 14 ॥

గాడిదరూపంలో ఉన్న ఆ ధేనుకాసురుడు, తన తమ్ములతో సహా మరణించడంతో, సమస్తమైన గోపాలకులకూ, గోపికలకూ ఆ తాలవనం చక్కని విహారభూమి అయింది.

తతస్తౌ జాతహర్షౌ తు వసుదేవసుతావుభౌ ।
హత్వా ధేనుకదైతేయం భాణ్డీరం వనమాగతౌ ॥ 15 ॥

బలరామకృష్ణులు ఇద్దరూ, ధేనుకాసురుడిని సంహరించి, ఆనందంగా భాండీర వనానికి వచ్చారు.

క్ష్వేలమానౌ ప్రగాయన్తౌ విచిన్వన్తౌ చ పాదపాన్ ।
శుశుభాతే మహాత్మానౌ బాలశృఙ్గావివర్షభౌ ॥ 16 ॥

ఆనందంతో కేరింతలు కొడుతూ, పాటలు పాడుతూ, చెట్లనుండి పూలు, పండ్లు మొదలైన వాటిని తుంచుతూ, మహాత్ములైన బలరామకృష్ణు లిద్దరూ పసికొమ్ములతో కూడిన లేగదూడలలాగా ప్రకాశించారు.

చారయన్తౌ చ గా దూరే వ్యాహరన్తౌ చ నామభిః ।
నియోగపాశస్కన్ధౌ తౌ వనమాలావిభూషితౌ ॥ 17 ॥

ఆవులను దూరంగా తోలుకొని వెళ్తున్నారు. దూరంగా ఉన్నవారిని పేర్లుపెట్టి గట్టిగా పిలుస్తున్నారు. దూడలకు కట్టిన తాళ్లను బుజాలకు తగిలించుకున్నారు. పెద్దపెద్ద పూలమాలలను అలంకరించుకున్నారు.

సువర్ణాఞ్జనవర్ణాభ్యాం తదా తౌ భూషితామ్బరౌ ।
మహేన్ద్రాయుధసఙ్కాశౌ శ్వేతకృష్ణావివామ్బుదౌ ॥ 18 ॥

కృష్ణుడు మేలిమి బంగారం రంగులో ఉన్న పట్టువస్త్రాన్నీ, బలరాముడు కాటుకవంటి నల్లనైన వస్త్రాన్నీ అందంగా ధరించారు. ఇంద్రధనుస్సులాగా రంగురంగుల వస్త్రాలతో రామకృష్ణులు తెలుపు, నలుపు మబ్బులవలె ఉన్నారు.

చేరతుర్లోకసిద్ధాభిః క్రీడాభిరితరేతరమ్ ।
సమస్తలోకనాథానాం నాథభూతౌ భువం గతౌ ॥ 19 ॥

సమస్త లోకాధిపతులకే ప్రభువులైన రామకృష్ణులు ఈ నేలమీద అవతరించి, పరస్పరం ప్రాంతీయమైన రకరకాల ఆటలు ఆడుతున్నారు.

మనుష్యధర్మాభిరతౌ మానయన్తౌ మనుష్యతామ్ ।
తజ్జాతిగుణయుక్తాభిః క్రీడాభిశ్చేరతుర్వనమ్ ॥ 20 ॥

దేవతా నాయకులైనా, భూలోకంలో సామాన్యమైన మానవులలాగా సంచరిస్తున్నారు. మానవ ధర్మాలను గొప్పగా ఆదరిస్తున్నారు. తమకు సంబంధించిన గొల్లపిల్లల ఆటలతో ఆ వనమంతా సంచరిస్తున్నారు.

తతస్త్వాన్దోలికాభిశ్చ నియుద్ధైశ్చ మహాబలౌ ।
వ్యాయామం చక్రతుస్తత్ర క్షేపణీయైస్తథాశ్మభిః ॥ 21 ॥

గొప్ప బలవంతులైన రామకృష్ణులు ఉయ్యాల లూగుతున్నారు. ఆటగా చిన్నచిన్న యుద్ధాలు చేస్తున్నారు. రాళ్లు దూరంగా విసరడం మొదలైన రకరకాల వ్యాయామాలు చేస్తున్నారు.

తల్లిప్సురసురస్తత్ర ఉభయో రమమాణయోః ।
ఆజగామ ప్రలమ్బాఖ్యో గోపవేషతిరోహితః ॥ 22 ॥

రామకృష్ణులను చంపడానికి ప్రలంబుడు అనే రాక్షసుడు ఆడుకుంటున్న వారివద్దకు వచ్చాడు. తన రాక్షసత్వం తెలియకుండా, వారితో కలిసిపోయే విధంగా ప్రలంబుడు గోపాలక వేషం ధరించాడు.

సోఽవగాహత నిశ్శఙ్కం తేషాం మధ్యమమానుషః ।
మానుషం రూపమాస్థాయ ప్రలమ్బో దానవోత్తమః ॥ 23 ॥

రాక్షసనాయకుడైన ప్రలంబుడు ఎవరికీ సందేహం కలగకుండా, మానవరూపం ధరించి, గోపాలకుల మధ్యలో సంచరిస్తున్నాడు.

తయోశ్ఛిద్రాన్తరప్రేప్సురతిశీఘ్రమమన్యత ।
కృష్ణం తతో రౌహిణేయం హన్తుం చక్రే మనోరథమ్ ॥ 24 ॥

కృష్ణుడినీ అలాగే బలరాముడిని ఏమాత్రం ఆలస్యం చేయకుండా, చాల త్వరగా చంపాలనే కోరికతో, అందుకు తగిన అవకాశం కోసం వెదుకుతున్నాడు.

హరిణా క్రీడనం నామ బాలక్రీడనకం తతః ।
ప్రక్రీడితాస్తు తే సర్వే ద్వౌ ద్వౌ యుగపదుత్పతన్ ॥ 25 ॥

గోపాలకు లందరూ శ్రీకృష్ణుడితో బాలక్రీడ అనే ఆట ఆడారు. ఆ ఆటలో ఇద్ద రిద్దరు ఒక జట్టుగా కలిసి, (ఒకరిపై ఇంకొకరు) ఎగిరి దూకుతున్నారు.

శ్రీదామ్నా సహ గోవిన్దః ప్రలమ్బేన తథా బలః ।
గోపాలైరపరైశ్చాన్యే గోపాలాస్సహ పుప్లువుః ॥ 26 ॥

కృష్ణుడు శ్రీదాముడితోనూ, బలరాముడు ప్రలంబుడితోనూ, అలాగే మిగిలిన గోపాలకులు ఆయా గోపాలకులతోనూ ఎగిరిదూకే ఆటను (వంగుళ్లు – దూకుళ్లు) ఆడుతున్నారు.

శ్రీదామానం తతః కృష్ణః ప్రలమ్బం రోహిణీసుతః ।
జితవాన్ కృష్ణపక్షీయైర్గోపైరన్యైః పరాజితాః ॥ 27 ॥

ఆ ఆటలో కృష్ణుడు శ్రీదాముడిపైన, బలరాముడు ప్రలంబుడిపైన గెలిచారు. మిగిలిన వారిలో శ్రీకృష్ణుడి పక్షంలో ఉన్నవారు ఇతరుల మీద గెలిచారు.

తే వాహయన్తస్త్వన్యోన్యం భాణ్డీరస్కన్ధమేత్య వై ।
పునర్నివృత్తాస్తే సర్వే యే యే తత్ర పరాజితాః ॥ 28 ॥

ఆ ఆటలో ఓడినవారు గెలిచినవారిని మోసుకుంటూ భాండీరవనంలో తాము ఓడినచోటికి అందరూ తిరిగి వచ్చారు.

సఙ్కర్షణం తు స్కన్ధేన శీఘ్రముత్క్షిప్య దానవః ।
న తస్థౌ ప్రజగామైవ సచన్ద్ర ఇవ వారిదః ॥ 29 ॥

బలరాముడి చేతిలో ప్రలంబుడు ఓడిపోయాడు. ఆ రాక్షసుడు బలరాముడిని ఎత్తుకుని మోసుకుంటూ చంద్రుడితో కూడిన మేఘంలాగా ఆగకుండా వెళ్లిపోయాడు.

అసహన్ రౌహిణేయస్య భారం వై దానవోత్తమః ।
వవృధే స మహాకాయః ప్రావృషీవ బలాహకః ॥ 30 ॥

ప్రలంబాసురుడు బలరాముడి బరువును మోయలేకపోయాడు. వర్షాకాలంలో మేఘంలాగా తన శరీరాన్ని విస్తారంగా పెంచాడు.

సఙ్కర్షణస్తు తం దృష్ట్వా దగ్ధశైలోపమాకృతిమ్ ।
స్రగ్దామలమ్బాభరణం ముకుటాటోపమస్తకమ్ ॥ 31 ॥

బలరాముడు ఆ రాక్షసుడిని గమనించాడు. అతడు దావానలంలో తగులబడిపోతున్న పెద్ద కొండలాగా ఉన్నాడు. వేలాడుతున్న పెద్దపెద్ద పూలదండలు అతడిని అలంకరిస్తున్నాయి. తలపైన కిరీటం ధగధగలాడుతున్నది.

రౌద్రం శకటచక్రాక్షం పాదన్యాసచలత్క్షితిమ్ ।
హ్రియమాణస్తతః కృష్ణమిదం వచనమబ్రవీత్ ॥ 32 ॥

ఆ రాక్షసుడు భయంకరంగా ఉన్నాడు. అతడి కళ్లు బండిచక్రాలలాగా ఉన్నాయి. వాడి అడుగుల తాకిడికి నేల కంపిస్తున్నది. అటువంటి ప్రలంబుడు తనను తీసుకుని పోతుండగా బలరాముడు కృష్ణుడితో ఇలా అంటున్నాడు.

బలరామ ఉవాచ :-కృష్ణుడితో బలరాముడు ఇలా అంటున్నాడు.

కృష్ణ కృష్ణ హ్రియేత్వేష పర్వతోదగ్రమూర్తినా ।
కేనాపి పశ్య దైత్యేన గోపాలచ్ఛద్మరూపిణా ॥ 33 ॥

కృష్ణా! ఓ కృష్ణా! ఈ రాక్షసు డెవడో, కొండలాంటి భయంకరమైన పెద్ద ఆకారంతో, గోపాలక వేషంలో రహస్యంగా వచ్చి, నన్ను అపహరించుకుని పోతున్నాడు. చూడు.

యదత్ర సామ్ప్రతం కార్యం మయా మధునిషూదన ।
తత్ కథ్యతాం ప్రయాత్యేష దురాత్మాతిత్వరాన్వితః ॥ 34 ॥

మధువనే రాక్షసుడిని సంహరించినవాడా! ఇపుడు నేనేమి చేయాలో చెప్పు. ఈ దుర్మార్గుడు త్వరత్వరగా వెళ్లిపోతున్నాడు.

వ్యాస ఉవాచ :- మునులతో వ్యాసమహర్షి ఇలా అంటున్నాడు.

తమాహ రామం గోవిన్దస్స్మితభిన్నోష్ఠసమ్పుటః ।
మహాత్మా రౌహిణేయస్య బలవీర్యప్రమాణవిత్ ॥ 35 ॥

బలరాముడి మాటలు విని శ్రీకృష్ణుడు పెదవులు కొద్దిగా విడిపడే విధంగా చిన్న నవ్వు నవ్వాడు. బలరాముడి శక్తి సామర్థ్యాలు చక్కగా తెలిసిన కృష్ణుడు అతడితో ఇలా అంటున్నాడు.

కృష్ణ ఉవాచ :- బలరాముడితో కృష్ణుడు ఇలా అంటున్నాడు.

కిమయం మానుషో భావో వ్యక్తమేవావలమ్బ్యతే ।
సర్వాత్మన్ సర్వగుహ్యానాం గుహ్యాద్ గుహ్యాత్మనా త్వయా ॥ 36 ॥

సర్వమూ నీ స్వరూపమే అయినవాడా! నీవు రహస్యా లన్నింటికంటె రహస్యమైన దానికి కూడ రహస్యమైన వాడివి. సాధారణ మానవుడిలాగా ఇలా మాట్లాడుతున్నా వేమిటి?

స్మరాశేషజగదీశ కారణం కారణాగ్రజ ।
ఆత్మానమేకం తద్వచ్చ జగత్యేకార్ణవే చ యః ॥ 37 ॥

సమస్తమైన జగత్తుకూ నీవే ప్రభువువి. సృష్టికి మూలకారణం నీవే. (జగత్తును సృష్టించిన వాడివి నీవే). కారణాల కన్నిటికీ మూలకారణమైన స్వామీ! ఈ జగత్తు సమస్తమూ జలమయమై ఏకార్ణవం అయినపుడు నిలిచి ఉన్నవాడివి నీ వొక్కడివే. నీ కంటె వేరుగా ఇంకొకడు లేడు. అద్వితీయమైన వాడివి. అటువంటి నీ అసలైన స్వరూపాన్ని గుర్తు చేసుకో.

భవానహం చ విశ్వాత్మన్నేకమేవ హి కారణమ్ ।
జగతోఽస్య జగత్యర్థం భేదేనావాం వ్యవస్థితౌ ॥ 38 ॥

సమస్తమూ నీవే అయినవాడా! నీవూ నేనూ ఒకటే. ఈ జగత్తు ఏర్పడడానికి మనమే మూలకారణం. లోకంకోసం (లోకస్థితికోసమే) మనం ఇలా వేరువేరుగా ఏర్పడ్డాం.

తత్ స్మర్యతామమేయాత్మంస్త్వయాత్మా జహి దానవమ్ ।
మానుష్యమేవమాలమ్బ్య బన్ధూనాం క్రియతాం హితమ్ ॥ 39 ॥

పరిమాణం ఇంత అని కొలిచి చెప్పడానికి వీలు లేనివాడా! నిన్ను నీవు గుర్తు చేసుకో. ఈ రాక్షసుడిని సంహరించు. మానవధర్మంతో నీ బంధువులకు మేలు చేయి.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇతి సంస్మారితో విప్రాః కృష్ణేన సుమహాత్మనా ।
విహస్య పీడయామాస ప్రలమ్బం బలవాన్ బలః ॥ 40 ॥

ద్విజులారా! మహానుభావుడైన శ్రీకృష్ణుడు ఈవిధంగా తనను గుర్తింపజేయగా బలరాముడు ఒక చిరునవ్వు నవ్వాడు. పరాక్రమవంతుడైన బలరాముడు ఆ తరువాత ప్రలంబుడిని చావగొట్టాడు.

ముష్టినా చాహనన్మూర్ధ్ని క్రోధసంరక్తలోచనః ।
తేన చాస్య ప్రహారేణ బహిర్యాతే విలోచనే ॥ 41 ॥

కోపంతో బలరాముడి కన్నులు ఎఱ్ఱబడ్డాయి. రాముడు పిడికిలితో ప్రలంబుడి నెత్తిపై గట్టిగా మోదాడు. ఆ దెబ్బకు ప్రలంబుడికి కనుగ్రుడ్లు బయటకు వెడలివచ్చాయి.

స నిష్కాసితమస్తిష్కో ముఖాచ్ఛోణితముద్వమన్ ।
నిపపాత మహీపృష్ఠే దైత్యవర్యో మమార చ ॥ 42 ॥

తలలోనుండి మెదడు బయటకు వచ్చిపడింది. నోటినుండి నెత్తురు వెళ్లగక్కుతూ ఆ రాక్షసుడు నేల గూలాడు. మరణించాడు.

ప్రలమ్బం నిహతం దృష్ట్వా బలేనాద్భుతకర్మణా ।
ప్రహృష్టాస్తుష్టువుర్గోపాస్సాధు సాధ్వితి చాబ్రువన్ ॥ 43 ॥

బలరాముడు ఆశ్చర్యకరంగా ప్రలంబుడిని సంహరించడం చూసి, గోపాలకు లందరూ చాలా సంతోషించారు. మేలు మేలు అని ప్రశంసించారు.

సంస్తూయమానో రామస్తు గోపైర్దైత్యే నిపాతితే ।
ప్రలమ్బే సహ కృష్ణేన పునర్గోకుల మాయయౌ ॥ 44 ॥

ప్రలంబుడు మరణించడంచేత గోపాలకులు తనను పొగడుతుండగా, బలరాముడు శ్రీకృష్ణుడితో కలిసి, గోకులానికి తిరిగివచ్చాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే బాలచరితే ధేనుకప్రలమ్బవధనిరూపణం నామ అష్టసప్తతితమోఽధ్యాయః ॥ 78 ॥

శ్రీబ్రహ్మపురాణంలో బాలచరిత్రలో ధేనుక ప్రలంబ వధ నిరూపణం అనే డెబ్బైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.



నవసప్తతితమోఽధ్యాయః - డెబ్బైతొమ్మిదవ అధ్యాయం
గోవర్ధనగిరియజ్ఞప్రవర్తనమ్ - గోవర్ధనగిరి యజ్ఞప్రవర్తనం

వ్యాస ఉవాచ :-మహర్షులతో వ్యాసుడు ఈవిధంగా చెప్తున్నాడు.

తయో ర్విహరతో రేవం రామకేశవయోర్వ్రజే ।
ప్రావృడ్ వ్యతీతా వికసత్సరోజా చాభవచ్ఛరత్ ॥ 1 ॥

బలరామకృష్ణులు గొల్లపల్లెలో ఈవిధంగా విహరిస్తుండగా వర్షాకాలం గడిచిపోయింది. చక్కగా వికసించిన పద్మాలతో కూడి శరదృతువు ప్రవేశించింది.

విమలామ్బరనక్షత్రే కాలే చాభ్యాగతే వ్రజమ్ ।
దదర్శేన్ద్రోత్సవారమ్భప్రవృత్తాన్ వ్రజవాసినః ॥ 2 ॥

ఆకాశం నిర్మలంగా ఉంది. నక్షత్రాలు చక్కగా ప్రకాశిస్తున్నాయి. ఆ శరత్సమయంలో గొల్లపల్లెలో నివసించే ప్రజలు ఇంద్రోత్సవం చేయాలని ప్రయత్నాలు ప్రారంభించడం చూశాడు కృష్ణభగవానుడు.

కృష్ణస్తానుత్సుకాన్ దృష్ట్వా గోపానుత్సవలాలసాన్ ।
కౌతూహలాదిదం వాక్యం ప్రాహ వృద్ధాన్ మహామతిః ॥ 3 ॥

ఇంద్రోత్సవం చేయాలనే కుతూహలంతో ఉత్సాహంగా ఉన్న గొల్లవారిని చూసి, బుద్ధిమంతుడైన కృష్ణుడు కులపుపెద్దలతో ఇలా అన్నాడు.

కృష్ణ ఉవాచ :-కులంపెద్దలతో కృష్ణుడు ఇలా అంటున్నాడు.

కోఽయం శక్రమహో నామ యేన వో హర్ష ఆగతః ।
ప్రాహ తం నన్దగోపశ్చ పృచ్ఛన్తమతిసాదరమ్ ॥ 4 ॥

ఈ ఇంద్రోత్సవం అంటే ఏమిటి? ఇంద్రోత్సవం చేయాలని మీరు చాల ఉత్సాహపడుతున్నారు కదా. అసలు ఇంద్రోత్సవం అంటే ఏమిటి? ఇలా అడిగిన కృష్ణస్వామితో గోపాలకు లందరిలో పెద్ద అయిన నందుడు వాత్సల్యంతో ఇలా చెప్తున్నాడు.

నన్ద ఉవాచ :-ఇంద్రయజ్ఞం గురించి నందుడు కృష్ణుడికి ఇలా చెప్తున్నాడు.

మేఘానాం పయసామీశో దేవరాజశ్శతక్రతుః ।
యేన సఞ్చోదితా మేఘా వర్షన్త్యమ్బుమయం రసమ్ ॥ 5 ॥

దేవతలకు రాజైన ఇంద్రుడు మేఘాలకూ, వర్షజలానికీ ప్రభువు. ఇంద్రుడి ప్రేరణతోనే మబ్బులు మేఘసార(జీవనాధార) మయిన నీళ్లను వర్షిస్తాయి.

తద్వృష్టిజనితం సస్యం వయమన్యే చ దేహినః ।
వర్తయామోపభుఞ్జానాస్తర్పయామశ్చ దేవతాః ॥ 6 ॥

ఆ వర్షంవల్ల పండిన ధాన్యాన్ని మేమూ, ఇంకా ఇతర ప్రాణులూ తిని జీవిస్తున్నాం. ఆ నీటితోనే దేవతలను తృప్తిపరుస్తున్నాం.

క్షీరవత్య ఇమా గావో వత్సవత్యశ్చ నిర్వృతాః ।
తేన సంవర్ధితైస్సస్యైః పుష్టాస్తుష్టా భవన్తి వై ॥ 7 ॥

అలాగే ఈ ఆవులు కూడ ఆ వర్షంవల్ల పెరిగిన ధాన్యాన్ని(పచ్చికను) తినే బాగా పుష్టిగానూ, ఆనందంగానూ ఉన్నాయి. సంతానం కలిగే సామర్థ్యాన్ని పొందుతున్నాయి. అలాగే పాలు ఇచ్చే శక్తిని కూడ పొందుతున్నాయి.

నాసస్యా నానృణా భూమిర్న బుభుక్షార్దితో జనః ।
దృశ్యతే యత్ర దృశ్యన్తే వృష్టిమన్తో బలాహకాః ॥ 8 ॥

దండిగా వర్షించే మేఘాలు ఉన్న ప్రాంతంలో పంటలు సమృద్ధిగా ఉంటాయి. అప్పుల అవసరం ఉండదు. (అందరూ బాగా ధనవంతులై ఉంటారు). ఆకలిబాధ ఉండదు.

భౌమమేతత్ పయో గోభిర్ధత్తే సూర్యస్య వారిదః ।
పర్జన్యస్సర్వలోకస్య భవాయ భువి వర్షతి ॥ 9 ॥

మేఘం నేలమీద ఉన్న నీటిని సూర్యుడి కిరణాలద్వారా తీసుకుంటుంది. నీళ్లు నిండిన ఆ మేఘం లోకాలన్నీ ఏర్పడడానికి వీలుగా నేలమీద వర్షిస్తుంది.

తస్మాత్ ప్రావృషి రాజానశ్శక్రం సర్వే ముదాన్వితాః ।
మహే సురేశమర్చన్తి వయమన్యే చ దేహినః ॥ 10 ॥

అందుచేత రాజులు అందరూ వర్షకాలంలో సంతోషంగా యజ్ఞం చేస్తారు. ఆ యజ్ఞంలో దేవేంద్రుడిని చక్కగా పూజిస్తారు. మేమూ, ఇంకా ఇతర ప్రాణులందరు కూడ ఇంద్రుడిని పూజిస్తారు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

నన్దగోపస్య వచనం శ్రుత్వేత్థం శక్రపూజనే ।
కోపాయ త్రిదశేన్ద్రస్య ప్రాహ దామోదరస్తదా ॥ 11 ॥

ఇంద్రుడిని పూజించే విషయంలో నందుడు చెప్పిన మాటలు విని, ఇంద్రుడికి కోపం గలిగేట్లుగా కృష్ణుడు ఇలా అన్నాడు.

కృష్ణ ఉవాచ :-నందుడితో కృష్ణుడు ఇలా చెప్తున్నాడు.

న వయం కృషికర్తారో వణిజ్యాజీవినో న చ ।
గావోఽస్మద్దైవతం తాత వయం వనచరా యతః ॥ 12 ॥

తండ్రీ! మనం వ్యవసాయం చేసేవాళ్లం కాదు. వ్యాపారం చేసి జీవించేవాళ్లమూ కాదు. మనకు ఆవులే దేవతలు. మనం అడవులలో సంచరిస్తుంటాం కదా!

ఆన్వీక్షికీ త్రయీ వార్తా దణ్డనీతిస్తథాపరా ।
విద్యాచతుష్టయం త్వేతద్ వార్తామత్ర శృణుష్వ మే ॥ 13 ॥

విద్య 1.ఆన్వీక్షకి, 2.త్రయి, 3.వార్త, 4.దండనీతి అని నాలుగు విధాలు. వీటిలో వార్తను గురించి చెప్తాను. వినండి.

కృషిర్వణిజ్యా తద్వచ్చ తృతీయం పశుపాలనమ్ ।
విద్యాహ్యేషా మహాభాగా వార్తా వృత్తిత్రయాశ్రయా ॥ 14 ॥

మహాత్మా! వీటిలో వార్త అనే విద్య వ్యవసాయం, వ్యాపారం, పశువులను పోషించడం అనే మూడు విధాలైన వృత్తులతో కూడిఉంటుంది.

కర్షకాణాం కృషిర్వృత్తిః పణ్యం పణ్యాయజీవినామ్ ।
అస్మాకం గాః పరా వృత్తిర్వార్తా భేదైరియం త్రిభిః ॥ 15 ॥

వ్యవసాయదారులకు వృత్తి వ్యవసాయం. వ్యాపారస్థులకు వృత్తి వ్యాపారం. మనకు పశువులను పోషించడమే ప్రధానమైన వృత్తి. ఇలా వార్త అనే విద్య మూడు విధాలుగా ఉంది.

విద్యయా యో యయా యుక్తస్తస్య సా దైవతం మహత్ ।
సైవ పూజ్యార్చనీయా చ సైవ తస్యోపకారికా ॥ 16 ॥

ఎవడికి ఏ విద్య సొంతమై ఉంటుందో, వాడికదే మహిమ గలిగిన దైవం. (ఎవడి వృత్తి వాడికి దైవం). దానినే పూజించాలి. గౌరవించాలి. అదే వాడికి తగిన మేలు చేస్తుంది.

యోఽన్యస్యాః ఫలమశ్నన్ వై పూజయత్యపరాం నరః ।
ఇహ చ ప్రేత్య చైవాసౌ తాత నాప్నోతి శోభనమ్ ॥ 17 ॥

తండ్రీ! ఒక విద్యను (వృత్తిని) ఆశ్రయించి దానివలన జీవించేవాడు, వేరొక విద్యను (వృత్తిని) పూజిస్తే వాడికి ఈలోకంలో గాని, పరలోకంలో గాని మంచి జరగదు.

పూజ్యన్తాం ప్రథితాస్సీమాస్సీమాన్తం చ పునర్వనమ్ ।
వనాన్తా గిరయస్సర్వే సా చాస్మాకం పరా గతిః ॥ 18 ॥

(ఆవుల కొట్టాలు ఉండే) ప్రసిద్ధమైన ఊరి పొలిమేరలను పూజిద్దాం. వాటికి హద్దులైన వనాలను పూజిద్దాం. ఆ వనాలకు హద్దులుగా ఉన్న పర్వతాలను పూజిద్దాం. ఈవిధంగా మనకు ఉపయోగకారులైన గోవులు మొదలైన వాటిని పూజించడంవల్లనే మనకు ఉత్తమమైన గతులు సిద్ధిస్తాయి.

గిరియజ్ఞస్త్వయం తస్మాద్ గోయజ్ఞశ్చ ప్రవర్త్యతామ్ ।
కిమస్మాకం మహేన్ద్రేణ గావశ్శైలాశ్చ దేవతాః ॥ 19 ॥

మనకు ఆవులూ, కొండలూ దేవతలు. కాబట్టి పర్వతపూజ, గోపూజ చేద్దాం. మనకు దేవేంద్రుడితో పనేమున్నది. (వ్యవసాయం లేదా వాణిజ్యం వృత్తి అయినవాళ్లు ఇంద్రుడిని పూజించాలి. కాని పశుపాలనం చేసేవాళ్లు కాదు. కాబట్టి మనకు ఇంద్రుడిని పూజించవలసిన అవసరం లేదు.)

మన్త్రయజ్ఞపరా విప్రాస్సీరయజ్ఞాశ్చ కర్షకాః ।
గిరిగోయజ్ఞశీలాశ్చ వయమద్రివనాశ్రయాః ॥ 20 ॥

బ్రాహ్మణులకు మంత్రమే దైవం. మంత్రాన్ని వారు అనుష్ఠించాలి. కృషీవలులకు నాగలి దైవం. వారికి నాగలిపూజ ప్రధానం. కొండలను, అడవులను ఆశ్రయించుకుని జీవిస్తున్నాం కాబట్టి మనకు కొండలు, గోవులు దైవాలు. మనం వాటిని పూజించాలి.

తస్మాద్ గోవర్ధనశ్శైలో భవద్భిర్వివిధార్హణైః ।
అర్చ్యతాం పూజ్యతాం మేధ్యం పశుం హత్వా విధానతః ॥ 21 ॥

అందుచేత మీరందరూ రకరకాలైన పూజాద్రవ్యాలతో గోవర్ధన పర్వతాన్ని అర్చించండి. పశువును బలి యిచ్చి, పద్ధతి ప్రకారం గోవర్ధన పర్వతానికి పూజ చేయండి.

సర్వఘోషస్య సన్దోహో గృహ్యన్తాం మా విచార్యతామ్ ।
భోజ్యన్తాం తేన వై విప్రా స్తథాఽన్యే చాపి వాఞ్ఛకాః ॥ 22 ॥

గోకులంలో ఉన్న పూజాసామగ్రి మొత్తం తీసుకుని రండి. వేరే ఆలోచన వద్దు. బ్రాహ్మణులకు భోజనాలు పెట్టండి. అలాగే ఆకలిగొన్న వారందరికీ అన్నం పెట్టండి.

తమర్చితం కృతే హోమే భోజితేషు ద్విజాతిషు ।
శరత్పుష్పకృతాపీడాః పరిగచ్ఛన్తు గోగణాః ॥ 23 ॥

గోవర్ధనగిరిని పూజించండి. హోమం చేయండి. బ్రాహ్మణులకు అన్నసంతర్పణం చేయండి. ఆ తరువాత శరదృతువులో పూచే పూలతో చేసిన మాలలను శిరసునిండా అలంకరించుకుని, (గోపూజానంతరం) ఆవుల మందలు ఇంటికి తిరిగివెళ్తాయి.

ఏతన్మమ మతం గోపాస్సమ్ప్రీత్యా క్రియతే యది ।
తతః కృతా భవేత్ ప్రీతిర్గవామద్రేస్తథా మమ ॥ 24 ॥

గోపాలకులారా! నా అభిప్రాయం ఇది. సంతోషంతో ఈ ప్రకారంగా చేస్తే, దానివల్ల ఆవులు ఆనందిస్తాయి. గోవర్ధనగిరి (కొండలు) సంతోషిస్తుంది. అదే విధంగా నాకు కూడా తృప్తి కలుగుతుంది.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇతి తస్య వచశ్శ్రుత్వా నన్దాద్యాస్తే వ్రజౌకసః ।
ప్రీత్యుత్ఫుల్లముఖా విప్రాస్సాధు సాధ్విత్యథాబ్రువన్ ॥ 25 ॥

శ్రీకృష్ణుడిమాటలు విని నందుడు మొదలుగా వ్రేపల్లెవాసులు అందరూ సంతోషించారు. ఆనందంతో వారికి ముఖాలు విచ్చుకున్నాయి. బాగుంది, బాగుంది అన్నారు అందరూ.

శోభనం తే మతం వత్స యదేతద్ భవతోదితమ్ ।
తత్ కరిష్యామహే సర్వే గిరియజ్ఞః ప్రవర్తతామ్ ॥26 ॥

నాయనా! నీ అభిప్రాయం చాల శుభప్రదంగా ఉంది. నువ్వు చెప్పిన ప్రకారంగానే చేస్తాం. గోవర్ధన గిరిపూజ ప్రారంభిస్తాం.

తథా చ కృతవన్తస్తే గిరియజ్ఞం వ్రజౌకసః ।
దధిపాయసమాంసాద్యైర్దదుశ్శైలబలిం తతః ॥ 27 ॥

వ్రేపల్లెవాసులు సంప్రదాయం ప్రకారం గోవర్ధనగిరిని పూజించారు. ఆ పర్వతానికి పెరుగు, పాయసం, మాంసం మొదలైన పదార్థాలను నివేదించారు.

ద్విజాంశ్చ భోజయామాసుశ్శతశోఽథ సహస్రశః ।
గావశ్శైలం తతశ్చక్రురర్చితాస్తం ప్రదక్షిణమ్ ॥ 28 ॥

వందలూ వేలసంఖ్యలో బ్రాహ్మణులకు భోజనాలు పెట్టారు. వ్రేపల్లెవాసులూ, వారు పూజించిన ఆవులూ గోవర్ధన పర్వతానికి ప్రదక్షిణం చేశారు.

వృషభాశ్చాభినర్దన్త స్సతోయా జలదా ఇవ ।
గిరిమూర్ధని గోవిన్దశ్శైలోఽహమితి మూర్తిమాన్ ॥
బుభుజేఽన్నం బహువిధం గోపవర్యాహృతం ద్విజాః ॥ 29 ॥

నీరు నిండిన మబ్బులలాగా (పిడుగువంటిధ్వనితో) రంకెలు వేస్తూ, ఎద్దులు కూడ గోవర్ధనపర్వతంచుట్టూ తిరిగాయి. శ్రీకృష్ణస్వామి ఆ గోవర్ధ పర్వత శిఖరంమీద కూర్చుని, వ్రేపల్లెవాసులు అర్చిస్తున్న పర్వతం రూపం తానే అని తెలియజేస్తూ, గోపాలకులు తెచ్చిన (పర్వతానికి నివేదించిన) వివిధమైన భోజ్యపదార్థాలను ఆరగించాడు.

కృష్ణస్తేనైవ రూపేణ గోపైస్సహ గిరేశ్శిరః ।
అధిరుహ్యార్చయామాస ద్వితీయామాత్మనస్తనుమ్ ॥ 30 ॥

కృష్ణుడు అదే రూపంతో గోపాలకులతో కలిసి, గోవర్ధనగిరి పైకెక్కి, తన రెండవ శరీరం అయిన ఆ పర్వతాన్ని తానూ అర్చించాడు.

అన్తర్ధానం గతే తస్మిన్ గోపా లబ్ధ్వా తతో వరాన్ ।
కృత్వా గిరిమహం గోష్ఠం నిజమభ్యాయయుః పునః ॥ 31 ॥

ఆ తరువాత అక్కడి కృష్ణమూర్తి అదృశ్యం అయింది. ఆ మూర్తివలన గోపాలకులు వివిధ వరాలను పొందారు. ఈవిధంగా వ్రేపల్లెనివాసులు గిరియజ్ఞాన్ని సంబరంగా చేసుకుని, తిరిగి తమ తమ నివాసాలకు చేరుకున్నారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే బాలచరితే గోవర్ధనగిరియజ్ఞప్రవర్తనం నామ నవసప్తతితమోఽధ్యాయః ॥ 79 ॥

శ్రీబ్రహ్మపురాణంలో బాలచరిత్రలో గోవర్ధనగిరి యజ్ఞ ప్రవర్తనం అనే డెబ్బైతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

అశీతితమోఽధ్యాయః - ఎనబైయవ అధ్యాయం

గోవిందాభిషేకవర్ణనమ్ - గోవిందాభిషేక వర్ణనం

వ్యాస ఉవాచ :-మహర్షులతో వ్యాసుడు ఈవిధంగా చెప్తున్నాడు.

మహే ప్రతిహతే శక్రో భృశం కోపసమన్వితః ।
సంవర్తకం నామ గణం తోయదానామథాబ్రవీత్ ॥ 1 ॥

ఇంద్రయజ్ఞం ఆపివేయడంతో దేవేంద్రుడికి బాగా కోపం వచ్చింది. వెంటనే సంవర్తకం అనే పేరు గలిగిన మేఘాల బృందాన్ని పిలిచి వాటితో ఇలా అన్నాడు.

ఇన్ద్ర ఉవాచ :-ఇంద్రుడు సంవర్తక మేఘాలతో ఇలా చెప్తున్నాడు.

భో భో మేఘా నిశమ్యైతద్ వదతో వచనం మమ ।
ఆజ్ఞానన్తరమేవాశు క్రియతామవిచారితమ్ ॥ 2 ॥

ఓ మేఘాల్లారా! నేను చెప్పే ఈ మాట శ్రద్ధగా వినండి. ఆజ్ఞాపించిన వెంటనే ఇక వేరే ఆలోచన లేకుండా నేను చెప్పిన ప్రకారం చేయండి.

నన్దగోపస్సుదుర్బుద్ధిర్గోపైరన్యైస్సహాయవాన్ ।
కృష్ణాశ్రయబలాధ్మాతో మహభఙ్గమచీకరత్ ॥ 3 ॥

గోపనాయకుడైన నందుడు దుష్టబుద్ధి. ఇతర గోపాలకులను కూడగట్టుకుని, కృష్ణుడి బలం తనకు అండగా ఉన్నదనే అహంకారంతో ఇంద్రపూజోత్సవాన్ని చెడగొట్టాడు.

ఆజీవో యః పరం తేషాం గోపత్వస్య చ కారణమ్ ।
తా గావో వృష్టిపాతేన పీడ్యన్తాం వచనాన్మమ ॥ 4 ॥

వారి జీవనానికి ఆధారం గోవులే. వారికి గోపాలకులు అనే గౌరవం కలగడానికి కూడ గోవులే కారణం. కాబట్టి నా ఆజ్ఞప్రకారం మీరు భయంకరంగా వానలు కురిసి, వారి ఆవులను బాధించండి.

అహమప్యద్రిశృఙ్గాభం తుఙ్గమారుహ్య వారణమ్ ।
సాహాయ్యం వః కరిష్యామి వాయూనాం సఙ్గమేన చ ॥ 5 ॥

నేను గూడా కొండశిఖరం వంటి ఐరావతం అనే ఏనుగును ఎక్కి, వాయువును కూడగట్టుకుని వచ్చి, మీకు సహాయం చేస్తాను.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

ఇత్యాజ్ఞప్తాస్సురేన్ద్రేణ ముముచుస్తే బలాహకాః ।
వాతవర్షం మహాభీమమభావాయ గవాం ద్విజాః ॥ 6 ॥

విప్రులారా! దేవేంద్రుడిఆజ్ఞ ననుసరించి, గోజాతి మొత్తాన్ని నాశనం చేయడానికి ఆ మేఘాలు మిక్కిలి భయంకరమైన వర్షాన్ని కురిపించాయి.

తతః క్షణేన ధరణీ కకుభోఽమ్బరమేవ చ ।
ఏకం ధారామహాసారపూరణేనాభవద్ ద్విజాః ॥ 7 ॥

విప్రులారా! ఒక్క క్షణంలో లెక్కలేనన్ని పెద్దపెద్ద జలధారలతో వర్షం తీవ్రంగా కురిసింది. ఆ వర్షధారలతో నేల, నింగి, దిక్కులు అన్నీ ఏకమయ్యాయి.

గావస్తు తేన పతతా వర్షవాతేన వేపితాః ।
ప్రాణాంస్తు ప్రజహుస్సర్వాస్తిర్యఙ్ముఖశిరోధరాః ॥ 8 ॥

తీవ్రంగా పడుతున్న వర్షధారలను ఆవులు భరించలేకపోయాయి. తలలూ, మెడలూ మెలికలుతిరిగి, ప్రాణాలు విడిచిపెట్టాయి.

క్రోడేన వత్సానాక్రమ్య తస్థురన్యా ద్విజోత్తమాః ।
గావో వివత్సాశ్చ కృతా వారిపూరేణ చాపరాః ॥ 9 ॥

బ్రాహ్మణవర్యులారా! కొన్ని ఆవులు తమ దూడలను గుండెలకు హత్తుకుని ఉండిపోయాయి. కొన్ని ఆవులు ఆ వర్షధారల తాకిడికి దూడలకు దూరమైనాయి.

వత్సాశ్చ దీనవదనాః పవనాకమ్పికన్ధరాః ।
త్రాహి త్రాహీత్యల్పశబ్దాః కృష్ణమూచురివార్తకాః ॥ 10 ॥

కొన్ని దూడలు వర్షంతో కూడిన సుడిగాలి తాకిడికి మెడలు కదిలిపోతుండగా, బిక్కముఖం వేసుకుని, బాధతో మెల్లని కంఠస్వరంతో, కృష్ణా! కాపాడు, కాపాడవయ్యా' అంటూ ప్రార్థించాయి.

తతస్తద్గోకులం సర్వం గోగోపీగోపసఙ్కులమ్ ।
అతీవార్తం హరిర్దృష్ట్వా త్రాణాయాచిన్తయత్ తదా ॥ 11 ॥

గోవులు, గోపికలు, గోపాలకులతో గోకులం అంతా తట్టుకోలేని బాధలు పడుతుండగా, చూసి, శ్రీకృష్ణస్వామి వారిని ఎలా రక్షించాలా అని ఒక్క క్షణం ఆలోచించాడు.

ఏతత్కృతం మహేన్ద్రేణ మహాభఙ్గవిరోధినా ।
తదేతదఖిలం గోష్ఠం త్రాతవ్యమధునా మయా ॥ 12 ॥

ఇంద్రోత్సవం చెడగొట్టామనే కోపంతో దేవేంద్రుడే ఇంతటి ఘోరం చేస్తున్నాడు. ఈ గోకులం మొత్తాన్నీ నేను ఇప్పుడే కాపాడాలి'.

ఇమమద్రిమహం వీర్యాదుత్పాట్యోరుశిలాతలమ్ ।
ధారయిష్యామి గోష్ఠస్య పృథుచ్ఛత్రమివోపరి ॥ 13 ॥

విశాలమైన బండరాళ్లతో కూడిఉన్న ఈ గోవర్ధనపర్వతాన్ని నేను నా బలపరాక్రమాలతో పెరికివేస్తాను. గోవులకూ, గొల్లలకూ పైన ఆ పర్వతాన్ని గొడుగులాగా ఉంచి, అందరినీ కాపాడతాను'. అనుకున్నాడు.

వ్యాస ఉవాచ :– మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇతి కృత్వా మతిం కృష్ణో గోవర్ధనమహీధరమ్ ।
ఉత్పాట్యైకకరేణైవ ధారయామాస లీలయా ॥ 14 ॥

కృష్ణస్వామి ఈవిధంగా నిశ్చయించుకుని, గోవర్ధనగిరిని ఊడబెరికి, ఒంటిచేతితో గొడుగులాగ విలాసంగా ఎత్తిపట్టుకున్నాడు.

గోపానాహ జగన్నాథస్సముత్పాటితభూధరః ।
విశధ్వమత్ర సహితాః కృతం వర్షనివారణమ్ ॥ 15 ॥

లోకరక్షకుడైన కృష్ణస్వామి గొల్లవారి నందరినీ పిలిచి, 'అందరూ కలిసి ఈ కొండ కిందికి రండి. వర్షం మిమ్మల్ని ఏమీ చేయదు.

సునిర్వాతేషు దేశేషు యథాయోగ్యమిహాస్యతామ్ ।
ప్రవిశ్య నాత్ర భేతవ్యం గిరపాతస్య నిర్భయైః ॥ 16 ॥

గాలి అంతగా వీచకుండా, అనుకూలంగా ఉన్న చోటు చూసుకుని అందరూ ఇక్కడ ఉండండి. ఈ కొండ కిందికి రండి. కొండ కూలి మీద పడుతుందేమో అని భయపడకండి'.

ఇత్యుక్తాస్తేన తే గోపా వివిశుర్గోధనైస్సహ ।
శకటారోపితైర్భాణ్డైర్గోప్యశ్చాసారపీడితాః ॥ 17 ॥

కృష్ణుడు ఈవిధంగా చెప్పగా విని, గోపాలకులు తమ తమ ఆవులతో సహా గోవర్ధగిరి కిందకు చేరారు. వానదెబ్బ తట్టుకోలేక గోపికలు కూడ బండ్లపై కెక్కించిన పాత్రసామగ్రితో సహా ఆ కొండ కిందికి చేరుకున్నారు.

కృష్ణోఽపి తం దధారైవం శైలమత్యన్తనిశ్చలమ్ ।
వ్రజౌకోవాసిభిర్హర్షవిస్మితాక్షైర్నిరీక్షితః ॥ 18 ॥

కృష్ణుడు కూడ ఆ గోవర్ధన పర్వతం ఏమాత్రం కదలకుండా స్థిరంగా ఉండేవిధంగా పట్టుకున్నాడు. అంత పెద్దకొండను ఒంటిచేతితో పసివాడైన కృష్ణుడు బెసగకుండా పట్టుకోవడం చూసి, ఆ గొల్లపల్లెలో ఉండే వారందరూ ఆనందంతోనూ, ఆశ్చర్యంతోనూ నిండిన కళ్లతో కృష్ణుడినే చూడసాగారు.

గోపగోపీజనైర్హృష్టైః ప్రీతివిస్తారితేక్షణైః ।
సంస్తూయమానచరితః కృష్ణశ్శైలమధారయత్ ॥ 19 ॥

గోపాలకులు, గోపికలు, ఆనందంతో, కళ్లు పెద్దవి చేసుకుని, చూస్తూ శ్రీకృష్ణుడి ఘనకార్యాన్ని స్తుతిస్తుండగా, కృష్ణుడు గోవర్ధనగిరిని ఒంటిచేత్తో ధరించాడు.

సప్తరాత్రం మహామేఘా వవర్షుర్నన్దగోకులే ।
ఇన్ద్రేణ చోదితా మేఘా గోపానాం నాశకారిణా ॥ 20 ॥

గోపాలకులను నాశనం చేయాలని, ఇంద్రుడు పంపిన ఆ సంవర్తక మేఘాలు నందుడు ఉంటున్న గోకులంలో ఏడు రోజులు విరామం లేకుండా వర్షించాయి.

తతో ధృతే మహాశైలే పరిత్రాతే చ గోకులే ।
మిథ్యాప్రతిజ్ఞో బలభిద్ వారయామాస తాన్ ఘనాన్ ॥ 21 ॥

ఆ ఏడు రోజులూ కృష్ణస్వామి గోవర్ధనగిరిని అలాగే ధరించి, గోకులం అంతటినీ కాపాడాడు. గొల్లలను నాశనం చేయాలనే ఇంద్రుడి ప్రతిజ్ఞ నెరవేరలేదు. ఇంద్రుడు చేసేది లేక, చివరికి మేఘాలను వెనకకు పంపాడు.

వ్యభ్రే నభసి దేవేన్ద్రే వితథే శక్రమన్త్రితే ।
నిష్క్రమ్య గోకులం హృష్టస్స్వస్థానం పునరావిశత్ ॥ 22 ॥

ఆకాశంలో మబ్బులన్నీ తొలగిపోయాయి. గోకులాన్ని నాశనం చేయాలనే ఇంద్రుడి ప్రయత్నం విఫలం అయింది. దానితో ఇంద్రుడు గోకులాన్ని విడిచిపెట్టి, వెనుదిరిగి ఇంటికి వెళ్లిపోయాడు.

ముమోచ కృష్ణోఽపి తదా గోవర్ధనమహాగిరిమ్ ।
స్వస్థానే విస్మితముఖైర్దృష్టస్తైర్వ్రజవాసిభిః ॥ 23 ॥

(వర్షం ఆగిపోవడంతో) కృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని కిందికి దించి, యథాస్థానంలో ఉంచాడు. గొల్లపల్లెలో నివసించేవారు చిరునవ్వులు నిండిన ముఖాలతో కృష్ణస్వామిని తిలకించారు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ధృతే గోవర్ధనే శైలే పరిత్రాతే చ గోకులే ।
రోచయామాస కృష్ణస్య దర్శనం పాకశాసనః ॥ 24 ॥

గోవర్ధనపర్వతాన్ని ధరించి, గోకుల మంతటినీ కాపాడిన శ్రీకృష్ణుడిని దర్శించా లని దేవేంద్రుడు ఉబలాడ పడ్డాడు.

సోఽధిరుహ్య మహానాగమైరావతమమిత్రజిత్ ।
గోవర్ధనగిరౌ కృష్ణం దదర్శ త్రిదశాధిపః ॥ 25 ॥

శత్రువులను జయించే ఆ దేవతలరాజు, ఇంద్రుడు ఐరావతం అనే తన గొప్ప ఏనుగును ఎక్కి వచ్చాడు. గోవర్ధనగిరిమీద శ్రీకృష్ణస్వామిని చూశాడు.

చారయన్తం మహావీర్యం గాశ్చ గోపవపుర్ధరమ్ ।
కృత్స్నస్య జగతో గోపం వృతం గోపకుమారకైః ॥ 26 ॥

గోపాలకుడి రూపంలో గొల్లపల్లెలో తిరుగుతున్న కృష్ణస్వామిని ఇంద్రుడు చూశాడు. అతడు గోవులను మాత్రమే కాదు సమస్త జగత్తునూ సంరక్షించేవాడు. గోపాలకులు కృష్ణుడి చుట్టూ చేరారు. అక్కడ సుఖంగా సంచరిస్తున్న ఆవులను చూశాడు.

గరుడం చ దదర్శోచ్చైరన్తర్ధానగతం ద్విజాః ।
కృతచ్ఛాయం హరేర్మూర్ధ్ని పక్షాభ్యాం పక్షిపుఙ్గవమ్ ॥ 27 ॥

విప్రులారా! అక్కడే ఇంద్రుడు గరుత్మంతుడిని కూడ చూశాడు. గరుత్మంతుడు ఆకాశంలో కనబడకుండా నిలిచి, శ్రీకృష్ణుడి తలపై గొడుగులాగా రెక్కలు విప్పి పరిచి, స్వామికి నీడ కల్పించాడు.

అవరుహ్య స నాగేన్ద్రాదేకాన్తే మధుసూదనమ్ ।
శక్రస్సస్మితమాహేదం ప్రీతివిస్ఫారితేక్షణః ॥ 28 ॥

ఇంద్రుడు ఐరావతాన్ని దిగి, ఆనందంతో విప్పారినకళ్లతో, చిరునవ్వుతో, ఏకాంతంలో శ్రీకృష్ణస్వామితో ఇలా అన్నాడు.

ఇన్ద్ర ఉవాచ :-శ్రీకృష్ణుడితో దేవేంద్రుడు ఇలా అంటున్నాడు.

కృష్ణ కృష్ణ శృణుష్వేదం యదర్థమహ మాగతః ।
త్వత్సమీపం మహాబాహో నైతచ్చిన్త్యం త్వయాఽన్యథా ॥ 29 ॥

హే కృష్ణా! దీర్ఘమైన బాహువులు కలిగిన స్వామీ! నేను నీ వద్దకు ఎందుకు వచ్చానో చెప్తాను, విను. నా రాక గురించి నీవు అన్యథా భావించవద్దు.

భారావతరణార్థాయ పృథివ్యాః పృథివీతలమ్ ।
అవతీర్ణోఽఖిలాధారస్త్వమేవ పరమేశ్వర ॥ 30 ॥

పరమాత్మా! సమస్తానికీ ఆధారం నీవే. భూభారాన్ని తగ్గించడానికి నీవు ఈ భూమిమీద అవతరించావు.

మహభఙ్గవిరుద్ధేన మయా గోకులనాశకాః ।
సమాదిష్టా మహామేఘాస్తైశ్చైతత్కదనం కృతమ్ ॥ 31 ॥

ఇంద్రోత్సవాన్ని ఆపివేయడం వలన గలిగిన క్రోధంతో నేను గోకులాన్ని నాశనం చేయమని సంవర్తక మేఘాలను ఆదేశించాను. ఆ మేఘాలవల్లనే ఈ అనర్థం జరిగింది.

త్రాతాస్తాపాత్ త్వయా గావస్సముత్పాట్య మహాగిరిమ్ ।
తేనాహం తోషితో వీర కర్మణాత్యుద్భుతేన తే ॥ 32 ॥

నీవు ఈ గోవర్ధన పర్వతాన్ని పెకలించి, గొడుగుగా చేసి, ఆవులను (గోకులాన్ని మొత్తాన్ని) రక్షించావు. పరాక్రమవంతుడా! నీవు చేసిన విచిత్రమైన ఆ ఘనకార్యానికి నేను సంతోషించాను.

సాధితం కృష్ణ దేవానామద్య మన్యే ప్రయోజనమ్ ।
త్వయా యమద్రిప్రవరః కరేణైకేన చోద్ధృతః ॥ 33 ॥

శ్రీకృష్ణా! ఈ మహాపర్వతాన్ని నీవు ఒకే చేతితో పైకి ఎత్తివేశావు. ఈనాడు నీవు చేసిన పనివల్ల దేవతల ప్రయోజనం కూడ నెరవేరిందని భావిస్తున్నాను.

గోభిశ్చ చోదితః కృష్ణ త్వత్సమీప మిహాగతః ।
త్వయా త్రాతాభిరత్యర్థం యుష్మత్కారణకారణాత్ ॥ 34 ॥

ఓ శ్రీకృష్ణా! నీవు రక్షించిన ఈ గోవుల ప్రేరణచేతనే నేను నీ వద్దకు వచ్చాను. నీ అవతారానికి కారణమైన గోవుల కారణంగానే నీతో కలిసి ఇక్కడ ఆనందం పొందే అవకాశం కలిగింది.

స త్వాం కృష్ణాభిషేక్ష్యామి గవాం వాక్యప్రచోదితః ।
ఉపేన్ద్రత్వే గవామిన్ద్రో గోవిన్దస్త్వం భవిష్యసి ॥ 35 ॥

గోవులను చక్కగా రక్షించిన నిన్ను ఆ గోవుల మాటల ప్రేరణతో ఉపేంద్రుడిగా అభిషేకిస్తున్నాను. (నేను దేవతలకు ఇంద్రుడిని కాగా) నీవు గోవులకు ఇంద్రుడివై, గోవిందుడివి అవుతావు.

అథోపవాహ్యాదాదాయ ఘణ్టామైరావతాద్ గజాత్ ।
అభిషేకం తయా చక్రే పవిత్రజలపూర్ణయా ॥ 36 ॥

అని దేవేంద్రుడు వాహనం దిగి, ఆ ఐరావతం మెడలోని గంటలో పవిత్రమైన జలాన్ని నింపి, ఆ నీటితో శ్రీకృష్ణుడిని ఆవులకు ఇంద్రుడు (ఉపేంద్రుడు) గా అభిషేకించాడు.

క్రియమాణోऽభిషేకం తు గావః కృష్ణస్య తత్క్షణాత్ ।
ప్రస్రవోద్భూతదుగ్ధార్ద్రో సద్యశ్చక్రుర్వసున్ధరామ్ ॥ 37 ॥

ఈవిధంగా కృష్ణుడిని గోవులకు ఇంద్రుడుగా అభిషేకించిన క్షణంలోనే ఆవులు నిండుగా స్రవిస్తున్న పాలధారలతో భూమిని చక్కగా తడిపివేశాయి. (భూమిని ఆవుపాలతో అభిషేకించాయి.)

అభిషిచ్య గవాం వాక్యాద్దేవేన్ద్రో వై జనార్దనమ్ ।
ప్రీత్యా సప్రశ్రయం కృష్ణం పునరాహ శచీపతిః ॥ 38 ॥

ఆవుల మాట ప్రకారం శ్రీకృష్ణస్వామిని గోవుల కధిపతిగా అభిషేకించిన తరువాత, శచీదేవికి భర్త అయిన దేవేంద్రుడు ఆనందంగా కృష్ణుడితో ఇంకా ఇలా అన్నాడు.

ఇన్ద్ర ఉవాచ :–శ్రీకృష్ణుడితో దేవేంద్రుడు ఇలా అంటున్నాడు.

గవామేతత్ కృతం వాక్యాత్ తథాऽన్యదపి మే శృణు ।
యద్ బ్రవీమి మహాభాగ భారావతరణేచ్ఛయా ॥ 39 ॥

మమాంశః పురుషవ్యాఘ్రః పృథివ్యాం పృథివీధర ।
అవతీర్ణోఽ ర్జునో నామ స రక్ష్యో భవతా సదా ॥ 40 ॥

మహాత్మా! శ్రీకృష్ణా! గోవుల మాటమేరకు నేను ఇదంతా చేశాను. అలాగే నా మనవి ఇంకొకటి ఆలకించు. భూభారాన్ని తొలగించడం కోసమే నా అంశతో ఈ భూమిమీద అర్జునుడు అనే పేరుతో ఒక ఉత్తమ పురుషుడు అవతరిస్తాడు. నీవు ఎల్లప్పుడూ ముందుండి అతడిని కాపాడాలి.

భారావతరణే సఖ్యం స తే వీరః కరిష్యతి ।
సంరక్షణీయో భవతా యథాత్మా మధుసూదన ॥ 41 ॥

మధుసూదనా! శ్రీకృష్ణా! భూమి భారాన్ని తొలగించేపనిలో వీరుడైన అర్జునుడు నీతో సహచరిస్తాడు. అతడిని నీవే కాపాడాలి. నీవే అతడని చూసుకోవాలి.

శ్రీభగవానువాచ :–శ్రీకృష్ణుడు దేవేంద్రుడితో ఇలా అంటున్నాడు.

జానామి భారతే వంశే జాతం పార్థం తవాంశతః ।
తమహం పాలయిష్యామి యావదస్మి మహీతలే ॥ 42 ॥

ఇంద్రా! నాకు తెలుసు. భరతవంశంలో నీ అంశతో పృథకు కుమారుడుగా అర్జునుడు జన్మిస్తాడు. నేను భూలోకంలో ఉన్నంత కాలం అర్జునుడిని రక్షిస్తాను.

యావన్మహీతలే శక్ర స్థాస్యామ్యహమరిన్దమ ।
న తావదర్జునం కశ్చిద్దేవేన్ద్ర యుధి జేష్యతి ॥ 43 ॥

శత్రువులను అణిచేసేవాడా! దేవేంద్రా! శక్రా! నేను భూలోకంలో ఉన్నంత కాలం యుద్ధంలో అర్జునుడిని ఎవ్వడూ జయించలేడు.

కంసో నామ మహాబాహుర్దైత్యోఽ రిష్టస్తథా పరః ।
కేశీ కువలయాపీడో నరకాద్యా స్తథాపరే ॥ 44 ॥

భూలోకంలో కంసుడు అనే మహాబలవంతుడైన రాక్షసుడు ఉన్నాడు. అలాగే అరిష్టుడు, కేశి, కువల యాపీడుడు, నరకుడు మొదలైన రాక్షసులు చాలమంది ప్రస్తుతం భూమిమీద ఉన్నారు.

హతేష్వేతేషు దేవేన్ద్ర భవిష్యతి మహాహవః ।
తత్ర విద్ధి సహస్రాక్ష భారావతరణం కృతమ్ ॥ 45 ॥

ఇంద్రా! ఆ రాక్షసులందరూ మరణించిన తరువాత ఒకానొక మహాసంగ్రామం జరుగుతుంది. ఆ యుద్ధంలో భూమి భారం తొలగింపబడుతుందని తెలుసుకో.

స త్వం గచ్ఛ న సన్తాపం పుత్రార్థం కర్తుమర్హసి ।
నార్జునస్య రిపుః కశ్చిన్మమాగ్రే ప్రభవిష్యతి ॥ 46 ॥

అందుచేత నీవు నీ కుమారుడిని గురించి విచారించ నవసరం లేదు. సంతోషంగా స్వర్గానికి తిరిగి వెళ్లిపో. నేనుండగా అర్జునుడికి ఎదురుగా శత్రువు అనే వాడెవడూ నిలవడు.

అర్జునార్థం త్వహం సర్వాన్ యుధిష్ఠిరపురోగమాన్ ।
నివృత్తే భారతే యుద్ధే కున్త్యై దాస్యామి విక్షతాన్ ॥ 47 ॥

ఆ మహాసంగ్రామం ముగిసిన తరువాత అర్జునుడి కోసమే నేను ధర్మరాజు మొదలైన వీరులందరినీ చిన్నగాయం కూడ లేకుండా, కుంతీదేవికి స్వయంగా అప్పగిస్తాను.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్తస్సమ్పరిష్వజ్య దేవరాజో జనార్దనమ్ ।
ఆరుహ్యైరావతం నాగం పునరేవ దివం యయౌ ॥ 48 ॥

ఆ పలుకులు విని, దేవేంద్రుడు ఆనందంతో శ్రీకృష్ణుడిని గట్టిగా కౌగిలించుకున్నాడు. తరువాత ఐరావతాన్ని అధిరోహించి, తిరిగి స్వర్గలోకానికి వెళ్లిపోయాడు.

కృష్ణోఽపి సహితో గోభిర్గోపాలైశ్చ పునర్వ్రజమ్ ।
ఆజగామాథ గోపీనాం దృష్టిపూతేన వర్త్మనా ॥ 49 ॥

శ్రీకృష్ణుడు కూడ ఆవులతోనూ, ఆవులను కాచేవారితోనూ, కలిసి, గోపికల చూపులతో పవిత్రమైన దారిలో గొల్లపల్లెకు తిరిగి వచ్చాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే బాలచరితే గోవిన్దాభిషేకవర్ణనం నామ అశీతితమోఽధ్యాయః ॥ 80 ॥

శ్రీబ్రహ్మపురాణంలో బాలచరిత్రలో గోవిందాభిషేక వర్ణనం అనే ఎనబైయవ అధ్యాయం సంపూర్ణం.



ఏకాశీతితమోఽధ్యాయః - ఎనభైఒకటవ అధ్యాయం

అరిష్టవధనిరూపణమ్ - అరిష్టవధనిరూపణం

వ్యాస ఉవాచ :-మహర్షులతో వ్యాసుడు ఈవిధంగా చెబుతున్నాడు.

గతే శక్రే తు గోపాలాః కృష్ణ మక్లిష్టకారిణమ్ ।
ఊచుః ప్రీత్యా ధృతం దృష్ట్వా తేన గోవర్ధనాచలమ్ ॥ 1 ॥

గోవర్ధనపర్వతాన్ని అవలీలగా ఎత్తి, ఘనకార్యం చేసిన బాలకృష్ణుడిని చూసి, గోపాలకులు ఇంద్రుడు వెళ్లిపోయిన తరువాత ప్రేమగా ఇలా అన్నారు.

గోపా ఊచుః :-బాలకృష్ణుడితో గోపాలకులు ఈవిధంగా అంటున్నారు.

వయ మస్మాన్ మహాభాగ భవతా మహతో భయాత్ ।
గావశ్చ భవతా త్రాతా గిరిధారణకర్మణా ॥ 2 ॥

మహాత్మా! నీవు గోవర్ధనపర్వతాన్ని ఎత్తి, వర్షమహాభయంనుండి మమ్మల్ని కాపాడావు. అలాగే ఈమాగోవులను కూడ నీవు చక్కగా రక్షించావు.

బాలక్రీడేయ మతులా గోపాలత్వం జుగుప్సితమ్ ।
దివ్యం చ కర్మ భవతః కిమేతత్ తాత కథ్యతామ్ ॥ 3 ॥

చిన్నపిల్లలఆటగా నీవు చేసిన ఈపని మరింకెవరూ చేయలేరు. తండ్రీ! అంతటిగొప్పమహిమ గలిగిననీవు గోవులను కాచే వృత్తి చేయడం నీచంగా ఉంది. నీవు చేసిన గోవర్ధనోద్ధరణం అనేకార్యం మిక్కిలి ఘనమయినది. ఈవింత యేమిటో చెప్పు.

కాలియో దమిత స్తోయే ప్రలమ్బో వినిపాతితః ।
ధృతో గోవర్ధన శ్చాయం శఙ్కితాని మనాంసి నః ॥ 4 ॥

కాలియమహాసర్పాన్ని మడుగులోనే అణగగొట్టావు. ప్రలంబుడు అనే రాక్షసుడిని చంపిపడేశావు. గోవర్ధన పర్వతాన్ని అవలీలగా ఎత్తిపట్టుకున్నావు. అద్భుతమయిన ఈపనులవలన నిన్ను గురించి మామనసుల్లో సందేహం కలుగుతున్నది.

సత్యం సత్యం హరేః పాదౌ శపామోఽమితవిక్రమ ।
యథా త్వద్వీర్య మాలోక్య న త్వాం మన్యామహే నరమ్ ॥ 5 ॥

అసమానమయిన పరాక్రమం గలిగిన స్వామీ! ఇది నిజం. ముమ్మాటికి నిజం. మేము శ్రీహరిపాదాలు ముట్టి చెప్తున్నాం. నీబలపరాక్రమాలు చూస్తుంటే, నీవు సాధారణమయిన మానవుడివి కాదని భావిస్తున్నాం.

దేవో వా దానవో వా త్వం యక్షో గన్ధర్వ ఏవ వా ।
కిం చాస్మాకం విచారేణ బాన్ధవోఽసి నమోఽస్తు తే ॥ 6 ॥

నీవు దేవుడివో, దానవుడివో, యక్షుడివో, గంధర్వుడివో. ఆ విచారం మాకు అవసరం లేదు. మమ్మల్ని కాపాడిన ఆత్మబంధువువి. నీకు నమస్కారం.

ప్రీతి స్సస్త్రీకుమారస్య వ్రజస్య తవ కేశవ ।
కర్మ చేద మశక్యం యత్ సమస్తై స్త్రిదశైరపి ॥ 7 ॥

కృష్ణా! దేవతలు అందరూ కలిసినా చేయలేని ఈఘనకార్యాన్ని నీవు ఒక్కడివే సులువుగా చేశావు. ఈగొల్లపల్లెలోని పిల్లలు, పెద్దలూ, ఆడవాళ్లు అందరికీ నీపై అత్యంతమయిన ఇష్టం ఏర్పడింది.

బాలత్వం చాతివీర్యం చ జన్మ చాస్మా స్వశోభనమ్ ।
చిన్త్యమానమమేయాత్మన్ శఙ్కాం కృష్ణ ప్రయచ్ఛతి ॥ 8 ॥

కృష్ణా! నీవు చూస్తే చాల పసివాడివి. బలపరాక్రమాలేమో అత్యధికంగా ఉన్నాయి. అటువంటినీవు తక్కువజాతి వారమయిన మా(గొల్లల)లో జన్మించావు. అమితమయిన సామర్థ్యం కలిగినవాడా! నీవిషయంలో మాకు సందేహం కలుగుతున్నది.

వ్యాస ఉవాచ :-మహర్షులతో వ్యాసుడు ఇలా చెబుతున్నాడు.

క్షణం భూత్వా త్వసౌ తూష్ణీం కిఞ్చిత్ ప్రణయకోపవాన్ ।
ఇత్యేవ ముక్త స్తై ర్గోపై రాహ కృష్ణో ద్విజోత్తమాః ॥ 9 ॥

విప్రవరులారా! గొల్లలమాటలు విన్నాడు కృష్ణుడు. కాసేపు మౌనంగా ఉన్నాడు. స్నేహంతో కొద్దిగా కోపం ప్రదర్శించాడు. తరువాత గోపాలకులతో ఇలా అన్నాడు.

శ్రీకృష్ణ ఉవాచ :-గోపాలకులతో కృష్ణుడు ఈవిధంగా చెబుతున్నాడు.

మత్సమ్బన్ధేన వో గోపా యది లజ్జా న జాయతే ।
శ్లాఘ్యో వాహం తతః కిం వో విచారేణ ప్రయోజనమ్ ॥ 10 ॥

గోపాలకులారా! నావలన మీకు తలవంపులు రానపుడు నేను ప్రశంసింపదగినవాడినే కదా! మరి అనవసర మయిన చర్చలు చేసినందువల్ల లాభం ఏమిటి?

యది వోఽస్తి మయి ప్రీతిః శ్లాఘ్యోఽహం భవతాం యది ।
తదర్థా బన్ధుసదృశీ బాన్ధవాః క్రియతాం మయి ॥ 11 ॥

ఆత్మబంధువులారా! మీకు నామీద ప్రేమ ఉంటే, మీకు గౌరవింపదగినవాడి ననిపిస్తే, నన్ను మీబంధువుగా ఆదరించండి. అదే నాకు గౌరవం.

నాహం దేవో న గన్ధర్వో న యక్షో న చ దానవః ।
అహం వో బాన్ధవో జాతో నాత శ్చిన్త్యమతోఽన్యథా ॥ 12 ॥

నేను దేవుడిని కాదు. గంధర్వుడిని కాదు. యక్షుడిని కాదు. దానవుడిని కూడా కాదు. నేను మీకు బంధువుగా మీలో జన్మించాను. నాపై బంధువు అనేదానికంటే వేరేభావం మీకు వద్దు.

వ్యాస ఉవాచ :-మహర్షులతో వ్యాసుడు ఈవిధంగా చెబుతున్నాడు.

ఇతి శ్రుత్వా హరే ర్వాక్యం బద్ధమౌనా స్తతో బలమ్ ।
యయు ర్గోపా మహాభాగా స్తస్మిన్ ప్రణయకోపిని ॥ 13 ॥

కృష్ణుడు స్నేహం నిండినకోపంతో పలికిన ఈపలుకులు విని, గోపాలకులు మాట్లాడకుండా ఊరుకున్నారు. కృష్ణుడికి కోపం వచ్చిందనుకుని మెల్లగా బలరాముడివద్దకు వెళ్లారు.

కృష్ణస్తు విమలం వ్యోమ శరచ్చన్ద్రస్య చన్ద్రికామ్ ।
తథా కుముదినీం ఫుల్లా మామోదితదిగన్తరామ్ ॥ 14 ॥

ఆకాశం నిర్మలంగా ఉంది. శరత్కాలపుచంద్రుడివెన్నెల అంతటా నిండింది. కలువలు చక్కగా వికసించాయి. వాటిపరిమళం అన్నిదిక్కులనిండా వ్యాపించింది.

వనరాజిం తథా కూజద్భృఙ్గమాలామనోరమామ్ ।
విలోక్య సహ గోపీభిర్మతించక్రే రతిం ప్రతి ॥ 15 ॥

బారులుతీరి, మధురంగా కూస్తున్న తుమ్మెదలతో అక్కడి ఉద్యానవనాలు మనసులను హరిస్తున్నాయి. వాటిని చూసి బాలకృష్ణుడు గోపికలతో కలిసి క్రీడించాలని సంకల్పించాడు.

సహ రామేణ మధురమతీవ వనితాప్రియమ్ ।
జగౌ కమలపాదోఽసౌ నామ తత్ర కృతవ్రతః ॥ 16 ॥

ఎఱ్ఱదామరలవంటిపాదాలు గలిగినకృష్ణస్వామి బలరాముడితో కలిసి, చక్కగా ఏకాగ్రమయిన మనసుతో ఆడవారిని అలరించే గానం చేశాడు.

రమ్యం గీతధ్వనిం శ్రుత్వా సన్త్యజ్యావసథాం స్తదా ।
ఆజగ్ముస్త్వరితా గోప్యో యత్రాస్తే మధుసూదనః ॥ 17 ॥

మధురమైన కృష్ణస్వామిగానం విని, గోపికలు ఇండ్లు (భర్తనూ, బిడ్డలనూ) విడిచి, శ్రీకృష్ణుడు ఉన్నచోటికి త్వరత్వరగా వచ్చారు.

శనైశ్శనైర్జగౌ గోపీ కాచిత్ తస్య పదానుగా ।
దత్తావధానా కాచిచ్చ తమేవ మనసాఽస్మరత్ ॥ 18 ॥

ఒకానొకగోపిక శ్రీకృష్ణుడిఅడుగులను అనుసరించి మెల్లమెల్లగా వచ్చింది. మరొకగోపిక మనసునిండా తదేకంగా కృష్ణుడినే స్మరించుకుంది.

కాచిత్ కృష్ణేతి కృష్ణేతి చోక్త్వా లజ్జాముపాయయౌ ।
యయౌ చ కాచిత్ ప్రేమాన్ధా తత్పార్శ్వమవిలజ్జితా ॥ 19 ॥

ఒకానొక గోపిక కృష్ణా! కృష్ణా! అంటూ (కృష్ణభావనతో) సిగ్గుపడింది. మరొక గోపిక ప్రేమతో గుడ్డిదై, సిగ్గు విడిచి, కృష్ణుడిప్రక్కకు వెళ్లింది.

కాచిదావసథ స్యాన్తః స్థిత్వా దృష్ట్వా బహిర్గురుమ్ ।
తన్మయత్వేన గోవిన్దం దధ్యౌ మీలితలోచనా ॥ 20 ॥

ఒకానొక గోపిక వాకిట్లో ఇంటిపెద్దలు ముంగిట్లో ఉండడం చూసింది. వాళ్లఎదురుగా శ్రీకృష్ణుడివద్దకు వెళ్లడం కుదరలేదు. అందుకని ఇంట్లోనే ఉండి, పరవశంతో కన్నులు మూసుకుని, కృష్ణుడినే ధ్యానించసాగింది.

గోపీపరివృతో రాత్రిం శరచ్చన్ద్రమనోరమామ్ ।
మానయామాస గోవిన్దో రాసారమ్భరసోత్సుకః ॥ 21 ॥

గోపికలు కృష్ణుడిచుట్టూ చేరారు. గోపాలకృష్ణుడు రాసక్రీడలు ప్రారంభించే ఆనందంతోనూ, ఉత్సాహంతోనూ, శరత్కాలపువెన్నెలలతో మనోహరమయిన రాత్రిసమయాన్ని ఆదరించాడు.

గోప్యశ్చ బృన్దశః కృష్ణచేష్టా స్వాయత్తమూర్తయః ।
అన్యదేశగతే కృష్ణే చేరుః బృన్దావనాన్తరమ్ ॥ 22 ॥

వేణుగానం మొదలయిన చేష్టలచేత కృష్ణుడికి వశమయిన గోపికలు గుంపులుగా చేరారు. కృష్ణుడు ఎక్కడ ఉన్నాడో తెలియక, వెదుక్కుంటూ అందరూ బృందావనంలోకి వెళ్లారు.

బభ్రముస్తాస్తతో గోప్యః కృష్ణదర్శనలాలసాః ।
కృష్ణస్య చరణం రాత్రౌ దృష్ట్వా బృన్దావనే ద్విజాః ॥ 23 ॥

బ్రాహ్మణులారా! బాలకృష్ణుడిని చూడాలనే కోరికతో గోపికలు ఆ బృందావనం అంతటా కలియతిరిగారు. ఆ రాత్రివేళ ఒకానొకచోట శ్రీకృష్ణస్వామి అడుగులగుర్తులను చూశారు.

ఏవం నానాప్రకారాసు కృష్ణచేష్టాసు తాసు చ ।
గోప్యో వ్యగ్రా స్సమం చేరూ రమ్యం బృన్దావనం వనమ్ ॥ 24 ॥

ఈవిధంగా రకరకాలయిన శ్రీకృష్ణుడిచేతలను చూసి, గోపికలు అతడిమీద ఆసక్తితో అందరూ ఒకేవిధంగా అందమయిన బృందావనం చేరారు.

నివృత్తాస్తాస్తతో గోప్యో నిరాశాః కృష్ణదర్శనే ।
యమునాతీరమాగమ్య జగుస్తచ్చరితం తదా ॥ 25 ॥

బృందావనంలో శ్రీకృష్ణుడికోసం వెదికారు. అతడు కనబడలేదు. కృష్ణుడిమీద ఆశ వదులుకుని, తిరిగి యమునానదీతీరానికి వచ్చారు. అక్కడ కృష్ణుడిమహిమలను పాటలుగా పాడసాగారు.

తతో దదృశురాయాన్తం వికాసిముఖపఙ్కజమ్ ।
గోప్యస్త్రైలోక్యగోప్తారం కృష్ణమక్లిష్టకారిణమ్ ॥ 26 ॥

ఆ సమయంలో గోపికలు కృష్ణుడు రావడం చూశారు. కృష్ణస్వామిముఖం చక్కగా వికసించిన పద్మంలాగా ప్రకాశిస్తున్నది. అతడు మూడులోకాలను చక్కగా కాపాడతాడు. ఎంతటిపనినయినా, అవలీలగా చేస్తాడు.

కాచిదాలోక్య గోవిన్దమాయాన్తమతిహర్షితా ।
కృష్ణ కృష్ణేతి కృష్ణేతి ప్రాహోత్ఫుల్లవిలోచనా ॥ 27 ॥

అలా వస్తున్న శ్రీకృష్ణస్వామిని చూచి, ఒకానొక గోపిక అత్యధికమయిన సంతోషంతో, విప్పారినకళ్లతో, కృష్ణా, కృష్ణా, కృష్ణా అని ఆర్తితో పలికింది.

కాచిద్ భ్రూభఙ్గురం కృత్వా లలాటఫలకం హరిమ్ ।
విలోక్య నేత్రభృఙ్గాభ్యాం పపౌ తన్ముఖపఙ్కజమ్ ॥ 28 ॥

మరొక గోపిక శ్రీహరిని చూసి, నుదుటిమీద కనుబొమ్మలు కదులుతుండగా, కన్నులనే తుమ్మెదలతో శ్రీకృష్ణుడిని ముఖం అనే పద్మాన్ని (పద్మంలోని సౌందర్యమకరందాన్ని) ఆస్వాదించింది.

కాచిదాలోక్య గోవిన్దం నిమీలితవిలోచనా ।
తస్యైవ రూపం ధ్యాయన్తీ యోగారూఢేవ సా బభౌ ॥ 29 ॥

ఇంకొక గోపిక గోవిందుడిని చూసి, ఆతడికి వశమై, కనులు మూతపడుతుండగా, స్వామిరూపాన్నే మనసులో ధ్యానంచేస్తూ, తనను తాను మరిచిపోయి, యోగంలో నిలిచిఉన్నట్లు ప్రకాశించింది.

తతః కాచిత్ ప్రియాలాపైః కాచిద్ భ్రూభఙ్గవీక్షితైః ।
నిన్యేఽనునయమన్యాశ్చ కరస్పర్శేన మాధవః ॥ 30 ॥

అప్పుడు కృష్ణుడు ఒక గోపికను మురిపెపుమాటలతోనూ, మరొక గోపికను కనుబొమ్మలకదలికలతోనూ అనునయించాడు. మరికొందరు గోపికలను చేయి పట్టుకుని, అలరించాడు.

తాభిః ప్రసన్నచిత్తాభిర్గోపీభిస్సహ సాదరమ్ ।
రరామ రాసగోష్ఠీభిరుదారచరితో హరిః.[1] ॥ 31 ॥

---

1. (ఇక్కడ అధికపాఠం) రాసమణ్డలబద్ధోఽపి కృష్ణపార్శ్వమనుద్గతః, గోపీజనో స చైవాభూదేకస్థానస్థిరాత్మనా.

ఆ గోపికలసముదాయం కృష్ణుడిచుట్టూ గుండ్రంగా ఏర్పడిఉన్నప్పటికీ, అందరూ కృష్ణుడిపైనే మనసును లగ్నంచేసి, ఎవరికి వారు కృష్ణుడు తమప్రక్కనే ఉన్న అనుభూతిని పొందారు.

2. హస్తే ప్రగృహ్య చైకైకాం స గోపికాం రాసమణ్డలం, చకార చ కరస్పర్శనిమీలితదృశం హరిః.

అప్పుడు శ్రీకృష్ణస్వామి ఆ రాసమండలంలోని ఒక్కొక్క గోపిక చేయి ప్రత్యేకంగా పట్టుకున్నాడు. కృష్ణకరస్పర్శచేత ఆ గోపికల కన్నులు పరవశంతో మూతపడ్డాయి.

ఈవిధంగా కృష్ణుడు తాను కానరానందుకు కలతచెందిన గోపికలబాధలను తొలగించి, వారిమనస్సులను శాంతింపజేశాడు. ఉత్తమచరితుడయిన శ్రీకృష్ణస్వామి గోపికలతో రాసగోష్ఠిలో క్రీడించాడు.

తతః ప్రవవృతే రమ్యా చలద్వలయనిస్వనైః ।
అనుయాతశరత్కావ్యగేయగీతిరనుక్రమాత్ ॥ 32 ॥

అప్పుడు క్రమంగా గోపికలముంజేతికంకణాలచప్పుడుకు అనుగుణంగా నడుస్తూ, శరత్కాలపు కవితాగీతికల గానం మనోహరంగా సాగింది.

కృష్ణశ్శరచ్చన్ద్రసమం కౌముదీకుముదాకరమ్ ।
జగౌ గోపీజనస్త్వేకం కృష్ణనామ పునః పునః ॥ 33 ॥

కృష్ణస్వామి శరత్కాలపుచంద్రుడితో సమానంగా, వెన్నెలకాంతులతో వికసించిన కలువలు నిండిన కొలనును గూర్చి గానం చేశాడు. గోపికలు మాత్రం మాటిమాటికీ కృష్ణనామం ఒక్కటే పలుమార్లు గానం చేశారు.

పరివృత్తా శ్రమేణైకా చలద్వలయతాపినీ ।
దదౌ బాహులతాం స్కన్ధే గోపీ మధువిఘాతినః ॥ 34 ॥

కృష్ణుడిచుట్టూ తిరిగి నాట్యం చేసి, అలసిపోయిన ఒకానొక గోపిక నిలువలేక కంకణాలు కదులుతుండగా, తీగలవంటి తన బాహువులను ఆ మధుసూదనుడిమెడపై ఉంచింది.

కాచిత్ ప్రవిలసద్బాహుః పరిరభ్య చుచుమ్బ తమ్ ।
గోపీ గీతస్తుతివ్యాజనిపుణా మధుసూదనమ్ ॥ 35 ॥

మరొక గోపిక కృష్ణస్వామిని గురించి గానం చేయడం అనే నెపంతో నేర్పుగా, అందమయిన బాహువులను చాచి, కృష్ణుడిని కౌగిలించుకుని, ముద్దాడింది.

గోపీ కపోలసంశ్లేషమభిప్రేత్య హరేర్భుజౌ ।
పులకోద్గమశస్యాయ స్వేదామ్బుఘనతాం గతౌ ॥ 36 ॥

ఒకానొక గోపిక శ్రీకృష్ణుడిచెక్కిళ్లతో పొందును గోరి, అతడిభుజాలను ఆశ్రయించింది. చెమటబిందువులు వర్షిస్తూ, పులకల మొలకలెత్తి, అప్పుడు ఆమె మేఘం అయింది.

రాసగేయం జగౌ కృష్ణో యావత్తారతరధ్వనిః ।
సాధు కృష్ణేతి కృష్ణేతి తావత్ తా ద్విగుణం జగుః ॥ 37 ॥

అప్పుడు కృష్ణుడు తారస్థాయిలో రాసగీతాన్ని ఆలాపించాడు. అది విని, గోపికలు కృష్ణగానధ్వనికి రెట్టింపుస్వరంతో కృష్ణా! కృష్ణా! అని గానం చేశారు.

గతేఽనుగమనం చక్రుర్వలనే సమ్ముఖం యయుః ।
ప్రతిలోమానులోమేన భేజుర్గోపాఙ్గనా హరిమ్ ॥ 38 ॥

కృష్ణుడు నడుస్తుండగా, గోపకాంతలు అతడిని అనుసరించి నడిచారు. అతడు వెనుకకు తిరగగా, వారు అతడికి ఎదురుగా వెళ్లారు. ఈవిధంగా గోపికలు అనుగుణంగానూ, అభిముఖంగానూ కృష్ణుడిని అనుసరించారు.

స తదా సహ గోపీభీ రరామ మధుసూదనః ।
స వర్షకోటిప్రతిమః క్షణస్తేన వినాఽభవత్ ॥ 39 ॥

అప్పుడు శ్రీకృష్ణుడు గోపికలతో కలిసి విహరించాడు. గోపికలకు కృష్ణుడితో ఎడబాటు కలిగిన ఒక్కొక్కక్షణం కోటిసంవత్సరాలకాలం అయింది.

తా వార్యమాణాః పితృభిః పతిభిర్భ్రాతృభిస్తథా ।
కృష్ణం గోపాఙ్గనా రాత్రౌ రమయన్తి రతిప్రియాః ॥ 40 ॥

తండ్రులు, భర్తలు, సోదరులు ఎంతగా వారించినా, గోపకాంతలు కృష్ణుడిపై అనురాగంతో రాత్రిఅంతా అతడితోనే క్రీడించారు.

సోఽపి కైశోరకవయా మానయన్ మధుసూదనః ।
రేమే తాభిరమేయాత్మా క్షపాసు క్షపితాహితః ॥ 41 ॥

రాక్షసులను నిర్మూలించేవాడూ, కొలతలకు అందనివాడూ అయిన శ్రీకృష్ణుడు, పిన్నవయసులో ఉండి, ఆ గోపకాంతలను ఆదరిస్తూ, రాత్రివేళలలో వారితో విహరించాడు.

తద్భర్తృషు తథా తాసు సర్వభూతేషు చేశ్వరః ।
ఆత్మస్వరూపరూపోఽసౌ వ్యాప్య సర్వమవస్థితః ॥ 42 ॥

కృష్ణస్వామి ఆ గోపకాంతలలోనూ, వారిభర్తలలోనూ, అలాగే సమస్తమయిన భూతకోటిలోనూ అంతర్యామిగా ఆత్మస్వరూపంతో అంతటా నిండిఉన్నాడు.

యథా సమస్తభూతేషు నభోఽగ్నిః పృథివీ జలమ్ ।
వాయుశ్చాత్మా తథైవాసౌ వ్యాప్య సర్వమవస్థితః ॥ 43 ॥

సమస్తమయిన భూతాలలోనూ నింగి, నిప్పు, నేల, నీళ్లు, గాలి అనే పంచభూతాలు ఉన్నవిధంగా, కృష్ణస్వామి అంతటా నిండిఉన్నాడు.

వ్యాస ఉవాచ :-మహర్షులతో వ్యాసుడు అంటున్నాడు.

ప్రదోషార్ధే కదాచి త్తు రాసాసక్తే జనార్దనే ।
త్రాసయన్ సమదో గోష్ఠానరిష్టస్సముపాగతః ॥ 44 ॥

ఇది ఇలా ఉండగా ఒకసారి సూర్యుడు సగం అస్తమించే సమయాన శ్రీకృష్ణుడు రాసక్రీడలను ఇష్టపడు తుండగా, అరిష్టుడు అనే రాక్షసుడు అందరినీ భయపెడుతూ ఆ చోటికి వచ్చాడు.

సతోయతోయదాకారస్తీక్ష్ణశృఙ్గోఽ ర్కలోచనః ।
ఖురాపాతైరథాత్యర్థం ధారయన్ ధరణీతలమ్ ॥ 45 ॥

అరిష్టుడి ఆకారం నీరు నిండిన మేఘంలాగా కారునలుపురంగులో ఉంది. వాడికొమ్ములు వాడిగా ఉన్నాయి. అతడికన్నులు సూర్యుడిలాగా మండిపడుతున్నాయి. కాలిగిట్టలదెబ్బలతో నేలను గట్టిగా తాటిస్తూ వచ్చాడు.

లేలిహానస్సనిష్పేషం జిహ్వయోష్ఠౌ పునః పునః ।
సంరమ్భాక్షిప్తలాఙ్గూలః కఠినస్కన్ధబన్ధనః ॥ 46 ॥

పిండిచేస్తున్నట్లుగా పెదాలను నాలుకతో గట్టిగా రుద్దుతున్నాడు. తోకను వేగంగా బాగా పైకి ఎత్తి ఎగురవేస్తున్నాడు. అతడి భుజాలు కండలుతిరిగి ఉన్నాయి.

ఉదగ్రకకుదాభోగః ప్రమాణాద్దురతిక్రమః ।
విణ్మూత్రాలిప్తపృష్ఠాఙ్గో గవాముద్వేగకారకః ॥ 47 ॥

అతడి మూపు ఎత్తుగా, విశాలంగా ఉంది. అతడి పరిమాణం కొలతలకు అందనంత అధికంగా ఉంది. అతడివెనుకభాగం మలమూత్రాలతో నిండిఉంది. అతడి రూపం ఆవులకు భయం కలిగించేవిధంగా ఉంది.

ప్రలమ్బకణ్ఠోఽ భిముఖస్తరుఘాతాఙ్కితాననః ।
పాతయన్ స గవాం గర్భాన్ దైత్యో వృషభరూపధృక్ ॥ 48 ॥

అతడి మెడ వేలాడుతూ ఉంది. ముఖం చెట్లరాపిడివల్ల ఏర్పడిన దెబ్బలతో నిండిఉంది. ఆ రాక్షసుడు ఈవిధంగా ఎద్దురూపాన్ని ధరించి, ఆవులకు గర్భస్రావం అయ్యేవిధంగా భయంకరంగా వారి కెదురుగా వచ్చాడు.

సూదయంస్తరసా సర్వాన్ వనాన్యటతి యస్సదా ।
తతస్తమతిఘోరాక్షమవేక్ష్యాతిభయాతురాః ॥
గోపా గోపస్త్రియశ్చైవ కృష్ణ కృష్ణేతి చుక్రుశుః ॥ 49 ॥

అడవులను కూలుస్తూ, ఆ రాక్షసుడు ఆ ప్రాంతంలో సంచరిస్తున్నాడు. మిక్కిలిభయంకరమయిన కన్నులు కలిగిన ఆ రాక్షసుడిని చూచి అక్కడి గోపాలకులూ, గోపకాంతలూ అందరూ భయంతో కృష్ణా! కృష్ణా! అని ఆక్రోశించారు.

సింహనాదం తతశ్చక్రే తలశబ్దం చ కేశవః ।
తచ్ఛబ్దశ్రవణాచ్చాసౌ దామోదరముఖం యయౌ ॥ 50 ॥

అప్పుడు శ్రీకృష్ణుడు ఉత్సాహంగా సింహనాదం చేశాడు. గట్టిగా చప్పట్లు చరిచాడు. ఆ శబ్దం విని ఆ రాక్షసుడు కృష్ణుడికి ఎదురుగా వెళ్లాడు.

అగ్రన్యస్తవిషాణాగ్రః కృష్ణకుక్షికృతేక్షణః ।
అభ్యధావత దుష్టాత్మా దైత్యో వృషభరూపధృక్ ॥ 51 ॥

తలవంచి కొమ్ములను ముందుకు చాపాడు. శ్రీకృష్ణుడి పొట్టమీద దృష్టి నిలిపాడు. ఎద్దురూపం ధరించిన ఆ దుర్మార్గుడు కృష్ణుడికి ఎదురుగా (కృష్ణుడి కడుపులో కొమ్ములతో కుమ్మటానికి) పరుగెత్తుకుంటూ వెళ్లాడు.

ఆయాన్తం దైత్యవృషభం దృష్ట్వా కృష్ణో మహాబలమ్ ।
న చచాల తతః స్థానాదవజ్ఞాస్మితలీలయా ॥ 52 ॥

అలా వేగంగా తనవైపు వస్తున్న మిక్కిలి బలవంతుడయిన ఆ రాక్షసుడిని చూశాడు కృష్ణుడు. ఏమాత్రం జంకలేదు. ఉన్నచోటినుంచి కదలలేదు. వాడిని హేళనచేస్తున్నట్లుగా విలాసంగా ఒక చిరునవ్వు నవ్వాడు.

ఆసన్నం చైవ జగ్రాహ గ్రాహవన్మధుసూదనః ।
జఘాన జానునా కుక్షౌ విషాణగ్రహణాచలమ్ ॥ 53 ॥

దగ్గరకు వచ్చిన ఆ రాక్షసుడి కొమ్ములను మొసలిలాగా కదలకుండా పట్టుకున్నాడు. మోకాలితో ఆ రాక్షసుడి కడుపులో గట్టిగా కుమ్మి, వాడిని సంహరించాడు.

తస్య దర్పబలం హత్వా గృహీతస్య విషాణయోః ।
ఆపీడ్యదరిష్టస్య కణ్ఠం క్లిన్నమివామ్బరమ్ ॥ 54 ॥

కృష్ణుడు ఆ రాక్షసుడి కొమ్ములను గట్టిగా పట్టుకుని, కదలకుండా చేసి, వాడి బలగర్వం అణచివేశాడు. తడిబట్టను పిండినట్లుగా అరిష్టుడి మెడను మెలిబెట్టి తిప్పాడు.

ఉత్పాట్య శృఙ్గమేకం చ తేనైవాతాడయత్ తతః ।
మమార స మహాదైత్యో ముఖాచ్ఛోణితముద్వమన్ ॥ 55 ॥

అరిష్టుడి కొమ్ము ఒకదానిని పీకి, వాడికొమ్ముతోనే వాడిని చితకబాదాడు. అప్పుడు ఆ రాక్షసుడు నోటివెంట నెత్తురుకక్కుకుంటూ మరణించాడు.

తుష్టువుర్నిహతే తస్మిన్ గోపా దైత్యే జనార్దనమ్ ।
వృత్రే హతే సహస్రాక్షం పురా దేవగణా యథా ॥ 56 ॥

పూర్వం వృత్రాసురుడిని సంహరించిన ఇంద్రుని దేవతలగుంపులు స్తుతించినట్లుగా, అరిష్టుడిని సంహరించిన శ్రీకృష్ణుడిని గోపాలకులు స్తుతించారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే బాలచరితేఽరిష్టవధనిరూపణం నామ ఏకాశీతితమోఽధ్యాయః ॥ 81 ॥

శ్రీబ్రహ్మపురాణంలో బాలచరిత్రలో అరిష్టవధనిరూపణం అనే ఎనభైఒకటవ అధ్యాయం సంపూర్ణం.



ద్వ్యశీతితమోఽధ్యాయః - ఎనబైరెండవ అధ్యాయం
కేశివధనిరూపణమ్ - కేశివధనిరూపణం

వ్యాస ఉవాచ :-మహర్షులతో వ్యాసుడు ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవం వినిహతేఽరిష్టే ధేనుకే చ నిపాతితే ।
ప్రలమ్బే నిధనం నీతే ధృతే గోవర్ధనాచలే ॥ 1 ॥

ఈవిధంగా కృష్ణుడు అరిష్టుడిని సంహరించాడు. ధేనుకుడిని కూల్చాడు. ప్రలంబుడిని చంపివేశాడు. గోవర్ధనపర్వతాన్ని చిటికెనవేలిపై ఎత్తిపట్టుకున్నాడు.

దమితే కాలియే నాగే భగ్నే తుఙ్గద్రుమద్వయే ।
హతాయాం పూతనాయాం చ శకటే పరివర్తితే ॥ 2 ॥

కాళియసర్పాన్ని అణచివేశాడు. ఎత్తయినచెట్లను కూల్చాడు. పూతనను సంహరించాడు. శకటాన్ని తిరగేసి, శకటాసురుడిని కూల్చాడు.

కంసాయ నారదః ప్రాహ యథావృత్తమనుక్రమాత్ ।
యశోదాదేవకీగర్భపరివర్తాద్యశేషతః ॥ 3 ॥

ఈసంఘటనలు జరిగిన తరువాత ఒకసారి నారదుడు కంసుడివద్దకు వెళ్లి, దేవకిపుత్రుడయిన కృష్ణుడు యశోదకుమారుడుగా మారడందగ్గరినుంచి అన్నివిషయాలు జరిగినవి జరిగినట్లుగా, ఏదీ విడిచిపెట్టకుండా, పూర్తిగా కంసుడికి వివరించాడు.

శ్రుత్వా తత్సకలం కంసో నారదాద్దేవదర్శనాత్ ।
వసుదేవం ప్రతి తదా కోపం చక్రే స దుర్మతిః ॥ 4 ॥

దివ్యదృష్టిగలిగిన నారదుడు చెప్పిన విషయాలు అన్నీ విని, దుర్మార్గుడయిన కంసుడు వసుదేవుడిమీద చాలా కోపగించుకున్నాడు.

సోఽతికోపాదుపాలభ్య సర్వం యాదవసంసది ।
జగర్హే యాదవాంశ్చాపి కార్యం చైతదచిన్తయత్ ॥ 5 ॥

కంసుడు మిక్కిలికోపంతో యాదవులసమావేశంలో జరిగినదంతా వివరించాడు. ఆ సభలో యాదవులను కూడా నిందించాడు. తరువాత చేయవలసిన కార్యాన్ని గురించి ఇలా ఆలోచించాడు.

యావన్న బలమారూఢో బలకృష్ణౌ సుబాలకౌ ।
తావదేవ మయా వధ్యావసాధ్యౌ రూఢయౌవనౌ ॥ 6 ॥

బలరాముడు, కృష్ణుడూ ఇద్దరూ ఇంకా పసివాళ్లు. పెద్దవారయి, బలవంతులుకాకపూర్వమే వారిని నేను సంహరించాలి. యుక్తవయసులోకి వచ్చిన తరువాత వాళ్ళను నేను ఏమీ చేయలేను.

చాణూరోఽత్ర మహావీర్యో ముష్టికశ్చ మహాబలః ।
ఏతాభ్యాం మల్లయుద్ధే తౌ ఘాతయిష్యామి దుర్మదౌ ॥ 7 ॥

ఇక్కడ చాణూరుడు మిక్కిలిశక్తిమంతుడు. ముష్టికుడు గొప్పబలవంతుడు. దుర్మార్గులయిన బలరామకృష్ణులను మల్లయుద్ధంలో వీరిచేత చంపిస్తాను.

ధనుర్మహమహాయాగవ్యాజేనానీయ తౌ వ్రజాత్ ।
తథా తథా యతిష్యామి యాస్యతస్సంక్షయం యథా ॥ 8 ॥

ధనుర్యాగం అనే మహాయజ్ఞం నెపంగా చేసుకుని, గొల్లపల్లెనుండి వారిని ఇక్కడికి రప్పిస్తాను. ఆ ఇద్దరినీ చంపడానికి చేయవలసిన దంతా చేస్తాను. (అని కంసుడు ఆలోచించాడు.)

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి చెబుతున్నాడు.

ఇత్యాలోచ్య స దుష్టాత్మా కంసో రామజనార్దనౌ ।
హన్తుం కృతమతిర్వీరమక్రూరం వాక్యమబ్రవీత్ ॥ 9 ॥

దుర్మార్గుడయిన ఆ కంసుడు ఈవిధంగా ఆలోచించి, బలరామకృష్ణులను సంహరించడానికి నిశ్చయించు కున్నాడు. అందుకోసం ముందుగా అక్రూరుడు అనే వాడిని పిలిచి, అతడితో ఇలా అంటున్నాడు.

కంస ఉవాచ :-అక్రూరుడితో కంసుడు ఈవిధంగా చెబుతున్నాడు.

భో భో దానపతే వాక్యం క్రియతాం ప్రీతయే మమ ।
ఇతస్స్యన్దనమారుహ్య గమ్యతాం నన్దగోకులమ్ ॥ 10 ॥

ఓ దానపతీ! (అక్రూరుడికి దానపతి అని పేరు) నేను చెప్పినపని చేసి, నన్ను ఆనందపెట్టు. రథమెక్కి ఇక్కడినుండి నందుడు నివసించే గోకులానికి వెళ్లు.

వసుదేవసుతౌ తత్ర విష్ణోరంశసముద్భవౌ ।
నాశాయ కిల సమ్భూతౌ మమ దుష్టౌ ప్రవర్ధతః ॥ 11 ॥

అక్కడ గోకులంలో వసుదేవుడికి విష్ణువు అంశతో పుట్టిన కుమారులు ఇద్దరు ఉన్నారు. ఆ దుర్మార్గులు నన్ను నాశనం చేయడానికే పుట్టి, గోకులంలో పెరుగుతున్నారు.

ధనుర్మహమహాయాగశ్చతుర్దశ్యాం భవిష్యతి ।
ఆనేయౌ భవతా తౌ తు మల్లయుద్ధాయ తత్ర వై ॥ 12 ॥

రాబోయే చతుర్దశినాడు ఇక్కడ ధనుర్యాగం అనే మహాయజ్ఞం జరుగుతుంది. ఆ సమయంలో మల్లయుద్ధం పోటీలో పాల్గొనడానికి వారిద్దరినీ ఇక్కడికి తీసుకుని రా.

చాణూరముష్టికౌ మల్లౌ నియుద్ధకుశలౌ మమ ।
తాభ్యాం సహానయోర్యుద్ధం సర్వలోకోఽత్ర పశ్యతు ॥ 13 ॥

చాణూరుడు, ముష్టికుడు అనేవాళ్లు ఇద్దరు మల్లులు నాకొలువులో ఉన్నారు. వాళ్లు మల్లయుద్ధంలో చాల నేర్పరులు. వసుదేవుడికుమారులకు వీరితో మల్లయుద్ధం జరుగుతుంది. లోకమంతా ఆ యుద్ధాన్ని ఇక్కడ చూడవచ్చు.

నాగః కువలయాపీడో మహామాత్రప్రచోదితః ।
స తౌ నిహంస్యతే పాపౌ వసుదేవాత్మజౌ శిశూ ॥ 14 ॥

నేర్పుకాడయిన మావటీడు కువలయాపీడం అనే యేనుగును రెచ్చగొట్టి, పాపాత్ములయిన వసుదేవుడి కుమారులమీద ప్రయోగిస్తాడు. ఆ ఏనుగు ఆ పసివారిని సంహరిస్తుంది.

తౌ హత్వా వసుదేవం చ నన్దగోపం చ దుర్మతిమ్ ।
హనిష్యే పితరం చైవ ఉగ్రసేనం చ దుర్మతిమ్ ॥ 15 ॥

ఈవిధంగా ముందుగా బలరామకృష్ణులను సంహరించి, ఆ తరువాత వసుదేవుడినీ, నందుడినీ కూడ చంపుతాను. అంతే కాదు. తరువాత దురాత్ముడయిన నాతండ్రి ఉగ్రసేనుడిని కూడ చంపుతాను.

తతస్సమస్తగోపానాం గోధనాన్యఖిలాన్యహమ్ ।
విత్తం చాపి హరిష్యామి దుష్టానాం మద్వధైషిణామ్ ॥ 16 ॥

నన్ను చంపాలనుకుంటున్న దుర్మార్గులయిన ఆ గోపాలకుల ఆవులనూ, ఇంకా ఇతరసంపదలనూ సమస్తమూ కొల్లగొడతాను.

త్వామృతే యాదవాశ్చేమే దుష్టా దానపతే మమ ।
ఏతేషాం చ వధాయాహం ప్రయతిష్యామ్యనుక్రమాత్ ॥ 17 ॥

అక్రూరా! నీవు తప్ప, మిగిలిన ఈయాదవులందరూ నాకు విరోధులే. వీళ్లను కూడా, వరుసగా చంపడానికి ప్రయత్నిస్తాను.

తతో నిష్కణ్టకం సర్వం రాజ్యమేతదయాదవమ్ ।
ప్రసాధిష్యే త్వయా తస్మాన్మత్ప్రీత్యా వీర గమ్యతామ్ ॥ 18 ॥

యాదవుడు అనేవాడు లేకుండాపోతే నాకు రాజ్యంలో ఎదురు ఉండదు. మహావీరా! నీసాయంతో ఈపనులన్నీ నేను చేస్తాను. అందుచేత నాప్రీతికోసం నీవు వెంటనే గోకులానికి వెళ్లు.

యథా చ మాహిషం సర్పిర్దధి చాప్యుపహార్య వై ।
గోపాస్సమానయన్త్వాశు త్వయా వాచ్యాస్తథా తథా ॥ 19 ॥

గేదెపెరుగునూ, నెయ్యినీ కానుకలుగా తీసుకుని గోపాలకులు వెంటనే ఇక్కడికి రావాలి. అలా వచ్చేవిధంగా నీవు వాళ్లకు నచ్చజెప్పు.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి అంటున్నాడు.

ఇత్యాజ్ఞప్తస్తదాఽ క్రూరో మహాభాగవతో ద్విజాః ।
ప్రీతిమానభవత్కృష్ణం శ్వో ద్రక్ష్యామీతి సత్వరః ॥ 20 ॥

బ్రాహ్మణులారా! కంసుడు ఈవిధంగా ఆజ్ఞాపించిన వెంటనే, పరమభక్తుడయిన అక్రూరుడు ఈవిధంగా నయినా, రేపే శ్రీకృష్ణుడిని దర్శించుకోవచ్చు గదా అని సంతోషించాడు.

తథేత్యుక్త్వా తు రాజానం రథమారుహ్య సత్వరః ।
నిశ్చక్రామ తదా పుర్యా మథురాయా మధుప్రియః ॥ 21 ॥

ఆ సంతోషంతో కంసమహారాజుతో 'సరే, అలాగే' అన్నాడు. మధువు అంటే ఇష్టపడే అక్రూరుడు ఇక ఆలస్యం చేయకుండా, రథ మెక్కి మధురానగరంనుండి బయటపడ్డాడు.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి (కేశివధ వృత్తాంతాన్ని) చెబుతున్నాడు.

కేశీ చాపి బలోదగ్రః కంసదూతః ప్రచోదితః ।
కృష్ణస్య నిధనాకాఙ్క్షీ బృన్దావనముపాగమత్ ॥ 22 ॥

కేశి అనే(గుఱ్ఱం)రాక్షసుడు కంసుడికి దూత. మిక్కిలి బలవంతుడు. కృష్ణుడు ఎప్పుడు మరణిస్తాడా అని ఎదురుచూస్తున్నాడు. కంసుడు పంపగా, కృష్ణుడిని చంపడంకోసం కేశిరాక్షసుడు బృందావనానికి వెళ్లాడు.

స ఖురక్షతభూపృష్ఠస్సటాక్షేపధుతామ్బుదః ।
పునర్విక్రాన్తచన్ద్రార్కమార్గో గోపాన్తమాగమత్ ॥ 23 ॥

కేశి కాలిగిట్టలదెబ్బలకు నేల దద్దరిల్లింది. అతడి జూలు విదిలింపులకు ఆకాశంలో మబ్బులు దూరంగా ఎగిరిపోయాయి. చంద్రుడు, సూర్యుడు సంచరించేమార్గం (ఆకాశం) అంతా నిండి, కేశిరాక్షసుడు గొల్లలు ఉండే చోటికి వచ్చాడు.

తస్య హ్రేషితశబ్దేన గోపాలా దైత్యవాజినః ।
గోప్యశ్చ భయసంవిగ్నా గోవిన్దం శరణం యయుః ॥ 24 ॥

కంసుడివాహనమయిన ఆ గుఱ్ఱం సకిలింపులధ్వనికి గోపాలకులూ, గోపికలూ భయపడి పోయి, శ్రీకృష్ణుడిని శరణు పొందారు.

త్రాహి త్రాహీతి గోవిన్దస్తేషాం శ్రుత్వా తదా వచః ।
సతోయజలదధ్వానగమ్భీరమిదముక్తవాన్ ॥ 25 ॥

కాపాడు. కృష్ణా! కాపాడు. అనే గొల్లల అరుపులు విని, శ్రీకృష్ణుడు నీరు నిండిన మేఘంధ్వనితో (పిడుగువంటి ధ్వనితో) వారితో ఇలా అన్నాడు.

గోవిన్ద ఉవాచ :–గొల్లలతో గోవిందుడు అంటున్నాడు.

అలం త్రాసేన గోపాలాః కేశినః కిం భయాతురైః ।
భవద్భిర్గోపజాతీయైర్వీరవీర్యం విలోప్యతే ॥ 26 ॥

గోపాలకులారా! కేశిని గురించి భయపడకండి. గోపాలకులవంశంలో పుట్టి, ఇలా భయంతో కలవర పడుతున్న మీమూలంగా మనజాతిశక్తిసామర్థ్యాలకు అవమానం జరుగుతుంది.

కిమనేనాల్పసారేణ హ్రేషితాటోపకారిణా ।
దైతేయబలవాహ్యేన వల్గతా దుష్టవాజినా ॥ 27 ॥

ఈగుఱ్ఱం బలహీనమయినది. పెద్దగా సకిలిస్తూ హడావిడి చేస్తున్నది. రాక్షసబలంతో వాహనమయి, ఇతరులను మోస్తూ తిరిగే ఈదుర్మార్గపుగుఱ్ఱం ఎంత చిందులు వేసినా, ఏమీ చేయలేదు.

ఏహ్యేహి దుష్ట కృష్ణోఽహం పూష్ణస్త్వివ పినాకధృక్ ।
పాతయిష్యామి దశనాన్ వదనాదఖిలాంస్తవ ॥ 28 ॥

దుర్మార్గుడా! కేశీ! రా, ఇటు రా. నేను కృష్ణుడిని. పరమేశ్వరుడు సూర్యుడిపళ్లు రాలగొట్టినట్లుగా నీనోటిలో పళ్లన్నీ రాలగొడతాను.

వ్యాస ఉవాచ:–మునులతో వ్యాసమహర్షి చెబుతున్నాడు.

ఇత్యుక్త్వా స తు గోవిన్దః కేశినస్సమ్ముఖం యయౌ ।
వివృతాస్యశ్చ సోఽప్యేనం దైతేయశ్చ ఉపాద్రవత్ ॥ 29 ॥

ఈవిధంగా పలికి, కృష్ణుడు కేశిరాక్షసుడికి ఎదురుగా వెళ్లాడు. ఆ రాక్షసుడు కూడ నోరు తెరుచుకుని కృష్ణుడివైపు పరుగెత్తుకుంటూ వచ్చాడు.

బాహూ మాభోగినం కృత్వా ముఖే తస్య జనార్దనః ।
ప్రవేశయామాస తదా కేశినో దుష్టవాజినః ॥ 30 ॥

కృష్ణుడు తనచేతిని బాగా పెద్దదిగా చేసి, చేయిమొత్తం దుర్మార్గుడయిన కేశిరాక్షసుడి నోట్లో దూర్చాడు.

కేశినో వదనం తేన విశతా కృష్ణబాహునా ।
శాతితా దశనాస్తస్య సితాభ్రావయవా ఇవ ॥ 31 ॥

కృష్ణుడిచేయి మొత్తం నోట్లో దూరుతుండగానే ఆ రాక్షసుడి దంతాలు అన్నీ తెల్లటిమబ్బుముక్కల్లాగా రాలిపడ్డాయి.

కృష్ణస్య వవృధే బాహుః కేశిదేహగతో ద్విజాః ।
వినాశాయ యథా వ్యాధిరాప్తభూతైరుపేక్షితః ॥ 32 ॥

విప్రులారా! ఆత్మీయులు పట్టించుకోకపోవడంతో ఒంట్లో రోగం ఎలా విస్తరిస్తుందో, అలా కృష్ణుడిచేయి కేశిశరీరంలోపలికి వెళ్లిన తరువాత ఇంకా పెద్దగా పెరిగిపోయింది.

విపాటితౌష్ఠో బహులం సఫేనం రుధిరం వమన్ ।
సృక్కణీ వివృతే చక్రే విశ్లిష్టే ముక్తబన్ధనే ॥ 33 ॥

దానివల్ల కేశిరాక్షసుడికి పెదవులు చీలిపోయాయి. పెదవులచివరిభాగాలు తెగి, విశాల మయినాయి. వాడు నురుగుతో సహా నెత్తురు కక్కుకున్నాడు. సంధిబంధాలు తెగిపోయాయి.

జగామ ధరణీం పాదైశ్శకృన్మూత్రం సముత్సృజన్ ।
స్వేదార్ద్రగాత్రశ్శ్రాన్తశ్చ నిర్యత్నస్సోఽ భవత్తతః ॥ 34 ॥

ఆ రాక్షసుడి శరీరం అంతా చెమటతో తడిసిపోయింది. పూర్తిగా అలిసిపోయాడు. కదలలేనిస్థితిలో ఉన్నాడు. మలమూత్రాలు విసర్జిస్తూ, నేలగూలాడు.

వ్యాదితాస్యో మహారౌద్రస్సోఽ సురః కృష్ణబాహునా ।
నిపపాత ద్విధాభూతో వైద్యుతేన యథా ద్రుమః ॥ 35 ॥

శ్రీకృష్ణుడిచేయి మొత్తం దూరడంచేత ఆ రాక్షసుడి నోరంతా తెరుచుకున్నది. పిడుగుపడిన చెట్టులాగా భయంకరమయిన ఆ రాక్షసుడు కృష్ణుడిచేతితో రెండుభాగాలుగా చీలి, నేలమీద పడిపోయాడు.

ద్విపాదపృష్ఠపుచ్ఛార్ధశ్రవణైకాక్షనాసికే ।
కేశినస్తే ద్విధాభూతే శకలే చ విరేజతుః ॥ 36 ॥

ఒక్కొక్కభాగంలో ఒకపాదం, ఒకపిరుదు, సగం తోక, ఒకచెవి, ఒకకన్ను, ఒకముక్కు చొప్పున ఆ రాక్షసుడి శరీరం రెండు ముక్కలు అయింది.

హత్వా తు కేశినం కృష్ణో గోపాలైర్ముదితైర్వృతః ।
అనాయస్తతనుస్స్వస్థో హసంస్తత్రైవ సంస్థితః ॥ 37 ॥

శ్రీకృష్ణుడు ఈవిధంగా కేశిరాక్షసుడిని సంహరించగా, గోపాలకులు అందరూ ఆనందంతో కృష్ణుడిచుట్టూ చేరారు. కృష్ణుడు ఏమాత్రం అలసట లేకుండా, ఉత్సాహంగా నవ్వుతూ అక్కడే ఉన్నాడు.

తతో గోపాశ్చ గోప్యశ్చ హతే కేశిని విస్మితాః ।
తుష్టువుః పుణ్డరీకాక్షమనురాగమనోరమమ్ ॥ 38 ॥

భయంకరమయిన ఆ రాక్షసుడు ఆ విధంగా కృష్ణుడిచేతిలో చచ్చిపోవడంతో గోపాలకులూ, గోపికలూ చాల ఆశ్చర్యపడ్డారు. ప్రేమగా కృష్ణుడిని ప్రశంసించారు. వారిస్తుతులకు కృష్ణుడు కూడ సంతోషించాడు.

అయయౌ త్వరితో విప్రో నారదో జలదస్థితః ।
కేశినం నిహతం దృష్ట్వా హర్షనిర్భరమానసః ॥ 39 ॥

కేశిరాక్షసుడు మరణించడం చూచి, నారదుడు మనసునిండా ఆనందించాడు. మబ్బులమాటునుండి త్వరత్వరగా కృష్ణుడివద్దకు వచ్చాడు.

నారద ఉవాచ :-శ్రీకృష్ణుడితో నారదమహర్షి అంటున్నాడు.

సాధు సాధు జగన్నాథ లీలయైవ యదచ్యుత ।
నిహతోఽయం త్వయా కేశీ క్లేశద స్త్రిదివౌకసామ్ ॥ 40 ॥

లోకేశ్వరా! బాగు, బాగు. అచ్యుతా! దేవతలను కష్టపెట్టిన కేశిరాక్షసుడిని నువ్వు అవలీలగా చంపివేశావు.

సముత్సుకో హి యన్నృత్యం నరవాజిన ఆహవే ।
ఆహతస్స త్వయా చాత్ర దుష్టస్స్వర్గముపాగతః ॥ 41 ॥

మనిషి, గుఱ్ఱమూ చేసిన మిక్కిలి ఉత్కంఠను గలిగించే యుద్ధంలో ఈరాక్షసుడు మరణించడం విశేషం. నీచేతిలో చావడంవల్ల ఈపాపాత్ముడు స్వర్గలోకానికి వెళ్లాడు.

సుకర్మాణ్యవతారే తు కృతాని మధుసూదన ।
యాని వై విస్మితం చేతస్తోషమేతేన మే గతమ్ ॥ 42 ॥

కృష్ణా! ఈ అవతారంలో మంచిపనులు చాలా చేశావు. వాటిని తలుచుకుంటే మిక్కిలి ఆశ్చర్యం కలుగుతుంది. అందుకు నామనసు ఎంతో ఆనందిస్తున్నది.

తురగస్యాస్య శక్రోఽపి కృష్ణ దేవాశ్చ బిభ్యతి ।
ధుతకేసరజాలస్య హ్రేషతోఽభ్రావలోకినః ॥ 43 ॥

జూలు విదిలించి, ఆకాశంకేసి చూస్తూ సకిలిస్తుంటే, గుఱ్ఱంరూపంలో ఉన్న ఈరాక్షసుడికి దేవతలు, ఇంద్రుడు కూడా భయపడతారు.

యస్మాత్ త్వయైష దుష్టాత్మా హతః కేశీ జనార్దన ।
తస్మాత్ కేశవనామ్నా త్వం లోకే గేయో భవిష్యసి ॥ 44 ॥

జనార్దనా! దుర్మార్గుడయిన కేశి అనే రాక్షసుడిని సంహరించావు. కాబట్టి నిన్ను లోకాలు అన్నీ కేశవుడు అనే పేరుతో కీర్తిస్తాయి.

స్వస్త్యస్తు తే గమిష్యామి కంసయుద్ధేఽధునా పునః ।
పరశ్వోఽహం సమేష్యామి త్వయా కేశినిషూదన ॥ 45 ॥

కేశిరాక్షసుడిని సంహరించినవాడా! నీకు శుభమగు గాక. ఇప్పటికి నేను వెళ్తున్నాను. ఎల్లుండి నీవు కంసుడితో యుద్ధం చేసేసందర్భంలో మళ్లీ వస్తాను.

ఉగ్రసేనసుతే కంసే సానుగే వినిపాతితే ।
భారావతారకర్తా త్వం పృథివ్యా ధరణీధర ॥ 46 ॥

ఈభూమిని కాపాడేవాడా! ఉగ్రసేనుడి కుమారుడయిన కంసుడిని అనుచరులతో సహా సంహరిస్తే, ఈభూమికి భారం తగ్గించినవాడివవుతావు.

తత్రానేకప్రకారేణ యుద్ధాని పృథివీక్షితామ్ ।
ద్రష్టవ్యాని మయా యుష్మత్ ప్రణీతాని జనార్దన ॥ 47 ॥

కృష్ణా! ఇక ముందు భూలోకంలో రాజులమధ్య నీవు చేయించబోయే అనేకవిధమయిన యుద్ధాలు నేను చూడవలసిఉంది.

సోఽహం యాస్యామి గోవిన్ద దేవకార్యం మహత్ కృతమ్ ।
త్వయా సభాజితశ్చాహం స్వస్తి తేఽస్తు వ్రజామ్యహమ్ ॥ 48 ॥

గోవిందా! ఇక నేను వెళ్తాను. రాక్షససంహారం అనే దేవతలకార్యాన్ని చాల చక్కగా నిర్వర్తించావు. నీమూలంగా నాకు కూడ మన్నన గలుగుతుంది. నీకు శుభమగు! గాక. నేను వెళ్లివస్తాను.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి అంటున్నాడు.

నారదే తు గతే కృష్ణస్సహ గోపైరవిస్మితః ।
వివేశ గోకులం గోపీనేత్రపానైకభాజనమ్ ॥ 49 ॥

నారదమహర్షి వెళ్లిపోయిన తరువాత గోపికలు కంటినిండా తననే చూస్తుండగా, శ్రీకృష్ణుడు గోపాలకులతో కలిసి సాధారణమయిన మానవుడిలాగా వెళ్లి, గోకులంలో ప్రవేశించాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే కృష్ణబాలచరితే కేశివధనిరూపణం నామ ద్వ్యశీతితమోఽధ్యాయః ॥ 82 ॥

శ్రీబ్రహ్మపురాణంలో బాలకృష్ణుడిచరిత్రలో కేశివధనిరూపణం అనే ఎనబైరెండవ అధ్యాయం ॥ 82 ॥



త్ర్యశీతితమోऽధ్యాయః – ఎనబైమూడవ అధ్యాయం

అక్రూరాగమనవర్ణనమ్ – అక్రూరాగమనవర్ణనం

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి చెబుతున్నాడు.

అక్రూరోऽపి వినిష్క్రమ్య స్యన్దనేనాశుగామినా ।
కృష్ణసన్దర్శనాసక్తః ప్రయయౌ నన్దగోకులే ॥ 1 ॥

అక్రూరుడు కూడా శ్రీకృష్ణుడిని దర్శించుకోవాలని ఉత్కంఠతో వెంటనే అక్కడినుండి బయలుదేరాడు. రథమెక్కి వేగంగా నందుడి గోకులానికి వెళ్లాడు.

చిన్తయామాస చాక్రూరో నాస్తి ధన్యతరో మయా ।
యోऽహ మంశావతీర్ణస్య ముఖం ద్రక్ష్యామి చక్రిణః ॥ 2 ॥

అక్రూరుడు మనసులో ఈవిధంగా అనుకున్నాడు – శ్రీమహావిష్ణువు అంశతో పుట్టిన కృష్ణస్వామిముఖం దర్శించు కోబోతున్న నాకంటె గొప్పధన్యుడు ఇంకొకడు లేడు.

అద్య మే సఫలం జన్మ సుప్రభాతా చ మే నిశా ।
యదున్నిద్రాబ్జపత్రాక్షం విష్ణోర్ద్రక్ష్యామ్యహం ముఖమ్ ॥ 3 ॥

వికసించిన తామరపూరేకులవంటి విశాలమయిన కన్నులుకలిగిన శ్రీకృష్ణస్వామిముఖాన్ని ఈనాడు నేను చూడబోతున్నాను. ఇంత కాలానికి నేను పుట్టిన ప్రయోజనం చేకూరింది. ఈరోజు రాత్రి నాకు చాలా శుభప్రదంగా తెల్లవారింది.

పాపం హరతి యత్పుంసాం స్మృతం సఙ్కల్పనామయమ్ ।
తత్పుణ్డరీకనయనం విష్ణోర్ద్రక్ష్యామ్యహం ముఖమ్ ॥ 4 ॥

కృష్ణుడు తలచుకున్నవెంటనే సమస్తమయిన పాపాలను పోగొట్టి, అన్ని కోరికలను నెరవేరుస్తాడు. తెల్లదామరలవంటి కన్నులతో నిండిన ఆ కృష్ణస్వామిముఖం చూడగలుగుతున్నాను.

నిర్జగ్ముశ్చ యతో వేదా వేదాఙ్గాన్యఖిలాని చ ।
ద్రక్ష్యామి యత్ పరంధామ దేవానాం భగవన్ముఖమ్ ॥ 5 ॥

వేదాలూ, సమస్తమయిన వేదాంగాలూ ఆ స్వామిముఖంనుండే వెలువడ్డాయి. దేవతలకందరికీ ఉత్తమగమ్యమయిన ఆ కృష్ణస్వామి ముఖాన్ని చూడబోతున్నాను.

యజ్ఞేషు యజ్ఞపురుషః పురుషైః పురుషోత్తమః ।
ఇజ్యతే యోऽఖిలాధారస్తం ద్రక్ష్యామి జగత్పతిమ్ ॥ 6 ॥

యజ్ఞాలలో ప్రధానుడయిన యజ్ఞపురుషుడు కృష్ణస్వామే. పురుషోత్తముడయిన ఆ స్వామినే యజ్ఞాలలో పురుషులు పూజిస్తారు. సమస్తమయిన సృష్టికీ ఆధారమయినవాడూ, లోకాలకన్నింటికీ ప్రభువూ అయిన కృష్ణస్వామిముఖం చూడగలుగుతున్నాను.

ఇష్ట్వా యమిన్ద్రో యజ్ఞానాం శతేనామరరాజతామ్ ।
అవాప తమనన్తాదిమహం ద్రక్ష్యామి కేశవమ్ ॥ 7 ॥

ఇంద్రుడు నూరు యజ్ఞాలలో ఆ స్వామినే అర్చించి దేవతలకు రాజు అనే పదవిని పొందాడు. తుది మొదలు తెలియరాని ఆ కృష్ణస్వామిని నేను చూడగలుగుతున్నాను.

న బ్రహ్మా నేన్ద్రరుద్రాశ్వివస్వాదిత్యమరుద్గణాః ।
యస్య స్వరూపం జానన్తి తం ద్రక్ష్యామి జగత్పతిమ్ ॥ 8 ॥

ఆ స్వామి స్వరూపాన్ని బ్రహ్మ, ఇంద్రుడు, రుద్రుడు, అశ్వినీదేవతలు, వసువులు, ఆదిత్యులు, మరుత్తులు కూడ తెలుసుకోలేరు. అటువంటి కృష్ణస్వామిని ప్రత్యక్షంగా నేను చూడబోతున్నాను.

సర్వాత్మా సర్వగస్సర్వస్సర్వభూతేషు సంస్థితః ।
యో భవత్యవ్యయో వ్యాపీ సత్తామాత్రస్స్వయం ప్రభుః ॥ 9 ॥

ఆ స్వామి సమస్తమూ తానే అయినవాడు. అంతర్యామిగా ఉండి అందరిలోనూ సంచరిస్తాడు. సమస్తమయిన భూతాలలో నెలకొనిఉంటాడు. ఆయనకు ఏవిధమైన మార్పు లేదు. అన్నింటిలోను నిండిఉంటాడు. ఉన్నాడు అని మాత్రమే తెలియదగినవాడు (స్వరూపాదులు తెలియరానివాడు). తనకు తానుగా లోకాలకన్నింటికీ ప్రభువయిన వాడు (ఆయనను నియమించేవాడు, ఆయనకంటె అధికుడు లేడు).

మత్స్యకూర్మవరాహాద్యైస్సింహరూపాదిభిః స్థితమ్ ।
చకార యోగతో యోగం స మామాలాపయిష్యతి ॥ 10 ॥

తనయోగశక్తితో మత్స్యం, కూర్మం, వరాహం, నారసింహం మొదలయిన రూపాలను ధరించి ఇక్కడ నిలిచాడు. అటువంటి స్వామి ఇపుడు నాతో మాట్లాడతాడు.

సామ్ప్రతం చ జగత్స్వామీ కార్యజాతే వ్రజే స్థితిమ్ ।
కర్తుం మనుష్యతాం ప్రాప్తస్స్వేచ్ఛాదేహధృగవ్యయః ॥ 11 ॥

ఎప్పటికీ, ఏవిధమయిన మార్పూ లేని ఆ జగన్నాథస్వామి ప్రస్తుతం లోకరక్షణకు చేయవలసిన పనుల నిమిత్తంగా, తన ఇచ్ఛ ననుసరించి మానవశరీరాన్ని ధరించి, గొల్లపల్లెలో ఉంటున్నాడు.

యోఽనన్తః పృథివీం ధత్తే శిఖరస్థితిసంస్థితామ్ ।
సోఽవతీర్ణో జగత్యర్థం మామక్రూరేతి వక్ష్యతి ॥ 12 ॥

అంతులేని ఆ స్వామి స్థితికార్యంలో ఉత్తమమయిన స్థానంలో ఉన్న ఈభూమిని భరిస్తున్నాడు. అటువంటి స్వామి లోకరక్షణంకోసం ఈభూమిమీద పుట్టాడు. ఆ స్వామి నేడు నన్ను 'అక్రూరా' అని ఆప్యాయంగా పిలుస్తాడు.

పితృబన్ధుసుహృద్భ్రాతృమాతృబన్ధుమయీమిమామ్ ।
యన్మాయాం నాలముద్ధర్తుం జగత్తస్మై నమో నమః ॥ 13 ॥

తండ్రి, చుట్టాలు, స్నేహితులు, సోదరులు, తల్లి, మొదలయిన బంధాలతో నిండిఉన్న ఈమాయనుండి కృష్ణస్వామి మాత్రమే లోకాన్ని ఉద్ధరించగలడు. అటువంటి ఆ కృష్ణస్వామికి నమస్కారం.

తరన్త్యవిద్యాం వితతాం హృది యస్మిన్నివేశితే ।
యోగమాయామిమాం మర్త్యాస్తస్మై విద్యాత్మనే నమః ॥ 14 ॥

ఆ స్వామి విద్యాస్వరూపుడు. ఆయన ఎవరిహృదయంలో ప్రవేశిస్తాడో, వాడు గాఢమయిన అజ్ఞానంనుండి, అసత్యాన్ని సత్యంగా భావించే మాయనుండి బయటపడతాడు. మానవులలోని అజ్ఞానం అనే మాయను తొలగించే విద్యారూపుడయిన ఆ స్వామికి నమస్కారం.

యజ్వభిర్యజ్ఞపురుషో వాసుదేవశ్చ శాశ్వతైః ।
వేదాన్తవేదిభిర్విష్ణుః ప్రోచ్యతే యో నతోఽస్మి తమ్ ॥ 15 ॥

యజ్ఞం చేసేవారు యజ్ఞపురుషుడనీ, వేదాంతం చక్కగా తెలిసిన స్థిరమయిన జ్ఞానం కలిగినవారు ఆ శ్రీమహావిష్ణుదేవుడిని వాసుదేవుడు అని పేర్కొంటారు. ఆ స్వామికి వినయంగా నమస్కరిస్తున్నాను.

తథా యత్ర జగద్ధామ్ని ధార్యతే చ ప్రతిష్ఠితమ్ ।
సదసత్త్వం స సత్త్వేన మయ్యసౌ యాతు సౌమ్యతామ్ ॥ 16 ॥

ఈజగత్తు సమస్తాన్నీ ఆ పరమాత్మ తనలో ధరించి, చక్కగా రక్షిస్తున్నాడు. ఆకారంతో సగుణంగానూ, ఆకారం లేకుండా నిర్గుణంగానూ ఉండే ఆ స్వామి నాకు సగుణమయిన రూపంతో ప్రత్యక్షంగా నిలిచి, నామీద అనుగ్రహం చూపాలి.

స్మృతే సకలకల్యాణభాజనం యత్ర జాయతే ।
పురుషప్రవరం నిత్యం వ్రజామి శరణం హరిమ్ ॥ 17 ॥

కృష్ణస్వామిని తలచినంతమాత్రంచేతనే సమస్తమైన శుభపరంపరలు సిద్ధిస్తాయి. అటువంటి పురుషోత్తముడైన శ్రీమహావిష్ణు దేవుడిని శరణు పొందుతున్నాను.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి అంటున్నాడు.

ఇత్థం స చిన్తయన్ విష్ణుం భక్తినమ్రాత్మమానసః ।
అక్రూరో గోకులం ప్రాప్తః కిఞ్చిత్ సూర్యే విరాజతి ॥ 18 ॥

అక్రూరుడు భక్తితో వినతమయిన మనస్సుతో శ్రీమహావిష్ణువును తలుచుకుంటూ, కొద్దిగా పొద్దెక్కేసమయానికి గోకులానికి చేరుకున్నాడు.

స దదర్శ తదా తత్ర కృష్ణమాదోహనే గవామ్ ।
వత్సమధ్యగతం ఫుల్లనీలోత్పలదలచ్ఛవిమ్ ॥ 19 ॥

అక్రూరుడు చక్కగా వికసించిన నల్లకలువవంటి మేనికాంతితో ఆవుదూడలనడుమ, ఆవును పాలు పితుకుతున్న కృష్ణస్వామిని గోకులంలో చూశాడు.

ప్రఫుల్లపద్మపత్రాక్షం శ్రీవత్సాఙ్కితవక్షసమ్ ।
ప్రలమ్బబాహుమాయామతుఙ్గోరస్థలమున్నసమ్ ॥ 20 ॥

కృష్ణస్వామి కన్నులు బాగా వికసించిన తామరరేకులలాగా విశాలంగా ఉన్నాయి. స్వామి వక్షస్థలంమీద శ్రీవత్సం అనే మచ్చ ఉన్నది. బాహువులు బాగా పొడవుగా ఉన్నాయి. వక్షస్థలం విశాలంగానూ, ఎత్తుగానూ ఉంది. ముక్కు కొనదేరి ఎత్తుగా ఉంది.

సవిలాసస్మితాధారం బిభ్రాణం ముఖపఙ్కజమ్ ।
తుఙ్గరక్తనఖం పద్భ్యాం ధరణ్యాం సుప్రతిష్ఠితమ్ ॥ 21 ॥

స్వామి ముఖం పద్మంలాగా ఉన్నది. ఆ ముఖంపై చిరునవ్వు మనోహరంగా ప్రకాశిస్తున్నది. ఎఱ్ఱగానూ, ఎత్తుగానూ ఉన్నగోళ్లతో కూడినపాదాలు నేలపై చక్కగా నెలకొనిఉన్నాయి.

బిభ్రాణం వాససీ పీతే వన్యపిచ్ఛవిభూషితమ్ ।
సాన్ద్రనీలలతాహస్తం సితామ్భోజావతంసకమ్ ॥ 22 ॥

స్వామి పట్టువస్త్రాలు ధరించిఉన్నాడు. తలమీద అడవినెమిలిపింఛం అలంకరించుకున్నాడు. చేతులు దట్టమయిన నల్లనితీగవలె ఉన్నాయి. తెల్లదామరపూవును చెవికి ఆభరణంగా పెట్టుకున్నాడు.

హంసేన్దుకున్దధవలం నీలామ్బరధరం ద్విజాః ।
తస్యాను బలభద్రం చ దదర్శ యదునన్దనమ్ ॥ 23 ॥

విప్రులారా! అక్రూరుడు కృష్ణస్వామివెంట ఉన్న యదుకుమారుడయిన బలరాముడిని కూడ దర్శించాడు. బలరాముడు హంసలు, చంద్రుడు, మొల్లలలాగా తెల్లనిమేనిచాయ కలిగినవాడు. నల్లనివస్త్రం ధరించాడు.

ప్రాంశుముత్తుఙ్గబాహుం చ వికాశిముఖపఙ్కజమ్ ।
మేఘమాలాపరివృతం కైలాసాద్రిమివాపరమ్ ॥ 24 ॥

బలరాముడు బాగా ఎత్తయినవాడు. అతడిభుజాలు బాగా ఎత్తుగా ఉంటాయి. అతడిముఖం తామరపూవులాగా చక్కగా ప్రకాశిస్తున్నది. అతడు అచ్చంగా మబ్బులు కమ్మిన కైలాసపర్వతంలాగా ఉన్నాడు.

తౌ దృష్ట్వా వికసద్వక్త్రసరోజస్స మహామతిః ।
పులకాఞ్చితసర్వాఙ్గస్తదాఽక్రూరోఽభవద్ ద్విజాః ॥ 25 ॥

బ్రాహ్మణులారా! కృష్ణబలరాములను చూడగానే బుద్ధిమంతుడయిన అక్రూరుడికి ముఖం తామరపూవులాగా చక్కగా వికసించింది. ఒళ్లంత గగురుపొడిచింది.

య ఏతత్పరమం ధామ ఏతత్తత్పరమం పదమ్ ।
అభవద్ వాసుదేవోఽసౌ ద్విధా యోఽయం వ్యవస్థితః ॥26 ॥

వాసుదేవుడే ఈవిధంగా కృష్ణబలరాములుగా రెండుగా ఏర్పడి ఇలా ఉన్నాడు. వీరున్న ఈచోటే ఉత్తమోత్తమ మయిన ఆ పరంధామం (వైకుంఠం). మిక్కిలి శ్రేష్ఠమయిన(మోక్ష)స్థానం ఇదే.

సాఫల్యమక్ష్ణోర్యుగపన్మమాస్తు దృష్టే జగద్ధాతరి కృష్ణరూపే ।
అప్యఙ్గమేతద్భగవత్ప్రసాదాద్దత్తాఙ్గసఙ్గే ఫలవర్మ తత్ స్యాత్ ॥ 27 ॥

జగత్తులను సృష్టించిన శ్రీకృష్ణస్వామిని దర్శించడంతో నాకుచూపు ఇచ్చిన ఈకన్నులు రెండూ ఒకేసారిసఫలత పొందుగాక! స్వామి నన్ను కౌగిలించుకోవడంచేత స్వామిశరీరంతో కలిసి, నాశరీరం ప్రయోజనవంత మగుగాక!

అద్యైవ స్పృష్ట్వా మమ హస్తపద్మం కరిష్యతి శ్రీమదనన్తమూర్తిః ।
యస్యాఙ్ఘ్రిలిస్పర్శహతాఖిలాఘైరవాప్యతే సిద్ధిరనుత్తమా నరైః ॥ 28 ॥

శ్రీకృష్ణస్వామి నాకరకమలాలను స్పృశించి, ఈక్షణమే నన్ను కృతార్థుడిని చేస్తాడు. ఆ స్వామివేలికొసలు తాకినంత మాత్రంచేతనే మానవులకు పాపాలు సమస్తమూ నశించిపోతాయి. ఇంకా మోక్షరూపమయిన పరమపదం లభిస్తుంది.

సుహృత్తమం జ్ఞాతిమనన్యదైవతమ్
దోర్భ్యాం బృహద్భ్యాం పరిరప్స్యతేఽథ మామ్ ।
ఆత్మా హి తీర్థీక్రియతే తదైవ మే
బన్ధశ్చ కర్మాత్మక ఉచ్ఛ్వసిత్యతః ॥ 29 ॥

నేను కృష్ణస్వామికి ప్రియమయిన స్నేహితుడిని. సోదరుడివంటివాడిని. కృష్ణుడిని తప్ప మరొకరిని దైవంగా భావించనివాడిని. అటువంటి నన్ను స్వామి మిక్కిలిదీర్ఘమైన బాహువులతో ఇప్పుడే కౌగిలించుకుంటాడు. ఆ క్షణమే నాఆత్మ పుణ్యతీర్థం అవుతుంది. పూర్వకర్మలవలన ఏర్పడిన (కంసాదులతో) నాబంధాలన్నీ తొలగిపోతాయి.

లబ్ధ్వాఽఙ్గసఙ్గం ప్రణతం కృతాఞ్జలిం
మాం వక్ష్యతేఽక్రూర తతేత్యురుశ్రవాః ।
తదా వయం జన్మభృతో మహీయసా
నైవాదృతో యో ధిగముష్య జన్మ తత్ ॥ 30 ॥

చేతులు జోడించి, సాష్టాంగంగా నమస్కరించిన నన్ను కృష్ణస్వామి ప్రేమగా 'అక్రూరా!' అని పిలుస్తాడు.ఆ క్షణంలో మేము ఈజన్మ మెత్తిన ప్రయోజనం నెరవేరుతుంది. ఉత్తములచేత ఆదరింపబడకపోతే ఆ జన్మ వ్యర్థంకదా!

న తస్య కశ్చిద్దయితస్సుహృత్తమో న చాప్రియో ద్వేష్య ఉపేక్ష్య ఏవ వా ।
తథాఽపి భక్తాన్ భజతే యథా తథా సురద్రుమో యద్వదుపాశ్రితోఽర్థదః ॥ 31 ॥

కృష్ణస్వామికి మిక్కిలిప్రియమయిన వాడు లేడు. గొప్పస్నేహితుడు లేడు. ఇష్టం కానివాడు లేడు. ద్వేషింపదగిన వాడూ లేడు. అయినా, కల్పవృక్షం తనదగ్గరకు వచ్చినవాళ్లకు అందరికీ ఏవిధమయిన భేదమూ లేకుండా, కావలసినదానిని ఇచ్చినవిధంగా, కృష్ణస్వామి తన నాశ్రయించిన భక్తులకందరికీ కావలసినవన్నీ ఇస్తాడు.

తథాఽశ్విరుద్రేన్ద్రవసుప్రణీతా దేవాః ప్రయచ్ఛన్తి వరం ప్రహృష్టాః ।
చక్రం ఘ్నతా దైత్యపతేర్హృతాని దైత్యాఙ్గనానాం నయనాన్తరాణి ॥ 32 ॥

రాక్షసులసమూహాన్ని సంహరించి, వారిభార్యల కంటికాటుకలను అపహరించిన శ్రీమహావిష్ణువు నాకు ప్రసన్నుడు కావడంచేత, దేవతలందరూ సంతోషిస్తారు. అశ్వినులు, రుద్రులు, ఇంద్రులు, వసువులతో వచ్చి, ఆ దేవతలు నాకు వరమిత్తురు గాక!

యత్రామ్బు విన్యస్య బలిర్మనోజ్ఞానవాప భోగాన్ వసుధాతలస్థః ।
తథాఽమరేశస్త్రిదశాధిపత్యం మన్వన్తరం పూర్ణమవాప శక్రః ॥ 33 ॥

ఈభూమిమీద ఉన్న బలిచక్రవర్తి వామనుడిరూపంలో ఉన్న శ్రీమహావిష్ణువుచేతిలో (మూడడుగులనేలను దానం చేస్తూ) దానజలాన్ని విడిచిపెట్టి, మనోహరమయిన (ఇంద్రుడికంటె అధికమయిన) భోగాలు ఎన్నో పొందాడు. అదే విధంగా ఇంద్రుడు దేవతలపై ఆధిపత్యాన్ని పొంది, ఒక మన్వంతరకాలం దేవతలకు రాజుగా (ఇంద్రభోగాలు) అనుభవించాడు.

అథాపి మాం కంసపరిగ్రహేణ దోషాస్పదీభూతమదోషయుక్తమ్ ।
కర్తా న మానోపహితం ధిగస్తు యస్మాన్మనస్సాధు బహిష్కృతో యః ॥ 34 ॥

ఇప్పుడు కూడా నాలో ఏపాపమూ లేకపోయినా, కంసుడు తనవాడిగా స్వీకరించి ఉండడంచేత దోషం పొందిన నన్ను కృష్ణస్వామి అనుగ్రహిస్తాడు. రాజాజ్ఞగా కంసుడు చెప్పినపనులు చేయడంలో నేను కర్తను కాను. అయినా, ఛీ, అభిమానం చంపుకుని జీవిస్తున్నాను. శరీరంనుండి బహిష్కరింపబడి, నామనస్సు మాత్రం పాపకర్మ చేయడం లేదు. కాబట్టి సాధువే. (రాజాజ్ఞ కారణంగా శరీరం పాపపుపనులు చేసినా, వాటిని అంగీకరింపని మనస్సు ఆ కర్మలకు దూరంగా ఉన్నది, కాబట్టి సాధువు.)

జ్ఞానాత్మకస్యాఖిలసత్త్వరాశేర్వ్యావృత్తదోషస్య సదాఽస్ఫుటస్య ।
కిం వా జగత్యత్ర సమస్తపుంసామజ్ఞాతమస్యాస్తి హృది స్థితస్య ॥ 35 ॥

జ్ఞానమే స్వరూపమయినవాడు, సమస్తమయిన జీవరాశులు తానే అయినవాడు, ఏవిధమయిన దోషమూ లేనివాడు, ఎప్పటికీ స్పష్టంగా తెలియరానివాడు, అందరిహృదయాలలో (అంతర్యామిగా) ఉండేవాడు అయిన కృష్ణపరమాత్మకు ఈలోకంలో తెలియరానిది ఏముంది?

తస్మాదహం భక్తివినమ్రగాత్రో వ్రజామి విశ్వేశ్వరమీశ్వరాణామ్ ।
అంశావతారం పురుషోత్తమస్య అనాదిమధ్యాన్తమజస్య విష్ణోః ॥ 36 ॥

అందుచేత ప్రభువులకందరికీ ప్రభువూ, జగన్నాథుడూ, పురుషోత్తముడూ, మొదలు, మధ్య, చివర తెలియరాని వాడూ, పుట్టుక లేనివాడూ అయిన విష్ణువుఅంశతో అవతరించిన కృష్ణస్వామిని భక్తితో అవనతమయిన శరీరంతో నేను శరణు పొందుతాను.

ఇతి శ్రీబ్రహ్మపురాణే కృష్ణక్రీడాయామక్రూరాగమవర్ణనం నామ త్ర్యశీతితమోఽధ్యాయః ॥ 83 ॥

శ్రీబ్రహ్మపురాణంలో కృష్ణక్రీడలో అక్రూరాగమనం అనే ఎనబైమూడవ అధ్యాయం సంపూర్ణం.

చతురశీతితమోऽధ్యాయః – ఎనబైనాల్గవ అధ్యాయం

అక్రూరప్రత్యాగమనమ్ – అక్రూరప్రత్యాగమనం

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి అంటున్నాడు.

చిన్తయన్ పథి గోవిన్దముపగమ్య స యాదవః ।
అక్రూరోऽస్మీతి చరణౌ ననామ శిరసా హరేః ॥ 1 ॥

ఈవిధంగా దారిపొడుగునా కృష్ణదర్శనాన్ని గురించే ఆలోచిస్తూ, యాదవుడైన అక్రూరుడు గోపల్లెకు వచ్చాడు. కృష్ణస్వామివద్దకు చేరుకుని, నేను అక్రూరుడి' నని చెప్పుకుని, స్వామిపాదాలకు వంగి నమస్కరించాడు.

సోऽప్యేనం ధ్వజవజ్రాబ్జకృతచిహ్నేన పాణినా ।
సంస్పృశ్యాకృష్య చ ప్రీత్యా సుగాఢం పరిషస్వజే ॥ 2 ॥

పతాకం, వజ్రం, పద్మం అనే శుభచిహ్నాలు కలిగిన చేతితో శ్రీకృష్ణుడు అక్రూరుడిని ఆప్యాయంగా స్పృశించాడు. అతడిని దగ్గరకు తీసుకుని గట్టిగా కౌగిలించుకున్నాడు.

కృతసంవన్దనౌ తేన యథావద్బలకేశవౌ ।
తతః ప్రవిష్టౌ సంహృష్టౌ తమాదాయాऽऽత్మమన్దిరమ్ ॥ 3 ॥

అక్రూరుడు తమకు నమస్కరించగా, కృష్ణబలరాములు తగినవిధంగా అతడిని వెంటతీసుకుని సంతోషంతో తమ మందిరంలో ప్రవేశించారు.

స చ తాభ్యాం తదాऽక్రూరః కృతసంవన్దనాదికః ।
భుక్తభోజ్యో యథాన్యాయమాచచక్షే తతస్తయోః ॥ 4 ॥

అప్పుడు కృష్ణబలరాములు అక్రూరుడిని తగువిధంగా గారవించారు. అక్రూరుడు వారితో కలిసి భోజనం చేశాడు. ఆ తరువాత వారితో యుక్తమయిన రీతిలో ఇలా చెప్పాడు.

యథా నిర్భర్త్సితస్తేన కంసేనాऽऽనకదున్దుభిః ।
యథా చ దేవకీదేవీ దానవేన దురాత్మనా ॥ 5 ॥

దుష్టరాక్షసుడయిన కంసుడు దేవకీదేవిని, వసుదేవుడిని భయపెట్టిన తీరు అంతా వివరించాడు.

ఉగ్రసేనే యథా కంసస్స దురాత్మా చ వర్తతే ।
యం చైవార్థం సముద్దిశ్య కంసేన స విసర్జితః ॥ 6 ॥

దుర్మార్గుడయిన కంసుడు తండ్రి అయిన ఉగ్రసేనుడివిషయంలో క్రూరంగా ప్రవర్తిస్తున్న విషయం చెప్పాడు. కంసుడు తనను కృష్ణబలరాములవద్దకు పంపిన ప్రయోజనం గురించి వర్ణించాడు.

తత్సర్వం విస్తరాచ్ఛ్రుత్వా భగవాన్ కేశిసూదనః ।
ఉవాచాఖిలమేతత్తు జ్ఞాతం దానపతే మయా ॥ 7 ॥

అక్రూరుడు సవివరంగా చెప్పిన అన్ని సంగతులన్నీ విని, కృష్ణుడు అతడితో ఇలా అన్నాడు. 'అక్రూరా! ఈసంగతులన్నీ నాకు తెలిశాయి'.

కరిష్యే చ మహాభాగ యదత్రౌపాయికం మతమ్ ।
విచిన్త్య నాన్యథైతత్తే విద్ధి కంసం హతం మయా ॥ 8 ॥

మహాత్మా! కంసుడివిషయంలో తగిన మార్గంలో చేయవలసినది చేస్తాను. నీవు అన్యథా భావించవద్దు. ఆ కంసుడు నాచేతిలో మరణించాడని తెలుసుకో.

అహం రామశ్చ మథురాం శ్వో యాస్యావస్సమం త్వయా ।
గోపవృద్ధాశ్చ యాస్యన్తి ఆదాయోపాయనం బహు ॥ 9 ॥

నేనూ, బలరాముడూ ఇద్దరమూ రేపు నీతో కలిసి మధురకు వస్తాం. పెద్దలయిన గోపాలకులు కూడ అనేకమైన కానుకలు తీసుకుని మనతో వస్తారు.

నిశేయం నీయతాం వీర న చిన్తాం కర్తుమర్హసి ।
త్రిరాత్రాభ్యన్తరే కంసం హనిష్యామి సహానుగమ్ ॥ 10 ॥

మహావీరా! ఈరాత్రి ఇక్కడే ఉండు. నీవు దిగులుపడవలసిందేమీ లేదు. మూడురోజులలోగా కంసుడిని వాడిఅనుచరులతో సహా చంపివేస్తాను.

వ్యాస ఉవాచ:-మునులతో వ్యాసమహర్షి చెబుతున్నాడు.

సమాదిశ్య తతో గోపానక్రూరోఽపి స కేశవః ।
సుష్వాప బలభద్రశ్చ నన్దగోపగృహే గతః ॥ 11 ॥

అక్రూరుడికి ఈవిధంగా చెప్పి, కృష్ణుడు గోపాలకులను ఇక విశ్రమించమని పంపించాడు. కృష్ణుడు, బలరాముడు, అక్రూరుడితో కలిసి, నందుడి ఇంటికి వెళ్లి, అక్కడ నిద్రించారు.

తతః ప్రభాతే విమలే రామకృష్ణౌ మహాబలౌ ।
అక్రూరేణ సమం గన్తుముద్యతౌ మథురాం పురీమ్ ॥ 12 ॥

తెల్లగా, తెల్లవారిన తరువాత బలవంతులయిన రామకృష్ణులు అక్రూరుడితో కలిసి, మధురానగరానికి బయలుదేరారు.

దృష్ట్వా గోపీజనస్స్రాస్రః శ్లథద్వలయబాహుకః ।
నిశ్వసంశ్చాతిదుఃఖార్తః ప్రాహ చేదం పరస్పరమ్ ॥ 13 ॥

కృష్ణుడు తమను విడిచి మధురానగరానికి వెళ్లడం చూచి, గోపికలకు కళ్లలో నీళ్లు తిరిగాయి. చేతికంకణాలు జారిపోయాయి. బాధతో నిట్టూర్పులు విడుస్తున్నారు. గోపికలు చాలా బాధపడుతూ తమలో తాము ఇలా అనుకుంటున్నారు.

మథురాం ప్రాప్య గోవిన్దః కథం గోకులమేష్యతి ।
నాగరస్త్రీకలాలాపమధు శ్రోత్రేణ పాస్యతి ॥ 14 ॥

మథురానగరానికి వెళ్లిన గోవిందుడు తిరిగి గోకులానికి ఎందుకు వస్తాడు? నగరంలో ఉండే స్త్రీల తీయనిమాటలలోని తేనె చెవులారా తాగుతూ వారితోటే ఉండిపోతాడు.

విలాసివాక్యజాలేషు నాగరీణాం కృతాస్పదమ్ ।
చిత్తమస్య కథం గ్రామ్యగోపగోపీషు యాస్యతి ॥ 15 ॥

మథురానగరకాంతలజాణమాటలలో తగులుకున్న కృష్ణుడి మనసు పల్లెవాసులైన గోపకులవైపు, గోపికలవైపు ఎలా తిరుగుతుంది?

సారం సమస్తగోష్ఠస్య విధినా హరతా హరిమ్ ।
ప్రహృతం గోపయోషిత్సు నిర్ఘృణేన దురాత్మనా ॥ 16 ॥

ఈగోకులం మొత్తానికి ప్రధానమయిన కృష్ణుడిని తీసుకునిపోతున్న దుర్మార్గుడయిన విధాతకు గోపికలపై ఏమాత్రం దయ లేదు. అతడు ఇలా గోపికలసర్వస్వాన్ని దోచుకున్నాడు.

భావగర్భస్మితం వాక్యం విలాసలలితా గతిః ।
నాగరీణామతీవైతత్ కటాక్షేక్షితమేవ చ ॥ 17 ॥

మనోహరమయిన భావాలతో నిండిన చిరునవ్వుతో కృష్ణుడు పలికే పలుకులు, అందంగా సుకుమారంగా ఉండే అతడినడవడి, మథురానగరకాంతల కడగంటిచూపులతో వారికి వశమయిపోతాయి.

గ్రామ్యో హరిరయం తాసాం విలాసనిగడైర్ధృతః ।
భవతీనాం పునః పార్శ్వం కయా యుక్త్యా సమేష్యతి ॥ 18 ॥

ఈకృష్ణుడు పల్లెటూరివాడు. ఆ మథురానగరంలోని స్త్రీలు నెఱజాణలు. వాళ్లు తమవిలాసాల సంకెళ్లతో కృష్ణుడిని తమతో బంధిస్తారు. ఇంక అతడు తిరిగి ఈపల్లెపిల్లలవద్దకు ఇంకేమి వస్తాడు?

ఏషో హి రథమారుహ్య మథురాం యాతి కేశవః ।
అక్రూరక్రూరకేణాపి హతాశేన ప్రతారితః ॥ 19 ॥

మనఆశలను కూల్చి, క్రూరుడయిన ఈఅక్రూరుడి వంచనతో, కృష్ణుడు ఇదిగో, రథమెక్కి మథురానగరానికి వెళ్తున్నాడు.

కిం న వేత్తి నృశంసోఽయమనురాగపరం జనమ్ ।
యేనేమమక్షరాహ్లాదం నయత్యన్యత్ర నో హరిమ్ ॥ 20 ॥

వ్రేపల్లెలోని జనాలకు కృష్ణుడిమీద విడదీయరాని ప్రేమ ఉన్న సంగతి దుర్మార్గుడయిన ఈఅక్రూరుడికి తెలియదా? అందరినీ నిరంతరంగా ఆనందపెట్టే మనకృష్ణుడిని ఎక్కడికో తీసుకునివెళ్తున్నాడు.

ఏష రామేణ సహితః ప్రయాత్యత్యన్తనిర్ఘృణః ।
రథమారుహ్య గోవిన్దస్త్వర్యతామస్య వారణే ॥ 21 ॥

కృష్ణుడు కూడ మనమీద ఏమాత్రం దయ లేకుండా, బలరాముడితో కలిసి, ఇదిగో రథమెక్కి వెళ్లిపోతున్నాడు. ఎలాగయినా వెళ్లకుండా ఆపాలి. అందరూ త్వరపడండి.

గురూణామగ్రతో వక్తుం కిం బ్రవీషి న నః క్షమమ్ ।
గురవః కిం కరిష్యన్తి దగ్ధానాం విరహాగ్నినా ॥ 22 ॥

ఊరిపెద్దల ఎదుట మాట్లాడడం ఇక మనవల్లకాదు. ఏమంటావు? అయినా, కృష్ణుడితో విరహం అనే అగ్గిలో బుగ్గి అవుతున్న మననుగురించి ఈపెద్దలు మాత్రం ఏమి చేయగలరు?

నన్దగోపముఖా గోపా గన్తుమేతే సముద్యతాః ।
నోద్యమం కురుతే కశ్చిద్ గోవిన్దవినివర్తనే ॥ 23 ॥

నందుడు మొదలయినవారు గోపాలకులలో పెద్దవారే మధురానగరానికి వెళ్లడానికి సిద్ధపడుతున్నారు కదా! (ఇంక కృష్ణుడిని మధురకు వెళ్లకుండా ఆపడంలో మనకు వారేమి సాయం చేయగల రని ప్రశ్న.) ఊరు విడిచి వెళ్తున్న కృష్ణుడిని వెనక్కి తీసుకురావడానికి ఎవ్వరూ ప్రయత్నించడం లేదు.

సుప్రభాతాఽద్య రజనీ మథురావాసియోషితామ్ ।
యాసా మచ్యుతవక్త్రాబ్జం యాతి నేత్రాలిభోగ్యతామ్ ॥ 24 ॥

మధురానగరంలో నివసిస్తున్న కాంతలకు ఈరోజు శుభోదయమైనట్లే. అందువల్లనే వారు నిద్ర లేవగానే ముందుగా శ్రీకృష్ణస్వామి ముఖపద్మాన్ని కన్నులనే తుమ్మెదలతో ఆస్వాదించబోతున్నారు.

ధన్యాస్తే పథి యే కృష్ణమితో యాన్తమవారితాః ।
ఉద్వహిష్యన్తి పశ్యన్తస్స్వదేహం పులకాఞ్చితమ్ ॥ 25 ॥

కృష్ణుడు వెళ్తున్నదారిలో ఉండి, ఎవరూ అడ్డగించకపోవడంచేత కృష్ణుడినే చూస్తూ, పులకలెత్తిన మేను ధరించినవారు అదృష్టవంతులు.

మథురానగరీపౌరనయనానాం మహోత్సవః ।
గోవిన్దవదనాలోకాదతీవాద్య భవిష్యతి ॥ 26 ॥

కృష్ణుడిముఖం చూడగలగడంవల్ల, మధురానగరంలో ఉండే పౌరులకళ్లకు ఈరోజు పండగే పండగ.

కో ను స్వప్నస్సభాగ్యాభిర్దృష్టస్తాభిరధోక్షజమ్ ।
విస్తారి కాన్తనయనా యా ద్రక్ష్యన్త్యనివారితమ్ ॥ 27 ॥

మధురానగరంలోని స్త్రీలు నేడు కన్నులు పెద్దవి చేసుకుని అడ్డూ ఆపూ లేకుండా, మెరిసేచూపులతో కృష్ణుడిని చూడగలుగుతున్నారు. వారు ఎంతో అదృష్టవంతులు. ఇది కల కాదు గదా!

అహో గోపీజనస్యాస్య దర్శయిత్వా మహానిధిమ్ ।
ఉద్ధృతాన్యద్య నేత్రాణి విధాత్రాఽకరుణాత్మనా ॥ 28 ॥

అయ్యో! బ్రహ్మదేవుడికి దయ అసలు లేదు కదా! కృష్ణస్వామి అనే గొప్పనిధిని ఈపల్లెలోని గోపికలకు చూపినట్లే చూపి, ఇప్పుడు కళ్లు పెరికివేశాడు.

అనురాగేణ శైథిల్యమస్మాసు వ్రజతో హరేః ।
శైథిల్య ముపయాన్త్యాశు కరేషు వలయాన్యపి ॥ 29 ॥

కృష్ణుడిమీది ప్రేమవలన, అతడు మనను విడిచి దూరంగా వెళ్తుంటే, మనశరీరం ఎంతగా శిథిలమై పోతున్నదో. ఈచేతులకు ఉన్న కంకణాలు కూడ వదులై, జారిపోతున్నాయి.

అక్రూరః క్రూరహృదయశ్శీఘ్రం ప్రేరయతే హయాన్ ।
ఏవమార్తాసు యోషిత్సు ఘృణా కస్య న జాయతే ॥ 30 ॥

అక్రూరుడి మనస్సు ఎంత కఠినమో? రథానికి కట్టిన గుఱ్ఱాలను చాల తొందరగా తోలుతున్నాడు. ఈవిధంగా దుఃఖిస్తున్న ఆడవారిమీద ఎవ్వరికీ దయ కలగడంలేదు.

ఏష కృష్ణరథస్యోచ్చైశ్చక్రరేణుర్నిరీక్ష్యతామ్ ।
దూరీకృతో హరిర్యేన సోఽపి రేణుర్న లక్ష్యతే ॥ 31 ॥

ఇదిగో కృష్ణుడి రథచక్రాలు రేపిన దుమ్ము చూడండి. ఈధూళివల్ల కృష్ణుడు (కనబడడంలేదు) మనకు ఇంకా దూరమయినాడు. అయ్యో, ఇప్పుడు (కృష్ణుడి రథచక్రం రేపిన) దుమ్ము కూడ కనబడడం లేదు సుమా!

ఇత్యేవమతిహార్దేన గోపీజననిరీక్షితః ।
తత్యాజ వ్రజభూభాగం సహ రామేణ కేశవః ॥ 32 ॥

ఈవిధంగా గోపికలు ఎంతో అనురాగంతో చూస్తూ ఉండగా, కృష్ణస్వామి బలరాముడితో కలిసి గొల్లపల్లెను విడిచివెళ్లాడు.

గచ్ఛన్తో జవనాశ్వేన రథేన యమునాతటమ్ ।
ప్రాప్తా మధ్యాహ్నసమయే రామాక్రూరజనార్దనాః ॥ 33 ॥

బలరాముడు, కృష్ణుడు, అక్రూరుడు వేగంగా పరుగులుతీసే గుఱ్ఱాలు కట్టిన రథంమీద మధ్యాహ్నసమయానికి యమునానదీతీరానికి చేరుకున్నారు.

అథాఽఽహ కృష్ణమక్రూరో భవద్భ్యాం తావదాస్యతామ్ ।
యావత్ కరోమి కాలిన్ద్యామాహ్నికార్హణమమ్భసి ॥ 34 ॥

అప్పుడు అక్రూరుడు కృష్ణుడితో ఇలా అన్నాడు–మీ రిద్దరూ ఇక్కడ కొద్దిసేపు ఉండండి. నేను కాళిందీజలంలో మాధ్యాహ్నిక మయిన అనుష్ఠానం చేసుకుని వస్తాను.

తథేత్యుక్తే తతస్నాత స్స్వాచాన్తస్స మహాద్యుతిః ।
దధ్యౌ బ్రహ్మ పరం విప్రాః ప్రవిశ్య యమునాజలే ॥ 35 ॥

ద్విజులారా! కృష్ణబలరాములు 'సరే' అన్నారు. తేజస్వి అయిన అక్రూరుడు ఆచమనంచేసి, యమునానదిలో దిగి, స్నానం చేశాడు. అనంతరం పరబ్రహ్మను గూర్చి ధ్యానం చేశాడు.

ఫణాసహస్రమాలాఢ్యం బలభద్రం దదర్శ సః ।
కున్దామలాఙ్గమున్నిద్రపద్మపత్రాయతేక్షణమ్ ॥ 36 ॥

ఆ యమునాజలాలలో అక్రూరుడికి బలరాముడు కనిపించాడు. అతడికి వేయిపడగలు ఉన్నాయి. మొల్లపూల లాగా స్వచ్ఛమయిన తెలుపువన్నెలో ఉన్నాడు. అతడికన్నులు చక్కగా వికసించిన తామరరేకులలాగా విశాలంగా ఉన్నాయి.

వృతం వాసుకిడిమ్భౌఘైర్మహద్భిః పవనాశిభిః ।
సంస్తూయమానముద్గన్ధివనమాలావిభూషితమ్ ॥ 37 ॥

బలరాముడు మంచిపరిమళం వెదజల్లుతున్న వనమాలను అలంకరించుకున్నాడు. అతడిచుట్టూ వాసుకి కుమారులు గుంపులుగా ఉన్నారు. వారు గాలిమాత్రమే ఆహారంగా పుచ్చుకునే మహనీయులు. వారందరూ బలరాముడిని స్తోత్రం చేస్తున్నారు.

దధానమసితే వస్త్రే చారురూపావతంసకమ్ ।
చారుకుణ్డలినం మత్తమన్తర్జలతలే స్థితమ్ ॥ 38 ॥

బలరాముడు నల్లనివస్త్రాలు ధరించాడు. మనోహరమయిన ఆభరణాలు ధరించాడు. చెవులకు పోగులు ఉన్నాయి. పడగ మనోహరంగా ఉంది. చక్కగా మదించిఉన్నాడు. అతడు నీళ్లలో ఉన్నాడు.

తస్యోత్సఙ్గే ఘనశ్యామమాతామ్రాయతలోచనమ్ ।
చతుర్బాహుముదారాఙ్గం చక్రాద్యాయుధభూషణమ్ ॥ 39 ॥

అతడి ఒడిలో శ్రీమహావిష్ణువు ఉన్నాడు. ఆ స్వామి కారుమబ్బులాగా నల్లగా ఉన్నాడు. కళ్లు ఎఱ్ఱగా, బాగా విశాలంగా ఉన్నాయి. నాలుగుభుజాలు ఉన్నాయి. అతడి అవయవాలు అన్నీ ఉత్తమలక్షణాలు కలిగిఉన్నాయి. సుదర్శనం మొదలయిన ఆయుధాలను అందంగా ధరించాడు.

పీతే వసానం వసనే చిత్రమాల్యవిభూషితమ్ ।
శ(చ)క్రచాపతటిన్మాలావిచిత్రమివ తోయదమ్ ॥ 40 ॥

పచ్చని పట్టువస్త్రాలు ధరించాడు. రంగురంగుల వింతపూమాలలను అందంగా ధరించాడు. ఇంద్రధనుస్సు, మెరుపుల మాలికలతో విచిత్రమైన మేఘంలాగా ఉన్నాడు.

శ్రీవత్సవక్షసం చారుకేయూరముకుటోజ్జ్వలమ్ ।
దదర్శ కృష్ణమక్లిష్టం పుణ్డరీకావతంసకమ్ ॥ 41 ॥

వక్షస్థలంమీద శ్రీవత్సం అనే గుర్తు ఉన్నది. అందమయిన భుజకీర్తులతోనూ, కిరీటంతోనూ గొప్పగా ప్రకాశిస్తున్నాడు. అలసట లేనివాడు. చెవులకు తెల్లదామరపూవులను అలంకరించుకున్నాడు.

సనన్దనాద్యైర్మునిభిస్సిద్ధయోగైరకల్మషైః ।
సఞ్చిన్త్యమానం తత్రస్థైర్నాసాగ్రన్యస్తలోచనైః ॥ 42 ॥

ఆ స్వామిని సనక,సనందనాదిమహర్షులు, పుణ్యాత్ములయిన సిద్ధులు, యోగులు సేవిస్తున్నారు. ఆ చుట్టూ ఉన్న వారందరూ కనుబొమ్మలనడుమ చూపు నిలిపి, ఆ స్వామిని ధ్యానిస్తున్నారు.

బలకృష్ణౌ తదాऽక్రూరః ప్రత్యభిజ్ఞాయ విస్మితః ।
అచిన్తయదథో శీఘ్రం కథమత్రాగతావితి ॥ 43 ॥

ఆ కనిపించినవారు బలరామకృష్ణులు అని అక్రూరుడు గ్రహించి ఆశ్చర్యపడ్డాడు. ఇంత తొందరగా తనకంటె ముందుగా వారు ఆ చోటికి ఎలా వచ్చారా అని ఆలోచించసాగాడు.

వివక్షోః స్తమ్భయామాస వాచం తస్య జనార్దనః ।
తతో నిష్క్రమ్య సలిలాద్రథమభ్యాగతః పునః ॥ 44 ॥

ఏదో మాట్లాడబోయిన అక్రూరుడికి కృష్ణస్వామి మాట వెలువకుండా స్తంభింపజేశాడు. అప్పుడు అక్రూరుడు యమునానదీజలం నుండి బయటపడి, కృష్ణబలరాములు ఉన్న రథంవద్దకు వచ్చాడు.

దదర్శ తత్ర చైవోభౌ రథస్యోపరి సంస్థితౌ ।
రామకృష్ణౌ యథా పూర్వమనుష్యవపుషాన్వితౌ ॥ 45 ॥

కృష్ణబలరాము లిద్దరూ ఇంతకు పూర్వంలాగానే మానవశరీరంతో అక్కడే రథంమీద ఉండడం చూశాడు.

నిమగ్నశ్చ పునస్తోయే దదృశే స తథైవ తౌ ।
సంస్తూయమానౌ గన్ధర్వైర్మునిసిద్ధమహోరగైః ॥ 46 ॥

మళ్లీ నదిలో మునిగి, మునుపటిలాగానే అక్కడ గంధర్వులు, మహర్షులు, సిద్ధులు, మహానాగులు స్తుతిస్తుండగా, రామకృష్ణులు దివ్యమయిన రూపంతో నదీజలంలో ఉండడం చూశాడు.

తతో విజ్ఞాతసద్భావస్స తు దానపతిస్తదా ।
తుష్టావ సర్వవిజ్ఞానమయమచ్యుతమీశ్వరమ్ ॥ 47 ॥

అప్పుడు అక్రూరుడు కృష్ణబలరాముల ఉనికిని చక్కగా గ్రహించాడు. సమస్తమయిన జ్ఞానానికి మూలమయిన ఆ కృష్ణస్వామిని స్తుతించాడు. ఆ స్తుతులకు కృష్ణబలరాములు చాల ఆనందించారు.

అక్రూర ఉవాచ :–శ్రీమహావిష్ణువును అక్రూరుడు స్తుతిస్తున్నాడు.

చిన్మాత్రరూపిణేఽచిన్త్యమహిమ్నే పరమాత్మనే ।
వ్యాపినే నైకరూపైకస్వరూపాయ నమో నమః ॥ 48 ॥

జ్ఞానమే స్వరూపమయినవాడు, ఊహకు అందని మహిమ గలిగినవాడు, అంతట నిండిఉన్నవాడు, అనేకమయిన రూపాలు గలిగినవాడు(సృష్టిలోని రూపాలు అన్నీ తానయినవాడు), ఒకేఒక్క రూపం అయినవాడు (అన్నింటిలో అంతర్యామిగా ఉన్న ఒకేఒక్క రూపం అయినవాడు), అయిన పరమాత్మకు మాటిమాటికీ నమస్కారం.

శబ్దరూపాయ తేఽచిన్త్య హవిర్భూతాయ తే నమః ।
నమో విజ్ఞానరూపాయ పరాయ ప్రకృతేః ప్రభో ॥ 49 ॥

దేవా! నీవు శబ్దం స్వరూపమయినవాడివి. ఊహించడానికి అవకాశం లేని ఉత్తమమయిన హవిస్సు అయిన వాడివి. విజ్ఞానం స్వరూపం అయినవాడివి. ప్రకృతికంటె పరమయినవాడివి. అటువంటి నీకు నమస్కారం.

భూతాత్మా చేన్ద్రియాత్మా చ ప్రధానాత్మా తథా భవాన్ ।
ఆత్మా చ పరమాత్మా చ త్వమేకః పఞ్చధా స్థితః ॥ 50 ॥

నీవు ఒక్కడివే 1.భూతాత్మ (చరాచరాత్మకమయిన అన్ని పదార్థాలలోనూ నీవు అంతర్యామివి.విష్ణు.8) 2. ఇంద్రియాత్మ, ఇంద్రియవ్యాపారాలు అన్నీ నీవే. 3. ప్రధానాత్మ (అలాగే ప్రకృతి కూడా నీవే.) 4. ఆత్మ (జీవుడివి నీవే.) 5. పరమాత్మ (కార్యకారణాలకు విలక్షణమయిన నిత్య, శుద్ధ, బుద్ధ ముక్తస్వభావుడు. విష్ణు. 11)అని అయిదువిధాలుగా ఉన్నావు.

ప్రసీద సర్వధర్మాత్మన్ క్షరాక్షర మహేశ్వర ।
బ్రహ్మవిష్ణుశివాద్యాభిః కల్పనాభిరుదీరితః ॥ 51 ॥

సమస్తమయిన ధర్మాలకు సారమూ, క్షరుడివి (సమస్తమైన భూతాలు –జగత్తు తానయినవాడు. విష్ణు.480), అక్షరుడివి (కూటస్థుడు (విష్ణు.481), సమస్తానికీ అద్వితీయమయిన ప్రభువువి, బ్రహ్మ, విష్ణువు, శివుడు అనే పేర్లతో రూపనామాలు కల్పింపబడినవాడివి అయిన స్వామీ! నన్ను అనుగ్రహించు.

అనాఖ్యేయస్వరూపాత్మన్ననాఖ్యేయప్రయోజన ।
అనాఖ్యేయాభిధాన త్వాం నతోఽస్మి పరమేశ్వరమ్ ॥ 52 ॥

నీస్వరూపలక్షణాలు వర్ణించడం సాధ్యం కాదు. నీవలన చేకూరే ప్రయోజనాలను వర్ణించడం సాధ్యంకాదు. నీపేర్లను పేర్కొనడం సాధ్యం కాదు. అందరినీ శాసించే సర్వోన్నతమయిన ప్రభువయిన నీకు నమస్కరిస్తున్నాను.

న యత్ర నాథ విద్యన్తే నామజాత్యాదికల్పనాః ।
తద్బ్రహ్మ పరమం నిత్యమవికారి భవానజః ॥ 53 ॥

ప్రభూ! స్వరూపాన్ని తెలియజేసే నామం, జాతి, మొదలయిన కల్పనలు నీకు సరిపడవు (నిన్ను వ్యక్తం చేయలేవు). ఎటువంటి మార్పులు లేనివాడివి. అన్నికాలాలలో ఉండేవాడివి. పుట్టుక లేనివాడివి. అటువంటి పరబ్రహ్మవు నీవు.

న కల్పనా మృతేఽర్థస్య సర్వస్యాధిగమో యతః ।
తతః కృష్ణాచ్యుతానన్తవిష్ణుసంజ్ఞాభిరీడ్యసే ॥ 54 ॥

నామం, జాతి మొదలయినవి కల్పించుకోకుండా పరమాత్మను గురించి గ్రహించడం సాధ్యం కాదు. కాబట్టి, నిర్గుణుడైన పరమాత్మ అయిన నిన్ను భక్తులు కృష్ణుడు, అచ్యుతుడు, అనంతుడు, విష్ణువు మొదలయిన పేర్లతో స్తుతిస్తున్నారు.

సర్వాత్మం స్త్వ మజ వికల్పనాభిరేతై ర్దేవా
స్త్వం జగదఖిలం త్వమేవ విశ్వమ్ ।
విశ్వాత్మం స్త్వ మతివికారభేదహీనః
సర్వస్మి న్న హి భవతోఽస్తి కిఞ్చిదన్యత్ ॥ 55 ॥

జగత్తు మొత్తానికి అంతరాత్మవు నీవే. నీకు పుట్టుక మొదలైనవికారాలు లేవు. దేవతలు నీవే. జగత్తు మొత్తమూ నీవే. సమస్తమూ నీవే. సమస్తంలోనూ సారభూతమయినవాడివి నీవే. మార్పులు, తేడాలు ఏమాత్రమూ లేనివాడివి. ఈసృష్టిలోని ఏవస్తువులోనూ నీకంటె భిన్నమైనపదార్థం కొంచెం కూడా లేదు.

త్వం బ్రహ్మా పశుపతి రర్యమా విధాతా
త్వం ధాతా త్రిదశపతి స్సమీరణోఽగ్నిః ।
తోయేశో ధనపతి రన్తక స్త్వమేకో
భిన్నాత్మా జగదపి పాసి శక్తిభేదైః ॥ 56 ॥

నీవే బ్రహ్మవు. పశుపతివి నీవే. అర్యముడివి నీవు. సృష్టికర్తవు నీవు. సృష్టిని కాపాడేవాడివి నీవు. ఇంద్రుడు, వాయువు, అగ్ని, వరుణుడు, కుబేరుడు, యముడు, అన్నీ నీవే. నీవు ఒక్కడివే ఆయాభిన్నరూపాలతో సృష్టి, స్థితి మొదలైన వివిధశక్తులతో జగత్తును రక్షిస్తున్నావు.

విశ్వం భవాన్ సృజతి హన్తి గభస్తిరూపో
విశ్వం చ తే గుణమయోఽయ మజ ప్రపఞ్చః ।
రూపం పరం స దితి వాచక మక్షరం యద్
జ్ఞానాత్మనే సదసతే ప్రణతోఽస్మి తస్మై ॥ 57 ॥

కిరణాలరూపంలో ఈజగత్తును నీవే సృష్టిస్తున్నావు. నీవే సంహరిస్తున్నావు. ఈసమస్తమైన ప్రపంచం నీగుణాలతోనే నిండిఉంది. సర్వోత్తమమైనదీ, సత్ అనేశబ్దంచేత తెలియబడేదీ అయిన 'ఓం' అనేఅక్షరం నీవు. జ్ఞానరూపమూ, నిర్గుణమూ, సగుణమూ అయిన పరబ్రహ్మకు నమస్కరిస్తున్నాను.

ఓం నమో వాసుదేవాయ నమ స్సఙ్కర్షణాయ చ ।
ప్రద్యుమ్నాయ నమస్తుభ్య మనిరుద్ధాయ తే నమః ॥ 58 ॥

వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అనే నాలుగువ్యూహాలస్వరూపాలలో ఉన్న నీకు నమస్కారం.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవ మన్తర్జలే కృష్ణ మభిష్టూయ స యాదవః ।
అర్చయామాస సర్వేశం ధూపపుష్పై ర్మనోమయైః ॥ 59 ॥

యమునానదీజలం మధ్యలో ఉండి, అక్రూరుడు ఈవిధంగా కృష్ణస్వామిని చక్కగా స్తుతించాడు. తరువాత ధూపం, పుష్పం మొదలైన ఉపచారాలను మానసికంగా సమర్పిస్తూ ఆజగన్నాథుడిని అర్చించాడు.

పరిత్య జ్యాన్యవిషయం మన స్తత్ర నివేశ్య సః ।
బ్రహ్మభూతే చిరం స్థిత్వా విరరామ సమాధితః ॥ 60 ॥

ఇతరవిషయాలను అన్నింటినీ విడిచిపెట్టి, పరమాత్మయందే మనసును ఏకాగ్రంగా నిలిపి, పరమాత్మలో ఏకమై, చాలకాలం ఉండిపోయాడు. తరువాత సమాధిస్థితినుండి మెల్లగా జగత్తులోకి వచ్చాడు.

కృతకృత్యమివాత్మానం మన్యమానో ద్విజోత్తమాః ।
ఆజగామ రథం భూయో నిర్గమ్య యమునామ్భసః ॥ 61 ॥

విప్రులారా! అక్రూరుడు తాను చేయవలసినదంతా చక్కగా చేసి, కృతార్థుడైనట్లు భావించాడు. యమునానది నుండి తిరిగి రామకృష్ణులున్న రథంవద్దకు వచ్చాడు.

రామకృష్ణౌ దద ర్శాథ యథాపూర్వ మవస్థితౌ ।
విస్మితాక్షం తదాక్రూరం తం చ కృష్ణోఽ భ్యభాషత ॥ 62 ॥

అంతకు పూర్వంలాగానే రథంలోఉన్నబలరామకృష్ణులను చూశాడు. అక్రూరుడికన్నులు ఆశ్చర్యంతో చకిత మయ్యాయి. తరువాత అక్రూరుడితో కృష్ణుడు ఇలా అన్నాడు.

శ్రీకృష్ణ ఉవాచ :–అక్రూరుడితో కృష్ణుడు ఈవిధంగా అంటున్నాడు.

కిం త్వయా దృష్ట మాశ్చర్య మక్రూర యమునాజలే ।
విస్మయోత్ఫుల్లనయనో భవాన్ సంలక్ష్యతే యతః ॥ 63 ॥

అక్రూరా! యమునానదిలో ఏమి వింత చూశావు. ఆశ్చర్యంతో నీకళ్లు బాగా విప్పారినట్లుగా కనబడు తున్నాయి.

అక్రూర ఉవాచ :–కృష్ణస్వామితో అక్రూరుడు ఇలా చెప్తున్నాడు.

అన్తర్జలే యదాశ్చర్యం దృష్టం తత్ర మయాఽచ్యుత ।
తదత్రైవ హి పశ్యామి మూర్తిమత్ పురతః స్థితమ్ ॥ 64 ॥

కృష్ణా! యమునాజలంమధ్యలో నేను ఏవింత చూశానో, ఆ వింత ఇక్కడ కన్నులయెదుట సాకారంగా కనబడుతున్నది.

జగదేత న్మహాశ్చర్యరూపం యస్య మహాత్మనః ।
తేనాశ్చర్యపరేణాహం భవతా కృష్ణసఙ్గతః ॥ 65 ॥

కృష్ణా! మహానుభావుడివయిన నీవల్ల ఈజగత్తు అంతా ఆశ్చర్యమయమై ఉంది. అటువంటివింతలకు అన్నింటికంటే అధికమైన నీతో నేను కలిసిఉన్నాను.

తత్కిమేతేన మథురాం ప్రయామో మధుసూదన ।
బిభేమి కంసాద్ ధిగ్ జన్మ పరపిణ్డోపజీవినః ॥ 66 ॥

కృష్ణా! నీవలన ఇంతటివింత అనుభవాన్ని పొందిననేనూ, నీవూ మధురానగరానికి వెళ్లవలసిందేనా. కంసుడిని తలుచుకుంటేనే నాకు భయం కలుగుతున్నది. ఛీ, ఇతరులదయతో బ్రతకేజన్మ ఎంత దుర్భరమో కదా.

వ్యాస ఉవాచ:–మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

ఇత్యుక్త్వా చోదయామాస తాన్ హయాన్ వాతరంహసః ।
సమ్ప్రాప్త శ్చాపి సాయాహ్నే సోఽక్రూరో మథురాం పురీమ్ ॥
విలోక్య మథురాం కృష్ణం రామం చాహ స యాదవః ॥ 67 ॥

అని చింతిస్తూ, అక్రూరుడు రథాన్ని తోలాడు. ఆగుఱ్ఱాలు వాయువేగంతో ముందుకు పరుగులు తీశాయి. సాయంకాలం అయ్యేటప్పటికి రామకృష్ణులతో అక్రూరుడు మధురానగరానికి చేరుకున్నాడు. మధురానగరాన్ని చూసి, అక్రూరుడు కృష్ణబలరాములతో ఇలా అన్నాడు.

అక్రూర ఉవాచ :–అక్రూరుడు రామకృష్ణులతో ఈవిధంగా చెప్తున్నాడు.

పద్భ్యాం యాతం మహావీర్యౌ రథే నైకో విశామ్యహమ్ ।
గన్తవ్యం వసుదేవస్య నో భవద్భ్యాం తథా గృహే ॥
యువయో ర్హి కృతే వృద్ధః కంసేన స నిరస్యతే ॥ 68 ॥

మహాబలులారా! ఇక్కడినుండి మీరిద్దరూ నడచిరండి. నేను ఒక్కడినే రథంమీద నగరంలో ప్రవేశిస్తాను. తండ్రి గదా అని మీరు వసుదేవుడిఇంటికి వెళ్లకండి. అలా చేస్తే మీమూలంగా కంసుడు వృద్ధుడైన వసుదేవుడిని హింసిస్తాడు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

ఇత్యుక్త్వా ప్రవివేశాసావక్రూరో మథురాం పురీమ్ ।
ప్రవిష్టౌ రామకృష్ణౌ చ రాజమార్గముపాగతౌ ॥ 69 ॥

రామకృష్ణులకు ఇలా చెప్పి, అక్రూరుడు రథంమీద మథురానగరంలో ప్రవేశించాడు. కృష్ణబలరాములు కూడ రాజవీథివెంట నడుచుకుంటూ మథురలో ప్రవేశించారు.

స్త్రీభి ర్నరైశ్చ సానన్దలోచనై రభివీక్షితౌ ।
జగ్మతు ర్లీలయా వీరౌ ప్రాప్తౌ బాలగజా వివ ॥ 70 ॥

ఆనగరంలోని ఆడవాళ్లు, మగవాళ్లు వారినే ఆనందంగా చూస్తుండగా, వీరులయిన రామకృష్ణులు గున్నయేనుగులలాగా విలాసంగా నడిచారు.

భ్రమమాణౌ తు తౌ దృష్ట్వా రజకం రఙ్గకారకమ్ ।
అయాచేతాం సురూపాణి వాసాంసి రుచిరాణి తౌ ॥ 71 ॥

అలా వెళ్తున్నవారు దారిలో వస్త్రాలకు రంగులువేసే చాకలిని చూశారు. రామకృష్ణులు ఆచాకలిని తమకు తగిన అందమైన వస్త్రాలు ఇమ్మని అడిగారు.

కంసస్య రజక స్సోఽథ ప్రసాదారూఢవిస్మయః ।
బహూ న్యాక్షేపవాక్యాని ప్రాహోచ్చైః రామకేశవౌ ॥ 72 ॥

అతడు కంసుడిచాకలి. రాజుగారికి ప్రియమైన చాకలి అయిన తన్ను నిర్భయంగా అడిగారని వారిపై, ఆశ్చర్యపడి రామకేశవులను రకరకాలుగా నిందించాడు.

తత స్తలప్రహారేణ కృష్ణ స్తస్య దురాత్మనః ।
పాతయామాస కోపేన రజకస్య శిరో భువి ॥ 73 ॥

అప్పుడు కృష్ణుడు ఆదుర్మార్గుడిని కోపంగా అరచేతితో గట్టిగా కొట్టాడు. ఆదెబ్బకు ఆచాకలివాడితల తెగి, నేలపై పడింది.

హత్వా చాదాయ వస్త్రాణి పీతనీలామ్బరౌ తతః ।
కృష్ణరామౌ ముదా యుక్తౌ మాలాకారగృహం గతౌ ॥ 74 ॥

ఆవిధంగా కృష్ణుడు ఆచాకలిని చంపి, వాడిదగ్గరవస్త్రాలు తీసుకున్నాడు. వాటిలో పచ్చనివస్త్రాన్ని కృష్ణుడు, నల్లటివస్త్రాన్ని బలరాముడు ఆనందంగా ధరించారు. ఆతరువాత వారిద్దరూ పూలమాలలు అల్లేవాడిఇంటికి స్వయంగా వెళ్లారు.

వికాసి నేత్రయుగలో మాలాకారోఽతివిస్మితః ।
ఏతౌ కస్య కులోత్పన్నౌ మనసాఽచిన్తయ త్తతః ॥ 75 ॥

మాలాకారుడు అపరిచితు లయినవారిని చూచి చాల ఆశ్చర్యపడ్డాడు. ఆశ్చర్యంతో అతడికి కనుగవ వికసించింది. వీళ్లు ఏవంశంలో పుట్టారా అని మనసులో ఆలోచించసాగాడు.

పీతనీలామ్బరధరౌ దృష్ట్వాఽతిసుమనోహరౌ ।
స తర్కయామాస తదా భువం దేవా వుపాగతౌ ॥ 76 ॥

పచ్చనివస్త్రాన్ని ధరించినకృష్ణస్వామినీ, నల్లనివస్త్రం ధరించినబలరాముడినీ చూసి, మనసును హరించే వారి సౌందర్యాన్ని గమనించి, వీళ్లు స్వర్గంలోకం నుండి భూలోకంలోకి దిగివచ్చినదేవతలా అని సందేహించాడు.

వికాశిముఖపద్మాభ్యాం తాభ్యాం పుష్పాణి యాచితః ।
భువం విష్టభ్య హస్తాభ్యాం పస్పర్శ శిరసా మహీమ్ ॥ 77 ॥

సంతోషంతో వారిముఖాలు విప్పారిఉన్నాయి. వారు పుష్పాలు ఇమ్మని మాలాకారుడిని అడిగారు. అప్పుడు మాలాకారుడు రెండు చేతులు నేలపై మోపి, తలను నేల కానించి వారికి మొక్కాడు.

ప్రసాదసుముఖౌ నాథౌ మమ గేహముపాగతౌ ।
ధన్యోఽహ మర్చయిష్యామీ త్యాహ తౌ మాల్యజీవికః ॥ 78 ॥

పూలమాలలు కట్టి, అమ్మి జీవించేఅతడు నామీద అనుగ్రహంతో నిండినఅందమయినముఖాలతో 'మీరు నాయింటికి వచ్చారు. నేను చాల ధన్యుడిని. పూజ్యులయినమిమ్మల్ని పూజించుకుంటాను' అన్నాడు.

తతః ప్రహృష్టవదన స్తయోః పుష్పాణి కామతః ।
చారూణ్యేతాని చైతాని ప్రదదౌ స విలోభయన్ ॥ 79 ॥

రామకృష్ణులను పూజిస్తున్నఆమాలాకారుడికి ముఖం ఆనందంతో వికసించింది. వారు కోరినవిధంగా, ఈపూలు బాగున్నాయి, ఈపూలు ఇంకా మంచివి అంటూ మంచిమంచిపూలను ఏరి, మనసు రంజింపజేస్తూ, రామకృష్ణులకు సమర్పించాడు.

పునః పునః ప్రణమ్యాసౌ మాలాకారోత్తమో దదౌ ।
పుష్పాణి తాభ్యాం చారూణి గన్ధవ న్త్యమలాని చ ॥ 80 ॥

ఉత్తముడైన మాలాకారుడు రామకృష్ణులకు మాటిమాటికీ వినయంగా వంగి నమస్కరిస్తూ, మంచిసువాసన గలిగినవీ, స్వచ్ఛమైనవీ, అందంగా ఉన్నవీ అయినపూలను సమర్పించాడు.

మాలాకారాయ కృష్ణోఽపి ప్రసన్నః ప్రదదౌ వరమ్ ।
శ్రీ స్త్వాం మత్సంశ్రయా భద్ర న కదాచిత్ త్యజిష్యతి ॥ 81 ॥

కృష్ణుడు కూడ మాలాకారుడిని అనుగ్రహించి 'మంచిలక్షణాలు కలిగినవాడా! నన్ను ఆశ్రయించుకునిఉండే సమస్త మయిన సంపదలు విడిచిపెట్టకుండా నిన్ను గూడా అంటిపెట్టుకునిఉంటాయి' అని వరం ఇచ్చాడు.

బలహానిర్న తే సౌమ్య ధనహానిరథాపి వా ।
యావద్ధరణిసూర్యౌ చ సన్తతిః పుత్రపౌత్రికీ ॥ 82 ॥

సజ్జనుడా! నీశక్తికి నష్టం ఉండదు. సంపదలకు హాని ఉండదు. ఈభూమి, సూర్యుడు ఉన్నంతకాలం నీకు కొడుకులు, మనుమళ్లతో సంతానం అభివృద్ధిచెందుతూ ఉంటుంది.

భుక్త్వా చ విపులాన్ భోగాం స్త్వమన్తే మత్ప్రసాదతః ।
మమానుస్మరణం ప్రాప్య దివ్యలోకమవాప్స్యసి ॥ 83 ॥

నాఅనుగ్రహంచేత నీవు ఈలోకంలో విస్తారంగా సుఖాలు అనుభవిస్తావు. తరువాత అవసానసమయంలో నన్ను తలుచుకునేశక్తి కూడా ఉంటుంది. ఆతరువాత దేవలోకానికి చేరుకుంటావు.

ధర్మే మనశ్చ తే భద్ర సర్వకాలం భవిష్యతి ।
యుష్మత్సన్తతిజాతానాం దీర్ఘమాయుర్భవిష్యతి ॥ 84 ॥

మంచిలక్షణాలు కలిగినవాడా! (నాఅనుగ్రహంచేత) నీమనస్సు ఎల్లకాలమూ ధర్మంమీదే లగ్న మైఉంటుంది. నీవంశంలో పుట్టినవారందరికీ దీర్ఘమైన ఆయుర్దాయం కలుగుతుంది.

నోపసర్గాదికం దోషం యుష్మత్సన్తతిసమ్భవః ।
అవాప్స్యతి మహాభాగ యావత్సూర్యో భవిష్యతి ॥ 85 ॥

ఓ మహానుభావా! సూర్యుడు ఉన్నంతకాలం నీవంశంవారి కెవ్వరికీ ఎటువంటికష్టనష్టాలు సంభవించవు.

వ్యాస ఉవాచ :–మహర్షులతో వ్యాసమహర్షి ఇలా అంటున్నాడు.

ఇత్యుక్త్వా తద్గృహాత్ కృష్ణో బలదేవసహాయవాన్ ।
నిర్జగామ మునిశ్రేష్ఠా మాలాకారేణ పూజితః ॥ 86 ॥

అని మాలాకారుడికి చెప్పి, అతడు చేసినపూజలు స్వీకరించి, శ్రీకృష్ణుడు బలరాముడితో కలిసి, మాలాకారుడి ఇంటినుండి తిరిగి వెళ్లిపోయాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసఋషిసంవాదే అక్రూరప్రత్యాగమనం నామ చతురశీతితమోఽధ్యాయః ॥ 84 ॥

శ్రీబ్రహ్మపురాణంలో వ్యాసఋషిసంవాదంలో అక్రూరప్రత్యాగమనం అనే ఎనభైనాల్గవ అధ్యాయం సంపూర్ణం.



పఞ్చాశీతితమోఽధ్యాయః - ఎనబైఐదవ అధ్యాయం

కంసవధకథనమ్ - కంసవధకథనం

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

రాజమార్గే తతః కృష్ణ స్సానులేపనభాజనామ్ ।
దదర్శ కుబ్జామాయాన్తీం నవయౌవనగోచరామ్ ॥ 1 ॥

రాజమార్గంలో పోతూ కృష్ణుడు ఎదురుగా వస్తూ ఉన్నకుబ్జను చూశాడు. ఆమె సుగంధద్రవ్యాలు ఉన్నపాత్రను తీసుకునివెళ్తున్నది. అప్పుడప్పుడే యౌవనవయసులో ప్రవేశించింది.

తామాహ లలితం కృష్ణః కస్యేద మనులేపనమ్ ।
భవత్యా నీయతే సత్యం వ దేన్దీవరలోచనే ॥ 2 ॥

కృష్ణుడామెతో మృదువుగా ఇలా అన్నాడు. 'నల్లకలువలవంటికన్నులు గలిగినసుందరీ! ఈసుగంధద్రవ్యాలు ఎవరికోసం తీసుకువెళ్తున్నావు? నిజం చెప్పు'.

సకామేనైవ సా ప్రోక్తా సానురాగా హరిం ప్రతి ।
ప్రాహ సా లలితం కుబ్జా దదర్శ చ బలా త్తతః ॥ 3 ॥

కృష్ణుడు మృదువుగా పలికినపలుకులలో అనురక్తిని గ్రహించి, కుబ్జ కూడ కృష్ణస్వామిని అనురాగంతో చూస్తూ, మృదువుగా ఇలా అన్నది.

కుబ్జోవాచ :-కృష్ణుడితో కుబ్జ ఇలా అంటున్నది.

కాన్త కస్మాన్నజానాసి కంసేనాపి నియోజితామ్ ।
నైకవక్రేతి విఖ్యాతా మనులేపనకర్మణి ॥ 4 ॥

మనోహరా! సుగంధద్రవ్యాలు పూసేపనికి నన్ను కంసమహారాజు స్వయంగా నియమించాడు. అనేకవక్ర అని ప్రసిద్ధి పొందాను. ఇటువంటినేను తెలియకపోవడ మేమిటి?

నాన్యపిష్టం హి కంసస్య ప్రీతయే హ్యనులేపనమ్ ।
భవ త్యహ మతీ వాస్య ప్రసాదధనభాజనమ్ ॥ 5 ॥

కంసమహారాజుకు నేను తయారుచేసినసుగంధాలు మాత్రమే నచ్చుతాయి. నేను మహారాజు అనుగ్రహసంపదను అందరికంటే అత్యధికంగా సంపాదించాను.

శ్రీకృష్ణ ఉవాచ :-కుబ్జతో కృష్ణుడు ఇలా అన్నాడు.

సుగన్ధ మేతద్ రాజార్హం రుచిరం రుచిరాననే ।
ఆవయో ర్గాత్రసదృశం దీయతా మనులేపనమ్ ॥ 6 ॥

సుందరాననా! ఈసుగంధం రాజులకు మాత్రమే తగినది సుమా! చాల బాగుంది. ఇది మాయిద్దరిశరీరాలకు కూడ తగినవిధంగా ఉంది. ఈమయిపూతను మాకు ఇవ్వు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

శ్రుత్వా తమాహ సా కృష్ణం గృహ్యతాఽ మితి సాదరమ్ ।
ప్రదదా వనులేపఞ్చ గాత్రయోగ్యమథోభయోః ॥ 7 ॥

కృష్ణుడిపలుకులు విని, కుబ్జ ప్రేమగా 'తీసుకోండి' అన్నది. బలరామకృష్ణు లిద్దరికీ ఒంటికి పూసుకోవడానికి తగిన ఆమైపూతను అందించింది.

భక్తిచ్ఛేదానులిప్తాఙ్గౌ తత స్తౌ పురుషర్షభౌ ।
సేన్ద్రచాపౌ విరాజేతాం సితకృష్ణావివామ్బుదౌ ॥ 8 ॥

పురుషోత్తములైన బలరామకృష్ణులు ఆమయిపూతను ఒంటికి చక్కగా పూసుకున్నారు. చిత్రమైన ఆపూతలతో వారు రంగురంగుల ఇంద్రధనుస్సుతో కూడిన, తెల్లనిమబ్బు, నల్లనిమబ్బులాగా ప్రకాశించారు.

తత స్తాం చిబుకే శౌరి రుల్లాపనవిధానవిత్ ।
ఉల్లాప్య తోలయామాస ద్వ్యఙ్గులే నాగ్రపాణినా ॥ 9 ॥

కార్యకుశలుడైన కృష్ణస్వామి అప్పుడు చేయి ముందుకు చాచి, చూపుడువేలు, నడిమివేలూ కుబ్జ గడ్డంకింద ఉంచి, ఎత్తి, ఆమెను పైకి లేపాడు.

చకర్ష పద్భ్యాం చ తదా ఋజుత్వం కేశవోఽ నయత్ ।
తత స్సా ఋజుతాం ప్రాప్తా యోషితా మభవద్వరా ॥ 10 ॥

తనపాదాలతో కుబ్జపాదాలను నొక్కిపట్టి, మేనివంకరలు తొలగిపోయేవిధంగా (గడ్డం కిందముంజేతివేళ్లతో పైకి) లాగాడు. దానివల్ల కుబ్జ శరీరంలోని వంకరలు అన్నీ పోయాయి. అందంతో కుబ్జ స్త్రీలలో శ్రేష్ఠురాలుఅయింది.

విలాసలలితం ప్రాహ ప్రేమగర్భభరాలసమ్ ।
వస్త్రే ప్రగృహ్య గోవిన్దం వ్రజ గేహం మమేతి వై ॥ 11 ॥

అప్పుడు కుబ్జ కృష్ణస్వామి వస్త్రం పట్టుకుని లాగి, కులుకులతోనూ, సుకుమారంగానూ, నిండైన అనురాగంతోనూ, మెల్లగా 'మాయింటికి రా' అన్నది.

ఆయాస్యే భవతీగేహ మితి తాం ప్రాహ కేశవః ।
విససర్జ జహా సోచ్చై రామస్యాలోక్య చాననమ్ ॥ 12 ॥

కృష్ణుడు కుబ్జతో 'మీయింటికి తప్పక వస్తాను' అన్నాడు. అప్పుడు కుబ్జ బలరాముడిముఖం చూస్తూ, పెద్దగా నవ్వుతూ, తాను పట్టుకునిలాగుతున్న కృష్ణుడివస్త్రాన్ని వదిలిపెట్టింది.

భక్తిచ్ఛేదానులిప్తాఙ్గౌ నీలపీతామ్బరా వుభౌ ।
ధనుశ్శాలాం తతో యాతౌ చిత్రమాల్యోపశోభితౌ ॥ 13 ॥

నల్లని, పచ్చనివస్త్రాలు ధరించినరామకృష్ణులు కుబ్జ ఇచ్చినసుగంధద్రవ్యాలను శరీర మంతటా పూసుకుని, మాలాకారుడు ఇచ్చినరకరకాలరంగులపూలమాలలను ధరించి, ధనుర్యాగం జరిగేచోటికి వెళ్లారు.

అధ్యాస్య చ ధనూరత్నం తాభ్యాం పృష్టైస్తు రక్షిభిః ।
ఆఖ్యాతం సహసా కృష్ణో గృహీ త్వాపూరయ ద్ధనుః ॥ 14 ॥

యాగం చేసేధనుస్సును రక్షించేవారిని 'ధనువు ఎక్కడ ఉన్నది' అని అడిగారు. వారు ఎక్కడ ఉన్నదో చెప్పారు. రామకృష్ణులు దానిని చూశారు. వెంటనే కృష్ణుడు ఆధనుస్సును తీసుకుని ఎక్కుపెట్టాడు.

తతః పూరయతా తేన భజ్యమానం మహద్ధనుః ।
చకారాతిమహాశబ్దం మథురా తేన పూరితా ॥ 15 ॥

కృష్ణుడు ఎక్కుపెడుతుండగానే, ఆవిల్లు విరిగిపోయింది. విరిగేటప్పుడు ఆధనుస్సునుండి అత్యధికమైన పెద్దచప్పుడు వెలువడింది. ఆధ్వని మథురానగరం అంతటా నిండింది.

అనుయుక్తౌ తత స్తౌ చ భగ్నే ధనుషి రక్షిభిః ।
రక్షిసైన్యం నికృత్యాశు నిష్క్రాన్తౌ కార్ముకాలయాత్ ॥ 16 ॥

యాగధనువు విరిగిపోవడంచేత దానిని రక్షించేవాళ్లు రామకృష్ణులను 'ఎవరు మీరు' అని ప్రశ్నించారు. ఆరక్షకభటులను నెట్టివేసి, రామకృష్ణులు ధనుర్యాగస్థలాన్ని విడిచి వెళ్లిపోయారు.

అక్రూరాగమవృత్తాన్త ముపలభ్య తతో ధనుః ।
భగ్నం శ్రుత్వాఽథ కంసోఽపి ప్రాహ చాణూరముష్టికౌ ॥ 17 ॥

అక్రూరుడు మథురకు తిరిగివచ్చాడనీ, యాగధనువు విరిగిపోయిందనీ కంసుడు విన్నాడు. (ఆవిరిచినవారు రామకృష్ణులే అని వారు మథురలో ఉన్నారని గ్రహించాడు) వెంటనే చాణూరుడు, ముష్టికుడు అనే తనఅనుచరులతో ఇలా అన్నాడు.

కంస ఉవాచ :-చాణూరముష్టికులతో కంసుడు ఇలా అంటున్నాడు.

గోపాలదారకౌ ప్రాప్తౌ భవద్భ్యాం తౌ మమాగ్రతః ।
మల్లయుద్ధేన హన్తవ్యౌ మమ ప్రాణహరౌ హి తౌ ॥ 18 ॥

రామకృష్ణులు మథురానగరానికి వచ్చేశారు. మీరు వారిద్దరినీ మల్లయుద్ధంలో నాకళ్లయెదుట చంపాలి. వాళ్లు నన్ను చంపడానికే వచ్చారు.

నియుద్ధే తద్వినాశేన భవద్భ్యాం తోషితో హ్యహమ్ ।
దాస్యామ్యభిమతాన్ కామాన్నాన్యథైతన్మహాబలౌ ॥ 19 ॥

మహాబలులారా! మల్లయుద్ధంలో మీరు వారిని చంపితే నాకు చాల ఆనందం. మీకు ఇష్టమైన కోరికలన్నీ నేను నెరవేరుస్తాను. సందేహం లేదు.

న్యాయతోఽన్యాయతో వాపి భవద్భ్యాం తౌ మమాహితౌ ।
హన్తవ్యౌ తద్వధాద్ రాజ్యం సామాన్యం వో భవిష్యతి ॥ 20 ॥

న్యాయమైన పద్ధతిలో గాని, అన్యాయమైన మార్గంలో గానీ, ఎలాగైనా మీరు నాశత్రువులయిన వారిద్దరినీ చంపాలి. అలా చంపితే నారాజ్యం మనముగ్గురిదీ అవుతుంది (మీకు నారాజ్యంలో భాగం ఇస్తాను).

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యాదిశ్య స తౌ మల్లౌ తతశ్చాహూయ హస్తిపమ్ ।
ప్రోవాచోచ్చైస్త్వయా మత్త స్సమాజద్వారి కుఞ్జరః ॥ 21 ॥

స్థాప్యః కువలయాపీడస్తేన తౌ గోపదారకౌ ।
ఘాతనీయౌ నియుద్ధాయ రఙ్గద్వారముపాగతౌ ॥ 22 ॥

చాణూరముష్టికులను ఈవిధంగా ఆజ్ఞాపించి, కంసుడు మావటివాడిని పిలిపించాడు. వాడితో పెద్దగా ఇలా అన్నాడు. 'ఓయీ, నీవు కువలయాపీడం అనేమదించినఏనుగును తెచ్చి, ఈసమాజంవాకిలివద్ద నిలుపు. రామకృష్ణులు మల్లయుద్ధం చేయడానికి, యుద్ధరంగం వాకిలివద్దకు రాగానే ఆఏనుగుతో తొక్కించి, చంపాలి.

తమాజ్ఞాప్యాథ దృష్ట్వా చ మఞ్చాన్ సర్వానుపాహృతాన్ ।
ఆసన్నమరణః కంసస్సూర్యోదయముదైక్షత ॥ 23 ॥

కంసుడు ఈవిధంగా మావటివాడిని ఆజ్ఞాపించి, ఉన్నతమైన ఆసనాలు తెప్పించాడు. చావుదగ్గరపడిన కంసుడు సూర్యుడు ఎప్పుడు ఉదయిస్తాడా అని ఎదురుచూడసాగాడు.

తతస్సమస్తమఞ్చేషు నాగరాస్తు తదా జనాః ।
రాజమఞ్చేషు చారూఢా స్సహ భృత్యై ర్మహీభృతః ॥ 24 ॥

మధురానగరంలోని పెద్దలు ఉన్నతమైన ఆసనాలమీద కూర్చున్నారు. పరివారంతో సహా వచ్చినరాజులు తమకు ఉచితమైన రాజసింహాసనాలమీద కూర్చున్నారు.

మల్లప్రాశ్నికవర్గశ్చ రఙ్గమధ్యే సమీపగః ।
కృతః కంసేన కంసోఽపి తుఙ్గమఞ్చే వ్యవస్థితః ॥ 25 ॥

ఆపోటీకి మధ్యవర్తులు (ప్రశ్నించే తీర్పరులు) కూడ మల్లురే. కంసుడు వారిని తనకు దగ్గరలో రంగస్థలం మధ్యలో కూర్చుండజేశాడు. తాను మధ్యలో ఎత్తైన సింహాసనంమీద కూర్చున్నాడు.

అన్తఃపురాణాం మఞ్చాశ్చ యథాన్యే పరికల్పితాః ।
అన్యే చ వారముఖ్యానామన్యే నగరయోషితామ్ ॥ 26 ॥

అంతఃపురకాంతలకు ఆసనాలు ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. మరి కొన్ని ఆసనాలు వారకాంతలకోసం ఏర్పాటుచేశారు. ఇంకా కొన్ని పౌరకాంతలకోసం ఏర్పరిచారు.

నన్దగోపాదయో గోపా మఞ్చేష్వన్యేష్వవస్థితాః ।
అక్రూరవసుదేవౌ చ మఞ్చప్రాన్తే వ్యవస్థితౌ ॥ 27 ॥

నందుడు మొదలైన గొల్లపెద్దలు ప్రత్యేకమైన ఆసనాలపై కూర్చున్నారు. అక్రూరుడు, వసుదేవుడు కూడ అక్కడికి దగ్గరలో కూర్చున్నారు.

నాగరీయోషితాం మధ్యే దేవకీ పుత్రగర్ధినీ ।
అన్తకాలేఽపి పుత్రస్య ద్రక్ష్యామీతి సుఖం స్థితా ॥ 28 ॥

కొడుకుకోసం తపిస్తున్న దేవకీదేవి అవసానసమయంలోనయినా, కొడుకును చూసుకుందా మని నగరకాంతలనడుమ, ఆనందంగా కూర్చుంది.

వాద్యమానేషు తూర్యేషు చాణూరే చాతివల్గతి ।
హాహాకారపరే లోకే ఆస్ఫోటయతి ముష్టికే ॥ 29 ॥

మంగళవాద్యాలు మోగుతున్నాయి. చాణూరుడు మల్లయుద్ధం చేయడానికి గంతులు వేస్తున్నాడు. ముష్టికుడు జబ్బలు చరుచుకుంటున్నాడు. చూడవచ్చినవారు ఆహా, ఆహా అంటున్నారు.

హత్వా కువలయాపీడం హస్త్యారోహప్రచోదితమ్ ।
మదాసృగనులిప్తాఙ్గౌ గజదన్తవరాయుధౌ ॥ 30 ॥

రామకృష్ణులపైకి ఎక్కించి, తొక్కి చంపడానికి కువలయాపీడం అనేయేనుగును ప్రయోగించారు. ఆఏనుగును రామకృష్ణులు చంపివేశారు. దాని మదద్రవమూ, రక్తమూ వారిఒంటినిండా అంటుకుంది. శ్రేష్ఠమైన ఆకువల యాపీడం దంతాలనే వారు ఆయుధాలుగా ధరించారు.

మృగమధ్యే యథా సింహౌ గర్వలీలావలోకినౌ ।
ప్రవిష్టౌ సుమహారఙ్గం బలదేవజనార్దనౌ ॥ 31 ॥

ఏనుగును చంపినరామకృష్ణులు మృగాలనడుమ సింహాలలాగా, విజయగర్వంతో చుట్టూ అందరినీ చూస్తూ, మల్లయుద్ధ రంగస్థలంలోకి ప్రవేశించారు.

హాహాకారో మహా ఞ్జజ్ఞే సర్వరఙ్గేష్వనన్తరమ్ ।
కృష్ణోఽయం బలభద్రోఽయ మితి లోకస్య విస్మయాత్ ॥ 32 ॥

వారిని చూసి, అక్కడి అన్నిప్రదేశాలలోనూ ఉత్సాహంతో ఆహా ధ్వనులు చెలరేగాయి. ఆప్రాంగణంలోనిజన మంతా, ఇదుగో ఇతడు కృష్ణుడు, ఇతడు బలరాముడు అంటూ ఆశ్చర్యంతో పెద్దగా అరిచారు.

సో౽యం యేన హతా ఘోరా పూతనా సా నిశాచరీ ।
ఆక్షిప్తం శకటం యేన భగ్నౌ చ యమలార్జునౌ ॥33॥

భయంకరమైన పూతన అనేఆరాక్షసిని చంపినవాడు వీడే. శకటాసురుడిని ఎగరగొట్టింది ఇతడే. యమలార్జునవృక్షాలను పడగొట్టినవాడూ వీడే.

సో౽యం యః కాలియం నాగం నన ర్తారుహ్య బాలకః ।
ధృతో గోవర్ధనో యేన సప్తరాత్రం మహాగిరిః ॥ 34 ॥

పసితనంలోనే భయంకరమైన కాళియసర్పం నెత్తికెక్కి నాట్యం చేసినవాడు వీడే. గోవర్ధనం అనే మహాపర్వతాన్ని ఏడురోజులపాటు అవలీలగా చిటికెనవేలిపై మోసినవాడు ఇతడే.

అరిష్టో ధేనుకః కేశీ లీలయైవ మహాత్మనా ।
హతా యేన చ దుర్వృత్తా దృశ్యతే సో౽యమచ్యుతః ॥ 35 ॥

దుర్మార్గులైన అరిష్టుడు, ధేనుకుడు, కేశి అనేరాక్షసులను అవలీలగా చంపిన మహానుభావుడైన కృష్ణస్వామి ఇదుగో ఎట్టయెదుట కనబడుతున్నాడు.

అయం చాస్య మహాబాహు ర్బలదేవో౽గ్రజో౽గ్రతః ।
ప్రయాతి లీలయా యోషిన్మనోనయననన్దనః ॥ 36 ॥

కృష్ణుడికి ముందుగా విలాసంగా నడుస్తున్న ఈతడు బలరాముడు. కృష్ణస్వామికి అన్న. దీర్ఘ మయినభుజాలు కలిగినఇతడు తరుణులమనస్సులకు, కన్నులకు పండుగ చేస్తాడు.

అయం స కథ్యతే ప్రాజ్ఞైః పురాణార్థావలోకిభిః ।
గోపాలో యాదవం వంశం సకలఞ్చోద్ధరిష్యతి ॥ 37 ॥

పురాణాలఅర్థాన్ని చక్కగా పరిశీలించినజ్ఞానులు ఈకృష్ణుడు యాదవవంశం మొత్తాన్నీ ఉద్ధరిస్తాడని చెప్తారు.

అయం స సర్వభూతస్య విష్ణోరఖిలజన్మనః ।
అవతీర్ణో మహీ మంశో నూనం భారహరో భువః ॥ 38 ॥

ఈకృష్ణుడు సమస్తాన్నీ సృష్టించినవాడూ, సమస్తమూ తానే అయినవాడూ అయిన శ్రీమహావిష్ణువుఅంశతో భూలోకంలో పుట్టాడు. ఇతడు భూభారాన్ని నిశ్చయంగా తొలగిస్తాడు.

ఇత్యేవం వర్ణితే పౌరైః రామే కృష్ణే చ తత్క్షణాత్ ।
ఉర స్తతో౽స్యా దేవక్యాస్స్నేహస్నుతపయోధరమ్ ॥ 39 ॥

మధురానగరవాసులు బలరామకృష్ణులను ఈవిధంగా వర్ణిస్తుంటే, ఆక్షణమే పుత్రవాత్సల్యంతో దేవకీదేవికి వక్షస్స్థలంనుండి పాలధారలు కురిశాయి.

మహోత్సవమివాలోక్య పుత్రావేవ విలోకయన్ ।
తత్యాజ వసుదేవోఽపి హర్షా దభ్యాగతాం జరామ్ ॥ 40 ॥

వసుదేవుడు కూడ కొడుకులనే చూసుకుంటూ, ఆసమయం పెద్దపండగలాగా ఆనందించాడు. పయికొన్న ముసలితనాన్ని మరచిపోయి యువకుడిలాగా ఉత్సాహపడ్డాడు.

విస్తారితాక్షియుగలా రాజాన్తఃపురయోషితః ।
నాగరస్త్రీసమూహశ్చ ద్రష్టుం న విరరామ తౌ ॥ 41 ॥

మధురానగరకాంతలూ, రాజుగారి అంతఃపురంలోనిస్త్రీలూ కళ్ళు పెద్దవి చేసుకుని బలరామకృష్ణులనే చూస్తున్నారు. ఆచూపులను వారినుండి తిప్పుకోలేకపోయారు.

స్త్రియ ఊచుః :–ఆకొలువులో ఉన్నకాంతలు ఇలా అంటున్నారు.

సఖ్యః పశ్యత కృష్ణస్య ముఖమ ప్యమ్బుజేక్షణమ్ ।
గజయుద్ధకృతాయాసస్వేదామ్బుకణికాఞ్చితమ్ ॥ 42 ॥

వికాసిశరదమ్భోజ మవశ్యాయ జలోక్షితమ్ ।
పరిభూతాక్షరం జన్మ సఫలం క్రియతాం దృశః ॥ 43 ॥

చెలులారా, తామరపూరేకులవంటికన్నులు కలగినకృష్ణస్వామి ముఖం చూడండి. కువలయాపీడం అనే యేనుగుతో యుద్ధం చేసినపుడు కలిగినచెమటబిందువులతో నిండి, చక్కగా వికసించినశరత్కాలపుతామరపూవు మంచునీటితో తడిసినవిధంగా ప్రకాశిస్తున్నది. అటువంటికృష్ణుడిముఖం చక్కగా దర్శించుకుని ఈజన్మను శాశ్వతప్రయోజనం కలిగినదానినిగా చేసుకోండి (మోక్షస్థితిని పొందండి). చూపులు సఫలం చేసుకోండి.

శ్రీవత్సాఙ్కం జగద్ధామ బాల స్యైత ద్విలోక్యతామ్ ।
విపక్షక్షపణం వక్షో భుజయుగ్మం చ భామిని ॥ 44 ॥

చెలీ, శ్రీవత్సం అనేచిహ్నంతో కూడినదీ, జగత్తు మొత్తానికీ ఆధారమూ, అయినబాలకృష్ణుడివక్షస్స్థలాన్ని చూడు. శత్రువులను నిర్మూలించేబాహువులజంటను చూడు.

కి న్న పశ్యసి ముగ్ధే త్వం మృణాలధవలాననమ్ ।
బలభద్ర మిమ న్నీలపరిధాన మి హాగతమ్ ॥ 45 ॥

అమ్మాయీ! తామరతూడులాంటితెల్లనిముఖం కలిగి, నల్లనివస్త్రం ధరించి, ఇటు వచ్చినబలరాముడిని చూస్తున్నావు కదా!

జల్పతా ముష్టికే నైవ చాణూరేణ తథా సఖి ।
క్రియతే బలభద్రస్య సామ్య మీష ద్విలోక్యతామ్ ॥ 46 ॥

చెలీ! కారుకూతలు కూస్తున్న ముష్టికుడితోనూ, చాణూరుడితోనూ బలరాముడు సమానంగా పోటీపడడం కొంచెం చూడు.

సఖ్యః పశ్యత చాణూరం నియుద్ధార్థ మయం హరిః ।
సముపైతి న సన్త్యత్ర కిం వృద్ధా యుక్తకారిణః ॥ 47 ॥

చెలికత్తెలారా! మల్లయుద్ధం చేయడానికి బాలకృష్ణుడు చాణూరుడిదగ్గరకు వెళ్తున్నాడు. చూడండి. ఇది అన్యాయమని వారించగలిగిన పెద్దలు ఎవ్వరూ లేరా?

క్వ యౌవనోన్ముఖీభూత స్సుకుమారతను ర్హరిః ।
క్వ వజ్రకఠినాభోగశరీర స్స మహాసురః ॥ 48 ॥

ఇంకా యుక్తవయసు కూడ రాక, మిక్కిలికోమలమైన శరీరం కలిగిన ఈచిన్నికృష్ణు డెక్కడ? వజ్రంలాగా మిక్కిలికరుకుదేరిన పెద్దశరీరం గలిగినరాక్షసుడు ఆచాణూరు డెక్కడ?

ఇమౌ సులలితౌ రఙ్గే వర్తేతే నవయౌవనౌ ।
దైతేయమల్లా శ్చాణూరప్రముఖా స్త్వతిదారుణాః ॥ 49 ॥

ఈకృష్ణబలరాములిద్దరూ మిక్కిలి సుకుమారులు. ఇపుడిప్పుడే యౌవనంలో అడుగుపెడుతున్నారు. ఆచాణూరుడు మొదలైనవారు అందరూ రాక్షసులు, మల్లయుద్ధంలో నిపుణులు. మిక్కిలిభయంకరులు.

నియుద్ధప్రాశ్నికానాం తు మహా నేష వ్యతిక్రమః ।
యద్బాలబలినో ర్యుద్ధం మధ్యస్థై స్సముపేక్ష్యతే ॥ 50 ॥

బాలకులకు, మిక్కిలిబలవంతులకూ నడుమ యుద్ధం జరగడాన్ని మధ్యవర్తులు పట్టించుకోవడం లేదు. ఈమల్లయుద్ధానికి తీర్పరులు కూడ పోటీదారులమధ్య ఉన్నభేదాన్ని ఉపేక్షించడం అన్యాయంగా ఉంది.

వ్యాస ఉవాచ :- మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్థం పురస్త్రీలోకస్య వదత శ్చాలయన్ భువమ్ ।
అతిప్రహర్షోత్కర్షం చ జనయన్ భగవాన్ హరిః ॥ 51 ॥

పౌరకాంతలు ఈవిధంగా మాట్లాడుకుంటుండగా, కృష్ణుడు భూమి కంపిచేటట్లుగానూ, చూపరులకు ఆనందం అతిశయించేవిధంగానూ యుద్ధానికి సిద్ధ మయినాడు.

బలభద్రోఽపి చాస్ఫోట్య వవల్గ లలితం యదా ।
పదే పదే తదా భూమి ర్న శీర్ణా య త్త దద్భుతమ్ ॥ 52 ॥

బలరాముడు కూడ, పెద్దగా జబ్బలుచరిచి, మెల్లగా ఎగిరి, గిరగిరా తిరిగాడు. బలరాముడిదూకుడులో ఒక్కొక్క అడుగుకూ పొడి అయిపోవలసిననేల, అలా కాకపోవటం విచిత్రం.

చాణూరేణ తతః కృష్ణో యుయుధేఽమితవిక్రమః ।
నియుద్ధకుశలో దైత్యో బలదేవేన ముష్టికః ॥ 53 ॥

మిక్కిలిపరాక్రమవంతుడైన కృష్ణుడు చాణూరుడితో యుద్ధం చేశాడు. మల్లయుద్ధవిశారదుడైన బలరాముడు ముష్టికుడితో తలపడ్డాడు.

సన్నిపాతావధూతైశ్చ చాణూరేణ సమం హరిః ।
క్షేపణై ర్ముష్టిభిశ్చైవ కీలావజ్రనిపాతనైః ॥
పాదోద్ధూతైః ప్రమృష్టాభి స్తయో ర్యుద్ధమభూన్మహత్ ॥ 54 ॥

కిందికిపడదోయడంలోనూ, దూరంగా విసిరివేయడంలోనూ, తోసివేయడంలోనూ, పిడిగుద్దులు ప్రయోగించడంలోనూ, మోచేతులతో, మోకాళ్లతో వజ్రంలాగా కఠినమైన దెబ్బలతోనూ, కాళ్లతో గట్టిగా తన్నడంలోనూ, కృష్ణుడు చాణూరుడితో సమానంగా ప్రవర్తించగా కృష్ణచాణూరులనడుమ గొప్పయుద్ధం జరిగింది.

అశస్త్రమతిఘోరం తత్తయోర్యుద్ధం సుదారుణమ్ ।
స్వబలప్రాణనిష్పాద్యం సమాజోత్సవసన్నిధౌ ॥ 55 ॥

ధనుర్యాగమహోత్సవంలో సమస్తమైన ప్రజలసమక్షంలో తమశక్తినీ, ప్రాణాలనూ పణంగా పెట్టి, వారు మల్లయుద్ధం చేశారు. అది ఆయుధాలు లేనియుద్ధం. మిక్కిలిభయంకరమైనది. చాల తీవ్ర మయినది.

యావద్యావచ్చ చాణూరో యుయుధే హరిణా సహ ।
ప్రాణహాని మవా పాగ్ర్యాం తావత్తావన్నబాన్ధవమ్ ॥ 56 ॥

చాణూరుడు కృష్ణుడితో ఎంతెంత తీవ్రంగా యుద్ధం చేశాడో, అంతంత వేగంగా ప్రాణాలు పోయేదెబ్బలు తిన్నాడు. ఆయుద్ధం సమయంలో వారు బంధుత్వాన్ని గురించి ఆలోచించలేదు.

కృష్ణోఽ పి యుయుధే తేన లీల యైవ జగన్మయః ।
ఖేదా చ్చాలయతా కోపా న్నిజశేషకరే కరమ్ ॥ 57 ॥

బాధతో చేతులు కదిలిస్తున్నచాణూరుడితో, కోపంతో తనచేయి కలుపుతూ, జగత్స్వరూపుడయిన కృష్ణుడు కూడ చాణూరుడితో ఆడుకుంటున్నట్లుగా అలవోకగా యుద్ధం చేశాడు.

బలక్షయం వివృద్ధిం చ దృష్ట్వా చాణూరకృష్ణయోః ।
వారయామాస తూర్యాణి కంసః కోపపరాయణః ॥ 58 ॥

చాణూరుడిశక్తి క్షీణించిపోవడమూ, కృష్ణుడిబలం అంతకంతకూ వృద్ధిపొందడమూ చూసి, కంసుడు కోపంతో భేరులను మోగించడం ఆపించాడు.

మృదఙ్గాదిషు వాద్యేషు ప్రతిషిద్ధేషు తత్క్షణాత్ ।
ఖసఙ్గతా న్యవాద్యన్త దేవతూర్యా ణ్యనేకశః ॥ 59 ॥

కంసుడిఆజ్ఞతో మృదంగాలు మొదలైన వాయిద్యాలు మోగడం ఆగినక్షణంలోనే ఆకాశంలో దేవతలు అనేకవిధమైన దుందుభులను పెద్దగా మోగించారు.

జయ గోవిన్ద చాణూరం జహి కేశవ దానవమ్ ।
ఇత్యన్తర్ధిగతా దేవాస్తుష్టువుస్తే ప్రహర్షితాః ॥ 60 ॥

గోవిందా! నీకు జయం. కేశవా! ఆరాక్షసుడిని సంహరించు' అంటూ ఆకాశంలో దేవతలు అదృశ్యంగా ఉండి ఆనందంతో అరుస్తూ కృష్ణస్వామిని స్తుతించారు.

చాణూరేణ చిరం కాలం క్రీడిత్వా మధుసూదనః ।
ఉత్పాట్య భ్రామయామాస తద్వధాయ కృతోద్యమః ॥ 61 ॥

కృష్ణుడు చాణూరుడితో మల్లయుద్ధం పేరుతో చాలసేపు ఆడుకున్నాడు. తరువాత అతడిని చంపడానికి నిశ్చయించుకుని, అతడిని పైకి లేపి గిరగిరా తిప్పాడు.

భ్రామయిత్వా శతగుణం దైత్యమల్ల మమిత్రజిత్ ।
భూమా వాస్ఫోటయామాస గగనే గతజీవితమ్ ॥ 62 ॥

ఈవిధంగా వందరెట్లు వేగంతో మల్లయుద్ధంలో నిపుణుడైన చాణూరుడిని గింగిరాలు తిప్పి, గట్టిగా నేలకేసి బాదాడు. ఆరాక్షసుడిప్రాణాలు ఆకాశంలోనే పోయాయి.

భూమా వాస్ఫోటిత స్తేన చాణూర శ్శతధాఽ భవత్ ।
రక్తస్రావమహాపఙ్కాం చకార స తదా భువమ్ ॥ 63 ॥

నేలమీద పడగానే చాణూరుడిశరీరం ముక్కలు ముక్కలైంది. వాడినెత్తురుతో తడిసి అక్కడినేలంతా బురద బురద అయింది.

బలదేవస్తు తత్కాలం ముష్టికేన మహాబలః ।
యుయుధే దైత్యమల్లేన చాణూరేణ యథా హరిః ॥ 64 ॥

గొప్పబలవంతుడైన బలరాముడు కూడా అదే సమయంలో రాక్షసుడైన ముష్టికుడు అనేమల్లుడితో కృష్ణుడు చాణూరుడితో చేసినట్లుగా మల్లయుద్ధం చేశాడు.

సోఽ ఽ ప్యేనం ముష్టినా మూర్ధ్ని వక్షస్యాహత్య జానునా ।
పాతయిత్వా ధరాపృష్ఠే నిష్పిపేష గతాయుషమ్ ॥ 65 ॥

బలరాముడు కూడ అదే విధంగా పిడికిటితో ముష్టికుడినెత్తిమీదా, మోకాలితో వక్షఃస్థలంమీదా పొడిచాడు. అతడిని నేలమీద పడేసి పిండి పిండిగా తొక్కేశాడు. ఆదెబ్బలకు ముష్టికుడికి ప్రాణం పోయింది.

కృష్ణ స్తోశలకం భూయో మల్లరాజం మహాబలమ్ ।
వామముష్టిప్రహారేణ పాతయామాస భూతలే ॥ 66 ॥

మల్లులలో శ్రేష్ఠుడైన తోశలకుడు అనేమహాబలవంతుడిని కృష్ణుడు ఎడమచేతిపిడికిలిగుద్దుతో నేలగూల్చాడు.

చాణూరే నిహతే మల్లే ముష్టికే చ నిపాతితే ।
నీతే క్షయం తోశలకే సర్వే మల్లాః ప్రదుద్రువుః ॥ 67 ॥

ఈవిధంగా చాణూరుడు, ముష్టికుడు, తోశలకుడు అనేమల్లయుద్ధవీరులు ముగ్గురూ మరణించడంతో మిగిలినమల్లులు అందరూ ప్రాణభయంతో పరుగులుతీశారు.

వవల్గతు స్తదా రఙ్గే కృష్ణసఙ్కర్షణా వుభౌ ।
సమానవయసో గోపాన్ బలాదాకృష్య హర్షితౌ ॥ 68 ॥

రాక్షసులను సంహరించినఆనందంతో, కృష్ణబలరాములు ఇద్దరూ తమతో సమాన మయినవయస్సు గలిగినగొల్లపిల్లలను తీసుకుని వచ్చి వారితో కలిసి, యుద్ధవేదికపైన ఎగిరిగంతులు వేశారు.

కంసోఽ పి కోపరక్తాక్షః ప్రాహోచ్చై ర్వ్యాయతా న్నరాన్ ।
గోపా వేతౌ సమాజౌఘా న్నిష్క్రామ్యేతాం బలాదితః ॥ 69 ॥

అప్పుడు భయంతో దూరంగా అక్కడక్కడ ఉన్న తనమనుషులను పిలిచి, కంసుడు కోపంతో ఎఱ్ఱబడ్డకళ్లతో గట్టిగా ఇలా అరిచాడు. 'ఈగొల్లపిల్లలమందలను ఇక్కడినుండి బలవంతంగా బయటకు తోసివేయండి.

నన్దోఽ పి గృహ్యతాం పాపో నిగడై రాశు బధ్యతామ్ ।
అవృద్ధార్హేణ దణ్డేన వసుదేవోఽ పి వధ్యతామ్ ॥ 70 ॥

నందుణ్ని కూడా పట్టుకోండి. ఈదుర్మార్గుడిని వెంటనే సంకెళ్లతో బంధించండి. వసుదేవుడు వృద్ధుడు. వృద్ధులకు మరణశిక్ష ఇవ్వడం తగదు. అయినా సరే, వసుదేవుడిని చంపండి.

వల్గన్తి గోపాః కృష్ణేన యే చేమే సహితాః పునః ।
గావో హ్రియన్తా మేషాం చ య చ్చాస్తి వసు కించన ॥ 71 ॥

కృష్ణుణ్ని చూసుకుని, ఈ గొల్లవాళ్లందరూ మిడిసిపడుతున్నారు. ఈ గొల్లలఆవులను కూడ హరించండి. వీళ్లసంపదలు ఇంకా ఏమున్నాయో అవి మొత్తం లాగేసుకోండి'.

ఏవ మాజ్ఞాపయన్తం తం ప్రహస్య మధుసూదనః ।
ఉత్ప త్యారుహ్య తన్మఞ్చం కంసం జగ్రాహ వేగితః ॥ 72 ॥

తనమనుషులకు ఈవిధంగా ఆజ్ఞలు ఇస్తున్నకంసుడిని చూసి, కృష్ణుడు చిన్ననవ్వు నవ్వాడు. కంసుడు కూర్చున్న సింహాసనం మీదికి ఎగిరి దూకి, వెంటనే కంసుడిని పట్టుకున్నాడు.

కేశేష్వాకృష్య విగలత్కిరీట మవనీతలే ।
స కంసం పాతయామాస తస్యోపరి పపాత చ ॥ 73 ॥

కంసుడికిరీటం జారి కింద పడిపోయింది. కృష్ణుడు కంసుడిజుట్టు పట్టుకుని, లాగి నేలమీద పడవేశాడు. తాను కంసుడిమీద పడ్డాడు.

నిశ్శేషజగదాధారగురుణా పతతోపరి ।
కృష్ణేన త్యాజితః ప్రాణా న్నుగ్రసేనాత్మజో నృపః ॥ 74 ॥

సమస్తమైన జగత్తులకు ఆధారమైన కృష్ణపరమాత్మ ఎగిరి మీదికి దూకడంతో ఉగ్రసేనుడికుమారుడైన కంసమహారాజు ప్రాణాలు పోయాయి.

మృతస్య కేశేషు తదా గృహీత్వా మధుసూదనః ।
చకర్ష దేహం కంసస్య రఙ్గమధ్యే మహాబలః ॥ 75 ॥

అప్పుడు మహాబలుడైన కృష్ణస్వామి మరణించినకంసుడిజుట్టు పట్టుకుని, అతడిశరీరాన్ని యుద్ధరంగం మధ్యలోకి లాక్కొనివచ్చి పడేశాడు.

గౌరవేణాతిమహతా పరిపాతేన కృష్యతా ।
కృతా కంసస్య దేహేన వేగితేన మహాత్మనా ॥ 76 ॥

కంసుడుశరీరం బాగా పెద్దది, చాల బరువైనది. దానిపై మహిమ కలిగినకృష్ణుడిశరీరం వేగంగా వచ్చిపడ్డది. ఆతరువాత మహాత్ముడైన కృష్ణుడు ఆశరీరాన్ని వేగంగా ఈడ్చుకుని తీసుకువచ్చాడు. దానివల్ల కంసుడిశరీరం నుజ్జు నుజ్జు అయింది.

కంసే గృహీతే కృష్ణేన తద్భ్రాతాఽ భ్యాగతో రుషా ।
సునామా బలభద్రేణ లీలయైవ నిపాతితః ॥ 77 ॥

ఈవిధంగా కృష్ణుడు కంసుడిని సంహరించడంతో కంసుడిసోదరుడైన సునాముడు కోపంతో కృష్ణుడి మీదికి వచ్చాడు. వాడిని బలరాముడు అనాయాసంగా సంహరించాడు.

తతో హాహాకృతం సర్వ మాసీ త్తద్రఙ్గమణ్డలమ్ ।
అవజ్ఞయా హతం దృష్ట్వా కృష్ణేన మథురేశ్వరమ్ ॥ 78 ॥

కృష్ణుడు కంసుడిని అవమానకరంగా చంపడం చూసి, ఆరంగస్థలం అంతా కంసుడిపరివారం చేసిన హాహాకారాలతో నిండిపోయింది.

కృష్ణోఽ పి వసుదేవస్య పాదౌ జగ్రాహ సత్వరమ్ ।
దేవక్యాశ్చ మహాబాహు ర్బలదేవసహాయవాన్ ॥ 79 ॥

మిక్కిలిదృఢమైన భుజాలు కలిగినకృష్ణుడు బలరాముడితో కలిసి, వెంటనే దేవకీవసుదేవులపాదాలను తాకి నమస్కరించాడు.

ఉత్థాయ వసుదేవస్తు దేవకీచ జనార్దనమ్ ।
స్మృతజన్మోక్తవచనౌ తావేవ ప్రణతౌ స్థితౌ ॥ 80 ॥

దేవకీవసుదేవులు ఇద్దరూ కృష్ణుడినీ బలరాముడినీ పైకి లేపారు. వారు పుట్టినవేళ కృష్ణుడు తమకు చెప్పినమాటలను గుర్తు చేసుకుని, వారే కృష్ణుడికి వినయంగా నమస్కారం చేశారు.

వసుదేవ ఉవాచ:-వసుదేవుడు కృష్ణుడిని ఈవిధంగా స్తుతిస్తున్నాడు.

ప్రసీద దేవదేవేశ దేవానాం ప్రవర ప్రభో ।
తథావయోః ప్రసాదేన కృతాభ్యుద్ధార కేశవ ॥ 81 ॥

దేవతలకే దేవుడవయిన స్వామీ! అనుగ్రహించు. దేవతలలో శ్రేష్ఠుడా! కేశవా! మమ్మల్ని అనుగ్రహించడానికే నీవు ఈవిధంగా అవతరించావు కదా!

ఆరాధితో యద్భగవా నవతీర్ణో గృహే మమ ।
దుర్వృత్తనిధనార్థాయ తేన నః పావితం కులమ్ ॥ 82 ॥

మేము నిన్ను పూజించాం. మాపై అనుగ్రహంతో నీవు దుష్టులను సంహరించడంకోసం మాయింట జన్మించావు. నీవు పుట్టడంవల్ల మావంశం పవిత్రమైంది.

త్వమన్తస్సర్వభూతానాం సర్వభూతేష్వవస్థితః ।
వర్తసే చ సమస్తాత్మం స్త్వత్తో భూతభవిష్యతీ ॥ 83 ॥

సమస్తమైన సృష్టిలోనూ నీవు అంతర్యామివై ఉన్నావు. సమస్తమైన జగత్తులోనూ ఉన్నావు. సమస్తమైన సృష్టి కూడ నీవే అయిఉన్నావు. ఇంతకు పూర్వం ఉన్నదీ, ఇంక ముందు కలగబోయేదీ కూడ నీవలననే ఏర్పడుతున్నది.

యజ్ఞే త్వ మిజ్యసేఽఽ చిన్త్య సర్వదేవమయాచ్యుత ।
త్వమేవ యజ్ఞో యజ్వా చ యజ్ఞానాం పరమేశ్వర ॥ 84 ॥

ఊహకు అందనివాడా! సమస్తమైన దేవతలలోనూ నిండిఉన్నవాడా! ఎటువంటిమార్పులు లేనివాడా! పరమాత్మా! యజ్ఞంలో నిన్నే అర్చిస్తారు. యజ్ఞం నీవే. సమస్తమైన యజ్ఞాలు చేసేవాడివీ నీవే.

సాపహ్నవం మమ మనో యదేత త్త్వయి జాయతే ।
దేవక్యాశ్చాత్మజప్రీత్యా తదత్యన్తవిడమ్బనా ॥ 85 ॥

నాకూ, దేవకికీ మనస్సులో నీవు మాపుత్రుడివి అనేభావనతో నీమీద ఉన్నపుత్రప్రేమ కేవలం అజ్ఞానం మూలంగా ఏర్పడినదే.

త్వం కర్తా సర్వభూతానా మనాదినిధనో భవాన్ ।
క్వ చ మే మానుష స్యైషా జిహ్వా పుత్రేతి వక్ష్యతి ॥ 86 ॥

చరాచరమైన సమస్తపదార్థాలను సృష్టించేవాడివి నీవే. నీకు పుట్టడం, మరణించడం అనేవి లేవు. మానవులమైన మానాలుక నిన్ను గురించి అజ్ఞానంతో నీవు మాపుత్రుడివి అని పేర్కొంటుంది.

జగ దేత జ్జగన్నాథ సమ్భూత మఖిలం యతః ।
కయా యుక్త్యా వినా మాయాం సోఽ స్మత్త స్సమ్భవిష్యతి ॥ 87 ॥

లోకేశ్వరా! సమస్తమైన ఈజగత్తు నీమాయవలననే ఏర్పడింది. అది తప్ప జగత్తు ఉనికికి వేరే కారణం ఏదీ లేదు. జగత్తులను సృష్టించే నీవు మాకు కొడుకుగా పుట్టడం కూడ నీమాయే తప్ప మరేమీ కాదు.

యస్మిన్ ప్రతిష్ఠితం సర్వం జగత్ స్థావరజఙ్గమమ్ ।
స కోష్ఠోత్సఙ్గశయనో మానుష్యా ధార్యతే కథమ్ ॥ 88 ॥

చరమూ, అచరమూ అయినఈజగత్తు సమస్తమూ నీలోనే స్థిరంగా ఉన్నాయి. అటువంటినిన్ను ఒకానొక మానవస్త్రీ తనగర్భంలో ఎలా ధరించగలదు? ఆమె ఒడిలో నీవు ఉండటం ఎలా సాధ్యం అవుతుంది?

స త్వం ప్రసీద పరమేశ్వర పాహి విశ్వ
మంశావతారకరణై ర్న మమాసి పుత్రః ।
ఆబ్రహ్మపాదపమయం జగదీశ సర్వం
చిత్తే విమోహయసి కిం పరమేశ్వరాత్మన్ ॥ 89 ॥

పరమాత్మా! సమస్తసృష్టికీ కర్తవైనటువంటి నీవు మమ్మల్ని అనుగ్రహించు. ఈలోకాన్ని రక్షించు. శ్రీమహావిష్ణువు అంశతో పుట్టినవాడివి. నీవు నాకు కుమారుడివి కాదు. చెట్టు మొదలుకొని బ్రహ్మవరకూ సమస్తమైన జగత్తూ నీవే. పరమేశ్వరా! ఆత్మవంతుడివైన నీవు మామనస్సును అజ్ఞానంలో ముంచుతా వెందుకు?

మాయావిమోహితదృశా తనయో మమేతి
కంసాద్ భయం కృతవతా తు మయాతితీవ్రమ్ ।
నీతోఽసి గోకుల మరాతిభయాకులస్య
బుద్ధిం గతోఽసి మమ చైవ గవామధీశ ॥ 90 ॥

నీమాయతో అజ్ఞానంలో మునిగినదృష్టితో నీవు మాకుమారుడివనీ, కంసుడు నిన్ను చంపుతాడేమోననీ అనుకున్నాను. ఆఅజ్ఞానం మూలంగానే కంసుడిభయంతో, ఆనాడు కష్టపడి నిన్ను గోకులానికి తీసుకునివెళ్లాను. గోపతీ! నాబుద్ధిలో నిలిచిఉన్నావు.

కర్మాణి రుద్రమరుదశ్విశతక్రతూనాం
సాధ్యాని యాని న భవన్తి నిరీక్షితాని ।
త్వం విష్ణు రీశ జగతా ముపకారహేతోః
ప్రాప్తోఽసి నః పరిగతః పరమో విమోహః ॥ 91 ॥

పరమేశ్వరా! రుద్రుడు, మరుత్తులు, అశ్వినులు, ఇంద్రుడు మొదలైనవారికి కూడ సాధ్యం కానివీ, వారు ఎప్పుడూ ఊహించలేనివీ అయిన రాక్షససంహారాదికార్యాలను నీవు చేశావు. లోకాలకు ఉపకారం చేయడంకోసం నీవు ఇలా మాకు అవతరించిన శ్రీమహావిష్ణువువి. నీకారణంగా మాఅజ్ఞానం తొలగిపోయింది.

ఇతి శ్రీబ్రహ్మపురాణే బాలచరితే కంసవధకథనం నామ పఞ్చాశీతితమోఽధ్యాయః ॥ 85 ॥

శ్రీబ్రహ్మపురాణంలో బాలచరితలో కంసవధకథనం అనే ఎనబైఐదవ అధ్యాయం సంపూర్ణం.

షడశీతితమోఽధ్యాయః - ఎనబైఆరవ అధ్యాయం
సాందీపనిపుత్రానయనమ్ - సాందీపనిపుత్రానయనం

వ్యాస ఉవాచ:-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

తౌ సముత్పన్నవిజ్ఞానౌ సర్వకర్మప్రదర్శనాత్ ।
దేవకీవసుదేవౌ తు దృష్ట్వా మాయాం పునర్హరిః ॥
మోహాయ యదుచక్రస్య వితతాన స వైష్ణవీమ్ ॥ 1 ॥

కృష్ణస్వామి తనలీలలను చూపినందువలన దేవకీవసుదేవులకు మోహం నశించింది. యథార్థజ్ఞానం పొందిన వారిని చూచి, శ్రీకృష్ణుడు తిరిగి యాదవులందరికీ అజ్ఞానం కలిగించడానికి విష్ణుసంబంధమైన మాయను ఇంకా అధికంగా ప్రయోగించాడు.

ఉవాచ చామ్బ భో స్తాత చిరా దుత్కణ్ఠితేన తు ।
భవన్తౌ కంసభీతేన దృష్టౌ సఙ్కర్షణేన చ ॥ 2 ॥

దేవకీవసుదేవులతో! ఓ తల్లీ! తండ్రీ! మిమ్మల్ని చూడాలని ఎప్పటినుండో చాల కుతూహలంగా ఉన్నది. కంసుడు మిమ్మల్ని ఏం చేస్తాడోనని భయపడుతున్నబలరాముడు కూడ నాతోపాటు మిమ్మల్ని ఇప్పటికి చూడగలిగాడు.

కుర్వతాం యాతి యః కాలో మాతాపిత్రోరపూజనమ్ ।
తత్ఖణ్డమాయుషో వ్యర్థం సాధూనాముపజాయతే ॥ 3 ॥

తల్లిదండ్రులను సేవింపకుండా గడిచిపోయినకాలం, సాధుజనులకు ఆయుర్దాయంలో పనికిరాకుండా పోయినభాగం అవుతుంది.

గురుదేవద్విజాతీనాం మాతాపిత్రోశ్చ పూజనమ్ ।
కుర్వతస్సఫలం జన్మ దేహినస్తాత జాయతే ॥ 4 ॥

తండ్రీ, గురువులనూ, దేవతలనూ, బ్రాహ్మణులనూ, తల్లిదండ్రులనూ సమర్చించినవాడికి జన్మ చరితార్థ మవుతుంది.

తత్ క్షన్తవ్య మిదం సర్వ మతిక్రమకృతం పితః ।
కంసవీర్యప్రతాపాభ్యా మావయోః పరవశ్యయోః ॥ 5 ॥

తండ్రీ! కంసుడిబలపరాక్రమాలకు భయపడి, స్వాధీనంలో లేని మేము ఇప్పటివరకు ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించాం. ఈఅపరాధాన్ని క్షమించు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

ఇత్యుక్త్వాఽథ ప్రణమ్యోభౌ యదువృద్ధా ననుక్రమాత్ ।
యథావదభిపూజ్యాథ చక్రతుః పూర్ణమానసాన్ ॥ 6 ॥

వసుదేవుడితో ఇలా పలికినతరువాత కృష్ణబలరాములిద్దరూ యాదవవంశంలోని పెద్దలందరికీ వరుసగా, ప్రణామాలు చేశారు. వారిపెద్దతికానికి తగినవిధంగా గౌరవించారు. వారు మనసు నిండా ఆనందించారు.

కంసపత్న్య స్తతః కంసం పరివార్య హతం భువి ।
విలేపు ర్మాతరశ్చాస్య శోకదుఃఖపరిప్లుతాః ॥ 7 ॥

కంసుడిభార్యలు, తల్లులు నేలగూలినకంసుడిశరీరం చుట్టూ చేరి, బాధలలో మునిగి విలపించారు.

బహుప్రకారమస్వస్థాః పశ్చాత్తాపాతురా హరిః ।
తా స్సమాశ్వాసయామాస స్వయమస్రావిలేక్షణః ॥ 8 ॥

కంసుడిమరణంవల్ల కంసుడిబంధువులందరూ అనేకవిధాలుగా కలతచెందారు. పశ్చాత్తాపంతో బాధపడు తున్నారు. కృష్ణుడికి కూడ కళ్ళలో నీళ్లు తిరిగాయి. అయినా, కృష్ణస్వామి ఏడుస్తున్నబంధువులనందరినీ సముదాయించాడు.

ఉగ్రసేనం తతో బన్ధా న్ముమోచ మధుసూదనః ।
అభ్యషిఞ్చ త్తథైవైనం నిజరాజ్యే హతాత్మజమ్ ॥ 9 ॥

కృష్ణుడు ఆతరువాత ఉగ్రసేనుడిని బంధాలనుండి విడిపించాడు. కుమారుడైన కంసుడు మరణించడంచేత, ఉగ్రసేనుడిని అతడిరాజ్యానికి రాజుగా పట్టాభిషేకం చేశాడు.

రాజ్యేఽభిషిక్తః కృష్ణేన యదుసింహ స్సుతస్య సః ।
చకార ప్రేతకార్యాణి యే చాన్యే తత్ర ఘాతితాః ॥ 10 ॥

కృష్ణుడు తనను రాజ్యానికి అభిషేకం చేయగా, ఉగ్రసేనుడు కంసుడికి, ఇక్కడ అక్కడ మరణించినఇతరులకూ ఉత్తరక్రియలు పూర్తి చేశాడు.

కృతోర్ధ్వదైహికం చైనం సింహాసనగతం హరిః ।
ఉవాచాజ్ఞాపయ విభో యత్కార్యమవిశఙ్కయా ॥ 11 ॥

అందరికీ పరలోకక్రియలు ఆచరించినపిమ్మట సింహాసనం మీద కూర్చున్నఉగ్రసేనుడితో కృష్ణుడు ఇలా అన్నాడు. 'మహారాజా! ఇప్పుడు నేను ఏమి చేయాలో ఆజ్ఞాపించండి. సందేహించవద్దు.

యయాతిశాపాద్ వంశోఽయ మరాజ్యార్హోఽపి సామ్ప్రతమ్ ।
మయి భృత్యే స్థితే దేవానాజ్ఞాపయతు కిం నృపైః ॥ 12 ॥

యయాతిమహారాజు ఇచ్చినశాపంవల్ల యదువువంశంలోవారికి రాజ్యాన్ని పరిపాలించే అర్హత లేదు. అయినా, నేను మీకు సేవకుడుగా ఉన్నాను. కాబట్టి మీరు దేవతలనైనా ఆజ్ఞాపించవచ్చును. ఇంక సాధారణమైన భూలోకంలోని రాజులవిషయం ప్రత్యేకంగా చెప్పేది ఏముంది?

ఇత్యుక్త్వా చోగ్రసేనం తు వాయుం ప్రతి జగాద హ ।
నృవాచా చైవ భగవాన్ కేశవః కార్యమానుషః ॥ 13 ॥

మానవులకార్యం నెరవేర్చడానికి మానవుడుగా అవతరించిన కృష్ణపరమాత్మ మానవుడిలాగానే ఈవిధంగా వసుదేవుడితో మాట్లాడాడు. ఆతరువాత వాయుదేవుడితో ఇలా అంటున్నాడు.

శ్రీకృష్ణ ఉవాచ :-కృష్ణుడు వాయుదేవుడితో ఈవిధంగా చెప్తున్నాడు.

గచ్ఛేన్ద్రం బ్రూహి వాయో త్వమలం గర్వేణ వాసవ ।
దీయతా ముగ్రసేనాయ సుధర్మా భవతా సభా ॥ 14 ॥

ఓ వాయుదేవా! నీవు వెళ్లి ఇంద్రుడితో ఈవిధంగా చెప్పు. 'దేవేంద్రా! అహంకారాన్ని విడిచిపెట్టు. సుధర్మ అనేపేరు గలిగిననీసభను ఉగ్రసేనమహారాజుకు ఇవ్వు.

కృష్ణో బ్రవీతి రాజార్హ మేత ద్రత్నమనుత్తమమ్ ।
సుధర్మాఖ్యా సభా యుక్త మస్యాం యదుభి రాసితుమ్ ॥ 15 ॥

ఇదిగో, కృష్ణుడు చెబుతున్నాడు. సుధర్మ అనేపేరు గలిగినఈసభ సభలన్నింటిలోనూ చాలా ఉత్తమ మయినది. ఈసభను యదువంశీయులు అధిష్ఠించడమే ఉచితం.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా అంటున్నాడు.

ఇత్యుక్తః పవనో గత్వా సర్వమాహ శచీపతిమ్ ।
దదౌ సోఽపి సుధర్మాఖ్యాం సభాం వాయోః పురన్దరః ॥ 16 ॥

కృష్ణుడు చెప్పినది విని, వాయువు దేవేంద్రుడివద్దకు వెళ్లాడు. కృష్ణుడు చెప్పిన దంతా విన్నవించాడు. ఇంద్రుడు కూడ ఆప్రకారమే సుధర్మ అనేతనసభను వాయువుకు ఇచ్చి పంపాడు.

వాయునా చాహృతాం దివ్యాం తే సభాం యదుపుఙ్గవాః ।
బుభుజు స్సర్వరత్నాఢ్యాం గోవిన్దభుజసంశ్రయాః ॥ 17 ॥

దేవతలకు సంబంధించిన ఆసుధర్మసభను వాయువు తీసుకునివచ్చి, యాదవనాయకులకు ఇచ్చాడు. కృష్ణస్వామి భుజబలాన్ని ఆశ్రయించుకునిఉన్నయాదవులు సమస్త మయినరత్నాలతో నిండిఉన్న ఆసభలో సమస్తమైన భోగాలూ అనుభవించారు.

విదితాఖిలవిజ్ఞానౌ సర్వజ్ఞానమయా వపి ।
శిష్యాచార్యక్రమం వీరౌ ఖ్యాపయన్తౌ యదూత్తమౌ ॥ 18 ॥

యాదవులలో వీరులైన బలరామకృష్ణులు సమస్తమైన విద్యలు చక్కగా తెలిసినవారు. పూర్తిగా జ్ఞానంతో నిండినవారు. అయినా, లోకంలో శిష్యులు, ఆచార్యుడు అనేపరంపరతో విద్యాభ్యాసం చేయడం అనే సంప్రదాయాన్ని నిలబెట్టదలచారు.

తతస్సాన్దీపనిం కాశ్యమవన్తిపురవాసినమ్ ।
అస్త్రార్థం జగ్మతుర్వీరౌ బలదేవజనార్దనౌ ॥ 19 ॥

అందుకోసం వీరులైన బలరామకృష్ణులు అస్త్రవిద్య నేర్చుకోవడానికి కాశీపురంలో జన్మించి (కాశీపండితుడై), ఉజ్జయినిలో నివసిస్తున్న సాందీపని అనేగురువుగారివద్దకు వెళ్లారు.

తస్య శిష్యత్వ మభ్యేత్య గురువృత్తిపరౌ హి తౌ ।
దర్శయాఞ్చక్రతు ర్వీరా వాచార మఖిలే జనే ॥ 20 ॥

సాందీపనికి శిష్యులై, ఆయనను గురువుగా సేవించారు. ఇలా ఆవీరులు గురువువద్ద శిష్యులు నడుచుకోవలసిన పద్ధతిని లోకానికంతటికీ ప్రత్యక్షంగా చూపించారు.

సరహస్యం ధనుర్వేదం ససఙ్గహ మధీయతామ్ ।
అహోరాత్రై శ్చతుష్షష్ట్యా తదద్భుత మభూ ద్విజాః ॥ 21 ॥

విప్రులారా! ధనుర్వేదం మొత్తం అందులోని రహస్యాలతో సహా, సంగ్రహంగా అరవైనాలుగు రోజులలో నేర్చుకున్నారు. ఇది అందరికీ చాల ఆశ్చర్యం కలిగించింది.

సాన్దీపని రసమ్భావ్యం తయోః కర్మాతిమానుషమ్ ।
విచిన్త్య తౌ తదా మేనే ప్రాప్తౌ చన్ద్రదివాకరౌ ॥ 22 ॥

ఊహించడానికి కూడ వీలు లేనివిధంగా కృష్ణబలరాములు చేసినధనుర్విద్యాభ్యాసం అనేదివ్య మయినపనిని చూసి, వారు సాధారణమానవులు కాదనీ, చంద్రసూర్యులనీ భావించాడు.

అస్త్రగ్రామ మశేషం చ ప్రోక్తమాత్రమవాప్య తౌ ।
ఊచతుర్ వ్రియతాం యా తే దాతవ్యా గురుదక్షిణా ॥ 23 ॥

సాందీపని చెప్పుండగానే ఆయుధవిద్య సమస్తమూ గ్రహించిన రామకృష్ణులు గురువుగారితో గురుదక్షిణ ఏమి ఇమ్మంటారని అడిగారు.

సోఽ ప్యతీన్ద్రియ మాలోక్య తయోః కర్మ మహామతిః ।
అయాచత మృతం పుత్రం ప్రభాసే లవణార్ణవే ॥ 24 ॥

మిక్కిలిబుద్ధిమంతుడైన సాందీపని అసాధారణమైన రామకృష్ణులఅద్భుతప్రతిభను గ్రహించి, లవణ సముద్రంలో ప్రభాసం అనేపుణ్యతీర్థంలో మరణించినతనకుమారుడిని తెచ్చి ఇమ్మని అడిగాడు.

గృహీతాస్త్రౌ తత స్తౌ తు గత్వా తం లవణోదధిమ్ ।
ఊచతుశ్చ గురోః పుత్రో దీయతామితి సాగరమ్ ॥ 25 ॥

రామకృష్ణులు ఆయుధాలను ధరించి, ఉప్పుసముద్రంవద్దకు వెళ్లారు. మాగురువుగారికుమారుడిని తెచ్చి ఇ మ్మని సముద్రుడిని అడిగారు.

కృతాఞ్జలిపుటస్తావత్ సార్ఘ్యపాత్రో మహోదధిః ।
ఉవాచ న మయా పుత్రో హృతస్సాన్దీపనే రితి ॥ 26 ॥

ఆ మహాసముద్రుడు వారిని అర్చించడానికి అర్ఘ్యపాత్రను తీసుకుని ఎదుట నిలిచాడు. చేతులు జోడించి, 'సాందీపనికుమారుడిని నేను అపహరించలేదు' అన్నాడు.

దైత్యః పఞ్చజనో నామ శఙ్ఖరూప స్స బాలకమ్ ।
జగ్రాహ సోఽస్తి సలిలే మమైవాసురసూదన ॥ 27 ॥

రాక్షసులను సంహరించేవాడా! పంచజనుడు అనేరాక్షసుడు శంఖంఆకారంలో ఉండి, సాందీపని పుత్రుడిని తీసుకువెళ్లాడు. ఆరాక్షసుడు ఈసముద్రజలంలోనే ఉన్నాడు.

ఇత్యుక్తోఽన్తర్జలం గత్వా హత్వా పఞ్చజనం తథా ।
కృష్ణో జగ్రాహ తస్యాస్థిప్రభవం శఙ్ఖముత్తమమ్ ॥ 28 ॥

సముద్రుడిమాటలు విని, కృష్ణుడు సముద్రజలంలో ప్రవేశించి, పంచజనుడిని సంహరించాడు. ఆరాక్షసుడి ఎముకలనుండి ఏర్పడిన ఉత్తమమైన శంఖాన్ని స్వీకరించాడు.

యస్య నాదేన దైత్యానాం బలహానిః ప్రజాయతే ।
దేవానాం వర్ధతే తేజో యాత్యధర్మశ్చ సంక్షయమ్ ॥ 29 ॥

ఆశంఖం ధ్వనికి రాక్షసులబలం నశించిపోతుంది. దేవతలకు తేజస్సు వృద్ధి అవుతుంది. అధర్మం నాశనం అవుతుంది.

తం పాఞ్చజన్య మాపూర్య గత్వా యమపురీం హరిః ।
బలదేవశ్చ బలవాఞ్జిత్వా వైవస్వతం యమమ్ ॥ 30 ॥

కృష్ణబలరాములిద్దరూ యముడిరాజధానికి వెళ్లారు. కృష్ణుడు శక్తిమంతమైన పాంచజన్యం అనేశంఖాన్ని ఊదాడు. అక్కడ బలవంతుడైన యముడిని జయించారు.

తం బాలం యాతనాసంస్థం యథాపూర్వశరీరిణమ్ ।
పిత్రే ప్రదత్తవాన్ కృష్ణో బలశ్చ బలినాం వరః ॥ 31 ॥

అక్కడ సాందీపనికుమారుడు యమయాతనలు అనుభవిస్తున్నాడు. బలవంతులలో శ్రేష్ఠుడైన కృష్ణుడు, అలాగే బలరాముడు, ఆబాలకుడిని తిరిగి పూర్వం ఉన్నవిధంగా చెక్కుచెదరనిశరీరంతో తీసుకునివచ్చి, అతడితండ్రి సాందీపనికి అందజేశారు.

మథురాం చ పున ర్యాతా వుగ్రసేనేన పాలితమ్ ।
ప్రహృష్టపురుషస్త్రీకా వుభౌ రామజనార్దనౌ ॥ 32 ॥

గురుదక్షిణ ఇచ్చినతరువాత, బలరామకృష్ణులు ఉగ్రసేనుడు పరిపాలిస్తున్న మధురానగరానికి తిరిగివెళ్లారు. వారిరాకను తెలుసుకుని ఆనగరంలోని మగ, ఆడ జనమంతా ఆనందించారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే బాలచరితే సాన్దీపనేః పుత్రానయనం నామ షడశీతితమోఽధ్యాయః ॥ 86 ॥

శ్రీబ్రహ్మపురాణంలో బాలచరితలో సాందీపనిపుత్రానయనం అనే ఎనభైఆరవ అధ్యాయం సంపూర్ణం.

సప్తాశీతితమోఽధ్యాయః - ఎనభైఏడవ అధ్యాయం

జరాసంధోపరోధమ్ - జరాసంధోపరోధం

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

జరాసన్ధసుతే కంస ఉపయేమే మహాబలః ।
అస్తిః ప్రాప్తిశ్చ భో విప్రా స్తయో ర్భర్తృహణం హరిమ్ ॥ 1 ॥

మహాబలపరీవారో మాగధాధిపతి ర్బలీ ।
హన్తు మభ్యాయయౌ కోపా జ్జరాసన్ధ స్సయాదవమ్ ॥ 2 ॥

అస్తి, ప్రాప్తి అనేవాళ్లు ఇద్దరు జరాసంధుడికుమార్తెలు. వారిని కంసుడు పెండ్లాడాడు. తనఅల్లుడైన కంసుడిని చంపాడని యాదవులందరితో సహా, కృష్ణుడిని చంపడానికి జరాసంధుడు పెద్దసైన్యాన్ని తీసుకుని, దండెత్తివచ్చాడు. జరాసంధుడు మగధదేశానికి రాజు. గొప్పబలవంతుడు.

ఉపేత్య మథురాం సోఽథ రురోధ మగధేశ్వరః ।
అక్షౌహిణీభి స్సైన్యస్య త్రయోవింశతిభి ర్వృతః ॥ 3 ॥

జరాసంధుడు ఇరవైమూడు అక్షౌహిణులసైన్యంతో వచ్చి మధురానగరం సరిహద్దులలో విడిదిచేశాడు.

నిష్క్ర మ్యాల్పపరీవారా వుభౌ రామజనార్దనౌ ।
యుయుధాతే సమం తస్య బలినౌ బలిసైనికైః ॥ 4 ॥

బలవంతులైన బలరామకృష్ణులు మాత్రం కొద్దిగా సైన్యం తీసుకుని, మధురానగరంనుండి వచ్చి, బలవంతులైన జరాసంధుడిసైన్యంతో యుద్ధం చేయసాగారు.

తతో బలశ్చ కృష్ణశ్చ మతిం చక్రే మహాబలః ।
ఆయుధానాం పురాణానా మాదానే మునిసత్తమాః ॥ 5 ॥

మహర్షులారా! బలవంతులైన బలరాముడు, కృష్ణుడు ఇద్దరూ సుప్రసిద్ధమైన తమతమఆయుధాలను పొందాలనుకున్నారు.

అనన్తరం చక్రశార్ఙ్గే తూణౌ చా ప్యక్షయౌ శరైః ।
ఆకాశాదాగతౌ వీరౌ తదా కౌమోదకీ గదా ॥ 6 ॥

ఆసంకల్పంచేత శక్తిమంతమైన సుదర్శనం అనేచక్రాయుధం, శార్ఙ్గం అనేవిల్లు, తరగనిబాణాలతో నిండిన రెండు అమ్ములపొదులు, కౌమోదకి అనేగదాయుధం ఆకాశంనుండి కృష్ణస్వామివద్దకు వచ్చాయి.

హలం చ బలభద్రస్య గగనాదాగమత్కరమ్ ।
సంవర్తాగ్నిసమం విప్రా స్సునన్దం ముశలం తథా ॥ 7 ॥

ద్విజులారా! ఆకాశంనుండి నాగలి ఆయుధం బలరాముడిచేతిలోకి వచ్చింది. ప్రజ్వలిస్తున్నఅగ్నిజ్వాలవంటి సునందం అనేరోకలిఆయుధం కూడ బలరాముడివద్దకు వచ్చింది.

తతో యుద్ధే పరాజిత్య ససైన్యం మగధాధిపమ్ ।
పురీం వివశతుర్వీరావుభౌ రామజనార్దనౌ ॥ 8 ॥

వీరులయిన బలరామకృష్ణులు ఇద్దరూ ఆఆయుధాలతో సమస్తమైన సైన్యంతో సహా జరాసంధుడిని ఓడించి, మధురానగరానికి తిరిగివచ్చారు.

జితే తస్మిన్ సుదుర్వృత్తే జరాసన్ధే ద్విజోత్తమాః ।
జీవమానే గతే తత్ర కృష్ణో మేనే న తం జితమ్ ॥ 9 ॥

విప్రవరులారా! దుర్మార్గుడైన జరాసంధుడు ఓడిపోయినా, బ్రతికిపోవడంతో అతడు ఓడినట్లు కాదనుకున్నాడు కృష్ణుడు.

పునరప్యాజగామాథ జరాసన్ధో బలాన్వితః ।
జితశ్చ రామకృష్ణాభ్యా మపక్రాన్తో ద్విజోత్తమాః ॥ 10 ॥

బ్రాహ్మణవరేణ్యులారా! జరాసంధుడు సైన్యాన్ని తీసుకుని మళ్లీ మధురానగరంమీదికి యుద్ధానికి వచ్చాడు. బలరామకృష్ణులచేతిలో మళ్లీ ఓడిపోయాడు. వెనుదిరిగి, పారిపోయాడు.

దశ చాష్టౌ చ సఙ్గ్రామా నేవ మత్యన్తదుర్మదః ।
యదుభి ర్మాగధో రాజా చక్రే కృష్ణపురోగమైః ॥ 11 ॥

మగధరాజు అయిన జరాసంధుడు దురహంకారంతో ఈవిధంగా పద్దెనిమిది పర్యాయాలు కృష్ణుడు మొదలైన యాదవులతో యుద్ధానికి తలపడ్డాడు.

సర్వేష్వేవ చ యుద్ధేషు యదుభిస్స పరాజితః ।
అపక్రాన్తో జరాసన్ధస్స్వల్పసైన్యైర్బలాధికః ॥ 12 ॥

అన్నిసార్లూ జరాసంధుడు యాదవులచేతిలో ఓడిపోతూనే ఉన్నాడు. పెద్దసైన్యంతో వచ్చి, కొద్దిసైన్యంతో తిరిగి వెనుకకు వెళ్లిపోతున్నాడు.

తద్బలం యాదవానాం వై రక్షితం యదనేకశః ।
తత్తు సన్నిధిమాహాత్మ్యం విష్ణోరంశస్య చక్రిణః ॥ 13 ॥

అన్నియుద్ధాలలోనూ యాదవులసైన్యం చెక్కుచెదరకుండా సురక్షితంగా ఉండడానికి కారణం, శ్రీమహావిష్ణువు అంశతో జన్మించిన కృష్ణస్వామి చక్రాయుధాన్ని ధరించి, వారికి అండగా ఉండడమే.

మనుష్యధర్మశీలస్య లీలా సా జగతః పతేః ।
అస్త్రాణ్యనేకరూపాణి య దరాతిషు ముఞ్చతి ॥ 14 ॥

శత్రువులపై రకరకాలఆయుధాలను ప్రయోగించి, వారిని సంహరించడం అనేది మానవధర్మంతో ఉన్న జగన్నాథుడైన కృష్ణస్వామి చూపిన లీలావిశేషమే.

మనసైవ జగత్సృష్టిసంహారం తు కరోతి యః ।
తస్యారిపక్షక్షపణే క్రియా నుద్యమవిస్తరః ॥ 15 ॥

ఆస్వామి కేవలం మనసులో సంకల్పించినమాత్రంచేతనే జగత్తు మొత్తాన్ని సృష్టించగలడు. సంహరించగలడు. అటువంటివాడికి శత్రువులను నిర్మూలించడంలో ప్రయత్నం చేయడం ఎంతటిది? (ఆఅవసరం లేదు. అయినా ప్రయత్నించడం స్వామిలీల.)

తథాఽపి యే మనుష్యాణాం ధర్మా స్తదనువర్తనమ్ ।
కుర్వన్ బలవతా సన్ధిం హీనై ర్యుద్ధం కరోత్యసౌ ॥ 16 ॥

అయినా, మానవుడుగా అవతరించినపుడు మానవధర్మాన్ని అనుసరించాలి. కాబట్టి కృష్ణస్వామి బలవంతులతో సంధి చేసుకుంటాడు. బలహీనులతో యుద్ధం చేస్తాడు.

సామ చోపప్రదానం చ తథా భేదం చ దర్శయన్ ।
కరోతి దణ్డపాతం చ క్వచిదేవ పలాయనమ్ ॥ 17 ॥

ముందుగా మాటలతో సామ ఉపాయాన్ని ప్రయోగించి, తరువాత దాన ఉపాయాన్ని, ఆతరువాత భేద ఉపాయాన్ని ప్రయోగించిన తరువాత దండోపాయాన్ని చివరికి ప్రయోగిస్తాడు. ఎప్పుడో కదాచిత్తుగా పారిపోవడం కూడ చేస్తాడు.

మనుష్యదేహినాం చేష్టా మిత్యేవ మనుకుర్వతః ।
లీలా జగత్పతే స్తస్య చ్ఛన్దత స్సమ్ప్రవర్తతే ॥ 18 ॥

మానవుడుగా అవతరించినస్వామి మానవులలాగానే నడుచుకుంటాడు. ఇది ఆస్వామి లీలమాత్రమే. సర్వస్వతంత్రుడైన స్వామి తనఇష్టం వచ్చినవిధంగా ప్రవర్తిస్తాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే శ్రీకృష్ణచరితే జరాసన్ధోపరోధో నామ సప్తాశీతితమోఽధ్యాయః ॥ 87 ॥

శ్రీబ్రహ్మపురాణంలో శ్రీకృష్ణచరితలో జరాసంధోపరోధం అనే ఎనభైఏడవ అధ్యాయం సంపూర్ణం.



అష్టాశీతితమోఽధ్యాయః - ఎనభైఎనిమిదవ అధ్యాయం

ముచుకుందస్తుతినిరూపణమ్ - ముచుకుందస్తుతినిరూపణం

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

గార్గ్యం గోష్ఠే ద్విజం శ్యాల షణ్ఢ ఇత్యుక్తవాన్ ద్విజాః ।
యదూనాం సన్నిధౌ సర్వే జహసు ర్యాదవా స్తదా ॥ 1 ॥

ఒకసారి గార్గ్యుడిబావమరిది గొల్లపల్లెలో యాదవు లందరిసమక్షంలో గార్గ్యుడిని నపుంసకుడని నిందించాడు. ఆమాటలకు అక్కడివారు అందరూ నవ్వారు.

తతః కోపసమావిష్టో దక్షిణాపథ మేత్య సః ।
సుత మిచ్ఛం స్తప స్తేపే యదుచక్రభయావహమ్ ॥ 2 ॥

అప్పుడు గార్గ్యుడికి కోపం వచ్చింది. ఆచోటువదిలి, దక్షిణదేశానికి వచ్చాడు. యాదవు లందరూ భయపడే కొడుకు కలగాలని తీవ్రమైన తపస్సు చేశాడు.

ఆరాధయన్ మహాదేవం సోఽయశ్చూర్ణ మభక్షయత్ ।
దదౌ వరం చ తుష్టోఽసౌ వర్షే ద్వాదశకే హరః ॥ 3 ॥

అటువంటిపుత్రుడికోసం పరమేశ్వరుడిని ఆరాధించాడు. ఆసమయంలో ఇనుమును పొడిగా చేసుకుని, దానిని ఆహారంగా తీసుకున్నాడు. అతడితపస్తీవ్రతకు మహాదేవుడు సంతోషించాడు. పన్నెండవసంవత్సరంలో అతడికి ప్రత్యక్ష మయి, అతడు కోరుకున్న పుత్రసంతానాన్ని వరంగా ఇచ్చాడు.

సమ్భావయామాస స తం యవనేశో హ్యనాత్మజః ।
తద్యోషిత్సఙ్గమా చ్చాస్య పుత్రోఽభూ దనలప్రభః ॥ 4 ॥

యవనరాజుకు కూడ పుత్రసంతానం లేదు. అతడు గార్గ్యుడిని గౌరవించాడు. యవనరాజు (మహాదేవుడిని సేవించి, పుత్రసంతానం పొందిన గార్గ్యుడిని శ్రద్ధగా సేవించడంచేత) భార్యతో కలియగా, వారికి అగ్నివంటితేజస్సు కలిగినకొడుకు పుట్టాడు.

తం కాలయవనం నామ రాజ్యే స్వే యవనేశ్వరః ।
అభిషిచ్య వనం యాతో వజ్రాగ్రకఠినోరసమ్ ॥ 5 ॥

అతడికి కాలయవనుడు అని పేరు. అతడివక్షస్స్థలం వజ్రంలాగా మిక్కిలికఠినంగా ఉంటుంది. ఆకాల యవనుడిని రాజుగా అభిషేకించి, యవనరాజు అడవులకు వెళ్లిపోయాడు.

స తు వీర్యమదోన్మత్తః పృథివ్యాం బలినో నృపాన్ ।
పప్రచ్ఛ నారద శ్చాస్మై కథయామాస యాదవాన్ ॥ 6 ॥

ఈభూమండలంలో తానే బలవంతుడినని కాలయవనుడికి గర్వం. ఆదుర్మదంతో కాలయవనుడు భూమిమీద బలవంతులైన రాజులెవరని నారదుడిని అడిగాడు. ఈలోకంలో యాదవులు అందరికంటె గొప్పబలవంతులని చెప్పాడు నారదుడు.

మ్లేచ్ఛకోటిసహస్రాణాం సహస్రై స్సోఽభిసంవృతః ।
గజాశ్వరథసమ్పన్నై శ్చకార పరమోద్యమమ్ ॥ 7 ॥

గజ, అశ్వ, కాల్బలాలతో కూడిన కోటిలక్షలమంది మ్లేచ్ఛులసైన్యం తనను పరివేష్ఠించి రాగా, కాలయవనుడు మధురానగరం మీదికి దండువెళ్లాడు.

ప్రయయౌ చావ్యవచ్ఛిన్నం చిన్తయానో దినే దినే ।
యాదవాన్ ప్రతి సామర్షో మునయో మధురాం పురీమ్ ॥ 8 ॥

మహర్షులారా, కాలయవనుడు యాదవులపైన కోపం పెంచుకున్నాడు. ప్రతిరోజూ యాదవులను ఎలా గెలవాలా అని ఆలోచిస్తున్నాడు. అందువల్ల మధురానగరంమీదికి దండయాత్ర చేశాడు.

కృష్ణోఽపి చిన్తయామాస క్షపితం యాదవం బలమ్ ।
యవనేన సమాలోక్య మాగధః ప్రహరిష్యతి ॥ 9 ॥

కృష్ణస్వామి ఇప్పుడు ఏం చేయాలా అని ఆలోచించాడు. కాలయవనుడిచేతిలో యాదవసైన్యం క్రమంగా నశించిపోతున్నది. ఈఅదను చూసుకుని మగధరాజయిన జరాసంధుడు వచ్చి, యాదవసైన్యాన్ని దెబ్బతీస్తాడు.

మాగధస్య బలం క్షీణం స కాలయవనో బలీ ।
హన్తా తదిదమాయాతం యదూనాం వ్యసనం ద్విధా ॥ 10 ॥

మగధరాజుబలం తగ్గినపుడు కాలయవనుడు బలవంతుడై, దండెత్తివస్తున్నాడు. అయ్యో! ఈవిధంగా యాదవులకు రెండువైపులనుంచి ఆపద వచ్చిపడింది.

తస్మా ద్దుర్గం కరిష్యామి యదూనా మతిదుర్జయమ్ ।
స్త్రియోఽపి యత్ర యుధ్యేయుః కిం పునర్ వృష్ణిపుఙ్గవాః ॥ 11 ॥

అందుచేత యాదవులపై ఇతరు లెవ్వరూ దండెత్తిరాకుండ శత్రుదుర్భేద్యమైన కోటను నిర్మిస్తాను. ఆకోటలో ఉండి, ఆడవాళ్లు గూడ నిర్భయంగా, సులువుగా శత్రువులతో యుద్ధం చేయగలరు. ఇంక వృష్ణివీరులకు అసలు భయమే ఉండదు.

మయి మత్తే ప్రమత్తే వా సుప్తే ప్రవసితేఽపి వా ।
యాదవాభిభవం దుష్టా మా కుర్యు ర్వైరిణోఽధికమ్ ॥ 12 ॥

నేను పరాకుగా ఉన్నా, ఇంకా అసలు పట్టించుకోకపోయినప్పటికీ, నిద్రపోతున్నా, ఈనగరాన్ని విడిచి వెళ్లినప్పటికీ, దుర్మార్గులైన శత్రువులు యాదవులను లోకువచేయగూడదు.

ఇతి సఞ్చిన్త్య గోవిన్దో యోజనాని మహోదధిమ్ ।
యయాచే ద్వాదశ పురీం ద్వారకాం తత్ర నిర్మమే ॥ 13 ॥

అని ఆలోచించి, కృష్ణుడు సముద్రుడిని పన్నెండుయోజనాలమేరప్రదేశాన్ని ఖాళీ చేసి, ఇమ్మని అడిగాడు. సముద్రుడు ఇచ్చినఆప్రదేశంలో ద్వారకానగరాన్ని నిర్మించాడు.

మహోద్యానాం మహావప్రాం తడాగశతశోభితామ్ ।
ప్రాకారశతసమ్బాధా మిన్ద్ర స్యే వామరావతీమ్ ॥ 14 ॥

పెద్దపెద్దఉద్యానాలు, బాగా ఎత్తయిన కోటగోడ, వందలకొద్దీ చెరువులు, వందలకొద్దీ ప్రహరీలతో, ద్వారకా నగరాన్ని దేవేంద్రుడిరాజధాని అయిన అమరావతీనగరంతో సమానంగా నిర్మించాడు.

మథురావాసినం లోకం త త్రానీయ జనార్దనః ।
ఆసన్నే కాలయవనే మథురాం చ స్వయం యయౌ ॥ 15 ॥

మథురలో నివసిస్తున్నప్రజల నందరినీ కృష్ణుడు ద్వారకానగరానికి తీసుకొనివచ్చాడు. కాలయవనుడు మథురను సమీపించే సమయానికి కృష్ణుడు స్వయంగా మథురానగరానికి వెళ్లాడు.

బహి రావాసితే సైన్యే మథురాయాం నిరాయుధః ।
నిర్జగామ స గోవిన్దో దదర్శ యవనశ్చ తమ్ ॥ 16 ॥

సైన్యం అంతా మథురనుండి వెళ్లి ద్వారకలో ఉండిపోయింది. తాను ఒక్కడే ఏవిధమైన ఆయుధమూలేకుండా, కృష్ణుడు ఒంటరిగా మథురకు వెళ్లాడు. కాలయవనుడు ఒంటరిగా నిరాయుధంగా ఉన్న కృష్ణుడిని చూశాడు.

స జ్ఞాత్వా వాసుదేవం తం బాహుప్రహరణో నృపః ।
అనుయాతో మహాయోగిచేతోభిః ప్రాప్యతే న యః ॥ 17 ॥

భుజబలంతో శత్రువులను దెబ్బతీయగలిగినకాలయవనుడు కృష్ణుడిని చూసి, వెంబడించాడు. గొప్ప గొప్పయోగులు కూడ అందుకోలేని కృష్ణస్వామిని కాలయవనుడు వెంటబడి తరిమాడు.

తేనానుయాతః కృష్ణోఽపి ప్రవివేశ మహాగుహామ్ ।
యత్ర శేతే మహావీర్యో ముచుకున్దో నరేశ్వరః ॥ 18 ॥

కాలయవనుడు వెంటబడి తరుముతుండగా, కృష్ణస్వామి పరుగెత్తుకుని వెళ్తూ ఒకానొకపెద్దగుహలో ప్రవేశించాడు. ఆగుహలో మిక్కిలిబలవంతుడైన ముచుకుందుడు అనేమహారాజు నిద్రిస్తున్నాడు.

సోఽపి ప్రవిష్టో యవనో దృష్ట్వా శయ్యాగతం నరమ్ ।
పాదేన తాడయామాస కృష్ణం మత్వా స దుర్మతిః ॥ 19 ॥

కృష్ణుడివెనకే కాలయవనుడు కూడ ఆగుహలో ప్రవేశించాడు. అక్కడ మంచంమీద పడుకుని నిద్రపోతున్న ముచుకుందుడిని చూసి, అతడే కృష్ణుడనుకుని ఆదుర్మార్గుడు కాలితో గట్టిగా తన్నాడు.

దృష్టమాత్రశ్చ తేనాసౌ జజ్వాల యవనోఽగ్నినా ।
తత్రోత్థధజేన మునయో భస్మీభూతశ్చ తత్క్షణాత్ ॥ 20 ॥

మహర్షులారా! ఆదెబ్బకు ముచుకుందుడు మేలుకొని కళ్లు తెరిచిచూశాడు. ఆచూపుతో వెలువడినపెద్ద అగ్నిజ్వాలలో కాలయవనుడు ఆక్షణమే, మాడి మసి అయిపోయినాడు.

స హి దేవాసురే యుద్ధే గత్వా జిత్వా మహాసురాన్ ।
నిద్రార్త స్సుమహాకాలం నిద్రాం వవ్రే వరం సురాన్ ॥ 21 ॥

పూర్వం దేవతలకూ, రాక్షసులకూ యుద్ధం జరిగినపుడు ఎంతోకాలం యుద్ధం చేసి, ముచుకుందుడు రాక్షసులను ఓడించి, దేవతలకు సహాయం చేశాడు. యుద్ధకాలంలో నిద్ర లేక బాధపడినముచుకుందుడు చాలాకాలం నిరాటంకంగా నిద్రపోవాలని దేవతలను వరం కోరుకున్నాడు.

ప్రోక్తశ్చ దైవై సంసుప్తం య స్త్వాముత్థాపయిష్యతి ।
దేహజేనాగ్నినా సద్య స్స తు భస్మీభవిష్యతి ॥ 22 ॥

దేవతలు ముచుకుందుడికి ఆవరం ఇచ్చి, అతడితో 'గాఢంగా నిద్రపోతున్న నిన్ను ఎవరు లేపుతారో వారు నీశరీరంనుండివెలువడినమంటల్లో పడి బూడిద అయిపోతారు' అని చెప్పారు.

ఏవం దగ్ధ్వా స తం పాపం దృష్ట్వా చ మధుసూదనమ్ ।
కస్త్వమిత్యాహ సోఽప్యాహ జాతోఽహం శశినః కులే ॥ 23 ॥

దేవతలిచ్చిన ఆవరం ప్రభావంతో ముచుకుందుడు ఈవిధంగా పాపాత్ముడైన కాలయవనుడిని కాల్చివేశాడు. తరువాత అక్కడే ఉన్న కృష్ణస్వామిని చూశాడు. 'ఎవరు నువ్వు' అని అడిగాడు. కృష్ణుడు ఇలా చెప్పాడు. నేను చంద్రవంశంలో జన్మించాను.

వసుదేవస్య తనయో యదువంశసముద్భవః ।
ముచుకున్దోఽపి తచ్ఛ్రుత్వా వృద్ధగార్గ్యవచ స్స్మరన్ ॥ 24 ॥

నేను వసుదేవుడికుమారుడిని. యదుమహారాజువంశంలో పుట్టాను'. కృష్ణుడిపలుకులు విని, ముచుకుందుడు పూర్వం వృద్ధుడైన గార్గ్యుడు చెప్పినమాటలను గుర్తుచేసుకున్నాడు.

సంస్మృత్య ప్రణిపత్యైనం సర్వం సర్వేశ్వరం హరిమ్ ।
ఆహ జాతో భవాన్ విష్ణో రంశాత్తు పరమేశ్వరః ॥ 25 ॥

అదంతా గుర్తుకు రావడంతో, ఎదురుగా ఉన్నకృష్ణస్వామి సమస్తానికీ ప్రభువైన శ్రీమహావిష్ణువు అని గ్రహించాడు. వెంటనే కృష్ణుడిపాదాలపై పడి ఇలా అన్నాడు. 'స్వామీ! నీవు శ్రీమహావిష్ణువుఅంశతో భూమిపై అవతరించిన పరమాత్మవు.

పురా గార్గ్యేణ కథిత మష్టావింశతితమే యుగే ।
ద్వాపరాన్తే హరే ర్జన్మ యదువంశే భవిష్యతి ॥ 26 ॥

పూర్వం గార్గ్యుడు ఇలా చెప్పాడు. ఇక పైన ఇరవై ఎనిమిదవద్వాపరయుగం చివర, యదువంశంలో శ్రీహరి అవతరిస్తాడు.

స త్వం ప్రాప్తో న సన్దేహో మర్త్యానా ముపకారకృత్ ।
యథా హి సుమహత్తేజో నాలం సోఢు మహం తవ ॥ 27 ॥

అలా అవతరించిన శ్రీమహావిష్ణువువే నీవు. అనుమానం లేదు. మానవులకు మేలు చేయడంకోసం వచ్చావు. స్వామీ! నీతేజస్సు మిక్కిలిగొప్పది. దానిని నేను తట్టుకోలేకపోతున్నాను.

తథా హి సజలామ్భోదధ్వనిధీరతరం తతః ।
వాక్యం తమితి హోవాచ యుష్మత్పాదసులాలితమ్ ॥ 28 ॥

అని ముచుకుందుడు నీరునిండినమేఘంలాగా గంభీరంగా పిడుగులు పడినవిధంగా స్థిరమైన కంఠధ్వనితో కృష్ణస్వామిని గురించి, ఇలా అన్నాడు.

దేవాసురే మహాయుద్ధే దైత్యాశ్చ సుమహాభటాః ।
న శేకుస్తే మహత్తేజ స్తత్తేజో న సహామ్యహమ్ ॥ 29 ॥

దేవతలకూ, రాక్షసులకూ జరిగినభయంకరమైన యుద్ధంలో పరాక్రమవంతులయినరాక్షసులే నీగొప్ప తేజస్సును తట్టుకోలేకపోయారు. అటువంటితేజస్సును నేనూ ఓర్చుకోలేను.

సంసారపతిత స్యైకో జన్తో స్త్వం శరణం పరమ్ ।
సంప్రసీద ప్రపన్నార్తిహర్తా హరమమాశుభమ్ ॥ 30 ॥

జననమరణరూపమైన సంసారంలో పడిపోయిన ప్రాణులకు నీవు ఒక్కడివే దిక్కు. ఆశ్రయించినవారిబాధల నన్నింటినీ తొలగించేవాడివి. నాకు కలిగినకష్టాన్ని తొలగించు.

త్వం పయోనిధయ శ్శైలా స్సరితశ్చ వనాని చ ।
మేదినీ గగనం వాయు రాపోఽగ్ని స్త్వం తథా పుమాన్ ॥ 31 ॥

సముద్రాలు, పర్వతాలు, నదులు, అరణ్యాలు, భూమి, ఆకాశం, గాలి, నీళ్లు, నిప్పు, పురుషుడు అన్నీనీవే.

పుంసః పరతరం సర్వం వ్యాప్య జన్మ వికల్పవత్ ।
శబ్దాదిహీన మజరం జన్మక్షయవివర్జితమ్ ॥ 32 ॥

ఆపురుషుడికంటె ఉన్నతమైన ప్రధానపురుషేశ్వరుడివి నీవే. అటువంటినీవు రకరకాలవికల్పాలతో కూడిన అన్నిజన్మలలోనూ నిండిఉంటావు. శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం అనేవిషయాలు నిన్ను అంటవు. ముసలితనం మొదలైనవి ఏవీ లేని వాడివి. పుట్టడం, మరణించడం అనేఅవస్థలు కూడ నీకు లేవు.

త్వత్తోఽమరాస్తు పితరో యక్షగన్ధర్వరాక్షసాః ।
సిద్ధా శ్చాప్సరస స్త్వత్తో మనుష్యాః పశవః ఖగాః ॥ 33 ॥

దేవతలూ, పితరులు, యక్షులు, గంధర్వులు, రాక్షసులు, సిద్ధులు, అప్సరసలు అనేదేవజాతులవారూ నీనుండే ఉద్భవించారు. మానవులు, పశువులు, పక్షులు నీవలననే కలిగాయి.

సరీసృపా మృగా స్సర్వే త్వత్త స్సర్వే మహీరుహాః ।
యచ్చ భూతం భవిష్యద్వా కిఞ్చిదత్ర చరాచరే ॥ 34 ॥

పాములు, ఇంకా ఇతరజంతువులు, చెట్లూ సమస్తమూ నీవల్లనే ఏర్పడ్డాయి. స్థావరజంగమాత్మకమైన ఈసృష్టిలో లోగడ ఉన్నదీ, ఇక పైని కలగబోయేదీ మొత్తమూ నీనుండే సంభవిస్తున్నది.

అమూర్తం మూర్త మథవా స్థూలం సూక్ష్మతరం తథా ।
తత్సర్వం త్వం జగత్కర్తు ర్నాస్తి కిఞ్చిత్త్వయా వినా ॥ 35 ॥

రూపం కలిగినదీ, రూపం లేనిదీ, పెద్దదీ, మిక్కిలిచిన్నదీ సమస్తమూ జగత్తులను సృష్టించే నీకు సంబంధించినదే. నీనుండి వచ్చిందే. నీవు లేకుండా ఏఒక్కటీ లేదు. అన్నీ నీవే.

మయా సంసారచక్రేఽ స్మిన్ భ్రమతా భగవన్ సదా ।
తాపత్రయాభిభూతేన న ప్రాప్తా నిర్వృతిః క్వచిత్ ॥ 36 ॥

దేవా! నేను నిరంతరమూ ఈసంసారచక్రంలో పడికొట్టుకుంటున్నాను. ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధిదైవికం అనేమూడు కష్టాలు నన్ను ఆక్రమించేశాయి. వీటినుండి నేను ఏమాత్రమూ బయటపడలేకపోతున్నాను.

దుఃఖాన్యేవ సుఖానీవ మృగతృష్ణాజలాశయః ।
మయా నాథ గృహీతాని తాని తాపాయ మేఽ భవన్ ॥ 37 ॥

ఎండమావులను చూసి, సరస్సులనే భ్రాంతితో పరుగులు తీసినవిధంగా, సుఖాలు అనే భ్రాంతితో బాధలవెంటబడుతున్నాను. నేను సుఖాలు అనుకున్నవన్నీ పరిణామంలో కష్టాలే అయినాయి.

రాజ్య ముర్వీం బలం కోశో మిత్రపక్ష స్తథాత్మజాః ।
భార్యా భృత్యజనా యే చ శబ్దాద్యా విషయాః ప్రభో ॥ 38 ॥

సుఖబుద్ధ్యా మయా సర్వం గృహీత మిద మవ్యయ ।
పరిణామే చ దేవేశ తాపాత్మక మభూ న్మమ ॥ 39 ॥

దేవా! నన్ను సుఖపెడతాయి అనేఉద్దేశ్యంతో సామ్రాజ్యం, భూమి, సైన్యం, ధనాగారం, స్నేహితులబృందం, భార్య, కొడుకులు, సేవకులు, శబ్దస్పర్శాదులైన విషయాలు మొదలైన వాటినన్నింటినీ చేరదీశాను. అన్నికాలాలలోనూ ఏవిధమైన మార్పూ లేకుండా ఉండేవాడా! దేవతలకు కూడ ప్రభువా! ఆరంభంలో సుఖం అనిపించినా, చివరికి అవి అన్నీ నన్ను బాధపెట్టేవే అయినాయి.

దేవలోకగతిం ప్రాప్తో నాథ దేవగణోఽ పి హి ।
మత్త స్సాహాయ్యకామోఽ భూ చ్ఛాశ్వతీ కుత్ర నిర్వృతిః ॥ 40 ॥

ఈబాధలనుండి నివృత్తికోసం నేను దేవతలగణాన్ని ఆశ్రయించాను. కాని, ఆదేవతలే నాసహాయాన్ని కోరుకున్నారు. ఇంక బాధలనుండి శాశ్వతమైనవిముక్తి (బ్రహ్మానందం) ఎక్కడ లభిస్తుంది?

త్వా మనారాధ్య జగతాం సర్వేషాం ప్రభవాస్పదమ్ ।
శాశ్వతీ ప్రాప్యతే కేన పరమేశ్వర నిర్వృతిః ॥ 41 ॥

పరమాత్మా! చరాచరజగత్తు సమస్తమూ పుట్టడానికి మూలకారణమైన నిన్ను ఆరాధించకుండా, ఏఒక్కడికీ శాశ్వతమైన ఆనందస్థితి లభించదు.

త్వన్మాయామూఢమనసో జన్మమృత్యుజరాదికాన్ ।
అవాప్య పాపాన్ పశ్యన్తి ప్రేతరాజానమన్తరా ॥ 42 ॥

దేవా! నీమాయచేత అజ్ఞానంతో మానవులు పుట్టడం, మరణించడం, ముసలితనం రావడం మొదలయినవికారాలు పొందుతున్నారు. పాపకర్మలు ఆచరిస్తున్నారు. చివరికి యమధర్మరాజువద్దకు వెళ్తున్నారు (వ్యర్థంగా మరణంపాలు అవుతున్నారు).

తతః పాశశతై ర్బద్ధా నరకే ష్వతిదారుణమ్ ।
ప్రాప్నువన్తి నరా దుఃఖం విశ్వరూపమిదం తవ ॥ 43 ॥

మానవులాతరువాత రకరకాలైన నరకాలలో పడి, వందలకొద్దీ తాళ్లతో బంధింపబడి, మిక్కిలిభయంకరమైన బాధలు అనుభవిస్తున్నారు. ఇదే నీవిశ్వరూపం.

అహ మత్యన్తవిషయీ మోహిత స్తవ మాయయా ।
మమత్వాగాధగర్తాన్తే భ్రమామి పరమేశ్వర ॥ 44 ॥

పరమాత్మా! నేను కూడ నీమాయవలన అజ్ఞానంలో పడిపోయి, విషయాలపైన గాఢమైన ఆసక్తితో మమకారం అనేఅంతులేనిలోతు కలిగినగోతిలో పడి అక్కడే తిరుగుతున్నాను.

సోఽహం త్వాం శరణమపారమీశమీడ్యం సమ్ప్రాప్తః పరమపదం యతో న కిఞ్చిత్ ।
సంసారశ్రమపరితాపతప్తచేతా నిర్విణ్ణే పరిణతధామ్ని సాభిలాషః ॥ 45 ॥

అటువంటినేను నిన్ను ఆశ్రయించాను. బాధలు పోగొట్టడానికి అందరికీ నీవే దిక్కు. స్తుతింపదగినవాడివి. అందరికీ చేరదగిన ఉత్తమోత్తమ మయిన(ముక్తి)స్థానం నీవే తప్ప మరొకటి లేనేలేదు. ఈసంసారంలోనికష్టాలతో నామనస్సు మిక్కిలిగా బాధ పడుతున్నది. అన్ని విషయాలలోనూ విరక్తితో కూడిన శాశ్వతమైన పరంధామం (నిన్ను) చేరుకోవాలని కోరుకుంటున్నాను.

ఇతి శ్రీబ్రహ్మపురాణే కాలయవనవధే ముచుకున్దస్తుతినిరూపణం నామ అష్టాశీతితమోఽధ్యాయః ॥ 88 ॥

శ్రీబ్రహ్మపురాణంలో కాలయవనవధలో ముచుకుందస్తుతినిరూపణం అనే ఎనభైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

ఏకోననవతితమోఽధ్యాయః - ఎనభైతొమ్మిదవ అధ్యాయం

బలప్రత్యాగమనవర్ణనమ్ - బలప్రత్యాగమనవర్ణనం

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

ఇత్థం స్తుత స్తదా తేన ముచుకున్దేన ధీమతా ।
ప్రాహేశ స్సర్వభూతానా మనాదినిధనో హరిః ॥ 1 ॥

బుద్ధిమంతుడైన ముచుకుందుడు ఈవిధంగా స్తుతించినతరువాత జననమరణాలు లేనివాడూ, సమస్త మయినసృష్టికీ ప్రభువూ అయిన శ్రీహరి ఇలా అన్నాడు.

శ్రీకృష్ణ ఉవాచ :-ముచుకుందుడితో కృష్ణస్వామి ఇలా అంటున్నాడు.

యథాభివాఞ్ఛితాన్ లోకాన్ దివ్యాన్ గచ్ఛ నరేశ్వర ।
అవ్యాహతపరైశ్వర్యో మత్ప్రసాదోపబృంహితః ॥ 2 ॥

రాజా! నాఅనుగ్రహంచేత ఎదురు లేనిప్రాభవంతో వర్ధిల్లు. నువ్వు కోరుకున్న దేవలోకాలకు వెళ్లు.

భుక్త్వా దివ్యాన్ మహాభోగాన్ భవిష్యసి మహాకులే ।
జాతిస్మరో మత్ప్రసాదా త్తతో మోక్ష మవాప్స్యసి ॥ 3 ॥

దేవలోకాలలో దివ్యమైన భోగాలను అనుభవించి, తిరిగి భూలోకంలో ఉత్తమమైన వంశంలో జన్మిస్తావు. ఆజన్మలో నీకు పూర్వజన్మస్మృతి ఉంటుంది. నాఅనుగ్రహంచేత ఆతరువాత మోక్షాన్ని పొందుతావు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్తః ప్రణిపత్యేశం జగతా మచ్యుతం నృపః ।
గుహాముఖా ద్వినిష్క్రాన్తో దదృశే సోఽల్పకాన్నరాన్ ॥ 4 ॥

స్వామిపలుకులు విని ముచుకుందమహారాజు లోకేశ్వరుడైన శ్రీకృష్ణుడికి పాదాభివందనం చేశాడు. అంతవరకు తాను నిద్రించినగుహనుండి వెలుపలికి వచ్చాడు. అక్కడ మిక్కిలిస్వల్పమై శరీరాలతో ఉన్న మానవులను చూశాడు.

తతః కలియుగం జ్ఞాత్వా ప్రాప్తం తప్తుం తతో నృపః ।
నరనారాయణస్థానం ప్రయయౌ గన్ధమాదనమ్ ॥ 5 ॥

వారిని చూసి, కలియుగం ప్రవేశించిందని గ్రహించాడు. వెంటనే, తపస్సు చేసుకుందా మని నరనారాయణు లుండే బదరీవనంలోని గంధమాదనప్రాంతానికి వెళ్లాడు.

కృష్ణోఽపి ఘాతయి త్వారి ముపాయేన హి తద్బలమ్ ।
జగ్రాహ మథురా మేత్య హస్త్యశ్వస్యన్దనోజ్జ్వలమ్ ॥ 6 ॥

కృష్ణుడు కూడ ఉపాయంతో కాలయవనుడిని సంహరించాడు. తిరిగి మధురకు వచ్చి, కాలయవనుడి చతురంగబలాన్ని బంధించాడు.

ఆనీయ చోగ్రసేనాయ ద్వారవత్యాం న్యవేదయత్ ।
పరాభిభవనిశ్శఙ్కం బభూవ చ యదో ర్బలమ్ ॥ 7 ॥

ఆసైన్యాన్ని పట్టి, తెచ్చి ద్వారకానగరంలో ఉగ్రసేనమహారాజుకు అప్పగించాడు. అప్పటినుండి యాదవబలం ఇంక ఎటువంటి పరాజయాలు తమకు సంభవింపవనే నిశ్చయంతో సుఖంగా ఉన్నారు.

బలదేవోఽపి విప్రేన్ద్రాః ప్రశాన్తాఖిలవిగ్రహః ।
జ్ఞాతిదర్శనసోత్కణ్ఠః ప్రయయౌ నన్దగోకులమ్ ॥ 8 ॥

ద్విజవరులారా! బలరాముడు కూడ శత్రువులు అందరూ నశించిపోవడంతో తనవారిని చూడాలనే కోరికతో నందుడిగోకులానికి ఉత్సాహంగా వెళ్లాడు.

తతో గోపాశ్చ గోపీశ్చ యథాపూర్వ మమిత్రజిత్ ।
తథైవాభ్యవదత్ ప్రేమ్ణా బహుమానపురస్సరమ్ ॥ 9 ॥

గోకులంలో గోపాలురు, గోపికలు అందరూ అంతకు పూర్వంలాగానే, శత్రువులను సంహరించివచ్చిన బలరాముడిని, గౌరవాభిమానాలతో ప్రేమగా పలకరించారు.

కైశ్చాపి సమ్పరిష్వక్తః కాంశ్చిత్ స పరిషస్వజే ।
హాసం చక్రే సమం కైశ్చిద్ గోపగోపీజనై స్తథా ॥ 10 ॥

కొందరు గోపాలురు బలరాముడిని గట్టిగా కౌగిలించుకున్నారు. కొందరిని బలరాముడు కౌగిలించుకున్నాడు. గోపకులతోనూ, గోపికలతోనూ సమానంగా బలరాముడు మేలమాడాడు.

ప్రియాణ్యనేకాన్యవదన్ గోపా స్తత్ర హలాయుధమ్ ।
గోప్యశ్చ ప్రేమముదితాః ప్రోచు స్సేర్ష్యమథాపరాః ॥ 11 ॥

కొందరు గోపకులు బలరాముడితో మంచి మంచి ముచ్చట్లు చెప్పారు. గోపికలు కొందరు ప్రేమతో ఆనందంగా మాట్లాడారు. మరికొందరు గోపికలు ఈర్ష్యతో వాదులాడారు.

గోప్యః పప్రచ్ఛు రపరా నాగరీజనవల్లభః ।
కచ్చి దాస్తే సుఖం కృష్ణ శ్చలత్ప్రేమరసాకులః ॥ 12 ॥

మరికొందరు గోపికలు కృష్ణుడిని గురించి, బలరాముడిని ఈవిధంగా అడిగారు. చంచలమైన అనురాగంతో గందరగోళపడే కృష్ణుడు అక్కడ మధురానగరంలో నాగరస్త్రీలఅనురాగరసంలో మునిగి, సుఖంగా ఉన్నాడు గదా!

అస్మచ్చేష్టోపహసనం న కచ్చిత్ పురయోషితామ్ ।
సౌభాగ్యమాన మధికం కరోతి క్షణసౌహృదః ॥ 13 ॥

క్షణం కూడ నిలకడ లేనిఅనురాగం చూపే కృష్ణుడు అక్కడ మాగొల్లపిల్లలచేష్టలను ఎగతాళి చేస్తూ, నాగరస్త్రీలసౌభాగ్యాన్ని అదృష్టాతిశయాన్ని ఇంకా అధికం చేయడం లేదు కదా!

కచ్చిత్ స్మరతి నః కృష్ణో గీతానుగమనం కృతమ్ ।
అప్యసౌ మాతరం ద్రష్టుం సకృదప్యాగమిష్యతి ॥ 14 ॥

ఆస్వామిపాట వెంటబడి తిరిగినమమ్మల్ని అక్కడ ఎప్పుడయినా అసలు తలుచుకుంటున్నాడా? కనీసం తనతల్లిని చూడడానికయినా ఒక్కసారి ఇక్కడకు వస్తాడా?

అథవా కిం తదాలాపైః క్రియన్తా మపరాః కథాః ।
యదస్మాభి ర్వినా తస్య వి నాస్మాకం భవిష్యతి ॥ 15 ॥

అయినా, కృష్ణుడిని గురించినమాటలెందుకు? ఇతరవిషయాలు మాట్లాడుకుందాం. అయినా, మనం లేకుండా కృష్ణుడికీ, కృష్ణుడు లేకుండా మనకీ జరగదు గదా!

పితా మాతా తథా భ్రాతా భర్తా బన్ధుజనశ్చ కః ।
న త్యక్త స్తత్కృతేఽస్మాభి రకృతజ్ఞ స్తతో హి సః ॥ 16 ॥

కృష్ణుడికోసం మేము తండ్రి, తల్లి, సోదరుడు, మగడు, ఇంకా బంధువులు అందరినీ వదులుకున్నాం. అటువంటిమమ్మల్ని కృష్ణుడు మరిచిపోయినాడు కదా! అతడు కృతజ్ఞతలేనివాడుగదా!

తథాఽపి కచ్చి దాత్మీయ మిహాగమనసంశ్రయమ్ ।
కరోతి కృష్ణో వక్తవ్యం భవతా వచనామృతమ్ ॥ 17 ॥

అయినా, కృష్ణుడికి కావలసినదీ, అతడిని ఇక్కడికి రప్పించేదీ అయినవస్తువు (మేము కాకపోయినా) ఏదో ఒకటి ఉండే ఉంటుంది. వారికి ఏదద్దైనా చెప్పమని నీకు చెప్పేఉంటాడు. అమృతంవంటిఆమాటలు మాకు కూడ వినిపించు.

దామోదరోఽసౌ గోవిన్దః పురస్త్రీసక్తమానసః ।
అపేతప్రీతి రస్మాసు దుర్దర్శః ప్రతిభాతి నః ॥ 18 ॥

దామోదరుడైన గోవిందుడు నగరకాంతలమీద మనసుపడ్డాడు. మాపైన ప్రేమ పోయింది. అతడు ఇక మాకు కనబడడేమోననిపిస్తున్నది.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఆమన్త్రిత స్స కృష్ణేతి పున ర్దామోదరేతి చ ।
జహసు స్సుస్వరం గోప్యో హరిణాకృష్టచేతసః ॥ 19 ॥

కృష్ణుడిమీద లగ్నమైన మనస్సుతో 'కృష్ణా, దామోదరా!' అంటూ కృష్ణుడిని మధురంగా పిలుస్తూ, ఆఆనందంతో చిరునవ్వులు చిందించారు.

సన్దేశై స్సామ్యమధురైః ప్రేమగర్భై రగర్వితైః ।
రామేణాశ్వాసితా గోప్యః కృష్ణస్యాతిమధుస్వరైః ॥ 20 ॥

బలరాముడు గోపికలకు కృష్ణుడు పంపినసందేశాన్ని తీయనిస్వరంతో వినిపించి, వారిని ఓదార్చాడు. కృష్ణుడు పంపినఆసందేశాలు మంచితనంతో మధురంగా ఉన్నాయి. ఏమాత్రమూ అహంకారం లేకుండా, ప్రేమతో నిండిఉన్నాయి.

గోపైశ్చ పూర్వవద్ రామో హరిణాకృష్ణచేతసైః ।
పరిహాసకథా శ్చక్రే సహ తైర్వ్రజవాసిభిః ॥ 21 ॥

శ్రీకృష్ణుడిపై మనసు పెట్టుకున్నగొల్లపల్లెలోని గోపాలకులతో మధురనుండి తిరిగివచ్చినబలరాముడు తాము మధురానగరానికి పోకముందులాగా నవ్వులముచ్చట్లు చెప్పేవాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే గోకులే బలప్రత్యాగమనవర్ణనం నామ ఏకోననవతితమోఽధ్యాయః ॥ 89 ॥

శ్రీబ్రహ్మపురాణంలో గోకులానికి బలరాముడిప్రత్యాగమనవర్ణనం అనే ఎనబైతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.



నవతితమోఽ ధ్యాయః - తొంబైయవ అధ్యాయం

హలక్రీడావర్ణనమ్ - హలక్రీడావర్ణనం

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

వనే విచరతస్తస్య సహ గోపైర్మహాత్మనః ।
మానుషచ్ఛద్మరూపస్య శేషస్య ధరణీభృతః ॥ 1 ॥

ఈ భూమిని మోస్తున్న ఆదిశేషుడే మానవుడి రూపం ధరించి, భూమిపై బలరాముడుగా అవతరించాడు. ఆ మహాత్ముడు బృందావనంలో గోపాలకులతో సంచరిస్తున్నాడు.

నిష్పాదితోరుకార్యస్య కార్యేణైవావతారిణః ।
ఉపభోగార్థమత్యర్థం వరుణః ప్రాహ వారుణీమ్ ॥ 2 ॥

ఆ బలరాముడు ఏదో బృహత్తరమైన పనిని నిర్వహించడం కోసమే మానవుడుగా పుట్టిన బలరాముడు ఆశ్చర్యకరమైన పనులెన్నో చేశాడు. బలరాముడి మీద ప్రేమతో అతడికి సుఖానుభూతి కలిగించడం కోసం వరుణుడు ఒకసారి వారుణిని పిలిచి ఆమెతో ఇలా అన్నాడు.

వరుణ ఉవాచ :-వారుణితో వరుణుడు ఇలా అంటున్నాడు.

అభీష్టా సర్వదా హ్యస్య మదిరే త్వం మహౌజసః ।
అనన్తస్యోపభోగాయ తస్య గచ్ఛ ముదే శుభే ॥ 3 ॥

కల్యాణీ! మదిరా! ఆనందం కలిగించేదానా! గొప్పపరాక్రమవంతుడైన బలరాముడికి ఎల్లవేళలలోనూ మదిర అంటే చాల ఇష్టం. ఆదిశేషుడైన అతడికి ఆ సుఖానుభవం అందించడానికి నీవు అక్కడికి వెళ్లు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

ఇత్యుక్తా వారుణీ తేన సన్నిధానమథాకరోత్ ।
బృన్దావనతటోత్పన్నకదమ్బతరుకోటరే ॥ 4 ॥

వరుణుడి మాటలు విని, వారుణీదేవి బలరాముడి వద్దకు వెళ్లింది. అక్కడ బృందావనంలో యమునానది ఒడ్డున పుట్టి పెరిగిన కడిమిచెట్టు తొఱ్ఱలో నివసిస్తున్నది.

విచరన్ బలదేవోఽ పి మదిరాగన్ధముద్ధతమ్ ।
ఆఘ్రాయ మదిరాహర్షమవాపాథ పురాతనమ్ ॥ 5 ॥

బలరాముడు ఆ ప్రాంతంలో సంచరిస్తున్న సమయంలో అక్కడ పెద్దయెత్తున వెలువడుతున్న మద్యపు సువాసనలను పీల్చాడు. ఆ పరిమళానికే పూర్వం ఎప్పుడో మద్యం తాగినపుడు కలిగిన ఆనందాన్ని తిరిగిపొందాడు.

తతః కదమ్బాత్ సహసా మద్యధారాం స లాఙ్గలీ ।
పతన్తీం వీక్ష్య మునయః ప్రయయౌ పరమాం ముదమ్ ॥ 6 ॥

మహర్షులారా! అప్పుడు బలరాముడు అక్కడ కడిమిచెట్టునుండి వేగంగా ఉబికివస్తున్న మద్యధారలను చూశాడు. పరమానంద పడ్డాడు.

పపౌ చ గోపగోపీభిస్సమవేతో ముదాన్వితః ।
ఉపగీయమానో లలితం గీతవాద్యవిశారదైః ॥ 7 ॥

గోపాలకులతోనూ! గోపికలతోనూ కలిసి ఆనందంగా మద్యం తాగాడు. పాటలు పాడడంలోనూ, వివిధ వాద్యాలను వాయించడంలోనూ నిపుణులైనవారు బలరాముడి మహిమలను మనోహరంగా స్తుతిస్తున్నారు.

శ్రమతోఽ త్యన్తఘర్మామ్భఃకణికామౌక్తికోజ్జ్వలః ।
ఆగచ్ఛ యమునే స్నాతుమిచ్ఛామీత్యాహ విహ్వలః ॥ 8 ॥

మరీ ఎక్కువగా తాగడంచేత అలిసిపోయిన బలరాముడికి ఒళ్లంతా చెమటలు పట్టాయి. ఆ చెమట నీటి బిందువులు ముత్యాలలాగా మెరుస్తున్నాయి. అప్పుడు బలరాముడు మద్యం మత్తులో కొంచెం స్మృతి తప్పి, యమునానదితో 'యమునా, నేను స్నానం చేద్దామనుకుంటున్నాను. ఇక్కడికి రా' అని పిలిచాడు.

తస్య వాక్యం నదీ సా తు మత్తోక్తమవమన్య వై ।
నాజగామ తతః క్రుద్ధో హలం జగ్రాహ లాఙ్గలీ ॥ 9 ॥

మద్యం తాగిన మత్తుతో మాట్లాడుతున్నాడనేఉద్దేశ్యంతో యమునానది బలరాముడి మాటలను పట్టించు కోలేదు. అందుచేత యమున బలరాముడివద్దకు రాలేదు. తనమాట వినక, అవమానించిందని బలరాముడికి యమునపై కోపం వచ్చింది. వెంటనే నాగలి ఆయుధాన్ని చేతబట్టాడు.

గృహీత్వా తాం హలాగ్రేణ చకర్ష మదవిహ్వలః ।
పాపే నాయాసి నాయాసి గమ్యతామిచ్ఛయాన్యతః ॥ 10 ॥

తాగిన మైకంలో మతి తప్పిన బలరాముడు నాగలితో యమునానదీ ప్రవాహాన్ని తనవైపుగా బలవంతంగా లాగాడు. పాపాత్మురాలా! నేను రమ్మని పిలిచినా, రాలేదు. నా మాట విని రాకపోతే, నువ్వు ఇక్కడ ఉండడానికి వీల్లేదు. వెంటనే ఇంకెక్కడికైనా నీ యిష్టం వచ్చిన చోటికి వెళ్లిపో' అన్నాడు.

సా కృష్టా తేన సహసా మార్గం సన్త్యజ్య నిమ్నగా ।
యత్రాస్తే బలదేవోఽ సౌ ప్లావయామాస తద్వనమ్ ॥ 11 ॥

బలరాముడు నాగలితో బలవంతంగా లాగడంచేత యమునానది పల్లానికి ప్రవహించడం మానుకుని, బలరాముడు ఉన్న బృందావనం వైపుగా ప్రవహించింది.

శరీరిణీ తథోపేత్య త్రాసవిహ్వలలోచనా ।
ప్రసీదేత్యబ్రవీద్ రామం ముఞ్చ మాం ముశలాయుధ ॥ 12 ॥

అప్పుడు యమునానది మానవ శరీరం ధరించి, బలరాముడి వద్దకు వచ్చింది. భయంతో బెదిరిపోతున్న చూపులతో 'రామా, రక్షించు. రోకలి ఆయుధంగా కలిగినవాడా! నన్ను విడిచిపెట్టు' అన్నది.

సోఽ బ్రవీదవజానాసి మమ శౌర్యబలం యది ।
సోఽ హం త్వాం హలపాతేన నయిష్యామి సహస్రధా ॥ 13 ॥

అప్పుడు బలరాముడు యమునానదితో 'నీవు నా శక్తిసామర్థ్యాలను అవమానిస్తే, నాగలిదెబ్బతో నిన్ను వెయ్యి ముక్కలు చేస్తాను' అన్నాడు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్తయాతిసన్త్రాసాత్తయా నద్యా ప్రసాదితః ।
భూభాగే ప్లావితే తత్ర ముమోచ యమునాం బలః ॥ 14 ॥

యమునానది మిక్కిలి భయంతో దీనంగా ప్రార్థించగా, బలరాముడు ఆమెను అనుగ్రహించాడు. బృందావనంలో ఇంతకు ముందు ఆ నది ప్రవహించిన ప్రాంతంలో, విడిచిపెట్టాడు.

తతస్స్నాతస్య వై కాన్తిరాజగామ మహావనే ।
అవతంసోత్పలం చారు గృహీత్వైకం చ కుణ్డలమ్ ॥ 15 ॥

వరుణప్రహితాం చాస్మై మాలామమ్లానపఙ్కజామ్ ।
సముద్రాభే తథా వస్త్రే నీలే లక్ష్మీరయచ్ఛత ॥ 16 ॥

తరువాత బలరాముడు బృందావనంలోనియమునానదిలో స్నానం చేశాడు. ఆసమయంలో బృందావన మంతటా ఒక వినూతనమైన కాంతి గోచరించింది. వరుణుడు పంపిన, ఒక నల్లకలువను, ఒక చెవికమ్మను ఎప్పటికీ వాడిపోని తామరపూల మాలను, సముద్రంలాగా నల్లగా ప్రకాశిస్తున్న ప్రధాన, ఉపవస్త్రాలు రెండింటినీ, లక్ష్మి తీసుకుని వచ్చి, బలరాముడికి ఇచ్చింది.

కృతావతంసస్స తదా చారుకుణ్డలభూషితః ।
నీలామ్బరధరశ్స్రీమాఞ్ఛుశుభే కాన్తిసంయుతః ॥ 17 ॥

బలరాముడు వరుణుడిచ్చిన కానుకలు స్వీకరించాడు. నల్లకలువను తలపై ఉంచుకున్నాడు. చెవికి కుండలం అలంకరించుకున్నాడు. నల్లని వస్త్రాలను కట్టుకున్నాడు. తేజస్వి అయిన బలరాముడు ఉత్తమమైన కొత్త కాంతితో కూడి చక్కగా ప్రకాశించాడు.

ఇత్థం విభూషితో రేమే తత్ర రామస్తదా వ్రజే ।
మాసద్వయేన యాతశ్చ పునస్స ద్వారకాం పురీమ్ ॥ 18 ॥

ఈవిధంగా అలంకరించుకున్న బలరాముడు గొల్లపల్లెలో ఆనందంగా విహరించాడు. ఇలా రెండు నెలలు గోకులంలో గడిచిపోయాయి. ఆ తరువాత బలరాముడు మళ్లీ ద్వారకానగరానికి వెళ్లాడు.

రేవతీం చైవ తనయాం రైవతస్య మహీపతేః ।
ఉపయేమే బలస్తస్యాం జజ్ఞాతే నిశఠోల్ముకౌ ॥ 19 ॥

రైవతుడు అనే మహారాజుగారి కూతురైన రేవతిని బలరాముడు వివాహం చేసుకున్నాడు. బలరాముడికి రేవతివల్ల నిశురుడు, ఉల్ముకుడు అనే ఇద్దరు కుమారులు కలిగారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే హలక్రీడావర్ణనం నామ నవతితమోఽధ్యాయః ॥ 90 ॥

శ్రీబ్రహ్మపురాణంలో హలక్రీడా వర్ణనం అనే తొంబైయవ అధ్యాయం సంపూర్ణం.

ఏకనవతితమోఽధ్యాయః - తొంబైఒకటవ అధ్యాయం

శమ్బరహృతప్రద్యుమ్నాగమనవర్ణనమ్ - శమ్బరహృత ప్రద్యుమ్నాగమనవర్ణనం

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

భీష్మకః కుణ్డినే రాజా విదర్భవిషయేఽభవత్ ।
రుక్మీ తస్యాభవత్ పుత్రో రుక్మిణీ చ తదాత్మజా ॥ 1 ॥

విదర్భదేశానికి భీష్మకుడు అనే రాజు ఉన్నాడు. అతడు కుండిన నగరాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలనం చేస్తున్నాడు. అతడికి రుక్మి అనే కుమారుడు, రుక్మిణి అనే కూతురు ఉన్నారు.

రుక్మిణీం చకమే కృష్ణస్సా చ తం చారుహాసినీ ।
న దదౌ యాచతే చైనాం రుక్మీ ద్వేషేణ చక్రిణే ॥ 2 ॥

రుక్మిణిని శ్రీకృష్ణుడు ప్రేమించాడు. అందంగా నవ్వే రుక్మిణి కూడ శ్రీకృష్ణుడిని భర్తగా కోరుకున్నది. శ్రీకృష్ణుడిమీద ఉన్న వైరంతో రుక్మి తన చెల్లెలైన రుక్మిణిని కృష్ణుడడిగినా ఇవ్వలేదు.

దదౌ స శిశుపాలాయ జరాసన్ధేన చోదితః ।
భీష్మకో రుక్మిణా సార్ధం రుక్మిణీ మురువిక్రమః ॥ 3 ॥

జరాసంధుడి ప్రేరణచేత రుక్మి, రుక్మితోపాటు పరాక్రమవంతుడైన భీష్మకుడు కూడ రుక్మిణిని శిశుపాలుడికి ఇవ్వడానికి నిశ్చయించారు.

వివాహార్థం తతస్సర్వే జరాసన్ధముఖా నృపాః ।
భీష్మకస్య పురం జగ్ముః శిశుపాలశ్చ కుణ్డినమ్ ॥ 4 ॥

రుక్మిణీవివాహం నిమిత్తంగా జరాసంధుడు మొదలైన రాజులందరూ భీష్మకమహారాజు రాజధాని అయిన కుండిన నగరానికి వెళ్లారు. శిశుపాలుడు కూడ వెళ్లాడు.

కృష్ణోఽపి బలభద్రాద్యైర్యదుభిః పరివారితః ।
ప్రయయౌ కుణ్డినం ద్రష్టుం వివాహం చైద్యభూపతేః ॥ 5 ॥

శ్రీకృష్ణుడు కూడ బలరాముడు మొదలైన యాదవులతో కలిసి, శిశుపాలుడి వివాహం చూడడానికి కుండిన నగరానికి వెళ్లాడు.

శ్వోభావిని వివాహే తు తాం కన్యాం హృతవాన్ హరిః ।
విపక్షభావమాసాద్య రామాద్యేష్వేవ బన్ధుషు ॥ 6 ॥

ఇక రేపు వివాహం జరుగుతుందనగా, బంధువులైన బలరాముడు మొదలైన వారు అందరూ వారించినా, వినకుండా శ్రీకృష్ణుడు రుక్మిణిని తీసుకుని వెళ్లిపోయినాడు.

తతశ్చ పౌణ్డ్రకశ్శ్రీమాన్ దన్తవక్త్రో విదూరథః ।
శిశుపాలో జరాసన్ధశ్శాల్వాద్యాశ్చ మహీభృతః ॥ 7 ॥

కుపితాస్తే హరిం హన్తుం చక్రురుద్యోగముత్తమమ్ ।
నిర్జితాశ్చ సమాగమ్య రామాద్యైర్యదుపుఙ్గవైః ॥ 8 ॥

అందుచేత శ్రీమంతుడైన పౌండ్రకుడు, దంతవక్త్రుడు, విదూరథుడు, శిశుపాలుడు, జరాసంధుడు, సాల్వుడు మొదలైన రాజులందరూ కృష్ణుడిపైన కోపగించారు. శ్రీకృష్ణుడిని చంపడానికి తీవ్రంగా ప్రయత్నం చేశారు. కాని, అందరూ బలరాముడు మొదలైన యాదవవీరుల చేతిలో ఓడిపోయారు.

కుణ్డినం న ప్రవేక్ష్యామి అహత్వా యుధి కేశవమ్ ।
కృత్వా ప్రతిజ్ఞాం రుక్మీ చ హన్తుం కృష్ణమభిద్రుతః ॥ 9 ॥

'కృష్ణుడిని యుద్ధంలో చంపకుండా, కుండిన నగరానికి తిరిగి రాను' అని శపథం చేసి, రుక్మి కృష్ణుడిని చంపడానికి అతడి మీదికి పరుగుతీశాడు.

హత్వా బలం స నాగాశ్వపత్తిస్యన్దనసఙ్కులమ్ ।
నిర్జితః పాతితశ్చోర్వ్యాం లీలయైవ స చక్రిణా ॥ 10 ॥

ఏనుగులు, గుఱ్ఱాలు, కాల్బలం, రథబలంతో నిండిఉన్న రుక్మి చతురంగ బలాలను శ్రీకృష్ణుడు అవలీలగా జయించి, నేలగూల్చాడు.

నిర్జిత్య రుక్మిణం సమ్యగుపయేమే స రుక్మిణీమ్ ।
రాక్షసేన విధానేన సంప్రాప్తో మధుసూదనః ॥ 11 ॥

రుక్మిని జయించిన తరువాత, శ్రీకృష్ణుడు రుక్మిణిని రాక్షస వివాహ పద్ధతిలో చక్కగా పెండ్లి చేసుకున్నాడు.

తస్యాం జజ్ఞే చ ప్రద్యుమ్నో మదనాంశస్స వీర్యవాన్ ।
జహార శమ్బరో యం వై యో జఘాన చ శమ్బరమ్ ॥ 12 ॥

శ్రీకృష్ణుడికి రుక్మిణివల్ల ప్రద్యుమ్నుడు పుట్టాడు. శక్తిమంతుడైన ప్రద్యుమ్నుడు మన్మథుడి అంశతో జన్మించాడు. అతడిని శంబరుడు అనే రాక్షసుడు అపహరించి, తీసుకువెళ్లాడు. ప్రద్యుమ్నుడు శంబరాసురుడిని సంహరించాడు.

మునయ ఊచుః :-వ్యాసమహర్షితో మునులు ఈవిధంగా అంటున్నారు.

శమ్బరేణ హృతో వీరస్స కథం తేన సంహతః ।
ఏతత్కథానకం దివ్యం కథయస్వ మహామతే ॥ 13 ॥

గొప్ప వివేకం కలిగినవాడా! వ్యాసమహర్షీ! వీరుడైన ప్రద్యుమ్నుడిని సమీపించి, శంబరుడు ఏవిధంగా అపహరించాడు? దివ్యమైన ఈ కథను మాకు తెలియజేయవలసింది.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

షష్ఠేఽహ్ని జాతమాత్రే తు ప్రద్యుమ్నం సూతికాగృహాత్ ।
మమైష హన్తేతి ద్విజా హృతవాన్ కాలశమ్బరః ॥ 14 ॥

విప్రులారా! ప్రద్యుమ్నుడు తనను సంహరిస్తాడనే భయంతో భయంకరుడైన శంబరాసురుడు ప్రద్యుమ్నుడు పుట్టిన ఆరవ రోజునే పురుటింటినుండి అపహరించుకుని వెళ్లాడు.

నీత్వా చిక్షేప చైవైనం గ్రాహోఽగ్రే లవణార్ణవే ।
కల్లోలజనితావర్తే సుఘోరే మకరాలయే ॥ 15 ॥

అలా తీసుకుని వెళ్లి ప్రద్యుమ్నుడిని ఉప్పుసముద్రంలో పడేశాడు. ఆ సముద్రం మొసళ్లతో నిండి భయంకరంగా ఉంటుంది. పెద్ద పెద్ద అలలతో ఏర్పడిన సుడులతో, ఆ సముద్రం మిక్కిలి భయం కలిగిస్తుంది.

పతితం చైవ తత్రైకో మత్స్యో జగ్రాహ బాలకమ్ ।
న మమార చ తస్యాపి జఠరానలదీపితః ॥ 16 ॥

నీళ్లలో పడిన ప్రద్యుమ్నుడిని అక్కడ ఉన్న ఒక చేప మింగివేసింది. దాని కడుపులోని జఠరాగ్నిలో పడినా, ప్రద్యుమ్నుడు మరణించలేదు.

మత్స్యబన్ధైశ్చ మత్స్యోఽసౌ మత్స్యైరన్యైస్సహ ద్విజాః ।
ఘాతితోఽసురవర్యాయ శమ్బరాయ నివేదితః ॥ 17 ॥

విప్రులారా! చేపలు పట్టుకునేవారు మిగిలిన చేపలతోపాటు, ప్రద్యుమ్నుడిని మింగిన చేపను కూడ పట్టుకుని చంపారు. దానిని తీసుకునివెళ్లి, రాక్షసరాజైన శంబరుడికి సమర్పించారు.

తస్య మాయావతీ నామ పత్నీ సర్వగృహేశ్వరీ ।
కారయామాస సూదానామాధిపత్యమనిన్దితా ॥ 18 ॥

శంబరుడి భార్య పేరు మాయావతి. ఇంటికి యజమానురాలు. చాల ఉత్తమురాలు. ఆ యింట వంటపెత్తనం అంతా ఆవిడదే.

దారితే మత్స్యజఠరే దదృశే సాతిశోభనమ్ ।
కుమారం మన్మథతరోర్దగ్ధస్య ప్రథమాఙ్కురమ్ ॥ 19 ॥

వండడంకోసం మాయావతి ఆ చేపను కోసింది. దాని కడుపులో అందమైన కుమారుడు కనబడ్డాడు. తగులబడి పోయిన మన్మథుడు అనే చెట్టుకు మొట్టమొదటగా ఏర్పడిన మొలకలాగా ఆ పసివాడు చాల మనోహరంగా ఉన్నాడు.

కోఽయం కథమయం మత్స్యజఠరే సముపాగతః ।
ఇత్యేవం కౌతుకావిష్టాం తాం తన్వీం ప్రాహ నారదః ॥ 20 ॥

ఆ కుమారుడిని చూడగానే 'ఈ బాలుడు ఎవడు? వాడు ఈ చేప కడుపులోకి ఎలా వచ్చాడు?' అని మాయావతికి చాల కుతూహలం కలిగింది.

నారద ఉవాచ :- అప్పుడామెతో నారదమహర్షి ఇలా అన్నాడు.

అయం సమస్తజగతాం సృష్టిసంహారకారిణా ।
శమ్బరేణ హృతః కృష్ణతనయస్సూతికాగృహాత్ ॥ 21 ॥

ఈ బాలుడు శ్రీకృష్ణస్వామి కుమారుడు. పురిటింటినుండి శంబరుడు అపహరించి తీసుకుని వచ్చాడు. ఆ శంబరుడు లోకాలన్నింటినీ సృష్టించగలడు, సంహరించగలడు.

క్షిప్తస్సముద్రే మత్స్యేన నిగీర్ణస్తే వశం గతః ।
నరరత్నమిదం సుభ్రు విశ్రబ్ధా పరిపాలయ ॥ 22 ॥

శంబరుడు ఈ పసివాడిని సముద్రంలో పడేశాడు. అక్కడ ఒక చేప వీడిని మింగింది. ఆ చేపద్వారా వీడు నీ వద్దకు చేరాడు. వీడు మానవోత్తముడు. అందమైన కనుబొమ్మలు కలిగినదానా! ఈ బాలుడిని మహత్త్వాన్ని విశ్వసించి, వీడిని శ్రద్ధగా పోషించు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

నారదేనైవముక్తా సా పాలయామాస తం శిశుమ్ ।
బాల్యాదేవాతిరాగేణ రూపాతిశయమోహితా ॥ 23 ॥

నారదుడు చెప్పిన మాటలు విని, మాయావతి ఆ పసివాడిని ప్రేమగా పెంచింది. ఆ పిల్లవాడి మనోహరమైన ఆకారం బాల్యంలోనే మాయావతిని బాగా ఆకర్షించింది.

స యదా యౌవనాభోగభూషితోఽభూద్ ద్విజోత్తమాః ।
సాభిలాషా తదా సా తు బభూవ గజగామినీ ॥ 24 ॥

బ్రాహ్మణోత్తములారా! ఆ పిల్లవాడు యుక్తవయస్సులోకి వచ్చాడు. యౌవన లక్షణాలు పరిపూర్ణంగా ఏర్పడ్డాయి. అప్పుడు ఆ సుందరికి అతడి మీద కోరిక కలిగింది.

మాయావతీ దదౌ చాస్మై మాయాస్సర్వా మహాత్మనే ।
ప్రద్యుమ్నాయానురూపాయ తన్న్యస్తహృదయేక్షణా ॥
ప్రసజ్జన్తీం తు తామాహ కార్ష్ణిః కమలలోచనః ॥ 25 ॥

అప్పుడు మాయావతి తనకు తగినవాడు, మహాత్ముడూ అయిన ప్రద్యుమ్నుడికి తనకు తెలిసిన మాయలు అన్నీ ఇచ్చింది.అతడిపైనే మనసు, దృష్టీ నిలుపుకున్నది. ఆమె ప్రవర్తనను గ్రహించి, కృష్ణుడి కుమారుడు, పుండరీకాక్షుడూ అయిన ప్రద్యుమ్నుడు ఆమెతో ఇలా అన్నాడు.

ప్రద్యుమ్న ఉవాచ :-మాయావతితో ప్రద్యుమ్నుడు ఈవిధంగా అంటున్నాడు.

మాతృభావం విహాయైవ కిమర్థం వర్తసేఽన్యథా ॥ 26 ॥

అమ్మా! నీవు నన్ను తల్లిలా చూడకుండా, వేరే విధంగా ప్రవర్తిస్తున్నా వేమిటి?

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

సా చాస్మై కథయామాస న పుత్రస్త్వం మమేతి వై ।
తనయం త్వామయం విష్ణోర్హృతవాన్ కాలశమ్బరః ॥ 27 ॥

అప్పుడు మాయావతి ప్రద్యుమ్నుడితో ఇలా అన్నది. నీవు నా కుమారుడివి కాదు. నీవు శ్రీకృష్ణుడి కొడుకువి. కాలశంబరుడు అనేవాడు నిన్ను అపహరించాడు.

క్షిప్తస్సముద్రే మత్స్యస్య సమ్ప్రాప్తో జఠరాన్మయా ।
సా తు రోదితి తే మాతా కాన్తా ద్యాప్యతివత్సలా ॥ 28 ॥

శంబరుడు నిన్ను సముద్రంలో పడేశాడు. అక్కడ ఒక చేప నిన్ను మింగింది. ఆ చేప కడుపులోనుండి నువ్వు నాకు దొరికావు. నిన్ను కన్న తల్లి నీ కోసం ఎంతో పుత్రప్రేమతో ఇప్పటికీ ఏడుస్తూనే ఉన్నది.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

ఇత్యుక్తశ్శమ్బరం యుద్ధే ప్రద్యుమ్నస్స సమాహ్వయత్ ।
క్రోధాకులీకృతమనా యుయుధేఽథ మహాబలః ॥ 29 ॥

మాయావతి మాటలు వినగానే ప్రద్యుమ్నుడికి శంబరుడిమీద బాగా కోపం వచ్చింది. శంబరుడిని తనతో యుద్ధానికి ఆహ్వానించాడు. మిక్కిలి బలవంతుడైన ప్రద్యుమ్నుడు కోపంతో వికలమైన మనస్సుతో, శంబరుడితో యుద్ధానికి దిగాడు.

హత్వా సైన్యమశేషం తు తస్య దైత్యస్య మాధవిః ।
సప్త మాయా వ్యతిక్రమ్య మాయాం సంయుయుజేఽష్టమీమ్ ॥ 30 ॥

ప్రద్యుమ్నుడు శంబరాసురుడి సైన్యాన్ని ఏమాత్రం మిగలకుండా సంహరించాడు. ఆ తరువాత ఏడు మాయలను దాటి, ప్రద్యుమ్నుడు ఎనిమిదవ మాయను శంబరుడిపై ప్రయోగించాడు.

తయా జఘాన తం దైత్యం మాయయా కాలశమ్బరమ్ ।
తతశ్చ సతయాసార్ధమాజగామ పితుఃపురమ్ ॥ 31 ॥

ప్రద్యుమ్నుడు ఆ ఎనిమిదవ మాయతో కాలశంబరాసురుణ్ణి సంహరించాడు. ఆ తరువాత మాయావతిని తీసుకుని, ఆ మాయతోనే ద్వారకకు తిరిగి వచ్చాడు.

అన్తఃపురేచ పతితం మాయావత్యా సమన్వితమ్ ।
తం దృష్ట్వా హృష్టసఙ్కల్పా బభూవుః కృష్ణయోషితః ॥
రుక్మిణీ చాబ్రవీత్ ప్రేమ్ణాసక్తదృష్టిరనిన్దితా ॥ 32 ॥

మాయావతితో సహా అంతఃపురంలో ప్రత్యక్షమైన ప్రద్యుమ్నుణ్ణి చూసి, శ్రీకృష్ణుడి భార్యలు సంతోషించారు. పూజ్యురాలైన రుక్మిణీదేవి ఆతడిని ప్రేమగా చూసి, ఇలా అన్నది.

రుక్మిణ్యువాచ :–ప్రద్యుమ్నుడితో రుక్మిణి ఇలా అంటున్నది.

ధన్యా యా ఖల్వయం పుత్రో వర్తతే నవయౌవనే ।
అస్మిన్ వయసి పుత్రోమే ప్రద్యుమ్నో యది జీవతి ॥ 33 ॥

ఇతడిని కన్న తల్లి ఎవరో కాని, ఆమె చాల అదృష్టవంతురాలు. ఇతడు ఇప్పుడే నూతనంగా యౌవనంలో ప్రవేశించాడు. నా కుమారుడు ప్రద్యుమ్నుడు కనుక బ్రతికిఉంటే వాడూ ఈ వయసులోనే ఉండేవాడు.

సభాగ్యా జననీ వత్స త్వయా కాపి విభూషితా ।
అథవా యాదృశస్స్నేహో మమ యాదృగ్వపుశ్చ తే ॥
హరే రపత్యం సువ్యక్తం భవాన్ వత్స భవిష్యతి ॥ 34 ॥

నాయనా! నీవు కొడుకుగా వన్నె కెక్కిన ఆ కాంత మిక్కిలి సౌభాగ్యవతి. నీపై మాకు ఈవిధమైన స్నేహభావం కలుగుతున్నది. ఇంకా నీ రూపం కూడా మా పోలికలతో ఉంది. బాబూ! ఈ పోలికలనుబట్టి, నీవు స్పష్టంగా శ్రీకృష్ణస్వామి కుమారుడివే అవుతావు.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

ఏతస్మిన్నన్తరే ప్రాప్తస్సహ కృష్ణేన నారదః ।
అన్తఃపురచరాం దేవీం రుక్మిణీం ప్రాహ హర్షితః ॥ 35 ॥

అదే సమయంలో కృష్ణుడితో కలిసి, నారదుడు అక్కడికి వచ్చాడు. అంతఃపురంలో ఉన్నపట్టపురాణి రుక్మిణితో [1]శ్రీకృష్ణుడు సంతోషంగా ఇలా అన్నాడు.

[2]**శ్రీకృష్ణ ఉవాచ :**–రుక్మిణితో శ్రీకృష్ణుడు ఇలా చెప్తున్నాడు.

ఏష తే తనయస్సుభ్రు హత్వా శమ్బరమాగతః ।
హృతో యేనాభవద్బాలో భవత్యాస్సూతికాగృహాత్ ॥ 36 ॥

---

1. ఇక్కడ మాట్లాడింది నారదుడు కావచ్చు నని 'కృష్ణేన నారదః' అనే పూర్వార్ధంవల్ల తెలుస్తున్నది. కాని తరువాత 'శ్రీకృష్ణ ఉవాచ' అనే వచనం కృష్ణుడు చెప్తున్నట్లుగా ఉంది. అక్కడ కూడ

2. 'నారద ఉవాచ' అని ఉంటే, అన్వయం, కథాభాగం కూడ అర్థవంతంగా ఉండేదేమో ననిపిస్తుంది. ఆ తరువాత 'హర్షసమావిష్టౌ రుక్మిణీకేశవౌ' (41 శ్లో.)అనేది మరి కొంత ఉచితంగా అన్వయిస్తుందనిపిస్తుంది. ఈ పురాణంలోనే 102వ అధ్యాయంలో 9వశ్లోకం తర్వాత 'శ్రీభగవానువాచ' అని ఉండాలి. కాని 'వ్యాస ఉవాచ' అని ఉంది. ఇక్కడ కూడ అటువంటి ప్రమాదం జరిగి ఉండవచ్చు. విజ్ఞులు నిర్ణయించాలి.

అందమైన కనుబొమ్మలు గలిగిన దేవీ! వీడు నీ కుమారుడే. నీ పురుటింటినుండి తనను అపహరించుకుని పోయిన శంబరాసురుడిని చంపి తిరిగి వచ్చాడు.

ఇయం మాయావతీ భార్యా తనయస్యాస్య తే సతీ ।
శమ్బరస్య న భార్యేయం శ్రూయతా మత్ర కారణమ్ ॥ 37 ॥

ఈమె మాయావతి. నీ కుమారుడికి భార్య. ఈమె శంబరుడి భార్య కాదు. దానికి కారణం చెప్తాను. విను.

మన్మథే తు గతే నాశం తదుద్భవపరాయణా ।
శమ్బరం మోహయామాస మాయారూపేణ రుక్మిణి ॥ 38 ॥

రుక్మిణీదేవీ! మన్మథుడు నశించిన తరువాత అతడి భార్య అయిన రతీదేవి తన భర్త మళ్లీ పుట్టడానికి పట్టుదలతో ప్రయత్నిస్తూ, అందులో భాగంగా మాయరూపంలో శంబరాసురుడిని మోహంలో పడేసింది.

వివాహాద్యుపభోగేషు రూపం మాయామయం శుభమ్ ।
దర్శయామాస దైత్యస్య తస్యేయం మదిరేక్షణా ॥ 39 ॥

ఈ మత్తుకన్నుల చిన్నది పెండ్లిండ్లు మొదలైన శుభకార్యాలలో మాయలతో నిండిన తన మంచి రూపాన్ని శంబరాసురుడికి మనోహరంగా ప్రదర్శించింది.

కామోఽవతీర్ణః పుత్రస్తే తస్యేయం దయితా రతిః ।
శఙ్కాచాత్ర న కర్తవ్యా స్నుషేయం తవ శోభనా ॥ 40 ॥

మన్మథుడే ప్రద్యుమ్నుడుగా నీకు కుమారుడుగా అవతరించాడు. ఆ మన్మథుడి భార్య అయిన రతీదేవే ఈ మాయావతి. ఇందులో సందేహించ వలసిన పని లేదు. ఈ సుందరాంగి నీ కోడలు.

వ్యాస ఉవాచ :- మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

తతో హర్షసమావిష్టౌ రుక్మిణీకేశవౌ తదా ।
నగరీచ సమస్తా సా సాధు సాధ్వీత్యభాషత ॥ 41 ॥

అప్పుడు రుక్మిణీ శ్రీకృష్ణులు ఇద్దరూ చాలా సంతోషించారు. ద్వారకానగరం అంతా బాగు, బాగు అని ప్రశంసించింది.

చిరం నష్టేన పుత్రేణ సఙ్గతాం ప్రేక్ష్య రుక్మిణీమ్ ।
అవాప విస్మయం సర్వో ద్వారవత్యాం జనస్తదా ॥ 42 ॥

రుక్మిణీదేవి చాలా కాలంగా దూరమైపోయిన కొడుకును కలుసుకోవడం చూసి, ద్వారవతీ నగరంలోని జనులందరూ ఎంతో ఆశ్చర్యపడ్డారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే శమ్బరహృతప్రద్యుమ్నాగమనవర్ణనం నామ ఏకనవతితమోఽధ్యాయః ॥ 91 ॥

శ్రీబ్రహ్మపురాణంలో శంబరహృత ప్రద్యుమ్నాగమన వర్ణనం అనే తొంబైఒకటవ అధ్యాయం సంపూర్ణం.

ద్వినవతితమోఽధ్యాయః - తొంబైరెండవ అధ్యాయం

రుక్మివధనిరూపణమ్ - రుక్మివధ నిరూపణం

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

చారుదేష్ణం సుదేష్ణం చ చారుదేహం చ శోభనమ్ ।
సుషేణం చారుగుప్తం చ భద్రచారుం తథాపరమ్ ॥ 1 ॥

చారువిన్దం సుచారుం చ చారుం బలినాం వరమ్ ।
రుక్మిణ్యజనయత్ పుత్రాన్ కన్యాం చారుమతీం తథా ॥ 2 ॥

చారుదేష్ణుడు, సుదేష్ణుడు, అందమైన చారుదేహుడు, సుషేణుడు, చారుగుప్తుడు, భద్రచారుడు, చారువిందుడు, సుచారుడు, బలవంతులలో శ్రేష్ఠుడైన చారుడు, అనే వారు రుక్మిణి కుమారులు. చారుమతి అనే ఆవిడ రుక్మిణి కూతురు.

అన్యాశ్చ భార్యాః కృష్ణస్య బభూవుస్సప్త శోభనాః ।
కాలిన్దీ మిత్రవిన్దా చ సత్యా నాగ్నజితీ తథా ॥ 3 ॥

శ్రీకృష్ణుడికి రుక్మిణితోపాటు ఇంకా ఏడుగురు భార్యలు ఉన్నారు. వారు 1. కాళింది, 2. మిత్రవింద, 3. సత్య, 4. నాగ్నజితి,

దేవీ జామ్బవతీ చాపి సదా తుష్టా తు రోహిణీ ।
మద్రరాజసుతా చాన్యా సుశీలా శీలమణ్డలా ॥ 4 ॥

5. జాంబవతి, 6. నిత్యమూ సంతోషంగా ఉండే రోహిణి, 7. మద్రదేశపు రాజు కూతురు, మంచి నడవడిక కలిగిన సుశీల.

సాత్రాజితీ సత్యభామా లక్ష్మణా చారుహాసినీ ।
షోడశాత్ర సహస్రాణి స్త్రీణామన్యాని చక్రిణః ॥ 5 ॥

వీరిలో సత్యభామ సత్రాజిత్తు కుమార్తె. శుభప్రదమైన లక్షణాలు కలిగినది. ఆమె నవ్వు చాల అందంగా ఉంటుంది. ఇంకా శ్రీకృష్ణుడికి పదహారువేల మంది వేరే భార్యలు కూడ ఉన్నారు.

ప్రద్యుమ్నోఽపి మహావీర్యో రుక్మిణస్తనయాం శుభామ్ ।
స్వయంవరస్థాం జగ్రాహ సాఽపి తం తనయం హరేః ॥ 6 ॥

రుక్మిణి కుమారుడైన ప్రద్యుమ్నుడు మిక్కిలి బలవంతుడు. అతడు స్వయంవరంలో రుక్మి కూతురిని వివాహం చేసుకున్నాడు. ఆమె కూడ ప్రద్యుమ్నుదుని స్వయంగా వరించింది.

తస్యామేవాభవత్ పుత్రో మహాబలపరాక్రమః ।
అనిరుద్ధోరణేఽరుద్ధో వీర్యోదధిరరిన్దమః ॥ 7 ॥

రుక్మి కూతురివల్ల ప్రద్యుమ్నుడికి అనిరుద్ధుడు పుట్టాడు. అతడు మిక్కిలి బలపరాక్రమాలు గలిగినవాడు. యుద్ధంలో అడ్డు లేనివాడు. (అందుకే అనిరుద్ధుడు) సముద్రమంతటి అగాధమైన శక్తి కలిగినవాడు. శత్రువులను అణచివేసే వాడు.

తస్యాపి రుక్మిణః పౌత్రీం వరయామాస కేశవః ।
దౌహిత్రాయ దదౌ రుక్మీ స్పర్ధయన్నపి శౌరిణా ॥ 8 ॥

అనిరుద్ధుడికి రుక్మి మనుమరాలిని (కొడుకు కూతురు) ఇమ్మని కృష్ణుడు అడిగాడు. శ్రీకృష్ణుడితో విరోధం ఉన్నప్పటికీ రుక్మి తన మనుమరాలిని కూతురు కొడుకుకు ఇచ్చాడు.

తస్యా వివాహే రామాద్యా యాదవా హరిణా సహ ।
రుక్మిణో నగరం జగ్ముర్నామ్నా భోజకటం ద్విజాః ॥ 9 ॥

విప్రులారా! ఆమె పెళ్లిలో బలరాముడు మొదలైన యాదవులు కృష్ణుడితో కలిసి రుక్మి రాజధాని అయిన భోజకటం అనే నగరానికి వెళ్లారు.

వివాహే తత్ర నిర్వృత్తే ప్రాద్యుమ్నేస్సుమహాత్మనః ।
కలిఙ్గరాజప్రముఖా రుక్మిణం వాక్యమబ్రువన్ ॥ 10 ॥

మహానుభావుడైన అనిరుద్ధుడి వివాహం జరిగిన తరువాత కళింగరాజు మొదలైన వారు రుక్మితో ఇలా అన్నారు.

కలిఙ్గాదయ ఊచుః :–కళింగరాజు మొదలైనవారు రుక్మితో ఇలా చెప్తున్నారు.

అనక్షజ్ఞో హలీ ద్యూతే తథాస్య వ్యసనం మహత్ ।
తం జయామో బలం తస్మాద్ ద్యూతేనైవ మహాద్యుతే ॥ 11 ॥

మిక్కిలిబలవంతుడా! తేజోవంతుడా! రుక్మీ! బలరాముడికి పాచికలాట తెలియదు. అయినా, అతడికి జూదం మీద ఆసక్తి చాల ఎక్కువ. అందుచేత బలరాముడిని పాచికలాటలోనే గెలుద్దాం.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

తథేతి తానాహ నృపాన్ రుక్మీ బలసమన్వితః ।
సభాయాం సహ రామేణ చక్రే ద్యూతం చ వై తదా ॥ 12 ॥

రుక్మి సరే, అలాగే చేద్దాం అన్నాడు. తనను సమర్థించేవారి నందరినీ తోడుగా ఉంచుకున్నాడు. పెద్దసభ ఏర్పాటు చేసి, అందులో బలరాముడితో జూదం ఆడటం ప్రారంభించాడు.

సహస్రమేకం నిష్కాణాం రుక్మిణా నిర్జితో బలః ।
ద్వితీయే దివసేచాన్యత్సహస్రం రుక్మిణా జితః ॥ 13 ॥

మొదటిరోజు జూదంలో రుక్మి బలరాముడి వద్దనుండి ఒక వేయి మాడలు గెలిచాడు. రెండవరోజు కూడా రుక్మియే మరొక వేయి మాడలు గెలిచాడు.

తతో దశ సహస్రాణి నిష్కాణాం పణమాదదే ।
బలదేవేన జయతా రుక్మీ ద్యూతవిదాం వరః ॥ 14 ॥

తరువాత జూదం ఆడడం బాగా తెలిసిన రుక్మి వరుస గెలుపులతో ఉత్సాహంగా బలరాముడితో పదివేల మాడలు పందెం కాశాడు.

తతో జహాసాథ బలం కలిఙ్గాధిపతిర్ద్విజాః ।
దన్తాన్ విదర్శయన్ మూఢో రుక్మీ చాహ మదోద్ధతః ॥ 15 ॥

విప్రులారా! అప్పుడు కళింగరాజు బలరాముడిని చూసి, హేళనగా పళ్లు బయటపడేటట్లు నవ్వాడు. గెలుపుమదంతో రుక్మి రెచ్చిపోతూ ఇలా అన్నాడు.

రు క్మ్యువాచ :-సభలోనివారితో రుక్మి ఇలా అంటున్నాడు.

అవిద్యోఽయం మయా ద్యూతే బలభద్రః పరాజితః ।
యుద్ధే వా చాక్షవిద్యాయాం త్వనభిజ్ఞస్సభాసదః ॥ 16 ॥

సభాసదులారా! ఈ బలరాముడు చేతకానివాడు. పాచికలాటలో నా చేతిలో ఓడిపోయాడు. యుద్ధంలో గానీ, పాచికల ఆటలో గానీ ఇతడికి ఏమాత్రమూ సామర్థ్యం లేదు.

దృష్ట్వా కలిఙ్గరాజం తు ప్రకాశదశనాననమ్ ।
రుక్మిణం చాపి దుర్వాక్యం కోపం చక్రే హలాయుధః ॥ 17 ॥

ముఖం నిండా పళ్లు వెళ్లబెట్టుకుని నవ్వుతున్న కళింగరాజునూ, దురహంకారంతో మాట్లాడుతున్న రుక్మినీ చూచి, బలరాముడికి వారిమీద కోపం వచ్చింది.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

తతః కోపపరీతాత్మా నిష్కకోటిం హలాయుధః ।
గ్లహం జగ్రాహ రుక్మీచ తదర్థేఽక్షానపాతయత్ ॥ 18 ॥

అప్పుడు కోపంతో ఒళ్ళు మండిన బలరాముడు కోటి మాడలు పందెం కాశాడు. రుక్మి ఆ పందానికి ఒప్పుకున్నాడు. రుక్మి పందానికి పాచికలు విసిరాడు.

అజయద్ బలదేవోఽథ ప్రాహోచ్చైస్తం జితం మయా ।
మమేతి రుక్మీ ప్రాహోచ్చైరలీకోక్తైరలం బలమ్ ॥ 19 ॥

ఆ పందెం బలరాముడు గెలిచాడు. ఆ ఉత్సాహంతో బలరాముడు 'నేను గెలిచాను' అని పెద్దగా అరిచాడు. 'నేనే గెలిచాను' అని రుక్మి బలరాముడితో అబద్ధమాడాడు.

త్వయోక్తోఽయం గ్లహస్సత్యం న మమైషోఽనుమోదితః ।
ఏవం త్వయా చేద్ విజితం న మయా విజితం కథమ్ ॥ 20 ॥

కోటి మాడలు పందెం అని నువ్వు చెప్పావు, నిజమే. కాని నేను దాన్ని అంగీకరించలేదు. అటువంటప్పుడు నువ్వు గెలిస్తే, నేను మాత్రం ఎందుకు గెలిచినట్లు కాదు? అన్నాడు రుక్మి.

తతోఽన్తరిక్షే వాగుచ్చైః ప్రాహ గమ్భీరనాదినీ ।
బలదేవస్య తం కోపం వర్ధయన్తీ మహాత్మనః ॥ 21 ॥

అప్పుడు ఆకాశంనుండి ఒక వాక్కు – పెద్దగానూ, గంభీరమైన ధ్వనితో, ఉత్తముడైన బలరాముడి కోపాన్ని ఇంకా పెంచుతూ, ఇలా అన్నది.

ఆకాశవాగువాచ :–ఆకాశవాణి ఇలా పలికింది.

జితం తు బలదేవేన రుక్మిణా భాషితం మృషా ।
అను క్త్వాపి వచః కిఞ్చిత్ కృతం భవతి కర్మణా ॥ 22 ॥

ఈ పందెం బలరాముడే గెలిచాడు. తాను గెలిచానని రుక్మి అబద్ధం ఆడుతున్నాడు. ఒట్టిమాటలు చెప్తే చేసినట్లు కాదు. అనవసరమైన మాటలు లేకుండా, కేవలం క్రియ చేసినంత మాత్రం చేతనే చేసినట్లు అవుతుంది.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

తతో బలస్సముత్థాయ క్రోధసంరక్తలోచనః ।
జఘానాష్టాపదేనైవ రుక్మిణం స మహాబలః ॥ 23 ॥

ఆకాశవాణి మాటల బలంతో బలరాముడికి రుక్మి మొదలైన వారిమీద కోపంతో కన్నులు ఎఱుపెక్కాయి. బలవంతుడైన ఆ బలరాముడు పాచికలాడే పలకతో రుక్మిని గట్టిగా కొట్టాడు.

కలిఙ్గరాజం చాదాయ విస్ఫురన్తం బలాద్ బలః ।
బభఞ్జ దన్తాన్ కుపితో యైః ప్రకాశం జహాస సః ॥ 24 ॥

మిడిసిపడుతున్న కళింగరాజును పట్టుకుని తన్నాడు. వెకిలిగా నవ్వుతుండగా బయటపడిన పళ్లు రాలిపోయే విధంగా కళింగరాజును బలరాముడు బాదాడు.

ఆకృష్య చ మహాస్తమ్భం జాతరూపమయం బలః ।
జఘాన యే తత్పక్షాస్తాన్ భూభృతః కుపితో బలః ॥ 25 ॥

బలరాముడు కోపంతో ఆ సభాభవనంలో ఉన్న ఒక పెద్ద బంగారు స్తంభాన్ని ఊడలాగి, రుక్మివైపు ఉన్నరాజు లందరినీ చావగొట్టాడు.

తతో హాహాకృతం సర్వం పలాయనపరం ద్విజాః ।
తద్రాజమణ్డలం సర్వం బభూవ కుపితే బలే ॥ 26 ॥

విప్రులారా! బలరాముడి కోపాన్ని చూసి, ఆ రాజుల గుంపు మొత్తమూ హాహాకారాలు చేసుకుంటూ, అక్కడినుండి పరుగులు తీశారు.

బలేన నిహతం శ్రుత్వా రుక్మిణం మధుసూదనః ।
నోవాచ వచనం కిఞ్చిద్ రుక్మిణీబలయోర్భయాత్ ॥ 27 ॥

బలరాముడిచేతిలో రుక్మి మరణించాడని కృష్ణుడు విన్నాడు. రుక్మిణీ బలరాములు ఏమంటారోననే భయంతో కృష్ణుడు ఆ విషయం ఎవ్వరికీ చెప్పలేదు.

తతోఽనిరుద్ధమాదాయ కృతోద్వాహం ద్విజోత్తమాః ।
ద్వారకామాజగామాథ యదుచక్రం సకేశవమ్ ॥ 28 ॥

బ్రాహ్మణోత్తములారా! అప్పుడు వివాహం చేసుకున్న అనిరుద్ధుడిని తీసుకుని, శ్రీకృష్ణుడితో సహా యాదవు లందరూ ద్వారకానగరానికి తిరిగి వచ్చారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే అనిరుద్ధవివాహే రుక్మివధనిరూపణం నామ ద్వినవతితమోఽధ్యాయః ॥ 92 ॥

శ్రీబ్రహ్మపురాణంలో అనిరుద్ధ వివాహంలో రుక్మివధ నిరూపణం అనే తొంబైరెండవ అధ్యాయం సంపూర్ణం.



త్రినవతితమోऽధ్యాయః – తొంబైమూడవ అధ్యాయం

నరకవధః – నరకవధ

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

> **ద్వారవత్యాం తతశ్శౌరిం శక్రస్త్రిభువనేశ్వరః ।**
> **ఆజగామాథ మునయో మత్తైరావతపృష్ఠగః ॥ 1 ॥**

మునులారా! మూడు లోకాలకూ అధిపతి అయిన ఇంద్రుడు ఐరావతం అనే మదించిన ఏనుగునెక్కి, ద్వారవతీ నగరంలో ఉన్న శ్రీకృష్ణస్వామిని గురించి వచ్చాడు.

> **ప్రవిశ్య ద్వారకాం సోऽథ సమీపేచ హరేస్తదా ।**
> **కథయామాస దైత్యస్య నరకస్య విచేష్టితమ్ ॥ 2 ॥**

ఇంద్రుడు ద్వారకానగరంలో ప్రవేశించాడు. శ్రీకృష్ణుడివద్దకు వెళ్లాడు. అక్కడ కృష్ణస్వామికి నరకాసురుడి దుర్మార్గాలను వివరించాడు.

ఇన్ద్ర ఉవాచ :–కృష్ణుడితో ఇంద్రుడు ఇలా చెప్తున్నాడు.

> **త్వయా నాథేన దేవానాం మనుష్యత్వేऽపి తిష్ఠతా ।**
> **ప్రశమం సర్వదుఃఖాని నీతాని మధుసూదన ॥ 3 ॥**

స్వామీ! శ్రీకృష్ణా! నీవు దేవతలకే ప్రభువువి. అయినా, మానవుడిగా అవతరించి కూడా నీవు దేవతల కష్టాలన్నీ పోగొట్టావు.

> **తపస్విజనరక్షాయై సోऽరిష్టోధేనుకస్తథా ।**
> **ప్రలమ్బాద్యాస్తథా కేశీ తే సర్వే నిహతాస్త్వయా ॥ 4 ॥**

సాధుజనులను రక్షించడానికి నీవు రాక్షసులైన అరిష్టుడినీ, ధేనుకుడినీ, ప్రలంబుడు మొదలైన వారినీ, అలాగే కేశిరాక్షసుడినీ సంహరించావు.

> **కంసః కువలయాపీడః పూతనా బాలఘాతినీ ।**
> **నాశం నీతాస్త్వయా సర్వే యేऽన్యే జగదుపద్రవాః ॥ 5 ॥**

కంసుడినీ, కువలయాపీడం అనే ఏనుగునూ, పసిపిల్లలను పొట్టన పెట్టుకునే పూతననూ, ఇంకా లోకాలకు కీడు చేసేవారి నందరినీ నీవు సర్వనాశనం చేశావు.

> **యుష్మద్దోర్దణ్డసంబుద్ధిపరిత్రాతే జగత్త్రయే ।**
> **యజ్ఞే యజ్ఞహవిః ప్రాశ్య తృప్తిం యాన్తి దివౌకసః ॥ 6 ॥**

నీ భుజబల పరాక్రమాలచేత మూడు లోకాలనూ నీవు కాపాడుతుంటే, దేవతలు నిర్విఘ్నంగా జరుగుతున్న యజ్ఞాలలో హవిస్సును భుజించి, సంతృప్తిని పొందుతున్నారు.

సోఽహం సామ్ప్రతమాయాతో యన్నిమిత్తం జనార్దన ।
తచ్ఛ్రుత్వా తత్ప్రతీకారప్రయత్నం కర్తుమర్హసి ॥ 7 ॥

సాధుజనులను సంరక్షించేవాడా! ఇప్పుడు నేను నీవద్దకు వచ్చిన కారణం చెప్తాను. అది విని నీవు దానికి విరుగుడుగా నీవు చేయవలసినది చేయాలి.

భౌమోఽయం నరకో నామ ప్రాగ్జ్యోతిషపురేశ్వరః ।
కరోతి సర్వభూతానామపఘాతమరిన్దమ ॥ 8 ॥

శత్రువులను అణిచేవాడా! నరకుడు అనేవాడు భూదేవి కుమారుడు. అతడు ప్రాగ్జ్యోతిషపురానికి రాజు. వాడు చరాచరమైన సమస్త భూతాలకు అపకారం చేస్తున్నాడు.

దేవసిద్ధసురాదీనాం నృపాణాం చ జనార్దన ।
హత్వా హి సోఽసురః కన్యా రురోధ నిజమన్దిరే ॥ 9 ॥

శ్రీకృష్ణా! ఆ రాక్షసుడు దేవతలు, సిద్ధులు, రాక్షసులు మొదలైనవారినీ, రాజులనూ సంహరించి, పెళ్లికాని పిల్లలను తెచ్చి, తన ఇంట్లో బంధించాడు.

ఛత్రం యత్ సలిలస్రావి తజ్జహార ప్రచేతసః ।
మన్దరస్య తథా శృఙ్గం హృతవాన్ మణిపర్వతమ్ ॥ 10 ॥

వరుణుడినుండి నీళ్లు జాలువారే గొడుగును కాజేశాడు. మందరపర్వతానికి సంబంధించిన మణిపర్వతం అనే శిఖరాన్ని అపహరించుకుని వెళ్లాడు.

అమృతస్రావిణీ దివ్యే మాతుర్మేఽమృతకుణ్డలే ।
జహార సోఽసురోఽదిత్యా వాఞ్ఛత్యైరావతం ద్విపమ్ ॥ 11 ॥

ఆ రాక్షసుడు మా అమ్మ అదితి కర్ణాభరణాలను అపహరించాడు. దివ్యమైన ఆ కుండలాలు అమృతాన్ని స్రవిస్తుంటాయి. చాల శ్రేష్ఠమైనవి. ఇప్పుడు ఐరావతం అనే నా ఏనుగును కాజేయాలని చూస్తున్నాడు.

దుర్నీతమేతద్ గోవిన్ద మయా తస్య తవోదితమ్ ।
యదత్ర ప్రతికర్తవ్యం తత్ స్వయం పరిమృశ్యతామ్ ॥ 12 ॥

శ్రీకృష్ణా! గోవిందా! నరకాసురుడి అకృత్యాలను నీకు విన్నవించాను. దీనికి ప్రతీకారం ఏం చేయాలో స్వయంగా నీవే ఆలోచించు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

ఇతి శ్రుత్వా స్మితం కృత్వా భగవాన్ దేవకీసుతః ।
గృహీత్వా వాసవం హస్తే సముత్తస్థౌ వరాసనాత్ ॥ 13 ॥

ఇంద్రుడి మాటలు విని, దేవకి కుమారుడైన శ్రీకృష్ణభగవానుడు ఒక చిరునవ్వు నవ్వాడు. ఇంద్రుడి చేయి అందుకుని, తాను కూర్చున్న ఉన్నతమైన ఆసనంనుండి లేచాడు.

సఞ్చిన్తితముపారుహ్య గరుడం గగనేచరమ్ ।
సత్యభామాం సమారోప్య యయౌ ప్రాగ్జ్యోతిషం పురమ్ ॥ 14 ॥

గరుత్మంతుడిని స్మరించాడు. వెంటనే గరుడుడు అక్కడికి వచ్చాడు. శ్రీకృష్ణుడు గరుత్మంతుడి పైన ఎక్కి సత్యభామను కూడ ఎక్కించుకున్నాడు. ఆకాశమార్గంలో ప్రాగ్జ్యోతిష నగరానికి వెళ్లాడు.

ఆరుహ్యైరావతం నాగం శక్రోऽపి త్రిదశాలయమ్ ।
తతో జగామ సుమనాః పశ్యతాం ద్వారకౌకసామ్ ॥ 15 ॥

సజ్జనులైన ద్వారకా నగరవాసులు చూస్తుండగా, ఇంద్రుడు కూడా ఐరావతం అనే తన వాహనగజాన్ని ఎక్కి అమరావతికి వెళ్లిపోయినాడు.

ప్రాగ్జ్యోతిషపురస్యాస్య సమన్తాచ్ఛతయోజనమ్ ।
ఆచితం భైరవైః పాశైః పరసైన్యనివారణే ॥ 16 ॥

ప్రాగ్జ్యోతిషపురానికి చుట్టూ నూరు యోజనాల దూరం వరకూ భయంకరమైన కట్టుతాళ్లు కట్టిఉన్నాయి. అవి శత్రువుల రాకను నిరోధించడానికి ఏర్పాటు చేశారు.

చిచ్ఛేద తాన్ హరిః పాశాన్ క్షిప్త్వా చక్రం సుదర్శనమ్ ।
తతో మురస్సముత్తస్థౌ తం జఘాన చ కేశవః ॥ 17 ॥

శ్రీకృష్ణుడు సుదర్శనం అనే చక్రాయుధాన్ని ప్రయోగించి, ఆతాళ్లను అన్నింటినీ తెంచివేశాడు. అక్కడ మురుడు అనే రాక్షసుడు కృష్ణుడి మీదికి వచ్చాడు. కృష్ణస్వామి వాడిని సంహరించాడు.

మురస్య తనయాన్ సప్త సహస్రాణి తతో హరిః ।
చక్రధారాగ్నినిర్దగ్ధాంశ్చకార శలభానివ ॥ 18 ॥

మురాసురుడికి ఏడువేలమంది కుమారులు. శ్రీకృష్ణుడు వారినందరినీ తన సుదర్శనాయుధం చివరి(పదును) నుండి వెలువడుతున్న మంటలతో మిడతలను చంపినట్లు చంపాడు.

హత్వా మురం హయగ్రీవం తథా పఞ్చజనం ద్విజాః ।
ప్రాగ్జ్యోతిషపురం ధీమాంస్త్వరావాన్ సముపాద్రవత్ ॥ 19 ॥

విప్రులారా! మురుడు, హయగ్రీవుడు, పంచజనుడు అనే వారిని సంహరించి, బుద్ధిమంతుడైన శ్రీకృష్ణస్వామి వేగంగా ప్రాగ్జ్యోతిషపురంలోకి పరుగుతీశాడు.

నరకేణాస్య తత్రాభూన్మహాసైన్యేన సంయుగః ।
కృష్ణస్య యత్ర గోవిన్దో జఘ్నే దైత్యాన్ సహస్రశః ॥ 20 ॥

శ్రీకృష్ణుడికి నరకుడితోనూ, అతడి పెద్ద సైన్యంతోనూ గొప్ప యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో కృష్ణుడు వేలకొలదిగా రాక్షసులను సంహరించాడు.

శస్త్రాస్త్రవర్షం ముఞ్చన్తం స భౌమం నరకం బలీ ।
క్షిప్త్వా చక్రం ద్విధా చక్రే చక్రీ దైతేయచక్రహా ॥ 21 ॥

భూమికుమారుడైన నరకాసురుడు కృష్ణుడిమీద వివిధమైన ఆయుధాలనూ, అస్త్రాలనూ ప్రయోగించాడు. అప్పుడు రాక్షస సమూహాలను నిర్మూలించే బలవంతుడైన కృష్ణస్వామి సుదర్శనాయుధాన్ని ప్రయోగించి, నరకుడిని రెండు ముక్కలు చేశాడు.

హతే తు నరకే భూమిర్గృహీత్వాదితికుణ్డలే ।
ఉపతస్థే జగన్నాథం వాక్యం చేదమథాబ్రవీత్ ॥ 22 ॥

నరకాసురుడు మరణించిన తరువాత, భూదేవి అదితి కర్ణాభరణాలను తీసుకునివచ్చి, శ్రీకృష్ణస్వామితో ఇలా అన్నది.

ధరణ్యువాచ :–శ్రీకృష్ణుడితో భూదేవి ఈవిధంగా చెప్తున్నది.

యదాఽహముద్ధృతా నాథ త్వయా సూకరమూర్తినా ।
త్వత్సంస్పర్శభవః పుత్రస్తదాయం మయ్యజాయత ॥ 23 ॥

స్వామీ! నీవు ఆదివరాహమూర్తివై ఏకార్ణవంనుండి నన్ను (భూమిని) ఉద్ధరించిన సమయంలో నీ స్పర్శవలన నాకు ఈ కుమారుడు జన్మించాడు.

సోఽయం త్వయైవ దత్తో మే త్వయైవ వినిపాతితః ।
గృహాణ కుణ్డలేచేమే పాలయాస్యచ సన్తతిమ్ ॥ 24 ॥

ఈ కుమారుడు నాకు నీవు అనుగ్రహించినవాడే. నువ్వు ఇచ్చిన కుమారుడిని నీవే కూల్చివేశావు. ఇవిగో అదితి కుండలాలు. తీసుకో. ఈ నరకుడి సంతానాన్ని నీవే కాపాడాలి.

భారావతరణార్థాయ మమైవ భగవానిమమ్ ।
అంశేన లోకమాయాతః ప్రసాదసుముఖ ప్రభో ॥ 25 ॥

నాథా! దయావిశేషంచేత ప్రసన్నుడివైన స్వామీ! నా(భూమి)భారాన్ని తగ్గించడానికి శ్రీమహావిష్ణువు అంశతో భూలోకానికి వచ్చినవాడివి.

త్వం కర్తా చ చ వికర్తా సంహర్తా ప్రభవోఽవ్యయః ।
జగత్స్వరూపో యశ్చ త్వం స్తూయసేఽచ్యుత కిం మయా ॥ 26 ॥

నీవు స్వతంత్రుడివి (విష్ణు.380). విచిత్రమైన ఈ జగత్తును సృష్టి చేసినవాడివి (విష్ణు.381). ఈ జగత్తును లయం చేసేవాడివి నీవే. మహాభూతాలు అన్నీ నీనుండే పుట్టాయి (విష్ణు.34.)నశించిపోవడం గాని మారిపోవడం

గాని లేనివాడివి (విష్ణు.13). ఈ జగత్తు నీ రూపమే. రూపంలో గానీ సమర్థతలో గానీ ఎప్పటికీ జారిపోనివాడివి (విష్ణు.100). అటువంటి నిన్ను నేను ఏవిధంగా స్తుతించగలను?

వ్యాపీ వ్యాప్యః క్రియా కర్తా కార్యం చ భగవాన్ సదా ।
సర్వభూతాత్మభూతాత్మా స్తూయసేఽచ్యుత కిం మయా ॥ 27 ॥

ఆకాశంలాగా అన్నింటా నిండి ఉంటావు (విష్ణు.467). అన్నీ నీలోనే ఉన్నాయి. సమస్తమైన పనులూ నీవే. ఆ పనులు చేసేవాడివీ నీవే. ఆ పనులు చేయడం కూడ నీవే. స్థావర జంగమాత్మకమైన సమస్త భూతాలలోనూ అంతరాత్మగా అయినవాడివి నీవే. శ్రీకృష్ణస్వామీ! అటువంటి నిన్ను స్తుతించడం నావల్ల కాదు.

పరమాత్మా త్వమాత్మా చ భూతాత్మా చావ్యయో భవాన్ ।
యదా తదా స్తుతిర్నాస్తి కిమర్థం తే ప్రవర్తతామ్ ॥ 28 ॥

ఉత్తమోత్తమమైన ఆత్మస్వరూపుడివి నీవే (విష్ణు.11). జీవుడివి నీవే. సమస్తమైన భూతాలలోనూ అంతర్యామిగా ఉండేవాడివి నీవే (విష్ణు.8). ఏవిధమైన మార్పు లేనివాడివి. అప్పటికీ, ఎప్పటికీ, ఇది అంతా యథార్థమే. కాని స్తోత్రం కాదు. నీ విషయంలో స్తుతి చేయడం సాధ్యం కాదు.

ప్రసీద సర్వభూతాత్మన్ నరకేణ కృతం చ యత్ ।
తత్ క్షమ్యతామదోషాయ మత్సుత స్స నిపాతితః ॥ 29 ॥

చరాచరకోటి అంతటా అంతర్యామిగా ఉన్న స్వామీ, నరకుడు చేసిన పాపాలు అన్నింటినీ క్షమించు. వాడిలోని తప్పులన్నీ తొలగించి, పుణ్యాత్ముడిని చేయడానికే నీవు వాడిని సంహరించావు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

తథేతి చోక్త్వా ధరణీం భగవాన్ భూతభావనః ।
రత్నాని నరకావాసాజ్జగ్రాహ మునిసత్తమాః ॥ 30 ॥

మహర్షులారా! సమస్తమైన భూతాలను సృష్టించేవాడూ, పోషించేవాడూ అయిన కృష్ణపరమాత్మ భూదేవి పలుకులకు 'అలాగే' అన్నాడు. నరకుడినివాసంనుండి రత్నాలు మొదలైన శ్రేష్ఠవస్తువులు అన్నింటినీ స్వీకరించాడు.

కన్యాపురే స కన్యానాం షోడశాతులవిక్రమః ।
శతాధికాని దదృశే సహస్రాణి ద్విజోత్తమాః ॥ 31 ॥

బ్రాహ్మణోత్తములారా! సాటి లేని పరాక్రమం కలిగిన కృష్ణస్వామి నరకుడి అంతఃపురంలో పదహారువేల నూరు మంది కన్యలను చూశాడు.

చతుర్దంష్ట్రాన్ గజాంశ్చోగ్రాన్ షట్సహస్రాణి దృష్టవాన్ ।
కామ్భోజానాం తథాశ్వానాం నియుతాన్యేకవింశతిమ్ ॥ 32 ॥

నాలుగు దంతాలు కలిగిన మదించిన ఏనుగులు ఆరువేలు, కాంభోజదేశంలో పుట్టిన ఉత్తమజాతి గుఱ్ఱాలు 21లక్షలు చూశాడు.

కన్యాస్తాశ్చ తథా నాగాంస్తానశ్వాన్ ద్వారకాం పురీమ్ ।
ప్రాపయామాస గోవిన్దస్సద్యో నరకకిఙ్కరైః ॥ 33 ॥

శ్రీకృష్ణుడు నరకుడి మందిరంలోని కన్యలనూ, ఏనుగులనూ, గుఱ్ఱాలనూ, నరకుని సేవకులద్వారా, వెంటనే ద్వారకానగరానికి పంపించాడు.

దదృశే వారుణం ఛత్రం తథైవ మణిపర్వతమ్ ।
ఆరోపయామాస హరిర్గరుడే పతగేశ్వరే ॥ 34 ॥

అలాగే అక్కడ వరుణిడి గొడుగునూ, మణిపర్వతం అనే మందరశిఖరాన్నీ పక్షిరాజు అయిన గరుత్మంతుడి మీదకు ఎక్కించాడు.

ఆరుహ్య చ స్వయం కృష్ణస్సత్యభామాసహాయవాన్ ।
అదిత్యాః కుణ్డలే దాతుం జగామ త్రిదశాలయమ్ ॥ 35 ॥

శ్రీకృష్ణుడు ఆ తర్వాత సత్యభామతో కలిసి, తాను కూడ గరుడుడి నెక్కాడు. అదితి కర్ణాభరణాలను ఆమెకు అందజేయడానికి స్వర్గలోకానికి వెళ్లాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే కృష్ణచరితే నరకవధో నామ త్రినవతితమోఽధ్యాయః ॥ 93 ॥

శ్రీబ్రహ్మపురాణంలో కృష్ణచరితలో నరకవధ అనే తొంబైమూడవ అధ్యాయం సంపూర్ణం.



చతుర్నవతితమోఽధ్యాయః - తొంభైనాల్గవ అధ్యాయం

శక్రస్తవనిరూపణమ్ - శక్రస్తవ నిరూపణం

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

గరుడో వారుణం ఛత్రం తథైవ మణిపర్వతమ్ ।
సభార్యం చ హృషీకేశం లీలయైవ వహన్ యయౌ ॥ 1 ॥

వరుణుడి గొడుగునూ, మణిపర్వతం అనే మందర శిఖరాన్నీ, భార్యతో సహా కృష్ణస్వామినీ సులువుగా వహిస్తూ, గరుత్మంతుడు బయలుదేరాడు.

తతశ్శఙ్ఖముపాధ్మాయ స్వర్గద్వారం గతో హరిః ।
ఉపతస్థుస్తతో దేవాస్సార్ఘపాత్రా జనార్దనమ్ ॥ 2 ॥

అప్పుడు శ్రీహరి స్వర్గానికి వెళ్లి, ద్వారం దగ్గర తన శంఖాన్ని పూరించాడు. కృష్ణుడి శంఖధ్వని విని,దేవత లందరూ కృష్ణస్వామిని పూజించడానికి ఉపయోగించే జలం నిండిన పాత్రలను తీసుకుని కృష్ణుడి వద్దకు వచ్చారు.

స దేవైరర్చితః కృష్ణో దేవమాతుర్నివేశనమ్ ।
సితాద్రిశిఖరాకారం ప్రవిశ్య దదృశేఽదితిమ్ ॥ 3 ॥

దేవతలు చేసిన పూజలు అందుకుని, ఆ తరువాత శ్రీకృష్ణుడు కైలాసపర్వత శిఖరం లాగా ఉన్న దేవతల తల్లి మందిరంలో ప్రవేశించాడు. అక్కడ అదితిని చూశాడు.

స తాం ప్రణమ్య శక్రేణ సహితః కుణ్డలోత్తమే ।
దదౌ నరకనాశం చ శశంసాస్యై జనార్దనః ॥ 4 ॥

కృష్ణుడు అదితికి ప్రణామం చేశాడు. ఇంద్రుడు కూడ ఆమెకు నమస్కరించాడు. తరువాత కృష్ణుడు తాను తెచ్చిన ఉత్తమమైన అదితి కర్ణాభరణాలను అదితికి ఇచ్చాడు. నరకుడు మరణించిన విధాన్ని ఆమెకు విశదీకరించాడు.

తతః ప్రీత్యా జగన్మాతా ధాతారం జగతాం హరిమ్ ।
తుష్టావాదితిరవ్యగ్రా కృత్వాతత్ప్రవణం మనః ॥ 5 ॥

లోకాలకు తల్లి అయిన అదితి సంతోషించింది. సృష్టికర్త అయిన ఆ శ్రీహరి మీద మనస్సు లగ్నం చేసి, స్థిరంగా ఉండి, ఆ స్వామిని స్తుతించింది. కృష్ణస్వామికి ఆనందం కలిగించింది.

అదితి రువాచ :-శ్రీహరిని అదితి ఈవిధంగా స్తుతిస్తున్నది.

నమస్తే పుణ్డరీకాక్ష భక్తానామభయఙ్కర ।
సనాతనాత్మన్ భూతాత్మన్ సర్వాత్మన్ భూతభావన ॥ 6 ॥

తెల్లదామరల వంటి కన్నులు కలిగినవాడా! భక్తుల భయాన్ని పోగొట్టేవాడా! అన్నింటికీ మూలకారణమైనవాడా! సమస్త భూతములు స్వరూపమైనవాడా! సమస్తము నీవే అయినవాడా! జగత్తును సృష్టించి, పోషించేవాడా! నీకు నమస్కారం.

ప్రాణాత్మమనసాం బుద్ధేరిన్ద్రియాణాం గుణాత్మక ।
త్రిగుణాతీత నిర్ద్వన్ద్వ శుద్ధ సర్వహృదిస్థిత ॥ 7 ॥

ప్రాణం, ఆత్మ, మనస్సు, బుద్ధి, ఇంద్రియాలలోని గుణం స్వరూపం అయినవాడా! సత్త్వరజస్తమస్సులనే మూడు గుణాలకు అతీతమైనవాడా! నీకంటె వేరుగా మరొక పదార్థం లేనివాడా! త్రిగుణాలు అంటనివాడా! అందరి హృదయ గుహలలో ఉండేవాడా! నీకు నమస్కారం.

సితదీర్ఘాదినిశ్శేషకల్పనాపరివర్జిత ।
జన్మాదిభిరసంస్పృష్ట స్వప్నాదిపరివర్జిత ॥ 8 ॥

తెలుపు, నిడుపు మొదలైన కల్పితభేదాలు లేనివాడా! పుట్టుక మొదలైన వికారాలు అంటనివాడా! స్వప్నం, సుషుప్తి, జాగ్రత్ అనే మూడు అవస్థలు లేనివాడా! నీకు నమస్కారం.

సన్ధ్యా రాత్రిరహర్భూమిర్గగనం వాయురమ్బు చ ।
హుతాశనో మనో బుద్ధిర్భూతాదిస్త్వం తథాచ్యుతః ॥ 9 ॥

రాత్రి, పగలు, రాత్రిపగళ్ల మధ్యకాలం (సంధ్య), (అనే మూడు కాలాలు) నేల, నింగి, గాలి, నీరు, నిప్పు, (అనే పంచభూతాలు), మనస్సు, బుద్ధి, (చిత్తం, అహంకారం) అన్నీ నీవే. సృష్టికి మూలం నీవే.

సృష్టిస్థితివినాశానాం కర్తా కర్తృపతిర్భవాన్ ।
బ్రహ్మవిష్ణుశివాఖ్యాభిరాత్మమూర్తిభిరీశ్వరః ॥ 10 ॥

సృష్టి, స్థితి, లయమూ చేసేవాడివి నీవు. ఆ పనులు చేసేవారికి ప్రభువువు నీవు. బ్రహ్మ, విష్ణువు, శివుడు అనే పేర్లతో నీవే ఆయారూపాలు ధరించావు. నీవు సర్వజగన్నాథుడివి.

మాయాభిరేతద్ వ్యాప్తం తే జగత్ స్థావరజఙ్గమమ్ ।
అనాత్మన్యాత్మవిజ్ఞానం సా తే మాయా జనార్దన ॥ 11 ॥

కృష్ణా, నీ మాయతోనే చరాచరాత్మకమైన ఈ జగత్తు సమస్తమూ నిండిఉంది. ఆత్మ కాని వస్తువునందు అదే ఆత్మ అనే భావం ప్రాణులకు నీ మాయవల్లనే ఏర్పడింది.

అహం మమేతి భావోఽత్ర యయా సముపజాయతే ।
సంసారమధ్యే మాయాయాస్తవైతన్నాథ చేష్టితమ్ ॥ 12 ॥

ప్రభూ! ఈ సంసారంలో నేను, నాది అనే భావం కల్గడానికి మూలమైన మాయ నీవు కల్పించినదే.

యైస్స్వధర్మపరైర్నాథ నరైరారాధితో భవాన్ ।
తే తరన్త్యఖిలామేతాం మాయామాత్మవిముక్తయే ॥ 13 ॥

పరమేశ్వరా! తమతమ ధర్మాలను ఆచరించే మానవులు సంసారంనుండి తమను తాము ఉద్ధరించుకోవడానికి నిన్నే ఆరాధిస్తున్నారు. నిన్ను ఆరాధించే వారందరూ నీ మాయనుండి పూర్తిగా బయటపడుతున్నారు.

బ్రహ్మాద్యాస్సకలా దేవా మనుష్యాః పశవస్తథా ।
విష్ణుమాయామహావర్తే మోహాన్ధతమసావృతాః ॥ 14 ॥

బ్రహ్మ మొదలుగా సమస్తమైన దేవతలు, మానవులు, జంతువులు, వైష్ణవ మాయ అనే సుడిగుండంలో పడి ఉన్నారు. వారిని అజ్ఞానం అనే దట్టమైన చీకటి ఆవరించింది.

ఆరాధ్య త్వామభీప్సన్తే కామానాత్మభవక్షయే ।
యదేతే పురుషా బద్ధా మాయయా భగవంస్తవ ॥ 15 ॥

పరమాత్మా! నీ మాయతో బంధింపబడిన ఈ జీవులందరూ సంసారంనుండి తరించడం కోసం నిన్ను ఆరాధించి, తమకోరికలను పొందుతున్నారు.

మయా త్వం పుత్రకామిన్యా వైరిపక్షక్షయాయ చ ।
ఆరాధితో న మోక్షాయ మాయావిలసితం హి తత్ ॥ 16 ॥

స్వామీ! నేను కూడ నాకు పుత్రసంతానం కలగాలనే కోరికతోనూ, నా శత్రువులు నశించిపోవాలనే కోరికతో నిన్ను ఆరాధించాను. కాని మోక్షం కోసం కాదు. దానికి కారణం నీ మాయా ప్రభావమే కదా!

కౌపీనాచ్ఛాదనప్రాయా వాఞ్ఛా కల్పద్రుమాదపి ।
జాయతే ఽకృతపుణ్యానాం సోఽపరాధస్స్వదోషజః ॥ 17 ॥

సంసారంపైన ఈ నా కోరిక కల్పవృక్షంనుండి గోచిముక్కను కోరుకున్న విధంగా ఉన్నది. పూర్వం తాము చేసుకున్న దోషంవల్లనే, పుణ్యం చెయ్యనివారు ఈవిధంగా పొరపాటు పడుతున్నారు.

తత్ ప్రసీదాఖిలజగన్మాయామోహకరావ్యయ ।
అజ్ఞానం జ్ఞానసద్భావ భూతభూతేశ నాశయ ॥ 18 ॥

లోకాలన్నిటినీ నీ మాయతో అజ్ఞానంలో ముంచేవాడా! ఎప్పటికీ ఏవిధమైన మార్పునూ పొందనివాడా! జ్ఞానం స్వరూపమైనవాడా! జగన్నాథా! నా అజ్ఞానాన్ని నిర్మూలించు.

నమస్తే చక్రహస్తాయ శఙ్ఖహస్తాయ తే నమః ।
గదాహస్తాయ తే విష్ణో పద్మహస్తాయ తే నమః ॥ 19 ॥

ఒకచేత సుదర్శనం అనే చక్రాయుధాన్ని, మరొక చేతిలో పాంచజన్య శంఖాన్నీ, ఇంకొక చేతిలో కౌమోదకీ గదనూ, వేరొకచేతిలో తామరపూవునూ ధరించిన స్వామీ! నీకు నమస్కారం.

ఏతత్ పశ్యామి తే రూపం స్థూలచిహ్నోపశోభితమ్ ।
న జానామి పరం తత్త్వం ప్రసీద పరమేశ్వర ॥ 20 ॥

పరమాత్మా! ఈవిధంగా చక్రాయుధం మొదలైన లక్షణాలతో కంటికి కనిపించే నీ రూపాన్ని చూడగలుగు తున్నాను. కాని, ఈ తోలుకంటికి కనబడని నీ నిర్గుణమైన రూపాన్ని తెలుసుకోలేను. నన్ను నీవే రక్షించాలి.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాస మహర్షి ఇలా అంటున్నాడు.

అదిత్యైవం స్తుతో విష్ణుః ప్రహస్యాహ సురారణిమ్ ।

అదితి ఈవిధంగా స్తుతించగా శ్రీకృష్ణుడు నవ్వి ఆ దేవతల మాతతో ఇలా అంటున్నాడు.

శ్రీకృష్ణ ఉవాచ :–కృష్ణుడు అదితితో ఇలా అన్నాడు.

మాతా దేవి త్వమస్మాకం ప్రసీద వరదా భవ ॥ 21 ॥

దేవీ! నీవు మాకు తల్లివి. మమ్మల్ని అనుగ్రహించు. మాకు వరాలు ప్రసాదించు.

అదితి రువాచ :–కృష్ణుడితో అదితి ఇలా అంటున్నది.

ఏవమస్తు యథేచ్ఛా తే త్వమశేషసురాసురైః ।
అజేయః పురుషవ్యాఘ్ర మర్త్యలోకే భవిష్యసి ॥ 22 ॥

పురుషోత్తమా! నీవు కోరుకున్నట్లే అగు గాక. నీవు మానవలోకంలో సమస్తమైన దేవతలూ, రాక్షసులూ ఎవ్వరూ నిన్ను జయించలేని పరాక్రమంతో ఉంటావు.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఇలా అంటున్నాడు.

తతోఽనన్తరమేవాస్య శక్రాణీసహితాం దితిమ్ ।
సత్యభామా ప్రణమ్యాహ ప్రసీదేతి పునః పునః ॥ 23 ॥

ఇలా జరిగిన తరువాత సత్యభామ దేవేంద్రుడి భార్య అయిన శచీదేవితో కలిసిఉన్న అదితికి ప్రణామం చేసింది. మాటిమాటికీ మాపై దయచూడమని ప్రార్థించింది.

అదితి రువాచ :–సత్యభామతో అదితి ఇలా అంటున్నది.

మత్ప్రసాదాన్న తే సుభ్రు జరా వైరూప్యమేవ చ ।
భవిష్యత్యనవద్యాఙ్గి సర్వభోగా భవిష్యసి ॥ 24 ॥

చక్కని కనుబొమలు కలదానా! నా అనుగ్రహ విశేషంచేత నీకు ముసలితనం గాని, ఆకారంలో లోపం కానీ రాదు. ఉత్తమ లక్షణాలతో కూడిన అవయవాలు కలిగినదానా! నీవు సమస్తమైన భోగాలు అనుభవిస్తావు. అన్నది.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

అదిత్యా తు కృతానుజ్ఞో దేవరాజో జనార్దనమ్ ।
యథావత్ పూజయామాస బహుమానపురస్సరమ్ ॥ 25 ॥

తల్లి అయిన అదితి అనుమతి తీసుకుని, దేవేంద్రుడు మిక్కిలి పూజ్యభావంతో, పద్ధతిప్రకారం శ్రీకృష్ణుడిని పూజించాడు.

తతో దదర్శ కృష్ణోఽ పి సత్యభామాసహాయవాన్ ।
దేవోద్యానాని సర్వాణి నన్దనాదీని సత్తమాః ॥ 26 ॥

విప్రోత్తములారా! కృష్ణుడు కూడ సత్యభామతో కలిసి నందనవనం మొదలైన దేవతల ఉద్యానవనాల నన్నింటినీ చూశాడు.

దదర్శ చ సుగన్ధాఢ్యం మఞ్జరీపుఞ్జధారిణమ్ ।
శైత్యాహ్లాదకరం దివ్యం బాలపల్లవశోభితమ్ ॥ 27 ॥

మథ్యమానేఽ మృతే జాతం జాతరూపసమప్రభమ్ ।
పారిజాతం జగన్నాథః కేశవః కేశిసూదనః ॥ 28 ॥

కేశి అనే రాక్షసుడిని సంహరించిన లోకేశ్వరుడైన శ్రీకృష్ణస్వామి అక్కడ పారిజాతవృక్షాన్ని చూశాడు. ఆ చెట్టు అత్యధికమైన పరిమళాలను వెదజల్లుతున్నది. పూలగుత్తులతో నిండిఉంది. చల్లదనంతో మనసుకు ఆహ్లాదం కలిగిస్తున్నది. దేవలోక మహిమలు కలిగిన ఆ వృక్షం లేతచిగుళ్లతో ప్రకాశిస్తున్నది. అమృతంకోసం చిలుకుతున్న సమయంలో పాలసముద్రంనుండి పుట్టింది. మేలిమి బంగారంతో సమానమైన కాంతి కలిగి ఉన్నది.

తం దృష్ట్వా ప్రాహ గోవిన్దం సత్యభామా ద్విజోత్తమాః ।

విప్రవరేణ్యులారా! సత్యభామ ఆ పారిజాతవృక్షాన్ని చూసి, శ్రీకృష్ణుడితో ఇలా అన్నది.

సత్యభామోవాచ :-కృష్ణుడితో సత్యభామ ఇలా అంటున్నది.

కస్మాన్న ద్వారకామేష నీయతే కృష్ణ పాదపః ॥ 29 ॥

స్వామీ! కృష్ణా! ఈ పారిజాతవృక్షాన్ని ద్వారకానగరానికి ఎందుకు తీసుకురావు?

యది తే తద్వచస్సత్యం సత్యాత్యర్థం ప్రియేతి మే ।
మద్గృహే నిష్కుటార్థాయ తదయం నీయతాం తరుః ॥ 30 ॥

అందరిలోనూ నాకు సత్యభామే మిక్కిలి ఇష్టమైనది అని నీవు చెప్తూఉండే మాట నిజమే అయితే, నా ఇంటి పెరటిలో నాటడానికి ఈ పారిజాతవృక్షాన్ని తీసుకుని రా.

న మే జామ్బవతీ తాదృగభీష్టా న చ రుక్మిణీ ।
సత్యే యథా త్వమిత్యుక్తం త్వయా కృష్ణాసకృత్ ప్రియమ్ ॥ 31 ॥

కృష్ణా! నీవు నాతో 'సత్యా! నువ్వంటే నాకు చాల ఇష్టం. జాంబవతి గానీ, రుక్మిణి గాని, నీ అంతగా నాకు ఇష్టమైనవారు కాదు' అని నాకు ప్రియమైన మాటలు చాలసార్లు చెప్పావు.

సత్యం తద్యది గోవిన్ద నోపచారకృతం వచః ।
తదస్తు పారిజాతోఽయం మమ గేహవిభూషణమ్ ॥ 32 ॥

గోవిందా! ఆ మాట నిజమే అయితే, మాటవరసకు చెప్పిన ఇచ్చకపు మాట కాకపోతే, ఈ పారిజాతవృక్షం వెంటనే నా యింటిని అలంకరించాలి.

బిభ్రతీ పారిజాతస్య కేశపాశేన మఞ్జరీమ్ ।
సపత్నీనామహం మధ్యే శోభేయమితి కామయే ॥ 33 ॥

నా క్రొమ్ముడిలో ఈ పారిజాతపు పూలమాలను అలంకరించుకుని, సవతుల నడుమ నేను గొప్పగా వెలిగిపోవాలి అని కోరికగా ఉన్నది.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్తః స ప్రహస్యైవం పారిజాతం గరుత్మతి ।
ఆరోపయామాస హరిస్తమూచుర్వనరక్షిణః ॥ 33 ॥

ఈ సత్యభామ మాటలు విని, కృష్ణుడు ఒక నవ్వు నవ్వి, ఆ పారిజాతవృక్షాన్ని పెరికి గరుత్మంతుడి మీది కెక్కించాడు. అప్పుడు అక్కడి తోటమాలులు శ్రీకృష్ణుడితో ఇలా అన్నారు.

వనపాలా ఊచుః :–కృష్ణుడితో వనపాలకులు ఇలా అంటున్నారు.

భోః శచీ దేవరాజస్య మహిషీ తత్పరిగ్రహమ్ ।
పారిజాతం న గోవిన్ద హర్తుమర్హసి పాదపమ్ ॥ 34 ॥

అయ్యా! దేవేంద్రుడి పట్టపురాణి శచీదేవి. ఈ పారిజాతవృక్షం ఆమె సొత్తు. కృష్ణా! ఈ చెట్టును అపహరించడం నీకు తగదు.

శచీవిభూషణార్థాయ దేవైరమృతమన్థనే ।
ఉత్పాదితోఽయం న క్షేమీ గృహీత్వైనం గమిష్యసి ॥ 35 ॥

అమృతంకోసం పాలసముద్రాన్ని చిలికే సమయంలో దేవతలు శచీదేవికి అలంకారం కోసం ఈ చెట్టును పుట్టించారు. దీనిని తీసుకుని నీవు క్షేమంగా వెళ్లలేవు.

మౌఢ్యాత్ ప్రార్థయసే క్షేమీ గృహీత్వైనం చ కో వ్రజేత్ ।
అవశ్యమస్య దేవేన్ద్రో వికృతిం కృష్ణ యాస్యతి ॥ 36 ॥

నువ్వు మూర్ఖంగా ఈ పారిజాతం చెట్టును తీసుకువెళ్దా మనుకుంటున్నావు. దీనిని తీసుకుని ఎవ్వడూ క్షేమంగా వెళ్లలేడు. కృష్ణా! ఈ పనివల్ల దేవేంద్రుడికి తప్పకుండా కోపం వస్తుంది.

వజ్రోద్యతకరం శక్రమనుయాస్యన్తి చామరాః ।
తదలం సకలైర్దేవైర్విగ్రహేణ తవాచ్యుత ॥
విపాకకటు యత్కర్మ న తచ్ఛంసన్తి పణ్డితాః ॥ 37 ॥

కోపంతో ఇంద్రుడు వజ్రాయుధాన్ని ధరించి వస్తుంటే, దేవత లందరూ తమతమ ఆయుధాలతో ఇంద్రుడి వెన్నంటి వస్తారు. కృష్ణా! దేవత లందరితోనూ విరోధం తెచ్చుకోవద్దు. చివరికి చేటు తెచ్చే పనిని వివేకులు మెచ్చరు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్తే తైరువాచైతాన్ సత్యభామాతికోపనా ॥ 38 ॥

సత్యభామోవాచ :-నందనవనపాలకులతో సత్యభామ ఇలా అంటున్నది.

కా శచీ పారిజాతస్య కో వా శక్రస్సురాధిపః ॥ 39 ॥

పారిజాతానికీ శచికీ సంబంధ మేమిటి? దేవతలకు రాజు కావచ్చు గాని (పారిజాతం సొంతం కావడానికి) ఇంద్రు డెవడు?

సామాన్యస్సర్వలోకానాం పారిజాతద్రుమోహ్యయమ్ ।
సముత్పన్నః పురా కస్మాదేకో గృహ్ణాతి వాసవః ॥ 40 ॥

ఈ పారిజాతం పూర్వం అమృతమథన సమయంలో పుట్టినదైతే, ఇది అందరికీ సంబంధించిన సామాన్యవస్తువు అవుతుంది. ఇంద్రుడు ఒక్కడే ఏవిధంగా తీసుకుంటాడు.

యథా సురా యథా చేన్దుర్యథా శ్రీర్వనరక్షిణః ।
సామాన్యస్సర్వలోకస్య ద్రుమోఽయం సిన్ధుసమ్భవః ॥ 41 ॥

తోటమాలులారా! పాలసముద్రంలో ఆనాడు పుట్టిన సుర ఎలాగో, చంద్రుడు ఎలాగో, సంపద ఎలాగో, ఈ పారిజాతవృక్షం కూడా అలాగే లోకంలో అందరికీ సమానంగా చెందుతుంది.

భర్తృబాహుమహాగర్వాద్రుణద్ధ్యేనమథో శచీ ।
తత్ కథ్యతాం ద్రుతం గత్వా పౌలోమ్యా వచనం మమ ॥ 42 ॥

తన మగడికి కండబలం ఉన్నదనే అహంకారంతో శచీదేవి ఈ పారిజాతవృక్షాన్ని తీసుకోకుండా అడ్డగిస్తుందేమో! అయితే, వెంటనే త్వరగా వెళ్లి, ఆ ఇంద్రుడి భార్యకు నా మాటగా ఇలా చెప్పండి.

సత్యభామా వదత్యేవం భర్తృగర్వోద్ధతాక్షరమ్ ।
యది త్వం దయితా భర్తుర్యది తస్య ప్రియా హ్యసి ॥
మద్భర్తుర్హరతో వృక్షం తత్కారయ నివారణమ్ ॥ 43 ॥

సమర్థుడైన భర్తను చూసుకుని సత్యభామ గర్వంగా ఈ మాటలు అంటున్నది. ఓ శచీ! నీవు నీ భర్తకు తగిన భార్యవైతే, నీ భర్తకు ఇష్టమైనదానివైతే, ఇదుగో నా భర్త ఈ పారిజాతవృక్షాన్ని అపహరించుకు పోతున్నాడు. చేతనైతే తీసుకెళ్లకుండా ఆపు.

జానామి తే పతిం శక్రం జానామి త్రిదశేశ్వరమ్ ।
పారిజాతం తథాప్యేనం మానుషీ హారయామి తే ॥ 44 ॥

నీ మగడిసంగతి నాకు తెలుసు. ఇంద్రుడు తెలుసు. అతడు దేవతలకు రాజు అనీ తెలుసు. అయినా మానవమాత్రురాలనైన నేను, మీ ఈ పారిజాతవృక్షాన్ని నా భర్తచేత అపహరించుకుని తీసుకుపోతున్నాను.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా అంటున్నాడు.

ఇత్యుక్తా రక్షిణో గత్వా శచ్యై ప్రోచుర్యథోదితమ్ ।
శచీచోత్సాహయామాస త్రిదశాధిపతిం పతిమ్ ॥ 45 ॥

సత్యభామ పలుకులు విని, వనపాలకులు శచీదేవి వద్దకు వెళ్లి సత్యభామ చెప్పిన మాటలు అన్నీయథాతథంగా విన్నవించారు. శచీదేవి కూడ దేవతలకు రాజైన తన భర్త ఇంద్రుడిని (సత్యభామ పైకి) రెచ్చగొట్టి పంపింది.

తతస్సమస్తదేవానాం సైన్యైః పరివృతో హరిమ్ ।
ప్రవృత్తః పారిజాతార్థమిన్ద్రో యోధయితుం ద్విజాః ॥ 46 ॥

విప్రులారా! అప్పుడు ఇంద్రుడు తన సైన్యాన్ని మొత్తాన్ని తోడు చేసుకుని, పారిజాతవృక్షం కోసం శ్రీకృష్ణుడితో యుద్ధం చేయడానికి సిద్ధపడ్డాడు.

తతః పరిఘనిస్త్రింశగదాశూల(ధ)వరాయుధాః ।
బభూవుస్త్రిదశాస్సజ్జాశ్శక్రే వజ్రకరే స్థితే ॥ 47 ॥

ఇంద్రుడు చేత వజ్రాయుధం ధరించి నిలువగా, దేవతలు అందరూ ఇనుపగుదియ, ఖడ్గం, గద, శూలం మొదలైన శ్రేష్ఠమైన ఆయుధాలను ధరించి, యుద్ధానికి సిద్ధమైనారు.

తతో నిరీక్ష్య గోవిన్దో నాగరాజోపరి స్థితమ్ ।
శక్రం దేవపరీవారం యుద్ధాయ సముపస్థితమ్ ॥ 48 ॥

అప్పుడు కృష్ణస్వామి ఐరావతం మీద ఎక్కి కూర్చున్న దేవేంద్రుడినీ, యుద్ధానికి సిద్ధమై వచ్చిన దేవతల దండునూ పరికించాడు.

చకార శఙ్ఖనిర్ఘోషం దిశశ్శబ్దేన పూరయన్ ।
ముమోచ చ శరవ్రాతం సహస్రాయుతసమ్మితమ్ ॥ 49 ॥

పాంచజన్య శంఖాన్ని గట్టిగా పూరించాడు. ఆ శంఖధ్వనితో దిక్కులు పిక్కటిల్లాయి. వేలు, పదివేల సంఖ్యలో బాణాలను గుంపులుగా దేవతలపై ప్రయోగించాడు.

తతో దిశో నభశ్చైవ దృష్ట్వా శరశతాన్వితమ్ ।
ముముచుస్త్రిదశాస్సర్వే శస్త్రాణ్యస్త్రాణ్యనేకశః ॥ 50 ॥

అప్పుడు అన్ని దిక్కులూ, ఆకాశమూ, వందలకొద్దీ బాణాలతో నిండిపోవడం చూసి, దేవతలు కూడ తమతమ ఆయుధాలను అనేకంగా కృష్ణుడిపై ప్రయోగించారు.

ఏకైకమస్త్రం శస్త్రం చ దేవైర్ముక్తం సహస్రధా ।
చిచ్ఛేద లీలయైవేశో జగతాం మధుసూదనః ॥ 51 ॥

జగన్నాథుడైన శ్రీకృష్ణుడు దేవతలు ప్రయోగించిన ఒక్కొక్క అస్త్రాన్నీ, శస్త్రాన్నీ అవలీలగా వేలకొద్ది ముక్కలుగా నరికి పడేశాడు.

పాశం సలిలరాజస్య సమాకృష్యోరగాశనః ।
చచాల ఖణ్డశః కృత్వా బాలపన్నగదేహవత్ ॥ 52 ॥

వరుణుడు ప్రయోగించిన పాశాయుధాన్ని గరుత్మంతుడు పిల్లపాము శరీరంలాగా ముక్కలు ముక్కలుచేశాడు.

యమేన ప్రహితం దణ్డం గదాప్రక్షేపఖణ్డితమ్ ।
పృథివ్యాం పాతయామాస భగవాన్ దేవకీసుతః ॥ 53 ॥

యముడు ప్రయోగించిన దండాయుధాన్ని దేవకి కుమారుడైన కృష్ణస్వామి తన గదతో ముక్కలు చేసి నేలమీద పడేశాడు.

శిబికాం చ ధనేశస్య చక్రేణ తిలశో విభుః ।
చకార శౌరిరర్కేన్దూ దృష్టిపాతహతౌజసౌ ॥ 54 ॥

శ్రీకృష్ణుడు కుబేరుడి పల్లకిని చక్రాయుధంతో నువ్వుగింజంత ముక్కలు చేశాడు. స్వామి చూపు పడగానే సూర్యచంద్రుల తేజస్సు నశించిపోయింది (స్వామి సూర్యచంద్రనేత్రుడు).

నీతోఽగ్నిశ్శతశో బాణైర్ద్రావితా వసవో దిశః ।
చక్రవిచ్ఛిన్నశూలాగ్రా రుద్రా భువి నిపాతితాః ॥ 55 ॥

శ్రీకృష్ణుడు ప్రయోగించిన బాణాలతో అగ్ని వందల ముక్కలైంది. అష్టవసువులు దిక్కులవెంట పరుగులు తీశారు. కృష్ణుడి చక్రాయుధం దెబ్బలకి తమ శూలాయుధాలు ముక్కలై పోవడంతో, పదకొండుమంది రుద్రులూ నేల గూలారు.

సాధ్యా విశ్వే చ మరుతో గన్ధర్వాశ్చైవ సాయకైః ।
శార్ఙ్గిణా ప్రేరితాస్సర్వే వ్యోమ్ని శాల్మలితూలవత్ ॥ 56 ॥

శ్రీకృష్ణుడు శార్ఙ్గం అనే వింటినుండి ప్రయోగించిన బాణాలతో సాధ్యులూ, విశ్వేదేవతలూ, మరుత్తులూ, గంధర్వులూ బూరుగుదూది పింజెలలాగా ఎగిరి ఆకాశంలో చెల్లాచెదురుగా పడ్డారు.

గరుడశ్చాపి వక్త్రేణ పక్షాభ్యాం చ నఖాఙ్కురైః ।
భక్షయన్నహనద్దేవానుపదేవాంస్తథా ఖగః ॥ 57 ॥

వాహనమైన గరుత్మంతుడు కూడా, ముక్కుతో పొడిచి తింటూ, రెక్కలతో, గోళ్ల కొనలతోనూ దేవతలనూ, రాక్షసులనూ సంహరించాడు.

తతశ్శరసహస్రేణ దేవేన్ద్రమధుసూదనౌ ।
పరస్పరం వవర్షాతే ధారాభిరివ తోయదౌ ॥ 58 ॥

ఆ తరువాత మేఘాలు నీటిధారలను కురిసినట్లుగా, దేవేంద్రుడూ, శ్రీకృష్ణుడూ ఇద్దరూ ఒకరిపై ఒకరు వేనవేల బాణాలను కురిపించుకున్నారు.

ఐరావతేన గరుడో యుయుధే తత్ర సఙ్కులే ।
దేవైస్సమేతైర్యుయుధే శక్రేణ చ జనార్దనః ॥ 59 ॥

ఆ దొమ్మియుద్ధంలో గరుత్మంతుడు ఐరావతంతో యుద్ధం చేశాడు. శ్రీకృష్ణుడు గుంపులుగా ఉన్న దేవతలతోనూ, ఇంద్రుడితోనూ యుద్ధం చేశాడు.

ఛిన్నేషు శీర్యమాణేషు శస్త్రేష్వస్త్రేషు సత్వరమ్ ।
జగ్రాహ వాసవో వజ్రం కృష్ణశ్చక్రం సుదర్శనమ్ ॥ 60 ॥

అన్ని విధాలైన ఆయుధాలు కూడా, ముక్కలై పోవడమూ, పొడి పొడైపోవడమూ చూసి, ఇంద్రుడు వేగంగా, వజ్రాయుధాన్ని తీసుకున్నాడు. వెంటనే కృష్ణుడు సుదర్శనం అనే తన చక్రాయుధాన్ని తీసుకున్నాడు.

తతో హాహాకృతం సర్వం త్రైలోక్యం సచరాచరమ్ ।
వజ్రచక్రధరౌ దృష్ట్వా దేవరాజజనార్దనౌ ॥ 61 ॥

వజ్రం ధరించిన ఇంద్రుడినీ, చక్రం ధరించిన కృష్ణుడినీ చూసి, స్థావర జంగమాత్మకమైన లోకాలు మూడూ ఒక్కసారిగా హాహాకారాలు చేశాయి.

క్షిప్తం వజ్రమథేన్ద్రేణ జగ్రాహ భగవాన్ హరిః ।
న ముమోచ తదా చక్రం తిష్ఠతిష్ఠేతి చాబ్రవీత్ ॥ 62 ॥

ఇంద్రుడు ప్రయోగించిన వజ్రాయుధాన్ని శ్రీకృష్ణుడు పట్టుకున్నాడు. కృష్ణుడు ప్రయోగించిన చక్రాయుధం ఇంద్రుడిని విడువకుండా వెంటబడి, 'ఆగు, పారిపోకు, ఆగు' అంటూ అరిచింది.

ప్రనష్టవజ్రం దేవేన్ద్రం గరుడక్షతవాహనమ్ ।
సత్యభామాఽబ్రవీద్ వాక్యం పలాయనపరాయణమ్ ॥ 63 ॥

వజ్రాయుధం కృష్ణుడిచేతికి చిక్కగా, ఇంద్రుడు నిరాయుధుడైనాడు. ఇంద్రుడి వాహనమైన ఐరావతాన్ని గరుత్మంతుడు బాగా గాయపరిచాడు. వెనక్కు తిరగకుండా, పారిపోతున్న ఇంద్రుడిని చూసి, సత్యభామ ఇలాఅన్నది.

సత్యభామోవాచ :-ఇంద్రుడితో సత్యభామ ఇలా అంటున్నది.

త్రైలోక్యేశ్వర నో యుక్తం శచీభర్తుః పలాయనమ్ ।
పారిజాతస్రగాభోగాత్ త్వాముపస్థాస్యతే శచీ ॥ 64 ॥

మూడు లోకాలకూ అధిపతీ! శచీదేవి భర్తకు పారిపోవడం తగదు. పారిజాత మాలికలు అలంకరించుకుని శచీదేవి నీకోసం వస్తున్నది.

కీదృశం దేవరాజ్యం తే పారిజాతస్రగుజ్జ్వలామ్ ।
అపశ్యతో యథాపూర్వం ప్రణయాభ్యాగణం శచీమ్ ॥ 65 ॥

నీ దేవతలరాజ్యం ఎంత గొప్పది? ఈ పారిజాతమాలతో మెరిసిపోతూ, శచీదేవి నీమీద ప్రేమతో మునపటిలాగా నీకోసం ఎదురు వస్తూంటే ఆమెను కనీసం చూడనైనా చూడకుండా వెళ్లిపోవడం సరికాదు.

అలం శక్ర ప్రయాసేన న వ్రీడాం యాతుమర్హసి ।
నీయతాం పారిజాతోఽయం దేవాస్సన్తు గతవ్యథాః ॥ 66 ॥

ఇంద్రా! కష్టపడింది చాలు. సిగ్గుపడిపోకు. ఇదుగో పారిజాతవృక్షాన్ని తీసుకునిపో. దేవతలు బాధపడ కుందురు గాక.

అతిగర్వావలేపేన బహుమానపురస్సరమ్ ।
న దదర్శ గృహాయాతాముపచారేణ మాం శచీ ॥ 67 ॥

నేను ఇంటికి వస్తే నీ భార్య శచీదేవి నన్ను గౌరవంగా చూడలేదు. నీవు గొప్ప బలవంతుడివని ఆమెకు గర్వం ఎక్కువ.

స్త్రీత్వాదగురుచిత్తాహం స్వభర్తుః శ్లాఘనాపరా ।
తతః కృతవతీ శక్ర భవతా సహ విగ్రహమ్ ॥ 68 ॥

ఇంద్రా! ఆడుదానిని కావడంచేత, నేను గొప్పమనసు లేనిదానిని. నా భర్తను గొప్పగా పొగడుకుంటాను. అందుచేతనే నీతో విరోధం పెట్టుకున్నాను.

తదలం పారిజాతేన పరస్వేన హృతేన వా ।
రూపేణ యశసా చైవ భవేత్ స్త్రీ కా న గర్వితా ॥ 69 ॥

పరుల సొమ్మైన పారిజాతం నాకు దక్కకపోయినా, నీవు తీసుకుని వెళ్లినా, బాధ లేదు. అందం కారణంగానూ, పేరుప్రతిష్ఠల మూలంగానూ ఆడది సామాన్యంగా గర్వపడుతుంటుంది.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్తే వై నివవృతే దేవరాజస్తథా ద్విజాః ।
ప్రాహ చైనామలం చణ్డి సఖి ఖేదాతివిస్తరైః ॥ 70 ॥

విప్రులారా! సత్యభామ పలుకులు విని, దేవేంద్రుడు సమాధానపడ్డాడు. అమ్మాయీ! కోపంతో బాధపడకు.

న చాపి సర్గసంహారస్థితికర్తాఖిలస్య యః ।
జితస్య తేన మే వ్రీడా జాయతే విశ్వరూపిణా ॥ 71 ॥

సృష్టి, స్థితి, లయాలు చేసేవాడు, సమస్తమూ తానే అయినవాడూ, అయిన కృష్ణపరమాత్మ చేతిలో ఓడినందుకు నాకు ఎంత మాత్రమూ అవమానం, బాధ కలగడం లేదు.

యస్మిఞ్జగత్ సకల మేతదనాదిమధ్యే
యస్మాద్యతశ్చ న భవిష్యతి సర్వభూతాత్ ।
తేనోద్భవప్రలయపాలనకారణేన
వ్రీడా కథం భవతి దేవి నిరాకృతస్య ॥ 72 ॥

ఈ స్వామి మొదలూ నడుమా (చివరా) లేనివాడు. ఈ జగత్తు సమస్తమూ ఇతడిలోనే నిలిచిఉన్నది. జగత్తు సమస్తమూ ఇతడి మూలంగానే ఏర్పడుతున్నది. ఇతడినుండే వెలువడుతున్నది. ఇతడే జగత్తును సృష్టిస్తాడు. లయం చేస్తాడు. తానే కాపాడుతాడు. అటువంటి పరమాత్మచేతిలో ఓడినవాడికి అవమానం ఎందుకు కలుగుతుంది?

సకలభువనమూర్తిర్మూర్తిరల్పా సుసూక్ష్మా
విదితసకలవేదైర్జ్ఞాయతే యస్య నాన్యైః ।
తమజమకృతమీశం శాశ్వతం స్వేచ్ఛయైనం
జగదపకృతిమాద్యం కో విజేతుం సమర్థః ॥ 73 ॥

సమస్తమైన లోకాలూ ఈ స్వామి స్వరూపమే. ఇతడి ఆకారం చాలా చిన్నది. ఇంకా సూక్ష్మమైనది. సమస్తమైన వేదాలు ఇతడిని గురించి తెలియజేస్తున్నాయి. వేదాలు తప్ప మరొకదానితో ఇతడిని తెలుసుకోలేము. అటువంటి – పుట్టుక లేనివాడు, ఇతరులచే ఏర్పడనివాడు, అన్నింటికీ ప్రభువూ, ఎల్లకాలమూ ఉండేవాడూ, లోకాలకు మేలు చేసేవాడూ, సృష్టిమొత్తానికి ముందే ఉన్నవాడూ, అయిన ఈ మహానుభావుడిని తన యిష్టం ప్రకారం జయించడం ఎవ్వడివల్లా కాదు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే పారిజాతహరణే శక్రస్తవనిరూపణం నామ చతుర్నవతితమోఽధ్యాయః ॥ 94 ॥

శ్రీబ్రహ్మపురాణంలో పారిజాతహరణంలో శక్రస్తవనిరూపణం అనే తొంబైనాల్గవ అధ్యాయం సంపూర్ణం.



పఞ్చనవతితమోఽధ్యాయః - తొంబైఐదవ అధ్యాయం

షోడశసహస్రైకశతస్త్రీవివాహకరణమ్ - పదహారువేల నూరుమంది కన్యలను వివాహంచేసుకోవడం

వ్యాస ఉవాచ :- మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

సంస్తుతో భగవానిత్థం దేవరాజేన కేశవః ।
ప్రహస్య భావగమ్భీరమువాచేదం ద్విజోత్తమాః ॥ 1 ॥

విప్రవరేణ్యులారా! దేవతలకు రాజైన ఇంద్రుడు ఈవిధంగా స్తుతించగా, శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వి, లోతైన అర్థంతో ఇలా అన్నాడు.

శ్రీభగవానువాచ :-ఇంద్రుడితో శ్రీకృష్ణుడు ఇలా చెప్తున్నాడు.

దేవరాజో భవానిన్ద్రో వయం మర్త్యా జగత్పతే ।
క్షన్తవ్యం భవతైవైతదపరాధకృతం మమ ॥ 2 ॥

లోకేశ్వరా! నీవు దేవతలకు రాజువి. ఇంద్రుడివి. మేము మానవమాత్రులం. అందుచేత తెలియక నీ విషయంలో అపరాధం చేశాం. మా తప్పు నీవే మన్నించాలి.

పారిజాతతరుశ్చాయం నీయతాముచితాస్పదమ్ ।
గృహీతోఽయం మయా శక్ర సత్యావచనకారణాత్ ॥ 3 ॥

ఈ పారిజాతవృక్షాన్ని తీసుకుని వెళ్లు. ఇది మీదగ్గర ఉండడమే ఉచితం. సత్యభామ మాటల మూలంగా దీనిని నేను స్వీకరించాను.

వజ్రం చేదం గృహాణ త్వం యన్మయి ప్రహితం త్వయా ।
తవైవైతత్ ప్రహరణం శక్రవైరివిదారణమ్ ॥ 4 ॥

ఇంద్రా! నీవు నా మీద ప్రయోగించిన ఈ వజ్రాయుధాన్ని కూడ నీవే తీసుకో. శత్రువులను చీల్చివేసే ఈ వజ్రం నీదే.

శక్ర ఉవాచ :-కృష్ణుడితో ఇంద్రుడు ఈవిధంగా అంటున్నాడు.

విమోహయసి మామీశ మర్త్యోఽహమితి కిం వదన్ ।
జానీమస్త్వాం భగవతోఽనన్తసౌఖ్యవిదో వయమ్ ॥ 5 ॥

దేవా! నేను మానవుడిని అని చెప్పి నీవు నన్ను మోహంలో పడేస్తున్నావేమి? భగవంతుడివైన నీవలన అంతులేని సుఖాలను పొందిన మేము నిన్ను ఎరుగుదుము.

యోఽసి సోఽసి జగన్నాథ ప్రవృత్తౌ నాథ సంస్థితః ।
జగతశ్శల్యనిష్కర్షం కరోష్యసురసూదన ॥ 6 ॥

దైత్యమర్దనా! జగన్నాథా! నీవు ఎవ్వరో అతడే అగుదువు. అయినా, ప్రస్తుతం ఈవిధంగా మానవరూపం ధరించి, లోకరక్షణం పనిలో ఉన్నావు. లోకాలను బాధించేవారిని నిర్మూలిస్తున్నావు.

నీయతాం పారిజాతోఽయం కృష్ణ ద్వారవతీం పురీమ్ ।
మర్త్యలోకే త్వయా ముక్తే నాయం సంస్థాస్యతే భువి ॥ 7 ॥

శ్రీకృష్ణస్వామీ! ఈ పారిజాతవృక్షాన్ని మీ ద్వారకా నగరానికి తీసుకుని వెళ్లు. నీవు మానవ లోకాన్ని విడిచి వెళ్లిన తరువాత ఈ పారిజాత వృక్షం భూమిమీద ఉండదు. (దేవలోకానికి తిరిగి వస్తుంది.)

వ్యాస ఉవాచ :- మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

తథేత్యుక్త్వా తు దేవేన్ద్రమాజగామ భువం హరిః ।
ప్రయుక్తైస్సిద్ధగన్ధర్వైః స్తూయమానస్త్వథర్షిభిః ॥ 8 ॥

ఇంద్రుడితో అలాగే నన్నాడు. సిద్ధులు, గంధర్వులు, మహర్షులు స్తోత్రాలు చేస్తుండగా, శ్రీకృష్ణుడు భూలోకానికి తిరిగి వచ్చాడు.

జగామ కృష్ణస్సహసా గృహీత్వా పాదపోత్తమమ్ ।
తతశ్శఙ్ఖముపాధ్మాయ ద్వారకోపరి సంస్థితః ॥ 9 ॥

పారిజాత వృక్షాన్ని తీసుకుని శ్రీకృష్ణుడు వేగంగా ద్వారకా నగరానికి వెళ్లాడు. ద్వారకపైనుండి పాంచజన్య శంఖాన్ని పూరించాడు.

హర్షముత్పాదయామాస ద్వారకావాసినాం ద్విజాః ।
అవతీర్యాథ గరుడాత్ సత్యభామాసహాయవాన్ ॥ 10 ॥

విప్రులారా! సత్యభామతో కూడి గరుత్మంతుడి మీదనుంచి ద్వారకలో దిగి, శ్రీకృష్ణుడు ద్వారకా నగర వాసులందరినీ ఆనందపెట్టాడు.

నిష్కుటే స్థాపయామాస పారిజాతం మహాతరుమ్ ।
యమభ్యేత్య జనస్సర్వో జాతిం స్మరతి పౌర్వికీమ్ ॥
వాస్యతే యస్య పుష్పాణాం గన్ధేనోర్వీ త్రియోజనమ్ ॥ 11 ॥

తాను తెచ్చిన పారిజాతవృక్షాన్ని సత్యభామ పెరటిలో నాటించాడు. ద్వారకానగర వాసులందరూ ఆ వృక్షం వద్దకు వెళ్లి, తమతమ పూర్వజన్మస్మృతి పొందుతున్నారు. ఆ పారిజాతం చెట్టుకు పూసిన పూలు మూడు యోజనాల దూరం వరకు సువాసనలు వెదజల్లుతున్నాయి.

తతస్తే యాదవాస్సర్వే దేవగన్ధానమానుషాన్ ।
దదృశుః పాదపే తస్మిన్ కుర్వతో ముఖదర్శనమ్ ॥ 12 ॥

అద్దంలోలాగా ఆ పారిజాతవృక్షంలో తమ ముఖాన్ని చూసుకుంటూన్న దేవజాతికి చెందిన వారినీ, మానవా తీతులనూ యాదవులందరూ చూశారు.

కిఙ్కరైస్సముపానీతం హస్త్యశ్వాది తతో ధనమ్ ।
స్త్రియశ్చ కృష్ణో జగ్రాహ నరకస్య పరిగ్రహాత్ ॥13॥

నరకుడు పోగుచేసిన సంపదలనుండి, తమ సేవకులు తీసుకుని వచ్చిన ఏనుగులూ, గుఱ్ఱాలూ, మొదలైన వాటినీ, ధనసంపదలనూ, స్త్రీలనూ శ్రీకృష్ణుడు స్వీకరించాడు.

తతః కాలే శుభే ప్రాప్త ఉపయేమే జనార్దనః ।
తాః కన్యా నరకావాసాత్ సర్వతో యాస్సమాహృతాః ॥ 14 ॥

నరకుడు భూమండలం మొత్తం నుండి తెచ్చి, అంతఃపురంలో బంధించిన కన్యలను ఒకానొక శుభ ముహూర్తంలో శ్రీకృష్ణుడు వివాహమాడాడు.

ఏకస్మిన్నేవ గోవిన్దః కాలేనాసాం ద్విజోత్తమాః ।
జగ్రాహ విధివత్ పాణీన్ పృథగ్గేహే స్వధర్మతః ॥ 15 ॥

విప్రవరులారా! శ్రీకృష్ణుడు సంప్రదాయానికి అనుగుణంగా శాస్త్రోక్తమైన పద్ధతిలో ఆ కన్యలందరినీ, అన్ని రూపాలు ధరించి, ఒకే ముహూర్తంలో వివాహం చేసుకున్నాడు.

షోడశ స్త్రీసహస్రాణి శతమేకం తథాధికమ్ ।
తావన్తి చక్రే రూపాణి భగవాన్ మధుసూదనః ॥ 16 ॥

పదహారువేల నూరుమంది కన్యలను వివాహం చేసుకోవడానికి శ్రీకృష్ణభగవానుడు పదహారువేల నూరుమంది కృష్ణుల రూపాలు ధరించాడు.

ఏకైకశశ్చ తాః కన్యా మేనిరే మధుసూదనమ్ ।
మమైవ పాణిగ్రహణం గోవిన్దః కృతవానితి ॥ 17 ॥

దానివల్ల ఆ కన్యలందరూ ఎవరికి వారు కృష్ణుడు తనను ఒక్కదానినే పాణిగ్రహణం చేస్తున్నాడని భావించారు.

నిశాసు జగతస్స్రష్టా తాసాం గేహేషు కేశవః ।
ఉవాస విప్రాస్సర్వాసాం విశ్వరూపధరో హరిః ॥ 18 ॥

లోకాలన్నింటినీ సృష్టించేవాడు, జగత్తు సమస్తం తన రూపమే అయిన శ్రీకృష్ణుడు రాత్రివేళలలో ఆ కన్యలందరి ఇండ్లలోనూ నివసించాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే శ్రీకృష్ణచరితే షోడశసహస్రైకశతస్త్రీవివాహకరణం నామ పఞ్చనవతితమోఽధ్యాయః॥95॥

శ్రీబ్రహ్మపురాణంలో శ్రీకృష్ణచరితలో పదహారువేల నూరుమంది కన్యలను వివాహం చేసుకోవడం అనే తొంబైఐదవ అధ్యాయం సంపూర్ణం.

షణ్ణవతితమో ఽధ్యాయః - తొంబైఆరవ అధ్యాయం

బాణయుద్ధోపాఖ్యానమ్ - బాణయుద్ధోపాఖ్యానం

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

ప్రద్యుమ్నాద్యా హరేః పుత్రా రుక్మిణ్యాం కథితా ద్విజాః ।
భాన్వాదికాంశ్చ వై పుత్రాన్ సత్యభామా వ్యజాయత ॥ 1 ॥

విప్రులారా! శ్రీకృష్ణుడికి రుక్మిణీదేవివలన ప్రద్యుమ్నుడు మొదలైన కుమారులు కలిగారని చెప్పాను గదా. సత్యభామకు భానుడు మొదలైన కుమారులు జన్మించారు.

దీప్తిమన్తః ప్రపక్షాద్యా రోహిణ్యాస్తనయా హరేః ।
బభూవుర్జామ్బవత్యాశ్చ సామ్బాద్యా బాహుశాలినః ॥ 2 ॥

శ్రీకృష్ణుడికి రోహిణియందు తేజస్సులైన ప్రపక్షుడు మొదలైన కుమారులు కలిగారు. భుజబలవంతులైన సాంబుడు మొదలైనవారు జాంబవతికి జన్మించారు.

తనయా భద్రవిన్దాద్యా నాగ్నజిత్యాం మహాబలాః ।
సఙ్గ్రామజిత్ ప్రధానాస్తు శైబ్యాయాం చాభవన్ సుతాః ॥ 3 ॥

మిగుల బలవంతులైన భద్రవిందుడు మొదలైన కుమారులు శ్రీకృష్ణుడికి నాగ్నజితివలన జన్మించారు. శైబ్యకు సంగ్రామజిత్తు మొదలైన కుమారులు కలిగారు.

వృకాద్యాస్తు సుతా మాద్రీ గాత్రవత్ ప్రముఖాన్ సుతాన్ ।
అవాప లక్ష్మణా పుత్రాన్ కాలిన్ద్యాశ్చ శ్రుతాదయః ॥ 4 ॥

వృకుడు మొదలైనవారు మాద్రి కుమారులు. లక్ష్మణకు గాత్రవంతుడు మొదలైన కుమారులు కలిగారు. కాళిందికి శ్రుతుడు మొదలైన కొడుకులు పుట్టారు.

అన్యాసాం చైవ భార్యాణాం సముత్పన్నాని చక్రిణః ।
అష్టాయుతాని పుత్రాణాం సహస్రాణి శతం తథా ॥ 5 ॥

ఇంకా ఇతర భార్యలందు శ్రీకృష్ణుడికి ఒకలక్షా (శతసహస్రం) యెనభైవేలమంది (అష్టాయుతం) కుమారులు కలిగారు.

ప్రద్యుమ్నః ప్రథమస్తేషాం సర్వేషాం రుక్మిణీసుతః ।
ప్రద్యుమ్నాదనిరుద్ధోఽభూద్ వజ్రస్తస్మాదజాయత ॥ 6 ॥

వారందరిలోనూ రుక్మిణి కుమారుడైన ప్రద్యుమ్నుడు మొట్టమొదటివాడు. ప్రద్యుమ్నుడికి అనిరుద్ధుడు జన్మించాడు. అనిరుద్ధుడికి వజ్రుడు పుట్టాడు.

అనిరుద్ధో రణేఽ రుద్ధో బలేః పౌత్రీం మహాబలః ।
బాణస్య తనయాముషాముపయేమే ద్విజోత్తమాః ॥ 7 ॥

బ్రాహ్మణోత్తములారా! యుద్ధరంగంలో అనిరుద్ధుడిని అడ్డుకోవడం ఎవ్వరికీ సాధ్యం కాదు. మిక్కిలి బలవంతుడైన అతడు బలిచక్రవర్తి మనుమరాలు, బాణాసురుడి కుమార్తె అయిన ఉషను పెళ్లిచేసుకున్నాడు.

యత్ర యుద్ధమభూద్ ఘోరం హరిశఙ్కరయోర్మహత్ ।
ఛిన్నం సహస్రం బాహూనాం యత్ర బాణస్య చక్రిణా ॥ 8 ॥

ఆ సందర్భంలో శ్రీకృష్ణుడికీ శివుడికీ బ్రహ్మాండమైన యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో కృష్ణుడు బాణాసురుడి వేయి బాహువులను నరికివేశాడు.

మునయ ఊచుః :-వ్యాసమహర్షితో మునులు ఇలా అంటున్నారు.

కథం యుద్ధమభూద్ బ్రహ్మన్నుషార్థం హరకృష్ణయోః ।
కథం క్షయం చ బాణస్య బాహూనాం కృతవాన్ హరిః ॥ 9 ॥

బ్రహ్మర్షీ! ఉషగురించి, శివకేశవులకు యుద్ధం ఎందుకు జరిగింది? అప్పుడు కృష్ణుడు బాణుడి చేతులను ఎలా నరికివేశాడు?

ఏతత్ సర్వం మహాభాగ వక్తుమర్హసి నోఽ ఖిలమ్ ।
మహత్కౌతూహలం జాతం శ్రోతుమేతాం కథాం శుభామ్ ॥ 10 ॥

మహానుభావా! ఈ సంగతులన్నీ సమగ్రంగా నీవే చెప్పగలవు. శుభప్రదమైన ఈ కథ వినాలని మాకు చాల ఉత్కంఠ కలుగుతున్నది.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఉషా బాణసుతా విప్రాః పార్వతీం శమ్భునా సహ ।
క్రీడన్తీముపలక్ష్యోచ్చైః స్పృహాం చక్రే తదా స్వయమ్ ॥ 11 ॥

ద్విజులారా! బాణుడి కూతురు ఉష. ఒకసారి పార్వతి పరమేశ్వరుడితో కలిసి విహరిస్తుండగా ఉష చూసింది. తాను కూడ పార్వతిలాగా సుఖించా లనుకున్నది.

తతస్సకలచిత్తజ్ఞా గౌరీ తామాహ భామినీమ్ ।
అలమత్యనుతాపేన భర్త్రా త్వమపి రంస్యసే ॥ 12 ॥

అందరి మనసు తెలిసిన పార్వతి ఉష కోరిక గ్రహించి, ఆమెతో ఇలా అన్నది. అమ్మాయీ! బాధ పడవద్దు. నీవు కూడా నీ భర్తతో క్రీడిస్తావు.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్తా సా తదా చక్రే కదేతి మతిమాత్మనః ।
కో వా భర్తా మమేత్యేనాం పునరప్యాహ పార్వతీ ॥ 13 ॥

పార్వతి మాటలు విని ఉష మనసులో అది ఎప్పుడు జరుగుతుందో అనుకుంది. నా భర్త ఎవరు? అనుకుంటున్న ఉషతో పార్వతి మళ్లీ ఇలా అన్నది.

పార్వత్యువాచ :–ఉషతో పార్వతి ఇలా చెప్తున్నది.

వైశాఖే శుక్లద్వాదశ్యాం స్వప్నే యోఽభిభవం తవ ।
కరిష్యతి స తే భర్తా రాజపుత్రి భవిష్యతి ॥ 14 ॥

'రాకుమారీ, వైశాఖమాసంలో శుక్లపక్షంలో ద్వాదశినాడు కలలో నీ మానమును గొన్నవాడు నీకు భర్త అవుతాడు' (అన్నది).

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

తస్యాం తిథౌ పుమాన్ స్వప్నే యథా దేవ్యా ఉదీరితః ।
తథైవాభిభవం చక్రే రాగం చక్రే చ తత్ర సా ॥
తతః ప్రబుద్ధా పురుషం నాపశ్యత్ సా తముత్సుకా ॥ 15 ॥

పార్వతీదేవి చెప్పిన విధంగానే ఆ తిథినాడు ఒకానొక పురుషుడు కలలో ఉషను మానభంగం చేశాడు. అప్పుడు ఆమెకు అతడిపై అనురాగం కలిగింది. ఆ తరువాత ఉషకు మెలకువ వచ్చింది. కుతూహలంగా ఆ పురుషుడికోసం చూసింది, కాని అతడు మళ్లీ కనిపించలేదు.

ఉషోవాచ :–కలలో కనిపించిన పురుషుడితో ఉష ఇలా అంటున్నది.

క్వ గతోఽసీతి నిర్లజ్జా ద్విజాశ్చోక్తవతీ సఖీమ్ ।
బాణస్య మన్త్రీ కుమ్భాణ్డశ్చిత్రలేఖా తు తత్సుతా ॥ 16 ॥

విప్రులారా! అప్పుడు ఉష 'ఎక్కడికి వెళ్లావు' అని కలలోని పురుషుడిని గురించి చెలికత్తెతో పలికింది. ఈమె బాణుడి మంత్రి కుంభాండుని కుమార్తె అయిన చిత్రలేఖ.

తస్యాస్సఖ్యభవత్ సా చ ప్రాహ కోఽయం త్వయోచ్యతే ।
యదా లజ్జాకులా నాస్యై కథయామాస సా సఖీ ॥ 17 ॥

ఆమె ఉషకు చెలికత్తె. ఆ చిత్రలేఖ ఉషతో 'ఎవ్వరిని గురించి నీవు మాట్లాడేది? అని అడిగింది. అప్పుడు సిగ్గుతో కలవరపడిన ఉష చెలికత్తెకు ఏమీ చెప్పలేదు.

తదా విశ్వాసమానీయ సర్వ మేవాశృణోద్ వచః ।
విదితాయాం తు తామాహ పునరూషా యథోదితమ్ ॥
దేవ్యా తథైవ తత్ప్రాప్తౌ యోఽభ్యుపాయః కురు ద్రుతమ్ ॥ 18 ॥

ఉషకు తనపై నమ్మకం కలిగే విధంగా మాట్లాడింది. (ఎవ్వరికీ చెప్పదనే) నమ్మకం కలిగిన తరువాత ఉష తన స్వప్నవృత్తాంతం అంతా చిత్రలేఖకు చెప్పింది. తన సంగతులు తెలిసిన చెలికత్తెతో ఉష పార్వతీదేవి మాటలతో సహా అంతకు పూర్వం జరిగిన వృత్తాంతం అంతా చెప్పింది. పిదప 'కలలో కన్పించిన ఆ పురుషుడిని పొందే మార్గం చూడ' మన్నది.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

తతః పటే సురాన్ దైత్యాన్ గన్ధర్వాంశ్చ ప్రధానతః ।
మనుష్యాంశ్చాభిలిఖ్యాసౌ చిత్రలేఖాప్యదర్శయత్ ॥ 19 ॥

అప్పుడు చిత్రలేఖ ఒకవస్త్రం మీద దేవతలు, రాక్షసులు, గంధర్వులు, ప్రఖ్యాతులైన మానవుల బొమ్మలను చక్కగా గీసి, ఉషకు చూపింది.

అపాస్య సా తు గన్ధర్వాన్ స్తథోరగసురాసురాన్ ।
మనుష్యేషు దదౌ దృష్టిం తేష్వప్యన్ధకవృష్ణిషు ॥ 20 ॥

ఆ చిత్రాలలో గంధర్వులు, నాగులు, దేవతలు, రాక్షసులను దాటి, ఉష మానవులపైనా, అందులోనూ అంధక వృష్ణివంశం వారిమీద చూపు నిలిపింది.

కృష్ణరామౌ విలోక్యాసీత్ సుభ్రూర్లజ్జావతీ తదా ।
ప్రద్యుమ్నదర్శనే వ్రీడాదృష్టిం నిన్యే తతో ద్విజాః ॥ 21 ॥

విప్రులారా! వారిలో బలరాముడినీ, కృష్ణుడినీ చూసి, ఆ సుందరాంగి కొంచెం సిగ్గుపడింది. ఆ తరువాత ప్రద్యుమ్నుడిని చూసే సమయంలో ఉష చూపులో సిగ్గు మరీ ఎక్కువైంది.

దృష్టమాత్రే తతః కాన్తే ప్రద్యుమ్నతనయే తదా ।
సోఽయం సోఽయం మమేత్యుక్తే తయా సా యోగగామినీ ॥
యయౌ ద్వారవతీమూషాం సమాశ్వాస్య తతస్సఖీమ్ ॥ 22 ॥

ఆ తరువాత ప్రద్యుమ్నుడి కుమారుడైన అనిరుద్ధుడిని చూచిన వెంటనే 'వీడు వాడే. వాడే వీడు. నా వాడు'. అన్నది. ఆ మాటలు విని చిత్రలేఖ ఉషకు (అతడిని తీసుకువస్తానని) ధైర్యం చెప్పి, యోగమార్గంలో ద్వారకానగరానికి వెళ్లింది.

ఇతి శ్రీబ్రహ్మపురాణే బాణయుద్ధోపాఖ్యానం నామ షణ్ణవతితమోఽధ్యాయః ॥ 96 ॥

శ్రీబ్రహ్మపురాణంలో బాణయుద్ధోపాఖ్యానం అనే తొంబైఆరవ అధ్యాయం సంపూర్ణం.

సప్తనవతితమోఽధ్యాయః - తొంబైఏడవ అధ్యాయం

ఉషానిరుద్ధానయనమ్ - ఉషానిరుద్ధానయనం

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

బాణోఽపి ప్రణిపత్యాగ్రే తతశ్చాహ త్రిలోచనమ్ ।
దేవ బాహుసహస్రేణ నిర్విణ్ణోఽహం వినాఽఽహవమ్ ॥ 1 ॥

బాణుడు పరమేశ్వరుడికి ఎదురుగా సాష్టాంగపడి, నమస్కారం చేశాడు. తరువాత శివుడితో ఇలా అన్నాడు. 'మహాదేవా! వేయి బాహువులు ఉండి కూడ ఒక్క యుద్ధం కూడ లేకపోవడంచేత నాకు దిగులుగా ఉంది.

క్వచిన్మమైషాం బాహూనాం సాఫల్యకరణో రణః ।
భవిష్యతి వినా యుద్ధం భారాయ మమ కిం భుజైః ॥ 2 ॥

నాకు ఇన్ని బాహువులు ఉన్నందుకు ప్రయోజనం కలిగించే గొప్ప యుద్ధం ఎప్పుడు కలుగుతుంది అటువంటి యుద్ధం లేకుండా, ఈ బాహువులు నాకు కేవలం మోయలేని బరువే తప్ప, వీటివల్ల లాభం ఏమున్నది?

శఙ్కర ఉవాచ :-బాణాసురుడితో పరమేశ్వరుడు ఇలా చెప్తున్నాడు.

అపూర్వధ్వజభఙ్గస్తే యదా బాణ భవిష్యతి ।
పిసితాశిజనానన్దం ప్రాప్స్యసి త్వం తదా రణమ్ ॥ 3 ॥

బాణాసురా! ఆశ్చర్యకరమైన నీ ధ్వజం ఎప్పుడు కూలిపోతుందో, అప్పుడు మాంసం తినే జంతువులకు ఆనందం కలిగించే మహత్తరమైన యుద్ధం నీకు సంభవిస్తుంది.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

తతః ప్రణమ్య ముదితశ్శమ్భుమభ్యాగతో గృహాన్ ।
భగ్నం ధ్వజమథాలోక్య హృష్టో హర్షం పరం యయౌ ॥ 4 ॥

అప్పుడు బాణుడు పరమేశ్వరుడికి ప్రణామం చేసి, ఇంటికి వచ్చాడు. అక్కడ తన జెండాకఱ్ఱ విరిగిపడి ఉండడం చూశాడు. యుద్ధం రాబోతున్నదని చాల సంతోషించాడు.

ఏతస్మిన్నేవ కాలే తు యోగవిద్యాబలేన తమ్ ।
అనిరుద్ధమథానిన్యే చిత్రలేఖా వరా సఖీ ॥ 5 ॥

అదే సమయంలో సమర్థురాలైన ఉష చెలికత్తె చిత్రలేఖ యోగశక్తితో అనిరుద్ధుడిని ఉష వద్దకు తీసుకుని వచ్చింది.

కన్యాన్తఃపురమధ్యే తం రమమాణం సహోషయా ।
విజ్ఞాయ రక్షిణో గత్వా శశంసుర్దైత్యభూపతేః ॥ 6 ॥

అనిరుద్ధుడు కన్యల అంతఃపురంలో ఉషతో క్రీడిస్తున్నాడు. అది తెలుసుకున్న అంతఃపుర రక్షకభటులు రాక్షసరాజైన బాణుడికి ఆ విషయం తెలియజేశారు.

వ్యాదిష్టం కిఙ్కరాణాం తు సైన్యం తేన మహాత్మనా ।
జఘాన పరిఘం లౌహమాదాయ పరవీరహా ॥ 7 ॥

బాణుడు సేవకులైన సైన్యాన్ని అనిరుద్ధుడిని శిక్షించమని ఆజ్ఞాపించాడు. శత్రువులను సంహరించే అనిరుద్ధుడు ఇనుపగుదియతో వారిని చంపివేశాడు.

హతేషు తేషు బాణోఽపి రథస్థస్తద్వధోద్ధతః ।
యుధ్యమానో యథాశక్తి యదా వీరేణ నిర్జితః ॥ 8 ॥

సేవకులు మరణించడంతో అనిరుద్ధుడిని చంపడానికి బాణుడు రథం మీద స్వయంగా బయలుదేరాడు. అనిరుద్ధుడితో యుద్ధం చేస్తూ, అతడి చేతిలో ఓడిపోయాడు.

మాయయా యుయుధే తేన స తదా మన్త్రచోదితః ।
తతశ్చ పన్నగాస్త్రేణ బబన్ధ యదునన్దనమ్ ॥ 9 ॥

అప్పుడు (న్యాయమైన యుద్ధంలో అనిరుద్ధుడిని గెలవడం సాధ్యం కాదని గ్రహించిన) బాణుడు అనిరుద్ధుడి మీద మాయలు ప్రయోగిస్తూ యుద్ధం చేశాడు. మంత్రబలంతో నాగాస్త్రాన్ని ఉపయోగించి అనిరుద్ధుడిని (పాములతో) బంధించాడు.

ద్వారవత్యాం క్వ యాతోఽసావనిరుద్ధేతి జల్పతామ్ ।
యదూనామాచచక్షే తం బద్ధం బాణేన నారదః ॥ 10 ॥

అక్కడ ద్వారకానగరంలో ఈ అనిరుద్ధుడు ఎక్కడికి వెళ్లాడు? కనబడడం లేదని యాదవులు గగ్గోలు పడుతున్నారు. అప్పుడు నారదుడు వచ్చి, అనిరుద్ధుడిని బాణాసురుడు బంధించాడని చెప్పాడు.

తం శోణితపురే శ్రుత్వా నీతం విద్యావిదగ్ధయా ।
యోషితా ప్రత్యయం జగ్ముర్యాదవానాం మతైరితి ॥ 11 ॥

యోగవిద్యలో నిపుణురాలైన ఒకానొక స్త్రీ అనిరుద్ధుడిని బాణాసురుడి రాజధాని అయిన శోణితపురానికి తీసుకుని వెళ్లిందని యాదవులు తెలుసుకున్నారు. అప్పుడు అనిరుద్ధుడిని బాణుడు బంధించాడని వారికి నమ్మకం కలిగింది.

తతో గరుడమారుహ్య స్మృతమాత్రాగతం హరిః ।
బలప్రద్యుమ్నసహితో బాణస్య ప్రయయౌ పురమ్ ॥ 12 ॥

శ్రీకృష్ణుడు గరుత్మంతుడిని తలచుకున్నాడు. తలుచుకున్న వెంటనే గరుడుడు అక్కడికి వచ్చాడు. శ్రీకృష్ణుడు గరుత్మంతుడిపై ఎక్కి, బలరాముడితో కలిసి బాణుడి రాజధానికి వెళ్లాడు.

పురీప్రవేశే ప్రమథైర్యుద్ధమాసీన్మహాబలైః ।
యయౌ బాణపురాభ్యాశం నీత్వా తాన్ సంక్షయం హరిః ॥ 13 ॥

ఆ నగరం ప్రవేశించేటపుడే మిక్కిలి బలవంతులైన ప్రమథగణాలతో వారికి యుద్ధం జరిగింది. కృష్ణుడు వారిని నిర్మూలించి బాణుడి రాజధానిని సమీపించాడు.

తతస్త్రిపాదస్త్రిశిరా జ్వరో మాహేశ్వరో మహాన్ ।
బాణరక్షార్థమత్యర్థం యుయుధే శార్ఙ్గధన్వనా ॥ 14 ॥

అక్కడ మహేశ్వరుడిశక్తి అయిన జ్వరం ఉన్నది. దానికి మూడు పాదాలు, మూడు తలలు ఉన్నాయి. అది బాణాసురుడిని రక్షించడానికి శ్రీకృష్ణుడితో యుద్ధం చేసింది.

తద్భస్మస్పర్శసమ్భూతతాపం కృష్ణాఙ్గసఙ్గమాత్ ।
అవాప బలదేవోఽపి సమం సమ్మీలితేక్షణః ॥ 15 ॥

ఆ జ్వరదేవత శరీరం మీద ఉన్న భస్మం తగలడంచేత కృష్ణుడికి తాపం కలిగింది. కృష్ణుడి శరీరంతో సంబంధం కలిగి ఉండడంచేత బలరాముడికి కూడ తాపం కలిగింది. దానితో వారు కళ్లు మూసుకున్నారు.

తతస్సంయుధ్యమానస్తు సహ దేవేన శార్ఙ్గిణా ।
వైష్ణవేన జ్వరేణాశు కృష్ణదేహాన్నిరాకృతః ॥ 16 ॥

శ్రీకృష్ణుడితో యుద్ధం చేస్తున్న మహేశ్వరజ్వరాన్ని కృష్ణుడిలో ఉన్న వైష్ణవజ్వరం కృష్ణుడినుండి దూరంగా నెట్టివేసింది.

నారాయణభుజాఘాతపరిపీడనవిహ్వలమ్ ।
తం వీక్ష్య క్షమ్యతా మస్యేత్యాహ దేవః పితామహః ॥ 17 ॥

నారాయణుడి బాహువుల దెబ్బలతో బాధతో కలవరపడుతున్న ఆ మహేశ్వరజ్వరాన్ని చూసి, బ్రహ్మదేవుడు దీనిని క్షమించి విడిచిపెట్టమని శ్రీకృష్ణుడితో చెప్పాడు.

తతశ్చ క్షాన్తమేవేతి ప్రోచ్య తం వైష్ణవం జ్వరమ్ ।
ఆత్మన్యేవ లయం నిన్యే భగవాన్ మధుసూదనః ॥ 18 ॥

అప్పుడు 'అలాగే క్షమించా' నని చెప్పి, కృష్ణభగవానుడు ఆ వైష్ణవజ్వరాన్ని తనలో లీనం చేసుకున్నాడు.

మమ త్వయా సమం యుద్ధం యే స్మరిష్యన్తి మానవాః ।
విజ్వరాస్తే భవిష్యన్తీత్యుక్త్వా చైనం యయౌ హరిః ॥ 19 ॥

'నీతో నాకు జరిగిన ఈ యుద్ధాన్ని తలుచుకున్న మానవుడికి ఏవిధమైన జ్వరబాధలు ఉండవు'. అని మహేశ్వర జ్వరంతో చెప్పి, శ్రీకృష్ణుడు అక్కడినుండి వెళ్లిపోయాడు.

తతోఽగ్నీన్ భగవాన్ పఞ్చ జిత్వా నీత్వా క్షయం తథా ।
దానవానాం బలం విష్ణుశ్చూర్ణయామాస లీలయా ॥ 20 ॥

ఆ తరువాత శ్రీకృష్ణుడు (బాణుడి నగరానికి నాలుగు దిక్కులలోనూ పై దిక్కులోనూ రక్షణగా ఉన్న) అయిదు అగ్నులను జయించి, వాటిని ఆర్పివేశాడు. పిదప రాక్షసుల సైన్యాన్ని శ్రీకృష్ణుడు అవలీలగా పిండి పిండి చేశాడు.

తతస్సమస్తసైన్యేన దైతేయానాం బలే స్సుతః ।
యుయుధే శఙ్కరశ్చైవ కార్తికేయశ్చ శౌరిణా ॥ 21 ॥

తరువాత బలిచక్రవర్తి కుమారుడైన బాణాసురుడు సమస్తమైన రాక్షస బలంతో వచ్చి,శ్రీకృష్ణుడితో యుద్ధం చేశాడు. శివుడు, కుమారస్వామి కూడ బాణుడికి రక్షణగా శ్రీకృష్ణుడితో యుద్ధం చేశారు.

హరిశఙ్కరయోర్యుద్ధమతీవాసీత్ సుదారుణమ్ ।
చుక్షుభుస్సకలా లోకాశ్శస్త్రాస్త్రైర్బహుధార్దితాః ॥ 22 ॥

అప్పుడు శ్రీకృష్ణుడికీ పరమేశ్వరుడికీ యుద్ధం మిక్కిలి భయంకరంగా సాగింది. వారు పరస్పరం ప్రయోగించే రకరకాలైన శస్త్రాస్త్రాలతో లోకాలు దెబ్బతిని, ఎంతో క్షోభించాయి.

ప్రలయోఽయమశేషస్య జగతో నూనమాగతః ।
మేనిరే త్రిదశా యత్ర వర్తమానే మహాహవే ॥ 23 ॥

శివకేశవులకు నడుమ యుద్ధం జరుగుతుండగా దేవతలు జగత్తు సమస్తం నశించిపోయే మహాప్రళయం వచ్చిందని భావించారు.

జృమ్భమాణాస్త్రేణ గోవిన్దో జృమ్భయామాస శఙ్కరమ్ ।
తతః ప్రణేశుర్దైతేయాః ప్రమథాశ్చ సమన్తతః ॥ 24 ॥

అప్పుడు కృష్ణుడు శివుడిపైన జృంభణం అనే అస్త్రం ప్రయోగించాడు. దాని ప్రభావంచేత శివుడు ఆవులించ సాగాడు. అప్పుడు రాక్షసులు, ప్రమథులు నశించసాగారు.

జృమ్భాభిభూతశ్చ హరో రథోపస్థ ఉపావిశత్ ।
న శశాక తదా యోద్ధుం కృష్ణేనాక్లిష్టకర్మణా ॥ 25 ॥

ఆవులింతలతో అలిసిపోయిన శంకరుడు రథంలో కూలబడ్డాడు. ఏపనైనా, అవలీలగా చేసే కృష్ణుడితో శంకరుడు యుద్ధం చేయలేకపోయాడు.

గరుడక్షతవాహశ్చ ప్రద్యుమ్నాస్త్రేణ పీడితః ।
కృష్ణహుఙ్కారనిర్ధూతశక్తిశ్చాపయయౌ గుహః ॥ 26 ॥

కుమారస్వామి వాహనాన్ని గరుడుడు గాయపరిచాడు. ప్రద్యుమ్నుడు ప్రయోగించిన అస్త్రాలతో కుమారస్వామి బాధలు పడ్డాడు. శ్రీకృష్ణుడు చేసిన హుంకారంతో కుమారస్వామి ఆయుధమైన శక్తి ఎగిరి పడింది. కుమారస్వామి యుద్ధం నుండి పారిపోయినాడు.

జృమ్భితే శఙ్కరే నష్టే దైత్యసైన్యే గుహే జితే ।
నీతే ప్రమథసైన్యే చ సఙ్క్షయం శార్ఙ్గధన్వనా ॥ 27 ॥

శ్రీకృష్ణుడితో జరిగిన యుద్ధంలో శంకరుడు ఆవులిస్తుండిపోయాడు. రాక్షస సైన్యం నశించింది. కుమారస్వామి ఓడిపోయాడు. ప్రమథుల సైన్యం నశించింది.

నన్దీశసఙ్గృహీతాశ్వమధిరూఢో మహారథమ్ ।
బాణస్తత్రాయయౌ యోద్ధుం కృష్ణకార్ష్ణిబలైస్సహ ॥ 28 ॥

అప్పుడు నందీశ్వరుడు తెచ్చిన గుఱ్ఱాలు పూన్చిన పెద్దరథం ఎక్కి బాణాసురుడు శ్రీకృష్ణుడితోనూ, కృష్ణుడి బలగాలతోనూ యుద్ధం చేయడానికి అక్కడికి వచ్చాడు.

బలభద్రో మహావీర్యో బాణసైన్యమనేకధా ।
వివ్యాధ బాణైః ప్రద్యుమ్నో ధర్మతశ్చాపలాయితః ॥ 29 ॥

మిక్కిలి శక్తిమంతుడైన బలరాముడు, అలాగే ప్రద్యుమ్నుడు కూడ ధర్మం తప్పకుండా, బాణాసురుడి సైన్యాన్ని బాణాలతో కొట్టి గాయపరిచారు.

ఆకృష్య లాఙ్గలాగ్రేణ ముశలేన చ పోథితమ్ ।
బలం బలేన దదృశే బాణో బాణైశ్చ చక్రిణః ॥ 30 ॥

బలరాముడు తన సైన్యాన్ని నాగలి ఆయుధంతో పట్టి లాగడమూ, రోకలి ఆయుధంతో మోదడమూ, కృష్ణుడు బాణాలు వేయడమూ బాణాసురుడు చూశాడు.

తతః కృష్ణస్య బాణేన యుద్ధమాసీత్ సమాసతః ।
పరస్పరం తు సన్దీప్తాన్ కాయత్రాణవిభేదినః ॥ 31 ॥

అప్పుడు బాణాసురుడు కృష్ణుడితో ముఖాముఖి యుద్ధానికి దిగాడు. శరీరాన్ని రక్షించే కవచాలను కూడా పగలగొట్టే ఆయుధాలతో యుద్ధం సాగుతున్నది.

కృష్ణశ్చిచ్ఛేద బాణాంస్తాన్ బాణేన ప్రహితాఞ్ఛరైః ।
బిభేద కేశవం బాణో బాణం వివ్యాధ చక్రధృక్ ॥ 32 ॥

బాణాసురుడు వేసిన బాణాలను తన బాణాలతో శ్రీకృష్ణుడు ముక్కలు చేశాడు. బాణుడు కృష్ణుడిని కొట్టాడు. చక్రధారి అయిన కృష్ణుడు బాణాసురుడికి గాయం చేశాడు.

ముముచాతే త థాస్త్రాణి బాణకృష్ణౌ జిగీషయా ।
పరస్పరక్షతిపరౌ పరిఘాంశ్చ తతో ద్విజాః ॥ 33 ॥

విప్రులారా! బాణుడు శ్రీకృష్ణుడు ఇద్దరూ జయించాలనే కోరికతో వివిధమైన ఆయుధాలను ప్రయోగిస్తున్నారు. ఒకరి నొకరు గాయపరచుకోవడానికి ఇనుప గుదియలతో కొట్టుకున్నారు.

ఛిద్యమానేష్వశేషేషు శస్త్రేష్వస్త్రేచ సీదతి ।
ప్రాచుర్యేణ హరిర్బాణం హన్తుం చక్రే తతో మనః ॥ 34 ॥

ఒకరు ప్రయోగించిన ఆయుధాలను మరొకరు ముక్కలు చేయడంతో ఆయుధాలన్నీ ముక్కలు ముక్కలై పోయాయి. అస్త్రాలు వ్యర్థమై పోయాయి. చివరికి కృష్ణుడు బాణుడిని చంపాలని మనసులో నిర్ణయం చేసుకున్నాడు.

తతోఽ ర్కశతసమ్భూతతేజసా సదృశద్యుతిః ।
జగ్రాహ దైత్యచక్రారిర్హరిశ్చక్రం సుదర్శనమ్ ॥ 35 ॥

అప్పుడు రాక్షసులను సంహరించే శ్రీకృష్ణస్వామి వంద సూర్యబింబాలతో సమానమైన తేజస్సుగలిగిన సుదర్శన చక్రాన్ని చేత బట్టాడు.

ముఞ్చతో బాణనాశాయ తచ్చక్రం మధువిద్విషః ।
నగ్నా దైతేయవిద్యాభూత్ కోటరీ పురతో హరేః ॥ 36 ॥

బాణాసురుడిని నాశనం చేయడానికి కృష్ణుడు ఆచక్రాన్ని విడిచిపెడుతుండగా, రాక్షసులమాయావిద్య అయిన కోటరి శ్రీకృష్ణుడి కన్నుల యెదుట నిలిచింది.

తామగ్రతో హరిర్దృష్ట్వా మీలితాక్షస్సుదర్శనమ్ ।
ముమోచ బాణముద్దిశ్య ఛేత్తుం బాహువనం రిపోః ॥ 37 ॥

ఆ మాయను ఎదురుగుండా చూసిన శ్రీకృష్ణుడు కన్నులు మూసుకుని, శత్రువు బాహువుల గుంపును నరికివేయాలనే సంకల్పంతో బాణుడిపైకి సుదర్శనచక్రాన్ని విడిచిపెట్టాడు.

క్రమేణాస్య తు బాహూనాం బాణస్యాచ్యుతచోదితమ్ ।
ఛేదం చక్రేఽ సురస్యాశు శస్త్రాస్త్రక్షేపణాద్ ద్రుతమ్ ॥ 38 ॥

కృష్ణుడు ప్రయోగించిన సుదర్శన చక్రం శస్త్రాలు అస్త్రాలు ప్రయోగిస్తున్న బాణాసురుడి చేతులు వేయింటినీ వరుసగా చకచకా నరికివేసింది.

ఛిన్నే బాహువనే తత్తు కరస్థం మధుసూదనః ।
ముముక్షుర్బాణనాశాయ విజ్ఞాతస్త్రిపురద్విషా ॥ 39 ॥

బాహువులన్నీ తెగిన వెంటనే సుదర్శనచక్రం తిరిగి శ్రీకృష్ణుడి చేతిలోకి వెళ్లింది. తరువాత శ్రీకృష్ణుడు బాణాసురుడిని కూడ చంపడంకోసం చక్రం ప్రయోగిద్దా మనుకున్నాడు. ఆ సంగతిని పరమేశ్వరుడు గ్రహించాడు.

స ఉత్పత్యాహ గోవిన్దం సామపూర్వముమాపతిః ।
విలోక్య బాణం దోర్దణ్డచ్ఛేదాసృక్స్రావవర్షిణమ్ ॥ 40 ॥

అప్పుడు తెగిన బాహువులనుండి నెత్తురు వర్షంలాగా ధారాపాతంగా కురుస్తుండగా బాణాసురుడిని చూసి, పార్వతీనాథుడు ఒక్కసారిగా ఎదుట నిలిచి, శ్రీకృష్ణస్వామితో ఇలా అన్నాడు.

రుద్ర ఉవాచ :-శ్రీకృష్ణుడితో పరమశివుడు ఇలా అంటున్నాడు.

కృష్ణ కృష్ణ జగన్నాథ జానే త్వాం పురుషోత్తమమ్ ।
పరేశం పరమాత్మానమనాదినిధనం పరమ్ ॥ 41 ॥

కృష్ణా! శ్రీకృష్ణా! లోకనాథా! నీవు పురుషోత్తముడివి. పరమేశ్వరుడివి. పరమాత్మవు. తుది మొదలు లేనివాడివి. సర్వోత్తముడివి అని గ్రహించాను.

దేవతిర్యఙ్మనుష్యేషు శరీరగ్రహణాత్మికా ।
లీలేయం తవ చేష్టా హి దైత్యానాం వధలక్షణా ॥ 42 ॥

దేవతలలోనూ, పశువులు పక్షులు మొదలైన వాటిలోనూ, మానవులలోనూ నీవు అవతరించి, ఆయా రూపాలు ధరించడం నీకు ఒకలీల. రాక్షసులను సంహరించడం కోసమే నీవు ఈవిధంగా చేస్తుంటావు.

తత్ ప్రసీదాభయం దత్తం బాణస్యాస్య మయా ప్రభో ।
తత్ త్వయా నానృతం కార్యం యన్మయా వ్యాహృతం వచః ॥ 43 ॥

దేవా! నన్ను అనుగ్రహించు. నేను ఈ బాణుడికి అభయం ఇచ్చాను. నేనన్న మాటను నీవు అసత్యం చేయవద్దు.

అస్మత్సంశ్రయవృద్ధోఽయం నాపరాధస్తవావ్యయ ।
మయా దత్తవరో దైత్యస్తతస్త్వాం క్షమయామ్యహమ్ ॥ 44 ॥

నన్ను ఆశ్రయించుకుని బాణుడు వృద్ధిని పొందాడు. ఇది నీ తప్పు కాదు. ఈ రాక్షసుడికి నేనే వరం ఇచ్చాను (కాబట్టి తప్పు నాదే). అందుచేత వీడిని క్షమించమని అడుగుతున్నాను.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్తః ప్రాహ గోవిన్దశ్శూలపాణిముమాపతిమ్ ।
ప్రసన్నవదనో భూత్వా గతామర్షోఽసురం ప్రతి ॥ 45 ॥

ఆ మాటలు విన్న శ్రీకృష్ణుడికి బాణాసురుడిమీద కోపం పోయింది. ముఖం ప్రసన్నం అయింది. శూలధారి అయిన పార్వతీపతితో కృష్ణుడు ఇలా అన్నాడు.

శ్రీభగవానువాచ :–శివుడితో కేశవుడు ఇలా చెప్తున్నాడు.

యుష్మద్దత్తవరో బాణో జీవతాదేష శఙ్కర ।
త్వద్వాక్యగౌరవాదేతన్మయా చక్రం నివర్తితమ్ ॥ 46 ॥

పరమేశ్వరా! నీవు వరమిచ్చిన ఈ బాణుడు తప్పక ప్రాణాలతో ఉంటాడు. నీ మాటలమీద గౌరవంతో నేను ఇదిగో చక్రాయుధాన్ని ఉపసంహరించుకుంటున్నాను.

త్వయా యదభయం దత్తం తద్దత్తమభయం మయా ।
మత్తోఽవిభిన్నమాత్మానం ద్రష్టుమర్హసి శఙ్కర ॥ 47 ॥

శివా! నీవు ఎవరికి అభయం ఇస్తే, వారికి నేను అభయ మిచ్చినట్లే. నీకు నాతో భేదం లేదని, (నీవు నేనే) గ్రహించు.

యోఽహం స త్వం జగచ్చేదం సదేవాసురమానుషమ్ ।
అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః ॥ 48 ॥

నేను ఎవ్వరో నువ్వు వాడే. దేవతలతోనూ, రాక్షసులతోనూ,మానవులతోనూ కూడిన జగత్తు అంతా మనమే. అజ్ఞానంతో తెలివితప్పినవారు నీవు(శివుడు) వేరు, నేను (విష్ణువు) వేరు అనుకుంటారు.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్త్వా ప్రయయౌ కృష్ణః ప్రాద్యుమ్నిర్యత్ర తిష్ఠతి ।
తద్బన్ధఫణినో నేశుర్గరుడానిలశోషితాః ॥ 49 ॥

పరమేశ్వరుడితో ఇలా పలికి శ్రీకృష్ణస్వామి అనిరుద్ధుడు ఉన్న చోటికి వెళ్లాడు. అతడిని బంధించిన పాములు (9శ్లో) గరుత్మంతుడినుండి వెలువడిన గాలులతో నీరసించి పోయాయి.

తతోఽనిరుద్ధమారోప్య సపత్నీకం గరుత్మతి ।
ఆజగ్ముర్ద్వారకాం రామకార్ష్ణిదామోదరాః పురీమ్ ॥ 50 ॥

అప్పుడు భార్య(ఉష)తో సహా అనిరుద్ధుడిని గరుత్మంతుడిమీద కెక్కించుకుని, బలరాముడూ, ప్రద్యుమ్నుడూ, కృష్ణుడూ ద్వారకా నగరానికి తిరిగి వచ్చారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే ఉషానిరుద్ధానయనం నామ సప్తనవతితమోఽధ్యాయః ॥ 97 ॥

శ్రీబ్రహ్మపురాణంలో ఉషానిరుద్ధానయనం అనే తొంబైఏడవ అధ్యాయం సంపూర్ణం.



అష్టనవతితమోఽధ్యాయః - తొంబైఎనిమిదవ అధ్యాయం

కాశీదాహవర్ణనమ్ - కాశీదాహ వర్ణనం

మునయ ఊచుః :-మునులు వ్యాసమహర్షితో ఈవిధంగా అంటున్నారు.

చక్రే కర్మ మహచ్చౌరిర్బిభ్రద్యో మానుషీం తనుమ్ ।
జిగాయ శక్రం శర్వంచ సర్వదేవాంశ్చ లీలయా ॥ 1 ॥

మానవుడుగా అవతరించిన శ్రీహరి ఇంద్రుడినీ, పరమేశ్వరుడినీ, ఇంక ఇతర దేవత లందరినీ అవలీలగా జయించి, అద్భుతమైన పనులు చేశాడు.

యచ్చాన్యదకరోత్ కర్మ దివ్యచేష్టావిఘాతకృత్ ।
కథ్యతాం తన్మహత్కర్మ హరేః కౌతూహలం హి నః ॥ 2 ॥

దేవతలు ఆచరించిన పనులను అడ్డగించిన అద్భుతమైన కార్యాలు శ్రీకృష్ణుడు ఇంకా ఏమేమి చేశాడో చెప్పవలసినది. వాటిని తెలుసుకోవాలని మాకు చాలా కుతూహలంగా ఉంది.

వ్యాస ఉవాచ :-మునులకు వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

గదతో మే మునిశ్రేష్ఠాశ్శ్రూయతామిదమాదరాత్ ।
నరావతారే కృష్ణేన దగ్ధా వారాణసీ యథా ॥ 3 ॥

మహర్షులారా! మానవుడుగా అవతరించిన కృష్ణస్వామి వారాణసీ నగరాన్ని తగులబెట్టిన విధం చెప్తాను. శ్రద్ధగా వినండి.

పౌండ్రకో వాసుదేవశ్చ వాసుదేవోఽభవద్ భువి ।
అవతీర్ణస్త్వమిత్యుక్తో జనైరజ్ఞానమోహితైః ॥ 4 ॥

పూర్వం పౌండ్రకుడైన వాసుదేవుడు ఉండేవాడు. అవివేకంతో మతి తప్పిన మానవులు అతడితో ఈ భూమి మీద వాసుదేవుడు అనే పేరుతో ఇంకొకడు ఉన్నాడు. నిజానికి వాసుదేవుడుగా అవతరించిన శ్రీమహావిష్ణువు నీవే అని చెప్పారు.

స మేనే వాసుదేవోఽహమవతీర్ణో మహీతలే ।
నష్టస్మృతిస్తతస్సర్వం విష్ణుచిహ్నమచీకరత్ ॥
దూతం చ ప్రేషయామాస స కృష్ణాయ ద్విజోత్తమాః ॥ 5 ॥

విప్రవరేణ్యులారా! ఆ పౌండ్రకుడు జనుల మాట విని, 'భూమిపై అవతరించిన అసలైన వాసుదేవుడిని నేనే' అనుకున్నాడు. ఆ నమ్మకంవల్ల వాడికి వివేకం నశించింది. దానివల్ల అతడు శ్రీమహావిష్ణువు చిహ్నాలు తయారు చేయించుకుని ధరించాడు. అంతే కాకుండా, శ్రీకృష్ణుడి వద్దకు ఒక దూతను పంపాడు.

త్యక్త్వా చక్రాదికం చిహ్నం మదీయం నామ తత్త్వతః ।
వాసుదేవాత్మకం మూఢ ముక్త్వా సర్వమశేషతః ॥ 6 ॥

(పౌండ్రక వాసుదేవుడు పంపిన దూత అతడి మాటలను కృష్ణుడికి ఇలా చెప్పాడు.) మూర్ఖుడా! కృష్ణా! చక్రం, శంఖం మొదలైన విష్ణువు చిహ్నాలను విడిచిపెట్టు. వాసుదేవుడు అనే పేరు నాది. కాబట్టి ఆ పేరును, ఇంకా మిగిలిన లక్షణాలు సమస్తమూ వదిలిపెట్టు.

ఆత్మనో జీవితార్థాయ తథా మే ప్రణతిం వ్రజ ।
ఇత్యుక్తస్స ప్రహస్యైవ దూతం ప్రాహ జనార్దనః ॥ 7 ॥

ఇంక నీవు జీవించి ఉండాలనుకుంటే, వచ్చి నన్ను శరణు పొందు'. ఆ పౌండ్రకుడి సందేశం విని, శ్రీకృష్ణుడు ఒక నవ్వు నవ్వి, ఆ దూతతో ఇలా అన్నాడు.

శ్రీభగవానువాచ :–పౌండ్రకుడి దూతతో శ్రీకృష్ణస్వామి ఇలా చెప్తున్నాడు.

నిజచిహ్నమహం చక్రం సముత్స్రక్ష్యే త్వయీతి వై ।
వాచ్యశ్చ పౌణ్డ్రకో గత్వా త్వయా దూత వచో మమ ॥ 8 ॥

'ఓయీ! దూతా! నా చిహ్నం అయిన చక్రాన్ని నీ మీదే విడిచిపెడతాను' అని అన్నానని నా మాటలుగా వెళ్లి పౌండ్రకుడితో చెప్పు'.

జ్ఞాతస్త్వద్వాక్యసద్భావో యత్కార్యం తద్ విధీయతామ్ ।
గృహీతచిహ్న ఏవాహమాగమిష్యామి తే పురీమ్ ॥ 9 ॥

నీ మాటల్లో అభిప్రాయం నాకు తెలిసింది. నీవు చేయదలచుకున్నది చేసుకో. విష్ణువుకు సంబంధించిన నా చిహ్నాలు ధరించే, నేను నీ రాజధానికి వస్తాను.

ఉత్స్రక్ష్యామి చ తే చక్రం నిజచిహ్నమసంశయమ్ ।
ఆజ్ఞాపూర్వం చ యదిదమాగచ్ఛేతి త్వయోదితమ్ ॥ 10 ॥

నా చిహ్నమైన ఈ చక్రాన్ని నీ మీదే విడిచిపెడతాను. ఇందులో సందేహం లేదు.నీ వద్దకు రమ్మని నాకు ఆజ్ఞ చేశావు కదా! ఆ ప్రకారమే వస్తున్నాను.

సమ్పాదయిష్యే శ్వస్తుభ్యం తదప్యేషోఽ విలమ్బితమ్ ।
శరణం తే సమభ్యేత్య కర్తాస్మి నృపతే తథా ।
యథా త్వత్తో భయం భూయో నైవ కిఞ్చిద్ భవిష్యతి ॥ 11 ॥

ఏమాత్రం ఆలస్యం చేయకుండా, రేపే నిన్ను కలుసుకుంటాను. నీ శరణు పొంది, మళ్లీ నీవల్ల ఏమాత్రమూ భయం కలగకుండా ఉండేవిధంగా, నేను చేయవలసినది చేస్తాను.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్తేఽపగతే దూతే సంస్మృత్యాభ్యాగతం హరిః ।
గరుత్మన్తం సమారుహ్య త్వరితం తత్పురం యయౌ ॥ 12 ॥

పౌండ్రకుడి దూతతో ఇలా చెప్పి, కృష్ణుడు ఆ దూతను తగువిధంగా సత్కరించాడు. అతడు తిరిగి వెళ్లిపోయాడు. అప్పుడు కృష్ణుడు గరుత్మంతుడి మీద ఎక్కి, పౌండ్రకుడి నగరానికి బయలుదేరాడు.

తస్యాపి కేశవోద్యోగం శ్రుత్వా కాశిపతి స్తదా ।
సర్వసైన్యపరీవారపార్ష్ణిగ్రాహముపాయయౌ ॥ 13 ॥

కాశీరాజు శ్రీకృష్ణుడి ప్రయత్నం విన్నాడు. పౌండ్రకుడికి తోడుగా, తన సైన్యం సమస్తాన్నీ చుట్టబెట్టుకుని, త్వరత్వరగా యుద్ధానికి బయలుదేరాడు.

తతో బలేన మహతా కాశిరాజబలేన చ ।
పౌణ్డ్రకో వాసుదేవోఽసౌ కేశవాభిముఖం యయౌ ॥ 14 ॥

పౌండ్రకుడు విస్తారమైన తన సైన్యంతోనూ, కాశిరాజు తెచ్చిన సైన్యంతోనూ కలిసి, శ్రీకృష్ణుడి మీదికి దండెత్తాడు.

తం దదర్శ హరిర్దూరాదుదారస్యన్దనే స్థితమ్ ।
చక్రశఙ్ఖగదాపాణిం పాణినా విధృతామ్బుజమ్ ॥ 15 ॥

ఎత్తైన రథంమీద ఉన్న పౌండ్రకుడిని కృష్ణుడు దూరం నుండే గమనించాడు. ఆ పౌండ్రకుడు నాలుగు చేతులలో శంఖం, చక్రం, గద, పద్మం ధరించాడు.

స్రగ్ధరం ధృతశార్ఙ్గంచ సుపర్ణరచనాధ్వజమ్ ।
వక్షస్స్థలకృతం చాస్య శ్రీవత్సం దదృశే హరిః ॥ 16 ॥

నిలువెత్తు పూల(వన)మాలను ధరించాడు. శార్ఙ్గం అనే ధనుస్సును పట్టుకున్నాడు. గరుత్మంతుడి చిహ్నం కలిగిన జెండా పెట్టుకున్నాడు. అతడి ఱొమ్ముమీద ఉన్న శ్రీవత్సం అనే మచ్చను కూడ చూశాడు కృష్ణుడు.

కిరీటకుణ్డలధరం పీతవాసస్సమన్వితమ్ ।
దృష్ట్వా తం భావగమ్భీరం జహాస గరుడధ్వజః ॥ 17 ॥

కిరీటాన్ని, చెవికమ్మలను ధరించాడు. పట్టువస్త్రం కట్టుకున్నాడు. అతడి వేషాన్ని చూసి శ్రీకృష్ణుడు మనసులోని భావం బయటపడకుండా నవ్వాడు.

యుయుధే చ బలేనాస్య హస్త్యశ్వబలినా ద్విజాః ।
నిస్త్రింశర్ష్టిగదాశూలశక్తికార్ముకశాలినా ॥ 18 ॥

విప్రులారా! ఖడ్గం, (రెండువైపులా పదునుండే) కత్తి,గద,శూలం,ఈటె,విల్లు, మొదలైన ఆయుధాలు గలిగిన పౌండ్రుడితోనూ, అతడితో వచ్చిన ఏనుగులు, గుఱ్ఱాలు (చతురంగ)బలంతోనూ, కృష్ణుడు యుద్ధం చేశాడు.

క్షణేన శార్ఙ్గనిర్ముక్తైశ్శరైరగ్నివిదారణైః ।
గదాచక్రాతిపాతైశ్చ సూదయామాస తద్బలమ్ ॥ 19 ॥

శార్ఙ్గం అనే ధనుస్సునుండి వెలువడుతున్న నిప్పులు కక్కే బాణాలతోనూ, గదాచక్రాయుధాల దెబ్బలతోనూ కృష్ణుడు శత్రుసైన్యాన్ని సంహరించాడు.

కాశిరాజబలం చైవ క్షయం నీత్వా జనార్దనః ।
ఉవాచ పౌణ్డ్రకం మూఢమాత్మచిహ్నోపలక్షణమ్ ॥ 20 ॥

శ్రీకృష్ణుడు కాశీరాజుసైన్యాన్ని కూడ నిర్మూలించాడు. తరువాత తన వైష్ణవ చిహ్నాలు ధరించిన, అవివేకి అయిన పౌండ్రకుడితో కృష్ణుడు ఇలా అన్నాడు.

శ్రీభగవానువాచ :–పౌండ్రకుడితో కృష్ణుడు ఇలా అంటున్నాడు.

పౌణ్డ్రకోక్తం త్వయా యత్ తద్ దూతవక్త్రేణ మాం ప్రతి ।
సముత్సృజేతి చిహ్నాని తత్ తే సమ్పాదయామ్యహమ్ ॥ 21 ॥

ఓరీ! పౌండ్రకా! నీ దూతముఖంగా నీవు నా వైష్ణవ చిహ్నాలు తీసివేయమని నాకు సందేశం పంపావు గదా! ఆ ప్రకారమే చేస్తాను.

చక్రమేతత్ సముత్సృష్టం గదేయం తే విసర్జితా ।
గరుత్మానేష నిర్దిష్టస్సమారోహతు తే ధ్వజమ్ ॥ 22 ॥

ఇదిగో, చక్రం నీపై విడిచిపెడుతున్నాను. ఇదిగో ఈ గద వదులుతున్నాను. ఇదిగో గరుత్మంతుడిని కూడ పంపుతున్నాను. అతడు వచ్చి నీ టెక్కెం మీదికి ఎక్కి కూర్చుంటాడు.

ఇత్యుచ్చార్య విముక్తేన చక్రేణాసౌ విదారితః ।
పోథితో గదయా భగ్నో గరుత్మాంశ్చ గరుత్మతా ॥ 23 ॥

అని కృష్ణుడు ప్రయోగించిన సుదర్శనచక్రం పౌండ్రకుడిని చీల్చివేసింది. కౌమోదకీ గద అతడిని చావమోదింది. కృష్ణుడు పంపిన గరుత్మంతుడు పౌండ్రకుడి జెండా మీద ఉన్న గరుడుడిని పడగొట్టాడు.

తతో హాహాకృతే లోకే కాశీనా మధిపస్తదా ।
యుయుధే వాసుదేవేన మిత్రస్యాపచితౌ స్థితః ॥ 24 ॥

పౌండ్రకుడు కూలడం చూసి అక్కడి జనమంతాహాకారాలు చేశారు. అప్పుడు కాశీరాజు తన స్నేహితుడికి సహాయపడడానికి శ్రీకృష్ణుడితో యుద్ధానికి దిగాడు.

తతశ్శార్ఙ్గవినిర్ముక్తైశ్ఛిత్వా తస్య శరైశ్శిరః ।
కాశిపుర్యాం స చిక్షేప కుర్వంల్లోకస్య విస్మయమ్ ॥ 25 ॥

అప్పుడు కృష్ణుడు శార్ఙ్గధనుస్సునుండి విడిచిపెట్టిన బాణాలతో కాశిరాజు ప్రయోగించిన బాణాలతోపాటు అతడి తలకాయను కూడ నరికి, కాశీనగరంలో పడేవిధంగా ఎగరగొట్టాడు. అది చూసి, లోకం ఆశ్చర్యపడింది.

హత్వా తు పౌణ్డ్రకం శౌరిః కాశిరాజం చ సానుగమ్ ।
రేమే ద్వారవతీం ప్రాప్తోఽమరస్స్వర్గగతో యథా ॥ 26 ॥

శ్రీకృష్ణుడు పౌండ్రకుడినీ, కాశీరాజునూ వారి వారి అనుచరులతో సహా, సంహరించి, ద్వారకా నగరానికి వెళ్లి, స్వర్గలోకంలో దేవుడిలాగా సుఖంగా ఉన్నాడు.

తచ్ఛిరః పతితం తత్ర దృష్ట్వా కాశిపతేః పురే ।
జనః కి మేత దిత్యాహ కేన కేనేతి విస్మితః ॥ 27 ॥

కాశీనగరంలో పడిన కాశీరాజు తల చూసి, అక్కడి ప్రజలు 'ఇది యేమిటి? ఈ పని చేసినవాడు ఎవడు'? అని ఆశ్చర్యపడ్డారు.

జ్ఞాత్వా తం వాసుదేవేన హతం తస్య సుతస్తతః ।
పురోహితేన సహితస్తోషయామాస శఙ్కరమ్ ॥ 28 ॥

తండ్రి తల తరిగినవాడు శ్రీకృష్ణుడు అని కాశిరాజు కుమారుడికి తెలిసింది. ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. తన పురోహితుడిని తీసుకుని వెళ్లి కాశీ విశ్వేశ్వరుడిని సేవించి, శివుడిని సంతోషపెట్టాడు.

అవిముక్తే మహాక్షేత్రే తోషితస్తేన శఙ్కరః ।
వరం వృణీష్వేతి తదా తం ప్రోవాచ నృపాత్మజమ్ ॥ 29 ॥

అవిముక్తం అనే మహాపుణ్యక్షేత్రంలో కాశిరాజు కుమారుడివలన ఆనందించిన పరమేశ్వరుడు ఆ రాకుమారుడిని 'వరం కోరుకో' మన్నాడు.

స వవ్రే భగవన్ కృత్యా పితృహన్తుర్వధాయ మే ।
సముత్తిష్ఠతు కృష్ణస్య త్వత్ప్రసాదాన్మహేశ్వర ॥ 30 ॥

కాశిరాజు కుమారుడు 'మహానుభావా! పరమేశ్వరా! నా తండ్రిని చంపిన శ్రీకృష్ణుడిని సంహరించడానికి నీ అనుగ్రహంతో కృత్య అనే మారకశక్తి ఉద్భవించాలి' అనే వరం కోరుకున్నాడు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఏవం భవిష్యతీత్యుక్తే దక్షిణాగ్నేరనన్తరమ్ ।
మహాకృత్యా సముత్తస్థౌ తస్మాదగ్నినివేశనాత్ ॥ 31 ॥

'నీవు కోరుకున్న విధంగానే జరుగుతుంది' అని శంకరుడు వరమిచ్చాడు. ఆ తరువాత కాశిరాజు కుమారుడి అగ్నిగృహంలోని దక్షిణాగ్నినుండి మహాకృత్య ఆవిర్భవించింది.

తతో జ్వాలాకరాలాస్యా జ్వలత్కేశకలాపినీ ।
కృష్ణ కృష్ణేతి కుపితా కృత్యా ద్వారవతీం యయౌ ॥ 32 ॥

అగ్నికీలలతో భయంకరమైన ముఖంతో, మంటలతో ఎగసిపడుతున్న జడలతో కోపంగా కృష్ణా! కృష్ణా! అంటూ ఆ మహాకృత్య ద్వారకా నగరానికి వెళ్ళింది.

తామవేక్ష్య జనస్సర్వో రౌద్రాం వికృతలోచనామ్ ।
యయౌ శరణ్యం జగతాం శరణం మధుసూదనమ్ ॥ 33 ॥

కోపంతో మండిపడుతూ, వంకర కన్నులతో ఉన్న ఆ కృత్యను చూసి ద్వారకా వాసులైన ప్రజలు అందరూ అందరికీ దిక్కైన శ్రీకృష్ణుడిని శరణు పొందారు.

జనా ఊచుః :-ప్రజలు ఇలా అంటున్నారు.

కాశిరాజసుతేనేయమారాధ్య వృషభధ్వజమ్ ।
ఉత్పాదితా మహాకృత్యా వధాయ తవ చక్రిణః ॥ 34 ॥

'పరమేశ్వరుడిని ఆరాధించి, శ్రీకృష్ణుడిని చంపడంకోసం కాశీరాజు కుమారుడు మహాకృత్యను పుట్టించాడు.

జహి కృత్యామిమాముగ్రాం వహ్నిజ్వాలాజటాకులామ్ ॥ 35 ॥

కృష్ణా! అగ్నికీలలతో మండిపడుతున్న జడల సమూహంతో భయంకరంగా ఉన్న ఈ కృత్యను సంహరించు'.

వ్యాస ఉవాచ :- మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

చక్రముత్సృష్టమక్షేషు క్రీడాసక్తేన లీలయా ।
తదగ్నిమాలాజటిలం జ్వాలోద్గారాతిభీషణమ్ ॥ 36 ॥

ఆ సమయంలో కృష్ణుడు పాచికలాటలో నిమగ్నమై ఉన్నాడు. అతడు ప్రజలు అనుకునే మాటలు విని, అగ్నికీలల వరుసలతో భయంకరమైన, మంటలను భయంకరంగా వెడలగ్రక్కే సుదర్శన చక్రాన్ని కృత్యపైకి ప్రయోగించాడు.

కృత్యామనుజగామాశు విష్ణుచక్రం సుదర్శనమ్ ।
తతస్సా చక్రవిధ్వస్తా కృత్యా మాహేశ్వరీ తదా ॥ 37 ॥

ఆ విష్ణుచక్రం కృత్యను విడువకుండా వెంటాడింది. చివరికి మహేశ్వరుడికి సంబంధించిన కృత్య సుదర్శన చక్రానికి చిక్కి దాని తాకిడికి ధ్వంసం అయిపోతున్నది.

జగామ వేగినీ వేగా త్తదప్యనుజగామ తామ్ ।
కృత్యా వారాణసీమేవ ప్రవివేశ త్వరాన్వితా ॥
విష్ణుచక్రప్రతిహతప్రభావా మునిసత్తమాః ॥ 38 ॥

మహర్షులారా! విష్ణుచక్రానికి భయపడి కృత్య వేగంగా పారిపోతున్నది. సుదర్శనచక్రం కూడా అదే వేగంతో కృత్యవెంట వెళ్ళింది. విష్ణుచక్రం ధాటికి శక్తి హీనమైన కృత్య, రక్షణకోసం గబగబా వారాణసీ నగరంలో ప్రవేశించింది.

తతః కాశిబలం భూరి ప్రమథానాం తథా బలమ్ ।
సమస్తశస్త్రాస్త్రయుతం చక్రస్యాభిముఖం యయౌ ॥ 39 ॥

అప్పుడు కాశీరాజు బలగమూ, పరమేశ్వరుడి ప్రమథుల బలగమూ కలిసి, అన్ని రకాలైన శస్త్రాలనూ, అస్త్రాలనూ తీసుకుని సుదర్శనచక్రం మీదికి వెళ్లాయి.

శస్త్రాస్త్రమోక్షబహులం దగ్ధ్వా తద్బలమోజసా ।
కృత్యాక్షేమామశేషాం తాం పురీం వారాణసీం యయౌ ॥ 40 ॥

అనేకమైనఆయుధాలను ప్రయోగిస్తున్న ఆసైన్యాన్ని సుదర్శనచక్రం దహించింది. వారణాసీ నగరంలోని వారందరికీ సుఖం లేకుండా చేస్తూ, విష్ణుచక్రం వారాణసీ నగరంలో ప్రవేశించింది.

ప్రభూతభృత్యపౌరాం తాం సాశ్వమాతఙ్గమానవామ్ ।
అశేషదుర్గకోష్ఠాం తాం దుర్నిరీక్ష్యాం సురైరపి ॥ 41 ॥

ఆ వారాణసీ నగరం రాజసేవకులతోనూ, పౌరులతోనూ, గుఱ్ఱాలు, ఏనుగులు మానవులతోనూ నిండి ఉంది. పరిపూర్ణమైన కోటలతోనూ, కొట్టాలతోనూ ఆ నగరం దేవతలు కూడ కన్నెత్తి చూడడానికి వీలు లేకుండాఉంది.

జ్వాలాపరివృతాశేషగృహప్రాకారతోరణామ్ ।
దదాహ తాం పురీం చక్రం సకలామేవ సత్వరమ్ ॥ 42 ॥

సుదర్శనచక్రం ప్రభావంతో కాశీనగరాన్ని అగ్నిజ్వాలలు చుట్టుముట్టాయి. ఇళ్లూ, ప్రాకారాలు, ప్రవేశ ద్వారాలతో సహా వారాణసీ నగరం మొత్తాన్నీ విష్ణుచక్రం చాల వేగంగా కాల్చివేసింది.

అక్షీణామర్షమత్యల్పసాధ్యసాధననిస్పృహమ్ ।
తచ్చక్రం ప్రస్ఫురద్దీప్తి విష్ణోరభ్యాయయౌ కరమ్ ॥ 43 ॥

అయినా, సుదర్శన చక్రానికి కోపం తగ్గలేదు. ఇంక నాశనం చేయడానికి అక్కడ కొంచెం కూడ ఏదీ మిగలలేదు. ఏదోచేయాలనే కోరిక నెరవేరక ఆ చక్రానికి నిరుత్సాహం కలిగింది. శత్రువులను సమస్తమూ నాశనం చేసిన తరువాత సుదర్శన చక్రం చక్కగా వెలుగుతూ శ్రీకృష్ణస్వామి చేతిలోకి తిరిగి వచ్చింది.

ఇతి శ్రీబ్రహ్మపురాణే శ్రీకృష్ణచరితే పౌణ్డ్రకవాసుదేవవధే కాశీదాహవర్ణనం నామ అష్టనవతితమోఽధ్యాయః ॥98॥

శ్రీబ్రహ్మపురాణంలో శ్రీకృష్ణచరితలో పౌండ్రక వాసుదేవ వధలో కాశీదాహ వర్ణనం అనే తొంబైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

ఏకోనశతతమోఽధ్యాయః - తొంబైతొమ్మిదవ అధ్యాయం

బలదేవమాహాత్మ్యనిరూపణమ్ - బలదేవ మాహాత్మ్య నిరూపణం

మునయ ఊచుః :-మునులు వ్యాసమహర్షితో ఈవిధంగా అంటున్నారు.

శ్రోతుమిచ్ఛామహే భూయో బలభద్రస్య ధీమతః ।
మునే పరాక్రమం శౌర్యం తన్నో వ్యాఖ్యాతుమర్హసి ॥ 1 ॥

మహాత్మా! ధీశాలి అయిన బలరాముడి బలపరాక్రమాలను గురించి ఇంకా వినాలని కోరుతున్నాం. వివరించి చెప్పడం నీకే సాధ్యం అవుతుంది.

యమునాకర్షణాదీని శ్రుతాన్యస్మాభిరత్ర వై ।
తత్ కథ్యతాం మహాభాగ యదన్యత్ కృతవాన్ బలః ॥ 2 ॥

యమునా ప్రవాహాన్ని దారి మళ్ళించడం మొదలైనవి కొన్ని ఇప్పుడే నీవల్ల విన్నాం. బలరాముడు ఇంకా ఏమేమి ఘనకార్యాలు చేశాడో, వాటిని చెప్పు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

శృణుధ్వం మునయః కర్మ యద్ రామేణాభవత్ కృతమ్ ।
అనన్తేనాప్రమేయేణ శేషేణ ధరణీభృతా ॥ 3 ॥

ఋషులారా! అనంతుడు, కొలతలకు అందనివాడూ, ఈ భూమి భారాన్ని మోసేవాడూ, ఆదిశేషుడూ అయిన బలరాముడు చేసిన గొప్ప పనులను వినండి.

దుర్యోధనస్య తనయాం స్వయంవరకృతేక్షణామ్ ।
బలాదాదత్తవాన్ వీరస్సామ్బో జామ్బవతీసుతః ॥ 4 ॥

దుర్యోధనుడు తన కూతురికి స్వయంవరం చేద్దామని చూస్తున్నాడు. ఆ సమయంలో జాంబవతి కుమారుడైన సాంబుడు ఆ కన్యను బలవంతంగా అపహరించి, తీసుకుని వచ్చాడు.

తతః క్రుద్ధా మహావీర్యాః కర్ణదుర్యోధనాదయః ।
భీష్మద్రోణాదయశ్చైవ బబన్ధుర్యుధి నిర్జితమ్ ॥ 5 ॥

దానిమూలంగా మిక్కిలి బలవంతులైన కర్ణుడు, దుర్యోధనుడు మొదలైనవారందరికీ సాంబుడి మీద చాల కోపం వచ్చింది.అప్పుడు భీష్ముడు, ద్రోణుడు మొదలైనవారు సాంబుడిని యుద్ధంలో ఓడించి, అతడిని బంధించారు.

తచ్ఛ్రుత్వా యాదవాస్సర్వే క్రోధం దుర్యోధనాదిషు ।
మునయః ప్రతిచక్రుశ్చ తాన్ విహన్తుం మహోద్యమమ్ ॥ 6 ॥

మునులారా! ఆ విషయం తెలిసి, యాదవు లందరికీ దుర్యోధనాదుల మీద బాగా కోపం వచ్చింది. ప్రతీకారంగా వారిని చంపివేయడానికి గట్టిగా ప్రయత్నించారు.

తాన్ నివార్య బలః ప్రాహ మదలోలాకులాక్షరమ్ ।
మోక్ష్యన్తి తే మద్వచనాద్ యాస్యామ్యేకో హి కౌరవాన్ ॥ 7 ॥

బలరాముడు వాళ్లని వారించాడు. మాటలలో గర్వమూ, నమ్మకమూ తొణికిసలాడుతుండగా యాదవులతో ఇలా అన్నాడు. 'కౌరవులు నా మాట విని, సాంబుడిని విడిచిపెడ్తారు.నేను ఒక్కడినే వెళ్లి ఈ పని చేసుకు వస్తాను'.

బలదేవస్తతో గత్వా నగరం గజసాహ్వయమ్ ।
బాహ్యోపవనమధ్యేఽభూన్న వివేశ తత్పురమ్ ॥ 8 ॥

అని బలరాముడు వెంటనే హస్తినాపురానికి వెళ్లాడు. కాని, నగరంలో ప్రవేశించలేదు. ఇంక ఊరికి వెలుపల ఉన్న ఉద్యానవనంలో విడిది చేశాడు.

బలమాగతమాజ్ఞాయ తదా దుర్యోధనాదయః ।
గామర్ఘముదకం చైవ రామాయ ప్రత్యవేదయన్ ॥ 9 ॥

బలరాముడు వచ్చాడని దుర్యోధనాదులకు తెలిసింది. వెంటనే ఒక ఆవునూ, అతడిని సత్కరించడానికి ప్రశస్తమైన జలాన్నీ బలరాముడికి అందించారు.

గృహీత్వా విధివత్ సర్వం తతస్తానాహ కౌరవాన్ ।
ఆజ్ఞాపయత్యుగ్రసేనస్సామ్బమాశు విముఞ్చత ॥ 10 ॥

సంప్రదాయానుగుణంగా వారు చేసిన మర్యాదలను బలరాముడు స్వీకరించాడు. అనంతరం కౌరవులతో ఇలా అన్నాడు. 'ఉగ్రసేన మహారాజు సాంబుడిని వెంటనే విడిచిపెట్టమని మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాడు'.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

తతస్తద్వచనం శ్రుత్వా భీష్మద్రోణాదయో ద్విజాః ।
కర్ణదుర్యోధనాద్యాశ్చ చుక్రుధుర్ద్విజసత్తమాః ॥ 11 ॥

బ్రాహ్మణులారా! విప్రవరేణ్యులారా! బలరాముడి మాటలు వినగానే, భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, దుర్యోధనుడు మొదలైనవారందరికీ బాగా కోపం వచ్చింది.

ఊచుశ్చ కుపితాస్సర్వే బాహ్లికాద్యాశ్చ భూమిపాః ।
అరాజ్యార్హం యదోర్వంశమవేక్ష్య ముశలాయుధమ్ ॥ 12 ॥

బాహ్లికుడు మొదలైన రాజులకూ అందరికీ కోపం వచ్చింది. రాజ్యం పాలించే అర్హత లేని యాదవులు రాజులైన తమను ఆజ్ఞాపించడం గురించి వారు బలరాముడితో ఇలా అన్నారు.

కౌరవా ఊచుః :-బలరాముడితో కౌరవులు ఇలా అంటున్నారు.

భో భోః కిమేతద్ భవతా బలభద్రేరితం వచః ।
ఆజ్ఞాం కురుకులోత్థానాం యాదవః కః ప్రదాస్యతి ॥ 13 ॥

ఓహోహో! బలరామా! ఏమంటున్నావు? కురువంశంలో పుట్టినవారిని ఆజ్ఞాపించే ఆ యాదవు డెవడు?

ఉగ్రసేనోఽపి యద్యాజ్ఞాం కౌరవాణాం ప్రదాస్యతి ।
తదలం పాణ్డురైశ్ఛత్రైర్నృపయోగ్యైరలఙ్కృతైః ॥ 14 ॥

ఉగ్రసేనుడు కూడ కౌరవులను ఆజ్ఞాపిస్తుంటే ఇంక మాకు ఈ శ్వేతచ్ఛత్రా లెందుకు? రాజోచితమైన కిరీటాది అలంకారాలు ఎందుకు? (రాజు అయ్యే యోగ్యత లేని వంశంలో పుట్టిన యాదవుడు రాజాధిరాజులైన కౌరవులను ఆజ్ఞాపించడం అవమానం.)

తద్గచ్ఛ బలదేవ త్వం సామ్బమన్యాయచేష్టితమ్ ।
విమోక్ష్యామో న భవతో నోగ్రసేనస్య శాసనాత్ ॥ 15 ॥

బలదేవా! నువ్వు వెనుదిరిగి వెళ్లిపో. తప్పు చేసిన సాంబుడిని ఉగ్రసేనుడు ఆజ్ఞాపించినా, నువ్వు చెప్పినా, మేం విడిచిపెట్టం.

ప్రణతిర్యా కృతాస్మాకం మాన్యానాం కుకురాన్ధకైః ।
న నామ సా కృతా కేయమాజ్ఞా స్వామిని భృత్యతః ॥ 16 ॥

గౌరవింపదగిన కుకురులు, అంధకులు అయిన రాజులే మాకు సాష్టాంగ నమస్కారం చేశారు. యాదవులు మాకు నమస్కారం చేయకపోగా, యజమాని సేవకుడిని ఆజ్ఞాపించినట్లుగా మాకు ఆజ్ఞ ఇవ్వడ మేమిటి?

గర్వమారోపితా యూయం సమానాసనభోజనైః ।
కో దోషో భవతాం నీతి ర్యత్ ప్రీణాత్యనపేక్షితా ॥ 17 ॥

మాతో సమానంగా కూర్చోబెట్టుకుని, మాతో సమానంగా భోజనం పెట్టడంవల్ల మీకు బాగా గర్వ మెక్కింది. అయినా, తప్పు మీది కాదులే. మీరు కోరకుండానే మీపై ప్రేమను చూపిన మా ధర్మానిదే తప్పు.

అస్మాభిరర్ఘ్యో భవతా యోఽయం బల నివేదితః ।
ప్రేమ్ణైవ న తదస్మాకం కులాద్యుష్మత్కులోచితమ్ ॥ 18 ॥

బలరామా! నీవు ప్రస్తావించిన ఆ ఉగ్రసేనుడిని మేము కేవలం ప్రేమతోనే గౌరవిస్తున్నాం. అంతే కాని వారి కులం గొప్పతనం చూసి కాదు. (మీ కులం గౌరవింపదగినది కాదు.)

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్త్వా కురవస్సర్వే నాముఞ్చన్త హరేస్సుతమ్ ।
కృతైకనిశ్చయాస్సర్వే వివిశుర్గజసాహ్వయమ్ ॥ 19 ॥

అని చెప్పి కౌరవులు శ్రీకృష్ణుడి కుమారుడిని విడిచిపెట్టలేదు. సాంబుడిని విడువరాదని అందరూ ఒకే నిర్ణయం చేసుకుని, తిరిగి హస్తినగరానికి వెళ్లిపోయారు.

మత్తః కోపేన చాఘూర్ణైస్తతోఽ ధిక్షేపజన్మనా ।
ఉత్థాపయామాస హలం విషమం స హలాయుధః ॥ 20 ॥

కౌరవులు తమ కులాన్ని గురించి చేసిన నిందలకు బలరాముడికి చాలా కోపం వచ్చింది. ఆ కోపంతో ఒళ్ళుమరిచి, ఆవేశంతో ఉడికిపోతూ, వెంటనే నాగలి ఆయుధాన్ని వేగంగా పైకెత్తాడు.

తతో విదారితా పృథ్వీ పార్ష్ణిఘాతాన్మహాత్మనః ।
ఆస్ఫోటయామాస తదా దిశశ్శబ్దేన పూరయన్ ॥
ఉవాచ చాతితామ్రాక్షో భ్రుకుటీకుటిలాననః ॥ 21 ॥

బలరాముడి పాదఘట్టనలతో భూమి బ్రద్దలైంది.ప్రతీకారంతో బలరాముడు జబ్బలు చరుస్తూండగా ఆ శబ్దం దిక్కు లన్నింటా నిండింది. కళ్లు బాగా ఎరుపెక్కాయి. కనుబొమ్మలు వంకర తిరుగుతూండగా, బలరాముడు ఇలా అన్నాడు.

బలదేవ ఉవాచ :-బలరాముడు ఈవిధంగా అంటున్నాడు.

అహో మదావలిప్తానామసారాణాం దురాత్మనామ్ ।
కౌరవాణామాధిపత్యమస్మాకం కిల కాలజమ్ ॥ 22 ॥

ఆహా! ఈ కౌరవులకు గర్వంతో కళ్లు మూసుకుపోయాయి. ఎందుకూ పనికిమాలినవాళ్లు, దుష్టబుద్ధులు. ఇటువంటి వీళ్లు మామీద అధికారం వెలగబెట్టడం కాలమహిమ సుమా!

ఉగ్రసేనస్య యామాజ్ఞాం మన్యన్తే చాప్యలఙ్ఘనామ్ ।
ఆజ్ఞాం ప్రతీచ్ఛేద్ధర్మేణ సహ దేవైశ్శచీపతిః ॥ 23 ॥

ఉగ్రసేన మహారాజు ఆజ్ఞ తిరుగులేనిది. శచీదేవితో సహా దేవేంద్రుడూ, సుధర్మ అనే ఇంద్రసభ మొత్తం కూడ ఉగ్రసేనుడి ఆజ్ఞకోసం వేచి ఉంటారు. దానినే ఈ కౌరవులు మన్నించడం లేదు.

సదాధ్యాస్తే సుధర్మాం తాముగ్రసేనశ్శచీపతేః ।
ధిఙ్ మనుష్యశతోచ్ఛిష్టే తుష్టిరేషాం నృపాసనే ॥ 24 ॥

ఉగ్రసేనుడు నిరంతరమూ శచీనాథుడైన దేవేంద్రుడిసభ సుధర్మను అధిష్ఠించి ఉంటాడు. నూరుమంది కౌరవులు కూర్చుండే ఎంగిలి సింహాసనం వీళ్ళకు ఎంత సంతోషాన్ని (గర్వాన్ని) ఇస్తున్నది?

పారిజాతతరోః పుష్పమఞ్జరీర్వనితాజనః ।
బిభర్తి యస్య భృత్యానాం సోఽ ప్యేషాం న మహీపతిః ॥ 25 ॥

ఉగ్రసేనుడి ఇంట్లో పనివాళ్ల పెళ్లాలు కూడా పారిజాత పుష్పమాలికలను అలంకరించుకుంటారు. అంతటి ఉగ్రసేనుడు ఈ కౌరవులకు రాజు కాకపోయాడా?

సమస్తభూభుజాం నాథ ఉగ్రసేనస్స తిష్ఠతు ।
అద్య నిష్కౌరవాముర్వీం కృత్వా యాస్యామి తాం పురీమ్ ॥ 26 ॥

ఉగ్రసేనుడు ఈ భూమండలం మీద ఉన్నరాజు లందరికీ అధిపతిగా స్థిరంగా ఉంటాడు. ఇక ఈ భూమి మీద కౌరవుడనేవాడు లేకుండా చేసి, ఆ తరువాతనే ద్వారకకు తిరిగి వెళ్తాను.

కర్ణం దుర్యోధనం ద్రోణమద్య భీష్మం సబాహ్లికమ్ ।
దుశ్శాసనాదీన్ భూరిం చ భూరిశ్రవసమేవ చ ॥ 27 ॥

సోమదత్తం శలం భీమమర్జునం సుయుధిష్ఠిరమ్ ।
యమజౌ కౌరవాంశ్చాన్యాన్ హత్వా సాశ్వరథద్విపాన్ ॥ 28 ॥

కర్ణుడు, దుర్యోధనుడు, ద్రోణుడు, భీష్ముడు, బాహ్లికుడు, దుశ్శాసనుడు మొదలైనవారు, (భూరి) భూరిశ్రవసుడు, సోమదత్తుడు, శలుడు, భీముడు, అర్జునుడు, ధర్మరాజు, నకుల సహదేవులు, ఇంకా ఇతరులైన కౌరవులు, అందరినీ వారి వారి గజ, అశ్వ, రథాలతో సహా సంహరిస్తాను.

వీరమాదాయ తం సామ్బం సపత్నీకం తతః పురీమ్ ।
ద్వారకాముగ్రసేనాదీన్ గత్వా వక్ష్యామి బాన్ధవాన్ ॥ 29 ॥

ఆ తరువాత భార్యతో సహా, మహావీరుడైన సాంబుడిని తీసుకుని, ద్వారకా నగరానికి వెళ్తాను. అక్కడ ఉగ్రసేనుడిని, బంధువులను కలుసుకుంటాను. వారికి ఈ సంగతులు చెప్తాను.

అథవా కౌరవాదీనాం సమస్తైః కురుభిస్సహ ।
భారావతరణే శీఘ్రం దేవరాజేన చోదితః ॥
భాగీరథ్యాం క్షిపామ్యాశు నగరం నాగసాహ్వయమ్ ॥ 30 ॥

లేదా, భూమి భారాన్ని తగ్గించడానికి దేవేంద్రాదులు నన్ను ఇక్కడికి పంపారు. కాబట్టి, కౌరవులను, కురువంశంలోని వారందరితో సహా, మొత్తం హస్తిన నగరాన్ని తీసుకునివెళ్లి భాగీరథీనదిలో కలిపివేస్తాను.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్త్వా క్రోధరక్తాక్ష సాలాఙ్గోఽధోముఖం హలమ్ ।
ప్రాకారవప్రే విన్యస్య చకర్ష ముశలాయుధః ॥ 31 ॥

అని పలికి, బలరాముడు కోపంతో ఎఱ్ఱబడిన కళ్లతో చేతిలోని నాగలి ఆయుధాన్ని వంచి, కోటగోడలో గుచ్చి, గట్టిగా లాగాడు.

ఆఘూర్ణితం తత్ సహసా తతో వై హస్తినాపురమ్ ।
దృష్ట్వా సంక్షుబ్ధహృదయాశ్చుక్రుశుస్సర్వకౌరవాః ॥ 32 ॥

ఆవేగానికి హస్తినగరం అంతా ఊగిసలాడింది. అది చూసి, కౌరవు లందరూ గుండె లదిరిపోయి, ఆక్రోశించారు.

కౌరవా ఊచుః :–బలరాముడితో కౌరవులు ఇలా అంటున్నారు.

రామ రామ మహాబాహో క్షమ్యతాం క్షమ్యతాం త్వయా ।
ఉపసంహ్రియతాం కోపః ప్రసీద ముశలాయుధ ॥ 33 ॥

రామా! బలరామా! పెద్దపెద్దబాహువులు కలిగినవాడా, రోకలి ఆయుధంగా కలిగినవాడా! క్షమించు. క్షమించు. మామీద కోపం విడిచిపెట్టు. దయ చూపించు.

ముక్తస్సామ్బస్సపత్నీకస్తవ జ్ఞాతం బలం బల ।
అవిజ్ఞాతప్రభావాణాం క్షమ్యతామపరాధినామ్ ॥ 34 ॥

బలదేవా! నీ బలం ఏమిటో మాకు తెలిసివచ్చింది. నీ శక్తిసామర్థ్యాలు గ్రహించలేక తప్పు చేసిన మమ్మల్ని క్షమించు. ఇదుగో, భార్యతో సహా సాంబకుమారుడిని విడిచిపెట్టేశాం.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

తతో నిర్యాతయామాసుస్సామ్బం పత్న్యా సమన్వితమ్ ।
నిష్క్రమ్య స్వపురీం తూర్ణం కౌరవా మునిపుఙ్గవాః ॥ 35 ॥

మహర్షులారా! కౌరవులు హస్తిననగరం వెలువడి వచ్చి, భార్యతో సహా సాంబుడిని బలరాముడి వద్దకు పంపించారు.

భీష్మద్రోణకృపాదీనాం ప్రణమ్య వదతాం ప్రియమ్ ।
క్షాన్తమేవ మయేత్యాహ బలో బలవతాం వరః ॥ 36 ॥

బలవంతులలో శ్రేష్ఠుడైన బలరాముడు మంచిమాటలు చెప్తున్న భీష్ముడు, ద్రోణుడు, కృపుడు మొదలైన పెద్దలకు అప్పుడు నమస్కరించాడు. 'జరిగినది మనసులో ఉంచుకోను' అన్నాడు.

అద్యాప్యాఘూర్ణితాకారం లక్ష్యతే తత్పురం ద్విజాః ।
ఏష ప్రభావో రామస్య బలశౌర్యోపలక్షితః ॥ 37 ॥

విప్రులారా! బలరాముడి బలపరాక్రమాలకు సూచకంగా ఆ హస్తినాపురం ఇప్పటికీ ఆనాటి దెబ్బతిన్న రూపంలోనే కనిపిస్తుంది. ఇదీ బలరాముడి మాహాత్మ్యం.

తతస్తు కౌరవాస్సామ్బం సమ్పూజ్య హలినా సహ ।
ప్రేషయామాసురుద్వాహధనభార్యాసమన్వితమ్ ॥ 38 ॥

అప్పుడు కౌరవులు బలరాముడితో గూడ, సాంబుడిని చక్కగా సత్కరించారు. పెండ్లికానుకలు, సంపదలతో కూడ సాంబుడిభార్యను ఇచ్చి, అందరినీ ద్వారకకు పంపించారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే శ్రీకృష్ణచరితే బలదేవమాహాత్మ్యనిరూపణం నామ ఏకోనశతతమోఽధ్యాయః ॥ 99 ॥

శ్రీబ్రహ్మపురాణంలో శ్రీకృష్ణచరితలో బలదేవ మాహాత్మ్య నిరూపణం అనే తొంబైతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

శతతమోఽధ్యాయః - నూఱవ అధ్యాయం

ద్వివిదవానరవధవర్ణనమ్ - ద్వివిద వానరవధ వర్ణనం

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా అంటున్నారు.

శృణుధ్వం మునయస్సర్వే బలస్య బలశాలినః ।
కృతం యదన్యదేవాభూత్ తదపి శ్రూయతాం ద్విజాః ॥ 1 ॥

మహర్షులారా! అందరూ వినండి. విప్రులారా! బలవంతుడైన బలరాముడు చేసిన ఇంకొక మహాకార్యాన్ని గురించి చెప్తాను. అది కూడ వినండి.

నరకస్యాసురేన్ద్రస్య దేవపక్షవిరోధినః ।
సఖాభవన్మహావీర్యో ద్వివిదో నామ వానరః ॥ 2 ॥

ద్వివిదుడు అనే వానరు డొక డున్నాడు. అతడు దేవతలకు శత్రువైన నరకాసురుడికి స్నేహితుడు.

వైరానుబన్ధం బలవాన్ స చకార సురాన్ ప్రతి ॥ 3 ॥

నరకాసురుడిని చంపారనే కోపంతో బలవంతుడైన ఆ వానరుడు దేవతలతో మిక్కిలి విరోధం పెట్టుకున్నాడు.

ద్వివిద ఉవాచ :-ద్వివిదుడు ఇలా అంటున్నాడు.

నరకం హతవాన్ కృష్ణో బలదర్పసమన్వితమ్ ।
కరిష్యే సర్వదేవానాం తస్మాదేవ ప్రతిక్రియామ్ ॥ 4 ॥

అత్యధికమైన శక్తిసామర్థ్యాలు కలిగిన నరకుడిని శ్రీకృష్ణుడు సంహరించాడు. అందుచేత (శ్రీకృష్ణ డొక్కడిమీద మాత్రమే కాకుండా ఆ పక్షంవారైన) దేవత లందరి మీద నరకవధకు ప్రతీకారం తీర్చుకుంటాను.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

యజ్ఞవిధ్వంసనం కుర్వన్ మర్త్యలోకక్షయం తథా ।
తతో విధ్వంసయామాస యజ్ఞానజ్ఞానమోహితః ॥ 5 ॥

యాగాలను ధ్వంసం చేశాడు. మానవులను మట్టుబెట్టేవాడు. ఇంకా, అజ్ఞానంతో మతి లేకుండా వేదసంబంధమైన అన్ని కార్యాలనూ నాశనం చేశాడు.

బిభేద సాధుమర్యాదాం క్షయం చక్రే చ దేహినామ్ ।
దదాహ చపలో దేశం పురగ్రామాన్తరాణి చ ॥ 6 ॥

సజ్జనుల గౌరవాన్ని మంట గలిపాడు. అన్నిరకాల ప్రాణులను సంహరించాడు. ఆ బుద్ధితక్కువవాడు పట్టణాలనూ, పల్లెలనూ, మారుమూలలనుండీ దేశమంతటినీ తగలబెట్టాడు.

క్వచిచ్చ పర్వతక్షేపాద్ గ్రామాదీన్ సమచూర్ణయత్ ।
శైలానుత్పాట్య తోయేషు ముమోచామ్బునిధౌ తథా ॥ 7 ॥

కొన్నిచోట్ల పర్వతాలను తీసుకునివచ్చి, గ్రామాలు మొదలైన జనావాసాలపై పడవేసి, ఊళ్లకు ఊళ్లు నాశనం చేశాడు. కొండలను పెరికి, వాటిని తీసుకువెళ్లి సముద్రజలాలలో పడేశాడు.

పునశ్చార్ణవమధ్యస్థః క్షోభయామాస సాగరమ్ ।
తేనాతిక్షోభితశ్చాబ్ధిరుద్వేలో జాయతే ద్విజాః ॥
ప్లావయంస్తీరజాన్ గ్రామాన్ పురాదీనతివేగవాన్ ॥ 8 ॥

విప్రులారా! సముద్రం మధ్యలో ఉండి దాన్ని అల్లకల్లోలం చేశాడు. దానివల్ల సముద్రం చెల్లాచెదురై, అలలు ఉవ్వెత్తున రేగి, సముద్రజలం వేగంగా ప్రవహిస్తూ ఒడ్డు వెంబడిగా ఉన్న పల్లెలనూ, పట్టణాలనూ చుట్టుప్రక్కల గ్రామాలనూ ముంచివేసింది.

కామరూపం మహారూపం కృత్వా సస్యాన్యనేకశః ।
లుఠన్ భ్రమణసమ్మర్దైస్సఞ్చూర్ణయతి వానరః ॥ 9 ॥

ఆ వానరుడు తనఇష్టం వచ్చినపెద్దఆకారం ధరించి, దూకుతూ, వేగంగా గెంతుతూ, అక్కడి పంటలను రకరకాలుగా ధ్వంసం చేశాడు.

తేన విప్రకృతం సర్వం జగదేతద్ దురాత్మనా ।
నిస్స్వాధ్యాయవషట్కారం ద్విజాశ్చాసీత్ సుదుఃఖితమ్ ॥ 10 ॥

బ్రాహ్మణులారా! ఆ దుర్మార్గుడు ఈ లోకం అంతటికీ ఎంతో కీడు చేశాడు. వేదాధ్యయనాలు, హోమాలు లేకుండా పోయాయి. లోకం దుఃఖంలో మునిగిపోయింది.

కదాచిద్ రైవతోద్యానే పపౌ పానం హలాయుధః ।
రేవతీ చ మహాభాగా తథైవాన్యా వరస్త్రియః ॥ 11 ॥

ఒకసారి బలరాముడు రైవతం అనే ఉద్యానవనంలో మద్యం తాగాడు. ఉత్తమురాలైన బలరాముడి భార్య రేవతి, ఇంకా ఇతరస్త్రీలు కొంతమంది కూడ అతడితోపాటుగా ఉన్నారు.

ఉద్గీయమానో విలసల్లలనామౌలిమధ్యగః ।
రేమే యదువరశ్రేష్ఠః కుబేర ఇవ మన్దిరే ॥ 12 ॥

వారందరూ బలరాముడి మహిమలను గొంతెత్తి కమ్మగా గానం చేస్తున్నారు. యాదవులలో శ్రేష్ఠుడైన ఆ బలరాముడు సుందరులైన ఆడవారి మధ్యలో, అంతఃపురంలోని కుబేరుడిలాగా ఆనందంగా క్రీడిస్తున్నాడు.

తతస్స వానరోఽభ్యేత్య గృహీత్వా సీరిణో హలమ్ ।
ముశలం చ చకారాస్య సమ్ముఖస్సవిడమ్బనామ్ ॥ 13 ॥

ఆ సమయంలో ద్వివిదుడు అక్కడికి వచ్చాడు. బలరాముడి నాగలిని, రోకలిని తీసుకున్నాడు. ఎదుట నిలిచి, బలరాముడిని అనుకరిస్తూ గెంతాడు.

తథైవ యోషితాం తాసాం జహాసాభిముఖం కపిః ।
పానపూర్ణాంశ్చ కరకాంశ్చిక్షేపాహత్య వై తదా ॥ 14 ॥

అదే విధంగా అప్పుడు రేవతి మొదలైన ఆడవారి యెదుట నిలిచి, వాళ్లను ఎగతాళి చేస్తూ నవ్వసాగాడు. మద్యంతో నిండిన కుండలను విసిరివేసి, పగలగొట్టాడు.

తతః కోపపరీతాత్మా భర్త్సయామాస తం బలమ్ ।
తథాపి తమవజ్ఞాయ చక్రే కిలకిలాధ్వనిమ్ ॥ 15 ॥

అది చూసి, బలరాముడికి కోపం వచ్చింది. బలవంతుడైన ద్వివిదుడిని బెదిరించాడు. అయినా, ఆ కోతి బెదరకుండా, బలరాముడిని అవమానిస్తూ కిలకిల ధ్వనులు చేసింది.

తతస్సముత్థాయ బలో జగృహే ముశలం రుషా ।
సోఽపి శైలశిలాం భీమాం జగ్రాహ ప్లవగోత్తమః ॥ 16 ॥

అప్పుడు బలరాముడు లేచి నిలుచున్నాడు. కోపంతో రోకలి చేత బట్టాడు. ఆ వానరుడు కూడ భయంకరమైన పెద్ద బండరాయిని తీసుకున్నాడు.

చిక్షేప చ స తాం క్షిప్తాం ముశలేన సహస్రధా ।
బిభేద యాదవశ్రేష్ఠస్సా పపాత మహీతలే ॥ 17 ॥

ఆ బండరాతిని బలరాముడి పైకి విసిరివేశాడు. మీదికి వస్తున్న ఆ రాతిని బలరాముడు రోకలితో వెయ్యి ముక్కలు చేశాడు. ముక్కలైన ఆ బండరాయి నేలమీద పడిపోయింది.

అపతన్ముశలం చాసౌ సముల్లఙ్ఘ్య ప్లవఙ్గమః ।
వేగేనాయామ్య రోషేణ బలేనోరస్యతాడయత్ ॥ 18 ॥

రోకలి దెబ్బను తప్పించుకోవడంలో ద్వివిదుడు కింద పడ్డాడు. వెంటనే లేచి, బలరాముడి గుండెల మీద కోపంతో బలంగా కొట్టాడు.

తతో బలేన కోపేన ముష్టినా మూర్ధ్ని తాడితః ।
పపాత రుధిరోద్గారీ ద్వివిదః క్షీణజీవితః ॥ 19 ॥

అప్పుడు బలరాముడు కోపంతో ఆ వానరుడి నెత్తిమీద పిడికిలితో బలంగా గుద్దాడు. ఆ దెబ్బతో ద్వివిదుడు నెత్తురు కక్కుకుంటూ, ప్రాణాలు పోయి, నేలగూలాడు.

పతతా తచ్ఛరీరేణ గిరేశ్శృఙ్గమశీర్యత ।
మునయశ్శతధా వజ్రివజ్రేణేవ హి తాడితమ్ ॥ 20 ॥

మహర్షులారా! ద్వివిదుడి మహాశరీరం కింద పడగానే ఇంద్రుడి వజ్రాయుధం దెబ్బ తగిలినట్లుగా ఆ రైవత పర్వతశిఖరం విరిగిపడింది.

పుష్పవృష్టిం తతో దేవా రామస్యోపరి చిక్షిపుః ।
ప్రశశంసుస్తదాభ్యేత్య సాధ్వేతత్ తే మహత్ కృతమ్ ॥ 21 ॥

అప్పుడు దేవతలు బలరాముడిపై పూలవాన కురిపించారు. బలరాముడి వద్దకు వచ్చి, 'చాల మంచిది. నువ్వు చాలా గొప్పపని చేశావు' అని దేవతలు బలరాముడిని ప్రశంసించారు.

అనేన దుష్టకపినా దైత్యపక్షోపకారిణా ।
జగన్నిరాకృతం వీర దిష్ట్యా సక్షయమాగతః ॥ 22 ॥

దుర్మార్గుడైన ఈ కోతి రాక్షసుల పక్షాన ఉండి, వాళ్లకు మేలు చేస్తున్నాడు. లోకానికి కీడు చేస్తున్నాడు. మహావీరా! బలరామా! నీవు వీడిని సంహరించడం మా అదృష్టం.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసుడు ఇలా అంటున్నాడు.

ఏవంవిధాన్యనేకాని బలదేవస్య ధీమతః ।
కర్మాణ్యపరిమేయాని శేషస్య ధరణీభృతః ॥ 23 ॥

ఈ భూలోకాన్ని మోస్తున్న ఆదిశేషుడు అయిన ఈ బలరాముడు బుద్ధిమంతుడు. ఈవిధంగా ఇతడు చేసిన గొప్పపనులు లెక్కలేనన్ని ఉన్నాయి.

ఇతి శ్రీబ్రహ్మపురాణే బలదేవమాహాత్మ్యే ద్వివిదవానరవధవర్ణనం నామ శతతమోఽధ్యాయః ॥ 100 ॥

శ్రీబ్రహ్మపురాణంలో బలదేవ మాహాత్మ్యంలో ద్వివిద వానరవధ నిరూపణం అనే నూఅవ అధ్యాయం సంపూర్ణం.



ఏకాధికశతతమోఽధ్యాయః - నూటఒకటవ అధ్యాయం

శ్రీకృష్ణనిజధామగమననిరూపణమ్ - శ్రీకృష్ణనిజధామగమననిరూపణం

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

ఏవం దైత్యవధం కృష్ణో బలదేవసహాయవాన్ ।
చక్రే దుష్టక్షితీశానాం తథైవ జగతః కృతే ॥ 1 ॥

జగత్తును రక్షించడంకోసం శ్రీకృష్ణస్వామి బలరాముడితో కలిసి, ఈవిధంగా రాక్షసులను, లోకకంటకులైన భూపాలకులను సంహరించాడు.

క్షితేశ్చ భారం భగవాన్ ఫాల్గునేన సమం విభుః ।
అవతారయామాస హరిస్సమస్తాక్షౌహిణీవధాత్ ॥ 2 ॥

శ్రీకృష్ణభగవానుడు అర్జునుడితో కలిసి, అక్షౌహిణుల సైన్యాన్ని మొత్తాన్నీ సంహరించి, భూమిభారాన్ని దించాడు.

కృత్వా భారావతరణం భువో హత్వాఖిలాన్ నృపాన్ ।
శాపవ్యాజేన విప్రాణాముపసంహృతవాన్ కులమ్ ॥ 3 ॥

శ్రీకృష్ణస్వామి ఈవిధంగా దుష్టులైనరాజు లందరినీ సంహరించి, భూభారాన్ని తొలగించిన తరువాత బ్రాహ్మణుల శాపం అనే నెపంతో తన కులాన్ని కూడ తనలోకి తీసుకున్నాడు (సంహరించాడు).

ఉత్సృజ్య ద్వారకాం కృష్ణస్త్యక్త్వా మానుష్యమాత్మభూః ।
స్వాంశో విష్ణుమయం స్థానం ప్రవివేశ పునర్నిజమ్ ॥ 4 ॥

శ్రీకృష్ణస్వామి తనకు తానుగా స్వీకరించి మానవజన్మను ఉపసంహరించుకున్నాడు. ద్వారకానగరాన్ని విడిచిపెట్టి, శ్రీమహావిష్ణుస్వరూపమైన తన అంశతో తిరిగి వైకుంఠంలో ప్రవేశించాడు.

మునయ ఊచుః :-మునులు వ్యాసమహర్షితో ఇలా అంటున్నారు.

స విప్రశాపవ్యాజేన సఞ్జహ్రే స్వకులం కథమ్ ।
కథం చ మానుషం దేహముత్ససర్జ జనార్దనః ॥ 5 ॥

శ్రీకృష్ణస్వామి బ్రాహ్మణుల శాపం అనే నిమిత్తంతో యాదవకులాన్ని ఏవిధంగా ఉపసంహరించాడు? మానవ శరీరాన్ని ఏవిధంగా విడిచిపెట్టాడు?

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసుడు ఈవిధంగా చెప్తున్నాడు.

విశ్వామిత్రస్తథా కణ్వో నారదశ్చ మహామునిః ।
పిణ్డారకే మహాతీర్థే దృష్ట్వా యదుకుమారకైః ॥ 6 ॥

యదుకుమారులు పిండారకం అనే గొప్ప పుణ్యతీర్థం వద్ద విశ్వామిత్రుడిని, కణ్వుడిని, నారదమహర్షిని చూశారు.

తతస్తే యౌవనోన్మత్తా భావికార్యప్రచోదితాః ।
సామ్బం జామ్బవతీపుత్రం భూషయిత్వా స్త్రియం యథా ॥
ప్రసృతాస్తాన్ మునీనూచుః ప్రణిపాతపురస్సరమ్ ॥ 7 ॥

యౌవనంలో ఉన్నవారికి వయసుమదంతో మతి తప్పింది. దానికి తోడు భవిష్యత్తులో జరగవలసిన కార్యం వారిని ప్రేరేపించింది. దాని ప్రభావంతో వారు జాంబవతికుమారుడైన సాంబుడికి ఆడవేషం వేశారు. అతడిని తీసుకుని ఆమహర్షుల వద్దకు వెళ్లారు. అందరూ సాష్టాంగంగా నమస్కారం చేశారు. తరువాత ఆ మహర్షులతో ఇలా అన్నారు.

కుమారా ఊచుః :–యదుకుమారులు నారదాదిమహర్షులతో ఇలా అంటున్నారు.

ఇయం స్త్రీ పుత్రకామా తు ప్రభో కిం జనయిష్యతి ? ॥ 8 ॥

మహాత్మా! ఈమె కొడుకు కావాలనుకుంటున్నది. ఎవరిని కంటుంది?

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

దివ్యజ్ఞానోపపన్నాస్తే విప్రలబ్ధాః కుమారకైః ।
శాపం దదుస్తదా విప్రాస్తేషాం నాశాయ సువ్రతాః ॥ 9 ॥

గొప్పనియమనిష్ఠలు, దివ్యమైన జ్ఞానసంపద కలిగిన ఆమహర్షులు యథార్థం తెలుసుకున్నారు. మగవాడిని ఆడది అని అబద్ధం చెప్పి తమను మోసం చేసిన యదుకుమారులను శపించారు.

మునయః కుపితాః ప్రోచుర్ముశలం జనయిష్యతి ।
యేనాఖిలకులోత్సాదో యాదవానాం భవిష్యతి ॥ 10 ॥

కోపంతో ఆమహర్షులు 'ఈమెకడుపున రోకలి పుడుతుంది. ఆరోకలి యాదవులవంశం మొత్తం నాశనం చేస్తుంది' అన్నారు.

ఇత్యుక్తా స్తైః కుమారాస్త ఆచచక్షుర్యథాతథమ్ ।
ఉగ్రసేనాయ ముశలం జజ్ఞే సామ్బస్య చోదరాత్ ॥ 11 ॥

ఆ మాటలు విని యదుకుమారులు వెంటనే ఈవృత్తాంతం అంతా ఉన్నది ఉన్నట్లుగా ఉగ్రసేనమహారాజుకు తెలియజేశారు. ఆతరువాత సాంబుడికడుపునుండి ఒకపెద్ద ఇనపరోకలి పుట్టింది.

తదుగ్రసేనో ముశలమయశ్చూర్ణమకారయత్ ।
జజ్ఞే త చ్చైరకా చూర్ణం ప్రక్షిప్తం వై మహోదధౌ ॥ 12 ॥

ఉగ్రసేనమహారాజు ఆ ఇనపరోకలిని పొడిపొడి చేయించాడు. ఆ ఇనపపొడిని సముద్రంలో పడేయించాడు. ఆ రోకలిపొడినుండి తుంగగడ్డి పుట్టింది.

ముశలస్యాథ లౌహస్య చూర్ణితస్యాన్ధకైర్ద్విజాః ।
ఖణ్డం చూర్ణయితుం శేకుర్నైవ తే తోమరాకృతి ॥ 13 ॥

విప్రులారా! అంధకులు ఆ ఇనపరోకలిని పొడి చేయగా, దానిలోని ఒకముక్కను మాత్రం పొడి చేయడం వారికి సాధ్యం కాలేదు. ఆముక్క ఒక ఇనుపగుదియలాగా అయింది.

తదప్యమ్బునిధౌ క్షిప్తం మత్స్యో జగ్రాహ జాలిభిః ।
ఘాతితస్యోదరాత్తస్య లుబ్ధో జగ్రాహ తజ్జరా ॥ 14 ॥

ఆ ఇనుపగుదియను కూడ వారు సముద్రంలో పడేశారు. దానిని సముద్రంలోని ఒకానొక చేప మింగింది. ఆ చేపను జాలరులు పట్టుకున్నారు. దురాశాపరుడైన ఒక జాలరి ఆ చేపను చంపి, దానికడుపులో ఉన్న ఇనుపగుదియను తీసుకున్నాడు.

విజ్ఞాతపరమార్థోఽపి సర్వశక్తిమయో హరిః ।
నైచ్ఛత్తదన్యథా కర్తుం విధినా యత్ సమాహృతమ్ ॥ 15 ॥

శ్రీకృష్ణస్వామికి యథార్థం అంతా తెలుసు. ఎంతటికార్యమైనా సాధించగలిగినసమర్థుడు. అయినా, విధినిర్ణయాన్ని అనుసరించి జరుగుతూ ఉన్నదానిని మార్చి మరొక విధంగా (యాదవులకు మేలు గలిగేవిధంగా) చేయడానికి ఇష్టపడలేదు.

దేవైశ్చ ప్రహితో దూతః ప్రణిపత్యాహ కేశవమ్ ।
రహస్యేవమహం దూతః ప్రహితో భగవన్ సురైః ॥ 16 ॥

దేవతలు శ్రీకృష్ణుడివద్దకు ఒకదూతను పంపారు. అతడు వచ్చి, కృష్ణుడికి సాష్టాంగంగా నమస్కరించి, ఏకాంతంలో ఇలా చెప్పాడు. 'మహాత్మా, నేను దేవతలు పంపగా వచ్చినదూతను.

వస్వశ్విమరుదాదిత్యరుద్రసాధ్యాదిభిస్సహ ।
విజ్ఞాపయతి వశ్శక్రస్తదిదం శ్రూయతాం ప్రభో ॥ 17 ॥

దేవా! వసువులు, అశ్వినులు, మరుత్తులు, ఆదిత్యులు, రుద్రులు, సాధ్యులు మొదలైనవా రందరితో కలిసి, దేవేంద్రుడు తమకు ఈవిధంగా విన్నవించుకుంటున్నాడు. ఈమాటలు వినండి.

దేవా ఊచుః :–కృష్ణుడితో చెప్పమని దేవతలు ఇలా చెప్పారు.

భారావతారణార్థాయ వర్షాణామధికం శతమ్ ।
భగవానవతీర్ణోఽత్ర త్రిదశైస్సమ్ప్రసాదితః ॥ 18 ॥

దేవతలు ప్రార్థించగా, భూభారాన్ని తొలగించడానికి స్వామి భూమిపై అవతరించారు. ఆ పనిపై ఇప్పటికి నూరుసంవత్సరాలుగా భూలోకంలోనే ఉన్నారు.

దుర్వృత్తా నిహతా దైత్యా భువో భారోఽవతారితః ।
త్వయా సనాథా స్త్రిదశా వ్రజన్తు త్రిదశాలయమ్ ॥ 19 ॥

స్వామివారు దుర్మార్గులైన రాక్షసులను సంహరించారు. భూమి భారం తగ్గింది. దేవతలకు తామే దిక్కయి, కాపాడుతున్నారు. ఇక స్వామి దేవలోకానికి తిరిగిరావాలి.

తవాతీతం జగన్నాథ వర్షాణామధికం శతమ్ ।
ఇదానీం గమ్యతాం స్వర్గో భవతా యది రోచతే ॥ 20 ॥

లోకేశ్వరా! (తమరు భూలోకానికి వెళ్లి) ఇప్పటికి నూరేండ్లకు పైగా గడిచిపోయింది. తమ కిష్ట మైతే ఇక స్వర్గలోకానికి రండి.

దేవైర్విజ్ఞాపితో దేవోఽ పృథాత్రైవ రతిస్తవ ।
తత్ సామ్ప్రతం యథాకాలమాస్థేయమనుజీవిభిః ॥ 21 ॥

స్వామివారికి భూలోకంలో ఉండడం ఇష్టమైతే, తమకు తోచినంతకాలం, మీఅనుచరులతో కలిసి, ఇక్కడే ఉండండి'. అని దేవతలు విన్నవించుకుంటున్నారు (అని దూత దేవతలసందేశాన్ని శ్రీకృష్ణస్వామికి వినిపించాడు).

శ్రీభగవానువాచ :–దేవతలతో శ్రీకృష్ణభగవానుడు ఇలా చెప్తున్నాడు.

యత్త్వమాత్థాఖిలం దూత వేద్మి చైతదహం పునః ।
ప్రారబ్ధ ఏవ హి మయా యాదవానామపి క్షయః ॥ 22 ॥

ఓయీ దేవదూతా! నీవు చెప్పినది సమస్తమూ నాకు ముందుగానే తెలుసు. భూభారాన్ని తగ్గించడానికి యాదవులను గూడ తొలగించడం ప్రారంభించాను.

భువో నామాతిభారోఽ యం యాదవైరనిబర్హితైః ।
అవతారం కరోమ్యస్య సప్తరాత్రేణ సత్వరః ॥ 23 ॥

మిక్కిలి బలవంతులైన యాదవులను ఎవ్వరూ సంహరించలేరు. వీరు కూడ భూమికి బరువే. త్వరగా వారం రోజులలో భూమికి ఈ (యాదవుల) భారాన్ని కూడ తొలగిస్తాను.

యథాగృహీతం చామ్భోధౌ హత్వాఽ హం ద్వారకాం పునః ।
యాదవానుపసంహృత్య యాస్యామి త్రిదశాలయమ్ ॥ 24 ॥

సముద్రంనుండి స్వీకరించిన ద్వారకానగరాన్ని తిరిగి సముద్రంలో కలిపి, యాదవులను ఉపసంహరించి, స్వర్గలోకానికి వెళ్తాను.

మనుష్యదేహముత్సృజ్య సఙ్కర్షణసహాయవాన్ ।
ప్రాప్త ఏవాస్మి మన్తవ్యో దేవేన్ద్రేణ తథా సురైః ॥ 25 ॥

నేను ఈమానవదేహాన్ని విడిచిపెట్టి, బలరాముడితో కలిసి, తిరిగి స్వర్గలోకానికి తిరిగి వచ్చాననే దేవేంద్రుడూ, దేవతలూ నిశ్చయించుకోవచ్చును.

జరాసన్ధాదయో యేఽ న్యే నిహతా భారహేతవః ।
క్షితేస్తేభ్యస్స భారో హి యదూనాం సమధీయత ॥ 26 ॥

భూమికి భారమైన జరాసంధుడు మొదలైనవారినీ, ఇంకా ఇతరులనూ హతమార్చాను. వారినుండి ఆ భూభారం యాదవులపై పడింది.

తదేతం సుమహాభారమవతార్య క్షితేరహమ్ ।
యాస్యామ్యమరలోకస్య పాలనాయ బ్రవీహి తాన్ ॥ 27 ॥

యాదవులవలన కలుగుతున్న ఆ మహాభారాన్ని భూమికి లేకుండా చేసి, దేవలోకాన్ని రక్షించడంకోసం ఆలోకానికి వస్తానని వారికి చెప్పు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

ఇత్యుక్తో వాసుదేవేన దేవదూతః ప్రణమ్య తమ్ ।
మునయో దివమాగత్య దేవరాజాన్తికం యయౌ ॥ 28 ॥

మునులారా! శ్రీకృష్ణస్వామి తన సందేశాన్ని ఇలా చెప్పగా దేవతలదూత స్వామికి ప్రణామం చేసి, స్వర్గలోకానికి వచ్చి, దేవేంద్రుడి వద్దకు వెళ్లాడు.

భగవానప్యథోత్పాతాన్ దివ్యాన్ భౌమాన్తరిక్షగాన్ ।
దదర్శ ద్వారకాపుర్యా వినాశాయ దివానిశమ్ ॥ 29 ॥

శ్రీకృష్ణుడు కూడ రాత్రింబవళ్లు భూమిపైన, ఆకాశంలోనూ, దేవతాసంబంధంగానూ రకరకాలయిన అపశకునాలను గమనించాడు. ఆ అపశకునాలు ద్వారకానగరం వినాశాన్ని సూచిస్తున్నాయి.

తాన్ దృష్ట్వా యాదవానాహ పశ్యధ్వమతిదారుణాన్ ।
మహోత్పాతాన్ శమాయైషాం ప్రభాసం యామ మా చిరమ్ ॥ 30 ॥

ఆ అపశకునాలను చూచి శ్రీకృష్ణుడు యాదవులతో ఇలా అన్నాడు. 'మిక్కిలి భయంకరమైన ఈ అపశకునాలను చూడండి. వీటిబారినుండి బయటపడడానికి మనం వెంటనే ప్రభాసతీర్థానికి వెళ్దాం. ఆలస్యం చేయవద్దు'.

మహాభాగవతః ప్రాహ ప్రణిపత్యోద్ధవో హరిమ్ ।
భగవన్ యన్మయా కార్యం తదాజ్ఞాపయ సామ్ప్రతమ్ ॥ 31 ॥

అప్పుడు భాగవతోత్తముడైన ఉద్ధవుడు శ్రీకృష్ణస్వామికి సాష్టాంగంగా నమస్కరించి, ఇలా అన్నాడు. 'మహాత్మా, ఈసమయంలో నేను చేయవలసిన పని ఏమిటో ఆజ్ఞాపించండి.

మన్యే కులమిదం సర్వం భగవాన్ సంహరిష్యతి ।
నాశాయాస్య నిమిత్తాని కులస్యాచ్యుత లక్షయే ॥ 32 ॥

శ్రీకృష్ణా! తమరు ఇప్పుడు యాదవకులం సమస్తం నాశనం చేస్తారని భావిస్తున్నాను. ఈఅపశకునాలవల్ల యదుకులం నాశనం అయ్యే సూచనలు గోచరిస్తున్నాయి.

శ్రీభగవా నువాచ :–ఉద్ధవుడితో శ్రీకృష్ణుడు ఇలా అంటున్నాడు.

గచ్ఛ త్వం దివ్యయా గత్యా మత్ప్రసాదసముత్థయా ।
బదరీమాశ్రమం పుణ్యం గన్ధమాదనపర్వతే ॥ 33 ॥

ఉద్ధవా! నా అనుగ్రహంచేత నీకు అతిమానుషమైనగమనం సిద్ధిస్తుంది. దానితో నీవు గంధమాదన పర్వతంమీద ఉన్న బదరికాశ్రమానికి వెళ్లు.

నరనారాయణస్థానే పవిత్రితమహీతలే ।
మన్మనా మత్ప్రసాదేన తత్ర సిద్ధిమవాప్స్యసి ॥ 34 ॥

ఆ ప్రదేశం నరుడు, నారాయణుడు అనే మహర్షులు ఉండడంచే పావనమైనది. ఆచోట నామీద ఏకాగ్రంగా నిలిచినబుద్ధివలన, నాఅనుగ్రహంతో నీవు సిద్ధిని పొందుతావు.

అహం స్వర్గం గమిష్యామి ఉపసంహృత్య వై కులమ్ ।
ద్వారకాం చ మయా త్యక్తాం సముద్రః ప్లావయిష్యతి ॥ 35 ॥

యాదవకులాన్ని ఉపసంహరించి, నేను స్వర్గానికి వెళ్తాను. నేను విడిచిపెట్టిన తరువాత ఈద్వారకానగరాన్ని సముద్రుడు ముంచివేస్తాడు.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

ఇత్యుక్తః ప్రణిపత్యైనం జగామ స తదోద్ధవః ।
నరనారాయణస్థానం కేశవేన ప్రచోదితః ॥ 36 ॥

శ్రీకృష్ణస్వామి ఈవిధంగా చెప్పగా విని, ఉద్ధవుడు స్వామికి ప్రణామం చేసి, కృష్ణుడి ప్రేరణతో నరనారాయణులు ఉండే బదరికాశ్రమానికి వెళ్ళిపోయాడు.

తతస్తే యాదవాస్సర్వే రథానారుహ్య శీఘ్రగాన్ ।
ప్రభాసం ప్రయయుస్సార్ధం కృష్ణరామాదిభిర్ ద్విజాః ॥ 37 ॥

విప్రులారా! ఆతరువాత కృష్ణుడితోనూ, బలరాముడితోనూ కలిసి, యాదవులందరూ వేగంగా ప్రయాణించే రథాల నెక్కి, ప్రభాసతీర్థానికి వెళ్ళారు.

ప్రాప్య ప్రభాసం ప్రయతా ప్రీతాస్తే కుకురాన్ధకాః ।
చక్రుస్తత్ర సురాపానం వాసుదేవానుమోదితాః ॥ 38 ॥

ప్రభాసతీర్థానికి వెళ్లిన తరువాత కుకురులూ, అంధకులూ శ్రీకృష్ణుడిఅనుమతితో ఆనందంగా ఆసక్తిగా మద్యం తాగారు.

పిబతాం తత్ర వై తేషాం సఙ్ఘర్షేణ పరస్పరమ్ ।
యాదవానాం తతో జజ్ఞే కలహాగ్నిః క్షయావహః ॥ 39 ॥

తాగినవారికి పరస్పరం తోపులాట జరిగింది. దానితో ఆయాదవులలో కులవినాశకరమయిన కలహం నిప్పులా రాజుకుంది.

జఘ్నుః పరస్పరం తే తు శస్త్రైర్దైవబలాత్కృతాః ।
క్షీణశస్త్రా స్తు జగృహుః ప్రత్యాసన్నామథైరకామ్ ॥ 40 ॥

ఆ తగవులాటలో వారు దైవం ప్రేరణతో బలవంతంగా వివిధాయుధాలతో ఒకరినొకరు చంపుకున్నారు. వారిదగ్గర ఉన్న ఆయుధాలన్నీ నశించిపోయాయి. అందుచేత వారు కొట్టుకోవడానికి దగ్గరలోనే ఉన్న తుంగగడ్డిని తీసుకున్నారు.

ఏరకా తు గృహీతా తైర్వజ్రభూతేవ లక్ష్యతే ।
తయా పరస్పరం జఘ్నుస్సమ్ప్రహారైస్సుదారుణైః ॥ 41 ॥

వారు తీసుకున్న ఆ గడ్డి వజ్రాయుధంలాగా తోచింది. దానితో భయంకరంగా కొట్టుకుని, యాదవులు ఒకరినొకరు చంపుకున్నారు.

ప్రద్యుమ్నసామ్బప్రముఖాః కృతవర్మాథ సాత్యకిః ।
అనిరుద్ధాదయశ్చాన్యే పృథుర్విపృథు రేవ చ ॥ 42 ॥

చారుదేష్ణస్సుబాహుశ్చ తథాఽక్రూరాదయో ద్విజాః ।
ఏరకారూపిభిర్వజ్రైస్తే నిర్జఘ్నుః పరస్పరమ్ ॥ 43 ॥

ప్రద్యుమ్నుడు, సాంబుడు మొదలైన కృష్ణకుమారులు, కృతవర్మ, సాత్యకి, అనిరుద్ధుడు మొదలైనవారు, ఇంకా మిగిలిన పృథువు, విపృథువు, చారుదేష్ణుడు, సుబాహువు, అక్రూరుడు మొదలైనవారు ఆగడ్డిరూపంలో ఉన్న వజ్రాలతో కొట్టుకుని మరణించారు.

నివారయామాస హరిర్యాదవాస్తే చ కేశవమ్ ।
సహాయం మేనిరే ప్రాప్తం తే నిర్జఘ్నుః పరస్పరమ్ ॥ 44 ॥

ఆవిధంగా పరస్పరం చంపుకుంటున్న యాదవులను శ్రీకృష్ణుడు అడ్డగించాడు. కాని తమనడుమకు వచ్చిన కృష్ణుడు తమకు సహాయం చేయడానికి వచ్చాడనుకుని, వారు పరస్పరం ఇంకా వేగంగా చంపుకున్నారు.

కృష్ణోఽపి కుపిత స్తేషామేరకాముష్టిమాదదే ।
వధాయ తేషాం ముశలం ముష్టిలోహమభూత్తదా ॥ 45 ॥

శ్రీకృష్ణుడికి వారిపై కోపం వచ్చింది. తుంగగడ్డిని కృష్ణస్వామి కూడ గుప్పిటినిండా పట్టుకున్నాడు. అది యాదవులను సంహరించడానికి ఇనపరోకలి అయింది.

జఘాన తేన నిశ్శేషానాతతాయీ స యాదవాన్ ।
జఘ్నుశ్చ సహసాభ్యేత్య తథాన్యే వై పరస్పరమ్ ॥ 46 ॥

దానితో శ్రీకృష్ణుడు ఎవ్వరూ మిగలకుండా, యాదవులందరినీ సంహరించాడు. మిగిలినవాళ్లు కూడా గబగబా వచ్చి, ఒకరినొకళ్లు చంపుకున్నారు.

తతశ్చార్ణవమధ్యేన జైత్రోஉసౌ చక్రిణో రథః ।
పశ్యతో దారుకస్యాశు హృతోஉశ్వైర్ద్విజసత్తమాః ॥ 47 ॥

బ్రాహ్మణోత్తములారా! అప్పుడు సారథి అయిన దారుకుడు చూస్తుండగానే గుఱ్ఱాలు శ్రీమహావిష్ణువు జైత్రరథాన్ని తీసుకుని వెళ్లిపోయాయి.

చక్రం గదా తథా శార్ఙ్గం తూణౌ శఙ్ఖోஉసి రేవ చ ।
ప్రదక్షిణం తతః కృత్వా జగ్మురాదిత్యవర్త్మనా ॥ 48 ॥

సుదర్శనచక్రం, శార్ఙ్గం అనేవిల్లు, అమ్ములపొదులు రెండు, శంఖం, ఖడ్గం, అనే శ్రీమహావిష్ణువు ఆయుధాలు శ్రీకృష్ణస్వామికి ప్రదక్షిణం చేసి, ఆకాశమార్గంలో వెళ్లిపోయాయి.

క్షణమాత్రేణ వై తత్ర యాదవానామభూత్ క్షయః ।
ఋతే కృష్ణం మహాబాహుం దారుకం చ ద్విజోత్తమాః ॥ 49 ॥

విప్రవరేణ్యులారా! దీర్ఘబాహువైన శ్రీకృష్ణుడు, దారుకుడు తప్ప మిగిలినయాదవులందరూ ఒక్కక్షణంలో అక్కడి కక్కడే నశించిపోయారు.

చఙ్క్రమ్యమాణౌ తౌ రామం వృక్షమూలకృతాసనమ్ ।
దదృశాతే ముఖాచ్చాస్య నిష్క్రామన్తం మహోరగమ్ ॥ 50 ॥

ఒకానొకచెట్టుకింద స్థిరమయిన ఆసనంలో కూర్చుని ఉన్న బలరాముడివద్దకు శ్రీకృష్ణుడు, దారుకుడు ఇద్దరూ పాకుకుంటూ వెళ్లారు. బలరాముడి నోటినుండి వెలువడుతూ ఉన్న ఒకమహాసర్పాన్ని చూశారు.

నిష్క్రమ్య స ముఖా త్తస్య మహాభోగో భుజఙ్గమః ।
ప్రయాతశ్చార్ణవం సిద్ధైః పూజ్యమానస్తథోరగైః ॥ 51 ॥

పెద్ద పడగతో ఉన్న ఆ మహాసర్పం బలరాముడి ముఖంనుండి వెలువడి, సిద్ధులు, నాగులు పూజిస్తుండగా, సముద్రంవైపు వెళ్లింది.

తమర్ఘ్యమాదాయ తదా జలధిస్సమ్ముఖం యయౌ ।
ప్రవివేశ చ తత్తోయం పూజితః పన్నగోత్తమైః ॥
దృష్ట్వా బలస్య నిర్యాణం దారుకం ప్రాహ కేశవః ॥ 52 ॥

అప్పుడు సముద్రుడు అర్ఘ్యం తీసుకుని ఆ సర్పానికి ఎదురు వెళ్లాడు. దానికి అర్ఘ్యం ఇచ్చి గౌరవించాడు. ఉత్తములయిన నాగులు పూజిస్తుండగా ఆ మహాసర్పం సముద్రంలో ప్రవేశించింది. బలరాముడు మరణించడం చూసి, శ్రీకృష్ణుడు దారుకుడితో ఇలా అన్నాడు.

శ్రీభగవానువాచ :-దారుకుడితో శ్రీకృష్ణుడు ఈవిధంగా అంటున్నాడు.

ఇదం సర్వం త్వ మాచక్ష్వ వసుదేవోగ్రసేనయోః ।
నిర్యాణం బలదేవస్య యాదవానాం తథా క్షయమ్ ॥ 53 ॥

దారుకా! నీవు వెళ్లి, బలరాముడు నిర్యాణం చెందడం, యాదవులందరూ నశించిపోవడం మొదలుగా ఇక్కడ జరిగినదంతా వసుదేవుడికీ, ఉగ్రసేనమహారాజుకూ విన్నవించు.

యోగే స్థిత్వాహమప్యేతత్ పరిత్యజ్య కలేబరమ్ ।
వాచ్యశ్చ ద్వారకావాసీ జనస్సర్వస్తథాహుకః ॥ 54 ॥

నేను కూడా యోగంలో నిలిచి, ఈశరీరాన్ని విడిచిపెడతాను. ఈవిషయాన్ని ద్వారకానగరంలో ఉండే జనులందరికీ ఆహుకుడికీ(?) చెప్పు.

యథేమాం నగరీం సర్వాం సముద్రః ప్లావయిష్యతి ।
తస్మాద్రథైస్సుసజ్జైస్తు ప్రతీక్ష్యో హ్యర్జునాగమః ॥ 55 ॥

నేను వెళ్లిన తరువాత ఈద్వారకానగరాన్ని సముద్రుడు ముంచివేస్తాడు. అందుచేత రథాలను సిద్ధం చేసుకుని, అర్జునుడి రాకకోసం ఎదురుచూడమని (ద్వారకావాసులకు) చెప్పు.

న స్థేయం ద్వారకామధ్యే నిష్క్రాన్తే తత్ర పాణ్డవే ।
తేనైవ సహ గన్తవ్యం యత్ర యాతి స కౌరవః ॥ 56 ॥

అర్జునుడు వెళ్లిన తరువాత ఇక ద్వారకలో ఉండగూడదు. అందుచేత ద్వారకావాసులు అర్జునుడితో కలిసి, అతడు ఎక్కడికి వెళ్తే అక్కడికి వెళ్లాలి.

గత్వా చ బ్రూహి కౌన్తేయమర్జునం వచనం మమ ।
పాలనీయస్త్వయా శక్త్యా జనోఽయం మత్పరిగ్రహః ॥ 57 ॥

కుంతికుమారుడైన ఆర్జునుడివద్దకు వెళ్లి 'నా (శ్రీకృష్ణుడి) భార్యల సముదాయాన్ని యథాశక్తిగా కాపాడాలి' అని నా మాటలుగా చెప్పు.

ఇత్యర్జునేన సహితో ద్వారవత్యాం భవాఞ్జనమ్ ।
గృహీత్వా యాతు వజ్రశ్చ యదురాజో భవిష్యతి ॥ 58 ॥

ఆ తరువాత నీవు కూడా ద్వారకలోని జనులందరినీ తీసుకుని, అర్జునుడితో కలిసి, వెళ్లు. యదువంశానికి (యాదవులకు) వజ్రుడు రాజు అవుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే శ్రీకృష్ణచరితే శ్రీకృష్ణనిజధామగమననిరూపణం నామ ఏకాధికశతతమోఽధ్యాయః॥101॥

శ్రీబ్రహ్మపురాణంలో శ్రీకృష్ణచరితలో శ్రీకృష్ణనిజధామగమననిరూపణం అనే నూటఒకటవ అధ్యాయం సంపూర్ణం.

ద్వ్యధికశతతమోఽధ్యాయః - నూటరెండవ అధ్యాయం

భగవత్స్వర్గారోహణమ్ - భగవత్స్వర్గారోహణం

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

ఇత్యుక్తో దారుకః కృష్ణం ప్రణిపత్య పునః పునః ।
ప్రదక్షిణం చ బహుశః కృత్వా ప్రాయాద్ యథోదితమ్ ॥ 1 ॥

శ్రీకృష్ణస్వామి ఈవిధంగా చెప్పగా విని, దారుకుడు స్వామికి పలుమార్లు ప్రణామాలు చేశాడు. తరువాత స్వామి చెప్పిన ప్రకారంగా అర్జునుడి వద్దకు వెళ్లాడు.

స చ గత్వా తథా చక్రే ద్వారకాయాం తథార్జునమ్ ।
ఆనినాయ మహాబుద్ధిం వజ్రం చక్రే తథా నృపమ్ ॥ 2 ॥

స్వామి చెప్పినవిధంగా అర్జునుడివద్దకు వెళ్లి, బుద్ధిమంతుడైన అతడిని ద్వారకకు తీసుకునివచ్చాడు. అదే విధంగా వజ్రుడిని యాదవులకు రాజును చేశాడు.

భగవానపి గోవిన్దో వాసుదేవాత్మకం పరమ్ ।
బ్రహ్మాత్మని సమారోప్య సర్వభూతేష్వధారయత్ ॥ 3 ॥

శ్రీకృష్ణభగవానుడు కూడ పరమమూ వాసుదేవస్వరూపమూ అయిన తనబ్రహ్మతత్త్వాన్ని ఆత్మలో నిలుపుకుని, చరాచరభూతా లన్నిటిలోనూ ధారణ చేశాడు.

స మానయన్ ద్విజవచో దుర్వాసా యదువాచ హ ।
యోగయుక్తో ఽభవత్ పాదం కృత్వా జానుని సత్తమాః ॥ 4 ॥

బ్రాహ్మణవచనం కావడంచేత పూర్వం దుర్వాసుడు చెప్పినమాటను గౌరవించి, కృష్ణుడు (ఎడమ) మోకాలి మీద (కుడి)పాదాన్ని ఉంచి, యోగంలో లీనమైనాడు.

సమ్ప్రాప్తో వై జరా నామ తదా తత్ర స లుబ్ధకః ।
ముశలావశేషలోహస్య సాయకం ధారయన్ పరమ్ ॥ 5 ॥

ఆ సమయంలో జర అనే బోయవాడు అక్కడికి వచ్చాడు. అతడు (యాదవులసంహారానికి మూలమైన) ఇనపరోకలిలో మిగిలినముక్కతో తయారైన విశిష్టమైనబాణాన్ని ధరించి ఉన్నాడు,

స తత్పాదం మృగాకారం సమవేక్ష్య వ్యవస్థితః ।
తతో వివ్యాధ తేనైవ తోమరేణ ద్విజోత్తమాః ॥ 6 ॥

విప్రవరేణ్యులారా! ఆబోయవాడు మోకాలిమీద ఉన్న కృష్ణుడిపాదం ఆకారం చూసి జింక అనుకున్నాడు. తనదగ్గర ఉన్నబాణంతో శ్రీకృష్ణస్వామిపాదాన్ని కొట్టాడు.

గతశ్చ దదృశే తత్ర చతుర్బాహుధరం నరమ్ ।
ప్రణిపత్యాహ చైవైనం ప్రసీదేతి పునః పునః ॥ 7 ॥

తరువాత బాణం కొట్టినచోటికి వెళ్లాడు. అక్కడ నాలుగుభుజాలతో మానవరూపంలో ఉన్న కృష్ణస్వామిని చూశాడు. వెంటనే సాష్టాంగపడి, మాటిమాటికీ 'స్వామీ, నన్ను కాపాడు' అని మరీ మరీ ప్రార్థించాడు.

అజానతా కృతమిదం మయా హరిణశఙ్కయా ।
క్షమ్యతామాత్మపాపేన దగ్ధం మా దగ్ధుమర్హసి ॥ 8 ॥

నేను ఈపాపం తెలియక చేశాను. (తమపాదాన్ని) జింక అనుకున్నాను. నాతప్పును మన్నించు. నేను చేసిన ఈపాపంతో కాలిపోతున్నాను. నన్ను నీవు ఇంకా దహించవద్దు.

వ్యాస ఉవాచ :–బోయవాడితో శ్రీకృష్ణస్వామి ఇలా అంటున్నాడు.

తతస్తం భగవానాహ నాస్తి తే భయమణ్వపి ।
గచ్ఛత్వం మత్ప్రసాదేన లుబ్ధ స్వర్గం సుఖాస్పదమ్ ॥ 9 ॥

అప్పుడు శ్రీకృష్ణభగవానుడు అతడితో ఇలా అన్నాడు. ఓయీ, బోయవాడా, నీవు కొంచెంగూడ భయపడ నవసరం లేదు. వెళ్లిపో. నాఅనుగ్రహంతో సమస్తసుఖాలకు నిలయమైనస్వర్గం నీకు లభిస్తుంది.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఇలా అంటున్నాడు.

విమానమాగతం సద్యస్తద్వాక్యసమనన్తరమ్ ।
ఆరుహ్య ప్రయయౌ స్వర్గం లుబ్ధకస్తత్ప్రసాదతః ॥ 10 ॥

శ్రీకృష్ణస్వామి పలికినక్షణంలోనే అక్కడికి ఒక విమానం వచ్చింది. స్వామిఅనుగ్రహంతో బోయవాడు ఆ విమానాన్నెక్కి స్వర్గలోకానికి ఆనందంగా వెళ్లిపోయాడు.

గతే తస్మిన్ స భగవాన్ సంయోజ్యాత్మానమాత్మని ।
బ్రహ్మభూతేఽవ్యయేఽచిన్త్యే వాసుదేవమయేఽమలే ॥ 11 ॥

అజన్మన్యజరేఽనాశిన్యప్రమేయేఽఖిలాత్మని ।
త్యక్త్వా స మానుషం దేహమవాప త్రిదివం తదా ॥ 12 ॥

బోయవాడు విమాన మెక్కి వెళ్లిపోయిన తరువాత, శ్రీకృష్ణభగవానుడు తన ఆత్మలో తనను లయం చేసు కున్నాడు. ఆ ఆత్మ తత్త్వస్వరూపం. మార్పు ఉండదు. ఊహకు అందదు. వాసుదేవతత్త్వంతో నిండినది. స్వచ్ఛమైనది. దానికి పుట్టుక లేదు. ముసలితనం లేదు. నశించిపోదు. కొలతలకు అందదు. సమస్తమూ తానే అయిఉంటుంది. అటువంటిఆత్మలో తనను లీనం చేసుకున్న కృష్ణస్వామి మానవశరీరాన్ని విడిచిపెట్టి, స్వర్గానికి వెళ్లిపోయాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసర్షిసంవాదే శ్రీకృష్ణచరితే భగవత్స్వర్గారోహణం నామ ద్వ్యధికశతతమోఽధ్యాయః ॥ 102 ॥

శ్రీబ్రహ్మపురాణంలో వ్యాసమునులసంవాదంలో శ్రీకృష్ణచరితలో భగవత్స్వర్గారోహణం అనే నూటరెండవ అధ్యాయం సంపూర్ణం.

త్ర్యధికశతతమోఽధ్యాయః - నూటమూడవ అధ్యాయం

శ్రీకృష్ణచరితసమాప్తికథనమ్ - శ్రీకృష్ణచరితసమాప్తికథనం

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

అర్జునోఽపి తదన్విష్య కృష్ణరామకలేబరే ।
సంస్కారం లమ్భయామాస తథాన్యేషామనుక్రమాత్ ॥ 1 ॥

అర్జునుడు బలరామకృష్ణులశరీరాలను వెదికి పట్టుకుని, వాటికి అగ్నిసంస్కారం చేశాడు. అదే విధంగా ఇతరయాదవప్రముఖుల కళేబరాలకు కూడ వరుసలో అగ్నిసంస్కారం చేశాడు.

అష్టౌ మహిష్యః కథితా రుక్మిణీప్రముఖాస్తు యాః ।
ఉపగృహ్య హరేర్దేహం వివిశుస్తా హుతాశనమ్ ॥ 2 ॥

అష్టమహిషులు అని ప్రసిద్ధి పొందిన రుక్మిణి మొదలైన శ్రీకృష్ణుడిభార్యలు శ్రీకృష్ణుడిశరీరాన్ని ఆశ్రయించుకుని, ఆ అగ్నిలో ప్రవేశించారు.

రేవతీ చైవ రామస్య దేహమాశ్లిష్య సత్తమా ।
వివేశ జ్వలితం వహ్నిం తత్సఙ్గాహ్లాదశీతలమ్ ॥ 3 ॥

ఉత్తమురాలైన రేవతి కూడ బలరాముడి శరీరాన్ని కౌగిలించుకుని, ఎగసిపడుతున్నమంటలతో కూడిన అగ్నిలో ప్రవేశించింది. బలరాముడిశరీరస్పర్శతో ఆ అగ్ని చల్లబడి ఆమెకు ఆనందం కలిగించింది.

ఉగ్రసేనస్తు తచ్ఛ్రుత్వా తథైవానకదున్దుభిః ।
దేవకీ రోహిణీ చైవ వివిశుర్జాతవేదసమ్ ॥ 4 ॥

శ్రీకృష్ణాదులనిర్యాణం వార్త విని ఉగ్రసేనుడు, అలాగే, వసుదేవుడు, వసుదేవుడితోపాటు దేవకి, రోహిణి కూడ అగ్నిలో ప్రవేశించారు.

తతోఽర్జునః ప్రేతకార్యం కృత్వా తేషాం యథావిధి ।
నిశ్చక్రామ జనం సర్వం గృహీత్వా వజ్రమేవ చ ॥ 5 ॥

అప్పుడు అర్జునుడు వారందరికీ విధివిధానంగా అపరక్రియలు చేశాడు. వజ్రుడిని, ఇంకా ఇతరఅంతః పురస్త్రీలను తీసుకుని ద్వారకానగరం విడిచి వెళ్లాడు.

ద్వారవత్యా వినిష్క్రాన్తాః కృష్ణపత్న్యస్సహస్రశః ।
వజ్రం జనం చ కౌన్తేయః పాలయన్ శనకైర్యయౌ ॥ 6 ॥

ద్వారకానగరం విడిచి వస్తున్న వేలమంది శ్రీకృష్ణుడిభార్యలను, వజ్రుడిని, ఇంకా ఇతరకాంతలను, జాగ్రత్తగా కాపాడుతూ అర్జునుడు మెల్లగా వెళ్తున్నాడు.

సభా సుధర్మా కృష్ణేన మర్త్యలోకే సమాహృతా ।
స్వర్గం జగామ భో విప్రాః పారిజాతశ్చ పాదపః ॥ 7 ॥

ఓ బ్రాహ్మణులారా! శ్రీకృష్ణుడు లోగడ స్వర్గలోకంనుండి మానవలోకానికి తెచ్చిన సుధర్మ అనే ఇంద్రసభ, పారిజాతవృక్షమూ తిరిగి స్వర్గలోకానికి వెళ్లిపోయాయి.

యస్మిన్ దినే హరిర్యాతో దివం సన్త్యజ్య మేదినీమ్ ।
తస్మిన్ దినేఽవతీర్ణోఽయం కాలకాయః కలిః కిల ॥ 8 ॥

శ్రీకృష్ణుడు ఈభూలోకాన్ని విడిచిపెట్టి స్వర్గలోకానికి వెళ్లినరోజే నల్లనిశరీరం కలిగినకలిపురుషుడు ఈభూలోకంలో అడుగుపెట్టాడు.

ప్లావయామాస తాం శూన్యాం ద్వారకాం చ మహోదధిః ।
యదుశ్రేష్ఠగృహం త్వేకం నాప్లావయత సాగరః ॥ 9 ॥

శ్రీకృష్ణుడు మొదలైనవారు లేని ఆ ద్వారకానగరాన్ని సముద్రం ముంచివేసింది. ఆ నగరంలో శ్రీకృష్ణుడు నివసించిన భవనం ఒక్కటిమాత్రం సముద్రుడు ముంచలేదు.

నాతిక్రామతి భో విప్రాస్తదద్యాపి మహోదధిః ।
నిత్యం సన్నిహితస్తత్ర భగవాన్ కేశవో యతః ॥ 10 ॥

ఓ ద్విజులారా! శ్రీకృష్ణభగవానుడు నిత్యమూ ఆ ఇంటిలోనే ఉంటాడు కాబట్టి, సముద్రుడు ఈరోజుకు కూడా తన మేర మీరి ముందుకు రావడం లేదు (శ్రీకృష్ణగృహాన్ని సమీపించడం లేదు).

తదతీవ మహాపుణ్యం సర్వపాతకనాశనమ్ ।
విష్ణుక్రీడాన్వితం స్థానం దృష్ట్వా పాపాత్ ప్రముచ్యతే ॥ 11 ॥

శ్రీకృష్ణుడు నివసించే ఆప్రదేశం ఎంతో పుణ్యప్రదం. సమస్తమైన పాపాలనూ నిర్మూలిస్తుంది. అది శ్రీమహావిష్ణువు విహరించిన పవిత్రస్థలం. ఆచోటును చూస్తేనే పాపాలు తొలగిపోతాయి.

పార్థః పఞ్చనదే దేశే బహుధాన్యధనాన్వితే ।
చకార వాసం సర్వస్య జనస్య మునిసత్తమాః ॥ 12 ॥

మహర్షులారా! అర్జునుడు తాను తీసుకువచ్చినజనానికి అందరికీ, అధికమైన సంపదలతోనూ, పంటలతోనూ నిండిన పంచనదం అనే దేశంలో నివాసం ఏర్పాటు చేశాడు.

తతో లోభస్సమభవత్ పార్థేనైకేన ధన్వినా ।
దృష్ట్వా స్త్రియో నీయమానా దస్యూనాం నిహతేశ్వరాః ॥ 13 ॥

విలుకాడయిన అర్జునుడు ఒంటరిగా తీసుకుపోతున్న భర్తలు లేని ఆడువారిని దొంగలు చూశారు. వారికి ఆ స్త్రీలపై ఆశపుట్టింది.

తతస్తే పాపకర్మాణో లోభోపహతచేతసః ।
ఆభీరా మన్త్రయామాసుస్సమేత్యాత్యన్తదుర్మదాః ॥ 14 ॥

పాపపు పనులు చేసే ఆ దొంగలకు యాదవకాంతలమీద కోరికతో మతి చెడింది. మిక్కిలిదుర్మార్గులైన ఆ గొల్లలు ఒకచోటికి చేరి, వారిలో వారు ఇలా ఆలోచనలు చేశారు.

ఆభీరా ఊచుః :–దొంగలైన గొల్లలు ఇలా అంటున్నారు.

అయ మేకోఽర్జునో ధన్వీ స్త్రీజనం నిహతేశ్వరమ్ ।
నయత్యస్మానతిక్రమ్య ధిగేతత్ క్రియతాం బలమ్ ॥ 15 ॥

విల్లు పట్టుకున్న ఈ అర్జునుడు ఒంటరిగాడు. ఈ ఆడవారికి భర్తలు లేరు. మనమంటే లెక్క లేకుండా, మన ఎదురుగుండానే వాళ్లను తీసుకువెళ్తున్నాడు. ఆహా, ఇది ఎంత అవమానం. వీడికి మనసత్తా చూపాలి.

హత్వా గర్వసమారూఢో భీష్మద్రోణజయద్రథాన్ ।
కర్ణాదీంశ్చ న జానాతి బలం గ్రామనివాసినామ్ ॥ 16 ॥

భీష్ముడు, ద్రోణుడు, జయద్రథుడు, కర్ణుడు మొదలైనవారిని చంపి, గర్వం తలకెక్కి, ఈఅర్జునుడు పల్లెజనాల బలం తెలుసుకోవడం లేదు.

బలజ్యేష్ఠాన్నరానన్యాన్ గ్రామ్యాంశ్చైవ విశేషతః ।
సర్వానేవావజానాతి కిం వో బహుభిరుత్తరైః ॥ 17 ॥

తానొక్కడే బలవంతుడిననే గర్వంతో మిగిలిన మహాబలవంతులనందరినీ అవమానిస్తున్నాడు. ముఖ్యంగా గ్రామాలలో ఉండేవారిని మరీ అవమానిస్తున్నాడు. ఇంక అనవసరమైన మాటలు ఎందుకు?

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

తతో యష్టిప్రహరణా దస్యవో లోష్టహారిణః ।
సహస్రశోఽభ్యధావన్త తం జనం నిహతేశ్వరమ్ ॥
తతో నివృత్తః కౌన్తేయః ప్రాహాభీరాన్ హసన్నివ ॥ 18 ॥

అపుడు వేలకొలదిగా ఉన్న ఆదొంగలు కఱ్ఱలు, కత్తులు పట్టుకుని మగడు లేని ఆ యాదవకాంతలపైకి పరుగుతీశారు. అప్పుడు అర్జునుడు వెనుదిరిగి, నవ్వుతూ వారితో ఇలా అన్నాడు.

అర్జున ఉవాచ :–దొంగలతో అర్జునుడు ఇలా అంటున్నాడు.

నివర్తధ్వమధర్మజ్ఞా యదీతో న ముమూర్షవః ॥ 19 ॥

అధర్మపరులారా! ప్రాణాలతో ఉండాలనుకుంటే వెంటనే వెనుదిరిగి వెళ్ళిపోండి.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

అవజ్ఞాయ వచస్తస్య జగృహుస్తే తదా ధనమ్ ।
స్త్రీజనం చాపి కౌన్తేయాద్ విష్వక్సేనపరిగ్రహమ్ ॥ 20 ॥

ఆ దొంగలు అర్జునుడి మాటలు పట్టించుకోలేదు. మీదబడి వారివద్ద ఉన్న సంపదలను దోచుకున్నారు. అర్జునుడి వద్దనుండి శ్రీకృష్ణుడిభార్యలను గూడ అందరినీ బలవంతంగా పట్టుకున్నారు.

తతోஉర్జునో ధనుర్దివ్యం గాణ్డీవమజరం యుధి ।
ఆరోపయితుమారేభే న శశాక స వీర్యవాన్ ॥ 21 ॥

యుద్ధరంగంలో ఎదురులేని గాండీవం అనే తన దివ్యమైన ధనుస్సును తీసుకుని అర్జునుడు ఎక్కుపెట్ట బోయాడు. కాని పరాక్రమవంతుడయినఅర్జునుడికి ఆవిల్లు ఎక్కుపెట్టడం సాధ్యం కాలేదు.

చకార సజ్జం కృచ్ఛ్రాత్తు తదభూచ్ఛిథిలం పునః ।
న సస్మార తథాஉస్త్రాణి చిన్తయన్నపి పాణ్డవః ॥ 22 ॥

ఎంతో కష్టపడి ధనుస్సుకు అల్లెత్రాటిని తగిలించి విల్లు ఎక్కుపెట్టగా అది వెంటనే వదులయిపోయింది. ఇంక వేరే అస్త్రాలు ప్రయోగిద్దామనుకుంటే, ఎంత ఆలోచించినా, అవి గుర్తుకు రాలేదు.

శరా న్ముమోచ చైతేషు పార్థశ్శేషాన్ స హర్షితః ।
న భేదం తే పరం చక్రురస్తా గాణ్డీవధన్వనా ॥ 23 ॥

గాండీవం అనే గొప్పవిల్లు కలిగినఅర్జునుడు చేసేది లేక, చేతిలో మిగిలిఉన్నబాణాలను ఆ దొంగలపై ప్రయోగించాడు. కాని అవి వారిని ఏమీ చేయలేక పనికిరాకుండా పోయాయి.

వహ్నినా చాక్షయా దత్తాశ్శరాస్తేஉపి క్షయం యయుః ।
యుధ్యతస్సహ గోపాలైరర్జునస్యాభవత్ క్షయః ॥ 24 ॥

ఒకప్పుడు అర్జునుడికి అగ్నిదేవుడు అక్షయమైన బాణాలు కానుకగా ఇచ్చాడు. అవి కూడ నశించి పోయాయి. ఆ గొల్లవారితో యుద్ధం చేస్తుండగా అర్జునుడికి శక్తి కూడా నశించింది.

అచిన్తయత్తు కౌన్తేయః కృష్ణస్యైష హి తద్బలమ్ ।
యన్మయా శరసఙ్ఘాతైస్సకలా భూభృతో జితాః ॥ 25 ॥

అప్పుడు అర్జునుడు ఇలా అనుకున్నాడు. పూర్వం నేను రాజులందరినీ జయించానంటే ఆబలం అంతా శ్రీకృష్ణుడిబలమే. (నాఆయుధాలది కానీ, నాది కానీ కాదు).

మిషతః పాణ్డుపుత్రస్య తతస్తాః ప్రమదోత్తమాః ।
అపాకృష్యన్త చాభీరైః కామాచ్చాన్యాః ప్రవవ్రజుః ॥ 26 ॥

అర్జునుడు చూస్తుండగానే, శ్రీకృష్ణుడిభార్యలందరినీ ఆ దొంగలు ఎత్తుకుపోయారు. మరికొంతమంది ఇతరకాంతలు కామంతో వారే ఆ దొంగలవెంట వెళ్లిపోయారు.

తత శ్శరేషు క్షీణేషు ధనుష్కోట్యా ధనఞ్జయః ।
జఘాన దస్యూంస్తే చాస్య ప్రహారాజ్జహసుర్ద్విజాః ॥ 27 ॥

విప్రులారా! తనఆయుధాలు అన్నీ కొఱగాకుండా పోవడంతో అర్జునుడు వింటికొసతో ఆ దొంగలను కొట్టాడు. ఆదెబ్బలకు దొంగలు భయపడకపోగా, అర్జునుడిని చూసి, ఎగతాళిగా నవ్వారు.

పశ్యత స్త్వేవ పార్థస్య వృష్ణ్యన్ధకవరస్త్రియః ।
జగ్మురాదాయ తే మ్లేచ్ఛాస్సమన్తాన్మునిసత్తమాః ॥ 28 ॥

మహర్షులారా! అర్జునుడు చూస్తుండగానే ఆ మ్లేచ్ఛులు వృష్ణి, అంధక వంశాలకు చెందిన ఉత్తమకాంత లందరినీ తీసుకుని, వెళ్లిపోయారు.

తత స్స దుఃఖితో జిష్ణుః కష్టం కష్టమితి బ్రువన్ ।
అహో భగవతా తేన ముక్తోఽస్మీతి రురోద వై ॥ 29 ॥

అప్పుడు అర్జునుడు చాల దుఃఖపడ్డాడు. 'అయ్యో కష్టం. భగవానుడైన ఆకృష్ణుడు నన్ను విడిచివెళ్లి పోయాడు. (నేను దిక్కు లేనివాడినైనాను గదా) ఎంత కష్టం వచ్చింది' అంటూ ఏడ్చాడు.

అర్జున ఉవాచ :–అర్జునుడు ఈవిధంగా అంటున్నాడు.

తద్ధనుస్తాని చాస్త్రాణి స రథస్తే చ వాజినః ।
సర్వమేకపదే నష్టం దానమశ్రోత్రియే యథా ॥ 30 ॥

శ్రోతియుడు కానివానికి చేసినదానంలాగా, ఆ గాండీవధనుస్సు, ఆ అస్త్రాలు, ఆ రథం, ఆ గుఱ్ఱాలు అన్నీ ఒక్కసారిగా (శ్రీకృష్ణుడితోపాటే) నశించిపోయాయి కదా. (శ్రోత్రియుడనగా వేదాధ్యయనం చేసిన బ్రాహ్మణుడని అర్థం.)

అహో చాతిబలం దైవం వినా తేన మహాత్మనా ।
యదసామర్థ్యయుక్తోఽహం నీచైర్నీతః పరాభవమ్ ॥ 31 ॥

విధి ఎంత బలీయమైనది? మహానుభావుడైన ఆ కృష్ణుడు తోడు లేకపోవడంచేత అసమర్థుడినైన నేను అల్పులైన ఈ గొల్లల చేతిలో అవమానం పాలైనాను.

తౌ బాహూ స చ మే ముష్టిః స్థానం తత్ సోఽస్మి చార్జునః ।
పుణ్యేనైవ వినా తేన గతం సర్వ మసారతామ్ ॥ 32 ॥

అవే (కృష్ణుడు తోడుగా ఉన్నప్పటివి) బాహువులు. ఈ నా పిడికిలి అప్పుడు ఉన్నదే. నా స్థానం కూడా అదే. నేను ఆఅర్జునిడినే. పుణ్యాత్ముడైన కృష్ణుడు లేకపోవడంతో ఇవి అన్నీ పనికిరాకుండా పోయాయి.

మమార్జునత్వం భీమస్య భీమత్వం తత్కృతం ధ్రువమ్ ।
వినా తేన య దాభీరైర్జితోఽహం కథమన్యథా ॥ 33 ॥

కృష్ణుడివల్లనే నేను అర్జునుడి నయ్యాను. భీముడు భీముడయ్యాడు. ఇది యథార్థం. కృష్ణుడు లేని కారణంగా నేను ఈగొల్లవారిచేతిలో ఓడిపోయానంటే, అందుకు కారణం మరొకటి ఏమి అవుతుంది.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్థం వదన్ యయౌ జిష్ణురిన్ద్రప్రస్థం పురోత్తమమ్ ।
చకార తత్ర రాజానం వజ్రం యాదవనన్దనమ్ ॥ 34 ॥

అర్జునుడు ఈవిధంగా పలికి, ఉత్తమమైన ఇంద్రప్రస్థపురానికి వెళ్లాడు. యదుకుమారుడైన వజ్రుడిని ఆరాజ్యానికి రాజును చేశాడు.

స దదర్శ తతో వ్యాసం ఫాల్గునః కాననాశ్రయమ్ ।
తముపేత్య మహాభాగం వినయేనాభ్యవాదయత్ ॥ 35 ॥

ఆ తరువాత అర్జునుడు అడవులలో ఉంటున్న వ్యాసమహర్షిని దర్శించుకున్నాడు. మహాత్ముడైన వ్యాసుడిని సమీపించి, వినయంగా నమస్కరించాడు.

తం వన్దమానం చరణావవలోక్య సునిశ్చితమ్ ।
ఉవాచ పార్థం విచ్ఛాయః కథమత్యన్తమీదృశః ॥ 36 ॥

తన పాదాలకు నమస్కరిస్తున్న అతడిని చూసి, వ్యాసమహర్షి అతడు అర్జునుడే అని నిశ్చయించుకుని, అతడితో ఇలా అన్నాడు. 'అర్జునా, మరీ ఇలా వెలవెలపోతూ ఉన్నా వేమిటి?

అజారజోఽనుగమనం బ్రహ్మహత్యాఽథవా కృతా ।
జయాశాభఙ్గదుఃఖీ వా భ్రష్టచ్ఛాయోఽసి సామ్ప్రతమ్ ॥ 37 ॥

అర్జునా, గొఱ్ఱెలు రేపినధూళివెంట వెళ్లావా? లేకపోతే, బ్రాహ్మణుడిని చంపావా? గెలుపుమీద ఆశ పెట్టుకుని, ఓడిపోవడంచేతనా? దుఃఖపడుతున్నట్లుగా ఇప్పుడు నీవు మిక్కిలి తేజోహీనుడివై ఉన్నావు.

సాన్తానికాదయో వా తే యాచమానా నిరాకృతాః ।
అగమ్యస్త్రీరతిర్వాపి తేనాసి విగతప్రభః ॥ 38 ॥

సంతానం మొదలైనవారు ఎవరయినా, నిన్ను యాచిస్తే తిరస్కరించి పంపివేశావా? కలియగూడని స్త్రీలను కలిశావా? మరి ఎందుకు నీవు ఇలా కాంతి తరిగిపోయావు?

భుంక్తేఽప్రదాయ విప్రేభ్యో మిష్ట మేక మథో భవాన్ ।
కిం వా కృపణవిత్తాని హృతాని భవతాఽర్జున ॥ 39 ॥

అర్జునా! బ్రాహ్మణులకు పెట్టకుండా, నీవు ఒక్కడివే విందు భోజనం చేశావా? లేకపోతే దీనులసంపదలను దోచుకున్నావా?

కచ్చి న్న సూర్యవాతస్య గోచరత్వం గతోఽర్జున ।
దుష్టచక్షుర్హతో వాఽపి నిశ్శ్రీకః కథ మన్యథా ॥ 40 ॥

అర్జునా! నీకు వడదెబ్బ దగలలేదు కదా? నీపై పాడుకళ్లు పడ్డాయా? మరి ఎందుకు ఈవిధంగా కాంతి కోల్పోయావు?

స్పృష్టో నఖామ్బసా వాపి ఘటామ్బుః ప్రోక్షితోఽపి వా ।
తేనాతీవాసి విచ్ఛాయో నీచైర్వా యుధి నిర్జితః ॥ 41 ॥

గోరు తగిలిననీటిని ముట్టుకున్నావా? మట్టికుండలోని నీళ్లు ఎవరూ నీపై చల్లలేదు కదా. యుద్ధంలో అధముల చేతిలో ఓడిపోయావా? ఎందుకు ఇలా మరీ తేజోహీనుడి వయినావు?

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

తతః పార్థో వినిశ్వస్య శ్రూయతాం భగవ న్నితి ।
ప్రోక్తో యథావదాచష్ట విప్రా ఆత్మపరాభవమ్ ॥ 42 ॥

ద్విజులారా! అప్పుడు అర్జునుడు దీర్ఘంగా నిట్టూర్పు విడిచి, 'మహాత్మా, విను' అని దొంగలవలన తనకు కలిగినఅవమానాన్ని జరిగినది జరిగినట్లుగా వివరించిచెప్పాడు.

అర్జున ఉవాచ :–వ్యాసమహర్షితో అర్జునుడు ఇలా చెప్తున్నాడు.

యద్బలం యచ్చ నస్తేజో యద్వీర్యం యత్పరాక్రమః ।
యా శ్రీచ్ఛాయా చ న స్సోఽస్మాన్ పరిత్యజ్య హరిర్గతః ॥ 43 ॥

మా అందరికీ బలమూ, తేజస్సూ, వీర్యమూ, పరాక్రమమూ, సంపదా, నీడా, అయిన కృష్ణుడు మమ్మల్ని విడిచి వెళ్లిపోయినాడు.

ఇతరేణేవ మహతా స్మితపూర్వాభిభాషిణా ।
హీనా వయం మునే తేన జాతాః స్థాణుమయా ఇవ ॥ 44 ॥

మహర్షీ! చిరునవ్వుతో చక్కగా మాట్లాడే ఆ మహాత్ముడు మాకు ఏమీ కానివాడిలాగా, వెళ్లిపోవడంచేత ఆ కృష్ణుడు లేని మేము చైతన్యం కోల్పోయి, బండబారిపోయాము.

అస్త్రాణాం సాయకానాం చ గాణ్డీవస్య తథా మమ ।
సారతా యాభవన్మూర్తా స గతః పురుషోత్తమః ॥ 45 ॥

మా ఆయుధాలకూ, బాణాలకూ, గాండీవానికీ అలాగే నాకూ సారం మూర్తీభవించిన పురుషశ్రేష్ఠుడైన కృష్ణస్వామి వెళ్లిపోయినాడు.

యస్యావలోకాదస్మాన్ శ్రీర్జయస్సమ్పదున్నతిః ।
న తత్యాజ స గోవిన్దస్త్యక్త్వాస్మాన్ భగవాన్ గతః ॥ 46 ॥

ఆ కృష్ణస్వామికటాక్షంచేతనే తేజస్సూ, విజయమూ, గొప్పసంపదలూ, మమ్మల్ని విడువకుండా, అంటి పెట్టుకుని ఉన్నాయి. కాని ఆ స్వామియే ఇపుడు మమ్మల్ని విడిచివెళ్లాడు.

భీష్మద్రోణాఙ్గరాజాద్యాస్తథా దుర్యోధనాదయః ।
యత్ప్రభావేణ నిర్దగ్ధాస్స కృష్ణస్త్యక్తవాన్ భువమ్ ॥ 47 ॥

భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, మొదలైన వీరులు, దుర్యోధనుడు మొదలైన దాయాదులు, అందరూ ఆ కృష్ణస్వామిమహిమ వలననే నశించిపోయారు. అటువంటి కృష్ణుడు ఈ భూలోకాన్నే విడిచివెళ్లాడు.

నిర్యౌవనా హతశ్రీకా భ్రష్టచ్ఛాయేవ మే మహీ ।
విభాతి తాత నైకో ఽహం విరహే తస్య చక్రిణః ॥ 48 ॥

తండ్రీ, నే నొక్కడినే కాదు. ఆకృష్ణుడు దూరంకావడంచేత ఈ భూమి కూడా వయసుమళ్లి, కాంతి కోల్పోయి, దిక్కు లేనిదయింది.

యస్యానుభావాద్ భీష్మాద్యైర్మయ్యగ్నౌ శలభాయితమ్ ।
వినా తేనాద్య కృష్ణేన గోపాలైరస్మి నిర్జితః ॥ 49 ॥

ఆ కృష్ణస్వామిమహిమచేతనే భీష్ముడు మొదలైనవారు అందరూ అర్జునుడు అనే అగ్నిలో మిడుతలయి పోయారు. ఆ కృష్ణుడు తోడుగా లేకపోవడంచేత నేను ఇపుడు గొల్లవాళ్లచేతిలో ఓడిపోయాను.

గాణ్డీవం త్రిషు లోకేషు ఖ్యాతం యదనుభావతః ।
మమ తేన వినాభీరై ర్లగుడైస్తు తిరస్కృతమ్ ॥ 50 ॥

ఆస్వామిమహిమచేతనే గాండీవం అనే ఈ విల్లు మూడులోకాలలోనూ పేరుమోసింది. ఆ కృష్ణుడు లేకపోవడంచేత నా గాండీవం గొల్లలకఱ్ఱలకు కూడ లోకువ అయిపోయింది.

స్త్రీసహస్రాణ్యనేకాని హ్యనాథాని మహామునే ।
యతతో మమ నీతాని దస్యుభిర్లగుడాయుధైః ॥ 51 ॥

మహర్షీ! నేను ఎంతగా ప్రయత్నించినా, మగడిని కోల్పోయి, వేలకొలదిగా నారక్షణలో ఉన్నమగువలను దుడ్డుకఱ్ఱలే ఆయుధాలయినదొంగలు తీసుకుని వెళ్లిపోయారు.

ఆనీయమానమాభీరై స్సర్వం కృష్ణావరోధనమ్ ।
హృతం యష్టిప్రహరణైః పరిభూయ బలం మమ ॥ 52 ॥

నేను తీసుకుని వస్తుండగా, నా పరాక్రమాన్ని ఎగతాళి చేస్తూ, గొల్లలు నన్ను కఱ్ఱలతో ఓడించి, శ్రీకృష్ణుడి అంతఃపురకాంత లందరినీ తీసుకునివెళ్లిపోయారు.

నిశ్శ్రీకతా న మే చిత్రం యజ్జీవామి తదద్భుతమ్ ।
నీచావమానపఙ్కాఙ్కీ నిర్లజ్జోఽస్మి పితామహ ॥ 53 ॥

తాతగారూ! నేను కాంతి తరిగిపోవడంలో వింత లేదు. కాని, ఇంకా బతికిఉండడమే ఆశ్చర్యం. అల్పులచేత అవమానం అనే బురదమరకలను అంటించుకుని, సిగ్గు లేకుండా, ఇంకా (బ్రతికే)ఉన్నాను'.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

శ్రుత్వాహం తస్య తద్వాక్యమబ్రవం ద్విజసత్తమాః ।
దుఃఖితస్య చ దీనస్య పాణ్డవస్య మహాత్మనః ॥ 54 ॥

బ్రాహ్మణోత్తములారా! మహాత్ముడైన అర్జునుడి మాటలు విని, దుఃఖంతో దీనంగా ఉన్న అతడితో నేను ఇలా అన్నాను.

అలం తే వ్రీడయా పార్థ న త్వం శోచితు మర్హసి ।
అవేహి సర్వభూతేషు కాలస్య గతి రీదృశీ ॥ 55 ॥

అర్జునా! సిగ్గు పడవద్దు. నువ్వు దుఃఖపడడం తగదు. ప్రాణులన్నింటివిషయంలోనూ కాలం ఈవిధంగానే (హెచ్చుతగ్గులుగా) ఉంటుందని తెలుసుకో.

కాలో భవాయ భూతానామభవాయ చ పాణ్డవ ।
కాలమూలమిదం జ్ఞాత్వా కురు స్థైర్యమతోఽర్జున ॥ 56 ॥

పాండుకుమారా! అర్జునా! స్థావరజంగమాత్మకమైన ఈ భూతకోటి పుట్టడానికీ, నశించడానికీ కాలమే కారణం. కాలం మూలంగానే ఇది జరుగుతున్నదని గ్రహించి, గుండె దిటవుచేసుకో.

నద్యస్సముద్రా గిరయస్సకలా చ వసున్ధరా ।
దేవా మనుష్యాః పశవస్తరవశ్చ సరీసృపాః ॥ 57 ॥

సృష్టాః కాలేన కాలేన పునర్యాస్యన్తి సంక్షయమ్ ।
కాలాత్మకమిదం సర్వం జ్ఞాత్వా శమమవాప్నుహి ॥ 58 ॥

నదులు, సముద్రాలు, కొండలు, ఈ భూమి మొత్తమూ, దేవతలూ, మనుష్యులూ, జంతువులు, చెట్లు, పాములు, అన్నిటినీ కాలమే సృష్టించింది. కాలంవల్లనే మళ్లీ ఇవన్నీ నశించిపోతాయి. కనబడేది సమస్తమూ కాలస్వరూపమే అని తెలుసుకుని, శాంతిని పొందు.

యథాత్థ కృష్ణమాహాత్మ్యం తత్ తథైవ ధనఞ్జయ ।
భారావతారకార్యార్థమవతీర్ణస్స మేదినీమ్ ॥ 59 ॥

అర్జునా, శ్రీకృష్ణుడిమహిమలను గురించి నీవు చెప్పినది యథార్థమే. భూభారాన్ని తొలగించడానికే ఆ శ్రీమహావిష్ణువు భూమిమీద అవతరించాడు.

భారాక్రాన్తా ధరా యాతా దేవానాం సన్నిధౌ పురా ।
తదర్థమవతీర్ణోఽ ఽసౌ కామరూపీ జనార్దనః ॥ 60 ॥

పూర్వం ప్రాణికోట్లబరువుతో నిండిన భూదేవి దేవతలవద్దకు వెళ్ళింది. ఇష్టం వచ్చినరూపం ధరించగలిగిన శ్రీవిష్ణుదేవుడు ఆ భూమికోరిక తీర్చడంకోసమే నేలపై కృష్ణుడుగా అవతరించాడు.

తచ్చ నిష్పాదితం కార్యమశేషా భూభృతో హతాః ।
వృష్ణ్యన్ధకకులం సర్వం యథావదుపసంహృతమ్ ॥ 61 ॥

ఆ స్వామి వచ్చిన పని అయిపోయింది. ఈ భూమిమీద దుర్మార్గులైన రాజులు ఎవరూ మిగలకుండా అందరినీ స్వామి సంహరించాడు. అదేవిధంగా తనవారైన వృష్ణి, అంధకవంశంవారిని కూడ స్వామి ఈ భూమినుండి తొలగించాడు.

న కిఞ్చిదన్యత్ కర్తవ్యమస్య భూమితలేఽ ర్జున ।
తతో గతస్స భగవాన్ కృతకృత్యో యథేచ్ఛయా ॥ 62 ॥

అర్జునా! ఇక కృష్ణస్వామికి ఈ భూమిమీద చేయవలసినపని మరొకటి ఏదీ లేదు. అందుచేత వచ్చినపని నెరవేరినస్వామి తనయిచ్ఛ ప్రకారం తిరిగి వెళ్లిపోయాడు.

సృష్టిం సర్గే కరోత్యేష దేవదేవః స్థితిం స్థితౌ ।
అన్తే చాథ సమర్థోఽ యం సామ్ప్రతం వై యథా కృతమ్ ॥ 63 ॥

దేవదేవుడైన శ్రీమహావిష్ణువు సృష్టికాలంలో ఈ జగత్తును సృష్టిస్తాడు. రక్షణకాలంలో రక్షిస్తాడు. అదే విధంగా చివరికి దానిని అంతం చేయడానికి కూడ ఆయన సమర్థుడు. ప్రస్తుతం అదే పని (లయం) చేశాడు.

తస్మాత్ పార్థ న సన్తాపస్త్వయా కార్యః పరాభవాత్ ।
భవన్తి భవకాలేషు పురుషాణాం పరాక్రమాః ॥ 64 ॥

అర్జునా! అందుచేత అవమానం జరిగిందని నీవు దుఃఖపడవద్దు. పురుషుల ప్రయత్నాలు నెరవేరవలసిన కాలంలో నెరవేరుతాయి.

యతస్త్వయైకేన హతా భీష్మద్రోణాదయో నృపాః ।
తేషామర్జున కాలోత్థః కిం న్యూనాభిభవో న సః ॥ 65 ॥

అర్జునా! నీ ఒక్కడిచేతిలోనే భీష్ముడు ద్రోణుడు మొదలైనవారు, ఇంకా చాలమంది రాజులు హతమైనారు. వారు అలా మరణించడానికి కారణం కాలం కాదా?(అది వాళ్లకు మరణకాలం కాబట్టే వాళ్లు ఆవిధంగా మరణించారు.) అంతే కాని వారికి అది పరాక్రమలోపమో, లేక పరాభవమో కాదు కదా.

విష్ణోస్తస్యానుభావేన యథా తేషాం పరాభవః ।
త్వత్తస్తథైవ భవతో దస్యుభ్యో ఽ న్తే తదుద్భవః ॥ 66 ॥

శ్రీమహావిష్ణువుమహిమచేత భీష్మద్రోణాదులకు ఆనాడు నీ మూలంగా పరాభవం జరిగిన విధంగానే (విష్ణువు మహిమవలననే) గొల్లలమూలంగా నీకు కూడ చివరికి అలాగే జరిగింది.

స దేవోఽన్యశరీరాణి సమావిశ్య జగత్పతిః ।
కరోతి సర్వభూతానాం నాశం చాన్తే వ్యవస్థితః ॥ 67 ॥

లోకనాథుడైన ఆ శ్రీమహావిష్ణువు ఇతరశరీరాలలో ప్రవేశించి, లయకాలంలో సమస్తమయిన భూతకోటిని సంహరిస్తాడు. (నీశరీరంలో ప్రవేశించి కృష్ణుడే భీష్మద్రోణాదులను సంహరించాడు.)

భవోద్భవే చ కౌన్తేయ సహాయస్తే జనార్దనః ।
భవాన్తే త్వద్విపక్షాస్తే కేశవేనావలోకితాః ॥ 68 ॥

ఓ అర్జునా! యుగకాలమందు శ్రీకృష్ణుడు నీకు తోడుగా ఉన్నాడు. కృష్ణనిర్యాణమను యుగాంతమందు నీ శత్రువులు ఆ కేశవుని చేత చూడబడినారు. తమతమ ప్రారబ్దకర్మకారణముగా శత్రువులు ఆచరించుచున్న చెడుకర్మలు శ్రీకృష్ణుడు పరీక్షించుచున్నాడని భావము.

కశ్శ్రద్దధ్యాత్ సగాఙ్గేయాన్ హన్యాస్త్వం సర్వకౌరవాన్ ।
ఆభీరేభ్యశ్చ భవతః కశ్శ్రద్దధ్యాత్ పరాభవమ్ ॥ 69 ॥

భీష్ముడు మొదలుగా కౌరవు లందరినీ నీవు ఒక్కడివే చంపావంటే ఎవడు నమ్ముతాడు? అలాగే నీవు గొల్లలచేతిలో ఓడిపోయి అవమానపడ్డావంటే ఎవడు నమ్ముతాడు?

పార్థైతత్ సర్వభూతేషు హరేర్లీలావిచేష్టితమ్ ।
త్వయా యత్ కౌరవాద్యాస్తు సఙ్గ్రామే వై పరాజితాః ॥ 70 ॥

అర్జునా! కౌరవులు మొదలైనవారు అందరూ యుద్ధంలో నీచేతిలో ఓడిపోయారంటే, అది అంతా సమస్త ప్రాణులలోనూ ఉన్న విష్ణుదేవుడిలీలలతో కూడినచేష్టలే (నీగొప్పదనం కాదు).

గృహీతా దస్యుభిర్యచ్చ రక్షితా భవతా స్త్రియః ।
తదప్యహం యథావృత్తం కథయామి తవార్జున ॥ 71 ॥

అర్జునా! నీవు రక్షిస్తున్న యాదవస్త్రీలను దొంగలు తీసుకుని పోవడంగురించి కూడా ఎలా జరిగిందో యథార్థం నీకు చెప్తాను.

అష్టావక్రః పురా విప్ర ఉదవాసరతోఽభవత్ ।
బహూన్ వర్షగణాన్ పార్థ గృణన్ దేవం సనాతనమ్ ॥ 72 ॥

అర్జునా! పూర్వం అష్టావక్రుడు అనేవాడు సనాతనమైన బ్రహ్మను ధ్యానిస్తూ, అనేకసంవత్సరాలు దీక్షగా నీటిలో నివాసం చేశాడు.

జితేష్వసురసఙ్ఘేషు మేరుపృష్ఠే మహోత్సవః ।
బభూవ తత్ర గచ్ఛన్త్యో దదృశుస్తం సురస్త్రియః ॥ 73 ॥

దేవదానవయుద్ధంలో రాక్షసులు ఓడిపోయిన తరువాత దేవతలు మేరుపర్వతశిఖరంమీద పెద్దపండుగ చేసుకున్నారు. ఆ ఉత్సవానికి వెళ్తూ దేవకాంతలు అష్టావక్రుడిని చూశారు.

రమ్భాతిలోత్తమాద్యాశ్చ శతశోఽథ సహస్రశః ।
తుష్టువుస్తం మహాత్మానం ప్రశశంసుశ్చ పాణ్డవ ॥ 74 ॥

పాండుకుమారా!, రంభ, తిలోత్తమ, మొదలైనవారు వందలకొలది వేలకొలదిమంది అష్టావక్రుడిని స్తుతించారు. వారి స్తోత్రాలకు అష్టావక్రుడు సంతోషించాడు.

ఆకణ్ఠమగ్నం సలిలే జటాభారధరం మునిమ్ ।
వినయావనతాశ్చైవ ప్రణేముః స్తోత్రతత్పరాః ॥ 75 ॥

పెద్దపెద్దజడలను ధరించి, గొంతువరకూ నీళ్లలో మునిగి ఉన్న మహాముని అష్టావక్రుడిని ఏకాగ్రమయిన బుద్ధితో స్తుతిస్తూ, వారు వినయంగా వంగి నమస్కారం చేశారు.

యథా యథా ప్రసన్నోఽభూత్తుష్టువు స్తం తథా తథా ।
సర్వాస్తాః కౌరవశ్రేష్ఠ వరిష్ఠం తం ద్విజన్మనామ్ ॥ 76 ॥

కురువంశోత్తమా!, అర్జునా!, బ్రాహ్మణోత్తముడైన అష్టావక్రుడికి ఎంతో సంతోషం కలిగేవిధంగా వారందరూ అతడిని చాల చక్కగా స్తుతించారు.

అష్టావక్ర ఉవాచ :–దేవకాంతలతో అష్టావక్రుడు ఇలా అంటున్నాడు.

ప్రసన్నోఽహం మహాభాగా భవతీనాం యదిష్యతే ।
మత్తస్తద్ వ్రియతాం సర్వం ప్రదాస్యామ్యపి దుర్లభమ్ ॥ 77 ॥

అమ్మా! మీపై నాకు అనుగ్రహం కలిగింది. నావలన మీరు ఏమి కోరుకుంటున్నారో, దానిని వరంగా అడగండి. ఎంత కష్టమైనా, మీరు అడిగినది సమస్తం ఇస్తాను.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

రమ్భాతిలోత్తమాద్యాశ్చ దివ్యాశ్చాప్సరసోఽబ్రువన్ ॥ 78 ॥

రంభ, తిలోత్తమ, మొదలైన అప్సరసలు అష్టావక్రుడితో ఇలా అంటున్నారు.

అప్సరస ఊచుః :–అష్టావక్రుడితో అప్సరసలు ఇలా అంటున్నారు.

ప్రసన్నే త్వయ్యసమ్ప్రాప్తం కిమస్మాకమితి ద్విజాః ॥ 79 ॥

విప్రులారా! ఆ అప్సరసలు 'మహాత్మా, నీకు మాపై అనుగ్రహం కలిగితే మాకు లభించనిది ఏముంటుంది?' అన్నారు.

ఇతరాస్త్వబ్రువన్ విప్ర ప్రసన్నో భగవన్ యది ।
తదిచ్ఛామః పతిం ప్రాప్తుం విప్రేన్ద్ర పురుషోత్తమమ్ ॥ 80 ॥

మహాత్మా! బ్రాహ్మణోత్తమా, నీకు మాపై అంతగా అనుగ్రహం కలిగితే, మీవలన మేం కోరుకునేది ఇదే. మాకు శ్రీమహావిష్ణువు భర్తగా లభించాలి.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఏవం భవిష్యతీత్యుక్త్వా ఉత్తతార జలాన్మునిః ।
తముత్తీర్ణం చ దదృశుర్విరూపం వక్రమష్టధా ॥ 81 ॥

అలాగే, మీరు కోరుకున్నవిధంగా జరుగుతుంది. అని, అష్టావక్రుడు నీటిలోనుండి వెలుపలికి వచ్చాడు. బయటకు వచ్చినఅష్టావక్రుడు ఎనిమిది విధములైన వంకరలతో వికారమయిన ఆకారంతో ఉండటం చూశారు దేవకాంతలు.

తం దృష్ట్వా గూహమానానాం యాసాం హాసః స్ఫుటోఽభవత్ ।
తాశ్శశాప మునిః కోపమవాప్య కురునన్దన ॥ 82 ॥

కురుకుమారా! అర్జునా, తనని చూచి, రహస్యంగా హేళనగా నవ్వడం అష్టావక్రుడికి తెల్లమయింది. ఆ మునికి కోపం వచ్చింది. వారిని శపించాడు.

అష్టావక్ర ఉవాచ :-దేవకాంతలతో అష్టావక్రుడు ఇలా అంటున్నాడు.

యస్మాద్ విరూపరూపం మాం మత్వా హాసావమాననా ।
భవతీభిః కృతా తస్మాదేష శాపం దదామి వః ॥ 83 ॥

నేను వికారమైన ఆకారంతో ఉన్నానని భావించి, హేళనగా నవ్వుతూ మీరు నన్ను అవమానించారు. అందుచేత ఇదిగో మీకు శాపం ఇస్తున్నాను.

మత్ప్రసాదేన భర్తారం లబ్ధ్వా తు పురుషోత్తమమ్ ।
మచ్ఛాపోపహతాస్సర్వా దస్యుహస్తం గమిష్యథ ॥ 84 ॥

నా అనుగ్రహంతోనే పురుషోత్తముడైన శ్రీకృష్ణుడిని భర్తగా పొందినమీరు నా శాపం తగిలి, మీరందరూ దొంగలచేతికి చిక్కుతారు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యుదీరితమాకర్ణ్య మునిస్తాభిః ప్రసాదితః ।
పునస్సురేన్ద్రలోకం వై ప్రాహ భూయో గమిష్యథ ॥ 85 ॥

అష్టావక్రమహర్షి మాటలు విని, దేవకాంతలు అతడిని తమను దయచూడమని ప్రార్థించారు. అష్టావక్రుడు 'ఆ తరువాత తిరిగి దేవేంద్రలోకానికి వెళ్లగల' రని శాపావసానాన్ని అనుగ్రహించాడు.

ఏవం తస్య మునేశ్శాపాదష్టావక్రస్య కేశవమ్ ।
భర్తారం ప్రాప్య తాః ప్రాప్తా దస్యుహస్తం వరాఙ్గనాః ॥ 86 ॥

అష్టావక్రుడిచ్చిన ఈ శాపంచేత ఆ దేవకాంతలు శ్రీకృష్ణుడిని భర్తగా పొందారు. వాళ్లే ఇపుడు దొంగలచేతిలో పడ్డారు.

తత్ త్వయా నాత్ర కర్తవ్యశ్శోకోఽల్పోపి హి పాణ్డవ ।
తేనైవాఖిలనాథేన సర్వం తదుపసంహృతమ్ ॥ 87 ॥

పాండుకుమారా! ఆ కారణంగా ఇపుడు జరిగినదానికి నీవు కొంచెం కూడా విచారించవలసిన అవసరం లేదు. అందరికీ దిక్కు అయిన ఆ కృష్ణభగవానుడే అది మొత్తం (నీఆయుధబలం, నీబలం మొదలైనవి కూడ) ఉపసంహరించాడు.

భవతాం చోపసంహారమాసన్నం తేన కుర్వతా ।
బలం తేజస్తథా వీర్యం మాహాత్మ్యం చోపసంహృతమ్ ॥ 88 ॥

అందరినీ ఉపసంహరిస్తున్న ఆ విష్ణుదేవుడు మిమ్మల్ని (పాండవులను) కూడ ఉపసంహరించే సమయం సమీపించింది. (ముందుగా) మీబలమూ, తేజస్సూ, శక్తి, మహిమలను ఉపసంహరించాడు.

జాతస్య నియతో మృత్యుః పతనం చ తథోన్నతేః ।
విప్రయోగావసానస్తు సంయోగస్సఞ్చయః క్షయః ॥ 89 ॥

పుట్టినవాడు చావక తప్పదు. పెరుగుట విరుగుటకొరకే. కలియుట చివరికి విడిపోవడానికే. పోగుకావడం నశించిపోవడానికే.

విజ్ఞాయ న బుధాశ్శోకం న హర్షముపయాన్తి యే ।
తేషామేవేతరే చేష్టాం శిక్షన్తస్సన్తి తాదృశాః ॥ 90 ॥

ఈ విషయం తెలిసిన పండితుడు శోకాన్ని కాని, సంతోషాన్ని కాని పొందడు. వారి చేతలను నేర్చుకున్నవారు కూడ అదే విధంగా శోకం, హర్షం పొందరు.

తస్మాత్ త్వయా నరశ్రేష్ఠ జ్ఞాత్వైతద్ భ్రాతృభిస్సహ ।
పరిత్యజ్యాఖిలం రాజ్యం గన్తవ్యం తపసే వనమ్ ॥ 91 ॥

నరవరా! నీవూ, నీ సోదరులూ అందరూ ఈ విషయాన్ని గ్రహించి, రాజ్యం విడిచిపెట్టి, అడవులకు వెళ్లి తపస్సు చేసుకోండి.

తద్గచ్ఛ ధర్మరాజాయ నివేద్యైతద్ వచో మమ ।
పరశ్వో భ్రాతృభిస్సార్ధం గతిం వీర యథా కురు ॥ 92 ॥

కురువీరా! వెంటనే వెళ్లు. నేను చెప్పినమాటలను ధర్మరాజుకు విన్నవించు. ఎల్లుండి మోక్షస్థితిని పొందడానికి ఏమి చేయాలో అది చేయండి.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్యుక్తోఽభ్యేత్య పార్థాయ యమాభ్యాం చ సహార్జునః ।
దృష్టం చైవానుభూతం వా కథితం తదశేషతః ॥ 93 ॥

వ్యాసుడు చెప్పిన మాటలు విని, అర్జునుడు వెళ్లి, ధర్మరాజుకు, నకులసహదేవులకు, (భీమసేనుడికి) తాను చూసినది, అనుభవించినదీ, మొత్తం వివరించాడు.

వ్యాసవాక్యం చ తే సర్వం శ్రుత్వాఽర్జునసమీరితమ్ ।
రాజ్యే పరీక్షితం కృత్వా యయుః పాణ్డుసుతా వనమ్ ॥ 94 ॥

వ్యాసుడి ఉపదేశంతో సహా అర్జునుడు చెప్పినమాటలు అన్నీ విని, పాండురాజుకుమారులు రాజ్యాన్ని పరీక్షిత్తుకు అప్పగించి, అడవులకు వెళ్లారు.

ఇత్యేతద్ వో మునిశ్రేష్ఠా విస్తరేణ మయోదితమ్ ।
జాతస్య చ యదోర్వంశే వాసుదేవస్య చేష్టితమ్ ॥ 95 ॥

మునివరేణ్యులారా! ఈవిధంగా, యదువంశంలో జన్మించిన శ్రీకృష్ణస్వామి చర్యలను వివరంగా, మీకు చెప్పాను.

ఇతి శ్రీబ్రహ్మపురాణే శ్రీకృష్ణచరితసమాప్తికథనం నామ త్ర్యధికశతతమోఽధ్యాయః ॥103 ॥

శ్రీబ్రహ్మపురాణంలో శ్రీకృష్ణచరితసమాప్తికథనం అనే నూటమూడవ అధ్యాయం సంపూర్ణం.



చతురధికశతతమోఽధ్యాయః - నూటనాల్గవ అధ్యాయం
విష్ణుప్రాదుర్భావానుకీర్తనమ్ - విష్ణుప్రాదుర్భావానుకీర్తనం

మునయ ఊచుః :-మునులు వ్యాసమహర్షితో ఇలా అంటున్నారు.

ప్రాదుర్భావం సురేశస్య దేవస్య చ విచేష్టితమ్ ।
రామస్య చ మునిశ్రేష్ఠ త్వయోక్తం భువి దుర్లభమ్ ॥ 1 ॥

వ్యాసమహర్షీ! దేవతాసార్వభౌము డైన శ్రీకృష్ణస్వామి, అలాగే బలరాముడు వీరిపుట్టుకను గురించి, వారు చేసిన మహత్కార్యాలను గురించి చెప్పావు. ఈ వృత్తాంతం ఈ భూలోకంలో ఇంక ఎక్కడా లభించదు.

న తృప్తిమధిగచ్ఛామ శృణ్వన్తో భగవత్కథామ్ ।
అపరం శ్రోతుమిచ్ఛామః ప్రాదుర్భావం జగత్పతేః ॥ 2 ॥

భగవంతుడి కథలు వింటుంటే మాకు ఎంతకూ తృప్తి కలగడం లేదు. (ఇంకా వినాలనిపిస్తుంది) జగన్నాథుడైన శ్రీమహావిష్ణుదేవుడి మరొకఅవతారం గురించి వినాలని మాకు కోరికగా ఉంది.

ప్రాదుర్భావః పురాణేషు విష్ణోరమితతేజసః ।
సతాం కథయతామేవ వరాహ ఇతి నశ్శ్రుతమ్ ॥ 3 ॥

అపరిమితమయిన తేజస్సు కలిగిన శ్రీమహావిష్ణువు వరాహంగా అవతరించినట్లు పెద్దలు చెపుతుండగా, పురాణాలలో మేము విన్నాం.

న జానీమోఽస్య చరితం న విధిం న చ విస్తరమ్ ।
న కర్మగుణసద్భావం న హేతుత్వమనీషితమ్ ॥ 4 ॥

ఆ వరాహచరిత్ర మాకు తెలియదు. దాని విధానమూ, ప్రవర్తనమూ, అది చేసిన కార్యాలూ, దాని గుణాలు, ఉనికి, దానికి కారణమూ మాకు తెలియదు.

కిమాత్మకో వరాహోఽసౌ కా మూర్తిః కా చ దేవతా ।
కిమాచారప్రభావో వా కిం వా తేన తదా కృతమ్ ॥ 5 ॥

ఈ వరాహం ఎటువంటిది? దాని స్వరూపం ఏమిటి? అది ఏ దేవత? ఏ విధంగా వర్తించింది? దాని మహిమ ఏమిటి? అవతారకాలంలో ఆ వరాహం ఏమి చేసింది?

యజ్ఞార్థం సమవేతానాం మిషతాం చ ద్విజన్మనామ్ ।
మహావరాహచరితం సర్వలోకసుఖావహమ్ ॥ 6 ॥

యజ్ఞం నిమిత్తంగా వచ్చిన ఈ బ్రాహ్మణులు అందరితో కలిసి, ఆ మహావరాహచరిత్రను వినడం సమస్తమైన ఉత్తమ లోకాల సుఖాలను కలిగిస్తుంది. (ఆదివరాహచరిత్ర విన్నవారికి ఉత్తమలోకాలు సిద్ధిస్తాయి.)

యథా నారాయణో బ్రహ్మన్ వారాహం రూపమాస్థితః ।
దంష్ట్రయా గాం సముద్రస్థాముజ్జహారారిమర్దనః ॥ 7 ॥

మహాత్మా! శత్రువులను (రాక్షసులను) సంహరించే శ్రీమన్నారాయణుడు వరాహరూపాన్ని ధరించి, సముద్రంలో మునిగిపోయిన ఈ భూమిని తనకోరతో పైకి లేపాడు.

విస్తరేణైవ కర్మాణి సర్వాణి రిపుఘాతినః ।
శ్రోతుం నో వర్తతే బుద్ధిర్హరేః కృష్ణస్య ధీమతః ॥ 8 ॥

ఉత్తమజ్ఞాని, దుష్టసంహారకుడూ ఆ శ్రీహరి అయిన, శ్రీకృష్ణుడు చేసిన ఘనకార్యాలు సమస్తమూ వినాలని మాకు కోరికగా ఉంది.

కర్మణామానుపూర్వ్యాం చ ప్రాదుర్భావాశ్చ యే విభోః ।
యా వాఽస్య ప్రకృతిర్ బ్రహ్మంస్తాశ్చాఖ్యాతుం త్వమర్హసి ॥ 9 ॥

మహాత్మా! ఆ శ్రీమన్నారాయణప్రభువు చేసిన పనులు, ఆస్వామి అవతారాలు, స్వభావమూ, అవి అన్నీ క్రమంగా చెప్పడానికి తగినవాడివి నీవే.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ప్రశ్నభారో మహానేష భవద్భిస్సముదాహృతః ।
యథాశక్త్యా తు వక్ష్యామి శ్రూయతాం వైష్ణవం యశః ॥ 10 ॥

మీరు అడిగిన ఈ ప్రశ్న చాల బరువైనది (విషయబహుళ మైనది). ఆ శ్రీమహావిష్ణువు ఘనతను గూర్చి, నా శక్తిమేరకు చెప్తాను.

విష్ణోః ప్రభావశ్రవణే దిష్ట్యా వో మతిరుత్థితా ।
హంత విష్ణోః ప్రవక్ష్యామి ప్రాదుర్భావం ద్విజోత్తమాః ॥ 11 ॥

బ్రాహ్మణవర్యులారా! అదృష్టవశాన మీకు శ్రీమహావిష్ణువుమహిమలను వినాలనే బుద్ధి పుట్టింది. ఆహా, శ్రీమహావిష్ణువు అవతారాలను గురించి మీకు వివరిస్తాను.

సహస్రాస్యం సహస్రాక్షం సహస్రచరణం చ యమ్ ।
సహస్రశిరసం దేవం సహస్రకర మవ్యయమ్ ॥ 12 ॥

శ్రీమహావిష్ణువు వేయి (లెక్క లేనన్ని) ముఖాలు, కన్నులు, పాదాలు, తలలు, చేతులు కలిగినవాడు. అన్ని కాలాలలోనూ స్థిరంగా ఉంటాడు.

సహస్రజిహ్వం భాస్వన్తం సహస్రముకుటం ప్రభుమ్ ।
సహస్రదం సహస్రాదిం సహస్రభుజమవ్యయమ్ ॥ 13 ॥

అంతు లేనినాలుకలూ, కిరీటాలూ, బాహువులూ, కలిగినవాడు. అంతు లేనన్ని వరాలు ఇస్తాడు. అసంఖ్యాకమైన అవతారాలు ధరించాడు. అందరినీ రక్షించేవాడు. చక్కగా ప్రకాశిస్తాడు. ఎన్నటికీ తరగనివాడు.

హవనం సవనం చైవ హోతారం హవ్యమేవ చ ।
పాత్రాణి చ పవిత్రాణి వేదిం దీక్షాం సమిత్ స్రువమ్ ॥ 14 ॥

స్రుక్ సోమశూర్పముశలం ప్రోక్షణీం దక్షిణాయనమ్ ।
అధ్వర్యుం సామగం విప్రం సదస్యం సదనం సదః ॥ 15 ॥

యూపం చక్రం ధ్రువాం దర్వీం చరూంశ్చోలూఖలాని చ ।
ప్రాగ్వంశం యజ్ఞభూమిం చ హోతారం చ పరం చ యత్ ॥ 16 ॥

హ్రస్వాణ్యతిప్రమాణాని స్థావరాణి చరాణి చ ।
ప్రాయశ్చిత్తాని వార్ఘ్యం చ స్థణ్డిలాని కుశాస్తథా ॥17 ॥

మన్త్రయజ్ఞవహం వహ్నిం భాగం భాగవహం చ యత్ ।
అగ్రాసినం సోమభుజం హుతార్చిషముదాయుధమ్ ॥ 18 ॥

ఆహుర్వేదవిదో విప్రా యం యజ్ఞే శాశ్వతం ప్రభుమ్ ।
తస్య విష్ణోస్సురేశస్య శ్రీవత్సాఙ్కస్య ధీమతః ॥ 19 ॥

ప్రాదుర్భావసహస్రాణి సమతీతాన్యనేకశః ।
భూయశ్చైవ భవిష్యన్తి హ్యేవమాహ పితామహః ॥ 20 ॥

హోమం, యజ్ఞం, యజ్ఞం చేసేవాడు, నెయ్యి మొదలయిన హోమం చేసే పదార్థాలు, హోమపాత్రలు, దర్భలు, యజ్ఞవేది, యజ్ఞదీక్ష, సమిధ, స్రువం, స్రుక్కు, సోమరసం, చేట, రోకలి, ప్రోక్షణిపాత్ర, దక్షిణాయనకాలం, యజుర్వేద మంత్రాన్ని చెప్పేవాడు, సామవేదమంత్రం గానం చేసేవాడు, మంత్రపాఠకుడు, యజ్ఞశాల, సభ,యజ్ఞ పశువును కట్టేకొయ్య, (అర్వణ)చక్రం, (హోమద్రవ్యాన్ని ఉంచే) గరిటె, హోమద్రవ్యం, రోళ్లు, ప్రాగ్వంశం, యజ్ఞ ప్రదేశం, అగ్నిలో హోమద్రవ్యాన్ని హోమం చేసేవాడు, ఇంకా శ్రేష్ఠ మయినవస్తుజాలమూ, చిన్నవీ, చాల పెద్దవీ, కదలనివీ, కదిలేవీ, ప్రాయశ్చిత్తాలు, అర్ఘ్యం, యజ్ఞప్రదేశాలు, దర్భలు, మంత్రాలనూ, యజ్ఞాన్నీ వహించేఅగ్ని, హవిర్భాగాలు, హవిర్భాగాలను ధరించే పాత్రలూ, అగ్రస్థానంలో ఉన్నవాడూ, సోమరసాన్ని స్వీకరించేవాడు, ఉత్తమమైన ఆయుధాలను ధరించినహోమాగ్నీ, అన్నీ శ్రీమహావిష్ణువే. (యజ్ఞాంగాలు సమస్తమూ శ్రీమహావిష్ణు స్వరూపమే.)

ద్విజులారా! వేదవేత్తలైన బ్రాహ్మణులు అతడిని యజ్ఞంలో ఎల్లకాలాలలోనూ స్థిరంగా ఉండే ప్రభువుగా చెప్తారు. దేవదేవుడూ, శ్రీవత్సం అనే చిహ్నం ధరించినవాడూ అయిన ఆ శ్రీమహావిష్ణువు ధరించిన అవతారాలు వేలకొలదిగా ఇప్పటికి జరిగిపోయాయి. ఇంక ముందు కూడ జరగబోతున్నాయి. అని బ్రహ్మదేవుడు చెప్పాడు.

యత్ పృచ్ఛధ్వం మహాభాగా దివ్యాం పుణ్యామిమాం కథామ్ ।
ప్రాదుర్భావాశ్రితాం విష్ణోస్సర్వపాపహరాం శివామ్ ॥ 21 ॥

మహాత్ములారా! సమస్తమైన పాపాలను నిర్మూలించేదీ, శుభాలను కలిగించేదీ, పుణ్యప్రదమయినదీ, అయిన మహావిష్ణువు అవతారాలను గూర్చి మీరు అడిగిన ఈ కథను చెప్తాను వినండి.

శృణుధ్వం తాం మహాభాగాస్తద్గతేనాన్తరాత్మనా ।
ప్రవక్ష్యామ్యానుపూర్వ్యేణ యత్ పృచ్ఛధ్వం మమానఘాః ॥
వాసుదేవస్య మాహాత్మ్యం చరితం చ మహామతేః ॥ 22 ॥

పుణ్యాత్ములారా! మీరు అడిగిన గొప్పధీశాలి అయిన వాసుదేవుడి మహిమను, ఆ స్వామిచరిత్రను క్రమంగా చెప్తాను. మహాత్ములారా, దానిపైనే మనసు నిలిపి, శ్రద్ధగా వినండి.

హితార్థం సురమర్త్యానాం లోకానాం ప్రభవాయ చ ।
బహుశస్సర్వభూతాత్మా ప్రాదుర్భవతి వీర్యవాన్ ॥ 23 ॥

స్థావరజంగమాత్మకమయిన సమస్తభూతాలూ తనస్వరూపమే అయి, శక్తిమంతుడైన ఆ మహాత్ముడు దేవలోకమూ, మానవలోకమూ సుఖంగా వర్ధిల్లడంకోసం అనేకరూపాలతో అవతరించాడు.

ప్రాదుర్భావాంశ్చ వక్ష్యామి పుణ్యాన్ దివ్యాన్ గుణాన్వితాన్ ॥ 24 ॥

పుణ్యప్రదమైనవీ, దేవసంబంధం గలిగినవీ, ఉత్తమగుణాలతో కూడినవీ అయిన ఆ విష్ణుమూర్తి అవతారాలను చెప్తాను.

సుప్తో యుగసహస్రం యః ప్రాదుర్భవతి కార్యతః ।
పూర్ణే యుగసహస్రేఽథ దేవదేవో జగత్పతిః ॥ 25 ॥

లోకనాథుడు, దేవతలకు దేవుడు అయిన ఆ స్వామి వేయియుగాలు నిద్రలో ఉంటాడు. వెయ్యియుగాలు పూర్తి అయిన తరువాత తాను చేయవలసిన పనులను చేయడానికి వైకుంఠంనుండి దిగివస్తాడు.

బ్రహ్మా చ కపిలశ్చైవ త్ర్యమ్బకాస్త్రిదశాస్తథా ।
దేవాస్సప్తర్షయశ్చైవ నాగాశ్చాప్సరసస్తథా ॥ 26 ॥

సనత్కుమారశ్చ మహానుభావో మనుర్మహాత్మా భగవాన్ ప్రజాకరః ।
పురాణదేవోఽథ పురాణి చక్రే ప్రదీప్తవైశ్వానరదీప్తతేజాః ॥ 27 ॥

బ్రహ్మ, కపిలమహర్షి, ముక్కంటి, ముప్పైరకాలదేవతలు, ఏడుగురు మహర్షులు, ఉరగులు, అప్సరసలు, మహానుభావుడైన సనత్కుమారుడు, భగవంతుడూ, ప్రజలను సృష్టించే మహాత్ముడూ అయినమనువు, సనాతనుడైన దేవుడు, మిక్కిలివెలుగొందుతున్న అగ్నిజ్వాలవంటి ప్రకాశించే తేజస్సు కలిగినవాడు అయిన ఆపరమాత్మ నగరాలను నిర్మించాడు.

యోఽసౌ చార్ణవమధ్యస్థో నష్టే స్థావరజఙ్గమే ।
నష్టే దేవాసురనరే ప్రణష్టోరగరాక్షసే ॥ 28 ॥

దేవతలు, అసురులు, మానవులు, నాగులు, రాక్షసులు, ఇంకా చరాచరాత్మకమైన ఈసృష్టి సమస్తం ప్రళయంలో నశించిన తరువాత అంతా జలమయమై, ఏకార్ణవంగా ఉండగా, శ్రీమహావిష్ణువు ఆ సముద్రం మధ్యలో ఉంటాడు.

యోద్ధుకామౌ దురాధర్షౌ తావుభౌ మధుకైటభౌ ।
హతౌ భగవతా తేన తయోర్దత్త్వామితం వరమ్ ॥ 29 ॥

ఆ సమయంలో మధుడు, కైటభుడు అనే ఎదురులేని రాక్షసులు ఇద్దరు ఏర్పడ్డారు. వారికి విష్ణుమూర్తితో యుద్ధం చేయాలని కోరిక కలిగింది. వారు స్వామిని దానినే వరంగా అర్థించారు. అప్పుడు స్వామి వారికి ఆ వరాన్ని ఇచ్చి, ఆ యుద్ధంలో మధుకైటభులను సంహరించాడు.

పురా కమలనాభస్య స్వపతస్సాగరామ్భసి ।
పుష్కరే తత్ర సమ్భూతా దేవాస్సర్షిగణాస్తథా ॥ 30 ॥

పూర్వం ఒకానొకప్పుడు శ్రీమహావిష్ణువు సముద్రజలంలో నిద్రిస్తున్నాడు. అక్కడ పుష్కరక్షేత్రంలో దేవతలు మహర్షులగణాలతో సహా సంభవించారు.

ఏష పౌష్కరకో నామ ప్రాదుర్భావో జగత్పతేః ।
పురాణం కథ్యతే యత్ర దేవశ్రుతిసమాహితమ్ ॥ 31 ॥

అదిలోకేశ్వరుడయిన విష్ణువు అవతారమే. పౌష్కరం అని దానిపేరు. ఇది దేవతలలోనూ వేదాలలోనూ ప్రసిద్ధం. మిక్కిలిపురాతనమైన ఈ అవతారం చక్కగా కీర్తించబడి ఉంది.

వారాహస్తు శ్రుతిముఖః ప్రాదుర్భావో మహాత్మనః ।
యత్ర విష్ణుస్సురశ్రేష్ఠో వారాహం రూపమాస్థితః[1] ॥ 32 ॥

---

1. ఇక్కడ అధికపాఠం.

1. వేదపాదో యూపదంష్ట్రః క్రతుదన్తశ్చితీముఖః, అగ్నిజిహ్వో దర్భరోమా బ్రహ్మశీర్షో మహాతపాః.

విష్ణువు అవతారమైన ఆదివరాహమూర్తికి వేదాలు. పాదాలు యజ్ఞంలో బలిపశువును కట్టిఉంచేకొయ్యకోర. యజ్ఞం ఆయనకు దంతాలు. సమిధలరాశి స్వామినోరు. అగ్ని ఆస్వామినాలుక దర్భలు. వెంట్రుకలు. బ్రహ్మదేవుడు గొప్ప తపస్వి అయిన విష్ణుమూర్తికిశిరస్సు

2. అహోరాత్రేక్షణో దివ్యో వేదాఙ్గశ్రుతిభూషణః, ఆజ్యనాసస్స్రువతుణ్డస్సామఘోషస్వరో మహాన్.

రాత్రింబగళ్లు ఆస్వామికి కన్నులు. మహిమాన్విత మయినవేదాంగాలు ఆస్వామికి కర్ణాభరణాలు. ఆస్వామి ముక్కు ఆవునెయ్యి. ముట్టె స్రువం (అగ్నిలో నెయ్యి వేసేగరిటె). గొప్ప దయినఆస్వామికంఠధ్వని సామవేదం.

3. సత్యధర్మమయ శ్శ్రీమాన్ క్రమవిక్రమసత్కృతః, ప్రాయశ్చిత్తనఖో ఘోరః పశుజానుర్మఖాకృతిః.

సత్యమూ, ధర్మమూ ఆస్వామిరూపం. శ్రీమంతుడైన ఆ స్వామి వేదపాఠక్రమంశక్తితో అలంకరింపబడినవాడు. వరాహస్వామి గోళ్లు ప్రాయశ్చిత్తాలు. ఆయనరూపం చూడరాకుంటుంది. పశువు వరాహస్వామి మోకాళ్లు. యజ్ఞం ఆయనస్వరూపం.

దేవతలలో ఉత్తముడైన శ్రీమహావిష్ణువు వరాహరూపంలో అవతరించడాన్ని గురించి వేదాలు ప్రముఖంగా స్తుతించాయి.

మహీం సాగరపర్యన్తాం సశైలవనకాననామ్ ।
ఏకార్ణవజలభ్రష్టామేకార్ణవగతః ప్రభుః ॥ 33 ॥

దంష్ట్రయా యస్సముద్ధృత్య లోకానాం హితకామ్యయా ।
సహస్రశీర్షో లోకాదిశ్చకార జగతీం పునః ॥ 34 ॥

కొండలతోనూ, ఉద్యానవనాలతోనూ, అడవులతోనూ, నిండి, సముద్రంవరకూ విస్తరించిన ఈ భూమండలం ఏకార్ణవంలో మునిగిపోయింది. లోకాలకు అన్నింటికీ మూలమయినవాడూ, అనంతమయిన శిరస్సులు కలిగినవాడూ అయిన శ్రీవరాహస్వామి సమస్తలోకాలకు మేలు చేయడంకోసం, ఆ ఏకార్ణవంలో ప్రవేశించి, తనకోరతో పైకి లేపి, జగత్తును తిరిగి నెలకొల్పాడు.

ఏవం యజ్ఞవరాహేణ భూత్వా భూతహితార్థినా ।
ఉద్ధృతా పృథివీ దేవీ సాగరామ్బుధరా పురా ॥ 35 ॥

ఈవిధంగా పూర్వం శ్రీమహావిష్ణువు చరాచరభూతకోటి మేలు కోరి, యజ్ఞాత్మకమయిన వరాహస్వరూపంలో సముద్రంలో మునిగి ఉన్న ఈ భూదేవిని ఉద్ధరించాడు.

---

4. ఉద్గాత్రాన్త్రో హోమలిఙ్గో బీజౌషధిమహాఫలః, వాద్యాన్తరాత్మా మన్త్రస్ఫిగ్వికృతస్సోమశోణితః.

యజ్ఞంలోని ఉద్గాత వరాహమూర్తి ప్రేగులు. హోమం స్వామికి లింగం. అత్యధికమైన ఫలాన్ని ఇచ్చే ఓషధులు ఆస్వామికి బీజాలు. వాద్యాలు ఆస్వామికి అంతరాత్మ. వేదమంత్రాలు ఆస్వామికి పిరుదులు. కొంత విలక్షణ మయినఆకృతి కలిగినఆస్వామికి సోమరసం రక్తం.

5. వేదిస్కన్ధో హవిర్గన్ధో హవ్యకవ్యాతివేగవాన్, ప్రాగ్వంశకాయో ద్యుతిమాన్ నానాదీక్షాభిరన్వితః.

యజ్ఞపీఠం స్వామి భుజపీఠం. హోమద్రవ్యం స్వామి పరిమళం. హవ్యమూ, కవ్యమూ స్వామికి వేగాలు. హవిర్గృహానికి తూర్పుభాగంలో యజమానుడు మొదలైనవారు ఉండటంకోసం ఏర్పాటుచేసిన గృహం (ప్రాగ్వంశం) స్వామికి శరీరం. స్వామి కాంతిమంతుడు. అనేక విధమైన దీక్షలతో కూడినవాడు.

6. దక్షిణాహృదయో యోగీ మహాసత్త్రమయో మహాన్, ఉపాకర్మాష్టరుచకః ప్రవర్గ్యావర్తభూషణః.

యజ్ఞంలో దక్షిణ స్వామికి హృదయం. ఆయన యోగి. మహాసత్త్రయాగం ఆయన స్వరూపం. అత్యున్నతుడు. ఉపాకర్మ మొదలయిన ఎనిమిదికర్మలు స్వామి ఆకారం. హోమాగ్నుల సుడులు స్వామికి అలంకారాలు.

7. నానాచ్ఛన్దోగతిపథో గుహ్యోపనిషదాసనః, ఛాయాపత్నీసహాయోఽసౌ మణిశృఙ్గ ఇవోత్థితః.

పలువిధములైన ఛందస్సులు స్వామి సంచరించే మార్గాలు. రహస్యమయిన ఉపనిషత్తులు స్వామికి ఆసనాలు. నీడయే భార్యగా సహకరిస్తుంది. రత్నాలశిఖరంలాగా నిలిచిఉంటాడు.

వరాహ ఏష కథితో నారసింహస్తతో ద్విజాః ।
యత్ర భూత్వా మృగేన్ద్రేణ హిరణ్యకశిపుర్హతః ॥ 36 ॥

విప్రులారా! ఈ యజ్ఞవరాహంగా అవతరించిన స్వామియే ఆ తరువాత నారసింహుడుగా అవతరించాడు. ఆ సింహమే హిరణ్యకశిపుడిని సంహరించింది.

పురా కృతయుగే విప్రాస్సురారిర్బలదర్పితః ।
దైత్యానామాదిపురుషశ్చకార సుమహత్తపః ॥ 37 ॥

బ్రాహ్మణులారా! పూర్వం కృతయుగంలో హిరణ్యకశిపుడు అనేవాడు రాక్షసులందరికీ మూలపురుషుడు. ఆ మహాసురుడు బలంతో గర్వించి, గొప్ప తపస్సు చేశాడు.

దశవర్షసహస్రాణి శతాని దశపఞ్చ చ ।
జపోపవాసనిరతస్తస్థౌ మౌనవ్రతస్థితః ॥ 38 ॥

పదివేల పదిహేనువందలసంవత్సరాలు దీక్షగా జపమూ, ఉపవాసమూ చేస్తూ, మౌనవ్రతంలో ఉండి గొప్పతపస్సు చేశాడు.

తతశ్శమదమాభ్యాం చ బ్రహ్మచర్యేణ చైవ హి ।
బ్రహ్మా ప్రీతోఽభవత్ తస్య తపసా నియమేన చ ॥ 39 ॥

హిరణ్యకశిపుడు బాహ్యేంద్రియాలను, అంతరింద్రియాలనూ నిగ్రహించుకుని, బ్రహ్మచర్యదీక్షతో, కఠినమైన నియమాలను పాటిస్తూ ఘోరమైన తపస్సు చేశాడు. దానికి బ్రహ్మదేవుడు సంతోషించాడు.

తం వై స్వయమ్భూర్భగవాన్ స్వయమాగమ్య భో ద్విజాః ।
విమానేనార్కవర్ణేన హంసయుక్తేన భాస్వతా ॥ 40 ॥

ఆదిత్యైర్వసుభిస్సార్ధం మరుద్భిర్దైవతైస్తథా ।
రుద్రైర్విశ్వసహాయైశ్చ యక్షరాక్షసకిన్నరైః ॥ 41 ॥

దిశాభిః ప్రదిశాభిశ్చ నదీభిస్సాగరైస్తథా ।
నక్షత్రైశ్చ ముహూర్తైశ్చ ఖేచరైశ్చ మహాగ్రహైః ॥ 42 ॥

దేవర్షిభిస్తపోవృద్ధై స్సిద్ధైర్విద్వద్భిరేవ చ ।
రాజర్షిభిః పుణ్యతమైర్గన్ధర్వైరప్సరోగణైః ॥43 ॥

చరాచరగురు శ్శ్రీమాన్ వృత స్సర్వై స్సురై స్తథా ।
బ్రహ్మా బ్రహ్మవిదాం శ్రేష్ఠో దైత్యం వచనమబ్రవీత్ ॥ 44 ॥

ఓ బ్రాహ్మణులారా! అప్పుడు ప్రకాశించే హంసతో కూడి, సూర్యతేజస్సు కలిగిన విమానంలో తనకు తానుగా ఏర్పడినబ్రహ్మదేవుడు స్వయంగా హిరణ్యకశిపుడివద్దకు వచ్చాడు. (పన్నెండుమంది) ఆదిత్యులు,

(ఎనిమిదిమంది) వసువులు, మరుత్తులు, (పదకొండుమంది) రుద్రులు, విశ్వేదేవతలు, ఇంకా యక్షులు, రాక్షసులు, కిన్నరులు, దిక్కులు, విదిక్కులు (మూలలు), నదులు, సముద్రాలు. నక్షత్రాలు, ముహూర్తాలు, ఆకాశగమనులు, పెద్దపెద్దగ్రహాలు, దేవఋషులు, ఇంక మిక్కిలివృద్ధులైన తపస్వులు, సిద్ధులు, విద్వాంసులు, రాజఋషులు, గంధర్వులు, అప్సరసలు, గొప్పపుణ్యాత్ములు, అయినవారితో సమస్తసృష్టికీ ఆద్యుడైన మహాత్ముడూ, బ్రహ్మజ్ఞానులలో ఉత్తముడూ, అయిన బ్రహ్మదేవుడు కలిసివచ్చి దేవతలందరూ తనచుట్టూ చేరి సేవిస్తుండగా, హిరణ్యకశిపుడితో ఇలా అన్నాడు.

బ్రహ్మోవాచ :–హిరణ్యకశిపుడితో బ్రహ్మ ఇలా అంటున్నాడు.

ప్రీతోఽస్మి తవ భక్తస్య తపసాఽనేన సువ్రత ।
వరం వరయ భద్రం తే యథేష్టం కామమాప్నుహి ॥ 45 ॥

తపస్వీ! నాకు భక్తుడివైన నీ ఈ ఘోరతపస్సుకు సంతోషించాను. కావలసిన వరం కోరుకో. నీకు శుభం జరుగుతుంది. నీ యిష్టం వచ్చిన కోరికను పొందు.

హిరణ్యకశిపురువాచ :–బ్రహ్మదేవుడితో హిరణ్యకశిపుడు ఇలా అంటున్నాడు.

న దేవాసురగన్ధర్వా న యక్షోరగరాక్షసాః ।
ఋషయో వాథ మాం శాపైః క్రుద్ధా లోకపితామహ ॥
శపేయుస్తపసా యుక్తా వర ఏవ వృతో మయా ॥ 46 ॥

లోకేశ్వరా! దేవతలు, అసురులు, గంధర్వులు, యక్షులు, నాగులు, రాక్షసులు, మహర్షులు, ఇంకా తపస్వులు ఎవరూ కూడ నామీద కోపంతో నన్ను శపించగూడదు. నేను కోరుకునే వరం ఇదే.

న శస్త్రేణ న వాస్త్రేణ గిరిణా పాదపేన వా ।
న శుష్కేణ న చార్ద్రేణ న చైవోర్ధ్వం న చాప్యధః ॥ 47 ॥

ఆయుధంతో కాని, మంత్రాస్త్రంతో కాని, కొండలతో కాని, మహావృక్షాలతో కాని, ఎండినదానితో కాని, తడిసినదానితో గాని, పైన (ఆకాశంలో) గాని, క్రింద (భూమిమీద) గాని, నాకు మరణం ఉండగూడదు.

పాణిప్రహారేణైకేన సభృత్యబలవాహనమ్ ।
యో మాం నాశయితుం శక్తస్స మే మృత్యుర్భవిష్యతి ॥ 48 ॥

కేవలం చేతిదెబ్బ ఒక్కదానితో మాత్రమే, పరివారంతోనూ, సైన్యంతోనూ, వాహనాలతోనూ సహా నన్ను నాశనం చేయగలిగినవాడు మాత్రమే నన్ను చంపాలి.

భవేయమహమేవార్క స్సోమో వాయుర్హుతాశనః ।
సలిలం చాన్తరిక్షం చ ఆకాశం చైవ సర్వశః ॥ 49 ॥

సూర్యుడూ, చంద్రుడూ, వాయువూ, అగ్నీ, నీళ్లూ, అంతరిక్షమూ, అన్నీ (అన్నిటికీ అధిపతి) నేనే కావాలి.

అహం క్రోధశ్చ కామశ్చ వరుణో వాసవో యమః ।
ధనదశ్చ ధనాధ్యక్షో యక్షః కింపురుషాధిపః ॥ 50 ॥

అదే విధంగా క్రోధమూ, కామమూ, వరుణుడూ, ఇంద్రుడూ, యముడూ, ధనాధిపతీ, కింపురుషులకు రాజూ, యక్షుడూ అయిన కుబేరుడూ, నేనే కావాలి.

బ్రహ్మోవాచ :–హిరణ్యకశిపుడితో బ్రహ్మ ఇలా అంటున్నాడు.

ఏతే దివ్యా వరాస్తాత మయా దత్తాస్తవాద్భుతాః ।
సర్వాన్ కామానిమాంస్తాత ప్రాప్స్యసి త్వం న సంశయః ॥ 51 ॥

నాయనా! విచిత్రమైన ఈ దివ్యవరాలు అన్నీ నీకు ఇచ్చేశాను. ఈ కోరికలు అన్నీ నీవు పొందుతావు. సందేహం లేదు.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఏవముక్త్వా తు భగవాన్ జగామాశు పితామహః ।
వైరాజం బ్రహ్మసదనం బ్రహ్మర్షిగణసేవితమ్ ॥ 52 ॥

హిరణ్యకశిపుడితో ఈ విధంగా చెప్పి, బ్రహ్మదేవుడు బ్రహ్మర్షులతో నిండిన, వైరాజం అనే తన(బ్రహ్మ)లోకానికి వెంటనే వెళ్లిపోయాడు.

తతో దేవాశ్చ నాగాశ్చ గన్ధర్వా మునయస్తథా ।
వరప్రదానం శ్రుత్వైవ పితామహముపస్థితాః ॥ 53 ॥

ఆ తరువాత హిరణ్యకశిపుడికి బ్రహ్మ ఈవిధంగా వరం ఇచ్చిన వృత్తాంతాన్ని విని, దేవతలు, నాగులు, గంధర్వులు, మహర్షులు బ్రహ్మవద్దకు వెళ్లారు.

దేవా ఊచుః :–బ్రహ్మతో దేవతలు ఇలా అంటున్నారు.

వరేణానేన భగవన్ బాధిష్యతి స నోఽసురః ।
తత్ ప్రసీదాశు భగవన్ వధోఽప్యస్య విచిన్త్యతామ్ ॥ 54 ॥

మహాత్మా! నీవు ఇచ్చిన ఈ వరంతో ఆ రాక్షసుడు మమ్మల్ని పీడిస్తాడు. దేవా, అతడినుండి మమ్మల్ని కాపాడు. హిరణ్యకశిపుడిని సంహరించేమార్గాన్ని గురించి కూడా ఆలోచించు.

భగవన్ సర్వభూతానాం స్వయమ్భూరాదికృత్ ప్రభుః ।
స్రష్టా చ హవ్యకవ్యానామవ్యక్తం ప్రకృతిర్ధ్రువమ్ ॥ 55 ॥

దేవా! నీవు స్వయంగా ఏర్పడ్డావు. సమస్తమైనభూతకోటినీ సృష్టించావు. అందరికీ ప్రభువువి. హవ్యాన్నీ (దేవతలకు ఇచ్చేది), కవ్యాన్నీ (పితరులకు ఇచ్చేది) సృష్టించినది నీవే. నీ స్వరూపం ఎవ్వరికీ తెలియదు. శాశ్వత మైనవాడివి.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

తతో లోకహితం వాక్యం శ్రుత్వా దేవః ప్రజాపతిః ।
ప్రోవాచ భగవాన్ వాక్యం సర్వదేవగణాంస్తథా ॥ 56 ॥

సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు లోకాలకు మేలు చేసేఆ దేవతల పలుకులు విని, దేవతలందరితోనూ ఇలా చెప్పాడు.

బ్రహ్మోవాచ :-దేవతలతో బ్రహ్మ ఇలా అంటున్నాడు.

అవశ్యం త్రిదశాస్తేన ప్రాప్తవ్యం తపసః ఫలమ్ ।
తపసోఽన్తే చ భగవాన్ వధం విష్ణుః కరిష్యతి ॥ 57 ॥

దేవతలారా! హిరణ్యకశిపుడు చేసిన తీవ్రమైనతపస్సుకు తగిన ఫలితాన్ని అతడు తప్పక పొంది తీరవలసిందే. తపఃఫలం అంతా అనుభవించిన తరువాత, శ్రీమహావిష్ణువు ఆ రాక్షసుడిని తప్పకుండా సంహరిస్తాడు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఏత చ్ఛ్రుత్వా సురాస్సర్వే వాక్యం పఙ్కజజన్మనః ।
స్వాని స్థానాని దివ్యాని జగ్ముస్తే వై ముదాన్వితాః ॥ 58 ॥

బ్రహ్మదేవుడు చెప్పినమాటలు విని, దేవతలు అందరూ సంతోషిస్తూ, దివ్యమైన తమ నివాసాలకు వెళ్లిపోయారు.

లబ్ధమాత్రే వరే చాపి సర్వాస్సోఽబాధత ప్రజాః ।
హిరణ్యకశిపుర్దైత్యో వరదానేన దర్పితః ॥ 59 ॥

బ్రహ్మదేవుడివలన వరం పొందడం మూలంగా తనను చంపగలిగినవాడు లేడనే గర్వంతో హిరణ్యకశిపుడు లోకాలను పీడించడం ప్రారంభించాడు.

ఆశ్రమేషు మహాభాగాన్ మునీన్ వై శంసితవ్రతాన్ ।
సత్యధర్మరతాన్ దాన్తాంస్తదా ధర్షితవాంస్తథా ॥ 60 ॥

సత్యధర్మాలలోనూ ఆసక్తి కలిగి, ఇంద్రియాలను జయించి, శ్రేష్ఠమైన ఉత్తమవ్రతదీక్షలలో ఉన్న మహాత్ములైన మహర్షులను వారి ఆశ్రమప్రదేశాలలోనే హిరణ్యకశిపుడు భయపెట్టాడు.

త్రిదివస్థాంస్తథా దేవాన్ పరాజిత్య మహాసురః ।
త్రైలోక్యం వశమానీయ స్వర్గే వసతి సోఽసురః ॥ 61 ॥

అదే విధంగా ఆ మహారాక్షసుడు దేవలోకంలోఉన్న దేవతలను జయించాడు. మూడులోకాలను తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. స్వర్గలోకంలో నివసించసాగాడు.

యదా వరమదోన్మత్తో విచరన్ దానవో భువి ।
యజ్ఞీయానకరోద్ దైత్యానయజ్ఞీయాశ్చ దేవతాః ॥ 62 ॥

ఆ రాక్షసుడు బ్రహ్మవరంవలన కలిగిన మదంతో పిచ్చివాడయి, భూమండలం అంతటా ఇష్టం వచ్చిన విధంగా తిరిగాడు. రాక్షసులకు యజ్ఞభాగాలను కల్పించాడు. దేవతలకు యజ్ఞభాగాలు లేకుండా చేశాడు.

ఆదిత్యా వసవస్సాధ్యా విశ్వే చ మరుతస్తదా ।
శరణ్యం శరణం విష్ణుముపతస్థుర్మహాబలమ్ ॥ 63 ॥

ఆదిత్యులు, వసువులు, సాధ్యులు, విశ్వేదేవతలు, మరుత్తులు, అందరూ శ్రీమహావిష్ణువును శరణు పొందారు. ఆ స్వామి మిక్కిలిబలవంతుడు. అందరికీ ఆశ్రయింపదగినవాడు.

దేవబ్రహ్మమయం యజ్ఞం బ్రహ్మదేవం సనాతనమ్ ।
భూతం భవ్యం భవిష్యం చ ప్రభుం లోకనమస్కృతమ్ ॥
నారాయణం విభుం దేవం శరణ్యం శరణం గతాః ॥ 64 ॥

ఆ విష్ణుదేవుడు దేవబ్రహ్మమయుడు. యజ్ఞం స్వరూపం అయినవాడు. బ్రహ్మదేవుడు. సనాతనుడు. జరిగిపోయినదీ, జరుగుతున్నదీ, జరగబోయేదీ అంతా ఆయన స్వరూపమే. అందరికీ ప్రభువు. సమస్తలోకాలు ఆయనకు నమస్కరిస్తాయి. (ఆపదలో ఉన్న) అందరికీ అతడే దిక్కు. లోకాలన్నీ ఆయన అధీనంలోనే ఉంటాయి. అటువంటి శ్రీమన్నారాయణదేవుడిని దేవతలు మొదలైనవారు అందరూ శరణు పొందారు.

దేవా ఊచుః :–శ్రీమహావిష్ణువుతో దేవతలు ఇలా అంటున్నారు.

త్రాయస్వ నోఽద్య దేవేశ హిరణ్యకశిపోర్భయాత్ ।
త్వం హి నః పరమో దేవస్త్వం హి నః పరమో గురుః ॥
త్వం హి నః పరమో ధాతా బ్రహ్మాదీనాం సురోత్తమ ॥ 65 ॥

దేవనాయకా! హిరణ్యకశిపుడివలన మాకు భయంగా ఉంది. ఇప్పుడే మమ్మల్ని కాపాడు. మాకు నీవే దేవ దేవుడివి. ఉత్తమమైన గురువూ నీవే. దేవవరేణ్యా, బ్రహ్మ మొదలైన మాకు (దేవతలకు) అందరికీ ఉత్తమమైన పోషకుడివి నీవే.

ఉత్ఫుల్లామలపత్రాక్ష శత్రుపక్షభయఙ్కర ।
క్షయాయ దితివంశస్య శరణం త్వం భవస్వ నః ॥ 66 ॥

చక్కగా వికసించిన తెల్లదామరలవంటికన్నులు కలిగినవాడా! శత్రువులవైపు వారిని నాశనం చేసేవాడా! దితిపుత్రులను సమూలంగా నాశనం చేయి. అందుకు మాకు నీవే దిక్కు కావాలి.

వాసుదేవ ఉవాచ :-దేవతలతో శ్రీమహావిష్ణువు ఇలా అంటున్నాడు.

భయం త్యజధ్వమమరా అభయం వో దదామ్యహమ్ ।
తథైవ త్రిదివం దేవాః ప్రతిలప్స్యథ మా చిరమ్ ॥ 67 ॥

అమరులారా! భయం విడిచిపెట్టండి. మీకు నేను అభయం ఇస్తున్నాను. దేవతలారా! పూర్వప్రకారంగా స్వర్గలోకాన్ని కూడ మీరు తొందరలోనే పొందుతారు.

ఏషోఽహం సగణం దైత్యం వరదానేన దర్పితమ్ ।
అవధ్యమమరేన్ద్రాణాం దానవేన్ద్రం నిహన్మి తమ్ ॥ 68 ॥

హిరణ్యకశిపుడు బ్రహ్మ ఇచ్చిన వరంతో అహంకరించాడు. అతడిని సంహరించడం దేవనాయకులకు కూడ సాధ్యం కాదు. రాక్షసులకు రాజైన అతడిని వాడి పరివారంతో సహా ఇదుగో నేను ఇప్పుడే చంపివేస్తాను.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఏవముక్త్వా తు భగవాన్ విసృజ్య త్రిదశేశ్వరాన్ ।
హిరణ్యకశిపోః స్థానమాజగామ మహాబలః ॥ 69 ॥

మిక్కిలి బలవంతుడైన శ్రీవిష్ణుభగవానుడు ఈవిధంగా చెప్పి, దేవనాయకులను విడిచి, హిరణ్యకశిపుడు ఉన్నచోటికి వచ్చాడు.

నరస్యార్ధతనుం కృత్వా సింహస్యార్ధతనుం ప్రభుః ।
నారసింహేన వపుషా పాణిం సంస్పృశ్య పాణినా ॥ 70 ॥

ఆ మహాదేవుడు సగం మానవశరీరాన్ని, మరొక సగం సింహం శరీరాన్ని స్వీకరించాడు. అటువంటి నారసింహ రూపంలో చప్పట్లు చరుస్తూ హిరణ్యకశిపుడి వద్దకు వచ్చాడు.

ఘనజీమూతసఙ్కాశో ఘనజీమూతనిస్వనః ।
ఘనజీమూతదీప్తౌజా జీమూత ఇవ వేగవాన్ ॥ 71 ॥

అప్పుడు స్వామి శరీరం గొప్ప మేఘంలాగా ఉంది. స్వామి చేస్తున్న ధ్వని పిడుగులవలె భీకరంగా ఉంది. స్వామి తేజస్సు మెరపులలాగా మిరుమిట్లు గొలుపుతున్నది. పెద్ద మేఘంలాగా స్వామి మిక్కిలి వేగంగా ఊగిపోతున్నాడు.

దైత్యం సోఽతిబలం దృష్ట్వా దృప్తశార్దూలవిక్రమః ।
దృప్తైర్దైత్యగణైర్గుప్తం హతవానేకపాణినా ॥ 72 ॥

నరసింహస్వామి చక్కగా మదించిన బెబ్బులివంటి పరాక్రమం కలిగిఉన్నాడు. మిక్కిలి బలవంతుడైన హిరణ్యకశిపుడిని మదించిన రాక్షసుల మూకలు కాపాడుతుండడం చూశాడు. నరసింహుడు హిరణ్యకశిపుడిని ఒంటిచేతిదెబ్బతో చావగొట్టాడు.

నృసింహ ఏష కథితో భూయో౽యం వామనః పరః ।
యత్ర వామనమాస్థాయ రూపం దైత్యవినాశనమ్ ॥ 73 ॥

ఈవిధంగా నరసింహావతారం గురించి చెప్పడం అయింది. ఇక ఆ తరువాతి అవతారం వామనుడు. రాక్షసులను సంహరించడంకోసం స్వామి పొట్టిదైన రూపాన్ని స్వీకరించాడు.

బలేర్బలవతో యజ్ఞే బలినా విష్ణునా పురా ।
విక్రమైస్త్రిభిరక్షోభ్యాః క్షోభితాస్తే మహాసురాః ॥ 74 ॥

పూర్వం మిక్కిలి బలవంతుడైన బలిచక్రవర్తి యజ్ఞం చేస్తుండగా, బాధించడానికి వీలులేని గొప్ప గొప్ప రాక్షసులను మూడు లోకాలు నిండిన విక్రమాలతో (మూడు అడుగులతో) ఎంతో బాధించాడు.

విప్రచిత్తిశ్శివశ్శఙ్కురయశ్శఙ్కుస్తథైవ చ ।
అయశ్శిరా అశ్వశిరా హయగ్రీవశ్చ వీర్యవాన్ ॥ 75 ॥

(ఆ సమయంలో విష్ణుదేవుడు సంహరించిన రాక్షసులు వీరు.) విప్రచిత్తి, శివుడు, శంకుడు, అయశ్శంకుడు, అయశ్శిరుడు, అశ్వశిరుడు, శక్తిమంతుడైన హయగ్రీవుడు,

వేగవాన్ కేతుమానుగ్రస్సోగ్రవ్యగ్రో మహాసురః ।
పుష్కరః పుష్కలశ్చైవ సాశ్వో౽శ్వపతిరేవ చ ॥ 76 ॥

వేగవంతుడు, కేతుమంతుడు, ఉగ్రుడు, రాక్షసశ్రేష్ఠుడైన సోగ్రవ్యగ్రుడు, పుష్కరుడు, పుష్కలుడు, అశ్వబలం అధికంగా కలిగిన అశ్వపతి,

ప్రహ్లాదో౽శ్వపతిః కుమ్భస్సంహ్రాదో గమనప్రియః ।
అనుహ్లాదో హరిహయో వారాహస్సంహరో౽నుజః ॥ 77 ॥

అశ్వబలానికి విశేషంగా నాయకుడైన ప్రహ్లాదుడు, కుంభుడు, కాల్బలం అధికమైన సంహ్రాదుడు, అనుహ్లాదుడు, హరిహయుడు, వారాహుడు, సంహరుడు, అనుజుడు,

శరభశ్శలభశ్చైవ కుపథః క్రోధనః క్రథః ।
బృహత్కీర్తిర్మహాజిహ్వాశ్శఙ్కుకర్ణో మహాస్వనః ॥ 78 ॥

శరభుడు, శలభుడు, కుపథుడు, క్రోధనుడు, క్రథుడు, బృహత్కీర్తి, మహాజిహ్వుడు, శంకుకర్ణుడు, మహాస్వనుడు,

దీప్తజిహ్వో౽ర్కనయనో మృగపాదో మృగప్రియః ।
వాయుర్గరిష్ఠో నముచిశ్శమ్బరో విక్షరో మహాన్ ॥ 79 ॥

దీప్తజిహ్వుడు, అర్కనయనుడు, మృగపాదుడు, మృగప్రియుడు, వాయువు, గరిష్ఠుడు, నముచి, శంబరుడు, గొప్పవాడైన విక్షరుడు,

చన్ద్రహన్తా క్రోధహన్తా క్రోధవర్ధన ఏవ చ ।
కాలకః కాలకోపశ్చ వృత్రః క్రోధో విరోచనః ॥ 80 ॥

చంద్రహంత, క్రోధహంత, క్రోధవర్ధనుడు, కాలకుడు, కాలకోపుడు, వృత్రుడు, క్రోధుడు, విరోచనుడు,

గరిష్ఠశ్చ వరిష్ఠశ్చ ప్రలమ్బనరకావుభౌ ।
ఇన్ద్రతాపనవాతాపీ కేతుమాన్ బలదర్పితః ॥ 81 ॥

గరిష్ఠుడు, వరిష్ఠుడు, ప్రలంబుడు, నరకుడు, ఇంద్రతాపనుడు, వాతాపి, అధికమైన బలంచేత అహంకరించే కేతుమంతుడు,

అసిలోమా పులోమా చ బాష్కలః ప్రమదో మదః ।
స్వమిశ్రః కాలవదనః కరాలః కేశిరేవ చ ॥
ఏకాక్షశ్చన్ద్రమా రాహుస్సంహ్రాదస్సమ్బరస్స్వనః ॥ 82 ॥

అసిలోముడు, పులోముడు, బాష్కలుడు, ప్రమదుడు, మదుడు, స్వమిశ్రుడు, కాలవదనుడు, కరాలుడు,కేశి, ఏకాక్షుడు, చంద్రముడు, రాహువు, సంహ్రాదుడు, సంబరుడు, స్వనుడు (అనే రాక్షసులను స్వామి ఆ సందర్భంలో సంహరించాడు).

శతఘ్నీ చక్రహస్తాశ్చ తథా ముసలపాణయః ।
అశ్వయన్త్రాయుధోపేతా భిన్దిపాలాయుధాస్తథా ॥ 83 ॥

(రాక్షసులు) శతఘ్ని, చక్రం, రోకలి, అనే ఆయుధాలు చేతబట్టినవారు, అశ్వయంత్రం, భిందిపాలం ఆయుధాలు కలిగినవారు,

శూలోలూఖలహస్తాశ్చ పరశ్వధధరాస్తథా ।
పాశముద్గరహస్తాశ్చ తథా పరిఘపాణయః ॥ 84 ॥

శూలం, రోలు, పరశువు, పాశం, ముద్గరం, పరిఘం అనే ఆయుధాలను చేత బట్టినవారు,

మహాశిలాప్రహరణాశ్శూలహస్తాశ్చ దానవాః ।
నానాప్రహరణా ఘోరా నానాదేశా మహాబలాః ॥ 85 ॥

పెద్దపెద్ద బండరాళ్లు ఆయుధాలుగా కలిగినవారు, శూలం పట్టినవారు, ఇంకా అనేకవిధాలైన ఆయుధాలను ధరించిన గొప్పబలశాలులైన భయంకరరాక్షసులు పలుప్రాంతాలకు చెందినవాళ్లు

కూర్మకుక్కుటవక్త్రాశ్చ శశోలూకముఖాస్తథా ।
ఖరోష్ట్రవదనాశ్చైవ వరాహవదనాస్తథా ॥ 86 ॥

ఆ రాక్షసులు కొందరు తాబేలుముఖం కలిగినవారు. కొందరు కోడిముఖం కలవారు, కొందరు కుందేలు ముఖంవారు. కొందరు గుడ్లగూబముఖం కలవారు. కొందరు గాడిదముఖం కలవారు. కొందరు ఒంటెముఖం కలిగినవారు. కొందరు పందిముఖం కలిగినవారు.

మార్జారశిఖివక్త్రాశ్చ మహావక్త్రాస్తథా పరే ।
నక్రమేషాననాః క్రూరా గోజావిమహిషాననాః ॥ 87 ॥

కొందరు పిల్లిముఖం కలిగినవారు. కొందరు మగనెమలిముఖం కలిగినవారు. మరి కొందరు చాలపెద్ద ముఖం కలిగినవారు. కొందరు మొసలిముఖంవారు. కొందరు మేకముఖం కలిగినవారు. కొందరు ఎద్దుముఖం కలిగినవారు. కొందరు గొఱ్ఱెముఖం కలవారు. కొందరు గేదెముఖం కలిగినవారు. కొందరు దున్నపోతుముఖం కలవారు. అందరూ క్రూరులే.

గోధాశల్లకివక్త్రాశ్చ క్రోష్టువక్త్రాశ్చ దానవాః ।
ఆఖుదర్దురవక్త్రాశ్చ ఘోరా వృకముఖాస్తథా ॥ 88 ॥

కొందరు ఉడుమువంటిముఖం కలవారు. కొందరు ఏదుపందిముఖం కలిగినవారు. కొందరు రాక్షసులు నక్కముఖం కలిగినవారు. కొందరు ఎలుకముఖం కలవారు. కొందరు కప్పముఖం కలవారు. కొందరు తోడేలు ముఖంతో భయంకరంగా ఉన్నారు.

భీమా మకరవక్త్రాశ్చ క్రౌఞ్చవక్త్రాశ్చ దానవాః ।
గరుడాననాః ఖరముఖా మయూరవదనాస్తథా ॥ 89 ॥

కొందరు మొసలిముఖంతో భయంకరంగా ఉన్నారు. కొందరు రాక్షసులు ఒకవిధమైన మగకొంగముఖం కలిగినవారు. కొందరు గద్దముఖం కలవారు. కొందరు గాడిదముఖం కలవారు. కొందరు రాక్షసులు నెమలిముఖం కలవారు.

గజేన్ద్రచర్మవసనాస్తథా కృష్ణాజినామ్బరాః ।
చీరసంవృతగాత్రాశ్చ తథా నీలకవాససః ॥ 90 ॥

కొందరు రాక్షసులు మదించిన ఏనుగుతోలు వస్త్రంగా ధరించారు. మరి కొందరు నల్లజింకతోలు కట్టుకున్నారు. కొందరు పెద్దవస్త్రాన్ని ఒంటికి చుట్టుకున్నారు. మరి కొందరు నల్లనివస్త్రాలు ధరించారు.

ఉష్ణీషిణో ముకుటినస్తథా కుణ్డలినోఽసురాః ।
కిరీటినో లమ్బశిఖాః కమ్బుగ్రీవాస్సువర్చసః ॥ 91 ॥

కొందరు తలపాగా చుట్టుకున్నారు. కొందరు తలపై తురాయి పెట్టుకున్నారు. కొందరు రాక్షసులు చెవులకు కమ్మలు ధరించారు. కొందరు కిరీటం ధరించారు. కొందరికి పెద్దపెద్ద పిలకలు వేలాడుతున్నాయి. కొందరికి ముఖం శంఖంలాగా ఉంది. కొందరు మంచి తేజస్సుతో ప్రకాశిస్తున్నారు.

నానావేషధరా దైత్యా నానామాల్యానులేపనాః ॥ 92 ॥

ఆ రాక్షసులు రకరకాలైన వేషాలు ధరించి ఉన్నారు. రకరకాలైన పూలమాలలు అలంకరించుకున్నారు. ఒంటికి వివిధమైన సుగంధద్రవ్యాలు పూసుకున్నారు.

స్వాన్యాయుధాని సంగృహ్య ప్రదీప్తాని చ తేజసా ।
క్రమమాణం హృషీకేశముపావర్తన్త సర్వశః ॥ 93 ॥

అటువంటి ఆ రాక్షసులు తేజస్సుతో జ్వలిస్తున్న తమ తమ ఆయుధాలను పట్టుకుని, అక్కడే సంచరిస్తున్న శ్రీమహావిష్ణువుపైకి అన్నివైపులనుండి చుట్టుముట్టారు.

ప్రమథ్య సర్వాన్ దైతేయాన్ పాదహస్తతలైర్విభుః ।
రూపం కృత్వా మహాభీమం జహారాశు స మేదినీమ్ ॥ 94 ॥

విష్ణుదేవుడు ఆ రాక్షసులను కాలితో తన్ని, చేతులతో బాది, అందరినీ నానావిధాలుగా హింసించాడు. మిక్కిలి భయంకరమైన మహారూపం ధరించి భూమిని ఆక్రమించాడు.

తస్య విక్రమతో భూమిం చన్ద్రాదిత్యౌ స్తనాన్తరే ।
నభఃప్రక్రమమాణస్య నాభ్యాం కిల తథా స్థితౌ ॥ 95 ॥

అప్పుడు భూమి అంతటా నిండి, ఇంకా పెరిగిపోతున్న ఆ విష్ణుమూర్తిలో సూర్యుడు, చంద్రుడు వక్షస్థలంలో ఉన్నారు. ఆకాశం దాటి, ఇంకా పైకి వ్యాపించిన తరువాత వారిద్దరూ స్వామిబొడ్డువద్ద ఉన్నారు.

పరమాక్రమమాణస్య జానుదేశే వ్యవస్థితౌ ।
విష్ణోరమితవీర్యస్య వదన్త్యేవం ద్విజాతయః ॥ 96 ॥

అత్యధికమైన విక్రమం కలిగిన శ్రీమహావిష్ణువు ఇంకా పైకి పెరగగా, సూర్యచంద్రులు స్వామికి మోకాలివద్దకు వచ్చారని విద్వాంసులు చెప్తుంటారు.

హృత్వా స మేదినీం కృత్స్నాం హత్వా చాసురపుఙ్గవాన్ ।
దదౌ శక్రాయ వసుధాం విష్ణుర్బలవతాం వరః ॥ 97 ॥

బలవంతులలో శ్రేష్ఠుడైన ఆ మహావిష్ణువు ఆ రాక్షసనాయకులందరినీ సంహరించాడు. ఈ భూమిని సమస్తాన్నీ తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. దానిని (స్వర్గాన్నీ) ఇంద్రుడికి ఇచ్చాడు.

ఏష వో వామనో నామ ప్రాదుర్భావో మహాత్మనః ।
వేదవిద్భిర్ద్విజైరేతత్ కథ్యతే వైష్ణవం యశః ॥ 98 ॥

ఇదీ మహాత్ముడైన శ్రీమహావిష్ణువు వామనుడుగా అవతరించిన వృత్తాంతం. శ్రీమహావిష్ణువు మహిమను వేదవేత్తలైన బ్రాహ్మణులు ఈవిధంగా కీర్తిస్తారు.

భూయో భూతాత్మకో విష్ణోః ప్రాదుర్భావో మహాత్మనః ।
దత్తాత్రేయ ఇతి ఖ్యాతః క్షమయా పరయా యుతః ॥ 99 ॥

శ్రీమహావిష్ణువు సమస్తభూతకోటికి అంతరాత్మ అయిన మహానుభావుడు. స్వామి తరువాతి అవతారం దత్తాత్రేయుడు అనే పేరుతో ప్రసిద్ధమైంది. ఆ దత్తాత్రేయ స్వరూపం అత్యంతమైన సహనంతో కూడి ఉంటుంది.

తేన నష్టేషు వేదేషు ప్రక్రియాసు మఖేషు చ ।
చాతుర్వర్ణ్యే చ సఙ్కీర్ణే ధర్మే శిథిలతాం గతే ॥ 100 ॥

ఒకానొక కాలంలో ఈ భూమిమీద వేదాలు నశించిపోయాయి. వేదాలు చెప్పిన కర్మలను ఎవ్వరూ ఆచరించడం లేదు. యజ్ఞాలు నశించాయి. నాలుగు వర్ణాలూ సంకరం అయ్యాయి. ధర్మం క్షీణించింది.

అతివర్ధతి చాధర్మే సత్యే నష్టేఽనృతే స్థితే ।
ప్రజాసు శీర్యమాణాసు ధర్మే చాకులతాం గతే ॥ 101 ॥

(వేదవిరుద్ధమైన) అధర్మం ప్రబలింది. సత్యం నశించింది. అంతటా అబద్ధం స్థిరపడింది. ప్రజలు భ్రష్టులైనారు. వేదధర్మం కకావికలయింది.

సయజ్ఞాస్సక్రియా వేదా ప్రత్యానీతా హి తేన వై ।
చాతుర్వర్ణ్యమసఙ్కీర్ణం కృతం తేన మహాత్మనా ॥ 102 ॥

అటువంటి కాలంలో దత్తాత్రేయస్వామి యజ్ఞాలతో సహా వేదకర్మలనూ, వేదాలనూ పునరుద్ధరించాడు. ఆ మహానుభావుడు ప్రజలలో వర్ణసంకరాన్ని తొలగించాడు.

తేన హైహయరాజస్య కార్తవీర్యస్య ధీమతః ।
వరదేన వరో దత్తో దత్తాత్రేయేణ ధీమతా ॥ 103 ॥

ఆ కాలంలో హైహయరాజు కార్తవీర్యుడు ఉండేవాడు. అతడు గొప్ప ధీశాలి. అందరికీ కోరిన వరాలను ఇచ్చేవాడూ, మహాజ్ఞానీ అయిన దత్తాత్రేయస్వామి కార్తవీర్యుడికి ఒక వరం ఇచ్చాడు.

ఏతద్బాహుద్వయం యత్తే తత్తే మమ కృతే నృప ।
శతాని దశ బాహూనాం భవిష్యన్తి న సంశయః ॥ 104 ॥

మహారాజా! నీ రెండు బాహువులు నా కోసం (ధర్మరక్షణాది కార్యాలలో) వెయ్యి బాహువులు అవుతాయి. సందేహం లేదు.

పాలయిష్యసి కృత్స్నాం చ వసుధాం వసుధేశ్వర ।
దుర్నిరీక్ష్యోఽరిబృన్దానాం యుద్ధస్థశ్చ భవిష్యసి ॥ 105 ॥

భూపాలకా! నీవు ఈ భూమండలం మొత్తాన్నీ పరిపాలిస్తావు. యుద్ధంలో శత్రువుల మూకలు నిన్ను కన్నెత్తి చూడలేవు.

ఏష వో వైష్ణవశ్శ్రీమాన్ ప్రాదుర్భావోఽద్భుతశ్శుభః ।
భూయశ్చ జామదగ్న్యోఽయం ప్రాదుర్భావో మహాత్మనః ॥ 106 ॥

ఈ దత్తాత్రేయరూపం మహిమాన్వితుడైన విష్ణువుకు సంబంధించిన అవతారం. ఇది చాల విచిత్రమైనది. మిక్కిలి శుభప్రదమైనది. ఆ తరువాత మహాత్ముడైన శ్రీమహావిష్ణువు మరొక అవతారం జమదగ్ని కుమారుడైన (పరశు)రాముడు.

యత్ర బాహుసహస్రేణ ద్విషతాం దుర్జయం రణే ।
రామోఽర్జునమనీకస్థం జఘాన నృపతిం ప్రభుః ॥ 107 ॥

రణరంగంలో వేయిచేతులతో యుద్ధం చేసే కార్తవీర్యార్జున మహారాజును శత్రువులు ఎవ్వరూ జయించలేరు. అటువంటివాడిని మహానుభావుడైన(పరశు)రాముడు యుద్ధంలోనే సంహరించాడు.

రథస్థం పార్థివం రామః పాతయిత్వార్జునం భువి ।
ధర్షయిత్వార్జునం రామః క్రోశమానం చ మేఘవత్ ॥ 108 ॥

యుద్ధంలో రథం మీద ఉన్న కార్తవీర్యార్జునుడిని పరశురాముడు నేలగూల్చాడు. అవమానించాడు. అప్పుడు కార్తవీర్యుడు (అవమానభారంతో) మేఘంలాగా ఆక్రోశించాడు.

కృత్స్నం బాహుసహస్రం చ చిచ్ఛేద భృగునన్దనః ।
పరశ్వధేన దీప్తేన జ్ఞాతిభిస్సహితస్య వై ॥ 109 ॥

ఆ సమయంలో భృగువంశజుడైన పరశురాముడు మిరుమిట్లు గొలిపే గొడ్డలితో కార్తవీర్యుడి వేయి చేతులను సమూలంగా నరికి పడేశాడు. కార్తవీర్యుడి దాయాదులను కూడ ఆ యుద్ధంలో పరశురాముడు నరికేశాడు.

కీర్ణా క్షత్రియకోటీభిర్మేరుమన్దరభూషణా ।
త్రిస్సప్తకృత్వః పృథివీ తేన నిఃక్షత్రియా కృతా ॥ 110 ॥

ఈ భూమికి మేరువు, మందరం అనే పర్వతాలు అలంకారాలు. భూమండలం ఆ సమయంలో కోట్లకొద్దీ క్షత్రియులతో నిండి ఉంది. అప్పుడు పరశురాముడు క్షత్రియులపై ఇరవైఒక్కసార్లు దాడిచేసి, భూమిమీద క్షత్రియులు లేకుండా చేశాడు.

కృత్వా నిఃక్షత్రియాం చైనాం భార్గవస్సుమహాయశాః ।
సర్వపాపవినాశాయ వాజిమేధేన చేష్టవాన్ ॥ 111 ॥

మిక్కిలి కీర్తిమంతుడైన పరశురాముడు ఈ భూమిమీద క్షత్రియులందరినీ చంపిన తరువాత ఆ పాపం సమస్తం పోగొట్టుకోవడానికి అశ్వమేధయాగం చేశాడు.

యస్మిన్ యజ్ఞే మహాదానే దక్షిణాం భృగునన్దనః ।
మారీచాయ దదౌ ప్రీతః కశ్యపాయ వసున్ధరామ్ ॥ 112 ॥

భృగుకుమారుడైన పరశురాముడు ఆ యాగంలో దక్షిణగా ఈ భూమిని మరీచిమహర్షి కుమారుడైన కశ్యపుడికి దానం చేశాడు.

వారణాంస్తురగాన్ శుభ్రాన్ రథాంశ్చ రథినాం వరః ।
హిరణ్యమక్షయం ధేనూర్గజేన్ద్రాంశ్చ మహీపతిః ॥
దదౌ తస్మిన్ మహాయజ్ఞే వాజిమేధే మహాయశాః ॥ 113 ॥

రథికులలో ఉత్తముడూ, గొప్పకీర్తిమంతుడూ అయిన ఆ పరశురాముడు ఆ అశ్వమేధ మహాయాగంలో ఇంకా ఏనుగులనూ, జాతిగుఱ్ఱాలనూ, రథాలనూ, అంతులేని బంగారాన్నీ, ఆవులనూ, మదించిన ఏనుగులనూ దానం చేశాడు.

అద్యాపి హితార్థాయ లోకానాం భృగునన్దనః ।
చరమాణస్తపో ఘోరం జామదగ్న్యః పునః ప్రభుః ॥
ఆస్తే వై దేవవచ్ఛ్రీమాన్ మహేన్ద్రే పర్వతోత్తమే ॥ 114 ॥

భృగువంశంలో ఉత్తముడూ, జమదగ్ని కుమారుడూ అయిన పరశురాముడు లోకాలకు మేలు కలగడంకోసం మిక్కిలిభయంకరమైన తపస్సు చేస్తూ, ఇప్పటికీ ఉత్తమమైన మహేంద్రపర్వతంమీద దేవుడిలాగా, తేజస్వియై ఉన్నాడు.

ఏష విష్ణోస్సురేశస్య శాశ్వతస్యావ్యయస్య చ ।
జామదగ్న్య ఇతి ఖ్యాతః ప్రాదుర్భావో మహాత్మనః ॥ 115 ॥

అన్ని కాలాలలోనూ ఉండేవాడూ, ఏ విధమైన మార్పు లేనివాడూ, పరమాత్మా, అయిన శ్రీమహావిష్ణువుకు సంబంధించిన పరశురాముడు అనే పేరుతో చాలా ప్రసిద్ధమైన అవతారం చరిత్ర ఇది.

చతుర్వింశే యుగే వాऽపి విశ్వామిత్రపురస్సరః ।
జజ్ఞే దశరథస్యాథ పుత్రః పద్మాయతేక్షణః ॥ 116 ॥

ఇరవై నాలుగవ త్రేతాయుగంలో పుండరీక విశాలనేత్రుడైన శ్రీమహావిష్ణువు దశరథుడికి కుమారుడుగా జన్మించాడు. అతడు విశ్వామిత్రుడిని అనుసరించాడు.

కృత్వాऽऽత్మానం మహాబాహుశ్చతుర్ధా ప్రభురీశ్వరః ।
లోకే రామ ఇతి ఖ్యాతస్తేజసా భాస్కరోపమః ॥ 117 ॥

దీర్ఘ మైన బాహువులు కలిగినవాడు, జగన్నాథుడూ అయిన విష్ణుదేవుడు తనను నాలుగు భాగాలుగా (దశరథుడి నలుగురు కుమారులుగా) చేసుకుని లోకంలో రాముడు అనే పేరుతో ప్రసిద్ధిని పొందాడు. అతడు సూర్యుడితో సమానమైన తేజస్సు కలిగినవాడు.

ప్రసాదనార్థం లోకస్య రక్షసాం నిగ్రహాయ చ ।
ధర్మస్య చ వివృద్ధ్యర్థం జజ్ఞే తత్ర మహాయశాః ॥ 118 ॥

మిక్కిలి యశస్వి అయిన స్వామి లోకాలను అనుగ్రహించడంకోసమూ, రాక్షసులను సంహరించడంకోసమూ, ధర్మాన్ని పెంపొందించడంకోసమూ భూలోకంలో (దశరథుడి కుమారుడుగా) అవతరించాడు.

తమప్యాహుర్మనుష్యేన్ద్రం సర్వభూతహితే రతమ్ ।
యస్సమాస్సర్వధర్మజ్ఞశ్చతుర్దశ వనేఽ వసత్ ॥ 119 ॥

ఆ రాముడిని మానవనాథుడనీ, సమస్తభూతాలకు మేలు చేయడంలో శ్రద్ధ కలిగినవాడనీ, చెప్తారు. సమస్తధర్మాలను తెలిసిన ఆ రామచంద్రుడు పద్నాలుగు సంవత్సరాలు అరణ్యంలో నివసించాడు.

లక్ష్మణానుచరో రామస్సర్వభూతహితే రతః ।
చతుర్దశ వనే తప్త్వా తపో వర్షాణి రాఘవః ॥ 120 ॥

లక్ష్మణుడు ఎప్పుడూ రాముడిని అనుసరించి ఉంటాడు. ఆ రాముడు చరాచర భూతకోటికి శ్రద్ధగా మేలు చేస్తూ, పధ్నాలుగేళ్లు అరణ్యంలో తీవ్రమైన తపస్సు చేశాడు.

రూపిణీ తస్య పార్శ్వస్థా సీతేతి ప్రథితా జనే ॥
పూర్వోదితా తు యా లక్ష్మీర్భర్తారమనుగచ్ఛతి ॥ 121 ॥

రాముడి భార్య రూపవతి. ఆమె ఎప్పుడూ రాముడివెంటనే ఉంటుంది. సీత అనే పేరుతో లోకంలో ప్రసిద్ధిని పొందింది. పూర్వం లక్ష్మీదేవి అయిన ఆమే తన భర్త విష్ణుదేవుడిని అనుసరించి వచ్చి, సీతయై, రాముడి వెంట ఉన్నది.

జనస్థానే వసన్ కార్యం త్రిదశానాం చకార సః ॥ 122 ॥

జనస్థానంలో నివసిస్తూ రాముడు దేవతల కార్యాన్ని నిర్వహించాడు.

తస్యాపకారిణం క్రూరం పౌలస్త్యం మనుజర్షభః ।
సీతాయాః పదమన్విచ్ఛన్ నిజఘాన మహాయశాః ॥ 123 ॥

కీర్తిమంతుడూ మానవోత్తముడూ అయిన శ్రీరాముడు సీతను వెదుక్కుంటూ వెళ్లి, తనకు అపకారం చేసిన దుర్మార్గుడైన రావణాసురుడిని సంహరించాడు.

దేవాసురగణానాం చ యక్షరాక్షసభోగినామ్ ।
యత్రావధ్యం రాక్షసేన్ద్రం రావణం యుధి దుర్జయమ్ ॥ 124 ॥

ఆ రావణుడిని యుద్ధంలో జయించడం ఎవ్వరికీ సాధ్యం కాదు. ఆ రాక్షసరాజును దేవతలు, అసురులు, యక్షులు, రాక్షసులు, నాగులు, మొదలుగా ఎవ్వరూ సంహరించలేరు.

యుక్తం రాక్షసకోటీభిర్నీలాఞ్జనచయోపమమ్ ।
త్రైలోక్యద్రావణం క్రూరం రావణం రాక్షసేశ్వరమ్ ॥ 125 ॥

కోట్లకొలదిగా రాక్షసులు అతడిని సేవిస్తుంటారు. నల్లగా దట్టమైన కాటుకకుప్ప వంటి మేనిఛాయ గలిగినవాడు. మూడు లోకాలనూ హింసించేవాడు. మిక్కిలి క్రూరుడు. ఆ రావణుడు రాక్షసులకు రాజు.

దుర్జయం దుర్ధరం దృప్తం శార్దూలసమవిక్రమమ్ ।
దుర్నిరీక్ష్యం సురగణైర్వరదానేన దర్పితమ్ ॥ 126 ॥

అతడిని జయించడం ఎవరికీ సాధ్యం కాదు. ఎవరూ అతడిని భరింపలేరు. బాగా అహంకరించి ఉంటాడు. బెబ్బులివంటి పరాక్రమం కలిగినవాడు. దేవతలు కూడ రావణుడిని కన్నెత్తి చూడలేరు. వరప్రభావంచేత చాలా గర్వించి ఉన్నాడు.

జఘాన సచివైస్సార్ధం ససైన్యం రావణం యుధి ॥ 127 ॥

అటువంటి రావణాసురుడిని అతడి మంత్రులతో సహా శ్రీరాముడు యుద్ధంలో సంహరించాడు.

మహాభ్రగణసఙ్కాశం మహాకాయం మహాబలమ్ ।
రావణం నిజఘానాశు రామో భూతపతిః పరః ॥ 128 ॥

పెద్ద మేఘాల సముదాయంలాగా ఉన్నవాడూ, గొప్ప శరీరం కలిగినవాడూ, మిక్కిలి బలవంతుడూ అయిన రావణుడిని శ్రీరాముడు మరొక(లయకారుడైన) పరమేశ్వరుడిలాగా, అవలీలగా చంపేశాడు.

సుగ్రీవస్య కృతే యేన వానరేన్ద్రో మహాబలః ।
వాలీ వినిహతస్సంఖ్యే సుగ్రీవశ్చాభిషేచితః ॥ 129 ॥

వానరులకు రాజూ, మిక్కిలి బలశాలీ అయిన వాలిని శ్రీరాముడు సుగ్రీవుడికోసం యుద్ధంలో సంహరించాడు. తరువాత సుగ్రీవుడిని వానరరాజ్యానికి రాజుగా అభిషేకించాడు.

మధోశ్చ తనయో దృప్తో లవణో నామ దానవః ।
హతో మధువనే వీరో వరమత్తో మహాసురః ॥ 130 ॥

మధువు అనే రాక్షసుడి కుమారుడైన లవణుడు అనే దానవుడు పరాక్రమంతో బాగా గర్వించాడు. వరప్రభావంతో మదించిన ఆ లవణాసురుడిని మధువనంలో సంహరించాడు.

యజ్ఞవిఘ్నకరౌ యేన మునీనాం భావితాత్మనామ్ ।
మారీచశ్చ సుబాహుశ్చ బలేన బలినాం వరౌ ॥ 131 ॥

ఆత్మభావన కలిగిన మహర్షులు చేస్తున్న యజ్ఞాలకు మారీచుడు, సుబాహుడు అనే రాక్షసులు అవరోధాలు కలిగించేవారు. వారు బలవంతులలో బలవంతులు.

నిహతౌ చ నిరాశౌ చ కృతౌ తేన మహాత్మనా ।
సమరే యుద్ధశౌణ్డేన తథాఽన్యే చాపి రాక్షసాః ॥ 132 ॥

బలవంతుడైన శ్రీరాముడు వారి కోరిక నెరవేరకుండా చేశాడు (యజ్ఞాలు సరిగా జరిపించాడు). వారిరువురినీ సంహరించాడు. యుద్ధవిశారదుడైన రాముడు వీరినే కాక ఇంకా ఇతర రాక్షసులను కూడ యుద్ధంలో సంహరించాడు.

విరాధశ్చ కబన్ధశ్చ రాక్షసౌ భీమవిక్రమౌ ।
జఘాన పురుషవ్యాఘ్రౌ గన్ధర్వౌ శాపమోహితౌ ॥ 133 ॥

విరాధుడు, కబంధుడు అనేవారు గంధర్వులు. ఉత్తమపురుషులు. శాపంవలన రాక్షసులై, అజ్ఞానులైనారు. మిక్కిలి భయంకరమైన పరాక్రమం కలిగినవారు. ఆ రాక్షసులను శ్రీరాముడు సంహరించాడు.

హుతాశనార్కాంశుతడిద్గణాభైః ప్రతప్తజామ్బూనదచిత్రపుఙ్ఖైః ।
మహేన్ద్రవజ్రాశనితుల్యసారై రిపూన్ స రామస్సమరే నిజఘ్నే ॥ 134 ॥

శ్రీరాముడి బాణాలు అగ్ని, సూర్యకిరణాలు, మెరుపుల గుంపులలాగా తీక్ష్ణంగా మెరుస్తుంటాయి. ఆ బాణాల అడుగుభాగాలు బాగా కాచిన బంగారంవలె విచిత్రంగా ఉంటాయి. దేవేంద్రుడి వజ్రాయుధంతోనూ, పిడుగులతోనూ సమానమైన చేవ కలిగి ఉంటాయి. అటువంటి బాణాలతో రాముడు యుద్ధంలో శత్రువులను సంహరించాడు.

తస్మై దత్తాని శస్త్రాణి విశ్వామిత్రేణ ధీమతా ।
వధార్థం దేవశత్రూణాం దుర్ధర్షాణాం సురైరపి ॥ 135 ॥

మహాజ్ఞాని అయిన విశ్వామిత్రుడు దేవతలు కూడ అడ్డుకోవడం సాధ్యం కాని రాక్షసులను సంహరించడంకోసం శ్రీరామచంద్రుడికి అనేకమైన ఆయుధాలను ఇచ్చాడు.

వర్తమానే మఖే యేన జనకస్య మహాత్మనః ।
భగ్నం మాహేశ్వరం చాపం క్రీడతా లీలయా పురా ॥ 136 ॥

పూర్వం మహాత్ముడైన జనకుడు యజ్ఞం చేస్తుండగా, శ్రీరాముడు శివుడి ధనుస్సును విలాసంగా ఆటగా విరిచేశాడు.

ఏతాని కృత్వా కర్మాణి రామో ధర్మభృతాం వరః ।
దశాశ్వమేధాఞ్జారూథ్యానాజహార నిరర్గలమ్ ॥ 137 ॥

ధర్మసంరక్షణంలో శ్రేష్ఠుడైన శ్రీరాముడు ఈ విధమైన ఘనకార్యాలు అనేకం చేసి, ఏవిధమైన అవరోధాలు లేకుండా ప్రసిద్ధమైన పది అశ్వమేధయాగాలు చక్కగా చేశాడు.

నాసూయన్నాశుభా వాచో నాకులం మారుతో వవౌ ।
న విత్తహరణం చాసీద్ రామే రాజ్యం ప్రశాసతి ॥ 138 ॥

రాముడు రాజ్యం పరిపాలిస్తున్న కాలంలో అశుభమైన మాటలు పుట్టలేదు (అన్నీ శుభాలే జరిగేవి). గాలి సుఖంగా వీచేది. డబ్బు దోచుకోవడాలు (దొంగతనాలు) లేవు.

పరిదేవన్తి విధవా నానర్థాశ్చ కదాచన ।
సర్వమాసీచ్ఛుభం తత్ర రామే రాజ్యం ప్రశాసతి ॥ 139 ॥

రాముడు రాజ్యాన్ని పాలిస్తున్న కాలంలో స్త్రీలు విధవలై బాధపడడం లేదు (అందరూ ముత్తైదువలుగానే ఉండేవారు). ఎక్కడా ఇబ్బందులు కలిగేవి కావు. అంతటా శుభమే జరుగుతుండేది.

న ప్రాణినాం భయం చాసీజ్జలాగ్న్యనిలఘాతజమ్ ।
న చాపి వృద్ధా బాలానాం ప్రేతకార్యాణి చక్రిరే ॥ 140 ॥

నీరు, నిప్పు, గాలి మొదలైన పంచభూతాలవలన జీవులకు ఎటువంటి భయమూ కలిగేది కాదు. ముసలివారు పిల్లలకు అపరకర్మలు చేయడం ఉండేది కాదు (అకాల మరణాలు లేవు).

బ్రహ్మచర్యపరం క్షత్రం విశస్తు క్షత్రియే రతాః ।
శూద్రాశ్చైవ హి వర్ణాంస్త్రీన్ శుశ్రూషన్త్యనహఙ్కృతాః ॥ 141 ॥

క్షత్రియులు బ్రాహ్మణులను సేవించేవారు. వైశ్యులు క్షత్రియులను అనుసరించి ఉండేవారు. శూద్రులు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులనే మూడు వర్ణాలవారినీ వినయంగా సేవించేవారు.

నార్యో నాత్యచరన్ భర్తౄన్ భార్యాం నాత్యచరత్ పతిః ।
సర్వమాసీజ్జగద్దాన్తం నిర్దస్యురభవన్మహీ ॥ 142 ॥

భార్యలు భర్తలనూ, భర్తలు భార్యలనూ అతిక్రమించి చరించేవారు కాదు. అందరూ నిగ్రహంతో ప్రశాంతంగా ఉండేవారు. దొంగలు ఈ భూమిపై ఎక్కడా లేరు.

రామ ఏకోఽభవద్ భర్తా రామః పాలయితాఽభవత్ ॥ 143 ॥

ప్రజలందరినీ రాముడు ఒక్కడే భరించేవాడు. రాముడే నిజమైన పరిపాలకుడు.

ఆసన్ వర్షసహస్రాణి తథా పుత్రసహస్రిణః ।
అరోగాః ప్రాణినశ్చాసన్ రామే రాజ్యం ప్రశాసతి ॥ 144 ॥

శ్రీరాముడు రాజ్యం పరిపాలిస్తున్నకాలంలో ప్రజలు అత్యధికమైన పుత్రసంతానంతో వేలకొలది సంవత్సరాలు (దీర్ఘకాలం) జీవించేవారు. ఏ రోగమూ లేకుండా సుఖంగా ఉండేవారు.

దేవతానామృషీణాం చ మనుష్యాణాం చ సర్వశః ।
పృథివ్యాం సమవాయోఽభూద్ రామే రాజ్యం ప్రశాసతి ॥ 145 ॥

శ్రీరాముడు రాజ్యం పాలిస్తున్న కాలంలో దేవతలూ, మహర్షులూ, మానవులూ అందరూ భూమిమీద కలిసి మెలిసి ఉండేవారు.

గాథామప్యత్ర గాయన్తి యే పురాణవిదో జనాః ।
రామే నిబద్ధతత్త్వార్థా మాహాత్మ్యం తస్య ధీమతః ॥ 146 ॥

శ్రీరాముడిమీద మనసు నిశ్చలంగా నిలిచిన పురాణవేత్తలైన మహాత్ములు బుద్ధిశాలి అయిన ఆ శ్రీరాముడి కథలను కీర్తిస్తుంటారు.

రామో యువా లోహితాక్షో దీప్తాస్యో మితభాషితః ।
ఆజానుబాహుస్సుముఖస్సింహస్కన్ధో మహాభుజః ॥
దశవర్షసహస్రాణి రామో రాజ్యమకారయత్ ॥ 147 ॥

శ్రీరాముడు యువకుడు. ఎఱ్ఱని కన్నులు కలిగినవాడు. అతడి ముఖం తేజస్సుతో ప్రకాశిస్తుంది. తగినమేర పరిమితంగా మాట్లాడుతాడు. శ్రీరాముడి బాహువులు మోకాలివరకూ వ్యాపించి, దీర్ఘంగా ఉంటాయి. ముఖం ప్రసన్నంగా ఉంటుంది. మూపురం సింహంమూపులాగా ఉంటుంది. అటువంటి శ్రీరామచంద్రుడు పదివేల సంవత్సరాలు రాజ్యపాలనం చేశాడు.

ఋక్సామయజుషాం ఘోషో జ్యాఘోషశ్చ మహాత్మనః ।
అవ్యుచ్ఛిన్నోఽభవద్ రాష్ట్రే దీయతాం భుజ్యతామితి ॥ 148 ॥

శ్రీరాముడి రాజ్యంలో ఋగ్, యజుస్, సామవేదాల ధ్వనులు, శ్రీరాముడి వింటినారి ధ్వనులు ఎడతెగకుండా వినిపిస్తుంటాయి. అలాగే "ఇవ్వబడుగాక, తినబడుగాక" అనే ధ్వనులు నిరంతరం వినిపిస్తుంటాయి.

సత్త్వవాన్ గుణసమ్పన్నో దీప్యమానస్స్వతేజసా ।
అతిచన్ద్రం చ సూర్యం చ రామో దాశరథిర్బభౌ ॥ 149 ॥

శ్రీరాముడు గొప్ప పరాక్రమవంతుడు. సమస్తమైన సద్గుణాల సంపదలు కలిగినవాడు. తన తేజస్సుతో మిక్కిలి వెలుగొందుతూ, సూర్యుడినీ, చంద్రుడినీ కూడ మించి ప్రకాశిస్తాడు.

ఈజే క్రతుశతైః పుణ్యైస్సమాప్తవరదక్షిణైః ।
హిత్వాఽయోధ్యాం దివం యాతో రాఘవో హి మహాబలః ॥ 150 ॥

శ్రీరాముడు పుణ్యప్రదమైన వందలకొలది యజ్ఞాలు చేశాడు. ఆ యజ్ఞాలను శ్రేష్ఠమైన గొప్ప గొప్ప దక్షిణలతో సంతృప్తికరంగా పూర్తిచేశాడు. మిక్కిలి బలవంతుడైన శ్రీరాముడు ఆ తరువాత అయోధ్యను విడిచి స్వర్గలోకానికి వెళ్లిపోయినాడు.

ఏవమేవ మహాబాహురిక్ష్వాకుకులనన్దనః ।
రావణం సగణం హత్వా దివమాచక్రమే విభుః ॥ 151 ॥

ఇక్ష్వాకువంశాన్ని ఆనందపెట్టిన పరాక్రమశాలి అయిన శ్రీరామచంద్రప్రభువు పరివారంతో సహా రావణాసురుడిని సంహరించి, స్వర్గలోకానికి వెళ్లిపోయినాడు.

అపరః కేశవస్యాయం ప్రాదుర్భావో మహాత్మనః ।
విఖ్యాతో మాథురే కల్పే సర్వలోకహితాయ వై ॥ 152 ॥

శ్రీమహావిష్ణువుకు సంబంధించిన మరొక అవతారం (కృష్ణుడు) గురించి చెప్తాను. సమస్తమైన లోకాలకూ మేలు చేయడంకోసం స్వామి మాథురం అనే కల్పంలో ఈ అవతారం ధరించి, ప్రసిద్ధుడైనాడు.

యత్ర శాల్వం చ చైద్యం చ కంసం ద్వివిదమేవ చ ।
అరిష్టం వృషభం కేశిం పూతనాం దైత్యదారికామ్ ॥ 153 ॥

నాగం కువలయాపీడం చాణూరం ముష్టికం తథా ।
దైత్యాన్ మానుషదేహేన సూదయామాస వీర్యవాన్ ॥ 154 ॥

శ్రీకృష్ణావతారంలో స్వామి సాల్వుడు, శిశుపాలుడు, కంసుడు, ద్వివిదుడు, అరిష్టుడు, వృషభాసురుడు, కేశి, పూతన అనే ఆడరాక్షసి, కువలయాపీడం అనే ఏనుగు, చాణూరుడు, ముష్టికుడు, అనే (మొదలైన)రాక్షసులను మానుషరూపంలో మిక్కిలి బలవంతుడై స్వామి సంహరించాడు.

ఛిన్నం బాహుసహస్రం చ బాణస్యాద్భుతకర్మణః ।
నరకశ్చ హతస్సఙ్ఖ్యే యవనశ్చ మహాబలః ॥ 155 ॥

అద్భుతమైన పనులు చేసిన బాణుడు అనే రాక్షసుడి వేయి బాహువులనూ శ్రీకృష్ణస్వామి నరికివేశాడు. యుద్ధరంగంలో నరకుడు, మిగుల బలవంతుడైన యవనుడు అనే రాక్షసులను చంపాడు.

హృతాని చ మహీపానాం సర్వరత్నాని తేజసా ।
దురాచారాశ్చ నిహతాః పార్థివా యే మహీతలే ॥
ఏష లోకహితార్థాయ ప్రాదుర్భావో మహాత్మనః ॥ 156 ॥

రాజులవద్ద ఉన్న సమస్త రత్నాలను పరాక్రమంతో స్వీకరించాడు. దుర్మార్గపు పనులు చేస్తున్న భూమిమీది రాజులందరినీ సంహరించాడు. లోకాలకు మేలు చేయడంకోసమే మహాత్ముడైన శ్రీమహావిష్ణువు ఈవిధంగా శ్రీకృష్ణుడుగా భూమిపై అవతరించాడు.

కల్కీ విష్ణుయశా నామ శమ్భలగ్రామసమ్భవః ।
సర్వలోకహితార్థాయ భూయో దేవో మహాయశాః ॥ 157 ॥

సమస్త లోకాలకూ మేలు చేయడంకోసం గొప్ప కీర్తిమంతుడైన విష్ణుదేవుడు విష్ణుయశుడు అనే పేరుతో కల్కిగా శంభల అనే గ్రామంలో మళ్లీ అవతరిస్తాడు.

ఏతే చాన్యే చ బహవో దివ్యా దేవగణైర్వృతాః ।
ప్రాదుర్భావాః పురాణేషు గీయన్తే బ్రహ్మవాదిభిః ॥ 158 ॥

ఇవే కాక ఇంకా వేరుగా దివ్యమైన, దేవతాగణాలు సేవించిన శ్రీమహావిష్ణువు అవతారాలు ఎన్నింటినో బ్రహ్మజ్ఞానులు పురాణాలలో కీర్తించారు.

యత్ర దేవా విముహ్యన్తి ప్రాదుర్భావానుకీర్తనే ।
పురాణం వర్తతే యత్ర వేదశ్రుతిసమాహితమ్ ॥ 159 ॥

శ్రీమహావిష్ణువుయొక్క అవతారాలను వర్ణించడానికి దేవతలు కూడ భ్రాంతికి లోనవుతారు. వేదార్థాన్ని చక్కగా తెలియజేస్తూ, పురాణం వేదంతో సమానంగా వర్తిస్తుంది.

ఏతదుద్దేశమాత్రేణ ప్రాదుర్భావానుకీర్తనమ్ ।
కీర్తితం కీర్తనీయస్య సర్వలోకగురోర్విభోః ॥ 160 ॥

అందుచేత లోకాలన్నింటికీ గురువూ, స్తుతింపదగినవాడూ అయిన శ్రీమహావిష్ణువు అవతారాలను ఈ విధంగా సూచనాప్రాయంగా కీర్తించడం జరిగింది.

ప్రీయన్తే పితరస్తస్య ప్రాదుర్భావానుకీర్తనాత్ ।
విష్ణోరమితవీర్యస్య యశ్శృణోతి కృతాఞ్జలిః ॥ 161 ॥

అపరిమితమైన పరాక్రమం కలిగిన శ్రీమహావిష్ణువు అవతారాలను కీర్తించినా, చేతులు జోడించి శ్రద్ధగా విన్నా, వాడి పితరులు సంతోషిస్తారు.

ఏతాశ్చ యోగేశ్వరయోగమాయాశ్శ్రుత్వా నరో ముచ్యతి సర్వపాపైః ।
ఋద్ధిం సమృద్ధిం విపులాంశ్చ భోగాన్ ప్రాప్నోతి శీఘ్రం భగవత్ప్రసాదాత్ ॥162 ॥

యోగేశ్వరుడైన శ్రీమహావిష్ణువుయొక్క ఈ యోగమాయలను విన్న మానవుడికి సమస్త పాపాలు నశించిపోతాయి. ఆ స్వామి అనుగ్రహంవలన వాడు వృద్ధి చెందుతాడు. సంపదలు పుష్కలంగా కలుగుతాయి. వెంటనే సమగ్రమైన జ్ఞానం లభిస్తుంది. ఈ లోకంలో విస్తారంగా భోగాలను పొందుతాడు.

ఏవం మయా మునిశ్రేష్ఠా విష్ణోరమితతేజసః ।
సర్వపాపహరాః పుణ్యాః ప్రాదుర్భావాః ప్రకీర్తితాః ॥ 163 ॥

మునివరులారా! అపరిమితమైన తేజస్సు గలిగిన శ్రీమహావిష్ణువు అవతారాలు సమస్తమైన పాపాలను నిర్మూలిస్తాయి. పుణ్యం కలిగిస్తాయి. అటువంటి విష్ణుఅవతారాలను ఇంతవరకూ వివరించాను.

ఇతి శ్రీబ్రహ్మపురాణే విష్ణోః ప్రాదుర్భావానుకీర్తనం నామ చతురధికశతతమోఽధ్యాయః ॥ 104 ॥

శ్రీబ్రహ్మపురాణంలో విష్ణువు అవతారాలను కీర్తించడం అనే నూటనాల్గవ అధ్యాయం సంపూర్ణం.



పఞ్చోత్తరశతతమోఽధ్యాయః - నూటఐదవ అధ్యాయం

యమలోకమార్గనిరూపణమ్ - యమలోక మార్గ నిరూపణం

మునయ ఊచుః :-మునులు వ్యాసమహర్షితో ఇలా అంటున్నారు.

న తృప్తిమధిగచ్ఛామః పుణ్యధర్మామృతస్య తు ।
మునే త్వన్ముఖగీతస్య తథా కౌతూహలం హి నః ॥ 1 ॥

మహర్షీ! నీ నోట కీర్తింపబడిన పుణ్యధర్మాలు అనే అమృతం స్వీకరించడంలో మేము తృప్తి పొందలేక పోతున్నాం. ఇంకా తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది.

ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానాం కర్మణో గతిమ్ ।
వేత్సి సర్వం మునే తేన పృచ్ఛామస్త్వాం మహామునే ॥ 2 ॥

మహర్షీ! చరాచర భూతాల పుట్టుక, వినాశం, వాటి నడవడి పద్ధతి సమస్తమూ తెలిసినవాడివి నువ్వే. మహామునీ! అందుచేత నిన్ను అడుగుతున్నాము.

శ్రూయతే యమలోకస్య మార్గః పరమదుర్గమః ।
దుఃఖక్లేశకరశ్శశ్వత్సర్వభూతభయావహః ॥ 3 ॥

మహర్షీ! యమలోకానికి పోయే దారి వెళ్లడానికి చాల కష్టం. ఆ ప్రయాణం చాలా బాధలు, కష్టాలు కలిగిస్తుంది. ప్రాణులన్నిటికీ మిక్కిలి భయం కలిగిస్తుంది అని విన్నాం.

కథం తేన నరా యాన్తి మార్గేణ యమసాదనమ్ ।
ప్రమాణం చైవ మార్గస్య బ్రూహి నో వదతాంవర ॥ 4 ॥

మాటనేర్పరీ! మానవులు ఆ దారిలో యముడుండే చోటికి ఏవిధంగా వెళ్తారు. యమలోకానికి వెళ్లే ఆ మార్గం ప్రమాణం ఎంతో వివరించు.

మునే పృచ్ఛామ సర్వజ్ఞ బ్రూహి సర్వమశేషతః ।
కథం నరకదుఃఖాని నాప్నువన్తి నరా మునే ॥ 5 ॥

సమస్తమూ తెలిసినవాడా! మహర్షీ! విడిచిపెట్టకుండా అన్ని విషయాలూ చెప్పు. మహామునీ! మానవులు నరకబాధలను తప్పించుకునే మార్గం ఏమిటి?

కేనోపాయేన దానేన ధర్మేణ నియమేన చ ।
మానుషస్య చ యామ్యస్య లోకస్య కియదన్తరమ్ ॥ 6 ॥

దానం, ధర్మం, నియమం మొదలుగా ఏ ఉపాయంతో నరకబాధలను తప్పించుకోవచ్చు? మానవలోకానికీ యమలోకానికీ నడుమ దూరం ఎంత?

కథం చ స్వర్గతిం యాన్తి నరకం కేన కర్మణా ।
కియన్తి స్వర్గస్థానాని కియన్తి నరకాణి చ ॥ 7 ॥

అదే విధంగా మానవులు ఏ కర్మలు చేయడంవల్ల స్వర్గానికి వెళ్తారు? ఏ కర్మలు చేయడంవల్ల నరకానికి వెళ్తారు? స్వర్గాలు ఎన్ని? నరకాలు ఎన్ని?

కథం సుకృతినో యాన్తి కథం దుష్కృతకారిణః ।
కిం రూపం కిం ప్రమాణం వా కో వర్ణస్తూభయోరపి ॥
జీవస్య నీయమానస్య యమలోకం బ్రవీహి నః ॥ 8 ॥

పుణ్యకర్మలు చేసినవాళ్లు (స్వర్గానికి) ఏ విధంగా వెళ్తారు. పాపకర్మలు చేసినవాళ్లు (నరకానికి) ఏవిధంగా వెళ్తారు? పుణ్యాత్ముల, పాపాత్ముల ఆకారం ఎలా ఉంటుంది. వాళ్లు ఏ ప్రమాణంలో ఉంటారు. ఏ రంగులో ఉంటారు? (యమభటులు) యమలోకానికి తీసుకునివెళ్లే జీవుడి స్వరూపం, ప్రమాణం, రంగు ఎలా ఉంటాయి?

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసుడు ఇలా చెప్తున్నాడు.

శృణుధ్వం మునిశార్దూలా వదతో మమ సువ్రతాః ।
సంసారచక్రమజరం స్థితిర్యస్య న విద్యతే ॥ 9 ॥

నియమవంతులారా! ఉత్తమమునులారా! చెప్తాను, వినండి. సంసారం అనే చక్రం నిరంతరం తెగకుండా సాగుతునే ఉంటుంది. అయినా, దాని ఉనికి శాశ్వతం కాదు.

సోఽహం వదామి వస్సర్వం యమమార్గస్య నిర్ణయమ్ ।
ఉత్క్రాన్తికాలాదారభ్య యథా నాన్యో వదిష్యతి ॥ 10 ॥

జీవుడు ఇక్కడ ప్రాణాలు విడిచినప్పటినుండి మొదలై, యమలోకానికి వెళ్లేవరకు నడుమ దారిని గురించి మీకు ఇతరులు ఎవ్వరూ చెప్పని విధంగా సమగ్రంగా నిశ్చయించి నేను చెప్తాను.

స్వరూపం చైవ మార్గస్య యన్మాం పృచ్ఛథ సత్తమాః ।
యమలోకస్య చాధ్వానమన్తరం మానుషస్య చ ॥ 11 ॥

ఉత్తములారా! మీరు అడిగిన విధంగా యమలోకమార్గ స్వరూపమూ, మానవలోకానికీ యమలోకానికి నడుమ దూరమూ చెప్తాను.

యోజనానాం సహస్రాణి షడశీతిస్తదన్తరమ్ ।
తప్తతామ్రమివాతప్తం తదధ్వానముదాహృతమ్ ॥ 12 ॥

మానవలోకానికీ యమలోకానికీ నడుమ దూరం ఎనభైఆరువేల యోజనాలు. ఆ దారి అంతా కాలిన రాగిలాగా బాగా కాలుతూ ఉంటుంది.

తదవశ్యం హి గన్తవ్యం ప్రాణిభిర్జీవసంజ్ఞకైః ।
పుణ్యాన్ పుణ్యకృతో యాన్తి పాపాన్ పాపకృతో నరాః ॥ 13 ॥

జీవులు అని పిలువబడే ప్రాణులు అందరూ ఆ దారిలో తప్పకుండా వెళ్లవలసిందే. ఈ లోకంలో పుణ్యకర్మలు చేసుకున్నవారు పుణ్యలోకాలకు వెళ్తారు. పాపకర్మలు చేసినవారు నరకలోకాలకు వెళ్తారు.

ద్వావింశతిశ్చ నరకా యమస్య విషయే స్థితాః ।
యేషు దుష్కృతకర్మాణో విపచ్యన్తే పృథక్ పృథక్ ॥ 14 ॥

యమలోకంలో ఇరవైరెండు నరకాలు ఉన్నాయి. పాపకర్మలు చేసినవారు తమ తమ కర్మలకు తగిన విధంగా ఆయా నరకాలలో బాధలు పడుతుంటారు.

నరకో రౌరవో రౌద్రశ్శూకరస్తాల ఏవ చ ।
కుమ్భీపాకో మహాఘోరశ్శాల్మలోఽథ విమోహనః ॥ 15 ॥

ఆ నరకాలు – 1. రౌరవం, 2. రౌద్రం, 3. శూకరం, 4. తాలం, 5. కుంభీపాకం, 6. మహాఘోరం, 7. శాల్మలం, 8. విమోహనం,

కీటాదః కృమిభక్షశ్చ లాలాభక్షో భ్రమస్తథా ।
నద్యః పూయవహాశ్చాన్యా రుధిరామ్బుస్తథైవ చ ॥ 16 ॥

9. కీటాదం, 10. కృమిభక్షం, 11. లాలాభక్షం, 12. భ్రమం, అందులో ప్రధానమైన నరకాలు. ఈ నరకాలలోని నదులలో చీము ప్రవహిస్తుంటుంది. మరికొన్ని నదులలో నెత్తురు ప్రవహిస్తుంది.

అగ్నిజ్వాలో మహాఘోరస్సన్దంశశ్శునభోజనః ।
ఘోరా వైతరణీ చైవ అసిపత్రవనం తథా ॥ 17 ॥

ఇంక నరకాలు 13. మిక్కిలి భయంకరమైన అగ్నిజ్వాలం 14. సందంశం, 15. శునభోజనం, భయంకరమైన వైతరణి, 16. అసిపత్రవనం.

న తత్ర వృక్షచ్ఛాయా చ న తడాగాస్సరాంసి చ ।
న వాప్యో దీర్ఘికా వాపి న కూపో న ప్రపా సభా ॥ 18 ॥

ఆ నరకాలకు పోయేదారిలో చెట్లనీడలు, చెరువులు, సరస్సులు, బావులు, దిగుడుబావులు, కుంటలు, చలివేంద్రాలు, సమావేశస్థలం ఏవీ ఉండవు.

న మణ్డపో నాయతనం న నద్యో న చ పర్వతాః ।
న కిఞ్చిదాశ్రమస్థానం విద్యతే తత్ర వర్త్మని ॥ 19 ॥

ఆ నరకమార్గంలో మండపం, ఇల్లు, నదులు, కొండలు, విశ్రాంతి తీసుకునే ప్రదేశం వంటివి ఏవీఉండవు.

యత్ర విశ్రమతే శ్రాన్తః పురుషోఽ ధ్వని కర్షితః ।
అవశ్యమేవ గన్తవ్యస్స సర్వైస్తు మహాపథః ॥ 20 ॥

ఆ దారిలో వెళ్తూ అలిసిపోయి, విశ్రాంతి తీసుకునేవాడిని కూడ బలవంతంగా లాక్కువెళ్తారు. అందరూ ఆ నరకమార్గంలో తప్పకుండా ప్రయాణించవలసిందే.

ప్రాప్తే కాలే తు సన్త్యజ్య సుహృద్బన్ధుధనాదికమ్ ।
జరాయుజాణ్డజాశ్చైవ స్వేదజాశ్చోద్భిజాస్తథా ॥
జఙ్గమాజఙ్గమాశ్చైవ గమిష్యన్తి మహాపథమ్ ॥ 21 ॥

మావినుండి పుట్టే మనుష్యులు మొదలైనవారూ, గ్రుడ్డునుండి పుట్టేపక్షులు మొదలైనవీ, చెమటనుండి పుట్టేక్రిములు మొదలైనవీ, నేలను చీల్చుకుని మొలకెత్తే చెట్లు మొదలైనవీ, అయిన స్థావర జంగమాత్మకమైన పదార్థాలు అన్నీ, మరణకాలం సమీపించినపుడు మిత్రులు, బంధువులు, సంపదలు మొదలుగా అన్నింటినీ విడిచిపెట్టి ఆ మహామార్గంలో వెళ్లిపోతాయి.

దేవాసురమనుష్యైశ్చ వైవస్వతవశానుగైః ।
స్త్రీపుంనపుంసకైశ్చైవ పృథివ్యాం జీవసంజ్ఞితైః ॥ 22 ॥

దేవతలైనా, మానవులైనా, స్త్రీలైనా, పురుషులైనా, ఈ నేలమీద జీవుడు అని పేర్కొనబడే వస్తువు ఏదైనా, యముడికి వశమై, ఆ మహామార్గంలో వెళ్లిపోవలసిందే.

పూర్వాహ్ణే చాపరాహ్ణే వా మధ్యాహ్నే వా తథా పునః ।
సన్ధ్యాకాలేఽ ర్ధరాత్రే వా ప్రత్యూషే వా ప్యుపస్థితే ॥ 23 ॥

ఉదయం గాని, సాయంకాలం గాని, మధ్యాహ్నం గాని, సంధ్యల సమయంలో కాని, అర్ధరాత్రివేళ గాని, సూర్యోదయ సమయంలో గాని, ఏ సమయంలోనైనా ఆ మార్గంలో వెళ్లవలసిందే.

వృద్ధైర్వా మధ్యమైశ్చాపి యౌవనస్థైస్తథైవ చ ।
గర్భవాసేఽ థ బాల్యే వా గన్తవ్యస్స మహాపథః ॥ 24 ॥

ముసలివారైనా, నడిమి వయస్సువారైనా, యువకులైనా, తల్లికడుపులో ఉన్నపుడైనా కాని, బాల్యంలో కాని ఏ వయసులోనైనా, ఆ మార్గంలో వెళ్లక తప్పదు.

ప్రవాసస్థైర్గృహస్థైర్వా వనస్థైర్వా స్థలేఽ పి వా ।
క్షేత్రస్థైర్వా జలస్థైర్వా గృహమధ్యగతైస్తథా ॥ 25 ॥

ఇతరదేశాలలో ఉన్నా, ఇంట్లో ఉన్నా, అడవులలో ఉన్నా, నేలమీద ఉన్నా, పొలాలలో ఉన్నా, నీళ్లలో ఉన్నా, నట్టింట్లో ఉన్నా ఎక్కడ ఉన్నవారైనా ఆ మార్గంలో ప్రయాణించవలసిందే.

ఆసీనైశ్చాస్థితైర్వాపి శయనీయగతైస్తథా ।
జాగ్రద్భిర్వా ప్రసుప్తైర్వా గన్తవ్యస్స మహాపథః ॥ 26 ॥

కూర్చున్నా, నిలుచున్నా, పడుకున్నా, మెలకువతో ఉన్నా, గాఢనిద్రలో ఉన్నా, ఆ మార్గంలో తప్పకుండావెళ్లాలి.

ఇహానుభూయ నిర్దిష్టమాయుర్జన్తుస్స్వయం తదా ।
తస్యాన్తే చ స్వయం ప్రాణైరనిచ్ఛన్నపి ముచ్యతే ॥ 27 ॥

జీవుడు తనకు నిర్ణయించిన ఆయుర్దాయాన్ని ఈ లోకంలో స్వయంగా అనుభవించిన తరువాత, ఆయువు తీరిన వెంటనే జీవుడికి ఇష్టం లేకపోయినా, ప్రాణాలు వాటి అంతట అవే వాడిని విడిచి వెళ్లిపోతాయి.

జలమగ్నిర్విషం శస్త్రం క్షుద్వ్యాధిః పతనం గిరేః ।
నిమిత్తం కిఞ్చిదాసాద్య దేహీ ప్రాణైర్విముచ్యతే ॥ 28 ॥

(ఆయువు తీరిన తరువాత) నీళ్లో, నిప్పులో, విషమో, ఆయుధమో, ఆకలో, రోగమో, కొండమీదనుంచి పడడమో, ఏదో ఒకటి నిమిత్తంగా చేసుకుని, ప్రాణాలు శరీరం ధరించిన ప్రతివాడినీ విడిచిపెడతాయి.

విహాయ సుమహత్ కృత్స్నం శరీరం పాఞ్చభౌతికమ్ ।
అన్యచ్ఛరీరమాదత్తే యాతనీయం స్వకర్మజమ్ ॥ 29 ॥

జీవుడు పంచభూతాలతో ఏర్పడిన ఈ గొప్ప శరీరాన్ని విడిచిపెట్టి, తన కర్మకు అనుగుణమైన ఫలితాలను అనుభవించడానికి తగిన (యాతనామయమైన) మరొక శరీరం ధరిస్తాడు.

దృఢం శరీరమాప్నోతి సుఖదుఃఖోపభుక్తయే ।
తేన భుఙ్క్తే స కృచ్ఛ్రాణి పాపకర్తా నరో భృశమ్ ॥
సుఖాని ధార్మికో హృష్ట ఇహ నీతో యమక్షయే ॥ 30 ॥

జీవుడు (జీర్ణమైన శరీరం విడిచిపెట్టిన తరువాత) తన కర్మల ఫలితమైన భోగాలనూ, బాధలనూ అనుభవించడానికి తగిన దృఢమైన శరీరం పొందుతాడు. పాపాలు చేసిన మానవుడు ఆ శరీరంతో కష్టాలను మిక్కిలి బాధగా అనుభవిస్తాడు. అదే విధంగా పుణ్యకర్మలను చేసినవాడు యముడి వద్దకు వచ్చినపుడు ఆనందంగా సుఖాలనే అనుభవిస్తాడు.

ఊష్మా ప్రకుపితః కాయే తీవ్రవాయుసమీరితః ।
భినత్తి మర్మస్థానాని దీప్యమానో నిరిన్ధనః ॥ 31 ॥

ప్రాణం పోయే సమయంలో శరీరంలో ఉన్న అగ్ని తీవ్రమైన వాయువుచేత రేగి, ఇంధనం లేకుండానే జ్వలిస్తూ, ఆయువుపట్టులను బద్దలు గొడుతుంది. (ఆయువుపట్లను చీల్చుకుని వెలువడుతుంది.)

ఉదానో నామ పవనస్తతశ్చోర్ధ్వం ప్రవర్తతే ।
భుక్తానామమ్బుభక్ష్యాణామధోగతినిరోధకృత్ ॥ 32 ॥

అప్పుడు (ప్రాణోత్క్రమణసమయంలో అంటే యమమార్గంలో ప్రయాణించేటపుడు) ఉదానం అనే వాయువు పైకి లేస్తుంది. జీవుడు తీసుకున్న నీళ్లు, అన్నం, మొదలైన పదార్థాలను క్రిందికి పోకుండా అడ్డగిస్తుంది.

తతో యేనామ్బుదానాని కృతాన్యన్నరసాస్తథా ।
దారైః పుత్రైస్తథా చాన్యైస్తేషు విప్రతిపద్యతే ॥ 33 ॥

జీవించి ఉన్న సమయంలో నీళ్లు, అన్నం మొదలైన పదార్థాలను ఇతరులకు దానం చేసిన వాడికి మాత్రం, భార్య, బిడ్డలతో సహా ఆ విధమైన అవరోధం గలగదు.

అన్నాని యేన దత్తాని శ్రద్ధాపూతేన చేతసా ।
సోఽపి తృప్తిమవాప్నోతి వినాప్యన్నేన వై తదా ॥ 34 ॥

శ్రద్ధతో పవిత్రమైన మనస్సుతో వివిధమైన అన్నాలు దానం చేసినవాడు మరణించే సమయంలో అన్నం తినకపోయినా, అన్నీ తిన్న తృప్తిని పొందుతాడు.

యేనానృతాని నోక్తాని ప్రీతిభేదః కృతో న చ ।
ఆస్తికశ్శ్రద్దధానశ్చ సుఖమృత్యుం స గచ్ఛతి ॥ 35 ॥

అబద్ధాలాడనివాడు, ఇతరుల ఆనందాన్ని చెడగొట్టనివాడు, దేవుడిపై నమ్మకం కలిగినవాడు, పుణ్యకర్మల యందు శ్రద్ధ కలిగినవాడు అనాయాసమైన మరణాన్ని పొందుతాడు.

దేవబ్రాహ్మణపూజాయాం యే రతాశ్చానసూయకాః ।
శుక్లా వదాన్యా హ్రీమన్తస్తే నరా స్సుఖమృత్యవః ॥ 36 ॥

దేవతలనూ, బ్రాహ్మణులనూ పూజించడంలో ఆసక్తి కలిగినవారూ, అసూయ లేనివారూ, పుణ్యకర్మలు మాత్రమే చేసేవారూ, దానాలు చేసేవారూ, పాపకర్మలు చేయనివారూ అయిన మానవులు సుఖమైన మరణం పొందుతారు.

యః కామాన్నాపి సంరమ్భాన్న ద్వేషాద్ధర్మముత్సృజేత్ ।
యథోక్తకారీ సౌమ్యశ్చ స సుఖం మృత్యుమృచ్ఛతి ॥ 37 ॥

కామంచేత కాని, ఉద్రేకంచేత కాని, ద్వేషంచేత కాని ధర్మాన్ని వదిలిపెట్టనివారు, మాటమీద నిలబడేవారూ, ఇతరులను బాధించనివారూ, ఏమాత్రం కష్టం లేకుండా, సుఖమైన మరణం పొందుతారు.

వారిదాస్తృషితానాం యే క్షుధితాన్నప్రదాయినః ।
ప్రాప్నువన్తి నరాః కాలే మృత్యుం సుఖసమన్వితమ్ ॥ 38 ॥

దాహంగా ఉన్నవారికి నీళ్లనూ, ఆకలిగా ఉన్నవారికి అన్నాన్నీ దానం చేసే మానవులు సకాలంలో సుఖకరమైన మరణం పొందుతారు.

శీతం జయన్తి ధనదా స్తాపం చన్దనదాయినః ।
ప్రాణఘ్నీం వేదనాం కష్టాం యేచాన్యోద్వేగధారిణః ॥
మోహం జ్ఞానప్రదాతారస్తథా దీపప్రదాస్తమః ॥ 39 ॥

అవసరమైన వారికి ధనం దానం చేసినవారు యమమార్గంలో చలిని జయిస్తారు. చందనం దానం చేసినవారు తాపాన్ని జయిస్తారు. ఇతరుల భయాలను బాధలనూ పోగొట్టినవారు ప్రాణాలు పోయేటప్పుడు కలిగే బాధను, కష్టాన్ని పొందరు. ఇతరులకు జ్ఞానదానం చేసినవాళ్లు మోహాన్ని జయిస్తారు. దీపదానం చేసినవాళ్లు చీకటిని (అజ్ఞానాన్ని) జయిస్తారు.

కూటసాక్షీ మృషావాదీ యే చ ప్రాణహరాస్తథా ।
తే మోహమృత్యవస్సర్వే తథా యే వేదనిన్దకాః ॥ 40 ॥

అబద్ధపు సాక్ష్యం చెప్పేవాళ్లు, అసత్యమాడేవాళ్లు, ప్రాణాలు తీసేవాళ్లు, వేదాలను నిందించేవాళ్లు మరణ సమయంలో తెలివి తప్పిపోతారు.

విభీషణాః పూతిగన్ధాః కూటముద్గరపాణయః ।
ఆగచ్ఛన్తి దురాత్మానో యమస్య పురుషాస్తథా ॥ 41 ॥

భయంకరంగా ఉండేవారు, పాడువాసన గలిగినవారు, సమ్మెట, సుత్తివంటి ఆయుధాలను చేతబట్టినవారు, దుర్మార్గులూ అయిన యమదూతలు జీవులు మరణించే సమయంలో వారివద్దకు వస్తారు.

ప్రాప్తేషు దృక్పథం తేషు జాయతే తస్య వేపథుః ।
క్రన్దత్యవిరతస్సోఽథ భ్రాతృమాతృపితౄంస్తథా ॥ 42 ॥

యమదూతలు కనిపించగనే మరణించేవాడికి వణుకు పుడుతుంది. తల్లి, తండ్రి, సోదరులు మొదలైన బంధువులను గూర్చి ఎడతెరిపి లేకుండా ఆక్రోశిస్తాడు.

సా తు వాగస్ఫుటా విప్రా ఏకవర్ణా విభావ్యతే ।
దృష్టిర్విభ్రామ్యతే త్రాసాత్ కాసోచ్ఛ్వాసవిచేష్టితః ॥ 43 ॥

బ్రాహ్మణులారా! ఆ సమయంలో వాడి మాటలు స్పష్టంగా ఉండవు. మాటలన్నీ ఒకే అక్షరంలాగా స్ఫురిస్తాయి. భయంతో అతడి చూపు కలవరపడుతుంటుంది. శ్వాసలో గురక ఏర్పడుతుంది.

తతస్స వేదనావిష్టం తచ్ఛరీరం విముఞ్చతి ।
బాహ్యాప్రసారీ తద్రూపదేహమన్యత్ ప్రపద్యతే ॥ 44 ॥

జీవుడు ఆ తరువాత బాధలతో నిండిన ఆ శరీరాన్ని విడిచిపెడతాడు. ఆ శరీరంనుండి వెలువడిన జీవుడు అదే రూపంతో ఉన్న మరొక శరీరంలో ప్రవేశిస్తాడు.

తత్కర్మయాతనార్థం చ న మాతృపితృసమ్భవమ్ ।
తత్ప్రమాణవయోవస్థాసంస్థానైః ప్రాప్యతే వ్యథా ॥ 45 ॥

ఆ జీవుడు తాను చేసిన కర్మలకు తగిన యాతనలను అనుభవించడానికి, మరొక శరీరం పొందుతాడు. ఆ శరీరం తల్లిదండ్రులవల్ల ఏర్పడినది కాదు. తాను విడిచిన శరీరంతో సమానమైన ప్రమాణమూ, వయస్సుల ఉనికి కలిగిన ఆ శరీరంతో బాధపడుతుంటాడు.

తతో దూతో యమస్యాథ పాశైర్బధ్నాతి దారుణైః ।
జన్తోస్సమ్ప్రాప్తకాలస్య వేదనార్తస్య వై భృశమ్ ॥ 46 ॥

మరణ సమయం సమీపించి, మరణ యాతనలతో బాధపడుతున్న ఆతడిని యమదూత భయంకరమైన యమపాశాలతో దృఢంగా బంధిస్తాడు.

భూతైస్సన్త్యక్తదేహస్య కణ్ఠప్రాప్తానిలస్య చ ।
శరీరాచ్చ్యావితో జీవో రోరవీతి తథోల్బణమ్ ॥ 47 ॥

పంచభూతాలు ఆ శరీరాన్ని విడిచి వెళ్లిపోతాయి. ప్రాణం గొంతులోకి వస్తుంది. అటువంటి శరీరంనుండి వెలువడి జీవుడు ఎద్దు రంకె వేసిన విధంగా పెద్దగా కేకలు వేస్తాడు.

నిర్గతో వాయుభూతస్తు షాట్కౌశికకలేబరే ।
మాతృభిః పితృభిశ్చైవ భ్రాతృభిర్మాతులైస్తథా ॥
దారైః పుత్రైర్వయస్యైశ్చ గురుభిస్త్యజ్యతే భువి ॥ 48 ॥

ఆరు కోశములతో కూడిన శరీరంలోనుండి వాయురూపంలో జీవుడు వెళ్లిపోగా, అతడిని (అతడి కళేబరాన్ని) తల్లి, తండ్రి, అన్నదమ్ములు, మేనమామలు, భార్య, కొడుకులు, స్నేహితులు, గురువులు అందరూ వదిలేస్తారు.

దృశ్యమానశ్చ తైర్దీనైరశ్రుపూర్ణేక్షణైర్భృశమ్ ।
స్వశరీరం సముత్సృజ్య వాయుభూతస్తు గచ్ఛతి ॥ 49 ॥

తల్లి, తండ్రి మొదలైన బంధువులందరూ దీనంగా, నీళ్లు నిండిన కళ్లతో తదేకంగా చూస్తుండగా, ఆ జీవుడు వాయువు రూపంలో తన శరీరాన్ని విడిచిపెట్టి వెళ్లిపోతాడు.

అన్ధకారమపారం చ మహాఘోరం తమోవృతమ్ ।
సుఖదుఃఖప్రదాతారం దుర్గమం పాపకర్మణామ్ ॥ 50 ॥

ఆ యమమార్గం అంతులేని అంధకారంతో నిండి ఉంటుంది. చాల భయంకరమైనది. అంతటా చీకటి కమ్ముకుని ఉంటుంది. కష్టసుఖాలను కలిగిస్తుంది. ఆ మార్గంలో పాపాత్ములు ప్రయాణించడం చాల కష్టం.

దుస్సహం చ దురన్తం చ దుర్నిరీక్షం దురాసదమ్ ।
దురాపమతిదుర్గం చ పాపిష్ఠానాం సదాఽహితమ్ ॥ 51 ॥

యమమార్గం భరించడానికి వీలు లేనిది. దుఃఖంతో ముగుస్తుంది. చూడడం కూడ కష్టం. పోవడానికి వీలు లేదు. పొందరాదు. మిక్కిలి కష్టసాధ్యం. పాపాత్ములకు ఎల్లప్పుడు కష్టం కలిగిస్తుంది.

కృష్యమాణాశ్చ తైర్భూతైర్యామ్యైః పాశైస్తు సంయతాః ।
ముద్గరైస్తాడ్యమానాశ్చ నీయన్తే తం మహాపథమ్ ॥ 52 ॥

యమదూతలు ఆ యమమార్గంలో జీవులను తాళ్లతో కట్టి, ఇనపగదలతో కొడుతూ, బలవంతంగా లాక్కు పోతారు.

క్షీణాయుషం సమాలోక్య ప్రాణినం చాయుషఃక్షయే ।
నినీషవస్సమాయాన్తి యమదూతా భయఙ్కరాః ॥ 53 ॥

జీవుల ఆయువు తీరిపోవడం గ్రహించి, ఆయువు తీరిన వెంటనే వారిని తీసుకుని పోవడానికి భయంకరులైన యమదూతలు వస్తారు.

ఆరూఢా యానకాలే తు ఋక్షవ్యాఘ్రఖరేషు చ ।
ఉష్ట్రేషు వానరేష్వన్యే వృశ్చికేషు వృకేషు చ ॥ 54 ॥

ప్రయాణించే సమయంలో యమదూతలు ఎలుగుబంట్లు, పెద్దపులులు, గాడిదలు, ఒంటెలు, కోతులు, తేళ్లు, తోడేళ్లు, ఎక్కి వస్తారు.

ఉలూకసర్పమార్జారవాహనా గృధ్రవాహనాః ।
శ్యేనసృగాలమారూఢాస్సరఘాకఙ్కవాహనాః ॥ 55 ॥

ఇంకా వారు గుడ్లగూబలు, పాములు, పిల్లులు, డేగలు, గ్రద్దలు, నక్కలు, తేనెటీగలు, రాబందులు, వాహనాలు చేసుకుని వాటిమీద ఎక్కి వస్తారు.

వరాహపశువేతాలమహిషాస్యాస్తథా పరే ।
నానారూపధరా ఘోరాస్సర్వప్రాణిభయఙ్కరాః ॥ 56 ॥

ఆ యమదూతలు పంది, మేక, పిశాచం, దున్నపోతు ముఖాలు కలిగి ఉంటారు. ఇంకా అనేక విధాలైన ఆకారాలు ధరించి ఉంటారు. చాల క్రూరంగానూ, సమస్తమైన జీవులు భయపడే విధంగానూ ఉంటారు.

దీర్ఘాననాః కరాలాస్యా వక్రనాసాస్త్రిలోచనాః ।
మహాహనుకపోలాస్యాః ప్రలమ్బదశనచ్ఛదాః ॥ 57 ॥

కొందరి ముఖాలు దీర్ఘంగా ఉంటాయి. కొందరి ముఖాలు చాల విశాలంగా ఉంటాయి. ముక్కులు వంకరగా ఉంటాయి. కన్నులు మూడు ఉంటాయి. వారి ముఖంలో దౌడలు, చెక్కిళ్లు చాల పెద్దవిగా ఉంటాయి. వ్రేలాడే పెదవులు ఉంటాయి.

నిర్గతై ర్వికృతాకారైర్దశనైరఙ్కురోపమైః ।
మాంసశోణితదిగ్ధాఙ్గా దంష్ట్రాభిర్భృశముల్బణైః ॥ 58 ॥

వారి ఆకారాలు బయటకు పొడుచుకు వచ్చిన అవయవాలతో వికారంగా ఉంటాయి. దంతాలు మొలకల లాగా ఉంటాయి. శరీరం అంతా మాంసంతోనూ నెత్తురుతోనూ నిండి ఉంటుంది. కోరలు చాల పెద్దవిగాఉంటాయి.

ముఖైః పాతాలసదృశైర్జ్వలజ్జిహ్వైర్భయఙ్కరైః ।
నేత్రైస్సువికృతాకారైర్జ్వలత్పిఙ్గలచఞ్చలైః ॥ 59 ॥

వారి నోళ్లు పాతాళంలాగా చాలా లోతుగా ఉంటాయి. నాలుకలు భయంకరంగా మండుతుంటాయి. కళ్లు మిక్కిలి వికారమైన ఆకారంతో, మండుతూ, వేగంగా కదులుతూ, గోధుమరంగులో ఉంటాయి.

మార్జారోలూకఖద్యోతశక్రగోపవదద్భుతైః ।
చికురైస్సఞ్చలైస్తబ్ధైర్లోచనైః పావకోపమైః ॥ 60 ॥

ఇంకా వారి కళ్లు పిల్లికళ్లులాగా, గుడ్లగూబ కళ్లలాగా, మిడుగురు పురుగులలాగా, ఆర్ద్ర పురుగులలాగా వింతగా ఉంటాయి. ఆ కన్నులు వేగంగా కదులుతుంటాయి. విషమంగా ఉంటాయి. నిక్కబొడుచుకుని ఉంటాయి. నిప్పులాగా మండుతుంటాయి.

భృశమాభరణైర్భీమైరాబద్ధైర్భుజగోపమైః ।
శోణాసరళగాత్రైశ్చ ముణ్డమాలావిభూషితైః ॥ 61 ॥

వారి శరీరాలు కొంచెం ఎరుపురంగులో ఉంటాయి. వారు శరీరం నిండా పాములవంటి భయంకరమైన ఆభరణాలు దృఢంగా అలంకరించుకుంటారు. ఆ ఆభరణాలు పుర్రెల మాలలతో అలంకరింపబడి ఉంటాయి.

కణ్ఠస్థకృష్ణసర్పైశ్చ ఫూత్కారవిభీషణైః ।
వహ్నిజ్వాలోపమైః కేశైస్తబ్ధరూక్షైర్భయఙ్కరైః ॥ 62 ॥

వారు మెడలో భయంకరంగా బుసకొడుతున్న కృష్ణసర్పాలను వేసుకుంటారు. వారి జుట్టు అగ్నిజ్వాలలాగా మండుతుంటుంది. నిక్కబొడుచుకుని, కఠినంగా, భయం కలిగిస్తూ ఉంది.

బభ్రుపిఙ్గలలోమైశ్చ కద్రుశ్మశ్రుభిరావృతాః ।
భుజదణ్డైర్మహాఘోరైః ప్రలమ్బైః పరిఘోపమైః ॥ 63 ॥

వారి వెంట్రుకలు అగ్నివర్ణంలోనూ గోధుమరంగులోనూ ఉంటాయి. నలుపు, పసుపు కలిసిన రంగులో ఉన్న మీసాలు, గడ్డాలు ముఖమంతటా ఆవరించి ఉంటాయి. దండంలాగా దృఢమైన వారి బాహువులు ఇనప గుదియలలాగా భయంకరంగా వేలాడుతుంటాయి.

కేచిద్ ద్విబాహవస్తత్ర తథాఽన్యేచ చతుర్భుజాః ।
ద్విరష్టబాహవశ్చాన్యే దశవింశభుజాస్తథా ॥ 64 ॥

యమదూతలు కొందరికి రెండు చేతులు, కొందరికి నాలుగు చేతులు, మరి కొంతమందికి పదహారు చేతులు, ఇంకా కొందరికి పది చేతులు, కొంతమందికి ఇరవై చేతులు ఉంటాయి.

అసఙ్ఖ్యాతభుజాశ్చాన్యే కేచిద్ బాహుసహస్రిణః ।
ఆయుధైర్వివిధాకారైః ప్రజ్వలద్భిర్భయానకైః ॥ 65 ॥

కొందరికి వెయ్యి చేతులు ఉంటాయి. కొందరికి లెక్కలేనన్ని చేతులు ఉంటాయి. వారి చేతులలో ఆయుధాలు రకరకాల ఆకారాలలో ఉంటాయి. అవి భయంకరంగా మండుతుంటాయి.

శక్తితోమరచక్రాద్యైస్సుదీప్తైర్వివిధాయుధైః ।
పాశశృఙ్ఖలదణ్డైశ్చ భీషయన్తో మహాబలాః ॥ 66 ॥

వాళ్ల చేతులలో ఇంకా ఈటెలు, ఇనప గదలు, చక్రాలు మొదలుగా బాగా మెరిసే రకరకాల ఆయుధాలు ఉంటాయి. తాళ్లు, సంకెళ్లు, పెద్ద పెద్ద కఱ్ఱలతో మిక్కిలి బలవంతులైన ఆ యమదూతలు భయం కలిగిస్తుంటారు.

ఆగచ్ఛన్తి మహారౌద్రా మర్త్యానామాయుషః క్షయే ।
గ్రహీతుం ప్రాణినస్సర్వే యమస్యాజ్ఞాకరాస్తథా ॥ 67 ॥

జీవుల ఆయువు తీరినపుడు యముడి ఆజ్ఞననుసరించి, జీవులను తీసుకెళ్లడానికి మిక్కిలి భయంకరమైన యమదూతలు పైవిధంగా వస్తారు.

యత్తచ్ఛరీరమాదత్తే యాతనీయం స్వకర్మజమ్ ।
తదస్య నీయతే జన్తోర్యమస్య సదనం ప్రతి ॥ 68 ॥

జీవుడు తాను చేసిన కర్మలకు అనుగుణమైన యమయాతనలను అనుభవించడానికి యాతనామయమైన శరీరాన్ని పొందుతాడు. ఆ శరీరాన్ని యమదూతలు యమపురానికి తీసుకుని వెళ్తారు.

బద్ధ్వా తత్కాలపాశైశ్చ నిగడైర్వజ్రశృఙ్ఖలైః ।
తాడయిత్వా భృశం క్రుద్ధైర్నీయతే యమకిఙ్కరైః ॥ 69 ॥

యముడి బంటులు యమపాశాలతోనూ, ఇనప గొలుసులతోనూ, వజ్రపు సంకెళ్లతోనూ, బంధించి, గట్టిగా కొడుతూ, పాపులను యమపురానికి తీసుకు వెళ్తారు.

ప్రస్ఖలితం రుదన్తం చ ఆక్రోశన్తం ముహుర్ముహుః ।
హా తాత మాతః పుత్రేతి వదన్తం కర్మదూషితమ్ ॥ 70 ॥

పాపపు కర్మలు చేసిన జీవుడు పడుతూ లేస్తూ, ఏడుస్తూ, బాధగా కేకలు వేస్తూ, మాటిమాటికీ అయ్యో తండ్రీ, అయ్యో తల్లీ, అయ్యో కొడుకా అని అరుస్తుండగా యమకింకరులు యమపురానికి తీసుకు వెళ్తారు.

ఆహత్య నిశితైశ్శూలైర్ముద్గరైర్నిశితైర్ఘనైః ।
ఖడ్గశక్తిప్రహారైశ్చ వజ్రదణ్డైస్సుదారుణైః ॥ 71 ॥

పదునైన శూలాలతోనూ, ఇనుప గదలతోనూ, వాడిగానూ, ఘనంగానూ ఉన్న విచ్చుకత్తులతోనూ, శక్తి ఆయుధాల తోనూ, మిక్కిలి భయంకరమైన వజ్రపు దండాలతోనూ జీవులను బాదుతూ యమకింకరులు యమపురానికి తీసుకువెళ్తారు.

భర్త్స్యమానో మహారావైర్వజ్రశక్తిసమన్వితైః ।
ఏకైకశో భృశం క్రుద్ధైస్తాడయద్భిస్సమన్తతః ॥ 72 ॥

యమకింకరులు కోపంతో ఒక్కొక్కరుగా జీవుడిని బిగ్గరగా అరుస్తూ భయపెడతారు. వజ్రంవంటి శక్తి గలిగిన ఆయుధాలతో ఒళ్ళంతా కుళ్లబొడుస్తూ యమపురానికి తీసుకు వెళ్తారు.

స ముహ్యమానో దుఃఖార్తః ప్రతపంశ్చ ఇతస్తతః ।
ఆకృష్య నీయతే జన్తురధ్వానం సుభయఙ్కరైః ॥ 73 ॥

ఆ దెబ్బలకు జీవుడు మూర్ఛపోతాడు. కష్టాలతో బాధపడతాడు. మిక్కిలిగా తపించిపోతాడు. అటువంటి జీవుడిని మిక్కిలి భయంకరులైన యమకింకరులు దారి అంతటా ఇటూ అటూ లాగుతూ తీసుకు వెళ్తారు.

కుశకణ్టకవల్మీకశఙ్కుపాషాణశర్కరే ।
తథా ప్రదీప్తజ్వలనే క్షారవజ్రశతోత్కటే ॥ 74 ॥

దర్భలు, ముళ్లు, చీమలపుట్టలు, మొరళ్లు, పెద్దపెద్దరాళ్లు, గులకరాళ్లు, బాగా మండుతున్న అగ్ని, వందల కొలదిగా ఉన్న, కఠినమైన గాజుముక్కలతో నిండిన దారిలో జీవులను యమకింకరులు తీసుకువెళ్తారు.

ప్రదీప్తాదిత్యతప్తేన దహ్యమానస్తదంశుభిః ।
కృష్యతే యమదూతైశ్చ శివాసన్నాదభీషణైః ॥ 75 ॥

మండుతున్న సూర్యుడి కిరణాలతో కాలిపోతుండగా, నక్కల అరుపులతో భయంకరమైన దారిలో యమదూతలు జీవులను బలవంతంగా లాక్కువెళ్తారు.

వికృష్యమాణస్తైర్ఘోరైర్భక్ష్యమాణశ్శివాశతైః ।
ప్రయాతి దారుణే మార్గే పాపకర్మా యమాలయమ్ ॥ 76 ॥

పాపకర్మలు చేసిన వాడిని భయంకరులైన యమదూతలు బలవంతంగా లాగుతూ ఉంటారు. దారిలో వందలకొద్దీ నక్కలు వారిని పీక్కుని తింటుంటాయి. దారి భయంకరంగా ఉంటుంది. అలా వాడు యమపురానికి వెళ్తాడు.

క్వచిద్ భీతైః క్వచిత్ త్రస్తైః ప్రస్ఖలద్భిః క్వచిత్ క్వచిత్ ।
దుఃఖేనాక్రన్దమానైశ్చ గన్తవ్యస్స మహాపథః ॥ 77 ॥

ఆ యమమార్గంలో కొన్నిచోట్ల బెదిరిపోతూ, కొన్నిచోట్ల భయపడుతూ, అక్కడక్కడ పడుతూ లేస్తూ, బాధగా కేకలు వేస్తూ, జీవులు ప్రయాణం చేస్తుంటారు.

నిర్భర్త్స్యమానైరుద్విగ్నైర్విద్రుతైర్భయవిహ్వలైః ।
క్వథ్యమానశరీరైస్తు గన్తవ్యం జీవసఞ్జ్ఞకైః ॥ 78 ॥

యమదూతల బెదిరింపులతోనూ, వ్యాకులమైన మనస్సుతోనూ, క్షోభతోనూ, భయంతో అవయవాలు స్వాధీనం తప్పిపోతుండగా, శరీరం కాగిపోతుండగా, జీవులు ఆ దారిలో వెళ్లవలసి ఉంటుంది.

కణ్టకాకీర్ణమార్గేణ సన్తప్తసికతేన వా ।
దహ్యమానైస్తు గన్తవ్యం నరైర్దానవివర్జితైః ॥ 79 ॥

జీవించి ఉండగా దానం చేయనివాళ్లు ముళ్లతో నిండిన దారిలో, బాగా వేడెక్కిన ఇసుకలో, ఒళ్లు దహించుకుని పోతుండగా, ఆ యమమార్గంలో వెళ్లవలసి ఉంటుంది.

మేదశ్శోణితదుర్గన్ధైర్విష్ఠామూత్రానులేపనైః ।
దగ్ధస్ఫుటత్వచాకీర్ణైర్గన్తవ్యం జీవఘాతకైః ॥ 80 ॥

జీవులను హింసించినవారు మజ్జ, నెత్తురుల దుర్వాసనలతో, మలమూత్రాల పూతలతో, కాలిపోయిన చర్మంతో యమమార్గంలో ప్రయాణిస్తారు.

కూజద్భిః క్రన్దమానైశ్చ విక్రోశద్భిశ్చ విస్వరమ్ ।
వేదనార్తైశ్చ సద్భిశ్చ గన్తవ్యం జీవఘాతకైః ॥ 81 ॥

ప్రాణులను హింసించినవాళ్లు దీనమైన కూతలతో, బాధగా అరుచుకుంటూ, గద్గదస్వరంతో దుఃఖిస్తూ, కష్టాలతో బాధపడుతూ, యమమార్గంలో ప్రయాణిస్తారు.

శక్తిభిర్భిన్దిపాలైశ్చ ఖడ్గతోమరసాయకైః ।
భిద్యద్భిస్తీక్ష్ణశూలాగ్రైర్గన్తవ్యం జీవఘాతకైః ॥ 82 ॥

యమదూతలు వడిసెలవంటి ఆయుధాలతోనూ, కత్తులతోనూ, ఇనప గదలతోనూ, బాణాలతోనూ, వాడి అయిన శూలాలకొనలతోనూ చీల్చుతుండగా, జీవులను హింసించినవాళ్లు యమమార్గంలో ప్రయాణిస్తారు.

శ్వానైర్వ్యాఘ్రైర్వృకైః కఙ్కైర్భక్ష్యమాణశ్చ పాపిభిః ।
స హి పాషాణసఙ్ఘట్టైర్భిద్యమానస్సమన్తతః ॥
కృన్తద్భిః క్రకచాఘాతైర్గన్తవ్యం మాంసఖాదిభిః ॥ 83 ॥

జీవులను హింసించినవాడు యమమార్గంలో ప్రయాణించే సమయంలో వాడిని పాపాత్ములైన కుక్కలు, పెద్దపులులు, తోడేళ్లు, రాబందులు, తింటుంటాయి. బండరాళ్ల దెబ్బలతో వాడి ఒళ్లంతా చితికిపోతుంది. మాంసం తినే యమదూతలు అంపాల దెబ్బలతో నరుకుతుంటారు. ఈ విధంగా వాడు యమమార్గంలో ప్రయాణిస్తాడు.

మహిషర్షభశృఙ్గాగ్రైర్భిద్యమానైస్సమన్తతః ।
ఉల్లిఖద్భిశ్శూకరైశ్చ గన్తవ్యం మాంసఖాదకైః ॥ 84 ॥

వాడు యమమార్గంలో ప్రయాణిస్తుండగా, దున్నపోతులు, ఎద్దులు కొమ్ముల చివరలతో వాడిని అన్ని వైపులనుంచి చీల్చివేస్తాయి. మాంసం తినే పందులు గీరుతుంటాయి.

సూచీభ్రమరకాలోలమక్షికాభిశ్చ సఙ్ఘశః ।
భుజ్యమానైశ్చ గన్తవ్యం పాపిష్ఠైర్మధుఘాతకైః ॥ 85 ॥

మధువును (ఇతరుల నోటివద్ద ఉన్న మధురాన్నాన్ని) నాశనం చేసిన పాపాత్ములు సూచి అనే పక్షులు, తుమ్మెదలు, కందిరీగలు గుంపులుగా వచ్చి, చుట్టూ మూగి, కుట్టి బాధిస్తుండగా యమమార్గంలో ప్రయాణిస్తారు.

విశ్వస్తం స్వామినం మిత్రం స్త్రియం వా యస్తు ఘాతయేత్ ।
శస్త్రైర్నికృత్యమానైశ్చ గన్తవ్యం చాతురైర్నరైః ॥ 86 ॥

నమ్మినవాడినీ, యజమానినీ, స్నేహితుడినీ, స్త్రీనీ హింసించినవాడు, యమదూతల ఆయుధాల దెబ్బలు తింటూ, యమమార్గంలో ప్రయాణించవలసి ఉంటుంది.

ఘాతయన్తి చ యే జన్తూంస్తాడయన్తి నిరాగసః ।
రాక్షసైర్భక్ష్యమాణాస్తే యాన్తి యామ్యపథం నరాః ॥ 87 ॥

ఎవరికీ అపకారం చేయని సాధుజంతువులను చంపిన మానవులు రాక్షసులు భక్షిస్తుండగా, యమమార్గంలో ప్రయాణిస్తారు.

యే హరన్తి పరస్త్రీణాం వస్త్రప్రావరణాని చ ।
తే యాన్తి విద్రుతా నగ్నాః ప్రేతీభూతా యమాలయమ్ ॥ 88 ॥

పరాయి ఆడవాళ్ల కట్టుబట్టలను దొంగిలించినవాళ్లు మరణానంతరం ప్రేతలై, యమపురానికి దిగంబరంగా పరుగులుతీస్తారు.

వాసో ధాన్యం హిరణ్యం వా గృహక్షేత్రమథాపి వా ।
యే హరన్తి దురాత్మానః పాపిష్ఠాః పాపకర్మిణః ॥ 89 ॥

పాషాణైర్లగుడైర్దణ్డైస్తాడ్యమానైస్తు జర్జరైః ।
వహద్భిశ్శోణితం భూరి గన్తవ్యం తు యమాలయమ్ ॥ 90 ॥

ఇతరుల వస్త్రాలు, ధాన్యం, బంగారం, ఇల్లు, పొలం కాజేసిన దుర్మార్గులు, పాపాత్ములు, పాపపుపని చేసినవాళ్లను యమదూతలు బండరాళ్లతోనూ, ఇనప గదలతోనూ, కఱ్ఱలతోనూ బాదుతుండగా, శరీరం శిథిలమై, ఒళ్లంతా మిక్కిలిగా నెత్తురోడుతుండగా వారు యమపురానికి వెళ్తారు.

బ్రహ్మస్వం యే హరన్తీహ నరా నరకనిర్భయాః ।
తాడయన్తి తథా విప్రా నాక్రోశన్తి నరాధమాః ॥ 91 ॥

నరకాన్ని గురించిన భయం లేకుండా, బ్రాహ్మణుల సొమ్మును కాజేసిన మానవులు, అలాగే బ్రాహ్మణులను కొట్టినవాళ్లు యమమార్గంలో బాధలతో ఆక్రోశిస్తారు.

శుష్కకాష్ఠనిబద్ధాస్తే ఛిన్నకర్ణాక్షినాసికాః ।
పూయశోణితదిగ్ధాస్తే కాలగృధ్రైశ్చ జమ్బుకైః ॥ 92 ॥

వారిని యమదూతలు ఎండిన కట్టెలకు కలిపి కట్టివేస్తారు.వారి చెవులు, ముక్కులు, కన్నులు కోసి వేస్తారు. వారి ఒళ్లంతా మలంతోనూ రక్తంతోనూ నిండిపోతుంది. వారిని యమలోకానికి సంబంధించిన గద్దలు, నక్కలు, పీక్కుతింటాయి.

కిఙ్కరైర్భీషణైశ్చణైస్తాద్యమానాశ్చ దారుణైః ।
విక్రోశమానా గచ్ఛన్తి పాపినస్తే యమాలయమ్ ॥93 ॥

భయంకరంగానూ, తీక్షణంగానూ ఉండే యమకింకరులు వారిని తీవ్రంగా కొడతారు. ఆ దెబ్బలకు బాధగా అరుస్తూ వారు యమపురానికి వెళ్తారు.

ఏవం పరమదుర్ధర్షమధ్వానం జ్వలనప్రభమ్ ॥ 94 ॥

యమాలయానికి వెళ్లే మార్గం ఈ విధంగా ఎంత మాత్రమూ భరింపరానిదిగా ఉంటుంది. ఇంకా అగ్నివంటి కాంతి కలిగిఉంటుంది.

రౌరవం దుర్గవిషమం నిర్దిష్టం మానుషస్య చ ।
ప్రతప్తతామ్రవర్ణాభం వహ్నిజ్వాలాస్ఫులిఙ్గకమ్ ॥ 95 ॥

రౌరవం అనే నరకం మానవులకోసమే నిర్ణయింపబడి ఉంది. అది సంచరించడానికి వీలు లేకుండా ఉంటుంది. బాగా కాల్చిన రాగిరంగులో ఉంటుంది. అగ్నిజ్వాలలతో నిప్పురవ్వలతో నిండి ఉంటుంది.

కురణ్టకణ్టకాకీర్ణం వికటపృథుతాడనైః ।
శక్తివజ్రైశ్చ సఙ్కీర్ణముజ్జ్వలం తీవ్రకణ్టకమ్ ॥ 96 ॥

గోరంటముళ్లతో నిండిఉంటుంది. అసాధారణమైన పెద్ద దెబ్బలతో కూడి ఉంటుంది. శక్తి, వజ్రం అనే ఆయుధాల దెబ్బలతో కూడినది. మిక్కిలి ప్రకాశిస్తుంది. దారుణమైన ముళ్లతో నిండి ఉంటుంది.

అఙ్గారవాలుకామిశ్రం వహ్నికీటకదుర్గమమ్ ।
జ్వాలామాలాకులం రౌద్రం సూర్యరశ్మిప్రతాపితమ్ ॥ 97 ॥

నిప్పుల వాగులతో కూడి ఉంటుంది. నిప్పులతో కఠినమై సంచరించడానికి వీలు లేకుండా ఉంటుంది. అగ్నికీలల వరుసలతో నిండి ఉంటుంది. చాల భయంకరంగా ఉంటుంది. సూర్యకిరణాలతో మిక్కిలిగా వేడెక్కి ఉంటుంది.

అధ్వానం నీయతే దేహీ కృష్యమాణస్సునిష్ఠురైః ॥ 98 ॥

యమకింకరులు మిక్కిలి కఠినమైన పద్ధతులతో జీవుడిని బలవంతంగా ఆ యమమార్గంలో లాక్కుపోతారు.

యద్దైవ క్రన్దతే జన్తుర్దుఃఖార్తః పతితః క్వచిత్ ।
తద్దైవాహన్యతే సర్వైరాయుధైర్యమకిఙ్కరైః ॥ 99 ॥

యమమార్గంలో వెళ్లేటపుడు కలిగిన కష్టాలతో జీవుడు బాధతో అరిచినా, దారిలో ఎక్కడైనా పడిపోయినా, యమకింకరులు తమ ఆయుధాలు అన్నింటితోనూ ఆ జీవుడిని చావగొడతారు.

ఏవం సన్తాద్యమానశ్చ లుబ్ధః పాపేషు యోఽనయః ।
అవశో నీయతే జన్తుర్దుర్ధరైర్యమకిఙ్కరైః ॥ 100 ॥

దుర్మార్గాలు చేసినవాడు, పాపాత్ములలో నీతితక్కువవాడు అయిన జీవుడు ఈ విధంగా యమకింకరులు కొడుతుండగా, తెలివి తప్పుతాడు. ఆ స్థితిలో ఉన్న అతడిని యమకింకరులు నిరాటంకంగా యమపురానికి తీసుకువెళ్తారు.

సర్వైరేవ హి గన్తవ్యమధ్వానం తత్ సుదుర్గమమ్ ।
నీయతే వివిధైర్ఘోరైర్యమదూతైరవజ్ఞయా ॥ 101 ॥

కష్టమైన ఆ యమమార్గంలో జీవులు అందరూ తప్పకుండా వెళ్లవలసిందే. యమదూతలు దారుణమైన రకరకాల కష్టాలు పెడుతూ, అవమానిస్తూ జీవుడిని యమపురానికి తీసుకువెళ్తారు.

నీత్వా సుదుర్గమం మార్గం ప్రాణినం యమకిఙ్కరైః ।
ప్రవేశ్యతే పురీం ఘోరాం తామ్రాయసమయీం ద్విజాః ॥ 102 ॥

బ్రాహ్మణులారా! ఆవిధంగా యమకింకరులు మిక్కిలి కష్టమైన యమమార్గంలో జీవుడిని తీసుకుని, రాగి, ఇనుము లోహాలతో నిర్మించిన యమపురంలో ప్రవేశిస్తారు.

సా పురీ విపులాకారా లక్షయోజనమాయతా ।
చతురస్రా వినిర్దిష్టా చతుర్ద్వారవతీ శుభా ॥ 103 ॥

ఆ యమనగరం ఆకారంలో చాలా పెద్దది. దాని వైశాల్యం లక్ష యోజనాలు. నలుచదరంగా ఒక క్రమంలో నిర్మింపబడి ఉంటుంది. దానికి నాలుగువైపుల ద్వారాలు ఉంటాయి.

ప్రాకారాః కాఞ్చనాస్తస్యాం యోజనాయుతముచ్ఛ్రితాః ।
ఇన్ద్రనీలమహానీలపద్మరాగోపశోభితాః ॥ 104 ॥

ఆ నగరం ప్రాకారాలు బంగారంతో నిర్మింపబడ్డాయి. వాటి యెత్తు పదివేల యోజనాలు. అవి ఇంద్రనీలాలు, మహానీలాలు (ఇంద్రనీలమణులలో జాతిభేదం), పద్మరాగాలు అనే రత్నాలతో చక్కగా ప్రకాశిస్తున్నాయి.

సా పురీ వివిధైస్సఙ్ఘైర్ఘోరా ఘోరైస్సమాకులా ॥ 105 ॥

ఆ నగరం రకరకాల జీవుల సమూహాలతో భయంకరంగా ఉంటుంది. భయంకరమైన దృశ్యాలతో నిండి ఉంటుంది.

దేవదానవగన్ధర్వైర్యక్షరాక్షసపన్నగైః ।
పూర్వద్వారం శుభం తస్యాః పతాకాశతశోభితమ్ ॥ 106 ॥

ఆ నగరంలో తూర్పుదిక్కుగా ఉన్న ద్వారం దేవతలు, దానవులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, నాగులతో శుభప్రదమైనది. వందలకొద్దీ జెండాలతో ప్రకాశిస్తుంది.

వజ్రేన్ద్రనీలవైదూర్యముక్తాఫలవిభూషితమ్ ।
గీతనృత్యైస్సమాకీర్ణం గన్ధర్వాప్సరసాం గణైః ॥ 107 ॥

యమనగరం తూర్పుద్వారం వజ్రాలతోనూ, ఇంద్రనీలమణులతోనూ, వైడూర్యాలతోనూ, ముత్యాలతోనూ అలంకరింపబడి ఉంటుంది. గంధర్వులు, అప్సరసలు గుంపులుగా కూడి, పాడుతూ, ఆడుతూ ఉంటారు.

ప్రవేశస్తేన దేవానామృషీణాం యోగినాం తథా ।
గన్ధర్వసిద్ధయక్షాణాం విద్యాధరవిసర్పిణామ్ ॥ 108 ॥

దేవతలు, మహర్షులు, యోగులు, గంధర్వులు, సిద్ధులు, యక్షులు, విద్యాధరులు, నాగులు ఆ తూర్పుద్వారం ద్వారా యమపురిలో ప్రవేశిస్తారు.

ఉత్తరం తు వరం ద్వారం ఘణ్టాచామరభూషితమ్ ।
ఛత్రచామరవిన్యాసం నానారత్నైరలఙ్కృతమ్ ॥ 109 ॥

యమనగరం ఉత్తరద్వారం చాల శ్రేష్ఠమైనది. ఘంటలతోనూ చామరాలతోనూ అలంకరింపబడి ఉంటుంది. అక్కడ ఛత్రాలూ, చామరాలూ విచిత్రంగా ఉంటాయి. రకరకాలైన రత్నాలతో ఆ ద్వారం అలంకరింపబడి ఉంటుంది.

వీణావేణురవై రమ్యైర్గీతమఙ్గలనాదితమ్ ।
ఋగ్యజుస్సామనిర్ఘోషైర్మునిబృన్దసమాకులమ్ ॥ 110 ॥

అక్కడ మనోహరమైన వీణానాదంతోనూ, వేణువుల గానంతోనూ శుభప్రదమైన సంగీతం ధ్వనిస్తుంటుంది. ఋగ్, యజు, స్సామవేదాలను చక్కగా ఉచ్చరిస్తున్న మహర్షులు గుంపులు గుంపులుగా చేరి ఉంటారు.

విశన్తి యేన ధర్మజ్ఞాస్సత్యవ్రతపరాయణాః ॥ 111 ॥

ధర్మం తెలిసినవారు, సత్యదీక్ష కలిగినవారు ఆ ఉత్తరద్వారంగుండా ప్రవేశిస్తారు.

గ్రీష్మే వారిప్రదా యే చ శీతే చాగ్నిప్రదా నరాః ।
శ్రాన్తసంవాహకా యే చ ప్రియవాదరతాశ్చ యే ॥ 112 ॥

గ్రీష్మకాలంలో నీళ్లు దానం చేసినవారూ, చలికాలంలో నిప్పును ఇచ్చినవారూ, అలసిపోయినవారికి ఒళ్లుపట్టేవారూ, మనసుకు ప్రీతిని కలిగించే మాటలు మాత్రమే చెప్పేవారు (ఇతరులను బాధించనివారు), ఆ ఉత్తరద్వారంగుండా ప్రవేశిస్తారు.

యే చ దానరతాశ్శూరా మాతాపితృపరాశ్చ యే ।
ద్విజశుశ్రూషణే యుక్తా నిత్యం యేఽతిథిపూజకాః ॥ 113 ॥

శ్రద్ధగా దానం చేసేవారూ, వీరులూ, తలిదండ్రులను సేవించేవారూ, బ్రాహ్మణులు చెప్పినమాట శ్రద్ధగా వినేవారూ, ఎల్లప్పుడూ అతిథులను పూజించేవారూ ఉత్తరద్వారం ద్వారా ప్రవేశిస్తారు.

పశ్చిమం తు మహాద్వారం పుర్యా రత్నైర్విభూషితమ్ ।
విచిత్రమణిసోపానం తోమరైస్సమలఙ్కృతమ్ ॥ 114 ॥

యమపురానికి పశ్చిమదిక్కులో ఉండే మహాద్వారం రత్నాలతో అలంకరింపబడి ఉంటుంది. దానిమెట్లు వింతవింత మణులతో నిర్మింపబడి ఉంటాయి. ఆ మెట్లకు ఇరుప్రక్కల ఇనప గదలవంటి నిర్మాణాలు అందంగా అలంకరింపబడి ఉంటాయి.

భేరీమృదఙ్గసన్నాదైశ్శఙ్ఖకాహలనాదితమ్ ।
సిద్ధబృన్దైస్సదా హృష్టైర్మఙ్గలైః ప్రణినాదితమ్ ॥ 115 ॥

భేరులు మృదంగాలు పెద్దగా ధ్వనిస్తుంటాయి. శంఖాలు, బాకాలు మోగుతుంటాయి. శుభప్రదమైన సిద్ధుల గణాలు ఆనందంగా నిరంతరమూ సందడి చేస్తుంటారు.

ప్రవేశస్తేన హృష్టానాం శివభక్తిమతాం నృణామ్ ॥ 116 ॥

శివుడిపైన భక్తితాత్పర్యాలు కలిగి, ఆనందంగా ఉండే మానవులు పశ్చిమద్వారం ద్వారా ప్రవేశిస్తారు.

సర్వతీర్థప్లుతా యే చ పఞ్చాగ్నేర్యే చ సేవకాః ।
ప్రస్థానే యే మృతా వీరా మృతాః కాలఞ్జరే గిరౌ ॥ 117 ॥

సమస్తమైన పుణ్యతీర్థాలలోనూ మునిగినవారూ, పంచాగ్నులను సేవించినవారూ, యుద్ధానికి వెళ్తూ మరణించిన వీరులూ, కాలంజరం అనే కొండమీద మరణించినవారూ,

అగ్నౌ విపన్నా యే వీరా స్సాధితం యైరనాశకమ్ ।
యే స్వామిమిత్రలోకార్థం గోగ్రహే సఙ్కులే హతాః ॥
తే విశన్తి నరాశ్శూరాః పశ్చిమేన తపోధనాః ॥ 118 ॥

నిప్పులలో దూకి మరణించిన వీరులూ, ఉపవాసవిధానంతో లక్ష్యాన్ని సాధించినవారూ, యజమానికోసమూ, స్నేహితులకోసమూ, ప్రజలకోసమూ, ఆవులకోసమూ గుంపులో ఉండి మరణించినవారూ, తపోధనులు, శూరులు. వీరందరూ పశ్చిమద్వారంగుండా ప్రవేశిస్తారు.

పుర్యాం తస్యాం మహాఘోరం సర్వసత్త్వభయఙ్కరమ్ ।
హాహాకారసమాకృష్టం దక్షిణం ద్వారమీదృశమ్ ॥ 119 ॥

ఆ యమనగరంలో దక్షిణం దిక్కులో ద్వారం చాల దారుణంగా ఉంటుంది. సమస్తమైన జీవులకు భయం పుట్టిస్తుంది. జీవులు చేసే హాహాకారాలతో నిండి ఉంటుంది. అది ఇంకా ఈవిధంగా ఉంటుంది.

అన్ధకారసమాయుక్తం తీక్ష్ణశృఙ్గైస్సమన్వితమ్ ।
కణ్టకైర్వృశ్చికైస్సర్పైర్వజ్రకీటైస్సుదుర్గమైః ॥ 120 ॥

దట్టమైన చీకటితో నిండి ఉంటుంది. వాడి అయిన శిఖరాలతో కూడి ఉంటుంది. ముళ్లు, తేళ్లు,పాములు, రాళ్లను కూడ లోపలినుండి తొలిచివేసే పురుగులు, వీటితో సంచరించడానికి వీలు లేకుండా ఉంటుంది.

విలుమ్పద్భిర్వృకైర్వ్యాఘ్రైర్ఋక్షైస్సింహైస్సజమ్బుకైః ।
శ్వానమార్జారగృధ్రైశ్చ సజ్వాలకవలైర్ముఖైః ॥ 121 ॥

అగ్నికీలలను కక్కుతున్న ముఖాలతో ముక్కలు ముక్కలుగా చీల్చిపడేసే తోడేళ్లు, పెద్దపులులు, ఎలుగుబంట్లు, సింహాలు, నక్కలు, కుక్కలు, పిల్లులు, గద్దలు, అక్కడ ఉంటాయి.

ప్రవేశస్తేన వై నిత్యం సర్వేషాం పాపకర్మణామ్ ॥ 122 ॥

పాపపుకర్మలు చేసినవారు అందరూ నిత్యమూ దక్షిణద్వారంద్వారా ప్రవేశిస్తారు.

యే ఘాతయన్తి విప్రాన్ గా బాలం వృద్ధం తథాఽఽతురమ్ ।
శరణాగతం సువిశ్వస్తం స్త్రియం మిత్రం నిరాయుధమ్ ॥ 123 ॥

బ్రాహ్మణులనూ, గోవులనూ, పిల్లలనూ, ముసలివాళ్లనూ,ఆపదలో ఉన్నవాళ్లనూ, శరణు కోరి వచ్చిన వాళ్లనూ, తననే గాఢంగా నమ్మిన వాళ్లనూ, ఆడవాళ్లనూ, స్నేహితులనూ, ఆయుధం లేనివాళ్లనూ చంపినవాళ్లు (దక్షిణద్వారం గుండా ప్రవేశిస్తారు.)

యేఽగమ్యాగామినో మూఢాః పరద్రవ్యాపహారిణః ।
నిక్షేపస్యాపహర్తారో విషవహ్నిప్రదాశ్చ యే ॥ 124 ॥

పొందగూడని స్త్రీలను పొందినవాళ్లూ, అజ్ఞానులూ, ఇతరుల వస్తువులను దొంగిలించినవాళ్లూ, నిధులను కాజేసినవాళ్లూ, విషం ఇచ్చినవాళ్లూ, నిప్పు పెట్టినవాళ్లూ,

పరభూమిం గృహం శయ్యాం వస్త్రాలఙ్కారహారిణః ।
పరరన్ధ్రేషు యే క్రూరా యే సదాఽనృతవాదినః ॥ 125 ॥

ఇతరుల నేలనూ, ఇంటినీ, శయ్యనూ, వస్త్రాలనూ, అలంకారాలనూ దొంగిలించినవాళ్లూ, ఇతరులలో తప్పులను వెదికే కఠినాత్ములూ, ఎప్పుడూ అసత్యమే మాట్లాడేవాళ్లూ,

గ్రామరాష్ట్రపురస్థానే మహాదుఃఖప్రదా హి యే ।
కూటసాక్షిప్రదాతారః కన్యావిక్రయకారకాః ॥ 126 ॥

గ్రామాలలోనూ, దేశాలలోనూ, నగరాలలోనూ జనాలకు అత్యధికమైన బాధలను కలిగించేవాళ్లూ, అబద్ధపుసాక్ష్యం చెప్పేవాళ్లూ, ఆడపిల్లలను అమ్ముకునేవాళ్లూ,

అభక్ష్యభక్షణరతా యే గచ్ఛన్తి సుతాం స్నుషామ్ ।
మాతరం పితరం చైవ యే వదన్తి చ పౌరుషమ్ ॥ 127 ॥

తినగూడని పదార్థాలను ఇష్టంగా తినేవాళ్లూ, కూతురినీ, కోడలినీ పొందేవాళ్లూ, తల్లిదండ్రులతో కఠినంగా మాట్లాడేవాళ్లూ,

అన్యే యే చైవ నిర్దిష్టా మహాపాతకకారిణః ।
దక్షిణేన తు తే సర్వే ద్వారేణ ప్రవిశన్తి వై ॥ 128 ॥

ఇంకా ఇతరమైన మహాపాతకాలుగా నిర్ణయించిన కర్మలు చేసినవాళ్లూ – అందరూ దక్షిణద్వారం ద్వారా యమపురంలో ప్రవేశిస్తారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసర్షిసంవాదే యమలోకస్య మార్గనిరూపణం నామ పఞ్చోత్తరశతతమోఽధ్యాయః॥105॥

శ్రీబ్రహ్మపురాణంలో వ్యాస ఋషి సంవాదంలో యమలోక మార్గ నిరూపణం అనే నూటఐదవ అధ్యాయం సంపూర్ణం.



షడుత్తరశతతమోఽధ్యాయః – నూటఆరవ అధ్యాయం

నరకగతపృథగ్యాతనాకీర్తనమ్ – నరకగత పృథగ్యాతనా కీర్తనం

మునయ ఊచుః :–వ్యాసమహర్షితో మునులు ఇలా అంటున్నారు.

కథం దక్షిణమార్గేణ పాపినో యాన్తి తత్పురమ్ ।
శ్రోతుమిచ్ఛామ తద్ బ్రూహి విస్తరేణ తపోధన ॥ 1 ॥

తపస్సంపన్నా! పాపులు యమపురానికి దక్షిణమార్గంలో ఏవిధంగా వెళ్తారు? దానిని తెలుసుకోవాలని మాకు కోరికగా ఉంది. వివరంగా చెప్పు.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

సుఘోరం తన్మహాఘోరం ద్వారం వక్ష్యామి భీషణమ్ ।
నానాశ్వాపదసఙ్కీర్ణం శివాశతనినాదితమ్ ॥ 2 ॥

యమపుర దక్షిణద్వారం చాల భయంకరంగా ఉంటుంది. మహాదారుణంగా ఉంటుంది. భయానకమైన ఆ దక్షిణద్వారం గురించి చెప్తాను. ఆ మార్గమంతటా క్రూరమైన జంతువులు నిండి ఉంటాయి. వందలకొద్దీ నక్కలు భయంకరంగా అరుస్తుంటాయి.

ఫేత్కారరవసంయుక్తమగమ్యం లోమహర్షణమ్ ।
భూతప్రేతపిశాచైశ్చ వృతం చాన్యైశ్చ రాక్షసైః ॥ 3 ॥

రకరకాల జంతువుల అరుపులతో కూడి ఉంటుంది. అక్కడికి వెళ్లడం చాల కష్టం. దాన్ని తలుచుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది. ఆ ప్రాంతమంతటా భూతాలు, ప్రేతాలు, పిశాచాలు ఆవరించి ఉంటాయి. అంతటా రాక్షసులు సంచరిస్తుంటారు.

ఏవం దృష్ట్వా మహాఘోరం ద్వారం దుష్కృతకారిణః ।
మోహం గచ్ఛన్తి సహసా త్రాసాద్ విప్రలపన్తి చ ॥ 4 ॥

మిక్కిలి భయంకరమైన దక్షిణద్వారాన్ని ఈ విధంగా చూసిన వెంటనే పాపాత్ములు మూర్ఛపోతారు. భయంతో పెద్దపెద్దగా కేకలు వేస్తారు.

తతస్తాఞ్ఛృఙ్ఖలైః పాశైర్బద్ధ్వా కర్షన్తి నిర్దయమ్ ।
తాడయన్తి చ దణ్డైశ్చ భర్త్సయన్తి పునః పునః ॥ 5 ॥

ఆ తరువాత యమకింకరులు ఆ పాపాత్ములను సంకెళ్లతోనూ, యమపాశాలతోనూ కట్టి పడేస్తారు. దయా దాక్షిణ్యాలు లేకుండా లాక్కువెళ్తారు. కఱ్ఱలతో కొడతారు. మాటిమాటికీ భయపెడుతుంటారు.

లబ్ధసంజ్ఞాస్తతస్తే వై రుధిరేణ పరిప్లుతాః ।
వ్రజన్తి దక్షిణం ద్వారం ప్రస్ఖలన్తః పదే పదే ॥ 6 ॥

యమకింకరుల దెబ్బలకు రక్తంతో తడిసిపోయిన ఆ పాపాత్ములు తెలివి వచ్చిన తరువాత అడుగడుగునా తడబడుతూ దక్షిణద్వారం గుండా ప్రయాణిస్తారు.

తీవ్రకణ్టకయుక్తేన శర్కరానిచితేన చ ।
క్షురధారానిభైస్తీక్ష్ణైః పాషాణైరన్వితేన చ ॥ 7 ॥

ఆ దారి అంతటా పదునైన ముళ్ళుంటాయి. గులకరాళ్లు ఉంటాయి. కత్తి పదునులాగా తీక్ష్ణమైన బండరాళ్లతో ఆ దారి నిండి ఉంటుంది.

క్వచిత్ పఙ్కేన నిచితా నిరుత్తారైశ్చ ఖాతకైః ।
లోహసూచీనిభైర్దర్భైస్సఞ్ఛన్నేన క్వచిత్ క్వచిత్ ॥ 8 ॥

ఒకచోట బురద బురదగా ఉంటుంది. కొన్నిచోట్ల దాటడానికి వీలు లేని గోతులు ఉంటాయి. కొన్నిచోట్ల దారి అంతా పెద్ద ఇనప సూదులవంటి ఏనుగుదంతాలు కప్పిఉంటాయి.

తటప్రపాతవిషమైః పర్వతైర్వృక్షసఙ్కులైః ।
ప్రతప్తాఙ్గారయుక్తేన యాన్తి మార్గేణ దుఃఖితాః ॥ 9 ॥

అంచుల వెంట కొండల పైనుండి బండరాళ్లు దొర్లి పడుతుంటాయి. పెద్దపెద్ద చెట్లు గుంపులుగా ఉంటాయి. దారి అంతా బాగా మండుతున్న నిప్పుకణికలతో నిండి ఉంటుంది. అటువంటి దారివెంట పాపాత్ములు ఏడుస్తూ ప్రయాణం చేస్తుంటారు.

క్వచిద్విషమగర్తాభిః క్వచిల్లోష్టైస్సుపిచ్ఛిలైః ।
సుతప్తవాలుకాభిశ్చ తథా తీక్ష్ణైశ్చ శఙ్కుభిః ॥ 10 ॥

ఆ దారిలో కొన్నిచోట్ల లోతైన గుంటలు ఉంటాయి. కొన్నిచోట్ల మట్టిపెళ్లలు జారిపడుతుంటాయి. కొన్నిచోట్ల బాగా వేడెక్కిన ఇసుకదిబ్బలు ఉంటాయి. మరికొన్నిచోట్ల పదునైన కఱ్ఱముక్కలు ఉంటాయి.

అయశ్శృఙ్గాటకైస్తప్తైః క్వచిద్దావాగ్నినా యుతమ్ ।
క్వచిత్తప్తశిలాభిశ్చ క్వచిద్ వ్యాప్తం హిమేన చ ॥ 11 ॥

నాలుగు దారులు కలిసేచోట్ల నేల ఇనుములాగా కాలిపోతూ ఉంటుంది. కొన్నిచోట్ల దావాగ్ని వ్యాపించి ఉంటుంది. కొన్నిచోట్ల రాళ్లు బాగా కాలిపోతూ ఉంటాయి. మరికొన్నిచోట్ల మంచు నిండి ఉంటుంది.

క్వచిద్వాలుకయా వ్యాప్తమాకణ్ఠాన్తఃప్రవేశయా ।
క్వచిద్దుష్టామ్బునా వ్యాప్తం క్వచిత్ కర్షాగ్నినా పునః ॥ 12 ॥

కొన్నిచోట్ల ఇసుక గొంతుదాకా కూరుకుపోయేవిధంగా వ్యాపించి ఉంటుంది. కొన్నిచోట్ల మురుగునీరు ప్రవహిస్తుంటుంది. మరికొన్నిచోట్ల మండుతున్న నిప్పు నిండిఉంటుంది.

క్వచిత్ సింహైర్వృకైర్వ్యాఘ్రైర్దంశకీటైశ్చ దారుణైః ।
క్వచిన్మహాజలౌకాభిః క్వచిచ్చాజగరైః పునః ॥ 13 ॥

కొన్నిచోట్ల సింహాలు, తోడేళ్లు, పెద్దపులులు, క్రూరంగా కరిచే ఈగలు, పెద్దజలగలు, కొండచిలువలు,

మక్షికాభిశ్చ రౌద్రాభిః క్వచిత్సర్పవిషోల్బణైః ।
క్వచిద్దుష్టగజై శ్చైవ బలోన్మత్తైః ప్రమాథిభిః ॥ 14 ॥

తేనెటీగలు, మిక్కిలి భయంకరమైన విషం కక్కే పాములు, మిక్కుటమైన బలంతో పిచ్చెత్తి, బాధించే దుర్మార్గపుఏనుగులు,

పన్థానముల్లిఖద్భిశ్చ తీక్ష్ణశృఙ్గైర్మహావృషైః ।
మహాశృఙ్గైశ్చ మహిషైరుష్ట్రైర్మత్తైశ్చ ఖాదనైః ॥ 15 ॥

వాడి అయిన కొమ్ములతో నేలరాచే పెద్ద ఎద్దులు, పెద్దపెద్ద కొమ్ములు కలిగిన దున్నపోతులు, తిండిపోతులై మదించిన ఒంటెలు,

డాకినీభిశ్చ రౌద్రాభిర్వికరాలైశ్చ రాక్షసైః ।
వ్యాధిభిశ్చ మహారౌద్రైః పీడ్యమానా వ్రజన్తి తే ॥ 16 ॥

భీషణమైన డాకినీపిశాచాలు, ఇంకా భయంకరమైన రాక్షసులు, తీవ్రమైన రోగాలు, పీడిస్తుండగా పాపాత్ములు ఆ ద్వారంగుండా యమపురానికి వెళ్తారు.

మహాధూలివిమిశ్రేణ మహాచణ్డేన వాయునా ।
మహాపాషాణవర్షేణ హన్యమానా నిరాశ్రయాః ॥ 17 ॥

గొప్ప దుమ్ముతో నిండి, భయంకరమైన సుడిగాలిచేతనూ, పెద్దరాళ్లవానచేతనూ మిక్కిలిగా బాధలు పడుతూ దిక్కుమాలినవారై, పాపాత్ములు ప్రయాణం చేస్తుంటారు.

క్వచిద్విద్యున్నిపాతేన దీర్యమాణా వ్రజన్తి తే ।
మహతా బాణవర్షేణ ఛిద్యమానాశ్చ సర్వశః ॥ 18 ॥

కొన్నిచోట్ల మెరుపులు మీదపడుతుండగా, శరీరం చితికిపోతుండగా వెళ్తుంటారు. అన్నివైపులనుండి బాణాలు మిక్కుటంగా వర్షిస్తుండగా శరీరం ముక్కలై పోతుండగా పాపాత్ములు ఆ ద్వారంవెంట ప్రయాణిస్తారు.

పతద్భిర్వజ్రసఙ్ఘాతైరుల్కాపాతైస్సుదారుణైః ।
ప్రదీప్తాఙ్గారవర్షేణ దహ్యమానా విశన్తి చ ॥ 19 ॥

వజ్రాల గుంపులలాగా భయంకరమైన పిడుగులు పడుతుండగా, కణకణలాడే నిప్పుల వానలో తగల బడిపోతూ పాపాత్ములు దక్షిణద్వారంద్వారా ప్రవేశిస్తారు.

మహతా పాంశువర్షేణ పూర్యమాణా రుదన్తి చ ।
మేఘారావై స్సుఘోరైశ్చ విత్రాస్యన్తే ముహుర్ముహుః ॥ 20 ॥

ధూళి దట్టంగా కురుస్తుండగా, ఆ దుమ్ములో మునిగిపోయి ఏడుస్తారు. దారుణమైన ఉరుముల ధ్వనులకు మాటిమాటికీ భయపడిపోతుంటారు.

నిశ్శేషాశ్శరవర్షేణ చూర్ణ్యమాణాశ్చ సర్వతః ।
మహాక్షారామ్బుధారాభిస్సిచ్యమానా వ్రజన్తి చ ॥ 21 ॥

బాణాలు వర్షంలాగా కురుస్తుండగా ఒళ్లంతా పొడిపొడి అయిపోతుంటుంది. ఉప్పునీళ్లు పెద్దపెద్ద ధారలుగా కురుస్తుండగా తడిసి ముద్దైపోతూ పాపాత్ములు ఆ దారిలో వెళ్తుంటారు.

మహాశీతేన మరుతా రూక్షేణ పరుషేణ వా ।
సమన్తాద్దీర్యమాణాశ్చ శుష్యన్తే సఙ్కుచన్తి చ ॥ 22 ॥

శుష్కింపజేసే, కఠినమైన మిక్కిలి చలిగాలివల్ల ఒళ్లు పగిలి, ఎండి, ముడుచుకుపోతుంటారు.

ఇత్థం మార్గేణ పురుషాః పాథేయరహితేన చ ।
నిరాలమ్బేన దుర్గేణ నిర్జలేన సమన్తతః ॥ 23 ॥

యమపురానికి వెళ్లే దారిలో ఎక్కడా తినడానికి తిండి ఉండదు. తాగడానికి నీళ్లు ఉండవు. తల దాచుకోవడానికి చోటు ఉండదు. ఆ దారివెంట ప్రయాణించడం చాల కష్టం.

అతిశ్రమేణ మహతా నిర్గతేనాఽఽ శ్రమాయ వై ।
నీయన్తే దేహినస్సర్వే యే మూఢాః పాపకర్మిణః ॥
యమదూతైర్మహాఘోరైస్తదాజ్ఞాకారిభిర్బలాత్ ॥ 24 ॥

ఆ మార్గంలో వెళ్లడం చాల శ్రమ. యముడి ఆజ్ఞని నిర్వర్తించే, మిక్కిలి భయంకరులైన యమకింకరులు పాపాత్ములూ, మూర్ఖులూ, అయిన జీవులందరినీ ఆ మార్గంలో బలవంతంగా యమపురానికి తీసుకువెళ్తారు.

ఏకాకినః పరాధీనా మిత్రబన్ధువివర్జితాః ।
శోచన్తస్స్వాని కర్మాణి రుదన్తి చ ముహుర్ముహుః ॥ 25 ॥

యమకింకరులకు వశమై, చుట్టాలు గాని, స్నేహితులు కాని, ఎవ్వరూ తోడు లేకుండా, ఒంటరిగా, తాము చేసిన పాపకర్మలను తలచుకుని దుఃఖిస్తూ, జీవులు మాటిమాటికి ఏడుస్తుంటారు.

ప్రేతీభూతా నిషిద్ధాస్తే శుష్కకణ్ఠౌష్ఠతాలుకాః ।
కృశాఙ్గా భీతభీతాశ్చ దహ్యమానాః క్షుధాగ్నినా ॥ 26 ॥

ప్రేతలుగా మారినవారిని యమదూతలు ఏడవవద్దని నిషేధిస్తారు. ఆ జీవులకు గొంతు, పెదవులు, దౌడలు తడిఆరిపోతాయి. బాగా నీరసించిపోతారు. మిక్కిలిగా భయపడుతూ, ఆకలిమంటలతో దహించుకుపోతూ ఆ దారి వెంట ప్రయాణిస్తారు.

బద్ధాశ్శృఙ్ఖలయా కేచిత్ కేచిదుత్తానపాదయోః ।
ఆకృష్యన్తే శుష్యమాణా యమదూతైర్బలోత్కటైః ॥ 27 ॥

మిగుల బలవంతులైన యమదూతలు కొందరు జీవులను సంకెళ్లతో బంధించీ, కొందరిని కాళ్లు పైకి ఉండే విధంగానూ, వారు నీరసించిపోతుంటే బలవంతంగా లాక్కువెళ్తారు.

నరా అధోముఖాశ్చాన్యే కృష్యమాణాస్సుదుఃఖితాః ।
అన్నపానీయరహితా యాచమానాః పునఃపునః ॥ 28 ॥

కొందరిని తలక్రిందులుగా లాక్కుపోతుంటారు. అప్పుడు వాళ్లు తిండి, నీళ్లు లేక మాటిమాటికి వాటిని అడుక్కుంటూ, పెద్దగా ఏడుస్తుంటారు.

దేహి దేహీతి భాషన్తస్స్రాశ్రుగద్గదయా గిరా ।
కృతాఞ్జలిపుటా దీనాః క్షుత్తృష్ణాపరిపీడితాః ॥ 29 ॥

వాళ్లు ఆకలితోనూ దప్పికతోనూ ఎంతో బాధపడుతూ, చేతులు జోడించి, దీనంగా, కళ్ల నీళ్లు పెట్టుకుని, గద్గదస్వరంతో దేహి, దేహి అని వేడుకుంటారు.

భక్ష్యానుచ్చావచాన్ దృష్ట్వా భోజ్యాన్ పేయాంశ్చ పుష్కలాన్ ।
సుగన్ధద్రవ్యసంయుక్తాన్ యాచమానాః పునః పునః ॥ 30 ॥

గొప్పవైన రకరకాల తిండ్లూ, పిండివంటలూ, పానీయాలూ, సుగంధద్రవ్యాలతో కూడినవీ, సమృద్ధిగా ఉండగా చూచి, వాటిని మాటిమాటికీ అడుక్కుంటూ ఉంటారు.

దధిక్షీరఘృతోన్మిశ్రం దృష్ట్వా శాల్యోదనం తథా ।
పానాని చ సుగన్ధీని శీతలాన్యుదకాని చ ॥ 31 ॥

తాన్ యాచమానాంస్తే యామ్యా భర్త్సయన్తస్తదాబ్రువన్ ।
వచోభిః పరుషైర్భీమాః క్రోధరక్తాన్తలోచనాః ॥ 32 ॥

పాలతో, పెరుగుతో, నేతితో కూడిన వరి అన్నాన్నీ, మంచి పరిమళం కలిగిన పానీయాలనూ, చల్లని నీళ్లనూ చూచి, ఇమ్మని అడుగుతుండగా, భయంకరులైన యమదూతలు కోపంతో ఎఱ్ఱబడిన కళ్లతో భయపెడుతూ, ఆ జీవులతో కఠినంగా ఇలా మాట్లాడతారు.

యామ్యా ఊచుః :-నరకానికి వెళ్తున్న జీవులతో యమదూతలు ఇలా అంటున్నారు.

న భవద్భిర్హుతం కాలే న దత్తం బ్రాహ్మణేషు చ ।
ప్రసభం దీయమానం చ వారితం చ ద్విజాతిషు ॥
తస్య పాపస్యచ ఫలం భవతాం సముపాగమత్ ॥ 33 ॥

మీరు సకాలంలో హోమాలు చేయలేదు. బ్రాహ్మణులకు ఏమీ దానం చేయలేదు. బ్రాహ్మణులకు ఇతరులు దానం చేస్తుండగా గట్టిగా అడ్డుపడ్డారు. ఆపాపానికి ఫలితమే ఇప్పుడు మీకు ఈవిధంగా తగిలింది.

నాగ్నౌ దగ్ధం జలే నష్టం న హృతం నృపతస్కరైః ।
కుతోవా సాంప్రతం విప్రే యన్న దత్తం పురాఽధమాః ॥ 34 ॥

నీచులారా! పూర్వం మీరు బ్రాహ్మణులకు దానం చేయకుండా దాచిన సొమ్ము ఇప్పుడు ఎక్కడుంది? అది నిప్పుల్లో తగలబడలేదు. నీళ్లలో మునిగిపోలేదు. రాజులు కాని, దొంగలు కాని అపహరించలేదు. (ఆ పాపఫలమే ఇప్పుడు మీరు అనుభవిస్తున్నారు)

యైర్దత్తాని తు దానాని సాధుభిస్సాత్త్వికాని తు ।
తేషామేతే ప్రదృశ్యన్తే కల్పితాహ్యన్నపర్వతాః ॥ 35 ॥

బ్రాహ్మణాదులకు ప్రతిఫలాపేక్షాదులు లేకుండా, సాత్త్వికదానాలు చేసిన సజ్జనులైన పుణ్యాత్ములకోసమే ఈ కనబడుతున్న కొండంతటి అన్నరాశులు ఏర్పాటుచేయబడ్డాయి.

భక్ష్యా భోజ్యాశ్చ పేయాశ్చ లేహ్యాశ్చోష్యాశ్చ సంవృతాః ।
న యూయమభిలష్యధ్వే న దత్తం చ కథంచన ॥ 36 ॥

పిండివంటలు, రుచికరమైన ఇతర వంటకాలు, పానీయాలు, పచ్చళ్లు, పులుసులు, మొదలైన పదార్థాలు అన్నీ ఇక్కడ చేరి ఉంటాయి. వీటిని మీరు కోరకూడదు. మీకు ఇవ్వడం ఎంతమాత్రమూ జరగదు.

యైస్తు దత్తం హుతం చేష్టం బ్రాహ్మణాశ్చైవ పూజితాః ।
తేషామన్నం సమానీయ ఇహ నిక్షిప్యతే సదా ॥ 37 ॥

దానాలూ, హోమాలూ, యజ్ఞాలూ చేసిన వాళ్లకోసం, బ్రాహ్మణులను పూజించిన వాళ్లకోసం అన్నం తెచ్చి, ఇక్కడ ఉంచడం జరిగింది.

పరస్వం కథమస్మాభిర్దాతుం శక్యేత నారకాః ॥ 38 ॥

నరకానికి వెళ్లవలసిన పాపులారా! ఆ పుణ్యాత్ములకు సంబంధించిన ఈ సొత్తును మీకు ఇవ్వడం సాధ్యం కాదు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

కిఙ్కరాణాం వచశ్శ్రుత్వా నిస్స్పృహాః క్షుత్తృషార్దితాః ।
తతస్తే దారుణైశ్శాస్త్రైః పీడ్యన్తే యమకిఙ్కరైః ॥ 39 ॥

ఆకలిదప్పులతో అలమటిస్తున్న ఆ జీవులు యమకింకరుల మాటలు విని, ఆహార పానీయాలపై ఆశ వదులుకున్నారు. యమకింకరులు తీక్ష్ణమైన ఆయుధాలతో వారిని ఇంకా బాధించారు.

ముద్గరైర్లోహదణ్డైశ్చ శక్తితోమరపట్టిశైః ।
పరిఘైర్భిన్దిపాలైశ్చ గదాపరశుభిశ్శరైః ॥ 40 ॥

పృష్ఠతో హన్యమానాశ్చ యమదూతైస్సునిర్దయైః ।
అగ్రతస్సింహవ్యాఘ్రాద్యైర్భక్ష్యన్తే పాపకారిణః ॥ 41 ॥

ఇనప గదలు, ఇనప దుడ్డుకఱ్ఱలు, శక్తి, తోమరం, పట్టిశం, పరిఘ, భిందిపాలం, గద, గొడ్డలి, బాణం అనే ఆయుధాలతో, కఠినాత్ములైన యమకింకరులు పాపాత్ములైన జీవులను వెనకనుంచి రకరకాలుగా హింసిస్తారు. సింహాలు, పులులు మొదలైనవి ఎదురుగా ఉండి వారిని తింటాయి.

న ప్రవేష్టుం న నిర్గన్తుం లభన్తే దుఃఖితా భృశమ్ ।
స్వకర్మోపహతాః పాపాః క్రన్దమానాస్సుదారుణాః ॥ 42 ॥

పాపాత్ములైన ఆ జీవులు తాము చేసిన పాపకర్మలకు ఫలితంగా ఎదుట క్రూరజంతువులూ, వెనక యమ కింకరులూ హింసిస్తుండగా ముందుకూ వెళ్లలేక, వెనకకూ వెళ్లలేక భయంకరంగా కేకలు వేస్తూ, మిక్కిలిగా దుఃఖిస్తుంటారు.

తత్ర సమ్పీడ్య సుభృశం ప్రవేశం యమకిఙ్కరైః ।
నీయన్తే పాపినస్తత్ర యత్ర తిష్ఠేత్ స్వయం యమః ॥
ధర్మాత్మా ధర్మకృద్దేవస్సర్వసంయమనో యమః ॥ 43 ॥

యమకింకరులు అక్కడ పాపాత్ములైన జీవులను దారుణంగా బాధిస్తారు. యముడు స్వయంగా నెలకొని ఉన్నచోటికి వారిని తీసుకుని వెళ్తారు. ఆ యముడు ధర్మస్వరూపుడు. ధర్మాన్ని ఏర్పరిచినవాడు. జీవులందరినీ శాసించేవాడు. అతడు మృత్యుదేవత. చక్కగా ప్రకాశిస్తాడు.

ఏవం పథాతికష్టేన ప్రాప్తాః ప్రేతపురం నరాః ।
ప్రజ్ఞాపితాస్తదా దూతైర్నివేశ్యన్తే యమాగ్రతః ॥ 44 ॥

ఈవిధంగా జీవులు అనేకమైన బాధలతో నిండిన మార్గంలో ప్రయాణించి, ప్రేతలు ఉండే యమనగరానికి చేరుకుంటారు. యముడి అనుమతితో యమకింకరులు వారిని యమధర్మరాజు ఎదుట ప్రవేశపెడతారు.

తత స్తేపాపకర్మాణ స్తం పశ్యన్తి భయానకమ్ ।
పాపాపవిద్ధనయనా విపరీతాత్మబుద్ధయః ॥ 45 ॥

అప్పుడు దుష్టమైన ఆలోచనలతో కళ్లు మూసుకుపోయినవారు, ఆత్మజ్ఞాన విరహితులూ అయి, పాపకర్మలు చేసిన ఆ జీవులు భయంకరంగా ఉన్న యముడిని ప్రత్యక్షంగా చూస్తారు.

దం ష్ట్రాకరాలవదనం భ్రుకుటీకుటిలేక్షణమ్ ।
ఊర్ధ్వకేశం మహాశ్మశ్రుం ప్రస్ఫురదధరోత్తరమ్ ॥ 46 ॥

ఆ యముడిముఖం పెద్దపెద్ద కోరలతో భీకరంగా ఉంటుంది. ముడిపడిన కనుబొమ్మలతో చూపులు వంకరగా ఉంటాయి. జుట్టు పైకి నిక్కబొడుచుకుని ఉంటుంది. పెద్దపెద్ద మీసాలు, గడ్డాలు ఉంటాయి. పెదవులు అదురుతూ ఉంటాయి.

అష్టాదశభుజం క్రుద్ధం నీలాఞ్జనచయోపమమ్ ।
సర్వాయుధోద్యతకరం తీవ్రదణ్డేన సంయుతమ్ ॥ 47 ॥

యముడికి పద్దెనిమిది బాహువులు ఉంటాయి. కోపంగా ఉంటాడు. రాశిపోసిన కాటుకలాగా నల్లగా ఉంటాడు. చేతులలో అన్నిరకాలైన ఆయుధాలు పైకి లేచి (కొట్టడానికి సిద్ధంగా) ఉంటాయి. తీక్షణమైన యమదండం ధరించి ఉంటాడు.

మహామహిషమారూఢం దీప్తాగ్నిసమలోచనమ్ ।
రక్తమాల్యామ్బరధరం మహామేఘ మివోచ్ఛ్రితమ్ ॥ 48 ॥

పెద్ద దున్నపోతుమీద ఎక్కి కూర్చుంటాడు. కళ్లు మండుతున్న అగ్నిలాగా ఉంటాయి. ఎఱ్ఱని పూలమాలలు, ఎఱ్ఱని వస్త్రాలు ధరించి ఉంటాడు. పెద్ద మేఘంలాగా బాగా ఎత్తుగా ఉంటాడు.

ప్రలయామ్బుదనిర్ఘోషం పిబన్తఇ్వ మహోదధిమ్ ।
గ్రసన్తమివ త్రైలోక్యముద్గిరన్తమివానలమ్ ॥ 49 ॥

ప్రళయకాలంనాటి మేఘంలాగా గర్జిస్తుంటాడు. మహాసముద్రాలను తాగుతున్నట్లుగా, మూడులోకాలను మింగివేస్తున్నట్లుగా నిప్పులు కక్కుతున్నట్లుగా ఉంటాడు.

మృత్యుం చ తత్సమీపస్థం కాలానలసమప్రభమ్ ।
ప్రలయానలసఙ్కాశం కృతాన్తం చ భయానకమ్ ॥ 50 ॥

యముడికి ప్రక్కనే మృత్యువు ఉంటుంది. ఆ మృత్యువు ప్రళయకాలపు అగ్నివంటి తేజస్సు కలిగి ఉంటుంది. ప్రళయాగ్నిలాగా భయంకరంగానూ, సర్వవినాశకరంగానూ ఉంటుంది.

మారీ చోగ్రా మహామారీ కాలరాత్రీ చ దారుణా ।
వివిధా వ్యాధయః కష్టా నానారూపా భయావహాః ॥ 51 ॥

ఉగ్రమైన మారి, మహామారి, భయంకరమైన కాళరాత్రి, రకరకాలైన రోగాలు, భయం కలిగించే అనేకవిధమైన కష్టాలు అక్కడే యముడికి సమీపంలో ఉంటాయి.

శక్తిశూలాఙ్కుశధరాః పాశచక్రాసిధారిణః ।
వజ్రదణ్డధరా రౌద్రాః క్షురతూణధనుర్ధరాః ॥ 52 ॥

అక్కడ యమభటులు శక్తి, శూలం, అంకుశం, పాశం, చక్రం, కత్తి, వజ్రాలతో నిర్మించిన దండం, మంగలికత్తి, అమ్ములపొది, విల్లు, అనే ఆయుధాలు ధరించి ఉంటారు.

అసఙ్ఖ్యాతా మహావీర్యాః క్రూరాశ్చాఞ్జనసప్రభాః ।
సర్వాయుధోద్యతకరా యమదూతా భయానకాః ॥ 53 ॥

యమకింకరులు లెక్క లేనంతమంది ఉంటారు. వాళ్లు అందరూ గొప్పబలవంతులు. క్రూరులు. కాటుకతో సమానమైన నల్లనిచాయ కలిగినవారు. అన్నిరకాల ఆయుధాలను ధరించి, వాటిని ప్రయోగించడానికి సిద్ధంగా ఉంటారు. వారు మిక్కిలి భయంకరంగా ఉంటారు.

అనేన పరివారేణ మహాఘోరేణ సంవృతమ్ ।
యమం పశ్యన్తి పాపిష్ఠాశ్చిత్రగుప్తం విభీషణమ్ ॥ 54 ॥

చుట్టూ ఇటువంటి దారుణమైన పరివారం కలిగిన యముడిని పాపాత్ములు దర్శిస్తారు. యముడి సమీపంలో మిగుల భయంకరంగా ఉండే చిత్రగుప్తుడిని కూడ పాపులు చూస్తారు.

నిర్భర్త్సయతి చాత్యర్థం యమస్తాన్ పాపకారిణః ।
చిత్రగుప్తస్తు భగవాన్ ధర్మవాక్యైః ప్రబోధయన్ ॥ 55 ॥

పాపకర్మలు చేసిన ఆ జీవులను యముడు మిక్కిలిగా బెదిరిస్తాడు. మహాత్ముడైన చిత్రగుప్తుడు మాత్రం ధర్మయుక్తమైన మాటలతో వారికి మంచి బోధలు చేస్తాడు.

చిత్రగుప్త ఉవాచ :–పాపకర్ములతో చిత్రగుప్తుడు ఇలా చెప్తున్నాడు.

భో భో దుష్కృతకర్మాణః పరద్రవ్యాపహారిణః ।
గర్వితా రూపవీర్యేణ పరదారవిమర్దకాః ॥ 56 ॥

ఓ పాపకర్మలు చేసిన వారలారా! ఇతరుల వస్తువులను కాజేసిన వారలారా! అందంచేతనూ, బలంచేతనూ అహంకరించిన వారలారా! ఇతరుల భార్యలను స్వీకరించిన వారలారా!

యత్ స్వయం క్రియతే కర్మ తత్ స్వయం భుజ్యతే పునః ।
తత్ కిమాత్మోపఘాతార్థం భవద్భిర్దుష్కృతం కృతమ్ ॥ 57 ॥

మీరు స్వయంగా చేసుకున్న ఆయా పాపకర్మల ఫలితాన్ని మీరు స్వయంగా అనుభవించవలసిందే. మిమ్మల్ని మీరు హింసించుకోవడానికే మీరు ఆవిధమైన పాపకర్మలు చేశారు.

ఇదానీం కిం ను శోచధ్వం పీడ్యమానాస్స్వకర్మభిః ।
భుఙ్క్ష్వధ్వం స్వాని దుఃఖాని న హి దోషోఽస్తి కస్యచిత్ ॥ 58 ॥

ఇప్పుడు విచారిస్తారెందుకు? మీరు చేసుకున్న కర్మలకు ఫలితంగానే బాధలు అనుభవిస్తున్నారు. మీరు స్వయంగా సంపాదించుకున్న బాధలను అనుభవించండి. ఇక్కడ ఎవ్వరి తప్పులేదు.

య ఏతే పృథివీపాలాస్సమ్ప్రాప్తా మత్సమీపతః ।
స్వకీయైః కర్మభిర్ఘోరై ర్దుష్ప్రజ్ఞా బలగర్వితాః ॥ 59 ॥

ఈ రాజులందరూ దుర్బుద్ధితోనూ, బలవంతులమనే గర్వంతోనూ తాము చేసిన దారుణమైన కర్మలకు ఫలితంగానే నా దగ్గరకు వచ్చారు.

భో భో నృపా దురాచారాః ప్రజావిధ్వంసకారిణః ।
అల్పకాలస్య రాజ్యస్య కృతే కిం దుష్కృతం కృతమ్ ॥ 60 ॥

ఓ మహారాజులారా! మీరు దుర్మార్గాలు చేశారు. ప్రజలను పీడించి నాశనం చేశారు. ఏదో కొద్దికాలం రాజ్యాన్ని పరిపాలించడం(రాజభోగాల)కోసం ఎంతటి పాపం చేశారు.

రాజ్యలోభేన మోహేన బలాదన్యాయతః ప్రజాః ।
యద్దణ్డితాః ఫలం తస్య భుఙ్క్ష్వధ్వమధునా నృపాః ॥ 61 ॥

ఓ రాజులారా! రాజ్యంపైన అత్యాశతోనూ, అజ్ఞానంతోనూ, బలంతో ప్రజలను అన్యాయంగా శిక్షించినందు వలన కలిగిన ఫలితాన్ని ఇప్పుడు అనుభవించండి.

కుతో రాజ్యం కలత్రం చ యదర్థమశుభం కృతమ్ ।
తత్సర్వం సమ్పరిత్యజ్య యూయమేకాకినః స్థితాః ॥ 62 ॥

యే రాజ్యం కోసం, యే భార్యకోసం పాపకర్మలు చేశారో, ఆ భార్యరాజ్యం ఇప్పుడెక్కడ? రాజ్యం, భార్య మొదలైనవన్నీ విడిచిపోగా, మీరు (మీ పాపఫలం అనుభవించడానికి) ఏకాకులుగా మిగిలిపోయారు.

పశ్యామో న బలం సర్వం యేన విధ్వంసితాః ప్రజాః ।
యమదూతైః పాట్యమానో అధునా కీదృశం ఫలమ్ ॥ 63 ॥

ఏ బలగర్వంతో ప్రజలను హింసించారో ఆ బలం సమస్తం ఇపుడు కనబడకుండా పోయింది. ఇప్పుడు యమదూతలు వచ్చి, మిమ్మల్ని చావగొడుతున్నారు. మీరు సుఖం కోరుకుని చేసిన పాపాలవలన ఎటువంటి ఫలితం వచ్చిందో చూశారా?

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఏవం బహువిధైర్వాక్యైరుపాలబ్ధా యమేన తే ।
శోచన్తః పాపకర్మాణి తూష్ణీం తిష్ఠన్తి పార్థివాః ॥ 64 ॥

యముడు అనేకవిధమైన మాటలతో ఆ రాజులను వ్యంగ్యంగా నిందించాడు. అప్పుడు ఆ రాజులు పూర్వం తాము చేసిన పాపకర్మలను తలచుకుని చింతిస్తూ కూర్చున్నారు.

ఇతి కర్మ సమాదిశ్య నృపాణాం ధర్మరాట్ స్వయమ్ ।
తత్పాతకవిశుద్ధ్యర్థమిదం వచనమబ్రవీత్ ॥ 65 ॥

ఈవిధంగా యమధర్మరాజు స్వయంగా వారు చేసిన పాపకర్మలను గూర్చి చెప్పమని చిత్రగుప్తుడిని ఆదేశించి, వారి పాపాలు శుద్ధికావడంకోసం ఇలా అన్నాడు.

యమ ఉవాచ :-యముడు తన దూతలతో ఇలా చెప్తున్నాడు.

భో భోశ్చణ్డ మహాచణ్డ గృహీత్వా నృపతీనిమాన్ ।
విశోధయధ్వం పాపేభ్యః క్రమేణ నరకాగ్నిషు ॥ 66 ॥

ఓయీ చండా! ఓయీ మహాచండా! ఈ రాజులను తీసుకుని వరుసగా వివిధమైన నరకాలలోని నిప్పులలో పడేసి, వీళ్ల పాపాలను కడిగివేయండి.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

తతశ్శీఘ్రం సముత్థాయ నృపాన్ సఙ్గృహ్య పాదయోః ।
భ్రామయిత్వా తు వేగేన క్షిప్త్వా చోర్ధ్వం ప్రగృహ్య చ ॥ 67 ॥

యముడి ఆజ్ఞ అయిన వెంటనే ఆ యమదూతలు రాజుల కాళ్లు పట్టుకుని, గిరగిరా త్రిప్పి పైకి ఎగురవేశారు. పైనుంచి కింద పడుతున్న వాళ్లను మళ్లీ పట్టుకున్నారు.

తత్తత్ పాపప్రమాణేన యమదూతాశ్శిలాతలే ।
ఆస్ఫోటయన్తి తరసా వజ్రేణేవ మహాద్రుమమ్ ॥ 68 ॥

యమదూతలు ఆ రాజులు చేసిన పాపాల పరిమాణానికి అనుగుణంగా వారిని బండరాళ్లపై వేసి గట్టిగా చితకబాదారు. అది మహావృక్షాన్ని పిడుగు నాశనం చేసిన విధంగా ఉంది.

తతస్తు రక్తం స్రోతోభిస్స్రవతే జర్జరీకృతః ।
నిస్సంజ్ఞస్స తదా దేహీ నిశ్చేష్టశ్చ ప్రజాయతే ॥ 69 ॥

అప్పుడు వారి ఒంటినిండా రక్తం ప్రవాహంలాగా కారిపోతున్నది. శరీరం చితికిపోతుంది. తెలివితప్పి పడిపోతారు. చేష్టలు ఆగిపోతాయి.

తతస్స వాయునా స్పృష్టశ్శనైరుజ్జీవతే పునః ।
నరం పాపవిశుద్ధ్యర్థం క్షిపన్తి నరకార్ణవే ॥ 70 ॥

ఆ తరువాత ఆ శరీరానికి గాలి తాకగా, ఆ జీవుడు మెల్లగా తెలివిలోకి వస్తాడు. ఆ జీవుడిని వాడుచేసిన పాపాలు శుద్ధి కావడానికి సముద్రంవంటి నరకంలోకి విసిరేస్తారు.

అన్యాంశ్చ తే తదా దూతాః పాపకర్మరతాన్నరాన్ ।
నివేదయన్తి విప్రేన్ద్రా యమాయ భృశదుఃఖితాన్ ॥ 71 ॥

బ్రాహ్మణోత్తములారా! బుద్ధిపూర్వకంగా పాపాలను చేసిన ఇతర (రాజులకంటె వేరైన) మానవులను కూడ వారు పెద్దగా ఏడుస్తుండగా, యమభటులు తీసుకువెళ్లి, యముడికి అప్పగిస్తారు.

యమదూతా ఊచుః :–యముడితో యమదూతలు ఇలా అంటున్నారు.

ఏష దేవ తవాదేశాదస్మాభిర్మోహితో భృశమ్ ।
ఆనీతో ధర్మవిముఖస్సదా పాపరతః పరః ॥ 72 ॥

మహాత్మా! నీ ఆజ్ఞప్రకారం మేము వీడిని మోహంలో ముంచి తీసుకుని వచ్చాము. ఇతడు అధర్మపరుడు. నిత్యమూ పాపాలు విడువకుండా చేస్తూనే ఉంటాడు.

ఏష లుబ్ధో దురాచారో మహాపాతకసంయుతః ।
ఉపపాతకకర్తా చ సదా హింసారతోఽశుచిః ॥ 73 ॥

వీడు పెద్ద పిసినిగొట్టు. ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించాడు. మహాపాపాలు, ఉపపాతకాలు చేశాడు. ఎప్పుడూ ఇతరులను హింసించేవాడు. మురికిగా ఉంటాడు.

అగమ్యగామీ దుష్టాత్మా పరద్రవ్యాపహారకః ।
కన్యాక్రయీ కూటసాక్షీ కృతఘ్నో మిత్రవఞ్చకః ॥ 74 ॥

పొందకూడని వాళ్లను పొందాడు. దుర్మార్గమైన బుద్ధి కలవాడు. ఇతరుల వస్తువులను అపహరించాడు. కన్యలను అమ్ముకున్నాడు. అబద్ధపు సాక్ష్యం చెప్పాడు. చేసిన మంచిని మరిచిపోయేవాడు. స్నేహితులను (నమ్మినవాళ్లను) మోసం చేశాడు.

అనేన మదమత్తేన సదా ధర్మో వినిన్దితః ।
పాపమాచరితం కర్మ మర్త్యలోకే దురాత్మనా ॥ 75 ॥

గర్వంతో కళ్లు మూసుకుపోయి ఎల్లప్పుడూ ధర్మాన్ని నిందించేవాడు. ఈ దుర్మార్గుడు మానవలోకంలో ఎన్నో పాపకర్మలు చేశాడు.

ఇదానీమస్య దేవేశ నిగ్రహానుగ్రహౌ వద ।
ప్రభురస్య క్రియాయోగే వయం వా పరిపన్థినః ॥ 76 ॥

దేవదేవా! కోపంతో శిక్షిస్తావో, దయతో రక్షిస్తావో చెప్పు. నిర్ణయించవలసిన అధికారివి నీవే. మేము నీవు ఎలా చెబితే ఆప్రకారం చేసే కింకరులం.

వ్యాస ఉవాచ :–మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

ఇతి విజ్ఞాప్య దేవేశం న్యస్యాగ్రే పాపకారిణమ్ ।
నరకాణాం సహస్రేషు లక్షకోటిశతేషు చ ॥ 77 ॥

యమకింకరులు పాపకర్మలు చేసినవాడిని ఎదుట నిలిపి, అతడు చేసిన పాపకర్మలను గురించి ఈవిధంగా యమధర్మరాజుకు విన్నవిస్తారు. తరువాత యముడి ఆజ్ఞప్రకారం వారిని వందలు, వేలు, లక్షలు, కోట్లసంఖ్యలో ఉన్న నరకాలలో పడేస్తారు.

కిఙ్కరాస్తే తతో యాన్తి గ్రహీతుమపరాన్నరాన్ ॥ 78 ॥

ఆ తరువాత యమకింకరులు ఇతర జీవులను యమలోకానికి తీసుకురావడానికి వెళ్తారు.

ప్రతిపన్నే కృతే దోషే యమో వై పాపకారిణామ్ ।
సమాదిశతి తాన్ ఘోరాన్నిగ్రహాయ స్వకిఙ్కరాన్ ॥
యథా యస్య వినిర్దిష్టో వసిష్ఠాద్యైర్వినిగ్రహః ॥ 79 ॥

పాపకర్మలు చేసినవారి దోషం నిశ్చయించిన తరువాత యముడు వారిని దండించడానికి తన కింకరులను ఆజ్ఞాపిస్తాడు. పూర్వం వసిష్ఠుడు మొదలైన ధర్మవేత్తలు ఏ అపరాధానికి ఏ శిక్ష నిర్ణయించారో, ఆ ప్రకారంగా పాప కర్ములకు యముడు శిక్షలను నిర్ణయిస్తాడు.

పాపస్య సంక్షయం క్రుద్ధాః కుర్వన్తి యమకిఙ్కరాః ।
అఙ్కుశైర్ముద్గరైర్దణ్డైః క్రకచైశ్శక్తితోమరైః ॥
ఖడ్గశూలనిపాతైశ్చ భిద్యన్తే పాపకారిణః ॥ 80 ॥

యమకింకరులు కోపంతో అంకుశాలు, ఇనప గదలు, ఇనప దండాలు, అంపాలు, శక్తి ఆయుధాలు, తోమరాలు, కత్తులు, శూలాలు, అనే ఆయుధాలతో కొట్టి, పాపాత్ముల పాపాలను నాశనం చేస్తారు.

నరకాణాం సహస్రేషు లక్షకోటిశతేషు చ ।
స్వకర్మోపార్జితైర్దోషైః పీడ్యన్తే యమకిఙ్కరైః ॥ 81 ॥

పాపాత్ములు చేసిన ఆయా కర్మలవలన కలిగిన పాపానికి అనుగుణంగా యమకింకరులు వారిని వందలు, వేలు, లక్షలు, కోట్లసంఖ్యలో ఉన్న నరకాలలో పడేసి బాధిస్తారు.

శృణుధ్వం నరకాణాం చ స్వరూపం చ భయఙ్కరమ్ ।
నామాని చ ప్రమాణం చ యేన యాన్తి నరాశ్చ తాన్ ॥ 82 ॥

ఇంక వివిధ నరకాల భయంకరమైన స్వరూపమూ, ఆయా నరకాల పేర్లు, వాటి పరిమాణమూ, ఏ పాపం చేస్తే ఏ నరకానికి వెళ్తారో, ఆ విషయాలను చెప్తాను. వినండి.

మహావీచీతి విఖ్యాతం నరకం శోణితప్లుతమ్ ।
వజ్రకణ్టకసమ్మిశ్రం యోజనాయుతవిస్తృతమ్ ॥ 83 ॥

మహావీచి అనే నరకం చాల ప్రసిద్ధం. అందులో నెత్తురు ప్రవహిస్తుంటుంది. వజ్రంలాగా చాల కఠినమైన ముళ్లతో నిండి ఉంటుంది. దాని వైశాల్యం పదివేల యోజనాలు.

తత్ర సమ్పీడ్యతే మగ్నో భిద్యతే వజ్రకణ్టకే ।
వర్షలక్షం మహాఘోరం గోఘాతీ నరకే నరః ॥ 84 ॥

గోవును చంపిన మానవుడిని ఆ నరకంలో పడేసి, లక్ష సంవత్సరాలపాటు వజ్రంవంటి ముళ్లతో గుచ్చి మహాభయంకరంగా హింసిస్తారు.

యోజనానాం శతం లక్షం కుమ్భీపాకం సుదారుణమ్ ।
తామ్రకుమ్భవతీ దీప్తా వాలుకాఙ్గారసంవృతా ॥ 85 ॥

కుంభీపాకం అనే నరకం ఇంకా భయంకరమైనది. అది లక్షయోజనాల విస్తీర్ణం కలిగి ఉంటుంది. అక్కడ బాగా కాలిన రాగిబిందెలు మండుతుంటాయి. ఆ నరకం నిప్పుల కుప్పవంటి ఇసుకతో నిండి ఉంటుంది.

బ్రహ్మహా భూమిహర్తా చ నిక్షేపస్యాపహారకః ।
దహ్యన్తే యత్ర సంక్షిప్తా యావదాభూతసంప్లవమ్ ॥ 86 ॥

బ్రాహ్మణుడిని చంపినవాడు, ఇతరుల నేలను అపహరించినవాడు, భూమిలోని నిధులను కాజేసినవాడు, ఆ నరకంలో పడి, మహాప్రళయం వచ్చేవరకూ కాలిపోతుంటాడు.

రౌరవో వజ్రనారాచైః ప్రజ్వలద్భిస్సమావృతః ।
యోజనానాం సహస్రాణి షష్టిరాయామవిస్తరైః ॥ 87 ॥

రౌరవం అనే నరకం మండుతున్న వజ్రంవంటి బాణాలతో నిండి ఉంటుంది. దాని పొడుగూ,వెడల్పూ అరవైవేల యోజనాలు ఉంటుంది.

భిద్యన్తే తత్ర నారాచై స్సజ్వాలైర్నరకే నరాః ।
ఇక్షువత్తత్ర పీడ్యన్తే యే నరాః కూటసాక్షిణః ॥ 88 ॥

అబద్ధపుసాక్ష్యం చెప్పిన మానవులు ఆ నరకంలో పడతారు. అక్కడ మండుతున్న బాణాల దెబ్బలతో రసం తీసే యంత్రంలో చెరుకుగడలాగా నలిగిపోతారు. (ఇందులో ఉత్తరార్ధం 133 శ్లోకంలో ఉత్తరార్ధంగాఉంది.)

అయోమయం ప్రజ్వలితం మఞ్జూషం నరకం స్మృతమ్ ।
నిక్షిప్తాస్తత్ర దహ్యన్తే బన్దిగ్రాహకృతాశ్చ యే ॥ 89 ॥

మంజూషం అనే నరకం ఎఱ్ఱగా మండుతున్న ఇనుముతో నిండిఉంటుంది. నిరపరాధులైన వారిని బంధించి బాధించినవారు ఆ నరకంలో పడి, కాలుతుంటారు. (ఇది 134 శ్లోకంగా మహాఘోరం అనే నరకంగా ఉంది. అదే సాధుపాఠం కావచ్చు.)

అప్రతిష్ఠేతి నరకం పూయమూత్రపురీషకమ్ ।
అధోముఖః పతేత్తత్ర బ్రాహ్మణస్యోపపీడకః ॥ 90 ॥

అప్రతిష్ఠం అనే నరకం చీము, మూత్రం, మలంతో నిండిఉంటుంది. బ్రాహ్మణులను బాధించినవాడు తలక్రిందులుగా ఆ నరకంలో పడతాడు. (అత్ర తిష్ఠ అనే నరకంగా ఈ శ్లోకం కొంచెం మార్పుతో 135 శ్లోకంగా ఉంది. అప్రతిష్ఠ అనేదే సాధుపాఠం కావచ్చు.)

లాక్షాప్రజ్వలితం ఘోరం నరకం తు విలేపకమ్ ।
నిమగ్నాస్తత్ర దహ్యన్తే మద్యపా యే ద్విజోత్తమాః ॥ 91 ॥

విప్రవరులారా! విలేపకం అనే నరకం మండుతున్న లక్కతో నిండి ఉంటుంది. మద్యం తాగినవాళ్లు ఆ నరకంలో పడి కాలుతుంటారు. (ఇది 138 శ్లోకంగానూ ఉంది.)

మహాప్రమేతి నరకం దీప్తశూలమహోచ్ఛ్రయమ్ ।
తత్ర శూలేన భిద్యన్తే పతిభార్యోపభేదినః ॥ 92 ॥

మహాప్రమ అనే నరకంలో మండుతున్న శూలాలు ఎత్తుగా నిలబెట్టి ఉంటాయి. ఆలుమగలనడుమ విరోధం తెచ్చినవాడు ఆనరకంలో పడతాడు. అక్కడ శూలంతో వారిని చీలుస్తారు. (ఇది 139 శ్లోకంగా మహాప్రేత అనే నరకంగా చెప్పబడింది.)

నరకం చ మహాఘోరం జయన్తీ చాయసీ శిలా ।
తయా చాక్రమ్యతే పాపః పరదారోపసేవకః ॥ 93 ॥

జయంతి అనే పేరు గలిగిన నరకం చాల భయంకరంగా ఉంటుంది. అక్కడ అంతటా ఇనప బండలు నిండి ఉంటాయి. ఆ నరకంలోని బండలు ఇతరుల భార్యలను పొందిన పాపాత్ముడిపైనబడి నలిపివేస్తాయి. (ఇది 140 మహాఘోరం అనే నరకంగా చెప్పబడింది. ఆ పాఠమే సరియైనది కావచ్చు.)

నరకం శాల్మలాఖ్యం తు ప్రదీప్తదృఢకణ్టకమ్ ।
తమాలిఙ్గతి దుఃఖార్తా నారీ బహునరఙ్గమా ॥ 94 ॥

శాల్మలం అనే నరకం మండుతున్న కఠినమైన ముళ్లతో నిండి ఉంటుంది. అనేక పురుషులను పొందిన స్త్రీ ఆ నరకంలో పడుతుంది. ఆ ముళ్లు ఆమె ఒంటినిండా గుచ్చుకుంటాయి. (ఇందులో పూర్వార్ధం 141 శ్లోకంలో పూర్వార్ధం. నరకం శాల్మలి అని భేదం.)

యే వదన్తి సదాఽసత్యం పరమర్మావకర్తనమ్ ।
జిహ్వోచ్ఛేద్యతే తేషాం సదస్త్యైర్యమకిఙ్కరైః ॥ 95 ॥

అక్కడ యమకింకరులు నిత్యమూ ఇతరుల జీవితాన్ని నాశనం చేసే అబద్ధం చెప్పేవాళ్ల నాలుకను తెగగోస్తారు. (ఇది కొంచెం భేదంతో 142 శ్లోకంగా ఉంది)

యే తు రాగైః కటాక్షైశ్చ వీక్షన్తే పరయోషితమ్ ।
తేషాం చక్షూంషి నారాచైర్విధ్యన్తే యమకిఙ్కరైః ॥ 96 ॥

ఇతర స్త్రీలను కామంతో, ఓరచూపులతో చూసే పాపాత్ముల కళ్లను యమకింకరులు ఆ నరకంలో బాణాలతో పీకివేస్తారు.

మాతరం యేఽపి గచ్ఛన్తి భగినీం దుహితరం స్నుషామ్ ।
స్త్రీబాలవృద్ధహన్తారో యావదిన్ద్రాశ్చతుర్దశ ॥ 97 ॥

తల్లినీ, సోదరినీ, కూతురినీ, కోడలినీ, పొందినవాళ్లూ, ఆడవాళ్లనూ, పసిపిల్లలనూ, ముసలివారినీ చంపిన వాళ్లూ పద్నాలుగుమంది ఇంద్రులు ఉండేంతకాలం ఆ నరకంలో పడిఉంటారు. (ఇందులో పూర్వార్ధం 143శ్లోకంలో పూర్వార్ధం చాలవరకు సమానం.)

జ్వాలామాలాకులం రౌద్రం మహారౌరవసంజ్ఞితమ్ ।
నరకం యోజనానాం చ సహస్రాణి చతుర్దశ ॥ 98 ॥

మహారౌరవం అనే పేరు గలిగిన నరకం అగ్నిజ్వాలల వరుసలతో నిండిఉంటుంది. దాని వైశాల్యం పద్నాలుగు వేల యోజనాలు.

పురం క్షేత్రం గృహం గ్రామం యో దీపయతి వహ్నినా ।
స తత్ర దహ్యతే మూఢో యావత్కల్పస్థితిర్నరః ॥ 99 ॥

నగరాన్నీ, పొలాన్నీ, ఇంటినీ, గ్రామాన్నీ నిప్పు పెట్టి తగలబెట్టిన మూర్ఖుడు ఒక కల్పం కాలం ఆ నరకంలో కాలుతుంటాడు.

తామిస్రమితి విఖ్యాతం లక్షయోజనవిస్తృతమ్ ।
నిపతద్భిస్సదా రౌద్రైః ఖడ్గపట్టిశముద్గరైః ॥ 100 ॥

తామిస్రం అనే నరకం చాల ప్రసిద్ధం. దాని విస్తీర్ణం లక్ష యోజనాలు. అక్కడ కత్తులు, పట్టిశం, ముద్గరం అనే ఆయుధాలు పైనుంచి భయంకరంగా పడుతుంటాయి.

తత్ర చోరా నరాః క్షిప్తాస్తాడ్యన్తే యమకిఙ్కరైః ।
శూలశక్తిగదాఖడ్గైర్యావత్కల్పశతత్రయమ్ ॥ 101 ॥

దోపిడులు చేసిన మానవులు ఆ నరకంలో పడతారు. అక్కడ యమకింకరులు వారిని మూడువందల కల్పాల కాలం శూలం, శక్తి, గద, కత్తి అనే ఆయుధాలతో చావగొడుతుంటారు.

తామిస్రాద్ద్విగుణం ప్రోక్తం మహాతామిస్రసంజ్ఞితమ్ ।
జలౌకాసర్పసమ్పూర్ణం నిరాలోకం సుదుఃఖదమ్ ॥ 102 ॥

మహాతామిస్రం అనే నరకం తామిస్రం అనే నరకానికి రెట్టింపు పరిమాణంలో ఉంటుంది. అది పూర్తిగా జలగలతోనూ, పాములతోనూ నిండి ఉంటుంది. చూడటానికి వీలు లేకుండా దట్టమైన చీకటితో నిండి ఉంటుంది. భరింపరాని బాధలు పెడుతుంది.

మాతృహా పితృహా చైవ మిత్రవిస్రమ్భఘాతకః ।
తిష్ఠన్తి తక్ష్యమాణాశ్చ యావత్తిష్ఠతి మేదినీ ॥ 103 ॥

తల్లిని చంపినవాడు, తండ్రిని చంపినవాడు, స్నేహితుల నమ్మకాన్ని వమ్ము చేసినవాడు ఈ భూమి ఉన్నంత కాలం ఆ నరకంలో ఉంటారు. అక్కడ వాళ్లను యమకింకరులు తమ ఆయుధాలతో చెక్కుతుంటారు.

అసిపత్రవనం నామ నరకం భూరిదుఃఖదమ్ ।
యోజనాయుతవిస్తారం జ్వలత్ఖడ్గైస్సమాకులమ్ ॥ 104 ॥

అసిపత్రవనం అనే పేరు గలిగిన నరకం మిక్కిలిగా బాధలు కలిగిస్తుంది. దాని విస్తీర్ణం పదివేల యోజనాలు. అది బాగా కాలుతున్న కత్తులతో నిండి ఉంటుంది.

పాతితస్తత్ర తైః ఖడ్గైశ్శతధా తు సమాహతః ।
మిత్రఘ్నః కృత్యతే తావద్యావదాభూతసంప్లవమ్ ॥ 105 ॥

మిత్రులకు ద్రోహం చేసినవాడు ఆ నరకంలో పడతాడు. మహాప్రళయం అయ్యేంతవరకూ అక్కడ వాడిని యమకింకరులు మండుతున్న కత్తులతో ముక్కలు ముక్కలుగా నరుకుతుంటారు.

కరమ్భవాలుకా నామ నరకం యోజనాయుతమ్ ।
కూపాకారం వృతం దీప్తైర్వాలుకాఙ్గారకణ్టకైః ॥ 106 ॥

కరంభవాలుక అనే పేరు గలిగిన నరకం పదివేల యోజనాల వైశాల్యం కలిగి ఉంటుంది. అది పెద్ద దిగుడు బావిలాగా ఉంటుంది. అది కాలుతున్న ఇసుకతోనూ, నిప్పు కణికలతోనూ, ముళ్లతోనూ నిండి ఉంటుంది.

దహ్యతే భిద్యతే వర్షలక్షాయుతశతత్రయమ్ ।
యేన దగ్ధో జనో నిత్యం మిథ్యోపాయైస్సుదారుణైః ॥ 107 ॥

అధర్మమైన మార్గాలలో మిక్కిలి భయంకరంగా, ప్రజలను దహించిన మానవుడు ఒకలక్షా, పదివేల, మూడువందల సంవత్సరాలు ఆ నరకంలో కాలుతుంటాడు. వారిని యమభటులు ముక్కలు ముక్కలుగా నరుకుతారు.

కాకోలం నామ నరకం కృమిపూయపరిప్లుతమ్ ।
క్షిప్యతే తత్ర దుష్టాత్మా ఏకాకీ మిష్టభోజనః ॥ 108 ॥

కాకోలం అనే పేరు గలిగిన నరకంలో పురుగులతో నిండిన చీము ప్రవహిస్తుంటుంది. ఇతరులకు పెట్టకుండా, ఒంటరిగా విందుభోజనం చేసిన పాపాత్ముడు ఆ నరకంలో పడతాడు.

కుడ్మలం నామ నరకం పూర్ణం విణ్మూత్రశోణితైః ।
పఞ్చయజ్ఞక్రియాహీనాః క్షిప్యన్తే తత్ర వై నరాః ॥ 109 ॥

కుడ్మలం అనే పేరు గలిగిన నరకం పూర్తిగా మలం, మూత్రం, నెత్తురులతో నిండి ఉంటుంది. పంచయజ్ఞాలు (దేవయజ్ఞం, బ్రహ్మయజ్ఞం, పితృయజ్ఞం, భూతయజ్ఞం, మనుష్యయజ్ఞం) చేయని మానవులు ఆ నరకంలో పడతారు.

సుదుర్గన్ధం మహాభీమం మాంసశోణితసఙ్కులమ్ ।
అభక్ష్యాన్నే రతాస్తేఽత్ర నిపతన్తి నరాధమాః ॥ 110 ॥

ఆ నరకం మిక్కిలి చెడ్డకంపు కొడుతుంటుంది. మహాభయంకరంగా ఉంటుంది. మాంసంతోనూ, నెత్తురుతోనూ నిండి ఉంటుంది. తినగూడని అన్నాన్ని ఇష్టంగా తినే నీచులైన మానవులు ఆ నరకంలో పడతారు.

కృమికీటసమాకీర్ణం శవపూర్ణం మహావటమ్ ।
అధోముఖః పతేత్తత్ర కన్యావిక్రయకృన్నరః ॥ 111 ॥

మహావటం అనే నరకం పురుగులతోనూ, కీటకాలతోనూ, శవాలతోనూ నిండి ఉంటుంది. కన్నెపిల్లలను అమ్ముకునే మానవుడు ఆ నరకంలో తలక్రిందులుగా పడతాడు.

నామ్నా వై తిలపాకేతి నరకం భృశదారుణమ్ ।
తిలవత్తత్ర పీడ్యన్తే పరపీడారతాశ్చ యే ॥ 112 ॥

తిలపాకం అనే పేరు గలిగిన నరకం చాల దారుణంగా ఉంటుంది. ఎప్పుడూ ఇతరులను హింసించేవాళ్లను ఆ నరకంలో నువ్వులను యంత్రంలో వేసి ఆడించినట్లుగా పీడిస్తారు.

నరకం తైలపాకేతి జ్వలత్తైలమహీప్లవమ్ ।
పచ్యతే తత్ర మిత్రఘ్నో హన్తా చ శరణాగతమ్ ॥ 113 ॥

తైలపాకం అనే నరకంలో బాగా కాగుతున్న నూనె నేల అంతటా పొంగి పొర్లుతుంటుంది. స్నేహితులను హింసించినవాళ్లూ, రక్షణకోసం తనను ఆశ్రయించినవాళ్లను చంపినవాళ్లూ, ఆ నూనెలో ఉడుకుతుంటారు.

నామ్నా వజ్రకపాటేతి వజ్రశృఙ్ఖలయాన్వితమ్ ।
పీడ్యన్తే నిర్దయం తత్ర యైః కృతః క్షీరవిక్రయః ॥ 114 ॥

వజ్రకపాటం అనే నరకం వజ్రాల సంకెళ్లతో కూడి ఉంటుంది. పాలు అమ్ముకునేవాళ్లు ఆ నరకంలో పడతారు. వారిని యమకింకరులు ఏమాత్రం దయ లేకుండా హింసిస్తారు.

నిరుచ్ఛ్వాస ఇతి ప్రోక్తం తమోఽన్ధం వాతవర్జితమ్ ।
నిశ్చేష్టం క్షిప్యతే తత్ర విప్రదాననిరోధకృత్ ॥ 115 ॥

మరో నరకం నిరుచ్ఛ్వాసం అని పేర్కొనబడుతుంది. అది పూర్తిగా చీకటితో నిండి ఉంటుంది. చూసేవాళ్లను గుడ్డివాళ్లను చేస్తుంది. (ఎవ్వరికీ ఏమీ కనబడదు). బ్రాహ్మణులకు దానం చేస్తుండగా అడ్డుపడినవాడిని ఆ నరకంలో పడేస్తారు. అక్కడ వాడు ఎటువంటి చేష్టలు లేకుండా స్థాణువులాగా పడిఉంటాడు.

అఙ్గారోపచయం నామ దీప్తాఙ్గారసముజ్జ్వలమ్ ।
దహ్యతే తత్ర యేనోక్తం దానం విప్రాయ నార్పితమ్ ॥ 116 ॥

అంగారోపచయం అనే నరకం మండుతున్న నిప్పులతో మిక్కిలిగా ప్రకాశిస్తుంటుంది. బ్రాహ్మణులకు ఇస్తానని చెప్పిన దానిని ఇవ్వనివాళ్లు, ఆ నరకంలో తగలబడుతుంటారు.

మహాపాయీతి నరకం లక్షయోజనమాయతమ్ ।
పాత్యన్తేఽధోముఖాస్తత్ర యే జల్పన్తి సదాఽనృతమ్ ॥ 117 ॥

మహాపాయి అనే నరకం లక్షయోజనాల వైశాల్యం కలిగి ఉంటుంది. ఎప్పుడూ అసత్యాలు వాగేవాళ్లు చివరికి తలక్రిందులుగా ఆ నరకంలో పడతారు.

మహాజ్వాలేతి నరకం జ్వాలాభాస్వరభీషణమ్ ।
దహ్యతే తత్ర సుచిరం యః పాపే బుద్ధికృన్నరః ॥ 118 ॥

మహాజ్వాల అనే నరకం అగ్నికీలల మెరపులతో భయంకరంగా ఉంటుంది. పాపాలు చేయడంలో బుద్ధి పెట్టిన మానవుడు ఆ నరకంలో చాలకాలంపాటు తగలబడుతుంటాడు.

నరకం క్రకచాఖ్యాతం పీడ్యన్తే తత్ర వై నరాః ।
క్రకచైర్వజ్రధారోగ్రైరగమ్యగమనే రతాః ॥ 119 ॥

క్రకచం అనే పేరు గలిగినది మరొకనరకం. పొందగూడని వాళ్లను పొందిన మానవులు అందులో పడతారు. అక్కడ పాపులను వజ్రంవంటి పదునైన చివరలు కలిగిన ఱంపాలతో హింసిస్తారు.

నరకం గుడపాకేతి జ్వలద్గుడప్రహ్రదైర్వృతమ్ ।
నిక్షిప్తో దహ్యతే తస్మిన్ వర్ణసఙ్కరకృన్నరః ॥ 120 ॥

గుడపాకం అనే నరకం బాగా కాగుతున్న బెల్లపు ప్రవాహాలతో నిండి ఉంటుంది. వర్ణధర్మాలను సంకరం చేసిన మానవుడు ఆ నరకంలో పడి, తగులబడుతుంటాడు.

క్షురధారేతి నరకం తీక్ష్ణక్షురసమావృతమ్ ।
ఛిద్యన్తే తత్ర కల్పాన్తం విప్రభూమిహరా నరాః ॥ 121 ॥

క్షురధార అనే నరకం అంతటా బాగా పదునైన చురకత్తులతో నిండి ఉంటుంది. బ్రాహ్మణుల భూమిని కాజేసినవాళ్లు ఆ నరకంలో పడి, ఆ కల్పం పూర్తయేంతవరకూ ముక్కలు ముక్క లవుతుంటారు.

నరకం చామ్బరీషాఖ్యం ప్రలయానలదీపితమ్ ।
కల్పకోటిశతం తత్ర దహ్యతే స్వర్ణహారకః ॥ 122 ॥

అంబరీషం అనే నరకం ప్రళయకాలంలో ఏర్పడే సర్వనాశంకరమైన అగ్నితో జ్వలిస్తుంటుంది. బంగారం దొంగిలించినవాడు ఆ నరకంలో నూరుకోట్ల కల్పాలకాలం కాలుతూ ఉంటాడు.

నామ్నా వజ్రకుతారేతి నరకం వజ్రసఙ్కులమ్ ।
ఛిద్యన్తే ఛత్రఛేత్తారో ద్రుమాణాం పాపకారిణః ॥ 123 ॥

వజ్రకుతారం అనే నరకం వజ్రాలతో నిండి ఉంటుంది. గొడుగులాగా నీడ నిచ్చే చెట్లను నరికిన పాపాత్ములను ఆ నరకంలో పడేసి, యమకింకరులు ముక్కలు ముక్కలుగా నరకుతారు.

నరకం పరితాపాఖ్యం ప్రలయానలదీపితమ్ ।
గరదో మధుహర్తా చ పచ్యతే తత్ర పాపకృత్ ॥ 124 ॥

పరితాపం అనే పేరు గలిగిన నరకం ప్రళయకాలపు మహాగ్నిలాగ ప్రజ్వరిల్లుతుంటుంది. విషం పెట్టడం, తేనెను దొంగిలించడం అనే పాపకర్మలు చేసినవాడిని ఆ నరకంలో ఉడకబెడతారు.

నరకం కాలసూత్రం చ వజ్రసూత్రవినిర్మితమ్ ।
భ్రమన్తస్తత్ర ఛిద్యన్తే పరసస్యోపలుణ్ఠకాః ॥ 125 ॥

కాలసూత్రం అనే నరకం వజ్రపుతాళ్లతో నిర్మింపబడింది. ఇతరుల పైర్లు కోసినవాళ్లు ఆ నరకంలో పడి తిరుగుతారు. యమభటులు వారిని నరుకుతుంటారు.

నరకం కశ్మలం నామ శ్లేష్మశిఙ్ఘాణకావృతమ్ ।
తత్ర సంక్షిప్యతే కల్పం మద్యమాంసరుచిర్నరః ॥ 126 ॥

కశ్మలం అనే పేరు గలిగిన నరకం కఫంతోనూ చీమిడితోనూ నిండి ఉంటుంది. మద్యమూ, మాంసమూ రుచిచూసిన మానవుడిని ఆ నరకంలో విసిరివేస్తారు. వాడు అక్కడ ఒక కల్పం కాలం ఉంటాడు.

నరకం చోగ్రగన్ధేతి లాలామూత్రపురీషవత్ ।
క్షిప్యన్తే తత్ర నరకే పితృపిణ్డాప్రయచ్ఛకాః ॥ 127 ॥

ఉగ్రగంధ అనే నరకం చొల్లు, మూత్రం, మలాలతో కూడి ఉంటుంది. పితరులకు పిండాలు పెట్టనివారిని ఆ నరకంలో పారేస్తారు.

నరకం దుర్ధరం నామ జలౌకావృశ్చికాకులమ్ ।
ఉత్కోచభక్షకస్తత్ర తిష్ఠతే వర్షకాయుతమ్ ॥ 128 ॥

దుర్ధరం అనే నరకం జలగలతోనూ, తేళ్లతోనూ నిండి ఉంటుంది. లంచాలు మింగేవాళ్లు పదివేల సంవత్సరాలు ఆ నరకంలో పడిఉంటారు.

యచ్చ వజ్రమహాపీడం నరకం వజ్రనిర్మితమ్ ।
తత్ర ప్రక్షిప్య దహ్యన్తే పీడ్యన్తే యమకిఙ్కరైః ॥ 129 ॥

ధనం ధాన్యం హిరణ్యం వా పరకీయం హరన్తి యే ।
యమదూతైశ్చ చోరాస్తే ఛిద్యన్తే లవశః క్షురైః ॥ 130 ॥

వజ్రమహాపీడం అనే నరకం వజ్రాలతో నిర్మింపబడింది. ఇతరుల ధనాన్నీ, ధాన్యాన్నీ, బంగారాన్నీ, అపహరించినవాళ్ళను యమకింకరులు ఆ నరకంలో పడేసి, కాలుస్తారు. ఇంకా రకరకాలుగా బాధిస్తారు. ఆ దొంగలను యమదూతలు చురకత్తులతో చిన్న చిన్న ముక్కలుగా నరుకుతారు.

యే హత్వా ప్రాణినం మూఢాః ఖాద్యన్తే కాకగృధ్రవత్ ।
భోజ్యన్తే చ స్వమాంసం తే కల్పాన్తం యమకిఙ్కరైః ॥ 131 ॥

జీవులను చంపి, కాకుల్లాగా, గద్దల్లాగా ఆ శవాన్ని పీక్కుతినేవారిని యమకింకరులు ఆ నరకంలో పడేసి, ఎవరి మాంసాన్ని వారిచేత తినిపిస్తారు.

ఆసనం శయనం వస్త్రం పరకీయం హరన్తి యే ।
ఇక్షువత్తత్ర పీడ్యన్తే యే నరాః కూటసాక్షిణః ॥ 132 ॥

ఇతరుల ఆసనాలనూ, శయనాలనూ, వస్త్రాలనూ అపహరించిన మానవులు, అబద్ధపుసాక్ష్యం చెప్పినవాళ్లూ ఆ నరకంలో పడి, గానుగలో చెరుకుగడలాగా నలిగిపోతారు. (ఇందులో ఉత్తరార్ధం 89 శ్లోకంలో ఉత్తరార్ధంగా ఉంది.)

అయోమయం ప్రజ్వాలితమాయసం నరకం స్మృతమ్ ।
నిక్షిప్తాస్తత్ర దహ్యన్తే బన్దిగ్రాహరతాశ్చ యే ॥ 133 ॥

ఆయసం అనే నరకం కాలుతున్న ఇనుముతో నిండి ఉంటుంది. నిరపరాధులను బంధించి పట్టుకునేవాళ్లను ఆ నరకంలో పడేసి, కాలుస్తారు. (ఇది 90శ్లోకంగా మంజూష అనే నరకంగా ఇంతకు ముందు చెప్పబడింది. మహాఘోరం అనేదే సాధుపాఠం కావచ్చు.)

అత్ర తిష్ఠేతి నరకం పూయమూత్రపురీషధృక్ ।
అధోముఖః పతేత్ తత్ర స్మృతివేదవినిన్దకః ॥ 134 ॥

అత్ర తిష్ఠ అని మరొక నరకం. అది చీము, మూత్రం, మలాలతో నిండి ఉంటుంది. వేదాలనూ, ధర్మ శాస్త్రాలనూ నిందించేవారు ఆ నరకంలో తలక్రిందులుగా పడతారు. (అప్రతిష్ఠ అనే నరకంగా ఈశ్లోకం కొంచెం మార్పుతో 91 శ్లోకంగా ఉంది.)

నరకం పారిలుమ్పాఖ్యం గృధ్రశ్వానవృకాకులమ్ ।
తప్యన్తే తత్ర వై ఘోరే బాలవృ(క్రు)ద్ధజనాపహాః ॥ 135 ॥

పారిలుంపం అనే పేరు గలిగిన నరకం గద్దలతో, కుక్కలతో, తోడేళ్లతో నిండి ఉంటుంది. చిన్నపిల్లలనూ, వయసు మళ్లినవారినీ అపహరించిన పాపాత్ములను భయంకరమైన ఆ నరకంలో పడేసి, కాలుస్తారు.

నరకన్తు కరాలాఖ్యం కరాలం ప్రేతసఙ్కులమ్ ।
రాక్షసైర్భక్ష్యతే తత్ర బ్రాహ్మణస్యోపపీడకః ॥ 136 ॥

కరాళం అనే పేరు గలిగిన నరకం ప్రేతలతో నిండి భయంకరంగా ఉంటుంది. బ్రాహ్మణులను బాధించిన వాడిని ఆ నరకంలో రాక్షసులు తింటుంటారు.

లాక్షాప్రజ్వలితం ఘోరం నరకన్తు విలేపనమ్ ।
నిమగ్నాస్తత్ర దహ్యన్తే మద్యపాస్తు ద్విజోత్తమాః ॥ 137 ॥

బ్రాహ్మణోత్తములారా! విలేపనం అనే నరకం వేడిగా ఉన్న చొంగతో దారుణంగా ఉంటుంది. మద్యం తాగినవాళ్లు ఆ నరకంలో మునిగి, కాలిపోతుంటారు. (ఇది 92 శ్లోకంగా చెప్పబడిఉంది.)

మహాప్రేతేతి నరకం దీప్తశూలం మహోచ్ఛ్రయమ్ ।
తత్ర శూలేన భిద్యన్తే పతిభార్యోపభేదకాః ॥ 138 ॥

మహాప్రేత అనే నరకంలో బాగా కాలుతున్న శూలాలు చాలా ఎత్తుగా (నిలబెట్టి)ఉంటాయి. ఆలుమగల నడుమ తగవులు పెట్టినవాళ్లను ఆ నరకంలో శూలంతో పొడిచి ముక్కలు చేస్తారు. (ఇది 93 శ్లోకంగా మహాప్రమ అనే నరకంగా ఇంతకు ముందు చెప్పబడింది)

నరకఞ్చ మహాఘోరం జ్వలన్తీత్వాయసీ శిలా ।
తయా చాకృష్యతే పాపః పరదారోపసేవకః ॥ 139 ॥

మహాఘోరం అనే నరకం చాల భయంకరంగా ఉంటుంది. అక్కడ ఇనపబండలు నిప్పులలాగా కాలుతూ ఉంటాయి. ఆ నరకంలోని బండలు ఇతరుల భార్యలను పొందిన పాపాత్ముడిపైన బడి నలిపివేస్తాయి.(ఇది 94 శ్లోకంగా జయంతి అనే నరకంగా ఇంతకు ముందు చెప్పబడింది. ఈ శ్లోకపాఠమే సరైనది కావచ్చు.)

నరకం శాల్మలీఖ్యాతం ప్రదీప్తం దృఢకణ్టకమ్ ।
తమాలిఙ్గతి దుఃఖార్తో పరఛిద్రరతో నరః ॥ 140 ॥

శాల్మలి అని ప్రసిద్ధమైన నరకం మండుతున్న కఠినమైన ముళ్లతో నిండి ఉంటుంది. ఇతరులలో లోపాలను వెదికే మానవుడు ఆ ముళ్లను కౌగిలించుకుని దుఃఖంతో బాధపడుతుంటాడు. (ఇది శాల్మలం అనే భేదంతో 95 శ్లోకంగా ఉంది.)

యే వదన్తి మృషా సత్యం పరమర్మవికృన్తనమ్ ।
జిహ్వా తు ప్రియతే తేషాం సదస్త్వైర్యమకిఙ్కరైః ॥ 141 ॥

ఇతరుల ఆయువుపట్లను తెగగొట్టే అబద్ధం చెప్పినవాళ్లు ఆ నరకంలో పడతారు. యమదూతలు వాళ్ల నాలుకలను చీలుస్తారు. (ఈ శ్లోకం ఇంతకు ముందు 96 శ్లోకంగా ఉంది.)

మాతరం యేఽభిగచ్ఛన్తి భగినీం కన్యకాం స్నుషామ్ ।
అఙ్గారరాశౌ ప్రక్షిప్తా దహ్యన్తే యమసేవకైః ॥ 142 ॥

తల్లినీ, సోదరినీ, కూతురినీ, కోడలినీ, పొందినవాళ్లను యమకింకరులు నిప్పుల కుప్పలో పడేసి తగలబెడతారు. (ఇందులో పూర్వార్ధం 98 శ్లోకంలో పూర్వార్ధంగా ఉంది.)

ధర్మం ధామ హిరణ్యం వా పరకీయం హరన్తి యే ।
యమదూతైశ్చ తే మూఢా భిద్యన్తే శక్తితోమరైః ॥ 143 ॥

ఇతరుల ధర్మాన్ని గానీ, ఇంటిని గానీ, బంగారాన్ని గానీ, అపహరించిన అజ్ఞానులను యమకింకరులు శక్తి, తోమరం అనే ఆయుధాలతో నలగగొడతారు.

ఫలం పత్రం నృణాం వాపి హృతం యైస్తు కుబుద్ధిభిః ।
యమదూతైశ్చ తే క్రుద్ధైర్దహ్యన్తే తృణవహ్నిభిః ॥ 144 ॥

ఇతరులకు సంబంధించిన పండును గానీ, ఆకును గానీ దుర్బుద్ధితో అపహరించిన వాళ్లను యమకింకరులు కోపంతో గడ్డికి నిప్పంటించి, ఆ నిప్పులో తగలబెడతారు.

పరద్రవ్యే కలత్రే చ యస్సదా దుష్టధీర్నరః ।
యమదూతైర్జ్వలత్తస్య హృది శూలం నిఖన్యతే ॥ 145 ॥

ఇతరుల వస్తువులపైనా, ఇతరుల భార్యపైనా, దుర్బుద్ధి కలిగిన మానవుల గుండెలో యమకింకరులు బాగా కాలుతున్న శూలం దించుతారు.

కర్మణా మనసా వాచా యే ధర్మవిముఖా నరాః ।
యమలోకే తు తే ఘోరా లభన్తే గురుయాతనాః ॥ 146 ॥

కర్మలలోనూ, మనస్సులోనూ, మాటలలోనూ (త్రికరణాలలో) ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తించే మానవులు యమలోకంలో భయంకరమైన పెద్దపెద్ద కష్టాలను అనుభవిస్తారు.

ఏవం శతసహస్రాణి లక్షకోటిశతాని చ ।
నరకాని నరైస్తత్ర సేవ్యన్తే పాపకారిభిః ॥ 147 ॥

ఈవిధంగా పాపాత్ములైన మానవులు యమలోకంలో లక్షలు, నూరుకోట్ల లక్షలు నరకాలలో పడి ఉంటారు.

ఇహ కృత్వా స్వల్పమపి నరః కర్మాశుభాత్మకమ్ ।
ప్రాప్నోతి నరకే ఘోరే యమలోకేషు యాతనామ్ ॥ 148 ॥

ఈ భూలోకంలో పాపం కలిగించే కర్మ ఏ కొంచెం చేసినా, యమలోకాలలో భయంకరమైన నరకాలలో నానాబాధలు అనుభవిస్తాడు.

న శృణ్వన్తి నరా మూఢా ధర్మోక్తం సాధు భాషితమ్ ।
దృష్టం కేనేతి ప్రత్యక్షం ప్రత్యుక్త్వైవ వదన్తి తే ॥ ఠి149 ॥

అజ్ఞానులైన మానవులు ధర్మంగా చెప్పిన మంచిమాట వినరు. ఇంక పైగా ఆ నరకాలను కళ్లారా చూసినవాడు ఎవడున్నాడని ఎదురుసమాధానం చెప్తారు.

దివా రాత్రౌ ప్రయత్నేన పాపం కుర్వన్తి యే నరాః ।
నాచరన్తి హి తే ధర్మం ప్రమాదేనాపి మోహితాః ॥ 150 ॥

మానవులు అజ్ఞానులై, రాత్రింబగళ్లు బుద్ధిపూర్వకంగా పాపాలు చేస్తారు. పొరపాటున గూడా ధర్మం ఆచరించరు.

ఇహైవ ఫలభోక్తారః పరత్ర విముఖాశ్చ యే ।
తే పతన్తి సుఘోరేషు నరకేషు నరాధమాః ॥ 151 ॥

చేసిన కర్మలకు ఫలితాన్ని ఇక్కడే అనుభవించాలని కోరుతూ, ఉత్తమగతులను ఇష్టపడని (మోక్షాన్ని తిరస్కరించే) నీచులైన మానవులు మిక్కిలి భయంకరమైన రకరకాల నరకాలలో పడిపోతారు.

దారుణో నరకే వాసస్స్వర్గవాసస్సుఖప్రదః ।
నరైస్సమ్ప్రాప్యతే తత్ర కర్మ కృత్వా శుభాశుభమ్ ॥ 152 ॥

నరకంలో నివసించడం చాల కష్టం. స్వర్గంలో నివసించడం సుఖంగా ఉంటుంది. మానవులు పుణ్యకర్మలు చేసి స్వర్గాన్నీ, పాపకర్మలు చేసి నరకాన్నీ పొందుతారు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసర్షిసంవాదే నరకగతపృథగ్యాతనాకీర్తనం నామ షడుత్తరశతతమోఽధ్యాయః ॥ 106 ॥

శ్రీబ్రహ్మపురాణంలో వ్యాస ఋషి సంవాదంలో నరకంలోని వేరువేరు బాధలను చెప్పడం అనే నూటఆరవ అధ్యాయం సంపూర్ణం.

సప్తోత్తరశతతమోఽధ్యాయః - నూటఏడవ అధ్యాయం

ధార్మికాణాంసుగతినిరూపణమ్ - ధార్మికుల సుగతి నిరూపణం

ఋషయ ఊచుః :-మునులు వ్యాసమహర్షితో ఇలా అంటున్నారు.

అహోఽతిదుఃఖం ఘోరం చ యమమార్గం త్వయోదితమ్ ।
నరకాణిచ ఘోరాణి ద్వారం యామ్యం చ సత్తమ ॥ 1 ॥

ఆహా! మహాత్మా! యమపురానికి వెళ్లే దారిలో కలిగే కష్టాలు మిక్కిలి భయంకరంగా ఉంటాయి. చాలా బాధిస్తాయి. నరకలోకాలు కూడా ఎంతో దారుణమైనవి. యమపురంలో ప్రవేశించే ద్వారమూ భయంకరం అని చెప్పావు.

అస్త్యుపాయో న వా బ్రహ్మన్ యమమార్గేఽతిభీషణే ।
బ్రూహి యేన నరా యాన్తి సుఖేన యమసాదనమ్ ॥ 2 ॥

బ్రహ్మర్షీ! అత్యంతం భయంకరమైన యమపురానికి వెళ్లే ఆ మార్గంలో సుఖంగా ప్రయాణించడానికి ఏదైనా ఉపాయం ఉందా, లేదా? మానవులు యమపురానికి సుఖంగా వెళ్లే ఉపాయం చెప్పవలసింది.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇహ యే ధర్మసంయుక్తాస్త్వహింసానిరతా నరాః ।
గురుశుశ్రూషణే యుక్తా దేవబ్రాహ్మణపూజకాః ॥ 3 ॥

యస్మిన్ మనుష్యలోకాస్తే సభార్యాస్ససుతాస్తథా ।
తమధ్వానం చ గచ్ఛన్తి యథా తత్ కథయామి వః ॥ 4 ॥

ఈ లోకంలో వేదోక్తమైన ధర్మాలను ఆచరించినవాళ్లూ, ఇతరులను ఏమాత్రమూ బాధింపనివాళ్లూ, గురుసేవను చెయ్యటంలో ఆసక్తికలవారు, దేవతలనూ బ్రాహ్మణులనూ పూజించేవాళ్లూ అయిన మానవులు తమ భార్యలతోనూ, బిడ్డలతోనూ ఆ యమమార్గంలో ఏవిధంగా (సుఖంగా) ప్రయాణిస్తారో మీకు చెప్తాను.

విమానైర్వివిధైర్దివ్యైర్వజ్రకాఞ్చనశోభితైః ।
ధర్మరాజపురం యాన్తి సేవమానాఽప్సరోగణైః ॥ 5 ॥

వాళ్లు వజ్రాలతోనూ బంగారంతోనూ ప్రకాశించే రకరకాల విమానాలలో యమపురానికి వెళ్తారు. ఆ విమానాలు దేవలోకంలో నిర్మించబడినవి. వాటిలో అప్సరసలు గుంపులుగా చేరి, వారిని సేవిస్తారు.

బ్రాహ్మణేభ్యస్తు దానాని నానారూపాణి భక్తితః ।
యే ప్రయచ్ఛన్తి తే యాన్తి సుఖేనైవ మహాపథే ॥ 6 ॥

బ్రాహ్మణులకు అనేకవిధాలైన దానాలు భక్తితో చేసిన మానవులు ఆ నరకమార్గంలో ఏ కష్టమూ లేకుండా సుఖంగా ప్రయాణిస్తారు.

అన్నం యే తు ప్రయచ్ఛన్తి బ్రాహ్మణేభ్యస్సుసంస్కృతమ్ ।
శ్రోత్రియేభ్యో విశేషేణ భక్త్యా పరమయా యుతాః ॥ 7 ॥

తరుణీభిర్వరస్త్రీభిస్సేవ్యమానాః ప్రయత్నతః ।
ధర్మరాజపురం యాన్తి విమానైరభ్యలఙ్కృతైః ॥ 8 ॥

బ్రాహ్మణులకు చక్కగా రుచికరంగా భోజనం సిద్ధం చేసి పెట్టినవాళ్లూ, అందులోనూ విశేషంగా వేద విద్వాంసులకు అత్యధికమైన భక్తిశ్రద్ధలతో అన్నం పెట్టిన మానవులు అందంగా అలంకరింపబడిన విమానాలలో యమపురానికి వెళ్తారు. ఆ విమానాలలో యుక్తవయస్సులో ఉన్న సుందరాంగులు వారిని శ్రద్ధగా సేవిస్తారు.

యే చ సత్యం ప్రభాషన్తే బహిరన్తశ్చ నిర్మలాః ।
తేఽ పి యాన్త్యమరప్రఖ్యా విమానైర్యమమన్దిరమ్ ॥ 9 ॥

మాటలలోనూ, చేతలలోనూ, మనసులోనూ ఏవిధమైన కల్మషం లేకుండా, ఎప్పుడూ సత్యమే మాట్లాడే మానవులు కూడ దేవతలలాగా విమానాలలో యమపురానికి వెళ్తారు.

గోదానాని పవిత్రాణి విష్ణుముద్దిశ్య సాధుషు ।
యే ప్రయచ్ఛన్తి ధర్మజ్ఞాః కృశేషు కృశవృత్తిషు ॥ 10 ॥

తే యాన్తి దివ్యవర్ణాభైర్విమానైర్మణిచిత్రితైః ।
ధర్మరాజపురం శ్రీమత్సేవ్యమానాఽప్సరోగణైః ॥ 11 ॥

శ్రీమహావిష్ణువు నుద్దేశించి, సజ్జనులకూ, చిన్నచిన్న వృత్తులతో తగిన జీవనాధారం లేక చిక్కిన వారికీ, పుణ్యప్రదమైన గోదానాలు చేసిన ధార్మికులు మనోహరమైన రంగులతో కూడిన విమానాలలో యమపురానికి వెళ్తారు. ఆ విమానాలు రకరకాల మణులతో విచిత్రంగా ఉంటాయి. వాటిలో సుందరాంగులైన అప్సరసలు గుంపులుగా చేరి వారిని సేవిస్తారు. ఆ విమానాలు చక్కగా ప్రకాశిస్తుంటాయి.

ఉపానద్యుగలం ఛత్రం శయ్యాసనమథాపి వా ।
యే ప్రయచ్ఛన్తి వస్త్రాణి తథైవాభరణాని చ ॥ 12 ॥

తే యాన్త్యశ్వై రథైశ్చైవ కుఞ్జరైశ్చాప్యలఙ్కృతాః ।
ధర్మరాజపురం దివ్యం ఛత్రైస్సౌవర్ణరాజతైః ॥ 13 ॥

చెప్పులజోడు, గొడుగు, మంచం, పీట, వస్త్రాలు, ఆభరణాలు, దానం చేసినవాళ్లు అందమైన అలంకారాలతో, గుఱ్ఱాలు, రథాలు, ఏనుగులూ ఎక్కి, దివ్యమైన వెండి, బంగారపు గొడుగుల నీడలో యమపురానికి వెళ్తారు.

యే చ భక్త్యా ప్రయచ్ఛన్తి గుడపానకమర్చితమ్ ।
ఓదనం చ ద్విజాగ్ర్యేభ్యో విశుద్ధేనాన్తరాత్మనా ॥ 14 ॥

తే యాన్తి కాఞ్చనైర్యానైర్వివిధైస్తు యమాలయమ్ ।
వరస్త్రీభిర్యథాకామం సేవ్యమానాః పునః పునః ॥ 15 ॥

రుచికరమై, పవిత్రమైన బెల్లపు పానకాన్ని, అన్నాన్ని ఉత్తములైన బ్రాహ్మణులకు, నిర్మలమైన మనస్సుతో భక్తిగా దానం చేసిన వాళ్లు రకరకాల బంగారు వాహనాలమీద యమపురానికి వెళ్తారు. ఆ వాహనాలలో సుందరాంగులు వారు కోరిన విధంగా నిరంతరమూ సేవిస్తారు.

యే చ క్షీరం ప్రయచ్ఛన్తి ఘృతం దధి గుడం మధు ।
బ్రాహ్మణేభ్యః ప్రయత్నేన శుద్ధోపేతం సుసంస్కృతమ్ ॥ 16 ॥

చక్రవాకప్రయుక్తైశ్చ విమానైస్తు హిరణ్మయైః ।
యాన్తి గన్ధర్వవాదిత్రైస్సేవ్యమానా యమాలయమ్ ॥ 17 ॥

శుద్ధమై, చక్కగా సంస్కరించిన పాలు, నెయ్యి, పెరుగు, బెల్లం, తేనెలను కష్టపడి సంపాదించి, బ్రాహ్మణులకు దానం చేసినవాళ్లు చక్రవాకపక్షులు నడిపే విమానాలమీద యమపురానికి వెళ్తారు. ఆ విమానాలు బంగారంతో నిర్మింపబడినవి. అందులో గంధర్వులు వివిధ వాద్యాలతో సంగీతం ఆలపిస్తూ వారిని సేవిస్తారు.

యే ఫలాని ప్రయచ్ఛన్తి పుష్పాణి సురభీణి చ ।
హంసయుక్తైర్విమానైశ్చ యాన్తి ధర్మపురం నరాః ॥ 18 ॥

సువాసనలు వెదజల్లే పూవులనూ, పండ్లనూ దానం చేసిన మానవులు హంసలతో కూడిన విమానాలమీద యమపురానికి వెళ్తారు.

యే తిలాంస్తిలధేనుం చ ఘృతధేనుమథాపి వా ।
శ్రోత్రియేభ్యః ప్రయచ్ఛన్తి విప్రేభ్యశ్శ్రద్ధయాన్వితాః ॥ 19 ॥

సోమమణ్డలసఙ్కాశైర్యానైస్తే యాన్తి నిర్మలైః ।
గన్ధర్వైరుపగీయన్తే పురే వైవస్వతస్య తే ॥ 20 ॥

నువ్వులనూ, నువ్వులతో చేసిన ఆవునూ, నేతితో చేసిన ఆవునూ వేదపండితులైన బ్రాహ్మణులకు శ్రద్ధగా దానం చేసినవాళ్లు చంద్రమండలంతో సమానంగా తెల్లగా ప్రకాశించే పవిత్రమైన వాహనాలమీద, గంధర్వులు గానం చేస్తుండగా, యమపురానికి వెళ్తారు.

యేషాం వాప్యశ్చ కూపాశ్చ తడాగాని సరాంసి చ ।
దీర్ఘికాః పుష్కరిణ్యశ్చ శీతలాశ్చ జలాశయాః ॥ 21 ॥

యానైస్తే హేమచన్ద్రాభైర్దివ్యఘణ్టానినాదితైః ।
వ్యజనైస్తాలవృన్తైశ్చ వీజ్యమానా మహాప్రభాః ॥ 22 ॥

బావులు, నీటిగుంటలు, చెరువులు, సరస్సులు, దిగుడుబావులు, పుష్కరిణులు, ఇంకా చల్లనైన నీటితోకూడిన జలాశయాలను నిర్మించినవారు బంగారంలాగా, చంద్రుడిలాగా ప్రకాశించే విమానాలమీద మిక్కిలి కాంతిమంతులై సుఖంగా యమపురానికి వెళ్తారు. ఆ విమానాలలో దివ్యమైన ఘంటలు మోగుతుంటాయి. (అప్సరఃకాంతలు) చామరాలతోనూ, తాటాకు విసనకఱ్ఱలతోనూ వారికి వీస్తుంటారు.

యేషాం దేవకులాన్యత్ర చిత్రాణ్యాయతనాని చ ।
రత్నైః ప్రస్ఫురమాణాని మనోజ్ఞాని శుభాని చ ॥ 23 ॥

తే యాన్తి లోకపాలైస్తు విమానైర్వాతరంహసైః ।
ధర్మరాజపురం రమ్యం నానాజనసమాకులమ్ ॥ 24 ॥

రత్నాలతో ప్రకాశించే విధంగానూ, మనోహరంగానూ, శుభప్రదంగానూ, దేవతలకు నివాసయోగ్యంగానూ విచిత్రాలతో దేవాలయాలను నిర్మించినవారు లోకపాలురతో కలిసి (వారితో సమానమైన గౌరవంతో), వాయువేగంతో ఎగిరే విమానాలమీద యమపురానికి వెళ్తారు. యమలోకం అనేకవిధాలైనజీవులతో సందడిగా ఉంటుంది.

పానీయం యే ప్రయచ్ఛన్తి సర్వప్రాణ్యుపజీవనమ్ ।
తే వితృష్ణాస్సుఖం యాన్తి విమానైరతిరంహసైః ॥ 25 ॥

జీవులందరికీ ప్రాణాలు నిలిచి ఉండడానికి ఆధారమైన నీళ్లను దానం చేసినవాళ్లు దాహబాధ లేకుండా, మిక్కిలి వేగవంతమైన విమానాలమీద సుఖంగా యమపురానికి వెళ్తారు.

కాష్ఠపాదుకాయానాని పీఠకాన్యాసనాని చ ।
యైర్దత్తాని ద్విజాతిభ్యస్తేఽధ్వానం యాన్తి వై సుఖమ్ ॥ 26 ॥

చెక్కతో చేసిన చెప్పులనూ, పీటలనూ, ఆసనాలనూ, బ్రాహ్మణులకు దానం చేసినవాళ్లు యమపురానికి వెళ్లేదారిలో ఏబాధా లేకుండా సుఖంగా ప్రయాణిస్తారు.

సౌవర్ణమణిపీఠేషు పాదౌ కృత్వోత్తమేషు చ ।
తే ప్రయాన్తి విమానైస్తు అప్సరోగణమణ్డితైః ॥ 27 ॥

బంగారంతోనూ, రత్నాలతోనూ నిర్మించిన శ్రేష్ఠమైన పాదపీఠాలపై కాళ్లు మోపి, అప్సరసల సమూహాలతో అందంగా ఉన్న విమానాలమీద యమపురానికి వెళ్తారు.

ఆరామాణి విచిత్రాణి పుష్పాఢ్యానీహ మానవాః ।
రోపయన్తి ఫలాఢ్యాని నరాణాముపకారిణః ॥ 28 ॥

వృక్షచ్ఛాయాసు రమ్యాసు శీతలాసు స్వలఙ్కృతాః ।
వరస్త్రీగీతవాద్యైశ్చ సేవ్యమానా వ్రజన్తి తే ॥ 29 ॥

మానవులకు చక్కగా ఉపయోగించే పూలతోనూ, పండ్లతోనూ నిండి, అద్భుతంగా ఉన్న తోటలను నెలకొల్పిన మానవులు చక్కగా అలంకరించబడి, యమపురానికి వెళ్తారు. మనోహరంగా ఉన్న చల్లని చెట్లనీడలలో, ఉత్తమలైన తరుణులు వివిధమైన వాద్యాలను వాయిస్తూ, గానం చేస్తూ సేవిస్తారు.

సువర్ణం రజతం వాపి విద్రుమం మౌక్తికం తథా ।
యే ప్రయచ్ఛన్తి తే యాన్తి విమానైః కనకోజ్జ్వలైః ॥ 30 ॥

బంగారం గాని, వెండి గాని, పగడాలు గాని, ముత్యాలు గాని దానం చేసిన మానవులు బంగారంతో నిర్మించబడి, చక్కగా ప్రకాశించే విమానాలమీద యమపురానికి వెళ్తారు.

భూమిదా దీప్యమానాశ్చ సర్వకామైస్తు తర్పితాః ।
ఉదితాదిత్యసఙ్కాశైర్విమానైర్భృశనాదితైః ॥ 31 ॥

భూమిని దానం చేసిన మానవులకు ఇక్కడ సమస్తమైన కోరికలు నెరవేరతాయి. తరువాత చక్కని సంగీత ధ్వనులతో, ఉదయిస్తున్న సూర్యుడులాగా ప్రకాశిస్తున్న విమానాలమీద, వెలిగిపోతూ, యమపురానికి వెళ్తారు.

కన్యాం తు యే ప్రయచ్ఛన్తి బ్రహ్మదేయామలఙ్కృతామ్ ।
దివ్యకన్యావృతా యాన్తి విమానైస్తే యమాలయమ్ ॥ 32 ॥

కన్యను చక్కగా అలంకరించి, బ్రాహ్మణులకు దానం చేసిన మానవులు దేవకన్యలు చుట్టూ చేరి సేవిస్తుండగా, విమానాలపై యమపురానికి వెళ్తారు.

సుగన్ధాగరుకర్పూరాన్ పుష్పధూపాన్ ద్విజోత్తమాః ।
ప్రయచ్ఛన్తి ద్విజాతిభ్యో భక్త్యా పరమయాఽన్వితాః ॥ 33 ॥

తే సుగన్ధాస్సువేషాశ్చ సుప్రభాస్సువిభూషితాః ।
యాన్తి ధర్మపురం యానైర్విచిత్రైరభ్యలఙ్కృతాః ॥ 34 ॥

విప్రవరులారా! బ్రాహ్మణులకు పరిమళభరితమైన అగరునూ, కర్పూరాన్నీ, పూవులనూ, ధూపాలనూ, అత్యంత భక్తితో దానం చేసిన మానవులు అద్భుతమైన వాహనాలమీద యమపురానికి వెళ్తారు. వారు ఒంటినిండా సుగంధద్రవ్యాలు పూసుకుంటారు. చక్కని వేషం ధరిస్తారు. అత్యధికమైన కాంతితో, చక్కని ఆభరణాలతో, అందమైన అలంకారాలతో కూడి ఉంటారు.

దీపదా యాన్తి యానైశ్చ దీపయన్తో దిశో దశ ।
ఆదిత్యసదృశైర్యానైర్దీప్యమానా యథాఽగ్నయః ॥ 35 ॥

దీపాన్ని దానం చేసిన మానవులు త్రేతాగ్నులలాగా ప్రకాశిస్తూ, దిక్కు లన్నింటిని వెలిగిస్తూ, సూర్యుడితో సమానమైన విమానాల మీద యమపురానికి వెళ్తారు.

గృహావసథదాతారో గృహైః కాఞ్చనమణ్డితైః ।
వ్రజన్తి బాలార్కనిభైర్ధర్మరాజగృహం నరాః ॥ 36 ॥

ఇళ్లు, మఠాలు దానం చేసిన మానవులు బంగారంతో అలంకరించబడి, ఉదయకాలపు సూర్యుడితో సమానమైన భవనాలలో, యముడి ఇంటికి వెళ్తారు.

జలభాజనదాతారః కుణ్డికాకరకప్రదాః ।
పూజమానాప్సరోభిశ్చ యాన్తి దృప్తైర్మహాగజైః ॥ 37 ॥

నీటిపాత్రలనూ, గుండిగలనూ, కమండలువులనూ దానం చేసిన మానవులు అప్సరసలు సేవిస్తుండగా, మదించిన యేనుగుల మీద యమపురానికి వెళ్తారు.

పాదాభ్యఙ్గం శిరోఽభ్యఙ్గం స్నానపానోదకం తథా ।
యే ప్రయచ్ఛన్తి విప్రేభ్యస్తే యాన్త్యశ్వైర్యమాలయమ్ ॥ 38 ॥

పాదాలకూ, తలకూ నలుగు పెట్టడంకోసం చమురూ, స్నానానికీ, తాగడానికీ నీళ్లూ బ్రాహ్మణులకు ఇచ్చిన మానవులు గుఱ్ఱాలమీద యమపురానికి వెళ్తారు.

విశ్రామయన్తి యే విప్రాంచ్ఛ్రాన్తానధ్వని కర్శితాన్ ।
చక్రవాకప్రయుక్తేన యాన్తి యానేన తే సుఖమ్ ॥ 39 ॥

దారివెంట నడకవలన శ్రమతో అలసి, బాధపడుతున్న బ్రాహ్మణులైన బాటసారులకు విశ్రాంతిని ఏర్పాటు చేసిన మానవులు చక్రవాకపక్షులు నడిపే వాహనంమీద సుఖంగా యమపురానికి వెళ్తారు.

స్వాగతేన చ యో విప్రం పూజయేదాసనేన చ ।
స గచ్ఛతి తమధ్వానం సుఖం పరమనిర్వృతః ॥ 40 ॥

బ్రాహ్మణుడిని భక్తితో స్వాగతించి, ఆసనమిచ్చి, పూజించిన మానవుడు యమపురానికి వెళ్లే దారిలో ఎటువంటి కష్టము లేకుండా, సుఖంగా ప్రయాణిస్తాడు.

నమో బ్రహ్మణ్యదేవేతి యో హరిం చాభివాదయేత్ ।
గాం చ పాపహరేత్యుక్త్వా సుఖం యాన్తి చ తత్పథమ్ ॥ 41 ॥

'నమో బ్రహ్మణ్యదేవాయ' అనే మంత్రంతో శ్రీమహావిష్ణువునూ, 'పాపహర' అనే మంత్రంతో ఆవునూ నమస్కరించినవాడు నరకమార్గంలో సుఖంగా ప్రయాణిస్తాడు.

అనన్తరాశినో యే చ దమ్భానృతవివర్జితాః ।
తేఽపి సారసయుక్తైస్తు యాన్తి యానైశ్చ తత్పథమ్ ॥ 42 ॥

బ్రాహ్మణులు (అతిథులు) భోజనం చేసిన తరువాత అన్నం తినేవాళ్లూ, మోసం చేయనివాళ్లూ, అసత్యమాడనివాళ్లూ నీటిపక్షులు నడిపే వాహనాలపైన నరకమార్గంలో సుఖంగా ప్రయాణిస్తారు.

వర్తన్తే హ్యేకభక్తేన శాఠ్యదమ్భవివర్జితాః ।
హంసయుక్తై ర్విమానైస్తు సుఖం యాన్తి యమాలయమ్ ॥43॥

వంచన కాని, దంబాచారం కాని లేకుండా యెవరు ఒంటిపూట భోజనంతో గడుపుతారోవారు హంసలు పూన్చిన విమానంమీద యమపురానికి వెళ్తారు.

చతుర్థేనైకభక్తేన వర్తన్తే యే జితేన్ద్రియాః ।
తే యాన్తి ధర్మనగరం యానైర్బర్హిణయోజితైః ॥ 44 ॥

ఇంద్రియాలను జయించి, యే మానవులు మూడురోజులు ఉపవసించి నాల్గవరోజు ఒక పూట భోజనం చేస్తారో ఆ మానవులు నెమళ్లు పూంచిన వాహనాలమీద యమపురానికి వెళ్తారు.

తృతీయే దివసే యే తు భుఞ్జతే నియతవ్రతాః ।
తేఽపి హస్తిరథైర్దివ్యైర్యాన్తి యానైశ్చ తత్పదమ్ ॥ 45 ॥

కఠినమైన నియమాలను పాటిస్తూ, రెండు రోజులు ఉపవాసం ఉండి, మూడవరోజు భోజనం చేసేవాళ్లు దేవలోకానికి సంబంధించిన ఏనుగు వాహనాలమీద యమపురానికి వెళ్తారు.

షష్ఠేఽన్నభక్షకో యస్తు శౌచనిత్యో జితేన్ద్రియః ।
స యాతి కుఞ్జరరథ శ్శచీపతిరివ స్వయమ్ ॥ 46 ॥

ఇంద్రియాలను తమ అధీనంలో ఉంచుకుని, నిత్యమూ పవిత్రంగా ఉంటూ, ఐదు రోజులు ఉపవాసం ఉండి, ఆరవరోజు భోజనం చేసేవాళ్లు దేవేంద్రుడిలాగా తెల్లయేనుగు వాహనంమీద స్వేచ్ఛగా యమపురానికి వెళ్తారు.

ధర్మరాజపురం రమ్యం నానామణివిభూషితమ్ ।
నానాస్వరసమాయుక్తం జయశబ్దేన సంయుతమ్ ॥ 47 ॥

(వారు వెళ్లిన) యమపురం చాల మనోహరంగా ఉంటుంది. రకరకాల రత్నాలతో అలంకరింపబడి ఉంటుంది. వివిధమైన సంగీతస్వరాలతో మారుమోగుతుంటుంది. జయ జయ ధ్వానాలతో నిండిఉంటుంది.

పక్షోపవాసినో యాన్తి యానైశ్శార్దూలయోజితైః ।
పురం తద్ధర్మరాజస్య సేవ్యమానాస్సురాసురైః ॥ 48 ॥

పదిహేనురోజులపాటు ఉపవాసం ఉండి పదహారవ రోజు భోజనం చేసే మానవులు దేవతలూ, రాక్షసులూ సేవిస్తుండగా, పెద్దపులులు కట్టిన వాహనంమీద, యమపురానికి వెళ్తారు.

యే చ మాసోపవాసం తు కుర్వతే సంయతేన్ద్రియాః ।
తేఽపి సూర్యప్రదీప్తైస్తు యాన్తి యానైర్యమాలయమ్ ॥ 49 ॥

ఇంద్రియాలను నియమించుకుని, నెలరోజులు ఉపవాసం ఉండి, ఆ మరునాడు భోజనం చేసే మానవులు సూర్యుడితో సమానంగా ప్రకాశించే విమానాలమీద యమపురానికి వెళ్తారు.

మహాప్రస్థానమేకాగ్రో యః ప్రయాతి దృఢవ్రతః ।
సేవ్యమానస్తు గన్ధర్వైర్యాతి యానైరవిప్రభైః ॥ 50 ॥

మరణసమయంలో శ్రీమహావిష్ణువుపై మనసును ఏకాగ్రంగా నిలిపిఉంచిన దృఢదీక్షాపరుడు గంధర్వులు సేవిస్తుండగా, సూర్యుడివంటి కాంతి కలిగిన విమానాలమీద యమపురానికి వెళ్తారు.

శరీరం సాధయేద్ యస్తు వైష్ణవేనాన్తరాత్మనా ।
స రథేనాగ్నివర్ణేన యాతీహ త్రిదశాలయమ్ ॥ 51 ॥

మనసు శ్రీమహావిష్ణువుపైన ఏకాగ్రంగా నిలిపి, శరీరాన్ని కేవలం స్వామిసేవకే సాధనంగా చేసుకున్నవాడు అగ్నిలాగా తేజరిల్లే రథంమీద యమపురానికి వెళ్తాడు.

అగ్నిప్రవేశం యః కుర్యాన్నారాయణపరాయణః ।
స యాత్యగ్నిప్రకాశేన విమానేన యమాలయమ్ ॥ 52 ॥

నారాయణుడిమీద తాత్పర్యంతో అగ్నిలో ప్రవేశించినవాడు అగ్నిలాగా ప్రకాశించే విమానంమీద యమపురానికి వెళ్తాడు.

ప్రాణాంస్త్యజతి యో మర్త్యస్స్మరన్ విష్ణుం హ్యనాశనైః ।
యానేనార్కప్రకాశేన యాతి ధర్మపురం నరః ॥ 53 ॥

ఉపవాసాదులతో నిరంతరమూ శ్రీమహావిష్ణువునే స్మరిస్తూ, ప్రాణాలు విడిచిపెట్టిన మానవుడు సూర్యుడివంటి కాంతి కలిగిన విమానంమీద యమపురానికి వెళ్తాడు.

ప్రవిష్టోఽన్తర్జలం యస్తు ప్రాణాంస్త్యజతి మానవః ।
సోమమణ్డలకల్పేన యాతి యానేన వై సుఖమ్ ॥ 54 ॥

శ్రీమహావిష్ణువుమీద తాత్పర్యంతో నీటిలో ప్రవేశించి ప్రాణాలు విడిచిపెట్టిన మానవుడు చంద్రమండలం వంటి వాహనంమీద సుఖంగా యమపురానికి వెళ్తాడు.

స్వశరీరం హి గృధ్రేభ్యో వైష్ణవో యః ప్రయచ్ఛతి ।
స యాతి రథముఖ్యేన కాఞ్చనేన యమాలయమ్ ॥ 55 ॥

శ్రీమహావిష్ణువుమీది భక్తితో తన శరీరాన్ని గద్దలకు (జీవులకు) ఆహారంగా సమర్పించినవాడు ఉత్తమమైన బంగారు రథంలో యమపురానికి వెళ్తాడు.

స్త్రీగ్రహే గోగ్రహే వాపి యుద్ధే మృత్యుముపైతి యః ।
స యాత్యమరకన్యాభిస్సేవ్యమానో రవిప్రభః ॥ 56 ॥

స్త్రీలనూ, గోవులనూ రక్షించడంకోసం పోరాడుతూ, మరణించినవాడు దేవతాస్త్రీలు సేవిస్తుండగా, సూర్యుడి వంటి తేజస్సు కలిగిన విమానంమీద యమపురానికి వెళ్తాడు.

వైష్ణవా యే చ కుర్వన్తి తీర్థయాత్రాం జితేన్ద్రియాః ।
తత్పథం యాన్తి తే ఘోరం సుఖయానైరలఙ్కృతాః ॥ 57 ॥

ఇంద్రియాలను తమ చెప్పుచేతలలో ఉంచుకుని, తీర్థయాత్రలు చేసే విష్ణుభక్తులు చక్కని అలంకారాలతో సుఖంగా ఉండే వాహనాల మీద యమమార్గంలో సుఖంగా ప్రయాణిస్తారు.

యే యజన్తి ద్విజశ్రేష్ఠాః క్రతుభిర్భూరిదక్షిణైః ।
తప్తహాటకసఙ్కాశైర్విమానైర్యాన్తి తే సుఖమ్ ॥ 58 ॥

బ్రాహ్మణోత్తములారా! దక్షిణలు ఘనంగా ఇచ్చి యజ్ఞాలు చేసినవాళ్లు మేలిమి బంగారం వంటి కాంతి కలిగిన విమానాలమీద సుఖంగా యమపురానికి వెళ్తారు.

పరపీడామకుర్వన్తో భృత్యానాం భరణాదికమ్ ।
కుర్వన్తి తే సుఖం యాన్తి విమానైః కనకోజ్జ్వలైః ॥ 59 ॥

ఇతరులను బాధించనివాళ్లు, సేవకులను చక్కగా పోషించేవాళ్లు ప్రకాశించే బంగారు విమానాలమీద యమపురానికి వెళ్తారు.

యే క్షాన్తాస్సర్వభూతేషు ప్రాణినామభయప్రదాః ।
క్రోధమోహవినిర్ముక్తా నిర్మదాస్సంయతేన్ద్రియాః ॥ 60 ॥

పూర్ణచన్ద్రప్రకాశేన విమానేన మహాప్రభాః ।
యాన్తి వైవస్వతపురం దేవగన్ధర్వసేవితాః ॥ 61 ॥

అన్నిప్రాణులపైనా క్షమాగుణం కలిగినవాళ్లూ, జీవులభయాన్ని పోగొట్టేవాళ్లూ, కోపమూ, ఆశ విడిచిపెట్టిన వాళ్లూ, అహంకారం లేనివాళ్లూ, ఇంద్రియాలను జయించినవాళ్లూ, నిండుచంద్రుడివంటి కాంతి కలిగిన విమానంలో యమపురానికి వెళ్తారు. వారు మిక్కిలి తేజస్సుతో ప్రకాశిస్తారు. ఆ విమానాలలో వారిని దేవతలు, గంధర్వులు సేవిస్తారు.

ఏకభావేన యే విష్ణుం బ్రహ్మాణం త్ర్యమ్బకం రవిమ్ ।
పూజయన్తి హి తే యాన్తి సద్యశ్శౌచసమన్వితాః ॥ 62 ॥

విష్ణువు, బ్రహ్మ, శివుడు, సూర్యుడు ఒక్కటే అనే భావనతో భేదభావం లేకుండా పూజించేవాళ్లు ఆ క్షణంలోనే పవిత్రులవుతారు. తరువాత సుఖంగా యమపురానికి వెళ్తారు.

యే చ మాంసం న ఖాదన్తి సత్యశౌచదయాపరాః ।
తేఽపి యాన్తి సుఖేనైవ ధర్మరాజపురం నరాః ॥ 63 ॥

సత్యము, పవిత్రత, కరుణ ప్రధానంగా కలిగి, మాంసం తినని మానవులు కూడ ఏమీ కష్టపడకుండా సుఖంగా యమపురానికి వెళ్తారు.

మాంసాన్మిష్టతరం నాస్తి భక్ష్యభోజ్యాదికేషు వై ।
తస్మాన్మాంసం న భుఞ్జీత నాస్తి మిష్టైస్సుఖోదయః ॥ 64 ॥

రుచికరమైన వంటకాలన్నింటిలోనూ మాంసాన్ని మించినది మరొకటి లేదు. అందుచేతనే మాంసాన్ని ఎంతమాత్రమూ తినగూడదు. రుచికరమైన పదార్థాలలో నిజమైన సుఖం లేదు.

గోసహస్రం తు యో దద్యాత్ యస్తు మాంసం న భక్షయేత్ ।
సమావేతౌ పురా ప్రాహ బ్రహ్మా వేదవిదాం వరః ॥ 65 ॥

వేదవేత్తలలో శ్రేష్ఠుడైన బ్రహ్మ పూర్వం మాంసం తిననివాడూ, వెయ్యి ఆవులను దానం చేసినవాడూ ఇద్దరూ సమానం అని చెప్పాడు. (మాంసాన్ని తినకపోవడం సహస్ర గోదాన ఫలం ఇస్తుంది.)

సర్వతీర్థేషు యత్పుణ్యం సర్వయజ్ఞేషు యత్ఫలమ్ ।
అమాంసభక్షణే విప్రాస్తచ్చ తచ్చ చ తత్సమమ్ ॥ 66 ॥

బ్రాహ్మణులారా! మాంసం తినకపోవడంవల్ల కలిగే పుణ్యఫలం సమస్తమైన పుణ్యతీర్థాలను సేవించడం వలన వచ్చే పుణ్యంతో సమానం. అలాగే సమస్తమైన యజ్ఞాలను చేయడంవలన కలిగే పుణ్యఫలం మాంసం తినకపోవడంవల్ల కలుగుతుంది.

ఏవం సుఖేన తే యాన్తి యమలోకం చ ధార్మికాః ।
దానవ్రతపరా యానైర్యత్ర దేవో రవేస్సుతః ॥ 67 ॥

ఈవిధంగా దానాలు, వ్రతాలు చేసిన ధర్మపరాయణులైన మానవులు సూర్యకుమారుడైన యమధర్మరాజు ఉండే లోకానికి సుఖంగా ప్రయాణం చేస్తారు.

దృష్ట్వా తాన్ ధార్మికాన్ దేవస్స్వయం సమ్మానయేద్ యమః ।
స్వాగతాసనదానేన పాద్యార్ఘ్యేణ ప్రియేణ తు ॥ 68 ॥

ధర్మపరాయణులైన వారిని చూడగానే యమధర్మరాజు స్వాగతం చెప్పి, ఆసనం ఇచ్చి, ఇష్టమైన పాద్యంతోనూ, అర్ఘ్యంతోనూ చక్కగా ఆదరిస్తాడు.

ధన్యా యూయం మహాత్మానస్స్వాత్మనో హితకారిణః ।
యేన దివ్యసుఖార్థాయ భవద్భిస్సుకృతం కృతమ్ ॥ 69 ॥

మీరు ధన్యులు. మహాత్ములు. మీకు మేలు గలిగించే పనులు చేశారు. దేవతాసంబంధమైన సుఖాలను పొందడంకోసం మీరు పుణ్యకర్మలను ఆచరించారు.

ఇదం విమానమారుహ్య దివ్యస్త్రీభోగభూషితాః ।
స్వర్గం గచ్ఛధ్వమతులం సర్వకామసమన్వితమ్ ॥ 70 ॥

ఇదిగో ఈ విమానం ఎక్కండి. దేవకాంతలతో భోగాలు పొందండి. స్వర్గానికి వెళ్లండి. అది సాటిలేనిది. సమస్తమైన కోరికలను నెరవేరుస్తుంది.

తత్ర భుక్త్వా మహాభోగానన్తే పుణ్యపరిక్షయాత్ ।
యత్ కిఞ్చిదల్పమశుభం ఫలం తదిహ భోక్ష్యథ ॥ 71 ॥

స్వర్గంలో గొప్ప గొప్ప భోగాలు అనుభవించి, చివరికి, భూలోకంలో మీరు సంపాదించుకున్న పుణ్యం అంతా వ్యయమైన తరువాత ఏదైనా కొద్దిగా పాపఫలం ఉంటే, (అప్పుడు ఇక్కడికి వచ్చి) దానిని ఇక్కడ అనుభవించండి.

యే తు తం ధర్మరాజానం నరాః పుణ్యానుభావతః ।
పశ్యన్తి సౌమ్యమనసం పితృభూతమివాత్మనః ॥ 72 ॥

మంచిమనసు కలిగిన యమధర్మరాజును తాము చేసుకున్న పుణ్యానికి ఫలితంగా మానవులు అందరూ తమ తండ్రిగా (సౌమ్యరూపంలో) దర్శిస్తారు.

తస్మాద్ధర్మస్సేవితవ్యస్సదా ముక్తిఫలప్రదః ।
ధర్మాదర్థస్తథా కామో మోక్షశ్చ పరికీర్త్యతే ॥ 73 ॥

అందుచేత మోక్షఫలాన్ని ఇచ్చే ధర్మాన్ని తప్పక భక్తితో ఆచరించాలి. ధర్మం మూలంగానే అర్థమూ, కామమూ, మోక్షమూ కలుగుతాయి. కాబట్టి పురుషార్థాల కన్నిటికీ ధర్మమే మూలసాధనం.

ధర్మో మాతా పితా భ్రాతా ధర్మో నాథస్సుహృత్తథా ।
ధర్మస్స్వామీ సఖా గోప్తా తథా ధాతా చ పోషకః ॥ 74 ॥

జీవుడికి ధర్మమే తల్లి, తండ్రి, తోడబుట్టువు, భర్త, మిత్రుడు, యజమాని, సహచరుడు. రక్షించేవాడు, ధరించేవాడు, పోషించేవాడు.

ధర్మాదర్థోఽర్థతః కామః కామాద్భోగస్సుఖాని చ ।
ధర్మాదైశ్వర్యమైకాగ్ర్యం ధర్మాత్ స్వర్గగతిః పరా ॥ 75 ॥

ధర్మంనుండి అర్థమూ, అర్థంనుండి కామమూ, ఆ కామంవలన రకరకాల భోగాలూ, సుఖాలూ కలుగుతాయి. ధర్మంవలననే తిరుగులేని ప్రభుత్వం గలుగుతుంది. ధర్మంవలననే ఉత్తమమైన స్వర్గానికి వెళ్లే అవకాశం కలుగుతుంది.

ధర్మస్తు సేవితో విప్రాస్త్రాయతే మహతో భయాత్ ।
దేవత్వం చ ద్విజత్వం చ ధర్మాత్ ప్రాప్నోత్యసంశయమ్ ॥ 76 ॥

బ్రాహ్మణులారా! చక్కగా సేవించిన ధర్మమే మానవుడిని ఎటువంటి భయాన్నుంచి అయినా కాపాడుతుంది. ధర్మంవలననే దేవత్వమూ, బ్రాహ్మణత్వమూ, పొందుతాడు. ఇందులో సందేహం లేదు.

యదా చ క్షీయతే పాపం నరాణాం పూర్వసఞ్చితమ్ ।
తదైషాం భజతే బుద్ధిర్ధర్మం చాత్ర ద్విజోత్తమాః ॥ 77 ॥

విప్రవరేణ్యులారా! పూర్వం తాము సంపాదించుకున్న పాపకర్మలఫలం నశించిపోగానే, వారికి ధర్మం ఆచరించాలనే బుద్ధి పుడుతుంది.

జన్మాన్తరసహస్రేషు మానుష్యం ప్రాప్య దుర్లభమ్ ।
యో హి నాచరతే ధర్మం భవేత్ స ఖలు వఞ్చితః ॥ 78 ॥

వేలకొలది జన్మలు గడిచిన తరువాత ఎప్పటికో ఎంతో దుర్లభమైన మానవజన్మ కలుగుతుంది. ఆ జన్మలో గూడ ధర్మాన్ని ఆచరించనివాడు తన్ను తాను మోసం చేసుకున్నవాడు అవుతాడు.

కుత్సితా యే దరిద్రాశ్చ విరూపా వ్యాధితాస్తథా ।
పరప్రేష్యాశ్చ మూర్ఖాశ్చ జ్ఞేయా ధర్మవివర్జితాః ॥ 79 ॥

(ఈ జన్మలో) నిందితులు, హీనులు, కురూపులు, రోగగ్రస్తులు, సేవకులు అయిన మానవులు పూర్వజన్మలలో ధర్మాన్ని ఆచరించలేదని గ్రహించాలి.

యే హి దీర్ఘాయుషశ్శూరాః పణ్డితా భోగినోఽర్థినః ।
అరోగా రూపవన్తశ్చ తైస్తు ధర్మః పురా కృతః ॥ 80 ॥

ఎక్కువకాలం జీవించి ఉన్నవారు, వీరులు, పండితులు, భోగాలు అనుభవించేవారు, ఆరోగ్యవంతులు, సుందరులు, అయి ఉన్నారో వారు పూర్వజన్మలలో ధర్మాన్ని చక్కగా ఆచరించినవాళ్లు.

ఏవం ధర్మరతా విప్రా గచ్ఛన్తి గతిముత్తమామ్ ।
అధర్మం సేవమానాస్తు తిర్యగ్యోనిం వ్రజన్తి తే ॥ 81 ॥

ద్విజులారా! ఈవిధంగా ధర్మంపైన మిక్కిలి ఆసక్తి కలిగి, ఆచరించేవాళ్లు ఉత్తమమైన గతులను పొందుతారు. అధర్మాన్ని ఆచరించినవాళ్లు పశువులు, పక్షులు మొదలైన జాతులలో పుడతారు.

యే నరా నరకధ్వంసి వాసుదేవమనువ్రతాః ।
న సమర్థో యమస్తేషాం తాన్ స్వప్నే ఽపి న పశ్యతి ॥ 82 ॥

నరకాసురుడిని సంహరించిన వాసుదేవస్వామిని దీక్షతో సేవించే భక్తులను ఆ యమధర్మరాజు కూడ ఏమీ చేయలేడు. కలలో కూడ విష్ణుభక్తులను కన్నెత్తి చూడలేడు.

అనాదినిధనం దేవం దైత్యదానవదారణమ్ ।
యే నమన్తి నరా నిత్యం న హి పశ్యన్తి తే యమమ్ ॥ 83 ॥

దైత్యులనూ, దానవులనూ సంహరించిన ఆ విష్ణుదేవుడు మొదలు, చివర తెలియరానివాడు. ఆ స్వామికి నిత్యమూ వినయంగా నమస్కరించే మానవులు యముడిని చూడరు (యమలోకానికి వెళ్లరు).

కర్మణా మనసా వాచా యేఽచ్యుతం శరణం గతాః ।
న సమర్థో యమస్తేషాం తే ముక్తిఫలభాగినః ॥ 84 ॥

మనస్సు, మాట, మేను అనే త్రికరణాలతోనూ శ్రీమహావిష్ణువును శరణు పొందిన మానవులు మోక్షం పొందడానికి అర్హులు. వారిని యముడు ఏమీ చేయలేడు.

యే జనా జగతాం నాథం నిత్యం నారాయణం ద్విజాః ।
నమన్తి న హి తే విష్ణోః స్థానాదన్యత్ర గామినః ॥ 85 ॥

విప్రులారా! నిత్యమూ జగన్నాథుడైన శ్రీమన్నారాయణుడికి భక్తితో నమస్కరించిన మానవులు విష్ణుపదానికి తప్ప మరొకచోటికి వెళ్లరు.

న తే దూతాన్న తన్మార్గం న యమం న చ తాం పురీమ్ ।
ప్రణమ్య విష్ణుం పశ్యన్తి నరకాణి కథంచన ॥ 86 ॥

శ్రీమహావిష్ణువుకు నమస్కరించిన మానవులు యమదూతలను గాని, యమలోక మార్గాన్ని గాని, యమపురాన్ని గాని, యముడిని గాని, నరకలోకాలను గాని చూడరు.

కృత్వాఽపి బహుశః పాపం నరా మోహసమన్వితాః ।
న యాన్తి నరకం నత్వా సర్వపాపహరం హరిమ్ ॥ 87 ॥

సమస్తమైన పాపాలను హరించే శ్రీహరికి నమస్కరించిన మానవులు, అజ్ఞానంతో ఎన్నో పాపాలు చేసినా, నరకానికి వెళ్లరు.

శాఠ్యేనాపి నరా నిత్యం యే స్మరన్తి జనార్దనమ్ ।
తేఽపి యాన్తి తనుం త్యక్త్వా విష్ణులోకమనామయమ్ ॥ 88 ॥

కపటపు బుద్ధితోనైనా, శ్రీమహావిష్ణువును తలుచుకున్న మానవులు శరీరం విడిచిన తరువాత ఎటువంటి బాధలూ లేని విష్ణులోకానికి వెళ్తారు.

అత్యన్తక్రోధసక్తోఽపి కదాచిత్ కీర్తయేద్ధరిమ్ ।
సోఽపి దోషక్షయాన్ముక్తిం లభేచ్చేదిపతిర్యథా ॥ 89 ॥

విష్ణువుపై మిక్కిలి కోపం కలిగినవాడు (విష్ణువిరోధి) అయినా, ఎప్పుడో ఒకప్పుడు (పొరపాటుగా) శ్రీహరి నామాన్ని ఉచ్చరిస్తే వాడి పాపాలు సమస్తమూ నశించిపోతాయి. వాడు శిశుపాలుడులాగా మోక్షాన్ని పొందుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసర్షిసంవాదే ధార్మికాణాం సుగతినిరూపణం నామ సప్తోత్తరశతతమోఽధ్యాయః॥107॥

శ్రీబ్రహ్మపురాణంలో వ్యాస ఋషి సంవాదంలో ధార్మికుల సుగతి నిరూపణం అనే నూటఏడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టాధికశతతమోఽధ్యాయః - నూటఎనిమిదవ అధ్యాయం

సంసారచక్రనిరూపణమ్ - సంసారచక్ర నిరూపణం

లోమహర్షణ ఉవాచ :-లోమహర్షణుడు నైమిశారణ్యంలోని మునులతో ఇలా అంటున్నాడు.

శ్రుత్వైవం యమమార్గం తే నరకేషు చ యాతనామ్ ।
పప్రచ్ఛుశ్చ పునర్వ్యాసం సంశయం మునిసత్తమాః ॥ 1 ॥

యమలోకానికి పోయే దారిలోనూ, నరకాలలోనూ ఉన్న బాధలను విని, మునులు తమ సందేహం గురించి వ్యాసమహర్షిని ఇలా అడిగారు.

మునయ ఊచుః :-వ్యాసమహర్షితో మునులు ఇలా అంటున్నారు.

భగవన్ సర్వధర్మజ్ఞ సర్వశాస్త్రవిశారద ।
మర్త్యస్య కస్సహాయో వై పితా మాతా సుతో గురుః ॥
జ్ఞాతిసమ్బన్ధివర్గశ్చ మిత్రవర్గస్తథైవ చ ॥ 2 ॥

సమస్తమైన ధర్మాలనూ తెలిసినవాడా! శాస్త్రాలన్నింటిలో నిష్ణాతుడా! మహాత్మా! మానవుడికి తోడుగా ఉండేవాడు ఎవడు? తండ్రా? తల్లా? కొడుకా? ఆచార్యుడా? దాయాదులా? చుట్టాలా? స్నేహితులా?

గృహం శరీరముత్సృజ్య కాష్ఠలోష్ఠసమం జనాః ।
గచ్ఛన్త్యముత్ర లోకే వై కశ్చ తాననుగచ్ఛతి ॥ 3 ॥

కట్టెతోనూ, రాయితోనూ సమానమైన ఇంటినీ, శరీరాన్నీ విడిచిపెట్టి జనాలు వెళ్లిపోతున్నారు. వాళ్లవెంట ఈ లోకంలో ఎవడు వెళ్తున్నాడు?

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఏకః ప్రసూయతే విప్రా ఏక ఏవ హి నశ్యతి ।
ఏకస్తరతి దుర్గాణి గచ్ఛత్యేకస్తు దుర్గతిమ్ ॥ 4 ॥

బ్రాహ్మణులారా! జీవుడు ఒంటరిగానే పుడతాడు. ఒంటరిగానే మరణిస్తాడు. ఒంటరిగానే కష్టాలను అనుభవిస్తాడు. ఒంటిగానే నరకలోకాలకు చేరతాడు.

అసహాయః పితా మాతా తథా భ్రాతా సుతో గురుః ।
జ్ఞాతిసమ్బన్ధివర్గశ్చ మిత్రవర్గస్తథైవ చ ॥ 5 ॥

తండ్రి, తల్లి, సోదరుడు, కొడుకు, ఆచార్యుడు, దాయాదులు, చుట్టాలు, స్నేహితులు ఎవ్వరూ జీవుడికి తోడు ఉండరు.

మృతం శరీరముత్సృజ్య కాష్ఠలోష్ఠసమం జనాః ।
ముహూర్తమివ రోదిత్వా తతో యాన్తి పరాఙ్ముఖాః ॥ 6 ॥

కట్టె, రాయి వంటి జీవుడి శరీరాన్ని శ్మశానంలో విడిచిపెట్టి, ఒక్కక్షణం ఏడ్చి, జన మందరూ ఇంటికి తిరుగుముఖం పట్టి వెళ్లిపోతారు.

తైస్తచ్ఛరీరముత్సృష్టం ధర్మ ఏకోఽనుగచ్ఛతి ।
తస్మాద్ధర్మస్సహాయశ్చ సేవితవ్యస్సదా నృభిః ॥ 7 ॥

అందరూ వదిలేసిన ఆ శరీరాన్ని ఆ జీవుడు ఆచరించిన ధర్మం ఒక్కటి మాత్రమే అనుసరించి వెళ్తుంది. అందుచేత మానవు లందరికీ నిజమైన తోడు ధర్మం మాత్రమే. కాబట్టి ధర్మాన్ని తప్పకుండా సేవించాలి.

ప్రాణీ ధర్మసమాయుక్తో గచ్ఛేత్ స్వర్గగతిం పరామ్ ।
తథైవాధర్మసంయుక్తో నరకం చోపపద్యతే ॥ 8 ॥

ధర్మం ఆచరించిన జీవుడు ఉత్తమమైన స్వర్గస్థానాన్ని పొందుతాడు. అలాగే అధర్మం ఆచరించినవాడు నరకానికి వెళ్తాడు.

తస్మాత్ పాపగతైరర్థైర్నానురజ్యేత పణ్డితః ।
ధర్మ ఏకో మనుష్యాణాం సహాయః పరికీర్తితః ॥ 9 ॥

అందుచేత వివేకం ఉన్నవాడు పాపం కలిగించే విషయాలపై ఆసక్తి పెట్టుకోగూడదు. మానవులకు ధర్మం ఒక్కటే తోడు అని పెద్దలు చెప్తారు.

లోభాన్మోహాదనుక్రోశాద్ భయాద్వాథ బహుశ్రుతః ।
నరః కరోత్యకార్యాణి పరార్థం లోభమోహితః ॥ 10 ॥

అన్నీ తెలిసిన పండితుడు కూడ దురాశాపరుడై, భ్రమతో, ఆశ, భ్రాంతి, కోపం, భయం మొదలైన కారణాలచేత ఇతరుల కోసం చేయగూడని పనులు చేస్తుంటాడు.

ధర్మశ్చార్థశ్చ కామశ్చ త్రితయం జీవతః ఫలమ్ ।
ఏతత్త్రయమవాప్తవ్యమధర్మపరివర్జితమ్ ॥ 11 ॥

జీవించిఉన్న కాలంలో ధర్మమూ, అర్థమూ, కామమూ అనేవి మూడూ సాధించవలసిన ప్రయోజనాలు. మానవుడు ఈ మూడింటినీ ధర్మానికి విరోధం కాకుండా, తప్పకుండా సాధించాలి.

మునయ ఊచుః :-వ్యాసమహర్షితో మునులు ఇలా అంటున్నారు.

శ్రుతం భగవతో వాక్యం ధర్మయుక్తం పరం హితమ్ ।
శరీరనిచయం జ్ఞాతుం బుద్ధిర్నోఽత్ర ప్రజాయతే ॥ 12 ॥

ధర్మంతో కూడి, లోకాలకు ఉత్తమమైన మేలు చేకూర్చే తమ మాటలు విన్నాం. ఇక పైన శరీరం నశించేతీరును గురించి తెలుసుకోవాలని మాకు బుద్ధి పుట్టింది.

మృతం శరీరం హి నృణాం సూక్ష్మమవ్యక్తతాం గతమ్ ।
అచక్షుర్విషయం ప్రాప్తం కథం ధర్మోఽనుగచ్ఛతి ॥ 13 ॥

మరణించిన తరువాత మానవుల శరీరం సూక్ష్మమైన రూపంలో ఎవ్వరికీ తెలియకుండా ఉంటుంది. కంటికి కనబడదు. అటువంటిదాన్ని ధర్మం ఏవిధంగా అనుసరించి వెళ్తుంది.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

పృథివీ వాయురాకాశమాపో జ్యోతిర్మనోఽన్తరమ్ ।
బుద్ధిరాత్మా చ సహితా ధర్మం పశ్యన్తి నిత్యదా ॥ 14 ॥

నేల, గాలి, నింగి, నీళ్లు, నిప్పు, మనస్సు, బుద్ధి, ఆత్మ అనేవి అన్నీ కలిసి నిత్యమూ ధర్మాన్ని సాక్షులుగా చూస్తుంటాయి.

ప్రాణినామిహ సర్వేషాం సాక్షిభూతా దివానిశమ్ ।
ఏతైశ్చ సహ ధర్మో హి తం జీవమనుగచ్ఛతి ॥ 15 ॥

పగలు, రాత్రి అనేవి ఎల్లపుడూ జీవుల కర్మలకు అన్నింటికీ సాక్షులుగా నిలుస్తాయి. వీటితో కలిసి, ధర్మం జీవుడిని అనుసరించి వెళ్తునే ఉంటుంది.

త్వగస్థిమాంసం శుక్రం చ శోణితం చ ద్విజోత్తమాః ।
శరీరం వర్జయన్త్యేతే జీవితేన వివర్జితమ్ ॥ 16 ॥

విప్రవరేణ్యులారా! ప్రాణం పోయిన తరువాత చర్మం, ఎముక, మాంసం, శుక్రం, శోణితం, అనేవి శరీరాన్ని విడిచిపెడతాయి.

తతో ధర్మసమాయుక్తస్సజీవస్సుఖమేధతే ।
ఇహలోకే పరేచైవ కిం భూయః కథయామి వః ॥17 ॥

అందుచేత ధర్మంతో కూడిన ఆ జీవుడు మాత్రమే ఈ లోకంలోనూ, పరలోకంలోనూ సుఖాన్ని పొందుతాడు. ఇంక తరువాత ఏమి చెప్ప మంటారు?

మునయ ఊచుః :- వ్యాసమహర్షితో మునులు ఇలా అంటున్నారు.

తద్దర్శితం భగవతా యథా ధర్మోఽనుగచ్ఛతి ।
ఏతత్తు జ్ఞాతుమిచ్ఛామః కథం రేతః ప్రవర్తతే ॥ 18 ॥

మరణించిన తరువాత జీవుడిని ధర్మం ఏవిధంగా అనుసరిస్తుందో మహాత్ములైన తమరు కంటికి కట్టినట్లు వివరించారు. తరువాత ఈ విషయం తెలుసుకోవాలని కోరికగా ఉంది. శుక్రం ఏవిధంగా ప్రవర్తిస్తుంది? (జీవుడి జన్మప్రకారం తెలుపవలసింది.)

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

అన్నమశ్నన్తి యే దేవాశ్శరీరస్థా ద్విజోత్తమాః ।
పృథివీ వాయురాకాశమాపో జ్యోతిర్మనస్తథా ॥ 19 ॥

బ్రాహ్మణవర్యులారా! శరీరంలో ఉండే భూమి, వాయువు, ఆకాశం, జలం, అగ్ని, మనస్సు అనే వాటికి అధిష్ఠానంగా ఉన్న దేవతలు అన్నం తింటారు.

తతస్తృప్తేషు భో విప్రాస్తేషు భూతేషు పఞ్చసు ।
మనష్షష్ఠేషు శుద్ధాత్మా రేతస్సమ్పద్యతే మహత్ ॥ 20 ॥

ద్విజులారా! అన్నం తినడంచేత తృప్తిని పొందిన భూమి మొదలైన పంచభూతాలు, ఆరవదైన మనస్సు అనే వాటినుండి పవిత్రమూ, ఉత్తమమూ అయిన రేతస్సు ఏర్పడుతుంది.

తతో గర్భస్సమ్భవతి శ్లేష్మా స్త్రీపుంసయోర్ద్విజాః ।
ఏతద్వస్సర్వమాఖ్యాతం కిం భూయశ్శ్రోతుమిచ్ఛథ ॥ 21 ॥

విప్రులారా! స్త్రీపురుషుల సంయోగంవలన ఆ రేతస్సునుండి గర్భం ఏర్పడుతుంది. రేతస్సు పుట్టుపూర్వోత్తరాలు పూర్తిగా వివరించాను. ఆ తరువాత మీరు ఏమి వినాలనుకుంటున్నారు?

మునయ ఊచుః :-వ్యాసమహర్షితో మునులు ఇలా అంటున్నారు.

ఆఖ్యాతం నో భగవతా గర్భస్సఞ్జాయతే యథా ।
యథా జాతస్తు పురుషః ప్రపద్యేత తదుచ్యతామ్ ॥ 22 ॥

మహాత్మా! గర్భం ఏవిధంగా ఏర్పడుతుందో తమరు చక్కగా వివరించారు. ఆ గర్భం పురుషుడుగా ఎలా ఏర్పడతాడో ఆ విషయం వివరించవలసింది.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

ఆసన్నమాత్రపురుషస్తైర్భూతైరభిభూయతే ।
విప్రయుక్తస్తు తైర్భూతైః పునర్యాత్యపరాం గతిమ్ ॥ 23 ॥

ఆ పంచమహాభూతాలు చేరడంతో జీవుడు వాటికి లోబడి ప్రవర్తిస్తాడు (పంచభూతాలు ఒకచోటికి చేరడంచేత శరీరాన్ని ధరించి, పుట్టుకను పొందుతాడు).ఆ భూతాలు విడిచిపెట్టడంతో తిరిగి ఇతర గతులను (మరణం) పొందుతాడు.

స చ భూతసమాయుక్తః ప్రాప్నోతి జీవమేవ హి ।
తతోఽస్య కర్మ పశ్యన్తి శుభం వా యది వాఽశుభమ్ ॥
దేవతాః పఞ్చభూతస్థాః కిం భూయశ్శ్రోతు మిచ్ఛథ ॥ 24 ॥

పంచభూతాలతో కూడినపుడు ప్రాణాన్ని పొందుతున్నాడు. అప్పుడు దేవతలు ఆ పంచభూతాలలో ఉండి, ఆ జీవుడు చేస్తున్న కర్మలు పుణ్యకర్మలు కానీ, పాపకర్మలు కానీ, సాక్షులుగా చూస్తుంటారు. ఇంక ఆ తరువాత ఏమి వినగోరుతున్నారు?

మునయ ఊచుః :-వ్యాసమహర్షితో మునులు ఇలా అంటున్నారు.

త్వగస్థిమాంసముత్సృజ్య తైస్తు భూతైర్వివర్జితః ।
జీవస్స భగవన్ క్వస్థస్సుఖదుఃఖే సమశ్నుతే ॥ 25 ॥

పంచభూతాలు విడిచిపెట్టిన తరువాత జీవుడు చర్మం, ఎముకలు, మాంసం (శరీరం) విడిచిపెట్టి, (తాను చేసిన పుణ్య పాప కర్మలకు ఫలితమైన) సుఖదుఃఖాలను ఎక్కడ ఉండి అనుభవిస్తాడు?

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

జీవః కర్మసమాయుక్తశ్శీఘ్రం రేతస్సమాగతః ।
స్త్రీణాం పుష్పం సమాసాద్య తతః కాలేన భో ద్విజాః ॥ 26 ॥

ఓ విప్రులారా! మరణించిన వెంటనే పూర్వం చేసిన కర్మల ఫలాలతో కూడి, జీవుడు పురుషుడి రేతస్సులో కలుస్తాడు. ఆ తరువాత కొంతకాలానికి రేతస్సుద్వారా స్త్రీశుక్రంతో చేరతాడు.

యమస్య పురుషైః క్లేశో యమస్య పురుషైర్వధః ।
దుఃఖం సంసారచక్రం చ నరః క్లేశం చ విన్దతి ॥ 27 ॥

ఆ జీవుడు యమభటుల చేతిలో నానావిధాలైన బాధలను పొందుతాడు. వారి చేతిలో మరణం పొందుతాడు. బాధామయమైన సంసారం అనే చక్రంలో పడిపోయి, సంసారబాధలను అనుభవిస్తాడు.

ఇహ లోకే స తు ప్రాణీ జన్మప్రభృతి భో ద్విజాః ।
సుకృతం కర్మ వై భుఙ్క్తే ధర్మస్య ఫలమాశ్రితః ॥ 28 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆ జీవుడు ఈ లోకంలో పుట్టినది మొదలు తాను చేసిన పుణ్యకర్మలకు, ధర్మాచరణకు ఫలితంగా సుఖాలు అనుభవిస్తాడు.

యది ధర్మం సమాయుజ్య జన్మప్రభృతి సేవతే ।
తత స్స పురుషో భూత్వా సేవతే నిత్యదా సుఖమ్ ॥ 29 ॥

పుట్టినది మొదలుగా జీవుడు ధర్మబద్ధమైన సత్కర్మలను ఆచరిస్తే పురుషుడై, నిత్యమూ సుఖమే అనుభవిస్తాడు.

అథాన్తరాన్తరం ధర్మమధర్మముపసేవతే ।
సుఖస్యానన్తరం దుఃఖం స జీవోఽ ప్యధిగచ్ఛతి ॥ 30 ॥

జీవుడు ధర్మంతోపాటుగా అధర్మాన్ని కూడ ఆచరించి ఉంటే, ముందుగా ధర్మఫలమైన సుఖాన్ని అనుభవించి, ఆ తరువాత అధర్మానికి ఫలితమైన కష్టాలను అనుభవిస్తాడు.

అధర్మేణ సమాయుక్తో యమస్య విషయం గతః ।
మహాదుఃఖం సమాసాద్య తిర్యగ్యోనౌ ప్రజాయతే ॥ 31 ॥

కేవలం అధర్మం మాత్రమే ఆచరించినవాడు యమలోకానికి వెళ్లి, అక్కడ మహాకష్టాలను అనుభవించి, ఆ తరువాత భూలోకంలో పశుపక్ష్యాది జాతులలో జన్మిస్తాడు.

కర్మణా యేన యేనేహ యస్యాం యోనౌ ప్రజాయతే ।
జీవో మోహసమాయుక్తస్తన్మే శృణుత సామ్ప్రతమ్ ॥ 32 ॥

ఇప్పుడు జీవుడు అజ్ఞానంతో ఏఏ పాపకర్మలను ఆచరించడంవలన ఏఏ తిర్యగ్జాతులలో పుడతాడో చెప్తాను. వినండి.

యదేతదుచ్యతే శాస్త్రైస్సేతిహాసైశ్చ ఛన్దసి ।
యమస్య విషయం ఘోరం మర్త్యలోకం ప్రవర్తతే ॥ 33 ॥

మిక్కిలి భయంకరమైన యమలోకంనుండి జీవుడు మానవలోకంలో ప్రవేశిస్తాడని శాస్త్రాలలోనూ, ఇతిహాసాలలోనూ, వేదాలలోనూ, చెప్పబడింది.

ఇహ స్థానాని పుణ్యాని దేవతుల్యాని భో ద్విజాః ।
తిర్యగ్యోన్యతిరిక్తాని గతిమన్తి చ సర్వశః ॥ 34 ॥

ఓ బ్రాహ్మణులారా! పశువులు, పక్షులు మొదలైన వాటికంటే వేరైన స్థానాలు పుణ్యప్రదమైనవి. దేవతలతో సమానమైనవి. ఉత్తమలోకాలకు వెళ్లడానికి అన్నివిధాలుగానూ సాధనమైనవి.

యమస్య భవనే విప్రా బ్రహ్మలోకసమే గుణైః ।
కర్మభిర్నియతైర్బద్ధో జన్తుర్దుఃఖాన్యుపాశ్నుతే ॥ 35 ॥

బ్రాహ్మణులారా! బ్రహ్మలోకంతో సమానమైన మంచి గుణాలతో కూడిన యముడి మందిరంలో తాను ఆచరించిన(పాప)కర్మలచేత బంధింపబడిన జీవుడు వివిధ దుఃఖాలను అనుభవిస్తాడు.

యేన యేన హి భావేన యేన వై కర్మణా గతిమ్ ।
ప్రయాతి పురుషో ఘోరాం తథా వక్ష్యామ్యతఃపరమ్ ॥ 36 ॥

ఇక మీదట జీవుడు తాను చేసినకర్మలకు ఫలితంగా ఏయే భయంకరమైన జాతులలో పుడతాడో వివరిస్తాను.

అధీత్య చతురో వేదాన్ ద్విజో మోహసమన్వితః ।
పతితాత్ ప్రతిగృహ్యాథ ఖరయోనౌ ప్రజాయతే ॥ 37 ॥

నాలుగు వేదాలనూ చక్కగా అభ్యసించిన బ్రాహ్మణుడు అజ్ఞానంతో ధర్మభ్రష్టులనుండి దానం స్వీకరిస్తే, గాడిదగా పుడతాడు.

ఖరో జీవతి వర్షాణి దశ పఞ్చ చ భో ద్విజాః ।
ఖరో మృతో బలీవర్దఃసప్త వర్షాణి జీవతి ॥ 38 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆ గాడిదరూపంలో జీవుడు పదిహేను సంవత్సరాలు జీవిస్తాడు. గాడిదగా మరణించిన తరువాత ఎద్దుగా పుట్టి. ఏడేండ్లు బ్రతుకుతాడు.

బలీవర్దో మృతశ్చాపి జాయతే బ్రహ్మరాక్షసః ।
బ్రహ్మరక్షస్తు మాసాంస్త్రీంస్తతో జాయేత బ్రాహ్మణః ॥ 39 ॥

ఎద్దురూపంలో మరణించిన తరువాత ఆ జీవుడు బ్రహ్మరాక్షసుడుగా జన్మిస్తాడు. బ్రహ్మరాక్షసుడి రూపంలో మూడు నెలలు జీవిస్తాడు. ఆ తరువాత తిరిగి, బ్రాహ్మణుడుగా జన్మిస్తాడు.

పతితం యాజయిత్వా తు కృమియోనౌ ప్రజాయతే ।
తత్ర జీవతి వర్షాణి దశ పఞ్చ చ భో ద్విజాః ॥ 40 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆ బ్రాహ్మణుడు ధర్మభ్రష్టులకోసం యాగం చేసి, పురుగుగా పుడతాడు. పురుగురూపంలో పదిహేనేండ్లు బ్రదుకుతాడు.

కృమిభావాద్వినిర్ముక్తస్తతో జాయేత గర్దభః ।
గర్దభః పఞ్చ వర్షాణి పఞ్చ వర్షాణి సూకరః ॥ 41 ॥

పురుగుజన్మలో మరణించిన తరువాత గాడిదగా పుడతాడు. ఆ జన్మలో ఐదు సంవత్సరాలు జీవిస్తాడు. ఆ తరువాత పందిగా పుట్టి, ఐదేండ్లు జీవిస్తాడు.

కుక్కుటః పఞ్చ వర్షాణి పఞ్చ వర్షాణి జమ్బుకః ।
శ్వా వర్షమేకం భవతి తతో జాయేత మానవః ॥ 42 ॥

తరువాత కోడిగా పుట్టి, ఐదు సంవత్సరాలు బ్రదుకుతాడు. తరువాత నక్కగా పుట్టి ఐదేండ్లు జీవిస్తాడు. ఆ తరువాత కుక్కగా పుట్టి, ఒక్క సంవత్సరం జీవిస్తాడు. ఆ తరువాత మానవుడుగా పుడతాడు.

అసూయకో నరశ్చాపి మృతో జాయేత శార్ఙ్గకః ।
విశ్వాసహర్తా చ నరో మీనో జాయేత దుర్మతిః ॥ 43 ॥

అసూయాపరుడైన మానవుడు మరణించిన తరువాత శార్ఙ్గకం అనే జంతువుగా పుడతాడు. ఇతరుల నమ్మకాన్ని వమ్ము చేసినవాడు చేపగా జన్మిస్తాడు.

భూత్వా మీనోఽష్టవర్షాణి మృగో జాయేత భో ద్విజాః ।
మృగస్తు చతురో మాసాంస్తతశ్ఛాగః ప్రజాయతే ॥ 44 ॥

ఓ బ్రాహ్మణులారా! చేపగా ఎనిమిది సంవత్సరాలు జీవిస్తాడు. అనంతరం జింకగా పుట్టి, నాలుగు నెలలు జీవిస్తాడు. ఆ తరువాత మేకగా పుడతాడు.

ఛాగస్తు నిధనం ప్రాప్య పూర్ణే సంవత్సరే తతః ।
కీటస్సఞ్జాయతే జన్తుస్తతో జాయేత మానుషః ॥ 45 ॥

ఒక సంవత్సరం పూర్తైన తరువాత మేకరూపంలో మరణించి, పురుగుగా పుడతాడు. ఆ తరువాత మానవుడుగా జన్మిస్తాడు.

ధాన్యాన్ యవాంస్తిలాన్ మాషాన్ కులిత్థాన్ సర్షపాంశ్చణాన్ ।
కలాయానథ ముద్గాంశ్చ గోధూమానతసీస్తథా ॥ 46 ॥

సస్యాన్యన్యాని హర్తా చ మర్త్యో మోహాదచేతనః ।
సఞ్జాయతే మునిశ్రేష్ఠా మూషికో నిరపత్రపః ॥ 47 ॥

మహర్షులారా! యవలు, నువ్వులు, మినుములు, కులిత్థములనే ధాన్యవిశేషాలు, ఆవాలు, సెనగలు, బటాణీలు, పెసలు, గోధుమలు, జనుము ఇంకా ఇతర ధాన్యాలను అజ్ఞానంతో, విచక్షణ లేకుండా, నిస్సిగ్గుగా అపహరించిన మానవుడు ఎలుకగా పుడతాడు.

తతః ప్రేత్య మునిశ్రేష్ఠా మృతో జాయేత సూకరః ।
సూకరో జాతమాత్రస్తు రోగేణ మ్రియతే పునః ॥ 48 ॥

మునివరులారా! ఎలుకరూపంలో మరణించిన తరువాత పందిగా పుడతాడు. పందిగా పుట్టిన వెంటనే రోగం వచ్చి మళ్లీ చచ్చిపోతాడు.

శ్వా తతో జాయతే మూకః కాలస్యాన్తే చ మానుషః ।
భూత్వాశ్వాపఞ్చ వర్షాణి జాయతే వా స మానవః ॥ 49 ॥

ఆ తరువాత కుక్కగా జన్మిస్తాడు. ఆ జన్మలో మరణించిన తరువాత చేపగా పుడతాడు. అయిదు సంవత్సరాలు కుక్కగా ఉండి, ఆ తరువాత మరణించి మానవుడుగా జన్మిస్తాడు.

పరాదారాభిమర్శం తు కృత్వా జాయేత వై వృకః ।
శ్వా శృగాలస్తతో గృధ్రో వ్యాలః కఙ్కో బకస్తథా ॥ 50 ॥

ఇతరుల భార్యను తాకినవాడు తోడేలుగా పుడతాడు. ఆ తరువాత వరుసగా కుక్క, నక్క, గద్ద, పాము, రాబందు, కొంగ జన్మలు ఎత్తుతాడు.

భ్రాతుర్భార్యాం తు పాపాత్మా యో ధర్షయతి మోహితః ।
పుంస్కోకిలత్వమాప్నోతి సోఽపి సంవత్సరం ద్విజాః ॥ 51 ॥

విప్రులారా! తోబుట్టువు భార్యను మోహించి, బలవంతం చేసినవాడు మగకోకిలగా పుట్టి, ఒక సంవత్సరం పాటు జీవిస్తాడు.

సఖిభార్యాం గురోర్భార్యాం రాజభార్యాం తథైవ చ ।
ప్రధర్షయిత్వా కామాత్మా మృతో జాయేత సూకరః ॥ 52 ॥

స్నేహితుడి భార్యను, గురువుగారి భార్యను, రాజుగారి భార్యను కామంతో బలాత్కరించినవాడు మరణించిన తరువాత పందిగా జన్మిస్తాడు.

సూకరః పఞ్చ వర్షాణి దశ వర్షాణి వై బకః ।
పిపీలికస్తు మాసాంస్త్రీన్ కీటస్స్యాన్మాసమేవ చ ॥ 53 ॥

పందిగా ఐదు సంవత్సరాలు జీవించి, తరువాత కొంగగా పుట్టి, పది సంవత్సరాలు బ్రదుకుతాడు. ఆ తరువాత చీమగా పుట్టి, మూడు నెలలు జీవిస్తాడు. ఆ తరువాత పురుగుగా పుట్టి, ఒక్క నెల బతికి ఉంటాడు.

ఏతానాసాద్య సంసారాన్ కృమియోనౌ ప్రజాయతే ।
తత్ర జీవతి మాసాంస్తు కృమియోనౌ చతుర్దశ ॥
నరోఽధర్మక్షయం కృత్వా తతో జాయేత మానుషః ॥ 54 ॥

ఈ జన్మలను పొందిన తరువాత క్రిమిగా పుడతాడు. కృమిగా పద్నాలుగు నెలలు జీవిస్తాడు. ఈవిధంగా ఆయా జన్మలలో పాపకర్మ ఫలితం అనుభవించి, ఆ తరువాత ఆ జీవుడు మానవుడుగా పుడతాడు.

పూర్వం దత్త్వా తు యః కన్యాం ద్వితీయే దాతుమిచ్ఛతి ॥ 55 ॥
[1](సోఽపి విప్రా మృతో జన్తుః క్రిమియోనౌ ప్రజాయతే,
తత్ర జీవతి వర్షాణి త్రయోదశ ద్విజోత్తమాః. 72)

ఒకసారి కన్యను దానం చేసి, మళ్లీ అదే కన్యను రెండవవాడికి దానం ఇవ్వదలచినవాడు (బ్రాహ్మణులారా! మరణించిన తరువాత క్రిమిగా పుడతాడు. బ్రాహ్మణోత్తములారా! ఆ క్రిమిరూపంలో పదమూడు సంవత్సరాలు బతుకుతాడు.)

ఉపాధ్యాయస్య యః పాపం శిష్యః కుర్యాదబుద్ధిమాన్ ।
స జన్మానీహ సంసారే త్రీణ్యాప్నోతి న సంశయః ॥ 56 ॥

గురువుగారి విషయంలో బుద్ధి లేకుండా, తప్పు చేసిన శిష్యుడు ఈ సంసారంలో మూడు పర్యాయాలు జన్మిస్తాడు. ఇందులో సందేహం లేదు.

ప్రాక్ శ్వా భవతి భో విప్రాస్తతః క్రవ్యాత్తతః ఖరః ।
పరిక్లిష్టేషు చ ప్రేత్య పశ్చాజ్జాయేత బ్రాహ్మణః ॥ 57 ॥

---

1. 72 సంఖ్యలో ఉన్న ఈ శ్లోకం ఇక్కడ ఉంటే ఈ శ్లోకార్థం పరిపూర్ణ మవుతుంది. లేకపోతే ఇక్కడి వాక్యం అసంపూర్ణంగా ఉంటుంది. ప్రత్యంతరంలో ఇక్కడే ఉండడం గమనించవచ్చు.

ఓ ద్విజులారా! వాడు మొదట కుక్క అవుతాడు. ఆ తరువాత మాంసం తినే జంతువు అవుతాడు. ఆ తరువాత గాడిద అవుతాడు. నానావిధమైన కష్టాలు అనుభవించిన తరువాత చివరికి మరణించి, బ్రాహ్మణుడుగా జన్మిస్తాడు.

మనసాఽపి గురో ర్భార్యాం యశ్శిష్యో యాతి పాపకృత్ ।
ఉదగ్రాన్ప్రైతి సంసారానధర్మేణేహ చేతసా ॥ 58 ॥

గురువుగారి భార్యను గురించి మనసులోనైనా పాపచింతన చేసిన శిష్యుడు ధర్మవిరుద్ధమైన బుద్ధి కారణంగా భయంకరమైన అనేక జన్మ లెత్తుతాడు.

శ్వయోనౌ తు సమ్భూతస్త్రీణి వర్షాణి జీవతి ।
తత్రాపి నిధనం ప్రాప్తః కృమియోనౌ ప్రజాయతే ॥ 59 ॥

కుక్కజాతిలో జన్మించి, మూడు సంవత్సరాలు బతుకుతాడు. ఆ జన్మలో మరణించిన తరువాత కృమిగా పుడతాడు.

కృమిభావమనుప్రాప్తో వర్షమేకం తు జీవతి ।
తతస్తు నిధనం ప్రాప్య బ్రహ్మయోనౌ ప్రజాయతే ॥ 60 ॥

క్రిమిగా జన్మించినవాడు ఒక్క సంవత్సరం జీవిస్తాడు. ఆ తరువాత మరణించి, బ్రాహ్మణుడుగా పుడతాడు.

యది పుత్రసమం శిష్యం గురుర్హన్యాదకారణమ్ ।
ఆత్మనః కామకారేణ సోఽపి హింస్రః ప్రజాయతే ॥ 61 ॥

కొడుకుతో సమానమైన శిష్యుడిని ఏ కారణం లేకుండా, స్వలాభంకోసం చంపిన గురువు క్రూరమైన జంతువుగా జన్మిస్తాడు.

పితరం మాతరం చైవ యస్తు పుత్రోఽవమన్యతే ।
సోఽపి విప్రా మృతో జన్తుః పూర్వం జాయేత గర్దభః ॥ 62 ॥

బ్రాహ్మణులారా! తండ్రినీ, తల్లినీ అవమానించిన కొడుకు మరణించిన తరువాత మొదట గాడిదగా జన్మిస్తాడు.

గర్దభత్వం తు సంప్రాప్య దశ వర్షాణి జీవతి ।
సంవత్సరం తు కుమ్భీరస్తతో జాయేత మానవః ॥ 63 ॥

గాడిదరూపంలో అతడు పది సంవత్సరాలు జీవిస్తాడు. ఆ తరువాత మొసలిగా పుడతాడు. ఆ తరువాతి జన్మలో మానవు డవుతాడు.

పుత్రస్య మాతాపితరౌ యస్య రుష్టావుభావపి ।
గుర్వపధ్యానతస్సోఽపి మృతో జాయేత గర్దభః ॥ 64 ॥

తల్లీ తండ్రీ ఇద్దరూ కోపించిన కొడుకు పెద్దలకు కోపం వచ్చే విధంగా చేసిన అపచారం కారణంగా, మరణించిన తరువాత గాడిదగా పుడతాడు.

ఖరో జీవతి మాసాంశ్చ దశ చాపి చతుర్దశ ।
బిడాలస్సప్త మాసాంస్తు తతో జాయేత మానవః ॥ 65 ॥

వాడు గాడిదగా ఇరవైనాలుగు నెలలు జీవిస్తాడు. ఆ తరువాత పిల్లిగా పుట్టి, ఏడు నెలలు జీవిస్తాడు. ఆ తరువాత జన్మలో మానవు డవుతాడు.

మాతాపితరావాక్రుశ్య సారీకస్సమ్ప్రజాయతే ।
తాడయిత్వా తు తావేవ జాయతే కచ్ఛపో ద్విజాః ॥ 66 ॥

విప్రులారా! తల్లిదండ్రులను క్షోభపెట్టిన కుమారుడు కోకిలగా పుడతాడు. తల్లిదండ్రులను కొట్టినవాడు తాబేలుగా జన్మిసాడు.

కచ్ఛపో దశ వర్షాణి త్రీణి వర్షాణి శల్యకః ।
వ్యాలో భూత్వా తు షణ్మాసాంస్తతో జాయేత మానుషః ॥ 67 ॥

తాబేలుగా పది సంవత్సరాలు జీవిస్తాడు. ఆ తరువాత ముళ్లపందిగా పుట్టి, మూడు సంవత్సరాలు బతుకుతాడు. దాని తరువాత పాముగా జన్మించి, ఆరు నెలలు బతుకుతాడు. ఆ తరువాత మానవుడుగా పుడతాడు.

భర్తృపిణ్డముపాదత్తే రాజద్విష్టాని సేవతే ।
సోఽపి మోహసమాపన్నో మృతో జాయేత వానరః ॥ 68 ॥

అజ్ఞానానికి వశుడై, యజమాని ఆహారాన్ని తిన్నవాడు, రాజవిరోధులను సేవించినవాడు, మరణించిన తరువాత కోతిగా పుడతాడు.

వానరో దశ వర్షాణి సప్త వర్షాణి మూషకః ।
శ్వాచ భూత్వా తు షణ్మాసాంస్తతో జాయేత మానవః ॥ 69 ॥

కోతిరూపంలో అతడు పదిసంవత్సరాలు జీవిస్తాడు. ఆతరువాత ఎలుకగా పుట్టి, ఏడు సంవత్సరాలు బతుకుతాడు. ఆ తరువాతి జన్మలో కుక్కై, ఆరు నెలలు జీవిస్తాడు. తరువాతి జన్మలో మానవు డవుతాడు.

న్యాసాపహర్తా తు నరో యమస్య విషయం గతః ।
సంసారాణాం శతం గత్వా కృమియోనౌ ప్రజాయతే ॥ 70 ॥

రక్షించమని ఇచ్చిన దానిని అపహరించిన మానవుడు యమలోకానికి వెళ్లి, (అక్కడ యమబాధ లనుభవించి) తరువాత వంద జన్మ లెత్తుతాడు. ఆ తరువాత క్రిమిగా పుడతాడు.

తత్ర జీవతి వర్షాణి దశ పఞ్చ చ భో ద్విజాః ।
దుష్కృతస్య క్షయం కృత్వా తతో జాయేత మానుషః ॥ 71 ॥

ఓ బ్రాహ్మణులారా! ఆ జీవుడు క్రిమిరూపంలో పదిహేను సంవత్సరాలు జీవిస్తాడు. తాను చేసిన పాపకర్మల ఫలితం అంతా అనుభవించిన తరువాత మానవుడుగా జన్మిస్తాడు.

సోఽపి విప్రా మృతో జన్తుః కృమియోనౌ ప్రజాయతే ।
తత్ర జీవతి వర్షాణి త్రయోదశ ద్విజోత్తమాః ॥
అధర్మసంక్షయే ముక్తస్తతో జాయేత మానుషః ॥ 72[1] ॥

బ్రాహ్మణులారా! ఆ మానవుడు మరణించిన తరువాత క్రిమిగా పుడతాడు. విప్రవరేణ్యులారా! ఆ క్రిమిరూపంలో పదమూడు సంవత్సరాలు బతుకుతాడు. పాపకర్మల ఫలితం అనుభవించడం పూర్తి అయిన తరువాత పశుపక్ష్యాదుల జన్మలనుండి విముక్తిని పొంది, మానవుడుగా పుడతాడు.

దేవకార్యమకృత్వా తు పితృకార్యమథాపి వా ।
అనిర్వాప్య పితౄన్ దేవాన్ మృతో జాయేత వాయసః ॥ 73 ॥

దేవకార్యాలను, పితృకార్యాలనూ చేయనివాడు, దేవతలకూ పితరులకూ తర్పణాలు ఇవ్వనివాడు, మరణించిన తరువాత కాకిగా పుడతాడు.

వాయసశ్శతవర్షాణి తతో జాయేత కుక్కుటః ।
జాయతే వ్యాలకశ్చాపి మాసం తస్మాత్తు మానుషః ॥ 74 ॥

కాకిగా వంద సంవత్సరాలు జీవించి, ఆ తరువాత కోడిగా పుడతాడు. ఆ తరువాతి జన్మలో పాము అవుతాడు. పాముగా ఒక నెల జీవించి, అనంతరం మానవుడుగా జన్మిస్తాడు.

జ్యేష్ఠం పితృసమం చాపి భ్రాతరం యోఽవమన్యతే ।
సోఽపి మృత్యుముపాగమ్య క్రౌఞ్చయోనౌ ప్రజాయతే ॥ 75 ॥

తండ్రితో సమానమైన అన్నను అవమానించిన తమ్ముడు మరణించిన తరువాత క్రౌంచపక్షిగా పుడతాడు.

క్రౌఞ్చో జీవతి వర్షాణి దశ జాయేత జీవకః ।
తతో నిధనమాప్నోతి మానుషత్వమవాప్నుయాత్ ॥ 76 ॥

క్రౌంచపక్షిగా పది సంవత్సరాలు జీవించి, తరువాత చకోరపక్షిగా పుడతాడు. చకోరపక్షిగా మరణించిన తరువాత మానవుడుగా జన్మిస్తాడు.

వృషలో బ్రాహ్మణీం గత్వా కృమియోనౌ ప్రజాయతే ।
తతస్సమ్ప్రాప్య నిధనం జాయతే సూకరః పునః ॥ 77 ॥

---

1. ఈ(72)శ్లోకం ఇక్కడ సరిగా అన్వయించదు. క్రిమిరూపంనుండి మానవుడై మళ్లీ క్రిమి కావడంలో ఔచిత్యం కనబడదు. ఇంక ఇది 55 శ్లోకం తర్వాత ఉంటే ఆ శ్లోకార్థం పరిపూర్ణ మవుతుంది. లేకపోతే అక్కడ వాక్యం అసంపూర్ణం అవుతుంది.

శూద్రుడు బ్రాహ్మణస్త్రీని పొందితే క్రిమిగా పుడతాడు. క్రిమిగా మరణించిన పిమ్మట పందిగా జన్మిస్తాడు.

సూకరో జాతమాత్రస్తు రోగేణ మ్రియతే ద్విజాః ।
శ్వా చ వై జాయతే మూఢః కర్మణా తేన భో ద్విజాః ॥ 78 ॥

విప్రులారా! పందిగా పుట్టిన వెంటనే రోగం వచ్చి, ఆ రోగంతోనే మరణిస్తాడు. ఓ బ్రాహ్మణులారా! మూర్ఖుడైన ఆ జీవుడు తాను చేసుకున్న కర్మఫలానికి అనుగుణంగా తరువాత కుక్కగా పుడతాడు.

శ్వా భూత్వా కృతకర్మాసౌ జాయతే మానుషస్తతః ।
తత్రాపత్యం సముత్పాద్య మృతో జాయేత మూషికః ॥ 79 ॥

కర్మల ననుసరించి కుక్కగా పుట్టిన జీవుడు తదనంతరం మానవుడుగా జన్మిస్తాడు. ఆ జన్మలో సంతానం కలిగిన తరువాత మరణించి, ఎలుకగా పుడతాడు.

కృతఘ్నస్తు మృతో విప్రా యమస్య విషయం గతః ।
యమస్య విషయే క్రూరైర్బద్ధః ప్రాప్నోతి వేదనామ్ ॥ 80 ॥

బ్రాహ్మణులారా! చేసిన మేలు మరిచేవాడు యమపురానికి వెళ్లి, ఆ లోకంలో కఠినాత్ములైన యమభటులు బంధించగా, యమయాతనలు అనుభవిస్తారు.

దణ్డకం ముద్గరం శూలమగ్నిదణ్డం చ దారుణమ్ ।
అసిపత్రవనం ఘోరం వాలుకాం కూటశాల్మలీమ్ ॥ 81 ॥

కఱ్ఱలతోనూ, ఇనపగదలతోనూ, శూలాలతోనూ, భయంకరమైన నిప్పులు చిమ్మే దండాలతోనూ కొట్టి, యమభటులు హింసిస్తుండగా, దారుణమైన అసిపత్రవనం అనే నరకంలోనూ, కాలుతున్న ఇసుక దిబ్బలతో నిండిన కూటశాల్మలి అనే నరకంలోనూ పడిపోతారు.

ఏతాశ్చాన్యాశ్చ బహవో యమస్య విషయం గతాః ।
యాతనాః ప్రాప్య ఘోరాస్తు తతో యాతి చ భో ద్విజాః ॥ 82 ॥

ఇవి మాత్రమే కాకుండా ఇంకా ఎన్నో నరకలోకాలకు వెళతారు. అక్కడ దారుణమైన నరకయాతనలను అనుభవించి, మళ్లీ చావుపుట్టుకల చక్రంలో పడతారు.

సంసారచక్రమాసాద్య కృమియోనౌ ప్రజాయతే ।
కృమిర్భవతి వర్షాణి దశ పఞ్చ చ భో ద్విజాః ॥ 83 ॥

ఓ బ్రాహ్మణులారా! జీవుడు సంసారచక్రంలో ప్రవేశించి, క్రిమిగా పుడతాడు. క్రిమిరూపంలో పదిహేను సంవత్సరాలు జీవిస్తాడు.

తతో గర్భం సమాసాద్య తత్రైవ మ్రియతే నరః ।
తతో గర్భశతైర్జన్తుర్బహుశస్సమ్ప్రపద్యతే ॥ 84 ॥

ఆ జీవుడు మరణానంతరం మళ్లీ క్రిమిగానే జన్మించి, మరణిస్తాడు. వందలకొలదిగా జన్మలు ఎన్నో పొందుతాడు.

సంసారాన్ సుబహూన్ గత్వా తతస్తిర్యక్ ప్రజాయతే ।
తతో దుఃఖమనుప్రాప్య బహువర్షగణాని వై ॥ 85 ॥

ఈవిధంగా అనేక జన్మలు ఎత్తిన తరువాత మళ్లీ పశువులు పక్షులు మొదలైన జాతులలో జన్మిస్తాడు. ఆయా జన్మలలో అనేక సంవత్సరాలు బాధ లనుభవిస్తాడు.

స పునర్భవసంయుక్తస్తతః కూర్మః ప్రజాయతే ॥ 86 ॥

మళ్లీ మళ్లీ జన్మలెత్తే క్రమంలో ఆ జీవుడు తాబేలుగా పుడతాడు.

దధి హృత్వా బకశ్చాపి ప్లవో మత్స్యానసంస్కృతాన్ ।
చోరయిత్వా తు దుర్బుద్ధిర్మధు దంశః ప్రజాయతే ॥ 87 ॥

పెరుగును దొంగిలించినవాడు కొంగగా పుడతాడు. పచ్చిచేపలను దొంగిలించినవాడు కప్పగా పుడతాడు. తేనెను దొంగిలించిన దుష్టమతి ఈగ (తేనెటీగ)గా పుడతాడు.

ఫలం వా మూలకం హృత్వా పూపం వాపి పిపీలికః ।
చోరయిత్వా తు నిష్పావం జాయతే ఫలమూషకః ॥ 88 ॥

పండును గాని, వేళ్లను గాని, అప్పం గాని దొంగిలించినవాడు చీమగా పుడతాడు. బొబ్బర్లను దొంగిలించిన వాడు పండెలుకగా పుడతాడు.

పాయసం చోరయిత్వా తు తిత్తిరిత్వమవాప్నుయాత్ ।
హృత్వా పిష్టమయం పూపం కుమ్భోలూకః ప్రజాయతే ॥ 89 ॥

పాయసాన్ని దొంగిలించినవాడు తీతువుపక్షిగా పుడతాడు. పిండివంటకాన్ని దొంగిలించినవాడు పెద్ద గుడ్లగూబగా పుడతాడు.

అపో హృత్వా తు దుర్బుద్ధిర్వాయసో జాయతే నరః ।
కాంస్యం హృత్వా తు దుర్బుద్ధిర్హారీతో జాయతే నరః ॥ 90 ॥

నీళ్లను దొంగిలించిన దుర్మార్గుడు కాకిగా పుడతాడు. కంచును దొంగిలించినవాడు పచ్చపిట్టగా పుడతాడు.

రాజతం భాజనం హృత్వా కపోతస్సమ్ప్రజాయతే ।
హృత్వా తు కాఞ్చనం భాణ్డం కృమియోనౌ ప్రజాయతే ॥ 91 ॥

వెండిపాత్రను దొంగిలించినవాడు పావురంగా పుడతాడు. బంగారుపాత్రను కాజేసినవాడు క్రిమిగా పుడతాడు.

పత్రోర్ణం చోరయిత్వా తు కురరత్వం నియచ్ఛతి ।
కోశకారం తతో హృత్వా నరో జాయేత నర్తకః ॥ 92 ॥

పట్టుబట్టను కాజేసినవాడు లకుముకిపిట్టగా పుడతాడు. పట్టుపురుగులను దొంగిలించినవాడు నెమలిగా పుడతాడు.

అంశుకం చోరయిత్వా తు శుకో జాయేత మానవః ।
చోరయిత్వా దుకూలం తు మృతో హంసః ప్రజాయతే ॥ 93 ॥

వస్త్రాలను దొంగిలించిన మానవుడు చిలుకగా పుడతాడు. సన్నవస్త్రాలను దొంగిలించినవాడు మరణానంతరం హంసగా పుడతాడు.

క్రౌఞ్చః కార్పాసికం హృత్వా మృతో జాయేత మానవః ॥ 94 ॥

నూలుగుడ్డలను దొంగిలించినమానవుడు మరణించినతరువాత క్రౌంచపక్షిగా పుడతాడు.

చోరయిత్వా నరః పట్టం త్వావికంచైవ భో ద్విజాః ।
క్షౌమం చ వస్త్రమాహృత్య శశో జన్తుః ప్రజాయతే ॥ 95 ॥

ఓ విప్రులారా! గొఱ్ఱెఉన్నితో చేసిన వస్త్రాలను, తెల్లని బట్టలను దొంగిలించిన జీవుడు కుందేలుగా పుడతాడు.

చూర్ణం తు హృత్వా పురుషో మృతో జాయేత బర్హిణః ।
హృత్వా రక్తాని వస్త్రాణి జాయతే జీవజీవకః ॥ 96 ॥

సున్నం దొంగిలించిన మానవుడు మరణించినతరువాత నెమలిగా పుడతాడు. ఎఱ్ఱనివస్త్రాలను దొంగిలించినవాడు చకోరపక్షిగా పుడతాడు.

వర్ణకాదీంస్తథా గన్ధాంశ్చోరయిత్వేహ మానవః ।
చుచ్ఛున్దరిత్వమాప్నోతి విప్రా లోభపరాయణః ॥ 97 ॥

ద్విజులారా! అత్యాశతో ఒంటికి పూసుకునే సుగంధద్రవ్యాలు, మంచిగంధం మొదలైన వాటిని దొంగిలించిన మానవుడు చుంచుగా పుడతాడు.

తత్ర జీవతి వర్షాణి తతో దశ చ పఞ్చ చ ।
అధర్మస్య క్షయం కృత్వా తతో జాయేత మానవః ॥ 98 ॥

చుంచుజన్మలో పదిహేను సంవత్సరాలు జీవిస్తాడు. ఆ సమయంలో తాను చేసిన పాపకర్మ ఫలం అంతా అనుభవించి, చివరికి మానవుడుగా పుడతాడు.

చోరయిత్వా పయశ్చాపి బలాకా సమ్ప్రజాయతే ॥ 99 ॥

పాలు దొంగిలించినవాడు కొక్కెరపక్షిగా జన్మిస్తాడు.

యస్తు చోరయతే తైలం నరో మోహసమన్వితః ।
సోఽపి విప్రా మృతో జన్తుస్తైలపాయీ ప్రజాయతే ॥ 100 ॥

బ్రాహ్మణులారా! అజ్ఞానంతో నువ్వులనూనె దొంగిలించినవాడు మరణించిన తరువాత గబ్బిలంగా పుడతాడు.

అశస్త్రం పురుషం హత్వా సశస్త్రః పురుషాధమః ।
అర్థార్థం యదివా వైరీ మృతో జాయేత వై ఖరః ॥ 101 ॥

నిరాయుధుడైన పురుషుడిని ధనంకోసం గానీ, లేదా శత్రుత్వంచేత గానీ ఆయుధంతో చంపిన నీచుడు గాడిదగా పుడతాడు.

ఖరో జీవతి వర్షే ద్వే తతశ్శస్త్రేణ వధ్యతే ।
స మృతో మృగయోనౌ తు నిత్యోద్విగ్నోఽభిజాయతే ॥ 102 ॥

గాడిదజన్మలో అతడు రెండు సంవత్సరాలు జీవిస్తాడు. ఆ తరువాత ఆ గాడిద ఆయుధంతో చస్తుంది. ఆవిధంగా మరణించిన గాడిద జింకగా పుట్టి నిరంతరం భయం భయంగా జీవిస్తుంది.

మృగో విధ్యేత శస్త్రేణ గతే సంవత్సరే తతః ।
హతో మృగస్తతో మీనస్సోఽపి జాలేన బాధ్యతే ॥ 103 ॥

ఆ జింక ఒక సంవత్సరం గడిచిన తరువాత ఆయుధంచేత చనిపోతుంది. అలా మరణించిన జీవుడు చేపగా పుట్టి, వలలో చిక్కి బాధపడతాడు.

మాసే చతుర్థే సమ్ప్రాప్తే శ్వాపదస్సమ్ప్రజాయతే ।
శ్వాపదో దశ వర్షాణి ద్వీపీ వర్షాణి పఞ్చ చ ॥ 104 ॥

నాలుగవ నెల ప్రవేశించగానే చేపరూపంలో ఉన్న ఆ జీవుడు క్రూరజంతువుగా పుడతాడు. ఆ జన్మలో పది సంవత్సరాలు జీవించి, తరువాత పెద్దపులిగా పుట్టి, ఐదు సంవత్సరాలు జీవిస్తాడు.

తతస్తు నిధనం ప్రాప్తః కాలపర్యాయబోధితః ।
అధర్మస్య క్షయం కృత్వా మానుషత్వమవాప్నుయాత్ ॥ 105 ॥

కాలం తీరిన తరువాత మరణించి, తాను చేసిన పాపకర్మఫలం నశించిపోయిన తరువాత మానవుడుగా జన్మిస్తాడు.

వాద్యం హృత్వా తు పురుషో లోమశస్సమ్ప్రజాయతే ॥ 106 ॥

వాద్యాన్ని దొంగిలించిన మానవుడు గొఱ్ఱెగా పుడతాడు.

తథా పిణ్యాకసమ్మిశ్రమన్నం యశ్చోరయేన్నరః ।
స జాయతే బభ్రుసటో దారుణో మూషికో నరః ॥
దశన్ వై మానుషాన్నిత్యం పాపాత్మా స ద్విజోత్తమాః ॥ 107 ॥

బ్రాహ్మణోత్తములారా! పిండితో కూడిన అన్నాన్ని దొంగిలించిన మానవుడు గోధుమరంగు వెంట్రుకలతో నిండి, భయంకరంగా ఉన్న ఎలుకగా జన్మిస్తాడు. ఆ యెలుక నిత్యమూ మనుష్యులను కొరుకుతూ ఉంటుంది.

ఘృతం హృత్వా తు దుర్బుద్ధిః కాకో మద్గుః ప్రజాయతే ।
మత్స్యమాంసమథో హృత్వా కాకో జాయేత మానవః ॥
లవణం చోరయిత్వా తు చిరికాకః ప్రజాయతే ॥ 108 ॥

నేతిని దొంగిలించినవాడు నీటికాకిగా పుడతాడు. చేపమాంసాన్ని దొంగిలించిన మానవుడు కాకిగా పుడతాడు. ఉప్పు దొంగిలించినవాడు చిరికాకిగా జన్మిస్తాడు.

విశ్వాసేన తు నిక్షిప్తం యోఽపనిహ్నోతి మానవః ।
స గతాయుర్నరస్తేన మత్స్యయోనౌ ప్రజాయతే ॥ 109 ॥

నమ్మకంతో తన దగ్గర ఉంచిన దానిని కాజేసిన మానవుడు మరణించిన తరువాత చేపగా పుడతాడు.

మత్స్యయోనిమనుప్రాప్య మృతో జాయేత మానుషః ।
మానుషత్వమనుప్రాప్య క్షీణాయురుపజాయతే ॥ 110 ॥

చేపగా పుట్టిన జీవుడు మరణించిన తరువాత మానవుడుగా జన్మిస్తాడు. ఆ జన్మలో అతడికి ఆయుర్దాయం చాల తక్కువగా ఉంటుంది.

పాపాని తు నరః కృత్వా తిర్యగ్జాయేత భో ద్విజాః ।
న చాత్మనః ప్రమాణం తు ధర్మం జానాతి కిఞ్చన ॥ 111 ॥

ఓ విప్రులారా! మానవుడు పాపాలు చేసి, పశువులు పక్షులు మొదలైన జాతులలో పుడతాడు. తన శక్తి యెంతటిదో, ధర్మం ఏమిటో అతడికి కొంచెం కూడా తెలియదు.

యే పాపాని నరాః కృత్వా నిరస్యన్తి వ్రతైస్సదా ।
సుఖదుఃఖసమాయుక్తా వ్యాధిమన్తో భవన్త్యుత ॥ 112 ॥

నిరంతరం పాపాలు చేస్తూ, పుణ్యవ్రతాలను నిందించే మానవులు కష్టసుఖాలతో తప్పకుండా రోగగ్రస్తులవుతారు.

అసంవీతాః ప్రజాయన్తే మ్లేచ్ఛాశ్చాపి న సంశయః ।
నరాః పాపసమాచారా లోభమోహసమన్వితాః ॥ 113 ॥

లోభంతోనూ, అజ్ఞానంతోనూ నిరంతరమూ పాపాలు చేసే మానవులు ఒంటిమీద బట్టలు లేకుండా, మ్లేచ్ఛులుగా జన్మిస్తారు. ఇందులో సందేహం లేదు.

వర్జయన్తి హి పాపాని జన్మప్రభృతి యే నరాః ।
అరోగా రూపవన్తశ్చ ధనినస్తే భవన్త్యుత ॥ 114 ॥

పుట్టినప్పటినుండి పాపకర్మ అసలు చేయని మానవులు నిశ్చయంగా ఆరోగ్యవంతులు, సుందరులు, ధనవంతులు అవుతారు.

స్త్రియోఽప్యేతేన కల్పేన కృత్వా పాపమవాప్నుయుః ।
ఏతేషామేవ పాపానాం భార్యాత్వముపయాన్తి తాః ॥ 115 ॥

ఆయా పాపాలు చేసినస్త్రీలు కూడ పూర్వం చెప్పిన ప్రకారంగానే ఆయా ఫలితాలను పొందుతారు. ఇటువంటి పాపాలు చేసేవారికే భార్యలు అవుతారు.

ప్రాయేణ హరణే దోషాస్సర్వ ఏవ ప్రకీర్తితాః ।
ఏతద్ వై లేశమాత్రేణ కథితం వో ద్విజర్షభాః ॥
అపరస్మిన్ కథాయోగే భూయశ్శ్రోష్యథ భో ద్విజాః ॥ 116 ॥

బ్రాహ్మణవరేణ్యులారా! ఇంతవరకూ ఆయా వస్తువులను దొంగిలించడంచేత కలిగే దోషఫలితాలు సమస్తమూ కొంచెంగా మాత్రమే చెప్పడం జరిగింది. ఓ విప్రులారా! తరువాతి కథాభాగంలో ఇంకా మిగిలిన విశేషాలు వింటారు.

ఏతన్మయా మహాభాగా బ్రహ్మణో వదతః పురా ।
సురర్షీణాం శ్రుతం మధ్యే పృష్టం చాపి యథా తథా ॥ 117 ॥

మయాఽపి తుభ్యం కార్త్స్న్యేన యథావదనువర్ణితమ్ ।
ఏతచ్ఛ్రుత్వా మునిశ్రేష్ఠా ధర్మే కురుత మానసమ్ ॥ 118 ॥

మహానుభావులారా! పూర్వం దేవర్షులు అడుగగా, బ్రహ్మదేవుడు వారికి చెప్పిన విషయాలను నేను విన్నది విన్నట్లుగా ఏదీ విడిచిపెట్టకుండా సమస్తమూ మీకు వివరించి చెప్పాను. మహర్షులారా! దీనిని జాగ్రత్తగా గ్రహించి, ధర్మంపై మనసు నిలపండి.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసర్షిసంవాదే సంసారచక్రనిరూపణం నామ అష్టాధికశతతమోఽధ్యాయః ॥ 108 ॥

శ్రీబ్రహ్మపురాణంలో వ్యాస ఋషి సంవాదంలో సంసారచక్ర నిరూపణం అనే నూటఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.



నవోత్తరశతతమోऽధ్యాయః - నూటతొమ్మిదవ అధ్యాయం

అన్నదానప్రశంసావర్ణనమ్ - అన్నదాన ప్రశంసా వర్ణనం

మునయ ఊచుః :-వ్యాసమహర్షితో మునులు ఇలా అంటున్నారు.

అధర్మస్య గతిర్బ్రహ్మన్ కథితానస్త్వయానఘ ।
ధర్మస్య చ గతిం శ్రోతుమిచ్ఛామో వదతాం వర ॥ 1 ॥

పుణ్యాత్మా! బ్రహ్మజ్ఞానీ! అధర్మమూ దానివలన కలిగే (అధమ) గతులను గూర్చి చెప్పావు. మాటనేర్పరీ! ఇక ధర్మమూ, దానివలన కలిగే(ఉత్తమ)గతులను గురించి వినాలని మాకు కోరికగా ఉంది.

కృత్వా పాపాని కర్మాణి కథం యాన్త్యశుభాం గతిమ్ ।
కర్మణా చ కృతేనేహ కేన యాన్తి శుభాం గతిమ్ ॥ 2 ॥

జీవుడు ఏ పాపపు పనులు చేయడంవలన కష్టాలు గలిగించే నీచమైన గతులను ఏ రకంగా పొందుతాడు? ఏ కర్మలు చేయడంవలన శుభం గలిగించే ఉత్తమమైన గతులను పొందుతాడు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈవిధంగా చెప్తున్నాడు.

కృత్వా పాపాని కర్మాణి త్వధర్మవశమాగతః ।
మనసా విపరీతేన నిరయం ప్రతిపద్యతే ॥ 3 ॥

ధర్మానికి విరుద్ధమైన మనస్సుతో అధర్మానికి లోబడి, (బుద్ధిపూర్వకంగా) పాపపుకర్మలు చేసిన జీవుడు నరకానికి వెళతాడు.

మోహాదధర్మం యః కృత్వా పునస్సమనుతప్యతే ।
మనస్సమాధిసంయుక్తో న స సేవేత దుష్కృతమ్ ॥ 4 ॥

అజ్ఞానంతో అధర్మం చేసి, యథార్థం గ్రహించి, పశ్చాత్తాపం పొంది, మనస్సును ధర్మంమీద నిలుపుకున్నవాడు ఆ కర్మకు సంబంధించిన పాపఫలితాన్ని (నరకం) పొందడు.

యథా యథా మనస్తస్య దుష్కృతం కర్మ గర్హతే ।
తథా తథా శరీరం తు తేనాధర్మేణ ముచ్యతే ॥ 5 ॥

జీవుడి మనస్సు పాపపు కర్మలను ఎంతగా వ్యతిరేకిస్తుందో, అంతగా అతడి శరీరం అధర్మానికి (పాపఫలితమైన కష్ట అనుభవానికి) దూరంగా ఉంటుంది.

యది విప్రాః కథ్యతే విప్రాణాం ధర్మవాదినామ్ ।
తతోऽధర్మకృతాత్ క్షిప్రమపరాధాత్ ప్రముచ్యతే ॥ 6 ॥

బ్రాహ్మణులారా! తాను చేసిన పాపాన్ని ధర్మవేత్తలైన బ్రాహ్మణులకు తెలియజేస్తే ఆ జీవుడు ధర్మవిరుద్ధమైన ఆ పాపకర్మఫలం నుండి వెంటనే విముక్తిని పొందుతాడు (పాపఫలం అనుభవించడు).

యథా యథా నరస్సమ్యగధర్మమనుభాషతే ।
సమాహితేన మనసా విముఞ్చతి తథా తథా ॥
భుజఙ్గ ఇవ నిర్మోకాన్ పూర్వభుక్తాఞ్జహాతి తాన్ ॥ 7 ॥

తాను చేసిన తప్పును దాచకుండా, స్వచ్ఛమైన మనస్సుతో, అందరి ముందూ ఎంతగా (దాచకుండా) చెప్తే, అతడు అంతగా ఆ పాపంనుండి విముక్తిని పొందుతాడు. పాము కుబుసాలను విడిచినట్లుగా పూర్వం చేసిన పాపాల నన్నింటిని విడిచిపెడతాడు.

దత్త్వా విప్రస్య దానాని వివిధాని సమాహితః ।
మనస్సమాధిసంయుక్తస్స్వర్గతిం ప్రతిపద్యతే ॥ 8 ॥

మనస్సును ధర్మంపైన లగ్నం చేసి, బ్రాహ్మణులకు వివిధ దానాలను శ్రద్ధగా చేసినవాడు, స్వర్గ లోకానికి వెళతాడు.

దానాని తు ప్రవక్ష్యామి యాని దత్త్వా ద్విజోత్తమాః ।
నరః కృత్వాప్యకార్యాణి తతో ధర్మేణ యుజ్యతే ॥ 9 ॥

విప్రవరేణ్యులారా! చేయగూడని పనులు చేసినప్పటికీ, (పాపఫలితం పొందకుండా) ధర్మపరుడు కావడానికి ఏ దానాలు చేయాలో, చెప్తాను.

సర్వేషామేవ దానానామన్నం శ్రేష్ఠముదాహృతమ్ ।
సర్వమన్నం ప్రదాతవ్యమృజునా ధర్మమిచ్ఛతా ॥ 10 ॥

దానా లన్నింటిలోనూ అన్నదానం చాల ఉత్తమమని చెప్పబడింది. ధర్మంపైన ఆసక్తి కలిగినవాడు ఇతర ఆలోచనలు లేకుండా శ్రద్ధతో (ఆకలిగొన్నవారికి) కడుపునిండా అన్నం పెట్టాలి.

ప్రాణాహ్యన్నం మనుష్యాణాం తస్మాజ్జన్తుః ప్రజాయతే ।
అన్నే ప్రతిష్ఠితా లోకాస్తస్మా దన్నం ప్రశస్యతే ॥ 11 ॥

ప్రాణాలతో ఉండడానికి మనుష్యులకు అన్నమే ఆధారం. ఆ అన్నంనుండే జీవుడు పుడుతున్నాడు. లోకా లన్నీ అన్నమే ఆధారంగా నిలిచి ఉన్నాయి. అందుచేత అన్నింటిలోనూ అన్నం శ్రేష్ఠంగా కీర్తింపబడుతున్నది.

అన్నమేవ ప్రశంసన్తి దేవర్షిపితృమానవాః ।
అన్నస్యహి ప్రదానేన స్వర్గమాప్నోతి మానవః ॥ 12 ॥

దేవతలు, పితరులు, మానవులు అన్నాన్నే స్తుతిస్తారు. అటువంటి అన్నం దానం చేయడంచేత మానవుడు స్వర్గాన్ని పొందుతాడు.

న్యాయలబ్ధం ప్రదాతవ్యం ద్విజాతిభ్యోఽన్నముత్తమమ్ ।
స్వాధ్యాయసముపేతేభ్యః ప్రహృష్టేనాన్తరాత్మనా ॥ 13 ॥

ధర్మబద్ధమైన మార్గంలో సంపాదించిన అన్నమే శ్రేష్ఠం. ఆ అన్నాన్ని వేదవిద్వాంసులైన బ్రాహ్మణులకు సంతోషం నిండిన మనస్సుతో పెట్టాలి.

యస్య త్వన్నముపాశ్నన్తి బ్రాహ్మణాశ్చ సకృద్దశ ।
హృష్టేన మనసా దత్తం న స తిర్యగ్గతిర్భవేత్ ॥ 14 ॥

జీవితంలో ఒక్కసారైనా, మనసు నిండా సంతోషంతో, పదిమంది బ్రాహ్మణులకు సంతృప్తిగా అన్నం పెట్టినవాడు ఎప్పటికీ పశుపక్ష్యాది జన్మలెత్తడు.

బ్రాహ్మణానాం సహస్రాణి దశాఽఽభోజ్య ద్విజోత్తమాః ।
నరోఽధర్మాత్ ప్రముచ్యేత పాపేష్వభిరతస్సదా ॥ 15 ॥

బ్రాహ్మణోత్తములారా! పదివేలమంది బ్రాహ్మణులకు తృప్తిగా అన్నం పెట్టిన మానవుడు ఎంతటి పాపాత్ముడైనా, ఆ పాపాలనుండి పూర్తిగా విముక్తిని పొందుతాడు.

భైక్షేణాన్నం సమాహృత్య విప్రో వేదపురస్కృతః ।
స్వాధ్యాయనిరతే విప్రే దత్త్వేహ సుఖమేధతే ॥ 16 ॥

వేదాలు చదివిన బ్రాహ్మణుడు బిచ్చమెత్తి తెచ్చిన అన్నాన్ని వేదపండితుడికి పెడితే, ఈ లోకంలో గొప్పగా సుఖపడతాడు.

అహింసన్ బ్రాహ్మణస్వాని న్యాయేన పరిపాల్య చ ।
క్షత్రియస్తరసా ప్రాప్తమన్నం యో వై ప్రయచ్ఛతి ॥ 17 ॥

ద్విజేభ్యో వేదముఖ్యేభ్యః ప్రయతస్సుసమాహితః ।
తేనాపోహతి ధర్మాత్మా దుష్కృతం కర్మ భో ద్విజాః ॥ 18 ॥

ఓ బ్రాహ్మణులారా! బ్రాహ్మణుల సొత్తుకు కీడు తలపెట్టకుండా, ధర్మబద్ధంగా కాపాడుతున్న క్షత్రియుడు, బలవంతంగా సంపాదించైనా, అన్నాన్ని వేదవేత్తలైన బ్రాహ్మణోత్తములకు శ్రద్ధగా దానం చేస్తే, ధర్మాత్ముడవుతాడు. అతడి పాపకర్మలన్నీ నశిస్తాయి.

షడ్భాగపరిశుద్ధం చ కృషేర్భాగముపార్జితమ్ ।
వైశ్యో దదద్ద్విజాతిభ్యః పాపేభ్యః పరిముచ్యతే ॥ 19 ॥

వ్యవసాయం చేసి, సంపాదించిన ద్రవ్యంలో పాపరహితమై, పరిశుద్ధమైన ఆరవభాగం బ్రాహ్మణులకు దానం చేసిన వైశ్యుడు తాను చేసిన అన్ని పాపాలనుండి విముక్తిని పొందుతాడు.

అవాప్య ప్రాణసన్దేహం కార్కశ్యేన సమార్జితమ్ ।
అన్నం దత్త్వా ద్విజాతిభ్యశ్శూద్రః పాపాత్ ప్రముచ్యతే ॥ 20 ॥

ప్రాణాలు పోతాయేమో అనే స్థితిలో కఠినంగా ప్రవర్తించి, సంపాదించిన ద్రవ్యమైనా, దానిని బ్రాహ్మణులకు దానం చేసిన శూద్రుడు తన పాపాలనుండి విముక్తిని పొందుతాడు.

ఔరసేన బలేనాన్నమర్జయిత్వాఽ విహింసకః ।
యః ప్రయచ్ఛతి విప్రేభ్యో న స దుర్గాణి సేవతే ॥ 21 ॥

ఏ ప్రాణినీ వధించకుండా, కన్నకొడుకుచేత బలవంతంగా ద్రవ్యం సంపాదింపజేసినా, దానిని బ్రాహ్మణులకు దానం చేస్తే, నరకాలకు పోడు.

న్యాయేనావాప్తమన్నం తు నరో హర్షసమన్వితః ।
ద్విజేభ్యో వేదవృద్ధేభ్యో దత్త్వా పాపాత్ ప్రముచ్యతే ॥ 22 ॥

ధర్మబద్ధంగా సంపాదించిన అన్నాన్ని సంతోషంగా వృద్ధులైన వేదపండితులకు దానం చేసినవాడు అన్నిపాపాలనుండి విముక్తిని పొందుతాడు.

అన్నమూర్జస్కరం లోకే దత్త్వోర్జస్వీ భవేన్నరః ।
సతాం పన్థానమావృత్య సర్వపాపైః ప్రముచ్యతే ॥ 23 ॥

లోకంలో అన్నమే బలవర్ధకమైనది. అటువంటి అన్నాన్ని దానం చేసిన మానవుడు తేజోవంతుడు అవుతాడు. సజ్జనుల మార్గాన్ని అనుసరించేవాడు (పాపాత్ముడైనా) సమస్తమైన పాపాలనుండి విముక్తిని పొందుతాడు.

దానవిద్భిః కృతః పన్థా యేన యాన్తి మనీషిణః ।
తేష్వప్యన్నస్య దాతారస్తేభ్యో ధర్మస్సనాతనః ॥ 24 ॥

బుద్ధిమంతులు వివిధ దానాల మహిమలను గురించి తెలిసినవారు వెళ్లిన మార్గంలో నడుస్తారు. వారిలో కూడ అన్నం దానం చేసినవారు శ్రేష్ఠులు. సనాతనమైన వేదధర్మం అన్నదాతల మూలంగానే నిలుస్తుంది.

సర్వావస్థం మనుష్యేణ న్యాయేనాన్నముపార్జితమ్ ।
కార్యాన్న్యాయాగతం నిత్యమన్నం హి పరమా గతిః ॥ 25 ॥

అందుచేత మానవుడు అన్నివిధాలుగానూ న్యాయంగా సంపాదించిన అన్నాన్ని దానం చేయాలి. ధర్మబద్ధమైన మార్గంలో వచ్చిన అన్నమే ఉత్తమ గతులను పొందడానికి సాధనం.

అన్నస్య హి ప్రదానేన నరో యాతి పరాం గతిమ్ ।
సర్వకామసమాయుక్తః ప్రేత్య చాప్యశ్నుతే సుఖమ్ ॥ 26 ॥

అన్నదానంచేత మానవుడు ఉత్తమోత్తమమైన గతిని పొందుతాడు. ఈ లోకంలో సమస్తమైన కోరికలు సిద్ధిస్తాయి. మరణించిన తరువాత కూడ (స్వర్గాది లోకాలు పొంది) సుఖంగా ఉంటాడు.

ఏవం పుణ్యసమాయుక్తో నరః పాపైః ప్రముచ్యతే ।
తస్మాదన్నం ప్రదాతవ్యమన్యాయపరివర్జితమ్ ॥ 27 ॥

ఈవిధంగా అన్నదానం చేసిన పుణ్యాత్ముడు పాపాలన్నింటినుండి విముక్తిని పొందుతాడు. అందుచేత న్యాయమార్గంలో సంపాదించిన అన్నాన్ని తప్పకుండా దానం చేయాలి.

యస్తు ప్రాణాహుతీపూర్వమన్నం భుఙ్క్తే గృహీ సదా ।
అవన్ధ్యం దివసం కుర్యాదన్నదానేన మానవః ॥ 28 ॥

నిత్యమూ పంచప్రాణాహుతులతో అన్నం తినే గృహస్థుడు అన్నం దానం చేసి, ఆ రోజును సార్థకం చేస్తాడు. (అన్నదానం చేయని రోజు నిరర్థకం).

భోజయిత్వా శతం నిత్యం నరో వేదవిదాం వరమ్ ।
న్యాయవిద్ధర్మవిదుషామితిహాసవిదాం తథా ॥ 29 ॥

న యాతి నరకం ఘోరం సంసారం న చ సేవతే ।
సర్వకామసమాయుక్తః ప్రేత్య చాప్యశ్నుతే సుఖమ్ ॥ 30 ॥

వేదవేత్తలూ, న్యాయవేత్తలూ, ధర్మవిదులూ, ఇతిహాసవేత్తలూ, అయిన వందమంది బ్రాహ్మణులకు నిత్యమూ అన్నదానం చేసినవాడు భయంకరమైన నరకానికి ఎప్పటికీ వెళ్లడు. వాడికి మళ్లీ పుట్టడమూ, చావడమూ ఉండదు. బ్రదికిఉండగా ఈ లోకంలో అన్ని కోరికలూ నెరవేరుతాయి. మరణించిన తరువాత స్వర్గాది సుఖాలు కలుగుతాయి.

ఏవం కర్మసమాయుక్తో రమతే విగతజ్వరః ।
రూపవాన్ కీర్తిమాంశ్చైవ ధనవాంశ్చోపజాయతే ॥ 31 ॥

ఈవిధంగా అన్నదానం అనే సత్కర్మను ఆచరించినవాడు ఎటువంటిబాధలు లేకుండా ఆనందంగా విహరిస్తాడు. తరువాతి జన్మలో అందగాడు, కీర్తిమంతుడు, ధనవంతుడుగా పుడతాడు.

ఏతద్ వస్సర్వమాఖ్యాతమన్నదానఫలం మహత్ ।
మూలమేతత్తు ధర్మాణాం ప్రదానానాం చ భో ద్విజాః ॥ 32 ॥

ఓ బ్రాహ్మణులారా! అన్నదానంవలన కలిగే గొప్ప ఫలితం సమస్తమూ మీకు ఈవిధంగా వివరించాను. సమస్త ధర్మాలకూ, దానాలకూ అన్నదానమే ప్రధానమైన ఆధారం.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసర్షిసంవాదే సంసారచక్రేఽన్నదాన ప్రశంసావర్ణనం నామ నవోత్తరశతతమోఽధ్యాయః ॥ 109 ॥

శ్రీబ్రహ్మపురాణంలో వ్యాస ఋషి సంవాదంలో సంసారచక్రంలో అన్నదాన ప్రశంసా వర్ణనం అనే నూటతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.



దశాధికశతతమోఽధ్యాయః - నూటపదవ అధ్యాయం

శ్రాద్ధవిధినిరూపణమ్ - శ్రాద్ధవిధి నిరూపణం

మునయ ఊచుః :-వ్యాసమహర్షితో మునులు ఇలా అంటున్నారు.

పరలోకగతానాం తు స్వకర్మస్థానవాసినామ్ ।
తేషాం శ్రాద్ధం కథం దేయం పుత్రైశ్చాన్యైశ్చ బన్ధుభిః ॥ 1 ॥

జీవులు ఈ లోకంలో చేసిన కర్మలకు అనుగుణమైన లోకాలలో నివసిస్తుంటారు గదా! వారికి వారి కుమారులు, ఇతర బంధువులు శ్రాద్ధకర్మ ఏ విధంగా ఆచరించాలి?

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఈ విధంగా చెప్తున్నాడు.

నమస్కృత్య జగన్నాథం వారాహం లోకభావనమ్ ।
శృణుధ్వం సమ్ప్రవక్ష్యామి శ్రాద్ధకల్పం యథోదితమ్ ॥ 2 ॥

లోకాలను సృష్టించి, పోషించేవాడు, వరాహరూపం ధరించి ఉన్నవాడు అయిన శ్రీమహావిష్ణువుకు నమస్కరించి, శ్రాద్ధవిధానం గురించి చెప్తాను. వినండి.

పురా కోకాజలే మగ్నాన్ పితౄనుద్ధృతవాన్ విభుః ।
శ్రాద్ధం కృత్వా తదా దేవో యథా తత్ర ద్విజోత్తమాః ॥ 3 ॥

బ్రాహ్మణోత్తములారా! పూర్వం కోక అనే పేరు గల పుణ్యతీర్థంలో మునిగి ఉన్న పితరులను శ్రీమహావిష్ణుదేవుడు శ్రాద్ధం చేసి ఉద్ధరించాడు.

మునయ ఊచుః :-వ్యాసమహర్షితో మునులు ఇలా అంటున్నారు.

కిమర్థం తే తు కోకాయాం నిమగ్నాః పితరోఽమ్భసి ।
కథం తేనోద్ధృతాస్తే వై వారాహేణ ద్విజోత్తమ ॥ 4 ॥

తస్మిన్ కోకాముఖే తీర్థే భుక్తిముక్తిఫలప్రదే ।
శ్రోతుమిచ్ఛామహే బ్రూహి పరం కౌతూహలం హి నః ॥ 5 ॥

విప్రవర్యా! పితరులు కోకానది నీటిలో ఎందువల్ల మునిగిపోయారు? భోగమోక్షాలను ప్రసాదించే కోకాతీర్థం నుండి శ్రీమహావిష్ణువు వరాహరూపంలో పితరులను ఎలా ఉద్ధరించాడు? అది వినాలని మాకు కోరికగానూ, చాల కుతూహలంగానూ ఉంది. చెప్పవలసింది.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

త్రేతాద్వాపరయోస్సన్ధౌ పితరో దివ్యమానుషాః ।
పురా మేరుగిరేః పృష్ఠే విశ్వేదేవైస్సహ స్థితాః ॥ 6 ॥

పూర్వం త్రేత, ద్వాపర యుగాలు కలిసే సంధికాలంలో దివ్యత్వమూ, మానవత్వమూ కలిగిన పితరులు మేరుపర్వత శిఖరం మీద విశ్వేదేవతలతో కలిసి ఉండేవారు.

తేషాం సముపవిష్టానాం పితౄణాం సోమసమ్భవా ।
కన్యా కాన్తిమతీ దివ్యా పురతః ప్రాఞ్జలిః స్థితా ॥
తామూచుః పితరో దివ్యా యే తత్రాసన్ సమాగతాః ॥ 7 ॥

పితరులు విశ్వేదేవతలతో ఒకచోట కలిసి కూర్చున్నారు. అప్పుడు చంద్రుడి కుమార్తెన కాంతిమతి అనే దేవకన్య అక్కడికి వచ్చింది. చేతులు జోడించి పితరుల ఎదుట నిలుచుంది. అక్కడ చేరి ఉన్న దివ్యులైన పితరులు కాంతిమతితో ఇలా అన్నారు.

పితర ఊచుః :-కాంతిమతితో పితృదేవతలు ఇలా అన్నారు.

కాऽసి భద్రే ప్రభుః కో వా భవత్యా వక్తుమర్హసి ॥ 8 ॥

కల్యాణీ, నీవు ఎవరు? నీకు ప్రభువు (భర్త) ఎవ్వడు? చెప్పు.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

సా ప్రోవాచ పితౄన్ దేవాన్ కలా చాన్ద్రమసీతి హ ।
ప్రభుత్వే భవతామేవ వరయామి యదీచ్ఛథ ॥ 9 ॥

అప్పుడు కాంతిమతి పితృదేవతలతో ఇలా చెప్పింది. నేను చంద్రుడికి సంబంధించిన కళను. మీరు అంగీకరిస్తే మిమ్మల్నే ప్రభువు(భర్త)గా కోరుకుంటున్నాను.

ఊర్జానామాస్తి ప్రథమం స్వధా చ తదనన్తరమ్ ।
భవద్భిరద్యైవ కృతం నామ కోకేతి భావితమ్ ॥ 10 ॥

నాకు మొదట ఊర్జ అని పేరు. తరువాత స్వధ అనే పేరు గలిగింది. ఇప్పుడే మీరు కోక అనే పేరుతో నన్ను ఆదరించారు.

తే హి తస్యా వచశ్శ్రుత్వా పితరో దివ్యమానుషాః ।
తస్యా ముఖం నిరీక్షన్తో న తృప్తిమధిజగ్మిరే ॥ 11 ॥

దేవమానవులైన పితరులు కాంతిమతి పలుకులు విని, ఆమె ముఖం చూస్తూ కూర్చున్నారు. ఎంత చూసినా, వారికి తృప్తి కలగలేదు.

విశ్వేదేవాశ్చ తాన్ జ్ఞాత్వా కన్యాముఖనిరీక్షకాన్ ।
యోగచ్యుతాన్ నిరీక్ష్యైవ విహాయ త్రిదివం గతాః ॥ 12 ॥

పితరులు కాంతిముఖం ఆసక్తిగా చూస్తూ ఉండడం విశ్వేదేవతలు గమనించారు. వారు (కామంవల్ల) యోగంనుండి భ్రష్టులైనారని గ్రహించారు. అందుచేత పితరులను విడిచిపెట్టి విశ్వేదేవతలు స్వర్గానికి వెళ్లిపోయారు.

భగవానపి శీతాంశురూర్జాం నాపశ్యదాత్మజామ్ ।
సమాకులమనా దధ్యౌ క్వగతేతి మహాయశాః ॥ 13 ॥

భగవానుడైన చంద్రుడు కూడ తన కూతురైన ఊర్జ కనబడకపోయేసరికి ఎంతో కలవరపడ్డాడు. కీర్తిమంతుడైన ఆ చంద్రుడు కలత చెందిన మనస్సుతో కూతురు ఎక్కడికి వెళ్లిందో అని విచారించాడు.

స వివేద తదా సోమః ప్రాప్తాం పితౄంశ్చ కామతః ।
తైశ్చావలోకితాం హార్దాత్ స్వీకృతాం చ తపోబలాత్ ॥ 14 ॥

చంద్రుడు తపశ్శక్తితో తన కూతురు పితృదేవతలపై మనసు పడి వారి వద్దకు వెళ్లిందనీ, వాళ్లు కూడ ఆమెను చూసి, మనస్ఫూర్తిగా తమదానిని చేసుకున్నారనీ గ్రహించాడు.

తతః కోపపరీతాత్మా పితౄఞ్ఛశధరో ద్విజాః ।
శశాప నిపతిష్యధ్వం యోగభ్రష్టా విచేతసః ॥
యస్మాదదత్తాం మత్కన్యాం కామయధ్వం సుబాలిశాః ॥ 15 ॥

విప్రులారా! అప్పుడు చంద్రుడు మనసునిండా కోపంతో 'నీచులారా! నేను ఇవ్వకుండానే నా కూతురిని కోరుకున్నారు (స్వీకరించారు) కాబట్టి, మీరు యోగభ్రష్టులై, బుద్ధిహీనులై, కింద పడిపోదురు గాక' అని పితరులను శపించాడు.

యస్మాద్ధృతవతీ చేయం పతీన్ పితృమతీ సతీ ।
స్వతన్త్రా ధర్మముత్సృజ్య తస్మాద్భవతు నిమ్నగా ॥
కోకేతి ప్రథితా లోకే శిశిరాద్రిసమాశ్రితా ॥ 16 ॥

ధర్మాన్ని విడిచి, తండ్రినైన నా అనుమతి లేకుండా, స్వతంత్రించి, భర్తలను పొందింది. కాబట్టి నా కూతురు కూడ నది అయి క్రిందికి పయనించును గాక. ఆ నది కోక అనే పేరుతో ప్రసిద్ధ మవుతుంది. ఈ హిమాలయపర్వతాన్ని ఆశ్రయించుకుని ఉంటుంది.

ఇత్థం శప్తాశ్చన్ద్రమసా పితరో దివ్యమానుషాః ।
యోగభ్రష్టా నిపతితా హిమవత్పాదభూతలే ॥ 17 ॥

చంద్రుడు ఈవిధంగా శపించడంచేత దేవమానవులైన పితరులు యోగభ్రష్టులై, హిమవత్పర్వతం మొదట్లో నేలమీద పడిపోయారు.

ఊర్జా తత్రైవ పతితా గిరిరాజస్య విస్తృతే ।
ప్రస్థే తీర్థం సమాసాద్య సప్తసాముద్రముత్తమమ్ ॥ 18 ॥

చంద్రుడి కూతురైన ఊర్జ అక్కడే విశాలమైన హిమవత్పర్వతం చరియ ప్రదేశంలో, సప్తసముద్రాలలోని నీళ్లను కలుపుకుని పుణ్యనదిగా ఏర్పడింది.

కోకా నామ తతో వేగాన్నదీ తీర్థశతాకులా ।
ప్లావయన్తీ గిరేశ్శృఙ్గం సర్పణాత్తు సరిత్ స్మృతా ॥ 19 ॥

ఆ నది పేరు కోక. అది వందలకొలది పుణ్యతీర్థాలతో నిండి, హిమగిరి శిఖరాలను తడుపుతూ, మిక్కిలి వేగంగా ప్రవహించింది. అందువల్ల దానికి సరిత్తు అనే పేరు వచ్చింది.

అథ తే పితరో విప్రా యోగహీనా మహానదీమ్ ।
దదృశుశ్శీతసలిలాం న విదుస్తాం సులోచనామ్ ॥ 20 ॥

ద్విజులారా! యోగభ్రష్టులైన పితరులు చల్లని నీళ్లతో నిండిన కోక అనే ఆ మహానదిని చూశారు. కాని ఆ నది తమ భార్య (చంద్రుడి కూతురు) అని గ్రహించలేకపోయారు.

తతస్తు గిరిరాడ్ దృష్ట్వా పితౄంస్తాంస్తు క్షుధాఽర్దితాన్ ।
బదరీమాదిదేశాథ ధేనుం చైకాం మధుస్రవామ్ ॥ 21 ॥

అప్పుడు పర్వతరాజైన హిమవంతుడు ఆ పితరులు ఆకలితో బాధపడుతుండడం చూసి, వారి ఆకలిని తీర్చడానికి ఒక రేగుచెట్టునూ, తీయని పాలను ధారపోసే ఆవునూ నియోగించాడు.

క్షీరం మధు చ తద్దివ్యం కోకామ్భో బదరీఫలమ్ ।
ఇదం గిరివరేణైషాం పోషణాయ నిరూపితమ్ ॥ 22 ॥

హిమవంతుడు ఆ ఆవు ఇచ్చే పాలను, కోకానదిలోని తేనెవంటి తీయని నీళ్లనూ, రేగుపండ్లనూ, ఆ పితరుల పోషణకు ఏర్పాటు చేశాడు.

తయా వృత్త్యా తు వసతాం పితౄణాం మునిసత్తమాః ।
దశవర్షసహస్రాణి యయురేకమహో యథా ॥ 23 ॥

మహర్షులారా! ఆవిధంగా జీవనం గడుపుతున్న పితరులకు పదివేల సంవత్సరాలు ఒక్క దినంలాగా గడిచి పోయాయి.

ఏవం లోకే విపితరి తథైవ విగతస్వధే ।
దైత్యా బభూవుర్బలినో యాతుధానాశ్చ రాక్షసాః ॥24 ॥

ఈవిధంగా లోకంలో పితరులు, స్వధాకారమూ లేకపోవడంతో దైత్యులు, యాతుధానులు, రాక్షసులు బలవంతులైనారు.

తే తాన్ పితృగణాన్ దైత్యా యాతుధానాశ్చ వేగితాః ।
విశ్వేదేవైర్విరహితాన్ సర్వతస్సముపాద్రవన్ ॥ 25 ॥

ఆ దైత్యులు, యాతుధానులు, రాక్షసులు విశ్వేదేవతల తోడు లేని ఆ పితరులపై అన్ని దిక్కులనుండి వచ్చిపడ్డారు.

దైతేయాన్ యాతుధానాంశ్చ దృష్ట్వైవాపతతో ద్విజాః ।
కోకాతటస్థాముత్తుఙ్గాం శిలాం తే జగృహూ రుషా ॥ 26 ॥

విప్రులారా! తమ మీదికి వచ్చి పడుతున్న దైత్యులను, యాతుధానులను చూసి, పితరులు కోపంతో కోకానది ఒడ్డున ఉన్న ఎతైన బండరాయిని తీసుకున్నారు.

గృహీతాయాం శిలాయాం తు కోకా వేగవతీ పితౄన్ ।
ఛాదయామాస తోయేన ప్లావయన్తీ హిమాచలమ్ ॥ 27 ॥

పితరులు ఆ బండరాయిని తీయగానే (ప్రవాహానికి అడ్డు తొలగి), కోకానది అమితమైన వేగంతో హిమపర్వతం అంతటా ప్రవహిస్తూ, పితరులను ముంచివేసింది.

పితౄనన్తర్హితాన్ దృష్ట్వా దైతేయా రాక్షసాస్తథా ।
విభీతకం సమారుహ్య నిరాహారాస్తిరోహితాః ॥ 28 ॥

పితరులు కోకానదీజలంలో మునిగి కనబడకుండాపోవడంతో దైత్యులు, రాక్షసులు అక్కడే ఉన్న తాడిచెట్టుపై కెక్కి, తిండితిప్పలు లేకుండా దాక్కున్నారు.

సలిలేన విషీదన్తః పితరః క్షుత్తృషార్దితాః ।
విషీదమానమాత్మానం సమీక్ష్య సలిలాశయాః ॥
జగుర్జనార్దనం దేవం పితరశ్శరణం హరిమ్ ॥ 29 ॥

నీటిలో మునిగిన పితరులు ఆకలి దప్పికలతో అలమటిస్తున్నారు. తమకు కలిగిన కష్టాలు తలచుకుని, ఆ నీటిలోనే ఉండి, దేవదేవుడు, కష్టాలలో ఉన్నవారికి దిక్కూ అయిన శ్రీమహావిష్ణువును గురించి, ఈవిధంగాస్తుతించారు.

పితర ఊచుః :–శ్రీమహావిష్ణువును గూర్చి పితృదేవతలు ఇలా స్తుతిస్తున్నారు.

జయస్వ గోవిన్ద జగన్నివాస జయోఽస్తు నః కేశవ తే ప్రసాదాత్ ।
జనార్జనాస్మాన్ సలిలాన్తరస్థానుద్ధర్తుమర్హస్యనఘప్రభావ ॥ 30 ॥

ఉపనిషత్తులచేత తెలియబడేవాడా! (విష్ణు.539), నీకు జయ మగు గాక. లోకాలన్నింటిలోను నిండి ఉన్నవాడా! జయం.బ్రహ్మ విష్ణు శివ స్వరూపుడా! (విష్ణు.648), నీ అనుగ్రహంచేత మాకు జయ మగు గాక. శ్రేయస్సు కోసం భక్తులచేత యాచింపబడేవాడా! (విష్ణు.126), పాపం గాని దుఃఖం గాని లేనివాడా! (విష్ణు.831), నీళ్లలో మునిగి ఉన్న మమ్మల్ని రక్షింపదగినవాడివి నీవే.

నిశాచరైర్దారుణదర్శనైః ప్రభో వరేణ్య వైకుణ్ఠ వరాహ విష్ణో ।
నారాయణాశేషమహేశ్వరేశ ప్రయాహి భీతాఞ్జయ పద్మనాభ ॥ 31 ॥

మిక్కిలి సమర్థమైనవాడా (విష్ణు.299), శ్రేష్ఠుడా! సృష్టిప్రారంభంలో విడివిడిగా ఉన్న భూతాలను కలిపి, వాటి కదలికలను నిరోధించినవాడా! (విష్ణు.405), వరాహరూపా! అన్నింట నిండిఉన్నవాడా! (విష్ణు.2), జీవులకు గమ్యస్థానమైనవాడా! (విష్ణు.246), సమస్తానికీ ప్రభువువైనవాడా! హృదయపద్మం నడుమ ఉన్నవాడా! (విష్ణు.346), చూడడానికే భయంకరంగా ఉన్న రాక్షసులవలన భయపడుతున్న మమ్మల్ని కాపాడు.

ఉపేన్ద్ర యోగిన్ మధుకైటభఘ్న విష్ణో అనన్తాచ్యుత వాసుదేవ ।
శ్రీశార్ఙ్గచక్రామ్బుజశఙ్ఖపాణే రక్షస్వ దేవేశ్వర రాక్షసేభ్యః ॥ 32 ॥

ఇంద్రుడిని మించినవాడా! (విష్ణు.151), జ్ఞానంచేత పొందదగినవాడా! (విష్ణు.849), మధువు, కైటభుడు అనే రాక్షసులను సంహరించినవాడా! అన్నింటిలోనూ ప్రవేశించి ఉన్నవాడా! (విష్ణు.2), దేశము, కాలము మొదలైన విభాగం లేనివాడా! (విష్ణు.886), షడ్భావవికారాలు లేనివాడా! (విష్ణు.318), తన మాయతో జగత్తులను ఆవరించి, ప్రకాశించేవాడా! (విష్ణు.709), నాలుగు చేతులలోనూ శార్ఙ్గం అనే విల్లు, సుదర్శనచక్రం, పద్మం, శంఖం ధరించి ఉన్నవాడా! దేవతలకు ప్రభువా! ఈ రాక్షసులనుండి మమ్మల్ని కాపాడు.

త్వం పితా జగతశ్శమ్భో న త్వాం శక్తః ప్రబాధితుమ్ ।
నిశాచరగణో భీమస్తతస్త్వాం శరణం గతాః ॥ 33 ॥

భక్తులకు సుఖం ఇచ్చేవాడా! (విష్ణు.38), జగత్తుల కన్నింటికీ నీవు తండ్రివి. భయంకరమైనఈ రక్కసుల మూక నిన్ను ఏమీ బాధించలేదు. అందుకే రాక్షసులనుండి కాపాడడానికి నీ శరణు పొందాము.

త్వన్నామసఙ్కీర్తనతో నిశాచరా ద్రవన్తి భూతాన్యపయాన్తి చారయః ।
నాశం తథా సమ్ప్రతి యాన్తి విష్ణో ధర్మాది సత్యం భవతీహ ముఖ్యమ్ ॥ 34 ॥

శ్రీమహావిష్ణూ! నీ నామాలను కీర్తించడంచేతనే రాక్షసులు భయంతో పరుగులు తీస్తారు. బాధించే భూతాలు వెనక్కు తిరిగి వెళ్లిపోతాయి. శత్రువులు వెంటనే నశిస్తారు. ప్రధానంగా ధర్మం మొదలైన పురుషార్థాలు నిశ్చయంగా సిద్ధిస్తాయి.

వ్యాస ఉవాచ :-మునులతో వ్యాసమహర్షి ఇలా చెప్తున్నాడు.

ఇత్థం స్తుతస్స పితృభిర్ధరణీధరస్తు తుష్టస్తదా విధృతసూకరదివ్యమూర్తిః ।
కోకాముఖే పితృగణం సలిలే నిమగ్నం దేవో దదర్శ శిరసాఽథ శిలాం వహన్తమ్ ॥ 35 ॥

పితరులు ఈవిధంగా స్తుతించగా శ్రీమహావిష్ణువు సంతోషించాడు. అప్పుడు దివ్యమైన వరాహరూపాన్ని ధరించాడు. కోకాజలంలో మునిగి, తలపై పెద్దబండరాయిని మోస్తూ ఉన్న పితరులను చూశాడు.

తం దృష్ట్వా సలిలే మగ్నం క్రోడరూపీ జనార్దనః ।
భీతం పితృగణం విష్ణురుద్ధర్తుం మతిమాదధే ॥ 36 ॥

వరాహరూపంలో ఉన్న విష్ణువు నీటిలో మునిగిఉన్న పితృదేవతలను చూశాడు. భయపడుతున్న పితరుల సమూహాన్ని నీళ్లనుండి పైకి లేపాలని సంకల్పించాడు.

దంష్ట్రాగ్రేణ సమాహత్య శిలాం చిక్షేప సూకరః ।
పితౄనాదాయ చ విభురుజ్జహార శిలాతలాత్ ॥ 37 ॥

వరాహరూపంలో ఉన్న విష్ణువు పితరుల నెత్తిమీద ఉన్న బండరాయిని తన కోరతో గట్టిగా కొట్టి, దూరంగా విసరివేశాడు. పితరులను పట్టుకుని ఆ(శిలాతలం?)నీటిలోనుండి పైకి లాగాడు.

వరాహదేహసంలగ్నాః పితరః కనకోజ్జ్వలాః ।
కోకాముఖే గతభయాః కృతా దేవేన విష్ణునా ॥ 38 ॥

వరాహమూర్తి శరీరాన్ని ఆధారం చేసుకుని ఉన్న పితరులు బంగారంలాగా మెరిశారు. శ్రీమహావిష్ణువు అనుగ్రహంతో ఏమాత్రం భయం లేకుండా, ఆ కోకానదినుండి బయటపడ్డారు.

ఉద్ధృత్య చ పితౄన్ దేవో విష్ణుతీర్థే తు సూకరః ।
దదౌ సమాహితస్తేభ్యో విష్ణుర్లోహార్గలే జలమ్ ॥ 39 ॥

వరాహరూపంలో ఉన్న విష్ణుదేవుడు కోకాముఖంనుండి పితరులను ఉద్ధరించిన తరువాత విష్ణుతీర్థం అనే పుణ్యస్థలం వద్ద వారికి ఆదరంతో (భయంనుండి తేరుకోవడానికి) లోహార్గలంలోని నీటిని ఇచ్చాడు.

తతస్స్వరోమసమ్భూతాన్ కుశానాదాయ కేశవః ।
స్వేదోద్భవాంస్తిలాంశ్చైవ చక్రేచోల్ముకముత్తమమ్ ॥ 40 ॥

ఆ తరువాత కేశవుడు తన వెంట్రుకలనుండి ఏర్పడిన దర్భలనూ, తన చెమటనుండి పుట్టిన నువ్వులనూ తీసుకున్నాడు. ఒక మండుతున్న కొఱవిని నిర్మించాడు.

జ్యోతిస్సూర్యప్రభం కృత్వా పాత్రం తీర్థం చ కామికమ్ ।
స్థితః కోటివటస్యాథో వారి గఙ్గాధరం శుచి ॥ 41 ॥

సూర్యుడితో సమానమైన కాంతి కలిగిన జ్యోతినీ, జలపాత్రనూ, కోరిన కోరికలను తీర్చే పుణ్యజలాన్నీ ఏర్పాటు చేశాడు. కోటివటం అనే పుణ్యవృక్షం కింద నిలిచి, అక్కడ గంగను ధరించిన నిర్మలమైన నీళ్లను (గంగాజలాన్ని) కల్పించాడు.

తుఙ్గకూటాత్ సమాదాయ యజ్ఞీయానౌషధీరసాన్ ।
మధుక్షీరరసాన్ గన్ధాన్ పుష్పధూపానులేపనాన్ ॥ 42 ॥

ఆ హిమవత్పర్వతం మీద ఎత్తైన శిఖరప్రదేశాలనుండి యజ్ఞాలకు ఉపకరించే ఓషధీరసాలను, తేనె, పాలు, ఇతరమైన మధురరసాలు, గంధాలు, పూలు, ధూపాలు, మైపూతలు, తీసుకున్నాడు.

ఆదాయ ధేనుం సరసో రత్నాన్యాదాయ చార్ణవాత్ ॥ 43 ॥

సరస్సునుండి ఆవునూ, సముద్రంనుండి రత్నాలనూ, తీసుకుని వచ్చాడు.

దంష్ట్రయోల్లిఖ్య ధరణీమభ్యుక్ష్య సలిలేన చ ।
ఘర్మోద్భవేనోపలిప్య కుశైరుల్లిఖ్య తాం పునః ॥ 44 ॥

వరాహరూపంలో ఉన్న తాను తన కోరతో భూమిని చదును చేశాడు. అక్కడి పుణ్యజలం ఆ ప్రదేశం అంతటా చల్లాడు. తన చెమట నుండి పుట్టిన పదార్థంతో ఆ ప్రదేశాన్ని అలికి, దర్భలతో గీతలు గీశాడు.

పరిణీయోల్ముకేనైనామభ్యుక్ష్య చ పునః పునః ।
కుశానాదాయ ప్రాగగ్రాన్ లోమకూపాన్తరస్థితాన్ ॥ 45 ॥

కొఱవితో చుట్టూ తిప్పి, తిరిగి మళ్లీ మళ్లీ నీటిని అభ్యుక్షణం చేసి, రోమకూపాల లోపల ఉన్న దర్భలను తీసి, వాటి చివరలు తూర్పువైపుగా ఉంచాడు.

ఋషీనాహూయ పప్రచ్ఛ కరిష్యే పితృతర్పణమ్ ॥ 46 ॥

మహర్షులను పిలిపించి, పితరులకు తర్పణం చేస్తానని అడిగాడు.

తైరప్యుక్తే కురుష్వేతి విశ్వాన్ దేవాంస్తతో విభుః ।
ఆహూయ మన్త్రతస్తేషాం విష్టరాణి దదౌ ప్రభుః ॥ 47 ॥

వారు అలాగే, చేయమన్నారు. తరువాత జనార్దనుడు విశ్వేదేవతలను ఆహ్వానించాడు. మంత్రపూర్వకంగా వారికి ఆసనాలను సమర్పించాడు.

ఆహూయ మన్త్రతస్తేషాం వేదోక్తవిధినా హరిః ।
అక్షతైర్దైవతారక్షాం చక్రే చక్రగదాధరః ॥ 48 ॥

చక్రమూ, గద ధరించిన శ్రీమహావిష్ణువు సమంత్రకంగా విశ్వేదేవతలను పిలిచి, వారికి వేదాలలో చెప్పబడిన విధానం ప్రకారం అక్షతలతో దేవతారక్ష చేశాడు.

అక్షతాస్తు యవౌషధ్యః సర్వదేవాంశసమ్భవాః ।
రక్షన్తి సర్వత్ర దిశో రక్షార్థం నిర్మితా హి తే ॥ 49 ॥

సమస్తమైన దేవతల అంశలతో సంభవించిన అక్షతలు, యవలు, ఓషధులు, అన్ని దిక్కులలోనూ రక్షణ కలిగిస్తాయి. భగవంతుడు వాటిని రక్షణకోసమే నిర్మించాడు.

దేవదానవదైత్యేషు యక్షరక్షస్సు చైవ హి ।
న హి కశ్చిత్ క్షయం తేషాం కర్తుం శక్తశ్చరాచరే ॥ 50 ॥

దేవతలు, దానవులు, దైత్యులు, యక్షులు, రాక్షసులు, మొదలుగా స్థావర జంగమాత్మకమైన సమస్త భూతాలలోనూ ఏదీ కూడ వాటిని నాశనం చేయలేదు.

న కేనచిత్ క్షతా యస్మాత్తస్మాత్తేహ్యక్షతాః కృతాః ।
దేవానాం తే హి రక్షార్థం నియుక్తా విష్ణునా పురా ॥ 51 ॥

దేనివలన కూడ దెబ్బతిననివి కావడంచేతనే అవి అక్షతలు అయినాయి. పూర్వం శ్రీమహావిష్ణువు వాటిని దేవతల రక్షకోసం ఏర్పాటుచేశాడు.

కుశగన్ధయవైః పుష్పైరర్ఘ్యం కృత్వా చ సూకరః ।
విశ్వేభ్యో దేవేభ్య ఇతి తతస్తాన్ పర్యపృచ్ఛత ॥ 52 ॥

వరాహస్వామి విశ్వేదేవతలకు దర్భలు, గంధం, యవలు, పుష్పాలతో అర్ఘ్యం సమర్పించి, తరువాత వారిని ఇలా అడిగాడు.

పితౄనావాహయిష్యామి యే దివ్యా యే చ మానుషాః ।
ఆవాహయస్వేతి చ తైరుక్తస్త్వావాహయచ్ఛుచిః ॥ 53 ॥

దేవమానవులైన పితరులను ఆహ్వానిస్తాను (అనుమతి ఇవ్వండి) అని అడగగా, విశ్వేదేవతలు 'ఆహ్వానించు' అన్నారు. శుచియైన వరాహస్వామి అప్పుడు పితరులను ఆహ్వానించాడు.

శ్లిష్టమూలాగ్రదర్భాంస్తు సతిలాన్ వేద వేదవిత్ ।
జానావారోప్య హస్తం తు దదౌ సవ్యేన చాసనమ్ ॥ 54 ॥

వేదవేత్త అయిన ఆ స్వామి మొదళ్లూ చివరలూ కలిపిన దర్భలను, నువ్వులతో సహా పుచ్చుకుని చేయి మోకాలిపై ఉంచి, సవ్యంగా ఆసనం ఇచ్చాడు.

తథైవ జానుసంస్థేన కరేణైకేన తాన్ పితౄన్ ।
వారాహః పితృవిప్రాణామాయాన్తు న ఇతీరయన్ ॥ 55 ॥

అదే విధంగా వరాహస్వామి ఒకచేయి మోకాలిపై ఉంచి, పితృస్థానంలో ఉన్న బ్రాహ్మణులను (బ్రాహ్మణ రూపంలో ఉన్న పితరులను) 'ఆయాన్తు నః పితరః' అనే మంత్రం ఉచ్చరిస్తూ పిలిచాడు.

అపహతేత్యువాచైవ రక్షణం చాపసవ్యతః ।
కృత్వా చాఽఽవాహనం చక్రే పితౄణాం నామగోత్రతః ॥ 56 ॥
వారాహః పితృవిప్రాణామాప్యాయయత్వితీరయన్ ।
సంవత్సరైరిత్యుదీర్య తతోఽర్ఘ్యం తేషు విన్యసేత్ ॥ 57 ॥

'అపహతా అసురా రక్షాంసి' అనే మంత్రం ఉచ్చరిస్తూ అపసవ్యంగా రక్షణం ఏర్పరచాడు. పిదప పితరుల పేరూ, గోత్రమూ చెప్పి, 'ఆప్యాయతు' అనే మంత్రం ఉచ్చరించి, వరాహమూర్తి పితృదేవతలను ఆహ్వానించాడు. 'సంవత్సరైః' అనే మంత్రంతో పితృదేవతలకు అర్ఘ్యం ఇచ్చాడు.

యాస్తిష్ఠన్త్యమృతా వాచో యన్మేతి చ పితుః పితుః ।
యన్మే పితామహేత్యేవం దదావర్ఘ్యం పితామహః ॥ 58 ॥

యన్మే ప్రపితామహేతి దదౌ చ ప్రపితామహే ।
కుశగన్ధతిలోన్మిశ్రం సపుష్పమపసవ్యతః ॥ 59 ॥

'యాస్తిష్ఠన్త్యమృతా వాచో యన్మే' అనే మంత్రంతో తండ్రికి, 'యన్మే పితామహ' అనే మంత్రంతో పితామహుడికి, 'యన్మే ప్రపితామహ' అనే మంత్రంతో ప్రపితామహుడికి – దర్భలు, గంధమూ, నువ్వులూ, పూలూ కలిసిన అర్ఘ్యాన్ని అపసవ్యంగా ఇచ్చాడు.

తద్వన్మాతామహేభ్యస్తు విధిం చక్రే జనార్దనః ।
తానర్చ్య భూయో గన్ధాద్యైర్ధూపం దత్త్వా తు భక్తితః ॥ 60 ॥

వరాహమూర్తి అదే విధంగా మాతామహ, మాతృ పితామహ, మాతృ ప్రపితామహులకు కూడ యథావిధిగా ఆహ్వానాదులు చేశాడు. పిదప భక్తిగా గంధాదులతో వారిని అర్చించి, ధూపం ఇచ్చాడు.

ఆదిత్యా వసవో రుద్రా ఇత్యుచ్చార్య జగత్ప్రభుః ।
తతశ్చాన్నం సమాదాయ సర్పిస్తిలకుశాకులమ్ ॥ 61 ॥

ఆ తరువాత వరాహమూర్తి (ప్రపితామహ, పితామహ, పితలను ఉద్దేశించి) 'ఆదిత్యా వసవో రుద్రాః' అనే మంత్రం పలికి, నెయ్యి, నువ్వులు, దర్భలతో కలిపిన అన్నం తీసుకున్నాడు.

విధాయ పాత్రే తచ్చైవ పర్యపృచ్ఛత్తతో మునీన్ ।
అగ్నౌ కరిష్య ఇతి తైః కురుష్వేతి చ చోదితః ॥ 62 ॥

ఆ అన్నాన్ని ఒకపాత్రలో ఉంచి, పిదప వరాహమూర్తి అక్కడి మహర్షులను చూచి, వారితో 'అగ్నౌ కరిష్యే' అని అడిగాడు. మహర్షులు 'కురుష్వ' అని అనుమతించారు.

ఆహుతిత్రితయం దద్యాత్ సోమాయాగ్నేర్యమాయ చ ।
యే మామకేతి చ జపేద్యజుస్సప్తకమచ్యుతమ్ ॥ 63 ॥

సోముడికి, అగ్నికి, యముడికి మూడు ఆహుతులు ఇచ్చాడు. తరువాత 'యే మామకాః' అని మొదలుగా శ్రేష్ఠమైన ఏడు యజుర్మంత్రాలను జపించాడు.

హుతావశిష్టం చ దదౌ నామగోత్రసమన్వితమ్ ।
త్రిరాహుతికమేకైకం పితరం తు ప్రతి ద్విజాః ॥ 64 ॥

బ్రాహ్మణులారా! వరాహమూర్తి ఆ పిదప హోమం చేయగా మిగిలిన దానిని పేరు గోత్రాలతో ఒక్కొక్క పితరుడికి మూడు ఆహుతులు చొప్పున ఇచ్చాడు.

అతోఽవశిష్టమన్నాద్యం పిణ్డపాత్రే తు నిక్షిపేత్ ।
తతోఽన్నం సరసం స్వాదు దదౌ పాయసపూర్వకమ్ ॥ 65 ॥

ఆ తరువాత మిగిలిన అన్నాన్ని పిండపాత్రలో ఉంచాడు. పిదప రసవంతమై, రుచిగా ఉన్న అన్నాన్ని పాయసంతో ప్రారంభించి, పితరులకు పెట్టాడు.

ప్రత్యగ్రమేకదాస్విన్నమపర్యుషితముత్తమమ్ ।
అల్పశాకం బహుఫలం షడ్రసమమృతోపమమ్ ॥ 66 ॥

ఆ అన్నం పరిశుద్ధమైనది. ఒకేసారి వండినది. పాచినది కాదు. కూరలు తక్కువగానూ, పండ్లు ఎక్కువగానూ ఉన్నది. ఆరు రుచులతోనూ కూడినది. అమృతంతో సమానమైనది.

యద్బ్రాహ్మణేషు ప్రదదౌ పిణ్డపాత్రే పితౄంస్తథా ।
దేవపూర్వం పితృష్వన్నమాజ్యప్లుతం మధూక్షితమ్ ॥ 67 ॥

ఆవిధమైన అన్నాన్ని బ్రాహ్మణులకు పెట్టాడు. నేతిలో తేలినదీ, తేనెతో నిండినదీ అయిన అన్నాన్ని దేవపితరులకు పిండపాత్రలో పెట్టాడు.

మన్త్రితం పృథివీత్యేవం మధువాతాతృచం జగౌ ।
భుఞ్జానేషు చ విప్రేషు జపన్ వై మన్త్రపఞ్చకమ్ ॥ 68 ॥

ఆ సమయంలో 'పృథివీ తే పాత్రమ్' అనే మంత్రమూ, 'మధు వాతా ఋతాయ తే' అనే మంత్రమూ గానం చేశాడు. బ్రాహ్మణులు భోజనం చేస్తుండగా ఐదు మంత్రాలు జపించాడు.

యత్తే ప్రకారమారభ్య నాధికం తే తతో జగౌ ।
త్రిమధు త్రిసుపర్ణం చ బృహదారణ్యకం తథా ॥ 69 ॥

1. యత్తే ప్రకారమ్ అనే దానితో ప్రారంభించి, 2. నాధికమ్, 3. త్రిమధు, 4. త్రిసుపర్ణం, 5. బృహదారణ్యకం అనే ఐదుమంత్రాలను జపించాడు.

జజాప వైషాం జాప్యం తు సూక్తం సౌరం సపౌరుషమ్ ।
భుక్తవత్సు చ విప్రేషు పృష్టా తృప్తాస్థ ఇత్యుత ॥ 70 ॥

ఆ తరువాత జపించదగిన సౌరసూక్త, పురుషసూక్తాలను కూడ జపించాడు. బ్రాహ్మణులు భోజనం చేసిన తరువాత వారిని 'తృప్తాః స్థ' (భోజనంతో తృప్తి పొందారా) అని అడిగాడు.

తృప్తాః స్మేతి సకృత్తోయం దదౌ మౌనవిమోచనమ్ ।
పిణ్డపాత్రం సమాదాయ చ్ఛాయాయై ప్రదదౌ తతః ॥ 71 ॥

ఆ బ్రాహ్మణులు 'తృప్తాః స్మ' (తృప్తిగా భుజించాం) అన్నారు. పిదప వరాహమూర్తి (భోజనకాలంలో పాటించిన) మౌనం విడిచిపెట్టడంకోసం ఉత్తరాపోశనజలం ఇచ్చాడు. తరువాత పిండపాత్రను తీసుకుని వెళ్లి ఛాయకు ఇచ్చాడు.

సా తదన్నం ద్విధా కృత్వా త్రిధైకైకమథాకరోత్ ।
వారాహో భూమథోల్లిఖ్య సమాచ్ఛాద్య కుశైరపి ॥ 72 ॥

ఛాయ ఆ అన్నాన్ని ముందుగా రెండు భాగాలు చేసింది. ఆ రెండు భాగాలను ఒకొక్కటి మళ్లీ మూడు భాగాలు చేసింది. వరాహమూర్తి నేలపై మూడు గీతలు గీశాడు. ఆ గీతలను దర్భలతో కప్పాడు.

దక్షిణాగ్రాన్ కుశాన్ కృత్వా తేషాముపరి చాసనమ్ ।
సతిలేషు సమూలేషు కుశేష్వేవ తు సంశ్రయః ॥ 73 ॥

ఆ దర్భలను దక్షిణం కొసలుగా ఉంచాడు. వాటిపై నువ్వులు, మూలాలు, దర్భలతో కూడిన ఆసనం ఉంచాడు.

గన్ధపుష్పాదికం కృత్వా తతః పిణ్డం తు భక్తితః ।
పృథివీ దర్వీరిత్యుక్త్వా తతః పిణ్డం ప్రదత్తవాన్ ॥ 74 ॥

ఆసనం మీద గంధం, పుష్పం మొదలైనవి ఉంచి, వాటిపైన శ్రద్ధగా పిండం పెట్టాడు. 'పృథివీ దర్వీ' అనే మంత్రం చెప్పి, తండ్రికి అక్కడ పిండం ఉంచాడు.

పితామహాః ప్రపితామహాస్తథేతిచాన్తరిక్షతః ।
మాతామహానామప్యేవం దదౌ పిణ్డాన్ స సూకరః ॥
పిణ్డనిర్వాపణోచ్ఛిష్టమన్నం లేపభుజేష్వదాత్ ॥ 75 ॥

పితామహాః, ప్రపితామహాః అని పైనుండి తాతకు, ముత్తాతకు కూడ పిండాలు ఉంచాడు. వరాహమూర్తి మాతామహ, మాతృపితామహ, మాతృప్రపితామహులకు కూడ అదే విధంగా పిండప్రదానం చేశాడు. పిండాలను తీసిన తరువాత మిగిలిన అన్నాన్ని దాయాదులైన పితరులకు పెట్టాడు.

ఏతద్వః పితరిత్యుక్త్వా దదౌ వాసాంసి భక్తితః ।
ద్వ్యఙ్గులజాని శుక్లాని ధౌతాన్యభినవానిచ ॥ 76 ॥

'ఏతద్ వః పితః' అంటూ తండ్రికి రెండంగుళాలతో ఏర్పడినవీ, తెల్లనివీ, ఉదికినవీ, కొత్తవీ అయిన వస్త్రాలను ఇచ్చాడు.

గన్ధపుష్పాదికం దత్త్వా కృత్వా చైషాం ప్రదక్షిణామ్ ।
ఆచమ్యాఽఽచామయేద్ విప్రాన్ పాత్రానాదౌ తతస్సురాన్ ॥ 77 ॥

గంధం, పుష్పం మొదలైనవి సమర్పించి, పితరులకు ప్రదక్షిణం చేశాడు. ఆ తరువాత మొదట తాను ఆచమనం చేసి, తరువాత బ్రాహ్మణులచేతనూ, మనుమలచేతనూ, ఆ పిదప దేవతలచేతనూ ఆచమనం చేయించాడు.

తతస్త్వభ్యుక్ష్య తాం భూమిం దత్త్వాఽఽపస్సుమనోక్షతాన్ ।
సతిలామ్బు పితృష్వాదౌ దత్త్వా దేవేషు సాక్షతమ్ ॥ 78 ॥

తరువాత అక్కడి నేలను నీటితో తడిపాడు. దానిపై నీళ్లు, పూవులు, అక్షతలు, ఉంచాడు. వాటిలో నువ్వులు, నువ్వులతో కూడిన నీళ్లను పితరులకు ఇచ్చాడు. తరువాత దేవతలకు అక్షతలతో కూడిన నీళ్లు ఇచ్చాడు.

అక్షయ్యం నోఽస్త్వితి పితౄన్ ప్రీయతామితి దేవతాః ।
ప్రీణయిత్వా పరావృత్య త్రిర్జపేచ్చాఘమర్షణమ్ ॥ 79 ॥

'అక్షయ్యం నోఽస్తు' అనే మంత్రంతో పితరులకూ, 'ప్రీయతామ్' అనే మంత్రంతో దేవతలకూ జలమిచ్చి, వారిని సంతోషపెట్టాడు. ఆ తరువాత వెనకకు తిరిగి, అఘమర్షణ మంత్రాలను మూడు పర్యాయాలు జపించాడు.

తతో నివృత్య తు జపేద్యన్మే నామ ఇతీరయన్ ।
గృహాన్నః పితరో దత్త ధనధాన్యప్రపూరితాన్ ॥ 80 ॥

తరువాత ముందుకు తిరిగి, 'యన్మే నామ' అనే మంత్రం చెప్పాడు. తమ యిండ్లలో నిండుగా సంపదలనూ, వివిధ ధాన్యాలనూ ఇవ్వాలని కోరాడు.

అర్ఘ్యపాత్రాణి పిణ్డానామన్తరే సపవిత్రకాన్ ।
నిక్షిప్యోర్జం వహన్తీతి కోకాతోయమథోఽజపత్ ॥ 81 ॥

దర్భలతో కూడిన అర్ఘ్యపాత్రలను పిండాల నడుమ ఉంచాడు. తరువాత 'ఊర్జం వహన్తి' అనే మంత్రంతో కోకానదీజలాన్ని మంత్రించాడు.

హిమక్షీరం మధుతిలాన్ పితౄణాం తర్పణం దదౌ ॥ 82 ॥

చల్లని మంచునీళ్లు, తేనె, నువ్వులతో పితరులకు తర్పణాలు ఇచ్చాడు.

స్వస్తీత్యుక్తే పైతృకైస్తు సౌరాహ్ణే తాస్తు తర్పయన్ ।
రజతం దక్షిణాం దత్త్వా విప్రాన్ దేవో గదాధరః ॥ 83 ॥

పితృస్థానీయులైన బ్రాహ్మణులు 'స్వస్తి' అన్నారు. వారికి ఆ మధ్యాహ్న సమయంలో వెండిని దక్షిణగా ఇచ్చాడు. వరాహమూర్తి ఆ బ్రాహ్మణులను చక్కగా తృప్తిపరిచాడు.

సంవిభాగం మనుష్యేభ్యో దదౌ స్వదితిచాబ్రువన్ ।
కచ్చిత్ సమ్పన్నమిత్యుక్త్వా ప్రత్యుక్తస్తైర్ద్విజోత్తమాః ॥ 84 ॥

బ్రాహ్మణోత్తములారా! వరాహస్వామి 'స్వత్' అని చెప్పి మానవులకు భాగాన్ని ఇచ్చాడు. తరువాత 'కచ్చిత్ సమ్పన్నమ్' అని అడిగాడు. బ్రాహ్మణులు 'సుసంపన్నమ్' అని సమాధానం చెప్పారు.

అభిరమ్యతామిత్యువాచ ప్రోచుస్తేఽభిరతాస్స్మ వై ।
శిష్టమన్నం చ పప్రచ్ఛ తైరిష్టైస్సహ చోదితః ॥ 85 ॥

వరాహమూర్తి బ్రాహ్మణులతో 'అభిరమ్యతామ్' అన్నాడు. వారు 'అభిరతాః స్మ' అన్నారు. 'శిష్టమన్నం కిం క్రియతామ్' (బ్రాహ్మణులు తినగా మిగిలిన అన్నం ఏం చేయమంటారు) అని అడిగాడు. వారు 'ఇష్టైస్సహ భుజ్యతామ్' (ప్రియమైన వారితో కలిసి తిను) అన్నారు.

పాణావాదాయ తాన్ విప్రాన్ కుర్యాదనుగతస్తదా ।
వాజే వాజే ఇతి పఠన్ బహిర్వేది వినిర్గతః ॥ 86 ॥

ఆ బ్రాహ్మణులను చేయిపట్టుకుని వారివెంట నడిచాడు. 'వాజే వాజే' అనే మంత్రం చదువుతూ ఆ ప్రదేశంనుండి వెలుపలికి వచ్చాడు.

కోటితీర్థజలేనాసావపసవ్యం సముత్క్షిపన్ ।
అలగ్నాన్ విపులాన్ బాలాన్ ప్రార్థయామాస చాశిషమ్ ॥ 87 ॥

కోటితీర్థజలాన్ని తీసుకుని అపసవ్యంగా ఎగురవేస్తూ యోగ్యులూ, పూజ్యులూ అయిన ఆ బ్రాహ్మణులనుండి ఆశీస్సులను అభ్యర్థించాడు.

దాతారో నోఽభివర్ధన్తాం తైస్తథేతి సమీరితః ।
ప్రదక్షిణముపావృత్య కృత్వా పాదాభివాదనమ్ ॥ 88 ॥

వరాహమూర్తి 'దాతారో నోఽభివర్ధన్తామ్' అన్నాడు. బ్రాహ్మణులు 'తథాస్తు' అన్నారు. స్వామి ఆ బ్రాహ్మణుల చుట్టూ ప్రదక్షిణం చేసి, వారి పాదాలకు నమస్కరించాడు.

ఆసనాని దదౌ చైషాం ఛాదయామాస సూకరః ।
విశ్రమ్యతాం ప్రవిశ్యాథ పిణ్డం జగ్రాహ మధ్యమమ్ ॥ 89 ॥

వరాహమూర్తి అనంతరం వారికి ఆసనాలు ఇచ్చి, విశ్రమించండి అని కోరాడు. ఆ తరువాత లోనికి ప్రవేశించి, మధ్యమపిండాన్ని తీసుకున్నాడు.

ఛాయామయీ మహీ పత్నీ తస్యై పిణ్డమదాత్ ప్రభుః ।
ఆధత్త పితరో గర్భమిత్యుక్త్వా సాఽపి రూపిణీ ॥ 90 ॥

పిణ్డం గృహీత్వా విప్రాణాం చక్రే పాదాభివన్దనమ్ ।
విసర్జనం పితౄణాం స కర్తుకామశ్చ సూకరః ॥ 91 ॥

ఆ పిండాన్ని ఛాయామయి అయిన తన భార్య భూదేవికి ఇచ్చాడు. ఆ సుందరి కూడ 'ఆధత్త పితరో గర్భమ్' అని చెప్పి, పిండాన్ని పుచ్చుకుని, బ్రాహ్మణులకు పాదనమస్కారం చేసింది. అప్పుడు వరాహమూర్తి పితరులను విసర్జనం చేద్దామనుకున్నాడు.

కోకా చ పితరశ్చైవ ప్రోచుస్స్వార్థకరం వచః ।
శప్తాశ్చ భగవన్ పూర్వం దివస్థా హిమభానునా ॥ 92 ॥

కోకానది, పితృదేవతలు ఇద్దరూ వరాహమూర్తితో తమకు ప్రయోజనం కలిగించే మాటలు ఇలా చెప్పారు. 'పరమాత్మా! పూర్వం స్వర్గంలో ఉన్న చంద్రుడు మమ్మల్ని శపించాడు.

యోగభ్రష్టా భవిష్యధ్వం సర్వ ఏవ దివశ్చ్యుతాః ।
తదేవం భవతా త్రాతాః ప్రవిశన్తో రసాతలమ్ ॥ 93 ॥

మీరు అందరూ యోగభ్రష్టులు అగుదురు గాక. స్వర్గలోకం నుండి భ్రష్టులైపోదురు గాక' అనే చంద్రుడి శాపప్రభావంచేత పాతాళంలో ప్రవేశించబోతున్న మమ్మల్ని నీవు రక్షించావు.

యోగభ్రష్టాంశ్చ విశ్వేశాస్తత్యజుర్యోగరక్షిణః ।
తత్తే భూయోఽభిరక్షన్తు విశ్వేదేవా హి నస్సదా ॥ 94 ॥

యోగాన్ని రక్షించే విశ్వేదేవతలు యోగభ్రష్టులమైన మమ్మల్ని విడిచిపెట్టి వెళ్లారు. నీ అనుగ్రహంచేత (యోగయుక్తులమైన మాతో కలిసి) విశ్వేదేవతలు మమ్మల్ని నిరంతరమూ రక్షింతురు గాక.

స్వర్గం యాస్యామశ్చ విభో ప్రసాదాత్తవ సూకర ।
సోమోఽధిదేవోఽస్మాకం చ భవత్వచ్యుత యోగధృక్ ॥ 95 ॥

వరాహదేవా! నీ దయతో మేము స్వర్గానికి వెళ్తాము. అచ్యుతా! యోగధరుడైన చంద్రుడు మాకు అధిదేవత అగు గాక.

యోగాధారస్తథాసోమస్త్రాయతే నః కదాచన ।
దివి భూమౌ సదా వాసో భవత్వస్మాసు యోగతః ॥ 96 ॥

యోగానికి ఆధారమైన చంద్రుడు మమ్మల్ని ఎప్పటికీ రక్షించును గాత. యోగశక్తిచేత మాకు స్వర్గంలోనూ భూలోకంలోనూ నిత్యమూ నివాసం కలుగు గాక.

అన్తరిక్షే చ కేషాఞ్చిన్మాసం పుష్టిస్తథాఽస్తు నః ।
ఊర్జాచేయం హి నః పత్నీ స్వధానామ్నా తు విశ్రుతా ॥
భవత్వేషైవ యోగాఢ్యా యోగమాతా చ ఖేచరీ ॥ 97 ॥

మాకు కొన్ని నెలలపాటు అంతరిక్షంలో కూడ పోషణ కలుగు గాక. ఈమె మా భార్య. పేరు ఊర్జ. స్వధ అనే పేరుతో ప్రసిద్ధమైంది. ఈమె విస్తారమైన యోగశక్తి కలిగి, యోగమాత అయి, ఆకాశంలో సంచరించునుగాక.

ఇత్యేవముక్తః పితృభిర్వారాహో భూతభావనః ।
ప్రోవాచాథ పితౄన్ విష్ణుస్తాం చ కోకాం మహానదీమ్ ॥ 98 ॥

పితృదేవతలు ఈవిధంగా పలుకగా సమస్త జీవకోటిని సృష్టించి, పోషించే వరాహస్వామి పితృదేవతలతోనూ, కోక అనే ఆ మహానదితోనూ ఇలా అన్నాడు.

యదుక్తం తు భవద్భిర్మే సర్వమేతద్ భవిష్యతి ।
యమోఽధిదేవో భవతాం సోమస్స్వాధ్యాయ ఈరితః ॥ 99 ॥

అంతా మీరు నాకు చెప్పిన ప్రకారమే జరుగుతుంది. మీకు యముడు అధిదేవత, చంద్రుడు స్వాధ్యాయం అవుతారు.

అధియజ్ఞస్తథైవాగ్నిర్భవతాం కల్పనా త్వియమ్ ।
అగ్నిర్వాయుశ్చ సూర్యశ్చ స్థానం హి భవతామితి ॥ 100 ॥

అగ్ని మీకు అధియజ్ఞం అవుతాడు. అగ్ని, వాయువు, సూర్యుడు, మీకు స్థానం అవుతారని ఈవిధంగా ఏర్పాటు జరిగింది.

బ్రహ్మా విష్ణుశ్చ రుద్రశ్చ భవతామధిపూరుషాః ।
ఆదిత్యా వసవో రుద్రా భవతాం మూర్తయస్త్విమాః ॥ 101 ॥

బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మీకు అధిపురుషులు. ఆదిత్యులు, వసువులు, రుద్రులు అనేవి మీ రూపాలు.

యోగినో యోగదేహాశ్చ యోగాధారాశ్చ సువ్రతాః ।
కామతో విచరిష్యధ్వం ఫలదాస్సర్వజన్తుషు ॥ 102 ॥

యోగులు, యోగశరీరులు, యోగానికి ఆధారులూ, నియమనిష్ఠలు కలిగినవారూ అయి, స్వేచ్ఛగా సంచరించండి. మీరు సమస్త భూతాలకు మంచి ఫలితాలను ఇవ్వగలరు.

స్వర్గస్థాన్నరకస్థాంశ్చ భూమిస్థాంశ్చ చరాచరాన్ ।
నిజయోగబలేనైవాఽఽప్యాయయిష్యధ్వముత్తమాః ॥ 103 ॥

ఉత్తములారా! స్వర్గంలోనూ, నరకంలోనూ, భూలోకంలోనూ ఉన్న స్థావర జంగమాత్మకమైన వస్తువు లన్నింటికీ మీ యోగశక్తితో ప్రీతిని కలిగించండి.

ఇయమూర్జా శశిసుతా కీలాలమధువిగ్రహా ।
భవిష్యతి మహాభాగా దక్షస్య దుహితా స్వధా ॥ 104 ॥

ఈ ఊర్జ చంద్రుడి కూతురు. ఈమె మూర్తి మంచునీరులాగా, తేనెలాగా మధురమైనది. ఈ మహాత్మురాలు స్వధ అనే పేరుతో దక్షుడికి కూతురు అవుతుంది.

తత్రేయం భవతాం పత్నీ భవిష్యతి వరాననా ।
కోకానదీతి విఖ్యాతా గిరిరాజసమాశ్రితా ॥ 105 ॥

ఆ జన్మలో ఈ సుందరాస్య మీకు భార్య అవుతుంది. ఈమె హిమగిరిని ఆశ్రయించుకుని ప్రవహిస్తుంది. కోకానది అనే పేరుతో ప్రసిద్ధమైంది.

తీర్థకోటిమహాపుణ్యా మద్రూపపరిపాలితా ।
అస్యామద్య ప్రభృతి వై నివత్స్యామ్యఘనాశకృత్ ॥ 106 ॥

కోకానది కోటి పుణ్యతీర్థాలలోని పుణ్యమహిమను పొందింది. నా రూపంగా రక్షిస్తుంది. నేను ఇప్పటినుండి ఈ నదిలో నివసిస్తూ అందరి పాపాలను నాశనం చేస్తుంటాను.

వరాహదర్శనం పుణ్యం పూజనం భుక్తిముక్తిదమ్ ।
కోకాసలిలపానం చ మహాపాతకనాశనమ్ ॥ 107 ॥

వరాహమూర్తిని దర్శించుకోవడం చాల పుణ్యప్రదం. ఆ స్వామికి చేసిన పూజ ఇప్పుడు భోగాలనూ, తరువాత మోక్షాన్నీ ఇస్తుంది. కోకానదిలోని నీరు తాగడంచేత మహాపాతకాలు నశిస్తాయి.

తీర్థేష్వాప్లవనం పుణ్యముపవాసశ్చ స్వర్గదః ।
దానమక్షయ్యముదితం జన్మమృత్యుజరాపహమ్ ॥108 ॥

కోకానదీతీర్థంలో మునగడం పుణ్యప్రదం.ఇక్కడ ఉపవసించడంవల్ల స్వర్గం లభిస్తుంది. దానం చేస్తే అది నశించకుండా, చావుపుట్టుకలు ముసలితనమూ లేకుండా చేస్తుంది (మోక్షం ఇస్తుంది).

మాఘే మాస్యసితే పక్షే భవద్భిరుదుపక్షయే ।
కోకాముఖముపాగమ్య స్థాతవ్యం దినపఞ్చకమ్ ॥109 ॥

మాఘమాసంలో కృష్ణపక్షంలో ఉదయమే చంద్రుడు అస్తమించే సమయంలో కోకానదీతీరానికి రావాలి. ఇక్కడ ఐదు రోజులు ఉండాలి.

తస్మిన్ కాలే తు యశ్శ్రాద్ధం పితౄణాం నిర్వపిష్యతి ।
ప్రాగుక్తఫలభాగీ స భవిష్యతి న సంశయః ॥ 110 ॥

ఆ సమయంలో పితరులకు శ్రాద్ధం పెట్టినవాడు పూర్వం చెప్పినఫలితాలు అన్నీ పొందుతాడు. ఇందులో సందేహం లేదు.

ఏకాదశీం ద్వాదశీం చ స్థేయమత్ర మయా సదా ।
యస్తత్రోపవసేద్ధీమాన్ స ప్రాగుక్తఫలం లభేత్ ॥ 111 ॥

నిత్యమూ ప్రతిమాసంలోనూ ఏకాదశి, ద్వాదశి తిథులలో నేను ఇక్కడే ఉంటాను. బుద్ధిమంతుడు ఆ సమయంలో ఇక్కడ ఉపవసించాలి. అలా చేసినవాడు పూర్వం చెప్పిన అన్ని ఫలితాలను పొందుతాడు.

తద్ వ్రజధ్వం మహాభాగాః స్థానమిష్టం యథేష్టతః ।
అహమప్యత్ర వత్స్యామీత్యుక్త్వా సోఽన్తరధీయత ॥ 112 ॥

మహాత్ములారా! ఇక మీ యిష్టం వచ్చిన చోటికి వెళ్లండి. నేను ఇక్కడే నివసిస్తానని చెప్పి వరాహస్వామి అంతర్ధానం చెందాడు.

గతే వరాహే పితరః కోకామామన్త్ర్య తే యయుః ।
కోకాఽపి తీర్థసహితా సంస్థితా గిరిరాజని ॥ 113 ॥

వరాహస్వామి అంతర్ధానమైన తరువాత, పితృదేవతలు కోకానదికి వీడ్కోలు చెప్పి, వెళ్లిపోయారు. కోకానది కూడ పుష్కలమైన నీటితో ఆ హిమగిరిపైన నెలకొన్నది.

ఛాయా మహీమయీ క్రోడీ పిణ్డప్రాశనబృంహితా ।
గర్భమాదాయ సశ్రద్ధా వారాహస్యైవ సున్దరీ ॥ 114 ॥

భూస్వరూపిణి అయిన ఛాయ ఆడువరాహరూపంలో పిండాన్ని శ్రద్ధగా తిన్న మహిమచేత వరాహస్వామి సంబంధమైన గర్భాన్ని ధరించింది.

తతోఽస్యాః ప్రాభవత్ పుత్రో భౌమస్తు నరకాసురః ।
ప్రాగ్జ్యోతిషం చ నగరమస్య దత్తం చ విష్ణునా ॥ 115 ॥

ఆ గర్భంవలన ఆమెకు భౌముడు అనే పేరుతో నరకాసురుడు జన్మించాడు. శ్రీమహావిష్ణువు అతడికి ప్రాగ్జ్యోతిష నగరాన్ని రాజధానిగా ఇచ్చాడు.

ఏవం మయోక్తం వరదస్య విష్ణోః కోకాముఖే దివ్యవరాహరూపమ్ ।
శ్రుత్వా నరస్సుకృతమలో విపాప్మా దశాశ్వమేధేష్టిఫలం లభేత ॥ 116 ॥

వరప్రసాది అయిన శ్రీమహావిష్ణువు కోకానదీముఖంలో దివ్యమైన వరాహరూపాన్ని ధరించిఉన్న వృత్తాంతం వివరించాను. ఈ వృత్తాంతాన్ని విన్న మానవుడు పాపాలు తొలగి, పుణ్యాత్ముడై, పది అశ్వమేధయాగాలు చేసిన ఫలితాన్ని పొందుతాడు.

ఇతి శ్రీబ్రహ్మపురాణే వ్యాసఋషిసంవాదే శ్రాద్ధవిధినిరూపణం నామ దశాధికశతతమోఽధ్యాయః ॥110 ॥

శ్రీబ్రహ్మపురాణంలో వ్యాస ఋషి సంవాదంలో శ్రాద్ధవిధి నిరూపణం అనే నూటపదవ అధ్యాయం ॥110 ॥

మొదటి సంపుటం సమాప్తం

ఇతి శమ్